ఈనాడు అల్లూరి సీతారామరాజు

ఆదివాసీలను ఆదుకునేలా!

జీఓ నం.3పై వర్క్‌షాపు రేపు

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు గిరిజనులకే దక్కేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జీఓ నంబరు 3కి ప్రత్యామ్నాయంగా కొత్త జీవో జారీ కోసం రాష్ట్రంలో ఉన్న అన్ని ఐటీడీఏల్లో విస్తృతంగా వర్క్‌షాపులు నిర్వహిస్తోంది. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆధ్వర్యంలో గిరిజన ఉపాధ్యాయులు, ప్రజా, విద్యార్థి సంఘాల అభిప్రాయాలను సేకరిస్తోంది. న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటోంది. పాడేరు ఐటీడీఏలో ఈ నెల 22న వర్క్‌షాప్ జరగనుంది. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదాభార్గవి పాల్గొననున్నారు.

▌గతంలో జీవో నం.3తో మన్యంలో ఉపాధ్యాయ పోస్టులన్నీ గిరిజనులతో భర్తీ చేసే అవకాశం ఉండేది. 2020 ఏప్రిల్‌లో ఈ జీవోను సుప్రీంకోర్టు రద్దు చేసింది. దీంతో అన్యాయానికి గురయ్యామని ఆదివాసీలు తీవ్ర ఆందోళన చెందారు. అప్పటి వైకాపా ప్రభుత్వం గిరిజనులకు న్యాయం చేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. జీవో నం.3 రద్దుతో జరిగిన నష్టాన్ని తాము పూడుస్తామని, ఆదివాసీలకు న్యాయం చేస్తామని అరకు ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ నేపథ్యంలో పరిపాలనా అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ జీవో తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

31 వరకే రెండో రాయితీ సిలిండర్ గడువు

విశాఖపట్నం: ఉచిత వంటగ్యాస్ సిలిండర్ల పథకంలో భాగంగా రెండో విడత సిలిండర్ పంపిణీ ప్రక్రియ ఈ నెలాఖరుతో ముగియనుంది. మొదటి విడత సిలిండర్‌ను గతేడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది మార్చి వరకు పంపిణీ చేశారు. రెండో విడతకు జులై నెలాఖరు వరకు అవకాశం ఉంది. అర్హులు ఎవరైనా తీసుకోకుంటే వెంటనే వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మొదటి విడత నిధులు సకాలంలోనే ఖాతాలకు జమైనా, రెండో విడతలో జాప్యం జరిగింది. సాంకేతిక సమస్యలను పరిష్కరించి ఖాతాలకు జమ చేస్తున్నారు. మూడో విడత సిలిండర్‌కు ఆగస్టు నుంచి నవంబరు వరకు అవకాశం ఉంటుంది.



శాకంబరిగా మోదకొండమ్మ

మన్యం ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏటా ఆషాఢ మాసం చివరిలో అమ్మవారిని కూరగాయలతో అలంకరించి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, పాడేరు పట్టణం

సొంతింటి కల నెరవేరేదెలా?

కూనవరం, న్యూస్‌టుడే

విలీన మండలాల్లో ఒకటైన కూనవరం పరిధిలోని కొండలపై నివాసం ఉంటున్న కొండరెడ్లకు సొంతింటి కల నెరవేరడం లేదు. దశాబ్దాలుగా బాహ్య ప్రపంచానికి దూరంగా గుట్టలపై నివాసం ఉంటున్న వారిని కిందకు తీసుకువచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్న ప్రజాప్రతినిధులు, అధికారుల ప్రతిపాదనలు అమలుకు నోచుకోవడం లేదు. అటవీ శాఖ నిబంధనలు ప్రతిబంధకంగా మారుతున్నాయి.

గుట్టలపై సర్వే చేస్తున్న గృహనిర్మాణ సిబ్బంది (పాత చిత్రం)

▼ అడవుల్లో లభ్యమయ్యే వెదురుతో కొండరెడ్లు అల్లికలు చేసి వాటిని మోసుకుంటూ గుట్టలు దిగి కిందకు వచ్చి విక్రయిస్తుంటారు. ఆ సొమ్ముతో నిత్యావసర సరకులు కొనుగోలు చేసి కొండలపైకి వెళ్లిపోతుంటారు. వెదురుతో అల్లికలు చేయడంతోపాటు తేనె సేకరణ, గుట్టలపైనే పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారానికి ఒకరోజే వారు కూటూరు పంచాయతీలో జరిగే వారపు సంతకు గుట్టలపై నుంచి ఐదారు కిలోమీటర్ల దూరం బరువులు మోసుకుంటూ వస్తారు.

▼ కూటూరు గుట్టలపై ఉంటున్న తొమ్మిది గ్రామాలకు చెందిన కొండరెడ్లకు పీఎం జన్‌మన్ పథకంలో పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రెండేళ్ల కిందట సర్వే చేశారు. గబ్బిలాలగొంది, పాత కారుమానుకొండ, కొత్త కారుమానుకొండ, పులుసుమామిడి గొంది, చింతమామిడి గొంది, ఎలుగుల గొంది, కలింగమెట్ట, కోపురమెట్ట, తోటమామిడి గొంది గ్రామాల్లోని 136 కుటుంబాలకు గృహ నిర్మాణ సంస్థ అధికారులు ఇళ్లు మంజూరు చేశారు. వీరందర్నీ గుట్టలపై నుంచి కిందకు తీసుకొచ్చి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

ప్రతిబంధకంగా నిబంధనలు

▼ కూటూరు పంచాయతీలో రెవెన్యూ భూమి లేకపోవడంతో అటవీ శాఖ భూముల్లో నిర్మాణాలు చేపట్టాలని తొలుత ప్రయత్నాలు చేశారు. గృహ నిర్మాణ సంస్థ, అటవీ శాఖ సంయుక్తంగా చేసిన సర్వేలో వీరి ఇళ్లకు సరిపడా భూమి ఇవ్వడానికి నిబంధనలు ప్రతిబంధకంగా నిలిచాయి. అటవీ శాఖ నిబంధనల ప్రకారం ఏదైనా గ్రామానికి/ గ్రామాలకు ప్రజా ప్రయోజనం కోసం మాత్రమే కొంత భూమి ఇవ్వడానికి నిబంధనలు సహకరిస్తాయి. వ్యక్తిగత అవసరాలకు భూమి ఇవ్వడానికి నిబంధనలు అంగీకరించక పోవడంతో ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయి. 2023లో సర్వే చేయగా 2024లో నిర్మాణాలకు అనుమతులు వచ్చాయి. అనుమతులు వచ్చి ఏడాది పూర్తవుతున్నా ఇళ్ల నిర్మాణానికి అనువైన స్థలాలను చూపడంలో ఐటీడీఏ, రెవెన్యూ అధికారులు విఫలమయ్యారు. ఫలితంగా గుట్టలపై ఉన్న వారికి సొంతింటి కల నెరవేర లేదు.

భూమి లేకే ఆలస్యం... తొమ్మిది గ్రామాలకు చెందిన 136 కుటుంబాలకు ఇళ్లు మంజూరయ్యాయి. వీరికి కావాల్సిన భూమిని అధికారులు చూపలేదు. దూరప్రాంతాలకు రావడానికి లబ్ధిదారులు అంగీకరించడం లేదు. సమీపంలో ఇస్తేనే వస్తామంటున్నారు. కూటూరు పంచాయతీలో సరిపడినంత రెవెన్యూ భూమి లేదు. అటవీ ప్రాంతంలో ఇవ్వడానికి ఆ శాఖ అధికారులు ఒప్పుకోవడం లేదు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాల గడువు ముగిసింది. భూమి చూపితే వచ్చే ఏడాదైనా నిర్మాణాలు చేపట్టవచ్చు.– ప్రసాద్, ఏఈ, గృహ నిర్మాణ సంస్థ

తాగునీటికి కటకట

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: గుమ్మకోట పంచాయతీ బూర్జవలస, సతాబి, మెట్టవలస, గాలిపాడు గ్రామాల్లో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలకు నిధులు విడుదలైనా.. గుత్తేదారు బోర్లు వేసి మిగతా పనులు నిలిపేశారని వైస్ సర్పంచి కన్నయ్య పేర్కొన్నారు. ఉన్న మోటార్లను గుత్తేదారు తీసుకెళ్లిపోయారని ఆరోపించారు. కూలీలకు సుమారు రూ.2 లక్షలు ఇవ్వాల్సి ఉందన్నారు.

బరువు లేని ద్రవరూప ఎరువు!

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

అల్లూరి జిల్లాలో గిరి రైతులు పలు రకాల పంటలు పండిస్తూ అధిక దిగుబడులు సాధించేందుకు నిరంతరం శ్రమిస్తుంటారు. మన్యంలోని వారపు సంతల్లో వ్యాపారులు నకిలీ ఎరువులు విక్రయిస్తున్నారు. అవి కొనుగోలు చేస్తూ రైతులు మోసపోతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం నానో ఎరువులను అందుబాటులోకి తీసుకొచ్చింది.

▌జిల్లాలో 1,68,059 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. రైతులు ఎక్కువగా యూరియా, డీఏపీ బస్తాలను కొనుగోలు చేసి పంటలకు వేస్తున్నారు. కొండ ప్రాంతంలో ఎరువుల బస్తాలను పైకి తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి నీటి తడులు అందకపోయినా, నీరు ఎక్కువైనా ఎరువు అంతా వృథానే. ఈ పరిస్థితుల్లో నానో యూరియా వినియోగం మేలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇవీ ప్రయోజనాలు..

బస్తా యూరియా ధర రూ.266. మార్కెట్లో రూ.350 పలుకుతోంది. ఇంటికి తీసుకురావడానికి రూ.50 అదనపు ఖర్చు. అదే నానో యూరియా 500 మి.లీ. సీసా రూ. 225కే లభిస్తుంది. డీఏపీ బస్తా ధర రూ. 1350. నానో డీఏపీ సీసా రూ.600 మాత్రమే. ఎక్కడికైనా పట్టుకుపోవచ్చు. ఎరువు నేలపై చల్లితే మొక్కకు పూర్తిస్థాయిలో అందుతుందో లేదో తెలియదు. 500 మి.లీ. ద్రావణం ఎకరాకు సరిపోతుంది. రెండుసార్లు పిచికారీ చేస్తే చాలని అధికారులు చెబుతున్నారు.

నానో యూరియాతో రైతులకు మేలు

గిరి రైతులకు అవగాహన లేక..

గిరిజన రైతులు దుకాణాల వద్దకు వచ్చి యూరియా బస్తాలు కావాలని అడుగుతున్నారు. బరువుమోత తప్పుతుందని ద్రవరూప యూరియా డబ్బాలను చూపిస్తే వద్దంటున్నారు. చాలామంది గిరిజనులకు వీటిపై అవగాహన లేక తీసుకువెళ్లడం లేదు. అధిక ధర చెల్లించి బస్తాలు తీసుకెళ్తున్నారు.

ద్రవ యూరియా, డీఏపీ డబ్బాలు

భారం తగ్గుతుంది..

జిల్లాలో నానో యూరియా, డీఏపీ నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. వీటి వినియోగంతో రైతుకు ఆర్థిక భారం, శారీరక శ్రమ తగ్గుతాయి. చాలా మంది రైతులు బస్తాలకే మొగ్గు చూపుతున్నారు. వీటి వినియోగిస్తే ఏమవుతుందోనని తీసుకువెళ్లడంలేదు. రైతులకు వీటి వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం.
– మధుసూదనరావు, ఏవో, చింతపల్లి

జలపాతంలో జలకాలాట

మోతుగూడెం పరిసర ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో కిక్కిరిశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి విహార యాత్రకు పెద్దఎత్తున తరలివచ్చారు. పొల్లూరు జలపాతం, దారాలమ్మ పిక్నిక్ స్పాట్, సీలేరు నది పరివాహక ప్రాంతాలు, జల విద్యుత్కేంద్రాలు, జలాశయాలు సందర్శకులతో సందడిగా మారాయి. జలపాతంలో జలకాలాడుతూ సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. సామూహిక భోజనాలు చేసి ఆటపాటలతో సందడి చేశారు. – న్యూస్‌టుడే, మోతుగూడెం

మోతుగూడెంలో అఖండ-2 షూటింగ్!

చింతూరు మండలం మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో అఖండ-2 సినిమా షూటింగ్ జరగనుంది. పలు సన్నివేశాలను ఈ నెల 22 నుంచి ఐదు రోజులపాటు ఇక్కడ చిత్రీకరించనున్నారు. ఇప్పటికే దర్శకుడు బోయపాటి శ్రీను, 30 మంది యూనిట్ బృందం మోతుగూడెం చేరుకుని రిసార్ట్స్‌లో ఉన్నారు. లొకేషన్ల ఎంపిక కోసం ఆదివారం పర్యాటక ప్రాంతాలను పరిశీలించారు. దారాలమ్మ పిక్నిక్ స్పాట్, పొల్లూరు జలపాతాలు మరికొన్ని ప్రదేశాలను ఎంపిక చేసినట్లు సమాచారం. కథానాయకుడు నందమూరి బాలకృష్ణ రెండు రోజులు షూటింగ్‌లో పాల్గొననున్నారు. ఈ నెల 22న 150 మంది యూనిట్ సభ్యులు రానున్నారు. – న్యూస్‌టుడే, మోతుగూడెం

లారీ.. వాగులోకి జారి!

గూడెంకొత్తవీధి మండలం దుచ్చరి పాలెం వంతెన నుంచి లారీ అదుపు తప్పి కింద పడింది. చింతపల్లి నుంచి ఆదివారం తెల్లవారుజామున గూడెంకొత్తవీధి వైపు వస్తున్న లారీ వంతెనపై బురద ఉండటంతో జారిపోయి పాత వంతెన వైపు వాగులో రెండు పల్టీలు కొట్టింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. వంతెనపై వర్షపు నీరు, బురద నిలిచి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, గూడెంకొత్తవీధి

జారుతున్నా.. నెడుతూ ముందుకు!

గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ కాకరపాడు గ్రామానికి రహదారి లేదు. మట్టి దారి వర్షాలకు చిత్తడిగా మారడంతో రాకపోకలకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా జారుతుండటంతో ఆ దారిలో ముందుకెళ్లే పరిస్థితి లేదు. అత్యవసరమైతే ఒకరు బండి జారకుండా నెడుతూ వెళ్లాల్సివస్తోంది. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, గూడెంకొత్తవీధి

లాహిరి లాహిరి అనంతగిరుల్లో..

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

మన్యం సందర్శనకు వచ్చే వారు అనంతగిరులను చూడకుండా వెళ్లే ప్రసక్తే లేదు. సహజసిద్ధ అందాలతో మంత్రముగ్ధుల్ని చేసే ప్రకృతి రమణీయ దృశ్యాలెన్నో ఇక్కడున్నాయి. నిత్యం దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు విశాఖపట్నం నుంచి రైలు, రోడ్డు మార్గంలో ముందుగా బొర్రా గుహలు చేరుకుంటారు. గుహల సందర్శన అనంతరం సమీపంలోని కటికి, తాటిగుడ జలపాతాలకు వెళ్తారు. అక్కడి నుంచి అరకులోయ బయలుదేరి దారిలో కాఫీ తోటల వద్ద ఆగుతారు. గాలికొండ వ్యూపాయింట్ నుంచి అనంతగిరులను చూస్తే తమను తాము మరిచిపోతారు. గిరుల అందాలను స్వీయ చిత్రాల్లో బంధించి అరకులోయ పయనమవుతారు.

కొండల మీదుగా జలజలా జాలువారే జలపాతాలు, కమ్మని కాఫీ తోటలు, శీతల వాతావరణం అనంతగిరుల ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నాయి. వీటితోపాటు ఎన్నో సందర్శనీయ ప్రాంతాలు ఇక్కడ ఉన్నాయి.

మెట్లుమెట్లుగా..: తాటిగుడ జలపాతం మెట్లుమెట్లుగా ఉంటుంది. అనంతగిరికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. జలపాతం కింద వరకు వెళ్లొచ్చు. చిన్నారులు ఆడుకునేందుకు ఆటవస్తువులు ఇక్కడ ఉన్నాయి.

టెంపుల్ ట్రీ: కాశీపట్నంలో మర్రిచెట్టు తొర్రలో ఉమామహేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయానిది ఐదు శతాబ్దాల చరిత్ర. పురాతన ఆలయం కావడంతో కార్తిక మాసంలో ఇక్కడకు వచ్చే భక్తులతో పరిసరాలన్నీ కిటకిటలాడుతుంటాయి. భక్తులు స్వయంగా శివలింగానికి అభిషేకం చేయడం ఇక్కడి ప్రత్యేకత.

సరియా జలపాతం: విశాఖకు 65 కి.మీ. దూరంలో ఉన్న దేవరాపల్లి చేరుకుని, అక్కడి నుంచి మరో 15 కి.మీ. వెళ్తే సరియా జలపాతం వస్తుంది. ఇక్కడకు చేరుకునేందుకు ఎంత శ్రమ పడి వస్తామో జలపాతం అందాలను చూసి కష్టమంతా మరిచిపోవడం ఖాయం. ఈ జలపాతం వద్ద జాగ్రత్తగా ఉండాలి.

కటికి జలపాతం: సుమారు 400 మీటర్ల ఎత్తు నుంచి నీటి ధారలు పడుతుంటాయి. బొర్రా గుహలకు దగ్గరలో ఈ జలపాతం ఉంది. కిలోమీటరు దూరం వరకు వాహనాల్లో చేరుకోవచ్చు. అక్కడి నుంచి కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది.

బొర్రా గుహలు: నిత్యం పర్యటకులతో సందడిగా ఉండే బొర్రాగుహలు సహజసిద్ధంగా ఏర్పడినవే. సుమారు 1.5 కిలోమీటరు దూరం గుహల్లో నడుచుకుంటూ అందాలను వీక్షించొచ్చు. విశాఖపట్నంకు 83 కి.మీ. దూరంలో ఈ గుహలున్నాయి. రైలు, రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు.

కాఫీ తోటలు: అరకు కాఫీ ఒక బ్రాండ్. ముడి సరకంతా అనంతగిరుల్లోని తోటల నుంచే వస్తుంది. కాఫీ తోటల వద్ద మండు వేసవిలోనూ వాతావరణం చల్లగా ఉంటుంది. సాయంత్రం 4 గంటలు దాటితే చలికి వణకాల్సిందే. కాఫీ తోటల్లో నడుచుకుంటూ కాఫీపండ్లు, చెట్లను దగ్గరగా చూడొచ్చు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

అరకులోయ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్ దొన్నుదొర అన్నారు. చినలబుడు పంచాయతీ తురాయిగుడలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తెదేపా నాయకులు భగత్‌రామ్, నీరజ, శామ్యూల్, సుందరమ్మ, రాజు, బాలుదొర పాల్గొన్నారు.

తురాయిగుడలో కరపత్రం అందజేస్తున్న ఆర్టీసీ జోన్ ఛైర్మన్ దొన్నుదొర

జాతీయ రహదారిపై 'సౌర'భం

జాతీయ రహదారి 516-ఈ నిర్మాణంతో మన్యం రూపురేఖలు మారుతున్నాయి. కొయ్యూరు మండలం కాకరపాడు నుంచి గూడెంకొత్తవీధి మండలం చాపరాతిపాలెం మీదుగా చింతపల్లి మండలం లంబసింగి వరకూ సువిశాలమైన రహదారి నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల వంతెనల పనులు జరుగుతున్నాయి. అప్రోచ్ రోడ్లు నిర్మిస్తున్నారు. మరోవైపు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామాల వద్ద సోలార్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. రాత్రివేళల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా వేగనియంత్రికల వద్ద వీటిని ప్రత్యేకంగా అమరుస్తున్నారు. చింతపల్లి- గూడెంకొత్తవీధి మండలాల మధ్య ప్రస్తుతం జాతీయ రహదారికి ఆనుకుని సోలార్ దీప స్తంభాలు అమర్చే పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
– న్యూస్‌టుడే, చింతపల్లి

ఇడ్లీల్లాంటి పుట్టగొడుగులు

మిగిలిపోయిన ఇడ్లీలను ఇలా పడేసి ఉంటారనుకుంటున్నారా. ఇవి ఇడ్లీలు కావు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు తెరిపి ఇవ్వడంతో మారేడుమిల్లి - భద్రాచలం రహదారిలో వాలమూరు వద్ద జంగిల్ స్టార్ నేచర్ క్యాంపు పరిసరాల్లో ఈ పుట్టగొడుగులు ఆదివారం కనిపించాయి. క్లిటోసైబ్ ఫ్రాగ్రాన్స్ జాతికి చెందిన ఇవి విషతుల్యం కావడంతో ఆహారంగా తీసుకునేందుకు పనికి రావు. ఫ్రాగ్రెంట్ ఫన్నెల్ అని, సీడ్‌టోడ్‌స్టూల్ అని పిలుస్తారు. లేత రంగులో ఉండి తెలుపు, పసుపు, గోధుమ వర్ణంలో టోపీలా కనిపిస్తాయి. సోంపు, తీపి బాదం వాసన వస్తుంది. వసంత రుతువులో తడి ప్రాంతాల్లో ఆకులు, చెత్త, నాచు మధ్య పెరుగుతాయని నేచర్ క్యాంపు సమన్వయకర్త వీరబాబు పేర్కొన్నారు. వీటిలో మస్కరిన్ అనే టాక్సిన్ ఉండటం వల్ల విషపూరితంగా ఉంటాయన్నారు.
– న్యూస్‌టుడే, మారేడుమిల్లి

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

స్పందనకు వందన

రంపచోడవరం, న్యూస్‌టుడే: దేవీపట్నం మండలం తున్నూరులో అంగన్‌వాడీ కేంద్రానికి భవన నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపినట్లు సీడీపీవో కుసుమకుమారి ఆదివారం తెలిపారు. 'విద్యా అవస్థకు ఆనవాళ్లు' శీర్షికన ఈ నెల 19న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఐసీడీఎస్ అధికారులు స్పందించి చిన్నారులు ఇబ్బందులు పడకుండా ప్రస్తుతం పాఠశాల భవనంలోకి అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్పు చేశారన్నారు.

ఘనంగా మోదమాంబ జాతర

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: కేజే పురంలో మోదమాంబ అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, హౌసింగ్ బోర్డ్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు అమ్మవారిని దర్శించుకున్నారు.

కల్వర్టు మీదుగా రాకపోకలు బంద్

దేవరాపల్లి, న్యూస్‌టుడే

కృష్ణారాయుడిపేట వద్ద కుంగిన కల్వర్టు మీదుగా ఆర్‌అండ్‌బీ అధికారులు వాహనాల రాకపోకలను నిషేధించారు. విశాఖపట్నం - దేవరాపల్లి రోడ్డులో జీవీఎంసీకి తాగునీరందించే రైవాడ కాలువపై నిర్మించిన ఈ కల్వర్టు శిథిలావస్థకు చేరింది. దేవరాపల్లి మీదుగా విశాఖ, కొత్తవలస తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు ఇదొక్కటే మార్గం. సామర్థ్యానికి మించిన బరువుతో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో కల్వర్టు దెబ్బతింది. మరోదారి లేక ఆర్టీసీ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఇటే రాకపోకలు సాగిస్తున్నాయి. కల్వర్టు దుస్థితిపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు స్పందించిన మద్దిలపాలెం డిపో మేనేజరు పద్మావతి శనివారం వంతెనను పరిశీలించారు. కల్వర్టు నిర్మాణం జరిగితే తప్ప బస్సులను నడపలేమని స్పష్టం చేశారు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు కల్వర్టుకు రెండు వైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. విశాఖ నుంచి ఆనందపురం, దేవరాపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు కృష్ణారాయుడిపేట వరకు బస్సులో వచ్చి.. ఇక్కడి నుంచి ఆటోల్లో గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. కొత్తవలస వైపు వెళ్లాల్సిన వారు ఆనందపురం నుంచి ఆటోల్లో వచ్చి ఇక్కడి నుంచి బస్సుల్లో వెళ్తున్నారు.

బారికేడ్ల ఏర్పాటుతో ఆటోలు దిగి కాలినడకన వస్తున్న ప్రయాణికులు

ఉద్యానంలో అభివృద్ధి ఊసేది?

హుకుంపేట, న్యూస్‌టుడే

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రం మత్స్యగుండం. ఎంతో ప్రసిద్ధిచెందిన ఈ క్షేత్రంలో భక్తులు, పర్యాటకుల కోసం 2002లో తెదేపా ప్రభుత్వం హయాంలో అప్పటి మంత్రి మత్స్యరాస మణికుమారి చొరవతో రూ.కోటి వెచ్చించి పార్కు నిర్మించారు. మత్స్యకన్య, త్రిముఖ లింగేశ్వరస్వామి విగ్రహాలతోపాటు విద్యుద్దీపాలు, పర్యాటకులు బస చేసేందుకు అతిథిగృహం నిర్మించారు. పార్కు నిర్వహణ బాధ్యత మాది కాదంటే మాది కాదంటూ పర్యాటక శాఖ, పాడేరు ఐటీడీఏ పట్టించుకోవడం లేదు. రూ.కోటి ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరు మాదిరిగా మారింది. కూటమి ప్రభుత్వం పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పర్యాటకులు, గ్రామస్థులు కోరుతున్నారు.

పార్కులో విద్యుత్తు దీపాల్లేని స్తంభాలు

ప్రతిపాదనలు పంపాం: ఉద్యానం అభివృద్ధికి ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చు చేసేందుకు అనుమతి కోరుతూ ప్రతిపాదనలు పంపాం. ఈ పార్కు అందుబాటులోకి వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. – శాంతకుమారి, సర్పంచి, మఠం పంచాయతీ

(c) eenadu

ఆగని మట్టి అక్రమ దందా!

మట్టి లోడ్ చేస్తున్న పొక్లెయిన్

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: సహజ వనరుల దోపిడీకి అడ్డుకట్ట పడటం లేదు. చెరువులు, నదుల్లో మట్టిని యథేచ్ఛగా తవ్వేస్తూ దందా సాగిస్తున్నారు. లేఅవుట్లు, ప్రైవేటు స్థలాలు, ఇళ్ల పునాదుల్లో వేసేందుకు ఇసుక, మట్టికి ఉన్న డిమాండును సొమ్ము చేసుకుంటున్నారు. సైతారుపేట చెరువులో మట్టి, ఎస్.రాయవరం సమీపంలోని వరాహ నదిలో ఇసుకను పట్టపగలే తవ్వేస్తూ తరలిస్తున్నారు. వరాహ నదిలో మట్టి దిబ్బలను తొలగించేందుకు రూ.4.5 లక్షలతో పనులు చేపట్టారు. నదిలో తీసిన మట్టిని ఎస్.రాయవరం జడ్పీ పాఠశాల మైదానానికి తరలించేందుకు అధికారులు అనుమతిచ్చారు. గుత్తేదారు ప్రైవేట్ స్థలాలను ఎత్తు చేసేందుకు మట్టిని విక్రయిస్తున్నారు. సైతారుపేట చెరువులో పొక్లెయిన్‌తో మట్టిని తవ్వి ఆరు ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. ఈ విషయాన్ని జలవనరుల శాఖ ఏఈ అమీనా బాను దృష్టికి తీసుకువెళ్లగా.. వరాహ నదిలో తవ్విన మట్టిని పాఠశాల మైదానానికి కాకుండా బయట ప్రాంతాలకు వెళ్తుండటంతో రవాణాను నిలిపివేశామన్నారు.

ఎలమంచిలి కాంప్లెక్స్‌కు అన్ని బస్సులొచ్చేలా చర్యలు

ఎలమంచిలి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఎలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులన్నీ వచ్చేలా చర్యలు తీసుకుంటానని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి చెప్పారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్సును ఆదివారం తనిఖీ చేశారు. ప్రయాణికులతో మాట్లాడారు. వసతులు పరిశీలించారు. సిబ్బంది విశ్రాంతి కోసం ఏర్పాటు చేసిన గదులను చూశారు. బస్సుల వివరాలు, తాగునీటి సమస్యపై అడిగి తెలుసుకున్నారు. ఎలమంచిలి కాంప్లెక్స్‌లోకి ఎక్స్‌ప్రెస్ బస్సులు రావడంలేదని ప్రయాణికుల ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పారిశుద్ధ్యం బాగోలేదని, ఆకతాయిలు ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. సీటీఎం సత్యనారాయణ, డీపీటీవో ప్రవీణ, డీఈఈ నరసింహారావు, గౌరీ తదితరులు పాల్గొన్నారు. అచ్యుతాపురంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌తో ప్రజా రవాణాకు చెందిన ఉన్నతాధికారులు బ్రహ్మానందరెడ్డి, వి.ప్రవీణ సమావేశమయ్యారు. విద్యార్థులకు ఇబ్బందిలేకుండా బస్సు సర్వీసులను పెంచాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

ఎలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్సును తనిఖీ చేస్తున్న ఆర్టీసీ ఎడ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానందరెడ్డి

సుపరిపాలనలో తొలి అడుగు త్వరగా పూర్తిచేయాలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో చేపట్టిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా తెదేపా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు సూచించారు. అనకాపల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం 30 రోజుల పాటు స్వపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ నెల రెండు నుంచి చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లాలో 5,19,709 ఇళ్లు ఉండగా ఇప్పటివరకు 2,00,479 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. 12 రోజుల్లో మిగిలిన ఇళ్లకు వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేలా పార్టీ శ్రేణులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తాతయ్యబాబు, పక్కన కాశీనాయుడు

ఎటు చూసినా 'స్కాన్'!

ప్రజాభిప్రాయ సేకరణకు సాంకేతిక దన్ను

ఈనాడు, విశాఖపట్నం: ప్రజాభిప్రాయ సేకరణలో విశాఖ మహా ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) కొత్త పుంతలు తొక్కుతోంది. మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. పర్యాటక ప్రాంతాల్లో ఫిర్యాదుల పెట్టెల స్థానంలో క్యూఆర్ కోడ్‌లను ఉపయోగించి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తోంది. తద్వారా ఆయా ప్రదేశాల్లో అందుతున్న సేవల గురించి తెలుసుకొని తగు మార్పులు చేస్తున్నారు.

✦ **ఈ ప్రదేశాల్లో..:** సిటీ సెంట్రల్ పార్కు, వుడా పార్కు, కైలాసగిరి, తొట్లకొండ, తెన్నేటి పార్కు, కురుసుర జలాంతర్గామి, టీయూ-142, సీహారియర్, రోప్‌వేలను వీఎంఆర్‌డీఏ నిర్వహిస్తోంది. నిత్యం వేల మంది వీటిని సందర్శిస్తారు. ఇక్కడ గతంలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేసినా స్పందన అంతంతమాత్రంగానే ఉండేది. వాటికి ప్రత్యామ్నాయంగా ఇటీవల క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటు చేయగా మంచి ఫలితాలు వస్తున్నాయి. ముఖ్యంగా పార్కుల వద్ద బ్యానర్ల రూపంలో ప్రజలకు కనిపించేలా వీటిని వేలాడదీస్తున్నారు.

వీఎంఆర్‌డీఏ భవనం వద్ద వివరాలతో ఇలా

✦ పార్కుల్లో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని, తాగునీటి వసతి సరిగా లేదని తదితర లోపాలపై ఫిర్యాదులొస్తున్నాయి. సిటీ సెంట్రల్ పార్కులో నడకకు ఉచితంగా ప్రవేశం కల్పించాలని, వాహనాలకు పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని పలువురు క్యూఆర్ కోడ్‌ల ద్వారా అభిప్రాయాలు తెలిపారు.

✦ **అద్దెకు తీసుకోవాలన్నా:** మధురవాడ, గాజువాక, సీతమ్మధార, ఎంవీపీ కాలనీ... ఇలా పలు చోట్ల వీఎంఆర్డీఏకు వాణిజ్య సముదాయాలున్నాయి. కొన్ని చోట్ల కల్యాణ మండపాలు, కైలాసగిరిపై వేడుకలకు అద్దెకిచ్చే స్థలాలున్నాయి. ఎక్కడెక్కడ ఏ భవనాలున్నాయి, వాటి అద్దె ఎంత అనే వివరాలు చిత్రాలతో సహా...'స్కాన్' చేసిన చోట వస్తాయి. నచ్చితే అక్కడి సేవలను వినియోగించుకోవచ్చు.

✦ వీఎంఆర్‌డీఏ ఇటీవల మధ్యతరగతి కుటుంబాల కోసం బడ్జెట్ హౌసింగ్ అపార్టుమెంట్లను ప్రతిపాదించింది. దీనికి సంబంధించిన డిమాండ్ సర్వేను క్యూఆర్ కోడ్‌లతోనే పూర్తి చేశారు. ఎంత విస్తీర్ణంలో అవసరం, ఏ ప్రాంతంలో కావాలి వంటి వివరాలతోపాటు సలహాలను ఆహ్వానిస్తూ క్యూఆర్ కోడ్ బ్యానర్లను నగరంలో పలు చోట్ల ఏర్పాటు చేశారు. వాటికి మంచి స్పందనే వచ్చింది. వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళిక పునఃపరిశీలనలో భాగంగా అభ్యంతరాల స్వీకరణ కూడా ఇదే తరహాలో చేశారు.

✦ **ఎప్పటికప్పుడు సమీక్షించి నివేదిక:** 'క్యూఆర్ కోడ్ ద్వారా వచ్చే వినతులను ముందుగా సంబంధిత విభాగాలకు పంపుతున్నాం. వాటిని ఎంత వరకు పరిష్కరించారనేది ప్రతి వారం సమీక్షించి ప్రగతి నివేదిక రూపొందిస్తున్నాం. వీఎంఆర్‌డీఏకు చెంది, ప్రజలతో సంబంధమున్న ప్రతి అంశాన్ని దీనికి అనుసంధానం చేస్తున్నాం. మెరుగైన ఫలితాలొస్తున్నాయి' అని కమిషనర్ విశ్వనాథన్ పేర్కొన్నారు.

ఎస్‌బీఐ శిక్షణ కేంద్రం సంచాలకుడిగా రాజేశ్వరరావు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి పట్టణంలోని ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి స్టేట్ బ్యాంక్ అనుబంధ గ్రామీణ స్వయం ఉపాధి ఉచిత శిక్షణ సంస్థ (ఎస్‌బీఐ-ఆర్‌సెటీ) సంచాలకుడిగా ఎస్‌బీఐ సీనియర్ మేనేజర్ సీహెచ్ రాజేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సంస్థ ప్రతినిధులు లక్ష్మి, ఈశ్వర్, వెంకట్, అమ్మాజీ తదితరులు అభినందించారు. పెద్దాపురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ సంచాలకులుగా ఉన్న విజయకుమార్ రాజమహేంద్రవరం ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్‌గా బదిలీ అయ్యారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎస్‌బీఐ అనుబంధ విశాఖ జిల్లా గ్రామీణ స్వయం ఉపాధి ఉచిత శిక్షణ కేంద్రంలో ఆగస్టు రెండు నుంచి మహిళలకు టైలరింగ్, తొమ్మిది నుంచి ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ (మగ్గం) కోర్సుల్లో ఉచిత శిక్షణ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సంచాలకుడు రాజేశ్వరరావు చెప్పారు. 31 రోజులపాటు ఇచ్చే ఈ ఉచిత శిక్షణకు ఎంపికైన వారికి భోజనం, వసతి కల్పించడంతోపాటు శిక్షణ అనంతరం ధ్రువపత్రాలు, అర్హులకు రుణాలు మంజూరు చేయిస్తామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల గ్రామీణ ప్రాంతానికి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను అనకాపల్లిలోని పీఎస్‌ఎం ప్లాజాలో ఉన్న సంస్థ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 80083 33509 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

220 విదేశీ మద్యం సీసాలు స్వాధీనం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఎక్సైజ్ శాఖకు చెందిన టాస్క్‌ఫోర్స్ విభాగం శనివారం రాత్రి లలితానగర్ ప్రాంతంలో దాడులు నిర్వహించి 220 విదేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఈఎస్ ఆర్.ప్రసాద్ తెలిపారు. పిఠాపురం కాలనీలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఆదివారం మధ్యాహ్నం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. లలితానగర్‌లో తిరుపతి వెంకటేశ్ పిళ్లై అనే వ్యక్తి ఒక ఇంటిని గోడౌన్‌గా మార్చి అనధికారికంగా వివిధ దేశాల నుంచి మద్యం సీసాలను సేకరించి విక్రయాలు చేపడుతున్నాడన్నారు. పక్కా సమాచారం రావడంతో శనివారం రాత్రి దాడులు చేపట్టామన్నారు. వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చెన్నై నుంచి మద్యం సీసాలను తెప్పిస్తున్నట్లు తెలిపాడన్నారు. ప్రస్తుతం దొరికిన 220 విదేశీ మద్యం సీసాల విలువ సుమారు రూ.15లక్షల నుంచి రూ.18 లక్షల వరకు ఉంటుందన్నారు. మద్యంతో పాటు ద్విచక్రవాహనం, రూ.4310 నగదు, చరవాణి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సరస్వతి, ఎస్సై ముసలినాయుడు, సిబ్బంది కె.వి.ఎం.రాజు, వెంకటేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల రద్దే లక్ష్యంగా ఉద్యమం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించే వరకు ఉద్యమించనున్నట్లు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం ప్రకటించారు. అనకాపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జిల్లాస్థాయి విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్ల విషయంలో ప్రభుత్వం, విద్యుత్తు అధికారులు మొండిగా వ్యవహరిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించి.. ఇప్పుడు సమర్థించడం దారుణమన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శంకరరావు, శ్రీరామ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్లను అడ్డుకోకుంటే ప్రమాదమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రొంగలి రాము అన్నారు. స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ఆదివారం అచ్యుతాపురం వినియోగదారులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. సామాన్యులకు స్మార్ట్ ఇబ్బందులు గురిచేయవద్దని ఆయన కోరారు. నర్లాల అబ్బాయినాయుడు, కర్రి వెంకునాయుడు, రాజాల మాస్టార్, రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న లోకనాథం

హిందుస్థాన్ షిప్‌యార్డు సందర్శన

షిప్‌యార్డులో మొక్క నాటుతున్న కేంద్ర సహాయమంత్రి సంజయ్ సేథ్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: వికసిత్ భారత్ దిశగా హిందుస్థాన్ షిప్‌యార్డు పనితీరు మెరుగ్గా ఉందని కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ప్రశంసించారని సంస్థ యాజమాన్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈనెల 18న విశాఖపట్నం నేవల్ జెట్టీలో నిస్తార్ నౌకను జాతికి అంకితం చేసిన కేంద్రమంత్రి, ఆ తర్వాత షిప్‌యార్డును సందర్శించి, వివిధ విభాగాలను పరిశీలించినట్లు పేర్కొంది. సంస్థ ఆవరణలో మొక్కలు నాటిన మంత్రి.. అధికారులు, సిబ్బందితో మాట్లాడి, వారితో గ్రూప్ ఫొటో దిగారు.

అప్రమత్తతతో సురక్షిత వేట..!

– న్యూస్‌టుడే, విశాఖపట్నం

ప్రాణాలకు తెగించి నడి సంద్రంలో చేపలవేట సాగించే మత్స్యకారులు.. తుపాన్ల సమయంలో అప్రమత్తంగా లేకుండా ముప్పు తప్పదని మత్స్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. గత ఏడాది విశాఖ చేపలరేవు నుంచి సముద్రంలోకి వెళ్లిన పది బోట్లకు విపత్కర పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ ఏడాది ఇప్పటికే వేట ప్రారంభమైన నేపథ్యంలో... తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ జేడీ పి.లక్ష్మణరావు సూచిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..! : విశాఖ చేపలరేవు నుంచి దాదాపు 600 బోట్లు ద్వారా సముద్ర జలాల్లో వేట సాగుతోంది. అవి ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరం వరకు వెళ్తుంటాయి. ఇటీవల వాతావరణ మార్పులతో సముద్రంపై అల్పపీడనాలు ఏర్పడి, ఈదురుగాలులు వీస్తున్నాయి ★ తుపాన్ల సమయంలో వీచే గాలులకు బోట్లు తట్టుకోలేవు. కొన్ని దారి తప్పి అలలపై సుదూర ప్రాంతాలకు కొట్టుకుపోతే, ఇంకొన్ని మునిగిపోతుంటాయి. గతంలో పలుమార్లు ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ★ సాధారణంగా మే- అక్టోబరు నెలల మధ్య తుపాన్లు ఎక్కువగా వస్తుంటాయి. ఈ సమాచారాన్ని మత్స్యకారులు ఎప్పటికప్పుడు తెలుసుకొని అప్రమత్తంగా ఉంటూ చేపలవేట కొనసాగించడం ద్వారా ముప్పు నుంచి బయటపడొచ్చు.

విశాఖ తీరంలో బోట్లు

వివరాల నమోదు తప్పనిసరి: ★ వేటకు వెళ్లే మత్స్యకారులు తమ బోటు నెంబరు, సిబ్బంది వివరాలు, వారి ఫోన్ నెంబర్లు, వేట సాగించే దిశ, ప్రాంతం వంటి వివరాలను కుటుంబ సభ్యులు, సంబంధిత గ్రామ పెద్దలతో పాటు, మత్స్య సహాయకులు, సాగర మిత్రలకు తెలియజేయాలి. ★ బోటులో రక్షణ పరికరాలైన లైఫ్ జాకెట్లు, టార్చ్‌లైట్‌తో పాటు ప్రతి బోటుకు జీపీఎస్ పరికరం అమర్చుకోవాలి. బోట్లుపై సముద్రంలోకి వెళ్లే వారు వీలైనంత వరకు దగ్గర దగ్గరగా వేట సాగించాలి. దీంతో అత్యవసర పరిస్థితిలో పరస్పర సహకారం, సమాచార మార్పిడికి వీలుంటుంది.

తుపాన్ల వేళ మత్స్యకారులకు అధికారుల సూచనలు

★ వేట సమయంలో తుపాన్లు, ఇతర విపత్కర పరిస్థితులు ఎదురైతే... వెంటనే మత్స్యకారులు తమ బోట్లను సమీప ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలకు, లేదా చేపలరేవులకు తీసుకెళ్లాలి. ★ మత్స్యకారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వేట సాగించితే... ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించొచ్చని జేడీ సూచించారు.

వైకాపాకు బొలిశెట్టి రాజీనామా

ఎస్.రాయవరం: మండలంలో వైకాపాకు భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు, ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు ఎంపీపీ పదవికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో కనీసం సమస్యలు చెప్పుకోవడానికి జగన్ కలిసే అవకాశం కల్పించలేదని పార్టీ పెద్దలు, మంత్రులు, జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కన్వీనర్లకు కోరినా ఫలితం లేదన్నారు. పార్టీ వల్ల ఎటువంటి ప్రయోజనం పొందలేదని, తమను పార్టీ చిన్న చూపు చూసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఏ పార్టీలో చేరే ఆలోచన లేదన్నారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

విశాఖపట్నం: నగర ప్రజల సమస్యలు పరిష్కరించేలా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. అన్ని జోనల్, ప్రధాన కార్యాలయాల్లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందన్నారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీల విజేత...'విశాఖ'

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులోని ఆక్వా స్విమ్మింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు రోజుల పాటు జరిగిన పదో రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ స్విమ్మింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో విశాఖ జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. జట్టు క్రీడాకారులు 15 స్వర్ణ, 27 రజత, 23 కాంస్య పతకాలతో 179 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో ఎన్టీఆర్ జిల్లా జట్టు నిలిచింది. ఆ క్రీడాకారులు 22 స్వర్ణ, 12 రజత, 9 కాంస్య పతకాలతో 155 పాయింట్లు సాధించారు. తృతీయ స్థానంలో నిలిచిన కృష్ణా జట్టు క్రీడాకారులు 9 స్వర్ణ, 10 రజత, 15 కాంస్య పతకాలతో 90 పాయింట్లు సొంతం చేసుకున్నారు. విశాఖ జిల్లా స్విమ్మింగ్ సంఘం అధ్యక్షుడు సంతోష్ శెట్టి, ఇతర సభ్యులు ఎన్.విజయకుమార్, ఆర్.విజయకుమార్ హాజరై విజేత జట్లకు ట్రోఫీలు అందించారు. టోర్నీ నిర్వాహకులు, జిల్లా స్విమ్మింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి మోహన్ వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న స్విమ్మింగ్ సంఘం అధ్యక్షుడు సంతోష్‌శెట్టి తదితరులు

మలేసియా మారిటైం విన్యాసాల్లో 'సంధాయక్'

విశాఖపట్నం, న్యూస్‌టుడే : ఇండియన్ నేవీ హైడ్రోగ్రాఫిక్ విభాగానికి(ఐఎన్‌హెచ్‌డీ) చెందిన 'ఐఎన్ఎస్ సంధాయక్' నౌక మలేసియా పర్యటనకు వెళ్లిందని ఆదివారం నేవీ వర్గాలు తెలిపాయి. ఈనెల 16 నుంచి 19 వరకు ఆదేశ మారిటైం సంబంధిత విన్యాసాల్లో భాగస్వామ్యం అయిందని పేర్కొన్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా సముద్ర ఛార్టులను, హైడ్రోగ్రాఫ్‌లను పూర్తి ఆధునికంగా రూపొందించడంలో నౌక సత్తా చాటుతోందని వివరించాయి. మలేసియా క్లాంగ్ పోర్టులో ఆ దేశ నౌకాదళం అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ఈ నౌక పూర్తి దేశీయ సాంకేతికతతో నిర్మితమై, 2024 ఫిబ్రవరిలో జాతికి అంకితమైందని నేవీ వర్గాలు వివరించాయి.

క్లాంగ్ పోర్ట్‌కు చేరిన ఐఎన్‌హెచ్‌డీ వెసల్ సంధాయక్

రెవెన్యూ అధికారులపై కబ్జాదారుల దాడి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వ స్థలం ఆక్రమణను అడ్డుకునేందుకు వెళ్లిన రూరల్ రెవెన్యూ అధికారులపై కబ్జాదారులు దాడికి పాల్పడ్డారు. జీవీఎంసీ ఏడో వార్డు పరిధి రామానాయుడు స్టూడియో కొండ దిగువన తిమ్మాపురం గ్రామంలో సుమారు 80 గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమించి కొందరు భవనం నిర్మిస్తున్నారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిశోర్, వీఆర్వో దుర్గాప్రసాద్‌లు ఆక్రమణను అడ్డుకునేందుకు వెళ్లారు. ఈ సమయంలో కబ్జాకు పాల్పడుతున్న కొర్రాయి రమణమ్మ, కె.అప్పయ్యమ్మ, శ్యామ్ తదితర కుటుంబ సభ్యులు వారిపై దాడికి యత్నించి వాగ్వాదానికి దిగారు. దీంతో రెవెన్యూ ఆర్ఐ ఆక్రమణదారులపై పీఎంపాలెం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అధికారులపై దాడికి పాల్పడిన ముగ్గురిని స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నట్లు సీఐ జి.బాలకృష్ణ తెలిపారు.

తిమ్మాపురంలో ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడం

✦ **ఆక్రమణల జోరు:** ఏడో వార్డు పరిధి తిమ్మాపురం గ్రామంలో కొండలపై ప్రభుత్వ స్థలాలను చదును చేసి విరివిగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. గ్రామంలో పెద్దలుగా చలామణి అవుతున్న కొందరు నాయకులు రాత్రి వేళ దాదాపు 80 నుంచి 100 గజాల స్థలాలను చదును చేసి రూ.8 నుంచి రూ.10 లక్షలకు విక్రయాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే చాలా వరకు కొండ ప్రాంతం కబ్జాల పాలైంది. దీనిపై భీమిలి ఆర్డీఓ దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భారీ వర్షం

అనంతగిరి, న్యూస్‌టుడే: అనంతగిరి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణమంతా మేఘావృతమై ఉండగా మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వర్షం ప్రారంభమై సుమారు రెండు గంటలసేపు భారీ వర్షం పడింది. జనజీవనం స్తంభించింది. విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ప్రయాణికులకు దారి కనిపించకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. రహదారిపైకి వర్షపు నీరు చేరింది. డముకు, అనంతగిరి, కాశీపట్నం, శివలింగపురం, చిలకలగెడ్డ గ్రామాల్లో భారీ వాన పడింది.

ఆదివాసీలకే శతశాతం ఉద్యోగాలివ్వాలి

పాడేరు, న్యూస్‌టుడే: ఐదో షెడ్యూల్డ్ ప్రాంత ప్రత్యేక చట్టాల ఆధారంగా ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని, ఏజెన్సీలో ఉద్యోగాలు స్థానిక గిరిజనులకు కేటాయిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. మెగా డీఎస్సీలో ప్రకటించిన ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ పోస్టులను స్థానిక ఎస్టీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏలో జరుగుతున్న సమావేశాల్లో ఆదివాసీల అభిప్రాయాలతో పాటు అర్జీలు స్వీకరించడానికి ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు.

JOBS

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 9014651068, 7075633416.

అధిక లోడు వాహనాలతో వంతెనలకు ముప్పు : అయ్యన్న

కశింకోట, న్యూస్‌టుడే: అన్‌రాక్ కర్మాగారానికి పరిమితికి మించిన లోడుతో లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో తాళ్లపాలెం - నర్సీపట్నం రహదారిలో వంతెనల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని సభాపతి అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. మామిడివాక గెడ్డపై వంతెనను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. గత వారం ఆర్అండ్‌బీ అధికారులు వంతెనను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారన్నారు. 20 టన్నుల లోడుతో వెళ్లాల్సిన లారీలు 60 టన్నుల ముడి సరకును తరలిస్తుండటంతో వంతెన శిథిలావస్థకు చేరిందన్నారు. వారం రోజుల్లో సాంకేతిక నిపుణుల బృందం పరిశీలన తర్వాత వారి సూచనల మేరకు కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలా? మరమ్మతు చేస్తే సరిపోతుందా చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. కొత్తగా వంతెన నిర్మాణానికి సుమారు రూ.15 కోట్లు ఖర్చవుతుందన్నారు.

ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ.. నర్సీపట్నం - చింతపల్లి రోడ్డును నాలుగు వరసలుగా విస్తరించాలని, చింతపల్లి నుంచి మన్యం వరకు రెండు లైన్లు విస్తరించడానికి ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు కృషి చేయాలని సభాపతిని కోరారు. ఆర్అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజినీరు జాన్ సుధాకర్, అనకాపల్లి ఏఈ ఎన్.సాంబశివరావు, నర్సీపట్నం డీఈ ఆర్.ఆర్.విద్యాసాగర్, సహాయ ఇంజినీరు కె.నారాయణరెడ్డి. ఎన్.ఎల్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాలెం వద్ద మామిడివాక వంతెన పరిశీలిస్తున్న సభాపతి అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే కొణతాల, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పీలా, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ తదితరులు

పిల్లల్లో మానసిక సమస్యలకు ఉచిత చికిత్స

'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్'లో సకల సౌకర్యాలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే

పిల్లల్లో మానసిక సమస్యలను గుర్తించి చికిత్స అందించడానికి పెదవాల్తేరు ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పథకంలో భాగంగా ఇటీవల దీన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం బాలల్లో మానసిక సమస్యలు పెరుగుతున్నాయని వాటిని ముందుగానే గుర్తించి వైద్య సేవలు అందించాలని, లేకపోతే వయసు పెరిగే కొద్దీ అవి తీవ్ర రూపం దాలుస్తాయని ఆసుపత్రి వైద్యులు చెబుతున్నారు. గతంలో మానసిక ఆసుపత్రిలో వారానికి ఒక రోజు పిల్లలకు ఓపీ ఉండేది. సరైన మందులు కూడా ఉండేవి కాదు. 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్' కారణంగా ఆ సమస్య తీరింది.

● **వైద్య సదుపాయాలు ఇలా..:** నిత్యం ఓపీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది. ఈ విభాగంలో 40 పడకలు ఉన్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్లు 3, పీజీ వైద్యులు 9 మంది ఉన్నారు. వ్యాధికి చికిత్స అందించిన తర్వాత ఉచితంగా మందులు అందజేస్తారు.

మానసిక ఆసుపత్రిలో పిల్లల ప్రత్యేక విభాగం

● **అందించే చికిత్సలు ఇలా..:** పలువురు బాలలు హైపర్ యాక్టివ్‌గా ఉంటారు.. విపరీతమైన విసుగు, కోపాన్ని ప్రదర్శిస్తుంటారు. దేనిపైనా ఏకాగ్రత నిలపరు. మిగతా పిల్లల్లో కలవరు. ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారు. ఇలాంటి వారికి బిహేవియర్ థెరపీ ఇచ్చి సాధారణ స్థితికి తీసుకొస్తారు. అవసరమైతే ప్రత్యేక విద్య అందిస్తారు. మాటలు తడబడుతుంటే స్పీచ్ థెరపీ ఇస్తారు.

ప్రయోజన సమాచారం

● 'ప్రస్తుతం రోజుకు 10 నుంచి 15వరకు కొత్త కేసులు వస్తున్నాయి. ఇన్‌పేషెంట్లుగా 25 మంది వరకు ఉన్నారు. 35 నుంచి 40 మంది నిరీక్షణలో ఉంటున్నారు. ఆసుపత్రి సేవలు అవసరమైన వారు 0891-2754918 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలి' అని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి తెలిపారు.

భర్త కళ్లముందే భార్య మృతి



లంకెలపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జాతీయ రహదారి లంకెలపాలెం కూడలికి సమీపంలో ఆదివారం మధ్యాహ్నం రోడ్డు దాటుతున్న మహిళను లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లంకెలపాలెం శ్రీరంగనగర్‌కాలనీకి చెందిన దాసరి లక్ష్మణరావు, **ఆదిలక్ష్మి**(67) భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కూర్మన్నపాలెంలో నివాసం ఉంటున్న పెద్ద కుమార్తె దగ్గరికి వెళ్లేందుకు ఆదివారం భార్యభర్తలిద్దరు పయనమయ్యారు. లంకెలపాలెం కూడలి సమీపంలోని బస్టాప్ వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గాజువాక నుంచి అనకాపల్లి వెళుతున్న సిమెంట్ లారీ ఆదిలక్ష్మీని ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. భర్త లక్ష్మణరావు కొద్ది క్షణాల ముందే రోడ్డు దాటడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. కళ్లెదుటే భార్య మృతిచెందడంతో కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. డ్రైవరును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు కార్మికులు ..

విశాఖపట్నం, న్యూస్‌టుడే: డాక్‌యార్డు సమీప ప్రైవేట్ గోదాముల వద్ద గోడ కూలి సివిల్ పనులు చేస్తున్న ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతి చెందిన ఘటనపై ఆదివారం మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాలు.. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన కార్మికులు ధర్మారావు(50), రామారావు(60) భవన నిర్మాణ పనికి వెళ్లారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో వారు పని చేస్తున్న ప్రదేశంలో అయిదున్నర అడుగుల ఎత్తులో ఉన్న గోడ ఒక్కసారిగా కూలిపోయి, వారిపై పడింది. గాయపడిన బాధితుల్ని కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఇద్దరూ చనిపోయారని పోలీసులు తెలిపారు.

నేడు గుర్రంపాలెంలో వ్యవసాయ మంత్రి పర్యటన

పెందుర్తి, న్యూస్‌టుడే: 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం గుర్రంపాలెంలో పర్యటిస్తారని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఇంటింటి ప్రచారంలో మంత్రి పాల్గొంటారన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	95	85
లైవ్	117	105
డ్రెస్డ్	170	180
స్కిన్‌లెస్	193	190

శాకంబరిగా బాపనమ్మ

బాపనమ్మతల్లి

నూకాలమ్మ

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా సీతపల్లిలో గడిబాపనమ్మతల్లి ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మైదాన, మన్యం ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యరమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

బాపనమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు

నూకాలమ్మకు ప్రత్యేక పూజలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా రాజవొమ్మంగి గ్రామ దేవత నూకాలమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

ఏకలవ్యులకు యాతన

నత్తనడకన భవన నిర్మాణాలు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించేందుకు జి.మాడుగులలో 2020-21 సంవత్సరంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల (ఈఎంఆర్ఎస్) మంజూరైంది. అప్పట్లోనే నిర్మాణ పనులు ప్రారంభించినా నేటికీ పూర్తి కాలేదు. నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. పరాయిపంచన ఓ భవనంలో విద్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. చాలీచాలని గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

జి.మాడుగుల ఏకలవ్య పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు సుమారు 300 విద్యార్థిని, విద్యార్థులు చదువుతున్నారు. పి.జి.మాడుగుల సమీపంలో పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభించి ఐదేళ్లు అవుతోంది. కొత్తూరులోని గురుకుల పాఠశాల అదనపు భవనంలో ప్రస్తుతం ఈ విద్యాలయం కొనసాగుతోంది. వసతిగృహం, తరగతులు రెండూ ఒకేచోట నిర్వహిస్తున్నారు. ఇక్కడ విద్యార్థినుల బాధలు వర్ణనాతీతం. భోజనాలు వండేందుకు, తినేందుకు సరిపడా వసతి లేదు. గురుకుల, ఏకలవ్య విద్యార్థులకు ఒకే దగ్గర వండి పెడుతున్నారు. కొత్త భవనంలో ఇప్పటికీ కొన్ని తరగతి గదులకు మాత్రమే టైల్స్ వేశారు. బాలురు, బాలికలు ఉండే భవనాలు పూర్తి కాలేదు. పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశిస్తున్నా ఫలితం ఉండడం లేదు. ఈ ఏడాదీ ఇబ్బందులు తప్పేలా లేవని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

అసంపూర్తిగా భవన నిర్మాణం

వసతి సమస్య తీర్చాలి

ఏకలవ్య విద్యార్థుల వసతి సమస్యను వెంటనే తీర్చాలి. పాఠశాల నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నా కుమారుడు పాఠశాలలో ఐదో తరగతిలో చేరి ఈ ఏడాది పదో తరగతికి వచ్చాడు. ఐదేళ్లుగా చాలీచాలని గదుల్లో అవస్థల నడుమ చదువు కొనసాగిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఐదేళ్లుగా నిర్మాణాలు ముందుకు కదలడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందిం పనులు పూర్తి చేయాలి. – సాగెని కోటి, విద్యార్థి తండ్రి, జి.మాడుగుల

సామాజిక తనిఖీ ప్రజావేదిక నేడు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికను సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసవిశ్వనాథ్ తెలిపారు. డ్వామా పీడీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రజావేదికలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల ఒకటి నుంచి 20 వరకు తనిఖీ బృందాలు అన్ని గ్రామాల్లో పర్యటించి, పనులను పరిశీలించి తగిన సమాచారాన్ని సేకరించాయన్నారు.

రాకపోకల పునరుద్ధరణ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: వాలమూరు వద్ద వాలీ సుగ్రీవ బొమ్మల మలుపులో శుక్రవారం రెండు లారీలు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు మూడు రోజుల పాటు నిలిచిపోయాయి. ఎట్టకేలకు ఆదివారం పొక్లెయిన్ల సహాయంతో లారీలను తొలగించారు. వెంటనే మరో ట్యాంకరు అదే ప్రదేశంలో నిలిచిపోవడంతో మళ్లీ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రానికి ట్యాంకరును కూడా తొలగించడంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి.

ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా చెట్లు

రంపచోడవరం-గోకవరం రహదారిలో..

రంపచోడవరం నుంచి గోకవరం వెళ్లే రహదారిలో కొన్ని చోట్ల భారీ వృక్షాలు ప్రమాదభరితంగా ఉన్నాయి. ఎప్పుడు కూలుతాయోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారిలో భద్రాచలం, కాకినాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాలకు వెళ్లే వారంతా రాకపోకలు సాగిస్తుంటారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు లారీలు వెళ్తుంటాయి. దేవరాతిగూడెం, సుద్దగొమ్ము, నరసాపురం గ్రామాలకు సమీపంలోని భారీ వృక్షాలు ఎండిపోయి పడిపోయేలా ఉన్నాయి. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి ఎండిన చెట్లను తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, రంపచోడవరం

రోడ్డుపై పశువులు.. తప్పని పాట్లు

శరభవరంలో జాతీయ రహదారిపై పశువులు

జాతీయ రహదారి 516-ఈ విస్తరణ పనులు పూర్తికావచ్చాయి. పలుచోట్ల పశువులు రహదారిని ఆవాసంగా చేసుకుని ఉంటుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శరభవరం, సూరంపాలెం, రాజవొమ్మంగి, దూసరపాము, వట్టిగెడ్డ తదితర గ్రామాలతోపాటు అడ్డతీగల, గంగవరం మండలాల్లోనూ ఇదే పరిస్థితి. ఇటీవల దూసరపాము శివారున పశువులు పరుగెత్తుకుంటూ రహదారిపైకి రావడంతో ద్విచక్ర వాహనచోదకుడు గాయపడ్డాడు. కుమార్తెను చూసేందుకు వచ్చిన ఓ వ్యక్తి వట్టిగెడ్డ సమీపంలో పశువులు అడ్డురావడంతో ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి పశువుల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు అతికించాలని అధికారులు ఆదేశాలు జారీచేసినా నేటికీ అమలు కాలేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. – న్యూస్‌టుడే, రాజవొమ్మంగి

అందేంత ఎత్తులో అపాయం

చావడికోట పంచాయతీ తుర్రవాడ గ్రామం ఎత్తయిన కొండపై ఉంది. అతి కష్టంపై ఇక్కడ విద్యుత్తు సదుపాయాన్ని కల్పించారు. ఇక్కడ పిల్లలకు సైతం చేతికి అందేలా ట్రాన్స్‌ఫార్మర్ అమర్చడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. దీని పక్కనే గిరిజన ప్రాథమిక పాఠశాల ఉండటంతో బాలలు ఆడుకుంటూ ఇక్కడకు వచ్చే అవకాశం ఉంది. అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – మారేడుమిల్లి, న్యూస్‌టుడే

జలాశయంపై నిర్లక్ష్యం

పాడైన గేటు చూపిస్తున్న రైతులు

కినపర్తి పంచాయతీ చుట్టుబంద సమీపంలోని తొణుకుల గెడ్డ జలాశయం మరమ్మతులకు గురైంది. గత కొన్నేళ్లుగా నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో జలాశయం పూడికతో నిండిపోవడంతోపాటు గేట్లు, ప్రధాన కాలువలు పాడయ్యాయి. సాగునీటి కోసం రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా పాలనలో పలుమార్లు అధికారులు, నేతలకు మొరపెట్టినా ఫలితం లేకపోయిందని వారంతా వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టిసారించి జలాశయాన్ని బాగు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక ఎస్.ఈ. ఎ.జె.ఈ రామకృష్ణను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. ప్రభుత్వం ఇటీవల రూ.20 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. జలాశయంలో నీరు తగ్గగానే ప్రధాన గేటు, ఇతర పనులు చేపడతామని చెప్పారు. – కొయ్యూరు, న్యూస్‌టుడే

అ వీ ఇ వీ

వంతెనలు బాగు చేయరూ..

సీలేరు, న్యూస్‌టుడే: గత ఏడాది తుపానుకు గంగవరం, దుప్పిలవాడ అగ్రహారం వద్ద వంతెనలు కొట్టుకుపోయాయని, మరమ్మతులు చేయించాలని సీపీఐ మండల కార్యదర్శి కవర్ల భగవాన్, గిరిజన సమాఖ్య మండల అధ్యక్షుడు పాంగి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. దీనిపై ఎన్నిసార్లు ఆందోళనలు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. వాగు దాటాలంటే భయంగా ఉందని పేర్కొన్నారు.

చలో ఐటీడీఏ జయప్రదానికి పిలుపు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతంలో ఆదివాసీలకు వందశాతం ఉద్యోగాల సాధన కోసం ఈనెల 21, 22న నిర్వహించనున్న చలో ఐటీడీఏ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిరుద్యోగుల సంఘం పాడేరు డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. జీవో నం.3 రద్దుతో గిరిజన నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందన్నారు.

ఫులే, అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: ఫులే, అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలని జై భీం ఫౌండేషన్ అధ్యక్షులు ఎస్.కోటేశ్వరరావు పేర్కొన్నారు. జి.మాడుగుల జూనియర్ కళాశాలలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్, ఫులే చిత్రపటాలకు నివాళి అర్పించారు. భారత రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించారు. బాంసెప్ క్యాడర్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మేనక ఫులే, శిక్షకుడు బాలాజీ నాయక్, సభ్యులు పాల్గొన్నారు.

మేకలకు వ్యాధులతో ఆందోళన

నోటిపై పుండ్లతో మేక

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: కంపుమానుపాకలు గ్రామంలో మేకలకు వ్యాధులు సోకాయి. గ్రామంలో వందకు పైగా మేకల ముఖంపై, నోటివద్ద పుండ్లు వచ్చి మేత మేయకుండా నీరసించిపోతున్నాయని రైతులు కొర్ర గంగరాజు, మొట్టడం బాలు ఆదివారం తెలిపారు. గ్రామంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరారు.

కోతుల దాడిలో బాలుడికి గాయాలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: కోతుల దాడిలో ఎనిమిదేళ్ల బాలుడు పాంగి నాయక్ తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానిక ఐటీడీఏ బి-టైపు క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న పాంగి జగదీష్ కుమారుడు నాయక్ ఆదివారం సాయంత్రం ఇంటివద్ద ఆడుకొంటుండగా ఒక్కసారిగా కోతులు మీదపడి కరిచాయి. దీంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. రంపచోడవరంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, వీటిని నిర్మూలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చికిత్స పొందుతున్న బాలుడు

కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాలకు ప్రాధాన్యం

అంతర్ల గ్రామస్థులకు పథకాలు వివరిస్తున్న తెదేపా నాయకులు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యమిస్తోందని తెదేపా చింతపల్లి పట్టణ అధ్యక్షుడు రీమల ఆనంద్ తెలిపారు. ఆదివారం అంతర్లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పథకాలు వివరించారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామన్నారు. తెదేపా నాయకులు అనిల్‌కుమార్, గాంధీ పడాల్, ముర్లభాస్కర్, మంగ్లు పాల్గొన్నారు.

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: ప్రజాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని జడ్పీటీసీ సభ్యులు వాళ్ల రంగారెడ్డి అన్నారు. ఆదివారం పలు గ్రామాల్లో చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు, పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రంపచోడవరం మార్కెట్ కమిటీ సభ్యులు ముత్యాల రామారావు, ప్రకాశరావు, కన్నారావు, దుర్గారావు పాల్గొన్నారు.

కరపత్రాలు అందిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు రంగారెడ్డి, నేతలు

శాంతించిన గోదావరి

దేవీపట్నం, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదావరి శాంతించింది. గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద గోదావరి తగ్గడంతో ఆలయం పూర్తిగా బయటపడింది. పోశమ్మగండి నుంచి డి.రావిలంక వరకూ రహదారిపై నీరు పూర్తిగా తగ్గడంతో పురుషోత్తపట్నం వైపునకు వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. సీతపల్లి వాగులో వరద ఉద్ధృతి తగ్గడంతో దామనపల్లి, వెలగపల్లి, మద్దిరాతిగూడెం పరిసర ప్రాంతాల గిరిజనులు ఇందుకూరుపేట వైపునకు రాకపోకలు సాగిస్తున్నారు. పాపికొండల విహారయాత్రకు జలవనరులశాఖ అధికారులనుంచి అనుమతులు లేకపోవడంతో 15 పర్యాటక బోట్లు గోదావరి ఒడ్డునే ఉన్నాయి.

పోశమ్మగండి వద్ద నిలిచిన పర్యాటక బోట్లు

పర్యాటకులతో మారేడుమిల్లి కళకళ

మారేడుమిల్లిలో వాహనాల రద్దీ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి ప్రాంతానికి ఆదివారం పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. జలతరంగిణి, అమృతధార జలపాతాలతోపాటు, దుంపవలస, వలస జలపాతాల వద్ద ఉల్లాసంగా గడిపారు. గుడిస కొండపైకి సందర్శకులు క్యూ కట్టారు. సూర్యోదయాన్ని చూడడానికి ఆసక్తి చూపారు. కాటేజీలు, రిసార్టుల్లో రద్దీ నెలకొంది.

జీతాలు చెల్లించక ఇబ్బందులు

దేవీపట్నం, న్యూస్‌టుడే: సత్యసాయి రక్షిత తాగునీటి పథకం కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ఈ పథకంలో పని చేస్తున్న 53 మంది కార్మికులకు 19 నెలలకు పైగా వేతన బకాయిలు చెల్లించకపోవడంతో వారంతా సమ్మె బాటపట్టారు. దీంతో మన్యంతో పాటు మైదాన ప్రాంతాల పరిధిలోని దాదాపు 80 గ్రామాలకు 13 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఆదివారం ఇందుకూరుపేటలో కార్మికులు మాట్లాడుతూ.. జీతాలు చెల్లించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

ఇందుకూరుపేటలో నినాదాలు చేస్తున్న సత్యసాయి పథక కార్మికులు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: ఏడాదికాలంగా వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని మండలంలోని క్లాప్‌మిత్రలు ఆదివారం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు 12 నెలలు వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు.

ఘనంగా నూకాలమ్మ సారె ఊరేగింపు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: ఆర్వీనగర్‌లో నూకాలమ్మ అమ్మవారి సారె ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమసరత సేవా ఫౌండేషన్ జిల్లా సహ కన్వీనర్ కొక్కుల లావణ్యగీత ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సారె ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. ఫౌండేషన్ మహిళా కన్వీనర్ గెమ్మెల నర్సమ్మ, మండల ధర్మప్రచారక్ వీరస్వామి భక్తులు పాల్గొన్నారు.

సారె ఊరేగింపులో మహిళలు, భక్తులు

వాహనాలకు ధ్రువపత్రాలు తప్పనిసరి

అవగాహన కల్పిస్తున్న సీఐ కన్నపరాజు

కూనవరం, న్యూస్‌టుడే: చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సీఐ కన్నపరాజు సూచించారు. జగ్గవరం క్రాస్‌రోడ్ వద్ద ఆదివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలకు ధ్రువపత్రాలు ఉండాలన్నారు. హెల్మెట్ ధరించాలన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిమ్ స్టార్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా క్రికెటు టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ టోర్నీలో నియోజకవర్గంలో 11 మండలాల నుంచి 60 జట్లు పాల్గొన్నాయి. దినేష్ లెవెన్ జట్టు విన్నర్స్‌గా, సదాబ్ లెవెన్ జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. విజేత జట్టుకు ఎమ్మెల్యే శిరీషాదేవి రూ.35 వేలు, రన్నర్స్ జట్టుకు జనసేన అరకు పార్లమెంటు ఇన్‌ఛార్జి గంగులయ్య రూ.20 వేలు అందజేశారు. తెదేపా మండల మాజీ అధ్యక్షుడు అడబాల బాపిరాజు, మాజీ సర్పంచి నిరంజనీదేవి, ప్రధాన కార్యదర్శి అనంతమోహన్, జనసేన మండల అధ్యక్షుడు పాపోలు శ్రీనివాసరావు, నేతలు కుండ్ల రాజశేఖరరెడ్డి, కాకి స్వామి, పండా కుమారి తదితరులు నగదుతోపాటు షీల్డ్‌ను అందజేశారు. నిర్వాహకులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ప్రశాంత్, ఎర్రయ్య, సిద్ధార్థ, రవికిరణ్, సూర్యతేజ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో కూటమి నేతలు, నిర్వాహకులు

కల్వర్టు లేక.. కష్టం తీరక!

జి.మాడుగుల మండలంలోని భీరం, దిగభీరం గ్రామాల మధ్యలో వాగుపై కల్వర్టు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ గ్రామాల మధ్యలో వాగు ఉండటంతో భీరంలో ప్రాథమిక పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కొందరు వాగు దాటలేక మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడివీధి, అనర్భ పాఠశాలలకు వెళ్లి చదుకోవాల్సిన పరిస్థితి. సమీపంలో పాఠశాల ఉన్నా.. మధ్యలో వాగు ఆటంకంగా మారింది. ఆదివారం కురిసిన భారీ వర్షానికి వాగు పొంగి ప్రవహించింది. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జి.మాడుగుల

వర్షంతో పొంగిన భీరం వాగు

నీటి వృథాకు అడ్డుకట్ట

స్పందనకు వందనం

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ జడ్పీకాలనీలో పైపులైను లీకేజీతో వారాల తరబడి తాగునీరు వృథా అయింది. దీనిపై ఈనెల 13న 'రోజుల తరబడి తాగునీరు వృథా' శీర్షికన 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ ప్రాంతంలో రెండు రోజులుగా మరమ్మతు పనులు చేపడుతున్నారు. లీకేజీలను కట్టడి చేశారు.

అరకులోయలో పైపులైనుకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

దీపాల ఏర్పాటు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగిలో జాతీయ రహదారి పక్కన వీధిదీపాలు వెలగక వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈ నెల 20న 'ఈనాడు'లో 'దీపాలు వెలగక.. చీకట్లో ఇక్కట్లు' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనికి సర్పంచి జి.రమణి, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి స్పందించారు. దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

మర్రివాడలో పేదలకు చీరలు పంచుతున్న తెదేపా నేతలు

రంపచోడవరం, వరరామచంద్రాపురం, ఎటపాక, కూనవరం, రాజవొమ్మంగి, దేవీపట్నం, న్యూస్‌టుడే: రంపచోడవరం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి కృషి చేస్తున్నారని తెదేపా నాయకులు కొనియాడారు. ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలను ఆదివారం నిర్వహించారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చోటు ఆధ్వర్యంలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. మర్రివాడలో తెదేపా నేత పెంటపాటి అనంతమోహన్ ఆధ్వర్యంలో పేదలకు చీరలు అందించారు. నేతలు అడబాల బాపిరాజు, వై.నిరంజనీదేవి, కారం సింహాచలం, బాబి పాల్గొన్నారు. వీఆర్‌పురం మండలంలో తెదేపా నేతలు వేడుకలు నిర్వహించారు. ఎటపాక తెదేపా నాయకులు వృద్ధులకు అన్నదానం చేశారు. నాయకులు చలపతిరావు, రమేష్‌బాబు, చందు, శ్రీకాంత్ పాల్గొన్నారు. కోతులగుట్ట వైద్యశాలలో తెదేపా నాయకులు రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. గడ్డిపాటి ప్రసాదు, చదలవాడ శివకుమార్, రంజిత్‌కుమార్, హరీశ్ పాల్గొన్నారు. రాజవొమ్మంగిలో మండల తెదేపా అధ్యక్షుడు జి.పెద్దిరాజు, జడ్డంగిలో సొసైటీ మాజీ అధ్యక్షుడు జి.తాతారావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఏఎంసీ ఛైర్మన్ లక్ష్మణరావు, నాయకులు సావిత్రి, కేశవ్, తాతారావు పాల్గొన్నారు. అడ్డతీగలలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. బాలయోగి, నానిబాబు, రాజా పాల్గొన్నారు. ఇందుకూరు ఆర్ అండ్ఆర్ పునరావాస కాలనీ-1లో పార్టీ మండలాధ్యక్షులు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కేకు కోశారు.

ఆర్వో ప్లాంట్‌కు శంకుస్థాపన

కూనవరం, న్యూస్‌టుడే: అయ్యవారిగూడెంలో చింతూరు ఐటీడీఏ నిధులతో ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు జడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఇక్కడి తాగునీటి సమస్యను గ్రామస్థులు పీవో అపూర్వ భరత్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన నిధులు మంజూరు చేశారు. సర్పంచి తెల్లం నిరోషా, ఎంపీటీసీ సభ్యురాలు కారం జయసుధ, కూటమి నాయకులు భాస్కర్‌రావు, ప్రకాశరావు, ఉమామహేశ్వరరావు, నరేంద్ర, నూపా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: రేఖపల్లి పంచాయతీలోని గొల్లగూడెంలో తాగునీటి పథకం మోటారును ఆదివారం బాగు చేయించారు. తాగునీటి సరఫరాను సర్పంచి సరోజిని ప్రారంభించారు. వార్డు సభ్యులు లక్ష్మి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు విజయ, కూటమి నాయకులు

కార్మికులకు న్యాయం చేయాలి

పాడేరు, న్యూస్‌టుడే: పొరుగుసేవల కార్మికులను సీనియారిటీ ఆధారంగా క్రమబద్ధీకరించాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షులు అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పాడేరులో కార్మికులతో సమావేశం నిర్వహించారు. వసతిగృహ కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలని, పనిభారం తగ్గించి వేతనాలు పెంచాలని కోరారు. కార్మికులు పాల్గొన్నారు.

సమావేశమైన కార్మికులు

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు : 89853 66570, అరకులోయ: 63034 86346
రంపచోడవరం: 94908 77172

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: నెల్లిమెట్ల-లబ్బర్తి ప్రధాన రహదారి నుంచి సీతారామపురం వెళ్లే మార్గం రాళ్లు పైకి తేలి అధ్వానంగా ఉంది. మరమ్మతులు చేపట్టాలి. – రాజు, రాజవొమ్మంగి, ✔: సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. – యాదగిరీశ్వరరావు, ఎంపీడీవో

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: సున్నంపాడు నుంచి రామన్నవలస కూడలిలో బస్‌షెల్టరు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. – కృష్ణారెడ్డి, తుర్రూరు, ✔: బస్‌షెల్టరు నిర్మాణానికి చర్యలు చేపడతాం. – శ్రీనివాసవిశ్వనాథ్, ఎంపీడీవో

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చిత్రాళ్లగొప్పు వద్ద నిర్మించిన ప్రభుత్వ దుకాణ సముదాయం నిరుపయోగంగా మారింది. ఈ ప్రాంతంలో చెత్త పేరుకుపోయింది. – అబ్బాయినాయుడు, గొందిపాకలు, ✔: చెత్తను పంచాయతీ కార్మికులతో తీయిస్తాం. దుకాణ సముదాయాన్ని వినియోగంలోకి తీసుకొస్తాం. – అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి, లంబసింగి

రంపచోడవరం, న్యూస్‌టుడే: నరసాపురం నుంచి కన్నారం వరకు నాలుగేళ్ల క్రితం చేపట్టిన బీటీ రహదారి పనులు ఇంకా పూర్తికాలేదు. గుత్తేదారుడు మెటల్ పరచి వదిలేశారు. – కారం బాపిరాజుదొర, కన్నారం, ✔: నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించాం. త్వరలో పనులు పూర్తి చేస్తాం. – ఉమాశంకర్, డీఈ పీఆర్(ప్రాజెక్టు), రంపచోడవరం

అక్రమ కట్టడాల తొలగింపులో నిర్లక్ష్యమెందుకు?

ఎటపాక, న్యూస్‌టుడే: ఏజెన్సీలో అక్రమ కట్టడాలు కూల్చివేయడంలో అధికారుల నిర్లక్ష్యం తగదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. పట్టుచీర గ్రామంలో ఆదివారం ఆదివాసీ హక్కులపై జరిగిన చైతన్య కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చినా అధికారులు అక్రమ కట్టడాలను గుర్తించి కూల్చకపోవటం విచారకరమని పేర్కొన్నారు. అధికారులు గిరిజనేతరులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. సత్యనారాయణ, చెల్లెమ్మ, వెంకయ్య, భద్రయ్య పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సంఘ ప్రతినిధులు

పారదర్శకంగా పోస్టుల భర్తీకి వినతి

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలో ఆశా కార్యకర్తల పోస్టులను పారదర్శకంగా భర్తీ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ సుందరరావు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ కోరారు. ఇన్‌ఛార్జి డీఎంహెచ్ఓ విశ్వేశరరావునాయుడిని ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. జిల్లాలో 124 ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. సామాజిక ఆరోగ్య కార్యకర్తలుగా పనిచేస్తున్నవారిని ఆ గ్రామాల్లో ఆశా కార్యకర్తలుగా నియమించాలని కోరారు. నియామకాల్లో రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చూడాలన్నారు.

డీఎంహెచ్ఓకు వినతిపత్రం సమర్పించిన సీఐటీయూ, గిరిజన సమాఖ్య నేతలు

మార్కెట్ కమిటీ సభ్యుల నియామకం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా కిల్లో ఊర్మిళ నియమితులైన సంగతి తెలిసిందే. వైస్ ఛైర్మన్‌గా రొబ్బ యశ్వంత్, సభ్యులుగా గొల్లి దేవి, వరలక్ష్మి, సేవా ఈశ్వరమ్మ, కినిబిరి రాజేశ్వరి, మొట్టడం శరభన్నదొర, చిందాడ అప్పారావు, చిటికెల కమల, ఎన్ చెన్నకేశవ, నంబార సత్యవతి, పెదరెడ్డ బేతాళుడు, బండారు సాంబమూర్తి, కిముడు కృష్ణమూర్తి, బైడు ప్రమీలలను నియమించారు. త్వరలో ప్రమాణస్వీకారం చేస్తామని ఛైర్‌పర్సన్ తెలిపారు.

(c) eenadu

విశ్వవినోదిని.. విజయ ప్రదాయిని

కంఠంరాజుకొండూరు మహంకాళి అమ్మవారి దేవాలయంలో ఆదివారం బోనాల ఉత్సవం వైభవంగా జరిగింది. దాదాపు 8 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన మహిళలు ఊరేగింపుగా బోనాలు సమర్పించారు. ఉత్సవ నిర్వహణకు చిలువూరుకు చెందిన రంగిశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జగదీష్, రమేష్ తోడ్పాటు అందించారు. ఈవో సునీల్‌కుమార్, వంశ పారంపర్య ధర్మకర్త దేవభక్తుని రంగప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. వివిధ వేషధారణలు, డప్పు కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

- న్యూస్‌టుడే, కంఠంరాజుకొండూరు(దుగ్గిరాల)

బోనాలతో మహిళలు, భక్తులు

విశేష అలంకరణలో మహంకాళి అమ్మవారు

అమృత్ 2.0 టెండర్ల గడువు పొడిగింపు

ఆగస్టు 7 వరకు దాఖలుకు అవకాశం

ఈనాడు, అమరావతి: అమృత్ 2.0 టెండర్ల గడువును అధికారులు పొడిగించారు. ఆగస్టు 7వ తేదీ వరకు దాఖలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. వాస్తవానికి అమృత్ 2.0 పనులకు సంబంధించి అధికారులు గత నెల 27న టెండర్లు పిలవడం తెలిసిందే. తాడేపల్లిలోని ఈఎన్‌సీ కార్యాలయంలో ఐదు సర్కిళ్లలోని ప్రజారోగ్యశాఖ ఎస్‌ఈలతో ఈఎన్‌సీ సమావేశం నిర్వహించి టెండర్లు పిలవడంపై నిర్ణయం తీసుకున్నారు. అలా ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పరిధిలో 86 పనులకు సంబంధించి రూ.1,092.60 కోట్లతో టెండర్లు పిలవగా, గుత్తేదార్లు ఆన్‌లైన్ బిడ్ దాఖలు చేయడానికి జులై 28వ తేదీ వరకు తొలుత గడువు విధించారు. అయితే, టెండరుదారుల నుంచి గడువు పొడిగించాలని అభ్యర్థనలు రావడంతో ఆమేరకు వచ్చేనెల 7వ తేదీ వరకు పొడిగిస్తూ ఉన్నతస్థాయి నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు గుంటూరు ప్రజారోగ్య పురపాలన సాంకేతికశాఖ విభాగం ఎస్‌ఈ శ్రీనివాస్ 'ఈనాడు'కు తెలిపారు.

అవార్డు ప్రేరణతో మెరుగ్గా పనిచేయండి

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగరపాలకసంస్థ సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్ అవార్డు అందుకోవడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వం తరఫు నుంచి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. తిరుపతిలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి కమిషనర్ ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జి ఎంహెచ్‌వో రామారావు, పారిశుద్ధ్య కార్మికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజలకు పారిశుద్ధ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు ఈ అవార్డులు ప్రేరణ కావాలని.. ప్రభుత్వం నుంచి అన్నివిధాలా సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

జీఎంసీ ఇన్‌ఛార్జి ఎంహెచ్‌వో రామారావు, పారిశుద్ధ్య కార్మికులను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి నారాయణ, పట్టాభిరామ్, సురేష్‌కుమార్ తదితరులు

సీఎం సహాయనిధితో పేదల జీవితాల్లో వెలుగులు

చెక్కు అందజేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

పట్టాభిపురం: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరులోని క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు రూ.42,14,861 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన ఆదివారం అందజేశారు. పెమ్మసాని మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయ నిధి అనేది ఒకటుందని జనం మరిచిపోయారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ నిధి ద్వారా పేదలను సీఎం చంద్రబాబు ఆదుకుంటున్నారు.

పేదల బియ్యం.. పెద్దల భోజ్యం

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

ఈనాడు - అమరావతి

గుంటూరు నగరంలో రేషన్ మాఫియాకు అడ్డే లేకుండాపోయింది. నియోజకవర్గాలవారీగా ప్రాంతాలను పంచేసుకుని ఒప్పందాలు కుదుర్చుకుని మరీ దందా సాగిస్తున్నారు. వీరికి కొంతమంది నేతలు అండగా ఉండటంతో అధికారులు సహకరించక తప్పని పరిస్థితి. ముందుగా ఒప్పందాలు చేసుకున్న వారు కాకుండా.. ఇతరులెవరైనా బియ్యం సేకరిస్తే వారిని అధికారుల ద్వారా పట్టిస్తున్నారు. మరోవైపు రేషన్ మాఫియా సభ్యుల మధ్య విబేధాలు రావడంతో నగర పరిధిలో జులై నెలలోనే రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న ఆరు వాహనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రెండు మాఫియాలో కీలకంగా ఉన్న ఇద్దరు వ్యక్తులది. నేతలకు నెలకింత ముట్టజెప్పే వారు మాత్రమే బియ్యం సేకరించి తరలిస్తున్నారు. రేషన్ బియ్యం పాలిష్ చేసే వ్యాపారులు మండలంలోని మిల్లుల్లో ఇటీవల దాడులు జరగడంతో ఇప్పుడు పేరేచర్లలోని ఓ మిల్లును కేంద్రంగా మార్చుకున్నారు. పౌరసరఫరాల సంస్థలో పని చేస్తున్న ఉద్యోగి ఒకరు మాఫియాకు అన్నివిధాలా సహకారం అందిస్తుండడంతో ఈ అక్రమాలకు అడ్డుకట్ట పడడం లేదు.

అరండల్‌పేట పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాలు

పాత్రధారులపై కేసులతో సరిపెడుతూ..

రేషన్ దుకాణాలు, కార్డుదారుల నుంచి కిలోకు రూ. 13 - రూ. 15 చెల్లించి మాఫియా బియ్యం సేకరిస్తోంది. ముందుగా నిర్ణయించుకున్న మిల్లుకు వాహనాల ద్వారా తరలిస్తున్నారు. ఇదంతా పక్కా ప్రణాళిక ప్రకారమే జరుగుతోంది. బియ్యం సేకరణ.. తరలింపు.. రవాణాలో ఎక్కడ ప్రత్యక్షంగా మాఫియా ఉండదు. వారి వద్ద పని చేస్తున్న వ్యక్తుల ద్వారానే వ్యవహారం నడిపిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేసినప్పుడు పట్టుబడితే వాహన డ్రైవర్లు, పనిచేసే వారిపై కేసులు పెడుతున్నారు. సూత్రధారులను గుర్తించి కేసులు నమోదు చేసే కఠిన చర్యలు తీసుకుంటేనే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. లెక్క కోసం కేసులు పెట్టడం, పోలీసులు పట్టుకున్నప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో చర్యలు తీసుకోవడం మినహా కఠినంగా ముందుకెళ్లడం లేదు. సూత్రధారులను తప్పించడంలో డీటీ ఒకరు కీలకంగా వ్యవహరిస్తున్నారు. మాఫియాలో విబేధాలు రావడం వల్లనే అక్రమాలు బయటపడుతున్నాయి. నగరంలోకి ఈ నెల నుంచి పల్నాడు జిల్లాకు చెందిన వ్యక్తి వచ్చి బియ్యం సేకరించి తరలిస్తున్నారు. ఈ అక్రమ వ్యవహారం లాభదాయకంగా ఉండడంతో పలువురు పోటీపడుతున్నారు. నేతలకు కాసులు కురిపించే వరంగా ఇది మారింది.

గిరులకు విరుల సిరులు..!

- రాజధాని ప్రాంతంలోని కొండలపై అటవీశాఖ దృష్టి
- 20 రకాల పూల మొక్కలు పెంచేందుకు కసరత్తు

ఈనాడు, అమరావతి

గిరులకు విరుల సిరులు కల్పించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. రాజధాని ప్రాంతంలోని కొండలపై పూల మొక్కలు పెంచే దిశగా అటవీశాఖ కసరత్తు చేస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఏడాది కాలంగా తిరిగి ఊపందుకోవడం, ఎక్కడికక్కడ భవన నిర్మాణాలతో సందడిగా మారనుండటంతో ఈ క్రమంలో అన్ని శాఖలు ఈ ప్రాంతంలో అభివృద్ధిపై దృష్టి పెట్టాయి. అలా అటవీశాఖ అధికారులు కూడా తమవంతుగా ఇక్కడ పచ్చదనం పెంచడంపై కసరత్తు చేస్తున్నారు. అలా సమీపంలోని అనంతవరం కొండ, నీరుకొండ, ఉండవల్లి కొండలపై మొక్కల పెంపకానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

నీరుకొండ గ్రామంలోని కొండ ప్రాంతం

త్వరితగతిన పట్టాలెక్కించేలా సన్నాహాలు

ఒకటి అటవీ, రెండు రెవెన్యూశాఖల పరిధిలో ఉన్న ఈ మూడు కొండలపై ఎక్కువగా పూల మొక్కలు నాటాలన్నది అటవీశాఖ ఆలోచన. సుమారు 20 రకాల జాతులను ఇక్కడ నాటడం ద్వారా ఈ ప్రాంతంలో పచ్చదనం, పూల సోయగాలను పెంచాలని యోచిస్తున్నారు. ఇందు కోసం సంబంధిత శాఖలన్నింటితో కలిసి సంయుక్తంగా ఓ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం మొదలవడం..ఎక్కడికక్కడ విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాలు ముమ్మరమైన క్రమంలో అటవీశాఖ వర్గాలు కూడా తమ ప్రతిపాదనను త్వరితగతిన పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయమై గుంటూరు కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ కాశీవిశ్వనాథరాజుతో 'ఈనాడు' మాట్లాడగా..రాజధాని పరిధిలోని కొండలపై పూల మొక్కలు పెంచే అంశంపై కసరత్తు చేస్తున్నామని వివరించారు.

నాడు కలగా మిగిలి.. నేడు కళగా మారి..

వైకాపా పాలనలో ముళ్ల పొదలతో..

రాజధాని అమరావతిని గత వైకాపా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపింది. సీడ్ యాక్సెస్ రహదారి నుంచి ఉద్దండరాయునిపాలెంలోని శంకుస్థాపన ప్రాంతానికి వెళ్లే రోడ్డు నాడు ముళ్లపొదలతో నిండిపోయి అడవిని తలపించేది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో పూర్వ వైభవం వచ్చింది. జంగిల్ క్లియరెన్స్ పనుల్లో భాగంగా పిచ్చిమొక్కలన్నింటినీ తొలగించి రహదారుల వెంట మొక్కలు నాటారు. ఏడాది కిందట నాటిన మొక్కలు ఎదిగి ప్రస్తుతం దారులన్నీ పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

- ఈనాడు గుంటూరు. న్యూస్‌టుడే తుళ్లూరు

కూటమి వచ్చాక పచ్చదనంతో..

వాళ్ల కొర్రీలు.. వీళ్లకు వర్రీలు..!

- గుంటూరు జిల్లా ఆడిట్ అధికారుల వింత పోకడ
- జడ్పీ, పీఆర్ విశ్రాంత ఉద్యోగుల పీఎఫ్‌లో తంతు

ఈనాడు, అమరావతి

వాళ్లు కొర్రీలు వేస్తున్నారు.. వీళ్లు వర్రీ కావాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నారు.. మొత్తంగా గుంటూరు జిల్లాలో ఆడిట్ అధికారుల ధోరణి కారణంగా జిల్లా పరిషత్తు, పంచాయతీరాజ్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగులు మదనపడుతున్నారు. ఇప్పుడు ఉద్యోగం చేస్తోన్న ఉపాధ్యాయులు అనారోగ్య కారణాలపై రుణాల కోసం ప్రతిపాదిస్తే.. నిబంధనలో లేని అంశాలను ప్రస్తావిస్తూ, ప్రతిపాదనలు వెనక్కి తిప్పి పంపడం మరో సమస్యగా తయారైంది. లోతుగా చూస్తే.. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్తు పరిధిలో ఇటీవల 55 మంది విశ్రాంత ఉపాధ్యాయుల పీఎఫ్‌కు సంబంధించి ఆడిట్ అధికారులు ఓ తిరస్కరణ లేఖను జడ్పీ ఉన్నతాధికారులకు పంపారు. అందులో సహేతుకం కాని కొన్ని అంశాలను పేర్కొన్నారు.

గుంటూరు జిల్లా పరిషత్తు కార్యాలయం

అన్నింటా అలా అంటే ఎలా?

ప్రధానంగా సదరు ఉపాధ్యాయులకు సంబంధించి ఓ నెలలో వారి చందా సున్నా ఉండి, తర్వాతి నెలలో ఎక్కువగా చందా నిల్వ చేశారన్నది సారాంశం. సున్నాగా ఉండడానికి గల కారణాలు స్పష్టంగా తెలపలేదన్నది ఆడిట్ వర్గాలు పేర్కొన్న అభ్యంతరం. సాధారణంగా ఖజానా శాఖ ఒక్కో సందర్భంలో ఆ నెలకు జమ చేయకపోవడం.. మరో నెలలో రెండు చందాలు కలిపి జమ చేయడం పరిపాటి. దీన్నే ప్రధాన కారణంగా చూపిస్తూ ఆడిట్ అధికారులు కొర్రీలు వేయడంతో సదరు విశ్రాంత ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. అకౌంట్ స్లిప్స్ అన్నింటిపైనా ధ్రువీకరణ ఎందుకు చేయలేదన్నదీ మరో ప్రశ్న. ఇలా అన్నింటికీ కొర్రీలు వేస్తుండడంతో ఏం చేయాలో వారికి అర్థం కావడం లేదు. జడ్పీ అధికారులు ఈ విషయంలో మిన్నకుండిపోవడం మరో సమస్యగా తయారైంది. ఉద్యోగ విరమణ అనంతరం వచ్చే ప్రయోజనాలు సరిగా అందక ఇబ్బంది పడుతున్న తమను.. ఆడిట్ అధికారుల వైఖరి మరింత ఇబ్బంది పెడుతోందని వాపోతున్నారు.

వైద్య ధ్రువపత్రాల్లోనూ అంతే

ప్రస్తుత జడ్పీ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి కొందరు అనారోగ్య కారణాలతో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడ పీఎఫ్ అధికారులు ఆడిట్ తరహాలో కొర్రీలు వేస్తుండడం మరో సమస్యగా మారింది. నిబంధనలు ఏ మెడికల్ ప్రాక్టీషనర్‌తో అయినా ధ్రువపత్రం తెచ్చుకోవచ్చని చెబుతుండగా.. సదరు అధికారులు మాత్రం ఎక్కడా లేని విధంగా సివిల్ సర్జన్, అసిస్టెంట్ సివిల్ సర్జన్ నుంచే వైద్య ధ్రువీకరణపత్రం ఉండాలని చెబుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇలా ఓవైపు వృద్ధులు, మరోవైపు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారిని అవస్థలకు గురిచేయడం సరికాదని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె.బసవలింగారావు, మక్కెన శ్రీనివాసరావు, కొడాలి శ్రీధర్ తదితరులు పేర్కొంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

గుంటూరు: కంకరగుంట ఆర్‌యూబీలోకి నీరు

జలమయమైన బృందావన్‌గార్డెన్స్ ప్రధాన రహదారి

ఇంట్లోకి చేరిన వర్షం నీరు

కుండపోత వర్షం.. రోడ్లు జలమయం

ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డు 4వ లైన్ వద్ద చెరువులా..

కలెక్టరేట్(గుంటూరు): నగరంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి కుండపోత వర్షం పడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కంకరగుంట ఆర్‌యూబీ, మూడు వంతెనలు, ప్రధాన రోడ్లపైనా వర్షం, మురుగునీరు నిలిచి రాకపోకలకు ఆటంకం కలిగింది. జిల్లాలోనూ తెరపివ్వకుండా వాన పడింది. డెల్టా ప్రాంతంలో ఇటీవల వరి సాగుకు విత్తనాలను వెద పెట్టుకున్నారు. ప్రస్తుత వర్షం కొంతవరకు పంటకు ఉపయోగమైనా వర్షం కొనసాగితే మొలకశాతం తగ్గుతుందని రైతులంటున్నారు. మెట్ట ప్రాంతాల్లో ప్రస్తుత వర్షాలు సాగు పనులకు ఉపయోగంగా ఉంటాయి.

సగటున 18.4 మి.మీ వర్షపాతం.. జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు సగటున 18.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పెదకాకాని 77.2, దుగ్గిరాల 67.8, గుంటూరు తూర్పు 54.2, గుంటూరు పశ్చిమ 40.2, మంగళగిరి 28.2, మేడికొండూరు 13.6, తాడేపల్లి 12.4, ప్రత్తిపాడు 9.6, వట్టిచెరుకూరు 8, ఫిరంగిపురం 7.4, కొల్లిపర 7.2, తాడికొండ 2.8, చేబ్రోలు 1.2, తుళ్లూరు 0.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఎస్సీ కార్పొరేషన్ వాణిజ్య సముదాయాల మరమ్మతులకు నిధులు

జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ వాణిజ్య దుకాణాల సముదాయాలకు మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వీటిని నిర్మించి 30 సంవత్సరాలైంది. చాలాచోట్ల గదులు పాడయ్యాయి. వర్షం కురిస్తే నీటి చెమ్మ చేరుతోంది. కొన్నింట్లో నీరు కారుతోంది. ఈ పరిస్థితిపై ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ప్రభుత్వానికి నివేదించడంతో మరమ్మతులు చేసేందుకు రూ.1.30 కోట్లు మంజూరయ్యాయి.

★ ఉమ్మడి జిల్లాలో 22 షాపింగ్ కాంప్లెక్సుల్లో 331 దుకాణాలున్నాయి. గుంటూరు జిల్లాలోని షాపింగ్ కాంప్లెక్సులకు రూ.45 లక్షలు, పల్నాడు జిల్లాకు రూ.85 లక్షలు మంజూరయ్యాయి.

★ గుంటూరు జిల్లాకు సంబంధించి ఏపీ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల సంస్థ ఈఈ టెండర్లు పిలిచారు. తక్కువ మొత్తంలో కోట్ చేసినవారికి పనులు అప్పగిస్తారు. పల్నాడు జిల్లాకు సంబంధించి టెండరు ప్రకటన విడుదల చేయనున్నారు.

★ దుకాణాల లీజుదారులకు మరమ్మతుల సమాచారాన్ని ఎస్సీకార్పొరేషన్ అధికారులు తెలియజేశారు. ఎక్కడెక్కడ ఏయే పనులు చేయాలో వివరాలు నమోదు చేశారు.

★ మరమ్మతులు పనులు త్వరలోనే చేపడతామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.శ్రీనివాస్ తెలిపారు. ప్రధాన పనులన్నీ ఎస్సీ కార్పొరేషన్ చేయిస్తుందని తెలిపారు.

యాంటీబయాటిక్స్ వినియోగంపై నియంత్రణ చర్యలు

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: అన్ని రంగాల్లో యాంటీబయాటిక్స్ వినియోగంపై నియంత్రణ చర్యలు చేపట్టేందుకు త్వరలోనే రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందులో ఐఎంఏ సభ్యులకూ భాగస్వామ్యం ఉంటుందన్నారు. యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్)ను కట్టడి చేయకపోతే 2050 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఏటా నాలుగు కోట్ల మరణాలు సంభవిస్తాయని కొన్ని అధ్యయనాలు హెచ్చరిస్తుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఐఎంఏ, క్లినికల్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ సొసైటీ(సిడ్స్) సంయుక్తంగా గుంటూరు వైద్య కళాశాలలో ఆదివారం యాంటీమైక్రోబియల్ నిరోధకతపై ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సదస్సును ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. ఏఎంఆర్ కట్టడిపై 2015లో ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలు రూపొందించిందన్నారు. భారత ప్రభుత్వం 2017లోనే దృష్టి సారించిందని, మన రాష్ట్రంలో 2022లో దీనిపై ప్రణాళికలు తయారు చేశారన్నారు. ఇటీవల తాను దిల్లీ వెళ్లినప్పుడు గొంతునొప్పి వస్తే వైద్యులను సంప్రదించకుండానే యాంటీబయాటిక్స్ వాడానని, దీనిపై తనకూ అంత అవగాహన లేదన్నారు. మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్ తదితర వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేస్తున్నామన్నారు. వీటితోపాటు ఏఎంఆర్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెడతామని హామీ ఇచ్చారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు నందకిశోర్ మాట్లాడుతూ యాంటిబయాటిక్స్‌ను విచ్చలవిడిగా వినియోగించే విపరీత ధోరణుల వల్లే ఏఎంఆర్ వేగం పుంజుకొంటోందన్నారు. రాష్ట్ర వైద్య మండలి ఛైర్మన్ శ్రీహరిరావు మాట్లాడుతూ నిర్ధారించిన వ్యాధులకు మాత్రమే వైద్యులు యాంటిబయాటిక్స్‌ను సిఫార్సు చేసేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం.. ఏఎంఆర్ నియంత్రణలో భాగంగా ఏపీ ఐఎంఏ శాఖ, అమెరికాకు చెందిన ఐఆర్‌ఏడీ మధ్య మంత్రి సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. సమావేశంలో సిడ్స్ రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, పక్కన నందకిశోర్, శ్రీహరిరావు, కల్యాణ చక్రవర్తి తదితరులు

ప్రకాశం బ్యారేజీకి వరద తాకిడి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : భారీ వర్షాల నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీకి స్థానిక వరద నీరు చేరుతోంది. జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఈ నెల 21వ తేదీ సోమవారం ప్రకాశం బ్యారేజీ గేట్లను ఎత్తి, సముద్రంలోకి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బ్యారేజీ వద్ద ప్రస్తుతం 12 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టం ఉంది. 3,000 క్యూసెక్కుల వరకు వరద నీరు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కృష్ణా డెల్టా పరిధిలోని జిల్లాల్లో వర్షాలు కురుస్తుండడంతో సాగునీటి అవసరాలు తగ్గాయి. నీటి విడుదలను బాగా తగ్గించారు. కాలువలకు నీటి విడుదల పరిమితం కావడంతో వచ్చిన వరద నీటిని సముద్రంలోకి వదిలేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. సముద్రంలోకి నీటిని విడుదల చేయనున్న క్రమంలో.. కృష్ణా నది దిగువ ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

పట్టిసీమ పంపుల తగ్గింపు.. పట్టిసీమ నుంచి 22 పంపుల ద్వారా గోదావరి నీటిని విడుదల చేస్తుండగా.. 10 పంపుల వరకు తగ్గించారు. గోదావరి నీటిని ఏలూరు జిల్లాలోనూ వినియోగిస్తున్నారు. ప్రస్తుతం అక్కడి అవసరాలకు పట్టిసీమ ఉపకరిస్తోంది. పులిచింతల నుంచి నీటిని నిలిపివేశారు. వజినేపల్లి నుంచి 1,589 క్యూసెక్కులు వస్తోంది. రెండు రోజుల్లో మునేరు నుంచి వరద నీరు వచ్చే వీలుంది. వెరసి అధికారులు అప్రమత్తమై, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

కాలువలకు నీటి విడుదల తగ్గింపు

ఎన్టీఆర్ కలెక్టరేట్: భారీ వర్షాల నేపథ్యంలో సాగునీటి కాలువలకు క్రమేపీ నీటి విడుదల తగ్గిస్తున్నారు. బాపట్ల, గుంటూరు, ఏలూరు, కృష్ణా జిల్లాల రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు నీటిని తగ్గించారు. గత కొన్ని రోజులుగా 13,000 పైచిలుకు క్యూసెక్కుల వరకు విడుదల చేయగా. . ఇప్పుడు 9,000 క్యూసెక్కులకు తగ్గించారు.

రాజధానిలో మంత్రి నారాయణ పర్యటన నేడు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ సోమవారం రాజధానిలో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. ఇందులో భాగంగా ఆయన రాయపూడి సమీపంలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అఖిల భారత ఉద్యోగుల భవన సముదాయాలు, మంత్రులు, ముఖ్య కార్యదర్శుల బంగ్లాల నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించనున్నారు.

(c) eenadu

గిరిజనుల జీవన చిత్రం

ఆవిష్కరించిన కృష్ణమూర్తికి అమెరికా సంస్థ ప్రత్యేక పురస్కారం

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిప్లొమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సు చదువుతున్న పోలుబోయిన కృష్ణమూర్తి తీసిన చిత్రాలకు అమెరికాలోని 'ఇమేజ్ కాలింగ్ సంస్థ' ప్రత్యేక పురస్కారం ప్రకటించింది. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా కోరాసైట్ ప్రాంతంలోని కొండకోనల్లో ఉంటున్న అరుదైన బోండా గిరిజనుల జీవన విధానంపై కృష్ణమూర్తి తీసిన చిత్రాలు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచాయి. అంతరించిపోతున్న గిరిజనుల జీవన విధానాన్ని ప్రపంచానికి తెలియజేశారు. ఈ చిత్రాలు తీసేందుకు ఎన్నో రోజులు శ్రమించారు. సంవత్సరంలో ఒక నెల మాత్రమే కొండపైకి అనుమతిస్తారు. దాదాపు ఐదేళ్ల నుంచి వాళ్ల ఫొటోలు తీయడానికి కష్టపడ్డారు. ఉదయం ఒక గంట, సాయంత్రం గంట మాత్రమే పోలీసులు అనుమతించేవారు. ఎక్కువగా నక్సలైట్ ప్రభావంతో ఎక్కువ రోజులు ఉండలేదని ఫొటోగ్రాఫర్ కృష్ణమూర్తి చెప్పారు. అక్కడి మహిళలు జీలుగు కల్లు తాగుతుంటారు. ప్రధానంగా ఎక్కువ వయస్సు ఉన్న యువతులను తక్కువ వయస్సు ఉన్న యువకులు వివాహాలు చేసుకుంటారు. ఒక్కసారి వివాహం జరిగిన తర్వాత భార్య.. భర్తను పోషించాలనే నియమం ఉంది. పచ్చి దుంపలు, జీలుగ కల్లు, దంపుడు బియ్యం, రాగులు, కొర్రలు, అలసందలు మాత్రమే తింటారు. ప్రకృతిలో పండిన వాటినే ఆహారంగా తీసుకుంటారు.

వాద్య పరికరంతో రాగాలాపన

జీలుగ కల్లు తాగుతున్న మహిళ

ఫొటోగ్రఫీ అంటే ప్రాణం

\- పోలుబోయిన కృష్ణమూర్తి, ఫొటోగ్రాఫర్

మాది ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం తిప్పాయిపాలెం. చిన్నతనం నుంచే ఫొటోగ్రఫీపై ఆసక్తి ఉంది. వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ అంటే చాలా ఇష్టం. ఒంగోలులోని రూట్ సెట్ సంస్థ ఫొటోగ్రఫీపై శిక్షణ ఇచ్చారు. మరింత మెలకువల కోసం ఏఎన్‌యూలో చేరాను. అక్కడ మంచి టెక్నిక్స్ నేర్పించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఉంది. మంచి చిత్రాలు తీయాలనే ఉద్దేశంతో అంతరించిపోతున్న గిరిజనులను ప్రపంచానికి తెలియజేయాలని ఒడిశా వెళ్లాను. కేవలం 1500 మంది మాత్రమే నివసిస్తున్నారు. ఎప్పటికైనా లండన్‌లోని రాయల్ ఫొటోగ్రఫీ సొసైటీలో గుర్తింపు రావాలని లక్ష్యంగా పెట్టుకున్నాను.

చిట్టడివిని తలపిస్తూ..

సరైన రహదారి లేని కాలనీ

పొదల మధ్య తాగునీటి కుళాయి

గొప్పలు చెప్పారు.. దిబ్బలుగా మార్చారు

ఫిరంగిపురం జగనన్న కాలనీ (ప్రస్తుతం పీఎం ఏవై-ఎన్టీఆర్ నగర్స్)లో నిర్మించిన వందలాది ఇళ్లకు నాలుగు పెద్ద పెద్ద ముఖద్వారాలు ఏర్పాటు చేసిన అప్పటి వైకాపా ప్రభుత్వం... సదుపాయాలు కల్పించకుండా నివాస ప్రాంతాన్ని ముళ్ల పొదల దిబ్బగా మార్చింది. ఫిరంగిపురంలో నాలుగు లేఅవుట్‌లలో 650 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసినా నిధులు మంజూరుకాకపోవడంతో మధ్యలోనే పనులను వదిలేశారు. కొంత మంది అప్పులు చేసి గృహాలు నిర్మించుకుని ఉంటున్నారు. కానీ కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, రహదారులు తదితరాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖద్వారాలు కూడా పగుళ్లు ఇస్తున్నాయి. వీటికి వెచ్చించిన ప్రజాధనంతో వసతులు కల్పిస్తే పేదల సొంతింటి కల నెరవేరేదని లబ్ధిదారులు వాపోతున్నారు. - ఈనాడు గుంటూరు, న్యూస్‌టుడే, ఫిరంగిపురం గ్రామీణం

ఆరోగ్య భారతి స్ఫూర్తి అందిపుచ్చుకోవాలి

❖ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆరోగ్య భారతి అందిస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకుని ఇతర స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకురావాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఆరోగ్య భారతి ఆంధ్రప్రదేశ్ కార్యకర్తల ప్రాంత అభ్యాసవర్గ సమావేశం గుంటూరు అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఆదివారం జరిగింది. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ఆరోగ్య భారతిని ప్రారంభించి 23 ఏళ్లు పూర్తయిందన్నారు. దేశంలో 92 శాతం జిల్లాల్లో ఆరోగ్య భారతి కార్యకర్తలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 600 మందికి పైగా పని చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం ఆయుష్ ఆసుపత్రులు ఏర్పాటు చేయనుందన్నారు. వైకాపా హయాంలో కేంద్రం నుంచి వచ్చే ఆయుష్ నిధులను తీసుకోకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి ఆరోగ్య సంరక్షణ కల్పించడమే బాధ్యతగా పని చేస్తున్నానన్నారు. 2030 నాటికి హెర్బల్ ఉత్పత్తుల ఎగుమతిలో దేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. 2023లో జరిగిన సర్వేలో క్యాన్సర్ రోగులు 73 శాతం మంది దేశంలో ఉన్నారని, అందుకు ప్రధాన కారణం మన ఆహార లోపాలేనన్నారు. వాటిలో మార్పులు తీసుకురావాలన్నారు. వేగంగా పెరుగుతున్న క్యాన్సర్ వంటి వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్తలే ముఖ్యమన్నారు. జీవితంలో వ్యాధుల నుంచి బయటపడాలంటే యోగా ఒక్కటే మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం ఆరోగ్య భారతి వంటి సంస్థల సహకారం తీసుకుంటుందన్నారు. డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే సేవలు ప్రశంసనీయమన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో 110 ఓపెన్ హార్ట్ సర్జరీలు జరిగాయని, గుండెపోటు నివారణకు ఖరీదైన ఇంజక్షన్లు 3,800 మందికి ఉచితంగా అందించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం నేచురోపతి, యోగా అభివృద్ధికి రూ.85 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 2020లో 320 క్లినికల్ కేసులు ఉండగా, 2024లో ఈ సంఖ్య భారీగా పెరిగిందన్నారు. అనంతరం ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో రూపొందించిన ఆరోగ్య జీవన విధానం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆరోగ్య భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.ఎస్.రావు, జాతీయ సంఘటన కార్యదర్శి డాక్టర్ అశోక్ కుమార్(న్యూదిల్లీ), జాతీయ సహ సంఘటన కార్యదర్శి ఆర్.మురళీకృష్ణ(చెన్నై), కె.ఎస్.ఎన్.చారి, కుమారస్వామి, అశోక్, డాక్టర్ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

మల్లిక స్పైన్ సెంటర్‌కు అంతర్జాతీయ అవార్డు

ప్రసంగిస్తున్న నరేష్‌బాబు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: నడుము, మెడ నొప్పి చికిత్సలో అల్ట్రాసోనిక్ లేజర్ టెక్నాలజీ సహాయంతో ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీలు విజయవంతంగా చేసే విధానంపై సమర్పించిన పరిశోధనా పత్రానికి మల్లిక స్పైన్ సెంటర్‌కు ఆసియా పసిఫిక్ ఉత్తమ అవార్డు దక్కిందని ప్రముఖ వెన్నెముక శస్త్రచికిత్స నిపుణుడు నరేష్‌బాబు తెలిపారు. గుంటూరులోని మల్లిక స్పైన్ సెంటర్లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు ముంబయిలో నిర్వహించిన 'సొసైటీ ఫర్ మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ-ఆసియా పసిఫిక్' అంతర్జాతీయ సదస్సులో ఈ పురస్కారం ప్రకటించారన్నారు. వచ్చే ఏడాది సింగపూర్‌లో నిర్వహించే వార్షిక సదస్సులో దీని అందజేస్తారన్నారు. నడుము, మెడ నొప్పితో బాధపడే వారిలో సర్జరీ అవసరమైన వారికి కేవలం చిన్న రంధ్రం ద్వారానే శస్త్రచికిత్స పూర్తి చేస్తున్నామన్నారు. అల్ట్రాసోనిక్ ధ్వని తరంగాలను వినియోగించడం వల్ల వేగంగా, కచ్చితంగా, రక్తస్రావం లేకుండా సర్జరీ చేసే వీలుంటుందన్నారు. దీనిపై సదస్సులో వివరించానన్నారు. ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీలో అల్ట్రాసోనిక్ టెక్నాలజీని వినియోగించడం ప్రపంచంలో ఇదే మొదటిసారన్నారు. ఈ సొసైటీ నుంచి ఉత్తమ పరిశోధన అవార్డు మన దేశానికి దక్కడం ఇదే ప్రథమమన్నారు. తనతో పాటు ఈ పరిశోధనలో సభ్యులైన డాక్టర్ పృథ్వీరాజ్‌కు ఆసియా పసిఫిక్ దేశాల్లో ఉన్న ప్రముఖ ఎండోస్కోపిక్ సర్జరీ కేంద్రాలను సందర్శించే ట్రావెల్ ఫెలోషిప్ లభించిందన్నారు.

మద్యం కుంభకోణంలో ఎవరినీ వదిలే ప్రసక్తి లేదు

❖ మంత్రి సత్యకుమార్ యాదవ్

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: మద్యం కుంభకోణంలో ఎవరినీ వదిలే ప్రసక్తి లేదని, దీనిపై సిట్ దర్యాప్తు చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కుంభకోణంలో ఎంత మంది ప్రమేయం ఉందో బయటకొస్తుందన్నారు. వైకాపా ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడిందన్నారు. నాసిరకం మద్యం తాగడం వల్ల కాలేయ సంబంధిత కేసులు పెరిగాయని, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి కూడా మరణించారని తెలిపారు. గుంటూరులో ఆదివారం మంత్రి మీడియాతో మాట్లాడారు. మిగులు జలాల విషయంలో తెలంగాణ ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తుందని, ఈ విషయంలో రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ప్రభుత్వ వైద్యులు సమయానికి ఆసుపత్రులకు రాకుంటే చర్యలు తప్పవని చెప్పారు. విదేశాల్లో వైద్య విద్య అభ్యసించిన వారికి ఎన్‌ఎంసీ నిబంధనలు, కోర్టు తీర్పును అనుసరించి న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రైవేటుగా ఆసుపత్రులు నిర్వహించే వైద్యులు.. వారానికోరోజు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయాలని కోరారు.

'ఓర్వలేక వైకాపా నేతలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు'

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: 'అధికారంలోకి వస్తే నరుకుతాం.. సప్త సముద్రాల అవతల ఉన్నా తీసుకొస్తాం.. బట్టలూడదీయిస్తామంటున్నారు.. ధైర్యం ఉంటే ఎవర్ని నరుకుతారో పేర్లు చెప్పండి. చేతగాని మాటలొద్దు. పేర్ని నాని, వైకాపా నేతలు.. మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుంటే మంచిది'.. అని తెదేపా సీనియర్ నేత, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హెచ్చరించారు. గుంటూరులోని క్యాంప్ కార్యాలయంలో యరపతినేని ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. 'తాడేపల్లి స్క్రిప్టు చదివినందుకు గత ఎన్నికల్లో ప్రజలు వైకాపాకు ప్రతిపక్ష హోదా లేకుండా చేసి మూలన కూర్చోబెట్టారు. తీరు మార్చుకోకపోతే సున్నాకు పరిమితం చేస్తారు. జగన్ హయాంలో అయిదేళ్లు.. సాగునీటి కాల్వలకు మరమ్మతులు చేయలేదు. రైతులకు వ్యవసాయ పరికరాలు ఇవ్వలేదు. ఎన్ని హెక్టార్లలో ఏయే పంటలు పండుతాయో తెలియదు. కిలోకు, క్వింటాకు, టన్నుకు తేడా తెలియదు. గంజాయి సాగు తప్ప వ్యవసాయం తెలుసా? మద్యపాన నిషేధమని చెప్పి సొంత బ్రాండ్లతో పిచ్చి మందు అంటగట్టి అమాయకుల ప్రాణాలు బలిగొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి పింఛన్ పెంపు, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం, తల్లికి వందనం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. చెత్త పన్ను తొలగించాం. ఆర్థికంగా పతనమైన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. ఏడాదిలో ఒక్క గురజాల నియోజకవర్గంలోనే రూ.1,200 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గత ఎన్నికల్లో వైకాపాకు ఓట్లేసిన అధికారులు కూడా.. వ్యవస్థలు బాగుపడాలంటే వైకాపా అధికారంలోకి రాకూడదని కోరుకుంటున్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందడం ఇష్టం లేక వైకాపా నేతలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు. వారు రెచ్చగొట్టినా మేము రెచ్చిపోం. అలాగని నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం. జగన్ పాలనలో జరిగిన కుంభకోణాలన్నీ ఆధారాలతో సహా నిరూపించి ఊచలు లెక్కపెట్టిస్తాం'.. అని స్పష్టం చేశారు.

దాతల సహకారం మరువలేం

కోటేశ్వరరావుకు రామకోటయ్య చేతుల మీదుగా చెక్కు అందజేస్తున్న ఆంజనేయులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: విద్యార్థినుల వసతిగృహ నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్న దాతల సహకారం మరువలేమని కమ్మజన సేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు పేర్కొన్నారు. కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నూతన వసతిగృహ భవన నిర్మాణానికి వీఎస్‌ఆర్ కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ అడ్డాల ఆంజనేయులు.. గురువు ఏఎన్‌యూ విశ్రాంత వైస్‌ఛాన్సలర్ దావులూరి రామకోటయ్య చేతుల మీదుగా రూ.6 లక్షల చెక్కును కోటేశ్వరరావుకు ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రూ.50 కోట్ల వ్యయంతో సకల సౌకర్యాలతో వసతిగృహాన్ని నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, సభ్యులు రాయపాటి గోపాలకృష్ణ, పెద్ది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంపై ఆలూరి, నటరాజన్ చెరగని ముద్ర

మాట్లాడుతున్న ప్రసిద్ధ తెలుగు రచయిత శివశంకర్, వేదికపై లక్ష్మీనారాయణ, లక్ష్మీప్రసాద్, బాబు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి వాసి ఆలూరి బైరాగి.. తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ, బెంగాలీలో కవితలు, కథా సంకలనాలు, తమిళనాడు వాసి సుబ్రహ్మణ్య నటరాజన్(శారద). తెలుగులో కవితలు, కథలు, నవలలు, నాటకాలు వ్యాసాలు వంటి సాధికార రచనలు చేశారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు పాపినేని శివశంకర్, మెనుగొండ లక్ష్మీనారాయణలు పేర్కొన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ, తెనాలికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు వడ్లమూడి గోపాలకృష్ణయ్య, వెంకటలక్ష్మమ్మ ఫౌండేషన్ సంయుక్తంగా గుంటూరు జిల్లా తెనాలి విశ్రాంత పింఛనుదారుల అసోసియేషన్ హాలులో ఆదివారం నిర్వహించిన ఆలూరి బైరాగి, సుబ్రహ్మణ్య నటరాజన్ శతజయంతి సదస్సు ప్రారంభ సమావేశంలో వారు మాట్లాడారు. ఫౌండేషన్ అధ్యక్షుడు బాబు.ఆర్.వడ్లమూడి అధ్యక్షత వహించారు. భాష, రచనల్లో శతజయంతి రచయితల ప్రత్యేకతలను శివశంకర్, లక్ష్మీనారాయణ వివరించారు. రచయితల రచనలకు సరైన పారితోషికం చెల్లించాలని సుబ్రహ్మణ్య నటరాజన్ కోరినట్లు వారు గుర్తు చేశారు. ఆయన జన్మస్థలంలో స్మృతి వనం ఏర్పాటుపై తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. ఆలూరి రచనలు ఆయనకు కేంద్ర, రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డులు తెచ్చిపెట్టాయని పేర్కొన్నారు. ముఖ్య అతిథి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఆలూరితో తనకున్న వ్యక్తిగత అనుభవాలను, జీవితంలో ఎదిగిన తీరును వివరించారు. వచ్చే నెల 9న తెనాలి ఐతానగర్‌లో సుమారు రూ.1.50లక్షలతో ఆలూరి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా రచయిత కొత్తపల్లి రవిబాబు అధ్యక్షతన నిర్వహించిన తొలి సమావేశంలో కందిమళ్ల శివప్రసాద్, కొర్రపాటి ఆదిత్య, పేరిశెట్టి శ్రీనివాసరావు ఆలూరి కవిత్వం, కథలు, నవల, నాటకం, హిందీ సాహిత్య కృషిపై మాట్లాడారు. ఆయన రచనలు, తదితరాల సొంతం తెలుసుకుని ఒక నిశ్చితాభిప్రాయానికి రావాలని వారు పేర్కొన్నారు. ఆలూరి వంటి రచయితలను యూరోపియన్లు అయితే ఒక ప్రవక్తగా పేర్కొంటారని ఉదహరించారు. ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అధ్యక్షతన నిర్వహించిన రెండో సమావేశంలో కె.శరశ్చంద్ర జ్యోతిశ్రీ, చెరుకూరి సత్యనారాయణ.. సుబ్రహ్మణ్య నటరాజన్ కథ, నవలా సాహిత్యంపై ప్రసంగించారు. ఆయన 30 ఏళ్ల జీవన ప్రస్థానంలో ఏడేళ్లు తెలుగు సాహిత్యానికి సేవచేశారని గుర్తుచేశారు. స్వీయ అనుభవాలను ఇతివృత్తంగా మలచుకుని కథలు, నవలలు, వ్యాసాలుగా రాసిన తీరు అనుసరణీయమన్నారు.

గుంటూరు జట్టు ద్వితీయ స్థానం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ సెంట్రల్ జోన్ అండర్-16 మల్టీ డే క్రికెట్ టోర్నీ విజేతగా ప్రకాశం జట్టు నిలిచింది. గుంటూరు జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. మంగళగిరి మైదానంలో ఆదివారం ఒక పరుగు ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో ఇన్నింగ్స్ ఫాలోఆన్ కొనసాగించిన పశ్చిమ గోదావరి జట్టు 41.1 ఓవర్లలో 97 పరుగులకే కుప్పకూలింది. ప్రకాశం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 493 పరుగులు చేయగా.. పశ్చిమ గోదావరి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 90 పరుగులకే ఆలౌటైంది. దాంతో ప్రకాశం జట్టు 306 పరుగుల ఆధిక్యంతో గెలుపొందింది. పేరేచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఆదివారం 47 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన కృష్ణా జట్టు 46.4 ఓవర్లలో 138 పరుగులకు ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు 5.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 17 పరుగులతో లక్ష్యాన్ని ఛేదించింది. దాంతో గుంటూరు జట్టు పది వికెట్ల తేడాతో విజయం సాధించింది.

శ్రమించాం.. గెలిచాం.. నిలిచాం

❖ తిరుపతి ఐఐటీయన్ల మనోగతం

ఏర్పేడు, శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఎంతో శ్రమించారు.. తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చేలా.. చివరికి విజయతీరాలు చేరుకున్నారు.. ఈ పయనంలో కొలువులు సాధించారు.. జీవితంలో తిరుగులేదనిపించారు. ఇక సాంకేతిక రంగంలో తమదైన రీతిలో రాణిస్తామని ధీమాగా చెబుతున్నారు తిరుపతి ఐఐటీలో పట్టభద్రులైన విద్యార్థులు. మూడోతరం ఐఐటీ అయినప్పటికీ ప్రపంచ దేశాలకు ఆదర్శవంతంగా నిలచేలా చాటిచెబుతామని ప్రతిజ్ఞ బూనారు. ఈ నేపథ్యంలోనే పలువురు 'ఈనాడు- ఈటీవీ'తో తమ లక్ష్యాలను పంచుకున్నారు. గుంటూరు వాసి అభిప్రాయం ఆయన మాటల్లోనే..

వృథానీటికి అడ్డుకట్ట

మాది గుంటూరు. ఐదేళ్ల కిందట తిరుపతి ఐఐటీలో అడుగుపెట్టాను. వినియోగించిన నీటిని నదులు, చెరువుల్లోకి విడుదల చేస్తుండటంతో నీటి కాలుష్యం అధికంగా మారుతుంది. నీటి వృథాకు అడ్డుకట్టి మురుగు నీటిని ట్రీట్ చేసేలా పరిశోధనలు చేశాను. ప్రస్తుతం యూఎస్‌ఏలో అగ్రికల్చర్ పరిశోధన సంస్థలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నా. ఇండియాకి తిరిగి వచ్చి ఇక్కడ పరిశోధన సంస్థలో శాస్త్రవేత్తగా చేరి వ్యవసాయాభివృద్ధి, నీటిశుద్ధిని పెంపొందించేందుకు కృషి చేస్తా. ఐఐటీ నుంచి ఉత్తమ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. - షేక్ మహ్మద్ అల్లాబక్షి

అభివృద్ధి పేరుతో పొలాలు తీసుకోవద్దు

మాట్లాడుతున్న మాజీ మంత్రి శోభనాద్రీశ్వరరావు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో వేలాది ఎకరాల పచ్చని పంట పొలాలు తీసుకునే విషయంలో ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు కోరారు. గుంటూరు రామన్నపేటలోని జనచైతన్య వేదిక కార్యాలయంలో 'అభివృద్ధి పేరుతో భూదోపిడీ' అంశంపై ఆదివారం చర్చాగోష్ఠి జరిగింది. కార్యక్రమానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ 5,500 ఎకరాల విస్తీర్ణం ఉన్న శ్రీసిటీలో 300కు పైగా కంపెనీలు కొనసాగుతుంటే.. నేడు వేలాది ఎకరాలు పచ్చని పంట పొలాలు ఒక్క ఇండోసోల్ కంపెనీకి ధారాదత్తం చేయాలనుకోవడం సమర్థనీయం కాదన్నారు. వేలాది మంది కరేడు రైతులు ఏకతాటిపై నిలబడి తమ భూములను రక్షించుకోవడానికి చేస్తున్న పోరాటం అభినందనీయమన్నారు. రాజధాని రెండో దశలో వేల ఎకరాల భూమి తీసుకుని రైల్వే స్టేషన్, స్పోర్ట్స్ సిటీలతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేయాలనుకోవడం భావ్యం కాదన్నారు. 8 లైన్ల ఔటర్ రింగ్ రోడ్ ప్రపంచంలో ఏ దేశ నగరాల్లో లేని విధంగా నిర్మించాలనుకోవడం, ఇందుకోసం వేలాది ఎకరాల భూమిని సేకరించడం సరికాదన్నారు. గతంలో శిర్డీ సాయి ఎలక్ట్రికల్స్‌ను జగన్ మోహన్‌రెడ్డి బినామీ కంపెనీగా పేర్కొన్న తెదేపా నేతలు... నేడు అదే కంపెనీకి బాసటగా నిలవడం విడ్డూరంగా ఉందన్నారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి మాట్లాడారు. కార్యక్రమంలో సామాజిక విశ్లేషకుడు టి.ధనుంజయరెడ్డి, కరేడు పోరాట కమిటీ నాయకులు ఎన్.సుకన్య, పి.రామలక్ష్మమ్మ, ప్రొఫెసర్ డి.ఎ.ఆర్.సుబ్రహ్మణ్యం, కొరివి వినయ్‌కుమార్, ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, రిటైల్ ధర - 139, చికెన్ విత్‌స్కిన్ - 202, చికెన్ స్కిన్‌లెస్ - 229.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -112 రిటైల్ ధర 134 చికెన్ విత్ స్కిన్ - 194, చికెన్ స్కిన్‌లెస్ - 221.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 119, 127, 137 చికెన్ విత్ స్కిన్ - 226 చికెన్ స్కిన్‌లెస్ - 237.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 520 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

బీసీ సంఘం పోరాటాలతోనే కులగణన ప్రారంభం

క్రాంతికుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న శంకరరావు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కుమ్మర క్రాంతి కుమార్‌ను నియమించినట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ప్రకటించారు. గుంటూరు చుట్టుగుంటలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో సంఘం చేసిన పోరాటం వల్లే జనగణనతో పాటు కులగణన ప్రారంభమైందని చెప్పారు. రాష్ట్రంలో బీసీ జెండా ఎగిరేలా సంఘం కృషి చేయాలన్నారు. బీసీల ప్రయోజనాల కోసం అనేక పోరాటాలు చేసి విజయం సాధించామన్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ బీసీల స్థితిగతులను మెరుగుపరుస్తామని స్పష్టం చేశారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో మూడు సీట్లు బీసీలకు ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కోశాధికారి కన్నా మాస్టారు, గౌరవ అధ్యక్షుడు నిమ్మల శేషయ్య, ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మల్లె ఈశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి కోల అశోక్, సమన్వయకర్త బ్రహ్మానందశర్మ, నాయకులు బండారు సోమరాజు, బి.శ్రీను, కొల్లూరు హనుమంతరావు, పారేపల్లి మహేష్, ముప్పాన వెంకటేశ్వర్లు, బలగాని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

EENADU eClassifieds

AGRI BUSINESS

గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్ ఆవులు అమ్మబడును. రెడ్సింధి 6 నెలల సుడి, థార్పార్కర్ 7 నెలల సుడి. సంప్ర: 98660 01222.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

స్వామి వివేకానంద గ్రూప్, VJA, శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99590 21122, 99590 31122.

రామకృష్ణ గ్రూప్ (AP No.1) VJA వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 96038 42233, 97054 72233.

JOBS

Wanted B-Pharmacy or D-Pharmacy Candidates to work in a Pharmacy in Guntur City. PCI Registration Mandatory. Contact: 63009 75241.

Wanted Maths, English, Hindi Bed experienced lady Teaches to teach high School. Call: 94918 98905. Between: 9:00 am to 5:00 pm.

Jayalakshmi Arena, Nexa Maruti authorised dealers Guntur, Ongole, Hiring relationship manager & senior relationship manager with automobile experience & freshers with Btech, MBA & any Degree qualification. Accountants with 3 years Exp. Interviews on dt 21,22,23 Ph: 98661 79109, 91007 87082.

Wanted Milk Delivery boys 5am to 8am Salary 6000+Petrol 1500. Bike and Smart Phone must Raithanna Milk Dairy Guntur. 95502 35554.

MNC Company Opportunity Full Time/ Part Time; Qualification: Intermediate. Monthly Income: 30,000/- above. for Details Contact: Ph: 99595 78601.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం, VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+ జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం - VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ.+ జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5,000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52838.

గుంటూరులో ప్రముఖ డోర్ కర్టన్ షాపులో పనిచేయుటకు 10th, ఇంటర్ చదివిన యువకులు కావలెను. సంప్రదించు వేళలు: 10:30 AM to 8PM. 90324 55294.

ప్రముఖ ఫైనాన్స్ సంస్థలో తెనాలిలో కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్-06 (M) కావలెను. Qlf: ఇంటర్, జీతం: 12K + TA + DA + Incentives. ఇంటర్వ్యూ: 22-07-25. ✆ 77990 28444, 92810 22773.

R.K. ఇంజనీరింగ్ కాలేజీ లేడీస్ హాస్టల్ నందు పనిచేయుటకు మంచి అనుభవం ఉన్న హాస్టల్ వార్డెన్ మరియు అనుభవం ఉన్న ఎలక్ట్రీషియన్స్ కావలెను. మంచి జీతం + భోజనం + ఉచిత వసతి కల్పించబడును. సంప్ర॥ కేతనకొండ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ. 97014 73399.

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 90146 51068, 70756 33416.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

రైతుల ప్రయోజనాలు కాపాడతాం



మంగళగిరి ఏఎంసీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న కిరణ్‌చంద్, చిత్రంలో పోతినేని, చిల్లపల్లి తదితరులు

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఛైర్మన్‌గా జవ్వాది కిరణ్ చంద్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతోపాటు వైస్ ఛైర్మన్ ఎర్రగుంట్ల భాగ్యారావు, డైరెక్టర్లుగా వి. సర్వకుమారి, నాగకుమారి, పద్మావతి, మల్లేశ్వరి, రాజేశ్వరి, తేజేశ్, లావణ్య, పరమేశ్వరరావు, శ్రీనివాసరావు, కిషోర్, శ్రీనివాసరావు, మస్తాన్, విజయకుమార్‌రెడ్డితో మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా కిరణ్ చంద్ మాట్లాడుతూ.. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు మంత్రి నారా లోకేశ్ తనపై పెట్టిన బాధ్యతను చిత్తశుద్ధితో అమలు చేస్తానన్నారు. తెదేపా గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావులు మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నారు. తెదేపా పట్టణ, మండల అధ్యక్షులు పడవల మహేష్, పల్లపోతుల శ్రీనివాసరావు, భాజపా మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు. తొలుత మంగళగిరి మండలం కిరణ్‌చంద్ పెదవడ్లపూడి నుంచి తెదేపా శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా వేదిక వద్దకు చేరుకున్నారు. భారీ ఏర్పాట్లు చేసినప్పటికీ వర్షం నేపథ్యంలో మార్కెట్ యార్డు సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

గో సంరక్షణ నిధికి విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం గో సంరక్షణ నిధికి తాడేపల్లికి చెందిన సూర్యనారాయణ ప్రసాద్, జయలక్ష్మి దంపతులు రూ.1,01,116 విరాళం అందించారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం ఈవో శీనానాయక్, వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దాత సూర్యనారాయణ ప్రసాద్ దంపతులకు విరాళం రసీదు ఇస్తున్న ఈవో శీనానాయక్

కళారూపాలతో సామాజిక చైతన్యం

మంగళగిరి, న్యూస్‌టుడే: సమాజంలో దుర్గుణాలను రూపుమాపడానికి కళారూపాలు ఎంతగానో తోడ్పడతాయని ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ అన్నారు. మంగళగిరి అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం సాయంత్రం జిల్లా అధ్యక్షులు పద్మావతి అధ్యక్షతన కళారూపాలను ప్రదర్శించారు. సీపీఐ నాయకులు ఎం.రవి, ఆ సంఘం జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు, ఆర్వీ రావమయ్య, బూదరపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల అందజేత

పెదనందిపాడు, న్యూస్‌టుడే: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతికి చేరుకోవాలని స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కొత్తా సత్యనారాయణ అన్నారు. పెదనందిపాడు కళాశాలలో వివిధ కోర్సులు చదివి ప్రతిభ చూపి ఉత్తమ మార్కులు సాధించిన పేద విద్యార్థులకు ఉత్తర అమెరికా తెలుగు సంఘ మాజీ అధ్యక్షుడు నూతి బాపయ్య చౌదరి సహకారంతో (సీతాదేవి మెరిట్ స్కాలర్‌షిప్) ఆదివారం ఉపకార వేతనాలు అందజేశారు. తులసీ(ఎంసీఏ), ఝాన్సీకుమారి(బీఎస్సీ కంప్యూటర్స్), అమృత (బీకాం కంప్యూటర్స్), నవీన్, సాంబ (సీనియర్ ఇంటర్) లకు రూ. 10 వేల చొప్పున నగదు అందజేశారు. ప్రిన్సిపల్ వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలు.. ఆకట్టుకునే పాఠాలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటు చేయడం, చిన్నారులకు ఆట పాటలతో కూడిన బోధన అందించడం అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటు లక్ష్యం. కానీ గత వైకాపా ప్రభుత్వ పాలనలో వీటి నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. మళ్లీ కేంద్రాలకు పూర్వవైభవం తీసుకువచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

నూతన విద్యావిధానంలో బోధన

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని అన్ని కేంద్రాల్లో నూతన విద్యావిధానం ప్రకారం బోధన సాగేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఆట, పాటలతో కూడిన విద్యాబోధన చిన్నారులను ఆకట్టుకుంటుంది. ఇందులో భాగంగా మూడేళ్లు దాటిన చిన్నారులకు ప్రీప్రైమరీ-1, ప్రీ ప్రైమరీ-2 పుస్తకాలను అందజేశారు. ఆంగ్లం, గణితం, తెలుగు ఇలా అన్ని అంశాలు సులభంగా చదివేలా, వారికి త్వరితగతిన అర్థమయ్యే రీతిలో పుస్తకాలు రూపొందించారు. ఆసక్తికర అంశాలను పొందుపరిచారు. అంగన్వాడీ కార్యకర్తలకు ఏడాది తొలిసారిగా ఆధారశిల, నవచేతన పేరిట రెండు పుస్తకాలు ఇచ్చారు. నవచేతన పుస్తకంలో పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల, వారి సంరక్షణకు కుటుంబ సభ్యులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. మూడేళ్ల వయస్సు వరకు వారి ఎలాంటి ఆహారం అందించాలి. ఏఏ మార్పులు గమనించాలి తదితర అంశాలను వివరించారు. ఈ పుస్తకంలో పొందుపరిచిన అంశాలను అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు వివరించాల్సి ఉంటుంది. మూడేళ్లు దాటిన చిన్నారులకు ఏ రోజు, ఏ అంశం వివరించాలో.. బోధన పద్ధతి ఎలా సాగాలి. వివిధ రకాల చిత్రాలతో ఆధారశిల అనే పుస్తకంలో అందుబాటులోకి తెచ్చారు.

ప్రత్తిపాడు: అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు

అంగన్వాడీ కేంద్రాలకు నూతన పుస్తకాల పంపిణీ

ఐసీడీఎస్ ప్రాజెక్టు	ప్రత్తిపాడు
మండలాలు	5
అంగన్వాడీ కేంద్రాలు	226
ఏడాది నుంచి 3 ఏళ్ల లోపు చిన్నారులు	3685
3 ఏళ్ల నుంచి 6 ఏళ్లలోపు వారు	2265
గర్భిణులు	833
బాలింతలు	654

కొత్తగా పంపిణీ చేసిన పుస్తకం

ప్లేస్కూళ్లకు దీటుగా నిర్వహణ..

ప్రభుత్వం కొత్తగా అందించిన పుస్తకాలను అన్ని అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ చేశాం. నూతన బోధన విధానంపై కార్యకర్తలకు శిక్షణ అందించాం. ప్లేస్కూళ్లకు దీటుగా చిన్నారులకు విద్యాబోధన సాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

-జి.విజయలక్ష్మి, సీడీపీవో, ప్రత్తిపాడు ప్రాజెక్టు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందనకు వందనం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడులో ఏకదండయ్య సత్రం వద్ద నివాసాల ఎదురు చెత్తాచెదారం కుప్పలుగా పడేస్తున్నారని, దుర్వాసనతో బయట కూర్చోలేక పోతున్నామని స్థానికులు సమస్యను 'మేమున్నాం... మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 19న ప్రచురితమైన కథనానికి పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి షేక్. ఖాజా స్పందించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.

★ వంగిపురంలో ఎస్సీకాలనీలో కాల్వల పూడిక తీయడం లేదు. మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచి దోమలకు ఆవాసంగా మారిందని స్థానికులు సమస్యను 'మేమున్నాం... మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 19న ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు స్పందించి మురుగు కాల్వల పూడిక తీయించారు.

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ? ప్రత్తిపాడులో సిద్దారపు బజారులో కొన్ని రోజుల నుంచి వీధి లైట్లు వెలగడం లేదు. చీకటిలో రాత్రి పూట తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. -శ్రీనివాసరావు

✔ మరమ్మతులు చేయిస్తాం. అవసరమైతే కొత్త లైట్లు ఏర్పాటు చేయిస్తాం. **- షేక్.ఖాజా, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి,**

? నడింపాలెంలో బోయకాలనీలో కాల్వల పూడిక తీయక వర్షపు నీరు రోడ్డుపై నిలుస్తున్నాయి. రాకపోకలు సాగించడం చాలా కష్టంగా ఉంది. **-స్థానికులు, నడింపాలెం**

✔ కాల్వల పూడిక తీయించి రోడ్లపై నీరు నిలబడకుండా చర్యలు తీసుకుంటాం. **-జీవీఆర్ఎస్ మూర్తి, గ్రామ కార్యదర్శి**

తాడికొండ, న్యూస్‌టుడే: ? తాడికొండ గ్రామ శివారు జగనన్న కాలనీలో వర్షపు నీరు నిలిచి రోడ్డు మార్గం మునిగిపోయింది. ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- వేణు, స్థానికుడు** ✔ జగనన్న కాలనీలో వర్షపు నీటిని తొలగిస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తాం. **-రమణ, గ్రామ కార్యదర్శి**

? కంతేరు గ్రామ శివారు చెట్ల కొమ్మలు విరిగి రహదారిపై పడ్డాయి. ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. **-హరీష్, ప్రయాణికుడు** ✔ రహదారిపై అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తాం. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేస్తాం. **- సాయి లీల, తాడికొండ, ఈవోపీఆర్డీ**

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

పెదనందిపాడు: వరగాని విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని అబ్బినేనిగుంటపాలెం, గోరిజవోలుగుంటపాలెం, రావిపాడు, గోగులమూడి, పెదనందిపాడు సబ్‌స్టేషన్ పరిధిలో అన్నపర్రు, కొప్పర్రు, పాలపర్రు, రాజుపాలెం, అన్నవరంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కరుణాకర్ తెలిపారు. వినియోగదారులు గమనించాలని చేశారు.

శాకంబరిగా కనకపుట్టలమ్మ

పెదకొండూరు(దుగ్గిరాల), న్యూస్‌టుడే: పెదకొండూరులోని కనకపుట్టలమ్మ తల్లిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ పాలకవర్గ ఛైర్మన్ మొలబంటి శ్రీరామమూర్తి, పాలకవర్గ సభ్యులు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. వందలాది మంది అమ్మవారిని దర్శించుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: నాగులపాడులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి ఆదివారం ఆడి కృత్తిక పర్వదినం సందర్భంగా కావడి మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అర్చకులు విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అమ్మవార్లకు సారె సమర్పణ

వరగాని (పెదనందిపాడు), న్యూస్‌టుడే: పెదనందిపాడు మండలం వరగానిలో గ్రామస్థులు ఆదివారం డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అంకమ్మ తల్లి, పోలేరమ్మ, శ్రీదేవి, భూదేవి, పార్వతి, మహాలక్ష్మీ అమ్మవార్లకు సారె సమర్పించారు. పూజలు నిర్వహించారు.

కుటుంబ సభ్యుల చెంతకు బాలుడు

స్పందనకు వందనం

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: వట్టిచెరుకూరు పోలీస్ స్టేషన్‌లో ఉన్న బాలుడిని ఆదివారం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల్లోకెళితే.. గుంటూరు నగరంలోని లాలాపేటకు చెందిన షేక్ అక్రం అహ్మద్ కుమారుడు మక్సూద్‌గా ఈ నెల 19వ తేదీ సాయంత్రం సైకిల్ తొక్కుకుంటూ అనంతవరప్పాడు గ్రామానికి వచ్చాడు. తిరిగి వెళ్లే దారి తెలియకపోవడంతో గ్రామంలోనే ఉండిపోయాడు. మాటలు సరిగా రాకపోవడంతో స్థానికులు గుర్తించి ఆరా తీసినా కుటుంబ సభ్యుల వివరాలు చెప్పలేకపోయాడు. దీంతో వారు సీఐ రామానాయక్‌కు సమాచారం ఇవ్వగా.. ఆయన బాలుడిని స్టేషన్‌కు తీసుకొచ్చారు. దీనిపై 'ఈనాడు'లో 'వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్‌లో గుర్తు తెలియని బాలుడు' శీర్షికన ప్రచురితమైన వార్తను చూసిన తండ్రి పోలీసులను సంప్రదించి.. కుమారుడిని ఇంటికి తీసుకెళ్లారు. సీఐ రామానాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు.

తప్పిపోయిన బాలుడిని తండ్రి షేక్ అక్రం అహ్మద్‌కు అప్పగించిన సీఐ రామానాయక్

సచివాలయంపై జగన్ చిత్రాల తొలగింపు

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: అధికారులు గ్రామ సచివాలయంపై పాత బొమ్మలు తొలగించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయాలు నిర్మాణం జరిగింది. అప్పట్లో గోడలపై జగన్ ముఖ చిత్రం, నవరత్నాల పేర్లు రాశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయింది. తక్కెళ్లపాడు గ్రామ సచివాలయంపై ఇప్పటికీ పాత బొమ్మలే కనిపిస్తున్నాయి. దీనిపై విమర్శలు వస్తున్నాయని ఈనాడులో ఆదివారం 'ప్రభుత్వం మారినా ఇంతేనా' శీర్షికతో కథనం ప్రచురించతమైంది. సంబంధిత మండల అధికారులు స్పందించారు. పాత బొమ్మలు కనిపించకుండా రంగు వేయించారు.

వంతెన.. అదుపు తప్పితే అంతేనా..

రక్షణ కంచె లేకుండా ఇలా..

కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాల్వపై మోరంపూడి వద్ద ఉన్న వంతెనను దిగి గ్రామంలో రోడ్డు మీదకు వచ్చే మార్గం ప్రమాదకరంగా మారింది. శనివారం ఉదయం, సాయంత్రం రెండు ప్రమాదాలు జరిగాయి. రెండింటిలోనూ త్రుటిలో ప్రాణనష్టం తప్పింది. వంతెన దిగే చోట కాల్వ వైపు రక్షణ కంచె లేదు. పైగా అక్కడ రాళ్లు లేచి ఉన్నాయి. దీంతో వాహనచోదకులు కంగారుపడిపోతున్నారు. రెండు వాహనాలు పడ్డాయి. మోరంపూడికి చెందిన ఒక మహిళ గాయపడ్డారు. రెండు సంఘటనలు జరిగిన సమయాల్లోనూ స్థానికులు వారిని లేపి పంపారు. ఏ మాత్రం పొరపాటు జరిగినా కాల్వలోకి పడిపోవడం ఖాయం. అసలే పెద్ద కాల్వ. అక్కడ ఇనుప కంచె ఏర్పాటు చేస్తే రక్షణ ఉంటుందని ప్రజలు కోరుతున్నారు. **- మోరంపూడి(దుగ్గిరాల), న్యూస్‌టుడే**

నమ్మండి.. ఇదీ రోడ్డే..!

వట్టిచెరుకూరు మండలంలోని కారంపూడిపాడు, కాకుమాను మండలం లింగంగుంటపాలెం మధ్య విస్తరించిన పంచాయతీ రాజ్‌రోడ్డు దారుణంగా మారింది. కొద్దిపాటి వర్షం కురిసినా బురదగా మారి ద్విచక్ర వాహనాల టైర్లు జారి వాహన చోదకులు కింద పడిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, వట్టిచెరుకూరు**

'స్నేహ' సుగంధం.. సంతోష మకరందం

దాదాపు 40 ఏళ్ల తర్వాత స్నేహితులు కలిశారు. ఆనాటి జ్ఞాపకాల్ని గుర్తు చేసుకున్నారు. దుగ్గిరాలలోని నిమ్మగడ్డ ఫౌండేషన్ జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో 1986-87లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలిశారు. కంఠంరాజుకొండూరు మహంకాళి అమ్మవారి ఆలయ పరిసరాల్లోని తోటలో కలుసుకున్న వీరంతా ఒక రోజు ఆనందంగా గడిపారు. తమలోని వారైన డీఎస్పీ స్థాయికి ఎదిగిన మైనేని రామకృష్ణను, ప్రవాస భారతీయుడు ఈడ్పుగంటి లలితప్రసాద్‌ను సత్కరించారు. **-న్యూస్‌టుడే, దుగ్గిరాల**

వెంకట సుబ్బయ్య చౌదరి సేవలు మరువలేనివి

మంగళగిరి, న్యూస్‌టుడే: దాత కారుమంచి వెంకట సుబ్బయ్య సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. నవులూరు గ్రామానికి చెందిన ఆయన పాఠశాలలు, బస్‌స్టాండ్‌లు, వైద్యశాలలు, సత్రాల ఏర్పాటుకు అనేక ప్రాంతాల్లో స్థలాలను దానం చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన 51వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళగిరి మండల పరిషత్ ఆవరణలోని, నవులూరులోని ఆయన విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఈపూరి ఆదాం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వెంకట సుబ్బయ్య వారసులు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలు అమలు చేయకుండా మోసం

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిని అద్భుతంగా తీర్చిదిద్దుతామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు .. మళ్లీ రాజధాని రెండో దశ భూ సమీకరణ పేరుతో రైతులను మోసం చేస్తున్నారని వైకాపా తాడికొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వనమా బాల వజ్రబాబు విమర్శించారు. ఆదివారం తుళ్లూరులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో 19 గ్రామాల వైకాపా నాయకులతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేస్తుందో ప్రజలకు వివరిస్తామన్నారు.

'దివీస్' సాయంతో భక్తులకు రక్షిత నీరు



ప్లాంటును ప్రారంభిస్తున్న జానకీదేవి, జగదీష్, ఈవో సునీల్‌కుమార్, ధర్మకర్త రంగప్రసాద్

దుగ్గిరాల, న్యూస్‌టుడే: భక్తులకు రక్షిత మంచి నీటిని అందించడం ఆనందదాయకమని తితిదే పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, రంగిశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకులు రంగిశెట్టి జగదీష్‌బాబు అన్నారు. కంఠంరాజుకొండూరులోని మహంకాళి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దివీస్ లేబొరేటరీస్ వాళ్లు ఏర్పాటు చేసిన సురక్షిత మంచినీటి ప్లాంటును వారు ప్రారంభించారు. ఈ ప్లాంటు భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈవో కోగంటి సునీల్‌కుమార్, వంశపారంపర్య ధర్మకర్త దేవభక్తుని రంగప్రసాద్ ఉన్నారు.

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి

మంగళగిరి, న్యూస్‌టుడే: ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని సోషలిస్ట్ కూటమి జాతీయ కార్యదర్శి జైబాబు కోరారు. మంగళగిరి లోని పెన్షనర్స్ అసోసియేషన్‌లో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా సుమారు 18 కోట్ల మంది ప్రైవేటు రంగంలో ఎక్కువ పనిగంటలు పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బండ్ల శ్రీనివాస్, భాస్కర్‌రావు, రాష్ట్రకార్యదర్శి వీరాస్వామి, జిల్లా కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషా ముస్లింలకు సముచిత స్థానం కల్పించండి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ నియమిత, జనసేన పార్టీ పదవుల్లో నూర్‌బాషా ముస్లింలకు సముచిత స్థానం కల్పించాలని కోరుతూ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు నూర్‌బాషా ముస్లింల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా ఆదివారం వినతిపత్రం అందజేశారు. మరోవైపు తెనాలిలోని తన కార్యాలయంలో మంత్రి మనోహర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటి పరిష్కారాలకు హామీ ఇచ్చారు.

దంచికొట్టిన వాన

తాడికొండ శివారు రహదారి వెంబడి విరిగిన తాడిచెట్టు

న్యూస్‌టుడే బృందం: నియోజకవర్గాల వ్యాప్తంగా ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మంగళగిరి, తాడేపల్లిలో గంటపాటు జనజీవనం రాకపోకలు స్తంభించాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వట్టిచెరుకూరు, పెదనందిపాడు, ప్రత్తిపాడు, దుగ్గిరాల మండలాల పరిధిలోని పల్లపు ప్రాంతాలు, రహదారులు జలమయం అయ్యాయి. అప్పాపురం ప్రధాన వాహిని, గుంటూరు వాహిని, సాగునీటి గుంటలు జలకళ సంతరించుకున్నాయి. పలు ప్రాంతాల్లో చెట్టకొమ్మలు విరిగిపడ్డాయి. ప్రత్తిపాడులోని గొట్టిపాడు రోడ్డులో కొంత సేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రత్తిపాడు శివారు, బొర్రవారిపాలెం నేలచప్టాల పైకి స్వల్పంగా వరద నీరు చేరింది.

పత్తి రైతుల్లో గుబులు..

ప్రత్తిపాడు పరిధిలో ఇప్పటికే పత్తి విత్తనాలు విత్తిన రైతులు నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి మొలకెత్తిన మొక్కలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు.

నిలిచిన పెట్రోల్ విక్రయం.. ప్రత్తిపాడులో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోలు బంకులో విద్యుత్తు సరఫరా లేక విక్రయాలు నిలిచాయి. జనరేటర్ సైతం సక్రమంగా పనిచేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని సిబ్బంది చెబుతున్నారు.



ఈమని వద్ద చేలల్లో నీరు

వట్టిచెరుకూరు గ్రామంలో ప్రధాన రహదారి ఇలా..

వైద్య శిబిరాలకు విశేష స్పందన

పెదనందిపాడు: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం ఉత్తర అమెరికా తెలుగు సంఘం, గౌతుల చ్చన బలహీనవర్గాల సంస్థ ఆధ్వర్యంలో నాట్స్ మాజీ అధ్యక్షుడు నూతి బాపయ్య చౌదరి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో శంకర కంటి ఆసుపత్రి వైద్యులు మరియ, అశ్వినిలు 550 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 270 మందికి శస్త్రచికిత్సలు చేసేందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బాపయ్య చౌదరి సేవలను పలువురు కొనియాడారు. తొలుత శిబిరాన్ని పారిశ్రామికవేత్త డి. శేషగిరి రావు ప్రారంభించారు. కార్యక్రమంలో బాపయ్య చౌదరి తల్లిదండ్రులు సుబ్బారావు, సీతాదేవి, పెదనందిపాడు కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కె. సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి ఎన్. బాలకృష్ణ, మార్కెటింగ్ శాఖ జేడీ రాజశేఖర్, తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త రమేష్‌బాబు, ప్రధానోపాధ్యాయులు అంకారావు తదితరులు పాల్గొన్నారు.

రావిపాడు(పెదనందిపాడు) న్యూస్‌టుడే: రావిపాడులో ఆదివారం ఆ గ్రామంలోని కల్యాణ మండపంలో శ్రావణి ఆసుపత్రి (గుంటూరు) వైద్యులు శ్రీనివాసరావు, సిరాజ్, వినయ్‌కుమార్‌లు 102 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

రేవేంద్రపాడు(దుగ్గిరాల): రేవేంద్రపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం అమరావతి ఐ హాస్పిటల్ ద్వారా ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. 86 మందికి పరీక్షలు చేయగా 30 మందికి శస్త్ర చికిత్స అవసరమని నిర్ధారించారు. తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ఎంపీపీ షేక్ జబీన్, కె.నాగమల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల మధుబాబు తదితరులున్నారు.

ప్రయాణ ప్రాంగణాలు బాగుపడేది ఎప్పుడు..?

తుళ్లూరు, తాడికొండ, న్యూస్‌టుడే: రాజధాని ప్రాంతంలోని తుళ్లూరు, తాడికొండ బస్‌స్టాండ్‌ల నిర్వహణ అధ్వానంగా మారింది. కూటమి ప్రభుత్వం రాకతో అమరావతికి పూర్వ వైభవం వచ్చింది. నిర్మాణ పనులు ఊపందుకోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు వేల సంఖ్యలో వచ్చారు. మరోవైపు రాజధాని ప్రాంతానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే సందర్శకుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో తుళ్లూరు బస్‌స్టాండ్‌లో తాగు నీరు, మరుగు దొడ్ల సౌకర్యాల్లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవనంపై పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. ఆవరణలో ఎటు చూసినా ముళ్లచెట్లు దర్శనమిస్తున్నాయి. మరోవైపు పెరుగుతున్న రద్దీగా తగ్గట్టుగా సర్వీస్‌ల సంఖ్యను ఆవరణను ఆధునికీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

తుళ్లూరు బస్‌స్టాండ్ ఆవరణలో పిచ్చి మొక్కలు

తాడికొండలో ఆటోలు నిలిపారిలా..

బస్సులు నిల్-ఆటోలు ఫుల్

తాడికొండ బస్‌స్టాండ్ ఆటో స్టాండ్‌ను తలపిస్తోంది. ఆవరణ మొత్తం ప్రైవేటు వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు లోపలికి రావడం లేదు. ప్రయాణికులు రోడ్డుపైనే ఎండలో, వానలో వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. రాత్రి వేళలో తాగుబోతులు అక్కడికి చేరి ప్రాంగణాన్ని అపరిశుభ్రంగా మారుస్తున్నారు. బస్ స్టాండ్ ఆవరణలోనే మూత్ర విసర్జన చేయడంతో దుర్వాసనతో ప్రయాణికులు నిలబడలేని పరిస్థితి. ఆర్టీసీ అధికారులు స్పందించి వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

మండలం	గ్రామాలు	జనాభా
తుళ్లూరు	19	60 వేలు
తాడికొండ	15	59 వేలు

పేద కళాకారులకు ఆర్థిక సాయం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ప్రముఖ హరికథకుడు నన్నపనేని సాంబశివరావు భాగవతార్ సంస్మరణ కార్యక్రమం సందర్భంగా తెనాలిలోని పేద కళాకారులకు ఆర్థిక సాయం అందించి ఆదర్శంగా నిలిచారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కొనియాడారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని.. 23 మంది పేద కళాకారులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, హరిశ్చంద్ర నాటకంలోని కాటిసీను ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నన్నపనేని రాంబాబు, ప్రియదర్శిని విద్యాసంస్థల అధినేత చందు రామారావు, తోటకూర రమణరావు, బుర్రా జయలక్ష్మి పాల్గొన్నారు.

(c) eenadu

'ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరం'

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: గత ఐదురోజుల నుంచి సమ్మె చేస్తున్న ఇంజినీరింగ్ పొరుగు సేవల కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించక పోవడం విచారకరమని సీఐటీయూ నాయకుడు కె.బాబూప్రసాద్ అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. షేక్ హుస్సేన్ వలి, చక్రి, గోపి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషా ముస్లింలకు సముచిత స్థానం కల్పించండి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ నియమిత, జనసేన పార్టీ పదవుల్లో నూర్‌బాషా ముస్లింలకు సముచిత స్థానం కల్పించాలని కోరుతూ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు నూర్‌బాషా ముస్లింల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా ఆదివారం వినతిపత్రం అందజేశారు. మరోవైపు తెనాలిలోని తన కార్యాలయంలో మంత్రి మనోహర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటి పరిష్కారాలకు హామీ ఇచ్చారు.

తెనాలి

•తెనాలి •పొన్నూరు

కనులపండువగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం పెదరావూరులోని శ్రీఅభయహస్త సుబ్రహ్మణ్య క్షేత్రం, మహా విద్యాపీఠంలో ఈ నెల 18న ప్రారంభమైన ఆడికృత్తిక మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహించారు. స్వామి వారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణ పరిధిలోని అలూరు రోడ్డులో చేతి పంపు పాడైపోయింది. **- బి. రాఘవయ్య, స్థానికుడు** ✔ మరమ్మతులు చేయిస్తాం. **- జంగం అపర్ణ, సహాయ ఇంజినీరు** ? పట్టణ పరిధిలోని డీవీసీ కాలనీ వెళ్లే మార్గంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- పి.రాంబాబు, స్థానికుడు** ✔ వ్యర్థాలు తొలగిస్తాం. **- శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి - న్యూస్‌టుడే, పొన్నూరు** ? తెనాలి పట్టణంలోని 14వ వార్డు చర్చి రోడ్డు, శ్మశానం ఎదురు మార్గంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. కాలువల్లో మురుగు పారడం లేదు. దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. **- మహేష్, 14వ వార్డు** ✔ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **-లక్ష్మీపతిరావు, ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్ - న్యూస్‌టుడే, తెనాలిటౌన్**

స్పందనకు వందనం

మేమున్నాం... మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణ పరిధిలోని షరాఫ్ బజారులోని మురుగు నీటి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను కార్మికులు తొలగించారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు** ✤ తెనాలి నందులపేటలో మురుగు కాలువల్లో చెట్ల కొమ్మలు, వ్యర్థాలు పడి ఉన్నాయని స్థానికులు ఈ నెల 19న 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా మున్సిపల్ అధికారులకు తెలియజేయగా, సిబ్బంది వాటిని తొలగించారు. ✤ తెనాలి గంగానమ్మపేటలో రోడ్డు వెంబడి వ్యర్థాలతో ఇబ్బందిగా ఉందని స్థానికులు ఈ నెల 19న మున్సిపల్ అధికారులకు తెలియజేయగా, సిబ్బందిని పంపి వ్యర్థాలు తొలగించి, అక్కడ చెత్త వేసేందుకు రెండు డబ్బాలను ఏర్పాటు చేశారు. ✤ తెనాలి మండలం తేలప్రోలు రైతు సేవా కేంద్రం ఆవరణలో పిచ్చి చెట్లు, పొదలు నిండి ఉన్నాయని స్థానికులు ఈ నెల 19న 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారులకు తెలియజేయగా, సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మంత్రి మాట.. పుర ప్రజలకు ఊరట

ఎన్నికలు జరిగితే సమస్యలకు దొరకనున్న పరిష్కారం

పొన్నూరు, న్యూస్‌టుడే

విద్యానగర్‌లో అధ్వానంగా రహదారి

భావనగర్ కాలనీలో ముందుకు కదలని మురుగు

విలీన గ్రామాలతో సంబంధం లేకుండా మూడు నెలల్లో పురపాలక సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రకటించారు. మంత్రి ప్రకటనతో పుర ప్రజలకు ఊరటనిచ్చింది. గత వైకాపా పాలకులు పొన్నూరు పురపాలక సంఘంలోకి చింతలపూడి, కసుకర్రు, వడ్డిముక్కల, అలూరు, కట్టెంపూడి, చిన ఇటికంపాడు గ్రామాలను విలీనం చేశారు. ఆయా గ్రామస్థులు విలీన ప్రక్రియను వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించడంతో విలీన ప్రక్రియ నిలిచిపోయింది.

పట్టణం	పొన్నూరు
వార్డులు	31
కుటుంబాలు	19,075
జనాభా	61,500
కచ్చా మురుగు నీటి కాలువలు	60 కి.మీ
కచ్చా రహదారులు	50 కి.మీ

◆ పొన్నూరు పురపాలక సంఘానికి 2020-23 వరకు కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.15.36 కోట్లు నిధులు కేటాయించారు. పురపాలక సంఘానికి ఎన్నికలు నిర్వహించకపోవడంతో 2023-24 ఏడాదికి రూ.4.16 కోట్లు, 2024-25కి రూ.4.4 కోట్లు నిధులను మంజూరు చేయలేదు. గత వైకాపా పాలకులు అవగాహన లేకుండా తీసుకున్న ఏకపక్ష నిర్ణయం వల్ల పురపాలక సంఘం ఆర్థిక పరమైన ఇబ్బందులు తప్పడం లేదని అధికారులు చెబుతున్నారు.

◆ విద్యానగర్, బాలాజీనగర్, సాంబశివనగర్, నిడుబ్రోలు, క్యాబిన్‌పేట తదితర కాలనీల్లో సిమెంటు రహదారులు నిర్మించకపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు నిర్వహించడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు.

◆ టీచర్స్‌కాలనీ, శ్రీరామ్ కాలనీ, వీవర్స్ కాలనీ, భావనగర్, వెంకటేశ్వరకాలనీ తదితర ప్రాంతాల్లో సిమెంటు మురుగు కాలువ నిర్మాణ పనులు చేపట్టలేదు. కచ్చా కాలువల్లో మురుగు నీరు ముందుకు కదలడం లేదు.

◆ శాంతినగర్, అంబేడ్కర్ నగర్, నిడుబ్రోలు, విద్యానగర్‌లోని పార్కుల్లో క్రీడా పరికరాలు అందుబాటులో లేవు.

◆ దీనిపై పొన్నూరు పురపాలక సంఘం కమిషనర్ ఎం.రమేష్‌బాబును న్యూస్‌టుడే వివరణ కోరగా.. పురపాలక సంఘ ఎన్నికలపై ప్రభుత్వం జారీ చేసే ఆదేశాలు మేరకు నడుచుకుంటామని వెల్లడించారు.

శాకంబరిగా భ్రమరాంబ

పెదకాకాని, న్యూస్‌టుడే : పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలోని భ్రమరాంబ అమ్మవారు ఆదివారం శాకంబరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చినట్లు ఈవో లీలాకుమార్ తెలిపారు. ఆలయ ప్రాంగణంతో పాటు వివిధ దేవతా మూర్తులను కూరగాయలు, పండ్లతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాటు చేశామన్నారు.

చేబ్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని శలపాడులో గంగానమ్మ తల్లికి ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు.

శలపాడులో గంగానమ్మ

◆ చేబ్రోలులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆదివారం ఆషాఢ సారె అందజేశారు. 108 రకాల నైవేద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నిత్యానందాశ్రమ సంఘ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. అభిషేకాలు, పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు

ఆలయానికి వెళుతున్న శాసన సభ్యుడు నరేంద్రకుమార్ దంపతులు

పెదకాకాని, న్యూస్‌టుడే : పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలోని భ్రమరాంబ అమ్మవారికి ఆదివారం పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జ్యోతిర్మయి దంపతులు ఆషాఢం సారె సమర్పించారు. వారికి ఈవో లీలాకుమార్, వేద పండితులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దంపతులతో అర్చకులు ప్రత్యేక

కనకదుర్గమ్మకు సారె సమర్పణ

ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కనకదుర్గమ్మకు పూజలు

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధి జీబీసీ రోడ్డులోని కనకదుర్గమ్మ దేవాలయంలో ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి ఆదివారం తెల్లవారుజామున పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. తోటమ్మ తల్లి దేవాలయం నుంచి కనకదుర్గమ్మ తల్లి దేవాలయం వరకు సారెను ఊరేగింపుగా తీసుకు వచ్చారు. దేవాలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు నిర్వహించారు. లలిత సహస్ర నామపారాయణ చేశారు.

ముగిసిన ఎల్లమ్మతల్లి జాతర

పెదకాకా : ఉప్పలపాడులోని చెరుకూరి వారి ఇలవేల్పు రేణుకా ఎల్లమ్మతల్లి అమ్మవారి కొలుపులు, జాతర వేడుకలు ఆదివారం ముగిశాయి. రెండో రోజు గుడారాలు, పోటు గొర్రెలు, ఆడపడుచుల పాల పొంగళ్లతో పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల్లో ఉన్న వంశస్థులు అందరూ ఒక చోటకు చేరి ఇలవేల్పు పూజలు చేశామన్నారు. అన్నదానం నిర్వహించారు.

చలానాలు రద్దు చేయాలి

గుంటూరు నేరవార్తలు : ఆటో కార్మికులపై విధించిన ఈ-చలానాలు రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తపేటలోని కార్యాలయంలో ఆటో డ్రైవర్లు, కార్మిక సంఘ నాయకుల సమావేశం నిర్వహించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లను వేధిస్తున్న రవాణా అధికారుల తీరును నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఆటో కార్మికులకు ప్రకటించిన రూ.15 వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. ఈసందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు.

విద్యార్థినికి ప్రోత్సాహం

వెనిగండ్ల(పెదకాకాని): వెనిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన పదో తరగతి విద్యార్థిని బుల్లా పూజిత ఇంటర్ చదివేందుకు రూ.5 వేలు నగదును గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజారావు ఆదివారం అందజేశారు.

భగవద్గీతపై ప్రచారం

వెనిగండ్ల(పెదకాకాని): వెనిగండ్ల గ్రామంలో భగవద్గీత విశిష్టతపై ప్రచారం నిర్వహించినట్లు త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలిపారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలని కోరారు.

చివలూరులో నీట మునిగిన వరి పొలాలు

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొల్లిపర, న్యూస్‌టుడే: లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సిద్ధార్థ తెలిపారు. ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు సోమవారం ఉదయం సుమారు మూడు లక్షల క్యూసెక్కుల కృష్ణా జలాలు విడుదల చేస్తారని సమాచారం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్నవరపులంక, కొత్తూరులంక, బొమ్మువానిపాలెం, పొట్టిదిబ్బలోని మహిళలు, వృద్ధులు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని సూచించారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని చెప్పారు.

భారీ వర్షాలు.. అంతటా జలమయం

రెండ్రోజులుగా కురుస్తోన్న భారీ వర్షాలతో కొల్లిపర మండల పరిధిలో రహదారులు జలమయమయ్యాయి. మురుగు కాలువలు పొంగిపొర్లుతున్నాయి. వరి నాట్లు, నారుమడులు నీట మునిగాయి.

పేద కళాకారులకు ఆర్థిక సాయం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ప్రముఖ హరికథకుడు నన్నపనేని సాంబశివరావు భాగవతార్ సంస్మరణ కార్యక్రమం సందర్భంగా తెనాలిలోని పేద కళాకారులకు ఆర్థిక సాయం అందించి ఆదర్శంగా నిలిచారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కొనియాడారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని.. 23 మంది పేద కళాకారులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, హరిశ్చంద్ర నాటకంలోని కాటిసీను ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నన్నపనేని రాంబాబు, ప్రియదర్శిని విద్యా సంస్థల అధినేత చందు రామారావు, తోటకూర రమణరావు, బుర్రా జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న మంత్రి మనోహర్

స్థలం కేటాయింపుపై హర్షం

చేబ్రోలు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతివనాన్ని ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని ఆర్య వైశ్య సంఘం నాయకుడు నాగభూషణరావు అన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సీతారామయ్య, నాయకులు సాంబశివరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

పొన్నూరు, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు క్రమశిక్షణతో మెలగాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పొన్నూరు అర్బన్ ఎస్సై శ్రీహరి పేర్కొన్నారు. ఆదివారం పొన్నూరు అర్బన్ పోలీసు స్టేషన్‌లో పట్టణ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివాదాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. రౌడీషీటర్లు నడవడికను మార్చుకోవాలని సూచించారు.

టీకా వేయించుకున్న విద్యార్థినులతో వైద్యులు, ఉపాధ్యాయినులు

ఆరోగ్య గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: సినీ నటుడు మహేష్‌బాబు కుమార్తె సితార పుట్టిన రోజు సందర్భంగా, అతడి దత్తత గ్రామం బుర్రిపాలెంలో ఆంధ్ర హాస్పిటల్స్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం, ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. మహేష్‌బాబు ఫౌండేషన్ సహకారంతో స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన 60 మంది బాలికలను విజయవాడలోని వైద్యశాలకు తీసుకెళ్లి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా రెండో విడత టీకా వేయించి తిరిగి వారిని పాఠశాలలో చేర్చారు. ఇప్పటి వరకు గ్రామంలో 44 వైద్య శిబిరాలు నిర్వహించామని, నమూనా ఆరోగ్య గ్రామంగా బుర్రిపాలెంను తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నట్లు డాక్టర్ పీవీ రామారావు తెలిపారు. వైద్యులు సయ్యద్ ముదస్సిర్, భూగణేష్, పావని వైద్య సేవలు అందించారు.

కొల్లిపర: పోస్టు ఛారిటబుల్ ట్రస్టు, ఆంధ్ర ప్రైమ్ ఆసుపత్రి సంయుక్తంగా కుంచవరం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి ప్రారంభించారు. శిబిరంలో మధుమేహం, థైరాయిడ్, అధిక రక్తపోటు, శ్వాస సంబంధ, గుండె, వెన్నెముక, మెదడు, స్త్రీ సంబంధ సమస్యల రోగులకు పరీక్షలు నిర్వహించారు.

'స్మార్ట్ మీటర్లతో నష్టం'

సుందరయ్యకాలనీలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పెదకాకాని, న్యూస్‌టుడే : ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే వినియోగదారులకు ఆర్థిక భారం పడుతుందని సీపీఎం మండల కార్యదర్శి ఎన్.శివాజీ పేర్కొన్నారు. పెదకాకాని సుందరయ్యకాలనీలో ఆదివారం స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసి మాట్లాడారు. విద్యుత్తును సైతం ప్రైవేటు పరం చేసేందుకే ఈ స్మార్ట్ మీటర్లు తెరపైకి తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామి ఆరాధన

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా పట్టణంలోని సుల్తానాబాదు శిర్డీ సాయి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి ఆరాధన కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

రైల్వే ప్రయాణికుడి సామగ్రి అప్పగింత

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై లగేజీ పడేసి విజయవాడ వెళ్లిపోయిన యువకుడికి, తిరిగి ఆ వస్తువులను తెనాలి రైల్వే పోలీసులు అప్పగించారు. ఎస్సై వెంకటాద్రి ఆదివారం తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం పెదపూడికి చెందిన సురేంద్ర. బెంగళూరు నుంచి స్వగ్రామం వచ్చేందుకు అంగ ఎక్స్‌ప్రెస్ రైలు(12253) ఎక్కాడు. ఆ రైలుకు తెనాలిలో స్టాప్ లేకపోవడంతో విజయవాడ వరకు టికెట్ తీసుకున్నారు. శనివారం అర్ధరాత్రి రైలు తెనాలి చేరుకున్న సమయంలో రెడ్ సిగ్నల్ పడటంతో ఆగింది. ఆ సమయంలో సురేంద్ర తన లగేజీని ప్లాట్‌ఫాంపై పడేశాడు. అనంతరం రైలు కదిలి వేగం అందుకోవడంతో దిగలేకపోయాడు. ఈ విషయాన్ని రైల్వే హెడ్ కానిస్టేబుల్ నరసింహారావు గమనించి.. సామగ్రిని స్టేషన్‌లో భద్రపరిచాడు. సురేంద్ర విజయవాడ రైల్వే స్టేషన్‌లో దిగి అక్కడి రైల్వే పోలీసులను కలిసి విషయం చెప్పగా.. వారు తెనాలి రైల్వే ఎస్సై వెంకటాద్రికి సమాచారం ఇచ్చారు. సురేంద్రను ఆదివారం తెల్లవారుజామున తెనాలి జీఆర్పీ స్టేషన్‌కు రప్పించి సామగ్రిని అప్పగించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పొన్నూరు, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆదివారం గ్రామీణ పోలీసులు వెల్లడించారు. మండల పరిధిలోని కట్టెంపూడి గ్రామానికి వడాలశెట్టి సంగమేశ్వరరావు (75) చాలా కాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 18న ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు గమనించి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలల్లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామీణ ఎస్సై కిరణ్ తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

చేతి పంపుల సామగ్రి మాయం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం సంగంజాగర్లమూడిలో రోడ్డు వెంబడి ఉన్న ఆరు చేతి పంపుల పైభాగాలు మాయమయ్యాయి. దీనిపై తెనాలి గ్రామీణ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు అందింది.

భాగస్వామి మోసంపై ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వ్యాపార భాగస్వామి మోసం చేశాడని తెనాలి గ్రామీణ పోలీసులను కొద్ది రోజుల కిందట సంగం జాగర్లమూడి వాసి ఆశ్రయించారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు విచారణ చేసి రూ.3.50 లక్షల విలువైన నగలను రికవరీ చేసినట్లు సమాచారం.

ద్విచక్ర వాహనం చోరీపై.. **తెనాలి టౌన్:** తెనాలి గాంధీచౌక్, పాత ప్రభుత్వ వైద్యశాల సమీపంలోని దుకాణం వద్ద నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని బ్యాంకు ఉద్యోగిని ఇచ్చిన ఫిర్యాదుపై ఆదివారం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రద్ధాంజలి

కీ॥శే॥ రావి రవీంద్రనాథ్ గారు

తెనాలి మాజీ శాసనసభ్యులు

జననం: 19-7-1942 మరణం: 21-7-2020

సదా మిమ్మలను స్మరించుకుంటూ...

భార్య: రావి ఝాన్సీలక్ష్మి

కుమార్తెలు: కిరణ్మయి, జ్యోతిర్మయి, సుధామయి

అభిమానులు మరియు బంధుమిత్రులు

(c) eenadu

గుంటూరు తూర్పు

ఎన్టీఆర్ రైతు బజారులో ధరలు నిన్నటివి... (కిలో రూ.ల్లో) టమాట 32, వంగ 18, బెండ 17, పచ్చిమిర్చి 73, కాకర 26, క్యారెట్ 42, క్యాబేజీ 23, బీర 28, దొండ 24, బంగాళదుంప 26, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుళ్లు 31, దోస 14, పొట్ల 18, చామదుంప 26, మునగ 6, గోంగూర 7, తోటకూర 8, చుక్కకూర 10, కొత్తిమీర 12, బీట్‌రూట్ 30, కీర 48, క్యాప్సికం 84, అల్లం 55, ఫ్రెంచి బీన్స్ 84, సొర 12, అరటి 7. - న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

స్పందనకు వందనం

★ వెంకట్రావుపేట ప్రధాన రోడ్డులో చెత్తకుప్పలు రెండురోజులుగా తీయడం లేదని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ స్పందించారు. కార్మికులతో చెత్తకుప్పలు తీయించి తరలించారు.
★ బాలాజీనగర్ నాలుగో లైన్ సైడు కాల్వల్లో పూడిక చేరి మురుగునీరు ముందుకు పారడం లేదని అందిన ఫిర్యాదు మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు స్పందించారు. కార్మికులతో సైడు కాల్వల్లో పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ(గుంటూరు)

కుటుంబ సభ్యుల చెంతకు బాలుడు

తప్పిపోయిన బాలుడిని తండ్రి షేక్ అక్రం అహ్మద్‌కు అప్పగించిన సీఐ రామానాయక్

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బాలుడిని ఆదివారం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల్లోకెళితే.. గుంటూరు నగరంలోని లాలాపేటకు చెందిన షేక్ అక్రం అహ్మద్ కుమారుడు మక్సూద్‌గా ఈ నెల 19వ తేదీ సాయంత్రం సైకిల్ తొక్కుకుంటూ అనంతవరప్పాడు గ్రామానికి వచ్చాడు. తిరిగి వెళ్లే దారి తెలియకపోవడంతో గ్రామంలోనే ఉండిపోయాడు. మాటలు సరిగా రాకపోవడంతో స్థానికులు గుర్తించి ఆరా తీసినా కుటుంబ సభ్యుల వివరాలు చెప్పలేకపోయాడు. దీంతో వారు సీఐ రామానాయక్‌కు సమాచారం ఇవ్వగా.. ఆయన బాలుడిని స్టేషన్‌కు తీసుకొచ్చారు. దీనిపై 'ఈనాడు'లో 'వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్‌లో గుర్తు తెలియని బాలుడు' శీర్షికన ప్రచురితమైన వార్తను చూసిన తండ్రి పోలీసులను సంప్రదించారు. కుమారుడిని ఇంటికి తీసుకెళ్లారు. సీఐ రామానాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించండి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: శారదా కాలనీలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారికి.. తమ ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి డిమాండ్ చేశారు. శారదా కాలనీలోని స్థానికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. నాయకులు బాషా, చిన్న, మరియదాసు, అరుణ్‌కుమార్, రవీంద్రబాబు, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వాలి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అర్హులందరికీ రేషన్‌కార్డులు, పింఛన్లు ఇవ్వాలని ఏఐవైఎఫ్ నాయకులు సురేష్‌బాబు కోరారు. సంగడిగుంటలో నగర సమితి సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. నగర కార్యవర్గ సభ్యులు అంజిబాబు మాట్లాడుతూ.. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. సుభానీ, సుబ్బారావు, రషీద్, అలీ, వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ రహదారి.. పట్టించుకోరా?

న్యూస్‌టుడే - నగరపాలక సంస్థ

సంజీవయ్యనగర్ లెవల్ క్రాసింగ్ వద్ద గుంతలు

నగరంలో ఎంతో కీలకమైన శంకర్‌విలాస్ పైవంతెన పనులు ప్రారంభమయ్యాయి. మూడు, నాలుగు రోజుల్లో పాత వంతెన పూర్తిగా కూలగొట్టేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ పనుల నేపథ్యంలో ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించారు. అమరావతిరోడ్డు, పశ్చిమ నియోజకవర్గం వైపు నుంచి మార్కెట్‌కు వచ్చే వాహనాలను వేరే మార్గాల మీదుగా వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రత్యామ్నాయ రహదారులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చి ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూస్తామని జీఎంసీ అధికారులు చెప్పిన మాటలు నీటిమూటలేనని తేలింది. శంకర్‌విలాస్ ఆర్వోబీ నిర్మాణం ప్రారంభమయ్యాక పీఎస్‌నగర్, డొంకరోడ్డు వైపు నుంచి కొత్తపేట, నెహ్రూనగర్‌కు; ఇన్నర్‌రింగురోడ్డు నుంచి రెడ్డిపాలెం, సంజీవయ్యనగర్ వైపుగా ఉన్న రహదారులపై రద్దీ బాగా పెరిగింది. ఇలా జరుగుతుందని ముందే తెలిసినా.. అధికారులు ఆమేరకు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

రహదారి మార్జిన్‌లో విద్యుత్తు స్తంభాలు

★ ఈ రహదారి సంజీవయ్యనగర్ రైల్వే గేటు నుంచి రెడ్డిపాలెం వరకు 80 అడుగుల వెడల్పుతో 1.5 కిలోమీటర్ల పొడవున అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలున్నా.. టెండర్లు పిలిచేందుకు అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. ఈ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి. రద్దీ పెరిగిన ప్రస్తుత తరుణంలో పనులు ప్రారంభమైతే ఇబ్బందులు రెట్టింపవడం ఖాయం. రోడ్డు పనులు ప్రారంభిస్తే ఆ మేరకు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ప్రణాళిక రూపొందించాల్సి ఉంది.

అస్తవ్యస్తంగా సంజీవయ్యనగర్ రహదారి

ఇన్నర్‌రింగ్‌రోడ్డు నుంచి రెడ్డిపాలెం మీదుగా కొత్తపేట, ఆర్టీసీ బస్టాండ్‌వైపు వెళ్లేందుకు సంజీవయ్యనగర్ రహదారి కీలకం. ఈ మార్గంలో నెల రోజుల నుంచి రద్దీ పెరిగింది. అయినా అధికారులు కనీసం గోతులు కూడా పూడ్చించలేదు. ఈ మార్గంలో వేయాల్సిన కరెంటు స్తంభాలను అలాగే పడేసి ఉంచారు. రైల్వేగేటు వద్ద గోతులమయంగా ఉండడంతో అందులోకి వర్షం నీరు చేరింది. మురికినీటిలోంచే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి.

క్రీస్తు మార్గం అనుసరణీయం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని తూర్పు ఎమ్మెల్యే నసీర్, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. శారదా కాలనీ 17వ వీధిలో కొత్తగా నిర్మించిన ప్రార్థనా మందిరాన్ని ఎమ్మెల్యే నసీర్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు భగత్ సింగ్, మద్దిరాల మ్యానీ, డెన్నిస్‌రాయ్, జూపూడి శ్రీనివాసరావు, మహంకాళి నరసింహారావు, వైద్యులు రవిబాబు, దయారత్నం, బాజీ, మల్లేశ్వరి, రమణ, విల్సన్ పాల్గొన్నారు.

నరెడ్కో నూతన కార్యవర్గం ఎన్నిక

నగరపాలకసంస్థ: నరెడ్కో క్యాపిటల్ జోన్ నూతన కార్యవర్గ ఎన్నికలు శనివారం గుంటూరు క్లబ్‌లో నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా పి.నాగవంశి, అధ్యక్షునిగా కేసీ అంకారావు, కార్యదర్శిగా మాదాల శ్రీనివాసరావు, కోశాధికారిగా చిన్న తిరుపతయ్య, ఉపాధ్యక్షులుగా శ్రీనాథ్, యోగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. మిగిలిన అన్ని పదవులకు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన సలహాదారు చుక్కపల్లి రమేష్ నూతన కమిటీని అభినందించారు.

అంతర్జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు, ప్రతిష్ఠలు తీసుకురావాలని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయపాటి రంగారావు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు అయిదుగురికి రూ.1,50,000 అందజేశారు. రంగారావు మాట్లాడుతూ అరిగెల్ల భార్గవ్‌రామ్ జాతీయ స్థాయిలోనే కాకుండా ఏషియన్ నంబర్‌వన్ ర్యాంక్ సాధించారు. బాలికల విభాగంలో అక్కాచెల్లెళ్లు దివెనబోయిన స్రవంతి, దీపికలు రాష్ట్ర స్థాయిలో వరుసగా ఛాంపియన్‌షిప్ సాధించారన్నారు. కార్యదర్శి దామచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలుర విభాగంలో సోదరులు కోటా సాయి సోహైల్, సాయి సోహన్‌లు అండర్-17 విభాగంలో ఛాంపియన్‌షిప్ సాధించారన్నారు. వీరు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కోచ్‌లకు రూ.30,000 నగదు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, సతీష్‌చంద్ర, కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారె సమర్పణ

పట్నంబజారు: కావడి ఉత్సవంలో భక్తులు

నెహ్రూనగర్: సారె సమర్పించి పూజలు చేస్తూ..

పట్నంబజారు, న్యూస్‌టుడే: పాతగుంటూరు మెయిన్ రోడ్డులోని శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం ఆషాఢ కృత్తిక అభిషేక పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం 6 గంటలకు వేద పండితులు స్వామివార్లకు సుప్రభాత సేవ నిర్వహించి, మహాన్యాస పూర్వకంగా రుద్రాభిషేకాలు చేశారు. 7 గంటలకు నగర ప్రధాన రహదారుల్లో కావడి ఉత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఊంజల్ సేవ జరిపారు. పూజా వేడుకల్లో ఆలయ అధ్యక్షుడు పి.శివనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం ఆకట్టుకుంది.

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: వేంకటేశ్వరస్వామి ఆలయ చెందిన కొత్తపేటలోని జగన్నాథస్వామి ఆలయంలో ఆదివారం ఆషాఢ సారె మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అయ్యప్ప స్వామివారికి విశేష పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదం అందించారు. ఈవో, సహాయ కమిషనర్ సుబ్బరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రోడ్లపై జలాశయాలు

నెహ్రూనగర్ 3వ వీధిలో..

బుచ్చయ్యతోటలో..

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: నగరంలో ఆదివారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నాజ్ సెంటర్, రాజాగారి తోట, రెలుపేట, సాంబశివపేట, శారదా కాలనీ, వసంతరాయపురం, పాతగుంటూరు, వెంకటాద్రిపేట, రాజీవ్‌గాంధీనగర్, సంజీవనగర్, ఆర్టీసీ బస్టాండ్, గుంటూరువారితోట పరిసరాల్లోని లోతట్టు ప్రాంతాలు వరద నీటితో నిండిపోయాయి. ప్రధాన రహదారులు చెరువులను తలపించడంతో వాహనచోదకులు నానా ఇబ్బందులు పడ్డారు. మూడు వంతెనల మార్గం వైపు వెళ్లాలంటే హడలిపోయారు. డ్రైనేజీ వ్యవస్థ బాగు చేయించి రహదారులపై మురుగు నీరు నిలవకుండా చూడాలని కోరుతున్నారు.

వర్షాలతో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: గత రెండ్రోజులుగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. వర్షాలు, గాలులతో విద్యుత్తు అంతరాయం కలిగితే తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఏఈలు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిస్తే తోడేందుకు మోటార్లను సిద్ధం చేయాలని సూచించారు. వర్షాలతో నీరు నిలిచే మూడు వంతెనలు, కంకరగుంట ఆర్‌యూబీ వద్ద నీటిని తొలగించడానికి సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. డ్రెయిన్లు, కల్వర్టులపై ఉన్న మెష్‌ల వద్ద వ్యర్థాలు తొలగించి మురుగునీరు పారేలా చర్యలు తీసుకోవాలన్నారు. గాలులతో చెట్ల కొమ్మలు విరిగిపడితే సిబ్బంది అందుబాటులో ఉండాలని ఏడీహెచ్‌కు ఆదేశించారు. మరో రెండు రోజులు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ సూచనలు ఇచ్చిన మేరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అస్తవ్యస్త పనులతో అవస్థలు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

రహదారి మార్జిన్ వదిలేశారిలా..

రహదారుల పనులు సగం చేసి వదిలేయడంతో సమస్యలు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెహ్రూనగర్ 9వ వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఆ సమయంలో ఇళ్ల ముందు మెట్లు పగలగొట్టారు. రోడ్డుకు ఇరువైపులా తవ్వారు. రహదారి నిర్మించి నెలలు గడుస్తున్నా.. పక్కనే ఉన్న స్థలంలో డస్టు పోయించి చదును చేయలేదని స్థానికులు పెదవి విరుస్తున్నారు. పాత రహదారిపై కొత్త రోడ్డు నిర్మించడంతో ఎత్తుగా ఉందని చెబుతున్నారు. వర్షం వస్తే రోడ్డు పక్కనే ఉన్న స్థలం గుంతగా మారి అందులో మురుగునీరు నిండిపోతున్నాయి. కొన్ని ఇళ్లు కిందకు ఉండడంతో వర్షం నీరు ఇంట్లోకి వచ్చేస్తుందని ఆవేదన చెందుతున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలు రోడ్డుపక్కనే ఉన్న గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇళ్ల ముందు ఇలా..

ఉంటాయా.. ఊడతాయా...?

న్యూస్‌టుడే - నగరపాలక సంస్థ

శిథిల స్థితిలో రిజర్వాయర్లు

శారదాకాలనీ రిజర్వాయర్ పిల్లర్లు ఇలా..

నగరంలోని అనేక ప్రాంతాల్లో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన తాగునీటి రిజర్వాయర్లు శిథిల స్థితికి చేరినా.. ఇంజినీరింగ్ విభాగం పట్టించుకోవడం లేదు. శారదాకాలనీ, సాంబశివపేట, స్తంభాలగరువు, ఏటీ అగ్రహారం, పొన్నూరు రోడ్డులోని బీఆర్ స్టేడియం వద్ద రిజర్వాయర్లు శిథిలమయ్యాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రిజర్వాయర్లకు సంబంధించిన పిల్లర్లు కూడా శిథిలమై ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. కొన్ని రిజర్వాయర్ల పైకప్పు స్లాబ్ పూర్తిగా ధ్వంసమైంది. శుద్ధ జలయం ఆయా రిజర్వాయర్లలోకి చేరినా.. దూళి కణాలు, పక్షుల రెట్టలు, వాటి ఈకలు రాలి పడితే పట్టించుకునే వారే ఉండరు. వాటిని నెలకోసారి శుభ్రం చేయాలని నిబంధనలు చెబుతున్నా అమలు కావడం లేదు. అధికారుల పర్యవేక్షణ కూడా అంతంతమాత్రంగానే కనిపిస్తోంది.

★ శిథిలమైన వాటిని ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పిల్లర్ల పటుత్వంపై సందేహాలను పలు సందర్భాల్లో ప్రజాసంఘాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లాయి. సిటీ రేట్‌పేయర్స్ అసోసియేషన్ నాయకులు పలుమార్లు రిజర్వాయర్లను పరిశీలించారు. నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా అధికారుల నుంచి స్పందన రాలేదు.

స్తంభాలగరువులో...

మానుకాక ముందే మేల్కోండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: మణిపురం పైవంతెనకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగాయి. క్రమేణా అవి పెద్దవిగా మారుతున్నాయి. దీంతో వంతెన గోడలు పగుళ్లిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటుగా నగరంలోని పలు ప్రాంతాల వేలాది మంది ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. వర్షాకాలం కావడంతో ఆ మొక్కలను అలాగే వదిలేస్తే మానులుగా మారి వంతెనకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. వంతెన పాడవకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్తు నియంత్రిక

ప్రకాష్‌నగర్‌లోని అమ్మవారి ఆలయం వద్ద విద్యుత్తు నియంత్రికల చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఈ ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. విద్యుత్తు నియంత్రికలు, ఫ్యూజ్ బాక్స్ కిందకు ఉండడంతోపాటు కరెంట్ తీగలు వేలాడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నెహ్రూనగర్

మ్యాన్‌హోల్‌తో జాగ్రత్త..చూసి వెళ్లండి

ఆర్టీసీ బస్టాండ్ ఎదురు రహదారిలో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. వారం రోజుల కిందట మరమ్మతుల కోసం మూతలను తొలగించి తర్వాత అమర్చకుండా వదిలేశారు. మూతలు తెరిచి ఉండటంతో మ్యాన్‌హోల్ గుంతలో వాహనాలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వర్షానికి మురుగునీటితో రహదారి నిండిపోవడంతో అక్కడ గుంత ఉన్న విషయం తెలియక పాదచారులు ప్రమాదానికి గురయ్యే అవకాశాలున్నాయి. దీంతో స్థానికులు హెచ్చరికగా కర్రకు ఎర్ర పట్టాకట్టి ఉంచారు. - న్యూస్‌టుడే, గుంటూరు నేరవార్తలు

మాట్లాడుతున్న అజయ్‌కుమార్, వేదికపై మాల్యాద్రి, అరుణ్‌కుమార్, శ్రీనివాసరావు, అంజిబాబు

ఆటోలపై చలానాలు రద్దు చేయాలి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆటో కార్మికులపై విధించిన ఈ-చలానాలు రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తపేటలోని కార్యాలయంలో ఆటో డ్రైవర్లు, కార్మిక సంఘ నాయకుల సమావేశం నిర్వహించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లను వేధిస్తున్న రవాణా అధికారుల తీరును నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఆటో కార్మికులకు ప్రకటించిన రూ.15 వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. ఈసందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మాల్యాద్రి, అరుణ్‌కుమార్, అంజిబాబు, శ్రీనివాసరావు, మరియదాసు, రాంప్రసాద్, బాబర్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

పట్నంబజారు, న్యూస్‌టుడే: యువకుడి అదృశ్యంపై ఆదివారం లాలాపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పొన్నూరు రూరల్ మండలం గాయవారిపాలేనికి చెందిన డొక్కు విజయ్ కృష్ణ(25) కొద్ది నెలల నుంచి పొన్నూరు రోడ్డులోని ఒక రూమ్‌లో అద్దెకు ఉంటూ నగరంలోని వస్త్ర దుకాణంలో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. అదే దుకాణంలో పనిచేస్తున్న యువతిని ప్రేమిస్తున్నానని ఇటీవల తన కుటుంబ సభ్యులకు చెప్పాడు. తమ వివాహం విషయమై యువతి ఇంటికి వెళ్లి మాట్లాడాలని తల్లిదండ్రులను కోరాడు. అందుకు విజయ్ కృష్ణ కుటుంబసభ్యులు నిరాకరించడంతో ఈనెల 17వ తేదీ సాయంత్రం తన రూమ్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గౌట్ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: కాలి బొటనవేలిపై వాపు ప్రారంభమైతే గౌట్‌గా అనుమానించి వైద్యుల సలహా తీసుకోవాలని డాక్టర్ అలేఖ్య సూచించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో అలేఖ్య మాట్లాడుతూ మొదటిసారి వాపు వచ్చినప్పుడు కొద్ది రోజుల్లో దానంతట అదే తగ్గిపోతుందన్నారు. ఎందుకో వాపు వచ్చి పోయిందలే అనుకుంటామని, అసలు సమస్య అక్కడి నుంచే ఆరంభమవుతుందన్నారు. తర్వాత కొన్ని నెలలకో.. రెండేళ్లకో.. బొటనవేలు మాత్రమే కాదు.. ఒంట్లోని చాలా కీళ్లలో గౌట్ దాడి మొదలవుతుందన్నారు. కదలికలు కష్టమవుతాయన్నారు. దీనిని సరిగా గుర్తించి చికిత్స తీసుకోకపోతే కిడ్నీల్లాంటి కీలక అవయవాలకూ ముప్పు తెచ్చిపెడుతుందని తెలుసుకోవాలన్నారు. కీళ్లనొప్పుల సమస్యలన్నింటిలోకీ ఒక్క గౌట్‌కు మాత్రమే పూర్తిగా నయం చేయడానికి చికిత్స ఉందన్నారు. సమావేశంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సదస్సు సమన్వయకర్త సాయిరామ్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

రైల్వేపాస్‌లు పునరుద్ధరించాలని వినతి

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: కోవిడ్ సమయంలో నిలిపివేసిన రైల్వే రాయితీ పాస్‌లను తిరిగి మంజూరు చేయాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్), బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ (ఏపీబీజేఏ)లు సంయుక్తంగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. రైల్వేపాస్‌ల పునరుద్ధరణ గురించి పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని తెలిపారు.

దొంగతనాల కట్టడికి చర్యలు తీసుకుంటాం

మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నసీర్

నగరపాలక సంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: శాంతిభద్రతల విషయంలో రాజీపడేది లేదని.. దొంగతనాల కట్టడికి పకడ్బందీ చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మూడో డివిజన్‌లో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని.. ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధిపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు దొంగతనాలు పెరిగిపోయి భయభ్రాంతులకు గురవుతున్నామని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సీఐతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అవసరమైతే తన సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాననడంతో.. ప్రజలు కూడా తాము సహకరిస్తామని ముందుకొచ్చారు. గత ప్రభుత్వం నందివెలుగు ఆర్వోబీ నిర్మాణానికి ఒక్క ఇటుక కూడా వేయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు పునః ప్రారంభించినట్లు తెలిపారు. వర్షాలు పడుతున్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. కార్పొరేటర్లు అశోక్, రాజా, అల్లం బాజీ, జాగర్లమూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ బంధం ఎంతో పవిత్రం

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ బ్రహ్మం, మద్దు రామకృష్ణయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు

పట్నంబజారు, న్యూస్‌టుడే: హిందూ వివాహ వ్యవస్థలో వివాహానికి ఎంతో ప్రాధాన్యం ఉందని ప్రవచనకర్త కేవీ కోటేశ్వరరావు అన్నారు. కొత్తపేటలోని పచ్చిపులుసు కల్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. కేవీ కోటేశ్వరరావు మాట్లాడుతూ..వివాహ బంధాన్ని ఫొటోలతో సరిపెట్టకుండా శాస్త్రబద్ధంగా జరపాలన్నారు. అవోపా అధ్యక్షుడు కేవీ బ్రహ్మం మాట్లాడారు. అనంతరం వధూవరుల ఫొటోలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. మద్దు రామకృష్ణయ్య, ఊటుకూరు నాగేశ్వరరావు, మహంకాళి శ్రీనివాసరావు, మంచుకొండ శ్రీను, సాయి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ అచీవర్స్ అవార్డుల ప్రదానం వాయిదా

నగరపాలకసంస్థ: నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో సోమవారం శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించ తలపెట్టిన స్వచ్ఛ అచీవర్స్ అవార్డుల ప్రదాన కార్యక్రమం భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం యథావిధిగా ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్(0863 -2224202) కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

Patola, Banaras Sarees Exhibition
21st JULY 10 AM - 10 PM
Venue: 7B Lane, Chandramouli Nagar, Near Siddhardha Gardens, Beside Shawarma Company, GUNTUR.

(c) eenadu

గుంటూరు పశ్చిమ

స్వచ్ఛ అచీవర్స్ అవార్డుల ప్రదానం వాయిదా

నగరపాలకసంస్థ: నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో సోమవారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించ తలపెట్టిన స్వచ్ఛ అచీవర్స్ అవార్డుల ప్రదాన కార్యక్రమం భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం యథావిధిగా ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్(0863 -2224202) కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 32, వంగ 18, బెండ 17, పచ్చిమిర్చి 73, కాకర 26, బీర 28, క్యాబేజి 23, క్యారెట్ 42, దొండ 24, బంగాళదుంప 26, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుళ్లు 31, దోస 14, సొర 13, పొట్ల కాయ 18, అరటికాయ 7, చామదుంప 26, మునగ 6, బీట్‌రూట్ 34, కీరదోస కాయ 48, బీన్స్ 84, క్యాప్సికమ్ 84, కొత్తిమీర 16, ఆకుకూరలు 10, నిమ్మకాయలు 25, అల్లం 54, వెల్లుల్లి 110. - **న్యూస్‌టుడే, పట్టాభిపురం**

కంకరగుంట ఆర్‌యూబీ వద్ద వాహనదారుల పాట్లు

కలెక్టరేట్ రోడ్డులో..

ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డు పీకలవాగు దగ్గర..

ముంచెత్తిన వాన

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: నగరంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పలు రహదారులు, లోతట్టు ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. రహదారులు చెరువులను తలపించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఏటీ అగ్రహారం నాలుగో లైన్ మెయిన్‌రోడ్డు దగ్గర, ఆకులవారితోట జెండా చెట్టు లైన్, ఎస్వీ బంగ్లా రోడ్డు, ఏటీ అగ్రహారం జీటీ లైన్ నుంచి మన్నవ వైపు వెళ్లే మార్గం, కంకరగుంట ఆర్‌యూబీ దగ్గర వర్షం నీరు నిలిచిపోవడంతో రెండు పక్కల ఆర్‌యూబీలో వాహనదారులు వర్షపు నీటిలో రావడానికి ఇబ్బంది పడ్డారు. కలెక్టరేట్ రోడ్డు, ఏటీ అగ్రహారం 4వలైన్ నుంచి కంకరగుంట మసీద్ రోడ్డులో పీకలవాగు పొంగి సమీపంలోని ఇళ్లలో వర్షపునీరు చేరి ఇబ్బందులు పడ్డారు.

చంద్రమౌళినగర్‌లో రహదారిపై వరదనీరు

అరండల్‌పేట ప్రధాన రహదారిలో..

ఆకులవారితోట జెండా చెట్టు లైన్‌లో..

అస్తవ్యస్త డ్రెయిన్లతో అవస్థలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే

నగరపాలక సంస్థ అధికారులు ముందు చేసే పని వెనుక....వెనుక చేసే పని ముందు చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సైడు కాల్వలు ఏర్పాటు చేసి రోడ్లు అభివృద్ధి చేస్తే ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావు. కోట్లాది రూపాయల ప్రజల సొమ్ము వెచ్చించి నిర్మిస్తున్న రహదారులు మన్నికగా ఉంటాయి. కార్పొరేషన్ అధికారులు రోడ్లు నిర్మించి సైడు కాల్వలు ఏర్పాటు చేయకుండా చేతులు దులుపుకుంటున్నారు. ఈ సమస్యలు శ్యామలనగర్‌లో తిష్ఠ వేసుకు కూర్చున్నాయి.

సైడు కాల్వలు ఏర్పాటు చేయకుండా రోడ్డు నిర్మించి వదిలేశారిలా..

గోడు వినే వారేరీ..

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో అవస్థలు పడుతున్నామని స్థానికులు లబోదిబోమంటున్నారు. ఎన్నో పర్యాయాలు నగరపాలక సంస్థ అధికారులకు విన్నవించినా అతీగతీ లేదు. గత ప్రభుత్వంలో శ్యామలనగర్‌లోని కొన్ని లైన్లలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్ని లైన్లలో రోడ్లను అభివృద్ధి చేశారు. గత ప్రభుత్వంలో డ్రెయిన్లు నిర్మించకుండా బాలకుటీర్ ఎదురు వీధిలో సిమెంట్ రోడ్డు వేశారు. అప్పట్లో సైడు కాల్వలు నిర్మించాక రోడ్డు అభివృద్ధి చేయమని పాలకులు, అధికారులను స్థానికులు కోరినా పట్టించుకోలేదు. ముందుగా రోడ్డు నిర్మించారు. ఇప్పటివరకు ఆ ప్రాంతంలో డ్రెయిన్లు నిర్మించడం సాధ్యం కాలేదు. దీంతో రోడ్డు ఎత్తుగా ఉండడం..కాల్వలు లేకపోవడం వల్ల అగాధంలా కనిపిస్తుంది. పొరపాటున వాహనచోదకులు రోడ్డు మార్జిన్‌కు వెళ్లారంటే కాల్వలో పడాల్సిందే. శ్యామలనగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. డ్రెయిన్లు లేకపోవడంతో వర్షపునీరు, మురుగునీరు ఖాళీస్థలాల్లోకి చేరడంతో పిచ్చి మొక్కలు పెరిగి అవి అడవిని తలపిస్తున్నాయి. ఖాళీ స్థలాల యజమానులు వాటి సంగతి అసలు పట్టించుకోకపోవడంతో దోమలు ప్రబలి రోగాల బారిన పడుతున్నామని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని శ్యామలనగర్ వాసులు కోరుతున్నారు.

ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ప్రజాప్రభుత్వంలో కుటుంబసభ్యుల్లా అభివృద్ధి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి లెక్కింది పరుగులు తీయిస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. నగరంలోని 43వ డివిజన్ సుగాలి కాలనీలో 'సుపరిపాలన-తొలిఅడుగు' కార్యక్రమం ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే గళ్లా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్రలతో కలిసి పెమ్మసాని.. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో సాధించిన ప్రగతి, చేపట్టిన సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెమ్మసాని మాట్లాడుతూ 'కూటమి ప్రభుత్వంపై 95 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వీధి కుక్కల సమస్య పరిష్కారానికి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. జంతు సంరక్షణ చట్టాలను దృష్టిలో పెట్టుకుని సురక్షితమైన పరిష్కార మార్గం వెతుకుతున్నాం'.. అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సొంత సంపాదనతో వైకాపా నేతలు మునిగి తేలారని విమర్శించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. 54 వ డివిజన్ పరిధిలో కూడా కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, తెదేపా నాయకులు సింహాద్రి కనకాచారి, పేరయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న పెమ్మసాని, మాధవి

దుర్గగుడికి విరాళం

ఆశీర్వచన మండపంలో దాత శివశంకర్ దంపతులు, పక్కన సూపరింటెండెంట్ సత్యనారాయణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఉచిత ప్రసాదం పంపిణీ పథకానికి గుంటూరు చంద్రమౌళి నగర్‌కు చెందిన శివశంకర్ వర్మ దంపతులు రూ. లక్ష విరాళం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ సత్యనారాయణ వారికి విరాళం రశీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

వర్షాలతో ప్రజలకు ఇబ్బందులేకుండా చూడండి

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: గత రెండ్రోజులుగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. వర్షాలు, గాలులతో విద్యుత్తుకు అంతరాయం కలిగితే తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఏతలు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిస్తే తోడటానికి మోటార్లను సిద్ధం చేయాలని సూచించారు. వర్షంతో నీరు నిలిచే మూడు వంతెనలు, కంకరగుంట ఆర్‌యూబీ వద్ద నీటిని తొలగించడానికి సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. డ్రెయిన్లు, కల్వర్టులపై ఉన్న మెష్ వద్ద వ్యర్థాలు తొలగించి మురుగునీరు పారుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గాలులతో చెట్లకొమ్మలు విరిగిపడితే సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఏడీహెచ్‌ను ఆదేశించారు. మరో రెండు రోజులు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ సూచనలు ఇచ్చిన మేరకు అప్రమత్తంగా ఉండాలన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆషాఢసారె సమర్పణ

పట్నంబజారు, న్యూస్‌టుడే: పాత గుంటూరు మెయిన్ రోడ్డులోని శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఆషాఢ కృత్తిక అభిషేక పూజలు కనులపండువగా జరిగాయి. ఉదయం 6 గంటలకు వేద పండితులు స్వామివార్లకు సుప్రభాత సేవ నిర్వహించి, మహాన్యాస పూర్వకంగా రుద్రాభిషేకం చేశారు. 7 గంటలకు నగర ప్రధాన రహదారుల్లో కావడి ఉత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఉంజల్ సేవ జరిపారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ అధ్యక్షుడు పి.శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యాలు ఆకట్టుకున్నాయి. దేవాదాయశాఖకు చెందిన కొత్తపేటలోని జగన్నాథస్వామి ఆలయంలో ఆదివారం ఆషాఢ సారె మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అయ్యప్ప స్వామివారికి విశేష పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదం అందించారు. ఈవో, సహాయ కమిషనర్ సుభద్ర ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పట్నంబజారు: కావడి ఉత్సవంలో భక్తులు

సారె సమర్పించి పూజలు చేస్తూ..

అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు, ప్రతిష్ఠలు తీసుకురావాలని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయపాటి రంగారావు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు అయ్యేందుకు రూ.1,50,000 అందజేశారు. రంగారావు మాట్లాడుతూ అరిగెల్ల భార్గవరామ్ జాతీయ స్థాయిలో కాంస్యం ఏషియన్ నంబర్ వన్ ర్యాంక్ సాధించారు. బాలికల విభాగంలో అక్కాచెల్లెళ్లు దివెనబోయిన స్రవంతి, దీపికలు రాష్ట్ర స్థాయిలో వరుసగా ఛాంపియన్‌షిప్ సాధించారన్నారు. కార్యదర్శి దామచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలుర విభాగంలో సోదరులు కోటా సాయి సోహైల్, సాయి సోహన్‌లు అండర్-17 విభాగంలో ఛాంపియన్‌షిప్ సాధించారన్నారు. వీరు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కోచ్‌కు రూ.30,000 నగదు అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, సతీష్‌చంద్ర, కార్యదర్శి రాము పాల్గొన్నారు.

క్రీడాకారులకు చెక్కులు అందజేసిన రాయపాటి రంగారావు, దామచర్ల శ్రీనివాసరావు

చదరంగంతో విద్యార్థుల్లో మేధోశక్తి పెంపు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: చదరంగం క్రీడ వల్ల విద్యార్థుల్లో మేధోశక్తి పెరుగుతుందని జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవ్‌తేజ పేర్కొన్నారు. ఎల్వీఆర్ సన్స్ క్లబ్‌లో ఇంటర్నేషనల్ చెస్ డే సందర్భంగా ఆదివారం చెస్ పోటీలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వందలాది మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు జేసీ భార్గవ్ తేజ బహుమతులు అందజేసి అభినందించారు. జేసీ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల్ని వారికి ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నూతక్కి బ్రహ్మేశ్వరరావు, కార్యదర్శి యాగంటి దుర్గారావు, పోటీల నిర్వాహకులు, ఆర్బిటర్స్ సురేష్, విజయ్ కుమార్, అబ్దుల్ నబీ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న జేసీ భార్గవ్‌తేజ

ఉంటాయా.. ఊడతాయా...?

శిథిల స్థితిలో రిజర్వాయర్లు

న్యూస్‌టుడే - నగరపాలక సంస్థ

నగరంలోని అనేక ప్రాంతాల్లో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన తాగునీటి రిజర్వాయర్లు శిథిల స్థితికి చేరినా.. ఇంజినీరింగ్ విభాగం పట్టించుకోవడం లేదు. శారదాకాలనీతోపాటు స్తంభాలగరవు, ఏటీ అగ్రహారం, పొన్నూరు రోడ్డులోని బీఆర్ స్టేడియం వద్ద రిజర్వాయర్లు శిథిలమయ్యాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రిజర్వాయర్లకు సంబంధించిన పిల్లర్లు కూడా శిథిలయై ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. కొన్ని రిజర్వాయర్ల పైకప్పు స్లాబ్ పూర్తిగా ధ్వంసమైంది. శుద్ధ జలయం ఆయా రిజర్వాయర్లలోకి చేరినా.. ధూళి కణాలు, పక్షుల రెట్టలు, వాటి కళేబరాలు పడితే పట్టించుకునే వారే ఉండరు. వాటిని నెలకో సారి శుభ్రం చేయాలని నిబంధనలు చెబుతున్నా అమలు కావడం లేదు. అధికారుల పర్యవేక్షణ కూడా అంతంతమాత్రంగానే కనిపిస్తోంది.

శారదాకాలనీ రిజర్వాయర్ పిల్లర్లు ఇలా..

స్తంభాలగరవులో...

★ శిథిలమైన వాటిని ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పిల్లర్ల పటుత్వంపై సందేహాలను పలు సందర్భాల్లో ప్రజాసంఘాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లాయి. సిటీ రేట్‌పేయర్స్ అసోసియేషన్ నాయకులు పలుమార్లు రిజర్వాయర్లను పరిశీలించారు. నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా అధికారుల నుంచి స్పందన రాలేదు.

సగం యాంటీబయాటిక్స్ పని చేయడం లేదు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: నానాటికీ సూక్ష్మక్రిములు యాంటీబయాటిక్స్‌కు నిరోధకత పెంచుకుని, మొండిగా తయారవుతుండటంతో చాలా రకాల వ్యాధులకు అత్యవసర మందులు పని చేయడం లేదని డాక్టర్ విష్ణురావు(హైదరాబాద్) ఆందోళన వ్యక్తం చేశారు. ఐఎంఏ, క్లినికల్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ సొసైటీ(సిడ్స్) సంయుక్తంగా గుంటూరు వైద్య కళాశాలలో ఆదివారం యాంటీమైక్రోబియల్ నిరోధకత(ఏఎంఆర్)పై ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి నిరంతర వైద్య విద్య కార్యక్రమంలో విష్ణురావు మాట్లాడారు. ఇప్పటికే 50 శాతం యాంటీబయాటిక్స్ పని చేయడంలేదన్నారు. మరో పదేళ్లలో ఇది 80 శాతానికి పెరుగుతుందన్నారు. దీనివల్ల ఎప్పుడో చిట్టచివరి అస్త్రాలుగా వాడాల్సిన మందులను తొలి దశలోనే వాడాల్సి వస్తోందన్నారు. చిన్న జబ్బులకు కూడా మందుల్లేకపోతే మనం ఏమవుతాం? అని అందరూ ఆలోచించాలన్నారు. ఈ విపత్తును ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రణాళికతో వ్యవహరించాల్సి ఉందన్నారు. డాక్టర్ విజయ్ మాట్లాడుతూ ప్రతి ఆసుపత్రిలో వైద్యులే నాయకులుగా వ్యవహరిస్తూ ఏఎంఆర్‌ని తగ్గించేందుకు ప్రయత్నించాలన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌కు చెందిన సుమిత్‌రాయ్ మాట్లాడుతూ రోగి నుంచి నమూనాల సేకరణ, వాటిని ప్రయోగశాలకు చేర్చడం, పరీక్షించిన తర్వాత వేగంగా నివేదిక తయారీలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఐసీఎంఆర్ వంటి పేరొందిన జాతీయ సంస్థలు ఇచ్చే నివేదికలను కూడా స్థానిక రోగులకు ఎంతవరకు ఉపయోగపడతాయో పరిశీలించాకే అమల్లోకి తేవాలన్నారు. కామినేని వైద్య కళాశాల ఆచార్యులు లక్ష్మి మాట్లాడుతూ అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని ప్రయోగశాలలో పరీక్షలు చేయాలన్నారు. సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు నందకిశోర్, సిడ్స్ రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ చక్రవర్తి, కోశాధికారి నీరేన్, సదస్సు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు నాగేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు సుబ్బారాయుడు, సేవకుమార్, ఏపీ మెడికల్ కౌన్సెల్ పరిశీలకుడు కిశోర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ, సైంటిఫిక్ కమిటీ సభ్యులు ఉదయ్‌శంకర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్ యాదవ్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏపీ ఐఎంఏ శాఖ, అమెరికా ఐఆర్‌ఏడీ ప్రతినిధులు

రైల్వేపాస్‌లు పునరుద్ధరించాలని వినతి

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: కోవిడ్ సమయంలో నిలిపివేసిన రైల్వే రాయితీ పాస్‌లను తిరిగి మంజూరు చేయాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్), బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ (ఏపీబీజేఏ)లు సంయుక్తంగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. రైల్వేపాస్‌ల పునరుద్ధరణ గురించి పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని తెలిపారు.

రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించండి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: శారదా కాలనీలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారికి.. తమ ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి డిమాండ్ చేశారు. శారదా కాలనీలోని స్థానికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. నాయకులు బాషా, చిన్న, మరియదాసు, అరుణ్‌కుమార్, రవీంద్రబాబు, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

నరెడ్కో నూతన కార్యవర్గం ఎన్నిక

నగరపాలకసంస్థ: నరెడ్కో క్యాపిటల్ జోన్ నూతన కార్యవర్గ ఎన్నికలు గుంటూరు క్లబ్‌లో నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా పి. నాగవంశీ, అధ్యక్షునిగా కేసీ అంకారావు, కార్యదర్శిగా మాదాల శ్రీనివాసరావు, కోశాధికారిగా చిన్న తిరుపతయ్య, ఉపాధ్యక్షులుగా శ్రీనాథ్, యోగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. మిగిలిన అన్ని పదవులకు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన సలహాదారు చుక్కపల్లి రమేష్ నూతన కమిటీని అభినందించారు.

నూతన కార్యవర్గం

గౌట్ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: కాలి బొటనవేలిపై వాపు ప్రారంభమైతే గౌట్‌గా అనుమానించి వైద్యుల సలహా తీసుకోవాలని డాక్టర్ అలేఖ్య సూచించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో అలేఖ్య మాట్లాడుతూ మొదటిసారి వాపు వచ్చినప్పుడు కొద్ది రోజుల్లో దానంతట అదే తగ్గిపోతుందన్నారు. ఎందుకో వాపు వచ్చి పోయిందలే అనుకుంటామని, అసలు సమస్య అక్కడి నుంచే ఆరంభమవుతుందన్నారు. తర్వాత కొన్ని నెలలకో.. రెండేళ్లకో.. బొటనవేలు మాత్రమే కాదు.. ఒంట్లోని చాలా కీళ్లలో గౌట్ దాడి మొదలవుతుందన్నారు. కదలికలు కష్టమవుతాయన్నారు. దీనిని సరిగా గుర్తించి చికిత్స తీసుకోకపోతే కిడ్నీల్లాంటి కీలక అవయవాలకూ ముప్పు తెచ్చిపెడుతుందని తెలుసుకోవాలన్నారు. కీళ్లనొప్పుల సమస్యలన్నింటిలోకీ ఒక్క గౌట్‌కు మాత్రమే పూర్తిగా నయం చేయడానికి చికిత్స ఉందన్నారు. సమావేశంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సదస్సు సమన్వయకర్త సాయిరామ్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న అలేఖ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

97042 53525, 80085 74897

? ఆకులవారితోటలోని సైడ్ కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ముందుకు కదలడం లేదు. దుర్వాసన వెదజల్లుతోంది. - **స్థానికులు, ఆకులవారితోట** . ✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం - **అంగడి వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? ఏటీ అగ్రహారం ఏడో లైన్‌లో సైడ్ కాలువల్లో పూడిక తీయడంలేదు. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. - **స్థానికులు, ఏటీ అగ్రహారం** ✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక ప్రతిరోజూ తీసేలా చర్యలు తీసుకుంటాం. - **అంగడి రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్. –న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

వివాహ బంధం ఎంతో పవిత్రం

పట్నంబజారు, న్యూస్‌టుడే: హిందూ వివాహ వ్యవస్థలో వివాహానికి ఎంతో ప్రాధాన్యం ఉందని ప్రవచనకర్త కేవీ కోటేశ్వరరావు అన్నారు. కొత్తపేటలోని పచ్చిపులుసు కల్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. కేవీ కోటేశ్వరరావు మాట్లాడుతూ..వివాహ బంధాన్ని ఫొటోలతో సరిపెట్టకుండా శాస్త్రబద్ధంగా జరపాలన్నారు. అవోపా అధ్యక్షుడు కేవీ బ్రహ్మం మాట్లాడారు. అనంతరం వధూవరుల ఫొటోలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. మద్దు రామకృష్ణయ్య, ఊటుకూరు నాగేశ్వరరావు, మహంకాళి శ్రీనివాసరావు, మంచుకొండ శ్రీను, సాయి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ బ్రహ్మం, మద్దు రామకృష్ణయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు

సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకార్చనలు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: శ్రీధర్మశాస్త అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామికి ఆడికృత్తిక నక్షత్రం సందర్భంగా ఆదివారం అర్చకులు శివకుమార్‌శర్మ భక్తిశ్రద్ధలతో విశేష ద్రవ్య పంచామృత అభిషేకార్చనలు నిర్వహించారు. ఆలయ పాలక మండలి ఛైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ప్రత్యేక అలంకరణలో స్వామి

వైభవంగా కావడి మహోత్సవం

ఏటి అగ్రహారం: ఏటీ అగ్రహారం ఏడో లైన్‌లో శ్రీకుమార స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కావడి మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్‌యాదవ్ మంత్రికి శాలువా కప్పి స్వాగతం పలికారు. పూజా కార్యక్రమంలో భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం పునరుజ్జీవనానికి కృషి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం పునరుజ్జీవనానికి కృషి చేయాలని సమాజం అధ్యక్షుడు జంపని రాధాకృష్ణమూర్తి అన్నారు. అరండల్‌పేట మూడో లైన్‌లోని కార్యాలయంలో దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సంఘీయులతో మహాజన సభ ఆదివారం నిర్వహించారు. మహిళలకు ఓటు హక్కు కల్పించడం, నూతన పాలకమండలిలో ప్రతి 50 మంది సభ్యులకు ఒక కార్యవర్గ సభ్యుడిని ఎంపిక చేయాల్సి ఉన్నందున 36 మంది కార్యవర్గ సభ్యుల ఎంపిక తదితర అంశాలపై తీర్మానం చేశారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు, సంఘ సభ్యులు హైకోర్టు న్యాయవాది అడవి కొలను వేణుగోపాలకృష్ణ, యోగి మహేశ్వరానంద గురూజీ, విశ్వకర్మ పీఠం వైస్ ఛైర్మన్ తుమోజు రామలక్ష్మణాచార్యులు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సమాజం ఉపాధ్యక్షుడు కె.నందవీరప్రసాద్, ప్రధాన కార్యదర్శి కందుకూరి శ్రీనివాస సుధాకర్‌రావు, కార్యదర్శి పూసపాటి గిరిధర్, కోశాధికారి కందేపు వెంకట్రావు, ఎన్నికల కమిటీ ఛైర్మన్ పాములపాటి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జంపని రాధాకృష్ణమూర్తి

వైకాపా రాష్ట్ర కార్యదర్శుల నియామకం

గోరంట్ల, న్యూస్‌టుడే: వైకాపా రాష్ట్ర కార్యదర్శులుగా పలువురిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లాకు చెందిన గులాం రసూల్, నిమ్మకాయల రాజనారాయణ, మందపాటి శేషగిరిరావులు పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులయ్యారు.

గుంటూరు సెంటీనియల్ సేవలు అమూల్యం

గోరంట్ల, న్యూస్‌టుడే: సమాజంలోని పేదలకు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటీనియల్ అందిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. నగరంలోని ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌కు ఆదివారం ఇస్త్రీ బండి అందించారు. అతను బండిపై ఇస్త్రీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేందుకు సాయపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, అపార్ట్‌మెంట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వండి

మాట్లాడుతున్న సురేష్‌బాబు, అంజిబాబు, సుభానీ, సుబ్బారావు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అర్హులందరికీ రేషన్‌కార్డులు, పింఛన్లు ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు సురేష్‌బాబు కోరారు. సంగడిగుంటలో నగర సమితి సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు నగర కార్యవర్గ సభ్యులు అంజిబాబు మాట్లాడుతూ..పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. సుభానీ, సుబ్బారావు, రషీద్, అలీ, వెంకట్రావు పాల్గొన్నారు.

Patola, Banaras Sarees Exhibition

21st JULY 10 AM - 10 PM

Venue : 7B Lane, Chandramouli Nagar, Near Siddhardha Gardens, Beside Shawarma Company, GUNTUR.

(c) eenadu

ఈనాడు
అమరావతి
కృష్ణా
సోమవారం జులై 21, 2025 5

అమ్మ దర్శనం.. తనువు పరవశం

ఆషాఢమాసం చివరి ఆదివారం కావడంతో విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. మహిళలు వేలాదిగా తరలివచ్చి అమ్మవారికి ఆషాఢసారె సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారితో క్యూలైన్లు, ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆధ్యాత్మికత పరిఢవిల్లింది. – ఈనాడు, అమరావతి

తాడేపల్లిగూడెం నుంచి సారె తీసుకొచ్చి పూజలు చేస్తున్న భక్తులు

నచ్చినట్లు వినియోగం.. ఎందుకీ మౌనం?

ముడ నిధులను ఖర్చు చేసిన గత పాలకులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

బందరుతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం ఏర్పాటైన మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడ) గురించి గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా పోర్టు కోసం భూముల సేకరణకు అప్పుగా తెచ్చిన నిధులనూ ఇష్టం వచ్చినట్లు వినియోగించడమే కాకుండా తెచ్చిన రుణానికి వడ్డీ కూడా చెల్లించలేదు. దీనిపై గతంలోనే మంత్రి కొల్లు రవీంద్ర ముడ అధికారులతో సమీక్షించి విచారణ చేస్తామన్నారు. కానీ ఇప్పటి వరకు దాని గురించి ఏమి తెలియక పోవడంతో విమర్శలు వస్తున్నాయి.

రుణం తీసుకొచ్చారు: తెదేపా హయాంలో పోర్టు కోసం భూముల సేకరణకు ఏపీ మినరల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.200 కోట్ల రుణం తీసుకొచ్చారు. బందరు మండలంలోని మంగినపూడి, తపశిపూడి, గోపువానిపాలెం, కరగ్రహారంలోని సముద్ర తీర, అసైన్డ్, పట్టా భూములను రైతుల నుంచి సేకరించారు.

రూ.200 కోట్ల రుణంలో భూముల సేకరణ, ఇతర అవసరాలకు వెచ్చించగా మిగిలిన రూ.20 కోట్లనూ నిర్దేశించిన అవసరాలకే వినియోగించాల్సి ఉంది. అయితే మాజీ మంత్రి పేర్ని నాని ఎన్నికల ముందు గత ప్రభుత్వం నుంచి జీవో జారీ చేయించి వాటిని ఇతరాలకు మళ్లించారు. కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందడానికే ఆ నిధులను మళ్లించారని తెదేపాతో పాటు వివిధ పక్షాల నాయకులు ప్రశ్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పాటు ముడ పరిధిలోని భూముల్లో ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. కరగ్రహారం లేఔట్‌లో ఇచ్చిన వాటిల్లో 24 ఎకరాలు ముడ భూములు ఉన్నాయి. వీటి విలువ రూ.9 కోట్ల వరకు ఉంటుందని లెక్కగట్టగా ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు విడుదల చేయలేదు. వాటిని ముడ తీసుకున్న అప్పులో మినహాయించుకునేలా ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.

ప్రశ్నించినా ఫలితం లేదు..

రోడ్డు, రైలు అనుసంధానానికి సంబంధించి 196 ఎకరాలు అవసరమవుతుందని అప్పట్లో అధికారులు నిర్ణయించగా ఈ భూమిని పోతేపల్లి, చిలకలపూడి, గోపువానిపాలెం, మాచవరం తదితర గ్రామాల్లోని వారి దగ్గర తీసుకున్నారు. ఇలా పలు ప్రాంతాల్లో భూముల కొనుగోలుకు తీసుకున్న రుణంలో రూ.180 కోట్ల వరకు వెచ్చించినట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం రావడంతో ఉన్న మార్గదర్శకాల్లో వారికి ఇష్టం వచ్చినట్లు మార్పులు చేసుకొని ఉన్న నిధులను ఖర్చు చేయడంపై అప్పట్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి.

నోటీసులు జారీ: ఏపీ మినరల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి తీసుకున్న రూ.200 కోట్ల రుణం చెల్లించక పోవడంతో వడ్డీ తడిసి మోపెడైంది. దీంతో రుణం చెల్లించాలంటూ ముడకు నోటీసులు జారీ అవుతున్నాయి. ఈ విషయాన్ని గతేడాది నిర్వహించిన సమీక్షలో అప్పటి అధికారులు మంత్రి రవీంద్రకు తెలిపారు. ఆ తర్వాత ముడ ఛైర్మన్ కూడా నియమితులయ్యారు. అయినా ఇప్పటి వరకు ఆ నిధుల వినియోగంపై విచారణ ఏమయ్యిందో.. ఎందుకు ఇంత జాప్యం జరుగుతుందోనని? ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పన్నులకూ ఎగనామం..!

నేతల సిఫార్సులతో అసలు చెల్లించనివి వేలల్లోనే

కృష్ణా, ఎన్టీఆర్‌లో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి

ఈనాడు, అమరావతి

★ ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని విజయవాడ నగరపాలక సంస్థతో పాటు కొండపల్లి, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు పట్టణ పరిధిలో 1286 అక్రమంగా అసలు పన్నే వేయకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. ★ కృష్ణా జిల్లా పరిధిలో తాడిగడప, మచిలీపట్నం, గుడివాడ, పెడన, ఉయ్యూరు పట్టణాల పరిధిలోనూ ఏకంగా 1614 నిర్మాణాలను అసలు పన్ను పరిధిలోకి తీసుకురాకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

మున్సిపాలిటీ	పన్ను వేయని భవనాలు	రావాల్సిన పన్ను (రూ.లక్షల్లో)	పన్ను తగ్గించిన భవనాలు	రావాల్సిన పన్ను (రూ.లక్షల్లో)	మొత్తం ఆదాయం
తాడిగడప	948	81,84,764	476	35,80,736	1,17,65,500
మచిలీపట్నం	344	45,67,536	680	36,97,408	82,64,944
గుడివాడ	116	9,51,904	337	35,43,504	44,95,408
పెడన	73	1,63,518	60	3,75,240	5,38,758
ఉయ్యూరు	133	5,15,430	114	3,82,568	8,97,998

నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో పన్నుల వసూళ్లపై తాజాగా అధికారులు నిర్వహిస్తున్న సర్వేలో అనేక వాస్తవాలు బయటకొస్తున్నాయి. గత ఐదేళ్ల వైకాపా హయాంలోనే తెరవెనుక లాబీయింగ్ పెద్దఎత్తున సాగింది. అప్పటి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్ల సిఫార్సులతో పట్టణ ప్రణాళిక సిబ్బంది ఈ భవనాలను చూసీచూడనట్టు వదిలేశారు. అందుకే ఇప్పటికీ వాటికి పన్నులే చెల్లించడం లేదు. గత నెలన్నరగా నిర్వహిస్తున్న అధ్యయనంలో పన్నుల పరిధిలోకే పూర్తిగా తీసుకురాని నిర్మాణాలు వేల సంఖ్యలో బయటపడుతున్నాయి. రెండు జిల్లాల్లో కలిపి 2,900 భవనాలు, ఇళ్లు, వాణిజ్య సముదాయాలకు అసలు పన్నే విధించకుండా ఏళ్ల తరబడి ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి కొడుతున్నారు.

తాడిగడపలో లెక్కలేనన్ని.. కృష్ణా జిల్లాలో అత్యధికంగా తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోనే ఈ పన్ను పరిధిలోకి రాని భవనాలున్నాయి. జిల్లాలో 1614 నిర్మాణాలు ఇలాంటివి గుర్తించగా వాటిలో 948 తాడిగడప పరిధిలోనే ఉండడం గమనార్హం. మచిలీపట్నంలోనూ ఇలాంటివి 344 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి వాటిపై ప్రతి ఆరు నెలల పన్ను కాలానికి కనీసం రూ.కోటిన్నరకు పైగా గండిపడుతోంది. ★ కృష్ణాలో పన్నును తగ్గించి వేసిన భవనాలు సైతం 1667 ఉన్నాయి. వీటిపైనా ఆరు నెలలకు మరో రూ.కోటి పైగా ప్రభుత్వ ఆదాయం నగర, మున్సిపాలిటీలు నష్టపోవాల్సి వస్తోంది. ★ విజయవాడలోనే అధికంగా.. పన్నుల పరిధిలోకి రాని నిర్మాణాలు ఏకంగా 990 వరకు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా రూ.కోటిన్నరకు పైగా ఆదాయానికి గండి పడుతోంది.

పట్టణ ప్రణాళికలో అక్రమార్కులు..

నగర, పట్టణ ప్రణాళికల్లోని కొంత మంది సిబ్బంది పూర్తిగా అవినీతిలో కూరుకుపోయారు. ఇప్పటికే విజయవాడ, తాడిగడప పరిధిలోని పలువురు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికీ చాలా మంది సిబ్బంది పట్టణ ప్రణాళిక విభాగంలో పూర్తిగా పాతుకుపోయి అక్రమాలకు పాల్పడుతున్నారు. అక్రమ భవనాలకు విచ్చలవిడిగా అనుమతులిచ్చి దండుకోవడం, పన్నుల్లోనూ అవినీతికి పాల్పడడంపై తీవ్రస్థాయిలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే : కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తారని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు ఆదివారం తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ పరిష్కార వేదిక ఉంటుందని చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమీపంలోని మండల, డివిజన్ కేంద్రాల్లో అర్జీలు సమర్పిస్తే అధికారులు తగు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. కాల్ సెంటరులోని 1100 నంబరుకు ఫోన్ చేసి అర్జీలు నమోదు చేసుకోవడంతో పాటు వాటి స్థితిగతులను తెలుసుకోవచ్చన్నారు.

హరితబరంపార్కు వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురంలోని పర్యాటక శాఖకు చెందిన హరిత బరంపార్కు వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతి వారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల గోడ పత్రికను ఆదివారం హరిత బరం పార్కు వద్ద విడుదల చేసి మాట్లాడారు. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు, వారిలో ఉత్సాహాన్ని నింపేందుకు వీలుగా ప్రతి ఆదివారం వీటిని నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ఆరేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న వారిని మొదటి కేటగిరి, 7 నుంచి 10 రెండో కేటగిరి, 11 నుంచి 15 ఏళ్ల వారు మూడో కేటగిరి, 16 సంవత్సరాలు కంటే ఎక్కువ వయస్సు ఉన్న వారు నాలుగో కేటగిరిలో పోటీలు జరుగుతాయని తెలిపారు. సోలో, బృందంగా, క్లాసికల్, జనరల్‌లో పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 27వ తేదీ నుంచి కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. ప్రతి వారం వినూత్నమైన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

ఏపీపీఎస్సీ లెక్చరర్ పరీక్షలకు 522 మంది హాజరు

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే : జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఏపీపీఎస్సీ లెక్చరర్ పరీక్షలకు 522 మంది హాజరయ్యారు. కానూరులోని అయాన్ డిజిటల్ జోన్, పీవీ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గంగూరులోని ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, మచిలీపట్నంలోని ద్వైతా మధుసూదన శాస్త్రి వెంకటేశ్వర హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో నిర్వహించిన పరీక్షలకు 1103 మంది హాజరు కావాల్సి ఉండగా 47.32 శాతం మంది మాత్రమే హాజరయ్యారు. కానూరులోని అయాన్ డిజిటల్ జోన్ సెంటర్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు తనిఖీలు నిర్వహించారు.

మోపిదేవిలో ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

స్వామికి ఆడికృత్తికా మహోత్సవం

మచిలీపట్నం(గొడుగుపేట), మోపిదేవి, న్యూస్‌టుడే: బందరు మండలం మేకవానిపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆడికృత్తిక కావడి సేవా మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. కోనేరు సెంటరు నుంచి పురవీధుల మీదుగా ఆలయం వరకు నిర్వహించిన ఊరేగింపులో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ✪ మోపిదేవిలో స్వామివారి జన్మ నక్షత్రమైన ఆడికృత్తికా మహోత్సవాన్ని జన్మదినోత్సవంగా నిర్వహించారు. 108 కలశాలతో అష్టోత్తర, కలశాభిషేకం, చతుర్వేద పండితులు, 11మంది రుత్వికులచే మహన్యాస పారాయణ, ప్రత్యేక అలంకరణలతో ఆలయం నూతన కళతో అలరారింది.

మోపిదేవి: ఫల పుష్పాలంకరణ

బందరులో వైభవంగా కావడి ఊరేగింపు

మచిలీపట్నం: సన్నాయి వాయిద్యంతో ఆకట్టుకున్న మహిళలు

గోవుకు గూడు.. రైతుకు తోడు

మినీ గోకులాలకు రూ.30.6 కోట్లు

ఈనాడు, అమరావతి

వైకాపా పాలనలో అటకెక్కిన మినీ గోకులాల నిర్మాణానికి పూర్వ వైభవం వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి ఏడాదిలోనే 1775 షెడ్ల ఏర్పాటు చేసిన పాడి రైతులకు అండగా నిలిచారు. తాజాగా 2025-26 ఆర్థిక ఏడాదికి నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో డ్వామా సిబ్బంది లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మొదలుపెట్టారు. గత నిర్మాణ పద్ధతులకు స్వస్తి చెప్పి నూతన విధానంలో నిర్మాణం చేపట్టేందుకు నమూనాలు రూపొందించారు.

పాడి రైతుకు వెన్నుదన్ను.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఎన్టీఆర్‌లో 1000, కృష్ణా జిల్లాలో 700 షెడ్లు మంజూరయ్యాయి. వీటికి రూ.30.6 కోట్ల వరకు నిధులు మంజూరు చేశారు. రైతులు పెంచుతున్న పశువులను బట్టి మూడు

షెడ్డు రకం	ఖర్చు(రూ.)	ప్రభుత్వం	రైతు వాటా
రెండు పశువులు	1,15,000	1,03,500	11,500
నాలుగు పశువులు	1,85,000	1,66,500	18,500
ఆరు పశువులు	2,30,00	2,07,000	23,000

రకాల షెడ్లు ఏర్పాట్లు చేసుకునేందుకు రైతులకు అవకాశం ఉంది. షెడ్డు నిర్మాణానికి అయ్యే ఖర్చులో 90శాతం నిధులు ప్రభుత్వం ఉపాధి హామీ నిధుల ద్వారా ఇస్తుంది. మిగిలిన పది శాతం రైతులు చెల్లించాలి. ప్రస్తుతం రెండు జిల్లాల్లో అర్హతలను బట్టి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు.

కొత్త నిర్మాణానికి శ్రీకారం.. ఇప్పటివరకు షెడ్ల నిర్మాణంలో మేత తొట్టెలు ఏదో ఒక వైపు నిర్మించేవారు. వర్షం వస్తే మేత తడిసిపోవడం, గాలి, వెలుతురు సవ్యంగా రాకపోవడం వంటి సమస్యలు ఉండేవి. దీన్ని పరిష్కరించేందుకు అధికారులు వినూత్న నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. షెడ్డు మధ్యలో మేత తొట్టి నిర్మిస్తున్నారు. దీని వల్ల షెడ్డు వెడల్పు పెరుగుతుంది. మధ్యలో మేత తొట్టి ఉండడంతో వర్షం వచ్చినా గడ్డి తడవదు. షెడ్డుకు ఇస్తున్న మొత్తం నిర్మాణంలో వృధా ఖర్చులు తగ్గించి ఆ సొమ్ముతో రెండు సీలింగ్ ఫ్యాన్లు, దోమ తెర కూడా అందించనున్నారు. ఈ అంశమై ఎన్టీఆర్, కృష్ణా జిల్లా డ్వామా పీడీలు రాము, శివప్రసాద్ మాట్లాడుతూ రైతులందరికీ ఇది మంచి అవకాశమని క్షేత్రసహాయకులు, ఎంపీడీవో కార్యాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రకాశం బ్యారేజీకి వరద తాకిడి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : భారీ వర్షాల నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీకి స్థానిక వరద నీరు చేరుతోంది. జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఈ నెల 21వ తేదీ సోమవారం ప్రకాశం బ్యారేజీ గేట్లను ఎత్తి, సముద్రంలోకి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బ్యారేజీ వద్ద ప్రస్తుతం 12 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టం ఉంది. 3,000 క్యూసెక్కుల వరకు వరద నీరు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కృష్ణా డెల్టా పరిధిలోని జిల్లాల్లో వర్షాలు కురుస్తుండడంతో సాగునీటి అవసరాలు తగ్గాయి. నీటి విడుదలను బాగా తగ్గించారు. కాలువలకు నీటి విడుదల పరిమితం కావడంతో వచ్చిన వరద నీటిని సముద్రంలోకి వదిలేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. సముద్రంలోకి నీటిని విడుదల చేయనున్న క్రమంలో.. కృష్ణా నది దిగువ ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

పట్టిసీమ పంపుల తగ్గింపు: పట్టిసీమ నుంచి 22 పంపుల ద్వారా గోదావరి నీటిని విడుదల చేస్తుండగా.. 10 పంపుల వరకు తగ్గించారు. గోదావరి నీటిని ఏలూరు జిల్లాలోనూ వినియోగిస్తున్నారు. ప్రస్తుతం అక్కడి అవసరాలకు పట్టిసీమ ఉపకరిస్తోంది. పులిచింతల నుంచి నీటిని నిలిపివేశారు. వజినేపల్లి నుంచి 1,589 క్యూసెక్కులు వస్తోంది. రెండు రోజుల్లో మునేరు నుంచి వరద నీరు వచ్చే వీలుంది. వెరసి అధికారులు అప్రమత్తమై, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

పండక్కి.. కొండెక్కి

రేటు పెరిగిపోయిన కొబ్బరికాయ

గొల్లపూడి, న్యూస్‌టుడే

ఈ ఫొటో చూడండి... విజయవాడ నగర పరిధిలోని ఓ సూపర్‌మార్కెట్‌లో ఒక మోస్తరుగా ఉన్న కొబ్బరి కాయ ధరే రూ.48లు పలుకుతుంది. అక్కడే అంత రేటు ఉంటే బహిరంగ మార్కెట్‌లోని ఇంకెంత ఉంటుందోనని ప్రజలు ఆందోళనపడుతున్నారు. పూజలు, హోమాలు, శుభ, అశుభ కార్యక్రమాలకు కొబ్బరికాయ లేనిదే ఆ తంతు పూర్తవదు. కానీ... ప్రస్తుత పరిస్థితుల్లో సామాన్య ప్రజలు కొబ్బరికాయలను కొనలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం చిన్నసైజు కాయలు రూ.30లు పలుకుతుండగా, పెద్ద సైజు రూ.50 నుంచి రూ.70వరకు అమ్ముతుండడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు.

ఇదే కారణం: కొబ్బరికాయలు విజయవాడకు ఎక్కువగా తమిళనాడులోని పొలాచ్చి, కోయంబత్తూరు నుంచి వస్తుంటాయి. అయితే... అక్కడ చెట్లకు చెదపురుగులు పట్టడంతో దాదాపు 70 శాతం మేర పంట పాడైపోయి దిగుబడి తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. దీనికి తోడు కర్ణాటకలోని సామ్రాజ్యనగర్, ఏపీలోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వచ్చే కాయలుకూడా పూర్తి స్థాయిలో రాకపోవటంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాల్లో గతంలో కొబ్బరికి ధర లేదంటూ రైతులు చెట్లను నరికి పామాయిల్ పంట వేయడమూ ధర పెరగడానికి ఓ కారణం.

అమాంతం పెరిగిన ధర...

తమిళనాడులో ప్రస్తుతం టన్ను కొబ్బరికాయ ధర రూ.67 వేలు పలుకుతుంది. రవాణా ఖర్చులు రూ.5 వేలు.. టన్నుకు సైజును బట్టి 2వేల వరకు కాయలు వస్తాయి. ఈ లెక్కన హోల్‌సేల్ వ్యాపారులకే ఒక కొబ్బరికాయ రూ.36 పలుకుతుంది. పెద్ద సైజువైతే రూ.46 పైమాటే. విజయవాడ నగర పరిధిలో గొల్లపూడి, సత్యనారాయణపురం, ఆటోనగర్, వన్‌టౌన్ ప్రాంతంలో హోల్‌సేల్ వ్యాపారులు ఉన్నారు. ప్రస్తుతం కొబ్బరికాయల ధర పెరగడం వల్ల డిమాండ్ లేదని పూర్తిగా వ్యాపారం పడిపోయిందని హోల్‌సేల్ వ్యాపారి వీరరాఘవులు చెబుతున్నారు.

తగ్గేనా... మరికొద్ది రోజుల్లో శ్రావణమాసం, వినాయకచవితి వేడుకలు వస్తున్నాయి. ఆ సమయంలో భక్తులు పెద్ద ఎత్తున పూజలు, వ్రతాలు చేస్తుంటారు. కొబ్బరికాయ ధరలు తగ్గకుంటే భక్తులు కొనలేని పరిస్థితులు ఏర్పడతాయి.

పెనమలూరు: కామయ్యతోపు సెంటర్లో నిలిచిన నీరు

పెనమలూరు–చోడవరం మధ్య చెరువును తలపిస్తున్న వరి పొలాలు

జిల్లాలో ఆదివారం కురిసిన వర్షానికి రహదారులు, పొలాలు మునిగాయి. –న్యూస్‌టుడే, కానూరు, పెనమలూరు

దంచింది.. ముంచింది

విజయవాడ నగరంలో ఆదివారం రాత్రి కుండపోతలా వర్షం కురిసింది. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన వాన 9.30 వరకు కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. రోడ్లు చెరువులయ్యాయి. – ఈనాడు, అమరావతి

న్యాయవాదికి రూ.13.30 లక్షల టోకరా

అధిక లాభాలు ఆశచూపి కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

పెనమలూరు, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్ల మోసాల వలలకు ఉన్నత విద్యావంతులు సైతం చిక్కుతున్నారు. కానూరుకు చెందిన ఓ న్యాయవాది అలా వారికి దొరికిపోయి రూ.13.30 లక్షలు పోగొట్టుకొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . కానూరు పిన్నమనేని టీచర్స్ కాలనీకి చెందిన ఓ న్యాయవాది వాట్సాప్‌కు ఇటీవల ఓ ప్రైవేటు బ్యాంకు స్టాక్ ఎక్స్ఛేంజ్ గ్రూప్‌లో చేరాలని సందేశం వచ్చింది. అది చట్టబద్ధమైందని ఆయన నమ్మారు. తమ షేర్ల సంస్థలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని గ్రూప్ నిర్వహిస్తున్న వారు ఆశ చూపారు. నమ్మిన న్యాయవాది వారు అడిగిన మేరకు తన కేవైసీ సమాచారం అందజేశాడు. అనంతరం వారి నుంచి ట్రేడింగ్, ఐడి, పాస్‌వర్డ్‌లు పొందాడు. అప్పట్నించి విడతల వారీగా రూ.13.30 లక్షలు వరకు పెట్టుబడిగా పెట్టాడు. గత మార్చిలో రూ.10 లక్షలు విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా వీలు పడలేదు. దీనిపై తాను సంప్రదింపులు జరుపుతున్న సంస్థ కస్టమర్ కేర్‌ను సంప్రదించగా ఏప్రిల్‌లో విత్‌డ్రా చేసుకోవాలని సూచించారు. అనంతరం రూ.5 లక్షలు తీసుకోవడానికి ప్రయత్నించగా సాధ్యపడలేదు. దీంతో అనుమానం వచ్చి.. కొద్దిరోజుల కిందట స్థానికంగా ఉన్న ప్రైవేటు బ్యాంకు సెక్యూరిటీస్ కార్యాలయంలో సంప్రదించాడు. వారు ఇచ్చిన సమాచారంతో తాను పెట్టుబడి పెట్టింది నకిలీ సంస్థలో అని గుర్తించాడు. మోసపోయినట్లు గుర్తించి ఆదివారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలకు నీటి విడుదల తగ్గింపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : భారీ వర్షాల నేపథ్యంలో సాగునీటి కాలువలకు క్రమేపీ నీటి విడుదల తగ్గిస్తున్నారు. బాపట్ల, గుంటూరు, ఏలూరు, కృష్ణా జిల్లాల రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు నీటిని తగ్గించారు. గత కొన్ని రోజులుగా 13,000 పైచిలుకు క్యూసెక్కుల వరకు విడుదల చేయగా.. ఇప్పుడు 9,000 క్యూసెక్కులకు తగ్గించారు. నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు ఆదివారం 9,499 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 6,492 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 3,007 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,003, ఏలూరు 1,204, బందరు 1,080, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,205 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. పట్టిసీమ నుంచి 5,680, వజినేపల్లి నుంచి 1589 వెరసి 7,269 క్యూసెక్కులు బ్యారేజీకి వస్తోంది. బ్యారేజీ వద్ద నీటి మట్టం 12 అడుగులు ఉంది.

నేడు రాజధానిలో మంత్రి నారాయణ పర్యటన

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ సోమవారం రాజధానిలో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. ఇందులో భాగంగా ఆయన రాయపూడి సమీపంలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అఖిల భారత ఉద్యోగుల భవన సముదాయాలు, మంత్రులు, ముఖ్య కార్యదర్శుల బంగ్లాల నిర్మాణం పనులను అధికారులతో కలసి పరిశీలించనున్నారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించనున్నారు.

(c) eenadu

భవితకు భరోసా..!

వృత్తి విద్యా కోర్సులతో ప్రయోజనాలెన్నో ★ నెలాఖరు వరకు ప్రవేశాలు

మాచవరం, న్యూస్‌టుడే

పదో తరగతి పూర్తయిన తర్వాత సాధారణంగా ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ చదవాలని ఎక్కువ మంది ఆసక్తి చూపుతారు. పలువురు విద్యార్థులకు ఈ కోర్సుల్లో చేరాలనే కోరిక ఉన్నా.. ఆర్థిక స్థోమత లేకపోవడం, కుటుంబ నేపథ్యం వంటి కారణాలతో సతమతమవుతుంటారు. ఇలాంటి వారి కోసమే కేంద్ర ప్రభుత్వం 1985లో ఒకేషనల్ (వృత్తి విద్య) కోర్సులను ప్రవేశపెట్టింది. వీటిని పూర్తి చేసిన వారికి ఉద్యోగ, అప్రెంటీస్ మేళాల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జనరల్ సబ్జెక్టులతో పాటు ఈ వృత్తి విద్యా కోర్సులు అందిస్తున్నారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వం వారికి ఉచితంగా టెక్స్ట్, నోట్ బుక్స్ అందించనుంది. ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అదనపు తరగతులు నిర్వహించనున్నారు. ఒకేషనల్ విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు సర్టిఫికెట్‌తో పాటు ఈ ఏడాది నుంచి కేంద్ర ప్రభుత్వం కూడా సర్టిఫికెట్ ఇస్తుంది. మలి దశ ప్రవేశాలను ఈ నెల 31వ తేదీ వరకు ఇంటర్ బోర్డు పొడిగించింది. ఆసక్తిగల వారు ప్రవేశాలు పొందవచ్చు. ఇంజినీరింగ్‌కు ఎంపీసీ, పారా మెడికల్‌కు బైపీసీ గ్రూపులో కొంత సిలబస్‌తో బ్రిడ్జి కోర్సు పూర్తి చేయాల్సి ఉంది. ఈ కోర్సులన్నీ రెండేళ్లలో పూర్తి చేసుకోవచ్చు.

కోర్సుల వివరాలు..

ఇంజినీరింగ్ విభాగంలో.. సీఎస్ఈ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సైన్స్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ కోర్సు ఎంతో ఉపయోగపడుతుంది. కంప్యూటర్‌కు సంబంధించిన అన్ని అవసరాలనూ తీర్చేలా విద్యార్థి తన కాళ్లపై తాను నిలబడేలా తోడ్పడుతుంది. ఉన్నత విద్యాభ్యాసానికి దోహద పడుతుంది.

ఈటీ (ఎలక్ట్రికల్ టెక్నీషియన్): విద్యుత్తు రంగానికి సంబంధించిన ప్రాథమిక, మాధ్యమిక అవగాహన కల్పిస్తారు. ఉన్నత విద్యనభ్యసించవచ్చు. స్థానికంగా గృహ, వాణిజ్య పరమైన నిర్మాణాల్లో వైరింగ్ పనులు చేసుకోవచ్చు. రైల్వేస్, ఆర్టీసీ వంటి పలు ప్రభుత్వరంగ సంస్థల్లో జూనియర్ లైన్‌మెన్, ఎలక్ట్రికల్ అసిస్టెంట్ టెక్నీషియన్‌గా ఉద్యోగాలు పొందవచ్చు.

సీఈటీ (కన్‌స్ట్రక్షన్ ఇంజినీరింగ్ టెక్నీషియన్): ఎన్ఆర్ఈజీఎస్ (నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్)లో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల (రోడ్లు, భవనాలు, వంతెనలు, చెరువులు)కు అర్హులు. వీటితో పాటు మండల సర్వేయర్ పోస్టులకు అర్హులు.

ఎం అండ్ ఏటీ (మెకానికల్ అండ్ ఆటోమొబైల్ టెక్నీషియన్): వాహనాలు, యంత్రాల పనివిధానంపై అవగాహన కల్పిస్తారు. ఈ కోర్సు చదివిన వారు స్వయం ఉపాధి పొందవచ్చు. ఆసక్తి ఉంటే ఉన్నత విద్య కూడా చదవవచ్చు. వివిధ ఆటో మొబైల్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

ఉన్నత విద్యలో..

★ నీట్ ద్వారా ఎంబీబీఎస్/ బీడీఎస్/ ఆయుర్వేదిక్/ హోమియో/ యునాని/ సిద్ధ కోర్సులు ★ ఎంసెంట్ ద్వారా అగ్రికల్చర్/ హార్టీకల్చర్/ ఫిషరీస్ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు. ★ పారా మెడికల్‌లో అయితే.. కార్డియాక్ టెక్నీషియన్/ ఎక్స్‌రే/ అనస్థీషియా అసిస్టెంట్, డయాలిసిస్ టెక్నీషియన్ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు. ఈ రెండేళ్ల కోర్సులు పూర్తి చేసిన వారు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉద్యోగాలకు అర్హులు.

పారా మెడికల్ విభాగం..

ఎంఎల్‌టీ (మెడికల్ లాబ్ టెక్నీషియన్): ఈ కోర్సు పూర్తి చేసిన తర్వాత ఏడాది పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్లినికల్ ల్యాబ్ ట్రైనింగ్ అప్రెంటీస్ పూర్తి చేసిన తర్వాత సొంతంగా ల్యాబ్ పెట్టుకోచ్చు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీపర్పస్ హెల్త్ వర్క్) (మహిళలు) : ఈ కోర్సు పూర్తి చేసిన తర్వాత ఏడాది పాటు క్లినికల్ ట్రైనింగ్ అప్రెంటీస్ పూర్తి చేసుకున్న వారు ఏఎన్ఎం పోస్టులకు, గ్రామ/వార్డు సచివాలయ నర్సులుగా ఉద్యోగాలు పొందేందుకు అర్హులు.

జాతీయ స్థాయి గుర్తింపు

ఇంటర్మీడియట్ పూర్తయిన వెంటనే ఉద్యోగాలు పొందాలనుకునే వారు ఒకేషనల్ కోర్సులో చేరుతుంటారు. అలాంటి వారికి రాష్ట్ర బోర్డు జారీ చేసే సర్టిఫికెట్ కంటే ఎన్‌సీవీఈటీ (జాతీయ వృత్తి విద్య శిక్షణ మండలి) సర్టిఫికెట్‌తో అదనపు ప్రయోజనాలు ఉంటాయి.

\- బి.ప్రభాకరరావు, డీవీఈవో

సమర్థ నాయకత్వంతో అభివృద్ధి పరుగులు

మహిళలతో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పక్కన బోడే ప్రసాద్

కంకిపాడు (గ్రామీణం), న్యూస్‌టుడే: సమర్థ నాయకత్వం ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందనడానికి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనే నిదర్శనమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని గొడవర్రులో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. మహిళలు, వృద్ధులు, రైతులతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని వాకబు చేశారు. గత వైకాపా.. ప్రస్తుత కూటమి పాలనకు గల వ్యత్యాసాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే బోడే మాట్లాడుతూ గొడవర్రుకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

గొడవర్రు అల్లుడికి ఘన స్వాగతం : కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని సతీమణి గొడవర్రు గ్రామానికి చెందిన వారు కావడంతో ఆయనకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. తొలుత స్థానిక సచివాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. అనంతరం అత్తవారింటి నుంచి పెమ్మసాని తన పర్యటన ప్రారంభించారు. గ్రామ అల్లుడిని చూసేందుకు స్థానికులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో దేవినేని రాజా, అనుమోలు ప్రభాకరరావు, ఎం.కల్యాణి, కోయా ఆనంద్, కోనేరు భానుప్రసాద్, రాజేష్, యలమంచిలి నాని తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా కాంప్లెక్స్ భవనం

అద్దెలకు ఇస్తే పంచాయతీకి ఆదాయం

అవనిగడ్డలో నిర్మించిన మహిళా సాధికారత కాంప్లెక్స్ ఇదే

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక తితిదే కల్యాణ మండపం పక్కన రూ.1.31 కోట్ల జిల్లా పరిషత్, ఇతర నిధులతో నిర్మించిన మహిళా సాధికారత కాంప్లెక్స్ భవన సముదాయం (షాపింగ్ కాంప్లెక్స్) నిరుపయోగంగా ఉంది. గతేడాది మార్చి 7న తేదీన జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక దీన్ని హడావుడిగా ప్రారంభించారు. పూర్తిగా వసతులు ఏర్పాటు చేయకపోవడంతో అప్పట్లో అద్దెకు ఇచ్చేందుకు చర్యలు చేపట్టలేదు. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఈ భవనం గురించి పట్టించుకోలేదు. భవన సముదాయానికి విద్యుత్ సరఫరా ఏర్పాటు వంటి పనులు ఇప్పటికీ పూర్తి చేయలేదు. దీంతో పంచాయతీకి రావాల్సిన ఆదాయం రాకుండా పోతోంది. పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ (24 గదులు) నిరుపయోగంగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ కాంప్లెక్స్ వరండా బిచ్చగాళ్లు, కుక్కలు పడుకోవడానికి ఉపయోగపడుతోంది. ఇప్పటికైనా విద్యుత్ సౌకర్యం కల్పించి గదులు అద్దెకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటే పంచాయతీకి నెలకు రూ.లక్ష వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు.

మనస్తాపంతోనే వెళ్లిపోయా..

★ పోలీసులకు ఏఈఈ కిశోర్ వాంగ్మూలం ★ క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగింత

రాజమహేంద్రవరంలో పోలీసుల సంరక్షణలో కిశోర్

తిరువూరు, పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: 'ఇదివరకు జరిగిన నెల దాటినా రిలీవ్ చేయకపోవడంతో మనస్తాపానికి గురై తిరువూరు నుంచి విశాఖపట్నం వెళ్లి, అక్కడి నుంచి రాజమహేంద్రవరం వచ్చాను' అంటూ.. జలవనరులశాఖ తిరువూరు ఏఈఈ వి.కిశోర్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ శుక్రవారం లేఖ రాసి, అధికారుల గ్రూపులో పోస్టుచేసి అదృశ్యమైన ఏఈఈని ఆదివారం ఉదయం రాజమహేంద్రవరంలో పోలీసులు పట్టుకున్నారు. దాంతో రెండ్రోజుల ఉత్కంఠకు తెరపడింది. క్షేమంగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరు తీసుకొచ్చి అతని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం తిరువూరులోని కార్యాలయం నుంచి ఖమ్మం జిల్లా బంజరు చేరుకున్నారు. అక్కడ నగదు డ్రా చేసి రాత్రి ప్రయాణ సమయంలో అతని ఫోన్ ఆన్ కావడం..వెంటనే ఆగిపోవడంతో విశాఖపట్నంలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, అతని కుటుంబ సభ్యులతో కలిసి బయలుదేరి వెళ్లారు. తీరా విశాఖపట్నం వెళ్లాక, శనివారం రాత్రి రాజమహేంద్రవరంలో ఫోన్ ఆన్ అయినట్లు సిగ్నల్స్ రాగా వారు కూడా అక్కడికి చేరుకున్నారు. అయినా మళ్లీ ఫోన్ ఆగిపోవడంతో రాత్రంతా అక్కడే ఉండిపోయారు. ఈ లోగా ఫోన్ కలిసే వరకు అందుబాటులో ఉండాలని ఏఈఈ కుటుంబ సభ్యులకు పోలీసులు సూచించారు. చివరికి ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో ఫోన్ కలవడంతో, సాంకేతిక సాయంతో అతను గోదావరి ఒడ్డున పుష్కర ఘాట్ వద్ద ఉన్నట్లు నిర్ధరించుకుని, భార్యతో ఫోన్ మాట్లాడమని సూచించారు. ఈ లోగా నేరుగా అక్కడకు చేరుకున్నారు. అక్కడ అల్పాహారం అనంతరం మధ్యాహ్నం 12 గంటలకల్లా తిరువూరు స్టేషన్‌కు తీసుకొచ్చారు. వాంగ్మూలం నమోదు చేసుకుని కుటుంబసభ్యులకు అప్పగించారు.

రిలీవ్ చేస్తున్నారని తెలిసి..

శుక్రవారం రాత్రి ప్రయాణంలో ఉన్న అతడు శనివారం రాత్రికి రాజమహేంద్రవరం చేరుకుని, బస్టాండ్ ప్రాంగణంలో గది తీసుకుని అక్కడే ఉన్నట్లు పోలీసులకు వివరించాడు. ఈ లోగా తనను రిలీవ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలివ్వడం, పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైనట్లు తెలుసుకుని తిరిగి రావడానికి సిద్ధమైనట్లు పేర్కొన్నారు.

యాదవులకు సముచిత స్థానం: మంత్రి కొలుసు

మంత్రి పార్థసారథిని సన్మానిస్తున్న యాదవ సంఘాల నాయకులు

పోరంకి(కానూరు), న్యూస్‌టుడే: బీసీలకు మొదటి నుంచి అండగా నిలిచిన పార్టీ తెదేపా అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం పోరంకి ఎల్ఎన్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా యాదవుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యాదవులంతా ఐక్యంగా ఉండి అటు వ్యాపారం, ఇటు రాజకీయ రంగాల్లో ఎదగాలన్నారు. గొర్రెల పెంపకానికి ప్రభుత్వం సుమారు రూ.కోటి వరకు రాయితీ రుణాలు అందిస్తోందన్నారు. అవసరమైన వారికి తాను సహకారం అందిస్తానన్నారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, తనకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తోందన్నారు. యాదవులంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి అండగా నిలిచి వచ్చే ఎన్నికల్లోనూ కూడా గెలిపించాలని కోరారు. అనంతరం మంత్రి పార్థసారథిని ఘనంగా సన్మానించారు.

మల్టీ డే క్రికెట్ ఛాంప్ 'ప్రకాశం'

విజేత జట్టు క్రీడాకారులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ సెంట్రల్ జోన్ అండర్-16 మల్టీ డే క్రికెట్ టోర్నీ విజేతగా ప్రకాశం జట్టు నిలిచింది. గుంటూరు జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. మంగళగిరి మైదానంలో ఆదివారం ఒక పరుగు ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో ఇన్నింగ్స్ ఫాలోఆన్ కొనసాగించిన పశ్చిమ గోదావరి జట్టు 41.1 ఓవర్లలో 97 పరుగులకే కుప్పకూలింది. ప్రత్యర్థి బౌలర్ ఎస్. సందేశ్ (5/7) మెరిశాడు. ప్రకాశం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 493 పరుగులు చేయగా.. పశ్చిమ గోదావరి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 90 పరుగులకే ఆలౌటైంది. దాంతో ప్రకాశం జట్టు 306 పరుగుల ఆధిక్యంతో గెలుపొందింది. ✦ పేరేచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఆదివారం 47 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన కృష్ణా జట్టు 46.4 ఓవర్లలో 138 పరుగులకు ఆలౌటైంది. గుంటూరు బౌలర్ ఎస్సీ గోపీచంద్ (5/25) మెరిశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు 5.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 17 పరుగులతో లక్ష్యాన్ని ఛేదించింది. దాంతో గుంటూరు జట్టు పది వికెట్ల తేడాతో విజయం సాధించింది.

మధుమేహ రోగుల్లో దృష్టి లోపాలపై పరిశోధన

డాక్టరేట్ అందుకున్న డాక్టర్ శ్రీకాంత్

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం నిమ్మగడ్డ గ్రామానికి చెందిన ప్రముఖ మధుమేహ వైద్య నిపుణులు డాక్టర్ మెడెంపూడి శ్రీకాంత్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. మధుమేహ దృష్టి లోపాలపై విస్తృత పరిశోధనకు డాక్టరేట్‌ను అందుకున్నారు. దీర్ఘకాలిక టైపు2 మధుమేహ రోగులలో డయాబెటిక్ రెటినోపతికి సంబంధించిన బాహ్య, అంతర్గత ప్రమాద కారకాలు, జన్యు వ్యత్యాసాల మూల్యాంకనంపై పరిశోధన చేశారు. విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎం.సుబ్బారావు పర్యవేక్షణలో పరిశోధన సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ 'మధుమేహ రోగులను చూసే డాక్టర్‌గా డయాబెటిక్ రెటినోపతి వల్ల వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దృష్టి పెట్టి బయోకెమికల్ మార్పులు, జీవనశైలి, జన్యు ప్రభావాలపై అధ్యయనం చేశాను. ఈ ఫలితాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉపయోగపడేలా ఒక రిస్క్ కాలిక్యులేటర్ వలే తయారు చేశాన'ని తెలిపారు.

బంగారు పతకానికి ఎంపిక

నందిగామ (గ్రామీణం): ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం లింగాలపాడుకు చెందిన ప్రత్యూష అగ్రికల్చర్ పీహెచ్‌డీలో బంగారు పతకానికి ఎంపికయ్యారు. దిగుమర్తి లక్ష్మణరావు, సుజాత దంపతుల ఇద్దరు కుమార్తెలు. వీరిలో పెద్ద కుమార్తె ప్రత్యూష గుంటూరు లాం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజమహేంద్రవరంలో బీఎస్సీ అగ్రికల్చర్, బాపట్ల వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ పీజీ, ఇక్కడే స్థిర వ్యవసాయంలో (సస్టెయినబుల్ అగ్రికల్చర్) పీహెచ్‌డీ పూర్తి చేసింది. బెస్ట్ డాక్టోరల్ డిగ్రీలో (పీహెచ్‌డీ) బంగారు పతకానికి ఎంపిక చేశారు.

'మద్యం కుంభకోణం బాధ్యులకు శిక్ష తప్పదు'

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: నకిలీ మద్యం అమ్మి అభాగ్యుల మృతికి కారకులైన వారికి శిక్ష తప్పదని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో జరిగిన లిక్కర్ స్కాం దేశ చరిత్రలోనే అతి పెద్ద కుంభకోణమన్నారు. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లూ వాగులు, వంకలు, గుట్టలు, శాండ్, ల్యాండ్, మైన్ ఇలా అన్నీ దోచుకుతిన్నారన్నారు. దీనికి నిదర్శనం మిథున్‌రెడ్డి అరెస్ట్ కావడమే అన్నారు. 2019లో మద్య నిషేధం విధించిన తర్వాతే ఎన్నికలకు వెళతానని చెప్పిన జగన్‌రెడ్డి.. అక్రమ మద్యాన్ని రాష్ట్రంలో ఏరులై పారించి వేలాది మంది అభాగ్యుల మృతికి కారకులయ్యారని గురుమూర్తి ఆరోపించారు. లక్షలాది మంది కిడ్నీలు, లివర్లు చెడిపోయి తీవ్ర అనారోగ్యం పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుంభకోణంలో పాత్రధారులు, సూత్రధారులు కటకటాలపాలు కాకతప్పదన్నారు. ప్రధాన సూత్రధారుడు జగన్‌ను కూడా అరెస్టు చేయాలని గురుమూర్తి డిమాండ్ చేశారు.

పుస్తక పఠనంతో ప్రేరణ

పుస్తకాలు ఆవిష్కరిస్తున్న రామచంద్రమూర్తి, రవి, ఆనందాచారి తదితరులు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : పుస్తక పఠనంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, అవి ప్రేరణగా నిలుస్తాయని సీనియర్ సంపాదకుడు కె.రామచంద్రమూర్తి అన్నారు. పాత్రికేయుడు, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి రాసిన 'ఆశయపథం(నవల), అభద్ర (కథల సంపుటి), సజీవం(కవితా సంకలనం), మీరే ప్రేరణ మీదే సాధన(వ్యక్తిత్వ వికాసం), ప్రజాగానం(పాటలు), నేనెప్పుడూ కమ్యూనిజానికే సొంతం(ఆరుద్ర)' అనే ఆరు పుస్తకాలను విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సభలో రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయాలు, వివిధ పరిణామాల నేపథ్యంలో రాసిన ఈ పుస్తకాలు చదివిన వారికి ఎంతో ప్రేరణగా నిలుస్తాయని చెప్పారు. రచయిత పుస్తకాల గురించి వివరిస్తూ.. ఇవి ఆరు ప్రక్రియలకు సంబంధించినవన్నారు. ఆశయపథం.. అపూర్వ విజయం నవలకు సంబంధించినదిగా వివరించారు. ఉమ్మడి మద్రాసు, నిజాం పాలనలో రెండు ప్రాంతాల ప్రజలు భుజాలు కలిపి ఏవిధంగా పోరాడి అపూర్వమైన విజయాన్ని సాధించారో అందులో వివరించినట్లు చెప్పారు. ఎవరికి వారు సొంతంగా ప్రేరణపొంది, శ్రమిస్తే కొత్త విషయాలు తెలుసుకుని విజయాలను ఎలా సాధించవచ్చన్నది 'మీరే ప్రేరణ.. మీదే సాధన' పుస్తకంలో వివరించానన్నారు. వివిధ రకాల కోణాలను పరిశీలించి 'అభద్ర' పేరుతో కథల సంపుటిని రాసినట్లు వివరించారు. ప్రజా సాహిత్యాన్ని, ప్రజల భాషను, తెలుగు సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పుస్తకాలు రచించినట్లు రవి వివరించారు. ప్రజాశక్తి బుక్‌హౌస్, సాహితీ స్రవంతిల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో.. ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకుడు ఎం.వి.ఎస్.శర్మ, జి.తులసీదాస్, కె.ఆనందాచారి, కెంగార మోహన్, సత్యాజీ, గోళ్ల నారాయణరావు, జగన్, పెద్ద సంఖ్యలో సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

తిరుపతమ్మకు ప్రత్యేక పూజలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో ఆదివారం తిరుపతమ్మ అమ్మవారి దేవాలయం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి మొదలైన రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సుమారుగా 25 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.

సమాజ చైతన్యంలో కళాకారుల పాత్ర కీలకం

జ్యోతి వెలిగిస్తున్న అతిథులు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : రామకృష్ణ నాట్యమండలి సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మచిలీపట్నానికి చెందిన రామకృష్ణ నాట్యమండలి స్వర్ణోత్సవ వేడుకలను ఆదివారం నగరంలోని మహతి కళావేదికలో ఘనంగా నిర్వహించారు. ఇందులో తెదేపా రాష్ట్ర నాయకులు గొర్రెపాటి గోపిచంద్, కొనకళ్ల జగన్నాథరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షుడు, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్దిరాజు, సాహితీవేత్త డా.బి ధన్వంతరి ఆచార్య తదితరులు పాల్గొని ప్రసంగించారు. 50 వసంతాలుగా సంస్కృతిని పరిరక్షిస్తూ.. కళాకారులను ప్రోత్సహిస్తున్న నాట్యమండలి నిర్వాహకులు జగన్మోహనరావు తన ప్రత్యేకతను చాటుకుంటున్నారన్నారు. సమాజ చైతన్యంలో కళాకారుల పాత్ర కీలకమన్నారు. ఇందులో భాగంగా వ్యక్తిత్వ వికాస నిపుణుడు విడియాల చక్రవర్తికి(జంధ్యాల రామకృష్ణ స్మారక), హార్మోనిస్టు కె.పరబ్రహ్మాచారికి(గుత్తికొండ కోటేశ్వరరావు స్మారక), ఘనాపాటి విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మకు(జొన్నలగడ్డ సుబ్రహ్మణ్య శాస్త్రి స్మారక), గాయనీమణి వై.రాధికా సుబ్రహ్మణ్యంకు(అయినంపూడి వెంకటేశ్వరరావు స్మారక), రంగస్థల నటుడు పుప్పాల వీరాంజనేయులుకు(డీవీ సుబ్బారావు స్మారక)పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాకారులు పలు పౌరాణిక నాటక ప్రదర్శనలు చేయగా పలువురు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అనంతరం కళాకారులకు నాట్యమండలి తరపున ఆర్థిక సహకారం అందించారు.

అదృశ్యమైన వృద్ధురాలు శవమై చెరువులో తేలింది

రాంప్రసాదం (పాత చిత్రం)

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: కోడూరు శివారు కృష్ణాపురానికి చెందిన వృద్ధురాలు చందన రాంప్రసాదం (90) అదృశ్యమై ఆదివారం ఇంటి సమీపంలోని చెరువులో శవమై తేలింది. శుక్రవారం రాత్రి నుంచి కనిపించడం లేదని మనుమడు మనోజ్ శనివారం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఆమె ఇంటి సమీపంలోని చెరువులో మృతదేహం లభ్యమైనట్లు ఇంఛార్జి ఎస్.ఐ రాజేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -112 రిటైల్ ధర 134 చికెన్ విత్ స్కిన్ - 194, చికెన్ స్కిన్‌లెస్ - 221. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, 129, 140 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 238.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 520 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

తాడిగడప వక్ఫ్ భూముల్లో ఉద్రిక్తత!

పాత కౌలు దారుల సాగు ప్రయత్నాలను అడ్డుకున్న అధికారులు

తాడిగడపలోని వక్ఫ్ భూములు

పెనమలూరు, న్యూస్‌టుడే: తాడిగడప వక్ఫ్ భూముల్లో ఉద్రిక్తత నెలకొంది. వాటికి కొద్దిరోజుల కిందట తహసీల్దార్ కార్యాలయంలో బహిరంగ కౌలు వేలం నిర్వహించగా రికార్డు స్థాయిలో పాట నమోదైంది. అయితే ఆ భూముల్లో పాత కౌలుదారులు వరి నారు మడులు పోయడాన్ని వక్ఫ్‌బోర్డు అధికారులు గుర్తించి.. ట్రాక్టర్‌తో ఆదివారం తొలగించారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, అక్కడి నుంచి ఆదేశాలు వస్తే సాగు నుంచి తప్పుకొంటామని పాత కౌలుదారులు చెప్పారు. దీనిపై వక్ఫ్‌బోర్డు తరఫున కొండపల్లి ఖాజీ సయ్యద్ హబీబుల్లా హుస్సేన్, అధికారులు నుహుఅలీషా, కరీముల్లాలు మాట్లాడుతూ భూముల్లో ఇతరులు ప్రవేశించకుండా హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. కొత్తగా పాడుకున్న వారు మాత్రమే సాగు చేయాలని స్పష్టం చేశారు. వివాదం పెద్దదవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలతో చర్చించారు. అనంతరం తమ విధులకు కొందరు ఆటంకం కలిగిస్తూ సాగు ప్రయత్నాలు చేస్తున్నారని వక్ఫ్‌బోర్డు అధికారులు పెనమలూరు తహసీల్దార్ గోపాలకృష్ణకు ఫిర్యాదు చేశారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర: ✆ 81422 92071.

FINANCIAL SERVICES

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలు లోపు ఫైనాన్స్ చేయబడును (సిబిల్ చూడబడదు). JK అసోసియేట్స్, ✆ 96665 47338.

PEOPLE CARE

OLD AGE HOME

స్వామి వివేకానంద గ్రూప్, VJA, శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99590 21122, 99590 31122.

రామకృష్ణ గ్రూప్ (AP No.1) VJA వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 96038 42233, 97054 72233.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

REAL ESTATE

Rjy, AVA రోడ్‌కు దగ్గరలో గేటెడ్ కమ్యూనిటీలో 3BHK Flats అమ్మబడును. Sft: 2,499/- రాజమండ్రి పరిసర ప్రాంతాలలో స్థలాలు, పొలాలు అమ్మబడును/ కొనబడును. ✆ 73824 01755.

LAND FOR SALE

2 Acres South Face కమర్షియల్‌గా ఉపయోగపడు పొలము 95 వెడల్పు, 900 అడుగుల లోతు, 33 Feet డొంకరోడ్డు ఫేసింగ్‌తో, ఈడ్పుగల్లు ఊళ్లో అమ్మకం. ✆ 95334 30709.

JOBS

Wanted Experienced Godown Incharge & Packing boys for Medical Agencies Srinivasa Drugs, Bhavanipuram. ✆ 9704071271

Hiring: IT, Non IT, Banking, Hospital, Hotels, Engineers, Doctors, Nurses & Skilled Workers. Contact ✆ 91053 69999.

English & Biology Teachers to teach Classes 6 to 10 at a School located in Gunadala, VJA. Salary: 25,000. Whatsapp resume: 63028 28080

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం, VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+ జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం - VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ.+ జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5,000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52838.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో ఆఫీస్ మేనేజర్స్, రిసెప్షనిస్ట్, టెలీకాలర్స్, సైట్ సూపర్ వైజర్స్, ఆఫీస్ బాయ్స్ కావలెను. ✆ 81214 84630.

ప్రముఖ ఫైనాన్స్ సంస్థలో విజయవాడలో కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్-06 (M) కావలెను. Qlf: ఇంటర్, జీతం: 12K + TA + DA + Incentives. ఇంటర్వ్యూ: 22-07-25. ✆ 77990 28444, 92810 22773.

WANTED
A leading TEXTILE cloth manufacturing company operating in COIMBATORE urgently requires an experienced AGENT for Vijayawada and surrounding cities.
93671 21204

R.K. ఇంజినీరింగ్ కాలేజీ లేడీస్ హాస్టల్ నందు పనిచేయుటకు మంచి అనుభవం ఉన్న హాస్టల్ వార్డెన్ మరియు అనుభవం ఉన్న ఎలక్ట్రీషియన్స్ కావలెను. మంచి జీతం + భోజనం + ఉచిత వసతి కల్పించబడును. సంప్ర॥ కేతనకొండ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ. 97014 73399.

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 90146 51068, 70756 33416.

వర్క్ ఫ్రం హోమ్ డేటా ఎంట్రీ: ప్రముఖ ఔట్ సోర్సింగ్ సంస్థ నందు ఇంటి వద్ద ఉండి పార్ట్/ ఫుల్‌టైం ప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop/ Desktop, స్మార్ట్ ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 87126 36572.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే : లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ సంస్థను స్థాపించి 23 ఏళ్లు అయిన సందర్భంగా ఆదివారం స్థానిక వెంకట రామకృష్ణ థియేటర్ ప్రాంగణంలో సంస్థ ఏర్పాటు చేసిన 13వ రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. తొలుత మండల ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ యూనియన్ అధ్యక్షుడు పూతబోయిన రామారావు శిబిరాన్ని ప్రారంభించారు. మచిలీపట్నం బ్లడ్ బ్యాంకు వైద్యులు పావని పర్యవేక్షణలో సుమారు 45 మంది దాతలు రక్తదానం చేశారు.

శివరామకృష్ణ క్షేత్రం నిర్మాణానికి విరాళం

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: కోడూరులో శివరామకృష్ణ క్షేత్రం నిర్మాణానికి కోడూరుకు చెందిన వ్యాపారవేత్త బండ్రెడ్డి లంకేశ్వరరావు, మణిమాల దంపతులు, కుమారుడు కిరణ్ సాయి రూ. 1,01,116లు విరాళాన్ని ఆదివారం కమిటీకి అందించారు. సభ్యులు అన్నం వెంకటసుబ్బారావు, జూపూడి సుభాచంద్రబోస్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

★ బందరులోని బుట్టాయిపేటలో రహదారి పక్కనున్న డ్రెయినేజీ పూడిపోవడంతో మురుగు పారుదలకు ఆటంకంగా మారింది. దీంతో ఆ ప్రాంతవాసులు సమస్యను 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వారు స్పందించి సిబ్బందిని పంపి పూడిక తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

? 15వ వార్డు సాయినగర్ కాలనీలో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విష సర్పాల సంచారంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. **- సీహెచ్.అల్లూరయ్య, విశ్రాంత డీఎస్పీ** ✔ ఇప్పటికే విద్యుత్తు శాఖకు డిపాజిట్ చెల్లించాం. జాప్యంపై సమీక్షించి సమస్యను పరిష్కరిస్తాం. **- ఎల్.చంద్రశేఖరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ - న్యూస్‌టుడే, పెడన**

? బందరు మండలంలో పోతేపల్లి పంచాయతీ ఉల్లిపాలెం నూకాలమ్మ ఆలయం సమీపంలోని స్తంభానికి ఉన్న వీధి దీపం కొంతకాలంగా వెలగడం లేదు. దీంతో రాత్రి పూట ఇబ్బందులు పడుతున్నాం. **- సుబ్బారావు, స్థానికులు.** ✔ సిబ్బందిని పంపి వెంటనే మరమ్మతులు చేయిస్తాం. **- నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్**

ఏవోల ప్రిలిమినరీ పరీక్ష

పెడన, పెడన గ్రామీణం : నేషనల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) పోస్టులకు ప్రిలిమినరీ పరీక్షను నందమూరు వాసవీ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 వరకు వంద మార్కులకు ఆన్‌లైన్ విధానంలో జరిగింది. ఆంగ్లం 30, రీజనింగ్ 30, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 35 మార్కులు మొత్తం 100 మార్కులకు పెట్టారు. మెయిన్ పరీక్ష ఆగస్టు 31న జరగనుంది.

ఉద్యోగులకు సన్మానం

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎలకుర్రు సచివాలయంలో సేవలు అందించి బదిలీ అయిన ఉద్యోగులను ఆదివారం సర్పంచి పానే శివమస్తాన్, పంచాయతీ కార్యదర్శి మాడుగుల ముద్దులయ్య సంయుక్త ఆధ్వర్యంలో సన్మానించారు. సన్మానం అందుకున్న వారిలో డిజిటల్ అసిస్టెంట్ మహమ్మద్ హుస్సేన్, మహిళా పోలీస్ శేషారత్నం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వనిత, సర్వేయర్ కీర్తి, ఏఎన్ఎం కోటేశ్వరమ్మ, వ్యవసాయ శాఖ సహాయకులు నగేష్‌లు ఉన్నారు.

ధర వరలు

టమాట 34, వంగ 20, బెండ 18, పచ్చిమిర్చి 75, కాకర 30, క్యాబేజీ 22, క్యారెట్ 42, దొండ 25, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 25, గోరు చిక్కుడు 30, దోస 16, సొర 10/08, అరటికాయ 8/7, చిక్కుళ్లు 34, బీర 20, చామదుంప 28, మునగ 07/06, కంద 58, బీట్‌రూట్ 30, కీరదోస 48, బీన్స్ 84, క్యాప్సికం 86, అలసందలు 30, చిలకడదుంప 38, కొత్తిమీర 16/8, పుదీనా 15/5 సోమవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి. ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఎస్టేట్ అధికారి బలి చక్రవర్తిని ఫోన్ నంబరు 91823 61295లో సంప్రదించవచ్చు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)**

సినిమాలు

రేవతీ : కొత్తపల్లిలో ఒకప్పుడు **సిరికృష్ణ :** మైబేబి **సిరి వెంకట్ :** జూనియర్ **- న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)**

అనర్హులకు స్థలాలు..తేలని చిట్టాలు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే

వైకాపా హయాంలో బందరు, పెడన నియోజకవర్గాల పరిధిలో నివేశన స్థలాలు మంజూరు చేసి లేఔట్లు ఏర్పాటు చేశారు. కానీ గత ఐదేళ్లలో వాటిల్లో కనీస వసతులు కల్పించలేదు. దీంతో ఎక్కడ చూసినా ఖాళీ స్థలాలే దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఆదేశాలతో అధికారులు సర్వే చేయగా పలుచోట్ల స్థలాలను ఖాళీగా వదిలేయడం వైకాపా తీరును తేట తెల్లం చేస్తున్నాయి.

సైకిల్ కూడా వెళ్లదు

రెండు నియోజకవర్గాల పరిధిలో ఏ కాలనీలోనూ రోడ్లు, తాగునీటి వసతి కల్పించిన దాఖ

మండలం పేరు	వేసిన లేఔట్లు	లబ్ధిదారులకు కేటాయించింది	ఖాళీగా ఉంది
బందరు	72	5,056	1,671
బందరు(అర్బన్)	10	16,541	11,951
పెడన	36	912	656
పెడన(అర్బన్)	04	2,249	540
గూడూరు	39	1,283	747
బంటుమిల్లి	20	1,345	652
కృత్తివెన్ను	19	958	614
మొత్తం	200	28,344	16,831

బందరు మండలం సుల్తానగరంలో అభివృద్ధికి నోచుకోని కాలనీ

లాలు లేవు. బందరు మండలం చిట్టిపాలెంలో పొలాల మధ్యలో లేఔట్ వేసి స్థలాలు కేటాయించారు. దానికి కనీసం సైకిల్ కూడా వెళ్లదని పలువురు వాపోతున్నారు. ఒకరిద్దరు నిర్మించిన ఇళ్లను అసంపూర్తిగా వదిలేయగా మిగిలి స్థలాలను ఖాళీగా వదిలేశారు. సుల్తానగరంలో ప్రధాన రహదారి నుంచి కాలనీకి వెళ్లేందుకు రోడ్డు లేదు. ఇలా రెండు నియోజకవర్గాల్లోని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను లబ్ధిదారులు పలుమార్లు వైకాపా పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

మొదటి నుంచి విమర్శలే..

గత పాలకులు తమకు ఇష్టం వచ్చిన వారి పేర్లు నమోదు చేయించి స్థలాలు కేటాయించారని మొదటి నుంచి విమర్శలు వస్తూనే ఉన్నాయి. అది ఇటీవల చేసిన సర్వేలో రుజువైంది. గూడూరు మండలంలో

జగనన్న కాలనీల్లో పూర్తయిన సర్వే

23 మంది అనర్హులకు స్థలాలు ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది. కొందరికి స్థలాలు ఉన్నా ఇతర వ్యక్తుల పేరిట పొందారు. మచిలీపట్నం నగర పరిధిలో 38 మంది, బందరు మండలంలో 8 మంది పొందినట్లు అధికారులు లెక్కగట్టారు. అయితే సక్రమంగా విచారణ చేస్తే వీరి సంఖ్య వందల్లో ఉంటుందని ఆయా ప్రాంతాల ప్రజలు అంటున్నారు. పెడన పట్టణంలో ఐదుగురు మాత్రమే అనర్హులు ఉన్నట్లు అక్కడి వారు నివేదించారు. కానీ పైడమ్మ కాలనీతో పాటు పల్లోటి పాఠశాల ప్రాంతంలోని కాలనీల్లో వందల సంఖ్యలో అనర్హులు స్థలాలు పొందారని, వారంతా ఇతరులకు విక్రయించేశారని కాలనీవాసులు చెప్పడం గమనార్హం. బంటుమిల్లి మండలంలో ఒకరు, కృత్తివెన్నులో ఒకరు చొప్పున అనర్హులు ఉన్నట్లు చెబుతున్నారు.

వైద్య శిబిరంలో 140 మందికి పరీక్షలు

శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న మెరైన్ స్టేషన్ అధికారులు

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే : కోస్టల్ సెక్యూరిటీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గిలకలదిండి మెరైన్ స్టేషన్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గిలకలదిండి తుపాను రక్షిత భవనంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని మెరైన్ సీఐ కె.వంశీకృష్ణ, ఎస్సై చంద్రబోస్, ఏఎస్సై మురళీకృష్ణ, స్థానిక తెదేపా నాయకులు వాటపల్లి రమేష్ తదితరులు పర్యవేక్షించారు. గిలకలదిండి, గరాలదిబ్బ, బందరుకోట గ్రామాలకు చెందిన సుమారు 140 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి నిర్వాహకులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విజయవాడ సెంటినీ ఆసుపత్రి సిబ్బంది వైద్య సేవలు అందించారు.

జనసేనలో చేరిక

పార్టీలో చేరిన వారితో శ్రీకాంత్, తదితరులు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడలో జనసేనలో చేరేందుకు అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులవుతున్నారని జనసేన గుడివాడ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్ పేర్కొన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పట్టణానికి చెందిన లోయ రాజా ఆధ్వర్యంలో ముత్యాల అశోక్, వడ్డాది సుబ్రమణ్యం, షేక్ హుస్సేన్, బొజ్జగాని కోటేశ్వరరావులు వారి స్నేహితులు ఆదివారం జనసేనలో చేరారు. ఈసందర్భంగా శ్రీకాంత్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్‌లు జనసేన కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. శాయన రాజేష్, సుంకర వెంకట్, షేక్ మీరా షరీఫ్, కళ్యాణి, భవాని తదితరులు పాల్గొన్నారు.

బందరు సబ్ డివిజన్‌లో పోలీస్ యాక్ట్ అమలు

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే : బందరు సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నట్లు డీఎస్పీ రాజా తెలిపారు. ఇది అమల్లో ఉన్నంత వరకూ ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదని చెప్పారు. ఎవరైనా సమావేశం, ర్యాలీ, ధర్నా నిర్వహించాలనుకుంటే తప్పనిసరిగా పోలీస్ వారి అనుమతి తీసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రాజా, డీఎస్పీ

గుంతల రోడ్లతో అవస్థలు

నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో అంతర్గత రహదారులన్నీ అధ్వానంగా తయారయ్యాయి. పలు చోట్ల గుంతలు ఏర్పడటంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా హయాంలోనే ఈ రోడ్ల సమస్యపై స్థానికులు పలుమార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదు. దీంతో క్రమేపీ రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. వర్షం పడితే చాలు గుంతల్లో నీరు చేరి దారి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కూటమి పాలకులు అయినా పట్టించుకొని రోడ్లు అభివృద్ధి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్**

ఆర్థిక రంగాన్ని గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నాం

పెడన 4వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, తెదేపా శ్రేణులు

పెడన, న్యూస్‌టుడే : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పట్టణంలోని 4వ వార్డులో ఆదివారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. గత వైకాపా ప్రభుత్వం రూ.9 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని దివాళా తీయించిందని, ఆ దశలో ఏడాది కిందట అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆర్థిక రంగాన్ని గాడిలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తోందని తెలిపారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, ప్రధాన కార్యదర్శి వాహబ్‌ఖాన్, మాజీ వైస్ ఛైర్మన్లు హన్నూ, వాహబ్‌ఖాన్, హజీమ్ తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి, న్యూస్‌టుడే : రాష్ట్రాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. మండల పరిధి రామవరపుమోడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఇంటింటా తిరిగి ప్రజలకు కరపత్రాలు అందించారు. మండల కన్వీనర్ కూనపురెడ్డి వీరబాబు, మల్లేశ్వరం మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఒడుగు తులసీరావు, కంచడం పీఏసీఎస్ ఛైర్మన్ గంధం సత్యనారాయణ, డీసీ ఛైర్మన్ బొర్రా కాశీ పాల్గొన్నారు.

మల్లవోలులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న పెద్దిరాజులు

గూడూరు, న్యూస్‌టుడే : మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వారి ప్రాంతాల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించడంతో పాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మల్లవోలులో తెలుగు రైతు నియోజకవర్గ నాయకులు కూనపరెడ్డి పెద్దిరాజులు, పలువురు నాయకులు పాల్గొన్నారు. గూడూరులో ఎన్ఏబేగ్, గొరిపర్తి ఫణి, పోతన కృష్ణారావు, బచ్చుల శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

యాప్‌లో వివరాలు నమోదు చేయాలి

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని పంచాయతీ కార్యదర్శులు స్వర్ణ పంచాయతీ యాప్‌లో ఈనెలాఖరులోపు వివరాలను నమోదు చేయాలని డిప్యూటీ ఎంపీడీవో ఎం. నాగిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను వివరాలతో పాటు ఇంటి దిక్కులు, నివసిస్తున్న గృహానికి సరిహద్దున ఉంటున్న వారి వివరాలు, ఇంటి కొలతలు కచ్చితంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యదర్శులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

ఉసూరుమనేలా.. ఉద్యానవనాలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

బందరు నగరంలోని ఉద్యానవనాలు అన్నీ అధ్వానంగా మారాయి. వాటిల్లో ఆహ్లాదం కరవై ప్రజలు ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపడం లేదు. పిల్లలు ఆడుకునే క్రీడా పరికరాలు పాడైపోయాయి. పార్కులు ఉన్నాయన్న మాటే కానీ గత వైకాపా ప్రభుత్వం వీటిని పట్టించుకోకపోవడంతో ఇలా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక నగరంలోని పలు ఉద్యానవనాలను అధికారులు అభివృద్ధి చేస్తున్నారు.

అన్ని చోట్లా అంతే

నగర వ్యాప్తంగా 80కిపైగా పార్కులు ఉన్నాయని అధికారిక గణాంకాలు చెప్పడమే గానీ క్షేత్ర స్థాయిలో ఆహ్లాదం పంచేవి పదిలోపే ఉంటాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వినియోగంలో ఉన్న వాటిల్లో కూడా కనీస వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతుంటే

నాయర్‌బడ్డీ సెంటరులో పాడైన క్రీడా పరికరాలు

మురుగు తటాకంలా శ్రీనివాస నగర్ కాలనీ పార్కు

కొన్నింటిని చూస్తే ఇవి పార్కులేనా అన్న అనుమానం కలుగుతుంది. నాయర్‌బడ్డీ సెంటరు, బచ్చుపేట ఉద్యానవనాల్లో బల్లలు, ఆట వస్తువులు పాడైపోయాయి. నాయర్‌బడ్డీ సెంటరు పార్కులో ఇటీవల గేట్లకు మరమ్మతులు చేశారు. కానీ లోపల ఇంకా అధ్వానంగానే ఉంది. శిడింబి అగ్రహారంలో పలు క్రీడా పరికరాలు మూలన పడ్డాయి. శ్రీనివాస నగర్ కాలనీలోని పార్కు స్థలంలో మురుగు చేరి తటాకంలా తయారైంది. ఈ క్రమంలో దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంతవాసులు ఆవేదన చెందుతున్నారు. ఇలా అనేక పార్కులు అస్తవ్యస్తంగా మారాయి. ప్రస్తుతం బ్రహ్మపురం, మచిలీపట్నం రైల్వే స్టేషన్‌లో పైలాన్ పార్కులో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. మిగిలిన ఉద్యానవనాలు కూడా కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చెందుతాయన్న ఆశతో నగరవాసులు ఎదురు చూస్తున్నారు.

వర్షం..పంటలకు పునర్జీవం

పెడన, బంటుమిల్లి, న్యూస్‌టుడే : పెడన ప్రాంతంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు వరి పంటకు ఊపిరి పోశాయి. బంటుమిల్లి ప్రధాన కాలువ, రామరాజుపాలెం ఛానల్ పరిధిలో సుమారు 22 వేల ఎకరాలు సాగులో ఉండగా దాదాపు 15 వేల ఎకరాలకు తీవ్ర నీటి కొరత ఏర్పడింది. ఈ రెండు కాలువల్లో పూర్తి సామర్థ్యంతో నీటి ప్రవాహం లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. వెద ద్వారా సాగును చేపట్టిన అన్నదాతలకు కళ్లెదుటే నారు ఎండిపోతుంటే ఆవేదన చెందారు. ఈ క్రమంలో కాలువల్లో నీటి ప్రవాహ స్థాయి పెరగడంతో పాటు వరుసగా కురుస్తున్న వర్షాలు రైతులకు ఊరటనిచ్చాయి. పలు ప్రాంతాల్లో రైతులు నాట్లు వేయడం మొదలెట్టారు. ఇంజన్లతో నీటిని కాలువల్లోంచి మళ్లించుకునే ప్రక్రియను కూడా నిలిపివేశారు. మండల వ్యాప్తంగా సాగు పనులు పుంజుకున్నాయని రైతులు మొదటి విడత ఎరువులను ఇప్పటికే మొదలు పెట్టారని మండల ఏవో సజ్జా జెన్నీ తెలిపారు.

రామరాజు ఛానల్‌లో పుష్కలంగా నీటి ప్రవాహం

పొలం పనుల్లో నిమగ్నమైన మహిళా రైతు

హారిక దంపతుల్ని పరామర్శించిన మేకా

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక దంపతులను మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం పరామర్శించారు. ఇటీవల గుడివాడలో జరిగిన సంఘటన గురించి ఆయన వారితో మాట్లాడారు. ఆయనతో పాటు జడ్పీ వైస్ ఛైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, నూజివీడు వైకాపా అధ్యక్షుడు శివ తదితరులు ఉన్నారు.

మద్యం దుకాణం వద్ద ఇరువురిపై దాడి

పెడన, న్యూస్‌టుడే : స్థానిక తోటమూల సెంటర్‌లోని పీఆర్ వైన్స్ వద్ద ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇరువర్గాల మధ్య చెలరేగిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ సంఘటనలో ఇరువురు వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన వ్యక్తులు, గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. దీనిపై సమాచారం అందిన వెంటనే ఎస్సై సత్యనారాయణ సంఘటన స్థలానికి తరలివెళ్లి పరిస్థితులను అదుపులోకి తీసుకు వచ్చారు.

విశ్వబ్రాహ్మణ సంఘం ఎంపిక

నూతన కార్యవర్గ సభ్యులతో సంఘ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

పెడన, న్యూస్‌టుడే : విశ్వబ్రాహ్మణ సంఘం పెడన యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. స్థానిక శ్యామలా నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం నూతన అధ్యక్షుడిగా పొన్నపల్లి గిరి శంకరరావును ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మేళ్లమర్తి నాగేశ్వరరావు, కార్యదర్శి పోలోజు రవికుమార్, సహాయ కార్యదర్శి ఆముదాలపల్లి నాగేశ్వరరావు, కోశాధికారి కోలవెన్ను దిలీప్ కుమార్, ఉపాధ్యక్షులుగా కొండిపర్తి విజయ్ కుమార్, అలుగోజి శివరామకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చింతలూరి సత్యనారాయణ చెప్పారు.

శిథిల భవనం..భయంతో జీవనం

నగరంలోని వినియోగదారుల కమిషన్ కార్యాలయం పక్కనే ఉన్న శిథిల భవనంతో ఉద్యోగులు, అక్కడకు వచ్చే కక్షిదారులు, న్యాయవాదులు ఆందోళన చెందుతున్నారు. భవనం ఏక్షణాన కూలుతుందో? అన్నట్లుగా ఉంది. పైగా దానిలో నుంచి అప్పుడప్పుడు విషసర్పాలు వస్తున్నాయని కార్యాలయ సిబ్బంది వాపోతున్నారు. దాన్ని కూల్చి వేయాలని స్థానికులతో పాటు న్యాయవాదులు, కార్యాలయ ఉద్యోగులు ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజుకు వినతిపత్రం కూడా అందించారు. అధికారులు త్వరితగతిన స్పందించి భవనాన్ని కూలగొట్టి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్**

పైడమ్మకు ఆషాఢ సారె సమర్పణ

ఊరేగింపుగా ఆలయానికి వచ్చిన మహిళలు

గంగానమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న సువాసినులు

పెడన, న్యూస్‌టుడే : పెడన గ్రామ దేవత పైడమ్మకు పట్టణ శిష్టకరణ కుల సంఘం ఆదివారం ఆషాఢ సారెను అందజేసింది. ఈ సంఘానికి చెందిన పలువురు మహిళలు స్థానిక కొత్తపేటలోని అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వచ్చి సారెను సమర్పించారు. 11వ వార్డు ఎన్టీఆర్ కాలనీ మహిళలు మేళతాళాలతో దేవాలయానికి తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త తోట రామారావు, పైడేశ్వరరావు భక్తులకు స్వాగతం పలికారు.

త్రిశక్తిపీఠంలో పూజలు అందుకున్న అమ్మవారు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : నగరంలోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేవతి సెంటరులోని గంగానమ్మ ఆలయంలో విశేష పూజలు చేపట్టగా సువాసినులు లలితా పారాయణం, భజన కార్యక్రమాలు చేశారు. భాస్కరపురం త్రిశక్తిపీఠంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించి పండితుల ఆధ్వర్యంలో పూజా క్రతువులు జరిపించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

గుడివాడ, న్యూస్‌టుడే : పట్టణంలో ఎక్కడైనా నేరాలు జరిగే ప్రాంతాలలో కనిపించినా, గొడవలకు దిగినా కఠిన చర్యలు తప్పవని గుడివాడ వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. అనుమానిత షీటర్లు, రౌడీషీటర్లు ఎప్పుడు పిలిస్తే అప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతీ వారం తప్పక స్టేషన్‌కు వచ్చి కనపడి వెళ్లాలన్నారు. ఊరు వదిలి వెళ్లాల్సి వచ్చినా సమాచారం ఇవ్వాలన్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

రక్షిత చెరువు...పశువులకు నెలవు



నగర వాసుల దాహార్తి తీర్చేందుకు ఉన్న రక్షిత మంచినీటి చెరువు పశువులకు నెలవుగా మారింది. నిషేధిత ప్రాంతంగా ఉండాల్సిన చెరువులో నిత్యం పదుల సంఖ్యలో పశువులు దిగడం విమర్శలకు తావిస్తోంది. సుమారు రెండు లక్షల మంది తాగునీటి అవసరాలకు ఉపయోగపడుతున్న రక్షిత పథకం చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో పలు అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం కలుగుతోంది. కొందరు చెరువు గట్టుపైనే మద్యం తాగి ఖాళీ సీసాలు అక్కడే పడేస్తున్నారు. ఎప్పటి నుంచో చెరువు పరిసరాల సుందరీకరణ అంశం హామీల్లోనే పరిభ్రమిస్తుండగా గట్లు, పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి విషకీటకాలకు ఆవాసంగా మారాయి. అధికారులు, సిబ్బంది రాకపోకలు సాగించే ప్రధాన గేటు నుంచే పశువులు వెళ్తున్న పట్టించుకునే వారే లేదు. భద్రతా సిబ్బంది లేకపోవడంతో ఎవరు వస్తున్నారో.. ఏం చేస్తున్నారో తెలియని దుస్థితి నెలకొంది. ఫలితంగా గతంలో కొందరు చెరువులోనే ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం(కోనేరు సెంటరు)**

'విద్యుత్తు రంగం ప్రైవేటీకరణకు కుట్ర'

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్లు పెట్టడం వెనుక విద్యుత్తు రంగాన్ని ప్రైవేటీకరణ చేసే కుట్ర దాగిఉందని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దోపిడీ విధానానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో ప్రజలను భాగస్వాములు చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర నాయకులు చిగురుపాటి బాబూరావు, సయ్యద్ అఫ్సర్ పిలుపునిచ్చారు. గన్నవరం సుందరయ్య పార్కు వద్ద ప్రజా వేదిక ఆధ్వర్యంలో 'స్మార్ట్ మీటర్లు వద్దు.. ట్రూఅప్ ఛార్జీలు రద్దు' విద్యుత్తు భారాలకు వ్యతిరేకంగా ఆదివారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ప్రజావేదిక నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, కాట్రగడ్డ జోషి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గన్నే వెంకట్రావు, అనుమోలు వెంకటేశ్వరరావు, బుద్ధవరం సర్పంచి బడుగు బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు..జనం బేజారు



బందరులోని రేవతీ కూడలి సమీపంలో ప్రధాన రహదారిపై తరచుగా మురుగు చేరి తిష్ఠ వేసుకుపోతోంది. దీనికి తోడు వర్షం వస్తే సమస్య మరీ ఇబ్బందికరంగా ఉంటుందని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై నిలిచిన మురుగు కారణంగా స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు రహదారిపై చేరకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు **K.V.** సత్యనారాయణమూర్తి **S/o** శ్రీరామమూర్తి గారికి మచిలీపట్నం, గొడుగుపేటలో డోర్ నెం: 8/115రు గల ఇల్లు మరియు స్థలము కలదు. సదరు ఆస్తికి నా క్లయింటు మాత్రమే ఏకైక వారసుడుగాను మరియు పూర్తి హక్కుదారుడై యున్నాడు. కావున ఇతరులెవరైనా సదరు ఆస్తిలో నా క్లయింటుకు తెలియకుండా ఏవిధమైన కట్టడములు కట్టుటకు ప్రయత్నములు గానీ, క్రయ విక్రయాలు గానీ, తనఖాలు గానీ, ఇతరత్రా ఏవిధమైన లావాదేవీలు గానీ జరిపినయెడల అవి చట్టరీత్యా చెల్లనేరవనీ, నా క్లయింటును బైండు చేయజాలవనీ మరియు అట్టి వ్యవహారములు జరిపిన వారు నా క్లయింటు తీసుకొనే సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

AZMATHUNNISA, Advocate
Ramanaidu Pet, Machilipatnam.
© 98850 88828

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు మచిలీపట్నం టౌన్, మేకావానిపాలెం, డోర్ నెం. 1/55రు కాపురస్తులు దాసరి చంద్రశేఖర్ S/o మాధవరావు గారి సంజాయిషీ మేర ఇచ్చు ప్రకటన ఏమనగా.... నా క్లయింటు యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని మచిలీపట్నం టౌన్, మాచవరం రూరల్, వలందపాలెం, చిలకలపూడి, డోర్ నెం. 16/52-1రు కాపురస్తులు కొల్లా నాగ వెంకటజ్యోతి W/o సురేష్ బాబు గారి వద్ద నుండి కొనుగోలు చేయు నిమిత్తమై ఎగ్రిమెంటు పొందియున్నారు. సదరాస్తిని కొల్లా నాగ వెంకటజ్యోతి గారు ది. 16-05-2019న తలారి లక్ష్మీ నాంచారమ్మ గారి వద్ద నుండి విక్రయ దస్తావేజు నెం. 3602/2019రుగా క్రయం పొందియున్నారు. సదరు యీ క్రయ దస్తావేజుకు లింకు దస్తావేజులుగా తలారి లక్ష్మీ నాంచారమ్మగారి పేరున గల దస్తావేజు నెం. 2330/2004, కొఠారి మామిళ్ళమ్మగారు వ్రాసిన రిజిస్టర్డ్ వీలునామా నెం.61/BK3/2005రు మరియు కొఠారి శ్రీరాములు, రామయ్య గార్ల పేరున గల క్రయ దస్తావేజు నెం. 3874/1959రు దస్తావేజులు ఇచ్చియున్నారు. సదరు లింకు దస్తావేజులలోని రిజిస్టర్డ్ వీలునామాలో తెలిపిన విధంగా కొఠారి శ్రీరాములు గారు మరియు వీరి భార్య మామిళ్ళమ్మగార్ల దత్తత కుమారుడు మరియు వీరి తండ్రిగారైన కొఠారి సుబ్బారావు గార్లు మరణించినారని వీరి మరణ ధ్రువీకరణ పత్రములు మరియు ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్స్ లేవని తెలిపియున్నారు. కావున అట్టి కొల్లా నాగ వెంకటజ్యోతి గారికి సంక్రమించిన ఆస్తిపై ఎవరికైనా ఎటువంటి ఎగ్రిమెంటులు గానీ, వారసత్వపు హక్కులు గానీ, మరి యే యితర లావాదేవీలు గానీ వున్న యెడల 10 రోజులలోపు వ్రాతపూర్వకంగా తెలుపగలరు. దర్మిలా వచ్చు అభ్యంతరాలు చెల్లనేరవు. మరియు నా క్లయింటును బైండు చేయజాలవు. **ఆస్తి షెడ్యూలు:** కృష్ణా జిల్లా, మచిలీపట్నం స॥ రి॥ వారి యిలాకా మచిలీపట్నం, మాచవరం, మున్సిపల్ వార్డు నెం. 16రు, డోర్ నెం. 16/415రుకు సమీపమున గల R.S. నెం. 319/2రు లోని చ.గ. 146లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు. **తూర్పు:** 20 అడుగుల వెడల్పు గల దారి, **దక్షిణం:** నా తాలూకు స్థలం, **పడమర:** అబ్దుల్ నయూమ్ గారి ప్రహరీగోడ హద్దు, **ఉత్తరం:** ఇతరుల స్థలం.

పసుమర్తి సూర్య ప్రకాష్
అడ్వకేట్, సెల్. 98661 27503,
మచిలీపట్నం, ది. 20-07-2025

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

చెత్త పన్ను వసూలుకు తీర్మానం

తాడిగడప (కానూరు), న్యూస్‌టుడే: తాడిగడప పురపాలక సంఘ పరిధిలోని వాణిజ్య సముదాయాల నుంచి చెత్త పన్ను వసూలుకు కౌన్సిల్ తీర్మానం చేసినట్లు కమిషనర్ షేక్ నజీర్ తెలిపారు. హోటళ్లు, వసతి గృహాలు, బేకరీలు, బార్ అండ్ రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, స్వీటు షాపులు, రిటైల్ షాపులు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, ఆసుపత్రులు, కల్యాణ మండపాలు ఇలా 48 రకాల వాణిజ్య విభాగ సముదాయాల్లో చెత్త సేకరణ నిమిత్తం నిర్దేశిత సర్వీస్ ఛార్జీలు వసూలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉత్పత్తి చేసే చెత్తను అనుసరించి నెలకు రూ.200 నుంచి రూ.15వేల వరకు రుసుములు ఉంటాయని వెల్లడించారు.

పునాదుల్లోనే ఆగింది... పచ్చదనం అల్లుకుంది



బాపులపాడు మండలం ఆరుగొలనులో రైతు సేవా కేంద్రం నిర్మాణం కోసం మూడున్నరేళ్ల కిందట శంకుస్థాపన చేశారు. ప్రాథమికంగా పనులు ప్రారంభించారు. తరువాత నిర్మాణం నిలిచిపోయింది. కేవలం పునాదులకే పరిమితమైంది. పిల్లర్ల కోసం ఏర్పాటు చేసిన ఇనుప చువ్వలు సైతం కనిపించకుండా పిచ్చి తీగలు అల్లుకుపోయాయి. గన్నవరం నియోజకవర్గంలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్మించతలపెట్టిన గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, ఆరోగ్య క్లినిక్ భవనాల పనుల్లో కదలిక లేదనడానికి ఈ చిత్రం దర్పణంగా నిలుస్తుంది. - హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

? గన్నవరం రాయ్‌నగర్ డీఎస్పీ కార్యాలయ పరిసరాల్లో మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయి అధ్వానంగా ఉన్నాయి. - **మధుసూదన్, స్థానికుడు** ✔ పూడిక తీయిస్తాం. - **చెన్నకేశవులు, ఈవో**

? తేలప్రోలు శివారులోని ఉంగుటూరు మార్గంలో దారిపొడవునా వ్యర్థాలు పేరుకుపోయాయి. కుక్కలకు ఆవాసంగా మారి దుర్వాసన వస్తోంది. - **వెంకట్రావు, స్థానికుడు** ✔ సిబ్బంది పంపి పారిశుద్ధ్య పనులు చేపడతాం.- **సత్యకుమార్, ఎంపీడీవో ఉంగుటూరు** - న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

స్పందనకు వందనం

◆ యనమలకుదురు ఇందిరానగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం. . మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. ఈ విషయమై స్పందించిన కమిషనర్ షేక్ నజీర్.. సిబ్బందిని పంపి వీధి దీపాలకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు.- న్యూస్‌టుడే, యనమలకుదురు (కానూరు)

పారదర్శకంగా సేవలందించండి

భవానీశంకర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్: సహకార సంఘాల ద్వారా అత్యంత పారదర్శకంగా సేవలందించి రైతుల మన్ననలు పొందాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. వేలేరు, బాపులపాడు, కాకులపాడు, కొత్తపల్లి, బిళ్లనపల్లి సహకార సంఘాలకు కొత్తగా నియమించిన త్రిసభ్య కమిటీలు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశాయి. ఆయా సభల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కేడీసీసీబీ ఛైర్మన్‌గా 13 నెలల పాటు తాను సేవలందించానని తెలిపారు. గ్రామీణ ప్రాంత రైతులకు నేరుగా సేవలందించే సహకార బ్యాంకులంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. ప్రస్తుత త్రిసభ్య కమిటీలు బాధ్యతాయుతంగా పని చేయాలని చెప్పారు. లావాదేవీల నిర్వహణపై అవగాహన కల్పించేందుకు, అప్రమత్తంగా ఉండేందుకు వీలుగా నియోజకవర్గ పరిధిలోని కమిటీలకు, సిబ్బందికి ప్రత్యేక కార్యశాల నిర్వహించాలని కేడీసీసీ బ్యాంకు అధికారులకు సూచించారు. అనంతరం నూతన కమిటీల ఛైర్మన్లను, సభ్యులను యార్లగడ్డ సత్కరించారు.

కాలువలు పూడ్చి.. పంటలను ముంచి!

పెనమలూరు, న్యూస్‌టుడే

అక్రమ లేఅవుట్లకు దారి కోసం కరకట్ట, కృష్ణా నదికి మధ్య మురుగు కాలువలను కొందరు పూడ్చేస్తుండటంతో భారీ వర్షాల సమయంలో పంట పొలాలు మునిగి ఏటా రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

వెయ్యి ఎకరాలకు..

పెదపులిపాక-చోడవరం మధ్య కృష్ణానది తీర ప్రాంతంలో అక్రమ లేవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వాటికి వెళ్లేందుకు దారి కోసం పటిష్ఠమైన కరకట్ట అంచులను సైతం ధ్వంసం చేసి ర్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. వాటికి లేఅవుట్లకు మధ్య ఉండే మురుగు కాలువలను పూడ్చి చిన్నపాటి తూములు ఏర్పాటు చేస్తుండటంతో నీరు సరిగా పారడం లేదు. ఫలితంగా ఆ ప్రాంతంలోని వెయ్యి ఎకరాల్లో సాగయ్యే వరి, పసుపు, కంద వంటి పంటలు ముంపునకు గురవుతున్నాయి. రోజుల తరబడి మునకలోనే ఉంటుండటంతో రైతులు నష్టపోతున్నారు.

పెదపులిపాక-చోడవరం మధ్య మురుగు కాలువ సగానికిపైగా పూడ్చి ఏర్పాటు చేసిన అక్రమ లేవుట్

చోడవరం గంగానమ్మ గుడి సమీపంలో పదడుగుల కాలువకు ఏర్పాటు చేసిన మూడడుగుల తూము

15 నుంచి 20 రోజుల వరకు

కరకట్ట దిగువన నదీతీరంలో సారవంతమైన మెట్ట భూములున్నాయి. భారీ వర్షాలు, వరదల అనంతరం పొలాల్లోని మురుగు నీరు దిగువకు ప్రవహించి తిరిగి కృష్ణానదిలోకి వెళ్లేలా బ్రిటిష్ కాలంలోనే మురుగు నీటి కాలువలను ఏర్పాటు చేశారు. అక్రమ లేఅవుట్లు పెరిగిపోవడంతో కాలువలు ఎక్కడికక్కడ బక్కచిక్కిపోతున్నాయి. 10 అడుగుల వెడల్పునకు గాను మూడు, నాలుగడుగుల తూములను ఏర్పాటు చేస్తుండటంతో రైతులకు పెద్ద సమస్యగా మారింది. ఒక్కోసారి 15 నుంచి 20 రోజుల వరకు పంట పొలాల్లో మురుగు నిలుస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభావం దిగుబడులపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీటి కాలువలకు అక్రమంగా ఏర్పాటు చేసిన తూములను వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

• రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

కరకట్ట దిగువన ఉన్న మురుగునీటి కాలువలను పూడ్చేస్తున్నారని చోడవరం రైతులు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమంగా ఏర్పాటు చేసిన తూములను తొలగిస్తాం. రైతులను ఇబ్బంది పెడితే చర్యలు కఠినంగా ఉంటాయి.

- గోపాలకృష్ణ, తహసీల్దారు

కుండపోతగా కురిసింది!

పప్పుల మిల్లు సెంటర్‌లో నిలిచిన నీరు

పెనమలూరు, కానూరు, తాడిగడప, న్యూస్‌టుడే: వరుసగా రెండో రోజు వరుణుడు తన ప్రతాపం చూపాడు. ఆదివారం రాత్రి 7 నుంచి 10.30 గంటల వరకు ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షానికి పెనమలూరు, కానూరు, తాడిగడప, యనమలకుదురు, పోరంకి ప్రాంతాలు జలమయమయ్యాయి. బందరు రోడ్డు చెరువును తలపించింది. వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. తాడిగడప పురపాలక సంఘ పరిధిలోని పలు కాలనీల్లో రెండు అడుగుల మేర నీరు నిలిచి, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిచింది. పెనమలూరు, పెదపులిపాక, చోడవరం ప్రాంతాల్లో పంట పొలాలు ముంపు బారిన పడ్డారు. మురుగును బయటకు పంపే మురుక్కోడులో తూటికాడ, పూడిక కారణంగా పూర్తి స్థాయిలో నీటి పారుదల లేకపోవడంతో మరో రెండు మూడ్రోజుల పాటు నీరు పొలాల్లో ఉండే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తాడిగడప రైతు బజారు ఎదురుగా..

గన్నవరం పరిసరాల్లో ..

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం పరిసరాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గౌడపేట, వీఎన్‌పురం కాలనీ, తేలప్రోలు హరిజనవాడ, కేసరపల్లి దళితవాడ, చైతన్య కూడలి వద్ద హైవేపై భారీ వరద చేరింది. వరద నీటిలో రాకపోకలకు వాహనదారులు, నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మాదలవారిగూడెం, గోపవరపుగూడెం పరిసరాల్లో ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు రైతులు శ్రమించారు.

తేలప్రోలు ఎస్సీ కాలనీలో రోడ్డుపై..

'విద్యుత్తు రంగం ప్రైవేటీకరణకు కుట్ర'

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్లు పెట్టడం వెనుక విద్యుత్తు రంగాన్ని ప్రైవేటీకరణ చేసే కుట్ర దాగిఉందని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దోపిడీ విధానానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో ప్రజలను భాగస్వాములు చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర నాయకులు చిగురుపాటి బాబూరావు, సయ్యద్ అప్సర్ పిలుపునిచ్చారు. గన్నవరం సుందరయ్య పార్కు వద్ద ప్రజావేదిక ఆధ్వర్యంలో 'స్మార్ట్ మీటర్లు వద్దు.. ట్రూఅప్ ఛార్జీలు రద్దు' విద్యుత్తు భారాలకు వ్యతిరేకంగా ఆదివారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ప్రజావేదిక నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, కాట్రగడ్డ జోషి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు... వైకాపా పాలనలో స్మార్ట్ మీటర్లు పెడుతుంటే.. వాటిని పగలకొట్టాలని చెప్పిన తెదేపా నాయకులు.. ప్రస్తుతం వాటిని పెట్టించే పనిలో ఉన్నారన్నారు. విద్యావంతులు, మేధావులు, ప్రజావేదిక నాయకులు ప్రజల్లోకి వెళ్లి వాటివల్ల కలిగే నష్టాలను వివరించాలని కోరారు. వెంకట్రావు, వెంకటేశ్వరరావు, బడుగు బాలమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిగురుపాటి బాబూరావు, పక్కన సయ్యద్ అప్సర్, మల్లంపల్లి ఆంజనేయులు తదితరులు

మురుగు పారక.. ఉండలేక!

తాడిగడప (కానూరు), న్యూస్‌టుడే: తాడిగడప పద్మజానగర్ శ్రీఅవెన్యూ అపార్టుమెంటు ఎదురుగా కొన్ని రోజులుగా కాలువలో మురుగు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కాలువ పక్కనే ఓ ప్రైవేటు కళాశాల బాలికల వసతి గృహం కూడా ఉంది. దుర్వాసన, దోమల బెడదతో ఉండలేకపోతున్నట్లు చుట్టు పక్కల ఉన్న వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురపాలక అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అసలే గోతులు.. ఆపై నీరు!



కానూరు, న్యూస్‌టుడే: కానూరు సర్కిల్ పరిధిలోని మురళీనగర్ టంకసాల వారి వీధిలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గోతులతో నిండిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీటితో నిండిపోయాయి. దీంతో రాకపోకలు సాగించడానికి స్థానికులు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

శివారు.. చెత్త తీయరు!

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు-వేలేరు శివారు ప్రాంతం వ్యర్థాలకు కేంద్రంగా తయారైంది. ఎక్కడెక్కడ్నుంచో తీసుకొచ్చి గ్యాస్ కంపెనీ అవతల నుంచి రహదారి అంచుల్లో ఇష్టారీతిన పోసేస్తున్నారు. వాటిల్లో కాలం చెల్లిన మాత్రలు, ఔషధ సీసాలు ఉండటం గమనార్హం. ఖాళీ క్యూర్ బిందెల సంగతి సరేసరి. వాటికి పూర్తిస్థాయిలో నిల్వ ప్రదేశంగా ఈ ప్రాంతం మారిపోయింది. ఈ కారణంగా దోమల బెడద, దుర్గంధం ఎక్కువైందని స్థానికులు వాపోతున్నారు. ప్రజారోగ్య దృష్ట్యా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె

హనుమాన్‌జంక్షన్: సారె తీసుకొస్తున్న మహిళలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: గోవింద నామ ప్రచార సేవా సంఘం, సేవా భారతి ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సందర్భంగా బాపులపాడులో కొలువైన గంగానమ్మకు భక్తులు ఆదివారం సారె సమర్పించారు. కె.సీతారాంపురంలోనూ భక్తులు గ్రామ దేవతలకు సారె సమర్పించారు.

గన్నవరం గ్రామీణం: బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పాత గన్నవరంలో కొలువైన లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారికి ఆదివారం బోనాలు సమర్పించారు. ఆషాఢ మాసం చివరి ఆదివారం పురస్కరించుకొని కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధరరావు ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులు, ఆవరణలోని అంకమ్మతల్లికి బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు గన్నవరం బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సంఘ అధ్యక్షుడు పి.విష్ణుమూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముదునూరు (ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: ఉయ్యూరు మండలం ముదునూరులోని పల్లపోతు అంకమ్మతల్లికి మహిళలు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. మేళతాళాలు, వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు.

భక్తిశ్రద్ధలతో శాకంబరి ఉత్సవాలు

హనుమాన్‌జంక్షన్: అలంకరణలో స్వామి, అమ్మవారు

విఘ్నేశ్వరుడికి కూరగాయలతో అలంకరణ

వేల్పూరులో గంగానమ్మ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని వీరవల్లి తిరుపతమ్మ ఆలయంలో శాకంబరి ఉత్సవాలు నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరిన మహిళా భక్తులు అమ్మవారికి ఆషాఢ సారె తీసుకొచ్చారు. అమ్మవారితో పాటు గోపయ్య స్వామికి, అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. ఆలయ నిర్వాహకులు నందమూరి కృష్ణప్రసాద్, లంక రవిశ్రీనివాస్, సురేంద్రబెనర్జీ, కలపాల నానిబాబు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం మండలం కేసరపల్లి గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలోని దేవతామూర్తులను శాకంబరిగా అలంకరించారు. ఉదయం పంచామృతాలతో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వేల్పూరు (కంకిపాడు), న్యూస్‌టుడే: మండలంలోని వేల్పూరు నాయీబ్రాహ్మణ కాలనీలోని గంగానమ్మను ఆదివారం శాకంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు.

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం

కానూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి రానుందని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు అన్నారు. ఆదివారం కానూరు తులసీనగర్‌లో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దోనేపూడి రవికిరణ్, ఇమామ్, రియాజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కానూరులో..

యనమలకుదురు(కానూరు), న్యూస్‌టుడే: యనమలకుదురు సర్కిల్‌లోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో తెదేపా యనమలకుదురు క్లస్టర్-3 ఇన్‌ఛార్జి అనంతనేని ఆజాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కల్యాణ చక్రవర్తి, శ్రీనివాసరావు, మహబూబ్ బాషా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ముదునూరులో కరపత్రాలు అందజేస్తున్న దండమూడి చౌదరి

ముదునూరు(ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్-6 పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. ముదునూరులో ఆదివారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఉండని ప్రాంతాలు నేడు

పోరంకి(కానూరు), న్యూస్‌టుడే: పోరంకి పరిధిలోని విశ్వాసాయినగర్, పీఎన్‌ఆర్‌కాలనీ, నిడమానూరు రోడ్డు, రాజమాతనగర్, పద్మనాభపురం కాలనీ, గిరిజాపురంకాలనీ పరిసర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్తు కోతలు ఉంటాయని ఈఈ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

కానూరు, న్యూస్‌టుడే: కానూరు సర్కిల్ పరిధిలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నవతారోడ్డు, కేసీపీస్కూల్‌ప్రాంతం, వినాయకనగర్ ప్రాంతాల్లో విద్యుత్తు కోతలు ఉంటాయని ఈఈ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

గన్నవరం గ్రామీణం: విద్యుత్తు తీగల మరమ్మతుల కారణంగా గన్నవరం సెక్షన్ పురుషోత్తపట్నం ఫీడర్ పరిధిలో పలుచోట్ల సోమవారం సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ రాజు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పురుషోత్తపట్నం, కొండపావులూరు పంచాయతీల పరిధిలో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

కానూరు, న్యూస్‌టుడే: ఏపీపీఎస్సీ లెక్చరర్ పోస్టుల భర్తీ పరీక్ష నిర్వహించిన కానూరు ఐయాన్ డిజిటల్ కేంద్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు ఆదివారం పరిశీలించారు. అక్కడి ఏర్పాట్లు, పరీక్ష జరుగుతున్న విధానాన్ని చూశారు.

గుర్తు తెలియని మృతదేహం గుర్తింపు

పెనమలూరు, న్యూస్‌టుడే: యనమలకుదురు లాకుల వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పెనమలూరు పోలీసులు గుర్తించారు. మృతుడి వయసు 50 ఏళ్ల వరకు ఉంటుంది. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయింది. ఒంటిపై గులాబీ రంగు షర్టు ఉంది.

రైతుల సంక్షేమానికి కృషి

పదవీ బాధ్యతలు చేపడుతున్న శ్రీనివాసరావు, పక్కన ఎమ్మెల్యే బోడే, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ

ఉయ్యూరు, న్యూస్‌టుడే: రైతులకు నిరంతర సేవలందిస్తూ వారి ప్రయోజనాలను కాపాడేలా సహకార సంఘ పాలకవర్గం కృషి చేయాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు సహకార పరపతి సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే బోడే అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం అధ్యక్షుడిగా కూనపరెడ్డి శ్రీనివాసరావు(వాసు), డైరెక్టర్లుగా పేరేపి రామకిషోర్, పచ్చిగళ్ల కోటేశ్వరరావులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, ఉయ్యూరు నగర పంచాయతీ ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని), ఉయ్యూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ కొండా ప్రవీణ్, నాయకులు కుటుంబరావు, గుర్నాథరావు, పూర్ణచంద్రరావు, అబ్దుల్ ఖుద్దూస్, దండమూడి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లు గడుస్తున్నా.. తీరని అవస్థలు

రహదారి ఆరంభంలో ఇదీ దుస్థితి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పెరికీడు నుంచి వసంతవాడ వెళ్లే ప్రధాన రహదారి తీరు మారడం లేదు. అత్యంత దారుణంగా తయారైంది. ఈ రహదారి పునర్నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా.. నామమాత్రంగానే పనులు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి స్వయంగా సందర్శించి అధికార్లపై మండిపడ్డారు. సత్వరమే పనులు కొలిక్కి తేవాలని ఆదేశాలు జారీ చేశారు. దాదాపు పనులు పూర్తి చేసిన అధికారులు, పెరికీడు నుంచి వసంతవాడ రోడ్డులోకి మలుపు తిరిగే చోట మాత్రం నేటికీ పనులు చేపట్టలేదు. ఆ కొద్ది ప్రాంతంలో ఏర్పడిన భారీ గుంతల్ని కూడా పూడ్చకపోవడంతో వాహనదారులు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు.

ఖాళీ స్థలాలు.. వ్యాధులకు ఆవాసాలు!

రామవరప్పాడులోని రాజుల బజార్‌లో..

రామవరప్పాడు, ప్రసాదంపాడు, న్యూస్‌టుడే: విజయవాడ గ్రామీణ మండలంలోని రామవరప్పాడు, ప్రసాదంపాడుల్లో ఖాళీ స్థలాల నిర్వహణ గురించి యజమానులు పట్టించుకోవడం లేదు. కొన్నేళ్ల కిందట ఆయా గ్రామాల్లో గజం రూ.10 వేల లోపు ధరకే రావడంతో భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చాలామంది స్థలాలు కొనుగోలు చేశారు. తరువాత వాటి నిర్వహణ గురించి పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఖాళీ స్థలాల్లో చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి చుట్టుపక్కల నివసించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు సైతం వాటిని శుభ్రం చేయించే విషయంలో శ్రద్ధ చూపకపోవడంతో అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. కొన్ని స్థలాలు రోడ్డు కంటే పల్లంలో ఉన్నాయి. వర్షపు నీరు అందులోకి వెళ్లి.. బయటకు పోయే మార్గం లేక చెరువుల్లా మారాయి. అవి దోమలకు ఆవాస కేంద్రాలుగా తయారయ్యాయి. మరికొన్ని చోట్ల గుబురుగా పిచ్చి మొక్కలు పెరగడం వల్ల రాత్రి విష పురుగులు సమీప నివాసాల్లోకి వస్తున్నాయి. పరిసర ప్రాంతాల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. అసలే విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. అపరిశుభ్ర వాతావరణం వల్ల జ్వరాల బారిన పడతామని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

✤ ఖాళీ స్థలాలను గుర్తించి శుభ్రం చేసే విషయమై పంచాయతీ అధికారులు చొరవ చూపడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి, గడువు లోపు శుభ్రం చేయించకపోతే పంచాయతే ఆ పని చేపట్టాలి. అందుకైన ఖర్చును స్థలం యాజమాని నుంచి వసూలు చేసుకోవాలి. పంచాయతీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఖాళీ స్థలాలు గుర్తించి, నోటీసులు జారీ చేయకుండా అలసత్వం వహిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రసాదంపాడులో వికాస్ స్కూల్ రోడ్డులో..

ఉలిక్కిపడిన సావరగూడెం

కొండపై పొక్లెయిన్లతో తవ్వకాలు

భారీ బ్లాస్టింగ్‌తో ఎగసి పడుతున్న దుమ్ము

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: భారీ బాంబ్ బ్లాస్టింగ్‌లతో చేపడుతున్న మైనింగ్ వల్ల సావరగూడెం శనివారం రాత్రి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గ్రామ శివారు కొండ ప్రాంతంలో కొంతకాలంగా తాత్కాలిక అనుమతులతో గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. వెదురుపావులూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 717/2లో ఐదు ఎకరాల భూమిని ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌కు ప్రభుత్వం కేటాయించింది. ఆ ఐదెకరాల్లో అర్ధరాత్రి వేళ పది రోజులుగా బాంబ్ బ్లాస్టింగ్‌తో మైనింగ్ చేపడుతున్నారు. ఆ ప్రభావంతో శనివారం రాత్రి కొండను ఆనుకొని ఉన్న సావరగూడెంలోని కొన్ని ఇళ్లతో పాటు సామగ్రి కదిలినట్లు నివాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. బ్లాస్టింగ్‌తో తమ జీవనం ప్రశ్నార్థకంగా మారుతోందని వాపోయారు. మైనింగ్ పేరుతో కొండను తొలిచివేయడం సరైన పద్ధతి కాదన్నారు. తాగునీటి, వ్యవసాయ బోర్లు పూడిపోతున్నాయని వాపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాహకులు ఇష్టారాజ్యంగా మైనింగ్ చేస్తున్నారని, సత్వరమే అనుమతులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

(c) eenadu

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

తోట్లవల్లూరులో భారీ వర్షం

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో ఆదివారం సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7.30 వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం పడింది. ప్రధాన రహదారుల్లో మోకాలి లోతు నీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

భారీ వర్షంతో తోట్లవల్లూరులో నీట మునిగిన సిమెంటు రోడ్డు

నిధుల గోల్‌మాల్ నిగ్గు తేల్చేందుకు చర్యలు

గుడ్లవల్లేరు: మండల కేంద్రమైన గుడ్లవల్లేరు పంచాయతీ నిధుల గోల్‌మాల్ వ్యవహారంపై డీపీవో ప్రత్యేక తనిఖీ బృందాన్ని నియమించారు. ఈ నెల 26న నలుగురు సభ్యుల బృందం పంచాయతీ రికార్డులను పరిశీలించనున్నారు. గుడ్లవల్లేరు పంచాయతీలో 2021 నుంచి వసూలు చేసిన పన్నులు, ఇతర వసూళ్లను పంచాయతీ ఖాతాకు జమ చేయకుండా కొందరు పక్కదారి పట్టించినట్లు, దాదాపు రూ.35 లక్షల వరకూ నిధులు గోల్‌మాల్ అయినట్లు 'ఈనాడు'లో 'గుడ్లవల్లేరు పంచాయతీలో నిధుల గోల్‌మాల్' అంటూ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో పంచాయతీలోని అన్ని పన్నులు, ఇతర వసూళ్ల రికార్డులను పరిశీలించేందుకు చిరిచింతల, కలవపూడిఅగ్రహారం (గుడివాడ మండలం), ఆరుగొలను(బాపులపాడు), జనార్ధనపురం(నందివాడ) పంచాయతీ కార్యదర్శులను బృందంగా నియమించారు. వీరు 26న పంచాయతీలోని అన్ని రికార్డులను తనిఖీ చేయనున్నారు.

శివరామకృష్ణ క్షేత్రం నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: కోడూరులో శివరామకృష్ణ క్షేత్రం నిర్మాణానికి కోడూరుకు చెందిన వ్యాపారవేత్త బండ్రెడ్డి లంకేశ్వరరావు, మణిమాల దంపతులు, కుమారుడు కిరణ్‌సాయి రూ.1,01,116లు విరాళాన్ని ఆదివారం కమిటీకి అందించారు. సభ్యులు అన్నం వెంకటసుబ్బారావు, జూపూడి సుభాచంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

పేదరికం నిర్మూలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

రామచంద్రపురం (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పేదరికం నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తోందని తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు చెప్పారు. రామచంద్రపురంలో తెదేపా, జనసేన పార్టీ నేతలతో కలిసి 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జనసేన నేత గుడివాక శివరావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు

చల్లపల్లిలో వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న వాసవీక్లబ్ నేతలు

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శుక్లాల వైద్యశిబిరం, ఉచిత హోమియో వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. డాక్టర్ మోహనరావు 70మందికి నేత్ర పరీక్షలు చేసి వారిలో 20మందికి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించారు. హోమియోపతి వైద్యశిబిరంలో డాక్టర్ మణికంఠ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాజేటి అమరవాణి, గోళ్ల వెంకటరత్నం, కోశాధికారి జూపూడి కిరణ్, దింటకుర్తి జ్యోతి, ఉరిమి సువర్చల, తమ్మన సతీష్, మలిశెట్టి చెంచురాములు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో పడకేసిన పారిశుద్ధ్యం

5వ లైనులో గుంతలు పడిన రహదారిలో నిలిచిన వర్షపు నీరు

కచ్చా డ్రెయిన్ నుంచి రోడ్డుపైకి చేరిన మురుగు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ రాజేంద్రనగర్ నిత్యం అత్యంత ఖరీదైన కార్లు కనిపించే ప్రాంతం. ఆదివారం వస్తే వేలాది మంది కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు గుంపులు గుంపులుగా ఉండే ప్రాంతం. ఇలాంటి రాజేంద్రనగర్‌లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. ఈ ప్రాంతంలో ఎటు చూసినా కచ్చా డ్రెయిన్లు కనిపిస్తాయి. వర్షం వస్తే చాలు వీటి నుంచి మురుగు రోడ్ల పైకి వచ్చి చేరుతుంది. పైగా కచ్చా డ్రెయిన్ల వలన ఈ ప్రాంతంలో మురుగు తీవ్ర దుర్వాసన వస్తుంది. పట్టపగలే దోమలు కుట్టి చంపుతాయి. కచ్చా డ్రెయిన్లలో వరాహాలు తిరగడమూ సమస్య తెస్తోంది. ఒక పక్క రహదారులు గుంతలు పడి ఉండటం వలన చిన్న వర్షం వచ్చినా మురుగు నీరు రహదారులపైకి వచ్చి చేరుతోంది. గత వైకాపా ప్రభుత్వంలో రాజేంద్రనగర్‌లోని రహదారుల అభివృద్ధికి నిధులు విడుదల అయినా, కావాలని నాయకులకు కావాల్సిన రహదారిని మాత్రమే నిర్మాణం చేసి మిగిలినవి వదిలేశారు. దీంతో పలు వీధులలో ఖాళీ స్థలాలలో మురుగు నీరు చేరి పిచ్చి మొక్కలతో నిండి స్థానికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఈ ఖాళీ స్థలాల నుంచి విష సర్పాలు, పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయి. ఒక వైపు వరాహాలు, మరో వైపు దోమలు, ఇంకా మురుగు వాసనలతో పలు చోట్ల రాజేంద్రనగర్ వాసులు అష్ట కష్టాలు పడుతున్నారు. ఇక్కడ ప్రధానంగా 8 లైన్లలో 4వ లైను, 5వ లైనులో రోడ్లు పూర్తిగా గుంతలు పడి వాహనాల రాకపోకలకు కష్టంగా మారాయి. ఈ ప్రాంతంలో ఉన్న కార్పొరేట్ పాఠశాలలకు ఆదివారం ఔటింగ్ ఇస్తారు. దీని కోసం తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది వారి పిల్లల కోసం వస్తూ పోతూ ఇక్కడున్న పరిస్థితుల వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పురపాలక సంఘంలో రెండు వార్డులు ఈ రాజేంద్రనగర్‌లో ఉండగా ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రతినిధి లేక స్థానికులు నష్ట పోతున్నారు. పురపాలక అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

నడిరోడ్డుపైనే వాహనాల నిలిపివేత

రామాలయం వద్ద ట్రాఫిక్‌ను ఆటంకపరిచే విధంగా వాహనాలు నిలిపిన దృశ్యం

గుడివాడ, న్యూస్‌టుడే: సాయంత్రం అయితే చాలు.. గుడివాడ పట్టణం బంటుమిల్లి రోడ్లపై వాహనాలు ఇష్టారీతిన కొలువుదీరి ఉంటాయి. పార్కింగ్ సదుపాయం లేక రామాలయం ముందు నడిరోడ్డుపై చోదకులు వాహనాలు నిలిపి వెళ్లిపోతుంటారు. దీంతో బంటుమిల్లి రోడ్డు, గీతాభవన్ రోడ్డులోనికి రామాలయం పక్కనుంచి వెళ్ళేవారు తీవ్ర కష్టాలు పడుతున్నారు. అక్కడ ఏ తినుబండారాల కోసం ఏ దుకాణానికి వచ్చినా ఇక్కడే వాహనాలు నిలిపేస్తున్నారు. దీంతో అక్కడున్న దుకాణాల వారిపై పోలీసులు పెట్టీ కేసుల పేరుతో జరిమానాలు విధిస్తున్నారు. అక్కడి వాహనాలు తమ దుకాణాలకి వచ్చిన జనాలవి కావని, తామే వాటివల్ల నానా ఇబ్బందులు పడుతున్నామని చెప్పినా వినకుండా జరిమానాలు విధిస్తున్నారని కొందరు వాపోతున్నారు. గుడికి వచ్చినా నడి రోడ్డుపైనే వాహనాలు నిలుపు చేస్తున్నారని పోలీసులు అటువంటి వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'విద్యుత్తు రంగం ప్రైవేటీకరణకు కుట్ర'

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్లు పెట్టడం వెనుక విద్యుత్తు రంగాన్ని ప్రైవేటీకరణ చేసే కుట్ర దాగిఉందని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దోపిడీ విధానానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో ప్రజలను భాగస్వాములు చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర నాయకులు చిగురుపాటి బాబూరావు, సయ్యద్ అఫ్సర్ పిలుపునిచ్చారు. గన్నవరం సుందరయ్య పార్కు వద్ద ప్రజావేదిక ఆధ్వర్యంలో 'స్మార్ట్ మీటర్లు వద్దు.. ట్రూఅప్ ఛార్జీలు రద్దు' విద్యుత్తు భారాలకు వ్యతిరేకంగా ఆదివారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ప్రజావేదిక నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, కాట్రగడ్డ జోషి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు... వైకాపా పాలనలో స్మార్ట్ మీటర్లు పెడుతుంటే.. వాటిని పగలకొట్టాలని చెప్పిన తెదేపా నాయకులు.. ప్రస్తుతం వాటిని పెట్టించే పనిలో ఉన్నారన్నారు. విద్యావంతులు, మేధావులు, ప్రజావేదిక నాయకులు ప్రజల్లోకి వెళ్లి వాటివల్ల కలిగే నష్టాలను వివరించాలని కోరారు. గన్నే వెంకట్రావు, అనుమోలు వెంకటేశ్వరరావు, బుద్ధవరం సర్పంచి బడుగు బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

పార్టీలో చేరిన వారితో శ్రీకాంత్

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడలో జనసేనలో చేరేందుకు అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులవుతున్నారని జనసేన గుడివాడ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్ పేర్కొన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పట్టణానికి చెందిన లోయ రాజా ఆధ్వర్యంలో ముత్యాల అశోక్, వడ్డాది సుబ్రమణ్యం, షేక్ హుస్సేన్, బొజ్జగాని కోటేశ్వరరావులు వారి స్నేహితులు ఆదివారం జనసేనలో చేరారు. ఈసందర్భంగా శ్రీకాంత్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్‌లు జనసేన కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. శాయన రాజేష్, సుంకర వెంకట్, షేక్ మీరా షరీఫ్, కళ్యాణి, భవాని పాల్గొన్నారు.

కాలనీలోకి వెళ్లే దారేది?

నీటమునిగిన కొక్కిలిగడ్డ జగనన్న కాలనీ

మోపిదేవి, న్యూస్‌టుడే: కొక్కిలిగడ్డ జగనన్న కాలనీ నీట మునిగింది. గురువారం సాయంత్రం కురిసిన భారీవర్షానికి జలమయం అయింది. నీరు బయటకు పోయేందుకు మార్గం లేదు. కాలనీ ముందున్న మురుగుకాల్వ నిండిపోవటం, ముందుకు ప్రవహించక నిలిచిపోవటంతో దారిలేక అవస్థలు పడుతున్నారు. నిల్వ నీరు దుర్వాసన వస్తోంది. దోమల వ్యాప్తి క్రమక్రమంగా పెరుగుతోంది. విషసర్పాల సంచారం పెరుగుతోంది. కాలనీలో దాదాపు 15 గృహాలున్నాయి. అంతర్గత రహదారులు లేవు. లోతట్టుగా ఉన్న కారణంగా తక్కువ వర్షానికే జలమయం కావటంతో పడుతున్న ఇబ్బందులపై ఎన్‌డీఏ ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు.

మురుగు నీరు పారేదెలా?

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: నాలుగు వందల ఎకరాల పరిధిలోని రామచంద్రపురం ఆయకట్టు ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. తూటుకాడ, ముళ్ల చెట్ల పొదలు నిండి ఉన్నాయి. ఇలాగైతే, వాన నీరు పారుదల ఎలా అని ఆయకట్టు రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అధిక వానలు కురిస్తే వ్యవసాయ క్షేత్రాల్లో చేరిన వాన నీరు బయటకు వెళ్లే మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తుంగలవారిపాలెం ఆయకట్టు ప్రాంతంలో మురుగు కాలువ అధ్వానంగా ఉంది. తూటుకాడ, గుర్రపు డెక్కతో నిండిపోయింది.

రామచంద్రపురం ఆయకట్టు ప్రాంతంలో డ్రెయిన్‌లో పెరిగిన తూటుకాడ

గుండేరులో గుర్రపు డెక్క తొలగింపు

ఘంటసాల, న్యూస్‌టుడే: దేవరకోట, బిరుదుగడ్డ, కొడాలి, ఘంటసాలపాలెం తదితర ప్రాంతాలలో వంతెనల వద్ద గుండేరులో దట్టంగా అల్లుకున్న గుర్రపుడెక్క, తూటుకాడను పొక్లెయిన్‌తో తొలగించే చర్యలు ఆదివారం చేపట్టారు. మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు గుండేరు ఆయకట్టులో నారుమళ్లు, ఊడ్చిన వరిపొలాలు మునిగాయి. 'ఈనాడు'లో శనివారం 'వరి పొలాలు మునక' శీర్షికన కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీనికి ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. గుండేరులో గుర్రపుడెక్క, తూటుకాడను తొలగించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులను ఆదేశించడంతో ఆమేరకు చర్యలు తీసుకున్నారు. దీంతో గుండేరులో నీటి ప్రవాహం వేగవంతమైంది.

దేవరకోట వంతెన వద్ద గుర్రపు డెక్క తొలగిస్తున్న పొక్లెయిన్

గుడివాడలో సెక్షన్ 30 అమలు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలో సెక్షన్ 30 పోలీసు చట్టం అమలులో ఉందని, ఎవరూ సభలు, సమావేశాలు పోలీసు వారి అనుమతి లేకుండా నిర్వహించరాదని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ ఆదేశించినట్లు ఆదివారం పట్టణంలో ఆటోల ద్వారా ప్రచారం ప్రారంభించారు. పట్టణంలో ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు, పార్టీ సభలు ఏర్పాటు చేయరాదన్నారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

పులిగడ్డ(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: పులిగడ్డలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైనట్లు ఎస్సై కె.శ్రీనివాసరావు చెప్పారు. మోపిదేవి ప్రాంతానికి చెందిన యువకుడు మోటారు సైకిల్‌పై పులిగడ్డ వైపు వస్తుండగా అదుపుతప్పి పడిపోవడంతో గాయాలయ్యాయి.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గుడివాడ, న్యూస్‌టుడే: పట్టణంలో ఎక్కడైనా నేరాలు జరిగే ప్రాంతాలలో కనిపించినా, గొడవలకు దిగినా కఠిన చర్యలు తప్పవని గుడివాడ వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. అనుమానిత షీటర్లు, రౌడీషీటర్లు ఎప్పుడు పిలిస్తే అప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతీ వారం తప్పక స్టేషన్‌కు వచ్చి కనపడి వెళ్లాలన్నారు. ఊరు వదిలి వెళ్లాల్సి వచ్చినా సమాచారం ఇవ్వాలన్నారు.

'ప్రభుత్వ అరాచకాలపై పోరాటం చేయండి'

భద్రిరాజుపాలెం(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై వైకాపా శ్రేణులు పోరాటానికి సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి మండలంలోని భద్రిరాజుపాలెం కల్యాణ మండపంలో నిర్వహించిన వైకాపా మండల స్థాయి సమావేశంలో అనిల్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల్లో అసత్యాలు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చారని తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, వైస్ ఎంపీపీ కళ్లం సాంబశివారెడ్డి, ఎన్.రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

లింగారెడ్డిపాలెంలో ..

లక్ష్మీపురం శివాలయంలో..

వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కోడూరులో గంగానమ్మ అమ్మవారికి సారె తీసుకువస్తున్న మహిళలు

అమ్మవార్లకు ఘనంగా ఆషాఢ సారె

పెదపారుపూడి: మోపర్రులో గంగానమ్మతల్లికి బోనాలు తీసుకెళుతున్న మహిళలు

ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం కావడంతో భక్తులు గ్రామ దేవతలకు వైభవంగా సారె సమర్పించారు. పసుపు, కుంకుమలు, మిఠాయిలు, పూలు, పండ్లతో మహిళలు ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అవే ఈ దృశ్యాలు.

- న్యూస్‌టుడే బృందం

పామర్రులో..

లంకమ్మ అమ్మవారికి సారె తీసుకువస్తున్న అవనిగడ్డ 6వ వార్డు మహిళలు

పులిగడ్డలో కనకదుర్గాదేవి అమ్మవారికి..

నయనానందకరం ఆదిత్యుడి కల్యాణోత్సవం

వేకనూరు(అవనిగడ్డ గ్రామీణం): వేకనూరులోని సూర్యదేవాలయంలో ఆదిత్యుడి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వికాస తరంగిణీ భక్త బృందం ఆదిత్యహృదయం స్తోత్రం పారాయణ చేశారు. ఆలయ వ్యవస్థాపకులు తుంగల వీరవసంతరావు-ఇందిర దంపతులు అన్న సంతర్పణ చేశారు.

శ్రీకొండలమ్మ తల్లికి పూజలు

వేమవరం(గుడ్లవల్లేరు): మండలంలోని ప్రసిద్ధ వేమవరం శ్రీకొండలమ్మతల్లి దేవస్థానంలో ఆదివారం చివరి ఆషాఢ ఆదివారం నేపథ్యంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దాదాపు 18 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజాదికాలు చేశారు. మహిళలు సామూహిక పాలపొంగళ్లు నైవేద్యంగా వండి సమర్పించారు. మొక్కుబడులు తీర్చుకుని బంధుమిత్రులకు అన్న సమారాధన చేసుకున్నారు. ఆషాఢం సారెను సమర్పించారు. ఆలయ ఈవో ఎ.కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సామూహిక పాలపొంగళ్లు వండుతున్న మహిళలు

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పూతబోయిన రామారావు

రక్తదాన శిబిరానికి స్పందన

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ సంస్థను స్థాపించి 23 సంవత్సరాలు అయిన సందర్భంగా ఆదివారం స్థానిక వెంకటరామకృష్ణ థియేటర్ ప్రాంగణంలో సంస్థ ఏర్పాటు చేసిన 13వ రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. తొలుత మండల ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ యూనియన్ అధ్యక్షుడు పూతబోయిన రామారావు శిబిరాన్ని ప్రారంభించారు. మచిలీపట్నం బ్లడ్ బ్యాంక్ వైద్యులు పావని పర్యవేక్షణలో సుమారు 45 మంది దాతలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, లెజెండ్స్ సంస్థ ప్రతినిధులు బడే నాని, బండే జయకిషోర్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎలకుర్రు సచివాలయంలో సేవలు అందించి బదిలీ అయిన ఉద్యోగులను ఆదివారం సర్పంచి పానే శివమస్తాన్, పంచాయతీ కార్యదర్శి మాడుగుల ముద్దులయ్య సంయుక్త ఆధ్వర్యంలో సన్మానించారు. సన్మానం అందుకున్న వారిలో డిజిటల్ అసిస్టెంట్ మహమ్మద్ హుస్సేన్, మహిళా పోలీస్ శేషారత్నం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వనిత, సర్వేయర్ మద్దాలి కీర్తి, ఏఎన్ఎం కోటేశ్వరమ్మ, వ్యవసాయశాఖ సహాయకులు నగేష్‌లు ఉన్నారు.

ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

పామర్రు: సాయినగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా, పార్టీ నాయకులు

పామర్రు, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ఆదివారం స్థానిక బాపూజీపేటలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

మురుగు సమస్య పరిష్కారం

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రులో ఆరు వార్డుల్లో మురుగు సమస్య పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ఆదివారం స్థానిక గుడివాడ రోడ్డులోని బాపూజీపేట నుంచి ఎన్‌హెచ్-65 వరకు ఉన్న చుట్టుపక్కల డ్రెయిన్ల నిర్మాణం సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే రోజుల్లో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణ దిశగా ఆలోచిస్తున్నామని ఎమ్మెల్యే కుమార్‌రాజా పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెదేపా నేత మృతికి సంతాపం

నాంచారయ్య

మేళ్లమర్తిలంక(మోపిదేవి): తెలుగుదేశం పార్టీ మేళ్లమర్తిలంక గ్రామ మాజీ అధ్యక్షులు కె.నాంచారయ్య(75) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎన్.జనార్ధనరావు, రావి నాగేశ్వరరావు, ఎంపీపీ రావి దుర్గావాణి, ఉప ఎంపీపీ ఎన్.జననీకుమారి తదితరులు నాంచారయ్య భౌతికకాయానికి నివాళులర్పించి సంతాపం తెలిపారు.

ఏటీఎస్ కేంద్రం గుడివాడలో ఏర్పాటు చేయాలి

మాట్లాడుతున్న ఆర్.సి.పి.రెడ్డి

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడలో ఆటోమొబైల్ టెస్టింగ్ సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.సి.పి.రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోనే అత్యధికంగా 33 రకాల సుమారు 7వేల ట్రాన్స్‌పోర్టు వాహనాలు కలిగిన యజమానులు గుడివాడలో ఉన్నారన్నారు. వీరంతా మచిలీపట్నానికి 10 కిలోమీటర్లకు పైగా దూరం వెళ్లి బ్రేకు చేయించుకోవడానికి చాలా ఖర్చు అవుతుందన్నారు. ఏటీఎస్ కేంద్రం గుడివాడలో ఏర్పాటు చేసేలా ఎమ్మెల్యే, ఎంపీలు జోక్యం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సీహెచ్.శివ నాగమల్లేశ్వరరావు, రేపాని కొండ పాల్గొన్నారు.

శ్రమ జీవుల కోసం అలుపెరగని పోరాటం

ప్రసంగిస్తున్న ఉప్పలపాటి వీరబాబు

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: రైతు కూలీ సంఘ నాయకుడు సైకం శ్రీహరి రైతు కూలీలు, శ్రమజీవుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేశారని రైతుకూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పలపాటి వీరబాబు చెప్పారు. ఆదివారం సాలెంపాలెంలో జరిగిన శ్రీహరి సంతాప సభలో వక్తలు మాట్లాడారు. కన్నా నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో జనసాహితి రాష్ట్ర అధ్యక్షుడు డి.వి.కుమార్, రాష్ట్ర మత్స్యకారుల సంఘం నేత లకనం నాగాంజనేయులు, నాయకులు జగన్, తలశిల లీలామనోహర్, సైకం రాజశేఖర్, పర్చూరి రాఘవేంద్రరావు, బండ్రెడ్డి పాణి, తదితరులు పాల్గొన్నారు.

చతుర్థ వర్ధంతి

మీరు మానుండి దూరమై 4 సంవత్సరములు గడిచిననూ సదా మీ జ్ఞాపకాలను స్మరించుకుంటూ...

కీ॥శే॥ యలమంచి జగన్మోహనరావు గారు

Rtd టీచర్, మేడూరు, పమిడిముక్కల మండలం

జననం: 19-08-1933 - మరణం: 03-08-2021

భార్య యలమంచి భ్రమరాంబ మరియు కుమార్తెలు

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

ఉలిక్కిపడిన సావరగూడెం

అర్ధరాత్రి బ్లాస్టింగ్‌లతో కొండలు పిండి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: భారీ బాంబ్ బ్లాస్టింగ్‌లతో చేపడుతున్న మైనింగ్ వల్ల సావరగూడెం శనివారం రాత్రి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గ్రామ శివారు కొండ ప్రాంతంలో కొంతకాలంగా తాత్కాలిక అనుమతులతో గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. వెదురుపావులూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 717/2లో ఐదు ఎకరాల భూమిని ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌కు ప్రభుత్వం కేటాయించింది. ఆ ఐదెకరాల్లో అర్ధరాత్రి వేళ పది రోజులుగా బాంబ్ బ్లాస్టింగ్‌తో మైనింగ్ చేపడుతున్నారు. ఆ ప్రభావంతో శనివారం రాత్రి కొండను ఆనుకొని ఉన్న సావరగూడెంలోని కొన్ని ఇళ్లతో పాటు సామగ్రి కదిలినట్లు నివాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. బ్లాస్టింగ్‌తో తమ జీవనం ప్రశ్నార్థకంగా మారుతోందని వాపోయారు. మైనింగ్ పేరుతో కొండను తొలిచివేయడం సరైన పద్ధతి కాదన్నారు. తాగునీటి, వ్యవసాయ బోర్లు పూడిపోతున్నాయని వాపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాహకులు ఇష్టారాజ్యంగా మైనింగ్ చేస్తున్నారని, సత్వరమే అనుమతులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

స్వదేశాగమన శుభాకాంక్షలు

మాకు అత్యంత ఆప్తులు, డా॥ శ్రీ ఉప్పలపాటి వేణుగోపాలరావు, శ్రీమతి జయశ్రీ గార్లు అమెరికా పర్యటన దిగ్విజయంగా ముగించుకుని గుడ్లవల్లేరుకు విచ్చేసిన సందర్భంగా వారికివే మా హార్దిక స్వాగత శుభాకాంక్షలు.

డా॥ శ్రీ ఉప్పలపాటి వేణుగోపాలరావు శ్రీమతి జయశ్రీ గార్లు

లక్ష్మీ నర్సింగ్ హోమ్, గుడ్లవల్లేరు

శ్రీ లక్ష్మీ వస్త్రాలయం

మెయిన్ రోడ్, గుడ్లవల్లేరు © 99595 91455

ప్రొ॥ V. రాజా

(c) eenadu

అమ్మ దర్శనం.. తనువు పరవశం

ఆషాఢమాసం చివరి ఆదివారం కావడంతో విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. మహిళలు వేలాదిగా తరలివచ్చి అమ్మవారికి ఆషాఢసారె సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారితో క్యూలైన్లు, ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆధ్యాత్మికత పరిఢవిల్లింది. – ఈనాడు, అమరావతి

తాడేపల్లిగూడెం నుంచి సారె తీసుకొచ్చి పూజలు చేస్తున్న భక్తులు

పండక్కి.. కొండెక్కి

రేటు పెరిగిపోయిన కొబ్బరికాయ

గొల్లపూడి, న్యూస్‌టుడే

ఈ ఫొటో చూడండి... విజయవాడ నగర పరిధిలోని ఓ సూపర్‌మార్కెట్‌లో ఒక మోస్తరుగా ఉన్న కొబ్బరి కాయ ధరే రూ.48లు పలుకుతుంది. అక్కడే అంత రేటు ఉంటే బహిరంగ మార్కెట్‌లోని ఇంకెంత ఉంటుందోనని ప్రజలు ఆందోళనపడుతున్నారు. పూజలు, హోమాలు, శుభ, అశుభ కార్యక్రమాలకు కొబ్బరికాయ లేనిదే ఆ తంతు పూర్తవదు. కానీ... ప్రస్తుత పరిస్థితుల్లో సామాన్య ప్రజలు కొబ్బరికాయలను కొనలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం చిన్నసైజు కాయలు రూ.30లు పలుకుతుండగా, పెద్ద సైజు రూ.50 నుంచి రూ.70వరకు అమ్ముతుండడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు.

ఇదే కారణం: కొబ్బరికాయలు విజయవాడకు ఎక్కువగా తమిళనాడులోని పొలాచ్చి, కోయంబత్తూరు నుంచి వస్తుంటాయి. అయితే... అక్కడ చెట్లకు చెదపురుగులు పట్టడంతో దాదాపు 70 శాతం మేర పంట పాడై పోయి దిగుబడి తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. దీనికి తోడు కర్ణాటకలోని సామ్రాజ్యనగర్, ఏపీలోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వచ్చే కాయలుకూడా పూర్తి స్థాయిలో రాకపోవటంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాల్లో గతంలో కొబ్బరికి ధర లేదంటూ రైతులు చెట్లను నరికి పామాయిల్ పంట వేయడమూ ధర పెరగడానికి ఓ కారణం.

అమాంతం పెరిగిన ధర... తమిళనాడులో ప్రస్తుతం టన్ను కొబ్బరికాయ ధర రూ.67 వేలు పలుకుతుంది. రవాణా ఖర్చులు రూ.5 వేలు.. టన్నుకు సైజును బట్టి 2వేల వరకు కాయలు వస్తాయి. ఈ లెక్కన హోల్‌సేల్ వ్యాపారులకే ఒక కొబ్బరికాయ రూ.36 పలుకుతుంది. పెద్ద సైజువైతే రూ.46 పైమాటే. విజయవాడ నగర పరిధిలో గొల్లపూడి, సత్యనారాయణపురం, ఆటోనగర్, వన్‌టౌన్ ప్రాంతంలో హోల్‌సేల్ వ్యాపారులు ఉన్నారు. ప్రస్తుతం కొబ్బరికాయల ధర పెరగడం వల్ల డిమాండ్ లేదని పూర్తిగా వ్యాపారం పడిపోయిందని హోల్‌సేల్ వ్యాపారి వీరరాఘవులు చెబుతున్నారు.

తగ్గేనా... మరికొద్ది రోజుల్లో శ్రావణమాసం, వినాయకచవితి వేడుకలు వస్తున్నాయి. ఆ సమయంలో భక్తులు పెద్ద ఎత్తున పూజలు, వ్రతాలు చేస్తుంటారు. కొబ్బరికాయ ధరలు తగ్గకుంటే భక్తులు కొనలేని పరిస్థితులు ఏర్పడతాయి.

పన్నులకూ ఎగనామం..!

- నేతల సిఫార్సులతో అసలు చెల్లించనివి వేలల్లోనే
- కృష్ణా, ఎన్టీఆర్‌లో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి

ఈనాడు, అమరావతి

మున్సిపాలిటీ	పన్ను వేయని ఆస్తులు	రావాల్సిన పన్ను (రూ.లక్షల్లో)	పన్ను తగ్గించిన ఆస్తులు	రావాల్సిన పన్ను (రూ.లక్షల్లో)	మొత్తం ఆదాయం
విజయవాడ	990	1,24,74,264	2388	19940072	3,24,14,336
కొండపల్లి	132	13,66,946	87	41,80,534	55,47,480
నందిగామ	90	5,80,972	52	5,76,608	11,57,580
జగ్గయ్యపేట	37	147696	29	167378	3,15,074
తిరువూరు	37	1,51,518	50	4,74,684	6,26,202

★ ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని విజయవాడ నగరపాలక సంస్థతో పాటు కొండపల్లి, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు పట్టణ పరిధిలో 1286 ఆస్తులకు అసలు పన్నే వేయకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. ★ కృష్ణా జిల్లా పరిధిలో తాడిగడప, మచిలీపట్నం, గుడివాడ, పెడన, ఉయ్యూరు పట్టణాల పరిధిలోనూ ఏకంగా 1614 నిర్మాణాలను అసలు పన్ను పరిధిలోకి తీసుకురాకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో పన్నుల పరిస్థితిపై తాజాగా అధికారులు నిర్వహిస్తున్న సర్వేలో అనేక వాస్తవాలు బయటకొస్తున్నాయి. గత ఐదేళ్ల వైకాపా హయాంలోనే తెరవెనుక లాబీయింగ్ పెద్దఎత్తున సాగింది. అప్పటి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్ల సిఫార్సులతో పట్టణ ప్రణాళిక సిబ్బంది ఈ భవనాలను చూసీచూడనట్టు వదిలేశారనే విమర్శలున్నాయి.

అందుకే ఇప్పటికీ వాటికి పన్నులే చెల్లించడం లేదు. గత నెలన్నరగా నిర్వహిస్తున్న అధ్యయనంలో పన్నుల పరిధిలోకే పూర్తిగా తీసుకురాని నిర్మాణాలు వేల సంఖ్యలో బయటపడుతున్నాయి. రెండు జిల్లాల్లో కలిపి 2,900 భవనాలు, ఇళ్లు, వాణిజ్య సముదాయాలకు అసలు పన్నే విధించకుండా ఏళ్ల తరబడి ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి కొడుతున్నారు. ★ విజయవాడలోనే అధికంగా.. పన్నుల పరిధిలోకి రాని నిర్మాణాలు విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోనే అధికంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఏకంగా 990 వరకూ విజయవాడ పరిధిలో ఇలాంటి నిర్మాణాలు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఇలా అస్సలు పన్నులు చెల్లించకుండా వదిలేసిన భవనాలపై కనీసం ఒక పన్ను కాలానికి రూ.కోటిన్నరకు పైగా ఆదాయానికి గండి పడుతోంది. ★ ఇవికాకుండా పన్ను విధించాల్సిన దానికంటే తక్కువగా వేసి వసూళ్లు చేస్తున్న భవనాలూ ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఏకంగా 2606 ఉన్నాయి. వీటి ద్వారా ఒక్కో పన్ను కాలానికి ఏకంగా రూ.2.50కోట్ల వరకూ ఆదాయానికి గండి కొడుతున్నారు. నేతల సిఫార్సుల వల్లే వేయాల్సిన దానికంటే తక్కువ పన్ను వేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

పట్టణ ప్రణాళికలో అక్రమార్కులు..

నగర, పట్టణ ప్రణాళికల్లోని కొంత మంది సిబ్బంది పూర్తిగా అవినీతిలో కూరుకుపోయారు. ఇప్పటికే విజయవాడ, తాడిగడప పరిధిలోని పలువురు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికీ చాలా మంది సిబ్బంది పట్టణ ప్రణాళిక విభాగంలో పూర్తిగా పాతుకుపోయి అక్రమాలకు పాల్పడుతున్నారు. అక్రమ భవనాలకు విచ్చలవిడిగా అనుమతులిచ్చి దండుకోవడం, పన్నుల్లోనూ అవినీతికి పాల్పడడంపై తీవ్రస్థాయిలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

ముక్త్యాల ఎత్తిపోతలకు రూ.489.28 కోట్లు మంజూరు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: రైతులకు అండగా నిలిచి వారికి పురోగతి అందించడం ద్వారా రాష్ట్రాభివృద్ధిని చూపాలన్న సీఎం చంద్రబాబు సంకల్పం జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఆచరణాత్మకం కాబోతోందని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య అన్నారు. ఆదివారం తన స్వగృహంలో ముఖ్య నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. తన నియోజకవర్గంలో 38,627 ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.489.28 కోట్లు మంజూరు చేస్తూ శుక్రవారం జీవో విడుదల చేసి చిత్తశుద్ధి నిరూపించుకుందన్నారు. వేదాద్రి వద్ద నుంచి 386.27 క్యూసెక్కుల నీటిని రెండు దశల్లో ఎత్తిపోసే ఈ పథకం ద్వారా జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో 30కి పైగా గ్రామాలు లబ్ధి పొందనున్నాయన్నారు. జగ్గయ్యపేట పట్టణంలో నుంచి ప్రవహించే ఎర్ర కాలువ ప్రక్షాళనకు, ఆధునికీకరణకు రూ.5.65 కోట్లు మంజూరు కావడం వల్ల పెద్ద సమస్య తీరనుందని ఎమ్మెల్యే తెలిపారు. చంద్రబాబు శంకుస్థాపన చేసిన ఈ ఎత్తిపోతలను వైకాపా ప్రభుత్వం పేరు మార్చి కనీస పురోగతి లేకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. అయినా ఎంపీ కేసినేని చిన్ని, నెట్టెం రఘురాంలతో కలిసి తాను చేసిన కృషి ఫలించిందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కట్టా నరసింహారావు, నీటి సంఘాల అధ్యక్షులు ఏలూరి గోపాలరావు, చిట్టూరి సుభాష్, మన్నె నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐ బోధన.. నైపుణ్య సాధన

జిల్లాలో మూడు పాఠశాలల్లో పాల్ అమలు ★ మరో ఐదు బడుల్లో త్వరలో మొదలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

చదువులో వెనుకబడిన విద్యార్థులపైన ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అటువంటి పిల్లలకు డిజిటల్ విధానంలో బోధించే విధానాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తోంది. ఫలితంగా వారంతా విద్యలో రాణించడమే కాకుండా నైపుణ్యవంతులుగా మారేలా చర్యలు తీసుకుంటోంది. విద్యార్థులు కోరుకునే.. అమితంగా ఇష్టపడే విధానంలోనే పాఠాలు అర్థమయ్యేలా చెప్పడం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. ముఖ్యంగా గణితం, ఆంగ్లం, తెలుగులో వెనుకబడిన విద్యార్థుల అభ్యసన స్థాయి మెరుగు పరిచేలా డిజిటల్ విధానంలో విద్యా బోధనకు పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్(పాల్) పద్ధతికి సమగ్ర శిక్షా అధికారులు శ్రీకారం చుట్టారు. జిల్లాలో ఈ తరహా బోధన అందించేందుకు ఎనిమిది పాఠశాలలను ఎంపిక చేశారు. మొదటి విడత గతేడాది గంపలగూడెం, ఎ.కొండూరు, రెడ్డిగూడెం కేజీబీవీల్లో అమలు చేశారు. ఒక్కొక్క పాఠశాలకు 30 చొప్పున 90 ట్యాబ్‌లు అందజేశారు. పవర్ ఛార్జింగ్ ల్యాబ్ సెటప్‌నకు ఒక్కో పాఠశాలకు రూ.22,500 చొప్పున మంజూరు చేశారు.

ట్యాబ్‌లో పాఠాలు వింటూ

విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి.. ఎంపీఎంఎస్ గంపలగూడెం, ఏపీఎంఎస్ మద్దులపర్వ, ఏపీఆర్ఎస్ భవానీపురం (మైనార్టీ), ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ (బాలికలు) నందిగామ, ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఎస్ (కొండపల్లి)లో ఈ విద్యా సంవత్సరం నుంచి పాల్ అమలు చేసేందుకు సమగ్ర శిక్షా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా పాఠశాలలకు 150 ట్యాబ్‌లు పంపించాల్సి ఉండగా.. 60 ట్యాబ్‌లు జిల్లా కార్యాలయానికి చేరుకున్నాయి. త్వరలో ఆయా పాఠశాలలకు వాటిని పంపించనున్నారు. ★ 6 నుంచి 9 వరకు పాఠ్యాంశాలను ట్యాబ్‌ల్లో నిక్షిప్తం చేస్తారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), డేటా విశ్లేషణ ద్వారా ట్యాబ్ పని చేస్తుంది. ల్యాబ్‌లోకి వెళ్లి ట్యాబ్ తీయగానే వీడియోలో పాఠం వస్తుంది. దానిపై కొన్ని ప్రశ్నలు వస్తాయి. వాటిలో ఎన్నింటికి సరైన సమాధానాలు చెప్పారో తెలుసుకొని.. విద్యార్థుల సామర్థ్యాన్ని ఏఐ అంచనా వేస్తుంది. వారూ చెప్పిన జవాబుల ఆధారంగా తర్వాత పాఠాలు వస్తాయి. ఎందుకు? ఎక్కడ? జవాబు తప్పు చేశారో విశ్లేషిస్తుంది.

విద్యా ప్రమాణాలు మెరుగు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ ఉత్తీర్ణులై అత్యధిక మార్కులు సాధించాలనేది సర్కారు లక్ష్యం. వెనుకబడిన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను ఏఐ సాంకేతికతతో ట్యాబ్‌ల ద్వారా బోధిస్తున్నాం. మూడు పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చాయి. మిగిలిన ఐదు పాఠశాలలకు కొద్ది రోజుల్లో మొదలు పెడతాం.

– జి.మహేశ్వరరావు, సమగ్ర శిక్షా జిల్లా అదనపు సమన్వయకర్త

ఉద్యోగం పేరిట మోసం

విజయవాడ (మధురానగర్): ఉద్యోగం పేరిట మోసం చేసిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు 17న కేసు నమోదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన సాత్విక్ (30) మల్టీ నేషనల్ కంపెనీలో డేటా ఎనలిస్ట్‌గా పని చేస్తున్నారు. బాపట్ల టీచర్స్‌కాలనీకి చెందిన చల్లపల్లి అనిల్ కుమార్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తాను బాపట్ల కలెక్టరేట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని అనిల్‌కుమార్ చెప్పడంతో.. అతడి మాటలు నమ్మారు. రెండు సంవత్సరాల క్రితం రూ.6.5లక్షలు చెల్లించారు. ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగం రాలేదు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే చంపుతానని బెదిరించాడు. దీనిపై సాత్విక్ అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భయం భయంగా..

బందరురోడ్డు: ఆగిన వాహనాన్ని తోసుకుంటూ వెళ్తూ..

ఎంప్లాయీస్ కాలనీ వద్ద..

జోరువానలో కనిపించక నిదానంగా సాగుతూ..

కనుచూపుమేర అంతా నీరే..

బెంజిసర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ మార్గం ఇలా..

దంచింది.. ముంచింది

విజయవాడ నగరంలో ఆదివారం రాత్రి కుండపోతలా వర్షం కురిసింది. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన వాన 9.30 వరకు కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. రోడ్లు చెరువులయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇక్కట్లపాలయ్యారు.కొన్నిచోట్ల వాహనాలు ఆగిపోగా, కొంతమంది రోడ్డు కనపడక నీళ్లలో పడిపోయారు. నగరంలోని బెంజిసర్కిల్, మొగల్రాజపురం, బస్టాండ్, పాతబస్తీ ప్రాంతాల్లో కాలువలు పొంగి ప్రత్యక్ష నరకాన్ని చూపింది.

– ఈనాడు, అమరావతి

జలమయమైన నిర్మలా కాన్వెంట్ రోడ్డు...

దారి ఏరైంది..

నగర పరిసరాల్లో 25.2 మి.మీ.వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. విజయవాడ (గ్రామీణ మండలం (నగర పరిసరాల్లో) అధికంగా 25.2 మిల్లీ మీటర్ల వర్షం పడింది. విజయవాడలో 19.6 నుంచి 20 మి.మీ. వరకు నమోదైంది. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. అజిత్‌సింగ్‌నగర్ 20, పటమట 19.8, గాంధీనగర్ 19.6, భవానీపురం 19.6, విస్సన్నపేట 24.4, తిరువూరు 14.8, వత్సవాయి 6.4, ఎ.కొండూరు 2.4, నందిగామలో అత్యల్పంగా 0.4 మి.మీ. మేర వర్షం పడింది. సగటు వర్షపాతం 7.63 మి.మీ.గా ఉంది.

ప్రకాశం బ్యారేజీకి వరద తాకిడి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : భారీ వర్షాల నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీకి స్థానిక వరద నీరు చేరుతోంది. జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఈ నెల 21వ తేదీ సోమవారం ప్రకాశం బ్యారేజీ గేట్లను ఎత్తి, సముద్రంలోకి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బ్యారేజీ వద్ద ప్రస్తుతం 12 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టం ఉంది. 3,000 క్యూసెక్కుల వరకు వరద నీరు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కృష్ణా డెల్టా పరిధిలోని జిల్లాల్లో వర్షాలు కురుస్తుండడంతో సాగునీటి అవసరాలు తగ్గాయి. నీటి విడుదలను బాగా తగ్గించారు. కాలువలకు నీటి విడుదల పరిమితం కావడంతో వచ్చిన వరద నీటిని సముద్రంలోకి వదిలేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. సముద్రంలోకి నీటిని విడుదల చేయనున్న క్రమంలో.. కృష్ణా నది దిగువ ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

పట్టిసీమ పంపుల తగ్గింపు: పట్టిసీమ నుంచి 22 పంపుల ద్వారా గోదావరి నీటిని విడుదల చేస్తుండగా.. 10 పంపుల వరకు తగ్గించారు. గోదావరి నీటిని ఏలూరు జిల్లాలోనూ వినియోగిస్తున్నారు. ప్రస్తుతం అక్కడి అవసరాలకు పట్టిసీమ ఉపకరిస్తోంది. పులిచింతల నుంచి నీటిని నిలిపివేశారు. వజినేపల్లి నుంచి 1,589 క్యూసెక్కులు వస్తోంది. రెండు రోజుల్లో మునేరు నుంచి వరద నీరు వచ్చే వీలుంది. వెరసి అధికారులు అప్రమత్తమై, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

కాలువలకు నీటి విడుదల తగ్గింపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : భారీ వర్షాల నేపథ్యంలో సాగునీటి కాలువలకు క్రమేపీ నీటి విడుదల తగ్గిస్తున్నారు. బాపట్ల, గుంటూరు, ఏలూరు, కృష్ణా జిల్లాల రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు నీటిని తగ్గించారు. గత కొన్ని రోజులుగా 13,000 పైచిలుకు క్యూసెక్కుల వరకు విడుదల చేయగా.. ఇప్పుడు 9,000 క్యూసెక్కులకు తగ్గించారు. నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు ఆదివారం 9,499 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 6,492 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 3,007 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,003, ఏలూరు 1,204, బందరు 1,080, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,205 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. పట్టిసీమ నుంచి 5,680, వజినేపల్లి నుంచి 1589 వెరసి 7,269 క్యూసెక్కులు బ్యారేజీకి వస్తోంది. బ్యారేజీ వద్ద నీటి మట్టం 12 అడుగులు ఉంది.

గోవుకు గూడు.. రైతుకు తోడు

మినీ గోకులాలకు రూ.30.6 కోట్లు

ఈనాడు, అమరావతి

షెడ్డు రకం	ఖర్చు(రూ.)	ప్రభుత్వం	రైతు వాటా
రెండు పశువులు	1,15,000	1,03,500	11,500
నాలుగు పశువులు	1,85,000	1,66,500	18,500
ఆరు పశువులు	2,30,00	2,07,000	23,000

వైకాపా పాలనలో అటకెక్కిన మినీ గోకులాల నిర్మాణానికి పూర్వ వైభవం వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి ఏడాదిలోనే 1775 షెడ్లు ఏర్పాటు చేసిన పాడి రైతులకు అండగా నిలిచారు. తాజాగా 2025-26 ఆర్థిక ఏడాదికి నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో డ్వామా సిబ్బంది లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మొదలుపెట్టారు. గత నిర్మాణ పద్ధతులకు స్వస్తి చెప్పి నూతన విధానంలో నిర్మాణం చేపట్టేందుకు నమూనాలు రూపొందించారు.

పాడి రైతుకు వెన్నుదన్ను.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఎన్టీఆర్‌లో 1000, కృష్ణా జిల్లాలో 700 షెడ్లు మంజూరయ్యాయి. వీటికి రూ.30.6 కోట్ల వరకు నిధులు మంజూరు చేశారు. రైతులు పెంచుతున్న పశువులను బట్టి మూడు రకాల షెడ్లు ఏర్పాట్లు చేసుకునేందుకు రైతులకు అవకాశం ఉంది. షెడ్డు నిర్మాణానికి అయ్యే ఖర్చులో 90శాతం నిధులు ప్రభుత్వం ఉపాధి హామీ నిధుల ద్వారా ఇస్తుంది. మిగిలిన పది శాతం రైతులు చెల్లించాలి. ప్రస్తుతం రెండు జిల్లాల్లో అర్హతలను బట్టి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు.

కొత్త నిర్మాణానికి శ్రీకారం.. ఇప్పటివరకు షెడ్ల నిర్మాణంలో మేత తొట్టెలు ఏదో ఒక వైపు నిర్మించేవారు. వర్షం వస్తే మేత తడిసిపోవడం, గాలి, వెలుతురు సవ్యంగా రాకపోవడం వంటి సమస్యలు ఉండేవి. దీన్ని పరిష్కరించేందుకు అధికారులు వినూత్న నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. షెడ్డు మధ్యలో మేత తొట్టి నిర్మిస్తున్నారు. దీని వల్ల షెడ్డు వెడల్పు పెరుగుతుంది. మధ్యలో మేత తొట్టి ఉండడంతో వర్షం వచ్చినా గడ్డి తడవదు. షెడ్డుకు ఇస్తున్న మొత్తం నిర్మాణంలో వృథా ఖర్చులు తగ్గించి ఆ సొమ్ముతో రెండు సీలింగ్ ఫ్యాన్లు, దోమ తెర కూడా అందించనున్నారు. ఈ అంశమై ఎన్టీఆర్, కృష్ణా జిల్లా డ్వామా పీడీలు రాము, శివప్రసాద్ మాట్లాడుతూ రైతులందరికీ ఇది మంచి అవకాశమని క్షేత్రసహాయకులు, ఎంపీడీవో కార్యాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

హరిత బరంపార్కు వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురంలోని పర్యాటక శాఖకు చెందిన హరిత బరంపార్కు వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రతి వారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల గోడపత్రికను ఆదివారం హరిత బరంపార్కు వద్ద విడుదల చేసి మాట్లాడారు. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు, వారిలో ఉత్సాహాన్ని నింపేందుకు వీలుగా ప్రతి ఆదివారం వీటిని నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ఆరేళ్ల కంటే తక్కువ వయస్సు వారు మొదటి కేటగిరి, 7 నుంచి 10 రెండో కేటగిరి, 11 నుంచి 15 ఏళ్ల వారు మూడో కేటగిరి, 16 సంవత్సరాలు కంటే ఎక్కువ వయస్సు ఉన్న వారు నాలుగో కేటగిరిలో పోటీలు జరుగుతాయని తెలిపారు. సోలో, బృందంగా, క్లాసికల్, జనరల్‌లో పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 27వ తేదీ నుంచి కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. ప్రతి వారం వినూత్నమైన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆర్డీవో కె.చైతన్య, పశ్చిమ తహసీల్దారు ఇంతియాజ్, నగరపాలక సంస్థ అధికారులు బి.సోమశేఖర్‌రెడ్డి, అన్నపూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు, చిన్నారులు

నేడు రాజధానిలో మంత్రి నారాయణ పర్యటన

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ సోమవారం రాజధానిలో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఇందులో భాగంగా ఆయన రాయపూడి సమీపంలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అఖిల భారత ఉద్యోగుల భవన సముదాయాలు, మంత్రులు, ముఖ్య కార్యదర్శుల బంగ్లాల నిర్మాణం పనులను అధికారులతో కలసి పరిశీలించనున్నారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించనున్నారు.

జిల్లాలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 21వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్ ఆవరణలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతి పత్రాలు స్వీకరించనున్నట్టు వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మీకోసం వెబ్‌సైట్‌లోనూ దాఖలు: ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం కోసం 1100 నంబరుకు ఫోన్ చేయవచ్చని వివరించారు.

(c) eenadu

భవితకు భరోసా..!

వృత్తి విద్యా కోర్సులతో ప్రయోజనాలెన్నో ★ నెలాఖరు వరకు ప్రవేశాలు

మాచవరం, న్యూస్‌టుడే

పదో తరగతి పూర్తయిన తర్వాత సాధారణంగా ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ చదవాలని ఎక్కువ మంది ఆసక్తి చూపుతారు. పలువురు విద్యార్థులకు ఈ కోర్సుల్లో చేరాలనే కోరిక ఉన్నా.. ఆర్థిక స్థోమత లేకపోవడం, కుటుంబ నేపథ్యం వంటి కారణాలతో సతమతమవుతుంటారు. ఇలాంటి వారి కోసమే కేంద్ర ప్రభుత్వం 1985లో ఒకేషనల్ (వృత్తి విద్య) కోర్సులను ప్రవేశపెట్టింది. వీటిని పూర్తి చేసిన వారికి ఉద్యోగ, అప్రెంటీస్ మేళాల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జనరల్ సబ్జెక్టులతో పాటు ఈ వృత్తి విద్యా కోర్సులు అందిస్తున్నారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వం వారికి ఉచితంగా టెక్స్ట్, నోట్ బుక్స్ అందించనుంది. ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అదనపు తరగతులు నిర్వహించనున్నారు. ఒకేషనల్ విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు సర్టిఫికెట్‌తో పాటు ఈ ఏడాది నుంచి కేంద్ర ప్రభుత్వం కూడా సర్టిఫికెట్ ఇస్తుంది. మలి దశ ప్రవేశాలను ఈ నెల 31వ తేదీ వరకు ఇంటర్ బోర్డు పొడిగించింది. ఆసక్తిగల వారు ప్రవేశాలు పొందవచ్చు. ఇంజినీరింగ్‌కు ఎంపీసీ, పారా మెడికల్‌కు బైపీసీ గ్రూపులో కొంత సిలబస్‌తో బ్రిడ్జి కోర్సు పూర్తి చేయాల్సి ఉంది. ఈ కోర్సులన్నీ రెండేళ్లలో పూర్తి చేసుకోవచ్చు.

కోర్సుల వివరాలు..

ఇంజినీరింగ్ విభాగంలో.. సీఎస్ఈ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సైన్స్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ కోర్సు ఎంతో ఉపయోగపడుతుంది. కంప్యూటర్‌కు సంబంధించిన అన్ని అవసరాలనూ తీర్చేలా విద్యార్థి తన కాళ్లపై తాను నిలబడేలా తోడ్పడుతుంది. ఉన్నత విద్యాభ్యాసానికి దోహద పడుతుంది.

ఈటీ (ఎలక్ట్రికల్ టెక్నీషియన్): విద్యుత్తు రంగానికి సంబంధించిన ప్రాథమిక, మాధ్యమిక అవగాహన కల్పిస్తారు. ఉన్నత విద్యనభ్యసించవచ్చు. స్థానికంగా గృహ, వాణిజ్య పరమైన నిర్మాణాల్లో వైరింగ్ పనులు చేసుకోవచ్చు. రైల్వేస్, ఆర్టీసీ వంటి పలు ప్రభుత్వరంగ సంస్థల్లో జూనియర్ లైన్‌మెన్, ఎలక్ట్రికల్ అసిస్టెంట్ టెక్నీషియన్‌గా ఉద్యోగాలు పొందవచ్చు.

సీఈటీ (కన్‌స్ట్రక్షన్ ఇంజినీరింగ్ టెక్నీషియన్): ఎన్ఆర్ఈజీఎస్ (నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్)లో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల (రోడ్లు, భవనాలు, వంతెనలు, చెరువులు)కు అర్హులు. వీటితో పాటు మండల సర్వేయర్ పోస్టులకు అర్హులు.

ఎం అండ్ ఏటీ (మెకానికల్ అండ్ ఆటోమొబైల్ టెక్నీషియన్): వాహనాలు, యంత్రాల పని విధానంపై అవగాహన కల్పిస్తారు. ఈ కోర్సు చదివిన వారు స్వయం ఉపాధి పొందవచ్చు. ఆసక్తి ఉంటే ఉన్నత విద్య కూడా చదవవచ్చు. వివిధ ఆటో మొబైల్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

ఉన్నత విద్యలో..

★ నీట్ ద్వారా ఎంబీబీఎస్/ బీడీఎస్/ ఆయుర్వేదిక్/ హోమియో/ యునాని/ సిద్ధ కోర్సులు ★ ఎంసెంట్ ద్వారా అగ్రికల్చర్/ హార్టికల్చర్/ ఫిషరీస్ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు. ★ పారా మెడికల్‌లో అయితే.. కార్డియాక్ టెక్నీషియన్/ ఎక్స్‌రే/ అనస్థీషియా అసిస్టెంట్, డయాలిసిస్ టెక్నీషియన్ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు. ఈ రెండేళ్ల కోర్సులు పూర్తి చేసిన వారు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉద్యోగాలకు అర్హులు.

పారా మెడికల్ విభాగం..

ఎంఎల్‌టీ (మెడికల్ లాబ్ టెక్నీషియన్): ఈ కోర్సు పూర్తి చేసిన తర్వాత ఏడాది పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్లినికల్ ల్యాబ్ ట్రైనింగ్ అప్రెంటీస్ పూర్తి చేసిన తర్వాత సొంతంగా ల్యాబ్ పెట్టుకోచ్చు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీపర్పస్ హెల్త్ వర్క్) (మహిళలు) : ఈ కోర్సు పూర్తి చేసిన తర్వాత ఏడాది పాటు క్లినికల్ ట్రైనింగ్ అప్రెంటీస్ పూర్తి చేసుకున్న వారు ఏఎన్ఎం పోస్టులకు, గ్రామ/వార్డు సచివాలయ నర్సులుగా ఉద్యోగాలు పొందేందుకు అర్హులు.

జాతీయ స్థాయి గుర్తింపు

ఇంటర్మీడియట్ పూర్తయిన వెంటనే ఉద్యోగాలు పొందాలనుకునే వారు ఒకేషనల్ కోర్సుల్లో చేరుతుంటారు. అలాంటి వారికి రాష్ట్ర బోర్డు జారీ చేసే సర్టిఫికెట్ కంటే ఎన్‌సీవీఈటీ (జాతీయ వృత్తి విద్య శిక్షణ మండలి) సర్టిఫికెట్‌తో అదనపు ప్రయోజనాలు ఉంటాయి.

- బి.ప్రభాకరరావు, డీఐఈవో

యాదవులకు సముచిత స్థానం

మంత్రి పార్థసారథిని సన్మానిస్తున్న యాదవ సంఘాల నాయకులు

పోరంకి(కానూరు), న్యూస్‌టుడే: బీసీలకు మొదటి నుంచి అండగా నిలిచిన పార్టీ తెదేపా అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం పోరంకి ఎన్‌వీఎన్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా యాదవుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యాదవులంతా ఐక్యంగా ఉండి అటు వ్యాపార, ఇటు రాజకీయ రంగాల్లో ఎదగాలన్నారు. గొర్రెల పెంపకానికి ప్రభుత్వం సుమారు రూ.కోటి వరకు రాయితీ రుణాలు అందిస్తోందన్నారు. అవసరమైన వారికి తాను సహకారం అందిస్తానన్నారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, తమకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తోందన్నారు. యాదవులంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి అండగా నిలిచి వచ్చే ఎన్నికల్లో కూడా గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి పార్థసారథిని ఘనంగా సన్మానించారు.

యోగాతో ఆరోగ్యం.. ఆనందం

మాట్లాడుతున్న కేడీసీసీబీ ఛైర్మన్ రఘురాం

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: యోగా సాధన చేస్తే ఆరోగ్యంతో పాటు ఆనందంగా ఉండొచ్చని కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆటోనగర్ సాయిబాబా కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన పోటీల ప్రారంభోత్సవానికి ఆయన హాజరై మాట్లాడుతూ... ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలని సూచించారు. కలెక్టర్ జి.లక్ష్మీశ క్రీడాకారులను అభినందించారు. యోగాసనాల ద్వారా మానసికంగా, శారీరకంగా ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 200 మంది క్రీడాకారులు తలపడ్డారు. ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. నగర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ వీవీ ఆర్ ప్రసాద్, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా, రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి వెంకట రామకృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పర్వతనేని ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ పీహెచ్‌డీలో బంగారు పతకానికి ఎంపిక

ప్రత్యూష

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం లింగాలపాడుకు చెందిన దుగ్గిరాల ప్రత్యూష అగ్రికల్చర్ పీహెచ్‌డీలో బంగారు పతకానికి ఎంపికయ్యారు. దుగ్గిరాల లక్ష్మణరావు, సుజాత దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరిలో పెద్ద కుమార్తె ప్రత్యూష గుంటూరు లాం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజమహేంద్రవరంలో బీఎస్సీ అగ్రికల్చర్ పీజీ, ఇక్కడే స్థిర వ్యవసాయంలో(సస్టైనబుల్ అగ్రికల్చర్) పీహెచ్‌డీ పూర్తి చేసింది. బెస్ట్ డాక్టోరల్ డిగ్రీలో (పీహెచ్‌డీ) బంగారు పతకానికి ఎంపిక చేశారు. ఈ నెల 24న విజయవాడ సిద్ధార్థ ట్రస్టులో నిర్వహించే ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 57వ స్నాతకోత్సవంలో బంగారు పతకం అందుకోనున్నారు. ప్రత్యూష ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. ఆమెను పలువురు గ్రామస్థులు అభినందించారు.

కోర్టు పరిసరాల్లో కర్ఫ్యూ వాతావరణం

నిర్మానుష్యంగా గోపాలరెడ్డిరోడ్డు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : మద్యం కుంభకోణం కేసులో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డిని సిట్ పోలీసులు శనివారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన్ని పోలీసులు ఆదివారం ఉదయం విజయవాడలోని అనిశా న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా న్యాయస్థానం పరిసరాల్లో పోలీసులు కఠినమైన ఆంక్షలు విధించారు. న్యాయస్థానానికి వెళ్లే మార్గాలను పూర్తిగా బారికేడ్లతో మూసివేశారు. గోపాలరెడ్డి రోడ్డులో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ఆదివారంతో సహా నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు నిర్మానుష్యంగా మారింది. మిథున్‌రెడ్డిని న్యాయస్థానంకు తీసుకువచ్చిన తర్వాత పోలీసులు గేట్లను మూసివేశారు. బారికేడ్లు అడ్డుగా పెట్టడంతో న్యాయస్థానం ఆవరణలో ఉన్న న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కొందరు పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేశారు. మరి కొందరు బీజేపీ అధ్యక్షుడు ఎ.వి.శివప్రసాద్‌కు ఫోన్ చేయడంతో.. ఆయన హుటాహుటిన ఇక్కడికి వచ్చారు. పోలీసు వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత పరిస్థితి సద్దుమణిగింది.

విద్యాభివృద్ధికి అమ్మ తోడ్పాటు అభినందనీయం

విద్యార్థినికి ఉపకార వేతనం అందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : కొన్నేళ్లుగా పేద విద్యార్థులకు 'అమ్మ' ఉపకార వేతనాలు అందిస్తూ విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించడం అభినందనీయమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) ఆధ్వర్యంలో 408 మంది విద్యార్థులకు రూ.16.50 లక్షల ఉపకార వేతనాలు, రాత పుస్తకాలను సున్నపుబట్టీల కూడలిలోని అమ్మ కల్యాణ మండపంలో ఆదివారం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అమ్మను స్ఫూర్తిగా తీసుకొని మరింతమంది పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, ప్రవాసాంధ్రులు సేవా కార్యక్రమాల నిర్వహణకు ముందుకు రావాలని కోరారు. మాదక ద్రవ్యాల వల్ల యువత నిర్వీర్యం అవుతోందని, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి హాని కలుగుతోందని, వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అమ్మ అధ్యక్షుడు గారపాటి సతీష్‌బాబు అసోసియేషన్ అందిస్తున్న సామాజిక సేవ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గోనుగుంట వెంకట సుబ్బారావు, దోనేపూడి దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి కె.దుర్గామల్లికార్జునరావు, మాజీ అధ్యక్షుడు మిరియాల వెంకటేశ్వరరావు, రెడ్ క్రాస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగా జోషి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మకు ప్రత్యేక పూజలు

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో ఆదివారం తిరుపతమ్మ అమ్మవారి దేవాలయం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి మొదలైన రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సుమారుగా 25 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.

మనస్తాపంతోనే వెళ్లిపోయా..

★ పోలీసులకు ఏఈఈ కిశోర్ వాంగ్మూలం ★ క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగింత

రాజమహేంద్రవరంలో పోలీసుల సంరక్షణలో కిశోర్

తిరువూరు, పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: 'బదిలీ జరిగి నెల దాటినా, రిలీవ్ చేయకపోవడంతో మనస్తాపానికి గురై తిరువూరు నుంచి విశాఖపట్నం వెళ్లి, అక్కడి నుంచి రాజమహేంద్రవరం వచ్చాను' అంటూ..జలవనరులశాఖ తిరువూరు ఏఈఈ వి.కిశోర్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ శుక్రవారం లేఖ రాసి, అధికారుల గ్రూపులో పోస్టుచేసి అదృశ్యమైన ఏఈఈని ఆదివారం ఉదయం రాజమహేంద్రవరంలో పోలీసులు పట్టుకున్నారు. దాంతో రెండ్రోజుల ఉత్కంఠకు తెరపడగా, క్షేమంగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరు తీసుకొచ్చి అతని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం తిరువూరులోని కార్యాలయం నుంచి ఖమ్మం జిల్లా బంజరు చేరుకున్న అతను, బస్సులో రాజమహేంద్రవరం చేరుకున్నాడు. అక్కడ నగదు డ్రా చేసి రాత్రికి ప్రయివేటు వాహనంలో విశాఖపట్నం వెళ్లాడు. రాత్రి సమయంలో అతని ఫోన్ ఆన్ కావడం..వెంటనే ఆగిపోవడంతో విశాఖపట్నంలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, అతని కుటుంబ సభ్యులతో కలిసి బయలుదేరి వెళ్లారు. తీరా విశాఖపట్నం వెళ్లాక, శనివారం రాత్రి రాజమహేంద్రవరంలో ఫోన్ ఆన్ అయినట్లు సిగ్నల్స్ రాగా వారు కూడా అక్కడికి చేరుకున్నారు. అయినా మళ్లీ ఫోన్ ఆగిపోవడంతో రాత్రంతా అక్కడే ఉండిపోయారు. ఈ లోగా ఫోన్ కలిసే వరకు అందుబాటులో ఉండాలని ఏఈఈ కుటుంబ సభ్యులకు పోలీసులు సూచించారు. చివరికి ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో ఫోన్ కలవడంతో, సాంకేతిక సాయంతో అతను గోదావరి ఒడ్డున పుష్కర ఘాట్ వద్ద ఉన్నట్లు నిర్ధరించుకుని, భార్యతో ఫోన్ మాట్లాడమని సూచించారు. ఈ లోగా నేరుగా అక్కడకు వెళ్లి కిశోర్‌ను పట్టుకున్నారు. అక్కడ అల్పాహారం అనంతరం మధ్యాహ్నం 12 గంటలకల్లా తిరువూరు స్టేషన్‌కు తీసుకొచ్చి, వాంగ్మూలం నమోదు చేసుకుని కుటుంబసభ్యులకు అప్పగించారు.

రిలీవ్ చేస్తున్నారని తెలిసి..

శుక్రవారం రాత్రి ప్రయాణంలో ఉన్న అతడు శనివారం రాత్రికి రాజమహేంద్రవరం చేరుకుని, బస్టాండ్ ప్రాంగణంలో గది తీసుకుని అక్కడే ఉన్నట్లు పోలీసులకు వివరించాడు. ఈ లోగా తనను రిలీవ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలివ్వడం, పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైనట్లు తెలుసుకుని తిరిగి రావడానికి సిద్ధమైనట్లు పేర్కొన్నారు.

పుస్తక పఠనంతో ప్రేరణ

పుస్తకాలు ఆవిష్కరిస్తున్న రామచంద్రమూర్తి, రవి, ఆనందాచారి తదితరులు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : పుస్తక పఠనంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, అవి ప్రేరణగా నిలుస్తాయని సీనియర్ సంపాదకుడు కె.రామచంద్రమూర్తి అన్నారు. పాత్రికేయుడు, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి రాసిన 'ఆశయపథం(నవల), అభద్ర (కథల సంపుటి), సజీవం(కవితా సంకలనం), మీరే ప్రేరణ మీదే సాధన(వ్యక్తిత్వ వికాసం), ప్రజాగానం(పాటలు), నేనెప్పుడూ కమ్యూనిజానికే సొంతం(ఆరుద్ర)' అనే ఆరు పుస్తకాలను విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సభలో రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయాలు, వివిధ పరిణామాల నేపథ్యంలో రాసిన ఈ పుస్తకాలు చదివిన వారికి ఎంతో ప్రేరణగా నిలుస్తాయని చెప్పారు. రచయిత పుస్తకాల గురించి వివరిస్తూ.. ఇవి ఆరు ప్రక్రియలకు సంబంధించినవన్నారు. ఆశయపథం.. అపూర్వ విజయం నవలకు సంబంధించినదిగా వివరించారు. ఉమ్మడి మద్రాసు, నిజాం పాలనలో రెండు ప్రాంతాల ప్రజలు భుజాలు కలిపి ఏవిధంగా పోరాడి అపూర్వమైన విజయాన్ని సాధించారో అందులో వివరించినట్లు చెప్పారు. ఎవరికి వారు సొంతంగా ప్రేరణపొంది, శ్రమిస్తే కొత్త విషయాలు తెలుసుకుని విజయాలను ఎలా సాధించవచ్చన్నది 'మీరే ప్రేరణ.. మీదే సాధన' పుస్తకంలో వివరించానన్నారు. వివిధ రకాల కోణాలను పరిశీలించి 'అభద్ర' పేరుతో కథల సంపుటిని రాసినట్లు వివరించారు. ప్రజా సాహిత్యాన్ని, ప్రజల భాషను, తెలుగు సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పుస్తకాలు రచించినట్లు రవి వివరించారు. ప్రజాశక్తి బుక్‌హౌస్, సాహితీ స్రవంతిల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో.. ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకుడు ఎం.వి.ఎస్.శర్మ, జి.తులసీదాస్, కె.ఆనందాచారి, కెంగార మోహన్, సత్యాజీ, గోళ్ల నారాయణరావు, జగన్, పెద్ద సంఖ్యలో సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

తిరువూరులో నిర్వహించిన సమావేశంలో సభ్యులు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా ప్రధానోపాధ్యాయుల సమావేశం పట్టణంలోని వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వత్సవాయి మండలం భీమవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్.రాంబాబు నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఎ.కొండూరు ఎంఈవో ఈఎల్‌సీ.కేశవరావు, కోశాధికారిగా కొండపల్లి బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.వెంకటనారాయణ, గౌరవాధ్యక్షుడిగా తిరువూరు బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం పిఎస్ఎన్.రాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా విస్సన్నపేట ఎంఈవో ఈ.సుధాకర్, రుద్రవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎ.రాంబాబు, సీవీఆర్‌జీ మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం సిహెచ్.వి.సుబ్రహ్మణ్యం, కేంద్ర కార్యదర్శిగా విజయవాడ మధ్య మండల ఎంఈవో ఆర్.విజయరామారావు ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి కె.విజయ్, వి.శ్రీనివాసరావు తెలిపారు. హైస్కూల్ ప్లస్, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, మండలం విద్యాశాఖాధికారి 1, 2 లకు సమానాధికారాలతో జాబ్ చార్ట్ సవరించాలని సమావేశంలో తీర్మానం చేశారు.

బదిలీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాల సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం గవర్నర్‌పేటలోని కార్యాలయంలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. . 2024, 2025 సంవత్సరాల్లో ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 4 కరవు భత్యాలు, 2021 నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు స్వేచ్ఛగా బోధన చేసేలా అనువైన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలని కోరారు. బోధనేతర పనుల నుంచి, యాప్‌ల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నగరపాలకసంస్థ పాఠశాలల్లో ఖాళీలు భర్తీ చేయాలని, తెలుగు ఎస్జీటీలకు పదోన్నతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎం.కృష్ణయ్య, పి.లీల, పి.నాగేశ్వరరావు, మహేశ్వర వెంకటేశ్వరరావు, కె.గంగరాజు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో రచనా నైపుణ్యాల పెంపునకు కృషి

కలెక్టర్ లక్ష్మీశను సన్మానిస్తున్న కలిమిశ్రీ, రాఘవేంద్రశేఖర్ తదితరులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : మానవ ఉనికికి మేధో వికాసం అంతిమ లక్ష్యం కావాలన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సూక్తిని నిజం చేస్తూ భావితరాలకు వెలుగుబాట వేసేలా మంచి ఆలోచనలకు అక్షర రూపం ఇవ్వాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. నేటితరంలో రచనా శక్తిపై ఆసక్తి తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే సృజనాత్మకత రచనా నైపుణ్యాలు పెంచేందుకు సమష్టి కృషి అవసరమన్నారు. మహాత్మాగాంధీరోడ్డులోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్మృతివనంలో మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 'ప్రణామం' కవి సమ్మేళనం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కవులు, రచయితలకు ఉన్న శక్తి అసామాన్యమైందన్నారు. వారి కలం నుంచి జాలు వారిన అక్షర శక్తి ముందు.. తూటా శక్తి నిలబడలేదని కొనియాడారు. అర్థవంతమైన రచనలు సమాజ దిశను మారుస్తాయని. . సమాజంలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు కలం, గళమే కారణమన్నారు. నేటి తరంలో రచనా నైపుణ్యాలు పెంచేందుకు జిల్లా యంత్రాంగం తరపున ప్రత్యేక పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆసక్తికరంగా కవితా గానం.. కవి సమ్మేళనంలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 80 మంది కవులు విచ్చేశారు. వీరు తెలుగు భాష, ప్రపంచ శాంతి, పర్యావరణం, దేశ భక్తి, సామాజిక చైతన్యం తదితర అంశాలపై కవితాగానం చేశారు. ఈ సందర్భంగా సామాజిక స్పృహ కలిగి, సమస్యలకు పరిష్కారం చూపేలా విజ్ఞాన వ్యాప్తికి ముందుకు సాగుతామని కవులు ప్రతిజ్ఞ చేశారు. వ్యాఖ్యాత వేముల హజరత్తయ్య గుప్తా వారితో ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్‌ను సత్కరించారు. చొప్పా రాఘవేంద్రశేఖర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సుప్రసిద్ధ కవులు శ్రీరామకవచం సాగర్, డాక్టర్ ఎం.ప్రభాకర్, గంటా విజయ్‌కుమార్, మల్లెతీగ కలిమిశ్రీ, డాక్టర్ ఎస్.దుర్గాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -112 రిటైల్ ధర 134 చికెన్ విత్ స్కిన్ - 194, చికెన్ స్కిన్‌లెస్ - 221. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, 129, 140 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 238.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 520 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

మల్టీ డే క్రికెట్ ఛాంప్ 'ప్రకాశం'

విజేత జట్టు క్రీడాకారులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ సెంట్రల్ జోన్ అండర్-16 మల్టీ డే క్రికెట్ టోర్నీ విజేతగా ప్రకాశం జట్టు నిలిచింది. గుంటూరు జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. మంగళగిరి మైదానంలో ఆదివారం ఒక పరుగు ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో ఇన్నింగ్స్ ఫాలోఆన్ కొనసాగించిన పశ్చిమ గోదావరి జట్టు 41.1 ఓవర్లలో 97 పరుగులకే కుప్పకూలింది. ప్రత్యర్థి బౌలర్ ఎస్.సందేశ్ (5/7) మెరిశాడు. ప్రకాశం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 493 పరుగులు చేయగా.. పశ్చిమ గోదావరి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 90 పరుగులకే ఆలౌటైంది. దాంతో ప్రకాశం జట్టు 306 పరుగుల ఆధిక్యంతో గెలుపొందింది.

✦ పేరేచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఆదివారం 47 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన కృష్ణా జట్టు 46.4 ఓవర్లలో 138 పరుగులకు ఆలౌటైంది. ప్రత్యర్థి బౌలర్ ఎస్వీ గోపీచంద్ (5/25) మెరిశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు 5.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 17 పరుగులతో లక్ష్యాన్ని ఛేదించింది. దాంతో గుంటూరు జట్టు పది వికెట్ల తేడాతో విజయం సాధించింది.

91.9 FM Vijayawada

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

REAL ESTATE

LAND FOR SALE

2 Acres South Face ...

FINANCIAL SERVICES

JOBS

Wanted Experienced Godown Incharge & Packing boys for Medical Agencies Srinivasa Drugs, Bhavanipuram. ✆ 9704071271

Hiring: IT, Non IT, Banking, Hospital, Hotels, Engineers, Doctors, Nurses & Skilled Workers. Contact ✆ 91053 69999.

English & Biology Teachers to teach Classes 6 to 10 at a School located in Gunadala, VJA. Salary: 25,000. Whatsapp num: 63028 28080

PEOPLE CARE

OLD AGE HOME

WANTED

A leading TEXTILE cloth manufacturing company operating in COIMBATORE urgently requires an experienced AGENT for Vijayawada and surrounding cities.

93671 21204

BOOK YOUR COLOUR CLASSIFIED

₹1200/- (5 Lines)

PH: 98496 97616

ప్రకటనలపై జీ.ఎస్.టీ. 5% అదనం

గమనిక

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? స్థానిక బీసీ బాలికల వసతి గృహం పక్కనే మురుగు పేరుకుపోయి దుర్వాసన, దోమలతో వ్యాధుల బారిన పడుతున్నాం. తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలి. **-జి.సుధాకర్, గ్రామస్థుడు**

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపించి తక్షణమే పరిష్కార చర్యలు చేపడతాం. **-బసవలింగేశ్వర రావు, పంచాయతీ కార్యదర్శి -న్యూస్‌టుడే, జి.కొండూరు**

● పట్టణంలోని 9వ వార్డు పరిధి డ్రెయినేజీల్లో పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా ఉందని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పురపాలిక సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. ● పట్టణంలోని 2వ వార్డు బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కన చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉందని స్థానికులు చేసిన ఫిర్యాదును శానిటరీ అధికారికి తెలపగా ఆయన స్పందించి పురపాలక కార్మికులతో తొలగింపజేసి శుభ్రం చేయించారు. **-న్యూస్‌టుడే, తిరువూరు**

వృద్ధులకు అన్నదానం

భవానీపురం, న్యూస్‌టుడే: రామరాజ్యనగర్‌లోని ఆశ్రాద్ ట్రస్టులోని వృద్ధులకు స్థానిక వాసి బాలాత్రిపుర శేష శైలేష్ జ్ఞాపకార్థం ఆయన భార్య బాలాత్రిపుర కమల ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఎస్‌ఆర్‌పీ సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ఆలయం బయట ఎమ్మెల్యే కొలికపూడి దంపతులు

తిరువూరు, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతిలో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా అలిపిరి నడక మార్గంలో తిరుమల చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్ర, తిరువూరు నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు చెప్పారు. అక్కడి వేదపండితులు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను వేద మంత్రాలతో ఆశీర్వదించగా ఆలయ అధికారులు శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

కళాకారుడికి అరుదైన గౌరవం

జి.కొండూరు, న్యూస్‌టుడే: కోడూరు గ్రామ మాజీ సర్పంచి, నటుడు వీరంకి వెంకట నరసింహారావుకు అరుదైన గౌరవం దక్కింది. రిథిక్ ఫౌండేషన్ వారు అందించే సామాజిక సేవా పురస్కారాన్ని సినీనటి జగదీశ్వరి చేతుల మీదుగా విజయవాడలోని ఆర్కే ఫంక్షన్ హాలులో ఆదివారం అందుకున్నారు. నాటకాలు, చలనచిత్ర రంగంలో ఆయన చేస్తున్న సేవలకు ఈ అరుదైన గౌరవం దక్కడం సంతోషదాయకమని వీరంకి వెంకటనరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు నిత్యాచారి తదితరులు పాల్గొన్నారు.

బాగయ్యేనా.. సాగయ్యేనా..?

ప్రశ్నార్థకంగా మారిన తారకరామ ఎత్తిపోతల పథకం

కట్టుబడిపాలెం సమీపంలో నిర్వహణకు నోచుకోని పంపుహౌస్

జి.కొండూరు, న్యూస్‌టుడే

కుడికాలువ కింద వివరాలు	
పంపుహౌస్‌లు	04
మోటార్లు	14
పనిచేయనివి	10
ఆయకట్టు	4818 ఎకరాలు

మైలవరం నియోజకవర్గంలో మెట్ట ప్రాంత రైతులను ఆదుకునేందుకు టీడీపీ వేడి నీటిని తారకరామ ఎత్తిపోతల ద్వారా ఎత్తిపోయాలనే లక్ష్యంతో తారకరామ ఎత్తిపోతల నిర్మించారు. 1988లో దీనికి నందమూరి తారక రామారావు శంకుస్థాపన చేయగా 1999లో అప్పటి వ్యవసాయశాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు చొరవతో పనులు ప్రారంభమయ్యాయి. మూడు దశల్లో పనులు పూర్తి చేయాల్సి ఉండగా రెండు విడతల నిర్మాణ పనులు మాత్రమే చేసి తదుపరి ఆగిపోయాయి. దీంతో మైలవరం మండలం వరకు వెళ్లాల్సిన సాగునీరు జి.కొండూరు మండలం వరకే వెళుతోంది. ఈ క్రమంలో కుడి కాలువకు ఉల్లిపాలెం నుంచి జి.కొండూరు వరకు నాలుగు పంపుహౌస్‌లు నిర్మించి కాలువల ద్వారా సాగునీరు అందిస్తున్నారు. కాలక్రమేణా అధికారులు, ప్రజాప్రతినిధులు దీని నిర్వహణను గాలికొదిలేయడంతో కాలువల్లో తూడుకాడ, జమ్ము గడ్డి పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తోంది.

గత ఐదేళ్లూ పట్టించుకోలేదు: ఈ ఎత్తిపోతల పథకం గత వైకాపా పాలనలో నిర్లక్ష్యానికి గురైంది. ఆయకట్టు రైతులు సాగు చేపట్టేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వమైనా ఎత్తిపోతల నిర్వహణ చేపట్టి రైతులకు సకాలంలో సాగునీరు అందిస్తే సాగుకు అనుకూలంగా ఉంటుందని అన్నదాతలు వాపోతున్నారు. రైతులకు సకాలంలో సాగు నీరందక దాదాపు 5 వేల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీరు లేక తూటుకాడ, జమ్మి గడ్డితో దుస్థితికి చేరిన కాలువ

తక్షణమే మరమ్మతులు చేపట్టాలి..

తారకరామ ఎత్తిపోతలపై ఆధారపడి పంటలు వేసే ఆయకట్టు గ్రామాలైన కవులూరు, కట్టుబడిపాలెం, పినపాక, జి.కొండూరు, గడ్డమణుగు రైతులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎత్తిపోతల నిర్వహణపై దృష్టి సారించి సాగునీరు అందిస్తే మెట్ట ప్రాంతమంతా సస్యశ్యామలంగా సాగు చేపడతామని వాపోతున్నారు. ఈ విషయమై తారకరామ సహాయక ఇంజినీరు న్యూస్‌టుడే వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశామని త్వరలోనే నిధులు మంజూరవుతాయన్నారు. అనంతరం ఎత్తిపోతల అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసి సాగునీరు అందిస్తామన్నారు.

శాకంబరి అలంకారంలో స్వామి, అమ్మవారు

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం మండలంలోని పెనుగొలనులో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ విగ్రహాలను కాయగూరలతో అలంకరించారు. దేవతామూర్తులు మూలవిరాట్టులకు అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. శాకంబరి అలంకారంలో ఉన్న స్వామి, దేవతామూర్తులను గ్రామస్థులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గుడి కమిటీ కార్యదర్శి సత్యనారాయణాచారి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పోగొట్టుకున్న చరవాణి అప్పగింత

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన పి.వినయ్‌కుమార్ అనే యువకుడు ఈనెల 15వ తేదీన ఇంటి నుంచి దుకాణానికి వెళ్తుండగా మార్గమధ్యలో రూ.30వేల విలువైన చరవాణి పోగొట్టుకున్నాడు. దీనిపై ఈనెల 17వ తేదీన అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సదరు యువకుడు పోగొట్టుకున్న ఫోను ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ఎర్రపల్లి గ్రామంలో ఓ వ్యక్తి వద్ద ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆ వ్యక్తి నుంచి చరవాణిని స్వాధీనం చేసుకుని ఫిర్యాదుదారుడికి ఆదివారం అందజేశారు. దీంతో ఆ యువకుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

యువకుడికి ఫోన్ అందిస్తున్న కానిస్టేబుల్

సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషి

బదిలీ అయిన సచివాలయ సిబ్బందితో ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులు

ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే: విధి నిర్వహణలో బాధ్యతలు తెలుసుకుని ఉత్తమ సేవలందించిన వారికి ఎక్కడికి వెళ్లినా మన స్వాగతమే లభిస్తుందని గ్రామ సర్పంచి నళిని ఆశాలత అన్నారు. బదిలీపై వెళుతున్న కేతనకొండ సచివాలయ సిబ్బందికి ఆ గ్రామ ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులు ఆదివారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తూ ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా వచ్చిన సచివాలయ సిబ్బందికి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ మౌనిక, సర్పంచి పత్రి లేపాక్షిరావు, గోపాలరావు, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సాయం

గొల్లపూడి, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు జీ.ఆర్.ఎస్.ఫౌండేషన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. మహిళాదళంలోని సేవాభారతి సంస్థలోని పేద విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, పుస్తకాలను అందించారు. అలాగే జక్కంపూడిలోని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి వేద స్మార్త సేవా సమితి వేద పాఠశాలలో అన్నదానం చేశారు. వేద పాఠశాలకు అవసరమైన నిత్యావసర సరుకులను అందజేశారు. జీఆర్ఎస్ ఫౌండేషన్‌ను వ్యవస్థాపకులు ఉషాబాల, స్రవంతిలకు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. జీఆర్ఎస్ సంస్థ ముఖ్య కార్యదర్శి కొండవీటి రవికుమార్, పార్వతి, మామిడిపల్లి సాయిబాబు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులతో జీఆర్ఎస్ ఫౌండేషన్ ప్రతినిధులు

న్యాయమైన వినతులు పరిష్కరించాలి

తిరువూరు పురపాలిక కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కార్మికుల నినాదాలు

తిరువూరు, న్యూస్‌టుడే: నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం తమ వేతనాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. గతేడాదిగా తమ సమస్యలను పరిష్కరిస్తామంటూ ప్రభుత్వం హామీలిస్తూనే అమలు చేయకుండా తాత్సారం చేస్తోందని ఆవేదన చెందారు. న్యాయమైన తమ డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించి పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. సీఐటీయూ, ఇంజినీరింగ్ కార్మికుల సంఘాల నాయకులు బి.వెంకటేశ్వరరావు, మోహనరావు, కిశోర్, రవి, నరసింహారావు, నారాయణ, కృష్ణయ్య, బాజీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి మహిళలు ఆదివారం బోనాలు సమర్పించారు. పిండి వంటలు, పాయసంతో ప్రదర్శనగా ఆలయానికి చేరుకున్నారు. పూలు, వేపమండలతో విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించి, మూలవిరాట్టుకు బోనాలు సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

గంగానమ్మకు సారె సమర్పణ

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడి సూరాయపాలెంలోని గంగానమ్మకు గ్రామస్థులు సారెను ఆదివారం సమర్పించారు. డప్పు వాయిద్యాలు, కోలాటంతో గ్రామంలో ఊరేగింపుగా గంగానమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయంలో మహిళలు

గొల్లపూడి: కోలాటం ఆడుతూ ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

గుంతలు దాటితే గండం గడిచినట్లే..!

మోకాలిలోతు గోతుల్లో నీరు నిలిచి ఇలా

చెరువుమాధవరం గ్రామం రంగా బొమ్మ సెంటర్ సమీపంలో ఆర్అండ్‌బీ రహదారి అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వానకు సైతం మార్గం లో ఏర్పడిన గుంతల్లో మోకాలి లోతు నీరు నిలబడి రాకపోకలకు అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కనీసం గుంతలైనా పూడ్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనికితోడు కాలానుగుణ వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. రహదారికి ఇరువైపులా సరైన డ్రెయినేజీలు లేకపోవడం, రహదారి పూర్తిగా పల్లంగా మారడంతో అవస్థలు పడుతున్నామని పలుమార్లు అధికారులకు మొర పెట్టుకున్నా ప్రయోజనం శూన్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, జి.కొండూరు**

ముళ్లపొదలు.. వెళ్లలేక ఇక్కట్లు

చిన నందిగామ-పుట్రేల ఆర్అండ్‌బీ రహదారిలో ఓబులాపురం గ్రామంలోని నాగసాని పాటి చెరువు దగ్గర తారురోడ్డుపైకి దట్టంగా పెరిగిన ముళ్లపొదలతో వాహన చోదకులు ఇక్కట్లు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో రాత్రి సమయాల్లో వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఆ కంపచెట్లలోకి వెళ్లి చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలా రోడ్డుపైకి చొచ్చుకొచ్చిన పొదలను తొలగించి రాకపోకలు సజావుగా సాగే విధంగా చూడాలని వాహన చోదకులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

రైతన్నకు మరో సాయం

కేతనకొండలో పూర్తయిన కంపోస్టు కుంట

అన్నదాతలకు అండగా ఉపాధి హామీ పథకం ద్వారా కంపోస్టు కుంటల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించగా ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంలో వాటి నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. మండల పరిధిలో 540 కుంటలకు అనుమతులు రాగా 302 కుంటల పనులు పూర్తయ్యాయి. కంపోస్టు కుంటల్లో సేంద్రియ వ్యర్థాలను కుళ్లబెట్టి ఎరువును తయారు చేసుకోవచ్చని ఉపాధి సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీని తవ్వకానికి రూ.వెయ్యి వరకు ప్రభుత్వం సహాయం అందిస్తోందని సేంద్రియ సాగు చేసే రైతాంగానికి ఎరువుల ఖర్చు తగ్గుతుందని ఉపాధి హామీ పథకం ఇబ్రహీంపట్నం ఏపీవో ప్రమీలా తెలిపారు. **-న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**

పనులే అనుకుంటే..దిమ్మెలు కూడానా..!

వైకాపా పాలనలో చేసిన పనులతో పాటు వాటి వివరాలకు ఏర్పాటు చేసిన దిమ్మెలు సైతం రెండు రోజుల వానలకే కూలిపోతున్నాయి. కొండపల్లి విద్యుత్తు వినియోగదారుల సేవా కేంద్రం సమీపంలో మురుగు కాలువ విషయమై ఓ దిమ్మెను గతంలో ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అది కాస్తా పడిపోయింది. చేసిన పనుల వివరాలు వర్షపు నీటిలో కలిసిపోయినట్లు అయ్యింది. అయితే ఈ పనులకు సంబంధించి గుత్తేదారులకు ఇప్పటికీ నగదు చేతుల్లోకి రాకపోవడం గమనార్హం. **-న్యూస్‌టుడే, కొండపల్లి**

జిల్లా స్థాయి ఓపెన్ చెస్ విజేత భావన్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ప్రపంచ చదరంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని జీఐజీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీలో కొల్లా భావన్ విజేతగా నిలిచాడు. ప్రీతం దర్శన్, బీజేఎస్‌కే రణధీర్, షేక్ జులేఖ బహార్, మందుల బాబు శామ్యూల్ ప్రోగ్రెసివ్ స్కోర్ ఆధారంగా వరుస స్థానాల్లో నిలిచారు. అండర్-7, 9, 11, 13 కేటగిరీల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులతో పాటు నగదు పారితోషికాలు అందజేశారు. స్కూల్ వైస్ ప్రిన్సిపల్ ఎన్.రమ్య విజేతలకు బహుమతులు అందజేశారు. ది విజయవాడ చెస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అక్బర్ పాషా, ఎం.రాజీవ్, పీఈటీ హనుక్ కుమార్ పాల్గొన్నారు.

తెదేపా నాయకుడికి నివాళి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కూనపరాజుపర్వ గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు సుందరమ్మ చెరువు నీటి సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గోపాలరావు ఇటీవల మృతిచెందగా శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ ఆదివారం ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలువురు నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: చెరువుమాధవరం గ్రామంలో సర్పంచి భర్త బాణవతు రాము, తెదేపా గ్రామ పార్టీ మాజీ అధ్యక్షుడు బళ్ల సాంబశివరావులు అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదివారం స్థానిక నాయకులతో కలిసి వెళ్లి బాధితులను పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత అదే గ్రామంలో భాజపా మండల అధ్యక్షుడు చల్లా నాగమల్లేశ్వరరావు తాతయ్య చల్లా కొండయ్య ఇటీవల మృతి చెందారని తెలుసుకుని కూటమి నాయకులతో కలిసి వెళ్లి కొండయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

కొండపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న వైస్ ఛైర్మన్ శ్రీను

మైలవరంలో..

విస్సన్నపేట: పుట్రేలలో..

చంద్రబాబుతోనే సంక్షేమ పాలన

కొండపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అందజేస్తోందని పురపాలిక వైస్ ఛైర్మన్ శ్రీను అన్నారు. కొండపల్లి 29వ డివిజన్ 161వ బూత్ పరిధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో సయ్యద్ ఫర్హాన్, సాంబమూర్తి, వెంకటేశ్వరరావు తదితరుతు పలాబ్గన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అభివృద్ధితో కూడిన సంక్షేమ పాలన ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని తెదేపా నాయకులు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మైలవరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన నాయకులు కూటమి ప్రభుత్వం ఈ ఏడాదిలో చేసిన సంక్షేమాభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. లితీష్, బాలకృష్ణ, బాబూరావు, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు, విస్సన్నపేట, న్యూస్‌టుడే: తిరువూరు నియోజకవర్గంలోని తిరువూరు, విస్సన్నపేట మండలాల్లో గత ఏడాది కాలంగా ఎన్డీయే కూటమి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెదేపా నాయకులు వివరిస్తూ సంబంధిత కరపత్రాలను అందజేశారు.

తిరువూరు: చింతలపాడులో..

దుర్గగుడికి విరాళాల అందజేత

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వేర్వేరు పథకాలకు దాతలు రూ.3,02,232 విరాళాన్ని ఆదివారం అందజేశారు. దుర్గగుడి ఉచిత ప్రసాదం పంపిణీ పథకానికి గుంటూరు చంద్రమౌళి నగర్‌కు చెందిన శివశంకర్ పద్మ దంపతులు రూ.లక్ష, గో సంరక్షణ నిధికి తాడేపల్లికి చెందిన సూర్యనారాయణ ప్రసాద్, జయలక్ష్మీ దంపతులు రూ.1,01,116, నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన కేసరి శ్రీనివాసరెడ్డి రూ.1,01,116 విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ సత్యనారాయణ వారికి విరాళం రశీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఆశీర్వచన మండపంలో దాత శివశంకర్ పద్మ దంపతులు

దాత సూర్యనారాయణ ప్రసాద్ దంపతులకు విరాళం రశీదు ఇస్తున్న ఈవో శీనానాయక్

మొక్కలు పెంచడం బాధ్యతగా చూడాలి

కొండపల్లి, న్యూస్‌టుడే: వంటింట్లోని వ్యర్థాలను కంపోస్టుగా చేసుకొంటే మొక్కలకు మంచి ఎరువు అవుతాయని సీటీజీ(సిటీస్ టెర్రాస్ గార్డెన్) సభ్యులు బి.పద్మజ అన్నారు. మెప్మా ఎస్‌హెచ్‌జీ సమావేశం సచివాలయం-2లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అవకాశం ఉన్న ప్రదేశంలో మొక్కలను పెంచుకుంటూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కొండపల్లి వంటి కాలుష్యం కలిగిన ప్రాంతంలో ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం బాధ్యతగా భావించాలని చెప్పారు. మెప్మా సిటీ మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ..పొదుపు సంఘ మహిళలు ఒకొక్కరు ఒక మొక్క నాటడంతో పాటు ఇతరులతో కూడా నాటించాలని సూచించారు. ఈ సందర్భంగా సీటీజీ సభ్యులు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకాష్, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీటీజీ సభ్యురాలు పద్మజ

సీతాకోకలు వస్తున్నాయ్.. వసతులు లేకున్నాయ్

ఇబ్రహీంపట్నం, కొండపల్లి, న్యూస్‌టుడే: తొలకరి వానలు పడుతుండగా సందడి చేస్తున్న సీతాకోక చిలుకల కోసం వస్తున్న ప్రకృతి ప్రేమికులకు వసతుల లేమి వెంటాడుతోంది. ఇబ్రహీంపట్నం మండల శివారు మూలపాడు అటవీ ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీశాఖ సీతాకోక చిలుకల వనాన్ని కొన్నేళ్ల కిందట నిర్మించింది. కూటమి ప్రభుత్వం ఈ వనాన్ని ఆకర్షణీయంగా మార్చాలని, పర్యాటకులను పెంచాలని దాని రూపురేఖలు పూర్తిగా మార్చింది. వర్షాకాలం మూడు నెలలు సీతాకోక చిలుకలు సీజన్ కావడంతో దాదాపు 500 రకాల సీతాకోకలు ఇక్కడి చెట్లపై వాలుతూ కనువిందు చేస్తాయి. వీటిని చూడడానికి వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు వస్తుంటారు. సాధారణ రోజుల్లో 100 మందికి పైగా వస్తుంటే ఆదివారాలు, సెలవుదినాలు, పర్వదినాల్లో 500 మంది వరకూ సందర్శిస్తుంటారు.

ప్రస్తుతం ఇది ఒక్కటే పనిచేస్తోంది..

ఈ ఇబ్బందులే ఎక్కువ

సందర్శకులకు తగ్గట్టుగా వసతులు లేకపోవడం విచారకరం. టాయిలెట్ల సౌకర్యం ఇంకా ఏర్పాటు చేయలేదు. దీనికి తోడు తాగునీటికీ కొరతే. వనధార పేరిట తాగునీటిని ప్లాంటును ఏర్పాటు చేసినా ఒక్క చోట మాత్రమే రావడంతో పర్యాటకులకు తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి తోడు వ్యర్థాలు వేయడానికి డంపింగ్ బుట్టలు ఒకటే ఉండడంతో పర్యటకులు ఉపయోగించిన వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ వదిలేస్తున్నారు.

ప్రాధాన్యత క్రమంలో: వనం అధికారి, శివప్రసాద్

గత సంవత్సరం నుంచి ప్రాధాన్య క్రమంలో వసతులు ఏర్పాటు చేస్తున్నాం. వనం ఇంకా ఆకర్షణీయంగా ఉంచాలన్న సంకల్పంతో పనులు జరుగుతున్నాయి. టాయిలెట్లతో పాటు తాగునీటి సౌకర్యాన్ని పలు చోట్ల ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

విజయవాడ తూర్పు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

విజయవాడ నగరపాలక సంస్థ: నగర వాసుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, మూడు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ పరిధిలోని సమస్యలు అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు.

రోడ్డు వేశారు.. అవస్థలు తీర్చారు

పటమట, న్యూస్‌టుడే: ఆటోనగర్ నుంచి వివేకానంద కాలనీకి వెళ్లే రహదారి గుంతలమయంగా మారి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన వీఎంసీ అధికారులు రోడ్డు వేశారు. వాహనదారుల అవస్థలు తీర్చారు.

స్పందనకు వందనం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

స్పందనకు వందనం

◆ మూడో డివిజన్ ఎన్టీఆర్ కాలనీ మూడో రోడ్డు మలినేని నాగేశ్వర రావు గ్రంథాలయం పక్కన తాగునీటి పైపు లీక్ అవుతోందని స్థానిక నివాసి రవి కుమార్ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా డీఈ రామారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు.

◆ 3వ డివిజన్ కరెన్సీనగర్ 7వ రోడ్డు పిల్లి సుబ్బన్న వీధిలో 3-14/182 విద్యుత్ స్తంభానికున్న వీధి దీపం కొంత కాలంగా వెలగడం లేదని, అంధకారం నెలకొందని స్థానిక నివాసి పానకాలు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు.

◆ జాతీయ రహదారి సర్వీస్ రోడ్ల వెంబడి డ్రెయిన్లు దుర్వాసన వెదజల్లుతున్నాయని, దోమల బెడద అధికంగా ఉందని స్థానిక నివాసి భగవాన్ మేమున్నాం...మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందిని పంపి ఆయిల్ బాల్స్ వేసి, పొగ పెట్టించారు. – న్యూస్‌టుడే, కరెన్సీనగర్

ప్రచార సిద్ధి.. వ్యాపార వృద్ధి

సామాజిక మాధ్యమాల్లో ఉత్పత్తుల మార్కెటింగ్

ఏఐ వీడియోల తయారీపై మహిళలకు కార్యశాల

పటమట, న్యూస్‌టుడే

మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో ప్రైవేట్ సంస్థలు సైతం భాగస్వామ్యమవుతున్నాయి. విజయవాడలోని వాసవ్య మహిళా మండలిలో మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలకు హెచ్‌సీఎల్ ఫౌండేషన్, వాసవ్య మహిళా మండలి, ఎన్ఐటీ వరంగల్, ఎన్టీఆర్ జిల్లా అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో వ్యాపార మెలకువలపై కార్యశాల నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన సుమారు 300 మంది మహిళలు పాల్గొన్నారు. ముఖ్యంగా వనితలు తయారు చేస్తున్న ఉత్పత్తులను సామాజిక మాధ్యమాల ద్వారా ఎలా మార్కెటింగ్ చేసుకోవాలో వివరించారు.

అవగాహన కార్యక్రమానికి హాజరైన మహిళలు

కృత్రిమ మేధ(ఏఐ)తో వ్యాపార వివరాలు తెలియజేస్తూ పోస్టర్లు, వీడియోలు ఎలా తయారు చేసుకోవాలి.... వినియోగదారులు ఆకట్టుకునేలా ఎలా రూపొందించాలనే అంశాలను వివరించారు.

చాలా అంశాలు నేర్చుకున్నా - శ్రీలేఖ

నా భర్తకి ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో సహజ సిద్ధ ఎరువులు తయారు చేసి విక్రయిస్తున్నా. కరోనా తరువాత సేంద్రియ కూరగాయల పట్ల ప్రజలు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా మా వ్యాపారాన్ని ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్లాలో కార్యశాలలో నేర్చుకున్నా.

నైపుణ్యాల పెంపే లక్ష్యం

ప్రస్తుతం ఏ వ్యాపారమైనా అభివృద్ధి చెందాలంటే సాంకేతికత జోడిస్తేనే సాధ్యం. ఉత్పత్తులను ప్రజల వద్దకు చేరాలంటే సాంకేతికత కీలక పాత్ర పోషించాల్సిందే. వ్యాపారంలో అధిక లాభాలు రావాలన్నా.. పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందాలన్నా నైపుణ్యాలు అవసరం. అటువంటి నైపుణ్యాల పెంపునకే కార్యశాల నిర్వహిస్తున్నాం.

- బి.కీర్తి, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు

వ్యాపార విస్తరణకు దోహదం - నందిని

నేచురల్ ప్రోడక్ట్స్ తయారు చేస్తుంటాను. తక్కువ ధరకే సబ్బులు, షాంపూలు, ఇతర అలంకరణ సామగ్రి, శానిటరీ ప్యాడ్స్ తయారు చేసి విక్రయిస్తుంటాను. నా వ్యాపార విస్తరణకు కార్యశాలలో నేర్చుకున్న విషయాలు ఉపయోగపడతాయి. స్వయం సహాయ సంఘంలో సభ్యురాలిగానూ ఉన్నాను.

స్వయం కృషితో ఎదగాలని.. - రాధ

నా భర్త ప్రైవేటు ఉద్యోగి. స్వయంకృషితో ఎదగాలని వస్త్ర వ్యాపారం ప్రారంభించాను. దుకాణం పెట్టుకునేందుకు ఆర్థిక స్తోమత కూడా లేదు. బ్యాంకు రుణం తీసుకోలేదు. ఇంటి వద్దే ఉండి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వ్యాపారం చేస్తున్నాను. కార్యశాల ద్వారా పోస్టర్ డిజైన్, వీడియో ఎడిటింగ్ నేర్చుకున్నా.

వాహనాల రాకపోకలకు మార్గం సుగమం

మలుపు వద్ద ఏర్పాటు చేస్తున్న ఇనుప గడ్డర్లు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: గుణదల దంత వైద్య కళాశాల రోడ్డు నుంచి హరిజన వాడ మీదుగా లయోలా కళాశాలకు వెళ్లే రోడ్డు మలుపులో వాహనాలు సులువుగా రాకపోకలు సాగించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే గోడ కట్టి పైపులు ఏర్పాటు చేయగా.. తాజాగా ఇనుప గడ్డర్లు ఏర్పాటు చేస్తున్నారు. పుల్లేటికట్టకు ఎటువంటి ముంపు తలెత్తకుండా భారీ ఇనుప గడ్డర్లు వేసి.. దానిపై ఇనుప షీట్ అమర్చుతున్నారు. దాంతో మాచవరం కూడలి వైపు నుంచి వచ్చే వాహనాలు ఫ్రీ లెఫ్ట్ తీసుకోవడానికి ఇబ్బందులు తొలగుతాయి. ఆ ప్రాంతంలోని ఆక్రమణలు తొలగిస్తే వాహనాలు మరింత సజావుగా రాకపోకలు సాగిస్తాయి.

గణేశుని విగ్రహ ఏర్పాటు సందర్భంగా పూజలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో లేబర్‌కాలనీలో 72 అడుగుల మట్టి గణపతిని ఏర్పాటు చేస్తున్న సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, సమితి సభ్యులు గద్దం రవి, సుబ్బారావు, ముక్కేశ్వరరావు పాల్గొన్నారు.

కాపు కల్యాణ మండపం నిర్మించాలి

లక్ష్మీకాంత్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న అంజిబాబు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: కాపులు అత్యధికంగా నివసిస్తున్న తూర్పు నియోజకవర్గంలో కల్యాణ మండపం నిర్మించాలని ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు అన్నారు. ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం సమావేశం మొగల్రాజపురంలోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కాపు మహిళలకు పెళ్లి కానుక పథకాన్ని ప్రవేశపెట్టాలని, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణప రాము, సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జస్వంత్‌కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు విస్సంశెట్టి ఉషాజ్యోతి, రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి రాజశేఖర్, తుమ్మల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. సంఘం తూర్పు నియోజకవర్గం అధ్యక్షుడిగా అమృతం లక్ష్మీకాంత్‌ని నియమిస్తూ అంజిబాబు అతనికి నియామక పత్రాన్ని అందజేశారు.

స్ఫూర్తి ప్రదాత కవయిత్రి మొల్లమాంబ

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కవయిత్రి మొల్లమాంబ మహిళా జాతికి స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని విద్యాధరపురం రామ మందిరం సెంటరులో ఏర్పాటు చేసిన కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని బీసీ సంక్షేమ సంఘం నేతలతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా జాతికి గర్వకారణంగా ఆమె రచించిన రామాయణం నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాడిశ రూపేష్, ఐలాపురం రాజా, ఈశ్వర్, సాంబశివరావు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న వైకాపా: గద్దె

మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్

పటమట, న్యూస్‌టుడే: అంతర్జాతీయ స్థాయి అభివృద్ధి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడానికి సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఆదివారం దర్శిపేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికాకు సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు తన పాలనా అనుభవంతో సమస్యలను ఛాలెంజ్‌గా తీసుకుని పరిష్కరిస్తున్నారని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధిని వైకాపా నాయకులు అడ్డుకుంటూ.. అసత్య ప్రచారాలు చేస్తూ రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నాయకులు కర్ణ కోటేశ్వరరావు, చెరుకూరి సాంబయ్య, గరికపాటి బద్రి, కర్ణ రమేష్, సుంకర వెంకన్న, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు అండగా కూటమి ప్రభుత్వం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: వ్యాపారులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ పేర్కొన్నారు. ఏపీ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నగరంలో నిర్వహించిన ఐదో కార్యవర్గ సమావేశంలో నూతన లోగోను ఆవిష్కరించిన అనంతరం రాకేష్ మాట్లాడుతూ.. వ్యాపార వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి సహకారం అందిస్తామన్నారు. నూతన కార్యాలయ నిర్మాణానికి తన వంతుగా గౌరవ వేతనం నుంచి రూ. 1,00,116 విరాళాన్ని అందజేస్తామని ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.వి.రత్నం, కరుణకుమార్ పాల్గొన్నారు.

◆ అమరావతి రాజధానిలో పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు తరఫున 58 అడుగుల ఎత్తున అమరజీవి విగ్రహ నిర్మాణానికి 6.8 ఎకరాల స్థలం ప్రభుత్వం కేటాయించేందుకు కృషి చేసిన ట్రస్టు అధ్యక్షుడు డూండీ రాకేష్‌ను వాసవీ ఫౌండేషన్ అధ్యక్షుడు వి.వి.కె. నరసింహారావు ఆదివారం అభినందించారు.

ఏకధాటి వర్షం.. దారులు జలమయం

పాత 'ఈనాడు' కార్యాలయం ఎదుట..

నెమ్మదిగా సాగుతున్న వాహనాలు

పటమట, విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: నగరంలో ఆదివారం సాయంత్రం సుమారు రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. రోడ్లన్నీ వరద నీటిలో మునిగిపోయాయి. ఆటోనగర్, బెంజ్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, నిర్మల కాన్వెంట్ రోడ్డు నీట మునగడంతో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. పటమట రామలింగేశ్వరనగర్, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు తదితర ప్రాంతాలు తటాకాలుగా మారాయి. వరదలో చిక్కుకొని ద్విచక్రవాహనాలు మొరాయించాయి. వివిధ పనుల నిమిత్తం వచ్చిన వాళ్లు, ప్రైవేటు ఉద్యోగులు తమ ఇళ్లకు వెళ్లడానికి ఇబ్బంది పడ్డారు. రహదారులపై నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో..

ప్రమాదకరంగా గుంత.. ప్రయాణం జాగ్రత్త

ఆటోనగర్‌లోని మొదటి క్రాస్ రోడ్డు వద్ద చప్టా ధ్వంసమైంది. రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు గుంతను గమనించని సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. **- ఆటోనగర్, న్యూస్‌టుడే**

రహదారిపై మురుగు... రాకపోకలకు అవస్థ

మొగల్రాజపురం బందులదొడ్డి కూడలిలోని మ్యాన్‌హోల్ నుంచి మురుగు బయటకు వస్తోంది. రాకపోకలు కొనసాగించే పాదచారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. కొన్ని రోజుల నుంచి వస్తున్నా పట్టించుకోవడం లేదని, సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే**

వర్షం పడితే..పుల్లేటికట్ట ముంపు తప్పదా?

ఈఎస్ఐ ఆస్పత్రి రోడ్డు నుంచి గుణదల సెంటర్ వరకు పుల్లేటికట్టకు గట్లు లేవు. అధిక వర్షానికి డ్రెయిన్ పొంగి మురుగు రహదారిపైకి, ఇళ్ల చుట్టూ చేరుతోంది. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డ్రెయిన్ అభివృద్ధికి ఆక్రమణలు అడ్డు ఉన్నాయి. పైగా సీఆర్‌డీఏ నిధులు మంజూరు చేస్తుందని కూటమి ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. రహదారి విస్తరణ తర్వాత డ్రెయిన్ పనులు మొదలవుతాయని అధికారులు అంటున్నారు. **- కరెన్సీనగర్, న్యూస్‌టుడే**

పైవంతెన నుంచి కారుతున్న వాన నీరు

బెంజి సర్కిల్ నుంచి నోవోటెల్ వరకు నిర్మించిన పైవంతెన నుంచి వర్షపు నీరు కారి సర్వీస్ రోడ్డుపై రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులపై పడుతోంది. వంతెన నుంచి దిగువకు వాడుక నీరు వెళ్లే డ్రెయినేజీ పైపులు పగిలిపోవడమే కారణమని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పైపులకు మరమ్మతులు చేయించి వర్షపు నీరు పడకుండా చూడాలని కోరుతున్నారు. **- కరెన్సీనగర్, న్యూస్‌టుడే**

రిజిస్ట్రేషన్‌తో కూడిన ఇళ్ల పట్టాల సాధనకు పోరాటం

ప్రచార యాత్రలో బాబూరావు, కాశీనాథ్ తదితరులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: కృష్ణా కరకట్ట పరిధిలోని ఇళ్లకు రిజిస్ట్రేషన్లతో కూడిన పట్టాలందించి ఇళ్లు పైకప్పు మార్చుకునేందుకు అవకాశం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. కృష్ణా కరకట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రణదివేనగర్ కరకట్ట ప్రాంతంలో ప్రచార యాత్ర నిర్వహించారు. బాబూరావు మాట్లాడుతూ కరకట్ట ప్రాంతంలో వేలాది కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, ఏ ప్రభుత్వం వచ్చినా ఇళ్లు తొలగించాలనే చూసిందని అన్నారు. ప్రజా పోరాటాల వల్ల రక్షణ గోడ సమకూరినట్లు తెలిపారు. విలువైన స్థలాలు కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చేందుకు సిద్ధ పడుతున్న ప్రభుత్వం.. ఇళ్లపై స్థానికులకు హక్కులు కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. రక్షణ గోడ పూర్తయినా డ్రెయిన్ నిర్మించకపోవడంతో దోమల తీవ్రత అధికంగా ఉందన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు సీపీఎం పోరాడుతుందని చెప్పారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ.. ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను సాధించేందుకు పరిరక్షణ కమిటీ చేపట్టిన ప్రచార యాత్రకు తమ పార్టీ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 28న తలపెట్టిన కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేత కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు పుప్పాల కృష్ణ, కోటేశ్వరరావు, కోరాడ రమణ, కుమార్, శ్రీరాములు, గోపి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఓపెన్ చెస్ విజేత భావన్

విజయవాడ క్రీడలు: ప్రపంచ చదరంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని జీజీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీలో కొల్లా భావన్ విజేతగా నిలిచాడు. ప్రీతం దర్శన్, బీజేఎస్‌కే రణధీర్, షేక్ జులేఖ బహార్, మందుల బాబు శామ్యూల్ ప్రోగ్రెసివ్ స్కోర్ ఆధారంగా వరుస స్థానాల్లో నిలిచారు. అండర్-7, 9, 11, 13 కేటగిరీల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులతో పాటు నగదు పారితోషికాలు అందజేశారు. స్కూల్ వైస్ ప్రిన్సిపల్ ఎన్.రమ్య విజేతలకు బహుమతులు అందజేశారు. ది విజయవాడ చెస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అక్బర్ పాషా, ఎం.రాజీవ్, పీఈటీ హనుక్ కుమార్ పాల్గొన్నారు.

విజేతలతో అతిథులు

ఆక్వాటిక్ జట్టుకు ఓవరాల్ ఛాంప్ రన్నరప్ ట్రోఫీ

అతిథుల నుంచి ట్రోఫీ అందుకుంటున్న ఎన్టీఆర్ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో ఈ నెల 19, 20వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో ఎన్టీఆర్ జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ రన్నరప్ ట్రోఫీ కైవసం చేసుకుంది. విశాఖ జట్టు ప్రథమ, కృష్ణా తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఎన్టీఆర్ జట్టు 22 పసిడి, 12 రజత, 9 కాంస్య పతకాలతో సత్తా చాటింది. ఎన్టీఆర్ స్విమ్మర్లు.. గ్రూపు-1 బాలికల విభాగంలో ఎన్. పావని సరయు, గ్రూపు-2 బాలికల విభాగంలో యానా జైన్, బాలుర విభాగంలో బి.పృథ్వీరాజ్ ఛాంపియన్లుగా నిలిచారు. కృష్ణా జిల్లాకు చెందిన యామర్తి పార్థవి గ్రూపు-3 బాలికల విభాగంలో ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుందని ఎన్టీఆర్ జిల్లా ఆక్వాటిక్ సంఘం కార్యదర్శి ఐ.రమేష్ తెలిపారు.

కాలువలో పూడిక తొలగింపు

స్పందనకు వందనం

వ్యర్థాలు తీసిన తర్వాత డ్రెయిన్ ఇలా..

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రా లయోల కళాశాల ప్రధాన ద్వారం వద్ద పుల్లేటికట్టలో వ్యర్థాలు నిలిచి మురుగు పారుదలకు ఆటంకంగా మారిందని 'వ్యర్థాలు ఇలా...రాకపోకలు ఎలా?' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి డివిజన్ శానిటరీ అధికారి రామకృష్ణ స్పందించారు. మురుగు పారుదలకు అడ్డంకిగా మారిన వ్యర్థాలను తొలగించారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

'మిథున్‌రెడ్డి అరెస్టు అన్యాయం'

పటమట, న్యూస్‌టుడే: వైకాపా ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ అన్యాయమని, ఎటువంటి ఆధారాలు లేకుండానే రాజకీయ కక్ష సాధింపులో భాగంగా మద్యం కుంభకోణంలో అరెస్టు చేశారని ఎన్టీఆర్ జిల్లా వైకాపా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. ఆదివారం గుణదల వైకాపా జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వైకాపా నేతలను ఇబ్బంది పెట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా మారిందని, అసమర్థ పాలన నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే అక్రమ అరెస్టులు చేస్తున్నారని అన్నారు. పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

కాలువ తీశారు.. అనుసంధానం మరిచారు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే

వర్షపు నీరు బయటికి వెళ్లేలా నోవోటెల్ నుంచి రమేష్ ఆస్పత్రి కూడలి వరకు జాతీయ రహదారికి ఇరువైపులా 200 మీటర్ల పొడవున సీసీ డ్రెయిన్లు నిర్మించారు. అవి ప్రస్తుతానికి నిరుపయోగంగా మారాయి. రహదారిపై నిలిచే నీరంతా డ్రెయిన్లలోకి వెళ్తోంది. డ్రెయిన్ కూడా కేవలం అడుగు లోతు మాత్రమే ఉంది. పైగా నీరు సర్వీస్ రోడ్డు డ్రెయిన్లలోకి అనుసంధానం చేసే మార్గం లేక ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోంది. ఫలితంగా చిన్నపాటి వర్షానికే మునిగిపోతోంది. దాంతో నీరంతా మళ్లీ హైవే మీదకు వస్తోంది. ఇటీవల నగరపాలక సంస్థ కాలువపై ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించింది. వర్షపు నీటిని కూడా మళ్లించే ఏర్పాటు చేస్తే వాహనచోదకులకు వెసులుబాటుగా ఉంటుంది. అధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రెయిన్‌పై వేసిన గ్రిల్

సర్వీస్ రోడ్డు కాలువకు కలపకుండా వదిలేశారిలా..

గోతులు పూడ్చండయ్యా!

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: తూర్పు నియోజకవర్గంలోని కొన్ని డివిజన్లలో తాగునీటి పైపుల లీకేజీల మరమ్మతులకు తవ్విన గోతులు సరిగా పూడ్చకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయాల్లో గోతులు కనపడక వాహనచోదకులు పడిపోతున్నారు. నాలుగో డివిజన్ వెటర్నరీ కాలనీ 5వ రోడ్డు, ఒకటో అడ్డరోడ్డు పార్కు స్థలం ఎదురుగా వారం కిందట గొయ్యి తవ్వి తాగునీటి పైపునకు మరమ్మతులు చేశారు. గొయ్యి పూడ్చకుండా వదిలేశారు. ఈఎస్ఐ ఆస్పత్రి రోడ్డు నుంచి గుణదల సెంటర్‌కు వెళ్లే రోడ్డులో డ్రెయిన్ల అనుసంధానానికి గోతులు తవ్వారు. ఇరుకైన రోడ్డు కావడంతో వాహన చోదకులు మార్జిన్‌లోకి వచ్చి గోతిలో పడుతున్నారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని, అనివార్యమైతే ఆయా ప్రాంతాల్లో చప్టాలు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

వెటర్నరీ కాలనీలో ప్రమాదకరంగా గొయ్యి

చురుగ్గా ఎన్టీఆర్ సర్కిల్ ఆధునికీకరణ

బెంజ్ సర్కిల్ సమీపంలోని ఎన్టీఆర్ సర్కిల్ ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఈ ఏడాది మే 13న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ భూమి పూజ చేశారు. సర్కిల్ చుట్టూ దిమ్మె ఎత్తు పెంచి టైల్స్ అతికించేందుకు సిద్ధం చేశారు. అనంతరం దిమ్మెకు గ్రిల్ ఏర్పాటు చేసి లోపల పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకుంటారు. – న్యూస్‌టుడే, పటమట

NAME CORRECTION

I VALLABHANENI BADRAMMA (Aadhar No: 8447 7081 9267) W/o. VALLABHANENI RAMESH, aged about 53 years, Indian Hindu, Residing at D.No:61-22/1-25, Gulabi Road, Ramalingeshwara Nagar, Krishna Lanka, Vijayawada (Urban), Krishna District, Andhra Pradesh-520 013 was mentioned as in my registered vacant land document my name VALLABANENI VARALAKSHMI (Doc. No: 2266/2012). For Gazette notification i solemnly declare that both the my names VALLABHANENI BADRAMMA and VALLABANENI VARALAKSHMI are the names of me only.

(c) eenadu

నందిగామ

•నందిగామ •జగ్గయ్యపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

★ స్థానిక ఎనిమిదో వార్డులో దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా కమిషనర్ లోవరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఫాగింగ్ చేయించారు.

★ రథం సెంటర్‌లో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెట్లు కొమ్మలు కొట్టి పడేశారని, మట్టి కుప్పలు పోయడంతో అధ్వానంగా ఉందని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన పారిశుద్ధ్య కార్మికులను పంపించి సమస్య పరిష్కరించారు.

★ స్థానిక 8వ వార్డులో ఓసీ క్లబ్ రోడ్డులో 11 రోజులుగా తాగునీరు రాక ఇబ్బందిపడుతున్నామని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. ★ స్థానిక ఎల్‌పీ సెంటర్‌లో ప్రధాన పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతోందని నివాసులు ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారికి తెలుపగా.. ఆమె స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయించి సరఫరా పునరుద్ధరించారు.

★ బాబూ జగ్జీవన్‌రాం ఫంక్షన్ హాలు విజయవాడ రోడ్డు పక్కన డ్రెయిన్‌లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయినట్టు స్థానికులు తెలుపగా.. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాదు పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులు డ్రెయిన్ శుభ్రం చేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, నందిగామ

పొంచి ఉన్న ప్రమాదం

అయ్యప్పనగర్‌లో పాఠశాల పక్కనే విద్యుత్తు స్తంభం ప్రమాదభరితంగా మారింది. వర్షాకాలం కావడంతో ఎక్కడ ఒరిగిపోతుందోనని స్థానికులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై ఏఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ వెంటనే పరిశీలించి స్తంభాన్ని పునరుద్ధరిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

సత్యసాయి సేవా సంస్థల సేవలు అభినందనీయం

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ సౌమ్య

చందర్లపాడు, న్యూస్‌టుడే: కోనాయపాలెంలో భగవాన్ శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రభుత్వవిప్ తంగిరాల సౌమ్య ఆదివారం ప్రారంభించారు. పది నెలలు ప్రతి మూడో ఆదివారం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తారని, గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సేవా సంస్థల సేవలు అభినందనీయమని కొనియాడారు. బీపీ, మధుమేహం, రక్త పరీక్షలు, సాధారణ వ్యాధులను వైద్యులు పరీక్షించి మందులను అందజేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్, గుత్తికొండ రాంబాబు, మేకల సుధాకర్, సర్పంచి వెంకట్రావమ్మ, సంస్థ ప్రతినిధులు కె.శ్రీనివాస్, రాఘవరావు, వాసుదేవరావు, సుశీల, చిట్టెమ్మ, సాయిరాం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: 21వ తేదీన తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పట్టణంలోని ఒకటో వార్డులో ధూళిపాళ్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటి పట్టణాన్ని పచ్చదనంతో నింపాలని సూచించారు. ధూళిపాళ్లను అభినందించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

చందర్లపాడు, న్యూస్‌టుడే: కోనాయపాలెంలోని 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ప్రాజెక్టుల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వాసిరెడ్డి ప్రసాద్, గుత్తికొండ రాంబాబు, మేకల సుధాకర్, వెంకట్రావమ్మ ఉలవలపూడి వెంకటరత్నం, వరకుమార్, నతానేలు, తదితరులు పాల్గొన్నారు.

భక్తితో సుబ్రహ్మణ్య హోమం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: అంబారుపేట బోధానంద ఆశ్రమంలో చాతుర్మాస మహావ్రతంలో భాగంగా ఆదివారం భక్తులు సుబ్రహ్మణ్య హోమం నిర్వహించారు. భగవన్నామ సంకీర్తనలు ఆలపించారు. ఆశ్రమ నిర్వాహకులు రమేష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సంఘ రాష్ట్ర కౌన్సిలర్‌గా 'ఆళ్ల'

నందిగామ గ్రామీణం: లింగాలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆళ్ల రాంబాబు ప్రధానోపాధ్యాయుల సంఘ రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఆదివారం తిరువూరులో నిర్వహించిన సంఘ జిల్లా సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఆయనను పలువురు ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

తిరుపతమ్మ ఆలయానికి రూ.58,116 విరాళం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ నిజాంపేట్‌కు చెందిన కేవీఎస్ రమేష్, ఆయన కుమార్తె మోహన లహరిలు తిరుపతమ్మ అమ్మవారి దేవాలయానికి ఆదివారం రూ.58,116 వితరణ చేశారు. ఈ మొత్తాన్ని ఏఈవో జంగం శ్రీనువాస్‌కు అందజేశారు. దాతలను అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని తిరుమలగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి తెలంగాణ నల్లబండగూడెంకు చెందిన చిగురుపాటి సుధాకర్-కల్యాణిలు రూ.10 వేలు విరాళంగా అందించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నూతక్కి వెంకటసాంబశివరావు తెలిపారు.

వంద పడకల వైద్యశాలకు సర్వం సిద్ధం

నందిగామ, న్యూస్‌టుడే

జీ ప్లస్ 4 అంతస్తుల్లో భవన నిర్మాణం

నందిగామలో డీవీఆర్ ప్రభుత్వ ఏరియా వైద్యశాల భవన నిర్మాణానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుత ఆసుపత్రి భవనం వద్దనే జీప్లస్ నాలుగు అంతస్తుల్లో భవనం నిర్మించనున్నారు. ఈ మేరకు టెండర్లు పిలిచి గుత్తేదారుడ్ని ఖరారు చేశారు. గత వైకాపా ప్రభుత్వంలో భవన నిర్మాణం అదిగో.. ఇదిగో అంటూ ఐదేళ్లు కాలక్షేపం చేశారు. ఎన్నికల ముందు రాజకీయంగా లబ్ధి కోసం పట్టణానికి దూరంగా ఉన్న స్థానిక డీవీఆర్ కాలనీ వద్ద భూములు కొనుగోలు చేయకుండానే వాటిలో భవన నిర్మాణానికి అప్పటి వైకాపా ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. దీనిలో కనీసం ఒక్క ఇటుక పెట్టి కూడా పనులు చేయలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం రాగానే ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి.

నందిగామ ప్రభుత్వ వైద్యశాల

నందిగామకు గుండెకాయ లాంటి గాంధీ సెంటర్‌లో ప్రస్తుత వైద్యశాల ఉంది. ఇది కేవలం 50 పడకల అవసరాలకే సరిపోతుంది. స్థాయి పెంచి వంద పడకల ఆసుపత్రిగా మార్చాక సరిపోవట్లేదు. అధునాతన వైద్యపరికరాల ఏర్పాటుకు స్థలం ఉండట్లేదు. వంద పడకలు వేసేందుకు గదులు లేవు. రోజూ 300 నుంచి 500 మంది వరకు రోగులు ఓపీ ఉంటుంది. ప్రస్తుతం 22 మంది వైద్యులు, 12 మంది పీజీ చదివే ట్రైనీ డాక్టర్లు పని చేస్తున్నారు. వీరందరికి గదుల్లేక ఒక్కో గదిలో ఇద్దరు, ముగ్గురు వరకు వైద్యులు ఉండి రోగులను పరీక్షిస్తున్నారు. దీనివల్ల రోగులు, వైద్యులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

రూ.29.50 కోట్లు మంజూరు

వంద పడకల వైద్యశాలకు తగ్గట్టుగా ఈ ప్రాంగణంలోనే జీప్లస్ 4 అంతస్తుల్లో వంద పడకల వైద్యశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.29.50 కోట్లు మంజూరు చేసింది. దీంతో 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనం నిర్మించనున్నారు. అదే విధంగా ఇతర సదుపాయాలు, అధునాతన పరికరాల కొనుగోలుకు రూ. 3.50 కోట్లు కేటాయించారు. త్వరలో పనులు ప్రారంభించడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. దీని కోసం ప్రస్తుత భవనం ముందు భాగంలో కొంతవరకు తొలగించాల్సి వస్తుంది. ఎమ్మెల్యే సౌమ్య ఆదేశాలు మేరకు వైద్యశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వేపూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అదనంగా రూ.1.20 కోట్లతో అన్ని వైద్య పరీక్షలు చేసేందుకు ల్యాబ్ భవనాన్ని నిర్మిస్తున్నారు. అదే విధంగా తాత్కాలిక షెడ్లు వేస్తున్నారు. ప్రస్తుతం బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు రూ.కోటి మంజూరు చేశారు. త్వరలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయబోతున్నారు.

త్వరలో శంకుస్థాపన

వంద పడకల వైద్యశాల నిర్మాణానికి త్వరలో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో త్వరలో శంకుస్థాపన చేయబోతున్నాం. ఈ సమయంలో వైద్య సేవలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అదనంగా షెడ్లు నిర్మించి అందులోకి కొన్ని విభాగాలను తరలిస్తాం. విశాలమైన భవనంలో అధునాతనమైన భవనాన్ని అన్ని వసతులతో నిర్మించనున్నారు. - వేపూరి నాగేశ్వరరావు, ఛైర్మన్, వైద్యశాల కమిటీ

చూసిన కనులదే భాగ్యం

లింగాలపాడులో శాకంబరిగా..

నందిగామ కూడలిలో ప్రసాదాల సమర్పణ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో లింగాలపాడు లక్ష్మీపేరంటాలు అమ్మవారిని ఆదివారం గ్రామస్థుల సహకారంతో రెండు క్వింటాళ్ల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. సహ దేవతలు పద్మావతి, అంకమ్మ తల్లిని కూడా అలంకరించారు. దాములూరు శివారు కూడలి రాజరాజేశ్వరి అమ్మవారికి మహిళలు ఆషాఢ సారె, బోనాలు సమర్పించారు. అమ్మవారికి సహస్ర నామాలతో కుంకుమార్చన చేశారు. అంబారుపేట సత్యమ్మతల్లికి నందిగామ ఏసీపీ తిలక్ దంపతులు సారె సమర్పించారు. ఎస్సై అభిమన్యునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు, న్యూస్‌టుడే: వర్షాలు సకాలంలో కురవాలని, పంటలు సుభిక్షంగా పండాలని కాంక్షిస్తూ మండలంలోని పలు గ్రామాల ప్రజలు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. మండల పరిధి జుజ్జూరు, నరసింహారావుపాలెం, అల్లూరు, గోకరాజుపల్లి, వెల్లంకి, తాటిగుమ్మి, కొణతాలపల్లి గ్రామాల్లో ఎడ్లబండ్లపై ప్రభలు కట్టి ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మ, గంటలమ్మ గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు.

నందిగామ గ్రామీణం: అంబారుపేటలో సత్యమ్మ తల్లికి సారె సమర్పిస్తున్న ఏసీపీ తిలక్ దంపతులు

పెనుగంచిప్రోలు: మండలంలో ముండ్లపాడుకు చెందిన భక్తులు తిరుపతమ్మకు సారె సమర్పించారు.

పెనుగంచిప్రోలు: ముండ్లపాడు నుంచి సారెతో వస్తున్న భక్తులు

వీరులపాడు: జుజ్జూరులో ఎడ్లబండ్లపై ప్రభలతో బోనాలు సమర్పించడానికి వెళుతున్న గ్రామస్థులు

జాతీయ రహదారి పక్కన చెత్త కుప్పలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలం చిల్లకల్లు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై చెత్తకుప్పలు వేయడంతో వాహనదారులు, గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్తకుప్పలు జిల్లా పరిషత్ పాఠశాల దగ్గరలో ఉండడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. పాఠశాల ఎదురుగా డ్రెయినేజీ లేక మురుగునీరు సరిగా ప్రవహించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వారు తొలగించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

భారీ వర్షంతో ప్రజల ఇక్కట్లు

కంచికచర్ల: కంచికచర్లలో కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. హనుమాన్‌పేట - విజయరాణి పాఠశాల రహదారి, ప్రణీత కాలనీ, అరుంధతి కాలనీలో పలు రహదారులు చెరువులను తలపించాయి. వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కంచికచర్లలో చెరువును తలపిస్తూ..

నందిగామ గ్రామీణం: నందిగామ పరిసర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వర్షం కురవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ద్విచక్ర వాహనచోదకులు అసౌకర్యానికి గురయ్యారు.

లింగాలపాడులో రహదారిపై నీరు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో లింగాలపాడు పీహెచ్‌సీ సెంటరులో రహదారిపై వర్షపు నీరు నిలిచి ద్విచక్ర వాహనాల రాకపోకలకు అసౌకర్యంగా మారింది. లింగాలపాడు-పాతబెల్లంకొండవారిపాలెం మార్గంలో వాగుపక్కనే రహదారిపై గుంతలుపడి నీరు నిలిచింది. నందిగామ-రామన్నపేట ఆర్‌అండ్‌బీ రహదారి మార్జిన్లలో గుంతలుపడి నీరు నిలవడంతో ద్విచక్ర వాహనచోదకులు ఎదురుగా వచ్చే వాహనాలను తప్పుకొనే వీలుపడక ఇబ్బంది పడుతున్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీకి ఎంపిక

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: ఈ నెల 28న తిరుపతిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ కోసం విజయవాడ ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన ఎంపిక జిల్లా స్థాయి పోటీల్లో జగ్గయ్యపేటకు చెందిన నాగార్జున స్కూల్ విద్యార్థిని బి. కార్తీషా(10వ తరగతి) విజేతగా నిలిచింది. బాలికల డబుల్స్ ఛాంపియన్-2025 పోటీల్లో విజయవాడకు చెందిన శ్రావ్యశ్రీతో కలిసి మొదటి స్థానంలో నిలిచి ట్రోఫీని అందుకున్న కార్తీషాను పాఠశాల ప్రిన్సిపల్ చావా కృష్ణయ్య, సిబ్బంది అభినందించారు.

ఎంపికైన కార్తీషా

సీపీఐ కమిటీ ఎన్నిక

చుండూరు సుబ్బారావు

కట్టా చామంతి

గులామ్‌మొహమద్

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శిగా చుండూరు సుబ్బారావు తిరిగి ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా కట్టా చామంతి, వీరులపాడుకు చెందిన షేక్ గులామ్ మొహమద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సీపీఐ నియోజకవర్గ మహాసభలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. రైతుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సుబ్బారావుకు మరోసారి అవకాశం ఇవ్వాలని నాయకులు ప్రతిపాదించడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వట్టికొండ చంద్రమోహన్, ఎం. ప్రకాశరావు, బలుసుపాటి రాంబాబు, మన్నెం నారాయణరావు, హనుమంతురావు, షేక్ అబ్దుల్లా, పెర్నా రమణ, నరసింహారావు, బాలస్వామి, సురేష్ తదితరులు నియమితులయ్యారు. వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకం మోటార్ల మరమ్మతులకు వెంటనే నిధులు కేటాయించాలని, నందిగామ ప్రాంతంలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని, పోలంపల్లి వద్ద మునేరుపై ప్రాజెక్టు నిర్మించాలని తీర్మానించారు. నందిగామ ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, పేపరు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, కూడలి దాములూరు వద్ద వైరా ఏరుపై వంతెనకు అప్రోచ్ రోడ్లు నిర్మించాలని కోరారు.

ఎస్ఐ వెంకటేశ్వరరావు దంపతులను సన్మానించిన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు రాజు, సూర్యశ్రీనివాస్

ఉద్యోగ విరమణ సన్మానం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ-2గా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన వెంకటేశ్వరరావుకు పట్టణంలోని శ్రీరాం అమ్మాణీ కళాశాలలో ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు రాజు, సూర్యశ్రీనివాస్, శ్రీనివాసరావులు పాల్గొని వెంకటేశ్వరరావును సన్మానించి ఆయన సేవలను అభినందించారు. మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కన్నెబోయిన రామలక్ష్మి, సంకా వెంకటరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధితో భరోసా

నందిగామ గ్రామీణం: మండలంలో రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన డొక్కా నాగేశ్వరరావు అనారోగ్యంతో విజయవాడ సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అతని వైద్యానికి రూ.2 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఈ విషయాన్ని తెదేపా నాయకుడు తోట నాగమల్లేశ్వరరావు.. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సీఎం సహాయనిధి ద్వారా రూ.2 లక్షలు మంజూరు చేశారు. నాయకులు గాడిపర్తి శ్రీనివాసరావు, మన్నేపల్లి వినయ్‌కుమార్‌తో కలిసి నాగమల్లేశ్వరరావు ఆదివారం బాధితునికి ఎల్‌వోసీ పత్రం అందజేశారు.

బాధితుడికి ఎల్‌వోసీ పత్రం అందజేస్తున్న తెదేపా నాయకులు

అసాంఘిక కార్యకలాపాలను సహించం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో పోలీస్ స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు రౌడీషీటర్లకు, అనుమానితులకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్కరు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు ప్రతి ఆదివారం కౌన్సెలింగ్‌కు రావాలని తెలిపారు. ఎస్ఐ రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మైనర్లకు వాహనాలు ఇస్తే నేరం

కంచికచర్ల, న్యూస్‌టుడే: వాహనాలు నడిపే ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా తమ వెంట అన్ని రకాల ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఎస్సై బోనగిరి రాజు అన్నారు. కంచికచర్ల నెహ్రూ సెంటర్‌లో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం తప్పని, వారికి వాహనాలు ఇవ్వడం నేరమని అన్నారు. నిబంధనలు పాటించని చోదకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

(c) eenadu

విజయవాడ పశ్చిమ

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

◆ చిట్టినగర్ నుంచి పాల ఫ్యాక్టరీ వరకు మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగు రోడ్లపై పారుతోందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. సమస్య ప్రచురితమైంది. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు.

◆ వించిపేట నైజాంగేటు ప్రాంతాల్లోని రైల్వేట్రాక్‌లకు సమీపంలోని మురుగు కాలువల్లో పూడిక తీయడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు.

◆ భవానీపురం లలితానగర్‌లో కుక్కల స్వైర విహారం అధికంగా ఉందని, ప్రజలపై దాడులు చేస్తున్నాయని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. స్పందించిన వెటర్నరీ అధికారులు కుక్కలను పట్టారు.

◆ అంబాపురం నుంచి సీవీఆర్ ఫైవంతెన రోడ్డు మార్గం, విజయవాడ పశ్చిమ రైల్వే బుకింగ్ ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్ వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. స్పందించిన 2వ పట్టణ పోలీసులు పలువురు ఆకతాయిలను పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. - **న్యూస్‌టుడే, వన్‌టౌన్**

? కర్మెల్ చర్చి ఎదురు వీధిలోని మురుగు కాలువలో పూడిక పేరుకుపోయింది. - **స్వర్ణ, స్థానికురాలు**
✔ పూడిక తీయిస్తాం. - **వేణుగోపాల్, శానిటరీ అధికారి**
? పాతరాజరాజేశ్వరీపేట బీరువాల కంపెనీ రోడ్డులో చెత్త పేరుకుపోయింది. - **సాయికుమార్, స్థానికుడు**
✔ చెత్త తరలిస్తాం. - **రంగారావు, శానిటరీ అధికారి**
? కబేళా నుంచి సితార కూడలి వచ్చే మార్గంలో రాత్రుల్లో మందుబాబులు వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. - **వెంకటేశ్వరరావు, స్థానికుడు** ✔ పరిశీలించి నిఘా ఏర్పాటు చేస్తాం. - **ఉమామహేశ్వరరావు, సీఐ, భవానీపురం** ? చెరువు సెంటర్ కూడలిలో రోడ్డుపై గుంతల కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. - **అన్నపూర్ణ, స్థానికురాలు** ✔ గుంతలు పూడ్చి వేస్తాం. - **సురేఖ, సర్కిల్-I, ఈఈ** ? భవానీపురం స్వాతిసెంటర్‌లో రంగుమారిన మంచినీరు సరఫరా అవుతోంది. - **రాంబాబు, స్థానికుడు** ✔ చర్యలు తీసుకుంటాం. - **రామకృష్ణ, మంచినీటి విభాగం, ఏఈ** - న్యూస్‌టుడే, వన్‌టౌన్

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ నేడు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరవాసుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, మూడు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలు అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

భవానీపురం, న్యూస్‌టుడే: రామరాజ్యనగర్‌లోని ఆశీర్వాద్ ట్రస్టులోని వృద్ధులకు స్థానిక వాసి బాలాంత్రపు శేష శైలేష్ జ్ఞాపకార్థం ఆయన భార్య బాలాంత్రపు కమల ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో ఎస్ఆర్‌పీ సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అత్యవసరంలో అవస్థలే..

అరకొరగా భక్తులకు వైద్య సేవలు

సౌకర్యాలు లేని దేవస్థానం అంబులెన్సు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

రాష్ట్రంలో రెండో అతి పెద్ద దేవాలయం శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం. నిత్యం 25 వేలు నుంచి 35 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. శుక్ర, ఆదివారాల్లో ఆ సంఖ్య 50 వేలకు చేరుతుంది. వాతావరణ పరిస్థితుల కారణంగా ఇంద్రకీలాద్రిపై అస్వస్థతకు గురైతే ఆసుపత్రికి తరలించే సౌకర్యాలు ఉన్న అంబులెన్సు కరువైంది. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఎంబీబీఎస్ వైద్యులు లేని దయనీయ పరిస్థితి. ఆయుర్వేదం, హోమియోకు చెందిన వైద్యులు సేవలు అందించేందుకు వచ్చినా కొందరు ఉద్యోగుల కారణంగా వారికి అవకాశం ఇవ్వడం లేదు.

◆ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం మల్లికార్జున మహా మండపం వద్ద అంబులెన్సు పేరుతో ఒక వ్యాను ఉంది. ఇది కేవలం తరలించేందుకు మాత్రమే ఉపయోగపడుతుంది. అందులో ఆక్సిజన్ సౌకర్యం లేదు. అస్వస్థతకు గురైన వ్యక్తిని జాగ్రత్తగా ఆసుపత్రికి చేర్చే అవకాశం లేదు.

◆ ఇటీవల దుర్గమ్మకు బంగారు ఆభరణాలు ఇచ్చేందుకు దాత కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. ఆభరణాలు ఇచ్చేంత వరకు అల్పాహారం కూడా తీసుకోకపోవడంతో అస్వస్థతకు గురయ్యారు. ఆమెను తరలించేందుకు దేవస్థానం అంబులెన్సును చూసి దాత కుటుంబీకులు ముక్కున వేలేసుకున్నారు.

◆ ఈ విషయమై.. ఏఈవో గంగాధర్‌ను సంప్రదించగా దేవస్థానంలో ఆర్ఎంపీ వైద్యుడు ప్రస్తుతం సేవలు అందిస్తున్నారని తెలిపారు. అంబులెన్సు విషయం దేవస్థానం ఈవో దృష్టికి తీసుకు వచ్చామని తెలిపారు. ఒక దాత త్వరలో రూ.11లక్షలు వెచ్చించి సౌకర్యాలు ఉన్న అంబులెన్సు విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. మరొక అంబులెన్సుతోపాటు అర్హత కలిగిన వైద్యులను నియమించే విషయంపై ఈవో ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు.

గణేశుని విగ్రహ ఏర్పాటు సందర్భంగా పూజలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో లేబరుకాలనీలో 72 అడుగుల మట్టి గణపతిని ఏర్పాటు చేస్తున్న సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి వేడుకల్లో ఉభయ తెలుగు రాష్ట్ర ప్రజలు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, సమితి సభ్యులు గడ్డం రవి, సుబ్బారావు, ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. ప్రజలకు ఇక్కట్లు

చిట్టినగర్, న్యూస్‌టుడే

పెరిగిన పిచ్చి మొక్కలు

ఖాళీ స్థలాలతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఆవాసాల నడుమ పిచ్చి మొక్కలు పెరిగి విష పురుగులకు ఆవాసంగా మారుతున్నాయి. చెత్త, చెదారం ఖాళీ స్థలాల్లో పడేయడం వల్ల దుర్వాసన వెలువడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడినప్పుడు విష పురుగులు, తేళ్లు, పాములు, కీటకాలు రోడ్డుపై సంచరిస్తున్నాయి. తేళ్లు ఇళ్లల్లో చేరుతున్నాయని జనం గగ్గోలు పెడుతున్నారు. స్థల యజమానులు తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు మాత్రం పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు

● కేఎల్‌రావునగర్, సిండికేటు బ్యాంకు కాలనీ, అంబేద్కర్ నగర్, దీన్‌దయాళ్‌నగర్, తమ్మినకృష్ణ వీధి, లంబాడీపేట తదితర ప్రాంతాల్లో 26 ఖాళీ స్థలాలు ఉన్నాయి. వాటి విషయమై ఎవరు పట్టించుకోవడం లేదు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ఇప్పటికైనా సంబంధిత నగరపాలక సంస్థ అధికారులు స్పందించి ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి పరిశుభ్రం చేయించే విధంగా చూడాలని కోరుతున్నారు.

● ఖాళీ స్థలాల విషయమై శానిటరీ అధికారి ఆనంద్‌కృపాల్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఇలా స్పందించారు. ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి నోటీసులు ఇచ్చి ఆయా స్థలాలను పరిశుభ్రం చేయించే విధంగా తగిన చర్యలు తీసుకుంటాం.

స్పందించి.. మరమ్మతులు చేసి..

పాల ఫ్యాక్టరీ కొండమూల సీవీఆర్ వంతెన దిగువన రోడ్డు గోతులమయంగా మారడం వల్ల ప్రమాదభరితంగా ఉన్న నేపథ్యంలో ఈనెల 14న 'విజయవాడ పశ్చిమ' పేజీలో 'దారంతా గుంతలు.. దాటలేక తిప్పలు' చిత్ర కథనం ప్రచురితమైంది. దీనికి నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్పందించారు. గోతులపై బీటీ రోడ్డు వేయడంతో వాహనచోదకులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. - **న్యూస్‌టుడే, చిట్టినగర్**

దుర్గగుడికి పలువురి విరాళాలు

ఆశీర్వచన మండపంలో శివశంకర్ దంపతులు

దాతకు విరాళం రశీదు ఇస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వేర్వేరు పథకాలకు దాతలు రూ. 3,02,232 విరాళాన్ని ఆదివారం అందజేశారు. దుర్గ గుడి ఉచిత ప్రసాదం పంపిణీ పథకానికి గుంటూరు చంద్రమౌళి నగరకు చెందిన శివశంకర్ పద్మ దంపతులు రూ.లక్ష, గోసంరక్షణ నిధికి తాడేపల్లికి చెందిన సూర్యనారాయణ ప్రసాద్, జయలక్ష్మి దంపతులు రూ. 1,01,116, నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన రెడ్డి శ్రీనివాసరెడ్డి రూ.1,01,116 విరాళాలు వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ సత్యనారాయణ వారికి విరాళం రశీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో రమేష్‌బాబు

ధర వరలు

వంకాయలు-20, టమాటా-33, బెండ-18, పచ్చిమిర్చి-74, కాకర-30, బీర-24/20, క్యాబేజీ-22, క్యారెట్-30/42, దొండ-24, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-25, గోరు చిక్కుళ్లు-30, దోస-15, సొర-8/10, పొట్ల-20, ఆనపకాయ-8/7, చామ దుంప-28, అల్లం-60, మునగ-7/6, ఆకు కూరలు (కట్ట)-3/8, కంద-58, బీట్ రూట్-30, కీరదోస-48, బీన్స్-84, క్యాప్సికమ్-86, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-7/14, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-12/14 (నిన్నటి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - **ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

దుర్గమ్మా.. అందుకో ఆషాఢ సారె

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రి దుర్గమ్మ సన్నిధిలో ఆషాఢ సారె సమర్పించేందుకు మహిళా బృందా సభ్యులు ఆదివారం పోటెత్తారు. ఒకవైపు సారె బృందాలు, మరోవైపు దర్శనం, ఆర్జిత సేవల కోసం సామాన్య భక్తులు తరలి రావడంతో ఘాట్ రోడ్డు, కనకదుర్గనగర్ మెట్ల మార్గం భక్తులతో కిటకిటలాడాయి. 70 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు భావిస్తున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వీఐపీ దర్శనాలు రద్దు చేశారు. రూ.100, రూ.300, రూ.500 క్యూలైన్లలో టిక్కెట్ల విక్రయాలు నిలిపి ఉచితంగా అమ్మవారి దర్శనం చేయించారు. మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో దుర్గమ్మ ఉత్సవమూర్తి వద్ద అర్చకులు మహిళా బృందాల సారె స్వీకరించారు. దేవస్థానం ఈవో శీనానాయక్ క్షేత్రంలో పరిశీలించి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ◆ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శనం టిక్కెట్ల విక్రయాలు నిలిపి వేయడంతో పాటు లిఫ్టు మార్గాన్ని కేవలం వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లులకు మాత్రమే పరిమితం చేశారు.

రాజగోపురం ప్రాంగణం వద్ద భక్తులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: 48వ డివిజన్ బంగారయ్యకొట్టు సెంటర్ కొండ ప్రాంతంలో నివసించే పెళ్లా సూరిబాబు, నాగమణి, పోతిన ఉపేంద్ర, పద్మ దంపతుల ఆధ్వర్యంలో మహిళలు, యువతులు అమ్మవారి సారెను తీసుకుని ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయరు రాయన భాగ్యలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించి సారె ఊరేగింపు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి, ఎ. కృష్ణకిషోర్, కె. రజనీ, శివ పట్నాయక్, తెదేపా నాయకుడు పేరాబత్తుల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఊరేగింపులో మేయరు భాగ్యలక్ష్మి తదితరులు

వైభవంగా ఆడికృత్తిక మహోత్సవం

పాతబస్తీలో గ్రామోత్సవం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతబస్తీ గాంధీకొండ సమీపంలోని శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆడి కృత్తిక నక్షత్ర కావడి ఉత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కావడి కమిటీ సారథ్యంలో వీపుపై గుచ్చుకున్న కొక్కాలతో రథాన్ని భక్తులు లాగి వారి భక్తిని చాటుకున్నారు. కొత్తపేట సుబ్రహ్మణ్యేశ్వరాలయానికి రథోత్సవం చేరుకున్నాక కమిటీ సభ్యులు వీపుకు గుచ్చిన శూలాలను తొలగించి ప్రత్యేక పూజలు చేశారు. 1వ పట్టణ పోలీసు స్టేషన్ సీఐ గురుప్రకాష్, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, భాజపా పశ్చిమ కన్వీనర్ పొట్టి శ్రీహరి, విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి కొంపెల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లంబాడీపేటలో రోడ్డు ధ్వంసం

లంబాడీపేట, అంబటి సముద్రాలవీధి, అడ్డరోడ్లలో సీసీ రోడ్డు ధ్వంసమైంది. రాత్రి సమయంలో వాహనచోదకులు, వృద్ధులు, పిల్లలు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. కల్వర్టుపై సిమెంటు దిమ్మెలు కూడా ధ్వంసమయ్యాయి. ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఆయా ప్రాంతాన్ని పరిశీలించి ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, చిట్టినగర్**

రంగుమారిన నీరు సరఫరా

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతబస్తీ వించిపేట ఆంధ్రుల అప్పన్న వారి వీధి, నైజాంగేటు, కొత్తపేట, చిట్టినగర్ రైల్వే యార్డు, కుమ్మరివీధుల ప్రాంతాల్లో రెండు రోజుల నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో రంగుమారి, తీవ్ర దుర్వాసనతో మంచినీరు సరఫరా అయ్యింది. గతవారం రోజులుగా ఇదే తంతు నడుస్తోందని, అధికారులకు సమాచారం ఇచ్చినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు.

కాలువలో పేరుకున్న వ్యర్థాలు

భవానీపురంలోని పలు ప్రాంతాల్లోని కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో మురుగునీటి పారుదలకు ఆటంకం ఏర్పడుతుంది. స్థానిక ప్రజలు కాలువల్లోనే చెత్త, వ్యర్థాలను పడేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు కాలువల్లో పేరుకున్న వ్యర్థాలను తొలగించకపోవడంతో వీధులు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. భవానీపురం మానవ మందిరం రోడ్డు వద్ద కాలువలో వ్యర్థాలు భారీఎత్తున పేరుకుపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, భవానీపురం**

'జగన్‌ను కూడా అరెస్టు చేయాలి'

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసులో పాత్రధారి వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం సబబేనని తెదేపా జిల్లా వాణిజ్య విభాగం సభ్యుడు ధనేకుల వెంకటహరికృష్ణ, తెలుగు యువత పశ్చిమ నియోజకవర్గ అధికార ప్రతినిధి తమ్మిన శేఖర్ పేర్కొన్నారు. అసలు సూత్రధారి జగన్‌ను కూడా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పాతబస్తీ పాతరాజరాజేశ్వరీపేటలోని తెదేపా కార్యాలయంలో వారు మాట్లాడారు.

వ్యాపారులకు అండగా కూటమి ప్రభుత్వం

రాకేష్‌ను సత్కరిస్తున్న రత్నం, కరుణ్‌కుమార్ తదితరులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: వ్యాపారులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ పేర్కొన్నారు. ఏపీ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నగరంలో నిర్వహించిన ఐదో కార్యవర్గ సమావేశంలో నూతన లోగోను ఆవిష్కరించిన అనంతరం రాకేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా వ్యాపార వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించడంలో తమ వంతు సహకారం అందిస్తామన్నారు. నూతన కార్యాలయ నిర్మాణానికి తన వంతుగా గౌరవ వేతనం నుంచి రూ.1,00,116 విరాళాన్ని అందజేస్తామని ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.వి. రత్నం, కరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

◆ అమరావతి రాజధానిలో పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు తరపున 58 అడుగుల ఎత్తున అమరజీవి విగ్రహ నిర్మాణానికి 6.8 ఎకరాల స్థలం ప్రభుత్వం కేటాయించేందుకు కృషి చేసిన ట్రస్టు అధ్యక్షుడు డూండీ రాకేష్‌ను వాసవీ ఫౌండేషన్ అధ్యక్షుడు వి.వి.కె.నరసింహారావు ఆదివారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘ నాయకులు నాగేశ్వరరావు, పి.లక్ష్మీసత్యనారాయణ, కె.ఎల్.వి. సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

దంచికొట్టిన వర్షం.. వీధులన్నీ జలమయం

తటాకాన్ని తపిస్తున్న గొల్లపాలెంగట్టు రోడ్డు

నీట మునిగిన పెనమాక దేవదాసు వీధి

చిట్టినగర్, న్యూస్‌టుడే: కురిసిన కుండపోత వర్షంతో రహదారులు వీధులు జలమయంగా మారాయి. మురుగు కాలువలు, రహదారులు ఏకమై నీరు ప్రవహిస్తున్నాయి. పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గొల్లపాలెంగట్టు ప్రధాన రహదారి తటాకాన్ని తపించింది. కొన్ని చోట్ల ఇళ్లల్లోకి కూడా నీరు చేరింది. చిట్టినగర్ నుంచి కేబీఎన్ కళాశాల, పొట్టి శ్రీరాముల చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల వరకు వీధులన్నీ జలమయమయ్యాయి. కలరా ఆసుపత్రి సెంటర్ సమీపంలోని ఎస్వీ కన్వెన్షన్, లలితాబార్ ప్రాంతంలో రోడ్డుపై నీరు నిలిచింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ లోపలికి వర్షపు నీరు చేరడంతో సిబ్బందికి తిప్పలు తప్పలేదు.

స్ఫూర్తి ప్రదాత కవయిత్రి మొల్లమాంబ

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కవయిత్రి మొల్లమాంబ మహిళా జాతికి స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య పేర్కొన్నారు. విద్యాధరపురం రామమందిరం సెంటరులో ఏర్పాటు చేసిన కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని బీసీ సంక్షేమ సంఘం నేతలతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా జాతికి గర్వకారణంగా ఆమె రచించిన రామాయణం నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాడిశ రూపేష్, ఐలాపురం రాజా, ఈశ్వర్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రిబ్బను కత్తిరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, నాగుల్ మీరా

విద్యాధరపురం, న్యూస్‌టుడే: నాలుగు స్తంభాల సెంటరులో 39వ డివిజన్ అధ్యక్షుడు కె.శివకుమార్ ఏర్పాటు చేసిన తెదేపా కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, సీనియర్ నాయకులు నాగుల్ మీరాతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. తెదేపా నాయకులు సమన్వయంతో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులకు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. మరో పదేళ్ల పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ గుండారపు హరిబాబు, రేగళ్ల లక్ష్మణరావు పాల్గొన్నారు.

సినిమాలు

జూనియర్, కొత్తపల్లిలో ఒకప్పుడు, ఓ భామ అయ్యో రామ: జీ-3(రాజ్-యువరాజ్), మీరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు), **జూనియర్:** అలంకార్, **కొత్తపల్లిలో ఒకప్పుడు:** జయరామ్, **జేఎస్‌కే(జానకీ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ), మై-బేబీ:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు), **ది 100:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణా కాంప్లెక్స్(గవర్నర్‌పేట), రామ్ సినిమాస్(గుణదల), సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), **పోలీసు వారి హెచ్చరిక, దేశాయ్:** నవరంగ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), **పోలీసు వారి హెచ్చరిక:** స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట) - **న్యూస్‌టుడే, వన్‌టౌన్**

ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పేద విద్యార్థులు ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలని 37వ డివిజన్ కార్పొరేటరు ఛటర్జీ అన్నారు. పాతబస్తీలోని మహేశ్వరీ భవన్‌లో ఆదివారం నిర్వహించిన మార్వాడి సమ్మేళనంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటరు అప్పాజీ, నిర్వాహకులు బాలకృష్ణ లోయా, ఓంజీ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఉపకార వేతనం అందజేస్తున్న కార్పొరేటర్లు ఛటర్జీ, అప్పాజీ

రూ.7 లక్షలతో తాగునీటి పైపులైన్లు

కొబ్బరికాయ కొడుతున్న స్థానిక మహిళ, పక్కన సత్యబాబు, మాజీ కార్పొరేటర్ ఆదిలక్ష్మి

చిట్టినగర్, న్యూస్‌టుడే: చిట్టినగర్ పరిధిలో రూ. 7 లక్షలతో తాగునీటి పైపులైన్లను వేస్తున్నట్లు సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు తెలిపారు. 50వ డివిజన్‌లోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల ఎదురు వీధిలో తాగునీటి పైపులైన్ల ఏర్పాటు పనులకు కొబ్బరికాయ కొట్టి ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. 35 ఏళ్ల నాటి పైపులు తుప్పు పట్టి, లీకేజీలతో తాగునీరు కలుషితం అవుతుండడంతో సమస్యను నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర దృష్టికి తీసుకు వెళ్లినట్లు వివరించారు. నిధులు మంజూరు చేయడంతో మహంతిపురం, జడా పాపయ్యవీధి, అప్పలస్వామి వీధి, దాసాంజనేయవీధి, అబ్దుల్‌ఖాదర్ వీధుల్లో కొత్త పైపులైన్లు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, సీపీఎం నాయకులు పి.రాజు, జి.నాగరాజు, దుర్గమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మురుగు పారదు.. అవస్థలు తీరవు

మరమ్మతులకు నోచుకోని కాలువలు

చిట్టినగర్, న్యూస్‌టుడే

కేఎల్‌రావునగర్‌లో కచ్చా డ్రెయిన్

మురుగు నీటి వ్యవస్థ సక్రమంగా లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షపునీటి కాలువలు దెబ్బతినడంతో వర్షాకాలంలో కొండ ప్రాంతాల్లో పడిన నీరు, కొండ మట్టి సైతం కొట్టుకు వచ్చి దిగడువ భాగంలో ఉన్న ప్రధాన కాలువల్లోకి చేరి మేట వేస్తున్నాయి. దీంతో వర్షపునీరు ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. పాడైన ఔట్‌ఫాల్ డ్రెయిన్లతో నీరు పొంగి రోడ్డుపైకి చేరుతున్నాయి.

జనాభా: సుమారు 30 వేల మంది

ఇబ్బందులు పడేవారు: 15 వేల మంది

ఏఏ ప్రాంతాల్లో.. గండమాల అచ్చమ్మవీధి, ఉప్పలపాటి రామచంద్రరాజు వీధి, లంబాడీపేట అడ్డరోడ్డు, అరుణా పాఠశాల వెనుక, భీమనవారిపేట గంగానమ్మగుడి, విశ్వబ్రాహ్మణవీధి అడ్డరోడ్డు, కేఎల్‌రావునగర్

అధికారులు స్పందించాలి

చిట్టినగర్‌లోని ఉప్పలపాటి రామచంద్రరాజు వీధి, అరుణా పాఠశాల వెనుక రోడ్డులో కాలువలు దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారి వెంట కావడంతో పిల్లలు పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. - **దుర్గాభవానీ, చిట్టినగర్**

దోమలతో ఇబ్బందులు

కేఎల్‌రావునగర్ కోళ్లఫారం వద్ద కచ్చా కాలువలో మురుగునీరు ప్రవహించడం లేదు. ఈ కాలువ ఇళ్ల మధ్యలో నుంచి కేఎల్‌రావునగర్ ఔట్‌ఫాల్ డ్రెయిన్‌లో కలుస్తుంది. వర్షాలు పడినప్పుడు చెత్త చెదారం కొట్టుకు వచ్చి నిలిచి పోతుంది. మురుగు నీరు కదలక దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నాం. పక్కా కాలువ నిర్మాణం చేయాలని కోరుతున్నాం. - **కిరణ్‌కుమార్, కేఎల్‌రావునగర్**

అంచనాలు సిద్ధం చేశాం

దెబ్బతిన్న కాలువల మరమ్మతులు చేపట్టేందుకు అంచనాలు వేశాం. అనుమతులు రాగానే టెండర్లు పిలుస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. - **శ్రీనివాసరావు, ఏఈ**

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
63036 11232

? సీతారాంపురం చాపరాలవారి వీధిలో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయింది. వర్షాలకు దోమలు వ్యాపిస్తున్నాయి. **- స్థానికులు** ✔ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. **- సి.హెచ్.బాబు శ్రీనివాస్, ఏఎంహెచ్‌వో**

? బావాజీపేటలోని ఒకటి నుంచి 5 లైన్ల వరకు పైపు లైన్ల కోసం తవ్విన గోతులు పూడ్చకుండా వదిలేశారు. స్థానికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ✔ పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం. **- బాలాజీ, నగరపాలక సంస్థ అధికారి**

– న్యూస్‌టుడే, సీతారాంపురం, గాంధీనగర్

అమ్మవారికి ప్రత్యేక పూజలు

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఆషాఢ బహుళ దశమి సందర్భంగా ఆదివారం సత్యనారాయణపురంలో కొలువైన కాశీ అన్నపూర్ణ అమ్మవారికి భక్తులు, సువాసినులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంగళ వాయిద్యాలతో 108 రకాల మంగళద్రవ్యాలతో పసుపు, కుంకుమలతో ఆషాఢసారె సమర్పించారు. లలిత సహస్రనామ పారాయణం చేశారు. భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు.

వీనులవిందుగా సంగీత విభావరి

గోపాలకృష్ణ సాయిని సత్కరిస్తున్న నిర్వాహకులు

గాంధీనగర్, న్యూస్‌టుడే : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక, సామాజిక సేవా సంఘం, సువర్ణ రిథమ్స్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కౌతా కళా వేదికపై నిర్వహించిన సినీ సంగీత విభావరి వీనులవిందుగా సాగింది. గాయకులు డేవిడ్‌రాజు, జయప్రభ, మారేపల్లి జోషి తదితరులు తెలుగు చిత్రాల్లోని పాటలను శ్రావ్యంగా ఆలపించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన బి.గోపాలకృష్ణసాయిని నిర్వాహకులు సత్కరించారు. పరుచూరి విజయలక్ష్మి, చింతకాయల చిట్టిబాబు, ప్రసూనరామన్, ప్రభల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకుల మోహనరావుకు నివాళి

కేదారేశ్వరపేట, న్యూస్‌టుడే : రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ అధ్యక్షుడు, సౌత్ మానిటరింగ్ అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ ఆకుల రాఘవేంద్ర తండ్రి మోహనరావు దశదిన కర్మ ఆదివారం స్థానిక నివాసంలో నిర్వహించారు. విజయవాడ మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, నంబూరి నరసింహారావు తదితరులు విచ్చేసి మోహనరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, రైల్వే ఉద్యోగులు, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్టేషన్‌కు హాజరుకావాల్సిందే

గాంధీనగర్: రౌడీ షీటర్లు ప్రతి వారం తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌కు హాజరుకావాల్సిందేనని సత్యనారాయణపురం ఎస్సై గోళ్ల సౌజన్య స్పష్టం చేశారు. ఆదివారం ఆమె స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జగన్మాతకు ఆషాఢ సారె సమర్పణ

సారెతో గుండపు చలపతిరావు కాలనీ వాసులు

సీతారాంపురం : ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : ఆషాఢ మాసం సందర్భంగా గుండపు చలపతిరావు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు కనక దుర్గమ్మకు సారె సమర్పించారు. ఆదివారం గున్న వారి వీధి నుంచి ర్యాలీగా బయలుదేరి ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎరుబోతు శ్రావణి రామారావు, గుండపు చంద్రశేఖర్, గున్న భవానీశంకర్, ఉప్పలపాటి శివరామరాజు, ఆకుల రామ్మోహన్‌రావు, హరికృష్ణ కుమార్, సింధే వెంకటేశ్వరరావు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సీతారాంపురం: స్థానిక రైవస్ కాలువ గట్టున ఉన్న శ్రీబాలదుర్గామల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆషాఢ సారెను దుర్గమ్మకు సమర్పించారు. కార్యక్రమంలో 25వ డివిజన్ తెదేపా అధ్యక్షుడు మాచర్ల గోపీనాథ్, పావని దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. సుమారు 50 మంది మహిళా భక్తులు సీతారాంపురం పురవీధుల నుంచి నడుచుకుంటూ వెళ్లి ఇంద్రకీలాద్రిపై వేంచేసిన జగన్మాతకు సారె సమర్పించారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

బస్ షెల్టర్ల లేక ఇక్కట్లు

న్యూరాజరాజేశ్వరి పేట (అజిత్‌సింగ్‌నగర్), న్యూస్‌టుడే

న్యూరాజరాజేశ్వరిపేటలో రోడ్లపైనే ప్రయాణికులు ఇలా..

విజయవాడ మధ్య నియోజకవర్గంలో పేద, మధ్య తరగతి ప్రజలు అధికంగా నివసించే శివారులో బస్సు షెల్టర్లు లేవు. ఎండలో ఎండుతూ.. వానలో తడుస్తూ బస్సుల కోసం ఎదురుచూపులు చూడక తప్పడం లేదు. వేసవి ముగిసినా.. ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. ఉక్కపోత, సూర్యుడి ప్రతాపంతో అల్లాడుతున్నారు. ఇలాంటి తరుణంలో కనీసం తలదాచుకోవడానికైనా ఎలాంటి వసతి లేక ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. న్యూరాజరాజేశ్వరి పేట, అజిత్‌సింగ్‌నగర్, పైపుల రోడ్డు, వాంబే కాలనీ, డాబా కొట్లు సెంటర్, కృష్ణా హోటల్ సెంటర్, లూనా సెంటర్, గంగానమ్మ గుడి సెంటర్, ఆంధ్రప్రభ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. జన సంచారం అధికంగా ఉంటున్నా.. వారి సౌకర్యార్థం అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పిల్లలు, వృద్ధుల బాధలు వర్ణనాతీతం. అధిక ఉష్ణోగ్రతలు ఒకవైపు.. వర్షం ప్రభావంతో.. ఇబ్బంది పడుతున్నారు. నడి రోడ్డుపైనే నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరాల కోసం ఆటోలను ఆశ్రయిస్తుంటే.. వారు ఇదే అదునుగా భావించి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్సు షెల్టర్లు నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్, బిల్డింగ్ ఓవర్సీర్ ఇన్‌ఛార్జి సత్యనారాయణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పైపుల రోడ్డులో బస్ షెల్టర్‌కు ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు. కానీ న్యూరాజరాజేశ్వరి పేట, అజిత్‌సింగ్‌నగర్‌ని ఇతర ప్రాంతాల్లో ఎలాంటి ప్రతిపాదనలు లేవని తెలిపారు.

ఎండలో నిలబడలేకున్నాం...

వ్యాపారం, ఉద్యోగాలు, పాఠశాలలు, కళాశాలల నిమిత్తం న్యూరాజరాజేశ్వరి పేట నుంచి ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ప్రతి రోజూ నగరంలోకి వెళ్లి వస్తున్నారు. కానీ పేటలో మచ్చుకకు ఒక్క బస్సు షెల్టర్ కూడా లేదు. బస్సు వచ్చే వరకు ఎండలో నిలబడలేని పరిస్థితి. ఒక్కోసారి అనారోగ్యం బారిన పడుతున్నారు. వర్షం వస్తే తడవాల్సిందే. షెల్టర్ ఉంటే అయినా కొంత వరకు ఉపశమనం లభిస్తుంది.

- తిరుమలరావు, ప్రైవేటు ఉద్యోగి

తక్షణమే స్పందించాలి

ప్రస్తుతం అజిత్‌సింగ్‌నగర్ పైపుల రోడ్డు నుంచి పండిట్ నెహ్రూ బస్టాండ్ వరకు మూడు షెల్టర్లు మాత్రమే ఉన్నాయి. ప్రధాన కూడళ్లలో ఎలాంటి సౌకర్యం లేదు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నగర పాలక సంస్థ చొరవ తీసుకుని.. కనీసం ముఖ్యమైన, ప్రధాన కూడళ్ల షెల్టర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- సుకన్య, ఆర్టీసీ ఉద్యోగి

తలసీమియా చిన్నారులకు బాసట


రక్తదానం చేస్తున్న రత్నను అభినందిస్తున్న బాలస్వామి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : తలసీమియాతో బాధ పడే చిన్నారులకు అవసరమైన రక్తం ఇచ్చేందుకు విజయవాడ సూర్య, కార్తీ ఫ్యాన్స్ అసోసియేషన్ ముందుకు వచ్చింది. ఈ నెల 23న సూర్య పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం సూర్యారావుపేటలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రత్నను అభినందించారు. తలసీమియా చిన్నారులకు అత్యవసరంగా రక్తం కావాలని కోరగానే.. సూర్య ఫ్యాన్స్ సభ్యులు మూడు రోజులు ముందుగానే రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. 45 మంది రక్తదానం చేసి, స్ఫూర్తిగా నిలిచారు. ఈ కార్యక్రమంలో రాము, చిరంజీవి, సాయి, ప్రేమ్, చోటు తదితరులు పాల్గొన్నారు.

వీరమల్లు విజయం కాంక్షిస్తూ రక్తదానం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : హీరో పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రం విజయాన్ని కాంక్షిస్తూ అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్, చిరంజీవి యువత సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్‌లోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పవన్ కల్యాణ్ అభిమానులు రక్తదానం చేయడం అభినందనీయమని అసోసియేషన్ అధ్యక్షుడు వి.మధు, అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు సోడిశెట్టి కృష్ణప్రసాద్, ఆకాశం శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. చిత్రం విడుదలయ్యే వరకు ఈ శిబిరం ప్రతి రోజూ కొనసాగుతుందని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇల్లూరి సుగుణబాబు, బి.వంశీ, కె.రాకేష్‌నాథ్, కొడాలి చంద్రశేఖర్, పి.శ్రీధర్, పి.రాంబాబు, రమేష్, ఎన్.ఆనంద్, వి.నాగరాజు, మధు, యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో పవన్ అభిమానులు..

కాపుల డిమాండ్లపై దశలవారీ ఉద్యమం

మాట్లాడుతున్న జనార్దన్

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్రంలో కాపు కులస్థుల సమస్యలపై దశలవారీగా ఉద్యమం చేస్తామని కాపు ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్దన్ తెలిపారు. ఆదివారం కాపు సంఘాల ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో ఉద్యోగ సంఘాలు, రాధా, రంగా మిత్రమండలి, వ్యాపార వర్గాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఉద్యమంలో భాగంగా జిల్లా, మండల స్థాయి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. విజయవాడ, రాయలసీమ, ఉత్తరాంధ్రలో బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాపు వర్గాలకు దామాషా అధికారాలు, కృష్ణా జిల్లాకు దివంగత వంగవీటి మోహనరంగారావు పేరు పెట్టాలని, రాజధాని అమరావతిలో కాపు భవన్‌కు ఐదు ఎకరాలు కేటాయించాలని, అన్ని జిల్లాల్లో భవనాలు నిర్మించాలని, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధుడు కన్నెగంటి హనుమంతు, కృష్ణదేవరాయల విగ్రహాలను అమరావతిలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐకాస నాయకులు ముత్యాల రాంబాబు, ఈశ్వర్, కొండిశెట్టి రాజేంద్ర, గాళ్ల సుబ్రహ్మణ్యం, సాయివరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అండగా ఉందాం

నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నగేష్‌బాబు తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : వృద్ధాప్యం అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగమని.. అది శాపం కాకూడదని పండగలా తీర్చిదిద్దుతున్న వయోవృద్ధుల చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని ఈగల్ పోలీస్ సూపరింటెండెంట్ కూడిపూడి నగేష్‌బాబు అన్నారు. ఆదివారం దుర్గాపురంలోని విజయ నర్సింగ్ కళాశాలలో ట్రస్టు ఆధ్వర్యంలో దాత సోలంకి హర్షవర్ అదినేతల అరవింద్, మహవీర్‌కుమార్ సహకారంతో వృద్ధులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. గత 217 నెలలుగా క్రమం తప్పకుండా నిరుపేద వృద్ధులకు సరుకులు, మందులు అందజేయడం గొప్ప విషయమని కొనియాడారు. తల్లిదండ్రులను పిల్లలు అశ్రద్ధ చేయకూడదు.. మంచిగా చూడాలని సూచించారు. సేవలను తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ టి.వి.మురళీకృష్ణ, ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, తట్టి అర్జునరావు, అమరా ఉమామహేశ్వరరావు, గోదావరి వెంకటేష్, పి.లక్ష్మీనరసింహారావు, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర వాసుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, మూడు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ పరిధిలోని సమస్యలు అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు.

పేరుకుపోయిన వ్యర్థాలు

సత్యనారాయణపురం విజ్ఞాన్ విహార్ పాఠశాల వద్ద చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. అటుగా రాకపోకలు సాగించే విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సత్యనారాయణపురం (గాంధీనగర్)**

తస్మాత్ జాగ్రత్త..!

కస్తూరిబాయిపేటలోని కృష్ణారావు వీధి క్రాస్ రోడ్డులో విద్యుత్తు స్తంభానికి చుట్టలు చుట్టలుగా కేబుళ్లు వేలాడుతున్నాయి. ఏది కేబులో.. ఏది విద్యుత్తు వైరో తెలియని పరిస్థితి నెలకొంది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అటుగా వెళ్లే వారు భయాందోళనలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కస్తూరిబాయిపేట (సీతారాంపురం)**

చిన్న గుంతలతో తంటా

వాంబేకాలనీ హెచ్-బ్లాక్ వార్డు సచివాలయం వెనుక కార్పొరేషన్ పార్కు రోడ్డులో చిన్న చిన్న గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాల చక్రాలు వాటిలో పడి.. అదుపు తప్పుతున్నాయి. చోదకులు గాయపడుతున్నారు. సంబంధిత శాఖాధికారులు స్పందించి వాటిని పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పాయకాపురం**

చురుగ్గా ఎన్టీఆర్ సర్కిల్ ఆధునికీకరణ

బెంజ్ సర్కిల్ సమీపంలోని ఎన్టీఆర్ సర్కిల్ ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఈ ఏడాది మే 13న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ భూమి పూజ చేశారు. సర్కిల్ చుట్టూ దిమ్మె ఎత్తు పెంచి టైల్స్ అతికించేందుకు సిద్ధం చేశారు. అనంతరం దిమ్మెకు గ్రిల్ ఏర్పాటు చేసి లోపల పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకుంటారు. **- న్యూస్‌టుడే, పటమట**

మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ సాధ్యం

సినీ హీరో భానుచందర్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : మార్షల్ ఆర్ట్స్ నేర్చుకునే వారికి క్రమశిక్షణతో సామాజిక స్పృహ అలవడుతుందని సినీ హీరో భానుచందర్ అన్నారు. ఇలాంటి వారు సమాజానికి మేలు చేయడానికి ఆసక్తి చూపుతారని పేర్కొన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని గుజ్జల సరళాదేవి కల్యాణ మండపంలో ఆదివారం వైఎంకే జాతీయ స్టార్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భానుచందర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఏడు రాష్ట్రాల్లో మార్షల్ ఆర్ట్స్‌తో పాటు నృత్యం, యోగా, సంఘ సేవ, విశేష ప్రతిభగల 216 మందికి ఈ అవార్డులు ప్రదానం చేశారు. జ్ఞాపిక, ప్రశంసా పత్రం, పతకం అందజేశారు. నిర్వాహకులు భానుచందర్‌ను ఘనంగా సత్కరించారు. వైఎంకే అకాడమీ చీఫ్ గల్లా రూపస్ పాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెదేపా ఫ్లోర్ లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, గ్రాండ్ మాస్టర్ ప్రకాశరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కళాశాల వార్షికోత్సవం

మాచవరం: మాచవరంలోని హిందీ బీఈడీ కళాశాల వార్షికోత్సవం ఆదివారం ఉత్సాహంగా సాగింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్ హిందీ ప్రచారక్ రేపాక రఘునందన్, ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాలశర్మ, దక్షిణ భారత హిందీ ప్రచార సభ విజయవాడ మేనేజరు సంధ్యారాణి, ప్రిన్సిపల్ కె.చారులత హాజరయ్యారు. విద్యార్థి నాయకుడు రఘురాజ్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

సంప్రదాయ నృత్య ప్రదర్శనలో విద్యార్థిని

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

వినతులపై కదలిక..!

సమస్యల పరిష్కారానికి అధికారుల చొరవ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రయాణికుల ఇబ్బందులపై ఈ నెల 14వ తేదీన కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీల నేపథ్యంలో అధికారుల్లో కదలిక వచ్చింది. సమస్యలు ఆర్టీసీ విభాగపరంగా ఉన్నప్పటికీ, వీటి పరిష్కార బాధ్యత మాత్రం ఇతర శాఖలతో ముడిపడి ఉంది. దీంతో సమన్వయ దిశగా ఆర్టీసీ అధికారులు అడుగులు వేస్తున్నారు. నగరంలోని కలెక్టరేట్ బస్ షెల్టరు వద్ద మెట్రో సిటీ బస్సులు ఆపడం లేదన్న ఫిర్యాదు రావడంతో.. ఆ శాఖాధికారులు బస్సులు ఆపేలా తక్షణం చర్యలు తీసుకున్నారు. నగరంలోని ఎంజీ (బందరు) రోడ్డు రూపురేఖలు విస్తరణ, ఇతర సౌకర్యాల పేరిట ఎప్పటికప్పుడు మారిపోతోంది. రహదారులను వెడల్పు చేయడం, పక్కా డ్రెయిన్ల నిర్మాణం, కాలి బాటల అభివృద్ధి నేపథ్యంలో బస్ షెల్టర్లను తొలగించాల్సి వచ్చింది. తిరిగి వాటిని పునర్ నిర్మించలేదు. గతంలో స్వరాజ్య మైదానం బస్టాప్ పేరిట అక్కడ బస్ షెల్టరు ఉండేది. అంబేడ్కర్ స్మృతి వనం నిర్మాణంతో షెల్టర్‌ను కూల్చివేశారు. బస్సులు ఎక్కడ ఆగుతాయో తెలియడం లేదు. బందరు రోడ్డులో మరి కొన్ని స్టేజీల వద్ద షెల్టర్లు లేవు. స్టేజీలు తెలిపే బోర్డులూ లేవు. దీనికి సంబంధించిన పీజీఆర్ఎస్ అర్జీపై ఆర్టీసీ అధికారులు విజయవాడ నగర పాలక సంస్థ అధికారులను సంప్రదిస్తున్నారు. మార్కింగ్ ఇవ్వడం, బోర్డుల ఏర్పాటు వీఎంసీ పరిధిలో ఉండడంతో ఆ దిశగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. కృష్ణలంక కరకట్టపై పాత ఫైర్‌స్టేషన్ బస్టాపు వద్ద బస్ షెల్టరు ఉన్నప్పటికీ.. తాడేపల్లి, మంగళగిరి, గుంటూరు, తెనాలి వైపు వెళ్లే పల్లె వెలుగు బస్సులను ఆపడం లేదు. కరకట్ట రోడ్డుకు పైవంతెన నిర్మించిన తర్వాత సర్వీసు రోడ్డు వేశారు. ఆర్డినరీ బస్సులు సర్వీసు రోడ్డులో వెళ్లాలన్న నిబంధన ఉంది. కృష్ణలంక పైవంతెన వద్ద గతంలో ఒక రోడ్డు ప్రమాదం జరిగిన కారణంగా పోలీసులు సర్వీసు రోడ్డులో బస్సులకు ఆంక్షలు విధించారు. పైవంతెన మీదుగా వెళ్లాలని సూచించారు. ఇదే అదనుగా డ్రైవర్లు తిన్నగా వెళ్లిపోతూ.. బస్సులను ఆపడం లేదు. తెనాలి, గుంటూరు మార్గంలో వెళ్లాల్సిన ప్రయాణికులు బస్టాండు లేదా వారధికి ఆటోల్లో చేరుకుని వ్యయ, ప్రయాసలతో బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం రావడంతో.. ప్రస్తుతం పోలీసు శాఖతో ఆర్టీసీ అధికారులు సంప్రదిస్తున్నారు. ఆంక్షలు సడలించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి కుమ్మర.. శాలివాహనుల సమస్యలు


మాట్లాడుతున్న ఈశ్వర్. వేదికపై వెంకయ్య, వివిధ జిల్లాల నాయకులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్రంలో కుమ్మర, శాలివాహన కులస్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని రాష్ట్ర కుమ్మర శాలివాహన ఫెడరేషన్ ఛైర్మన్ పేరేవి ఈశ్వర్ హామీ ఇచ్చారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాలివాహన సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం బలహీనవర్గాల ఆకాంక్షలు నెరవేర్చేలా, ఇచ్చిన హామీలు తప్పక అమలు చేస్తుందని చెప్పారు. కులస్థులంతా ఏకతాటిపైకి వచ్చి అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని కోరారు. జీవో నంబరు 310 వల్ల అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఇటుకల తయారీకి అవసరమైన మట్టి గతంలో చెరువుల ద్వారా ఉచితంగా తీసుకెళ్లేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ విధానాన్ని అమలు చేయకపోవడంతో కులవృత్తులు వీధిన పడాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఇలాంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. సంఘీయుల అభ్యున్నతి, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్సీ, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలాపురం వెంకయ్య అధ్యక్షత వహించారు. వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

'వైకాపా పాలనలో రేషన్ డీలర్లకు ఇబ్బందులు'


మాట్లాడుతున్న లీలా మాధవరావు. వేదికపై వెంకట రమణ, శేషు తదితరులు

రాఘవయ్యపార్క్ కూడలి (కృష్ణలంక), న్యూస్‌టుడే : వైకాపా ఐదేళ్ల పాలనలో రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం నిర్వహణదారుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వైకాపా పాలనలో ఇంటింటికీ రేషన్ పంపిణీలో అవకతవకలు జరగడంతో పాటు డీలర్లు తమ స్వతంత్రతను కోల్పోయారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. కోల్పోయిన స్వతంత్రతను తిరిగి పొందారని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలోనే కమీషన్ పెంచి వ్యవస్థను బలోపేతం చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పాత విధానాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ అందజేస్తున్నామని తెలిపారు. ఎండీయూల కంటే పక్కాగా రేషన్ పంపిణీ చేస్తుండడంతో లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని వివరించారు. రేషన్ డోర్ డెలివరీ అనేది ఖర్చుతో కూడుకున్నట్లుగా పరిగణించి గత ప్రభుత్వం ఎండీయూల సహాయకులకు రూ.5వేలు ఇచ్చిందని గుర్తు చేశారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం తమకు ఇవ్వాలని ఆయన కోరారు. తెలంగాణలో డీలర్లకు రూ.5వేల గౌరవ వేతనంతో పాటు క్వింటాకు రూ.140 కమీషన్‌గా ఇస్తున్నారని వెల్లడించారు. గౌరవవేతనంతో పాటు క్వింటాకు రూ.200లు కమీషన్ ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. కాగా.. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అడపా వెంకట రమణ, ప్రధాన కార్యదర్శిగా కొప్పాక శేషు, కోశాధికారిగా తిరుపాలయ్యను ఎన్నుకున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల డీలర్లు పాల్గొన్నారు.

పెయింటర్ అనుమానాస్పద మృతి

మధురానగర్, న్యూస్‌టుడే : ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వాంబేకాలనీకి చెందిన షేక్ సాదిక్ (28) పెయింటింగ్ పనులు చేస్తుంటారు. భార్యతో గొడవ పడి ఇంటి నుంచి వచ్చేసి దేవీనగర్ 8వ రోడ్డులోని బస్టాపులో ఉంటున్నాడు. శనివారం రాత్రి కుంభవృష్టి పడడంతో పూర్తిగా తడిచిపోయాడు. దుస్తులు ఆరబెట్టుకుని, రగ్గు కప్పుకొన్నాడు. అక్కడ ఉండే బిచ్చగాడితో కలిసి అర్ధరాత్రి 12 గంటల వరకు చలిమంట వేసుకుని కూర్చున్నారు. తర్వాత పడుకున్నారు. తెల్లవారుజామున రోడ్డు పక్కన.. అతడు రక్తపు గాయాలతో పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం పడి ఉన్న తీరును బట్టి చూస్తే.. ఏదైనా వాహనం ఢీకొని ఉండొచ్చని అనుమానిస్తున్నారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. ఒక లారీ అనుమానాస్పదంగా కనిపించింది. ప్రమాదం జరిగిన సమయంలో అది ఘటనా స్థలంలో 3 నిమిషాలు ఆగినట్లు పోలీసులు గుర్తించారు. లారీ నంబరు కోసం మరిన్ని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆర్టీసీ స్థలాలు కారుచౌకగా అప్పగించడం తగదు'


గవర్నర్‌పేట డిపో ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గవర్నర్‌పేట : ఆర్టీసీకి చెందిన విలువైన ఆస్తులను లులు సంస్థకు కట్టబెట్టడంపై వామపక్షాలు మండిపడ్డాయి. ఆదివారం గవర్నర్‌పేటలోని ఆర్టీసీ డిపో వద్ద సీపీఎం, సీపీఐలు వేర్వేరుగా ధర్నాలు నిర్వహించాయి. ఆస్తులను కారు చౌకగా అప్పగించడాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. లులు సంస్థకు విలువైన ప్రభుత్వ భూములు పందేరం చేయడంలో భారీ కుంభకోణం ఉందని సీపీఎం నాయకులు సి.హెచ్.బాబూరావు, డి.కాశీనాథ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న, మధ్య తరగతి వ్యాపారులను దెబ్బతీసి.. కూటమి ప్రభుత్వం బడా కంపెనీలకు దాసోహం అంటోందని విమర్శించారు. ఆర్టీసీని కాపాడాల్సిన పాలకులే ఇలా చేయడం గర్హనీయమన్నారు. వందలాది మందికి ఉపాధి దొరుకుతుందని నమ్మిస్తూ.. వేలాది మంది చిరువ్యాపారుల పొట్టగొట్టడం అమానుషమని పేర్కొన్నారు. ☛ ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుకు కట్టపెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. గవర్నర్‌పేట, విద్యాధరపురం డిపోల ఆస్తులను అమ్మకాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సంపద సృష్టి అంటే ఆస్తులను అమ్మడమా అని ప్రశ్నించారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని.. వారికి విద్య, వైద్యం అందించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.

జిల్లా స్థాయి ఓపెన్ చెస్ విజేత భావన్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ప్రపంచ చదరంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని జీఐజీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీలో కొల్లా భావన్ విజేతగా నిలిచాడు. ప్రీతం దర్శన్, బీజేఎస్‌కే రణధీర్, షేక్ జులేఖ బహార్, మందుల బాబు శామ్యూల్ ప్రోగ్రెసివ్ స్కోర్ ఆధారంగా వరుస స్థానాల్లో నిలిచారు. అండర్-7, 9, 11, 13 కేటగిరీల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులతో పాటు నగదు పారితోషికాలు అందజేశారు. స్కూల్ వైస్ ప్రిన్సిపల్ ఎస్.రమ్య విజేతలకు బహుమతులు అందజేశారు. ది విజయవాడ చెస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అక్బర్ పాషా, ఎం.రాజీవ్, పీఈటీ హనుక్ కుమార్ పాల్గొన్నారు.

(c) eenadu

శాకంబరిగా నూకాలమ్మ

ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు అనకాపల్లి నూకాలమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. స్థానిక కూరగాయల వ్యాపారి మళ్ల జగ్గప్పారావు వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు సమకూర్చగా అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ నాగశ్రీను, ఈవో సుధారాణి ఏర్పాట్లను పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, అనకాపల్లి పట్టణం

మన మిత్రలో.. అన్నదాత సుఖీభవ సమాచారం

జిల్లాలో 2,43,298 మంది అర్హులు

వాట్సాప్ మన మిత్రలో అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల సమాచారం అందుబాటులోకి వచ్చింది. అన్నదాత సుఖీభవ పోర్టల్‌కు వెళ్లి ఆ పథకానికి అర్హులో, కాదో తెలుసుకునే అవకాశాన్ని వ్యవసాయ శాఖ ఇప్పటికే అందుబాటులోకి తీసుకువచ్చింది. తాజాగా వాట్సాప్ మన మిత్ర ద్వారా తెలుసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా 24 మండలాల పరిధిలో 2,43,298 మంది రైతులను అర్హులుగా ప్రకటించారు. అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలో పేరుందో, లేదో తెలుసుకోవాలంటే వాట్సాప్ మన మిత్ర (95523 00009) నంబరుకు ముందుగా 'హాయ్' అని సందేశం పంపాలి. ఫోన్ తెరపై సేవను ఎంచుకుని అందులో మొదటి వరుసలో ఉండే అన్నదాత సుఖీభవపై క్లిక్ చేసి ఆధార్ నంబరు నమోదు చేసుకోవాలి. వెంటనే లబ్ధిదారు పేరు, తండ్రి పేరు, జిల్లా, మండలం, గ్రామం తదితర వివరాలు వస్తాయి. అందులో అర్హులా, అనర్హులా అనే వివరాలుంటాయి. ఒకవేళ అనర్హులని చూపిస్తే అందుకు కారణమూ అక్కడే చూపుతుంది. ఈ-కేవైసీ పూర్తయిందో, లేదో తెలుసుకోవచ్చు. అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితాలు రైతు సేవా కేంద్రాల్లోనూ అందుబాటులో ఉన్నాయి. – న్యూస్‌టుడే, కలెక్టరేట్

నిండుగా జలం.. సాగుకు సన్నద్ధం

ఖరీఫ్‌లో నీటి విడుదలపై నేడు నిర్ణయం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో 51,465 ఎకరాల ఆయకట్టు ఉన్న తాండవ జలాశయం నుంచి ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగుకు నీటి విడుదలపై జలవనరుల శాఖ అధికారులు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చారు. ప్రాజెక్టు కమిటీ, రైతులతో సోమవారం సమావేశమై నీటి విడుదల తేదీని ప్రకటించనున్నారు. జలాశయంలో రెండు నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయి. వర్షాలు పడుతుండటంతో ఎగువ నుంచి నీరు వచ్చి చేరుతుండటంతో ఈ ఏడాది వరిసాగుకు ఢోకా లేదని చెబుతున్నారు.

★ కాకినాడ జిల్లాలో కోటనందూరు, తుని, రౌతులపూడి, అనకాపల్లి జిల్లాలో నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల మండలాల్లోని 77 గ్రామాల్లో ఇప్పటికే 75 శాతం నారుమళ్లు సిద్ధమయ్యాయి. గత ప్రభుత్వంలో తాండవ జలాశయం కాలువలు, కట్టడాలు మరమ్మతుకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక సభాపతి అయ్యన్నపాత్రుడు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకువెళ్లి విడతల వారీగా రూ.6.4 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. అండర్ టన్నెళ్లు, సైఫన్లు, అక్విడక్టులకు అత్యవసరమైన చోట మరమ్మతు చేశారు. ప్రధాన గేటుకు రంధ్రాలు పడి కూసెక్కుల కొద్దీ నీరు వృథాగా పోయేది. సభాపతి అయ్యన్న చొరవతో గేటుకు మరమ్మతు చేసి లీకులను అరికట్టారు. మరో రూ.2 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపారు.

తాండవ జలాశయ సమాచారం	
■ గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం:	4,400 ఎంసీఎఫ్‌టీలు
■ ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు:	2,621 ఎంసీఎఫ్‌టీలు
■ గత ఏడాది ఇదే సమయానికి నిల్వ:	2132.8 ఎంసీఎఫ్‌టీలు
■ ఎడమ ప్రధాన కాలువ పొడవు:	19.80 కి.మీ.
■ కుడి ప్రధాన కాలువ పొడవు:	15.40 కి.మీ.

కాలవలో పూడికతీత పనులు

పొదుపుగా వాడుకోవాలి

నీటి విడుదలపై చర్చించేందుకు ప్రాజెక్టు కమిటీ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ, సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులతో నాతవరంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశాం. ఆగస్టు మొదటి వారంలోనే నీరు విడుదల చేయాలని యోచిస్తున్నాం. అందరి అభిప్రాయం మేరకు తుది నిర్ణయం తీసుకుంటాం. రైతులంతా సాగునీటిని పొదుపుగా వాడటంతోపాటు వృథాను అరికట్టాలి. సాగునీటి వినియోగదారుల సంఘాల సభ్యులంతా కాలువలో సాగునీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలి.
– అనూరాధ, డీఈఈ, తాండవ ప్రాజెక్టు

లాహిరి లాహిరి అనంతగిరుల్లో..

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

మన్యం సందర్శనకు వచ్చే వారు అనంతగిరులను చూడకుండా వెళ్లే ప్రసక్తే లేదు. సహజసిద్ధ అందాలతో మంత్రముగ్ధుల్ని చేసే ప్రకృతి రమణీయ దృశ్యాలెన్నో ఇక్కడున్నాయి. నిత్యం దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు విశాఖపట్నం నుంచి రైలు, రోడ్డు మార్గంలో ముందుగా బొర్రా గుహలు చేరుకుంటారు. గుహల సందర్శన అనంతరం సమీపంలోని కటికి, తాటిగుడ జలపాతాలకు వెళ్తారు. అక్కడి నుంచి అరకులోయ బయలుదేరి దారిలో కాఫీ తోటల వద్ద ఆగుతారు. గాలికొండ వ్యూపాయింట్ నుంచి అనంతగిరులను చూస్తూ తమను తాము మరిచిపోతారు. గిరుల అందాలను స్వీయ చిత్రాల్లో బంధించి అరకులోయ పయనమవుతారు.

కొండల మీదుగా జలజలా జాలువారే జలపాతాలు, కమ్మని కాఫీ తోటలు, శీతల వాతావరణం అనంతగిరుల ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నాయి. వీటితోపాటు ఎన్నో సందర్శనీయ ప్రాంతాలు ఇక్కడ ఉన్నాయి.

మెట్లుమెట్లుగా..: తాడిగుడ జలపాతం మెట్లుమెట్లుగా ఉంటుంది. అనంతగిరికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. జలపాతం కింద వరకు వెళ్లొచ్చు. చిన్నారులు ఆడుకునేందుకు ఆటవస్తువులు ఇక్కడ ఉన్నాయి.

టెంపుల్ ట్రీ: కాశీపట్నంలో మర్రిచెట్టు తొర్రలో ఉమామహేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయానిది ఐదు శతాబ్దాల చరిత్ర. పురాతన ఆలయం కావడంతో కార్తిక మాసంలో ఇక్కడకు వచ్చే భక్తులతో పరిసరాలన్నీ కిటకిటలాడుతుంటాయి. భక్తులు స్వయంగా శివలింగానికి అభిషేకం చేయడం ఇక్కడి ప్రత్యేకత.

సరియా జలపాతం: విశాఖకు 65 కి.మీ. దూరంలో ఉన్న దేవరాపల్లి చేరుకుని, అక్కడి నుంచి మరో 15 కి.మీ. వెళ్తే సరియా జలపాతం వస్తుంది. ఇక్కడకు చేరుకునేందుకు ఎంత శ్రమ పడి వస్తామో జలపాతం అందాలను చూసి కష్టమంతా మరిచిపోవడం ఖాయం. ఈ జలపాతం వద్ద జాగ్రత్తగా ఉండాలి.

కటికి జలపాతం: సుమారు 400 మీటర్ల ఎత్తు నుంచి నీటి ధారలు పడుతుంటాయి. బొర్రా గుహలకు దగ్గరలో ఈ జలపాతం ఉంది. కిలోమీటరు దూరం వరకు వాహనాల్లో చేరుకోవచ్చు. అక్కడి నుంచి కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది.

బొర్రా గుహలు: నిత్యం పర్యటకులతో సందడిగా ఉండే బొర్రాగుహలు సహజసిద్ధంగా ఏర్పడినవే. సుమారు 1.5 కిలోమీటరు దూరం గుహల్లో నడుచుకుంటూ అందాలను వీక్షించొచ్చు. విశాఖపట్నంకు 83 కి.మీ. దూరంలో ఈ గుహలున్నాయి. రైలు, రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు.

కాఫీ తోటలు: అరకు కాఫీ ఒక బ్రాండ్. ముడి సరకంతా అనంతగిరుల్లోని తోటల నుంచే వస్తుంది. కాఫీ తోటల వద్ద మండు వేసవిలోనూ వాతావరణం చల్లగా ఉంటుంది. సాయంత్రం 4 గంటలు దాటితే చలికి వణకాల్సిందే. కాఫీ తోటల్లో నడుచుకుంటూ కాఫీ పండ్లు, చెట్లను దగ్గరగా చూడొచ్చు.

ఆగని మట్టి అక్రమ దందా!

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే

సైతారుపేట చెరువులో ట్రాక్టర్లకు మట్టి లోడ్ చేస్తున్న పొక్లెయిన్

సహజ వనరుల దోపిడీకి అడ్డుకట్ట పడటం లేదు. చెరువులు, నదుల్లో మట్టిని యథేచ్ఛగా తవ్వేస్తూ దందా సాగిస్తున్నారు. లేఅవుట్లు, ప్రైవేటు స్థలాలు, ఇళ్ల పునాదుల్లో వేసేందుకు ఇసుక, మట్టికి ఉన్న డిమాండును సొమ్ము చేసుకుంటున్నారు. సైతారుపేట చెరువులో మట్టి, ఎస్.రాయవరం సమీపంలోని వరాహ నదిలో ఇసుకను పట్టపగలే తవ్వేస్తూ తరలిస్తున్నారు. వరాహ నదిలో మట్టి దిబ్బలను తొలగించేందుకు రూ.4.5 లక్షలతో పనులు చేపట్టారు. నదిలో తీసిన మట్టిని ఎస్.రాయవరం జిల్లా పరిషత్ పాఠశాల మైదానానికి తరలించేందుకు అధికారులు అనుమతిచ్చారు. గుత్తేదారు ప్రైవేటు స్థలాలను ఎత్తు చేసేందుకు మట్టిని విక్రయిస్తున్నారు. సైతారుపేట చెరువులో పొక్లెయిన్‌తో మట్టిని తవ్వి ఆరు ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. ట్రాక్టర్‌కు రూ.800 వసూలు చేస్తున్నారు. ఈ విషయాన్ని జలవనరుల శాఖ ఏఈ అమీనా భాను దృష్టికి తీసుకువెళ్లగా.. వరాహ నదిలో తవ్విన మట్టిని పాఠశాల మైదానానికి కాకుండా బయట ప్రాంతాలకు వెళ్తుండటంతో రవాణాను నిలిపివేశామన్నారు. సైతారుపేట చెరువులో తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదని, పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

అధిక లోడు వాహనాలతో వంతెనలకు ముప్పు

వంతెనను పరిశీలిస్తున్న సభాపతి అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, మాజీ ఎమ్మెల్సీ బుద్ద తదితరులు

కశింకోట, న్యూస్‌టుడే: అన్‌రాక్ కర్మాగారానికి పరిమితి మించిన లోడుతో లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో తాళ్లపాలెం - నర్సీపట్నం రహదారిలో వంతెనల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని సభాపతి అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. మామిడివాక గెడ్డపై వంతెనను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. గత వారం ఆర్‌అండ్‌బీ అధికారులు వంతెనను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారన్నారు. 20 టన్నుల లోపుతో వెళ్లాల్సిన లారీలు 60 టన్నుల ముడి సరకును తరలిస్తుండటంతో వంతెన శిథిలావస్థకు చేరిందన్నారు. వారం రోజుల్లో సాంకేతిక నిపుణుల బృందం పరిశీలన తర్వాత వారి సూచనల మేరకు కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలా? మరమ్మతు చేస్తే సరిపోతుందా చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. కొత్తగా వంతెన నిర్మాణానికి సుమారు రూ.15 కోట్లు ఖర్చవుతుందన్నారు.

★ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ.. నర్సీపట్నం - చింతపల్లి రోడ్డును నాలుగు వరసలుగా విస్తరించాలని, చింతపల్లి నుంచి మన్యం వరకు రెండు లైన్లు విస్తరించాలని ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు కృషి చేయాలని సభాపతిని కోరారు. ఆర్‌అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజినీరు జాన్ సుధాకర్, అనకాపల్లి ఏఈ ఎన్.సాంబశివరావు, నర్సీపట్నం డీఈ ఆర్.ఆర్.విద్యాసాగర్, సహాయ ఇంజినీరు కె.నారాయణరెడ్డి. ఎన్.ఎల్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చక్కెర పరిశ్రమకు తీపి పంచేలా..

సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వానికి నివేదిక

పాయకరావుపేట, న్యూస్‌టుడే

చెరకు రైతులకు దన్నుగా నిలిచిన చక్కెర కర్మాగారాల రూపుమారనుంది. ఆశించిన స్థాయిలో చెరకు సాగు లేకపోవడంతో మూతలు చేరిన వీటికి జవసత్వాలు నింపే దిశగా ప్రభుత్వం దృష్టిసారిస్తోంది. పరిశ్రమలను స్థానిక అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా అధికారులు రూపొందించిన నివేదికలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

★ తాండవ, ఏటికొప్పాక చక్కెర కర్మాగారాల పరిధిలో చెరకు సాగు విస్తీర్ణం తగ్గడంతో కొన్నేళ్ల కిందటే రెండు పరిశ్రమలూ మూత పడ్డాయి. చెరకు గిట్టుబాటు ధర రాకపోవడంతో అన్నదాతలు సాగును తగ్గించేశారు. పరిణామంగా గానుగాట నిలిపివేశారు. 2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా పాయకరావుపేట వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చక్కెర పరిశ్రమలకు కొత్తరూపు తీసుకువస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా నివేదికలు ఇవ్వాలని ఇటీవల ఉన్నతాధికారులకు ఆదేశాలొచ్చాయి.

తాండవ చక్కెర కర్మాగారం

■ పాయకరావుపేటలోని తాండవ చక్కెర పరిశ్రమ 51 ఎకరాల్లో ఏర్పాటైంది. పోలవరం ఎడమ కాలువ తవ్వకాలకు ఇందులో 11 ఎకరాలు ఇచ్చారు. ప్రస్తుతం 40 ఎకరాలు ఉంది. ఏటికొప్పాకలో ఇంతే మొత్తం స్థలం అందుబాటులో ఉంది. రైలు, రోడ్డు రవాణా సదుపాయాలు, తాండవ నది జలాలు అందుబాటులో ఉండటంతో ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు రూపొందించారు. నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ పరిశ్రమ, మిట్టల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు దృష్ట్యా వాటికి అనుబంధ పరిశ్రమలను తాండవ, ఏటికొప్పాక స్థలాల్లో ఏర్పాటు చేసేందుకు అనుకూల పరిస్థితులున్నాయని నివేదికలు సిద్ధం చేశారు. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేసినా లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై ఏపీఐఐసీ త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనుంది.

సమగ్ర వివరాలు పొందుపరిచాం

చక్కెర పరిశ్రమల స్థానంలో అనుబంధ పరిశ్రమల ఏర్పాటు, ఇథనాల్ తయారీ అవకాశాలపై సమగ్ర నివేదికలు రూపొందించి ఉన్నతాధికారులకు అందించాం. రెండు కర్మాగారాలకు రవాణా, నీటి లభ్యత తదితర అన్ని అనుకూలమైన పరిస్థితులున్నాయి.

– పి.ప్రసాదరావు, ఇన్‌ఛార్జి ఎండీ, తాండవ కర్మాగారం

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నేడు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరుగుతుందని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదివారం తెలిపారు. మండల, డివిజన్, జీవీఎంసీ, పురపాలక కార్యాలయాల్లోనూ సమస్యలపై వినతులు అందజేయవచ్చన్నారు. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా మీకోసం వెబ్‌సైట్‌లో వినతులు అప్‌లోడ్ చేయవచ్చన్నారు. అర్జీల స్థితిని తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1100కు ఫోన్ చేయవచ్చని సూచించారు.

వర్షాలతో అప్రమత్తం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా అనకాపల్లితోపాటు పలు ప్రాంతాల్లో సోమవారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెట్ల కింద, శిథిలావస్థకు చేరువలో ఉన్న గోడలు, భవనాల వద్ద ఉండొద్దన్నారు.

వృద్ధుల రేషన్‌లో అక్రమాలకు చెక్

నర్సీపట్నం, న్యూస్‌టుడే

ఇళ్ల వద్దనే వృద్ధులకు అందజేసే రేషన్ పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల బియ్యం తూకం ఆన్‌లైన్ చేయకుండానే అందజేశారు. ఇలా చేస్తే అవకతవకలకు ఆస్కారం ఉందని గుర్తించిన అధికారులు కాటా వివరాల్లో సైతం పారదర్శకత తప్పనిసరి చేశారు.

★ జిల్లాలోని సుమారు ఐదు లక్షల కార్డులు ఉండగా, 56 వేల వరకు ఇళ్ల వద్ద బియ్యం తీసుకుంటున్న వారున్నారు. నర్సీపట్నం ప్రాంతంలో పది వేల మంది వరకు ఉండగా, 160 మంది డీలర్లు సరకులు అందజేస్తున్నారు. దుకాణాల్లో ఎలక్ట్రానిక్ తూకానికి ఈపోస్ అనుసంధానం కావడంతో వేలిముద్ర వేసిన వెంటనే సరకు బరువు సహా అన్నీ ఆన్‌లైన్లో నమోదవుతాయి. ఇంటి వద్ద ఇచ్చే సరకుల విషయంలో ఇటీవల డీలర్లు కాటాలు లేకుండానే అందజేశారు. దీంతో జావాబుదారీతనం లోపించింది. రేషన్ ఇచ్చిందీ, లేనిది గుర్తించలేని పరిస్థితి. చౌక దుకాణదారుని వరకే సమాచారం పరిమితమైంది. అందరికీ వివరాలు తెలిసే అవకాశం లేకపోవడంతో తూకం లెక్కలు సైతం ఆన్‌లైన్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

చర్యలు చేపడుతున్నాం

ప్రస్తుతం డీలర్లు ముందుగా ఇంటి వద్ద వృద్ధుల నుంచి ఈపోస్‌పై బయోమెట్రిక్ నమోదు చేసుకుంటున్నారు. తర్వాత దుకాణాలకు వెళ్లి అక్కడ బ్లూటూత్‌తో తూకం వివరాలు అనుసంధానం చేస్తున్నారు. అనంతరం రేషన్ సరకులు ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. బరువుగా ఉండే కాటాను ఇళ్లకు తీసుకువెళ్లలేక డీలర్లు రెండుసార్లు తిరగాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆదేశాలను పక్కాగా పాటించేలా చర్యలు చేపడుతున్నాం.
– చందనరేఖ, డీటీ, నర్సీపట్నం

వార్డుల్లో పడకలు మరింత శుభ్రంగా..

సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఏడు రంగుల దుప్పట్లు

పడకలపై ఒకసారి వాడి పడేసే బెడ్‌షీట్లు

నక్కపల్లి, న్యూస్‌టుడే

ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స పొందే రోగులకు వైద్యమే కాదు, పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడటం ఎంతో అవసరం. కూటమి ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం రోగులకు మరింత మేలు చేయనుంది. వార్డుల్లో పడకలపై త్వరలోనే రంగుల దుప్పట్లు అందుబాటులోకి రానున్నాయి.

★ గ్రామాల్లో ఎక్కువ మంది రోగులకు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోనే వైద్య సేవలు అందుతుంటాయి. జిల్లా, ప్రాంతీయాసుపత్రులతోపాటు 30, 50 పడకల ఆసుపత్రులు దాదాపుగా వైద్య విధాన పరిషత్తు పరిధిలోనే ఉన్నాయి. వీటిలో సంస్కరణలు అమలయ్యేలా సర్కార్ చర్యలు చేపట్టింది. వార్డుల్లో పడకలపై రోగులకు మరింత పరిశుభ్రత ఉండేలా చూడాలని ఆదేశాలిచ్చింది. ప్రస్తుతం వినియోగిస్తున్న తెలుపు రంగు దుప్పట్ల స్థానంలో వారంలో ఏడు రోజులు ఏడు రంగుల దుప్పట్లను వేయనున్నారు.

★ జిల్లా కేంద్రం అనకాపల్లితోపాటు నర్సీపట్నం ప్రాంతీయాసుపత్రి, నక్కపల్లి, ఎలమంచిలి, కోటవురట్ల, కె.కోటపాడు, రావికమతం, చోడవరం కలిపి ఎనిమిది సామాజిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. అనకాపల్లి, నర్సీపట్నం ఆసుపత్రుల్లో 350 పడకలుండగా, మిగతా చోట్ల 400 ఉన్నాయి. ప్రతి రోజూ పడకలన్నీ రోగులతో నిండుగా ఉంటున్నాయి. ఆసుపత్రికి వచ్చే రోగులకు రెండు, మూడు రోజులపాటు ఇక్కడే వైద్యం అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆసుపత్రుల్లో మంచాలపై వాడుతున్నవన్నీ తెలుపురంగు దుప్పట్లు, పునర్వినియోగం లేని (డిస్పోజబుల్) నీలి రంగు బెడ్ షీట్స్ మాత్రమే. వైరల్ ఇన్‌ఫెక్షన్, ఇతర అత్యవసర పరిస్థితిని బట్టి డిస్పోజబుల్ వాడుతుంటారు. తెలుపు దుప్పట్లపై రక్తం, ఇతర మరకలు ఉంటే ఉతికినవైనా సరే వాడేందుకు ఇబ్బందికరంగా ఉంటాయి. ఈ క్రమంలో కొందరు రోగులు ఇళ్ల నుంచి దుప్పట్లు తెచ్చి వేసుకుంటున్నారు. మరి కొందరు బాగున్నవి వేయాలంటూ సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు.

★ రోగులు, ఉద్యోగులు ఇబ్బంది పడకుండా ఇంద్రధనస్సు తరహాలో సప్త వర్ణాల దుప్పట్లు వేసేందుకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఏడాదికి రూ.5.25 కోట్లు ఖర్చవుతుందని అంచనా. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పడకల సంఖ్య ఆధారంగా రంగురంగుల దుప్పట్లు ఇవ్వనున్నారు. ఆదివారం నుంచి శనివారం వరకు ఒక్కో రోజు ఒక్కో రంగు దుప్పటి పడకలపై వేయనున్నారు. గతంలో తెదేపా హయాంలో ఈ విధానాన్ని అనుసరించగా వైకాపా పాలనలో అటకెక్కించారు. తిరిగి ఇప్పుడు అమలులోకి తెస్తున్నారు.

సముచిత నిర్ణయం

ఆసుపత్రికి వచ్చే రోగులు ఇక్కడి వాతావరణం ఎంత బాగుంటే అంత త్వరగా కోలుకుంటారు. వార్డుల్లో మంచాలు, దుప్పట్లు బాగాలేకపోతే వారంతా ఇబ్బంది పడతారు. ఈ విషయంలో అక్కడక్కడా అభ్యంతరాలు, ఫిర్యాదులు వస్తుంటాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రోగులకు మేలు జరుగుతుంది. ఏరోజు ఏ రంగు వాడాలో ముందే నిర్ణయిస్తారు. రోజుకనుగుణంగా ఆయా దుప్పట్లు లేకపోతే రోగులు ప్రశ్నించొచ్చు. ఇది చాలా సముచిత నిర్ణయం.
– డాక్టర్ శ్రీనివాసరావు, డీసీహెచ్

కల్వర్టు మీదుగా రాకపోకలు బంద్

బారికేడ్ల ఏర్పాటుతో ఆటోలు దిగి కాలినడకన వస్తున్న ప్రయాణికులు

దేవరాపల్లి, న్యూస్‌టుడే

కృష్ణారాయుడిపేట వద్ద కుంగిన కల్వర్టు మీదుగా ఆర్అండ్‌బీ అధికారులు వాహనాల రాకపోకలను నిషేధించారు. విశాఖపట్నం - దేవరాపల్లి రోడ్డులో జీవీఎంసీకి తాగునీరందించే రైవాడ కాలువపై నిర్మించిన ఈ కల్వర్టు శిథిలావస్థకు చేరింది. దేవరాపల్లి మీదుగా విశాఖ, కొత్తవలస తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు ఇదొక్కటే మార్గం. సామర్థ్యానికి మించిన బరువుతో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో కల్వర్టు దెబ్బతింది. మరోదారి లేక ఆర్టీసీ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఇటే రాకపోకలు సాగిస్తున్నాయి. కల్వర్టు దుస్థితిపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు స్పందించిన మద్దిలపాలెం డిపో మేనేజరు పద్మావతి శనివారం వంతెనను పరిశీలించారు. కల్వర్టు నిర్మాణం జరిగితే తప్ప బస్సులను నడపలేమని స్పష్టం చేశారు. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు కల్వర్టుకు రెండు వైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. విశాఖ నుంచి ఆనందపురం, దేవరాపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు కృష్ణారాయుడిపేట వరకు బస్సులో వచ్చి.. ఇక్కడి నుంచి ఆటోల్లో గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. కొత్తవలస వైపు వెళ్లాల్సిన వారు ఆనందపురం నుంచి ఆటోల్లో వచ్చి ఇక్కడి నుంచి బస్సుల్లో వెళ్తున్నారు.

పంట వేయకున్నా.. బీమా

సద్వినియోగం చేసుకోండి

అనకాపల్లి, న్యూస్‌టుడే

పంట వేయకపోయినా బీమా చేసుకునే అవకాశాన్ని కూటమి ప్రభుత్వం రైతులకు కల్పించింది. బీమా చేశాక పంట సాగు చేసి ఆ వివరాలను ఈ-పంటలో తప్పనిసరిగా నమోదు చేయాలి. ఇంతవరకు పంట వేసిన తర్వాత బీమా చేయించుకునే వారు. వర్షాల్లేక చాలా మంది రైతులు నాట్లు వేయలేకపోతున్నారు. వీరంతా బీమాకు దూరమవుతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రైతులకు ప్రయోజనం చేకూరేలా పంట వేయకపోయినా ముందు బీమా చేయించుకుని ఆ తర్వాత పంట వేసుకునే వెసులుబాటు కల్పించింది. తద్వారా ఎక్కువ మంది రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

★ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద ఒక్కో జిల్లాలో ఒక్కో పంటకు బీమా చేసే అవకాశముంది. జిల్లాలో అన్ని పంటల కంటే వరి సాగే అధికం. తక్కువ ప్రీమియంతో ఎక్కువ పరిహారం పొందే ఆస్కారముంది. హెక్టారుకు రూ.210 ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. పంట దెబ్బతింటే బీమా కింద రూ.1.05 లక్షలు పరిహారంగా చెల్లిస్తారు. ఎకరాకు రూ.84 చెల్లిస్తే బీమాగా రూ.42 వేలు అందుతుంది.

నారు పోసే దశలోనే..

జిల్లాలో ఏటా 54,465 హెక్టార్లలో వరి సాగవుతోంది. ఈ ఏడాది 31,270 హెక్టార్లకు సరిపడా నారు పోశారు. నెల తర్వాత నాట్లు వేస్తారు. ప్రస్తుతం నారు పోసిన రైతులు ఆగస్టు 15 తర్వాత నాట్లు వేసే అవకాశముంది. మిగిలిన వారు సెప్టెంబరు మొదటి వారం వరకు నాట్లు వేస్తూనే ఉంటారు. ప్రభుత్వం వరి పంటకు బీమా చేసేందుకు ఆగస్టు 15 తుది గడువుగా నిర్ణయించింది. అప్పటికి నాట్లు వేయకపోయినా బీమా చేసుకోవచ్చు. వర్షాలు పుష్కలంగా పడిన తర్వాత నాట్లు వేసుకోవచ్చు. సాగు అనంతరం ఈ-పంటలో విధిగా నమోదు చేసుకోవాలి. పంట వేయకపోతే బీమాకు చెల్లించిన ప్రీమియం పోయినట్లేనని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ట్రాక్టర్‌తో దుక్కి దున్నిస్తున్న రైతు

తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనం పొందవచ్చు. రబీలో వరి పంటకు హెక్టారుకు రూ.1,575 ప్రీమియంగా నిర్ణయించగా ఖరీఫ్‌లో రూ.210 చెల్లిస్తే సరిపోతుంది. పంట వేయకపోయినా బీమా ఎలా చేయాలనే అనుమానం అవసరం లేదు. గడువులోగా బీమా చేయండి. నాట్లు వేశాక ఈ-పంట నమోదు చేయించుకుంటే సరిపోతుంది. గ్రామ సచివాలయాల్లో సంప్రదించి ప్రీమియం చెల్లించవచ్చు. ఎన్‌సీఐపీ యాప్ ద్వారానైనా చెల్లించవచ్చు. పంట రుణం తీసుకున్న రైతులు బ్యాంకులో స్వచ్ఛంద ధ్రువపత్రం సమర్పిస్తే సరిపోతుంది. రుణం నుంచి బీమా ప్రీమియం మినహాయించుకుంటారు. – మోహనరావు, జిల్లా వ్యవసాయాధికారి

(c) eenadu

మోతుగూడెంలో అఖండ-2 షూటింగ్!

రిసార్ట్‌లో దర్శకుడు బోయపాటి శ్రీను, తదితరులు

చింతూరు మండలం మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో అఖండ-2 సినిమా షూటింగ్ జరగనుంది. పలు సన్నివేశాలను ఈ నెల 22 నుంచి పది రోజులపాటు ఇక్కడ చిత్రీకరించనున్నారు. ఇప్పటికే దర్శకుడు బోయపాటి శ్రీను, 30 మంది యూనిట్ బృందం మోతుగూడెం చేరుకుని రిసార్ట్‌లో ఉన్నారు. లొకేషన్ ఎంపిక కోసం ఆదివారం పర్యాటక ప్రాంతాలను పరిశీలించారు. దారాలమ్మ, పిక్నిక్ స్పాట్, పొల్లూరు జలపాతాలు మరికొన్ని ప్రదేశాలను ఎంపిక చేసినట్లు సమాచారం. కథానాయకుడు నందమూరి బాలకృష్ణ రెండు రోజులు షూటింగ్‌లో పాల్గొననున్నారు. ఈ నెల 22న 150 మంది యూనిట్ సభ్యులు రానున్నారు. - న్యూస్‌టుడే, మోతుగూడెం

సుపరిపాలనలో తొలి అడుగు త్వరగా పూర్తిచేయాలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో చేపట్టిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా తెదేపా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు సూచించారు. అనకాపల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశం ప్రకారం 30 రోజులపాటు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ నెల రెండు నుంచి చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లాలో 5,19,709 ఇళ్లు ఉండగా ఇప్పటివరకు 2,00,479 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. 12 రోజుల్లో మిగిలిన ఇళ్లకు వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేలా పార్టీ శ్రేణులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తాతయ్యబాబు, పక్కన కాశీనాయుడు

ఎటు చూసినా 'స్కాన్'!

ప్రజాభిప్రాయ సేకరణకు సాంకేతిక దన్ను

ఈనాడు, విశాఖపట్నం: ప్రజాభిప్రాయ సేకరణలో విశాఖ మహా ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్డీఏ) కొత్త పుంతలు తొక్కుతోంది. మార్పులను అనుసరించి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. పర్యాటక ప్రాంతాల్లో ఫిర్యాదుల పెట్టెల స్థానంలో క్యూఆర్ కోడ్‌లను ఉపయోగించి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తోంది. తద్వారా ఆయా ప్రదేశాల్లో అందుతున్న సేవల గురించి తెలుసుకొని తగు మార్పులు చేస్తున్నారు.

✦ **ఈ ప్రదేశాల్లో..:** సిటీ సెంట్రల్ పార్కు, వుడా పార్కు, కైలాసగిరి, తొట్లకొండ, తెన్నేటి పార్కు, కురుసుర జలాంతర్గామి, టీయూ-142, సీహారియర్, రోప్‌వే వంటివి వీఎంఆర్డీఏ నిర్వహిస్తోంది. నిత్యం వేల మంది వీటిని సందర్శిస్తారు. ఇక్కడ గతంలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేసినా స్పందన అంతంతమాత్రంగానే ఉండేది. వాటికి ప్రత్యామ్నాయంగా ఇటీవల క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటు చేయగా మంచి ఫలితాలు వస్తున్నాయి. ముఖ్యంగా పార్కుల వద్ద బ్యానర్ల రూపంలో ప్రజలకు కనిపించేలా వీటిని వేలాడదీస్తున్నారు.

వీఎంఆర్డీఏ భవనం వద్ద వివరాలతో ఇలా

✦ పార్కుల్లో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని, తాగునీటి వసతి సరిగా లేదని తదితర లోపాలపై ఫిర్యాదులొస్తున్నాయి. సిటీ సెంట్రల్ పార్కులో నడకకు ఉచితంగా ప్రవేశం కల్పించాలని, వాహనాలకు పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని పలువురు క్యూఆర్ కోడ్‌ల ద్వారా అభిప్రాయాలు తెలిపారు.

✦ **అద్దెకు తీసుకోవాలన్నా:** మధురవాడ, గాజువాక, సీతమ్మధార, ఎంవీపీ కాలనీ...ఇలా పలు చోట్ల వీఎంఆర్డీఏకు వాణిజ్య సముదాయాలున్నాయి. కొన్ని చోట్ల కల్యాణ మండపాలు, కైలాసగిరిపై వేడుకలకు అద్దెకిచ్చే స్థలాలున్నాయి. ఎక్కడెక్కడ ఏ భవనాలున్నాయి, వాటి అద్దె ఎంత అనే వివరాలు చిత్రాలతో సహా...'స్కాన్' చేసిన చోట వస్తాయి. నచ్చితే అక్కడి సేవలను వినియోగించుకోవచ్చు.

✦ వీఎంఆర్డీఏ ఇటీవల మధ్యతరగతి కుటుంబాల కోసం బడ్జెట్ హౌసింగ్ అపార్టుమెంట్లను ప్రతిపాదించింది. దీనికి సంబంధించిన డిమాండ్ సర్వేను క్యూఆర్ కోడ్‌తోనే పూర్తి చేశారు. ఎంత విస్తీర్ణంలో అవసరం, ఏ ప్రాంతంలో కావాలి వంటి వివరాలతోపాటు సంప్రదింపులు ... క్యూఆర్ కోడ్ బ్యానర్లను నగరంలో పలు చోట్ల ఏర్పాటు చేశారు. వాటికి మంచి స్పందన వచ్చింది. వీఎంఆర్డీఏ బృహత్తర ప్రణాళిక ప్రతిపాదనలకు భాగంగా అభ్యంతరాల స్వీకరణ కూడా ఇదే తరహాలో చేశారు.

✦ **ఎప్పటికప్పుడు సమీక్షించి నివేదిక:** 'క్యూఆర్ కోడ్ ద్వారా వచ్చే వినతులను ముందుగా సంబంధిత విభాగాలకు పంపుతున్నాం. వాటిని ఎంత వరకు పరిష్కరించారనే దానిపై ప్రతి వారం సమీక్షించి ప్రగతి నివేదిక రూపొందిస్తున్నాం. వీఎంఆర్డీఏకు చెందిన, ప్రజలతో సంబంధమున్న ప్రతి అంశాన్ని దీనికి అనుసంధానం చేస్తున్నాం. మెరుగైన ఫలితాలొస్తున్నాయి' అని కమిషనర్ విశ్వనాథన్ పేర్కొన్నారు.

ఎలమంచిలి కాంప్లెక్స్‌కు అన్ని బస్సులొచ్చేలా చర్యలు

ఎలమంచిలి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఎలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులన్నీ వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి చెప్పారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆదివారం తనిఖీ చేశారు. ప్రయాణికులతో మాట్లాడారు. వసతులు పరిశీలించారు. సిబ్బంది విశ్రాంతి కోసం ఏర్పాటు చేసిన గదులను చూశారు. బస్సుల వివరాలు, రాకపోకలపై ఆరా తీశారు. ఎలమంచిలి కాంప్లెక్స్‌లోకి ఎక్స్‌ప్రెస్ బస్సులు రావడంలేదని ప్రయాణికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పరిశుభ్రత బాగోలేదని, ఆక్రమణలు ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. సీపీఎం సత్యనారాయణ, డీపీటీవో ప్రవీణ, డీఈఈ నరసింహారావు, గౌరీ తదితరులు పాల్గొన్నారు. అచ్యుతాపురంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌తో ప్రజా రవాణాకు చెందిన ఉన్నతాధికారులు బ్రహ్మానందరెడ్డి, వి.ప్రవీణ సమావేశమయ్యారు. విద్యార్థులకు ఇబ్బందిలేకుండా బస్సు సర్వీసులను పెంచాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

ఎలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్‌ను తనిఖీ చేస్తున్న ఆర్టీసీ ఎడ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానందరెడ్డి

స్మార్ట్ మీటర్ల రద్దే లక్ష్యంగా ఉద్యమం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించే వరకు ఉద్యమించనున్నట్లు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం ప్రకటించారు. అనకాపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జిల్లాస్థాయి విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్ల విషయంలో ప్రభుత్వం, విద్యుత్తు అధికారులు మొండిగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించి.. ఇప్పుడు సమర్థించడం దారుణమన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శంకరరావు, శ్రీరామ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్లను అడ్డుకోకుంటే ప్రమాదమేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రొంగలి రాము అన్నారు. స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ఆదివారం అచ్యుతాపురం వినియోగదారులతో కలిసి ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. సామాన్యులకు స్మార్ట్ ఇబ్బందులు గురిచేయవద్దని ఆయన కోరారు. నర్మాల అబ్బాయినాయుడు, కర్రి వెంకునాయుడు, రాజుల మాస్టార్, రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న లోకనాథం

హిందుస్థాన్ షిప్‌యార్డు సందర్శన

షిప్‌యార్డులో మొక్క నాటుతున్న కేంద్ర సహాయమంత్రి సంజయ్ సేథ్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: వికసిత్ భారత్ దిశగా హిందుస్థాన్ షిప్‌యార్డు పనితీరు మెరుగ్గా ఉందని కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ప్రశంసించారని సంస్థ యాజమాన్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈనెల 18న విశాఖపట్నం నేవల్ జెట్టీలో నిస్తార్ నౌకను జాతికి అంకితం చేసిన కేంద్రమంత్రి, ఆ తర్వాత షిప్‌యార్డును సందర్శించి, వివిధ విభాగాలను పరిశీలించినట్టు పేర్కొంది. సంస్థ ఆవరణలో మొక్కలు నాటిన మంత్రి.. అధికారులు, సిబ్బందితో మాట్లాడి, వారితో గ్రూప్ ఫొటో దిగారు.

ఎస్‌బీఐ శిక్షణ కేంద్రం సంచాలకుడిగా రాజేశ్వరరావు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి పట్టణంలోని ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి స్టేట్ బ్యాంక్ అనుబంధ గ్రామీణ స్వయం ఉపాధి ఉచిత శిక్షణ సంస్థ (ఎస్‌బీఐ-ఆర్ఎస్ఈటీఐ) సంచాలకుడిగా ఎస్‌బీఐ సీనియర్ మేనేజర్ సీహెచ్ రాజేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సంస్థ ప్రతినిధులు లక్ష్మి, ఈశ్వర్, వెంకట్, అమ్మాజీ తదితరులు అభినందించారు. పెద్దాపురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ సంచాలకులుగా ఉన్న విజయ్‌కుమార్ రాజమహేంద్రవరం ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్‌గా బదిలీ అయ్యారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎస్‌బీఐ అనుబంధ విశాఖ జిల్లా గ్రామీణ స్వయం ఉపాధి ఉచిత శిక్షణ కేంద్రంలో ఆగస్టు రెండు నుంచి మహిళలకు టైలరింగ్, తొమ్మిది నుంచి ఎంబ్రాయిడరీ, ఫ్రేబ్రిక్ పెయింటింగ్ (మగ్గం) కోర్సుల్లో ఉచిత శిక్షణ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సంచాలకుడు రాజేశ్వరరావు చెప్పారు. 31 రోజులపాటు ఇచ్చే ఈ ఉచిత శిక్షణకు ఎంపికైన వారికి భోజనం, వసతి కల్పించడంతోపాటు శిక్షణ అనంతరం ధ్రువపత్రాలు, అర్హులకు రుణాలు మంజూరు చేయిస్తామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల గ్రామీణ ప్రాంతానికి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను అనకాపల్లిలోని పీఎస్ఎం ప్లాజాలో ఉన్న సంస్థ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 80083 33509 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

220 విదేశీ మద్యం సీసాలు స్వాధీనం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఎక్సైజ్ శాఖకు చెందిన టాస్క్‌ఫోర్స్ విభాగం శనివారం రాత్రి లలితానగర్ ప్రాంతంలో దాడులు నిర్వహించి 220 విదేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఈఎస్ ఆర్.ప్రసాద్ తెలిపారు. పిఠాపురం కాలనీలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఆదివారం మధ్యాహ్నం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. లలితానగర్‌లో తిరుపతి వెంకటేశన్ పిళ్లై అనే వ్యక్తి ఒక ఇంటిని గొడౌన్‌గా మార్చి అనధికారికంగా వివిధ దేశాల నుంచి మద్యం సీసాలను సేకరించి విక్రయాలు చేపడుతున్నాడన్నారు. పక్కా సమాచారం రావడంతో శనివారం రాత్రి దాడులు చేశామన్నారు. వెంకటేశన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చెన్నై నుంచి మద్యం సీసాలను తెప్పిస్తున్నట్లు తెలిపాడన్నారు. ప్రస్తుతం దొరికిన 220 విదేశీ మద్యం సీసాలు విలువ సుమారు రూ.15లక్షల నుంచి రూ.18 లక్షల వరకు ఉంటుందన్నారు. మద్యంతో పాటు ద్విచక్రవాహనం, రూ.4310 నగదు, చరవాణి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్, ఎస్సై ముసలనాయుడు, సిబ్బంది కె.వి.ఎం.రాజు, వెంకటేశ్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో సురక్షిత వేట..!

– న్యూస్‌టుడే, విశాఖపట్నం

ప్రాణాలకు తెగించి నడి సంద్రంలో చేపలవేట సాగించే మత్స్యకారులు.. తుపాన్ల సమయంలో అప్రమత్తంగా లేకుండా ముప్పు తప్పదని మత్స్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. గత ఏడాది విశాఖ చేపలరేవు నుంచి సముద్రంలోకి వెళ్లిన పది బోట్లకు విపత్కర పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ ఏడాది ఇప్పటికే వేట ప్రారంభమైన నేపథ్యంలో... తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ జేడీ పి.లక్ష్మణరావు సూచిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..! : విశాఖ చేపలరేవు నుంచి దాదాపు 600 బోట్లు ద్వారా సముద్ర జలాల్లో వేట సాగుతోంది. అవి ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరం వరకు వెళ్తుంటాయి. ఇటీవల వాతావరణ మార్పులతో సముద్రంపై అల్పపీడనాలు ఏర్పడి, ఈదురుగాలులు వీస్తున్నాయి ★ తుపాన్ల సమయంలో వీచే గాలులకు బోట్లు తట్టుకోలేవు. కొన్ని దారి తప్పి అలలపై సుదూర ప్రాంతాలకు కొట్టుకుపోతే, ఇంకొన్ని మునిగిపోతుంటాయి. గతంలో పలుమార్లు ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ★ సాధారణంగా మే- అక్టోబరు నెలల మధ్య తుపాన్లు ఎక్కువగా వస్తుంటాయి. ఈ సమాచారాన్ని మత్స్యకారులు ఎప్పటికప్పుడు తెలుసుకొని అప్రమత్తంగా ఉంటూ చేపలవేట కొనసాగించడం ద్వారా ముప్పు నుంచి బయటపడొచ్చు.

విశాఖ తీరంలో బోట్లు

వివరాల నమోదు తప్పనిసరి: ★ వేటకు వెళ్లే మత్స్యకారులు తమ బోటు నెంబరు, సిబ్బంది వివరాలు, వారి ఫోన్ నెంబర్లు, వేట సాగించే దిశ, ప్రాంతం వంటి వివరాలను కుటుంబ సభ్యులు, సంబంధిత గ్రామ పెద్దలతో పాటు, మత్స్య సహాయకులు, సాగర మిత్రలకు తెలియజేయాలి. ★ బోటులో రక్షణ పరికరాలైన లైఫ్ జాకెట్లు, టార్చ్‌లైట్‌తో పాటు ప్రతి బోటుకు జీపీఎస్ పరికరం అమర్చుకోవాలి. బోట్లుపై సముద్రంలోకి వెళ్లే వారు వీలైనంత వరకు దగ్గర దగ్గరగా వేట సాగించాలి. దీంతో అత్యవసర పరిస్థితిలో పరస్పర సహకారం, సమాచార మార్పిడికి వీలుంటుంది.

తుపాన్ల వేళ మత్స్యకారులకు అధికారుల సూచనలు

★ వేట సమయంలో తుపాన్లు, ఇతర విపత్కర పరిస్థితులు ఎదురైతే... వెంటనే మత్స్యకారులు తమ బోట్లను సమీప ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలకు, లేదా చేపలరేవులకు తీసుకెళ్లాలి. ★ మత్స్యకారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వేట సాగించితే... ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించొచ్చని జేడీ సూచించారు.

వైకాపాకు బొలిశెట్టి రాజీనామా

ఎస్.రాయవరం: మండలంలో వైకాపాకు భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు, ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు ఎంపీపీ పదవికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం రాత్రి ప్రకటించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో సమస్యలు చెప్పుకోవడానికి జగన్ కలిసే అవకాశం కల్పించాలని పార్టీ పెద్దలు, మంత్రులు, జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కన్వీనర్లను కోరినా ఫలితం లేదన్నారు. పార్టీ వల్ల ఎటువంటి ప్రయోజనం పొందలేదు. తమపై పార్టీ చిన్న చూపు చూసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఏ పార్టీలో చేరే ఆలోచన లేదన్నారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

విశాఖపట్నం: నగర ప్రజల సమస్యలు పరిష్కరించేలా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. అన్ని జోనల్, ప్రధాన కార్యాలయాల్లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందన్నారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీల విజేత...'విశాఖ'

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులోని ఆక్వా స్విమ్మింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు రోజుల పాటు జరిగిన పదో రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ స్విమ్మింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో విశాఖ జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. జట్టు క్రీడాకారులు 15 స్వర్ణ, 27 రజత, 23 కాంస్య పతకాలతో 179 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో ఎన్టీఆర్ జిల్లా జట్టు నిలిచింది. ఆ క్రీడాకారులు 22 స్వర్ణ, 12 రజత, 9 కాంస్య పతకాలతో 155 పాయింట్లు సాధించారు. తృతీయ స్థానంలో నిలిచిన కృష్ణా జట్టు క్రీడాకారులు 9 స్వర్ణ, 10 రజత, 15 కాంస్య పతకాలతో 90 పాయింట్లు సొంతం చేసుకున్నారు. విశాఖ జిల్లా స్విమ్మింగ్ సంఘం అధ్యక్షుడు సంతోష్ శెట్టి, ఇతర సభ్యులు ఎన్.విజయకుమార్, ఆర్.విజయకుమార్ హాజరై విజేత జట్లకు ట్రోఫీలు అందించారు. టోర్నీ నిర్వాహకులు, జిల్లా స్విమ్మింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి మోహన్ వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న స్విమ్మింగ్ సంఘం అధ్యక్షుడు సంతోష్‌శెట్టి తదితరులు

మలేసియా మారిటైం విన్యాసాల్లో 'సంధాయక్'

విశాఖపట్నం, న్యూస్‌టుడే : ఇండియన్ నేవీ హైడ్రోగ్రాఫిక్ విభాగానికి(ఐఎన్‌హెచ్‌డీ) చెందిన 'ఐఎన్ఎస్ సంధాయక్' నౌక మలేసియా పర్యటనకు వెళ్లిందని ఆదివారం నేవీ వర్గాలు తెలిపాయి. ఈనెల 16 నుంచి 19 వరకు ఆదేశ మారిటైం సంబంధిత విన్యాసాల్లో భాగస్వామ్యం అయిందని పేర్కొన్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా సముద్ర ఛార్టులను, హైడ్రోగ్రాఫ్‌లను పూర్తి ఆధునికంగా రూపొందించడంలో నౌక సత్తా చాటుతోందని వివరించాయి. మలేసియా క్లాంగ్ పోర్టులో ఆ దేశ నౌకాదళం అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ఈ నౌక పూర్తి దేశీయ సాంకేతికతతో నిర్మితమై, 2024 ఫిబ్రవరిలో జాతికి అంకితమైందని నేవీ వర్గాలు వివరించాయి.

క్లాంగ్ పోర్టుకు చేరిన ఐఎన్‌హెచ్‌డీ వెసల్ సంధాయక్

రెవెన్యూ అధికారులపై కబ్జాదారుల దాడి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వ స్థలం ఆక్రమణను అడ్డుకునేందుకు వెళ్లిన రూరల్ రెవెన్యూ అధికారులపై కబ్జాదారులు దాడికి పాల్పడ్డారు. జీవీఎంసీ ఏడో వార్డు పరిధి రామానాయుడు స్టూడియో కొండ దిగువన తిమ్మాపురం గ్రామంలో సుమారు 80 గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమించి కొందరు భవనం నిర్మిస్తున్నారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిశోర్, వీఆర్వో దుర్గాప్రసాద్‌లు ఆక్రమణను అడ్డుకునేందుకు వెళ్లారు. ఈ సమయంలో కబ్జాకు పాల్పడుతున్న కొర్రాయి రమణమ్మ, కె.అప్పయ్యమ్మ, శ్యామ్ తదితర కుటుంబ సభ్యులు వారిపై దాడికి యత్నించి వాగ్వాదానికి దిగారు. దీంతో రెవెన్యూ ఆర్ఐ ఆక్రమణదారులపై పీఎంపాలెం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అధికారులపై దాడికి పాల్పడిన ముగ్గురిని స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నట్లు సీఐ జి.బాలకృష్ణ తెలిపారు.

తిమ్మాపురంలో ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడం

✦ **ఆక్రమణల జోరు:** ఏడో వార్డు పరిధి తిమ్మాపురం గ్రామంలో కొండలపై ప్రభుత్వ స్థలాలను చదును చేసి విరివిగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. గ్రామంలో పెద్దలుగా చలామణి అవుతున్న కొందరు నాయకులు రాత్రి వేళ దాదాపు 80 నుంచి 100 గజాల స్థలాలను చదును చేసి రూ.8 నుంచి రూ.10 లక్షలకు విక్రయాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే చాలా వరకు కొండ ప్రాంతం కబ్జాల పాలైంది. దీనిపై భీమిలి ఆర్డీఓ దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

FURNITURE & FURNISHING

FINANCIAL SERVICES

We are doing all Loans Personal, Business, Home, Mortgage, Vehicle & Education Loans for all profiles with good service. 9393932337.

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలు లోపు ఫైనాన్స్ చేయబడును (సిబిల్ చూడబడదు). JK అసోసియేట్స్, ✆ 96665 47338.

REAL ESTATE

PLOT FOR SALE

MADHURAWADA

55000/- per sq. yd. 366 sq.yds. E/s corner. vuda plot. Lake view layout, Midhilapuri colony. Cont: 9059837191.

JOBS

Subhodayam!.. Great Job opportunity awaits you in a well established and reputed orgn. in Vizag with excellent income with good working environment. req. M/F candidates above 35 years. Cont: 8885435455.

ప్రముఖ కంపెనీలో ఫుల్/ పార్ట్ టైం చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F), Retd. పర్సన్స్, ఈవెంట్స్ కండక్ట్ చేయుటకు (F) కావలెను. జీతం+ ఇన్‌సెంటివ్స్. ✆ 9985209038.

ప్రముఖ స్వీట్స్ & బేకరీ గాజువాక మల్కాపురంలో పనిచేయుటకు సేల్స్‌మెన్స్ కావలెను. పురుషులు మాత్రమే. భోజనం మరియు వసతి సదుపాయం కలదు. ✆ 9866073366.

ప్రముఖ స్వీట్స్ & బేకరీ సంస్థ వైజాగ్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ మరియు హౌస్‌కీపింగ్ కావలెను. భోజనం సదుపాయం కలదు. ✆ 9948557714.

పెందుర్తిలో మహిళా శక్తి సదన్‌లో ఉండిపోయి పనిచేయుటకు సూపరింటెండెంట్ (F) కావలెను అర్హత Any P.G. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ✆ 7331124498.

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 9014651068, 7075633416.

HR **ఫీల్డ్** ఆఫీసర్లు, సెక్యూరిటీ గార్డులు, టెలికాలర్స్, క్లీనింగ్, హౌస్ కీపింగ్ వారు కావలెను. 10th, డిగ్రీ. జీతం : 14-18K. RSR. Ct: 7702959468, 0891-3570630.

FACULTY/ TEACHERS

Wanted Teachers to Teach Biology and Social for Higher Classes. Sri Ramanjuan School, T.C. Palem, VSP-16. ✆ 8639890047.

DRIVERS

ఆరిలోవ ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు అంబులెన్సు డ్రైవర్ కావలెను. డ్యూటీ: 12 గం॥ -జీతం: 21,000/-. ✆ 9505204279, 8247036280.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పిల్లల్లో మానసిక సమస్యలకు ఉచిత చికిత్స

'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్'లో సకల సౌకర్యాలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే

పిల్లల్లో మానసిక సమస్యలను గుర్తించి చికిత్స అందించడానికి పెదవాల్తేరు ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పథకంలో భాగంగా ఇటీవల దీన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం బాలల్లో మానసిక సమస్యలు పెరుగుతున్నాయని వాటిని ముందుగానే గుర్తించి వైద్య సేవలు అందించాలని, లేకపోతే వయసు పెరిగే కొద్దీ అవి తీవ్ర రూపం దాలుస్తాయని ఆసుపత్రి వైద్యులు చెబుతున్నారు. గతంలో మానసిక ఆసుపత్రిలో వారానికి ఒక రోజు పిల్లలకు ఓపీ ఉండేది. సరైన మందులు కూడా ఉండేవి కాదు. 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్' కారణంగా ఆ సమస్య తీరింది.

● వైద్య సదుపాయాలు ఇలా..: నిత్యం ఓపీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది. ఈ విభాగంలో 40 పడకలు ఉన్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్లు 3, పీజీ వైద్యులు 9 మంది ఉన్నారు. వ్యాధికి చికిత్స అందించిన తర్వాత ఉచితంగా మందులు అందజేస్తారు.

మానసిక ఆసుపత్రిలో పిల్లల ప్రత్యేక విభాగం

● అందించే చికిత్సలు ఇలా..: పలువురు బాలలు హైపర్ యాక్టివ్‌గా ఉంటారు.. విపరీతమైన విసుగు, కోపాన్ని ప్రదర్శిస్తుంటారు. దేనిపైనా ఏకాగ్రత నిలపరు. మిగతా పిల్లల్లో కలవరు. ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారు. ఇలాంటి వారికి బిహేవియర్ థెరపీ ఇచ్చి సాధారణ స్థితికి తీసుకొస్తారు. అవసరమైతే ప్రత్యేక విద్య అందిస్తారు. మాటలు తడబడుతుంటే స్పీచ్ థెరపీ ఇస్తారు.

ప్రయోజన సమాచారం

● 'ప్రస్తుతం రోజుకు 10 నుంచి 15వరకు కొత్త కేసులు వస్తున్నాయి. ఇన్‌పేషెంట్లుగా 25 మంది వరకు ఉన్నారు. 35 నుంచి 40 మంది నిరీక్షణలో ఉంటున్నారు. ఆసుపత్రి సేవలు అవసరమైన వారు 0891-2754918 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలి' అని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి తెలిపారు.

భర్త కళ్లముందే భార్య మృతి

లంకెలపాలెం (పరవాడ)న్యూస్‌టుడే: జాతీయ రహదారి లంకెలపాలెం కూడలికి సమీపంలో ఆదివారం మధ్యాహ్నం రోడ్డు దాటుతున్న మహిళను లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లంకెలపాలెం శ్రీరంగనగర్‌కాలనీకి చెందిన దాసరి లక్ష్మణరావు, **ఆదిలక్ష్మి**(67) భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కూర్మన్నపాలెంలో నివాసం ఉంటున్న పెద్ద కుమార్తె దగ్గరికి వెళ్లేందుకు ఆదివారం భార్యభర్తలిద్దరు పయనమయ్యారు. లంకెలపాలెం కూడలి సమీపంలోని బస్టాప్ వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గాజువాక నుంచి అనకాపల్లి వెళుతున్న సిమెంట్ లారీ ఆదిలక్ష్మిని ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. భర్త లక్ష్మణరావు కొద్ది క్షణాల ముందే రోడ్డు దాటడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. కళ్లెదుటే భార్య మృతిచెందడంతో కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు అక్కడి వారిని కంటతడి పెంటించింది. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. డ్రైవరును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు కార్మికులు ..

విశాఖపట్నం, న్యూస్‌టుడే: డాక్‌యార్డు సమీప ప్రైవేట్ గోదాముల వద్ద గోడ కూలి సివిల్ పనులు చేస్తున్న ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతి చెందిన ఘటనపై ఆదివారం మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాలు.. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన కార్మికులు ధర్మారావు(50), రామారావు(60) భవన నిర్మాణ పనికి వెళ్లారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో వారు పని చేస్తున్న ప్రదేశంలో అయిదున్నర అడుగుల ఎత్తులో ఉన్న గోడ ఒక్కసారిగా కూలిపోయి, వారిపై పడింది. గాయపడిన బాధితుల్ని కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఇద్దరూ చనిపోయారని పోలీసులు తెలిపారు.

నేడు గుర్రంపాలెంలో వ్యవసాయ మంత్రి పర్యటన

పెందుర్తి, న్యూస్‌టుడే: 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం గుర్రంపాలెంలో పర్యటిస్తారని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఇంటింటి ప్రచారంలో మంత్రి పాల్గొంటారన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	95	85
లైవ్	117	105
డ్రెస్‌డ్	170	180
స్కిన్‌లెస్	193	190

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **మైబేబీ**, రామచంద్ర: **3బీహెచ్‌కే** శ్రీసత్య: **ఏమాయ చేశావే**, సత్యనారాయణ స్క్రీన్-1: **జూనియర్**, స్క్రీన్-2: **కన్నప్ప**, వెంకటేశ్వర: **మిస్టర్ రెడ్డి**, పర్తిసాయి: **ఓభామ అయ్యోరామ** షిర్డీసాయి: **కొత్తపల్లిలో ఒకప్పుడు**

అచ్యుతాపురం: స్క్రీన్-1: **కొత్తపల్లిలో ఒకప్పుడు, మై బేబీ** స్క్రీన్-2: **జూనియర్**

27న 'బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: 'బుద్ధుని నా ప్రయాణం' తెలుగు నాటక ప్రదర్శన ఈ నెల 27న విశాఖ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో జరుగుతుందని సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం తెలిపారు. అనకాపల్లిలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన గోడప్రతులు, కరపత్రాలు విడుదలచేసి మాట్లాడారు. బుద్ధుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆఖరి మజిలీకి అంతులేని కష్టాలు

కోతకు గురైన శ్మశానవాటిక

పాయకరావుపేట, న్యూస్‌టుడే

చివరి మజిలీ గ్రామస్థులకు అంతులేని కష్టాలను మిగుల్చుతోంది. పుట్టెడు దుఃఖంతో శ్మశానవాటికకు బయలుదేరితే... అంత్యక్రియలకు పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలోని శ్రీరాంపురంలో శ్మశాన వాటిక కోతకు గురి కావడంతో ఈ దుస్థితి వచ్చింది. గ్రామంలో తాండవ నది ఒడ్డున కాలువ గట్టుపై 30 ఏళ్ల క్రితం సుమారు 11 ఎకరాల శ్మశానవాటిక ఉండేది. క్రమేణా ఏటి కోత కారణంగా ప్రస్తుతం సెంటున్నర మాత్రమే మిగిలింది. దీనిలోనే అన్ని వర్గాలకు చెందిన వారు అంత్యక్రియలు చేపట్టాల్సి వస్తోంది. ఆచారాలకు అనుగుణంగా ఇక్కడ పార్థివ దేహాలను ఖననం చేస్తున్నారు. కొన్ని వర్గాలు సంప్రదాయాన్ని బట్టి మట్టిలో పూడ్చుతారు.

శ్రీరాంపురంలో శ్మశానవాటిక

» ఇక్కడ స్థలం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ఏటి అవతల వైపు ఉన్న ప్రభుత్వ స్థలంలో కర్మఖాండలు నిర్వహిస్తున్నారు. నదిలో నీరు లేని సమయంలో ఇక్కట్లు ఉండటం లేదు. వర్షాకాలం నుంచి డిసెంబరు వరకు నదిలో నీరు ప్రవహిస్తుంది. ఈ సమయంలో మృతదేహాలను పెట్టెలో ఉంచి నదిలో మోసుకు వెళ్లడం సాహసంతో కూడిన పనే. గతంలో నది ప్రవాహం ధాటికి శవపేటిక నీటిలో కొట్టుకుపోయింది. ఒక్కోసారి శవపేటిక మోసే వ్యక్తులు నీటి ఒరవడికి ప్రమాదాల బారిన పడుతున్నారు. శ్మశానవాటికకు ప్రభుత్వం స్పందించి స్థలం కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..:

శ్మశానవాటిక లేక పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. స్థలాన్ని కేటాయించాలని పలుమార్లు కోరాం. వర్షాల సమయంలో అంత్యక్రియలు నిర్వహించాలంటే అన్నీ అవస్థలే. సమస్యను హోంమంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళుతున్నాం. ప్రత్యామ్నాయంగా స్థలం కేటాయించాలి. – **జి.కృష్ణప్రసాద్, సర్పంచి**

కష్టాలు తీర్చాలి..:

అంత్యక్రియలు చేయాలంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. మరుభూమికి తక్కువ స్థలం ఉంది. దీంతో ఏంచేయాలో తెలియడం లేదు. కొంతమంది నదికి ఆవల వైపునకు వెళతారు. నదిలో వరద వచ్చిందంటే ఇక అంతేసంగతులు. అధికారులు సమస్యకు పరిష్కారం చూపాలి. – **శివ, గోవిందరావు**

ఎన్నాళ్లకెన్నాళ్లకు.. కాలువలకు కొత్తరూపు

పాయకరావుపేట, న్యూస్‌టుడే

సాగునీటి రంగానికి ఎట్టకేలకు కొత్తకళ వస్తోంది. ఏళ్ల తరబడి పిచ్చిమొక్కలు, పూడికతో నిండిన కాలువలకు కొత్తరూపునకు నోచుకుంటున్నాయి. సత్యవరం నుంచి మాసాహెబ్‌పేట వరకు ఉన్న ఎంఎస్ పేట, ఊర కాలువల్లో పూడిక తొలగిపోతోంది. మాసాహెబ్‌పేట కాలువకు తాండవ నుంచి నీరు చేరుతుంది. అక్కణ్నించి కొత్త, కోట, ఊర, తుప్పల కాలువల్లోకి దీన్ని సాగునీటి జలాలు వస్తాయి. అక్కడి నుంచి పంటభూముల్లోకి నీరు చేరుతోంది. వీటిపై ఆధారపడి సుమారు మూడు వేల ఎకరాల పంట భూములున్నాయి. వీటి ఆధునికీకరణకు ఇప్పటివరకు ఎవరూ దృష్టి సారించలేదు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో ఎం.ఎస్. పేట ఛానల్‌లోని పిచ్చిమొక్కలు తొలగించారు. దీంతోపాటు ప్రవాహానికి అడ్డులేకుండా శుభ్రం చేయించారు. దీంతోపాటు జలవనరుల శాఖ ఆధ్వర్యంలో ఊర కాలువలో పూడిక తీత పనులు చేపట్టారు. దీనికోసం రూ. 2.65 లక్షలు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం వీటి పనులు చురుగ్గా సాగుతున్నాయి. సాగునీటి ఇబ్బందులకు ఇకపై తెరపడినట్లేనని ఎం.ఎస్. పేట ఛానల్ అధ్యక్షుడు ఎన్. జోగిరాజు, ఉపాధ్యక్షుడు కె.సీతారాం తెలిపారు. కాలువలకు కొత్తరూపు వస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఎం.ఎస్.పేట కాలువ

సీతానగరం గ్రోయిన్‌కు మోక్షం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: సుదీర్ఘ కాలం తరువాత అనకాపల్లి మండలం సీతానగరం గ్రోయిన్‌తో పాటు కాలువల్లో పూడిక తీత పనులు పూర్తి కావడంతో మూడు గ్రామాలకు చెందిన సుమారు 800 ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

సీతానగరం గ్రోయిన్

సీతానగరం, వెంకుపాలెం, కుంచంగి గ్రామాలకు చెందిన భూములు ఈ గ్రోయిన్, అనుబంధ కాలువలపై ఆధారపడి ఉన్నాయి. కొన్నేళ్లుగా సాగునీటి వ్యవస్థను ఎవరూ పట్టించుకోక పోవడంతో గ్రోయిన్, ఆనకట్టలకు ఇబ్బందులు ఎదరయ్యాయన్నారు.

✦ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రతిపాదనలతో సీతానగరం గ్రోయిన్, పంటకాలువల మరమ్మతులకు ప్రత్యేకంగా రూ. 10 లక్షలు మంజూరయ్యాయి. ఇటీవల ఈ పనులు ఎమ్మెల్యే కొణతాల ప్రారంభించారు. ఆయన ప్రత్యేక శ్రద్ధతో పనులు కూడా పూర్తయ్యాయి. దీంతో ఖరీఫ్ సాగులో రైతులకు మేలు జరుగుతుందని విశ్రాంత ఆర్మీ ఉద్యోగి పోలిన సూరి జగ్గారావు తెలిపారు. సుమారు 20 ఏళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే దాడి వీరభద్రరావు హయాంలో మాత్రమే వీటి అభివృద్ధి, మరమ్మతు పనులు జరిగాయన్నారు. మళ్లీ ఇప్పుడు ఎమ్మెల్యే కొణతాల కృషితో ఈ ప్రాంత రైతులకు మేలు జరిగేలా పనులు చేపట్టారని ఆయన వివరించారు.

నేడు ఊడేరులో వైద్య శిబిరం

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఊడేరులో కిడ్నీ సంబంధిత సమస్యలపై సోమవారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది హాజరు కానున్నారు.

కుళ్లిన మాంసం విక్రయాల అడ్డగింత

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఏఎంఏఎల్ కళాశాల కూడలిలో ఆదివారం ఉదయం పంది మాంసం విక్రయాలు జరిగాయి. కుళ్లిన, నిల్వ ఉన్న మాంసం విక్రయిస్తున్నట్లు స్థానికులు వార్డు సభ్యుడు శ్రీనివాస్, సర్పంచి లక్ష్మీ ప్రసన్న దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే ఎంపీహెచ్‌ఓకు ఫోను చేయగా స్పందన లేకపోవడంతో సమీపంలోని వైద్యశాఖ ప్రతినిధి గుర్నాథ గుప్తాకు ఫిర్యాదు చేశారు. కొద్దిసేపటికి అక్కడకు చేరుకున్న గుప్తాతోపాటు కలిసి మాంసం విక్రయాలను అడ్డుకున్నారు.

వైకాపాకు కోలపర్తి శ్రీను రాజీనామా

అనకాపల్లి గ్రామీణం: తుమ్మపాల గ్రామానికి చెందిన వ్యాపారవేత్త కోలపర్తి శ్రీను ఆదివారం వైకాపాకు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రానికి వైకాపా రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్‌కు అందించారు. గత 14 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారు. ఎన్నికల ముందు పార్టీలో చేరిన ఆయన పార్టీలో అంతర్గత విభేదాలు, పార్టీ విధానాలు నచ్చకపోవడంతో రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. గతంలో రెండుసార్లు భాజపా పట్టణ శాఖ అధ్యక్షుడిగా, రాష్ట్ర ఓబీసీ కార్యదర్శిగా పనిచేశారు.

రైతుసంఘం అధ్యక్షునిగా నూకరాజు

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక మూల బంధంలోని మూల రైతు సంఘం ఎన్నికలు ఆదివారం జరిగాయి. సంఘ అధ్యక్షుడిగా దొడ్డి నూకరాజు, కార్యదర్శిగా దాడి శివాజీ అప్పారావు, కోశాధికారిగా సూరిశెట్టి నాగదుర్గారావు, పాలకవర్గ సభ్యులుగా కుంది గంగారావు, దొడ్డి త్రినాథ్ ఎన్నికయ్యారు. దాడి సూర్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో సంఘ సభ్యులు దాడి శివ, దొడ్డి గంగసూరి, రామ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని గ్రీన్ క్లబ్ అధ్యక్షుడు కొణతాల పణిభూషణ్ శ్రీధర్ పేర్కొన్నారు. తగరంపూడి గ్రామంలో ఆదివారం గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో పరిశుభ్రత, పచ్చదనం, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచి యాదగిరి అప్పారావు, వైస్ ఎంపీపీ ఆయితా రాము, తెదేపా నాయకుడు నక్కా వెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గోపాలమిత్రను తొలగించాలని ఫిర్యాదు

మునగపాక, న్యూస్‌టుడే: పశువులకు ఎలాంటి వైద్య సేవలందించకుండా వేతనం పొందుతున్న మూలపేట గోపాలమిత్రను విధుల నుంచి తొలగించి ఆయన స్థానే మరొకరిని నియమించాలని పాడి రైతులు డిమాండ్ చేశారు. మూలపేట పాల సొసైటీలో విధులు నిర్వహిస్తున్న వి.వెంకట సూరి అప్పారావు అయిదేళ్లుగా గోపాలమిత్రగా కొనసాగుతున్నారని రైతులు కె.ఆదినాయుడు, బి.త్రినాథరావు తదితరులు తెలిపారు. విధులకు జరుగుతున్న అప్పారావును తొలగించి ఆయన స్థానే మరొకరిని నియమించాలని కోరుతూ జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారికి ఫిర్యాదు చేశామన్నారు.

తొమ్మిది మద్యం సీసాలతో మహిళ అరెస్టు

కశింకోట: వెదురుపర్తిలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న మహిళను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై పి.మనోజ్‌కుమార్ తెలిపారు. ఆమె నుంచి తొమ్మిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

వాహనాలు మూలకు...

పేటలో చెత్త సేకరణకు ఉపయోగించే వాహనాలు మూలకు చేరాయి. పట్టణంలోని 20 వార్డుల పరిధిలో పారిశుద్ధ్యం మెరుగుకు సుమారు 100 మంది కార్మికులు విధులు నిర్వహిస్తుంటారు. చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు మూడు ట్రాక్టర్లు, మూడు టాటాఏస్‌లు, ఏడు రిక్షాలు వినియోగిస్తున్నారు. వీటిలో రెండేళ్ల క్రితం మూడు టాటా ఏస్‌లు మూలకు చేరాయి. అప్పటి నుంచి మిగిలిన వాహనాల్లో చెత్తను తరలిస్తున్నారు. మరమ్మతులు చేపట్టకపోవడంతో పూర్తిగా వాహనాలు పాడయ్యాయి. కొత్తవాటి ప్రతిపాదనలు పంపించామని ఈవో లవరాజు తెలిపారు. – న్యూస్‌టుడే, పాయకరావుపేట

మూలకు చేరిన వాహనాలు

రహదారిపై పొగ..

రహదారిపై వ్యాపిస్తున్న పొగ

మండలంలోని పలు గ్రామాల్లో చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించకుండా రోడ్ల పక్కనే పోగులు వేస్తున్నారు. ఆ తర్వాత తరచూ చెత్తకు నిప్పు పెడుతుండటంతో రోడ్లపై పొగ వ్యాపిస్తోంది. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ ప్రాంతాల్లో ప్రయాణించడానికి అవస్థలు పడుతున్నారు. ధర్మవరం - అగ్రహారం, పెనుగొల్లు, గెడ్డపాలెం, గుడివాడ, తిమ్మాపురం తదితర గ్రామాల్లో ఎక్కువగా రోడ్ల పక్కనే చెత్తకు నిప్పు పెడుతున్నారు. పంచాయతీ సిబ్బంది చెత్తకు నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎస్.రాయవరం

ప్రమాదమని తెలిసీ..

రహదారులపై ప్రమాదాల నియంత్రణలో ప్రజలు నిబంధనలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నా జనాలకు పట్టడంలేదు. ముఖ్యంగా జాతీయ రహదారిపై సరకు రవాణా వాహనాల్లో ప్రయాణిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. జిల్లాలో పలువురు తుని తలుపులమ్మ లోవ ఆదివారం పదుల సంఖ్యలో వాహనాల్లో జాతరకు ఇలా ప్రమాదకరంగా ప్రయాణాలు చేశారు. దురదృష్టవశాత్తు ఇలాంటి వాహనాలకు ప్రమాదాలు జరిగితే ప్రాణనష్టం ఊహించడానికే కష్టం. ఆషాఢమాసం చివరి ఆదివారం కావడంతో అధికసంఖ్యలో భక్తులు లోవకు తరలివెళ్లారు. టోల్‌గేట్ వద్ద రద్దీ నెలకొంది. – న్యూస్‌టుడే, నక్కపల్లి

సరకు రవాణా వాహనాల్లో ప్రయాణిస్తున్న జనం

శిష్ట కరణాల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన శిష్ట కరణాల సంఘం నూతన కార్యవర్గం

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని వివేకానంద హాల్‌లో ఆదివారం శిష్ట కరణాల సంక్షేమ సంఘం 55వ వార్షికోత్సవం, సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2025-27 కాలానికి కార్యవర్గ ఎన్నికలు న్యాయవాది పోలాకి శ్రీనివాస పట్నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా శీలరామంత్రి వి.ఎన్. పట్నాయక్, అధ్యక్షుడిగా పక్కి రమేశ్, ఉపాధ్యక్షులుగా పోలాకి సునీత, జగ్గుమంత్రి రమాదేవి, రాజమహంతి రాంబాబు, కంఠిమహంతి లక్ష్మణరావు, గొడబ తారక రామారావు, ప్రధాన కార్యదర్శిగా డబ్బీరు విష్ణుమూర్తిలతోపాటు ఆరుగురు సహాయ కార్యదర్శులు, ఇద్దరు ట్రెజరర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉల్లాసంగా లాంగ్‌వాక్ పోటీలు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్త్రీ, పురుషులకు ఆదివారం లాంగ్‌వాక్ పోటీలు నిర్వహించారు. స్థానిక రింగ్‌రోడ్డు కూడలి నుంచి ప్రారంభమైన ఈ పోటీలను క్లబ్ అధ్యక్షులు బీఎస్ఎంకే.జోగినాయుడు ప్రారంభించారు. అధికసంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవంలో భాగంగా ఈ పోటీలు నిర్వహించినట్లు పాలక వర్గ సభ్యులు తెలిపారు. విజేతలకు ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డీడీ నాయుడు బహుమతులు అందజేశారు. బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు పెంటకోట నర్సింగరావు, ఛైర్మన్ పీఎస్ అప్పారావు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి భర్ని కాన శ్రీనివాసరావు, బుద్ద రమణాజీ పాల్గొన్నారు.

లాంగ్‌వాక్ పోటీల్లో పాల్గొన్న సభ్యులు

భూములకోసం ఇబ్బంది పెట్టొద్దు

నక్కపల్లి, న్యూస్‌టుడే: బల్క్ డ్రగ్ పార్కు నిమిత్తం అదనపు భూముల పేరిట ఇబ్బంది పెట్టొద్దని జానకయ్యపేటకు చెందిన రైతులు, అఖిలపక్ష నాయకులు కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, వైకాపా మండలశాఖ అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి తదితరుల ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో స్థానికులంతా సమావేశమయ్యారు. భూసేకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే పరిశ్రమ నిమిత్తం వందల ఎకరాలు తీసుకున్నారని, ఇది చాలదంటూ చుట్టుపక్కల గ్రామాల్లోని పంట భూములు లాక్కోవడం సరికాదన్నారు. వీటిని తీసుకుంటే జీవనాధారం కోల్పోతామని, ముఖ్యంగా కాలుష్య కారక పరిశ్రమలతో మనుగడ ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళనలో కురందాసు సింహాచలం, కురందాసు అప్పలరాజు, నానాజీ, మామిడి బాబ్జి, దేవర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జానకయ్యపేటలో నాయకులు, రైతుల నినాదాలు

ఘనంగా మరిడమ్మ పండగ

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాకలో మరిడమ్మతల్లి పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఆషాఢమాస ఆదివారం ఈ పండగ చేయడం ఆనవాయితీ. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళా పూజారులను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు వీరికి హారతులు పట్టారు. ఆలయానికి వెళ్లి దర్శనాలు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది. రేబాక గూడుపమ్మతల్లికి భారీ ఎత్తున సారె సమర్పించారు. పలు గ్రామాల నుంచి భక్తులు వివిధ రకాల పిండివంటలు తయారు చేసి ఆలయం వద్దకు తెచ్చారు. ధర్మకర్త గొట్టిముక్కల శ్రీహరిరాజు, సర్పంచి సాదిరెడ్డి శ్రీనివాసరావు, సమరసత సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

గవరపాలెం సంతోషి మాతకు పాలాభిషేకం

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోటలో ఆదివారం మోదకొండమ్మ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శారదా నది ఆవల ఉన్న అమ్మవారి దేవాలయాన్ని భక్తులు, మహిళలు ఉదయం నుంచి దర్శించుకుని పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

నెహ్రూచౌక్ (అనకాపల్లి): గవరపాలెం సంతోషిమాత ఆలయంలో దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మారిశెట్టి భాస్కరరావు, కార్యనిర్వాహణాధికారి బి.మురళికృష్ణ, అర్చకులు సరిపల్లి కామేశ్వరరావు పాల్గొన్నారు.

కోటవురట్ల, న్యూస్‌టుడే: కొడవటిపూడిలో తలుపులమ్మ జాతం నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి దేవాలయం వద్ద బారులుతీరి, పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధి తెరువుపల్లి గ్రామంలో ఆదివారం బురదమాంబ జాతర వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ పండగ రోజు గ్రామస్థులంతా బురద జల్లుకుంటారు. గ్రామ పెద్ద జయరాం, కూటమి నాయకులు లాలం సోమినాయుడు, కరణం రవికుమార్, దిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని యానాద్రి అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల అమ్మవారి జాతరనిర్వహించారు. దీన్ని పురస్కరించుకుని అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

రేబాకలో సారె ఊరేగింపు

ఉపమాకలో మహిళల కోలాటం

శాకంబరిగా నూకాలమ్మ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని నూకాలమ్మ ఆలయంలో అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని ఆలయ నిర్వాహకులు కూరగాయలతో అలంకరించారు. భక్తులు దర్శనానికి భారీగా తరలి వచ్చారు. పూజలు చేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధి

రాంబిల్లి: పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చెప్పారు. లాలంకోడూరులో గ్రామస్థులతో ఆదివారం ఆయన సమావేశం అయ్యారు. గ్రామానికి సమీపంలో పరిశ్రమల ఏర్పాటుతో కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని, గ్రామాన్ని తరలించాలని గ్రామస్థులు ఎమ్మెల్యేను కోరారు. జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ లాలం భవాని, వైస్ ఎంపీపీ కశిరెడ్డి నరసింగరావు, మాజీ సర్పంచులు లాలం సత్యప్రసాద్, లాలం రమేష్‌నాయుడు, కూటమి నాయకులు వి.దిన్నుబాబు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ

అనకాపల్లి పట్టణం, కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ అన్ని వేళలా కార్యకర్తలకు అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. కొత్తూరులో జరిగిన పార్టీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల మరణించిన కొత్తూరు పంచాయతీకి చెందిన గొలగాని వెంకటరావుకు పార్టీ నుంచి వచ్చిన బీమా పరిహారం రూ. అయిదు లక్షల చెక్కును మృతుని నివాసానికి వెళ్లి, కుటుంబ సభ్యులకు అందజేశారు. వెంకటరావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనకాపల్లి 84వ వార్డు గొల్లవీధి ప్రాంతంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. 81వ వార్డు నిదానం దొడ్డి ప్రాంతంలో గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర పర్యటించారు.

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్ అయిదేళ్లు చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని రక్షించి చంద్రబాబు నాయకత్వంలో ఇప్పుడిప్పుడే రాష్ట్రం వికాసం వైపు అడుగులు వేస్తోందని ఏపీ రహదార్ల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. రావిపాలెంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం కార్యక్రమం జరిగింది. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్, మండలపార్టీ అధ్యక్షులు పీలా తులసీరామ్, చిన్నయ్యనాయుడు పాల్గొన్నారు.



కొత్తూరులో బీమా చెక్కు అందజేస్తున్న గోవింద

రావిపాలెంలో ప్రచారం చేస్తున్న ప్రగడ, పప్పల, రాజాన

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాజయ్యపేటలో తెదేపా నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమంతోపాటు, చేపట్టిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో పిక్కి కోదండరావు, వాసుపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి: పట్టణంలో తెదేపా నాయకులు ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. క్లస్టర్ కన్వీనర్ కరణం రవికుమార్, నేతలు శ్రీమంతుల శ్రీను, పండాల చంద్రరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త నియామకంలో అన్యాయం

అచ్యుతాపురం: వైకాపా విజయం కోసం పనిచేసిన వారిని అంగన్‌వాడీ కార్యకర్తగా నియమించడానికి ఎమ్మెల్యే సహకరించడం అన్యాయమని, గ్రామంలో రాజకీయంగా ఇబ్బంది పడుతున్నామని కూటమి నాయకులు విచారం వ్యక్తం చేశారు. తిమ్మరాజుపేటలో తెదేపా, జనసేన, భాజపా నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. గత ఎన్నికల్లో సుందరపు విజయకుమార్ విజయానికి అంకితభావంతో పనిచేసినా అంగన్‌వాడీ కార్యకర్తగా తాము సూచించిన మహిళను కాదని మరొకరని సిఫార్సు చేశారని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైన నిరుపేదరాలు అయిన మంత్రి సునీతకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరుతున్నట్లు తెలిపారు. తెదేపా నేతల కర్రి ఆదిబాబు, రేవిడి కృష్ణ, సర్పంచి శరగడం భాగ్యలక్ష్మి, శివబాపునాయుడు, జనసేన నాయకులు నాగార్జున, ఆడారి నర్సింగరావు, కర్రి జోగినాయుడు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని వేల్పులవీధిలోని సులభ్ కాంప్లెక్స్ నుంచి దుర్వాసన వస్తోంది. శుభ్రం చేయడం లేదు. సమస్యను పరిష్కరించగలరు. – **నాగేంద్రకుమార్, అనకాపల్లి**, ✓: సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. – **రవి కుమార్, శానిటరీ సూపర్‌వైజర్, అనకాపల్లి**

పాయకరావుపేట: ?: పాయకరావుపేటలోని పండరీపురంలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. పాములు, తేళ్లతో ఇబ్బందులు పడుతున్నాం.– **పోలిశెట్టి శ్రీనివాస్, స్థానికుడు**, ✓: పిచ్చిమొక్కలు తొలగించేందుకు చర్యలు చేపడతాం. స్థలం యజమానికి తాఖీదులు జారీ చేస్తాం. – **లవరాజు, ఈవో**

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ?: ఎలమంచిలి పట్టణంలోని దిమిలి రోడ్డులో ఆక్రమణలతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. – **వి.బాబులు ఎలమంచిలి**, ✓: ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తాం. ఇప్పటికే పాతజాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాం. –**ప్రసాదరాజు, కమిషనర్, ఎలమంచిలి**

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ?: కొండకర్లలో మురుగునీ టి వ్యవస్థ అధ్వానంగా ఉంది. కాలవుల్లో నీరు ప్రవహించడంలేదు. – **చంద్రశేఖర్, కొండకర్ల**, ✓: మురుగు కాలవలు శుభ్రంచేసి ఇబ్బందులేకుండా చూస్తాం. –**శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, కొండకర్ల**

స్పందనకు వందనం

వీధి దీపాల ఏర్పాటు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజుగారి బీడులో గ్రామసచివాలయం పక్క వీధిలో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఈనెల 17న 'పేటలో చీకటిదే రాజ్యం' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఈవో లవరాజు స్పందించారు. పాడైన దీపాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేశారు.

బలవంతం చేయొద్దు

కొత్తూరు (అనకాపల్లి): ఇంటి యజమానుల నుంచి స్వచ్ఛందంగా దరఖాస్తు ఉంటేనే ఆ ఇంటికి స్మార్ట్‌మీటర్ వేయాలని, ఒత్తిడి చేసి వేయవద్దని పౌర సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు ఆదివారం కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న అధికారులు, సిబ్బందికి కాళ్ల తేలయ్యబాబు, పెంటకోట శ్రీనివాసరావు వినతిపత్రాలు అందజేశారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

సత్యసాయి ధ్యాన మందిరంలో సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు

సామూహిక వ్రతాలు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా దేవరాపల్లిలోని సత్యసాయి ధ్యాన మందిరంలో ఆదివారం సామూహిక సత్యసాయి, సత్యనారాయణమూర్తి స్వామి వ్రతాలు జరిగాయి. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, జోనల్ ఇన్‌ఛార్జ్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం నేడు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరుగుతుందని ఎంపీడీఓ సువర్ణరాజు పేర్కొన్నారు. ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరవుతారని తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి అధికారులంతా తమ శాఖలకు చెందిన పూర్తి సమాచారంతో రావాలన్నారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి: కొత్తపల్లిలో ఒకప్పుడు, ఐ నో వాట్ యు డిడ్ లాస్ట్ సమ్మర్, ఆడి2: ఏ మాయ చేసావే, సూర్య సన్ ఆఫ్ కృష్ణన్, ఆడి3: జూనియర్, సూపర్ మ్యాన్, ఆడి4: SMURFS, జురాసిక్ వరల్డ్, సూపర్‌మ్యాన్, బంగార్రాజు: మై బేబీ, రాజు: జూనియర్, చోడవరం: శ్రీసాయిలక్ష్మి: జూనియర్, సాయిలక్ష్మి: మై బేబీ, పూర్ణ: 3బీహెచ్‌కే

శక్తి అస్త్రం.. ఆడబిడ్డలకు అభయం

నర్సీపట్నం, న్యూస్‌టుడే

వారం కితం నర్సీపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో కొందరు ఆకతాయిలు వెకిలి చేష్టలతో విద్యార్థినులను ఇబ్బంది పెట్టారు. దీంతో ఒక అమ్మాయి తన ఫోన్‌లోని శక్తి యాప్‌తో పోలీసులకు సమాచారం చేరవేసింది. వెంటనే శక్తి బృందం పోలీసులు అక్కడ ప్రత్యక్షమయ్యారు. ముగ్గురు ఆకతాయిలను గుర్తించి స్టేషన్‌కు తీసుకువెళ్లి తల్లిదండ్రులను సైతం రప్పించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

★ కొత్తకోట నుంచి ఆర్టీసీ బస్సులో నర్సీపట్నంలోని కళాశాలకు బయలుదేరిన విద్యార్థినితోపాటు ఉన్న మరో అమ్మాయిని ఓ యువకుడు వేధించాడు. బస్సు దిగిన తరువాత సైతం వెకిలి వేషాలతో వెంటపడ్డాడు. దీంతో ఇబ్బంది పడుతున్న ఆమెను అటువైపు వస్తున్న శక్తి గ్రూప్ కానిస్టేబుల్ గుర్తించి వెంటనే సదరు యువకుడిని స్టేషన్‌కు తీసుకొచ్చి ఇన్‌స్పెక్టర్లతో కౌన్సిలింగ్ నిర్వహించారు.

★ నర్సీపట్నం ప్రాంతంలో యువతులు, బాలికలు, గృహిణులు తరుచూ ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. వీటికి అడ్డుకట్టు వేసేందుకు శక్తి బృందాలతో పోలీసులు నిరంతరం నిఘా ఉంటున్నారు. ఇలాంటి సంఘటనలకు ఎవరూ భయపడన వసరం లేదని పట్టణ, గ్రామీణ సీఐలు గోవిందరావు, రేవతమ్మ చెబుతున్నారు. అరచేతిలోని 'శక్తి' యాప్ ఆయుధంతో తక్షణం రక్షణ పొందవచ్చని సూచిస్తున్నారు. ప్రతి నెలా సుమారు 400 మంది చేత ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. ఇప్పటికే పలు విద్యా సంస్థల్లోని విద్యార్థినులకు దీనిపై అవగాహన కల్పించారు. అమ్మాయిలపై నేరాలకు ఆస్కారం ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్, రామారావుపేట తదితర చోట్ల ఉన్న కళాశాలలు, శివపురంలోని హాస్టళ్ల ప్రాంతాలను హాట్ స్పాట్లుగా గుర్తించారు.

ఆపద సమాయాల్లో ఇలా చేయండి..

విద్యార్థినులు, మహిళలు ఎవరైనా సరే అత్యవసరమనుకుంటే చరవాణిలోని ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేయడం లేదా గాలిలో షేక్ చేయడం వల్ల ఆపదలో ఉన్నట్లు కాల్ సెంటర్‌కు సందేశం వెళ్తుంది. దీనిపై దగ్గర్లోని పోలీసుస్టేషన్‌కు సమాచారం అంది రక్షణకు చర్యలు తీసుకుంటారు. 'సేఫ్ ట్రావెల్ బటన్ క్లిక్ చేస్తే ప్రయాణాల్లో ఉన్నవారిపై నిఘా కొనసాగుతూ వారు గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకునేలా సహకరిస్తారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గ్రామీణ సీఐ రేవతమ్మ, పక్కన పట్టణ సీఐ గోవిందరావు

నిశ్చింతగా ఉంటున్నాం

శక్తి యాప్‌తో ఇప్పుడు మహిళలు నిశ్చింతగా ఉంటున్నారు. పోలీసులు సకాలంలో స్పందించి రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఆకతాయిల చేష్టలకు కళ్లెంపడుతోంది. కళాశాలకు వెళ్లాలంటే ఇన్నాళ్లు భయంగా ఉండేది. – సీహెచ్ తారక, బైపీసీ ద్వితీయ సంవత్సరం, నర్సీపట్నం

స్టేషన్‌కు రానవసరం లేదు

విద్యార్థినులు, మహిళలు ఎవరైనా ఇబ్బందికి గురైతే స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదు. శక్తి యాప్ తోనూ, లేదా ఒక్క ఫోన్ చేసినా చాలు. వెంటనే తగిన రక్షణకు, అవసరమైన సహాయక చర్యలు చేపట్టడానికి సిద్ధంగా ఉంటాం. – గోవిందరావు, రేవతమ్మ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, నర్సీపట్నం

తారకరామా జలాశయానికి మంచిరోజులు

తారక రామాజలాశయం

మాడుగుల, న్యూస్‌టుడే: మాడుగులలో జలవనరుల శాఖ పరిధిలోని తారకరామా జలాశయాన్ని పూర్తి చేయడానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేస్తున్న ప్రయత్నం ఫలించే దిశగా అడుగులు పడుతున్నాయి. శనివారం చోడవరం వచ్చిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి ఈ జలాశయం నిధులు మంజూరుకు విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించారు.

చేయాల్సిన పనులు

❖ 800 అడుగుల కాలువ తవ్వకం. కాలువ పనులకు భూసేకరణ చేయడం. ❖ మట్టి గట్టు గండిని పూడ్చడం. రాతి రివిట్‌మెంటు సరిచేయడం. పూడికతో నిండిపోతున్న కాలువను సరిచేయడం. ❖ 4 పిల్లకాలువలు తవ్వాలి.

గండిద్వారా వృథాగా పోతున్న సాగునీరు

పనులు ఎందుకు ఆగిపోయాయంటే..

జలాశయం తాటిపర్తి వద్ద తాచేరుపై నిర్మించారు. ఆయకట్టులో కె.జె.పురం గ్రామానికి చెందిన పాత ఆయకట్టు 1300 ఎకరాలు జలాశయంలో కలపలేదు. అదిదాని చేస్తే పనులు ఎప్పుడో పూర్తి అయ్యే అవకాశం ఉండేది. ఈపాత ఆయకట్టును జలాశయం పరిధిలో కలపడం తెలిసి ఆయకట్టు రైతులు పనులు ముందుకు సాగనీయలేదు. దీంతో 66మీ. కాలువకు 800 మీటర్ల కాలువ తవ్వకం సాగకుండా నిలిచి పోయింది. 2006లో వచ్చిన వరదలకు జలాశయం పొంగి మట్టిగట్టు తెగిపోయే పరిస్థితి వచ్చింది. అప్పటి అధికారులు మట్టిగట్టుకు గండి కొట్టి వరద నీటిని విడుదల చేశారు. గండి ప్రాంతంలోనే తమ పాత ఆయకట్టుకు నీరివ్వాలని పట్టుదలతో మడుమ నిర్మించాలని రైతులు పట్టు పట్టడంతో దానికి మిగిలిన ఆయకట్టు రైతులు అంగీకరించక పోవడంతో వివాదం ఏళ్ల గడిచింది. అనక్కడే సమసిపోయి పనులు చేపట్టేందుకు మార్గం సుగమమై నిధుల కొరత తలెత్తింది. ప్రస్తుతం ఆ సమస్య పరిష్కారం దిశగా పనులు జరుగుతుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

★ తారకరామా జలాశయానికి 1988లో శంకుస్థాపన జరిగింది. అప్పట్లో ఇది తెదేపా హయాంలోనే రూ.4 కోట్లతో చేయడానికి నిధులు మంజూరు చేశారు. అప్పటి నుంచి నత్తనడక పనులతో ప్రభుత్వాలు మారే పోవడంతో పనులు ముందుకు సాగక మూడు దశాబ్దాలుగా అసంపూర్తి పనుల కారణంగా నీటి వృథా జరుగుతోంది. జలవనరుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాడుగుల మండలంలో అసంపూర్తిగా ఉన్న జలాశయాలపై దృష్టి సారించారు. ఆయన కృషికి ఫలితంగా పెద్దేరు జలాశయం పనులకు రూ.84 కోట్లు మంజూరయ్యాయి. దాని తరువాత తారక రామా జలాశయాన్ని పూర్తి చేయించే లక్ష్యంతో ఈ ఏడాదిలో పెరిగిన ధరల ప్రకారం ఆ శాఖ అడిగిన మేరకు రూ.16.45 కోట్లు నిధుల అంచనా దస్త్రం ఉన్నతాధికారులకు పంపించారు.

నిధులు మంజూరు చేస్తే పనులు

జలాశయం పనులకు నిధులు మంజూరు కాకపోవడం అడ్డంకి. నిధులు మంజూరు చేస్తే ఈ ఏడాదిలో పనులు పూర్తి చేసి రైతులకు నీరిస్తాం. ఇప్పటికే 2,200 ఎకరాలకు సాగు నీరందించేందుకు పనులు పూర్తి చేశాం. కాలువ పూడిక తీయించాం. - దేవేంద్రరావు డీఈఈ తారక రామాజలాశయం

ఈ భవనం పూర్తయ్యేదెప్పుడో?

అసంపూర్తిగా సచివాలయ భవనం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. లోపూడిలో భవనం నాలుగేళ్లు గడిచినా పూర్తి కాలేదు. స్లాబు వేసి, గోడలు నిర్మించి వదిలేశారు. ప్లాస్టరింగ్, ఇతరత్రా పనులు పూర్తి చేయలేదు. చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. తుప్పలు మాటున పాడుబడిన భవనంలా కనిపిస్తోంది. మరోవైపు వసతి సదుపాయం లేకపోవడంతో సచివాలయ కార్యాలయాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అక్కడ సరైన సదుపాయాలు లేక సిబ్బంది చెట్ల కింద కూర్చోని విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీ నుంచి సరిగా అద్దె చెల్లించడం లేదంటూ భవన యజమానులు వచ్చి అప్పుడప్పుడు కార్యాలయానికి తాళాలు వేస్తున్నారు. సొంత భవనాన్ని పూర్తిచేయకుండా వదిలేయడంతో ఏళ్లతరబడి అద్దెభవనంలోనే కాలం వెళ్లదీస్తున్నారు.

మూడేళ్ల తర్వాత కాలువకు జలకళ

కూటమి ప్రభుత్వ చొరవతో ఆనకట్టకు మరమ్మతులు
ఆయకట్టు రైతుల్లో ఆనందం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: మూడేళ్ల తర్వాత మంగళపురం ఆర్ఎస్ ఛానల్‌లో జలకళ కనిపిస్తోంది. నీటి ప్రవాహంతో కాలువ కళకళలాడుతోంది. కూటమి ప్రభుత్వం చొరవతో ఆనకట్టు మరమ్మతులు పూర్తయ్యాయి. ఆనకట్టు నుంచి కాలువ ద్వారా నీరు రావడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మంగళాపురం సమీపంలో బొడ్డేరుపై ఆనకట్టు నుంచి కుడి, ఎడమ కాలువల ద్వారా సాగుభూములకు నీరందుతోంది. కుడి కాలువ ద్వారా బుచ్చెయ్యపేట మండలంలో ఉన్న మంగళాపురం, కుముందానుపేట, విజయరామరాజుపేట గ్రామాలకు, ఎడమ కాలువ ద్వారా చోడవరం మండలం లక్ష్మీపురం తదితర గ్రామాలకు నీరు ప్రవహిస్తోంది. రెండు కాలువల కింద సుమారు 4వేల ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. మూడేళ్ల కిందట భారీ వర్షాలకు ఒక పక్క పెద్ద గండి పడి నీరంతా వృథాగా పోయేది. దీనివల్ల ఆయకట్టు భూములకు నీరందక అన్నదాతలు అవస్థలుపడాల్సి వచ్చింది.

★ ఆనకట్టుకు మరమ్మతులు చేయించి సాగు నీటి కష్టాలు తీర్చమని స్థానిక నాయకులు, రైతులందరూ కోరేవారు. ఎట్టకేలకు అప్పటి అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు బి.సత్యవతి స్పందించి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.40 లక్షల నిధులు మంజూరు చేయించారు. వీటితో కొంతవరకు పనులు జరిగాయి. నిధులు చాలకపోవడంతో నిలిచిపోయాయి. కూటమి నాయకుల చొరవతో అసంపూర్తిగా ఉన్న ఆనకట్ట పనులకు ఓ కొలిక్కి వచ్చాయి. విజయరామరాజుపేట మాజీ సర్పంచి దొడ్డి కిషోర్ తదితరులు ఈ సమస్యను ఎమ్మెల్యే రాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. వారిద్దరూ విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌తో మాట్లాడి రూ.8లక్షల నిధులు కేటాయించడంతో పనులు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే రాజు కూటమి నాయకులతో కలిసి ఆనకట్టను పరిశీలించి పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మరమ్మతులు చేయించామని పేర్కొన్నారు.

మంగళాపురం ఆర్ఎస్ ఛానల్‌లో ప్రవహిస్తున్న నీరు

మార్కెట్ కమిటీ సభ్యుల నియామకం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా కిల్లో ఊర్మిళ నియమితులైన సంగతి తెలిసిందే. వైస్ ఛైర్మన్‌గా రొబ్బ యశ్వంత్, సభ్యులుగా గొల్లి దేవి, వరలక్ష్మి, సేవా ఈశ్వరమ్మ, కినిబిరి రాజేశ్వరి, ముట్టడం శరభన్నదొర, బెండ అప్పారావు, బిటికెల కమల, ఎస్ చెన్నకేశవ, నంబరా సత్యవతి, పెదరెడ్డ జోతాలమ్మ, బండారు సాంబమూర్తి, కిముడు కృష్ణమూర్తి, జైదు ప్రమీలలను నియమించారు. త్వరలో ప్రమాణస్వీకారం చేస్తామని ఛైర్‌పర్సన్ తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాలకు ప్రాధాన్యం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యమిస్తోందని తెదేపా చింతపల్లి పట్టణ అధ్యక్షుడు రీమల ఆనంద్ తెలిపారు. ఆదివారం అంతర్లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పథకాలు వివరించారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామన్నారు. తెదేపా నాయకులు అనిల్‌కుమార్, గాంధీ పడాల్, ముర్లభాస్కర్, మంగ్లు పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: మండలంలోని పొట్టిదొరపాలెం గ్రామంలో మృతుల కుటుంబాలకు ఆదివారం జనసేన నేతలు ఆర్థికసాయాన్ని అందించారు. ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మండపాక బాబూరావు తన సొంత నిధులతో ఇటీవల కాలంలో మృతిచెందిన పలువురి కుటుంబాలకు రూ. రెండు వేలు చొప్పున అందజేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీఎస్ఎన్ రాజు చేతులమీదుగా ఈ నగదు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన కార్యకర్తలను రాజు అభినందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు అందరూ కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు డి.ఎస్. నాయుడు, బుదిరెడ్ల అరుణ్, గోవింద్, బలిజ మహరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాద ప్రాంతం.. అధ్వాన మార్గం

చీడికాడ మండలం కోనాం మధ్యతరహా జలాశయం పరిసర ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. ఇక్కడి ప్రకృతి అందాలను తిలకించేందుకు చేరుకునే వారికి అధ్వానంగా ఉన్న ఈ రహదారి స్వాగతం పలుకుతోంది. ప్రధాన రహదారి నుంచి జలాశయానికి రావడానికి ఉన్న రోడ్డంతా రాళ్లు తేలి గుంతలతో దర్శనమిస్తోంది. గురుకుల పాఠశాల ముందు నుంచి జలాశయం ముఖద్వారం వరకు సిమెంటు నిర్మించాలని సందర్శకులు, రైతులు కోరుతున్నారు.
– చీడికాడ, న్యూస్‌టుడే

కోనాం జలాశయం వెళ్లడానికి రాళ్లుతేలిన మార్గం

కేజేపురంలో ఘనంగా మోదమాంబ జాతర

అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు, నాయకులు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కేజేపురం గ్రామంలో మోదమాంబ అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఆషాఢమాసం ఆఖరి ఆదివారం అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమం భాగంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, అనకాపల్లి జిల్లా తెదేపా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, వ్యవసాయకమిటీఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, సర్పంచి జామి రమణబాబు పాల్గొన్నారు.

దొండపూడిలో ముత్యాలమ్మ పండగ

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని దొండపూడిలో గ్రామదేవత ముత్యాలమ్మతల్లి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. మెయిన్ రోడ్డును ఆనుకొనివున్న అమ్మవారి గుడికి ఉదయం నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

ముత్యాలమ్మ జాతరలో నేలవేషాలు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని పి.పొన్నవోలు, గర్నికం, మరుపాక, తట్టబంద గ్రామాల్లో దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న నలుగురు బాధిత రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.5.83 లక్షల ఆర్థిక సాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్‌రాజు అందజేశారు. పొన్నవోలుకు చెందిన ముచ్చకర్ల వరహాలమ్మకు రూ.1.20 లక్షలు, గర్నికంకు చెందిన అర్లి చిన నూకరాజుకు రూ.1.24.015, మరుపాక వెలుపురి సత్యలక్ష్మి రూ.1.21.223, తట్టబందకు చెందిన నమ్మి అప్పారావుకు రూ.2.18.290 ఆర్థిక సాయం చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు కోమటి శంకరరావు, మరుపాక ఎంపీటీసీ సూర్యనారాయణ, తట్టబంద సర్పంచి గోకివాడ రమణ, తట్టబంద ఎంపీటీసీ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం, న్యూస్‌టుడే: నిరుపేదలైన వారికి సీఎం సహాయ నిధి పేరిట ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 13 బాధితులకు ఆర్థిక సాయం కింద రూ.9.53 లక్షల చెక్కులను బాధితులకు ఆయన అందజేశారు. అనారోగ్యం పాలైన ఆకస్మిక దుర్ఘటనలు సంభవించినా సంబంధిత బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, వార్డు సభ్యులు సంతోష్, దివ్య, పార్టీ నాయకులు బొబ్బిలి ఈశ్వరరావు, విస్సు రావికమతం మండల పార్టీ అధ్యక్షుడు శంకరరావు, పుల్లేటి శంకరరావులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

పారదర్శకంగా పోస్టుల భర్తీకి వినతి

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలో ఆశా కార్యకర్తల పోస్టులను పారదర్శకంగా భర్తీ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ సుందరరావు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ కోరారు. ఇన్‌ఛార్జి డీఎంహెచ్ఓ విశ్వేశర రావునాయుడిని ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ. . జిల్లాలో 124 ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. సామాజిక ఆరోగ్య కార్యకర్తలుగా పనిచేస్తున్నవారిని ఆ గ్రామాల్లో ఆశా కార్యకర్తలుగా నియమించాలని కోరారు.

డీఎంహెచ్ఓకు వినతిపత్రం సమర్పించిన సీఐటీయూ, గిరిజన సమాఖ్య నేతలు

కొత్తలైన్ ఏర్పాటుతో సమస్యకు పరిష్కారం

చీడికాడ, న్యూస్‌టుడే: ఎన్నోఏళ్ల నాటి సమస్యకు విద్యుత్తు అధికారులు పరిష్కారం చూపారు. చీడికాడ రైతు సేవా కేంద్రం నుంచి ఉప్పరగూడెం కూడలి వరకు ప్రధాన రహదారిలోని ఒకే విద్యుత్తు స్తంభానికి చీడికాడ, జైతవరం, చీడికాడ ఎల్‌టీ లైన్‌కి మూడు ఫీడర్‌లు ఉండటంతో చాలా ప్రమాదకరంగా ఉండేది. ఈ సమస్యను విద్యుత్తు శాఖ అధికారులు చొరవచూపి పరిష్కరించారు. రైతు సేవా కేంద్రం నుంచి ఉప్పరగూడెం కూడలి వరకు కొత్తగా విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేసి తీగలను బిగిస్తున్నట్లు చీడికాడ విద్యుత్తు శాఖ జేఈ భాస్కరరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ భూషణం, మండల లైన్‌మెన్ వరహాలు తెలిపారు.

కొత్తలైన్‌కు విద్యుత్తు తీగలు బిగిస్తున్న విద్యుత్తు సిబ్బంది

వైద్య శిబిరానికి స్పందన

కె.కోటపాడు, న్యూస్‌టుడే: ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదలపాలిట ఆరోగ్య సంజీవని అని సత్యసాయిసేవా సంస్థల జిల్లా రక్తదాన శిబిరాల కోఆర్డినేటర్ పైలగోపి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వైద్య శిబిరంలో ఈ మేరకు మాట్లాడారు. దాదాపు 150 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో బండారు నారాయణపాత్రుడు, కన్నూరు అప్పలనాయుడు, డోకల నర్సింహమూర్తి పాల్గొన్నారు.

శిబిరంలో తనిఖీ చేస్తున్న వైద్యులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవసరం: ఏఐఎస్ఎఫ్

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం శోచనీయమని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర అన్నారు. ఆదివారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ తక్షణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయడంతో పాటు విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈనెల 21 నుంచి సంక్షేమ వసతి వసతిగృహాలను సందర్శించి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోరుతూ ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. జిల్లాలో పలు వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కొరవడినట్లు తెలిపారు. పలుచోట్ల సొంత భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు బి.బాజ్జి అధ్యక్షత వహించారు. నాయకులు జగదీష్, సింహాద్రి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల దాతృత్వం

చోడవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా గాంధీగ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వంటశాల వద్ద ఎటువంటి నీడ కల్పించే సదుపాయాలు లేవు. దీంతో ఎండ, వర్షానికి విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. దీంతో ప్రధానోపాధ్యాయుడు రంగారావు ప్రత్యేక చొరవతో మిగిలిన ఉపాధ్యాయుల సహకారంతో వంటశాల వద్ద రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టారు. ఇందుకు దాదాపు రూ.50 వేలు తమ సొంత నగదును వెచ్చించారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వి.విజయేంద్ర ప్రసాదు తన ఎంపీ నిధులు రూ.25 లక్షలు వెచ్చిండం ద్వారా నిర్మించిన షెడ్డును సోమవారం నుంచి అందుబాటులోకి రానున్నట్లు ప్రధానోపాధ్యాయుడు రంగారావు తెలిపారు.

వంట శాల వద్ద విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు సొంత నిధులతో నిర్మించిన రేకుల షెడ్

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743, చోడవరం - 80085 74732, మాడుగుల - 80085 74740 చీడికాడ - 80085 74742

?: ప్రధాన రహదారిలో కాలువలో పూడిక తీయడం లేదు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి వెళ్లే కాలువలోనే పూడిక పేరుకుపోయింది. – బాబు, చోడవరం.
★ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పూడిక తొలగిస్తాం. – కె.శ్రీనివాసరావు, కార్యదర్శి, చోడవరం.

?: జగన్న చావిడి వద్ద మురుగు కాలువలు దుర్వాసనతో అధ్వానంగా ఉన్నాయి. దోమలు ప్రబలి జనం బాధలు పడుతున్నారు. – వాలంకి రమేష్, జగన్న చావిడి, మాడుగుల, ★ తొందరతోనే పారిశుద్ధ్య కార్మికులను పంపించి మురుగు పూడిక తీయిస్తాం. – నారాయణ రావు, సేనటరీ ఇన్‌స్పెక్టర్, గ్రామ పంచాయతీ, మాడుగుల

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని సత్యవరం గ్రామంలో సచివాలయం పక్కనే రూ 3 లక్షలతో నిర్మాణం చేపట్టిన సామాజిక మరుగుదొడ్లు చుట్టు, పిచ్చిమొక్కలు, డోర్లు పోయి నిరుపయోగంగా ఉన్నాయి. – సచివాలయ సిబ్బంది, సత్యవరం.★ పరిశీలన చేసి మరుగుదొడ్ల చుట్టు ఉన్న పిచ్చితుప్పలు తొలగించి వినియోగంలోకి తీసుకొస్తాం. – ఎంపీడీవో కొంకి అప్పారావు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలోని పెదబొడ్డేపల్లిలో రావిచెట్టు వద్ద చాలా రోజుల నుంచి కుళాయి నీరు వృథాగా పోతోంది. ఎన్ని ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. – జి.వెంకటరాజు, బొడ్డేపల్లి, ★ సిబ్బందిని పంపించి అక్కడ నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటాం. – ఎం.రవి, మున్సిపల్ ఏఈ, నర్సీపట్నం

ప్రమాదమని తెలిసీ..

రహదారులపై ప్రమాదాల నియంత్రణలో ప్రజలు నిబంధనలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నా జనాలకు పట్టడంలేదు. ముఖ్యంగా జాతీయ రహదారిపై సరకు రవాణా వాహనాల్లో ప్రయాణిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. జిల్లాలోని పలువురు తుని తలుపులమ్మ లోవకు ఆదివారం పదుల సంఖ్యలో వాహనాల్లో ఇలా ప్రమాదకరంగా ప్రయాణాలు చేశారు. దురదృష్టవశాత్తు ఇలాంటి వాహనాలకు ప్రమాదాలు జరిగితే ప్రాణనష్టం ఊహించడానికి కష్టమే. ఆషాఢమాసం చివరి ఆదివారం కావడంతో అధికసంఖ్యలో భక్తులు లోవకు తరలివెళ్లారు. టోల్‌గేట్ వద్ద రద్దీ నెలకొంది. – న్యూస్‌టుడే, నక్కపల్లి

సరకు రవాణా వాహనాల్లో ప్రయాణిస్తున్న జనం

రాకపోకలు ఎలా..!

చోద్యం నుంచి కొయ్యూరు మండలం కంతారం మీదుగా బొర్రంపేట వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. ఏడు కి.మీ. దూరం ప్రయాణించేందుకు గంటకుపైగా సమయం పడుతోంది. 20 కి.మీ. ప్రయాణిస్తే నాతవరం, కాకినాడ జిల్లా రాజవొమ్మంగి చేరుకునే అవకాశం ఉన్నా.. 40 కి.మీ. చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని చోదకులు వాపోతున్నారు.
– న్యూస్‌టుడే, గొలుగొండ

కూటమి ప్రభుత్వంలో సాగునీటి వనరులకు జీవం

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతో సాగునీటి వనరులకు జీవంవచ్చిందని రైవాడ జలాశయ ఛైర్మన్ పాత్రునాయుడు పేర్కొన్నారు. ఆయన ఆదివారం వారాడ బ్రాంచి కాలువ పూడికతీత పనులను జలవనరులశాఖ డీఈ సత్యం నాయుడు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ పనులకు రూ.7 లక్షలు మంజూరయ్యాయని ఛైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో కాలువ ఛైర్మన్ బొడ్డు ఉమాదేవి, రాష్ట్ర వెలమకార్పొరేషన్ డైరెక్టరు రొంగలి మహేశ్, సర్పంచి బొడ్డు అక్కునాయుడు, జలవనరుల శాఖ ఏఈ నందకిశోర్‌తోపాటు ప్రాదేశిక సభ్యులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభిస్తున్న డీఈ సత్యంనాయుడు, జలాశయ ఛైర్మన్ పాత్రునాయుడు తదితరులు

పూడికతీత పనులు ప్రారంభం

దేవరాపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని కొత్తూరు కాలువ పూడికతీత పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎ.కొత్తపల్లి సమీపంలోని రాళ్లకట్టు నుంచి ఈ పనుల్ని చేపట్టారు. జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు, వైస్ ఛైర్‌పర్సన్ భర్త అక్కునాయుడు, రైవాడ జలాశయ డీఈఈ సత్యం నాయుడు ఈ పనుల్ని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తి, న్యూస్‌టుడే
లక్ష్మీకాంత్ స్ర్కీన్-1 - **జూనియర్**
స్ర్కీన్-2 - **మై బేబీ**

ఇంకుడు గుంతల నిర్వహణతో ప్రయోజనం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఇంకుడు గుంతల నిర్వహణతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, జీవీఎంసీ పరిధిలో సాధించిన ఫలితాలతో రూపొందించిన 'రెయిన్ హార్వెస్ట్ పిట్ గైడ్ బ్రోచర్'ను మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆదివారం 87వ వార్డు తిరుమలనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఉదయ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కేఎస్ఆర్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్టీల్‌క్లబ్ ఉత్సవాలు

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కునగరంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న స్టీల్‌క్లబ్ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన క్లబ్ అధ్యక్షులు, ఉక్కు జీఎం(హెచ్‌ఆర్) ఇంఛార్జి ఎం.మధుసూదనరావు మాట్లాడారు. ఈ మేరకు ఐక్యంగా ఉత్సవాలను విజయవంతం చేసిన క్లబ్ సభ్యుల్ని అభినందించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆయా కళాకారుల్ని క్లబ్ నిర్వాహకులు సత్కరించారు. ఉక్కు జీఎం (యుటిలిటీస్) వి.చిట్టిబాబు, క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, సభ్యులు రవికుమార్, వేణుగోపాల్, నరసింహం, కృష్ణయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: 93వ వార్డు గౌతం నగర్‌లో రహదారులు అస్తవ్యస్తంగా ఉండటంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంది. - శ్రీనివాసరావు, గౌతం నగర్ ✓: రహదారులు మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపడతాం. - హేమవతి, జోనల్‌కమిషనరు, జోన్-8

సబ్బవరం న్యూస్‌టుడే: ?: సబ్బవరం మెయిన్ రోడ్డులో దీపాలు వెలగటం లేదు. రాత్రి వేళల్లో ప్రయాణం సాగించాలంటే భయమేస్తోంది. - కె.సూర్యనారాయణ సబ్బవరం. ✓: చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం - అశోక్ కుమార్ ఏఈ ఏపీడీసీఎల్ సబ్బవరం

?: సబ్బవరంలో కుక్కలు పెరిగిపోయాయి. రాత్రివేళ అడ్డగించి కాటేస్తున్నాయి. కుక్కలను పట్టి వాటి సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టాలి - వి.బంగారు కృష్ణ సబ్బవరం. ✓: కుక్కలను పట్టించే ఏర్పాటు చేస్తాం. సమస్యను పరిష్కరిస్తాం.
- వై రాజేశ్వరరావు కార్యదర్శి, సబ్బవరం.

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ విద్యుత్తు సబ్‌స్టేషన్ కూడలి వద్ద బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బస్‌లు వచ్చే వరకు దుకాణాల వద్ద ఎండలో వేచి ఉండాల్సి వస్తోంది. - నారాయణరావు, ప్రయాణికుడు. ✓: సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పరిష్కారానికి కృషి చేస్తాం - ధర్మారావు, ఈవోపీఆర్డీ, పరవాడ

కాలువ శుభ్రం చేయించారు

స్పందనకు వందనం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలం గుర్రమ్మపాలెం పంచాయతీ అక్కిరెడ్డిపాలెం గ్రామంలో కాలువలు పూడుకుపోయాయని స్థానికులు 'ఈనాడు మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు శనివారం 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి మండల డిప్యూటీ ఎంపీడీవో కామేశ్వరరావు స్పందించారు. సిబ్బందితో కాలువలు శుభ్రం చేయించి పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. దీనిపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

ఇళ్లు నిర్మించకుంటే పట్టా రద్దు

పేదల గృహనిర్మాణ పథకంపై కలెక్టర్ ఆదేశాలు
గ్రామసభల నిర్వహణకు అధికారుల సన్నాహాలు

పెందుర్తి, న్యూస్‌టుడే: గృహనిర్మాణ పథకంలో భాగంగా పేద, బలహీనవర్గాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయకుంటే పట్టాలు రద్దు చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు గ్రామ సభలు నిర్వహించి నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మూడు రోజుల క్రితం గృహనిర్మాణ పథకాల పురోగతిపై ఆయన సమీక్షించారు. నిర్మాణాలు పూర్తి చేయడంపై మండల స్థాయి అధికారులకు తగు సూచనలు చేశారు. దీంతో లబ్ధిదారుల్లో చలనం మొదలయ్యే అవకాశాలున్నాయి.

కూటమి ప్రభుత్వం అదనంగా రూ.50వేలు మంజూరు

పెందుర్తి మండలంలోని తొమ్మిది గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న 15 గ్రామ పంచాయతీల్లో 1785 ఇళ్లను గత ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ నిర్మాణం చేపట్టేందుకు గత ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80లక్షల సొమ్ము ఎటూ సరిపోని నేపథ్యంలో చాలా మంది లబ్ధిదారులు అప్పట్లో ముందుకు రాలేదు. మొత్తం నిర్మాణాల్లో 936 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. చాలా ఇళ్లు పునాది స్థాయిలోనే ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గృహనిర్మాణ పథకంపై దృష్టి సారించింది. నిర్మాణాలు చేపట్టేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అదనంగా మరో రూ.50వేలు మంజూరు చేసింది.

ఆ పట్టాల రద్దుకు సన్నాహాలు

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయని లబ్ధిదారుల పట్టాలను రద్దు చేసేందుకు గృహనిర్మాణ శాఖాధికారులు పూర్తి సన్నాహాలు చేస్తున్నారు. ముందుగా గ్రామసభలు ఏర్పాటు చేసి నిర్మాణాలు పూర్తి చేయాలని సూచిస్తారు. లబ్ధిదారులు స్పందించకపోతే పట్టాలు రద్దు చేస్తామని నోటీసులు పంపుతారు. దాన్ని కూడా బేఖాతరు చేస్తే పట్టా రద్దు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

గుర్రమ్మపాలెం గృహనిర్మాణ లేఅవుట్‌లో అరకొరగా నిర్మాణాలు

పెందుర్తి మండలంలో ఇళ్ల నిర్మాణ పురోగతి ఇలా..

మొత్తం ఇళ్లు	1785
పూర్తయిన నిర్మాణాలు	936
ఇంకా ప్రారంభం కానివి	3
పునాది స్థాయికి దిగువన ఉన్నవి	215
పునాది దశలోనే ఉన్నవి	434

అవగాహన కల్పిస్తాం

ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని లబ్ధిదారుల్లో అవగాహన కల్పించి కలెక్టర్ ఆదేశాలను తెలియజేస్తాం. గృహనిర్మాణ పథకాల లే అవుట్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఇప్పటికే ఆదేశించారు. - నాగేశ్వరరావు, గృహనిర్మాణ శాఖ ఏఈ, పెందుర్తి.

'రెండు నెలల్లో వేపగుంట - పినగాడి రహదారి పూర్తి'

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

సీసీ రహదారుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ప్రజా ప్రతినిధులు

రాంపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: వేపగుంట - పినగాడి రహదారి రెండు నెలల్లో పూర్తవుతుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు హామీ ఇచ్చారు. పెందుర్తి మండలం రాంపురం గ్రామంలో రూ.2.25 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఆదివారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేపగుంట - పినగాడి రహదారి నిర్మాణానికి అనేక ఆటంకాలు ఎదురైనా ఎన్నో ప్రయత్నాలు చేసి ర.భ.శాఖ నుంచి ఎన్‌వోసీ తీసుకువచ్చినట్లు తెలిపారు. పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. రాంపురం గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైకాపా నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ముందుగా ఉపాధి హామీ నిధులతో చేపట్టిన రోడ్లు, కాలువలు, అంగన్‌వాడీ భవనాల ప్రారంభోత్సవం చేసిన అనంతరం జలజీవన్ మిషన్ ద్వారా నిర్మించనున్న నీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి, రాంపురం, సరిపల్లి ఎంపీటీసీ సభ్యులు గండి హిమబిందు, గొల్లవిల్లి రమణ, జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గంగునాయుడు, పెందుర్తి భాజపా కన్వీనర్ గొర్లె రామునాయుడు, పెందుర్తి ఎంపీడీవో గుండు అప్పలరాజు, డీఈ పీవీ.రమణమూర్తి, ఏఈ లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎంవీవీ సత్యనారాయణ, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

వెదుళ్లనరవలో ఇటీవల అక్రమంగా నిర్మించిన షెడ్డు

సబ్బవరం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్లనరవ రెవెన్యూ సర్వే నెం.99/18లో 1.53 ఎకరాల గెడ్డ వాగు భూమి ఉంది. మూడేళ్ల కిందట ఈ స్థలంలో ఓ వ్యక్తి వేసిన షెడ్డును సబ్బవరం రెవెన్యూ అధికారులు తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇప్పుడు అదే స్థలంలో మరో వ్యక్తి షెడ్డు నిర్మించారు. దీనిపై గ్రామస్థుడు ఉరుకూటి దండుబాబు ప్రశ్నించగా... ఆక్రమణకు పాల్పడిన వ్యక్తి ఇతర మహిళలతో దాడి చేయించినట్లు బాధితుడు సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామచంద్రరావు తెలిపారు.

ఊరించి.. వెనక్కి వెళ్లిన మేఘాలు

వేపగుంటలో ఆదివారం సాయంత్రం మేఘావృతమైన ఆకాశం

వేపగుంట, న్యూస్‌టుడే : ఆదివారం ఉదయం నుంచి ఎండతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారి మేఘావృతమై కనిపించింది. దీంతో వాతావరణం కాస్త చల్లబడినప్పటికీ వర్షం పడకుండా మేఘాలు వెనక్కి మరలిపోవడంతో వేపగుంట వాసులు నిరాశకు గురయ్యారు. రాత్రిసరికి కొద్దిపాటి చిరుజల్లులు పడటంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఇళ్ల మేడలపై నుంచి పలువురు తిలకించారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కరపత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు

లంకెలపాలెం (పరవాడ) న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. వార్డు పరిధి లంకెలపాలెం బీసీ కాలనీలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాదికాలంగా చేస్తున్న సంక్షేమం, అభివృద్ధితో పాటు భవిష్యత్తులో అమలుచేయబోయే పథకాల గురించి వివరించి కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అర్జున్, రామారావు, మూర్తి, చిన్నారావు, అప్పారావు, నూకరాజు, సూరిబాబు పాల్గొన్నారు

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా

రహదారిపై వృథాగా పోతున్న నీరు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల పరిషత్ కూడలికి సమీపంలోని ఏపీఐఐసీకి చెందిన పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోయింది. పరవాడ ఫార్మాసిటీలోని ఏపీఐఐసీకి చెందిన పంపు హౌస్ నుంచి అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో ఉన్న పరిశ్రమలకు భూగర్భం ద్వారా తాగునీటిని సరఫరా అందించేందుకు దశాబ్దాల క్రితం పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. గత కొంత కాలంగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. వెంటనే పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు

ప్రారంభించి పక్కన పెట్టేశారు..

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ సంతబయలువద్ద నూతనంగా నిర్మించిన సచివాలయం-1 భవనం నిరుపయోగంగా మూతపడి ఉంది. సుమారు రూ.35 లక్షల వ్యయంతో గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టారు. భవన నిర్మాణ పనులు అన్ని హంగులతో పూర్తిచేసి 2024 సార్వత్రిక ఎన్నికలకు కొద్దిరోజుల ముందు అప్పటి ప్రజాప్రతినిధులు హడావుడిగా ప్రారంభించారు. అప్పటి నుంచి ఏడాదిన్నరగా భవనం మూతపడి ఉంది. ఈ భవనం పూర్తి స్థాయి సేవలు అందించడానికి సరిపోకపోవడంతో నేటికీ పాత పంచాయతీ భవనంలోనే సచివాలయ సేవలను అందిస్తున్నారు. ఇప్పటికైనా భవనాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా ఉన్న పరవాడ సచివాలయం-I భవనం

తొట్టెలు సరే.. నీరు మరి..?

ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కు శివారు కొండ ప్రాంతం వద్ద నిరుపయోగంగా తొట్టె

పరవాడ, న్యూస్‌టుడే: మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం(ఎన్‌ఆర్‌ఈజీఎస్) నిధులతో నీటి తొట్టెలను నిర్మించారు. మేతకు వెళ్లిన పశువులకు నీటిని అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో రూ.30 వేలు ఖర్చు చేసి నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం ఈ.భోనంగి సాలిడ్ వేస్టుమెనేజ్‌మెంట్ ప్లాంటు మార్గంలో, ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కు శివారు కొండప్రాంతం వద్ద నిర్మించిన రెండు నీటి తొట్టెలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. నీటిని నింపకపోవడంతో పశువులను మేతకు తీసుకువెళ్లే సమయంలో ఇబ్బంది పడుతున్నామని పాడి రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తొట్టెల్లో నీరు నింపేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా బీఆర్టీఎస్ డక్ట్‌లు

వేపగుంట, న్యూస్‌టుడే : బీఆర్టీఎస్ రహదారిలో వర్షపునీరు, మురుగునీరు ప్రవహించేందుకు ఏర్పాటుచేసిన డక్ట్‌లపై మూతలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. దీంతో మురుగునీరు బయటకు పొంగిపొర్లి రోడ్డుమీదకు వచ్చేస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పాదచారులు నడిచివెళ్లేటప్పుడు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సమస్య మరింత ఎక్కువగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాలని వాహనదారులు, స్థానికులు, కాలనీవాసులు కోరుతున్నారు. ఈ విషయమై జెడ్సీ హేమావతిని వివరణ కోరగా.. డక్ట్‌ల విషయాన్ని ప్రాజెక్టు అధికారులకు తెలియజేసి మూతలు వేయించే ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఎల్జీ పాలిమర్స్ కూడలి వద్ద మురుగుతో నిండిన డక్ట్

మురుగుతో తప్పని ఇక్కట్లు

రహదారి మధ్యలో నిలిచిపోయిన మురుగు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ క్రమశిక్షణనగర్ పోర్టు కాలనీ వాసులకు భూగర్భ మురుగు నీటి వ్యవస్థతో కష్టాలు తప్పడం లేదు. సత్యానగర్ పార్కు సమీపంలోని హంస ఆర్కేడ్ బహుళ అంతస్తుల భవనం ఎదురుగా యూజీడీ పంపు నుంచి మురుగు గత కొన్ని రోజులుగా రహదారి మధ్యలో నిలిచిపోతోంది. దీనిని పట్టించుకునే వారే లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోయారు. నిత్యం దుర్వాసన వెదజల్లుతుందని అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

సీఎం సహాయ నిధి అందజేత

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం మల్లునాయుడుపాలెం, గ్రామానికి చెందిన రావిపల్లి పైడంనాయుడు అనారోగ్యంతో బాధ పడుతున్న విషయాన్ని తెలుసుకుని పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండిబాబ్జీ ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి రూ.2,01,607 మంజూరు చేయించారు. ఈ మేరకు మంజూరైన చెక్కును ఆదివారం బాధితుడికి అందించారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం మాజీ ఎంపీపీ, సబ్బవరం పీఏసీఎస్ ఛైర్మన్ గండి దేముడు, మండల తెదేపా అధ్యక్షుడు బలిరెడ్డి అప్పారావు, నాయకులు బలిరెడ్డి సూర్యప్రసాద్, అప్పారావు, బలిరెడ్డి రాము, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడుకి చెక్కును అందిస్తున్న పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, నాయకులు

అక్కిరెడ్డిపాలెంలో రక్తదాన శిబిరం

గుర్రమ్మపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలం గుర్రమ్మపాలెం పంచాయతీ పరిధిలోని అక్కిరెడ్డిపాలెంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. యువ ఫౌండేషన్, గ్రామ యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఎక్కువగా యువత పాల్గొని రక్తదానం చేశారు. ఈ మేరకు నగరానికి చెందిన ఫస్ట్ రక్తనిధి కేంద్రం ప్రతినిధులు మొత్తంగా 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో త్రివేణి ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ శంకర్, కొప్పిశెట్టి ప్రసాద్, గ్రామ యువత పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఔత్సాహికులు, నిర్వాహకులు

వీధిదీపాలు, తాగునీటి బోర్లు మంజూరు

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ 88వ వార్డుకి మూడవ విడతగా 50వీధి దీపాలు, 11 మంచినీటి బోర్లు మంజూరైనట్లు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు తెలిపారు. అవసరాన్ని గుర్తించి ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన మంచినీటి బోర్లను ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. దీనికి సహకరించిన ఎమ్మెల్యే పంచకర్ల, తెదేపా ఇన్‌ఛార్జి గండిబాబ్జీ, మేయర్ పీలా శ్రీనువాసరావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మంచినీటి బోరును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు

దుర్గమాంబ ఆలయంలో 25 నుంచి శ్రావణమాస పూజలు

శ్రీదుర్గమాంబ అమ్మవారు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం దుర్గమాంబ ఆలయంలో శ్రావణ మాసం పూజలు ఈ నెల 25నుంచి ఆగస్టు 23 వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఆయా తేదీల్లో జరగనున్న పూజలను వివరించారు. మొదటి శుక్రవారం 25న సామూహిక కుంకుమార్చనలు జరుగుతాయని తెలిపారు. ఆగస్టు 1న సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన గాజుల అలంకరణ ఉంటుందని తెలిపారు. 8న సాయంత్రం వరలక్ష్మీదేవి వ్రతం, కుంమార్చన, బంగారు వెండి పుష్పాలతో అమ్మవారికి పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 15న అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకాలు జరుగుతాయన్నారు. 22న అమ్మవారికి సారె ఊరేగింపు ఉంటుందన్నారు. కుంకుమార్చనలో పాల్గొనాలనుకునే భక్తులు ముందుగా ఆలయ కమిటీ వారిని సంప్రదించి గోత్ర నామాలతో పేర్లు రాయించుకోవాలని సూచించారు.

శివాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న సోమునాయుడు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం శివాలయానికి మండలంలోని తవ్వవానిపాలేనికి చెందిన బోకం శ్రీనివాస్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈమేరకు ఆతని సోదరుడు సోమునాయుడు చేతులమీదుగా ఆదివారం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దంగేటి నాగేశ్వరావు, గెడ్డం కృష్ణ, బర్ల రమణ, కోరాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం

వేపగుంట, న్యూస్‌టుడే: అలమేలు మంగాదేవి, పద్మావతి సమేత శ్రీనివాసకల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలగాణ్య బ్రాహ్మణ అభ్యుదయ సమాజం 52వ వసంతాల స్వర్ణోత్సవం సందర్భంగా వేపగుంట-పినగాడి రహదారిలో చీమలాపల్లి సమీప మీనాక్షీ కన్వెన్షన్ సెంటర్‌లో కల్యాణోత్సవం జరిపారు. ఉదయం సుప్రభాతసేవతో వేడుక ప్రారంభమైంది. అనంతరం తోమాలసేవ, విశేష అలంకరణ, నీరాజన మంత్ర పుష్పములు, మహానివేదన, ప్రసాద వితరణ జరిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సైబర్ నేరాలపై నియంత్రణపై అవగాహన

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: సాంకేతికత అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతమవుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ సూచించారు. 97వ వార్డు చినముషిడివాడ పాత గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సైబర్ నేర అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గుర్తు తెలియని నంబర్లతో వచ్చే ఫోన్లకు, అనుమానాస్పద ఎస్ఎమ్ఎస్‌లకు, వాట్సాప్ సందేశాలకు స్పందించడం, ఇతరులకు సమాచారం పంపడం వంటివి చేయవద్దని సూచించారు. పిల్లలకు స్మార్ట్ ఫోన్లు అవసరం మేరకే ఇవ్వాలని తెలిపారు.

అవగాహన సదస్సులో పాల్గొన్న సీఐ సతీశ్‌కుమార్, స్థానిక మహిళలు

సమస్యల పరిష్కారానికి కృషి

వేపగుంట, న్యూస్‌టుడే: బాలాజీగార్డెన్ కాలనీలో కార్పొరేటరు రాపర్తి కన్నా ఆదివారం పర్యటించారు. స్థానిక అపార్ట్‌మెంట్ వాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కాలనీ వాసులు మురుగు సమస్య ప్రధానంగా ఉందని, కొన్నిచోట్ల వీధిదీపాలు వెలగడంలేదని ఆయనకు వివరించారు. అంచెలంచెలుగా ప్రతీ సమస్యను పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

బాలాజీగార్డెన్ కాలనీవాసులతో చర్చిస్తున్న కార్పొరేటర్ రాపర్తికన్నా

నిర్వహణ లేక.. వీధి దీపాలు వెలగక..

వెలగని వీధిదీపం

అంధకారంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
పట్టించుకోని అధికారులు

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డుపరిధి దేశపాత్రునిపాలెంలో వీధి దీపాల నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో సంభాలు ఉన్నా వీధి దీపాలు అమర్చకపోవడం, కొన్ని చోట్ల దీపాలు ఉన్నా మరమ్మతులకు గురై మూలకు చేరడంతో రాత్రి వేళల్లో చీకటి అలుముకుంటోంది. దీంతో నిత్యం వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు నానా యాతన పడాల్సి వస్తోంది.

ఇదీ పరిస్థితి..:

★ నిత్యం వాహనదారులు, పాదచారులతో రద్దీగా ఉండే జాజులవానిపాలెం నుంచి దేశపాత్రునిపాలెం వరకు గల మెయిన్‌రోడ్డు వెంబడి పలు చోట్ల వీధి దీపాలు కొంతకాలంగా వెలగడం లేదు. అదే మార్గంలో కొన్ని స్తంభాలకు దీపాలు అమర్చకుండా నిరుపయోగంగా వదిలేశారు. ప్రస్తుతం వర్షాల కారణంగా మరికొన్ని చోట్ల దీపాలు వెలుగుతూ, ఆరిపోతూ ఉన్నాయి.
★ బస్టాపు వద్ద సాయంత్రమైతే వెలుగులు లేకపోవడంతో సమీపంలో పనులు చేసుకునే వారు ఇబ్బంది పడుతున్నారు. ★ ఆశిస్ ఎస్టేట్స్‌కు వెళ్లేమార్గంలో అంధకారంతో బయటకు వెళ్లాలంటే భయపడాల్సి వస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు. కుక్కల బెడదతో పాటు విష పురుగులు రహదారిపైకి వస్తున్నా కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన చెందుతున్నారు.

ఆశిష్ ఎస్టేట్స్‌కు వెళ్లే దారిలో అంధకారం

సమస్య పరిష్కరిస్తాం..

వర్షాకాలంలో విద్యుత్తు సమస్యలు తలెత్తుతాయి. ఎక్కడ వీధి దీపాలు వెలగకపోయినా విద్యుత్తు సిబ్బందితో మాట్లాడి ప్రజలు ఇబ్బంది పడకుండా మరమ్మతులు చేయిస్తున్నాం. నిరుపయోగంగా ఉన్న స్తంభాలకు దీపాలను అమర్చి వెలిగే విధంగా చర్యలు చేపడతాం.
- వార్డు కార్పొరేటర్, రౌతు శ్రీనివాసరావు

● ఆంజనేయస్వామి ఆలయానికి తుది మెరుగులు

పరవాడ, న్యూస్‌టుడే: మండలకేంద్రం పరవాడ సంతబయలు వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయం అన్ని హంగులతో రూపుదిద్దుకుంటోంది. దశాబ్దాల క్రితం నిర్మించిన స్వామి వారి ఆలయం శిథిలావస్థకు చేరడంతో దాన్ని తొలగించి ఆ స్థానంలో దాతల సహకారంతో గ్రామస్థులు నూతన ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. దాదాపు పనులు పూర్తికావడంతో రంగులు వేస్తున్నారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తిచేయించి ఆలయ ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నట్లు సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు తెలిపారు.

శ్రద్ధాంజలి


శ్రీ జి. జగన్నాథ రావు
President
Port Employees Union
Visakhapatnam

విశాఖపట్నం పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు **శ్రీ గాజుల జగన్నాథ రావు** గారు తే॥ **19-07-2025** ది రాత్రి స్వర్గస్తులయ్యారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం ప్రసాధించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ H.M.S.

(c) eenadu

ఈనాడు అనంతపురం
సోమవారం జులై 21, 2025

ఎందుకిలా మారుస్తున్నారు?

■ బోధనేతర ఉద్యోగుల బదిలీలపై విమర్శలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో బోధనేతర ఉద్యోగుల బదిలీలపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎస్కేయూలో కొత్తగా ఉపకులపతి, కులసచివులు బాధ్యతలు స్వీకరించారు. నూతన ఉన్నతాధికారుల పాలన ఏర్పడి ఈ నెల 19వ తేదీ నాటికి ఏడాది పూర్తయ్యింది. ఈ ఏడాది కాలంలో బోధనేతర ఉద్యోగులను ఐదుసార్లు బదిలీ చేశారు. ఒక ఉద్యోగికి నాలుగుసార్లు వేరువేరు విభాగాలకు మార్చారు. మరికొందరిని రెండుసార్లు బదిలీ చేశారు. గతంలో ఒకసారి బదిలీ అయితే కనీసం ఒకటి, రెండేళ్ల వరకు బదిలీ చేసేవారు కాదు. మొదటిసారి 60 మందిని బదిలీ చేశారు. ఆ తరువాత ఎడాపెడా సీట్లు మారుస్తూనే ఉన్నారు. తాజాగా శుక్రవారం 16 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తరచూ నిర్వహిస్తున్న బదిలీల్లో ఏదో మతలబు ఉందని ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. బోధనేతర ఉద్యోగుల్లో రెగ్యులర్ ప్రాతిపదికన సుమారు 200 మంది, టైంస్కేల్ ఉద్యోగులు 160, మినిమంస్కేల్ ఉద్యోగులు 220 మంది పని చేస్తున్నారు. విద్యార్థులకంటే బోధనేతర ఉద్యోగులే ఎక్కువ మంది ఎస్కేయూలో పని చేస్తున్నారు. అవసరం ఉన్నా లేకపోయినా బదిలీలు చేస్తున్నారనే ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు.

వైకాపా అనుయాయులకే ప్రాధాన్యం

విశ్వవిద్యాలయం రాజకీయాలకు అడ్డాగా మారింది. అప్పట్లో కొందరు బోధనేతర ఉద్యోగులు వైకాపాకు అనుకూలంగా పని చేశారు. ప్రతి విభాగంలో వారే కీలకంగా వ్యవహరించారు. ఇటీవల నిర్వహించిన బదిలీల్లో వైకాపాకు అనుకూలమైనవారిని కీలక విభాగాల్లో నియమించినట్లు తెలుస్తోంది. పరీక్షల విభాగం ఎంతో కీలకమైనది. ఆ విభాగంలో కూడా గత ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన వారిని నియమించినట్లు ఉద్యోగవర్గాల్లో చర్చ నడుస్తోంది. నిత్యం బదిలీలు నిర్వహిస్తుండటంతో ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. ఇందులో ఏవైనా అక్రమాలు జరుగుతున్నాయా అనే అనుమానాలను ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ఆర్ట్స్ కళాశాలలో రూ.1.29 కోట్లతో తరగతి గదుల నిర్మాణం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: 110 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆర్ట్స్ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాలలో రూ.1.29 కోట్లతో తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదివారం భూమి పూజ నిర్వహించారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపడుతున్నారన్నారు. 50 సంవత్సరాల నుంచి షెడ్లలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. వాటి స్థానంలో పక్కా భవనాలు నిర్మించడం అభినందనీయమన్నారు. వసతి గృహాల భవనాలకు రూ.2.45 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కళాశాలలో ఆడిటోరియం మంజూరు చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కాలువలు బాగుంటేనే చెరువులకు జలకళ

➡ హంద్రీనీవా, హెచ్చెల్సీ నీటిరాక ఆరంభం ➡ మరమ్మతులకు నిధులు

ఈనాడు, పుట్టపర్తి, చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం, తుంగభద్ర జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 17న మల్యాల వద్ద ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీనీవాకు నీటిని విడుదల చేశారు. నీటిపారుదల సాఫీగా సాగాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మల్యాల నుంచి జీడిపల్లి జలాశయం వరకు హంద్రీనీవా ప్రధాన కాలువ కాంక్రీట్ లైనింగ్ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టింది. చాలావరకు పనులు పూర్తయ్యాయి. శ్రీశైలం నుంచి చిత్తూరు వరకు నీటిని తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదట జిల్లాలోని జలాశయాలను.. ఆపై చెరువులను నింపేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు.

చెరువుల మరమ్మతులకు మంజూరైన నిధుల వివరాలు

నియోజకవర్గం	చెరువులు	నిధులు (రూ.లక్షల్లో)
పెనుకొండ	25	50
హిందూపురం	14	23.19
మడకశిర	14	35
కదిరి	24	33
పుట్టపర్తి	48	99

అదే నిర్లక్ష్యం పునరావృతం కాకుండా..

ఉమ్మడి అనంత జిల్లావ్యాప్తంగా హంద్రీనీవా, హెచ్చెల్సీ ద్వారా వందలాది చెరువులకు నీరందనుంది. గత ప్రభుత్వంలో హంద్రీనీవా నీటిని తూతూమంత్రంగా చెరువులకు అందించినప్పటికీ ఆయకట్టుకు అందిన దాఖలాల్లేవు.. దీంతో చెరువుల ఆయకట్టు కాలువలు పిచ్చిమొక్కలతో నిండి, పలుచోట్ల పూడిక పేరుకుపోయింది. జగన్ సర్కారు కనీసం చెరువుకట్టలు, కాలువలకు మరమ్మతులు చేయించిన పాపానపోలేదు. ఆరేళ్లుగా నిర్వహణకు నోచుకోని కాలువలు రూపు కోల్పోయాయి. అదే నిర్లక్ష్యం పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రూ.2.40 కోట్లు మంజూరు

జిల్లాలోని 105 చెరువుల మరమ్మతులకు రూ.2.40 కోట్లు మంజూరయ్యాయి. వీటితో పనులు చేపడతాం. మిగిలిన చెరువుల కోసం ప్రతిపాదనలు పంపాం. సాగునీటి యాజమాన్య సంఘాలతో మాట్లాడి కాలువల్లో చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తాం.

- గురుమూర్తి, మైనర్ ఇరిగేషన్ ఈఈ

చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దల చెరువు ఆయకట్టు కాలువలో పెరిగిన జొను

వివాదాలు రానీయకుండా..

శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 1,186 చెరువులు ఉన్నాయి. వీటి కింద 83,485 ఎకరాల ఆయకట్టు ఉంది. జిల్లాలో ఈసారి లోటు వర్షపాతం నమోదైనా.. హంద్రీనీవా, హెచ్చెల్సీ ద్వారా సాగు, తాగునీటి అవసరాలు తీరే అవకాశం ఉంది. తుంగభద్ర, శ్రీశైలం జలాశయాల ద్వారా ఈసారి 23 టీఎంసీలు అందే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. నీరు చెరువులకు చేరాలంటే కాలువలు అధ్వానస్థితిలో ఉన్నాయి. వాటికి సత్వరమే మరమ్మతులు చేయించాలి. చెరువు కట్టలపై పెరిగిన ముళ్లకంపను తొలగించాలి. బలహీనంగా ఉన్న కట్టలను పటిష్ఠం చేయించాలి. నీటి వినియోగంలో రైతుల మధ్య వివాదాలు తలెత్తకుండా సమన్వయంతో పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వైకాపా పాలనలో జరిగిందంతా అరాచకమే

● సుపరిపాలనలో తొలిఅడుగులో మంత్రి కొల్లు రవీంద్ర

కనగానపల్లి, న్యూస్‌టుడే: వైకాపా పాలనంతా అరాచకంగానే సాగిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. ఆదివారం కనగానపల్లిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత, ఎంపీ బీకే పార్థసారథితో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి పథకాలన్నీ అందుతున్నాయా లేదా? అని ఆరా తీశారు. అనంతరం బీసీ కాలనీలో రూ.1.30 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లు, శివాలయం వద్ద సామాజిక భవన నిర్మాణానికి రూ.15 లక్షలు, రూ.60 లక్షలు ఎంపీ నిధులతో చేపడుతున్న కనకదాసు కల్యాణ మండపానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. పేరూరు జలాశయానికి నీరు అందించేందుకు గత తెదేపా ప్రభుత్వంలో రూ.800 కోట్ల నిధులు కేటాయించిందన్నారు. ఇందుకోసం భూమి సేకరించారన్నారు. సోమరవాండ్లపల్లితోపాటు పలు జలాశయాల నిర్మాణం చేపట్టామన్నారు. ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో వైకాపాకు అధికారాన్ని ఇస్తే. . రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి నెట్టేలా చేశారన్నారు. హిందూపురం పార్లమెంటు అధ్యక్షుడు అంజినప్ప పాల్గొన్నారు.

పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే సునీత, ఎంపీ పార్థసారథి

సత్యసాయి బోధనలు, సేవలు ఆచరణీయం

సంగీత విభావరి నిర్వహిస్తున్న విదేశీ భక్త బృందం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి ఆధ్యాత్మిక బోధనలు, సేవాతత్వాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ప్రశాంతి నిలయంలో మూడో రోజు ఆదివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. 18 దేశాలకు చెందిన యువతీ యువకులు పాల్గొన్నారు. యువతలో స్వీయ పరివర్తన కోసం సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో చేపట్టిన కోర్సులను పూర్తి చేసుకున్న వారిని ఉద్దేశించి మలేషియాకు చెందిన విమల్‌రాజ్, యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన రిషా ప్రసంగించారు. సత్యసాయి మానవాళికి బోధించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసను ఆచరించాలని పేర్కొన్నారు. సాయి బోధనలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ దేశాలకు చెందిన యువత సంయుక్తంగా సాయి భక్తి గీతాలను ఆలపించారు. కోర్సులు పూర్తి చేసుకున్న యువతకు ట్రస్టీ ఆర్జే రత్నాకర్ సతీమణి హిమవాహిని ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ధ్రువపత్రం ప్రదానం చేస్తున్న హిమవాహిని

ఉత్తర కాలువ పరిశీలన

పెద్దవడుగూరు, గార్లదిన్నె, న్యూస్‌టుడే: గార్లదిన్నె సమీపంలోని ఎంపీఆర్ ప్రాజెక్టు ఉత్తర కాలువను ఆదివారం ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ రాజారెడ్డి పరిశీలించారు. ప్రస్తుతం ఉత్తర కాలువ గేట్లు, కాలువ పరిస్థితి, నీటి ప్రవాహానికి ఏవైనా ఆటంకాలు ఉన్నాయా అనే అంశాలు తెలుసుకున్నారు. తుంగభద్ర నుంచి నీటిని విడుదల చేయడంతో చేరే సమయానికి ఇక్కడి ప్రాజెక్టు దక్షిణ, ఉత్తర కాలువ గేట్లకు ఎలాంటి సమస్య రాకుండా ఉండేలా ముందస్తుగా పరిశీలించినట్లు తెలిపారు. ఉత్తర కాలువలో కొన్ని మరమ్మతుల నిమిత్తం నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులను కోరినట్లు చెప్పారు.

వృథాగా చెత్త సేకరణ వాహనాలు

నార్పల మేజర్ పంచాయతీలో చెత్త సేకరించడానికి ఉపయోగించే వాహనాలు గత కొన్ని నెలలుగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వృథాగా ఉన్నాయి. నార్పల మేజర్ పంచాయతీతో పాటు మరికొన్ని పంచాయతీల్లో చెత్తను సేకరించడానికి జిల్లా అధికారులు ఏడాది కిందట బ్యాటరీ వాహనాలు మంజూరు చేశారు. అవి కొద్ది రోజులకే మరమ్మతులకు గురవడంతో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మూలకు చేరాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేసి చెత్త సేకరణకు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నార్పల

పండమేరు వంతెన పూర్తయ్యేదెన్నడు?

■ ఎనిమిది నెలలుగా రాకపోకలకు ఇబ్బందులు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: అనంత నగర శివారులోని పండమేరు పాతవంతెన మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.85 లక్షలతో మరమ్మతులకు మూడు నెలల కిందట టెండర్లు పిలిచారు. అధికారులు నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పినా నేటికీ చేస్తూనే ఉన్నారు. ఆర్డీటీ స్టేడియం సమీపంలో పండమేరుపై 2014లో వంతెన నిర్మించారు. 2023లో ఈ మార్గంలో నాలుగు వరుసల రహదారి విస్తరించారు. ఇందులో భాగంగానే పాత వంతెన పక్కనే మరో వంతెన నిర్మించారు. పాత వంతెన కంపిస్తుండంతో ఏడాది కిందట మూసివేశారు. కొత్త వంతెనపై మాత్రమే రాకపోకలు సాగిస్తున్నారు. ఇది జాతీయ రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. కదిరి, తిరుపతి, ధర్మవరం, బెంగళూరువైపు వాహనాలు ఈ రోడ్డులోనే ప్రయాణిస్తాయి. వాహనాలు వేగంగా వచ్చే క్రమంలో వంతెన వద్ద మలుపు ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశముంది. గతంలో వనమిత్ర ఉద్యానవనం నుంచి ఓ విద్యార్థి బయటకు వస్తుండగా వాహనం ఢీకొని ప్రాణాలు కోల్పోయాడు. వంతెనను వాహనచోదకులు భయం భయంగా దాటాల్సిన పరిస్థితి నెలకొంది.

పాత వంతెనపై ఆగిన పనులు

ఇరవై రోజుల్లో పూర్తి చేయిస్తాం

- గిడ్డయ్య, డీఈ, జాతీయ రహదారులశాఖ

వంతెన కింద బేరింగులు పాడయ్యాయి. వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేశాం. 20 రోజుల్లో పనులు పూర్తి చేసి, వాహనాలకు అనుమతిస్తాం.

చూస్తూ ఉంటే.. వెలుస్తూనే ఉంటాయ్!

■ అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు ■ పురపాలిక ఆదాయానికి గండి

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి పురపాలక పరిధిలోని గుత్తి, గుత్తి ఆర్.ఎస్, చెర్లోపల్లి, సూరశింగనపల్లిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలతోపాటు బహుళ అంతస్తులకు చాలా మంది అనుమతులు తీసుకోవడం లేదు. దీంతో పురపాలికకు రూ.కోట్ల ఆదాయం చేజారిపోతోంది. గుత్తిలో ఇళ్లకు డిమాండ్ నెలకొంది. కొందరు ధనవంతులు ఖాళీ స్థలాలను కొనుగోలు చేస్తూ జీ-ప్లస్2, జీ-ప్లస్3 భవనాలు నిర్మిస్తున్నారు. భవన నిర్మాణాలకు గతంలో అహుడాకు అనుమతులు ఇచ్చే అధికారం ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం పురపాలికలకు ఆ అధికారం ఇచ్చింది. ఉద్యోగులు రూ.10 వేలు మామూళ్లు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పేదలు పాత ఇళ్లను కూల్చి కొత్తగా నిర్మాణం చేస్తుంటే సిబ్బంది వెంటనే వాలిపోయి పనులను ఆపుతున్నారు. వారిని కార్యాలయానికి పిలిపించుకుని మామూళ్లు తీసుకొని అనధికారికంగా అనుమతులు ఇస్తున్నారు. అనంతపురం రోడ్డు, తాడిపత్రి రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోనూ అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. సీపీఐ కాలనీలో ఓ వ్యక్తి బహుళ అంతస్తు భవనం నిర్మిస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గుత్తిలో సుమారు 200 ఇళ్లకు అనుమతులు లేనట్లు తెలుస్తోంది. ఈ లెక్కన పురపాలక సుమారు రూ.2.40 కోట్లు రుసుము కోల్పోతుంది.

గుత్తిలోని సీపీఐ కాలనీలో నిర్మించిన భవనం

చేతులు తడిపితే చాలు..

పట్టణ ప్రణాళిక విభాగం ఉద్యోగుల చేతులు తడపుతూ ఇళ్లు, బహుళ అంతస్తులు నిర్మించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మూడు సెంట్ల స్థలంలో జీ-2 భవనం నిర్మించుకోవాలంటే పురపాలికకు రూ.1.20 లక్షలు దాకా లేఅవుట్ రుసుం రావాల్సి ఉంది. కేవలం బ్యాంకు రుణాలతో నిర్మించుకునే ఇళ్లకు మాత్రమే అనుమతులు తీసుకుంటున్నారు. అందుకు కూడా పురపాలక

కేసులు పెడుతున్నాం

- జబ్బార్‌మియా, కమిషనర్, గుత్తి

అక్రమ నిర్మాణాలపై కేసులు పెడుతున్నాం. ఇప్పటికే 25 భవనాలకు అనుమతులు లేనట్లు గుర్తించి కోర్టులో కేసులు వేశాం. ఒక్కో భవనం నుంచి అపరాధ రుసుం సుమారు రూ.20 లక్షలు రాబడతాం. ఇళ్లు, భవనాలను నిర్మించుకునేవారు తప్పకుండా పురపాలక అనుమతులు తీసుకోవాలి.

అలంకరణలో స్వామి

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కోటంక సమీపంలో కొండల మధ్య వెలిసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అర్చనలు, క్షీరాభిషేకాలు, ఆకు పూజలు చేసి స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ముస్సోరి శిక్షణకు వెళ్లిన కలెక్టర్

■ 27 రోజుల తర్వాత విధుల్లో చేరిక

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ సంస్థాగత శిక్షణ కార్యక్రమానికి వెళ్లారు. 27 రోజులపాటు ఈ శిక్షణలో పాల్గొంటారు. ఈనెల 21 నుంచి ఆగస్టు 16 దాకా శిక్షణలో పాల్గొనడానికి ఆయన ఉత్తరాఖండ్ రాష్ట్రం ముస్సోరి లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమికి బయలుదేరి వెళ్లారు. ఈనెల 19న విజయవాడ వెళ్లారు. అక్కడి నుంచి ముస్సోరి వెళ్లారు. ఆగస్టు 16 తర్వాత ఆయన విధుల్లో చేరనున్నారు. అప్పటి దాకా జేసీ శివనారాయణ శర్మ ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా వ్యవహరిస్తారు. మరోవైపు.. ఈలోపు భారీ ఎత్తున ఐఏఎస్‌ల బదిలీలు జరిగే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. 27 రోజులపాటు కలెక్టర్ శిక్షణలో ఉండనున్నారు. ఈలోపు కొత్త వారిని నియమిస్తారన్న ప్రచారం లేకపోలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది మంది ఐఏఎస్‌లను నిర్దేశిత తేదీల్లో శిక్షణకు అనుమతి ఇచ్చారు.

ఆగస్టుదాకా నిలకడగా టమాటా ధర!

● రైతుల్లో ఆశలు ● పెరుగుతున్న విక్రయాలు

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : జిల్లాలోని ఖరీఫ్‌లో నీటి ఆధారం కింద 12 వేల ఎకరాల్లో టమాటా సాగు చేశారు. ఎకరాకు 18 మెట్రిక్ టన్నుల చొప్పున 2.16 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తోందని ఉద్యానశాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే 30 శాతం పంట కోతకు రాగా అందులో 7,200 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తోంది. ఈ నాలుగు నెలలపాటు నిరంతరం టమాటా పంట రైతుకు చేతికొస్తూనే ఉంటుంది. తాజాగా పంట కోతకొచ్చిన రైతులకు మంచి ధరలు లభిస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

★ చిత్తూరు జిల్లా మదనపల్లి, కర్ణాటకలోని కోలార్‌లో ఉన్నవి అతి పెద్ద టమాటా మార్కెట్లు. జూన్ నెలాఖరుకు చిత్తూరు, కోలార్ పరిసర ప్రాంతాల్లో టమాటా కోతలు పూర్తి అవుతాయి. అనంతపురం జిల్లాలో జులైలో పంట కోతలు ప్రారంభమవుతాయి. అనంతపురం గ్రామీణం కక్కలపల్లి మార్కెట్‌తోపాటు మదనపల్లి, కోలార్, తెలంగాణ రాష్ట్రంలోని పలు మార్కెట్లకు జిల్లా నుంచే టమాటా ఎగుమతి అవుతుంది. అందుకే ఈనెలల్లో ధరలు బాగానే ఉంటాయని, ఆగస్టులో ధరలు తగ్గే అవకాశం ఉంటుందని ఉద్యానశాఖ అధికారవర్గాలు తెలిపాయి. అనంతపురం మార్కెట్‌తోపాటు తోటల నుంచి రైతులు నేరుగా వివిధ మార్కెట్లకు లారీల్లో పంపుతున్నారు. నిత్యం 300 లారీల్లో 3 వేల మెట్రిక్ టన్నుల వరకు టమాటా ఎగుమతి అవుతుందని అంచనా ఉంది.

కంబదూరు మండలంలో టమాటాలను గ్రేడింగ్ చేస్తున్న మహిళలు

కక్కలపల్లి మార్కెట్‌లో 1,950 మె.ట.విక్రయం

అనంతపురం గ్రామీణం కక్కపల్లి మార్కెట్‌లో విక్రయాలు భారీగా పెరుగుతున్నాయి. ఆదివారం మొత్తం 17 మండీలకు 1,950 మెట్రిక్ టన్నులు రైతులు తీసుకొచ్చి విక్రయించారు. ధరలు పరిశీలిస్తే.. కిలో కనిష్ఠం రూ.31, మధ్యస్థం రూ.20, కనిష్ఠం రూ.13 చొప్పున ధరలు పలికాయి. 15 కిలో బుట్ట ధర పరిశీలిస్తే కనిష్ఠం రూ.465, మధ్యస్థం రూ.300, కనిష్ఠం రూ.195 చొప్పున ధరలు పలికాయి.

జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులపై కేసు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: పవర్‌గ్రిడ్ పనుల అడ్డగింపు, ఇంజినీర్ కిడ్నాప్, కార్మికులపై దాడి ఘటనలో తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులపై యాడికి పోలీసులు కేసు నమోదు చేశారు. తరచూ పనుల వద్దకు వెళ్లి బెదిరింపులకు పాల్పడుతున్న చిన్న దివాకర్‌రెడ్డి, హాజీవలి, నారాయణస్వామి, చౌడయ్యబాబు, రంగయ్యలతోపాటు మరో 40 మంది జేసీ అనుచరులను నిందితులుగా చేర్చారు. కాగా పవర్‌గ్రిడ్ అనంతపురం కర్నూలు ట్రాన్స్‌మిషన్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో టవర్ పనులు చేస్తుండగా ఈనెల 16న జేసీతో పాటు అతని అనుచరులు 40 మంది వెళ్లి పనుల్ని దౌర్జన్యంగా ఆపేశారు. కార్మికులు, ఇంజినీర్లపై దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. దాడి ఘటనను చరవాణిలో చిత్రీకరించిన ఇంజినీర్ అమిత్ యాదవ్‌ను బలవంతంగా వాహనంలో కిడ్నాప్ చేసి, అతని వద్దనున్న ఫోన్ లాక్కొని మరోసారి అతనిపై దాడికి పాల్పడ్డారు. తాడిపత్రి ప్రాంతంలో ఎలాంటి పనులు చేయవద్దంటూ హెచ్చరించారు. సంస్థ ఇంజినీర్లు, కార్మికులు పనులు చేయడానికి భయపడి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిపై సంస్థ జనరల్ మేనేజర్ హెచ్‌కే మౌనస్ అనంతపురం కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో యాడికి పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

షష్ఠమ వర్ధంతి
కీ॥శే॥ దండుపల్లి వెంకటాచలపతి - శ్రీమతి సావిత్రమ్మ గార్ల మరియు శ్రీమతి గాజుల జానకి కీ॥శే॥ గాజుల రామస్వామి గార్ల మనవడు
"స్వర్గీయ దండుపల్లి ఆశీష్"

స్వర్గీయ దండుపల్లి ఆశీష్
జననం: 28-02-1992 మరణం: 21-07-2019

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

పూర్తి వివరాలకు: 8008709784

హోంమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

ఏర్పాట్లను పరిశీలన చేస్తున్న ఎస్పీ వి.రత్న, ఎమ్మెల్యే ఎం.ఎస్‌.రాజు, పోలీసు అధికారులు

మడకశిర, న్యూస్‌టుడే : మడకశిరలో సోమవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పర్యటన సంబంధించి పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం జిల్లా ఎస్పీ వి. రత్న, ఎమ్మెల్యే ఎం.ఎస్‌.రాజు మంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాట్లపై చర్చించారు. మంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వారు తెలిపారు.

పటిష్ఠ బందోబస్తు

హోంమంత్రి పర్యటనకు సంబంధించి పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. పర్యటనకు 120 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నామని, బహిరంగ సభ సమయంలో ట్రాఫిక్కు అంతరాయం లేకుండా ఎస్పీ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేశామన్నారు.

మాజీ సైనికుల ఇంటి పట్టాలకు 400 అర్జీల స్వీకరణ

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా మాజీ సైనికుల సంఘం సర్వసభ్య సమావేశం తపోవనంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఇంటి స్థలాలు లేని మాజీ సైనికుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ సూచనల మేరకు దరఖాస్తులు స్వీకరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 400 మంది అర్జీలు సమర్పించారు. ఆ సంఘం అధ్యక్షుడు కెప్టెన్ డి. శేషప్ప ఆధ్వర్యంలో అర్జీలు స్వీకరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి కెప్టెన్ ఉమామహేశ్వరరావు, కోశాధికారి తిమ్మారెడ్డి, సభ్యులు కుమారస్వామి, ఈశ్వరయ్య, హుస్సేన్, సంజీవ్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

'భారతీయ ముస్లింల త్యాగాలు వెలకట్టలేనివి'

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ గోపాలగౌడ తదితరులు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరంలో ముస్లిం యోధుల త్యాగాలు వెలకట్టలేనివని, దేశ అభివృద్ధిలో వారి పాత్ర గణనీయమైనదని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ పేర్కొన్నారు. హిందూపురం పట్టణానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త ఉమర్ ఫారూక్‌ఖాన్ రచించిన '150 మంది ముస్లిం లెజెండ్స్' పుస్తకాన్ని ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ హాల్‌లో స్వాతంత్ర్య సమరయోధులు మోహన్ వాయి గోవిందరెడ్డి, ఆంధ్రప్రభ ఎడిటర్ వైఎస్ఆర్ శర్మ, గజల్ శ్రీనివాస్, కవి బిక్కి కృష్ణతో కలిసి జస్టిస్ గోపాల్‌గౌడ ఆవిష్కరించారు. దేశం కోసం ముస్లిం పోరాట యోధులు, రచయితలు, సాహితీకారులు, సామాజిక కార్యకర్తలు తమ జీవితాలను అంకితం చేశారని వక్తలు పేర్కొన్నారు. హిందూ, ముస్లిం మధ్య విభేదాలు సృష్టించి, దేశ నాశనానికి పాల్పడే వినాశకర శక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కనుమరుగవుతున్న ముస్లింల చరిత్రను వెలికి తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐ.ఆర్‌.ఎస్‌. అధికారి విద్యాధర్‌రావు, మున్సిపల్ ఛైర్మన్ రమేశ్, డీఎస్పీ మహేశ్, అనంతరాముడు, జాబిలి చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పేదల బియ్యం.. అక్రమార్కులకు భోజ్యం

పావగడ నుంచి అక్రమ రవాణా చేస్తుండగా పట్టుకున్న పీడీఎస్ బియ్యం లారీ

మడకశిర, న్యూస్‌టుడే : పేదల ఆకలి తీర్చాలనే ఆశయంతో పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. జిల్లాలోని కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న నియోజకవర్గాల నుంచి యథేచ్ఛగా తరలిస్తున్నారు. దళారులు అత్యధికంగా కర్ణాటక సరిహద్దులో ఉన్న గ్రామాలనే ఎంపిక చేసుకుని లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని సేకరించి అక్రమంగా రవాణా చేస్తున్నారు.

యథేచ్ఛగా సాగుతున్న దందా

పావగడ కేంద్రంగా..

చౌకబియ్యాన్ని అక్రమ రవాణా చేసేందుకు కర్ణాటక రాష్ట్రం పావగడ అడ్డాగా మారింది. ఉమ్మడి జిల్లాలోని కంబదూరు, శెట్టూరు, కుందుర్పి, రొద్దం, రామగిరి, అమరాపురం, మడకశిర, గుడిబండ మండలాలు కర్ణాటకకు సరిహద్దున ఉన్నాయి. దీంతో పక్కనే ఉన్న పావగడలోని కొంతమంది బడా వ్యాపారులు ఆయా మండలాల్లోని చిన్న వ్యాపారులతో సంబంధాలు పెట్టుకుని చౌకబియ్యాన్ని సేకరించి అక్రమంగా తరలిస్తున్నారు.

రైస్ మిల్లులకు తరలించి..

గ్రామీణ ప్రాంతాల్లో దళారులు, వ్యాపారులు ఇంటింటికీ తిరిగి సగటున కిలో రూ.10 నుంచి రూ.20 చొప్పున లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని పావగడలోని రైస్‌మిల్లులకు చేర్చుతున్నారు. అక్కడ సన్న బియ్యంగా మార్చి 50కిలోల బస్తాను తుమకూరు, శిరా, బెంగళూరు పట్టణాలకు తరలించి రూ.3 వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

పోలీసుల హస్తం..?

పీడీఎస్ బియ్యాన్ని సరిహద్దులు దాటించేందుకు ఇద్దరు, ముగ్గురు పోలీసులు సహకరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గత రెండేళ్లలో పీడీఎస్ బియ్యం లారీలను 90 శాతం విజిలెన్స్ అధికారులు పట్టుకోవడమే ఇందుకు నిదర్శనం. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇలాంటి వాటికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

235 క్వింటాళ్లు పట్టివేత..

విజిలెన్స్ అధికారులు ఈ నెల 18న నిర్వహించిన తనిఖీల్లో ఒకే రోజు కర్ణాటకకు తరలిస్తున్న 455 సంచుల్లో 235 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. విజిలెన్స్ అధికారులు మడకశిరకు వచ్చి ఆకస్మిక తనిఖీలు చేస్తేనే ఇంత పెద్ద మొత్తంలో పట్టుకున్నారు. రేషన్ బియ్యం అక్రమ దందాపై పోలీసు, రెవెన్యూ, పౌరసరఫరా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమాచారం ఇస్తే చర్యలు

రేషన్ బియ్యం అక్రమంగా తరలుతున్నట్లు సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రేషన్ బియ్యం సక్రమంగా లబ్ధిదారులకు అందాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా ఉండాలని డీలర్లను హెచ్చరిస్తున్నాం. లబ్ధిదారులు కూడా చౌకబియ్యాన్ని వ్యాపారులకు విక్రయించరాదు.- **లక్ష్మీనరసింహా, సివిల్ సప్లై ఉప తహసీల్దార్, మడకశిర**

మస్తాన్‌వలిస్వామి ఉరుసు ప్రారంభం

విద్యుత్తు దీపకాంతుల్లో దర్గా

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో సయ్యద్ మస్తాన్‌వలిస్వామి ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పాత గుంతకల్లులో ఆదివారం అర్ధరాత్రి గంధం ఇంటి నుంచి గంధం ఊరేగింపుతో దర్గాకు చేరుకుంది. 22న వేకువజామున స్వామివారి పుష్పకం ఊరేగింపుతో దర్గాకు చేరుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉరుసుతో పాత గుంతకల్లులో సందడి నెలకొంది. భక్తులు మస్తాన్‌వలిస్వామి సమాధిని దర్శించుకుని ప్రార్థనలు నిర్వహించారు. దర్గాను విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

సంతల ఆదాయం రూ.3.18 లక్షలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: **అనంతపురం వ్యవసాయ మార్కెట్** యార్డులోని వారం సంతల్లో మొత్తం 3,18,300 ఆదాయం వచ్చింది. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో రూ.1,69,300 ఆదాయం రాగా, ఆదివారం జరిగిన పశువుల సంతలో రూ.1.49 లక్షలు ఆదాయం వచ్చిందని యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి గోవింద తెలిపారు.

నృత్యం చేస్తున్న బాలికలు

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

పుట్టపర్తి, న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా బాలికలు నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. ఆదివారం రాత్రి పుట్టపర్తిలోని శిల్పారామంలో జయంతి చారి డాన్స్ అకాడమీ బృందం భరతనాట్యం ప్రదర్శన నిర్వహించారు. గణేష్, సత్యసాయి గీతాలను ఆలపిస్తూ.. నృత్యం చేశారు. వందలాది మంది ప్రజలు పాల్గొని తిలకించారు.

ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

సీనియర్ మహిళ, పురుష జట్లతో సంఘం జిల్లా అధ్యక్షుడు తదితరులు

హిందూపురం, న్యూస్‌టుడే: సీనియర్ల మహిళ, పురుష జిల్లా ఫుట్‌బాల్ జట్లను ఆదివారం ఎంపిక చేశారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో ఎంపిక పోటీలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు వివరించారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్, కార్యదర్శి మొహమ్మద్ సలీం, కోశాధికారి శేఖర్, ఈసీ సభ్యులు విజయవాణి, ఆజాద్, కోచ్‌లు బాలజీ, చైతన్యలు అభినందించారు.

ఉత్కంఠ భరితంగా జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

వివిధ విభాగాల జట్ల ఎంపిక

పతకాలు సాధించిన క్రీడాకారులతో ఎమ్మెల్యే దగ్గుపాటి తదితరులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలు విజయవంతంగా ముగిశాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జట్ల ఎంపిక నిమిత్తం నిర్వహించిన ఈ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆదివారం స్మాష్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగిన ఫైనల్ పోటీలు నువ్వా, నేనా అన్నట్లుగా ఉత్కంఠరేపాయి. చిన్నారులు అద్భుత స్మాష్ షాట్లతో అలరించారు. కొన్ని ఫైనల్ పోటీలు ఏకపక్షంగా.. మరికొన్ని పోటీలు ఆసక్తి రేపాయి. విజేతలుగా నిలిచిన క్రీడాకారులను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి, కార్యదర్శి జయశంకర్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా సత్తా చాటి ఛాంపియన్లుగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చదువుతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తోందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రాథమిక విద్య నుంచే క్రీడలను పాఠశాలల్లో నేర్పుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలను అంతర్భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారి వివరాలను బ్యాడ్మింటన్ కార్యదర్శి జయకుమార్ ప్రకటించారు.

విభాగాల వారీగా ఇలా..

35 ఏళ్ల పైన పురుషుల సింగిల్స్ విభాగం విజేత నరేష్, ద్వితీయ స్థానం ముస్తాక్
డబుల్స్ విభాగం: ప్రథమ స్థానం షాషావలి, మల్లికార్జున, ద్వితీయ స్థానం నరేష్, మల్లి
45+ సింగిల్స్ విభాగం: రామాంజనేయులు (ప్రథమ), చంద్రశేఖర్ (ద్వితీయ)
50+ సింగిల్స్ విభాగం: షాషావలి (ప్రథమ), సుబ్బారెడ్డి (ద్వితీయ)
అండర్-13 బాలికల సింగిల్స్ విభాగం: ఎస్.ముష్కాన్ (ప్రథమ), శ్రీనిధి (ద్వితీయ)
బాలుర విభాగం: 1. హర్షిత్ వెంకటసాయి 2. జె.కార్తీక్. **అండర్-15 బాలికల విభాగం:** 1. యజ్ఞశ్రీ 2. ముష్కాన్, **బాలుర విభాగం:** 1. డీవీ యజ్ఞదత్ 2. హర్షిత్ వెంకటసాయి
అండర్-17 బాలికల విభాగం: 1. డీవీ యజ్ఞశ్రీ 2. జల నక్షత్ర.
అండర్-19 బాలుర విభాగం: 1. మురళీ వెంకట్ 2. అబురెహాన్
బాలికల విభాగం: 1. యజ్ఞశ్రీ 2. జలనక్షత్ర

EENADU Classifieds
BUSINESS SERVICES
BUSINESS OFFER
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం. Cell: 7382114647.
EDUCATION
GNM అడ్మిషన్స్: ఇంటర్మీడియట్‌లో Any Group పాస్ స్టూడెంట్స్‌కి G.N.M (Nursing)కి గవర్నమెంట్ సీట్స్ కలవు. అనంతపురం నందు గల గర్ల్స్ కాలేజీలో అడ్మిషన్లు పొందవచ్చు. G.మురళి Cell: 9030661651, ATP.
AP NCETలో క్వాలిఫైడ్ స్టూడెంట్స్‌కి B.Sc (Nursing) నందు అడ్మిషన్స్ కలవు. క్వాలిఫై కాని వారికి, AP NCET రాయని వారికి G.N.M (Nursing), B.Sc (MLT), B.P.T (ఫిజియోథెరపీ) నందు only గర్ల్స్ కాలేజ్‌లో ఫ్రీ ఎడ్యుకేషన్, ఫ్రీ హాస్టల్ కలదు. Cont: G.Murali, 9030661651, అనంతపురం.
JOBS
వాంటెడ్ డ్రైవర్స్ హెవీ ట్రక్ నడుపుటకు తాడిపత్రి ఆంధ్రప్రదేశ్, 12 వీల్, 16 వీల్, 22 వీల్ (బల్కర్) 1 ఇయర్ ఎక్స్‌పీరియన్స్. మంచి జీతం, బత్తా. Ph: 7994761626.
మెరైన్ వాటర్ సొల్యూషన్స్ కంపెనీ యందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ మరియు సేల్స్ మేనేజర్ కావలెను. Age: 21 to 28 Qua: Any Degree/ MBA, Ramnagar, ATP. Ph: 9966620252, 9100703123.
Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 9014651068, 7075633416.
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బులు వసూలు చేయరాదు. డబ్బులు వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపర మైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.
5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే
తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ప్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...
వివరాలకు : 8008709784
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

మంత్రి అనిత పర్యటనను అడ్డుకుంటాం

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న వైకాపా నాయకులు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలో సామూహిక లైంగిక దాడికి గురైన దళిత బాలికను ప్రభుత్వం ఆదుకోవాలని, లేని పక్షంలో నేడు (సోమవారం) మడకశిర వస్తున్న హోంమంత్రి అనితను అడ్డుకుంటామని వైకాపా నాయకులు హెచ్చరించారు. లైంగిక దాడికి గురై, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన బాలికను పరామర్శించేందుకు వైకాపా నాయకులు ఆదివారం ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చంద్ర, నాయకుడు చామలూరు రాజగోపాల్‌లు మాట్లాడుతూ.. హోంమంత్రి దళితురాలైనా.. తమ వర్గానికి న్యాయం జరగలేదన్నారు. ఇటీవల మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ జిల్లాకు వచ్చి వెళ్లినా బాలికకు న్యాయం జరగలేదన్నారు. ప్రస్తుతం బాధిత బాలిక ప్రసవించిందన్నారు. తల్లీబిడ్డ సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలపాలన్నారు. బాలిక పరామర్శకు వెళ్తుంటే అడ్డుకోవడం దారుణమన్నారు. అనంతపురంలో ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్యకు గురైనా ఆ కుటుంబాన్ని ఆదుకోలేదన్నారు. జిల్లాలో దళిత సామాజిక వర్గానికి చెందిన ఎంఎస్ రాజు, బండారు శ్రావణి ఎమ్మెల్యేలుగా గెలిచినా దళితుల గురించి ఆలోచించడం లేదని ఆరోపించారు. బాధితుల తరపున వైకాపా పోరాటం చేస్తుందన్నారు. ఆందోళన చేస్తున్న నాయకులను రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం వదిలేశారు. నాయకులు శ్రీనివాస్‌బాబు నాయక్, శ్రీనివాసులు, చంద్రశేఖర్ యాదవ్, పసులూరి ఓబులేసు, చంద్రలేఖ పాల్గొన్నారు.

ప్రాణాలంటే లెక్కలేదా?

వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా ప్రజల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. అందుకు ఈ చిత్రమే నిదర్శనం. హీరేహాళ్ మండలం హిర్దేహాళ్ సమీపంలో పనికి వెళ్లిన పిల్లలు బొలెరో వాహనం టాపుపై కూర్చొని ప్రమాదకరంగా ప్రయాణం సాగించారు. అందులో మొత్తం 50 మందిని ఎక్కించారు. గుంతల దారుల్లో వాహనం ఏమాత్రం కుదుపులకు లోనైనా భారీగా ప్రాణనష్టం వాటిల్లే ఆస్కారం ఉంది. ఇటువంటి వారిపై పోలీసులు అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, డి.హీరేహాళ్**

బదిలీ ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఇటీవల బదిలీ పొందిన ఉపాధ్యాయులకు వెంటనే వేతనాలు చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం ఆ ఉపాధ్యాయ సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. బదిలీలు నిర్వహించి నెల గడిచింది. పనిచేసే పాఠశాల ఐడీ లేకపోవడంతో వేతనాలు రాలేదన్నారు. రెండు నెలల వేతనాలు బకాయి ఉన్నాయని, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వంలో రహదారులకు మోక్షం

దండేపల్లి వద్ద పత్తి పంటను పరిశీలిస్తున్న మంత్రి సవిత

రొద్దం, న్యూస్‌టుడే : గత వైకాపా పాలకుల నిర్లక్ష్యంతో గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారాయని, వాటికి కూటమి ప్రభుత్వం మోక్షం కల్పిస్తోందని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. ఆదివారం రొద్దం మండలంలోని దండేపల్లి వద్ద నుంచి నల్లూరుకు వెళ్లే రహదారిలో పెన్నానదిపై నిర్మిస్తున్న వంతెన పనులను మంత్రి పరిశీలించారు. ఈ రహదారికి రూ.8 కోట్లతో పనులు చేస్తున్నారు. వంతెన వద్దకు వెళ్లే సమయంలో మంత్రి దండేపల్లికి చెందిన గోవిందమ్మ అనే మహిళా రైతు సాగుచేసిన పత్తి పంటను పరిశీలించారు. ఈ ఏడాది సాగు ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రొద్దం, దొడగట్ట, కోగిర గ్రామాల్లో పర్యటించి అనారోగ్యం, రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించారు. మండలాభివృద్ధి అధికారి రామ్‌కుమార్, పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీర్లతో పాటు వివిధ శాఖల అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయ ప్రసాద్

తొగటవీర క్షత్రియులు ఐక్యతతో మెలగాలి

ధర్మవరం: తొగటవీర క్షత్రియులు ఐక్యంగా మెలగాలని అప్పుడే సామాజికంగా, రాజకీయంగా రాణించగలరని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయప్రసాద్ అన్నారు. పట్టణంలోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం సత్యసాయి జిల్లా సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. కుల గురువు దివ్యజ్ఞానానందగిరి స్వామి సమక్షంలో జిల్లా అధ్యక్షుడిగా దాసరి శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా పోలా వెంకటనారాయణ, సోమశేఖర్, బండారు శ్రీనివాసులు, శేషాద్రి, జిల్లా కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ధర్మవరంలో 50 ఏళ్లుగా వైద్య సేవలందిస్తున్న డాక్టర్ నరసింహులును సన్మానించారు. కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు జయశ్రీ, పోలా ప్రభాకర్ పాల్గొన్నారు.

సమ్మె ఉద్ధృతం చేస్తాం

కూటమి ప్రభుత్వ పెద్దల చిత్రపటాల మాస్కులతో ర్యాలీగా వస్తున్న కార్మికులు

కమలానగర్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉద్ధృతం చేస్తామని మున్సిపల్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నగర అధ్యక్షుడు వెంకటనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం 9వ రోజు సమ్మె సందర్భంగా కార్మికులు వినూత్నంగా రాజకీయ నాయకుల చిత్రపటాల మాస్కులతో నగరపాలక సంస్థ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. 125 మున్సిపాలిటీల్లో కార్మికులు సమ్మె చేస్తున్నా కూటమి ప్రభుత్వ నాయకులు స్పందించటం లేదన్నారు. డిమాండ్లు పరిష్కరించని పక్షంలో సమ్మె ఉద్ధృతం చేస్తామన్నారు. నాయకులు మల్లికార్జున, రాయుడు, ఓబుళపతి, పోతులయ్య పాల్గొన్నారు.

చెరువు గట్టుపై నుంచి పడి రైతు మృతి

ఆంజనేయులు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కెంచానపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతు ఆంజనేయులు (40) చెరువు గట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు.. గ్రామంలో మాగాణి కౌలుకు తీసుకొని తల్లి చిన్నమారెక్క, కుమారుడు ఆంజనేయులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఆయనకు వివాహం కాలేదు. ఈనెల 16న తోటలో వ్యవసాయ పనులకు వెళ్తుండగా చెరువుపై నుంచి కిందపడి తలకు తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బంధువులు వెంటనే అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. రాయదుర్గం ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

దూసుకొచ్చిన మృత్యువు

కారు ఢీకొని దంపతుల దుర్మరణం

రఘునాథ్‌రెడ్డి, సావిత్రమ్మ

శింగనమల, న్యూస్‌టుడే: అమ్మవారిని దర్శించుకోవాలి.. స్వగ్రామంలో బంధు, మిత్రులను కలిసి సరదాగ గడపాలని ఆ దంపతులు ద్విచక్ర వాహనంలో బయల్దేరారు. రోడ్డు విస్తరణలో భాగంగా దేవాలయాన్ని గుర్తించలేక కాస్త ముందుకెళ్లారు. వాహనాన్ని వెనక్కు తిప్పుతుండగా మృత్యువు కారు రూపంలో దూసుకొచ్చి ఆ దంపతులను బలిగొంది. ముప్పై ఏళ్ల దాంపత్య జీవనం సాగించిన వీరు మృత్యువులోనూ బంధాన్ని వీడలేదు. ఈ ఘటన శింగనమల మండలం శ్రీశివపురం పెద్దమ్మ దేవాలయం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. శింగనమల మండలం గుమ్మేపల్లి గ్రామానికి చెందిన రఘునాథ్‌రెడ్డి (55), సావిత్రమ్మ (48) జీవనోపాధి కోసం 20 ఏళ్ల కిందట తాడిపత్రిలో స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో శివపురం వద్ద శ్రీపెద్దమ్మ అమ్మవారిని దర్శనం చేసుకోవాలని నిర్ణయించుకొన్నారు. ఆరు వరుసల రోడ్డు నిర్మాణంతో అమ్మవారి దేవాలయాన్ని గుర్తించలేక కొంత ముందుకు వచ్చారు. స్థానికులను దేవాలయం ఎక్కడ అని అడిగారు. వెనకనే ఉందని చెప్పడంతో వెంటనే వాహనాన్ని తిప్పారు. అదేసమయంలో తాడిపత్రి నుంచి వస్తున్న కారు వేగంగా వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో రఘునాథ్‌రెడ్డి కాళ్లు తెగిపడి అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన సావిత్రమ్మను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని.. యువకుడి మృత్యువాత

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం మండలం బి.కొత్తపల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని భరతసింహారెడ్డి (22) అనే యువకుడు దుర్మరణం చెందాడు. బుక్కరాయసముద్రం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గార్లదిన్నె మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన రమేశ్‌రెడ్డి కుమారుడు భరతసింహారెడ్డి వడియంపేట హెచ్‌పీ గ్యాస్ ప్లాంటులో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై యర్రగుంట్లకు వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. చేతికి వచ్చిన కుమారుడు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

రమేశ్‌నాయుడు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: గార్లదిన్నె మండలం తిమ్మంపేట గ్రామ సమీపంలో జాతీయరహదారి పక్కన వ్యవసాయ పొలాల్లో రమేశ్‌నాయుడు (28) అనే యువకుడు విష ద్రావకం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లికి చెందిన రమేశ్‌నాయుడు అనంతపురంలోని శిల్పనగర్‌లో నివాసముంటున్న ఓ యువతిని గత నెల ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరు అన్యోన్యంగా జీవనం సాగించారు. కొద్దిరోజుల కిందట యువతి పుట్టింటికి వెళ్లి కాపురానికి రానని చెప్పడంతో యువకుడు వారం రోజుల కిందట పామిడి రైల్వే స్టేషన్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆదివారం గార్లదిన్నె మండల సమీపంలోని తిమ్మంపేట వద్ద బలవన్మరణం చెందాడు. బంధువులకు సమాచారం అందడంతో పోలీసులకు జరిగిన ఘటన తెలిపారు. సీఐ కౌలుట్లయ్య, ఎస్సై గౌస్‌బాషాలు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

ఉద్యోగినిపై వేధింపులు.. కేసు నమోదు

కదిరి పట్టణం: కదిరి అడపాలవీధిలో నివాసముంటున్న ఓ బ్యాంకులో మహిళా ఉద్యోగిని వేధిస్తున్న విజయ్‌కుమార్‌పై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఉద్యోగిని భర్త అనారోగ్యంతో మృతిచెందారు. ఆమెతో స్వగ్రామానికి చెందిన విజయ్‌కుమార్ నాలుగేళ్లుగా చనువుగా ఉంటున్నాడు. ఆ పరిచయంతో వ్యక్తిగత అవసరాల కోసం విజయ్‌కుమార్ మహిళ నుంచి డబ్బు, బంగారం తీసుకున్నాడు. తిరిగి ఇస్తానని నమ్మించి ఇవ్వకపోవడంతో ఆమె నిలదీశారు. ఈ క్రమంలో ఆగ్రహించిన విజయ్‌కుమార్ ఆమెపై దాడి చేశాడు. నీ అంతుచూస్తానని బెదిరించి, ఆమెకు సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తానని బెదిరిస్తున్నారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

పోలీసులపై మందుబాబుల రుబాబు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని గుత్తి రోడ్డులో మందుబాబులు ఆదివారం రెచ్చిపోయారు. ఏకంగా పోలీసులతోనే ఘర్షణకు దిగారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. నగరానికి చెందిన షేక్ షఫీ, టిప్పుసుల్తాన్‌లు గుత్తిరోడ్డులోని స్థానిక రాజశేఖర్ మద్యం దుకాణం వద్ద రోడ్డుపై బహిరంగంగా మద్యం తాగుతూ హల్‌చల్ చేశారు. అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులను ఆపి వారిని భయపెడుతూ దూషణలకు దిగారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ బ్లూకోల్ట్స్ పోలీసులు గంగరాజు, హోంగార్డుతో కలిసి ఘటనాస్థలికి వెళ్లి స్టేషనుకు తరలించడానికి ప్రయత్నించారు. రెచ్చిపోయిన మందుబాబులు గొడవకు దిగారు. మత్తులోనే పోలీసులపై గట్టిగా కేకలు వేస్తూ దాడికి వెళ్లారు. అంతటితో ఆగకుండా పోలీసుల ద్విచక్ర వాహన తాళాలు తీసుకుని, బెదిరింపులకు పాల్పడ్డారు. సీఐ శాంతిలాల్ ఆదేశాలతో వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై నోరు పారేసుకోవడమే కాకుండా, ఆటంకం కల్గించినందుకు వారిపై కేసు నమోదు చేశారు. నిందితులను మొబైల్ కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి వారికి 14 రోజులు రిమాండ్ విధించడంతో రెడ్డిపల్లి జైలుకు తరలించారు.

రాయదుర్గం
•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమం

ఉరవకొండ, న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా సీపీఎం ఉద్యమాలకు సిద్ధమవుతోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నల్లప్ప పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మండల స్థాయి సమావేశాన్ని ప్రతినిధి మురళీ అధ్యక్షతన నిర్వహించారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని విరమించాలని డిమాండు చేశారు. వాటిని అమలు చేస్తే విద్యుత్తు ఛార్జీలు రెట్టింపు అవుతాయన్నారు. ఒక్కో మీటరుకు రూ.10వేల నుంచి రూ.17వేల వరకు ఖర్చు అవుతుందని, దాన్ని దశల వారీగా వినియోగదారుల నుంచే ప్రభుత్వం వసూలు చేయనుందని ఆరోపించారు. సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, మండల కార్యదర్శి మధుసూదన్, నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో పేదల సంక్షేమం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : తెదేపా హయాంలోనే పేదల సంక్షేమం, అభివృద్ధి జరిగిందని తెదేపా నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని శింగానహళ్లి, గోవిందవాడ, నేమకల్లు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. మజ ఎంపీటీసీ వేమన్న, మాజీ సర్పంచి హనుమంత రెడ్డి, కూటమి నాయకులు బొంబాయి ఈరన్న, రమేశ్, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

కంబదూరు : మండల కేంద్రం కంబదూరులో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ వారికి ఏఏ సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. తెదేపా గ్రామ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

చెరువులకు మోక్షం..

శెట్టూరు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం హయాంలో చెరువుల మరమ్మతులకు పైసా కూడా విదల్చలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. మండలంలో ఐదు మైనర్ ఇరిగేషన్ చెరువులకు నిధులు మంజూరయ్యాయి. వీటితో చెరువు కట్టలపై పెరిగిన కంపచెట్లు, కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేస్తున్నారు. మండలంలోని ములకలేడు చెరువుకు రు.3లక్షలు, శెట్టూరు రు.5లక్షలు, కనుకూరు రు.4లక్షలు, యాటకల్లు రు.4లక్షలు, తిప్పనపల్లి చెరువుకు రు.4లక్షలు మంజూరైనట్లు మైనర్ ఇరిగేషన్ ఇంజినీరు మనోజ్‌కుమార్ తెలిపారు.

కుండీ నిండి రోడ్డుపైకి చేరిన చెత్త

పౌర సేవలకు సమ్మె పోటు

● విధులకు దూరంగా ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు ● స్తంభించిన వ్యర్థాలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో పని చేసే ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తుండటంతో పౌరసేవలపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. ఈ నెల 12 నుంచి ఇంజినీరింగ్ కార్మికులు, 18 నుంచి పారిశుద్ధ్య కార్మికులు విధులను బహిష్కరించారు. పట్టణంలో తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణలో ఇంజినీరింగ్ కార్మికుల సేవలే కీలకం. ఆసేవలు స్తంభించడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

తాగునీటి కష్టాలు: పట్టణంలో వారం రోజులుగా తాగునీరు సక్రమంగా సరఫరా కాక ప్రజల ఇక్కట్లు అధికమయ్యాయి. పట్టణంలో 50 మంది ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెబాట పట్టడంతో తాత్కాలిక కార్మికులకు ఏ వాల్వ్ తిప్పాలో తెలియడం లేదు. మొన్నటి దాకా పైపులైన్లు లేని శివారు కాలనీలకు మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేవారు. సమ్మెతో ట్యాంకర్ సేవలు సైతం నిలిచిపోయాయి.

వీధి దీపాలు అమర్చేవారేరీ : అసలే వర్షా కాలం వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. దీంతో ఆయా కాలనీల్లో చీకట్లు కమ్ముకున్నాయి. పట్టణంలో మొత్తంగా 300లకు పైగా వీధి దీపాలు చెడిపోయాయి. ఇటీవల ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు రూ.5లక్షలతో వాటి నిర్వహణకు బల్బులు తెప్పించినా అమర్చేందుకు ఎలక్ట్రీషియన్లు లేరు.

అధ్వానంగా పారిశుద్ధ్యం: పారిశుద్ధ్య కార్మికులు సైతం సమ్మె చేస్తుండటంతో అపరిశుభ్రత పెరిగిపోతోంది. కుండీల్లో చెత్త నిండిపోయి రోడ్లపైన పడుతోంది. పట్టణంలో రోజుకు 27 మెట్రిక్ టన్నుల చెత్త, వ్యర్థాలను 33 మంది రెగ్యులర్, 78 మంది కాంట్రాక్ట్ కార్మికులు చెత్తను సేకరిస్తున్నారు. ప్రస్తుతం వారంతా సమ్మెలో ఉన్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాం

ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో పట్టణంలో పౌరసేవలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నాం. తాగునీటి సరఫరాకు రెండు ప్రైవేటు ట్యాంకర్లను ఏర్పాటు చేశాం. త్వరలో సమ్మె పరిష్కారమై పరిస్థితులు సాధారణమవుతాయి. - వి.దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం.

డ్రైనేజీలో కంపచెట్లు, మురుగు తొలగింపు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : మండలంలోని గోవిందవాడ ఆర్‌డీటీ కాలనీలో ఆదివారం పంచాయతీ అధికారులు, తెదేపా నాయకులు కలిసి డ్రైనేజీలో పూడిక, కంప చెట్లు తొలగించారు. గ్రామస్థుల విన్నపం మేరకు తెదేపా నాయకులు సోమనాథ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ వేమన్న పంచాయతీ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ దృష్టికి తీసుకుని వెళ్లి డ్రైనేజీని శుభ్రం చేయించినట్లు వారు తెలిపారు.

'రాజకీయ కక్షతోనే మిథున్‌రెడ్డి అరెస్టు'

ఉరవకొండ, న్యూస్‌టుడే: రాజకీయ కక్షతోనే ఎంపీ మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం అరెస్టు చేసిందని వైకాపా ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. లేని లిక్కర్ స్కామ్‌ను సృష్టించి మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలన్న దురుద్దేశంతో ఎంపీని ప్రభుత్వం అరెస్టు చేసిందన్నారు. వైకాపా ప్రజా ప్రతినిధులు, నాయకుల అక్రమ అరెస్టులను ఎండగడతామని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: ఉరవకొండలో లయన్స్ క్లబ్ వద్ద గత మూడు నెలలుగా తాగునీరు వృథాగా పోతోంది. దీంతో బురదమయమై ఉచిత కంటి పరీక్ష కేంద్రానికి వచ్చే వృద్ధులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. **-శ్రీనివాసులు**
సమాధానం: పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటాం. **-విజయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ, ఉరవకొండ**
– న్యూస్‌టుడే, ఉరవకొండ

సమస్య: కళ్యాణదుర్గం మండలం చాపిరిలోని మారెమ్మ ఆలయం వద్ద పైప్ లీకేజీ అవుతోంది. **- హాజరత్, చాపిరి**
సమాధానం: మరమ్మతు చేయించి సమస్యను పరిష్కరిస్తాను. **- బొజ్జన్న, పంచాయతీ కార్యదర్శి, చాపిరి.**
– న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

సమస్య: పట్టణంలోని రాచప్పబావి వీధిలో చెత్త పేరుకుపోయింది. దీంతో వాహన చోదకులు, పాదచారులకు ఇబ్బందిగా ఉంది. **- కుమార్, రాచప్పబావి వీధి**
పరిష్కారం: పరిశీలించి వెంటనే చెత్తను అక్కడి నుంచి తొలగిస్తాం.
- అలీఖాన్, మున్సిపల్ పారిశుద్ధ్య అధికారి
– న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం

సమస్య: కళ్యాణదుర్గం నుంచి చిన్నంపల్లి, బచ్చేహళ్లి, లింగదీర్లపల్లి మీదుగా శెట్టూరుకు ఆర్టీసీ బస్సు సర్వీసు తిరిగేలా చూడండి. **- మాసప్ప, లింగదీర్లపల్లి**
సమాధానం: ఆర్టీసీ డీఎంతో మాట్లాడి బస్సు ఏర్పాటుకు ప్రయత్నిస్తాం. **- బలాన్‌షా, ఎంటీఓ**
సమస్య: ములకలేడు ఉన్నత పాఠశాల వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు చేయండి. **- రఘు, ములకలేడు**
సమాధానం: స్థలాన్ని పరిశీలించి బస్‌షెల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- రఘురామ్‌రావు, శెట్టూరు, ఈవోఆర్డీ**
– న్యూస్‌టుడే, శెట్టూరు

పచ్చని తీగల తొలగింపు

ఉరవకొండ: కూడేరు మండలం ఉదిరిపికొండలో విద్యుత్తు తీగలకు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్న పచ్చని తీగను విద్యుత్తు అధికారులు తొలగింపజేశారు. ఆదివారం 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ప్రచురితమైన ఫొటో కథనానికి వారు స్పందించారు. సమస్య పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కష్టకాలంలో అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యం

చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: కష్ట సమయంలో ప్రజలకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెదేపా జిల్లా సీనియర్ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ ప్రతిపాదనలతో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 29 మందికి ప్రభుత్వం సీఎం సహాయ నిధి నుంచి రూ.21.90 లక్షల ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది. ఈ మేరకు ఆదివారం చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఇది వారి ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవడానికి ఉపకరించనుందని చెప్పారు. లబ్ధిదారులు సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బెళుగుప్ప, న్యూస్‌టుడే : నిచ్చెన మీద నుంచి పడ్డ ఓ వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెళుగుప్ప మండలం గంగవరానికి చెందిన చంద్రశేఖర్(44) ఈ నెల 17న వర్షం పడుతున్నప్పుడు ఇంటి పైకప్పును మూసేయడానికి నిచ్చెన ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డారు. కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స చేయించి ఇంటికి తీసుకొచ్చారు. ఈ నెల 19న తీవ్ర తలనొప్పి రావడంతో కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : మండలంలోని ఉంతకల్లులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మంజునాథ్ గౌడ్, నాయకుడు ఎం.సికిందర్ బాషా, రాయదుర్గం భాజపా అసెంబ్లీ కన్వీనర్ హీరోజీరావు అన్నారు. ఆదివారం కిమ్స్ సవేరా వైద్య నిపుణుల బృందం ద్వారా ఈ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 150 మంది ఈసీజీ, బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. కిమ్స్ సవేరా వైద్య బృందం, కూటమి నాయకులు రెడ్డి మాని మురళి, లేపాక్షి, ప్రేమకుమార్, శివరాజు, శివరాం పాల్గొన్నారు.

ప్రేమ పెళ్లి విషయంలో ఘర్షణ

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రేమ పెళ్లి విషయంలో ఏడాదిన్నర తర్వాత ఇరు కుటుంబాల మధ్య దాడి ఘటన ఆదివారం మండలంలోని మల్లాపురంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నవీన్, హారతులు ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకొని అనంతపురంలో నివసిస్తున్నారు. నవీన్ తల్లి సంధ్యకు ఆపరేషన్ అవ్వడంతో పలకరించేందుకు స్వగ్రామానికి వచ్చాడు. అదే సమయంలో సమీప బంధువులు మారుతి, అంజిలు వారితో ఘర్షణకు దిగారు. ఒకరి పై ఒకరు దాడి చేసుకోవడంతో ఐదు మంది గాయపడగా కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

రైతుపై దుండగుల దాడి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బోయలపల్లికి చెందిన రైతు ఎర్రిస్వామిపై ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు ఆదివారం రాత్రి దాడి చేశారు. మొక్కజొన్న పొలానికి కాపలాగా వెళ్లిన సమయంలో ఈ దాడి జరిగింది. బాధితుడి కథనం మేరకు.. కొన్నేళ్లుగా తల్లిదండ్రులతో వేరుగా ఉంటున్నాను. గతేడాది నాన్న వద్దకు వచ్చి ఉంటున్నాను. గత నెల 10న ఆయన మృతిచెందారు. అమ్మ, అక్కకు సమాచారం ఇచ్చినా హాజరుకాలేదు. నాన్న మరణ ధ్రువపత్రం నావద్దే ఉంది. ముసుగు ధరించిన దుండగులు ధ్రువపత్రం ఇవ్వాలని అడిగి మమ్మల్ని కర్రలతో కొట్టారని బాధితుడు వాపోయాడు. వారి నుంచి తప్పించుకొని కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. గాయాలవడంతో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తనను అడ్డు తొలగించుకోవాలని అమ్మ గోవిందమ్మ, అక్క లక్ష్మీదేవి, అల్లుడు నవీన్‌చౌదరి హత్యాయత్నం చేయించారని, రక్షణ కల్పించాలని ఎర్రిస్వామి పోలీసులను ఆశ్రయించారు. దాడిపై పోలీసులు విచారణ చేపట్టారు.

పట్టుబట్టి పట్టా సాధించాడు

తల్లి చిట్టెమ్మతో అనిల్‌కుమార్

కళ్యాణదుర్గంలోని అయ్యగార్లపల్లికి చెందిన అనిల్‌కుమార్ తిరుపతి ఐఐటీలో పట్టుదలతో చదివి పట్టా పొందాడు. ఐదేళ్ల కిందట తండ్రి అంజయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ అప్పులు తీర్చేందుకు తల్లి చిట్టెమ్మ తనకున్న మూడెకరాల పొలంలో రెండు ఎకరాలను అమ్మేశారు. మిగిలిన ఎకరాలో వ్యవసాయం చేస్తూ దంతోపాటు కూలీ పనులు చేసి తన ఇద్దరు బిడ్డలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో రెండో కుమారుడైన అనిల్ ఐఐటీలో సీటు సాధించడమే కాకుండా ఉత్తీర్ణతతో పట్టా అందుకున్నాడు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం రావడంతో నెలకు రూ.88వేలు ఆర్జిస్తున్నాడు. కుమారుడు ఉన్నత స్థాయికి చేరుకోవడంతో తల్లి ఆనందం వ్యక్తం చేసింది. **- న్యూస్‌టుడే, ఏర్పేడు**

పీరావలిదాదా ఉరుసు ప్రారంభం

కణేకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని యర్రగుంటలో హజరత్ పీరావలి దాదా దర్గాలో ఆదివారం 73వ ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా ముస్తాబు చేసిన దర్గాలో నిర్వాహకుడు బండి పూల రంగన్న ఆధ్వర్యంలో గంధం వేడుకలు నిర్వహించారు. భక్తులు చక్కెర చదివింపులు చేసి ప్రార్థనలు చేశారు. అనంతరం జెండాలతో వీధుల్లో ఊరేగించారు. సోమవారం రాత్రి ఉరుసు ఊరేగింపు, మంగళవారం జియారత్ కార్యక్రమంతో ఉరుసు ముగుస్తుందని నిర్వాహకులు వివరించారు.

జలధికి తరలిన పీర్లు

బెళుగుప్ప : మండలంలోని ఎర్రగుడి గ్రామంలో కొలువైన పీర్లను జలధికి తరలించారు. ఆదివారం తెల్లవారుజామున అగ్నిగుండం ప్రవేశం చేశారు. జనసందోహం, డప్పు వాయిద్యాల నడుమ జలధికి వెళ్లాయి.

ముగిసిన మొహర్రం..

కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలో జంబుగుంపలలో మొహర్రం ఆదివారం ముగిసింది. ఆదివారం గ్రామస్థులు పీర్లచావిడి చుట్టూ అలాయ్ ఆడారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు.

వంతెన నిర్మాణం చేపట్టండి

బెళుగుప్ప, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం, బెళుగుప్ప ప్రధాన రహదారిలో విరుపాపల్లి సమీపంలో హంద్రీనీవా కాలువ తవ్వారు. వాహనాల రాకపోకల కోసం కాలువపై తాత్కాలిక మట్టిరోడ్డును వేశారు. వర్షాకాలంలో నీరు నిలుస్తుండటంతో దారి అధ్వానంగా మారింది. గతంలో ప్రమాదాలు జరిగి ఇద్దరు మృతి చెందారు. సంబంధిత అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

'దుర్గం' అభివృద్ధికి కౌన్సిల్ అడ్డంకి!

సమావేశాలకు హాజరు కాని వైనం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధికి వైకాపా కౌన్సిల్ అడ్డంకిగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణ పురోగతికి వివిధ రూపాల్లో రూ.కోట్ల నిధులు మంజూరు చేసినా పనులు ముందుకు సాగడం లేదు. దీనికి ప్రధాన కారణం వైకాపా కౌన్సిలర్లు, ఛైర్మన్లు ఆమోదం తెలపకపోవడమే. మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాల్సిన కౌన్సిల్ సభ్యులు కనీసం సమావేశాలకు హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. రూ.8.21 కోట్లు నిధులు, వాటి వినియోగం, టెండర్లు ఇలా చాలా పనులున్నా కౌన్సిల్ అంటీఅంటనట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. జనవరిలో నిర్వహించిన బడ్జెట్ సమావేశమే చివరిదవ్వడం గమనార్హం.

కాలనీల్లో దుర్భర పరిస్థితి

పట్టణంలోని పార్వతీనగర్, దేవీరమ్మకాలనీ, ఉమానగర్, శంకరప్పతోట, రెవెన్యూ కాలనీ, మారెంపల్లి, జయనగర్ కోట వీధి కాలనీల్లో మౌలిక వసతుల లేమితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షం వస్తే నీరు రోడ్లపైనే నిలుస్తోంది. ఎమ్మెల్యే చొరవతో టీ కూడలి సమీపంలో హిందూపురం ప్రధాన రోడ్‌లో కల్వర్టు నిర్మించారు. దానికి అనుసంధానంగా రూ.కోటికి పైగా ఖర్చుతో అంతర్గత మురుగు కాలువ తరహా కాలువ నిర్మించాల్సి ఉంది. ఆ పనులు టెండర్ దశను దాటాయి కానీ పనులు జరగాలంటే కౌన్సిల్ తీర్మానం తప్పనిసరి. ఇటీవల తెదేపా కౌన్సిలర్లు అభ్యర్థన సమావేశం నిర్వహించి వైకాపా కౌన్సిలర్లు, ఛైర్మన్ తీరును ఎండగట్టారు. తెదేపాకు ఓట్లు వేశారని ప్రజలపై వైకాపా వారు కక్ష సాధిస్తున్నారని పలువురు తెదేపా కౌన్సిలర్లు విమర్శిస్తున్నారు.

ప్రధాన కాలువ పనులు జరగాల్సింది ఇక్కడి నుంచే..

రూ.8.21 కోట్ల పనులకు గ్రహణం

రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.3 కోట్లు, రూ.2.61 కోట్లతో 29 పనులకు టెండర్ పూర్తి అయింది. కానీ కౌన్సిల్ ఆమోదం లేకపోవడంతో పనులు ప్రారంభించలేదు. సభ్యులు ఆమోదిస్తే ప్రధాన మురుగు కాలువ, విద్యుత్తు దీపాలు, పైపులైన్ల పనులు జరిగే అవకాశం ఉంది. 2023-24 రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.95 కోట్లతో ఎనిమిది పనులకు సంబంధించి కౌన్సిలర్ ఆమోదం కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. ప్రజలు తెదేపా కౌన్సిలర్లను ప్రశ్నిస్తుండటంతో ఈనెల 21న అభ్యర్థన సమావేశం ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. నేటి సమావేశానికైనా వైకాపా కౌన్సిలర్లు, ఛైర్మన్ హాజరు అవుతారా? అభివృద్ధి పనులకు ఆమోదం తెలుపుతారా? అన్నది వేచి చూడాల్సిందే.

రేషన్ డీలర్‌కు పదవి

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలం గూళపాళ్యానికి చెందిన రేషన్ డీలర్ మిద్దె తిరుపాలయ్యకు గౌరవ పదవి దక్కింది. విజయవాడ బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ జాతీయ ఉత్పత్తి పథకం నిర్వాహణ దారుల సంక్షేమ సమాఖ్య సంఘంలో రాయలసీమ తరఫున రాష్ట్ర కోశాధికారిగా ఎంపికయ్యారు.

మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన ఎక్సైజ్ అధికారులు

అనంత నేరవార్తలు: ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ మంత్రి కొల్లు రవీంద్రను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణతో కలిసి మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. రోడ్లు, భవనాల విశ్రాంత భవనంలో వారు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

అధ్వాన రోడ్డు.. ప్రయాణికుల అగచాట్లు

నూతిమడుగు నుంచి కర్తనపర్తి గ్రామం మీదుగా వెళ్లే తారురోడ్డు కంకర తేలి కొన్నేళ్లైంది. ఎన్నేళ్లకు సమస్య తీరుతుందో గానీ ప్రయాణికుల అగచాట్లు దేవుడికెరక. ఇంత అధ్వానంగా ఉన్నా అటువైపు కన్నెత్తి చూసేవారు కరవయ్యారని ఆ ప్రాంత వాసులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకుని మరమ్మతులు చేయాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, కంబదూరు**

శిథిల ట్యాంకుతో భయాందోళన

కూడేరు మండలంలోని జల్లిపల్లిలో పీఏబీఆర్‌కి వెళ్లే దారిలో ఇళ్ల మధ్య ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు శిథిలం అయ్యింది. దాని కింది భాగంతో పాటు పిల్లర్లు దెబ్బతిన్నాయి. పూర్తిగా శిథిలమై ఎప్పుడో కూలుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కూడేరు**

వ్యర్థాలు ఇలా.. మురుగు పారేదెలా?

ఉరవకొండలో పాతసంత మార్కెట్ వద్ద ప్రధాన కాలువలో వ్యర్థాలు పేరుకు పోయాయి. దీని కారణంగా మురుగు ముందుకు సాగడం లేదు. దీంతో స్థానికంగా నివాసం ఉండే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలు, పూడికను తొలగించే దిశగా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో సమస్య అధికమవుతోంది. దీనిని తొలగించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

కంపతో మూసుకుపోతున్న దారి

పట్టణంలోని సీవీవీ నగర్ వ్యవసాయ గోదాము మీదుగా వెళ్లే వీధిలో సిమెంటు దారికి ఇరువైపుల కంప ఏపుగా పెరిగింది. దానిని ఎప్పటికప్పుడు తొలగించక పోవడంతో కంప దారిని కప్పేస్తోంది. చాలా కాలంగా సమస్యను ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. పంచాయతి అధికారులు కంపను తొలగింప చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్‌ను వివరణ కోరగా, కార్మికుల చేత కంపను తొలగింప చేసి, రాకపోకలకు ఇబ్బంది లేకుండ చూస్తామన్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

రాయదుర్గం, న్యూస్‌టుడే: మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికుల వినూత్నంగా నిరసన తెలియజేశారు. 8వ రోజు సమ్మెలో భాగంగా కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేదాకా సమ్మె విరమించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

మోకాళ్లపై నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

9 తరగతులు.. 5 గదులు

☛ పాఠశాల కార్యాలయంలోనూ బోధనే..
☛ నిలిచిన నూతన భవనాల నిర్మాణం

ఇరుకు గదిలో చిన్నారులు

విడపనకల్లు(ఉరవకొండ), న్యూస్‌టుడే: ఆ పాఠశాలను గదుల కొరత వేధిస్తోంది. తరగతులు ఎక్కువ ఉన్నాయి, సరిపడా గదులు మాత్రం లేవు. విడపనకల్లు మండలం హంచనహాల్(పెంచలపాడు) మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 9 తరగతులు నడుస్తున్నాయి. 167 మంది విద్యార్థులు ఉన్నారు. కానీ 5 గదులు మాత్రమే ఉన్నాయి. అవి కూడా ఇరుకుగా ఉండి విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ఒకే గదిలో తరగతితో పాటు పాఠశాల కార్యాలయం సైతం నిర్వహిస్తున్నారు. గదుల కొరత కారణంగా కొన్ని తరగతులను దగ్గరలోని ఆర్డీటీ భవనంలో నడిపిస్తున్నారు. ఇప్పుడున్న గదులు సైతం శిథిలం అయ్యాయి. పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. గత్యంతరం లేక ఉపాధ్యాయులు వాటి మధ్యనే బోధన సాగిస్తున్నారు.

● గతంలో నాడు- నేడులో భాగంగా రెండు గదుల నిర్మాణాన్ని చేపట్టారు. వాటిని సైతం చిన్నగా నిర్మించడంతో అవీ ఇరుకుగా ఉన్నాయి. అక్కడ పాఠశాల నిర్వహణకు అనుకూలమైన వాతావరణం కనిపించడం లేదు. ప్రభుత్వం మారడంతో వాటి నిర్మాణం ఆగిపోయింది. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని గదుల నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ఉప విద్యాధికారి శ్రీనివాసులను వివరణ కోరగా.. నిధులు కొరత వల్లే నిర్మాణం ముందుకు సాగడం లేదన్నారు. నిధులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. విడుదలయిన వెంటనే నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దిండి ఉత్సవం

స్వామి చిత్రపటంతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో భావసార క్షత్రియులు ఆదివారం పాండురంగస్వామి దిండి ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీరశైవ నగర్‌లోని పాండురంగ ఆలయంలో వేకువ జాము నుంచే స్వామి, అమ్మవార్ల మూల విరాట్టులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆ తరవాత స్వామి చిత్ర పటాన్ని మంగళ వాయిద్యాల నడుమ పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

25 నుంచి శ్రావణమాసం ప్రత్యేక పూజలు

గుంతకల్లు, న్యూస్‌టుడే: పాతగుంతకల్లులోని శ్రీశైల జగద్గురు సూర్య సింహాసన మఠంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మఠం మేనేజరు మల్లప్ప, పర్యవేక్షక బృందం సభ్యులు తెలిపారు. పూజలు ఈనెల 25 నుంచి ఆగస్టు 23 వరకు జరగనున్నాయి. ఈ పూజల్లో శ్రీశైలం పీఠాధిపతి జగద్గురు డాక్టర్ చెన్నసిద్ధరామ పండితారాధ్యశివాచార్య మహాస్వాములు పాల్గొంటారని వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కరపత్రాలను ఆదివారం మఠంలో ఆవిష్కరించారు. మఠం పర్యవేక్షకులు తిమ్మారెడ్డి, మంతకల్‌రెడ్డి, దేవేంద్రప్ప, సురేష్‌గౌడ్, బండారు రమేష్, మోహన్‌బాబు, వీరన్నగౌడ్, సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

పెద్దమ్మకు విశేష పూజలు

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలోని నారాపురం గ్రామంలో పెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని పునః ప్రతిష్ఠించి 41 రోజులు అయిన సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్థులను ఆప్యాయంగా పలకరించారు. తెదేపా నాయకులు రవీంద్రారెడ్డి, శివప్రసాద్ నాయుడు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాం

కొత్తపేట(గుత్తి గ్రామీణం): గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. గుత్తి మండలంలోని కొత్తపేట గ్రామంలో ఆదివారం మాజీ కౌన్సిల్ సభ్యుడు ఇషాక్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, ఇంటి పట్టాలు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. గుమ్మనూరు ఈశ్వర్, మండల కన్వీనర్ భర్రివలి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ జక్కలచెరువు ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్ యాదవ్, శీనా తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు: యువత అన్ని రంగాల్లో దూసుకుపోవాలని ఎమ్మెల్యే జయరాం పిలుపునిచ్చారు. గుంతకల్లు పట్టణ యువత అధ్యక్షుడిగా ఎంపికైన రమణ ఆదివారం పెద్దఎత్తున నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఊరేగింపు పట్టణ శివారులోని ఆభయాంజనేయస్వామి కూడలి నుంచి పాతగుంతకల్లు వరకు సాగింది. యువకులు రాజకీయాల్లోకి వచ్చి బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని, పార్టీ అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు కుటుంబసభ్యులను గజమాలతో సత్కరించారు.

శుద్ధజల కేంద్రాలు మూత

పాడైపోతున్న యంత్రాలు

అంకాలమ్మ గుడికాలనీలో మూతపడిన శుద్ధజల పథకం

గుంతకల్లు, న్యూస్‌టుడే: పట్టణ ప్రజలకు రక్షితనీటిని అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మున్సిపాలిటీల్లో శుద్ధజల కేంద్రాలను నిర్మించింది. అందులో భాగంగా రాష్ట్రంలోనే మొట్టమొదట గుంతకల్లు మున్సిపాలిటీలో మూడు శుద్ధజల కేంద్రాలు నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం అవి మూలనపడ్డాయి. పలితంగా ఆయా కాలనీల్లోని పేదలు ప్రైవేటు ట్యాంకర్ల వద్ద నీటిని కొని తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. పథకాలు మూతపడటంతో అందులోని విలువైన యంత్రాలు చిలుంపట్టి పాడైపోతున్నాయి. పలితంగా ప్రభుత్వం వ్యయం చేసిన నిధులకు సార్థకత లేకుండా పోతోంది. ఈ కేంద్రాలను వినియోగంలోకి తెస్తే ప్రజలకు శుద్ధజలం అందుతుంది.

● గుంతకల్లు పట్టణంలోని పాతగుంతకల్లులో భాగమైన అంకాలమ్మగుడి కాలనీలో మొదటి నీటి పథకాన్ని 2010లో ఏర్పాటు చేశారు. ఆ తరువాత భాగ్యనగర్, మోదినాబాదులో ప్రారంభించారు. ఈ మూడు కేంద్రాల ఏర్పాటుకు రూ.కోటికి పైగా వ్యయం చేశారు. ఈ కేంద్రాలను అధికారులు మూడు, నాలుగు సంవత్సరాల పాటు నిర్వహించారు. తరువాత వాటిని పట్టించుకోలేదు. కేంద్రాల ద్వారా మూడు ప్రాంతాల్లో దాదాపు 30 వేలమందికి పైగా రోజూ శుద్ధజలాన్ని పొందేవారు. ప్రస్తుతం మున్సిపాలిటీ సరఫరా చేసే నీటిని తాగుతూ ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. పిల్లలు జ్వరాల బారిన పడుతున్నారు. మూడు శుద్ధజల కేంద్రాలతో పాటు సాయినగర్‌లోని ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని కూడా వినియోగంలోకి తీసుకురావాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై మున్సిపల్ కార్యనిర్వాహక ఇంజినీరు ఇంతియాజ్ వివరణ కోరగా మూతపడిన శుద్ధజల పథకాలను పరిశీలిస్తాం. యంత్రాల కండిషన్ను పూర్తిగా అధ్యయనం చేయాల్సి ఉంది. విని యోగంలోకి తెచ్చే అవకాశం ఉంటే, పునరుద్ధరించి ప్రజలకు శుద్ధజలం అందిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: గుంతకల్లులోని పాతబస్టాండు కొలిమి లైన్ రహదారిలో బురదమయంగా ఉంది. పాదచారులు నడవడానికి ఇబ్బందిగా ఉంది. - రజాక్

సమాధానం: పరిష్కారం చేయిస్తాం. - చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

సమస్య: తాడిపత్రి పట్టణంలోని నందలపాడు కాలనీ సమీపంలో పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్దఎత్తున నాపరాళ్ల వ్యర్థాలు పడేశారు. ఈ దారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. ఎవరైనా దారి పక్కకు వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. - గంగరాజు

సమాధానం: వెంటనే ఆయా పరిశ్రమదారులతో మాట్లాడి దారి పక్కన నాపరాళ్ల వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. - రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, గన్నేవారిపల్లి

- న్యూస్‌టుడే, తాడిపత్రి

తెలుగుభాషను పరిరక్షించుకోవాలి

పురస్కారం అందుకుంటున్న నాగముని

గుత్తి (గ్రామీణం), న్యూస్‌టుడే: తెలుగుభాషను ప్రతిఒక్కరూ పరిరక్షించుకోవాలని గుత్తి ఆర్ఎస్కు చెందిన కవి నాగముని పేర్కొన్నారు. విద్యుత్తు శాఖలో సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న ఆయన కొన్నేళ్ల నుంచి సాహితీ రంగంలో రాణిస్తున్నారు. హిందూపురంలో ఆదివారం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఉర్దూ కవి ఫైజ్‌అహ్మద్ ఫైజ్ సాహితీ పురస్కారాన్ని ఆయన ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా అందుకున్నారు.

రైల్వేలో కొత్తగా శుద్ధజల ట్యాంకుల నిర్మాణం

ప్రభాత్‌నగర్‌లో నిర్మించిన ట్యాంకు

గుంతకల్లు, న్యూస్‌టుడే: గుంతకల్లులో రైల్వే అధికారులు, సిబ్బంది, ప్రయాణికులకు నీటిని అందించడానికి పందేళ్ల కిందట అంగ్లేయులు నిర్మించిన ఉపరితల నీటి ట్యాంకులను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నారు. కాలనీలకు శుద్ధజలాన్ని అందించడానికి ఒకవైపు ట్యాంకులు, మరోవైపు పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయి. ప్రభాత్‌నగర్‌లో రెండు, రైల్వే ఆసుపత్రి వద్ద ఒకటి, కేంద్రీయ విద్యాలయం, అరవిందనగర్ తదితర కాలనీల్లో రూ.4 కోట్లు వ్యయంతో ట్యాంకులను నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఒక్కొక్క ట్యాంకులో లక్ష లీటర్ల నీటిని నిల్వ ఉంచడానికి అవకాశముంది. ఇప్పటికే రెండింటి పనులు పూర్తయ్యాయి. మిగిలిన ట్యాంకుల పనులు కొనసాగుతున్నాయి. రైల్వే ఆసుపత్రి వద్ద నాలుగైన 1886 సంవత్సరంలో ఉపరితల ట్యాంకును ఆంగ్లేయులు ఏర్పాటు చేశారు. దీన్ని పైనుంచి కిందకు ఏవిదంగా తీసుకురావాలో అధికారులకు అర్థం కావడంలేదు. పలితంగా ఈ ట్యాంకును వినియోగిస్తున్నారు.

లక్ష్యానికి మించి డిపాజిట్లు సేకరణ

మాట్లాడుతున్న అబ్దుల్‌జిలాన్

గుత్తి, న్యూస్‌టుడే: పట్టణ సహకార బ్యాంకును అందరి సహకారంతో అభివృద్ధి పథంలోకి తీసుకువెళుతున్నట్లు గుత్తి బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్‌జిలాన్ పేర్కొన్నారు. పాలకవర్గంతోపాటు అధికారులు, ఖాతాదారుల సహాయ సహకారాలతో బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. లక్ష్యానికి మించి ఈసారి రూ.13 కోట్లు డిపాజిట్లను సేకరించినట్లు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఓ పంక్షన్‌హాలులో 102వ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పామిడి, అనంతపురంలో బ్రాంచిలను ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే గుంతకల్లు, నంద్యాల జిల్లా డోన్, శ్రీసత్యసాయి జిల్లా కదిరి, రాయదుర్గంలో బ్రాంచిల ఏర్పాటుకు రిజర్వ్ బ్యాంకు అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఖాతాదారులు సొకర్యార్థం ఏటీఎంలను కూడా ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మాబు, నాగరాజు, వెంకి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి

తాడిపత్రి, న్యూస్‌టుడే: ఉచిత కుట్టుమిషన్ శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి లభిస్తుందని తాడిపత్రి రోటరీ క్లబ్ సభ్యులు తెలిపారు. ఆదివారం స్థానిక క్లబ్ కార్యాలయంలో కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 15 ఏళ్లుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అధ్యక్షుడు కిశోర్‌కుమార్, కార్యదర్శి నవీన్‌కుమార్, సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మహిళా సమస్యలపై ఉద్యమిద్దాం'

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమిద్దామని ఐద్వా జిల్లా నాయకురాలు చంద్రిక పిలుపునిచ్చారు. ఆదివారం బుక్కరాయసముద్రంలో మండల మహాసభలో పాల్గొన్నారు. భాజపా, తెదేపా కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరవైందని ఆరోపించారు. దాడులు, హత్యలు, హత్యాచారాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మహిళలపై దాడులు అరికట్టాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఐద్వా నాయకురాళ్లు నాగమ్మ, మునిజ, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డా.కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం వెంకటాపురం, దయ్యాలకుంటపల్లి గ్రామాల్లో సత్యయోగ మిత్రమండలి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గుండె, గర్భ సంబంధిత వ్యాధులు, డయాబెటిస్, కంటి జబ్బులు, మోకాళ్ల సమస్యలకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ఈశ్వర్, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దర్గాను అభివృద్ధి చేయకపోవడం అన్యాయం: ఎమ్మెల్యే

గుంతకల్లు, న్యూస్‌టుడే: పాతగుంతకల్లులోని సయ్యద్ మస్తాన్ వలి స్వామి దర్గాకు ప్రతి సంవత్సరం రూ.50 లక్షలకుపైగా ఆదాయం వస్తున్నా అభివృద్ధి చేయకపోవడం అన్యాయమని ఎమ్మెల్యే జయరామ్ అన్నారు. ఉరుసును పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు, తెదేపా, తెలుగు యువతతో కలిసి ఆదివారం దర్గాను దర్శించుకున్నారు. స్వామి సమాధికి చదివింపులు చేసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. సకాలంలో వర్షాలు కురిసి రైతులు పంటలు పెట్టుకునే విధంగా కరుణించాలని వేడుకున్నారు. దర్గా అభివృద్ధి విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని తెలిపారు.

పాముల బెడదతో భయాందోళన

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులోని ఆలూరు రోడ్డు ప్రశాంతి నగరంలో కొన్నిరోజులు వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళ పాముల సంచారం వస్తున్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఆదివారం సాయంత్రం మూడు పాములు కనిపించడంతో కాలనీవాసులు మున్సిపల్ కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లారు. పాములు పట్టే వ్యక్తిని పిలిపించి రెండు పాములను పట్టుకున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రక్తదాతకు సన్మానం

షేక్షావలిని సన్మానిస్తున్న ప్రముఖులు

గుత్తి: గుత్తిలోని రక్తదాతల సంస్థ అధ్యక్షుడు షేక్షావలిని ఆదివారం హిందూపురంలో సన్మానించారు. భారతీయ ముస్లిం లెజెండ్స్ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని నిర్వాహకులు సన్మానించారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం అభినందనీయం అన్నారు.

కంటి వైద్యాధికారికి సన్మానం

మధుసూదనరాజు దంపతులను సన్మానిస్తున్న వైద్యులు

యాడికి, న్యూస్‌టుడే: తాడిపత్రి క్లస్టర్ కంటి వైద్యాధికారి జి.మధుసూదనరాజు పదవీ విరమణ సందర్భంగా యాడికివాసులు ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక షాదీఖానాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పరమేశ్వర్, ప్రవీణ్, మలేరియా ఉప వైద్యాధికారి శ్రీనివాసులు, రాయలచెరువు లయన్స్ క్లబ్ సభ్యులు కులశేఖర్ నాయుడు, రవిప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు ఆయన్ని ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు.

పట్టుబట్టి పట్టా సాధించాడు

తల్లి చిట్టెమ్మతో అనిల్‌కుమార్

కళ్యాణదుర్గంలోని అయ్యగార్లపల్లికి చెందిన అనిల్‌కుమార్ తిరుపతి ఐఐటీలో పట్టుదలతో చదివి పట్టా పొందాడు. ఐదేళ్ల కిందట తండ్రి అంజయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ బాధ్యతలను తీసుకొని తల్లి చిట్టెమ్మ తనకున్న మూడెకరాల పొలంలో రెండు ఎకరాలను అమ్మేశారు. మిగిలిన ఎకరాలో వ్యవసాయం చేయడంతోపాటు కూలీ పనులు చేసి తన ఇద్దరు బిడ్డలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో రెండో కుమారుడైన అనిల్ ఐఐటీలో సీటు సాధించడంతో కళాకండా ఉత్తీర్ణతతో పట్టా అందుకున్నాడు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం రావడంతో నెలకు రూ.88వేలు ఆర్జిస్తున్నాడు. కుమారుడు ప్రయోజకుడిగా మారడంతో తల్లి ఆనందం వ్యక్తం చేసింది. - న్యూస్‌టుడే, ఏర్వేడు

'ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగంగా కాల్చరాదు'

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగంగా కాల్చడం వల్ల ఊపిరితుల సమస్య ఏర్పడుతుందని హైదరాబాద్ యశోద ఆసుపత్రి ఊపిరితిత్తుల వైద్యనిపుణుడు కోన మురళీధరరెడ్డి పేర్కొన్నారు. పెద్దవడుగూరులోని సరస్వతి పాఠశాలలో ఆదివారం యాడికి లయన్స్‌క్లబ్, మేఘ హెల్త్‌యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు వందమంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మారుతి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ప్రసవనారాయణ, మేఘ హెల్త్‌యా ఫౌండేషన్ సభ్యులు మహేంద్ర, నాగరాజు, కాంతమ్మ పాల్గొన్నారు.

కంటి సంరక్షణ ముఖ్యం

పామిడి: కంటి సంరక్షణ ముఖ్యమని పట్టణ లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి తిరుపాలనాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక భావసార క్షత్రియ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ అబ్దుల్ ఆబిద్ పాల్గొని 250 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 70 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. లయన్స్ అధ్యక్షుడు రమావీర్ అన్నదానం చేశారు. శిబిరంలో శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ శివప్రకాశ్, పామిడి లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తా

పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకున్న బాలబాలికలు

గుంతకల్లు, న్యూస్‌టుడే: కడపలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన దక్షిణభారత స్థాయి కరాటే పోటీల్లో గుంతకల్లు పట్టణం బాలబాలికలు సత్తాచాటారు. పట్టణంలోని ఏఎస్ గోజూరియో కరాటే అకాడమీలో శిక్షణ పొందుతున్న 12 మంది బాలబాలికలు పోటీల్లో పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వారితో వీరు పోటీ పడ్డారని అకాడమీ శిక్షకుడు దినేశ్ అన్నారు. అందరూ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారని ఆయన పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు వారిని సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

గుంతకల్లు పట్టణం: గుంతకల్లులోని ఆలూరు రోడ్డులో ఉన్న విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో సోమవారం కొత్త లైను లాగుతున్న నేపథ్యంలో రెండు గంటల పాటు పట్టణంలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రఘు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

యాదవుల కలశయాత్ర

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలో ఆదివారం సాయంత్రం యాదవులు కలశయాత్ర నిర్వహించారు. భారత సైన్యంలో అహీర్ రెజిమెంట్ ఏర్పాటు చేయాలని కోరుతూ అఖిల భారత యాదవ సంఘం కలశయాత్రను చేపట్టింది. భారత్-చైనా యుద్ధంలో 114మంది యాదవులు మరణించారు. రెజాంగ్‌లా నుంచి వీరమరణం పొందిన పవిత్ర స్థలంలో మట్టిని సేకరించి కలశయాత్రను చేపట్టారు. యాత్రను పురస్కరించుకుని గుత్తి, గుత్తిఆర్.ఎస్.లలో యాదవులు బైక్ ర్యాలీ చేశారు.

అటవీ అధికారులకు నెమలి అప్పగింత

గుత్తి: గుత్తిలో జనావాసాల్లోకి వచ్చిన నెమలిని ఆదివారం వెంకటేశ్ అనే వ్యక్తి అటవీ అధికారులకు అప్పగించారు. స్థానిక సీపీఐ కాలనీలోకి నెమలి రావడంతో కుక్కలు వెంబడించాయి. వాటి బారి నుంచి నెమలిని కాపాడి అటవీ అధికారులకు అప్పగించడంతో అడవిలో వదిలేశారు.

సమస్యలు పరిష్కరించాలి

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి కోరారు. ఆదివారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం పేదలకు ఇచ్చిన ప్రాజెక్టులపై పదుతున్నట్లు తెలిపారు. సమస్యలపై విన్నవించినా గత నెలలో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సందర్శించినట్లు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినా ఇప్పటికీ పట్టించుకోలేదన్నారు. పట్టణంలో నిరుపేదలకు స్థలాలు ఇవ్వాలని కోరుతూ తాము మూడు నెలల కిందట పురపాలక కార్యాలయంతోపాటు రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళనలు చేశామన్నారు. అధికారులు స్థలాలు ఇచ్చేందుకు అర్హులపై అర్హుల జాబితాను రూపొందించలేదని వాపోయారు. గుంతకల్లు మార్గంలో మురుగు కాలువలు నుంచి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్, మండల కార్యదర్శి రామదాసు, షఫీ, రాజా, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా పూర్వవిద్యార్థుల కలయిక

శింగనమల, న్యూస్‌టుడే: శింగనమల ఉన్నత పాఠశాలలో ఆదివారం 1998లో చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులను ఆహ్వానించి సన్మానించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకని సంతోషంగా గడిపారు.

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

జలధికి తరలిన పీర్లు

చెదుళ్లలో పీర్ల ఊరేగింపు

పసలూరులో..

పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

పూలకుంట(గుత్తి గ్రామీణం): గుత్తి మండలంలోని పూలకుంట గ్రామంలో కుళ్లాయిస్వామి చిన్నపీర్లను ఆదివారం ఊరేగించినట్లు సర్పంచి నగరూరు సుమలత తెలిపారు. గతవారం రోజులుగా పీర్లకు భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చక్కెర చదివింపులు చేశారు. పీర్లస్వాములను జలధికి తరలించారు.

బుక్కరాయసముద్రం: మండలంలోని చెదుళ్ల, పసలూరు గ్రామాల్లో ఆదివారం పీర్లు జలధికి తరలాయి. ఆదివారం తెల్లవారుజామున పీర్లు అగ్గిగుండంలోకి ప్రవేశించాయి. అనంతరం గ్రామంలో ఊరేగించారు. భక్తులు చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం జలధికి వెళ్లాయి.

తాడిపత్రి: తాడిపత్రి పట్టణంలోని నందలపాడు, మండలంలోని కోమలి గ్రామంలో పీర్లను జలధికి తరలించారు. భక్తులు బెల్లం, చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలో ఈనెల 18న వైకాపా నిర్వహించిన రికాల్ చంద్రబాబు మ్యానిఫెస్టో కార్యక్రమం సందర్భంగా గొడవలు సృష్టించేందుకు పాల్పడిన కొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. వైకాపాకు సంబంధించి బ్రహ్మానందరెడ్డి, ఆర్‌ఎస్ ఓబుల్‌రెడ్డి మరికొందరు, తెదేపాకు చెందిన రవీంద్రారెడ్డి, మరికొందరిపై కేసు నమోదు చేశారు.

భాగవత ప్రవచనం ముగింపు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో భాగవత ప్రవచనం ఆదివారం ముగిసింది. గత వారం రోజుల నుంచి బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ భాగవత సప్తాహం నిర్వహించి ప్రవచనం కొనసాగించారు. చివరి రోజు ఊహించని బ్రహ్మశ్రీ భక్తులకు ప్రవచనం వినిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపా జగదీశ్, కార్యదర్శి కందూరి కృపాకర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, జయంతి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం కురవాలని పూజలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని దిమ్మగుడిలో ఆదివారం వర్షం కురవాలని కోరుతూ రైతులు గంగకు ప్రత్యేక పూజలు చేశారు. బోనాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించి పూజలు నిర్వహించారు. ఆలయానికి వెళ్లి వర్షాలు కురవాలని పూజలు ఆచరించారు. చిన్నవడుగూరు గ్రామంలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో వంద టెంకాయలు కొట్టారు.

పామిడి, న్యూస్‌టుడే: మండలంలోని నీలూరులో వర్షం కోసం గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం బొడ్రాయి వద్ద 101 బిందెలతో నీళ్లు పోసి, 101 టెంకాయలు కొట్టారు. వినుకు జాడ లేకపోవడంతో వర్షం కురవాలని పూజలు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

క్రమశిక్షణ తప్పితే చర్యలు

గుంతకల్లు, న్యూస్‌టుడే: జనసేన పార్టీలో ఉండేవారు ఎవరైనా సరే క్రమశిక్షణ తప్పితే చర్యలు తీసుకుంటామని పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మధుసూదన్ గుప్తా హెచ్చరించారు. స్థానిక జనసేన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీకి చెందిన ఇద్దరు పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా అనవసరంగా విమర్శలు చేశారన్నారు. వారికి నోటీసులు పంపామని వివరించారు. పార్టీ తనకు ఎలాంటి పదవులు ఇవ్వలేదని, అందరినీ కలుపుకొని పోవడం లేదంటూ వారు చేసిన ఆరోపణలు ఖండిస్తున్నామని చెప్పారు. తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా, నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించిన పత్రాలను ప్రదర్శించారు. అనవసరంగా విమర్శలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. సమావేశంలో నాయకులు బండి శేఖర్, పవర్ శేఖర్, ధనుంజయ, సురేశ్, తిమ్మప్ప, పాండుకుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

హెచ్చెల్సీ కాలువ గట్లు శిథిలం

● ఏళ్లు గడుస్తున్నా నిధులు ఇవ్వని వైనం ● ఆయకట్టుకు నీటి సరఫరాలో అంతరాయం

పెద్దవడుగూరు సమీపంలో కాలువ దుస్థితి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పెద్దవడుగూరు మండలానికి సాగునీరు అందించే ప్రధాన హెచ్చెల్సీ కాలువ శిథిలావస్థకు చేరింది. కాలువ లైనింగ్ గోడలు, డ్రాప్‌లు దెబ్బతిన్నాయి. రైతులు పంటలు సాగునీరు పెట్టుకునేందుకు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిదుతూరు నుంచి మండలానికి డిస్ట్రిబ్యూటరీ కాలువలు ఉండగా ప్రతి డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో డ్రాప్‌లు కూలిపోయి శిథిలమై ఎందుకు పనికిరాకుండా పోయాయి. గత ప్రభుత్వంలో కాలువల మరమ్మతులకు నిధులు కేటాయించలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా కాలువకు పూర్వవైభవం వస్తుందని ఆయకట్టు రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. 13,14,15,16 డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో రైతులు నీటిని పొలాలకు తరలించాలంటే పెద్ద పెద్ద రాళ్లు నీటి ప్రవాహానికి అడ్డు పెట్టి నీరు చంపుకుంటున్నారు. వ్యయప్రయాసలతోపాటు అదనంగా డబ్బు వెచ్చించాల్సి వస్తోంది. ఒకటి నుంచి ఎనిమిది డిస్ట్రిబ్యూటరీ కాలువల వద్ద ఇదే పరిస్థితి. చివరి ఆయకట్టు ప్రాంతాల్లో చిన్నవడుగూరు, దిమ్మగుడి, చిట్టూరు గ్రామాల వద్ద లైనింగ్ గోడలు కూలిపోయి కాలువలోకి అడ్డంగా పడిపోయాయి. వీటి మరమ్మతులకు అధికారులు చొరవ చూపలేదు.

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం

హెచ్చెల్సీ కాలువల్లో మరమ్మతుల కోసం ఈ ఏడాది రూ.3.2 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. ప్రధాన కాలువల్లో ఏళ్లపాటు ఖీడ పనులు ఉపాధిహామీ వారిని గుర్తించాం. కల్వర్టులు, ఇతర పనులపై కూడా దృష్టిసారించాం. నిధులు వచ్చాక పనులు చేపడతాం.
- మానస, హెచ్చెల్సీ ఏఈ, పెద్దవడుగూరు

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని తలగాసిపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. అనంతపురం సిండికేట్‌నగర్‌కు చెందిన గోవిందు, మరో వ్యక్తి ద్విచక్రవాహనంపై కల్లూరు నుంచి అనంతపురం వైపు వెళ్తుండగా ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం 108లో అనంతపురం తరలించారు.

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

గాయత్రి ఆలయంలో ఆధ్యాత్మిక శోభ

అనంత సాంస్కృతికం: హౌసింగ్‌బోర్డు కాలనీలోని పంచ ముఖ గాయత్రి ఆలయంలో ఆదివారం పలు ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఈ ఉత్సవంలో నగరంలోని పలు ప్రాంతాలనుంచి మహిళలు చీర, సారె మేళతాళాలతో తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. తెల్లవారుజామున గాయత్రిమాతకు పంచామృతాభిషేకం జరిపి కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు.

అలంకరణలో గాయత్రిదేవి

భాషపై మమకారం మరి..

భాషపై మమకారంతో రాంనగర్‌కు చెందిన సురేశ్ తన కారు నంబరును తెలుగులో రాయించుకున్నారు. 'తెలుగులో అయితే కొత్తగా ఉంటుంది. చూసినవారు ఎవరైనా కాసేపు ఆ నంబరు వైపు అలా చూసి ఇది ఏ భాష? అని అడుగుతారు.. ఆ విధంగానైనా తెలుగులో ఇలా రాస్తారా? అనే విషయం తెలుసుకుంటారు.. అని చెప్పడం గమనార్హం. **- ఈనాడు అనంతపురం**

వర్షం పడితే మురుగు బాధలు రెట్టింపు

రాకపోకలకూ ఇబ్బందులు

రుద్రంపేట పంచాయతీ పరిధి నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలోనూ డ్రైనేజీ స్తంభించి మురుగు రహదారిపైకి చేరి ఇళ్ల ముందుకు వస్తోంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. పంచాయతీ అధికారి హిదయతుల్లా మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని ప్రజలు అర్జీ ఇచ్చారని, త్వరలో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, రుద్రంపేట**

రాంనగర్ (అనంతపురం) : అనంతపురం నగరంలో వర్షం పడితే చాలు పలు కాలనీల వాసులకు గుండెల్లో గుబులు మొదలవుతోంది. ముఖ్యంగా నడిమివంక పరీవాహ ప్రాంతాలవారికి కంటిమీద ఉండటం లేదు. గతంలో వచ్చిన వరదల భయం ఇంకా వారిని వెంటాడుతోంది. వీరితో పాటు నగరంలోని పలు కాలనీల్లో సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. నగర పాలక కనీస కార్యాచరణ చేపట్టడం లేక సమస్యలు మరింత తీవ్రం అవుతున్నాయి.

✦ రాంనగర్‌లో చిన్నపాటి వర్షానికే మురుగంతా రోడ్లపై ప్రవహిస్తోంది. ఇళ్ల ముందు ఉన్న ప్రధాన గేట్లను దాటి మురుగు ఇంటి ఆవరణాల్లోకి చేరుతోంది. పెద్ద వర్షం అయితే సెల్లార్లలోకి నీరు చేరి ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల ముందు రహదారులపై మురుగంతా ఆగి దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు.

✦ సిరి ఆపార్ట్‌మెంటు పరిసర ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడే మురుగు నిలిచిపోయింది. దోమలకు నిలయాలుగా మారాయి. మురుగును శుభ్రం చేసుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువ వ్యవస్థను మెరుగు పరిచి, సమస్య నుంచి విముక్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రాంనగర్‌లోని సిరి అపార్ట్‌మెంటు వెనక భాగంలో ఆగిన మురుగు

మద్యం అవినీతిలో తప్పించుకోలేరు

రాంనగర్ (అనంతపురం): గత వైకాపా ప్రభుత్వ హయాంలో మద్యంలో భారీ స్థాయిలో అవినీతికి పాల్పడ్డారని, తప్పు చేసినవారు ఎట్టి పరిస్థితుల్లో తప్పించుకోలేరని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగరంలోని 18వ డివిజన్ గుల్జార్‌పేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఐదేళ్ల వైకాపా పాలనలో నాసిరకం మద్యంతో ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకున్నారని, మహిళల తాళిబొట్లు తెగాయని వ్యాఖ్యానించారు. జగన్ దుర్మార్గ పాలన సాగించారన్నారు. జగన్ అండతో ఎంపీ మిథున్‌రెడ్డి మద్యంలో వేల కోట్లు దోచుకున్నారన్నారు. మద్యంలో ఒక్కొక్కరుగా బయటపడుతారన్నారు. తర్వాత జగన్ వంతేనని తెలిపారు. తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు రూ.118 కోట్లతో అనేక లభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, మేయర్ వసీం విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

గుల్జార్‌పేటలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్

రజక విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: కుల వృత్తినే కాకుండా, పిల్లలను బాగా చదివించి ముందుకెళ్లేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సావిత్రి సూచించారు. నగరంలోని జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన రజక విద్యార్థుల ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రజక ఉద్యోగ, విద్యావంతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్రిస్వామి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి శివశంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రజక కులానికి చెందిన విద్యార్థులు బాగా చదువుకుని అన్నిరంగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన 51 మంది విద్యార్థులను అభినందిస్తూ నగదు, జ్ఞాపికను అందజేశారు.

నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేస్తున్న రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సావిత్రి, విశ్రాంత న్యాయమూర్తి శివశంకర్ తదితరులు

మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన ఎక్సైజ్ అధికారులు

అనంత నేరవార్తలు: ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ మంత్రి కొల్లు రవీంద్రను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణతో కలిసి మర్యాద పూర్వకంగా ఆదివారం కలిశారు. రోడ్లు, భవనాల విశ్రాంత భవనంలో వారు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి

అనంత సాంస్కృతికం: నగరంలోని మూడో రోడ్డు ఘంటసాల భవన్‌లో ఆదివారం అనంత ఘంటసాల ఆరాధన సమితి ఆధ్వర్యంలో 'మోహన-కళ్యాణి' స్వర రాగ కార్యక్రమం జరిగింది. విశ్రాంత తహసీల్దార్ పాలసముద్రం నాగరాజు సారథ్యంలో గాయనీ గాయకులు ఎస్‌కేయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, డీఆర్వో మాలోల, రామాంజనేయులు, రామయ్య, బృందమణి, శ్రీదేవి, విజయలక్ష్మి స్వరార్చన చేసి ఆకట్టుకున్నారు.

పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా చల్లా కృష్ణరంగయ్య

అనంత సాంస్కృతికం: నగరంలోని పాతూరు ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడుగా చల్లా కృష్ణరంగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాచర్ల అశోక్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో జరిగిన సమావేశానికి ప్రస్తుత అధ్యక్షుడు పిన్ని నాగరత్నం అధ్యక్షత వహించారు. నూతన కమిటీ ఎంపిక ప్రక్రియలో కృష్ణరంగయ్య, అశోక్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ప్రకటించారు.

ఘనంగా చదరంగ దినోత్సవం

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ చదరంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నీలం సంజీవరెడ్డి స్టేడియంలో పెద్ద చదరంగం బోర్డును ఆవిష్కరించారు. ప్రపంచ చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో 101వ చదరంగ దినోత్సవం సందర్భంగా ఎవ్వెరీ మూవ్ కౌంట్స్ అనే నినాదంతో నిర్వహించారు. చెస్ అంతర్జాతీయ ఆర్బిటర్ ఎ.ఉదయ్‌కుమార్ నాయుడు 1212 చదరంగం బోర్డును ఆవిష్కరించారు. చెస్ ఆడటం వల్ల మేధో వికాసానికి పునాది పడుతుందన్నారు. అతిపెద్ద చదరంగం బోర్డును ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. చెస్ సంఘం ఛైర్మన్ బాలరాజు, అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి కిశోర్‌నాయుడు, ఆర్బిటర్ గోవిందరాజులు, శిక్షకుడు విజయ్‌కుమార్, మహారాజ్ పాల్గొన్నారు.

పెద్ద చదరంగం బోర్డు ఆవిష్కరణ

పురస్కార గ్రహీతలకు సన్మానం

అనంత సాంస్కృతికం: వివిధ సంస్థల నుంచి ఒకేసారి వివిధ పురస్కారాలు అందుకున్న నగర ప్రముఖులు ముగ్గురికి ఆదివారం ఘనంగా సన్మానం జరిగింది. అనంత అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో జరిగిన అభినందన సమావేశంలో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి డా. శాంతినారాయణ సురవరం ప్రతాపరెడ్డి ప్రతిభ పురస్కారం, డా. రావూరి భరద్వాజ స్మారక పురస్కారం బండి నారాయణ స్వామి, రామసుబ్బయ్య ఫౌండేషన్ వారి సాహిత్య విమర్శ పురస్కారం తూముచర్ల రాజారాం అందుకున్నారు. వీరికి అభినందన పూర్వకంగా అరసం నాయకులు ఉపాధ్యాయ భవన్‌లో ఘనంగా సన్మానించారు.

పురస్కారాలు పొందిన వారిని అభినందిస్తున్న అరసం ప్రతినిధులు

ఉద్యోగుల సంక్షేమానికి కృషి

రాంనగర్, కమలానగర్: జిల్లాలోని నూర్‌బాషా ముస్లిం ఉద్యోగుల సంక్షేమం, దూదేకుల ఉద్యోగుల సంక్షేమ కోసం కృషి చేస్తామని తెదేపా యువ నాయకుడు, చమన్ సాబ్ కుమారుడు ఉమర్‌ముక్తార్ పేర్కొన్నారు. ఆయా కులాల ఉద్యోగుల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో అనంతపురంలో చమన్ వంక్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. ఉమర్‌ముక్తార్ మాట్లాడుతూ.. ఉద్యోగుల పిల్లల సంక్షేమం కోసం వసతి గృహం, ఫంక్షన్‌హాలు నిర్మాణాలు, కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామని ఆయన తెలియజేశారు. ఉద్యోగులంతా ఉమర్‌ముక్తార్‌ను ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తూ సన్మానించారు.

ఉమర్ ముక్తార్‌ను సన్మానిస్తున్న డ్వామా పీడీ సలీం, హనీఫ్, తదితరులు

జలధికి తరలిన చిన్నపీర్లు

అనంత సాంస్కృతికం: మొహర్రం పురస్కరించుకుని నగరంలో పలు ప్రాంతాల్లో నెలకొల్పిన పీర్లు ఆదివారం రాత్రి జలధికి తరలాయి. చెరువుకట్ట సమీపంలోని అమిదాల వీధి మాబు సుబహాని మకాన్‌లో షేక్షావలి, షాషావలి, అంగార్‌వలి, దూద్‌పీరా పేరిట ఏర్పాటైన పీర్లకు, 5వ రోడ్డులో కొలువుదీరిన బీబీ ఫాతిమా మకాన్‌లోని బీబీ ఫాతిమా, హసేన్, హుసేన్ పీర్లకు ఆదివారం రాత్రి జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు.

5వ రోడ్డులో పీర్ల మకాన్ వద్ద సందడి

తెరపై ఈనాడు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : గంగా : మార్గన్, పోలీసు వారి హెచ్చరిక, **గౌరి :** జురాసిక్ వరల్డ్, **గాయత్రి :** ఐనో వాట్ యూ డిడ్ లాస్ట్ సమ్మర్, **గౌతమి :** కొత్తపల్లిలో ఒకప్పుడు, **త్రివేణి :** జూనియర్, **నీలిమ :** ఏ మాయ చేసావె, సూపర్ మ్యాన్, **తరంగిణి :** ఎక్క, **ఎస్వీ సినిమా :** ఓ భామ అయ్యో రామ, **శాంతి :** మై బేబి, **సుధా :** కుబేర.

రైల్వేలో శుద్ధజల ట్యాంకుల నిర్మాణం

గుంతకల్లు, న్యూస్‌టుడే: గుంతకల్లులో రైల్వే అధికారులు, సిబ్బంది, ప్రయాణికులకు నీటిని అందించడానికి వందేళ్ల కిందట ఆంగ్లేయులు నిర్మించిన ఉపరితల నీటి ట్యాంకులను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నారు. కాలనీలకు శుద్ధజలాన్ని అందించడానికి ఒకవైపు ట్యాంకులు, మరోవైపు పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయి. ప్రభాత్ నగర్‌లో రెండు, రైల్వే ఆసుపత్రి వద్ద ఒకటి, కేంద్రీయ విద్యాలయం, అరవింద్‌నగర్ తదితర కాలనీల్లో రూ.4 కోట్లు వ్యయంతో ట్యాంకులను నిర్మిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఒక్కొక్క ట్యాంకులో లక్ష లీటర్ల నీటిని నిల్వ ఉంచడానికి అవకాశముంది. ఇప్పటికే రెండింటి పనులు పూర్తయ్యాయి. మిగిలిన ట్యాంకుల పనులు కొనసాగుతున్నాయి. రైల్వే ఆసుపత్రి భవనాలపైన 1886 సంవత్సరంలో ఉపరితల ట్యాంకును ఆంగ్లేయులు ఏర్పాటు చేశారు. దీన్ని పైనుంచి కిందకు ఏవిధంగా తీసుకురావాలో అధికారులకు అర్థం కావడంలేదు. ఫలితంగా ఇదే ట్యాంకును వినియోగిస్తున్నారు.

గంగమ్మతల్లికి బోనాలు

అనంత సాంస్కృతికం: స్థానిక ఆదర్శ నగర్‌లో కొలువైన గంగమ్మ తల్లికి ఆదివారం విస్తృత స్థాయిలో బోనాల సమర్పణ జరిగింది. ఏటా ఆషాఢమాసం చివరి ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ఆలయంలో గంగమ్మ ఉత్సవమూర్తితో పాటు బోనాలు నెత్తిన పెట్టుకుని సమీపంలోని శివాలయం, ఎల్ఐజీ బస్టాపు, ఉత్సవ వేదిక వరకు ఊరేగించారు.

కష్టపడ్డ ప్రతి కార్యకర్తకి న్యాయం చేస్తాం

రాప్తాడు, న్యూస్‌టుడే: తెదేపా పార్టీలో కష్టపడిన ఏ ఒక్క కార్యకర్తకు అన్యాయం జరగనివ్వమని న్యాయం చేస్తామని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. ఆదివారం సాయంత్రం రాప్తాడు మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయి తెదేపా పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎంపీ పార్థసారథి, ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించిన కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

'మహిళా సమస్యలపై ఉద్యమిద్దాం'

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమిద్దామని ఐద్వా జిల్లా నాయకురాలు చంద్రిక పిలుపునిచ్చారు. ఆదివారం బుక్కరాయసముద్రంలో మండల మహాసభలో పాల్గొన్నారు. భాజపా, తెదేపా కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరవైందని ఆరోపించారు. దాడులు, హత్యలు, హత్యాచారాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మహిళలపై దాడులు అరికట్టాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఐద్వా నాయకురాళ్లు నాగమ్మ, మునిజ, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

౯౦ వసంతాల వేళ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని పి.యాలేరు లిటిల్ ఫ్లవర్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు సమ్మేళనాన్ని నిర్వహించారు. బ్రిటీష్ కాలంలో పాఠశాల ప్రారంభించి నేటికి 90 సంవత్సరాలు పూర్తి అయింది. పాఠశాల ప్రారంభం అయిన నాటి నుంచి నేటి వరకూ పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించలేదు. అయితే 1988-1995 వరకూ 1 నుంచి 7 వరకూ చదివిన విద్యార్థులు కలసి నాటి సన్నివేశాలను గుర్తు తెచ్చుకున్నారు. నాడు చదువులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించి గ్రామంలో ఊరేగించారు.

28 నుంచి శ్రావణమాస పూజలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేశారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం స్వామి వారికి విశేషంగా పల్లకీసేవ, స్వర్ణ కవచ సేవ చేశారు. ఈ నెల 28 నుంచి శ్రావణమాస పూజలు ప్రారంభం కానున్నట్లు ఈవో బాబు తెలిపారు.

అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

తెలుగుభాషను పరిరక్షించుకోవాలి

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: తెలుగుభాష పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భాషను ప్రేమిస్తూ బతికించుకోవాలని.. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన కవి నాగముని పేర్కొన్నారు. విద్యుత్తు శాఖలో సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న ఆయన కొన్నేళ్ల నుంచి సాహితీ రంగంలో రాణిస్తున్నారు. హిందూపురంలో ఆదివారం జిల్లా రచయితల సంఘం అధ్వర్యంలో నిర్వహించిన సభలో ఉర్దూకవి ఫైజ్‌అహ్మద్ ఫైజ్ సాహితీ పురస్కారాన్ని ఆయన ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు తెలుగుభాష వాడుక, మనుగడపై పలు సూచనలు ఇచ్చారు. పిల్లలు ఆంగ్ల వ్యామోహంలో పడకుండా, మాతృభాష వాడుక కొనసాగేలా జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఆదిశేషయ్యకు సన్మానం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులుగా సుదీర్ఘకాలం పనిచేసి ఇటీవల ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన ఆదిశేషయ్యను ఆదివారం ఘనంగా సన్మానించారు. నగరంలోని రెవెన్యూ భవన్‌లో కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు అంకాల కొండయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివానందరెడ్డి హాజరయ్యారు. ఆదిశేషయ్య తెలుగుభాషా ఉపాధ్యాయుడుగా విద్యార్థులకు సేవలందించారన్నారు.

ఆత్మకూరులో ఇంటింటా కరపత్రాలను పంచుతున్న తెదేపా నాయకులు

ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుతోంది

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుతోందని తెదేపా మండల కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గత వైకాపా పాలనలో రాష్ట్రం పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. 5 సంవత్సరాల కాలంలో ఎక్కడా అభివృద్ధి చేసిన ఘటనలు లేవని వివరించారు. నేడు కూటమి ప్రభుత్వ హయాంలో ఎక్కడ చూసినా అభివృద్ధి జరుగుతోందని వివరించారు.

గ్రామీణులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డా.కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం వెంకటాపురం, దయ్యాలకుంటపల్లి గ్రామాల్లో సత్య యోగ మిత్రమండలి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గుండె, గర్భ సంబంధిత వ్యాధులు, డయాబెటిస్, కంటి జబ్బులు, మోకాళ్ల సమస్యలకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ఈశ్వర్, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూచిక స్తంభానికి గేదెను కట్టేశారు

అనంతపురం తాడిపత్రి వెళ్లే దారిలో రెడ్డిపల్లి వద్ద రోడ్డు కాస్త కుడివైపు వంపు తిరిగి ఉంటుంది. ఈ విషయం తెలియడానికి అక్కడ బోర్డు పెట్టి.. నల్లని బాణం గుర్తు కూడా ఏర్పాటు చేశారు. సోలార్‌తో వెలిగే ఆరెంజ్ రంగు లైట్ కూడా ఏర్పాటు చేశారు. రాత్రి వేళలో ఈ లైట్ ఆరెంజ్ రంగులో వెలుగుతుంటే వాహనదారుడు వాహనాన్ని మెల్లగా నడిపి కుడివైపు ఉన్న వంపుని గమనించి అటు వెళ్లాలని అర్థం. కానీ అక్కడే ఆ సిగ్నల్ స్తంభానికి రాత్రి, పగలు గేదెను అక్కడి వారు కట్టేస్తున్నారు. గేదెనే చూస్తూ సిగ్నల్ గమనించకుండా వెళ్తే ప్రమాదం తప్పదు. **- ఈనాడు, అనంతపురం**

జీడీఎస్ ఉద్యోగుల సమస్యలపై పోరాడండి

అరవిందనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ జీడీఎస్ ఉద్యోగుల సంఘం నూతన రాష్ట్ర అధ్యక్షుడి పదవి చేపట్టిన క్రిష్ణయ్య యాదవ్‌కు సూచించారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలన్నారు. నగరంలోని ఎంపీ నివాసంలో కలిసిన క్రిష్ణయ్య గ్రామీణ తపాలా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందించారు.

శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం

కమలానగర్, న్యూస్‌టుడే: నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల గొంతు శస్త్ర చికిత్స చేయించుకున్న వడ్డెర్ల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యురాలు లక్ష్మీదేవికి వైద్య ఖర్చుల కోసం రూ.20 వేలు ఆర్థిక సహాయంగా సంఘం నాయకులు ఆదివారం అందించారు. శ్రీసత్యసాయి జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మారెప్ప భార్య లక్ష్మీదేవిని జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి గోగుల చక్రపాణి ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలసి తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

చెన్నకేశవస్వామి దేవస్థానానికి నిధుల మంజూరు

రాప్తాడు: రాప్తాడు మండల భోగినేపల్లిలోని చెన్నకేశవస్వామి దేవస్థానానికి దేవదాయశాఖ నుంచి నిధులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే సునీత భోగినేపల్లి గ్రామస్థులు చెన్నకేశవ స్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులకు నిధులు కేటాయించాలని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కోరడంతో రూ.65.60 లక్షలు మంజూరు చేయించారు. గ్రామస్థులు సునీత, ధర్మవరపు మురళికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆల్బం విడుదల

అనంత సాంస్కృతికం: నగరంలోని అర్బన్ బ్యాంకు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 'మనసిచ్చి మోసపోయా' ఆల్బంపాట విడుదల అయింది. కళాసాగర్ డ్యాన్స్ స్కూల్ నృత్యశిక్షకుడు కత్తి విజయకుమార్ ఆధ్వర్యంలో రచయిత, గాయకుడు, సంగీత దర్శకుడు ప్రేంచంద్ నటించి విడుదల చేసిన చిత్రంలోని సంబంధించిన పాటను విడుదల చేశారు.

భవనాలపై చెట్లు..

పాతవూరులో పురాతన ఇళ్లు ప్రమాదకరంగా మారాయి. వాటిల్లో ఎవరూ నివసించకపోవడంతో గోడలకు పెద్ద చెట్లు మొలిచాయి. గోడల మధ్య నుంచి చెట్ల వేళ్ళు బయటకి వచ్చి గోడలకు నెర్రెలు వచ్చాయి. ప్రస్తుతం పెద్ద వర్షం పడితే ఇలాంటి ఇళ్ళు కూలడం ఖాయం. అదీ రోడ్ల ప్రక్కనే ఉండడంతో ఇరుగుపొరుగు నివసిస్తున్న వారు, పాదచారులకు, వాహనదారులకు ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది. **- ఈనాడు అనంతపురం**

గిట్టలు పెరిగి.. నడిచే వీల్లేక!

అనంతపురం నగరం సాయినగర్‌లో తిరుగుతున్న ఆవుకు గిట్టలు భారీగా పెరిగి అడుగు వేయలేని దయనీయ స్థితి. సాధారణంగా పెంచుకున్న పశువులు, ఎద్దులు, గేదెలు, ఆవులకు గిట్టలు పెరగవని, పట్టణాల్లో పశువులకు తిండిలేక ఇలా గిట్టలు పొడవుగా పెరుగుతాయని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పద్మనాభం తెలిపారు.

- న్యూస్‌టుడే, అనంతపురం (వ్యవసాయం)



నీటి కష్టాలు షురూ..

అనంతపురం నగరంలో పలు కాలనీల్లో నీటి కొరత ఎదురవుతోంది. ఇటీవల కొన్ని కాలనీల్లో నీరు రంగుమారి, పాచి ఆనవాళ్లు వస్తున్నట్లు తేలిన నేపథ్యంలో ఆయా కాలనీల వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోవూరు నగర్ నాలుగో క్రాస్ రోడ్డులో మంచి నీరు రాక ఓ వృద్ధుడు సైకిల్‌కు వెనక రెండు ప్లాస్టిక్ బిందెలను తాడుతో కట్టి చాలా దూరంలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి అతి కష్టం మీద ఇంటికి తీసుకెళ్తుండగా తీసిన చిత్రమిది . **- ఈనాడు అనంతపురం**

క్రమశిక్షణే విజయానికి మూలం

కమలానగర్, న్యూస్‌టుడే : విద్యార్థి దశ నుంచి క్రమ శిక్షణ ఉంటేనే విద్యార్థి విజయానికి మూలం అవుతుందని అనంతపురం మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ మహబూబ్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం అరవిందనగర్‌లోని బీసీ బాలికల వసతిగృహంలో బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ మహబూబ్ బాషా, వైద్యురాలు శంషాద్‌బేగం పాల్గొని మాట్లాడారు. యుక్త వయసులో చదువుపై దృష్టి పెట్టాలని, ఎవరైనా ఇబ్బంది పెడితే భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగర శివారులోని టీవీ టవర్ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. టీవీ టవర్ సమీపంలో నివాసముంటున్న రమణ రోడ్డు దాటుతుండగా, తాడిమర్రి మండల కేంద్రానికి చెందిన అశోక్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై నగరంలోకి వస్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పాదచారుడితో పాటు వాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

(c) eenadu

ఈనాడు అన్నమయ్య
సోమవారం జులై 21, 2025

వేల్ వేల్ మురుగయ్యా.. కల్యాణం కనరయ్యా!

ప్రత్యేకాలంకారంలో దర్శనమిస్తున్న సుబ్రహ్మణ్యస్వామి

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యస్వామిని అర్చకులు సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆడికృత్తికను పురస్కరించుకుని రుద్రాభిషేక పూజలు చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేల్‌వేల్ మురుగయ్యా అంటూ కీర్తించారు. అనంతరం కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకటరమణారెడ్డి, స్థానిక, కన్నడ భక్తులు పాల్గొన్నారు.

అందరికీ నీళ్లు... అందించే వారికి కన్నీళ్లు

మదనపల్లె మార్గం ఈద్గా కేంద్రం వద్ద శుద్ధి జలానికి బారులుతీరిన స్థానికులు

జిల్లాలో అతి పెద్ద పంచాయతీ పీలేరులో 25 శుద్ధిజల కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద పనిచేసే సిబ్బందికి నెలకు రూ.ఐదు వేలు గౌరవ వేతనం ఇచ్చేలా ఒప్పందంతో నియమించారు. వీరికి ఏడాదిగా వేతనాలు అందకపోవడంతో రోజూ ఉదయం గంట సమయం మాత్రమే నీటి సరఫరా చేస్తుండడంతో స్థానికులు బారులు తీరాల్సి వస్తోంది. తాగునీరు ఉచితంగా అందిస్తున్నా తమకు మాత్రం వేతనాలు అందక కన్నీరు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీలేరులోని ఓ కేంద్రం వద్ద బారులు తీరిన జనాన్ని చిత్రంలో చూడవచ్చు. **- న్యూస్‌టుడే, పీలేరు**

వన విహారి.. లాహిరి... లాహిరి

● అనుమతికి అటవీ అధికారుల ప్రతిపాదన
● రెండో దశ పనులకు ప్రణాళిక సిద్ధం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ప్రకృతి రమణీయతతో అలరాలుతున్న సోమశిల వెనుక జలాల్లో పర్యాటకులు పడవలో షికారు చేయడానికి అనుమతివ్వాలని అటవీ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు. ఈ జలవనరు సామర్థ్యం 77.988 టీఎంసీలు. ప్రస్తుతం 27.645 టీఎంసీల నీరుంది. ఏటా అక్టోబరు-డిసెంబరు వరకు చూస్తే కనీసం 65-70 టీఎంసీలకు పైగా నీరు ఉంటుంది. అదేవిధంగా జనవరి-ఏప్రిల్ నెలల్లో 35-40 టీఎంసీల జలాలు ఉంటాయి. నెల్లూరు జిల్లాలో ఈ ప్రాజెక్టును నిర్మించడంతో ఉమ్మడి కడప జిల్లాలో ఒంటిమిట్ట, అట్లూరు, గోపవరం, నందలూరు, సిద్దవటం, పెనగలూరు మండలాల్లో 105 గ్రామాలు పూర్తిగా, మరో తొమ్మిది పల్లెలు పాక్షికంగా ముంపులో చేరాయి. ● ఒంటిమిట్ట మండలం కోటపాడు వద్ద వెనుక జలాల చెంతనే అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఇప్పటికే వన విహారి కేంద్రంలో మొదటి దశలో రూ.అర కోటి వెచ్చించి వనం ఏర్పాటు చేశారు. ఇక్కడ యాత్రికులు విడిది చేయడానికి రెండు గదులు నిర్మించారు. చిన్న పిల్లలు ఆడుకోవడానికి పార్కు ఏర్పాటు చేశారు. పచ్చదనంతో పాటు ఆహ్లాదం కోసం మొక్కలు నాటి పెంచుతున్నారు. ● మండల కేంద్రమైన ఒంటిమిట్ట నుంచి 13 కి.మీ దూరంలో శ్రీరామ ఎత్తిపోతల పంపుహౌస్ సమీపంలోనే వన విహారి కేంద్రం పనులు చేపట్టారు. పర్యాటకులను ఆకర్షించేలా వెనుక జలాలను సందర్శించాలని ఇక్కడికి వస్తున్న యాత్రికులు నీటిలో పడవపైన విహారం (బోటింగ్) చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అటవీ అధికారులు ముందుకొచ్చారు. ● జల షికారు నిర్వహణ కోసం పడవలు కావాలి. నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలి. బోట్లును అటవీ శాఖ ద్వారా కొనుగోలు చేయాలనా, పర్యాటకాభివృద్ధి సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలనా అనే అంశంపై ఉన్నత స్థాయిలో చర్చ జరుగుతోంది. ● అపారమైన మత్స్య సంపద ఉంది. అటు, ఇటు పెనుశిల నరసింహ అభయారణ్యం ఉంది. నింగిని తాకే ఎత్తయిన గిరులు నడుమ జల హోయలతో పెన్నానది పరవళ్లు తొక్కుతోంది. విదేశాల నుంచి వస్తున్న వేలాది వలస పక్షులు ఈ ప్రాంతంలో సందడి చేస్తున్నాయి. ప్రకృతి సోయగాల మధ్యలో బోటు ప్రయాణం అందుబాటులోకి తీసుకొస్తే యాత్రికులు అంతులేని జలానుభూతి పొందుతారని అధికారులు భావిస్తున్నారు. జల విహారంతో యాత్రికులకు మధురానుభూతి కలగనుంది. ఈ ప్రాంతాన్ని పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చేయాలని కసరత్తు చేస్తున్నారు.

వెనుక జలాల్లో పడవ ప్రయాణం

ప్రతిపాదనలు పంపించాం : కోటపాడు సమీపంలో వన విహారి కేంద్రం తొలివిడత పనులు ముగింపు దశకు వచ్చాయి. మలి దశలో మరికొన్ని వసతులు కల్పించాలని నిర్ణయించాం. సోమశిల వెనుక జలాల్లో పర్యాటకులు జలానందం పొందేలా జల షికారును అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నాం. ఇందుకోసం అనుమతి ఇవ్వాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఉన్నత స్థాయి నుంచి అనుమతి రాగానే అటవీ శాఖ లేదా పర్యాటక శాఖ ద్వారా పడవలో విహారం కోసం కావాల్సిన ఏర్పాట్లు చేస్తాం. ఈ ప్రాంతాన్ని పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చేస్తాం. ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం.
- బాలసుబ్రహ్మణ్యం, అటవీ క్షేత్రాధికారి, ఒంటిమిట్ట

మదనపల్లె ఫైల్స్.. దర్యాప్తు తుస్సస్!

● దస్త్రాల దహనానికి నేటితో ఏడాది

ఈనాడు, కడప

రాష్ట్రంలో సంచలనం కలిగించిన అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ దస్త్రాల దహనం ఘటన జరిగి సరిగ్గా నేటితో (జులై 21) ఏడాది. ఈ కేసులో ఆశించినంతగా పురోగతిలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వేలాది దస్త్రాలతో ముడిపడిన వ్యవహారం కావడంతో కేసు దర్యాప్తుకు సమయం పడుతోందని దర్యాప్తు సంస్థ సీఐడీ ఐజీ వాదన. సమగ్ర దర్యాప్తుతో వ్యవహారాన్ని నిగ్గు తేల్చడానికి అన్ని రకాల ప్రయత్నాలు జరుగుతున్నాయని విచారణాధికారి చెబుతున్నారు. 2024 జులై 21న రాత్రి 11.30 గంటలకు ఘటన జరిగా.. ● మరుసటి రోజే మదనపల్లెకు అప్పటి డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యనార్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం యాక్సిడెంట్ కాదని.. ఇన్సిడెంట్ అని విచారణ సందర్భంగా అప్పట్లో డీజీపీ వ్యాఖ్యానించారు. ● మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో పుంగనూరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో వైకాపా హయాంలో భారీగా భూదందాలు జరిగాయి. వైకాపా హయాంలో ఫ్రీహోల్డ్ చట్టం తీసుకొచ్చాక డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 416 సర్వే నంబర్ల కింద 48,279 ఎకరాల భూముల్ని అక్రమంగా ఫ్రీహోల్డ్ చేశారు. ఆ తర్వాత వైకాపా అధికారం కోల్పోవడం, కూటమి సర్కారు అధికారంలోకి రావడం, రెవెన్యూ అధికారుల బదిలీలతో అక్రమాలు బయటకొస్తాయనే కారణంగా దస్త్రాలను దహనం చేసినట్లు అభియోగాలు నమోదయ్యాయి. ● మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి అనుచరులే ఘటనకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. వందలాది మంది బాధితులు తరలివచ్చి పెద్దిరెడ్డి కుటుంబంపై ఫిర్యాదులు చేశారు. ఘటన తర్వాత బాధ్యులుగా గుర్తించి పూర్వ ఆర్డీవో మురళి, ఘటన జరిగిన సమయంలో పని చేసిన హరిప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. కేసు తీవ్రత నేపథ్యంలో దర్యాప్తును 2024 ఆగస్టు 6న సీఐడీకి అప్పగిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ● అంతకు ముందే ఈ ఘటనపై పోలీసులు 9 కేసులు నమోదు చేశారు. సీఐడీ మొదటగా సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపింది. ఆ తర్వాత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డి హస్తం ఉన్నట్లుగా గుర్తించి అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టగా కొన్ని కారణాలతో రిమాండ్ నుంచి తప్పించుకున్నారు. ● ఇటీవల పూర్వ ఆర్డీవో మురళిని అరెస్టు చేయగా సుప్రీంకోర్టు నుంచి బెయిల్ తెచ్చుకోవడంతో విడుదలయ్యారు.

దస్త్రాల దహనం జరిగిన మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలోని భవనం

కాలిపోయిన దస్త్రాలు (పాత చిత్రం)

రిమాండ్ రిపోర్టులో పెద్దిరెడ్డి పేరు

ఇప్పటికే అరెస్టయిన గౌతమ్ తేజ్ రిమాండ్ రిపోర్టులో పలుచోట్ల సీఐడీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేరును ప్రస్తావించింది. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని డీ పట్టా, ఫ్రీహోల్డ్ భూముల అక్రమ క్రమబద్ధీకరణకు సంబంధించిన ఆధారాలు ధ్వంసం చేసేందుకు, అవినీతి దందాలు బయటకు రాకూడదనే ఉద్దేశంతో పెద్దిరెడ్డి పీఏ ముని తుకారాం, ముఖ్య అనుచరుడు మాధవరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌ను పురికొల్పి దస్త్రాలకు నిప్పుపెట్టినట్లు పేర్కొంది. ఈ కేసులో నాలుగో నిందితుడైన (ఏ-4) ముని తుకారాం గత ఏడాది జులైలో అమెరికాకు పారిపోయారు. ఇప్పటికీ ఆయన జాడ కనిపించలేదు. అభియోగాలు ఎదుర్కొంటున్న కాల్‌డేటాను సీఐడీ తీసింది. వారి మధ్య ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ కాల్స్‌ను విశ్లేషించింది. వేల ఎకరాల భూముల్ని ఆర్డీవో స్థాయి అధికారి అప్పటి మంత్రి పీఏ, అనుచరుడు చెప్పారని రెగ్యులరైజ్ చేసేస్తారా?.. పెద్దిరెడ్డి ఆదేశంతోనే ఇది జరిగిందా?.. వీటి అంతటి అధికారం ఎవరిచ్చిన సమగ్ర ఆధారాల సేకరణకు సీఐడీ ప్రయత్నిస్తోంది. చివరకు ముని తుకారాం జాడ ఇప్పటికీ కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అమెరికాలో ఆరు నెలలకు మించి ఉండటానికి ఆస్కారం లేదు. విచారణలో జాడ గురించి తేలాల్సి ఉంది.

మార్గ దీపిక.. ప్రమాద వీచిక

భాకరాపేట సమీపంలో వాహనాలు ఢీకొనడంతో దెబ్బతిన్న సూచికలు

కడప-రేణిగుంట జాతీయ రహదారి-716లో సిద్దవటం మండలం మలినేనిపట్నం కాలనీ సమీపంలో ప్రమాదాల నివారణ కోసం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఆధ్వర్యంలో వర్టికల్ స్ప్రింగ్ పోల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో అటు, ఇటు తిరుగుతున్న వాహనాలు వీటిని ఢీకొనడంతో అవి పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రమాదాలు జరగకుండా, రోడ్డు దాటుతున్న వారికి రక్షణ కోసం వీటిని అమర్చారు. కొన్నాళ్లకే పాడయ్యాయి. అధికారులు స్పందించి పాడైన వాటిని తొలగించి ప్రమాదాల జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

కేంద్ర కారాగారం... ప్రక్షాళనకు శ్రీకారం

కేంద్ర కారాగారం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప కేంద్ర కారాగారం ఇటీవల వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. కారాగారంలో వరుసగా చరవాణులు దొరకడం, కారాగారంలోని ఓ ఖైదీ అధికారులను శాసించడంతో పాటు పలు ఆరోపణలు రావడంతో ఉన్నత స్థాయి అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జైళ్లశాఖ డీజీ అంజనీకుమార్ ఇటీవల కడప కేంద్ర కారాగారాన్ని తనిఖీ చేసినప్పటికీ ఎలాంటి మార్పు రాలేదు. జైల్లో ఓ ఖైదీ వద్దనే విడతల వారీగా 11 చరవాణులు దొరకడం కలకలం రేపింది. కడప జైల్లో ఏమి జరుగుతుందో పూర్తి స్థాయిలో విచారించి నివేదిక ఇవ్వాలని డీజీపీ ఆదేశించడంతో రాజమండ్రి ప్రాంతీయ డీఐజీ రవికిరణ్ ఆరు రోజులుగా ఇక్కడే తిష్ఠ వేశారు. గత కొద్ది రోజులుగా ప్రధాన ద్వారాల వద్ద బందోబస్తు ఉంటున్న వారి వివరాలను రికార్డు చేసి వారి పాత్రపై ఆరా తీశారు. సెల్‌ఫోన్లు బయటపై వచ్చిన ఆరోపణలన్నింటినీ విచారిస్తున్నారు. ప్రధాన కారకులు ఎవరన్నది ఇప్పటికే గుర్తించి నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం. దీంతో కేంద్ర కారాగార సిబ్బందిలో పలువురిపై వేటు పడే అవకాశముందని చెబుతున్నారు. విచారణ నేపథ్యంలో అక్కడున్న అధికారులు, సిబ్బందిలో భయం మొదలైంది. మరో అయిదు రోజుల పాటు విచారణ కొనసాగనుందని తెలుస్తోంది.

అయ్యో గుడ్లగూబా.. అడవికి చేరావా!

గ్రామీణ ప్రాంతాల్లో నిశీధిలో సంచరించే గుడ్లగూబలంటే తెలియని వారుండరు... గతంలో రాత్రిళ్లు ఇళ్ల సమీపంలో వాటి అరుపులు పిల్లలను భయపెట్టేవి. అదంతా గతం... పల్లెలకు కూడా ఎల్ఈడీ దీపకాంతులు విస్తరించడంతో వాటికి చీకటి కరవైంది. రాత్రి కూడా పగలుగా మారడంతో అక్కడ మనుగడ సాగించలేక సమీప అటవీ ప్రాంతాలకు వలస కడుతున్నాయి. మదనపల్లెలోని గ్రామీణ ప్రాంతాల్లో గుడ్లగూడల జాడ అరుదుగా మారగా కురబలకోట మండలంలోని ముదివేడు సమీపంలో వేప చెట్టుపై మూడు నిశీధి పక్షులు ఒకేచోట చేరి ట్రెక్కింగ్‌కు వెళ్లిన మదనపల్లె యువకులకు ఇదిగో ఇలా ఫోజివ్వడంతో కెమెరా క్లిక్ మనిపించారు. ఆ చిత్రమే ఇది. **- న్యూస్‌టుడే, మదనపల్లె విద్య**

ముదివేడు సమీపంలో వేపచెట్టుపై చుక్కల గుడ్లగూబలు

కొత్తిమీర.. అడిగేవారే లేరా!

కొత్తిమీర పంటను పశువులు మేస్తున్న ఈ చిత్రం రామసముద్రం మండలం కుదురుచీమనపల్లె గ్రామ పంచాయతీ వై.కురప్పల్లె గ్రామంలోనిది. గ్రామానికి చెందిన రైతు వెంకట రమణ ఎకరం విస్తీర్ణంలో రూ.50 వేల ఖర్చుతో పంటను సాగు చేశారు. మార్కెట్‌లో వంద కట్టల కొత్తిమీర బస్తా రూ.200 కూడా ధర పలకడం లేదు. కనీసం కోత కూలీ, రవాణా ఖర్చులు కూడా దక్కడం లేదు. మార్కెట్‌కు తీసుకెళ్లినా వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. చేసేది లేక రైతు ఇలా పంటను పశువులకు ఆహారంగా వదిలేశారు. ఇలాంటి చిత్రాలు మదనపల్లె, రామసముద్రం ప్రాంతాల్లో సర్వసాధారణంగా మారాయి. జిల్లాలోని మదనపల్లె, రామసముద్రం, కురబలకోట, బి.కొత్తకోట, పీటీఎం, పీలేరు, వాల్మీకిపురం, చిన్నమండ్యం, రాయచోటి, రైల్వేకోడూరు వంటి ప్రాంతాల్లో రైతులు 500 ఎకరాలకు పైగానే కొత్తిమీర సాగు చేపట్టారు. మే నెలలో విత్తిన పంట ప్రస్తుతం 250 ఎకరాల వరకు దిగుబడినిస్తోంది. ఎకరానికి రూ.50 వేలు చొప్పున జిల్లాలోని రైతులు రూ.2.50 కోట్ల వరకు పెట్టుబడి రూపంలో నష్టాన్ని చవిచూశారు. **- న్యూస్‌టుడే, రామసముద్రం**

దిగుబడి కిందకు... ధర పైకి

ములకలచెరువు, న్యూస్‌టుడే: ములకలచెరువు మార్కెట్‌కు టమాట దిగుబడి రాక తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయి. వారం రోజుల క్రితం ములకలచెరువు మార్కెట్‌లో మొదటి రకం క్రేటు ధర రూ.600లు పలకగా ఆదివారం రూ.810కు చేరింది. మార్కెట్ నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు 4 వేల టన్నులకు పైగా సరకు ఎగుమతి అయింది. శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి టమాటాలు ఈ మార్కెట్‌కు వస్తున్నాయి.

మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

బాలబడి... నూతన ఒరవడి

కలకడ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు బోధిస్తున్న పర్యవేక్షకురాలు శాంత

కలకడ, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయడంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యలోనే ప్రైవేటు ప్లే స్కూళ్లకు దీటుగా విద్యా బోధన సాగించడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మూడేళ్లు దాటిన చిన్నారులకు మెరుగైన విద్యా బోధనకు పాఠ్య పుస్తకాలను కేంద్రాలకు సరఫరా చేశారు. ఆంగ్లం, గణితం, తెలుగుతో పాటు స్పోకెన్ ఇంగ్లిషు సులభంగా చదువుకొనేలా, అర్థమయ్యే రీతిలో పుస్తకాలు రూపొందించారు. ఆట పాటలతో విద్యా బోధన చేయడానికి కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కొత్తగా వచ్చిన పుస్తకాలను చదవడానికి చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు.

● **కార్యకర్తలకు నవచేతన :** అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు ఈ సంవత్సరం కొత్తగా నవచేతన, ఆధార్‌శిల పేరిట రెండు పుస్తకాలు అందజేశారు. నవచేతనలో బాల్యారంభ ప్రేరణకు జాతీయ చట్టం-2025 మేరకు పుట్టినప్పటి నుంచి మూడేళ్ల వరకు ప్రేరణ కృత్యాలకు సంబంధించిన అంశాలు పొందుపరిచారు. గర్భస్త శిశువుకు గర్భధారణ దశ నుంచి శారీరక, మానసిక ప్రేరణ అవసరాన్ని తెలిపారు. ఆధార్ శిలతో మూడేళ్ల నుంచి ఆరేళ్ల చిన్నారులకు ఏ రోజు ఏ అంశం వివరించాలో పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు తొలిసారిగా పుస్తకాలను అందజేసి వారితో వినూత్న రీతిలో విద్యాబోధన చేయిస్తున్నారు.

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు
- ప్రధాన కేంద్రాలు : 1,858, ● మినీ కేంద్రాలు : 417
- గర్భిణులు : 9,287, ● బాలింతలు : 7,653
- 3-4 సంవత్సరాల లోపు పిల్లలు : 44,811
- 4-6 సంవత్సరాల లోపు పిల్లలు : 51,842

● **చిన్నారుల సంఖ్య పెరిగేలా చర్యలు :** అంగన్‌వాడీ కేంద్రాలను ప్రైవేటు ప్లే స్కూళ్లకు దీటుగా విద్యాబోధన అందించేలా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోంది. కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచడానికి చర్యలు చేపట్టాం. ఆధునిక విజ్ఞానంతో కూడిన పాఠ్య పుస్తకాలను చిన్నారులకు అందిస్తున్నాం. కార్యకర్తలకు విద్యా బోధనపై శిక్షణ ఇచ్చాం. ఆధార్‌శిల, నవచేతన పుస్తకాల్లో విలువైన అంశాలు ఉన్నాయి.
- ఉమాదేవి, పీడీ ఐసీడీఎస్

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తాం

కళ్లకు గంతలు కట్టుకుని నినాదాలు చేస్తున్న కార్మికులు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని కార్మికులు తేల్చి చెప్పారు. సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తోందని పురపాలక ఉద్యోగులు, కార్మికుల సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు డి.వెంకటరామయ్య ధ్వజమెత్తారు. బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం కళ్లకు గంతలు కట్టుకుని కార్మికులు నిరసన తెలిపారు. పురపాలకశాఖ మంత్రి నారాయణకు ఎన్నిసార్లు సమస్యలను విన్నవించినా ఫలితం లేకపోవడంతో సమ్మెకు దిగినట్లు స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి సురేంద్రబాబు, నాయకులు ఆవుల శ్రీనివాసులు, శివకుమార్, జి.వెంకటేశ్‌లు పాల్గొన్నారు.

నాడు ఛీఛీ... నేడు సీసీ

మదనగోపాలపురం ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు

రూ.1.50 కోట్లతో నిర్మించిన సీసీ రహదారి

రాజంపేట మండల పరిధిలో ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ స్వగృహ, మదనగోపాలపురం, తాళ్లపాక, సిద్దులపల్లి, పౌల్ట్రీ కాలనీ, చక్రధర్ కాలనీ ప్రాంతాలకు వెళ్లాలంటే గతంలో రహదారి అధ్వానంగా ఉండేది. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడాల్సి వచ్చేంది. దాదాపు మూడు కిలోమీటర్ల పొడవునా గుంతలమయంగా ఉండటంతో ప్రమాదాలు సైతం జరిగేవి. ఈ క్రమంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే రూ.1.50 కోట్లతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ రోడ్డు నిర్మాణం పూర్తయి రాకపోకలు ప్రశాంతంగా సాగుతున్నాయని పరిసర ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆ చిత్రాలే ఇవి. **- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ**

8738030604తో వైద్యుడు మీ చెంత ఉన్నట్లే

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : మదనపల్లెకు చెందిన రమణకు మోకాళ్లలో నొప్పిగా ఉండటంతో ఆసుపత్రికి వైద్యుడికి చూపించారు. ఆయన ఎక్స్‌రే తీయించి మోకాళ్లలో సమస్య ఉందని మందులు రాసిచ్చారు. అయితే వైద్యుడి సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో రమణ తన చరవాణిలో నమోదు చేసుకున్న ఆగస్టు ఏఐ నంబరుకు ఎక్స్‌రే ఫొటో తీసి వాట్సప్‌లో పెట్టాడు. అర నిమిషంలోనే ఆయనకు మోకాళ్లలో కీళ్ల మధ్య స్థలం తగ్గడం, ఎముకల అంచువద్ద చిన్న ఎముక పెరగడం వల్ల సమస్య ఉందని దాని కోసం చేయాల్సిన వ్యాయామాలు, మందుల వినియోగాన్ని క్షుణ్నంగా పంపింది. దీంతో రమణకు తన పరిస్థితిపై పూర్తి అవగాహన వచ్చింది.



వైద్యుడు రాసిచ్చిన చీటిలోని మందులు తెలుగులో చూపిస్తున్న ఇలా...

● ఇంట్లో ఎవరో ఒకరికి అనారోగ్యం సర్వ సాధారణంగా మారింది. వైద్యుల వద్దకు వెళితే మనం చెప్పేది వినకుండా వారే మాట్లాడి, అర్థంకాని విధంగా మందుల చీటీ రాసివ్వడం పరిపాటిగా మారింది. కొన్నిసార్లు ఔషధ దుకాణదారులకు కూడా అర్థం కాక జుట్టుపీక్కోవాల్సి వస్తోంది. అలాంటి సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు ఏఐ పేరుతో ఓ నంబరు వచ్చింది. దాని ద్వారా వైద్యులిచ్చిన చీటీని ఫొటో తీసి పెట్టిన వెంటనే అందులో ఉన్న మందులు, వాటి ఉపయోగాలు, ఏవిధంగా వినియోగించాలన్న సమాచారం వస్తోంది. ఆంగ్లం, తెలుగుతో పాటు స్పీచ్ నోట్ ద్వారా కూడా ఈ సేవలను సద్వినియోగం చేసుకోవచ్చు.

● ఆగస్టు ఏఐ నంబరు 8738030604ను చరవాణిలో నమోదు చేసుకుని ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా అందులో పొందుపర్చిన వెంటనే సమాచారం వస్తుంది. అలాగే శరీరంపై మచ్చలు, వాపులు, గాయాలుంటే వాటిని ఫొటో తీసి వాట్సప్ చేస్తే చాలు వెంటనే దానికి అవసరమైన మందులు, ఏవిధంగా వినియోగించాలన్న సమాచారం వస్తుంది. ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవడం తో చాలా వరకు అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చు. ప్రస్తుతం ప్రజలు దీన్ని ఎక్కువగా సద్వినియోగం చేసుకుంటున్నారు.

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత ..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో
నివేదించడం తప్ప
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
స్మృతి, వర్ధంతి, జయంతి ప్రకటనల వివరాలకు
ఈనాడు కార్యాలయము, ఆలంఖాన్‌పల్లి, కడప.
కడప: 99899 97626
మదనపల్లి: 80080 01768

(c) eenadu

కమనీయం... సుబ్రహ్మణ్య కల్యాణం

సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

పులంపేట, న్యూస్‌టుడే: పుల్లంపేటలో వెలిసిన వల్లీదేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆడి కృత్తికను పురస్కరించుకుని ఆదివారం కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి వారి మూలవిరాట్ విగ్రహానికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్

కడప విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిషన్‌ను నియమించి కనీసం 30 శాతం ఐఆర్ ప్రకటించాలని బీటీయూ జిల్లా అధ్యక్షుడు మేధ్రగుత్తి గంగరాజు కోరారు. ఆదివారం స్థానిక బహుజన టీచర్స్ యూనియన్ (బీటీయూ) కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 13 నెలలు పూర్తయిందని, ఐంతవరకూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ కమిటీ వేయకపోవడం, కనీసం ఐఆర్ ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. అన్ని రకాల పాఠశాలల్లో తెలుగు మీడియం ప్రవేశపెట్టాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు శివార్జున, సుదర్శన్‌బాబు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన నారు అందించాలి

ప్రత్యక్షం ఉత్తరం

ములకలచెరువు, న్యూస్‌టుడే: నర్సరీ యాజమానులు రైతులకు నాణ్యమైన నారు అందించాలని ములకలచెరువు ఉద్యానవన శాఖ అధికారి బీమేష్ సూచించారు. ఈ నెల 17న ఈనాడులో 'నారు అమ్మినోళ్లు.. నమ్మకం ఇవ్వడం లేదు' అన్న శీర్షిక ప్రచురితమైంది. ఈ కథనంపై స్పందించిన అధికారులు ములకలచెరువు, బి.కొత్తకోట, పీటీఎం మండలాల్లోని నర్సరీల్లో తనిఖీలు చేపట్టారు. నర్సరీ యాజమానులు ఆడిచిదుడి ఇష్టం వచ్చినట్టు కూరగాయల నారును ఉత్పత్తి చేసి విక్రయించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. విత్తన కొనుగోలు వివరాలు, నారు విక్రయాల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.

నర్సరీలో తనిఖీ చేస్తున్న అధికారులు

కళ తప్పిన గండికోట

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ఇంటర్ విద్యార్థిని హత్యతో పర్యాటక కేంద్రమైన గండికోట కళ తప్పింది. జిల్లాతోపాటు కర్నూలు, చెన్నై, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే వేలాది మంది పర్యాటకులతో కళకళలాడే కోటలో ఆదివారం సందడి కనిపించలేదు. కోటలో భద్రతపై పర్యాటకులతోపాటు ప్రజా సంఘం నాయకులు అనుమానాలు వ్యక్తం చేయడం తెలిసిందే. ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి గ్యాంగ్‌కు అడ్డాగా మారిందని ఆరోపిస్తున్నారు. స్పందించిన పోలీసు అధికారులు కోట ముఖ ద్వారం వద్ద ఉన్న పోలీసు అవుట్‌పోస్టును పునఃప్రారంభించి ఒక ఏఎస్ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లను నియమించారు. కోట సందర్శనకు వచ్చే పర్యాటకులకు సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేసుకున్న తర్వాతే లోనికి పంపిస్తున్నారు. కేవలం 55 వాహనాలు వచ్చినట్లు సమాచారం.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

రాయచోటి-II (13194) బ్రాంచ్ ట్రంక్ రోడ్, రాయచోటి, అన్నమయ్య జిల్లా, ఏపీ-516269

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత(లు): M/s న్యూ సుప్రీమ్ పైప్ ఇండస్ట్రీ, ప్రొప్రయిటర్: షేక్ ఫజ్లూర్ రహమాన్ (ఋణగ్రహీత) మరియు శ్రీ దఫేదార్ షేక్ యాస్మిన్ (హామీదారు)** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము **రూ. 20,73,616.62/- (అక్షరాల ఇరవై లక్షల డెబ్బై మూడు వేల ఆరు వందల పదహారు రూపాయలు మరియు అరవై రెండు పైసలు మాత్రమే)** మొత్తంను సదరు నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా తేది **13-05-2025న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **15-07-2025వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీత, హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత(లు), హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్** వారికి చెల్లించవలసిన బకాయి **రూ. 21,20,741.38/- (అక్షరాల ఇరవై ఒక్క లక్షల ఇరవై వేల ఏడు వందల నలభై ఒక్క రూపాయలు మరియు ముప్పై ఎనిమిది పైసలు మాత్రమే) +** వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

స్థిరాస్తి వివరములు:

రాయచోటి మున్సిపాలిటీ, చిత్తూరు రోడ్డు, రాయచోటి ఇండస్ట్రియల్‌పార్కు, సర్వే నెం. 578/1 మరియు 578/2, ప్లాట్ నెం. D8 లోని **మొత్తం 964.05 చ॥గ॥ లేదా 805.95 చ॥మీ॥ ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు:** 40 అ॥ రస్తా, **పడమర:** మెస్సర్స్ న్యూ సుప్రీమ్ పైప్ ఇండస్ట్రీ ప్లాట్ నెం. D5 లోని స్థలం, **ఉత్తరం:** మెస్సర్స్ న్యూ సుప్రీమ్ పైప్ ఇండస్ట్రీ ప్లాట్ నెం. D7 లోని స్థలం, **దక్షిణం:** 40అ॥ రస్తా. **కొలతలు:** తూర్పు-పడమర: ఉత్తరం 30 మీ॥, దక్షిణం 29.70 మీ॥, ఉత్తరం-దక్షిణం: తూర్పు 24 మీ॥, పడమర 30 మీ॥, **మొత్తం ఏరియా 964.05 చ॥గ॥.**

తేది: **15.07.2025**, ప్రదేశం: రాయచోటి — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

రాయచోటి-II (13194) బ్రాంచ్ ట్రంక్ రోడ్, రాయచోటి, అన్నమయ్య జిల్లా, ఏపీ-516269

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత: డి. షేక్ ఫజ్లూర్ రెహమాన్, తండ్రి: డి. షేక్ అబ్దుల్ రహమాన్** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము రూ. **23,82,408.51/- (అక్షరాల ఇరవై మూడు లక్షల ఎనభై రెండు వేల నాలుగు వందల ఎనిమిది రూపాయలు మరియు యాభై ఒక్క పైసలు మాత్రమే)** మొత్తంను సదరు నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా తేది **13-05-2025న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **15-07-2025వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీత, హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత(లు), హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్** వారికి తేది. 15.07.2025 నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.23,45,944.51/- (అక్షరాల ఇరవై మూడు లక్షలు నలభై ఐదు వేల తొమ్మిది వందల నలభై నాలుగు రూపాయలు మరియు యాభై ఒక్క పైసలు మాత్రమే)** + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

స్థిరాస్తి వివరములు:

రాయచోటి మున్సిపాలిటీ, భట్టు వీధి, సర్వే నెం. 675/2B1, డి.నెం 58/150 & 58/151, **మొత్తం 77.75 చ॥గ॥** (డి.నెం. 58/150 లోని 31.09 చ॥గ॥ మరియు డి.నెం. 58/151లోని 46.66 చ॥గ॥) **భూమి మరియు బిల్డింగ్ (జి+2). ఐటమ్ నెం.1:** ఎస్.నెం 675/2B1, డోర్ నెం. 58/150, విస్తీర్ణం 31.09 చ॥గ॥. **హద్దులు: తూర్పు:** రస్తా, **పడమర:** ఆసిఫా బేగం, భర్త: ఆసాద్ ఇల్లు, **ఉత్తరం:** షేక్ ఫజులూరు రహమాన్ గారి డోర్ నెం. 58/151లోని ఇల్లు, **దక్షిణం:** ఉప్పు సురేష్, గఫూర్ ఇళ్లు. **కొలతలు:** తూర్పు-పడమర (పొడవు) = 24' అ॥; ఉత్తరం-దక్షిణం (వెడల్పు) = 11'8" అ॥. **ఐటమ్ నెం.2:** ఎస్.నెం 675/2B1, డోర్ నెం. 58/151, విస్తీర్ణం 46.66 చ॥గ॥. **హద్దులు: తూర్పు:** డోర్ నెం. 58/150-A, B,C,D,E గల రూమ్స్, **పడమర:** ఆసిఫా బేగం, భర్త: ఆసాద్ ఇల్లు, **ఉత్తరం:** రస్తా, **దక్షిణం:** షేక్ ఫజ్లూర్ రెహమాన్ డోర్ నెం. 58/150లోని ఇల్లు. **కొలతలు:** తూర్పు - పడమర (పొడవు) = 14' అ॥; ఉత్తరం-దక్షిణం (వెడల్పు) = 30' అ॥.

తేది: **15.07.2025**, ప్రదేశం: రాయచోటి — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కలల సౌధం... దూరవిద్యతో సాకారం

ఇంటి నుంచే చదువుకునే అవకాశం | ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లెలో పరీక్షలు రాస్తున్న ఓపెన్ స్కూల్ విద్యార్థులు

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: పాఠశాలకు ప్రతి రోజూ వచ్చి చదువుకునే అవకాశం లేని వారికి ప్రభుత్వం మంచి అవకాశం కల్పిస్తోంది. దూర విద్యలో పది, ఇంటర్ చదువుకోవాలనే వారికి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వరంగా మారింది. 2025-26 సంవత్సరానికి పది, ఇంటర్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది. అభ్యర్థులు నచ్చిన భాషను ఎంపిక చేసుకోవచ్చు. ఒకసారి ప్రవేశం పొందితే అయిదేళ్ల వరకు పరీక్షలు రాసుకునే అవకాశం ఉంది.

అర్హతలు ఇవే..: పదో తరగతికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా పాఠశాలలో చదివిన టీసీ కానీ, రికార్డు షీటు ఉండాలి. ఒకవేళ ఏ పాఠశాలలో చదవకపోయినా, ఎటువంటి విద్యార్హత లేకపోయినా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 ఆగస్టు 31 నాటికి 14 ఏళ్లు నిండిన వారు ఎవరైనా దరఖాస్తు చేసుకునేందుకు అర్హులే.

★ ఇంటర్మీడియట్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదో తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలి. ఇందుకు సంబంధించిన ధ్రువపత్రాలు ఉండాలి. మార్కుల జాబితా, టీసీ ఉండాలి. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు 2025 ఆగస్టు 31 నాటికి 15 ఏళ్లు పూర్తయి ఉండాలి. ఎంపీసీ, ఎంబైపీసీ, బైపీసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

జిల్లాలో 78 కేంద్రాలు: అన్నమయ్య జిల్లాలో 78 ఓపెన్ స్కూల్ కేంద్రాలున్నాయి. అందులో 18 ప్రైవేటు కేంద్రాలు. 60 ప్రభుత్వ కేంద్రాలున్నాయి. అన్ని ప్రభుత్వ కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. కేవలం 25 కేంద్రాల్లోనే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఏదైనా 33 ర గతులు నిర్వహిస్తారు. అభ్యర్థుల సౌకర్యార్థం సెలవు రోజుల్లోనే తరగతులు నిర్వహిస్తారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధిస్తారు.

దరఖాస్తు విధానం: పది, ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రవేశం కోసం ఏపీ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ 2025 జులై 31 కాగా, రూ. 200 ఆలస్య రుసుముతో గడువు 2025, ఆగస్టు 15 వరకు ఉంది.

సద్వినియోగం చేసుకోండి

ఆసక్తి ఉన్న అభ్యర్థులు చదువుకోడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. వివరాలకు దగ్గరలో ఉన్న ఓపెన్ స్కూల్ కేంద్రాన్ని సంప్రదించాలి. చదువు మానేసిన వారికి ఇదొక మంచి అవకాశం. అభ్యర్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేస్తారు.

- శ్రీనివాసరాజు, ఓపెన్ స్కూల్ జిల్లా సమన్వయకర్త

రమేష్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు

మాజీ ఎమ్మెల్యే అరెస్టు... మదనపల్లె గ్రామీణ ఠాణాకు తరలింపు

రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాయచోటి మాజీ ఎమ్మెల్యే, వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డిపై పోలీసులు అవివారం కేసు నమోదుచేశారు. ★ చిన్నమండెం మండలం కదిరివాండ్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ఎమ్మెల్యేలు దోపిడీ చేయని చోటు ఏది ఉన్నారో చెప్పాలన్నారు. ప్రతి పల్లెలో నాలుగు గొలుసు దుకాణాలు నిర్వహిస్తూ వేలలు ఉప్పు పాలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం కట్ల సాధింపుగా వ్యవహరిస్తున్నారన్నారు. చంద్రబాబు చెప్పింది వెయ్యి మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పదే పదే చెప్పినా చిన్నమండెం మండలంలో నాలుగు వేల ఓట్ల మెజార్టీ ఇచ్చారన్నారు. ఎవరినీ బెదిరించి పెట్టామని.. ఏదో అయిపోయిందని చెవులకు దొంగను తెల్పారాని అనుచిత వ్యాఖ్యలు చేశారు.

మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

★ తెదేపా నేతలతో పాటు ప్రజలను రెచ్చగొట్టేలా ప్రసంగించారని లక్కిరెడ్డిపల్లెకు చెందిన తెదేపా నాయకుడు మదనమోహన్ లక్కిరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు కేసు నమోదు చేశామని సీఐ కొండారెడ్డి తెలిపారు. దీంతో స్థానికంగా ఎలాంటి మర్దాలు తలెత్తకుండా ఉండేందుకు రమేష్‌కుమార్‌రెడ్డిని రాత్రి అదుపులోకి తీసుకున్నామని ఆయన వివరించారు. లక్కిరెడ్డిపల్లె నుంచి మదనపల్లె గ్రామీణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రమేష్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గంలోని లక్కిరెడ్డిపల్లె, రామాపురం, సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి పోలీస్ స్టేషన్లలో ఆయా మండలాలకు చెందిన తెదేపా నాయకులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం, మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో సీఐ కొండారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న తెదేపా నాయకులు

ఓర్వలేకనే విమర్శలు: మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో లక్కిరెడ్డిపల్లె పోలీసు స్టేషన్‌కు చేరుకోవడంతో కాస్తు ఆక్కడ ఉద్రిక్తత నెలకొంది. తమ ప్రజల పక్షాన పని చేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రిని ఓర్వలేకనే వైకాపా నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

సెప్టెంబరు 12 నుంచి ఏఐఎస్‌బీ జాతీయ మహాసభలు

కడప విద్య, న్యూస్‌టుడే: కడప నగరంలో సెప్టెంబరు 12, 13, 14 తేదీల్లో అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) 9వ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ ఎంపీ రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ మహాసభల్లో విద్యార్థులు, యువకులు, విద్యావంతులు, మేధావులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన లోగోను ఆదివారం కడప నగరంలో ఏఐఎస్‌బీ నాయకులతో కలిసి ఆవిష్కరించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ సమాజంలో విద్యార్థి సంఘాల పాత్ర కీలకమైందన్నారు. విద్యారంగ సమస్యలపై, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థి సంఘాల పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం అధ్యక్షుడు సుందర్‌రామరాజు, ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, నాయకులు పాపిరెడ్డిపల్లి పృథ్వీ, సగిలి రాజేంద్రప్రసాద్, మనోజ్, చిరంజీవి, విష్ణు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై మంత్రి మండిపల్లి ఆగ్రహం

మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి, పక్కన తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, నాయకులు

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పై వైకాపా నేతలు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించే ప్రసక్తే లేదని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం రాత్రి తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను శాంతియుత రాయచోటి ఉంటే రెచ్చగొట్టేలా అను చిత వ్యాఖ్యలు చేసి రావణకాష్టం చేయాలనుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డికి వైకాపాలో ఆయన స్థానం ఏమిటో తెలియదని.. అలాంటి వ్యక్తి తనను.. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి ఎక్కడిది ప్రశ్నించారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు పనులు బిల్లుల్ని తన ఖాతాలోకి వేసుకుని కార్యకర్తలు, నాయకుల నోళ్లు కొట్టిన చరిత్ర ఆయనదేనన్నారు. వైకాపాలోకి రానీయకుంటే రాయచోటి నుంచి పంపి మరీ ఎన్నికల ముందు పార్టీలో చేరి తెదేపాకు ద్రోహం చేసిన వ్యక్తి అని ఆరోపించారు. సామాజిక మాధ్యమాలలో ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెట్టినా, కామెంట్లు చేసినా ఊర్కొనే సహించే ప్రసక్తే ఉండదన్నారు. అటువంటి వారికి సరైన జవాబు చెప్పి తీరుతానని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, మాజీ సర్పంచ్ నాగేశ్వరనాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డెయ్య, మైనార్టీ నాయకుడు జాఫర్ పాల్గొన్నారు.

ఆర్థిక నేరగాళ్లే అసలైన ఉగ్రవాదులు

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు ఈశ్వరయ్య, రాధాకృష్ణ, మణి తదితరులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: తమ హక్కులను కాపాడుకోవాలని పోరాటాలు చేస్తున్న వారిని ఉగ్రవాదులు అంటున్నారని, కానీ దేశ సంపదను కొల్లగొట్టే ఆర్థిక నేరగాళ్లే అసలైన ఉగ్రవాదులని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. రైల్వేకోడూరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ మహా సభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీటీడీ రోడ్డులోని ప్రభుత్వాసుపత్రి వద్ద నుంచి టోల్‌గేట్ వరకు ఎర్రదండు ర్యాలీ నిర్వహించారు. స్థానిక హెచ్ఎంఎస్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న సంపదను ఇద్దరు గుజరాతీలు చౌకగా అమ్ముతుంటే మరో ఇద్దరు గుజరాతీలు కొంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సహజ వనరుల దోపిడీ ఆగడంలేదన్నారు. మంగంపేట ముగ్గురాయి గనులను బల్క్ టెండర్ పేరుతో కొందరికి దోచి పెడుతున్నారని, ఆ విధానాలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తుమ్మల రాధాకృష్ణ, శివరామకృష్ణదేవర, సీనియర్ నాయకుడు మలిశెట్టి రామారావు, నాయకులు పందుగోల మణి, చిన్నయ్య, కృష్ణయ్య, రాజశేఖర్, మురళి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

వీరబల్లి, న్యూస్‌టుడే: హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు రాజంపేట డీఎస్పీ సుధాకర్ పాట్లు నరసింహారెడ్డి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. మండలంలోని వంగిమళ్ల గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి (70) ఈ నెల ఒకటో తేదీ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారన్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా హత్యగా తేలిందన్నారు. ఈ నేపథ్యంలో సుబ్బారెడ్డి మృతికి కారణమవుతున్నారు. ఈ క్రమంలో సుబ్బారెడ్డి తమ పొలం వద్దకు వెళ్లే పొలాల వెంకటేసులు పొలాల సమీపంలో టేకారి వెంకటేసులు పొలాల సమీపంలో విద్యుత్తు తీగలు అమర్చి ఉండగా మృతి చెందారన్నారు. మృతికి కారణమవుతున్నారు. ఈ క్రమంలో సుబ్బారెడ్డి తమ పొలం వద్దకు వెళ్లేందుకు ఉండగా నిందితులు విద్యుత్తు తీగలు అమర్చుతున్నట్లు గుర్తించి మండలించారు. పోలీసులు దృష్టికి తీసుకెళ్తానని చెప్పడంతో ఆయనపై దాడి చేసి చంపారు. విద్యుత్తు మోటారు వద్ద పడేసి వెళ్లిపోయారు. స్థానికులు గుర్తించి తెలుపగా విద్యుదాఘాతానికి గురయ్యారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. ఆయన ఒంటిపై గాయాలు ఉండటంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు. విచారణలో భాగంగా నిందితులను గుర్తించి అరెస్టు చేశామన్నారు. న్యాయస్థానంలో హాజరు పరచగా రిమాండు విధించారని తెలిపారు.

చెరువులో పడి గొర్రెల కాపరి మృతి

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: చెరువులో పడి గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన పెద్దతిప్పసముద్రం మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. కమ్మచెరువు పంచాయతీ, మొరుసుపల్లికి చెందిన **చిన్నకోట్ల మారెప్ప(60)** తోటి కాపరులతో కలిసి వ్యాసరాయచెరువులో గొర్రెలను కడుగుతుండగా ప్రమాదవశాత్తు జారి నీటిలో గల్లంతయ్యాడు. గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ములకలచెరువు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక అధికారి వీరభద్రారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది రెడ్డెన్న, అల్లాబక్ష, చిన్నబాబు, శశి కుమార్, మనోజ్‌లు గాలించి మృతదేహాన్ని బయటికి తీశారు. అనంతరం శవపరీక్ష నిమిత్తం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. పీటీఎం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఒరిగిన స్తంభం.. విరిగితే ప్రమాదం

ములకలచెరువు మండలం కదిరినాథునికోట గ్రామ సమీపంలో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా పక్కకు ఒరిగింది. ఈ స్తంభం రోడ్డు పక్కనే ఉండడంతో కూలితే పెను ప్రమాదం పొంచి ఉంది. ఈ మార్గంలో నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపక్కనే ఇలా ఉన్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదని విమర్శలున్నాయి. వెంటనే ఈ స్తంభాన్ని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ములకలచెరువు**

కల్వర్టు.. రక్షణ కనికట్టు

మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారి కలికిరికి సమీపం బడబళ్లవంకపై నిర్మించిన కల్వర్టు ఇరువైపులా రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారింది. ఓ వైపు జమ్ము, మరోవైపు గుర్రపు డెక్క, ముళ్లపొదలు అలుముకున్నాయి. దీంతో వాహనదారులు పక్కకు వెళ్లే సమయంలో జారి వంకలో వాహనాలు పడి ప్రమాదాలు జరిగే అవకాశముంది. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుపై రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కలికిరి**

పరిశోధనాలయం.. పారిశుద్ధ్యం అధ్వానం

మదనపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ఏర్పాటుచేసిన వ్యవసాయ పరిశోధన కేంద్రం చుట్టూ పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 2021లో నిర్మించిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌కు రైతులు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. కేంద్ర చుట్టూ గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనులు చేస్తున్నా, ఇక్కడ మాత్రం ఆ ఊసే లేదు. **- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ**

ప్రభుత్వ నిర్లక్ష్యంపై పోరుబాట : యూటీఎఫ్

కడప విద్య, న్యూస్‌టుడే : ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి ఏడాది పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పట్టించుకోవడం లేదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా అన్నారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు కొండంత చేసింది గోరంత మాత్రమేనన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను నామ మాత్రంగానే చెల్లించారన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా బకాయిలన్నీ చెల్లిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. గత పీఆర్సీ బకాయిలతో పాటు డీఏ, సరెండర్ లీవ్స్, ఏపీజీఎల్ఐ బకాయిలు చెల్లింపులకు నోచుకోలేదన్నారు. 2024 జూన్ మాసానికే 12వ పీఆర్సీని అమలు చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగులకు నెలసరి జీతాలను చెల్లించడమే ప్రభుత్వం గొప్పగా భావిస్తున్నట్లుందన్నారు. ఉద్యోగులకు జీవన్మరణ సమస్యగా ఉన్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జన జీవనంపై సమ్మె ప్రభావం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: పురపాలక కార్మికులు కొనసాగిస్తున్న సమ్మె ప్రభావం జన జీవనంపై ప్రభావాన్ని చూపుతోంది. గత నాలుగు రోజులుగా బి.కొత్తకోటలో నీటి సరఫరా ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని బీసీకాలనీవాసులు ఆదివారం ట్యాంకర్ల నుంచి నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇదే తరహాలోనే పలు ప్రాంతాల్లో నీటి కొరత నెలకొంది. చెత్త పేరుకుపోయింది. మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. సమ్మె నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

బి.కొత్తకోట బీసీకాలనీలో ట్యాంకరు వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు... బెంగళూరురోడ్డులో పేరుకుపోయిన చెత్త

స్పాట్ వ్యాల్యూషన్ నిధులు చెల్లించండి

కడప విద్య, న్యూస్‌టుడే : పదో తరగతి పరీక్షలకు సంబంధించి స్పాట్ వ్యాల్యూషన్ నిధులను ఉపాధ్యాయుల ఖాతాలో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 పదో తరగతి పరీక్షలకు సంబంధించి చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారుల, స్క్వాడ్‌ల రెమ్యునరేషన్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. బదిలీల్లో రీఅపోర్షనెంట్‌లో వచ్చిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా బలోపేతానికి కృషి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : భాజపా రాజంపేట పార్లమెంటు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా మదనపల్లెకు చెందిన యల్లంపల్లె ప్రశాంత్ రెండోసారి ఎంపికయ్యారు. తనకు ఈ అవకాశం కల్పించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్, జిల్లా ఇన్‌ఛార్జి చంద్రమౌళికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వికసిత్‌భారత్ సంకల్ప దిశగా పార్టీకి పనిచేస్తానన్నారు. పార్లమెంటు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే
Contact: KDP: 9989997626, 8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చటపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

MARRIAGE SERVICES

శ్రీ పరిణయ మ్యాట్రిమోనీలో పెళ్లి సంబంధాల రిజిస్ట్రేషన్ అమ్మాయిలకు ఫ్రీ, అబ్బాయిలకు 50% రాయితీ. జులై 31 వరకు మాత్రమే. మా వద్ద న్యూమరాలజీ, పామిస్ట్రీ, జ్యోతిష్యం, వాస్తుసేవలు కలవు, తిరుపతి ✆ 9491840669.

REAL ESTATE

PLOT FOR SALE

తిరుపతి ఎయిర్‌బైపాస్ రోడ్డు రోడ్డుకు 2వ ప్లాటు (రాస్ బిల్డింగ్ దగ్గర) 100 అంకణముల సెమి కమర్షియల్ ప్లాటు అమ్మబడును. వివరములకు: Cell: ✆ 95154 83527.

JOBS

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 9014651068, 7075633416.

మదనపల్లె పురపాలక కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని నిరసన

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య విభాగం కార్మికులు చేపట్టిన రిలేనిరాహారదీక్షలు ఆదివారం రెండో రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను కార్మికులకు వర్తింపజేయాలన్నారు. సర్వీసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మిదేవి, కృష్ణప్ప, శ్రీనాథ్, రాజు, రామచంద్ర, గోపాల్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె

• మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

అక్రమ నిర్మాణాల తొలగింపు

ఆక్రమణలను యంత్రంతో తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : కోళ్లబైలు పంచాయతీ బాబుకాలనీ సమీపంలో అక్రమంగా నిర్మించిన పునాదులను రెవెన్యూ అధికారులు తొలగించారు. వీటిపై మండల తహసీల్దారు కిశోర్‌కుమార్‌కు ఫిర్యాదు అందింది. ఆయన ఆదేశాల మేరకు ఆర్.ఐ. బాలసుబ్రహ్మణ్యం, మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, వీఆర్వో సౌజన్య క్షేత్రస్థాయికి వెళ్లి రెవెన్యూ దస్త్రాలను పరిశీలించారు. అక్రమంగా నిర్మించిన 6 ఇంటి నిర్మాణాలను జేసీబీ సాయంతో తొలగించారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హెచ్చరించారు.

సంస్థాగత ఎన్నికలపై చర్చ

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : తెదేపా జోన్-4 ఇన్‌ఛార్జి దీపక్‌రెడ్డితో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా భేటీ అయ్యారు. ఆదివారం మధ్యాహ్నం హార్సిలీహిల్స్‌లో ఉన్న ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలతోపాటు సంస్థాగత ఎన్నికలపై చర్చించినట్లు సమాచారం. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ రాజు, సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గురుమూర్తి గౌడ్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: నిమ్మనపల్లె మండలంలో 144 సెక్షన్ అమలు ఉన్నందున నిబంధనలు ఉల్లంఘించి ర్యాలీలు ధర్నాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని మదనపల్లె రూరల్ సీఐ సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం నిమ్మనపల్లెలో పర్యటించారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిబంధనలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ తిప్పేస్వామి పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ జాబితాలో పేరు లేదా?

నెలాఖరు వరకు ఫిర్యాదు చేసేందుకు అవకాశం

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే:

ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్న రైతులు అతివృష్టి లేదా అనావృష్టితో ఏటా అన్నదాత నష్టపోతున్నాడు. ఇలాంటి పరిస్థితి నుంచి రైతులకు భరోసా ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ.6,000 కేంద్రం ప్రభుత్వం మూడు విడతలుగా ఆర్థిక సాయం అందిస్తోంది. దీనికి తోడుగా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.14 వేలు కలిపి మొత్తం రూ.20 వేలు ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఇందుకు శాఖాపరమైన అడ్డంకులను అధిగమించి త్వరలో రైతుల ఖాతాలోని నగదు జమ చేయడానికి చర్యలు తీసుకుంది. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 56 వేల హెక్టార్లు కాగా, 1.97 లక్షల మంది రైతులున్నారు.

మార్గదర్శకాలు ఇవే...

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పన్నులు చెల్లించే వారిని ఈ పథకంలో అనర్హులుగా చూపించారు. ఈ సమస్య ఉన్న వారు ఆడిటర్‌ను సంప్రదిస్తే వారు ధ్రువపత్రం ఇస్తారు. దాన్ని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు అందజేస్తే సరిపోతుంది. కుటుంబంలో ఒకరికే పథకం వర్తిస్తుంది. కుటుంబం నుంచి వేరుగా ఉంటే గ్రామ, వార్డు సచివాలయాల్లో కుటుంబ సర్వేలో వేరుగా చేయించుకోవాలి. వెబ్‌ల్యాండ్‌లో రైతు ఆధార్ సంఖ్య తప్పుగా అనుసంధానం చేసి ఉంటే రెవెన్యూ అధికారులను సంప్రదించి సరి చేయించుకోవాలి. వెబ్‌ల్యాండ్‌లో ఆధార్‌తో జత కాలేదని గుర్తించినా, మృతి చెందిన వారి భూములు మ్యుటేషన్(పేరు మార్పు) జరగకపోయినా సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించాలి.

పీలేరు సమీపంలో సాగులో ఉన్న వరి

తప్పులు సరిదిద్దుకోవాలి

అర్హతే ప్రామాణికంగా తీసుకుని ఆర్థిక సాయం అందించాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యం. ఇందుకు ఈ పథకంలో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉండేలా మార్గదర్శకాలను జారీ చేసింది. ఒక కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకున్నాం. వ్యవసాయ శాఖ వెబ్‌ల్యాండ్ ఆధారంగా ఖరారు చేసిన రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా జాబితాను సిద్ధం చేశాం. అర్హుల జాబితాలో పేరు లేకుంటే రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి తప్పులుంటే సరిదిద్దుకోవాలి.

- శివనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
మదనపల్లె : 8008574955
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 7989663199

స్పందనకు వందనం

కలకడలోని చెరువుబండ వీధిలోని మురుగు కాలువను కార్మికులు శుభ్రం చేశారు. మురుగు కాలువలో చెత్తాచెదారం చేరి మురుగు నిల్వ ఉండటంపై మేమున్నాం..మీకు తోడుగాలో సమస్య ప్రచురితమైంది. స్పందించిన కార్యదర్శి దేవేంద్ర సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. **- న్యూస్‌టుడే, కలకడ**

?: రంగారెడ్డికాలనీలో చెట్టు కొమ్మల కారణంగా విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. విద్యుత్తు తీగలకు కొమ్మలు తగులుతున్నాయి. **- జాఫర్, రంగారెడ్డికాలనీ**

✓: మరమ్మతులు చేయించి వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- షరూప్దీన్, కార్యదర్శి, కొత్తిండ్లు పంచాయతీ**

?: రెహ్మత్‌నగర్‌లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. రోడ్లపై మురుగు పారుతోంది. **- బాషా, స్థానికుడు**

✓: పారిశుద్ధ్య పనులు చేయించి సమస్య లేకుండా చూస్తాం. **- అబ్దుల్‌షుకూర్, ఈవోపీఆర్డీ, మదనపల్లె**

?: వేంపల్లె పంచాయతీ కేంద్రం పాఠశాల ఎదుట వంకలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దోమలకు నిలయంగా మారింది. **- నారాయణ, వేంపల్లె**

✓: వంకలో మురుగు నిల్వ లేకుండా, చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయిస్తాం. **- తాజ్‌మస్రూర్, ఎంపీడీవో, మదనపల్లె**

?: బెంగళూరు రోడ్డులో పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ అంధకారం నెలకొంది **- వేమయ్య, మదనపల్లె**

✓: మరమ్మతులు చేయించి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. **- ప్రమీల, కమిషనర్, మదనపల్లె పురపాలక సంఘం**

?: బొమ్మనచెరువు పంచాయతీలోని తాగునీటి తొట్టెల్లో పాచి పట్టి అధ్వానంగా ఉన్నాయి. **-కమలమ్మ, బొమ్మనచెరువు**

✓: కార్మికులతో శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటాం. **- నాగరాజు, డీఎల్‌పీవో, మదనపల్లె**

?: కొత్తవారిపల్లె పంచాయతీ కేంద్రంలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. **- బాబు, స్థానికుడు**

✓: పారిశుద్ధ్య పనులు చేపట్టి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. **- తాజ్‌మస్రూర్, మదనపల్లె ఎంపీడీవో**

?: చెంబకూరురోడ్డులో రామాపురం మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలున్నాయి. **- శేఖర్‌బాబు, మదనపల్లె**

✓: రోడ్డుకు అడ్డంగా ఉన్న ముళ్లకంపలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- బూరయ్య, ఆర్అండ్‌బీ ఏఈ, మదనపల్లె**

?: వేంపల్లె చెరువులో ఇసుకను అనుమతి లేకుండా జేసీబీలతో తోడేస్తున్నారు. వ్యవసాయబోర్లు, తాగునీటి పథకాల్లో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. **- సురేంద్ర, వేంపల్లె క్రాస్**

✓: అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకుంటాం. **- రాజేంద్రప్రసాద్, జలవనరులశాఖ ఏఈ - న్యూస్‌టుడే,మదనపల్లె గ్రామీణ**

మైనార్టీల సంక్షేమమే ధ్యేయం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల సంక్షేమం తెదేపాతోనే సాధ్యమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. పురపాలక సంఘం 20వ వార్డులో ఆదివారం స్థానిక కౌన్సిలర్ లలిత ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సూపర్ సిక్స్‌తో పాటు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత తెదేపాకే దక్కుతుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. సీఎం చిత్రపటానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు. అనంతరం బాధితులకు 17 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గురుమూర్తిగౌడ్, సురేష్‌రాజు, బాబునాయుడు, రామకృష్ణాచారి, నాదెళ్ల శివ, షంషీర్, సంగం హరి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

అందుబాటులోకి ఆయూష్ సేవలు

కలికిరిలో ఆయూష్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడున్న ఆసుపత్రిలో వైద్యురాలుగా పనిచేస్తున్న విజయచంద్రిక రెండేళ్ల కిందట చెంగన్నగుంట ఆసుపత్రికి డిప్యుటేషన్‌పై బదిలీ అయింది. దీంతో కలికిరి ఆయూష్ ఆసుపత్రిలో వైద్యురాలు లేకపోవడంతో కాంపౌండర్ వైద్యం అందిస్తున్నారు. మందుల కొరతతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆయుర్వేద వైద్యం కోసం వచ్చే రోగులు మందులు ఎక్కడ ఇస్తారో? తెలియక వెనుతిరుగుతున్నారని ఈ ఏడాది ఫిబ్రవరి 15న 'కాంపౌండరే వైద్యులు' అనే శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు స్పందించి డిప్యుటేషన్ రద్దు చేసి కలికిరికి బదిలీ చేయడంతో విజయచంద్రిక కలికిరిలో బాధ్యతలు చేపట్టారు. దీంతో రోగులకు ఆయూష్ వైద్యం అందుబాటులోకి వచ్చింది. **- న్యూస్‌టుడే, కలికిరి**

'మద్యం కేసులో వైకాపా నాయకులు జైలుకే'

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : గత వైకాపా పాలనలో నాణ్యతలేని, అక్రమ మద్యం వ్యాపారంలో సంపాదించిన డబ్బులు తాడేపల్లె ప్యాలెస్‌కు చేరాయని కూటమి నాయకులు ఆరోపించారు. తెదేపా రాజంపేట పార్లమెంటు నియోజకవర్గం కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో జనసేనపార్టీ రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రాందాస్‌చౌదరి, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, మార్కెట్‌యార్డు ఛైర్మన్ జంగాల శివరామ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వ్యాపార రంగంలో డిజిటల్ లావాదేవీలు చేయాలని స్పష్టంగా పేర్కొందని, అయితే ఏపీలో మాత్రం గత వైకాపా పాలనలో మద్యం దుకాణాల్లో అమలు చేయలేదన్నారు. ఈ విషయంలో నిందితులందరిపై చట్ట ప్రకారం చర్యలుంటాయన్నారు. వైకాపా నాయకులు ప్రజా తీర్పును సమీక్షించుకోలేదన్నారు. గత పాలనలో వందల మంది కల్తీ మద్యం తాగి చనిపోయారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం జగన్, వైకాపా నాయకులు త్వరలోనే జైలుకు పోతారన్నారు. సమావేశంలో దొరస్వామినాయుడు, అరుణ్‌తేజ్, శ్రీనివాసులు, మహబూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కూటమి నాయకులు

వైద్య శిబిరాలకు స్పందన

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, భరతమాత స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో మదనపల్లె పట్టణంలోని సాయి సంజీవని కిడ్నీ స్టోన్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం అమ్మచెరువు మిట్ట పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది.

రామసముద్రం : అంధత్వ నివారణే లక్ష్యమని శంకర్ నేత్రాలయ మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ అన్నారు. రామసముద్రంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ, రోటరీ పుంగనూరు సెంట్రల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 40మంది రోగులకు కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు.

మదనపల్లె పట్టణం: మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న వారికి అమ్మచెరువుమిట్టలోని వెలుగు సంస్థలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన జీబీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గోపాలం శివనారాయణ ఇందులో పాల్గొన్నారు. రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

పెద్దమండ్యం, న్యూస్‌టుడే : మండలంలోని వెలిగల్లు గ్రామంలో ఆదివారం ఘనంగా పీర్ల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అలంకరించిన పీర్లను గ్రామ వీధుల్లో భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. ఆదివారం అగ్నిగుండాన్ని ఏర్పాటు చేశారు. కుల, మతాలకతీతంగా భక్తులు పాల్గొన్నారు.

వెలిగల్లులో ఊరేగింపుగా తీసుకెళ్తున్న పీర్లు

లయన్స్‌క్లబ్ సేవలు మరింత విస్తృతం

వరుణ్‌ను సన్మానిస్తున్న జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాంటెండెంట్ గురుప్రసాద్

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నూతన లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వరుణ్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా ఎంపికైన వరుణ్‌ను పలువురు పట్టణ ప్రముఖులు సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ ఎంజేఎఫ్ గౌతమ్‌రెడ్డి, కంటి ఆసుపత్రి ఛైర్మన్ భాస్కరనాయుడు, రవికాంత్, శశిధర్‌రావు, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాంటెండెంట్ ఆర్.గురుప్రసాద్, ద్వారకనాథరెడ్డి, నాగార్జునబాబు, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

పీలేరు, వాల్మీకిపురం, రామసముద్రం, న్యూస్‌టుడే: ఆడికృత్తిక మహోత్సవం పురస్కరించుకుని ఆదివారం పీలేరు మహాగణపతి ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామికి ఘనంగా పూజలు చేశారు. స్వామిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వాల్మీకిపురం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున భక్తులు కావిడిలను సమర్పించారు. రామసముద్రం దిగువపేటలోని చంద్రశేఖరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాభిషేకం చేశారు.

రామసముద్రం దిగువపేటలో సుబ్రహ్మణ్య స్వామి

ఘనంగా గంగమ్మ జాతర

వాల్మీకిపురంలో దర్శనమిస్తున్న గంగమ్మ

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : వాల్మీకిపురంలో గంగమ్మ జాతర మహోత్సవం వైభవంగా జరిగింది. లాభాల గంగమ్మ, దుర్గాదేవి, బోయకొండ గంగమ్మల ఆలయాల్లో ఆదివారం 108 మట్టి కుండల్లో గంగా జలాలను నడివీధి గంగమ్మతో పాటు అమ్మవార్లకు అభిషేకించారు. మహిళలు పెద్దఎత్తున దీలుబోనాలను సమర్పించారు.

పీలేరు, పీలేరు గ్రామీణ : పీలేరు పట్టణం బండ్లవంక ప్రాంతంలో . గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పీలేరు ఏఎంసీ ఛైర్మన్ పురం రామ్మూర్తి, రెడ్డెమ్మ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పీలేరులో కలశాలు తీసుకెళ్తున్న మహిళలు, భక్తులు

గుర్రంకొండ, : చెర్లోపల్లెలో వెలిసిన శ్రీరెడ్డెమ్మదేవతకు భక్తులు ఆషాడం సారె ఆదివారం సమర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్ అన్నమయ్య జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో భక్తులు, మహిళా భక్తులు 400మందికి పైగా అంగరంగ వైభవంగా దద్దాలవారిపల్లె నుంచి భజనలు చేస్తూ రెడ్డెమ్మకొండ వరకు ర్యాలీగా వచ్చారు.

రెడ్డెమ్మ ఆలయానికి ర్యాలీగా వస్తున్న భక్తులు

గుంతల దారి.. జాగ్రత్త బాటసారీ!

చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారి నుంచి కలకడ మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీలోని ఝరికోన రోడ్డు గుంతలమయమై అధ్వానంగా మారింది. కొన్నేళ్ల కిందట మట్టిరోడ్డును తారురహదారిగా అభివృద్ధి చేశారు. ప్రస్తుతం రోడ్డు మొత్తం గుంతలమయమైంది. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని చోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కలకడ**

బస్టాండులో భరించలేని దుర్వాసన

స్వచ్ఛ భారత్ పేరిట మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో మూడేళ్ల క్రితం మూత్రశాలలు ఏర్పాటయ్యాయి. ఇందులో కొళాయిలను ఏర్పాటు చేయక పోవడంతో నీటి సౌకర్యం కరవైంది. అలాగే వదిలేయడంతో దుర్వాసన వస్తోంది. దీంతో ప్రయాణికులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ డీఈ పోతురాజు దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే కొళాయి కనెక్షన్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, మదనపల్లె అర్బన్**

నీటికుంట కాదు సీసీరోడ్డే

ఇదేదో నీటికుంట అనుకుంటే పప్పులో కాలు వేసినట్లే. ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సీసీరోడ్డు. రామసముద్రం మండలం నారిగానిపల్లె గ్రామపంచాయతీ ఆల్చేపల్లె గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు చిత్రమిది. రోడ్డు నిర్మాణంలో ఎత్తు పల్లాలు ఉండడంతో వర్షపు నీరు ఇలా రోడ్డుపై నిల్వ ఉండిపోతోంది. నీటిని తొలగిస్తే రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పీఆర్ ఏఈ రమణను వివరణ కోరగా కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే, రామసముద్రం**

వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, రామసముద్రం, న్యూస్‌టుడే : ఆటో బోల్తా పడి నలుగురు గాయపడిన సంఘటన చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలో ఆదివారం జరిగింది. సోమల మండలం నెల్లిమంద గొల్లపల్లెకు చెందిన మునిరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి బోయకొండ గంగమ్మను దర్శించుకునేందుకు ఆటోలో వెళ్తుండగా చౌడేపల్లె మండలం కడియాలకుంట ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆటోలో నుంచి పొట్టేలు దూకింది. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న మునిరాజు, అతని తల్లి వెంకటసుబ్బమ్మ, కురబలకోట మండలం ముదివేడుకు చెందిన రెడ్డీశ్వరి, మునిదినేష్‌లు గాయపడ్డారు. వీరిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ❖ రామసముద్రం సమీపంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టింది. కర్ణాటక రాష్ట్రం శ్రీనివాపురం పట్టణానికి చెందిన మల్లికార్జున ద్విచక్రవాహనంపై పుంగనూరు నుంచి రామసముద్రానికి వస్తుండగా వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోటలో ఓ కాలనీకి చెందిన విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లుస్థానిక సీఐ జీవన్ గంగానాథ్ బాబు ఆదివారం తెలిపారు. ఈ నెల 19న కళాశాల నుంచి ఇంటికి వచ్చిన విద్యార్థిని చరవాణిలో ఎవరితోనో మాట్లాడుతుండగా, గమనించిన ఆమె తండ్రి మందలించాడు. దీంతో ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాస్‌పోర్ట్ పోయినది

బీదం సంధ్యారాణి భర్త బీదం హరిప్రసాద్ అయిన నేను Door No.3-1, ఎగువగొల్లపల్లె, ముదివేడు H/o, కురబలకోట మండలం, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో నివాసం ఉంటున్నాము. నాకు సంబంధించిన ఒరిజినల్ పాస్‌పోర్ట్ No.S6243195 ముదివేడు బస్టాండ్ నందు దారపోయినది. సంబంధించిన పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల క్రింది సెల్ నెంబర్‌కి కాల్ చేసి తెచ్చి ఇవ్వగలరు.

Cell No.70935 53016

అక్రమ అరెస్టుపై న్యాయపోరాటం

మదనపల్లె పట్టణం, వాల్మీకిపురం, న్యూస్‌టుడే : ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టుపై న్యాయ పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, పురపాలకసంఘం ఛైర్‌పర్సన్ వి.మనూజ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్ రెడ్డి ఎంపీ అరెస్టును ఖండించారు. ❖ వాల్మీకిపురంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టు చేయడాన్ని ఖండించారు.

ఎనిమిది మందిపై కేసు నమోదు

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: నిమ్మనపల్లె మండలం తవళం పంచాయతీకి చెందిన రెండు వర్గాలు వాగ్వాదానికి దిగారు. ఈ ఘటనపై ఇరువర్గాల్లోని 8 మందిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

బంగారు నగల చోరీ

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లెకు చెందిన పురుషోత్తంరెడ్డి ఇంట్లో 49 గ్రాముల బంగారు నగలు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఆదివారం సంఘటనా స్థలాన్ని మదనపల్లె రూరల్‌సీఐ సత్యనారాయణ ఎస్ఐ తిప్పేస్వామి పరిశీలించారు. బంగారు నగల విలువ రూ.1.60లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

పారిశుద్ధ్యం అధ్వానం... వ్యాధులతో సతమతం

● మదనపల్లెలో మారని పరిస్థితి

కాలువలో పూడికను తీసి గట్టుపైనే వదిలేశారిలా..

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పారిశుద్ధ్యం నిర్వహణలో పురపాలకసంఘం లక్ష్యాన్ని చేరుకోలేకపోతోంది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, కాలువ గట్లపై పూడిక వదిలేశారు. పట్టణంలోని రెడ్డెప్పనాయుడుకాలనీ, ఆర్టీసీ బస్టాండు పరిసరప్రాంతం, ఎస్‌బీఐ కాలనీ, రామారావు కాలనీల్లోని ప్రజలు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. రెడ్డెప్పనాయుడు కాలనీలో కాలువల్లోని పూడికను తీసి గట్లపై వదిలేశారు. కొన్ని రోజులుగా వర్షం కురుస్తుండటంతో ఆ మట్టి మళ్లీ కాలువలోకి వెళ్తోంది. దీంతో కాలువలు పూడిపోయి వర్షాకాలంలో మురుగు రోడ్లపైకి వస్తోంది. కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడుతున్నారు.

నీటి సరఫరాకు ఇక్కట్లు

రామారావు కాలనీలో మూడు రోజులకొకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. తాగునీటి సమస్య ఉండటంతో ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. స్థానికంగా పురపాలక సంఘానికి చెందిన నీటిశుద్ధి కేంద్రం ఉన్నా సక్రమంగా నీరు లభించక వాటర్ క్యాన్లను కొంటున్నారు. పలుచోట్ల కాలువలు పాక్షికంగా దెబ్బతిని మురుగు రోడ్డుపైకి వస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు తెలిపారు. బాహుదానదిలోకి వ్యర్థపు నీటిని వదులుతుండటంతో దుర్వాసన వస్తోంది. నది ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. అధికారులు రెండు సార్లు శుభ్రం చేయించినా పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఈ విషయమై కమిషనర్ ప్రమీల మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బాహుదానదిలో పారుతున్న మురుగు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

కొత్త కోడూరు కాలనీ అభివృద్ధికి కృషి

స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్త కోడూరు కాలనీలో సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం వారు పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గంగమ్మ ఆలయం, మసీదు వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని, వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని వారు వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

రాజంపేటలో భారీ వర్షం

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేటలో ఆదివారం రాత్రి తొమ్మిది గంటల నుంచి భారీ వర్షం కురుస్తోంది. ఖరీఫ్ కాలంలో రాజంపేట ప్రాంతంలో వర్షాలే. ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో రైతుల్లో హర్షం వ్యక్తం చేస్తున్నారు. తుఫానులు బోర్లలో నీటి మట్టం పెరుగుతుంది. తాగునీటి బోర్లలో నీటి శాతం పెరిగే అవకాశముందని వారు చెబుతున్నారు. లోతట్టు ప్రాంతాలు మునగడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు.

పట్టణంలోని ఓ వీధిలో కురుస్తున్న వర్షం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 9703572572

సుండుపల్లి, న్యూస్‌టుడే: కృష్ణానగర్ అంకాళమ్మ వీధిలో నీటి సరఫరా పునరుద్ధరించారు. పంచాయతీ సిబ్బంది సాంకేతిక సమస్యను గుర్తించి పరిష్కార మార్గాలు తీసుకోవడంతో నీరు సరఫరా అయింది. 'మేమున్నాం మీకుతోడుగా' కింద ఆదివారం వార్త ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి సమస్యను తీర్చడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సుండుపల్లి: కె.బి.పి.వీధిలో మురుగు నీటి కాలువలో పేరుకుపోయిన పూడికను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. జేసీబీ వల కుదిరిన వర్గాలకు మట్టి కొట్టుకొచ్చి పూడిపోవడంతో ఆదివారం మేమున్నాం మీకుతోడుగా కింద సమస్యపై వార్త ఇవ్వడంతో సమస్య పరిష్కరించారు.

రాయచోటి (గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్జీవో కాలనీ, టెంకాయ చెట్టు వీధిలో పది రోజులుగా చెత్త నిల్వలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. ఈ సమస్యపై మేమున్నాం మీకు తోడుగా కింద ఆదివారం వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు చెత్త నిల్వలను తొలగించారు.

?: బాలాజీనగర్ నుంచి చాన్‌బాషా వీధిలోకి వెళ్లే మలుపులో చెత్త కుప్పలు పేరుకుపోయాయి దుర్వాసన వెదజల్లుతోంది. వెంటనే తొలగించాలి. - **స్థానికులు, బాలాజీనగర్, సుండుపల్లి**

✓: వెంటనే సిబ్బందిని పంపించి చెత్తకుప్పల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. - **రామచంద్ర, పంచాయతీ కార్యదర్శి, సుండుపల్లి - న్యూస్‌టుడే, సుండుపల్లి**

?: మండల కేంద్రంలో విద్యుత్తు స్తంభాలకు మొక్కల తీగలు అల్లుకుంటున్నాయి. వాటి ద్వారా కింద ఉన్న చెట్ల కొమ్మలకు విద్యుత్తు సరఫరా అవుతోంది. స్తంభాలకు అల్లుకున్న తీగలు తొలగించాలి. - **జయపాల్‌రెడ్డి, సర్పంచి, ఓబులవారిపల్లె**

✓: వెంటనే లైన్‌మెన్‌ను పంపిస్తాం. వీలైనంత త్వరగా విద్యుత్తు తీగలకు అల్లుకున్న తీగలను తొలగింపజేస్తాం. - **కిరణ్‌కుమార్, ఏఈ, కొర్లకుంట - న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె**

?: ఓబులవారిపల్లెలోని పలు వీధుల్లో విద్యుత్తు దీపాలు కాలిపోయాయి. వాటికి మరమ్మతులు చేయించాలి.

✓: వెంటనే సిబ్బందిని పంపించి విద్యుత్తు దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. రాత్రి వేళల్లో వృద్ధులు, చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం. - **భారతి, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె**

?: పట్టణంలో కార్మికుల సమ్మె కారణంగా తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. 15 రోజులైనా కొన్ని వీధుల్లో నీటి సరఫరా జరగడం లేదు. - **ద్వారక, రాయచోటి**

✓: నీటి సరఫరాకు ఇబ్బందులకు సచివాలయ సిబ్బందితో పాటు 20 మంది దినసరి కూలీల సేవలను వినియోగిస్తున్నాం. 8 ట్యాంకర్లను అదనంగా తీసుకుని పట్టణంలో సరఫరా చేస్తున్నాం. త్వరలోనే పూర్తి స్థాయిలో మెరుగుపరుస్తాం. - **వాసుబాబు, కమిషనర్ - న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ**

పాఠశాల ఆటోలా... పుష్పక విమానాలా!

❖ పరిమితికి మించి విద్యార్థుల తరలింపు
❖ రద్దీ రోడ్లపై మితిమీరిన వేగంతో ప్రయాణం

రాయచోటి (గ్రామీణ, న్యూస్‌టుడే: పాఠశాల ఆటోలు పుష్పక విమానాలను తలపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఆటోవాలాలు పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారు. బస్సు సౌకర్యం అందుబాటులో లేకనో తల్లిదండ్రులు తమ పిల్లల్ని పాఠశాలలకు తీసుకెళ్లడానికి కుదరకనో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

● రాయచోటి పట్టణంలో దాదాపు వందకు పైగా ప్రైవేటు పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో చాలా వాటికి రవాణా సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఆటోల్లో పాఠశాలలకు పంపిస్తున్నారు. సాధారణంగా ఒక ఆటోలో నలుగురు విద్యార్థులను మించి తీసుకెళ్లకూడదు. కానీ కొందరు డబ్బులు ఆశపడి ఒక్కో ఆటోలో సుమారు 12 నుంచి 15 మంది వరకు తీసుకెళ్తున్నారు. డ్రైవర్ సీట్లో ఇరువైపులా ముగ్గురు, నలుగురు విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. అంతేగాక ఆటోకు ఇరువైపులా ఉన్న కడ్డీలపై కూడా విద్యార్థులను ప్రమాదకరంగా కూర్చోబెట్టి పరిమితికి మించి తీసుకెళ్తున్నారు. ఇంత జరుగుతున్నా రవాణా శాఖ అధికారులుగానీ.. పోలీసులుగానీ పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి.

● చాలా మంది ఆటో చోదకులు 10 నుంచి 15 మంది వరకు పిల్లల్ని వాహనంలో ఎక్కిస్తున్నారు. చివరకు డ్రైవర్ సీటులో కూడా రెండు వైపుల విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. పుస్తకాల బ్యాగులు, క్యారియర్లను వాహనాల ఇరువైపులా తగిలిస్తుండటంతో వాహనచోదకులకు అవి తగిలి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

● కొందరు ఆటోడ్రైవర్లు లైసెన్సులు లేకుండానే ఆటోలు నడుపుతున్నారు. ప్రమాదాలు జరిగిన మిందట అధికారులు స్పందించి పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న పాఠశాల ఆటోలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆటోలో డ్రైవరుకు ఇరువైపులా కడ్డీలపై కూర్చుని ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులు

నిబంధనలివీ...

ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రైవరు పక్కన ఎవ్వరినీ కూర్చోబెట్టరాదు. ఆ విధంగా ప్రయాణించడం ప్రమాదాలకు కారణమవుతుంది. డ్రైవర్‌కు లైసెన్స్, ఆటోకు పర్మిట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి. ● పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్లే వాహన వివరాలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో నమోదు చేయాలి. పోలీసులు ప్రత్యేకంగా గుర్తింపు సంఖ్యను ఇస్తారు. ● పిల్లల్ని పాఠశాలలకు తీసుకెళ్లే వాహనంపై స్కూల్ ఆటో అని రాయాలి.

తైక్వాండో విద్యార్థుల ప్రతిభ

సత్తా చాటిన క్రీడాకారులతో శిక్షకులు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణంలోని మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో ఆదివారం అన్నమయ్య జిల్లా తైక్వాండో అకాడమీ మాస్టర్ పీర్వయ్య ఆధ్వర్యంలో క్రీడాకారులకు బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీల్లో బ్లూ బెల్టిన సాహితి, గౌతమ్, వెంకటదీక్షిత్, గ్రీన్ బెల్టిన రితీష్‌రెడ్డి, ఎల్లో బెల్టిన దీక్షిత, లక్ష్మీకీర్తన, సుహాస్, మౌనిక, దర్శన్‌నాయక్‌లు ఉత్తీర్ణత సాధించారు. వీరికి శిక్షకులు జాహిద్‌అలీ, మనోజ్‌కుమార్‌నాయుడు బెల్టులు అందజేశారు.

ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఎన్డీయే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తున్నామని తెదేపా నాయకులు తెలిపారు. పెనగలూరులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు.

కార్మిక సమస్యలను పరిష్కరించాలని ఆందోళన

రాజంపేట, న్యూస్‌టుడే: న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని ఐదురోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని యూటీఐయూ జిల్లా కార్యదర్శి శ్రీహరి తెలిపారు. స్థానిక పురపాలక కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికులు తలపెట్టిన సమ్మె ఆదివారం కొనసాగింది. వీరి సమ్మెకు యూటీఐయూ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్మికుల పట్ల ఇంత కఠినంగా వ్యవహరించడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఐయూ నాయకులు సాజిత్, పుర కార్మికులు కె.ప్రసాద్, సి.హెచ్.ఓబయ్య, ఎం.ప్రమీల, పెంచలయ్య, గంగయ్య, రెడ్డయ్య పాల్గొన్నారు.

రాయచోటిలో నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

రాజంపేట పురపాలక కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ...

కనీస వేతనం ఇవ్వాలని వినతి...

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: పురపాలక శాఖలో పని చేస్తున్న ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక పురపాలక కార్యాలయం ఎదుట ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్న ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు ఆదివారం సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఆప్కాస్‌ను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు మంగమ్మ, రమాదేవి, మల్లికార్జున రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో విరూపాక్షమ్మ జాతర

చాందీనిబండిలో కొలువైన అమ్మవారికి నమస్కరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

అన్నదానం చేస్తున్న స్థానికులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బోడిరెడ్డిగారిపల్లెలో విరూపాక్షమ్మ జాతర కనుల పండువగా సాగింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు అమ్మవారిని చాందినీ బండిలో కొలువుదీర్చి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. చెక్క భజనలు, కోలాటాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాలేటమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురిజాల జగన్‌మోహన్, తెదేపా పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా బాబు, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, కలెక్టరు శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు మంత్రి ఆధ్వర్యంలో భారీగా అన్నదానం ఏర్పాటు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజంపేట (గ్రామీణ, (పెనగలూరు): పెనగలూరు మండలం అనంతసముద్రం గ్రామానికి చెందిన చాగం వెంకటసుబ్బయ్య(45) అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారని ఎస్సై రవిప్రకాష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన మద్యానికి బానిసై.. డబ్బుల కోసం ఇంట్లో భార్యను వేధించడం వంటి ఘటనలు నిరంతరం జరిగేవని.. వీటి కారణంగా కుటుంబ సభ్యులు మందలించడం... మద్యం కోసం డబ్బులు ఇవ్వకపోవడంతో గత నెల 19వ తేదీన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు.

పోలీసుల అదుపులో జూదరులు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణంలోని ఎర్రబాలెం సమీపంలో ఆదివారం జూదం ఆడుతున్న ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ పి.ఎం.నాగేశ్వరరావు తెలిపారు. వీరి నుంచి రూ.1,290లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అదుపు తప్పి లారీ బోల్తా

చిన్నమండెం, న్యూస్‌టుడే: చిన్నమండెం-రాయచోటి ప్రధాన రహదారిలోని వండాడి క్రాస్ వద్ద ఆదివారం సాయంత్రం లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మదనపల్లె వైపు నుంచి రాయచోటికి వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవరు రెడ్డెప్పకు స్వల్పగాయాలయ్యాయి. 108లో రాయచోటికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రాజంపేట ఎంపీ చేసిందేమీ లేదు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజకీయంగా రాజంపేటకు ఉన్న పరువును ఎంపీ మిథున్‌రెడ్డి తీసేశారని తెదేపా లీగల్‌సెల్ పార్లమెంటు అధ్యక్షుడు టి.లక్ష్మినారాయణ ఆరోపించారు. స్థానిక పార్టీ లీగల్ సెల్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజంపేట ఎంపీగా మూడుసార్లు ఎంపికైనా ఈ ప్రాంతానికి చేసిన మేలు ఏం లేదన్నారు. ఆయన సాధించిందేమీలేదన్నారు. కనీసం రాజంపేటలో రైళ్ల నిలుపుదల కోసం ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు.

ప్రభుత్వ మోసాలను ఎండగట్టాలి

సంబేపల్లె (రాయచోటి), న్యూస్‌టుడే: ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సంబేపల్లెలో ఆదివారం ఆయన మాట్లాడారు. వైకాపా అధినేత జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు కార్యకర్తలు, నాయకులు శాయశక్తులా కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంలో చెప్పుకొనేందుకు శాశ్వత అభివృద్ధి పథకం ఒక్కటైనా ఉందా అని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. కక్ష సాధింపు ధోరణి సరికాదన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్మన్ సుగవాసి బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

విద్యార్థులకు హిందీ వ్యాస రచన పోటీలు

రాజంపేట, న్యూస్‌టుడే: ప్రేమ్ చంద్ హిందీ భవన్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక భారతీయ విద్యానికేతన్ పాఠశాలలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు హిందీపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇలాంటి పోటీ పరీక్షలు మనలోని శక్తి సామర్థ్యాలను తెలియజేస్తాయన్నారు. ఇంకా ఎంత కష్టపడాలనే విషయం తెలుస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపకులు సర్తాజ్ హుస్సేన్ అన్నారు. విజేతలకు ఈ నెల 31న హిందీ రచయిత ప్రేమ్ చంద్ జయంతి సందర్భంగా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు సైరాబాను, రాజశేఖర్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమం

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అక్రమమని.. రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. పురపాలక ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, నాయకులు చొప్పా ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

నందలూరు, న్యూస్‌టుడే: మండలంలోని అరవపల్లెలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో ఆదివారం శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సరసా రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్ఛరణ, భక్తుల గోవింద నామస్మరణల నడుమ కల్యాణం కనుల పండువగా జరిపించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం సీతారాముల ఉత్సవ మూర్తులను పుర వీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ధర్మకర్త గంపా సుధాకర్, నిర్వాహకులు నడివీధి సుధాకర్, నారపుశెట్టి శివలు పాల్గొన్నారు.

మంగళ సూత్రాలను చూపుతున్న పండితులు

ఘనంగా ఆడికృత్తిక పూజలు

❖ పలు చోట్ల ఘనంగా కల్యాణోత్సవాలు

రాజంపేట: కల్యాణ వేదికపై కొలువైన ఉత్సవ మూర్తులు


రైల్వేకోడూరు : ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శరవణుడు

రాజంపేట : వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ...

రాజంపేట మండలం వైబీఎన్‌పల్లి అభయాంజనేయస్వామి ఆలయంలో...

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: రైల్వేకోడూరు పట్టణంలోని శ్రీ భుజంగేశ్వరాలయంలో ఆదివారం ఆడికృత్తిక సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అర్చకులు పవన్‌కుమార్‌శర్మ, యోగీశ్వరశర్మ ఆధ్వర్యంలో శ్రీ సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో, వెండి ఆభరణాలతో అలంకరించారు.

రాజంపేట: రాజంపేట పట్టణంలోని ఈడిగ పాళెంలో వెలసిన వినాయకస్వామి, బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధిబుద్ధి వినాయకస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిలకు కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిపించారు. స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజంపేట గ్రామీణ: రాజంపేట మండలంలోని పలు ఆలయాల్లో ఆడకృత్తిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజంపేట మండలం వైబీఎన్‌పల్లి గ్రామ పరిధిలోని శ్రీఅభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు అప్పలాచారి, శేషాద్రి స్వామిల ఆధ్వర్యంలో ఆకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

రాజంపేటలో కల్యాణానికి హాజరైన భక్తులు

కుషావతి... మురుగుతో నిండినది

గాలివీడులోని రాయచోటి-కదిరి రోడ్డులో కుషావతి నదికి మురుగు నీటిని మళ్లించారు. నాలుగు వరుసల రహదారి అభివృద్ధి పనులతో పాటు మురుగునీటి కాలువలు నిర్మించారు. గృహాల నుంచి వెలువడే మురుగునీటిని కాలువల ద్వారా నదిలోకి ప్రవహించడంతో రోడ్డు వంతెన వద్ద నీరు కలుషితం అవుతోంది. నది సమీపంలో చెత్తా చెదారం నీటిలో కలిసిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. జలాలు గరళంగా మారకుండా సంబంధిత శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, గాలివీడు**

మానవతా సంఘం సేవలు ఎనలేనివి

సుండుపల్లి, న్యూస్‌టుడే: సేవకు చిరునామాగా మానవతా సంఘం నిలుస్తోందని ఉమ్మడి కడప జిల్లా సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి అన్నారు. సుండుపల్లిలో ఆదివారం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్యులు సైతం సభ్యులుగా చేరి సేవ అందించాలన్న లక్ష్యంతోనే ముందుకెళ్తున్నామన్నారు. విద్యార్థులలో నైతిక విలువల పెంపు, ప్రతిభావంతులకు ప్రోత్సాహం, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అవగాహనా కార్యక్రమాలు అందించగలుగుతున్నామన్నారు. మండలంలో సంఘం ఏర్పాటు సమయంలో తొలి శీతలీకరణ పెట్టె అందించిన ఎన్‌ఆర్‌ఐ తిమ్మసముద్రం గ్రామానికి చెందిన తాతినేని బాలాజీ నాయుడిని సంఘం తరఫున జ్ఞాపిక ఇచ్చి సత్కరించారు. అనంతరం నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సమావేశంలో ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి రామానాయుడు, ఆత్మీయ కమిటీ జిల్లా అధ్యక్షుడు రామాంజులు రెడ్డి(బాబు రెడ్డి), జిల్లాశాఖ కోశాధికారి జె.హరికుమార్, రాయచోటి శాఖ ఛైర్మెన్ శివగింగిరెడ్డి, సుండుపల్లి శాఖ కో కన్వీనరు తదతరులు పాల్గొన్నారు.

ప్రమాణం చేయిస్తున్న ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి

భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంపిక

రాయచోటి, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆనందగజతిరాజును నియమిస్తూ పార్టీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉంటూ సేవలందించడంతో తనకు పదవి దక్కిందని పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

వైకాపా నాయకుడి మృతికి సంతాపం

రాయచోటి, న్యూస్‌టుడే: వైకాపా మైనార్టీ నేత బేపారి బషీర్‌ఖాన్(85) ఆదివారం తన స్వగృహంలోనే మృతి చెందారు. ఆయన వయోభారంతో కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ సుగవాసి బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ ఛైర్మన్ ఎస్.ఫయాజ్‌బాషా, ఇతర నాయకులు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పెద్దకర్మ
పోలీస్‌శాఖలో విశేష సేవలందించి, కుటుంబ ఉన్నతికొరకు అహర్నిశలు శ్రమించి అందరికీ ఆదర్శంగా, మాకు మార్గదర్శకంగా నిలిచిన మీరు... ఆకస్మికంగా మా నుండి దూరమవ్వటం మాకు తీరనిలోటు. మీ పవిత్రాత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థిస్తున్నాము.
జననం : 01.06.1949
మరణం : 12.07.2025
స్వర్గీయ ముప్పాల సుబ్బరాజు గారు
రిటైర్డ్ A.S.I.,
మన్నూరు పోలీస్ స్టేషన్, రాజంపేట.
భార్య : ముప్పాల రాణెమ్మ
కుమారులు : ముప్పాల శివకుమార్‌రాజు
ముప్పాల జనార్ధన రాజు
ముప్పాల సురేష్‌రాజు
మరియు కుటుంబసభ్యులు
పెద్దకర్మ : 22/07/2025వ తేదీ మంగళవారం
న్యూబోయనపల్లి (చౌడేశ్వరిగుడి దగ్గర), రాజంపేటలోని మా స్వగృహం నందు జరుపబడును. కావున అందరికీ తెలపడమైనది.

(c) eenadu

సాగునీరందక.. ఖరీఫ్ సాగక!

నారుమళ్లు పోయడానికి అన్నదాతల వెనుకంజ

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే

సంతరావూరు వద్ద కొమ్మమూరు కాలువ ఇలా..

వేటపాలెం ప్రాంతంలో దుక్కి దున్నిన పొలాలు

కొమ్మమూరు కాలువకు ఇంకా సాగునీరు విడుదల చేయకపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్ ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. జూన్, జులై నెలల్లో సాధారణ వర్షపాతానికి నమోదు కావడంతో రైతులు దుక్కులు దున్నారు. నారు పోయాలంటే కచ్చితంగా సాగునీరు వస్తేనే ఎప్పుడు విడుదల చేస్తారో అధికారులు ప్రకటన చేయాలి. వ్యవసాయ అధికారులు అన్నదాతల్ని సన్నద్ధం చేయాలి. ఈ రెండింటి ఊసే లేక వ్యవసాయ పనులు మొదలు పెట్టడానికి రైతులు వెనుకాడే పరిస్థితి నెలకొంది. కృష్ణా పశ్చిమ డెల్టా ఆయకట్టు చివర భూములు చీరాల, కారంచేడు, పర్చూరు, వేటపాలెం, సంతరావూరు, చినగంజాం, తిమ్మసముద్రం గ్రామాల పరిధిలో ఉన్నాయి. ఇక్కడ సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగవుతుంది. ఏటా మాదిరిగా అయితే ఈ నెల 10వ తేదీ తర్వాత నీరు విడుదల చేయాల్సి ఉండగా.. నేటికీ చేయకపోవడంతో రైతులు ఆలోచనలో పడ్డారు. కాగా, సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు, పిచ్చి చెట్ల తొలగింపు, షట్టర్లు, తూముల మరమ్మతులకు ప్రభుత్వం రూ.1.42 కోట్లు విడుదల చేసింది. నీటి వినియోగదారుల కమిటీల ఆధ్వర్యంలో పనులు చేస్తున్నారు. ఇవి చివరి దశకు చేరాయి. పూర్తయితే చివరి భూములకు నీటి సరఫరాకు ఇబ్బంది ఉండదు.

విడుదలకు సిద్ధంగా ఉన్నాం..

'సాగునీరు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. ఈ నెల 10 వరకు తాగునీటి చెరువులకు నీటిని వదిలాం. కాలువల మరమ్మతులు పూర్తి అయ్యాక నీటిని విడుదల చేస్తాం. వ్యవసాయ శాఖాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం' అని జలవనరుల శాఖ డీఈ ఎన్వీకే ప్రసాద్ తెలిపారు.

అమృత్ 2.0 టెండర్ల గడువు పొడిగింపు

ఆగస్టు 7 వరకు దాఖలుకు అవకాశం

ఈనాడు, అమరావతి: అమృత్ 2.0 టెండర్ల గడువును అధికారులు పొడిగించారు. ఆగస్టు 7వ తేదీ వరకు దాఖలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. వాస్తవానికి, అమృత్ 2.0 పనులకు సంబంధించి అధికారులు గత నెల 27న టెండర్లు పిలవడం తెలిసిందే. తాడేపల్లిలోని ఈఎన్‌సీ కార్యాలయంలో ఏపీ సర్కిళ్లలోని ప్రజారోగ్యశాఖ ఎస్‌ఈలతో ఈఎన్‌సీ సమావేశం నిర్వహించి టెండర్లు పిలవడంపై నిర్ణయం తీసుకున్నారు. అలా ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పరిధిలో 86 పనులకు సంబంధించి రూ.1,092.60 కోట్లతో టెండర్లు పిలవగా, గుత్తేదార్లు ఆన్‌లైన్ బిడ్ దాఖలు చేయడానికి జులై 28వ తేదీ వరకు తొలుత గడువు విధించారు. అయితే, టెండరుదారుల నుంచి గడువు పొడిగించాలని అభ్యర్థనలు రావడంతో ఆమేరకు వచ్చే నెల 7వ తేదీ వరకు పొడిగిస్తూ ఉన్నతస్థాయి నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు గుంటూరు ప్రజారోగ్య పురపాలక సాంకేతిక విభాగం ఎస్ఈ శ్రీనివాస్ 'ఈనాడు'కు తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వహణకు నిధుల్లేవ్!

- పల్లెల్లో వెలుగు చూస్తున్న వైరల్ జ్వరాలు
- బ్లీచింగ్ కొనలేని దుస్థితిలో పంచాయతీలు

న్యూస్‌టుడే, బాపట్ల, నగరం

పేరలిలో రోడ్డుపై నిలిచిన నీరు

జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు, రహదారులపై నీరు నిలిచి పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. దోమల బెడద పెరిగింది. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వైరల్ జ్వరాలతో పాటు డెంగీ కేసులు నమోదవుతున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణకు నిధులు లేక పంచాయతీలు సతమతమవుతున్నాయి. కనీసం సున్నం, బ్లీచింగ్ బస్తాలు కొనుగోలు చేయలేని దుస్థితిలో చిన్న పంచాయతీలున్నాయి.

నగరం మండలం ఈదుపల్లిలో ఇటీవల డెంగీ కేసు నమోదైంది. పారిశుద్ధ్య నిర్వహణకు బ్లీచింగ్, సున్నం బస్తాలు కొనుగోలు చేద్దామంటే పంచాయతీ వద్ద నిధుల్లేవు. ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సుల రూపంలో ఏటా రూ.లక్షల్లో ఆదాయం వచ్చే పెద్ద పంచాయతీలు మినహా మిగిలిన చిన్న పంచాయతీలు ఆర్థికంగా కటకటలాడుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు లేక ఎదురుచూస్తున్నాయి. బాపట్ల మండలం కేసీపాలెం, తూర్పుబాపట్ల, పడమర బాపట్ల, ముత్తాయపాలెం, మరుప్రోలువారిపాలెం, ఆసోదివారిపాలెం, అడవి, పిన్నిబోయినవారిపాలెం పంచాయతీలకు విలీన సమస్యతో ఎన్నికలు జరగలేదు. పాలకవర్గాలు లేక 15వ ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. వీటికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

ఇటీవల కురుస్తున్న వర్షాలతో పల్లెల్లో నీరు నిలిచింది. నీటిని బయటకు పంపించి సున్నం, బ్లీచింగ్ చల్లాల్సి ఉంది. దోమల నిర్మూలన చర్యలు మలేరియా శాఖాధికారులతో పాటు పంచాయతీలు చేపట్టాల్సి ఉంది. మందులు, ఆయిల్ బాల్స్ కొనుగోలు చేయాల్సి ఉంది. మేజర్ పంచాయతీల్లో కొంత నిధుల లభ్యత ఉన్నందున అవసరమైన పారిశుద్ధ్య సామగ్రి తెప్పించుకుంటున్నారు. చిన్న పంచాయతీల్లో కనీసం సున్నం, బ్లీచింగ్ బస్తాలు కూడా లేవు.

✦ పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటే వైరల్, డెంగీ, గన్యా జ్వరాలు ప్రబలే ప్రమాదముంది. వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఏటా రెండువిడతల్లో సచివాలయానికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.20 వేలు మంజూరు చేస్తున్నారు. మార్చిలో 60 శాతం సచివాలయాలకు మాత్రమే నిధులు విడుదలయ్యాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రతి పంచాయతీకి అత్యవసరంగా రూ.10 వేలు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

బ్లీచింగ్ బస్తాలు

నిధులు కేటాయిస్తాం

పారిశుద్ధ్య నిర్వహణ నిమిత్తం పంచాయతీలకు నిధులు వెంటనే కేటాయిస్తాం. మార్చిలో నిధులందని గ్రామాలకు రూ.10 వేల చొప్పున అందజేస్తాం. సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ప్రబలకుండా అన్ని చర్యలు చేపడతాం.

- విజయమ్మ, డీఎంహెచ్‌వో

దాతల సహకారం మరువలేం

గుంటూరు: విద్యార్థినుల వసతిగృహ నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్న దాతల సహకారం మరువలేమని సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు పేర్కొన్నారు. కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నూతన వసతిగృహ భవన నిర్మాణానికి వీఎస్ఆర్ కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ అడ్డాల ఆంజనేయులు.. గురువు ఏఎన్‌యూ విశ్రాంత వైస్‌ఛాన్సలర్ దావులూరి రామకోటయ్య చేతుల మీదుగా రూ.6 లక్షల చెక్కును కోటేశ్వరరావుకు ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రూ.50 కోట్ల వ్యయంతో సకల సౌకర్యాలతో వసతిగృహాన్ని నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, సభ్యులు రాయపాటి గోపాలకృష్ణ, పెద్ది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కారణంగా ఉప్పుటూరులో పొగాకు మండెలపై పట్టలు కప్పిన రైతులు

వణికిన పొగాకు రైతు

పర్చూరు, మార్టూరు, యద్దనపూడి, చినగంజాం, కారంచేడు, ఇంకొల్లు, న్యూస్‌టుడే: వర్షం పొగాకు రైతులను వణికించింది. రెండ్రోజులుగా చిరుజల్లులతో కూడిన వాన కురవగా ఆదివారం మధ్యాహ్నం నుంచి ఎడతెరపి లేకుండా పడింది. దీంతో నిల్వ చేసుకున్న పొగాకు మండెలపై పట్టలు కప్పేందుకు రైతులు పొలంబాట పట్టారు. నియోజకవర్గంలోని పర్చూరు, కారంచేడు, మార్టూరు, యద్దనపూడి, ఇంకొల్లు, చినగంజాం మండలాల్లో విస్తారంగా వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమై రాత్రి వరకు పడుతూనే ఉండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

● వర్షం కారణంగా చీరాల డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక గ్రామాల్లోని రోడ్లపై వర్షపు నీరు నిలిచి వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడ్డారు. మరోవైపు రైతులు పొలాల్లో దుక్కులు దున్ని పత్తి సాగు చేపట్టారు. వర్షం ఇప్పటికే వేసిన పత్తి పైరుకు ఊపిరిపోసింది.

మహాశక్తిగా బండ్లమ్మ

చందోలు బండ్లమ్మకు ఆషాఢమాసం ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణమాతృకా బంగారు కాసుల హారం, రజత కవచంతో అలంకరించారు. మహాశక్తి దేవతగా భక్తులకు దర్శనమిచ్చారు.

- న్యూస్‌టుడే, చందోలు(పిట్టలవానిపాలెం)

విశ్వవినోదిని.. విజయ ప్రదాయిని

దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు మహంకాళి ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. 300 మందికి పైగా మహిళలు పొంగళ్లు, ఆలయ విశ్రాంత అర్చకుడు తారకనాథ్ అమ్మవారికి బోనం సమర్పించారు. తితిదే పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, తెదేపా మహిళా నాయకులు కేసంనేని శ్రీఅనిత, యేళ్ల జయలక్ష్మి, అపర్ణ బోనాలు సమర్పించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దేవభక్తుని రంగప్రసాద్, సీతారామయ్య, యేమినేని కోటేశ్వరరావు, మౌళయ్య తదితరులు పాల్గొన్నారు. ఈవో సునీల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాదాపు 8 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. **-న్యూస్‌టుడే, దుగ్గిరాల**

మత్తు వినియోగంపై డ్రోనాస్త్రం

డ్రోన్ కెమెరాతో చిత్రీకరించిన అద్దంకి పట్టణ పరిసరాలు

అద్దంకి, న్యూస్‌టుడే

అద్దంకి పట్టణ శివారు ప్రాంతాల్లో గంజాయి వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాతో చిత్రీకరించారు. సీఐ సుబ్బరాజు నేతృత్వంలో ఓ బృందాన్ని ఇందుకు ఏర్పాటు చేశారు. కొందరు యువకుల 'హుక్కా' పేరుతో మత్తుకు అలవాటుపడ్డారు. గుండ్లకమ్మ సమీపంలోని శ్మశాన వాటికల్లో అర్ధరాత్రి వరకు సంచరిస్తూ మత్తు పదార్థాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. సమీపంలోని రైతులు, ప్రజలు వీరి తతంగం గమనిస్తున్నా లెక్క చేయడం లేదు. ఈ విషయమై సీఐ మాట్లాడుతూ ఎక్కడైనా.. ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడినా, మత్తు పదార్థాలు వినియోగించినా, విక్రయించినా వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఆదివారం దక్షిణ అద్దంకి ప్రాంతాల్లోని అనేక ప్రదేశాల్లో మత్తు వినియోగించే వారి కోసం గాలించామని, ఎవరూ కనిపించలేదని తెలిపారు.

వాళ్ల కొర్రీలు.. వీళ్లకు వర్రీలు..!

- గుంటూరు జిల్లా ఆడిట్ అధికారుల వింత పోకడ
- జడ్పీ, పీఆర్ విశ్రాంత ఉద్యోగుల పీఎఫ్‌లో తంతు

ఈనాడు, అమరావతి

జడ్పీ కార్యాలయం

వాళ్లు కొర్రీలు వేస్తున్నారు..వీళ్లు వర్రీ కావాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నారు..మొత్తంగా గుంటూరు జిల్లాలో ఆడిట్ అధికారుల ధోరణి కారణంగా జిల్లా పరిషత్తు, పంచాయతీరాజ్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగులు మదనపడుతున్నారు. ఇప్పుడు ఉద్యోగం చేస్తున్న ఉపాధ్యాయులు అనారోగ్య కారణాలపై రుణాల కోసం ప్రతిపాదిస్తే.. నిబంధనలో లేని అంశాలను ప్రస్తావిస్తూ, ప్రతిపాదనలు వెనక్కి తిప్పి పంపడం మరో సమస్యగా తయారైంది. లోతుగా చూస్తే..ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్తు పరిధిలో ఇటీవల 55 మంది విశ్రాంత ఉపాధ్యాయుల పీఎఫ్‌కు సంబంధించి ఆడిట్ అధికారులు ఓ తిరస్కరణ లేఖను జడ్పీ ఉన్నతాధికారులకు పంపారు. అందులో సహేతుకం కాని కొన్ని అంశాలను పేర్కొన్నారు.

అన్నింటా అలా అంటే ఎలా?

ప్రధానంగా సదరు ఉపాధ్యాయులకు సంబంధించి ఓ నెలలో వారి చందా సున్నా ఉండి, తర్వాతి నెలలో ఎక్కువగా చందా నిల్వ చేశారన్నది సారాంశం. సున్నాగా ఉండడానికి గల కారణాలు స్పష్టంగా తెలపలేదన్నది ఆడిట్ వర్గాలు పేర్కొన్న అభ్యంతరం. సాధారణంగా ఖజానా శాఖ ఒక్కో సందర్భంలో ఆ నెలకు జమ చేయకపోవడం..మరో నెలలో రెండు చందాలు కలిపి జమచేయడం పరిపాటి. దీన్నే ప్రధాన కారణంగా చూపిస్తూ ఆడిట్ అధికారులు కొర్రీలు వేయడంతో సదరు విశ్రాంత ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. అకౌంట్ స్లిప్స్ అన్నింటిపైనా ధ్రువీకరణ ఎందుకు చేయలేదన్నదీ మరో ప్రశ్న. ఇలా అన్నింటికీ కొర్రీలు వేస్తుండటంతో ఏం చేయాలో వారికి అర్థం కావడం లేదు. జడ్పీ అధికారులు ఈ విషయంలో మిన్నకుండిపోవడం మరో సమస్యగా తయారైంది. ఉద్యోగ విరమణ అనంతరం వచ్చే ప్రయోజనాలు సరిగా అందక ఇబ్బంది పడుతున్న తమను..ఆడిట్ అధికారుల వైఖరి మరింత ఇబ్బంది పెడుతోందని వాపోతున్నారు.

వైద్య ధ్రువపత్రాల్లోనూ ..

ప్రస్తుత జడ్పీ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి కొందరు అనారోగ్య కారణాలతో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడ పీఎఫ్ అధికారులు ఆడిట్ తరహాలో కొర్రీలు వేస్తుండటం మరో సమస్యగా మారింది. నిబంధనలు ఏ మెడికల్ ప్రాక్టీషనర్‌తో అయినా ధ్రువపత్రం తెచ్చుకోవచ్చని చెబుతుండగా.. సదరు అధికారులు మాత్రం ఎక్కడా లేని విధంగా సివిల్ సర్జన్, అసిస్టెంట్ సివిల్ సర్జన్ నుంచే వైద్య ధ్రువీకరణపత్రం ఉండాలని చెబుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇలా ఓవైపు వృద్ధులు, మరోవైపు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారిని అవస్థలకు గురిచేయడం సరికాదని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె.బసవలింగారావు, మక్కెన శ్రీనివాసరావు, కొడాలి శ్రీధర్ తదితరులు పేర్కొంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఆపదొస్తే ఆదుకునేదెవరు?

జాతీయ రహదారిపై కనిపించని ఎస్‌వోఎస్ వ్యవస్థ

కనగాల (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే

జాతీయ రహదారిపై ప్రయాణ సమయంలో ఏదైనా ఆపదొచ్చినా.. అత్యవసరంగా వైద్య సాయం అందాలన్నా ప్రమాద సమాచారాన్ని చేరవేసే మార్గం ఒకటి ఉంటుంది. దీనికి ఫోన్ అవసరం లేదు. సేవ్ అవర్ సోల్స్ ఎస్‌వోఎస్ పేరిట ఉండే వ్యవస్థలో ఒక్క బటన్ నొక్కితే చాలు తక్షణం సాయం అందుతుంది. ఈ విధానాన్ని ఒంగోలు- కత్తిపూడి 216 జాతీయ రహదారిపై ఏర్పాటు చేయకపోవడం సమస్యగా మారింది. ప్రమాదం జరిగి అత్యవసర సహాయం అవసరమైతే బాధితులు ఫోన్ ద్వారా కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులకు చెప్పాల్సి వస్తోంది. జేబులో చరవాణి లేనివారు, వృద్ధులు, అభాగ్యులు ప్రమాదం బారిన పడితే వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఎస్‌వోఎస్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే ఇలాంటి వారికి మేలు జరుగుతుంది.

కనగాల వద్ద ఎస్‌వోఎస్ ఊసే లేని హైవే బైపాస్

100 కి.మీ.కు రెండు అంబులెన్స్‌లు .. బాపట్ల జిల్లాలో 216 జాతీయ రహదారి దాదాపు 100 కిలోమీటర్ల మేర ఉంది. ప్రతి 60 కి.మీ.కు ఒక టోల్‌గేటు ఏర్పాటు చేశారు. వాటి వద్ద మాత్రమే జాతీయ రహదారికి సంబంధించిన అంబులెన్స్‌లు ఉన్నాయి. ఇలా జిల్లాలో రెండు ఉన్నాయి. వాహనాల రద్దీ కారణంగా ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏ ప్రమాదం జరిగినా బాధితులు 108 వాహన సిబ్బంది సాయం పొందుతున్నారు. ఇవి కూడా ఎక్కడి నుంచో రావాల్సిందే. ఆపదలో ఆదుకునే 1033 వంటి టోల్‌ఫ్రీ వివరాలను తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయకపోవడం పెద్ద లోపం.

నిబంధనలు ఇవే.. జాతీయ రహదారిపై అత్యవసర సమయంలో వాహనదారులు ఏం చేయాలో సూచిస్తూ అత్యవసర నంబర్ల బోర్డులు ఏర్పాటు చేయాలి. ఎస్‌వోఎస్ ఫోన్ పరికరాలను 3 కి.మీ.కు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలి. ఇవి 24 గంటలు పనిచేసేలా వాటిపై సౌర ఫలకాలు అమర్చాలి. ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు.

చాలా ఇబ్బంది పడ్డాం.. 'రెండు నెలల క్రితం కనగాల బైపాస్‌లో రాత్రివేళ గడ్డి ట్రాక్టర్ డ్రైవర్ ఎదుటి వాహనాన్ని తప్పించేందుకు పక్కకు వచ్చారు. ట్రాక్టర్ ట్రక్కుపై ఉన్న గడ్డి కట్టలు తగిలి బైక్‌పై నుంచి పడిపోయాం. నా వెనుక ఉన్న మా నాన్నకు దెబ్బలు తగిలాయి. ఆ ప్రాంతంలో సాయం చేయడానికి ఎవరూ లేరు. చరవాణులు పగిలిపోయాయి. చాలా ఇబ్బంది పడ్డాం. వాహనదారులను ఆపి ఇంటికి ఫోన్ చేస్తే మావాళ్లు వచ్చి రేపల్లె వైద్యశాలకు తీసుకెళ్లారు' అని భట్టిప్రోలు మండలం ఐలవరానికి చెందిన మురహరి తెలిపారు.

యాంటీబయోటిక్స్ వినియోగంపై నియంత్రణ చర్యలు

గుంటూరు: అన్ని రంగాల్లో యాంటీబయోటిక్స్ వినియోగంపై నియంత్రణ చర్యలు చేపట్టేందుకు త్వరలోనే రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందులో ఐఎంఏ సభ్యులకూ భాగస్వామ్యం ఉంటుందన్నారు. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్)ను కట్టడి చేయకపోతే 2050 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఏటా నాలుగు కోట్ల మరణాలు సంభవిస్తాయని కొన్ని అధ్యయనాలు హెచ్చరిస్తుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఐఎంఏ, క్లినికల్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ సొసైటీ (సిడ్స్) సంయుక్తంగా గుంటూరు వైద్య కళాశాలలో ఆదివారం యాంటీ మైక్రోబియల్ నిరోధకతపై ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సదస్సును మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు నందకిశోర్ మాట్లాడుతూ యాంటిబయోటిక్స్‌ను విచ్చలవిడిగా వినియోగించే విపరీత ధోరణుల వల్లే ఏఎంఆర్ వేగం పుంజుకుంటోందన్నారు. రాష్ట్ర వైద్య మండలి ఛైర్మన్ శ్రీహరిరావు, సిడ్స్ రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

సమస్యలపై ఆన్‌లైన్లో అర్జీల స్వీకరణ

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రజలు తమ సమస్యలపై అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి మీకోసం వెబ్‌సైట్ ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించిందని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. ప్రజలు నమోదు చేసిన అర్జీల స్థితికి సంబంధించి సమాచారాన్ని తెలుసుకోవడానికి నేరుగా 1100కు ఫోన్ చేయవచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో సోమవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సమస్యలపై అర్జీలను కార్యాలయాల్లో నేరుగా అందజేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

సాగర్‌కు 67,488 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం రాత్రి 9 గంటలకు 567.00 అడుగులకు పెరిగింది. ఇది 249.0470 టీఎంసీలకు సమానం. ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 21,440, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 1800 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 67,488 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

రిజిస్ట్రేషన్ సేవలపై సర్కారు కన్ను

నరసరావుపేట, న్యూస్‌టుడే

ప్రజలతో నిత్యసంబంధాలు కొనసాగించే కీలక ప్రభుత్వ శాఖల్లో అవినీతిని అరికట్టడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. రెవెన్యూ శాఖలో వీఆర్‌వోలు, సర్వేయర్ల చేతివాటాన్ని కొన్ని నెలల కిందట ఐవీఆర్ఎస్ ద్వారా గుర్తించి ప్రజల్ని పీడిస్తున్న వారిపై చర్యలు తీసుకుంది. అదే విధంగా ప్రస్తుతం రిజిస్ట్రేషన్ శాఖలో సేవలపరంగా చోటు చేసుకుంటున్న అవినీతిపై దృష్టి పెట్టింది. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వివిధ సేవల కోసం వచ్చి వెళ్లేవారిని రాష్ట్ర కార్యాలయ ఉద్యోగులు పలకరిస్తున్నారు. ఏ సేవకు ఎంత లంచమిచ్చారు, ఏయే సేవలెలా అందుకున్నారని ఆరా తీస్తున్నారు.

అవినీతిపై ఐవీఆర్ఎస్‌తో ఆరా

జిల్లాలో అమరావతి, చిలకలూరిపేట, గురజాల, క్రోసూరు, మాచర్ల, పిడుగురాళ్ల, పెదకూరపాడు, సత్తెనపల్లి, వినుకొండ, నరసరావుపేటలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటి పరిధిలో గత ఏడాది 1,06,498 దస్తావేజులు నమోదయ్యాయి. ప్రభుత్వ ఖజానాకు రూ.372.65 కోట్ల ఆదాయం వచ్చింది. రిజిస్ట్రేషన్ సేవల్ని సులభతరం చేసేందుకు ఏప్రిల్ చివరివారం నుంచి స్లాట్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ముందుగా స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయానికెళ్తే 20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. అయితే కొందరు సిబ్బంది గంట, గంటన్నర వ్యవధి తీసుకుని ప్రజల్ని ఇబ్బంది పెడుతున్నారు.


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఐవీఆర్ఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ శాఖ సేవలపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. భూములు, స్థలాల క్రయవిక్రయదారులతో పాటు వివిధ సేవలకు కార్యాలయానికి వచ్చిన వారి చరవాణి నంబర్లకు ఫోన్ చేసి.. మీ వద్ద డాక్యుమెంట్ ఫీజు కాకుండా అధికంగా నగదు వసూలు చేశారా అని ఆరా తీస్తున్నారు. మొదట్లో నేరుగా ప్రజలే ఐవీఆర్ఎస్‌లో సమాధానాలు ఇచ్చేవారు. కాగా, కొందరు ఉద్యోగులు తమ అవినీతి బయటపడుతుందని డాక్యుమెంట్లలో భూములు, స్థలాల క్రయవిక్రయదారుల నంబర్లు కాకుండా డాక్యుమెంట్ రైటర్లు, వారి సహాయకుల నంబర్లు నమోదు చేయిస్తున్నారు. వివరాలు అడగ్గానే అంతా బాగుందని సమాధానమిస్తూ.. ప్రజాభిప్రాయ సేకరణను కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారు.

ఒక్కో పనికి ఒక రేటు

కొందరు అధికారులు, ఉద్యోగులు ఒక్కో పనికి ఒక రేటు పెట్టి వసూలుచేస్తున్నారు. కొన్ని కార్యాలయాలకు వెళ్లడానికి దస్తావేజు లేఖరులు కూడా భయపడే పరిస్థితి నెలకొంది. మధ్యవర్తులుగా పని చేయిస్తే కొంత నగదు వస్తుందనుకుంటే.. దాన్నీ లాక్కునేలా కొందరు ఉద్యోగుల తీరు ఉంటోందని చెబుతున్నారు. ఫీజు టు ఫీజు వసూలు ప్రక్రియ చాలాచోట్ల ఇప్పటికీ ఉంది. లంచం ఎందుకు ఇవ్వాలని ఎవరైనా ప్రశ్నిస్తే వారిని మినహాయిస్తున్నారు. వసూళ్లపై కొందరు బాధితులు ఫిర్యాదులు కూడా చేస్తున్నారు. ఐవీఆర్ఎస్ ద్వారా గుర్తించిన అవినీతి, సేవల్లో లోపాలకు సంబంధించి బాధ్యులపై ఉన్నత స్థాయి నుంచి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని పర్యవేక్షక అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయుల ఖాళీల భర్తీకి కసరత్తు

నరసరావుపేట అర్బన్: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల తర్వాత ఖాళీ అయిన పోస్టులు భర్తీ చేసేందుకు విద్యా శాఖాధికారులు చర్యలు చేపట్టారు. పాఠశాలలకు నిర్దేశించిన ఉపాధ్యాయుల పోస్టుల్లో 425 ఖాళీలను గుర్తించారు. ఆయా పాఠశాలల్లో విద్యా బోధనకు ఆటంకం లేకుండా చూడాలని ప్రభుత్వమిచ్చిన ఆదేశాలతో ఎంటీఎస్ ఉపాధ్యాయులతో వాటిని పూరించేందుకు కసరత్తు చేశారు. ఆగస్టు 20లోగా డీఎస్సీ-2025 ద్వారా నియామకాలు చేపడుతున్నట్లు సీఎం ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో అప్పటివరకు ఎంటీఎస్ ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవాసంస్థల సహకారంతో విద్యా వాలంటీర్లను నియమించారు.

88 పోస్టులు.. జిల్లాలో 56 పోస్టులను మినిమం టైమ్ స్కేల్ అందుకుంటున్న ఉపాధ్యాయులతో పూరించారు. దుర్గి మండలంలో 12, బొల్లాపల్లి 13, వెల్దుర్తి 19, నూజండ్ల 7, వినుకొండ 2, రెంటచింతల, కారంపూడి, ఈపూరులో ఒక్కొక్కరు చొప్పున ఎంటీఎస్ ఉపాధ్యాయులను కేటాయిస్తూ గుంటూరు జిల్లా డీఈవో రేణుక ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే అసిస్ట్ సంస్థ మరో 32 మందికి శిక్షణ ఇచ్చి విద్యా వాలంటీర్లుగా నియమించింది.

(c) eenadu

పోలీసుల సత్వర స్పందన.. నిలిచిన మూడు ప్రాణాలు

కుమార్తెలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడటానికి రైల్వేట్రాక్ వద్దకు వచ్చిన మహిళ

రైల్వేట్రాక్ వద్ద అడ్డుకుని తిరుపతమ్మతో మాట్లాడుతున్న వెదుళ్లపల్లి ఎస్సై భాగ్యరాజు

బాపట్ల, న్యూస్‌టుడే: పోలీసుల సత్వర స్పందన మూడు ప్రాణాలను నిలిపింది. భార్యాభర్తల మధ్య జరిగిన తగాదా నేపథ్యంలో ఆవేశంతో భార్య ఇద్దరు కుమార్తెలను తీసుకుని ఆత్మహత్య చేసుకోవటానికి రైల్వేట్రాక్ వద్దకు వచ్చింది. స్థానికుల అందించిన సమాచారంతో పోలీసులు హుటాహుటిన వచ్చి వారిని అడ్డుకుని కౌన్సెలింగ్ చేసి ఇంటికి పంపించారు. చీరాల మండలం తులసినగర్‌కు చెందిన పాలెం లక్ష్మీతిరుపతమ్మ, రామకృష్ణారెడ్డి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. శనివారం రాత్రి వీరిద్దరి మధ్య గొడవపడ్డారు. భర్త మద్యానికి బానిసై వేధిస్తుండటంతో లక్ష్మీతిరుపతమ్మ మనస్తాపానికి గురై ఇద్దరు కుమార్తెలను తీసుకుని బాపట్ల మండలం వెదుళ్లపల్లి బిడిరుల ఆశ్రమ పాఠశాల ఎదురుగా రైల్వే ట్రాక్ వద్దకు ఆది వారం ఉదయం చేరుకుంది. స్థానికులు గమనించి డయల్ 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. మహిళ, కుమార్తెలు రైలు ఎలాంటి ప్రమాదానికి పాల్పడకుండా అప్రమత్తమైన వెదుళ్లపల్లి ఎస్సై భాగ్యరాజు వేగంగా స్పందించి సిబ్బందితో రైల్వేట్రాక్ వద్దకు వచ్చారు. ఆమెను వారించి కుమార్తెలతో సహా ట్రాక్ నుంచి దూరంగా తెచ్చారు. ఆత్మహత్యా యత్నాన్ని అడ్డుకుని మహిళ, ఇద్దరు కుమార్తెల ప్రాణం కాపాడారు. వారితో కలిసి తులసినగర్‌లోని ఇంటికెళ్లి భర్తకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సమయస్ఫూర్తిగా వ్యవహరించి ముగ్గురి ప్రాణాలు కాపాడిన వెదుళ్లపల్లి ఎస్సై భాగ్యరాజు, పోలీసు సిబ్బందిని ఎస్పీ తుషార్‌డూడీ, డీఎస్పీ రామాంజనేయులు అభినందించారు.

యథేచ్ఛగా సరిహద్దులు దాటిస్తున్నారు

దాచేపల్లి వద్ద పట్టుబడిన 18 గ్రానైట్ వాహనాలు ★ అక్రమార్కులకు ఉద్యోగుల వత్తాసు

మార్టూరు, న్యూస్‌టుడే

అక్రమార్జనే ధ్యేయంగా కొందరు అక్రమార్కులు గ్రానైట్‌ను ఏకంగా రాష్ట్రాలు దాటిస్తూ ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగిస్తున్నారు. మామూళ్ల మత్తులో జోగుతున్న కొందరు ఉద్యోగుల తీరుతో ఈ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలు చందంగా సాగుతోంది. జిల్లాల సరిహద్దులు దాటిస్తూ సాగుతున్న ఈ వ్యాపారానికి అడ్డు వస్తే ఎంతటి వారినైనా అడ్డుకుంటామన్నట్లు కొందరు ఉన్నారు. తాజాగా పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ సమీపంలోని రాష్ట్ర సరిహద్దు పొందుగల చెక్‌పోస్టు వద్ద జీఎస్టీ అధికారులకు పట్టుబడిన గ్రానైట్ లారీలే ఇందుకు ఉదాహరణ.

దాచేపల్లి మార్కెట్ యార్డులో గ్రానైట్ వాహనాలు

పట్టుబడిన వాహనాలపై ఆరా

జీఎస్టీ బిల్లులు తీసుకోకుండా ఉమ్మడి గుంటూరు జిల్లా మీదుగా తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న సమారు 18 వాహనాలను శనివారం అధికారులు అడ్డుకున్నారు. ఒక్కసారిగా ఇన్ని పట్టుబడటంతో ఈ వ్యాపారం వెనుక తతంగాన్ని ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఆయా శాఖల సిబ్బంది చేతివాటంతో రూ.లక్షల్లో ఆదాయం ప్రభుత్వ ఖజానాకు గండి పడుతున్నట్లు ప్రచారం ఉంది.

బిల్లులున్న వాహనాలు నిలిపివేత

వాణిజ్య పన్నుల అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్న వాహనాల్లో 8 వాహనాలు మైనింగ్, వాణిజ్య శాఖల పన్నులు చెల్లించినట్లు బిల్లులు చూపారు. బిల్లులు లేని వాహనాలు యథేచ్ఛగా సరిహద్దులు దాటుతుంటే.. బిల్లులు ఉన్న వాహనాలను ఆపడంలో అంతర్యం ఏమిటని పారిశ్రామికవర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

పోలీసులపై జులుం

దాచేపల్లి వద్ద పోలీసులపై అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ పలకల వాహనాలను అప్పటికప్పుడు నిలిపివేశారు. సమాచారం అందుకున్న మార్టూరు ప్రాంత కొందరు వ్యాపారులు అక్కడికి చేరుకుని వాహనాలను దౌర్జన్యంగా తీసుకు వెళ్లేందుకు పోలీసులపై జులుం ప్రదర్శించారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. అక్రమార్కులు బరి తెగింపుకు పాల్పడిన పోలీసుల ఉదాసీనత విమర్శలకు దారి తీసింది. ఉన్నతాధికారులు దర్యాప్తులో పట్టుబడిన సరుకు అక్రమమా? సక్రమమా అన్నది తేలనుంది.

'నేను నాతరం' పుస్తకావిష్కరణ

నరసరావుపేట అర్బన్: పట్టణానికి చెందిన విద్యావేత్త, విశ్రాంత అధ్యాపకుడు ఐలా సత్యనారాయణ రచించిన 'నేను నాతరం' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. శ్రీవాసవి ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వక్తలు పుస్తకంలో సత్యనారాయణ ప్రస్తావించిన అంశాలను వివరించారు. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి గ్రామీణ స్థితిగతులు, వ్యవసాయం, విద్యకు అవకాశాలు లేమి తదితర అంశాలు కళ్లకు కట్టినట్లు చూపారని తెలిపారు. కార్యక్రమంలో ఐ.ఎం.స్వామి, చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, వేదాంతం సత్యశ్రీనివాసయ్యంగార్, శ్రీనాథ సాహితీ పరిషత్తు కార్యదర్శి సత్తి చినరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు

వినుకొండ రూరల్: వినుకొండలో ఎలాంటి మసాజ్ కేంద్రాలు లేవని, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని వినుకొండ పట్టణ ఇన్‌ఛార్జి సీఐ సుబ్బానాయుడు హెచ్చరించారు. వినుకొండలో మసాజ్ కేంద్రాలు, బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున ప్రచారం చేయడంతో అనుమానిత కేంద్రాల్లో ఆదివారం తనిఖీలు చేపట్టామని ఆయన తెలిపారు. ఆయా కేంద్రాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు సాగడం లేదన్నారు. అలాంటి సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో ఎస్సై సత్యంత పాల్గొన్నారు.

వేతన సవరణ కమిషన్ ఏర్పాటుకు వినతి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉపాధ్యాయ, ఉద్యోగుల వేతనాల సవరణకు సంబంధించిన 12వ కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు అన్నారు. జిల్లా ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేతన సవరణ గడువు 2023 జులైతో ముగిసిందని తెలిపారు. అలాగే 11 వేతన సవరణ కమిషన్‌కు సంబంధించిన బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. కరవు భత్యం బకాయిలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో స్వచ్ఛంద, స్వర్ణాంధ్ర పేరుతో బోధనేతర కార్యక్రమాలతో విద్యాబోధన కుంటుపడుతుందని తెలిపారు. విద్యాశక్తి పేరుతో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎల్వీ రామిరెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సుభాని, జిల్లా కమిటీ నేతలు పాల్గొన్నారు.

పేరాయపాలెం కొండపై హరితవనానికి నాంది

అద్దంకి, న్యూస్‌టుడే: మండలంలోని పేరాయపాలెం కొండపై హరితవనం ఏర్పాటుకు ఆదివారం నాంది పలికారు. విద్యుత్తు శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, డీఈఈ చంద్రశేఖర్, గ్రామస్థులు పుట్టా రామాంజనేయులు, కందుల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు కొండపట్టిన తరలించామని, ఇకపై హరితవనం ఏర్పాటుకు మొక్కలు నాటనున్నట్లు విద్యుత్తు శాఖ ఈఈ మస్తాన్‌రావు తెలిపారు.

కొండపై మొక్క నాటుతున్న విద్యుత్తు శాఖ ఈఈ మస్తాన్‌రావు తదితరులు

ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా పోరాటాలు

అద్దంకి, న్యూస్‌టుడే: ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలకు సన్నద్ధం చేస్తున్నామని సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్సీ జెల్లీ విల్సన్ అన్నారు. 28న అద్దంకిలో నిర్వహించే సీపీఐ జిల్లా రెండో మహాసభల నేపథ్యంలో ఆదివారం ఆయన అద్దంకిలో పర్యటించారు. ఆహ్వాన సంఘం సమావేశం భూపేష్ భవన్ వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెల్లీ విల్సన్ మాట్లాడుతూ సీపీఐ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా పార్టీ నిర్మాణాత్మక మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి తన్నీరు శింగరకొండ, ఖాదర్‌బాషా, తుమ్మల పూర్ణచంద్రశేఖర్, గర్నెపూడి ప్రసాద్, కేఎల్‌డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ జెల్లీ విల్సన్

సాగర తీరాన.. సందడి చేద్దాం

అలలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు

సముద్రం ఒడ్డున ఇసుకతో గూళ్లు కడుతూ..

వారాంత సెలవులు వస్తే తీరంలోని ప్రకృతి ఒడిలో సేద తీరేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. నిత్యం ఉద్యోగ బాధ్యతలు, వ్యాపార లావాదేవీలు, ఇతర విధుల్లో బిజీగా గడిపే వీరు కాస్త ఉపశమనానికి కుటుంబ సభ్యులతో కలిసి వస్తున్నారు. సముద్ర స్నానాల అనంతరం రైజింగ్ బైకులు, ఒంటెలపై విహారం, ఫొటోషూట్లతో సందడి చేస్తున్నారు. సెలవులొస్తే తెలంగాణతో పాటు మన రాష్ట్రానికి చెందిన వారు అయిదు వేల మంది వరకు వస్తుంటారు. వాడరేవు, రామాపురం, కఠారిపాలెం ప్రాంతాల్లోని ప్రైవేట్ రిసార్టుల నిర్వాహకులు వీరికి అన్ని వసతులు సమకూర్చుతున్నారు. **- న్యూస్‌టుడే, చీరాల అర్బన్**

ఎవర్ని నరుకుతారో పేర్లు చెప్పే ధైర్యం ఉందా?

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

గురజాల (పట్టాభిపురం), న్యూస్‌టుడే: 'అధికారంలోకి వస్తే నరుకుతాం.. సప్త సముద్రాల అవతల ఉన్నా తీసుకొస్తాం.. బట్టలూడదీయిస్తామంటున్నారు.. ధైర్యం ఉంటే ఎవర్ని నరుకుతారో పేర్లు చెప్పండి. చేతగాని మాటలొద్దు. పేర్ని నాని, వైకాపా నేతలు.. మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుంటే మంచిది.. అని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హెచ్చరించారు. గుంటూరులోని క్యాంప్ కార్యాలయంలో యరపతినేని ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. 'తాడేపల్లి ప్యాలెస్ చదివి వినుకుండ గత ఎన్నికల్లో ప్రజలు వైకాపా ప్రతిపక్ష హోదా లేకుండా చేసి మూలన కూర్చోబెట్టారు. తీరు మార్చుకోకపోతే సున్నాకు పరిమితం చేస్తారు. జగన్ హయాంలో అయిదేళ్లు.. నాసిరకం కార్యక్రమాలు జరిగాయి. రైతులకు వ్యవసాయ పరికరాలు ఇవ్వలేదు. ఎన్ని హెక్టార్లలో ఏయే పంటలు పండుతాయో తెలియదు. కిలోకు, క్వింటాకు, టన్నుకు తేడా తెలియదు. గంజాయి సాగు తప్ప వ్యవసాయం తెలుసా? మద్యపాన నిషేధమని చెప్పి సొంత బ్రాండ్లతో పిచ్చి మందు అంటగట్టి అమాయకుల ప్రాణాలు బలిగొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. ఏడాదిలో ఒక్క గురజాల నియోజకవర్గంలోనే రూ.1,200 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాష్ట్రం అభివృద్ధి చెందడం ఇష్టం లేక వైకాపా నేతలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు. వారు రెచ్చగొట్టినా మేము రెచ్చిపోం. అలాగని నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం. జగన్ పాలనలో జరిగిన కుంభకోణాలన్నీ ఆధారాలతో సహా నిరూపించి ఊచలు లెక్కపెట్టిస్తాం'.. అని స్పష్టం చేశారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు

వినుకొండ రూరల్: వినుకొండ నవాజ్‌కుంటలో నివాసం ఉండే 62 ఏళ్ల దేవరాల నాగమ్మ కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం మధ్యాహ్నం నుంచి ఆమె అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో ఆమె కుమారుడు కొండరాజు పోలీసులను ఆశ్రయించారు.

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం

వినుకొండ రూరల్: రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన నూజండ్ల రోడ్డులో డిగ్రీ కళాశాలకు వెళ్లే దారిలో రైల్వే కింది వంతెన వద్ద ఆదివారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ మండలం పిట్టంబండ గ్రామానికి చెందిన జక్కంపూడి రామారావు (29) వినుకొండలోని ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న సోదరుడు రాంప్రసాద్ వద్ద ఉంటున్నాడు. 2019 నుంచి మతిస్థిమితం లేని కారణంగా వైద్య సేవలు అందిస్తున్నామని, ఎప్పుడు పడితే అప్పుడు పిట్టంబండ, ఇతర చోట్లకు వెళ్తుంటాడని, ఆదివారం తెల్లవారుజామున బయటకు వెళ్లాడని మృతుడి సోదరుడు చెప్పాడు. 6 గంటల సమయంలో రైలు పట్టాలు దాటుతుండగా చీకటీగలపాలెం వైపు నుంచి వినుకొండ వెళ్తున్న రైలు ఢీకొనగా మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

బాపట్ల కలెక్టరేట్‌లో ఉద్యోగాల పేరిట మోసం

విజయవాడ (మధురానగర్), న్యూస్‌టుడే : బాపట్ల కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఉద్యోగం కోసం ఒక వ్యక్తికి రూ.6.5 లక్షలు కట్టి మోసపోయాడో యువకుడు. దీనిపై విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు ఈ నెల 17న కేసు నమోదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన సాత్విక్ (30) మల్టీ నేషనల్ కంపెనీలో డేటా ఎనలిస్ట్‌గా పని చేస్తున్నారు. బాపట్ల టీచర్స్‌కాలనీకి చెందిన చల్లపల్లి అనిల్‌కుమార్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తాను బాపట్ల కలెక్టరేట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని అనిల్‌కుమార్ చెప్పడంతో.. అతడి మాటలు నమ్మారు. రెండు సంవత్సరాల క్రితం రూ.6.5లక్షలు చెల్లించారు. ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగం రాలేదు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే చంపుతానని బెదిరించాడు. దీనిపై సాత్విక్ అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే : పట్టణంలోని పాపరాజుతోటకు చెందిన కొత్త శ్రీలక్ష్మి (57) మనస్తాపానికి గురై నాలుగు రోజుల క్రితం ఇంటిలో ఉన్న పెట్రోలు ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. ఆమెను అదే రోజు ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు పంపగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. దీంతో ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్వల్ప విషయానికి మహిళ ఆత్మహత్య చేసుకోవడంతో కాలనీలో విషాదం అలముకుంది.

ఫసల్ బీమా.. ఆపదవేళ ధీమా

ఆగస్టు 15 వరకు నమోదుకు గడువు

న్యూస్‌టుడే, అమృతలూరు

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతన్నను ఆపద వేళ ఆదుకుంటుంది. తుపాన్లు, కరవు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలతో పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందుతుందని అమృతలూరు మండల వ్యవసాయ అధికారి భరత్‌కుమార్ చెబుతున్నారు. ఈ ఏడాది ఆగస్టు 15 లోపు ఎకరాకు రూ.800 ప్రీమియం చెల్లించి పంట నష్టం జరిగిన సమయంలో రూ.40వేల వరకు పరిహారం పొందవచ్చన్నారు.

దరఖాస్తు విధానం: బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతులకు ప్రీమియం వసూలు చేసి బ్యాంకు సిబ్బంది నేరుగా బీమా కంపెనీకి చెల్లిస్తారు. రుణం తీసుకోని రైతులు కామన్ సర్వీస్ సెంటరు, గ్రామ సచివాలయాల ద్వారా ప్రీమియం చెల్లించి రసీదు పొందవచ్చు. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ ద్వారా నేరుగా వెబ్‌సైట్లో లేదా మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చు.

వరి పైరు

అప్రమత్తత అవసరం: రైతులు దళారుల్ని, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు. రైతు లేక కౌలురైతు ఆధార్, కౌలురైతు గుర్తింపు కార్డు, బ్యాంకు ఖాతా, పంట వేసిన ధ్రువపత్రాలను నమోదు సమయంలో సమర్పించాలి. వరినాట్లు ప్రారంభించిన తరుణంలో రైతులు త్వరపడి బీమా నమోదు చేసుకోవాలి. ఇతర వివరాలకు ఆయా గ్రామాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయ అధికారిని సంప్రదించవచ్చు.

ప్రమాద ఘటనపై కేసు నమోదు

అద్దంకి, న్యూస్‌టుడే : మండలంలోని తిమ్మాయపాలెం శివారు ఇటుక బట్టీల వద్ద జరిగిన ప్రమాద ఘటనపై అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఏఎస్‌ఐ కె.సైదయ్య సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా ఒంగోలు బండ్లమిట్టకు చెందిన ఎన్.కోటయ్య- పద్మ దంపతులు ఈనెల 7న పూరిమెట్లలో కొలుపులకు హాజరై తిరుగు ప్రయాణమయ్యాడు. తిమ్మాయపాలెం శివారుకు వచ్చిన తరువాత వీరి ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడి కోటయ్య గాయపడ్డాడు. ఆమేరకు క్షతగాత్రుడ్ని మంగళగిరి ఎన్నారై ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. ఆయన భార్య పద్మ ఫిర్యాదు మేరకు ఏఎస్సై కేసు నమోదు చేశారు.

★ అద్దంకి బంగ్లారోడ్డు ఆరంభంలో ఆదివారం మధ్యాహ్నం కారు ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి సీఐ ఎ.సుబ్బరాజు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించగా ద్విచక్ర వాహన చోదకుడు మద్యం మత్తులో తూలుతున్నాడు.. పైపెచ్చు స్వల్ప గాయాలు కావడంతో కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

EENADU e Classifieds

AGRI BUSINESS

గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్ ఆవులు అమ్మబడును. రెడ్సింధి 6 నెలల సుడి, ఫార్వార్కర్ 7 నెలల సుడి. సంప్రః 98660 01222.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

స్వామి వివేకానంద గ్రూప్, VJA, శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99590 21122, 99590 31122.

రామకృష్ణ గ్రూప్ (AP No.1) VJA వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 96038 42233, 97054 72233.

JOBS

Wanted B-Pharmacy or D-Pharmacy Candidates to work in a Pharmacy in Guntur City. PCI Registration Mandatory. Contact: 63009 75241.

Wanted Maths, English, Hindi Bed experienced lady Teaches to teach high School. Call: 94918 98905. Between: 9:00 am to 5:00 pm.

Jayalakshmi Arena, Nexa Maruti authorised dealers Guntur, Ongole, Hiring relationship manager & senior relationship manager with automobile experience & freshers with Btech, MBA & any Degree qualification. Accountants with 3 years Exp. Interviews on dt 21,22,23 Ph: 98661 79109, 91007 87082.

Wanted Milk Delivery boys 5am to 8am Salary 6000+Petrol 1500. Bike and Smart Phone must. Raithanna Milk Dairy Guntur. 95502 35554.

MNC Company Opportunity Full Time/ Part Time; Qualification: Intermediate. Monthly Income: 30,000/- above. for Details Contact: Ph: 99595 78601.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం, VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ.+ జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం - VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ.+ జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5,000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52838.

గుంటూరులో ప్రముఖ డోర్ కర్టన్ షాపులో పనిచేయుటకు 10th, ఇంటర్ చదివిన యువకులు కావలెను. సంప్రదించు వేళలు: 10:30 AM to 8PM. 90324 55294.

ప్రముఖ ఫైనాన్స్ సంస్థలో తెనాలిలో కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్-06 (M) కావలెను. Qlf: ఇంటర్, జీతం: 12K + TA + DA + Incentives. ఇంటర్వ్యూ: 22-07-25. ✆ 77990 28444, 92810 22773.

R.K. ఇంజనీరింగ్ కాలేజీ లేడీస్ హాస్టల్ నందు పనిచేయుటకు మంచి అనుభవం ఉన్న హాస్టల్ వార్డెన్ మరియు అనుభవం ఉన్న ఎలక్ట్రీషియన్స్ కావలెను. మంచి జీతం + భోజనం + ఉచిత వసతి కల్పించబడును. సంప్రః కేతనకొండ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ. 97014 73399.

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 90146 51068, 70756 33416.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

పురుషులకూ పొదుపు సంఘాలు

జిల్లాలో 74 ఏర్పాటు ★ తొలి విడతగా రూ.10 వేల రుణం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే

సంఘంగా ఏర్పడిన పురుషులు

పట్టణాల్లో వివిధ వృత్తుల్లో నైపుణ్యం ఉన్న వారిని సంఘాలుగా ఏర్పాటు చేసి.. వారి జీవనోపాధి పెంచేందుకు ప్రభుత్వం వారితో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయనుంది. వీరికి రుణాలు అందించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రోత్సహించనుంది. ఇందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో వీరిని గ్రూపులుగా ఏర్పాటు చేస్తోంది.

ఇప్పటికి ఏర్పాటైన గ్రూపులు	
భవన నిర్మాణ కార్మికులు	62
డొమిస్టిక్ వర్కర్లు	10
రవాణా కార్మికులు	2

★ జిల్లాలో చీరాలతో పాటు బాపట్ల, రేపల్లె, అద్దంకి పట్టణాల్లో పురుషులను గుర్తించి ఒక్కొక్క సంఘానికి 5 నుంచి 10 మంది సభ్యులుగా ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు. తొలి విడతగా ఒక్కొక్కరికి రూ.10 వేల రుణం అందిస్తారు. అది తిరిగి చెల్లిస్తే మరింత పెంచి ఇవ్వనున్నారు. సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారి వృత్తులకు అనుగుణంగా వీటిని అందించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఎవరు అర్హులు అంటే..

గ్రూపుల్లో సభ్యులుగా ఉండేవారు ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు, గిగ్ వర్కర్లు (జొమాటో, స్విగ్గీ లాంటి వాటిల్లో పని చేసేవారు), రవాణా కార్మికులు (సామగ్రి తీసుకెళ్లేవారు) కేర్ టేకర్, ఏసీ మెకానిక్, ప్లంబర్, వాషింగ్ మెషిన్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్లు, బ్యూటీషియన్లు (సర్వీస్ ప్రొవైడర్లు). వీరిలో ఆసక్తి ఉన్న వారిని గుర్తించి సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

ప్రహరీ లేక విద్యార్థులకు రక్షణ కరవు

ప్రహరీ లేని ప్రాథమిక పాఠశాల

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: భవనంవారిపాలెం పంచాయతీ పరిధి కొత్తరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేక పోవడంతో విద్యార్థులకు రక్షణ కరవవుతోంది. ప్రధాన రహదారి పక్కన ఉండి పాఠశాల ముందు పచ్చిక తోపాటు ముళ్లపొదలు ఉండటంతో విషపురుగులతో ప్రమాదం పొంచి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడికి సాహిత్య పురస్కారం

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన కవి, ఉపాధ్యాయుడు కరీముల్లా తిరుపతి వేంకట కవులు సాహిత్య పురస్కారం అందుకున్నారు. భారతీయ సాహిత్య సేవాసమితి ఆధ్వర్యంలో హిందూపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గజల్ శ్రీనివాస్ ఆయనను సత్కరించి పురస్కారం అందించారు. ఆయన రాసిన అబాబీలు నూతన వచన కవితా ప్రక్రియ అనేక మందికి మార్గదర్శకం అయిందని పలువురు వక్తలు ప్రశంసించారు. ఉమర్ ఫారూఖ్‌ఖాన్ నిర్వహించిన ఈ సభలో పలువురు పాల్గొన్నారని పురస్కార గ్రహీత తెలిపారు.

కరీముల్లాను సన్మానిస్తున్న గజల్ శ్రీనివాస్ తదితరులు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, రిటైల్ ధర - 139, చికెన్ విత్‌స్కిన్ - 202, చికెన్ స్కిన్‌లెస్ - 229.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -112 రిటైల్ ధర 134 చికెన్ విత్ స్కిన్ - 194, చికెన్ స్కిన్‌లెస్ - 221. **అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 119, 127, 137 చికెన్ విత్ స్కిన్ - 226 చికెన్ స్కిన్‌లెస్ - 237.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 520 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

91.9FM Vijayawada 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

కోరిక తీరిస్తే.. కోరిన పని చేస్తా!

మహిళపై వీఆర్వో వేధింపులు

బెల్లంకొండ, న్యూస్‌టుడే: రెవెన్యూశాఖలో కొందరు ఉద్యోగుల తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. తాజాగా ఓ వీఆర్వో మహిళను వేధింపులకు గురిచేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఎస్సై ప్రవీణ్ వివరాల మేరకు.. పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలానికి చెందిన ఓ మహిళ రేషన్ కార్డు, ఆధార్‌లో మార్పుల కోసం సచివాలయానికి వెళ్లింది. వీఆర్వో వెంకయ్యతో మాట్లాడితే సమస్య పరిష్కరిస్తారని అక్కడి సిబ్బంది చెప్పారు. దీంతో ఆమె నెల రోజుల నుంచి వీఆర్వోతో మాట్లాడుతూ రేషన్ కార్డు, ఆధార్‌లో మార్పులు చేయించాలని, అందుకు సంబంధించిన దరఖాస్తుపై సంతకం చేయాలని కోరుతూ వస్తోంది. ఈక్రమంలోనే వీఆర్వో తన కోరిక తీరిస్తే మీ పని చక్కబెడతానంటూ వేధింపులకు గురి చేశాడు. వారం రోజుల కిందట వీఆర్వో ఆమెకు ఫోన్ చేసి తన గదికి రావాలని, భోజనం కూడా తెప్పిస్తానంటూ లోబరచుకునే ప్రయత్నం చేశాడు. వీఆర్వో మాటలను సెల్‌ఫోన్‌లో రికార్డు చేసిన ఆమె ఆ వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేయగా విషయం వెలుగుచూసింది. ఈ ఘటనపై విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గతంలోనూ ఆరోపణలు: వెబ్‌ల్యాండ్‌లో పేర్లు నమోదు చేయాలంటే రూ.30 వేలు ఇవ్వాలని, ఆ సొమ్ము కంప్యూటర్ ఆపరేటర్, ఉన్నతాధికారులకు చెల్లించాలంటూ రైతుల నుంచి వసూళ్లు చేస్తున్నట్లు వీఆర్వోపై ఆరోపణలు ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వంలో బెల్లంకొండ వీఆర్వోగా విధులు నిర్వహిస్తూ అన్నీతానై రెవెన్యూ కార్యాలయాన్ని నడిపించాడు. అడంగళ్, వన్‌బీలకు రూ.5 వేల చొప్పున వసూలు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేశాడని పలువురు చెబుతున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

భారీ వర్షం.. చల్లబడిన వాతావరణం

బాపట్ల, చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: తీరంలో ఆదివారం భారీవర్షం కురిసింది. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి వర్షం ప్రారంభమై రాత్రి ఎనిమిది గంటలకు ఆగింది. బాపట్ల పట్టణంతో పాటు గ్రామాల్లో రహదారులపై నీరు నిలిచింది. వేడి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు. పంటలకు వర్షం మేలు చేసింది. వెద పద్ధతిలో విత్తనాలు నాటిన రైతులు బెట్ట పరిస్థితుల కారణంగా ఆందోళన చెందారు. నారుమడులు సైతం ఎండుముఖం పట్టాయి. వర్షం వెద వరి పైరు, నారుమడులకు ఊపిరి పోసింది. చెరుకుపల్లి మండలం కనగాలలో దుళిపూడి రోడ్డుపై గుంతలన్నీ వాన నీటితో నిండి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

మురుగు కాల్వకు గండి.. వంతెన పనులకు ఆటంకం

నిజాంపట్నం, న్యూస్‌టుడే : రేపల్లె ప్రధాన మురుగు కాలువపై చెక్కావారిపాలెం- కొమరవోలు గ్రామాల మధ్య జరుగుతున్న పనులకు ఆటంకం ఏర్పడింది. ఎగువ ప్రాంతాల నుంచి మురుగు భారీగా తరలిరావడంతో పనులకు ఆటంకం ఏర్పడింది. వంతెన నిర్మాణాలకు ఇప్పటికే పిల్లర్లు నిర్మించినా ఇతర పనులు పూర్తి చేయాల్సి ఉంది. కాలువలకు ఇతర ప్రాంతాల నుంచి మురుగు తరలిరావడంతో పనులకు ఆటంకం ఏర్పడింది. మరికొన్ని రోజులపాటు పనులు ఆపేయాలని మురుగు నీటి పారుదల శాఖ అధికారులు భావిస్తున్నారు.

రేపల్లె ప్రధాన మురుగు కాల్వకు గండి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: ? చందోలు పెద్దమసీదు వీధిలో సీసీ రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తోంది. - రహీమ్, చందోలు ✔ రహదారిని పరిశీలించి మురుగు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం. -శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, చందోలు

సేవాభావంతో పని చేయాలి

పెదపల్లి గ్రామస్థులు సన్మానించిన సచివాలయ సిబ్బంది

నగరం, న్యూస్‌టుడే: సేవాభావంతో పని చేయడమే ఉద్యోగుల బాధ్యతని పెదపల్లి వీఆర్వో కృష్ణమూర్తి అన్నారు. ఇప్పటి వరకు సచివాలయంలో పని చేసి వేరే సచివాలయాలకు బదిలీ అయిన ఉద్యోగులను గ్రామస్థులు ఆదివారం సత్కరించారు. సచివాలయంలో పని చేసిన రమేష్, ఇతరులు మాట్లాడుతూ గ్రామస్థుల సహకారంతోనే ఐదేళ్లు ఇబ్బందులు లేకుండా పని చేశామని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌ఏలు ఉన్నారు.

పోషకాహార లోపం.. మహిళలకు శాపం

న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

ఇంటికి దీపం ఇల్లాలు. ఆమె ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుంది. పిల్లల ఎదుగుదలకు, సమగ్ర వికాసానికి గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కీలకం. జిల్లాలో ఎక్కువ మంది పోషకాహారలోపం కారణంగా రక్తహీనతకు గురవుతున్నారు. ఆ ప్రభావం శిశువులపై పడుతోంది. ఇటీవల ప్రసవ సమయంలో పలువురు గర్భిణులకు రక్తం ఎక్కించాల్సి వస్తోందని వైద్యులు చెబుతున్నారు.

మాతాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన ప్రతి గర్భిణి, బాలింతలకు బాల సంజీవని పేరుతో పోషకాల పిండి, బెల్లం, ఎండు కర్జూరం, అటుకులు, నెలకు 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు, విటమిన్‌లతో కూడిన మాత్రలు అందిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితం రావడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం తీసుకుంటున్నా సద్వినియోగం చేసుకోవడం లేదు. నోటికి రుచిగా లేదంటూ నిర్లక్ష్యం వహిస్తున్నారని స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులు చెబుతున్నారు.

పోషకాహారంపై గర్భిణులు, తల్లులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సుచిత్ర

జిల్లాలో వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు:	1885
నమోదైన గర్భిణులు:	5167
రక్తహీనత బారినపడిన వారు:	165
బాలింతలు:	2784
రక్తహీనతకు గురైనవారు:	147

చురుకుదనం లోపించి..

రక్తహీనతకు గురైన మహిళల్లో చురుకుదనం లోపిస్తుంది. కొద్దిదూరం నడిచినా గుండె వేగంగా కొట్టుకోవడం, అలసట, ఆయాసం, కళ్లు తిరగడం తదితర సమస్యలు ఎదురవుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. తల్లి బలహీనంగా ఉంటే ఆ ప్రభావం శిశువులపై పడుతుంది. రక్తహీనత బారిన పడిన శిశువుల్లో ఎదుగుదల ఉండదు. ప్రసవం తరువాత కొన్ని

రక్తహీనతతో సమస్యలు

రోజులు ఆసుపత్రిలోనే ఉంచాల్సి వస్తోంది.

సమతుల ఆహారం తప్పని సరి

గర్భిణుల ఆహారంలో కచ్చితంగా ఆకుకూరలు, పప్పు ఉండేలా చూసుకోవాలి. రాగిజావలో బెల్లం కలుపుకొని తాగాలి. రోజూ తాజా పండ్లు, గుడ్డు తిని పాలు తాగాలి. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసూతి వైద్యుల సేవలు పొందాలి. పోషకాహారంతో పాటు వైద్యుల సూచనలు పాటించి అవసరమైన మందులు సక్రమంగా వాడాలి. -శ్రావ్య, మొల్లగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు

నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం

రక్తహీనత బారిన పడకుండా నాణ్యమైన పోషకాహారం అందిస్తున్నాం. కొంతమంది వాటిని సరిగా తీసుకోవడంలేదు. దీంతో అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. అంగన్‌వాడీ సిబ్బంది పట్టణం, గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు.

-సుచిత్ర, సీడీపీవో రేపల్లె

రక్తదాతలను ప్రోత్సహించాలి

బాపట్ల, న్యూస్‌టుడే: అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు కాపాడే రక్తదానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్ బత్తుల శరత్ బోస్ అన్నారు. చీలురోడ్డులోని సంస్థ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు రక్తదానం చేశారు. 12 మంది శరీర, అవయవదానంపై ముందుకు వచ్చి సమ్మతి తెలుపుతూ సంతకాలు చేశారు. మానవతా సంస్థ అధ్యక్షుడు పంగులూరి హరిప్రసాదరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు శస్త్రచికిత్సల సమయంలో అవసరమైన రక్తం అందకపోవటం వల్ల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. వీటిని నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రక్తదానంతో ప్రాణ దాతలుగా నిలవాలని పేర్కొన్నారు. శరీర, అవయవదానానికి ముందుకు వచ్చిన వారికి అభినందనలు తెలిపారు. ప్రతినిధులు గురజాల శ్రీనివాసరావు, సీహెచ్‌వీవీ సత్యనారాయణ, అల్లాడి రవికుమార్, మద్దెన ప్రసన్నాంజనేయులు, కరణం రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న దాత

ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం

బాపట్ల, న్యూస్‌టుడే: మెరైన్ పోలీసు అధికారులు, సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి అన్నారు. యజ్ఞ ఆసుపత్రి ఆధ్వర్యంలో రామ్‌నగర్‌లో మెరైన్ పోలీసులకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు యజ్ఞ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, మత్స్యకారులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఔషధాలు పంపిణీ చేశారు. వైద్యులు శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి నెలా ఓ ఆదివారం గ్రామాలకు వెళ్లి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యం కాపాడుకోవటంపై అవగాహన కల్పించారు.

రైల్వే ప్రయాణికుడి సామగ్రి అప్పగింత

తెనాలి టౌన్: తెనాలి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై లగేజీ పడేసి విజయవాడ వెళ్లిపోయిన యువకుడికి, తిరిగి ఆ వస్తువులను తెనాలి రైల్వే పోలీసులు అప్పగించారు. ఎస్సై వెంకటాద్రి ఆదివారం తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం పెదపూడికి చెందిన సురేంద్ర.. బెంగళూరు నుంచి స్వగ్రామం వచ్చేందుకు అంగ ఎక్స్‌ప్రెస్ రైలు(12253) ఎక్కాడు. ఆ రైలుకు తెనాలిలో స్టాప్ లేకపోవడంతో విజయవాడ వరకు టికెట్ తీసుకున్నారు. శనివారం అర్ధరాత్రి రైలు తెనాలి చేరుకున్న సమయంలో రెడ్ సిగ్నల్ పడటంతో ఆగింది. ఆ సమయంలో సురేంద్ర తన లగేజీని ప్లాట్‌ఫాంపై పడేశాడు. అనంతరం రైలు కదిలి వేగం అందుకోవడంతో దిగలేకపోయాడు. ఈ విషయాన్ని రైల్వే హెడ్ కానిస్టేబుల్ నరసింహారావు గమనించి. . సామగ్రిని స్టేషన్‌లో భద్రపరిచాడు. సురేంద్ర విజయవాడ రైల్వే స్టేషన్‌లో దిగి అక్కడి రైల్వే పోలీసులను కలిసి విషయం చెప్పగా.. వారు తెనాలి రైల్వే ఎస్సై వెంకటాద్రికి సమాచారం ఇచ్చారు. సురేంద్రను ఆదివారం తెల్లవారుజామున తెనాలి జీఆర్పీ స్టేషన్‌కు రప్పించి సామగ్రిని అప్పగించారు.

సోమేశ్వరస్వామి ఆలయ నిర్మాణంలో తీవ్రజాప్యం

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని సోమేశ్వరాలయ జీర్ణోద్ధరణ పనుల్లో తీవ్రజాప్యం జరుగుతోంది. 18వ శతాబ్ధం నాటి పాత ఆలయాన్ని 2024 మార్చిలో తొలగించారు. నూతన ఆలయాన్ని రూ.1.15 కోట్లతో నిర్మించటానికి భూమి పూజ చేశారు. పునాది వేసిన తర్వాత నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఆలయ నిర్మాణానికి కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ క్రియాశీలంగా పని చేయటం లేదు. ఇదే సమయంలో సూర్యలంక రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏడాదికి పైగా సోమేశ్వరాలయ నిర్మాణ పనులు నిలిచిపోవటంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక బాలాలయంలో స్వామికి పూజలు చేస్తున్నారు. దీనిపై ఆలయ ఈవో వెంకటేశ్వర్లును సంప్రదించగా ఆలయాన్ని పూర్తిగా రాతితో నిర్మించనున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణ కమిటీని పునర్ వ్యవస్థీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. మూడు ప్రధాన ఆలయాలు, నాలుగు ఉప ఆలయాలు కలిపి మొత్తం ఏడు ఆలయాల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని చెప్పారు.

పునాది దశలో ఆగిన ఆలయం

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

వేమూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే ఆనందబాబు తెలిపారు. వేమూరు మండలం చంపాడులో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలు అందజేసి, ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. తెదేపా బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి విజయబాబు, వేమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పూర్ణకుమారి, వైస్‌ఛైర్మన్ కిశోర్, సర్పంచి రత్నకుమారి, నాయకులు తాతాజీ, తేజాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అద్దేపల్లి మురుగు కాలువను ఆధునికీకరించండి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : అద్దేపల్లి బాడవ పొలాల రైతులకు ఇబ్బందిగా మారిన మురుగు కాలువను ఆధునికీకరించాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు విన్నవించారు. ఈ కాలువ అద్దేపల్లి నుంచి గూడవల్లి గంగోలు డ్రెయిన్ వరకు విస్తరించిందని, తూటికాడ, గుర్రపుడెక్కతో పేరుకుందని తెలిపారు. గతంలో కురిసిన భారీవర్షాలకు వరి పైరు నీటమునిగి రైతులు నష్టపోయారని వివరించారు. వెంటనే పనులు జరిగేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. నేతలు యడ్ల జయశీలరావు, అంజిబాబు, డొక్కు శ్రీనివాసరావు, వేల్పూరి వెంకట్రావు, లోకానంద్, బేగ్, వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

పద్మశాలీయ సంఘం సేవలు అభినందనీయం

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు ఏళ్లుగా నోటు పుస్తకాలు అందిస్తున్న పద్మశాలీయ సంఘం సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. పద్మశాలీయ కల్యాణ మండపంలో అద్దేపల్లి, భట్టిప్రోలు మార్కండేయ పద్మశాలీయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన సభకు సంఘ అధ్యక్షుడు బట్టు మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. 400 మందికి పుస్తకాలు, 30 మందికి రూ.2 వేలు చొప్పున ఉపకార వేతనాలు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పద్మశాలీయులకు కావాల్సిన సత్రాన్ని త్వరలో ఏర్పాటయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు కౌతరపు పిచ్చయ్యశాస్త్రి, సంఘ నాయకులు వంగర చలమయ్య సిద్ధాంతి, బట్టు రాము, మురుగుడు సత్యనారాయణ, తిరువీధుల బాలాజీ, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి పుస్తకాలు, ఉపకార వేతనం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ఈ రోడ్డుపై ప్రయాణం ప్రయాసే..

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె మండలం మోర్తోట శివారు నుంచి బొబ్బర్లంక వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. పలుచోట్ల రోడ్డు సగానికి పైగా దెబ్బతింది. రాకపోకలు సాగించేందుకు చోదకులు అవస్థలు పడుతున్నారు. రాత్రివేళ ఎదురుగా వాహనం వస్తే రోడ్డుమార్జిన్ దిగితే ఎక్కడ పడిపోతామోనని వాపోతున్నారు. ఈ మార్గంలో చెన్నుపల్లివారిపాలెం, పిరాట్లంక, చోడాయపాలెం, బొబ్బర్లంక ప్రజలు నిత్యం పట్టణానికి వచ్చి వెళ్తుంటారు. ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

కనగాలవారిపాలెం శివారులో రహదారి ఇలా..

నీరు నిలిచి ఇబ్బందులు

ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: జాతీయ రహదారి నుంచి ఖాజీపాలెం వెళ్లే రహదారిపై కప్పలవారిపాలెం వద్ద నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు అడుగుల మేర నీరు నిలిచింది. అధికారులు స్పందించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ సుమన్‌పాల్ మాట్లాడుతూ పరిశీలించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రధాన రహదారిపై వర్షపునీరు

పొంగుతున్న మురుగు కాలువలు

గూడవల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మురుగు కాలువలు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని గూడవల్లి వద్ద ఆర్‌ఎం డ్రెయిన్‌లో కలిసే అద్దెపల్లి మురుగు కాలువ వర్షపునీటితో నిండింది. ఇందులో బాడవపొలం వెళ్లే మార్గంలో వంతెన వద్ద గుర్రపు డెక్క అధికంగా ఉంది. నీటి ప్రవాహానికి ఆటంకాలున్నాయి. మురుగునీటి పారుదల అధికారులు తక్షణమే అడ్డంకులను తొలగించాలని, లేకుంటే పొలాల్లోకి నీరు చేరే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అద్దెపల్లి మురుగుకాల్వలో గుర్రపు డెక్క

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

నగరం, న్యూస్‌టుడే: నగరం సబ్‌స్టేషన్ పరిధిలోని అల్లపర్రు ఫీడర్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నందున సోమవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు మండల పరిధిలోని ఆక్వా కల్చర్‌కు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగుల్ మీరా ఆదివారం తెలిపారు.

24న ఇంకొల్లు ఐటీఐలో ప్రాంగణ ఎంపికలు

ఇంకొల్లు, న్యూస్‌టుడే : ఇంకొల్లు మారుతీ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ఈనెల 24 జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ తెలిపారు. 300పైగా ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని, 18-30 ఏళ్ల లోపు ఉండి.. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, ఫార్మసీ పూర్తి చేసిన వారు అర్హులని చెప్పారు. వివరాలకు 99888 53335 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో బాపట్ల క్రీడాకారుడి ప్రతిభ

బాపట్ల, న్యూస్‌టుడే: గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో నిర్వహించిన అండర్-15 షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ విభాగంలో బాపట్లకు చెందిన యువ క్రీడాకారుడు శిఖరం రామకృష్ణ ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచాడు. రెండు విభాగాల్లో ప్రథమ బహుమతులు కైవసం చేసుకున్నాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. క్రీడాకారుడిని పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.

క్రీడాకారుడు రామకృష్ణకు బహుమతి అందజేస్తున్న ప్రతినిధులు

23లోపు దరఖాస్తు చేసుకోవాలి

పర్చూరు, న్యూస్‌టుడే : అర్హత కలిగిన రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి ఈనెల 23 లోపు దరఖాస్తు చేసుకోవాలని పర్చూరు ఏవో భాస్కరరావు ఆదివారం తెలిపారు. లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని రైతులు రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా వరి, మిరప, కంది, మినుము పంటలకు పంటల బీమా పథకం అమలు చేస్తారని తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

వేమూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలో వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. కొల్లిపర ఛానల్‌లో గుర్తు తెలియని మృతదేహం కొట్టుకొచ్చి చంపాడు వంతెన వద్ద గుర్రపుడెక్కల్లో ఇరుక్కుపోయింది. ఈ విషయమై వేమూరు పోలీసులను ఆరా తీయగా తమకు సమాచారం లేదన్నారు. పెనుమర్రు పంచాయతీ చెరువులో గొరికపూడి జగదీష్(29)మునిగి మృతి చెందాడు. ఇతను కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. వేమూరు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. చెరువులో నుంచి మృతదేహాన్ని ఒడ్డుకు తీశారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

విఠలేశ్వరనగర్‌లో పట్టపగలే చోరీ

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: విఠలేశ్వరనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు మాచర్ల సీతారామయ్య కుటుంబం ఇంటికి తాళం వేసి పనికి వెళ్లారు. పని ముగించుకుని ఇంటికొచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో ఉన్న రూ.16 వేలు నగదు, రూ.5 లక్షల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆదివారం ఎస్సై శివయ్య సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేశారు.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

నగరం: చీరాలకు వన్ టౌన్‌కు చెందిన అన్నపురెడ్డి గోపి నగరం మండలం మంత్రిపాలెం గ్రామ శివారు బొడ్డువారిపాలెంలో 2024 నవంబరులో అదృశ్యమైనట్లు తల్లి సరోజిని చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసిన చీరాల పోలీసులు నగరం స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ఎస్సై భార్గవ్ ఆదివారం తెలిపారు. అవివాహితుడైన గోపి మతిస్థిమితం లేకుండా తిరుగుతుంటాడన్నారు. చీరాలకు చెందిన ఆంజనేయులుతో కలసి బొడ్డువారిపాలెంలో లైటింగ్ పని చేయడానికి వచ్చిన గోపి అదృశ్యమైనట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అల్లూరమ్మ

శ్రీమహాలక్ష్మి అమ్మవార్లు

గుండెపాటెమ్మ

బాలాత్రిపురసుందరి

దుర్గాభవానీమాత

కనకదుర్గాదేవి

శాకంబరి.. శుభకరి..

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: పిట్టలవానిపాలెం, గోకరాజు నల్లిబోయినవారిపాలెంలోని శ్రీబండ్లమ్మ అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. పిట్టలవానిపాలెం మండలంలోని అల్లూరు గ్రామదేవత అల్లూరమ్మకు ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం ఆర్య వైశ్య, క్షత్రియ సంఘం వారు సారె సమర్పించారు. అమ్మవారిని కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు.

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : మండలంలోని వెల్లటూరు, వేమవరం గ్రామదేవతలు శ్రీకట్లమ్మ, శ్రీపోలేరమ్మ అమ్మవార్లకు ఆషాఢ మాసం పురస్కరించుకుని ఆదివారం శాకంబరి దేవి అలంకరణ చేశారు. కూరగాయలతో చేసిన అలంకరణ ఆకట్టుకుంది. భట్టిప్రోలులో కాపు, యాదవ సంఘాల ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు పసుపు, కుంకుమలతో సారె తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పేటేరు(రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే: ఆషాఢమాసం పురస్కరించుకుని రేపల్లె మండలం పేటేరు గ్రామదేవత శ్రీమహాలక్ష్మి గుండెపాటెమ్మ తల్లిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. ప్రత్యేక పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

భ్రమరాంబ అమ్మవారికి సారె సమర్పణ

నగరం, న్యూస్‌టుడే: ఉల్లిపాలెం, నగరం, జిల్లేపల్లి గ్రామాల్లోని శ్రీ భ్రమరాంబ చెన్నమల్లేశ్వరుడు, శ్రీపద్మావతి సమేత శ్రీనివాసుడు, ఉమామహేశ్వరుని దేవాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సారెను అమ్మవారికి సమర్పించారు. ముందుగా గ్రామస్థులు మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు.

ఉల్లిపాలెంలో భ్రమరాంబకు సారె తీసుకొస్తున్న గ్రామస్థులు

చెరుకుపల్లిలోని ఆలయాల్లో..

చెరుకుపల్లి న్యూస్‌టుడే: ఆషాఢమాసం పురస్కరించుకుని ఆదివారం చెరుకుపల్లిలోని శ్రీబాలా త్రిపురసుందరి, శ్రీపోలేరమ్మ అమ్మవార్లకు భక్తులు సారె సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీబాలాత్రిపుర సుందరీదేవిని కూరగాయలతో అలంకరించారు. పలు సామాజిక సంఘాలకు చెందిన వారు ప్రదర్శనగా బయలుదేరి అమ్మవారిని దర్శించుకున్నారు.

బాపట్లలో పోలేరమ్మకు సారె తీసుకెళుతున్న భక్తులు

బాపట్ల, న్యూస్‌టుడే: ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా భావపురి కాలనీ నుంచి భక్తులు ప్రదర్శనగా వెళ్లి పోలేరమ్మ, ఎస్‌ఎన్‌పీ అగ్రహారంలోని ప్రసన్న దుర్గా భవానిమాతకు సారెలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు.

బాపట్ల, న్యూస్‌టుడే: చీలురోడ్డు కనకదుర్గాదేవి, లలితాత్రిపురసుందరీ దేవి, అగ్రహారం ప్రసన్న దుర్గాభవాని మాత ఆలయాల్లో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు సారె సమర్పించారు. కూరగాయలతో మూలవిరాట్లను అలంకరించారు.

శ్రద్ధాంజలి

మరణం: 09-07-2025

కీ॥శే॥ చండ్ర సీతారామయ్య గారు
బూతుమల్లి, వేమూరు (మం)

మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మహామనిషి మీరు భువి నుండి దివికేగిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..
వారి కుటుంబసభ్యులకు మా ప్రగా సానుభూతిని తెలియజేస్తూ...

గోగినేని అశోక్ కుమార్ — నూకాలమ్మతల్లి ఎర్త్‌మూవర్స్ - తెనాలి
ఘంటా సుందరరావు — నూకాలమ్మతల్లి ఎర్త్‌మూవర్స్ - తెనాలి
మాదినేని మురళీధరరావు — బూతుమల్లి
మాదినేని రమేష్‌బాబు — బూతుమల్లి
కన్నెగంటి సత్యనారాయణ వరప్రసాద్ — బూతుమల్లి
గోగినేని కేశవరావు — బూతుమల్లి
కోగంటి శ్రీనివాసరావు — చెన్నై
కోగంటి ప్రసాద్ — చెన్నై

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రేపల్లె బ్రాంచ్ (00911), రేపల్లె, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు

(I) ఋణగ్రహీత పేరు మరియు చిరునామా : శ్రీ మోర్ల జగదీష్, తండ్రి: ఉమామహేశ్వరరావు, డి.నెం. 5-29-87/7, లంబాడీ కాలనీ, వార్డ్ నెం. 23, ఉమామహేశ్వర నిలయం, రైల్వేస్టేషన్, రేపల్లె, గుంటూరు జిల్లా-522265.
NPA HTL అకౌంట్ నెం: 38219597701 & 38219604471.

(II) బకాయి మొత్తం: తేది. 16.07.2025 నాటికి మొత్తం రూ. 18,54,927.00/- (అక్షరాల పద్దెనిమిది లక్షల యాభై నాలుగు వేల తొమ్మిది వందల ఇరవై ఏడు రూపాయలు మాత్రమే) + పైన పేర్కొన్న మొత్తానికి కాంట్రాక్టువల్ రేటు ప్రకారం భవిష్య వడ్డీతో కలిపి ఇతర ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు, మొ॥వితో కలిపి చెల్లించవలెను. (తదుపరి చెల్లింపులు ఏమైనా ఉన్నచో తీసివేయబడును)

(III) డిమాండ్ నోటీసు తేది: 16.07.2025 NPA తేది: 04-07-2025

షెడ్యూలు ఆస్తి వివరములు

పార్టు-I: అన్ని హైపోథికేటెడ్ ఆస్తులు., హైపోథకేషన్ స్టాక్స్ మరియు మిషనరీ ఆస్తులు మరియు రాబడులు మరియు కంపెనీ యొక్క ప్రస్తుత మరియు భవిష్యత్తు ఆస్తులు, బుక్ డెబిట్స్ మొదలైనవి, డాక్యుమెంట్స్ తెలపబడినవి. (షెడ్యూల్ బి).

పార్టు-II: (తనఖా డాక్యుమెంట్స్ / డీడ్‌లను డాక్యుమెంట్స్ లో తెలిపిన విధంగా బ్యాంకుకు తనఖాపెట్టిన స్థిరాస్తుల వివరాలను (షెడ్యూల్ బి)

గుంటూరు జిల్లా, తెనాలి రిజిస్ట్రేషన్ జిల్లా, రేపల్లె మున్సిపల్ ఏరియా, రేపల్లె, లంబాడి కాలనీ, డి.నెం. 5-29-87/6 & సర్వే నెం. 41/5A లో 145.2 చ॥గ॥ల స్థలంలో నిర్మాణపు గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు & రెండవ అంతస్తు తో ఆర్‌సిసి రూఫు బిల్డింగ్ మరియు యావత్తు ఆస్తి. రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 5548/2011. తేది: 10.10.2011 ప్రకారం శ్రీ మోర్ల జగదీష్, తండ్రి: (లేటు) ఉమామహేశ్వరరావు గారికి చెందిన ఆస్తి. హద్దులు: తూర్పు: పడమటి బసవవెంకటేశ్వరమ్మ యొక్క ఆస్తి, దక్షిణం: మోర్ల వేణుగోపాల్ యొక్క ఆస్తి, పడమర: మున్సిపల్ రోడ్డు, ఉత్తరం: జన్నువీర వెంకటమోహనరావు యొక్క మిగిలిన స్థలం (అమ్మకందారు).

పైన చెప్పబడిన ఋణగ్రహీత/హామీదారు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రేపల్లె బ్రాంచ్, బాపట్ల జిల్లా వారి నుండి ఋణము పొందియున్నారు. సదరు ఋణమునకు పైన పేర్కొన్న ఆస్తిని హామీగా ఇచ్చియున్నారు. ఋణము యొక్క నియమ నిబంధనలననుసరించి సకాలంలో చెల్లించకపోవటంచే సదరు ఖాతాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియమ నిబంధనల ప్రకారం నిరర్థక ఖాతాగా పరిగణించబడినది. బ్యాంకువారు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించిన డిమాండ్ నోటీసులు తిరిగి వచ్చినందున, ఋణగ్రహీత/హామీదారుల సంతకములు సరిగా లేనందున పత్రికా మూలకముగా మీకు మరల నోటీసు జారీచేయడమగుచున్నది. కావున మీరు పైన పేర్కొన్న మొత్తములను ఈ పత్రికా ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా వడ్డీ & ఇతర ఖర్చులతో కలిపి మొత్తమును చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయిని రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.

తేది: 16.07.2025, ప్రదేశం: రేపల్లె — సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

చీరాల

•చీరాల •అద్దంకి •పర్చూరు

23లోపు దరఖాస్తు చేసుకోవాలి

పర్చూరు, యద్దనపూడి, కారంచేడు, అద్దంకి, న్యూస్‌టుడే : అర్హత కలిగిన రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి ఈనెల 23 లోపు దరఖాస్తు చేసుకోవాలని పర్చూరు, యద్దనపూడి, కారంచేడు, అద్దంకి ఏవోలు కె.భాస్కరరావు, ఎస్.వి.పి.కుమారి, నాగరాజు, కె.మోహనకృష్ణ ఆదివారం తెలిపారు. లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా వరి, మిరప, కంది, మినుము పంటలకు పంటల బీమా పథకం అమలు చేస్తారని తెలిపారు. వరిపంటకు ఆగస్టు 15లోపు, మిగిలిన అన్ని పంటలకు జులై 31 లోపు ప్రీమియం చెల్లించాలని చెప్పారు.

కమనీయం.. కావడి మహోత్సవం

ఉత్సవంలో మహిళలు

కారంచేడు, న్యూస్‌టుడే : కారంచేడు మాస్కో బజారులో గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పుట్ట వద్ద ఆదివారం కావడి మహోత్సవం నిర్వహించారు. ఆషాఢమాసం ఆదివారం ఆడికృతిక నక్షత్రాన్ని పురస్కరించుకుని మహిళలు కావడిలతో పుట్ట వద్దకు చేరుకున్నారు. అక్కడ వేదపండితులు వాటిని స్వామి విగ్రహం ఎదుట ఉంచి పూజలు చేశారు. కార్యక్రమాలను పి.వెంకటేశ్వర్లు, డి.నాగమణి పర్యవేక్షించారు. అనంతరం అన్న ప్రసాదాన్ని అందించారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, ఆవోపా ప్రతినిధులు

చీరాల, న్యూస్‌టుడే : సమాజంలో విభిన్న వర్గాల వారికి.. ముఖ్యంగా పేద విద్యార్థులకు చేయూత ఇచ్చేందుకు ఆవోపా చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. ఆవోపా ఆధ్వర్యంలో చదువుల పండగ పేరుతో 109 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, 80 మందికి వడ్డీ లేని విద్యారుణాలు, 64 మందికి ఉచిత చేయూత పురస్కారాలు, ఐదుగురికి వడ్డీ లేని రుణంగా ల్యాప్‌టాప్‌లు అందజేశారు. కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొండయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాయాన్ని సద్వినియోగం చేసుకుని.. ఉన్నత స్థానాలకు చేరాలని, భవిష్యత్తులో మరికొంత మందికి సాయం చేయాలని సూచించారు. ఆవోపా అధ్యక్షుడు మురళీకృష్ణ, ముప్పల రమణారావు, శ్యామ సుందరరావు, వెంకటరామయ్య, శివరంగనాయకులు, రమేష్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పందిళ్లమ్మ అమ్మవారి సేవలో ఎమ్మెల్యే

పందిళ్లపల్లి (వేటపాలెం), న్యూస్‌టుడే : పందిళ్లమ్మ అమ్మవారి శిడి మానోత్సవం అనంతరం దేవాలయం వద్ద నిర్వహించే పొంగళ్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆదివారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ పెద్దలు కోలా రామయ్య, రొండా సత్యనారాయణరెడ్డి, తిరుమల శ్రీనివాసరావు, సాంబయ్య, ఆనాల నరసింహారావు, పార్టీ నాయకులు ఉన్నారు.

పేదల ఆకలి తీరుతోంది

అన్న క్యాంటీన్‌లో నిత్యం వెయ్యిమందికి అల్పాహారం, భోజనం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే

భోజనం చేస్తున్న పేద, మధ్యతరగతి వర్గాలు

పేదలు, దినసరి కూలీల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. గత ప్రభుత్వం వీటిని మూసివేయడంతో ఎంతో మంది పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి అధికారంలోకి రాగానే వీటిని తిరిగి ఏర్పాటు చేయగా ఎంతో ఉపయోగంగా మారింది. చీరాలలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి.. త్వరలో ఏడాది పూర్తవుతుంది.

☛ **నా పేరు సింగారెడ్డి.** గతంలో రిక్షా తొక్కేవాడ్ని. ఇప్పుడు అనారోగ్యంతో మానేశాను. రెండు పూటలా భోజనం, ఉదయం అల్పాహారం అన్న క్యాంటీన్‌లో తింటాను. మాలాంటి వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతోంది.

☛ **నా పేరు రామారావు.** పట్టణంలోని భవానీపురం మాది. నేను రిక్షా తొక్కి జీవనం సాగిస్తాను. ఉదయం ఇంటి నుంచి వచ్చాక రాత్రికి వెళతాను. మధ్యాహ్నం భోజనం ఇక్కడే తింటా. రూ.5కు ఇచ్చే భోజనం సరిపోతోంది. మరో టిక్కెట్ కావాలన్నా ఇస్తున్నారు.

☛ చీరాల పట్టణంలోని ముంతావారి సెంటర్‌కు సమీపంలో అన్న క్యాంటీన్‌ను గత ఏడాది ఆగస్టు 16న ఏర్పాటు చేశారు. కేవలం రూ.5కే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రికి భోజనం అందిస్తున్నారు. అంటే రూ.15కు రెండుపూటలా భోజనం, ఉదయం అల్పాహారం ఇస్తారు. అల్పాహారం కింద ప్రతి రోజు ఇడ్లీ, సాంబార్‌తో పాటు అదనంగా అంటే సోమవారం పూరి, మంగళవారం ఉప్మా, బుధవారం పొంగలి, గురువారం పూరి, శుక్రవారం ఉప్మా, శనివారం పొంగలి వడ్డిస్తారు. ఇక భోజనంలో ఒక కూర, సాంబారు, చట్నీ, పెరుగు ఇస్తారు. ప్రతి బుధ, శనివారం రాత్రి పూట వెజిటబుల్ బిర్యాని అందిస్తారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా త్రోవగుంట సమీపంలో హరేకృష్ణ సంస్థ వద్ద తయారైన ఆహార పదార్థాలు ఇక్కడకు క్యారేజీల ద్వారా తీసుకువస్తారు. రోజుకి వెయ్యి మంది వరకు దీన్ని వినియోగించుకుంటున్నారు. ఆదివారం, పండగ రోజుల్లో సెలవు ఉంటుంది. దీని ప్రకారం నెలకు సరాసరి 25 వేల మంది వరకు ఇక్కడ భోజనం చేస్తున్నారు. ఆ ప్రకారం 11 నెలల్లో 2.75 లక్షల మంది దీని సేవలు పొందారు. క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి సలహాలివ్వండి- మంత్రి గొట్టిపాటి

అద్దంకి, న్యూస్‌టుడే : అద్దంకి శాఖ గ్రంథాలయాన్ని ఆధునికంగా, సర్వ హంగులతో నిర్మించేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎన్నెస్పీ ఆవరణలో పది సెంట్ల భూమిని గ్రంథాలయానికి కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దీంతో పాటు భవన నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరయ్యాయని, ఈ నిధులతో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ గ్రంథాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణం చేపట్టేందుకు సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు.

ప్రజోపయోగ కార్యక్రమాలపై దృష్టి

వేటపాలెం: రోటరీ సభ్యులు ప్రజోపయోగ కార్యక్రమాలపై దృష్టి సారించాలని రోటరీ పీడీజీ పి.శివనారాయణ అన్నారు. క్లబ్ నూతన పాలక వర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎ.వి.సురేష్, కార్యదర్శిగా అక్కల చంద్రశేఖరరెడ్డి, కోశాధికారిగా రొండా దశరథరామిరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. అసిస్టెంట్ గవర్నర్ ఎన్.శ్రీనివాసరావు, రోటరీ చార్టర్ ప్రెసిడెంట్ గొల్లపూడి సీతారాం, కొత్త శ్రీనివాసరావు, కారంచేటి శివరామప్రసాదు పాల్గొన్నారు.

24న ఇంకొల్లు ఐటీఐలో ప్రాంగణ ఎంపికలు

ఇంకొల్లు, న్యూస్‌టుడే : ఇంకొల్లు మారుతీ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ఈనెల 24 జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ తెలిపారు. 300పైగా ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని, 18- 30 ఏళ్ల లోపు ఉండి.. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, ఫార్మసీ పూర్తిచేసిన వారు అర్హులని చెప్పారు. వివరాలకు 99888 53335 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

నేటి నుంచి పొగాకు కొనుగోలు కేంద్రం మార్పు

పంగులూరులో పాసింగ్‌కు సిద్ధంగా పొగాకు బేళ్లు

జె.పంగులూరు న్యూస్‌టుడే : పంగులూరు పొగాకు కొనుగోలు కేంద్రం గత నెల 30న ప్రారంభించి ఈనెల 18 వరకు పొగాకు కొన్నారు. 19 రోజుల్లో 155 మంది రైతుల నుంచి 2527 బేళ్లు చొప్పున 2095 క్వింటాళ్లు కొన్నారు. పంగులూరులోని గోదాములు నిండటంతో సోమవారం నుంచి మండలంలోని తూర్పు కొప్పెరపాడు వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలోని గోదాముల వద్ద కొనుగోళ్లు చేయనున్నట్లు జనకవరం పీఏసీఎస్ సీఈవో నాగబోయిన లక్ష్మీదేవి తెలిపారు. సోమవారం పొగాకు అమ్ముకునేందుకు 30 మంది రైతులకు ఒక్కొక్కరు 10 చెక్కులు తీసుకొచ్చేలా చరవాణి ద్వారా మార్క్‌ఫెడ్ కేంద్ర కార్యాలయం నుంచి సమాచారం అందినట్లు ఆమె తెలిపారు.

చేపల వేటకు నీటిని వదిలారు

కలవకూరు (అద్దంకి), న్యూస్‌టుడే : మండలంలోని కలవకూరు చెరువులో నీరు అడుగంటింది. చెరువులో ఉన్న చేపల్ని గుత్తేదారు పట్టుకుని ఒడ్డుకు చేర్చారు. సుమాకరు రెండు వందల ఎకరాల్లో విస్తరించిన ఈ చెరువులో చేపలు వేసి పెంచుకుని, పట్టుకునేందుకు పంచాయతీ నుంచి అనుమతి పొందారు. ఆ మేరకు రెండేళ్ల క్రితం వేసిన చేపపిల్లలు పెద్దవి కావటంతో వారం రోజుల నుంచి గుత్తేదారు పడవల ద్వారా చేపలు పట్టిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో నీరు ఎక్కువగా ఉండటంతో బయటకు పంపారు. ఆ నీరు నేరుగా భవనాశి తటాకానికి చేరింది. తిరిగి సాగర్ నీరు విడుదల చేసిన సమయంలో కలవకూరు చెరువు నింపనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

నిర్వహణ లేక.. మరమ్మతులు పట్టక

ఇనుప గడ్డర్ల సాయంతో నిలిచిన షట్టరు

సాగర్ కుడి కాలువ పరిధిలోని అద్దంకి మేజరు (ఏబీసీ)లో నీటి నిర్వహణకు ఏర్పాటు చేసిన షట్టర్ల మరమ్మతుల్లో ఆరు దశాబ్దాలుగా పురోగతి లేదు. కాలువలో నీటి సరఫరా సమయంలో పరిణామానికి మించి నీరు వచ్చినపుడు, దిగువన కాలువకు గండ్లు పడినపుడు ఈ షట్టర్లను ఉపయోగిస్తారు. 60 ఏళ్లలో ధర్మవరం సమీపంలోని 33/2 మైలురాయి, రామకూరు సమీపంలోని 37వ మైలురాయి వద్ద ఉన్న వీటిని ఉపయోగించలేదు. దశాబ్ద కాలం క్రితం షట్టర్లు కిందకు జారకుండా ఇనుప కమ్మీలతో కట్టారు. షట్టర్లకు ఇరువైపులా సిమెంటు కాంక్రీటు దిమ్మెలు మరమ్మతులకు గురయ్యాయి. తాత్కాలిక మరమ్మతులతో కొనసాగిస్తున్నారు. ఈ విషయమై ఎన్నెస్పీ డీఈ కె.రామకృష్ణను అడుగగా ఈ ఏడాది ఎన్నెస్పీ పరిధిలో కట్టడాల మరమ్మతులకు నిధులు మంజూరు కాలేదని, వచ్చే ఏడాది ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు.– న్యూస్‌టుడే, అద్దంకి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? ఏల్చూరు శివారు రామిరెడ్డిపాలెం చివరి వీధిలో అయిదు స్తంభాలకు వీధి దీపాలు వెలగటం లేదు.-**స్థానికులు**

✔ పరిశీలించి.. వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించి.. వినియోగంలోకి తెస్తాం.-**పూర్ణచంద్, పంచాయతీ కార్యదర్శి, ఏల్చూరు** – న్యూస్‌టుడే, ఏల్చూరు (సంతమాగులూరు)

? పోతుకట్లలో చెత్తను రోడ్డు వెంబడి వేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది.-**స్థానికులు** ✔ ఆ ప్రాంతంలో చెత్త తొలగించి బ్లీచింగ్ చల్లిస్తాను.- **కె.సత్యన్నారాయణ, డిప్యూటీ ఎంపీడీవో, పర్చూరు** – న్యూస్‌టుడే, పర్చూరు

? చినగంజాం సుందరయ్య కాలనీ, శివాలయానికి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు ఉన్నాయి. - **శ్రీనివాసరావు**

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి రెండ్రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. - **కె.అంజయ్య, పంచాయతీ కార్యదర్శి, చినగంజాం** – న్యూస్‌టుడే, చినగంజాం

అంకమ్మా.. ఆషాఢ సారె అందుకోవమ్మా

సారె సమర్పించి పూజలు చేస్తున్న మహిళలు

మార్టూరు, న్యూస్‌టుడే : మండల పరిధి ద్రోణాదుల అంకమ్మ శక్తిక్షేత్రంలో ఆషాఢమాసం చివరి ఆదివారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి వేకువజాము నుంచే అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలతో పాటు చీరలతో సారె సమర్పించారు. వడపప్పు, పానకంతో పొంగళ్లు పొంగించి.. నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించారు. పెద్దసంఖ్యలో మహిళలు రాగా.. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మికత నెలకుంది. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ పూజారి ఎ.పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఎన్టీఆర్ అభిమానుల అన్నదానం

చీరాల, న్యూస్‌టుడే : జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఆదివారం వివిధ ప్రాంతాల్లో నిరుపేదలకు ఆహార పొట్లాలు అందించి సేవాగుణాన్ని చాటారు. అభిమానుల సంఘం ప్రతినిధి నిద్దాన సతీష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ పేరుతో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి.. సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు.

అప్రకటిత విద్యుత్తు కోతపై అసంతృప్తి

అద్దంకి, న్యూస్‌టుడే : అద్దంకిలో అప్రకటిత విద్యుత్తు కోతపై వ్యాపార యజమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం గుండ్లకమ్మకు వెళ్లే దారిలో విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేస్తుండటంతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా అంతరాయం కలిగింది. ఈ దారిలో రెండు పెట్రోలు బంకులు, రెస్టారెంట్ ఉండటంతో వాటి యజమానులు అసహనానికి గురయ్యారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP No: 15/2019 in OS No.60/2018

Between: మాలెంపాటి బుచ్చయ్య - DHR
మరియు
కోట అంజయ్య - JDR

పై నెంబరు E.P.లో ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై కోర్టువారి తేది: 12-08-2025న ఉదయం గం.10-30 ని.లకు పై కోర్టులో బహిరంగ వేలం జరుపుతారు. కావున కావలసిన వారు సదరు కోర్టు వారి షరతులకు లోబడి పాట పాడుకొనవచ్చును.

షెడ్యూలు:
Bapatla District (Old Prakasam Dt) - Prakasam Dt. Registration - Ammanabrolu S.R.O - Korisapadu Mandal - Kanagalavaripalem h/o Pamidipadu village, S.No: 200/3 - an extent of AC.2-06 cents of dry land **bounded on: East:** Vagu, **South:** land of Kota Venkata Sai Durga, **West:** Vagu, **North:** Land of Kota Satyanarayana.

DHR Value	: Rs.8,24,000/-
Amina Value	: Rs.22,00,000/-
Market Value	: Rs.7,93,100/-
Date of Sale	: 12-08-2025
Date of Hearing	: 19-08-2025

అద్దంకి 20-07-25
J.రామచంద్రరావు, B.Com, BL.
DHR తరపు అడ్వకేటు

భారీ వర్షం.. రహదారులు జలమయం

వేటపాలెం జూనియర్ కళాశాల రోడ్డులో..

అద్దంకి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రెండు రోజుల క్రితం ఆరు సెం.మీ. వర్షపాతం నమోదు కాగా ఆదివారం మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 7 వరకు 5.8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఈ కారణంగా రహదారులన్నీ జలమయం అయ్యాయి. ఆదివారం కావటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారిపై ఎస్‌బీఐ (ఏబీసీ) ఎదుట మురుగు కాలువలు పొంగి రోడ్డు పైకి రాగా ప్రయాణం కష్టమైంది. ద్విచక్ర, భారీ వాహనాలు కూడా ఈ ప్రదేశం వద్ద నెమ్మదిగా ప్రయాణిస్తున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాలతో పాటు జె.పంగులూరు, కొరిశపాడు మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది.

నామ్ రహదారిపై ఎస్‌బీఐ ఎదుట రోడ్డుపై వర్షపునీరు

చీరాల అర్బన్, వేటపాలెం: నియోజకవర్గంలో మధ్యాహ్నం నుంచి రెండు గంటల పాటు వర్షం ఏకధాటిగా కురిసింది. పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా చీరాల పట్టణంలోని దర్బార్ రోడ్డు, మసీదు సెంటరు, చీరాల- ఒంగోలు రోడ్డులో పాతచీరాల, జాండ్రపేట శివాలయం, నూలుమిల్లు, రామనగర్, దేశాయిపేట ప్రాంతాల్లో కొద్దిపాటి వర్షం పడినా రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. అయినా అధికారులు చర్యలు చేపట్టక పోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కారంచేడు: కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు కోరారు. ఆదివారం మండలంలోని స్వర్ణ గ్రామం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కౌలు రైతుల జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. సంఘ జిల్లా నాయకులు సీహెచ్ గంగయ్య, జిల్లా కార్యదర్శి టి.రామారావు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కౌలు రైతు సంఘ అధ్యక్షుడిగా గోళ్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా పి.కొండయ్యను ఎన్నుకున్నారు.

గోమాతకు సీమంతం

తిమ్మాయపాలెం (అద్దంకి), న్యూస్‌టుడే : మండలంలోని తిమ్మాయపాలెంలో గోమాతకు సీమంతం చేశారు. సంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణే లక్ష్యం

మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న ఎస్సై సురేష్

ఇంకొల్లు, న్యూస్‌టుడే : మాదక ద్రవ్యాల నివారణే లక్ష్యంగా పని చేస్తున్నామని ఇంకొల్లు ఎస్సై సురేష్ పేర్కొన్నారు. ఆదివారం ఇంకొల్లులో మాదక ద్రవ్యాల నివారణపై ప్రదర్శన, యువకులకు అవగాహన కల్పించారు. సురేష్ మాట్లాడుతూ గంజాయి, నల్లమందు, ఇతర మాదక ద్రవ్యాలు ప్రాణాలు బలి తీసుకుంటాయని చెప్పారు. మాదక ద్రవ్యాలు అమ్మటం, సేవించటం నేరమని, వీటికి కఠిన శిక్షలు పడే అవకాశం ఉందని సూచించారు. యువకులు మత్తు పదార్థాలకు అలవాటు పడి తల్లిదండ్రులను మానసిక వేదనకు గురి చేయవద్దన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించి.. చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

దేవాంగ పురోహిత్ పరిషత్ నూతన కార్యవర్గం



వేటపాలెం, న్యూస్‌టుడే : ఏపీ దేవ బ్రాహ్మణ (దేవాంగ) పండిత అర్చక పురోహిత్ పరిషత్ నూతన కార్యవర్గం ఎన్నిక మండలంలోని ఆమోదగిరి పట్నం సాయిబాబా కల్యాణ మండపంలో ఆదివారం చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షుడిగా చల్లా రామారావు, ఉపాధ్యక్షులుగా కొలువుల మల్లికార్జునరావు, పన్నెం బాలశంకర్, అంబాబత్తుల అండ కొండ రాముడు, ప్రధాన కార్యదర్శిగా చల్లా లక్ష్మణరావు, సహాయ కార్యదర్శులుగా డాక్టర్ కడి మల్లేశ్వర సిద్ధాంతి, దంతం శివ హనుమంతరావు, కోశాధికారిగా ఊట్ల దేవమూర్తి, ఉప కోశాధికారులుగా ఏకాంబరం, దుర్గాప్రసాదు ఎంపికయ్యారు. అంతకు ముందు పురోహిత పరిషత్ నాలుగో సర్వసభ్య సమావేశం సందర్భంగా దేవాంగ కులదేవత రామలింగ చౌడేశ్వరికి పూజలు చేశారు.

పేదలకు ఉచిత వైద్య శిబిరాలు

మార్టూరు, న్యూస్‌టుడే : రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్ సౌజన్యంతో మార్టూరు సాయి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ నాగకిరణ్ సుమారు 145 మందికి గుండెకు సంబంధించి ఎకో, ఈసీజీ, రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్షుడు మాదాల సాంబశివరావు, కార్యదర్శి చెరుకూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదల సౌకర్యార్థం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్లబ్ సభ్యుడు జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జె.పంగులూరు న్యూస్‌టుడే: పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఒంగోలు ఉపాస్ వైద్యశాల సహకారంతో వైద్య శిబిరం నిర్వహించినట్లు సమన్వయకర్త తాళ్లూరి రామాంజనేయులు తెలిపారు. వైద్యులు జగదీష్ బాబు, జి.శ్రీనివాస్ వి.జయవర్ధన్ పర్యవేక్షణలో 340 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యశాల జనరల్ మేనేజర్ ఆనంద్, పీఆర్‌వో ఇస్లాం, విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

పర్చూరు : నూతలపాడులో ఆదివారం జీవీఆర్ వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు పి.ప్రదీప్, ఎ.స్వాతి 317 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యశాల డైరెక్టర్ సాధన, మేనేజర్ ఎ.రేవంత్, తదితరులు పాల్గొన్నారు.

వైకాపా మండల కన్వీనర్ పదవి ఎస్సీలకు కేటాయించరా?

పర్చూరు, న్యూస్‌టుడే : పర్చూరు మండల వైకాపా కన్వీనర్ పదవిని ఎస్సీలకు కేటాయించాలని కోరుతూ ఆదివారం మండలంలోని దళిత నాయకులు స్థానిక పరివర్తన భవన్‌లో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో అధికంగా దళితుల ఓట్లు ఉన్నా ఎస్సీలకు కన్వీనర్ పదవి ఇవ్వలేదని తెలిపారు. ఈసారి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో నేతలు ఇస్సాకు బాబు, జి.స్వరాజ్, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. అయితే వీరి డిమాండ్ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది.

గత ప్రభుత్వ వైఖరి కారణంగానే కార్మికులకు సమస్యలు

అద్దంకి, న్యూస్‌టుడే : గత ప్రభుత్వ దుర్మార్గ చర్యలతోనే కార్మికుల రోడ్లపైకి వస్తున్నారని సీపీఎం నేత ఆంధ్ర మాల్యాద్రి అన్నారు. పురపాలక సంఘ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం ఎనిమిదో రోజుకు చేరింది. దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు పలికారు. ప్రభుత్వం స్పందించాలని కోరారు.

గోవాడలో సుపరిపాలనలో తొలి అడుగు

గోవాడ (అద్దంకి) : మండలంలోని గోవాడలో తెదేపా నేతలు 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. ఏఎంసీ సంచాలకురాలు రావిపాటి రామాంజమ్మ నేతృత్వంలో ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేశారు.

సాగుకు సమాయత్తం చేసిన వర్షం

ఏల్చూరు (సంతమాగులూరు), న్యూస్‌టుడే : సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు, పుట్టావారిపాలెం గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో రైతుల్లో ఉత్సాహం నెలకొంది. ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మిరపకు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నట్లు వెల్లడించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

మార్టూరు, న్యూస్‌టుడే : మండలంలోని బొబ్బేపల్లిలో ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందినట్లు సీఐ ఎం.శేషగిరిరావు తెలిపారు. స్థానిక ముస్లిం కాలనీకి చెందిన పఠాన్ మీరాబి (25) మృతి చెందినట్లు సమాచారం అందగా మార్టూరు పోలీసులు వెళ్లి పరిశీలించారని చెప్పారు. నరసరావుపేట సమీపంలోని విప్పర్లకు చెందిన మీరాబీకి నాలుగు నెలల క్రితమే వివాహం అయిందని, భర్త కరిముల్లా పోలీసు అదుపులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

పెద్దకర్మ

జననం 11-05-1944 మరణం 10-07-2025

కీ॥శే॥ కనిగంటి అక్కయ్య

మీ ప్రేమ, ఆప్యాయత, మా జీవితాంతం మరువలేము, మీ మధురస్మృతులు, జ్ఞాపకాలు మా హృదయాల్లో ఎల్లప్పుడు పదిలంగా ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ....... అశ్రునయనాలతో

భార్య : కనిగంటి వెంకటరత్నం

తాళ్ళూరి కోటయ్య	(బావ)	- నాగేంద్రమ్మ	(చెల్లెలు)
గోరంట్ల చంద్రమౌళి	(బావ)	- చంద్రావతి	(చెల్లెలు)
యార్లగడ్డ నాగేశ్వరరావు	(బావమరిది)	- లేటు విజయలక్ష్మి	(చెల్లెలు)
బాచిన సింగయ్య	(తోడల్లుడు)	- లేటు రాజ్యలక్ష్మి	(మరదలు)
యార్లగడ్డ సుబ్బయ్య	(అల్లుడు)	- రమాదేవి	(కుమార్తె)
తాళ్ళూరి శ్రీనివాసరావు	(అల్లుడు)	- ఉషారాణి	(కుమార్తె)

మనుమళ్ళు, మనుమరాళ్ళు మరియు కుటుంబసభ్యులు

పెద్దకర్మ : ది: 21-07-2025 సోమవారం నాడు కారంచేడు గ్రామం కారంచేడు మండలంలోని మాస్వగృహము నందు జరుగును.

(c) eenadu

ఈనాడు చిత్తూరు

సోమవారం జులై 21, 2025

ఆలయంలో భక్తుల రద్దీ

గంగమ్మ సన్నిధి.. వరాల పెన్నిధి

ఒక్క రోజు ఆదాయం రూ.22.44 లక్షలు

తన సన్నిధి.. వరాల పెన్నిధిగా ప్రసిద్ధి చెందిన బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. రణభేరి గంగమ్మ ఆలయం నుంచి ప్రధాన ఆలయం వరకు కాలినడకన వచ్చే భక్తులు పలికే ఆదిశక్తి నామాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. సర్వ దర్శనానికి సుమారు 3 గంటలు సమయం భక్తులు క్యూలైన్లో నిరీక్షించారు. రూ.200, రూ.500 టిక్కెట్ల దర్శనాల క్యూలైన్లు సైతం కిక్కిరిశాయి. రద్దీ పెరగడంతో వీఐపీల దర్శనాలు రద్దు చేస్తూ ఈవో ఏకాంబరం ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక దర్శన టిక్కెట్లు, ప్రసాదాల నుంచి ఒక్క రోజు ఆదాయం రూ.22.44 లక్షలు సమకూరింది.

– న్యూస్‌టుడే, చౌడేపల్లె

◆ చిత్తూరు నగరపాలికలో గత ప్రభుత్వ హయాంలో పన్నుల విధింపు సమయంలో వైకాపా పాలకుల ఒత్తిడులకు తలొగ్గి ఆ పార్టీ నాయకుల గృహాలకు, వాణిజ్య సముదాయాలకు భారీగా పన్ను తగ్గించేశారు. ఇదే సమయంలో రెవెన్యూ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు.

◆ తిరుపతి నగరపాలక సంస్థలో గత ప్రభుత్వ హయాంలో పన్నుల మదింపులో అవినీతి, అక్రమాలకు సంబంధించి ప్రభుత్వానికి ఫిర్యాదులందాయి. అనంతపురం ఆర్డీ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. నగరంలోని ఒక డివిజన్‌లో రూ.20లక్షల వరకు పన్ను మదింపులో చేతులు మారినట్లు తనిఖీల్లో వెల్లడైంది.

◆ సూళ్లూరుపేట మున్సిపాలిటీలో పట్టణ ప్రణాళిక, రెవెన్యూ విభాగంలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు అవినీతి నిరోధకశాఖ అధికారులు గుర్తించారు. ఇంటి నిర్మాణం పేరుతో భవనాన్ని నిర్మించి వాణిజ్యపరంగా వినియోగించడాన్ని అధికారులు గుర్తించారు. అప్పట్లో ఏసీబీ అధికారులు 125 భవనాలపై ఛార్జిషీటు దాఖలు చేసి చర్యలు చేపట్టారు. గూడూరు, నాయుడుపేట మున్సిపాలిటీల్లోనూ ఇలాంటి ఘటనలే ఉన్నాయి.

పుత్తూరు పురపాలిక

తలొగ్గి.. తగ్గించి

◆ ఆస్తి పన్ను మదింపులో చేతివాటం

◆ వైకాపా ప్రభుత్వ హయాంలో అన్నీ అక్రమాలే

పుత్తూరు, సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో పురపాలకశాఖ రాబడికి భారీగా గండిపడింది. పురపాలికలు, నగరపాలక సంస్థల్లో ఆస్తిపన్ను మదింపులో వైకాపా నేతల మాటే చెల్లుబాటైంది. నేతల ఇష్టారాజ్యంతో కొన్ని చోట్ల భవనాలకు ఆస్తిపన్ను విధించలేదు. మరి కొన్ని చోట్ల నామమాత్రపు పన్నులు విధించి చేతులు దులుపుకొన్నారు. కూటమి ప్రభుత్వం ఆస్తిపన్ను మదింపుపై ఇంటింటి సర్వే చేయాలని మార్గదర్శకాలిచ్చి ఆ దిశగా చర్యలు చేపట్టడంతో అక్రమాలు వెలుగుచూస్తున్నాయి.

పురపాలికలకు ఆర్థికంగా వెసులుబాటు

ప్రభుత్వం చేపడుతున్న సర్వే పూర్తయితే మున్సిపాలిటీలకు ఆర్థిక వెసులుబాటు కలగనుంది. తక్కువ పన్నుతో లబ్ధి పొందుతున్న వారి గుర్తింపు జరిగితే వారికి పన్నులు విధించడం ద్వారా నగరపాలికలు, పురపాలికలకు రూ.కోట్లల్లో ఆదాయం సమకూరే అవకాశం ఉంది. దీంతో ఆర్థిక పరిపుష్టి కలగనుంది.

రాష్ట్ర వ్యాప్తంగా సర్వే

నగరపాలికలు, పురపాలికల్లో ఆస్తి పన్ను మదింపులో అవినీతి, అక్రమాలపై సర్వే చేస్తున్నాం. అక్రమాలు తేలితే అధికారులు, సిబ్బందిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– విశ్వనాథ్, ఇన్‌ఛార్జి ఆర్డీ, అనంతపురం

సంబరం కలకాలం నిలిచేలా స్వీయచిత్రం

సెల్ఫీ పాయింట్‌లో పట్టాలతో యువతులు

పట్టా ప్రదానం చేసి.. ఛాత్రుని ప్రోత్సహిస్తున్న ఐఐటీ డైరెక్టర్

విజ్ఞానగిరి.. భక్తజన ఝరి

మార్మోగిన హరోహర నామస్మరణ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మురుగనికు హరోహర.. స్కందునికు హరోహర అంటూ శ్రీకాళహస్తి పులకించిపోయింది. ఆడికృత్తిక వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం విజ్ఞానగిరి భక్తజన ఝరిగా మారిపోయింది. కొండపై కొలువుదీరిన కుమారస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్కందునికి ప్రీతికరమైన ఆడికృత్తిక సందర్భంగా భక్తులు పసుపు వస్త్రాలు ధరించి.. భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించి.. కావళ్లు పట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీవళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఇంద్రవిమానాన్ని అధిరోహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

కావడితో వెళ్తున్న చిన్నారి

ఇంద్ర విమానంపై కొలువుదీరిన శ్రీవళ్లీ, దేవసేన సమేత చెంగల్వరాయస్వామి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి ఆదివారం సాయంత్రానికి భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోయి ఏటీజీహెచ్ వరకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వీరికి దాదాపు 12 గంటల్లో, రూ.300 ఎస్ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని 90,011 మంది భక్తులు దర్శించుకోగా రూ.4.23 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

29న గరుడ పంచమి

తిరుమల, న్యూస్‌టుడే: ఈ నెల 29న మంగళవారం గరుడ పంచమి పర్వదినం తిరుమలలో జరగనుంది. ఈ సందర్భంగా రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శ్రీమలయప్ప స్వామివారు తనకు ఇష్టమైన గరుడునిపై తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహిస్తారు. ఈ నెలలో స్వామివారు రెండోసారి గరుడ వాహనంపై దర్శనమివ్వనున్నారు.

మేమే ఐఐటీయన్లం

▪ ఘనంగా ఏడో స్నాతకోత్సవం

▪ ప్రాంగణమంతా కుటుంబ సభ్యులతో విద్యార్థుల సందడి

కుటుంబ సభ్యులతో బంగారుపాళ్యం విద్యార్థి వెంకటేష్ ● ఫొటో బూత్‌లో..

ఏర్పేడు, శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఐఐటీ ఏడో స్నాతకోత్సవంలో పట్టభద్రులు సంతోషాలతో సంబరాలు జరుపుకొన్నారు. కుటుంబ సమేతంగా ఐఐటీ ప్రాంగణానికి చేరుకుని ఫొటో బూత్‌ల వద్ద కాలం పదిలంగా మదిలో ఉండేలా స్వీయచిత్రాలు తీసుకున్నారు. ఆచార్యుల ఆశీర్వచనాలు పొందడంతో పాటు తోటి విద్యార్థులతో కలిసి సందడి చేశారు. మేమే 'ఐఐటీయన్లమని కేరింతలతో ఐఐటీ ప్రాంగణం సందడిగా మారింది. కొందరు పరిశోధన విద్యార్థులు పిల్లలతో కలిసి స్నాతకోత్సవానికి హాజరుకాగా మరికొందరు తల్లిదండ్రులు, బంధువులు, ఆప్తులతో కలిసి పాల్గొన్నారు.

కుమారుడికి తల దువ్వుతూ..

పట్టుబట్టి పట్టా సాధించాడు

తల్లి చిట్టెమ్మతో అనిల్‌కుమార్

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అయ్యగార్లపల్లికి చెందిన అనిల్‌కుమార్ పట్టుదలతో చదువుల్లో రాణించి ఐఐటీ పట్టా పొందాడు. పేదల కుటుంబం. తండ్రి అంజయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ బాధ్యత తల్లి చిట్టెమ్మ తీసుకున్నారు. ఉన్న మూడెకరాల్లో రెండు ఎకరాలు అమ్మేశారు. మిగిలిన ఎకరాలో సాగు చేస్తూ.. కూలి పనులకు వెళ్లి తన ఇద్దరు బిడ్డలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేశారు. ఈ నేపథ్యంలో రెండో కుమారుడైన అనిల్ ఐఐటీలో సీటు సాధించడంతో కాకుండా ఉత్తీర్ణుడై పట్టా సాధించాడు. ఆదివారం బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం రావడంతో నెలకు రూ.88వేలు ఆర్జిస్తున్నాడు. కుమారుని ప్రయోజకుడిగా మారడంతో తల్లి చిట్టెమ్మ ఆనందం వ్యక్తం చేశారు.

వేదికపై ముఖ్యఅతిథులు లక్ష్మీనారాయణన్, సజ్జన్ జిందాల్, డైరెక్టర్ సత్యనారాయణ, వివిధ విభాగాధిపతులు

బుజ్జాయిలకు బేబీ కిట్..!

పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం సిద్ధం

పుంగనూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్యశాలల్లో జన్మించే చిన్నారులకు రక్షణ కల్పించేందుకు ఎన్టీఆర్ బేబీ కిట్లు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. అధికారంలో ఉన్నంత కాలం అమలైంది. అనంతరం గద్దెనెక్కిన వైకాపా.. ఈ పథకం పూర్తిగా ముక్కుబడిగా అమలు చేసింది. 2021 నుంచి పూర్తిగా నిలిపేసింది. దీంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

11 రకాల వస్తువులు

కూటమి ప్రభుత్వం అందించనున్న ఎన్టీఆర్ కిట్‌లో మొత్తం 11 రకాల వస్తువులు ఉంటాయి. శిశువు పడుకునేందుకు వీలుగా బెడ్, దోమతెర, చేతులు శుభ్రం చేసుకునే ద్రావణం, సోప్, న్యాప్‌కిన్, రెండు తువ్వాళ్లు, బొమ్మతో పాటు మరికొన్ని వస్తువులు కిట్‌లో ఉంటాయి. ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు పెంచాలనే ఉద్దేశంతో ఈ కిట్ల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది.

పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డు

జిల్లా వివరాలిలా..

జిల్లా ఆస్పత్రి : ఒకటి ఏరియా ఆస్పత్రులు : 4
సీహెచ్‌సీలు : 6 పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలు: 71
ఆస్పత్రుల్లో ఏటా ప్రసవాలు: సుమారు 7 వేలు
మార్కెట్‌లో బేబీ కిట్ ఖరీదు: రూ.1,500 నుంచి రూ.2వేలు

రుగ్మతల బారినపడే అవకాశం

ప్రసవం అయిన తర్వాత పిల్లల సంరక్షణపై ప్రత్యేక దృష్టి అవసరం. దుస్తులు, వ్యక్తిగత శుభ్రత లేకపోయినా నవజాత శిశువులు రుగ్మతల బారినపడే ప్రమాదముంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పేదలకు ప్రయోజనం చేకూరుతోంది.

– డా.హరగోపాల్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, పుంగనూరు

మహిళల జీవితాల్లో దీపం వెలుగులు

◆ రెండో విడతలో రూ.22.50 కోట్లు జమ

◆ తొలివిడత నమోదుకు నెలాఖరుతో ముగింపు

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: దీపం-2 పథకంలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం తొలి విడత ఉచిత గ్యాస్ సిలిండర్ నమోదు ప్రక్రియ ఈ నెలాఖరుతో ముగియనుంది. ఏటా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

దీపం-2 పథకం కింద తొలివిడతగా 3.34 లక్షల గ్యాస్ కనెక్షన్లకుగాను రాయితీ నగదు రూ.27.72 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రెండో విడతలో 3,31,734 గ్యాస్ లబ్ధిదారులకు రూ.22,50,16,077 జమయింది. సిలిండర్ కోసం వివరాలు నమోదు చేసుకున్న రెండు రోజుల్లో వినియోగదారుడికి చేరుతుంది. ఇందుకు మొదట నగదు చెల్లించాలి. తర్వాత 48 గంటల్లోనే వినియోగదారుడి ఖాతాలోకి ఆ మొత్తాన్ని ప్రభుత్వం జమ చేస్తుంది. ఏదైనా సమస్యలు ఎదురైనా.. వినియోగదారులు ఫిర్యాదు చేసినా.. పౌరసరఫరాల శాఖ, గ్యాస్ ఏజెన్సీలు వెంటనే పరిశీలించి పరిష్కరిస్తున్నాయి. రాయితీ నగదు జమ కాకుంటే వినియోగదారులు ఫిర్యాదు చేసేలా ప్రభుత్వం వీలు కల్పించింది.

నగదు పడకుంటే..

సిలిండరు తీసుకున్న తర్వాత రాయితీ జమ కాకుంటే 1967 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి సమస్య తెలియజేయొచ్చు. తొలుత వినియోగదారుడుగ్యాస్ ఏజెన్సీని సంప్రదించాలి. అక్కడ ఈకేవైసీ చేయించుకోవాలి. ఆ తర్వాత సదరు బ్యాంకుకు వెళితే ఎన్‌పీసీఐ మ్యాపింగ్ ప్రక్రియ చేపడతారు. అనంతరం రాయితీకి అర్హత నగదు ఖాతాల్లోకి జమవుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి

దీపం-2లో ఈ ఏడాది తొలి విడత ఉచిత గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ఈ నెలాఖరుతో ముగియనుంది. లబ్ధిదారులు అందరూ సిలిండర్లు బుక్ చేసుకోవాలి. 48 గంటల్లో రాయితీ నగదు ఖాతాల్లో జమవుతుంది.

– శంకరన్, డీఎస్‌వో

■ గతేడాది ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయంలో విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. జూనియర్‌ను సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. అధికారులు, పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ర్యాగింగ్ భూతానికి దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు.

■ ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ వరండాలో క్రికెట్ ఆడుతున్న సీనియర్లను జూనియర్ ప్రశ్నించడంతో వివాదం నెలకొని కొట్టుకున్నారు. సీఐ రామయ్య కౌన్సెలింగ్ ఇచ్చి.. ర్యాగింగ్ కమిటీ ఏర్పాటుకు సహకరించారు.

ర్యాగింగ్.. ఆదిలోనే అరికడదాం..!

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: విద్యార్థుల మధ్య ఆధిపత్య పోరుతో ర్యాగింగ్ భూతం జడలు విప్పుతోంది. రెండేళ్లుగా పలు కళాశాలల్లో ర్యాగింగ్ జరుగుతున్నా.. వెలుగులోకి రాలేదు. చిన్న విషయాలే కాబట్టి విద్యార్థుల జీవితాలు నాశనం చేయడమెందుకని కేసులు పెట్టకుండా హెచ్చరించి వదిలేశారు. విద్యాక్షేత్రంగా విరాజిల్లుతున్న తిరుపతిలోని వర్సిటీలు, ఇంటర్, డిగ్రీ, బీటెక్, వైద్య కళాశాలల్లో ఏదోరూపంలో జడలు విప్పుతున్న ర్యాగింగ్ భూతాన్ని యాజమాన్యాలు బహిర్గతం కానివ్వడం లేదు. దీనికి ఆస్కారమే లేకుండా

కమిటీల ఏర్పాటు, బలోపేతం కీలకం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్

'ర్యాగింగ్ నిర్మూలన కమిటీ' ప్రతి కళాశాలలో ఏర్పాటు చేయాల్సి ఉంది. కొన్నిచోట్ల నామమాత్రంగా.. ఎక్కువ కళాశాలల్లో కమిటీల ఊసే లేని పరిస్థితుల్లో అధికారులు ఆది నుంచే అప్రమత్తం కావాల్సి ఉంది.

కమిటీలో ఎవరుంటారంటే..

ర్యాగింగ్ నిర్మూలన కమిటీ ఛైర్మన్‌గా కళాశాల ప్రిన్సిపల్ లేదా సంచాలకులు ఉంటారు. పలు విభాగాల సీనియర్ అధ్యాపకులు ఒకరిద్దరు.. ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులు ప్రతినిధులుగా ఉండాలి. స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో సభ్యులుగా ఉండాలి. విద్యార్థుల తల్లిదండ్రులు, సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు సభ్యులుగా ఉండవచ్చు.

బాధ్యతలు ఇలా..

ర్యాగింగ్‌కు ఆస్కారం లేకుండా పర్యవేక్షించాలి. అలాంటివి ఉంటే కమిటీలోని ఉన్నతస్థాయి అధికారి దృష్టికి తీసుకెళ్లాలి. ర్యాగింగ్ వల్ల కలిగే దుష్పరిణామాలు, కేసుల్లో చిక్కుకుంటే ఎదురయ్యే పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. బాధితులకు అండగా నిలవాలి. ఫిర్యాదుల స్వీకరణకు వీలు కల్పించాలి. టోల్‌ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించాలి.

సదస్సులు నిర్వహిస్తున్నాం

శక్తి టీమ్స్, ఈగల్ క్లబ్‌లతో కలసి తరచూ కళాశాలలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. కమిటీలు ఎలాంటి చర్యలు చేపట్టాలో సూచిస్తున్నాం. బహిరంగ ప్రదేశాల్లో ఎలా ప్రవర్తించాలి.. ర్యాగింగ్‌తోపాటు గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరిస్తున్నాం. శక్తి యాప్ డౌన్‌లోడ్ చేయించి ఎలా వినియోగించాలో తెలియజేస్తున్నాం.

– ఎం.శ్రీలత, మహిళా డీఎస్పీ, తిరుపతి

ప్రభుత్వ చొరవ.. దిగొచ్చిన వ్యాపారులు..!

పలమనేరు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎరువుల వ్యాపారులు ప్రభుత్వ చొరవతో దిగొచ్చారు. యూరియా అడిగిన రైతుల నుంచి వ్యాపారులు అధిక మొత్తంలో వసూలు చేస్తుండటంతో అధికారులు ఇటీవల దుకాణాలపై దాడులు చేసి హెచ్చరించారు. దీంతో వ్యాపారులు యూరియాను నిర్ణీత ధరలకే విక్రయిస్తున్నారు.

స్థానికంగా ఉన్న ఎరువుల వ్యాపారులు తమ వద్ద నిల్వ ఉంచుకున్న కాంప్లెక్స్ ఎరువులను కొంటేనే యూరియా ఇస్తామనే నిబంధనలు పెట్టడంతో తప్పని పరిస్థితిలో కొనుగోలు చేసేవారు. మరికొందరు రైతులు అంత డబ్బు వెచ్చించుకోలేక పక్కనే ఉన్న కర్ణాటకకు వెళ్లి ఒకటి రెండు బస్తాలను ద్విచక్ర వాహనంలో తెచ్చుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో కూటమి ప్రభుత్వం చొరవతో ఇటీవల అధికారులు దుకాణాలపై దాడులు చేయడంతో యూరియా ధరలు దిగొచ్చాయి.

ఇదీ పరిస్థితి..

సాధారణంగా పరిశ్రమ నుంచి ఎరువులు నేరుగా ప్రధాన డీలర్లకు అక్కడి నుంచి ద్వితీయ శ్రేణి ట్రేడర్లకు చేరుతాయి. ఈ ప్రక్రియలో ప్రతి బస్తాకు ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు అదనం. ఉదాహరణకు.. రేణిగుంట ప్రధాన డీలరు నుంచి కుప్పంలోని రిటైలర్‌కు చేర్చడానికి బస్తాకు రూ.60, వి.కోటకు రూ.40 ఇలా ప్రాంతాన్ని బట్టి ఛార్జీలు ఉంటాయి. కానీ ఈ ఛార్జీలను అధికంగా చూపి యూరియా బస్తా ధర రూ.260 ఉంటే రూ.600 వరకు పెంచుతున్నారు.

స్టాక్ ఉన్నా లేదంటూ..

కొందరు ఇప్పటికీ స్టాక్ ఉన్నా.. లేదని చెబుతుండటం గమనార్హం. తమ వద్ద ఉన్న యూరియాను భద్రపరిచి మరికొన్ని రోజుల తర్వాత అధిక ధరకు విక్రయించే పనిలో ఉన్నారనే విమర్శలు లేకపోలేదు.

వ్యాపారులు యూరియాను నిల్వ చేయకుండా చూస్తామని.. నిర్ణీత ధరకే యూరియా విక్రయించేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారిణి సంధ్య తెలిపారు.

తితిదే కళాశాలల్లో.. ఇంటర్ స్పాట్ ప్రవేశాలపై పీటముడి

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తితిదే జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ ఎంతకూ కొలిక్కి రావడం లేదు. ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియ ముగించి 20 రోజులు గడుస్తున్నా స్పాట్ ప్రవేశాలు తేల్చకపోవడం, సమాధానం చెప్పేవారు లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తితిదే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీపద్మావతి, ఎస్వీ జూనియర్ కళాశాలల ప్రవేశాలకు గత నెల 9 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. ఆ వెంటనే మిగిలిన సీట్లకు స్పాట్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించాల్సి ఉండగా జాప్యం నెలంది. దీనిపై కనీస సమాచారం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు ప్రైవేటులో చేరలేక ఇటు తితిదే కళాశాలల్లో సీటు వస్తుందో రాదో తెలియక నలిగిపోతున్నారు.

యూనిట్ టెస్ట్ పూర్తయినా..

ఇంటర్ విద్యార్థులకు ఈ నెల 17న విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం యూనిట్ టెస్ట్-1 పూర్తయింది. మరోవైపు ఇంటర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందంటూ అధికారులు ప్రకటిస్తుండటం గమనార్హం. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని త్వరితగతిన ప్రవేశాలకు ముగింపు పలకాలన్న విన్నపాలు వెల్లువెత్తుతున్నాయి.

యువత.. సామాజిక బాధ్యత

పెనుమూరు, న్యూస్‌టుడే: మండలంలోని పర్యాటక ప్రాంతమైన పులిగుండు పైభాగం, పరిసరాల్లో చిత్తూరుకు చెందిన యువత, ప్రజలు ఆదివారం స్వచ్ఛందంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని చిత్తూరులోని గ్లామ్స్ స్టుడియో నిర్వాహకులు రాజ్‌కమల్ నేతృత్వంలో నిర్వహించారు. ఇటీవల ఆయన పులిగుండును సందర్శించిన సమయంలో అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు అపరిశుభ్రంగా ఉండడాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని స్నేహితులు, ఇన్‌స్టాగ్రాం ఇన్‌ఫ్లూయెన్సర్స్ బృందం సభ్యులకు తెలిపారు. దీంతో సుమారు 40 మంది యువతీ యువకులు పులిగుండు వద్దకు చేరుకుని పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించారు. వాటిని సుమారు యాభై బస్తాల్లో నింపి తాడు సాయంతో కిందకు దింపారు. వ్యర్థాలను ట్రాక్టర్‌లో ఉంచి పెనుమూరు డంపింగ్ యార్డుకు తరలించారు. స్థానిక ఎస్సై రామచంద్రయ్య, సిబ్బంది సహకరించారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

చిత్తూరు కలెక్టరేట్: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోనూ అర్జీలు నమోదు చేసుకోవచ్చని, అర్జీల స్థితి గురించి తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో..

చిత్తూరు (నేరవార్తలు): జిల్లా ఏఆర్(పాత డీపీవో) కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

పట్టీలు కావాలని వచ్చి.. బంగారం కొట్టేసి

◆ ఇద్దరు మహిళల చేతివాటం ◆ సీసీ కెమెరా ఫుటేజీల్లో వెలుగులోకి

నాగలాపురం, న్యూస్‌టుడే: పట్టీలు కావాలని నగల దుకాణానికి వచ్చిన ఇద్దరు మహిళలు వ్యాపారి ఏమరుపాటుగా ఉన్న సమయంలో బంగారం కాజేసి జారుకున్న ఘటన సీసీ కెమెరా ఫుటేజీలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. నాగలాపురంలోని మహావీర్ బంగారు నగల దుకాణానికి శనివారం మధ్యాహ్నం ఇద్దరు మహిళలు వెండి కాళ్లపట్టీలు కావాలని వచ్చారు. దుకాణ యజమాని జష్‌రాజ్ వాటిని తీస్తుండగా గోడకు ఉంచిన 12 గ్రాముల బరువైన రెండు బంగారు గొలుసులను తీసిన వారు లోదుస్తుల్లో పెట్టుకుని వెళ్లిపోయారు.

దుండగుల దుశ్చర్యతో..

ఆదివారం ఉదయం దుకాణ షట్టర్ల తాళాల ధ్వంసానికి విఫలయత్నం జరిగి ఉండటాన్ని గమనించిన స్థానికులు చెప్పడంతో జష్‌రాజ్ సీసీ కెమెరాల పుటేజీ చూశారు. అందులో శనివారం అర్ధరాత్రి దాటాక ఇద్దరు యువకులు దుకాణ షట్టర్ తాళాలను గడ్డపారతో విరగొట్టడానికి యత్నించిన దృశ్యం కన్పించింది. ఎంతకీ తాళాలు పగలకపోవడంతో వారు వెళ్లిపోయారు. అలా సీసీ కెమెరాల పుటేజీ చూడగా శనివారం మధ్యాహ్నం ఇద్దరు మహిళలు చేసిన చోరీ దృశ్యం కూడా కన్పించడంతో ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమగ్రంగా విచారించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

చోరీ చేస్తున్న మహిళ (సీసీ కెమెరాలో దృశ్యం)

104FM Tirupati

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008555167, 9000180635

(c) eenadu

శ్రమించాం.. గెలిచాం.. నిలిచాం..

తిరుపతి ఐఐటీయన్ల మనోగతం

పట్టాలు, బంగారు పతకాలు పొందిన విద్యార్థులు

ఏర్పేడు, శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఎంతో శ్రమించారు.. తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చేలా.. చివరికి విజయతీరాలను చేరుకున్నారు. ఈ పయనంలో కొలువులు సాధించారు.. జీవితంలో తిరుగులేదనిపించారు. ఇక సాంకేతిక రంగంలో తమదైన రీతిలో రాణిస్తామని ధీమాగా చెబుతున్నారు తిరుపతి ఐఐటీలో పట్టభద్రులైన విద్యార్థులు. మూడోతరం ఐఐటీ అయినప్పటికీ ప్రపంచ దేశాలకు ఆదర్శవంతంగా నిలిచేలా చాటిచెబుతామని ప్రతిజ్ఞబూనారు. ఈ నేపథ్యంలోనే పలువురు 'ఈనాడు- ఈటీవీ'తో తమ లక్ష్యాలను పంచుకున్నారు. ఆ విశేషాలు వారి మాటల్లోనే..

గొప్ప శాస్త్రవేత్తగా ఎదుగుతా

మాది బెంగళూరు. నాన్న విక్రాంత ఉద్యోగి, అమ్మ రాధ గృహిణి. కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తిచేశాను. పాలింగ్‌గేడింగ్ అల్గారిథంలో మార్పులు, ఉపయోగాలపై పరిశోధన చేశాను. ఐఐటీలో అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రతిభను కనబరచడంతో నాకు ప్రెసిడెంట్ మెడల్ రావడం ఆనందంగా ఉంది. అమ్మ, తాతతో సాధించాన్ని పంచుకున్నాను. మరిన్ని పరిశోధనలు జరిపి కొత్త సాంకేతిక విధానాన్ని రూపొందించాలన్నదే నా లక్ష్యం.

- అరవింద్ శ్రీనివాసన్, ప్రెసిడెంట్ మెడల్ గ్రహీత

కెమికల్ ఇంజినీర్‌గా రాణిస్తా

మాది తమిళనాడు. నాన్న మురుగన్, అమ్మ చిత్ర. నేను ఐఐటీలో కెమికల్ ఇంజినీరింగ్ పూర్తిచేయడంతో పాటు గవర్నర్ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. బయోసెన్సార్ విభాగంపై చేసిన పరిశోధన సంతృప్తినిచ్చింది. ఐఐటీ మద్రాస్‌లో ఎంటెక్ పూర్తిచేసి కెమికల్ ఇంజినీర్‌గా రాణించాలన్నదే నా లక్ష్యం.

- మేఘవర్షిణి, గవర్నర్ మెడల్ అవార్డు గ్రహీత

వృథానీటికి అడ్డుకట్ట

మాది గుంటూరు. వచ్చే కిందట తిరుపతి ఐఐటీలో అడుగుపెట్టాను. వినియోగించిన నీటిని నదులు, చెరువుల్లోకి విడుదల చేస్తుండటంతో నీరు కాలుష్యం అధికంగా మారుతుంది. నీటి వృథాకు అడ్డుకట్ట మురుగునీటిని ట్రీట్ చేసేలా పరిశోధనలు చేశాను. ప్రస్తుతం యూఎస్‌లో అగ్రికల్చర్ పరిశోధన సంస్థలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నా. ఐండియాకు తిరిగి వచ్చి ఇక్కడ పరిశోధన సంస్థలో శాస్త్రవేత్తగా చేరి వ్యవసాయాభివృద్ధి, నీటిశుద్ధిని పెంపొందించేందుకు కృషి చేస్తా. ఐఐటీ నుంచి ఉత్తమ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. **- షేక్ మహ్మద్ అల్లాబక్ష్**

గూగుల్‌లో ఉద్యోగం వచ్చింది

మాది హైదరాబాద్. ఐఐటీ తిరుపతిలో కంప్యూటర్ సైన్స్ విద్యను పూర్తిచేశాను. ఈనేపథ్యంలో ఐఐటీ ప్లేస్‌మెంట్లలో గూగుల్ సంస్థలో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం నెలకు రూ.55వేలు వంతున సంపాదిస్తున్నా. తిరుపతి ఐఐటీ నాకు ఎప్పటికీ ప్రత్యేకమే. **- వర్షిత, విద్యార్థిని**

12 మండలాల్లో వర్షం

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: నైరుతి రుతుపవనాల ప్రభావంతో శనివారం రాత్రి జిల్లాలోని 12 మండలాల్లో తేలిక పాటి వర్షం కురిసింది. పాలసముద్రం మండలంలో 16.2 మి.మీటర్లు, కుప్పం 8.2, పెనుమూరు 7.4, వి.కోట 6.8, గుడిపల్లె 3.6, నగరి 3.4, శాంతిపురం 3.2, రామకుప్పం, చిత్తూరు గ్రామీణం 3.0, బైరెడ్డిపల్లె 2.2, ఎస్‌ఆర్‌పురం 1.4, పుంగనూరు 1.0 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

గణనాథుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

జస్టిస్ రవినాథ్ తిల్హరికి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో పెంచల కిషోర్

కాణిపాకం: శ్రీవర సిద్ధి వినాయకస్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదల ప్రకారం ఈవో పెంచల కిషోర్, ఆర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికి దర్శనం చేయించారు. ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక, ప్రొటోకాల్ న్యాయమూర్తి శిరీష, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, చిత్తూరు న్యాయస్థాన సిబ్బంది ఉన్నారు.

ఒప్పందం.. అభివృద్ధికి ఊతం

◆ జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఎంవోయూలు ◆ అభివృద్ధి పథంలో మహిళా వర్సిటీ



మహిళా వర్సిటీ(తిరుపతి), న్యూస్‌టుడే: మహిళలను ఉన్నత విద్యావంతులుగా, సాంకేతిక నిపుణులుగా, పారిశ్రామిక వేత్తలుగా, వృత్తి నిపుణులుగా తయారు చేస్తూ వారు సాధికారత సాధించేలా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 42ఏళ్లుగా విశిష్ట కృషి చేస్తోంది. నూతన కోర్సులు, ప్రత్యేక సెంటర్లతో అందిరికంటే ముందుంటోంది. వర్సిటీని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తూ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమామహేశ్వరి, ఉన్నతాధికారులు వివిధ సంస్థలు, విశ్వవిద్యాలయాలతో సరికొత్త మార్పులు తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా పలు దేశ, విదేశీ సంస్థలు, విశ్వవిద్యాలయాలతో మెమోరాండమ్ ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంవోయూ) చేసుకున్నారు. 2014నుంచి ఇప్పటి వరకు దేశ, విదేశాలకు చెందిన పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలతో 166 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

ఏఏ సంస్థలంటే..

హిందుస్థాన్‌కు చెందిన ఏపీ స్టేట్ సెరికల్చర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, యూనిసెఫ్‌కు చెందిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, సికింద్రాబాద్‌కు చెందిన ది ప్రతిష్ఠ ఇండస్ట్రీస్, ఇండియన్ బిజినెస్ ఇన్నోవేషన్ హబ్, న్యూ ఇక్విస్ వర్సిటీ, నవ్య ఫుడ్స్ అగ్రిఎంటెక్ ఫుడ్ ప్రాడక్ట్స్, టాటా ఫుడ్స్, శ్రీ వర్ష ఫుడ్ ప్రాడక్ట్స్, శ్రీ మంజునాథ ఫ్రూట్ కానింగ్ ఇండస్ట్రీస్, సెంటర్ ఫర్ మీడియా స్టడీస్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టాంజే, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్, యూఎస్ఏ పోమోనా వర్సిటీ, స్విస్, తానా, పద్మావతి మెడికల్ కాలేజ్, యూఎస్ఏ సున్నర ఆకాడమీ, ఎస్వీ వెటర్నరీ వర్సిటీ, స్పాండోర్ట్ బ్లెకింగ్ యూనివర్సిటీ, ఎస్వీ జూపార్క్, యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్, ఐడియాపియా జిగ్గిగా వర్సిటీ, సౌత్ కొరియా, బంగ్లాదేశ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఐసీటీ ఇన్ డెవలప్‌మెంట్, సింగపూర్ విద్య సంగీతం అకాడమి, మలేషియా లిన్‌కోల్న్ వర్సిటీ, ఇవే కాకుండా ఆస్ట్రేలియా, కొరియా, అమెరికా, స్వీడన్, ఇథియోపియా, శ్రీలంక, యూకే వంటి దేశాలకు చెందిన సంస్థలు, దేశీయ సంస్థలు కలిపి మొత్తం 166 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

ఇవీ ప్రయోజనాలు

అవగాహన ఒప్పందాలతో ఇరు సంస్థలు, వర్సిటీలకు వివిధ ఉపయోగాలున్నాయి. డ్యూయల్ డిగ్రీ, నూతన, ఉమ్మడి కోర్సుల నిర్వహణ, ఫ్యాకల్టీ సభ్యుల మార్పిడి, సహకార పరిశోధన ప్రాజెక్టులు, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సదుపాయం, నూతన ఆవిష్కరణలకు అవకాశం, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం, ప్రయోగశాలల వినియోగం, నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో పరస్పర సహకారం, ప్రాజెక్టు ప్రపోజల్స్ పంపడం, వర్క్‌షాపుల నిర్వహణ, ఉద్యోగ, ఉపాధి తదితర ప్రయోజనాలున్నాయి.

మధ్యవర్తిత్వం.. కక్షిదారులకు సువర్ణావకాశం

పుంగనూరు, న్యూస్‌టుడే: కక్షిదారులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వమే సువర్ణావకాశం. సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి జీవనం సాగిస్తే శాంతి నెలకొంటుంది. కానీ మారుతున్న కాలంలో మితిమీరిన ఆశ, క్షణికావేశం, అసూయ, కక్షలు ఎక్కువవుతున్నాయి. ఓ వైపు అపరిష్కృత కేసులు.. మరోవైపు కొత్తగా నమోదవుతున్న కేసులతో కోర్టుల్లో కేసుల భారం పెరిగిపోతోంది. ఇలాంటి సమస్యల నేపథ్యంలో న్యాయసేవాధికార సంస్థ 'జాతీయ లోక్ అదాలత్'ను నిర్వహిస్తోంది. తాజాగా మీడియేషన్, సయోధ్య ప్రాజెక్టు కమిటీ ఆదేశాలతో 'మధ్యవర్తిత్వం' ద్వారా కేసులు పరిష్కరించేలా కార్యాచరణ చేపట్టారు.

పుంగనూరులో అవగాహన ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు

సమయం, నగదు ఆదా

ఏదైనా కేసులో కోర్టుకు వెళ్లామంటే అది ఎన్నాళ్లకు పరిష్కారమవుతుందో తెలియని పరిస్థితి. కానీ లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం అందడంతో పాటు శాశ్వత పరిష్కారం లభిస్తోంది. అటు సమయం ఇటు నగదు ఆదా అవుతోంది. రాజీకి అనువైన సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుంది.

కక్షిదారులు ముందుకు రావాలి

మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి కక్షిదారులు ముందుకు రావాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. **- ఎ.చెన్నకేశవులు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, పుంగనూరు**

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి, చిత్తూరు, శ్రీకాళహస్తి, పుంగనూరు, మదనపల్లె, కుప్పం, వాల్మీకిపురం, తంబళ్లపల్లె, సత్యవేడు, పుత్తూరు, పీలేరు, పలమనేరు, పాకాల, నగరిలో ఈ ఏడాదిలో ఐదు 2024 మార్చి నుంచి 2025 జులై వరకు నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసుల వివరాలిలా..

ఏడాది	నెల	పరిష్కరించిన కేసులు
2024	మార్చి	1079
2024	జూన్	1336
2024	సెప్టెంబరు	3,629
2024	డిసెంబరు	5,317
2025	మార్చి	8,201
2025	జులై	5,098

ఘాట్‌రోడ్డులో ఎలుగుబంటి సంచారం

ఘాట్‌రోడ్డుకు సమీపంలో ఎలుగు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల మొదటి ఘాట్ రోడ్డు సమీపంలో ఓ ఎలుగుబంటి కలకలం సృష్టించిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. కపిల తీర్థం ఆలయంపైన ఉన్న కొండ ప్రాంతంలో ఎలుగుబంటి సంచారాన్ని మొదటి ఘాట్‌రోడ్డులో వాహనాల్లో వెళ్తున్న భక్తులు గుర్తించారు. ఈ విషయాన్ని తితిదే అటవీశాఖకు సమాచారం అందించారు. అనంతరం కొంతసేపటికి ఎలుగుబంటి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది.

గుజ్జు పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాలు పాటించని మామిడి గుజ్జు పరిశ్రమలు, ర్యాంపులపై చర్యలు తీసుకోవాలని మామిడి సంక్షేమ సంఘం జిల్లా కమిటీ నాయకులు తీర్మానించారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ భవనంలో మామిడి సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ కన్వీనర్లు జనార్దన్, ఆనందనాయుడు, మునీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తోతాపురి మామిడి కిలోకు రూ.12 అందజేస్తామని.. ఇందులో గుజ్జు పరిశ్రమలు రూ.8, ప్రోత్సాహక నగదుగా ప్రభుత్వం రూ.4 చెల్లిస్తామని సీఎం ప్రకటించారన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని పాటించని వారిపై చర్యలకు ఉపక్రమించాలని కోరారు. ఈ నెల 22న స్థానిక జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రపంచ మామిడి దినోత్సవానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని జయప్రదం చేయాలని కోరారు. కమిటీ సభ్యులు హరిబాబుచౌదరి, సంజీవరెడ్డి, లవకుమార్, ఓబుల్ రాజు, మునిరత్నంనాయుడు, చంద్రమౌళిరెడ్డి, గంగరాజు పాల్గొన్నారు.

సమావేశంలో కమిటీ సభ్యులు

మార్కెటింగ్ శాఖ ఆదాయం రూ.2.76 కోట్లు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లా మార్కెటింగ్ శాఖకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.2.76 కోట్ల ఆదాయం సమకూరిందని ఆ శాఖ జేడీ రామాంజనేయులు తెలిపారు. జిల్లాలో 10 వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. పంటల ఉత్పత్తుల నుంచి సెస్ వసూళ్లు, వాణిజ్య సముదాయాలు, గోదాముల అద్దెల ద్వారా కమిటీలకు ఆదాయం సమకూరుతోంది. ఈ ఏడాది మార్కెటింగ్ శాఖ ఆదాయ లక్ష్యం రూ.10.39 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

శునకం పాలు.. దూడకు మురిపాలు

తల్లి అనే పదం ఏ జీవికైనా ఒకటే.. కొన్నిసార్లు బద్ధ శత్రువులైన మూగజీవాలు కూడా తల్లి ప్రేమ ముందు ఒక్కోసారి సహజ గుణం కోల్పోతుంటాయి. ఇలాంటి ఘటనే చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె మండలం జంగాల అగ్రహారంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ప్రశాంత్ ఇంట్లో ఓ దూడ తన చెంతకొచ్చిన కుక్క దగ్గర పాలు తాగుతూ కనిపించింది. ఇలాంటి ఘటనే వి.కోట మండలంలోనూ చోటుచేసుకుంది.

- న్యూస్‌టుడే, పలమనేరు, వి.కోట

గోవిందుడిని స్మరించి.. తిరునామం ధరించి

శ్రీవారి భక్తులకు సేవ చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి తిరుమలకు వస్తుంటారు. అయితే అందులో కొందరు తమ ప్రత్యేకత చాటుతున్నారు. అలాంటి కోవలోకే వస్తారు తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా పెద్దపల్లికి చెందిన నాగరాజు శర్మ. భక్తులచే గోవింద నామాలు పలికిస్తూ వాటిని తన మైక్ ద్వారా అందరికీ వినిపించేలా చేస్తూ వారికి తిరు నామాలు దిద్దుతున్నారు. తద్వారా భక్తులు ఆసక్తిగా ఆయన వద్దకు చేరుకుని తిరునామాలు పెట్టించుకోవడంతోపాటు గోవింద నామాలు పలుకుతూ స్మరిస్తూ ఆధ్యాత్మిక అనుభూతి పొందుతున్నారు. **- న్యూస్‌టుడే, తిరుమల**

వరుణదేవ.. కరుణించవా..!

సాగు, తాగునీరు లేక గుడుపల్లె ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం గుడుపల్లె పంచాయతీ ఇరిసిగానిపల్లె వాసులు కుటుంబ సమేతంగా ఎండిపోయిన గౌని చెరువుకు చేరుకుని వరుణదేవుడికి పూజలు చేశారు. వరుణదేవ.. కరుణించవా అంటూ వేడుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం అక్కడే సహపంక్తి భోజనాలు చేశారు. **- న్యూస్‌టుడే, గుడుపల్లె**

శ్రీవారి ఆలయం ఎదుట వికాస్ సింగ్ తదితరులు

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్‌సింగ్ ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

డీలర్ల సమాఖ్యలో చోటు.. తిరుపతి(రెవెన్యూ): రాష్ట్ర రేషన్ డీలర్ల సమాఖ్యలో జిల్లాకు చెందిన ముగ్గురికి చోటు లభించింది. విజయవాడలో ఆదివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా చెర్లోపల్లికి చెందిన కోటీశ్వరనాయుడు, ఉపాధ్యక్షులుగా వెంకటేష్‌రెడ్డి, హేమలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మునగాకు కోస్తూ విద్యుదాఘాతంతో యువకుడి మృతి

లోకేశ్ (పాతచిత్రం)

గంగాధర నెల్లూరు, న్యూస్‌టుడే: మిట్టకొత్తూరులో ఆదివారం మునగాకు కోస్తూ లోకేశ్ (31) అనే వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. వరదరాజులనాయుడు కుమారుడైన లోకేశ్ పొలం వద్ద ఉన్న మునగచెట్టు ఎక్కి ఆకు కోస్తుండగా, చెట్టుపై వెళ్తున్న విద్యుత్తు తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. కుటుంబీకులు చిత్తూరు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సీఐ శ్రీనివాసంతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● **పండుగ రోజే విషాదం:** వరదరాజులనాయుడుకు ఏడాది క్రితం ఇందుప్రియ అనే యువతితో వివాహమైంది. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి. ఆదివారం ఆడికృత్తిక కోసం మామతో కలిసి పొలం వద్ద మునగచెట్టు ఎక్కి మృత్యువాత పడటంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఇందుప్రియను ఓదార్చడం బంధుమిత్రులు, గ్రామస్థుల వల్ల కాలేదు. మేస్త్రి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించే లోకేశ్ మృతితో ఆ కుటుంబం వీధిన పడింది.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

తొట్టంబేడు, న్యూస్‌టుడే: భార్య అలిగి వెళ్లిందని ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన శ్రీకాళహస్తిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు.. స్థానిక కుందేటివారివీధికి చెందిన చిన్నప్పరెడ్డి (64) బీడీ కార్మికుడిగా పనిచేస్తుంటారు. మద్యానికి బానిసైన ఈయన తరచూ తాగొచ్చి భార్యతో గొడవకు దిగేవారు. ఈ నేపథ్యంలో శనివారం భార్యతో గొడవపడగా అతనితో ఉండలేనంటూ సమీపంలో కాపురముంటున్న కుమారుడి ఇంటికెళ్లింది. మనస్తాపానికి గురైన చిన్నప్పరెడ్డి చీరతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. కుటుంబీకులు ఆయన్ను శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందారని వైద్యులు నిర్ధారించారు. కుటుంబీకులు ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పంచనామా అనంతరం వారికి అప్పగించామని సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

ఏడాదిగా బెదిరిస్తూ.. యువతిపై వృద్ధుడి అత్యాచారం

కల్లూరు, న్యూస్‌టుడే: అరవై ఏళ్ల వృద్ధుడు ఏడాదిగా ఓ యువతిని బెదిరిస్తూ.. అత్యాచారానికి పాల్పడిన ఘటన పులిచెర్ల మండలంలో ఆదివారం వెలుగు చూసింది. కల్లూరు ఎస్సై వెంకటేశ్వర్లు కథనం మేరకు.. మండలానికి చెందిన 22 ఏళ్ల యువతి కొంత వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగా అదే గ్రామానికి చెందిన 60 ఏళ్ల వృద్ధుడు (వరుసకు మామ) యువతిని కత్తితో బెదిరించి ఏడాది కిందట యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇలా పలుమార్లు బెదిరించి అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఈ విషయం తన తల్లిదండ్రులకు చెబుతానని యువతి అనడంతో 'మీ నాన్న తాగే మద్యంలో విషం కలిపి చంపుతా' అని బెదిరించినట్లు యువతి ఫిర్యాదులో పేర్కొంది. ఈ నెల 13న యువతి తన తమ్ముడితో కలిసి వెళ్తుండగా మళ్లీ బెదిరించాడు. ఆ తర్వాత యువతి మెడలో దారం వేసి ఫొటో దిగి పెళ్లయినట్లు చిత్రీకరించడంతో ఆమె తల్లిదండ్రులకు అసలు విషయం చెప్పింది. దీంతో వారు బాధితురాలిని పోలీసుల వద్దకు తీసుకెళ్లారు. వృద్ధుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మాజీ వైస్ ఎంపీపీ హత్య

రంగయ్యనాయుడు (పాతచిత్రం)

తవణంపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని తెల్లగుండ్లపల్లె గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ రంగయ్యనాయుడు(78) శనివారం రాత్రి హత్యకు గురయ్యాడు. తెదేపా హయాంలో 1994-99లో రంగయ్యనాయుడు తవణంపల్లె మండలం వైస్ ఎంపీపీగా పనిచేశారు. పోలీసుల కథనం మేరకు.. తెల్లగుండ్లపల్లె గ్రామానికి చెందిన రంగయ్యనాయుడు భార్య జయంతి అనారోగ్యం రీత్యా హైదరాబాదులో నివాసం ఉన్న కుమారుడు బాలాజీ దగ్గరకు వెళ్లింది. కుమార్తె జనప్రియ, అల్లుడు షణ్ముగనాయుడు తెల్లగుండ్లపల్లెలో ఉంటూ రంగయ్య బాగోగులు చూసుకుంటున్నారు. శనివారం ఉదయం గ్రామానికి చెందిన సాయి, బాలాజీ మరికొందరు యువకులతో రంగయ్యకు వాగ్వాదం జరిగింది. ఆదివారం ఉదయం రంగయ్య ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డులో ఉరికి వేలాడుతూ మృతిచెంది ఉండటాన్ని పక్కింటి వారు చూశారు. కాళ్లు, చేతులు కట్టేసి ఉన్నాయి. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేయించారు. లభించిన ఆధారాలతో పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గొడవ పడ్డ కొందరు యువకులను అనుమానితులుగా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీధర్‌నాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

శాశ్వత మార్గం చూపిస్తాం

ఈనాడు కథనానికి స్పందన

పాలసముద్రం, న్యూస్‌టుడే: కాలనీ వాసులకు శాశ్వత రహదారి విషయమై కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన నియోజకవర్గ బాధ్యుడు పొన్నా యుగంధర్ పేర్కొన్నారు. ఆదివారం పాలసముద్రం మండలంలోని ఎస్‌ఆర్‌కండ్రిగ పంచాయతీ దళితవాడ జగనన్న కాలనీకి రాకపోకలు సాగించేందుకు వీలులేక రహదారిలో అడ్డంగా గాడితీసి అడ్డుకుంటున్న సమస్యపై 'ఈనాడు'లో 'మీకిటు దారి లేదు..!' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తమిళనాడు రైతుతో మాట్లాడి తాత్కాలికంగా పక్కన నడకదారిని ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. అధికారుల చొరవతో సర్వే చేసి పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. జనసేన మండలాధ్యక్షుడు లతీష్, నాయకులు రమేష్, మదన్, చందు, కోదండన్, రూపేష్, వెంకటేష్, అన్నామలై తదితరులు ఉన్నారు.

గాడి తవ్విన స్థలాన్ని పరిశీలించి, బాధితులతో మాట్లాడుతున్న యుగంధర్, జనసైనికులు

క్రీడాస్ఫూర్తితో సేవలు కొనసాగించాలి

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి పొందిన వ్యాయామ దర్శకుల(పీడీ) సన్మాన కార్యక్రమం ఆదివారం చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగింది. వక్తలు మాట్లాడుతూ క్రీడా శిక్షకుల నుంచి ప్రధానోపాధ్యాయులైన వీరు క్రీడా స్ఫూర్తితో సేవల్ని కొనసాగించాలని అభిలషించారు. ఉద్యోగోన్నతి పొందిన సురేష్, కోటేశ్వరరావు, కోమల, చంద్రశేఖర్, రామ, సెల్వపాండియన్, అమర్‌నాథ్, మురళీకృష్ణ, దామోదరం, పీడీలు రవి, రవీంద్రారెడ్డి, నూరుద్దీన్, బాబు, సుబ్రహ్మణ్యంరెడ్డి, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం అందుకున్న ప్రధానోపాధ్యాయులు

ట్రేడింగ్ పేరిట మోసం

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట ఓ మహిళ మోసపోయింది. చిత్తూరు ఒకటో పట్టణ సీఐ మహేశ్వర్ కథనం మేరకు.. స్థానిక వినాయకపురానికి చెందిన కుమార్ భార్య లలిత గతేడాది ఫేస్‌బుక్‌లో వచ్చిన ఆన్‌లైన్ ట్రేడింగ్ పోస్టుకు ఆకర్షితురాలైంది. అధికంగా సంపాదించాలని ట్రేడింగ్ మొదలుపెట్టింది. విడతల వారీగా సుమారు రూ.5.80 లక్షల వరకు పెట్టుబడి పెట్టింది. ఇటీవల పెట్టిన పెట్టుబడి నుంచి రూ.1.40 లక్షలు విత్‌డ్రా చేయగా.. ట్రేడింగ్ నిర్వాహకులు ఆ నగదును తిరిగి అదే ఖాతాకు జమ చేయాలని ఒత్తిడి చేశారు. మిగిలిన నగదును విత్‌డ్రా చేయడానికి వీల్లేకుండా ఖాతా బ్లాక్ కావడంతో లలిత ఆరా తీసింది. ఆన్‌లైన్ మోసమని గుర్తించి.. రూ.4.40 లక్షలు నష్టపోయానని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఫోన్‌పేలో నగదు బదిలీ.. దొంగ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: సహచర రైల్వే ప్రయాణికులు ఫోన్‌పే వినియోగించే సమయంలో లాక్ గుర్తుపెట్టుకుని తర్వాత ఇంట్లోవాళ్లతో మాట్లాడాలని వారి సెల్‌ఫోన్ తీసుకుని ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేసుకునే దొంగను అరెస్టు చేసినట్లు జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు ఆశీర్వాదం, సందీప్ కుమార్ ఆదివారం తెలిపారు. ఒంగోలుకు చెందిన వేణుబాబు (36) రైల్లో ప్రయాణిస్తూ.. పక్కనున్న వృద్ధుడి ఫోన్ తీసుకుని రూ.87 వేల నగదు బదిలీ చేసుకున్న ఘటనపై గతంలో తిరుపతి జీఆర్‌పీ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఘటనపై జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి నిందితుడు వేణుబాబును శనివారం ఒంగోలులో అరెస్టు చేసి తిరుపతికి తీసుకొచ్చారు. వృద్ధుల పక్కన కూర్చొని వారి సెల్‌ఫోన్లలోని నగదు కాజేసినట్లు నిందితుడు అంగీకరించారు. ఎస్సైలు ధర్మేంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

వెన్‌కాబ్ (కిలో రూ.ల్లో)

బ్రాయిలర్ (రైతు ధర)	106
రిటైల్	127
లేయర్	112
బ్రాయిలర్	184
బ్రాయిలర్ స్కిన్ లెస్	210
లేయర్ మాంసం	190

EENADU Classifieds
BUSINESS SERVICES
TO LET
FOR SALE
JOBS
EDUCATION
MARRIAGE SERVICES
PERSONAL CLASSIFIEDS
CHANGE OF NAME
CHANGE OF NAME
I, G.Sree Harsha is son of ser No-JC-441899 H Sub: Ramesh Golla Resident of Varanasi Vari Palli (village), Rompicherla (Mandal), Chittoor (Dist), Andhra Pradesh State, Pin 517192. Have changed my name from G.SREE HARSHA to GOLLA SREE HARSHA vide Affidavit Declaration Date: 19th July, 2025. Advocate and Notary: P.Nagabushanam, Piler.
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), B.A, B.Com, B.Sc, BBA, BCA, B.Tech, Diploma, M.A, M.Com, MBA, MCA Regular/ Lateral Entry ✆ 93812 87629.
Salary Negotiable. ✆ 97015 10490.
Showroom Sales Man, Sales Woman, Manager & Accountant ✆ Ph.No: 99667 71121.
Evargo Ph: 7337544439, 9014651068, 7075633416.
✆ 95027 73400. ✆ 99895 68666. ✆ 85559 11711. ✆ 94918 40669. ✆ 94400 46210, 88852 78852.
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
80085 13290
B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తింపును



చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

డీఈఈ సెట్ కౌన్సెలింగ్

కార్వేటినగరం, న్యూస్‌టుడే: డీఈఈ సెట్ కౌన్సెలింగ్‌కు 8 మంది అభ్యర్థులు హాజరైనట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. కార్వేటినగరం డైట్‌లో డీఈఈ సెట్ కౌన్సెలింగును ఆదివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 91 మంది ప్రభుత్వ డైట్ కళాశాలకు, 103 మంది అభ్యర్థులు ప్రైవేట్ డీఈడీ కళాశాలకు ఎంపికైన సంబంధించిన కౌన్సెలింగుకు హాజరు కావాల్సి ఉండగా ఆదివారం ప్రభుత్వ డైట్‌కు ఇద్దరు, ప్రైవేట్ డీఈడీ కళాశాలకు 6 మంది హాజరయ్యారని, వారికి ఆయా కళాశాలల్లో ప్రవేశానికి అనుమతి పత్రాలను అందజేశామన్నారు. డైట్ వైస్ ప్రిన్సిపల్ దామోదర్‌రాజు, అధ్యాపకులు నాగరాజు, దశరథుడు పాల్గొన్నారు.

మొగిలీశ్వరస్వామి ఆలయంలో శ్రమదానం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మొగిలి గ్రామంలోని స్వయంభు మొగిలీశ్వరస్వామి ఆలయంలో తమిళనాడు రాష్ట్రం వేలూరు, గుడియాత్తం ప్రాంతాలకు చెందిన అప్పర్ స్వామిగళ్ ఉళవార్ సేవాసంఘానికి చెందిన 80 మంది భక్తులు ఆదివారం శ్రమదానం చేశారు. ఆలయంలోని పుష్కరిణి, ఆలయప్రాంగణం, ఆలయ ప్రహారీ పరిసరాల్లో పరిశుభ్రత పనులు చేశారు.

ఆలయంలో తమిళనాడు భక్తులు

రైతులకు అండగా నిలిచి సహకరించాలి

ఎమ్మెల్యే భానుప్రకాష్ సమక్షంలో ప్రమాణస్వీకారం చేస్తున్న ఛైర్మన్, డైరెక్టర్లు

నగరి, న్యూస్‌టుడే: రైతులకు అవసరమైన రుణాలు అందించి, వారికి అండగా నిలిచి పూర్తి సహకారం అందించాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఆదివారం జరిగిన నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన కార్యవర్గ ఛైర్మన్ కె.బాలాజీ, డైరెక్టర్లు జవహర్‌రెడ్డి, వెంకటేశ్వర్లుతో సీఈవో ఈశ్వరయ్య ప్రమాణస్వీకారం చేయించారు. చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధికార ప్రతినిధి దినబాబు, నగరి పట్టణ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి శ్రీనివాసన్, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.మీరా తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి వినతి.. పుత్తూరు, న్యూస్‌టుడే: గాలేరు- నగరి ప్రాజెక్టును పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విన్నవించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తిరుపతి జిల్లా పర్యటనకు శనివారం విచ్చేసిన ముఖ్యమంత్రిని రేణిగుంట విమానాశ్రయంలో కలిసి గాలేరు-నగరి ప్రాజెక్టు గురించి చర్చించినట్లు చెప్పారు.

తెదేపా నాయకుడికి పరామర్శ.. వడమాలపేట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనలో శనివారం విమానాశ్రయం వద్ద పాపరాసకండ్రిగ గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు వెంకటేశ్వర్లు గాయపడ్డాడు. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతన్ని ఆదివారం ఎమ్మెల్యే పరామర్శించారు. పార్టీ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని, మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

బాల్యానికి భరోసా

పూర్వ విద్య బోధన ప్రక్రియను పరిశీలిస్తున్న సీడీపీవో శ్యామసుగుణకుమారి

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల బాల్యానికి భరోసా ఇచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిన్నారులు మానసికంగా, శారీరకంగా ఎదిగేలా నవచేతన, ఆధార్‌శిల పేర్లతో పాఠ్యపుస్తకాలు రూపొందించి కేంద్రాలకు సరఫరా చేసింది. వీటిలోని అంశాలను అంగన్‌వాడీ కార్యకర్తలు అమలు చేయడంతోపాటు తల్లిదండ్రులకు వివరించాల్సి ఉంటుంది.

చిత్తూరు నగరం, గ్రామీణ, గుడిపాల మండలాల్లోని

అంగన్‌వాడీ కేంద్రాలు:	227
గర్భిణుల సంఖ్య:	1188
బాలింతలు:	1044
0-6 నెలల పిల్లలు:	1050
6 నెలల నుంచి ఏడాది పిల్లలు:	1508
1-3సం. పిల్లలు:	4463
3-6 సం. పిల్లలు:	2486

అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక పాఠ్యపుస్తకాలు

నవచేతన.. శిశువు పుట్టిన పూటి నుంచి మూడేళ్ల వయసు వరకు ప్రేరణ కృత్యాలు నేర్పించడం నవచేతన ముఖ్య ఉద్దేశం. గర్భిణులకు గర్భస్థ దశ నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం వంటివి వివరిస్తారు. పిండ భద్రత, రక్షణ, ప్రతిస్పందన వంటి వాటిపై కార్యకర్తలు అవగాహన కల్పిస్తారు. పుట్టినబిడ్డకు తల్లిపాలు తాగించడం, తల్లి ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకుంటే పోషకాలు అందుతాయో వివరిస్తారు.



ఆధార్ శిల.. బాల్య ఆరంభ సంరక్షణ, విద్య నేర్పించడం, ఆధార్ శిల పుస్తకాల లక్ష్యం. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లల పెంపకం, కుటుంబ సభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తారు. చిన్నారులకు శారీరక, భాష, మేధ, సాంస్కృతిక సృజనాత్మక, సామాజిక భావోద్వేగ వికాస్ వంటివి నేర్పిస్తారు. శారీరక, మానసిక, ఆరోగ్యం పెరుగుదల వంటివి వివరిస్తారు.



చిన్నారుల ఎదుగుదలకు దోహదం

పిల్లల్లో మెదడు అభివృద్ధి దశ ఆరేళ్ల ముందు పూర్తవుతుంది. ఈ సమయంలో సరైన సంరక్షణ, ప్రేరణ, అనుభవాత్మక కృత్యాలతో చిన్నారుల్లో సృజనాత్మక, ఆలోచనాశక్తి, శ్రద్ధ పెంపొందిస్తారు. బాల్యారంభ దశ నుంచే అన్ని విధాలుగా ఎదిగేందుకు ఈ పాఠ్యపుస్తకాలు దోహదపడుతాయి. ఇప్పటికే కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాం. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పుస్తకాలు సరఫరా చేశాం.

- శ్యామసుగుణకుమారి, సీడీపీవో, చిత్తూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

పాలసముద్రం, న్యూస్‌టుడే: సమస్య: వనదుర్గాపురం పంచాయతీ ఆదిఆంధ్రవాడ గ్రామానికి వెళ్లే రహదారిలో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి అడవిని తలపిస్తోంది. **-ఈశ్వర్, గ్రామస్థుడు**

సమాధానం: వెంటనే పిచ్చిమొక్కలు తొలగిస్తాం. **-సుధాకర్, పంచాయతీ కార్యదర్శి**

పుత్తూరు, న్యూస్‌టుడే: సమస్య: మహాలక్ష్మీపురం వద్ద చెత్త కుప్పలు తరలించడం లేదు. **-రమణ, పుత్తూరు**

సమాధానం: రోజువారీగా చెత్త తరలించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- మోహన్‌కృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

మురుగు కాలువ శుభ్రం

స్పందనకు వందనం

పుత్తూరు : ఈనాడులో వచ్చిన వార్తకు మున్సిపల్ కమిషనర్ మంజునాథగౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కృష్ణ స్పందించారు. పిళ్లారిపట్టు వీధిలో మురుగునీటి కాలువను శుభ్రం చేయించారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య పోటీలు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: ప్రజాహిత సేవా సంస్థ, మాదిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన శాస్త్రీయ నృత్య పోటీలు ఆకట్టుకున్నాయి. చిత్తూరులోని రెవెన్యూ భవనంలో ఆదివారం జరిగిన పోటీల్లో బాలబాలికలు సంప్రదాయ నృత్యాలతో అలరించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతుల్ని ప్రదానం చేశారు. ప్రజాహిత సంస్థ అధ్యక్షుడు రాజరత్నం, మాజీ కౌన్సిలర్ పార్థసారథినాయుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెదేపాతోనే సంక్షేమం

పథకాలను గ్రామస్థులకు వివరిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్, చల్లా బాబు

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: తెదేపాతోనే సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్ పేర్కొన్నారు. ఆదివారం రొంపిచెర్ల మండలంలోని కమ్మపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక తెదేపా ఇన్‌ఛార్జి చల్లా బాబుతో కలిసి పర్యటించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్ర కురవ సంఘం డైరెక్టర్ ఉయ్యాల రమణ, నాయకులు రవినాయుడు, శేషాద్రినాయుడు పాల్గొన్నారు.

మామిడి దినోత్సవానికి పిలుపు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: ఈనెల 22న చిత్తూరులో జరుగే ప్రపంచ మామిడి దినోత్సవానికి ఉమ్మడి జిల్లాల రైతులు తరలిరావాలని మామిడి రైతు సంక్షేమ సంఘ కన్వీనరు జనార్దన్, మునీశ్వరరెడ్డిలు పిలుపునిచ్చారు. మండలంలోని జిల్లేడు పల్లెలో ఆదివారం మామిడి రైతులకు కరపత్రాలను పంపిణీ చేసి ఆహ్వానించారు.

వైభవంగా ఆడికృత్తిక పూజలు

మునీశ్వరుడికి పూజలు చేస్తున్న గ్రామస్థులు

జీడీనెల్లూరు: ఎట్టేరిలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

కార్వేటినగరంలో..

ఆధ్యాత్మికం

పాలసముద్రం, న్యూస్‌టుడే: ఆడినెలను పురస్కరించుకుని శ్రీకావేరిరాజుపురం గ్రామంలో వెలసిన శ్రీమునీశ్వరుడికి ఆదివారం మహిళలు, గ్రామస్థులు అభిషేకాలు, పూజలు, పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ● పెనుమూరు, న్యూస్‌టుడే: స్థానిక కన్నికల కొండపై వెలసిన శ్రీసుబ్రహ్మణ్య స్వామికి ఆదివారం ఆడి కృత్తిక పూజలు జరిగాయి. ఉదయం స్వామివారి మూలవిరాట్టుకు అర్చకులు గుంటూరు శివరామశర్మ ఆధ్వర్యంలో వివిధ అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పుష్ప కావళ్లు తీసుకువచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ● వడమాలపేట, న్యూస్‌టుడే: మాతమ్మ తిరునాళ్లు బట్టీకండ్రిగలో నిర్వహించారు. మాజీ మంత్రి రోజా అమ్మవారిని దర్శించుకున్నారు. ● గంగాధరనెల్లూరు: ఎట్టేరి శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో కృత్తిక వేడుకలు నిర్వహించారు. భక్తులు కావళ్లను సమర్పించారు. ● కార్వేటినగరం, న్యూస్‌టుడే: కార్వేటినగరంలో వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కృత్తిక వేడుకలను నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణనాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ● నగరి: దేశమ్మ ఆలయంలో ఆడి ఉత్సవాలు నిర్వహించారు. మధుర మీనాక్షి అవతారంలో దేశమ్మకు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈవో డి.వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ సభ్యులు మదన్‌కుమార్, అర్చకులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

పెనుమూరు: కృష్ణమనాయుడును సన్మానిస్తున్న నాయకులు

రైతులకు మెరుగైన సేవలు అందిస్తా

గంగాధరనెల్లూరు : రైతులకు మెరుగైన సేవలు అందిస్తానని పెనుమూరు మార్కెట్‌కమిటీ ఛైర్మన్‌గా ఎంపికైన జీడీనెల్లూరు పాతపాళెం సర్పంచి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు అన్నారు. మండలంలోని పలువురు తెదేపానేతలు ఆయనను ఘనంగా సన్మానించారు. **పెనుమూరు:** కృష్ణమనాయుడును మండల తెదేపా నాయకులు ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచులు కృష్ణమూర్తి, ఎన్‌ఎస్‌నాయుడు, ఏఎంసీ మాజీ సభ్యుడు హేమాద్రి, సింగిల్‌విండో మాజీ సభ్యుడు రమేష్, నాయకులు కిషోర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డుకు మోక్షమెప్పుడో?

పుత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని వేపగుంట-నెడియం అంతర్రాష్ట్ర రోడ్డు అభివృద్ధి అసంపూర్తి పాలకులకు పట్టడం లేదు. దీంతో నిత్యం ఆ రోడ్డులో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని వేపగుంట క్రాస్ నుంచి తమిళనాడు సరిహద్దు వరకు 10 కిలోమీటర్లు ఉంది. 8.5 కిలోమీటర్లు అంతర్రాష్ట్ర రోడ్డు విస్తరణకు 2009లో అప్పటి మంత్రి చెంగారెడ్డి రూ.7.50కోట్ల నిధులు మంజూరు చేయించారు. రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అప్పట్లో టెండర్లు అధికంగా కోట్ చేయడంతో రెండు దఫాలు పనులు ఆగిపోయాయి. అనంతరం దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు రూ.9కోట్లు మంజూరు చేయించారు. టెండర్లు పిలిచి పనులు చేయించారు. ప్రస్తుతం 1.5 కిలోమీటర్లు రోడ్డు అసంపూర్తిగా ఆగిపోయింది. దీంతో నిత్యం ప్రమాదాలే. ● వేపగుంట క్రాస్ రోడ్డు నుంచి కేబీఆర్ పురం వరకు రోడ్డు పనులు పూర్తి చేశారు. అక్కడి నుంచి సింగిల్ రోడ్డు కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతర్రాష్ట్ర రోడ్డు కావడంతో అక్రమ రవాణా అంతా ఆ రోడ్డులోనే సాగుతోంది. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికి తోడు నిండ్రలోని నేతమ్స్ చక్కెర కర్మాగారం మూసివేయడంతో ఎస్ఆర్‌పురంలోని ఎస్ఎన్‌జే షుగర్స్‌కు తూర్పు మండలాల రైతులు ఆ కర్మాగారానికి చెరకు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుంటారు. ఆ సమయంలో ఎదురుగా వాహనాలు వచ్చినా ఇబ్బందులే. ఇప్పటికైనా ఈ రోడ్డు అభివృద్ధికి పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ఈ రోడ్డు ఎవరి కోసం?

నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

కంకర తేలిన వసంతాపురం ఎస్టీ కాలనీకి వెళ్లే మార్గం

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సీసీరోడ్డు నిర్మించి లక్షల రూపాయల ప్రజాధనాన్ని చెరువు కుంట పాల్జేశారు. ఇదెక్కడో కాదండోయ్.. జిల్లా కేంద్రం చిత్తూరు గ్రామీణ మండలం కుర్చివేడు పంచాయతీ దళితవాడ చెరువు కుంట రోడ్డు. జడ్పీ నిధులు రూ.10 లక్షలతో 250-300 మీటర్ల సీసీరోడ్డును కుర్చివేడు దళితవాడ చెరువుకుంట మార్గాన్ని నిర్మించారు. ఈ రోడ్డు ప్రజలకు ఉపయోగం లేకపోయినా.. నిధుల వినియోగానికి, అధికారులు, ప్రజాప్రతినిధుల వాటాలతో ప్రజాధనం హారతిలా చెరువులో కరిగించారు. ఇక అదే పంచాయతీ సమీప తాళంబేడు పంచాయతీ వసంతాపురం ఎస్టీ కాలనీకి వెళ్లే మార్గం ఏడేళ్లుగా కంకర తేలి, నడక నరకంలా మారింది. ఈ మార్గంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ఇవేమీ అధికారులు, ప్రజాప్రతినిధులకు కనిపించడం లేదు. ఇప్పటికైనా కలెక్టరు పంచాయతీ నిధుల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజా అవసరాలు, సంక్షేమానికి వినియోగించేలా చూడాల్సిన బాధ్యత ఉందని ప్రజలు కోరుతున్నారు.

పి.కొత్తకోటకు మహర్దశ

పూతలపట్టు, న్యూస్‌టుడే: పి.కొత్తకోటను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే మురళీమోహన్ కృషి చేస్తున్నారు. అందులో భాగంగా చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారి పక్కన ఉన్న పి.కొత్తకోటలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఇటీవల జరిగిన డీఆర్సీ సమావేశంలో ఎమ్మెల్యే ప్రస్తావించగా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన విషయం విదితమే. ఆ ఆసుపత్రి స్థాయిని వంద పడకల ఆసుపత్రికి పెంచేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే మురళీమోహన్ పి.కొత్తకోట పంచాయతీ పరిధిలో పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. మన భవిష్యత్తు-మనబడి కార్యక్రమంలో భాగంగా రూ.16 లక్షలతో పూర్తైన జడ్పీ ఉన్నత పాఠశాల భవనం, పశుసంవర్ధక వైద్యశాలను రూ.5 లక్షలతో, ప్రభుత్వ వసతి గృహాన్ని ఎంపీ నిధులు రూ.16 లక్షలు, సాంఘిక సంక్షేమ శాఖ రూ.5 లక్షలతో మరమ్మతులు

ఒప్పంద కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: ఒప్పంద, పొరుగు సేవల కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం పరిష్కరించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నగరంలో నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుమన్, మధుబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. గౌరవాధ్యక్షుడు గంజి రామ్మూర్తి, నాయకులు సంపత్ కుమార్, చంద్రశేఖర్, రామభద్ర, కరీముల్లా, షకీలా, శరవణ పాల్గొన్నారు.

నేతల సత్కారం

పిచ్చాటూరు: కీళపూడిలో పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు పద్మనాభరాజు, మాజీ ఎంపీపీ మధుబాల దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారిని నరసింహయాదవ్, శంకర్‌రెడ్డిలు సత్కరించారు.

'మిథున్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం'

పుత్తూరులో నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి రోజా, నాయకులు

పుత్తూరు, న్యూస్‌టుడే: ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని మాజీ మంత్రి రోజా పేర్కొన్నారు. పుత్తూరు పున్నమి వద్ద ఆదివారం దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అక్కడే నిరసన చేపట్టారు. అంతకుముందు వినాయకపురం ఎస్టీ కాలనీలో వైకాపాకు చెందిన రాజయ్య ఆటోకు దుండగులు నిప్పుపెట్టడంతో కాలిపోయింది. అతన్ని పరామర్శించారు. ● నిండ్ర, న్యూస్‌టుడే: మిట్టకండ్రిగ దళితవాడలో మాజీ మంత్రి పర్యటించారు. అదే దళితవాడకు చెందిన వైకాపా కార్యకర్త రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీపీ దీప, వైకాపా మండల కన్వీనర్ వేణుగోపాల్‌రాజు, నాయకులు పాల్గొన్నారు.

తప్పిపోయిన పిల్లల అప్పగింత

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: నగరంలోని జింకల పార్క్ వద్ద తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను పోలీసులు చేరదీసి రాత్రి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. స్థానిక సంతపేటకు చెందిన ధనరాజ్ ఆదివారం తమ పిల్లలు యస్మిత(7), తనుశ్రీ(5)లను జింకల పార్క్ వద్దకు తీసుకెళ్లగా.. రాత్రి సమయంలో పిల్లలు తప్పిపోయారు. రాత్రి 10 గంటల సమయంలో చిన్నారులు ఏడుస్తూ కనిపించగా.. అటుగా వెళ్తున్న కట్టమంచికి చెందిన భరత్‌రాజ్, గుణశ్రీలు వారిని పలకరించి, పోలీసులకు అప్పగించారు. చిత్తూరు ఒకటో పట్టణ సీఐ మహేశ్వర్ పిల్లలతో మాట్లాడి సమాచారం తెలుసుకుని రాత్రి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి పిల్లలను అప్పగించారు. ఈ సందర్భంగా భరత్‌రాజ్, గుణశ్రీలను సీఐ మహేశ్వర్ అభినందించారు.

ప్రతిభావంతులు

వివిధ పోటీల్లో రాణిస్తున్న పేద విద్యార్థులు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: చిత్తూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతూ వక్తృత్వ, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో రాణిస్తున్నారు విద్యార్థులు. పిల్లలు అభిరుచులకనుగుణంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సహిస్తున్నారు.

కుంచె పట్టిన కుషాల్

కుషాల్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తండ్రి మురళీమోహన్ పెయింటర్. తల్లి లైలా అమరరాజ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచి బొమ్మలు గీయడం అలవాటు. రంగోత్సవం సందర్భంగా చిత్రలేఖనం జిల్లా పోటీలు కార్వేటినగరం డైట్ కళాశాలలో నిర్వహించగా ద్వితీయ బహుమతి, గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా చిత్రలేఖనంలో జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి, సేవ్‌గర్ల్ కార్యాక్రమంలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించాడు. ఐఏఎస్ కావాలన్నదే లక్ష్యంగా చదువుతున్నాడు.

వ్యాసరచనలో సింధుశ్రీ

సింధుశ్రీ తొమ్మిదో తరగతి చదువుతోంది. తండ్రి మునిశేఖర్ ట్రాక్టర్ డ్రైవర్. తల్లి రెడ్డమ్మ గృహిణి. చదువుతో పాటు పాఠశాల, మండల స్థాయిలో జరిగే ప్రతి పోటీలో పాల్గొని బహుమతులు సాధిస్తోంది. క్రీడలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించింది. జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలో ద్వితీయ బహుమతి పొందింది. సాఫ్ట్‌వేర్ కావాలన్నదే తన లక్ష్యమని చెబుతోంది.

చిత్రలేఖనంలో లాస్య

లాస్య తొమ్మిదో తరగతి చదువుతోంది. చిన్నప్పటి నుంచి పాఠ్యపుస్తకాలతోపాటు ఇతర పుస్తకాలు చదవడం అలవాటు. భారత్ సంస్కృతి ప్రతిష్ఠాన్ అయోధ్య రామ మందిర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించగా మొదటి బహుమతి, జిల్లా స్థాయి చిత్రలేఖనంలో ప్రథమ స్థానం సాధించింది. ఎమ్మెల్యే జగన్మోహన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంది. ఐఏఎస్ కావాలన్నదే లక్ష్యంగా చదువుతోంది.

తిరుమలరాజుపురంలో తమిళనాడు మద్యం

పాలసముద్రం, న్యూస్‌టుడే: గ్రామంలో బెల్టు షాపు ఉదయం 5 గంటల నుంచి మొదలై ఒంటిగంట వరకు కొనసాగుతున్నా సంబంధిత శాఖ పట్టించుకోవడం లేదని గ్రామప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని తిరుమలరాజుపురం పంచాయతీ గ్రామంలో గుడి, బడి నివాస ప్రాంతాలనే తేడా లేకుండా బెల్టుషాపుల ద్వారా యథేచ్ఛగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన మద్యంను విక్రయించేస్తున్నారు. గ్రామ పంచాయతీలో బెల్టుషాపుల ద్వారా రేయింబవళ్లు విక్రయాలు సాగుతున్నా నియంత్రించాల్సిన అధికారులు నామమాత్రపు దాడులైనా చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

● మండల సరిహద్దు తమిళనాడు నుంచి మద్యం బాటిళ్లు తీసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా కానిస్తున్నారు. యువత మద్యానికి బానిసవుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మండలంలో ఏటా పదో తరగతి ఫలితాల్లో మొదటి స్థానం సాధించే తిరుమలరాజుపురం జడ్పీఉన్నత పాఠశాల కలిగిన ప్రాంతంలో ఇలా విక్రయాలతో విద్యార్థులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ శిరీషాదేవిని వివరణ కోరగా.. తమ దృష్టికి రాలేదని, వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: అనారోగ్య కారణాలతో ఈనెల 15న వేల్కూరులో ఆత్మహత్యకు యత్నించిన కుప్పయ్య(63) చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. సీఐ శ్రీనివాసంతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

కార్వేటినగరం, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఏఎస్సై మునికృష్ణ తెలిపారు. కార్వేటినగరం పోలీస్ స్టేషన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను గుర్తించి సీజ్ చేశామన్నారు. రాజంపేట నుంచి తమిళనాడుకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. తమిళనాడులోని తిరునల్వేలికి చెందిన టిప్పర్ డ్రైవర్ ఇళయరాజా, క్లీనర్ హరిక్రిష్ణన్, చెన్నైకి చెందిన యజమాని సేతురామన్‌పై కేసు నమోదు చేశామన్నారు.

ప్రథమ వర్ధంతి 21-07-2025

జననం 02-06-1952 మరణం 31-07-2024

కీ॥శే॥ డా॥ కురచవేడు పురంధరరాజు గారు
రిటైర్డ్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి.

ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన కీ॥శే॥ డా॥ కె.పురంధరరాజు గారు మానుండి దూరమైనా వారి మధుర స్మృతులు మరువలేకున్నాము. వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థిస్తూ...

భార్య: కె.సుజాత మరియు కుటుంబ సభ్యులు

(c) eenadu

పలమనేరు
•పలమనేరు •కుప్పం •పుంగనూరు

ప్రత్యేకాలంకారంలో చాముండేశ్వరిదేవి

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక తూర్పు మొగశాలలో చాముండేశ్వరి దేవి ఆదివారం ప్రత్యేకాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి జయంత్యుత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోశాల అభివృద్ధికి విరాళం

బోయకొండ(చౌడేపల్లె), న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాల అభివృద్ధికి నంద్యాలకు చెందిన అటవీశాఖాధికారి ఈశ్వరయ్య రూ.69,200 నగదు, ఆలయానికి రూ.32,000 విలువ చేసే బంగారం విరాళంగా ఇచ్చినట్లు ఈవో ఏకాంబరం ఆదివారం తెలిపారు.

రేపు ఉద్యోగ మేళా.. కుప్పం పట్టణం: స్థానిక కడా కార్యాలయంలో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్‌మర్మత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు కడా కార్యాలయంలో సోమవారం ముందస్తు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: **సమస్య:** పట్టణంలో దోమల బెడద తీవ్రమైంది. - **కుమార్, కుప్పం**

సమాధానం: కాలువల్లో పారిశుద్ధ్య పనులు చేపడతాం.
- **శ్రీనివాసరావు, కమిషనర్**

పలమనేరు, న్యూస్‌టుడే: **సమస్య:** పట్టణంలోని ఎల్‌బీనగర్ సమీపంలోని ఆర్టీసీ గ్యారేజీ వద్ద మురుగు కాలువలు చెత్తతో నిండిపోయాయి. - **బాలు, పలమనేరు**

సమాధానం: కాలువలు శుభ్రం చేయించడానికి చర్యలు తీసుకుంటాం. - **ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్**

వినాయకనగర్‌లో శుభ్రత పనులు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని వినాయక నగర్ ప్రాంతంలో మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికతో వచ్చిన వార్తకు అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తీయడమే కాకుండా పిచ్చి మొక్కలు తొలగించారు.

స్పందనకు వందనం

ముగిసిన ఉత్సవాలు

అమ్మవారి వేషాధారికి పూజలు చేస్తున్న దృశ్యం

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని కరకమందలో ఎల్లమ్మ తల్లి కొలుపు ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. గ్రామంలో ఎల్లమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. గ్రామ పొలిమేర్లలో ఉన్న సిద్ధులను గ్రామస్థులు జంపన్నతో వెళ్లి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చి సిద్ధపూజ అనంతరం అన్నదానం నిర్వహించారు. ఎల్లమ్మ తల్లి, జంపన్న వేషాధారణలో ఉన్నవారికి గ్రామస్థులు పూజలు చేశారు.

ఘనంగా పాలేటమ్మ జాతర

ఆధ్యాత్మికం

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని నెల్లిమందలో పాలేటమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారి మూల విగ్రహాలను విశేషంగా అలంకరించారు. ఊరేగింపుగా పాలేటమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఆలయం వద్దకు తీసుకొచ్చారు. పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

భక్తిశ్రద్ధలతో హోమం

హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక కల్యాణ వేంకటరమణ స్వామి ఆలయంలో ఆదివారం పవిత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి వివిధ హోమాలు, ఉత్సవాలు చేశారు. రెండో రోజు పవిత్రోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆడికృత్తికతో ఆలయాల్లో రద్దీ

పుంగనూరు, న్యూస్‌టుడే: ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సుబ్రమణ్య స్వామి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శ్రీవల్లి, దేవసేన సుబ్రహ్మణ్య స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజించారు.

పటాలమ్మకు దివ్వెల ఊరేగింపు

పటాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

పుంగనూరు, న్యూస్‌టుడే: మండలంలోని ప్రసన్నయ్యగారిపల్లె వద్ద ఉన్న పటాలమ్మ దేవతకు భక్తులు ఆదివారం దివ్వెల ఊరేగింపు చేపట్టారు. ఏటా ఆషాఢమాసం చివరి ఆదివారం పూలవారి కుటుంబీకులు, ప్రజలు ఈ పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజించారు.

జల వనరులకు ముంచుకొస్తున్న ముప్పు

✦ పెట్రేగుతున్న ఇసుక, మట్టి అక్రమార్కులు ✦ పట్టించుకోని అధికారులు

పుంగనూరు, న్యూస్‌టుడే: భూగర్భ జలాలను పెంపొందించే జల వనరులకు ముంపు ముంచుకొస్తోంది. వాగులు, వంకలు బాగుంటేనే చెరువులకు నీళ్లు చేరేది. ఆ చెరువుల్లో నీళ్లుంటేనే కల్పతరువులుగా ఆదుకుంటాయి. జిల్లాలో చిత్తూరు, నగరి, కుప్పం, పలమనేరు జలవనరుల శాఖ పరిధిలో 4,306 చెరువులు ఉన్నాయి. వాటి కింద 46,900 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాభావ పరిస్థితులతో చుక్క నీరు లేని చెరువులు సింహ భాగమే ఉన్నాయి. చెరువుల్లో పేరుకున్న ఇసుకతో భూగర్భజలాలు ఎక్కువ కాలం నిల్వ ఉండే అవకాశం ఉంది. అలాగే మట్టిని కొంతవరకు తవ్వితే ఇబ్బంది లేదు. కానీ ఇష్టానుసారం తవ్వుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, అనుమతులు లేకపోయినా ఇష్టారాజ్యంగా తవ్వకాలు సాగుతున్నాయి.

ఓ పక్క పర్యావరణ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు రూ.కోట్ల నిధులు వెచ్చించి వన సంరక్షణ, జల సంరక్షణ పనులు చేపడుతుంటే మరో వైపు ఇసుక, మట్టి వ్యాపారులు యంత్రాలతో చెరువులు, కుంటల్లో ఇసుకను ఇష్టానుసారం తోడేస్తున్నారు. ఇసుక తవ్వకాలపై నిషేధం ఎత్తివేయడంతో ఇసుక వ్యాపారులు పెట్రేగిపోతూ రాత్రివేళల్లో యంత్రాలను ఉపయోగించి సరిహద్దులోని పొరుగు రాష్ట్రాలకు తరలిస్తున్నారు. నాడు ప్రభుత్వ పనులకు కూడా అనుమతించని అధికారులు నేడు వందల ట్రాక్టర్లతో తరలుతున్న ఇసుక బడికా, గుడికా, యంత్రాలతో వేశారా..? కూలీలతో వేశారా..? వాల్టా చట్టాన్ని పరిగణిస్తున్నారా అనే అంశాలను సైతం పట్టించుకోకపోవడంతో ఇసుకాసురుల వ్యాపారం ఇష్టారాజ్యంగా సాగుతోంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో చెరువుల్లోని గోతులను పూడ్చితేనే చెరువుల్లో నీళ్లు నిలిచే పరిస్థితి ఉంది.

నీళ్లు లేకపోవడంతో..

పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల్లో ఎక్కువ సంఖ్యలో ఉన్న చెరువుల్లో నీరు లేకపోవడంతో మట్టి, ఇసుక తరలింపునకు మార్గం సునాయాసమైంది. ఈ అక్రమ తవ్వకాలకు కళ్లెం వేయకపోతే భూగర్భ జలాలు దెబ్బతిని బోరు బావులు సాగునీరు, తాగునీరు సమస్యలు ఉత్పన్నమవుతాయి. అక్రమ లేఅవుట్లకు తరలిస్తున్న మట్టిని అడ్డుకోవాల్సి అవసరం ఎంతైనా ఉంది.

మట్టి తవ్వకాలతో పిచ్చిగుండ్లపల్లె చెరువులో ఏర్పడిన గోతులు

చర్యలు తీసుకుంటాం

అనుమతి లేకుండా మట్టి, ఇసుక తరలించే వారిపై చర్యలు తీసుకుంటాం. ఆకస్మిక పర్యటన చేపట్టి యంత్రాలు ఉపయోగించే, చెట్లను కూలదోసే, నిర్ణీత లోతు కంటే ఎక్కువగా తోడే వారిపై చర్యలు తీసుకుంటాం.
- రాము, తహసీల్దారు, పుంగనూరు

రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

శస్త్రచికిత్సలకు 59 మంది ఎంపిక

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 59 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు సాయి మాత సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్‌బాబు తెలిపారు. జిల్లా ఆంధ్ర నివాస సంస్థ, సాయి మాత సేవా ట్రస్ట్, బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 220 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజేష్, లావణ్య, నేత్ర, వీరభద్రప్ప పాల్గొన్నారు.

గ్రామంలో పర్యటిస్తున్న బీవీఎం శివశంకర్

సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, పలమనేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీవీఎం శివశంకర్ అన్నారు. పల్లె పల్లెకు కాంగ్రెస్ అన్న నినాదంతో గ్రామాల పర్యటనకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఆదివారం మండలంలోని కొత్తూరు పంచాయతీ కేంద్రంలో అన్ని వీధుల్లో పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. నాయకులు దొరస్వామి, శంకరకుమార్, రెడ్డెప్ప, లక్ష్మణ్, చిన్నమల్లప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి

సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

శాంతిపురం, న్యూస్‌టుడే: పేదరిక నిర్మూలనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెదేపా నేతలు పేర్కొన్నారు. ఆదివారం శివరామపురం, గట్టూరు, సంజంపేట, కోటగడ్డ గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేసి సమస్యలు తెలుసుకున్నారు. నాయకులు శేఖర్, ఆనందరెడ్డి, సూరి, పొరాలి, హేమావతి, మధు పాల్గొన్నారు.

దినోత్సవానికి పిలుపు

బంగారుపాళ్యం: ఈనెల 22న చిత్తూరులో జరుగే ప్రపంచ మామిడి దినోత్సవానికి ఉమ్మడి జిల్లాల రైతులు తరలిరావాలని మామిడి రైతు సంక్షేమ సంఘం కన్వీనర్ జనార్దన్, మునీశ్వరరెడ్డిలు పిలుపునిచ్చారు. మండలంలోని జల్లిపల్లిలో ఆదివారం మామిడి రైతులకు కరపత్రాలను పంపిణీ చేసి ఆహ్వానించారు.

ఎన్టీఆర్ కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

భాజపా నాయకుల నిరసన

పుంగనూరు, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాపై ఎస్‌డీపీఐ నాయకులు చేస్తున్న ఆరోపణలపై ఆదివారం స్థానిక ఎన్టీఆర్ కూడలిలో భాజపా నాయకులు నిరసన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడ ఏం జరిగినా భాజపాను అంటకట్టడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌రాజు, రాజారెడ్డి, ప్రసాద్, బాబు, మణిమొదలియార్ పాల్గొన్నారు.

నియామకం

వెంకటరెడ్డి యాదవ్, అనీషారెడ్డి

పుంగనూరు, న్యూస్‌టుడే: వైకాపా కార్యదర్శులుగా పట్టణానికి చెందిన ఎస్. వెంకటరెడ్డియాదవ్, ఎన్.అనీషారెడ్డిలను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజనల్ కో-ఆర్డినేటర్లు, నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోటీల్లో విజయం పొందిన 15 మంది కబడ్డీ క్రీడాకారులకు వైఎస్ ఎంపీపీ శశిరెడ్డి క్రీడా దుస్తులను ఆదివారం విరాళంగా అందజేశారు. కబడ్డీ కోచ్ అరవింద బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే.. ప్రజాధనం వృథా కాదా..?

స్వచ్ఛభారత్ కింద మంజూరు చేసిన చెత్తసేకరణ వాహనాలు.. నిర్వహణ, పర్యవేక్షణ లేక తుప్పుపట్టి దుస్థితికి చేరాయి. ప్రజాధనంతో పంచాయతీలకు అందించిన చెత్త సేకరణ బండ్లు, వాహనాలు ఎక్కడపడితే అక్కడ ఎండకు ఎండుతూ... వానకు తడుస్తూ పలు గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. - న్యూస్‌టుడే, కుప్పం గ్రామీణ

ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం

మునిపల్లెలో విద్యుత్తు స్తంభం పైభాగంలో విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. స్తంభానికి పైభాగంలో 11 కేవీ విద్యుత్తు తీగలు లాగారు. 11 కేవీ తీగలకు కింది భాగంలో గృహ విద్యుత్తు తీగలు అమర్చారు. తీగల మధ్యలో స్తంభం విరిగిపోవడంతో ఎప్పుడు గృహ విద్యుత్తు తీగలపై పడి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి స్తంభం మార్పు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె

కూడలిలో నిత్యం ట్రాఫిక్ సమస్య..!

బైరెడ్డిపల్లె నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోంది. మదనపల్లె-కృష్ణగిరి జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఇక్కడ రహదారి విస్తరణ పనులు ఆగిపోయాయి. బైరెడ్డిపల్లె-పుంగనూరు రహదారి విస్తరణ పనులు చేపట్టినా ఆక్రమణలతో రహదారి కుంచించుకుపోయింది. రహదారి పక్కన ఓ వైపు ఆటోలు..మరో వైపు ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. - న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె

పూర్తికి ఇంకెన్ని రోజులో..?

ముత్తుకూరులోని రైతు సేవా కేంద్ర భవనానికి వైకాపా ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయింది. గతంలో పంచాయతీ కేంద్రంలో అన్ని సేవలు అందించే లక్ష్యంతో వైకాపా ఇక్కడ నిర్మాణం చేపట్టింది. అయితే లక్ష్యసాధనలో అప్పటి ప్రభుత్వ యంత్రాంగం విఫలమైంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు అసంపూర్తిగా ఉన్న రైతు సేవా కేంద్రానికి నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దపంజాణి

త్రుటిలో తప్పిన ప్రమాదం

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: రొంపిచెర్ల క్రాస్ రోడ్డులో ఆదివారం సాయంత్రం ప్రమాదం జరిగింది. చల్లావారిపల్లెకు చెందిన వరుణ్, జస్వంత్ మరో ఇద్దరు స్నేహితులతో కలిసి కారులో వెళ్తుండగా గుట్టకిందపల్లె హరిజనవాడ సమీపంలో కారు అదుపుతప్పి పక్కనున్న స్తంభాన్ని ఢీకొని కాలువలో పడింది. కారులో ప్రయాణిస్తున్న జస్వంత్, చరణ్‌కు తీవ్రగాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు.

రాజశేఖర్ దీక్షితులుకు శైవాగ రత్న అవార్డు

అవార్డు అందుకుంటున్న రాజశేఖర్ దీక్షితులు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకులుగా ఉన్న రాజశేఖర్ దీక్షితులు శైవాగ రత్న అవార్డు అందుకున్నారు. ఆదివారం బెంగళూరులో జరిగిన శ్రీకంఠశివాచార్య గురుపూజను పురస్కరించుకుని శైవాగంలో ఉత్తీర్ణులైన పలు ఆగమికులను సత్కరించారు. ఇందులో భాగంగా అవార్డు అందుకున్నట్లు ఆయన వివరించారు.

పథకాలను గ్రామస్థులకు వివరిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్, చల్లా బాబు

తెదేపాతోనే సంక్షేమం

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: తెదేపాతోనే సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ పేర్కొన్నారు. ఆదివారం రొంపిచెర్ల మండలంలోని కమ్మపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక తెదేపా ఇన్‌ఛార్జి చల్లా బాబుతో కలిసి పర్యటించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్ర కురవ సంఘం డైరెక్టర్ ఉయ్యాల రమణ, నాయకులు రవినాయుడు, శేషాద్రి నాయుడు పాల్గొన్నారు.

మొగిలీశ్వరస్వామి ఆలయంలో శ్రమదానం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మొగిలి గ్రామంలోని స్వయంభు మొగిలీశ్వరస్వామి ఆలయంలో తమిళనాడు రాష్ట్రం వేలూరు, గుడియాత్తం ప్రాంతాలకు చెందిన అప్పర్ సన్మార్గ ఉయవార్ సేవాసంఘానికి చెందిన 80 మంది భక్తులు ఆదివారం శ్రమదానం చేశారు. ఆలయంలోని పుష్కరిణి, ఆలయప్రాంగణం, ఆలయ ప్రహరీ పరిసరాల్లో పరిశుభ్రత పనులు చేశారు.

ఆలయంలో తమిళనాడు భక్తులు

ఏనుగుల దాడిలో రైతులకు నష్టం

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని దిగువమూర్తివారిపల్లెలో శనివారం రాత్రి ఏనుగుల గుంపు మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన శంకర, నరసింహులు, వంకాయలపాటివారిపల్లెకు చెందిన దుర్వాసులు నాయుడు పొలంలోని మామిడి చెట్లను విరిచేశాయి. మరికొందరి రైతులకు తీవ్ర నష్టం కలిగించాయి.

అక్రమంగా అరెస్టు చేశారు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసిందని జడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు ఆరోపించారు. వైకాపా మండల అధ్యక్షుడు నాగభూషణరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పలువురు వైకాపా నాయకులు ఎంపీ అరెస్టును ఖండించారు.

యల్లంపల్లె వద్ద రోడ్డు ప్రమాదం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని యల్లంపల్లె వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. పుంగనూరు మండలం ఓబిరెడ్డిపల్లెకు చెందిన మోహన్, విశ్వనాథ ద్విచక్ర వాహనంపై బోయకొండకు వెళ్లి వస్తుండగా వాహనం అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి.

యువతి అదృశ్యం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధి కుమ్మరగుంటకు చెందిన యువతి(22) ఈ నెల 18 నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

బహిరంగ ప్రకటన

[illegible]

SCHEDULE OF PROPERTY

Chittoor District, Palamaner Sub-District, Chittoor ZP, Pedda Panjani Mandal and Mandal Parishath, Pedda Panjani Grampanchayath ... [illegible]

SITUATE WITHIN THE FOLLOWING BOUNDARIES: [illegible]

కె.లక్ష్మీపతి, ... [illegible]
సెల్: 9440599356, 7013127665

బహిరంగ ప్రకటన

[illegible]

SCHEDULE OF PROPERTY

Chittoor District, Palamaner Sub-District - Chittoor ZP, Palamaner Mandal and Mandal Parishath, Palamaner Municipality, ... Village, ... Nagamangalam ... [illegible]

(i) Plot No.1 Measuring: ... [illegible]

SITUATE WITHIN THE FOLLOWING BOUNDARIES: ... [illegible]

(ii) Plot No.2 Measuring: ... [illegible]

SITUATE WITHIN THE FOLLOWING BOUNDARIES: ... [illegible]

కె.లక్ష్మీపతి, ... [illegible]
సెల్: 9440599356, 7013127665

పారిశుద్ధ్య లోపం.. జనం సతమతం..!

✦ యంత్రాంగానికి పట్టని వైనం

వి.కోట, న్యూస్‌టుడే: వి.కోట మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం లోపించి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోవడంతో వీధులు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పారిశుద్ధ్య సమస్య తోడైతే ఎక్కడ వ్యాధులు ప్రబలుతాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధన్నూపురం వద్ద పేరుకుపోయిన చెత్త

గతంలో రోగాల వ్యాప్తి

మండలంలో గత వర్షాకాలంతో అంటు వ్యాధులు ప్రబలి మండల కేంద్రంలో ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడ్డారు. చాలా మంది రోగాల బారినపడి తీవ్ర అస్వస్థకు గురయ్యారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య ఎక్కడంటే

స్థానిక చౌడేపల్లె రోడ్డు, ధన్నూపురం, భారత్‌నగర్, ఈశ్వర్‌నగర్, లాంగ్ బజార్, మసీదు వీధి తదితర చోట్ల చెత్త పేరుకుపోయింది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో చెత్త కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. దీంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశిస్తాం. శుభ్రత కార్యక్రమాలు ఎప్పటికప్పుడు చేపడతాం.
- ఈశ్వరన్, ఎంపీడీవో

నడుచుకుంటూ వచ్చి.. ద్విచక్ర వాహనాలతో ఉడాయించి

కుప్పం, న్యూస్‌టుడే: స్థానిక పీఈఎస్ వైద్య కళాశాల ఆస్పత్రి ప్రాంగణంలోకి నడుచుకొంటూ వెళ్లిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనాలను చోరీ చేసి ఉడాయించారు. శనివారం చోటు చేసుకున్న ఈ ఘటన సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన విషయం ఆదివారం వెలుగు చూసింది. వివరాల మేరకు.. జాతీయ రహదారి నుంచి నడుచుకుంటూ ఆస్పత్రిలోకి వెళ్లిన గుర్తు తెలియని యువకులు.. తిరుగు పయనంలో రెండు బైకులతో వెళ్లారు. సమీప తమిళనాడుకు చెందిన కొందరు యువకులు ముఠాగా ఏర్పడి వాహనాల చోరీకి పాల్పడుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. శనివారం జరిగిన చోరీ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా.. మహిళకు తీవ్రగాయాలు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: ఆటో బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న మహిళకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలో ఆదివారం జరిగింది. సోమల నుంచి బోయకొండకు ఆటోలో వెళ్తుండగా మార్గమధ్యలో కడియాలకుంట వద్ద అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సోమల మండలం గొల్లపల్లెకు చెందిన రెడ్డెమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.

మృతికి సంతాపం

శాంతిపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని శాంతంపల్లెకు చెందిన తెదేపా కార్యకర్త మునిరత్నం బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోవడం బాధాకరమని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నాయకులు జనార్దన్‌రెడ్డి, గోపాల్, నాగరాజు, రమేష్ పేర్కొన్నారు. మునిరత్నం మృతదేహానికి ఆదివారం నివాళి అర్పించారు. బాధిత కుటుంబానికి పార్టీ తరపున అండగా ఉంటామని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని నెల్లిపట్లకు చెందిన అలీంబాషా ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న 190 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడ్ని ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పరశురాముడు తెలిపారు.

(c) eenadu

నాటి నిర్లక్ష్యమే నేడు అన్నదాతకు శాపం

– న్యూస్‌టుడే, పి.గన్నవరం

రైతులు మునుపెన్నడూలేని విధంగా ఖరీఫ్ సాగుకు ఇక్కట్లు పడుతున్నారు. ప్రధానంగా శివారు ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. గత ఏడేళ్లగా పంటకాలువల్లో పూడిక తీయకపోవడం కారణంగా ఈ దుస్థితి ఏర్పడిందని ఈ నెల 18న పి.గన్నవరంలో జరిగిన జిల్లాస్థాయి సాగునీటి సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదీ ప్రధాన కారణం

ప్రధాన పంటకాలువల్లో గతంలో పడిపోయిన చెట్లు తొలగించకుండా ఉంచేయడంతో వ్యర్థాలు అడ్డుపడి దుర్వాసన రావడమే కాకుండా సాగునీటి ప్రవాహానికి ఇబ్బందికరంగా మారుతోంది. సుమారు 60 కిలోమీటర్ల మేర విస్తరించిన గన్నవరం ప్రధాన పంటకాలువపై 55 వేల పైబడి ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉంది. ఇందులో పలుచోట్ల చెట్లు పడిపోయి ఉన్నాయి. వీటిని తొలగించే చర్యలు చేపట్టడం లేదు. పొడవునా పలుచోట్ల తూడు, గుర్రపుడెక్క నిండిపోయింది. ఈ కారణంగా శివారు ప్రాంతాలకు నిర్దేశిత నీరు చేరడం లేదని సాగునీటి సంఘాల అధ్యక్షులు వాపోతున్నారు.

గన్నవరం ప్రధాన పంటకాలువలో జి.పెదపూడి వద్ద గుర్రపు డెక్క

ఆక్రమణలు తోడై.. పి.గన్నవరం నుంచి సుమారు ఏడు కిలోమీటర్ల మేర ఉన్న ఏనుగుపల్లి పంటకాలువ గట్టు ఆక్రమణల బారినపడి కుంచించుకుపోయింది. వాస్తవానికి ఒకవైపున అధికారులు వెళ్లేందుకు వీలుగా ఇన్స్‌పెక్షన్ బ్యాంకు(గట్టు)లుగా ఉండేవి. అధికారులు, సిబ్బంది వీటిపై వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకునేవారు. ఈ గట్లను ఆక్రమించేసి కొబ్బరి చెట్లు, ఇతర కట్టడాలు వెలిశాయి. ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఆక్రమణలు గుర్తించామని ఎస్.ఇ. కె.గోపీనాథ్ 'న్యూస్‌టుడే'కు వివరించారు.

చెరువులు వెలవెల.. ధర కళకళ

వనామీ రొయ్యలు 100 కౌంట్ రూ.250కు పెరుగుదల

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ఈ ఏడాది మే నెలలో వాతావరణ మార్పులు.. వ్యాధులు వనామీ రొయ్యల సాగును కుదేలు చేశాయి. ప్రతికూల పరిస్థితి కారణంగా అప్పటికప్పుడు పట్టుబడి పట్టి వచ్చిన ధరకు విక్రయించేశారు. గత నెలలో 100 కౌంట్ కిలో రూ.210 ఉంటే ప్రస్తుతం రూ.250కు పెరిగింది. దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడం, ఎగుమతికి ఆర్డర్లు రావడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు వ్యాపారులు చెబుతున్నారు. మరో రూ.10 పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. చైనా, యూఏఈ, సౌదీ, కువైట్, వియత్నం, థాయ్‌లాండ్ దేశాలకు చిన్న కౌంట్ రొయ్యల ఎగుమతులు పెరగడంతో గిరాకీ పెరిగింది.

ధరల పెరుగుదల ఇలా.. (కిలోకు రూ.లలో)

కౌంట్	ప్రస్తుతం	జూన్‌లో
100	250	215
90	260	220
80	280	240
70	305	265
60	335	295
50	355	310
40	385	340
30	460	410

వారికి నష్టం..

జిల్లాలో అధికారికంగా 40 వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. అనధికారికంగా మరో 10 వేల ఎకరాల్లో చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం సుమారు 80 శాతం చెరువులు ఖాళీ అయ్యాయి. 100 కౌంట్ దాటిన రొయ్యలు ఉన్న చెరువులు 10వేల ఎకరాల లోపే ఉంటాయని అంచనా. ఇప్పటికే పట్టుబడి పట్టిన రైతులు నష్టాలపాలయ్యారు.

వ్యాధుల విజృంభణ...

ఆక్వాసాగులో గత రెండు నెలలుగా వ్యాధుల విజృంభణ ఎక్కువైంది. మండే ఎండలు.. తర్వాత వానలు, చల్లగాలు ఇలా వాతావరణంలో విపరీత మార్పుల కారణంగా రొయ్యల ఎదుగుదల లేక పెట్టుబడులు పెరిగిపోయాయి. హేచరీల్లో నాణ్యమైన సీడ్ రాకపోవడంతో చెరువుల్లో వేసిన తర్వాత వ్యాధుల బారిన పడుతున్నాయి. తెల్లమచ్చ, వైట్ గట్, విబ్రియో, ఈహెచ్‌పీ వ్యాధుల విజృంభణతో చెరువులు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం చెరువుల్లో పిల్లలను వదులుతున్నారు. అవి పట్టుబడికి రావడానికి మరో రెండు నెలల సమయం పడుతుంది. ఈ ధరలు అప్పటి వరకు నిలకడగా ఉంటేనే రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

పట్టుబడి చేస్తున్న వనామీ రొయ్యలు

రైతులకు ఉపశమనం

ప్రస్తుతం వనామీ రొయ్యల ధరలు స్వల్పంగా పెరిగాయి. రైతులకు టన్నుకు అదనంగా రూ.30 వేల వరకు లాభం వస్తోంది. కొంత కాలంగా నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న సాగుదారులకు ఈ ధరలు కొంత ఉపసమనం కలిగించనున్నాయి.
-పీవీ శ్రీనివాసరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

వైకాపా జమానాలో అయినవారికే నజరానా

1,836 నిర్మాణాలకు ఆస్తి పన్నే లేదు ● నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన యంత్రాంగం

ఈనాడు, రాజమహేంద్రవరం: వైకాపా జమానాలో ప్రజాప్రతినిధులు.. నాయకుల మాటలే శాసనమన్నట్లు అధికారులు వ్యవహరించారు. అడ్డగోలుగా స్థలాలు ఆక్రమించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. 45 రోజులుగా చేస్తున్న 'పుర' సర్వేలో పన్ను పరిధిలో లేని నిర్మాణాల నిగ్గు తేలుతోంది. ఉమ్మడి జిల్లాల్లోని నగర, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో దాదాపు రూ.4.59 కోట్ల మేర ఆదాయానికి గండి కొట్టినట్లు గుర్తించగా.. వాటిని వసూళ్లు చేసేందుకు, బాధ్యులైన అధికారుల పైనా చర్యలకు యంత్రాంగం సిద్ధమవుతోంది.

అమలాపురం పట్టణంలో ఓ వీధి

వెలుగులోకొస్తున్న అక్రమాలు..

జగన్ జమానాలో అధికారులపై కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఇతర నాయకులు ఒత్తిడి తెచ్చి పలు నిర్మాణాలకు పన్నులు వేయకుండా అడ్డుకోగా.. కొన్నింటికి వసూళ్లు చేయాల్సిన నిర్దేశిత పన్ను కంటే తక్కువగా నమోదు చేశారు. తూర్పు గోదావరి, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల్లో ఇప్పటి వరకు 1836 నిర్మాణాలకు అసలు పన్నులే విధించలేదని తేలింది. వీటిలో అత్యధికంగా వైకాపా హయాంలోనే నిర్మించినవే కావడం గమనార్హం. ఆస్తి పన్ను వసూళ్లు చేయకపోవడం వల్ల రూ.2.33 కోట్లు మేర ఆదాయం కోల్పోయినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఒక్క కాకినాడలోనే ఈ తరహా నిర్మాణాలు 365 ఉండగా అత్యధికంగా రూ.1.32 కోట్లు, రాజమహేంద్రవరంలో 457 ఇళ్లకు రూ..59.50 లక్షలు మేర ఆస్తి పన్ను వసూలు చేయలేదు.

విలువ తగ్గించి నమోదు..

విస్తీర్ణం కంటే తక్కువగా చూపించడం, వాణిజ్య అవసరాలకు వినియోగించేవాటిని నివాస భవనాలుగా చూపించి పన్నులు తగ్గించడంలో క్షేత్ర సిబ్బంది, కమిషనర్ల ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఉమ్మడి జిల్లాలో 3,032 నిర్మాణాలకు విలువ తగ్గించి ఆస్తి పన్ను వసూలు చేయడం వల్ల పుర ఆదాయం సుమారు రూ.2.25 కోట్లు కోల్పోయినట్లు తేల్చారు.

జిల్లాలో నగర, పురపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో పన్నులు విధించని, తక్కువగా చూపిన వివరాలు...

● పురపాలిక ▲ పన్ను వేయని నిర్మాణాలు ◗ కోల్పోయిన ఆదాయం (రూ.లక్షల్లో)

పురపాలిక	పన్ను వేయని నిర్మాణాలు	కోల్పోయిన ఆదాయం (రూ.లక్షల్లో)
అమలాపురం	99	6.39
మండపేట	112	6.14
రామచంద్రపురం	52	2.47
ముమ్మిడివరం	60	1.30

రూ.22 వేలు పలికిన పులస

యానాం, న్యూస్‌టుడే: పులస చేపలకు ఈ ఏడాది రికార్డు ధరలు లభిస్తున్నాయి. యానాంలోని రాజీవ్‌బీచ్‌లో ఆదివారం మత్స్యకారులు నిర్వహించిన వేలంలో 1.800 కేజీల పులసను చేపల వ్యాపారం చేసే పొన్నమండ రత్నం రూ.22 వేలకు దక్కించుకున్నారు. బంగాళాఖాతం నుంచి సంతానోత్పత్తి కోసం గోదావరి వరద నీటిలోకి వచ్చి మత్స్యకారులకు చిక్కే. వీటిని కొనుగోలు చేసేందుకు ఏటా తీవ్ర పోటీ ఉంటుంది. హోప్ ఐలాండ్‌కు చెందిన మల్లాడి ప్రసాద్ వలకు ఈ చేప చిక్కింది. గతేడాది ఓ పులసను రూ.23 వేలకు విక్రయించినట్లు అతడు చెప్పారు. ప్రస్తుత సీజన్లో లభ్యత తక్కువగా ఉండటంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

పులసను చూపిస్తున్న రత్నం

పిల్లలకు గండం.. పెద్దలకు కష్టం!

పి.గన్నవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం బూరుగులంక రేవులో వరద నీరు తగ్గుముఖం పట్టడంతో పడవలు తిరగడం లేదు. దీంతో ఊడిమూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజలకు కష్టాలు వచ్చిపడ్డాయి. నది మధ్యలో గతంలో వేసిన తాత్కాలిక కాలిబాట ఈ నెల 10న వరదకు కొట్టుకుపోయింది. అధికార యంత్రాంగం రెండు మర పడవలను ఏర్పాటు చేయడంతో గురువారం వరకు అవి తిరిగాయి. వరద నీరు తగ్గిపోవడంతో నదీపాయ బయటపడింది. మధ్యలో ఒకచోట నడుము వరకు లోతు ఉంది. పెద్దలు దాంట్లోంచి నడిచి రాకపోకలు సాగిస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను ఎత్తుకొని అవతలకు దాటిస్తున్నారు. సాయంత్రం రేవు వద్దకు వెళ్లి జాగ్రత్తగా పిల్లలను ఇళ్లకు తీసుకెళ్తున్నారు. ఇక్కడ తూరలు ఏర్పాటు చేసి తాత్కాలిక కాజ్‌వేగా సదుపాయం కల్పిస్తే పిల్లలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

బూరుగులంకరేవులో చిన్నారులను ఎత్తుకుని రేవు దాటిస్తున్న పెద్దలు

బాటలపైనే రాకపోకలు

గోదావరి వరద ప్రవాహం కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో కోనసీమలోని వివిధ నదీపాయల్లో నీరు బాగా తగ్గిపోయింది. దీంతో స్థానికులు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక బాటలు బయటపడుతున్నాయి. ఆదివారం బెల్లంపూడి-పెదమల్లంక రేవులో రాకపోకలు కొనసాగిస్తున్నారు. మళ్లీ వరదనీరు వచ్చేవరకు వీరికి ఇబ్బంది ఉండదు. మూడు రోజుల క్రితం వరకు ఇక్కడ మర పడవలపై ప్రయాణం సాగించారు.
- న్యూస్‌టుడే, పి.గన్నవరం

శాకంబరిగా నూకాలమ్మ

మామిడికుదురులోని నూకాలమ్మను ఆదివారం భక్తులు శాకంబరిగా అలంకరించి పలు రకాల ప్రసాదాలతో సారె సమర్పించారు. సమరసత, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, మామిడికుదురు

నేడు వినతుల స్వీకరణ

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. కలెక్టర్ మహేష్‌కుమార్‌తో పాటు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజలు తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లా పరిష్కార మార్గాలు పొందాలని సూచించారు.

బిల్లులందక పేదల ఘోల్లు

ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం బిల్లులకు ఎదురు చూపులు

న్యూస్‌టుడే, అల్లవరం

లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న గృహ నిర్మాణ శాఖ సిబ్బంది

పేదల సొంతింటి కలను నిజం చేయాలని 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకంలో అర్హులకు పక్కా ఇళ్లను మంజూరు చేసింది. అప్పట్లో నిర్మాణాలు ప్రారంభించిన వారికి రూ. 288.28 కోట్లు చెల్లించారు. ఇంకా రూ.65.16 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా బిల్లులు నిలుపుదల చేసింది. కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోయింది.

గతంలో ఇలా..

ఒక్కో ఇంటికి రూ.2 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.2.50 లక్షలుగా నిర్ణయించారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యే నాటికి నాలుగు దశల్లో బిల్లులు చెల్లించారు. వీటిలో సగానికి పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. తర్వాత వచ్చిన వైకాపా బిల్లులు చెల్లింపులు పూర్తి చేయకుండా కాలయాపన చేసింది.

సర్వేతో కదలిక..

గత ఏడాది అక్టోబరు, నవంబరు నెలల్లో సచివాలయ, గృహ నిర్మాణ శాఖ సిబ్బంది గ్రామాల్లో ప్రత్యేక సర్వే నిర్వహించారు. లబ్ధిదారుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి పెండింగ్ బిల్లులపై ప్రభుత్వానికి నివేదించారు. సర్వే ప్రక్రియ పూర్తయి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఎలాంటి ప్రగతి లేదు.

ప్రభుత్వానికి నివేదించాం

గతంలో బిల్లులు చెల్లింపులు నిలిచిన వారి వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేశాం. వారి వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. నిధులు విడుదల చేసిన వెంటనే నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి.
- నరసింహారావు, గృహ నిర్మాణ శాఖ పీడీ

జిల్లాలో ఇళ్ల వివరాలు

మంజూరైనవి	36,680
ప్రారంభించనివి	1693
పునాది దశలో	2668
వివిధ దశల్లో	20179
పూర్తయినవి	12140
మొత్తం బిల్లులు (కోట్లలో)	353.44
చెల్లించినది	288.28
పెండింగ్‌లో ఉన్నది	65.16

25 నుంచి సత్యదేవుని ఆవిర్భావ వేడుకలు

అన్నవరం, న్యూస్‌టుడే : అన్నవరం సత్యదేవుని ఆవిర్భావ వేడుకలు ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్నాయి. 26న స్వామివారి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. స్వామి, అమ్మవారు, పరమేశ్వరుల మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, ప్రాకారసేవ, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయి. ఉత్సవాల నిర్వహణకు హైదరాబాద్‌కు చెందిన సిరి కాలిబ్రేషన్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ ఏ.నాగేశ్వరరావు ప్రధానాలయం, యంత్రాలయం, ఉపాలయాల్లో అలంకరణకు పట్టు వస్త్రాలు అందించారు.

● దేవస్థానంలో అత్యధికంగా సత్యదేవుని ప్రసాదం ప్యాకెట్లు లక్ష ఆదివారం విక్రయించారు. లోవ తలుపులమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు తిరుగుప్రయాణంలో ఎన్‌హెచ్‌పై నమూనాలయాల వద్ద పెద్దసంఖ్యలో ప్రసాదం ప్యాకెట్లను కొనుగోలు చేశారు. స్వామివారి పల్లకీ సేవ జరిగింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంటు డైరెక్టర్ ఎల్.వి.రమణ మూర్తి స్వామిని దర్శించుకుని పూజలాచరించారు.

WANTED
WARDENS
(Male/Female Candidates)
For ADITYA HOSTELS
QUALIFICATION :
Any Degree with fluency in English & Hindi
FREE LODGING & BOARDING
(BACHELORS PREFERRED)
ATTRACTIVE SALARY FOR DESERVING CANDIDATES
ADITYA ACADEMY
Srinagar, KAKINADA
Ph: 7036146665
77320 76668

వణికిస్తున్న శిథిల భవనాలు

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం, మండపేట

జిల్లా కేంద్రం అమలాపురంలో పాత భవనాలు భయపెడుతున్నాయి. ఎప్పుడు కూలుతాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ వాటిలో విధులు నిర్వహిస్తున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన వీటికి కనీసం మరమ్మతులు చేయడం లేదు. వర్షాలకు పెచ్చులు ఊడి మీద పడతాయేమోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. అమలాపురం ఏవీఆర్ నగర్‌లో 8 పాత భవనాలు ఉన్నాయి. మున్సిపల్ ఉద్యోగుల నివాస సముదాయంలో చెట్లు పెరిగి పాము, క్రిమికీటకాలు సంచరిస్తున్నాయి. గడియారస్తంభం కూడలిలో, శ్రీచెన్నమల్లేశ్వరస్వామి ఆలయం వీధిలో శిథిల పాఠశాల, ఇతర నిర్మాణాలు ఇలాగే ఉన్నాయి. మండపేటలో 5 దశాబ్దాల క్రితం బస్టాండ్ వద్ద మెయిన్ రోడ్డును ఆనుకుని ట్రావెల్స్ బంగ్లా నిర్మించారు. శిథిల దశకు చేరి రెండున్నర దశాబ్దాలు దాటినా కనీసం మరమ్మతులైనా చేయలేదు. ఇదే ప్రాంగణంలోని పంచాయతీరాజ్, ర.భ.శాఖ భవనాలు అధ్వానంగా మారాయి.

అమలాపురం ఏవీఆర్‌నగర్‌లో చెట్ల మధ్య ఇలా..

వర్షపు నీరు లీకవుతున్నా.. అక్కడే విధులు నిర్వహిస్తున్నారు.

ఆదాయం వస్తున్నా..

రూ.కోట్లు ఆదాయం తెచ్చిపెడుతున్న ప్రభుత్వశాఖల కార్యాలయ భవనాల పరిస్థితి దారుణంగా ఉంది. ఇలాంటి వాటిలో ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, ఎస్ఈబీ, వాణిజ్య పన్నులు తదితర శాఖల తాలుకా కార్యాలయాలు ఉన్నాయి. అమలాపురం నల్లవంతెన దిగువున అధ్వాన భవనంలో ఎక్సైజ్ (అబ్కారీ) కార్యాలయం నిర్వహిస్తున్నారు. చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతోంది. నల్లవంతెన ఎన్టీఆర్ మార్గ్‌లో 1910లో బ్రిటిష్ కాలంలో నిర్మించిన భవనంలోనే రిజిస్ట్రేషన్లుశాఖ కార్యాలయం ఉంది.

చర్యలు తీసుకుంటాం...

అమలాపురం పట్టణంలో సుమారు 22 పాతభవనాలున్నాయి. సంబంధిత వ్యక్తులకు నోటీసులు అందజేశాం. కొన్నింటిని వారే కూల్చివేశారు. ప్రమాదంగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేస్తే వాటిని కూలగొట్టేలా చర్యలు తీసుకుంటాం. - **రాణి సంయుక్త, అమలాపురం పట్టణ ప్రణాళికాధికారిణి**

అన్నవరంలో నిఘా నిద్రావస్థ

సరకుల స్టోర్ నుంచి వినియోగం వరకు.. ● అడుగడుగునా కొరవడిన పర్యవేక్షణ

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరంలో నిఘా వ్యవస్థ సక్రమంగా లేదు. పూజలు, ఇతర వాటికి వినియోగించే పూజాసామగ్రి, సరకులు స్టోర్స్ నుంచి వినియోగం వరకు పర్యవేక్షణ కొరవడింది. క్షేత్ర రక్షకులు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో పూజకు వినియోగించే నెయ్యి డబ్బాలు దేవస్థానం స్టోర్స్ నుంచి ఈ ఆలయానికి రాగా మూడు డబ్బాలను అక్కడ పనిచేసే ఉప ప్రధాన అర్చకుడు, సంభావన పరిచారకుడు పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు. వీరిద్దరినీ విధుల నుంచి సస్పెండ్ చేసినా ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. 'అన్నవరంలో నెయ్యి పక్కదారి' శీర్షికతో ఈనెల 19న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై పూర్తి వివరాలు అందించాలని ప్రభుత్వ కార్యదర్శి ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ కార్యదర్శికి జరిగిన ఘటన, గుర్తింపు, తీసుకున్న చర్యలు వివరిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ నివేదిక అందజేశారు. మరోవైపు ఇలా సరకులు పక్కదారి పడుతున్న పరిస్థితులు ఎక్కడైనా ఉన్నాయా అన్నది పరిశీలించాలని దేవస్థానం అధికారులను కమిషనర్ ఆదేశించారు. దేవస్థానంలోని వివిధ సబ్‌స్టోర్స్ (సరకులు నిల్వచేసే గోదాం), ఉపాలయాలకు సంబంధించి సీసీ కెమెరాల గత 90 రోజుల బ్యాకప్ పరిశీలించి నివేదిక పంపాలన్నారు. నెయ్యిని పక్కదారి పట్టించే ప్రయత్నం చేసిన ఉప ప్రధాన అర్చకుడిని ఇప్పటికే సస్పెండ్ చేయగా సంభావన పరిచారికుడ్ని నిలుపుదల చేయాలని ఆదేశాలిచ్చారు. సుమారు 300 కెమెరాలు ఉన్నా రికార్డింగ్ బ్యాకప్ సామర్థ్యం మాత్రం కేవలం 30 రోజులే ప్రస్తుతం ఉంది. సామర్థ్యం 90 రోజులకు పెంచడానికి అవసరమైన సర్వరు, హార్డ్‌డిస్కులు ఏర్పాటు చేయడానికి ఇటీవల రూ.70 లక్షలు అంచనాలను అధికారులు సిద్ధం చేశారు. అయితే స్టోర్స్, ఉపాలయాల సీసీ కెమెరాల 90 రోజుల బ్యాకప్ పరిశీలించాలని కమిషనర్ ఆదేశించినా పరిశీలించే అవకాశం లేదని సమాచారం. స్టోర్స్ నుంచి సరకులు బయటకు వచ్చిన తర్వాత వాటి వినియోగంపై పర్యవేక్షణకు పకడ్బందీ వ్యవస్థ ఉండాలి.

కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank
(భారత ప్రభుత్వరంగ సంస్థ) Syndicate (A Govt. of India Undertaking)
మండపేట బ్రాంచ్ (13256): మెయిన్ రోడ్డు, మండపేట-533308,
డా॥ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్.
ఖాతాదారులకు కెనరా బ్యాంక్ విజ్ఞప్తి
మండపేట మండలంలోని కెనరా బ్యాంకులో దొంగ బంగారం దొరికిందని కొన్ని సామాజిక మాధ్యమాలు తప్పుడు సమాచారాన్ని వైరల్ చేస్తున్నాయి. ఇది అసత్యం మరియు తప్పుడు సమాచారమని ఖాతాదారులు గ్రహించగలరు. కెనరా బ్యాంకులో ఎటువంటి దొంగ బంగారం లేదని స్పష్టం చేస్తున్నాము. అబద్ధపు వార్తలు, వదంతులను నమ్మవద్దని వినియోగదారులకు తెలియచేస్తున్నాము. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని వ్యాపించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాము.
సం/- బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంక్, మండపేట బ్రాంచ్

పర్యాటకం.. కావాలి ప్రగతి చోదకం..!

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, తాళ్లరేవు

కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఆధ్యాత్మికత, ఆనందం, ఆహ్లాదం పంచే పర్యాటక ప్రాంతాలెన్నో ఉన్నాయి. వైకాపా హయాంలో ఈ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో రూ.94 కోట్లతో అఖండ గోదావరి ప్రాజెక్టు పేరుతో పర్యాటక అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లా నుంచి ఎన్నికైన పర్యాటశాఖ మంత్రి కందుల దుర్గేశ్ పర్యాటక ప్రాంతాలపైనే దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

మౌలిక వసతులు లేక

కాకినాడకు సుమారు 8 కి.మీ దూరంలో సముద్రం మధ్యన సహజ సిద్ధమైన ద్వీపం హోప్ ఐలాండ్ ఉంది. తుపాను నుంచి పట్టణానికి రక్షణగా, పర్యాటకులను ఆకర్షించే ద్వీపంగా ఇది నిలుస్తుంది. సముద్రంలో 40 నిమిషాల బోటు ప్రయాణంతో ఇక్కడకు చేరుకోవచ్చు. ఏపీ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో 2019 వరకు ప్రత్యేకంగా పడవలు నడిపేవారు. వారి కోసం షెడ్లు నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పించారు. కచ్చులూరు పడవ ప్రమాద ఘటన తర్వాత బోట్లు నిలిపేశారు. కొంతమంది స్థానిక మత్స్యకారుల పడవలపై అక్కడకు వెళ్లినా సదుపాయాలు లేక నిరాశగా వెనుతిరుగుతున్నారు.

కోరింగ.. కావాలి మరింత కనువిందు..

కాకినాడకు సుమారు 10 కి.మీ దూరంలో దట్టమైన మడ అడవులతో కోరింగ అభయారణ్యం, వన్య ప్రాణుల సంరక్షణ కేంద్రం ఉంది. ఇక్కడ ఆరు అడుగుల ఎత్తులో చెక్క వంతెనపై విహరించడం, గోదావరి పాయ నడుమ బోటుతో సముద్రంలోకి వెళ్లడాన్ని పర్యాటకులు ఆస్వాదిస్తున్నారు. గతంలో కొంతమేర ఇక్కడ అభివృద్ధి పనులు చేసినా ఇంకా పర్యాటకులకు మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన ఉంది. గైడ్‌లను నియమిస్తే బాగుంటుందని సందర్శకులంటున్నారు. ✦ కాకినాడ జిల్లాలో తలుపులమ్మలోవ గుడి నుంచి అన్నవరం సత్యనారాయణ స్వామి.. పిఠాపురం శక్తిపీఠం, పెద్దాపురంలోని తొలి తిరుపతి గుడి, సామర్లకోటలోని 1100 ఏళ్లనాటి భీమేశ్వరస్వామి ఆలయం, సర్పవరంలోని భావన్నారాయణ ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం సర్క్యూట్ ప్రతిపాదన దశలోనే ఉంది.

మంత్రి దుర్గేశ్‌పైనే ఆశలు

పర్యాటకంగా అభివృద్ధిలేని కాకినాడ హోప్ ఐలాండ్ ప్రాంతం

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..

విజయవాడలోని భవానీ ద్వీపం, హోప్ ఐలాండ్ కంటే విస్తీర్ణంలో చిన్నదే. జల క్రీడలు, అమ్యూజ్‌మెంట్ పార్క్, అతిథులు రాత్రిళ్లు బస చేయడానికి హోటళ్లు ఉండటంతో ఈ ద్వీపానికి సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కాకినాడ హోప్ ఐలాండ్‌లో పరిస్థితి దీనికి భిన్నం. పర్యాటకంగా ఎలాంటి అభివృద్ధి జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎకో టూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ప్రయాణికుల బోట్లు, 12 కాటేజీల నిర్మాణం, పర్యాటకుల నడక దారి, విశ్రాంత గదులు, మరుగుదొడ్లు, పిల్లలు ఆడుకునేందుకు సామగ్రి సమకూర్చడానికి సుమారు రూ.8 కోట్లు అవుతుందని లెక్కగట్టారు. నెలకు లక్ష మందికి పైగా సందర్శించడానికి అవకాశం ఉంటుందని అంచనా వేశారు. కానీ ఈ ప్రతిపాదనలకు అటవీశాఖ అధికారులు మోకాలడ్డినట్లు తెలిసింది. దీనిపై పర్యాటక మంత్రి చొరవ చూపితేనే ప్రాజెక్టులో ముందడుగు పడేది.

మధురమే... మధురమే... మధురమే...
ఈ క్షణములు ఇంకా మధురమే...
పదవీ విరమణ శుభాకాంక్షలు
ఈనాడు
మరిన్ని వివరాలకు :
80085 97607

(c) eenadu

కూరగాయల నైవేద్యం

అమలాపురం గ్రామీణ మండలం రంగాపురంలోని బాలా త్రిపురసుందరి, గోగులమ్మ, చింతాలమ్మ భద్రకాళీ, రాజరాజేశ్వరి అమ్మవార్లకు సమరసత సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం ఆషాఢం సారె సమర్పించారు. ఇందుపల్లి గ్రామదేవత మావుళ్లమ్మవారిని గ్రామస్థులు కూరగాయలతో శాకంబరిగా ప్రత్యేకంగా అలంకరించారు. - న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

కరెన్సీ శోభాయమానం

ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలోని శ్రీసత్తెమ్మతల్లికి రూ.20 లక్షల కరెన్సీ నోట్లతో అలంకారం చేశారు. ఆషాఢ మాసం ఆదివారం కావడంతో ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కరెన్సీ నోట్ల అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు పులిహోర, అన్నప్రసాదం, పాలు తదితరాలను దాతలు సమకూర్చారు. - న్యూస్‌టుడే, ముమ్మిడివరం

కనువిప్పు కలగాలని సందేశం



ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బతిని ప్రపంచానికి పొంచి ఉన్న ముప్పుపై స్థానిక చిత్రకారుడు నల్లి సంగీత్ గీసిన చిత్రం ఆకట్టుకుంటోంది. మానవాళి, జంతు, పశుపక్ష్యాదులు ఏవిధంగా నాశనమైపోతున్నాయో ఇందులో చూపించారు. నారసంచుల వినియోగించడం, పచ్చదనాన్ని పెంచడం వంటివి చేపట్టాలని సూచించారు. - న్యూస్‌టుడే, మలికిపురం

కర్షకుడికి జల పరీక్ష..

వాడపల్లి కొత్త వంతెన సమీపంలో పొలాలు ఇలా..

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు తోడు బ్యాంక్ కెనాల్ నీటి మట్టం పెరగడంతో వాడపల్లి, లొల్ల, మెర్లపాలెం ఆయకట్టు పొలాలు సుమారు 300 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. ఇప్పటికే 90 శాతం నాట్లు వేశారు. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంటే పంట కుళ్లిపోయే పరిస్థితి ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కేవలం ఖరీఫ్ సీజన్‌లోనే ఇలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తుతున్నాయి. సైఫన్లు పూర్తిస్థాయిలోకి వినియోగంలోకి రాకపోవడం, అకాల వర్షాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముంపునీరు బయటకు వెళ్లేందుకు ప్రధాన పంట కాలవల్లో నీటిమట్టం 2,600 క్యూసెక్కుల నుంచి 2,350కి తగ్గించారు. అమలాపురం 950, గన్నవరం 580, బ్యాంక్ కెనాల్‌కు 790 క్యూసెక్కుల చొప్పున నీటిని మళ్లించారు. 30 క్యూసెక్కులు ఆత్రేయపురం మండలంలోని ఎత్తిపోతల పథకాలకు కేటాయించారు.

ఆశయానికి తూట్లు.. ప్లాంట్ నిరుపయోగం

రాజోలు: రాజోలు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో కొవిడ్ సమయంలో సినీ దర్శకుడు సుకుమార్ తన తండ్రి పేరున రూ.42 లక్షలతో ఏర్పాటు చేసిన 80 ఎల్‌పీఎం ఆక్సిజన్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. రెండో విడత కొవిడ్ సమయంలో ఆక్సిజన్ కొరతతో రాష్ట్రంలో చాలామంది మృత్యువాత పడ్డారు. ఆ పరిస్థితి రాకుండా ఆయన విశాల హృదయంతో అప్పట్లో దీన్ని సమకూర్చారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రికి 500 ఎల్‌పీఎం సామర్థ్యం గల ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. దీంతో దాత ఇచ్చిన ప్లాంట్ నిరుపయోగమైంది. ఈ విషయం రెండు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. ఈ విషయాన్ని సినీ నిర్మాత బండ్రెడ్డి విజయ్ వద్ద ప్రస్తావించగా ప్లాంట్ నిరుపయోగంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రశాంతిని వివరణ కోరగా ప్రస్తుతం ఆసుపత్రి సామర్థ్యానికి అవసరమైన ఆక్సిజన్ ప్రభుత్వ ప్లాంట్ నుంచి వచ్చేది సరిపోతోందన్నారు.

ఆయుర్వేద ఆసుపత్రులకు పూర్వవైభవం

న్యూస్‌టుడే, పి.గన్నవరం, అంబాజీపేట

పలుచోట్ల వైద్యుల నియామకం

నరేంద్రపురంలో పదేళ్లుగా వైద్యుడు లేని ఆసుపత్రి ఇది. ఇటీవల ఇద్దరు దిగువస్థాయి ఉద్యోగులను నియమించారు

కూటమి ప్రభుత్వం ఆయుర్వేద ఆసుపత్రులకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. దాదాపు పదేళ్ల క్రితం వరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పలుచోట్ల పూర్తిస్థాయిలో వైద్యులు లేక ప్రజలు ఈ సేవలకు దూరమయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టింది.

జిల్లాలో ఇలా..

నరేంద్రపురం, అంబాజీపేట, పాశర్లపూడి, తాటిపాక, కె.జగన్నాథపురం, పల్లంకుర్రు, ముమ్మిడివరం, అనాతవరం, ఆత్రేయపురం ప్రాంతాల్లో ఆయుర్వేద ఆసుపత్రులు ఉన్నాయి. నరేంద్రపురంలో వైద్యుడు దాదాపు పదేళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఇంతవరకు పూర్తిస్థాయి వైద్యుడి నియామకం చేపట్టలేదు. ఒకప్పుడు ఇక్కడికి నిత్యం సుమారు 50 మంది వరకు రోగులు వచ్చేవారు. అలాంటిది దాదాపుగా మూతపడినట్లయింది. అనాతవరంలో కూడా ఇదే దుస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది జనవరిలో వివిధ చోట్ల పూర్తిస్థాయి వైద్యులను నియమించింది. నరేంద్రపురంలో ఇటీవల ఒక ఎం.ఎన్.ఒ.(మేల్ నర్సింగ్ ఆర్డర్), ఒక అటెండరును నియమించడంతో వారు విధుల్లో చేరారు. ఇక్కడ కొన్నిచోట్ల భవనాలకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. పాశర్లపూడి, తాటిపాకలో నూతన భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపారు.

గతంలో కంటే మెరుగుదల

గతంలో నేను అంబాజీపేటలో పనిచేస్తూ మరికొన్ని ఆసుపత్రులకు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహించాను. ఇప్పుడు వైద్యుల నియామకంతో గతంలోకంటే మెరుగుదల కనిపిస్తుంది. కొత్తగా భవన నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు వెళ్లాయి. మందులు కూడా కొరత లేకుండా సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

- డాక్టర్ శ్యామ్‌సుందర్, ఆయుర్వేద ఆసుపత్రి వైద్యుడు, అంబాజీపేట

సాంస్కృతిక ఉద్యమం రావాలి

అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గొల్లపల్లి తదితరులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: దేశంలో సాంస్కృతిక ఉద్యమం రావలసిన అవసరం ఉందని కవి కోయ కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో చోడగిరి చంద్రరావు సమగ్ర కవిత్వం పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, త్రిరత్న బుద్ధవిహార్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను చంద్రరావు సాహిత్యం ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఛైర్మన్ నాగాబత్తుల ప్రసాదరావు, సంస్థ కార్యదర్శి డీటీ లోక్, ఇసుకపట్ల రఘుబాబు, జంగా బాబురావు, దిబ్బిడి బాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో అధ్యయనోత్సవాలు

ఉత్సవమూర్తులతో ప్రదక్షిణ చేస్తున్న వేదపండితులు, అర్చకులు

మామిడికుదురు, న్యూస్‌టుడే: అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయంలో ఐదు రోజుల పాటు జరగనున్న అధ్యయనోత్సవాలు ఆదివారం ఉదయం ప్రారంభమయ్యాయి. వివిధ దేవస్థానాల నుంచి వచ్చిన వేదపండితులు ద్రావిడ వేద సేవా కాలం జరిపారు. తొలుత ఉత్సవ మూర్తులతో ఆలయ ప్రదక్షిణ చేశారు. స్వామి, అమ్మవార్ల మూలవిరాట్లను వివిధ రకాల పూలు, తులసి మాలలతో అలంకరించారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాస పాల్గొన్నారు. ఏసీ వి.సత్యనారాయణ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

జగన్ జైలుకెళ్లడం ఖాయం: ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, న్యూస్‌టుడే: జగన్ త్వరలో జైలుకెళ్లడం ఖాయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల సారథ్యంలో కూటమి ప్రభుత్వానికి తిరుగులేదన్నారు. ఇప్పటికే వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి జైలుకెళ్లిన నేపథ్యంలో త్వరలో జగన్‌కు సైతం జైలుయోగం తప్పదన్నారు. ఆదివారం ఆలమూరు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మద్య నిషేధమని చెప్పి పిచ్చిపిచ్చి బ్రాండ్లతో కల్తీ మద్యం అమ్మి మోసం చేశారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక హామీలన్నీ అమలు చేస్తున్నామని, రాష్ట్రంలో ప్రశాంత వాతావరణంలో సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు అందుతున్నాయన్నారు. భవిష్యత్తులో వైకాపాకు 11 సీట్లు కూడా రావని ఎద్దేవా చేశారు.

చేనేత సంఘాలకు కమిటీలు వేయాలి

వినతిపత్రం అందిస్తున్న వీరభద్రేశ్వరరావు తదితరులు

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయ పరపతి సంఘాలకు నామినేటెడ్ కమిటీలు వేసిన విధంగానే చేనేత సంఘాలకు కూడా నామినేటెడ్ కమిటీలు గాని, ఎన్నికలు గాని పెట్టాలని కోరుతూ మాజీ చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ చింతా వీరభద్రేశ్వరరావు ఆదివారం పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు, కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం చేనేత సంఘాలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉండటంతో అభివృద్ధి కుంటుపడటమే కాకుండా కార్మికులకు ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయని, సభ్యులకు రాయితీ పథకాలు సక్రమంగా అందడం లేదని వివరించారు. ఈ కార్యక్రమంలో మోరి సొసైటీ మాజీ అధ్యక్షుడు గణేష్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్‌తో వైకాపా నాయకుల గుండెల్లో రైళ్లు: సుభాష్

మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

ఆలమూరు, న్యూస్‌టుడే: మేమొస్తే అరాచకాలు సృష్టిస్తామని వైకాపా నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం ఆలమూరు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల ముందు రెడ్‌బుక్ పేరు చెబితే అవహేళనగా మాట్లాడిన వారే ఈ రోజు రెడ్‌బుక్ జపం చేస్తున్నారన్నారు. రెడ్‌బుక్ అంటే గుండెపోటు వచ్చిందని ఒకరు, బాత్‌రూమ్‌లో జారిపడినవారొకరు, నల్లజుట్టు కాస్తా తెల్లజుట్టుగా మారినవారొకరని ఎద్దేవా చేశారు. తమది కక్షసాధింపు పాలన కాదని, అవినీతి చేసిన వారిని వదలబోమని ముఖ్యమంత్రి చెప్పినట్లుగానే మద్యం కుంభకోణంలో విచారణ ద్వారానే నిందితుల అరెస్టులు జరుగుతున్నాయన్నారు. మద్యం కుంభకోణంలో అప్రూవర్‌లు బయటికి వచ్చి వాస్తవాలు చెబుతుండటంతో.. అరెస్టు భయంతో, మానసిక వేదనతో జగన్ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడని విమర్శించారు. జగన్ అంశంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రి సుభాష్ అన్నారు. తాము కక్షసాధింపు చేయబోమని, అభివృద్ధి, సంక్షేమం వైపే కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.

మంత్రి చొరవతో దీర్ఘకాల సమస్య పరిష్కారం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: మంత్రి సుభాష్ చొరవతో సుమారు రెండున్నర దశాబ్దాల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారమైంది. ద్రాక్షారామలో మండపేట కొత్త కాలనీలో ఉంటూ ఆయుర్వేద మందులు తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న వారికి ఇప్పటి వరకు కుల ధ్రువీకరణ పత్రాలు లేవు. సర్పంచి కొత్తపల్లి అరుణ సమస్యను మంత్రి సుభాష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన అధికారులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ గెజిట్ ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్ ఏలో సీరియల్ నంబరు 36లో ప్రకటించిన వివరాల ప్రకారం బీసీ-ఎ38(155)కు చెందిన వారిగా గుర్తించారు. వీరికి 25 ఏళ్ల తర్వాత మంత్రి సుభాష్ కులధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మంత్రి సుభాష్, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుల నిర్లక్ష్యం.. విద్యార్థినికి శాపం

- రెండేళ్లపాటు హాజరు వేయకపోవడంపై తల్లిదండ్రుల ఆవేదన
- స్థానిక ఎమ్మెల్యే చొరవతో దిద్దుబాటుకు యత్నం

అంబాజీపేట, న్యూస్‌టుడే: ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా ఓ విద్యార్థిని భవిష్యత్తుకు తీవ్రం నష్టం వాటిల్లింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రెండేళ్ల పాటు హాజరు వేయకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందకుండా పోవడంతో పాటు ధ్రువపత్రాలు సైతం రాని పరిస్థితి నెలకొంది. దిక్కుతోచని స్థితిలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో చివరకు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో హడావుడిగా హాజరు వేయడానికి సదరు ఉపాధ్యాయులు ప్రయత్నిస్తుండటం విచిత్రం. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కేంద్రంలోని పండువారి పేటకు చెందిన నాగవరపు ప్రసాద్, ఉమామహేశ్వరి దంపతులకు ఇద్దరు కవల ఆడపిల్లలు. నాగవరపు బెహర్ష, బెరీషాలను స్థానిక ఉన్నత పాఠశాలలో రెండేళ్ల కిందట 6వ తరగతిలో చేర్పించారు. వీరిలో బెరీషాకు ఉపాధ్యాయులు హాజరు వేయగా బెహర్షకు వేయలేదు. ప్రస్తుతం వీరు 8వ తరగతి చదువుతున్నారు. 6, 7 తరగతుల్లో రెండేళ్లకు సంబంధించి హాజరు వేయకపోవడంతో బెహర్షకు తల్లికి వందనం నగదు పడలేదు. అప్పటి నుంచి తండ్రి ప్రసాద్ ఉపాధ్యాయుల చుట్టూ తిరిగారు. సమస్యను మండల విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లారు. తల్లికి వందనం రాకపోవడంతో పాటు ధ్రువపత్రాలు లేకపోతే రానున్న రోజుల్లో తమ కుమార్తెపై చదువులకు ఇబ్బంది ఏర్పడుతుందని తండ్రి మదన పడుతున్నారు. 6, 7 తరగతులు స్థానిక పాఠశాలలో చదివినట్లుగా ధ్రువపత్రాలు ఇప్పించాలని కోరుతున్నారు. ఇదే విషయంపై ఇటీవల స్థానిక పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు వివరించడంతో ఆయన సదరు హెచ్‌ఎం కడలి సాయిరామ్‌ను వివరణ కోరారు. దీంతో హడావుడిగా రెండేళ్లకు సంబంధించి హాజరు ఒకేసారి వేయడానికి నిర్ణయించారు. దీనిపై పాఠశాల హెచ్‌ఎం కడలి సాయిరామ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆన్‌లైన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా విద్యార్థినికి హాజరుపడలేదన్నారు. 6, 7 తరగతులు ఇక్కడ చదివినట్లు ధ్రువపత్రాలు ఇస్తామన్నారు. ప్రస్తుతం ఆ బాలికకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ హాజరు వేస్తున్నామన్నారు.

'తల్లికి వందనం' ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ప్యాఫ్టో ఛైర్మన్ లంకలపల్లి సాయి శ్రీనివాస్ కోరారు. అమలాపురం ఎస్టీయూ విద్యాభవన్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు ఆధ్వర్యంలో ఎస్టీయూ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అమలు చేయాలన్నారు. దీని వల్ల ఈ బడులకు ఆదరణ పెరుగుతుందన్నారు. బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయులు సతమతమవుతూ ఒత్తిడికి గురి అవుతున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, జిల్లా ఆర్థిక కార్యదర్శి నేరుడుమిల్లి సత్యనారాయణ, రాంబాబు, మైనర్‌బాబు, మునగాల భవాని, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో!/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

GK గోల్డ్‌లోన్ బ్యాంకు / ప్రైవేటు తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ ధరకు కొనబడును లేదా అధిక రుణం ఇప్పించబడును. సంప్ర॥ 8897731257.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No.1) VJA వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 96038 42233, 97054 72233.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

రాజమండ్రికి 30 కి.మీ. దూరంలోగల మురారి, గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ॥ల రోడ్డు ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మబడును. (నో బ్రోకర్స్), ✆ 90329 88265.

PLOT FOR SALE

GENERAL

122.44/ 125.66/ 139/ 143.11/ 173.94 Sq. యార్డ్స్ రెసిడెన్షియల్/ కమర్షియల్ సైట్స్ అమ్మబడును. జనార్దన్ మిల్లు రోడ్, శివ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ ప్రక్కన, తాళ్ళపూడి. ✆ 83090 25067.

అమలాపురం, ఈదరపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి నగర్ ఏరియాలో ఈస్ట్ ఫేసింగ్ గల 4 సెంట్లు స్థలం అమ్మకమునకు కలదు. సెల్: 98664 97645.

TO LET

COMMERCIAL

బాలాజీపేట, రాజమండ్రి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో నూతనంగా నిర్మించబడుచున్న కమర్షియల్ బిల్డింగ్ నందు కమర్షియల్ స్పేస్ లీజుకు ఇవ్వబడును. (G+3), ఒక్కొక్క ఫ్లోర్ 2500 Sft. ✆ 90329 88265.

JOBS

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం, VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+ జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం (TG No.1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119570, 8639120683.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం - VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ.+ జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5,000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52838.

హోండా టూవీలర్ టెక్నీషియన్‌గా పనిచేయుటకు ట్రైనింగ్ ఇవ్వబడును. జీతం: రూ. 15,000/- నుండి రూ. 20,000/- వరకు + ఇన్సెంటివ్. Cont: శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్ రోడ్, కాకినాడ, సెల్: 94909 98888.

భారతదేశంలో అత్యంత నమ్మకమైన TATA కంపెనీలో వర్క్ చేయడానికి టీం లీడర్స్ కావలెను. 10th ఆపైన, ఫుల్/ పార్ట్ టైమ్. సెల్: 96188 44614.

పెద్దాపురం ప్రముఖుల ఇంట్లో వంట చేయుటకు బ్రాహ్మణ వంట మనిషి కావలెను. సంప్రదించండి సెల్: 94941 54551.

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 73375 44439, 90146 51068, 70756 33416.

Managers: కాకినాడ నందు ప్రముఖ ఇన్స్యూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు 40 సం॥లు నిండి, 10th పాసైనవారు సంప్రదించండి. శాలరీ, ఇన్సెంటివ్స్, ఫారిన్ కన్వెన్షన్ సదుపాయం కలదు. Cont: 98487 90024.

వర్క్ ఫ్రం హోమ్ డేటా ఎంట్రీ: ప్రముఖ ఔట్ సోర్సింగ్ సంస్థ నందు ఇంటి వద్ద ఉండి పార్ట్/ ఫుల్‌టైం ప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop/ Desktop, స్మార్ట్ ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 95534 29994.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-05 పైII
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	23,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	112-00
రిటైల్ లైవ్	134-00
డ్రెస్డ్	194-00
స్కిన్‌లెస్	221-00

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact

9000180626, 9989993175

కాలువలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

రాయవరం, న్యూస్‌టుడే: వృద్ధాప్యానికి తోడు వీడని దీర్ఘకాలిక వ్యాధులతో జీవితంపై విరక్తి చెంది రాయవరం పంతులు డాక్టరుగారి వీధికి చెందిన కొండపల్లి అచ్చియ్యమ్మ (80) ఆదివారం మాచవరం-పసలపూడి పంట కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం ఫైలేరియా, ఆస్తమాతో ఆమె బాధపడుతున్నారు. ఆమె ఇద్దరు కుమార్తెలు రాయవరం, మండపేటలో నివసిస్తున్నారు. రాయవరంలోని కుమార్తె ఇంటి వద్దే ఉంటూ, ఆదివారం లొల్ల మానవత ఆశ్రమంలోని ఉచిత హోమియో వైద్యశిబిరంలో మందులు తెచ్చుకుంటానని వెళ్లి.. మాచవరం పంట కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. మృతురాలి అల్లుడు మాడా ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మండపేటలో శవపంచనామా అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగిస్తామని తెలిపారు.

ఉద్యోగాల పేరిట మోసం!

ఇద్దరిపై బాధితుల దాడి

అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేష్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేసిన ఇద్దరిపై బాధితులు దాడి చేసి గాయపర్చినట్లు సీఐ వీరబాబు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రావులపాలెంలోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న అయినవిల్లి మండలం వీరవల్లిపాలేనికి చెందిన దోనిపాటి మహేష్, తుని పురపాలక సంఘ ఉద్యోగి ఉదయ్‌శంకర్ స్నేహితులు. వీరిద్దరూ రెండేళ్ల క్రితం ఉద్యోగాలు ఇప్పిస్తామని ఓ మహిళ నుంచి రూ.2 లక్షలు, మరో ముగ్గురు యువకుల నుంచి రూ.6.70 లక్షలు తీసుకున్నారు. తాను రాజమహేంద్రవరంలో స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నట్లు మహేష్ నమ్మించాడు. ఉద్యోగాలు ఇంకెప్పుడు ఇప్పిస్తారని డబ్బులిచ్చినవారు ప్రశ్నించగా మోసం బయటికొచ్చింది. దాంతో ఆ ముగ్గురు యువకులు శని, ఆదివారాల్లో ఉదయ్‌శంకర్, మహేష్‌లను మరోసారి ప్రశ్నించినా.. డబ్బులివ్వలేమనడంతో వారిని అమలాపురం, అల్లవరం మండలం దేవర్లంక తదితర ప్రాంతాలకు తీసుకువెళ్లి దాడికి పాల్పడ్డారు. మహేష్ అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. డీఎస్పీ ప్రసాద్ వివరాలు సేకరించారు. దాడికి పాల్పడిన యల్లమిల్లి విజయ్, కృష్ణ, మహేష్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మహేష్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలని పలువురు దళిత నాయకులు కోరారు.

వివాహిత హత్య కేసు విచారణ వేగవంతం చేయండి

- డీజీపీకి జాతీయ మహిళా కమిషన్ ఆదేశం
- రాజోలు ఘటనపై సుమోటోగా స్వీకరణ

రాజోలు, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం బి.సావరం గ్రామంలో ఈ నెల 16న జరిగిన వివాహిత ఓలేటి పుష్ప దారుణ హత్య కేసును జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది. నిందితుడిని తక్షణం అరెస్ట్ చేసి విచారణ వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీని కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ ఆదివారం ఆదేశించారు. బీఎన్‌ఎస్ చట్టం 2023 ప్రకారం కేసు విచారణ చేపట్టాలని కోరారు. మృతురాలిని ఆమె ప్రియుడు షేక్‌షమ్మా వ్యభిచారం చేయాలని ఒత్తిడి తీసుకువచ్చి కిరాతకంగా హత్య చేశాడు. ఇప్పటికే రాజోలు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు

గోదావరిలో గాలిస్తున్న బృందం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం మండలం వాడపల్లిలో వెంకన్న దర్శనానికి వచ్చి గోదావరిలో స్నానానికి దిగి గల్లంతైన ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రాంతానికి చెందిన పి.దినేష్ కోసం ఆదివారం గాలింపు చర్యలు కొనసాగాయి. రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఫైర్, పోలీసులు, స్పెషల్ టీం సిబ్బంది బోట్లపై గోదావరిలో గాలించినప్పటికీ ఆచూకీ తెలియలేదు. ఏ ప్రాంతంలోనైనా యువకుడికి సంబంధించిన వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

(c) eenadu

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చర్యలు

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు ఆర్టీసీ డిపోలో శుద్ధజల యంత్రం ఏర్పాటుకు లక్కవరం గ్రామానికి చెందిన రుద్రరాజు రంగరాజు దంపతులు రూ.1.50 లక్షల విరాళాన్ని అందించారు. డిపో మేనేజర్ దనమ్మకు ఆదివారం ఈ మొత్తాన్ని అందించారు. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఈ సహాయం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ముదునూరి సాయిరాజు, అరిగెల సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

హాఫ్ మారథాన్‌లో రన్నరప్‌గా రామరాజు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: చెన్నైలో ఆదివారం నిర్వహించిన డ్రీమ్ రన్నర్స్ హాఫ్ మారథాన్ 45-46 సంవత్సరాల విభాగంలో లొల్ల గ్రామానికి చెందిన దాట్ల శ్రీరామరాజు 10 కి.మీ పరుగును 38 నిమిషాల్లో పూర్తిచేసి రన్నరప్‌గా నిలిచి నగదు బహుమతి, ట్రోఫీ అందుకున్నారు. ఈనెల 6న బెంగళూరులో జరిగిన 10 కిలోమీటర్ల పరుగును 39 నిమిషాల్లో పూర్తిచేసి నాలుగో స్థానంలో నిలిచారు. గ్రామస్థులతో పాటు పలువురు మాజీ సైనికులు రామరాజును అభినందించారు.

శాకంబరిగా వాగ్దేవి

నగరమహాలక్ష్మి

నర్సిపూడి దానాలమ్మ

వానపల్లి పళ్లాలమ్మ

బోడపాటివారిపాలెంలో తాటమ్మ

వనుములమ్మ

ఆత్రేయపురం, ఆలమూరు, కొత్తపేట, పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి, రావులపాలెం గ్రామీణం, అంబాజీపేట, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ కూరగాయలతో శాకంబరిగా అలంకరించి చీర, సారె సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్దఎత్తున హాజరై దర్శించుకున్నారు.

పి.గన్నవరం తాటమ్మ

మొగలికుదురులో పల్లాలమ్మ

లక్ష్మీపోలవరంలో కనకదుర్గమ్మకు సారె

ఊడలమ్మకు మొక్కులు

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884
ఉ: 10 - మ: 1

స్పందనకు వందనం

వీధి దీపాలకు మరమ్మతులు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం మండలం ఊబలంకలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పంచాయతీ కార్యదర్శి శరబరాజు దృష్టికి తీసుకెళ్లగా, సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు.

వృక్షాల తొలగింపు

అంబాజీపేట: ముక్కామలలోని ఉన్నత పాఠశాల, ప్రధాన రహదారి, ఆలయం వీధి తదితర చోట్ల వృక్షాలు పేరుకుపోయాయి. ఈ విషయాన్ని సర్పంచి బండారు వెంకటలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి సిబ్బందితో వృక్షాలు తొలగించారు.

రోడ్డు అంచులు చదును

మలికిపురం: మేడిచర్లపాలెంలో ప్రధాన రహదారి అంచుల్లో తుప్పలు, పిచ్చిమొక్కలు బాగా పెరిగిపోయాయి. ఈ సమస్యను సర్పంచి మేడిచర్ల వర్షిణి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారు. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో పొక్లెయిన్‌తో చదును చేయించారు.

పాఠశాలల చెంత.. ప్రమాదాలతో చింత

ప్రహరీలు లేక బాలలకు భద్రత కరవు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం, కొత్తపేట

కొత్తపేట నియోజకవర్గంలో పలు పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో రక్షణ కరువైంది. ఆకతాయిలు రాత్రి వేళల్లో లోపలికి ప్రవేశించి అసాంఘిక కార్యక్రమాలతో పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు. పలుచోట్ల పాఠశాలల స్థలాలు ఆక్రమణలకు గురికావడం, పక్కనే చెరువు, తుప్పలు ఉన్నచోట చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో విద్యాలయాల రూపురేఖలు మార్చామంటూ గొప్పలు చెప్పుకొన్నారు. మౌలిక సదుపాయాల్లో కీలకమైన ప్రహరీల నిర్మాణం పట్టించుకోలేదు.

ప్రహరీ లేని మెర్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల

హిందూ కొత్తపాలెం ప్రాథమిక పాఠశాల పక్కన చెరువు

నియోజకవర్గంలో ఇలా..

మండలం	పాఠశాలలు	ప్రహరీ లేనివి
ఆత్రేయపురం	53	16
కొత్తపేట	83	52
ఆలమూరు	49	15
రావులపాలెం	55	20

ఆత్రేయపురం మండలం మెర్లపాలెం ఎస్సీపేటను ఆనుకొని ఉన్న రెండు ప్రాథమిక పాఠశాలల చెంత పంట కాలువలు ఉన్నాయి. ఇదే గ్రామంలో కొత్తపాలెం పాఠశాల పక్కన చెరువు ఉంది. ప్రస్తుతం నీటి ప్రవాహంతో ప్రమాదకరంగా ఉన్నాయి. ఆత్రేయపురం ఎస్సీపేటలో ఉన్న పాఠశాల మురుగు కాలువకు ఆనుకొని ఉంది. గతంలో చెంతన ఉన్న డ్రెయిన్‌లో పడి ఒక బాలుడు మృతి చెందాడు. మెర్లపాలెం జడ్పీ పాఠశాలకు రక్షణ గోడ నిర్మించేందుకు అవసరమైన స్థలం కూడా లేదు. అతిపెద్ద గ్రామం ర్యాలి జడ్పీ పాఠశాలకు కొంత భాగం ప్రహరీ నిర్మించి వదిలేశారు. సెలవు రోజుల్లో కొంత మంది ఆకతాయలు పాఠశాలలోకి ప్రవేశించి జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. తరగతి గదుల్లోకి రాళ్లు వంటివి విసిరి ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇలా పలు పాఠశాలలకు ప్రహరీలు లేక రక్షణ కరువైంది. విద్యాశాఖ స్పందించి వీటి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ సమస్యలను విద్యాశాఖాధికారి పీవీ ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లగా, ప్రహరీల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి పంపామన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలోని శ్రీసత్యసాయి సేవా సంస్థలో సోమవారం నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ కన్వీనర్ మద్దుల పర్వతవర్ధనరావు తెలిపారు. పదో తరగతి చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తిగలవారు ఉదయం 9 గంటలకు అవగాహన సదస్సుకు హాజరుకావాలని కోరారు.

అన్నదాన ట్రస్ట్‌కు విరాళాలు

అయినవిల్లి, ఆత్రేయపురం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన ట్రస్ట్‌కు ఆదివారం విశాఖపట్నానికి చెందిన వరద కమలాకర్, అపర్ణ దంపతులు రూ.1,00,000, అయినవిల్లికి చెందిన రజనీ రియల్టర్స్ వారు రూ.10,116 విరాళం అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన దుద్దిపూడి నాగవెంకట వరప్రసాద్ 5.650 గ్రాములతో తయారు చేయించిన బంగారు నామం సమర్పించారు. వీరికి అర్చకులు వినాయకరావు స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాలు అందజేశారు. ● వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన నిత్యాన్నదాన భవన నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన చుండి వెంకటరామసుబ్బారావు, నాగకళ్యాణి దంపతులు రూ.51,116 విరాళాన్ని సమర్పించారు. వీరికి స్వామివారి చిత్రపటం అందించి దేవస్థానం ఈవో నల్లం సూర్యచక్రధరరావు అభినందించారు. ● వాడపల్లి వెంకన్న క్షేత్రంలో అన్నదానం నిమిత్తం రాజమహేంద్రవరానికి చెందిన కుదప వెంకటప్రద్యుమ్న కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళాన్ని అందించారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

అయినవిల్లి: దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అర్చకుడు

స్వామివారికి సమర్పించిన బంగారు నామం

అన్ని రంగాల్లోనూ అభివృద్ధి

కొత్తపేట: కూటమి పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో పురోభివృద్ధి సాధిస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం మందపల్లిలో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత తల్లికి వందనం, ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, మెగా డీఎస్సీ. ఇలా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. చింతం కృష్ణ, సిద్ధంశెట్టి సత్యనారాయణ, ధర్నాల రామకృష్ణ, భూసి భాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మందపల్లిలో అర్చకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు, నాయకులు

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

రాజోలు, న్యూస్‌టుడే: మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సోంపల్లిలో కనకదుర్గ అగ్నికుల క్షత్రియ ఫిషర్‌మెన్ అండ్ బోట్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహన, శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్యసంపద యోజనలో భాగంగా ప్రాథమిక మత్స్యకార సహకార సంఘాలను ఫిష్ ఫార్మర్స్ ఉత్పత్తిదారుల సంస్థగా మార్చి బలోపేతం చేసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. దీనిద్వారా లబ్ధి పొందిన ఈ సంఘం రాష్ట్రంలోనే మొదటిగా నిలిచిందన్నారు. రూ.5 లక్షలు మంజూరయ్యాయన్నారు. నియోజకవర్గంలోని మొత్తం 36 సంఘాల్లో 20 వేల మందికి లబ్ధి చేకూరనుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు సంకరపు ఆదినారాయణ, సర్పంచి కట్టా శ్రీనివాసరావు, ఉపసర్పంచి పొన్నమండ శ్రీనివాసరావు, ఉప ఎంపీపీలు ఇంటిపల్లి ఆనందరాజు, శ్యాంబాబు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ గోపాలకృష్ణ, ఆప్కాబ్ సెంట్రల్‌టీం సభ్యులు కె.గంగాధర్, పి.వి.ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

కొళాయి నీరు వృథా..

తొత్తరమూడి పంచాయతీ పరిధి ముక్తేశ్వరం ప్రధాన రహదారి అగ్రహారం వీధిలో పైపులైను దెబ్బతిన్న కారణంగా కొళాయి నీరు వృథాగా పోతోంది. దీంతో సమీపంలోని ఇళ్లు, కాలనీలకు సక్రమంగా సరఫరా కావడం లేదని అక్కడి ప్రజలు వాపోతున్నారు. దీనిని పరిశీలించి మరమ్మతులు చేపడతామని పంచాయతీ కార్యదర్శి రవి తెలిపారు. – న్యూస్‌టుడే, అయినవిల్లి

పూడిక తొలగించరూ..

వాడపల్లి కొత్తకాలనీ పార్కింగ్ చెంత డ్రెయిన్‌లో చెత్త పేరుకుపోవడంతో మురుగు పారుదలకు ఆటంకం ఏర్పడింది. దుర్వాసన, రాత్రివేళల్లో దోమల బెడదతో స్థానికులు విసుగెత్తిపోతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో బీకేఎస్ఎస్ వెంకటరామన్ వద్ద ప్రస్తావించగా, కాలువను శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

పనులు పూర్తికావు.. నిధులు కానరావు

లూటుకుర్రు మండల పరిషత్ పాఠశాలకు సంబంధించి రెండు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన పనులు ఏడాదిన్నర కాలంగా ముందుకు సాగకపోవడంతో ఇబ్బందులు వెంటాడుతున్నాయి. రూ.35.17 లక్షలకుగాను రూ.12 లక్షలు మాత్రమే వచ్చాయి. రెండో స్లాబు, గోడల ప్లాస్టింగ్ నిలిచిపోయాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఎంఈవో-2 మోకా వెంకన్నబాబు దృష్టికి తీసుకువెళ్లగా నిధులు రాగానే పనులు పూర్తి చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

అవశేషాలతో దుర్వాసన

నిత్యం వేలాదిమంది రైతులు, కూలీలు, వర్తకులు వచ్చే రావులపాడు అరటి మార్కెట్‌యార్డు సమీపంలో పందులను కాల్చి మాంసం విక్రయాల అనంతరం అవశేషాలను అక్కడే పారేస్తుండటంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. యార్డు సమీపంలో, జాతీయ రహదారి చెంతనే ఉన్న మాంసం విక్రయ దుకాణాల వద్ద పరిస్థితిపై రైతులు, కూలీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి యార్డు సమీపంలో కాల్చడం, అవశేషాలు పారేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం

అసంపూర్తిగా రైతుసేవా కేంద్రం

పడమటిపాలెంలో రైతుసేవా కేంద్రం అసంపూర్తిగా నిలిచిపోయింది. గత వైకాపా ప్రభుత్వంలో ఎన్నార్ఈజీఎస్ నిధులతో దీన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఖాళీగా ఉండటంతో స్థానికులు కలప, ఇతర సామగ్రి ఉంచుతున్నారు. దీన్ని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. పీఆర్ జేఈ ఎంవీఎస్ రవికుమార్‌ని వివరణ కోరగా నిధుల లభ్యతను బట్టి పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– న్యూస్‌టుడే, మలికిపురం

ఎంటీఎస్ ఉపాధ్యాయులకు వేతనాలు ఇవ్వాలని వినతి

అంబాజీపేట: డీఎస్సీ-98, ఎంటీఎస్ ఉపాధ్యాయులకు గత రెండు నెలలుగా వేతనాలు రావడం లేదని, వేతనాలు ఇప్పించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సీహెచ్ కేశవకుమార్ కోరారు. కాకినాడలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులునాయుడు, పేరాబత్తుల రాజశేఖరాలకు అందజేశారు. ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పి.గన్నవరం: ఇటీవల గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకున్న పి.గన్నవరానికి చెందిన చింతా అబ్బులుకు 1986 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం రూ.25 వేలు అందించారు. తోటి మిత్రుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నూకపెయ్యి ఏడుకొండలు, సుంకర కృష్ణ, వడలి నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం: గొల్లపల్లి

మలికిపురం, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొల్లపల్లి సూర్యారావు ఆరోపించారు. మలికిపురంలో అడబాల బ్రహ్మాజీ అధ్యక్షతన ఆదివారం జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చి బోర్లాపడ్డారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు బళ్ల ప్రసన్నకుమారి, రుద్రరాజు చిన్నరాజా, మట్టపర్తి నాగేంద్ర, కటకంశెట్టి ఆదిత్య, తెన్నేటి కిషోర్, కూనపరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారి దుస్థితిపై గ్రామస్థుల ఆందోళన

మామిడికుదురు, న్యూస్‌టుడే: నగరంలోని తాడివారిమెరకలో దాదాపు పదకొండేళ్ల క్రితం వేసిన రహదారి గుంతలు పడి అధ్వానంగా మారినా బాగు చేయకుండా వదిలివేయడంతో స్థానికులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. వర్షం కురిస్తే చాలు మడుగుల్లా మారుతున్న గుంతల్లో వాహనచోదకులు, మహిళలు, పిల్లలు పట్టుతప్పి పడిపోతూ తరచూ ప్రమాదాల బారిన పడుతున్నా ఎవరికీ తమగోడు పట్టడం లేదని ధ్వజమెత్తారు. ఈ విషయాన్ని ఇన్‌ఛార్జి ఏఈ ఆనంద్ దృష్టికి తీసుకువెళ్లగా ఇక్కడ 3.75 మీటర్ల వెడల్పుతో సిమెంటు రహదారి ఏర్పాటుకు రూ.13 లక్షల వ్యయమయ్యే ప్రతిపాదనలు పంపించామని, నిధులు వచ్చిన వెంటనే పనులు చేపడతామన్నారు. నిరసనలో ఎం.కె.అబ్బాస్, ఇక్బాల్‌హుస్సేన్, అన్వర్‌నవాబ్ జానీ తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న స్థానికులు

ఆలమూరు ఏఎంసీ సభ్యుల ప్రమాణ స్వీకారం

ఆలమూరు: ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కొత్తపల్లి వెంకటలక్ష్మి, వైస్ ఛైర్మన్‌గా కేతా రాంబాబు, సభ్యులుగా మరో పదిహేను మంది ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. ఆలమూరులోని వినాయక కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, కొత్తపేట జనసేన ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాస్, జిల్లా తెలుగుదేశం అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి, కేతా శ్రీనివాస్, మిద్దె ఆదినారాయణ, చిలువూరి సతీష్‌రాజు, కరుటూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఛైర్మన్, వైస్ ఛైర్మన్లతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి సుభాష్

కాలువలోకి దూసుకెళ్లిన కారు

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు మండలం శివకోటి లాకుల సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం వేగంగా వచ్చిన ఓ కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకువెళ్లింది. ఆ సమయంలో డ్రైవర్‌తో సహా ముగ్గురు మహిళలు ఉన్నారు. స్థానికులు వారందరినీ బయటకు తీశారు. ఎవరికీ ప్రమాదం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ కారు విజయవాడ నుంచి రాజోలు వైపు వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

వంతెనలు శిథిలం.. ప్రయాణమెలా పదిలం?

న్యూస్‌టుడే, మలికిపురం

పురాతన వంతెనలు శిథిల స్థితికి చేరుకున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో వీటిపైనే రోజూ భయం భయంగా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. విశ్వేశ్వరాయపురం, మలికిపురం, గూడపల్లి, శంకరగుప్తం గ్రామాల్లోని మురుగు కాలువలపై నిర్మించిన వంతెనలు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి.

వేపచెట్టు మీడియం డ్రెయిన్‌పై ..

స్లాబ్ ఊచలు ఊడి..

● మలికిపురంలోని భాష్యం పాఠశాల సమీపంలో వేపచెట్టు మీడియం డ్రెయిన్‌పై 40 ఏళ్ల క్రితం నిర్మితమైన వంతెన స్లాబ్‌పై రోడ్డు దెబ్బతినడమే కాకుండా అడుగు భాగాన ఇనుప చువ్వలు బయట పడ్డాయి. దీని మీదుగా పలు విద్యాసంస్థలకు చెందిన బస్సులు విద్యార్థులతో నిత్యం తిరుగుతుంటాయి. పాలకొల్లు, నరసాపురం, భీమవరం తదితర దూర ప్రాంతాలకు వెళ్లే మలికిపురం, సఖినేటిపల్లి మండలాల ప్రజలకు దగ్గర మార్గంగా ఉపయోగపడుతుంది. గుడిమెళ్లంక, మూలపోడు, రామరాజులంక, పెదతిప్ప గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఇదే ఆధారం. గత తెదేపా ప్రభుత్వ హయాంలో దీనిస్థానే కొత్త దానికి 2019 సంవత్సరంలో నిధులు మంజూరయ్యాయి. స్థల సమస్యతో పనులు జాప్యమవ్వడం.. ఈలోగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నిలిచిపోయింది. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వంలో అసలు దీన్ని పట్టించుకోలేదు. ● మలికిపురంలోని సత్యజ్యోతి సినిమాహాలు సమీపంలో వ్యవసాయ ఉత్పత్తుల తరలింపునకు ఉపయోగపడే వంతెన పూర్తిగా పాడైంది. ● విశ్వేశ్వరాయపురం -మట్టపర్రు మధ్య వేపచెట్టు మీడియం డ్రెయిన్‌పై వంతెన మరమ్మతులకు గురైంది. ● గూడపల్లి గంటాలమ్మ ఆలయం నుంచి మలికిపల్లి వెళ్లే రోడ్డులో డ్రెయిన్‌పై వంతెన కూలడానికి సిద్ధంగా ఉంది.

విశ్వేశ్వరాయపురంలో ఇలా..

అభివృద్ధికి చర్యలు

డ్రెయిన్లపై శిథిల స్థితికి చేరిన వంతెనల నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాం. ప్రభుత్వ ఆమోదానికి పంపిస్తాం. - ఆర్.నాగార్జున, డీఈఈ, జలవనరుల శాఖ(డ్రెయిన్ల విభాగం)

డెల్టా వ్యవస్థను కాపాడుకుందాం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలను సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా కాటన్ నిర్మించిన డెల్టా వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని నదీజలాలు-ప్రాజెక్టుల విశ్లేషకుడు టి.లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం ఆయన పి.గన్నవరం వద్ద డొక్కా సీతమ్మ అక్విడక్టును పరిశీలించారు. కాటన్ నిర్మించిన సాగునీటి వ్యవస్థకు నిర్వహణ పనులు చేయడం ద్వారా మరింత సమర్థంగా పనిచేస్తుందన్నారు. పి.గన్నవరం సాగునీటి సంఘ అధ్యక్షుడు చొల్లంగి సత్యనారాయణమూర్తి, డాక్టర్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

మహారాజశ్రీ రాజోలు Civil Judge (Senior Division) వారి కోర్టులో..
IP 5/2025
పిటీషనర్: పాలంకి రాంబాబు
రెస్పాండెంట్లు: 1. బెల్లంకొండ సత్యనారాయణ, S/o ఆంజనేయులు, రామరాజులంక, మలికిపురం (M),
2. బెల్లంకొండ సుధారాణి, W/o సత్యనారాయణ, రామరాజులంక, మలికిపురం (M),
3. మేడిచర్ల వీరరాఘవులు, S/o హనుమంతరావు, రామరాజులంక, మలికిపురం (M),
4. The Official Receiver, Rajamahendravaram
ప్రకటన
పై నెంబరులో 1, 2 రెస్పాండెంట్లు, పిటీషనరుకు ఇవ్వవలసిన ప్రోనోటు బాకీను చెల్లించకుండా తమ తాలూకు రామరాజులంక గ్రామంలోని RS No.168/5 రులో Ac 0-03 ట్లు ఖాళీ స్థలమును ది.11-2-2025వ తేదీ గల Regd. Sale deed ద్వారా 3వ రెస్పాండెంటుకు క్రియపరచి, Insolvency Acts Commit చేసినందున, సదరు 1, 2 రెస్పాండెంట్లును Insolvents గా Adjudicate చేసి, సదరు Regd. Sale deedను Annul చేసి, సదరు ఆస్తిని Administration నిమిత్తం Possessionలోనికి తీసుకోవలెనని 4వ రెస్పాండెంటును Direct చేయవలెనని కోరుచూ, పిటీషనరు పై నెంబరున Creditor IP దాఖలు చేసినందున, అందుపై ఎవరికైనా ఎట్టి అభ్యంతరములున్ననూ, ది.11-09-2025 వ తేదీన ఉదయం 10.30ని||కు శ్రీ కోర్టువారి ఎదుట హాజరయి తెలియపరచుకోవలసినదిగా ఇందుమూలముగా యావన్మందికీ తెలియపరచడమైనది.
యాగంటి చలపతిరావు, B.Com., B.L., Advocate, Kovvuru

(c) eenadu

అమలాపురం
• అమలాపురం • ముమ్మిడివరం

అభివృద్ధి పనుల్లో జాప్యంపై ఎంపీల ఫిర్యాదు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి ఎంపీ ల్యాడ్స్ నిధులతో వివిధ నియోజకవర్గాల్లో ప్రతిపాదించిన పలు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, వీటిపై తగిన చర్యలు తీసుకోవాలని లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు వి.వైతిలింగం, సెల్వగణపతి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ చౌహాన్‌కు ఫిర్యాదు చేశారు. మంచినీరు, ప్రజారోగ్యం, విద్య, రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు సమర్పిస్తే దస్త్రాలు తయారీ నుంచి టెండరు ప్రక్రియ వరకు వెళ్లడానికి ఏళ్లు పడుతుందని ఆరోపించారు. రాజ్యసభ ఎంపీ గత నాలుగేళ్లలో రూ.20 కోట్లతో పనులకు ప్రతిపాదనలు పంపితే రూ.5.55 కోట్లు మాత్రమే కార్యరూపం దాల్చాయన్నారు. తాము పంపిన ప్రతిపాదనల విషయంలో జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అనుమతిలేని కట్టడాల క్రమబద్ధీకరణ

యానాం, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా, ప్లాన్ ఉల్లంఘించి నిర్మించిన వివిధ రకాల కట్టడాలకు ఏక కాల క్రమబద్ధీకరణ పథకం(ఒన్‌టైమ్ రెగ్యులరైజేషన్ స్కీం)ను నిర్ణీత రుసుం చెల్లించే విధానంలో ప్రవేశ పెడుతూ పుదుచ్చేరి ప్రభుత్వం ప్రకటన జారీచేసింది. నివాస భవనాలకు రూ.5వేలు, ఇతర భవనాలకు రూ.10వేలు దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. నివాస భవనాల పరిశీలనకు చదరపు మీటరుకు రూ.20, ఇతర భవనాలకు రూ.50 చెల్లించాలని పేర్కొన్నారు. భవనాలకు సంబంధించిన అన్ని ప్లాన్‌లను అందజేయాలన్నారు. నివాస భవనాల యజమానులు మినహాయింపు కోసం మీటరుకు రూ.500, ప్రత్యేక భవనాలకు రూ.750, బహుళ అంతస్తుల భవనాలకు రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718, ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

గారపాటివీధిలో పిచ్చిమొక్కలు

కె.అగ్రహారం బ్యాంకువీధిలో

సమస్య: అమలాపురం శ్రీకృష్ణనగర్ శివారు మురుగుకాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. -నారాయణ

సమస్య: కె.అగ్రహారం బ్యాంకు వీధిలో రోడ్డు వ్యర్థాలతో నిండి అపరిశుభ్రంగా తయారైంది. -పవన్

సమస్య: కాటన్‌మార్గ్ పక్క వీధిలో రోడ్డుపై పిచ్చిమొక్కలు, చెత్త దర్శనమిస్తున్నాయి. అటుగా వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. -దొరబాబు, వ్యాపారి.

సమస్య: గారపాటివీధి మురుగుకాలువపై పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. -రెడ్డి, వ్యాపారి

సమస్య: అమలాపురం కె.అగ్రహారం బ్యాంకువీధిలో చెత్త తొలగించడం లేదు. -చర్ల, వ్యాపారి

పరిష్కారం: శ్రీకృష్ణనగర్ శివారు మురుగుకాలువ, బ్యాంకు వీధిలో రోడ్డు, కాటన్‌మార్గ్ పిచ్చి మొక్కల సమస్యలు తెలుసగా సచివాలయ కార్యదర్శులు స్పందించారు. సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. గారపాటివీధి మురుగుకాలువపై పిచ్చిమొక్కలు, కె.అగ్రహారంలో చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

వానొస్తే అవస్థలమయం

పట్టణ వివరాలు	
వార్డులు: 30	ప్రజలు : 70వేలు
శాశ్వత డ్రెయిన్ల పొడవు : 124 కి.మీ.	
కచ్చాకాలువ వ్యవస్థ : 36 కి.మీ.	

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

అమలాపురం పట్టణంలోని ప్రధాన రహదారులు కొద్ది పాటి వర్షానికే మునుగుతున్నాయి. స్థానికులతో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంగా మారినా ఈ సమస్య వీడటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదని వాపోతున్నారు.

అమలాపురం పట్టణం పరిధిలో శనివారం కురిసిన వర్షానికి వాహనదారుల ఇక్కట్లు

ఉన్నవాటికే ప్రతిపాదనలు

శాశ్వతంగా ఉన్న డ్రెయిన్లను తొలగించి మళ్లీ కొత్తవాటిని నిర్మిస్తున్నారు. కచ్చా కాలువ వ్యవస్థ ఉన్న చోట మాత్రం ప్రతిపాదనలు పెట్టడం లేదు. మురుగు, ముంపు నీరు పూర్తి స్థాయిలో దిగువకు వెళ్లక ప్రధాన రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. సమస్యకు శాశ్వత పరిష్కార మార్గాలు చూపాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ప్రధానంగా ఈ ప్రాంతాల్లో..

ముస్లింవీధి, హైస్కూల్ కూడలి, సుబ్బారాయుడు చెరువు సెంటరు, తపాలా కార్యాలయం వద్ద, గాంధీ బజార్ కూడలి, హౌసింగ్ బోర్డు కాలనీ, విద్యుత్తు నగర్, 29వ వార్డు, ఈదరపల్లి వంతెన సమీపంలో మోకాళ్ల లోతులో నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్‌స్టాండ్ దాటిన తర్వాత ఏడాది పొడవునా మురుగు నిలిచి ఉంటుంది. సగం రహదారి కనిపించడం లేదు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ..

పూర్తిస్థాయి డ్రైనేజీ వ్యవస్థ లేక పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. పురపాలక సంఘం పరిధిలో సుమారు 160 కి.మీ. మేర మురుగు కాలువ వ్యవస్థ ఉంది. 124 కి.మీ. మేర మాత్రమే శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఉంది. మిగిలిన 36 కి.మీ కచ్చా కాలువల ద్వారానే మురుగు మళ్లిస్తున్నారు.

ముంపు లేకుండా చర్యలు

వర్షాకాలంలో ముంపు సమస్య లేకుండా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ఏయే ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయో గుర్తించి పూడిక తొలగించి ముంపు దిగేలా చర్యలు తీసుకుంటున్నాం. అన్ని ప్రాంతాలకు శాశ్వత డ్రెయిన్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.
-నిర్మల్ కుమార్, అమలాపురం పురపాలిక కమిషనర్

సన్మానం అందుకుంటున్న అంజి

చిత్రకళా సేవలకు సన్మానం

కాట్రేనికోన, న్యూస్‌టుడే: భీమవరం ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రముఖ చిత్రకారుడు కేరళకు చెందిన రాజశేఖరన్ పరమేశ్వరన్ ఆదివారం భీమవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆకొండి అంజి చిత్రం గీశారు. చిత్రకారులంగా ఆయన సేవలను గుర్తించి సన్మానించారు.

డ్రెయిన్ నిర్మించక అవస్థలు

కాట్రేనికోన: స్థానిక కొప్పిశెట్టివారివీధిలో సీసీ రోడ్డు పల్లపు ప్రాంతం కావడంతో వర్షపునీరు రోజుల తరబడి నిలిచిపోతోంది. దీంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు, సత్తెమ్మచెట్టు, మొండిపోర, వెంకమ్మచెరువు, కంచువారిపేట గ్రామస్థులు వాపోతున్నారు. ఎప్పుడో నిర్మించిన ఈ రహదారిని మెరక చేయాలని కోరుతున్నారు. ముంపు నీటి కారణంగా దోమలు వ్యాప్తి చెందుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ తీరుతో నష్టం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశ ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతోందని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పేర్కొన్నారు. సీపీఐ ప్రతినిధుల జిల్లా రెండో మహాసభ అమలాపురం గడియారస్తంభం కూడలి వెంకటేశ్వర వేడుక మందిరంలో జిల్లా కన్వీనర్ కె.సత్తిబాబు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు మాత్రమే అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బండారు సావిత్రి, జేసుదాస్, శీలం వెంకటేష్, దేవ, పెద్దిరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

తెదేపాలో పలువురి చేరిక

ఉప్పలగుప్తం: ఎస్.యానాం గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు వారికి తెదేపా కండువాలు కప్పి ఆహ్వానించారు. అయితాబత్తుల అజయ్, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ సోంబాబు, పెచ్చెట్టి చంద్రమౌళి పాల్గొన్నారు.

రహదారిలో చెత్త.. రాకపోకలకు అవస్థ

యానాంలోని వెంకటనగర్ వెనుక నుంచి మెట్టకూరు నాయుడు కాలనీకి వెళ్లే మార్గంలో రోజుల తరబడి చెత్త పేరుకుపోయింది. స్థానికులతో పాటు ఆ మార్గంలో రాకపోకలు సాగించే పాదచారులు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మురుగు కాలువ, రహదారిపై చెత్త కుప్పలు తొలగించడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై కమిషనర్ దృష్టి సారించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, యానాం

తాగునీటి వృథా పట్టదా..!

ముమ్మిడివరం పెద్ద వంతెన వద్ద ప్రధాన పైపులైన్‌కు లీకు ఏర్పడి తాగునీరు వృథాగా పోతోంది. పైపులైన్ నుంచి నీరు లీకై ఎగజిమ్ముతోంది. పలు గ్రామాలకు వెళ్లే పైపులైన్‌లకు నీటి ప్రవాహ వేగం తగ్గుతోంది. అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ముమ్మిడివరం

విద్యుత్తు స్తంభం విరిగినా.. వదిలేశారు

ఉప్పలగుప్తం మండలం వానపల్లి పాలెం గ్రామ పరిధి బి.వి.రమణయ్య కాలనీలో 15 రోజుల క్రితం విద్యుత్తు స్తంభం విరిగిపోయింది. సిబ్బంది దాని స్థానంలో చిన్నకర్రను ఏర్పాటుచేసి చేతులు దులిపేసుకున్నారు. దీంతో ప్రమాదం పొంచి ఉందని.. ఆదివారం గ్రామస్థులు నిరసనకు దిగారు. గాలులు, వర్షాలకు ఇళ్లల్లో విద్యుత్తు ఉపకరణాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్తంభాన్ని ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు. -న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

భవనం.. పునాదులకే పరిమితం

ఉప్పలగుప్తం మండలం గోపవరంలో గత ప్రభుత్వ హయాంలో ఆర్భాటంగా నిర్మాణం ప్రారంభించిన వెల్‌నెస్ సెంటర్ భవనం పునాదుల్లోనే నిలిచిపోయింది. అప్పట్లో నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం వైద్యసిబ్బంది వసతులు లేని భవనాల్లో సేవలు అందిస్తున్నారు. పునాదుల్లో నిలిచిన ఆరోగ్యభవనాల గురించి వైద్యశాఖ చర్యలు చేపట్టాల్సి ఉందని పీఆర్ ఏఈ రాధాకృష్ణ తెలిపారు. - న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

'మోసపూరిత హామీల్ని ప్రజలు గ్రహించారు'

మాట్లాడుతున్న పొన్నాడ

కాట్రేనికోన, న్యూస్‌టుడే: చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రజలు ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ అన్నారు. కాట్రేనికోనలో వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు ఎన్.నరసింహమూర్తి అధ్యక్షతన ఆదివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పొన్నాడ మాట్లాడుతూ నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకు పింఛను, ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ, మహిళలకు రూ.1500 హామీలను అమలు చేయలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా అందరినీ సమానంగా చూశానన్నారు. లంచాలు తీసుకున్నట్టు నిరూపిస్తే ప్రాణత్యాగానికైనా సిద్ధమన్నారు. అధికారులు, పోలీసులు తమ పార్టీ నాయకుల్ని, కార్యకర్తల్ని వేధిస్తే సహించేది లేదన్నారు. గత ఎన్నికల్లో పార్టీకి వెన్నుపోటు పొడిచిన వారి వివరాలు తమ వద్ద ఉన్నాయన్నారు. పితాని బాలకృష్ణ మాట్లాడుతూ వైకాపాలో అధికారులు, వాలంటీర్లతో పాలన సాగిందన్నారు. వాలంటీర్లు పార్టీకి మోసం చేశారన్నారు. రూ.10 వేలు ఇస్తామంటే చంద్రబాబు మాటలు నమ్మారన్నారు. ఏడిద చక్రపాణి, నడింపల్లి సూరిబాబు, మాతా మురళి, నేల కిషోర్, కాశి మునికుమారి, గంటి సుధాకర్, కోలాటి సత్యం, హనుమంతరావు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల జీతాలు పెంచాలి

అమలాపురం పట్టణం: ఉపాధ్యాయుల జీతాలు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.నరేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు డిమాండ్ చేశారు. అమలాపురం కె.అగ్రహారం యూటీఎఫ్ హోంలో జిల్లా నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు జరిగి రెండు నెలలు అవుతున్నా కొందరికి జీతాలు చెల్లించలేదన్నారు. ఎస్ఎస్‌సీ మూల్యాంకనం సొమ్ము చెల్లించలేదన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పజెప్పకూడదని తీర్మానించారు.

డెల్టా వ్యవస్థను కాపాడుకుందాం

పి.గన్నవరం: సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలను సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా కాటన్ నిర్మించిన డెల్టా వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని నదీజలాలు-ప్రాజెక్టుల విశ్లేషకుడు టి.లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం ఆయన పి.గన్నవరం వద్ద డొక్కా సీతమ్మ అక్విడక్టును పరిశీలించారు. కాటన్ నిర్మించిన సాగునీటి వ్యవస్థకు నిర్వహణ పనులు చేయడం ద్వారా మరింత సమర్థంగా పనిచేస్తుందన్నారు.

కారు బోల్తా: సురక్షితంగా బయటపడ్డ డ్రైవర్

కారును పరిశీలిస్తున్న ఎస్సై జ్వాలాసాగర్

ముమ్మిడివరం: దొమ్మేటివారి పాలెం వద్ద బైపాస్ రోడ్డులో ఆదివారం ఓ కారు బోల్తాపడింది. అమలాపురం నుంచి యానాం వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి తుప్పల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఆ సమయంలో కారులో డ్రైవర్ మాత్రమే ఉన్నట్లు సమాచారం. కారు నుంచి అతడు సురక్షితంగా బయట పడినట్లు స్థానికులు చెప్పారు. ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

పాము కాటుకు కోళ్లు మృతి

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: జనుపల్లిలో పాము కాటుకు నాలుగు కోళ్లు మృతి చెందాయి. బాలయోగిఘాట్ వెనుకవైపు నివాసం ఉంటున్న మారిశెట్టి నాగభూషణం ఇంటి పెరట్లోకి ఆరు అడుగుల నల్లతాచు ప్రవేశించి నాలుగు కోళ్లను కాటేసి చంపేసింది. పామును గమనించిన ఆ ఇంటి వాళ్లు భయాందోళనకు గురయ్యారు. భీమనపల్లికి చెందిన స్నేక్‌క్యాచర్ జంపన గణేష్‌వర్మకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న ఆయన పామును పట్టుకుని సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టారు.

గ్రామదేవతలకు సారె సమర్పణ

ఐ.పోలవరం: మురమళ్ల గ్రామదేవతలు మాణిక్యాంబ, కనకమహాలక్ష్మి అమ్మవార్లకు ఆషాఢం సారెను ఆదివారం సమర్పించారు. ప్రభుత్వవిప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు సారెకు వీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ర్యాలీగా డప్పుల వాయిద్యాలతో అమ్మవార్ల ఆలయాలకు చేరుకుని సారె అందించారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, వడపప్పు, పానకం, వివిధ రకాలు స్వీట్లు, చీర, రవిక, గాజులు, గజమాలలను అమ్మవార్లకు సమర్పించారు.

కాట్రేనికోన: గెద్దనపల్లిలోని చింతలమెరకలో కొలువైన విజయలక్ష్మీ దుర్గాదేవికి అర్చకులు ఆకొండి శ్రీకాంత్ వర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

అమలాపురం పట్టణం: ఆషాఢ మాసం సందర్భంగా అమలాపురం గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మకు ఆదివారం భక్తులు సారె సమర్పించారు. నల్లావీధి యువసేన ఆధ్వర్యంలో మహిళలు చలివిడి, పానకం, పండ్లు, తీపికావిడి నివేదించారు. సుబ్బాలమ్మను, నల్లావీధి శ్రీవిజయ దుర్గ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

అమలాపురం మంచినీటి చెరువు రోడ్డులో శ్రీకామాక్షి ఏకాంబరీశ్వరి అమ్మవారు శాకంబరి దేవిగా దర్శనమిచ్చారు. స్వర్ణకార సంఘ సభ్యుల ఆధ్వర్యంలో సమర్పించిన వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని, ఆలయాన్ని ఆదివారం అలంకరించారు.

అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

ముమ్మిడివరం: పల్లవారిపాలెంలోని విజయదుర్గ అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. బలుసులమ్మ అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించారు.

అమలాపురం సుబ్బాలమ్మ, కామాక్షి ఏకాంబరీశ్వరి

పల్లవారిపాలెంలో విజయదుర్గ

మురమళ్లలో అమ్మవార్లకు సారెను తీసుకెళ్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు

రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

కాట్రేనికోన, న్యూస్‌టుడే: సొసైటీలకు ఎన్నికైన నూతన కమిటీలు రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. కుండలేశ్వరం సొసైటీ అధ్యక్షుడిగా ఎంపికైన గంగుమళ్ల రవికుమార్, సభ్యులు కర్రి వీరవెంకట సత్యనారాయణ, బీర అంబేడ్కర్‌లు ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోనే అన్నదాతలకు అన్నింటా న్యాయం జరుగుతోందన్నారు. సొసైటీల ద్వారా రైతులకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఓగూరి భాగ్యశ్రీ, జీవీవీ సుబ్బలక్ష్మి, నాగిడి నాగేశ్వరరావు, ఆకాశం శ్రీను, త్సవటపల్లి నాగు, జి.పుండరిష్, బాలప్రసాద్, నూకల దుర్గ, భద్రరావు, నీటిసంఘం, సొసైటీల అధ్యక్షులు, పలువురు కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయం

సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: అమలాపురం రోళ్ళపాలెంలోని గున్నపంతుల అగ్రహారంలోని జిల్లా పరిషత్తు పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఆదివారం సన్మానించారు. చెరుకూరి వెంకటసుబ్రహ్మణ్య కృష్ణమూర్తి, బూడిద వెంకటేశ్వరరావు, అక్కిరాజు ఫణిబాబును ఉపాధ్యాయులు, సిబ్బంది సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం బొంతు వరప్రసాదరావు, సర్పంచి మట్టా వైదేహి, ఎంపీటీసీ సభ్యురాలు నాగరత్నం, మట్టా నాగేశ్వరరావు, సాయిరామారావు తదితరులు పాల్గొన్నారు.

అందరి సంక్షేమమే కూటమి లక్ష్యం

ఐ.పోలవరం: అందరి సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం

కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఐ.పోలవరం మండలం మురమళ్లలో ఆదివారం ఇంటింటా తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. సాగిరాజు సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్, రాయపురెడ్డి మాణిక్యాలరావు, యేలూరి మూర్తి, జంపన బాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెదేపా పాలన సాగుతోందని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. ఆదివారం దేవగుప్తంలో సుపరి పాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరించారు.

మురమళ్లలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దాట్ల, ఎమ్మెల్సీ రాజశేఖరం

నవోదయ క్లస్టర్ స్థాయి ఎంపిక పోటీలు

కయానాం, న్యూస్‌టుడే: పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ నెల 23, 24 తేదీల్లో బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, చదరంగం, యోగా క్లస్టర్ స్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహించడానికి ప్రిన్సిపల్ శరత్‌చంద్రకీర్తి వ్యాయామోపాధ్యాయులు లక్ష్మీప్రసన్న, సింహాచలం ఏర్పాట్లు చేశారు. గుంటూరు, కృష్ణ, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, కాకినాడ తదితర తొమ్మిది నవోదయ విద్యాలయాలకు చెందిన 150 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులు హైదరాబాద్ రీజియన్ స్థాయి పోటీలకు వెళ్తారు.

(c) eenadu

మండపేట

•మండపేట •రామచంద్రపురం

ప్లాస్టిక్ అడ్డంకులు..

మండపేట మండలం ద్వారపూడి గ్రామం వస్త్ర దుకాణ సముదాయం వద్ద డ్రైనేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారడంలేదు. దుర్వాసనతో పాటు దోమలు పెరిగిపోయి స్థానికులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఆకుల వివి.రమణను వివరణ కోరగా వెంటనే ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, ద్వారపూడి

గుంతలు ఇలా.. ప్రయాణం సాగేదెలా..?

గుంతలతో అధ్వానంగా కురకాళ్లపల్లి-పామర్రు రహదారి

వర్షం వచ్చిందంటే రాయవరం మండలం కురకాళ్లపల్లి నుంచి పామర్రు వెళ్లే ప్రధాన రహదారిలో వాహన చోదకులు ఇబ్బందులు తప్పడం లేదు. వెంటూరు నుంచి పామర్రు వరకు అయిదు కిలోమీటర్ల మేర గుంతలతో అధ్వానంగా ఉంది. రామచంద్రపురం డివిజన్ ర.భ.శాఖ డీఈఈ టీవీఎస్ సూర్యనారాయణను వివరణ కోరగా, వర్షాలు తగ్గిన అనంతరం గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, రాయవరం

నూతన కోర్సులు.. ఉపాధి అవకాశాలు

న్యూస్‌టుడే, మండపేట

ఆధునిక హంగులతో ఉపాధి అవకాశాలు పెంపొందించే కోర్సులతోపాటు నాక్, యూజీసీ గుర్తింపు పొందిన మండపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆహ్వానం పలుకుతోంది. చదువు మధ్యలో మానేసిన వారి కోసం దూరవిద్య ద్వారా కోర్సు పూర్తి చేసేందుకు అవకాశం ఉంది.

కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థినులు

అందుబాటులో ఉన్న కోర్సులు ఇవే: బీఎస్సీ ఫిజిక్స్, బీఏ ఎకనమిక్స్, బీకం సీఏ, బీకాం జనరల్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ జువాలజీ.

అధ్యాపకులు: అన్ని సబ్జక్టులకు కలిపి 22 పోస్టులు ఉండగా.. శాశ్వత అధ్యాపకులు 8 మంది, ఒప్పంద విధానంలో 14 మంది ఉన్నారు. బోధనేతర సిబ్బంది 9 మంది ఒప్పంద పద్ధతిలో పనిచేస్తున్నారు

క్రీడల్లో శిక్షణ: ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న డిగ్రీ కళాశాలలో ఇండోర్ స్టేడియం, అవుట్‌డోర్ క్రీడా మైదానం ఉన్నాయి. కళాశాల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో టెన్నీకాయిట్ పోటీలో బంగారు పతకం సాధించారు. వ్యాయామ అధ్యాపకుడు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు.

ల్యాబ్‌లు: ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ కోర్సులు చదివే వారికోసం అత్యాధునిక ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్ ల్యాబ్‌తోపాటు విద్యార్థులు 100 ఎంబీపీఎస్ వేగంతో అంతర్జాలం, వైఫై సౌకర్యం ఉచితంగా ఉపయోగించుకోవచ్చు.

పోటీ పరీక్షలకు తోడ్పాటు: సివిల్స్, బ్యాంకింగ్, రైల్వే తదితర పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు చదువుకునేందుకు దాతల సహకారంతో నూతనంగా ఏసీ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

భద్రత కోసం: ర్యాగింగ్, వేధింపులు లేని విద్యాబోధన, విద్యార్థినీ విద్యార్థుల భద్రతకు సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ.

సౌకర్యాలు: పట్టణంలో బీసీ బాలికలు, బాలుర వసతిగృహాల్లో ఉచిత వసతి ఏర్పాటు. బస్ పాస్ సౌకర్యం, ఫీజు రీయింబర్స్‌మెంటు. ఆధునిక మరుగుదొడ్లు, మినరల్ వాటర్ ప్లాంటు ఉన్నాయి.

ఉపాధి కల్పన దిశగా: రాష్ట్రప్రభుత్వ సహకారంతో నేషనల్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్, స్కిల్ హబ్ ఏర్పాటు. విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలు పెంపొందించేందుకు శిక్షణ కేంద్రం ఏర్పాటు. డిగ్రీ అనంతరం జీవనోపాధి కోసం ఫ్యాషన్ డిజైన్, బ్యూటీషియన్, డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్ కోర్సుల్లో శిక్షణ.

ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నాం..

విద్యార్థులకు చదువు పూర్తయ్యేలోగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పలు సంస్థలతో మేళాలు నిర్వహిస్తున్నాం. గత సంవత్సరం 50 మందికి ఉద్యోగావకాశాలు వచ్చాయి. అన్నిరకాల ప్రభుత్వ పథకాలు విద్యార్థులకు వర్తింపజేస్తున్నాం.

- టీకేవీ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండపేట

విద్యార్థికి సత్కారం

రామచంద్రపురం: కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ప్రథమ ఇంటర్ కంప్యూటర్ సైన్సులో 492/500 మార్కులు సాధించిన ఎం.బి.వి.ఎస్.జగదీశ్‌ను ఆర్యవైశ్య అఫీషియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా కాకినాడలో సత్కరించింది. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎ.వీరన్న మాస్టారు అభినందించారు.

రిష్వంత్‌రాయ్‌కి అభినందన

రామచంద్రపురం: తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్ రామచంద్రపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులు కావడంతో పీడీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సిద్ధు, జనసేన ఎస్సీసెల్ నాయకుడు బుంగ రాజు సత్కరించారు. రామచంద్రపురం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ అభినందించారు.



"మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని" - 2 తిమోతి 4:7

ఆదరణ కూడిక

మా కుటుంబ పెద్దగా "పెద్దన్న"గా మా బాధ్యతలు నెరవేరుస్తూ, మా ఉన్నతికి, శ్రేయస్సుకి అహర్నిశలు శ్రమిస్తూ మా మార్గదర్శిగా నిలిచిన మంచిమనిషి, అర్తమూరు గ్రామంలో వైద్యునిగా, ప్రాణదాతగా పేరు తెచ్చుకొని మన కుటుంబానికి పేరు ప్రతిష్ఠలు తెచ్చిన మహోన్నత వ్యక్తి శ్రీ కాకర శ్రీనివాసరావు (డాక్టర్ శ్రీను) గారి ఆకస్మిక మరణం మా ఊహకు అందనిది. ప్రభువు సన్నిధి కేగిన మీ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

డా॥ కాకర శ్రీనివాసరావు (డాక్టర్ శ్రీను) గారు, BMP
7వ వార్డు పంచాయతీ సభ్యులు
జననం: 15-01-1971 మరణం: 11-07-2025
అర్తమూరు

భార్య: శ్రీమతి లూథి కుమారి

తండ్రి : కాకర యేసేబు (లేటు) | తల్లి : రుక్మిణి
పెద్ద కుమార్తె : జెలెక్ట్ స్మిగ్ధ, MBA | అల్లుడు : రవికాంత్, M.Tech
మనుమడు : జైవాన్స్
చిన్న కుమార్తె : డా॥ కాకర రాగమౌనిక, MBBS (M.S.)
తమ్ముడు : కాకర గోవిందు | మరదలు : ఝాన్సీ
కుమార్తెలు : స్పజన, సింజన, సాత్విక
తమ్ముడు : కాకర సూకరాజు | మరదలు : పరిమళ
కుమారుడు : ప్రేమ్ యువతేజ | కుమార్తె : రేష్మ
చెల్లెలు : జయలక్ష్మి | బావ : చెక్కా కాండబాబు(లేటు)
చెల్లెలు : కృష్ణవేణి | బావ : మందపాటి రవికుమార్
చెల్లెలు : శ్రీదేవి | బావ : ప్రాద్యుమ్న కరుణాకర్(లేటు)

మేనల్లుళ్లు - మేనకోడళ్లు: M.సుధీర్‌కుమార్, M.అజయ కుమార్ (లేటు), P.సుధాకర్, P.సునాదరాజు, M.రూప ప్రియాంక - M. శ్రీహరి, M.శ్రీలేఖ - మధుబాబు మరియు కుటుంబసభ్యులు, బంధుమిత్రులు

ఆదరణ కూడిక: ది. 21-07-2025 (ఈ రోజు) అర్తమూరులో మా స్వగృహమునందు జరుగును.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు | ద్రాక్షారామ : 80085 74192 | ద్వారపూడి : 91543 96553

కాలువలో పూడిక తొలగించారు

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం ఎస్సీపేటలోని డ్రెయినేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీరు నిలిచిపోయిందని సర్పంచి చంద్రమళ్ల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా, పారిశుద్ధ్య కార్మికులతో వ్యర్థాలను తొలగింపజేశారు.

కుక్కలను అరికట్టాలి

సమస్య: రామచంద్రపురం పట్టణంలోని పలు వార్డుల్లో కుక్కల సంచారంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. - వెల్ల రాంబాబు

సమాధానం: పట్టణంలో కుక్కలను పట్టించి పట్టణానికి దూరంగా విడిచిపెట్టేలా ఏర్పాట్లు చేస్తున్నాం. - డేవిడ్‌రాజు, శానిటరీ తనిఖీదారు

ఎమ్మెల్యేను కలిసిన సొసైటీ ఛైర్మన్లు

సొసైటీ ఛైర్మన్లను సత్కరించిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, న్యూస్‌టుడే: కేశవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ ఉండమట్ల శ్రీనివాసరావు, పడమర ఖండ్రిక ఛైర్మన్ పుల్లం శ్రీనివాస్‌లు ఆదివారం ఎస్‌ఈఎస్ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును తెదేపా కార్యాలయంలో కలిశారు. ఎమ్మెల్యే వారిని సత్కరించి, రైతులకు మెరుగైన సేవలందించాలని కోరారు. కేశవరం సొసైటీ సభ్యులు చంద్రమళ్ల సూర్యప్రకాశరావు, మేడం సత్యనారాయణ మూర్తి, పడమరఖండ్రిక సభ్యులు కర్రి పార్వతి, మాత వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గంగవరంలో ఉచిత వైద్య శిబిరం

పామర్రు: కె.గంగవరంలో ఆదివారం అంజన దంత వైద్యశాల వైద్యుడు డా.సలాది వీరవెంకటేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. దంత, గైనిక్, గుండె, డయాబెటిస్. పిల్లల వైద్యం విభాగాల వైద్యులు పాల్గొని రోగులను పరీక్షించారు. మందులు, దంత సంరక్షణ కిట్‌లను ఉచితంగా అందజేశారు. రామచంద్రపురం కేవీఆర్ హాస్పిటల్ వైద్యుడు కోట సతీష్, వైద్యులు రమ్య, చందు, దివ్య, వెంకటేష్ తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించారు.

డ్రైవర్ కుటుంబానికి రూ.7 లక్షలు అందజేత

చెక్కు అందజేస్తున్న రాఘవకుమార్

రామచంద్రపురం: రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తూ గత ఏడాది ఆగస్టు 22న మృతిచెందిన రాయవరం మండలం కురకాళ్లపల్లి గ్రామానికి చెందిన పంపన వీరవెంకటసత్యనారాయణ కుటుంబాన్ని ఆర్టీసీ ఆదుకుంది. కుమారుడు భానువీరేంద్రకుమార్‌కు రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో కండక్టర్ ఉద్యోగం కల్పించడంతోపాటు భార్య వెంకటలక్ష్మికి ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.7,00,100 చెక్కును జిల్లా ప్రజా రవాణాధికారి రాఘవకుమార్ చేతులమీదుగా అందజేసినట్లు డిపో మేనేజర్ పి.భాస్కరరావు తెలిపారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలోని శ్రీసత్యసాయి సేవా సంస్థలో సోమవారం నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ కన్వీనర్ మన్యం పర్వతవర్ధనరావు తెలిపారు. పదో తరగతి చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తిగలవారు ఉదయం 9 గంటలకు అవగాహన సదస్సుకు హాజరుకావాలని కోరారు.

గ్రామ దేవతలకు ఆషాఢం సారె

ద్రాక్షారామ: ఆషాఢమాసం పురస్కరించుకొని ఆదివారం ద్రాక్షారామ ముత్యాలమ్మ, వెలంపాలెం గోగులాంబ, అన్నాయిపేట ఎల్లారంబికా అమ్మవార్లకు ఆయా గ్రామాల ప్రజలు వేర్వేరుగా సారె సమర్పించారు. ద్రాక్షారామ ముత్యాలమ్మకు భీమేశ్వరాలయం తరఫున మేళతాళాలతో ఆలయ అర్చకులు తదితరులు మహిళలతో కలిసి సారె తీసుకెళ్లారు. అన్నాయిపేటలో సర్పంచి పెమ్మిరెడ్డి దొరబాబు, ఎంపీటీసీ సభ్యుడు శాఖ బాబి ఆధ్వర్యంలో అమ్మవారికి సారె సమర్పించారు. వెలంపాలెంలో గోగులాంబ, హసనబాదలో ఇలింద్రమ్మ వార్లకు మహిళలు పండ్లను సారెగా సమర్పించారు. హసనబాదలో సర్పంచి నాగిరెడ్డి సతీష్‌రావు, జిల్లా మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయం నుంచి ముత్యాలమ్మకు సారె తీసుకెళ్తున్న అర్చకులు

ద్వారపూడి: కేశవరంలో పుంతలో మునసమ్మవారికి మహిళలు చీర, సారె సమర్పించారు. కమిటీ సభ్యులు కర్రి తాతారావు, ముత్యపాటి శ్రీనివాస్, చిర్రా బాబూరావు, నాగేశ్వరరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెలంపాలెం గోగులాంబ అమ్మవారికి..

హసనబాదలో ఇలింద్రమ్మవారికి సారె

కేశవరంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

కూటమి ప్రభుత్వంలో సహకార సంఘాలకు పునరుజ్జీవం

రాయవరం: సహకార సంఘాలకు పునరుజ్జీవాన్ని ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ అన్నారు. ఆదివారం చెల్లూరులో సహకార సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్ పి.చంద్రమౌళి మాట్లాడారు. త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్‌గా దేవళ్ల వెంకట్రావు (వెంటూరు), పాలకవర్గ సభ్యులు తలాటం వెంకటేష్ (చెల్లూరు), మేడిశెట్టి నాగేశ్వరరావు (కురకాళ్లపల్లి) ప్రమాణ స్వీకారం చేశారు. పాలకవర్గాన్ని లీలాకృష్ణ, తదితరులు సత్కరించారు. ఎంపీటీసీ సభ్యురాలు గొల్లపల్లి అనూరాధ, లొల్ల సర్పంచి చాట్రాతి జానకీరాంబాబు, పంచాయతీ సభ్యుడు చంద్రు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సభ్యులను అభినందిస్తున్న ఏపీడబ్ల్యూఆర్‌డీసీ ఛైర్మన్ లీలాకృష్ణ

ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావుకు పురస్కారం

పామర్రు, న్యూస్‌టుడే: మండల కేంద్రం కె.గంగవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు ఉమ్మడి జిల్లా స్థాయి ఆదర్శ ప్రధానోపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్నారు. యంగ్ మైండ్స్ సంస్థ ఆదివారం కాకినాడలో నిర్వహించిన సభలో ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, గాదె శ్రీనివాసులనాయుడు, తదితరుల నుంచి అవార్డు స్వీకరించారు. సంస్థ నిర్వాహకుడు వాకాడ చిన్న మాట్లాడుతూ గణిత బోధన, వివిధస్థాయి సైన్స్ ఫెయిర్‌లలో విద్యార్థులను విజేతలుగా నిలపడంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా అవార్డుకు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా సైన్సు అధికారి గిరిజాల వెంకటసుబ్రహ్మణ్యం, ఎంఈవోలు అలజంగి నాగరాజు, చోడిశెట్టి ఆంజనేయులు, ఉపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, వి.శ్రీధర్, జి.ఏడుకొండలు, అముజూరు సర్పంచి నానాపరపు కల్యాణి, శ్రీనివాస్, ఆయన కుటుంబికులు తదితరులు పాల్గొని ఆయన్ను సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావును గ్రామస్థులు అభినందించారు.

అవార్డు అందుకున్న వెంకటేశ్వరరావు

వ్యర్థాల గుట్టలు.. దుర్వాసనతో అవస్థలు

స్థానిక అలమూరు రోడ్డులో ఐటీఐ కళాశాల దాటిన తరువాత రోడ్డుపై వ్యర్థాలు గుట్టలుగా పోయడంతో దుర్వాసనతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యర్థాలు పోసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వ్యర్థాలు తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. - న్యూస్‌టుడే, మండపేట

అమృతమూర్తికి అశ్రునివాళి

శ్రీ కాకర శ్రీనివాసరావు (డాక్టర్ శ్రీను) BMP గారు
పంచాయతీ 7వ వార్డు సభ్యులు, అర్తమూరు

అర్తమూరు గ్రామంలో ఎన్నో సం॥రాలుగా వైద్య సేవలు అందిస్తూ, ఎంతోమందికి తన వైద్య చికిత్స ద్వారా నయం చేసి ప్రాణదాతగా పేరుగాంచి అందరి తలలో నాలుకలా పేరు సంపాదించుకున్న మా శ్రేయోభిలాషి శ్రీ కాకర శ్రీనివాసరావు (డాక్టర్ శ్రీను) గారి ఆకస్మిక మరణం మా ఊహకు అందనిది. దైవసన్నిధికేగిన వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెల్పుతూ...

పి.శ్రీనివాస్ — పంచాయతీ కార్యదర్శి, ఏడిద
శ్రీ విజయ మెడికల్ ఏజెన్సీస్ — V.R.మోహన్, T.రామారెడ్డి, S.శ్రీనివాస్
శ్రీ సాయినాథ్ డయాగ్నోస్టిక్ ల్యాబ్ — ప్రొ. దిండి సత్యవరప్రసాద్, గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా, మండపేట
లక్ష్మి మెడికల్స్ & సర్జికల్స్ — ప్రొ॥ కర్రి వంశీకిరణ్‌రెడ్డి, రాజమండ్రి
శ్రీ లక్ష్మి మెడికల్స్ & ఫ్యాన్సీ స్టోర్ — ప్రొ. చెన్నా సత్యనారాయణ, అర్తమూరు
శ్రీ దత్తసాయి మెడికల్ స్టోర్స్ — ప్రొ. పి.కృష్ణకిషోర్, పెద్దాపురం
శ్రీ శివశంకర మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ — పెద్దతాళ్ళపాలెం, రామచంద్రపురం, సెల్: 92912 92196
KKSR టెంట్‌హౌస్ — కర్రి హరినాథరెడ్డి, అర్తమూరు, సెల్: 90007 99888
పడాల సుబ్బారెడ్డి — A.P. పౌల్ట్రీ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ, అర్తమూరు, సెల్: 98491 36444
నల్లమిల్లి వీర్రెడ్డి — జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, అర్తమూరు, సెల్: 98491 36458
పడాల రామకృష్ణారెడ్డి — తాపేశ్వరం P.A.C.S. అధ్యక్షులు, అర్తమూరు, సెల్: 98493 00444
తాడి శేషారెడ్డి — అర్తమూరు, సెల్: 94401 76444
కర్రి సత్యనారాయణరెడ్డి (జంబయ్య) — ఉపసర్పంచ్, అర్తమూరు, సెల్: 98492 23566
చిర్ల రామన్న, 98491 27972 — వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్; చిర్ల సత్య నాగ మణికంఠరెడ్డి — అర్తమూరు, సెల్: 90104 99999
చిర్ల చంద్రారెడ్డి — 10వ వార్డు సభ్యులు, అర్తమూరు, సెల్: 95537 66666
మేడపాటి వీర్రెడ్డి — రెడ్డి సంక్షేమ సంఘం ప్రెసిడెంట్, 9వ వార్డు సభ్యులు, సెల్: 98884 19999
శ్రీమతి కర్రి రమాదేవి చిన్నారెడ్డి — 5వ వార్డు సభ్యురాలు, సెల్: 96182 33444
తాడి బొజ్జిరెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు; శ్రీమతి నాగలక్ష్మి, 12వ వార్డు సభ్యురాలు — అర్తమూరు, సెల్: 84999 60678
తేతల వెంకటరెడ్డి, 4వ వార్డు సభ్యులు; శ్రీమతి కల్యాణి అనిత, MPTC-2 — అర్తమూరు, సెల్: 90009 97999
శ్రీమతి చిర్ల దేవి సుమలత వీర్రాఘవరెడ్డి — 6వ వార్డు సభ్యురాలు, అర్తమూరు
పేట్నాల సత్యనారాయణమూర్తి — 11వ వార్డు సభ్యులు, అర్తమూరు
శ్రీమతి అండిమేని లక్ష్మి ప్రసాద్ — 1వ వార్డు సభ్యురాలు, అర్తమూరు
శ్రీమతి నార్కెడమిల్లి కనకలక్ష్మి దేవి వెంకటరత్నం (నాని) — 14వ వార్డు సభ్యురాలు, అర్తమూరు
చిర్ల ఆదిరెడ్డి (బాబులు) — పొలమూరు నీటి సంఘం అధ్యక్షులు, అర్తమూరు, సెల్: 98662 25833
తాడి సత్తిరెడ్డి — P.S.R. పౌల్ట్రీస్, అర్తమూరు, సెల్: 98498 91999
కర్రి వీరవెంకట సత్యనారాయణరెడ్డి (వీర) — అర్తమూరు, హైదరాబాద్, సెల్: 98664 95559
తిరగటి శివ — మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు, అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు గ్రహీత, సెల్: 93477 22244
శ్రీ వెంకట సాయిలక్ష్మి మెడికల్ & జనరల్ స్టోర్స్ — ప్రొ॥ చిర్ల శ్రీనివాసరెడ్డి, అర్తమూరు
సబ్బెళ్ళ శ్రీనివాసరెడ్డి — కుతుకులూరు నీటిసంఘం మాజీ అధ్యక్షులు, అర్తమూరు, సెల్: 98661 12444
గుడిమెట్ల మణికంఠరెడ్డి — S/o ఆదినారాయణరెడ్డి, అర్తమూరు, సెల్: 92473 63151
ద్వారంపూడి వీర్రాఘవరెడ్డి — అర్తమూరు, సెల్: 99897 95111
హోటల్ శ్రీలేఖ రెస్టారెంట్ — ప్రొ॥ N.V.N.S.రాజు, ఏలేశ్వరం
శ్రీను స్వీట్స్ — ప్రొ. ఎస్.శ్రీనివాస్, ఏలేశ్వరం
గిలాద్ మెడికల్ & జనరల్ స్టోర్స్ — ప్రొ. U.V.V.లక్ష్మణ్, రాజవొమ్మంగి
రుచి రెస్టారెంట్ — ప్రొ. Ch.రాంబాబు, పలాస
P.సోమశేఖర్ రెడ్డి — మాచవరం
పూజ ఫార్మశీ మెడికల్ — ప్రొ. డా॥ నగేష్, ద్వారపూడి
G.అభిలాష్ — Gr. III లైబ్రేరియన్, అనపర్తి
వరసాల రమేష్ — మండపేట
కామిశెట్టి శ్రీనివాస్ & బ్రదర్స్ — తెదేపా సీనియర్ నాయకులు, అర్తమూరు
లంక శ్రీనివాస్, రేలంగి సత్తిబాబు — తెదేపా సీనియర్ నాయకులు, అర్తమూరు
వెలగల రామారెడ్డి, వెలగల రామకృష్ణారెడ్డి, చిర్ల వాసు, తెదేపా నాయకులు, అర్తమూరు

(c) eenadu

రూ.22 వేలు పలికిన పులస

పులసను చూపిస్తున్న రత్నం

యానాం, న్యూస్‌టుడే: పులస చేపలకు ఈ ఏడాది రికార్డు ధరలు లభిస్తున్నాయి. యానాంలోని రాజీవ్‌బీచ్‌లో ఆదివారం మత్స్యకారులు నిర్వహించిన వేలంలో 1.800 కేజీల పులసను చేపల వ్యాపారం చేసే పొన్నమండ రత్నం రూ.22 వేలకు దక్కించుకున్నారు. బంగాళాఖాతం నుంచి సంతానోత్పత్తి కోసం గోదావరి వరద నీటిలోకి వచ్చి మత్స్యకారులకు చిక్కే వీటిని కొనుగోలు చేసేందుకు ఏటా తీవ్ర పోటీ ఉంటుంది. హోప్ ఐలాండ్‌కు చెందిన మల్లాడి ప్రసాద్ వలకు ఈ చేప చిక్కింది. గతేడాది ఓ పులసను రూ.23 వేలకు విక్రయించినట్లు అతడు చెప్పారు. ప్రస్తుత సీజన్లో లభ్యత తక్కువగా ఉండటంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

తగ్గిన గోదావరి వరద.. యథావిధిగా బోటు షికారు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: పైనుంచి గోదావరి వరద ఉద్ధృతి తగ్గడంతో ప్రవాహ వేగం నెమ్మదించింది. వరదల సమయంలో రాజమహేంద్రవరం పుష్కర ఘాటు వద్ద 56 అడుగుల వరకు నీరు చేరగా, ప్రస్తుతం 46 అడుగులకు నీరు చేరింది. బురద చేరడంతో మోటార్లు మొరాయిస్తున్నాయి. దీంతో నీటి సరఫరా ఆలస్యమవుతుంది. శివారు ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో సరఫరా చేయలేకపోతున్నారు. తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నదిలో టూరిజం శాఖ బోటు షికారు యథావిధిగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో ప్రవాహాన్ని చూసేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు.

అయినవారికే సర్దుబాటు.. 'పుర' ఆదాయానికి పన్నుపోటు

1,836 నిర్మాణాలకు ఆస్తి పన్నే లేదు ● వైకాపా జమానాలో నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన యంత్రాంగం

ఈనాడు, రాజమహేంద్రవరం: వైకాపా జమానాలో ప్రజాప్రతినిధులు.. నాయకుల మాటలే శాసనమన్నట్లు అధికారులు వ్యవహరించారు.. అడ్డగోలుగా స్థలాలు ఆక్రమించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆ రోజుల్లో చేస్తున్న 'పుర' సర్వేలో పన్ను పరిధిలో లేని నిర్మాణాలు నిగ్గు తేలుతోంది. ఉమ్మడి జిల్లాల్లోని నగర, పుర పాలక సంఘాలు, నగర పంచాయతీల్లో దాదాపు రూ.4.59 కోట్ల మేర ఆదాయానికి గండి కొట్టినట్లు గుర్తించారు.. వాటిని వసూళ్లు చేసేందుకు, బాధ్యులైన అధికారులపైనా చర్యలకు యంత్రాంగం సిద్ధమవుతోంది.

రాజమహేంద్రవరం నగరం

జిల్లాలో నగర, పురపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో పన్నులు విధించని, తక్కువగా పన్నులు మదింపు వివరాలు..

పురపాలిక	పన్ను వేయని నిర్మాణాలు	కోల్పోయిన ఆదాయం (రూ.లక్షల్లో)
రాజమహేంద్రవరం	457	59.49
నిడదవోలు	213	6.42
కొవ్వూరు	70	1.74

యతీల్లో ఇప్పటి వరకు 1836 నిర్మాణాలకు అసలు పన్నులే విధించలేదని తేలింది. వీటిలో అత్యధికంగా వైకాపా హయాంలోనే నిర్మించినవే కావడం గమనార్హం. ఆస్తి పన్ను వసూళ్లు చేయకపోవడం వల్ల రూ.2.33 కోట్ల మేర ఆదాయం కోల్పోయినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఒక్క కాకినాడలోనే ఈ తరహా నిర్మాణాలు 365 ఉండగా అత్యధికంగా రూ.1.32 కోట్లు, రాజమహేంద్రవరంలో 457 ఇళ్లకు రూ..59.50 లక్షల మేర ఆస్తి పన్ను వసూలు చేయలేదు.

వెలుగులోకి అక్రమాలు..

జగన్ జమానాలో అధికారులపై కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఇతర నాయకులు ఒత్తిడి తెచ్చి పలు నిర్మాణాలకు పన్నులు వేయకుండా అడ్డుకోగా.. కొన్నింటికి వసూళ్లు చేయాల్సిన నిర్దేశిత పన్ను కంటే తక్కువగా నమోదు చేశారు. తూర్పు గోదావరి, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని నగరాలు, పట్టణాలు, నగర పంచా

విలువ తగ్గించి నమోదు..

విస్తీర్ణం కంటే తక్కువగా చూపించడం, వాణిజ్య అవసరాలకు వినియోగించేవాటిని నివాస భవనాలుగా చూపించి పన్నులు తగ్గించడంలో క్షేత్ర సిబ్బంది, కమిషనర్ల ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఉమ్మడి జిల్లాలో 3,032 నిర్మాణాలకు విలువ తగ్గించి ఆస్తి పన్ను వసూలు చేయడం వల్ల పుర ఆదాయం సుమారు రూ.2.25 కోట్లు కోల్పోయినట్లు తేల్చారు.

గంటలోపు ఫిర్యాదు చేస్తే గట్టెక్కినట్లే..!

– న్యూస్‌టుడే, కంబాలచెరువు(రాజమహేంద్రవరం)

సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీకి అవకాశం

రాజమహేంద్రవరంలోని ప్రకాశంనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ విశ్రాంత ఉద్యోగి ముంబయికి కొన్ని దస్త్రాలు కొరియర్ ద్వారా పంపించారు. అది అక్కడకు చేరని వారం రోజులకు ముంబయి పోలీసులమంటూ ఓ ఫోన్ వచ్చింది. 'మీరు పంపిన కొరియర్‌లో మత్తు పదార్థాలు ఉన్నాయి..మీపై కేసు నమోదైంది' అంటూ భయపెట్టారు. వీడియో కాల్ చేసి మరింత ఆందోళనకు గురిచేశారు. కొంతసేపటికి ఫోన్ చేసి రాజీ చేసుకోవాలంటే సొమ్ము చెల్లించాలనడంతో రూ.8.50 లక్షలు ఆయన వారు చెప్పిన ఖాతాకు దశలవారీగా పంపారు. తర్వాత అనుమానం వచ్చి 1930 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సైబర్‌సెల్‌కి ఫిర్యాదు చేశారు. నగదు బదిలీ చేసిన ఖాతా వివరాలు తెలుసుకున్న సైబర్ అధికారులు దానిని స్తంభింపజేశారు. చివర పంపిన రూ.3.50 లక్షలు కోర్టు ద్వారా పోలీసులు ఆ ఖాతా నుంచి రికవరీ చేశారు.

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి ఒక్కసారి సొమ్ము చేజారితే ఇక అంతే.. మళ్లీ అది రికవరీ అవుతుందో లేదో తెలియని పరిస్థితి. సైబర్ మోసాల్లో కాజేసిన సొమ్ము ఇతర ఖాతాలకు మళ్లించడం.. వెంటనే ఉపసంహరించడం వల్ల బాధితులు తీవ్రంగా నష్టపోతున్నారు. సైబర్ మోసానికి గురైన మొదటి గంటలోపు ఫిర్యాదు చేస్తే సొమ్ము తిరిగి పొందడం, నేరస్థులను గుర్తించడానికి ఎక్కువ అవకాశం ఉందని జిల్లా పోలీసులు చెబుతున్నారు. దీనికే 'గోల్డెన్ అవర్'గా పిలుస్తున్నారు. జిల్లాలోని రాజమహేంద్రవరం నగరంతోపాటు గ్రామీణ ప్రాంతాలు, కళాశాలల్లో దీనిపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

వేగంగా ఖాతాల వివరాల సేకరణ

రాజమహేంద్రవరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్‌సెల్ విభాగం అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్నారు. ఫిర్యాదు అందిన వెంటనే ఏ ఖాతా నుంచి ఏ ఖాతాకు సొమ్ము చేరిందనేది నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్(ఎన్‌సీఆర్‌పీ) పోర్టల్ ద్వారా పరిశీలన చేస్తారు. ఎన్‌సీఆర్‌లో అన్ని బ్యాంకుల సర్వర్లతో అనుసంధానం ఉంటుంది. దీనిని వినియోగించి వారు చివరగా ఏ ఖాతాలో ఆ డబ్బు ఉందో గుర్తించి దానిని నిలుపుదల చేస్తారు. అనంతరం కోర్టు ద్వారా ఆ ఖాతాలో సొమ్ము సంబంధిత బ్యాంకు నుంచి రికవరీ అవుతుంది.

అలసత్వమైతే అంతే..: బాధితులు ఖాతాల నుంచి దోచేసిన సొమ్మును సైబర్ నేరగాళ్లు నిమిషాల వ్యవధిలోనే వేర్వేరు ప్రాంతాల్లోని కొన్ని వందల ఖాతాలకు బదిలీ చేస్తారు. అనంతరం ఏటీఎం నుంచి నగదు ఉపసంహరణ చేస్తుంటారు. ఒక ఖాతా నుంచి మరో ఖాతాకు కొన్నింటికి బదిలీ చేసేందుకు కొంత సమయం పడుతుంది. ఆ సమయంలో అప్రమత్తమై స్పందించగలిగితే ప్రయోజనం ఉంటుంది.

ఏం చేయాలంటే
● సైబర్ నేరం కట్టడికి కేంద్రం ఇండియన్ సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్ ప్రారంభించారు. దీనిలో దర్యాప్తు సంస్థలు, బ్యాంకులు, వివిధ ఆర్థిక సంస్థలను భాగస్వాములను చేశారు.
● బాధితులు ఫిర్యాదు చేసేందుకు 1930 టోల్‌ఫ్రీ ఫోన్ చేసి మోసం వివరాలు చెప్పొచ్చు. సైబర్ క్రైం వెబ్‌సైట్‌లో ఫిర్యాదును పూర్తి చేయొచ్చు.
● బాధితుల బ్యాంకు ఖాతా నంబరు, యూపీఐ, ఫోన్ నంబరుతో పాటు సైబర్ నేరగాళ్లు వినియోగించిన ఫోన్ నంబరు, బ్యాంకు ఖాతా నంబరు, యూపీఐ ఐడీ వంటి వివరాలు ఇవ్వాలి.
● టోల్‌ఫ్రీ నంబరు, వెబ్ సైట్‌కు వచ్చిన వివరాలను స్థానిక పోలీసు స్టేషన్లకు పంపిస్తారు. అక్కడ నుంచి జిల్లా పోలీసు కార్యాలయాల్లో ఉండే సైబర్ సెల్ దానిని పర్యవేక్షిస్తుంది.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం జిల్లాలో యథావిధిగా నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై ప్రజల నుంచి అధికారులు అర్జీలు స్వీకరించనున్నారు. కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్, మున్సిపల్, మండల కార్యాలయాల్లోనూ అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమీపంలోని కార్యాలయంలోనూ అధికారులను సంప్రదించి సమస్యలు నమోదు చేయించుకోవచ్చన్నారు. 1100 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేసి తమ అర్జీ పరిష్కార స్థితి గురించి తెలుసుకోవచ్చన్నారు.

బిక్కవోలు పీజీఆర్ఎస్‌కు కలెక్టర్..

వి.ఎల్.పురం, బిక్కవోలు: బిక్కవోలు మండలంలో జరిగే ప్రజాసమస్యల పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి పాల్గొనున్నారు. మండల కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. ఆ మండల పరిధిలోని ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

25 నుంచి సత్యదేవుని ఆవిర్భావ వేడుకలు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని ఆవిర్భావ వేడుకలు ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్నాయి. 26న స్వామివారి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. స్వామి, అమ్మవారు, పరమేశ్వరుల మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, ప్రాకారసేవ, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయి.

నదీమ తల్లికి నిత్య హారతి

తిలకిస్తున్న భక్తజనం

పవిత్ర గోదావరి తీరంలో నిత్యం హారతి ఇస్తారు. ఈ ఆధ్యాత్మిక వేడుకను తిలకించేందుకు జిల్లావ్యాప్తంగా వస్తారు. ఆదివారం సెలవురోజు కావడంతో పెద్దసంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. గోదారమ్మకు శాస్త్రోక్తంగా 14రకాల హారతులను వేదపండితులు సమర్పించారు.

- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

గోదారమ్మకు హారతి ఇస్తున్న వేదపండితులు

భక్తుల కొంగుబంగారం.. కోటసత్తెమ్మ..

తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ తల్లిని ఆషాఢ మాసం పురస్కరించుకుని ఆదివారం రెండు టన్నుల కూరగాయలు, వివిధ రకాల పండ్లతో శాకంబరిగా ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.2,61,460 ఆదాయం వచ్చింది. దర్శనాల ద్వారా రూ.68,980, అన్నదాన ట్రస్టుకు రూ.14,233, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.78,500, ఇతర టిక్కెట్లు ద్వారా రూ.79,518, విరాళాల రూపంలో రూ.20,232 ఆదాయం వచ్చింది.

- న్యూస్‌టుడే, నిడదవోలు

ఇక.. కొత్త భవనంలో ఈఎస్ఐ సేవలు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం)

ఈనాడు కథనానికి స్పందన

రాజమహేంద్రవరంలోని కార్మిక ప్రభుత్వ బీమా ఆసుపత్రి (ఈఎస్ఐ) కొత్త భవనంలో వైద్యసేవలు ప్రారంభించడానికి ఎట్టకేలకు అనుమతి లభించింది. ఇప్పటికే నిర్మాణం పూర్తయి సిద్ధంగా ఉన్న వంద పడకల కొత్త భవనాన్ని ఈఎస్ఐ కార్పొరేషన్ వైద్యాధికారులకు అప్పగించింది. రూ.55 కోట్లలో చేపట్టిన ఆసుపత్రి కొత్త భవన నిర్మాణాలు పూర్తయినా.. ప్రారంభం కాకపోవడం.. ఐపీ సేవలు పునఃప్రారంభం కాకపోవడం.. అత్యవసర కేసులను రిఫరల్ ఆసుపత్రులకు తరలిస్తుండటంపై 'అందుబాటులో వంద పడకలు.. ప్రారంభోత్సవానికి మీనమేషాలు' శీర్షికన గత నెల 13న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఈఎస్ఐ కార్పొరేషన్ ఉన్నతాధికారులు స్పందించారు. ప్రస్తుతం ప్రత్యామ్నాయ భవనాల్లో కొనసాగిస్తున్న వైద్యసేవలను నూతన భవనంలోకి మార్పు చేసి రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఇక్కడ వైద్యాధికారులకు సూచించారు. ప్రత్యామ్నాయ భవనాల్లోని వైద్యపరికరాలు, సామగ్రిని నూతన భవనంలోకి తరలించడానికి చర్యలు చేపట్టారు.

కూటమి సర్కారు వచ్చాక పనులు వేగవంతం

50 పడకలుగా ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రి పాత భవనాల స్థానే జీప్లస్‌టూ తరహాలో వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి 2021లో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అదే ఏడాది మార్చిలో టెండర్లు దక్కించుకున్న రాజస్థాన్‌కు చెందిన భవన నిర్మాణ సంస్థ పనులు చేపట్టింది. కానీ వివిధ కారణాలతో నిర్మాణ పనుల్లో తీవ్రజాప్యం జరుగుతూ వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు వేగవంతానికి చర్యలు తీసుకోవడంతో ఏడు నెలల కిందటే నిర్మాణాలు పూర్తి చేశారు. ✦ ఇప్పటికే కొత్త కుర్చీలు, టేబుళ్లు, బెడ్‌లతోపాటు కొన్ని పరికరాలు వచ్చాయి. వీటితోపాటు ప్రత్యామ్నాయ భవనాల్లోని వైద్య పరికరాలు, సామగ్రిని కూడా ఈ నెల 21, 22 తేదీల్లో కొత్త భవనంలోకి తరలించి అనంతరం అక్కడే వైద్యసేవలు కొనసాగించనున్నట్లు ఈఎస్ఐ ఇన్‌ఛార్జి మెడికల సూపరింటెండెంట్ కోటేశ్వర్ చెప్పారు. దశలవారీగా అత్యాధునిక వైద్యపరికరాలు కూడా సమకూరనున్నాయన్నారు. వంద పడకల ఆసుపత్రిగా వర్గోన్నతి ప్రక్రియ పూర్తయితే త్వరలో ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్యసిబ్బందిని పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

పరిశ్రమలకు రాచబాట

న్యూస్‌టుడే, రాజానగరం

ఉద్యోగాల కల్పనకు, పారిశ్రామిక ప్రగతికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. అందులో భాగంగా జిల్లాలో పారిశ్రామికవాడ అభివృద్ధికి చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాజానగరం మండలంలోని కలవచర్లలో ఏర్పాటు చేసిన పారిశ్రామికవాడలో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. 104 ఎకరాలను అభివృద్ధి చేసి 396 ప్లాట్లుగా విభజించారు. పరిశ్రమల ఏర్పాటుకు పలువురు దరఖాస్తు చేసుకుంటున్నారు. వారు పెట్టబోయే పరిశ్రమ అవసరాల మేరకు ఎంత విస్తీర్ణంలో స్థలం అవసరం అనేది అధికారులు పరిశీలించి కేటాయిస్తున్నారు. 300 గజాల నుంచి ఎకరం వరకూ కేటాయిస్తారు. పరిశ్రమలు పెట్టే వారికి ఏకగవాక్ష విధానంలో అనుమతులు ఇవ్వనున్నారు.

కలవచర్లలోని పారిశ్రామికవాడలో సెంట్రల్ విద్యుత్తు సౌకర్యం

సమకూరుతున్న వసతులు..

ఇక్కడ అంతర్గత రహదారుల నిర్మాణం పూర్తయ్యింది. ఆయా ప్రధాన రహదారుల్లో సెంట్రల్ లైటింగ్, మామూలు రహదారుల్లో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. నీటి సౌకర్యం, కల్వర్టుల నిర్మాణం, విద్యుత్తు సదుపాయం కల్పిస్తున్నారు. ఈ మేరకు మూడు నియంత్రికలు పెట్టారు. విద్యుత్తు ఉపకేంద్రం ఏర్పాటు చేయనున్నారు. త్వరితగతిన ప్రారంభించేలా చకచకా పనులు జరుగుతున్నాయి.

వీటికి ఎంతో అనుకూలం..

పారిశ్రామికవాడలో ఫుడ్ ప్రాసెసింగ్, మాన్యుఫ్యాక్చరింగ్, జీడిపిక్కల, ఇంజినీరింగ్ సంబంధిత పరిశ్రమలు, కాగితంతో కప్పులు, ప్లేట్ల తయారీ వంటివాటికి అనుకూలంగా అధికారులు చెబుతున్నారు. మిగిలిన వాటికి కూడా సంప్రదించవచ్చని సూచిస్తున్నారు.

అన్ని వర్గాలకు ఉపాధి..

ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయదలచుకున్న వారికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చెబుతున్నారు. స్థలం కావాలనుకున్న వారు ముందుకొస్తే ధర తగ్గించి మంజూరు చేసే ఆలోచన ఉందన్నారు. పూర్తిస్థాయిలో వచ్చిన తర్వాత అన్ని వర్గాలకు కలిపి సుమారు నాలుగులక్షల మందికి ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. త్వరితగతిన ప్రారంభించేలా జిల్లా పరిశ్రమల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు.

వాడపల్లి.. ఆధ్యాత్మికత పరిఢవిల్లి

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. వేలాది మంది స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించాయి. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపింది. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రశాంతంగా ఏపీపీఎస్సీ పరీక్ష

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: అధ్యాపకుల పోస్టుల భర్తీ కోసం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్(ఏపీపీఎస్సీ) నిర్వహించిన రాత పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. రాజమహేంద్రవరం లూథరగిరిలోని డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో రెండు షిఫ్టుల్లో జరిగిన ఈ పరీక్షకు జిల్లా పరిధిలోని 759 అభ్యర్థులకుగాను 414 మంది హాజరుకాగా 345 మంది గైర్హాజరయ్యారని జిల్లా సంయుక్త కలెక్టర్ చిన్నరాముడు తెలిపారు. పరీక్షాకేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ఏపీపీఎస్సీ పరీక్షను జిల్లాలో సజావుగా నిర్వహించామన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి షిఫ్టులో జరిగిన పరీక్షకు 519 మందికి 337 మంది హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు రెండో షిఫ్టులో జరిగిన పరీక్షకు 240 మందికి 77మంది రాసినట్లు తెలిపారు. ఏపీపీఎస్సీ అధికారి ఎం.జగదీష్, సహాయ చీఫ్ సూపర్‌వైజర్ ఎస్.వి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

WANTED WARDENS
(Male/Female Candidates)
For ADITYA HOSTELS
QUALIFICATION : Any Degree with fluency in English & Hindi
FREE LODGING & BOARDING (BACHELORS PREFERRED)
ATTRACTIVE SALARY FOR DESERVING CANDIDATES
ADITYA ACADEMY
Srinagar, KAKINADA
Ph: 7036146665
77320 76668

అన్నవరం.. నిద్రావస్థలో నిఘా

✦ సరకుల స్టోర్ నుంచి వినియోగం వరకు..
✦ అడుగడుగునా కొరవడిన పర్యవేక్షణ

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరంలో నిఘా వ్యవస్థ సక్రమంగా లేదు. పూజలు, ఇతర వాటికి వినియోగించే సామగ్రి, సరకుల ఉంచే స్టోర్స్ నుంచి వినియోగం వరకు పర్యవేక్షణ కొరవడింది. క్షేత్ర రక్షకులు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో పూజకు వినియోగించే నెయ్యి డబ్బాలు దేవస్థానం స్టోర్స్ నుంచి ఈ ఆలయానికి రాగా మూడు డబ్బాలను అక్కడ పనిచేసే ఉప ప్రధాన అర్చకుడు, సంభావన పరిచారకుడు పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు. వీరిద్దరినీ విధుల నుంచి సస్పెండ్ చేసినా ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. 'అన్నవరంలో నెయ్యి పక్కదారి' శీర్షికతో ఈనెల 19న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై పూర్తి వివరాలు అందించాలని ప్రభుత్వ కార్యదర్శి ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ కార్యదర్శికి జరిగిన ఘటన, గుర్తింపు, తీసుకున్న చర్యలు వివరిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ నివేదిక అందజేశారు. మరోవైపు ఇలా సరకులు పక్కదారి పడుతున్న పరిస్థితులు ఎక్కడైనా ఉన్నాయా అన్నది పరిశీలించాలని దేవస్థానం అధికారులను కమిషనర్ ఆదేశించారు. దేవస్థానంలోని వివిధ సబ్‌స్టోర్స్ (సరకులు నిల్వచేసే గోదాం), ఉపాలయాలకు సంబంధించి సీసీ కెమెరాల గత 90 రోజుల బ్యాకప్ పరిశీలించి నివేదిక పంపాలన్నారు. నెయ్యిని పక్కదారి పట్టించే ప్రయత్నం చేసిన ఉప ప్రధాన అర్చకుడిని ఇప్పటికే సస్పెండ్ చేయగా సంభావన పరిచారికుడ్ని నిలుపుదల చేయాలని ఆదేశాలిచ్చారు. సుమారు 300 కెమెరాలు ఉన్నా రికార్డింగ్ బ్యాకప్ సామర్థ్యం మాత్రం కేవలం 30 రోజులే ప్రస్తుతం ఉంది. సామర్థ్యం 90 రోజులకు పెంచడానికి అవసరమైన సర్వరు, హార్డ్‌డిస్కులు ఏర్పాటు చేయడానికి ఇటీవల రూ.70 లక్షలు అంచనాలను అధికారులు సిద్ధం చేశారు. అయితే స్టోర్స్, ఉపాలయాల సీసీ కెమెరాల 90 రోజుల బ్యాకప్ పరిశీలించాలని కమిషనర్ ఆదేశించినా పరిశీలించే అవకాశం లేదని సమాచారం. స్టోర్స్ నుంచి సరకులు బయటకు వచ్చిన తర్వాత వాటి వినియోగంపై పర్యవేక్షణకు పకడ్బందీవ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరముంది.

పర్యాటకం.. ప్రోత్సహిస్తే మణిహారం

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, తాళ్లరేవు

తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఆధ్యాత్మికత, ఆనందం, ఆహ్లాదం పంచే పర్యాటక ప్రాంతాలెన్నో ఉన్నాయి. వైకాపా హయాంలో ఈ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో రూ.94 కోట్లతో అఖండ గోదావరి ప్రాజెక్టు పేరుతో పర్యాటక అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లా నుంచి ఎన్నికైన పర్యాటశాఖ మంత్రి కందుల దుర్గేశ్ పర్యాటక ప్రాంతాలపైనే దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

మౌలిక వసతులు లేక

కాకినాడకు సుమారు 8 కి.మీ దూరంలో సముద్రం మధ్యన సహజ సిద్ధమైన ద్వీపం హోప్ ఐలాండ్ ఉంది. తుపాను నుంచి పట్టణానికి రక్షణగా, పర్యాటకులను ఆకర్షించే ద్వీపంగా ఇది నిలుస్తుంది. సముద్రంలో 40 నిమిషాల బోటు ప్రయాణంతో ఇక్కడకు చేరుకోవచ్చు. ఏపీ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో 2019 వరకు ప్రత్యేకంగా పడవలు నడిపేవారు. వారి కోసం షెడ్లు నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పించారు. కచ్చులూరు పడవ ప్రమాద ఘటన తర్వాత బోట్లు నిలిపేశారు. కొంతమంది స్థానిక మత్స్యకారుల పడవలపై అక్కడకు వెళ్లినా సదుపాయాలు లేక నిరాశగా వెనుతిరుగుతున్నారు.

మంత్రి దుర్గేష్‌పైనే ఆశలు

పర్యాటకంగా అభివృద్ధిలేని కాకినాడ హోప్ ఐలాండ్ ప్రాంతం

మడ అడవులకు కోరింగ కేంద్రం..

కాకినాడకు సుమారు 10 కి.మీ దూరంలో దట్టమైన మడ అడవులతో కోరింగ అభయారణ్యం, వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం ఉంది. ఇక్కడ ఆరు అడుగుల ఎత్తులో చెక్క వంతెనపై విహరించడం, గోదావరి పాయ నడుమ బోటుతో సముద్రంలోకి వెళ్లడాన్ని పర్యాటకులు ఆస్వాదిస్తున్నారు. గతంలో కొంతమేర ఇక్కడ అభివృద్ధి పనులు చేసినా ఇంకా పర్యాటకులకు మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన ఉంది. గైడ్‌లను నియమిస్తే బాగుంటుందని సందర్శకులంటున్నారు. ✦ కాకినాడ జిల్లాలో తలుపులమ్మలోవ గుడి నుంచి అన్నవరం సత్యనారాయణ స్వామి.. పిఠాపురం శక్తిపీఠం, పెద్దాపురంలోని తొలి తిరుపతి గుడి, సామర్లకోటలోని 1100 ఏళ్లనాటి భీమేశ్వరస్వామి ఆలయం, సర్పవరంలోని భావన్నారాయణ ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం సర్క్యూట్ ప్రతిపాదన దశలోనే ఉంది.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..

విజయవాడలోని భవానీ ద్వీపం, హోప్ ఐలాండ్ కంటే విస్తీర్ణంలో చిన్నదే. జలక్రీడలు, అమ్యూజ్‌మెంట్ పార్క్, అతిథులు రాత్రిళ్లు బస చేయడానికి హోటళ్లు ఉండటంతో ఈ ద్వీపానికి సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కాకినాడ హోప్ ఐలాండ్‌లో పరిస్థితి దీనికి భిన్నం. పర్యాటకంగా ఎలాంటి అభివృద్ధి జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎకో టూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ప్రయాణికుల బోట్లు, 12 కాటేజీల నిర్మాణం, పర్యాటకుల నడక దారి, విశ్రాంత గదులు, మరుగుదొడ్లు, పిల్లలు ఆడుకునేందుకు సామగ్రి సమకూర్చడానికి సుమారు రూ.8 కోట్లు అవుతుందని లెక్కగట్టారు. నెలకు లక్ష మందికి పైగా సందర్శించడానికి అవకాశం ఉంటుందని అంచనా వేశారు. కానీ ఈ ప్రతిపాదనలకు అటవీశాఖ అధికారులు మోకాలడ్డినట్లు తెలిసింది. దీనిపై పర్యాటక మంత్రి చొరవ చూపితేనే ప్రాజెక్టులో ముందడుగు పడేది.

(c) eenadu

50 ఏళ్లకు కలిశారు.. జ్ఞాపకాలతో మురిశారు

వారంతా చిన్ననాటి స్నేహితులు. వేర్వేరు ప్రాంతాల్లో వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. 50 ఏళ్ల తర్వాత కలుసుకుని రోజంతా ఆనందంగా గడిపారు. 1975-76లో మున్సిపల్ టౌన్ హైస్కూల్‌లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక రజక కల్యాణమండపంలో కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా ఆటపాటలతో సరదాగా గడిపారు. ప్రధాన ఉపాధ్యాయులుగా పనిచేసిన వి.సీతారామయ్యను సత్కరించారు. మధుసూదన్, లక్ష్మణతీర్థ, రామ్‌కుమార్, అడ్డూరి ప్రకాశరావు, నాగేంద్రకుమార్, ఎంవీ రామారావు తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, శ్యామలాసెంటర్

కోటసత్తెమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

నిడదవోలు, న్యూస్‌టుడే: ప్రతిష్ఠాత్మక అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా కోటసత్తెమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శాకంబరీగా దర్శనమిచ్చిన నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ వారిని మంత్రి ఆదివారం దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, వేదపండితులు ఆయనకు స్వాగతంపలికి అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. మంత్రి మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం కలిగిన అమ్మవారి ఆలయం ఆధ్యాత్మికతతో అలరారుతోందన్నారు. ఆవరణం అభివృద్ధి, ఆలయ గోపురం ఆధునికీకరణ, భక్తుల సౌకర్యార్థం అదనపు వసతి గృహాలు తదితర మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం నేతృత్వంలో ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్ పాల్గొన్నారు.



కోటసత్తెమ్మను దర్శించుకున్న మంత్రి దుర్గేష్

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

రాజానగరం, న్యూస్‌టుడే: స్వామి వివేకానంద రెండో ఏపీ రాష్ట్ర స్థాయి ఓపెన్ ర్యాపిడ్ చదరంగం పోటీలు శ్రీచెస్ 64 అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం దివాన్‌చెరువులోని దిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 408 చదరంగం క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలు భీమరాసెట్టి శ్రావ్యశ్రీకి ప్రథమ బహుమతి రూ.10,116 నగదు, డి.లక్ష్మణరావుకు ద్వితీయ బహుమతి రూ.7 వేలు, అల్లూరి భాస్కరరత్న షణ్ముఖరెడ్డికి తృతీయ బహుమతి రూ.5వేలు నగదుతో పాటు ట్రోఫీ, సర్టిఫికెట్స్ అందజేశారు. మొత్తంగా 225 మంది విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథులుగా దిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ జె.కరుణ్‌దీప్, శ్రీచెస్ అకాడమీ 64 డైరెక్టర్ పి.హరిప్రసాద్, ఎండీ లక్ష్మీనరసమ్మ, తూర్పుగోదావరి జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి జి.వి.కుమార్, ఉపాధ్యక్షుడు కళ్యాణ్‌కుమార్, ఫన్‌మోజీ బృందం హరీష్, రాహుల్, విష్ణుతేజ హాజరయ్యారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న ముఖ్యఅతిథులు

చిన్నారుల నోట.. భగవద్గీత శ్లోకాలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఊహ తెలిసిన నాటి నుంచి చిన్నారులకు గీతా శ్లోకాల పఠనం నేర్పించడం ద్వారా మాటలో స్పష్టత వస్తుంది. క్లిష్టమైన శ్లోకాలు అలవోకగా చెప్పడం అలవాటు చేసుకుంటే ఉచ్చారణ పెరగడంతో పాటు జ్ఞాపకశక్తి మెరుగు అవుతుంది. రాజమహేంద్రవరం గౌతమఘాట్‌లోని ఇస్కాన్ మందిరంలో ఆదివారం తరగతులు నిర్వహిస్తూ గీతా శ్లోకాల పఠనంలో శిక్షణ అందిస్తున్నారు. నగరానికి చెందిన పలు పాఠశాలల చిన్నారులు ఉత్సాహంగా హాజరవుతున్నారు.

ఆదివారం ప్రత్యేక తరగతుల్లో ఇవీ..

ప్రహ్లాద సన్‌డే క్లాసెస్ పేరుతో నిర్వహించే తరగతులకు మొత్తం 624 మంది హాజరవుతున్నారు. వీరిని 12 విభాగాలుగా విభజించి మాధవా, యశోదా నందన్, బాలగోపాల్, గోపీనాథ్, బలరామ తదితర పేర్లతో ఒక్కో తరగతికి వారి పురోగతి ప్రకారం కేటాయిస్తారు. ఒకటి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు పాల్గొంటున్నారు. శ్లోకాలు, వాటి భావాలు నేర్పిస్తారు. నీతికథలు, ఆధ్యాత్మిక క్రీడలు, కృష్ణ సంబంధ కథలు చెబుతారు.

ఇప్పటికి 24 నేర్చుకున్నా..

భగవద్గీత శ్లోకాలను కంఠస్తం చేస్తూ వాటి అర్థం తెలుసుకోవడం బాగుంటుంది. మొదట్లో కష్టంగా ఉన్నా తోటి పిల్లలతో కలిసి సాధన చేయడంతో అలవాటుగా మారింది. ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః అనే శ్లోకం నాకు చాలా ఇష్టం. - బి.తన్విక, రెండో తరగతి

నీతి కథలు బాగున్నాయ్..

శ్లోకాల పఠనం నాకు చాలా ఇష్టం. ఇంతవరకు 20 నేర్చుకున్నాను. వీటితో పాటు కృష్ణలీలల నుంచి నీతికథలు చెబుతారు. ఆపై క్విజ్ పోటీలు నిర్వహించి మార్కులు వేస్తారు. నాతోపాటు మా స్నేహితులు కూడా వస్తున్నారు. - కె.చైతన్య, మూడో తరగతి

శిక్షణ ఇస్తున్న ఇస్కాన్ స్వామీజీ, మాతాజీలు

మాటల్లో స్పష్టత వచ్చింది..

ప్రహ్లాద తరగతుల్లో చేరిన కొత్తలో శ్లోకాలు చదవడం వచ్చేది కాదు. ఉచ్చారణ చాలా కష్టంగా అనిపించేది. క్రమంగా అలవాటు చేసుకున్నా. దీంతో నాకు జ్ఞాపకశక్తి బాగా పెరిగింది. చదువులోనూ ముందు వరుసలో ఉంటున్నాను. - కె.నిషిక, మూడో తరగతి

ఆధ్యాత్మిక భావనతోనే అభివృద్ధి..

బాల్యం నుంచి పిల్లలకు ఆధ్యాత్మికత అలవాటు చేయాలి. మంచి, చెడులను అర్థం చేసుకుని జీవన విధానంపై అవగాహన కలిగించాలి. ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం చిన్నారులకు ప్రహ్లాద ఆదివారపు తరగతుల్లో నీతికథలు, శ్లోకాల పఠనం నేర్పించి క్విజ్‌పోటీలు నిర్వహిస్తాం. జూన్ నుంచి మార్చి వరకు జరిగే తరగతుల్లో ఏడాది మొత్తంలో వారు నేర్చుకున్న అంశాలపై శిక్షణ అందించి పైతరగతికి పంపిస్తాం. 108శ్లోకాలు, వాటి భావార్థం, తాటకి వధ, రాక్షస సంహారం తదితర కథలు నేర్పించి వాటిలో పరీక్షలు నిర్వహిస్తాం. - హేమనిమాయి దాస్, తరగతుల నిర్వాహకులు

చాగల్లు మండలంలో నీట మునిగిన పొలాలు

తగ్గిస్తే ముప్పు.. పెంచితే ముంపు

జలవనరులశాఖ అధికారులకు తలనొప్పిగా మారిన సాగునీటి విడుదల

నిడదవోలు, న్యూస్‌టుడే: జిల్లాలో గత కొద్ది రోజులుగా పశ్చిమడెల్టా కాలువలకు విడుదల చేస్తున్న సాగునీరు వ్యవహారం వివాదాస్పదం అవ్వడంతో జలవనరులశాఖ అధికారులకు తలనొప్పిగా మారింది. పశ్చిమడెల్టా పరిధిలో సుమారు 5.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. వర్షాలు ముఖం చాటేయడంతో రైతులకు సాగునీటి అవసరాలు పెరిగాయి. ఇది గుర్తించిన అధికారులు 7,200 క్యూసెక్కుల వరకు సాగునీరు అందించినా శివారు ప్రాంతాలకు చేరని పరిస్థితి. దీనికి తోడు నిడదవోలు ఆర్వోబీ పనుల నిమిత్తం పశ్చిమడెల్టా ప్రధానకాలువలో ఏర్పాటు చేసిన క్రాస్‌బండ్ పూర్తిగా తొలగించకపోవడం వల్ల ఎగువన పంటచేలు ముంపునకు గురవుతుండగా, దిగువన సాగునీరు అందడం లేదని రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. చాగల్లు మండలం మార్కొండపాడు, గవరపాడు, ఎస్.ముప్పవరం, బ్రాహ్మణగూడెం, దారవరం, నిడదవోలు మండలంలో గోపవరం, సమిశ్రగూడెం గ్రామాల పరిధిలో అప్పారావు ఛానల్‌ను ఆనుకుని ఉన్న పొలాలు నీట మునిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశ్చిమడెల్టా కాలువలకు విడుదల చేస్తున్న సాగునీరు తగ్గిస్తే ఈ పంట చేలలోకి నీరంతా అప్పారావు ఛానల్‌లోకి వెళ్లి ముంపు నుంచి పంటకు విముక్తి కలుగుతుందని ఆ రైతుల వాదన. పంట పొలాలకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో విడుదలను తగ్గించలేమని అధికారులు చెబుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న కారణంగా పశ్చిమడెల్టా ఆయకట్టు రైతులకు సాగునీరు సమస్య కొంతమేర తీరడంతో ఆదివారం 500 క్యూసెక్కులు వరకు తగ్గించి 6,700 క్యూసెక్కులు అందిస్తున్నాం. నిడదవోలు ఆర్వోబీ నిర్మాణ పనుల వద్ద క్రాస్‌బండ్ కూడా పూర్తిగా తొలగించడం వల్ల సమస్య తీరుతుంది. రైతులకు సాగునీరు అవసరం తగ్గితే క్రమంగా నీటి విడుదల తగ్గిస్తాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ఈఈ, పశ్చిమడెల్టా, నిడదవోలు

కేంద్ర కారాగారం వద్ద వైకాపా శ్రేణుల హల్‌చల్

పోలీసుల హెచ్చరికలను పట్టించుకోని వైనం

ఈనాడు, రాజమహేంద్రవరం, టి.నగర్, కంబాలచెరువు, న్యూస్‌టుడే, కంబాలచెరువు: మద్యం కేసులో నిందితుడు, ఎంపీ మిథున్‌రెడ్డిని ఆదివారం రాత్రి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ నేపథ్యంలో స్థానిక వైకాపా శ్రేణులు అక్కడకు చేరుకుని హల్‌చల్ చేశారు. వైకాపా జెండాలతో అలజడి సృష్టించారు. పోలీసుల హెచ్చరికలు ఏ మాత్రం పట్టించుకోలేదు.

మిథున్‌రెడ్డిని కేంద్రకారాగారంలోకి తరలిస్తున్న వాహనాలు

కేంద్రకారాగారం వద్ద వైకాపా శ్రేణులు

నీటి విడుదల తగ్గింపునకు చర్యలు

చాగల్లు: చాగల్లు రైతుల పంట పొలాలు ముంపు బారినుంచి తప్పించేందుకు మంత్రి నిమ్మల రామానాయుడు చర్యలు తీసుకున్నారు. పాలకొల్లులో మంత్రిని ఆదివారం రాత్రి చాగల్లు రైతులు, ఏఎంసీ ఛైర్మన్ నెక్కంటి శ్రీరామ్, పలువురు నాయకులతో కలిసి తమ పొలాలను ముంపు బారి నుంచి కాపాడాలని కోరారు. పశ్చిమ డెల్టా హెడ్ స్లూయిజ్ నుంచి నీటి విడుదల కారణంగా అప్పారావు ఛానల్‌లో నీరు వెనక్కు వస్తోందని, దీంతో పొలాలు మునిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రి ఆ శాఖాధికారులతో మాట్లాడారు.

మానాన్న ఆరోగ్య సమాచారం ఎందుకు విడుదల చేయలేదు..?

- అభిమానులకు తెలియజేయాల్సిన అవసరం లేదా..
- మాజీ మంత్రి ముద్రగడ కుమార్తె క్రాంతి ఆవేదన

సామర్లకోట (గ్రామీణం), న్యూస్‌టుడే: తన తండ్రి ఆరోగ్య సమాచారం విడుదల చేయకుండా ఇంత రహస్యం ఎందుకు వైద్యం చేస్తున్నారని మాజీ మంత్రి, వైకాపా సీనియర్ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి కుమార్తె బార్లపూడి క్రాంతి కన్నీటి పర్యంతం అయ్యారు. తన సోదరుడు ముద్రగడ గిరి చెబితే ఆపేస్తారా అని ప్రశ్నించారు. ఆదివారం రాత్రి తన తండ్రిని చూసేందుకు కాకినాడ ఏడీబీరోడ్డులోని ఆసుపత్రి వద్దకు ఆమె వచ్చారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తనను ఆసుపత్రి లోపలికి వెళ్ళకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. తాను వస్తున్నానని తెలిసి నర్సులతో తలుపులు వేయించేశారన్నారు. తన తండ్రి కాకినాడ వచ్చి నాలుగు రోజులు అయ్యిందని.. ఇంతవరకు మూడు ఆసుపత్రులు తిప్పారని, హైదరాబాద్‌కు ఎందుకు తీసుకువెళ్లలేదని ప్రశ్నించారు. అంత రహస్యం ఏమిటని.. ఆయన ఒక కీలక నేత అని, ఆయన ఆరోగ్య సమాచారం అభిమానులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. [illegible] ఆయనకు డయాలసిస్ జరుగుతోందని చెబుతున్నారని.. కానీ క్యాన్సర్ వైద్యం జరగటం లేదన్నారు. అసలైన వైద్యం చేయకుండా డయాలసిస్ చేస్తే ఏం ప్రయోజనం అన్నారు. తనకు ఏం విషయం తెలియకుండా ఆపేస్తున్నారని, ఎవరికి ఫోన్ చేసినా మాట్లాడనివ్వకుండా బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆసుపత్రిలో క్రాంతి

భాజపా జిల్లా నూతన కమిటీ ఎంపిక

దేవీచౌక్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: భాజపా తూర్పుగోదావరి జిల్లా నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆదివారం ప్రకటించారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. కమిటీలో ఏడుగురు ఉపాధ్యక్షులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, ఏడుగురు కార్యదర్శులు, కోశాధికారి, సామాజిక మాధ్యమ సమన్వయకర్త, ఐటీ విభాగం కన్వీనర్లను నియమించారు. నూతన కమిటీలో అయిదుగురు మహిళలకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు ప్రధాని నరేంద్ర మోదీ పాలన, కేంద్ర ప్రభుత్వ పథకాలు, విజయాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. లబ్ధిదారులకు కేంద్ర పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. త్వరలో నూతన కమిటీ సమావేశ పరిచి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

ఉపాధ్యాయుల నిర్లక్ష్యం.. విద్యార్థినికి శాపం

- రెండేళ్లపాటు హాజరు వేయకపోవడంపై తల్లిదండ్రుల ఆవేదన
- స్థానిక ఎమ్మెల్యే చొరవతో దిద్దుబాటుకు యత్నం

అంబాజీపేట, న్యూస్‌టుడే: ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా ఓ విద్యార్థిని భవిష్యత్తుకు తీవ్రం నష్టం వాటిల్లింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రెండేళ్ల పాటు హాజరు వేయకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందకుండా పోవడంతో పాటు ధ్రువపత్రాలు సైతం రాని పరిస్థితి నెలకొంది. దిక్కుతోచని స్థితిలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో చివరకు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో హడావుడిగా హాజరు వేయడానికి సదరు ఉపాధ్యాయులు ప్రయత్నిస్తుండటం విచిత్రం. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కేంద్రంలోని పండువారిపేటకు చెందిన నాగవరపు ప్రసాద్, ఉమామహేశ్వరి దంపతులకు ఇద్దరు కవల ఆడపిల్లలు. నాగవరపు బెహర్ష, బెరీషాలను స్థానిక ఉన్నత పాఠశాలలో రెండేళ్ల కిందట 6వ తరగతిలో చేర్పించారు. వీరిలో బెరీషాకు ఉపాధ్యాయులు హాజరు వేయగా బెహర్షకు వేయలేదు. ప్రస్తుతం వీరు 8వ తరగతి చదువుతున్నారు. 6, 7 తరగతుల్లో రెండేళ్లకు సంబంధించి హాజరు వేయకపోవడంతో బెహర్షకు తల్లికి వందనం నగదు పడలేదు. అప్పటి నుంచి తండ్రి ప్రసాద్ ఉపాధ్యాయుల చుట్టూ తిరిగారు. సమస్యను మండల విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లారు. తల్లికి వందనం రాకపోవడంతో పాటు ధ్రువపత్రాలు లేకపోతే రానున్న రోజుల్లో తమ కుమార్తె పై చదువులకు ఇబ్బంది ఏర్పడుతుందని తండ్రి మదన పడుతున్నారు. 6, 7 తరగతులు స్థానిక పాఠశాలలో చదివినట్టుగా ధ్రువపత్రాలు ఇప్పించాలని కోరుతున్నారు. ఇదే విషయంపై ఇటీవల స్థానిక పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు వివరించడంతో ఆయన సదరు హెచ్ఎం కడలి సాయిరామ్‌ను వివరణ కోరారు. దీంతో హడావుడిగా రెండేళ్లకు సంబంధించి హాజరు ఒకేసారి వేయడానికి నిర్ణయించారు. దీనిపై పాఠశాల హెచ్ఎం కడలి సాయిరామ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆన్‌లైన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా విద్యార్థినికి హాజరుపడలేదన్నారు. 6, 7 తరగతులు ఇక్కడ చదివినట్లు ధ్రువపత్రాలు ఇస్తామన్నారు. ప్రస్తుతం ఆ బాలికకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ హాజరు వేస్తున్నామన్నారు.

కొంతమూరులో బంగారం, వెండి చోరీ

రాజానగరం, న్యూస్‌టుడే: కొంతమూరులోని ఓ ఇంట్లో బంగారం, వెండి ఆభరణాలు చోరీకి గురైన ఘటన రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ, ఎస్సై వీరయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమూరులోని భవానీపురానికి చెందిన గరిమెళ్ల పవన్‌కుమార్ (పురోహితుడు) కుటుంబంతో కలసి ఈ నెల 15న దైవదర్శనానికి శ్రీశైలం వెళ్లారు. ఆదివారం ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా పడిపోయి ఉండటాన్ని గమనించారు. పరిశీలించగా లాకరులో ఉన్న 140 గ్రాముల బంగారం, మూడున్నర కిలోల వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. దీంతో రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో పవన్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఉత్తర మండల డీఎస్పీ వై.శ్రీకాంత్, అదనపు ఎస్పీ సుబ్బరాజు, సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ, సీఐ

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ.లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)	23,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ.లలో

ఫారంరేటు	112-00
రిటైల్ లైవ్	134-00
డ్రెస్డ్	194-00
స్కిన్‌లెస్	221-00

వివాహిత హత్య కేసు విచారణ వేగవంతం చేయండి

- డీజీపీకి జాతీయ మహిళా కమిషన్ ఆదేశం
- రాజోలు ఘటనపై సుమోటోగా స్వీకరణ

రాజోలు, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం బి.సావరం గ్రామంలో ఈ నెల 16న జరిగిన వివాహిత ఓలేటి పుష్ప దారుణ హత్య కేసును జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది. నిందితుడిని తక్షణం అరెస్ట్ చేసి విచారణ వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీని కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ ఆదివారం ఆదేశించారు. బీఎన్ఎస్ చట్టం 2023 ప్రకారం కేసు విచారణ చేపట్టాలని కోరారు. మృతురాలిని ఆమె ప్రియుడు షేక్‌షమ్మా వ్యభిచారం చేయాలని ఒత్తిడి తీసుకువచ్చి కిరాతకంగా హత్య చేశాడు. ఇప్పటికే రాజోలు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

'ఫ్లెక్సీలు చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి'

దేవీచౌక్: కొవ్వూరు మండలం పశివేదలలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్ ఫ్లెక్సీలను కొంతమంది చింపి, వాటి స్థానంలో కొత్తవి పెట్టడం దారుణమని మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుమర్తి చిన్నమాదిగ ఆరోపించారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీకి రాసిన బహిరంగ లేఖ ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజ్యాంగ బద్ధమైన పదవిని నిర్వహిస్తున్న వ్యక్తిని అగౌరవపరచడం తగదన్నారు. ఈనెల 23లోగా బాధ్యులను గుర్తించి అరెస్టు చేయకపోతే 24న ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. దళితులు, కూటమి పార్టీకి మధ్య దూరం సృష్టించాలని చూసేవారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. గత ఎన్నికల్లో తామంతా తెదేపా విజయం కోసం పనిచేశామన్నారు. సమావేశంలో బోయినపల్లి సుందరయ్య, కాకినాడ జిల్లా తెదేపా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి దారా ఏసురత్నం, పెనుమాక సురేష్, డాక్టర్ ఖండవిల్లి లక్ష్మి తదితరులు మాట్లాడారు.

మాట్లాడుతున్న మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుమర్తి చిన్న

మనస్తాపంతోనే వెళ్లిపోయా..

- పోలీసులకు ఏఈఈ కిశోర్ వాంగ్మూలం
- క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగింత

తిరువూరు, న్యూస్‌టుడే: 'బదిలీ జరిగి నెల దాటినా, రిలీవ్ చేయకపోవడంతో మనస్తాపానికి గురై తిరువూరు నుంచి విశాఖపట్నం వెళ్లి, అక్కడి నుంచి రాజమహేంద్రవరం వచ్చాను' అంటూ.. జలవనరుల శాఖ తిరువూరు ఏఈఈ వి.కిశోర్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ శుక్రవారం లేఖ రాసి, అధికారుల గ్రూపులో పోస్టుచేసి అదృశ్యమైన ఏఈఈని ఆదివారం ఉదయం రాజమహేంద్రవరంలో పోలీసులు పట్టుకున్నారు. దాంతో రెండ్రోజుల ఉత్కంఠకు తెరపడగా, క్షేమంగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరు తీసుకొచ్చి అతని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం తిరువూరులోని కార్యాలయం నుంచి ఖమ్మం జిల్లా బంజరు చేరుకున్న అతను, బస్సులో రాజమహేంద్రవరం చేరుకున్నాడు. అక్కడ నగదు డ్రా చేసి రాత్రికి ప్రయివేటు వాహనంలో విశాఖపట్నం వెళ్లాడు. రాత్రి సమయంలో అతని ఫోన్ ఆన్ కావడం..వెంటనే ఆగిపోవడంతో విశాఖపట్నంలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, అతని కుటుంబ సభ్యులతో కలిసి బయలుదేరి వెళ్లారు. తీరా విశాఖపట్నం వెళ్లాక, శనివారం రాత్రి రాజమహేంద్రవరంలో ఫోన్ ఆన్ అయినట్లు సిగ్నల్స్ రాగా వారు కూడా అక్కడికి చేరుకున్నారు. అయినా మళ్లీ ఫోన్ ఆగిపోవడంతో రాత్రంతా అక్కడే ఉండిపోయారు. ఈ లోగా ఫోన్ కలిసే వరకు అందుబాటులో ఉండాలని ఏఈఈ కుటుంబ సభ్యులకు పోలీసులు సూచించారు. చివరికి ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో ఫోన్ కలవడంతో, సాంకేతిక సాయంతో అతను గోదావరి ఒడ్డున పుష్కరఘాట్ వద్ద ఉన్నట్లు నిర్ధరించుకుని, భార్యతో ఫోన్ మాట్లాడమని సూచించారు. ఈ లోగా నేరుగా అక్కడకు వెళ్లి కిశోర్‌ను పట్టుకున్నారు. అక్కడ అల్పాహారం అనంతరం మధ్యాహ్నం 12 గంటలకల్లా తిరువూరు స్టేషన్‌కు తీసుకొచ్చి, వాంగ్మూలం నమోదు చేసుకుని కుటుంబసభ్యులకు అప్పగించారు.

బస్టాండ్‌లో బస: శుక్రవారం రాత్రి ప్రయాణంలో ఉన్న అతడు శనివారం రాత్రికి రాజమహేంద్రవరం చేరుకుని, బస్టాండ్ ప్రాంగణంలో గది తీసుకుని అక్కడే ఉన్నట్లు పోలీసులకు వివరించాడు. ఈ లోగా తనను రిలీవ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలివ్వడం, పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైనట్లు తెలుసుకుని తిరిగి రావడానికి సిద్ధమైనట్లు పేర్కొన్నారు.

రాజమహేంద్రవరంలో పోలీసుల సంరక్షణలో వి.కిశోర్

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

GK గోల్డ్‌లోన్ బ్యాంకు / ప్రైవేటు తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి [illegible] 8897731257.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No.1) VJA [illegible] ☎ 96038 42233, 97064 72233.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

రాజమండ్రి 30 కి.మీ. [illegible] ☎ 90329 88265.

PLOT FOR SALE

GENERAL

122.44/ 125.66/ 139/ 143.11/ 173.94 Sq. [illegible] ☎ 83090 25067.

అమలాపురం, ఈదరపల్లి [illegible] సెల్: 98664 97645.

TO LET

COMMERCIAL

JOBS

పెద్దాపురం ప్రముఖుల ఇంట్లో వంట చేయుటకు బ్రాహ్మణ వంట మనిషి కావలెను. సంప్రదించండి సెల్: 94941 54551.

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 73375 44439, 90146 51068, 70756 33416.

[illegible]

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

(c) eenadu

రాజమహేంద్రవరం

డిగ్రీలోనూ ఏఐ.. డేటాసైన్స్

కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్

దేవీచౌక్, న్యూస్‌టుడే: ఇంటర్ ఉత్తీర్ణులయిన ప్రతిఒక్కరూ ఇంజినీరింగ్ విద్యే లక్ష్యంగా ఆలోచిస్తారు. అందులో సీటు రాకపోతే వారు, వారి తల్లిదండ్రులు తీవ్ర మనస్తాపానికి గురవుతారు. ఇప్పుడు డిగ్రీ విద్యలో కూడా ఇంజినీరింగ్‌తో సమానమైన కోర్సులు ఉన్నాయి. అవి చదివి అదే స్థాయిలో ఉద్యోగాలు సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏఐ, డేటా సైన్స్ వంటి కంప్యూటర్ కోర్సులు రెండేళ్ల క్రితమే అందుబాటులోకి వచ్చాయి. ఇందులో డేటా సైన్స్ మైనర్ సబ్జెక్టుగా ఉంది. తాజాగా వీటి ప్రాధాన్యం పెరగడంతో పాటు డిమాండ్ కూడా పెరిగింది.

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో..

కళాశాలలో మొత్తం అయిదు కంప్యూటర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో సీట్లు

కోర్సు	సంఖ్య
బీఎస్సీ కంప్యూటర్స్	60
బీఎస్సీ ఏఐ	40
బీఎస్సీ స్టాటస్టిక్స్, డాటా సైన్స్	60
జియాలజీ కంప్యూటర్ అప్లికేషన్స్	60
బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్	120

ఒక్కో కోర్సులో 40 నుంచి 120 సీట్లు ఉన్నాయి. మొదట విడత కౌన్సెలింగ్‌లోనే సీట్లన్నీ భర్తీ అయిపోతున్నాయి. ఈ విద్యార్థుల కోసం వివిధ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని కార్యశాలలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ కంప్యూటర్ కోర్సు పూర్తి చేసిన చాలమంది విద్యార్థులు టీసీఎస్, విప్రో, గూగుల్, అడోబ్, క్యాప్ జెమినీ వంటి ప్రసిద్ధ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయని అధ్యాపకులు చెబుతున్నారు. ఏఐ, డేటా సైన్స్ విద్యార్థులు ప్రస్తుతం ద్వితీయ సంవత్సరంలో ఉన్నారు. ప్రస్తుతం డిగ్రీలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. కళాశాలలో ఆధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు, జేకేసీ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. పలు సంస్థలు ప్రాంగణ నియామకాలు కూడా నిర్వహిస్తున్నారు. డిగ్రీ తర్వాత ఉద్యోగం రాకపోతే విద్యార్థులు పీజీ, ఎంసీఏ వంటి ఉన్నత కోర్సులకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్‌లో సీటు రాని విద్యార్థులు నిరాశ చెందకుండా ఏఐ, డేటాసైన్స్ వంటి కోర్సుల్లో చేరాలని అధ్యాపకులు సూచిస్తున్నారు.

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్, న్యూస్‌టుడే: టమాట-24, వంకాయలు నలుపు-26/ గులాబీ-28/ తెలుపు-28/ దొమ్మేరు-38, బెండ-17, బీర పందిరి-20, దొండ-20, క్యారెట్-32, బీట్‌రూట్-30, గోరుచిక్కుళ్లు-36, దోస-16, ఆనబకాయ-15, చిక్కుళ్లు-88, పచ్చిమిర్చి-66, బంగాళదుంపలు-20, ఉల్లిపాయలు-22.

గడుల ఆటలో ఘనులు

చదరంగం ఆడుతున్న క్రీడాకారులు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: 64 గడుల చదరంగం క్రీడలో నగరానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తున్నారు. ఒకప్పుడు స్థానికంగా సరదాగా ఆడేవారు. ఆటకు పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నారు. ఫిడే రేటింగ్‌లు సాధించి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు.

అన్నయ్యను చూసి..

నా పేరు **జమ్మలమడక కార్తీక్.** అన్నయ్యను చూసి ఆటపై ఇష్టం ఏర్పడి తనతో పాటు అకాడమీకి వెళ్లాను. రెండేళ్లుగా నేర్చుకుంటున్నా. పదేళ్ల వయసులోనే ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్‌లో 1550 ర్యాంకు సాధించాను. అండర్-11 జిల్లా ఛాంపియన్‌గా నిలవడంతో పాటు విజయవాడలో జరిగిన రేటింగ్ టోర్నమెంట్‌లో ప్రథమస్థానంలో నిలిచాను.

రెండుసార్లు జిల్లా ఛాంపియన్‌గా..

నా పేరు **కాజా నందన ఉషశ్రీ కార్తీక.** మూడేళ్లుగా చదరంగం సాధన చేస్తున్నాను. అండర్-11 విభాగంలో రెండుసార్లు జిల్లా ఛాంపియన్‌గా నిలిచాను. గతేడాది జూన్‌లో విడుదల చేసిన ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ 1425 సాధించాను. జాతీయస్థాయిలో ఉత్తమ చదరంగం క్రీడాకారిణిగా రాణించాలన్నదే నా ఆశయం.

తాతయ్య స్ఫూర్తితో..

నా పేరు **జమ్మలమడక శ్రీనికేష్.** తాతయ్య, తల్లి ప్రోత్సాహంతో చదరంగంపై ఆసక్తి పెరిగింది. రాష్ట్రంలో అండర్-13 ఛాంపియన్‌గా నిలిచాను. రెండున్నరేళ్లుగా సాధన చేస్తున్నా. ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్‌లో 1500 ర్యాంకు సాధించాను. అమలాపురంలో జరిగిన అండర్-13లో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచాను. భవిష్యత్‌లో గ్రాండ్‌మాస్టర్ కావాలన్నదే నా లక్ష్యం.

గ్రాండ్‌మాస్టర్ కావాలన్నదే నా లక్ష్యం

నా పేరు **వి.షణ్ముఖ సాయి.** నాన్న ప్రోత్సాహంతోనే నేర్చుకోవడం మొదలుపెట్టాను. ప్రస్తుతం పదోతరగతి చదువుతున్నా. ఇప్పటికి పదిసార్లు స్టేట్ ఛాంపియన్ షిప్‌లు సాధించాను. 2016 నుంచి 18 వరకు మూడుసార్లు దిల్లీలో జరిగిన కామన్‌వెల్త్ చదరంగం టోర్నమెంట్‌లో పాల్గొన్నా. నేను మరిన్ని టోర్నమెంట్‌లు ఆడి గ్రాండ్‌మాస్టర్ కావాలన్నది నా లక్ష్యం.

ఎంసీసీ ప్రాంగణంలో ఉద్యోగమేళా నేడు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం తాడితోట వద్ద ఉన్న మోడల్ కేరీర్ సెంటర్ (ఎంసీసీ) ప్రాంగణంలో ఈనెల 21న ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. పాటిల్ గ్రూప్, శివానికే టెక్, ఎస్ఎస్ఆర్‌టీఎల్ కంపెనీల ప్రతినిధులు హాజరై పలు ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని శనివారం జిల్లా ఉపాధి అధికారి హరీష్‌చంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబరులో సంప్రదించాలన్నారు.

రాజ్యలక్ష్మి కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు ఆహ్వానం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి ఏడాది ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపల్ రాఘవ కుమారి తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాలలో బీఏ పొలిటికల్ సైన్స్, స్పెషల్ ఇంగ్లీష్, ఎకనామిక్స్, స్పెషల్ తెలుగు, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ జువాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన వారు వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

వెంకన్న ఆలయంలో అన్నదానానికి విరాళం

ఆత్రేయపురం న్యూస్‌టుడే: వాడపల్లి వెంకన్న క్షేత్రంలో అన్నదానం నిమిత్తం రాజమహేంద్రవరానికి చెందిన కుడప వెంకటప్రద్యుమ్న కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళాన్ని ఆదివారం అందించారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

మహిళలకు గోరింటాకు పోటీలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణ మహిళ ఆధ్వర్యంలో గోరింటాకు పోటీలు నిర్వహించారు. ఆదివారం సరస్వతీఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు వందమందికి పైగా మహిళలు ఉత్సాహంగా పాల్గొని చేతులపై అందమైన డిజైన్లను అలంకరించి ప్రదర్శించారు. రాజమహేంద్రవరానికి చెందిన అల్లపల్లి భావన ప్రథమ, కె.పద్మిని ద్వితీయ, శ్రీరమ్య తృతీయ స్థానాల్లో నిలిచారు. పదిమందికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. ముదునూరు వాణిశ్రీ, పోతుల గీతావరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అత్తి అనురాధాదేవి, తోట సుబ్బారావు, కె.సూర్యకుమారి, మాదిరాజు శ్రీనివాస్, దూర్వాసుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకులకు పురస్కారాలు

గుబ్బల రాంబాబును సత్కరిస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ తదితరులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: సమాజ హితానికి పాటుపడుతున్న సేవకులను ఒకే వేదికపై సత్కరించడం అభినందనీయమని నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఎస్.ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో వేడుక నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీసీ హాజరై మాట్లాడారు. విద్యావంతుల నిర్వహణలో రాజమహేంద్రి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేద విద్యార్థులకు ఆర్థికసాయం అందించడం, గ్రంథాలయాల్లో పుస్తకాలు సమకూర్చడం తదితర సేవలందిస్తున్న ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమన్నారు. నగరానికి చెందిన స్వర్ణాంధ్రా సేవాసంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు, వాకర్స్ యోగా, లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, వ్యాపారి పి.వెంకట హరినాథ్, జనవిజ్ఞానవేదిక ప్రతినిధి ఎం.మల్లికార్జునరావు, ఉత్తమ ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్న పలువురికి మహోపాధ్యాయ పురస్కారాలు అందించారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ చల్లా శంకర్రావు, ఇన్నీస్‌పేట కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు చేతుల మీదుగా పురస్కార గ్రహీతలను సత్కరించారు. ట్రస్ట్ ప్రతినిధులు పర్యవేక్షించారు.

అష్టదేవతల దర్శనానికి భక్తుల పయనం

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి 'ఆషాఢం దేవి దర్శనం' పేరిట ఆదివారం ఏర్పాటు చేసిన రెండు ప్రత్యేక యాత్ర బస్సుల్లో వందమంది భక్తులు బయలుదేరి వెళ్లారు. ఒకరోజు యాత్రలో భాగంగా ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎనిమిది క్షేత్రాల్లో అష్టదేవలను భక్తులు దర్శించుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను ఆర్టీసీ డీఎం కె.మాధవ్ ప్రారంభించారు. ఉదయం 5 గంటలకు బయలుదేరిన వీరు చింతలూరులో నూకాలమ్మ, మట్లపాలెంలో మహాలక్ష్మి, కాకినాడలో వారాహి, పిఠాపురంలో పురుహూతిక, తాటిపర్తిలో అపర్ణాదేవి, పెద్దాపురంలో మరిడమ్మ, కాండ్రకోటలో నూకాలమ్మ, కడియపులంకలో ముసలమ్మతల్లి అమ్మవార్ల దర్శనం అనంతరం తిరిగి రాత్రి 8 గంటలకు డిపోనకు చేరాయని డీఎం తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్) అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజినీర్ నాయుడు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో బయలుదేరిన భక్తులు

అమ్మవారికి ఆషాఢం సారె

రాజమహేంద్రవరం గ్రామీణ మండలంలోని తొర్రేడు ఓనువులమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి గ్రామస్థులు ఆషాఢం సారె సమర్పించారు. 150 రకాల మిఠాయిలు, పండ్లు తదితర సారెతో గరగ నృత్యాల నడుమ అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం సారెను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, కంబాలచెరువు(తొర్రేడు)

సిద్ధివినాయకుడికి బంగారు నామం

అయినవిల్లి: అయినవిల్లి సిద్ధివినాయక స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన ట్రస్ట్‌కు ఆదివారం విశాఖపట్టణానికి చెందిన వరద కమలాకర్, అపర్ణ దంపతులు రూ.1,00,000 విరాళం అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన దుద్దిపూడి నాగవెంకటవరప్రసాద్ 5.650 గ్రాములతో తయారు చేయించిన బంగారు నామం సమర్పించారు. వీరికి అర్చకుడు వినాయక రావు స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాలు అందజేశారు.

శాకంబరిగా బాపనమ్మతల్లి

రంపచోడవరం: ఆషాఢమాసం సందర్భంగా రంపచోడవరం మండలంలోని సీతపల్లిలో గడి బాపనమ్మతల్లిని ఆదివారం శాకంబరిదేవిగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మైదాన, మన్యం ప్రాంతాలకు చెందిన వేలసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు అమ్మవారిని దర్శించుకొన్నారు.

వృథాకు అడ్డుకట్ట

స్పందనకు వందనం

స్థానిక ఐ.ఎల్.టి.డి రైతుబజారు ప్రాంతంలో తాగునీటి కుళాయి దెబ్బతిని నీరు వృథా అవుతుంది. దీనిపై గతనెల 17న 'ఈనాడు'లో 'నీరు వృథా..తీరని వ్యథ' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేయించారు. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

స్తంభం.. పడితే ప్రమాదం

నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలు సరైన నిర్వహణ, రక్షణ చర్యలు లేకుండా ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల ఒరిగిపోయి ఉన్నాయి. ఐ.ఎల్.టి.డి రోడ్డులో ఇటీవల ఓ వాహనం స్తంభాన్ని ఢీకొనడంతో ఒరిగిపోయింది. ప్రమాదం జరగకముందే సంబంధిత శాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

దారంతా చీకటి..

రైల్వేస్టేషన్, కోటిపల్లి బస్టాండ్, రోడ్డు కమ్ రైలు వంతెనకు వెళ్లే ప్రధాన రహదారిలో, వీటీ కళాశాల రోడ్డులో వీధి దీపాలు సరిగా వెలగట్లేదు. రాత్రి సమయాల్లో రైల్వేస్టేషన్‌కు వెళ్లే వారికి ఇబ్బందులు తప్పట్లేదు. మరోవైపు రహదారి మధ్యలో విద్యుత్తు స్తంభాలు ఉన్నాయి. రాకపోకలకు సమస్యలు ఎదురవుతున్నాయి. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

కాలువంతా ప్లాస్టిక్ వ్యర్థాలు

నగరంలో కొన్ని ప్రాంతాల్లో చెత్త నేరుగా కాలువలో పడేస్తున్నారు. మురుగు ముందుకు ప్రవహించక వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. పలు ప్రాంతాల్లోని కాలువలను కలిపే మేజర్ డ్రెయిన్ 27వ వార్డులో ఉంది. దీని నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

ఆన్‌లైన్ సేవలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి

కార్మికులకు అండగా ప్రభుత్వం

టి.నగర్, న్యూస్‌టుడే: కార్మికుల సంక్షేమానికి తెదేపా కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో టీఎన్టీయూసీకి అనుబంధంగా ఏర్పాటు చేసిన ది రాజమహేంద్రవరం ఆన్‌లైన్ ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రారంభ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. తెదేపా కార్మిక పక్షపాతి అని, కార్మికులకు అండగా నిలుస్తుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కార్మికులకు మరింత ఆదాయం పెరిగేందుకు దోహదపడేలా యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు. గత పాలనలో రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లు వేసిందన్నారు. కూటమి రాగానే బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లను అరికట్టిందన్నారు. కుడిపూడి సత్తిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, ఇప్పటి పాలనకు తేడాలను గ్రహించాలన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి కృషి చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో యర్రా వేణుగోపాలరాయుడు, నల్లం శ్రీనివాస్, ఉప్పులూరి జానకి రామయ్య, బుడ్డిగ రాధా, చాపల చినరాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

కడియం, న్యూస్‌టుడే: చెడు వ్యసనాలకు బానిసలై, జల్సాలకు అలవాటు పడి గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముఠాను కడియం పోలీసులు పట్టుకున్నారు. కడియం సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాలతో కడియం ఎస్సై బి.నాగదుర్గాప్రసాద్ తన సిబ్బందితో కలిసి కడియం మండలం కడియపులంకలో అయిదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15వేలు విలువైన మూడున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి ధవళేశ్వరం, రాజానగరం, రాజవొమ్మంగి, గండేపల్లి, తణుకు, బొమ్మూరు పోలీసుస్టేషన్ల పరిధిలో చోరీకి గురైన ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఏజెన్సీ పరిధిలోని కేడీ పేట నుంచి గంజాయిని తీసుకొచ్చి ఈ ప్రాంతాల్లో చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్రణాళికతో సాధించి.. స్వచ్ఛతలో పురోగతి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: స్వచ్ఛ రాజమహేంద్రవరం సాధనకు ప్రణాళిక ప్రకారం చర్యలు చేపడుతున్నట్లు పారిశుద్ధ్య విభాగం హెల్త్ అసిస్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్, శానిటరీ ఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో జాతీయ స్థాయిలో 19వ ర్యాంకు సాధించడంపై ఆదివారం వారు స్పందించారు. కొన్నేళ్లుగా వచ్చిన ర్యాంకులను దృష్టిలో పెట్టుకొని ఈసారి మొదటి 20లో సాధించాలనే పట్టుదలతో పనిచేసినట్లు చెప్పారు. స్వచ్ఛ భారత్ సర్వేలో నగరవాసులు అనేక మంది పాల్గొని ఆన్‌లైన్ ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేయడంతోనే ఉత్తమ ర్యాంకు సాధించేందుకు ప్రధాన కారణంగా నిలిచిందన్నారు. రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. నగరపాలక సంస్థ ర్యాంకు సాధించడానికి తోడ్పడిన అంశాలను, స్వచ్ఛ సర్వేక్షణ్ కమిటీ నివేదికను వివరించారిలా..

నగరంలో పారిశుద్ధ్య పనులు

ర్యాంకు సాధించామిలా.. ప్రతి క్లస్టర్‌కు పారిశుద్ధ్య పర్యవేక్షకులను నియమించడం. ★ ఉదయం చెత్త సేకరణ, మధ్యాహ్నం వీధుల శుభ్రతపై దృష్టి సారించడం. ★ ఇంటింటా చెత్తసేకరణలో 90 శాతం చేయడం. ★ రోజుకు 160 మెట్రిక్ టన్నుల చెత్త సేకరించి, రీ-సైక్లింగ్ చేయడం, సేంద్రియ ఎరువుల తయారీ నిర్వహణపై ఆరోగ్య విభాగం దృష్టి సారించడం. ★ ప్లాస్టిక్ నిషేధానికి తనిఖీలు, వినియోగిస్తే అపరాధ రుసుం విధించడం.★ పుష్కరాల నాటికి పూర్తిస్థాయిలో తగ్గించడం. ★ రోడ్ల పరిశుభ్రతకు నూతనంగా వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. ★ వీధులు శుభ్రం చేసేందుకు రూ.20 లక్షల విలువైన వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు.

మాట్లాడుతున్న రమేష్, శ్రీనివాస్

సంక్షేమ పథకాలపై కళాజాత

రాజమహేంద్రవరం సాంస్కృతికం: వయోవృద్ధుల సంక్షేమంపై కళాజాత ప్రదర్శనల ద్వారా ఆదివారం అవగాహన కల్పించారు. రైల్వేస్టేషన్ ప్రాంగణం, పుష్కరఘాట్ వద్ద ప్రదర్శనలు ఇచ్చారు. ఆసుపత్రుల్లో వయోవృద్ధులకు సౌకర్యాలు, కన్నబిడ్డలు పట్టించుకోకపోతే ట్రైబ్యునల్ ద్వారా అందించే భరణం తదితర చట్టాలపై వివరించారు. విభూది ఉమాశంకర్ ఆధునిక వీధినాటిక బృందం పాల్గొంది. వివిధ ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 83282 39927, 80089 02897

సమస్య: స్థానిక కోటిలింగాలపేటలో పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కొళాయి నుంచి సన్నధారగా నీళ్లు వస్తుండటంతోపాటు కొన్నిసార్లు అవి ఎరుపు రంగులో వస్తున్నాయి. తాగలేని పరిస్థితి. ఇక్కడి తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కోటేశ్వరరావు, స్థానికుడు

సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– వాటర్‌వర్క్సు అధికారి, ఆర్ఎంసీ

స్పందనకు వందనం

స్థానిక ఇన్నీసుపేట పచ్చమట్లవారి వీధిలో వీధిదీపాల సమస్యపై 'మేమున్నాం.. మీకుతోడుగా'కు అందిన ఫిర్యాదును నగరపాలక సంస్థ ఎలక్ట్రికల్ విభాగం ఏఈ విమల దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సంబంధిత విభాగం సిబ్బంది ఇక్కడి వీధిదీపాలకు మరమ్మతులు చేశారు. సమస్య పరిష్కారమైనట్లు ఫిర్యాదుదారుడు దుర్గాదివాకర్ తెలిపారు. - న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

చదరంగంలో చిచ్చర పిడుగులు

విజేతలతో ముఖ్య అతిథులు, నిర్వాహకులు

లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ప్రపంచ చదరంగ దినోత్సవం సందర్భంగా కాల్ ఫ్యూజన్ చెస్ అకాడమీలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. 125 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారని క్లబ్ అధ్యక్షుడు మైలవరపు కిరణ్ కుమార్ తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన లయన్స్ పూర్వపు గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల్లో విద్యతోపాటు చదరంగం నేర్చుకోవడం ద్వారా మెదడు చురుకుగా పని చేస్తుందన్నారు. మద్దుల శ్రీరామగుప్తా మాట్లాడుతూ చదరంగం ఇక్కడే పుట్టి, ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి చెందిందన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. లక్ష్మీ వసంత కుమారి, కె.బుచ్చిరాజు, ఎం.వి.ఎన్.మాధవరావు, వి.రాఘవరావు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం, శ్యామలాసెంటర్

యువత శ్రమదానం.. స్వచ్ఛ సంకల్పం

ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు ఆదివారం ఉదయం స్వచ్ఛభారత్ నిర్వహించారు. కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని ఎమ్మార్వో కార్యాలయ ఆవరణలో పేరుకున్న చెత్త, గడ్డి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిన రాజమహేంద్రవరం నగరం రాబోయే రోజుల్లో మొదటి స్థానంలో నిలవాలని కోరుతూ వాలంటీర్లు శ్రమదానం చేశారు. ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఆదిత్య ఎన్ఎస్ఎస్ అధికారులు జి.వి.ఎస్.నాగేశ్వరరావు, బి.రమాదేవి, పోలుకొండ సాయి, ఆకుల శిరీష, కె.మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆదివారం రాత్రి 11 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. చింతూరుకు చెందిన దివ్యాంగుడు సాయికుమార్ తన మూడుచక్రాల వాహనంపై ఆర్ట్స్ కళాశాల వద్ద రోడ్డు దాటుతుండగా లాలాచెరువు నుంచి కంబాలచెరువు వైపునకు ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు యువకులు ఢీకొన్నారు. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. మూడుచక్రాల బైక్‌పై వస్తున్న దివ్యాంగుడికి కాలు ఎముక విరిగింది. వేరే కేసు నిమిత్తం అటుగా వెళ్తున్న 108 వాహనంలో వీరిని రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

ఆధ్యాత్మికతపై అవగాహన

రంగంపేట: బాల్యం నుంచి ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని బాలవికాస్ గురువు పప్పు దేవి అన్నారు. వీరంపాలెం లోని కోదండ రామాలయంలో ఆధ్యాత్మిక అంశాలపై బాలవికాస్ తరగతులు జరిగాయి. ఆధ్యాత్మికతపై ఏవిధంగా అవగాహన చేసుకోవాలనే దానిపై మరో గురువు టి.హైమావతి వివరించారు.

సంక్షేమ పథకాలపై కళాజాత

రాజమహేంద్రవరం సాంస్కృతికం: వయోవృద్ధుల సంక్షేమంపై కళాజాత ప్రదర్శనల ద్వారా ఆదివారం అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ ప్రాంగణం, పుష్కరఘాట్ వద్ద జరిగిన ప్రదర్శనలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వయోవృద్ధులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, కన్నబిడ్డలు పట్టించుకోకపోతే ట్రిబ్యునల్ ద్వారా ప్రతి నెలా అందించే భరణం తదితర చట్టాలపై వివరించారు.

ఎంసీసీ ప్రాంగణంలో ఉద్యోగమేళా నేడు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం తాడితోట వద్ద ఉన్న మోడల్ కేరీర్ సెంటర్ (ఎంసీసీ) ప్రాంగణంలో ఈనెల 21న ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. పాటిల్ గ్రూప్, శివానికే టెక్, ఎస్ఎస్ఆర్‌టీఎల్ కంపెనీల ప్రతినిధులు హాజరై పలు ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని శనివారం జిల్లా ఉపాధి అధికారి హరీష్‌చంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబరులో సంప్రదించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 79939 35706

పూడిక తీశారు..

బొమ్మూరు కాళీకృష్ణనగర్‌లో కాలువ పూడికలతో నిండిపోయింది. మూడు రోజుల నుంచి దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గ్రామ కార్యదర్శి కాశీ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి పూడికలు తీయించారు. సమస్య పరిష్కారమవ్వడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

స్పందనకు వందనం

వెలగని వీధి దీపం

సమస్య: రాజవోలు పంచాయతీ వీధి మలుపులో, రాజవోలు రోడ్డులో వీధి దీపాలు వెలగట్లేదు. రాత్రిపూట ఇబ్బందిగా ఉంది.

– కరుణ, స్థానికుడు

సమాధానం: మరమ్మతులు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి, బొమ్మూరు

- న్యూస్‌టుడే, బొమ్మూరు

క్రీడా మైదానం.. అభివృద్ధి శూన్యం

కొంతమూరు (సీతానగరం), న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడామైదానాలను ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల అందుకు తగ్గ వసతుల్లేక విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. క్రీడామైదానాలు అభివృద్ధి చెందితే విద్యార్థులు క్రీడల్లో రాణించే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

సీతానగరం క్రీడావికాస కేంద్రం

నిబంధనలు ఇలా..

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలు ఆడుకోవడానికి విధిగా ఆటస్థలాలు ఉండాలి. ప్రాథమిక పాఠశాలలకు 1.5 ఎకరాలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు రెండు ఎకరాలు, ఉన్నత పాఠశాలలకు నాలుగు ఎకరాల్లో ఆటస్థలాలు ఉండాలి. 80 శాతానికి పైగా పాఠశాలల్లో ఆట స్థలాలు లేకుండా పోయాయి. మిగతా చోట్ల అరకొరగా ఉన్నా అధ్వానంగా తయారయ్యాయి. కొన్ని మైదానాల్లో తుప్పలు పెరిగి విషసర్పాలు తిరుగుతున్నాయి. పాఠశాల, మండల స్థాయిల్లో నిర్వహించే క్రీడలకు మైదానాలు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. క్రీడా మైదానం ఉన్నచోట మండలం లోని అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులను తీసుకెళ్లి పోటీలు నిర్వహించే పరిస్థితులు ఉన్నాయి.

డివిజన్ పరిధిలో పరిశీలిస్తే..

డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో సుమారు 100 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మూడొంతుల పాఠశాలలు క్రీడలకు దూరమయ్యాయి. వంగలపూడి, చిన కొండేపూడి, బొబ్బిల్లంక తదితర చోట్ల క్రీడా మైదానాల్లో భవనాలు కట్టేశారు. ● సీతానగరంలోని పువ్వాడ సత్యమాంబ స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారు 400 మంది బాలబాలికలు ఉన్నారు. సుమారు రూ.2.50 కోట్లతో నిర్మాణం చేపట్టిన క్రీడావికాస కేంద్రం గత ప్రభుత్వ హయాంలో అసంపూర్ణంగా నిలిచిపోయింది. ఎంతోమంది క్రీడాకారులు ఈ మైదానంలో ఆటలాడి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపికయ్యారు. ప్రస్తుతం మైదానం తుప్పలతో అధ్వానంగా మారింది.

నియోజకవర్గం	పాఠశాలలు	ఆట స్థలాలు	
		ఉన్నవి	లేనివి
రాజానగరం	173	23	150
రాజమహేంద్రవరం గ్రామీణం	107	28	79
అనపర్తి	144	31	113
గోకవరం (మండలం)	51	12	39

తొర్రేడు ఉన్నత పాఠశాలలో..

చర్యలు తీసుకుంటాం..

ఉన్నత పాఠశాలల్లో క్రీడామైదానాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. క్రీడాపోటీల్లో ప్రస్తుత పరిస్థితులపై ప్రధానోపాధ్యాయుల నుంచి నివేదికలు తీసుకున్నాం. ఉపాధి నిధులతో ఆట స్థలాలను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కె.వాసుదేవరావు, జిల్లా విద్యాశాఖాధికారి

గ్రామదేవతలకు సారె

సీతానగరం, న్యూస్‌టుడే: ఆషాఢంలో గ్రామ దేవతలకు సారె పెట్టేందుకు మహిళలు పెద్ద ఎత్తున పోటెత్తారు. మండలంలోని చినకొండేపూడిలో వేంచేసి ఉన్న వెదుళ్లమ్మ తల్లికి ఆదివారం కోలాటం, గరగ నృత్యాల ప్రదర్శనతో మహిళలు సారె సమర్పించారు. రాజానగరం ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు. తొర్రేడులో ఒనువులమ్మతల్లికి విశేష పూజలు చేశారు.

తొర్రేడులో ఒనువులమ్మ

కనకదుర్గ అమ్మవారికి..

కోరుకొండ: మండలంలోని మధురపూడి గ్రామంలో కనకదుర్గ అమ్మవారికి ఆదివారం భక్తులు సారె సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆడపడుచులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దుర్గేష్‌ను సత్కరిస్తున్న వాసవి ఇంటర్నేషనల్ క్లబ్స్

వైశ్యుల సేవాభావం స్ఫూర్తిదాయకం

రాజానగరం, న్యూస్‌టుడే: సమాజంలో వారి వల బలహీనవర్గాల అభ్యున్నతికి పాటు పడుతూ మిగతా కులాల అభివృద్ధికి కృషి చేస్తున్న వైశ్యుల సేవాభావం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు కొనియాడారు. ఆదివారం దివాన్‌చెరువులో కార్యనిర్వాహక అధ్యక్షుడు సాయి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ అర్ధ సంవత్సర సమీక్షా సమావేశం (మెడికాన్)లో ముఖ్యఅతిథిగా మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ వాసవీ క్లబ్స్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వైశ్యులు రాజకీయంగా మరింత గుర్తింపు పొందేలా కృషి చేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ గతంలో తెదేపా తరఫున గంధి లలితను డిప్యూటీ మేయర్‌గా చేశామని భవిష్యత్తులో కూడా అలాంటి అవకాశాలు పార్టీ కల్పిస్తుందన్నారు. ప్రతి వైశ్యుడు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారని ఏపీ ఐఐసీ మాజీ ఛైర్మన్ శివరామసుబ్రహ్మణ్యం అన్నారు. అతిథులను వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎరుకుళ్ల రామకృష్ణ, తదితరులు శాలువలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి గార్లపాటి శ్రీనివాస్, కోశాధికారి సుజాత, మెడికాన్ వైస్ ఛైర్మన్ కేకేవీపీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటలపై ఆసక్తి పెంచుకోవాలి

పెదపూడి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పెదపూడి మండలం మాజీ ఎంపీటీసీ తమలంపూడి శివరామారెడ్డి ఆధ్వర్యంలో జీఆర్ఎస్ఏ ఫ్యామిలీ హెల్త్ క్లబ్‌లో జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతం కంటే ప్రస్తుతం శారీరక శ్రమ లోపించడం వల్ల అనేక వ్యాధులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు అధిక ప్రోత్సాహం అందిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కూటమి నాయకులు జుత్తుక సూర్యకుమారి, గోపీ కృష్ణారెడ్డి, ఆర్. నాగు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అష్టదేవతల దర్శనానికి భక్తుల పయనం

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి 'ఆషాఢ దేవీ దర్శనం' పేరిట ఆదివారం ఏర్పాటు చేసిన రెండు ప్రత్యేక యాత్ర బస్సుల్లో వందమంది భక్తులు బయలుదేరి వెళ్లారు. ఒకరోజు యాత్రలో భాగంగా ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎనిమిది క్షేత్రాల్లో అష్టదేవతలను భక్తులు దర్శించుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను ఆర్టీసీ డీఎం కె.మాధవ్ ప్రారంభించారు. ఉదయం 5 గంటలకు బయలుదేరిన వీరు చింతలూరులో నూకాలమ్మ, ముక్కామలలో మహాలక్ష్మి, కాకినాడలో వారాహి, పిఠాపురంలో పురుహూతిక, తాటిపర్తిలో అపర్ణాదేవి, పెద్దాపురంలో మరిడమ్మ, కాండ్రకోటలో నూకాలమ్మ, కడియపులంకలో ముసలమ్మతల్లి అమ్మవార్ల దర్శనం అనంతరం తిరిగి రాత్రి 8 గంటలకు డిపోనకు చేరాయని డీఎం తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్) అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజినీర్ నాయుడు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

సీతానగరం, న్యూస్‌టుడే: లాభసాటిగా ఉండే పంటల వైపు రైతులను ప్రోత్సహించేలా, అధిక దిగుబడులతో వస్తున్న వంగడాలను వారు రాయితీపై అందుకునేలా అవగాహన కల్పించాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధికారులకు సూచించారు. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గం సీతాఫలానికి పేరు ఉండని ఇప్పుడు పొరుగు రాష్ట్రాల నుంచి సీతాఫలం తీసుకొచ్చి అమ్మే పరిస్థితులు ఎందుకొచ్చాయని ప్రశ్నించారు. రైతులు సీతాఫలం వేసే దిశగా ఉద్యానశాఖ ప్రోత్సహించకపోవడమే కారణమన్నారు. త్వరలో కలవచర్ల పారిశ్రామిక పార్కు వస్తోందని ఉద్యాన పంటలను పెంచితే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. నియోజకవర్గంలో 51 శాతం వరినాట్లు పూర్తిచేశారని, ఆగస్టు 10లోపు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిచేసేలా రైతులు ఉన్నారని ఏడీఏ మల్లికార్జునరావు వివరించారు. నియోజకవర్గంలో అత్యధికంగా 3,487 హెక్టార్ల విస్తీర్ణంలో ఆయిల్‌ఫామ్ సాగు ఉందని ఉద్యానశాఖ అధికారి పి.రిని తెలిపారు. ఈ ఏడాది 400 హెక్టార్ల లక్ష్యం ఉంటే మూడు నెలల కాలంలోనే 122 హెక్టార్ల విస్తీర్ణంలో పూర్తి చేశామన్నారు.

అశోక్‌గజపతిరాజును కలిసిన జీజీయూ ఛాన్సలర్ చైతన్యరాజు

రాజానగరం, న్యూస్‌టుడే: జీజీయూ ఛాన్సలర్ కె.వి.వి.సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్‌గజపతిరాజును విజయనగరంలోని ఆయన స్వగృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ జీజీయూ తరఫున జ్ఞాపికను అందజేశారు.

కార్యాలయం.. భయం.. భయం..

బొమ్మూరులో కార్యాలయం జిల్లా బాలల పరిరక్షణ విభాగం కార్యాలయం బయట పిచ్చిమొక్కలతో నిండిపోయింది. పాదులు పైకి పాకుతున్నా సిబ్బందికి పట్టట్లేదు. పరిసరాల్లోనే కాగితాలు, కవర్లు వేయడంతో అపరిశుభ్రంగా మారుతోంది. దీని పైభాగంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ఉంది. ఆవరణ చుట్టూ మొక్కలు పెరిగి విషకీటకాల బెడద ఎక్కువగా ఉందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులను సంప్రదించగా డీఎంహెచ్‌వో, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో శుభ్రం చేయిస్తున్నామని చెబుతున్నారు. పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, బొమ్మూరు

గుంతల రోడ్డుతో.. అవస్థలు మెండు

రాజానగరం- కలవచర్ల రహదారి అధ్వానంగా తయారై ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. సుమారు అయిదు కి.మీ రహదారి అభివృద్ధికి నోచుకోవట్లేదు. వేసవిలో దుమ్ము, ధూళి ప్రస్తుతం గుంతలలో వర్షపు నీరు చేరి ద్విచక్రవాహనదారులు అవస్థలు పడుతున్నారు. రహదారి పునర్నిర్మాణం చేయాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, రాజానగరం

గుర్రపుడెక్కతో ఇక్కట్లు..

హుకుంపేటలోని ప్రధాన మురుగు కాలువ గుర్రపుడెక్కతో నిండిపోయింది. కొన్ని నెలలుగా వాటిని తొలగించకపోవడంతో మురుగు తక్కువగా పారుతుందని స్థానికులు వాపోతున్నారు. చెత్త అందులో వేయడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని చెబుతున్నారు. మలుపు వద్ద చెత్త పేరుకుపోయి దోమల సమస్య ఎక్కువగా ఉందని అంటున్నారు. పారిశుద్ధ్య సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. దీనిపై కార్యదర్శి కాశీని సంప్రదించగా గుర్రపు డెక్క తొలగించేందుకు ఎంపీడీవోతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, బొమ్మూరు

చాగల్నాడు కాలువకు 23న గోదావరి జలాలు

ఈనాడు కథనానికి స్పందన

రాజానగరం, న్యూస్‌టుడే: చాగల్నాడు ఎత్తిపోతల పథకం ద్వారా ఈనెల 23న గోదావరి జలాలు విడుదల చేసే విధంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చర్యలు తీసుకున్నారు. 'ఎండుతున్న నారుమళ్లు, రైతుల కంట కన్నీళ్లు' శీర్షికన ఈనాడులో ప్రచురించిన కథనానికి ఆయన స్పందించి నీటిపారుదల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చాగల్నాడు ఎత్తిపోతల పథకంతో పాటు వెంకట్‌నగరం ఎత్తిపోతల పథకానికి సైతం అదేరోజు నీరు విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు.

సమాజసేవకులకు పురస్కారాలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: సమాజ హితానికి పాటుపడుతున్న సేవకులను ఒకే వేదికపై సత్కరించడం అభినందనీయమని నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఎస్.ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. రాజమహేంద్రి ఛారిటబుల్ ట్రస్ట్ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో వేడుక నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ విద్యావంతుల నిర్వహణలో రాజమహేంద్రి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేద విద్యార్థులకు ఆర్థికసాయం అందించడం, గ్రంథాలయాల్లో పుస్తకాలు సమకూర్చడం తదితర సేవలందిస్తున్న ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమన్నారు. స్వర్ణాంధ్ర సేవాసంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు, వాకర్స్ యోగా, లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, వ్యాపారి పి.వెంకట హరినాథ్, జనవిజ్ఞానవేదిక ప్రతినిధి ఎం.మల్లికార్జునరావు, ఉత్తమ ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్న పలువురికి మహోపాధ్యాయ పురస్కారాలు అందించారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ చల్లా శంకర్రావు, ఇన్నీస్‌పేట కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు చేతుల మీదుగా పురస్కార గ్రహీతలను సత్కరించారు.

గంజాయి విక్రేతల అరెస్టు

కడియం, న్యూస్‌టుడే: చెడు వ్యసనాలకు బానిసలై, జల్సాలకు అలవాటు పడి గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముఠాను కడియం పోలీసులు పట్టుకున్నారు. కడియం సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాలతో కడియం ఎస్సై బి.నాగదుర్గాప్రసాద్ తన సిబ్బందితో కలిసి కడియం మండలం కడియపులంకలో అయిదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15వేలు విలువైన మూడున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి ధవళేశ్వరం, రాజానగరం, రాజవొమ్మంగి, గండేపల్లి, తణుకు, బొమ్మూరు పోలీసుస్టేషన్ల పరిధిలో చోరీకి గురైన ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఏజెన్సీ పరిధిలోని కేడీ పేట నుంచి గంజాయిని తీసుకొచ్చి ఈ ప్రాంతాల్లో చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

అనపర్తి గ్రామీణం: చెత్త పారవేయడానికి వెళ్లిన వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును ఓ దుండగుడు చోరీ చేసిన ఘటన అనపర్తిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అనపర్తికి చెందిన కర్రి ఆదిలక్ష్మి ఇంట్లో ఉన్న చెత్త పారవేసేందుకు సమీప రైల్వేగేటు ప్రాంతానికి ఆదివారం ఉదయం వెళ్లింది. అది గమనించిన ఓ దుండగుడు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాగి పారిపోయాడు. గొలుసును కాపాడుకునే ప్రయత్నంలో సగం ఆమె చేతిలో ఉండిపోగా, మిగిలిన సగం చోరీకి గురయ్యింది. ఘటనా స్థలాన్ని ఎస్సై శ్రీను నాయక్ పరిశీలించారు. చోరీకి గురైన సొత్తు సుమారు 3 కాసులు ఉంటుందని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హరిత పన్ను తగ్గింపుపై హర్షం

అనపర్తి గ్రామీణం,న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం గ్రీన్‌టాక్స్ తగ్గించడంపట్ల లారీ యజమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామవరంలో ఆదివారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని శాలువతో కప్పి పూలమాలలతో సత్కరించారు. అనపర్తి, ఆర్ఎస్‌పేట లారీ యజమానుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మహాత్ముని విగ్రహానికి మరమ్మతు

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరంలోని నాలుగురోడ్ల కూడలిలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆకతాయిలు విరగ్గొట్టారు. సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ సూచన మేరకు రాజానగరం మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు సముద్రాల రాంబాబు స్పందించి విరిగిన మహాత్ముని కుడిచేతిని తిరిగి యథావిధిగా తయారు చేయిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని పలువురు అభినందించారు.

అన్నదాతలకు అండగా .. వ్యవసాయం లాభసాటిగా

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి నియోజకవర్గంలో ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అన్నదాతలకు అండగా నిలిచి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంతో పాటు, రైతులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కారం చూపుతూ సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించేందుకు కూటమి ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విత్తనం నాటిన నుంచి పంట చేతికొచ్చే వరకు అన్నదాతలకు వ్యవసాయ అధికారులు సలహాలు ఇస్తారు. రసాయన ఎరువుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై అవగాహన కల్పిస్తారు. ప్రతి మంగళ,బుధవారాల్లో పొలం పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు నిర్వహిస్తున్నారు.

రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయధికారులు

నియోజకవర్గంలో..	
మండలం	రైతులు
అనపర్తి	12000
బిక్కవోలు	6250
రంగంపేట	10450

'పొలం పిలుస్తోంది' ఎంతో ఉపయుక్తం

పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. రైతుల వరి పొలాలను పరిశీలించి వారికి అవగాహన కల్పిస్తాం. రైతుల సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతుంది.

– సురేష్‌కుమార్, మండల వ్యవసాయాధికారి

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏఐ.. డేటాసైన్స్

దేవీచౌక్, న్యూస్‌టుడే: ఇంటర్ ఉత్తీర్ణులయిన ప్రతిఒక్కరూ ఇంజినీరింగ్ విద్యే లక్ష్యంగా ఆలోచిస్తారు. అందులో సీటు రాకపోతే వారు, వారి తల్లిదండ్రులు తీవ్ర మనస్తాపానికి గురవుతారు. ఇప్పుడు డిగ్రీ విద్యలో కూడా ఇంజినీరింగ్‌తో సమానమైన కోర్సులు ఉన్నాయి. అవి చదివి అదే స్థాయిలో ఉద్యోగాలు సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏఐ, డేటా సైన్స్ వంటి కంప్యూటర్ కోర్సులు రెండేళ్ల క్రితమే అందుబాటులోకి వచ్చాయి. ఇందులో డేటాసైన్స్ మైనర్ సబ్జెక్టుగా ఉంది. తాజాగా వీటి ప్రాధాన్యం పెరగడంతో పాటు డిమాండ్ కూడా పెరిగింది.

కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్

మొదటి విడత కౌన్సెలింగ్‌లోనే..

కళాశాలలో మొత్తం అయిదు కంప్యూటర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో కోర్సులో 40 నుంచి 120 సీట్లు ఉన్నాయి. మొదట విడత కౌన్సెలింగ్‌లోనే సీట్లన్నీ భర్తీ అయిపోతున్నాయి. ఈ విద్యార్థుల కోసం వివిధ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని కార్యశాలలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ కంప్యూటర్ కోర్సు పూర్తి చేసిన చాలమంది విద్యార్థులకు టీసీఎస్, విప్రో, గూగుల్, అడోబ్, క్యాప్ జెమినీ వంటి ప్రసిద్ధ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయని అధ్యాపకులు చెబుతున్నారు. ఏఐ, డేటాసైన్స్ విద్యార్థులు ప్రస్తుతం ద్వితీయ సంవత్సరంలో ఉన్నారు. ప్రస్తుతం డిగ్రీలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. కళాశాలలో ఆధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు, జేకేసీ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. పలు సంస్థలు ప్రాంగణ నియామకాలు కూడా నిర్వహిస్తున్నాయి. డిగ్రీ తర్వాత ఉద్యోగం రాకపోతే విద్యార్థులు పీజీ, ఎంసీఏ వంటి ఉన్నత కోర్సులకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్‌లో సీటు రాని విద్యార్థులు నిరాశ చెందకుండా ఏఐ, డేటా సైన్స్ వంటి కోర్సుల్లో చేరాలని అధ్యాపకులు సూచిస్తున్నారు.

కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో సీట్లు

కోర్సు	సంఖ్య
బీఎస్సీ కంప్యూటర్స్	60
బీఎస్సీ ఏఐ	40
బీఎస్సీ స్టాటస్టిక్స్, డాటా సైన్స్	60
జియాలజీ కంప్యూటర్ అప్లికేషన్స్	60
బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్	120

ప్రకటన

నా క్లయింటు తూ॥గో॥జిల్లా, గోకవరం మండలం, కామరాజుపేట కాపురస్తులు అయిన కాకి వెంకటేశ్వరరావు గారి కుమారుడు కాకి ప్రసాద్ గారు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు స్థిరాస్తిని జాస్తి శేషయ్య గారి కుమారుడు జాస్తి జనార్ధనమూర్తి గారి వద్ద నుండి 'ఎ' షెడ్యూలు ఆస్తిని మరియు కంటే వీర వెంకట సత్యనారాయణ గారి కుమారుడు కంటే వెంకటేశ్వర్లు గారి వద్ద నుండి 'బి' షెడ్యూలు ఆస్తిని కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొని ది. 18-7-2025వ తేదీ గల క్రియ అగ్రిమెంటు వ్రాయించుకొనియున్నారు. సదరు అగ్రిమెంటు షరతులు రీత్యా నా క్లయింటు క్రియ ప్రతిఫలం చెల్లించి 30 రోజులలో రిజిష్టరీ క్రియ దస్తావేజు పొందుటకు నిర్ణయం. సదరు జాస్తి జనార్ధనమూర్తి వగైరాల, దాసరి నిత్య కళ్యాణి చక్రయమ్మ గారి వద్ద నుండి కొనుగోలు చేసియున్నారు. [illegible]

'ఎ' షెడ్యూలు: [illegible] 189/1 [illegible]

'బి' షెడ్యూలు: [illegible] 189/1 [illegible]

కె.వి.వి.సూర్యనారాయణ, అడ్వకేట్
డో.నెం.78-14-12/10, టి/2, శ్రీ బాలాజీ అపార్ట్‌మెంట్, శ్యామలనగర్, రాజమహేంద్రవరం
ది.20-7-25 సెల్:9441475573

(c) eenadu

కొవ్వూరు
•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నల్లజర్ల, దేవరపల్లి, న్యూస్‌టుడే: నల్లజర్ల మండలంలో చీపురుగూడెం విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతుల చేపడుతున్నట్లు ఆ శాఖ ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆ గ్రామంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు. ● దేవరపల్లి మండలంల రామన్నపాలెం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో 11కేవీ ఫీడర్ ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సుబ్బరాయపురం, ధుమంతునిగూడెం, కొత్తగూడెం గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ తెలిపారు.

పశ్చిమడెల్టా ఇన్‌ఛార్జి ఈఈగా సత్యనారాయణ

నిడదవోలు, న్యూస్‌టుడే: పశ్చిమడెల్టా నిడదవోలు డివిజన్ ఇన్‌ఛార్జి ఈఈగా భీమవరం డ్రైనేజీ ఈఈ సీహెచ్‌వీవీ సత్యనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ ఈఈగా పనిచేసిన సుబ్రహ్మణ్యేశ్వరరావు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారంటూ ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన సంగతి విదితమే.

భాజపా జిల్లా కార్యదర్శిగా శ్రీనుబాబు

గోపాలపురం, న్యూస్‌టుడే: భాజపా జిల్లా కార్యదర్శిగా తనకు జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ప్రకటించారని గెల్లా శ్రీనుబాబు ఆదివారం తెలిపారు. పార్టీ కోసం పడిన కష్టాన్ని గుర్తించి తనకు ఈ బాధ్యతలు అప్పగించారన్నారు. పార్టీ అభ్యున్నతికి మరింత కృషి చేస్తానన్నారు.

పశివేదల సొసైటీ పాలకవర్గం ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, అచ్చిబాబు

రైతు పురోభివృద్ధికి సొసైటీలు తోడ్పాటు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: సహకార స్ఫూర్తితో ఏర్పాటైన సొసైటీలు రైతు పురోభివృద్ధికి తోడ్పడతాయని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పశివేదల సహకార సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బ్యాంకు ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే, తెదేపా సీనియర్ నాయకులు పెండ్యాల అచ్చిబాబు హాజరవ్వగా సొసైటీ ఛైర్‌పర్సన్‌గా గారపాటి రామచంద్రరావు, సభ్యులుగా వేములపల్లి రత్నరాజేంద్ర గునపురెడ్డి శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెదేపా హయాంలో సొసైటీలు అభివృద్ధి చెందాయన్నారు. కూటమి ప్రభుత్వం సంఘాలకు అధిక ప్రాధాన్యమిచ్చి రైతు సంక్షేమానికి పాటు పడుతోందన్నారు. అచ్చిబాబు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సొసైటీలను అభివృద్ధి చేయాలని, ఈ పదవులను బాధ్యతగా గుర్తించి కృషి చేయాలన్నారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, గారపాటి శ్రీనివాసరావు, వట్టికూటి వెంకటేశ్వరరావు, బేతిన నారాయణ, ఉండపల్లి గోపాల్, సర్పంచి తుంపల్లి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ధర్మవరంలో ఆదివారం నిర్వహించారు. నాయకులతో ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిపై కరపత్రాలను అందించారు. హరిదాసుల పోశిరత్నం ఆరోగ్య సేవలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.18 వేలు చెక్కును అందించారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు రామకృష్ణ, సర్పంచి నాగమణి, వెంకటకృష్ణ, సతీష్, సురేంద్ర, జవహర్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు పంటల పరిశీలన

రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో సుస్మిత

చాగల్లు, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో ముంపునకు గురైన పంటభూముల్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆర్డీవో రాణి సుస్మిత అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. వర్షపు నీరు ముంచెత్తడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 1,700 ఎకరాలకు వర్షపు నీరు చేరిందన్నారు. ఈ నీటిని ఎగువకు ప్రవహించేందుకు చర్యలు చేపట్టాలని, రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా కృషి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. సమస్యను పరిష్కరించేలా జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎం.మెరికమ్మ, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో రైతు బజార్లు

✦ గోపాలపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో 2017లో సుమారు రూ.8.50 లక్షల వ్యయంతో రైతు బజారు నిర్మించారు. మొదట్లో ఇద్దరు, ముగ్గురు వచ్చి వ్యాపారం మొదలు పెట్టారు. ఊరికి చివరన ఉండటంతో క్రమంగా జనాలు రావడం తగ్గించడంతో ప్రస్తుతం అది నిరుపయోగంగా ఉంది.

✦ తాళ్లపూడిలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో సుమారు రూ.8 లక్షల వ్యయంతో నిర్మించారు. ప్రస్తుతం అక్కడ వ్యాపారం చేయకపోవడంతో పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది. ఊరి చివరన ఉండడంతో మందు బాబులకు అడ్డాగా మారింది.

దేవరపల్లిలో పిచ్చి మొక్కల మధ్య..

పరిశీలన

గోపాలపురం, తాళ్లపూడి, దేవరపల్లి, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో వ్యవసాయ మార్కెట్ కమిటీలకు సంబంధించి సొమ్ములను వాడుకున్నారు. రైతు బజార్ల నిర్వహణను మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దీంతో రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన రైతు బజార్లు నిరుపయోగంగా ఉన్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి. ప్రజలు బహిరంగ మార్కెట్లలో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంటోంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆయా మార్కెట్ కమిటీలకు పాలక వర్గాలను ఏర్పాటు చేసింది. రైతు బజార్లను కూడా వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో గతంలో ఏర్పాటు చేసిన రైతు బజార్లు ఎక్కువగా ఊరికి దూరంగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అంత దూరం వెళ్లలేక ప్రజలు దగ్గరగా ఉన్న చోట్ల కొనుగోలు చేస్తున్నారు.

డివిజన్ పరిధిలో ఇలా..

డివిజన్ పరిధిలోని గోపాలపురం, నిడదవోలు, కొవ్వూరు నియోజకవర్గాల్లో మూడు వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ప్రతి మండలంలో ఒక్కో రైతు బజారు ఏర్పాటు చేశారు. కొన్ని 2014-19 మధ్య, మరికొన్ని 2019-23 సంవత్సరాల మధ్య నిర్మాణాలు చేపట్టారు. అయితే ఇవి పట్టుమని ఒక్క ఏడాది కూడా సక్రమంగా నడిచిన దాఖలాలు లేవు.

తాళ్లపూడిలో నిరుపయోగంగా..

వినియోగంలోకి తీసుకొస్తాం..

నియోజకవర్గ పరిధిలో ఉన్న రైతు బజార్లను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం నూతన కమిటీలు ఏర్పాటు అయ్యాయి. ఛైర్మన్, పాలక వర్గం సభ్యులతో మాట్లాడి వాటిని అందుబాటులోకి తీసుకొస్తాం.

- ఎన్‌వీవీ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి, గోపాలపురం

సహాయ ఇంజినీర్ల సంక్షేమానికి కృషి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: గృహనిర్మాణ సంస్థ సహాయ ఇంజినీర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా కొవ్వూరు ఏఈ కేవీఎస్ చక్రవర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కొవ్వూరు పట్టణ ఏఈగా ఉన్న చక్రవర్తికి ఈ పదవి వచ్చింది. ఈ సందర్భంగా ఇంజినీర్ల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆయన అన్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్.శ్రీరాములు రెడ్డి, కోశాధికారిగా డి.శ్రీనివాస్ ఎన్నికైనట్లు తెలిపారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండలం కోరుమామిడిలో నిర్వహిస్తున్న కోడి పందేలా శిబిరంపై ఆదివారం దాడి చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై బాలాజీ సుందరరావు తెలిపారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1,150 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, రెండు కోడిపుంజులు, నాలుగు కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఉచిత వైద్య శిబిరం

నిడదవోలు: రావిమెట్ల గ్రామంలో నిడదవోలు రోటరీ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో ఇంజే శేఖర్ ఆర్థిక సహకారంతో ఆదివారం ఉచిత మధుమేహ, బీపీ వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 126 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు సత్యప్రసాద్, కార్యదర్శి ఆనందమురళీకృష్ణ, క్లబ్ ట్రైనర్ ఫణిసింహ, గణపతి పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: తాళ్లపూడి, గోపాలపురం సరిహద్దులోని కొండ ప్రాంతాల్లో నాటుసారా తయారీ స్థావరాలపై ఆదివారం దాడులు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. సూరయ్యపేట, గోపాలపురం మండలం బీమోలు గ్రామాల సరిహద్దుల్లోని కొండప్రాంతాల్లో చింతలపూడి కాలువ పక్కన నాటుసారా తయారీ చేస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ నాలుగు డ్రమ్ముల్లో సుమారు 800 లీటర్ల బెల్లపు ఊట, ఇతర తయారీ సామగ్రిని గుర్తించామన్నారు. బెల్లపు ఊటను అక్కడే ధ్వంసం చేశామన్నారు.

దేవరపల్లిలో బంగారు పాపమ్మకు..

వేములమ్మకు..

అమ్మవార్లకు ఆషాఢం సారె

తెలికిచెర్లలో అంకాలమ్మ

కలవచర్లలో గోగులమ్మకు..

నిడదవోలు, పెరవలి, దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం, ఉండ్రాజవరం, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆషాఢ మాసంలో చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని అమ్మవార్లకు చీర, గాజులు, పిండివంటలతో సారెను సమర్పించారు. కలవచర్ల గ్రామదేవత గోగులమ్మకు, అన్నవరప్పాడులో పులిదిండి వారి ఆడపడుచు వెంకమ్మతల్లికి, దేవరపల్లిలో బంగారు పాపమ్మకు, తెలికిచెర్ల గ్రామదేవత అంకాలమ్మతల్లికి, జగన్నాధపురం గ్రామ దేవత గంగానమ్మకు, వేలివెన్ను ఐలమ్మకు, ముత్యాలమ్మ, మహాకాళమ్మ అమ్మవార్లకు, వేములూరు గ్రామ దేవత వేములమ్మకు ఆయా గ్రామాల ప్రజలు ఊరేగింపుగా వెళ్లి సారె సమర్పించి ఉత్సవాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, లలితా సహస్ర నామ పారాయణ నిర్వహించారు.

నిరసనలో పురపాలక పారిశుద్ధ్య కార్మికులు

సానుకూలంగా స్పందించకుంటే పోరాటం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కార్మికుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో పోరాటాలు ఉద్ధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కొవ్వూరు పురపాలక కార్మికులు ఆదివారం నిరసన దీక్షను కొనసాగించారు. పట్టణ ప్రధాన వీధుల్లో ప్రదర్శన చేపట్టి నినాదాలు చేశారు. ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేయాలని చూడటం సరికాదన్నారు. యూనియన్ అధ్యక్షుడు భూపతి రమేశ్, కార్యదర్శి పూజారి వాసు, కల్యాణ్ రాజేష్ నిరసనలో పాల్గొన్నారు.

అచ్చిబాబును కలిసిన క్రిస్టియన్ జేఏసీ జాతీయ కన్వీనరు

కొవ్వూరు పట్టణం, తాళ్లపూడి, న్యూస్‌టుడే: ఆలిండియా క్రిస్టియన్ జేఏసీ జాతీయ కన్వీనర్‌గా నియమితులైన బొంతా శ్యామ్ రఘురామ్ తెదేపా సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ● మలకపల్లికి చెందిన మాజీ సర్పంచి ప్రతాపం, ఉసూరంటి రామారావు తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను అచ్చిబాబు, ద్విసభ్య కమిటీ సభ్యులు సుబ్బారావుచౌదరి, రామకృష్ణ కలిసి పరామర్శించారు.

రహదారి పక్కన తుప్పల తొలగింపు

ఈనాడు స్పందన

ఉండ్రాజవరం: మండలంలోని మోర్త, పెరవలి రహదారిలో ఇరుపక్కల తుప్పలు పెరగటంతో మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. సమస్యపై ఈ నెల 17న 'తుప్పలు పెరిగి తిప్పలు' శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తాడిపర్రు తదితర ప్రాంతాల్లో రహదారి పక్కన అలముకున్న తుప్పలను తొలగింపజేశారు.

కోళ్ల వ్యర్థాలు ఉపయోగిస్తే కఠిన చర్యలు

దేవరపల్లి: మండలంలోని యాదవోలులో ఆరిపాటి దిబ్బలు వెళ్లే రహదారిలో కొండ చెరువు సమీపంలో కొంత మంది చేపల పెంపకంలో కోళ్ల వ్యర్థాలు వినియోగించడంపై మత్స్యశాఖ అధికారులు స్పందించారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఆర్జించాలన్న దురుద్దేశంతో కోళ్ల వ్యర్థాలు ఉపయోగిస్తున్నారని ఈనాడులో గురువారం 'చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలు..' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.నిర్మల కుమారి స్పందించారు. మత్స్యశాఖ తనిఖీ అధికారి కృష్ణవేణి, సచివాలయం మత్స్యశాఖ అసిస్టెంట్ నాగమణి చెరువును పరిశీలించారు. కోళ్ల వ్యర్థాలు ఉపయోగిస్తే నోటీసులు పంపించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నిబంధనలు పాటించని క్వారీ లారీలకు జరిమానా

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు, గౌరీపట్నం పరిసర ప్రాంతాల నుంచి క్వారీ లారీలు అధిక లోడుతో వేగంగా నడుపుతున్నారు. లారీ నుంచి పడిన రాళ్ల వల్ల వాహనదారులు జారిపడి గాయాలపాలవుతున్నారని జూన్ 7న 'క్వారీ లారీలు...ప్రమాదాల కోకొల్లలు' శీర్షికన ఈనాడులో వార్త ప్రచురితమైంది. దీంతో సీఐ బి.నాగేశ్వర్‌నాయక్, ఎస్సై వి.సుబ్రహ్మణ్యం స్పందించి సుమారు 9 క్వారీ లారీలకు రూ.13,815 జరిమానా విధించారు.

గుంతలమయం.. ప్రమాదాల భయం

నల్లజర్ల నుంచి జగన్నాథపురానికి వెళ్లే బీటీ రహదారి గుంతలమయంగా మారింది. వర్షాలకు గుంతల్లో నీరు చేరి మడుగులను తలపిస్తున్నాయి. వాటిని తప్పించుకుంటూ ముందుకు సాగే ప్రయత్నంలో వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. నల్లజర్ల జిల్లా ఉన్నత పాఠశాలకు కాలినడకన వచ్చే విద్యార్థులు గుంతలను దాటి ముందుకు వెళ్లేందుకు నరకయాతన పడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవచూపి రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ర.భ.శాఖ, ఏఈ శ్రీనివాస విజయ్‌ను వివరణ కోరగా త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. - న్యూస్‌టుడే, నల్లజర్ల

రోడ్డు కోత.. రాకపోకలకు వాత

డి.ముప్పవరం నుంచి గోపవరం వెళ్లే ర.భ.శాఖ రహదారిలో పురుషోత్తపల్లి విద్యుత్తు ఉపకేంద్రం-గోపవరం మధ్య రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. నిత్యం వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ కోతకు గురైన ప్రాంతం రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులకు కనిపించకపోవడంతో పడిపోయి గాయాలపాలవుతున్నారు. ప్రమాదాల నివారణకు స్థానికులే కొమ్మలు, ఆకులు వంటివి ఆ ప్రాంతంలో అడ్డంగా పెట్టి దీనిపై సంకేతాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా కోతకు గురైన ప్రాంతంలో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నిడదవోలు

మురుగు పారదు.. సమస్య తీరదు

దేవరపల్లిలోని అంబేడ్కర్ ఏరియాలో ఎస్సీ బాలుర వసతి గృహం సమీపంలో రహదారిపై మురుగు చేరి స్థానికులు అవస్థలు పడుతున్నారు. నివాసాల్లో వాడుకున్న నీరు బయటకు వెళ్లేందుకు మురుగుకాలువ లేకపోవడంతో రహదారిపైకి చేరుతోంది. దోమలు విజృంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి రవిశేఖర్ వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, దేవరపల్లి

కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది: వనిత

మాట్లాడుతున్న మాజీ మంత్రి వనిత

నల్లజర్ల, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మాజీమంత్రి, గోపాలపురం నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి తానేటి వనిత అన్నారు. బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నల్లజర్లలో మండలశాఖ అధ్యక్షుడు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద ఆదివారం నిర్వహించారు. వనిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలను ప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసి వివరించాలన్నారు. ● మద్యం కుంభకోణంలో అరెస్టు అయిన వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డిని ఆదివారం రాత్రి రాజమహేంద్రవరం కర్మాగారానికి తరలిస్తుండగా వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద తానేటి వనిత కారును పోలీసులు అడ్డుకున్నారు. మిథున్‌రెడ్డి వెళ్లిన 30 నిమిషాల తర్వాత అనుమతి ఇచ్చారు. ● సూపర్‌సిక్స్ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని వైకాపా జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని కొవ్వూరు లిటరరీ క్లబ్‌లో నిర్వహించారు. తలారి వెంకట్రావు, గూడూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మలగిరిలో ముమ్మరంగా అభివృద్ధి పనులు

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లి మండలం గౌరీపట్నం నిర్మలగిరి మేరీ మాత పుణ్యక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం అనేక మార్పులు చేస్తున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా, క్రైస్తవులు-హిందూవుల అనుబంధ రూపంలో ఆలయం నిర్మించడంతో కొబ్బరికాయలు కొట్టడం, లడ్డూ, పులిహోర ప్రసాదం వితరణ, ముడుపులు కట్టడం, మొక్కులు చెల్లించుకోవడం తదితరవి ఇక్కడ జరుగుతుంటాయి. దీంతో నిర్మలగిరికి నెలకు సుమారు 70 వేల నుంచి 80 వేల మంది భక్తులు వస్తుంటారని పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ చెబుతున్నారు.

పుణ్యక్షేత్రంలో అఖండ దేవాలయం

ఉచిత భోజనశాలలో..

నిర్మలగిరికి వచ్చిన భక్తులకు నాణ్యమైన భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అన్నదానానికి విరాళాన్ని అందజేసిన దాతల పేర్లను శిలాఫలకంపై చెక్కిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా పార్కింగ్, అన్నదానం ప్రాంతాల్లో షెడ్లు, మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. అలాగే కేశఖండనశాలలో అదనపు వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు రావడంతో అడ్డుకట్ట వేయడానికి సీసీ కెమెరాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

భక్తుల శ్రేయస్సు మేరకు..

గౌరీపట్నం పుణ్యక్షేత్రానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఏలూరు పీఠాధిపతి జయరావు పొలిమేర సారథ్యంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. భక్తుల వద్ద అక్రమ వసూళ్లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నాం. పుణ్యక్షేత్రం అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నాం.

- ఎస్.జాన్ పీటర్, పుణ్యక్షేత్ర డైరెక్టర్, గౌరీపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తాళ్లపూడి: 80085 74498
ఉండ్రాజవరం: 80085 74503, నల్లజర్ల: 97011 37112

కూడలిలో చెత్తాచెదారం

సమస్య: గాంధీబొమ్మ వీధిలోని ప్రధాన కూడలిలో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. పందులు సంచరిస్తున్నాయి. దోమల బాధ ఎక్కువగా ఉంది. - స్థానికుడు, తాళ్లపూడి

సమాధానం: చెత్తచెదారాలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - వీరన్న, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, తాళ్లపూడి

సమస్య: ఖండవల్లిలో విద్యుత్తుబిల్లుల చెల్లింపునకు సంబంధించి గతంలో ఇద్దరు సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం ఒక్కరే ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - రామారావు, స్థానికుడు

సమాధానం: ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. - నిశ్చల్, విద్యుత్తు శాఖ ఏఈ

– న్యూస్‌టుడే, పెరవలి



సేంద్రియ సాగు.. దిగుబడి బాగు

న్యూస్‌టుడే, నల్లజర్ల

రసాయనాలు, క్రిమిసంహారక మందులు అధికంగా వినియోగించిన పంటల్లో దిగుబడి తగ్గడమే కాకుండా ఆయా ఉత్పత్తులను తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో చాలా మంది రైతులు ప్రకృతి సాగుపై మక్కువ చూపుతున్నారు. గోపాలపురం నియోజకవర్గంలో 6,500 మంది రైతులు సుమారు 5000 ఎకరాల్లో సేంద్రియ విధానంలో కూరగాయలతోపాటు వరి, ఆయిల్‌పాం, నిమ్మ, మొక్కజొన్న, కోకో వంటి పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వర్జీనియా పొగాకు సాగు కూడా చేపట్టారు.

జీవామృతం తయారీలో మహిళ

ప్రయోగాత్మకంగా..

నల్లజర్ల మండలంలోని సింగరాజుపాలెం, మారెళ్లమూడి, ముసుళ్లకుంట, పుల్లలపాడు, నల్లజర్ల గ్రామాల్లో ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టారు. వరి, కూరగాయలు, ఆయిల్‌పాం, నిమ్మ, మొక్కజొన్న సాగు 400 మంది రైతులు 200 ఎకరాల్లో ప్రారంభించారు. ప్రకృతిపరంగా సాగయ్యే పంటకు ప్రతికూల వాతావరణాన్ని సైతం తట్టుకునే శక్తి ఉంటుందని, చీడపీడలు దరి చేరవని, నాణ్యమైన ఉత్పత్తుల తిగబడి ఉంటుందని మాస్టర్ ట్రైనీలు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. బీజామృతం, బ్రహ్మాస్త్రం తదితర కషాయాల తయారీపై వివరిస్తున్నారు.

తక్కువ ఖర్చుతో..

సేంద్రియ సాగు వల్ల ఖర్చులు చాలా వరకు తగ్గాయి. రూ.10 వేలు ఖర్చు చేసి రసాయన ఎరువులు కొనిచేసే వ్యవసాయంలో రూ.వెయ్యితో సేంద్రియ వ్యవసాయం చేయవచ్చు. పైగా ఆరోగ్యకరమైన దిగుబడి వస్తుంది.

– ఎం.కనకదుర్గ, రైతు, సింగరాజుపాలెం

రైతుల ఆసక్తి..

ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. జీవామృతం భూసారాన్ని పెంచుతుంది. తద్వారా పంట దిగుబడులు పెరుగుతాయి. ఈ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి ధరలు లభిస్తాయి.

– శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్, ప్రకృతి వ్యవసాయం

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

చాగల్లు, న్యూస్‌టుడే: రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్నేహితులు, బంధువుల వివరాల ప్రకారం.. కొవ్వూరు పట్టణానికి చెందిన ఐ.యశ్వంత్ తన ద్విచక్రవాహనంపై ఆదివారం తోగుమ్మి వెళ్లారు. తిరిగి వస్తుండగా మరో ద్విచక్రహనంపై వస్తున్న వ్యక్తి ఎదురుగా వచ్చి ఢీకొన్నారు. ప్రమాదంలో యశ్వంత్ తలకు తీవ్ర గాయాలవ్వడంతో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

(c) eenadu

మురుగన్‌కు పాల కావడి

ఉత్సవంలో ఎమ్మెల్యే కామినేని

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటరులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆడి కృత్తిక కావడి సేవ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి విఘ్నేశ్వర పూజ, గోపూజ, పంచగవ్య ప్రాసన వంటి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని పసుపు దుస్తులు ధరించి పాలు, నెయ్యి, తేనె, పన్నీరు, చందనం, విభూది, పుష్పం, పంచామృత కావిళ్లు పట్టుకుని వీధుల్లో ఊరేగించారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కావడి పట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన స్వామివారి మాస కల్యాణోత్సవంలో దంపతులు పీటల మీద కూర్చుని కల్యాణ క్రతువు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆడి కృత్తిక పూజలు చేస్తున్న అర్చకులు, వేద పండితులు

మావుళ్లమ్మకు ఆషాఢ సారె

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మకు వివిధ ప్రాంతాల మహిళలు ఆషాఢం సారెను ఆదివారం సమర్పించారు. విజయవాడ, ఆకివీడు, వీరవాసరం నుంచి పసుపు, కుంకుమ, గాజులు, చీర, సుమారు 150 రకాల మిఠాయిలు 650 కిలోలు తీసుకు రాగా.. ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జునశర్మ, అర్చకులు సంప్రోక్షణ చేసి అమ్మవారి వద్ద నైవేద్యంగా ఉంచారు. భీమవరం పట్టణానికి చెందిన క్రిస్టల్ కిట్టీ మహిళ సభ్యులు 250 కిలోల సుమారు 51 రకాల మిఠాయిలతో సారె సమర్పించినట్లు ఆలయ సహాయ కమిషనర్ బి.ఎం.నగేష్ తెలిపారు.

బాలల బడి.. భవితకు పునాది

- కార్పొరేట్ హంగులతో సౌకర్యాలు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరిగిన ప్రవేశాలు

న్యూస్‌టుడే, ఏలూరు వన్‌టౌన్: కార్పొరేట్ తరహాలో అంగన్‌వాడీ బోధన.. చిన్నారులను ఆరోగ్యవంతులుగా మార్చేందుకు పౌష్టికాహారం.. ఇదీ ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించి ఆహ్లాదకర నిలయాలుగా మారుస్తున్నారు. దీంతో ఏటా చేరే చిన్నారుల సంఖ్య పెరుగుతోంది.

గత ప్రభుత్వ హయాంలో నిధులు సమకూర్చకుండా అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నాటి సమస్యల్ని అధిగమించి మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. నక్షత్ర పథకంలో పోషణ వాటిక (పెరటితోట) కోసం రూ. 10 వేలు, ఇంకుడు గుంతకు రూ. 16 వేలు, విద్య, ఆటల సామగ్రి కొనుగోలుకు రూ. 19,800 వంతున కేటాయించింది. ఇలా ఒక్కో కేంద్రానికి రూ. 45,800 చొప్పున జిల్లాలోని 855 కేంద్రాలకు రూ. 3.91 కోట్లు విడుదల చేశారు. ఈ నిధులతో తల్లీబిడ్డ ఆరోగ్య పరిరక్షణ, బాలల శారీరక, మానసిక ఎదుగుదలకు వసతుల కల్పనతోపాటు కేంద్రాల్లో ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేశారు. కార్టూన్లు, బొమ్మలు, ఆటలు, పాటలు, చిట్టి కథలు తదితర వాటిని ఎల్‌ఈడీ తెరలపై చూపిస్తూ ఆసక్తిగా బోధిస్తున్నారు. శుద్ధజలం, మరుగుదొడ్లు, బల్లలు, కుర్చీలు తదితర ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. బోధనకు దృశ్య శ్రవణ విద్యకు అవసరమైన పరికరాలు సమకూర్చారు. ప్రీస్కూళ్ల ద్వారా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహిస్తున్నారు.

చిన్నారులను ఆకర్షించేలా గోడలపై రంగులమయమైన చిత్రాలతో బోధన

ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు

గతేడాది 10 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ప్రీస్కూళ్లలో 3 నుంచి 5 సంవత్సరాల్లోపు పిల్లలు 24,623 మంది ఉండగా 2025-26 విద్యా సంవత్సరంలో కొత్తగా 4,340 మంది చేరడంతో ఆ సంఖ్య 28,963కు చేరింది. గతంతో పోలిస్తే తల్లిదండ్రులు తమ పిల్లల్ని అంగన్‌వాడీల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీనిపై ఐసీడీఎస్ పీడీ పి.శారద మాట్లాడుతూ గతంలో కంటే ఈ ఏడాది ప్రవేశాలు బాగా పెరిగాయని.. ఇదే స్ఫూర్తి కొనసాగిస్తామన్నారు.

కాగితాల్లోనే 100.. ఉండేది 50

- ఏళ్లుగా సా..గుతున్న వంద పడకల భవన నిర్మాణం
- చింతలపూడి ఆసుపత్రిలో వేధిస్తోన్న సమస్యలు

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో సమస్యలు వెంటాడుతున్నాయి. వైద్యులు, నర్సుల కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2021లో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల నాని శంకుస్థాపన చేశారు. రెండు విడతలుగా రూ.25 కోట్లు మంజూరు చేసి ఏడాదిలో పనులు పూర్తిచేసి ఆసుపత్రి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అప్పటి నుంచి పనులు సా..గుతూనే ఉన్నాయి.

చికిత్స పొందుతున్న రోగులు

రేకుల షెడ్డులో.. ప్రస్తుత వైద్య సేవలు అందిస్తున్న భవనం వర్షానికి నాని లీకవుతోంది. ముప్పై పడకల ప్రాంతీయ ఆసుపత్రిని వంద పడకలుగా మార్చినా.. తగిన సౌకర్యాలు లేవు. 50 పడకలతోనే రేకుల షెడ్డులో నెట్టుకొస్తున్నారు. సీజనల్ వ్యాధులు, రోగుల తాకిడి ఎక్కువగా ఉన్న సమయంలో ఒకే మంచంపై ఇద్దరికి చికిత్స అందించిన సందర్భాలున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ఆసుపత్రిలో వైద్యులు, నర్సుల కొరత వేధిస్తోంది. ఇక్కడ 24 మంది నర్సులు అవసరం ఉండగా 18 మంది మాత్రమే విధులకు హాజరవుతున్నారు.

తీరని అవస్థలు.. ఆసుపత్రిలో ఏళ్ల తరబడి వైద్యుల కొరత వేధిస్తోంది. వంద పడకల ఆసుపత్రికి కావలసిన 23 మంది వైద్యులు అవసరం ఉండగా వారిలో ప్రస్తుతం ఏడుగురు మాత్రమే వైద్య సేవలందిస్తున్నారు. ఇద్దరిని అదనపు బాధ్యతల మేరకు ఇతర ఆసుపత్రులకు పంపుతుండటంతో పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది. స్త్రీ, ప్రసూతి వైద్యులున్నా ఎక్కువగా సెలవుపై వెళ్తున్నారు. ఫలితంగా ఆసుపత్రికి వచ్చే రోగులను ఏలూరు తరలించాల్సి వస్తోంది. కీళ్ల, ఎముకల వైద్యులు, దంత, జనరల్ సర్జన్, కంటి, చెవి, ముక్కు, గొంతు, రేడియాలజిస్టు వంటి ముఖ్యమైన వైద్యులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రి ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే అవకాశాలు లేవు. ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిలోనైనా వైద్యుల భర్తీ చేసి పడకలు పెంచి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

ఆసుపత్రిలో వైద్యులు, నర్సుల కొరతపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు త్వరలోనే భర్తీ చేస్తాం. వైద్యులకు వేరే ఆసుపత్రిలో అదనపు బాధ్యతలు తొలగించాం. రోగులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తాం. - పాల్ సతీష్‌కుమార్, జిల్లా సమన్వయకర్త, వైద్య ఆరోగ్యశాఖ

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

బాలికతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అండగా నిలుస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఆదివారం పాలకొల్లులో దివ్యాంగులకు పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రూ.500 ఉండే దివ్యాంగుల పింఛనును రూ. 3 వేలకు.. మళ్లీ 2024లో రూ.3 వేల నుంచి రూ. 6 వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. వైకాపా ఐదేళ్ల పాలనలో కనీసం సహాయ పరికరాలు కూడా దివ్యాంగులు నోచుకోలేకపోయారన్నారు. కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ స్టీల్ ఆథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ద్వారా దివ్యాంగుల సహాయ పరికరాల నిమిత్తం నరసాపురం పార్లమెంటు నియోజకవర్గంలో రూ. 2 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. తొలి విడతగా రూ. 50 లక్షలు మంజూరు కాగా పాలకొల్లు నియోజకవర్గంలో మొదటి శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సరికొత్తగా పోలీసు సేవలు

- ఇ-ఆఫీస్ అమలుకు ఏర్పాట్లు
- నమూనా ప్రాజెక్టుగా ఎంపిక

నరసాపురంలో ఎస్డీపీవో కార్యాలయం

నరసాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పోలీస్‌స్టేషన్లు, ఆ శాఖ కార్యాలయాల్లో 'ఇ-ఆఫీస్' విధానం అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా నరసాపురం సబ్ డివిజినల్ పోలీసు కార్యాలయాన్ని రాష్ట్రంలో తొలి ఇ-ఆఫీస్‌గా ప్రయోగాత్మకంగా అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేసింది. ఈ నెల 19వ తేదీ నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించి సంబంధిత సాఫ్ట్‌వేర్‌ను కార్యాలయ కంప్యూటర్లలో నిక్షిప్తం చేశారు. ఈ విధానంలో బాధితుల నుంచి ఫిర్యాదు అందినప్పటి నుంచి పరిష్కారమయ్యే వరకు అన్ని దశల్లో ఉన్నత స్థాయి పర్యవేక్షణ ఉంటుంది. తొలి దశలో ఎంపిక చేసిన అధికారులకు నూతన సాంకేతిక విధానాలు, కేసుల పరిష్కారంలో కృత్రిమ మేధ వినియోగం తదితర అంశాలపై గత నెలలో వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. జిల్లా నుంచి ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, నరసాపురం డీఎస్పీ జి. శ్రీవేదఅరవింద ఈ శిక్షణలో పాల్గొన్నారు.

జాప్యం లేకుండా.. బాధితులు, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, నమోదైన కేసులు, వాటి స్థాయి, విచారణలో భాగంగా తీసుకున్న, తీసుకోవాల్సిన చర్యలు, జాప్యం లేకుండా పరిష్కారం తదితర అంశాలను ఎస్డీపీవో కార్యాలయం నుంచి జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుని సమీక్షించేందుకు వీలుంటుంది. ఈ విధానంతో సమయం ఆదా కావడంతో కాగిత రహితంగా కార్యాలయ నిర్వహణకు అవకాశం ఏర్పడనుంది. బాధితులకు సత్వర న్యాయం, పారదర్శకంగా కేసుల విచారణకు వీలుంటుందని పోలీసు శాఖ ఉన్నతాధికారులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

నేడు యథావిధిగా ప్రజా ఫిర్యాదుల వేదిక

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజల సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. మండలం, డివిజినల్, పురపాలక కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రజలకు సమీపంలోని కార్యాలయానికి వెళ్లి వినతులు అందజేయొచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

వరద తగ్గుముఖం

పోలవరం, న్యూస్‌టుడే: గోదావరికి వరద తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద ఆదివారం సాయంత్రానికి నీటి మట్టం 27.06 మీటర్లకు తగ్గింది. 47 గేట్ల ద్వారా 97 వేల క్యూసెక్కులు దిగువకు వెళ్తోంది.

సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహాలు

3.2 మెగా వాట్ల ఉత్పత్తికి అవకాశం

గ్రామస్థులతో చర్చిస్తున్న తహసీల్దార్ (పాతచిత్రం)

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం మండలంలో సౌరవిద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. నెడ్‌క్యాప్ సంస్థ ఆధ్వర్యంలో ప్లాంట్ల నిర్మాణం జరగనుంది. ప్లాంట్ల స్థాపనకు దిప్పకాయలపాడు పరిధిలోని 284 సర్వే నంబరులో పది ఎకరాలు, సరిపల్లి గ్రామ పరిధిలో 4.5 ఎకరాల విస్తీర్ణంలోని రెవెన్యూ భూమిని గుర్తించారు. దిప్పకాయలపాడులో కొండగుట్టగా పిలిచే భూమిలో ఆక్రమణలకు గురైన సుమారు రెండున్నర ఎకరాల్లో సాగులో ఉన్న జామాయిల్, జీడిమామిడి చెట్లను తొలగించాలని సంబంధిత రైతులకు అధికారులు సూచించారు. ఇటీవల జరిగిన సమావేశంలో గ్రామస్థులతో ఈ మేరకు చర్చించినట్లు తహసీల్దారు ఎన్.నాగరాజు తెలిపారు. దిప్పకాయలపాడు పరిధిలో ఏర్పాటయ్యే సౌర విద్యుత్తు ప్లాంటులో 2.2 మెగా వాట్ల విద్యుత్తు, సరిపల్లిలో ఏర్పాటయ్యే ప్లాంట్‌లో 1 మెగా వాట్ విద్యుత్తు ఉత్పత్తికి అవకాశం ఉందని జంగారెడ్డిగూడెం విద్యుత్తు ఈఈ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

కుళ్లిన నారు చూపిస్తున్న రైతులు

●ఉరేసుకొని ఉపాధ్యాయిని ఆత్మహత్య
బ్లేడుతో కాళ్లు, చేతులు కోసుకున్న భర్త
6లో

నారుమడులు నీట మునక

రావులపర్రు (ఉంగుటూరు), న్యూస్‌టుడే: రావులపర్రులో సుమారు 150 ఎకరాల్లో వరి నారుమళ్లు నీట మునగడంతో అన్నదాతలు ఆదివారం ఆందోళన చేపట్టారు. వరినారు నీట మునిగి కుళ్లిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు తోకలపల్లి మురుగు కాలువ గుండా కొల్లేరులో కలుస్తోంది. రావులపర్రు రెగ్యులేటర్ వద్ద ఈ కాలువ చెక్క బల్లలు కిందకు దించడంతో నీరు దిగువకు వెళ్లడం లేదు. పత్తేపురం పంట కాలువకు మిడ్‌లెవల్ కాలువ, తోకలపల్లి మురుగు కాలువలు ప్రధాన నీటి వనరు. సామర్థ్యానికి మించి తోకలపల్లి మురుగు కాలువ నుంచి నీరు పత్తేపురం పంట కాలువలో కలుస్తోంది. దీంతో నీరు వెనక్కి మళ్లి పొలాల్లోకి నీరు చేరి నారుమళ్లు నీట మునిగిపోయాయని రైతులు ఆందోళన వెలిబుచ్చారు. దీనిపై నీటి పారుదల శాఖ ఏఈ సుధారాణి మాట్లాడుతూ సీతారామపురంలో పందికోడు వద్ద నీటిని దిగువకు మళ్లించగా పరిస్థితి కొంత చక్కబడిందని.. రావులపర్రు-రాచూరు మధ్య డ్రెయిన్ పూడిక తీయించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

రొయ్య అధరహో..!

- వనామీ రకం వంద కౌంటు కిలో రూ.250
- చెరువులు ఖాళీ అయ్యాక పెరుగుదల

కలిదిండి, న్యూస్‌టుడే: 'అయిదు ఎకరాల్లో రొయ్యలు పండిస్తున్నా.. వాతావరణ మార్పులతో పది రోజుల కిందట ఆకస్మికంగా పట్టుబడి చేసేశా.. రూ. 7.50 లక్షల నష్టం వాటిల్లింది. ఈ రోజు ఉన్న ధర ఆ రోజు ఉంటే లాభాలతో బయట పడేవాణ్ని' అని ప్రొద్దువాకకు చెందిన ఓ రొయ్యల రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

● దిగుబడులు బాగున్నప్పుడు ధరలు పతనం అవుతున్నాయి. చెరువులు ఖాళీ అయ్యాక ధరలు పైపైకి ఎగిసిపడుతున్నాయి. ఇదీ.. రొయ్య రైతుల దయనీయ పరిస్థితి. రెండు నెలలుగా వ్యాధుల ఉద్ధృతితో ఉమ్మడి జిల్లాలో 80 శాతం చెరువుల్లో పట్టుబడులు చేసేశారు. ఈ నేపథ్యంలో ధరలు పెరగడంతో రైతులు ఉసూరుమంటున్నారు.

నష్టాల బాట.. ఈ ఏడాది జూన్ తొలి వారంలో 100 కౌంటు కిలో ధర రూ. 225 ఉంది. మూడో వారంలో రూ. 215కి పడిపోయింది. జులై తొలి వారం నుంచి ధర క్రమంగా పుంజుకుంటూ 20వ తేదీకి రూ. 250కి చేరింది. రూ. 210 - 220 ధరల్లో పట్టుబడి చేసిన రైతులంతా తీవ్ర నష్టాలు మూటగట్టుకున్నారు. ఇప్పుడు పెరిగిన ధరలు చూసి ఆవేదనకు గురవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో (లక్షల ఎకరాల్లో..)

ఆక్వా సాగు మొత్తం :	2.90
రొయ్యలు :	1.10
చేపలు :	1.80

(ధర రూ.లో)

కౌంటు	జూన్‌లో	ప్రస్తుతం
100	215	250
90	225	260
80	245	280
70	265	305
60	295	335
50	310	355
40	340	360

సాగుపై సందిగ్ధం .. ఇన్ని ఒడిదుడుకులు ఎదుర్కొంటూ రొయ్యల సాగు చేయాలా? వద్దా? అనే సందిగ్ధంలోకి సాగుదారులు వెళ్లిపోతున్నారు. రాష్ట్ర తలసరి ఆదాయంలో సింహభాగం సమకూర్చి పెట్టే ఆక్వా రంగంపై ప్రభుత్వాలు మరింత శ్రద్ధ పెట్టాలనే భావన రైతుల్లో కనిపిస్తోంది. రొయ్య పిల్ల హేచరీల ఏర్పాటు, మందులు, మేతల ధరల నియంత్రణ, ధరల స్థిరీకరణ, శీతల గిడ్డంగుల ఏర్పాటు వంటి వాటిపై గట్టి చర్యలు తీసుకుంటేనే సాగు మనుగడ సాధ్యమవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

హమ్మయ్య..భారం తగ్గింది

హరిత పన్ను నుంచి ఊరట

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం పన్నుల భారం వేసి రవాణా రంగాన్ని కుదేలు చేస్తే... కూటమి ప్రభుత్వం వారిని ఆదుకుంది. ఈ మేరకు సరకు, ప్రజా రవాణా వాహనాలపై హరిత పన్ను(గ్రీన్ ట్యాక్స్) రూపంలో ఉన్న భారాన్ని తగ్గిస్తూ ప్రభుత్వం తాజాగా ఆర్డినెన్స్ జారీ చేసింది.

రెండు స్లాబ్ విధానంలోనే.. ఉమ్మడి జిల్లాలో రవాణా వాహనాలు సుమారు 64 వేల వరకు ఉన్నాయి. సరకు, ప్రజా రవాణా వాహనాలు ఏడేళ్ల తర్వాత సామర్థ్య పత్రం పొందాలంటే ఏటా హరిత పన్ను చెల్లించాలి. ఇది రూ. 200 మాత్రమే ఉండేది. గత ప్రభుత్వం 2022లో భారీగా పెంచింది. 7 నుంచి పదేళ్ల వాహనాలకు సగం, 10 నుంచి 12 ఏళ్ల వాటికి పూర్తిగా, 12 ఏళ్లు దాటితే రెండు రెట్లు త్రైమాసిక పన్నుల విలువ మేర చెల్లించేలా ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆయా కేటగిరీ, వాటి వయస్సు బట్టి రూ. 800 నుంచి గరిష్ఠంగా రూ. 20 వేల వరకు ఏటా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా మూడురెట్లకు పైగా పెంచింది. అప్పట్లో ఈ బాదుడు వల్ల ప్రభుత్వానికి రూ. 13 కోట్ల వరకు ఆదాయం సమకూరిందని అంచనా. ఇలా ఇష్టానుసారంగా పన్నులు పెంచడంతో పాటు బాడుగులు సక్రమంగా లేక లారీల యజమానులు ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. కొంత మంది లారీలను విక్రయించి డ్రైవర్లుగా చేరారు. భారీగా పెంచిన పన్నులు తలకుమించిన భారంగా ఉన్నాయని లారీ యజమానులు ఎన్నికల ముందు యువనేత లోకేశ్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఇచ్చిన హామీ మేరకు హరిత పన్ను సవరించి ఏడాదికి రూ. 1,500, రూ. 3 వేలు చొప్పున రెండు స్లాబ్‌ల్లో చేసేలా కూటమి ప్రభుత్వం కొత్త విధానం తీసుకొచ్చింది. ఇది లారీ యజమానులకు భారీగా ఊరట కలిగించిందని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి నన్నపనేని సత్యనారాయణ తెలిపారు.

చిత్రకళను ప్రోత్సహించాలి

ప్రఖ్యాత చిత్రకారుడు రాజశేఖరన్ పరమేశ్వరన్‌కు చిత్రపటాన్ని బహూకరిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: చిత్రకళను అందరూ ప్రోత్సహించాలని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. భీమవరం ఆర్ట్స్ సొసైటీ, విజయవాడ ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ఆధ్వర్యంలో భీమవరంలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో భారతీయ కళా దర్శకుడు, రెండు సార్లు గిన్నిస్ ప్రపంచ రికార్డులు సాధించిన రాజశేఖరన్ పరమేశ్వరన్ పర్యవేక్షణలో చిత్ర ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ చిత్రాన్ని ప్రదర్శించగా.. దాన్ని ఆయన తిలకించి మాట్లాడారు. చిత్రకారుల కళా నైపుణ్యం, సామర్థ్యం ఎనలేనిదన్నారు. భూపతిరాజు గోపరాజు(జిన్నూరు), అనుపోజు వరప్రసాద్ (ఏలూరు), కె.సతీష్ (వేల్పూరు), నందిగం సాగర్ (నరసరావుపేట), గొర్లె దుర్గారావు (శ్రీకాకుళం), నిమ్మల సాయినాథ్‌రామ్ (దొడ్డనపూడి), కొత్తపల్లి సీతారామరాజు (భీమవరం) తదితరులు వేసిన చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. కాస్మోపాలిటన్ క్లబ్ అధ్యక్షుడు అల్లూరి పద్మరాజు, కార్యదర్శి పెన్మెత్స వెంకట రామరాజు, ముదునూరి సుబ్బరాజు, కోసూరి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకో దండం.. అడుగేస్తే గండం

అభివృద్ధికి నోచుకోని ప్రత్తిపాడు-బాదంపూడి మార్గం

జువ్వలపాలెం వద్ద ఇలా..

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే

అడుగడుగునా అగాథాలతో ప్రమాద ఘంటికలు మోగిస్తున్న ఆ రోడ్డు పేరు చెబితేనే ప్రయాణికులు వణికిపోతున్నారు. ఒక గొయ్యి తప్పించే లోపే మరో గొయ్యి ఇలా దారి పొడవునా ఉన్న గుంతలను తప్పించేందుకు చోదకులు ప్రయాసపడాల్సి వస్తోంది. అతుకుల బొంతను తలపిస్తున్న ప్రత్తిపాడు - బాదంపూడి రోడ్డులో ప్రయాణమంటే ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.

తాడేపల్లిగూడెం పట్టణం మీదుగా వెళ్లే ప్రత్తిపాడు-బాదంపూడి రోడ్డు సుమారు 12 కి.మీ. పొడవు ఉంటుంది. ప్రతిరోజు సగటున ఈ మార్గంలో 25 వేలకు పైగా చిన్న, పెద్ద వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గతంలో గోదావరి పుష్కరాల సమయంలో ఈ మార్గంలో నూతన రహదారి నిర్మాణం జరిగింది. మళ్లీ పుష్కరాలు సమీపిస్తున్నా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఫలితంగా 12 కి.మీ. పరిధిలో వందల సంఖ్యలో గుంతలు ఏర్పడ్డాయి. కిందటి వైకాపా ప్రభుత్వం అప్పుడు రోడ్డు వేస్తాం ఇప్పుడు రోడ్డు వేస్తామంటూ ఐదేళ్ల పాటు కాలయాపన చేసింది. ఎన్నికల వేళ నూతన రహదారి నిర్మాణానికి రూ. 6.90 కోట్లు కేటాయిస్తూ హడావుడిగా శంకుస్థాపనలు చేసి ప్రజలను మభ్యపెట్టారు. చివరకు పైపైన గోతులు పూడ్చి వదిలేశారు. దీంతో రాకపోకలకు వాహన చోదకులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు.

మరమ్మతుల మాయాజాలం

వైకాపా ప్రభుత్వం రోడ్డు వేయడం పక్కన పెడితే గుత్తేదారులకు లబ్ధి చేకూర్చే విధంగా వ్యవహరించింది. ఐదేళ్ల కాలంలో కేవలం రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చేందుకే రూ. 1.02 కోట్లు ఖర్చు చేసింది. అప్పటి అధికారులు, పాలకులు చేతివాటం ప్రదర్శిస్తూ మరమ్మతుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చారు. నిబంధనలు పక్కన పెట్టి గోతుల్లో పైపైన పూతలు పూసి మరమ్మతుల మాయాజాలం ప్రదర్శించారు. చివరకు గ్రావెల్, మట్టితో కూడా గోతులను పూడ్చిన సందర్భాలు ఉన్నాయి.

పడాల వద్ద బస్సు వెళ్తుంటే పైకి లేస్తున్న దుమ్ము

రోడ్డు నిర్మాణానికి చర్యలు

ఇటీవల రహదారిపై ఉన్న గుంతలను చాలా వరకు పూడ్చటం జరిగింది. ఈ మార్గంలో నూతన రహదారి నిర్మాణానికి కృషి చేస్తాం. -రవి, ఆర్‌అండ్‌బీ ఏఈ

లెక్కలు నేర్వాలి.. సామర్థ్యాలు పెరగాలి..!

పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ 2024 నివేదికలో వెల్లడి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: జాతీయ విద్య పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ పేరిట విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై నివేదికను ఇటీవల విడుదల చేసింది. గతేడాది డిసెంబరులో ఎన్‌సీఈఆర్టీ జిల్లాలో మూడు, ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థులకు మాతృభాష, గణితం, పరిసరాల పరిజ్ఞానం, సామాన్య సాంఘిక శాస్త్రాల్లో పరీక్ష నిర్వహించారు. దానికి సంబంధించి వెలువడిన ఫలితాల్లో ఎక్కువ అంశాల్లో జిల్లా సగటు రాష్ట్ర, జాతీయ సగటు కంటే తక్కువగా ఉండటం గమనార్హం. ఆయా విభాగాల్లో ఇంకా మెరుగు పడాల్సి ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

వివిధ సబ్జెక్టుల్లో సగటు స్కోరు ఇలా..

తరగతి	పాఠ్యాంశం	జిల్లా	రాష్ట్రం	జాతీయ
మూడో	మాతృభాష	63	64	64
	గణితం	59	61	60
ఆరో	మాతృభాష	46	48	57
	గణితం	39	41	46
	ఈవీఎస్	39	40	49
తొమ్మిదో	మాతృభాష	47	50	54
	గణితం	34	35	37
	సైన్సు	34	36	40
	సోషల్	35	37	40

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఏలూరు జిల్లాలో జాతీయ బృందం మొత్తం 115 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను పరిశీలించింది. 3, 6, 9వ తరగతులకు చెందిన 2,903 మంది విద్యార్థులు, 420 మంది ఉపాధ్యాయులపై సర్వే చేసి నివేదిక రూపొందించింది. పశ్చిమగోదావరి జిల్లాలో 104 పాఠశాలల్లోని 2,813 మంది విద్యార్థులు, 378 మంది ఉపాధ్యాయులపై సర్వే చేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల్లో కొందరు లెక్కలు సరిగ్గా చేయడం లేదు. గణితంలో 40 శాతం దాటలేదు. ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థుల కంటే మూడో తరగతి విద్యార్థులే మెరుగ్గా కనిపించారు. వారు రెండు జిల్లాల్లోనూ 59 స్కోరు దాటారు. ఆరు, తొమ్మిది తరగతి వారు 50 స్కోరు దాటకపోవడం గమనార్హం. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించి వారిలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాల్సిన ఆవశ్యకత సర్వే తేటతెల్లం చేసింది.

ఎరువుల అతి వినియోగంతో నష్టాలు

రాష్ట్ర సగటుతో పోలిస్తే జిల్లాలో 203 శాతం ఎక్కువ

మార్టేరు, న్యూస్‌టుడే: రసాయన ఎరువుల అతి వినియోగంతో పెట్టుబడి వ్యయం పెరగడం తప్ప ప్రయోజనం ఉండదని మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఎకరాకు సగటున 102 కిలోల ఎరువుల వినియోగంతో రాష్ట్రం దేశంలో 8 స్థానంలో నిలిచిందని. . ఇది ఆందోళన కలిగించే పరిణామని ఆదివారం వెల్లడించారు. దేశంలో సగటున ఎకరాకు 56 కిలోలు వాడుతుండగా ఏపీలో 82 శాతం అధికంగా ఉందన్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే తూర్పుగోదావరి జిల్లాలో సగటున ఎకరానికి 164 కిలోలు (193 శాతం అధికం), పశ్చిమగోదావరిలో 170 కిలోలు (203 శాతం అధికం)వినియోగిస్తున్నారని పేర్కొన్నారు.



(c) eenadu

క్రీడాకారిణులతో అసోసియేషన్ ప్రతినిధులు

బాస్కెట్‌బాల్ బాలికల జట్టు ఎంపిక

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ బాలికల జట్టు ఎంపికను స్థానిక కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. వారు ఆగస్టు 14 నుంచి పిఠాపురంలో జరిగే అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైనవారిలో ఈవీపీ జయశ్రీ, వి.యామిని, ఎ.రుత్విక, జి.పూజిత, డి.సాయి భవాని, పి.నందిని, బి.దేవిశ్రీ, జి.సరిత, ఎస్.ఖుషీ హాసిని, డి.సాయి శ్రీలాస్య, ఎ.రియా, పి.శాంతిసులోచన ఉన్నారు.

మీరూ వ్యాపారవేత్తలు కావచ్చు..!

పీఎంఈజీపీ పథకంలో యువతకు అవకాశాలు

నూజివీడు, న్యూస్‌టుడే: వ్యాపారం చేయాలనే ఆసక్తి ఉందా.. పెట్టుబడికి రుణం పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా.. ఇలాంటి సమస్యలకు పీఎంఈజీపీ (ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పట్టభద్రులైన యువత వ్యాపారం నెలకొల్పి పలువురికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో దీనికి రూపకల్పన చేశారు. ఈ పథకం ద్వారా అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చు. ఇందుకుగానూ https:///www.kviconline.gov.in/pmegpeportal/pmegphome/index.jsp వెబ్‌సైట్‌లో అప్లికేషన్ ఫర్ న్యూ యూనిట్ అనే దానిపై క్లిక్ చేస్తే రుణ దరఖాస్తు ప్రత్యక్షమవుతుంది. మోడల్ ప్రాజెక్ట్‌లపై క్లిక్ చేస్తే 1056 వ్యాపార ఆలోచనల ప్రాజెక్టు పీడీఎఫ్ వివరాలు వస్తాయి. వాటిలో ఏదైనా ఒకదాన్ని ఎంచుకుని ప్రాజెక్టుతో రుణ ఫారం దరఖాస్తు పూర్తి చేయాలి.

ఆన్‌లైన్ పోర్టల్ ముఖ చిత్రం

రూ.లక్ష నుంచి రూ.50లక్షల వరకు.. ఈ పథకంలో చిన్న వ్యాపారాలు మొదలుకుని మధ్య తరహా పరిశ్రమ స్థాయి వరకు రుణాలు ఇస్తారు. పాత పరిశ్రమల నవీకరణ కోసం మాత్రం రుణం ఇవ్వరు. నెగిటివ్ పరిశ్రమల జాబితాలో ఉన్న వాటికి ఈ పథకం వర్తించదు. 2026 వరకు దీనిని అమలు చేయనున్నారు. 18 ఏళ్ల వయస్సు, 8వ తరగతి విద్యార్హత ఉంటే చాలు. స్వయం సహాయక బృందాలు అనగా ఇతర పథకాల కింద ప్రయోజనం పొందని బీపీఎల్‌కు చెందిన వారు అర్హులు. ఒక కుటుంబం నుంచి ఒక వ్యక్తి మాత్రమే అర్హుడు. కొత్త యూనిట్ నెలకొల్పడానికి రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు రుణం అందిస్తుంది. నిరుద్యోగ యువతకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో రుణ పరిమితిని రూ.50 లక్షల వరకు పెంచారు.

రాయితీ ఇలా... ఈ పథకం కింద పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే యూనిట్లకు 25 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో వారికి 35 శాతం రాయితీ ఉంది.

మునకేసి.. పట్టేసి!

చిత్రంలోని నల్లని నీటికోళ్లను చూశారా.. అవలీలగా నీటిలో మునకేసి ఒడుపుగా చేపను పట్టేస్తుంది. దీనిని లిటిల్ కార్మోరాంట్ అని పిలుస్తారు. శాస్త్రీయనామం ఫాలక్రోకొరాక్స్ నైజర్. ఇది ఆహారం కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో గంట నుంచి రెండుగంటల పాటు నీటిలో వేట కొనసాగిస్తుంది. బయటకొచ్చి శరీరాన్ని ఆరబెట్టుకుంటుంది. తర్వాత ఆహారాన్ని ఆయిల్ ద్రావణాన్ని ముక్కుతో తీసి వెంట్రుకలకు రాసుకుంటుంది. దాని మూలంగా ఉత్తేజితమవుతూ మెరుస్తుంది, తాజా పట్టిన చేపలను తింటుందని ఫారెస్ట్ బీట్ అధికారి రాజేశ్ తెలిపారు. పొడవు 51 సెంటీమీటర్లు, బరువు 600 నుంచి 800 గ్రాముల వరకు ఉంటుంది. కొల్లేరులో ఇవి ఎనిమిది వేల వరకు ఉన్నాయన్నారు. కైకలూరు మండలం ఆటపాక సమీపంలోని పోల్‌రాజ్‌కెనాల్‌లో 'ఈనాడు' కెమెరాకు చిక్కిన చిత్రాలివి.

- ఈనాడు, ఏలూరు

మాజీ ఎమ్మెల్యే మాణిక్యరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తూ..

సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: విశ్రాంత అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారావు అన్నారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని స్థానిక సీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే ఎంబీ మాణిక్యరావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కృష్ణారావు మాట్లాడుతూ విశ్రాంత అధ్యాపకులకు డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీఆర్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి ఆర్‌ఎస్ నరసయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ జె.గంగాధరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోటలో అధిక వర్షం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో శనివారం ఉదయం 8.30 నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల మధ్యలో 7.5 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైందని సీపీవో వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. కామవరపుకోట మండలంలో అధికంగా 78.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా ఇలా.. పెదవేగి 47.4, ఆగిరిపల్లి 18.4, దెందులూరు 16.2, చాట్రాయి 15.4, లింగపాలెం 13.8, ముదినేపల్లి 7.6, ఏలూరు అర్బన్ 4.2, ద్వారకాతిరుమల 3.4, జంగారెడ్డిగూడెం 2.4, జీలుగుమిల్లి 2.0, పోలవరం 1.0, కలిదిండి 0.2, బుట్టాయగూడెం 0.2.

ఫస్ట్ అయినా.. సెకండైనా మేమే..

ముదినేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పేరూరు శివారు తెలగాపేట ప్రాథమిక పాఠశాలలో పరిస్థితి ఇది. ఇక్కడ ప్రస్తుతం ఒక ఉపాధ్యాయుడు, ఇద్దరు విద్యార్థులు మాత్రమే మిగిలారు. గతేడాది అయిదుగురు ఉండగా ముగ్గురు ఆరో తరగతి చేరేందుకు వెళ్లిపోయారు. గ్రామంలో బడి ఈడు పిల్లలు మరెవరూ లేరని ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు తెలిపారు. చేపల చెరువులపై కాపలాకు వలస వచ్చిన వారిలో ఎవరైనా ఉన్నారేమో వివరాలు తెలుసుకుంటున్నామని వివరించారు.

ఉన్న ఇరువురు విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

క్రమశిక్షణ, కఠోర సాధనతోనే విజయం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నేటి యువత ప్రతికూల ఆలోచనా విధానాన్ని విడిచి పెట్టి క్రమశిక్షణ, కఠోర సాధనతో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని యూపీఎస్సీ పరీక్షలో జాతీయ స్థాయి 11వ ర్యాంకు సాధించిన ట్రిపుల్ ఐటీ పూర్వ విద్యార్థిని సాయి శివాని తెలిపారు. ఆదివారం నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహించిన 'యూపీఎస్సీ ప్రేరణ వ్యూహ శిబిరం' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ ఆమెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సాయి శివాని జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2016 నుంచి 2022 సంవత్సరాల మధ్య ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ఈసీఈ విభాగంలో చదివినట్లు చెప్పారు. ముఖ్యంగా సోషల్ మీడియాను ఎంత వరకు ఉపయోగించుకోవాలో అవగాహన ఉండాలన్నారు. జాతీయ స్థాయిలో యూపీఎస్సీ పరీక్ష ద్వారా 23 సర్వీసులకు ఎంపికయ్యే అవకాశం ఉందని వివరించారు. ఎన్సీఈఆర్టీ పుస్తకాలను చదివి బేసిక్స్ నుంచి బలమైన కాన్సెప్ట్‌లను నిర్మించుకోవాలని సూచించారు. యూపీఎస్సీలో విజయం సాధించిన విజేతల మనోగతాలను, ప్రిపరేషన్ విధానాన్ని పరిశీలించాలన్నారు.

ఫలాలపై కాకుండా ప్రక్రియపై..

ఫలాలపై కాకుండా ప్రక్రియపై దృష్టి పెట్టాలని సాయి శివాని సూచించారు. మీ శ్రమను ఆధారం చేసుకుని మీకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవడానికి ప్రయత్నించాలని, మన కలలను సాధించడానికి ఎన్నో త్యాగాలు చేయాలని, ఎక్కువ సమయం పుస్తక పఠనంలో, రివిజన్‌లో గడపాలన్నారు. రోజూ చదువుతున్న చదువుపై అదనంగా మూడు, నాలుగు గంటలు చదవాలని సూచించారు. కోచింగ్ కంటే స్వీయ అధ్యయనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇంటర్వ్యూలో వ్యక్తిగత వివరాలతో పాటు సత్వర నిర్ణయాలు, ప్రజెంటేషన్, స్పష్టత అనే అంశాలు ప్రాధాన్యత కలిగి ఉంటాయన్నారు. వ్యక్తిగత జీవితం, తల్లిదండ్రులు తనకు స్ఫూర్తిగా నిలిచిన విధానం, ప్రివెన్షన్ పద్ధతి, ఇంటర్వ్యూ విధానం తదితర అంశాలను చెప్పి విద్యార్థులను ఆకట్టుకున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ ఆమెను జ్ఞాపిక, శాలువాతో సన్మానించారు. పీయూసీ విద్యార్థులు పెన్సిల్‌తో గీసిన సాయి శివాని చిత్రపటాన్ని ఆమెకు బహూకరించారు. ఏవో లక్ష్మణరావు, డీన్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సాయి శివానిని సత్కరిస్తున్న ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్

26న గిరి ప్రదక్షిణ మార్గం ప్రారంభం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవారి క్షేత్రంలో పారిశ్రామికవేత్త గోకరాజు గంగరాజు వితరణతో నిర్మించిన గిరి ప్రదక్షిణ మార్గం ఈ నెల 26న ఉదయం ప్రారంభించనున్నారు. అహోబిల మఠం పీఠాధిపతి అహోబిల రామానుజ జీయర్‌స్వామి గిరి మార్గాన్ని శనివారం ఉదయం 10.38 గంటలకు శాస్త్రోక్తంగా ప్రారంభిస్తారని ఈవో కె.శ్రీనివాస్, అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పేరిచర్ల జగపతిరాజు తెలిపారు. పారిజాతగిరి కొండ చుట్టూ సుమారు 2.5 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డును గోకరాజు గంగరాజు సుమారు రూ.60 లక్షలు వెచ్చించి నిర్మించారు. చాలా కాలంగా పారిజాతగిరి చుట్టూ ప్రదక్షిణ ఏర్పాటు చేయాలని అభివృద్ధి కమిటీ ప్రయత్నాలు చేస్తోంది. ఇవి ఎట్టకేలకు కార్యరూపం దాల్చాయి.

గిరి ప్రదక్షిణ సందర్భంగా ఈ నెల 26 శనివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవం ఉంటుందని ప్రధాన అర్చకుడు రవికుమారాచార్యులు తెలిపారు. గిరి ప్రదక్షిణ చేసేందుకు ఆసక్తి ఉన్న భక్తులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఇందులో పాల్గొనవచ్చని ఈవో తెలిపారు. శనివారం నాడు ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

పూజల్లో ఎమ్మెల్యే రామాంజనేయులు

మావుళ్లమ్మ, కనకదుర్గమ్మ జాతర ఊరేగింపు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మావుళ్లమ్మ ఆషాఢమాసం ఉత్సవాల్లో భాగంగా 36వ వార్డులో మావుళ్లమ్మ, కనకదుర్గమ్మ 45వ జాతర ఊరేగింపును ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆదివారం ప్రారంభించారు. అమ్మవారి ప్రతిమతో ప్రధాన వీధుల మీదుగా రాత్రి వరకు ఊరేగింపు నిర్వహించారు. మెంటేపల్లి వారి వీధి 20వ వార్డులో జాతరను మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. 23వ వార్డు చిన్నివారి వీధిలో మావుళ్లమ్మ, పుంతలో ముసలమ్మవార్ల జాతర శ్రీరామ బాలభక్త యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. 3వ వార్డులో జాతర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపులో భక్తులు అమ్మవారికి హారతులు ఇచ్చి నైవేద్యాలు సమర్పించారు.

ట్రిపుల్ ఐటీలో తెలుగు అధ్యాపకుల ఆందోళన

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీలో తెలుగు అధ్యాపకులు తమకు అన్యాయం జరుగుతోందంటూ గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఆదేశాలను తీసుకొచ్చినా పాటించకుండా యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఆదివారం ఆందోళన చేపట్టారు. ట్రిపుల్ ఐటీలో బీటెక్ తెలుగు కోర్సును 2023 వరకు నిర్వహించారు. గత ఏడాది అకడమిక్ కౌన్సిల్ నిర్ణయంతో పూర్తిగా తెలుగు సబ్జెక్టును తీసేశారు. దీంతో ముగ్గురు అధ్యాపకులకు పని లేకుండా పోయింది. అధికారులు వారికి పీయూసీ సబ్జెక్టులు బోధించాలని సూచించారు. అప్పటికే (పీయూసీ)లో ఆరుగురు తెలుగు మెంటార్లు విధుల్లో ఉన్నారు. గతంలో 18 గంటలు ఉండే పని గంటలు 12కు తగ్గాయి. దీంతో అధికారులు 2024లో పీయూసీ బోధించే అధ్యాపకులు వారానికి 24 గంటలు బోధించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ సమయంలో ఇక్కడ సిబ్బంది అధికంగా ఉన్నారని పీయూసీ మెంటార్లను ఒంగోలు, శ్రీకాకుళం పంపారు. దీని పైన బీటెక్ సహాయ ఆచార్యుల వల్ల తెలుగు మెంటార్లకు అన్యాయం జరుగుతోందని, ఈ ఆదేశాలను వ్యతిరేకిస్తూ మార్చి 2024లో హైకోర్టును ఆశ్రయించారు. విధుల్లో ఆఖరున చేరిన వారు ముందు బయటకు వెళ్లాలని న్యాయస్థానం సూచించింది. అధికారులు ఈ ఆదేశాలను పాటించకుండా మళ్లీ పీయూసీ తెలుగు అధ్యాపకులను వేధించడం ప్రారంభించారు. ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు బీటెక్ అధ్యాపకులను కాకుండా పీయూసీ మెంటార్లను వెళ్లాలని చెప్పడంతో మరోసారి వివాదం తలెత్తింది. ఈ విషయమై డైరెక్టర్ అమరేంద్రకుమార్‌ను వివరణ కోరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వెనుక బెంచీ విద్యార్థులుండరిక

నేడు నుంచి కొత్త విధానం అమలు

నిడమర్రు, న్యూస్‌టుడే: అక్షరాస్యతా శాతంలో కేరళ ప్రథమ స్థానంలో ఉంటుంది. కేరళ నుంచి తీసుకొచ్చిన ఉపాధ్యాయులతో మన విద్యార్థులకు విద్యాబోధన చేయిస్తుంటారు. తాజాగా అక్కడి పాఠశాలల్లో ఎవరూ వెనుక బెంచీ విద్యార్థులు ఉండకుండా వినూత్న కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులందరినీ 'యు' ఆకారంలో కూర్చోబెట్టి బోధన చేస్తున్నారు. దీంతో అక్కడ ఆ కార్యక్రమం సత్ఫలితాలనిచ్చింది. దీంతో మన జిల్లాలో కూడా అటువంటి విధానం అవలంబించాలని డీఈవో వెంకట లక్ష్మమ్మ డీవైఈవోలకు, ఎంఈవోలకు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ నెల 21 నుంచి అనుకూలంగా ఉన్న పాఠశాలల్లో ఈ విధానం అమలు చేయాలని తెలిపారు. దీని వల్ల ఏ ఒక్కరూ తాను వెనుక బెంచీ విద్యార్థి కానని అందరూ సమానమేనన్న భావన ప్రతి ఒక్కరిలో కలుగుతుంది. జిల్లాలో 1801 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక, గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో వీలున్న వాటిలో పిల్లలను యూ ఆకారంలో కూర్చోబెట్టి విద్యాబోధన చేస్తే చదువుపై శ్రద్ధ, ఆసక్తి పెరుగుతుందని భావిస్తున్నారు 'జిల్లాలో తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఈ విధానం అమలు చేయటానికి అవకాశం ఉంది. మిగిలిన పాఠశాలల్లో వారి సౌలభ్యాన్ని బట్టి అమలు చేయాలనుకుంటున్నాం' అని డీఈవో వెంకట లక్ష్మమ్మ చెప్పారు.

వీడని బంధం.. ఒకరి వెంట మరొకరు..!

పోలవరంలో భార్యాభర్తలు మృతి

చాట్రాయి, న్యూస్‌టుడే: కష్టాలైనా.. కన్నీళ్లయినా.. కలసి జీవించారు. నలభై ఏళ్ల సహచర్యాన్ని పంచుకున్న భార్య మృతితో తట్టుకోలేని భర్త గంట తేడాలోనే ప్రాణాలొదిలిన ఘటన పోలవరం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. తేళ్లూరి వెంకటేశు(63), ఏసు పాప(55) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు. వెంకటేశు మూడు రోజుల కిందట అస్వస్థతకు గురవగా విజయవాడలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. ఇంట్లో భార్య ఏసుపాప ఇరువురు మనవళ్లతో ఉండగా ఆదివారం తెల్లవారుజామున ఆమె మృతి చెందింది. సమాచారం తెలిసిన గంటలోనే వెంకటేశు ఆకస్మికంగా మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

వెంకటేశు, ఏసుపాప

కాలువలో పడి యువకుడు..

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని మర్రిబంధానికి చెందిన చిక్కాల నరేంద్ర(25) ఆదివారం పోలవరం కాల్వలో పడి మృతి చెందాడు. మర్రిబంధం సమీపంలో పడిపోగా ఆగిరిపల్లి మండలంలో మృతదేహం బయటపడింది. ఉల్లిపాయల వ్యాపారం చేసే నరేంద్ర మృతి కుటుంబ సభ్యులను, గ్రామస్థులను కలచి వేసింది. కాల్వలో పడి మృతి చెందడానికి గల కారణాలు తెలియలేదు. రూరల్ పోలీసులకు ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఫిర్యాదు చేసేందుకు కుటుంబ సభ్యులు వచ్చారు. మృతదేహం ఉన్న ప్రదేశాన్ని పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారుల సూచనల మేరకు కేసు నమోదు చేస్తామని హెచ్‌సీ అజయ్ తెలిపారు.

చిక్కాల నరేంద్ర

రైలు ఢీకొని ఒకరి.. భీమడోలు, న్యూస్‌టుడే: భీమడోలు రైల్వే గేటు సమీపంలో రైలు ఢీకొని ఒక వ్యక్తి ఆదివారం మృతి చెందాడని రైల్వే ఎస్‌ఐ సైమన్ ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడు ద్వారకాతిరుమల మండలం సత్తెనగూడెం గ్రామానికి చెందిన కొత్తపల్లి అశోక్(32)గా గుర్తించారు. మృతదేహాన్ని శవ పరీక్ష కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

తణుకు, న్యూస్‌టుడే: వెనుక నుంచి వేగంగా వచ్చిన మినీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం తణుకు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. తేతలి గ్రామానికి చెందిన గుంటూరి సూర్యకుమారి (38), ఆమె పిన్ని భూపతిరాజు లక్ష్మీ ద్విచక్ర వాహనంపై డీమార్ట్‌కు వెళ్లే క్రమంలో పాత టోల్‌గేట్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా పెరవలి వైపు నుంచి తణుకు వైపు వస్తున్న వాహనం ఢీకొట్టడంతో సూర్యకుమారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను తణుకు జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. లక్ష్మీ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద ఘటనపై పట్టణ ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.80 లక్షలకు టోకరా?

ఆకివీడు, న్యూస్‌టుడే: ఓ మహిళ ఉద్యోగాలు ఇప్పిస్తానని సుమారు రూ.80 లక్షలకు టోకరా వేసిన ఘటన ఆకివీడులో వెలుగులోకి వచ్చింది. స్థానిక సాలిపేట ప్రాంతంలో నివాసముంటూ తాను చార్టెడ్ అకౌంట్ (సీఏ) చేశానంటూ, ఉద్యోగాలు వేయిస్తానని నిరుద్యోగులను నమ్మించారు. అది నిజమనుకుని పలువురు ఆమెకు దఫదఫాలుగా రూ.లక్షల్లో ఇచ్చారు. చివరకు ఆమె మోసం చేసింది అని గుర్తించిన బాధితులు ఒక్కొక్కరు బయటకు వస్తున్నారు. న్యాయం చేయాలని స్థానిక నాయకులను ఆశ్రయిస్తున్నారు. ఈ విషయంలో మహిళ భర్త తనకు ఏమీ తెలియదంటూ తప్పించుకుంటున్నారని బాధితులు చెబుతున్నారు. వీరు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తుంది.

ఉరేసుకొని ఉపాధ్యాయిని ఆత్మహత్య..!

బ్లేడుతో కాళ్లు చేతులు కోసుకున్న భర్త

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆ దంపతులిద్దరూ ఉపాధ్యాయులు.. వారికి ఇద్దరు పిల్లలు.. సాఫీగా సాగిపోతున్న సంసారం.. ఇద్దరూ అన్యోన్యంగా ఉంటారని స్థానికులు, బంధువులు చెబుతున్నారు.. ఈ నేపథ్యంలో ఇంట్లోనే భార్య ఉరేసుకొని మృతి చెందడం, అది జీర్ణించుకోలేక ఆమె భర్త బ్లేడుతో కాళ్లు, చేతులు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు నగర శివారు చొదిమెళ్లలోని ఓ అపార్టుమెంట్లో నివాసముంటున్న మందాడ దేవిక (38), చిన్ని సురేంద్ర దంపతులిద్దరూ ఉపాధ్యాయులు. వారికి ఇంటర్, పదో తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులు న్నారు. దేవిక ఉంగుటూరు మండలం నల్లమాడులో పని చేస్తుండగా సురేంద్ర అదే మండలం రాచూరులోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 19న దేవిక పుట్టిన రోజు. యథావిధిగా ఇద్దరూ విధులు ముగించుకొని రాత్రికి ఇంటికి చేరుకున్నారు. సురేంద్ర ఇంటికి వచ్చే సమయానికి ఇల్లు తాళం వేసి ఉండటంతో, తన వద్ద ఉన్న తాళం చెవితో తెరిచి చూడగా దేవిక ఫ్యానుకు ఉరేసుకొని వేలాడుతూ కనిపించింది.

దేవిక, సురేంద్రబాబు (పాత చిత్రం)

జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్యాయత్నం

భార్య మృతిని జీర్ణించుకోలేని సురేంద్రబాబు బ్లేడుతో చేతులు, కాళ్లను కోసుకున్నారు. ఆ రక్తంతో భార్య నుదుటిపై తిలకం దిద్దారు. ఆ తర్వాత గోడపై 'ఐ లవ్ యు దేవిక' అని, బాగా చదువుకొని జాగ్రత్తగా ఉండాలంటూ పిల్లలకు సూచిస్తూ రక్తంతో రాశారు. ఆ తర్వాత అలానే ఉండిపోయారు. శనివారం రాత్రి బాగా పొద్దుపోయాక గుర్తించిన స్థానికులు ఆయన్ను ఆసుపత్రిలో చేర్పించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న దేవిక తల్లిదండ్రులు, బంధువులు ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రస్తుతం సురేంద్ర చికిత్స పొందుతున్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు ఆదివారం ఆసుపత్రికి చేరుకొని పరామర్శించారు.

పిల్లలను బాగా చదివించాలంటూ..

దేవిక చనిపోయే ముందు తన గదిలో బోర్డుపై 'అమ్మా నాన్న ఐ లవ్ యు, భర్తను ఉదహరించి లవ్ యూ చిన్నా అంటూ.. పిల్లలను బాగా చదివించి ఐఐటీలో చేర్పాలని, తాను బాగానే చదువుకున్నానని, పిల్లలు కూడా ప్రయోజకులు కావాలని' మార్కర్‌తో రాశారు. అనంతరం సురేంద్రబాబు కూడా అదే బోర్డుపై పిల్లలనుద్దేశించి బాగా చదవాలని.. ఏటీఎం పిన్ నంబర్లను రాశారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు

ఈ కేసును పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సీఐ సత్యనారాయణ, గ్రామీణ ఎస్సై దుర్గాప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దేవిక మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి శవాగారానికి తరలించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై సురేంద్రను ఆరా తీశారు. అనంతరం సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పలేదని భర్తపై అలిగి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలిసిందన్నారు. ఇంకా ఏమైనా బలమైన కారణాలున్నాయా అనే దానిపై విచారణ చేస్తామన్నారు. అయితే తమ కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని దేవిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ ఉభయ జిల్లాల సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. సంఘంలో సభ్యులుగా ఉన్న బోధనేతర సిబ్బంది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జయరామ్, ఉపాధ్యక్షుడిగా యోసేపు, ప్రధాన కార్యదర్శిగా కృపారావు, సంయుక్త కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా శ్రీనివాసరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు నూతన కార్యవర్గాన్ని సత్కరించారు.

రెండు బిల్లులు ఒకేసారి సమర్పించేలా..

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఈ ఏడాది జూన్ నెలలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు సప్లిమెంటరీ జీతాల బిల్లులతోపాటు రెగ్యులర్ జీతాల బిల్లులు ఒకేసారి సమర్పించేలా రాష్ట్ర ఖజానా శాఖ సంచాలకుడు చొరవ చూపాలని ఏపీటీఎఫ్-1938 రాష్ట్ర అకడమిక్ కన్వీనరు జి.కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఇ.రామ్మోహన్ ఒక ప్రకటనలో కోరారు. కొంతమంది డీడీవోలు బదిలీ అయిన ఉపాధ్యాయులకు బకాయి జీతాల బిల్లులు చేసే అవకాశం ఉన్నా బిల్లులు చేయకుండా వేధిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా వ్యవహరిస్తున్న డీడీవోలపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -112 రిటైల్ ధర 134 చికెన్ విత్ స్కిన్ - 194, చికెన్ స్కిన్‌లెస్ - 221.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, 129, 140 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 238.

అన్నామంతే.. చేశామింతే!

పునాదుల్లోనే వైద్య కళాశాల నిర్మాణం

వైకాపా సర్కారు వైఫల్యాలే కారణం

ఈనాడు డిజిటల్, భీమవరం, భీమవరం టూటౌన్, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు పునాదుల దశ దాటని ఎన్నో నిర్మాణాలు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఆ కోవలోకే పాలకొల్లులోని వైద్య కళాశాల నిర్మాణం చేరుతుంది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పార్లమెంటు నియోజకవర్గానికో వైద్య కళాశాల మంజూరు చేశామంటూ ఊదరగొట్టినా పూర్తి చేసేందుకు మాత్రం ముందుకు రాలేదు.

ఈ చిత్రం ఊరి చివరన కొండ ప్రాంతం కాదు. వైద్య కళాశాల నిర్మాణానికి పునాదుల కోసం తీసిన గోతులు. కాంక్రీటు పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ఇలా మారింది.

నాడు-నేడుతో వైద్య, ఆరోగ్య రంగంలో పెనుమార్పులు తీసుకొస్తామని 2021లో పాలకొల్లులో వైద్య కళాశాల నిర్మాణానికి దగ్గులూరు సమీపంలో 61 ఎకరాలు సేకరించారు. రూ.475 కోట్ల అంచనాతో చేపట్టి సుమారు రూ.60 కోట్ల పనులు మాత్రమే చేశారు. 2023 నాటికి పూర్తి కావాల్సి ఉండగా.. నిధుల సమస్యతో పునాదుల్లో మట్టి వేసేందుకే రెండేళ్లు పట్టింది. సేకరించిన స్థలం పూర్తిగా పల్లపు ప్రాంతం కావడంతో చిన్నపాటి వర్షమొచ్చినా నీరు నిలిచిపోతోంది. కొంతకాలంగా పనులు ఆగిపోవడంతో విలువైన నిర్మాణ సామగ్రి తుప్పుపట్టి పోతుంది. కళాశాలలో ప్రవేశాలు, తరగతులు జరగాలంటే 300 పడకల ఆసుపత్రిని అనుసంధానం చేయాల్సి ఉంటుంది. ఆ దిశగా చర్యలు చేపట్టకుండానే భవన నిర్మాణ పనులు చేపట్టడంపై అప్పట్లోనే అనేక అభ్యంతరాలు వచ్చినా పట్టించుకోలేదు. ఫలితంగా రూ.కోట్ల సొమ్ము పునాదులకే పరిమితమవుతుంది.



తుప్పు పడుతున్న ఇనుము

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

PEOPLE CARE

OLD AGE HOME

స్వామి వివేకానంద గ్రూప్, VJA, శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99590 21122, 99590 31122.

రామకృష్ణ గ్రూప్ (AP No.1) VJA వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 96038 42233, 97054 72233.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం (TG No.1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119570, 8639120683.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం - VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ.+ జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5,000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52838.

JOBS

Required Female office Staff well Experience in Computer, Communication & Accounts. Salary- 15 to 20K- Depend on Experience. Contact: 94918 48888, 94418 48888. WhatsApp.

KFC Hiring Part Time/ Full Time Jobs in Tadepalligudem. SSC Pass, Age: 18 to 30 Yrs. Male/Female, Salary CTC 15740/- ✆ 8309225385, 9642101030.

ఉండిలోని ఓ రెస్టారెంట్‌లో పనిచేయడానికి టిఫిన్ మాస్టర్ మరియు సర్వీసు చేసేవారు కావలెను. Ph: 98482 38133. భార్యా భర్తలకు ప్రాధాన్యత ఇవ్వబడును.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం, VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ.+ జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

భీమవరంలో ఫైనాన్స్ కంపెనీ యందు పని చేయుటకు రికవరీ స్టాఫ్ (Male) జీ: 14000 to 16000. Ph: 91339 87779, 96526 74226.

ఆపే ఆటో ఆథరైజ్డ్ డీలర్ ధరణి మోటార్స్ కొరకు ఏలూరు మరియు భీమవరంలలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, HR ఎగ్జిక్యూటివ్స్ కావలెను. వివరాలకు ఫోన్ : 9885185543, 9949452666.

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 9014651068, 7075633416.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.05 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

92.7 FM Rajamahendravaram
92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 6304901226

(c) eenadu

ఏలూరు

•ఏలూరు •దెండులూరు •ఉంగుటూరు

శక్తి యాప్‌పై విస్తృత అవగాహన

విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: శక్తి యాప్ ప్రయోజనాలపై పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పించారు. నగరంలో ఆదివారం సాయంత్రం పలు బాలికల వసతిగృహాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుబ్బారావు, రెండు, మూడో పట్టణ సీఐలు అశోక్ కుమార్, కోటేశ్వరరావు, పలువురు ఎస్సైలు, సిబ్బంది పాల్గొని మహిళల భద్రతకు సంబంధించిన అంశాలు., టెక్నాలజీ వినియోగం, అత్యవసర సమయాల్లో ఎలా అప్రమత్తంగా ఉండాలనే అంశాలపై అవగాహన కల్పించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, న్యూస్‌టుడే : రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా ద్రవ్యాలు, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.89,307 ఆదాయం లభించిందని ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

శివారు ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం: డీఈ

పెదపాడు, న్యూస్‌టుడే: ఏలూరు-కృష్ణ కాలువ పరిధిలోని శివారు గ్రామాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జలవనరులశాఖ డీఈ కొడాలి బాబు తెలిపారు. పెదపాడు మండల పరిధిలోని ఏలూరు-కృష్ణ కాలువలో సాగునీటికి అడ్డంకిగా ఉన్న తూడు, నాచు, గుర్రపుడెక్క తొలగించే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం 'ఈనాడు'లో ఆవరించిన కష్టాలు శీర్షికన వచ్చిన కథనానికి స్పందించి పనులు చేపట్టినట్లు చెప్పారు.

ఈనాడు కథనాలకు స్పందన

చెరువులు నింపేందుకు ప్రత్యేక చర్యలు.. ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏలూరు వన్‌టౌన్‌లోని పంపుల చెరువులను నింపేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నగరంలో ఉన్న మూడు పంపుల చెరువుల్లోని నీరు పూర్తిగా అడుగంటాయి. ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో తాగు, ఇతర అవసరాలకు నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. దీనిపై ఈ నెల 12న 'ఈనాడు'లో 'అడుగంటిన నీళ్లు.. ఉబికొస్తున్న కన్నీళ్లు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ విషయంపై అధికారులు స్పందించి ప్రస్తుతం గోదావరి నీటిని చెరువులోకి పంపింగ్ చేస్తున్నారు. ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. చెరువు ఎండిపోవటంతో ఇదే అదనుగా కొందరు చేపలు పట్టేవారు, గేదెలు చెరువులోకి దిగడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనిని అరికట్టేందుకు కాపలా సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఇప్పటికే చెరువుల్లో సంచరిస్తున్న గేదెలను కూడా పట్టుకున్నారు. చేపలు పట్టినా, గేదెలను చెరువులోకి వదిలినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	దెందులూరు:	80085 74535
భీమడోలు:	80085 74527	గణపవరం:	70939 81613

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ? తంగెళ్లమూడి తపాలా కార్యాలయం సమీపంలో తాగునీటి పైపులైను మరమ్మతుల కోసం గొయ్యి తవ్వి వదిలేశారు. - **ఖాసిం, స్థానికుడు**

✔ గొయ్యిని పూడ్చిస్తాం. - **భానుప్రతాప్, నగరపాలక కమిషనరు**

? మాదేపల్లి వెళ్లే మార్గంలోని గాయత్రి నగర్ 7వ రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. - **సుగుణరావు**

✔ మరమ్మతులు చేయిస్తాం. - **భానుప్రతాప్, నగరపాలక కమిషనరు**

? శ్రీరామ్‌నగర్ 13వ రోడ్డులో మురుగు కాల్వల నుంచి పూడిక తీయడం లేదు. - **పోతురాజు, స్థానికుడు**

✔ పూడిక తీయిస్తాం. - **భానుప్రతాప్, నగరపాలక కమిషనరు**

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ? శ్రీరామ్‌నగర్ 7వ రోడ్డు కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇబ్బంది పడుతున్నాం. - **సుష్మ**

✔ శునకాల సంతతి వ్యాప్తి చెందకుండా శస్త్రచికిత్సలు చేయిస్తున్నాం. - **చంద్రయ్య, అడిషనల్ కమిషనర్**

? శ్రీరామ్‌నగర్‌లో డ్రెయిన్లు ఆక్రమించి ర్యాంపులు కట్టారు. దీంతో మురుగునీరు వెళ్లకుండా నిలిచిపోతుంది. - **వెంకటేశ్వరరావు.**

✔ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించిన ర్యాంప్‌లను తొలగిస్తాం. . డ్రెయిన్లు ప్రక్షాళన చేసి ఇబ్బంది లేకుండా చూస్తాం. - **భాను ప్రతాప్, నగర కమిషనర్.**

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : ? చానమిల్లిలో గ్రామ సచివాలయం సమీపాన డ్రెయినేజీ పూడిపోయి మురుగు కదలడం లేదు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. - **స్థానికులు.**

✔ శుభ్రం చేయిస్తాం. - **సంజీవరావు, పంచాయతీ కార్యదర్శి**

పెదపాడు, న్యూస్‌టుడే: ? వట్లూరు పరిధి పలు కాలనీల్లో విద్యుత్తు తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. - **నవీన్**

✔ చర్యలు తీసుకుంటాం. - **రాంబాబు, విద్యుత్తుశాఖ ఏఈ, పెదపాడు**

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: ? బావాయిపాలెం శివాలయం వెనుక వీధిలో డ్రెయినేజీ పూడిపోయి మురుగు నీరు నిలిచిపోతోంది. - **లహరి, స్థానికురాలు**

✔ పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం. - **స్వామి, ఈవోపీఆర్డీ**

కాలువల్లో కాలకూటం.. ప్రజారోగ్యంతో చెలగాటం

న్యూస్‌టుడే, ఏలూరు గ్రామీణ

కాలువల్లో నీరు కాలకూట విషంలా మారింది. కలుషిత జలాలను సాగు, తాగునీరుగా సరఫరా చేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. పర్యవేక్షించాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

నేరుగా వదిలేస్తున్నారు.. విజయవాడ, ఏలూరు నగరాల్లోని గృహాలు, హోటళ్లు, ఆసుపత్రులు తదితరాల ద్వారా వ్యర్థాలను నేరుగా కృష్ణా ఏలూరు కాలువ, తమ్మిలేరులోకి వదులుతున్నారు. చెత్తతోపాటు ఇతర వ్యర్థాలు కాలువల్లో పారబోస్తున్నారు. కలుషిత జలాలను పంట కాలువలు, మంచినీటి చెరువులు, పొలాల్లో నింపుతుండటంతో మరిన్ని సమస్యలకు కారణమవుతున్నాయి. పాండురంగ థియేటర్ పక్కన ఉన్న జంట పంట కాలువలు, మాదేపల్లి, చాటపర్రు, కొమడవోలు రహదారుల్లోని పంట కాలువలు ఆక్రమించి దీర్ఘ కాలం నుంచి నివాసం ఉంటున్నారు. వారంతా గృహాల్లోని వ్యర్థాలతోపాటు మల మూత్రాలు సైతం గొట్టాల ద్వారా నేరుగా పంట కాలువల్లోకి వదులుతున్నారు. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు.

చెత్త ఇతర వ్యర్థాలతో ఇలా..

వ్యాధులు ప్రబలుతాయని ఆందోళన.. కృష్ణా నది కాలువలోని నీటిని పెదపాడు, ఏలూరు, దెందులూరు మండలం సీతంపేట కాలువ దిగువన ఉన్న గ్రామాల్లోని మంచినీటి చెరువుల్లో తాగునీరుగా నింపుతున్నారు. ఆ నీటిని తాగితే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. కాలువలు, పొలాల్లోకి పనులకు వెళ్లినవారు చర్మ సంబంధ వ్యాధుల బారిన పడుతున్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని కూలీలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి రూ.వేలల్లో వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ నీటిని పొలాల్లో నింపుతుంటే దుర్వాసన వస్తోంది. ఆరోగ్యకరమైన పంటలు పండించలేకపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపకుంటే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏలూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రయ్య మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో కృష్ణా కాలువ వెంబడి కంచె వేసి కాలువను పరిరక్షించాలని జలవనరుల శాఖ, ఏలూరు నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించామని తెలిపారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి: ధర్మరాజు

మొయ్యేరులో త్రిసభ్య కమిటీ బృందంతోపాటు ధర్మరాజు, గన్నిలను సత్కరిస్తున్న కూటమి శ్రేణులు

గణపవరం, న్యూస్‌టుడే: రైతులకు మెరుగైన సేవలందించి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా త్రిసభ్య కమిటీలు పని చేయాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. జల్లికొమ్మర, డి.కుమారవల్లి, మొయ్యేరు, కొమర్రు, కాశిపాడు సహకార సంఘాల త్రిసభ్య కమిటీల ప్రమాణస్వీకారంలో ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులుతో కలిసి ఆయన ఆదివారం పాల్గొని మాట్లాడారు. మొయ్యేరులో గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ సహకార సంఘాల అభ్యున్నతికి త్రిసభ్య కమిటీలు పోటీపడి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో త్రిసభ్య కమిటీలను ధర్మరాజు, గన్ని సత్కరించి అభినందనలు తెలిపారు. జల్లికొమ్మర కమిటీ ఛైర్మన్‌గా మద్దాల మహంకాళి, సభ్యులుగా పి.శ్రీనివాస్, కవల కోదండ రాంబాబు, కొమర్రు ఛైర్మన్‌గా గంగుమోలు రత్నయ్య, సభ్యులుగా బొల్లిశెట్టి పద్మారావు, కె.రామకృష్ణ, డి.కుమారవల్లి ఛైర్మన్‌గా దాసం వెంకటేశ్వరరావు, సభ్యులుగా కోపల్లె సావిత్రి, పంపన వెంకటేశ్వర్లు, మొయ్యేరు ఛైర్మన్‌గా కానుమిల్లి వెంకటేశ్వరరావు, సభ్యులుగా గంటా రామకృష్ణ, గుత్తుల వెంకటేశ్వరరావు, కాశిపాడు ఛైర్మన్‌గా కొలుసుల శ్రీనివాస రాజు, సభ్యులుగా కొయ్యల వెంకట సుబ్బారావు, గుడ్డిన వీర్రాజు ప్రమాణస్వీకారం చేశారు.

చిన్నారులకు మందులు అందజేస్తున్న ప్రభాకర్ తదితరులు

దాతల సహకారం అభినందనీయం

దెందులూరు, న్యూస్‌టుడే: దాతల సహకారంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడం అభినందనీయమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఆదిత్య కమర్షియల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, చింతమనేని ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం దెందులూరులోని తితిదే కల్యాణ మండపంలో మధుమేహంతో బాధపడుతున్న చిన్నారులకు ఆదివారం రూ.5 లక్షలు విలువ చేసే మందులు, ఇన్సులిన్ ఉచితంగా అందజేశారు. దెందులూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేసి ప్రసూతి వార్డులో మరింత మెరుగైన వైద్య సేవలందించే విధంగా తీర్చిదిద్దడానికి ముందుకొచ్చిన ఆదిత్య కమర్షియల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత వంకినేని భానుప్రకాష్‌ను అభినందించారు. ఆల్ ఇండియా అకాడమీ ఆఫ్ ఫ్యామిలీ ఫిజీషియన్స్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ జి.మల్లేశ్వరమ్మ, మధుమేహ వైద్యులు పాతూరి విష్ణు ప్రియారావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ కార్యాలయంలో సమస్యల పరిష్కార వేదిక

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని.. డీఎస్పీ కార్యాలయ పరిధిలోని సమస్యలను ప్రజలు మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పోలీసు కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమం నిర్వహిస్తారని, అక్కడ కూడా ఫిర్యాదులు చేయొచ్చన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం : చంటి

సంక్షేమ పథకాలపై మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే బడేటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన స్థానిక 41వ డివిజన్‌లో ఆదివారం పర్యటించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. తెదేపా నాయకులు వెంకటరత్నం, కె.రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గణపవరం, న్యూస్‌టుడే: మొయ్యేరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ ఆకాశపు స్వామితో కలిసి ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు లబ్ధిదారులకు వివరించారు.

చెత్త తొలగించారు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరు శాంతినగర్ 2వ వీధిలో చెత్తకుప్పలు పేరుకుపోయాయని స్థానికులు 'ఈనాడు' నిర్వహిస్తున్న 'మేమున్నాం.. మీకు తోడుగా..' దృష్టికి తీసుకురావడంతో ఈ నెల 17న ప్రచురితమైంది. దీనికి అధికారులు వెంటనే స్పందించారు. అదనపు కమిషనర్ చంద్రయ్య ఆదేశాలతో సిబ్బంది చెత్తను తొలగించారు.

స్పందనకు వందనం

ముళ్ల చెట్లు..

భీమడోలు, న్యూస్‌టుడే: రద్దీగా ఉండే తహసీల్దారు కార్యాలయం, ప్రభుత్వాసుపత్రి రహదారి వెంబడి ముళ్ల చెట్లు పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని 'ఈనాడు'లో వచ్చిన కథనంపై పంచాయతీ అధికారులు స్పందించారు. రహదారి వెంబడి పెరిగిన ముళ్ల చెట్లను తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	లోపలికి రా చెప్తా
అంబిక మినీ	తొలిప్రేమ
సాయిబాలాజీ	జూనియర్
బాలాజీ	ఓ భామ అయ్యో రామ
సత్యనారాయణ స్క్రీన్ 1	కొత్తపల్లిలో ఒకప్పుడు
సత్యనారాయణ స్క్రీన్ 2	దేవరకొండ పోలీస్‌స్టేషన్
సత్యనారాయణ స్క్రీన్ 3	తమ్ముడు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	పోలీస్ వారి హెచ్చరిక
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	మై బేబి
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	3 బీహెచ్‌కే
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	జూనియర్
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	తమ్ముడు
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	3 బీహెచ్‌కే
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	కన్నప్ప

గంగానమ్మకు ఊరేగింపుగా సారె తీసుకొస్తున్న భక్తులు

శాకంబరీ.. శరణుశరణు..

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా ఏలూరు 28 డివిజన్ తంగెళ్లమూడి సీతారామనగర్ చెరువు గట్టుపై గంగానమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారిని వివిధ కూరగాయలు, పండ్లతో శాకంబరిగా అలంకరించారు. గంగానమ్మకు 108 రకాల మిఠాయిలు, ఫలాలు, పిండి వంటలతో సారె సమర్పించారు. ★ ఒకటో డివిజన్ సాయినగర్‌లోని నాగమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగమ్మ తల్లి ..

ఉంగుటూరులో..

దెందులూరులో..

అనంతరం నిర్వాహకులు అప్పలనాయుడుని ఆలయ మర్యాదలతో సత్కరించారు.

సీతమ్మకు ఆషాఢ సారె .. దెందులూరు, న్యూస్‌టుడే: కొవ్వలి గాంధీనగర్‌లోని కోదండ రామాలయంలో సీతమ్మకు భక్తులు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. సీతారామలక్ష్మణులకు విశేష పూజలు, అలంకరణలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులు, పండ్లు, పూలు సమర్పించారు. కొవ్వలిలోని గంగానమ్మ, నూకాలమ్మ, పోతురాజుబాబుకు జలాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

దొంతవరం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: దొంతవరం గ్రామ దేవతలు గోగులమ్మ, పెద్దింట్లమ్మ అమ్మవార్లకు గ్రామస్థులు ఆదివారం సారె సమర్పించారు.

వైభవంగా ఆడికృత్తిక మహోత్సవం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: దొండపాడులోని దత్త సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో ఆదివారం ఆడికృత్తిక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మ ముహూర్తంలో త్రిశతినామ భస్మార్చన చేశారు. ఉదయం ఆలయ ప్రదక్షిణ, గణపతి పూజ, పుణ్యాహవాచన నిర్వహించారు. భక్తులు స్వయంగా ఉత్సవ మూర్తులకు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మూలమంత్ర హోమం చేశారు. స్వామికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం కృత్తికా నక్షత్ర దీపోత్సవ సేవ నేత్రపర్వంగా సాగింది.

నూతన కమిటీ సభ్యుల్ని సన్మానిస్తున్న అప్పలనాయుడు

జనసేనకు కార్యకర్తలే బలం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే : జనసేన పార్టీ ఏలూరు నగరంలో 3, 20వ డివిజన్లకు సంబంధించి నూతన కమిటీలను ప్రకటించింది. ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిగాయి. 3 డివిజన్ ఇన్‌ఛార్జిగా కొసనం ప్రమీలను, అధ్యక్షుడిగా నడిపూడి ఈశ్వరరావును, ఉపాధ్యక్షులుగా ఓలిపల్లి చిరంజీవి, దిరిశాల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా తాబేలు శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా ఆబోతుల మధును, 20వ డివిజన్ అధ్యక్షుడిగా మల్లెమొగ్గల బాలాజీ, ఉపాధ్యక్షుడిగా తోట కిశోర్‌ను, ప్రధాన కార్యదర్శిగా పిల్లా తాతారావు, కార్యదర్శిగా అచ్యుత్ నాని, సంయుక్త కార్యదర్శిగా మొదవ లోకేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ జనసేన పార్టీకి కార్యకర్తలే బలమన్నారు.

సంగీతం, నాట్యానికి విశేష ప్రాముఖ్యం

ఆత్మీయ సత్కారంలో జయలక్ష్మి, పార్వతీ రామచంద్రన్ తదితరులు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అరవై నాలుగు కళల్లో సంగీతం, నాట్యానికి విశేష ప్రాముఖ్యత ఉందని గరికపాటి ఆర్ట్స్ అధినేత గరికపాటి కాళిదాసు అన్నారు. స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలిలో గరికపాటి ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో ఆదివారం దేవపల్లి నాగలక్ష్మి (వీణ సోలో), టి.హరిణి, డాక్టర్ ఎం. స్వరూప, పి.సాయి శివాని, కె.పద్మావతి, విజయలక్ష్మి, ఎం.సరస్వతి శ్రీవిక్షణ, (వయోలిన్ సోలో) యం.డి.ఎస్ మీనాక్షిలచే నిర్వహించిన శాస్త్రీయ భక్తి సంగీత విభావరి అలరించింది. వీరా శివ ప్రసాద్ వయోలిన్, సీహెచ్ లక్ష్మీనారాయణన్ మృదంగంపై సహకారం అందించారు. కళారత్న ఎ.పార్వతీ రామచంద్రన్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వీణాపాణి ఎ.జయలక్ష్మి, కళారత్న పార్వతీ రామచంద్రన్‌లకు ఆత్మీయ సత్కారం చేశారు. సాహిత్యమండలి కో కన్వీనర్ పుల్లాభొట్ల సత్యవాణి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తమరావు పర్యవేక్షించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక రామకోటి ప్రాంగణంలో లయన్ మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల, ఉషా గ్రూప్స్ అధినేత ఉషా బాలకృష్ణ సహకారంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశాల బృందం 153 మందికి ఉచిత నేత్ర పరీక్షలు చేశారు. 21 మందిని శస్త్ర చికిత్సలకు వేమగిరిలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. 33 మందికి రాయితీపై కళ్ల జోళ్లు అందజేశారు. బొలిశెట్టి సురేష్ కుమార్, తవ్వా మణికంఠ, కేశవ్ సేవలందించారు.

వివాహిత అదృశ్యంపై కేసు

పెదపాడు, న్యూస్‌టుడే : వేంపాడు గ్రామానికి చెందిన వివాహిత మన్నెపు హారికాసుధ ఈనెల 18న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తల్లి మండపాక సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కట్టా శారదాసతీష్ తెలిపారు.

జూద శిబిరంపై దాడి.. దెందులూరు, న్యూస్‌టుడే: దెందులూరు, పోతునూరులో జూద శిబిరాలపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. దెందులూరులో ఏడుగురు వ్యక్తుల నుంచి రూ.14,500, పోతునూరులో ఏడుగురి నుంచి 16,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివాజీ తెలిపారు.

ఏపుగా పెరిగి.. సరఫరాకు అడ్డుపడి

అత్తిలి నుంచి పిప్పర వెళ్లే ప్రధాన రహదారిలో మొయ్యేరు సమీపాన విద్యుత్తు పరివర్తకం ప్రమాదకరంగా మారింది. తీగజాతి పిచ్చిమొక్కలు ఏపుగా అల్లుకొని పైకి పాకడంతో నిప్పురవ్వలు ఎగసి పడుతున్నాయి. దీంతో ఆ రహదారిపై ప్రయాణించే వాహనచోదకులు భయాందోళనలకు గురవుతున్నారు. తరచూ విద్యుత్తు సరఫరాలో సైతం అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గణపవరం విద్యుత్తు శాఖ ఏఈ వెంకన్నబాబు మాట్లాడుతూ పిచ్చిమొక్కలు తొలగించి సమస్య పరిష్కరిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, గణపవరం**

హోం మంత్రి పర్యటనకు ఏర్పాట్లు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరంలో నూతనంగా రూ.2.50 కోట్లతో నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభించేందుకు హోం మంత్రి వంగలపూడి అనిత రాకను పురస్కరించుకుని ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రెండు మూడు రోజుల్లో మంత్రి వచ్చే అవకాశం ఉందని, అందుకే ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

అత్తులూరి సేవలు నిరుపమానం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏలూరు నగర అభివృద్ధికి విశేష కృషి చేసిన మాజీ శాసనసభ్యుడు, సీపీఐ నాయకుడు అత్తులూరి సర్వేశ్వరరావు ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే పిలుపునిచ్చారు. ఆదివారం ఏలూరు పైపుల హెచ్ సెంటర్‌లో సర్వేశ్వరరావు స్మారక స్తూపం వద్ద ఆయన వర్ధంతి సభను ఏలూరు పట్టణ పొగాకు పనివారల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్వేశ్వరరావు నిరాడంబర జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నగరంలో ఏఐటీయూసీ, సీపీఐని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

పోలవరం

•పోలవరం •చింతలపూడి

మొదలైన తాత్కాలిక రహదారి పనులు

కామవరపుకోట, న్యూస్‌టుడే: ఏలూరు-జంగారెడ్డిగూడెం రహదారిలో ఆడమిల్లి వద్ద వంతెన దెబ్బతిన్న విషయం తెలిసిందే. అయితే ఆదివారం తాత్కాలిక రహదారి ఏర్పాటు పనులు ప్రారంభించారు. కుంగిన వంతెన సమీపంలో రహదారి ఆక్రమణలు తొలగించిన ప్రదేశంలో వాహనాలు వెళ్లేందుకు తాత్కాలిక రహదారికి రూ.10 లక్షలు మంజూరు చేసి మళ్లింపు రోడ్డు నిర్మించాలంటూ ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ఆదేశాల మేరకు పనులు చేపట్టారు. పనులకు ఆటంకంగా ఉన్న కొన్ని విద్యుత్తు స్తంభాలు తొలగించాలని ఆ శాఖ అధికారులకు తెలియజేశామని ఏఈ సుందరరావు తెలిపారు.

గిరిజనుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం గ్రామాల్లోని గిరిజనుల సంక్షేమానికి ఎన్డీయే ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెదేపా ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా దర్భగూడెంలో ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, ప్రచార కరపత్రాలు అందించారు. నాయకులు కుంజా సంబరు, సున్నం గౌతమ్, పొడియం అర్జున్, షేక్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు

కన్నాపురం: ప్రదర్శనగా వస్తున్న భక్తులు

అమ్మవార్లకు సారె సమర్పణ

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఆషాఢం పురస్కరించుకుని పలుచోట్ల గ్రామ దేవతల ఆలయాల వద్ద ఆదివారం సందడి నెలకొంది. కన్నాపురంలో అభయాంజనేయస్వామి ఆలయం నుంచి పలు రకాల మిఠాయిలు, పండ్లు, నూతన వస్త్రాలు తీసుకుని మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరిన భక్తులు విజయ కనకదుర్గ, గ్రామ దేవతలు చల్లాలమ్మ, గంగానమ్మ అమ్మవార్లకు సారెను సమర్పించారు. కుటుంబసభ్యులతో సహా భారీ సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కొయ్యలగూడెంలోని తూర్పుపేట కోదండ రామాలయం వద్ద గల చింతాలమ్మ ఆలయం వద్ద అమ్మవారికి కుంభాభిషేకం నిర్వహించారు. మహిళలు బిందెలతో నీరు తెచ్చి జలాభిషేకం చేశారు. అనంతరం ఆషాఢ సారెను అందజేశారు.

గంగానమ్మకు.. కామవరపుకోట, న్యూస్‌టుడే: ఆషాఢంలో అమ్మవార్లకు సారె సమర్పణ సంప్రదాయ ఆచారంలో భాగంగా ఆదివారం తడికలపూడి గంగానమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా శ్రీగాంగేశ్వరస్వామి ఆలయం నుంచి మహిళలు పూలు, పండ్లు, కానుకలతో ఊరేగింపుగా మేళ తాళాలతో గంగానమ్మ ఆలయానికి చేరుకుని జరిపించారు.

సమర్పిస్తున్న మహిళలు

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని దర్భగూడెంలో భూలక్ష్మీ దేవి గుడిలో అమ్మవారు ఆదివారం శాకాంబరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు సారెను వైభవంగా ఊరేగించి తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

సారెతో భక్తుల ఊరేగింపు

లలితాసహస్రనామ పారాయణం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం గ్రామదేవత చింతాలమ్మ ఆలయం వద్ద కోటి లలిత సహస్రనామ పారాయణం ఉత్సాహంగా కొనసాగుతోంది. తొలి ఏకాదశి పర్వదినాన ప్రారంభమైన పారాయణం 90 రోజుల పాటు జరగనుంది. అమ్మవారి సహస్రనామ పారాయణంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నూతన ఆలయ నిర్మాణంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆలయ కమిటీ సన్నద్ధమవుతోంది.

చింతాలమ్మ ఆలయంలో మహిళలు

ఎనిమిది పశువైద్యశాలలు.. ఒక్కరే వైద్యుడు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం మండలాల్లోని పలు పశు వైద్యశాలల్లో వైద్యులు లేకపోవడంతో కాలక్షేపం చేస్తున్నారు. దీంతో పశు పోషకులు అవస్థలు తప్పడం లేదు. ఎనిమిది పశు వైద్యశాలలకు మైదాన ప్రాంతానికి చెందిన ఒక్క పశు వైద్యుడే ఇన్‌ఛార్జిగా ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

బుట్టాయగూడెం పశు వైద్యశాల

మూడేళ్లుగా భర్తీకి నోచుకోక

బుట్టాయగూడెం, నూతిరామన్నపాలెం, దొరమామిడి, రేపల్లెవాడ, గూటాల, దర్భగూడెం, కుక్కునూరు, వేలేరుపాడులలో పశు వైద్యశాలలు, కోండ్రుకోట, కొరుటూరు, పులిరామునుడుగూడెం, రెడ్డిగణపవరం, కామయ్యపాలెం, పూచికపాడు, ములగలంపల్లి, రుద్రంకోటలలో గ్రామీణ పశు వైద్యశాలలు ఉన్నాయి. జీలుగుమిల్లి, పోలవరంలలో ప్రాంతీయ పశు వైద్యశాలలు ఉన్నాయి. ప్రాంతీయ పశు వైద్యశాలల్లో సహాయ సంచాలకులు మాత్రమే ఉంటారు. గ్రామీణ పశు వైద్యశాలల్లో ఉండాల్సిన విధంగానే పశు వైద్య సహాయకులు ఉన్నారు. కీలకమైన పశు వైద్యశాలల్లో మాత్రం పశు వైద్యుల ఉద్యోగాలు మూడేళ్లుగా భర్తీకి నోచుకోలేదు.

దర్భగూడెం పశు వైద్యురాలు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. బుట్టాయగూడెం పశు వైద్యుడు నెల కిందట మన్యేతర ప్రాంతానికి బదిలీ అయ్యారు. దీంతో ఎనిమిది పశు వైద్యశాలలకు వైద్యులు లేని పరిస్థితి నెలకొంది. వీటన్నింటికీ కొయ్యలగూడెం పశు వైద్యుడు శ్రీనివాసన్‌ను అదనపు బాధ్యతలతో ఇన్‌ఛార్జిగా నియమించారు.

ప్రాథమిక వైద్యంతో సరి.. తమ పశువులు అనారోగ్యం బారిన పడితే కేవలం ప్రాథమిక వైద్యంతోనే సరిపుచ్చుకోవాల్సి వస్తుందని పలువురు పశు పోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శస్త్రచికిత్సలు, వ్యాధి నిర్ధారణ చేసి వైద్యం అందించే వారు లేక అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. ఖాళీలను భర్తీ చేసి సేవలను మెరుగుపరిచేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. 'పశు వైద్యుల నియామకాల్లో మన్యం ప్రాంతానికి ప్రాధాన్యమిస్తాం. తప్పనిసరిగా ఖాళీలు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.' అని పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు గోవిందరాజు తెలిపారు.

అందరి సహకారంతో జనసేన అభివృద్ధికి కృషి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జనసేన పార్టీని అందరి సహకారంతో అభివృద్ధి చేద్దామని డీసీసీబీ మాజీ ఛైర్మన్, జనసేన ముఖ్య నేత కరాటం రాంబాబు అన్నారు. జంగారెడ్డిగూడెం జడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జీ ఇటీవల జనసేనలో చేరారు. ఈ నేపథ్యంలో స్థానిక ఆలపాటి గంగాభవాని కల్యాణ మండపంలో ఆదివారం జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దానిలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కరాటం మాట్లాడుతూ.. కొద్ది రోజుల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బుట్టాయగూడెం విచ్చేయనున్నారని ప్రకటించారు. అనంతరం ఆయన సమక్షంలో పలువురు వైకాపా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు జనసేనలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పిన కరాటం రాంబాబు జనసేనలోకి ఆహ్వానించారు. జనసేన చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ పీరూ, ఉపాధ్యక్షుడు నరేశ్, నాయకులు ఉమామహేశ్వరి, వలవల తాతాజీ, చింతల నాని తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కరాటం రాంబాబు

మన్యంలో మెరుగైన వైద్య సేవలు: చిర్రి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మరింత కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. దొరమామిడిలో జంగారెడ్డిగూడేనికి చెందిన త్రినేత్ర ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మన్యంలో వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని, వీటిని రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

అర్హులందరికీ పథకాలు : ఎమ్మెల్యే

చింతలపూడి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తూ ఏడాది పాలనను విజయవంతంగా పూర్తి చేసిన కూటమి ప్రభుత్వం, రాబోయే నాలుగేళ్లలో మరిన్ని అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందించనుందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని వెలమపేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకంలో అర్హులైన ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో నగదు జమ చేశామన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు.

ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

సేవా దృక్పథం అవసరం.. చింతలపూడి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడిలో నూతనంగా నిర్మించిన మానవత స్వచ్ఛంద సంస్థ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం సంపాదించిన దాంట్లో సమాజానికి ఎంతో కొంత ఇవ్వాలనే ధ్యేయంతో జీవనం సాగించాలన్నారు. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మానవత వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.రామచంద్రారెడ్డి, జిల్లా కేంద్ర కమిటీ ఛైర్మన్ అలపాటి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు భాస్కరరావు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితులకు తక్షణమే పరిహారం చెల్లించి వారిని పునరావాస కాలనీలకు తరలించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కమిటీ కార్యదర్శి గౌస్ అన్నారు. పడమటిమెట్టలో ఆదివారం నిర్వహించిన డివిజన్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నాళ్లు నిర్వాసితులను గోదావరిలో ముంచుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు రామారావు, ముత్యాలరావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? స్థానిక తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే రహదారి వెంబడి ద్విచక్ర వాహనాలు నిలుపుతుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. – క్రాంతికుమార్

✔ రహదారి వెంబడి దుకాణాదారులకు అవగాహన కల్పించి సమస్య పరిష్కరిస్తాం. – సతీశ్‌కుమార్, ఎస్సై

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ? కొయ్యలగూడెం అశోక్‌నగర్ ఓవర్‌హెడ్ ట్యాంకు సమీపంలో తాగునీటి పైపులైను పగిలి నీరు రోడ్డుపైకి చేరుతోంది. రెండు పర్యాయాలుగా పనులు చేపట్టి వదిలేశారు. డ్రెయిన్ దగ్గరలో ఉండటంతో తాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. – పి.శ్రీనివాస్, కొయ్యలగూడెం

✔ పైపులైను మరమ్మతులు చేపట్టాం. త్వరలోనే పూర్తి చేయిస్తాం. – కె.సురేశ్, పంచాయతీ కార్యదర్శి

? కొయ్యలగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనుక వీధిలో పోస్టాఫీసు శివారు వరకు వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. ఒకటి రెండు రోజులు వెలగడం, మిగిలిన రోజుల్లో ఆరిపోతున్నాయి. – గన్నవరపు వెంకట్రాజు

✔ సమస్య పరిష్కరిస్తాం. – కె.సురేశ్, పంచాయతీ కార్యదర్శి

? కన్నాపురంలో ప్రధాన రహదారి నుంచి ఎస్సీపేటకు వెళ్లే దారి బురదమయంగా ఉంది. – విజయ్

✔ ఉపాధి హామీ నిధులతో రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాం. మంజూరు అయిన వెంటనే పనులు చేపడతాం. – సురేశ్, ఏఈ, పంచాయతీరాజ్

హోం మంత్రి పర్యటనకు ఏర్పాట్లు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరంలో నూతనంగా రూ.2.50 కోట్లతో నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభించేందుకు హోంమంత్రి వంగలపూడి అనిత రాకను పురస్కరించుకుని ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రెండు మూడు రోజుల్లో మంత్రి వచ్చే అవకాశం ఉందని, అందుకే ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

తీర్మానం చేశారు.. నిర్మాణం మరిచారు!

తడికలపూడిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి గతంలో తీర్మానం చేశారు. ఈ మేరకు పోలీసుస్టేషన్ సమీపంలో పాడుపడిన రహదారి బంగ్లా స్థలం ఎంపిక చేశారు. కానీ నిర్మాణ పనులు చేపట్టలేదు. దీంతో కొంత స్థలం ఆక్రమణకు గురైంది. ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణంతో తడికలపూడి, సాగిపాడు, వీరంపాలెం, పాపయ్యపాలెం, కళ్లచెర్వు తదితర గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందుతాయని ఆశిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కామవరపుకోట

ఎంపిక చేసిన స్థలంలో పెరిగిన చెట్లు

ఇరుకుగా.. ఇబ్బందిగా..

కుక్కునూరు ప్రధాన కూడలి ఇరుకుగా మారింది. వ్యాపారులు ఇక్కడ రోడ్లపైకి ఆక్రమించుకుని రావడంతో, సాధారణ జనం అక్కడ నిల్చొనే చోటు కరవైంది. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు చోటులేక తమ వాహనాలను రోడ్డుపైనే నిలిపి ఉంచుతున్నారు. దీంతో రోడ్డుపై వెళ్లే బస్సులు, ఇతర వాహనాలకు ఇబ్బందిగా మారింది. ఇదే ప్రదేశంలో రెండు బస్సులు ఎదురెదురుగా తప్పుకోవాలంటే తిప్పలు తప్పడంలేదు. వెంట్రుకవాసి తేడాతో తప్పించుకొని రావాల్సి వస్తోంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా, ఒకదానికొకటి ఢీకొనడం ఖాయం. రోడ్డుపైకి దుకాణాలు చొచ్చుకొచ్చినా పంచాయతీ, ర.భ. శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రయాణికులు, వివిధ అవసరాలకు మండల కేంద్రానికి వచ్చే సమీప గ్రామాల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. - న్యూస్‌టుడే, కుక్కునూరు

వానాకాలంలోనూ తాగునీటి కష్టాలే

కాలమేదైనా లింగపాలెం మండలం అనపనేనివారిగూడెం వాసులకు తాగునీటి కష్టాలు తప్పడంలేదు. గ్రామంలో భూగర్భ జలాలు లేక బోరులు వేస్తున్నా నీరు ఏమాత్రం పడకపోవడంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏడు కిలోమీటర్ల దూరంలోని కె.గోకవరంలో బోరు వేసి పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేసి గ్రామంలో నిర్మించిన ట్యాంకులోకి మళ్లించి, కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే పంట పొలాల్లో పైపులైన్లు వేయడంతో తరచూ వ్యవసాయ పనులు చేయడంతో అవి దెబ్బతింటున్నాయి. ఫలితంగా ఒక్కొక్కసారి పది రోజులు కూడా నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా పైపులైన్ల లీకేజీలతో వర్షాకాలం జలం కలుషితమవుతోంది. ఆ నీటిని తాగి రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ గ్రామానికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, లింగపాలెం

వరి పొలాల్లో పైపులైన్ లీకవుతుండటంతో మరమ్మతులు చేస్తున్న కార్మికులు

26న బుట్టాయగూడెం మండలంలో అవగాహన సదస్సులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26న బుట్టాయగూడెం మండలంలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్‌ఏఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలోని పథకాలు, గిరిజనుల హక్కులు, పరిరక్షణ, తదితర సామాజిక అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దారు పీవీ చలపతిరావు తెలిపారు.



పేదలకు ప్రభుత్వ భూములు పంచాలి: సీపీఐ

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: భూమిలేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం కేతవరంలోని దళిత, పేదలకు కేటాయించిన సీలింగ్ భూముల్లో దుక్కి దున్ని సాగు చేసే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టాదారులకు భూములు చెందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు బండి వెంకటేశ్వరరావు, జేవీ రమణరాజు, సుంకర రాధాకృష్ణ, కూరాకుల బాబూరావు, కోనేరు రంగారావు, యడ్లపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూములు పరిశీలిస్తున్న నాయకులు

సీపీఎం సీనియర్ నాయకుడి మృతి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: పడమర రేగులకుంటకు చెందిన సీపీఎం సీనియర్ నేత, మండల కమిటీ మాజీ సభ్యుడు కొవ్వాసి దుర్గారావు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. పలువురు నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

చింతలపూడి, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తూ ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వృద్ధురాలి రెండు కాళ్లు నుజ్జునుజ్జైన ఘటన చింతలపూడి కొత్తబస్టాండులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చాట్రాయికి చెందిన తుమ్మల లక్ష్మి బంధువుల ఇంటికి వెళ్లేందుకు చింతలపూడి కొత్త బస్టాండుకు వచ్చారు. బస్టాండులో ఆమె నడిచి వస్తుండగా.. ప్రమాదవశాత్తూ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: భార్యను వేధిస్తోన్న భర్తపై జంగారెడ్డిగూడెం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై జబీర్ కథనం మేరకు.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కావేరికి.. తాళ్లపూడి గ్రామానికి చెందిన భైరవ రాజేశ్‌తో 2014లో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. పెళ్లయిన నాటి నుంచి వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో పెద్దల్లో పెట్టి మందలించినప్పటికీ రాజేశ్ ప్రవర్తన మారలేదు. దీంతో మూడేళ్ల కిందట వీరు తాళ్లపూడి నుంచి జంగారెడ్డిగూడెం వచ్చి వేరే కాపురం పెట్టారు. అయితే గత కొంతకాలంగా రాజేశ్ పనికి వెళ్లకుండా, మద్యం తాగుతూ భార్య కావేరిని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. దీనిపై బాధితురాలు ఆదివారం పోలీసులను ఆశ్రయించారు.

సారా స్వాధీనం: బెల్లపు ఊట ధ్వంసం

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి మండలంలో సారా స్థావరాలపై దాడి చేసినట్లు ఎస్సై సతీశ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ దాడుల్లో కొమ్ముగూడెంలో ఆయిల్‌పామ్ తోటల్లో సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడిచేసి ఇద్దరి యువకులను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

టి.నరసాపురం, చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: టి.నరసాపురం మండలం సింగరాయపాలెం గ్రామానికి చెందిన గొర్రె అనంత అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై జయబాబు ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం. . అనంత రెండు రోజుల కిందట భర్త శ్రీనివాసరావుతో గొడవపడి ఇంటినుంచి బయటకు వెళ్లినట్లు చెప్పారు. చుట్టుపక్కల, బంధువుల వద్ద విచారించినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జూద స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం ఐఎస్ రాఘవాపురంలో కోడి పందేల స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. 15 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.20,670, నాలుగు కోడి పుంజులు, 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధీర్ తెలిపారు.

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: వేలేరుపాడులో జూద స్థావరంపై పోలీసులు దాడి చేశారు. దాడుల్లో రూ.8 వేలు, ఐదుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణ శివారులో కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఒక కోడి, కోడి కత్తి, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయ ముట్టడి

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు అఖిల పక్ష నేతలు తెలిపారు. ఆదివారం యర్రబోరులో నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. సమస్యపై స్పష్టత వచ్చేంత వరకు ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

నేడు

డీఎస్పీ కార్యాలయంలో 'మీ కోసం'

పోలవరం, న్యూస్‌టుడే: స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీ కోసం) నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రధాన రహదారులమే.. గోతులతో ఉన్నాం..!

వాహనదారుల అవస్థలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణ ప్రధాన రహదారులు దారుణంగా తయారయ్యాయి. పట్టణానికి నాలుగు వైపులా ఉన్న అన్ని ప్రధాన రోడ్ల పరిస్థితి ఇలానే ఉంది. అశ్వారావుపేట రోడ్డు బైపాస్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు బాగా పాడైంది. గుంతలు పడటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు కోసం రూ.80 లక్షల నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు జాప్యమవుతున్నాయి. తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

చెరువులను తలపిస్తూ.. ఏలూరు రోడ్డు పట్టణంలో పలు చోట్ల పెద్ద పెద్ద గుంతలు పడి చెరువులను తలపిస్తున్నాయి. ఊరచెరువు వద్ద బస్టాండ్ సమీపంలో ఈ రహదారి అధ్వానంగా ఉంది. ప్రమాద భరితంగా ఉన్న ఈ గుంతల్లో నిత్యం వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. బుట్టాయగూడెం రోడ్డులో పొట్టిశ్రీరాములు విగ్రహం కూడళ్లలో పరిస్థితి మరీ దారుణం. ఇక్కడ రోడ్డు మొత్తం పాడైంది. గురువారం కురిసిన వర్షానికి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. తాత్కాలిక మరమ్మతులైనా చేసి రోడ్లు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మరమ్మతులు వెంటనే చేయిస్తామని పురపాలక కమిషనర్ రమణ తెలిపారు.

పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బుట్టాయగూడెం రోడ్డు ఇలా..

ఏలూరు రోడ్డు ఊర చెరువు వద్ద అధ్వానంగా..

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

ఆషాఢ సారె సమర్పణ

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరులోని సంతాన నాగేంద్ర స్వామి ఆలయంలోని వల్లీదేవసేన సమేత నాగేంద్ర స్వామి, గంగా పార్వతీ సమేత ఆనంద లింగేశ్వర స్వామికి గ్రామస్థులు ఆదివారం భక్తి శ్రద్ధలతో ఆషాఢ సారె సమర్పించారు. మహిళలు సంప్రదాయ వస్త్ర ధారణతో, మేళతాళాలతో దేవస్థానానికి తరలివచ్చి క్షీరాన్నం, పలు రకాల తీపి వంటకాలు, పసుపు, కుంకుమ, గాజులు, పట్టువస్త్రాలు సమర్పించి దర్శించుకున్నారు. అర్చకులు చావలి శంకర శాస్త్రి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

22న హనుమాన్ జంక్షన్‌లో విద్యుత్తు గ్రీవెన్స్

కైకలూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22న హనుమాన్ జంక్షన్‌లోని ఎస్.ఆర్. కన్వెన్షన్ హాల్లో వినియోగదారుల విద్యుత్తు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఈఈ జీబీ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు అంతరాయాలు, హెచ్చుతగ్గుల సరఫరా, మీటర్, బిల్లులు, ఇతర సమస్యలను అర్జీల రూపంలో అందించవచ్చన్నారు. విద్యుత్తు వినియోగంలో అనుసరించాల్సిన విధానాలు, సమస్యల పరిష్కారం కోసం ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహిస్తున్న అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చినకామనపూడిలో అమ్మవారికి.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: చినకామనపూడిలోని ఉన్న ఆలయాల్లోని అమ్మవార్లకు ఆదివారం సర్పంచి చిట్టూరి నాంచారయ్య ఆధ్వర్యంలో ఆషాఢ సారె సమర్పించారు. మహిళలు, గ్రామస్థులు పాల్గొని ఊరేగింపుగా పిండి వంటలను, మిఠాయిలను తీసుకువెళ్లి సీతమ్మ, గంగానమ్మలకు సారె సమర్పించారు. పసుపు కుంకుమలతో అమ్మవారికి పూజలు చేశారు.

కొల్లేటి పెద్దింట్లమ్మా నమోస్తుతే

కైకలూరు, న్యూస్‌టుడే: కోరిన కోర్కెలు తీర్చే వరదాయని.. పెద్దింట్లమ్మా నమోస్తుతే అంటూ భక్తులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు. ఆదివారం కావడంతో కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. కొల్లేరులంక గ్రామస్థులతో పాటు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి వందలాది మంది భక్తులు మంగళ వాయిద్యాలతో అమ్మవారికి ఆషాఢ సారె అందించారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభం వద్ద విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పండ్ల రసాభిషేకాలు, సహస్ర శతనామావళి, కుంకుమార్చన, ధూప సేవ తదితర పూజలను నిర్వహించారు. ఆదివారం ఒక్క రోజే అమ్మవారికి రూ.1,17,660 ఆదాయం వచ్చినట్లు ఈవో కుచిపూడి శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను ఈవో పర్యవేక్షించారు.

కనకదుర్గమ్మకు బోనాలు

మూలలంక (కలిదిండి), న్యూస్‌టుడే: మూలలంకలోని కనకదుర్గమ్మ వారికి భక్తులు ఆదివారం బోనాలు సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో చీర, సారె బిందెలతో కాలి నడకన వెళ్లారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్ల వేషధారణలో చిన్నారులు విశేషంగా ఆకట్టుకున్నారు.

అమ్మవార్ల వేషధారణలో చిన్నారులు

చావలిపాడు కల సాకారం

- అదనపు మంచినీటి చెరువు నిర్మాణం
- 'ఈనాడు' కథనాలతో కదిలిన యంత్రాంగం

మండవల్లి, న్యూస్‌టుడే: ఏళ్లుగా వేధిస్తున్న తాగు నీటి సమస్యపై 'ఈనాడు' దినపత్రికలో పలుమార్లు కథనాలు ప్రచురించడంతో ఏళ్ల కల సాకారమయ్యింది. మండవల్లి మండలం చావలిపాడులో దాదాపు 2 వేలు పైబడిన జనాభా ఉంది కానీ మంచినీటి చెరువు విస్తీర్ణం కేవలం 2 ఎకరాలు మాత్రమే. ఒకసారి నీటిని నింపితే నెలరోజుల్లో నీరు అడుగంటి పోయే పరిస్థితి. నిత్యం నీటికోసం గ్రామంలోని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీకి చెందిన 13.5 ఎకరాల చెరువులో 5 ఎకరాలను తాగునీటికి కేటాయించాలని 'ఈనాడు'లో సూచన పూర్వక కథనం ప్రచురితమైంది. దీంతో 2023లో సర్పంచి తలారి ధనలక్ష్మి అధ్యక్షతన పంచాయతీ పాలకవర్గం చెరువు ఏర్పాటుకు తీర్మానం చేసింది.

నిర్మించిన గట్టు ఇదే

వ్యతిరేకించిన సొసైటీ సభ్యులు

నలభై ఏళ్లుగా చావలిపాడు మత్స్యకార సొసైటీ సభ్యులు 13.5 ఎకరాల చెరువును అనుభవిస్తుండటంతో తమ ఉపాధి కోల్పోతామని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో న్యాయస్థానం ఆదేశాల మేరకు 2024 ఫిబ్రవరి 2లో అప్పటి కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, డీపీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, ఈవోపీఆర్డీలతో కూడిన ఓ కమిటీని ఏర్పాటు చేసి అందరికి ఆమోదయోగ్యమైన నిర్ణయంతో మంచి నీటి చెరువు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

చెరువు గట్టు నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు

ఎన్నికల్లో ఇబ్బందులు వస్తాయని..

అప్పటికి 2024 అసెంబ్లీ ఎన్నికలకు కేవలం 3 నెలలే సమయం ఉండటంతో సొసైటీ సభ్యుల వ్యతిరేకత పార్టీకి నష్టం కలిగిస్తుందని నాటి కైకలూరు వైకాపా ఎమ్మెల్యే భావించడంతో పనులు నిలిచిపోయాయి. ఈ నెల 8న వెంటనే చెరువు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం పోలీసులు, రెవెన్యూ శాఖను ఆదేశించింది. దీంతో పనులు చేపట్టారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు గోపాల్, కైకలూరు పట్టణ, గ్రామీణ సీఐలు కృష్ణ, రవికుమార్, మండవల్లి రామచంద్రరావు గట్టు నిర్మాణాన్ని పర్యవేక్షించారు.

పోలీసు సంబంధిత సమస్యలా?

సీఐతో 'ఫోన్ ఇన్' రేపు

కైకలూరు నియోజకవర్గంలోని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసుల నమోదులో జాప్యం జరుగుతుందా? ఫిర్యాదుదారులకు సముచిత గౌరవం లభించడం లేదా? మీకు అన్యాయం జరిగి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయడానికి భయపడుతున్నారా? ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ ఎదుర్కొంటున్నారా? మీ పరిధిలో జూదాలు, మాదక ద్రవ్యాల జాడ కనిపిస్తోందా? సమస్య ఎలాంటిదైనా కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ దృష్టికి తీసుకెళ్లడానికి 'ఈనాడు - మీతోడు' వారధిగా నిలుస్తుంది. మీరు చేయాల్సిందల్లా ఇక్కడ పేర్కొన్న చరవాణి నంబరుకు ఫోన్ చేసి సమస్యను తెలియజేయడమే. మరి.. ఇంకెందుకాలస్యం సమస్య ఉంటే.. ఫోన్ చేయండి.

తేదీ: 22-07-2025 (మంగళవారం)
సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు
ఫోన్ నంబరు 83329 83800

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	:80085 74698	కైకలూరు	:73060 88555
ముసునూరు	:93983 81268	కలిదిండి	:90594 84862

స్పందనకు వందనం

మురుగు తొలగింది.. కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు 8వ వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి తీవ్ర దుర్గంధంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను తెలియజేశారు. ఈనెల 17న సమస్య ప్రచురితం కాగా పంచాయతీ ఈవో వై. ప్రసాద్ స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో డ్రెయినేజీలో పూడిక తీయించి సమస్యకు పరిష్కారం చూపారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి

మహిళతో మాట్లాడుతున్న పార్థసారథి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, సుపరిపాలనతో ఏడాదిలో ఎన్నో విజయాలు సాధించామని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఆదివారం రాత్రి ఆగిరిపల్లిలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలోని పేదరికాన్ని పారదోలేలా మార్గదర్శకుల సహకారంతో పీ-4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. తల్లికి వందనం అమలుతో పల్లెల్లో పండగ వాతావరణం నెలకొందని తెలిపారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆగిరిపల్లిలో మురుగు కాలువ వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో మంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మురుగు కాలువ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ఎంపీడీవో బి.భార్గవిని మంత్రి ఆదేశించారు. మండల తెదేపా అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, చిట్నేని శివరామ కృష్ణ, మడుపల్లి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'అన్ని విధాలా అండగా ఉంటా.. ఆదుకుంటా'.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: తెదేపా కార్యకర్తలు, నాయకులకు ఆపద సమయంలో అండగా ఉంటానని, అన్ని విధాలా ఆదుకుంటానని మంత్రి కొలుసు పార్థసారథి భరోసా కల్పించారు. ఇటీవల ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడేనికి చెందిన తెదేపా కార్యకర్త పటాపంచుల గంగరాజు రహదారి ప్రమాదంలో మరణించారు. దాంతో మంత్రి ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆగిరిపల్లికి చెందిన తెదేపా నాయకుడు బెజవాడ శ్రీనివాస్ తల్లి ఇటీవల మరణించారు. ఆయన ఇంటికి వెళ్లి మంత్రి పరామర్శించి ధైర్యం చెప్పారు.

సాగు, తాగు నీటికే తొలి ప్రాధాన్యం

కైకలూరులో పంటకాలువ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

కైకలూరు, న్యూస్‌టుడే: పంట కాలువలకు నీరు విడుదల చేసిన తరుణంలో సాగు, తాగు నీటికి మొదటి ప్రాధాన్యమివ్వాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. పంట కాలువల్లో ఎగువ నుంచి వస్తున్న గుర్రపు డెక్క తొలగింపు పనులను ఆదివారం కైకలూరులో సాగునీటి సంఘాల నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రతి గ్రామంలో సర్పంచులు అధికారులను సమన్వయం చేసుకుంటూ నూరుశాతం పంచాయతీ చెరువులు నింపుకోవాలని సూచించారు. ముదినేపల్లి, కైకలూరు, కలిదిండి, మండవల్లి మండలాల్లో వరి పొలాలకు అవసరమైన నీటిని అందించి రైతులకు అండగా నిలవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, డీసీ ఛైర్మన్ పొత్తూరి వాసురాజు, డ్రెయినేజీ డీఈఈ రామకృష్ణ, నాయకులు బలే ఏసురాజు, పోకల జోగిరాజు, వల్లభనేని శ్రీనివాసచౌదరి తదితరులు పాల్గొన్నారు.

సహాయ నిధి చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 17 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.9,79,177 చెక్కులను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మండలంలోని వరహాపట్నంలోని ఆయన నివాసంలో పంపిణీ చేశారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి..

కైకలూరు, న్యూస్‌టుడే: పేదలకు అండగా ఉంటూ సమాజాభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. 'మానవత' ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా కైకలూరుకు చెందిన కొండ్రెడ్డి వెంకట సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక సీతారామ కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై నూతన కార్యవర్గంతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. మానవతా సంస్థ విద్యా, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, రక్తదానం, విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, వంటి సామాజిక సేవలు ఐక్యతగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ క్రమంలో వెంకట సత్యనారాయణ తల్లిదండ్రుల పేరుపై ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 180 మందికి ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, మానవత సంస్థ వ్యవస్థాపకుడు ఎన్.రామచంద్రరెడ్డి, ఎంపీపీ అడవికృష్ణ, కైకలూరు శాఖ అధ్యక్షుడు గుర్రం శ్యామ్‌కుమార్, ప్రభావతి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాలువకు అడ్డు తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం భైరవపట్నం శివారు నీలగిరిపట్నం వద్ద జాతీయ రహదారి విస్తరణ పనులతో కాలువకు అడ్డుకట్ట వేసిన మట్టిని ఎన్‌హెచ్ అధికారులు తొలగించారు. వంతెన నిర్మాణానికి కాలువకు అడ్డంగా మట్టిని వేయడంతో నీళ్లు వెళ్లే వీలులేకుండా పోయింది. దీంతో ఇటీవల కాలువకు నీళ్లు విడుదల చేయడంతో కిందకు నీరు వెళ్లకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఈ నెల 16న 'నీరు పారక.. పైరు తడవక..' శీర్షికతో 'ఈనాడు'లో కథనాన్ని ప్రచురించిన సంగతి పాఠకులకు విదితమే. దీనిపై జలవనరుల శాఖ డీఈ శిరీష, ఎన్‌హెచ్ డీఈ సత్యనారాయణ స్పందించి కాలువ నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న మట్టి దిబ్బలను భారీ యంత్రం సహాయంతో తొలగించారు. రైతులు హర్షం వ్యక్తం చేశారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం

ముసునూరు, న్యూస్‌టుడే: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందుజ్ఞాన వేదిక నూజివీడు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ముసునూరు మండలం చిల్లబోయినపల్లిలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. శ్రీకృష్ణుడు గురించి వివరించారు. కార్యక్రమంలో సభ్యులు అరుణ్‌కుమార్, కోటేశ్వరరావు, జాస్తి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కలిసి పని చేద్దాం

నూజివీడు ఏఎంసీ ఛైర్‌పర్సన్

అరుణను సన్మానిస్తున్న నాయకులు

చాట్రాయి, న్యూస్‌టుడే: అభివృద్ధి కోసం కలిసి పని చేద్దామని, తనను ఏఎంసీ ఛైర్‌పర్సన్‌గా ఎంపిక చేసిన కూటమి ప్రభుత్వ లక్ష్యం మేరకు పని చేస్తానని నూజివీడు ఏఎంసీ ఛైర్‌పర్సన్‌గా నియమితులైన కుంపటి అరుణ తెలిపారు. సూరంపాలెం గ్రామంలో భాజపా నాయకులు బుర్రె శేఖర్ గృహంలో ఆదివారం ఆమె మాట్లాడారు. మండల భాజపా అధ్యక్షుడు ఒబ్బినేని రాజా, నాయకులు బుర్రె శేఖర్, గద్దం సంజీవరెడ్డి, కుమారెడ్డి ముత్యాలరెడ్డి, చాగంటి వాసుదేవరావు, తెదేపా నాయకులు కందుల కృష్ణ, ములగాపాటి శ్రీనివాసరావు, దుర్గారావు తదితరులు ఆమెను సన్మానించారు. నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ నిధులతో రైతులకు మేలు చేసేలా అభివృద్ధి పనులు చేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

కూటమి పాలనపై ఇంటింటి ప్రచారం

చాట్రాయి, న్యూస్‌టుడే: కూటమి పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు ప్రతి ఇంటికీ తెలియజేస్తూ.. రానున్న కాలంలో చేపట్టబోయే పథకాలను ప్రజలకు చెబుతున్నామని తెదేపా మండల అధ్యక్షుడు జజ్జూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆరుగొలనుపేట గ్రామంలో ఆదివారం తెదేపా కార్యకర్తలతో కలిసి 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు పానుగంటి కోటేశ్వరరావు, బొల్లికొండ వెంకటేశ్వరరావు, కొమ్ము నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గవర్నర్ పదవి రావడంపై హర్షం

అశోక్ గజపతిరాజుకు అభినందనలు తెలుపుతూ ఆయన చిత్రం పటం వద్ద కొప్పుల వెలమపేట వాసులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మాజీ పౌర విమానయాన శాఖ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవి రావడంపై నూజివీడులోని కొప్పుల వెలమపేట యూత్ ఆధ్వర్యంలో శనివారం స్థానికులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పూసపాటి అశోక్ గజపతిరాజు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నాయకులు సందడి చేశారు. ఆయన దేశానికి, రాష్ట్రానికి చేసిన సేవలను ఈ సందర్భంగా ప్రస్తావించి గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నౌడు మల్లేశ్వరరావు, జీవీ రామారావు, ఎదురేశి యరకయ్య, దాసరి పండు, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లు.. ఇంకెన్నేళ్లు..

కోడూరు రహదారితో అవస్థలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: కోడూరు ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై, పెద్దపెద్ద గుంతలు పడటంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇటీవల కాలంలోనే పాఠశాల ఉపాధ్యాయురాలితో పాటు పలువురు గ్రామస్థులు గుంతల్లో వాహనాలపై నుంచి పడిపోయి ప్రమాదాల బారినపడి క్షతగాత్రులయ్యారు.

ప్రమాదాలకు నిలయంగా.. జాతీయరహదారి నుంచి కోడూరుకు సుమారు ఆరు కిలోమీటర్ల మేర సుమారు ఆరున్నర ఏళ్ల క్రితం మరమ్మతులు నిర్వహించారు. ఆ తర్వాత మరమ్మతులు, నూతన రహదారి నిర్మాణం చేయలేదు. దీంతో రహదారిపై పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. దానికి తోడు సుమారు అరకిలో మీటరు మేర ఇరువైపుల ఉన్న కాలువల వల్ల రహదారిలో దిగబడిపోతున్నాయి. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ప్రధాన రహదారి మధ్యలో గొయ్యిలా ఏర్పడినా పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంత మంది పాలకులు మారినా ఏళ్లు గడుస్తున్నా ఆరు కిలోమీటర్ల మేర రోడ్డును మాత్రం నిర్మించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రహదారి నిర్మాణం చేసి తమ ప్రయాణ కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ధ్వంసమైన మార్గం

రోడ్డుపై ఏర్పడిన గుంత

మళ్లీ ప్రతిపాదనలు..

గతంలో నూతన రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. ఇటీవల గ్రామానికి న్యాయమూర్తి బట్టు దేవానంద్ రావడంతో రహదారి నిర్మాణం చేయాలని అర్జీ అందించారు. ఆర్‌అండ్‌బీ నుంచి లేఖ వచ్చింది. దీంతో తాజాగా 5.6 కి.మీ మేర రూ.3.10 కోట్లతో రహదారి నిర్మాణానికి మళ్లీ ప్రతిపాదనలు పంపించాం. - మంగినేని సత్య అరవింద్, ఆర్‌అండ్‌బీ డీఈఈ

మనోజ్‌కు సేవారంగంలో అవార్డు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లికి చెందిన ప్రైవేటు వైద్యుడు అంబుల మనోజ్‌కు రితిక ఫౌండేషన్స్ నంది అవార్డు అందించింది. విజయవాడ ఆటోనగర్‌లో ఆదివారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఫౌండర్ నిత్యానంద చారి, డీఎస్పీ శ్రీనివాసరావు, సినీ నటి ఎం.జ్యోతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

హోంమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

పోలవరం: పోలవరంలో నూతనంగా రూ.2.50 కోట్లతో నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత రాకను పురస్కరించుకుని ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రెండు మూడు రోజుల్లో మంత్రి వచ్చే అవకాశం ఉందని, అందుకే ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

సినిమా

నూజివీడు పట్టణం	
సత్యనారాయణ	మై బేబీ
సత్యనారాయణ మినీ	కొత్తపల్లిలో ఒకప్పుడు
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	జూనియర్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	....
ద్వారక సినిమాస్ స్క్రీన్ 3	....
ఆగిరిపల్లి: శ్రీను డీలక్స్	తమ్ముడు
కైకలూరు: విజయలక్ష్మి జూ	జూనియర్
మాగంటి సినిమాస్	కొత్తపల్లిలో ఒకప్పుడు
శ్రీవెంకటరమణ సినిమాస్	ఓ భామ అయ్యో రామ
ముదినేపల్లి: పూర్ణిమ	జూనియర్

బాలిక అదృశ్యం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పదిహేడేళ్ల బాలిక అదృశ్యమైనట్లు ఆమె సోదరుడు రూరల్ పోలీసులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. రూరల్ హెచ్‌సీ జె.అజయ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ మిల్లులో బాలిక కుటుంబం పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమయంలో ఒక వ్యక్తి తమ కుమార్తెను మభ్యపెట్టి తీసుకుని వెళ్లిపోయినట్లు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సారా స్వాధీనం

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి మండలంలో సారా స్థావరాలపై దాడి చేసినట్లు ఎస్సై సతీశ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ దాడుల్లో కొమ్ముగూడెంలో ఆయిల్‌పామ్ తోటల్లో సారా తయారు చేస్తున్న ఇద్దరి యువకులను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు.

ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

చింతలపూడి, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తూ ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వృద్ధురాలి రెండు కాళ్లు నుజ్జునుజ్జయిన ఘటన చింతలపూడి కొత్తబస్టాండులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చాట్రాయికి చెందిన తుమ్మల లక్ష్మి బంధువుల ఇంటికి వెళ్లేందుకు చింతలపూడి కొత్త బస్టాండుకు వచ్చారు. అక్కడి నుంచి ఆమె నడిచి వస్తుండగా.. ప్రమాదవశాత్తూ బస్సు ఢీకొట్టింది. ఇందులో రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అయిదుగురు జూదరుల అరెస్టు

కైకలూరు, న్యూస్‌టుడే: మండలంలోని తామరకొల్లులో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సీఐ పి.కృష్ణకు వచ్చిన సమాచారంతో కైకలూరు పట్టణ ఎస్సై ఆర్.శ్రీనివాస్ ఆదివారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గ్రామ శివారులో గుట్టుచప్పుడు కాకుండా కోడి పందేలు వేస్తున్న అయిదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1250, రెండు కోళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పారిశ్రామిక ప్రగతి బాటలు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో పరిశ్రమలు అమరావతి వచ్చేందుకు వెనకడుగు వేశాయని, ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో పారిశ్రామిక ప్రగతి బాటలు పడుతున్నాయని విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. ఆదివారం మండలంలోని మీర్జాపురంలో ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు.

ఉపాధి పైకం పక్కదారి!

- రూ.60 లక్షల పనులపై సమగ్ర విచారణ
- రూ.2.32 లక్షల రికవరీకి ఆదేశాలు

ఉపాధి హామీ పనులు చేస్తున్న శ్రామికులు

కలిదిండి, న్యూస్‌టుడే : పేదలకు పని కల్పించి వాళ్ల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు అమలు చేస్తోన్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పారదర్శకత లోపించడంతో లక్ష్యం నిర్వీర్యమైపోతోంది. పేదలకు వెళ్లాల్సిన పైకం పక్కదారి పడుతోంది. కలిదిండి మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ, పంచాయతీ రాజ్‌కు సంబంధించిన పనుల్లో రూ.1.49 కోట్ల విలువైన పనులపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది.

రూ.11.22 కోట్లతో..

కలిదిండి మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.11.22 కోట్లతో ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించిన పనులు జరిగాయి. ఈ పనులపై వారం రోజులుగా సామాజిక తనిఖీ నిర్వహించారు. అనంతరం శనివారం వెలుగు కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా వేదికలో వెల్లడైన వాస్తవాలు విస్తుగొలుపుతున్నారు.

పారదర్శకంగా లేవని

సామాజిక తనిఖీలో భాగంగా మండల వ్యాప్తంగా రూ.60 లక్షల విలువైన పనులు పారదర్శకంగా లేవని నిర్ధారించారు. పరిశీలనా బృందం ఈ పనులపై అనేక సందేహాలు వ్యక్తం చేశారు. వీటిపై సమగ్ర విచారణ నిర్వహించాల్సిన అవసరం ఉందని అధికారులు స్పష్టం చేశారు.

రూ.86 లక్షల పునఃపరిశీలన

పలు గ్రామాల్లో జరిగిన రూ.86 లక్షల పనులపై స్పష్టత రాకపోవడంతో వీటిని పునః పరిశీలించాలని నిర్ణయించారు. నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు చేసిన రూ.2.32 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందున సిబ్బందికి రూ.55 వేలు జరిమానా విధించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ స్థాయిలో అవకతవకలు చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

నిబంధనలకు తిలోదకాలు

నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగినట్లు అధికారులు గుర్తించారు. కాలువలు, బోదెలు, చెరువుల్లో నీరు ఉండగా పనులు చేయకూడదు. కొన్ని గ్రామాల్లో నీళ్లలో పని చేసి బిల్లులు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గుర్వాయిపాలెంలో బినామీ మస్టర్లు వేసినట్లు ధ్రువీకరించారు. ఇలాంటి తప్పులు పలు గ్రామాల్లో జరిగినట్లు ఓ నిర్ణయానికి వచ్చారు. ప్రతి రూపాయి తప్పనిసరిగా రాబటతామని జిల్లా విజిలెన్సు అధికారి నాతి బుజ్జి స్పష్టం చేయడంతో సమగ్ర విచారణ, పునఃపరిశీలనలో ఇంకెలాంటి లొసుగులు బయట పడతాయోనన్న ఆసక్తి నెలకొంది.

అంగన్‌వాడీ చిన్నారుల్లో.. నవ చైతన్యం

ప్రత్యేక పుస్తకాలతో వినూత్న విద్యా బోధన

నూజివీడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక బాలల భవిష్యత్తును తీర్చిదిద్దే అంగన్‌వాడీ కేంద్రాల్లో మార్పులకు శ్రీకారం చుట్టింది. పౌష్టికాహారం అందజేత, పర్యవేక్షణ యాప్‌లు ఇప్పటికే కొత్తవి అమలు చేసింది. తాజాగా చిన్నారుల అభ్యసన సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు కొత్త పుస్తకాలను సరఫరా చేసింది. బాల్యానికి భరోసా ఇవ్వడానికి ప్రాధాన్యం కల్పిస్తోంది. చిన్నారులు మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఎదిగేలా కూటమి ప్రభుత్వం కేంద్రాల్లో మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా 'నవ చేతన' 'ఆధార్ శిల' అనే పుస్తకాలను రూపొందించి అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికి అందజేసింది. వీటిలోని అంశాలను వారు అమలు చేయడంతో పాటు తల్లిదండ్రులకు వివరించాల్సి ఉంటుంది.

అర్థమయ్యేలా..'నవ చేతన'.. ఈ పుస్తకంలో శిశువు గురించి వివరించారు. గర్భధారణ దశ నుంచే శిశువు తన శారీరక, మానసిక ప్రేరణ అవసరాన్ని తెలియజేస్తుంది. ఇది గుర్తించి చిన్నారుల మెదడు, శరీర అభివృద్ధిని గుణాత్మకంగా పెంచేందుకు చిట్టి బుర్రలకు అర్థమయ్యేలా ఎలా కబుర్లు, కథలు చెప్పాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఎలా ప్రవర్తించాలి? అనేది చిత్రాలు సహా ఇచ్చారు. పిల్లలకు ఏ నెలలో ఎలాంటి అంశాలు నేర్పించాలో కూడా ఈ పుస్తకంలో వివరించారు. ఇందులోని అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు బాలింతలకు అవగాహన కల్పించాలి. 36 నెలలలోపు చిన్నారులకు ఈ పుస్తకంలో పొందుపరిచిన అంశాలు నేర్పిస్తారు.

వినోదాత్మకంగా.. 'ఆధార్ శిల'..

ఈ పుస్తకంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్ల చిన్నారులకు వినోదాత్మకంగా పాఠాలు ఎలా బోధించాలో వివరించారు. నీతి పద్యాలను, రుతువులు, పండగలు, పండ్లు, కూరగాయలు, మన ఊరు, కుటుంబం తదితర ఇతివృత్తాల ద్వారా పిల్లలు పరిసరాలు, సంస్కృతిని అర్థం చేసుకోవడానికి దోహదపడేలా రూపొందించారు.

కొత్తగా రూపొందించిన పుస్తకాలు

ప్రైవేటుకు దీటుగా...

ప్రైవేటు ప్లే స్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాబోధన అందించేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుంది. దీంట్లో భాగంగా ఆధునిక విజ్ఞానంతో నిండిన పుస్తకాలను చిన్నారులకు అందించాం. అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరే చిన్నారుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. - పి.విజయకుమారి, సీడీపీవో, నూజివీడు.

నియోజకవర్గ సమాచారం ఇలా..	
అంగన్‌వాడీ కేంద్రాలు	319
చిన్నారులు	14,689
గర్భిణులు	1,265
బాలింతలు	1,354

(c) eenadu

అన్నవరం.. నిద్రావస్థలో నిఘా

✦ సరకుల స్టోర్ నుంచి వినియోగం వరకు..

✦ అడుగడుగునా కొరవడిన పర్యవేక్షణ

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరంలో నిఘా వ్యవస్థ సక్రమంగా లేదు. పూజలు, ఇతర వాటికి వినియోగించే సామగ్రి, సరకుల ఉంచే స్టోర్స్ నుంచి వినియోగం వరకు పర్యవేక్షణ కొరవడింది. క్షేత్ర రక్షకులు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో పూజకు వినియోగించే నెయ్యి డబ్బాలు దేవస్థానం స్టోర్స్ నుంచి ఈ ఆలయానికి రాగా మూడు డబ్బాలను అక్కడ పనిచేసే ఉప ప్రధాన అర్చకుడు, సంభావన పరిచారకుడు పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు. వీరిద్దరినీ విధుల నుంచి సస్పెండ్ చేసినా ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. 'అన్నవరంలో నెయ్యి పక్కదారి' శీర్షికతో ఈనెల 19న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై పూర్తి వివరాలు అందించాలని ప్రభుత్వ కార్యదర్శి ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ కార్యదర్శికి జరిగిన ఘటన, గుర్తింపు, తీసుకున్న చర్యలు వివరిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ నివేదిక అందజేశారు. మరోవైపు ఇలా సరకులు పక్కదారి పడుతున్న పరిస్థితులు ఎక్కడైనా ఉన్నాయా అన్నది పరిశీలించాలని దేవస్థానం అధికారులను కమిషనర్ ఆదేశించారు. దేవస్థానంలోని వివిధ సబ్‌స్టోర్స్ (సరకులు నిల్వచేసే గోదాం), ఉపాలయాలకు సంబంధించి సీసీ కెమెరాల గత 90 రోజుల బ్యాకప్ పరిశీలించి నివేదిక పంపాలన్నారు. నెయ్యిని పక్కదారి పట్టించే ప్రయత్నం చేసిన ఉప ప్రధాన అర్చకుడిని ఇప్పటికే సస్పెండ్ చేయగా సంభావన పరిచారికుడ్ని నిలుపుదల చేయాలని ఆదేశాలిచ్చారు. సుమారు 300 కెమెరాలు ఉన్నా రికార్డింగ్ బ్యాకప్ సామర్థ్యం మాత్రం కేవలం 30 రోజులే ప్రస్తుతం ఉంది. సామర్థ్యం 90 రోజులకు పెంచడానికి అవసరమైన సర్వరు, హార్డ్‌డిస్కులు ఏర్పాటు చేయడానికి ఇటీవల రూ.70 లక్షలు అంచనాలను అధికారులు సిద్ధం చేశారు. అయితే స్టోర్స్, ఉపాలయాల సీసీ కెమెరాల 90 రోజుల బ్యాకప్ పరిశీలించాలని కమిషనర్ ఆదేశించినా పరిశీలించే అవకాశం లేదని సమాచారం. స్టోర్స్ నుంచి సరకులు బయటకు వచ్చిన తర్వాత వాటి వినియోగంపై పర్యవేక్షణకు పకడ్బందీవ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరముంది.

కిలోమీటరు దూరం.. ఒళ్లంతా హూనం

కాకినాడ నగరం దుమ్ములపేట రైల్వే ట్రాక్ నుంచి కుంభాభిషేకం చేపలరేవుకు ఆనుకుని వెళ్లే పోర్టు రోడ్డును కలిపే ఆర్అండ్‌బీ రహదారి పెద్ద గుంతలు, రాళ్లు తేలి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ మార్గం పోర్టుకు వెళ్లే సిబ్బంది, మత్స్యకారులు, వివిధ కర్మాగారాలకు సరకుల తీసుకెళ్లే వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇది అత్యంత ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు ఇటు ప్రయాణం అంటేనే హడలిపోతున్నారు. వర్షాలు పడినప్పుడు నీరు నిలిచి, ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యుత్తు దీపాలు లేకపోవడంతో రాత్రి పూట విధులు నిర్వహించేందుకు వెళ్లే పోర్టు సిబ్బంది బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టాలంటూ వాహనదారులు కోరుతున్నారు. – ఈనాడు, కాకినాడ

అయిదేళ్ల అంధకారం.. హరించే సౌరదీపం!

నాటి తెదేపా హయాంలో నిర్మించిన టిడ్కో గృహాల చెంత ప్రస్తుతం సౌర వెలుగుల శోభ సౌకర్యంగా మారింది. ఆ ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు ఇష్టంలేక మిగిలిన చిన్నపాటి పనులూ పూర్తిచేయకుండా గత వైకాపా ప్రభుత్వంలో ఎన్ని ఇబ్బందులకు గురిచేశారో అందరికీ తెలిసిందే. అయిదేళ్ల సమస్యలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూవస్తోంది. మౌలిక వసతులకు పెద్దపీట వేస్తూనే.. మధ్యలో నిలిచిన ఇళ్ల నిర్మాణం పూర్తికి ప్రణాళికలు అమలు చేస్తోంది. కాకినాడ పర్లోవపేట టిడ్కో గృహ సముదాయాల్లో చీకట్లు తొలగించేందుకు సౌర దీపాలు ఏర్పాటు చేయగా ఉచిత విద్యుత్తు వెలుగులు వారికి లభించాయి. ఇక్కడున్న 36 బ్లాకుల్లో జీవనం సాగిస్తున్న 1,152 కుటుంబాలు రాత్రి వేళల్లో హాయిగా రాకపోకలు సాగిస్తున్నారు. – ఈనాడు, కాకినాడ

పేరు ఆకర్షణీయం.. తీరు దయనీయం

పైన పటారం.. లోన లొటారం అన్నట్టుగా తయారైంది ఆకర్షణీయ నగరం కాకినాడలోని వివేకానంద పార్క్ సమీపంలోని బస్‌షెల్టర్ పరిస్థితి. ఇందులో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరికొన్ని చోరీకి గురయ్యాయి. లోపల సీలింగ్ పూర్తిగా పాడై ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం ఆరుబయటే నిరీక్షించాల్సిన పరిస్థితి.. ఇప్పటికైనా నగరపాలక అధికారులు దీనిని బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. – ఈనాడు, కాకినాడ

దూరం.. భారం కాకూడదని!

● బడి పిల్లలకు రవాణా ఛార్జీలు

● అర్హుల జాబితా సిద్ధం చేస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగంలో అనేక మార్పులు తెస్తోంది. పుస్తకాల బరువు తగ్గించి సెమిస్టర్ విధానాన్ని అమలు చేయడం, ఉపాధ్యాయుల యాప్‌ల భారాన్ని తగ్గించడం.. సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం తదితర సంస్కరణలు తెచ్చింది. వీటితో పాటు దూరం పేరుతో విద్యార్థులు పాఠశాల మానేయకుండా రవాణా ఛార్జీలు చెల్లించాలని నిర్ణయించింది. పాఠశాలకు కి.మీ. కంటే ఎక్కువ దూరంలో ఉన్న 5వ తరగతి లోపు పిల్లలు, అలాగే 3 కి.మీ. కంటే ఎక్కువ దూరంలో ఉన్న 6, 7, 8 తరగతి విద్యార్థులకు నెలకు రూ.600 చొప్పున మూడు నెలలకుగాను రూ.1800 ఇవ్వనున్నారు. ఇందులో కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చొప్పున భరించనున్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి ఇప్పటికే కేంద్రం రూ.41.91 కోట్లు మంజూరు చేసింది. దీనిని రాష్ట్ర వాటా కలిపి అమలుకు రాష్ట్ర సమగ్ర శిక్షా అధికారులు కార్యాచరణ రూపొందించారు.

హేతుబద్ధీకరణతో ఇక్కట్లు పడకుండా

విద్యా సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం హేతుబద్ధీకరణ చేసి 9 రకాల బడులను తీసుకొచ్చింది. కాకినాడ జిల్లాకు సంబంధించి 466 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేసింది. ఇక్కడ అయిదు తరగతుల నిర్వహణ జరుగుతోంది. ఇందుకోసం సమీపంలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను అక్కడకు తరలించారు. కొన్ని చోట్ల పిల్లలు తక్కువగా ఉండటంతో ప్రాథమికోన్నత బడుల స్థాయిని తగ్గించారు. దీంతో 6, 7, 8 తరగతుల విద్యార్థులను సమీపంలోని ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోంది. దూరంగా ఉన్నాయని కొంతమంది బడి మానేసే యోచన చేయకుండా ప్రభుత్వం వారికి రవాణా ఛార్జీలు ఇవ్వడానికి ముందుకొచ్చింది. కాకినాడ జిల్లాలో ఇలాంటివారు 1,711 మంది వరకు అంచనా. మూడు నెలలకు సంబంధించి ఆగస్టులో చెల్లించేందుకు కార్యాచరణ ప్రారంభించారు.

సన్నాహాలు చేస్తున్నాం..

బడి పిల్లలకు రవాణా ఛార్జీలు చెల్లించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. అర్హుల జాబితాలు సిద్ధం చేస్తాం. పిల్లలు దూరం పేరుతో బడికి మానే కుండా ఈ పథకం దోహదపడుతుంది.

- పి.వేణుగోపాలరావు, ఏపీసీ, సమగ్ర శిక్షా, కాకినాడ

మాయ చేసి.. పన్ను ఎగవేసి..!

✦ 1,836 నిర్మాణాలకు ఆస్తి పన్నే లేదు

✦ వైకాపా జమానాలో నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన యంత్రాంగం

ఈనాడు, రాజమహేంద్రవరం: వైకాపా జమానాలో ప్రజాప్రతినిధులు.. నాయకుల మాటలే శాసనమన్నట్లు అధికారులు వ్యవహరించారు. అడ్డగోలుగా స్థలాలు ఆక్రమించినా పట్టింపులేని దాఖలాలు లేవు. ఇళ్లపై అదనపు అంతస్తులు, వాణిజ్య సముదాయాలు నిర్మించినా వాటికి పన్నులు వేసేందుకు సాహసించని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో ఈ తరహా అక్రమాలు ఒక ఎత్తయితే.. కాకినాడ నగరపాలక సంస్థలోనే అత్యధికంగా ఆ ప్రభావం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 'పుర' ఆదాయానికి పన్నుల రూపంలో రావాల్సిన రూ.కోట్ల ఆదాయానికి జగన్ జమానాలో గండి కొట్టారు. 45 రోజులుగా చేస్తున్న 'పుర సర్వే'లో పన్ను పరిధిలో లేని నిర్మాణాల నిగ్గు తేలుతోంది. ఉమ్మడి జిల్లాలోని నగర, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో దాదాపు రూ.4.59 కోట్ల మేర రావాల్సిన ఆదాయానికి గండి కొట్టినట్లు గుర్తించగా.. వాటిని వసూళ్లు చేసేందుకు, బాధ్యులైన అధికారులపైనా చర్యలకు యంత్రాంగం సిద్ధమవుతోంది.

జగన్ జమానాలో అధికారులపై కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఇతర నాయకులు ఒత్తిడి తెచ్చి పలు నిర్మాణాలకు పన్నులు వేయకుండా అడ్డుకోగా.. కొన్నింటికి వసూళ్లు చేయాల్సిన నిర్దేశిత పన్ను కంటే తక్కువగా నమోదు చేశారు. తూర్పు గోదావరి, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల్లో ఇప్పటి వరకు 1836 నిర్మాణాలకు అసలు పన్నులే విధించలేదని తేలింది. వీటిలో అత్యధికం వైకాపా హయాంలోనే నిర్మించినవే కావడం గమనార్హం. ఆస్తి పన్ను వసూళ్లు చేయకపోవడం వల్ల రూ.2.33 కోట్లు మేర ఆదాయం కోల్పోయినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఒక్క కాకినాడలోనే ఈ తరహా నిర్మాణాలు 365 ఉండగా అత్యధికంగా రూ.1.32 కోట్లు, రాజమహేంద్రవరంలో 457 ఇళ్లకు రూ..59.50 లక్షలు మేర ఆస్తి పన్ను వసూలు చేయలేదు. ప్రస్తుతం ఎగవేతదారులకు నోటీసులిచ్చి వసూళ్లచేయనున్నారు.

కాకినాడ నగరం

వెలుగులోకి కొస్తున్న అక్రమాలు..

కార్పొరేషన్/పురపాలిక	పన్ను వేయని నిర్మాణాలు	రావాల్సిన ఆదాయం (రూ.లక్షల్లో)
కాకినాడ	365	132.77
పెద్దాపురం	148	6.72
పిఠాపురం	67	3.65
సామర్లకోట	85	1.71
తుని	33	1.59
ఏలేశ్వరం	51	1.55
గొల్లప్రోలు	24	0.71

విలువ తగ్గించి నమోదు..

ఇళ్లు, ఇతర నిర్మాణాలను విస్తీర్ణం కంటే తక్కువగా చూపించడం, వాణిజ్య అవసరాలకు వినియోగించే వాటిని నివాస భవనాలుగా చూపించి పన్నులు తగ్గించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది, కమిషనర్ల ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఉమ్మడి జిల్లాలో 3,032 నిర్మాణాలకు విలువ తగ్గించి ఆస్తి పన్ను వసూలు చేయడం వల్ల 'పుర' ఆదాయం సుమారు రూ.2.25 కోట్లు కోల్పోయినట్లు తేల్చారు. వైకాపా నాయకుల బినామీ పేర్లతో చేసిన నిర్మాణాలకు పన్ను విధింపులో ఈ తరహా లొసుగులు గుర్తించినట్లు తెలుస్తోంది.

త్వరలోనే జగన్ జైలుకెళ్లడం ఖాయం: ఎమ్మెల్యే నెహ్రూ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, న్యూస్‌టుడే: లిక్కర్ స్కామ్‌లో త్వరలోనే జగన్‌కి అరెస్టు తప్పదని ఎమ్మెల్యే, తితిదే బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. ఆదివారం జగ్గంపేట తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. 2019 - 2024 ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా నాసిరకం మద్యం అమ్మి అనేకమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. దీనికి సంబంధించి జగన్‌పై విచారణ జరిపించాలన్నారు. ఈ స్కామ్‌లో అప్పుడు క్యాబినెట్‌లో ఈ మద్యం పాలసీని ఆమోదించిన వారిని విచారించాలన్నారు. నాయకులు ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు తదితరులు ఉన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

రైల్వే మంత్రికి ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ లేఖ

సర్పవరం జంక్షన్(కాకినాడ): కాకినాడ జిల్లా రైల్వే పరిధిలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌కు లేఖ రాసినట్లు ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్తు వ్యవస్థ 25 కేవీ సరిపోవడం లేదని, దాని సామర్థ్యం రెట్టింపు చేస్తేనే విద్యుత్తు ఇంజిన్ల రైళ్లు మరింత సమర్థంగా నడుస్తాయని తెలిపానన్నారు. ప్రస్తుత వ్యవస్థ హైస్పీడ్ రైళ్లకు అనువుగా లేదని, భవిష్యత్తులో గంటకు 160 కిలోమీటర్ల వేగంతో నడిచే రైళ్లను దృష్టిలో పెట్టుకుని వంతెనలు, ట్రాక్‌లు, యార్డులను ఆధునికీకరించాలని కోరానన్నారు. నిర్మాణంలో ఉన్న ఆర్‌వోబీలు, అండర్ పాస్‌ల వద్ద తాత్కాలికంగా బాటసారులు, ద్విచక్ర వాహనాలు, అత్యవసర సేవల వాహనాల రాకపోకలకు అనుమతించాలని విన్నవించానని ఎంపీ తెలిపారు.

ఎన్నెన్నో అందాలు.. ఆదరిస్తే పర్యాటక మణిహారాలు

మంత్రి దుర్గేష్‌పైనే ఆశలు

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, తాళ్లరేవు

కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఆధ్యాత్మికత, ఆనందం, ఆహ్లాదం పంచే పర్యాటక ప్రాంతాలెన్నో ఉన్నాయి. వైకాపా హయాంలో ఈ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం ఇటీవల తూర్పు గోదావరి జిల్లాలో రూ.94 కోట్లతో అఖండ గోదావరి ప్రాజెక్టు పేరుతో పర్యాటక అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లా నుంచి ఎన్నికైన పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ పర్యాటక ప్రాంతాలపైనే దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోని కాకినాడ హోప్ ఐలాండ్ ప్రాంతం

కోరింగ.. కావాలి మరింత కనువిందు..

కాకినాడకు సుమారు 10 కి.మీ దూరంలో దట్టమైన మడ అడవులతో కోరింగ అభయారణ్యం, వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం ఉంది. ఇక్కడ చెక్క వంతెనపై విహరించడం, గోదావరి పాయ నడుమ బోటుతో సముద్రంలోకి వెళ్లడాన్ని పర్యాటకులు ఆస్వాదిస్తున్నారు. గతంలో కొంతమేర అభివృద్ధి పనులు చేసినా ఇంకా మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన ఉంది. ✦ తలుపులమ్మలోవ నుంచి అన్నవరం, పిఠాపురం శక్తిపీఠం, పెద్దాపురంలో తొలి తిరుపతి గుడి, సామర్లకోటలో భీమేశ్వరస్వామి సర్పవరం భావన్నారాయణ ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం సర్క్యూట్ ప్రతిపాదన దశలోనే ఉంది.

మౌలిక వసతులు లేక

కాకినాడకు సుమారు 8 కి.మీ దూరంలో సముద్రం మధ్యన సహజ సిద్ధమైన ద్వీపం హోప్ ఐలాండ్ ఉంది. తుపాను నుంచి పట్టణానికి రక్షణగా, పర్యాటకులను ఆకర్షించే ద్వీపంగా ఇది నిలుస్తుంది. సముద్రంలో 40 నిమిషాల బోటు ప్రయాణంతో ఇక్కడకు చేరుకోవచ్చు. ఏపీ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో 2019 వరకు ప్రత్యేకంగా పడవలు నడిపేవారు. వారి కోసం షెడ్లు నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పించారు. కచ్చులూరు పడవ ప్రమాద ఘటన తర్వాత బోట్లు నిలిపేశారు. కొంతమంది స్థానిక మత్స్యకారుల పడవలపై అక్కడకు వెళ్లినా సదుపాయాలు లేక నిరాశగా వెనుతిరుగుతున్నారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..

విజయవాడలోని భవానీ ద్వీపం, హోప్ ఐలాండ్ కంటే విస్తీర్ణంలో చిన్నదే. జల క్రీడలు, అమ్యూజ్‌మెంట్ పార్క్, అతిథులు రాత్రిళ్లు బస చేయడానికి హోటళ్లు ఉండటంతో ఈ ద్వీపానికి సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కాకినాడ హోప్ ఐలాండ్‌లో పరిస్థితి దీనికి భిన్నం. పర్యాటకంగా ఎలాంటి అభివృద్ధి జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎకో టూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ప్రయాణికుల బోట్లు, 12 కాటేజీల నిర్మాణం, పర్యాటకుల నడక దారి, విశ్రాంత గదులు, మరుగుదొడ్లు, పిల్లలు ఆడుకునేందుకు సామగ్రి సమకూర్చడానికి సుమారు రూ.8 కోట్లు అవుతుందని లెక్కగట్టారు. నెలకు లక్ష మందికి పైగా సందర్శించడానికి అవకాశం ఉంటుందని అంచనా వేశారు. కానీ ఈ ప్రతిపాదనలకు అటవీశాఖ అధికారులు మోకాలడ్డినట్లు తెలిసింది. దీనిపై పర్యాటక మంత్రి చొరవ చూపితేనే ప్రాజెక్టులో ముందడుగు పడేది.

శాకంబరిగా నూకాలమ్మ

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామ దేవతగా పూజలందుకుంటున్న సూర్యారావుపేటలోని నూకాలమ్మ ఆదివారం శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారితోపాటు, ఆలయాన్ని సుమారు రెండు టన్నుల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు.

WANTED
WARDENS
(Male/Female Candidates)
For ADITYA HOSTELS
QUALIFICATION :
Any Degree with fluency in English & Hindi
FREE LODGING & BOARDING
(BACHELORS PREFERRED)
ATTRACTIVE SALARY FOR DESERVING CANDIDATES
ADITYA ACADEMY
Srinagar, KAKINADA
Ph: 7036146665
77320 76668

చెరువులు వెలవెల.. ధర కళకళ

వనామీ రొయ్యలు 100 కౌంట్ రూ.250కు పెరుగుదల

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ఈ ఏడాది మే నెలలో వాతావరణ మార్పులు. . వ్యాధులు వనామీ రొయ్యల సాగును కుదేలు చేశాయి. ప్రతికూల పరిస్థితి కారణంగా అప్పటికప్పుడు పట్టుబడి పట్టి వచ్చిన ధరకు విక్రయించేశారు. గత నెలలో 100 కౌంట్ కిలో రూ.210 ఉంటే ప్రస్తుతం రూ.250కు పెరిగింది. దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడం, ఎగుమతికి ఆర్డర్లు రావడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు వ్యాపారులు చెబుతున్నారు. మరో రూ.10 పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. చైనా, యూఏఈ, సౌదీ, కువైట్, వియత్నం, థాయ్‌లాండ్ దేశాలకు చిన్న కౌంట్ రొయ్యల ఎగుమతులు పెరగడంతో గిరాకీ పెరిగింది. కోనసీమ జిల్లాలో అధికారికంగా 40 వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. అనధికారికంగా మరో 10 వేల ఎకరాల్లో చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం సుమారు 80 శాతం చెరువులు ఖాళీ అయ్యాయి. 100 కౌంట్ దాటిన రొయ్యలు ఉన్న చెరువులు 10వేల ఎకరాల లోపే ఉంటాయని అంచనా. ఇప్పటికే పట్టుబడి పట్టిన రైతులు నష్టాలపాలయ్యారు.

వ్యాధుల విజృంభణ...

ఆక్వాసాగులో గత రెండు నెలలుగా వాతావరణంలో విపరీత మార్పుల కారణంగా రొయ్యలు వ్యాధుల బారిన పడుతున్నాయి. దీంతో చెరువులు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం చెరువుల్లో పిల్లలను వదులుతున్నారు. అవి పట్టుబడికి రావడానికి మరో రెండు నెలల సమయం పడుతుంది. ఈ ధరలు అప్పటి వరకు నిలకడగా ఉంటేనే రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

రూ.22వేలు పలికిన పులస

యానాం, న్యూస్‌టుడే: పులస చేపలకు ఈ ఏడాది రికార్డు ధరలు లభిస్తున్నాయి. యానాంలోని రాజీవ్‌బీచ్‌లో ఆదివారం మత్స్యకారులు నిర్వహించిన వేలంలో 1.800 కేజీల పులసను చేపల వ్యాపారం చేసే పొన్నమండ రత్నం రూ. 22 వేలకు దక్కించుకున్నారు. బంగాళాఖాతం నుంచి సంతానోత్పత్తి కోసం గోదావరి వరద నీటిలోకి వచ్చి మత్స్యకారులకు చిక్కే వీటిని కొనుగోలు చేసేందుకు ఏటా తీవ్ర పోటీ ఉంటుంది. హోప్ ఐలాండ్‌కు చెందిన మల్లాడి ప్రసాద్ వలకు ఈ చేప చిక్కింది. గతేడాది ఓ పులసను రూ.23 వేలకు విక్రయించినట్లు అతడు చెప్పారు. ప్రస్తుత సీజన్లో లభ్యత తక్కువగా ఉండటంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

వేలంలో దక్కించుకున్న పులసను చూపిస్తున్న రత్నం

25 నుంచి సత్యదేవుని ఆవిర్భావ వేడుకలు

అన్నవరం, న్యూస్‌టుడే : అన్నవరం సత్యదేవుని ఆవిర్భావ వేడుకలు ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్నాయి. 26న స్వామివారి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. స్వామి, అమ్మవారు, పరమేశ్వరుల మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, ప్రాకారసేవ, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయి. ఉత్సవాల నిర్వహణకు హైదరాబాద్‌కు చెందిన సిరి కాలిబ్రేషన్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ ఏ.నాగేశ్వరరావు ప్రధానాలయం, యంత్రాలయం, ఉపాలయాల్లో అలంకరణకు పట్టు వస్త్రాలు అందించారు. ✦ దేవస్థానంలో అత్యధికంగా సత్యదేవుని ప్రసాదం ప్యాకెట్లు లక్ష ఆదివారం విక్రయించారు. లోవ తలుపులమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు తిరుగుప్రయాణంలో ఎన్‌హెచ్‌పై నమూనాలయాల వద్ద పెద్దసంఖ్యలో ప్రసాదం ప్యాకెట్లను కొనుగోలు చేశారు. స్వామివారి పల్లకీ సేవ జరిగింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంటు డైరెక్టర్ ఎల్.వి.రమణ మూర్తి స్వామిని దర్శించుకుని పూజలాచరించారు.

నేడు కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ రద్దు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను అనివార్య కారణాలతో రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

ఇళ్ల స్థలాల పంపిణీపై కసరత్తు

అర్హుల ఎంపికకు క్షేత్రస్థాయిలో విచారణ

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

జిల్లాలో ఇళ్లు లేని నిరుపేదలకు స్థలాలు కేటాయించి, పట్టాల పంపిణీకి కూటమి ప్రభుత్వం సంకల్పించింది. గ్రామీణంలో పేదలకు 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున మంజూరుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు జిల్లాలోని ప్రభుత్వ స్థలాల గుర్తింపునకు చర్యలు చేపట్టింది. వీలైనంత త్వరగా అర్హులైన వారికి కేటాయింపునకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్), రెవెన్యూ సదస్సులు, గ్రామ, వార్డు సచివాలయాలు, ఎమ్మెల్యేలకు అందిన దరఖాస్తులపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.

తూరంగిలో విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

దరఖాస్తుల పరిశీలన

జిల్లాలోని 20 మండలాలు, ఏడు పట్టణ స్థానిక సంస్థల్లో ఇప్పటి వరకు ఇళ్ల స్థలాలకు 18,079 మంది దరఖాస్తు చేశారు. వీటిలో 11,862 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆరంచెల తనిఖీల ద్వారా విచారించారు. ఇందులో 6,831 మందిని అర్హులుగా గుర్తించారు. 5,031 మందిని అనర్హులుగా నిర్ధారించారు. మిగతా వాటిపై ఆన్‌లైన్‌లో విచారణ జరుగుతోంది. అర్హులైన వారి దరఖాస్తులపై రెవెన్యూ శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి, నిజనిర్ధారణ చేస్తున్నారు.

ఆ కాలనీల్లో ఖాళీగా..

గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల పేరుతో 1,41,817 మందికి ఇళ్ల పట్టాలు జారీ చేశారు. వీటిలో 1,06,804 ప్లాట్లు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు ఇక్కడ స్థలాలు పొందిన వారిలో 5,006 మందిని అనర్హులుగా నిర్ధారించారు. ఆ కాలనీల్లో చాలామంది నిర్మాణం చేపట్టలేదు. వందల సంఖ్యలో లబ్ధిదారులు పట్టాలను ఇతరులకు అమ్మేసుకున్నారు. ప్రస్తుతం కొత్తవారికి కేటాయింపునకు ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోతే.. గతంలో నిర్మాణాలను చేపట్టని వాటిని, అనర్హులకు ఇచ్చిన వాటిని కేటాయించే అవకాశంపై కసరత్తు జరుగుతోంది.

విచారణ జరుగుతోంది

ఇళ్ల స్థలాల దరఖాస్తులపై తహసీల్దార్ల ద్వారా విచారణ ప్రారంభించాం. ఇప్పటికే కొంత మంది అర్హులను గుర్తించాం. వాటిపై నిజనిర్ధారణ చేయిస్తున్నాం. త్వరలో ప్రభుత్వానికి అర్హుల జాబితా నివేదిస్తాం.

- జె.వెంకటరావు, డీఆర్వో, కాకినాడ

(c) eenadu

అపాయకర ప్రయాణం

కాకినాడ నుంచి విశాఖపట్నం వెళ్లే పాస్ట్ ప్యాసింజర్ రైలులో బోగీ తలుపుల వద్ద కూర్చుని ప్రయాణం చేస్తుండగా ఆదివారం 'న్యూస్‌టుడే' కెమెరా క్లిక్‌మనిపించింది. రైలు వెళ్లేటప్పుడు చల్లటి గాలి ముఖానికి తగిలి నిద్ర ముంచుకొచ్చి పడిపోతే.. మృత్యువు తప్పదని అనేక ఘటనలు రుజువు చేసినా.. మార్పు లేదని పలువురు వాపోతున్నారు. కదిలే రైలు ఎక్కడం, దిగడం చేయకుండా, తలుపుల వద్ద కూర్చోకుండా ఆర్పీఎఫ్ పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

ఆధ్యాత్మిక సౌరభం

కాకినాడ జిల్లా గొల్లప్రోలులో గ్రామదేవత పొదిలికి అమ్మవారి బోనాల పండగ ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. భారీ సంఖ్యలో మహిళలు బోనాలతో డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాల నడుమ సందడి చేస్తూ.. ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఏటా ఆషాఢ మాసంలో ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

ఇదేం చోదకం..

ద్విచక్ర వాహనం వ్యక్తిగత ప్రయాణాలకు వినియోగించడం పరిపాటి. ఈ చిత్రంలో చూడండి ఎంతటి ప్రమాదకరంగా వెళ్తున్నారో. ద్విచక్ర వాహనం కనిపించనంతగా టైర్లు తగిలించుకునిమరీ వెళ్తున్న తీరు ప్రమాదకరంగా కనిపించింది. వాహనం అదుపు తప్పినా.. టైర్లు కింద పడినా.. వెనుక వచ్చే వాహనదారులకు అపాయం తప్పదు. కాకినాడ నగరంలోని భానుగుడి కూడలి వద్ద కనిపించిన చిత్రమిది. – ఈనాడు, కాకినాడ

ఈదారి కళావిహీనం

అందమైన నగరం కాకినాడలోని వివేకానంద పార్కు–జేఎన్‌టీయూకే దారిలో నగర సుందరీకరణలో భాగంగా రెండేళ్ల క్రితం సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రధాన మార్గానికి, సైకిల్ ట్రాక్‌కు మధ్యలో రబ్బరు గొట్టాలు పెట్టించారు. కొంతకాలానికే అవి విరిగిపోయి కళావిహీనంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా నగరపాలిక అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు

మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో జిల్లా ఫుట్‌బాల్, ఎంఎస్ఎన్ ఫుట్‌బాల్ అసోసియేషన్ల సహకారంతో కాకినాడ అండర్-10, 12 విభాగంలో ఫుట్‌బాల్(ఎఫ్‌యూటీఎస్ఏఎల్) టోర్నమెంట్‌ను ఆదివారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రెండు విభాగాల్లో మొత్తం 22 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు డీఎస్‌డీవో శ్రీనివాస కుమార్, తదితరులు బహుమతులు అందజేశారు. కోచ్ కె. స్వామి శ్రీనివాస్, పీడీలు వీరబాబు, గోవిందు, లంకా రవి, రవి కౌర్ తదితరులు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి, పిఠాపురం వారి కోర్టులో
I.P.No. 9/2025

Between:
బత్తిన వెంకట కృష్ణ ...పిటీషనరు
మరియు
నక్కా శ్రీను మరియు 19గురు వగైరాలు ...రెస్పాండెంట్లు

పై నెంబరు పిటీషన్‌ను బత్తిన వెంకట కృష్ణ, తండ్రి: పద్మరాజు, వయస్సు 35 సంII, డోర్. నెం. 11-103, చల్లావారి వీధి, చెబ్రోలు గ్రామము, గొల్లప్రోలు మండలం అను ఆసామి, అతనిని ఇన్‌సాల్వెంట్‌గా ప్రకటించమని కోరుచూ 1) నక్కా శ్రీను, 2) రంగనాథం వెంకటేశ్వరరావు, 3) తాటికాయల వీరబాబు, 4) నాయుడు ఎస్.సి.వి.సావిత్రి సింధూష, 5) దాలే ప్రభాకర్, 6) రతనాల నాగ వెంకట సూర్యనారాయణ, 7) చల్లా సుబ్రహ్మణ్యం, 8) పులపకాయల వెంకటరమణ, 9) చల్లా నాని, 10) చల్లా శివకుమార్, 11) ముద్దన రవి, 12) బొబ్బిలి సీతారామాంజనేయులు, 13) మొగలి కాశీవిశ్వనాథ్, 14) రంగనాథం సతీష్, 15) పెదిరెడ్డి త్రిమూర్తులు, 16) తోట రాజేష్, 17) చాపశెట్టి శ్రీనివాసరావు, 18) కొప్పర్తి సాయి మణికంఠ, 19) కొడవాటి బాలాజీ, 20) బొనసెట్టి వెంకట సాయి పవన్ భూషన్ అనువారి మీద పిటీషన్ దాఖలు చేసుకొనగా, శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారంగా పై నెంబరు పిటీషనులో ఎవ్వరికైనను ఎట్టి అభ్యంతరములు వున్నను తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది. 28-07-2025 తేదీకి వాయిదా వేసియున్నారు. కావున పైన తెలిపిన వ్యక్తి ఇంకా ఎవ్వరికైనా ఎట్టి బాకీలు వున్న ఎడల సదరు వాయిదా రోజున శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10-30 లకు స్వయముగా గాని, ప్లీడరుగారి ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేదీ: 28-07-2025
కందా వెంకట రమణ, అడ్వకేట్
పిఠాపురం, సెల్ నెం: 93463 30567

అప్రమత్తం చేయకుండా పనులెలా చేస్తారు: రాజా

తుని, న్యూస్‌టుడే: ప్రజలను అప్రమత్తం చేయకుండా పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు చేపట్టడం సరికాదని వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. పట్టణంలోని 1వ వార్డు డ్రైవర్స్ కాలనీ ప్రాంతంలో ఆయన ఆదివారం పర్యటించారు. కొండపై నుంచి శనివారం బండరాళ్లు పడ్డ ప్రదేశాలు పరిశీలించి, గాయపడ్డ బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు.

ఖండన ప్రకటన

నా క్లయింట్లు M/s. ADITYA DEVELOPERS (ADITYA GREEN CITY) represented by Sri Nallamilli Bhimeswara Reddy వారి సంజాయిషీపై ఈ ఖండన ప్రకటన జారీ చేయడమైనది. ది.20-07-2025సం॥రం తేదీన ఈనాడు దినపత్రిక నందు M/s. శ్రీ పద్మాలయ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ పార్టనర్ అయిన చుండ్రు శ్రీహరిరావు గారి తరపున వారి అడ్వకేటు కాకర వెంకటేశ్వరరావు గారు ఇచ్చిన ప్రకటన పూర్తిగా సత్యదూరము, అవాస్తవమైన సంగతులతో ఇప్పించిన ప్రకటనై ఉన్నది. మరియు వాస్తవ విషయములను కప్పిపుచ్చి, నా క్లయింట్ యొక్క వ్యాపారలావాదేవీలను నష్టపరచు ఉద్దేశ్యముతో ఇప్పించబడి వున్నది.

సదరు ప్రకటన యందు పేర్కొనియున్న పెద్దాపురం మండలం, పెద్దాపురం టౌన్‌లో చేరియున్న T.S.2-8-439లో చేరియున్న L.P.No.58/209 తాలూకు ఆస్తిని M/s. N.S.N. Reddy Rice Industries మేనేజింగ్ పార్టనర్ శ్రీ నల్లమిల్లి భీమేశ్వర రెడ్డి, S/o. సత్యనారాయణ రెడ్డి గారు ఆంధ్రాబ్యాంకు వారు, వారి తాలూకు 2012 సం॥నకు చెందిన తనఖా బాకీ నిమిత్తమై జరిపిన వేలపు విక్రయంలో కొనుగోలు చేసి దరిమిలా కర్రి వెంకట కృష్ణారెడ్డి గారు జరిపిన వాజ్యమునందు కూడా నెగ్గి శ్రీ సుప్రీంకోర్టు వారి సివిల్ అపీల్ 1614/2018 వారి ఉత్తర్వుల ద్వారా హక్కుదారుడై ఉండి వున్నారు. సదరు కె.వి.కృష్ణారెడ్డి గార్కి ఏవిధమైన హక్కులు సదరు ఆస్తిలో ఉండియుండలేదు. కావున ప్రకటనలో పేర్కొన బడిన ఆస్తిపై కె.వి.కృష్ణారెడ్డి గారి ద్వారా M/s. శ్రీ పద్మాలయ ఫైనాన్స్ కార్పొరేషన్ వార్కి ఏవిధమైన బాకీ వసూలు హక్కులు లేవు. అయినను ఈ విషయము కప్పిపుచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించు ఉద్దేశ్యములో అబద్ధపు సంగతులతో ఈనాడు దినపత్రిక నందు ప్రకటన ఇప్పించియున్న కారణముగా వాస్తవ సంగతులను తెలియపరచు ఉద్దేశ్యముతో ఈ ఖండన ప్రకటన జారీ చేయడమైనది.

ఇట్లు
కాకినాడ
తేది:20-07-2025
K.V.S.V. LAKSHMAJI RAO (ADVOCATE)
DHANTUVARI VEEDHI, KAKINADA.

బండరాళ్లతో ముంచుకొస్తున్న ముప్పు

భద్రత కల్పించాలంటున్న తుని ఒకటో వార్డు ప్రజలు

తుని, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ నిర్మాణానికి సంబంధించి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొండను పేల్చుతుండగా భారీ బండ రాళ్లు శనివారం ఉదయం ఒకటో వార్డు డ్రైవర్స్ కాలనీ, నెహ్రూనగర్, కట్రాళ్లకొండలోని ఇళ్లపైకి రావడంతో ఇద్దరు మహిళలు గాయపడడం, ప్రహరీ పడిపోవడం, గోడలు బీటలు వారిన విషయం విదితమే. నిత్యం కొండను తొలిచే పనులు జరుగుతుండగా ఎప్పుడు ఏ ప్రమాదం ఎటునుంచి వస్తుందోనని కన్నీరుమున్నీరు అవుతున్నారు. కొండకు ఆనుకుని ఉన్న ఆయా ఇళ్లల్లో ఉండాలా? లేక ప్రాణాలు కాపాడుకోవడానికి కుటుంబ సమేతంగా ఎక్కడికైనా వెళ్లిపోవాలా? అన్న మీమాంసలో ఉన్నారు. అదే కొండను ఆనుకుని మరోవైపు ఉన్న పట్టించుకోలేదు. రోజూ కొండను తొలిచే పనులు, పేలుళ్లు జరుగుతున్నాయి. పేలుళ్ల నేపథ్యంలో స్థానికులకు ముందస్తు జాగ్రత్తగా ఉండాలని చెప్పినవారు లేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బండరాళ్ల దాటికి ప్రహరీ ఇలా..

సుమారు 300 ఇళ్లు..600 లకు పైగా కుటుంబాలు

డ్రైవర్స్ కాలనీ, నెహ్రూనగర్, కట్రాళ్లకొండ వద్ద 300లకు పైగా పెంకుటిళ్లు, డాబాలు ఉన్నాయి. వీటిలో సుమారు 600కు పైగా కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. వీరంతా శ్రమజీవులే. ఇళ్లల్లోకి వెళ్లాలంటే కొండవైపు చూస్తు జంకుతున్నారు. ప్రాజెక్టు రూపకల్పన చేసిన సమయంలో 25 ఏళ్ల కిందట ఒకటో వార్డు ప్రాంతంలో పెద్దగా ఇళ్లు లేవు. దాంతో అప్పట్లో జనావాసాలపై సర్వే చేయలేదు. ఇప్పుడు ఆ ప్రాంతంలో వందల మంది స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. తాజాగా పనులు చేపట్టేముందు క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఒక్కసారి కూడా అంచనా వేయలేదు. దీంతో కొండను తొలిచే క్రమంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. క్షేత్రస్థాయి పరిస్థితుల్లో కొండకు ఆనుకుని, పైన ఉన్న పలు పాత ఇళ్లు, ఆలయాలకు ముప్పు వాటిల్లుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

పట్టణంలో డ్రైవర్స్ కాలనీ కొండకు ఆనుకుని ఉన్న ఇళ్లు

డ్రోన్లతో చిత్రీకరించి కలెక్టర్‌కు నివేదన..

ప్రస్తుతానికి కొండకు కుడివైపున బ్లాస్టింగ్ నిలిపివేశాం. ఎడమవైపు అంటే కుమ్మరిలోవ కాలనీ వైపు పనులు చేస్తున్నాం. తదుపరి ప్రక్రియ ఏవిధంగా చేయాలనే దానిపై కట్రాళ్లకొండ ప్రాంతాన్ని మొత్తం డ్రోన్ల ద్వారా చిత్రీకరించి, పూర్తి సమాచారాన్ని కలెక్టర్‌కు పంపుతున్నాం. - మురళి, డీఈ, పోలవరం ప్రాజెక్టు

లోవ.. భక్తజన తోవ

తుని గ్రామీణం: తలుపులమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢమాస నేపథ్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్న సమయంలో దేవస్థాన బోర్డుల్ నుంచి మెట్ల మార్గం వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ఒక్కరోజే సుమారు 50 వేలకు పైబడి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానానికి రూ.16.74 లక్షల ఆదాయం సమకూరినట్లు దేవస్థాన డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు. డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ వైట్లన్ తుమ్మల బాబు తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

భక్తులతో కిక్కిరిసిన లోవ దేవస్థానం

మానాన్న ఆరోగ్య సమాచారం ఎందుకు విడుదల చేయలేదు..?

● అభిమానులకు తెలియజేయాల్సిన అవసరం లేదా.. ● మాజీ మంత్రి ముద్రగడ కుమార్తె క్రాంతి ఆవేదన

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: తన తండ్రి ఆరోగ్య సమాచారం విడుదల చేయకుండా ఇంత రహస్యంగా ఎందుకు వైద్యం చేస్తున్నారని మాజీ మంత్రి, వైకాపా సీనియర్ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి కుమార్తె బార్లపూడి క్రాంతి కన్నీటి పర్యంతం అయ్యారు. తన సోదరుడు ముద్రగడ గిరి చెబితే ఆపేస్తారా అని ప్రశ్నించారు. ఆదివారం రాత్రి తన తండ్రిని చూసేందుకు కాకినాడ ఏడీబీరోడ్డులోని ఆసుపత్రి వద్దకు ఆమె వచ్చారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తనను ఆసుపత్రి లోపలికి వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. తాను వస్తున్నానని తెలిసి నర్సులతో తలుపులు వేయించేశారన్నారు. తన తండ్రి కాకినాడ వచ్చి నాలుగు రోజులు అయ్యిందని.. ఇంతవరకు మూడు ఆసుపత్రులు తిప్పారని, హైదరాబాద్‌కు ఎందుకు తీసుకువెళ్లలేదని ప్రశ్నించారు. అంత రహస్యం ఏమిటని.. ఆయన ఒక కీలక నేత అని, ఆయన ఆరోగ్యం సమాచారం అభిమానులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తండ్రి వద్దకు వెళ్తే చేయి పట్టుకుని మాట్లాడటానికి ప్రయత్నించారన్నారు. ఆయనకు డయాలసిస్ జరుగుతుందని చెబుతున్నారని.. కాని క్యాన్సర్ వైద్యం జరగటం లేదన్నారు. అసలైన వైద్యం చేయకుండా డయాలసిస్ చేస్తే ఏంప్రయోజనం అన్నారు. తనకు ఏం విషయం తెలియకుండా ఆపేస్తున్నారని, ఎవరికి ఫోన్ చేసినా మాట్లాడనివ్వకుండా బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆసుపత్రిలో ముద్రగడ కుమార్తె క్రాంతి

ముద్రగడకు పలువురు పరామర్శ

పరామర్శించేందుకు ఆసుపత్రికి వచ్చిన ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, వైకాపా సీనియర్ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి ఆరోగ్యం అస్వస్థతకు గురైన నేపథ్యంలో పలువురు రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు ఆదివారం పరామర్శించారు. ఆయన ప్రస్తుతం సామర్లకోట ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ముద్రగడను కుమార్తె బార్లపూడి క్రాంతి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, వంగా గీత, చిర్ల జగ్గిరెడ్డి, దవులూరి దొరబాబు, వైకాపా నాయకులు పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

వివాహిత హత్య కేసు విచారణ వేగవంతం చేయండి

డీజీపీకి జాతీయ మహిళా కమిషన్ ఆదేశం

రాజోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం బి.సావరం గ్రామంలో ఈ నెల 16న జరిగిన వివాహిత ఓలేటి పుష్ప దారుణ హత్య కేసును జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది. నిందితుడిని తక్షణం అరెస్ట్ చేసి విచారణ వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీని కమిషన్ ఛైర్పర్సన్ విజయ రహాత్కర్ ఆదివారం ఆదేశించారు. బీఎన్ఎస్ చట్టం 2023 ప్రకారం కేసు విచారణ చేపట్టాలని కోరారు. మృతురాలిని ఆమె ప్రియుడు షేక్‌షమ్మా వ్యభిచారం చేయాలని ఒత్తిడి తీసుకువచ్చి కిరాతకంగా హత్య చేశాడు. ఇప్పటికే రాజోలు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉపాధ్యాయుల నిర్లక్ష్యం.. విద్యార్థినికి శాపం

● రెండేళ్లపాటు హాజరు వేయకపోవడంపై తల్లిదండ్రుల ఆవేదన
● స్థానిక ఎమ్మెల్యే చొరవతో దిద్దుబాటుకు యత్నం

అంబాజీపేట, న్యూస్‌టుడే: ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా ఓ విద్యార్థిని భవిష్యత్తుకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రెండేళ్ల పాటు హాజరు వేయకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందకుండా పోవడంతో పాటు ధ్రువపత్రాలు సైతం రాని పరిస్థితి నెలకొంది. దిక్కుతోచని స్థితిలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో చివరకు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో హడావుడిగా హాజరు వేయడానికి సదరు ఉపాధ్యాయులు ప్రయత్నిస్తుండటం విచిత్రం. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కేంద్రంలోని పండువారిపేటకు చెందిన నాగవరపు ప్రసాద్, ఉమామహేశ్వరి దంపతులకు ఇద్దరు కవల ఆడపిల్లలు. నాగవరపు బెహర్ణ, బెరీషాలను స్థానిక ఉన్నత పాఠశాలలో రెండేళ్ల కిందట 6వ తరగతిలో చేర్పించారు. వీరిలో బెరీషాకు ఉపాధ్యాయులు హాజరు వేయగా బెహర్ణకు వేయలేదు. ప్రస్తుతం వీరు 8వ తరగతి చదువుతున్నారు. 6, 7 తరగతుల్లో రెండేళ్లకు సంబంధించి హాజరు వేయకపోవడంతో బెహర్ణకు తల్లికి వందనం నగదు పడలేదు. అప్పటి నుంచి తండ్రి ప్రసాద్ ఉపాధ్యాయుల చుట్టూ తిరిగారు. సమస్యను మండల విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లారు. తల్లికి వందనం రాకపోవడంతో పాటు ధ్రువపత్రాలు లేకపోతే రానున్న రోజుల్లో తమ కుమార్తెపై చదువులకు ఇబ్బంది ఏర్పడుతుందని మదన పడుతున్నారు. 6, 7 తరగతులు స్థానిక పాఠశాలలో చదివినట్లుగా ధ్రువపత్రాలు ఇప్పించాలని కోరుతున్నారు. ఇదే విషయంపై ఇటీవల స్థానిక పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు వివరించడంతో ఆయన సదరు హెచ్ఎం కడలి సాయిరామ్‌ను వివరణ కోరారు. దీంతో హడావుడిగా రెండేళ్లకు సంబంధించి హాజరు ఒకేసారి వేయడానికి నిర్ణయించారు. దీనిపై పాఠశాల హెచ్ఎం కడలి సాయిరామ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆన్‌లైన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా విద్యార్థినికి హాజరుపడలేదన్నారు. 6, 7 తరగతులు ఇక్కడ చదివినట్లు ధ్రువపత్రాలు ఇస్తామన్నారు. ప్రస్తుతం ఆ బాలికకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ హాజరు వేస్తున్నామన్నారు.

పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

కాకినాడ కలెక్టరేట్: రాష్ట్రంలో పీపీపీ విధానంలో చేపడుతున్న పర్యాటక అభివృద్ధిలో ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిర్వాహకులు భాగస్వాములు కావాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ విద్యుత్తునగర్‌లోని ఎ-కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన కాకినాడ ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం, ఈమా లైమ్‌లైట్ అవార్డుల ప్రదాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వచ్చే నెలలో తిరుపతిలో టూరిజం కాన్‌క్లేవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సరికొత్త ఆలోచనలతో సృజనాత్మకతతో కూడిన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. త్వరలో రాష్ట్రస్థాయి ఈవెంట్ మేనేజ్‌మెంట్ సమావేశం నిర్వహించి, అందరి సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. అనంతరం యాంకర్లు, సింగర్లు, డాన్సర్లు, సౌండ్, లైటింగ్, ఎల్ఈడీ టెక్నీషియన్లకు అవార్డులు అందజేశారు.

భీమకవి చంద్రరావు సాహిత్యం అజరామరం

పుస్తకావిష్కరణలో పొనుగుమట్ల విష్ణుమూర్తి, డాక్టర్ కె.బాబ్జి, జి.లక్ష్మీనరసయ్య, శిఖామణి, కోయి కోటేశ్వరరావు తదితరులు

గాంధీనగర్: మధురకవి, గౌతమి కోకిల, భీమకవిగా పేరు గాంచిన చోడగిరి చంద్రరావు సాహిత్యం అజరామరమని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం కచేరిపేట యూటీఎఫ్ హోంలో సవిలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమకవి చోడగిరి చంద్రరావు సమగ్ర కవిత్వం పుస్తకావిష్కరణ సభ ఎన్.బాలరాజు అధ్యక్షతన నిర్వహించారు. పాత్రికేయుడు, రచయిత పొనుగుమట్ల విష్ణుమూర్తి మాట్లాడుతూ సమగ్ర కవిత్వాన్ని పుస్తక రూపంలో తీసుకువచ్చిన డాక్టర్ కోయి కోటేశ్వరరావు అభినందనీయులన్నారు. తనకు అవార్డులు అక్కరలేదని భీమకవిగా గుర్తుపెట్టుకుంటే చాలని అంబేడ్కర్‌కు కృతజ్ఞతతో వెలుగొందిన కవి చోడగిరి అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ కె.బాబ్జి మాట్లాడుతూ మరుగున పడిన ఎంతోమంది దళిత కవులను, వారి సాహిత్యాన్ని వెలికి తీయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పుస్తక రచయిత కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి తూ.గో.జిల్లా కోరుమిల్లిలో జన్మించిన చంద్రరావు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనేక గేయాలు, కవితలు తనదైన శైలితో రాశారన్నారు. ఆచార్య శిఖామణి, కవి, విమర్శకుడు జి.లక్ష్మీనరసయ్య, బండి సత్యనారాయణ, అద్దేపల్లి ప్రభు, మాకినీడి సూర్యభాస్కర్, చంద్రరావు కుమార్తె లలితాదేవి, కుమారుడు బుల్లిరాజ అంబేడ్కర్, పాకా చంద్రరావు, పి.వెంకట్రావు, సవిలే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేష్, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

GK గోల్డ్‌లోన్ బ్యాంకు / ప్రైవేటు తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ ధరకు కొనబడును లేదా అధిక రుణం ఇప్పించబడును. సంప్ర॥ 8897731257.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No.1) VJA వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 96038 42233, 97054 72233.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

రాజమండ్రికి 30 కి.మీ. దూరంలోగల మురారి, గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ॥ల రోడ్డు పేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మబడును. (నో బ్రోకర్స్), ✆ 90329 88265.

PLOT FOR SALE

GENERAL

122.44/ 125.66/ 139/ 143.11/ 173.94 Sq. యార్డ్స్ రెసిడెన్షియల్/ కమర్షియల్ సైట్స్ అమ్మబడును. జనార్దన్ మిల్లు రోడ్, శివ ఎన్‌క్లేవ్ అపార్ట్మెంట్ ప్రక్కన, తాళ్ళపూడి. ✆ 83090 25067.

అమలాపురం, ఈదరపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి నగర్ ఏరియాలో ఈస్ట్ ఫేసింగ్ గల 4 సెంట్లు స్థలం అమ్మకమునకు కలదు. సెల్: 98664 97645.

EENADU eClassifieds

TO LET

COMMERCIAL

బాలాజీపేట, రాజమండ్రి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో నూతనంగా నిర్మించబడుచున్న కమర్షియల్ బిల్డింగ్ నందు కమర్షియల్ స్పేస్ లీజుకు ఇవ్వబడును. (G+3), ఒక్కొక్క ఫ్లోర్ 2500 Sft. ✆ 90329 88265.

JOBS

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం, VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబికేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కల్గిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+ జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం (TC No.1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబికేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119570, 8639120683.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం - VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబికేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ.+ జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5,000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52838.

హోండా టూవీలర్ టెక్నీషియన్‌గా పనిచేయుటకు ట్రైనింగ్ ఇవ్వబడును. జీతం: రూ. 15,000/- నుండి రూ. 20,000/- వరకు + ఇన్సెంటివ్. Cont: శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్ రోడ్, కాకినాడ, సెల్: 94909 98888.

భారతదేశంలో అత్యంత నమ్మకమైన TATA కంపెనీలో వర్క్ చేయడానికి టీం లీడర్స్ కావలెను. 10th ఆపైన, ఫుల్/ పార్ట్ టైమ్. సెల్: 96188 44614.

పెద్దాపురం ప్రముఖుల ఇంట్లో వంట చేయుటకు బ్రాహ్మణ వంట మనిషి కావలెను. సంప్రదించండి సెల్: 94941 54551.

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 73375 44439, 90146 51068, 70756 33416.

Managers: కాకినాడ సందు ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు 40 సం॥లు నిండి 10th పాసైనవారు సంప్రదించండి. శాలరీ, ఇన్సెంటివ్స్, ఫారిన్ కన్వెన్షన్ సదుపాయం కలదు. Cont: 98487 90024.

వర్క్ ఫ్రం హోమ్ డేటా ఎంట్రీ: ప్రముఖ ఔట్ సోర్సింగ్ సంస్థ నందు ఇంటి వద్ద ఉండి పార్ట్/ ఫుల్‌టైం ప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop/ Desktop, స్మార్ట్ ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 95534 29994.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-05 పైII
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్ళలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	23,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	112-00
రిటైల్ లైవ్	134-00
డ్రెస్ట్	194-00
స్కిన్‌లెస్	221-00

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

యోగాతో బహుళ ప్రయోజనాలు

గాంధీనగర్: కోకనాడ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి యోగాసనా పోటీలు జేఎన్‌టీయూకేలో ఉత్సాహంగా సాగాయి. వివిధ విభాగాల్లో 10 సంవత్సరాల వారి నుంచి 55 సంవత్సరాల వారి వరకూ 100 మంది పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కోకనాడ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి తుమ్మల రామస్వామి(బాబు) , భాజపా జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.రాధిక తదితరులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ యోగాతో బహుళ ప్రయోజనాలున్నాయని పేర్కొన్నారు. శారీరకంగా, మానసికంగా బలోపేతమవుతారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం యోగాకు క్రీడలస్థాయి గుర్తింపు ఇవ్వడంతో ఈ ధ్రువపత్రాలు పొందిన వారికి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. పోటీల పరిశీలకుడిగా వెంకటరమణ, ఈసీ సభ్యులు రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుధాదేవి హాజరయ్యారు. అనంతరం విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. న్యాయనిర్ణేతలు, సభ్యులు రాజు, యాసిన్, గాయత్రి, లక్ష్మీ, అసోసియేషన్ ఉపాధ్యక్షులు తలాటం హరీష్, సత్యనారాయణ, కోశాధికారి మూర్తి, జ్యోతుల రాజేష్, ఎం.సురేష్, శ్రీహరి, సింగ్, సాయి గోపీ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు పతకాలు అందజేసిన అతిథులు, అసోసియేషన్ సభ్యులు

అపూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కిర్లంపూడి పాఠశాలలో 1978- 79లో చదివిన విద్యార్థులు

కిర్లంపూడి, న్యూస్‌టుడే: కిర్లంపూడిలో శ్రీకొక్కొండ రామశేష గిరావు పంతులు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 1978-79 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. 46ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులంతా ఒకచోటచేరి సందడి చేశారు. వారిలో రాష్ట్ర ఎన్నికల సంఘం ముఖ్యకార్యదర్శిగా పనిచేసి ఇటీవల పదవీవిరమణ పొందిన కర్రి రాజభౌమ హరినారాయణ చక్రవర్తి, టెక్ మహీంద్రా సాఫ్ట్‌వేర్ సంస్థలో సీనియర్ వైస్‌ప్రెసిడెంట్‌గా పనిచేసి పదవీవిరమణ పొందిన కర్రి శ్రీనివాస చక్రవర్తితోపాటు 50 మంది అప్పటివారు ఉన్నారు. అప్పటి గురువులు గోపి, కోటి, శంకరం, శ్రీధర్‌శాస్త్రి, సంపర రామ్ కుమార్‌లను సత్కరించారు. పిరాట్ల వెంకట బాబు, వాడకట్టు సుబ్బారావు, బాదంపూడి కామేశ్వరశర్మ తదితరులను పూర్వ మిత్రులు అభినందించారు.

కాకినాడలో షహీదే ఆజం సదస్సు

సాంబమూర్తినగర్: కాకినాడ జగన్నాథపురం జె.రామారావుపేటలో జెండా సెంటర్ వద్ద ఆదివారం షహీదే ఆజం జిల్లాస్థాయి సదస్సు జరిగింది. ఎం.ఎం., మక్కా మసీదు డెవలప్‌మెంట్, హసన్ హుసేన్ యూత్, జె.రామారావుపేట యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లింలు పెద్దఎత్తున పాల్గొన్నారు. సూఫీ పెద్ద మహమ్మద్ అహ్మద్ మాట్లాడుతూ మొహర్రం నెల త్యాగాలను వివరించారు. అనంతరం ఆమ్‌ఖాస్ దావత్(అన్నదానం) నిర్వహించారు.

మాట్లాడుతున్న సూఫీ పండితుడు మహమ్మద్ అహ్మద్

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాట- 18, 20, వంకాయలు- 24, 30, 36, బెండకాయలు- 16, పచ్చిమిర్చి- 70, 80, కాకరకాయ- 36, బీర- 20, 26, క్యాబేజీ- 30, క్యారెట్- 36, దొండకాయలు- 20, బంగాళాదుంపలు- 20, 23, ఉల్లి- 23, 29, గోరు చిక్కుడు- 36, దోసకాయలు- 16, చిక్కుడు- 40, చేమదుంపలు- 40, బీట్‌రూట్- 34, కీరదోస- 40, బీన్సకాయలు- 70, అల్లం- 48, క్యాప్సికం- 100, బొబ్బర్లు- 22, బెండకాయలు- 36, ఒకటి దొప్పల ఆనపకాయ- 15, 20, పొట్లకాయ- 25, 30, అరటికాయ- 7, 8, మునగకాడ- 5, 6, మామిడికాయ- 6, 8, నిమ్మకాయలు(డజన్) - 24, 36.

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4(స్క్రీన్- జూనియర్, కొత్తపల్లిలో ఒకప్పుడు, మైబేలి, కుబేర, ఓ భామా అయ్యో రామ, సూపర్‌మేన్, దేవీ మల్టీప్లెక్స్ 4(స్క్రీన్- జూనియర్, కొత్తపల్లిలో ఒకప్పుడు, ఓ భామా అయ్యోరామ, మార్గన్, లక్ష్మీ- జూనియర్, సత్యగౌరి - మార్గన్, తిరుమల - కొత్తపల్లిలో ఒకప్పుడు, సీలండీస్ 1- మైబేలి, సీలండీస్ 2- కుబేర, శ్రీప్రియ - 3బీహెచ్‌కే, పద్మప్రియ- ఏందమయ చేసావే, సూర్య1(వాకలపూడి) - మైబేలి, సూర్య 2 - సూపర్‌మేన్..

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ఉ 10 - మ 1
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

ముళ్ల కంపలు తొలగించండి..

కాకినాడ గోడారిగుంట మూడుగుళ్ల సమీపంలోని కాలనీ రహదారిలో మలుపు వద్ద ముళ్ల కంపలు పెరగడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాకపోకల సమయంలో కంపలు కళ్లకు గుచ్చుకుని గాయాలపాలవుతున్నామని వాహనదారులు వాపోయారు. అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కోరుతున్నారు.

● స్థానిక శశికాంత్‌నగర్, అరుణ్ నగర్ రహదారిలో నాలుగు రోడ్ల కూడలి వద్ద రోడ్డుపై చెత్తాచెదారంతోపాటు ఎండు కొమ్మలు పేరుకుపోయాయి. అధికారులు స్పందించి వాటిని తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కుంగిన ఇనుపచట్రం

కాకినాడ సిద్ధార్థనగర్‌లోని మూడు రోడ్ల కూడలి వద్ద ఇనుప చట్రం కిందకు కుంగడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో అటువైపు వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

చెత్త తొలగింపు

కాకినాడ పెద్దిరెడ్డివారివీధిలోని నగరపాలకసంస్థ ఉద్యానంలో ట్రాక్ పక్కన చెత్తాచెదారం పేరుకుపోయి అధ్వానంగా ఉంది. దీంతో దుర్వాసన వస్తోందని, పాములు సంచరిస్తున్నాయని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. అక్కడ వ్యర్థాలను సిబ్బందితో తొలగింపజేశారు. – న్యూస్‌టుడే, మసీదుసెంటర్

స్లాబురాయి ఏర్పాటు..

కాకినాడ ఎస్పీ కార్యాలయం ఎదురుగా ఫుట్‌పాత్‌పై కాలువపై స్లాబురాయి లేక ప్రమాదకరంగా ఉందని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అక్కడ మూత ఏర్పాటు చేసి, సమస్య పరిష్కరించారు. – న్యూస్‌టుడే, మసీదుసెంటర్

స్పందనకు వందనం

జిల్లా స్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలు ప్రారంభం

పిఠాపురం: ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పిఠాపురం మాజీ ఎంపీటీసీ సభ్యుడు తమలంపూడి శివరామారెడ్డి ఆధ్వర్యంలో జీఆర్‌ఎస్‌పీ ఫ్యామిలీ హాల్ క్లబ్‌లో జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలు ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కూటమి నాయకులు జుత్తుక సూర్యకుమారి, గోపీ కృష్ణారెడ్డి, ఆర్.నాగు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మేలు

సర్పవరం జంక్షన్: కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా అన్నారు. ఆదివారం కాకినాడ అర్బన్ రెండో డివిజన్ కాలనీలో మాజీ డిప్యూటీ మేయర్ కాలా సత్తిబాబు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలను ఇంటింటా పంచారు.

ఒకటి, రెండు.. ఇక్కట్లు మెండు

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

నగరంలో మూతపడిన సామాజిక మరుగుదొడ్లు

స్మార్ట్‌సిటీగా పేరొందిన కాకినాడలో మరుగు కష్టాలు వెంటాడుతున్నాయి. దాదాపు రెండు నెలలుగా సామాజిక మరుగుదొడ్లు (పబ్లిక్ టాయిలెట్లు) మూతపడటంతో నగరానికి వచ్చే సందర్శకులు నానా అగచాట్లు పడుతున్నారు. ప్రధానంగా మహిళల ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. కాకినాడ జిల్లా కేంద్రం కావడంతో కలెక్టరేట్, జీజీహెచ్, కోర్టులు, ప్రైవేటు ఆస్పత్రులు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు, విద్యాసంస్థలకు, వ్యాపార లావాదేవీలకు రోజుకు 30 వేల నుంచి 40 వేల మంది వరకు రాకపోకలు సాగిస్తారని అంచనా. ప్రజల సౌకర్యార్థం నగరంలో రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో 18 వరకు సామాజిక మరుగుదొడ్లను నగరపాలక సంస్థ ఏర్పాటు చేసింది. వినియోగ రుసుములు వసూలు చేసుకుని, నిర్వహించేలా గుత్తేదారుకు అప్పగించింది. గడువు ముగియడంతో గుత్తసంస్థ నిర్వహణ బాధ్యతల నుంచి వైదొలగింది. దీంతో మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో మరుగు కష్టాలు మొదలయ్యాయి. అత్యవసరమైతే బస్టాండు, హోటళ్లు, పెట్రోలు బంకులు, కార్యాలయాల వైపు పరుగులు తీస్తున్నారు. ఆయా యజమానులు అనుమతించకపోతే నానా ఇబ్బందులు పడుతున్నారు.

సూరమ్మ గుడి సమీపంలో మరుగుదొడ్డికి తాళం

దాతలు సమకూర్చినవి నిరుపయోగమే..

నగరంలో కొన్ని చోట్ల దాతలు మరుగుదొడ్లను నిర్మించి నగరపాలక సంస్థకు అప్పగించారు. వాటిని సైతం గుత్తేదారుకు అప్పగించడంతో అవి కూడా వినియోగానికి దూరంగా ఉన్నాయి. వార్డు, బాట సారులకు బాలాత్రిపుర సుందరి ఆలయం సమీపాన వివేకానంద పార్కు పక్కన లయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ నిర్మించినవి గత రెండు నెలలుగా నిరుపయోగంగా ఉన్నాయి. అలాగే వాటర్ వర్క్స్ పక్కన పట్టణ ఆరోగ్య కేంద్రం సమీపాన బాలికలకు పేద తీర్చి పిల్లలకు పాలిచ్చేందుకు పింక్ టాయిలెట్ నిర్మించారు. ప్రస్తుతం ఇది కూడా ఉపయోగపడటం లేదు. కొత్తగా టెండర్లు పిలిచి, గుత్తేదారును ఎంపిక చేసే వరకు నగరపాలక సంస్థ సిబ్బందితోనైనా వీటిని నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు

గుత్తేదారు గడువు ముగియడంతో సామాజిక మరుగుదొడ్లు మూతపడ్డాయి. టెండర్లు పిలవడానికి ఇంజినీరింగ్ విభాగం చర్యలు చేపట్టింది. ప్రక్రియ పూర్తికాగానే వినియోగంలోకి తెస్తాం.
– డా.పృథ్వీచరణ్, ప్రజారోగ్య అధికారి, నగరపాలక సంస్థ, కాకినాడ

పేదరిక నిర్మూలనకు కృషి చేయాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడ కేంద్రంగా యంగ్ మైండ్స్ సంస్థ నిస్వార్థ సేవలు అందిస్తున్నా... పేద విద్యార్థులు, దివ్యాంగులు, వృద్ధులు, మహిళల కోసం అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో ఆదివారం యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు వాకాడ చిన్న మాస్టారు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మాట్లాడుతూ సామాజిక సేవను ఒక బాధ్యతగా భావించాలన్నారు. సమాజంలో పేదరికాన్ని, దుర్గుణాలను పారదోలేందుకు స్వచ్ఛంద సంస్థలు కృషిచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు, మాజీ సైనికులు, ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్మికులకు రెయిన్ కోట్లు, టోపీలు, బూట్లు, గ్లౌజులు తదితర ఉపకరణాలను అందజేశారు. దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, పేద విద్యార్థులకు సైకిళ్లు, మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వాసిరెడ్డి ఏసుదాసు, కటకంశెట్టి బాబీ, వెన్నపు చక్రధరరావు, మతుకుమిల్లి శ్రీవిజయ్, తిలక్‌బాబు, సీహెచ్ ప్రదీప్‌కుమార్, నరాల కృష్ణకుమార్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఉపకరణాలు అందించిన ఎమ్మెల్సీలు శ్రీనివాసులునాయుడు, రాజశేఖరం తదితరులు

సేవలతోనే ఎనలేని సంతృప్తి

గాంధీనగర్, న్యూస్‌టుడే: సేవా కార్యక్రమాలతో ఎనలేని సంతృప్తితో పాటు, సమాజంలో ప్రత్యేక గుర్తింపు వస్తుందని రోటరీ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ డాక్టర్ ఏలూరి కల్యాణచక్రవర్తి, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ ఆధ్వర్యంలో అధ్యక్షుడు తడాల బుజ్జి నేతృత్వంలో 2025-26 ఏడాది మూడో సమావేశాన్ని ఆదివారం రోటరీ హాల్లో నిర్వహించారు. సినీ హీరో మహేష్‌బాబు కుమార్తె సితార పుట్టిన రోజును పురస్కరించుకుని మహేష్‌బాబు ఫౌండేషన్ సమకూర్చిన స్లైకెల్ క్యాన్సర్ వ్యాక్సిన్లు, మహిళలకు ఆదరణ కుట్టుమిషన్లు, నాలుగు పాఠశాలలకు క్రికెట్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం స్పోర్ట్స్ జోన్‌ను ముఖ్య అతిథులు, అసిస్టెంట్ గవర్నర్ సురభి శారద చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జి.శ్రీసత్య, తడాల వరప్రసాద్, ఎస్.రమేష్, చోడవరపు మూర్తి, అహ్మద్, ఎం.సత్యనారాయణ, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు అందజేసిన డాక్టర్ కల్యాణచక్రవర్తి, చిక్కాల రామచంద్రరావు తదితరులు

ఫెన్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం సాంబమూర్తినగర్‌లోని ఆదిత్య మహిళా కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా డా.నల్లమిల్లి సుగుణ (తూర్పు గోదావరి), కార్యదర్శిగా గుణ్ణం కృష్ణమోహన్ (పశ్చిమగోదావరి), కోశాధికారిగా ఆకుల చంద్రకళావతి(కడప), ఉపాధ్యక్షురాలుగా కె.సూర్యలక్ష్మీదేవి(గుంటూరు), సహాయ కార్యదర్శిగా జి.నవీన్(ప్రకాశం), కార్యవర్గ సభ్యులుగా సంధ్యా రాణి, డి.అశోక్‌కుమార్ ఎన్నికయ్యారు. పరిశీలకులుగా ఫెన్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి అశోక్‌రావు, శాప్ నుంచి కాకినాడ డీఎస్‌ఏ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ వి.సతీష్ హాజరయ్యారు. నూతన కార్యవర్గం 2025-29 వరకు కొనసాగుతుందని అసోసియేషన్ మెంటార్ నాగం సతీష్ తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్న సంఘ అధ్యక్షురాలు నల్లమిల్లి సుగుణ, సభ్యులు

'చలో విజయవాడ' విజయవంతానికి పిలుపు

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈ నెల 25న నిర్వహించే చలో విజయవాడను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు పిలుపునిచ్చారు. ఆదివారం జగన్నాథపురంలోని ఎస్సీ హాస్టల్లో జరిగిన కార్యక్రమంలో చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిద్ధు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యారంగం కునారిల్లుతుందన్నారు. పీడీఎస్‌యూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సాయికిరణ్, ఎం.మూర్తి, నాయకులు మహేష్, ఉదయ్, చిన్న, జయరాం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

అలరింపజేసిన నాటికలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ రజతోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు నగర వాసులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం సాయంత్రం స్వరాభిషేకం పేరిట జరిగిన సినీ సంగీత విభావరి అలరింపజేసింది. అనంతరం కళారంగ విశిష్ట పురస్కారాలను కె.వెంకటేశ్వరరావు, బి.రత్నశ్రీ, నాట్యాచార్య కృష్ణమోహన్, రాయప్రోలు భగవాన్, ప్రసాద్, చొక్కా శ్రీనివాసరావులకు అందజేశారు. రాత్రి పోటీల్లో భాగంగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి స్వేచ్ఛ నాటిక ప్రదర్శించారు. పలువురి ఏకపాత్రాభినయాలతో ఆకట్టుకున్నారు. సంస్థ అధ్యక్షుడు కె.అచ్యుతరామారెడ్డి, ప్రధాన కార్యదర్శి పంపన దయానంద బాబు, సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అపాయమే..

కాకినాడ శాంతినగర్‌లోని ఓ రహదారి కూడలి వద్ద కల్వర్టుపై ఇనుపచట్రం లేక ప్రమాదకరంగా ఉంది. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితితో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఆ కల్వర్టు వద్ద సూచికగా బుట్ట, కర్రలు, సిమెంట్ రాళ్లు అడ్డుగా ఉంచారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, మసీదుసెంటర్

విద్యుత్తు పెట్టె.. సరిచేయండి

కాకినాడ వెంకట్‌నగర్‌లోని ఓ వీధిలో విద్యుత్తు స్తంభానికి ఏర్పాటు చేసిన ఇనుప పెట్టె ప్రమాదకరంగా ఉంది. చిన్నారులకు సైతం చేతికి అందే ఎత్తులో, విద్యుత్తు పెట్టెకు మూతలేకుండా తీగలు వేలాడుతున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో పెనుప్రమాదం వాటిల్లకముందే అధికారులు స్పందించి రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, మసీదుసెంటర్

అంధకారంలో ఆర్ఆర్‌నగర్ కూడలి

కాకినాడ సురేష్‌నగర్ బైపాస్ రహదారిలో ఆర్ఆర్‌నగర్ నాలుగు రోడ్ల కూడలి వద్ద అంధకారం నెలకొంది. గత కొన్ని రోజులుగా రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

రహదారిపై మురుగు ప్రవాహం

నగరంలోని 27వ డివిజన్‌లోని పాత తపాలా కార్యాలయం వీధిలో ప్రధాన రహదారిపైకి మురుగునీరు పారడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాకినాడ పోర్టు, వాకలపూడి, వలసపాలక, డెయిరీఫారం కూడలి, సంజయ్‌నగర్, వార్ఫురోడ్డు మీదుగా వన్‌వేలో సినిమారోడ్డుకు చేరుకుని ఈ రహదారి మీదుగా భారీ వాహనాలు మెయిన్‌రోడ్డుకు చేరుతున్నాయి. సరిగ్గా వాహనాలు వెళ్లే చోట మురుగునీరు పోటెత్తడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి డ్రెయిన్‌ను బాగు చేసి, ప్రధాన రహదారిపైకి మురుగునీరు రాకుండా కట్టడి చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.
– న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

ప్లాస్టిక్ వ్యర్థం.. పర్యావరణానికి అనర్థం

గాంధీనగర్, న్యూస్‌టుడే: మనం వాడే ప్లాస్టిక్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలవకుండా పర్యావరణానికి, మానవ జీవితానికి, జీవరాశులకు ఆటంకంగా మారుతున్నాయని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారి శ్రీరామచంద్రమూర్తి అన్నారు. మండలి ఆధ్వర్యంలో ఆదివారం శాంతినగర్ శ్రీరామకృష్ణ పాఠశాలలో ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన, క్విజ్ పోటీలు జరిగాయి. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. వి.ఎల్.గాంధీ, వి.రామకృష్ణ, సతీష్, సభ్యులు, జవివే జిల్లా అధ్యక్షుడు కె.తాతారావు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

సాంస్కృతిక సంబరం.. కళాత్మకం

పాట్ పెయింటింగ్

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ రంగరాయ వైద్యకళాశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో భాగంగా విద్యార్థులు తమ సృజనకు పదును పెట్టారు. ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో కల్చరల్ సెక్రటరీ, జనరల్ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.కె.శైలజ పర్యవేక్షణలో ఆదివారం విద్యార్థులు పెన్సిల్‌తో గీసిన ఆర్ట్‌లు, వ్యర్థాలతో రూపొందించిన ఫ్లవర్‌వాజ్‌లు, కాగితాలు, గడ్డితో తయారుచేసిన బొమ్మలు, డ్రైఫ్రూట్స్ తొక్కలు, సబ్బుతో ఆకృతులు, టీషర్ట్ పెయింటింగ్ తదితర కళలను ఆవిష్కరించారు. యూజీ, పీజీ వైద్య విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సబ్బుతో చేసిన కళాకృతులు

పెన్సిల్‌తో గీసిన చిత్రాలు

ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక

కరప, న్యూస్‌టుడే: కరప జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1989-90 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన వారంతా ఆదివారం ఆత్మీయంగా కలిశారు. బాల్య స్నేహితులుగా విడిపోయి వివిధ వృత్తుల్లో, ఉద్యోగాల్లో దేశవిదేశాల్లో స్థిరపడిన మిత్రులు 35 ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వేడుకలు నిర్వహించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు రావుల సత్తిరాజు, సుధాకర్, సోమయాజులు, ప్రేమకుమారి, భానుమతి తదితరులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఆకుల రేఖ, వరలక్ష్మి, నక్కా చంటివీరన్న, కోన ఉమేష్, చింతా కృష్ణ, ఆచారి, కోశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కరప జడ్పీ ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

21 ద్విచక్రవాహనాలు సీజ్

మసీదు సెంటర్ (కాకినాడ): ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు, ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో స్థానిక పోర్టు పోలీసుస్టేషన్ పరిధిలోని పూలే పాకలు, టిడ్కో అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు నాకాబందీ నిర్వహించారు. రికార్డుల్లేని 21 ద్విచక్ర వాహనాలు సీజ్ చేసి, పాత నేరస్థుడు ఒకరిని పట్టుకున్నారు. పోర్టు సీఐ సునీల్‌కుమార్, వన్ టౌన్ సీఐ నాగదుర్గారావు, త్రీటౌన్ సీఐ సత్యనారాయణ, పోర్టు ఎస్సై సూర్యప్రకాష్, సర్పవరం ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పురస్కారాల అందజేత

సాంబమూర్తినగర్: పర్యావరణ పరిరక్షణ సేవలకుగాను ఉత్తమ ఎన్జీవో పురస్కారం లభించినట్లు ఇగ్నైటెడ్ హెల్పింగ్ మైండ్స్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రకీబ్ తెలిపారు. ఆనందభారతి మైదానంలో శనివారం జరిగిన ఎండ్ టు ప్లాస్టిక్ కార్యక్రమంలో కలెక్టర్ షాన్ మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని సంస్థ ప్రతినిధి పావని అందుకున్నారు. కాకినాడ ఆల్‌ఈజ్‌వెల్ సంస్థకు ఉత్తమ ఎన్జీవో పురస్కారాన్ని సంస్థ సభ్యులు టీవీవీఎస్ఎన్ రెడ్డి అందుకున్నట్లు సంస్థ అధ్యక్షుడు కిషోర్‌కుమార్ తెలిపారు.

ఆహ్లాదం ఎండమావే!

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లో ఆహ్లాదాన్ని పంచాల్సిన నగరపాలకసంస్థ ఉద్యానవనాలు నిర్లక్ష్యానికి గురై కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. స్థానిక శాంతినగర్‌లోని సంజీవరావు ఉద్యానం, వెంకట్‌నగర్ ఉద్యానం, పెద్దిరెడ్డివారివీధిలోని పార్కు, సిద్ధార్థనగర్ ఉద్యానం పార్కులు అధ్వానంగా ఉన్నాయి. సిద్ధార్థనగర్‌లో పలు చోట్ల గడ్డి పెరిగిపోయింది. వర్షాకాలం నేపథ్యంలో పాములు, క్రిమికీటకాలు వచ్చే అవకాశం ఉందని సందర్శకులు వాపోతున్నారు. ఇక్కడ క్రీడా పరికరాలు నిరుపయోగంగా మారాయి. పలు పార్కులు చీకటిపడితే ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నాయి. మందుబాబులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని, సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు, సందర్శకులు కోరుతున్నారు.

నిరుపయోగంగా క్రీడా పరికరం

సిద్ధార్థనగర్ పార్కులో పెరిగిన గడ్డి

చర్యలు తీసుకుంటాం..

పలు పార్కుల్లో క్రీడా పరికరాల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాం. మిగిలిన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం. ఆవరణను శుభ్రం చేయించి ఆకతాయిలకు రాకుండా పర్యవేక్షణ పెంచుతాం.
-సిరిల్, ఉద్యానశాఖాధికారి

భాజపా బలోపేతానికి కృషి

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రజల్లో భాజపా పట్ల ఎంతో నమ్మకముందని, పార్టీని మరింత బలోపేతం చేసేలా తమవంతు కృషి చేస్తామని భారతీయ జనతా పార్టీ సెంట్రల్ మండలాధ్యక్షురాలు గోడి సత్యవతి అన్నారు. ఆదివారం గాంధీనగర్ క్షత్రియ పరిషత్ హాల్లో ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సెంట్రల్ మండలంలో కూటమి నాయకులతో కలిసి ప్రభుత్వ పథకాలు, వాటి ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ సీనియర్ నేతలు యెనిమిరెడ్డి మాలకొండయ్య, పైడా భావన ప్రసాద్, దువ్వూరి సుబ్రహ్మణ్యం, పెద్దిరెడ్డి రవికిరణ్, తుమ్మల పద్మజ, లక్ష్మీప్రసన్న, గట్టి సత్యనారాయణలు మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలన్నారు. సెంట్రల్ మండల ప్రధాన కార్యదర్శి జంపన రమణయ్యరాజు, ఉపాధ్యక్షులు టి.నాగభూషణం, కె.రవి, కమిటీ సభ్యులు, భాజపా నాయకులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరరావును సత్కరిస్తున్న గోడి సత్యవతి, కమిటీ సభ్యులు

లయన్స్ క్లబ్‌ల కమిటీల ప్రమాణస్వీకారం

గాంధీనగర్, న్యూస్‌టుడే: లయన్స్‌క్లబ్ కాకినాడగోల్డెన్ జూబ్లీ, ఫ్రెండ్స్, మనం, సఖి క్లబ్‌ల నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం రామారావుపేటలోని లయన్స్‌క్లబ్ హాల్లో ఘనంగా జరిగింది. లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్ బాదం బాలకృష్ణ వారితో ప్రమాణ స్వీకారం చేయించి, బాధ్యతలు అప్పగించారు. లయన్స్‌క్లబ్ మనం క్లబ్ అధ్యక్షురాలిగా యు.అచ్యుతాంబ, గోల్డెన్ జూబ్లీ క్లబ్ ప్రెసిడెంట్‌గా డి.జ్యోతి, ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడిగా గ్రంధి సతీష్, సఖి క్లబ్ ప్రెసిడెంట్‌గా ధారా సునీత బాధ్యతలు స్వీకరించారు. నూతన క్లబ్‌ల తరఫున మహిళకు కుట్టుమిషన్, పేద విద్యార్థికి ఆర్థికసాయం, పేదలకు బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. లయన్స్ ప్రస్తుత పాస్ట్ గవర్నర్ ఈశ్వర్ కుమార్, ఆయా క్లబ్‌ల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికుల కార్యవర్గం ..

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణంలోని వలసపాకల కోరమాండల్ ఒప్పంద కార్మికుల యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 18 విభాగాల్లో పనిచేసే సుమారు 600 మంది కార్మికులు ప్రస్తుత అధ్యక్షుడు పాతాళ శ్రీనివాస్‌నే తిరిగి ఆ స్థానంలో ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సీహెచ్ రాజు, ప్రధానకార్యదర్శిగా వళ్ల దుర్గాప్రసాద్, కార్యదర్శిగా సీహెచ్‌వీ రమణ, కోశాధికారిగా కె.లక్ష్మణరావు, ప్రచార కార్యదర్శిగా పి.రాజు తదితరులను ఎన్నుకున్నారు. యూనియన్ లీగల్ కార్యదర్శి సలాది శ్రీనివాసుబాబు వారిని అభినందించారు.

ఎన్నికైన వారిని అభినందిస్తున్న శ్రీనివాసబాబు

(c) eenadu

కాకినాడ గ్రామీణం
• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

సామర్లకోట: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ రౌడీ షీటర్లను హెచ్చరించారు. ఆదివారం సామర్లకోట పోలీసుస్టేషన్ పరిధిలో కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్కొక్కరిపై ఎన్నికేసులు ఉన్నాయని, వాటి తీవ్రత, కుటుంబ సభ్యుల నేపథ్యం, వారి దురలవాట్లు ఆరా తీసి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిత్యం నిఘా ఉంటుందన్నారు.

డిగ్రీ కళాశాలలో మెరుగుపడుతున్న సౌకర్యాలు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహర్దశ పట్టింది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో కళాశాలకు గత ఏడాది సొంత భవనం సమకూరింది. అదే విధంగా సీఎస్ఆర్ నిధులతో కంప్యూటర్ ల్యాబ్, బెంచీలు, మరుగుదొడ్లు నిర్మించారు. తాజాగా మరో రూ.కోటి సీఎస్ఆర్ నిధులతో అదనపు గదుల నిర్మాణం, చుట్టూ ప్రహరీ, క్రీడా మైదానం అభివృద్ధి పనులు చకచక జరుగుతున్నాయి.

పనులు చేపడుతున్న కార్మికులు

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: కాకినాడ గ్రామీణం: 80085 74325
ఉ. 10 - మ. 1 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: కరపలోని గ్రోమోర్ వీధిలో పైపులైన్ లీకై తాగునీరు వృథాగా పోతోంది. కట్టడి చేయాలి. **- అనిల్**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి నిర్మలాదేవికి చెప్పగా పైపులైన్‌కు సిబ్బందితో మరమ్మతులు చేయించారు. **- న్యూస్‌టుడే, కరప**

సమస్య: వాకలపూడి పంచాయతీ సంతోష్‌నగర్‌లో మురుగు కాలువల్లో పూడిక తీయడం లేదు. **-టి.చంద్రమౌళి**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి పాండురంగారావుకు చెప్పగా సిబ్బందితో పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, సర్పవరం జంక్షన్**

సమస్య: పిఠాపురంలోని కొండప్ప వీధి శివారులో సత్తెమ్మతల్లి ఆలయం వద్ద రోడ్డుపై నీరు నిలిచిపోయి, రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **-రమేష్, స్థానికుడు**

పరిష్కారం: కమిషనర్ కనకరావుకు సమస్య చెప్పగా పొక్లెయిన్‌తో కాలువ శుభ్రం చేయించి, మురుగు నీరు తొలగించారు. **-న్యూస్‌టుడే, పిఠాపురం**

వెదసాగుతో ముందస్తు పంట

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పిఠాపురం, న్యూస్‌టుడే: ఖరీఫ్ సాగు ఈ ఏడాది చాలా ఆలస్యమైంది. ప్రస్తుతం జలాశయాల నుంచి నీరు విడుదలవుతోంది. ఇప్పుడు నారుమళ్లు వేస్తే నాట్లు వేసేందుకు మరో 20 రోజులు గడువు తప్పదు. ఈ నేపథ్యంలో రైతులు వెదసాగుకు వెళ్లాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

పీబీసీ కాలువలో తగ్గుతున్న నీరు

ఆయకట్టుకు నీరు లేక..

పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల్లో ఖరీఫ్ సాగు ఇంకా ఊపందుకోలేదు. ఇక్కడి ఆయకట్టుకు ఏలేరు, పీబీసీ జలాశయాల నుంచి వచ్చిన నీటిని సరఫరా చేస్తారు. పీబీసీపై ఆరు మండలాల్లో 32,507 ఎకరాలకు, ఏలేరుపై 12 మండలాల్లో 53 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తుంటారు. ఏలేరులో 10.60 టీఎంసీలు ఉండగా, 1600 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నారు. రెండు జలాశయాల పరిధిలో క్లోజర్ పనులు ఆలస్యంగా మొదలయ్యాయి. గుర్రపుడెక్క తొలగింపు పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో నీరు శివారు ఆయకట్టుకు చేరడం లేదు. వీటికి చేరాలంటే పురుషోత్తపట్నం నీరు విడుదల చేయాలి. లేకపోతే వర్షాలు పడాలి. ఇవి లేక పనులు ఊపందుకోలేదు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఇప్పటికే 45 రోజులు ఆలస్యమైంది. ఈ ప్రభావంతో సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో వచ్చే విపత్తులు, వరదలకు పంట నష్టం తప్పదని

మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో..)
పిఠాపురం	7,960
గొల్లప్రోలు	4,300
కొత్తపల్లి	4,483
కాకినాడ గ్రామీణం	1,780
కరప	5,868
సామర్లకోట	7,361
పెద్దాపురం	4,150
తాళ్లరేవు	3,529
కాజులూరు	7,570

రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వెదసాగు చేపడితే అక్టోబరు చివరికి పంట చేతికందుతుందని, పెట్టుబడి వ్యయం కూడా తగ్గుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుత నారుమళ్లు వేస్తే ఒక్కో మండలంలో 100 హెక్టార్లలో సిద్ధం చేయాల్సి ఉంటుంది.

ఆలస్యం చేయవద్దు..

జలాశయాలలో నీరు లేకపోవడంతో ఇప్పటికే పంట ఆలస్యమైంది. ఇప్పుడిప్పుడే నీరు వస్తున్న నేపథ్యంలో రైతులు నారుమళ్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. నారు వేయకుండా నేరుగా వెదజల్లే పద్ధతిలో ఖరీఫ్‌ను ప్రారంభించడం మేలు. అందుకు తగిన సలహాలు, సూచనలు వ్యవసాయాధికారులు అందిస్తారు. **- పి.స్వాతి, ఏడీఏ, పిఠాపురం**

నేడు పీజీఆర్ఎస్ రద్దు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పాడా కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమం అనివార్య కారణాలతో సోమవారం రద్దు చేసినట్లు పాడా పీడీ వసంత మాధవి తెలిపారు. గతంలో ఇచ్చిన అర్జీల స్థితిని 1100కి డయల్ చేసి తెలుసుకోవచ్చని, గడువులోగా మిగిలిన వాటిని కూడా పరిష్కారమవుతాయని చెప్పారు.

సొసైటీల బలోపేతంతో రైతులకు మేలు

కాజులూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. ఆదివారం పెనుమళ్ల సహకార పరపతి సంఘం కమిటీ అధ్యక్షునిగా కొల్లు వెంకటేశ్వర్లు, సభ్యులుగా బొక్కా అప్పన్న, కోన సుబ్రహ్మణ్యం ప్రమాణ స్వీకారం చేశారు. చిక్కాల, వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ పీఏసీఎస్‌లు బలోపేతమైతే రైతులకు మేలు జరుగుతుందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

మురుగు తొలగింది..

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ అర్బన్ 2వ డివిజన్ సర్పవరం జంక్షన్ రమణయ్యపేట చేపల మార్కెట్ వద్ద చెత్త సరిగా తీయక కుళ్లి దుర్వాసనతోపాటు మురుగునీరు రహదారి పక్కన ప్రవహిస్తోందని ఎస్.వెంకటరమణ అనే స్థానికుడు ఈ నెల 7న 'ఈనాడు'కు తెలుపగా.. మన చైతన్యం.. జనహితం శీర్షిక చిత్ర కథనం ప్రచురితమైంది. దానికి కార్పొరేషన్ పారిశుద్ధ్య బాధ్యులు స్పందించి వ్యర్థాలను తొలగించారు. మురుగు నిలిచే ప్రాంతంలో మట్టి వేయించడంతో సమస్య తొలగింది.

ఈనాడు స్పందన

కోరమాండల్ ఒప్పంద కార్మికుల కార్యవర్గం

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణంలోని వలసపాకల కోరమాండల్ ఒప్పంద కార్మికుల యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 18 విభాగాల్లో పనిచేసే సుమారు 600 మంది కార్మికులు ప్రస్తుత అధ్యక్షుడు పాతాళ శ్రీనివాస్‌నే తిరిగి ఆ స్థానంలో ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సీహెచ్ రాజు, జనరల్ సెక్రటరీ వళ్లు దుర్గాప్రసాద్, కార్యదర్శిగా సీహెచ్‌వీ రమణ, కోశాధికారిగా కె.లక్ష్మణరావు, ప్రచార కార్యదర్శిగా పి.రాజు తదితరులను ఎన్నుకున్నారు. యూనియన్ లీగల్ కార్యదర్శి సలాది శ్రీనివాసుబాబు వారిని అభినందించారు.

ఎన్నికైన వారిని అభినందిస్తున్న శ్రీనివాసబాబు

ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక

కరప జడ్పీ ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

కరప, న్యూస్‌టుడే: కరప జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1989-90 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన వారంతా ఆదివారం ఆత్మీయంగా కలిశారు. బాల్య స్నేహితులుగా విడిపోయి వివిధ వృత్తుల్లో, ఉద్యోగాల్లో దేశవిదేశాల్లో స్థిరపడిన మిత్రులు 35 ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో కలిసి చిన్ననాటి చిలిపితనం గుర్తు చేసుకున్నారు. స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వేడుకలు నిర్వహించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు రావుల సత్తిరాజు, సుధాకర్, సోమయాజులు, ప్రేమకుమారి, భానుమతి తదితరులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఆకుల రేఖ, వరలక్ష్మి, నక్కా చంటివీరన్న, కోన ఉమేష్, చింతా కృష్ణ, ఆచారి, కోశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంగాధర్‌కు 'యంగ్‌మైండ్స్' పురస్కారం

సామర్లకోట, న్యూస్‌టుడే: సమాజ సేవకుడు గంగాధర్ 'యంగ్‌మైండ్స్' పురస్కారం అందుకున్నారు. ఆదివారం కాకినాడలో యంగ్‌మైండ్ క్లబ్ రేపటి కోసం స్వచ్ఛంద సేవా సంస్థ ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకుని పురస్కారాలు అందజేశారు. సామర్లకోట మండలం పెద్దబ్రహ్మదేవం శారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ సేవలను గుర్తించి యంగ్‌మైండ్స్ పురస్కారాన్ని అందజేశారు. సమాజంలో మొక్కలు నాటడం, బంధువులు, స్నేహితుల పుట్టిన రోజులకు మొక్కలు నాటించడం, పర్యావరణ పరిరక్షణకు వాటి ఆవశ్యకతను వివరించడం, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, వినాయక మట్టి విగ్రహాల పంపిణీ వంటి కార్యక్రమాలు గత రెండు దశాబ్దాలుగా నిర్వహించడాన్ని గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేశారని తెలిపారు. వాకాడ చిన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలు రాజశేఖరం, గాదె శ్రీనివాసులనాయుడు చేతులమీదుగా పురస్కారాన్ని అందజేశారు. సంస్థ ప్రతినిధులు వెన్నపు చక్రధరరావు, తెదేపా నాయకులు ఏసుదాసు తదితరులు పాల్గొన్నారన్నారు.

యంగ్‌మైండ్స్ పురస్కారం అందుకుంటున్న తోటకూర గంగాధర్

ధనమ్మతల్లికి సారె

కరప: కొంగోడు గ్రామదేవత ధనమహాలక్ష్మి అమ్మవారికి గ్రామానికి చెందిన భక్తులు చీర, సారెను ఆదివారం సమర్పించారు. అంతకుముందు పిండివంటలతో శివాయిద్యాల నడుమ గ్రామోత్సవం చేశారు.

శాకంబరిగా అమ్మవారు

తాళ్లరేవు: తాళ్లరేవు వాసవీకన్యకా పరమేశ్వరి ఆదివారం శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వాసవీకన్యకా పరమేశ్వరి

మరిడమ్మా దీవించమ్మా

పెద్దాపురం, తాళ్లరేవు: పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర నాలుగో ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. ఉచిత దర్శనం వద్ద భక్తులు బారులుదీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పట్టణానికి చెందిన వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు ఉచితంగా ఉప్మా, మజ్జిగ పంపిణీ చేశారు. ● పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మతల్లి జాతర శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలు, కోయ, కోలాట, గరగల నృత్యాలతో అమ్మవారిని ఊరేగించారు.

ఊరేగింపులో యువతుల కోలాట ప్రదర్శన

వైభవంగా పోదాంబిక బోనాల పండుగ

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు గ్రామదేవత పోదాంబిక అమ్మవారి బోనాల పండుగ ఆదివారం వైభవంగా నిర్వహించారు. బోనాలతో 500 మంది యువతులు, మహిళలు ఊరేగింపులో పాల్గొన్నారు. డప్పు వాయిద్యాలు, గరగనృత్యాలు, మహిళా బృందాల కోలాటంతో ప్రదర్శన కొనసాగింది. అనంతరం అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వర్షంనీరు పారేదెలా..

పెద్దాపురం సుధా న్యూ బ్యాంకు కాలనీలో వర్షంనీరు ప్రవహించడానికి మురుగు నీటి వ్యవస్థ లేకపోవడంతో చెరువులా నీరు నిలిచిపోయి కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీవాసుల ఇబ్బందులను తెలుసుకుని పురపాలిక సంఘ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు. పురపాలిక సంఘ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సమస్యను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, పెద్దాపురం**

కార్యాలయ ప్రాంగణం అధ్వానం

పెద్దాపురం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయి, కార్యాలయం ప్రాంతంలో చిత్తు కాగితాలతో అధ్వానంగా ఉంది. ఇకనైనా అధికారులు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహిస్తే బాగుంటుందని పలువురు అంటున్నారు. దీనిపై తహసీల్దార్ సీహెచ్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ పిచ్చి మొక్కలు, చిత్తు కాగితాలు తొలగించి పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, పెద్దాపురం**

ఏలేరు కాలువలో గుర్రపుడెక్క తొలగింపు పనులు

గొల్లప్రోలు శివారు ఏలేరు ప్రధాన కాలువలో గుర్రపుడెక్క తొలగించే పనులు ఆదివారం చేపట్టారు. పొక్లెయిన్‌తో పనులు నిర్వహిస్తున్నారు. పనులను ఏలేరు నీటి సంఘం వైస్‌ఛైర్మన్ ఇందన శ్రీనివాస్, డైరెక్టర్లు పరిశీలించారు. సార్వా సాగుకు సాగునీటి ఇబ్బందులు నెలకొనకుండా త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు నీటి సంఘం వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. **-న్యూస్‌టుడే, గొల్లప్రోలు**

ఆర్బీపట్నం పరపతి సంఘ అధ్యక్షుడు ప్రమాణస్వీకారం

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మండలం ఆర్బీపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా పెనుమర్తి దొరబాబు, సభ్యులు ఆదివారం ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, రాజాసూరిబాబురాజు, మన్యం ప్రసన్న కుమార్, సానిపిని సురేష్, కల్లూరి శ్రీను పాల్గొన్నారు.

పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న పెనుమర్తి దొరబాబు, పక్కన తుమ్మల రామస్వామి

టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలి

పెదపూడి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పెదపూడి మండలం ఎంపీటీసీ మాజీ సభ్యుడు తమలంపూడి శివరామారెడ్డి ఆధ్వర్యంలో జీఆర్ఎస్ఏ ఫ్యామిలీహెల్త్ క్లబ్‌లో జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతం కంటే ప్రస్తుతం శారీరక శ్రమ లోపించడం వల్ల అనేక వ్యాధులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు అధిక ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కూటమి నాయకులు జుత్తుక సూర్యకుమారి, గోపీ కృష్ణారెడ్డి, ఆర్.నాగు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైకాపా విస్తృత స్థాయి సమావేశం

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామస్థాయిలో కార్యకర్త, ముఖ్యమైన నాయకుల్ని కలిసి కమిటీలు ఏర్పాటు చేసుకోవటం ద్వారా వైకాపాను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని వైకాపా పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు పేర్కొన్నారు. మండలంలోని వి.కె.రాయపురంలో వైకాపా మండల స్థాయి సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు తలారి దొరబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. నాయకులు బొబ్బరాడ సత్తిబాబు, అత్తిలి సీతారామస్వామి, దమ్మాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మండలం తిరుపతి గ్రామానికి చెందిన చింతల వెంకట గంగాధర్(36) కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పెద్దాపురం పోలీసులు అందించిన సమాచారం ప్రకారం అనారోగ్య సమస్యతో ఈనెల 17వ తేదీన గడ్డి మందు తీసుకున్నాడు. కాకినాడ జీజీహెచ్‌కి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.మౌనిక తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సంతోషం

సర్పవరం జంక్షన్, పెద్దాపురం: కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా అన్నారు. ఆదివారం కాకినాడ అర్బన్ రెండో డివిజన్ కాలనీలో మాజీ డిప్యూటీ మేయర్ కాలా సత్తిబాబు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలను ఇంటింటా పంచారు. ● పెద్దాపురం నియోజకవర్గంలో అనేక అభివృద్ధి నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆదివారం పెద్దాపురం మండలం సిరివాడ గ్రామంలో సుపరిపాలన కార్యక్రమంలో మాట్లాడుతూ రహదారులు, మురుగు కాలువలు నిర్మాణంతోపాటు ఇతర నిర్మాణాలు చేపడతామన్నారు. ఎలిశెట్టి నాని, తోట రామకృష్ణ, మొయిళ్ల కృష్ణమూర్తి, సీహెచ్ కోటేశ్వరరావు, బుజ్జి పాల్గొన్నారు. ● ఆర్బీపట్నం గ్రామంలో ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రాజాసూరిబాబురాజు, సహకార సంఘ అధ్యక్షుడు పెనుమర్తి దొరబాబు, మన్యం ప్రసన్నకుమార్, కల్లూరి శ్రీను, సానిపిన సురేష్, నవీన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

కాకినాడ అర్బన్ రెండో డివిజన్‌లో పర్యటిస్తున్న శ్రీనివాసబాబా

తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ..

కావలి, న్యూస్‌టుడే: తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని మోసంచేసిన వ్యక్తిని పోలీసులు పట్టుకోగా, అతను అస్వస్థతకు గురైన ఘటన ఆదివారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన ఉలవకాయల వీరబాబుకు.. రెండేళ్ల క్రితం కావలి పట్టణం తుపాన్‌నగర్‌కు చెందిన గుర్రం కొండ కిశోర్ పరిచయమయ్యారు. తక్కువ ధరకే బంగారం ఇస్తానంటూ నమ్మించారు. రూ.20లక్షలు తీసుకున్నారు. అప్పటి నుంచి ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేదు. కనీసం నగదు అయినా తిరిగి ఇవ్వాలని కోరుతున్నా తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ మేరకు బాధితుడు కావలి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు నిందితుడ్ని పట్టుకోగా అస్వస్థతకు గురయ్యారు. స్థానికంగా ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా గుండె సంబంధిత ఇబ్బందులున్నాయని వైద్యులు ధ్రువీకరించారు. ఆరోగ్యం మెరుగుపడగానే అదుపులోకి తీసుకుని విచారిస్తామని సీఐ గిరిబాబు తెలిపారు.

చేబ్రోలు కాలనీలో అభివృద్ధి పనులు

గొల్లప్రోలు: చేబ్రోలు ఈబీసీకాలనీలో డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణ పనులు ఎట్టకేలకు చేపట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14 లక్షలతో కాంక్రీటు డ్రెయిన్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పనులను పద్మశాలి సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ, జనసైనికులు పరిశీలించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు

కాజులూరు: మద్యం తాగి వాహనాలు నడపడంతో ఇటీవల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. ఆదివారం కొలంక శివారులో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. శని, ఆదివారాల్లో రాజమండ్రి, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల నుంచి యువత వచ్చి మద్యం తాగి వాహనాలపై వెళ్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో 900 మార్కులకు 878 సాధించిన రాయవరపు అనుగ్రకు శ్రీమ్ అపర్ణా సేవాట్రస్ట్ ఛైర్మన్ వెంకటేశ్వరశర్మ నగదు ప్రోత్సాహం అందించారు. తాటిపర్తిలో ఆదివారం రూ.2వేలు చెక్కు అందజేశారు. బి. వీరభద్రం పాల్గొన్నారు.

ఎస్సీల శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

పిఠాపురం: ఎస్సీలకు శ్మశాన వాటిక లేకపోవడం దారుణమని పీవీరావు మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కొంగు నూకరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నవఖండ్రవాడలో ఆ సంఘ నాయకులు పర్యటించారు. ప్రభుత్వం స్పందించి స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరారు.

టిడ్కో గృహాల్లో సమస్యల తిష్ఠ

సామర్లకోట, న్యూస్‌టుడే: పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు లబ్ధిదారుని వాటా కట్టించుకుని టిడ్కో గృహాలు నిర్మించింది. సామర్లకోట పట్టణంలో జగ్గమ్మగారిపేట, పిఠాపురం రోడ్డులోని ఉప్పువారి సత్రం వద్ద 1098 మంది లబ్ధిదారులకు గృహనిర్మాణాలు ఏర్పాటు చేశారు. బ్యాంకు రుణాలతో గృహాలను అప్పగించారు. కొంతమందికి బ్యాంకు రుణాలు అవ్వక.. గృహాల నిర్మాణం పూర్తి కాకపోవడంతో 50 శాతం మంది మాత్రమే గృహాల్లో నివాసముంటున్నారు.

కనీస సౌకర్యాలు లేక..

సామర్లకోట పట్టణంలోని టిడ్కో గృహాల్లో నివసిస్తున్న ప్రజలకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. రక్షిత మంచి నీరు వీరికి అందకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందిపడుతున్నామని స్థానికులు వాపోయారు. మంచినీటిని సుమారు రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న పట్టణంలోకి వచ్చి వాటర్ ప్లాంటుల నుంచి డబ్బాల్లో తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో వీధి దీపాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడం, వేసినవి వెలగకపోవడంతో రాత్రి వేళల్లో అంధకారంగా ఉంటోంది. చుట్టూ పంటపొలాలు ఉండటంతో విషసర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయి. రాజీవ్ గృహకల్ప, అమ్మణ్ణమ్మ గృహకల్ప సముదాయాలను లబ్ధిదారులకు ఉచితంగా ఇచ్చి టిడ్కో గృహాలకు మాత్రం తమను రుణాలు చెల్లించాలని వేధిస్తున్నారని ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు.

గృహాల వద్ద పేరుకు పోయిన మురుగు

తుప్పలతో దర్శనమిస్తున్న టిడ్కో గృహాలు

పనులు చేపట్టాం..

సామర్లకోట పట్టణ పరిధిలో ఉన్న టిడ్కో గృహాల్లో సమస్యలను స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణం స్పందించి యంత్రాలతో తుప్పలు తొలగింపజేసే పనుల చేపట్టాం. వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. రక్షిత మంచి నీరు అందించేందుకు చర్యలు చేపడతాం. చోరీలు జరగకుండా రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలని పోలీసు శాఖకు నివేదించాం. బ్యాంకు రుణాలు పరిధి తమది కాదు, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి చర్యలు తీసుకుంటాం. **- శ్రీవిద్య, పురపాలిక కమిషనర్ సామర్లకోట**

WANTED
మా పెద్దాపురం బ్రాంచిలో పనిచేయుటకు
క్యాషియర్ (MALE)
జీతం: Rs:15,000/-, విద్యార్హత: డిగ్రీ
ఇంటర్వ్యూ తేది: 22.07.2025
ఉ:11 గం.ల నుండి సా:5:30 గం.వరకు
దర్గా సెంటర్ దగ్గర, ఆక్సిస్ షో రూమ్ ప్రక్కన, మెయిన్ రోడ్, పెద్దాపురం
శ్రీ పద్మ ప్రియ ఫైనాన్స్ కార్పొరేషన్
77990 28444
92810 22773

(c) eenadu

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

వైద్య శిబిరంలో 280 మందికి పరీక్షలు

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తుని పట్టణం: అలయన్స్ క్లబ్, విశాఖ తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో రోగులకు పలు రకాల పరీక్షలు చేశారు. గణపతినగర్‌లోని నారాయణ స్కూలు ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆట్నూరి ఉషారాణి ప్రారంభించారు. అనంతరం గైనికాలజిస్టు తేజస్విని, నేత్ర వైద్యుడు ఎస్.శివప్రసాద్ 280 మందికి పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా గరగపర్రు గ్రామానికి చెందిన వేణుగోపాలరావు ఆదివారం రూ.లక్ష విరాళాన్ని ఈవో సుబ్బారావుకు అందజేశారు.

నేడు చలో ప్రత్తిపాడు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: కార్మికులు, చిన్న, సన్నకారు రైతులు, పేదలు పలు ఆర్థిక సమస్యలతో అల్లాడుతున్నారని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ మానుకొండ లచ్చబాబు అన్నారు. వీరి సమస్యల పరిష్కారం కోసం అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు సోమవారం 'చలో ప్రత్తిపాడు' నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మండల కేంద్రం, గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. సంఘ నాయకులు తాడి నాగేశ్వరరావు, రాజాల ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పూడికతీత పనులు

ఏలేశ్వరం: ఏలేశ్వరం పరిధిలోని తిమ్మరాజు చెరువుకి సంబంధించిన పంట కాలువల పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. పట్టణం, గ్రామీణంలో కాలువల నుంచి వ్యర్థాలను తొలగించే పనులు నిర్వహించారు. ఈనాడు స్పందన: 'కాలువలు ఇలా.. నీరు చేరేదెలా' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే సత్యప్రభ స్పందించారు. వెంటనే కాలువలను పరిశుభ్రం చేసే పనులు చేపట్టాలని ఆమె ఆదేశించారు. యంత్రంతో కాలువల్లో ఉన్న వ్యర్థాలను తొలగిస్తున్నారు. వెంటనే వాటిని డంపింగ్ యార్డుకి తరలించే ఏర్పాట్లు వెంటనే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ముమ్మరంగా పోలవరం ఎడమ కాలువ పనులు

తాండవ నదిపై నిర్మిస్తున్న పోలవరం అక్విడక్టు

ఒక వైపు పట్టణం.. మరోవైపు కొండను తొలగిస్తున్న యంత్రాలు

కొండలను తొలుస్తూ సాగుతున్న పనులు

పోలవరం కాలువ నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వంలో శరవేగంగా సాగుతున్నాయి. తుని మండల పరిధిలో సుమారు 18 కి.మీ. మేర పోలవరం ఎడమ కాలువ పనులు సాగుతున్నాయి. గత తెదేపా హయాంలో చేపట్టిన పనులు సుమారు 70 శాతం వరకు పూర్తి కాగా తర్వాత వచ్చిన వైకాపా హయాంలో మొత్తం పనులు నిలిచిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు జోరందుకున్నాయి. ప్రధానంగా తుని మండల పరిధిలోని కుమ్మరిలోవ కాలనీవాసులకు ప్రభుత్వ పరంగా అందించాల్సిన నష్టపరిహారం ఇవ్వడంతో వారు కాలనీని ఖాళీ చేశారు. దీంతో సమీపంలోని కొండను తొలిచే పనులు చేపట్టారు. దీనికి అనుసంధానంగా కుమ్మరిలోవ, రేఖవానిపాలెం మధ్యలో ఉన్న తాండవ నదిపై రూ.80 కోట్ల వ్యయంతో అక్విడక్టు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పనులను ఉన్నతాధికారులకు తెలియజేసేందుకు సంబంధిత అధికారులు డ్రోన్‌తో చిత్రీకరించి నివేదిక అందజేశారు. ఆ చిత్రాల్లో కొన్ని ఇవీ. - న్యూస్‌టుడే, తుని గ్రామీణం

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066
ఉ. 10 - మ. 1

సమస్య: దానవాయిపేట రెండో వార్డులో ఉన్న మురుగు కాలువలు పూడికతో నిండి ఉన్నాయి. పూడిక తీయించాలి. - రాము, స్థానికుడు

సమాధానం: పంచాయతీ సిబ్బందికి తెలియజేసి పూడిక తీయించి సమస్య పరిష్కరిస్తాం. - విశ్వాస్, కార్యదర్శి - న్యూస్‌టుడే, తొండంగి

స్పందనకు సందర్భం

సమస్య: ఒకటో వార్డులో ప్రధాన కాలువలో మురుగు ముందుకు ప్రవహించడం లేదు. దీంతో దోమలబెడద అధికమైంది. - స్థానికులు

పరిష్కారం: పారిశుద్ధ్య కార్మికులను పంపి మురుగు పూడిక తీయించి సమస్యను కమిషనర్ పరిష్కరించారు. వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, ఏలేశ్వరం



యనమల సమక్షంలో తెదేపాలోకి చేరిన వైకాపా నాయకులు

తెదేపాలోకి చేరిక

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులైన తొండంగి మండలం పలువురు వైకాపా నాయకులు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సమక్షంలో తెదేపాలోకి చేరారు. తేటగుంట పార్టీ కార్యాలయంలో తొండంగి గ్రామానికి చెందిన కాపు, దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకులు ఆదివారం యనమలను కలిసి పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. నాయకులు యనమల రాజేష్, దూలం మురళి, బంటుపల్లి అన్వేష్, నేమాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు.. కలగని కనువిప్పు

కొరవడిన నిఘా

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో ప్రమాదాలు జరుగుతున్నా ఆ వాహన చోదకుల కనువిప్పు కలగడం లేదు. ప్రయాణికుల్లోనూ చైతన్యం లోపించడంతో ప్రమాదాలు పరిపాటిగా మారాయి. నగర పంచాయతీ ఏలేశ్వరంలో వాహన చోదకుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు నడిపే వారిపై పర్యవేక్షణ కొరవడడంతో దారినపోయే ఇతరులకు ఆందోళన తప్పడంలేదు.

రవాణా వాహనాల్లో రాకపోకలు

పెళ్లిళ్లు తదితర శుభకార్యాల్లో ప్రయాణం ఏవిధంగా ఉండాలో అవగాహన ఉన్నా ప్రమాదకర ప్రయాణాలు కొనసాగుతోంది. ఏలేశ్వరం నుంచి మన్యం వెళ్లే వారిలో పలువురు సరకు రవాణా చేసే వాహనాలను ఆశ్రయిస్తున్నారు. వాహనాల వెనుకభాగంలో నిల్చుని ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే వారు వ్యానుల్లో ప్రమాదకరంగా

సరకు రవాణా వాహనంలో ప్రయాణానికిలా..

ప్రయాణం చేస్తున్నా అధికారులకు పట్టింపులేదు. రవాణా, పోలీస్ శాఖలు చొరవ తీసుకుని ప్రమాదాలను నివారించాలి.

పరిమితికి మించి..

ఆటోల్లో నిర్ధారిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకోవాలి. కాని ఏలేశ్వరం పట్టణం, గ్రామీణ మండలంలో ఆటోల్లో ఇలా పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తున్నారు. చోదకుని సీటు పక్కన ప్రయాణికులను కూర్చోపెడుతూ నిబంధనలను కాలరాస్తున్నారు. ఇక ద్విచక్ర వాహనాలపై ముగ్గురు, నలుగురు సైతం ఎక్కి ప్రయాణిస్తున్నారు. వాహనాల తనిఖీ అన్నదే లేదు. సంబంధిత శాఖలు తనిఖీలు చేపట్టాల్సి ఉంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

రోడ్లపై వాహనాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందే. ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవు. సరకులు చేరవేసే వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకోరాదు. ఆటోల్లోనూ పరిమితంగానే ప్రయాణికులను ఎక్కించుకోవాలి. ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ఇకపై నిరంతరం మరింత పర్యవేక్షణ చేస్తాం. అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తాం. - వి.సూర్య అప్పారావు, సీఐ, ప్రత్తిపాడు

సంక్షేమ పథకాలతో అందరికీ ప్రయోజనం

జగ్గంపేట గ్రామీణం, కిర్లంపూడి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలందరికీ ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. రామవరం, బూరుగుపూడిలో ఆదివారం 'సుపరిపాలనలో తొలి అడుగు'లో పాల్గొని ప్రభుత్వ పథకాలను మహిళలకు వివరించారు. కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. మారిశెట్టి భద్రం, అప్పలరాజు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, అడబాల వెంకటేశ్వరరావు, జువ్వల సీతారామయ్య, ఒంటిపల్లి బాబ్జి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపూడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

సీఎంను విమర్శించే అర్హత మాజీమంత్రికి లేదు: ఎమ్మెల్యే

జగ్గంపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును విమర్శించే అర్హత జగ్గంపేట వైకాపా ఇన్‌ఛార్జి, మాజీమంత్రి తోట నరసింహంకు లేదని జగ్గంపేట ఎమ్మెల్యే, తితిదే బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ.. చంద్రబాబును విమర్శించే అర్హత నీకు, నాకు లేదని ఎందుకంటే మనమిద్దరం పలు పార్టీలు మారామన్నారు. ఒక వ్యక్తిని వ్యక్తిగతంగా విమర్శించడానికి మన స్థాయి సరిపోవాలన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం మీ అందరికీ ఇస్తున్నామన్నారు. గెద్దనాపల్లిలో ఒకే కుటుంబంలో ఐదుగురికి 'తల్లికి వందనం' ఇచ్చామన్నారు. కష్టపడి చంద్రబాబును ఒప్పించి మెట్టప్రాంతానికి రూ.130 కోట్లు మంజూరు చేయించి శంకుస్థాపన చేయించి, టెండర్లు పిలిచి 17 శాతం పూర్తిచేస్తే ఆ పథకాన్ని నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రంలో 3 ఎత్తిపోతల పథకాలు ఉంటే అందులో మల్లవరం పథకం ఒకటన్నారు. నాయకులు ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, సుంకర సీతారామయ్య, బద్ది సురేష్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పదవులకు వన్నెతెచ్చి.. గ్రామానికి పేరు తెచ్చి..

విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రవర్తి

కిర్లంపూడి, న్యూస్‌టుడే: చదువుకునే రోజుల్లోనే ఉత్తమ ప్రతిభ చూపి మంచి ర్యాంకుతో ఐఏఎస్ సాధించడమే కాకుండా ఏ స్థాయిలో పనిచేసినా నిబద్ధతతో పనిచేసి కిర్లంపూడి గ్రామానికి మంచి పేరు తెచ్చారని విశ్రాంత ఐఏఎస్ అధికారి కర్రి రాజభౌమ హరినారాయణ చక్రవర్తిని గ్రామస్థులు, అధికారులు కొనియాడారు. ఇటీవల పదవీవిరమణ పొందిన చక్రవర్తి పూర్వ మిత్రుల కలయిక కోసం ఆదివారం కిర్లంపూడి వచ్చారు. ఈసందర్భాన్ని పురస్కరించుకుని కిర్లంపూడిలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పౌరసన్మానం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు డీవీఆర్ సూరిబాబు అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో చిన్ననాడు చదువునేర్పిన గురువులు సంపరరామ్‌కుమార్, స్నేహితులు చక్రవర్తిని ఘనంగా సత్కరించారు.

కిర్లంపూడిలో చక్రవర్తిని సన్మానిస్తున్న పీడీ సత్యనారాయణ తదితరులు

అ'పూర్వ' సాయం..

తమ సైకిళ్లు ఎండకు ఎండి, వానకు తడుస్తూ పాడైపోతున్నాయని విద్యార్థులు ఆందోళనకు గురయ్యేవారు. ఈ సమస్యను గుర్తించిన ఏలేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985-86 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు తమ ఔదార్యం చాటుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో సైకిల్ స్టాండ్ నిర్మింపజేశారు. తమకు పూర్వ విద్యార్థుల చొరవతో సౌకర్యం కలగడంతో ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్నవారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, ఏలేశ్వరం

చెరువు కాదు జాతీయ రహదారి..

శంఖవరం మండలం కత్తిపూడి ఎన్‌హెచ్‌ని చూసి చెరువు అనుకుంటే పొరపడినట్లే... చిన్నపాటి వర్షం కురిసినా నీరు పోయే మార్గం లేక శంఖవరం జంక్షన్ వద్ద నీరు నిలిచి చెరువును తలపిస్తుంది. డ్రెయినేజి పనులు సగం చేసి వదిలేయడంతో ఈ దుస్థితి ఏర్పడింది. దీంతో పాదచారులకు అవస్థలు తప్పడం లేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, శంఖవరం

చెట్టు వెనుక దాగిన విద్యుత్తు స్తంభం

తుని గ్రామీణ మండలం డి.పోలవరం జడ్పీ పాఠశాల సమీపంలోని పచ్చని చెట్ల మధ్య ఉన్న విద్యుత్తు స్తంభానికి పొదలు అల్లుకుపోయాయి. దీంతో కాస్తో కూస్తో వర్షం వచ్చినా విద్యుత్తు అంతరాయంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయంలో అల్లుకుపోయిన అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్తు స్తంభానికి పేరుకున్న పొదలను తొలగించి సమస్యను పరిష్కరించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తుని గ్రామీణం

ఆదమరిస్తే.. అంతే..

తొండంగి-తుని వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో గెడ్డ వద్ద భారీ కంకర గుట్టను వేసి వదిలేశారు. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ఆ గుట్టను గమనించక పలువురు గాయపడ్డారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారి మధ్యలో ఉన్న కంకర గుట్టను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తొండంగి

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం

జగ్గంపేట ,న్యూస్‌టుడే: లయన్స్‌క్లబ్ సమావేశ హాలులో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఉదయ భాస్కరచౌదరి, సెక్రటరీగా వెంపటి రామారావు, ట్రెజరర్‌గా కొత్త కృష్ణ చైతన్య తదితర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు డా.మేక బాల గంగాధర రావు, సెక్రటరీ డా. మేక పద్మావతిల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. గోలి శ్రీరామమూర్తి, లయన్ కోడూరి రంగారావు, కోడూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఫ్లైర్ 2కే25 వేడుకలు

గండేపల్లి, న్యూస్‌టుడే: నీలాద్రిరావుపేట శివారు శుభమస్తు కల్యాణ మండపంలో ఆదివారం శ్రీప్రజ్ఞ పాఠశాల ఫ్లైర్ 2కే25 వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు సంస్థ ఛైర్మన్ బి.నాగబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 2024-25 ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించారన్నారు. విద్యార్థుల నృత్యాలు, వస్త్ర అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తితత్వం.. తన్మయత్వం

జగ్గంపేట గ్రామీణం, రౌతులపూడి, ప్రత్తిపాడు, తుని గ్రామీణం, ఏలేశ్వరం, కిర్లంపూడి, న్యూస్‌టుడే: సీతానగరంలో కోరినకోర్కెలు ఏగులమ్మ ఆదివారం శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి చీర, సారె, నైవేద్యాలు సమర్పించారు. ● శృంగవరంలో పాదాలమ్మ అమ్మని ఆదివారం రూపాయినోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. పాదాలమ్మ తల్లి జాతరను పురస్కరించుకుని భజనలు నిర్వహించారు. లక్ష్మీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ● తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఆషాఢమాస ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం ఆలయ వేద పండితులు లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. ● ప్రత్తిపాడు మండలం శరభవరంలో ఆదివారం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరునికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి పాలకావిళ్లతో గ్రామోత్సవం నిర్వహించారు. ● ఏలేశ్వరంలో మరిడమ్మ ఆలయం వద్ద తీర్థ మహోత్సవం వైభవంగా జరిగింది. మరిడమ్మను విశేషంగా అలంకరించారు. ● కిర్లంపూడి మండలం సోమవరం గ్రామదేవత పాసాలమ్మని గ్రామస్థులు శాకంబరిదేవిగా ఆదివారం అలంకరించారు. అమ్మవారిని జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, కూటమి పార్టీల నాయకులు మత్సా తిరుపతి రాయుడు, గంగిరెడ్ల నాగభూషణం తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



శృంగవరంలో..

శాకంబరిగా ఏగులమ్మ

పూజల్లో లోవ అమ్మవారు

రౌడీషీటర్లు ఉత్తములుగా మారాలి

కిర్లంపూడిలో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై సతీష్

కిర్లంపూడి: వివిధ గ్రామాలలో గతంలో గొడవలు, ఇతర కారణాలతో కేసులు నమోదు అయిన రౌడీషీటర్లకు ఆదివారం కిర్లంపూడి స్టేషన్‌లో సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్సై జి.సతీష్‌లు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఏవిధమైన గొడవలు, కొట్లాటల కేసుల జోలికి వెళ్లవద్దని, ఎవరైనా ఏదైనా సమస్యలు తీసుకువస్తే గతంలో ఉన్న బెయిల్ రద్దుచేసి మరలా జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. మంచి ప్రవర్తనతో గ్రామాల్లో సంచరిస్తే గతంలో ఓపెన్ చేసిన రౌడీషీట్లను రద్దుచేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ వారికి సూచించారు.

GENERAL NOTICE

In the Court of the Senior Civil Judge at Peddapuram
I.P.No.5/2025

Between:
Kakaraparthi Siva, Occupation Nil, S/o Thrimurthulu, Age 36 years, D.No.20-1-4 Bradipeta, Ramachandra puram ...Petitioner
and
1. Eathakota Durga Prasad, S/o Prasad, Age: 35, Business, R/o D.No.2-2-127/1, Shiridi Nagar, Jayasree Palace, Yeleswaram, Prathipadu D.M.C.
2. Pandranki Venkatesh, Business, S/o Late Venkateswara Rao, Age: 33, Business, Dibbalapalem, Yeleswaram.
3. Peroori Raghava, W/o Raju, Age: 42 Years, Shiridi Colony, R/o D.No.8-5-32/33, St.No.8, Venkateswara Temple, Hyderabad.
4. Veesam Nagesh, S/o Suribabu, Age: 33, Business, R/o Moolapeta, NTR Colony, Thammupala Post, Anakapalli D.M.C.
5. Pendayala Venkataramana, S/o Not Known, 47 Years, Business, Tailor, Near R.T.C. Complex, Peddapuram, Peddapuram D.M.C.
6. Gompa Manga, W/o. Sivakumar, Age: 35 Years, Near Krishna Temple, Lingamparthi, Yeleswaram Mandal, Prathipadu D.M.C.
7. Kona Sreenu, S/o Demudu, Age: 30 Years, Business, R/o Satrampampu, Lingamparthi, Yeleswaram, Prathipadu D.M.C.
8. Varupula Venkataramana, S/o Sathibabu, Age: 35 Years, Business D.No.6-193, Lingamparthi, Yeleswaram Mandal, Prathipadu D.M.C.
9. Tirumala Routhu Yesubabu, S/o Abbai, Age: 35 Years, Business, D.No.2-78, Lingamparthi, Yeleswaram Mandal, Prathipadu D.M.C.
10. Manda Ramesh, S/o Kasiviswesware Rao, Age 40 Years, Business, D.No.1-45, China Sankarlapudi Village, Prathipadu D.MC.
11. Donka Lova Raju, S/o Swami Naidu, Age: 28 years, Business, D.No.5-92, Lingamparthi, Prathipadu D.M.C.
12. Official Receiver, Rajamahendravaram ...Respondents

పై నెంబరు I.P. దావా గ్రంథమునకు సంబంధించి పిటీషనరు తనను Insolventగా డిక్లేర్ (Declare) చేయమని కోరుచూ పై కోర్టులో పిటీషను దాఖలు చేసినారు. దీనికి సంబంధించి ది.వి. 4-08-2025 వాయిదాగా అయి ఉన్నది. కాబట్టి దీనికి సంబంధించి ఎవ్వరికైనా ఏవిధమైన అభ్యంతరాలు గాని, ఆక్షేపణలు గాని ఉన్నయెడల మీరు స్వయంగా గాని లేదా మీ లాయరు ద్వారా గాని ది.వి. 4-08-2025న ఉదయం 10.30 గంటలకు పైకోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీని దాఖలు చేసుకొనవలెను.

శ్రీ కోర్టువారి ఉత్తర్వులు అనుసరించి
B.V.V.Varaprasad, Advocate
Cell: 94401 03628.

శిథిలమైన కల్వర్టుతో ఇబ్బందులు

బెండపూడి ప్రధాన రహదారిలో పోస్టాఫీసు వీధిలో ఉన్న కల్వర్టు శిథిలమైంది. దీంతో మురుగునీరు రహదారిపైకి వచ్చి చేరడంతో పాటు పక్కనే ఉన్న ఇళ్లలోకి చేరుతుంది. ఆ కారణంగా ప్రయాణికులు, వాహనచోదకులు ఆ గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తొండంగి

కళాశాల లేనట్టేనా..?

ములగపూడిలో 15 మంది విద్యార్థులే చేరిక

రౌతులపూడి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే ఉద్దేశంతో ఏర్పాటైన కళాశాలల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రౌతులపూడి, ములగపూడి గ్రామాల్లో జూనియర్ కళాశాలల ఏర్పాటుతో ఏళ్లుగా ఉన్న నిరీక్షణకు తెరపడింది. కళాశాలలు వచ్చాయనే సంతోషం ఎంతో కాలం నిలవకుండానే మండల కేంద్రంలోని కళాశాల లేనట్టయ్యింది. ములగపూడిలో ఉన్న మహిళా కళాశాలలో చేరికలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. రౌతులపూడి మండలంలోని విద్యార్థులు ఇంటర్ విద్య కోసం ప్రైవేటు బాట పట్టారు.

సిబ్బంది లేరు..

+2 విధానంలో రౌతులపూడిలో కో-ఎడ్యుకేషన్, ములగపూడిలో బాలికలకు ఇంటర్ తరగతులు గతేడాది నిర్వహించారు. రౌతులపూడిలో 56 మంది ఇంటర్ విద్యార్థులకు ఒక్కరు మాత్రమే ఉత్తీర్ణత సాధించగా, ములగపూడిలో ప్రథమ సంవత్సరంలో ఇద్దరు, ద్వితీయ సంవత్సరంలో ఒకరే ఉత్తీర్ణులయ్యారు. ఫలితాలు ఆశాజనకంగా లేకపోవడం, పూర్తిస్థాయిలో అధ్యాపకులు లేకపోవడంతో ఈఏడాది ములగపూడి బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 5గురు, బైపీసీలో 10 మంది మాత్రమే చేరారు. ములగపూడి కళాశాలకు గతేడాది అధ్యాపక బృందాన్ని కేటాయించడంతో ఈఏడాది అక్కడ తరగతుల నిర్వహణ సాగుతోంది. రౌతులపూడిలో కళాశాల ఏర్పాటైన మొదటి ఏడాది 56 మంది చేరగా... రెండో ఏడాది ప్రవేశాలకు అవకాశం లేదు. అధ్యాపకులు లేకపోవడంతో ఇంటర్ తరగతులు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడడంతో ప్రవేశాలు నిలిపివేశారు. ద్వితీయ సంవత్సరానికి వచ్చిన విద్యార్థులు టీసీలు తీసుకుని వేరే కళాశాలలకు వెళ్లిపోయారు. మండల కేంద్రంలో ఊరించిన కళాశాల ప్రస్తుతం లేకపోవడంతో పేద విద్యార్థులు ఇంటర్ చదువులకు ప్రైవేటుకు పరుగులు పెట్టాల్సి వచ్చింది. కళాశాల ఏర్పాటైన ఏడాదిలోనే ఇలా చేయడం ఏమిటని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. కళాశాలకు సిబ్బందిని కేటాయించి పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు విద్యాశాఖాధికారులు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం సిబ్బంది కొరత ఉంది, కళాశాల నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించలేదు. దీంతో ఈఏడాది ఇంటర్‌లోకి విద్యార్థులను చేర్చుకోలేదని హెచ్‌ఎం కోళ్ల రాంబాబు తెలిపారు.

రౌతులపూడి జడ్పీ ఉన్నత పాఠశాల

(c) eenadu

ఈనాడు కర్ణాటక

సోమవారం జులై 21, 2025

పైలెట్‌రహిత రైలు.. పట్టాలపైకి షురూ

సంచారానికి పైలెట్ రహిత మెట్రో రైలు సిద్ధం

బెంగళూరు(అడుగోడి),న్యూస్‌టుడే: నమ్మ మెట్రో ఎల్లో మార్గంలో పైలెట్‌రహిత రైలు ప్రయోగాత్మక సంచారం మరోసారి ఈనెల 22 నుంచి నాలుగు రోజులపాటు నిర్వహి స్తారు. పరిశీలనకు కేంద్ర మెట్రో రైలు సురక్షిత ప్రాధికార కమిషన్ నిపుణులు వస్తారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మూడు పైలెట్‌రహిత రైళ్ల సంచారాన్ని పరీక్షిస్తారు. స్టేష న్‌లో ఉన్న సౌకర్యాలు, పట్టాలు, సిగ్నల్ వ్యవస్థ, స్టేషన్‌లో రైలు నిలుపుదల, తదితర అంశాలను పరిశీలిస్తారు. కొద్ది రోజులపాటు పైలెట్‌ను నియమిస్తారు. నిదానంగా పైలెట్ లేకుండా రైలు సంచరించే విధానాన్ని అమల్లోకి తెస్తారు. ఆర్‌వీరోడ్డు నుంచి బొమ్మనహళ్లి ఐటీ కారిడార్ 18.75 కిలో మీటర్ల పైలెట్‌రహిత మెట్రో రైలు సంచారాన్ని ఆగస్టు 15 నుంచి ప్రారంభిస్తామని బీఎంఆర్‌సీఎల్ అధికారులు వెల్లడిం చిన విషయం తెలిసిందే. ఈ దశలో నిపుణులు వివిధ పరీక్షలు నిర్వహించడంలో నిమగ్నమయ్యారు.

బన్నిమండపం వద్ద కొత్త బస్సు ప్రాంగణం

మైసూరు, న్యూస్‌టుడే: బన్నిమండపం వద్ద 14 ఎకరాల విస్తీర్ణంలో కొత్త ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించే పనులు ప్రారంభం అయ్యాయి. ముఖ్య మంత్రి సిద్ధరామయ్య బస్టాండ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.120 కోట్ల ఖర్చుతో 4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ ప్రయాణ ప్రాంగణం సెల్లార్‌లో 4 వేల ద్విచక్ర వాహనాలు, 300 కార్లు నిలుపుకోవడంతో పాటు ఒకే సారి 75 బస్సులు నిలిపేందుకు ప్రత్యేక వరుస మార్గాలు, నాలుగు లిఫ్టులు, మరు గుదొడ్లు, రెస్టారెంట్లు వచ్చేలా కొత్త బస్టాండ్‌ను నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

దురాగతాలు

- ధర్మస్థలలో దారుణాలపై ‘సిట్’ ఏర్పాటు
- మహిళల సామూహిక హత్యల విచారణకు సర్కారు నిర్ణయం

11 ఏళ్ల కిందట అదృశ్యమైన సౌజన్య

ఈనాడు, బెంగళూరు, బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: 20 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతున్న ధర్మస్థల మహిళల హత్యల కేసుపై ఎట్టకేలకు సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే స్థానిక పోలీసులతో ప్రాథమిక విచారణకు ఆదేశించిన సర్కారు ప్రజా సంఘాలు, బాధితుల డిమాండ్ల మేరకు ప్రత్యేక విచారణ బృందాన్ని (ఎస్‌ఐటీ)ని నియమించింది. ప్రాథమిక విచారణ కొనసాగుతున్న వేళ సిట్ అవసరం ఏముందని హోంమంత్రి డా.జి.పరమేశ్వర్ శనివారం వ్యాఖ్యానించిన 24 గంటల్లోపే సిట్ ఏర్పాటుచేస్తూ ఆదేశాలు జారీ చేయటం గమనార్హం. ఈ దురాగతాల నిగ్గు తేల్చేందుకు ఏర్పాటైన సిట్‌కు డీజీపీ (అంతర్గత భద్రతా విభాగం) ప్రణవ్ మహంతి నేతృత్వం వహిస్తుండగా డీఐజీ (నియామకాలు) ఎం.ఎన్.అనుచేత్, నగర రిజర్వ్ పోలీసు డీసీపీ సౌమ్యలత, అంతర్గత భద్రత విభాగం ఎస్పీ జీతేంద్ర కుమార్ దయామ ఇతర సభ్యులుగా వ్యవహరిస్తారు.

అంతా సంచలనమే

ధర్మస్థల అంటే కేవలం కన్నడిగులకే కాదు యావత్తు దేశంలోని హిందువులకు పవిత్రమైన స్థలం. మంజునాథ స్వామి దేవాలయ పరిసరాల్లోని చిక్కని అడవులు ప్రస్తుతం అంతుచిక్కని రహస్యానికి కేంద్రంగా మారాయి. రెండు దశాబ్దాలుగా ఈ దేవాలయ పరిసర ప్రాంతాల్లో మహిళలు ఉన్నపళంగా కనిపించకపోవటం, వారిలో అత్యధికులు విద్యార్థినులుండటం, పోలీసుల రికార్డుల్లో వీరి ఆచూకీ కోసం ఫిర్యాదులు నమోదైనా వాటిపై పారదర్శక విచారణ జరగలేదన్న వాదన స్థానికుల నుంచి వినిపించేది. ఈ ప్రాంతంలో ఎవరికీ అంతుచిక్కని దురాగతాలు మాత్రం కొనసాగుతూనే ఉండేవి. 2003 నుంచీ దక్షిణ కన్నడ జిల్లా ధర్మస్థల చుట్టు పక్కల ప్రాంతాల్లో గుర్తుతెలియని మృతదేహాలు ప్రధానంగా మహిళలు మృత దేహాలు, పుర్రెలు, ఎముకలు, అస్థిపంజరాలు బయటపడుతున్నట్లు స్థానిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తుండేవారు.

ఒక్కొక్కరుగా బయటకు

ఈనెల మొదటి వారంలో ఇదే దేవాలయ ప్రాంగణంలో పని చేసే గుర్తు తెలియని వ్యక్తి ఒకరు చేసిన ఫిర్యాదుతో అంతు చిక్కని మారణహోమం అసలు రంగు బయటపడింది. అతని ఫిర్యాదు మేరకు తవ్వకాలు చేపట్టడం, ఆ తవ్వకాల్లో ఓ యువతి పుర్రె బయటపడటంతో మాయమైన యువతుల కుటుంబ సభ్యులు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి ఫిర్యాదులు ఇవ్వసాగారు. ఇలా 2003లో బెళ్తంగడి పోలీసు స్టేషన్‌లో సుజాత భట్ అనే మహిళ తన కుమార్తె అనన్యభట్ ధర్మస్థల దేవాలయానికి వెళ్లి మాయమైనట్లు అప్పట్లోనే ఫిర్యాదు చేయగా, తాజా పరిణామాలతో మరింత ధైర్యంగా వచ్చి తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తాను నేరుగా సదరు దేవాలయ యాజమాన్యాన్ని న్యాయం చేయాలని మనవి చేసినా తనలో విశ్వాసం కల్గించే హామీ ఇవ్వలేకపోయారు. పైగా కొందరు దుండగులు తనపై దాడికి పాల్పడగా మూడు నెలల పాటు అపస్మారక స్థితికి చేరినట్లు వాపోయారు. 11 ఏళ్ల కిందట మరో విద్యార్థిని సౌజన్య హత్య కేసుతో స్థానికుల్లో ఈ అనుమానం మరింత బలపడింది. బాధితులకు ప్రజా సంఘాలు కూడా తోడవటంతో ఈ దురాగతాలపై విచారణ చేపట్టాలన్న డిమాండ్లు తీవ్రరూపం దాల్చాయి. ఈ క్రమంలో తాను పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్న సమయంలో మృత మహిళల మృతదేహాలను పూడ్చాను. ఇందులో తన బంధువుల మహిళ కూడా ఉన్నా నోరు మెదపలేకపోయాను. తనలోని పశ్చాత్తాపం నియంత్రించుకోలేని స్థితిలో నిజం బయటపెట్టాలని నిర్ణయించానని చెప్పిన విషయం తెలిసిందే. ఆ సాక్షికి ప్రత్యేక భద్రత కల్పించి అతను సేకరించిన పుర్రె, అస్థి పంజరాలను భద్రపరిచిన పోలీసులు ఆయనను రహస్య స్థలంలో విచారిస్తున్నారు.

న్యాయం జరిగేనా?

ఈ హత్యలు, అసహజ చావులు, అత్యాచార సంఘటనలపై విచారణకు డిమాండు చేస్తూ కొన్ని సంఘాలు కొన్నేళ్లుగా ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎలాంటి హత్యలు, అసహజ మరణాలు, అత్యాచారాలు జరగలేదని అధికారులు న్యాయస్థానానికి నివేదించుకున్నారు. నేటికీ ఆ కేసు న్యాయస్థానంలో విచారణ సాగుతోంది. సౌజన్యకు న్యాయం జరగాలని ఆమె తల్లిదండ్రులు, వివిధ సంఘాలు కలిసి నేటికీ పోరాటాలు చేస్తున్నారు. ఇందుకు ప్రభుత్వం స్పందించిన దాఖలాలు లేవు. జరుగుతున్న సంఘటనలపై రాష్ట్ర మహిళ కమిషన్ తీవ్రంగా స్పందించింది. సమగ్ర విచారణకు ఆదేశించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మరోవైపు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ నేతృత్వంలోని వివిధ సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిసి ధర్మస్థల వద్ద జరుగుతున్న అసహజ చావులు, హత్యలు, మహిళలపై అత్యాచారాలపై విచారణకు ఆదేశించాలని కోరారు. సాక్ష్యాధారాలు నాశనం కాకుండా జరుగుతున్న సంఘటనలపై సమగ్ర విచారణకు ఆదేశించాలని మాజీ మంత్రి, సినీనటుడు ప్రకాశ్‌రాజ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ధర్మస్థల పోలీసుఠాణాలో నమోదైన కేసులను సిట్‌కు బదిలీ చేసి సమగ్ర విచారణ తర్వాత ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనుంది.



ఇటీవల ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిసిన వివిధ సంఘాల ప్రతినిధులు

‘వ్యక్తిగత పనిపై వెళ్లాను’

డీకే శివకుమార్

మైసూరు, న్యూస్‌టుడే: సాధనా సమావేశాల నుంచి తాను ఢిల్లీకి వెళ్లవలసిన అవసరం ఉండటంతో శనివారం హుటాహుటిన బెంగళూరుకు వచ్చానని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. ఢిల్లీకి వెళ్లి, అక్కడి న్యాయవాదులతో భేటీ అయి మళ్లీ తెల్లవారుజామున తిరిగి వచ్చానన్నారు. హెగ్గడదేవన కోటె తాలూకా బీచనహళ్లిలోని కబిని జలాశయం వద్ద తనను కలుసుకున్న విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రత్యేకంగా వెళ్లి రాజకీయాలు చేయవలసిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ముఖ్యమంత్రితో కలిసి తాను శనివారం సుదీర్ఘంగా మాట్లాడుకున్నామని చెప్పారు. క్రమశిక్షణను ఉల్లంఘించే మంత్రులు, ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఖర్గే భరోసా ఇచ్చారని తెలిపారు. తమ పార్టీలో అధిష్ఠానం ఇక్కడ ప్రతి ఒక్కరికీ గాడ్ ఫాదర్ అన్నారు. పదే పదే వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ద్వారా కొందరు మంత్రులు తమ ప్రతిష్ఠను తామే దెబ్బ తీసుకుంటున్నారని పరోక్ష వ్యాఖ్యలు చేశారు. గ్రూపు రాజకీయాలు చేయవద్దని పార్టీ వ్యవహారాల బాధ్యుడు రణదీప్ సింగ్ సుర్జేవాలా నేతలు అందరికీ హితవు పలికి వెళ్లారని గుర్తు చేశారు.

రాజకీయ అంతానికి సీఎం గుంత తవ్వారు

అశోక్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను రాజకీయంగా అంతం చేసేందుకు మైసూరు సాధనా సమావేశాల్లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భూమిపూజ పేరిట పెద్ద గుంత తీశారని విపక్ష నేత అశోక్ ఎద్దేవా చేశారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, సమావేశాల్లో డీకే శివకుమార్ పేరును ప్రస్తావించకుండా మాట్లాడడం వెనుక ఉద్దేశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించారని చెప్పారు. ముఖ్యమంత్రి పీఠాన్ని శివకుమార్‌కు వదిలి పెట్టాలన్న అక్కసు ఉండడంతోనే సీఎం తెరవెనుక కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కుర్చీలపైనా తన ఫొటోను ఉంచుకుని, తనకు మద్దతుగా నినాదాలు చేయించుకుంటూ ఉప ముఖ్యమంత్రిని అవమానించారని పేర్కొన్నారు. నవంబరులో ముఖ్యమంత్రి పీఠం ఖాళీ అవుతుందని కొత్త నేత దాన్ని భర్తీ చేస్తారని జోస్యం చెప్పారు.

ఇంట్లో కూర్చునే వారి పేరెందుకు?

డీకేను ప్రస్తావించడంపై సిద్ధరామయ్య ఫైర్

ఇంటర్నెట్‌డెస్క్: కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు ఉంటుందని కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతుండటం.. అగ్రనాయకులు వాటిని తోసిపుచ్చడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఓ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఓ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేరు ప్రస్తావించాలని సూచించిన వ్యక్తిపై సీఎం సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంట్లో కూర్చునే వాళ్ల గురించి ఎందుకని వ్యాఖ్యానించారు. మైసూరులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్, కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సహా పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో డీకే తన ప్రసంగం తర్వాత ముఖ్యమైన పనిమీద బెంగళూరుకు బయలుదేరారు. ఆ తర్వాత సీఎం ప్రసంగించేందుకు పోడియం వద్దకు వచ్చారు. ఈ క్రమంలో ప్రముఖుల గురించి ప్రస్తావించే సమయంలో డిప్యూటీ సీఎం పేరును ప్రస్తావించ లేదు. పార్టీ కార్యకర్త ఒకరు ఈ విషయాన్ని గుర్తుచేయగా. . సీఎం ఆయనపై మండిపడ్డారు. ‘శివకుమార్ ఇక్కడ లేరు కదా? దయచేసి వెళ్లి కూర్చోండి. ఆయన బెంగళూరుకు తిరిగి వెళ్లిపోయారు. వెళ్లిపోయిన వారి గురించి కాదు.. వేదికపై ఉన్న నేతల పేర్లను ప్రస్తావించాలి. ఇంట్లో కూర్చున్న వారి గురించి కాదు. ఇక్కడ ఉన్నవారికి ఆహ్వానం పలకాలి. అదే ప్రొటోకాల్. ఆ మాత్రం అర్థం చేసుకోలేరా’ అని అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంపికపై హస్తం పార్టీ తీవ్ర కసరత్తు చేసింది. చివరకు సీనియార్టీ, ఇతరత్రా అంశాలను దృష్టిలో పెట్టుకొని సిద్ధరామయ్యను అగ్రనాయకత్వం ఎంచుకుంది. అయితే, రెండున్నరేళ్ల తర్వాత ముఖ్యమంత్రి పీఠంలో మార్పు ఉంటుందని అప్పటి నుంచే ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు కూడా దాన్నే విశ్వసిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల పలువురు ఎమ్మెల్యేలు, కార్యకర్తలు బహిరంగంగానే దీనిపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై డీకే, సిద్ధరామయ్య ఇద్దరూ స్పష్టత నిస్తూనే ఉన్నా.. రాజకీయం మాత్రం రసవత్తరంగా మారింది.

భాజపా వాళ్లు పెరుగులో రాళ్లు వెతుకుతారు

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎద్దేవా

నేతలతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం సిద్ధరామయ్య

మైసూరు, న్యూస్‌టుడే: భాజపా నాయకులు పెరుగులో రాళ్లు వెతుకుతుంటారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎద్దేవా చేశారు. అభివృద్ధి పనులు, వివిధ పథకాల అమలుకు సంబంధించి చర్చకు రమ్మని పిలిచినా, స్పందించరని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు, తనకు మధ్య వివాదాలు ఉన్నట్లు ప్రజలను నమ్మించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. డీకే శివకుమార్, మంత్రులు కె.వెంకటేశ్, డాక్టర్ హెచ్‌సీ మహదేవప్ప, ఎమ్మెల్యేలు అనిల్ చిక్కమాదు, దర్శన్ ధ్రువనారాయణతో కలిసి హెచ్‌డీ కోటె తాలూకా కబిని జలాశయానికి ఆదివారం వాయనాన్ని సమర్పించారు. తమ పార్టీలో నేతల మధ్య అభిప్రాయబేధాలు లేవని, అందరం ఐకమత్యంగా కలిసి పని చేస్తున్నామని చెప్పారు. తనకు, ఇతరనేతల మధ్య చీలికలు వస్తే తమకు లాభం జరుగుతుందని భాజపా భ్రమల్లో తేలియాడుతోందని ఎద్దేవా చేశారు. డిజిటల్ పేమెంట్లు స్వీకరిస్తున్న వ్యాపారులు వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) చెల్లించాలని ప్రభుత్వమే నోటీసులు జారీ చేస్తోందని భాజపా అధ్యక్షుడు విజయేంద్ర, ఇతర నేతలు వ్యాఖ్యలు చేయడం వారి అజ్ఞానానికి అద్దం పడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు వేధిస్తే తనకు ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. జీఎస్టీ చెల్లించాలని కేంద్ర వాణిజ్య పన్నుల శాఖ అధికారులు నోటీసులు పంపిస్తే తాను బాధ్యుడిని ఎలా అవుతానని ప్రశ్నించారు. వ్యాపారులకు ఇబ్బంది లేకుండా, తాను కేంద్ర జీఎస్టీ కౌన్సిల్‌తో మాట్లాడతానని చెప్పారు. తమ ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో నిర్వహించిన సాధనా సమావేశాల్లో రెండు లక్షల మంది హాజరయ్యారని చెప్పారు. గ్యారంటీ పథకాల కోసం తాము ఏటా రూ.52 వేల కోట్లను ఖర్చు చేస్తున్నామని వివరించారు. గ్యారంటీలను విమర్శిస్తున్న భాజపా నేతలు దిల్లీ, బిహారు ఎన్నికలకు ముందు మోదీ ఏఏ హామీలు ఇచ్చారో ఒకసారి పరామర్శించుకోవాలని హితవు పలికారు.

జలాశయానికి వాయనం ఇస్తున్న సిద్ధు, శివకుమార్

కుట్ర పూరితంగా ఇరికించారు

బీదర్, న్యూస్‌టుడే: వివాహం చేసుకుంటానని నిశ్చితార్థం చేసుకుని అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలపై మాజీ మంత్రి ప్రభు చౌహాన్ కుమారుడు ప్రతీక్ చౌహాన్‌పై కేసు నమోదైంది. లోక్‌సభ మాజీ సభ్యుడు భగవంత ఖూబా కుట్రతోనే కేసు పెట్టించారని ప్రభు చౌహాన్ ఆరోపించారు. ఆ యువతితో 2023 డిసెంబరు 25న నిశ్చితార్థం చేసుకున్నామని, అప్పటి నుంచి వివాహానికి సరైన ముహూర్తమే దొరకలేదని ఆయన చెప్పారు. ఇటీవల ఆ యువతి కుటుంబ సభ్యులు తమ ఇంటికి వచ్చి దాడి చేసేందుకు విఫలయత్నం చేశారని ఆరోపించారు. దాడి చేశారని ఫిర్యాదు చేయడంతోనే వారు తమ కుమారునిపై అత్యాచారం కేసు పెట్టించారని ఆక్రోశించారు. అత్యాచారం జరిగిందని ఆ యువతి తమ వద్దకు వచ్చి ఫిర్యాదు చేయడంతోనే కేసు నమోదు చేశామని ఎస్పీ ప్రదీప్ తెలిపారు. మరోవైపు మహిళా కమిషన్‌లోనూ ఆ యువతి ఫిర్యాదు చేసింది.

తేనెవల నిందితులు కేరళలో చిక్కారు

మైసూరు, న్యూస్‌టుడే: పిరియాపట్టణ తాలూకా కంపలాపురకు చెందిన దుస్తుల వ్యాపారి దినేశ్ కుమార్‌ను హనీట్రాప్‌లో బిగించి నగదు వసూళ్లకు పాల్పడి పరారైన కవన, సైఫ్ అనే నిందితులను బైలకుప్ప ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో హుణసూరు ఠాణా కానిస్టేబుల్ శివణ్ణ, మూర్తి అనే యువకునితో పాటు ఒక యువతిని కూడా పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. శివణ్ణను అడ్డుపెట్టుకుని నిందితులు దినేశ్ కుమార్ నుంచి రూ.10 లక్షల నగదు వసూలు చేశారు. సైఫ్, కవన ఇద్దరూ కణ్ణూరులో ఉన్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా ఎస్సై రవి కుమార్ నేతృత్వంలోని సిబ్బంది దాడి చేసి వారిని అరెస్టు చేసి బైలకుప్పెకు తీసుకువచ్చి విచారణ ప్రారంభించారు.

కానిస్టేబుల్ కోసం గాలింపు తీవ్రం

రామనగర, న్యూస్‌టుడే: తమ ఊళ్లో నిత్యం గొడవలు జరుగుతున్నాయని, పోలీసు బీటు ఏర్పాటు చేయాలని కోరుతూ ఫోన్ చేసిన మహిళ చరవాణి నంబరు తీసుకుని కానిస్టేబుల్ పుట్టస్వామి పరిచయం పెంచుకున్నాడు. బెంగళూరు దక్షిణ జిల్లా చెన్నపట్టణ తాలూకా సహాయవాణి 112 కార్యాలయంలో వాహనం డ్రైవరుగా పని చేస్తున్నాడు. మీ ఊరి సమస్యను పరిష్కరించేందుకు నీకు సాయం చేస్తానని నమ్మించి ఆమెను తన వద్దకు పిలిపించుకున్నాడు. తన ఇంటికి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ అకృత్యాన్ని రికార్డు చేసుకుని, మరో మూడు సార్లు తన ఇంటికి పిలిపించుకుని అత్యాచారానికి పాల్పడ్డాడు. అతని వేధింపులు తట్టుకోలేక బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనపై చెన్నపట్టణ ఠాణాలో కేసు నమోదైందని తెలుసుకుని పుట్టస్వామి ఇల్లు విడిచి పరారయ్యాడు. అతన్ని విధుల నుంచి ఉన్నతాధికారులు తప్పించగా, పరారీలో ఉన్న నిందితుని కోసం పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.

కల్యాణ కర్ణాటకకు విద్యుత్తు బస్సులు

కలబురగి, న్యూస్‌టుడే: మహిళలకు ‘శక్తి’ పథకాన్ని అందిస్తున్న బస్సుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కల్యాణ కర్ణాటక పరిధిలో బస్సుల కొరతను పరిష్కరించేందుకు నవంబరు నుంచి 200 ఈ-బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నారు. కలబురగికి 100, బళ్లారి, విజయపుర జిల్లాలకు తలా 50 బస్సులను అందిస్తామని అధికారులు తెలిపారు.

ప్రమాదంలో నుజ్జయిన కార్లు, రహదారిపై పడిన కారు ముందు భాగం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

హాసన, న్యూస్‌టుడే: చెన్నరాయపట్టణ శివారు ప్రాంతం శెట్టిహళ్లి ఉపరితల వంతెన వద్ద శనివారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మణించారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. బెంగళూరులోని సంజయనగరకు చెందిన మీనాక్షి (29), చెన్నరాయపట్టణకు చెందిన కారు డ్రైవరు ప్రతాప్ (32)లను మృతులుగా గుర్తించారు. బెంగళూరు నుంచి హాసనకు వస్తున్న కారు, హాసన నుంచి హిరిసావెకు వస్తున్న మరో కారును ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. గాయపడిన వారిని చికిత్స కోసం హాసన, చెన్నరాయపట్టణ ఆసుపత్రుల్లో చేర్పించారు. చెన్నరాయపట్టణ ట్రాఫిక్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నీట మునిగి ముగ్గురు విద్యార్థుల విషాదం

మైసూరు, న్యూస్‌టుడే: మైసూరు తాలూకా మీనాక్షిపుర వద్ద కేఆర్‌ఎస్ బ్యాక్ వాటర్‌లో ఈతకు దిగి ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. మండ్యలోని ఒక నర్సింగ్ కళాశాలలో చదువుతున్న ప్రశాంత్, సిద్ధ, కృష్ణను మృతులుగా గుర్తించారు. స్నేహితులతో కలిసి నీటిలో ఈతకు దిగి వీరు ముగ్గురూ గల్లంతయ్యారు. మృతదేహాలను వెలికి తీసేందుకు అగ్నిమాపకదళ సిబ్బందితో కలిసి ఇలవాల ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కోలుకున్న మఠాధిపతి

బాగలకోటె, న్యూస్‌టుడే: వాంతులు కడుపునొప్పితో చికిత్స కోసం ఆసుపత్రిలో చేరిన జయమృత్యుంజయ స్వామి ఆదివారం కోలుకున్నారు. ఆయనను ఆసుపత్రి నుంచి వైద్యులు ఇంటికి పంపించారు. కూడలసంగమ బసవేశ్వరుని ఆశీస్సులతో తాను త్వరగా కోలుకున్నానని చెప్పారు. తనను కూడల సంగమ పీఠం నుంచి బహిష్కరించినా నూతన పీఠం ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమని చెప్పారు. మాజీ మంత్రి సీసీ పాటిల్, లింగాయత పంచమసాలి మఠానికి చెందిన పలువురు భక్తులు తనకు ఇప్పటికే మద్దతుగా ఉన్నారని చెప్పారు. ఎమ్మెల్యే విజయానంద కాశప్పనవర్ దౌర్జన్యంగా మఠానికి తాళం వేశారని, దాన్ని తెరిచేందుకు ప్రయత్నించిన ఏడుగురు భక్తులపై హునగుంద ఠాణాలో కేసు పెట్టారని ఆరోపించారు.

రౌడీల నివాసాలపై దాడులు

బెంగళూరు (సదాశివనగర): ఉత్తర విభాగం పరిధిలోని రౌడీషీటర్ల నివాసాలపై డీసీపీ బీఎస్ నేమగౌడ నేతృత్వంలోని పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఉదయం 4 నుంచి ఆరు గంటల మధ్య 13 ఠాణాల ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు. రౌడీషీటర్లను డీసీపీ కార్యాలయానికి తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. జీవనోపాధికి వారు చేస్తున్న పనులు, చరవాణుల నంబర్లు తీసుకున్నారు. నేర ప్రవృత్తి మానుకోవాలని హితవు పలికి పంపించారు. పాత నేరస్థులు సత్ప్రవర్తనతో మెలగాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌టీనగరలో శనివారం రాత్రి కొందరు వ్యక్తులు పుట్టిన రోజు వేడుకలను ఆచరించుకుంటూ తల్వార్లను ప్రదర్శించారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవాలు లేవని నేమగౌడ స్పష్టం చేశారు. ఇలాంటి వాటిని నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇనుప డబ్బాలు పాయె.. ప్లాస్టిక్ సంచులొచ్చె!

రవీంద్ర కళాక్షేత్ర ఆవరణలోని చెట్లకు కట్టిన ప్లాస్టిక్ సంచులను చూసి అక్కడకు వచ్చిన ప్రజలు ఆశ్చర్యపోయారు. అంతకు ముందు ఇక్కడి ఆవరణలో చెత్తను వేసేందుకు ఉన్న డబ్బాలు పాడైతే వాటి స్థానంలో పారిశుద్ధ్య కార్మికులు ఇలా చెట్లకు కట్టేశారు. చెత్త వేయకుండా పైన బిగించి కట్టారని ప్రశ్నిస్తే దిగువ కొంత భాగం కత్తిరించి, ఆ కంత నుంచి వ్యర్థాలను వేయాలని సిబ్బంది సూచించారు. మార్కెట్, మహానగర పాలికె ప్రధాన కార్యాలయం, టౌన్‌హాల్‌కు చేరువలో ఉన్న రవీంద్ర కళాక్షేత్ర, నయన ఆడిటోరియాలకు నిత్యం వందలాది మంది వస్తుంటారు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు, బాతాఖానీ వేసుకునేందుకు ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగులు, కళాకారులు వచ్చి వెళ్తుంటారు. ఇప్పటి వరకు ఉన్న చెత్త డబ్బాల స్థానంలో కొత్తగా వీటిని ఏర్పాటు చేయడంపై వారు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. **- బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే**

కోహ్లి అరెస్టుకు కుట్ర

ఉడుపి, న్యూస్‌టుడే: చిన్నస్వామి క్రికెట్ మైదానం వెలుపల తొక్కిసలాట ఘటనలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును బాధ్యునిగా చేసిన భారత క్రికెటర్ విరాట్ కోహ్లిని అరెస్టు చేసేందుకు కుట్ర జరుగుతోందని మాజీ డీవైఎస్పీ అనుపమ శెణై ఆరోపించారు. ఐపీఎస్ అధికారి దయానంద్ ఇచ్చిన నివేదికను పరిశీలిస్తే ఈ అంశం అర్థం అవుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వంలోని కొందరు పెద్దలు తెరవెనుక ఉంటూ ఈ నివేదికను తయారు చేయించినట్లు ఉందని ఆరోపించారు. తొక్కిసలాట ఘటన వెనుక స్వార్థ రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని అనుమానం వస్తోందన్నారు. డీజేహళ్లి, కేజీహళ్లిలో గతంలో ఘర్షణలకు కారణమైన వారి సాయంతో తొక్కిసలాట చేయించినట్లు ఉందని పేర్కొంటూ బెంగళూరు నగర జిల్లాధికారి జగదీశ్‌కు లేఖ రాశారు. దీనిపై తాను న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

డిజిటల్ చెల్లింపు వద్దు.. నగదు ముద్దు

వ్యాపారులకు కొత్త చిక్కు

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: వీధి పక్కన ఆహార పదార్థాలు విక్రయించే వీధి వ్యాపారి మునియప్పకు రూ.35లక్షలు వ్యాపార లావాదేవీలకు సంబంధించి జీఎస్‌టీ ఇతర పన్నులు చెల్లించాలని వాణిజ్యపన్నులు శాఖ నుంచి నోటీసు వచ్చింది. ఆందోళనకు గురైన ఆయన స్థానిక అధికారులను ఆశ్రయించారు. తరువాత వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులను కలిశారు. ఫోన్ పే, గూగుల్ పే తదితర డిజిటల్ చెల్లింపులను వినియోగిస్తున్నందున వాటికి సంబంధించిన మొత్తాలకు జీఎస్‌టీ పన్ను చెల్లించాలని నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు. బిత్తర పోయిన ఆయన కొద్దిరోజులు వ్యాపారం నిలిపివేశారు. ఆఖరికి తక్కువ మొత్తం చెల్లిస్తే సరిపోతుందని అధికారులు తెలియజేయడంతో ఊపిరి పీల్చుకుని తిరిగి వీధి వ్యాపారం ప్రారంభించారు. ఈసారి ‘నో పే’ అనే బోర్డు తగిలించారు. డబ్బులు చెల్లించాలని సూచించారు. వచ్చిన వినియోగదారుల నుంచి కచ్చితంగా నగదు వసూలు చేయడం మొదలు పెట్టారు. ప్రస్తుతం నగరంలో చిరు వ్యాపారులందరూ తమ వ్యాపార స్థలంలో ‘నో పే’ అనే బోర్డులు ఉంచారు. నగదు చెల్లించి వస్తువులను కొనుగోలు చేయాలని తెలిపారు. మరోవైపు నెలకొన్న సమస్య పరిష్కరించేందుకు వాణిజ్య పన్నుల శాఖ రంగంలోకి దిగింది. ఇందుకు కోసం ప్రత్యేక సహాయ వాణి 18004256300 ఏర్పాటు చేసింది. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఈ కేంద్రం పని చేస్తుందని అధికారులు తెలిపారు. వ్యాపారులు ఫోన్ చేసి తమ అనుమానాలను పరిష్కరించుకోవచ్చు.



ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

జంగిల్ లాడ్జీలు.. పర్యాటకుల అనువైన ప్రదేశాలు

కబిని వెనక తట్టు ప్రదేశంలో పడవలో సంచరిస్తూ ఏనుగులను తిలకిస్తున్న పర్యాటకులు

వెదురుతో తయారు చేసిన కుటీరాలు

అరేబియా సముద్రతీరంలో ఉన్న దీవుల్లో వేడుకలు నిర్వహించుకునేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు

అరేబియా దరి.. ప్రకృతి అందాల విడిది

- ఆస్వాదనకు పర్యాటకుల ఆసక్తి
- ప్రత్యేక హోంస్టేలు సిద్ధం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: వాతావరణంలో మార్పు రావడం అద్భుతమైన సౌందర్యాలతో కూడిన ఆహ్లాదకరమైన ప్రకృతి ఆస్వాదించేందుకు కుటుంబ సభ్యులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. వర్షం కురుస్తుండగా సముద్రం అలలను తిలకించేందుకు పోటీపడుతున్నారు. ఆషాఢ మాసం, శ్రావణ మాసం ప్రారంభ దినాలు ఆలయాలను సందర్శించుకుని కొందరు ప్రజలు సముద్ర స్నానం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో అధికారులు సముద్రతీరంలో సంచరించేందుకు స్నానం చేసేందుకు అనుమతులు ఇస్తున్నారు. ఓ వైపు మొక్కులు తీర్చుకోవడంతో పాటు ప్రకృతి ఒడిలో సేద్యం తీర్చుకునేందుకు పర్యాటకులు జంగల్ లాడ్జిలు, హోంస్టేలు, ప్రసిద్ధమైన హోటళ్లలో గదుల బుకింగ్‌కు పోటీ పడుతున్నారు. ఇప్పటికే 60 శాతం గదులు ముందస్తు బుకింగ్ అయినట్లు నిర్వాహకులు తెలిపారు. వర్షాకాలంలో ప్రకృతి మధ్య గడపాలనే ఉద్దేశంతో అక్కడికి వెళ్లేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు పర్యాటక శాఖ సందర్శకులకు జంగిల్ లాడ్జిల్లో గదులు రిజర్వు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. వచ్చే స్వదేశీ, విదేశీ పర్యాటకులు కొద్ది రోజులు లాడ్జిల్లో బస చేసి ప్రకృతి అందాలను తనివి తీరా ఆస్వాదిస్తారు. కబిని, బండిపుర, నాగరహొళె తదితర ప్రాంతాల్లో ఉన్న జంగిల్ లాడ్జీలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కొందరు ముందస్తుగా గదులను రిజర్వు చేసుకుంటున్నారని అధికారులు తెలియజేశారు. ప్రైవేట్ హోంస్టేలు, హోటళ్ల నిర్వాహకులు పర్యాటకులను ఆకట్టుకునేందుకు కొన్ని రాయితీలు ప్రకటించారు. జంగిల్ లాడ్జీల భర్తీపై అధికారులు ఎక్కువగా దృష్టి సారించారు. ప్రత్యేక ప్యాకేజీలు, రాయితీలను ప్రకటించారు. జంగిల్ లాడ్జిల వద్ద పర్యాటకుల సురక్షిత చర్యలతో అన్ని రకాల ఆహార పదార్థాలు దొరికేలా చర్యలు చేపట్టారు. కబిని ఆనకట్ట వెనకతట్టు ప్రదేశంలో సంచరించే ఏనుగులను తిలకించేందుకు ఆధునిక పడవలను ఏర్పాటు చేస్తారు. నాగరహోళెలో పులుల సంరక్షణ కేంద్రం సందర్శించేందుకు కొత్త వాహనాలను కొనుగోలు చేశారు. అరేబియా సముద్రం తీర ప్రాంతాల్లో ఉన్న బీచ్‌లలో సంచరించేందుకు అనుమతులు ఇస్తున్నారు. ఎక్కువ మంది పర్యాటకులు బీచ్‌లను తిలకించేందుకు ఆసక్తి చూపుతున్నందున చిక్కమగళూరు, ఉడుపి, మంగళూరు. కార్వార, బనవాసి, హొరనాడు తదితర ప్రాంతాల్లో ఉన్న బీచ్‌లలో మౌలిక సౌకర్యాలతో పాటు సురక్షిత చర్యలు చేపట్టారు.

ఉడుపిలో సిద్ధంగా ఉన్న హోంస్టే భవనం

భక్తిశ్రద్ధలతో ఆడికృత్తిక

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగరం కనకదాస కూడలి సమీపంలోని కుమారస్వామి ఆలయంలో ఆదివారం ఆడికృత్తిక మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున స్వామికి మహా పంచామృత అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని విశేష ఆభరణాలు, పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు మురుగన్‌తో పాటు శివుడు, వినాయకుడిని దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయ ట్రస్టు సభ్యులు భక్తులకు మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అన్నప్రసాదాలు వితరణ చేశారు. దాదాపు 7వేలమందికి పైగా భక్తులు ప్రసాదం స్వీకరించినట్లు ట్రస్ట్ అధ్యక్షుడు విజయకుమార్ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి పల్లకీ సేవ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కౌల్‌బజార్ పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

విశేషాలంకారంలో సుబ్రహ్మణ్య స్వామి

స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

సామాజిక సేవ అందరి బాధ్యత

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు పట్టణంలోని పలు వార్డుల్లో చెట్లు దట్టంగా పెరిగిపోయి వివిధ సమస్యలతో ప్రజలు బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో నగర సభ అనుమతితో చెట్ల కొమ్మలు కత్తిరింపునకు శ్రీకారం చుట్టిన స్థానిక వసిరి, అఖండ భూమి ఫౌండేషన్ ప్రతినిధులకు ఆదివారం లయన్స్ క్లబ్ సభ్యులు పలు కట్టర్లను ఉచితంగా అందజేసి మాట్లాడారు. సామాజిక సేవ అందరి బాధ్యతని, మీరు తలపెట్టిన కార్యానికి తమవంతు సాయంగా వీటిని ఇస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గూడపాటి వెంకటేశ్ తెలిపారు. అనంతరం లయన్స్ క్లబ్ సభ్యులు ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి శ్రమదానంలో పాలుపంచుకున్నారు. కత్తిరించిన కొమ్మలను తరలించేందుకు నగరసభ ఓ ట్రాక్టరును ఏర్పాటు చేసింది.

ఫౌండేషన్ ప్రతినిధులకు కట్టర్లు బహూకరించి శ్రమదానంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ సభ్యులు

ప్రతిభ ఎవరి సొత్తు కాదు

మైసూరు, న్యూస్‌టుడే: ప్రతిభ ఎవరో ఒకరి సొత్తు కాదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. అవకాశాలు లభిస్తే ప్రతి ఒక్కరి ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. బాలల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శ్రమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు కులం, మతం పేరిట సంఘాలను ఏర్పాటు చేసుకుని సమావేశాలను నిర్వహించడం సరికాదని హితవు పలికారు. పాత పింఛను విధానాన్ని అమలు చేసేందుకు సమితి ఇచ్చే నివేదికకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం శనివారం రాత్రి ఇక్కడ నిర్వహించిన సమావేశంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగులు, చట్టసభ ప్రతినిధులు కాలేరని పేర్కొన్నారు. అవకాశాలు లభిస్తే ఎవరైనా ముందంజలోకి వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రజా సేవ చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లే బాధ్యత ఉద్యోగులదే అని చెప్పారు. ఆరోగ్య సంజీవని పథకాన్ని కూడా జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని సత్కరిస్తున్న ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

'చక్కని వాతావరణం ప్రసాదించు సామీ'

ఉడుపి, న్యూస్‌టుడే: గత రెండు నెలలుగా కర్ణాటక తీర ప్రాంత జిల్లాల్లో వాతావరణం పాడైందని భావిస్తూ మత్స్యకారులు ప్రత్యేక పూజలు, జాతర నిర్వహించారు. 'దైవరాజ బొబ్బర్య'తో కలిసి మాకు బుట్టల నిండా చేపలు ఇవ్వు, సాగర అలలను చీల్చి ముందుకు వెళ్లే శక్తి ఇవ్వు స్వామీ అంటూ పూజలు చేశారు. చిన్న దోణి, పడవలను సముద్రంలోకి అనుమతించకపోవడంతో తమకు ఉపాధి పోయిందని మత్స్యకారులు ఆక్రోశించారు. ఆగస్టు 10 వరకు నాటు పడవలే వేటకు వెళ్లాలి. తుపాను, సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో చిన్న చెరువులు, కుంటల్లోనే చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు.

జాతరలో మత్స్యకారులు

నిందితుని అరెస్టు

కలబురగి: దొంగతనాల కోసం హైదరాబాద్ నుంచి కలబురగికి వచ్చి వెళుతున్న సయ్యద్ హమీద్ (47) అనే దొంగను విశ్వవిద్యాలయం ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.11.07 లక్షల విలువైన 123 గ్రాముల ఆభరణాలను జప్తు చేసుకున్నామని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ ఎస్.డీ. శరణప్ప వెల్లడించారు. విశ్వవిద్యాలయం ఠాణా పరిధిలో ఏడు ఇళ్లలో ఇటీవల దొంగతనాలకు పాల్పడ్డాడని ప్రాథమిక విచారణలో గుర్తించామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరా ఫుటేజ్‌ల ఆధారంగా దర్యాప్తు పూర్తి చేసి నిందితుడ్ని పట్టుకున్నామని వివరించారు.

నగరంలో ఏఐఏఎంఏ ఎక్స్‌పో-2025

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: భారత్‌లో ప్రథమ మార్కెటింగ్ అగరబత్తీలను అందించే నాయకునిగా నిలబెట్టే దిశలో ప్యాలెస్ మైదానంలో సదస్సును నిర్వహిస్తున్నామని అఖిల భారత అగర్‌బత్తీ తయారీదారుల సంఘం ప్రకటించింది. 'పారంపరికంగా ఆధునికం' అనే ఇతివృత్తంతో నవంబరు 6-8 వరకు నిర్వహించే సదస్సులో జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొంటారని ఏఐఏఎంఏ అధ్యక్షుడు అంబికా రామాంజనేయులు తెలిపారు. సంఘం మాజీ అధ్యక్షుడు అర్జున్ రంగ, ఇతర సభ్యులు టీవీ కృష్ణ, శరత్ బాబు, సప్తగిరి తదితరులతో కలిసి సదస్సుకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేసి మాట్లాడారు. అగర్‌బత్తీ, అనుబంధ ఉత్పత్తులను తయారు చేస్తున్న సంస్థలు, ఎసెన్షియల్ ఆయిల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు ఒక్కతాటిపైకి వచ్చి నిర్వహిస్తున్న సదస్సులో ఐదు వేలకు పైగా సభ్యులు, ప్రతినిధులు పాల్గొంటారని అంచనా వేశామని తెలిపారు.

గోడ పత్రికలను ప్రదర్శిస్తున్న సంఘం ప్రతినిధులు

పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో భాగంగా మద్రాస్ ఐఐటీలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామని హెచ్‌ఏఎల్ సీఎండీ డాక్టర్ డీకే సునీల్ తెలిపారు. ఆ సంస్థల్లో ఇప్పటి వరకు 40 మంది విద్యార్థులకు అందించిన ఉపకారవేతనాలను కొత్తగా మరో 40 మంది విద్యార్థులకు విస్తరిస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా వివిధ విద్యా సంస్థల్లో ఇదే తరహాలో రూ.500 కోట్ల మేర ఉపకార వేతనాలను హెచ్‌ఏఎల్ అందిస్తోందని చెప్పారు. ఐఐటీ మద్రాసు ప్రతినిధి ఆచార్య మను సంతానానికి హెచ్‌ఏఎల్ జనరల్ మేనేజరు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

తప్పిన పెను ప్రమాదం

హొసపేటె, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సును వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. కారులోని ప్రయాణికులకు ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ ప్రమాదం ఆదివారం హొసపేటె తాలూకా మరియమ్మనహళ్లి సమీప 50వ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హొసపేటెకి చెందిన ఓ కుటుంబ సభ్యులు కొందరు కారులో శివమొగ్గ నుంచి స్వస్థలం వస్తూ మరియమ్మనహళ్లి సమీపంలో ముందు వెళుతున్న బస్సును ఢీకొన్నారు. ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. బస్సు వెనుకభాగం కొంత దెబ్బతింది. సమాచారం అందుకున్న మరియమ్మనహళ్లి పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

ప్రమాదంలో నుజ్జయిన కారు ముందుభాగం

వంచన కేసు రద్దు నిరాకరణ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: మొదటి భర్త నుంచి విడాకులు తీసుకోకుండానే, రెండవ వివాహం చేసుకుని, భర్తతో శోభనానికి అంగీకరించకుండా, నగలు, నగదు తీసుకుని వంచించిన మహిళ (30)పై నమోదైన క్రిమినల్ కేసును రద్దు చేసేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. భైరవేశ్వరనగరకు చెందిన వి సంతోశ్ అనే బాధితుడు వేసుకున్న అర్జీని జస్టిస్ జేఎం ఖాజీ విచారణ చేపట్టారు. సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన అఖిల అనే మహిళ తనకు మొదటి వివాహం అయిన విషయాన్ని దాచి పెట్టి తనతో వివాహానికి అంగీకరించిందని సంతోశ్ తెలిపాడు. ఆమె బావ అరుణ్ వివాహ ఖర్చులు అని చెప్పి తన నుంచి రూ.5 లక్షలు తీసుకోగా, తనకు అవసరం అని రూ.2.60 లక్షలకు రెండు ఐఫోన్లను ఆమె తీసుకుంది. తన సోదరితో కలిసి నగల దుకాణంలో రూ.15 లక్షల ఆభరణాలు కొనుగోలు చేసుకుంది. పరిచయం అయిన నాలుగేళ్లకు 2022 నవంబరు 11న నాగరబావిలోని మద్దూరమ్మ ఆలయంలో వివాహమైంది. ఒక నెల మాత్రమే తనతో కలిసి ఉన్న ఆమె శోభానానికి అంగీకరించకుండా పరారైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో ఆమెకు అప్పటికే వివాహమైందని గుర్తించారు. మోసం చేసిన ఆరోపణలపై అఖిలపై క్రిమినల్ కేసు నమోదైంది. తనపై నమోదైన క్రిమినల్ కేసును రద్దు చేయాలని ఆమె ఉన్నత న్యాయస్థానంలో వేసుకున్న అర్జీని న్యాయమూర్తి తోసిపుచ్చారు.

పెళ్లి కాలేదని హోంగార్డు ఆత్మహత్య

చెళ్లకెర (చిత్రదుర్గం): తనకు పెళ్లి కావడం లేదన్న మనస్తాపంతో తిరుమల(31) అనే హోంగార్డు మొలకాల్మూరు తాలూకా జేబీహళ్లిలో శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. గత నాలుగేళ్లుగా ఎన్ని సంబంధాలు చూసినా కుదరకపోవడంతో తన ఇంట్లో పంకాకు ఉరేసుకొని బలవన్మరణం చెందారు. ఆయన రాంపురం పోలీసు ఠాణాలో హోంగార్డుగా పనిచేసే వారు. రాంపురం పోలీసు ఠాణాలో కేసు నమోదైంది.

తిరుమల

విక్రయాలకు అవకాశం కల్పించరూ..

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: మెట్రో రైల్వే స్టేషన్ ఆవరణాలు, స్టేషన్లకు సమీపంలో నందిని పాలు, పాల ఉత్పత్తులను విక్రయించేందుకు అధికారులు అవకాశం కల్పించాలని బమూల్ అధ్యక్షుడు డీకే సురేశ్ కోరారు. మెట్రో రైలు మండలి విశ్రాంత అధికారి మహేశ్వరరావు, కొత్త ఎండీ రవిశంకర్‌లకు భేటీ అయి ఆయన వినతిపత్రాన్ని అందించారు. మెట్రో స్టేషన్ల పరిధిలో ఖాళీ స్థలాల్లో బూత్‌లు, స్టాళ్లను లీజు పద్ధతిలో ఏర్పాటుకు అవకాశం కల్పించాలని వినతి పత్రాలను ఇచ్చానని సురేశ్ తెలిపారు.

కావడితో భక్తుల రాక

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే: కృత్తికోత్సవంలో భాగంగా ఆదివారం భక్తులు కావళ్లు మోసుకుని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలకు వచ్చారు. మొక్కులు చెల్లించిన భక్తులు ఇక్కడి నుంచి తమిళనాడులోని పళనికి తరలి వెళ్లారు. వీవీపురం, ప్రకాశ్‌నగర తదితర ప్రాంతాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయాల వద్ద పసుపు రంగు దుస్తులు ధరించిన చిన్నా, పెద్ద, కావళ్లతో నైవేద్యాలతో వచ్చి పూజలు చేసుకుని వెళ్లారు.

కావడిలతో వస్తున్న భక్తులు

పావగడ తాగునీటి పథకానికి మోక్షం

నేడు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: తుమకూరు జిల్లా పావగడలో రూ.2,132 కోట్ల వ్యయంతో చేపట్టిన 'పావగడ బహుగ్రామ తాగునీటి పథకాన్ని' ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం ప్రారంభించనున్నారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం పావగడలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. నిత్యం కరవుకాటకాలు, ఫ్లోరైడ్ నీటితో సతమతమవుతున్న పావగడ తాలూకా వాసులకు తుంగభద్ర జలాశయం నుంచి తాగునీటిని అందించడానికి ప్రభుత్వం 2018లో ఈ పథకాన్ని ఆమోదించిన విషయం తెలిసిందే. విజయనగర జిల్లా హొసపేట వద్ద నున్న తుంగభద్ర జలాశయం పోటు జలాల్లో జాక్‌వెల్‌ను నిర్మించి సుమారు 230 కి.మీ. దూరం పైపుల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం తీర్మానించింది. పథకంలో భాగంగా హొసపేట తాలూకాలోని 14, కూడ్లిగి, కొట్టూరులో 215, మొళకాల్మూరు 132, చిత్రదుర్గం 58, చెళ్లకెర 360, పావగడ తాలూకాలోని 359 గ్రామాలు కలిపి మొత్తం 1,138 గ్రామాల్లోని 17.21 లక్షల మంది ప్రజలకు శుద్ధి జలం అందనుంది.

రూ.10 కోట్లకుపైగా విద్యుత్తు బకాయిలు: ఈ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులకు 2023లో కేపీటీసీఎల్ సంస్థ విద్యుత్తు సరఫరా ఇచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ సంస్థకు కరెంటు ఛార్జీలు చెల్లించలేదు. సుమారు రూ.10 కోట్లకు పైనే బకాయిలు రావాల్సి ఉందని బెస్కాం ఈఈ సతీశ్ తెలిపారు. నెలనెలా విద్యుత్తు ఛార్జీలు చెల్లించాలని పలుమార్లు నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. త్వరలో చెల్లిస్తామని హామీ లేఖలు వచ్చాయే తప్ప డబ్బులు అందలేదని ఆయన వివరించారు.

తుంగభద్ర జలాశయంలో నిర్మించిన జాక్‌వెల్

'అది సీఎం శక్తి ప్రదర్శన సమావేశం'

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: మైసూరులో జరిగింది కాంగ్రెస్ సాధన సమావేశం కాదని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శక్తి ప్రదర్శన సమావేశమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర ఆరోపించారు. గంగావతి తాలూకా మరళి సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయనగర జిల్లాల భాజపా నాయకుల సమావేశాన్ని విజయేంద్ర ప్రారంభించి మాట్లాడారు. మైసూరు సమావేశానికి డి.కె.శివకుమార్ మద్దతుదారులు ఎవరూ రాకపోవడంతో ఖాళీ కుర్చీలు కనిపించాయన్నారు. ముఖ్యమంత్రి కుర్చీ కోసం ఇరువురి మధ్య పోటీ నెలకొందని, ఆగస్టులో సీఎం మార్పు లేదా ప్రభుత్వం పడిపోయే అవకాశం ఉందన్నారు. పంచ గ్యారంటీలతో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని ఆ పార్టీ నేతలే అంటున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీని విమర్శించడం తగదన్నారు.

రెడ్డి-శ్రీరాములు పార్టీకి పెద్ద శక్తి: గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి, మాజీ మంత్రి బి.శ్రీరాములు భాజపాకు పెద్ద శక్తి అని, వారిద్దరి మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని విజయేంద్ర తెలిపారు. రాబోయే విధానసభ ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపా 140 సీట్లు గెలిచేందుకు వారిద్దరూ కీలకమవుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీ గోవింద కారజోళ, నాయకులు దొడ్డనగౌడ పాటిల్, శశిల్ నమోషీ, శివరాజ్ పాటిల్, హేమలతా నాయక్, శ్రీరాములు, గాలి జనార్దనరెడ్డి, శివరామగౌడ, కె.విరూపాక్షప్ప, దడేసుగూరు బసవరాజ్, పరణ్ణ మునవళ్లి, యడ్లపల్లి ఆనందరావు, వీరేశ్ సాలోణి పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న విజయేంద్ర తదితరులు

రూ.1,421 కోట్లతో 65 చెరువులకు సాగునీరు

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: హిరియూరు తాలూకాలోని 65 చెరువులకు సుమారు రూ.1,421 కోట్ల అంచనా వ్యయంతో సాగునీరు అందించే పథకాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆమోదించినట్లు జిల్లా బాధ్య మంత్రి డి.సుధాకర్ తెలిపారు. ఆయన ఆదివారం హిరియూరులో విలేకరులతో మాట్లాడారు. ఈ పథకంతో ఐమంగల ప్రాంతంలోని 61, ఆంధ్రా సరిహద్దు ధర్మపురం ప్రాంతంలోని మరో 4 చెరువులకు సాగునీరు అందుతుందన్నారు. దీనివల్ల ఈ ప్రాంతాల్లో దాదాపు 10వేల ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. చిత్రదుర్గ, చెళ్లకెర, హొళల్కెర తాలూకాల్లోని 78 చెరువుల కింద సుమారు 12వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి రూ.2,703 కోట్ల విలువైన పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ పనుల టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. జిల్లాలోని చెరువులకు సాగునీరు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆయన వెంట నగరసభ అధ్యక్షుడు బాలకృష్ణ, ఉపాధ్యక్షురాలు మంజుళ తదితరులున్నారు.

హిరియూరులో మాట్లాడుతున్న మంత్రి సుధాకర్

EENADU Classifieds

JOBS

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 9014651068, 7075633416.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించే [illegible]

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్లారి: 9121167525

బెంగళూరు: 9121167527

(ప్రకటనలపై జీఎస్‌టీ 5% వర్తించబడును)

శివరాజ్‌కుమార్ చిత్రం '45'

ప్రముఖ సినీనటులు శివరాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి.శెట్టి కలిసి నటిస్తున్న '45' చిత్రం టీజర్, పాటలను విడుదల చేశారు. టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విపరీతమైన స్పందన వచ్చిందని దర్శకుడు అర్జున్ జన్యచౌచ్చల తెలిపారు. సూరజ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై చిత్రాన్ని రమేష్‌రెడ్డి నిర్మిస్తున్నారు. శివరాజ్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. చిత్రీకరణ పూర్తి చేసుకుని ఇతర పనుల్లో చిత్రబృందం నిమగ్నమయ్యారు.

45 చిత్రంలో శివరాజ్‌కుమార్ ప్రత్యేక పోస్టర్ విడుదల

'జస్ట్ మ్యారిడ్'కు సెన్సార్ అనుమతి

శైన్ శెట్టి, అంకితఅమర్ కలిసి నటిస్తున్న 'జస్ట్ మ్యారిడ్' చిత్రం చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమవుతోంది. సెన్సార్ బోర్డు నుంచి అన్నిరకాలు అనుమతులు వచ్చినట్లు దర్శకుడు సి.ఆర్.బాబి తెలిపారు. ప్రేమకథతో కూడిన కుటుంబ చిత్రమని అన్నివర్గాలను ఆకట్టుకుందని తెలియజేశారు. ఇటీవల విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వచ్చిందన్నారు. దేవరాజ్, అచ్యుతకుమార్, మాళవిక అవినాశ్, అనూప్‌భండారి, శృతిహరిహరన్, శృతికృష్ణ, సాక్షిఅగర్‌వాల్, శ్రీమాన్, రవిశంకర్ గౌడ, రవిభట్, వాణిహరికృష్ణ, సంగీత, అనిల్ వేదికా తదితరులు నటిస్తున్నారు.

జస్ట్ మ్యారిడ్ చిత్రంలో శైన్‌శెట్టి, అంకిత అమర్

అతివల మెచ్చే 'బెన్ని'

సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలను కళ్లకు కట్టినట్లు నిర్మిస్తున్న మహిళ ప్రధాన చిత్రం 'బెన్ని' చిత్రీకరణ జోరుగా సాగుతోంది. తండ్రి, కుమార్తెల జీవితాల్లో జరిగిన సంఘటనల ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు శ్రీలేశ్ నాయర్ తెలిపారు. ప్రముఖ నటి నందితా శ్వేతా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళం భాషల్లో చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

బెన్ని చిత్రంలో నందితాశ్వేతా

'మోడకవిద వాతావరణ'లో హీరోగా శీలమ్

మోడకవిద వాతావరణ చిత్రం ద్వారా కన్నడ చిత్ర రంగానికి హీరో శీలమ్ పరిచయం కానున్నారు. చిత్రీకరణ పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేస్తున్నట్లు సింపల్ సుని తెలిపారు. నేటి యువతను ఆకట్టుకునే ప్రేమకథ అన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు కుటుంబాలపై ఏవిధంగా ప్రభావం చూపిస్తాయనే అంశాన్ని ప్రేక్షకుల ముందు ఉంచుతున్నట్లు తెలియజేశారు. హీరో స్వాతికా నటిస్తుండగా జోడా స్యాండి, జెడ్ సంగీతం అందిస్తున్నారు.

మోడకవిద వాతావరణ చిత్రంలో శీలమ్, స్వాతికా

- న్యూస్‌టుడే, బెంగళూరు(యశ్వంతపుర)

(c) eenadu

వీధి నాటికలతో సామాజిక చైతన్యం

ప్రజల్లో సామాజిక చైతన్యం కలిగించేందుకు వీధి నాటికలు దోహద పడతాయని ధర్మస్థల గ్రామాభివృద్ధి తాలూకా యోజనాధికారి నింగప్ప అగసర అన్నారు. కారటగి తాలూకాలోని ఆర్.జి.నగర్‌లో నిర్వహించిన జ్ఞాన వికాస కార్యక్రమంలో భాగంగా ఆదివారం వీధి నాటిక ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల సంరక్షణ, ఆరోగ్య జాగ్రత్తలపై నాటిక ద్వారా జాగృతి కల్పిస్తుండటం ఆనందంగా ఉందన్నారు. సమాజ సేవకుడు చెన్నబసప్ప సుంకద, ఆశ్రయ సేవా ట్రస్టు అధ్యక్షుడు శరణప్ప మాట్లాడారు. హల్గాపూర్ కళా బృందం పరిసరాల సంరక్షణ, నీటి పొదుపు, బాల్య వివాహాల నియంత్రణ, ఆరోగ్య సంరక్షణ జాగృతి నాటికలను ప్రదర్శించారు. - న్యూస్‌టుడే, కారటగి

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

సిరివార, (మాన్వి) : తాలూకాలో పంటల సర్వే పనులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత, జీవిత బీమా సదుపాయం కల్పించాలని కర్ణాటక రాష్ట్ర పీఆర్ సంఘం డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్షుడు తిమ్మణ్ణ మరాట ఆధ్వర్యంలో సంఘం సభ్యులు స్థానిక తహసీల్దార్ అశోక్ పవార్‌కు వినతి పత్రం అందించారు. పంటల సర్వే చేపట్టేటపుడు సమస్యలు, ప్రమాదాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. తేళ్లు, పాములు, అడవి పందులు, తేనెటీగలు దాడిచేస్తున్నాయని, కలబురగి జిల్లా సేడం, మళకేడ్, కోడ గ్రామాల్లో చోటు చేసుకున్న సంఘటనలే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు అమరేశ్‌నాయక్, మాళింగరాయ, మిరాజుద్దీన్, రంగస్వామి, నాగరాజ్, మల్లికార్జున, పంపాపతి, ప్రేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సర్వే సిబ్బంది

సమీక్షించరు.. పరిష్కరించరు

• కేడీపీ సమావేశం మరోసారి వాయిదా

బళ్లారి, న్యూస్‌టుడే: కర్ణాటక అభివృద్ధి కార్యక్రమాల (కేడీపీ) తొలి త్రైమాసిక జిల్లా పంచాయతీ ప్రగతి పరిశీలన సమావేశం ఈ నెల 22న జరగాల్సి ఉండగా, జిల్లా ప్రజాప్రతినిధులు అందుబాటులో లేకపోవడంతో మరోసారి వాయిదాపడింది. జిల్లా ప్రగతిపై ప్రజాప్రతినిధుల నిబద్ధత ఏంటో వెల్లడైంది. కేడీపీ సమావేశాలు క్రమం తప్పకుండా జరగకపోవడంతో చాలా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని బళ్లారి జిల్లావాసులు మండిపడుతున్నారు. జూన్‌లో జరగాల్సిన ఈ సమావేశం నెల ఆలస్యం తర్వాత జులై 22న నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. సంబంధిత అధికారులు వివిధ విభాగాలపై నివేదికలు సిద్ధం చేసుకున్నారు. వాటిని ప్రజాప్రతినిధులకూ పంపినా ఉపయోగం లేకపోయింది.

పూర్తయినా ప్రారంభానికి నోచని గడియార గోపురం

బాధ్య మంత్రికి బాధ్యత లేదా: జిల్లా బాధ్య మంత్రి అధ్యక్షతన ప్రతి మూడు నెలలకొకసారి కేడీపీ సమావేశం జరగాలి. ఇందులో శాఖల వారీగా ప్రగతిని సమీక్షిస్తారు. వివిధ పనుల్లో ఆలస్యం, అభివృద్ధికి ఆటంకాలు, లక్ష్య సాధనకు ఇబ్బందులు తదితరాలపై చర్చిస్తారు. అధికారుల పనితీరు బట్టి దిశా నిర్దేశం చేయాలి. అభివృద్ధిలో వెనుకబడటం, పురోగతి సాధించని విభాగాధిపతుల దృష్టికి తేవడం, సమస్యలను పరిష్కరించడం చేయాలి.

ప్రజాప్రతినిధుల సలహాలేవీ: జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, లోక్‌సభ సభ్యులు పల్లారి నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు, అధికారుల పనితీరు, ఇతర సమస్యలను మంత్రి దృష్టికి తేవాలి. సంబంధిత అధికారులను ప్రశ్నించాలి. ప్రజాప్రతినిధులు అందుబాటులో లేకపోతే కేడీపీ నిర్వహించినా ప్రయోజనం లేకపోవడంతో జిల్లా బాధ్య మంత్రి సమావేశం వాయిదా వేశారు.

గతేడాది అక్టోబరులో..: జిల్లా పంచాయతీ త్రైమాసిక కేడీపీ సమావేశం గతేడాది అక్టోబరు 9న జరిగింది. ఆరోజూ మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభించి హడావిడిగా ముగించారు. ఈ సమయానికి జిల్లాలో మూడు సమావేశాలు జరగాల్సి ఉండగా, ఒక్కటీ నిర్వహించక పోవడం శోచనీయం.

జిల్లాలో తిష్ట వేసిన సమస్యలు

జిల్లాలో కరవు నీడలు కమ్ముకుంటున్నాయి. వర్షాధార ప్రాంతాల్లో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. నగరవాసులు రకరకాల సమస్యలతో అవస్థలు పడుతున్నారు. పలు తాలూకాల్లో రహదారులు దుస్థితికి చేరాయి. గని ప్రభావిత ప్రాంతాల్లో ప్రగతికి ఆమడ దూరంలో నిలిచాయి. ఈ ఏడాది అఖిలభారత కన్నడ సాహిత్య సమ్మేళనం 68 ఏళ్ల తర్వాత బళ్లారికి వచ్చింది. ఎందుమెప్ప మార్కెట్, అంతర్జాతీయ విమానాశ్రయం పనులు ప్రారంభమే కాలేదు. సుధాక్రాస్‌లో చేపట్టిన పైవంతెన, గడిగి చెన్నప్ప కూడలి పనులను సాగదీస్తున్నారే ఉన్నారు. వాల్మీకి కూడలి, సంగనకల్లు మార్గంలోని కేఈబీ కూడలి, రహదారి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి.

కొనసాగుతున్న సుధాక్రాస్ రైల్వే పైవంతెన పనులు

'కులవర్గీకరణలో లంబాడీలకు అన్యాయం'

హొసపేటె, న్యూస్‌టుడే: కుల వర్గీకరణలో లంబాడీ సమాజానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని మాజీ మంత్రి పీటీ పరమేశ్వర నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన బంజారా సాహిత్య పరిషత్తు ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో లంబాడీల జనాభా 40 లక్షల వరకు ఉందని, ఇటీవలే వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ చేపట్టిన కులగణనలో లంబాడీల జనాభా కేవలం 9లక్షలేనని నివేదిక ఇచ్చారని ఆగ్రహం చెందారు. దీనివల్ల రిజర్వేషన్లలో లంబాడీలకు న్యాయం జరగదన్నారు. ఈ లోపాన్ని ప్రభుత్వం సరిదిద్దాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 3,900 తండాల్లో మరోసారి కులగణన చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వారికి అందాల్సిన సౌకర్యాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బంజారా సమాజం ప్రతినిధులు శివప్రకాశ్ స్వామి, తిప్పేస్వామి, ప్రముఖులు ఆర్.బి.నాయక్, డాక్టర్ ఉత్తమ్ నాయక్, హేల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నగారా వాయిస్తూ ప్రారంభిస్తున్న మాజీ మంత్రి పరమేశ్వరనాయక్

సింధనూరులో విజయేంద్ర సందడి

సింధనూరు, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర ఆదివారం సింధనూరులో యువతతో కలిసి కొద్దిసేపు సందడి చేశారు. గంగావతిలో ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వ సాధన సమావేశానికి వెళుతున్న ఆయన మార్గంమధ్యలో సింధనూరులోని రెండు కూడళ్లలో కాసేపు ఆగారు. రాయచూరు నుంచి సింధనూరు మీదుగా గంగావతి బయలుదేరిన విజయేంద్ర వాహనాల దండు ఉదయం 10 గంటలకు సింధనూరు చేరింది. పార్టీ స్థానిక నాయకులు కె.కరియప్ప తదితరులు ఐబీ వద్ద ఆయనకు స్వాగతం పలికేందుకు వేచిఉండగా, పట్టణ ప్రారంభంలోనే పోస్టాఫీసు కూడలిలో యువకులు భారీగా గుమిగూడారు. విజయేంద్రతో అక్కడున్న వీరవనిత కిత్తూరు రాణి చెన్నమ్మ శిలా విగ్రహానికి నివాళులర్పించేలా చేయాలని ప్రయత్నించారు. కాస్త ముందుకు వెళ్లిన కార్లు ఆగాయి. అందులోంచి విజయేంద్ర కిందికి దిగి యువత కోరిక మేరకు రాణి చెన్నమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పలువురికి స్వీయచిత్రాలకు అవకాశం ఇచ్చారు. అక్కడి నుంచి ఐబీ వద్దకు రాగానే నాయకులు కరియప్ప, హనుమేశ్, సిద్ధరామేశ్ పూలహారాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాయచూరు ఎమ్మెల్యే డా.శివరాజ్‌పాటిల్, మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్‌గౌడ, బసవరాజ్ దడేసుగూరు, జడ్పీ మాజీ అధ్యక్షురాలు వీరమని ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువతతో కలిసి రాణి చెన్నమ్మ విగ్రహానికి నివాళులర్పించిన విజయేంద్ర

బాధిత మహిళలకు న్యాయం చేయరా..

హొసపేటె, న్యూస్‌టుడే: హొసపేటె పట్టణంలోని ప్రియాంక సహకార సంఘం ద్వారా వంచనకు గురైన మహిళలకు న్యాయం చేయాలి. రూ.కోట్లలో అవినీతి జరిగిన ఈ కేసును సీబీఐ దర్యాప్తునకు అప్పగించాలంటూ సీపీఎం, దళిత హక్కుల సమితి కార్యకర్తలు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే హెచ్.ఆర్.గవియప్ప నివాసం వద్ద ధర్నాకు దిగారు. దీనికి నేతృత్వం వహించిన సీపీఎం నాయకులు యు.బసవరాజ్, భాస్కర్‌రెడ్డి, జంబయ్య నాయక ఈ సందర్భంగా మాట్లాడారు. బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తాం, రెట్టింపు వడ్డీ చెల్లిస్తామంటూ పట్టణంలోని చాలామంది స్త్రీల నుంచి ప్రియాంక సహకార సంఘం అధ్యక్షురాలు ప్రియాంకా జైన్ డిపాజిట్లు తీసుకొని మోసగించారన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు సమర్పించారు. ఆయన ఒక్కమాట మాట్లాడకుండా వెళ్లిపోవడంతో ఆందోళనకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు నియోజకవర్గ ప్రజల కష్టాలతో పనిలేదని దుయ్యబట్టారు.

ఎమ్మెల్యే గవియప్పకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం, డీహెచ్‌ఎస్ నాయకులు

చివరి ఆయకట్టుకు సాగు నీరివ్వాల్సిందే..

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి తాలూకా ఇటిగి ప్రాంతంలోని తుంగభద్ర చివరి ఆయకట్టుకు సాగు నీరందించాలని గ్రామ రైతులు ఎమ్మెల్యే గణేశ్‌ను కోరారు. ఇటిగి గ్రామంలో సీసీ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణానికి ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆయన దృష్టికి సమస్య తెచ్చారు. తుంగభద్ర వితరణ కాలువ పూర్తిగా పూడుకుపోయి చివరి ఆయకట్టుకు నీరందడం లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు అన్ని సరఫరా కాలువల కింద చివరి ఆయకట్టులో ఇదే సమస్య నెలకొందన్నారు. ఎవరైనా కర్షకులు అయిదెకరాల భూమి ఇస్తే ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసి, చెరువు తవ్విస్తామన్నారు. నది నీటిని అందులోకి మళ్లించి కాలువ ద్వారా భూములకు అందిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యను ప్రజలు ఎమ్మెల్యేకు తెలిపారు. బెన్నూరు రాజమ్మ అనే దివ్యాంగురాలు తనకు పింఛను రావడం లేదని చెప్పగా వెంటనే ఎమ్మెల్యే చరవాణి ద్వారా అధికారులతో మాట్లాడి త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేశ్

ప్రజల సంక్షేమమే ధ్యేయం

సిరుగుప్ప, న్యూస్‌టుడే: సముదాయ భవనాలతో ప్రజల సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే బి.ఎం.నాగరాజు తెలిపారు. సిరుగుప్ప తాలూకాలోని నడివి, దేశనూరు గ్రామాల్లో రూ.20 లక్షలు, బి.ఎం.సూగురులో రూ.75 లక్షలతో చేపట్టనున్న వాల్మీకి సముదాయ భవనాలకు ఆయన ఆదివారం భూమి పూజ చేశారు. సూగురు గ్రామంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 2023-24 ఆర్థిక ఏడాదికి పరిశిష్ట వర్గ సంక్షేమ శాఖ (కేఆర్‌ఐడీఎల్) నుంచి మంజూరైన నిధులతో భవనాల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సముదాయ భవనాల నిర్మాణంతో ప్రజలు వివిధ శుభ కార్యక్రమాలు జరుపుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ తాలూకా అధ్యక్షుడు ఎన్.కరిబసప్ప, ప్రభుత్వ గ్యారంటీ యోజన అనుష్ఠాన సమితి అధ్యక్షుడు ఎం.మారుతిరెడ్డి, బగరు హుకుం సభ్యుడు పవన్‌కుమార్ దేశాయి, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు సోమమ్మ, వాల్మీకి విద్యాభివృద్ధి ట్రస్ట్ అధ్యక్షుడు బి.ఎం.సతీష్, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సముదాయ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు తదితరులు

ప్రతిభావంత విద్యార్థులకు చేయూత

బళ్లారి, న్యూస్‌టుడే: వ్యవసాయం కోసం బళ్లారి జిల్లాలో స్థిరపడిన రైతుల పిల్లలను విద్యావంతులను చేయాలనే ఉద్దేశంతో నగరంలో కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో వసతిగృహం మొదలైంది. నేడు శిక్షణ కేంద్రం, పాఠశాల, కళాశాలను ప్రారంభించాలని పలువురు సలహాలు వచ్చారని సంఘం కార్యదర్శి దామోదర్ చౌదరి తెలిపారు. ఆదివారం స్థానిక కోర్టు రోడ్డులోని కమ్మ కల్యాణ మండపంలో జరిగిన 2024-25 వార్షిక సర్వసభ్య సమావేశానికి అధ్యక్షుడు ముండ్లూరు అనూప్‌కుమార్ అధ్యక్షత వహించగా, కార్యదర్శి దామోదర్ చౌదరి మాట్లాడారు. కల్యాణ మండపం, వాణిజ్య దుకాణాల నుంచి వచ్చే ఆదాయంతో ప్రతిభావంత విద్యార్థులకు సీఈటీ, నీట్, సివిల్స్, కేఏఎస్ తదితర పరీక్షల శిక్షణ కోసం ప్రత్యేక హాల్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ భవనానికి ఇప్పటికే నగర పాలికె నుంచి అనుమతి వచ్చిందని, త్వరలో పనులు మొదలవుతాయన్నారు. న్యాయవాది కోటేశ్వర రావు, బళ్లారి రాఘవ స్మారక సమితి గౌరవాధ్యక్షుడు కె.చెన్నప్ప మాట్లాడుతూ కమ్మ సంఘంలో పేదలు, మధ్య తరగతి ప్రజలు ఉన్నారన్నారు. సంఘం తరపున నగర శివార్లలో స్థలం కొని పాఠశాల, కళాశాలను ప్రారంభిస్తే అనుకూలంగా ఉంటుందని సలహా ఇచ్చారు. ఈ నేపథ్యంలో కొంతమంది దాతలు స్థలం కొనుగోలుకు విరాళాలు ప్రకటించారు. అనంతరం సంఘం అభివృద్ధి గురించి ఉపాధ్యక్షుడు ముల్లంగి చంద్రశేఖర్ చౌదరి వివరించారు. చివరగా 25 మంది ప్రతిభావంత విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25 వేల విలువైన చెక్‌లు అందజేశారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు ముండ్లూరు రమేష్‌బాబు, వైకుంఠం ఇందిరా, ప్రభాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దామోదర్, చిత్రంలో అనూప్‌కుమార్, రమేష్‌బాబు, చంద్రశేఖర్, ఇందిరా తదితరులు

చెక్కులు అందుకున్న లబ్ధిదారులు, నిర్వాహకులు

10.ముద్దాపురలో మోకాలి నొప్పులు

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి తాలూకా 10.ముద్దాపుర గ్రామంలో చాలామంది మోకాలి నొప్పితో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో బాధితులు గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హెచ్.ఎం.శరణయ్య స్వామి మాట్లాడుతూ దాదాపు ఏడాది కాలంగా గ్రామంలో 200 మందికిపైగా మోకాలి నొప్పితో బాధపడుతున్నారన్నారు. 40ఏళ్ల వయసు పైబడిన మహిళలు, పురుషులకు ఈ సమస్య ఉందన్నారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుచేసి పరీక్షలు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడు కట్టె విజయ మహంతేశ్ మాట్లాడుతూ గ్రామంలో చాలా మంది బోరు నీరు తాగుతారన్నారు. రెండు శుద్ధి జల కేంద్రాలున్నా ఒక్కటీ పని చేయడం లేదన్నారు. బహుగ్రామ తాగునీటి పథకం కింద తుంగభద్ర నది నుంచి పైపు లైను వేసినా నీటి సరఫరా జరగడం లేదన్నారు. సమావేశంలో గ్రామ ప్రముఖులు కె.కుమారస్వామి, కట్టె ఈశణ్ణ, లింగప్ప, మడివాళప్ప తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె 10వ వార్డు నీలకంఠేశ్వర ఆలయం వెనుక రూ.16.42 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ కోనంకి తిలక్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీశ్ ప్రారంభించారు. ఎమ్మెల్సీ నిధులతో అధునాతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించి అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడారు. ఈ కేంద్రం స్థానిక నీలకంఠేశ్వర దేవస్థానం వెనుకభాగం, మఠ్రిస్వామి మఠం, చుట్టుపక్కల పిల్లలు, గర్భిణులకు బాలింతలకు అనుకూలంగా మారిందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలని కార్యకర్తలకు సూచించారు.

ఎరువుల కృత్రిమ కొరతను సహించం

కురుగోడు (బళ్లారి), న్యూస్‌టుడే: ఖరీఫ్‌కు సరిపడే ఎరువులు నిల్వ ఉన్నాయి. వ్యాపారులు వాటిని గోదాముల్లో నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ నరసప్ప హెచ్చరించారు. ఆయన ఆదివారం కురుగోడులోని ఎరువుల గోదాములను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రస్తుతం తాలూకాలో ఆయకట్టు కింద పంటలు సాగు ప్రారంభమైందన్నారు. ఆగస్టులో రైతులు మిరప సాగు చేయడానికి సిద్ధమవుతున్నారని, సరిపడే ఎరువులు అందుబాటులోకి తెచ్చామన్నారు. కొందరు వ్యాపారులు గోదాముల్లో ఎరువుల నిల్వ లేవని చెబుతున్నట్లు తన దృష్టికి రావడంతో తనిఖీలు చేపట్టామన్నారు. తాలూకా వ్యవసాయ శాఖాధికారి గర్జప్ప మాట్లాడుతూ మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. యూరియా ఎరువులు సన్నవి, పెద్దవనే తేడాలు సృష్టించి ఎక్కువ ధరలకు విక్రయించడం సరికాదని స్పష్టం చేశారు.

గోదాముల్లో ఎరువులను పరిశీలిస్తున్న తహసీల్దార్ నరసప్ప తదితరులు

బాధితుల రక్షణకే పోలీస్‌స్టేషన్లు

కురుగోడు (బళ్లారి), న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాల మాదిరిగానే పోలీస్ స్టేషన్లని, ఫిర్యాదుదారులు ఎవరైనా నిర్భయంగా ఇక్కడికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని ఏఎస్సైలు ఆనంద రెడ్డి, షేక్షావలి తెలిపారు. ఆదివారం ధర్మస్థలం గ్రామీణాభివృద్ధి పథకం జ్ఞాన వికాశ కేంద్రం సభ్యులు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు తెచ్చాయన్నారు. మహిళలకు ఇంట్లో, బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు ఎదురైనా, దౌర్జన్యాలకు గురైనా తక్షణమే పోలీసులను సంప్రదించాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు, బాల కార్మిక పద్ధతులకు స్వస్తి పలకాలన్నారు. అనంతరం సభ్యులు అగ్నిమాపక కార్యాలయాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. పోలీసులు శ్రీనివాస, నవీన, నీలమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన మహిళలతో మాట్లాడుతున్న ఎ.ఎస్.ఐలు

శాస్త్రీయ పద్ధతిలో సాగుతో లాభాలు

కురుగోడు (బళ్లారి), న్యూస్‌టుడే: తుంగభద్ర ఆయకట్టు కింద ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు మోతాదుకు మించి నీరు, రసాయన ఎరువులు వాడొద్దని, ఇలాచేస్తే భవిష్యత్తులో భూసారం కోల్పోయే ప్రమాదం ఉందని ధార్వాడ వ్యవసాయ విశ్వ విద్యాలయం జల, మట్టి నిర్వహణ విభాగం అధ్యాపకుడు బి.వై.బండివడ్డర్ కళవళ సూచించారు. కురుగోడు పట్టణంలోని రైతు సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన అవగాహన సదసుసలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాల మేరకు నీరు, రసాయన ఎరువులు, ఔషధాలు వినియోగిస్తే మంచి లాభాలు వస్తాయన్నారు. అధ్యాపకుడు హిందూధర్ హిరేమఠ్ మాట్లాడుతూ సాగులో సాంకేతికతను వినియోగించుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. హగరి వ్యవసాయ విజ్ఞాన కేంద్రం మట్టి విభాగం అధ్యాపకుడు డా.రవి మాట్లాడుతూ పంటల సాగుకు ముందు మట్టి పరీక్షలు చేయించకుంటే పెట్టుబడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధ్యాపకులు బండివడ్డ కళవళ, హిరేమఠ్, రవి తదితరులు

గుండెపోట్లపై భయాందోళన

చెళ్లకెర, న్యూస్‌టుడే: ఆకస్మిక గుండె పోట్లతో యువత మృతి చెందడం, మధుమేహం పిల్లలకూ వ్యాపిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని స్థానిక ఎమ్మెల్యే టి.రఘుమూర్తి అన్నారు. ఆయన ఆదివారం ఇక్కడి సీజీఎస్ ఆసుపత్రిలో హృదయ సంబంధ, మధుమేహ వ్యాధులపై ఉచిత సలహా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా బెంగళూరులోని జయదేవ ఆసుపత్రి డైరెక్టర్ డా.రవీంద్రనాథ్ అభినందన గ్రంథం స్పందనను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డా.రవీంద్రనాథ్, తుమకూరు డయాబిటీస్ సలహా కేంద్రం నిర్వాహకులు డా.ముద్దురంగప్ప, డా.కాంతరాజు, డా.మీరాసాబిహళ్లి శివణ్ణ, డా.శివలింగప్ప, శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘుమూర్తి

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

20-07-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1626.03	1621.32
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	38.079	1,07,198
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	39,213	1,267
నీటి నిల్వ (టి.ఎం.సి)	79.900	65.110

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

సమస్యలపై విజ్ఞప్తుల స్వీకరణ

బళ్లారి, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, గ్రామీణ శాసనసభ్యులు బి.నాగేంద్ర అధ్యక్షతన జరిగిన జనవాణిలో నగర పాలికెతో పాటు గ్రామీణ నియోజకవర్గ ప్రజల సమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అక్కడి నుంచే సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు వారి గ్రామాలకు చెందిన సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో తుంగభద్ర కాలువల చివరి భూములకు నీరు అందడం లేదన్నారు. రహదారులు, పాఠశాలల్లో తరగతి గదుల దుస్థితి, విద్యుత్తు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఆసుపత్రిలో వైద్యులు కొరత, శస్త్రచికిత్సకు ఆర్థిక సమస్యలు తదితరాలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. బళ్లారి నగర పాలికె వ్యాప్తిలోకి వచ్చే 11 వార్డుల నుంచి హాజరైన ప్రజలు తమ సమస్యలు వివరించి వార్డులను సందర్శించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ ముల్లంగి నందీశ్, ఉపమేయర్ డి.సుకుం, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సమస్యలను ఎమ్మెల్యే, మేయర్‌కు వివరిస్తున్న స్థానికులు

పోలీసుల గస్తీకి ద్విచక్ర వాహనాల వితరణ

గ్రామీణ ప్రాంతాల్లో రాత్రివేళల్లో గస్తీ పెంచడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌ఎండీసీ సంస్థ సీఎస్‌ఆర్ నిధుల నుంచి రూ.16 లక్షలతో పోలీసులకు ఎనిమిది ద్విచక్ర వాహనాలను కొని వితరణ చేసింది. సండూరు తాలూకా చోరునూరు, తోరణగల్లు పోలీస్ స్టేషన్ వ్యాప్తిలో రాత్రింబవళ్లు పోలీసుల గస్తీ పెంచడానికి ఎనిమిది బైక్‌లు ఇవ్వడం సంతోషంగా ఉందని ఎస్పీ డా.శోభారాణి అన్నారు. అనంతరం ఆమె పచ్చజెండా ఊపి వాటిని ప్రారంభించారు. ఏఎస్పీలు రవికుమార్, నవీన్‌కుమార్, డీఎస్పీ ప్రసాద్ గోఖలే తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, సండూరు (బళ్లారి)

పవర్ ప్లాంట్ పనుల అడ్డగింత

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు తాలూకా జవళగేరి సమీప సుల్తానపూరులో ఆదివారం సాయంత్రం ఉద్రిక్తత తలెత్తింది. బెళగానూరు పోలీసులు, రైతుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. రైతు సంఘం నాయకులు రంగంలోకి దిగి కర్షకుల వాదనకు మద్దతుగా నిలబడటంతో ఉద్రిక్తత తీవ్ర స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో బసవరాజ గోడిహాళ తదితర పదిమంది రైతు సంఘం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రైతుల వాదన ప్రకారం.. సుల్తానపూరు గ్రామంలో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన హల్లూరు పవర్స్ సంస్థ దాదాపు 300 ఎకరాల్లో సౌర విద్యుత్తు ప్లాంటును నిర్మిస్తోంది. దీనికి ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చుకొని, కొందరు రైతుల పొలాల్లో 26 బృహత్ విద్యుత్తు స్తంభాలను నిర్మించింది. ఆదిలో కొద్ది మొత్తాన్ని ఆయా పొలాల కర్షకులకు పరిహారాన్ని ముట్టజెప్పింది. ఇతర పొలాలపై విద్యుత్తు తంతులను లాగడానికి ఒప్పుకోమంటూ ఆయా పొలాల అన్నదాతలు మొండికేశారు. ఆదివారం తంతులు లాగడానికి వచ్చిన సిబ్బందిని తరిమికొట్టడంతో బెళగానూరు పోలీసులు రంగంలోకి దిగారు. భవిష్యత్తులో ఇక్కడ నుంచే బైపాస్ నిర్మాణం జరగనుంది. సింధనూరు-జవళగేరి మధ్య రైలు మార్గం కూడా వేస్తున్నారు. మా భూములకు ఎక్కువ డిమాండ్ వస్తుంది. మీరు తంతులు లాగితే ఇతరత్రా పనులు ఎలా చేస్తారని? తమ గతేమవుతుందని అన్నదాతలు ఎదురుతిరిగారు.

పొలంలో తంతులు వేయకుండా అడ్డుకుంటున్న రైతులు

(c) eenadu

జంగిల్ లాడ్జిలు.. పర్యాటకుల అనువైన ప్రదేశాలు

కబిని వెనక తట్టు ప్రదేశంలో పడవలో సంచరిస్తూ ఏనుగులను తిలకిస్తున్న పర్యాటకులు

వెదురుతో తయారు చేసిన కుటీరాలు

అరేబియా దరి.. ప్రకృతి అందాల విడిది

● ఆస్వాదనకు పర్యాటకుల ఆసక్తి
● ప్రత్యేక హోంస్టేలు సిద్ధం

అరేబియా సముద్రతీరంలో ఉన్న దీవుల్లో వేడుకలు నిర్వహించుకునేందుకు పర్యాటకుల ఆసక్తి చూపుతున్నారు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: వాతావరణంలో మార్పు రావడం అద్భుతమైన సౌందర్యంతో కూడిన ఆహ్లాదకరమైన ప్రకృతి ఆస్వాదించేందుకు కుటుంబ సభ్యులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. వర్షం కురుస్తుండగా సముద్రం అలలను తిలకించేందుకు పోటీపడుతున్నారు. ఆషాఢ మాసం, శ్రావణ మాసం ప్రారంభ దినాల ఆలయాలను సందర్శించుకుని కొందరు ప్రజలు సముద్ర స్నానం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో అధికారులు సముద్రతీరంలో సంచరించేందుకు స్నానం చేసేందుకు అనుమతులు ఇస్తున్నారు. ఓ వైపు మొక్కులు తీర్చుకోవడంతో పాటు ప్రకృతి ఒడిలో సేద్యం తీర్చుకునేందుకు పర్యాటకులు జంగల్ లాడ్జిలు, హోంస్టేలు, ప్రసిద్ధమైన హోటళ్లలో గదుల బుకింగ్‌కు పోటీ పడుతున్నారు. ఇప్పటికే 60 శాతం గదులు ముందస్తు బుకింగ్ అయినట్లు నిర్వాహకులు తెలిపారు. వర్షాకాలంలో ప్రకృతి మధ్య గడపాలనే ఉద్దేశంతో అక్కడికి వెళ్లేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు.

మరోవైపు పర్యాటక శాఖ సందర్శకులకు జంగిల్ లాడ్జిల్లో గదులు రిజర్వు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. వచ్చే స్వదేశీ, విదేశీ పర్యాటకులు కొద్ది రోజులు లాడ్జిల్లో బస చేసి ప్రకృతి అందాలను తనివి తీరా ఆస్వాదిస్తారు. కబిని, బండీపుర, నాగరహొళె తదితర ప్రాంతాల్లో ఉన్న జంగిల్ లాడ్జీలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కొందరు ముందుస్తుగా గదులను రిజర్వు చేసుకుంటున్నారని అధికారులు తెలియజేశారు.

ఉడుపిలో సిద్ధంగా ఉన్న హోంస్టే భవనం

ప్రైవేట్ హోంస్టేలు, హోటళ్ల నిర్వాహకులు పర్యాటకులను ఆకట్టుకునేందుకు కొన్ని రాయితీలు ప్రకటించారు. జంగిల్ లాడ్జీల భద్రపై అధికారులు ఎక్కువగా దృష్టి సారించారు. ప్రత్యేక ప్యాకేజీలు, రాయితీలను ప్రకటించారు. జంగిల్ లాడ్జిల వద్ద పర్యాటకుల సురక్షిత చర్యలతో అన్ని రకాల ఆహార పదార్థాలు దొరికేలా చర్యలు చేపట్టారు. కబిని ఆనకట్ట వెనకతట్టు ప్రదేశంలో సంచరించే ఏనుగులను తిలకించేందుకు ఆధునిక పడవలను ఏర్పాటు చేశారు. నాగరహొళెలో పులుల సంరక్షణ కేంద్రం సందర్శించేందుకు కొత్త వాహనాలను కొనుగోలు చేశారు. అరేబియా సముద్రం తీర ప్రాంతాల్లో ఉన్న బీచ్‌లలో సంచరించేందుకు అనుమతులు ఇస్తున్నారు. ఎక్కువ మంది పర్యాటకులు బీచ్‌లను తిలకించేందుకు ఆసక్తి చూపుతున్నందున చిక్కమగళూరు, ఉడుపి, మంగళూరు. కార్వార, బనవాసి, హోరనాడు తదితర ప్రాంతాల్లో ఉన్న బీచ్‌లలో మౌలిక సౌకర్యాలతో పాటు సురక్షిత చర్యలు చేపట్టారు.

కండక్టర్ డ్రైవింగ్ : యువతి దుర్మరణం

సుమ

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే: పీణ్యా బస్టాండ్‌లో జరిగిన ప్రమాదంలో బ్యాంక్ ఉద్యోగిని సుమ (25) మృతి చెందగా మరో ముగ్గురు ప్రయాణికులు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఎలక్ట్రికల్ బస్సును కండక్టర్ నడపడానికి ప్రయత్నించడంతో బస్సు ఫ్లాట్‌ఫామ్ దాటి హోటల్లోకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన సుమ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈమె హెబ్బాళలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో పనిచేస్తోంది, మండ్య తలకెరె గ్రామానికి చెందిన యువతిగా గుర్తించారు. ప్రస్తుతం సుంకదకట్టెలో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నామని, ఇంతలో దుర్ఘటన చోటుచేసుకుందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వంచన కేసు రద్దుకు నిరాకరణ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: మొదటి భర్త నుంచి విడాకులు తీసుకోకుండానే, రెండవ వివాహం చేసుకుని, భర్తతో శోభనానికి అంగీకరించకుండా, నగలు, నగదు తీసుకుని పరారైన మహిళ (30)పై నమోదైన క్రిమినల్ కేసును రద్దు చేసేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. భైరవేశ్వరనగర్‌కు చెందిన వి సంతోష్ అనే బాధితుడు వేసుకున్న అర్జీని జస్టిస్ జేఎం ఖాజీ విచారణ చేపట్టారు. సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన అఖిల అనే మహిళ తనకు మొదటి వివాహం అయిన విషయాన్ని దాచి పెట్టి తనతో వివాహానికి అంగీకరించిందని సంతోష్ తెలిపారు. ఆమె బావ అరుణ్, విహార్ ఖర్చుల కోసం రూ.5 లక్షలు తీసుకోగా, తనకు అవసరం అని రూ.2.60 లక్షలు రెండు విడతలు ఆమె తీసుకుంది. తన సోదరితో కలిసి నగల దుకాణంలో రూ.15 లక్షల విలువైన ఆభరణాలు కొనుగోలు చేసుకుంది. పరిచయం అయిన నాలుగెళ్లకు 2022 నవంబరు 11న నాగరబావిలోని మద్దూరమ్మ ఆలయంలో వివాహమైంది. ఒక నెల మాత్రమే తనతో కలిసి ఉన్న ఆమె శోభానానికి అంగీకరించకుండా పరారైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో ఆమెకు అప్పటికే వివాహమైందని గుర్తించారు. మోసం చేసిన ఆరోపణలపై అఖిలపై క్రిమినల్ కేసు నమోదైంది. తనపై నమోదైన క్రిమినల్ కేసును రద్దు చేయాలని ఆమె ఉన్నత న్యాయస్థానంలో వేసుకున్న అర్జీని న్యాయమూర్తి తోసిపుచ్చారు.

ప్రతిభ ఎవరి సొత్తు కాదు

మైసూరు, న్యూస్‌టుడే: ప్రతిభ ఎవరో ఒకరి సొత్తు కాదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. అవకాశాలు లభిస్తే ప్రతి ఒక్కరి ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. బాలల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శ్రమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు కులం, మతం పేరిట సంఘాలను ఏర్పాటు చేసుకుని సమావేశాలను నిర్వహించడం సరికాదని హితవు పలికారు. పాత పింఛను విధానాన్ని అమలు చేసేందుకు సమితి ఇచ్చే నివేదికకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం శనివారం రాత్రి ఇక్కడ నిర్వహించిన సమావేశంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగులు, చట్టసభ ప్రతినిధులు కాలేరని పేర్కొన్నారు. అవకాశాలు లభిస్తేనే ఎవరైనా ముందంజలోకి వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రజా సేవ చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లే బాధ్యత ఉద్యోగులదే అని చెప్పారు. ఆరోగ్య సంజీవని పథకాన్ని కూడా జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని సత్కరిస్తున్న ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

‘చక్కని వాతావరణం ప్రసాదించు సామీ’

ఉడుపి, న్యూస్‌టుడే: గత రెండు నెలలుగా కర్ణాటక తీర ప్రాంత జిల్లాల్లో వాతావరణం పాడైందని భావిస్తూ మత్స్యకారులు ప్రత్యేక పూజలు, జాతర నిర్వహించారు. ‘దైవరాజ బొబ్బర్య’తో కలిసి మాకు బుట్టల నిండా చేపలు ఇవ్వు, సాగర అలలను చీల్చి ముందుకు వెళ్లే శక్తి ఇవ్వు స్వామీ అంటూ పూజలు చేశారు. చిన్న దోణి, పడవలను సముద్రంలోకి అనుమతించకపోవడంతో తమకు ఉపాధి పోయిందని మత్స్యకారులు ఆక్రోశించారు. ఆగస్టు 10 వరకు నాటు పడవల్లో వేటకు వెళదామంటే తుపాను, సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో చిన్న చెరువులు, కుంటల్లోనే చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు.

జాతరలో మత్స్యకారులు

నిందితుల కోసం గాలింపు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: తనను వివాహం చేసుకోవాలని ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన గృహిణి (28)ని వేధిస్తూ వచ్చిన సెల్వ కార్తిక్ (26) అనే యువకుడిపై హత్యాయత్నం జరిగింది. తనను వివాహం చేసుకోవాలని వేధిస్తున్నాడని ఆ గృహిణి తన భర్త, తండ్రి, ఇతర బంధువులకు తెలిపింది. అతన్ని బెంగళూరుకు పిలిపించమని కుటుంబసభ్యుల సలహాతో తమిళనాడు తిరప్పత్తూరు నుంచి బెంగళూరుకు రమ్మని కబురు పంపింది. ఆమె మాటల్ని విశ్వసించి నగరానికి వచ్చిన కార్తిక్‌ను హెచ్‌ఏఎల్ వద్ద బైకుపై వచ్చిన వ్యక్తులు పలకరించారు. మిమ్మల్ని తీసుకురమ్మని గృహిణి పిలిచిందని ద్విచక్ర వాహనం మధ్యలో కూర్చోబెట్టుకున్నారు. దారి మధ్యలో అతని గొంతు కోసి, రహదారి పక్కన పడేసి వెళ్లారు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని పోలీసుల సాయంతో ఆసుపత్రిలో చేర్పించారు. అతని ఫిర్యాదుతో పరారీలో ఉన్న నిందితుల కోసం హెచ్‌ఏఎల్ ఠాణా పోలీసులు గాలింపు చేపట్టారు.

పోలీసు ఠాణాను శుభ్రం చేయండి

మంగళూరు, న్యూస్‌టుడే: మద్యం తాగి బైకు నడుపుతూ వచ్చిన సమయంలో తనను అడ్డుకున్న పోలీసులతో అనుచితంగా వ్యవహరించిన అకింత్ పలాయ అనే యువకుడికి న్యాయస్థానం శిక్ష, రూ.10 వేల జరిమానాను విధించింది. ఈ నెల 28 వరకు నిత్యం ఉదయం 10 నుంచి 12 గంటల మధ్యలో సుళ్య ఠాణాను శుభ్రం చేయాలని న్యాయమూర్తి మోహన్ బాబు నిందితుడ్ని ఆదేశించారు. నిందితుడు ఈ ఏడాది ఏప్రిల్ 22 రాత్రి మద్యం తాగి వస్తూ నాకాబందీ నిర్వహించిన పోలీసులతో అనుచితంగా వ్యవహరించాడు. పోలీసుల నుంచి తప్పించుకుని పరారైన నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. విచారణ పూర్తి చేసి న్యాయస్థానం ముందు అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. నిందితుడ్ని న్యాయస్థానం ముందు శనివారం హాజరుపరిచారు. నేరం అంగీకరించడంతో ఠాణాను శుభ్రం చేసే శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

నిందితుని అరెస్టు

నిందితుడు, జప్తు చేసుకున్న ఆభరణాలు

కలబురగి, న్యూస్‌టుడే: దొంగతనాల కోసం హైదరాబాద్ నుంచి కలబురగికి వచ్చి వెళుతున్న సయ్యద్ హమీద్ (47) అనే చోరుడ్ని విశ్వవిద్యాలయం ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.11.07 లక్షల విలువైన 123 గ్రాముల ఆభరణాలను జప్తు చేసుకున్నామని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ ఎస్‌డీ శరణప్ప వెల్లడించారు. విశ్వవిద్యాలయం ఠాణా పరిధిలో ఏడు ఇళ్లలో ఇటీవల దొంగతనాలకు పాల్పడ్డాడని ప్రాథమిక విచారణలో గుర్తించామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరా ఫుటేజ్‌ల ఆధారంగా దర్యాప్తు పూర్తి చేసి నిందితుడ్ని పట్టుకున్నామని వివరించారు.

నదీ తీరంలో గ్రామ అధికారి మృతదేహం

చామరాజనగర: కొళ్లేగాల తాలూకా దాసనపుర వంతెన సమీపంలో కావేరి నదీ తీరంలో పడి ఉన్న నిరంజనమూర్తి (31) అనే వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనపరచుకున్నారు. జికనకహళ్లికి చెందిన బాధితుడు మండ్య జిల్లా బెళకవాడి హోబళి బీజీపురలో గ్రామ పాలన అధికారిగా సేవలు అందిస్తున్నారు. గత గురువారం మధ్యాహ్నం బైకులో వస్తూ వంతెనపై నుంచి నదిలోకి పడిపోయారని అనుమానిస్తున్నారు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని గుర్తించి, మరణోత్తర పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని కొళ్లేగాల గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	60
క్యారెట్-	85
బీరకాయలు-	45
క్యాబేజి-	30
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	35
సొరకాయ-	45
దొండకాయలు-	45
పొట్లకాయ-	35
పచ్చి మిరప-	120
కాకర కాయలు-	65
టమాటా(నాటు)-	25
టమాటా(సాధారణ)-	20
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	32
ఉల్లి(మేలురకం)-	30
ఉల్లి(సాధారణ)-	25
వెల్లుల్లి-	170
సాంబారు ఉల్లి-	180
బీట్‌రూట్-	45
వంకాయలు-	55
బెండకాయలు-	45
ముల్లంగి-	45
నిమ్మకాయ-	270

పండ్లు,ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	450
సిమ్లా ఆపిల్-	275
గ్రీన్ ఆపిల్-	405
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	45
బొప్పాయి-	35
ఆరంజి-	215
బత్తాయి-	85

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

నగరంలో ఏఐఏఎంఏ ఎక్స్‌పో-2025

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: భారత్‌లో ప్రపంచ మార్కెట్‌కు అగర్‌బత్తీలను అందించే నాయకునిగా నిలబెట్టే దిశలో ప్యాలెస్ మైదానంలో సదస్సును నిర్వహిస్తున్నామని అఖిల భారత అగర్‌బత్తీ తయారీదారుల సంఘం ప్రకటించింది. ‘పారంపరికంగా ఆధునికం’ అనే ఇతివృత్తంతో నవంబరు 6-8 వరకు నిర్వహించే సదస్సులో జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొంటారని ఏఐఏఎంఏ అధ్యక్షుడు అంబికా రామాంజనేయులు తెలిపారు. సంఘం మాజీ అధ్యక్షుడు అర్జున్ రంగ, ఇతర సభ్యులు టీవీ కృష్ణ, శరత్ బాబు, సప్తగిరి తదితరులతో కలిసి సదస్సుకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేసి మాట్లాడారు. అగర్‌బత్తీ, అనుబంధ ఉత్పత్తులను తయారు చేస్తున్న సంస్థలు, ఎసెన్షియల్ ఆయిల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు ఒక్కతాటిపైకి వచ్చి నిర్వహిస్తున్న సదస్సులో ఐదు వేలకు పైగా సభ్యులు, ప్రతినిధులు పాల్గొంటారని అంచనా వేశామని తెలిపారు.

గోడ పత్రికలను ప్రదర్శిస్తున్న సంఘం ప్రతినిధులు

పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో భాగంగా మద్రాస్ ఐఐటీలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామని హెచ్‌ఏఎల్ సీఎండీ డాక్టర్ డీకే సునీల్ తెలిపారు. ఆ సంస్థల్లో ఇప్పటి వరకు 40 మంది విద్యార్థులకు అందించిన ఉపకారవేతనాలను కొత్తగా మరో 40 మంది విద్యార్థులకు విస్తరిస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా వివిధ విద్యా సంస్థల్లో ఇదే తరహాలో రూ.500 కోట్ల మేర ఉపకార వేతనాలను హెచ్‌ఏఎల్ అందిస్తోందని చెప్పారు. ఐఐటీ మద్రాసు ప్రతినిధి ఆచార్య మను సంతానానికి హెచ్‌ఏఎల్ జనరల్ మేనేజరు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

విక్రయాలకు అవకాశం కల్పించరూ..

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: మెట్రో రైల్వే స్టేషన్ ఆవరణాలు, స్టేషన్లకు సమీపంలో నందిని పాలు, పాల ఉత్పత్తులను విక్రయించేందుకు అధికారులు అవకాశం కల్పించాలని బమూల్ అధ్యక్షుడు డీకే సురేశ్ కోరారు. మెట్రో రైలు మండలి విశ్రాంత అధికారి మహేశ్వరరావు, కొత్త ఎండీ రవిశంకర్‌లకు భేటీ అయి ఆయన వినతిపత్రాన్ని అందించారు. మెట్రో స్టేషన్ల పరిధిలో ఖాళీ స్థలాల్లో బూత్‌లు, స్టాళ్లను లీజు పద్ధతిలో ఏర్పాటుకు అవకాశం కల్పించాలని వినతి పత్రాలను ఇచ్చానని సురేశ్ తెలిపారు.

కావడితో భక్తుల రాక

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే: కృత్తికోత్సవంలో భాగంగా ఆదివారం భక్తులు కావళ్లు మోసుకుని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలకు వచ్చారు. మొక్కులు చెల్లించిన భక్తులు ఇక్కడి నుంచి తమిళనాడులోని పళనికి తరలి వెళ్లారు. వీవీపురం, ప్రకాశ్‌నగర తదితర ప్రాంతాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయాల వద్ద పసుపు రంగు దుస్తులు ధరించిన చిన్నా, పెద్ద, కావళ్లతో నైవేద్యాలతో వచ్చి పూజలు చేసుకుని వెళ్లారు.

కావడిలతో వస్తున్న భక్తులు

పావగడ తాగునీటి పథకానికి మోక్షం
నేడు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: తుమకూరు జిల్లా పావగడలో రూ.2,132 కోట్ల వ్యయంతో చేపట్టిన ‘పావగడ బహుగ్రామ తాగునీటి పథకాన్ని’ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం ప్రారంభించనున్నారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం పావగడలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. నిత్యం కరవుకాటకాలు, ఫ్లోరైడ్ నీటితో సతమతమవుతున్న పావగడ తాలూకా వాసులకు తుంగభద్ర జలాశయం నుంచి తాగునీటిని అందించడానికి ప్రభుత్వం 2018లో ఈ పథకాన్ని ఆమోదించిన విషయం తెలిసిందే. విజయనగర జిల్లా హొసపేట వద్ద నున్న తుంగభద్ర జలాశయం పోటు జలాల్లో జాక్‌వెల్‌ను నిర్మించి సుమారు 230 కి.మీ. దూరం పైపుల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం తీర్మానించింది. పథకంలో భాగంగా హొసపేట తాలూకాలోని 14, కూడ్లిగి, కొట్టూరులో 215, మొళకాల్మూరు 132, చిత్రదుర్గం 58, చెళ్లకెర 360, పావగడ తాలూకాలోని 359 గ్రామాలు కలిపి మొత్తం 1,138 గ్రామాల్లోని 17.21 లక్షల మంది ప్రజలకు శుద్ధి జలం అందనుంది.

తుంగభద్ర జలాశయంలో నిర్మించిన జాక్‌వెల్

రూ.10 కోట్లకుపైగా విద్యుత్తు బకాయిలు: ఈ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులకు 2023లో కేపీటీసీఎల్ సంస్థ విద్యుత్తు సరఫరా ఇచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ సంస్థకు కరెంటు ఛార్జీలు చెల్లించలేదు. సుమారు రూ.10 కోట్లకు పైనే బకాయిలు రావాల్సి ఉందని బెస్కాం ఈఈ సతీశ్ తెలిపారు. నెలనెలా విద్యుత్తు ఛార్జీలు చెల్లించాలని పలుమార్లు నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. త్వరలో చెల్లిస్తామని హామీ లేఖలు వచ్చాయే తప్ప డబ్బులు అందలేదని ఆయన వివరించారు.

‘అది సీఎం శక్తి ప్రదర్శన సమావేశం’

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: మైసూరులో జరిగింది కాంగ్రెస్ సాధన సమావేశం కాదని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శక్తి ప్రదర్శన సమావేశమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర ఆరోపించారు. గంగావతి తాలూకా మరళి సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయనగర జిల్లాల భాజపా నాయకుల సమావేశాన్ని విజయేంద్ర ప్రారంభించి మాట్లాడారు. మైసూరు సమావేశానికి డి.కె.శివకుమార్ మద్దతుదారులు ఎవరూ రాకపోవడంతో ఖాళీ కుర్చీలు కనిపించాయన్నారు. ముఖ్యమంత్రి కుర్చీ కోసం ఇరువురి మధ్య పోటీ నెలకొందని, ఆగస్టులో సీఎం మార్పు లేదా ప్రభుత్వం పడిపోయే అవకాశం ఉందన్నారు. పంచ గ్యారంటీలతో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని ఆ పార్టీ నేతలే అంటున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీని విమర్శించడం తగదన్నారు.

రెడ్డి-శ్రీరాములు పార్టీకి పెద్ద శక్తి: గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి, మాజీ మంత్రి బి.శ్రీరాములు భాజపాకు పెద్ద శక్తి అని, వారిద్దరి మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని విజయేంద్ర తెలిపారు. రాబోయే విధానసభ ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపా 140 సీట్లు గెలిచేందుకు వారిద్దరూ కీలకమవుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీ గోవింద కారజోళ, నాయకులు దొడ్డనగౌడ పాటిల్, శశిల్ నమోషీ, శివరాజ్ పాటిల్, హేమలతా నాయక్, శ్రీరాములు, గాలి జనార్దనరెడ్డి, శివరామగౌడ, కె.విరూపాక్షప్ప, దడేసుగూరు బసవరాజ్, పరణ్ణ మునవళ్లి, యడ్లపల్లి ఆనందరావు, వీరేశ్ సాలోణి పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న విజయేంద్ర తదితరులు

రూ.1,421 కోట్లతో 65 చెరువులకు సాగునీరు

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: హిరియూరు తాలూకాలోని 65 చెరువులకు సుమారు రూ.1,421 కోట్ల అంచనా వ్యయంతో సాగునీరు అందించే పథకాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆమోదించినట్లు జిల్లా బాధ్య మంత్రి డి.సుధాకర్ తెలిపారు. ఆయన ఆదివారం హిరియూరులో విలేకరులతో మాట్లాడారు. ఈ పథకంతో ఐమంగల ప్రాంతంలోని 61, ఆంధ్రా సరిహద్దు ధర్మపురం ప్రాంతంలోని మరో 4 చెరువులకు సాగునీరు అందుతుందన్నారు. దీనివల్ల ఈ ప్రాంతాల్లో దాదాపు 10వేల ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. చిత్రదుర్గ, చెళ్లకెర, హొళల్కెర తాలూకాల్లోని 78 చెరువుల కింద సుమారు 12వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి రూ.2,703 కోట్ల విలువైన పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ పనుల టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. జిల్లాలోని చెరువులకు సాగునీరు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆయన వెంట నగరసభ అధ్యక్షుడు బాలకృష్ణ, ఉపాధ్యక్షురాలు మంజుళ తదితరులున్నారు.

హిరియూరులో మాట్లాడుతున్న మంత్రి సుధాకర్

శివరాజ్‌కుమార్ చిత్రం ‘45’

ప్రముఖ సినీనటులు శివరాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి.శెట్టి కలిసి నటిస్తున్న ‘45’ చిత్రం టీజర్, పాటలను విడుదల చేశారు. టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విపరీతమైన స్పందన వచ్చిందని దర్శకుడు అర్జున్ జన్యచొప్పల తెలిపారు. సూరజ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై చిత్రాన్ని రమేష్‌రెడ్డి నిర్మిస్తున్నారు. శివరాజ్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. చిత్రీకరణ పూర్తి చేసుకుని ఇతర పనుల్లో చిత్రబృందం నిమగ్నమయ్యారు.

45 చిత్రంలో శివరాజ్‌కుమార్ ప్రత్యేక పోస్టర్ విడుదల

‘జస్ట్ మ్యారిడ్’కు సెన్సార్ అనుమతి

శైన్ శెట్టి, అంకితఅమర్ కలిసి నటిస్తున్న ‘జస్ట్ మ్యారిడ్’ చిత్రం చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమవుతోంది. సెన్సార్ బోర్డు నుంచి అన్నిరకాలు అనుమతులు వచ్చినట్లు దర్శకుడు సి.ఆర్.బాబి తెలిపారు. ప్రేమకథతో కూడిన కుటుంబ చిత్రమని అన్నివర్గాలను ఆకట్టుకుందని తెలియజేశారు. ఇటీవల విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వచ్చిందన్నారు. దేవరాజ్, అచ్యుతకుమార్, మాళవిక అవినాశ్, అనూప్‌భండారి, శృతిహరిహరన్, శృతికృష్ణ, సాక్షిఅగర్‌వాల్, శ్రీమాన్, రవిశంకర్ గౌడ, రవిభట్, వాణిహరికృష్ణ, సంగీత, అనిల్ వేదికా తదితరులు నటిస్తున్నారు.

జస్ట్ మ్యారిడ్ చిత్రంలో శైన్‌శెట్టి, అంకిత అమర్

అతివల మెచ్చే ‘బెన్ని’

సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలను కళ్లకు కట్టినట్లు నిర్మిస్తున్న మహిళ ప్రధాన చిత్రం ‘బెన్ని’ చిత్రీకరణ జోరుగా సాగుతోంది. తండ్రి, కుమార్తెల జీవితాల్లో జరిగిన సంఘటనల ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు శ్రీలేశ్ నాయర్ తెలిపారు. ప్రముఖ నటి నందితా శ్వేతా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళం భాషల్లో చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

బెన్ని చిత్రంలో నందితాశ్వేతా

‘మోడకవిద వాతావరణ’లో హీరోగా శీలమ్

మోడకవిద వాతావరణ చిత్రం ద్వారా కన్నడ చిత్ర రంగానికి హీరో శీలమ్ పరిచయం కానున్నారు. చిత్రీకరణ పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేస్తున్నట్లు సింపల్ సుని తెలిపారు. నేటి యువతను ఆకట్టుకునే ప్రేమకథ అన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు కుటుంబాలపై ఏవిధంగా ప్రభావం చూపిస్తాయనే అంశాన్ని ప్రేక్షకుల ముందు ఉంచుతున్నట్లు తెలియజేశారు. హీరో స్వాతికా నటిస్తుండగా జోడా స్వాండి, జేడ్ సంగీతం అందిస్తున్నారు.

మోడకవిద వాతావరణ చిత్రంలో శీలమ్, స్వాతికా

- న్యూస్‌టుడే, బెంగళూరు(యశ్వంతపుర)

EENADU Classifieds
JOBS
Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరి చేయడానికి బైక్ కలిగిన డెలివరి బాయ్స్ కావలెను. Ph: 7337544439, 9014651068, 7075633416.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలు
ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి.
బళ్లారి : 9121167525
బెంగళూరు : 9121167527

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

పోటీలను ప్రారంభిస్తున్న నాగణ్ణ, ప్రతినిధులు

అంతర గ్రామ కబడ్డీ పోటీలు ప్రారంభం

తుమకూరు, న్యూస్‌టుడే : తుమకూరు నగరంలోని మహాత్మాగాంధీ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన అంతర గ్రామ కబడ్డీ పోటీలు ఆదివారం నగరంలోని మహాత్మాగాంధీ ఇండోర్ స్టేడియంలో అట్టహాసంగా కొనసాగాయి. 10 నుంచి 14 సంవత్సరాల వయస్సులోపు పిల్లలకు ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. 121 గ్రామాల నుంచి ఎంపిక చేసిన 240 మంది పిల్లలు పోటీల్లో పాల్గొన్నారు. రెడ్ క్రాస్ ప్రతినిధి ఎస్.నాగణ్ణ, నవసహయోగ్ ఫౌండేషన్ ప్రతినిధులు, యువ సబలీకరణ, క్రీడాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ఠ బందోబస్తు

మాట్లాడుతున్న ఎస్పీ అశోక్

పావగడ, న్యూస్‌టుడే : తుంగభద్ర తాగునీటి పథకం జాతికి అంకితం, పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కోసం నేడు పావగడ పట్టణానికివస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భద్రత కోసం పటిష్ఠ బందోబస్తు చేపట్టనున్నట్లు తుమకూరు ఎస్పీ కె.వి.అశోక్ తెలిపారు. ఆయన పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఆదివారం 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ నలుగురు ఏఎస్పీలు, 12 మంది డీఎస్పీలు, 31 మంది సీఐలు, 97 మంది ఎస్ఐలు, 141 మంది ఏఎస్ఐలు, 922 మంది హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులు, 300 మంది హోంగార్డులతో కలిపి మొత్తం 1507 మంది అధికారులు, సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారన్నారు. 6 కేఎస్ఆర్‌పీ, 7 డీఏఆర్ బెటాలియన్లతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తామని ఎస్పీ వివరించారు.

హో సూ రు క బు ర్లు

శ్రీరామసేవ హిందూ సంస్థ ప్రారంభం

పదాధికారులను పరిచయం చేస్తున్న ప్రమోద్ ముతాలిక్

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కామరాజ కాలనీలోని ఆంధ్ర సాంస్కృతిక సమితి సభాప్రాంగణంలో శ్రీరామసేన హిందూ సంస్థ పార్టీని ఆదివారం ప్రారంభించింది. అఖిల భారత శ్రీరామసేన సంస్థ అధ్యక్షుడు ప్రదీప్‌ముతాలిక్ నేతృత్వం వహించి మాట్లాడారు. తమిళనాడులో శ్రీరామసేన సంస్థ హోసూరు నుంచి ప్రారంభమైందన్నారు. వెయ్యి మంది కార్యకర్తలు రంగు టవళ్లను ధరించి ఊరేగింపుగా సభాప్రాంగణం చేరుకున్నారు. దేశ ఐక్యతకు, ప్రగతికి హిందువులు ఐక్యంగా ఉన్నపుడు భారతం సురక్షితంగా ఉంటుందని కరతాళాల మధ్య ప్రకటించారు. రాష్ట్ర స్థాయి, మండల, జిల్లా స్థాయి పదాధికారులను నియమించి బాధ్యత స్వీకరణ పత్రాలను కార్యకర్తల సమక్షంలో అందజేశారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా హోసూరుకు చెందిన తారకప్రభు, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్ నియమితులయ్యారు. హోసూరు నగం అధ్యక్షుడిగా మణికంఠన్, ప్రధాన కార్యదర్శిగా మణిజీ, కార్యదర్శిగా శివలను నియమించారు.

ఎనిమిది వాహనాల ఢీ : ముగ్గురి దుర్మరణం

జాతీయ రహదారిపై ప్రమాద దృశ్యం

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు-కృష్ణగిరి జాతీయ రహదారిలో ఆదివారం సాయంత్రం వేగంగా వస్తున్న కారు, కంటైనరు లారీ, లారీ తదితర వాహనాలు కురుబరపల్లి దగ్గర శికారి మేడు స్థలంలో వరుసగా ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు ఘటనాస్థలంలోనే మృతిచెందారు. మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శనివారం, ఆదివారం సెలవులు ముగించుకొని తిరిగివస్తూ ప్రమాదం బారిన పడినట్లు అధికారులు తెలిపారు. రోడ్డు ప్రమాదం కారణంగా జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలు గంటల కొద్దీ స్తంభించాయి.

ఖాతాలు త్వరగా జారీ చేయండి

దరఖాస్తులను పరిశీలిస్తున్న జిల్లాధికారి

చిక్కబళ్లాపుర: మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో బీ ఖాతాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి పనులు త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ అధికారులను జిల్లాధికారి పీఎన్ రవీంద్ర ఆదేశించారు. ఈ ఏడాది వినియోగదారులు ఈ-సేవలు దాఖలు చేసి, రుసుము చెల్లించిన వెంటనే జాప్యం లేకుండా వాటిని పంపిణీ చేయాలని సూచించారు. పౌరుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ విభాగాల్లో ఆయన అధికారులతో కలిసి తనిఖీ చేశారు. కార్యాలయ ఆవరణలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అర్జీలను పరిష్కరించాలన్నారు. మునిసిపల్ కౌన్సిల్ కమిషనర్ మన్సూర్, అధ్యక్షుడు గజేంద్ర, అధికారులతో కలిసి దస్త్రాలను పరిశీలించారు.

ఆసుపత్రిలో పండ్ల పంపిణీ

ఆసుపత్రిలో పండ్లు అందజేస్తున్న సోమణ్ణ బళగ బృందం

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : గోవిందరాజనగర రెఫరల్ ఆసుపత్రిలో వి.సోమణ్ణ అభిమానుల బళగ ఆధ్వర్యంలో కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి వి.సోమణ్ణ పుట్టినరోజును ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాజపా నాయకులు హెచ్.రమేష్, గోపీనాథ్‌రాజు, శ్రీధర్, రామాంజనీ, సి.ఎం.రాజప్ప, కనకపుర రాజణ్ణ, పాలన పక్షం మాజీ నాయకుడు హెచ్.రవీంద్ర, మండల మాజీ అధ్యక్షుడు విశ్వనాథగౌడ, మాజీ పాలికే సభ్యులు చెన్నప్ప మోహన్‌కుమార్, ఆనంద్ హోసూరు, దాసేగౌడ, ఆనంద్ పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ఉద్యోగ మేళను ప్రారంభిస్తున్న నవీన్‌కుమార్, తదితరులు

బెంగళూరు (అడుగోడి), న్యూస్‌టుడే : ఉద్యోగ మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని బెంగళూరు జైన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.ఎం.నవీన్‌కుమార్ తెలిపారు. ఇక్కడ జైన్ కళాశాలలో ఏర్పాటు కనెక్ట్-2 ఉద్యోగ మేళాను ఆయన ప్రారంభించారు. ప్రతిభ, అవకాశాల మధ్య తేడా ఉంటుందని విద్యార్థులు గమనించి ఆయా కంపెనీల్లో తమ ప్రతిభను చూపి ఉన్నత స్థాయికి వెళ్లాలని సూచించారు. ఒక ఉద్యోగానికి పరిమితం కాకుండా చదువును కొనసాగిస్తూ మరింత పురోభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. 3900 మంది విద్యార్థులు తమ పేరు నమోదు చేసుకోగా 2300 మంది 65 కంపెనీలకు ఎంపికయ్యారు.

మెగా ఉద్యోగ మేళాకు స్పందన

మేళాలో పాల్గొన్న ఎమ్మెల్యే, తదితరులు

ముళబాగిలు, న్యూస్‌టుడే : నగరంలోని సొన్నవాడిరోడ్డులోని పూల్‌చంద్ కల్యాణ మంటపంలో ఆదివారం జరిగిన మెగా ఉద్యోగ మేళాకు మంచి స్పందన వచ్చింది. మేళాలో 45 పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు హాజరై అభ్యర్థులతో ముఖాముఖి నిర్వహించి ఎంపిక చేసుకున్నారు. కార్యక్రమంలో కోలారు ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, నాయకులు ఆదినారాయణ్, జి.రామలింగారెడ్డి, అలంగూరు శివణ్ణ, జమ్మనహళ్లి కృష్ణ, నగరసభ మాజీ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, నాగనాథేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మారియమ్మ కరగ ఉత్సవాలు

కరగకు స్వాగతం పలుకుతున్న గోపాలయ్య, తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగరంలోని నందినిలేఅవుట్- కృష్ణానందనగర ప్రాంతంలో శ్రీవీరి మారియమ్మ దేవస్థానంలో కరగ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మాజీ మంత్రి గోపాలయ్య, ధర్మాధికారి జి.వెంకటేశ్ తదితరులు కలిసి కరగ ఉత్సవాలు ప్రారంభించి పూజలు నిర్వహించారు. పద్మావతి అమ్మ పువ్వుల కరగ ఎత్తుకుని అగ్నిగుండంలో నడిచారు. పువ్వుల కరగ ఎత్తుకున్న పద్మావతి అమ్మను భక్తులు ముందు ఉండి నడిపించారు. యశ్వంతపుర ఏపీఎంసీ యార్డు, శంకరనగర, గౌతమ్‌నగర, మారప్పపాళ్య, సోమేశ్వరనగర, విజయానంద నగర, కృష్ణానంద నగర తదితర ప్రధాన రహదారుల్లో కరగ సంచరించింది. దారి పొడవునా భక్తులు రహదారిలో నీరు చల్లి శుభ్రం చేసి ముగ్గులు వేసి కర్పూర ఆరతులు పట్టి కొబ్బరికాయలు కొట్టి స్వాగతం పలికారు.

అగ్నిగుండం దాటుతున్న పద్మావతి

అభివృద్ధి పనులకు నిధుల విడుదల

చిక్కబళ్లాపుర: గౌరీబిదనూరు తాలూకాలో 12 అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని ఎంపీ డాక్టర్ కె.సుధాకర్ తెలిపారు. గౌరీబిదనూరు మునిసిపాలిటీ పరిధిలో తాగునీటి కేంద్రం, హైమాస్ట్ దీపాల ఏర్పాటుకు భూమి పూజ చేసి మాట్లాడారు. జాతీయ రహదారి 94లో 8 కి.మీ. రహదారి అభివృద్ధికి రూ.6 కోట్లు, గౌరీబిదనూరులో వివిధ అభివృద్ధి, మరమ్మతులకు రూ.52 లక్షల నిధులు విడుదలయ్యాయని చెప్పారు. వీటితో పాటు లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో అన్ని పనులకు కలిపి రూ.66.6 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. తన నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేసేందుకు శ్రమిస్తున్నానని తెలిపారు.

భూమిపూజ చేస్తున్న ఎంపీ సుధాకర్, తదితరులు

సువర్ణకవచం అమర్చిన గర్భగుడిలో అధ్యక్షుడు, సభ్యులు

శనీశ్వరాలయంలో సంప్రోక్షణ

పావగడ, న్యూస్‌టుడే : స్థానిక శీతలాంబ, జ్యేష్ఠాదేవి, శనైశ్చరస్వామి దేవాలయంలో గర్భగుడి సువర్ణకవచం అమర్చడంతో ఆలయ ఆకర్షణీయంగా భక్తులకు కనువిందుగా కనిపిస్తోంది. శని, ఆదివారాల్లో సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సి.ఎస్.ఆనందరావు తెలిపారు. శనివారం గణపతి పూజ, స్వస్తి వాచన, పంచగవ్య ప్రోక్షణ, రక్షాబంధన, కలశస్థాపన, జపములు, మహామంగళారతి, సాయంత్రం కలశాలకు అర్చన, అగ్నిప్రతిష్ఠాపన, రక్షోఘ్నహోమం, గణపతిహోమం, జపములు చేశారు. ఆదివారం ఉదయం కలశాలకు అర్చన, జపానుష్ఠానాలు, నవగ్రహహోమం, శనైశ్చర స్వామి మూలమంత్రహోమం, దిక్పాలకబలి, పూర్ణాహుతి, మహామంగళారతి, కలశోద్వాసన, మూలదేవతలకు అభిషేకం, కలశోదక మార్జన, మహామంగళారతి, మధ్యాహ్నం పూర్ణాహుతి అనంతరం మహామంగళారతి ఆలయ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశేష పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

నూతన కార్యవర్గ సభ్యులు

ముళబాగిలు, న్యూస్‌టుడే : కోలారు జిల్లా న్యాయవాదుల సంఘానికి ఆదివారం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సుబ్రమణి, ప్రధాన కార్యదర్శిగా కె.వి.ఆదర్శ, కోశాధికారిగా పి.గాయత్రి, కార్యవర్గ సభ్యులుగా అంబరీష్, జగదీశ్వర, లోకేష్, జి.కె.లోకేష్‌గౌడ, మంజునాథ్, కె.సతీష్‌లను ఎన్నుకున్నారు.

ఘనంగా సోమణ్ణ జన్మదిన వేడుకలు

పుట్టినరోజు వేడుకల్లో అభిమానుల సంబరాలు

తుమకూరు: కేంద్ర జలశక్తి, రైల్వే సహాయక శాఖ మంత్రి వి.సోమణ్ణ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం సోమణ్ణ అభిమానుల బళగ, ఎన్డీఏ కార్యకర్తలు జిల్లాలోని వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. తుమకూరు దేవాలయాల్లో అభిషేకాలు, అర్చనలు చేయించి మంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. వివిధ బడావణిల్లో మొక్కలు నాటారు. నాయకులు చిదానంద్, శివప్రసాద్, హుచ్చయ్య, బాబురగేగౌడ, కృష్ణప్ప, మల్లికార్జున్, మహదేవయ్య తదితరులు పాల్గొన్నారు.

బలవన్మరణానికి పాల్పడిన ఎస్సై

కార్వార, న్యూస్‌టుడే: శిరసి గ్రామీణ ఠాణా ఎస్సై కీరప్ప ఘటకాంబ్లే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. శిరసి గ్రామీణ ఠాణాలో ఏఎస్సైగా ఉన్న ఆయన ఎస్సైగా పదోన్నతి పొంది రెండు నెలల క్రితం బంట్వాళ ఠాణాకు వచ్చారు. ఉత్తర కన్నడ జిల్లా హళియాళకు చెందిన ఆయన సమయపాలనలో బంట్వాళలోని తన వసతిగృహంలో ఉరి వేసుకున్నారు. ఆత్మహత్యకు కారణాలు గుర్తించాల్సి ఉందని బంట్వాళ ఠాణా పోలీసులు తెలిపారు.

పంట కుంటలో మునిగి తండ్రీ కొడుకులు మృతి

బెళగావి, న్యూస్‌టుడే: మలగళి గ్రామంలోని పంట కుంట నీటిలో పడి బసవరాజు (40), ఆయన కుమారుడు దరెప్ప (13) మరణించారు. ఆదివారం సెలవు కావడంతో తండ్రితో కలిసి దరెప్ప పొలానికి వెళ్లాడు. కుంట వద్ద ఆడుకుంటూ నీటిలో పడిపోయాడు. అతన్ని రక్షించే ప్రయత్నంలో బసవరాజు కూడా నీటిలో పడి మరణించారు. బెళగావి గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వంచనకు గురైన ఉద్యోగిని

మైసూరు: ఫేస్‌బుక్‌లో పరిచయమైన డాక్టర్ శివకుమార్ అనే వ్యక్తి తనను వంచించాడని ప్రజాపనుల శాఖలో ఫస్ట్‌గ్రేడ్ ఉద్యోగిని శ్వేతా మహంతేశ్ (46) జయలక్ష్మీపురం ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త చనిపోయిన అనంతరం అతని ఉద్యోగం శ్వేతకు వచ్చింది. ఫేస్‌బుక్‌లో పరిచయమైన అనంతరం తన చరవాణి నంబరు తీసుకుని ఇంటికి రాకపోకలు మొదలుపెట్టిన ఆయన తన నుంచి 500 గ్రాముల ఆభరణాలు, 2 కిలోల తూకం ఉన్న 110 వెండి నాణేలు, రూ.10.50 లక్షల నగదును తీసుకుని వంచించాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు.

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: లంచం ఇవ్వాలని అధికారులు ఎవరైనా డిమాండ్ చేస్తే తమకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వ్యాపారులను కోరారు. పలువురు ఉద్యోగులు డిజిటల్ పేమెంట్లు చేయించుకుంటున్నారని వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని 1800 425 6300 అనే నంబరుకు సెలవు రోజులు మినహాయించి ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని అధికారులు తెలిపారు.

దారి దోపిడీకి గురైన డ్రైవరు

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే: రహదారి పక్కన తోపుడు బండి వద్ద కొనుగోలు చేసుకుంటున్న గూడ్సు వాహనం డ్రైవరు రమేశ్ శనివారం రాత్రి దారి దోపిడీకి గురయ్యారు. ఆయన వద్దకు వచ్చిన ఇద్దరు దుండగులు దాడి చేసి రమేశ్ వద్ద ఉన్న రూ.15 వేల నగదు, చరవాణి లాక్కొని పరారయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు కలాసిపాళ్య ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వివాహితకు వేధింపులు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేసిన భర్తపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరంలోని పడారుపల్లికి చెందిన ఓ యువతికి కర్ణాటక రాష్ట్రంలోని కోలారు జిల్లాకు చెందిన చేతన్‌కుమార్‌తో ఈ ఏడాది మార్చిలో వివాహమైంది. కొద్ది రోజులు దంపతులు అన్యోన్యంగా ఉన్నారు. వివాహిత ఫిట్స్‌తో అనారోగ్యానికి గురవడంతో భర్త హింసించడం మొదలుపెట్టారు. మూడు నెలల క్రితం నెల్లూరులోని తల్లిదండ్రుల వద్ద వదిలి వెళ్లారు. రూ.15 లక్షలు కట్నం తీసుకొస్తేనే కాపురానికి రావాలని లేదంటే విడాకులు ఇవ్వాలని షరతు పెట్టారు. పెద్దలు సర్దిచెప్పినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో బాధితురాలు ఆదివారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: బళ్లారి రోడ్డు విండ్సర్ మ్యానర్ కూడలి వద్ద శనివారం అర్ధరాత్రి దాటిన అనంతరం సంభవించిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ముందు వెళుతున్న కారును వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. బాధితులను చికిత్స కోసం స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. హైగ్రౌండ్స్ ట్రాఫిక్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రహదారి మధ్య మృత్యు కుహరం

మినర్వా కూడలి నుంచి మావళ్లికి వెళ్లే రహదారిలోని బిలం ఇది. కార్మికులు మురుగును తొలగించేందుకు పైన ఉన్న మూతను తీసి పక్కన పడేసి వెళ్లిపోయారు. గత కొన్ని రోజులుగా ఇలాగే మూత లేని బిలం ఉండడంతో రాత్రుళ్లు పలువురు ప్రమాదాల బారిన పడి గాయపడ్డారు. బిబీఎంపీకి ఫిర్యాదు చేయకుండా, సంబంధిత నష్టం వదిలి వెళ్లడంతో దుర్వాసన వస్తోందని, ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపించారు. ఆ గుంతలో పడకుండా అడ్డుగా రెండు ఇసుక మూటల్ని ఉంచి వెళ్లారు.

- న్యూస్‌టుడే, బెంగళూరు (జయనగర)

మూడు పుస్తకాల విడుదల

పుస్తకాలను విడుదల చేస్తున్న ముఖ్య అతిథులు, రచయిత్రులు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : నగరంలోని ప్రముఖ పుస్తక ముద్రణా సంస్థ అంకిత పుస్తక..బుక్ బ్రహ్మ సహకారంతో ఆదివారం ముగ్గురు రచయిత్రులు రాసిన మూడు పుస్తకాలను (చిత్రకారన బెరళు, సరహద్దు, కపిలె కండ కథెగళు) విడుదల చేశారు. ప్రముఖ రచయిత్రి, విమర్శకురాలు డాక్టర్ ఎం.ఎస్.ఆశాదేవి పుస్తకాలను ఆవిష్కరించి..రచయిత్రులను అభినందించారు. రచయిత్రులు తమ జీవితానుభవాలు, సామాజిక బాగోగులను క్షుణ్ణంగా పరిశీలించి అధ్యయనం చేసి ఇందులో పొందుపరచటం గమనార్హమని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ రచయిత వసుధేంద్ర మాట్లాడుతూ చాలా మంది రచయిత్రులు రచించే రచనలలో అధికంగా మహిళా సంవేదనలు, వారి సాధక బాధల గురించే వివరణ ఉంటుందన్నారు. ఈ ముగ్గురు రచయిత్రులు (శాంతి కె.అప్పణ్ణ, దీపా హిరేగుత్తి, కుసుమా ఆయరహళ్లి) సామాన్యుల మనసులను క్షుణ్ణంగా చదవటంతో పాటు సామాజిక పర అనేక అంశాలను ప్రస్తావించారని తెలిపారు. కార్యక్రమంలో అంకిత పుస్తక వ్యవస్థాపకుడు ప్రకాశ్, పుస్తకాభిమానులు పాల్గొన్నారు.

మాల మహాసభ నూతన కార్యవర్గం ఎన్నిక

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కర్ణాటక మాల మహాసభ నూతన పదాధికారులు ఎన్నిక ఆదివారం ఇక్కడ జరిగింది. నూతన అధ్యక్షుడిగా ఎల్.నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులుగా సిద్ధం నారయ్య, వెంకటేశ్ సత్యాల, రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శిగా సంజీవరావు, కార్యదర్శులుగా చక్రవర్తి, గంధం రామకృష్ణ, వెంకట్, కోశాధికారిగా కె.మాల్యాద్రి ఎన్నికైనట్లు ప్రకటించారు. నగరంలో మాలలు అధిక సంఖ్యలో నివశించే 30 ప్రదేశాలను గుర్తించి ఆయా ప్రాంతాలకు చెందిన వారిని సంచాలకులుగా నియమించారు. సభ్యత్వ నమోదు ముమ్మరం చేయాలని తీర్మానించారు. రాబోవు రోజుల్లో సంచాలకుల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని, ప్రభుత్వ పథకాలు, మండలి, కార్పొరేషన్ నియామకాల్లో తమ వంతు వాటా కోసం ప్రయత్నించాలని నిర్ణయించినట్లు అధ్యక్షుడు ఎల్.నాగేశ్వర్‌రావు తెలిపారు. ఏరాజకీయ పార్టీకి అనుబంధం కాదని, మాలల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేయాలని తీర్మానించినట్లు వివరించారు.

ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

కంటి పరీక్షలను వీక్షిస్తున్న మంత్రి రామలింగారెడ్డి, తదితరులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని రవాణా, దేవాదాయశాఖల మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. ఆదివారం మహాలక్ష్మీ లేఅవుట్ విధానసభా బ్లాక్ కాంగ్రెస్ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. కురుబరహళ్లి బయలు రంగమందిరంలో కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్.కేశవమూర్తి, జి.హుచ్చప్ప, ఎం.శివరాజు, వి.ఎస్.ఆరాధ్య, శివకుమార్, సుధీంద్ర, పరిసర రామకృష్ణ, జనార్ధన్, కృష్ణబిస్ట్ తదితరులు పాల్గొన్నారు. వైద్య శిబిరంలో నేత్రధామ, పుణ్య ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

కృష్ణమూర్తి, వేదవతిని సత్కరిస్తున్న ప్రతినిధులు

బెంగళూరు (సాంస్కృతికం): హోసకెరెహళ్లిలోని ఆడన్ విద్యాసంస్థలో ఆదివారం రోటరీ గిరినగర్, రోటరీ రీచ్ అవుట్, రోటరీ సిటీ సెంటర్ సంయుక్తగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివిధ ఆసుపత్రులకు చెందిన 50 మంది వైద్యులు, సిబ్బంది 400 మందికి రక్తపోటు, మధుమేహం, కీళ్లనొప్పులు, గుండె వ్యాధులు, ఆయాసం, న్యూరో, ఈఎన్‌టీ, కంటి, పంటి తదితర వ్యాధులకు పరీక్షలు చేశారు. నాడీ వ్యవస్థకు సంబంధించి డాక్టర్ కృష్ణమూర్తి సలహాలిచ్చారు. ఈ సందర్భంగా వృద్ధులకు ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థల అధ్యక్షుడు హరీష్ కృష్ణ, కార్యదర్శులు కిరణ్‌కుమార్, నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. నాగేశ్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా..వైద్యులు కృష్ణమూర్తి, వేదవతి తదితరులను సంస్థ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

క్రీడాకారులతో మీనాక్షి బైరేగౌడ, నాయకులు

బెంగళూరు (బ్యాటరాయణపుర), న్యూస్‌టుడే : క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని రెవెన్యూశాఖ మంత్రి సతీమణి మీనాక్షి భైరేగౌడ తెలిపారు. ఇక్కడ విద్యారణ్యపురలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. విజయం సాధించడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను సత్కరించారు.

సౌదీ పోటీలకు మాస్టర్ లక్ష్‌శర్మ ఎంపిక



లక్ష్‌శర్మ

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : సౌదీ అరేబియాలో ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న సౌదీ జూనియర్ తొమ్మిది బంతుల పోటీల్లో కర్ణాటకకు చెందిన మాస్టర్ లక్ష్‌శర్మ పాల్గొంటున్నట్టు కర్ణాటక బిలియర్డ్స్ స్నూకర్ సంఘం ప్రకటించింది. ఈనెల 25 దాకా జరిగే పోటీల్లో 16 మంది అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొంటున్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ నేతృత్వంలో గ్రామాల దత్తత

వార్షికోత్సవాలను ప్రారంభిస్తున్న శేషప్ప, వసంత, అక్షతాప్రభు తదితరులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : రాష్ట్రీయ సేవా యోజన-ఎన్‌ఎస్‌ఎస్ నేతృత్వంలో గ్రామాలను దత్తత తీసుకోవాలని చేపట్టాలని మంగళూరు విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ సంచాలకుడు డాక్టర్ కె.శేషప్ప తెలిపారు. ఆళ్వాస్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్‌ఎస్‌ఎస్ వార్షికోత్సవాలను శేషప్ప ప్రారంభించి మాట్లాడారు. భారతదేశంలో లక్షల సంఖ్యలో స్వయం సేవకులు ఉన్నారన్నారు. భాష, జాతి, ధర్మం, వయస్సుతో సంబంధం లేకుండా అందరికీ సాయం చేయాలన్నారు. కళాశాల పాలనాధికారి బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్‌తో జ్ఞానర్జనతో పాటు జీవితానుభావాలను అభివృద్ధి చేసేందుకు ఎంతో సహకారం కానుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల మాజీ ఎన్‌ఎస్‌ఎస్ సంయోజనాధికారి వసంతను సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి అక్షతాప్రభు, కార్యదర్శి వైశాఖ్, ప్రతినిధులు కిరణ్, సంజన, సుమిత్, సమీక్ష, శశాంక్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దిండి ఉత్సవం

వార్కరి బృందంతో కలిసి నృత్యాలు చేస్తున్న మహిళలు, చిన్నారులు

పావగడ, న్యూస్‌టుడే : పట్టణంలోని ఆంజనేయ శెట్టి కల్యాణ మండపంలో స్థానిక భావసార క్షత్రియ సముదాయం, మహిళా మండలి, యువక మండలి, పట్టభద్రుల పరిషత్, సముదాయ పెద్దల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు 37వ దిండి ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భావసార క్షత్రియ తాలూకా అధ్యక్షుడు డి.లోకేశ్‌రావు మాట్లాడుతూ 36 ఏళ్లుగా ఏటా ఆషాఢమాసం చివరి శనివారం, ఆదివారం పాండురంగ స్వామి, రుకుమాయి విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలాచరించి దిండి ఉత్సవాన్ని ఆచరిస్తున్నట్లు తెలిపారు. శనివారం రాత్రి భజనలు, కీర్తనలు ఆలపించడానికి దావణగెరె, శివమొగ్గ, భద్రావతి, గుబ్బి, శిరా, మధుగిరి, కొరటగెరె పట్టణాల నుంచి 40 మంది వార్కరి బృందం (శ్రీపాండురంగ స్వామి కీర్తనలు)తో కలిసి స్థానిక మహిళలు, చిన్నారులు కీర్తనలకు నృత్యాలు చేశారు. దివారం పాండురంగస్వామి, రుకుమాయి చిత్రపటాలను రథంపై ఉంచి పుర వీధుల్లో ఊరేగించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భావసార క్షత్రియ తాలూకా గౌరవాధ్యక్షుడు కృపాశంకర్, సముదాయ ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

రాజ్యాంగంపై అధ్యయనం అవసరం

శిబిరంలో న్యాయమూర్తులు, అధికారులు, ప్రముఖులు

ముళబాగిలు, న్యూస్‌టుడే : అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించకపోతే వ్యవస్థలు ఇబ్బంది పడేవని, దోపిడీ, హింస, అణచివేత నుంచి రాజ్యాంగం కాపాడుతోందని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నాగమోహనదాసు అభిప్రాయపడ్డారు. కోలారు నగర సువర్ణ కన్నడ భవనంలో రాజ్యాంగం అధ్యయనం శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రాజ్యాంగాన్ని సమగ్రంగా చదివి అధ్యయనం చేయాలని, విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ రవి మాట్లాడుతూ రాజ్యాంగం చాలా అర్థపూర్ణ పుస్తకమని, ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని చదివి అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రవీణ్, జిల్లా పోలీస్ అధికారి నిఖిల్, న్యాయమూర్తి నటేశ్, జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గోపాలగౌడ, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.ఆర్.వెంకటేశ్‌గౌడ, ప్రముఖులు రాజశేఖరమూర్తి, సూర్యనారాయణ, టి.విజయకుమార్, అరివు శివప్ప, కొండరాజనపల్లె మంజుళా తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

వినతిపత్రాన్ని అందిస్తున్న డీకే సురేశ్

విక్రయాలకు అవకాశం కల్పించరూ

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: మెట్రో రైల్వే స్టేషన్ ఆవరణాలు, స్టేషన్లకు సమీపంలో నందిని పాలు, పాల ఉత్పత్తులను విక్రయించేందుకు అధికారులు అవకాశం కల్పించాలని బమూల్ అధ్యక్షుడు డీకే సురేశ్ కోరారు. మెట్రో రైలు మండలి విశ్రాంత అధికారి మహేశ్వరరావు, కొత్త ఎండీ రవిశంకర్‌లకు భేటీ అయి ఆయన వినతిపత్రాన్ని అందించారు. మెట్రో స్టేషన్ల పరిధిలో ఖాళీ స్థలాల్లో బూత్‌లు, స్టాళ్లను లీజు పద్ధతిలో ఏర్పాటుకు అవకాశం కల్పించాలని వినతిపత్రాలను ఇచ్చానని సురేశ్ తెలిపారు.

కావడితో భక్తుల రాక

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే: కృత్తికోత్సవంలో భాగంగా ఆదివారం భక్తులు కావళ్లు మోసుకుని సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలకు వచ్చారు. మొక్కులు చెల్లించిన భక్తులు ఇక్కడి నుంచి తమిళనాడులోని పళనికి తరలి వెళ్లారు. వీవీపురం, ప్రకాశ్‌నగర తదితర ప్రాంతాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయాల వద్ద పసుపు రంగు దుస్తులు ధరించిన చిన్నా, పెద్ద, కావళ్లతో నైవేద్యాలతో వచ్చి పూజలు చేసుకుని వెళ్లారు.

కావడిలతో వస్తున్న భక్తులు

బ్రాహ్మణుల సేవలు అనన్యం

సాధకులకు సత్కరిస్తున్న ప్రముఖులు

రాయచూరు, న్యూస్‌టుడే : స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తర్వాత బ్రాహ్మణులు దేశానికి నిరుపమానమైన సేవలందించారని చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు కొనియాడారు. జిల్లా బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడి రంగమందిరంలో విప్రోత్సవం జరిగింది. పది, పీయూసీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహకాలు, సీఏ వెంకట కృష్ణన్, విశ్రాంత అధ్యాపకురాలు కళావతికి విప్రశ్రీ పురస్కారాలను ప్రదానం చేశారు. ఎనిమిది మంది సాధకులను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి బోసురాజు మాట్లాడుతూ బ్రాహ్మణులకు సమాజంలో నేటికి గౌరవ స్థానం చిరస్థాయిగా ఉందన్నారు. రాయచూరు గ్రామీణ శాసనసభ్యుడు బసనగౌడ దద్దల్ ప్రసంగిస్తూ ఏ పనినైనా నిబద్ధత, నిజాయితీ, శ్రద్ధాసక్తులతో చేస్తూ.. గురువులుగా భావించే బ్రాహ్మణులు సరస్వతీ పుత్రులని అభివర్ణించారు. మాజీ ఎమ్మెల్సీ మధుసూదన్ మాట్లాడుతూ పార్టీలు, సిద్ధాంతాల కంటే దేశ భవిష్యత్తే ముఖ్యమని భావించే వారు పురోహితులని తెలిపారు. అందరి క్షేమాన్ని కోరుకునే ఈ సామాజిక వర్గం వారు సమాజ హితం గురించే ఆలోచిస్తారని చెప్పారు. భూములను స్వాధీనం చేసుకున్నా ఏ రోజు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయలేదన్నారు. బ్రాహ్మణ అభివృద్ధి మండలి అధ్యక్షుడు జయసింహ మాట్లాడుతూ లోక కల్యాణాన్ని ఆశించే వీరి వల్ల సమాజంలో పరిపూర్ణత సాధ్యమన్నారు. విద్యార్థులకు ఇస్తున్న ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా బ్రాహ్మణ మహాసభ ఎన్నిక ప్రతినిధి రమేష్ కులకర్ణి మాట్లాడుతూ సభ్యత్వ నమోదును పెంచుతామని, ఈడబ్ల్యూఎస్ పత్రాలు మంజూరు, గాయత్రి దేవాలయం నిర్మాణానికి శ్రమిస్తానని ప్రకటించారు. పేదలకు గృహాలు కట్టించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సామాజికవర్గం ప్రముఖులు నరసింగరావు దేశపాండే, అరవింద్ కులకర్ణి, ప్రాణేశ్ ముతాలిక్, పూర్తిబ్లి రామకృష్ణ, రాఘవేంద్ర చూడామణి, సుయిమీంద్ర కులకర్ణి, ఆనంద్ తీర్థ ఫడ్నీస్, సదానంద ప్రభు, శ్యామాచార్, సుదేంద్ర జాగీర్దార్, రామరావ్, వెంకటేష్ కులకర్ణి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న మండలి అధ్యక్షుడు జయసింహ

భాజపా వాళ్లు పెరుగులో రాళ్లు వెతుకుతారు

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎద్దేవా

మైసూరు, న్యూస్‌టుడే: భాజపా నాయకులు పెరుగులో రాళ్లు వెతుకుతుంటారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎద్దేవా చేశారు. అభివృద్ధి పనులు, వివిధ పథకాల అమలుకు సంబంధించి చర్చకు రమ్మని పిలిచినా, స్పందించరని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు, తనకు మధ్య వివాదాలు ఉన్నట్లు ప్రజలను నమ్మించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. డీకే శివకుమార్, మంత్రులు కె.వెంకటేశ్, డాక్టర్ హెచ్‌సీ మహదేవప్ప, ఎమ్మెల్యేలు అనిల్ చిక్కమాదు, దర్శన్ ధ్రువనారాయణతో కలిసి హెచ్‌డీ కోటె తాలూకా కబిని జలాశయానికి ఆదివారం వాయనాన్ని సమర్పించారు. తమ పార్టీలో నేతల మధ్య అభిప్రాయభేదాలు లేవని, అందరం ఐకమత్యంగా కలిసి పని చేస్తున్నామని చెప్పారు. తనకు, ఇతరనేతల మధ్య చీలికలు వస్తే తమకు లాభం జరుగుతుందని భాజపా భ్రమల్లో తేలియాడుతోందని ఎద్దేవా చేశారు. డిజిటల్ పేమెంట్లు స్వీకరిస్తున్న వ్యాపారులు వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) చెల్లించాలని ప్రభుత్వమే నోటీసులు జారీ చేస్తోందని భాజపా అధ్యక్షుడు విజయేంద్ర, ఇతర నేతలు వ్యాఖ్యలు చేయడం వారి అజ్ఞానానికి అద్దం పడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు వేధిస్తే తనకు ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. జీఎస్టీ చెల్లించాలని కేంద్ర వాణిజ్య పన్నుల శాఖ అధికారులు నోటీసులు పంపిస్తే తాను బాధ్యుడిని ఎలా అవుతానని ప్రశ్నించారు. వ్యాపారులకు ఇబ్బంది లేకుండా, తాను కేంద్ర జీఎస్టీ కౌన్సిల్‌తో మాట్లాడతానని చెప్పారు. తమ ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో నిర్వహించిన సాధనా సమావేశాల్లో రెండు లక్షల మంది హాజరయ్యారని చెప్పారు. గ్యారంటీ పథకాల కోసం తాము ఏటా రూ.52 వేల కోట్లను ఖర్చు చేస్తున్నామని వివరించారు. గ్యారంటీలను విమర్శిస్తున్న భాజపా నేతలు దిల్లీ, బిహారు ఎన్నికలకు ముందు మోదీ ఏఏ హామీలు ఇచ్చారో ఒకసారి పరామర్శించుకోవాలని హితవు పలికారు.

జలాశయానికి వాయనం ఇస్తున్న సిద్ధు, శివకుమార్

నేతలతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం సిద్ధరామయ్య

బన్నిమండపం వద్ద కొత్త బస్సు ప్రాంగణం

మైసూరు, న్యూస్‌టుడే : బన్నిమండపం వద్ద 14 ఎకరాల విస్తీర్ణంలో కొత్త ఆర్టీసీ బస్టాండ్ నిర్మించే పనులు ప్రారంభం అయ్యాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బస్టాండ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.120 కోట్ల ఖర్చుతో 4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ ప్రయాణ ప్రాంగణం సెల్లార్‌లో 4 వేల ద్విచక్ర వాహనాలు, 300 కార్లు నిలుపుకోవడంతో పాటు ఒకే సారి 75 బస్సులు నిలిపేందుకు ప్రత్యేక వరుస మార్గాలు, నాలుగు లిఫ్టులు, మరుగుదొడ్లు, రెస్టారెంట్లు వచ్చేలా కొత్త బస్టాండ్‌ను నిర్మిస్తున్నామని అధికారులు తెలిపారు.

లింగసూగూరులో సీఈవో పర్యటన

రాయచూరు, న్యూస్‌టుడే : జడ్పీ సీఈవో ఈశ్వర్ కాందూ లింగసూగూరు తాలూకాలో పర్యటన కొనసాగింది. చిత్తాపూర పంచాయతీ పరిధిలోని జావూరు గ్రామంలోని బహు గ్రామ తాగునీటి పథకానికి సంబంధించిన నారాయణపుర ఆనకట్ట వద్ద జరుగుతున్న పనులను వీక్షించారు. నీటి శుద్ధీకరణ నిర్మాణాలను పరిశీలించారు. అక్కడి నుంచి ముదగల్ ట్యాంక్ యార్డు క్యాంపులను వెళ్లి తాగునీటి పనులను చూశారు. సకాలంలో పనులన్నింటిని పూర్తి చేయాలని గుత్తేదార్లకు సూచించారు. తర్వాత లింగసూగూరు పట్టణంలోని తాలూకా పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆక్వా, కేపీసీ 15 రోజుల్లో తెరవాలని అధికారులను సూచించారు. మహిళలు మాత్రమే నిర్వహించాలని, ధరలను నామఫలకంలో పొందు పరచాలని, ధూమ, మద్య పాన విక్రయాలకు అవకాశం ఇవ్వొద్దని, సీసీ కెమెరాలను అమర్చాలని సీఈవో అధికారులను ఆదేశించారు.

పనులను పరిశీలిస్తున్న సీఈవో ఈశ్వర్

తేనెవల నిందితులు కేరళలో చిక్కారు

మైసూరు, న్యూస్‌టుడే : పిరియాపట్టణ తాలూకా కంపలాపురకు చెందిన దుస్తుల వ్యాపారి దినేశ్ కుమార్‌ను హనీట్రాప్‌లో బిగించి నగదు వసూళ్లకు పాల్పడి పరారైన కవన, సైఫ్ అనే నిందితులను బైలకుప్ప ఠాణా పోలీసులు కేరళలో అరెస్టు చేశారు. ఈ కేసులో హాసన సూరు ఠాణా కానిస్టేబుల్ శివణ్ణ, మూర్తి అనే యువకునితో పాటు ఒక యువతిని కూడా పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. శివణ్ణ అడ్డుపెట్టుకుని నిందితులు దినేశ్ కుమార్ నుంచి రూ.10 లక్షల నగదు వసూలు చేశారు. సైఫ్, కవన ఇద్దరూ కణ్ణూరులో ఉన్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా ఎస్పై రవికుమార్ నేతృత్వంలోని సిబ్బంది దాడి చేసి వారిని అరెస్టు చేసి బైలకుప్పకు తీసుకువచ్చి విచారణ ప్రారంభించారు.

ఖాతాలు సకాలంలో అందక అగచాట్లు

రాయచూరు, న్యూస్‌టుడే : ఈ-ఖాతా, బీ ఖాతా, మ్యుటేషన్ పత్రాలను సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా సమాజ సేవకుల సంఘం ప్రతినిధులు నగర పాలక సంస్థ కమిషనర్ జుబిన్ మహోపాత్రను విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందరాజ్ నేతృత్వంలో వినతి పత్రాన్ని అందజేశారు. దరఖాస్తు చేసిన వారంలోపు ఖాతా పత్రాలను ఇచ్చేలా సూచించాలని కోరారు. పత్రాల కోసం ప్రజలు రెండు, మూడు మాసాలు కార్యాలయం చుట్టూ తిరిగే పరిస్థితి ఉందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నాలుగైదు రోజులకు అధికారులు ఈడీ లాగిన్ మార్పుస్తున్నందున దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి ముఖ్య కారణమని గుర్తు చేశారు. కనీసం నెల రోజులు ఒకే లాగిన్ ఉంచాలన్నారు. ధృవ ఏ దశలో ఉంది తెలుసుకునేందుకు సహాయవాణిని ఏర్పాటు చేయాలని, నెలకోసారి సమావేశం ఏర్పాటు చేయాలని విన్నవించారు. న్యాయ సమ్మతమైన సమస్యలు పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

సంఘం ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్

కరియప్ప తాత జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

రాయచూరు, న్యూస్‌టుడే : తాలూకాలోని కల్మలలో ఈ నెల 29న జరిగే కరియప్ప తాత జాతర రథోత్సవం గోడ పత్రాన్ని రాయచూరు గ్రామీణ శాసనసభ్యుడు బసనగౌడ దద్దల్ నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోని అతి పెద్ద జాతరల్లో ఒకటైన ఈ జాతరకు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చే అవకాశమున్నందున భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయం చుట్టూ స్వచ్ఛతా పనులు చేయించాలని, రథం సంచరించే రహదారి ప్రాంతాన్ని ఆక్రమణలను తీర్చిదిద్దాలని, బ్యారికేడ్లు నిర్మించాలని కోరారు. వైద్యులు, ఔషధాలు, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. జిల్లా నలుమూలల నుంచి బస్సులు నడపాలని, విద్యుత్తు సరఫరాలో సమస్య ఏర్పడకుండా చూసుకోవాలని ఆయా శాఖల అధికారులను కోరారు.

గోడ పత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే తదితరులు

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

ఒకరి మృతి, మరొకరు గల్లంతు

మంత్రాలయం (గ్రామీణం కౌతాళం), న్యూస్‌టుడే : కౌతాళం మండలంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆరుగురు ప్రయాణిస్తున్న కారు శునకాన్ని తప్పించే బోయి ఎల్లెల్సీ దిగువ కాల్వలోకి దూసుకెళ్లింది. అక్కడే వ్యవసాయ పనులు చేస్తున్న కూలీలు వెంటనే వచ్చి నీటిలో కొట్టుకుపోతున్న నలుగురిని ఎంతో సాహసంగా కాపాడారు. మరో ఇద్దరిని కాపాడేలోగా మునిగిపోయారు. ఒకరి మృతదేహం లభ్యం కాగా.. మరొకరు గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . కర్ణాటకలోని ధార్వాడ జిల్లాకు చెందిన హైదర్, అభిషేక్, అప్పయ్య, మంజునాథ్, సునీల్, మణికంఠలు హుబ్లీలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనానికి శనివారం కారులో వచ్చారు. ఆదివారం తిరుగు ప్రయాణంలో కొప్పళ సిద్ధేశ్వర ఆలయాన్ని దర్శించుకునేందుకు కౌతాళం మీదుగా వెళ్తున్నారు. శునకాన్ని తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు కారు ఎల్లెల్సీ కాలువలోకి దూసుకెళ్లింది.

కారును బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు

కాపాడిన ఇద్దరు యువకులు

అక్కడే పొలంలో పని చేస్తున్న గొట్టయ్య, గోవర్ధన అనే ఇద్దరు యువకులు సాహసం చేసి ఎల్లెల్సీ కాలువలో దూకారు. కారు తలుపులు తీసి నలుగురిని బయటకు లాగి ఒడ్డుకు చేర్చారు. మరో ఇద్దరు సునీల్(23), మణికంఠలను కాపాడేలోగా నీటిలో మునిగి కొట్టుకుపోయారు. కౌతాళం సీఐ అశోక్ కుమార్ వెంటనే స్పందించి గాలింపు చర్యలు చేపట్టారు. అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. సాయంత్రం 4 గంటలకు సునీల్ మృతదేహం లభ్యమైంది. గల్లంతైన మణికంఠ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. చీకటి పడటంతో గాలింపు చర్యలను నిలిపేశారు. మూడు చోట్ల కాల్వకు అడ్డంగా వల వేసి ఉంచారు. సోమవారం ఉదయమే గాలింపు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

హాసన, న్యూస్‌టుడే : చెన్నరాయపట్టణ శివారు ప్రాంతం శెట్టిహళ్లి ఉపరితల వంతెన వద్ద శనివారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. బెంగళూరులోని సంజయనగరకు చెందిన మీనాక్షి (29), చెన్నరాయపట్టణకు చెందిన కారు డ్రైవరు ప్రతాప్ (32)లను మృతులుగా గుర్తించారు. బెంగళూరు నుంచి హాసనకు వస్తున్న కారు, హాసన నుంచి హిరిసావెకు వస్తున్న మరో కారును ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. గాయపడిన వారిని చికిత్స కోసం హాసన, చెన్నరాయపట్టణ ఠాణాల్లో చేర్పించారు. చెన్నరాయపట్టణ ట్రాఫిక్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రహదారిపై పడిన కారు ముందు భాగం

ప్రమాదంలో నుజ్జయిన కారు

పోలీసు ఠాణాను శుభ్రం చేయండి

మంగళూరు, న్యూస్‌టుడే : మద్యం తాగి బైకు నడుపుతూ వచ్చిన సమయంలో తనను అడ్డుకున్న పోలీసులతో అనుచితంగా వ్యవహరించిన అకింత్ పలాయ అనే యువకుడికి న్యాయస్థానం శిక్ష, రూ.10 వేల జరిమానాను విధించింది. ఈ నెల 28 వరకు నిత్యం ఉదయం 10 నుంచి 12 గంటల మధ్యలో సుళ్య ఠాణాను శుభ్రం చేయాలని న్యాయమూర్తి మోహన్ బాబు నిందితుడ్ని ఆదేశించారు. నిందితుడు ఈ ఏడాది ఏప్రిల్ 22 రాత్రి మద్యం తాగి వస్తూ నాకాబందీ నిర్వహించిన పోలీసులతో అనుచితంగా వ్యవహరించాడు. పోలీసుల నుంచి తప్పించుకుని పరారైన నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. విచారణ పూర్తి చేసి న్యాయస్థానం ముందు అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. నిందితుడ్ని న్యాయస్థానం ముందు శనివారం హాజరుపరిచారు. నేరం అంగీకరించడంతో ఠాణాను శుభ్రం చేసే శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

అన్నదాతల కళ్లలో ఆనందం

రాయచూరు, న్యూస్‌టుడే : దేవదుర్గ తాలూకాలోని నారాయణపుర కుడి కాలువ ఉప కాలువల దశ తిరగనుంది. ఉప కాలువల లోపల, గట్టుపైన పెరిగిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కల తొలగింపు ప్రక్రియ ఎట్టకేలకు మొదలైంది. 17వ సబ్ డిస్ట్రిబ్యూటరీ మోరీ వద్ద ఏపుగా పెరిగిన గడ్డిని తీసేశారు. ప్రస్తుతం నీరు ముందుకు సాఫీగా పారుతోంది. నాలుగైదు రోజుల్లో పూర్తి కానుంది. తర్వాత 15, 16, 18 ఉపకాలువల వద్ద తొలగింపు పనులు చేపడుతారు. 15 రోజుల్లో నాలుగు ఉప కాలువలు కొత్త రూపు రేఖలు సంతరించుకోనున్నాయి. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ పాటిల్ ఒత్తిడి వల్ల ఇంజినీర్లు కదిలారు. ఉప కాలువల దుస్థితి గురించి ఆయన కృష్ణభాగ్య జల నిగమ ఇంజినీర్ల దృష్టికి తీసుకెళ్లారు. నిర్వహణ పనులు చేయాలని ఇంజినీర్లు, గుత్తేదారును కోరినా పట్టించుకోలేదు. వీటిని బాగు చేయించకపోతే కచేరి వద్ద ఆందోళన ప్రారంభిస్తామని ప్రభాకర్ చీఫ్ ఇంజినీర్ ప్రేమ్‌సింగ్‌కు స్పష్టం చేశారు. ఫలితంగా ప్రేమ్ సింగ్ శనివారం ఉపకాలువలపై పర్యటించారు. వాస్తవ పరిస్థితి ఆయనకు బోధపడింది. అత్యవసర చోట్ల ముళ్లచెట్లను, పొదలను తొలగించాలని ఇంజినీర్లకు ఆదేశించడంతో ఆదివారం పనులు చేపట్టారు ఐదేళ్లుగా వేసవిలో నిర్వహణ చేయనందునే కాలువలు పూర్వ స్థితిని కోల్పోయాయి. దరిమిలా చివరి ఆయకట్టు అన్నదాతలకు సాగునీటి ఇబ్బందులు తప్పలేదు. జులై 8న నీటిని విడుదల చేశారు. దిగువకు నీరు సరఫరా మొదలైంది. ఈ ఏడాది సమస్య ఉండదనే అభిప్రాయం అన్నదాతల్లో వ్యక్తమవుతోంది. వచ్చే ఏడాది నుంచి వేసవిలోనే జంగిల్ కటింగ్ చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ముళ్ల పొదలు కప్పేసిన ఉపకాలువ (దాచిన చిత్రం)

తొలగించడతో పారుతున్న నీరు

ప్రభాకర్ పాటిల్

డిజిటల్ చెల్లింపు వద్దు.. నగదు ముద్దు

వ్యాపారులకు కొత్త చిక్కు

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: వీధి పక్కన ఆహార పదార్థాలు విక్రయించే వీధి వ్యాపారి మునియప్పకు రూ.35లక్షలు వ్యాపార లావాదేవీలకు సంబంధించి జీఎస్టీ ఇతర పన్నులు చెల్లించాలని వాణిజ్యపన్నులు శాఖ నుంచి నోటీసు వచ్చింది. ఆందోళనకు గురైన ఆయన స్థానిక అధికారులను ఆశ్రయించారు. తరువాత వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులను కలిశారు. ఫోన్ పే, గూగుల్ పే తదితర డిజిటల్ చెల్లింపులను వినియోగిస్తున్నందున వాటికి సంబంధించిన మొత్తాలకు జీఎస్టీ పన్ను చెల్లించాలని నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు. బిత్తర పోయిన ఆయన కొద్దిరోజులు వ్యాపారం నిలిపివేశారు. ఆఖరికి తక్కువ మొత్తం చెల్లిస్తే సరిపోతుందని అధికారులు తెలియజేయడంతో ఊపిరి పీల్చుకుని తిరిగి వీధి వ్యాపారం ప్రారంభించారు. ఈసారి 'నో పే' అనే బోర్డు తగిలించారు. డబ్బులు చెల్లించాలని సూచించారు. వచ్చిన వినియోగదారుల నుంచి కచ్చితంగా నగదు వసూలు చేయడం మొదలు పెట్టారు. ప్రస్తుతం నగరంలో చిరువ్యాపారులందరూ తమ వ్యాపార స్థలంలో 'నో పే' అనే బోర్డులు ఉంచారు. నగదు చెల్లించి వస్తువులను కొనుగోలు చేయాలని తెలిపారు. మరోవైపు నెలకొన్న సమస్య పరిష్కరించేందుకు వాణిజ్య పన్నుల శాఖ రంగంలోకి దిగింది. ఇందుకు కోసం ప్రత్యేక సహాయవాణి 18004256300 ఏర్పాటు చేసింది. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఈ కేంద్రం పని చేస్తుందని అధికారులు తెలిపారు. వ్యాపారులు ఫోన్ చేసి తమ అనుమానాలను పరిష్కరించుకోవచ్చు.

వ్యాపారులు తమ దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన నో పే బోర్డులు

కేసు రద్దు చేసేందుకు నిరాకరణ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మొదటి భర్త నుంచి విడాకులు తీసుకోకుండానే, రెండో వివాహం చేసుకుని, భర్తతో శోభనానికి అంగీకరించకుండా, నగలు, నగదు తీసుకుని వంచించిన మహిళ (30)పై నమోదైన క్రిమినల్ కేసును రద్దు చేసేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. భైరవేశ్వరనగరకు చెందిన వి సంతోశ్ అనే బాధితుడు వేసుకున్న అర్జీని జస్టిస్ జేఎం ఖాజీ విచారణ చేపట్టారు. సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన అఖిల అనే మహిళ తనకు మొదటి వివాహం అయిన విషయాన్ని దాచి పెట్టి తనతో వివాహానికి అంగీకరించిందని సంతోశ్ తెలిపాడు. ఆమె బావ అరుణ్ వివాహ ఖర్చులు అని చెప్పి తన నుంచి రూ.5 లక్షలు తీసుకోగా, తనకు అవసరం అని రూ.2.60 లక్షలకు రెండు ఐఫోన్లను ఆమె తీసుకుంది. తన సోదరితో కలిసి నగల దుకాణంలో రూ.15 లక్షల ఆభరణాలు కొనుగోలు చేసుకుంది. పరిచయం అయిన నాలుగేళ్లకు 2022 నవంబరు 11న నాగరబావిలోని మద్దూరమ్మ ఆలయంలో వివాహమైంది. ఒక నెల మాత్రమే తనతో కలిసి ఉన్న ఆమె శోభానానికి అంగీకరించకుండా పరారైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో ఆమెకు అప్పటికే వివాహమైందని గుర్తించారు. మోసం చేసిన ఆరోపణలపై అఖిలపై క్రిమినల్ కేసు నమోదైంది. తనపై నమోదైన క్రిమినల్ కేసును రద్దు చేయాలని ఆమె ఉన్నత న్యాయస్థానంలో వేసుకున్న అర్జీని న్యాయమూర్తి తోసిపుచ్చారు.

కోహ్లి అరెస్టుకు కుట్ర

ఉడుపి, న్యూస్‌టుడే: చిన్నస్వామి క్రికెట్ మైదానం వెలుపల తొక్కిసలాట ఘటనలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును బాధ్యునిగా చేసిన భారత క్రికెటర్ విరాట్ కోహ్లిని అరెస్టు చేసేందుకు కుట్ర జరుగుతోందని మాజీ డీవైఎస్పీ అనుపమ శెణై ఆరోపించారు. ఐపీఎస్ అధికారి దయానంద్ ఇచ్చిన నివేదికను పరిశీలిస్తే ఈ అంశం అర్థం అవుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వంలోని కొందరు పెద్దలు తెరవెనుక ఉంటూ ఈ నివేదికను తయారు చేయించినట్లు ఉందని ఆరోపించారు. డీజేహళ్లి, కేజీహళ్లిలో గతంతో ఘర్షణలకు కారణమైన వారి సాయంతో తొక్కిసలాట చేయించినట్లు ఉందని పేర్కొంటూ బెంగళూరు నగర జిల్లాధికారి జగదీశ్‌కు లేఖ రాశారు. దీనిపై తాను న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

యువత భాగస్వామ్యంతో విజయం

పచ్చజెండా ఊపుతున్న మంత్రి

రాయచూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ కార్యక్రమాల్లో యువతను భాగస్వాములను చేసేందుకు జిల్లా యువ సబలీకరణ-క్రీడాశాఖ, రాయచూరు నగర పాలక సంస్థ (కార్పొరేషన్) సంయుక్తంగా 'యువకుల కోసం నగరం- నగరం కోసం యువకులు' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆదివారం మంత్రి బోసురాజు మహాత్మాగాంధీ మైదానంలో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రులు, అధికారులు కొత్త కార్యక్రమాలను రూపొందిస్తారని, అవి అమలు కావాలంటే ప్రజల సహకారం అవసరమన్నారు. విజయవంతానికి యువతను కలుపుకుని పోవాలనే కమిషనర్ జుబిన్ మంచి ఆలోచన చేశారని ప్రశంసించారు. కమిషనర్ మాట్లాడుతూ కార్యక్రమల్లో యువత చేరాలని పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన ప్రణాళిక కాలమానిని మంత్రి ఆవిష్కరించారు. కార్పొరేషన్ అధ్యక్షుడు సాజిద్ సమీర్, సీనియర్ కౌన్సిలర్ జయణ్ణ, యువ సబలీకరణ, క్రీడాశాఖ అధికారి వీరేశ్ నాయక్ హాజరయ్యారు.

శాంతించిన కృష్ణవేణి

రాయచూరు, న్యూస్‌టుడే : ఉత్తర కర్ణాటక, తెలుగు రాష్ట్రాల జలదాయిని కృష్ణమ్మ చల్లబడింది. ఎగువ భాగాన, పరివాహక ప్రదేశంలో, చుట్టు పక్కల ప్రాంతాల్లో వరుణుడు నెమ్మదించడంతో ప్రవాహ ఉద్ధృతి సన్నగిల్లింది. ఫలితంగా ఆలమట్టి, నారాయణపురలోకి చేరే వరద నీళ్లు, డ్యామ్‌ల నుంచి కిందికి విడిచే నీటి ప్రమాణం శనివారంతో పోలిస్తే గణనీయంగా పడిపోయింది. ఆదివారం సాయంత్రం ఆరు గంటల వేళ..ఆలమట్టి ఇన్‌ఫ్లో 62,167, అవుట్‌ఫ్లో 60 వేలు, నారాయణపుర ఇన్‌ఫ్లో 65 వేలు, అవుట్‌ఫ్లో 48,025 క్యూసెక్కులకు కుదించారు. ప్రస్తుతం ఆలమట్టిలో 97.416 టీఎంసీల లభ్యత ఉంది. గడచిన రోజు గణంకాలను పరిశీలిస్తే 1.607 శత కోటి ఘనపుటడగులు తగ్గింది. నారాయణపుర 30.130 టీఎంసీలతో నిండుకుండలా మారింది. ఇందులో స్వల్పంగా 0.81 టీఎంసీలు నీటి మట్టం పెరగడం గమనించ తగ్గ విషయం. నారాయణపుర కుడి కాల్వ (రాయచూరు జిల్లా)కు వెయ్యి క్యూసెక్కులు, ఎడమకాలువకు (యాదగిరి జిల్లాకు) 4 వేల క్యూసెక్కులకు విడుస్తున్నారు.

రాయచూరులో దంచి కొట్టిన వాన

వానదేవుడు ఆదివారం రాయచూరులో విజృంభించాడు. సాయంత్రం 4 గంటల నుంచి భారీగా కురుస్తోంది. జూన్ నెల ఒకటి నుంచి జులై 19 వరకు నమోదైన వర్షపాతం కంటే ఎక్కువగా పడింది. ప్రతి రోజు మేఘాలు కనిపిస్తున్నాయే తప్పా చినుకు జాడ లేదు. ప్రజలు వానలపై ఆశలు క్రమేపీ వదిలేసుకున్నారు. తిరిగి ఆశలు చిగురిస్తున్నాయి.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

సిరివార, (మాన్వి) : తాలూకాలో పంటల సర్వే పనులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత, జీవిత బీమా సదుపాయం కల్పించాలని కర్ణాటక రాష్ట్ర పీఆర్ సంఘం డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్షుడు తిమ్మణ్ణ మరాట ఆధ్వర్యంలో సంఘం సభ్యులు స్థానిక తహసీల్దార్ అశోక్ పవార్‌కి వినతి పత్రం అందించారు. పంటల సర్వే పనులు చేపట్టేటప్పుడు సమస్యలు, ప్రమాదాలను ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. తేళ్లు, పాములు, అడవి పందులు, తేనెటీగలు దాడిచేస్తున్నాయని, కలబురగి జిల్లా సేడం, మళకేడ్, కోడా గ్రామాల్లో చోటు చేసుకున్న సంఘటనలే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు అమరేశ్‌నాయక్, మాళింగరాయ, మిరాజుద్దీన్, రంగస్వామి, నాగరాజ్, చన్నబసవ, పంపాపతి, ప్రేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సర్వే సిబ్బంది

కండక్టర్ డ్రైవింగ్ : యువతి దుర్మరణం

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే : పీణ్యా బస్టాండ్‌లో జరిగిన ప్రమాదంలో బ్యాంక్ ఉద్యోగి సుమ (25) మృతి చెందగా మరో ముగ్గురు ప్రయాణికులు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఎలక్ట్రికల్ బస్సును కండక్టర్ నడపడానికి ప్రయత్నించడంతో బస్సు ఫుట్‌పాత్ దాటి హోటల్లోకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన సుమ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈమె హెబ్బాళ్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో పనిచేస్తోందని, మండ్య తరికెరే గ్రామానికి చెందిన యువతిగా గుర్తించారు. ప్రస్తుతం సుంకదకట్టలో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నామని, ఇంతటి దుర్వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సుమ

(c) eenadu

నిధులు రూ.కోట్లు.. ■ అధికారుల పర్యవేక్షణ కరవు
నిరుపయోగంగా తొట్లు

పత్తికొండ, న్యూస్‌టుడే: దాహంతో తల్లడిల్లే పశువుల గొంతు తడిపేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో నీటి తొట్లు నిర్మించారు. గ్రామాల్లో మేతకు వెళ్లే సమయంలో, తిరిగి వచ్చేటప్పుడు వాటికి నీరందించాలన్న సదుద్దేశంతో కూటమి సర్కారు ఉపాధి నిధులు మంజూరు చేసింది. తొట్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. క్షేత్రస్థాయిలో మాత్రం పూర్తిగా సఫలం కావడం లేదు. ప్రతి గ్రామంలో అవసరం మేరకు ఒకటి లేదంటే రెండు తొట్లు నిర్మించేలా చర్యలు చేపట్టిన అధికారులు వాటి నిర్వహణను గాలికొదిలేస్తున్నారు. నిధులు దుర్వినియోగం కావడం తప్ప పశువులకు చుక్కనీరు అందని దుస్థితి. ఒక్కో తొట్టి నిర్మాణానికి రూ.32 వేలు, మరి కొన్నింటికి రూ.38 వేల వరకు ఖర్చు చేయాలన్న నిబంధన ఉన్నాయి. ఇంత వెచ్చించినా ఎక్కడా వినియోగంలో లేకపోవడం గమనార్హం.

ఖర్చు చేసి.. నిర్వహణ మరిచి..

తుగ్గలి మండలం రామాపురం గ్రామంలో రూ.38 వేలు ఖర్చు చేసి నీటి తొట్టి నిర్మించారు. ఖర్చు వివరాలతో సూచిక (బోర్డు) సైతం ఏర్పాటు చేశారు. ఇందులో చుక్క నీరు లేదు. చుట్టూ ముళ్లపొదలు పెరిగిపోయాయి. పశువులు అక్కడికి వెళ్లలేని పరిస్థితి. అయినా అధికారులు పట్టించుకోలేదు. ఫలితంగా దీనిని ఏర్పాటుచేసినా ప్రయోజనం లేకపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్యం చేరుకోలేక..

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ.20 కోట్లతో 614 పశువుల తాగునీటి తొట్లు నిర్మించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. గ్రామాల్లో నిర్మించిన అనంతరం వీటిని పంచాయతీలకు అప్పగించి నీరు నింపడం, ఇతర నిర్వహణ పనులు చేపట్టాలి. వివిధ కారణాలతో లక్ష్యాన్ని చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా కేవలం 255 మాత్రమే పూర్తయ్యాయి. ఇంకనూ 359 నీటి తొట్లు నిర్మించాల్సి ఉంది.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలోనూ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

స్నాతకోత్సవ సంబరం

కర్నూలు నగర శివారులోని ట్రిపుల్ ఐటీ కళాశాల (డీఎం)లో ఆదివారం ఏడో స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు, ప్రతిభావంతులకు బంగారు పతకాలు అందజేశారు. ట్రిపుల్ ఐటీ కళాశాల (డీఎం) ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ డాక్టర్ విజయలక్ష్మి దేశ్‌మణే తదితరులు హాజరయ్యారు. – ఈనాడు, కర్నూలు

వంకపై కన్నేసి.. ఆక్రముంచేసి

రూ.కోట్ల విలువైన స్థలాల కబ్జా

విలువైన స్థలాలపై నేతల కన్ను పడింది. కొందరు నేతలు వంక భూములను మాపి కబ్జా చేస్తున్నారు. వైకాపా హయాంలో రూ.లక్షల విలువ చేసే స్థలాలను పలువురు నేతలు కన్నేసి సొమ్ము చేసుకున్నారు. అప్పటి నేతల తప్పిదం కారణంగా ప్రస్తుతం కొందరు చోటా నేతలు కబ్జాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ సెంటు స్థలం ధర రూ.లక్షల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఎవరికివారు వంక స్థలంపై కన్నేశారు. –న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

మట్టి తోలి.. బండలు వేసి

ఎమ్మిగనూరు పట్టణంలోని సున్నం బట్టీ వీధి మీదుగా వంక వెళుతుంది. ఈ ప్రాంతంలో సెంటు స్థలం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల పలుకుతోంది. సర్వే నంబరు 195లో వంక పోరంబోకు ఖాళీ స్థలం ఉండగా కొందరు షెడ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టారు. వైకాపా హయాంలో ఒక నేత అండదండలతో వంకను చెరబట్టారు. రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు తీసుకుని డబ్బాలు, షెడ్లు వేసుకునేందుకు అనుమతులిచ్చారు. ఇలా 30కిపైగా షెడ్లు వెలిశాయి. ప్రస్తుతం ఓ నేత చొరవతో ఏకంగా వంకలోకే షెడ్లు వేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. వంకలో మట్టి తోలి బండలు వేస్తుండటం గమనార్హం. తెర వెనక కొందరు నేతలు పావులు కదుపుతుండటంతో అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా వంక కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది.

సున్నంబట్టీ వీధిలో వంకలో తోలిన మట్టి

నీరు పారడం కష్టమే

సున్నంబట్టీ వీధిలో వంక ఆక్రమణల నేపథ్యంలో నీరు ప్రవాహం చడం కష్టంగా మారింది. భారీ వర్షమొస్తే నీరంతా రామలక్ష్మమ్మ కాలనీలోకి చేరుతాయి. గూడూరు రోడ్డు, చంద్రయ్యకొట్టాల, చాకలి వీధి తదితర కాలనీల్లోకి సైతం నీరు చేరి ఇళ్లు మునిగిపోయే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో అధికారులు త్వరితగతిన స్పందించి ఆక్రమణలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

కఠిన చర్యలు తీసుకుంటాం: గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

వంకను ఆక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటాం. వంకను సర్వే చేసి హద్దులు ఏర్పాటుచేస్తాం. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేస్తాం. ప్రభుత్వ భూమి సెంటు స్థలం ఆక్రమించినా వదిలే ప్రసక్తే లేదు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.

అనుమానాస్పద లింకులను నొక్కొద్దు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: బ్యాంకు ఖాతాల్లోని నగదును దోచుకోవడమే లక్ష్యంగా సైబర్‌నేరగాళ్లు లింకులను పంపి మోసాలకు పాల్పడుతున్నారని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. అపరిచితులు పంపే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. అజ్ఞాత వ్యక్తుల సమాచారాలకు, ఫోన్‌కాల్స్‌కు తొందరపడి స్పందించవద్దన్నారు. అనుమానం వస్తే పోలీసులను సంప్రదించి నిర్ధారించుకోవాలన్నారు. ఓటీపీలు, బ్యాంకు ఖాతా, ఇతర వ్యక్తిగత వివరాలను అపరిచితులకు పంచుకోవద్దన్నారు. సెల్‌ఫోన్‌లో ఫేక్ యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకోవద్దని సూచించారు. సైబర్‌నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులు వెంటనే 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

లక్ష్య సాధన.. విజయపథాన 6

పనుల్లో కదలిక.. కల సాకారమిక

■ టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు అడుగులు ■ రూ.6.90 కోట్లతో మౌలిక వసతులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: చేనేత కార్మికుల కల నెరవేరనుంది. టెక్స్‌టైల్ పార్కు కోసం భూమి పూజ చేసిన మూడు నెలల్లో పనులు మొదలయ్యాయి. మెగా టెక్స్‌టైల్ పార్కులో మౌలిక వసతులు కల్పించేందుకుగాను మే 6వ తేదీన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ రూ.6.90 కోట్లు మంజూరు చేయించారు. అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మిగనూరు బనవాసి ఫారంలో ఉన్న భూములను చదును చేసేందుకు పనులు మొదలు పెట్టారు.

టెక్స్‌టైల్ పార్కు కోసం చెట్ల తొలగింపు

పొక్లెయిన్లు ఏర్పాటుచేసి చెట్లు తొలగించి భూమిని చదును చేసే ప్రక్రియ చేపట్టారు.

పెద్దఎత్తున ఉపాధి

మెగా టెక్స్‌టైల్ పార్కు అందుబాటులోకి వస్తే పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి. చుట్టుపక్కల ప్రాంతాల వారికి మేలు జరుగుతుంది. చేనేత పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది. వివిధ పరిశ్రమల ఏర్పాటుతో జీవనోపాధి కలుగుతుంది. వలసలు సైతం తగ్గే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో టెక్స్‌టైల్ పార్కు పనులు ముమ్మరంగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

77 ఎకరాల విస్తీర్ణంలో..

సుమారు 77 ఎకరాల్లో ఏర్పాటు చేసే పార్కులో 25 ఎకరాలను చేనేతలకు అప్పగిస్తారు. మిగిలిన 50 ఎకరాల్లో డైయింగ్, పారిశ్రామికవేత్తలు, ఇతర పెద్ద కంపెనీలకు అప్పగిస్తారు. టెక్స్‌టైల్ పార్కులో అన్ని మౌలిక వసతులు కల్పించే దిశగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం 80 అడుగుల రహదారి నిర్మించేందుకుగాను ప్రణాళికలు రూపొందించారు. జౌళి, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ముళ్లపొదలు, నీలగిరి చెట్లు తొలగించే పనులు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమం పూర్తైన తర్వాత మిగిలిన సౌకర్యాల కల్పనపై దృష్టి సారించనున్నారు. కాగా మూడు నెలలోపు అనుకున్న పనులు ప్రారంభమవడంతో చేనేతల్లో ఆనందం నెలకొంది. దశాబ్దాల కల నెరవేరుతోందని పలువురు పేర్కొంటున్నారు.

ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలోని ఆరు మండలాల్లో శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు తేలికపాటి వర్షం కురిసింది. కౌతాళం మండలంలో అత్యధికంగా 24 మి.మీ వర్షంపాతం నమోదైంది. గూడూరు 15.6, ఆదోని 9.2, కోసిగి 8.2, నందవరం 4.6, ఓర్వకల్లు 4.4 మి.మీ వర్షం కురిసింది. ఆరు మండలాల్లో 66 మి.మీ వర్షం కురవగా జిల్లా సగటున 2.5 మి.మీ వర్షంపాతం నమోదైంది. ఆదివారం రాత్రి నగరంలో అరగంట పాటు ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది.

పట్టాలు తప్పిన నాణ్యత

అధ్వానంగా రైల్వే డబ్లింగ్ పనులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రైల్వే డబ్లింగ్ పనుల్లో నాణ్యత కరవైంది. అధికారుల పర్యవేక్షణ లేక ఇష్టానుసారంగా జరుగుతున్నాయి. గుంటూరు-గుంతకల్లు మధ్య రైల్వే డబ్లింగ్ పనులు ఏడేళ్లుగా సాగుతున్నాయి. 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. రూ.3,631 కోట్లతో 426 కి.మీల మేర జరుగుతున్న పనుల్లో 347 కి.మీ. మేర పూర్తయ్యాయి. ప్రస్తుతం ప్రకాశం జిల్లా దిగువమెట్ట నుంచి గాజులపల్లె వరకు 27 కి.మీ., నంద్యాల-గాజులపల్లె మధ్య 16 కి.మీ.లు, నంద్యాల-పాణ్యం మార్గంలో 14 కి.మీ. మేర పనులు జరుగుతున్నాయి. నంద్యాల-గాజులపల్లె మార్గంలో జరుగుతున్న పనుల్లో నాణ్యత లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పొన్నాపురం వద్ద గుట్టలుగా వేసిన మట్టి

పరిమాణంలో తేడాలు

నంద్యాల రైల్వేస్టేషన్ నుంచి కుందూ నది వంతెన వైపు జరుగుతున్న పనుల్లో వాడుతున్న కంకర పరిమాణంలో తేడాలున్నాయి. ట్రాక్ నిర్మాణంలో భాగంగా వేయాల్సిన కంకర అధిక పరిమాణంలో ఉంది. 80 ఎంఎం.. ఆపై సైజు కంకర వినియోగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో 60 ఎంఎం, 80 ఎంఎం కంకరతోపాటు ఆపై పరిమాణంలో వాడుతున్నారు.

ఇష్టానుసారంగా చేస్తూ..

డబ్లింగ్ పనుల్లో భాగంగా నంద్యాల మండలం పొన్నాపురం సమీపం నుంచి జిల్లా కేంద్రం బొమ్మలసత్రం వరకు పనులు చేపట్టారు. ట్రాక్ నిర్మాణంలో భాగంగా గాజులపల్లె భైరవాణి చెరువు నుంచి ఎర్రమట్టి తవ్వి తీసుకొస్తున్నారు. పొన్నాపురం సమీపంలో జరుగుతున్న పనుల్లో భాగంగా టిప్పర్ల ద్వారా వేల క్యూబిక్ మీటర్ల మట్టి వేస్తున్నారు. కట్ట ఎత్తు చేసేందుకు మట్టి వేస్తారు. దీనిని లేయర్ల ప్రకారం వేయాలి. ఒక లేయర్ మట్టి వేసి దానిపై రోలింగ్ చేసి నీటితో క్యూరింగ్ చేయాలి. అనంతరం మరో లేయర్ మట్టి వేస్తూ పనులు చేయాలి.. ఇలా చేస్తే కట్ట పటిష్ఠంగా ఉంటుంది. నిబంధనల ప్రకారం అడుగు మందం మట్టి వేస్తే అదే స్థాయిలో నీళ్లు వేసి చదును చేయాలి. ప్రస్తుతం చెరువు మట్టిని టిప్పర్ల ద్వారా పెద్దఎత్తున వేస్తున్నారు. గుట్టలుగా వేసిన మట్టిని రోలర్ ద్వారా చదును చేసేస్తున్నారు. ఫలితంగా లెవలింగ్ రావడం లేదు.

కొరవడిన 'పర్యవేక్షణ'

మట్టి, కంకర వినియోగంలో అధికారుల పర్యవేక్షణ కరవైంది. గోపవరం భైరవాణి చెరువు నుంచి 75 వేల క్యూబిక్ మీటర్లు, నంద్యాల మండలం అయ్యలూరు మండ్లెం చెరువు నుంచి మట్టి తవ్వుకునేందుకు అధికారులు అనుమతించారు. వర్షాలు ప్రారంభమయ్యేలోగా మట్టి తవ్వి తరలించి పనులు ముగించేయాలన్న ఉద్దేశంతో హడావుడిగా సాగుతున్నాయి. కొన్ని పనులను సబ్ కాంట్రాక్టుకు ఇవ్వడంతో నాణ్యతపై ప్రభావం చూపుతున్నాయన్న విమర్శలున్నాయి.

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గోకారి

ఓపీఎస్ అమలు చేయాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేయడంతో పాటు ఓపీఎస్‌ను అమలు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి డిమాండ్ చేశారు. నగరంలోని ఎస్టీయూ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించడంతో పాటు 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కరవు భత్యాన్ని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తిమ్మన్న, గౌరవాధ్యక్షుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జాడలేని చినుకులు.. ఎండుతున్న పంటలు

పత్తికొండ, న్యూస్‌టుడే: పత్తికొండ నియోజకవర్గంలో పత్తి, కంది, ఉల్లి తదితర పంటలు సాగు చేశారు. జులైలో మేఘాలు ఊరించి ఉసూరుమనిపిస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. నియోజకవర్గంలోని పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల పరిధిలో 2.60 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగయ్యాయి. ఈ సారి ముందస్తు వర్షాల కారణంగా సాగు చేపట్టారు. తర్వాత వర్షాలు లేకపోవడంతో వేరుసెనగతో పాటు, కంది, మిరప, ఆముదం మొక్కలు దెబ్బతింటున్నాయి. నష్టాలు తప్పడం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మద్దికెర వద్ద ఎండిపోతున్న వేరుసెనగ

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన వారిపై కేసు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన పెరకం నాగాంజనేయులు, తిరుపతికి చెందిన పామిడి సత్యనారాయణ, కొండూరు మహేశ్‌లపై కర్నూలు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో సైబర్ నేరాలు, ఇతర చట్టాల కింద ఆదివారం కేసు నమోదు చేశారు. తిరుపతిలోని శ్రీపంగలూరి సీతమ్మ ఆర్యవైశ్య ధర్మసత్రం అభివృద్ధి సంఘం ఛైర్మన్‌గా మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ కొనసాగుతున్నారని, ఆయనపై ముగ్గురు నిందితులు అసత్య ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని కర్నూలుకు చెందిన ఆ ట్రస్టు కోశాధికారి ఇల్లూరి లక్ష్మయ్య ఫిర్యాదు చేశారు. డబ్బుల కోసం బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

లేనోళ్లకు పన్ను.. ఉన్నోళ్లకు దన్ను

పన్ను మదింపులో పారదర్శకత కరవు

★ నగరంలోని పెద్దపాడు రస్తాలో మూడు సెంట్లలో భవనం నిర్మించారు.. తక్కువ పన్ను విధించడంతో నగరపాలక సంస్థ ఆదాయానికి ఏటా రూ.50 వేల వరకు గండి పడుతోంది. గీతానగర్‌లో 2.75 సెంట్లలో నిర్మించిన భవనానికి తక్కువ పన్ను వేశారు.

★ పెద్దపాడు ప్రాంతంలో ఒకరు ఐదు సెంట్లలో జీ+2 భవనం నిర్మించారు.. భవన యజమాని వద్ద కొందరు రూ.1.50 లక్షలు తీసుకుని కింది ఫ్లోర్‌కు మాత్రమే పన్ను విధించారు.

ఆదోని, కర్నూలు, పురపాలకం, నంద్యాల రైతునగరం, ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో నగరపాలక సంస్థతో పాటు తొమ్మిది పురపాలికల్లో ఆస్తి పన్ను సర్వే పనులు కొలిక్కిరావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలతో పురపాలక సంఘాలు నష్టపోయాయి. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం జరిగిన తప్పిదాలను సరిచేసేందుకు పురపాలికల్లో ఆస్తి పన్ను సర్వే చేసి పన్ను పరిధిలోకి రాని వాటిని తీసుకొచ్చేలా.. ఇంటింటి సర్వేకు ఆదేశించింది.

ఇంటింటి సర్వే చేస్తున్న సిబ్బంది

ఆదాయం వచ్చే అవకాశమున్నా..

ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంఘాల్లో 3.01 లక్షల మంది ఆస్తి పన్ను చెల్లింపుదారులున్నారు. సర్వే నేపథ్యంలో 15 శాతం ఆదాయం పెరుగుతుందని అంచనా. అన్ని పురపాలక సంఘాలకు కలిపి రూ.217 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. సర్వే నేపథ్యంలో మరో రూ.32 కోట్లకుపైగా రావాలని అంచనా. క్షేత్రస్థాయిలో పారదర్శకంగా వ్యవహరిస్తే ఆదాయం సమకూరే అవకాశమున్నా ఆ దిశగా అడుగులు పడటం లేదు. సర్వే 70 శాతం కూడా పూర్తి కాన్నట్లు సమాచారం.

● కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో 1.20 లక్షల మంది ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఉన్నారు. ఏటా నగరపాలకకు రూ.90 కోట్ల పన్నుల రూపంలో సమకూరుతుంది. పన్ను మదింపు పక్కాగా చేస్తే మరో రూ.15 కోట్లు రావాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు రూ.కోటి మాత్రమే వచ్చింది. కొన్ని భవనాలకు తక్కువ కొలతలు వేయడం, రెండు, మూడు అంతస్తు

సిబ్బంది తీరుతో..

లుంటే ఒక్కదానికి మాత్రమే సిబ్బంది పన్ను విధిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

● నంద్యాలలో 49,455 మంది ఆస్తి పన్ను చెల్లింపుదారులున్నారు. ఏటా రూ.36 కోట్ల వరకు ఆస్తి పన్ను ద్వారా ఆదాయం వస్తోంది. ఇంటింటి సర్వే ద్వారా రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల అదనంగా ఆదాయం సమకూరుతుందని అంచనా. పన్నులు చెల్లించనివి.. పన్ను పరిధిలోకి రాని భవనాలు సుమారు 875 వరకు గుర్తించారు. దీనిద్వారా రూ.50 లక్షల ఆదాయం సమకూరనుంది. కాగా ఇంకనూ ఎక్కువ ఆదాయం రావాల్సి ఉండగా సర్వే పారదర్శకంగా జరగడం లేదన్న ఆరోపణలున్నాయి.

ఐక్యత చాటుతున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు

పథకాలు కాదు.. ప్రాజెక్టులు ముఖ్యం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: రాయలసీమ ప్రజలకు కావాల్సింది పథకాలు కాదని.. నీటి ప్రాజెక్టులు కావాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. ఆదోని పట్టణంలో కర్నూలు జిల్లా జల సాధన సమితి సదస్సును ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాయలసీమకు నీటి ప్రాజెక్టులు లేక కరవు ప్రాంతంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగభద్ర నది పొలాలకు సమీపంలో ఉన్నా.. నీరు అందని పరిస్థితి నెలకొందని, ఆస్పరి మండలంలో 33 గ్రామాలకు తాగునీరు సరిగా అందక ఇబ్బందిగా మారిందని గుర్తుచేశారు. ఈ గ్రామాలకు హంద్రీనీవా కాల్వ నుంచి తాగునీరు అందించాలన్నారు. రాయలసీమకు రావాల్సిన సాగు, తాగునీటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సమితి కన్వీనరు శేషాద్రిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు హలిగేర కేశం వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వేదవతి ప్రాజెక్టు కన్వీనరు ఆదినారాయణరెడ్డి, సుజ్ఞానమ్మ, మణి, శ్రీనివాసరెడ్డి, రామిరెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంబళనూరులో మొసలి కలకలం

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: కౌతాళం మండలంలోని కుంబళనూరు గ్రామ శివారులో ప్రధాన రహదారిపై ఆదివారం భారీ మొసలి కనిపించింది. రహదారిపై నుంచి ప్రవహిస్తున్న వంకలో మొసలి తిరుగుతుండటంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. వాహనదారులు, రైతులు అటువైపు వెళ్లేందుకు భయపడిపోతున్నారు. అధికారులు స్పందించి మొసలిని అక్కడి నుంచి తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉల్లి.. సాగు సన్నగిల్లి

■ పెరిగిన ఖర్చులతో రైతుల అనాసక్తి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో రైతులు క్రమంగా ఉల్లి సాగుకు దూరమవుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలన్నర గడిచింది. ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో సాధారణ సాగు 20,817 హెక్టార్లు కాగా 4,250 హెక్టార్లకు మించలేదు. ఈపాటికే పది వేల హెక్టార్లకు పైగా పంట సాగు చేయాల్సి ఉండగా సగం కూడా వేయలేదు.

– న్యూస్‌టుడే, గోనెగండ్ల

నారు... కొనేవారే లేరు

గోనెగండ్లకు చెందిన రైతు వెంకటేశ్వర్లు మూడెకరాలు కౌలుకు తీసుకుని ఉల్లి నారు సాగు చేశారు. విత్తు, కలుపు నివారణ, పురుగు మందులకుగాను రూ.70 వేలకు పైగా వెచ్చించారు. నారు కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదు. విత్తనాల ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కానరావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలోనే ప్రథమ స్థానం

ఉమ్మడి జిల్లాలో ఉల్లి సాగుకు అనుకూలమైన నల్లరేగడి నేలలు ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉల్లి సాగయ్యే జిల్లాల్లో కర్నూలు జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. గతేడాది ఖరీఫ్‌లో రాష్ట్రంలో 68,979 ఎకరాల్లో ఉల్లి సాగవగా.. కర్నూలులో 43,211, నంద్యాల జిల్లాలో 8,988 ఎకరాల్లో సాగవడం విశేషం. వర్షాభావ పరిస్థితులు, అధిక వర్షాలతో దిగుబడులు తగ్గడం.. పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో చాలాసార్లు నష్టాలే మిగులుతున్నాయి. ఈ నేపథ్యంలో అన్నదాతలు ఉల్లి సాగుపై పెద్దగా ఆసక్తి చూపడంలేదు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం

● గత ప్రభుత్వ హయాంలో ఉల్లి రైతులకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వలేదు. కొద్దిమందికి నామమాత్రంగా రాయితీ విత్తనాలు ఇచ్చారు. మద్దతు ధర రూ.770గా నిర్ణయించారు. మద్దతు ధర పెంచాలని రైతులు, రైతు సంఘాల నాయకులు ఆందోళన చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.

● 2014-19 మధ్యకాలంలో తెదేపా ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకుంది. మద్దతు ధర రాని సమయంలో మద్దతు పథకం కింద 3.10 లక్షల టన్నుల ఉల్లి సేకరించింది. రైతుల నుంచి క్వింటా రూ.800కు కొనుగోలు చేసి రైతుబజార్లకు సరఫరా చేసింది.

మార్కెట్‌పై ప్రభావం

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఏటా 3.50 లక్షల నుంచి 5 లక్షల క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు వస్తున్నాయి. గతేడాది రికార్డు స్థాయిలో 6.65 లక్షల క్వింటాళ్లు వచ్చాయి. క్వింటా రూ.5 వేలకు పైగా పలికింది. సగటున రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు అమ్ముడుపోయింది. మార్కెట్‌కు సెస్సు రూపంలో రూ.1.80 కోట్ల వరకు ఆదాయం సమకూరింది. ఈ ఏడాది రూ.50 లక్షలు కూడా వచ్చే పరిస్థితి కానరావడం లేదని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

రబీలో సాగు పెంచేలా

రైతులు ఖరీఫ్‌లో స్థానికంగా లభించే ఉల్లి రకాల సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా నష్టాలు వస్తున్నాయి. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో జాతీయ ఉద్యాన పరిశోధన, అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రైతులకు తక్కువ ధరలకు ఉల్లి విత్తనాలు పంపిణీ చేస్తున్నా చాలామంది తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. ఉమ్మడి జిల్లాలో రబీలో తక్కువ విస్తీర్ణంలో ఉల్లి సాగు చేస్తున్నారు. రబీలోనూ సాగు పెంచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హెక్టారుకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు కలిపి రూ.20 వేల వరకు రాయితీ అందిస్తోంది.

(c) eenadu

దేశ, ధర్మ పరిరక్షణకు కృషి చేద్దాం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: దేశ, ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్క భారతీయుడు బాధ్యతగా సమయం కేటాయించి, పనిచేయాల్సిన అవసరముందని విశ్వహిందూ పరిషత్ విశేష సంపర్క్ ప్రముఖ్ ప్రతాప్‌రెడ్డి, బజరంగ్‌దళ్ ప్రాంత సహ సంయోజక్ రవికుమార్ అన్నారు. ఆదోని కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా స్థాయి అభ్యాసవర్గ(శిక్షణ తరగతులు) కార్యక్రమంలో పాల్గొన్నారు. సంఘటిత సమాజం, వ్యక్తి నిర్మాణం, సంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్క హిందువు కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హనుమంతరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బీమిరెడ్డి, జిల్లా ప్రచార ప్రముఖ్ ఉపేందర్‌రెడ్డి, వీరనరసప్ప, రాఘవేంద్ర, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు హాజరైన వారితో వీహెచ్‌పీ ప్రతినిధులు

ఎండిన కొమ్మల్లో హెచ్చరిక

మద్దికెర నుంచి గుంతకల్లు వెళ్లే ప్రధాన రహదారి పలు చోట్ల అధ్వానంగా ఉంది. ఈ దారిలో వర్షం నీరు నిలిస్తే.. ఎక్కడ దారుందో? ఎక్కడ గోతులున్నాయో తెలుసుకోలేని పరిస్థితి. రాకపోకలు ప్రమాదకరంగా మారుతాయి. వాగుపై నిర్మించిన కల్వర్టు పూర్తిగా శిథిలమవుతోంది. ఇప్పటికే గోతులు పడ్డాయి. వాహనదారులు ప్రమాదాల అంచున ప్రయాణిస్తున్నా.. సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. వాహనదారులే ఇలా ఓ చెట్టుకొమ్మను ఉంచి దానికి ఓ ఎర్ర సంచిని తగిలించారు. ఇదే ప్రమాద సూచికగా భావించి జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. మద్దికెర- గుంతకల్లు ప్రధాన రహదారిలో కల్వర్టు వద్ద ఇదీ పరిస్థితి.

– న్యూస్‌టుడే, మద్దికెర

రోడ్డు చూస్తేనే వణుకు పుట్టేలా..

మండలంలోని సి.బెళగల్ నుంచి పలుకుదొడ్డి సంగాల బీటీ రహదారి పూర్తిగా గుంతలమయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2008లో నాబార్డు నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తట్టెడు మన్ను కూడా పోయలేదు. దీంతో రహదారికి సుమారు 45 పెద్ద గోతులు ఏర్పడినా.. ఇంతవరకు నిర్మాణం పనులు చేపట్టకపోవడం విచారకరం. ఇటీవల కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. గుత్తేదారు కేవలం బీటీ రహదారిపై పొక్లెయిన్‌తో సరిచేశారు. ఇప్పటి వరకు పనులు చేపట్టకపోవడంతో గుంతల రహదారి శరణ్యంగా మారింది. త్వరగా రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని సి.బెళగల్, పలుకుదొడ్డి, సంగాల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, పలుకుదొడ్డి(సి.బెళగల్)

పరిశోధనలు సాగిస్తాం.. అంకురాలు స్థాపిస్తాం

★ ఘనంగా ట్రిపుల్ ఐటీ డీఎం స్నాతకోత్సవం

ఈనాడు, కర్నూలు : ప్రజా శ్రేయస్సుకు.. దేశాభివృద్ధికి ఉపయోగపడేలా పరిశోధనలు సాగిస్తాం.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నూతన ఆవిష్కరణలు చేస్తాం.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపుతూ అంకుర సంస్థలను స్థాపిస్తామని ఇంజినీరింగ్ పట్టభద్రులు చెబుతున్నారు. కర్నూలు నగరంలోని ట్రిపుల్ ఐటీ డీఎం ఏడో స్నాతకోత్సవం ఆదివారం ఆ కళాశాలలోని కృష్ణా సెమినార్ హాల్లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ తన ప్రసంగంతో విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలు కావాలని పిలుపునిచ్చారు. నిత్య విద్యార్థులుగా ఉంటూ నూతన సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సంపాదించాలని సూచించారు. చదువులో అత్యుత్తమ ప్రతిభ చూపి.. బంగారు పతకాలు, పట్టాలు అందుకున్న విద్యార్థులు తమ భవిష్యత్తు లక్ష్యాలను ఇలా వివరించారు.

డేటా సైన్స్‌లో ఎంటెక్ చేస్తా.. - లావిష్‌సింగ్, మధ్యప్రదేశ్

ట్రిపుల్ ఐటీ డీఎంలోని అన్ని బ్రాంచల విద్యార్థులతో పోటీపడి అత్యధిక సీజీపీఏ (9.6) సాధించాను. కంప్యూటర్ సైన్స్ విభాగంలో బ్రాంచి టాపర్‌గా నిలిచా. రెండు బంగారు పతకాలు సాధించడం ఆనందంగా ఉంది. క్రమశిక్షణ, నిబద్ధతతో చదువుకోవడంతో పాటు ఆచార్యుల సలహాలు, సూచనలు పాటించడంతో మంచి స్కోరు సాధించగలిగా. డేటా సైన్స్‌లో ఎంటెక్ చేయాలన్నది నా లక్ష్యం.

సివిల్స్ ర్యాంకు సాధించాలి - బి.ప్రీతి, మెకానికల్ ఇంజినీరింగ్

మెకానికల్ ఇంజినీరింగ్‌లో బ్రాంచి టాపర్ నిలిచినందుకు నాకు బంగారు పతకం లభించింది. ట్రిపుల్ ఐటీ డీఎంలో మంచి గ్రంథాలయం, నిపుణులైన ఆచార్యులు, విస్తృతమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. దీంతో మంచి ఫలితాలు సాధించగలిగాను.

పరిశోధనలపై దృష్టిసారిస్తా

- ప్రణయ్‌సందీప్ పరాట్‌వార్, ఎంటెక్

కృత్రిమ మేధ, డేటా సైన్స్ బ్రాంచిలో ఎంటెక్ చేసి టాపర్‌గా నిలిచి బంగారు పతకం అందుకున్నా. ఏఐ, డేటా సైన్స్ రంగాల్లో పరిశోధనలు చేయాలన్నది నా లక్ష్యం. ట్రిపుల్ ఐటీ డీఎం సంస్థలో విస్తృత మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతిభకు మెరుగులు దిద్దుకోవడానికి ఎన్నో అవకాశాలున్నాయి.

రెండు బంగారు పతకాలు అందుకున్నా

- శ్రీసౌగంధిక, బీటెక్, ఏఐ, డేటా సైన్స్

నేను కృత్రిమమేధ, డేటా సైన్స్ బ్రాంచిలో బీటెక్ పూర్తిచేసి టాపర్‌గా నిలిచాను. బంగారు పతకం అందుకున్నా కళాశాలలో చదువుకున్న అన్ని బ్రాంచిల విద్యార్థినుల కంటే ఎక్కువ సీజీపీఏ సాధించా. ఇందుకు గానూ మరో బంగారు పతకం అందుకున్నా. ట్రిపుల్ ఐటీలో విద్యార్థినులకు అత్యంత అనుకూల వాతావరణం ఉంది. ప్రశాంతంగా చదువుకోవచ్చు. చదువుతో పాటు సంగీతం, నృత్యం తదితర పోటీల్లో కూడా చురుగ్గా పాల్గొనేదాన్ని. గేట్‌లో 210వ ర్యాంకు వచ్చింది.

రూ.30 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం వచ్చింది

- సీహెచ్‌వీ శ్రీవర్ధనమూర్తి, శ్రీకాకుళం జిల్లా

బీటెక్ ఈసీఈ బ్రాంచిలో 9.4 సీజీపీఏ సాధించి టాపర్‌గా నిలిచినందుకు నాకు బంగారు పతకం వచ్చింది. విశాఖ ఐఐఎం నుంచి ఆన్‌లైన్లో ఎంబీఏ కూడా చేస్తున్నాను. ప్రాంగణ నియామకాల్లో రూ.30 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగానికి ఎంపికయ్యాను. బెంగళూరు ఐఐఎస్సీలో సీటు రావడంతో ఎంటెక్ చేయాలని నిర్ణయించుకున్నా. కర్నూలు ట్రిపుల్ ఐటీ డీఎంలో దేశంలోని వివిధ రాష్ట్రాల విద్యార్థులతో కలిసి చదువుకునే అవకాశం ఉండటం విద్యార్థులకు కలిసివచ్చే అంశం.

ఈత పోటీల్లో జిల్లా విద్యార్థులకు పతకాలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : విశాఖలో ఈనెల 19 నుంచి 20వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్, జూనియర్ అంతర్ జిల్లాల అక్వాటిక్ పోటీల్లో కర్నూలు జిల్లా

సాధించిన క్రీడాకారులతో శిక్షకుడు నటరాజరావు

క్రీడాకారులు ప్రతిభ చూపారు. గ్రూప్-1 బాలుర విభాగంలో దేవసృత్‌సాయి 200, 100 మీటర్ల ఫ్రీస్టైల్, 20 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ విభాగాల్లో రజత పతకాలు సాధించాడు. బాలికల విభాగంలో హేమలత 200, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 100 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్ రజత పతకాలు, 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో కాంస్య పతకం గెలుపొందింది. గ్రూప్-2 బాలికల విభాగంలో కురువ శ్రుతి 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 800 మీటర్ల ఫ్రీస్టైల్‌లో కాంస్య పతకాలు అందుకుంది. వీరిని ఇన్‌ఛార్జి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, డీఎస్ఏ ఈత శిక్షకుడు నటరాజరావు, జిల్లా అక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహాచారి, రామకృష్ణ యాదవ్ అభినందించారు.

వేరుసెనగ క్వింటా ధర రూ.6,970

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.6,970, మధ్యస్థ ధర రూ.5,410, కనిష్ఠ ధర రూ.3,360కు వ్యాపారులు కొన్నారు. రైతులు మార్కెట్‌కు 2,505 వేరుసెనగ బస్తాలను అమ్మకానికి తెచ్చారు.

లక్ష్య సాధన.. విజయ పథాన

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : యువ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలుగులోకి తెచ్చి వారిని.. జాతి గర్వించదగ్గ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా.. లక్ష్య ఫౌండేషన్ ఇస్తున్న శిక్షణ సత్ఫలితాన్నిస్తోంది. ఈ సంస్థలో రెండేళ్ల కిందట శిక్షణ పొందిన క్రీడాకారులు విజయాల బాటలో సాగుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల జరిగిన దక్షిణ మండలం సీబీఎస్ఈ అంతర్ పాఠశాలల అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో లక్ష్య శిక్షకురాలు హారికతో పాటు క్రీడాకారులు జస్వీక, దివెన్‌కుమార్ పతకాలు సాధించారు. జాతీయస్థాయిలో విజయాలు సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు వీరు చెబుతున్నారు.

☛ అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న విద్యార్థులు

పోటీల్లో జస్వీక దూకుడు

నగరానికి చెందిన జస్వీక్ ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. క్రీడలపై మక్కువతో రెండేళ్ల కిందట లక్ష్య ఫౌండేషన్‌లో చేరింది. డీఎస్ఏ స్టేడియంలో శిక్షకురాలు హారిక వద్ద లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్‌లో తర్ఫీదు పొందింది. ◆ 2024 సెప్టెంబరు 17 నుంచి 19వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన సీబీఎస్ఈ దక్షిణ మండల అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో లాంగ్‌జంప్‌లో, ట్రిపుల్ జంప్‌లో స్వర్ణం పతకాలు సాధించింది. ◆ గతేడాది అక్టోబరు 6 నుంచి 10వ తేదీ వరకు వారణాసిలో జరిగిన జాతీయస్థాయి అంతర్ సీబీఎస్ఈ పాఠశాలల అథ్లెటిక్స్ పోటీల్లో ఆడి ప్రతిభ చూపింది. ◆ 2024లో కర్నూలు కేంద్రీయ విద్యాలయంలో జరిగిన అండర్-14 అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల పరుగులో స్వర్ణం, 400 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు పతకాలు సాధించింది. జాతీయస్థాయిలో బంగారు పతకాలు సాధించడమే లక్ష్యంగా శిక్షకురాలు హారిక వద్ద మెలకువలు నేర్చుకుంటున్నట్లు జస్విక్ చెబుతోంది.

దివెన్‌కుమార్.. పతకాల పరుగు

కర్నూలు నగరంలోని గుత్తి పెట్రోలు బంకు ప్రాంతంలో నివసించే దివెన్‌కుమార్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతున్నాడు. కేంద్రీయ విద్యాలయంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. క్రీడల్లో రాణించాలన్న పట్టుదలతో లక్ష్య ఫౌండేషన్‌లో చేరి శిక్షణ తీసుకుంటున్నాడు. ◆ 2020 ఫిబ్రవరిలో తిరుపతిలో జరిగిన జాతీయస్థాయి అంతర్ కేంద్రీయ విద్యాలయాల క్రీడా పోటీల్లో హార్డిల్స్‌లో రజతం గెలిచాడు. ◆ 2023 జులైలో హైదరాబాద్‌లో జరిగిన రీజినల్ స్పోర్ట్స్ మీట్‌లో అండర్-17 విభాగంలో 100 మీటర్ల పరుగులో రజతం, లాంగ్‌జంప్‌లో కాంస్య పతకం అందుకున్నాడు. ◆ 2023 సెప్టెంబరులో గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ మీట్‌లో 400 మీటర్ల పరుగులో కాంస్య పతకం అందుకున్నాడు. ◆ 2024 జులైలో కేంద్రీయ విద్యాలయాల స్పోర్ట్స్ మీట్‌లో 400 మీటర్ల పరుగు, 400 మీటర్ల హార్డిల్స్‌లో స్వర్ణ పతకాలు గెలుపొందాడు. ◆ 2024 సెప్టెంబరులో హైదరాబాద్‌లో జరిగిన సీబీఎస్ఈ దక్షిణ మండల అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల పరుగు, 400 మీటర్ల హార్డిల్స్‌లో స్వర్ణ పతకాలు సాధించాడు. అక్టోబరు 7 నుంచి జరుగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించాలన్న పట్టుదలతో కఠోర సాధన చేస్తున్నాడు దివెన్‌కుమార్.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

◆ ఒకరి మృతి, మరొకరు గల్లంతు

◆ నలుగురిని కాపాడిన యువకులు

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: కౌతాళం మండలంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆరుగురు ప్రయాణిస్తున్న కారు శునకాన్ని తప్పించబోయి ఎల్లెల్సీ దిగువ కాల్వలోకి దూసుకెళ్లింది. అక్కడే వ్యవసాయ పనులు చేస్తున్న కూలీలు వెంటనే వచ్చి నీటిలో కొట్టుకుపోతున్న నలుగురిని ఎంతో సాహసంగా కాపాడారు. మరో ఇద్దరిని కాపాడేలోగా మునిగిపోయారు. ఒకరి మృతదేహం లభ్యం కాగా.. మరొకరు గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

కారును బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు

కర్ణాటకలోని ధార్వాడ జిల్లాకు చెందిన హైదర్, అభిషేక్, అప్పయ్య, మంజునాథ్, సునీల్, మణికంఠలు హుబ్లీలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనానికి శనివారం కారులో వచ్చారు. ఆదివారం తిరుగు ప్రయాణంలో కొప్పళ సిద్దేశ్వర ఆలయాన్ని దర్శించుకొనేందుకు కౌతాళం మీదుగా వెళ్తున్నారు. శునకాన్ని తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు కారు ఎల్లెల్సీ కారులోకి దూసుకెళ్లింది.

సాహసం చేసి.. కాల్వలో దూకి..

అక్కడే పొలంలో పని చేస్తున్న గొట్టయ్య, గోవర్ధన అనే ఇద్దరు యువకులు సాహసం చేసి ఎల్లెల్సీ కాలువలో దూకారు. కారు తలుపులు తీసి నలుగురిని బయటకు లాగి ఒడ్డుకు చేర్చారు. మరో ఇద్దరు సునీల్(23), మణికంఠలను కాపాడేలోగా నీటిలో మునిగి కొట్టుకుపోయారు. కౌతాళం సీఐ అశోక్ కుమార్ వెంటనే స్పందించి గాలింపు చర్యలు చేపట్టారు. అగ్నిమాపక, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. సాయంత్రం 4 గంటలకు సునీల్ మృతదేహం లభ్యమైంది. గల్లంతైన మణికంఠ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. చీకటి పడటంతో గాలింపు చర్యలను నిలిపేశారు. మూడు చోట్ల కాల్వకు అడ్డంగా వల వేసి ఉంచారు. సోమవారం ఉదయమే గాలింపు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ఎల్లెల్సీ కాల్వలో సుమారు 690 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఎల్లెల్సీ డీఈ మహమ్మద్ షఫీ ఉల్లా వెంటనే స్పందించి డిస్ట్రిబ్యూటరీ గేట్లను ఎత్తి నీటిని కాల్వలకు విడుదల చేశారు. సునీల్ స్వగ్రామం గోకుల్ కాగా.. మణికంఠది తరిహాల్ గ్రామం. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు. ఘటన సమాచారాన్ని యువకుల కుటుంబాలకు తెలియజేసినట్లు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

అవుకు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. వివరాల మేరకు.. అవుకు మండలంలోని చనుగొండ్ల గ్రామానికి చెందిన బాచం వెంకటరెడ్డి(75) ఆదివారం మొక్కజొన్న పంటకు నీళ్లు కట్టేందుకు వెళ్లి ప్రమాదానికి గురయ్యారు. మోటారు ఆన్ చేసేందుకు స్టార్టర్ బాక్సు తెరవడంతో.. అందులో తీగలు జారిపడి బాక్సుకు విద్యుత్తు ప్రసారం కావడంతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. బాక్సు తెరిచిన వెంటనే షాక్‌కు గురై కుప్పకూలిపోయాడని... విషయం తెలుసుకునేలోపే మరణించినట్లు వెల్లడించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఘటనకు సంబంధించి తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు.



వెంకటరెడ్డి (పాత చిత్రం)

పెద్దతుంబళం గ్రామంలో..

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: సెంట్రింగ్ కూలి పనులు చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తిమ్మప్ప(29) మృత్యువాత పడిన ఘటన ఆదివారం ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామంలో చోటు చేసుకుంది. పెద్దతుంబళం పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దతుంబళం గ్రామానికి చెందిన తిమ్మప్ప సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇతడి భార్య మూడేళ్ల కిందట మృతిచెందారు. తిమ్మప్ప గ్రామంలో ఆదివారం సెంట్రింగ్ పనులు చేస్తుండగా.. ఇనుపకడ్డీలు పైకి ఎత్తే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలకు తాకడంతో తిమ్మప్ప విద్యుదాఘానికి గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడన్నారు. గుర్తించిన తోటి కార్మికులు చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోని చనిపోయాడన్నారు. విషయం తెలుసుకున్న మృతుడి తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు.

తిమ్మప్ప (పాత చిత్రం)

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం నిజాముద్దిన్ కాలనీకి చెందిన ఇసాక్(46) ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక నిజాముద్దిన్ కాలనీలో ఇసాక్, షంసున్ని దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. ఇసాక్ కూరగాయల వ్యాపారం చేస్తూ.. కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా.. ఇటీవల ఆయన మానసిక స్థితి సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ క్రమంలో పట్టణంలోని ఖాజీపుర సమీపంలో డిష్ వైర్లకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. గుర్తించిన పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఇసాక్ (పాత చిత్రం)

డబ్బుల విషయంలో గొడవ

చికిత్స పొందుతూ వివాహిత మృతి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: పిల్లల చదువు కోసం ప్రభుత్వం వేసిన తల్లికి వందనం డబ్బులు ఇవ్వాలని తాగుబోతు భర్త గొడవ చేయడంతో పురుగుమందు తాగిన భార్య చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు. . గోనెగండ్లకు చెందిన కురువ అంజినమ్మ(30), ఈరన్న దంపతులు కురువపేటలో నివాసం ఉంటున్నారు. ముగ్గురు పిల్లల చదువు కోసం ప్రభుత్వం అంజినమ్మ బ్యాంకు ఖాతాలో రూ.39 వేలు వేసింది. మద్యం తాగేందుకు ఆ డబ్బులు ఇవ్వాలని ఈనెల 2వ తేదీన భర్త గొడవ చేశాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అంజినమ్మ పురుగుల మందు తాగింది. డబ్బాలో ఉన్న కాస్త మందును ఈరన్న తాగాడు. గమనించిన స్థానికులు వీరిద్దరినీ కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వారానికే భర్త ఈరన్న కోలుకున్నాడు. అంజినమ్మ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. తాగుబోతు అల్లుడిలో మంచి ప్రవర్తన రావాలని పలుమార్లు పెద్ద మనుషులతో చెప్పించా..కూతురు కాపురం బాగుపడాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయిందని మృతురాలి తండ్రి కురువ శంకరప్ప కన్నీరుమున్నీరయ్యారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ విజయభాస్కర్ పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: వెల్దుర్తి మండలం కృష్ణాపురానికి చెందిన సోమ శ్రీకాంత్ (30) ఆత్మహత్యకు పాల్పడ్డారు. గ్రామానికి చెందిన సోమ తిప్పారెడ్డి కుమారుడు సోమ శ్రీకాంత్‌కు నంద్యాల జిల్లా పాణ్యంకు చెందిన ఓ యువతితో తొమ్మిది నెలల కిందట వివాహం జరిగింది. వారి మధ్య మనస్పర్థలు రావడంతో పెద్దలను ఒప్పించి ఇద్దరూ విడిపోయారు. వైవాహిక జీవితం దెబ్బతినిందన్న మనస్తాపంతో శ్రీకాంత్ కుంగుబాటుకు లోనయ్యారు. కల్లూరు ఎస్టేట్‌లో నివసించే తన బావ రామాంజనేయులు వద్దకు శనివారం వెళ్లారు. అక్కడే క్రిమి సంహారక మందు తాగారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రితో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. శ్రీకాంత్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కుక్క దాడితో చిన్నారికి గాయాలు

పాములపాడు, న్యూస్‌టుడే: ఆడుకుంటున్న చిన్నారిపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. భానుముక్కలకు చెందిన బలరాజు, దేవమ్మల ఐదేళ్ల కుమార్తె ఆదివారం ఆడుకుంటుండగా కుక్క దాడి చేసింది. చిన్నారిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు.

చేనేత పట్టు జారి

☛ పవర్ మగ్గాలతో నేతన్నలకు కడుపుకోత

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పవర్ మగ్గాలు నేతన్నలకు కడుపుకోత మిగిల్చింది. చేనేతలు తయారు చేసిన వస్త్రాలకు డిమాండ్ లేకపోవడంతో ఆదాయానికి భారీగా గండిపడింది. అమ్మకాలు తగ్గి మాస్టర్ వీవర్స్ దగ్గర రూ.కోట్ల విలువైన నిల్వలు పేరుకుపోయాయి. దీంతో కొందరు మగ్గాల సంఖ్యను కుదిస్తున్నారు. పవర్ లూమ్స్ మగ్గాలతో తయారు చేసిన చీరల ధర తక్కువగా ఉండటంతో వ్యాపారులు వాటినే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో చేనేతల వద్ద రూ.కోట్ల విలువ చేసే ముడిసరకు నిల్వలు ఉండిపోయాయి. జిల్లాలోని చేనేతల దుస్థితిపై 'న్యూస్‌టుడే' అందిస్తున్న పరిశీలన కథనం.

జిల్లాలోని ఎమ్మిగనూరు, నందవరం, నాగలదిన్నె, కోడుమూరు, ఆదోని, నంద్యాల, గూడూరు, గుడేకల్లు ప్రాంతాల్లో చేనేత కార్మికులు అధికంగా ఉన్నారు. మాస్టర్ వీవర్స్ 500 మందికిపైగానే ఉండగా.. పట్టు మగ్గాలపై 11వేలు మంది ఆధారపడ్డారు. చీరకు రూ.2500 నుంచి రూ.8500 కూలీ సొమ్ము చెల్లిస్తారు. నెలకు ఒక్కో మగ్గంపై 4 నుంచి 5 చీరలు తయారు చేస్తారు. కొందరు వ్యాపారుల వద్ద ముడిసరకు తెచ్చి.. తయారైన చీరలను వారికే ఇస్తారు. మరికొందరు ముడి సరకు తెచ్చుకొని బయట అమ్ముతారు.

మగ్గాలు నేస్తున్న కార్మికులు

గద్వాల పట్టు...

గద్వాల పట్టుకు పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. ఇక్కడ తయారైన చీరలను దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. అచ్చంగా నేతన్న నేసిన వస్త్రాలు కావడంతో డిమాండు ఉంది. కానీ మాస్టర్ వీవర్స్ తయారు చేసిన చీరలను నాలుగు నెలల నుంచి కొనుగోలు చేయడం లేదు. నేతన్న నేసిన చీరల స్థానంలో.. పవర్ మగ్గాలతో తయారు చేస్తున్నారు. వీటి ధర రెండింతలు తక్కువగా ఉండటంతో వ్యాపారులు వాటిపై మొగ్గు చూపుతున్నారు.

వ్యాపారం తగ్గి.. - శ్రీనివాసులు, మాస్టర్ వీవర్స్

గతంలో నాలుగు మగ్గాలు ఉండేవి. పట్టు చీరలకు సరైన మార్కెట్ లేకపోవడంతో మగ్గాలు తగ్గించుకున్నా. ప్రస్తుతం రెండు మగ్గాలపై సొంతంగా పట్టు చీరలు తయారు చేస్తాం. చీరలు, ముడిసరకు, మగ్గాలు అన్నీ కలిపి దాదాపు రూ.5లక్షల విలువ ఉంటుంది. గద్వాలకు చెందిన వ్యాపారి నుంచి రూ.2.50లక్షలు రావాల్సి ఉంది. నేత చీరల కన్నా.. బెంగళూరు పవర్‌లూమ్‌లో తయారు చేసిన చీరలు తక్కువ ధరలకు వస్తున్నాయని పెద్ద వ్యాపారులు అంటున్నారు. పవర్ లూమ్‌తో పూర్తిగా వ్యాపారం తగ్గింది.

రూ.1.50కోట్ల బకాయిలు - చిన్నరంగన్న, మాస్టర్ వీవర్స్, ఎమ్మిగనూరు

మాస్టర్ వీవర్స్ కింద మాకు 125 మగ్గాలు ఉన్నాయి. ధర్మవరం, బెంగళూరు, సూరత్ వ్యాపారుల నుంచి ముడిసరకు కొనుగోలు చేసుకుంటా. నాలుగు నెలలు నుంచి తయారు చేసిన పట్టు చీరలు 700కు పైగానే ఉన్నాయి. వీటి విలువ దాదాపు రూ.80లక్షలు ఉంది. 125 మగ్గాలపై ముడిసరకు 30లక్షలు పైగానే ఉన్నాయి. మహారాష్ట్ర, హైదరాబాదు, బెంగళూరులో వ్యాపారుల నుంచి దాదాపు రూ.1.50 కోట్లు రావాల్సి ఉంది. చీరలకు డిమాండు లేకపోవడంతో ప్రస్తుతం 500 చీరలు నిల్వ ఉన్నాయి. వీటి విలువ దాదాపు రూ.కోటిపైగానే ఉంది. చీరలు అమ్ముడు పోకపోతే ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి. గతంలో ప్రభుత్వం మా చీరలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు మగ్గాలు కొన్నింటిని నిలిపివేసే పరిస్థితి ఏర్పడింది. పవర్ మగ్గాలతో వ్యాపారం పూర్తిగా తగ్గింది.

EENADU Classifieds

BUSINESS SERVICES

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 73375 44439, 90146 51068, 70756 33416.

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

REAL ESTATE

PLOT FOR SALE

నగరవనం ఎదురుగా గ్లోబల్ లేక్‌వ్యూ వెంచర్‌లో ప్లాటు నెం: 94, ఉత్తరం పడమర కార్నర్ 6 1/4 సెంటు ప్లాటు అమ్మకంనకు కలదు. సంప్ర: 94415 80948.

JOBS

కర్నూలులో కొత్త అయ్యప్ప స్వామి గుడి దగ్గర B.K. సింగ్ టవర్స్ అపార్ట్‌మెంట్ నందు పనిచేయుటకు సూపర్‌వైజర్ కావలెను. 40-50 సంవత్సరాల వారు సంప్ర: 94944 82319.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఐక్యతతోనే హక్కుల సాధన

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను అసోసియేషన్ సభ్యులంతా కలికట్టుగా పరిష్కరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కట్టమంచి జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసుదేవయ్య, నాగరాజు అన్నారు. ఆదోని పట్టణంలోని నేషనల్ ఉన్నత పాఠశాలలో గోపాల్‌రెడ్డి అధ్యక్షతన అసోసియేషన్ ఆదోని నూతన కమిటీ ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఆదోని గౌరవాధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులుగా నాగేంద్ర, కృష్ణమూర్తి, కోశాధికారిగా దశరథరాముడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆదోని డివిజన్ అధ్యక్షుడు బాసీం, దూదేకులు, ఇంతియాజ్, కస్తూరిదెంట్ల సుధాకర్‌రెడ్డి, కేశవనారాయణరెడ్డి, చిన్నప్పరెడ్డి, రమేశ్‌బాబు, వరప్రసాద్, ఉసేనప్ప, అఫ్జల్ రహమాన్, పాండు, తిప్పయ్య, నాగరాజు, వెంకటేశ్, వీరేశ్, జనార్దన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

మండల సర్వసభ్య సమావేశం నేడు

ఆస్పరి, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గీతావాణి తెలిపారు. మండల అధ్యక్షురాలు సుకర ఉమాదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ప్రధానంగా తాగునీటి సమస్య, వ్యవసాయం, రహదారులు, విద్యుత్తు, ఉపాధి హామీ పథకం, రెవెన్యూ, వైద్యంతో పాటు పలు అంశాలపై చర్చ ఉంటుందన్నారు. సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 80085 73822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలోని హనుమాన్‌పేటలో జైన్ మందిరం ముందు భాగం రహదారిలో తాగునీటి పైపులైన్ లీకవుతోంది. - లక్ష్మణ, ఆదోని

✔: నీటి విభాగం సిబ్బందికి సూచించి సమస్య పరిష్కరిస్తాం.-కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

హొళగుంద, న్యూస్‌టుడే: ?: హొళగుంద పలు కాలనీ లోతట్టు ప్రాంతాల్లో పరిసరాలంతా వర్షం నీరు చేరడంతో దోమలు వ్యాప్తిచెందుతున్నాయి. సమస్య పరిష్కరించాలి. - జాంటీ వీరేష్, హొళగుంద

✔: నీరు నిలబడకుండా చర్యలు తీసుకుని దోమల మందును ఫాగింగ్ చేపడతాం.

- రాజశేఖర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి, హొళగుంద

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని రామస్వామి ఆలయం వెనుక ఉన్న దేవుడు బావిని శుభ్రం చేయించాలి. - శ్రీనివాసులు, మద్దికెర

✔: పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

- శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణ శివారులోని శిల్పా సౌభాగ్య ఎస్టేట్‌లో తాయమ్మవ్వ ఆలయం ప్రాంతం అపరిశుభ్రంగా ఉంది. దుర్వాసన వస్తోంది. - శ్రీనివాసులు, ఆదోని

✔: కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపడతాం.

- చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి, ఆదోని

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలోని లంగరబావివీధిలోని మారెమ్మవ్వ ఆలయం నుంచి జైన్ మందిరం వెళ్లే రహదారిలో చెత్త తొలగించడం లేదు. దుర్వాసన వస్తోంది. - ఫణి, ఆదోని

✔: పురపాలక పారిశుద్ధ్య విభాగం వారికి సూచించి సమస్య పరిష్కరిస్తాం.

- కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

పద్మశ్రీ మంజమ్మకు సన్మానం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత మంజమ్మ జోగతి ఆదివారం పర్యటించారు. ఓ కార్యక్రమానికి వచ్చిన ఆమెను ఆర్యవైశ్య సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నగరేశ్వరస్వామి, మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆలయాలను సందర్శించారు. అనంతరం ఆమెను జ్ఞాపికతో సత్కరించారు. కన్నడ రంగస్థల నటి, గాయని, జానపద నృత్యకర్తే, కళాకారిణిగా జానపద అకాడమీ అధ్యక్షురాలిగా ఆమె అందించిన సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మిరియాల రామ్‌ప్రసాద్, కార్యదర్శి బింగి మనోహర్, ఉపాధ్యక్షుడు కరవళ్లి సత్యనారాయణ, కోశాధికారి వాసు, మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆలయ ధర్మకర్త రాచోటి సుబ్బయ్య, రవీంద్ర, తదితరులు రాష్ట్రపతి అవార్డు

మంజమ్మ జోగతిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం పెద్దలు

చినుకు రాలితే చిక్కులే

◆ పట్టణ దారుల్లో పొంచి ఉన్న ప్రమాదం
◆ మురుగు కాలువలపై మూతలేవీ?

ఆదోని పట్టణంలోని పురపాలక రహదారి మలుపు ప్రాంతంలోని కంజాని రేడియో హౌస్ ప్రాంతంలోని మురుగు కాలువ. వర్షం వస్తే రహదారిపై మురుగు చేరుతుంది. కాలువ కనిపించకుండా పోతోంది. పాదచారులు పొరపాటున అడుగేస్తే మురుగు కాలువలో కొట్టుకుపోవాల్సిందే. ఇక్కడి ప్రాంతంలో వ్యాపార కేంద్రం కావడంతో జనంతో నిండి ఉంటుంది. వీటిపై మూతలు మూస్తే ప్రమాదాలు నివారించవచ్చు.

☛ పట్టణ నడిబొడ్డున ఉన్న 167ఎ జాతీయ రహదారిపై అంబేడ్కర్ కూడలిలో మూడు వైపులా మురుగు వంక ఉంది. పది అడుగుల లోతు ఉండటంతో వంక పూర్తిగా మునిగిపోయి, నీరు నిలుస్తోంది. ఈ ప్రాంతంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. మార్కెట్ ప్రాంతం కావడంతో జనం రద్దీగా ఉంటారు. రహదారి కనిపించక, వంక వైపు అడుగేస్తే కొట్టుకుపోయే ప్రమాదముంది. కనీసం రక్షణ గోడలు సైతం లేవు.

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో నోళ్లు తెరిచిన మురుగు వంకలు, కాలువలతో ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. పట్టణంలో 14-15 కి.మీ. మేర వంకలు ప్రవహిస్తున్నాయి. మట్టూర్‌వీధి మినహా మరెక్కడా వంకలపై రక్షణ గోడలు లేవు. అంబేడ్కర్ కూడలిలో మూడు వైపులా పది అడుగుల వెడల్పుతో ప్రవహించే వంకలిది ఇదే పరిస్థితి. కనీసం వంకపై ఇనుప జాలి కూడా ఏర్పాటు చేయలేదు. వరద ప్రవాహంలో రహదారి కనిపించక వంకలో కాలు వేస్తే కొట్టుకుపోవాల్సిందే. పురపాలక రహదారిలో కంజాని రేడియోస్, రోషన్ లాడ్జి మలుపు ప్రాంతం, మార్కండేయ గుడి ఆలయం వెనుక భాగం, పాత ఆశాపంచిత మలుపు ప్రాంతం, షైబిబజార్ కేంద్రం, మర్చంట్ క్లబ్ ముందు భాగం, మరాఠివీధిలోని పాపమ్మ మఠం ముఖద్వారం, బుడ్డేకల్లు, మేదర మసీదు తదితర ప్రాంతాల్లో వంకలకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. వీటి వల్ల జనం రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇవన్నీ జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాలు.

ఇలా చేస్తే.. మేలు

ప్రధాన మార్కెట్ ప్రాంతాల్లో ప్రవహిస్తున్న వంకలకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించి, హెచ్చరిక చర్యలు బోర్డులు ఏర్పాటు చేయాలి.

● లోతుగా ఉండే మురుగు కాలువలపై ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసి మూతేయాలి. ప్రమాదకరంగా ఉన్న మార్గాలను పటిష్ఠపరచాలి.

● బలహీనంగా ఉన్న కల్వర్టులు గుర్తించి.. వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలి.

● రైల్వేస్టేషన్ దారిలో వర్షం వస్తే వంక నీరు పొంగిపొర్లి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తుంది. ఇక్కడి ప్రాంతంలో కల్వర్టు ఎత్తు పెంచాలి. దీంతో పాటు రైల్వే ట్రాక్ కింది భాగంలో మురుగు వంక విస్తరించాలి.

● తిమ్మారెడ్డి బస్టాండు ప్రాంతంలో క్రాంతినగర్ ముఖద్వారంలో బలహీన పడిన వంక రక్షణ గోడలు కొత్తగా నిర్మించాలి. వరద ప్రవాహం ప్రాంతాల్లో మట్టి కోతకు గురి కాకుండా సీసీ లైనింగ్ పనులు చేయాలి.

పాచిపట్టినా.. పట్టించుకోరు

జొన్నగిరి బీసీ కాలనీలో మినీ ట్యాంకు నుంచి నీరు వృథా అవుతోంది. కుళాయిలతో పాటు ట్యాంకుకు నెర్రలిచ్చి నీరు వృథా అవుతోంది. బిరడాలు లేకపోవడంతో కర్రముక్కలు, ప్లాస్టిక్ పేపర్ నొక్కి పెడుతున్నారు. నీరంతా వృథాగా పోతోంది. టాంకు చుట్టూ పాచిపట్టిపోయింది. ఏటా వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు కుళాయిలకు బిరడాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జొన్న గిరి(తుగ్గలి)

నేలపైనే.. విద్యుత్తు తీగలు

పొలాల వెంబడి ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలపై ఉండాల్సిన తీగలు నేలపై వాలుతూ ప్రమాదకరంగా మారాయి. రైతులు, పశువులకు సైతం ఇవి మృత్యుపాశాలుగా తయారయ్యాయి. బొమ్మనపల్లి-రాంపురం గ్రామాల మధ్య పొలం గట్ల పైనే ఉన్న విద్యుత్తు తీగలు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు పణంగా పెట్టాల్సిందే. అధికారులు ఇప్పటికైనా స్పందించి సరిచేయాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, మద్దికెర

బిణిగేరి.. పారిశుద్ధ్యం లేదుమరి

ఆస్పరి మండలంలోని బిణిగేర గ్రామంలో పారిశుద్ధ్యం లోపించింది. ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాల్వలు లేవు. దీంతో ఇళ్లలోని మురుగంతా రహదారిపైనే పారుతోంది. సచివాలయ ఉద్యోగులు సైతం ఈ మురుగులోనే రాకపోకలు సాగిస్తున్నారు తప్ప.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగాలు ప్రబలుతున్నాయని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఆస్పరి

లీకేజీతో భవిష్యత్తులో ప్రమాదమే

హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్వి మండలం చింతకుంట గ్రామ శివారులోని తుంగభద్ర దిగువ కాల్వ 133/900 కి.మీ. పరిధి వద్ద లీకేజీతో నీరు వృథా అవుతోంది. కాల్వకు ఒకవైపు వంతెన కింది భాగంలో రాతి కట్టడం నుంచి నీరు లీకవుతుండటంతో భవిష్యత్తులో మరింత ప్రమాదం తప్పేలా లేదని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలలుగా ఈ పరిస్థితి ఉన్నా.. కాల్వ సిబ్బంది, అధికారులు పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా టీబీ బోర్డు అధికారులు స్పందించి భవిష్యత్తులో ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

నియోజకవర్గానికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి

చిప్పగిరి, న్యూస్‌టుడే: ఆలూరు నియోజకవర్గానికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి ప్రభుత్వాన్ని కోరారు. చిప్పగిరిలో ఆదివారం జరిగిన సమావేశంలో వైకాపా నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. జిల్లాలోనే ఆలూరు నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల రహదారులు అధ్వానంగా ఉన్నాయన్నారు. సరైన ఉపాధి సౌకర్యాలు లేక కూలీలు వలసలు వెళ్తున్నారని ఆయన చెప్పారు. రెండేళ్లగా తీవ్రంగా నష్టపోయి, అప్పులపాలైన మిరప రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మొలగవల్లి కొట్టాల రాజును అభినందించారు. సమావేశంలో ఎమ్మెల్యే సోదరులు శ్రీరాములు, వెంకటేష్, కుమారుడు చంద్రశేఖర్, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించి.. వలసలు నివారించాలి

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా.. జిల్లా పశ్చిమ ప్రాంత వాసుల వలసలు మాత్రం ఆగడం లేదని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. తిరుపతి పర్యటనకు వెళ్లిన ఆయనకు ఆదివారం అక్కడ వైకుంఠపురంలో కర్నూలు జిల్లాతో పాటు ఆదోని ప్రాంత వాసులు వలసొచ్చి జీవనం సాగిస్తున్నారన తెలుసుకుని, ఆ ప్రాంతానికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. సాగు, తాగు నీటి అవసరాలు తీరిస్తే ఇక్కడ వలసలు గణనీయంగా తగ్గుతాయని, స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పిస్తే, సమస్యలుండవన్నారు. మీ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కర్నూలు జిల్లా వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.పార్థసారథి

గ్రహణ మేళాకు ఆహ్వానం

ఆస్పరి, న్యూస్‌టుడే: మండలంలోని హలిగేర గ్రామ సమీపంలో శ్రీకూర్మక్షేత్రంలో సెప్టెంబరు ఏడో తేదిన జరిగే రాహుగ్రస్త సంపూర్ణ చంద్ర గ్రహణ మేళాకు పశ్చిమ గోదావరిలోని ఏలూరులో ప్రణవపీఠం పీఠాధిపతి బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ శాస్త్రీని ఆహ్వానించినట్లు కూర్మనారాయణ క్షేత్ర నిర్వాహకులు నరేష్, గ్రామపెద్దలు ప్రసాద్‌రెడ్డి, గంగాధర్, జనార్దన్‌స్వామి తెలిపారు. ఇటీవల వారిని కలిసి గ్రహణ మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించినట్లు తెలిపారు. ప్రతి శనివారం, గ్రహణ కాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రహణ మేళా గోడపత్రాలు విడుదల చేస్తున్న నిర్వాహకులు

తీరు మార్చుకోకపోతే నష్టపోతారు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు తీరు మార్చుకొని.. ప్రశాంతమైన జీవితం గడపాలని.. లేదంటే భారీగా నష్టపోతారని రెండో పట్టణ సీఐ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదోని రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు, వివిధ కేసుల్లో నిందితులకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. అల్లర్లు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రవర్తన మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిందితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

కోయిలకొండ(కృష్ణగిరి), న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగానే ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు సాగుతున్నారని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. కృష్ణగిరి మండలం కోయిలకొండ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. తెదేపా యువనాయకులు కేఈ నందీష్ బాబు, పత్తికొండ మార్కెట్ యార్డు ఛైర్మన్ నబిసాహెబ్, మండల, గ్రామ తెదేపా నాయకులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మండల తెదేపా అధ్యక్షుడుమద్రిశ్రీరాములు, రఫీ, సర్పంచి లక్ష్మీశ్వరయ్య,చంద్ర శేఖర్‌గౌడు, చిట్యాల నాగరాజు, మాధవకృష్ణ, రంగడు, రఘు, మండల, గ్రామ తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఆదోని తెదేపా బాధ్యుడు, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షి నాయుడు, పరిశీలకుడు ఏపీసీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఆదోని పట్టణం హనుమాన్‌నగర్‌లో ఆదివారం తెదేపా ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.

ఆదోని పట్టణం హనుమాన్‌నగర్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, కురవ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, గుడిసె కృష్ణమ్మ, రంగస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, ఉమ్మి సలీం, రామస్వామి, శంకర్, రంగన్న, తిమ్మప్ప, లక్ష్మీనారాయణ, అంజి, అంజనప్ప,రంగన్న, నరసింహులు, మహాదేవప్ప, బ్రహ్మ, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెర్నేకల్ (దేవనకొండ), న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా మండల నాయకులు నాయకంటి రాజశేఖర్, బండ్లయ్య, తెదేపా పట్టణ అధ్యక్షుడు మస్తాన్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు దేవనకొండలోని పదో వార్డు, బిసెంటర్ గ్రామంలో తెదేపా నాయకులు వెంకటస్వామి, రంగన్న తదితరులు నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు.

రాంపల్లి(తుగ్గలి), న్యూస్‌టుడే: రాంపల్లి గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని తెదేపా నాయకులు చేపట్టారు. పార్టీ రాష్ట్ర నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకటరాముడు తదితరులు కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, తిరుపాల్‌నాయుడు, శివరాముడు, శ్రీనివాసులు, వెంకటరాముడు చౌదరి పాల్గొన్నారు.

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే తెదేపా ధ్యేయమని మండల తెదేపా అధ్యక్షుడు బలరాంగౌడ్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం వెల్దుర్తిలో పర్యటించారు. కార్యక్రమంలో వెల్దుర్తి యూనిట్ ఇన్‌ఛార్జి గోపాల్‌గౌడ్, తెదేపా నాయకులు సూరి, చిట్టిబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: తెదేపా జెండా ఆవిష్కరించిన తెదేపా నాయకురాలు వైకుంఠం జ్యోతి, నాయకులు

ఆస్పరి న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని తెదేపా రాష్ట్ర మహిళ నాయకురాలు వైకుంఠం జ్యోతి, శివప్రసాద్ అన్నారు. మండలంలోని చిన్నహోతూరు గ్రామంలో మాజీ సర్పంచి వరదరాజులు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు నరసన్న, సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణయాదవ్, నాయకులు మనోహర్, సుదర్శన్, రాఘవేంద్ర యాదవ్, వీరేష్, నెట్టికల్లు, జీవన్‌కుమార్, గోవిందు, శేషిరెడ్డి, మధు, విక్రమ్, రాజశేఖర్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని మండలం జి.హోసళ్లి గ్రామంలో ఆదివారం తెదేపా సీనియర్ నాయకుడు మదిరె భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు సొదీరవూప, రామచంద్ర, ఫకృద్దిన్, బుద్దారెడ్డి, మల్లికార్జున, సోమశేఖర్‌రెడ్డి, గోపాలరెడ్డి, శ్రీనివాసులు, మల్లేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షలతో తాగునీటి పైపులైను పనులు

చిప్పగిరి, న్యూస్‌టుడే: తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.5 లక్షల వ్యయంతో పైపులైను పనులను ఆదివారం చేపట్టారు. నగరడోణలోని కొండ ప్రాంతంలోని కాలనీ వాసుల తాగునీటి సమస్యలపై పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన సంబంధిత శాఖాధికారులు ఇటీవల బోరు వేశారు. ఎంపీపీ నిధులతో కొత్తగా పైపులైను ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ సర్పంచి మల్లమ్మ తెలిపారు. వారం రోజుల్లో పనులు పూర్తిచేసి కాలనీ వాసులకు తాగునీటి సరఫరా చేస్తామన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ఎస్కేడి.కాలనీలో సంస్కృతి ఫంక్షన్ హాల్‌లో ఆవోప, వామ్(వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆవోపా అధ్యక్షుడు శ్రీనాథ్‌గుప్తా,

పరీక్షలు చేస్తున్న వైద్యులు, పక్కన ఆవోపా సంఘం నాయకులు

ఎన్ఆర్ఐ కాకుబాల్ నగేష్‌కుమార్ సహకారంతో హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వ్యాస్కులర్ ఆస్పత్రి, నంద్యాల శాంతిరాం ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు కార్యక్రమం చేపట్టారు. ప్రముఖ వ్యాపారవేత్త రాచోటి సుధాకర్ శిబిరాన్ని ప్రారంభించారు. రూ.4500 విలువ చేసే కలర్ డాప్లర్, టూడీ ఎకో పరీక్షలు, రక్తనాళాలు తదితర పరీక్షలను 358 మంది ఉచితంగా నిర్వహించారు. 76 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డైమండ్ రఘు, వెంకటేశ్వర్లు, రత్నయ్య, రాధాకృష్ణ, రవికుమార్, మమతాశ్రీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దిగువ ఆయకట్టుకు సాగుకళ

◆ పెరిగిన పెట్టుబడి ఖర్చులు
◆ జలచౌర్యం అరికట్టాలంటున్న రైతులు

హాలహర్వి, ఆదోని ఎస్కేడీ కాలనీ, దేవనకొండ, న్యూస్‌టుడే: ఆదోని డివిజన్ పరిధిలో తుంగభద్ర దిగువ కాలువలో పీరు ప్రవహిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో సుమారు 48 వేల ఎకరాల ఆయకట్టు సాగువుతోంది. కొన్ని వందల ఎకరాలకు రైతులు నానాయకట్టు కింద కూడా రైతులు పంటలు సాగు చేస్తున్నారు. డివిజన్‌లోని హాలహర్వి, హొళగుంద, ఆదోని, కౌతాళం, ఎమ్మిగనూరు, పెద్దకడబూరు. గోనెగండ్ల మండలల్లో దిగువ కాలు పారుతుంది. ఈ ఏడాది పంటలకు పెట్టుబడులు పెరుగుతాయని అన్నదాతలు అంచనా వేస్తున్నారు. ఇంధనం, కూలీల ధరలు పెరగడంతో పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి నాట్లు మొదలుకుని కూలీలు, యంత్రాలు, ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది. ఎకరా వరి నాటుకు రూ.35 వేలు నుంచి రూ.40 వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎరువులు, కలుపుతీత, సస్యరక్షణ చర్యలతో కలుపుకొని పంట చేతికందే సరికి రూ.70 వేలు నుంచి రూ.85 వేలు వరకు ఖర్చవుతుందని వ్యవసాయదారులు ఆందోళన చెందుతున్నారు.

ఎల్లెల్సీ కింద పొలం పనుల్లో నిమగ్నం

ఇదీ పరిస్థితి..

◆ దేవనకొండ మండలంలోని కరివేముల చెరువుకు హంద్రీనీవా నీరు చేరడంతో ఆయకట్టు కింద ఉన్న 200 ఎకరాలు వరి నాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. హంద్రీనీవాకు సమృద్ధిగా నీరు విడుదల చేయడంతో కరివేముల చెరువు ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

◆ 'విత్తనం కొరత లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. వరి పంటకు అవసరమైన ఎరువుల సమస్యలు లేకుండా అన్ని గ్రామాల్లో నిల్వలు ఉంచాలి. ఇటు చివరి అయకట్టుకు నీరు అందించేలా అధికారులు దృష్టి సారించాలి. కాల్వపై గస్తీ ఏర్పాటు చేసి జలచౌర్యం జరగకుండా అరికట్టాలి' అని జె.హొస్సళ్లి గ్రామానికి చెందిన రైతు పడదయ్యస్వామి తెలిపారు.

◆ జె.హొస్సళ్లి సాగు నీటి సంఘం అధ్యక్షుడు మల్లప్ప మాట్లాడుతూ.. దిగువ కాల్వపై ఆయకట్టు రైతులకు సకాలంలో నీరు అందేలా చర్యలు చేపట్టాం. నీటి వృథాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు చొరవ చూపాలి. నీటి చౌర్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వం

- ఈశ్వర్, ఏఈ

దిగువ కాల్వ పర్యవేక్షణ అధిక భాగం టీబీ బోర్డు పరిధిలోకి వస్తుంది. ఎక్కడ ఎలాంటి నీటి చౌర్యం జరిగినా వారు తగిన చర్యలు తీసుకుంటారు. మన వద్ద హాలహర్వి, హొళగుంద, మండలాలు మధ్య కర్ణాటక గ్రామాలు సైతం ఉన్నాయి. బోర్డు, అధికారులు సమన్వయంతో జలచౌర్యం జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచి ఆయకట్టు రైతులకు సకాలంలో నీరు అందించే ఏర్పాటు చేస్తాం. ఎక్కడైనా జలచౌర్యం జరిగితే తమకు సమాచారం అందించాలి. వెంటనే అలాంటి వాటిపై చర్యలు తీసుకుంటాం.

జన్మదిన శుభాకాంక్షలు

గౌ॥ శ్రీమతి కె.వరలక్ష్మి గారికి మా హృదయపూర్వక పుట్టిన రోజు శుభాకాంక్షలు. మీరు నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ..

శ్రీమతి కె.వరలక్ష్మి గారు
B.Sc., BL
మాజీ ZPTC సభ్యురాలు, తుగ్గలి
మాజీ జిల్లామహిళా శిశు సంక్షేమ శాఖ ఛైర్మన్
IOC డీలర్, తుగ్గలి

ఎం.రామ్‌ప్రసాద్

కె.గుండయ్య
Manager, తుగ్గలి

సి.రంగస్వామి

బేస్త రామమూర్తి

ఎం.రమేష్

(c) eenadu

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

బృందావనుడి దర్శనానికి భారీగా కర్ణాటక భక్తులు

ఆలయానికి వస్తున్న కన్నడ భక్తులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: బృందావనుడి దర్శనార్థం కర్ణాటక నుంచి భక్తులు తండోపతండాలుగా వచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో రాఘవేంద్ర స్వామి మూల బృందావనం దర్శనార్థం కన్నడ భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. దీంతో భక్తులతో జనసంద్రంగా మారింది. నదిలో స్నానం చేసి గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని.. అన్న ప్రసాదం స్వీకరించి తిరుగు ప్రయాణం అయ్యారు.

నిరీక్షించి.. నీరసించి

◆ యూరియా దొరక్క రైతులకు ఇబ్బందులు

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే: కౌతాళం మండలంలో రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. గత రెండు మూడు రోజులుగా రైతులు యూరియా కోసం మండల కేంద్రంలో పడిగాపులు కాస్తున్నా ఒక బస్తా యూరియా దొరకని పరిస్థితి నెలకొంది. కౌతాళం రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీ చేస్తారనే సమాచారంతో రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే నిరీక్షించారు.

పట్టించుకోని అధికారులు

రైతులు పడిగాపులు కాస్తున్నా వ్యవసాయాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గత నాలుగు రోజులుగా రైతులకు టోకెన్లు ఇస్తున్నారు. వారికి కావాల్సి వ్యక్తుల నుంచి మాత్రమే డబ్బులు కట్టించుకున్నారని.. మిగతా రైతుల నుంచి తీసుకోవడం లేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. రైతు సేవా కేంద్రాలకు రావాల్సిన ఎరువులను రాజకీయ నాయకులకు, ఫర్టిలైజర్ దుకాణాలకు లారీల లోడు దింపుతున్నారని వాపోయారు. సామాన్య రైతులకు అందకుండా ఇతరులకు తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్య రైతులు మాత్రం నిత్యం రైతు సేవా కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నారు.

కౌతాళంలో రైతు సేవా కేంద్రం వద్ద రైతులు

మూడు రోజులుగా వస్తున్నా.. –ఈరన్న, గోతులదొడ్డి

నేను 16 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను. గత మూడు రోజులుగా యూరియా కోసం గోతులదొడ్డి గ్రామం నుంచి వచ్చి కౌతాళంలో పడిగాపులు కాస్తున్నా ఒక బస్తా యూరియా దొరకడం లేదు. ప్రస్తుతం వర్షం కురుస్తోంది. పంటలకు ఎరువులు వేయాలనుకున్నా యూరియా దొరకడం లేదు. వ్యవసాయాధికారులు మాత్రం అప్పుడు, ఇప్పుడు అంటూ మూడు రోజులుగా తిప్పుతున్నారు.

సుంకేసులకు స్వల్పంగా పెరిగిన వరద

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి స్వల్పంగా వరద పెరిగింది. దీంతో ఆదివారం 9గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి 42 వేల క్యూసెక్కుల వరద జలాలు వచ్చి చేరుతుండగా.. దిగువకు 39,708 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 1540 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జలాశయం ఇంజినీరు మహేంద్రరెడ్డి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం 80085 73794
కోసిగి 9550434095

గూడూరు, న్యూస్‌టుడే: ?: మురుగు కాలువ శుభ్రం చేయడం లేదు. దుర్వాసనతో పాటు దోమల బెడద తీవ్రంగా ఉంది. -గోవిందు, సంజీవయ్య నగర్, గూడూరు.

✔: శానిటరీ అధికారికి సూచించి సమస్యను పరిష్కరిస్తాం. -రమేష్‌బాబు, కమిషనర్.

సి.బెళగల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పారిశుద్ధ్యం లోపించి జ్వరాలతో బాధపడుతున్నాం. చర్యలు తీసుకోవాలి. - రాజు, ముడుమాల.

✔: ప్రతి రోజు వైద్య శిబిరం ఏర్పాటు చేయిస్తున్నాం. నీటిని వేడి చేసుకొని తాగాలి. మెరుగైన సేవలు అందిస్తాం. - రాణెమ్మ, ఎంపీడీవో.

స్పందనకు వందనం

పిల్లర్ల తొలగింపు

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద ప్రమాదకరంగా ఉన్న పిల్లర్లు తొలగించారు. 'పిల్లరుతో బడి పిల్లలకు ప్రమాదం' అనే శీర్షికతో ఈనెల 12వ తేదీన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్రవార్తకు అధికారులు స్పందించారు. పిల్లర్లు తొలగించి కొత్తవాటి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎమ్మిగనూరుకు వెళ్లే రహదారిలో విద్యుత్తు నియంత్రిక తక్కువ ఎత్తులో రక్షణ లేకుండా ఉండటంపై గత నెల 28న 'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న నియంత్రికకు విద్యుత్తు శాఖ అధికారులు రక్షణ ఏర్పాట్ల కోసం నిర్మాణం ప్రారంభించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ఆరోగ్యమే మహాభాగ్యం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటూ విద్యలో రాణించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, తదితరులు

హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యాన్సర్, ఇతర వ్యాధులు రాకుండా యువతకు, విద్యార్థులకు అవగాహన అవసరమన్నారు. విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువుకోవాలని సూచించారు. ఎమ్మిగనూరు నవోదయలో చదివిన విద్యార్థులు కలెక్టర్లు, జడ్జిలు, ఇతర ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. ఎంతో మందిని ఉన్నత స్థానంలో నిలిపిన ఈ విద్యాలయానికి దేశవ్యాప్తంగా గుర్తింపు తేవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మావతి, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కాంతి నాయుడు, వైద్యులు రవీంద్రబాబు, సాయివాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం, వెల్ఫేర్ ట్రస్ట్, బచ్చు జానకి రామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీ చేశారు.

రహదారి పనులకు భూమి పూజ

నవోదయ విద్యాలయంలో రూ.35లక్షలతో నిర్మించే అంతర్గత రహదారుల పనులకు ఎమ్మెల్యే బీవీ పూజలు నిర్వహించారు. విద్యాలయానికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ మల్లయ్య, డీఈ నాగరాజు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటాం

పెంచికలపాడు(గూడూరు గ్రామీణం), న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. మండలంలోని పెంచికలపాడు గ్రామానికి చెందిన తలారి గోపాల్ భార్య, తలారి రంగమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.62038 విలువైన చెక్కును ఆదివారం ఎమ్మెల్యే స్వగృహంలో బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు జే.సురేష్, సీనియర్ నాయకులు నాగేష్, వెంకట రాముడు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

కరపత్రాలు ఇస్తున్న చంద్రశేఖర్ తదితరులు

కృష్ణదొడ్డి (సి.బెళగల్), న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని మండల తెదేపా కన్వీనరు బి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని కృష్ణదొడ్డి గ్రామంలో ఆదివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో తెదేపా కార్యకర్తలు తిరుమలేశ్, గోకారి, మద్దిలేటి, రాముడు తదితరులతో ఇంటింటా పర్యటిస్తూ తెదేపా చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు.

సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రజలకు అందిస్తున్న పథకాలను పట్టణంలోని 4,6 వార్డుల్లో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మధు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఇంటికి సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలే లక్ష్యంగా తెదేపా పాలన కొనసాగుతోందని కౌన్సిలర్ కోడుమూరు షాషావలి అన్నారు. నగర పంచాయతీలోని 185వ బూత్ పరిధిలో ఆదివారం తెదేపా పట్టణ కన్వీనరు కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రేమట వెంకటేష్, నాగప్పయాదవ్, హనుమంతు, కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం పడకేసి.. రోడ్డు పక్కనే పడేసి

పట్టణంలోని కల్లుపేట వీధిలో రహదారి పక్కనే చెత్త పడేస్తున్నారు. వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సమయానికి చెత్త తొలగించకపోవడంతో పశువులు వ్యర్థాలను, ప్లాస్టిక్ సంచులను తినేస్తున్నాయి. న్యూస్‌టుడే, కోడుమూరు పట్టణం

మురుగు కుంటలు.. నడవలేక తంటాలు

మండలంలోని కల్లుకుంట గ్రామ ఎగువ బీసీ కాలనీలో ఇళ్ల ముందు మురుగు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాల్వలు నిండి అంతర్గత రహదారిపై ప్రవహిస్తుండటంతో కుంటలు ఏర్పడ్డాయి. దిగువన మురుగు కాల్వ శుభ్రం చేయనందునే ఈ దుస్థితి నెలకొందని కాలనీవాసులు వాపోతున్నారు. ఏళ్ల నుంచి ఈ సమస్య వేధిస్తున్నా.. పట్టించుకొనే నాథుడేలేరని ప్రజలు వాపోతున్నారు. ఇళ్ల ముందు మురుగు నిలవడంతో కాలనీలో మహిళలు నిత్యం ఘర్షణలకు పాల్పడే దుస్థితి ఏర్పడింది. అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, పెద్దకడబూరు

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడి ఎన్నిక

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా ప్రతాప్ శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆదివారం ఆ సంఘం నాయకులు తెలిపారు. ఆర్యవైశ్య

ప్రతాప్ శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

సంఘం సభ్యులు ప్రతాప్ శ్రీకాంత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఈరన్నశెట్టి, ప్రతాప్ ఉరుకుందయ్యశెట్టి, నాగయ్య, తక్కశిల సుబ్రహ్మణ్యం, దేవికి వెంకటేశ్, చంద్రశేఖర్, శ్రీధర్, వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

శిథిల గ్రంథాలయంలో అవస్థలు

మంత్రాలయం, న్యూస్‌టుడే: శిథిలమైన గ్రంథాలయ భవనానికి రూ.10 వేల అద్దె చెల్లించలేమని గ్రంథాలయ అధికారిణి వసంత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రాలయం రామచంద్ర నగర్‌లో ఇంట్లో ప్రభుత్వ గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. గతవారం రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షానికే గ్రంథాలయంలోని పుస్తకాలు తడిసిపోతున్నాయి. గత కొంత కాలంగా రూ.6 వేలు ఉన్న అద్దెను రూ.10 వేలకు పెంచారని.. అంత అద్దె చెల్లించలేమని అధికారిణి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు. అంతవరకు నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల గదుల్లోకి మార్చడానికి అధికారులు అనుమతి ఇవ్వాలని, లేదంటే పుస్తకాలు, గ్రంథాలు వర్షానికి తడిసి పనికిరాకుండా పోతాయని ఆమె పేర్కొన్నారు.

అద్దె గ్రంథాలయం ముందు అధికారిణి వసంత

సంక్షిప్త సమాచారం

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్‌లో సోమవారం తహసీల్దారు వెంకటలక్ష్మీ అధ్యక్షతన ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఉపతహసీల్దారు పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే వినతులు ఇచ్చి పరిష్కారం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

సి.బెళగల్, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారి మిథున్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయుస్సు వైద్యాధికారి ప్రసాదరెడ్డి తెలిపారు. గ్రామాల్లో ఉప ఆరోగ్య కేంద్రాల గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోలకల్: గ్రామంలోని సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పురోహితుడు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయం ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిపారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సింగనగేరి కాలనీలో భువనేశ్వరి నీలకంఠేశ్వర స్వామి ఆలయం, పెంచికలపాడు గ్రామంలోని శివాలయంలో స్వామివారికి సోమవారం పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ ప్రజలకు రోజూ రెండు పూటలా తాగునీరు అందించాలని వైకాపా సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ కోరారు. ఆదివారం తాగునీటి ట్యాంకు, ఫిల్టర్ బెడ్లను పరిశీలించారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గూడూరు మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు వెంకటేష్ నాయక్ అధ్యక్షతన ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు ఉప తహసీల్దారు ధనుంజయ రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: జగన్ మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఏకవచనంతో మాట్లాడేటప్పుడు స్థాయి ఏంటో తెలుసుకోవాలని మాజీ ఎంపీ, వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. మాచాని బాలికల ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీటి సమస్యను మూడు నెలలైనా తీర్చలేదని అన్నారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేయడం సరికాదని వైకాపా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. మంత్రాలయం మండలం రాంపురంలో ఆయన మాట్లాడారు.

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు పట్టణంలో ఆదివారం వైకాపా నియోజకవర్గ బాధ్యుడు ఆదిమూల సతీష్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయంలో నిర్వహించిన వైకాపా కార్యకర్తల సమావేశానికి తితిదే పాలక మండలి మాజీ సభ్యుడు సీతారామిరెడ్డి హాజరయ్యారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రాక్టర్

కోసిగి, న్యూస్‌టుడే: కోసిగి నుంచి తుంబిగనూరు గ్రామం మీదుగా తుంగభద్ర గ్రామానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సును ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ

ప్రమాద స్థలంలో ట్రాక్టర్, ద్విచక్రవాహనం

సంఘటన కోసిగి మండలం తుంబిగనూరు శివారులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. తుంబిగనూరు గ్రామానికి చెందిన వైకాపా సర్పంచి వారం ఈరన్న కుమారుడు తిమ్మప్ప ట్రాక్టర్‌పై వేగంగా వచ్చి బస్సును ఢీకొట్టాడు. అనంతరం పక్కనే ఉన్న ద్విచక్రవాహనంపైకి దూసుకెళ్లి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజిన్ రెండు భాగాలుగా విడిపోగా.. దిచక్ర వాహనం నుజ్జునుజ్జు అయింది. విద్యుత్తు స్తంభం విరిగి ప్రమాదకరంగా మారింది. బస్సు ముందు భాగం దెబ్బతినగా.. అందులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నర్సప్ప ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ తిమ్మప్పపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



(c) eenadu

కర్నూలు

•కర్నూలు • పాణ్యం

మాట్లాడుతున్న నంద్యాల ఆర్ఏఆర్ఎస్ కీటక శాస్త్రవేత్త డా.రామకృష్ణారావు

ఎరువుల అధిక వినియోగంతో సూక్ష్మధాతు లోపాలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : రసాయన ఎరువులు అవసరానికి మించి వాడటం వల్ల సూక్ష్మధాతు లోపాలు తలెత్తుతాయని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం కీటక శాస్త్రవేత్త డా. రామకృష్ణారావు పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో ఆదివారం దేశీ కార్యక్రమం కింద ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లు దేశీ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జి.రత్నప్రసాద్ సూచించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నగరపాలక కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632,
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : ?: అశోక్‌నగర్‌లో వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. – స్థానికులు

?: సీతారాంనగర్, చల్లావారివీధిలో మురుగు కాలువలను చాలాకాలం నుంచి శుభ్రం చేయడం లేదు. పూడిపోయాయి. – ఆనంద్

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ?: స్టాంటన్‌పురం కెనరా బ్యాంకు సమీపంలో ఉన్న దిల్‌సుఖ్‌నగర్‌లో మట్టిరోడ్డుపై చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలుస్తోంది. సీసీరోడ్డు నిర్మించాలి. – రవికుమార్, దిల్‌సుఖ్‌నగర్

✔: వీధిదీపాలకు మరమ్మతులు చేయిస్తాం. కాలువలు శుభ్రం చేయిస్తాం. – నగరపాలక అధికారులు

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే : ?: 19వ వార్డు సాయివైభవ్‌కాలనీ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు ఉన్న రహదారిపై ఏర్పడిన గుంతల్లో కొన్నింటిని పూడ్చారు. చాలా గుంతల్ని వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. – కాలనీ వాసులు

?: మద్దూరునగర్ కాలనీలో దుకాణాల వద్ద కొత్తగా సిమెంటు రహదారులు వేశారు. క్యూరింగ్ కోసం వేసిన మట్టిని తొలగించకుండా అక్కడే వదిలేయడంతో వర్షాలు కురిసినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
– మద్దూరునగర్, శ్రీరాంనగర్ కాలనీవాసులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ?: 36వ వార్డు వాసవీనగర్‌లో రెండు వారాలుగా నాలుగు వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో చీకటిగా మారుతుంది. – వెంకటరాముడు, స్థానికుడు

?: కల్లూరు అర్బన్ రేడియో స్టేషన్ సమీపంలోని శాంతినగర్‌లో రహదారులు వర్షాకాలంలో బురదమయంగా మారుతున్నాయి. మురుగు కాలువలు, సీసీ రోడ్లు నిర్మించాలి. – రాముడు, స్థానికులు

✔: సాయివైభవ్ కాలనీ, మద్దూరునగర్‌లో రహదారులను బాగుచేస్తాం. వీధిదీపాలకు మరమ్మతులు చేయిస్తాం. శాంతినగర్‌లో అభివృద్ధి పనులు చేపడతాం.
– నగరపాలక సంస్థ అధికారులు

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. కల్లూరు పట్టణం 20వ వార్డులోని అరుంధతినగర్, బీడీ కార్మికుల కాలనీలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో తెదేపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు, తితిదే బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, తెదేపా పాణ్యం నియోజకవర్గ పరిశీలకుడు ఆదెన్న, నాయకులు పెరుగు పురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

బకాయిలు రూ.కోట్లు.. వసూలుకు పాట్లు

● ట్రేడ్ లైసెన్సు రుసుములు చెల్లించని వ్యాపారులు ● కమిషనర్ ఆదేశాలతో నగరపాలక సిబ్బంది పరుగులు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థలో కొన్నేళ్లుగా ట్రేడ్ లెసెన్సు బకాయిలు పేరుకుపోయాయి. వ్యాపార అనుమతుల రెన్యువల్ సొమ్ము చెల్లించకుండా వ్యాపారులు మొండికేస్తున్నారు. దీంతో నగరపాలక ఆదాయానికి గండి పడుతోంది. వసూలు చేయాల్సిన నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో బకాయిలు రూ.కోట్లకు చేరుకున్నాయి. కొందరు సిబ్బంది దుకాణదారుల నుంచి మామూళ్లకు అలవాటుపడి ట్రేడ్ లైసెన్సు సొమ్ము వసూలుపై దృష్టిపెట్టడం లేదన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.విశ్వనాథ ట్రేడ్ లెసెన్సు బకాయిలు తక్షణం వసూలు చేయాలని.. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించడంతో సిబ్బంది దుకాణదారుల చుట్టూ తిరుగుతున్నారు.

నాలుగు రోజుల గడువు

నగరపాలక యంత్రాంగం గత కొన్నేళ్లుగా రెన్యువల్ రుసుము సక్రమంగా వసూలు చేయకపోవడంతో రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. ఈ మొత్తాన్ని నాలుగు రోజుల్లో వసూలు చేయాలని నూతన కమిషనర్ గడువు విధించడంతో.. ప్రజారోగ్య విభాగం అధికారులు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు ప్రస్తుతం తంటాలు పడుతున్నారు. రెండు రోజుల్లో రూ.2.28 లక్షలు వసూలు చేయడం గమనార్హం.

దుకాణదారు నుంచి ట్రేడ్ లైసెన్సు బకాయిలు వసూలు చేస్తున్న సిబ్బంది

పక్కాగా లేని లెక్కలు

నగరపాలక పరిధిలో చిన్న, పెద్ద దుకాణాలు కలిపి 40 వేలకుపైగా ఉన్నట్లు అంచనా. వీటిలో 19,505 వరకు దుకాణాలకు మాత్రమే లైసెన్సులు ఉన్నట్లు తెలిసింది. ప్రజారోగ్య విభాగం సిబ్బంది ప్రతి దుకాణం నుంచి లైసెన్సు, రెన్యువల్ రుసుములు వసూలు చేయాల్సి ఉంది. ● సుమారు 20 వేల దుకాణాల నుంచి లైసెన్సు రుసుము వసూలు కావడం లేదు. కొందరు సిబ్బంది వ్యాపారుల నుంచి లైసెన్సు పేరుతో డబ్బు వసూలు చేసి ఖజానాకు జమచేయకుండా స్వాహా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఎగవేతకు కొత్త ఎత్తుగడ

నగరపాలక పరిధిలో ఏదైనా వ్యాపారం చేయాలంటే ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి. వ్యాపారులు ఏటా కొంత సొమ్ము చెల్లించి ట్రేడ్ లైసెన్సును రెన్యువల్ చేసుకోవాల్సి ఉంది. రూ.కోట్లలో వ్యాపారాలు చేసుకుంటున్నా చాలామంది రెన్యువల్ సొమ్ము చెల్లించడం లేదు. వీరికి నగరపాలక ప్రజారోగ్య విభాగం నుంచి పూర్తి సహకారం ఉండటం గమనార్హం.

● మరోవైపు చాలామంది వ్యాపారులు కొత్త లైసెన్సులు పొందుతూ పాత బకాయిలు ఎగ్గొడుతున్నారు.

● బార్ అండ్ రెస్టారెంట్లు, హోటళ్లు, పాఠశాలలు, రెసిడెన్సీలు, ఆసుపత్రులు, ద్విచక్రవాహన షోరూంలు, పెట్రోలు బంకులు ఇలా చాలామంది రెన్యువల్ సొమ్ము కట్టకుండానే పేర్లు మార్చి కొత్త లైసెన్సులు పొందుతున్నట్లు సమాచారం. వీరికి లైసెన్సులు ఇవ్వడంలో భారీగా డబ్బు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

వైకాపా నాయకులు జాగ్రత్తగా మాట్లాడాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలు వైకాపా నాయకులు జాగ్రత్తగా మాట్లాడాలని తెదేపా కార్పొరేటర్లు హెచ్చరించారు. స్థానిక మౌర్యఇన్ హోటల్‌లోని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కార్యాలయంలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు మన్సూర్ అలీఖాన్, కార్పొరేటర్లు పరమేశ్, లతీఫ్, జకియా, పద్మలతారెడ్డి, పరాక్‌ఖాన్, క్రాంతికుమార్,

మాట్లాడుతున్న తెదేపా కార్పొరేటర్లు, నాయకులు

రమణమ్మ, నాయకులు మహబూబ్‌ఖాన్, అబ్బాస్ తదితరులు పాత్రికేయులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, వైకాపా నాయకులు మంత్రి టీజీ భరత్ కుటుంబంపై హాస్యాస్పదంగా వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ఎస్వీ మోహన్‌రెడ్డి రౌడీలను తయారు చేస్తున్నారని ఆరోపించారు. రౌడీయిజం చేస్తున్న కార్పొరేటర్ యూనుస్‌ను మందలించక పోయి మంత్రిపై బురదచల్లడం తగదన్నారు.

మహాగౌరి అమ్మవారికి శాకంబరి అలంకరణ

సూర్యనారాయణస్వామి ఆలయంలో శాకంబరి అలంకరణలో మహాగౌరి

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే : ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని నగరంలోని గుత్తి రోడ్డు సమీపంలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం మహాగౌరీ అమ్మవారికి శాకంబరి అలంకరణ చేశారు. వేద పండితులు, అర్చకులు శ్లోకాలతో షోడశోపచార పూజలు చేశారు. శ్రీదేవి ఖడ్గమాల, లలితా సహస్రనామ, లలిత త్రిశతి, లలితా, అన్నపూర్ణ, దుర్గాదేవి అష్టోత్తర పూర్వక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శివరామకృష్ణ, సభ్యులు భక్తులకు ప్రసాదాలు అందచేశారు.

● కర్నూలు ఇస్కాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వెంకటరమణ కాలనీలో నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు జగన్నాథుడ్ని స్మరిస్తూ, భజనలు చేస్తూ పల్లకి సేవ నిర్వహించారు.

వెంకటరమణ కాలనీలో నగర సంకీర్తన

22 నుంచి ప్రేమ ప్రవాహిని రథోత్సవం

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే : సత్యసాయి బాబా అవతార శత జయంతి వేడుకల్లో భాగంగా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సత్యసాయి ప్రేమ ప్రవాహిని' రథోత్సవం ఈనెల 22, 23 తేదీల్లో కర్నూలు నగరంలో కొనసాగనుంది. ఈ మేరకు నగరంలోని సత్యసాయి మందిరంలో సమితి కన్వీనరు మాకా అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రథోత్సవ పర్యటన ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. కర్నూలులో రథోత్సవం జరిగే సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సేవాదళ్ సభ్యులు విధులు నిర్వర్తించాలని కోరారు. 22న ఉదయం 9 గంటలకు పాతబస్తీలోని లలితాపీఠం వద్ద పూజల అనంతరం రథోత్సవం మొదలవుతుందన్నారు.

డివైడరు గుంతలో వేసిన కంకర పొడి

రహదారిపై గుంతల పూడ్చివేతకు చర్యలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : నగరంలోని బంగారుపేట కూడలి నుంచి ఆర్ఎస్ రోడ్డు ఐదురోడ్ల కూడలి వరకు డివైడర్‌ను తొలగించి రహదారి మధ్యలో గుంత తవ్వారు. దీనివల్ల వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈనెల 20న 'ఈనాడు'లో 'గోతులు తీశారు.. గండాలు మిగిల్చారు' శీర్షికన చిత్రకథనం ప్రచురితమైంది. నగరపాలక అధికారులు స్పందించి వెంటనే గుంతలు పూడ్చివేయాలని బంగారుపేటలో మురుగు కాలువలు, డివైడర్ల నిర్మాణ పనులు చేస్తున్న గుత్తేదారుకు సూచించారు. దీంతో కంకర పొడి తోలించి గుంతలను పూడ్చే పనులు చేపట్టారు.

అశోక్‌నగర్‌లో చోరీ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని అశోక్‌నగర్‌కు చెందిన సయ్యద్ ముబషీర్ పాషా ఖాద్రి ఇంట్లో చోరీ జరిగింది. రెండురోజుల కిందట ఈయన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. ఆదివారం రాత్రి వీరు తిరిగొచ్చేసరికి దొంగలు ఇంటిని దోచేశారు. తాళం తొలగించి ఇంట్లోకి చొరబడిన దొంగలు 5 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు చోరీ చేసినట్లు బాధితులు గుర్తించారు. వారిచ్చిన సమాచారం మేరకు కర్నూలు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

వాహన సేవల యాప్‌లు రద్దు చేయాలి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ఆటో డ్రైవర్లకు నష్టం కలిగించే ఓలా, ఉబర్, రాపిడో ఇతర ప్రైవేటు వాహన సేవల యాప్‌లను రద్దు చేయాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్ల సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్, రాధాకృష్ణ, హుసేన్‌వలి డిమాండ్ చేశారు. నగరంలోని అంబేడ్కర్‌నగర్‌లో ఆదివారం పలువురు సీఐటీయూలో చేరారు. ఈసందర్భంగా వారు జెండా ఎరుగవేసి మాట్లాడారు.

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

యోగా, పీటీఎంతో సమయం వృథా

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో యోగా, మెగా పీటీఎం కార్యక్రమాలతో సమయం వృథా అవుతోందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఉద్యోగులకు సమావేశంలో ఆయన మాట్లాడారు. పీ4 రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎత్తివేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ విధానాలనే కూటమి ప్రభుత్వం కూడా అనుసరించడమేంటని ప్రశ్నించారు. పదోన్నతి బదిలీ పొందిన ఉపాధ్యాయులకు వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే సహించేది లేదు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలోని ఇళ్లకు విద్యుత్తు స్మార్ట్ మీటర్లను బిగిస్తే సహించేది లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పార్టీ నాయకుడు నరసింహులు అధ్యక్షతన నగరంలోని కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.1700 కోట్లు చేతులు మారాయని.. అటువంటి ఒప్పందాన్ని రద్దు చేయకుండా కూటమి ప్రభుత్వం మీటర్ల ఏర్పాటుకు పూనుకోవడం బాధాకరమన్నారు. భవిష్యత్తులో విద్యుత్తు రంగాన్ని ప్రైవేటుపరం చేసేందుకే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శులు రాజశేఖర్, రాముడు, షరీఫ్, సాయిబాబా, రామకృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు నిర్మల

ఆహార నియమాలతో ఆరోగ్యం పదిలం

మహిళను పరీక్షిస్తున్న వైద్యులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ప్రతిఒక్కరూ ఆహార నియమాలు పాటిస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని అశ్విని హాస్పిటల్ వైద్యులు సి.శ్రీనివాసరెడ్డి, బి.ప్రమీల పేర్కొన్నారు. స్థానిక కల్లూరు పట్టణ పరిధిలోని లక్ష్మీపురంలో ఆదివారం అశ్విని హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్, ఆస్తమా, శ్వాసకోశ సంబంధిత రోగాలకు పరీక్షలు నిర్వహించారు. మహిళలు, పురుషులకు ఎముకల సాంద్రత, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచి పుల్లారెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ ఆకెపోగు వెంకటస్వామి, తెదేపా నాయకుడు రామిరెడ్డి, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : కమ్యూనిస్టు పార్టీ దేశంలో అనేక ఉద్యమాలు చేపట్టి ప్రజలకు చేరువైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య పేర్కొన్నారు. సీపీఐ కర్నూలు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం దేవనగర్‌లోని గుడ్‌షెపర్డ్ పాఠశాల నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అధ్యక్షత జనసేవ దళ్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 9 నుంచి 11వ తేదీ వరకు నగరంలో జిల్లా 24వ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లెనిన్‌బాబు, నాయకులు మునెప్ప, కె.జగన్నాథం, కారుమంచి, విరూపాక్షి, మహేశ్, సుదర్శన్, గిడ్డమ్మ, నాగేంద్రమ్మ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

కవాతు చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : జొహరాపురం నుంచి వెంకాయపల్లె వెళ్లే రహదారికి ఇరువైపులా కాల్వలు నిర్మించాలని కోరుతూ ఆదివారం నాయకుడు రమణ ఆధ్వర్యంలో జొహరాపురంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం పాతనగరం కార్యదర్శి రాజశేఖర్, విజయరామాజనేయులు తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : రైతులు, దళితులు, బీసీలు, మైనారిటీలకు నష్టం కలిగించే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని కేవీపీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజశేఖర్, నగర గౌరవాధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు. నగరంలో ఆదివారం వారు మాట్లాడారు.

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు నగరం శరీన్‌నగర్‌కు చెందిన ఓ బాలిక (17) అదృశ్యమైంది. శనివారం ఉదయం పనికి వెళ్లిన తల్లిదండ్రులు సాయంత్రం తిరిగొచ్చేసరికి బాలిక ఇంట్లో లేదు. చరవాణి కూడా స్విచ్ఛాఫ్ అని రావటంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికారు. ఎక్కడా ఆమె ఆచూకీ కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఆదివారం కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మొర విన్నారు.. మార్గం చూపారు

నగరంలోని కొత్తబస్టాండు నుంచి కల్లూరు వైపు వెళ్లే వాహనదారులు బళ్లారి చౌరస్తాలో ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులు పడేవారు. ఇక్కడ ఫ్రీలెఫ్ట్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు కొన్నేళ్లుగా కోరుతున్నా అధికారులు పట్టించుకోలేదు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్ సైతం ఆదేశించారు. ఆయన ఆదేశించిన ఐదు నెలల తర్వాత నగరపాలక అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి మూడు రోజుల కిందట చౌరస్తాలో కల్లూరు వైపు వాహనాలు నేరుగా వెళ్లేలా రోడ్డును కాంక్రీటు దిమ్మెలతో విభజించి ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేశారు. దీంతో ఏడాదిగా ఎదురవుతున్న ఇబ్బందులు తీరాయని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

సనత్‌నగర్ పార్కు.. అభివృద్ధి అడగకు

నగరంలోని నందికొట్కూరు రహదారి సమీపంలోని సనత్‌నగర్‌లో ఉద్యానవనం ఏర్పాటు కోసం పురపాలక అధికారులు 50 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చుట్టూ ప్రహరీ ఏర్పాటు కోసం కాంక్రీటు పిల్లర్లు నిర్మించారు. అంతటితో పనులు ఆగిపోయాయి. పార్కు ఆవరణం మొత్తం కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయి తీవ్ర అపరిశుభ్రంగా మారింది. ప్రహరీ నిర్మించకపోవడంతో పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. ప్రహరీ పూర్తిచేసి పార్కును అభివృద్ధి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

అడుగుకో గుంత.. ప్రజలకేది భద్రత

జొహరాపురం పాత డంపింగ్ యార్డు నుంచి ఇందిరమ్మకాలనీకి వెళ్లే రహదారి సుమారు 2 కిలోమీటర్ల మేర దారుణంగా దెబ్బతింది. అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. రాళ్లు తేలి అధ్వానంగా మారింది. ఇందిరమ్మకాలనీ, వెంకాయపల్లె వాసులు నిత్యం ఈ రహదారిలోనే రాకపోకలు సాగిస్తుంటారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు ప్రయాణించడం కష్టంగా మారింది. రాత్రిళ్లు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులే నిర్మాణ వ్యర్థాలు, బండరాళ్లతో కొన్ని గుంతలు పూడ్చారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. - ఈనాడు, కర్నూలు

మురుగు కదలక.. దుర్గంధం వదలక

ఎన్టీఆర్‌నగర్‌కు వెళ్లే దారిలో మురుగునీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో పక్కా డ్రైనేజీ వ్యవస్థ లేదు. కచ్చా కాలువలు తవ్వి వదిలేశారు. ఇవి పూడిపోవడంతో ఎక్కడికక్కడ మురుగు నీరు నిల్వ చేరింది. దుర్వాసన, దోమల బెడద తీవ్రమయ్యాయని స్థానికులు వాపోతున్నారు. మురుగు నిల్వతో పందుల సంచారం పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో కాలువలు పూడిపోయి మురుగునీరు రహదారులపై ప్రవహిస్తోంది. పక్కా కాలువలు నిర్మించి సమస్య పరిష్కరించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. - కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే

బెల్టులు, పతకాలు అందుకున్న చిన్నారులు

తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పోటీల్లో ప్రతిభ

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : కల్లూరు సమీపంలోని ముజఫర్‌నగర్ పరిధిలోని ఆదిత్యనగర్ పార్కులో ఆదివారం చిన్నారులకు తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. చెర్రీ, లాస్య, దాక్షాయని, ఉషారాణి, కౌశిక్‌లు ఎల్లో, రిత్విక, తన్మయి, రద్విక్ ఎల్లో-1 బెల్టులు, ఆకాశ్, సాయి, భవ్య గ్రీన్, అఖిల బ్లూ బెల్టు సాధించారు. పారిశ్రామికవేత్త ప్రసాద్ వారికి బెల్టులు, పతకాలు ప్రదానం చేశారు. శిక్షకుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కరాటే సాధనతో ఆరోగ్యం, ఆత్మరక్షణ

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : కరాటే సాధన చేయడం ద్వారా ఆత్మరక్షణతో పాటు ఆరోగ్య సంరక్షణకు ఉపకరిస్తుందని వైద్యుడు శంకర్‌శర్మ పేర్కొన్నారు. నగరంలోని సంకల్‌బాగ్‌లో ఉన్న చిన్మయ విద్యా మిషన్‌లో కరాటే మాస్టర్ ఆరిఫ్ ఆధ్వర్యంలో ఆదివారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ చూపిన చిన్నారులకు బెల్ట్‌లు పంపిణీ చేశారు. కోయంబత్తూరులో జరిగిన కరాటే సెమినార్‌లో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు.

రెజ్లింగ్ క్రీడాకారుడికి ఆర్థిక సాయం

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : తిరుపతిలో ఈనెల 12 నుంచి 13వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న నాగహితేష్ బంగారు పతకం సాధించాడు. ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు బిలాస్‌పూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. క్రీడాకారుడు ప్రయాణం ఖర్చుల కోసం అవోపా సంఘం నాయకులు ఆదివారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు వి.సి.నరసింహులు, సభ్యులు పాల్గొన్నారు.

జగదేక సుందరి సామ నాటక ప్రదర్శన

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : అభినయ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పద్య నాటక పోటీల్లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులు 'జగదేక సుందరి సామ' పద్యనాటకాన్ని ప్రదర్శించారు. దర్శకుడు కళారత్న పత్తి ఓబులయ్య, కళాకారులు శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, సురభి ప్రభావతి, హసీనా, రాముడు, రాజారత్నం తదితరులను నిర్వాహకుడు బి.వి.రెడ్డి పురస్కారంతో సత్కరించారు.

అధికారుల మీనమేషాలు.. సిబ్బందికి గుబులు

☛ శిథిలావస్థకు చేరిన కార్యాలయ భవనం ☛ మరమ్మతులూ చేయించలేని దైన్యం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : వర్షం పడిన ప్రతిసారి జిల్లా మత్స్యశాఖ సహాయ సంచాలకుల కార్యాలయ సిబ్బంది భయం భయంగా విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. దశాబ్దాల కిందట నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఎన్నిసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. నిధుల కొరతను సాకుగా చూపుతూ.. కొన్నేళ్లుగా మరమ్మతులు చేయించడం లేదు. దీంతో వర్షం కురిసిన ప్రతిసారి కార్యాలయం మొత్తం కారుతోంది. సిబ్బంది తడుస్తూనే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. గోడలు పూర్తిగా తడిసిపోయాయని.. భవనం ఎప్పుడు కుప్పకూలుతుందోనని కార్యాలయ సిబ్బంది భయపడుతున్నారు.

కార్యాలయం కప్పుపై పెరిగిన పిచ్చిమొక్కలు

వర్షాకాలం భయం భయం

కర్నూలు జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్, అడిషనల్ డైరెక్టర్‌తో పాటు సుమారు 20 మంది ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. ఇక్కడున్న నాలుగు భవనాలు శిథిలావస్థకు చేరాయి.

● గత ప్రభుత్వంలో మత్స్యశాఖ అభివృద్ధికి ఎటువంటి నిధులు కేటాయించలేదు. దీంతో కార్యాలయాలకు మరమ్మతులకు కూడా చేయించలేని దుస్థితి నెలకొంది.

● వర్షాకాలంలో పరిస్థితి దారుణంగా ఉంటుంది. చిన్నపాటి వాన కురిసినా కార్యాలయం మొత్తం కారుతుంది. దీంతో పైకప్పు కారే చోటల్లా ప్లాస్టిక్ డబ్బాలు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది. కార్యాలయ గోడల్లో నీరు దిగి నెమ్మెక్కాయి. విద్యుత్తు సరఫరా వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా ఉండటంతో తడిసిన గోడలకు కరెంటు ప్రసారమయ్యే ప్రమాదం ఉందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

శిక్షణ ఇవ్వాలన్నా చిక్కులే..

మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపల పెంపకం, వాటి మార్కెటింగ్, ఉప ఉత్పత్తుల తయారీపై యువతకు శిక్షణ ఇస్తారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మూడు నెలలకోసారి ఈ కార్యాలయంలోనే శిక్షణ ఇవ్వాల్సి ఉంది. ఒక్కో బ్యాచ్‌లో 20 నుంచి 25 మంది యువత శిక్షణ పొందుతారు. వారికి తరగతులు నిర్వహించే భవనం సైతం పూర్తిగా దెబ్బతింది. అందులో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో శిక్షణార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇక్కడి పరిస్థితులు చూసి చాలామంది శిక్షణ పొందేందుకు ఆసక్తి చూపడం లేదు.

పైకప్పు కారడంతో గదిలో నిలిచిన వర్షంనీరు

(c) eenadu

నిర్లక్ష్యమొక్కటై.. పర్యావరణానికి శాపమై

జూపాడుబంగ్లా మండలం తంగడంచ సమీపంలో 340సీ జాతీయ రహదారి పక్కన నాటేందుకు తీసుకొచ్చిన మొక్కలను నిర్లక్ష్యంగా పడేయడంతో అవి ఎండిపోతున్నాయి. కొన్నిచోట్ల గుంతలు తీసి నాటకుండా వదిలేశారు. మొక్కలు కొనుగోలు చేసి నాటేందుకు పెద్దఎత్తున నిధులు వెచ్చించారు. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో ప్రజాధనం వృథా అవుతోంది. ఇకనైనా మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాలలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. స్థానిక సెంటినరీ హాలులో ఉదయం 9.30 నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మున్సిపాలిటీ, నియోజకవర్గ, మండల స్థాయిలోనూ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్జీదారులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారానూ అందజేయొచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. తమ దరఖాస్తులు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకొనేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించాలని కోరారు. బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.

కన్నేశారు.. మన్నేశారు

☛ ఆక్రమణలకు గురవుతున్న ఎన్టీఆర్ జలాశయం

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఉన్న ఎన్టీఆర్ జలాశయంపై కొందరు అక్రమార్కులు కన్నేశారు. కొద్దికొద్దిగా మట్టి వేస్తూ హస్తగతం చేసుకుంటున్నారు. విలువైన స్థలం ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు దృష్టి సారించడం లేదు. ఫలితంగా ఇది కనుమరుగయ్యే ప్రమాదం నెలకొంది.

భూగర్భ జలాల పెంపునకు..

నందికొట్కూరు పట్టణంలో కేజీ రహదారి పక్కన ఎన్టీఆర్ జలాశయాన్ని దశాబ్దాల కిందట పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సుమారు 3 ఎకరాల్లో ఏర్పాటుచేశారు. భూగర్భ జలాలు పెంపొందించే ఉద్దేశంతో దీనిని నిర్మించారు. జలాశయంలో నీటి మట్టం పెరిగినప్పుడు సాయిబాబాపేట, హాజీనగర్, మారుతి నగర్ ప్రాంతాల మీదుగా నీరు సాఫీగా వెళ్లేలా కాలువ నిర్మించారు.

జలాశయంలోకి తోలిన మట్టి

విలువైన స్థలంపై కన్నేసి..

ప్రస్తుతం జలాశయంలో నాలుగు సెంట్ల విస్తీర్ణంలో స్థలం ఆక్రమణలకు గురైంది. ఇది ఆంజనేయస్వామి మాన్యం భూమిగా స్థానికులు చెబుతుంటారు. ప్రధాన రహదారి పక్కన ఉన్న విలువైన స్థలం ఆక్రమణలకు గురవుతున్నా అటు దేవాదాయశాఖ, ఇటు పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో మరికొందరు సైతం ప్లాట్లు వేసి అమ్మేసుకుంటున్నారు. ఇక్కడ సెంటు భూమి సుమారు రూ.30 లక్షల వరకు పలుకుతోంది. విలువైన స్థలం కావడంతో అక్రమార్కులు మెల్లమెల్లగా ఆక్రమించుకోవడం ప్రారంభిస్తున్నారు.

వర్షాలు పడితే మునకే

ప్రస్తుతం జలాశయం ఆక్రమణలకు గురవుతోంది. వర్షాలు పడితే నీరంతా సాయిబాబా పేట, హాజీనగర్, మారుతి నగర్ మీదుగా జలాశయంలోకి చేరుతుంది. ఇది నిండితే కోటా వారి వీధి మీదుగా నీరు వెళుతుంది. ప్రస్తుతం ఆక్రమణల నేపథ్యంలో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని.. లేకుంటే జలాశయం పూర్తిగా ఆక్రమణలకు గురై భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదముందని పలువురు హెచ్చరిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ బేబి మాట్లాడుతూ ఈ జలాశయం దేవాదాయ శాఖ పరిధిలోకి వస్తుందని చెప్పారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పట్టాలు తప్పిన నాణ్యత

☛ అధ్వానంగా రైల్వే డబ్లింగ్ పనులు

పొన్నాపురం వద్ద గుట్టలుగా వేసిన మట్టి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రైల్వే డబ్లింగ్ పనుల్లో నాణ్యత కరవైంది. అధికారుల పర్యవేక్షణ కానరాకపోవడంతో ఇష్టానుసారంగా జరుగుతున్నాయి. గుంటూరు-గుంతకల్లు మధ్య రైల్వే డబ్లింగ్ పనులు ఏడేళ్లుగా సాగుతున్నాయి. 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. రూ.3,631 కోట్లతో 426 కి.మీల మేర జరుగుతున్న రెండు వరుసల పనుల్లో 347 కి.మీ. మేర పూర్తయ్యాయి. ప్రస్తుతం ప్రకాశం జిల్లా దిగువమెట్ట నుంచి గాజులపల్లె వరకు 27 కి.మీ. పొడవునా.. నంద్యాల-గాజులపల్లె మధ్య 16 కి.మీ.లు, నంద్యాల-పాణ్యం మార్గంలో 14 కి.మీ. మేర పనులు జరుగుతున్నాయి. మిగిలిపోయిన డబ్లింగ్ పనుల్లో 80 శాతం పనులు జిల్లాలోనే జరుగుతున్నాయి. నంద్యాల-గాజులపల్లె మార్గంలో జరుగుతున్న పనుల్లో నాణ్యత లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరిమాణంలో తేడాలు

నంద్యాల రైల్వేస్టేషన్ నుంచి కుందూ నది వంతెన వైపు జరుగుతున్న పనుల్లో వాడుతున్న కంకర పరిమాణంలో తేడాలున్నాయి. ట్రాక్ నిర్మాణంలో భాగంగా వేయాల్సిన కంకర అధిక పరిమాణంలో ఉంది. 80 ఎంఎం.. ఆపై సైజు కంకర వినియోగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో 60 ఎంఎం, 80 ఎంఎం కంకరతోపాటు ఆపై పరిమాణంలో వాడుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

మట్టి, కంకర వినియోగంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిబంధనలు అమలు కాలేదు. గోపవరం భైరవాణి చెరువు నుంచి 75 వేల క్యూబిక్ మీటర్లు, నంద్యాల మండలం అయ్యలూరు మండ్లెం చెరువు నుంచి మట్టి తవ్వుకునేందుకు అధికారులు అనుమతించారు. వర్షాలు ప్రారంభమయ్యేలోగా మట్టిని తవ్వి తరలించి పనులు ముగించేయాలన్న ఉద్దేశంతో హడావుడిగా సాగుతున్నాయి. కొన్ని పనులను సబ్ కాంట్రాక్టుకు ఇవ్వడంతో నాణ్యతపై ప్రభావం చూపుతున్నాయన్న విమర్శలున్నాయి.

ఇష్టానుసారంగా చేస్తూ...

డబ్లింగ్ పనుల్లో భాగంగా నంద్యాల మండలం పొన్నాపురం సమీపం నుంచి జిల్లా కేంద్రం బొమ్మలసత్రం వరకు పనులు చేపట్టారు. ట్రాక్ నిర్మాణంలో భాగంగా గాజులపల్లె భైరవాణి చెరువు నుంచి ఎర్ర మట్టి తవ్వి తీసుకొస్తున్నారు. పొన్నాపురం సమీపంలో జరుగుతున్న పనుల్లో భాగంగా టిప్పర్ల ద్వారా వేల క్యూబిక్ మీటర్ల మట్టి వేస్తున్నారు. కట్ట ఎత్తు చేసేందుకు మట్టి వేస్తారు. దీనిని లేయర్ల ప్రకారం వేయాలి. ఒక లేయర్ మట్టి వేసి దానిపై రోలింగ్ చేసి నీటితో క్యూరింగ్ చేయాలి. అనంతరం మరో లేయర్ మట్టి వేస్తూ పనులు చేయాలి.. ఇలా చేస్తే కట్ట పటిష్ఠంగా ఉంటుంది. నిబంధనల ప్రకారం అడుగు మందం మట్టి వేస్తే అదే స్థాయిలో నీళ్లు వేసి చదును చేయాలి. ప్రస్తుతం చెరువు మట్టిని టిప్పర్ల ద్వారా పెద్దఎత్తున వేస్తున్నారు. గుట్టలుగా వేసిన మట్టిని రోలర్ ద్వారా చదును చేసేస్తున్నారు. ఫలితంగా లెవలింగ్ రావడం లేదు.

కామేశ్వరీదేవికి పుట్టింటి సారె

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో కామేశ్వరీదేవి అమ్మవారికి ఆంధ్రా, తెలంగాణతోపాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన బాలాజీ సేవా సమితి ఆధ్వర్యంలో పుట్టింటి సారెను ఆదివారం తీసుకొచ్చారు. మహానంది క్షేత్రంలోని గరుడ నందీశ్వరాలయం వద్దకు రాగా ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, వేద పండితులు రవిశంకర్ అవధాని బృందం, అర్చకులు రాజమాణిక్యశర్మ తదితరులు సాదర స్వాగతం పలికారు. పండితుల వేద మంత్రాల నడుమ అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించారు. ఆ సమితి వ్యవస్థాపకులు ధనుంజయరెడ్డి, అధ్యక్షుడు శ్రీకాంత్, శివలీల, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సారె తీసుకొస్తున్న భక్తులు

శ్రీమఠంలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

మంత్రాలయం, న్యూస్‌టుడే: రాఘవేంద్ర స్వామి బృందావనం దర్శనార్థం కర్ణాటక రాష్ట్రం కలబుర్గి బెంచి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శిరీషానంద ఆదివారం మంత్రాలయం వచ్చారు. వీరికి మఠం అధికారులు స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు.

స్నాతకోత్సవ సంబరం

కర్నూలు నగర శివారులోని ట్రిపుల్ ఐటీ కళాశాల (డీఎం)లో ఆదివారం ఏడో స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు, ప్రతిభావంతులకు బంగారు పతకాలు అందజేశారు. ట్రిపుల్ ఐటీ కళాశాల (డీఎం) ఛైర్‌పర్సన్ పద్మశ్రీ డాక్టర్ విజయలక్ష్మి దేశ్‌మణే తదితరులు హాజరయ్యారు. - ఈనాడు, కర్నూలు

చిరుత సంచారం

☛ భయాందోళనలో జనం

ప్యాపిలి, న్యూస్‌టుడే: మండలంలోని కలుచట్ల, మామిళ్లపల్లె గ్రామాల్లో చిరుత సంచరిస్తుండటంతో జనం భయాందోళన చెందుతున్నారు. గత నాలుగు రోజులుగా కలుచట్ల గ్రామ సమీపంలోని రంగస్వామి కొండ ప్రాంతంలో చిరుత తిరుగుతోందని గ్రామస్థులు తెలిపారు. చిరుత కుక్కలను తినేసి వెళ్లిందని.. పొలాల్లో పాదాల గుర్తులు కనపడుతున్నాయని రైతులు తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ గ్రామాల్లో దండోరా వేయించారు. మండల పరిధిలోని మామిళ్లపల్లె కొండల్లో రాజు అనే పశువుల కాపరికి చిరుత కనిపించినట్లు సమాచారం. అటవీ శాఖ అధికారులు స్పందించి వెంటనే చిరుతను బంధించేలా ఏర్పాట్లు చేయాలని జనం విన్నవిస్తున్నారు.

లక్ష్య సాధన.. విజయపథాన

6లో

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

లేనోళ్లకు పన్ను.. ఉన్నోళ్లకు దన్ను

■ మదింపులో పారదర్శకత కరవు

☛ నగరంలోని పెద్దపాడు రస్తాలో మూడు సెంట్లలో భవనం నిర్మించారు.. తక్కువ పన్ను విధించడంతో నగరపాలక సంస్థ ఆదాయానికి ఏటా రూ.50 వేల వరకు గండి పడుతోంది. గీతానగర్‌లో 2.75 సెంట్లలో నిర్మించిన భవనానికి తక్కువ పన్ను వేశారు.

☛ పెద్దపాడు ప్రాంతంలో ఒకరు ఐదు సెంట్లలో జీ+2 భవనం నిర్మించారు.. భవన యజమాని వద్ద కొందరు రూ.1.50 లక్షలు తీసుకుని కింది ఫ్లోర్‌కు మాత్రమే పన్ను విధించారు.

ఆదోని, కర్నూలు, పురపాలకం, నంద్యాల రైతునగరం, ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలోని నగరపాలక సంస్థతో పాటు తొమ్మిది పురపాలికల్లో ఆస్తి పన్ను సర్వే పనులు కొలిక్కిరావడం లేదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలతో పురపాలక సంఘాలు పెద్దఎత్తున నష్టపోయాయి. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం జరిగిన తప్పిదాలను సరిచేసేందుకు పురపాలికల్లో ఆస్తి పన్ను సర్వే చేసి పన్ను పరిధిలోకి రాని వాటిని తీసుకురావాలని ఆదేశించింది. ఈ మేరకు ఇంటింటి సర్వే చేపట్టింది. చాలా ప్రాంతాల్లో సర్వే ముందుకు సాగడం లేదు.

ఆదాయం వచ్చే అవకాశమున్నా..

ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంఘాల్లో 3.01 లక్షల మంది ఆస్తి పన్ను చెల్లింపుదారులున్నారు. సర్వే నేపథ్యంలో కనీసం 15 శాతం ఆదాయం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అన్ని పురపాలక సంఘాలకు కలిపి రూ.217 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. 15 శాతం అంటే.. మరో రూ.32 కోట్లకుపైగా ఆదాయం రావాలని అంచనా. క్షేత్రస్థాయిలో పారదర్శకంగా వ్యవహరిస్తే అంతకు మించి ఆదాయం సమకూరే అవకాశమున్నా ఆ దిశగా అడుగులు పడటం లేదు. గత నెలలో సర్వే చేపట్టగా ఈ నెలాఖరుకు పూర్తవ్వాల్సి ఉంది. కానీ 70 శాతం కూడా సర్వే పూర్తి కాలేదని సమాచారం.

ఇంటింటి సర్వే చేస్తున్న సిబ్బంది

సిబ్బంది తీరుతో..

● కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో 1.20 లక్షల మంది ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఉన్నారు. ఏటా నగరపాలకకు రూ.90 కోట్ల పన్నుల రూపంలో సమకూరుతుంది. పన్ను మదింపు పక్కాగా చేస్తే మరో రూ.15 కోట్లు రావాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు రూ.కోటి మాత్రమే వచ్చింది. కొన్ని భవనాలకు తక్కువ కొలతలు వేయడం, రెండు, మూడు అంతస్తులుంటే ఒక్కదానికి మాత్రమే సిబ్బంది పన్ను విధిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

● ఆదోని పురపాలక సంఘం పరిధిలో 36 వేల మంది ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. ఏటా రూ.14 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. కొత్తగా ఆస్తి పన్ను పరిధిలోకి వచ్చినవి.. పన్ను పరిధిలోకి రాని భవనాలను గుర్తించారు. ఫలితంగా అర్ధ సంవత్సరానికి రూ.33 లక్షల వరకు ఆదాయం పెరిగింది. వాస్తవానికి రూ.కోటిన్నర దాకా రావాలని అంచనా.

● నంద్యాలలో 49,455 మంది ఆస్తి పన్ను చెల్లింపుదారులున్నారు. ఏటా రూ.36 కోట్ల వరకు ఆస్తి పన్ను ద్వారా ఆదాయం వస్తోంది. ఇంటింటి సర్వే ద్వారా రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల అదనంగా ఆదాయం సమకూరుతుందని అంచనా. పన్నులు చెల్లించనివి.. పన్ను పరిధిలోకి రాని భవనాలు సుమారు 875 వరకు గుర్తించారు. దీనిద్వారా రూ.50 లక్షల ఆదాయం సమకూరనుంది. కాగా ఇంకనూ ఎక్కువ ఆదాయం రావాల్సి ఉండగా సర్వే పారదర్శకంగా జరగడం లేదన్న ఆరోపణలున్నాయి.

సాగుకు డ్రోన్ సాయం

☛ ఉమ్మడి జిల్లాలో 43 మంది పైలట్లకు శిక్షణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా అన్నదాతలకు రాయితీపై డ్రోన్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. 80 శాతం రాయితీపై రైతు బృందాలకు అందిస్తోంది.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 9.50 లక్షల హెక్టార్లకుపైగా సాగు భూమి ఉంది. ఖరీఫ్‌లో 6 లక్షల హెక్టార్లకుపైగా భూముల్లో వివిధ పంటలు సాగవుతూ ఉంటాయి. వ్యవసాయంలో ఖర్చులు పెరిగిపోతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి సాంకేతిక ఫలాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పురుగు మందుల పిచికారీకి డ్రోన్లు పంపిణీ చేయాలని నిర్ణయించింది.

ఎవరికి అందిస్తారు..

కనీసం ఐదుగురు రైతులు కలిసి ఒక గ్రూపుగా ఏర్పడాలి. వీరిలో ఒక వ్యక్తి పదో తరగతి లేదా ఐటీఐ చదివి ఉండాలి. ఆ రైతుకు డ్రోన్ ఎలా ఉపయోగించాలి.. నిర్వహణ, ఎరువులు, పురుగు మందుల పిచికారీ తదితర అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. అతను మాత్రమే డ్రోన్ ఉపయోగించి పనిచేయాల్సి ఉంటుంది.

డ్రోన్ సాయంతో మినుము పంటపై పిచికారీ

అవసరానికి అనుగుణంగా..

ప్రస్తుతం నంద్యాల జిల్లాకు 40, కర్నూలు జిల్లాకు 35 డ్రోన్లు కేటాయించారు. ఇందులో నంద్యాల జిల్లా పరిధిలో 20, కర్నూలు జిల్లాలో 18 గ్రూపులు డిపాజిట్ చేశాయి. ఔత్సాహికులైన రైతులు ముందుకొస్తే మిగిలిన వాటిని అధికారులు అందిస్తారు. ఇంకనూ ఎవరైనా ఆసక్తి చూపితే రైతు బృందాలకు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

గతంలో శిక్షణ ఇచ్చి.. పంపిణీ మరిచి

డ్రోన్లను రాయితీపై అందించేందుకు గత వైకాపా ప్రభుత్వం 2022లో చర్యలు చేపట్టింది. అప్పట్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాలో 28 మంది, కర్నూలు జిల్లాలో 15 మంది.. కలిపి మొత్తం 43 మంది పైలట్లకు శిక్షణ ఇచ్చారు. డ్రోన్ల వినియోగంపై రైతు గ్రూపు బృందంలో ఒకరికి గుంటూరు లామ్‌ఫామ్‌లో శిక్షణ ఇచ్చారు. నంద్యాల జిల్లాలో పాణ్యం మండలం మినహా మిగిలిన మండలాల రైతు పైలట్‌లు 2023లో తర్ఫీదు పొందారు. శిక్షణ పొందినవారిలో మొదటి విడతలో మండలానికి ఒకటి చొప్పున రాయితీ డ్రోన్లు ఇవ్వనున్నట్లు గత ప్రభుత్వం ఆర్భాటం చేసింది. కానీ ఏ ఒక్కరికీ పంపిణీ చేయలేదు.

అదనపు ఆదాయమే..

ఒక్కో డ్రోన్ ఖరీదు రూ.9.80 లక్షల వరకు ఉంది. ఇందులో 80 శాతం రాయితీని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. రైతు బృందం తన వాటాగా ముందుగా రూ.2 లక్షలు చెల్లించాలి. మిగిలిన రూ.7.80 లక్షలను బ్యాంకుల ద్వారా రుణంగా అందిస్తుంది. ఆ తర్వాత ప్రభుత్వం రాయితీ మొత్తాన్ని బ్యాంకులకు చెల్లిస్తుంది. డ్రోన్ తీసుకున్న గ్రూపు సభ్యులు సొంత పొలాలతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ పనులు చేయొచ్చు. పిచికారీ చేసినందుకుగాను ఎకరాకు రూ.400 నుంచి రూ.500 వరకు తీసుకోవచ్చు. ఇలా ఒక సీజన్‌లోనే పెట్టుబడి మొత్తం తిరిగి వచ్చే అవకాశముంది.

పాత బకాయిలు విడుదల చేయండి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: వేతన సవరణ అమలుకు కమిషన్ నియమించాలని, వెంటనే మధ్యంతర భృతి, కరవు భత్యంతో పాటు పాత బకాయిలు విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రరెడ్డి, కేవీ శివయ్య కోరారు. స్థానిక కార్యాలయంలో ఏపీటీఎఫ్ జిల్లా నాయకులతో వారు ఆదివారం సమావేశమై మాట్లాడారు. 2023 జులై నుంచి ఉద్యోగులకు వేతన సవరణ జరగాల్సి ఉందని చెప్పారు. పాత పింఛను విధానం అమలుచేయాలని కోరారు. బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు ఇంకనూ పొజిషన్ ఐడీలు లేక..

ప్రసంగిస్తున్న కేవీ శివయ్య

వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సభ్యులు భాస్కర్‌రెడ్డి, జాకీర్ హుసేన్, వీరేశ్వర్‌రెడ్డి, హరినాథ్ గౌడ్, రమాబాయి, తిమ్మారెడ్డి, నౌమన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైష్ణవ కరుణానిధిమూర్తి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వైష్ణవ కరుణానిధిమూర్తి డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించాలని కోరారు. పట్టణంలోని సంకల్ప్ పాఠశాలలో పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు 35 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వై.రామపక్కీర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎంటీఎస్ వర్తింపజేయాలన్నారు. కర్నూలు జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు సయ్యద్ చాంద్‌బాషా, భాస్కర్‌రెడ్డి, భార్గవరామయ్య, కృష్ణారావు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ తగదు

రైతునగరం, నంద్యాల న్యూస్‌టుడే: రాష్ట్రంలో సోలార్ ప్రాజెక్టులు, ఎస్‌ఈజెడ్‌ల పేరుతో పేదల భూములను బలవంతంగా లాక్కోవాలని చూస్తే ఊరుకోమని వక్తలు పేర్కొన్నారు. నంద్యాల ఎన్జీవో కాలనీలోని నేషనల్ పీజీ కళాశాల కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో రైతు, వ్యవసాయ, కార్మిక, కౌలు రైతు సంఘం నాయకులు పాల్గొని మాట్లాడారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి, వి.వెంకటేశ్వర్లు, విశ్రాంత ఉప కలెక్టర్ గోవిందరాజులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత చాటుతున్న నాయకులు, రైతులు

ఉల్లి.. సాగు సన్నగిల్లి

☛ పెరిగిన ఖర్చులతో రైతుల అనాసక్తి

గోనెగండ్లకు చెందిన రైతు వెంకటేశ్వర్లు మూడెకరాలు కౌలుకు తీసుకుని ఉల్లి నారు సాగు చేశారు. విత్తు, కలుపు నివారణ, పురుగు మందులకుగాను రూ.70 వేలకు పైగా వెచ్చించారు. నారు కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదు. విత్తనాల ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కానరావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, గోనెగండ్ల

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులు క్రమంగా ఉల్లి సాగుకు దూరమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో సాధారణ సాగు 20,817 హెక్టార్లు కాగా ఈ ఏడాది 4,250 హెక్టార్లకు మించలేదు. ఏటా పెట్టుబడులు పెరుగుతుండటంతో ఉల్లి రైతులు పత్తి వైపు దృష్టి సారించారని.. ఫలితంగా పంట సాగు తగ్గిందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.

రాష్ట్రంలోనే ప్రథమ స్థానం

రాష్ట్రంలోనే అత్యధికంగా ఉల్లి సాగయ్యే జిల్లాల్లో కర్నూలు జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. గతేడాది ఖరీఫ్‌లో రాష్ట్రంలో 68,979 ఎకరాల్లో సాగవగా.. కర్నూలులో 43,211, నంద్యాల జిల్లాలో 8,988 ఎకరాల్లో సాగవడం విశేషం. వర్షాభావ పరిస్థితులు, అధిక వర్షాలతో దిగుబడులు తగ్గడం.. గిట్టుబాటు ధర రాకపోవడంతో చాలాసార్లు నష్టాలే మిగులుతున్నాయి. ఈ నేపథ్యంలో అన్నదాతలు ఉల్లి సాగుపై పెద్దగా ఆసక్తి చూపడంలేదు.

మార్కెట్‌పై ప్రభావం

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఏటా సరాసరిన 5 లక్షల క్వింటాళ్ల వరకు ఉల్లి దిగుబడులు అమ్మకానికి వస్తుంటాయి. గతేడాది 6.65 లక్షల క్వింటాళ్లు రాగా క్వింటా రూ.5 వేలకు పైగా పలికింది. సగటున రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు అమ్ముడుపోయింది. మార్కెట్‌కు సెస్సు రూపంలో రూ.1.80 కోట్లు సమకూరింది. ఈ ఏడాది రూ.50 లక్షలు కూడా వచ్చే పరిస్థితి కానరావడం లేదని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

రబీలో సాగు పెంచేలా

రైతులు ఖరీఫ్‌లో స్థానికంగా లభించే ఉల్లి రకాల సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా నష్టాలు వస్తున్నాయి. జాతీయ ఉద్యాన పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో తక్కువ ధరకు విత్తనాలు పంపిణీ చేస్తున్నా చాలా మంది తీసుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలో రబీలో తక్కువగా ఉల్లి సాగవుతోంది. సాగు పెంచేలా హెక్టారుకు విత్తనాలు, ఎరువులు తదితరాలు కలిపి ప్రభుత్వం రూ.20 వేల వరకు రాయితీ అందిస్తోంది.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం

● గత ప్రభుత్వ హయాంలో ఉల్లి రైతులకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వలేదు. కొద్దిమందికి నామమాత్రంగా రాయితీ విత్తనాలు ఇచ్చారు. మద్దతు ధర రూ.770గా నిర్ణయించారు. మద్దతు ధర పెంచాలని రైతులు, రైతు సంఘాల నాయకులు ఆందోళన చేసినా ప్రయోజనం లేకుండాపోయింది.

● 2014-19 మధ్యకాలంలో తెదేపా ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకుంది. మద్దతు ధర రాని సమయంలో మద్దతు పథకం కింద 3.10 లక్షల టన్నుల ఉల్లి సేకరించింది. రైతుల నుంచి క్వింటా రూ.800కు కొనుగోలు చేసి రైతుబజార్లకు సరఫరా చేసింది.

(c) eenadu

దేశ, ధర్మ పరిరక్షణకు కృషి చేద్దాం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: దేశ, ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్క భారతీయుడు తమ వంతు సమయం కేటాయించి, పనిచేయాల్సిన అవసరముందని విశ్వహిందూ పరిషత్ విశేష సంపర్క్ ప్రముఖ్ ప్రతాప్‌రెడ్డి, బజరంగ్‌దళ్ ప్రాంత సహ సంయోజక్ రవికుమార్ అన్నారు. ఆదోని కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా స్థాయి అభ్యాసవర్గ(శిక్షణ తరగతులు) కార్యక్రమంలో పాల్గొన్నారు. సంఘటిత సమాజం, వ్యక్తి నిర్మాణం, సంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్క హిందువు కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హనుమంతరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భీమిరెడ్డి, జిల్లా ప్రచార ప్రముఖ్ ఉపేందర్‌రెడ్డి, వీరనరసప్ప, రాఘరెడ్డి, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు హాజరైన వారితో వీహెచ్‌పీ ప్రతినిధులు

ఎండిన కొమ్మల్లో హెచ్చరిక

మద్దికెర నుంచి గుంతకల్లు వెళ్లే ప్రధాన రహదారి పలు చోట్ల అధ్వానంగా ఉంది. ఈ దారిలో వర్షం నీరు నిలిస్తే.. ఎక్కడ దారుందో ఎక్కడ గోతులున్నాయో తెలుసుకోలేని పరిస్థితి. రాకపోకలు ప్రమాదకరంగా మారుతాయి. వాగుపై నిర్మించిన కల్వర్టు పూర్తిగా శిథిలమవుతోంది. ఇప్పటికే గోతులు పడ్డాయి. వాహనదారులు ప్రమాదాల అంచున ప్రయాణిస్తున్నా.. సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. వాహనదారులే ఇలా ఓ చెట్టుకొమ్మను ఉంచి దానికి ఓ ఎర్ర సంచిని తగిలించారు. ఇదే ప్రమాద సూచికగా భావించి జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. మద్దికెర- గుంతకల్లు ప్రధాన రహదారిలో కల్వర్టు వద్ద ఇదీ పరిస్థితి.

– న్యూస్‌టుడే, మద్దికెర

రోడ్డు చూస్తేనే వణుకు పుట్టేలా..

మండలంలోని సి.బెళగల్ నుంచి పలుకుదొడ్డి సంగాల బీటీ రహదారి పూర్తిగా గుంతమయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2008లో నాబార్డు నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తట్టెడు మన్ను కూడా పోయలేదు. దీంతో రహదారికి సుమారు 45 పెద్ద గోతులు ఏర్పడినా.. ఇంతవరకు నిర్మాణం పనులు చేపట్టకపోవడం విచారకరం. ఇటీవల కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. గుత్తేదారు కేవలం బీటీ రహదారిపై పొక్లెయిన్‌తో సంచేశారు. ఇప్పటి వరకు పనులు చేపట్టకపోవడంతో గుంతల రహదారి శరణ్యంగా మారింది. త్వరగా రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని సి.బెళగల్, పలుకుదొడ్డి, సంగాల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, పలుకుదొడ్డి(సి.బెళగల్)

పరిశోధనలు సాగిస్తాం..
అంకురాలు స్థాపిస్తాం

★ ఘనంగా ట్రిపుల్ ఐటీ డీఎం స్నాతకోత్సవం

ఈనాడు, కర్నూలు : ప్రజా శ్రేయస్సుకు.. దేశాభివృద్ధికి ఉపయోగపడేలా పరిశోధనలు సాగిస్తాం.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నూతన ఆవిష్కరణలు చేస్తాం.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపుతూ అంకుర సంస్థలను స్థాపిస్తామని ఇంజినీరింగ్ పట్టభద్రులు చెబుతున్నారు. కర్నూలు నగరంలోని ట్రిపుల్ ఐటీ డీఎం ఏడో స్నాతకోత్సవం ఆదివారం ఆ కళాశాలలోని కృష్ణా సెమినార్ హాల్లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ తన ప్రసంగంతో విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలు కావాలని పిలుపునిచ్చారు. నిత్య విద్యార్థులుగా ఉంటూ నూతన సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సంపాదించాలని సూచించారు. చదువులో అత్యుత్తమ ప్రతిభ చూపి.. బంగారు పతకాలు, పట్టాలు అందుకున్న విద్యార్థులు తమ భవిష్యత్తు లక్ష్యాలను ఇలా వివరించారు.

డేటా సైన్స్‌లో ఎంటెక్ చేస్తా.. - లావిష్‌సింగ్, మధ్యప్రదేశ్

ట్రిపుల్ ఐడీ డీఎంలోని అన్ని బ్రాంచుల విద్యార్థులతో పోటీపడి అత్యధిక సీజీపీఏ (9.6) సాధించాను. కంప్యూటర్ సైన్స్ విభాగంలో బ్రాంచి టాపర్‌గా నిలిచా. రెండు బంగారు పతకాలు సాధించడం ఆనందంగా ఉంది. క్రమశిక్షణ, నిబద్ధతతో చదువుకోవడంతో పాటు ఆచార్యుల సలహాలు, సూచనలు పాటించడంతో మంచి స్కోరు సాధించగలిగా. డేటా సైన్స్‌లో ఎంటెక్ చేయాలన్నది నా లక్ష్యం.

సివిల్స్ ర్యాంకు సాధించాలి - బి.ప్రీతి, మెకానికల్ ఇంజినీరింగ్

మెకానికల్ ఇంజినీరింగ్‌లో బ్రాంచి టాపర్ నిలిచినందుకు నాకు బంగారు పతకం లభించింది. ట్రిపుల్ ఐటీ డీఎంలో మంచి గ్రంథాలయం, నిపుణులైన ఆచార్యులు, విస్తృతమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. దీంతో మంచి ఫలితాలు సాధించగలిగాను.

పరిశోధనలపై దృష్టిసారిస్తా

- ప్రణయ్‌సందీప్ పరాట్‌వార్, ఎంటెక్

కృత్రిమ మేధ, డేటా సైన్స్ బ్రాంచిలో ఎంటెక్ చేసి టాపర్‌గా నిలిచి బంగారు పతకం అందుకున్నా. ఏఐ, డేటా సైన్స్ రంగాల్లో పరిశోధనలు చేయాలన్నది నా లక్ష్యం. ట్రిపుల్ ఐటీ డీఎం సంస్థలో విస్తృత మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతిభకు మెరుగులు దిద్దుకోవడానికి ఎన్నో అవకాశాలున్నాయి.

రెండు బంగారు పతకాలు అందుకున్నా

- శ్రీసౌగంధిక, బీటెక్, ఏఐ, డేటా సైన్స్

నేను కృత్రిమమేధ, డేటా సైన్స్ బ్రాంచిలో బీటెక్ పూర్తిచేసి టాపర్‌గా నిలిచాను. బంగారు పతకం అందుకున్నా కళాశాలలో చదువుకున్న అన్ని బ్రాంచిల విద్యార్థినుల కంటే ఎక్కువ సీజీపీఏ సాధించా. ఇందుకు గానూ మరో బంగారు పతకం అందుకున్నా. ట్రిపుల్ ఐటీలో విద్యార్థినులకు అత్యంత అనుకూల వాతావరణం ఉంది. ప్రశాంతంగా చదువుకోవచ్చు. చదువుతో పాటు సంగీతం, నృత్యం తదితర పోటీల్లో కూడా చురుగ్గా పాల్గొనేదాన్ని. గేట్‌లో 210వ ర్యాంకు వచ్చింది.

రూ.30 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం వచ్చింది

- సీహెచ్‌వీ శ్రీవర్ధనమూర్తి, శ్రీకాకుళం జిల్లా

బీటెక్ ఈసీఈ బ్రాంచిలో 9.4 సీజీపీఏ సాధించి టాపర్‌గా నిలిచినందుకు నాకు బంగారు పతకం వచ్చింది. విశాఖ ఐఐఎం నుంచి ఆన్‌లైన్లో ఎంబీఏ కూడా చేస్తున్నాను. ప్రాంగణ నియామకాల్లో రూ.30 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగానికి ఎంపికయ్యాను. బెంగళూరు ఐఐఎస్సీలో సీటు రావడంతో ఎంటెక్ చేయాలని నిర్ణయించుకున్నా. కర్నూలు ట్రిపుల్ ఐటీ డీఎంలో దేశంలోని వివిధ రాష్ట్రాల విద్యార్థులతో కలిసి చదువుకునే అవకాశం ఉండటం విద్యార్థులకు కలిసివచ్చే అంశం.

నేడు జిల్లాలో మంత్రుల పర్యటన

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం నందికొట్కూరు నియోజకవర్గంలోని కొత్తపల్లె మండలంలోని దుద్యాల గ్రామంలో ఉదయం 9 గంటలకు నిర్వహించే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి పాల్గొంటారు. మధ్యాహ్నం కలెక్టరేట్‌లో నిర్వహించే సాంఘిక సంక్షేమం, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ, గ్రామ, వార్డు సచివాలయాల అధికారులతో ఆయన సమీక్షిస్తారు. మంత్రి ఆనం రామానారాయణరెడ్డి ఉదయం 11.30 గంటలకు పాణ్యంలో నిర్వహించే సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారు.

గోశాల అభివృద్ధికి విరాళం

బోయకొండ(చౌడేపల్లె), న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాల అభివృద్ధికి నంద్యాలకు చెందిన అటవీశాఖాధికారి ఈశ్వరయ్య రూ.69,200 నగదు, ఆలయానికి రూ.32,000 విలువ చేసే బంగారం విరాళంగా ఇచ్చినట్లు ఈవో ఏకాంబరం తెలిపారు.

వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.6,970

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.6,970, మధ్యస్థ ధర రూ.5,410, కనిష్ఠ ధర రూ.3,360కు వ్యాపారులు కొన్నారు. రైతులు మార్కెట్‌కు 2,505 వేరుసెనగ బస్తాలను అమ్మకానికి తెచ్చారు.

లక్ష్య సాధన.. విజయ పథాన

☛ అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న విద్యార్థులు

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : యువ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలుగులోకి తెచ్చి వారిని.. జాతి గర్వించదగ్గ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా.. లక్ష్య ఫౌండేషన్ ఇస్తున్న శిక్షణ సత్ఫలితాన్నిస్తోంది. ఈ సంస్థలో రెండేళ్ల కిందట శిక్షణ పొందిన క్రీడాకారులు విజయాల బాటలో సాగుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల జరిగిన దక్షిణ మండలం సీబీఎస్ఈ అంతర్ పాఠశాలల అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో లక్ష్య శిక్షకురాలు హారికతో పాటు క్రీడాకారులు జస్విక, దివెన్‌కుమార్ పతకాలు సాధించారు. జాతీయస్థాయిలో విజయాలు సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు వీరు చెబుతున్నారు.

పోటీల్లో జస్విక దూకుడు

నగరానికి చెందిన జస్విక ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. క్రీడలపై మక్కువతో రెండేళ్ల కిందట లక్ష్య ఫౌండేషన్‌లో చేరింది. డీఎస్ఏ స్టేడియంలో శిక్షకురాలు హారిక వద్ద లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్‌లో తర్ఫీదు పొందింది. ◆ 2024 సెప్టెంబరు 17 నుంచి 19వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన సీబీఎస్ఈ దక్షిణ మండల అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో లాంగ్‌జంప్‌లో, ట్రిపుల్ జంప్‌లో స్వర్ణం పతకాలు సాధించింది. ◆ గతేడాది అక్టోబరు 6 నుంచి 10వ తేదీ వరకు వారణాసిలో జరిగిన జాతీయస్థాయి అంతర్ సీబీఎస్ఈ పాఠశాలల అథ్లెటిక్స్ పోటీల్లో ఆడి ప్రతిభ చూపింది. ◆ 2024లో కర్నూలు కేంద్రీయ విద్యాలయంలో జరిగిన అండర్-14 అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల పరుగులో స్వర్ణం, 400 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు పతకాలు సాధించింది. జాతీయస్థాయిలో బంగారు పతకాలు సాధించడమే లక్ష్యంగా శిక్షకురాలు హారిక వద్ద మెలకువలు నేర్చుకుంటున్నట్లు జస్విక చెబుతోంది.

దివెన్‌కుమార్.. పతకాల పరుగు

కర్నూలు నగరంలోని గుత్తి పెట్రోలు బంకు ప్రాంతంలో నివసించే దివెన్‌కుమార్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతున్నాడు. కేంద్రీయ విద్యాలయంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. క్రీడల్లో రాణించాలన్న పట్టుదలతో లక్ష్య ఫౌండేషన్‌లో చేరి శిక్షణ తీసుకుంటున్నాడు. ◆ 2020 ఫిబ్రవరిలో తిరుపతిలో జరిగిన జాతీయస్థాయి అంతర్ కేంద్రీయ విద్యాలయాల క్రీడా పోటీల్లో హర్డిల్స్‌లో రజతం గెలిచాడు. ◆ 2023 జులైలో హైదరాబాద్‌లో జరిగిన రీజినల్ స్పోర్ట్స్ మీట్‌లో అండర్-17 విభాగంలో 100 మీటర్ల పరుగులో రజతం, లాంగ్‌జంప్‌లో కాంస్య పతకం అందుకున్నాడు. ◆ 2023 సెప్టెంబరులో గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ మీట్‌లో 400 మీటర్ల పరుగులో కాంస్య పతకం అందుకున్నాడు. ◆ 2024 జులైలో కేంద్రీయ విద్యాలయాల స్పోర్ట్స్ మీట్‌లో 400 మీటర్ల పరుగు, 400 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకాలు గెలుపొందాడు. ◆ 2024 సెప్టెంబరులో హైదరాబాద్‌లో జరిగిన సీబీఎస్ఈ దక్షిణ మండల అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల పరుగు, 400 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకాలు సాధించాడు. అక్టోబరు 7 నుంచి జరుగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించాలన్న పట్టుదలతో కఠోర సాధన చేస్తున్నాడు దివెన్‌కుమార్.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

◆ ఒకరి మృతి, మరొకరు గల్లంతు

◆ నలుగురిని కాపాడిన యువకులు

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: కౌతాళం మండలంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆరుగురు ప్రయాణిస్తున్న కారు శునకాన్ని తప్పించబోయి ఎల్లెల్సీ దిగువ కాల్వలోకి దూసుకెళ్లింది. అక్కడే వ్యవసాయ పనులు చేస్తున్న కూలీలు వెంటనే వచ్చి నీటిలో కొట్టుకుపోతున్న నలుగురిని ఎంతో సాహసంగా కాపాడారు. మరో ఇద్దరిని కాపాడేలోగా మునిగిపోయారు. ఒకరి మృతదేహం లభ్యం కాగా.. మరొకరు గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని ధార్వాడ జిల్లాకు చెందిన హైదర్, అభిషేక్, అప్పయ్య, మంజునాథ్, సునీల్, మణికంఠలు హుబ్లీలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనానికి శనివారం కారులో వచ్చారు. ఆదివారం తిరుగు ప్రయాణంలో కొప్పళ సిద్దేశ్వర ఆలయాన్ని దర్శించుకొనేందుకు కౌతాళం మీదుగా వెళ్తున్నారు. శునకాన్ని తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు కారు ఎల్లెల్సీ కారులోకి దూసుకెళ్లింది.

కారును బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు

సాహసం చేసి.. కాల్వలో దూకి..

అక్కడే పొలంలో పని చేస్తున్న గొట్టయ్య, గోవర్ధన అనే ఇద్దరు యువకులు సాహసం చేసి ఎల్లెల్సీ కాలువలో దూకారు. కారు తలుపులు తీసి నలుగురిని బయటకు లాగి ఒడ్డుకు చేర్చారు. మరో ఇద్దరు సునీల్(23), మణికంఠలను కాపాడేలోగా నీటిలో మునిగి కొట్టుకుపోయారు. కౌతాళం సీఐ అశోక్ కుమార్ వెంటనే స్పందించి గాలింపు చర్యలు చేపట్టారు. అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. సాయంత్రం 4 గంటలకు సునీల్ మృతదేహం లభ్యమైంది. గల్లంతైన మణికంఠ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. చీకటి పడటంతో గాలింపు చర్యలను నిలిపేశారు. మూడు చోట్ల కాల్వకు అడ్డంగా వల వేసి ఉంచారు. సోమవారం ఉదయమే గాలింపు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ఎల్లెల్సీ కాల్వలో సుమారు 690 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఎల్లెల్సీ డీఈ మహమ్మద్ షఫీ ఉల్లా వెంటనే స్పందించి డిస్ట్రిబ్యూటరీ గేట్లను ఎత్తి నీటిని కాల్వలకు విడుదల చేశారు. సునీల్ స్వగ్రామం గోకుల్ కాగా.. మణికంఠది తరిహాల్ గ్రామం. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు. ఘటన సమాచారాన్ని యువకుల కుటుంబాలకు తెలియజేసినట్లు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

అవుకు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. వివరాల మేరకు.. అవుకు మండలంలోని చనుగొండ్ల గ్రామానికి చెందిన బాచం వెంకటరెడ్డి(75) ఆదివారం మొక్కజొన్న పంటకు నీళ్లు కట్టేందుకు వెళ్లి ప్రమాదానికి గురయ్యారు. మోటారు ఆన్ చేసేందుకు స్టార్టర్ బాక్సు తెరవడంతో.. అందులో తీగలు జారిపడి బాక్సుకు విద్యుత్తు ప్రసారం కావడంతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. బాక్సు తెరిచిన వెంటనే షాక్‌కు గురై కుప్పకూలిపోయాడని... విషయం తెలుసుకునేలోపే మరణించినట్లు వెల్లడించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఘటనకు సంబంధించి తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు.



వెంకటరెడ్డి (పాత చిత్రం)

పెద్దతుంబళం గ్రామంలో..

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: సెంట్రింగ్ కూలి పనులు చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తిమ్మప్ప(29) మృత్యువాత పడిన ఘటన ఆదివారం ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామంలో చోటు చేసుకుంది. పెద్దతుంబళం పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దతుంబళం గ్రామానికి చెందిన తిమ్మప్ప సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇతడి భార్య మూడేళ్ల కిందట మృతిచెందారు. తిమ్మప్ప గ్రామంలో ఆదివారం సెంట్రింగ్ పనులు చేస్తుండగా.. ఇనుపకడ్డీలు పైకి ఎత్తే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలకు తాకడంతో తిమ్మప్ప విద్యుదాఘానికి గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడన్నారు. గుర్తించిన తోటి కార్మికులు చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోని చనిపోయాడన్నారు. విషయం తెలుసుకున్న మృతుడి తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు.

తిమ్మప్ప (పాత చిత్రం)

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం నిజాముద్దీన్ కాలనీకి చెందిన ఇసాక్(46) ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక నిజాముద్దీన్ కాలనీలో ఇసాక్, షంసున్ని దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. ఇసాక్ కూరగాయల వ్యాపారం చేస్తూ.. కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా.. ఇటీవల ఆయన మానసిక స్థితి సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ క్రమంలో పట్టణంలోని ఖాజీపుర సమీపంలో డిష్ వైర్లకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. గుర్తించిన పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఇసాక్ (పాత చిత్రం)

అప్పు తీర్చమన్నందుకు హత్య

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: అప్పు తీర్చమని అడిగినందుకు వ్యక్తిని హత్య చేసిన ఘటన పాణ్యంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నంద్యాల బొమ్మలసత్రంకు చెందిన అశోక్‌చౌదరి(38) గతంలో శాంతిరాం వైద్యశాలలో క్యాంటీన్ నిర్వహించేవాడు. పాణ్యం డొంగు సమీపంలో గోరుకల్లు రహదారిలో కూల్‌డ్రింక్ దుకాణం నిర్వహిస్తున్న సుబ్బయ్యకు రూ.40 లక్షలు అప్పు ఇచ్చాడు. అశోక్‌చౌదరి ఆదివారం కూల్‌డ్రింక్ దుకాణం వద్దకు వచ్చి సుబ్బయ్యను అప్పు కట్టమని అడగడంతో ఇరువురి మధ్య ఘర్షణ నెలకొంది. సుబ్బయ్య కుమారుడు, మరో వ్యక్తి కలిసి అశోక్ చౌదరిని హత్య చేసి పోలీసు స్టేషన్‌లో లొంగిపోయారు. డీఎస్పీ జావలి సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అశోక్ చౌదరి (పాత చిత్రం)

విద్యుత్తు లైన్‌మెన్‌పై దాడి.. ఇద్దరిపై కేసు

మహానంది, న్యూస్‌టుడే: మహానంది మండలం గోపవరం గ్రామంలో విద్యుత్తు లైన్‌మెన్‌పై దాడి చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు మహానంది ఎస్సై రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం..గోపవరం గ్రామంలో శనివారం రాత్రి విద్యుత్తు శాఖ లైన్‌మెన్ వేణుగోపాల్ కొత్తపేట వీధుల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో నియంత్రిక వద్ద మరమ్మతులు చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన బాల నడిపి మద్దిలేటి, అతని కుమారుడు మధుకృష్ణ తమకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తావా అంటూ లైన్‌మెన్, సిబ్బంది రవిబాబుతో దుర్భాషలాడి దాడి చేశారు. లైన్‌మెన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కుక్క దాడితో చిన్నారికి గాయాలు

పాములపాడు, న్యూస్‌టుడే: ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారిపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. మండలంలోని భానుముక్కలకు చెందిన బలరాజు, దేవమ్మల ఐదేళ్ల కుమార్తె ఆదివారం ఆడుకుంటుండగా కుక్కదాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. చిన్నారిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు.

చేనేత పట్టు జారి

☛ పవర్ మగ్గాలతో నేతన్నలకు కడుపుకోత

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పవర్ మగ్గాలు నేతన్నలకు కడుపుకోత మిగిల్చింది. చేనేతలు తయారు చేసిన వస్త్రాలకు డిమాండ్ లేకపోవడంతో ఆదాయానికి భారీగా గండిపడింది. అమ్మకాలు తగ్గి మాస్టర్ వీవర్స్ దగ్గర రూ.కోట్ల విలువైన నిల్వలు పేరుకుపోయాయి. దీంతో కొందరు మగ్గాల సంఖ్యను కుదిస్తున్నారు. పవర్ లూమ్స్ మగ్గాలతో తయారు చేసిన చీరల ధర తక్కువగా ఉండటంతో వ్యాపారులు వాటినే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో చేనేతల వద్ద రూ.కోట్ల విలువ చేసే ముడిసరకు నిల్వలు ఉండిపోయాయి. జిల్లాలోని చేనేతల దుస్థితిపై 'న్యూస్‌టుడే' అందిస్తున్న పరిశీలన కథనం.

జిల్లాలోని ఎమ్మిగనూరు, నందవరం, నాగలదిన్నె, కోడుమూరు, ఆదోని, నంద్యాల, గూడూరు, గుడేకల్లు ప్రాంతాల్లో చేనేత కార్మికులు అధికంగా ఉన్నారు. మాస్టర్ వీవర్స్ 500 మందికిపైగానే ఉండగా.. పట్టు మగ్గాలపై 11వేలు మంది ఆధారపడ్డారు. చీరకు రూ.2500 నుంచి రూ.8500 కూలీ సొమ్ము చెల్లిస్తారు. నెలకు ఒక్కో మగ్గంపై 4 నుంచి 5 చీరలు తయారు చేస్తారు. కొందరు వ్యాపారుల వద్ద ముడిసరకు తెచ్చి.. తయారైన చీరలను వారికే ఇస్తారు. మరికొందరు ముడి సరకు తెచ్చుకొని బయట అమ్ముతారు.

మగ్గాలు నేస్తున్న కార్మికులు

గద్వాల పట్టు...

గద్వాల పట్టుకు పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. ఇక్కడ తయారైన చీరలను దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. అచ్చంగా నేతన్న నేసిన వస్త్రాలు కావడంతో డిమాండు ఉంది. కానీ మాస్టర్ వీవర్స్ తయారు చేసిన చీరలను నాలుగు నెలల నుంచి కొనుగోలు చేయడం లేదు. నేతన్న నేసిన చీరల స్థానంలో.. పవర్ మగ్గాలతో తయారు చేస్తున్నారు. వీటి ధర రెండింతలు తక్కువగా ఉండటంతో వ్యాపారులు వాటిపై మొగ్గు చూపుతున్నారు.

వ్యాపారం తగ్గి.. - శ్రీనివాసులు, మాస్టర్ వీవర్స్

గతంలో నాలుగు మగ్గాలు ఉండేవి. పట్టు చీరలకు సరైన మార్కెట్ లేకపోవడంతో మగ్గాలు తగ్గించుకున్నా. ప్రస్తుతం రెండు మగ్గాలపై సొంతంగా పట్టు చీరలు తయారు చేస్తాం. చీరలు, ముడిసరకు, మగ్గాలు అన్నీ కలిపి దాదాపు రూ.5లక్షల విలువ ఉంటుంది. గద్వాలకు చెందిన వ్యాపారి నుంచి రూ.2.50లక్షలు రావాల్సి ఉంది. నేత చీరల కన్నా.. బెంగళూరు పవర్‌లూమ్‌లో తయారు చేసిన చీరలు తక్కువ ధరలకు వస్తున్నాయని పెద్ద వ్యాపారులు అంటున్నారు. పవర్ లూమ్‌తో పూర్తిగా వ్యాపారం తగ్గింది.

రూ.1.50కోట్ల బకాయిలు - చిన్నరంగన్న, మాస్టర్ వీవర్స్, ఎమ్మిగనూరు

మాస్టర్ వీవర్స్ కింద మాకు 125 మగ్గాలు ఉన్నాయి. ధర్మవరం, బెంగళూరు, సూరత్ వ్యాపారుల నుంచి ముడిసరకు కొనుగోలు చేసుకుంటా. నాలుగు నెలలు నుంచి తయారు చేసిన పట్టు చీరలు 700కు పైగానే ఉన్నాయి. వీటి విలువ దాదాపు రూ.80లక్షలు ఉంది. 125 మగ్గాలపై ముడిసరకు 30లక్షలు పైగానే ఉన్నాయి. మహారాష్ట్ర, హైదరాబాదు, బెంగళూరులో వ్యాపారుల నుంచి దాదాపు రూ.1.50 కోట్లు రావాల్సి ఉంది. చీరలకు డిమాండు లేకపోవడంతో ప్రస్తుతం 500 చీరలు నిల్వ ఉన్నాయి. వీటి విలువ దాదాపు రూ.కోటిపైగానే ఉంది. చీరలు అమ్ముడు పోకపోతే ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి. గతంలో ప్రభుత్వం మా చీరలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు మగ్గాలు కొన్నింటిని నిలిపివేసే పరిస్థితి ఏర్పడింది. పవర్ మగ్గాలతో వ్యాపారం పూర్తిగా తగ్గింది.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 73375 44439, 90146 51068, 70756 33416.

REAL ESTATE

PLOT FOR SALE

నగరవనం ఎదురుగా గ్లోబల్ లేక్‌వ్యూ వెంచర్‌లో ప్లాటు నెం: 94, ఉత్తరం పడమర కార్నర్ 6 1/4 సెంటు ప్లాటు అమ్మకంనకు కలదు. సంప్ర: 94415 80948.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

JOBS

కర్నూలులో కొత్త అయ్యప్ప స్వామి గుడి దగ్గర B.K. సింగ్ టవర్స్ అపార్ట్‌మెంట్ నందు పనిచేయుటకు సూపర్ వైజర్ కావలెను. 40-50 సంవత్సరాల వారు సంప్ర: 94944 82319.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఛిద్రమవుతున్న బాల్యం

బాలికలపై కొనసాగుతున్న అఘాయిత్యాలు

ఈనాడు డిజిటల్, నంద్యాల, నేరవిభాగం న్యూస్‌టుడే: పోక్సో కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షిస్తున్నప్పటికీ మార్పు రావడం రాలేదు. బాలికలు, చిన్నారుల రక్షణకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు అమలు చేస్తున్నా అకృత్యాలకు అడ్డుకట్ట పడటం లేదు. ముక్కుపచ్చలారని చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోతూనే ఉన్నాయి. జిల్లాలో పోలీసు శాఖ కేంద్రంలో మూడు సంవత్సరాల కేసులను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతోంది.

తెలిసినవారే ఎక్కువ

పోక్సో కేసుల్లో చాలా వరకు తెలిసినవారే ఎక్కువగా ఉంటున్నారు. ముక్కుపచ్చలాడని చిన్నారులు కావడంతో తమకు జరిగిందేమిటో కూడా కొందరు గుర్తించలేకపోతున్నారు. కొన్ని సందర్భాల్లో వైద్యులను సంప్రదించినంత వరకు ఈ విషయాలేవీ బయటకు రావడం లేదు.

నిర్భయంగా వెల్లడించాలి

పిల్లల ప్రవర్తనను తల్లితండ్రులు గమనిస్తుండాలి. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వం అవగాహన కల్పిస్తోంది. వారితో అసభ్యంగా ప్రవర్తించే వారి వివరాలు నిర్భయంగా వెల్లడించేలా పెద్దలు చెప్పాలి. అత్యాచారానికి గురైన బాధితులు ధైర్యంగా ముందుకు రావాలి.

శిక్షలు ఇలా..

● నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం ముత్యాలపాడుకు చెందిన కుండబోయిన చిన్న ఎల్లయ్యకు పోక్సో కేసులో 20ఏళ్ల జైలుశిక్ష, రూ.50వేల జరిమానా విధించారు.

● బనగానపల్లె మండలం, తుమ్మడపల్లె గ్రామానికి చెందిన మాల గుడిసె రుద్రేశ్(22)కు బాలికపై అత్యాచారం కేసులో 20ఏళ్ల జైలు, రూ.50వేల జరిమానా విధించారు.

జిల్లాలో పోక్సో కేసుల వివరాలు

కేసులు	2023	2024	2025 (ఇప్పటికి వరకు)
పోక్సో	49	35	28

కఠినంగా శిక్షిస్తాం

- కె.జయరామ్, సీఐ, దిశ పోలీసు స్టేషన్, నంద్యాల

పోక్సో చట్టం గురించి సిబ్బందికి ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తున్నారు. నిందితులను కఠినంగా శిక్షిస్తాం. ఈ కేసుల్లో అయిదేళ్ల జైలు నుంచి మరణశిక్ష పడే అవకాశం ఉంటుంది. ఈ కేసులను ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తాం. బాధితులకు భరోసా కేంద్రం ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నాం.

నంద్యాల

• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

ఉద్యాన పంటల సాగుకు అవకాశం

శిరివెళ్ల: రైతులకు ఉపాధిహామీ పథకంలో భాగంగా ఉద్యాన పంటలసాగుపై క్షేత్రసహాయకులు అవగాహన కల్పించాలని ఏపీవో విజయకుమార్ ఆదివారం పేర్కొన్నారు. ఐదు ఎకరాల్లోపు చిన్న, సన్నకారు రైతులు వివిధ రకాల పూల, పండ్ల తోటలను సాగు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. రైతులకు ఎక్కువ ఆదాయం కల్పించి దరఖాస్తు చేసుకునేలా చూడాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) నందికొట్కూరు: 94403 61729 ఆత్మకూరు: 90149 09024 నంద్యాల: 98853 28120

నంద్యాల పురపాలకం : ?: పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లో మురుగునీరు ఇబ్బందిగా ఉంది. - జాకీర్

?: సంజీవనగర్‌లో కాల్వలు శుభ్రం చేయడం లేదు. దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. - రఫీ

?: నంద్యాల పట్టణంలోని బైరమల్ వీధిలో వీధికుక్కల బెడద అధికమైంది. భయంగా ఉంది. - శశి

?: సరస్వతీనగర్‌లో వీధికుక్కల బెడద అధికమైంది. బయటకు వెళ్లలేకపోతున్నాం. - శ్రీను, సాయికుడు

✔: సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయిస్తాం. రోడ్డుపై మురుగును తొలగింపజేస్తాం. త్వరలోనే కుక్కలు పట్టించి సమస్య పరిష్కరిస్తాం. - లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

నందికొట్కూరు, న్యూస్‌టుడే: ?: కర్నూలు-గుంటూరు రహదారిపై వర్షం నీటి నిల్వలతో ఇబ్బంది పడుతున్నాం. చర్యలు తీసుకోవాలి. - ప్రభు, నందికొట్కూరు.

✔: చర్యలు తీసుకుంటాం. శాశ్వత పనులు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. - నాసీర్

కొత్తపల్లి గ్రామీణం?: సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాల సమీపంలో కల్వర్టు ధ్వంసమైంది. కల్వర్టుపై బండరాళ్లతో ఇబ్బందిగా ఉంది. కల్వర్టు ఏర్పాటు చేయండి. - ఖాజా

✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. కల్వర్టు బండలు సరిచేసి సిమెంట్ చేయించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. - బీజు, కమిషనర్.

ఆత్మకూరు పట్టణం?: నంద్యాల మార్గం నుంచి వెలుగోడు వెళ్లే రహదారి పక్కన వాహనాలు నిలుపుతున్నారు. ప్రమాదాలకు అవకాశం ఉంది. - సదాం

✔: వాహన యజమానులను హెచ్చరిస్తాం. - వెంకట నారాయణరెడ్డి, ఎస్సై

?: పాత బస్టాండు-దుద్యాల మార్గంలో రెండు వీధి దీపాలు వెలగటం లేదు. - సుధీర్

✔: వీధి దీపాలు మరమ్మతులు చేయిస్తాం. - షాహిర్‌బాషా, పురపాలక ఏఈ.

అరకొర వాన.. రైతుల హైరానా

● దినదిన గండంగా మొక్కజొన్న సాగు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఈ ఏడాది మొక్కజొన్న రైతుకు దినదిన గండంగా మారింది. ఖరీఫ్‌లో ముందస్తుగా కురిసిన వర్షాలతో రైతులు ఎక్కువగా మొక్కజొన్న సాగు చేశారు. తరువాత వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంటలు బెట్టపోయాయి. ఇక పంట తొలగించాల్సి వస్తుందనే సమయంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు పైరుకు ప్రాణం పోశాయి. అయినప్పటికీ రైతు సందిగ్ధంలోనే ఉన్నారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలో పంటల సాగుపై కథనం.

పచ్చదనంతో కళకళలాడుతున్న పొలం

ముందస్తుగా సాగు

ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు మొక్కజొన్న ముందస్తుగా సాగు చేశారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంట బెట్టకొచ్చింది. పంట తొలగించాలనే సమయంలో కొద్దిగా వర్షం కురవడంతో ఎరువులు చల్లారు. మళ్లీ వానజల్లే పంటలు బెట్టపోయాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటకు ప్రాణం పోశాయి.

సకాలంలో కురవని వర్షాలు

నియోజకవర్గంలో ఏప్రిల్‌లో 199.3 మి.మీ, మేలో 177.4 మి.మీ ఎక్కువ వర్షపాతం నమోదైంది. జూన్‌లో 87.5 మి.మీటర్లు 46.5, జులైలో 173 మి.మీటర్లు 33 మి.మీల వర్షపాతం మాత్రమే నమోదైంది. జూన్‌లో 46.9 మి.మీలు, జులైలో 80.7 మి.మీలు తక్కువ కురిసింది. బావుల్లో నీరు లేక ఇబ్బంది పడుతున్నారు.

దిగుబడులపై ప్రభావం

డివిజన్ పరిధిలో మొక్కజొన్న పంట 50 నుంచి 60 రోజుల మధ్య ఉంది. ప్రస్తుతం సుడిఆకు, తురాయి వేస్తున్నాయి. కొన్నిచోట్ల పైరులో ఎదుగుదల లోపించి, తక్కువ ఎత్తు పెరిగాయి. బెట్ట కారణంగా పంట దెబ్బతింటే, దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయాధికారులు మాత్రం యూరియా వంటి ఎరువులు చల్లితే ప్రయోజనం ఉంటుందంటున్నారు. కంకి దశ వరకు దుర్భరమని రైతులు భావిస్తున్నారు.

తగిన మోతాదులో ఎరువులు వాడాలి

- హేమలత, వ్యవసాయాధికారిణి

అధిక మోతాదులో ఎరువులు వాడటంతో పంట బెట్టకు లోనయ్యే అవకాశం ఉంది. తగిన మోతాదులోనే వినియోగించాలి. కత్తెర పురుగు ఆశిస్తే ఇమామెక్టిన్ బెంజోయేట్ ద్రావణం పిచికారీ చేయాలి. మేలో ముందస్తుగా సాగు చేసిన పంటల్లో నీటి పారుదల లేనిచోట ఎదుగుదల లోపించింది. కంకి ఏర్పడే వరకు వేచి చూడాలి. దిగుబడి తగ్గినా నష్టం ఉండకపోవచ్చు.

క్రీడాభివృద్ధికి కృషి చేస్తాం

చాగలమర్రి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఉమ్మడి కర్నూలు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఛైర్మన్ షేక్‌బాబలాల్, చక్రం షబ్బీర్‌లు తెలిపారు. పట్టణంలోని వైకాపా కార్యాలయంలో రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో విజేతలైన నంద్యాల జిల్లా క్రీడాకారులను ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేసి సన్మానించారు. రాష్ట్ర బేస్‌బాల్ సంఘం కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి, లీగల్ అడ్వైజర్ మాధవరావు మాట్లాడుతూ.. ఇటీవల సత్యసాయి జిల్లా కదిరిలో జరిగిన పోటీల్లో జిల్లా జట్టు విజేతగా నిలిచి బంగారు పతకం సాధించిందన్నారు.

ఇసుక రవాణాకు భారీ బోట్లు

పగిడ్యాల మండలం ముచ్చుమర్రి హంద్రీనీవా సుజలస్రవంతి పథకం సమీపంలో భారీ బోట్ల ద్వారా ఇసుక రవాణా జరుగుతోంది. ప్రకాశం జిల్లాలోని దోర్నాల సమీపంలో చేపడుతున్న వెలిగొండ ప్రాజెక్టు పనులకు తుంగభద్ర నుంచి టిప్పర్లలో ఇసుక తీసుకువచ్చి కృష్ణా నది గుండా ఈ భారీ బోట్లలో తరలిస్తున్నారు. రహదారి గుండా వ్యయం అధికమవుతుందని గుత్తేదారులు నీరు ఉన్న సమయంలో నదిగుండా దగ్గరి మార్గాన్ని ఎంచుకుంటున్నారు. జూన్ నుంచి నవంబరు వరకు ఈ వాహనాల్లోనే ఇసుక తరలుతోంది. - న్యూస్‌టుడే, నందికొట్కూరు

నెర్రెలిచ్చింది.. పట్టించుకోరేంది?

నంద్యాల పట్టణంలోని పురపాలక కార్యాలయ ఆవరణలో ఉన్న మరుగుదొడ్డి ఇది. దీని గోడ నెర్రెలిచ్చి ప్రమాదకరంగా మారింది. ఎవరైనా గోడ పక్కనే రాకపోకలు సాగిస్తుండగా పడిపోతే వారి ప్రాణాలకే ముప్పు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. - న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

విద్యుత్తు స్తంభం.. ప్రమాదకరం

జూపాడుబంగ్లా మండలం 80 బన్నూరు గ్రామంలోని బీసీ కాలనీలో విద్యుత్తు స్తంభం రోడ్డుపై వేశారు. దీనికి ఇనుప కడ్డీలు ఉండటంతో రోడ్డును ఆక్రమించుకొని రాకపోకలకు అడ్డుగా, ప్రమాదకరంగా ఉంది. ఇద్దరు చిన్నారులు స్తంభానికి ఏర్పాటు చేసిన కడ్డీలు తగిలి గాయపడ్డారు. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి అక్కడి నుంచి స్తంభాన్ని తీసుకెళ్లాలని కాలనీవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నందికొట్కూరు

వర్షపు నీరు పారే దారేది?

ఈ చిత్రంలో కనబడుతున్న ప్రదేశం ఆత్మకూరులోని పోలీసు స్టేషను ఎదురుగా ఉంది. ప్రధాన రహదారి కావటంతో వేల సంఖ్యలో భారీ వాహనాలు, లారీలు, బస్సులు వెళ్తున్నాయి. నీళ్లు నిలబడిన ప్రాంతం పక్కన గతంలో ఖాళీ స్థలం ఉండేది. అక్కడ నిర్మాణం చేపట్టడంతో వర్షపు నీరు వెళ్లడానికి దారి లేక నాలుగు రోజులుగా అలాగే నిలిచి ఉన్నాయి. అధికారులు పట్టించుకోవటం లేదు. - న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఫయాజ్

అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా నాయకులు ఎన్‌ఎండీ.ఫయాజ్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక 19వ వార్డులో ఆయన పర్యటించి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సాధించిన ప్రగతి కరపత్రాలను పంపిణీ చేశారు. తెదేపా ఇన్‌ఛార్జి షేక్ మహ్మద్ రఫీ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జనార్దన్ గౌడ్, వడ్డే జనార్దన్, షేక్ మహబూబ్‌బాషా, సుబ్రహ్మణ్యం, నాగరాజు, శంకర్, పుల్లయ్య, హరి, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాల ఏర్పాటుకు స్థల పరిశీలన

ఆత్మకూరు, న్యూస్‌టుడే: కొత్తగా ఏర్పడిన డీఎల్‌డీవో, డీఎల్‌పీవో కార్యాలయాల ఏర్పాటుకు ఆత్మకూరులో స్థల పరిశీలన చేసినట్లు జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి నాసరారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ..ఆత్మకూరులో సెరికల్చర్ కార్యాలయం మొదటి అంతస్తు, ఎంపీడీవో కార్యాలయాల్లో స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో సయ్యద్‌ఉమ్మర్, పీఆర్‌ఏఈ సుబ్బయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వినోద్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థల పరిశీలనలో నాసరారెడ్డి

సూపర్ నేపియర్ గడ్డిలో పోషకాలు

పగిడ్యాల, న్యూస్‌టుడే: సూపర్ నేపియర్ గడ్డితో పశుగ్రాసం కొరత తీరి, పశువులకు అవసరమయ్యే పోషకాలు పుష్కలంగా లభిస్తాయని జూపాడుబంగ్లా పశుసంవర్ధక సహాయ సంచాలకుడు డాక్టర్ రామాంజనేయులు నాయక్ చెప్పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..రోజుకు 30కిలోల గ్రాసం ఒక పశువుకు అందిస్తే ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పాల దిగుబడి పెరుగుతుందన్నారు.

కవికి సన్మానం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: హైదరాబాద్ మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ నంద్యాలకు చెందిన కవి కొప్పుల ప్రసాద్‌ను ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో సంస్థ అధ్యక్షుడు డా.వీడీ.రాజగోపాల్, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, విశ్రాంత అటవీశాఖ అధికారి కృష్ణారెడ్డి, సినీగేయ రచయిత సాధనాల వెంకటస్వామి నాయుడు పాల్గొన్నారు.

మంత్రికి పుస్తకం బహూకరణ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంత్రి ఎన్‌ఎండీ.ఫరూక్‌కు హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ స్పిరిచ్యువేల్ అనాటమీ పుస్తకాన్ని బహూకరించారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం ఈ మేరకు సంస్థ సభ్యులు ఆయనకు పుస్తకాన్ని అందజేశారు. ఆశ్రమ మేనేజర్ డా.శ్రీనివాస్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫరూక్‌కు పుస్తకాన్ని అందజేస్తున్న సంస్థ సభ్యులు

నంద్యాల పట్టణం: భేదాభిప్రాయాలకు తావివ్వకుండా సామరస్యంతో పని చేసుకోవాలని మంత్రి ఎన్‌ఎండీ.ఫరూక్ హితవు పలికారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుల మధ్య తలెత్తిన స్వల్ప విభేదాలను ఆయన ఆదివారం పరిష్కరించారు. దీంతో వారు మంత్రిని తెదేపా కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దదిక్కు లేని అభాగ్యులం సారూ.. ఆదుకోండి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: కూలీకి వెళ్తేగాని డొక్కాడని స్థితి. జబ్బులు, ఆసుపత్రికి వెళ్లాలని కూడా తెలియదు. భార్య, నలుగురు పిల్లలకు ఆయనే పెద్దదిక్కు. తెలియని జబ్బుతో ఆయన మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. పాణ్యం బస్టాండ్ సమీపంలోని చెంచుకాలనీకి చెందిన మేకల నాగశేషులు(30), భార్య కొండమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు(13, 5ఏళ్లు), ఇద్దరు కుమారులు(9ఏళ్లు, 9నెలలు) ఉన్నారు. నాగశేషులు మేకలను మేపుతూ కుటుంబానికి తిండి పెడుతున్నాడు. కొన్ని రోజులుగా కడుపు ఉబ్బి నొప్పి, ఆయాసంతో బాధపడుతుండేవాడు. ఆసుపత్రికి వెళ్లాలని కూడా తెలియదు. కాలనీలో ఖాళీగా ఉన్న పాత ఇళ్లలో జీవనం సాగించేవారు. నాగశేషులు 20 రోజులుగా మంచానికి పరిమితమై ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. దీంతో తన పనులు కూడా తాను చేసుకోలేని భార్య, పిల్లల పరిస్థితిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భార్యకు దీర్ఘకాలిక, బాలింత సమస్యలున్నాయని చెబుతున్నారు. ఐసీడీఎస్ అధికారులు వీరిని చేరదీయాలని కోరుతున్నారు.

మృతుడి భార్య, పిల్లలు

30 ద్విచక్రవాహనాలు.. 4 ఆటోలు స్వాధీనం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆత్మకూరు, నందికొట్కూరు డివిజన్‌లలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 30 ద్విచక్రవాహనాలు, 4 ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీఐ రాము ఆధ్వర్యంలో కృష్ణాపురంలో నిర్వహించిన ఆపరేషన్‌లో 10 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆత్మకూరు రూరల్ సర్కిల్‌లో రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రేగడగూడూరులో 12 ద్విచక్రవాహనాలు, 4 ఆటోలు, 13 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నందికొట్కూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, బ్రాహ్మణకొట్కూరు సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 8 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రైలు కింద పడతానని యువకుడి హల్‌చల్

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పాణ్యం సమీపంలో రైలు కింద పడతానని ఒక యువకుడు హల్‌చల్ చేశాడు. స్థానికులు, రైల్వే అధికారుల సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం రైల్వేస్టేషన్ సమీపంలోని వద్దెల వాగు వద్ద కృష్ణమ్మకొన నుంచి పాణ్యం వైపు గూడ్స్ రైలు వస్తుండగా పట్టలపైకి రక్తపు మరకలతో యువకుడు చేరుకున్నాడు. లోకో పైలెట్ హారన్ కొట్టినా పక్కకు వెళ్లకపోవడంతో రైల్వే స్టేషన్‌కు సమాచారం అందించి రైలును నెమ్మది చేశాడు. యువకుడిని పట్టుకోవడానికి రైల్వే అధికారులు వెంబడించగా పారిపోయాడన్నారు. దీంతో ఆలస్యంగా గూడ్స్ రైలు స్టేషన్‌కు చేరుకుంది.

చర్చి ఎన్నికలకు భారీ బందోబస్తు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: దక్షిణ ఇండియా సంఘానికి సంబంధించిన 2025-2028 సంవత్సరానికి నంద్యాల అధ్యక్ష ప్యానల్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. పట్టణంలోని స్థానిక పెద్దచర్చి ఎదురుగా ఉన్న కమ్యూనిటీ హాల్‌లో ఎన్నికలు చేపట్టారు. మూడో పట్టణ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరు వర్గాలు తెల్లవారుజామునుంచే ఓట్లు వేశారు. ఎన్నిక నిర్వాహకులు మాట్లాడుతూ..మొత్తం 1870 ఓట్లలో 1655 ఓట్లు పోలైనట్లు తెలిపారు.

చదరంగంతో మేధాశక్తికి పదును

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : చదరంగం మేధాశక్తికి పదునుపెట్టే క్రీడ అని, క్రీడాకారుల్లో ఏకాగ్రతను ఇనుమడింపచేస్తుందని జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డా.రవికృష్ణ పేర్కొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న డా.రవికృష్ణ

స్థానిక నెరవాటి పాఠశాలలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులను చదువుతోపాటు క్రీడలలో ప్రోత్సహించాలని కోరారు. పాఠశాల కరస్పాండెంట్ కృష్ణసాయి రోహిత్, లయన్స్‌క్లబ్ ప్రాంతీయ ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ భగవానుడికే ఊరేగింపు చేయాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: శ్రీ కృష్ణ భగవానుడికి మాత్రమే ఊరేగింపు నిర్వహించాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి చింతపల్లి, ఆత్మకూరు కమిటీల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మునిదాసు అన్నారు. మండల పరిధిలోని కురుకుంద గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం నిర్వహించారు. పుల్లారెడ్డి, కుమారాచారి, సంజీవ, పార్థసారధి, చక్రపాణి, నాగమద్దిలేటి, బాస్కర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో పూజా పుస్తకావిష్కరణ

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో కామేశ్వరీ దేవి అమ్మవారి వ్రతకల్పం పూజా విధానం ఆవిష్కరించారు. హైదరాబాదుకు చెందిన వారణాసి రామ్మోహన్‌రావు, విజయలక్ష్మి దంపతులు, వారి కుమార్తెలు అమ్మవారి పేరుమీద రాసిన పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. దేవస్థానం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు రవిశంకర్ అవధాని, అర్చక బృందం రచయితలను అభినందించారు.

హిందువుల సమస్యలపై పోరాటం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: సమాజంలో హిందువుల సమస్యలపై కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకుని పోరాటం చేయాల్సి ఉందని విశ్వహిందూ పరిషత్ సంఘటన కార్యదర్శి ఆవులరెడ్డి, ప్రఖండ కార్యదర్శి మల్లిఖార్జున అన్నారు. ఆత్మకూరు వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ప్రఖండ మాసికవర్గ నిర్వహించారు. వారు మాట్లాడుతూ..హిందువుల చరిత్ర, వాటి మూలాలు, మాత, గోమాత, భూమాత, ధర్మగ్రంథాలు, మఠమందిరాల విశిష్టతపై చర్చించారు. హిందువుల మత మార్పిడి విషయలో చైతన్య

సమావేశంలో పాల్గొన్న విశ్వహిదూపరిషత్ నాయకులు

తీసుకురావాలన్నారు. నాయకులు గిరిధర్, కమ్మయ్య, సత్యనారాయణ, నాగరాజు, లాలప్ప, మహేష్, రాజు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు బోనాలు

యాళ్లూరు(గోస్పాడు), న్యూస్‌టుడే: మండలంలోని యాళ్లూరులో రజకసంఘం ఆధ్వర్యంలో గంగమ్మ భక్తులు కేసీ కాల్వ చెంతన గంగమ్మ ఆలయ నిర్మాణానికి సంకల్పించారు. ఈ సందర్భంగా ఆదివారం వందలాది మహిళలు, భక్తులు భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు, బలిదానాలు, అన్నదానం చేశారు.

యాళ్లూరులో బోనాలు మోసుకుపోతున్న మహిళలు

వాసవీమాతకు సారె సమర్పణ

మహానంది, న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ క్షేత్రంలో వెలసిన కన్యకా పరమేశ్వరీ వాసవీమాతకు పుట్టింటి పట్టు చీర, సారెలను మహిళా భక్తులు సమర్పించారు. ఆదివారం మహానంది క్షేత్రానికి చెందిన ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు మునగనూరు శ్రీలక్ష్మీతోపాటు అలంపూర్ గ్రామానికి చెందిన మరికొందరు భక్తులు సమర్పించినట్లు తెలిపారు.

పారిశుద్ధ్యంపై చెత్తశుద్ధి

★ నంద్యాల పట్టణంలో అధ్వానంగా పరిసరాలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరణ నిర్వహణ సరిగ్గా లేదని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కార్మికులు ఒకే డబ్బాలో సేకరించి చెత్త దిబ్బల్లో పడేస్తున్నారు. ఉదయాన్నే తరలించాల్సి ఉన్నా.. మధ్యాహ్నం వరకు రావడం లేదు. పట్టణంలో ఏ వీధిలో చూసినా రోడ్ల పక్కన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి.

● నంద్యాల పురపాలక సంఘంలో 348మంది ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులు, 96మంది రెగ్యులర్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. మరో వంద మంది కార్మికులు అవసరమని అధికారులు చెబుతున్నారు.

సాయిబాబానగర్ రహదారి పక్కన పడేసిన వ్యర్థాలు

పాడైన వాహనాలు

నంద్యాల పట్టణంలో రోజూ 110 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పన్నమవుతోంది. ప్రజల ఇళ్ల నుంచి చెత్త సేకరించడానికి పట్టణంలో 162 పుష్ కార్ట్‌లు, 8 ట్రై సైకిళ్లు ఉన్నాయి. 8 కంపాసిటర్లలో ఒకటి మరమ్మతులకు గురైంది. టిప్పర్లు 5 ఉన్నా.. 3 మాత్రమే పనిచేస్తున్నాయి. 14 ట్రాక్టర్‌లు ఉన్నాయి. వీటిలో ఒకటి మరమ్మతులకు గురైంది. స్ట్రీట్ లోడర్లు రెండూ మరమ్మతులకు గురయ్యాయి.

పరిశీలన

ఇదీ పరిస్థితి

● సాయిబాబానగర్ ఏసుకృప చర్చి ఎదురుగా ప్రధాన రహదారి పక్కన తోపుడు బండిలో సేకరించిన వ్యర్థాలను రహదారి పక్కనే పడేశారు. దుర్వాసన వెదజల్లుతోంది.

● పట్టణంలోని బర్మశాల వీధిలో పుష్‌కార్ట్‌లో పొడి, తడి చెత్తను డబ్బాల్లో సేకరించి రహదారి పక్కనే పెట్టారు.

● దేవనగర్ నుంచి శ్రమదానం వంతెన వెళ్లే దారిలో రహదారి పక్కనే వ్యర్థాలు వేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది.

● రైతునగరం రహదారి పక్కన వ్యర్థాలను సిబ్బంది తొలగించడం లేదని స్థానికులు చెబుతున్నారు.

బేస్‌బాల్ అసోసియేషన్ కోశాధికారిగా పుల్లయ్య

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ కోశాధికారిగా పీఈటీ పుల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జనరల్ బాడీ కార్యవర్గ సమావేశంలో అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అహ్మద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర బేస్‌బాల్ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్, ఉపాధ్యక్షుడు మాధవరావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇతరులను ఇబ్బంది పెట్టవద్దు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: రహదారి నియమాలు పాటించకుండా ఇతరులను ఇబ్బందులు పెట్టవద్దని ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పాణ్యంలోని ప్రధాన కూడలల్లో ఆయన మాట్లాడారు. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. ఒకరికొకరు సహకరించుకుంటూ వాతావరణం ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలన్నారు.

వడ్డెర సొసైటీలకు గనులు కేటాయించాలి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వడ్డెర సొసైటీలకు నాపరాయి గనులు కేటాయించాలని జాతీయ వడ్డెర సంఘం కార్యదర్శి శిల్పి సుబ్బరాయుడు కోరారు. మండల పరిధిలోని రామకృష్ణాపురంలో ఆదివారం వడ్డెర మహాసభ నిర్వహించారు. వడ్డెర కులస్థులకు నాపరాయి గనులను లీజుకు ఇవ్వాలని, సొసైటీలకు గనులు కేటాయించాలన్నారు.

ORDER 21 RULE 54 NOTICE
IN THE COURT OF THE III ADDL. DIST. JUDGE : GUNTUR
EP.No.110/2022 in O.S.No.36/2015
Between:
Pathakota Rama Muni Reddy. ...D.Hr
And
Nagireddy Kesava Reddy@Kesal Reddy. ...J.Dr
To,
Nagireddy Kesava Reddy @Kesal Reddy, S/o.Subba Reddy, Secretary and Correspondent of Kanaka Durga Educational Society and Kesava Reddy Educational Institutes, Presently R/o.Kesava Reddy Public School, Panyam Complex, Narawada Panyam(Vil&Md), Kurnool Dist.
పై నెంబరు ఇ.పిలో రూలు-54 నోటీసును పై కోర్టు వారి నుండి పంపించిన ముట్టనందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.29-07-2025కి వాయిదా వేసినారు.కావున వాయిదారోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
కె. సుబ్బారావు, టి. బలరామ మూర్తి
డి.హెచ్.ఆర్.తరపు అడ్వకేట్స్, గుంటూరు. సెల్: 9848232267

ఆళ్లగడ్డ
• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

రోటరీ సేవలను విస్తృతం చేయాలి

మాట్లాడుతున్న రోటరీ జిల్లా గవర్నర్ కేశవరెడ్డి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల రోటరీ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటరాముడు, పీవీ సుబ్బారావు ఎంపికయ్యారు. గ్రామంలోని స్కంధ కాలనీలోని కమ్యూనిటీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో వారితో క్లబ్ జిల్లా గవర్నర్ పి.కేశవరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన వారు మెరుగైన సేవా కార్యక్రమాలు నిర్వహించి స్ఫూర్తిదాయకంగా నిలవాలని సూచించారు. క్లబ్ సహాయ గవర్నర్ హరీష్‌గుప్తా, పూర్వ గవర్నర్ డాక్టర్ రవికుమార్, మాజీ అధ్యక్షులు శ్రీనివాసులు, బాలాంజనేయరెడ్డి, రవీంద్రనాథరెడ్డి, మోహనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు అవకాశం

శిరివెళ్ల, న్యూస్‌టుడే: మండల పరిధి గ్రామాల్లోని రైతులకు ఉపాధిహామీ పథకంలో భాగంగా ఉద్యాన పంటలసాగుపై క్షేత్ర సహాయకులు అవగాహన కల్పించాలని ఆశాఖ ఏపీవో విజయ్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయిదు ఎకరాల్లోపు చిన్న, సన్నకారు రైతులు వివిధ రకాల పూల, పండ్ల తోటలను సాగు చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. రైతులకు ఎఫ్ఏలు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునేలా చూడాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

ఆళ్లగడ్డ గ్రామీణం,న్యూస్‌టుడే: ?: మండలంలోని నల్లగట్ల బీసీ కాలనీలో నీటి ట్యాంకు వద్ద ముళ్లపొదలు పెరిగి అపరిశుభ్రంగా మారింది. - గుర్రప్ప, నల్లగట్ల
✔: ముళ్లపొదలు తొలగించి పారిశుద్ధ్య పనులు చేపడతాం. - అశ్విన్, ఈవోపీఆర్డీ, శిరివెళ్ల
?: మండలంలోని శిరివెళ్ల ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలు ఏర్పాటు చేయాలి. - ఇస్మాయిల్.
✔: కాలువల ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం - అశ్విన్ కుమార్, ఈవో, శిరివెళ్ల
బనగానపల్లి, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని కొండపేట ఎస్సీ బాలుర వసతిగృహం పక్కనే మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దాంతో దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్డుపైకి మురుగు నీరు రావడంతో అటుగా వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి. - అల్లాబకస్, కాలనీవాసి
✔: సిబ్బందిని పంపించి తగు చర్యలు తీసుకుంటాం. - సతీష్ కుమార్‌రెడ్డి, ఈవో

న్యాయబద్ధంగా పనిచేయాలి

మంత్రి బీసీని సన్మానిస్తున్న జాకీర్ హుసేన్ బాషా తదితరులు

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీగా ఎంపికైన న్యాయవాది ఎస్. జాకీర్ హుసేన్ బాషా ఆదివారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని న్యాయబద్ధంగా పనిచేయాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

మంత్రి రాకతో అభిమానుల సందడి

అవుకు: రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి రాకతో మండలంలోని రామాపురంలో ఆదివారం సందడి నెలకొంది. అనంతపురం జిల్లాలో పోలీసు అధికారిగా విధులు నిర్వహిస్తున్న వెంకటశివారెడ్డి ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి మంత్రి సతీసమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యకర్తలు, అభిమానులు అపూర్వస్వాగతం పలికారు. రామాపురం వాసులతో తమకు మంచి అనుబంధం ఉందని.. అభిమానులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటామని మంత్రి వెల్లడించారు. గ్రామ నాయకులతో ప్రత్యేకంగా ముచ్చటించారు.

టోల్ తీసి.. వసతులు మరిచి!

★ జాతీయ రహదారుల నిర్వహణ అస్తవ్యస్తం

పరిశీలన

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా టోల్ రుసుములు వసూలు చేస్తున్నా.. ఆ పరిధిలో కనీస వసతులు కల్పించకపోవడంపై వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్వహణ సైతం అంతంతమాత్రంగానే ఉందని.. సంబంధిత అధికారులెవరూ స్పందించడంలేదని, ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

మరుగుదొడ్లకు తాళాలు

చాగలమర్రి, న్యూస్‌టుడే: పట్టణం గుండా 40వ జాతీయ రహదారి సాగుతోంది. చాగలమర్రి సమీపంలో 40వ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా ఉంది. ప్లాజా వద్ద ప్రయాణికులకు కల్పించాల్సిన మెరుగైన వసతులు లేవు. సమీపంలో ప్రయాణికులు విశ్రాంతి తీసుకునేందుకు గదులు లేవు. మరుగుదొడ్లు ఉన్నా అవి ప్రయాణికులు వినియోగించుకోవడం లేదు. ఎప్పుడూ మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుదూర ప్రయాణం చేసిన వారు కాసేపు సేదతీరేందుకు వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. టోల్‌గేట్ వసూలు మాత్రం సవ్యంగా సాగుతుంది. రోజూ 7 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. స్థానిక ప్లాజా వద్ద నామమాత్రంగా చూసేందుకు మాత్రమే మరుగుదొడ్లు దర్శనమిస్తున్నాయి. అక్కడ ప్రయాణికులెవ్వరూ వినియోగించుకోవడం లేదు. ఎప్పుడు గమనించినా మరుగుదొడ్లకు తాళాలు వేసే కనిపిస్తున్నాయి. మరుగుదొడ్లను క్రమంగా శుభ్రం చేస్తూ వసతులు కల్పిస్తే ప్రయాణికులు వినియోగించుకునేందుకు వీలుంటుంది.

వెలగని విద్యుద్దీపాలు

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: డోన్ నుంచి కర్నూలుకు వెళ్లే జాతీయ రహదారిలో అమకతాడు టోల్‌ప్లాజా ఉంది. ఇక్కడ రోజుకు 10వేల వాహనాల రాకపోకలు ఉంటాయి. ఇక్కడ రోజుకు రూ.30 నుంచి రూ.35 లక్షల దాకా వాహనాల నుంచి టోల్ రుసుం వసూలు చేస్తున్నారు. స్నానం గదులకు నీటి సరఫరా, తలుపులు సరిగా లేవు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. పక్కనే ఓ తొట్టెలో అరకొర నీటిని నింపుతున్నారు. టోల్‌ప్లాజాకు రెండు వైపులా రహదారి మధ్యలో, ఇరువైపులా ఉన్న స్తంభాలకు విద్యుద్దీపాలు ఉన్నా రాత్రి వేళల్లో వెలగడం లేదు. టోల్‌ప్లాజా వద్ద రాత్రి సమయంలో చీకటిగా ఉండటంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజాంబేగ్

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అజాంబేగ్ డిమాండ్ చేశారు. ప్యాపిలి మండలంలోని ఉపాధ్యాయులు డి.చిన్నపరెడ్డి, హాజీ మస్తాన్‌వలి ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. దీంతో యూనియన్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఎన్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలశాఖ అధ్యక్షుడు చంద్రమౌళి అధ్యక్షతన వారికి సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అజాంబేగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణలు చేయాలంటే ముందు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం డాక్టర్ టి.సురేష్‌బాబు, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జేఎండీ ఇక్బాల్‌బాషా, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటనాయక్, సీనియర్ నాయకుడు పి.మౌలాలి, నాయకులు రాంప్రసాద్, దేవేంద్రప్ప, మద్దిలేటి, విశ్వనాథ్, పరమేష్, సుశీలమ్మ, జీవిత తదితరులు పాల్గొన్నారు.

అసలే మలుపు .. ఆపై కూలిన వంతెన

మండలంలోని పెద్దమ్మ కనుమ సమీపంలో మలుపు వద్ద రహదారి ప్రమాదకరంగా మారింది. కొండవాలులో దశాబ్దాల క్రితం నిర్మించిన వాగుకల్వర్టుకు నిర్మించిన రక్షణ గోడ శిథిలమయింది. కొండమలుపులో ఉన్న వాగు కావడం వల్ల ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. చీకటి వేళల్లో రహదారి కనిపించని దుస్థితి. అధికారులు పరిశీలించి కల్వర్టుకు రక్షణ గోడ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే అవుకు

పచ్చదనంపై గొడ్డలి వేటు

చెట్లు సమస్త ప్రాణకోటి మనుగడకు జీవనాధారం. వాటిని కొట్టాల్సి వస్తే ప్రత్యామ్నాయ మార్గం చూడాలి. అంతే కానీ అభివృద్ధి పేరిట, విద్యుత్తు తీగలకు అడ్డు వస్తున్నాయనో, వంట చెరకుగా ఉపయోగపడతాయనో నరికివేస్తే పర్యావరణానికే కాకుండా మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుంది. ఇప్పటికే పచ్చదనం హరించుకుపోయి పర్యవసానాలను అనుభవిస్తున్నాం. మండలంలోని వల్లంపాడు గ్రామం సుంకులమ్మ దేవాలయ సమీపంలో ఇలా పచ్చని చెట్లను నరికివేసి పచ్చదనాన్ని హరిస్తున్నారు. - న్యూస్‌టుడే, కోవెలకుంట్ల గ్రామీణం

బోర్డు చూస్తే... బోల్తా పడినట్లే

ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె మెట్ట గ్రామ సమీపంలో జాతీయ రహదారి నిర్వాహకులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డుతో ప్రయాణికులు తికమక పడుతున్నారు. పెద్ద కోటకందుకూరు మెట్టకు వెళ్లే మార్గం సూచించే బోర్డును పేరాయిపల్లె మెట్టకు సమీపంలో ఏర్పాటు చేశారు. అక్కడ కోటకందుకూరు ఊరు లేదు. కాని బోర్డులో మాత్రం సూచించారు. బోర్డును నమ్మిన ప్రయాణికులు బోల్తా పడుతున్నారు. - న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

ఊర్లో చెత్త.. ఊర్లోనే..!

వార్డుల్లోని కుండీల వద్ద, వీధుల్లో రహదారుల పక్కన ఉన్న చెత్తను కంపోస్టుయార్డుకు తరలించే ట్రాక్టర్ ట్రాలీ దెబ్బతింది. వెనుక డోర్ లేకపోవడం గమనార్హం. ట్రాక్టర్ వెళ్తున్న సమయంలో ఎత్తుపల్లాలు వచ్చినప్పుడు ట్రాలీలోని చెత్తంతా కిందకు జారి పడిపోతుండడంతో ఊర్లో ఎత్తిన చెత్త..ఊర్లోనే పడిపోతున్నట్లుగా ఉంది. ఇళ్ల ముందు చెత్త పడుతుండటంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ట్రాక్టర్ ట్రాలీ వెనుక డోర్‌ను ఏర్పాటు చేస్తే అందులోని చెత్త కిందకు పడిపోకుండా ఉంటోంది. - న్యూస్‌టుడే, డోన్‌పట్టణం:

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు

ప్యాపిలి, న్యూస్‌టుడే: పట్టణంలో పెద్ద సరిగెత్తు కార్యక్రమాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పీర్ల చావిళ్లకు తరలివచ్చి పీర్లకు చెక్కర చదివించి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఖాజా బందేనవాజ్ పీర్ల చావిడీని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముజావర్లు ఆమెను ఆశీర్వదించారు.

సంక్షిప్త సమాచారం

డోన్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం నవరత్నాల పేరుతో, ప్రస్తుత ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య విమర్శించారు. స్థానిక కొండపేటలో ఆదివారం నిర్వహించిన సీపీఐ శాఖ మహాసభల్లో ఆయన మాట్లాడారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు హాజరవుతున్నందున గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కారానికి అర్జీలను స్వీకరిస్తామని తెలిపారు. అర్జీలను అంతర్జాలంలో నమోదు చేసి నిర్ణీత వ్యవధిలో పరిష్కారం చూపించడంజరుగుతుందన్నారు.

కోవెలకుంట్ల: రౌడీషీటర్లు నేరాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఎస్సై భూపాలుడు హెచ్చరించారు. కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు ఆదివారం మంత్రణం నిర్వహించారు.

రుద్రవరం: సమీపంలో వెలసిన వాసాపురం వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపం నిర్మాణం కోసం నగేష్ దంపతులు రూ.లక్ష నగదును నిర్వాహకులకు అందజేశారు.

★ మండల కేంద్రంలోని శ్రీవాసవీ అమ్మవారి కల్యాణమండపంలో మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి వైకాపా పార్టీ మండల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

సంజామల, కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని గిద్దలూరులో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతస్థాయి సామావేశం నిర్వహించారు. అలాగే కోవెలకుంట్లలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క నెరవేర్చలేదని ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ ఛైర్మన్ చలంరెడ్డి అన్నారు. ఆదివారం బేతంచెర్ల వైసీపీ కార్యాలయంలో పట్టణ, మండల విస్తృత సమావేశం నిర్వహించారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని వైకాపా కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు పోదొడ్డి కృష్ణమూర్తి అధ్యక్షతన బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ నిర్వహించారు. వైకాపా నాయకులు మెట్టు వెంకటేశ్వరరెడ్డి, పుల్లారెడ్డిలు క్యూఆర్ కోడ్ బ్రోచర్లను విడుదల చేశారు.

డోన్‌పట్టణం: ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలకు ఎన్నో హామీలను ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించి ప్రజలను నట్టేట ముంచారని డోన్ మండల ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. స్థానిక వైకాపా కార్యాలయం వద్ద మండల, పట్టణ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్న సీఎం

మాజీ ఎమ్మెల్యే సుజాతమ్మకు ఉత్సవమూర్తుల చిత్రపటాన్ని అందిస్తున్న కౌన్సిలర్ దంపతులు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ఘనత రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడికే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. 'సుపరిపాలనతో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని నాల్గో వార్డులో ఆమె పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం ఇంటింటి పర్యటన చేపట్టారు. వార్డులోని ప్రజల సమస్యలను ఆమె అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు. వచ్చే నెల 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నట్లు తెలిపారు. వార్డులో తెదేపా కౌన్సిలర్ బద్దల సుబ్బలక్ష్మి, బద్దల రాముడు దంపతులు వారి స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్రకార్యదర్శి కె.వి.ఫణిరాజ్, వైస్ ఛైర్మన్ కొత్రికె హరికిషన్, జిల్లా అధికార ప్రతినిధి విజయ్‌భట్టు, నాయకులు టీఈ రాఘవేంద్రగౌడ్, ఓం ప్రకాష్, కె.శ్రీరాములు, సుధీశ్‌రాజు, చిట్యాల మద్దయ్య గౌడ్, బద్దల హరిదీప్, బద్దల సందీప్, సేనా, బచ్చు చక్రి తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే సుపరిపాలన

సిమెంట్‌నగర్(బేతంచెర్ల),న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని తెదేపా నాయకులు వాసు, రామాంజనేయులు అన్నారు. ఆదివారం మండలంలోని సిమెంట్‌నగర్ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని రాముడు, విజయ్‌కుమార్ తదితరులతో కలిసి నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాల గురించి కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని చెప్పారు. వైకాపా వారు చెప్పే మాటలను నమ్మవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు.

ఇష్టపడి చదవాలి

విద్యార్థినిని సన్మానిస్తున్న అధికారులు

చాగలమర్రి, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతోపాటు ఇష్టపడి విద్యాభ్యాసం కొనసాగించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని మండల విద్యాధికారి నయామతుల్లా, ప్రయివేటు పాఠశాలల తాలూకా అధ్యక్షులు అమీర్‌బాషా ఆకాంక్షించారు. పట్టణంలోని చైతన్య భారతి ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పాఠశాల విద్యార్థులను కరెస్పాండెట్ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. పది ఫలితాల్లో 584 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన అంబికాశ్రీ, 579 మార్కులతో మూడోస్థానంలో నిలిచిన కనీష్‌తేజలను ఘనంగా సన్మానించారు.

బాల్య వివాహాలు చేయొద్దు

వెంకటాపురం (శిరివెళ్ల), న్యూస్‌టుడే: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్సై చిన్న పీరయ్య యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని వీరారెడ్డిపల్లె, వెంకటాపురం గ్రామాల ప్రధాన రహదారుల వద్ద ఆదివారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే తల్లిదండ్రులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు చట్టప్రకారం నిర్ణీత వయసులోనే తమ పిల్లలకు వివాహాలు చేయాలని సూచించారు.

క్రీడాభివృద్ధికి కృషి చేస్తాం

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ విజేతలతో అసోసియేషన్ నాయకులు

చాగలమర్రి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఉమ్మడి కర్నూలు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఛైర్మన్ షేక్‌బాబలాల్, చక్రం షబ్బీర్‌లు తెలిపారు. పట్టణంలోని వైకాపా కార్యాలయంలో రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో విజేతలైన నంద్యాల జిల్లా క్రీడాకారులను ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేసి సన్మానించారు. రాష్ట్ర బేస్‌బాల్ సంఘం కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి, లీగల్ అడ్వైజర్ మాధవరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల సత్యసాయి జిల్లా కదిరిలో జరిగిన పోటీల్లో జిల్లా జట్టు అత్యంత ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచి బంగారు పతకాలు సాధించిందన్నారు.

వడ్డెర సొసైటీలకు గనులు కేటాయించాలి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వడ్డెర సొసైటీలకు నాపరాయి గనులు కేటాయించాలని జాతీయ వడ్డెర సంఘం కార్యదర్శి శిల్పి సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని రామకృష్ణాపురంలో ఆదివారం వడ్డెర మహాసభ నిర్వహించారు. వడ్డెర కులస్థులు ఏళ్ల తరబడి నాపరాయి గనుల్లో కూలీలుగా పనులు చేస్తూ జీవనం గడిపిస్తున్నారన్న ఆయన... ప్రభుత్వం వారికి నాపరాయి గనులను లీజుకు ఇవ్వాలని, అలాగే సొసైటీలకు గనులు కేటాయించాలన్నారు. వడ్డెరులు ఐకమత్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ముత్యాల అలంకారంలో వాసవీమాత

ప్యాపిలి, న్యూస్‌టుడే: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని భక్తులు మండలంలోని పలు దేవాలయాల్లో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవీమాతను ముత్యాల అలంకారంలో అందంగా అలంకరించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్.కృష్ణాపురం(ఆళ్లగడ్డ గ్రామీణం),న్యూస్‌టుడే: మండలంలోని ఆర్.కృష్ణాపురంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థం పుట్టాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టాలమ్మ, పరశురామేశ్వర, లక్ష్మీనృసింహస్వామి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

దొర్నిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడే వంటా వార్పు చేసుకోని భోజనాలు చేశారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్లలో సత్యసాయి బాబా వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవంబర్ 23న జరగబోయే పుట్టపర్తి సత్యసాయిబాబా జన్మదిన వేడుకలను పురస్కరించుకొని వందరోజుల పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

సత్యసాయి ప్రేమ రథయాత్ర

చాగలమర్రి, న్యూస్‌టుడే: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి 100వ జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా సత్యసాయి ప్రేమ ప్రవాహిని, ప్రేమ రథయాత్ర ఆదివారం చాగలమర్రికి చేరుకుంది. పట్టణానికి రథయాత్ర చేరుకున్న అనంతరం స్థానిక ఏకశిల పదునెట్టాంబడి అయ్యప్ప ఆలయ ఆవరణలో భక్తులు పెద్దఎత్తున చేరి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చాగలమర్రిలో సత్యసాయి రథం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పట్టణంలో వెలసిన సత్తెమ్మ తల్లికి బోనాల సమర్పణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని భక్తితో ఊరేగింపుగా అమ్మవారి గుడికి వెళ్లారు.

బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

తెదేపా నాయకుడి మృతికి సంతాపం

కలుచట్ల (ప్యాపిలి), న్యూస్‌టుడే: మండలంలోని కలుచట్ల గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు మాజీ సర్పంచి రామాంజినేయులు (48) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఉండడంతో కుటుంబ సభ్యులు కర్నూలు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి గ్రామానికి చేరుకొని భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెదేపా ప్రభుత్వం ఎల్లవేళలా రామాంజినేయులు కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం దేశాభివృద్ధి కన్నా మైనార్టీలపై దాడులకే ప్రాధాన్యం ఇస్తోందని ఎస్‌డీపీఐ జిల్లా ప్రతినిధి జాఫర్ అన్నారు. అస్సాంలో మైనార్టీలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ అస్సాంలో భాజపా ప్రభుత్వం మైనార్టీల పట్ల రాక్షసంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీపీఐ నియోజకవర్గ బాధ్యులు ముక్తార్, జేఏసీ కన్వీనర్ బీరువాల బాషా, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, మాల మహానాడు నాయకులు ఓబులేసు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణానికి మార్గం

బేతంచెర్ల,న్యూస్‌టుడే: బేతంచెర్ల నుంచి కర్నూలు వెళ్లే మార్గంలో గొరుమానుకొండ మెట్ట వద్ద రహదారి ప్రమాదాలకు నెలవుగా ఉండేది. ఈ రహదారి ఎత్తుగా ఉండడంతో వాహనదారులు తరచు ప్రమాదాల బారిన పడేవారు. సమస్యను పరిష్కరించేందుకు జాతీయ రహదారి 340బి పనుల్లో భాగంగా సోమయాజుల పల్లె నుంచి డోన్ సమీపంలోని గుత్తి రోడ్డు వరకు సుమారు రూ.650 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో రోడ్డు ఎత్తును తగ్గించి సాఫీగా రాకపోకలు సాగేందుకు పనులు చేపట్టారు. గొరుమానుకొండ మెట్ట, సీతారాంపురం గ్రామాల సమీపంలో కర్నూలు వెళ్లే ప్రధాన రహదారి ఎత్తుగా ఉండి వాహనాల రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కొండలా ఉన్న రోడ్డు ఎత్తును తవ్వే పనులు పూర్తవడంతో వాహనదారులకు ఇబ్బందులు తొలగిపోతాయి. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గొరుమానుకొండ మెట్ట వద్ద రహదారి

విద్యుద్దీపాలు అమర్చిన అధికారులు

స్పందనకు వందనం

బనగానపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రధాన రహదారిలో పంచాయతీ అధికారులు స్తంభాలకు విద్యుద్దీపాలు అమర్చారు. 'ఈనాడు'లో శుక్రవారం 'అంధకారం.. అవస్థలే నిత్యం' అనే చిత్ర కథనం ప్రచురితమైంది. పంచాయతీ ఈవో సతీష్ కుమార్‌రెడ్డి స్పందించారు. ప్రధాన రహదారుల్లో ఉన్న అన్ని విద్యుత్తు స్తంభాలకు లైట్లు అమర్చారు. ప్రధాన రహదారితో పాటు పలు కాలనీల్లో లైట్లు వెలగని చోట పరిశీలించారు. ప్రణాళికబద్ధంగా ప్రతి రోజూ ఓ కాలనీకి వెళ్లి స్తంభాలకు లైట్లు లేకపోతే తక్షణమే చర్యలు తీసుకుంటామని 'న్యూస్‌టుడే'కు ఆయన వెల్లడించారు.

చట్టాలపై అవగాహన అవసరం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని ఎస్ఐ మల్లికార్జున రెడ్డి అన్నారు. కోవెలకుంట్లలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు శక్తియాప్, డయల్ 112, తదితరాలపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు.

చిన్నారుల ఆట.. విజయాల బాట

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ఇటీవల కాలంలో మార్షల్ ఆర్ట్స్‌పై విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో 'తైక్వాండో' అధికంగా ప్రాచుర్యం పొందింది. ఈ పోరాట క్రీడను నేర్చుకోవాలని చిన్నారులు ఆసక్తి చూపిస్తున్నారు. బేతంచెర్ల పట్టణానికి చెందిన విద్యార్థులు శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో మాస్టర్ నాగన్న ఆధ్వర్యంలో శిక్షణ పొందుతూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో బంగారు, వెండి పతకాలు సొంతం చేసుకున్నారు. ఈ చిన్నారులు సాధించిన పతకాలపై కథనం.

బ్లాక్ బెల్ట్ సాధనే లక్ష్యం
– సుచరిత, బేతంచెర్ల

పట్టణానికి చెందిన సుచరిత 5వ తరగతి చదువుతోంది. ఆత్మ రక్షణ కోసం కరాటే పోటీల్లో ప్రావీణ్యం పొందాలన్నది ఆమె ధ్యేయం. 2023లో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి, 2024లో రాష్ట్ర స్థాయిలో విశాఖ, తిరుపతిలో జరిగిన తైక్వాండో పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించింది. 2025 జనవరి నెలలో జరిగిన బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో బ్లూ వన్ బెల్టుకు ఎంపికైంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలన్నదే లక్ష్యమంటోంది ఈ చిన్నారి.

జాతీయస్థాయిలో రాణిస్తా
– వెంకటతనూజ్‌రెడ్డి, బేతంచెర్ల

ఈ చిన్నారి పట్టణంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. ఇటు చదువులోనూ, క్రీడల్లోనూ రాణిస్తుంది. 2023లో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని బంగారు, వెండి, రజత పతకాలు సాధించాడు. 2024లో తిరుపతి, విశాఖలో జరిగిన పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు అందుకున్నాడు. భవిష్యత్‌లో బ్లాక్‌బెల్ట్ సాధించడంతో పాటు జాతీయ స్థాయిలో రాణించడమే తన లక్ష్యమని చెబుతున్నాడు.

(c) eenadu

ఒడిశా ఉపాధ్యాయ అర్హత పరీక్ష రద్దు

● కేంద్రాల వద్ద అభ్యర్థుల ఆవేదన

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం జరగాల్సిన ఒడిశా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఓటీఈటీ) రద్దు చేస్తున్నట్లు శనివారం అర్ధరాత్రి మాధ్యమిక విద్యా మండలి(విద్యాశాఖ విభాగం) ప్రకటించింది. ప్రశ్నపత్రాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో పరీక్ష రద్దు చేశారు. త్వరలో పరీక్ష నిర్వహణ తేదీని ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

మహారాజా బాలుర పాఠశాల ప్రాంగణంలో హాల్ టికెట్లతో అభ్యర్థులు

ఈ విషయం ఆలస్యంగా తెలియడంతో చాలా మంది అభ్యర్థులు దూర ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రాలకు వ్యయప్రయాసలకు ఓర్చి ఆదివారం వచ్చేశారు. పరీక్ష రద్దయిందని తెలియడంతో ఆవేదన వ్యక్తం చేశారు.

25 వరకు రాష్ట్రంలో వర్షాలకు అవకాశం

గోపాలపూర్, న్యూస్‌టుడే: ఈనెల 24న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 25వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం(ఎంఈడీ) అధికారి ఉమాశంకర్ దాస్ ఆదివారం సాయంత్రం 'న్యూస్‌టుడే'కు తెలిపారు. రాష్ట్రంపై థండర్ స్టార్మ్(గాలివాన) ప్రభావం కూడా ఉన్నట్లు చెప్పారు. గడిచిన 24 గంటల్లో చాలాచోట్ల వర్షాలు కురిశాయని, బరగఢ్ జిల్లా అతాబిరాలో వర్షపాతం 10 సెం.మీ. నమోదైందన్నారు. సోమవారం అనుగుల్, ఢెంకనాల్, నయాగఢ్, కంధమాల్, కలహండి, రాయగడ, కొరాపుట్, గంజాం, గజపతి, నవరంగపూర్, మల్కాన్‌గిరి, బౌద్ధ్, మయూర్‌భంజ్, కేంఝర్, నువాపడ, బాలేశ్వర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రపడ, కటక్, జగత్సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, సుందర్‌గఢ్, ఝార్సుగుడ, బరగఢ్, సంబల్‌పూర్, దేవ్‌గఢ్, సోన్‌పూర్, బొలంగీర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న అంచనాగా 'ఎల్లో' హెచ్చరికలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

పరిహారం అందజేత



భువనేశ్వర్, న్యూస్‌టుడే: బాలేశ్వర్ ఎఫ్ఎం కళాశాల విద్యార్థిని సౌమ్యశ్రీ మృతి తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఆమె కుటుంబీకులకు రూ.20 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ మొత్తం చెక్కును బాలేశ్వర్ ఎంపీ ప్రతాప్‌చంద్ర షడంగి ఆదివారం భోగ్రాయి సమితిలోని పాలాసియాకు వెళ్లి తండ్రి బలరాం బీశికి అందజేశారు. నిందితులపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సకాలంలో వైద్యం అందక రోగి మృతి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సకాలంలో అంబులెన్స్ సేవలు అందక రోగి మృతి చెందినట్లు లక్ష్మీపూర్ సమితి గొడగుడ చెందిన కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. వారి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మురళీ కుమార్(35) తీవ్ర అనారోగ్యానికి గురవడంతో కుటుంబ సభ్యులు లక్ష్మీపూర్ పీహెచ్‌సీకి తరలించారు. బ్రహ్మపురకు తరలించాలని వైద్యులు సూచించడంతో శనివారం అంబులెన్స్ కోసం ప్రయత్నించారు. 108కు పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేదు. సుమారు 12 గంటల పాటు వేచి ఉండడంతో మురళి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా క్షీణించింది. దీంతో శనివారం రాత్రి కొరాపుట్‌కు ప్రైవేటు వాహనంలో తరలిస్తుండగా దారిలో మృతి చెందాడు.

అవస్థలకే ఆశ్రమం!!

సంక్షేమ పాఠశాలల్లో కానరాని భోజన శాలలు

ఆరుబయట, చెట్ల కింద విద్యార్థుల సా పాట్లు!!

– న్యూస్‌టుడే, సిమిలిగుడ

ఎండొచ్చినా.. వాన పడినా.. వారందరికీ ఆరుబయట, చెట్లకింద మట్టి నేలే భోజన శాలలు. అరకొర వసతుల మధ్య మధ్యాహ్న భోజనాలు చేయలేక వారి అవస్థలు అన్నీఇన్నీ కావు. ఇదీ కొరాపుట్ జిల్లాలోని పాఠశాలల్లో భోజనాలు చేసేందుకు కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థుల ఎదుర్కొంటున్న పరిస్థితి.

కొరాపుట్ జిల్లాలో సంక్షేమ, విద్యా శాఖ ఆధ్వర్యంలో సుమారు 2వేలకు పైగా ఆశ్రమ, ప్రాథమిక, యూజీఎం పాఠశాలలు ఉన్నాయి. లక్షలమంది విద్యార్థులు ఇందులో చదువుతున్నారు. ఆ మేరకు పాఠశాలల్లో సదుపాయాలు లేక విద్యార్థులు నిత్యం అగచాట్లు పడుతున్నారు. ప్రధానంగా భోజనశాలల కొరతతో బడుల్లో చిన్నారులు మధ్యాహ్నం, రాత్రి ఇబ్బందులు పడుతున్నారు. 90 శాతం పాఠశాలలకు డైనింగ్ హాళ్లు లేవు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు, ఉపాధ్యాయులు పిల్లలకు భోజనాలు పెట్టి చేతులు దులిపేసుకుంటున్నారు. ఇటీవల హికిమ్‌పుట్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు వర్షంలో గొడుగులు వేసుకుని భోజనాలు చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వెంటనే స్పందించిన అధికారులు భోజన గది నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదని పలుచోట్ల విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

వర్షం కురిసినా విద్యార్థులకు తప్పని అవస్థ

జిల్లాలో ఇదీ పరిస్థితి..

పాఠశాలలు	సంఖ్య
ఆశ్రమ	156
ప్రాథమిక	194
యూజీఎం	180

పాపం చిన్నారులు...

జిల్లాలో ఆశ్రమ, ప్రాథమిక, యూజీసీ పాఠశాలలు మొత్తం 2473 ఉన్నాయి. ఆశ్రమ పాఠశాలల్లో 90 వేల మంది విద్యార్థులు, ప్రాథమిక, యూజీసీ బడుల్లో 1,91,530 మంది, కలిపి జిల్లాలో మొత్తం విద్యార్థులు 2,81,530 మంది చదువుతున్నారు. వీరిలో బడుల్లో మధ్యాహ్న భోజనం ఇస్తుండగా, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు అందిస్తున్నారు. వీటిలో అత్యధిక పాఠశాలల్లో భోజన గదుల్లేవు. దీంతో ఆ సమయానికి బడి వరండాలపై, వంట గదిలోనో, చెట్ల కిందో, పక్కనే శిథిల భవనాల్లో, అపరిశుభ్ర పరిసరాల్లో మట్టిలో కూర్చుని ఎండ ఉన్నా, వానవచ్చినా భోజనాలు చేయాల్సిన పరిస్థితి.

● పాఠశాలల్లో ఇప్పటికీ డైనింగ్ హాళ్లు లేవని, వీటి కోసం కనీసం నిధులు లేక నిర్మాణం చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

నేలపై అపరిశుభ్రత వాతావరణంలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

● కొన్ని పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో పశువులు, శునకాలు ఇతర జంతువులు లోనికి ప్రవేశించి ఆవరణ అంతా పాడుచేస్తున్నాయి. అలాంటి చోట్ల చిన్నారులు తినాల్సిన పరిస్థితి. సిమిలిపుట్, హాట్‌గుడ పాఠశాలలే ఇందుకు ఉదాహరణ. ఇవే సమస్యలు జిల్లాలో వందలాది బడుల్లో నెలకొన్నాయి.

● సిమిలిగుడ, నందపూర్, దశమంత్‌పూర్ బడుల్లో డైనింగ్ హాళ్లు లేవు.

ఏడాదిలోగా గదుల నిర్మాణం..

కొన్ని ఆశ్రమ పాఠశాలల్లో డైనింగ్ హాళ్ల నిర్మాణం చేపట్టాం. అన్ని ఆశ్రమ బడుల్లోనూ భోజన గదులు నిర్మిస్తాం. ఇటీవల జిల్లాలో జరిగిన విద్యా శాఖ సమీక్ష సమావేశంలో దీనిపై చర్చించాం. ఏడాది లోగా అన్ని పాఠశాలలకు డైనింగ్ హాళ్లు నిర్మిస్తాం.

– కీర్తివాసన్, జిల్లా పాలనాధికారి, కొరాపుట్

గవర్నర్‌తో నాల్కో సీఎండీ భేటీ

సిమిలిగుడ, న్యూస్‌టుడే: రాష్ట్ర గవర్నర్ కె. హరిబాబును నాల్కో సీఎండీ బి.పి సింగ్ శనివారం రాత్రి రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సింగ్‌తో పాటు హెచ్‌ఆర్ డైరెక్టర్ టి.కె. పట్నాయక్, హెచ్‌అండ్‌పి కార్యనిర్వాహక సంచాలకులు అశుతోష్‌రథోలు రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ హరిబాబును కలిశారు. నాల్కోకు సంబంధించిన వ్యూహాత్మక కార్యక్రమాలు, ఒడిశా సామాజిక-ఆర్థిక అభివృద్ధికి నాల్కో సహకారం అందించడంతో పాటు సామాజిక సేవలు కొనసాగించాలనే అంశాలపై చర్చించినట్లు నాల్కో పీఆర్‌వో ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

గవర్నర్ హరిబాబును కలిసిన సీఎండీ సింగ్

రూ.2379 కోట్లతో 59 రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ

గోపాలపూర్, న్యూస్‌టుడే: రైల్వేశాఖ సహాయ మంత్రి వి. సోమన్న కుటుంబ సమేతంగా ఆదివారం పూరీ జగన్నాథుడిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో కొత్త రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు ముమ్మరంగా జరుగుతున్నాయని, ట్రాక్‌ల డబ్లింగ్ పనులు, సౌకర్యాలకు ప్రాధాన్యతిచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం రూ.2,379 కోట్లతో 59 స్టేషన్ల ఆధునికీకరణ చేపడుతున్నట్లు చెప్పారు. పూరీ స్టేషన్‌కు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో వందేభారత్ రైళ్లు నడిపిస్తున్నామని చెప్పారు.

మాట్లాడుతున్న రైల్వే సహాయ మంత్రి సోమన్న

పాడి రైతులకు తీపికబురు

● పదేళ్లలో 165 లక్షల లీటర్ల ఉత్పత్తి లక్ష్యం

గోవు నుంచి పాలు తీస్తున్న మహిళ

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పాడి రైతులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2036 నాటికి రోజుకు 165 లక్షల లీటర్ల పాల ఉత్పత్తికి లక్ష్యం నిర్దేశించింది. ఆ దిశగా ఇప్పటికే చర్యలకు ఉపక్రమించినట్లు పేర్కొంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పాల ఉత్పత్తి పెంపుతో 15 లక్షల మందికి పైగా పాడి రైతులకు సాధికారత కల్పించేందుకు కసరత్తు చేస్తోంది. ఇందుకోసం జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు(ఎన్‌డీడీబీ), ఒడిశా రాష్ట్ర పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య(ఓంఫెడ్)తో ఒప్పందం కుదుర్చుకుంది. శనివారం కటక్ జిల్లా గోవిందపూర్‌లో కొత్తగా నిర్మించిన క్షీర ఉత్పత్తి కేంద్రం ప్రారంభించిన సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఈ మేరకు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కామధేను యోజన ద్వారా అధిక పాల ఉత్పత్తి నిచ్చే 10 వేల మేలు జాతి రకం గోవులను రైతులకు సమకూర్చేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా దాదాపు 40 వేల ఆవులను సమకూర్చేందుకు ఎన్‌డీడీబీ అంగీకారం తెలిపినట్లు ప్రభుత్వం పేర్కొంది.

2047 నాటికి 274 లక్షల లీటర్ల లక్ష్యం

రాష్ట్రంలో ప్రస్తుతం రోజుకు 72 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతుండగా, 2036 నాటికి దీనిని 165 లక్షలు, 2047 నాటికి 274 లక్షల లీటర్లకు పెంచేందుకు లక్ష్యం విధించినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. 2024-25లో కామధేను యోజన కింద 3 లక్షల మంది లబ్ధిదారులకు రూ.71 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు ప్రభుత్వం గుర్తు చేసింది. శనివారం జరిగిన కార్యక్రమంలో రూ.7.50 కోట్ల వ్యయంతో 2 వేల నుంచి 15 వేల లీటర్ల సామర్థ్యమున్న 22 పాల ట్యాంకులను పంపిణీ చేసినట్లు వెల్లడించింది.

విజిలెన్స్ వలలో అటవీశాఖాధికారి

నిత్యానంద నాయక్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంఝర్ జిల్లా విస్తరాకుల ప్రాంత అటవీ డివిజన్ అధికారి(డీఎఫ్‌వో) నిత్యానంద నాయక్ ఆదివారం విజిలెన్స్ అధికారులకు చిక్కారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణల మేరకు విజిలెన్స్ అధికారులు కేంఝర్, అనుగుల్, నయాగఢ్ ప్రాంతాల్లోని ఏడు చోట్ల నాయక్ ఇళ్లు, ఆస్తులపై సోదాలు చేశారు. ప్రాథమిక వివరాల మేరకు ఆయా చోట్ల 115 ప్లాట్లు, విలాసవంతమైన రెండు భవనాలు, నగలు, నగదును అధికారులు గుర్తించారు.

గండాహతికి జలకళ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా రాయగడ సమితిలోని పర్యాటక ప్రాంతమైన గండాహతి జలపాతం వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు జలపాతంలో నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. గజపతి జిల్లాలోని చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు ఆంధ్రా నుంచి కూడా పర్యాటకులు చేరుకుని సందడి చేస్తున్నారు. ఆదివారం కావడంతో రద్దీ మరింత పెరిగింది. ఆ ప్రాంతం పచ్చదనం, ఇరువైపులా కొండలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.

పూరీ బాలికను దిల్లీ ఎయిమ్స్‌కు తరలింపు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న పూరీ జిల్లా బొలంగలోని నువాగోపాల్‌పూర్‌కు చెందిన బాలికను ఆదివారం మధ్యాహ్నం దిల్లీ ఎయిమ్స్‌కు ప్రత్యేక విమానంలో తరలించారు. శనివారం నువాగోపాల్‌పూర్‌కు చేరువలోని భార్గవి నది గట్టు ప్రాంతంలో ముగ్గురు దుండగులు బాలికపై కిరోసిన్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. 70 శాతం ఆమె దేహం కాలిపోగా, తొలుత భువనేశ్వర్‌లో చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉన్న బాధితురాలు కోలుకోవాలని, మెరుగైన చికిత్స కోసం దిల్లీ పంపించామని, దీనికయ్యే వ్యయమంతా ప్రభుత్వం భరిస్తుందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు.

దుండగులను శిక్షించకుంటే ఆందోళన ఉద్ధృతం

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ జిల్లాలోని బొలంగ ఠాణా వద్ద ఆదివారం బిజద నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేశారు. బాలికపై కిరోసిన్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన నిందితుల్ని పోలీసులు అరెస్టు చేయలేకపోయినందుకు నిరసనగా ఠాణా ముట్టడికి యత్నించారు. సోమవారం లోగా బాధ్యులను కస్టడీలోకి తీసుకోకపోతే బొలంగ, పూరీ రహదారిలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. మరోవైపు పోలీసులు ఈ ఘటనకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కొందరు గ్రామస్థులను ఠాణాకు పిలిచి వివరాలు సేకరించారు. పూరీ ఎస్పీ పినాక మిశ్ర ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక బృందం నిందితుల కోసం గాలిస్తోంది.

ఘటనా స్థలం పరిశీలన

గోపాలపూర్, న్యూస్‌టుడే: డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా ఆదివారం సాయంత్రం పూరీ జిల్లా బొలంగ ప్రాంతంలో పర్యటించారు. భార్గవి నది తీరంలో బాలికపై దాడిచేసిన పరిసరాలు పరిశీలించారు. బాధితురాలి ఇంటికి వెళ్లిన ఆయన స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కేంద్ర మండల ఐజీ ప్రవీణ్‌కుమార్, పూరీ ఎస్పీ పినాక మిశ్రలు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా డీజీపీ విలేకర్లతో మాట్లాడుతూ నిందితుల్ని త్వరలో కస్టడీలోకి తీసుకుంటామన్నారు.

బొలంగలోని ఘటనా స్థలం పరిశీలిస్తున్న డీజీపీ ఖురానియా, ఇతర అధికారులు

సునాబెడలో ఘోర ప్రమాదం

● రెండు కార్లు ఢీకొని ముగ్గురి దుర్మరణం
● మరో నలుగురికి తీవ్ర గాయాలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా, మరో నలుగురు తీవ్ర గాయాలపాలైన ఘటన కొరాపుట్ జిల్లా సునాబెడ హాల్ టీటీఎస్ పాఠశాల సమీపంలో శనివారం చోటుచేసుకుంది. సునాబెడ ఠాణాధికారి సుష్మకుహర్ తెలిపిన వివరాల ప్రకారం... మతల్‌పుట్ ప్రాంతానికి చెందిన దేవానంద్ సరబ్ కుటుంబ సభ్యులు అర్ధరాత్రి 12 గంటల సమయంలో కొరాపుట్ నుంచి ఇంటికి కారులో వస్తున్నారు. అదే సమయంలో సునాబెడకు చెందిన బికాష్‌పాత్ర్(26), దివ్యరంజన్ పాత్ర్(24), అశుతోష్ రానా(24), కైలాష్ హరిజన(25) మరో కారులో సిమిలిగుడ నుంచి వెళ్తుండగా హాల్ పాఠశాల సమీపంలో ఓ బైకును తప్పించే క్రమంలో రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో అశుతోష్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన ఆరుగురిని కొరాపుట్‌లోని వైద్య కళాశాలకు తరలించగా చికిత్స పొందుతూ బికాష్, దివ్యరంజన్ మృతి చెందారు. కైలాష్ హరిజన, తులు స్వాయిన్ పరిస్థితి విషమించడంతో వారిని విశాఖకు తరలించారు. మద్యం మత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. దీనిపై సీఎం మోహన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రుల చికిత్స ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

బికాష్

అశుతోష్ (పాతచిత్రాలు)

హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు మంచిరోజులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలోని హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు మంచిరోజులు వచ్చాయి. జిల్లాలోని బాలబాలికలు ఈ క్రీడలో రాణిస్తున్నా.. ఆ మేరకు సాధనకు కోర్టు సదుపాయం లేకపోవడంతో ఇన్నాళ్లూ ఇబ్బందులు పడ్డారు. మైదానాలు అందుబాటులో లేక కళ్లికోట విశ్వవిద్యాలయం క్రీడామైదానంలోనే ఓ వైపు కోర్టుగా నిత్యం సాధన చేస్తూ పోటీలకు వెళ్తున్నారు. ఈ ఆటకు తగిన సాధనసంపత్తి, ఇతర సౌకర్యాలు కల్పించాలని జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రతినిధులు జిల్లా క్రీడాధికారి, రాష్ట్ర క్రీడాశాఖకు పలుమార్లు లేఖలు రాసినా ఫలితం లేకపోయింది.

ఎట్టకేలకు స్పందన..

బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్‌కుమార్ రాష్ట్ర క్రీడాశాఖ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడంతో తాజాగా స్పందించారు. వారి ఆదేశాలతో రెండునెలల కిందట ఆ శాఖ అధికారులు బ్రహ్మపురకు వచ్చి మహాత్మాగాంధీ క్రీడా మైదానంలోని ఓ స్థలాన్ని గుర్తించి అక్కడ హ్యాండ్‌బాల్ కోర్టు నిర్మాణానికి ప్రతిపాదించారు. సంఘం ప్రతినిధులతో చర్చించి ఆటకు కల్పించాల్సిన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రతినిధి, జాతీయ రిఫరీ ప్రశాంతకుమార్ రథ్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ హ్యాండ్‌బాల్ జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్నారన్నారు. కోర్టు ఏర్పడితే ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. త్వరితగతిన నిర్మిస్తే మేలు జరుగుతుందని రథ్ కోరుతున్నారు.

మహాత్మాగాంధీ క్రీడామైదానంలో హ్యాండ్‌బాల్ కోర్టుకు గుర్తించిన స్థలం ఇదే

భాబినిపూర్ బడిలో కేరళ తరహా తరగతులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా భాబినిపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు కేరళ పద్ధతిలో బోధన చేపట్టడం చర్చనీయాంశమైంది.

తరగతి గదిలో అర్ధ చంద్రాకారంలో కూర్చున్న విద్యార్థులు

సాధారణంగా తరగతి గదిలో విద్యార్థులు బెంచీల్లో ఒకరి వెనుక మరొకరు కూర్చునే విధానం ఉంది. దీనికి స్వస్తి పలికి, తరగతి గదిలో అర్ధ చంద్రాకారంలో విద్యార్థులను ఏక వరుసలో ఉంచి బోధనకు నాంది పలికారు. దీంతో బ్యాక్ బెంచర్స్ లేని తొలి తరగతి గదులు ఏర్పాటైన పాఠశాలగా ప్రశంసలందుకుంటోంది. ఇటీవల పాఠశాలను సందర్శించిన స్థానిక సర్పంచి రంజిత్ కుమార్ సాహు సామాజిక మాధ్యమాల్లో తెలుసుకున్న కేరళ విద్యా విధానంపై వివరించి, ఇక్కడా బ్యాక్ బెంచర్స్‌లేని తరగతులు నిర్వహించాలని సూచించడంతో ప్రారంభించామని ప్రధానోపాధ్యాయిని పుష్పితా పాణిగ్రాహి తెలిపారు. ఇప్పుడు అందరికీ బోర్డు కనిపిస్తోందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు ఉపాధ్యాయిని మమతా చెప్పారు.

కళాకారులకు హద్దుల్లేవు

రాయగడ, న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్రం కళలకు నిలయమని, ఇక్కడి కళలు, సంస్కృతితోపాటు కళాకారులు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందారని మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ కళాకారుడు డా.గిరిధర్ గొమాంగో అన్నారు. ఆదివారం స్థానిక బిజు పట్నాయక్ ఆడిటోరియంలో మా మజ్జిగౌరీ ఎంటర్‌టైన్మెంట్ ట్రస్ట్ వారు నిర్వహించిన రాయగడ టాలెంట్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రానికి చెందిన ప్రముఖ గాయకుడు రఘునాథ్ పాణిగ్రాహి అనేక తెలుగు చలన చిత్రాల్లో పాటలు పాడి గుర్తింపు పొందారని, కళాకారులకు హద్దులు లేవన్నారు. వారిని గౌరవిస్తూ రాయగడ టాలెంట్ అవార్డులు అందించడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు సంతోష్ బొచ్చు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాసనసభ్యుడు అప్పలస్వామి కద్రక, భాజపా జిల్లా అధ్యక్షుడు గోపి ఆనంద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ప్రశంగిస్తున్న డా.గిరిధర్ గొమాంగో

ఉన్నత విద్యాసంస్థల్లో 'శక్తిశ్రీ'

● అమ్మాయిల భద్రతే ధ్యేయం: సీఎం మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బాలేశ్వర్ ఎఫ్ఎం కళాశాల విద్యార్థిని సౌమ్యశ్రీ ఆత్మాహుతి, సంబల్‌పూర్ జీఎం వర్సిటీ విద్యార్థినిని ఉపాధ్యాయుడు మోసగించిన ఘటనలు ప్రభుత్వ ప్రతిష్ఠను మసకబార్చాయి. ఉన్నత విద్యాసంస్థల్లో అమ్మాయిల భద్రత చర్చనీయాంశం కాగా దిద్దుబాటు చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

అన్ని వర్సిటీలు, కళాశాలల్లో...

ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని 16 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, 730 డిగ్రీ కళాశాలల్లో అమ్మాయిల భద్రతకు సంబంధించి 'శక్తిశ్రీ' కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. 'శక్తిశ్రీ'లో ఆత్మరక్షణ, భద్రతకు సంబంధించి 8 కార్యక్రమాలు అమలవుతాయన్నారు. విద్యా సంస్థల్లో దీని అమలు బాధ్యతను ఒక విద్యార్థిని, అధ్యాపకురాలుకు అప్పగిస్తామన్నారు. ఆయా జిల్లాల పాలనాధికారుల ద్వారా మరో అయిదుగురు విద్యార్థినులు 'శక్తి అక్కల' పేరిట నియమితులవుతారన్నారు. వీరికి తొలుత ఆరు రోజులు శిక్షణనిస్తారు. శక్తిశ్రీ మొబైల్ యాప్‌ల ద్వారా ఆయా తరగతుల్లోని విద్యార్థులందర్నీ చేరుస్తారు. విద్యాసంస్థల బోధన, బోధనేతర సిబ్బందికి ప్రత్యేక కోడ్ వ్యవస్థ ఉంటుందన్నారు. సేఫ్ కేంపైన్ ద్వారా వర్సిటీలు, కళాశాలల్లో ఏడాదిలో రెండుసార్లు ఆత్మరక్షణ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఏటా డిసెంబరు 31 నాటికి క్యాంపస్‌ల భద్రతకు సంబంధించి నివేదికలు సిద్ధం అవుతాయన్నారు. విద్యాసంస్థల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 'ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్‌మెంట్'(పీవోఎస్‌హెచ్) చట్టంపై అమ్మాయిలకు శిక్షణ కల్పిస్తామన్నారు. ఏడాదికోసారి శక్తిశ్రీ సాధీలు, శక్తిశ్రీ నిర్వాహకులతో సదస్సులు నిర్వహిస్తామన్నారు.

విలేకర్ల సమావేశంలో సీఎం మోహన్, పక్కన మంత్రి సూర్యవంశీ సూరజ్

సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

ఉన్నత విద్యాశాఖ శక్తిశ్రీ కార్యక్రమాల అమలుకు సంబంధించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందని, సమీప భవిష్యత్తులో అపశ్రుతులు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలకు శ్రీకారం చుట్టినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. విలేకర్ల సమావేశంలో ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ పాల్గొన్నారు.

థైరాయిడ్‌పై రాష్ట్ర స్థాయి సదస్సు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: నగరంలోని 'స్వాస్థ్య సదన్' ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) బ్రహ్మపుర శాఖ సహకారంతో ఆదివారం బ్రహ్మపురలో రాష్ట్రస్థాయి '5వ దక్షిణ ఒడిశా థైరాయిడ్ సదస్సు-2025' జరిగింది. స్థానిక ఐఎంఏ హాల్లో జరిగిన దీనికి ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్, సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ కోట సునీల్ కుమార్ నిర్వహించారు. వైద్యులు ఆచార్య దుర్గాప్రసాద్ శత్పధి, పి.కె.కర్, కె.కె.పాణిగ్రహి, ఎల్.కె.మెహర్, ఆజోధ్యనాథ్ పాఢి అతిథులుగా హాజరయ్యారు. నిపుణులు థైరాయిడ్ సంబంధిత ఆరోగ్య సమస్యలు, చికిత్స విధానం, జాగ్రత్తలు వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 300 మంది వైద్యులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

సదస్సు ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

(c) eenadu

పతకాలతో రీతూరావు, అర్పిత, సొనాలి, బందన

ఉత్సాహంగా ముగిసిన సైక్లింగ్ పోటీలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశా సైక్లింగ్ సంఘం తరపున అశ్మిత ఖేలో ఇండియా మహిళా సిటీ లీగ్ రోడ్ సైక్లింగ్ పోటీలు ఆదివారం జరిగాయి. గోపాల్‌పూర్‌కు వెళ్లే దారిలో ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ కళాశాల కూడలి వద్ద మహిళా ఇలైట్, జూనియర్, సబ్‌జూనియర్, యూత్ కేటగిరీల్లో నిర్వహించిన 10, 15 కిలోమీటర్ల సైక్లింగ్ పోటీల్లో యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో సబ్‌జూనియర్ విభాగంలో బ్రహ్మపురకు చెందిన అర్పితపండా ద్వితీయం, సీనియర్ విభాగంలో ఎ.రీతూ రావు, సొనాలినాయక్, బందనా పండాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచి పతకాలు సాధించారు. ముగింపు కార్యక్రమంలో పతకాలు అందజేశారు.

చైతన్య దీపికలు.. సహానీ కవితలు

రాయగడ, న్యూస్‌టుడే: పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకొని, వివిధ పత్రికల్లో ప్రచురితం అయిన కృష్ణప్రియ సహానీ కవితలు సమాజ చైతన్య దీపికలని సబ్ కలెక్టర్ రమేష్‌కుమార్ జెనా అన్నారు. ఆదివారం స్థానిక మహిళా కళాశాల సమావేశ భవనంలో జరిగిన పుస్తక ఆవిష్కరణ సభలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.అర్చన పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత రీడర్, ప్రముఖ కవయిత్రి కృష్ణప్రియ సహానీ రూపొందించిన అవ్యక్త ఈశ్వర ఒడియా కవితా సంకలనం, ది వింగ్డ్ చారియట్ ఆంగ్ల కవితా సంకలనాలు ఆవిష్కరించారు. డా.డి.కె.మహంతి, సుశాంత్ నాయక్, శ్రీనివాస్ ఆచార్యలు పాల్గొన్నారు.

పుస్తకాలు ఆవిష్కరణలో శ్రీనివాస్, సహానీ, అర్చన, రమేష్ తదితరులు

నివేదిక సమర్పిస్తున్న కార్యదర్శి ప్రశాంతం ఆచారి. చిత్రంలో అతిథులు, నిర్వాహకులు

భక్త సమితి సర్వ సభ్య సమావేశం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీవిరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి భక్త సమితి త్రైవార్షిక సర్వ సభ్య సమావేశం ఆదివారం జరిగింది. మధ్యాహ్నం డైమండ్ ట్యాంకు రోడ్డులోని స్వామి మండపంలో ఏర్పాటైన దీనికి భక్త సమితి అధ్యక్షుడు వానపల్లి బిజయకుమార్ ఆచారి అధ్యక్షత వహించారు. రాయగడ డీఎస్పీ ఎల్.శ్రీనివాసరావు ఆచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అతిథులుగా భక్త సమితి సలహాదారు శ్రీనివాసరావు, బ్రహ్మపుర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వీరభద్ర రావు పాల్గొన్నారు. కార్యదర్శి ప్రశాంతం, కోశాధికారి జగదీశ్ నివేదికలు సమర్పించారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులు, వివిధ రంగాల ప్రముఖులను సత్కరించారు. సాయి బాబా సమన్వయకర్తగా వ్యవహరించారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం

సత్య నచికకు చెక్కు అందజేస్తున్న నిహార్ రంజన్

రాయగడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కాశీపూర్ సమితి సందిపాడు గ్రామానికి చెందిన ఆదివాసీ విద్యార్థి సత్య నచిక చెన్నై ఐఐటీలో సీటు సాధించాడు. తండ్రి బద్రు నచిక మృతి చెందగా తల్లి కూలి పనులు చేస్తూ ఇతన్ని చదివించింది. ఆర్థిక ఇబ్బందులతో చెన్నై వెళ్లలేక గత సోమవారం వినతుల స్వీకరణలో కలెక్టర్ పరుల్ పట్వారికి ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. కలెక్టర్ స్పందించి రూ.60 వేలు ఆర్థిక సహాయం ప్రకటించారు. శనివారం సాయంత్రం అదనపు కలెక్టర్ నిహార్ రంజన్ కొహార్ చెక్కును అందించారు.

జేసీబీ సహాయంతో తొలగిస్తున్న చెత్త

చెత్త తొలగింపు ప్రారంభం

ఈనాడు కథనానికి స్పందన

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో ముకాపుట్ డంప్‌యార్డులో ఉన్న చెత్త ప్రోసెసింగ్ పనులు ఆగిపోవడంతో వ్యర్థాలు పెరిగి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. దీనిపై 'ఈనాడు'లో 'యార్డులో పెరుగుతున్న చెత్త' అనే శీర్షికన శనివారం(19 జులై) కథనం ప్రచురితమైంది. స్పందించిన సంబంధిత అధికారి రాజశేఖర్ వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఆదివారం నుంచి చెత్తను జేసీబీతో తొలగింపు ప్రారంభించారు.

ప్లాస్టిక్ రహిత సమాజం అందరి లక్ష్యం

ప్రసంగిస్తున్న గౌరీప్రసాద్. చిత్రంలో విజయ, సుజన తదితరులు

రాయగడ, న్యూస్‌టుడే: ఆరోగ్యానికి, ప్రకృతికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధించాలని వక్తలు అన్నారు. స్థానిక హోటల్ సమావేశ భవనంలో శనివారం సాయంత్రం మణిద్వీప మహిళా సంఘం వారు ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వినియోగం-నష్టాలు అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ప్రసాద్ టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ పి.రాజ్‌కుమార్ ప్రసంగించారు. అధ్యక్షురాలు బరాటం సుజన తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్య పరిష్కారం

ఘటనా స్థలంలో అధికారులు, ఇతరులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్-ఝార్‌గ్రామ్ సెక్షన్ మధ్య బాస్తలా ప్రాంతంలో రైలు ఢీకొని మూడు ఏనుగులు ఇటీవల దుర్మరణం చెందిన సంగతి తెలిసిందే. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అటవీశాఖ ఉన్నతాధికారులు, రైల్వే ఉన్నతాధికారులు కలిసి శనివారం చర్చలు జరిపారు. ఈ చర్చల్లో అటవీ శాఖ ఉన్నతాధికారి సందీప్ శాండిల్య, రైల్వే ఉన్నతాధికారి డీఆర్ఎం కేఆర్ చౌదరి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆగస్టులో సాగునీటి విడుదల

సమావేశంలో పాల్గొన్న ఇంజినీర్లు, అధికారులు

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా పద్మపురం సమితి కెందుగుడ సమీపంలో ఉన్న బడనాల సాగునీటి ప్రాజెక్టు నీటిని ఆగస్టు నెలలో విడుదల చేస్తామని హరబంగి జలవనరుల విభాగ కార్యనిర్వాహక ఇంజినీరు సుబ్రత్ చౌదరి అన్నారు. శనివారం సాయంత్రం బడనాల ప్రాజెక్టు కార్యాలయంలో రైతు ప్రతినిధులతో సమావేశమయ్యారు. పాణి పంచాయతీ రైతు ప్రతినిధులతో పాటు పద్మపురం తహసీల్దారు శంకర్ బాగ్, సహాయ ఇంజినీరు ఎల్.మురళీ కృష్ణ, వ్యవసాయ అధికారి సంజీవ కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

20 వేల మందికి పైగా ఉచిత వైద్యసేవలు

వేదాంత ఆధ్వర్యంలో ఏర్పాటైన వైద్య శిబిరం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: మారుమూల ప్రాంతాల ప్రజల కోసం వేదాంత పరిశ్రమ ఏటా నిర్వహిస్తున్న వైద్య శిబిరాల ద్వారా గతేడాది 20 వేల మందికి పైగా లబ్ధి చేకూరింది. వేదాంత సీఈవో ప్రణబ్‌కుమార్ భట్టాచార్య ఈ వివరాలను మీడియాకు ప్రకటన ద్వారా వెల్లడించారు. కలహండి జిల్లాలో తాజాగా నిర్వహించిన వైద్య శిబిరాలతో 350 మందికి పైగా ఉచిత వైద్యసేవలు పొందారు. ఇందుకోసం 650కి పైగా సంచార వైద్య కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

జిల్లాస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు

స్నాచ్‌లో బరువులెత్తుతున్న బ్రహ్మపుర లిఫ్టరు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: గంజాం జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ సంఘం తరపున బ్రహ్మపురలో జిల్లాస్థాయి అశ్మిత వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. మహాత్మాగాంధీ క్రీడామైదానంలోని ఇండోర్ హాల్లో నిర్వహించిన పోటీలను బీఈఎంసీ మేయరు సంఘమిత్ర దొళాయి, ఉపమేయరు ఈ.వివేక్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు కుముద్‌చంద్ర సాహు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో అర్జున అవార్డు గ్రహీత కె.రవికుమార్, ఒడిశా వెయిట్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు చిత్తరంజన్ స్వాయిన్, జిల్లా కార్యదర్శి సుధీర్‌కుమార్ పాత్ర్ పాల్గొన్నారు. పోటీల్లో బ్రహ్మపుర, చికిటి, కవిసూర్యనగర్, అస్కా తదితర ప్రాంతాల నుంచి 38 మంది మహిళా లిఫ్టర్లు 43, 48 కిలోల విభాగాల్లో స్నాచ్, క్లీన్‌జర్క్‌ల్లో బరువులెత్తి పోటీపడ్డారు. యూత్, సీనియర్ విభాగాల్లో 16మంది పాల్గొన్నట్లు సుధీర్‌కుమార్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు. మొదటిస్థానాల్లో నిలిచిన వారు జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

శ్రీవారి సేవకు తరలిన భక్తులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ పాతకోళీ శ్రీవేంకటేశ్వర ఆలయం నుంచి శ్రీవారి సేవ కోసం తిరుపతికి 150 మంది శ్రీవారి భక్తులు ఆదివారం బయలుదేరారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి శ్రీవేంకటేశ్వర ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఒకరికొకరు రక్షలు కట్టుకున్నారు. తిరుపతిలో వీరు వారం రోజులపాటు సేవలు అందిస్తారని ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.కాళిదాస్ తెలిపారు.

విద్యార్థినిని సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వైద్యులు వి.వి.ఎల్.ఎన్.రావు, గోపాలరావులను సత్కరిస్తున్న నిర్వాహకులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక ప్రేమనగర్ రెండో లైనులోని చవ్వా సుబ్బారావు ఆర్య వైశ్య ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఆర్య వైశ్య సంఘం(బ్రహ్మపుర), వాసవీ క్లబ్ బ్రహ్మపుర, ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవాప)ల సంయుక్త ఆధ్వర్యంలో ఇది ఏర్పాటైంది. శిబిరంలో 106 మందికిపైగా వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. శంకర కంటి ఆసుపత్రి (సమరయొళి) నిపుణులు పాల్గొని నేత్ర పరీక్షలు చేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.త్రినాథరావు, వి.శ్రీనివాస్, వాసవీ క్లబ్ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ మూర్తి, అవాప అధ్యక్ష, కార్యదర్శులు పి.బుచ్చిబాబు, ఏ.గోవిందరాజు పర్యవేక్షించారు. వైద్యులు వి.వి.ఎల్.ఎన్.రావు, పి.గోపాలరావులను నిర్వాహకులు సత్కరించారు.

ప్రతిభా విద్యార్థులకు పురస్కారాలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'నిఖిల ఉత్కళ ఖడురా సమాజ్ కల్యాణ పరిషద్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా విద్యార్థులకు సత్కారోత్సవాలు నిర్వహించారు. రంగుణిబొంద వీధిలోని ఖడురా కల్యాణ మండపంలో జరిగిన వేడుకలకు పరిషద్ నగర శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్ అధ్యక్షత వహించారు. ఉన్నత విద్యాశాఖ ఆర్డీ సిద్ధార్థ శంకర్‌పాడి ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో ఇటీవల వెల్లడైన పది, ప్లస్‌టూ పరీక్షా ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన 135 మందిని సత్కరించి అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మొక్క నాటుతున్న కమాండెంట్ ఫిరోజ్‌కుమార్, రజిత

రాయగడ, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సీఆర్పీఎఫ్ 4వ బెటాలియన్ కమాండెంట్ ఫిరోజ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక అపరాజిత లయన్స్‌క్లబ్ వారు సీఆర్పీఎఫ్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అపరాజిత క్లబ్ కార్యనిర్వాహక అధ్యక్షురాలు రజిత కోరాడ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 2వ కమాండెంట్లు ప్రభాకర్ ఉపాధ్యాయ, సంజయ్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు.

మొక్కలు నాటడం అలవర్చుకోవాలి

జయపురం: మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధ్యాపకులు, సంస్థ సభ్యులు

జయపురం, సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ మహిళా కళాశాల ప్రాంగణంలో జిల్లా యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కళాశాల ప్రిన్సిపల్ డా.వివేకానంద్ సునా, రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షురాలు డా.కనకలత మహాపాత్ర్ నేతృత్వంలో మొక్కలు నాటారు. ● సునాబెడకు చెందిన జవహర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పురపాలక సంస్థ అధ్యక్షులు రాజేంద్రకుమార్ పాత్ర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

భారత ఓపెన్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో పుణెలోని పాటలీపుత్ర మైదానంలో జరిగిన ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్-2025 పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఇందులో శనివారం నిర్వహించిన 100, 200, 400, 1500 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ అంశాల్లో రాష్ట్ర అథ్లెట్లు అవినాష్ సాహు, శ్రావణి నందొ, మనీషా మెరెల్, సరున్‌పయ సింగ్, లక్ష్మీప్రియ కిసన్‌లు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచి పసిడి, రజత, కాంస్య పతకాలు గెలుచుకున్నారు.

1500 మీటర్ల పరుగులో పాల్గొన్న లక్ష్మీప్రియ(నీలంరంగు జెర్సీ)

నేరడివలసలో ఉచిత వైద్య శిబిరం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఒడిశా-ఆంధ్ర రాష్ట్రాల వివాదాస్పద కొరియా పంచాయతీకి చెందిన నేరడివలసలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా యంత్రాంగం, పొట్టంగి, కొరియా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు సంయుక్తంగా శనివారం మధ్యాహ్నం ఏర్పాటు చేశారు. 286 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు.

న్యాయవాదుల సంతాపం

రాయగడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కొల్నారాకు చెందిన సీనియర్ న్యాయవాది జి.మన్మధరావు(70) మృతిపై రాయగడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు సంతాపం ప్రకటించారు. ఆదివారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవీప్రసాద్ పట్నాయక్, కార్యదర్శి మంగళమూర్తి, లలిత్ మోహన్ పట్నాయక్, చిట్టి కుమందాన్, వై.శ్రీహరి తదితరులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అక్రమంగా కలప తరలిస్తున్న లారీ పట్టివేత

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కాశీపూర్ సమితి చంద్రగిరి పంచాయతీ నుంచి అక్రమంగా కలపను తరలిస్తున్న లారీని శనివారం అర్ధరాత్రి అటవీశాఖ అధికారులు కాశీపూర్‌లో పట్టుకున్నారు. ఇందులో ఇరిడి, టేకు కలప ఉన్నట్లు తెలిసింది. వాహన చోదకుడిని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

బురదలో వరినాట్లతో వినూత్న నిరసన

బురద రహదారిపై వరి నాట్లు వేస్తున్న గ్రామస్థులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: బురద రహదారితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సిమెంటు రహదారి నిర్మించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో బురద రహదారిపై వరినాట్లు నాటుతూ గ్రామస్థులు వినూత్నంగా నిరసన తెలుపుతున్నారు. ఈ ఘటన నవరంగపూర్ జిల్లా నందహండి సమితి జగన్నాథపూర్ పంచాయతీ పుపుగావ్-పాలుగూడ గ్రామాల మధ్య జరిగింది. సరైన రహదారి లేకపోవడంతో అంబులెన్స్ కూడా రావడం లేదని, తమ గ్రామాలకు సరైన రహదారి నిర్మించాలని కోరుతున్నారు.

నాలుగు బృందాలుగా విద్యార్థులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: రైల్వే సెటిల్మెంట్ పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం-2లో శనివారం విద్యార్థులను స్ఫూర్తిమంత ప్రదర్శనకు నాలుగు బృందాలు(విద్యార్థి పరిషత్) ఏర్పాటు చేశారు. వీటికి సుభాష్, ఠాగూర్, అశోక్, రామన్ పేర్లు పెట్టారు. విద్యాలయం ప్రిన్సిపల్ సంగ్రామ్ బెనర్జీ, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎంపికైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

నిందితుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: పూరీ జిల్లా బలంగా ఠాణా పరిధిలో శనివారం ఓ విద్యార్థినిపై ముగ్గురు వ్యక్తులు కిరోసిన్ పోసి నిప్పు పెట్టిన ఘటనను ఆలిండియా డీఎస్‌వో తీవ్రంగా ఖండించింది. ఆ సంస్థ గంజాం జిల్లా కమిటీ ప్రతినిధులు శనివారం రాత్రి కళ్లికోట వర్సిటీ వద్ద నిరసన తెలిపారు. నిందితుల్ని తక్షణం అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. ప్రతినిధులు నిమయిచరణ సాహు, శుభస్మిత పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.

సిమిలిగుడలో రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న దాతలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడకు చెందిన సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సాయి ప్రేమ సంజీవిని కార్యక్రమంలో భాగంగా సాయి మందిరంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షులు మార్కండేయా షరీఫ్ శిబిరాన్ని ప్రారంభించారు. 56 మంది రక్తదానం చేశారు. సమితి కన్వీనర్ ఎం.మహదేవ్ అధ్యక్షతన జిల్లా రక్తదాతల సంఘం అధ్యక్షులు సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధన శిక్షణ శిబిరం

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో ఉన్న విక్రమ్‌దేవ్ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయులకు డిజిటల్ తరగతి గదిలో విద్యాబోధనపై ఆదివారం శిక్షణ శిబిరం జరిగింది. వోఎస్‌డీ ప్రొఫెసర్ డా.దేవీప్రసాద్ మిశ్ర, రిజిస్ట్రార్ మహేశ్వర్ చంద్రనాయక్ అధ్యక్షతన వర్సిటీ అధ్యాపకులు డిజిటల్ తరగతి గదుల్లో విద్యార్థులకు పాఠాలు ఎలా చెప్పాలి, ఉన్నత విద్యాబోధనలో సాంకేతికతలపై వివరించారు. శిబిరంలో 25-30 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

EENADU Classifieds
JOBS
Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 9014651068, 7075633416.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

బురదగా మారిన రహదారి

అజాగ్రత్తగా ఉంటే జారిపోతాం

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం ధాన్వి టౌన్‌షిప్‌లో రహదారిపై బురద చేరడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల పట్టణ రహదారి నిర్మాణ శాఖ జాతీయ రహదారి నుంచి ఉమురి వైపుగా బైపాస్ రోడ్డు నిర్మాణం ప్రారంభించింది. సిమెంటు, ఇసుక రహదారి వద్ద విడిచిపెట్టి పనులు నిలిపివేయగా, గాలికి ఆ ఇసుక, సిమెంటు టౌన్‌షిప్ దారి మీదకు చేరుతోంది. వర్షాల కారణంగా ఆ మార్గమంతా బురద కావడంతో స్థానికులు రాకపోకలకు భయపడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, వెంటనే బురదను తొలగించాలని కోరుతున్నారు.

దీర్ఘకాల సమస్యలపై పోరాటం

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కల్యాణ సింగ్‌పూర్ సమితిలో అఖిల ఒడిశా అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. భారతీయ మజ్దూర్ ఆధ్వర్యంలో సంఘం ఉపాధ్యక్షుడు జోగేశ్వర దాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దీర్ఘ కాలంగా ఉన్న డిమాండ్లపై పోరాడాలని దాస్ అన్నారు. జిల్లా అంగన్‌వాడీ అధ్యక్షురాలు జయంతితో పాటు సమితిలో అన్ని కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

సమావేశంలో జోగేశ్వర దాస్, జయంతి తదితరులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

ధర్మతలా చలోకు భారీగా సమాయత్తం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: కోల్‌కతా ధర్మతలా ప్రాంతంలో తృణమూల్ కాంగ్రెస్ సోమవారం షహీద్ దివస్ భారీ ఎత్తున నిర్వహిస్తోందని, ఇందుకు లక్షల సంఖ్యలో కార్యకర్తలను సమీకరిస్తుందని, అంతా తరలిరావాలని పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎస్.సూర్యప్రకాష్‌రావు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కీలక ప్రసంగం చేయనున్నారని, ఈ బహిరంగ సభలో పాల్గొనడానికి పట్టణం నుంచి 2 వేలకు పైగా కార్యకర్తలు బయలుదేరుతారని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృత్యువాత

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై బాలుడు మృత్యువాత పడిన ఘటన గంజాం జిల్లా పొలసరా ఠాణా పరిధిలోని చిరికిపడ శాసన గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక ఠాణా అధికారి కౌశిక్ మాఝి వివరాల ప్రకారం.. చిరికిపడ శాసన గ్రామంలో ఉంటున్న సుశాంతకుమార్ సాహు తన ఇంటి ముందు ఇనుప తీగలతో కంచె ఏర్పాటు చేసుకున్నారు. శునకాలు, ఇతర వన్య ప్రాణులు ఇంట్లోకి రాకుండా వాటికి విద్యుత్తు తీగల్ని అమర్చాడు. ఇతని ముందు వీధిలో ఉంటున్న తన్మయ కుమార్ సాహు (13) అటు వైపుగా వెళ్లి తీగలను తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ముందు జాగ్రత్తగా సుశాంత, అతని భార్యను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించామని స్టేషన్ అధికారి కౌశిక్ మాఝి తెలిపారు.

మరదలు హత్య కేసులో బావ అరెస్టు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే; తమ్ముడి భార్య మరదలు ఏఎన్ఎమ్‌గా పనిచేసిన్తున్న శైలేంద్ర సరకని(35)ని హత్య చేసిన నేరానికి మృతురాలి బావ లత్రిక ప్రపకను అరెస్టు చేసినట్లు కె.సింగ్‌పూర్ పోలీసులు తెలిపారు. హత్య తరువాత పోలీసు స్టేషన్‌లో లొంగిపోయిన లత్రికని విచారణ అనంతరం శనివారం రాత్రి కోర్టుకు తరలించినట్లు ఐఐసీ నీలకంఠ బెహర తెలిపారు.

కుంద్రాలో చోరీ, హత్య కలకలం

జయపురం, న్యూస్‌టుడే: ఒకే గ్రామంలో చోరీ, హత్య జరగడంతో కొరాపుట్ జిల్లా కుంద్రా సమితి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఠాణాధికారి అశ్వినికుమార్ పట్నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. కుంద్రా ఠాణా పరిధిలో అభిగావ్ గ్రామానికి చెందిన సత్యేంద్ర గుప్తా ఇంట్లోకి శనివారం రాత్రి కొందరు దుండగులు చొరబడి, అతనిపై దాడిచేసి బీరువాలో ఉన్న రూ.లక్ష నగదు, బంగారు గొలుసును దోచుకొని పరారయ్యారు. అదేరోజు రాత్రి గ్రామంలో బొరిగుమ్మ సమితి కమర గ్రామానికి చెందిన భరత్ గండ్(40) దారుణంగా హత్యకు గురయ్యాడు. భరత్ సోదరుడు మోహన్ ఫిర్యాదు మేరకు పోలీసులు, శాస్త్రీయ బృందం ఆదివారం ఉదయం గ్రామానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జయపురం ఎస్‌డీపీవో జగదీశ్ కశ్యప్ తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం

కాశీనగర్, న్యూస్‌టుడే: గజపతి జిల్లాలోని కాశీనగర్ పట్టణానికి చెందిన ఓ యువకుడు ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం సమీపంలోని రాజ్‌నగర్ గ్రామంలో రొక్కం గిరిధర్(38) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల మేరకు.. గిరిధర్ కనిపించడం పోవడం లేదని అతని సోదరుడు కాశీనగర్ పోలీస్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. యువకుడి మృతదేహం ఆంధ్రా రాజ్‌నగర్ గ్రామంలోని విశ్రాంతి భవనంలో లభించిన తర్వాత ఆంధ్రా పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు చేపట్టి అతని ఆధార్ కార్డు ఆధారంగా కాశీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు మృతుడి కుటుంబానికి సమాచారం అందించారు.

అత్యాచారం కేసులో అగ్నిమాపక అధికారి..

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఓ వివాహిత మహిళపై అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలపై రాయగడ అగ్నిమాపక శాఖ జిల్లా అదనపు అధికారిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఐఐసీ ప్రసన్నకుమార్ బెహరా తెలిపిన వివరాల మేరకు అగ్నిమాపక శాఖలో అదనపు అధికారిగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌చంద్ర బెహరా పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు బాధిత మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి రమేష్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా..

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం పరాబెడ చౌక్ వద్ద ఆదివారం ఉదయం అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎస్‌బీఐ ఏటీఎం వద్ద చోరీ ప్రయత్నం చేస్తుండగా స్థానికులు అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దుండగులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దర్యాప్తు పూర్తి కాగానే వివరాలు తెలియజేస్తామని ఎస్‌డీపీవో జగదీశ్ కశ్యప్ తెలిపారు. దుండగులు ఉత్తరప్రదేశ్‌కి చెందిన వారిగా గుర్తించారు.

ట్రక్కు చోదకుడికి ఏడేళ్ల జైలుశిక్ష

జయపురం, న్యూస్‌టుడే: ట్రక్కు దుర్ఘటనలో 8 మంది మృతిచెందిన కేసులో కొరాపుట్ జిల్లా న్యాయస్థానం వాహన చోదకుడికి ఏడేళ్లు జైలుశిక్ష, రూ.15 వేలు జరిమానా విధించింది. న్యాయవాది మహేంద్రకుమార్ నాగ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2023 ఫిబ్రవరి 18న డంగరంచి పంచాయతీ బారంగపుట్ గ్రామానికి చెందిన రఘునాథ్ గద్బ కుమార్తె వివాహం సందర్భంగా వధువు తరపున బంధువులు కదమగూడలో జరిగే వివాహానికి వెళ్లేందుకు, గ్రామానికి చెందిన నీలమాధవ్ బిసోయి వద్ద ట్రక్కు అద్దెకు తీసుకున్నారు. వాహన చోదకుడు గోవర్ధన గద్బ మద్యం తాగి ఆ ట్రక్కును నడిపాడు. తురుడి చౌక్ వద్ద వాహనం బోల్తాపడటంతో, 8 మంది మృతిచెందారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు నీలమాధవ్‌ను, గోవర్ధన్‌ను అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఏడేళ్ల జైలుశిక్షను గోవర్ధన్‌కు విధిస్తూ శనివారం న్యాయమూర్తి ప్రదీప్ మహంతి తీర్పు ప్రకటించారు.

కలాగూడలో ఆబ్కారీ దాడులు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం సమితి గొడపొదర పంచాయతీ కలాగూడ ప్రాంతంలో ఆదివారం ఉదయం ఆబ్కారీ వోఐసీ శుబ్రత్ కేసరి హిరణ్ నేతృత్వంలో శాఖాధికారులు దాడులు నిర్వహించారు. మూడు బట్టీల వద్ద 1,200 లీటర్ల నాటు సారా, 2,200 లీటర్ల విప్ప సారాను నేలపాలు చేశారు. అధికారుల రాకను గమనించి బట్టీ యజమానులు పరారయ్యారు. అధికారులు బట్టీలను ధ్వంసం చేసి సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

101 లీటర్ల విదేశీ మద్యం స్వాధీనం

పోలీసుల అదుపులో నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా మునిగుడ సమితి పరిధిలో అంబోదల పోలీసులు ఓ వ్యక్తి నుంచి 101 లీటర్లకు పైగా విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు తన ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 101.455 లీటర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

(c) eenadu

సీతాఫలాలకు గిట్టుబాటేదీ..

వారపు సంతలో అమ్మకం కోసం తెచ్చిన సీతాఫలాలు

సీతంపేట, న్యూస్‌టుడే: మన్యంలో సీతాఫలాల సీజన్ ప్రారంభమైంది. సీతంపేట వారపు సంతకు ఆదివారం గిరిజనులు సీతాఫలాలను తీసుకొచ్చి, విక్రయించారు. ఒక్కో ట్రే రూ.700 నుంచి 800 లోపు చెల్లుబాటు అయ్యాయని అంటున్నారు. గతేడాది ఇదే సమయానికి ఒక్కో ట్రే రూ.1500 వరకు అమ్ముడుపోయాయని తెలిపారు. రానున్న రోజుల్లో ధర ఎలా మారుతుందో అని కలవరపడుతున్నారు. మరికొద్ది రోజుల్లో మన్యం సంతలకు సీతాఫలాలు భారీగా రానున్నాయి. ప్రోసెసింగ్ యూనిట్ మన్యంలో ఏర్పాటు చేస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశిస్తున్నారు.

ఉత్సవాలు ఉట్టిపడేలా నిర్వహించాలి

సమావేశానికి హాజరైన నాయకులు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేలా ప్రపంచ ఆదివాసీ ఉత్సవాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి అన్నారు. ఆగస్టు 9న నిర్వహించనున్న ఉత్సవాలకు సంబంధించి ఆదివారం గుమ్మలక్ష్మీపురం వైటీసీలో పలు సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. మారుమూల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చేలా చూడాలన్నారు. నాయకులు రమణ, నాగభూషణరావు, శంకరరావు, ప్రసాదరావు, శేఖర్, సన్యాసిరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలపై నిరసన

నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో విద్యార్థులు సమస్యలతో సతమతం అవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.అఖిల్, కె.రాజు అన్నారు. పార్వతీపురం బాలుర కళాశాల వసతి గృహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ప్రహరీ లేక విష కీటకాలు గదుల్లోకి వస్తున్నాయన్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక విద్యార్థులు ఆరుబయటకు వెళ్తున్నట్లు చెప్పారు. కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేయాలన్నారు.

పోస్టులు అమ్ముకోవడం వారి సంస్కృతి

సాలూరు, న్యూస్‌టుడే: పోస్టులు అమ్ముకోవడం, ఉద్యోగులను వేధించడం వైకాపా సంస్కృతి అని సాలూరు పట్టణ, మండల తెదేపా అధ్యక్షులు చిట్టి, పరమేశు అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వందల సంఖ్యలో పోస్టులు పారదర్శకంగా భర్తీ చేసినట్లు చెప్పారు. విద్యుత్ శాఖలో షిఫ్ట్ ఆపరేటర్ల ఉద్యోగాలను వేలం వేసి మరీ వైకాపా నేతలు అమ్ముకున్నట్లు ఆరోపించారు. కౌన్సిలర్ హర్ష, ఎంపీటీసీ సభ్యురాలు పాల్గొన్నారు.

మాకెవరైనా చదువు చెప్పండి సారూ..

వీరంతా కొమరాడ మండలంలోని గిరిశిఖర ప్రాంతం నయ పంచాయతీ దేరుపాడు గ్రామానికి చెందిన విద్యార్థులు. ఒకటి, రెండు తరగతుల్లో కలిపి 10 మంది చదువుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లిపోయారు. ఆ స్థానంలో ఎవర్నీ నియమించకపోవడంతో విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారు. విషయం ఎంఈవో నారాయణస్వామి వద్ద ప్రస్తావించగా.. ఐటీడీఏ నుంచి నియామకాలు జరగాల్సి ఉందన్నారు. క్లస్టర్ పరిధిలోని ఉపాధ్యాయులను దేరుపాడు పాఠశాలకు పంపిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కొమరాడ

నిండుకుండ



ఒడిశాలో కురుస్తున్న వర్షాలతో గోముఖి, సువర్ణముఖి నదుల ద్వారా వెంగళరాయసాగర్ జలాశయంలో వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 167 మీటర్లకు గాను ప్రస్తుతం 164 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండటంతో శనివారం సాయంత్రం 100 క్యూసెక్కులు దిగువకు విడిచిపెట్టారు. – న్యూస్‌టుడే, మక్కువ

అక్రమాలకు అడ్డుకట్ట..!

న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం, ఇచ్ఛాపురం గ్రామీణం

గతంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందజేసే సరకుల పంపిణీలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. వాటికి అడ్డుకట్ట వేయడానికి కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ముఖ ఆధారిత హాజరు తీసుకుని పోషకాహారం, బాలసంజీవని కిట్లు పంపిణీ చేయనున్నారు.

మూలకు చేరిన 2జీ ఫోన్లు

వైకాపా ప్రభుత్వం బాలసంజీవని నమోదుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు 2జీ ఫోన్లు అందజేసింది. అవి చాలా వరకు పని చేయడం లేదు. సిబ్బంది ఎక్కువగా సొంత సెల్‌ఫోన్లు వినియోగిస్తున్నారు.

❖ ఇటీవల అందుబాటులోకి వచ్చిన బాల సంజీవని యాప్ 2.0 ద్వారా ఉదయం, సాయంత్రం ముఖ హాజరు తప్పనిసరి చేసింది. ఎంత మంది కేంద్రాలకు వచ్చారో సెల్‌ఫోన్ ద్వారా చిత్రాలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ నెల 1 నుంచి పోషణ్ ట్రాకర్ పేరిట ముఖ ఆధారిత యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై అంగన్‌వాడీ కార్యకర్తలు బాల సంజీవని యాప్, పోషణ్ ట్రాకర్‌లోనూ ఈకేవైసీ, ముఖ ఆధారిత హాజరు నమోదు చేయాల్సిందే. ❖ ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో 488 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌లు లోపభూయిష్టంగా ఉండటంతో సరకుల పంపిణీ అస్తవ్యస్తంగా సాగేది. ఈ విషయాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు పక్కాగా పోషకారం అందేలా కీలక నిర్ణయం తీసుకుంది.

వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం అంగన్‌వాడీ కేంద్రంలో ముఖ ఆధారిత హాజరు నమోదు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

ముఖ ఆధారిత గుర్తింపుతో పోషకాహారం పంపిణీ

పారదర్శకంగా సరఫరా

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం, సరకులు లబ్ధిదారులకు ఇవ్వడానికి వారి ముఖ ఆధారిత హాజరును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. లబ్ధిదారులు సహకరించి కేంద్రాలకు వెళ్లి తీసుకోవాలి. ముఖ ఆధారిత హాజరుతో పారదర్శకంగా సరకుల పంపిణీ జరుగుతుంది. ప్రత్యేక యాప్‌తో అక్రమాలకు అవకాశం ఉండదు. – కవిటి భారతి, బి.సుజాత సీడీపీవోలు, కాశీబుగ్గ, ఇచ్ఛాపురం

సూచికలు: ★ నియోజకవర్గం, ❑ అంగన్‌వాడీ కేంద్రాలు, ✓ గర్భిణులు, ▲బాలింతలు

★ పలాస, ❑ 189, ✓ 775, ▲ 780, 0-6 ఏళ్ల చిన్నారులు: 6,167

★ ఇచ్ఛాపురం, ❑ 488, ✓ 1,519, ▲ 1,518 6 నెలలు-3 ఏళ్ల చిన్నారులు: 8,042, 3-5 ఏళ్ల పిల్లలు: 6,126

నాసిరకం భోజనంపై ఎమ్మెల్యే ఆగ్రహం

భోజనం చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం మండలంలోని జోగింపేట సామాజిక సంక్షేమ శాఖ గురుకులంలో భోజనం నాసిరకంగా ఉండటంపై ఎమ్మెల్యే విజయచంద్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి గురుకులాన్ని ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అన్నం రుచిగా లేకపోవడం, పురుగులు ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి సందర్శిస్తానని, మార్పు రాకపోతే అందరిపై చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు విద్యార్థులకు వాలీబాల్ కిట్లు అందజేశారు. నాయకులు బి.లక్ష్మణరావు, అరవింద్, చిరంజీవి, సత్యనారాయణ ఉన్నారు.

నేడు పెదంకలాం నీరు విడుదల

బలిజిపేట, న్యూస్‌టుడే: బలిజిపేట, వంగర మండలాల్లో సాగుకు ప్రధాన నీటి వనరు పెదంకలాం ప్రాజెక్టు నుంచి సోమవారం నీరు విడుదల చేయనున్నట్లు తెదేపా అరకు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు బి.రామ్మోహనరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే విజయచంద్ర ఆధ్వర్యంలో కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు నుంచి 8,250 ఎకరాలకు సాగునీరు వెళ్తుందన్నారు.

5,600 లీటర్ల ఊట ధ్వంసం

సామగ్రి చూపుతున్న పోలీసులు

కొమరాడ, న్యూస్‌టుడే: ఆంధ్ర- ఒడిశా సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న సారా తయారీ కేంద్రాలపై ఆబ్కారీ ఇన్‌స్పెక్టర్ బి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. కొరాపుట్ జిల్లా బందుగాం బ్లాక్ పరిధిలో అలమండ, జగ్గగూడ, పల్లెడ కేంద్రాల్లో 5,600 లీటర్ల ఊటతో పాటు 400 లీటర్ల సారా ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం కొరాపుట్, బొబ్బిలి, సీతానగరం, పార్వతీపురం ఆబ్కారీ సిబ్బంది, విజయనగరం టాస్క్‌ఫోర్స్ పోలీసులు 51 మంది పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలని వినతి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: కురుపాం మండలంలోని తియ్యాలవలస, అడ్డంగూడ, ఎగువ పీరంగూడకు రహదారి సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. శనివారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కడ్రక మల్లేశ్వరరావును గుణదలో కలిసి వినతిపత్రం అందించారు. రోడ్డు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాలన్నా డోలీలనే ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. సమస్యను ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.

డ్రోన్‌తో సాగుదాం..!

రైతు సంఘాలకు రాయితీపై డ్రోన్లు సమకూరుస్తుండటంతో పంట పొలాల్లో క్రిమి సంహారక మందుల పిచికారీ, ఎరువులు, విత్తనాలు జల్లడం ఇతర సాగు పనులు వేగంగా పూర్తి చేయడానికి అవకాశం కలిగింది. కర్షకులకు వీటిపై అవగాహన కల్పించి వినియోగం పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతు సంఘాలకు జిల్లాకు డ్రోన్లు అందించింది. ❖ జిల్లాలో 30 దరఖాస్తులు అందగా ఇప్పటికే 10 గ్రూపులకు డ్రోన్లు సరఫరా చేశారు.

న్యూస్‌టుడే, సోంపేట, కవిటి గ్రామీణం

ఆధునిక సాగు విధానాల వైపు రైతుల్ని మళ్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. శాస్త్ర, సాంకేతిక రంగాల ప్రగతిని వ్యవసాయానికి అనుసంధానం చేస్తూ అన్నదాతలు సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపుతోంది. వివిధ అంశాల్లో విరివిగా వినియోగిస్తున్న డ్రోన్లను సాగులో వినియోగించేలా ప్రోత్సహిస్తోంది. జిల్లాలోనూ ఈ ప్రక్రియ ప్రారంభమైంది.

సాగు పనులకు సిద్ధం చేస్తున్న డ్రోన్

పురుగు మందు, ఎరువుల పిచికారీకి అనుకూలం

ఇలా చేయాలి..

ఐదుగురు రైతులు ఒక గ్రూపుగా ఏర్పడాలి. అందులో ఒకరు 10వ తరగతి, ఐటీఐ చదివి ఉండాలి. సంబంధిత రైతుకు డ్రోన్‌తో ఎలా పని చేయాలి, నిర్వహణ, ఎరువులు, మందుల పిచికారీ ఇతర అంశాలపై 12 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందిన వ్యక్తి మాత్రమే పరికరంతో పని చేయాలి. దీనికి సంబంధించిన నిబంధనలతో ఒప్పంద పత్రం ఇస్తారు. డ్రోన్ ఖరీదు రూ.10 లక్షలు. ఈ మొత్తంలో బ్యాంకు రుణంగా రూ.5 లక్షలు ఇస్తుంది. మొత్తం యూనిట్‌లో 80శాతం లబ్ధిదారుకి రాయితీ లభిస్తుంది.

నిమిషాల్లోనే పని పూర్తి

వ్యవసాయ పనులకు కూలీల కొరత వేధిస్తోంది. ఈ పరిస్థితుల్లో పురుగు మందులు, ఎరువులు పొలాల్లో జల్లడానికి మనిషికి రూ.700 వరకు చెల్లించాలి. పని పూర్తవడానికి కనీసం 5 గంటల సమయం పడుతుంది. ఒకరే మందు పిచికారీ చేయాలంటే కనీసం 6 గంటలపైనే పట్టే అవకాశం ఉంది. డ్రోన్ ద్వారా కేవలం 4 నిమిషాల్లో ఈ పనులు పూర్తి చేసే అవకాశం ఉండటంతో సమయం, సాగు ఖర్చు తగ్గుతుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

సాగులో సాంకేతికతను వినియోగించడం ద్వారా వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవచ్చు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. దీంతో ఖర్చు తగ్గడమే కాకుండా సమయం ఆదా అవుతుంది. సాంకేతిక, ఇతర సహకారం అందిస్తోంది. ఈ అంశలపై వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. – కె.త్రినాథస్వామి, జిల్లా వ్యవసాయాధికారి, శ్రీకాకుళం

పొంచి ఉన్న ముప్పు

కంచిలి ప్రధాన రహదారి నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డు పక్కన విద్యుత్తు స్తంభాలపై తీగలకు పొదలు అల్లుకున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు శాఖ ఏఈ గురవయ్యను 'న్యూస్‌టుడే' సంప్రదించగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కంచిలి

ఇలాగైతే రాకపోకలెలా..!

ఇచ్ఛాపురం మండలం టి.బరంపురం సమీపంలో భారీ గుంత ప్రమాదకరంగా తయారైంది. ఇక్కడి నుంచి ఒడిశా ప్రాంతానికి కలుపుతూ జయంతిపురం, పాత్రపురం, జరడ తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతలో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ జేఈ విశ్వనాథను 'న్యూస్‌టుడే' సంప్రదించగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

రోడ్డు తడుస్తోంది.. గొంతెండుతోంది

కవిటి మండలం రాజపురంలో ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి గ్రామానికి తాగునీరు సరఫరా అయ్యే పైపులైన్ లీకవుతోంది. నీరు వృథాగా పోతుండటంతో సరఫరా సక్రమంగా కావడం లేదని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీని 'న్యూస్‌టుడే' సంప్రదించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ప్రయాణం..అవస్థలమయం

వజ్రపుకొత్తూరు మండలం బెండి గేటు నుంచి బెండి మధ్య 3 కిలోమీటర్ల పరిధిలో ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి పాడైంది. వర్షం పడితే ప్రయాణానికి నరక యాతన పడుతున్నారు. నువ్వలరేవు నుంచి బెండి మీదుగా రేగులపాడు వరకు రోడ్డు మంజూరై నాలుగేళ్లు గడిచినా పనులు పూర్తికాలేదు. చివరికి గుంతలతో దయనీయంగా మారింది. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ జేఈ జగదీశ్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

బిందెలు వేచి చూస్తున్నాయ్..

ఎప్పుడు నీరొస్తుందో.. ఎంత సమయం ఇస్తారో తెలియక కొత్తపాలెం మహిళలు బిందెలను కుళాయిల వద్ద వరస క్రమంలో పెట్టి పడిగాపులు కాస్తున్నారు. గ్రామానికి మెగా నీటి పథకం ద్వారా నీటిని అందిస్తున్నారు. నీటి కోసం తెల్లవారుజాము నుంచే బిందెలు పెట్టి కాపలా కాయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీని 'న్యూస్‌టుడే' సంప్రదించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఎస్సై పి.అనీష్ వివరాల మేరకు.. చినమేరంగికి చెందిన ఎస్.నాగరాజు, ఎస్.వెంకటేష్ ద్విచక్ర వాహనంపై పెదమేరంగి నుంచి ఇంటికి వెళ్తుండగా, పార్వతీపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు పెదమేరంగి రామాలయం వద్ద మలుపులో ఢీకొంది. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో చినమేరంగి సీహెచ్‌సీకి, అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: విశాఖలో జరగనున్న అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సిటు అధ్యక్ష, కార్యదర్శులు రమణరావు, మన్మథరావు పిలుపునిచ్చారు. పార్వతీపురంలో నాయకులు సమావేశమయ్యారు. కార్మికల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనట్లు పేర్కొన్నారు. శ్రమజీవుల హక్కుల హరించేలా జీవోలు తీసుకొస్తున్నట్లు ఆరోపించారు. సెప్టెంబరు 13, 14 తేదీల్లో పాలకొండలో జిల్లా సభలు ఉంటాయన్నారు. నాయకులు బీవీ.రమణ, ఎన్.వై.నాయుడు, రెడ్డి.వేణు, శాంతి, ఉమామహేశ్వరి, జ్యోతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపాలని ఆరోగ్య కార్యకర్తలు కోరారు. శనివారం ఎమ్మెల్యే విజయచంద్రను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వేతనాలు పెంచాలని, ఆశా కార్యకర్తలుగా గుర్తించాలని, ఏకరూప దుస్తులు అందించాలని కోరారు. విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచించారు. సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని గిజబలో ఆదివారం పర్యటించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు ఎ.మధుసూదనరావు, నాయకులు ఎం.పురుషోత్తంనాయుడు, కె.సుమన్, ఎం.బి.విజయాంకుశం, వై.శ్రీనివాసరావు, తవిటినాయుడు పాల్గొన్నారు.

పాచి పట్టిన నీరే గతి..!

గ్రామాల్లో క్లోరినేషన్ చేయకుండానే సరఫరా

❖ కవిటి మండలం భైరిపురంలో ఓవర్ హెడ్ ట్యాంకును రెండేళ్లుగా శుభ్రం చేయలేదు. ఇక్కడి నుంచి సరఫరా అవుతున్న నీరు తాగితే అనారోగ్యానికి గురవుతున్నామని గ్రామస్థులు చెబుతున్నారు. గొంతు నొప్పి, జలుబు, తలనొప్పితో తరచూ బాధపడుతున్నామని వాపోతున్నారు.

❖ ఇచ్ఛాపురం మండలం డొంకూరులో ఓవర్ హెడ్ ట్యాంకును ఏడాదిన్నరగా క్లోరినేషన్ చేపట్టలేదు. ఇక్కడి నుంచి పంపిణీ చేస్తున్న నీరు తాగితే వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్థులు తెలిపారు. వర్షాలు పడుతుండటంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కవిటి మండలం భైరిపురంలో శుభ్రతకు నోచుకోని ట్యాంక్

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ప్రజలకు రక్షిత నీరు అందించాలనే లక్ష్యంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంకుల శుభ్రతను గాలికొదిలేశారు. క్లోరినేషన్ చేయకపోవడంతో పాచి పట్టిన నీరు సరఫరా అవుతోంది. తాగిన వారు అనారోగ్యానికి గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ట్యాంకులను కొన్ని నెలలుగా శుభ్రం చేయకపోయినా పర్యవేక్షించే వారు కరవయ్యారు. కవిటి మండలంలోని 23 పంచాయతీల్లో ఉద్దానం, పీడబ్ల్యూఎస్ పథకాల పరిధిలో 23 ఓవర్ హెడ్ ట్యాంకులున్నాయి.

నిబంధనలివీ..

రక్షిత నీటి పథకం ట్యాంకులను ప్రతి నెలా 15 నుంచి 30 రోజుల్లో శుభ్రం చేయాలి. పంచాయతీ కార్యదర్శి లాగ్‌బుక్‌లో ట్యాంక్ శుభ్రం చేసిన తేదీ, మళ్లీ శుభ్రం చేయాల్సిన తేదీని విధిగా నమోదు చేయాలి. ట్యాంకును ఆ నెలలో శుభ్రం చేయించినట్లు అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు సంతకాలు చేయాలి. గ్రామాల్లో ట్యాంకులు శుభ్రం చేయకుండానే శుభ్రం చేయిస్తున్నట్లు సంతకాలు చేయిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. క్లోరినేషన్ చేయిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. 20 రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేసి ఓపెన్ లెవల్ మోతాదుకు మించకుండా బ్లీచింగ్ వేయాలి. ఇది ఎక్కడా అమలు కావడం లేదు.

పంచాయతీ కార్యదర్శులకు తెలియజేశాం..

ప్రతి గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతీ నెలా క్లోరినేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం. పంచాయతీ పరిధిలో ట్యాంకులను శుభ్రం చేసి బ్లీచింగ్ వేయించాలని సూచించాం. వర్షాకాలంలో ప్రతీ ట్యాంకు శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. – వంశీ, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కవిటి మండలం

దశాబ్దాలుగా నిర్లక్ష్యం



హిరమండలం మేజర్ పంచాయతీ మైత్రీ కాలనీ, పెరికివీధి మధ్యలో కొన్ని దశాబ్దాలుగా చెరువు ఉపయోగంలో లేక అపరిశుభ్రంగా మారింది. నీరు వచ్చి పోయేందుకు ఎలాంటి మదుములు లేకపోవడంతో చుట్టుపక్కల నుంచి వచ్చే మురుగంతా ఇందులో చేరి దుర్వాసన, దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ చెరువును కప్పేసి పంచాయతీ ఆదాయ వనరుగా ఉపయోగించుకుంటే మేలని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈవో భాస్కరరావు మాట్లాడుతూ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, హిరమండలం

ఈనాడు పల్నాడు
సోమవారం జులై 21, 2025
5

ఆస్తి పన్ను ఎందుకు తగ్గింది?

పునఃపరిశీలనకు ప్రత్యేక బృందాలు

వినుకొండ, న్యూస్‌టుడే

వినుకొండ మక్కెనగర్‌లో పర్యటిస్తున్న పరిశీలనాధికారి అబ్దుల్ జబ్బార్

విలువ ఆధారిత ఆస్తి పన్ను విధానం అమల్లోకి వచ్చిన తర్వాత 2022తో పోలిస్తే 50 శాతం పన్ను తగ్గిన అసెస్‌మెంట్లను పురపాలక శాఖ పునఃపరిశీలన చేయిస్తోంది. ఇందుకు ఇతర మున్సిపాలిటీల అధికారులను నియమించింది. జిల్లాలో ఆరు మున్సిపాలిటీలు, రెండు నగర పంచాయతీల్లో ఆస్తి బిల్టప్ ప్రాంతం, వినియోగంలో మార్పు లేకున్నా.. పన్ను తగ్గినట్లు గుర్తించిన 364 అసెస్‌మెంట్లను నిశితంగా తనిఖీ చేస్తున్నారు. కేసుల వారీగా వివరణాత్మక నివేదికలు అందజేయాలని డీఎంఏ కార్యాలయం పరిశీలనాధికారులను ఆదేశించింది.

రాష్ట్రవ్యాప్తంగా.. వినుకొండ ఆకులవారి వీధిలో ఓ ఇంటికి 2022-23లో రూ.1137 ఆస్తి పన్ను విధించారు. ఆ తర్వాత అన్నదమ్ముల పంపకంతో ఆ ఇంటికి పన్ను 50 శాతం తగ్గింది. ఇక్కడ రెండు అసెస్‌మెంట్లుగా చేసినా సాంకేతికంగా తగ్గించారా, మరే మైనా కారణాలున్నాయా అనే అంశాలు పరిశీలిస్తున్నారు. ఇలాంటి వాటిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర వ్యాప్త తనిఖీలు చేపట్టారు. ఇతర పట్టణాల నుంచి వచ్చిన అధికారులు ఆయా పురపాలక సంఘాల రెవెన్యూ సిబ్బందిని వెంటబెట్టుకుని కొలతలు తీసి లెక్కలు కడుతున్నారు.

నివేదిక ఆధారంగా చర్యలు.. 'మున్సిపల్ డీఎంఏ ఆదేశాల మేరకు వారు నుంచి పంపిన అసెస్‌మెంట్లను తనిఖీ చేస్తున్నారు. ఎక్కువగా భాగ పంపిణీలు, భవనాల తొలగింపులే కనిపిస్తున్నాయి. ఇవి కాకుండా ఇతరత్రా ఉన్నా వాటిని గుర్తించి విచారణాధికారులు నివేదిక పంపిస్తారు. తదనుగుణంగా చర్యలు తీసుకుంటారు' అని వినుకొండ మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, నరసరావుపేట మున్సిపల్ రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పురపాలక సంఘం	తనిఖీ చేసే అసెస్‌మెంట్లు	తగ్గిన పన్ను రూపాయల్లో
సత్తెనపల్లి	38	23,42,852
నరసరావుపేట	81	6,93,774
చిలకలూరిపేట	52	3,82,576
మాచర్ల	41	2,86,053
పిడుగురాళ్ల	113	1,55,812
వినుకొండ	26	7,180
దాచేపల్లి	12	7,180
గురజాల	1	1,144

అమృత్ 2.0 టెండర్ల గడువు పొడిగింపు

ఆగస్టు 7 వరకు దాఖలుకు అవకాశం

ఈనాడు, అమరావతి: అమృత్ 2.0 టెండర్ల గడువును అధికారులు పొడిగించారు. ఆగస్టు 7వ తేదీ వరకు దాఖలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. వాస్తవానికి అమృత్ 2.0 పనులకు సంబంధించి అధికారులు గత నెల 27న టెండర్లు పిలవడం తెలిసిందే. తాడేపల్లిలోని ఈఎన్సీ కార్యాలయంలో ఐదు సర్కిళ్లలోని ప్రజారోగ్య శాఖ ఎస్ఈలతో ఈఎన్సీ సమావేశం నిర్వహించి టెండర్లు పిలవడంపై నిర్ణయం తీసుకున్నారు. అలా ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పరిధిలో 86 పనులకు సంబంధించి రూ.1,092.60 కోట్లతో టెండర్లు పిలవగా, గుత్తేదారులు ఆన్‌లైన్ బిడ్ దాఖలు చేయడానికి జులై 28వ తేదీ వరకు తొలుత గడువు విధించారు. అయితే, టెండరుదారుల నుంచి గడువు పొడిగించాలని అభ్యర్థనలు రావడంతో ఆ మేరకు వచ్చేనెల 7వ తేదీ వరకు పొడిగిస్తూ ఉన్నతస్థాయి నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు గుంటూరు ప్రజారోగ్య పురపాలన సాంకేతిక శాఖ విభాగం ఎస్ఈ శ్రీనివాస్ 'ఈనాడు'కు తెలిపారు.

రిజిస్ట్రేషన్ సేవలపై సర్కారు కన్ను

అవినీతిపై ఐవీఆర్ఎస్‌తో ఆరా

ప్రజలతో నిత్యసంబంధాలు కొనసాగించే కీలక ప్రభుత్వ శాఖల్లో అవినీతిని అరికట్టడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. రెవెన్యూ శాఖలో వీఆర్వోలు, సర్వేయర్ల చేతివాటాన్ని కొన్ని నెలల కిందట ఐవీఆర్ఎస్ ద్వారా గుర్తించి ప్రజల్ని పీడిస్తున్న వారిపై చర్యలు తీసుకుంది. అదే విధంగా ప్రస్తుతం రిజిస్ట్రేషన్ శాఖలో సేవలపరంగా చోటు చేసుకుంటున్న అవినీతిపై దృష్టి పెట్టింది. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వివిధ సేవల కోసం వచ్చి వెళ్లే వారిని రాష్ట్ర కార్యాలయ ఉద్యోగులు పలకరిస్తున్నారు. ఏ సేవకు ఎంత లంచమిచ్చారు, ఏయే సేవలెలా అందుకున్నారని ఆరా తీస్తున్నారు.

నరసరావుపేట, న్యూస్‌టుడే

సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

జిల్లాలో అమరావతి, చిలకలూరిపేట, గురజాల, క్రోసూరు, మాచర్ల, పిడుగురాళ్ల, పెదకూరపాడు, సత్తెనపల్లి, వినుకొండ, నరసరావుపేటలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటి పరిధిలో గత ఏడాది 1,06,498 దస్తావేజులు నమోదయ్యాయి. ప్రభుత్వ ఖజానాకు రూ.372.65 కోట్ల ఆదాయం వచ్చింది. రిజిస్ట్రేషన్ సేవల్ని సులభతరం చేసేందుకు ఏప్రిల్ చివరివారం నుంచి స్లాట్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ముందుగా స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయానికొస్తే 20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. అయితే కొందరు సిబ్బంది ఉద్దేశపూర్వకంగా గంట, గంటన్నర వ్యవధి తీసుకుని ప్రజల్ని ఇబ్బంది పెడుతున్నారు.

పక్కదారి పట్టించే ప్రయత్నాలు.. ఐవీఆర్ఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ శాఖ సేవలపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. భూములు, స్థలాల క్రయవిక్రయదారులతో పాటు వివిధ సేవలకు కార్యాలయానికి వచ్చిన వారి చరవాణి నంబర్లకు ఫోన్ చేసి.. మీ వద్ద డాక్యుమెంట్ ఫీజు కాకుండా అధికంగా నగదు వసూలు చేశారా అని ఆరా తీస్తున్నారు. మొదట్లో నేరుగా ప్రజలే ఐవీఆర్ఎస్‌లో సమాధానాలు ఇచ్చేవారు. కాగా, కొందరు ఉద్యోగులు తమ అవినీతి బయటపడుతుందని డాక్యుమెంట్లలో భూములు, స్థలాల క్రయవిక్రయదారుల నంబర్లు కాకుండా డాక్యుమెంట్ రైటర్లు, వారి సహాయకుల నంబర్లు నమోదు చేయిస్తున్నారు. వివరాలు అడగ్గానే అంతా బాగుందని సమాధానమిస్తూ.. ప్రజాభిప్రాయ సేకరణను కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారు.

ఒక్కో పనికి ఒక రేటు

కొందరు ఉద్యోగులు ఒక్కో పనికి ఒక రేటు పెట్టి వసూలు చేస్తున్నారు. కొన్ని కార్యాలయాలకు వెళ్లడానికి దస్తావేజు లేఖరులు కూడా భయపడే పరిస్థితి నెలకొంది. మధ్యవర్తులుగా పని చేయిస్తే కొంత నగదు వస్తుందనుకుంటే.. దాన్నీ లాక్కునేలా కొందరు ఉద్యోగుల తీరు ఉంటోందని చెబుతున్నారు. లంచం ఎందుకు ఇవ్వాలని ఎవరైనా ప్రశ్నిస్తే వారిని మినహాయిస్తున్నారు. వసూళ్లపై కొందరు బాధితులు ఫిర్యాదులు కూడా చేస్తున్నారు. ఐవీఆర్ఎస్ ద్వారా గుర్తించిన అవినీతి, సేవల్లో లోపాలకు సంబంధించి బాధ్యులపై ఉన్నత స్థాయి నుంచి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని పర్యవేక్షక అధికారులు తెలిపారు.

కనులపండువగా ఆడికృత్తిక మహోత్సవం

స్వామి ఊరేగింపు

పట్టణంలోని సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆడికృత్తిక మహోత్సవం (ఆషాఢ కృత్తిక) ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామిని అలంకరించి పల్లకీలో ఊరేగించారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు భక్తులు కావడి తీసుకెళ్లారు. ఆలయంలో పూజారులు శ్రీవల్లీ గణపతి, సుబ్రహ్మణ్య, కృత్తిక నక్షత్ర, సర్పసూక్త హోమాలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, పిడుగురాళ్ల

ఉపాధ్యాయుల ఖాళీల భర్తీకి చర్యలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల తర్వాత ఖాళీ అయిన పోస్టులు భర్తీ చేసేందుకు విద్యా శాఖాధికారులు చర్యలు చేపట్టారు. పాఠశాలలకు నిర్దేశించిన ఉపాధ్యాయుల పోస్టుల్లో 425 ఖాళీలను గుర్తించారు. ఆయా పాఠశాలల్లో విద్యా బోధనకు ఆటంకం లేకుండా చూడాలని ప్రభుత్వమిచ్చిన ఆదేశాలతో ఎంటీఎస్ ఉపాధ్యాయులతో వాటిని పూరించేందుకు కసరత్తు చేశారు. ఆగస్టు 20లోగా డీఎస్సీ-2025 ద్వారా నియామకాలు చేపడుతున్నట్లు సీఎం ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో అప్పటివరకు ఎంటీఎస్ ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో విద్యా వాలంటీర్లను నియమించారు.

88 పోస్టులు.. జిల్లాలో 56 పోస్టులను మినిమం టైమ్ స్కేల్ అందుకుంటున్న ఉపాధ్యాయులతో పూరించారు. దుర్గి మండలంలో 12, బొల్లాపల్లి 13, వెల్దుర్తి 19, నూజెండ్ల 7, వినుకొండ 2, రెంటచింతల, కారంపూడి, ఈపూరులో ఒక్కొక్కరు చొప్పున ఎంటీఎస్ ఉపాధ్యాయులను కేటాయిస్తూ గుంటూరు జిల్లా డీఈవో రేణుక ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే అదనంగా సంస్థ మరో 32 మందికి శిక్షణ ఇచ్చి విద్యా వాలంటీర్లుగా నియమించింది. వారిలో వెల్దుర్తికి 15 మందిని నియమించారు. మిగిలిన వారిని అవసరమైన చోటకు పంపారు.

బోధనకు ఆటంకం లేకుండా.. 'జిల్లాలో విద్యా బోధనకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నాం. ప్రతి పాఠశాలలో 50 శాతం ఉపాధ్యాయులు ఉన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో అన్ని చోట్ల ఉపాధ్యాయులను నియమించాం. ఇంకా మిగిలిన ఖాళీలను డీఎస్సీ ద్వారా వచ్చే ఉపాధ్యాయులతో భర్తీ చేస్తాం' అని డీఈవో చంద్రకళ తెలిపారు.

కరుణించిన వరుణుడు

అన్నదాత ఆనందం

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో రెండ్రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జూన్‌లో పడిన వానలకు వేసిన వివిధ రకాల పైర్లు ఎదుగుదల వర్షాభావం కారణంగా ఆగిపోయింది. ఎండలకు తోడు ఈదురుగాలులతో భూముల్లోని తేమ ఆవిరవుతూ పైర్లు ఎండుముఖం పట్టడంతో రైతులు నిరాశ చెందారు. వరుణుడు కరుణించి శనివారం నుంచి వర్షాలు కురుస్తుండటంతో మెట్ట పైర్లకు జీవం వచ్చింది. రొంపిచర్లలో ఆదివారం మధ్యాహ్నం వరకు సూర్యుడు భగభగలాడాడు. తర్వాత కారుమబ్బులు కమ్మి భారీ వర్షం పడటంతో వాణిజ్య పంటలు సాగు చేసిన రైతుల ఆశ చిగురించింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచింది.

వర్షం కురవడంతో కళకళలాడుతున్న మినుప పైరు

నరసరావుపేటలో 41.8 మి.మీ. వర్షం.. జిల్లాలోని పలుచోట్ల శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు వర్షం కురిసింది. అత్యధికంగా నరసరావుపేటలో 41.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. దుర్గి 2.8, గురజాల 14.2, దాచేపల్లి 5.0, కారంపూడి 26.4, బొల్లాపల్లి 1.2, వినుకొండ 7.6, నూజండ్ల 5.6, ఈపూరు 6.2, రొంపిచర్ల 7.4, ముప్పాళ్ల 8.4, నాదెండ్ల 35.6, చిలకలూరిపేట 8.2, యడ్లపాడు 14.2 మి.మీ. వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ తెలిపింది.

వాళ్ల కొర్రీలు.. వీళ్లకు వర్రీలు..!

* గుంటూరు జిల్లా ఆడిట్ అధికారుల వింత పోకడ
* జడ్పీ, పీఆర్ విశ్రాంత ఉద్యోగుల పీఎఫ్‌లో తంతు

ఈనాడు, అమరావతి

వాళ్లు కొర్రీలు వేస్తున్నారు.. వీళ్లు వర్రీ కావాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నారు.. మొత్తంగా గుంటూరు జిల్లాలో ఆడిట్ అధికారుల తీరు కారణంగా జిల్లా పరిషత్తు, పంచాయతీరాజ్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగులు మదనపడుతున్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న ఉపాధ్యాయులు అనారోగ్య కారణాలపై రుణాల కోసం ప్రతిపాదిస్తే.. నిబంధనలో లేని అంశాలను ప్రస్తావిస్తూ, ప్రతిపాదనలు వెనక్కి తిప్పి పంపడం మరో సమస్యగా తయారైంది. లోతుగా చూస్తే.. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్తు పరిధిలో ఇటీవల 55 మంది విశ్రాంత ఉపాధ్యాయుల పీఎఫ్‌కు సంబంధించి ఆడిట్ అధికారులు ఓ తిరస్కరణ లేఖను జడ్పీ ఉన్నతాధికారులకు పంపారు. అందులో సహేతుకం కాని కొన్ని అంశాలను పేర్కొన్నారు.

అన్నింటా అలా అంటే ఎలా?.. ప్రధానంగా సదరు ఉపాధ్యాయులకు సంబంధించి ఓ నెలలో వారి చందా సున్నా అంటే, తర్వాతి నెలలో ఎక్కువగా చందా నిల్వ చేశారన్నది సారాంశం. సున్నాగా ఉండటానికి గల కారణాలు స్పష్టంగా తెలపలేదన్నది ఆడిట్ వర్గాలు పేర్కొన్న అభ్యంతరం. సాధారణంగా జీతాల జమ ఒక్కో సందర్భంలో ఆ నెలకు జమ చేయకపోవడం.. మరో నెలలో రెండు చందాలు కలిపి జమచేయడం పరిపాటి. దీన్నే ప్రధాన కారణంగా చూపిస్తూ ఆడిట్ అధికారులు కొర్రీలు వేయడంతో సదరు విశ్రాంత ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. అకౌంట్ స్లిప్ అన్నింటిపైనా ప్రదీకరణ ఎందుకు చేయలేదన్నదీ మరో ప్రశ్న. ఇలా అన్నింటికీ కొర్రీలు వేస్తుండటంతో ఏం చేయాలో వారికి అర్థం కావడం లేదు. జడ్పీ అధికారులు ఈ విషయంలో మిన్నకుండిపోవడం మరో సమస్యగా తయారైంది. ఉద్యోగ విరమణ అనంతరం వచ్చే ప్రయోజనాలు సరిగా అందక ఇబ్బంది పడుతున్న తమను.. ఆడిట్ అధికారుల వైఖరి మరింత ఇబ్బంది పెడుతోందని వాపోతున్నారు.

వైద్య ధ్రువపత్రాల్లోనూ అంతే

ప్రస్తుత జడ్పీ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి కొందరు అనారోగ్య కారణాలతో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడ పీఎఫ్ అధికారులు ఆడిట్ తరహాలో కొర్రీలు వేస్తుండటం మరో సమస్యగా మారింది. నిబంధనలు ఏ మెడికల్ ప్రాక్టీషనర్‌తో అయినా ధ్రువపత్రం తెచ్చుకోవచ్చని చెబుతుండగా.. సదరు అధికారులు మాత్రం ఎక్కడా లేని విధంగా సివిల్ సర్జన్, అసిస్టెంట్ సివిల్ సర్జన్ నుంచే వైద్య ధ్రువీకరణపత్రం ఉండాలని చెబుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇలా ఓవైపు వృద్ధులు, మరోవైపు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారిని అవస్థలకు గురిచేయడం సరికాదని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె.బసవలింగారావు, మక్కెన శ్రీనివాసరావు, కొడాలి శ్రీధర్ తదితరులు పేర్కొంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

నీరుకొండ

గిరులకు విరుల సిరులు

రాజధాని ప్రాంతంలోని కొండలపై అటవీశాఖ దృష్టి

ఈనాడు, అమరావతి

గిరులకు విరుల సిరులు కల్పించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. రాజధాని ప్రాంతంలోని కొండలపై పూల మొక్కలు పెంచే దిశగా అటవీ శాఖ కసరత్తు చేస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఏడాది కాలంగా తిరిగి ఊపందుకోవడం, ఎక్కడికక్కడ భవన నిర్మాణాలతో సందడిగా మారడం తెలిసిందే. ఈ క్రమంలో అన్ని శాఖలు ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి పెట్టాయి. అలా అటవీశాఖ అధికారులు కూడా తమ వంతుగా ఇక్కడ పచ్చదనం పెంచడంపై కసరత్తు చేస్తున్నారు. అలా సమీపంలోని అనంతవరం కొండ, నీరుకొండ, ఉండవల్లి కొండలపై మొక్కల పెంపకానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

పచ్చదనం.. పూల సోయగాలు పంచేలా.. ఒకటి అటవీ, రెండు రెవెన్యూ శాఖల పరిధిలో ఉన్న ఈ మూడు కొండలపై ఎక్కువగా పూల మొక్కలు నాటాలన్నది అటవీశాఖ ఆలోచన. సుమారు 20 రకాల జాతుల మొక్కలు నాటడం ద్వారా ఈ ప్రాంతంలో పచ్చదనం, పూల సోయగాలను పెంచాలని యోచిస్తున్నారు. ఇందుకోసం సంబంధిత శాఖలన్నింటితో కలిపి సంయుక్తంగా ఓ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం మొదలవడం.. ఎక్కడికక్కడ విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాలు ముమ్మరమైన క్రమంలో అటవీశాఖ వర్గాలు కూడా తమ ప్రయత్నాన్ని త్వరితగతిన పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయమై గుంటూరు కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ కాశీవిశ్వనాథరాజుతో 'ఈనాడు' మాట్లాడగా.. రాజధాని పరిధిలోని కొండలపై పూల మొక్కలు పెంచే అంశంపై కసరత్తు చేస్తున్నామని వివరించారు.

కాగితాల్లోనే.. డిజిటల్ గ్రంథాలయం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

ముప్పాళ్లలో డిజిటల్ గ్రంథాలయ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం

కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తే విజ్ఞానం, వికాసం

వర్క్‌ఫ్రం హోం ఉద్యోగులు పెరగడం, అంతర్జాల అవసరాలు అంతకంతకు పెరుగుతుండటం, కొత్త విషయాల్ని తెలుసుకునేందుకు యువత, విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్న తరుణంలో డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని వైకాపా ప్రభుత్వం ఆలోచన చేసింది. ఆశయం ఘనంగా ఉన్నా ఆచరణలో ఘోరంగా వైఫల్యం చెందింది. డిజిటల్ గ్రంథాలయాల నిర్మాణాల్ని కాగితాలకే పరిమితం చేసింది.

జిల్లాకు 134.. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పల్నాడు ప్రాంతానికి మొదట 41 గ్రంథాలయాలే మంజూరవగా పూర్వ కలెక్టర్ శివశంకర్ చొరవ తీసుకుని వాటిని 134కి పెంచారు. గ్రామాల్లో మహిళా స్వయం సహాయక బృందాల సమాఖ్య భవనాల పేరిట డిజిటల్ గ్రంథాలయాలు నిర్మించేలా మార్గదర్శకాలు జారీ చేశారు. ఉపాధి హామీ పథకం కింద ఒక్కో గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.16 లక్షలు కేటాయించారు. నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిన నేపథ్యంలో 2024లో అదనంగా మరో రూ.2 లక్షల వరకు మంజూరు చేశారు.

❖ సత్తెనపల్లి మండలంలో 25 పంచాయతీలుంటే ఆరుచోట్ల డిజిటల్ గ్రంథాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అయినా ఇప్పటివరకు పనులు మొదలవలేదు. ముప్పాళ్ల మండలంలో 14 పంచాయతీలుండగా ఆరుచోట్ల గ్రంథాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ముప్పాళ్ల, చాగంటివారిపాలెం, దమ్మాలపాడు, తొండపి, నార్నెపాడు, మాదలలో వీటిని నిర్మించాల్సి ఉండగా ఒక్కచోటా పనులు చేపట్టలేదు. అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి ఉంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డిజిటల్ గ్రంథాలయాల నిర్మాణ అంశం పక్కకు వెళ్లింది. ప్రాధాన్యాంశాల్లో లేకపోవడంతో కేటాయించిన నిధులు దస్త్రాల్లోనే ఉన్నాయి. ప్రభుత్వం దృష్టి సారించి డిజిటల్ గ్రంథాలయాల నిర్మాణాలు చేపడితే అవి నేటి, రాబోయే తరాలకు ఎంతో ఉపయుక్తంగా ఉండే అవకాశముంది.

సమన్వయ లోపం.. గ్రంథాలయ భవనాల నిర్మాణానికి మూడుసెంట్ల స్థలం అవసరం. రెవెన్యూ శాఖ స్థల సేకరణ ప్రక్రియ చేపట్టాలి. ప్రభుత్వ భూములు అందుబాటులో లేకుంటే దాతల సహాయం తీసుకోవాలి. స్థలాలు అందుబాటులో ఉన్నచోట శాశ్వత భవనాల నిర్మాణాల్ని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం చేపట్టాలి. ఇంజినీర్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) క్షేత్రస్థాయి సిబ్బంది, రెవెన్యూ శాఖ అధికారుల సహకారం తీసుకోవాలి. పీఆర్, రెవెన్యూ, డ్వామా శాఖల మధ్య సమన్వయ లోపంతో స్థలాల సేకరణ పూర్తవలేదు.

యాంటీబయోటిక్స్ వినియోగంపై నియంత్రణ చర్యలు

గుంటూరు, న్యూస్‌టుడే: అన్ని రంగాల్లో యాంటీబయోటిక్స్ వినియోగంపై నియంత్రణ చర్యలు చేపట్టేందుకు త్వరలోనే రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందులో ఐఎంఏ సభ్యులకూ భాగస్వామ్యం ఉంటుందన్నారు. యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్)ను కట్టడి చేయకపోతే 2050 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఏటా నాలుగు కోట్ల మరణాలు సంభవిస్తాయని కొన్ని అధ్యయనాలు హెచ్చరిస్తుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు.

జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు

ఐఎంఏ, క్లినికల్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ సొసైటీ (సిడ్స్) సంయుక్తంగా గుంటూరు వైద్య కళాశాలలో ఆదివారం యాంటీ మైక్రోబియల్ నిరోధకతపై ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సదస్సును మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు నందకిశోర్ మాట్లాడుతూ యాంటిబయోటిక్స్‌ను విచ్చలవిడిగా వినియోగించే విపరీత ధోరణుల వల్లే ఏఎంఆర్ వేగం పుంజుకుంటోందన్నారు. రాష్ట్ర వైద్య మండలి ఛైర్మన్ శ్రీహరిరావు, సిడ్స్ రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌కు 67,488 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం రాత్రి 9 గంటలకు 567.00 అడుగులకు పెరిగింది. ఇది 249.0470 టీఎంసీలకు సమానం. ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 21,440, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 1800 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 67,488 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

లక్ష్యానికి దూరంగా పీహెచ్‌సీలు

17 కేంద్రాల్లో ఒక్క ప్రసవమూ జరగలేదు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే

జిల్లాలో గ్రామీణులకు వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది సేవలు ఆశించిన మేర ఉండటం లేదు. ప్రతి కేంద్రంలో తప్పనిసరిగా పది కాన్పులు చేయాలన్నది లక్ష్యం. జిల్లాలో 39 పీహెచ్‌సీలు ఉంటే.. జూన్ నెలకు సంబంధించి రెండే లక్ష్యాన్ని చేరుకున్నాయి. మొత్తం 390 కాన్పులు జరగాల్సి ఉండగా 140 మాత్రమే చేశారు. మాచవరం పీహెచ్‌సీలో పది కంటే ఎక్కువ సహజ కాన్పులు చేశారు. మాచవరంలో 30, అచ్చంపేటలో 13 ప్రసవాలు చేసి లక్ష్యాన్ని చేరుకున్నారు. శిరిగిరిపాడులో 8, క్రోసూరులో 6 చేయగా.. 17 పీహెచ్‌సీల్లో ఒక్కటీ చేయలేదు. ఈ అంశాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఇటీవల సమీక్ష చేసి.. లక్ష్యాల మేరకు కాన్పులు చేయని వైద్యులకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు.

మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అక్కడ ఉన్నదేంటి.. ఇక్కడ లేనిదేంటి? ప్రభుత్వం జిల్లాలోని అన్ని ప్రాథమిక కేంద్రాల్లో వైద్యులు, సిబ్బందిని నియమించింది. మాచవరం పీహెచ్‌సీ సిబ్బంది నెలకు గరిష్ఠంగా 30 కాన్పులు చేస్తున్నారు. గ్రామీణులకు వైద్య సేవలందించే అంశంలో ఈ పీహెచ్‌సీ రాష్ట్రంలో ద్వితీయ, జిల్లాలో ప్రథమస్థానంలో ఉంది. జిల్లాలో మిగిలినచోట్ల అవే వసతులు.. అదే విద్యార్హతలున్న వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది ఉన్నారు. అయితే ప్రజల్లో విశ్వాసం కల్పించడంలో విఫలమవుతున్నారు. మొదటి కాన్పు అయితే నేరుగా పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ లేదా ప్రైవేటు వైద్యశాలల్లో చేరుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

మెమోలు జారీ చేశాం.. 'ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీహెచ్‌సీల్లో కనీసం పది కాన్పులు చేయాలి. జిల్లాలో లక్ష్యాన్ని చేరని వైద్యులకు మెమోలు జారీ చేశాం. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించాం. ప్రజలు కూడా ప్రభుత్వ వైద్యశాలల్లో సేవలను సద్వినియోగం చేసుకునే విషయమై ఆలోచించాలి' అని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి అన్నారు.

వేతన సవరణ కమిషన్ ఏర్పాటుకు వినతి

మాట్లాడుతున్న ఎస్టీయూ నేత జోసెఫ్ సుధీర్‌బాబు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉపాధ్యాయ, ఉద్యోగుల వేతనాల సవరణకు సంబంధించిన 12వ కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు అన్నారు. జిల్లా ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేతన సవరణ గడువు 2023 జులైతో ముగిసిందని తెలిపారు. అలాగే 11 వేతన సవరణ కమిషన్‌కు సంబంధించిన బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. కరవు భత్యం బకాయిలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర పేరుతో బోధనేతర కార్యక్రమాలతో విద్యాబోధన కుంటుపడుతుందని ఆవేదన వెలిబుచ్చారు. విద్యాశక్తి పేరుతో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎల్వీ రామిరెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సుభాని, జిల్లా కమిటీ నేతలు పాల్గొన్నారు.

కోరిక తీరిస్తే.. కోరిన పని చేస్తా!

మహిళపై వీఆర్వో వేధింపులు

బెల్లంకొండ, న్యూస్‌టుడే: రెవెన్యూశాఖలో కొందరు ఉద్యోగుల తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. తాజాగా ఓ వీఆర్వో మహిళను వేధింపులకు గురిచేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఎస్సై ప్రవీణ్ వివరాల మేరకు.. పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలానికి చెందిన ఓ మహిళ రేషన్ కార్డు, ఆధార్‌లో మార్పుల కోసం సచివాలయానికి వెళ్లింది. వీఆర్వో వెంకయ్యతో మాట్లాడితే సమస్య పరిష్కరిస్తారని అక్కడి సిబ్బంది చెప్పారు. దీంతో ఆమె నెల రోజుల నుంచి వీఆర్వోతో మాట్లాడుతూ రేషన్ కార్డు, ఆధార్‌లో మార్పులు చేయించాలని, అందుకు సంబంధించిన దరఖాస్తుపై సంతకం చేయాలని కోరుతూ వస్తోంది. ఈక్రమంలోనే వీఆర్వో తన కోరిక తీరిస్తే మీ పని చక్కబెడతానంటూ వేధింపులకు గురి చేశాడు. వారం రోజుల కిందట వీఆర్వో ఆమెకు ఫోన్ చేసి తన గదికి రావాలని, భోజనం కూడా తెప్పిస్తానంటూ లోబరచుకునే ప్రయత్నం చేశాడు. వీఆర్వో మాటలను సెల్‌ఫోన్‌లో రికార్డు చేసిన ఆమె ఆ వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేయగా విషయం వెలుగు చూసింది. ఈ ఘటనపై విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గతంలోనూ ఆరోపణలు.. వెబ్‌ల్యాండ్‌లో పేర్లు నమోదు చేయాలంటే రూ.30 వేలు ఇవ్వాలని, ఆ సొమ్ము కంప్యూటర్ ఆపరేటర్, ఉన్నతాధికారులకు చెల్లించాలంటూ రైతుల నుంచి వసూళ్లు చేస్తున్నట్లు వీఆర్వోపై ఆరోపణలు ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వంలో బెల్లంకొండ వీఆర్వోగా విధులు నిర్వహిస్తూ అన్నీతానై రెవెన్యూ కార్యాలయాన్ని నడిపించాడు. అడంగల్, వన్‌బీలకు రూ.5 వేల చొప్పున వసూలు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేశాడని పలువురు చెబుతున్నారు.

జాతీయ రహదారి వెంబడి చెట్ల నరికివేత

గుట్టగా వేసిన మొద్దులు

శావల్యాపురం, న్యూస్‌టుడే: చెట్లు పెంచండి.. పర్యావరణాన్ని కాపాడండి అంటూ ప్రభుత్వం ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుంటే.. మరో వైపు కొందరు వాటిని యథేచ్ఛగా నేలకూల్చుతున్నారు. ఇటీవల శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామంలో విద్యుత్తు సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. దానికి శావల్యాపురం స్టేషన్ నుంచి ప్రత్యేకంగా విద్యుత్తు లైన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి వెంబడి ఉన్న చెట్లను నరికేశారు. విద్యుత్తు లైన్ ఏర్పాటు చేసే గుత్తేదారుడు ఇష్టానుసారంగా చెట్లను నరికి ఆ కొమ్మలను విక్రయించారు. విషయం తెలిసి జాతీయ రహదారి అధికారులు తమ సిబ్బందిని సంఘటనాస్థలానికి పంపి చెట్ల నరికివేత నిలుపుదల చేయించి, ట్రాక్టరుపై ఉన్న మొద్దులను అక్కడే వేయించారు.

ఉపాధ్యాయుడికి సాహిత్య పురస్కారం

కరీముల్లాను సన్మానిస్తున్న గజల్ శ్రీనివాస్ తదితరులు

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన కవి, ఉపాధ్యాయుడు కరీముల్లా తిరుపతి వేంకట కవులు సాహిత్య పురస్కారం అందుకున్నారు. భారతీయ సాహిత్య సేవాసమితి ఆధ్వర్యంలో హిందూపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గజల్ శ్రీనివాస్ ఆయనను సత్కరించి పురస్కారం అందించారు. ఆయన రాసిన అబాబీలు నూతన వచన కవితా ప్రక్రియ అనేక మందికి మార్గదర్శకం అయిందని పలువురు వక్తలు ప్రశంసించారు. ఉమర్ ఫారూఖ్‌ఖాన్ నిర్వహించిన ఈ సభలో పలువురు పాల్గొన్నారని పురస్కార గ్రహీత తెలిపారు.

విజ్ఞానజ్యోతితో నవోదయం

11, 12 తరగతుల్లో ఐఐటీ, నీట్ శిక్షణ

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

అది కార్పొరేట్ విద్యా సంస్థ కాదు.. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 6 నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన చేస్తున్న చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని జవహర్ నవోదయ విద్యాలయ. ఇక్కడ చదువుతున్న విద్యార్థులు 12వ తరగతితో పాటు నీట్, జేఈఈ అడ్వాన్స్డ్, మెయిన్స్‌లో సీట్లు సాధిస్తూ అబ్బురపరుస్తున్నారు. పదో తరగతి, 12వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించడంతో పాటు విద్యాలయలో విజ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా అందిస్తున్న ఐఐటీ, నీట్ శిక్షణను అందిపుచ్చుకుని విజయ తీరాలు చేరుకుంటున్నారు. గతేడాది ఆరుగురు, ఈ ఏడాది ముగ్గురు నీట్‌లో సీట్లు సాధించగా, నలుగురు ఐఐటీలో చోటు దక్కించుకున్నారు. కార్పొరేట్ సంస్థల్లో ఇంటర్‌తో పాటు నీట్, ఐఐటీ శిక్షణకు రూ.5లక్షలకు పైగా వెచ్చించాల్సి ఉంటుంది. అయినా వేలమందిలో కొద్దిమందికి మాత్రమే సీట్లు వస్తుంటాయి. కానీ జవహర్ నవోదయలో ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతూ ఉన్నత స్థానానికి చేరేలా కృషి చేస్తోంది. ఈ ఏడాది సీట్లు సాధించిన పలువురు విద్యార్థుల మనోభావాలు ఇలా...

కంప్యూటర్ శిక్షణలో విద్యార్థులు

ఆహ్లాదకర వాతావరణం

నాపేరు నాగిరెడ్డి. 12వ తరగతి వరకు ఇక్కడే చదివాను. ఎన్ఐటీ కాలికట్‌లో కంప్యూటర్ సైన్స్‌లో సీటు సాధించాను. రూ.లక్షల్లో వ్యయం అయ్యే విద్యను నవోదయలో ఉచితంగా అందించడంతోనే ఇది సాధ్యమైంది. అధ్యాపకులు చెప్పే అంశాలు శ్రద్ధగా విని అర్థం చేసుకుని ప్రణాళిక ప్రకారం చదువుకుంటే కచ్చితంగా సీటు సాధించగలం. నవోదయలో ఆహ్లాదకర వాతావరణం, విశాలమైన తరగతి గదులు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ ప్రశాంతంగా చదువుకునేందుకు దోహదపడతాయి. మా లాంటి పేద విద్యార్థులకు నవోదయ విద్యాలయ ఓ వరం.

ప్రణాళికతో ముందుకు సాగితే..

నా పేరు వర్షవర్ధిని. 6 నుంచి 12వ తరగతి వరకు నవోదయ విద్యాలయలో చదువుకున్నాను. ఈ ఏడాది నీట్‌లో 6910 ర్యాంక్ సాధించాను. ప్రిన్సిపల్, అధ్యాపకుల సహకారంలో ప్రణాళికతో చదువుకోవడం ద్వారా ఇది సాధ్యమైంది. విద్యాలయలో గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌ను ఉపయోగించుకోవడం ద్వారా ఎప్పటికప్పుడు అదనపు సమాచారం తెలుసుకుని పోటీలో రాణించేలా కృషి చేశాను.

నమూనా పరీక్షలతో మేలు

నా పేరు భవాని నాయక్. 12వ తరగతి వరకు నవోదయ విద్యాలయలో చదువుకున్నాను. బట్టీ లేకుండా ప్రతి సబ్జెక్టును లోతుగా అర్థమయ్యేలా అధ్యాపకులు బోధించారు. శ్రద్ధగా వినడంతో పాటు నోట్స్ తయారు చేసుకుని ఏరోజుకారోజు చదువుకోవడం, ప్రతిరోజు నమూనా పరీక్షలను రాయడం ద్వారా ఐఐటీ ఖరగ్‌పూర్‌లో సీటు సాధించాను. నవోదయలో చదువుకోవడం అదృష్టంగా భావిస్తాను. అవకాశాలను ప్రతి విద్యార్థి అందిపుచ్చుకోవాలి.

'నేను నాతరం' పుస్తకావిష్కరణ

నరసరావుపేట అర్బన్: పట్టణానికి చెందిన విద్యావేత్త, విశ్రాంత అధ్యాపకుడు లంకా సత్యనారాయణ రచించిన 'నేను నాతరం' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. శ్రీవాసవి ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వక్తలు పుస్తకంలో సత్యనారాయణ ప్రస్తావించిన అంశాలను వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి గ్రామాల స్థితిగతులు, వ్యవసాయం, విద్యకు అవకాశాల లేమి తదితర అంశాలు కళ్లకు కట్టినట్లు చూపారని తెలిపారు. కార్యక్రమంలో ఇ.ఎం. స్వామి, చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, వేదాంతం సత్యశ్రీనివాసఅయ్యంగార్, శ్రీనాథ సాహితీ పరిషత్తు కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు

వినుకొండ రూరల్: వినుకొండలో ఎలాంటి మసాజ్ కేంద్రాలు లేవని, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని వినుకొండ పట్టణ ఇన్‌ఛార్జి సీఐ సుభాషిణి హెచ్చరించారు. వినుకొండలో మసాజ్ కేంద్రాలు, బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున ప్రచారం చేయడంతో అనుమానిత కేంద్రాల్లో ఆదివారం తనిఖీలు చేపట్టామని ఆమె తెలిపారు. ఆయా కేంద్రాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు సాగడం లేదన్నారు. అలాంటి సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో ఎస్సై స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

రంగయ్య ఛారిటబుల్ ట్రస్టు సేవలు విస్తృతం చేస్తాం

ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కూటమి పార్టీల నాయకులు, అధికారులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తేనే పిల్లలు ప్రయోజకులు అవుతారనే అపోహను తల్లిదండ్రులు వీడాలని, ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో తన తండ్రి కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో చదివిన చాలామంది శాస్త్రవేత్తలుగా, సీఈవోలుగా, వివిధ రంగాల నిపుణులుగా ప్రపంచం గర్వించేస్థాయికి చేరారన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థుల చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఉండకూడదనే ఆలోచనతో రంగయ్య ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఏటా ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు చెప్పారు. 2013 నుంచి విద్య, వైద్యం, తాగునీటి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ట్రస్టు సేవల్ని విస్తృతం చేస్తామన్నారు. 84 మంది పది, ఇంటర్ విద్యార్థులకు రూ.11.15 లక్షలు ఉపకార వేతనాలుగా అందజేశారు. తొలుత రంగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. మాజీ మేయర్ కన్నా నాగరాజు, ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, విశ్రాంత అధ్యాపకుడు సుబ్రమణ్యం, కూటమి పార్టీల నాయకులు రామస్వామి, వెంకటేశ్‌యాదవ్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, భవన్నారాయణ, నరసయ్య, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

శంకరమంచి సేవలు మరువలేం

అర్చకులను సత్కరిస్తున్న వేదపండితులు

అమరావతి: వెనుకటి తరాలను గుర్తుంచుకుని, గౌరవించినప్పుడే సమాజంలో సముచిత స్థానం కల్పించినట్లవుతుందని దేవాదాయశాఖ ఆర్జేసీ ఆజాద్ అన్నారు. ఆదివారం అమరేశ్వరస్వామి ఆలయంలో మాజీ ప్రధాన అర్చకులు శంకరమంచి బాలగోపాలశాస్త్రి శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన తదితర పూజలు చేశారు. పంచారామాల్లో పని చేస్తున్న అర్చకులను సన్మానించారు. ధర్మప్రచార కర్త రాధా మనోహర్‌దాస్, ముప్పవరపు సింహాచలశాస్త్రి, జంధ్యాల రామలింగేశ్వరశాస్త్రి, పీసపాటి నాగేశ్వరశర్మ, దేవస్థానం ఈవో రేఖ తదితరులు మాట్లాడారు. శంకరమంచి సేవలు కొనియాడారు.

వాసవీ మాతకు.. మూడు తరాల ఆడపడచుల పూజలు

పుష్పాలంకృతులైన కన్యకా పరమేశ్వరి

పసుపు, కుంకుమ సారెతో ఆలయానికి వెళుతున్న మూడు తరాల మహిళలు

ఈపూరు, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా ఈపూరు మండలం ముప్పాళ్లలో ఆర్యవైశ్య సంఘీయులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మూడు తరాల ఆడపడచులు ఎక్కడెక్కడున్న వారు తరలి వచ్చి ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహిళలు కోలాటం ఆడుతూ ఊరేగింపుగా వెళ్లి శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి పసుపు, కుంకుమ సారె సమర్పించారు. ఈ సందర్భంగా కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి పుష్పయాగం, లలితా సహస్రనామం, భజన కార్యక్రమం, కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పార్వతీ, శ్రీచౌడేశ్వరీ అమ్మవారు, తిరుపతమ్మ తల్లి దేవతలకు పసుపు కుంకుమ సమర్పించారు.

శాకంబరిగా గంగా బాలత్రిపుర సుందరి

చిలకలూరిపేట కళామందిర్ సెంటర్ వద్ద ఉన్న శ్రీ గంగా బాలత్రిపుర సుందరి సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు ఆషాఢమాసం ఆదివారం దశమి సందర్భంగా శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాన్ని పలు రకాల కూరగాయలతో అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

యువకుడికి దేహశుద్ధి

మాదిపాడు(అచ్చంపేట): ఇళ్లలో చోరీకి పాల్పడిన యువకుడిని పట్టుకున్న గ్రామస్థులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మాదిపాడు గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్థుల వివరాల మేరకు గింజుపల్లితండాకు చెందిన నాగరాజు అనే యువకుడు మాదిపాడులోని శేషగిరి ఇంటి తాళాలు, బీరువాను పగులగొట్టి బంగారు ఆభరణాలు, కొంత నగదు దోచుకున్నాడు. ఆ తర్వాత ఎదురుగా ఉన్న పుల్లయ్య ఇంట్లో బీరువా లాకర్లు పగులగొట్టి రూ.8 వేలు చోరీ చేశాడు. గ్రామస్థులకు అనుమానం వచ్చి యువకుడిని పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిందితుడు కృష్ణానది పడవ రేవుకు వెళ్లే దారిలో శ్మశానం సమీపంలో ఆభరణాలు, నగదు గుంతలో పూడ్చి పెట్టాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు.

భార్యపై దాడి - కేసు నమోదు

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట): నరసరావుపేట ప్రకాష్‌నగర్‌కు చెందిన జార్జికి అతని మేనత్త కుమార్తె మేరీకుమారితో 2017లో ప్రేమ వివాహం జరిగింది. వివాహానంతరం కొంతకాలం హైదరాబాద్‌లో ఉన్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో దంపతుల మధ్య వివాదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో గత నెల 10న జార్జి కుటుంబ సభ్యులు మేరీకుమారి, ఆమె తల్లిపై దాడికి పాల్పడ్డారు. బాధితురాలు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అరుణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పాదచారికి గాయాలు

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట): పట్టణంలో నవోదయనగర్‌కు చెందిన నరసమ్మ పావులూరి సుబ్బారావు పాఠశాల ఎదుట రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. గాయాలైన ఆమెను స్థానికులు స్థానికంగా ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఒకటో పట్టణ ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

అంబటికి గ్రామీణ పోలీసుల నోటీసు

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: రెంటపాళ్లలో మాజీ సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో నిబంధనలు అతిక్రమించిన కేసులో మాజీ మంత్రి అంబటి రాంబాబుకు సత్తెనపల్లి గ్రామీణ పోలీసులు ఆదివారం నోటీసులు జారీ చేశారు. సోమవారం విచారణ నిమిత్తం స్టేషనుకు రావాలని పేర్కొన్నారు.

91.9FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

ఎవర్ని నరుకుతారో పేర్లు చెప్పే ధైర్యం ఉందా?

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

గుంటూరు, న్యూస్‌టుడే: 'అధికారంలోకి వస్తే నరుకుతాం.. సప్త సముద్రాల అవతల ఉన్నా తీసుకొస్తాం.. బట్టలూడదీయిస్తామంటున్నారు.. ధైర్యం ఉంటే ఎవర్ని నరుకుతారో పేర్లు చెప్పండి. చేతగాని మాటలొద్దు. పేర్ని నాని, వైకాపా నేతలు.. మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుంటే మంచిది'.. అని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హెచ్చరించారు. గుంటూరులోని క్యాంప్ కార్యాలయంలో యరపతినేని ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. 'తాడేపల్లి స్క్రిప్టు చదివినందుకు గత ఎన్నికల్లో ప్రజలు వైకాపాకు ప్రతిపక్ష హోదా లేకుండా చేసి మూలన కూర్చోబెట్టారు. తీరు మార్చుకోకపోతే సున్నాకు పరిమితం చేస్తారు. జగన్ హయాంలో అయిదేళ్లూ.. సాగునీటి కాల్వలకు మరమ్మతులు చేయలేదు. రైతులకు వ్యవసాయ పరికరాలు ఇవ్వలేదు. ఎన్ని హెక్టార్లలో ఏయే పంటలు పండుతాయో తెలియదు. కిలోకు, క్వింటాకు, టన్నుకు తేడా తెలియదు. గంజాయి సాగు తప్ప వ్యవసాయం తెలుసా? మద్యపాన నిషేధమని చెప్పి సొంత బ్రాండ్లతో పిచ్చి మందు అంటగట్టి అమాయకుల ప్రాణాలు బలిగొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. ఏడాదిలో ఒక్క గురజాల నియోజకవర్గంలోనే రూ.1,200 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాష్ట్రం అభివృద్ధి చెందడం ఇష్టం లేక వైకాపా నేతలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు. వారు రెచ్చగొట్టినా మేము రెచ్చిపోం. అలాగని నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం. జగన్ పాలనలో జరిగిన కుంభకోణాలన్నీ ఆధారాలతో సహా నిరూపించి ఊచలు లెక్కపెట్టిస్తాం'.. అని స్పష్టం చేశారు.

గాలివానకు కూలిన స్తంభాలు

లగడపాడు-గుజ్జర్లపూడి మార్గంలో నేలకొరిగిన స్తంభాలు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: గత మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. మండలంలోని జగనన్న కాలనీలతోపాటు, గృహాలు, వ్యవసాయానికి విద్యుత్తు సరఫరా చేసే స్తంభాలు పడిపోయాయి. లగడపాడు-గుజ్జర్లపూడి గ్రామాల మధ్య మూడు స్తంభాలు పొలాల్లో వాలిపోగా. . పెదకూరపాడు-లగడపాడు మధ్య మరో మూడు స్తంభాలు ఒరిగాయి. పెదకూరపాడు కచేరీ సెంటర్‌లో ఓ స్తంభం ఒరిగిపోవడంతో ఆదివారం రాత్రి రెండు గంటలపాటు విద్యుత్తు సరఫరా నిలిపివేశారు.

లారీ చెట్టుకు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రమాద దృశ్యం

కిష్టాపురం(శావల్యాపురం), న్యూస్‌టుడే : వేగంగా ప్రయాణిస్తున్న కూరగాయల లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి మార్గంలో కిష్టాపురం వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ప్రకాశం జిల్లా గిద్దలూరు నుంచి కూరగాయల లోడుతో చిలకలూరిపేట వస్తున్న లారీ కిష్టాపురం సమీపంలో అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఆ సమయంలో లారీలో ఇద్దరు మాత్రమే ఉన్నారు. ప్రమాద ధాటికి అందులో ఉన్న దమ్మవరపు శేఖర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. చుట్టుపక్కల వాహనాల్లో ప్రయాణికులు తాళ్ల సహాయంతో లారీని పక్కకు లాగి అతన్ని అతి కష్టం మీద బయటకు తీశారు. అతని రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, దమ్మవరపు బన్నీకి స్వల్ప గాయాలు కావడంతో శావల్యాపురం 108 వాహనంలో వినుకొండ ప్రభుత్వ సుప్రతికి తరలించారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు కొంతసేపు ఇబ్బంది తలెత్తింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం

వినుకొండ రూరల్: రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన నూజండ్ల రోడ్డులో డిగ్రీ కళాశాలకు వెళ్లే దారిలో రైల్వే కింది వంతెన వద్ద ఆదివారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ మండలం పిట్టంబండ గ్రామానికి చెందిన జక్కంపూడి రామారావు (29) వినుకొండలోని ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న సోదరుడు రాంప్రసాద్ వద్ద ఉంటున్నాడు. 2019 నుంచి మతిస్థిమితం లేని కారణంగా వైద్య సేవలు అందిస్తున్నామని, ఎప్పుడు పడితే అప్పుడు పిట్టంబండ, ఇతర చోట్లకు వెళ్తుంటాడని, ఆదివారం తెల్లవారుజామున బయటకు వెళ్లాడని మృతుడి సోదరుడు చెప్పాడన్నారు. 6 గంటల సమయంలో రైలు పట్టాలు దాటుతుండగా చీకటీగలపాలెం వైపు నుంచి వినుకొండ వెళ్తున్న రైలు ఢీకొన్నట్లు పేర్కొన్నారు. మృతుడు అవివాహితుడని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు

వినుకొండ రూరల్: వినుకొండ నవాబ్‌కుంటలో నివాసం ఉండే 62 ఏళ్ల దేవరాల నాగమ్మ కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం మధ్యాహ్నం నుంచి ఆమె అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో ఆమె కుమారుడు కొండరాజు పోలీసులను ఆశ్రయించారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, రిటైల్ ధర - 139, చికెన్ విత్‌స్కిన్ - 202, చికెన్ స్కిన్‌లెస్ - 229.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -112 రిటైల్ ధర 134 చికెన్ విత్ స్కిన్ - 194, చికెన్ స్కిన్‌లెస్ - 221.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 119, 127, 137 చికెన్ విత్ స్కిన్ - 226 చికెన్ స్కిన్‌లెస్ - 237.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 520 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

ద్విచక్ర వాహన చోదకుడి మృతి

దండు బుడే (పాత చిత్రం)

క్రోసూరు (అచ్చంపేట), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి అనంతవరం-దొడ్లేరు మధ్య జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. క్రోసూరు మండలం దొడ్లేరుకు చెందిన దండు బుడే (38) ఓ హోటల్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి పయనమయ్యాడు. మార్గమధ్యలో అనంతవరం-దొడ్లేరు మధ్య గేదెను ఢీకొని కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. అతడికి భార్య నాగుల్‌బీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవిబాబు తెలిపారు.

EENADU Classifieds

AGRI BUSINESS
గుంటూరు జిల్లా ... 98660 01222.

Wanted Maths, English, Hindi Bed experienced lady Teachers to teach high School. Call: 94918 98905. Between: 9:00 am to 5:00 pm.

Jayalakshmi Arena, Nexa Maruti authorised dealers Guntur, Ongole, Hiring relationship manager & senior relationship manager with automobile experience & freshers with Btech, MBA & any Degree qualification. Accountants with 3 years Exp. Interviews on dt: 21.22.23 Ph: 98661 79109, 91007 87082.

BUSINESS SERVICES

Wanted Milk Delivery boys 5am to 8am Salary 6000+Petrol 1500. Bike and Smart Phone must Raithanna Milk Dairy Guntur. 95502 35554.

MNC Company Opportunity Full Time/ Part Time; Qualification: Intermediate. Monthly Income: 30,000/- above. for Details Contact: Ph: 99595 78601.

Evargo ... 51068, 70756 33416.

PEOPLE CARE

OLD AGE HOME

JOBS

Wanted B-Pharmacy or D-Pharmacy Candidates to work in a Pharmacy in Guntur City. PCI Registration Mandatory. Contact: 63009 75241.

గమనిక

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

కళారంగానికి గుమ్మడి సేవలు అభినందనీయం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వృద్ధులతో పాటు కళాకారుల అభివృద్ధికి శ్రమిస్తున్న గుమ్మడి వెంకటేశ్వరరావు అభినందనీయుడని కౌన్సిలర్ షకీలా అన్నారు. వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమంలో రావిపాటి వీరయ్య అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కళాకారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ కార్యవర్గంలో ఉన్నందుకు గర్వపడుతున్నట్లు పేర్కొన్నారు. జవాను కంచర్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక చైతన్యం కోసమే కాకుండా వృద్ధులను కంటికి రెప్పలా చూసుకుంటూ నిరంతరం శ్రమిస్తున్నారని గుమ్మడి దంపతులను కొనియాడారు. కళాకారుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, యోహాను, ప్రసాద్, హనుమంతరావు, రాములు పాల్గొన్నారు.

మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం నేడు.. నూజండ్ల: నూజండ్ల మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈనెల 21న ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉమాదేవి తెలిపారు. తాగు నీరు, విద్యుత్తు సరఫరా వివిధ పథకాల నిర్వహణపై సమావేశంలో చర్చిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలో సాంబశివనగర్ ట్యాంకుల ఎదురు బజారు నుంచి టిడ్కో గృహాలకు వెళ్లే మూలమలుపు వద్ద వర్షం నీరు నిలబడి ఉంటోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. - **వెంకటేశ్వరరావు** ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి రోడ్డుపై నీరు నిలబడకుండా చర్యలు తీసుకుంటాం. - **రమణరావు, పారిశుద్ధ్య అధికారి** – న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

భారీ వర్షం.. రహదారులు జలమయం

చిలకలూరిపేట గ్రామీణ, నరసరావుపేట సెంట్రల్, ఈపూరు, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో ఆదివారం నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లోని మండలాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పొలాల్లో నీరు నిలిచింది. నెల రోజులుగా వరుణుడి రాకకు ఎదురు చూస్తున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిలకలూరిపేట సీఆర్‌కాలనీ ప్రాంతంలో దట్టంగా కమ్ముకున్న మేఘాలు చూపరులకు ఆహ్లాదం పంచాయి. పట్టణంలో ఆర్‌వీఎస్ రోడ్డు, యల్లయ్య హోటల్ బజారు, చలివేంద్రం వీధి, మార్కెట్ సెంటర్, కళామందిర్ సెంటర్‌వైపు రోడ్లన్నీ నీటితో నిండాయి. నరసరావుపేట మండలం అచ్చమ్మపాలెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణ చిన్నపాటి వర్షానికే చెరువును తలపించింది. సోమవారం పాఠశాలకు వచ్చే విద్యార్థులు బురదలోనే తరగతి గదుల్లోకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై ప్రధానోపాధ్యాయుడు జాలయ్యను అడగ్గా పాఠశాలలో వర్షపు నీరు నిలవకుండా మట్టి తోలిస్తామని తెలిపారు. ఈపూరు మండలం భద్రుపాలెం ఎస్సీ కాలనీలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. కాలనీవాసులు బయటకు వెళ్లాలంటే ఇబ్బందులు పడ్డారు.

ఈపూరు: భద్రుపాలెం ఎస్సీ కాలనీలో అంతర్గత రోడ్డు

చిలకలూరిపేట: యల్లయ్య హోటల్ వైపు వెళ్లే బజారులో నీటి ప్రవాహం

సొసైటీ ఛైర్‌పర్సన్ల బాధ్యతల స్వీకరణ

వినుకొండ రూరల్, శావల్యాపురం, న్యూస్‌టుడే : వినుకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్‌పర్సన్‌గా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, సభ్యులుగా విఠంరాజుపల్లికి చెందిన వజ్రాల కృష్ణారెడ్డి, వెంకుపాలెంకు చెందిన జనసేన నేత గణపా శ్రీను ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మండల తెదేపా, జనసేన నేతలు వారిని అభినందించారు. శావల్యాపురం సొసైటీ ఛైర్‌పర్సన్‌గా పోట్లూరు శివారు కిష్టాపురానికి చెందిన గడుపూడి విశ్వనాథం, సభ్యులుగా శావల్యాపురం జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు బండారు వీరాంజనేయులు, చినకంచర్లకు చెందిన గోనుగుంట్ల నాగరాజు బాధ్యతలు స్వీకరించారు.

గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : నాదెండ్ల మండలం గణపవరం సొసైటీ అధ్యక్షుడిగా నియమితులైన పెంటేల శేషయ్య ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనను అభినందించి సత్కరించారు.

ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారం

నూజండ్ల, న్యూస్‌టుడే : మండలంలో కొండలరాయునిపాలెం బీసీ కాలనీలో వర్షం, మురుగునీరు వెళ్లడానికి అవకాశం లేకపోవడంతో నెలల తరబడి కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు సమస్యను సర్పంచి, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. దీంతో నేరుగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ సమస్యలపై ఏకరవు పెట్టారు. స్పందించిన ఆయన మండల స్థాయి అధికారులు, కార్యదర్శితో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో సర్పంచి భిక్షాలు, కార్యదర్శి ప్రభాకర్ ఆదివారం పొక్లెయిన్ తెప్పించి కాలువ తీయించారు. కాలనీ వాసులు ఆనందం వెలిబుచ్చారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

బొందిలిపాలెం (శావల్యాపురం), వినుకొండ, వినుకొండ రూరల్, యడ్లపాడు, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. శావల్యాపురం మండలం బొందిలిపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా తెదేపా గ్రామ శాఖ అధ్యక్షుడు పాపసాని హనుమంతరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జోరు వానలోనూ గ్రామంలో ప్రధాన వీధి, ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు. అనంతరం శావల్యాపురం, కారుమంచి సొసైటీ ఛైర్మన్లుగా నియమితులైన గడుపూడి విశ్వనాథం, గోపాళం శివప్రసాద్‌ను సన్మానించారు. వినుకొండ ఒకటో వార్డులో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడారు. నాగులవరం ఎస్సీ కాలనీలో మాజీ మండల తెదేపా అధ్యక్షుడు మక్కెన కొండలు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. యడ్లపాడు మండలం జాలాది, సందెపూడి గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం పర్యటించారు. ఇళ్లు లేని పేదలకు 3 సెంట్లు స్థలం ఇస్తామన్నారు. జాలాదిలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన మెటల్ రోడ్డు, సందెపూడిలో రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు. కార్యక్రమంలో తెదేపా నేతలు నెల్లూరి సదాశివరావు, కామినేని సాయిబాబు, కందిమళ్ల రఘురామారావు, మద్దినేని సుబ్బారావు, పోపూరి వెంకయ్య పాల్గొన్నారు.



యడ్లపాడు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

శావల్యాపురం: కరపత్రాలు అందిస్తున్న చీఫ్ విప్ ఆంజనేయులు

రాచుమల్లునగర్ అభివృద్ధిపై దృష్టి పెట్టరూ!

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలో 17వ వార్డులోని రాచుమల్లునగర్‌లో సమస్యలు పరిష్కరించాలని లోక్‌సత్తా పార్టీ నాయకుడు మాదాసు భానుప్రసాద్, ఆ ప్రాంత వాసులు ఎమ్మెల్యే పుల్లారావును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రి పక్కన పడమర వైపు సీసీ రోడ్డు, మురుగు కాలువలు, విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. వీలైనంత త్వరలో అక్కడి సమస్యలన్నీ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ప్రత్తిపాటి వారికి తెలిపారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన వారిలో స్థానికులు రమేష్, ప్రసాద్, వెంకటేశ్వరరావు ఉన్నారు.

మహంకాళి ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలో ఇస్సపాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన మద్దూరి వెంకటేశ్వరరెడ్డి, పార్వతి రూ.5లక్షలు విరాళం ప్రకటించారు. ముందుగా రూ.4లక్షల చెక్కును ఈవో మాధవిదేవికి అందజేశారు. కార్యక్రమంలో దాత బంధువులు వజ్రాల కాంతికిరణ్, వెంకాయమ్మ, ఇషికారెడ్డి, మహిరా కిరణ్‌రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఈవోకు చెక్కు అందిస్తున్న దాతలు

ప్రజలకు అందుబాటులో ఉండాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ప్రజలకు నేతలు, కార్యకర్తలు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. తెదేపా పట్టణ కార్యవర్గ ప్రమాణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత తెదేపా కార్యాలయం నుంచి శివుని విగ్రహం కూడలి మీదుగా జమీందార్ ఫంక్షన్‌హాల్‌కు భారీ ప్రదర్శన నిర్వహించారు. తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా గట్టుపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా గూడూరి శేఖర్‌తో పాటు 14 మంది బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, మాజీ ఛైర్మన్ సుబ్బరాయగుప్తా, కపలవాయి విజయ్‌కుమార్, కొల్లి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ నేతలు

ఊడిజర్లను ముంచెత్తిన మురుగు

మండలంలోని ఊడిజర్లలో కల్వర్టులు, తూములు, కాలువలు పూడిపోవడంతో వర్షాల సమయంలో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారంతో కాలువలు నిండిపోయాయి. దీంతో ఆదివారం కురిసిన వర్షానికి మురుగునీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త రోడ్డుపైకి చేరింది. దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యపై పలుమార్లు అధికారులకు చెప్పినా పరిష్కారం కాలేదని స్థానికులు వాపోయారు. ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ నాగెండ్ల రత్నం దృష్టికి తీసుకెళ్లగా కల్వర్టులు, కాలువల్లో పూడిక తొలగించి మురుగునీరు దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. –న్యూస్‌టుడే, ఈపూరు

వివాహిత అనుమానాస్పద మృతి

మార్టూరు, న్యూస్‌టుడే : మండలంలోని బొబ్బేపల్లిలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు సీఐ ఎం.శేషగిరిరావు తెలిపారు. స్థానిక ముస్లిం కాలనీకి చెందిన పఠాన్ మీరాబి (25) మృతి చెందినట్లు సమాచారం అందగా మార్టూరు పోలీసులు వెళ్లి పరిశీలించారని చెప్పారు. నరసరావుపేట సమీపంలోని విప్పర్లకు చెందిన మీరాబీకి నాలుగు నెలల క్రితమే వివాహం అయిందని, భర్త కరీముల్లా పోలీసు అదుపులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

సత్తెనపల్లి

•సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

క్రీడాకారుడికి పురస్కారం

దుర్గి, న్యూస్‌టుడే: దుర్గికి చెందిన పారా క్రీడాకారుడు కందుకూరి శ్యామ్ పురస్కారం అందుకున్నారు. విశాఖలో ఎన్టీఆర్ ట్రస్టీ ఆధ్వర్యంలో తలసేమియా బాధితులకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నారా భువనేశ్వరి చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు శ్యామ్‌ను అభినందించారు.

నారా భువనేశ్వరి నుంచి పురస్కారం అందుకుంటున్న శ్యామ్

చదరంగంతో మేధాశక్తి

బహుమతులు అందుకున్న విజేతలు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: చదరంగం ద్వారా మేధాశక్తి పెరుగుతుందని ఎంఈవో సురేష్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ చదరంగ దినోత్సవం సందర్భంగా మాచర్లలోని కోదండ రామస్వామి ఆలయ ప్రాంగణంలో వాసవీ క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ సంజీవ్‌నాయక్, ద్వితీయ దీక్షిత్, తృతీయ బహుమతి మోజస్ అందుకున్నారు. కోచ్ కిరణ్, నరసింహారావు, మార్కొండారెడ్డి, దశరథన్, చెన్నకేశవ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? తండాలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గాలేక మురుగు నీరు ఇళ్ల ముందు చేరుతోంది. ఇబ్బందులు పడుతున్నాం. **- రాజు, సేవా నాయక్ తండా** ✔ రెండ్రోజుల్లో పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాలువల్లో పూడిక తీయిస్తాం. **- మకట్‌లాల్, ఈవోపీఆర్డీ**

? గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. **- శ్రీను, లోయపల్లి** ✔ వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. **- మాచర్లయ్య, కార్యదర్శి**

? గ్రామంలో వీధి కుక్కల సమస్య ఎక్కువగా ఉంది. చిన్నారులు, మహిళలపై దాడి చేస్తున్నాయి. **- ఉప్పలపాడు గ్రామస్థులు** ✔ త్వరలో సమస్య తీరుస్తాం. **- చంద్రయ్య, కార్యదర్శి** – న్యూస్‌టుడే, వెల్దుర్తి

? మాడుగుల అడ్డరోడ్డు వద్ద నుంచి జాతీయ రోడ్డు వరకు దారి గోతులమయంగా మారింది. ప్రయాణానికి ఇబ్బందిగా ఉంది. **- సుబ్బారావు, గురజాల** ✔ గోతులను పూడ్చేందుకు నిధుల కోసం ప్రభుత్వాన్ని కోరాం. వీలైనంత త్వరగా గోతులను పూడ్చుతాం. **- యూసుఫ్, ఏఈ** – న్యూస్‌టుడే, గురజాల

? జంగమహేశ్వరపాడు గ్రామంలో మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో దోమలు వృద్ధి చెంది ఇబ్బందులు పడుతున్నాం. **- గ్రామస్థులు** ✔ ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకెళ్లా. త్వరలో పూడిక తొలగించేందుకు కృషి చేస్తా. **- రత్నకుమారి, కార్యదర్శి** ? కంచరగుంట ఎస్సీకాలనీల్లో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో విష పురుగులు సంచరిస్తున్నాయి. **- కాలనీ వాసి** ✔ సిబ్బందిని పంపి వీధి దీపాలు వెలిగించేలా చూస్తాం. **- సత్యప్రసాద్, ఈవోపీఆర్డీ** – న్యూస్‌టుడే, దుర్గి

? నడికుడి రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. వేగంగా వచ్చే వాహనాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- సైదావలి, స్థానికుడు** ✔ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన స్పీడ్ బ్రేకర్లు వేయించి వేగాన్ని నియంత్రించేలా చర్యలు తీసుకుంటాం. **- సుబ్బారావు, ఏఈ** – న్యూస్‌టుడే, దాచేపల్లి

నిర్మించారు సరే.. ప్రారంభించేదెప్పుడో?

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే

గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యనందించాలన్న లక్ష్యంతో 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే కారంపూడిలో అన్ని సదుపాయాలతో భవనం నిర్మించేందుకు రూ.6 కోట్ల నిధులు మంజూరు చేసింది. నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. విద్యార్థులు మాత్రం ఇరుకు గదుల్లోనే చదువు, వసతి పొందుతూ ఇబ్బందులు పడుతున్నారు.

బాలుర వసతి గృహంలోనే నిర్వహణ

2016 నుంచి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను ఎస్టీ బాలుర వసతి గృహంలో నిర్వహిస్తున్నారు. 5 నుంచి 10వ తరగతి వరకు 141 మంది పిల్లలు ఉన్నారు. 8 గదులు ఉన్నాయి. వాటిల్లోనే సామగ్రి పెట్టుకుని, అక్కడే చదువుతూ.. రాత్రి వేళ అక్కడే నిద్రిస్తున్నారు.

ఇరుకు గదుల్లోనే చదువు, వసతి

పూర్తయిన భవనాలు

నాగార్జునసాగర్ కుడికాలువ పక్కన 5 ఎకరాల సువిశాల ప్రాంతంలో 4 బ్లాకులుగా తరగతుల నిర్వహణకు 12 గదులతో ఒక బ్లాకు, విద్యార్థుల వసతికి మరో బ్లాకు, భోజనం వండేందుకు, తినేందుకు ఇంకో బ్లాకు, మరుగుదొడ్లు, మూత్రశాలలకు ప్రత్యేక బ్లాకులను నిర్మించారు. భవన నిర్మాణాలు గత ఏప్రిల్ నాటికే పూర్తయినా అందుబాటులోకి తేలేదు. మరోవైపు ప్రహరీ, క్రీడా ప్రాంగణం లేదు. కారంపూడి-వినుకొండ రహదారికి కిలోమీటరు దూరంలో భవనం ఉంది. అక్కడికి రహదారి సైతం సక్రమంగా లేదు.

త్వరలో ప్రారంభిస్తాం

– జ్యోత్స్న, డీటీడబ్ల్యూవో

కారంపూడిలో నూతన గిరిజన గురుకుల పాఠశాల, వసతి గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలో ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రహరీ, ఉపాధ్యాయుల క్వార్టర్స్ నిర్మాణానికి ప్రస్తుతం నిధులు లేవు. రహదారిని ఉపాధి పథకం నిధులతో చేపట్టాలని ప్రతిపాదనలు పంపాం.

ఐదు గదులు.. ఎనిమిది సెక్షన్లు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని లెనిన్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాలను 2017లో జడ్పీ ఉన్నత పాఠశాలగా పదోన్నతి కల్పించారు. ఆతర్వాత నాడు-నేడు కార్యక్రమం ద్వారా 14 గదులతో భవన నిర్మాణానికి రూ.3.20 కోట్ల నిధులు మంజూరు చేశారు. నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో ఇప్పటికీ 60 శాతం పనులే జరిగాయి. ప్రస్తుతం పాఠశాలలో 320 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఇక్కడ అయిదు తరగతులు.. ఎనిమిది సెక్షన్లు ఉన్నాయి. అయిదు గదులే ఉండటంతో వాటిల్లో ఐదు సెక్షన్లు, మిగిలిన మూడు సెక్షన్ల తరగతులు వరండాల్లో నిర్వహించాల్సి వస్తోంది. పిల్లలు ఇరుకిరుకుగా కూర్చొని, అసౌకర్యాల నడుమ చదువుతున్నారు. మరోవైపు నీటి సమస్య వెంటాడుతోంది. విద్యాశాఖ అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తి చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వరండాలో చదువు

వైద్య శిబిరానికి స్పందన

సత్తెనపల్లి గ్రామీణ: మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో ఆదివారం జరిగిన ఉచిత మెగా వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. కాటూరి మెడికల్ కళాశాల వైద్యులు సుమారు 340 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కొఠారి సత్యనారాయణ పలువురికి ఈసీజీ తీశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోమటినేని శ్రీనివాసరావు, దరువూరి నాగేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరావు, ఫౌండేషన్ ప్రతినిధులు మాగులూరి కృష్ణారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ కార్యదర్శిగా మునగోటి

పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శిగా మునగోటి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అమరావతిలో జరిగిన మహాసభల్లో ఆయనను మూడో పర్యాయం సీపీఐ కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ తెలిపారు. సీపీఐ కౌన్సిల్ సభ్యులుగా 41, కమిటీ సభ్యులుగా 11మందిని నియమిస్తూ మహాసభలో తీర్మానం చేసినట్లు తెలిపారు.

ముప్పాళ్లలో ప్రధాన రహదారిపై వర్షపు నీరు

భారీ వర్షం

సత్తెనపల్లి, ముప్పాళ్ల: బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఆదివారం సత్తెనపల్లి, ముప్పాళ్ల మండలాల్లో వర్షం దంచికొట్టింది. భారీ వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. నిన్నటివరకు వేడిగా ఉన్న వాతావరణం చల్లబడింది. ఈ వర్షాలు పంటల సాగుకు మేలు చేస్తాయని అన్నదాతలు చెబుతున్నారు.

కూటమితో సుపరిపాలన

పెదకూరపాడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. బుచ్చయపాలెంలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఏడాది పాలనలో నియోజకవర్గంలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. గ్రామస్థుడు తెదేపా నేత పరుచూరి నాని సొంత నిధులతో ఏర్పాటు చేసిన 63కేవీ నియంత్రికలు, విద్యుత్తు స్తంభాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. నేతలు వెన్నా సాంబశివారెడ్డి, ఏటుకూరి బ్రహ్మయ్య, రత్న, గల్లా బాబు, గంగాధర్, అప్పారావు, చంద్రం, సర్పంచి పద్మజ పాల్గొన్నారు.

పెదపాలెం (అచ్చంపేట), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ద్వారానే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని తెదేపా జిల్లా కార్యవర్గ సభ్యుడు పాటిబండ్ల బాపిరాజు తెలిపారు. ఆదివారం పెదపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి గురించి వివరించారు. తెదేపా నేతలు ఆశీర్వాదం, సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, చిన్నవెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బోనాలు సమర్పించి.. మొక్కులు చెల్లించి

పిడుగురాళ్లలో..

రెంటచింతలలో చౌడేశ్వరి మాత

అమరావతి: శాకంబరిగా..

గురజాల: బోనాలతో మహిళలు

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా గురజాలలోని కనకదుర్గమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని భవానీనగర్‌లో కనకదుర్గమ్మ తల్లికి ఆషాఢమాసం సందర్భంగా భక్తులు బోనాలు సమర్పించారు. మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి పూజలు చేసి, బోనాలు సమర్పించారు.

రెంటచింతల: రెంటచింతల చౌడేశ్వరి మాత ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవం నిర్వహించారు. అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. బ్రహ్మయ్య బావి కూడలిలోని బొడ్రాయికి బోనాలు సమర్పించి వేడుక జరిపారు.

అమరావతి, న్యూస్‌టుడే: అమరావతిలో కొలువైన పెద్దింటమ్మ అమ్మవారికి ఆషాఢమాసం సందర్భంగా మహిళలు బోనాలు సమర్పించారు. ఉదయం ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు.

నిదానంపాడులో పల్లకిసేవ

దుర్గి: పల్నాట ప్రసిద్ధి చెందిన శ్రీనిదానంపాటి అమ్మవారి పల్లకి సేవ ఆదివారం ఘనంగా నిర్వహించారు. శనివారం నుంచే ఉమ్మడి తెలుగురాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి సన్నిధికి తరలివచ్చారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, ఈవో కాకర్ల ఆదిశేషనాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నలుగురు నిందితుల అరెస్టు

ముప్పాళ్ల: దమ్మాలపాడులో రూ.30 వేలు అప్పు ఉన్నాడని, స్థలం వివాదం ఉందని ఆ గ్రామానికి చెందిన రవిని చెట్టుకు, సిమెంట్ దిమ్మెకు కట్టేసి కొట్టిన కేసులో నిందితులను అరెస్టు చేసి ఆదివారం సత్తెనపల్లి కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. తనపై దాడి చేయడమే కాకుండా బహిరంగంగా అవమానించారని రవి చేసిన ఫిర్యాదు మేరకు నాగేంద్రబాబు, ఆర్ఎంపీ వీరాంజనేయులు, గోపి, మదార్‌వలిపై కేసు నమోదు చేసినట్లు వారు చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామివారి దేవస్థానము
దేవరంపాడు గ్రామము, రాజుపాలెం మండలం, పల్నాడు జిల్లా - 522411
Email: eodevarampadugroup@gmail.com

కొటేషన్ ప్రకటన

పల్నాడు జిల్లా, రాజుపాలెం మండలం, దేవరంపాడు కొండపైన వేంచేసియున్న శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామివారి దేవస్థానములో భక్తుల సౌకర్యార్థము కొరకు, రెండు బాత్‌రూమ్స్ ఫ్లోరింగ్, టైల్స్, డోరు, ఆర్.ఒ.ఆర్ ప్లాంటు రేకులు షెడ్డు ఏర్పాటు, రేకుల షెడ్డు 4 అడుగులు కంకరతో మెరక తేపడం, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు, త్రాగునీరు పైపులైను దేవస్థానంలో వేయడం, మంగలి షెడ్డు దగ్గర స్నానపు పైపు లైను ఏర్పాటు కోసం, దేవస్థాన కార్యాలయము దగ్గర రేకుల షెడ్డు ఏర్పాటు మొదలగువాటి కోసం, బ్రిక్స్ రాళ్ళు, ఇసుక, కంకర, సిమెంటు, జింక్ పైపు రేకులు, ఐరన్ మెషలు, వెల్డింగ్ వర్క్, టైల్స్, డోరు వైట్ సిమెంట్‌తో పని పూర్తి చేసి దేవస్థానం వారికి అప్పచెప్పేలాగ మెటీరియల్ మరియు లేబర్ కాంట్రాక్ట్ క్రింద (సివిల్ వర్క్స్) కొటేషన్స్ ది.21.07.2025 నుండి 23.07.2025లోపు ఆసక్తి గల వారు దేవస్థాన కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయమునకు సమర్పించవలసినదిగా కోరడమైనది.

శ్రీ స్వామి వారి సేవలో....
కార్యనిర్వహణాధికారి

గ్రానైట్ మాఫియాను అడ్డుకోవాలి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి గ్రానైట్ మాఫియాను అడ్డుకోవాలని వైకాపా రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి చింతలపూడి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పల్నాడు హాస్పిటల్స్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించి ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు చీమకుర్తి, మార్టూరు ప్రాంతాల నుంచి గ్రానైట్ లారీలు ఎలాంటి బిల్లులు లేకుండా పల్నాడు మీదుగా వెళుతున్నాయన్నారు. పొందుగుల చెక్‌పోస్టు దగ్గర శనివారం పలు లారీలను వాణిజ్య పన్నుల అధికారులు పట్టుకున్నట్లు గుర్తుచేశారు. గ్రానైట్ మాఫియాను అరికట్టకపోతే ప్రత్యక్షంగా పోరాటానికి సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు.

కరుణ చూపమ్మా.. రేణుకా అంకమ్మ

అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్, లావణ్య దంపతులు, తదితరులు

బుచ్చయపాలెం (పెదకూరపాడు), న్యూస్‌టుడే: మండల పరిధిలోని బుచ్చయపాలెంలో రేణుకా అంకమ్మ తల్లి జాతర ఆదివారం వైభవంగా సాగింది. తెదేపా నాయకులు పరుచూరి నాని ఆధ్వర్యంలో రుత్వికుల బృందం భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, లావణ్య దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వర్షాలు కురిసి, పాడిపంటలతో గ్రామాలు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేదలకు అండ ఎర్రజెండా

మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

అమరావతి, న్యూస్‌టుడే: పేదలకు అండగా ఎర్రజెండా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం అమరావతిలో పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ 16వ మహాసభ నిర్వహించారు. తొలుత ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ముప్పాళ్ల మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పుట్టుక, దాని ప్రాధాన్యత, విశిష్టత, బాధ్యతలను వివరించారు. స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమన్నారు. వైఎస్ జగన్ నియంతృత్వ పాలనతో రాజధాని అమరావతి అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, శ్రీనివాసరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

శేషగిరిరావుకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

నంబూరు సేవలు మరువలేం

రెంటచింతల, న్యూస్‌టుడే: తెదేపా అధికారంలో లేనప్పుడే ధైర్యంగా ప్రత్యర్థి పార్టీ నేతలపై పోరాడిన నంబూరు శేషగిరిరావు సేవలు మరువలేమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం పాలువాయిగేటులో నంబూరు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చరవాణి ద్వారా బాధితులను పరామర్శించారు. కుటుంబాన్ని అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: సమ్మెలో భాగంగా తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు ఆదివారం పురపాలక సంఘ కార్యాలయం వద్ద మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు నినాదాలు చేశారు.

పిడుగురాళ్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తొమ్మిదోరోజు ఆదివారం సమ్మె చేపట్టారు. జానపాడురోడ్డులో దీక్షా శిబిరంలో కార్మికులు ఒంటికాలిపై నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

భార్య చున్నీయే ఉరి తాడై

పెదనెమలిపురి(రాజుపాలెం): భార్య చున్నీనే ఉరితాడుగా చేసుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన పెదనెమలిపురిలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన నరసింహారావు(25)కు పొన్నూరుకు చెందిన ఏసురాణితో మూడేళ్ల కిందట వివాహం జరిగింది. కాగా మనస్పర్థలతో భార్య పదిహేను రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్య చున్నీతో ఉరేసుకున్నాడు. తల్లి వెంకటరమణ ఇంటికి వచ్చి చూడగా కుమారుడు దూలానికి వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. ఎస్సై వేణుగోపాల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త రిక్షాలకు తుప్పు

మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో చెత్తను తరలించే రిక్షాలు మూలనపడి తుప్పుపడుతున్నాయి. మూడేళ్ల కిందట వాటిని పంచాయతీ కార్మికులకు అందజేశారు. వినియోగించకుండా మూల పడేసినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ పాఠశాల, సచివాలయం వద్ద రిక్షాలను పడేశారు. అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దాచేపల్లి

చిల్లచెట్లు చీల్చేస్తున్నాయ్

పెదకూరపాడు-పాటిబండ్ల మార్గంలో చిల్ల చెట్లు రహదారి పైకి విస్తరించి ప్రమాదకరంగా మారాయి. ముళ్ల కొమ్మలు వాహన చోదకుల చర్మాన్ని చీల్చేస్తున్నాయి. మూల మలుపుల వద్ద మరింత ప్రమాదం పొంచి ఉంది. దగ్గరకు వచ్చే వరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చిల్లచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, పెదకూరపాడు**

వారి కష్టానికిదే సంకేతం

మన్యంలో సిగ్నళ్లు అందక ఇక్కట్లు

సాలూరు గ్రామీణం, కొమరాడ, న్యూస్‌టుడే: పోషకాహారం పంపిణీలో అక్రమాలు చోటు చేసుకోకుండా గర్భిణులు, బాలింతలకు ముఖ ఆధారిత హాజరు వేసి సరకులు పంపిణీ చేస్తున్నారు. అయితే గిరిశిఖర గ్రామాల్లో సంకేతాలు అందక అవస్థలు ఎదురవుతున్నాయి. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

గతంలో పోషకాహారం తీసుకునే వారి సంఖ్యను మాత్రమే యాప్‌లలో నమోదు చేసేవారు. కానీ కేంద్రం ప్రవేశపెట్టిన పోషణ ట్రాకర్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న బాల సంజీవని యాప్‌లలో ముఖ హాజరు తీసుకుంటున్నారు. దీంతో ఎంతమంది లబ్ధిదారులకు పథకాలు చేరుతున్నాయో ఇట్టే తెలుస్తోంది. ఒకప్పుడు లేనివారి పేర్లు రాసి పాలు, గుడ్లు, ఇతర సరకులను పక్కదారి పట్టించేవారు. ఇలాంటి సమస్యలకు స్వస్తి చెప్పేందుకు ఈ యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే నమోదులో భాగంగా సంకేతాల సమస్యలతో ఇబ్బందులు తప్పడం లేదు.

వీరంతా సాలూరు మండలంలోని ఎగువశెంబి, సమీప ప్రాంతాలకు చెందిన గర్భిణులు, బాలింతలు. సంకేతాలు అందక ఇలా కొండలపైకి వచ్చారు

ముందుగా రిజిస్ట్రేషన్..

ముఖ ఆధారిత హాజరు కావాలంటే ముందుగానే రిజిస్ట్రేషన్ చేయాలి. ఆధార్ నమోదుతో పాటు చరవాణి సంఖ్యను అనుసంధానిస్తారు. అంటే ప్రతి లబ్ధిదారు వద్ద ఆధార్‌తో లింకు అయిన చరవాణి ఉండాల్సిందే. దీంతోపాటు ఈకేవైసీ చేయాలి. నెలన్నర నుంచి ఈ ప్రక్రియ సాగుతోంది. మైదాన ప్రాంతాల్లో వేగంగా జరుగుతున్నా.. కొండలపై సంకేతాల సమస్య అడ్డంకిగా మారింది. దీనికి తోడు కొందరు సిబ్బందికి సాంకేతికతపై అవగాహన లేకపోవడంతో గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి.

15 రోజులకోసారి..

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి. గ్రామాల్లో డ్రాప్‌అవుట్స్‌గా ఉన్న కిశోర బాలికలు, ప్రీస్కూళ్లకు వెళ్లే 3 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారుల ఫొటోలను తీసి నమోదు చేస్తారు. అయితే పోషకాహారం ప్రతి 15 రోజులకు ఒకసారి అందిస్తున్న నేపథ్యంలో వారంతా ఆందోళన చెందుతున్నారు. ముఖ ఆధారిత హాజరు 92 శాతం, ఈకేవైసీ 84 శాతం పూర్తయ్యాయని, సంకేతాలు రాని ప్రాంతాల్లో కార్యకర్తలు సమన్వయం చేసుకొని పనిచేస్తున్నారని ఇన్‌ఛార్జి సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు.

సాలూరు ప్రాజెక్టు పరిధిలో ఇలా..	అంగన్‌వాడీ కేంద్రాలు: 276	గర్భిణులు, బాలింతలు: 1272 మంది	7 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు: 3,456 మంది

భోజనం చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

నాసిరకం భోజనంపై ఎమ్మెల్యే ఆగ్రహం

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం మండలంలోని జోగింపేట సాంఘిక సంక్షేమ శాఖ గురుకులంలో భోజనం నాసిరకంగా ఉండటంపై ఎమ్మెల్యే విజయచంద్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి గురుకులాన్ని ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అన్నం రుచిగా లేకపోవడం, పురుగులు ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి సందర్శిస్తానని, మార్పు రాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు విద్యార్థులకు వాలీబాల్ కిట్లు అందజేశారు. నాయకులు బి.లక్ష్మణరావు, అరవింద్, చిరంజీవి, సత్యనారాయణ ఉన్నారు.

ఉద్యాన రైతులకు ఊతం

సీతానగరం, న్యూస్‌టుడే: సన్న, చిన్నకారు రైతులను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. మూడేళ్ల కాలంలో పంట చేతికి వచ్చే మొక్కలను ఉచితంగా అందిస్తూ, వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటోంది. గుంతలు తవ్వడం, మొక్కల సరఫరా, నాటడం, రక్షణ కల్పించడం తదితర ఖర్చులకు నిధులు చెల్లిస్తోంది. ఇప్పటివరకు 4,500 ఎకరాల్లో తోటలు వేసింది.

పామాయిల్ మొక్కలు నాటుతున్న కూలీలు

పంపిణీ చేసిన మొక్కలివీ.. మామిడి, జీడిమామిడి, సీతాఫలం, సపోటా, నిమ్మ, దానిమ్మ, జామ, డ్రాగన్ ఫ్రూట్, పనస, కొబ్బరి, పామాయిల్.

మేలు ఇలా..

◆ పామాయిల్ మినహా(ప్రైవేటు కంపెనీలు అందిస్తాయి) మిగిలిన అన్ని మొక్కలనూ ఉపాధి పథకం నుంచి ఉచితంగా సరఫరా చేశారు. ◆ ఎకరాకు 70 చొప్పున అందించారు ◆ చెరువు గట్లపై నాటేందుకు 50 చొప్పున కొబ్బరి మొక్కలిచ్చారు ◆ నీరు పోసేందుకు ఏడాదికి రూ.6 వేల చొప్పున మూడేళ్లకు రూ.18 వేలు, సంరక్షణకు మరో రూ.44 వేలు అందిస్తున్నారు.

లక్ష్యాన్ని చేరుకున్నాం...: ఈ ఏడాది ఉద్యాన పంటల సాగు లక్ష్యాన్ని సకాలంలో చేరుకున్నాం. వర్షాకాలం ప్రారంభంలోనే 4,500 ఎకరాల్లో మొక్కలు నాటించాం. కొన్నిచోట్ల కొబ్బరి వేయాల్సి ఉంది. ఇప్పటివరకు 90,101 కొబ్బరి మొక్కలిచ్చాం. సంరక్షణ బాధ్యతలను మహిళా సంఘాల సభ్యులకు అప్పగించాం. గుంత తవ్వి, మొక్క నాటి, కంచె ఏర్పాటు చేసి, నీరు పోసి రక్షించేందుకు ఒక్కో మొక్కకూ రూ.1100 వరకు అందించాం. ఈ సారి ఎక్కువ విస్తీర్ణంలో నాటేందుకు ప్రణాళికలు వేశాం. **- రామచంద్రరావు, డ్వామా పీడీ**

వెళ్లే దారి లేదు.. అడిగే దిక్కు లేదు

పార్వతీపురం జిల్లా కేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ కూడలి సమీపంలోని గూడ్స్‌షెడ్ రోడ్డు మలుపు ప్రమాదకరంగా ఉంది. భారీ వాహనాల రాకపోకలతో పూర్తిగా పాడైంది. ఎక్కడికక్కడే భారీ గుంతలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాటిల్లో నీరు చేరి, ప్రమాదాలు జరుగుతున్నాయి. గూడ్స్‌షెడ్ వద్ద మలుపు ఉండడంతో వేగంగా వచ్చే వాహనాలు బోల్తా కొడుతున్నాయి. అధికారులు స్పందించి బాగు చేయాలని చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు. ఈ సమస్యపై ఆర్అండ్‌బీ డీఈఈ అప్పాజీని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పరిశీలించి, మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

పుట్టుకలో లాభాల లెక్కలు

ఆందోళనకరంగా సిజేరియన్లు

☛ విజయనగరానికి చెందిన 20 ఏళ్ల గర్భిణి ఆరంభం నుంచి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రసవానికి ఘోష ఆసుపత్రిలో చేరుతానని చెప్పగా ప్రైవేటు వైద్యులు వద్దన్నారు. ఉమ్మ నీరు తగ్గిందని, కాన్పు కష్టమని చెప్పారు. ఇంతవరకు సమస్యలు లేవన్నారు కదా అని గర్భిణి ప్రశ్నించగా.. తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. డబ్బులు ఖర్చైనా పర్వాలేదని కుటుంబ సభ్యులు అప్పు చేసి అక్కడే శస్త్రచికిత్స చేయించగా రూ.1.70 లక్షలు తీసుకున్నారు.

2024-25లో నమోదు ఇలా..

ఆసుపత్రి	ప్రసవాలు	సాధారణ	శస్త్రచికిత్సలు
ప్రభుత్వ	20,272	14,424	5,848
ప్రైవేటు	20,501	11,999	8,502

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

అత్యవసర పరిస్థితుల్లో తల్లీబిడ్డను కాపాడేందుకు సిజేరియన్లు చేయాలి. కానీ ఇప్పుడు కాన్పు అంటేనే కోత శరణ్యంగా మారింది. కొన్ని ప్రైవేటు ఆసుపత్రులకైతే ఇది ఆదాయ వనరుగా మారిపోయింది. వివిధ రకాల కారణాలతో శస్త్రచికిత్సలకు ఒప్పించి లాభాల లెక్కలేసుకుంటున్నారు. సాధారణ ప్రసవానికి రూ.30 వేల వరకు, శస్త్రచికిత్స అయితే రూ.50 నుంచి రూ.70 వేలకు పైబడి వసూలు చేస్తున్నారు. వివిధ రకాల పరీక్షలు, గది అద్దె, మందుల ఖర్చులు అదనం.

'ఉమ్మడి జిల్లాలో సిజేరియన్లు జరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే తాజా గణాంకాల ప్రకారం దేశంలో అత్యధికంగా శస్త్రచికిత్సలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఏపీ మూడో స్థానంలో ఉంది. ఉమ్మడి విజయనగరం జిల్లా 65.10 శాతంతో రాష్ట్రంలో అయిదో స్థానంలో ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు'.

రిఫరల్‌కే మొగ్గు..

రెండు జిల్లాల్లో 85 పీహెచ్‌సీలున్నాయి. ఒక్కో ఆసుపత్రిలో ఇద్దరు, ముగ్గురు చొప్పున వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, ఆరోగ్య సహాయకులు, ఆశాలు, 108, 104 సిబ్బంది ఉంటారు. ఇంతమంది ఉన్నప్పటికీ సాధారణ ప్రసవాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. చాలావరకు రిఫరల్‌కే మొగ్గు చూపుతున్నారు. గతేడాది విజయనగరం జిల్లాలోని పీహెచ్‌సీల్లో 776 సాధారణ ప్రసవాలే జరిగాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వోలు భాస్కరరావు, జీవనరాణి తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులపై నిఘా పెంచుతామన్నారు.

ఆరోగ్యానికి ప్రమాదకరం

రక్తస్రావం, ఇన్‌ఫెక్షన్లు, అలర్జీలు, శక్తి సన్నగిల్లడం, ఒక్కోసారి గర్భసంచి తీసేయాల్సిన పరిస్థితి రావొచ్చు. బిడ్డల్లో శ్వాసకోశ, స్థూలకాయత్వానికి ఆస్కారం ఉంటుంది. తల్లిని విపరీతమైన నడుమునొప్పి, ఆందోళన, కోపం వంటి దీర్ఘకాలిక సమస్యలు వెంటాడుతాయని ఘోషా ఆసుపత్రి వైద్యుడు రవిచంద్ర తెలిపారు.

నేడు పెదంకలాం నీరు విడుదల

బలిజిపేట, న్యూస్‌టుడే: బలిజిపేట, వంగర మండలాల్లో సాగుకు ప్రధాన నీటి వనరైన పెదంకలాం ప్రాజెక్టు నుంచి సోమవారం నీటిని విడుదల చేయనున్నట్లు తెదేపా అరకు పార్లమెంటరీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బి.రామ్మోహనరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే విజయచంద్ర ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టు నుంచి 8,250 ఎకరాలకు సాగునీరు వెళ్తుందన్నారు.

శ్రద్ధాంజలి

కీ॥శే॥ కలివరపు అప్పారావు గారు
రిటైర్డ్ హెడ్‌మాస్టర్, పార్వతీపురం
జననం: తే.13.09.1942, మరణం: 11.07.25

మంచితనానికి, మానవత్వానికి పెన్నిధిగా నిలిచి, సమాజంలో ఉపాధ్యాయునిగా మంచి పేరు ప్రతిష్టలు సంపాదించి, కుటుంబ అభివృద్ధికి అహర్నిశలూ శ్రమించి మా అందరి భవిష్యత్‌కూ బంగారు బాటలు వేసిన మీరు స్వర్గస్తులైనందుకు మిక్కిలి చింతిస్తూ... నిరంతరం మీ జ్ఞాపకాలను మా అందరి మనసులలో పదిలంగా నిలుపుకుంటూ మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో మీ కుటుంబ సభ్యులు.

భార్య: కీ॥శే॥ కలివరపు లక్ష్మీప్రభ

కుమారుడు - కోడలు - మనుమలు/మనుమరాండ్రు
కలివరపు అనీల్‌కుమార్ - శాంతిప్రియ - అభిరామ్, ఆదిత్యరామ్
కుమార్తెలు - అల్లుళ్లు
కలివరపు ప్రశాంతి - చిన్నారి కృష్ణమూర్తి - భార్గవ - స్వర్ణరామ, నిహాంత్‌సాయి, నిహితసాయి
రఘువంశీ- సంజన, షాన్వికసాయి
బోటు సుమలత - బోటు రత్నకుమార్ - మాణిక్యవీణ-హర్ష, ఐశ్వర్య
కలివరపు సునీత - గుడ్ల సురేష్ - సందీప్, సంజయ్

పెద్దకర్మ: తే. 21.07.2025ది, సోమవారం, వివేక్‌కాలనీ, రామాలయం ఎదురుగా, పార్వతీపురం

మహోన్నతమైన మహనీయునికి అశ్రుతాంజలి



జననం : 01-01-1942
మరణం : 12-07-2025

కీ॥శే॥ శంబంగి నాయనోరు కృష్ణమూర్తినాయుడు గారు
పక్కి గ్రామం, బొబ్బిలి మండలం

మంచితనానికి, మానవత్వానికి, ఆప్యాయత, ప్రేమానురాగాలకు ప్రతీకగా ఎంతోమంది పేదప్రజల కంటి వెలుగుగా వారి కంటి చూపు మెరుగుపరిచేందుకు ఆపరేషన్స్ చేసుకునేందుకు విశేష కృషిచేసి అనేక సామాజిక, రాజకీయ సేవలందించి అందరి హృదయాలలో సుస్థిరస్థానం సంపాదించుకున్న మీరు భౌతికంగా మా నుండి దూరమైనారన్న నిజం నమ్మలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : శంబంగి మహాలక్ష్మి

తమ్ముళ్లు : శంబంగి నాయనోరు సూరపునాయుడు
శంబంగి నాయనోరు శివున్నాయుడు

చెల్లెళ్లు : శ్రీమతి చింతల పార్వతి
శ్రీమతి గుల్లిపల్లి కళావతి

మరియు బంధుమిత్రులు

కుమారులు - కోడళ్లు - మనుమలు/మనుమరాండ్రు - మునిమనుమలు
కన్నంనాయుడు - కుమారి - నరేంద్ర-స్వప్న, భార్గవ్ - చి॥ దేవాన్ష్‌నాయుడు, తనిష్క
శ్రీరామమూర్తినాయుడు - సునీత - ప్రియాంక

కుమార్తె - అల్లుడు - మనుమలు
నడిమింటి అలివేలు - పరశురాంనాయుడు - ఈష్‌కుమార్, సంతోష్

పెద్దకర్మ : తే 21-07-2025 సోమవారం నాడు పక్కి గ్రామంలో మా స్వగృహము నందు జరుపబడును. సెల్ : 81061 51876, 77319 30270, 96669 82248

(c) eenadu

ఇక్కడ మోక్షం

మేఘాద్రి గెడ్డ వంతెనకు నిధులు మంజూరు

కొత్తవలస మండలం మంగళపాలేనికి సమీపంలోని మేఘాద్రి గెడ్డపై అసంపూర్తిగా ఉన్న వంతెన పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇక్కడి వారధిపై స్లాబ్ నిర్మించి సుమారు 1.4 కి.మీ. తారు రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నుంచి రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి. తెదేపా అధికారంలో ఉన్నప్పుడు వంతెనకు, బీటీ రోడ్డు నిర్మాణానికి అప్పట్లోనే రూ.కోటి మేర కేటాయించారు. వైకాపా అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత పనులు ప్రారంభమయ్యాయి. అనుసంధాన రహదారి, గెడ్డపై కాంక్రీట్ స్తంభాలు నిర్మించి వదిలేశారు. బిల్లులు అందక గుత్తేదారు పనులు ఆపేశారు. సుమారు రూ.70 లక్షల బిల్లు చెల్లించినా మిగతా పని పూర్తిచేయలేదు. ఈ పరిస్థితిపై 'ఈనాడు'లో వరుస కథనాలొచ్చాయి. దీని నిర్మాణం పూర్తయితే ఏడెనిమిది గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభమవుతాయి. గనిశెట్టిపాలేనికి సమీపంలో సబ్బవరం- కొత్తవలస- కె.కోటపాడు రోడ్డు నుంచి మంగళపాలెం మీదుగా కూడలిలో విశాఖపట్నం- అరకు జాతీయ రహదారిని చేరుకోడానికి ఈ వంతెన, రోడ్డు దోహదపడతాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే లలితకుమారి చొరవతో ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయి. వర్షాలు తగ్గితే పనులు చేయిస్తామని పంచాయతీరాజ్ డీఈ సీహెచ్.వి.స్వామి నాయుడు చెప్పారు. - న్యూస్‌టుడే, కొత్తవలస

అక్కడ దైన్యం

తాండ్రంగి గోస్తనీ నదిపై కానరాని కాజ్‌వే

జామి మండలంలో తాండ్రంగి- తానవరం గ్రామాల మధ్య గోస్తనీ నదిపై కాజ్‌వే నిర్మించాలని స్థానికులు ఏళ్లుగా కోరుతున్నారు. ఈ ప్రాంతంలో నిర్మిస్తే సమీప గ్రామాలకు ఎస్.కోట మండలం దగ్గరవుతుంది. ప్రస్తుతం నదికి వరద వస్తే తాండ్రంగి వాసులు ఎస్.కోట వెళ్లాలంటే జామి మీదుగా సుమారు ఎనిమిది కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. గంట్యాడ, గజపతినగరం, బొండపల్లి మండలాల ప్రజలు ఎస్.కోట వెళ్లడానికి ఇది దగ్గర దారి. ఇంత ప్రాధాన్యమున్న ఈ ప్రాంతంలో కాజ్‌వే నిర్మించడానికి గత వైకాపా ప్రభుత్వం ముందుకు రాలేదు. నిధులు మంజూరయ్యాయని ప్రతి గ్రామసభలో అప్పటి ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు ప్రకటించినా నిర్మాణం జరగలేదు. ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు కూడా పలు మార్లు దీని గురించి వినతిపత్రాలు ఇచ్చారు. ఇటీవల సుపరిపాలన పర్యటనలో, కలెక్టరు ఈ గ్రామం సందర్శించినప్పుడు విజ్ఞప్తి చేశారు. దీనిపై పంచాయతీరాజ్ డీఈ స్వామినాయుడు వద్ద ప్రస్తావించగా.. తాండ్రంగి గోస్తనీ నదిపై కాజ్‌వే నిర్మించాలన్న స్థానికుల విజ్ఞప్తిని జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. అంచనాలు తయారు చేశామని, నిధులు మంజూరైతే పనులు చేపడతామని తెలిపారు. - న్యూస్‌టుడే, జామి

తానవరం సమీపంలో కాజ్‌వే నిర్మించాల్సిన స్థలమిదే

కలెక్టర్ ఆదేశాలూ పట్టించుకోరా..?

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని స్వయానా కలెక్టర్ ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికి నిదర్శనమే సాలూరు పట్టణంలోని బీసీ బాలురు కళాశాల వసతి గృహం. ఇక్కడ పది మరుగుదొడ్లు ఉండగా ఒక్కటే వినియోగంలో ఉంది. మిగిలినవి పైపులు, తలుపులు పాడవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ సమస్యపై గతనెల 18న 'ఈనాడు'లో 'మన్నీలే తలుపులై.. కన్నీళ్లే తలపులై' శీర్షికతో వార్త ప్రచురితమైంది. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ స్పందించారు. వెంటనే బాగు చేయాలని ఆదేశించారు. ఎస్సీ బాలిక వసతి గృహంలో రూ.1.50 లక్షలతో బాగు చేశారు. బీసీ వసతి గృహంలో తలుపులు బిగించి వదిలేశారు. దీంతో విద్యార్థులకు ఆరుబయటకు వెళ్తున్నారు. ఒకే గుత్తేదారుకు అన్నిచోట్లా పనులు అప్పగించడంతో జాప్యం జరిగిందని, త్వరలో పనులు చేయిస్తామని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇ.అప్పన్న తెలిపారు. - న్యూస్‌టుడే, సాలూరు

వినియోగానికి దూరంగా మరుగుదొడ్లు.. (అంతరచిత్రం) లోపల దుస్థితి

భూతాన్ని తరుముదాం.. ఆరోగ్యం పంచుదాం

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, పాలకొండ, సాలూరు

కూరగాయలు కొనాలన్నా.. చేపలు, మాంసం తీసుకురావాలన్నా.. ఇంటి నుంచి బయటకు వెళ్లాలన్నా చేతిలో పాలిథిన్ సంచులు ఉండాల్సిందే. ఇంట్లో ఉన్న ఎన్నో వస్తువులు ప్లాస్టిక్‌వే. వీటి వినియోగంతో సర్వ రోగాలు వస్తాయని తెలిసినా వదులుకోలేని స్థితికి చేరుకున్నాం. దూరంగా ఉంచితేనే ఆరోగ్యం సొంతం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిషేధం విధించాలని సూచిస్తున్నారు.

జిల్లా కేంద్రంలో వదిలేశారు..

పార్వతీపురం పట్టణంలోని 30 వార్డుల్లో 2,061 దుకాణాలు ఉన్నాయి. ఇళ్లు, దుకాణాల నుంచి రోజుకు 21 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. 3 టన్నుల వరకు పాలిథిన్, టన్ను కవర్లు ఉంటాయి. గతంలో బెలగాంలోని అన్న క్యాంటీన్ స్థలంలో చెత్తను వేరు చేసి ప్లాస్టిక్‌ను ఇతర ప్రాంతాలకు రవాణా చేసేవారు. కొన్నాళ్లుగా ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో డబ్బాలు, సంచులే కనిపిస్తున్నాయి.

సాలూరులో రూ.70 వేల జరిమానా..

సాలూరు పట్టణంలోని 29 వార్డుల నుంచి రోజుకు 18.5 టన్నుల చెత్తను సిబ్బంది సేకరిస్తున్నారు. 500 కిలోల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటాయి. పట్టణంలో నిషేధం అమల్లో ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు దుకాణ దారులకు రూ.70 వేల వరకు అపరాధ రుసుము విధించారు. వ్యర్థాలను డంపింగ్‌యార్డుకు తీసుకెళ్లి బెయిలింగ్ చేసి విక్రయిస్తూ నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం సంపాదిస్తున్నారు.

వరహాలు గెడ్డ వద్ద సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు

పాలకొండలో రెండేళ్లే నిషేధం..

పాలకొండ పట్టణంలోని 20 వార్డుల నుంచి రోజుకు 13 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. 2, 3 టన్నుల వరకు పాలిథిన్ ఉంటుంది. ఇక్కడ 2019 నుంచి రెండేళ్ల పాటు ప్లాస్టిక్‌పై నిషేధం అమలైంది. తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. దీనికి తోడు డంపింగ్‌యార్డు కూడా లేకపోవడంతో ప్లాస్టిక్‌ను వేరు చేసే ప్రక్రియ జరగడం లేదు. దీంతో పట్టణంలో ఎక్కడ చూసినా వ్యర్థాలే కనిపిస్తున్నాయి.

ఇలా చేస్తే మేలు.. ● చేపలు, మాంసం దుకాణాల వద్ద నార, వస్త్ర సంచులు, స్టీలు డబ్బాలు ఉండేలా యంత్రాంగమే చర్యలు చేపట్టాలి. ● టీ దుకాణాల్లో మట్టి, గాజు గ్లాసులు వినియోగించేలా చూడాలి. ● వేడుకల్లో ప్లాస్టిక్ సామగ్రి వినియోగం తగ్గించాలి. ● ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

అధికారుల మాట.. పురపాలక సంఘాల్లో ప్రైవేటు భవనాలు అద్దెకు తీసుకొని చెత్త, ప్లాస్టిక్ వేరు చేసే ప్రక్రియ ప్రారంభిస్తాం. పాలిథిన్‌పై నిషేధం విధించి ప్రజలకు అవగాహన కల్పిస్తాం. - వెంకటేశ్వర్లు, రత్నరాజు, బాలకృష్ణ, **కమిషనర్లు, పారిశుద్ధ్య అధికారి, పార్వతీపురం, పాలకొండ, సాలూరు**

నాడు నరకం.. నేడు సాఫీ ప్రయాణం

ఒకప్పుడు వర్షం పడితే బురద మార్గంలో వెళ్లేందుకు జియ్యమ్మవలస మండలంలోని లోతువానివలస గ్రామస్థులు పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న నాథుడే లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధి హామీ నిధులు రూ.80 లక్షలు మంజూరు చేసింది. వీటితో జియ్యమ్మవలస ప్రధాన రోడ్డు నుంచి లోతువానివలసకు 1.5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డుతో పాటు మధ్యలో 6 కల్వర్టులు నిర్మించారు. ఇకపై హాయిగా వెళ్తామని గ్రామస్థులు చెబుతున్నారు. త్వరలో రోడ్డు ప్రారంభిస్తామని పీఆర్ ఏఈ పార్థసాయి తెలిపారు. - న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

బయోమెట్రిక్‌కు 1.14 లక్షల మంది దూరం

న్యూస్‌టుడే, విద్యావిభాగం, కొమరాడ

ఆధార్ నవీకరణకు ప్రజల నుంచి స్పందన కొరవడుతోంది. అధికారిక గణాంకాలను బట్టి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ నెల 18కి నవీకరించుకోని వారి సంఖ్య 1.14 లక్షల మంది ఉన్నట్లు తేల్చారు. కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ నవీకరించుకోవడం తప్పనిసరి అని అధికారులు పదేపదే సూచిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్న సచివాలయాల్లో అందిస్తున్న నవీకరణ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

ఆధార్ నవీకరణకు కొరవడుతున్న స్పందన

వయసు పెరిగిన కొద్దీ చేతి వేలిముద్రల్లో మార్పులు వస్తుంటాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో సమస్య రాకుండా నవీకరణను తీసుకొచ్చారు. ఆధార్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ 5-10, 11-17 ఏళ్లలో రెండు సార్లు ఆధార్ మేన్డేటరీ బయోమెట్రిక్ అప్‌డేషన్ (ఎంబీయూ) చేసుకోవాలని నిర్దేశించారు. నవీకరణ చేసుకోవడంతో భవిష్యత్తులో వేలిముద్రల మ్యాచింగ్ సమస్య రాదు. డేటాబేస్‌లో కనీసం ఒక్కసారైనా నవీకరణ కాకపోతే సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం శాఖాపరంగా ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేషన్ ప్రక్రియను దఫదఫాలుగా నిర్వహిస్తోంది. ఈ నెలలో 15, 18 తేదీల్లో సచివాలయాల్లో నవీకరణ, ఆధార్ నమోదు చేపట్టారు. మళ్లీ మరోమారు ఈ నెల 22, 25 తేదీల్లో నిర్వహించనున్నారు. విజయనగరం జిల్లాలో 125 సచివాలయాల్లో సేవలు పొందవచ్చు.

కేంద్రంలో వేలిముద్ర వేస్తున్న మహిళ

జిల్లా	ఎంబీయూ చేసుకోనివారు	ఆధార్ లేని ఏడాదిలోపు పిల్లలు
పార్వతీపురం మన్యం	39,972	191
విజయనగరం	74,160	373

ఏడాదిలోపు వారికీ..

పుట్టిన ప్రతి పిల్లవాడికీ ఆధార్ ఉండాలి. ఏడాదిలోపు బాలల్లో కొందరికి ఆధార్ లేదని ఇటీవలే అధికారులు గుర్తించారు. రెండు జిల్లాల్లో వీరి సంఖ్య 563గా ఉంది. వీరిలో ఎక్కువ మంది విజయనగరం జిల్లాలో ఉన్నారు. వీరంతా నమోదు చేసుకోవాలి. పెండింగ్‌లో ఉన్నవారికి సచివాలయాల్లో నమోదు చేస్తున్నట్లు జిల్లా సచివాలయ అధికారిణి ఎస్.రోజారాణి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. నమోదుతో పాటు నవీకరణ సేవలు పొందవచ్చన్నారు. సీఎస్‌సీ, తపాలా, బ్యాంకుల్లో కూడా సేవలను వినియోగించుకోవచ్చని సూచించారు.

సివిల్స్ అభ్యర్థులకు అండగా ఉంటా: ఎంపీ

మాట్లాడుతున్న కలిశెట్టి అప్పలనాయుడు, చిత్రంలో ఐవీపీ.రాజు తదితరులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: పార్లమెంటులో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ఇప్పటివరకు 89 ప్రశ్నలు వేసినట్లు చెప్పారు. ఆదివారం విజయనగరంలోని అశోక్ బంగ్లాలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన పార్లమెంటు పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో ఒక డిజిటల్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీల్యాడ్స్, దాతల సహకారంతో నిర్మిస్తామని, ఇందుకోసం భూసేకరణ జరుగుతోందన్నారు. ఇందులో యోగా కేంద్రం, సివిల్స్‌కు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం అన్ని రకాల సదుపాయాలు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. తెదేపా నాయకులు ఐవీపీ.రాజు, ప్రసాదుల వరప్రసాద్, కర్రోతు నర్సింగరావు, బ్రహ్మరాజు, సంతోష్‌కుమార్, భరత్, కనకల మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌కు శుభాకాంక్షల వెల్లువ

సత్కరిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు, తెలుగుయువత నాయకులు

విజయనగరం అర్బన్, కొత్తవలస, న్యూస్‌టుడే: గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతిరాజును ఆదివారం విజయనగరంలోని బంగ్లాలో శాప్ ఛైర్మన్ రవినాయుడు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అతనితో పాటు శాప్ డైరెక్టర్ బీవీఎస్ఎన్.రాజు, విజయనగరం పార్లమెంటరీ తెలుగు యువత అధ్యక్షుడు వేమలి చైతన్యబాబు, ప్రధాన కార్యదర్శి గొలగాన సురేంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొగిరి పైడిరాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మద్దిల ప్రవీణ్, నాయకులు రాజు నాయుడు, మాతా బుజ్జి, సంతోష్‌వర్మ, సతీష్ పాల్గొన్నారు. ★ మంగళపాలెంకు చెందిన శ్రీగురుదేవ ఛారిటబుల్ ట్రస్ట్ వైస్ ఛైర్మన్ డా.ఫణీంద్ర మర్యాద పూర్వకంగా కలిసి, సత్కరించారు.

సీతాఫలాలకు గిట్టుబాటేదీ?

వారపు సంతలో అమ్మకానికి తెచ్చిన సీతాఫలాలు

సీతంపేట, న్యూస్‌టుడే: మన్యంలో సీతాఫలాల సీజన్ ప్రారంభమైంది. సీతంపేట వారపు సంతకు ఆదివారం గిరిజనులు సీతాఫలాలను తీసుకొచ్చి, విక్రయించారు. ఒక్కో ట్రే రూ.700 నుంచి 800 లోపు చెల్లుబాటు అయ్యాయని అంటున్నారు. గతేడాది ఇదే సమయానికి ఒక్కో ట్రే రూ.1500 వరకు అమ్ముడుపోయాయని తెలిపారు. రానున్న రోజుల్లో ధర ఎలా మారుతుందో అని కలవరపడుతున్నారు. మరికొద్ది రోజుల్లో మన్యం సంతలకు ఈ పండ్లు భారీగా రానున్నాయి. ప్రోసెసింగ్ యూనిట్ మన్యంలో ఏర్పాటు చేస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశిస్తున్నారు.

మద్యం, పొగాకు విక్రయాలపై నిఘా

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, ప్రజాశాంతికి భంగం కలిగించినా, విద్యా సంస్థలకు వంద మీటర్ల పరిధిలో సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యా సంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయించే వ్యాపారులపై నిఘా పెట్టామని చెప్పారు. శనివారం ఒక్క రోజే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 255 మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

గణప్రసాద్ (పాతచిత్రం)

కొమరాడ, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉండగా గుండె నొప్పి రావడంతో కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కొమరాడ పోలీసు స్టేషన్‌లో గార్డుగా విధుల్లో ఉన్న కానిస్టేబుల్ గణప్రసాద్(41) శనివారం రాత్రి భోజనం అనంతరం శరీరంలో నలతగా ఉందని సహచరులకు చెప్పారు. తర్వాత ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే సిబ్బంది ప్రథమ చికిత్స చేసి అత్యవసర వాహనానికి సమాచారం అందించారు. స్టేషన్ నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న భార్య, ఇద్దరు కుమారులు ఆసుపత్రికి చేరుకొని విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మరో ఇద్దరికి గాయాలు

దామోదరరావు (పాతచిత్రం)

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో ఓ యువకుడు మృతి చెందగా, ఇద్దరికి గాయాలైన ఘటన పూసపాటిరేగ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై దుర్గాప్రసాద్ వివరాల మేరకు.. డెంకాడ మండలం దొడ్డుబాడువకు చెందిన డోల దామోదరరావు(27), కోరాడ నారాయణరావు, కోరాడ నాగభూషణరావు ద్విచక్ర వాహనంపై పూసపాటిరేగ వస్తుండగా కోనాడ కూడలి సమీపంలో అదుపు తప్పి బోల్తా పడి విభాగినిని ఢీకొట్టారు. దామోదరరావు అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఇద్దరికీ గాయాలయ్యాయి. వారిని నగరంలోని మహారాజా ఆసుపత్రికి తరలించారు. దామోదరరావుకు తండ్రి వెంకటరావు, తల్లి గంగమ్మ ఉన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

5,600 లీటర్ల ఊట ధ్వంసం

సామగ్రి చూపుతున్న పోలీసులు

కొమరాడ, పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్ర- ఒడిశా సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న సారా తయారీ కేంద్రాలపై అబ్కారీ ఇన్‌స్పెక్టర్ బి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. కొరాపుట్ జిల్లా బందుగాం బ్లాక్ పరిధిలో అలమండ, జగ్గగూడ, పల్లాడ కేంద్రాల్లో 5,600 లీటర్ల ఊటతో పాటు 400 లీటర్ల సారా ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం కొరాపుట్, బొబ్బిలి, సీతానగరం, పార్వతీపురం అబ్కారీ సిబ్బంది, విజయనగరం టాస్క్‌ఫోర్స్ పోలీసులు 51 మంది పాల్గొన్నారు.

మహిళకు వేధింపులు.. కేసు నమోదు

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: వివాహితను ఓ యువకుడు వేధిస్తుండడంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. పూసపాటిరేగకు చెందిన జి.లక్ష్మిని, శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం వంద్రంగి గ్రామానికి చెందిన సహిన క్రిష్ణ చైతన్య వేర్వేరు నంబర్లతో ఫోన్ చేసి వేధిస్తున్నాడు. అసభ్య పదజాలంతో దూషిస్తూ, ఎవర్నికైనా చెబితే ఆమె భర్తను హత్య చేస్తానని బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

EENADU e Classifieds

JOBS

ప్రముఖ కంపెనీ Ephraimలో పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. జీతం నెలకు 21,000/- నుండి 45,000/- వరకు. Cell : 9704107303, 8008574616.

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 9014651068, 7075633416.

MARKETING/ SALES

Wanted PRO's/marketing staff for a reputed residential school in Vizag. No's: 9441225296, 7569534430.

SECURITY GUARDS

గరివిడిలో పనిచేయుటకు Security Guards కావలెను. 15,000/- Salary ఉచిత వసతి సదుపాయం కలదు. Contact No:9949826283, 8341732380.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

నెల కిందట రూ.180.. ఇప్పుడు రూ.900

పార్కింగ్ రుసుములపై రైల్వే ప్రయాణికుల నిరసన

ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు వివరిస్తున్న ప్రయాణికులు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధి నిమిత్తం విజయనగరం రైల్వే స్టేషన్ నుంచి సుమారు 3 వేల మంది నిత్యం విశాఖపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో కొందరు నెల మొత్తానికి డబ్బులు చెల్లించి పాస్ తీసుకుంటారు. రోజూ ప్రయాణించే వారిలో నిరుపేద, మధ్యతరగతి ప్రయాణికులే అధికం. రైల్వే పార్కింగ్ గుత్తేదారు తీసుకున్న నిర్ణయం వారికి గుదిబండగా మారింది. గతంలో సైకిల్ పార్కింగ్‌కు 24 గంటలకు రూ.5లను ప్రస్తుతం రూ.20 చేశారని, ద్విచక్ర వాహనానికి రూ.12కు బదులు రూ.80 వసూలు చేస్తున్నారని ప్రయాణికుడు అరవింద్ తెలిపారు. నెల వారీ పార్కింగ్‌కు గతంలో రూ.180 ఉండేదని, ఇప్పుడు రూ.900 తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా రైల్వే స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రయాణికులు ఆదివారం విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజును కలిసి వినతిపత్రం ఇచ్చారు. అంతకు ముందు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, అనకాపల్లి, విజయనగరం ఎంపీలు సీఎం రమేష్, కలిశెట్టి అప్పలనాయుడును కలిసి వినతిపత్రాలు అందజేశారు. రైల్వే గుత్తేదారు తాజా నిర్ణయాన్ని మార్చుకోకపోతే న్యాయపోరాటం చేస్తామని ప్రయాణికులు పేర్కొన్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80081 11237

చికెన్ ధరలు

రకం	బ్యాగ్‌లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	105	180	190

విద్యార్థులం.. సమాజ సేవకు సిద్ధం

న్యూస్‌టుడే, సీతానగరం

దేశభక్తి, క్రమశిక్షణతో పాటు సేవాగుణం పెంచేందుకు విద్యార్థులను స్కౌట్స్, గైడ్స్‌గా తీర్చిదిద్దుతున్నారు. దీనిలో భాగంగా మన్యం జిల్లాలో పలువురు బాలలకు శిక్షణ ఇచ్చారు. ముందుగా పీఎంశ్రీ పథకంలో ఉన్న పాఠశాలలను గుర్తించి బాల, బాలికలను ఎంపిక చేశారు. వీరికి 5 రోజుల పాటు అవగాహన కల్పించారు.

జోగింపేటలో ముగిసిన స్కౌట్స్, గైడ్స్ శిక్షణ

గుడారాలు ఏర్పాటు చేస్తున్న గైడ్స్

వీరికి శిక్షణ.. : జిల్లాలోని 19 పీఎంశ్రీ పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో వీరఘట్టం, గాదెలవలస, గరుగుబిల్లి, చినమేరంగి, బలిజిపేట, పాంచాలి, మక్కువ, పాలకొండ ఉన్నత, మక్కువ, భామిని, సాలూరు ఆదర్శ, నర్సిపురం, అన్నవరం ప్రాథమిక, కొమరాడ, రేగిడి, హడ్డుబంగి, కురుపాం గురుకుల, బెలగాం, డబ్బివీధి బాలికల పాఠశాలలు ఉన్నాయి. ఆయా విద్యాలయాల నుంచి 48 బాలురు, 40 మంది బాలికలను ఎంపిక చేసి జోగింపేట పంపించారు.

ప్రాణాలు కాపాడటమే లక్ష్యం..

బాలభటుల వ్యవస్థలో ప్రవేశ్, ప్రథమ, ద్వితీయ, తృతీయ, రాష్ట్రీయ విభాగాలను గుర్తించారు. ప్రార్థన గీతాలు, జెండా ఆవిష్కరణ, వ్యాయామం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆపదలో ఉన్న వారిని ఆదుకొని ప్రథమ చికిత్స అందించడం, అగ్ని ప్రమాదాల్లో భవనాల్లో చిక్కుకున్న వారిని కాపాడటమే లక్ష్యంగా తర్ఫీదు ఇచ్చారు. గుడారాల ఏర్పాటు, కర్రలతో వంతెనల నిర్మాణంపై మెలకువలు నేర్పించారు.

క్రమశిక్షణ, మానసిక దృఢత్వం..

ఇక్కడ విద్యార్థులకు క్రమశిక్షణ, మానసిక, శారీరక దృఢత్వం పెంపొందేలా నిపుణులు రజియా బేగం, నాగేశ్వరరావు, నారాయణ మూర్తి, చిన్నంనాయుడు, విజయ్‌కుమార్ సూచనలు అందించారు. ఈ కేంద్రంలో శిక్షణ పొందిన 88 మంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి మిగిలిన వారికి రోజూ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది.

మిగిలిన వారికి నేర్పిస్తాం

శిక్షణ కేంద్రంలో దేశభక్తి గేయాలు, జెండా వందనం, పెట్రోలింగ్, తాళ్లతో ముడులు వేయడం, ప్రథమ చికిత్స గురించి వివరించారు. ఇన్నాళ్లు వీటిని ప్రత్యక్షంగా చేయలేదు. శిక్షణ బాగుంది. మిగిలిన వారికి నేర్పిస్తాం. - వర్షిణి, మణిశ్రీ, భవ్యశ్రీ, దుర్గ

సంప్రదాయాలపై అవగాహన

శిక్షణలో దేశ సంస్కృతి, సంప్రదాయాల గురించి వివరించారు. వరదలు, అగ్ని ప్రమాదాల్లో బాధితులను రక్షించే విధానాలు ఆసక్తి రేపాయి. కొండలు, గుట్టల్లో చిక్కుకున్న వారిని తాళ్ల సాయంతో కాపాడటంపై అవగాహన వచ్చింది. - సాయిసుధీర్, సంపత్‌కుమార్, రిత్విక్, మోహన్ వంశీ, ప్రేమ్‌చంద్, స్కౌట్స్

పాఠశాలల్లో కొనసాగించాలి

జోగింపేటలో శిక్షణ పొందినవారు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు నేర్పించాలి. వారి ఆసక్తి ఆధారంగా 12, 24, 32 మంది చొప్పున బృందాలుగా ఏర్పడి కార్యక్రమాలు నిర్వహించవచ్చు. సామాజిక సేవ, నాయకత్వ లక్షణాలు పెంచడమే లక్ష్యంగా తర్ఫీదు ఇచ్చాం. - **జె.నారాయణస్వామి, జిల్లా కార్యదర్శి, భారత్ స్కౌట్స్, గైడ్స్**

(c) eenadu

ఎత్తిపోతలపై చిగురించిన ఆశలు

పాచిపెంట, న్యూస్‌టుడే

పాచిపెంట మండలంలోని పెద్దగెడ్డ జలాశయం ద్వారా కేసలి, కొటికిపెంట గ్రామాల్లోని 200 ఎకరాల పంట భూములకు సాగునీరు అందించేందుకు చేపట్టిన ఎత్తిపోతల పథకం పనులు ఏళ్లుగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వం పూర్తిగా పట్టించు కోలేదు. కానీ ఇటీవల కేసలిలో పర్యటించిన గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి పనుల పూర్తిపై హామీ ఇవ్వడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి.

సగంలో నిలిచిన కుండీ నిర్మాణ పనులు

రూ.3 కోట్లతో మంజూరు..

ఆరేళ్ల క్రితం కేసలి వద్ద జలాశయానికి ఆనుకొని ఎత్తిపోతల పథకం నిర్మాణం ప్రారంభించారు. ఊటబావి, పొలాల్లో భూగర్భ పైపులు అమరిక, విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేశారు. రెండేళ్ల పాటు రూ.1.60 కోట్ల విలువైన పనులు చేశాక నిలిపేశారు. గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోకపోవడంతో సమస్య ఏర్పడింది. దీంతో కేసలి, కొటికిపెంట రైతులు వర్షాధారంపైనే ఆధారపడి పంటలు పండిస్తున్నారు. విషయం జేఈ అనుదీప్ వద్ద ప్రస్తావించగా.. మిగిలిన పనులు పూర్తి చేసేలా రూ.1.41 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

15 వేల ఎకరాలకు నీరు చేరేనా?

పాలకొండ మండలానికి ప్రధాన సాగునీటి వనరు తోటపల్లి ఎడమ కాలువ. ఆధునికీకరణ పనులు గత రెండేళ్లుగా అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో కాలువలో పూడిక పేరుకుపోయి రూపుమారింది. మండల పరిధిలో 15 వేల ఎకరాల ఆయకట్టు భూములు దీనిపైనే ఆధారపడి ఉన్నాయి. ఏటా కాలువల ద్వారా కీలక సమయాల్లో సాగునీరు అందకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాదీ అదే పరిస్థితి ఎదురు కానుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు అస్తవ్యస్త కొరత వెంటాడుతోంది. ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జలవనరులశాఖ డీఈఈ గని రాజు తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

ఎం.సింగుపురం వద్ద కాలువ దుస్థితి

25 నుంచి శ్రావణమాసోత్సవాలు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానంలో ఈ నెల 25 నుంచి శ్రావణమాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి సూర్యనారాయణ తెలిపారు. జులై 25, ఆగస్టు 1, 8, 15, 22 తేదీల్లో సామూహిక లక్ష కుంకుమార్చన పూజలు మహిళలతో ఉదయం 4 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చేయించనున్నారు. ఆగస్టు 9న శ్రావణ పౌర్ణమి మహోత్సవం నిర్వహించనున్నారు. స్వర్ణ కిరీట కవచ ధారణతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, స్వర్ణపుష్పాలతో పూజలు చేస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎమ్మెల్యే విజయచంద్రకు వినతిపత్రం ఇస్తున్న కార్యకర్తలు

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపాలని ఆశా కార్యకర్తలు కోరారు. శనివారం ఎమ్మెల్యే విజయచంద్రను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వేతనాలు పెంపుదల, ఆశా కార్యకర్తలుగా గుర్తించాలని, ఏకరూప దుస్తులు అందించాలని కోరారు. విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం(నేడు) ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఐటీడీఏ పరిధిలో గల గిరిజనులు తమ వ్యక్తిగత, గ్రామ సమస్యలపై వినతులు అందజేసుకోవచ్చన్నారు.

కిక్ కొడతారు.. పతకాలు పడతారు

తైక్వాండోలో విద్యార్థుల సత్తా

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే

చదువులో రాణిస్తూనే ఆత్మరక్షణ విద్యలో ప్రతిభ కనబరుస్తున్నారు పార్వతీపురం పట్టణం, పరిసర ప్రాంతాల విద్యార్థులు. రోజూ ఉదయం 5 నుంచి 7 మధ్య తైక్వాండో సాధన చేస్తూ వివిధ వేదికలపై సత్తా చాటుతున్నారు. ఇటీవల హరిద్వార్‌లో జరిగిన జాతీయ పోటీల్లో పతకాలు సాధించారు. వీరికి శిక్షకులు రవికుమార్, కోటేశ్వరరావు శిక్షణ ఇచ్చారు.

పార్వతీపురంలో సాధన చేస్తున్న క్రీడాకారులు

జాతీయస్థాయిలో స్వర్ణం..

బెలగాంకు చెందిన షణ్ముఖ సిద్ధార్థనాయుడు ఆరో తరగతి చదువుతున్నాడు. తండ్రి అనంత్ జాతీయ స్థాయి కరాటే క్రీడాకారుడు కావడంతో కుమారుడిని చిన్నప్పటి నుంచే తైక్వాండోలో ప్రోత్సహించారు. దీంతో సిద్ధార్థ తెనాలి, నెల్లూరు, అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వెండి, కాంస్య పతకాలు గెలిచాడు. 2023లో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో కాంస్యం సాధించాడు. ఇటీవల అనంతపురం జిల్లా తాడిపత్రి, హరిద్వార్‌లో జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో స్వర్ణాలు పొందాడు.

దేవికి ఎదురు నిలిచేదెవరు..

పార్వతీపురం పట్టణానికి చెందిన ఈ బాలిక పేరు ఇజ్జాడ వైష్ణవిదేవి. ఆరో తరగతి చదువుతున్న ఈ బాలిక తొలిసారి జాతీయ వేదికపై తలపడి రజతం గెలిచింది. 2023, 24లో బొబ్బిలి, విజయనగరం, తుని, అనంతపురంలో జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణాలు కైవసం చేసుకుంది. ఈ ఏడాది బొబ్బిలి, తాడిపత్రిలో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు, వెండి పతకాలతో మెరిసింది.

తండ్రి ప్రోత్సాహంతో..

పార్వతీపురం పట్టణానికి చెందిన ఇజ్జాడ దేవి సంపవి ఎనిమిదో తరగతి చదువుతుంది. విశ్రాంత ఆర్మీ ఉద్యోగి అయిన తండ్రి శివరామకృష్ణ ప్రోత్సాహంతో రెండేళ్లుగా తైక్వాండో సాధన చేస్తోంది. 2024లో తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రజతం, తెనాలిలో 14వ సబ్ జూనియర్ పోటీల్లో స్వర్ణం కైవసం చేసుకుంది. గతేడాది డెహ్రాడూన్‌లో జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది.

ప్రత్యర్థికి చెమటలే..

ఇంటర్ చదువుతున్న బి. హర్షవర్ధన్ తల్లిదండ్రులు ప్రభావతి, గణేష్. సాధారణ కుటుంబంలో పుట్టినా చిన్ననాటి నుంచి తైక్వాండోలో శిక్షణ పొందుతున్నాడు. ఇప్పటివరకు 13 జిల్లా, 11 రాష్ట్ర, ఒకసారి జాతీయ స్థాయిలో పోటీ పడి అన్ని చోట్లా పతకాలు సాధించాడు. హర్ష బరిలో దిగితే ప్రత్యర్థికి చెమటలు పడతాయని చెబుతుంటారు సహచరులు. ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం, జాతీయస్థాయి 48 కిలోల విభాగంలో రజతం సాధించాడు.

కూరగాయల ధరలు

పార్వతీపురం రైతు బజారులో ఆదివారం సాయంత్రానికి కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. (కిలో..రూపాయల్లో..) **టమాటా:** 32, **వంకాయలు:** 36, **బెండ:** 28, **బీర:** 34, **చిక్కుడు:** 34, **పచ్చిమిర్చి:** 98, **కాకర:** 30, **క్యారెట్:** 44, **బీట్‌రూట్:** 40, **ఉల్లి:** 23, **బంగాళదుంపలు:** 18, **అల్లం:** 60, **వెల్లుల్లి:** 80, **క్యాప్సికమ్:** 75, **అరటి కాయ:** 5, **ఆనప కాయ:** 16 – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

తెరపై ఈనాడు

పార్వతీపురం: శ్రీ వీరభద్ర సినిమా: సూపర్‌మ్యాన్, జూనియర్★ **టీబీఆర్:** ఓ భామ.. అయ్యోరామ, మైబెవీ ● **పాలకొండ: రామకృష్ణమందిర్**- జూనియర్ ★ **వెంకటగౌరి (స్క్రీన్1)** - ఓభామ.. అయ్యోరామ **(స్క్రీన్2)** - మైబెవీ ● **సాలూరు: శ్రీరామ**- జూనియర్, **లక్ష్మి**- మైబెవీ. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, పాలకొండ, సాలూరు

హైనా.. చిరుత పులా..?

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట మండలం జమ్మిరవలస సమీపంలో శనివారం చీకటి పడిన తర్వాత చిరుత పులి ఆకారంలోని జంతువు సంచరించిందని స్థానికులు అంటున్నారు. గ్రామ సమీపంలోని ఓ కొబ్బరి వద్ద కంచెను పీకేందుకు ప్రయత్నించిందని, స్థానికులు, కుక్కలు అరవడంతో వెళ్లి పోయిందని చెప్పారు. గ్రామ అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిరుత పులా లేక హైనా అనేది తెలియకపోవడంతో చీకటి పడిన తర్వాత బయటకు వెళ్లడానికి భయపడుతున్నారు. ఎవరికీ అపాయం కలగకుండా రక్షణ కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయంపై అటవీశాఖ బీట్ అధికారి కె.దాలినాయుడు వద్ద ప్రస్తావించగా.. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా చిరుతపులి సంచారం ఏమీ లేదన్నారు. హైనాను చూసి చిరుత అని ప్రజలు భావించి ఆందోళన చెందుతున్నారని తెలియజేశారు.

ఇదీ.. సాలూరులో ఉద్యానం దుస్థితి

సాలూరు పట్టణంలోని బంగారమ్మకాలనీలో ఉన్న పార్కు దుస్థితి ఇది. చిన్నారులు, పెద్దలు సేదతీరుతూ కనిపించాల్సిన చోట పనికిరాని మొక్కలు, ముళ్ల పొదలు దర్శనమిస్తున్నాయి. తెదేపా పాలనలో రూ.10 లక్షలు కేటాయించి పార్కు స్థలాన్ని అభివృద్ధి చేసి అంతర రోడ్లు వేశారు. గత ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోకపోవడంతో ఆహ్లాదం కనుమరుగైంది. విషయం పుర డీఈ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. పార్కు అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, సాలూరు

వర్షం పడితే వీధుల్లోకి వెళ్లలేం

వర్షం కురిస్తే పాలకొండలోని పలు ప్రాంతాల రహదార్లు చిత్తడిగా మారుతున్నాయి. వడమ దారిలో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గాయత్రీనగర్, గటాలడెప్పివీధి, నవోదయనగర్, గారమ్మకాలనీలో ఇదే పరిస్థితి ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి పరిష్కారం చూపుతామని పాలకొండ నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

వేలాడుతున్న తీగలు.. ఆందోళనలో రైతులు

సాలూరు మండలంలోని కందులపదం రహదారి సమీపంలోని పొలాల్లో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. స్తంభం ఒరిగిపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. ఇక్కడ కోమటి చెరువులోనూ తీగలు కిందకి ఉండటంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. అటుగా వెళ్తే ఏం జరుగుతుందోనని వాపోతున్నారు. నెల రోజుల క్రితం ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

కూలేందుకు సిద్ధం.. పట్టించుకోని వైనం

గుమ్మలక్ష్మీపురం మండలం దేరువాడలోని జీసీసీ డిపో శిథిలావస్థకు చేరుకుంది. రాతి గోడలు బీటలు వారి, రాళ్లు కనిపిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఎప్పుడు కూలుతుందోనని భయాందోళన చెందుతున్నారు. వర్షం పడితే సరకులు తడుస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు. కొత్త భవనం నిర్మించాలని కోరుతున్నారు. ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైతే పనులు చేపడతామని జీసీసీ బీఎం రాము తెలిపారు. – న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

లోతట్టు ప్రాంతాలు జలమయం

పార్వతీపురంలోని వరహాలు గెడ్డలో ప్రవాహం పెరగడంతో సమీప ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి. నాలుగు రోజుల క్రితం భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. దీనికి వరహాలు గెడ్డ ప్రవాహం తోడు కావడంతో బూరాడ వీధి శివారులోని పశుపతినాథ ఆలయం పరిసర ప్రాంతాలు మునిగిపోయాయి. విషయం పారిశుద్ధ్య అధికారి పకీరురాజు వద్ద ప్రస్తావించగా.. నీరు మళ్లించే చర్యలు చేపడతామని చెప్పారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? శివ్వన్నపేట- మాదలింగి మార్గంలో కాలువలు పనికిరాని మొక్కలు, వ్యర్థాలతో నిండిపోయాయి. **- సాయి** ★ కాలువలో పూడిక, పనికిరాని మొక్కలు తొలగిస్తాం. **- జగదీశ్, కార్యదర్శి - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం**

? తామరకండి నుంచి సువర్ణముఖి నది నీలాటి రేవులకు వెళ్లే మార్గంలో తుప్పలు పెరిగిపోయాయి. **- రామినాయుడు**

★ నీలాటి రేవులను శుభ్రం చేస్తాం. **- లలిత, సర్పంచి - న్యూస్‌టుడే, సీతానగరం**

? పాలకొండ ప్రధాన రహదారిలోని ఆంజనేయ కూడలిలో రోడ్డుపై ఇసుక పేరుకుపోయి ఉంది. **- బుజ్జి** ★ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- రత్నరాజ్, కమిషనరు - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం**

పద్మవ్యూహంలో పార్వతీపురం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రం పార్వతీపురం ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుంది. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు జిల్లా కావడంతో సమస్య తీవ్రంగా మారింది. జిల్లా కేంద్రంగా మారిన తర్వాత పట్టణానికి రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య భారీగా పెరిగినా రహదారుల విస్తరణ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

పార్కింగ్ ప్రాంతాలు కరవు..

పట్టణంలో 62 వేల మంది జనాభా నివస్తున్నారు. సుమారు 14 నుంచి 16 వేల మధ్య వాహనాలు ఉన్నాయి. దీనికి తోడు బయట ప్రాంతాల నుంచి రోజూ 10 వేలకు పైగా వాహనాలు పట్టణంలోకి వస్తుంటాయి. వీటిని నిలిపేందుకు ఎక్కడా పార్కింగ్ ప్రాంతాలు కానరావడం లేదు. దుకాణాల ముందు, రోడ్లపైనే నిలపాల్సిన పరిస్థితి. కొన్నిసార్లు రహదారులపై ఉన్న వాహనాలకు పోలీసులు అపరాధ రుసుములు వేస్తున్నారు.

ఎక్కడికక్కడ అంతరాయం..

భారీగా వాహనాలు వస్తున్నా పట్టణంలో రోడ్లు మాత్రం అభివృద్ధి చెందలేదు. రాయగడ రోడ్డు శివారు నుంచి బెలగాం శివారు వరకు 3 కిలోమీటర్ల మేర పట్టణ ప్రధాన రహదారిలో వాణిజ్య సముదాయాలు, కల్యాణ వేదికలు ఉన్నాయి. గతంలో పట్టణంలోని సిరేల వీధిని పార్కింగ్ స్థలంగా మార్చాలని భావించినా అడుగులు ముందుకు పడలేదు. రాయగడ రోడ్డులో భారత్ భవనం వీధి, కాకర్ల వీధి వద్ద, పాతబస్టాండ్ కూడలి, కూరగాయలు బజారు, నాలుగు రోడ్ల కూడలి, సారిక వీధి కూడలి, సౌందర్య రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి, గూడ్స్‌షెడ్ రోడ్డు, చర్చివీధి కూడళ్లలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది.

పార్వతీపురం నాలుగు రోడ్ల కూడలిలో పరిస్థితి

కానరాని ప్రత్యామ్నాయం..

పాతబస్టాండు కూడలికి రోజూ ఉదయం 4 గంటల నుంచే గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు కూరగాయలతో చేరుకుంటారు. ఆ సమయం నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ మార్గం రద్దీగానే ఉంటుంది. సారిక వీధి కూడలి, సౌందర్య రోడ్డు మీదుగా మండలంలోని ఎల్ఎన్ పురం, కృష్ణపల్లితో పాటు, ఒడిశా వెళ్లే వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ పెరుగుతోంది. కానీ ఎక్కడా ప్రత్యామ్నాయ చర్యలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

సమన్వయంతో పరిష్కారం..

పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఏళ్లుగా ఉంది. ర.భ, రెవెన్యూ, పోలీసు శాఖలను సమన్వయం చేసుకొని ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడతాం. పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం. త్వరలోనే పరిష్కారం చూపిస్తాం.

– సీహెచ్.వెంకటేశ్వర్లు, పుర కమిషనరు

ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం

గిజబలో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచించారు. గిజబలో ఆదివారం పర్యటించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు ఎ. మధుసూదనరావు, నాయకులు ఎం. పురుషోత్తంనాయుడు, కె.సుమన్, ఎం.బి.విజయాంకుశం తదితరులు పాల్గొన్నారు. ● గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఎగువతాడికొండలో తెదేపా మండల కన్వీనర్ నరేష్, నాయకులు జయంత్, శ్రీహరి, కురుపాం మండలంలోని గుజ్జుపాడు, సంగెడ్డ, గొందిలోవ, సింగుపురంలో తెదేపా మండల కన్వీనర్ కె.కొండయ్య, ఎస్.గోవిందరావు, సుకేశ్, చంద్రరావు తదితరులు ప్రచారం నిర్వహించారు.

అక్రమంగా పశువుల రవాణా

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: నిత్యం పశువుల అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు వాహన తనిఖీల్లో గుర్తించినా చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కురుపాం మీదుగా ఆదివారం రాత్రి ఓ వ్యాన్‌లో పశువులను ఇరికించి తరలిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. నిబంధనలకు వ్యతిరేకంగా జరుగుతున్న రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలని వినతి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: కురుపాం మండలంలోని తియ్యాలవలస, అడ్డాయిగూడ, ఎగువ పీరుంగూడకు రహదారి సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. శనివారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కడ్రక మల్లేశ్వరరావును గుణదలో కలిసి వినతిపత్రం అందించారు. రోడ్లు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాలన్నా డోలీలనే ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. సమస్యను ప్రభుత్వ విప్ జగదీశ్వరి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సీతంపేట మన్యంలో వర్షం

సీతంపేట, న్యూస్‌టుడే:సీతంపేట మన్యంలో ఆదివారం వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో మోస్తరుగా, మరికొన్ని చోట్ల జల్లులు కురిశాయి. వేడి వాతావరణంతో అల్లాడుతున్న ప్రజలకు వర్షపు జల్లులు ఉపశమనం కలిగించాయి.

మహాసభల విజయవంతానికి పిలుపు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: విశాఖలో జరగనున్న అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సిటు అధ్యక్ష, కార్యదర్శులు రమణరావు, మన్మథరావు పిలుపునిచ్చారు. పార్వతీపురంలో నాయకులు సమావేశమయ్యారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనట్లు పేర్కొన్నారు. శ్రమజీవుల హక్కులను హరించేలా జీవోలు తీసుకొస్తున్నట్లు ఆరోపించారు. సెప్టెంబరు 13, 14 తేదీల్లో పాలకొండలో జిల్లా సభలు ఉంటాయన్నారు. నాయకులు బీవీ.రమణ, ఎన్.వై.నాయుడు, రెడ్డి.వేణు, శాంతి, ఉమామహేశ్వరి, జ్యోతి పాల్గొన్నారు.

కార్యకర్తలను అవమానించడం తగదు

పాలకొండ గ్రామీణం, పాలకొండ, న్యూస్‌టుడే: పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జెండా మోసిన నాయకులు, కార్యకర్తల్ని అవమానించడం తగదని తెదేపా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పాలకొండలో జరిగిన సుపరిపాలన కార్యక్రమం సమాచారం ముందుగా ఇవ్వలేదని స్థానిక నాయకులు డి.రమణ, పాపినాయుడు, జి.దుర్గారావు, ప్రవీణ్ తదితరులు నియోజకవర్గ బాధ్యులు పి.భూదేవిని నిలదీశారు. వారికి డీసీసీబీ అధ్యక్షుడు సూర్యనారాయణ సర్దిచెప్పారు.

నిలదీస్తున్న తెదేపా నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్ని ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఎస్సై పి.అనీష్ వివరాల మేరకు.. చినమేరంగికి చెందిన ఎస్.నాగరాజు, ఎస్.వెంకటేష్ ద్విచక్ర వాహనంపై పెదమేరంగి నుంచి ఇంటికి వెళ్తుండగా, పార్వతీపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు పెదమేరంగి రామాలయం వద్ద మలుపులో ఢీకొంది. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో చినమేరంగి సీహెచ్‌సీకి, అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సేవలకు గుర్తింపు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన సుంకరి అనిల్ కుమార్ షైనింగ్ స్టార్స్ ఎక్స్‌లెన్స్ పురస్కారం అందుకున్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో ఆయన అందించిన సేవలను గుర్తించిన వైఎంకే అకాడమీ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ ఈ పురస్కారం అందించింది. ఆదివారం విజయవాడలో సినీ హీరో భానుచందర్ చేతుల మీదుగా జ్ఞాపిక అందుకున్నారు.

పోస్టులు అమ్ముకోవడం వైకాపా సంస్కృతి

మాట్లాడుతున్న తెదేపా నేతలు

సాలూరు, న్యూస్‌టుడే: పోస్టులు అమ్ముకోవడం, ఉద్యోగులను వేధించడం వైకాపా సంస్కృతి అని సాలూరు తెదేపా పట్టణ, మండలాల అధ్యక్షులు చిట్టి, పరమేశు అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేసినట్లు చెప్పారు. విద్యుత్తు శాఖలో షిఫ్ట్ ఆపరేటర్ల ఉద్యోగాలను వేలం వేసి మరీ వైకాపా నేతలు అమ్ముకున్నట్లు ఆరోపించారు. కౌన్సిలర్ హర్ష, ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి, డి.అన్నపూర్ణ, యుగంధర్, అశోక్ పాల్గొన్నారు.

సంస్కృతి ఉట్టిపడేలా ఉత్సవాల నిర్వహణ

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేలా ప్రపంచ ఆదివాసీ ఉత్సవాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి అన్నారు. ఆగస్టు 9న నిర్వహించనున్న ఉత్సవాలకు సంబంధించి ఆదివారం గుమ్మలక్ష్మీపురం వైటీసీలో పలు సంఘాల నాయకులతో సమావేశమై చర్చించారు. నాయకులు రమణ, నాగభూషణరావు, శంకరరావు, ప్రసాదరావు, శేఖర్, సన్యాసిరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన నాయకులు

హామీలు మాటలకే పరిమితం

ప్రచారం చేస్తున్న రాజన్నదొర, నాయకులు

సాలూరు, న్యూస్‌టుడే: కేవలం ఓట్లు పొందడం కోసమే హామీలిచ్చి కూటమి నాయకులు అధికారంలోకి వచ్చారని, మాజీ ఉప ముఖ్యమంత్రి పి.రాజన్నదొర విమర్శించారు. పట్టణంలోని బంగారమ్మకాలనీలో ఆదివారం వైకాపా నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. నాయకులు రాంబాయి, జి.రఘు, రామకృష్ణ, మాధవరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలపై నిరసన

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో విద్యార్థులు సమస్యలతో సతమతం అవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.అఖిల్, కె.రాజు అన్నారు. పార్వతీపురం బాలుర కళాశాల వసతి గృహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ప్రహరీ లేక విష కీటకాలు గదుల్లోకి వస్తున్నాయన్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక విద్యార్థులు ఆరుబయటకు వెళ్తున్నట్లు చెప్పారు. కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేయాలన్నారు.

నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శ్రమదానంతో రోడ్డు బాగు

సీతంపేట మండలంలోని పాతరేగులగూడ- రేగులగూడ మధ్యనున్న చెరువు గట్టుపైన రోడ్డును గిరిజనులు బాగు చేసుకున్నారు. రూ.2 కోట్ల ఉపాధి నిధులతో పనులు ప్రారంభించి, వదిలేయడంతో వర్షాకాలంలో చెరువు గట్టుపై రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో వేరే దారి లేక రోడ్డును బాగు చేసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుకుంటున్నారు. – న్యూస్‌టుడే, సీతంపేట

(c) eenadu

కొత్తపట్నం ప్రధాన రహదారి పక్కన నిలిచిన వర్షం నీరు

భారీ వర్షం... రైతుల హర్షం

ఒంగోలు వ్యవసాయం, గ్రామీణం - న్యూస్‌టుడే: జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు భారీ వర్షం పడింది. దీంతో రైతుల్లో ఖరీఫ్ ఆశలు చిగురించాయి. జూన్‌లో ఏరువాక సాగినా వరుణుడు ముఖం చాటేయడంతో విత్తు వేయని దుస్థితి నెలకొంది. ఖరీఫ్ సాగు విస్తీర్ణం 1.29 లక్షల హెక్టార్లు కాగా... 11 వేల హెక్టార్లలో మాత్రమే పైర్లు వేశారు. అదీ బోర్ల ఆధారంగా మొక్కజొన్న, వరి, పత్తి, మినుము వంటివి సాగు చేశారు. జులైలోనూ సాధారణ వర్షపాతం 87.8 మి.మీ. కాగా... 55.6 మి.మీ. లోటు నమోదైంది. దీంతో వేసిన కొద్దిపాటి పంటలూ దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆదివారం కురిసిన వర్షం వాటికి జీవం పోసింది. ఇప్పటికే దుక్కులు దున్ని విత్తులు వేసేందుకు నిరీక్షిస్తున్న రైతులకూ మేలు కలిగింది. టంగుటూరులో అత్యధికంగా 77.25 మి.మీ వర్షం కురిసింది. ఒంగోలు నగరంలోని ప్రధాన రహదారులు జలమయమై... రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

మండలం	టంగుటూరు	ఎస్.ఎన్.పాడు	కురిచేడు	చీమకుర్తి	దొనకొండ	ఒంగోలు	కొత్తపట్నం	దర్శి	సింగరాయకొండ	వై.పాలెం	మద్దిపాడు	ముండ్లమూరు	పొదిలి
వర్షపాతం (మి.మీల్లో)	77.75	63.5	53.0	43.0	36.5	32.5	30.5	29.0	23.5	22.0	21.25	16.75	11.75

➻ మార్కాపురం తూర్పువీధిలోని ఓ ప్రైవేటు కళాశాల అధ్యాపకుడికి, పట్టణంలోని మరో కళాశాల నిర్వాహకుడికి మధ్య ప్రవేశాల విషయమై ఘర్షణ చోటుచేసుకుంది. ఇద్దరూ స్టేషన్ మెట్లెక్కారు. ఓ అధికారి వద్ద ప్రైవేట్ డ్రైవర్‌గా ఉన్న వ్యక్తి పంచాయితీ చేశాడు. కేసులు వద్దనడంతో రూ.లక్ష డిమాండ్ చేసి.. . చివరకు రూ.80 వేలకు సెటిల్ చేసి సదరు అధికారికి ఇప్పించినట్లు తెలిసింది.

➻ పట్టణానికి చెందిన ఓ పార్టీ నాయకుడు నాలుగేళ్ల క్రితం ఓ బంగారు వ్యాపారి వద్ద నగలు తాకట్టు పెట్టి రూ.12.50 లక్షల రుణం తీసుకున్నాడు. గడువు ముగిసేసరికి వడ్డీతో కలిపి అది రూ.23 లక్షలైంది. ఆ మొత్తం ఇవ్వకుండా వ్యాపారిని బెదిరించడంతో పంచాయితీ స్టేషన్‌కు చేరింది. ఓ ప్రైవేటు డ్రైవర్ కల్పించుకుని సర్కిల్ కార్యాలయానికి వారిని తీసుకెళ్లి సెటిల్ చేశాడు. ఇరువురి నుంచి సుమారు రూ.1.20 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం.

ప్రైవేటు డ్రైవర్లు.. చేసేది పంచాయితీలు!

● మార్కాపురం సర్కిల్ స్టేషన్లలో వీరిదే హవా

న్యూస్‌టుడే - మార్కాపురం

మార్కాపురంలోని పోలీసు స్టేషన్లలో ప్రైవేటు డ్రైవర్ల దందా నడుస్తోంది. ఫిర్యాదు చేసేందుకు ఎవరైనా వస్తే చాలు గద్దల్లా వాలిపోయి... మీ పని చేయిస్తామంటూ బేరసారాలు మొదలు పెడుతున్నారు. అధికారుల వద్దే పంచాయితీలు చేసి రూ.వేలల్లో గుంజేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారిక సిబ్బంది కంటే వీరి హవానే కొనసాగుతోందని ఆయా స్టేషన్ల సిబ్బందే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

మార్కాపురం పోలీసు స్టేషన్

అధికారులకు తెలిసినా...

మార్కాపురం పట్టణ స్టేషన్‌లో ఇద్దరు, సీఐ కార్యాలయంలో మరో ఇద్దరు, గ్రామీణ స్టేషన్‌లో ఇంకో ఇద్దరు ప్రైవేటు డ్రైవర్లుగా పని చేస్తున్నారు. వీరంతా అనధికారికంగానే విధులు నిర్వహిస్తున్నారు. అధికారుల వాహనాలు నడిపేవారు కావడంతో... వీరిలో కొందరు ఆయా స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులను నేరుగా కలిసి పంచాయితీలు చేస్తున్నారు. ప్రైవేటు డ్రైవర్లను తొలగించాలని జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేసినా మార్కాపురంలో మాత్రం అది అమలు కావడం లేదు. పట్టణానికి చెందిన ఓ మాజీ సైనికోద్యోగి సైతం వీరితో జత కలిశాడు. అధికారులు ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు అతడి కారును పంపిస్తుంటాడు. ఆ పరిచయాలతో దందా సాగిస్తున్నాడు. పలువురు అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

అనధికారిక బాసులు...

ఆయా స్టేషన్లలో నిత్యం సెటిల్‌మెంట్లు చేస్తూ వీరే అనధికారిక బాసుల్లా మారారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నలభై రోజుల క్రితం కొందరు జూదరులను పోలీసులు పట్టుకున్నారు. ఆ క్రమంలో మరి కొందరు పరారయ్యారు. సదరు డ్రైవర్లు వారి సమాచారం తెలుసుకుని... తలా కొంతమొత్తం సేకరించి వారిపై కేసుల్లేకుండా చేసినట్లు సమాచారం. నెల రోజుల క్రితం... తిప్పాయపాలెం శివారులో కారు ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. కేసు తీవ్రత తగ్గించేందుకు పంచాయితీ చేసి సదరు కారు డ్రైవర్ నుంచి రూ.లక్ష మేర తీసుకున్నట్లు తెలిసింది. సివిల్ కేసుల్లోనూ కొందరు తలదూరుస్తున్నట్లు తెలిసింది. విషయాన్ని డీఎస్పీ యు.నాగరాజు దృష్టికి తీసుకువెళ్లగా... విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేసులు, సెటిల్‌మెంట్లు పేరిట ఎవరైనా వేధిస్తే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఆన్‌లైన్ వేదిక... అతివకు ఆసరా!

◗ స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ ◗ పూర్తయిన కసరత్తు... త్వరలో అందుబాటులోకి

సంతనూతలపాడు మండలం చిలకపాడుకు చెందిన చప్పిడి కోమలి... కొప్పోలులో నిర్వహిస్తున్న చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీ యూనిట్

న్యూస్‌టుడే, ఒంగోలు కలెక్టరేట్

అతివల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెట్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తోంది. తద్వారా ఇంటి నుంచే వివిధ ప్రాంతాల వినియోగదారులకు విక్రయాలు సాగించే వెసులుబాటు కలుగుతుంది.

జిల్లాలో 4 వేల మంది గుర్తింపు...

వ్యాపార నిర్వహణపై ఆసక్తి ఉన్న ఔత్సాహిక మహిళలను గుర్తించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించడంతో... క్షేత్రస్థాయిలో డీఆర్డీఏ సిబ్బంది ఆ వివరాలు సేకరించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు నాలుగు వేల మంది మహిళలు వివిధ రకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. వీటిలో నాణ్యమైన వాటిని గుర్తించి ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) వేదిక ద్వారా ఇంటి నుంచే విక్రయాలు సాగించేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పటి వరకు 298 మంది తయారు చేస్తున్న 1,192 రకాల ఉత్పత్తుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు.

" జిల్లాలో మొత్తం 1,536 గ్రామ సమాఖ్య సంఘాలు ఉండగా... ప్రతి సమాఖ్య నుంచి ఏదో ఒక ఉత్పత్తిని అమ్మకాల నిమిత్తం ఆన్‌లైన్‌లో ఉంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

బ్యాంకు రుణాలు సైతం...

అధికారులు ఎంపిక చేసిన వాటిలో వివిధ రకాల ఊరగాయలు, పచ్చళ్లు, కారం, మల్టీగ్రెయిన్ పిండి, తేనె, గానుగ నూనె, ఫినాయిల్, చీపుర్లు, బేకరీ, నూడుల్స్, సహజ సిద్ధమైన ఉత్పత్తులు ఉన్నాయి. సేవా రంగానికి సంబంధించి సెంట్రింగ్ పనులు, కారు ట్రావెల్స్, టెంట్ హౌస్‌లు, డీజే సౌండ్ సిస్టమ్ వంటివి ఉన్నాయి. ఈ యూనిట్ల ఏర్పాటు, నిర్వహణ నిమిత్తం మహిళలకు 35 శాతం రాయితీపై బ్యాంకు రుణాలు సైతం మంజూరు చేయిస్తున్నారు. త్వరలోనే ఆన్‌లైన్ వేదికగా ఆయా ఉత్పత్తుల విక్రయాలు, సేవలు అందుబాటులోకి వచ్చేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇది పూర్తయితే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ మాదిరిగానే ఈ వేదిక నుంచీ కొనుగోళ్లు చేయవచ్చు.

" ఈ ఉత్పత్తులన్నీ నాన్ జీఎస్టీ విభాగంలో ఉంచడం వల్ల వినియోగదారులకు తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చే వీలుంది. తద్వారా అమ్మకాలు పెరిగి మహిళలకు లాభదాయకంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

శివలింగంలా కట్టి... గంగను ఒడిసి పట్టి!

మార్కాపురం - శ్రీశైలం దారిలో పెద్దారవీడు మండలం కాశినాయన ఆశ్రమంలోని శివాలయం వెనుక నిర్మించిన వాటర్ ట్యాంకు ఇది. వినూత్నంగా శివలింగాకృతిలో ఇలా నిర్మించారు. ఆ మేరకు రంగులేసి హంగులద్దడంతో... దగ్గరగా వచ్చి తదేకంగా చూస్తే తప్ప ఇదో నీటి తొట్టె అని గుర్తించడం కష్టం. ప్రత్యేకంగా ఉండడంతో అటుగా వెళ్లేవారంతా ఆసక్తిగా దీనిని తిలకిస్తున్నారు.

- ఈనాడు, ఒంగోలు; న్యూస్‌టుడే, పెద్దారవీడు

దొనకొండలో డీఆర్‌డీవో అధికారులు

◗ రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుకు స్థల పరిశీలన

దొనకొండ, న్యూస్‌టుడే: దొనకొండ పంచాయతీ బాదాపురంలోని ఏపీఐఐసీకి చెందిన భూములను డీఆర్‌డీవో బృందం సభ్యులు ఆదివారం పరిశీలించారు. రక్షణ రంగానికి చెందిన పరిశ్రమల ఏర్పాటుకు 100 ఎకరాల మేర భూమి అవసరమని దిల్లీ, బెంగళూరుకు చెందిన డీఆర్‌డీవో ప్రతినిధులు చెప్పినట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్‌మోహన్ తెలిపారు. కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి... దొనకొండలోని బ్రిటిష్ కాలం నాటి విమానాశ్రయం భూములను సైతం చూపించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే సమృద్ధిగా నీరు లభిస్తుందని, రవాణా మార్గం కూడా అందుబాటులో ఉందని తెలిపారు. రక్షణ పరికరాల తయారీకి ఇక్కడ అన్నివిధాలా సౌకర్యంగా ఉంటుందని అధికారులు వారికి వివరించారు. తహసీల్దార్ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ నాగార్జున, సర్వేయర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బాదాపురంలో భూములను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో అధికారులు



శాకంబరీ నమోస్తుతే!

ఆషాఢమాసం సందర్భంగా పొదిలిలోని వాసవీ కన్యకా పరమేశ్వరిని వివిధ రకాల పండ్లు, కూరగాయలతో ఆదివారం శాకంబరిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. - న్యూస్‌టుడే, పొదిలి

చుక్కల జింకకు ఆపద

● జనావాసాల్లోకి వస్తూ మృత్యువాత

పునుగోడు ప్రాంతంలో చుక్కల జింకల సంచారం

కుక్కల దాడికి భయపడి పామూరు రోడ్డులోని కాలువలో చిక్కుకుందిలా...

న్యూస్‌టుడే - వెలిగండ్ల

కనిగిరి అటవీ ప్రాంతం వన్యప్రాణులకు అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతం. దుప్పులు, కణుతులు, కుందేళ్లు వంటివి ఇక్కడ సంచరిస్తున్నా.. సంఖ్యా పరంగా చుక్కల జింకలు ఎక్కువ. కనిగిరి, పామూరు, వెలిగండ్ల, సీఎస్‌పురం, హనుమంతునిపాడు, పీసీ పల్లి మండలాలు; నెల్లూరు జిల్లా పరిధిలోని వలేటివారిపాలెం, చుండి, అయ్యవారిపల్లి, లింగసముద్రం, మాలకొండ, మొగిలిచెర్ల, అరిపాలెం తదితర ప్రాంతాల్లో వీటి సంచారం ఎక్కువ. దాదాపు రెండు వేల వరకు ఉన్నట్లు అటవీ అధికారుల అంచనా. క్రమేణా పెరుగుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా... అడవుల నరికివేత కారణంగా మేత, నీటి వసతి కొరవడి సమీప పొలాలు, గ్రామాల్లోకి వచ్చి ప్రమాదంలో చిక్కుకుంటున్నాయి.

◗ ముప్పు వాటిల్లుతోందిలా...: కొద్ది రోజుల క్రితం పీసీపల్లిలోకి ఓ జింక వచ్చింది. కుక్కలు వెంటపడడంతో పామూరు రోడ్డులోని ఓ మురుగు కాల్వలో మరోటి చిక్కుకుంది. కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోకి వచ్చిన ఇంకో జింకపై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. స్థానికులు సకాలంలో గుర్తించడంతో వాటికి తగిన చికిత్స అందించి అటవీ ప్రాంతంలోకి పంపారు. కొందరు వేటగాళ్లు వీటి కోసం ఉచ్చులు బిగిస్తూ... మాంసాన్ని విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

◗ అవగాహన కల్పిస్తున్నాం...: 'చుక్కల జింకల సంరక్షణకు ఏర్పాట్లు చేస్తున్నామ'ని కనిగిరి రేంజ్ అటవీ అధికారి టి.మహేశ్వరరెడ్డి తెలిపారు. నీటి కోసం అవి బయటకు రాకుండా అడవిలోనే సాసర్ పిట్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. దారి తప్పి గ్రామాల్లోకి వచ్చే జింకలు, ఇతర వన్యప్రాణులకు ఎలాంటి హాని కలిగించొద్దని అటవీ సమీప గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఎవరైనా వాటిని వేటాడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ముందు పాక... ఆపై పాగా!

◗ కనిగిరి ప్రధాన రహదారుల్లో యథేచ్ఛగా ఆక్రమణలు

కనిగిరి పట్టణ ప్రధాన రహదారుల్లో ఆక్రమణలు పెరుగుతున్నా అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. ఇదే అదునుగా ఒకరిని చూసి మరొకరుగా షెడ్లు నిర్మిస్తున్నారు. దీంతో ఆయా మార్గాలు ఇరుగ్గా మారి ట్రాఫిక్ చిక్కులు తలెత్తుతున్నాయి. -న్యూస్‌టుడే, కనిగిరి

తొలగించినా యథాస్థితే...

కనిగిరి నుంచి పామూరు, కందుకూరు, పొదిలి వెళ్లే ప్రధాన రహదారులకు ఇరువైపులా కిలోమీటరు మేర ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. మొదట పాకలు వేసి... తరువాత శాశ్వతంగా పాగా వేస్తున్నారు. కొందరు పూర్తిస్థాయి నిర్మాణాలు చేపడుతున్నారు. గత ఏడాది మున్సిపాలిటీ, ఆర్ అండ్ బీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించారు. తరువాత కొద్ది రోజులకే పరిస్థితి మామూలు... తరువాత యథా పరిస్థితి నెలకొంది. కాలువలను పూర్తిగా మూసేయడంతో వరద, మురుగు పోయే దారిలేక... వర్షాల సమయంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరోవైపు రహదారులు కుంచించుకుపోయి ఎదురెదురు వాహనాలు తప్పుకోవడమూ కష్టమవుతోంది.

కాలువ మూసేసి ఏర్పాటు చేసిన షెడ్డు

స్వాధీనానికి చర్యలేవీ...

కనిగిరి పట్టణం మాచవరం సమీపంలోని ఆరెకరాల ప్రభుత్వ భూమిని వైకాపా నేతలు ఆక్రమించి నిర్మాణాలు సాగించారు. కొన్నాళ్ల క్రితం ఆయా కట్టడాలను తొలగించారు. కాశిరెడ్డినగర్ ఎదుట మరో పదెకరాల ప్రభుత్వ భూమిని ... సృష్టించి నిర్మించిన కట్టడాలను సైతం కూల్చారు. ఇంత వరకు బాగానే ఉన్నా... ఆయా స్థలాల స్వాధీనానికి నేటికీ చర్యలు తీసుకోలేదు. దీంతో ఆక్రమణదారులు మళ్లీ తమ ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈఈ ఫిరోజ్ మాట్లాడుతూ... ఆక్రమణల తొలగింపు చేపడుతున్నామని, తమ శాఖ స్థలం ఎంతవరకు ఉంటే అంతవరకు కొలతలు వేయించి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

టిడ్కో ఇళ్లు... చూస్తే కన్నీళ్లు!

◗ గత ప్రభుత్వ తీరుతో లబ్ధిదారులకు అవస్థలు

న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

గత వైకాపా ప్రభుత్వ తీరుతో గిద్దలూరులోని టిడ్కో గృహ లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దాదాపుగా పూర్తయిన నిర్మాణాలు అప్పగించ లేదు. పైపెచ్చు... పనులు ప్రారంభం కాలేదంటూ మరి కొన్ని రద్దు చేసింది. వీరికి తమ వాటాగా చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాల్సి ఉన్నా ఆ దిశగానూ చర్యలు తీసుకోక నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమను ఆదుకుంటుందని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారిన గృహ సముదాయం

గాలికొదిలేసిన వైకాపా...

గిద్దలూరు - నంద్యాల రహదారిలో ఉద్యానశాఖకు చెందిన స్థలంలో టిడ్కో గృహ సముదాయం పనులు చేపట్టారు. ఇందుకోసం పట్టణంలోని 1,392 మంది లబ్ధిదారులను అప్పట్లో గుర్తించారు. 300 చ.అ. విస్తీర్ణం కలిగిన ఇళ్లు 864; 355 చ.అ... 336, 400 చ.అ. విస్తీర్ణంలో రెండు పడకల ఇళ్లు 192 నిర్మించేందుకు నిర్ణయించారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు 300, 365 చ.అ. నిర్మాణాలను దాదాపుగా పూర్తి చేశారు. రెండు పడకలకు వచ్చే సరికి 44 గృహాల పనులే ప్రారంభించారు. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం మిగతా వాటిని రద్దు చేసింది. అప్పటికే దాదాపుగా పూర్తయిన వాటినీ గాలికి వదిలేసింది. ప్రస్తుతం ఆయా ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు పెరిగి భవనాల రూపు రేఖలే మారిపోయాయి.

రద్దు చేసినా చెల్లింపుల్లేవు...

రెండు పడకల ఇళ్ల లబ్ధిదారుల్లో చాలా మంది తమ వాటాగా అప్పట్లోనే రూ.లక్ష చెల్లించారు. మరికొందరు వివిధ మొత్తాలు కట్టారు. ఎనిమిదేళ్లవుతున్నా నేటికీ ఇళ్లు అప్పగించలేదు. పూర్తిగా రద్దు చేసిన లబ్ధిదారులకు దాదాపు రూ.75 లక్షలు తిరిగి ఇవ్వాల్సి ఉన్నా అతీగతీ లేదు. ఎన్నికలకు ముందు వీరి బకాయిలు చెల్లింపు నిమిత్తం నగర పంచాయతీ ఖాతాకు నిధులు జమ చేసినా ఇప్పటికీ ఆ మొత్తాలు ఇవ్వలేదు. దీంతో అప్పులు తెచ్చి డబ్బులు కట్టిన వారంతా ప్రస్తుతం వాటికి వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది.

రూ.70.76 కోట్లు అవసరం...

గిద్దలూరు పట్టణ పరిధిలో వివిధ దశల్లో ఉన్న 1,248 నిర్మాణాల పూర్తికి రూ.58.84 కోట్లు అవసరమని టిడ్కో అధికారులు ప్రతిపాదనలు చేశారు. రహదారులు, నీటి సౌకర్యం, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.8.84 కోట్లు, ఎస్టీపీ పనులకు రూ.2.25 కోట్లు, విద్యుత్తు సౌకర్యానికి రూ.0.83 కోట్లు అవసరమని అంచనాలు పంపారు. ఇవి ఆమోదానికి నోచుకుంటేనే లబ్ధిదారులకు గృహయోగం సాకారమయ్యే అవకాశం ఉంది.

చిన్నారి జ్ఞాపకం... సరికొత్త ప్రపంచం

ఫొటో షూట్‌కు వినియోగిస్తున్న పరికరాలు

ప్రీవెడ్డింగ్, ప్రో వెడ్డింగ్ ఫొటో షూట్‌లు మనకు తెలుసు. తాజాగా అప్పుడే పుట్టిన శిశువుల నుంచి రెండేళ్ల లోపు చిన్నారుల కోసం ప్రత్యేకంగా బేబీ ప్రాప్ స్టూడియోలు వెలుస్తున్నాయి. వీటికి ఆదరణ పెరుగుతుండడంతో ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని ఇతర పట్టణాల్లో ఆరు వరకు ఏర్పాటయ్యాయి. వివిధ రకాల థీమ్‌లతో చిన్నారుల హావభావాలను సహజ సిద్ధంగా చిత్రీకరించడమే వీటి ప్రత్యేకత. ఈ ఫొటోగ్రఫీలో భాగంగా చిన్నపిల్లలకు టవల్ చుట్టడం (ర్యాపింగ్), ఏడవకుండా చేయడం, నిద్రపుచ్చడం వంటి అంశాలపై హైదరాబాద్‌లో శిక్షణ సైతం తీసుకుంటుండడం గమనార్హం. వైద్యులు, ఐటీ తదితర రంగాల్లో ఉన్నవారు తమ పిల్లలకు ఈ తరహా ఫొటోలు తీయించేందుకు ఎక్కువగా వస్తున్నారని నగరానికి చెందిన ఓ స్టూడియో నిర్వాహకుడు చెప్పారు. - న్యూస్‌టుడే, టంగుటూరు

సాగర్ కాలువలకు కొత్తరూపు

◗ త్రిపురాంతకం సబ్ డివిజన్‌లో చురుగ్గా పనులు

న్యూస్‌టుడే - త్రిపురాంతకం గ్రామీణం

అయిదేళ్ల వైకాపా పాలనలో నిర్లక్ష్యానికి గురైన సాగర్ కాలువల మరమ్మతులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. చివరి ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్ డివిజన్ పరిధిలోని 14 మేజర్, మైనర్ కాలువలకు రూ.75 లక్షలు కేటాయించింది. ప్రస్తుతం ఆ పనులు తుది దశకు చేరాయి.

నీరొచ్చేలోగా పూర్తి...

ఈ సబ్ డివిజన్‌లో 25 వేల ఎకరాల సాగర్ ఆయకట్టు ఉంది. గుంటూరు-ప్రకాశం జిల్లాల సరిహద్దు 137వ కి.మీ (85/3వ మైలు) నుంచి 172వ కి.మీ (107వ మైలు) దూపాడు వంతెన వరకు... 14 మేజర్ కాలువల పరిధిలో తొమ్మిది సాగు నీటి సంఘాలు, ఓ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉన్నాయి. 2018 తర్వాత కాలువల మరమ్మతులను పూర్తిగా విస్మరించడంతో... కట్టలకు ఇరువైపులా చిల్లచెట్లు పెరిగి చిట్టడవుల్లా మారాయి. పూడిక ఏర్పడి నీరు దిగువకు చేరకుండా కట్టలపై పొంగిపొర్లుతూ వృథాగా పోయేది. ఈ నేపథ్యంలో రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం కాలువల అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. దీంతో ప్రధాన కాలువను బాగు చేసి... కరకట్టపై గుంతలను పూడ్చి రవాణాకు వీలుగా మారుస్తున్నారు. ఆ పరిధిలోని మేజర్, మైనర్లలో 120 కి.మీ. మేర పిచ్చి మొక్కలు తొలగించి పూడికతీత పనులు చేస్తున్నారు. 'దాదాపు 80 శాతం పూర్తయ్యాయని... సాగు నీరు విడుదలయ్యేలోగా మిగతావీ పూర్తి చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామ'ని ఎన్నెస్పీ డీఈఈ విజయలక్ష్మి తెలిపారు.

అభివృద్ధి చేశాక అద్దంలా కనిపిస్తున్న ప్రధాన కాలువ



(c) eenadu

చిట్టి మెదడుకు హాయ్ బుజ్జియే నేస్తం

'ఈనాడు' క్లిప్పింగులతో బోధన

ఆ..పాఠశాలలో చేరిన చిన్నారులకు ఆయన పలక, బలపం అందించరు. 'ఈనాడు' హాయ్ బుజ్జి, ఆదివారం అనుబంధంలో వచ్చిన కథలు, పజిల్స్, ఇతర విభిన్న అంశాలే వారికి చదువుల నేస్తాలు. అందులో వచ్చిన వాటితో కృత్యాంశాలు తయారుచేసి బుల్లి మెదడుకు పదును పెడతారు. చిట్టి చేతులతో బొమ్మలు వేయిస్తారు వెలిగండ్ల మండలం మొగళ్లూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జడ్డు రమణయ్య. బుడతల వికాసానికి 'ఈనాడు'లో ఇస్తున్న అంశాలను అట్టలపై అతికించి ఆయన చేస్తున్న బోధన ఆకట్టుకుంటోంది. వాటి ద్వారా బోధిస్తే చిటికెలో అర్థమవుతోందని ఉపాధ్యాయుడు రమణయ్య అభిప్రాయపడ్డారు. గత ఇరవై ఏళ్లుగా ప్రచురితమైన పేజీలను భద్రపరిచి అట్టముక్కలపై అంటించి ప్రపంచంలోని వింతలు, విశేషాలు వివరిస్తున్నారు. మంచిమాట, ఇలా చేద్దాం..ఇవి మానేద్దాం, పొడుపు కథలు, సామెతలు, బాలభారతంలోని కథలు, పద వినోదం, సిసింద్రీ, కనుక్కోండి చూద్దాం, రంగులేద్దాం తదితర అంశాలను అట్టలపై అంటించి చిన్నారులతో పూర్తి చేయిస్తున్నారు. కనిగిరి, వెలిగండ్ల, హనుమంతునిపాడు మండలాల్లోని వివిధ స్కూళ్లలో ఆయన చేసిన వినూత్న బోధనను గ్రామస్థులు ప్రశంసిస్తున్నారు. – న్యూస్‌టుడే, కనిగిరి, వెలిగండ్ల

నిర్లక్ష్యం సదా.. అర్ధాయుష్మాన్ భవా

● వైకాపా నిధుల మళ్లింపుతో నిలిచిన క్లినిక్‌లు

గ్రామ స్థాయిలోనే మెరుగైన వైద్య సేవలందిస్తామంటూ గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు పూర్తికాకపోవడంతో గ్రామస్థులకు కష్టాలు తప్పడం లేదు. కేంద్రం ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా వీటికి తమ వాటా నిధులందించినా..రాష్ట్రం ప్రభుత్వం వాటిని వేరే వాటికి మళ్లించడంతో ఇవన్నీ ఉత్సవ విగ్రహాల్లా మిగిలాయి. దీంతో అద్దె భవనాలు, గ్రామ సచివాలయాల్లో అసౌకర్యాల మధ్య నడుపుతున్నారు. కూటమి పాలకులు వీటిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

దరగా వెళ్లే దారిలో వృథాగా ఉన్న క్లినిక్

మండ్లవారి వీధిలో అద్దె గదిలో వైద్య సేవలు

న్యూస్‌టుడే, బేస్తవారపేట

జిల్లావ్యాప్తంగా 492 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ.20.08 లక్షల అంచనా వ్యయంతో మొత్తం రూ.99 కోట్లను వెచ్చించారు. వాటిలో 418 భవన నిర్మాణాలు ప్రారంభించగా, అందులో 367 పునాది, ఆపై స్థాయిలో ఉండగా మిగతావి పునాదికి దిగువన ఉన్నాయి. వాటికి కేంద్ర వాటా నిధులిచ్చినా వైకాపా ప్రభుత్వం వేరే అవసరాలకు మళ్లించడంతో గుత్తేదారులకు బిల్లులు అందలేదు. దీంతో వారు ఎక్కడికక్కడే నిలిపేశారు. కొన్నింటిని పూర్తిచేసిన విద్యుత్తు, నీరు తదితర మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో అద్దె, సచివాలయ భవనాల్లోకి మార్చారు. అక్కడ సౌకర్యాలు లేక విలువైన వైద్య సామగ్రి మూలకు చేరుతోంది. బేస్తవారపేట సచివాలయం-1 కింద దరగా వెళ్లే దారిలో క్లినిక్ భవనాన్ని పూర్తిచేసి వైద్యశాఖకు అప్పగించారు. అయితే విద్యుత్తు, నీటి సౌకర్యం లేకపోవడంతో ఎంఎల్‌హెచ్‌పీ నాగమణి సిబ్బందితో మండ్లవారి వీధిలోని ఓ అద్దె ఇంట్లో రోగులకు వైద్య సేవలంస్తున్నారు.

12 రకాల వైద్య సేవలు..

గత వైకాపా ప్రభుత్వం 2,500 జనాభాకు ఒకటి చొప్పున గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. క్లినిక్‌లలో 12 రకాల వైద్యసేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. టెలీ మెడిసిన్ ద్వారా పీహెచ్‌సీ వైద్యుడితో పాటు హబ్‌లోని జనరల్ మెడిసిన్, గైనిక్, పీడియాట్రిషన్ వంటి స్పెషలిస్ట్ వైద్యుల కన్సల్టేషన్ సేవలు ప్రజలందుతాయి. దీనిపై పంచాయతీరాజ్‌శాఖ డీఈ సుబ్బారెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా..గత వైకాపా ప్రభుత్వం క్లినిక్‌ల నిర్మాణాలు చేపట్టకముందే సిబ్బందిని కేటాయించిందన్నారు. కొత్త ప్రభుత్వానికి సమస్య నివేదించి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు

బదిలీ ఉపాధ్యాయులకు జీతాలివ్వాలి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు కోరారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో షేక్ అబ్దుల్ హై అధ్యక్షతన జిల్లా కార్యదర్శివర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కొమ్మోజు మాట్లాడుతూ బదిలీలు పూర్తయి నెలరోజులైనా కొత్త పోస్టులకు పొజిషన్ ఐడీలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడుతూ బదిలీ అయి కూడా రిలీవర్స్ రాక చాలామంది ఉపాధ్యాయులు పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారన్నారు. డీఎస్సీ పోస్టులిచ్చినా కూడా జిల్లాలో 500 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉంటాయన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని అర్హతగల అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలన్నారు. అబ్దుల్‌హై మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వచ్చాక పాత పీఆర్‌సీ కమిటీని రద్దు చేయడం తప్ప ఇంకేమీ చేయలేదన్నారు. మూడు డీఏలు పెండింగ్‌లో ఉండగా కనీసం ఒకటి కూడా ఇవ్వలేదన్నారు. అనంతరం ఎస్టీఎఫ్ఐ 9వ ఆలిండియా ట్రైనియల్ కాన్ఫరెన్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు రవి, ఉమామహేశ్వరి, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగానికి ప్రభుత్వం చేయూత

సింగరాయకొండ గ్రామీణం, టంగుటూరు న్యూస్‌టుడే: రాష్ట్రంలో రవాణా రంగం అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వాహనాలపై హరిత పన్ను తగ్గించామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయ స్వామి అన్నారు. టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలోని మంత్రి నివాసం వద్ద ఆదివారం సింగరాయకొండ లారీ యూనియన్ నాయకులు ఆయన్ను గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైకాపా పాలనలో రవాణా రంగం కుదేలైందని, అధిక సుంకాలు విధించి దోచుకున్నారని విమర్శించారు. అనంతరం సింగరాయకొండ లారీ యూనియన్ కార్యాలయం వద్ద చంద్రబాబు, పవన్, స్వామి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర లారీ యూనియన్ ఉపాధ్యక్షుడు శేషగిరి, లారీ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపాలెంలో మంత్రి స్వామిని సత్కరిస్తున్న లారీ యూనియన్ నాయకులు

బాధితులకు చేయూత : టంగుటూరు : మండలంలోని యం.నిడమానూరుకు చెందిన చాట్రగడ్డ రాకేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీ అందజేశారు. దీంతో మంత్రి స్వామి తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం రూ.1.13 లక్షల చెక్కును అందజేశారు. గ్రామ తెదేపా నాయకులు అంజిబాబు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం సాంబమూర్తినగర్‌లోని ఆదిత్య మహిళా కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా డా.నల్లమిల్లి సుగుణ (తూర్పుగోదావరి), కార్యదర్శిగా గుణ్ణం కృష్ణమోహన్ (పశ్చిమగోదావరి), కోశాధికారిగా ఆకుల చంద్రకళావతి(కడప), ఉపాధ్యక్షురాలుగా కె.సూర్యలక్ష్మీదేవి(గుంటూరు), సహాయ కార్యదర్శిగా జి.నవీన్(ప్రకాశం), కార్యవర్గ సభ్యులుగా నంద్యాల రాధిక, డి.అశోక్ బాబు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం 2025-29 వరకు కొనసాగుతుందని అసోసియేషన్ మెంటార్ నాగం సతీష్ తెలిపారు.

24న సెక్యులర్ భారత రాజ్యాంగంపై సదస్సు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో ఈ నెల 24న ఉదయం 10.30 గంటలకు సెక్యులర్ భారత రాజ్యాంగం లాల్, నీల్ మైత్రి ఆవశ్యకత సదస్సు నిర్వహించనున్నట్లు డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలను నీరుగార్చడానికి మతం, కులం ఆధారంగా ప్రాంతీయతత్వాన్ని పెంచారని విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణ, మను వాదానికి వ్యతిరేకంగా సెక్యులర్ వాతావరణాన్ని పెంపొందించడానికి లాల్, నీల్ శక్తుల మైత్రి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్‌రావు, పలు సంఘాల నాయకులు సంత వేలూరి కోటేశ్వరరావు, ఎం.మల్లికార్జునరావు, అంగలకుర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నేడు రొయ్య రైతుల ధర్నా

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: రొయ్య రైతుల సమస్యల పరిష్కారానికి కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఉమ్మడి ప్రకాశం రొయ్య రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు సంఘం గౌరవాధ్యక్షుడు మార్నేని వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు ఈదర యశ్వంత్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా రొయ్యల మేత కిలోకు రూ.9 తగ్గింపును అమలు చేయాలన్నారు. విద్యుత్తు యూనిట్ ధర రూపాయిన్నర అమలు చేయాలని కోరారు. జిల్లాలోని రొయ్యరైతులందరూ ఆందోళనా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఆదివారం నెక్ విజయవాడ జోన్ సూచించిన హోల్‌సేల్ ధర ఫాం గేటు ధర 100 గుడ్లకు రూ. [illegible] ... రూ.590/-

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కేజీ కి రూ.ల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 120, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234

యువకుడిని కాపాడిన మత్స్యకారులు

కొత్తపట్నం, న్యూస్‌టుడే: సముద్రంలో కొట్టుకుపోతున్న ఓ యువకుడిని మత్స్యకారులు కాపాడిన సంఘటన కొత్తపట్నం మండలం మడనూరు తీరంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ వివరాల ప్రకారం..రాజుపాలేనికి చెందిన విశ్వజిత్ ఆదివారం మడనూరు తీరానికి వెళ్లి సముద్ర స్నానం చేస్తూ కెరటాల తాకిడికి కొట్టుకుపోతుండగా, స్థానిక మత్స్యకారులు గుర్తించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అదే సమయంలో మరో వ్యక్తి సముద్రంలో కొట్టుకుపోతుండగా తాము కాపాడినట్లు మత్స్యకారులు చెబుతున్నారు. అయితే ప్రాణాలు దక్కించుకున్న విశ్వజిత్ మాత్రం [illegible] లేదని చెప్పడం గమనార్హం.

మాట్లాడుతున్న జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జయప్రకాశ్

సైన్స్ ద్వారానే సమాజాభివృద్ధి

కనిగిరి, న్యూస్‌టుడే: సైన్సు ద్వారానే సమాజాభివృద్ధి చెందుతుందని జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జయప్రకాశ్ తెలిపారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన జేవీవీ మహాసభలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించేతత్వం, సృజనాత్మకతను పెంపొందించడానికి ఎన్నో ఏళ్లుగా చెకుముకి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇతర రాష్ట్రాల మాదిరి రాష్ట్ర అసెంబ్లీలో కూడా మూఢ నమ్మకాల నిరోధక చట్టం చేయాలన్నారు. ఇటీవల విద్యారంగంలో, శాస్త్ర సాంకేతిక రంగాలకు అధిక ప్రాధాన్యత్వివ్వాలన్నారు. ఆగస్టు 9,10 తేదీల్లో గిద్దలూరులో జరిగే జేవీవీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖాజాహుస్సేన్, వి.మాలకొండారెడ్డి, టి.పెద్దిరెడ్డి, బ్రహ్మారెడ్డి, గంగయ్య, రత్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

నినదిస్తున్న ఐద్వా ప్రతినిధులు

లింగ సమానత్వం కోసం ఉద్యమం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: లింగ సమానత్వం కోసం ఉద్యమించాలని వైద్యురాలు ఎన్.ఉదయని కోరారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఆదివారం ఐద్వా ఒంగోలు నగర 12వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సామాజికంగా వెనుకంజలో ఉన్న మహిళలకు విద్య, ఉపాధి అవకాశాలు మరింత విస్తృతంగా అందించడం ద్వారా సమాజం వేగంగా అభివృద్ధి చెందేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కుటుంబంలోనూ, సమాజంలోనూ అడ్డంకులు ఎదురవుతున్నా వాటిని అధిగమిస్తూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వస్తున్నారన్నారు. నేటికీ కొన్ని పాత సంప్రదాయాలు, కట్టుబాట్ల పేరుతో బాల్య వివాహాలు చేయడం, చిన్న వయసులోనే ప్రసవించడం వంటి వాటికి అడ్డుకట్ట వేయాలన్నారు. మహిళలకు పోషకాహారం అందుబాటులో లేక రక్తహీనత సమస్య వస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి, నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.గోవిందమ్మ, జి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. తొలుత ఐద్వా జెండావిష్కరణ జరిగింది.

పరిమితి దాటితే పగాకే

● పొగాకు సాగు తగ్గించాలని ప్రచారం

న్యూస్‌టుడే, పొదిలి

పరిమితికి మించి పొగాకు సాగుచేయడం..అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేక పోవడంతో జిల్లాలో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇది గత కొన్నేళ్లుగా పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో వారు పంట నియంత్రణ పాటించేలా పొగాకు బోర్డు విస్తృత ప్రచారం చేస్తోంది. ప్రపంచంలోనే వర్జీనియా పొగాకు ఉత్పత్తిలో మూడో స్థానం, ఎగుమతుల్లో రెండోస్థానంలో దేశముంది. అయితే ఇతర దేశాల్లో పొగాకు ఉత్పత్తి పెరిగిన నేపథ్యంలో ఇటీవల కొంత ఇబ్బందికర వాతావరణం నెలకొనడంతో ఈ చర్యలకు ఉపక్రమించింది.

జిల్లాలో వచ్చే సీజన్‌లో ఎస్‌బీఎస్ పరిధిలో రూ.42.10 మి.కిలోలు, ఎస్ఎల్ఎస్ పరిధిలో 48.10 మి.కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతించింది. ఒక్కో బ్యారన్‌కు ఎస్‌బీఎస్‌లో 35.65 క్వింటాళ్లు, ఎస్ఎల్ఎస్‌లో 36.65 క్వింటాళ్లు పండించేందుకు అంగీకరించింది. ఉత్పత్తి తగ్గినా నాణ్యమైన దిగుబడులు సాధిస్తేనే రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తాయని అధికారులు చెబుతున్నారు. పొగాకుతో పాటు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని కోరుతున్నారు. అందుకోసం ఇప్పటి నుంచే నాణ్యమైన దిగుబడులపై దృష్టి సారించాలని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. పొగాకు రైతులు విధిగా పచ్చిరొట్ట పైర్లు సాగుచేసి భూసారాన్ని పెంచుకుని తద్వారా పొగాకు దిగుబడి, నాణ్యత పెంచాలని బోర్డు అధికారులు కోరుతున్నారు. అనధికారికంగా పొగాకు బ్యారన్లు నిర్మించుకోవడం, అధిక మొత్తంలో కౌలుకు బ్యారన్లు లీజుకు తీసుకోవడం, భూములు కౌలుకు తీసుకొని పంట సాగు చేయొద్దని ఈ సందర్భంగా రైతులకు సూచిస్తున్నారు. బోర్డు నిర్దేశించిన మొత్తంలోనే పంట పండించాలని ఇప్పటి నుంచే చైతన్యపరుస్తున్నారు. ప్రతిరోజు వేలం కేంద్రాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

రైతుల ఇంటి వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తున్న పొగాకు బోర్డు క్షేత్రాధికారులు

యువకుడి కలలు కల్లలు

◆ ఇంటికి దూరం కాలేక బలవన్మరణం

కంభం, న్యూస్‌టుడే : దూర ప్రాంతానికి వెళ్లి చదువుకోవడం ఇష్టం లేని ఆ యువకుడు మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి కంభం పట్టణంలో రహమత్ నగర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై నరసింహారావు కథనం మేరకు.. గిద్దలూరుకు చెందిన కుంచాల రంగనాథ్, సునీత దంపతులకు ఇద్దరు పిల్లలు. ఇటీవల కాలంలో భార్యాభర్తల నడుమ మనస్పర్థలు రావడంతో ఇరవై రోజుల కిందట సునీత కుమారుడు అంజనీకమల్ (18), కూతురితో గిద్దలూరు నుంచి కంభానికి వచ్చి ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. కుమారుడికి మహారాష్ట్రలోని పాలిటెక్నిక్ కళాశాలలో సీటు వచ్చింది. అక్కడికి వెళ్లి చదువుకోవాలని తల్లి గట్టిగా చెప్పారు. జేఈఈ కోచింగ్ తీసుకొని చదువుకుంటానని అతను తల్లికి చెప్పాడు. ఈ విషయంపై ఇద్దరికీ చిన్నపాటి వాదన జరిగింది. పాలిటెక్నిక్ చదవడం ఇష్టం లేని కుమారుడు ఇంట్లోని పంకాకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనతో స్థానికంగా విషాదం నెలకొంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంజనీకమల్ మృతదేహం

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు-కరవది స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం..శనివారం రాత్రి 11 గంటల సమయంలో తిరుపతి నుంచి లింగంపల్లి వెళ్తున్న నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ నుంచి జారిపడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతుని వయసు సుమారు 45 సంవత్సరాలుంటాయి. ఈ మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.

గాయపడిన యువకుడు : మార్కాపురం: ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మార్కాపురం గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పల్నాడు జిల్లా యడ్లపాడు మండలంలోని బోయపాలేనికి చెందిన బత్తుల సాంబశివరావు (32) వ్యక్తిగత పనుల నిమిత్తం ఈ నెల 15న మార్కాపురం వచ్చారు. అక్కడి నుంచి ఒంగోలు వైపు వెళ్తుండగా రాయవరం రైల్వే వంతెనపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డారు. ఆయన్ను మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించగా..అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంకమ్మరావు తెలిపారు.

ప్రమాద ఘటనపై కేసు నమోదు : అద్దంకి, న్యూస్‌టుడే : బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం శివారు ఇటుక బట్టీల వద్ద జరిగిన ప్రమాద ఘటనపై అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఏఎస్ఐ కె.సైదయ్య సమాచారం మేరకు ..ఒంగోలు బండ్లమిట్టకు చెందిన ఎన్.కోటయ్య- పద్మ దంపతులు ఈనెల 7న పూరిమెట్లలో కొలుపులకు హాజరై తిరుగు ప్రయాణమయ్యారు. తిమ్మాయపాలెం శివారుకు వచ్చిన తరువాత వీరి ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని మంగళగిరి ఎన్నారై ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

అర్ధాంగి ఒడిలోనే కన్నుమూసి..

● రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కుమార్తెకు మంచి భవిష్యత్తు ఇచ్చానన్న ఆనందం ఆ తండ్రికి కొన్ని గంటల్లోనే ఆవిరైంది. ఆమెను కళాశాలలో జాయిన్ చేసి వస్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రక్తమోడుతూ అర్ధాంగి చేతుల్లోనే కన్ను మూయడం స్థానికులను కలచివేసింది. ఈ సంఘటన ఆదివారం సింగరాయకొండ మండలం కలికివాయ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై మహేంద్ర తెలిపిన వివరాల ప్రకారం..నెల్లూరు జిల్లా కందుకూరు మండలం పలుకూరుకు చెందిన షేక్ సుభానీ బాషా, ఆఫ్రిన్ దంపతులు. సుభానీ స్థానికంగా దర్జీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయనకు భార్య ఆఫ్రిన్, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కుమార్తెకు మంచి భవిత ఇవ్వాలని.. : సుభానీ కుమార్తె మంచి ప్రతిభ చాటి తెలంగాణ రాష్ట్రం బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. దీంతో ఆమెను అక్కడ చేర్పించి శనివారం రాత్రి రైల్లో దంపతులిద్దరూ తిరుగుపయనమయ్యారు. ఆదివారం ఒంగోలులో దిగి ద్విచక్ర వాహనంపై పలుకూరుకు వస్తూ కలికివాయ సమీపంలో ఆగివున్న లారీని ఢీకొని రోడ్డుపై పడిపోయారు. భర్త తలకు తీవ్ర గాయమై రక్తమోడుతుండటంతో భార్య ఆఫ్రిన్ సపర్యలు చేస్తున్నారు. వెంటనే అక్కడున్న ప్రయాణికులు స్పందించి 108 వాహనంలో వారిని ఒంగోలుకు తరలిస్తుండగా, భార్య ఒడిలోనే ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పిల్లలకు మంచి భవిష్యత్తు ఇచ్చేందుకు సుభానీ తాపత్రయపడేవారని, రోడ్డు ప్రమాదంలో ఆయన మృతిచెందడంతో తమకు దిక్కెవరని భార్య కన్నీరుమున్నీరయ్యారు.

గాయపడిన సుభానీకు సపర్యలు చేస్తున్న భార్య ఆఫ్రిన్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9701112824
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008535779

EENADU Classifieds

BUSINESS SERVICES
EDUCATION
COACHING CENTRES
PEOPLE CARE
OLD AGE HOME
REAL ESTATE
PLOT FOR SALE
LEASE / RENT
గమనిక
JOBS

Wanted Female Computer Operators/Female Telecallers for an educational consultancy in Ongole salary 10-15k for more details contact: 90529 75353.

Evargo [illegible] 7337544439, 9014651068, 7075633416.

Jayalakshmi Arena, Nexa Maruti authorised dealers Guntur, Ongole, Hiring relationship manager & sales/relationship manager with auto mobile experience & freshers with Btech. MBA & any Degree qualification. Accountants with 3 years Exp. interviews on dt 21,22,23 Ph: 98661 79103, 81007 67082.

97011 12824
ఒంగోలు
80087 09902
మార్కాపురం
80081 11050
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500
Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

మార్కాపురం
• మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

పైపుల తరలింపు అడ్డగింత

ఈనాడు కథనానికి స్పందన

పైపుల లోడుతో ఉన్న లారీని అడ్డుకున్న ప్రజలు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: పదేళ్ల కిందట సాగర్ నీటి సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం రూ.8 కోట్లతో దుపాడు నుంచి వై.పాలెం వరకు పైపు లైన్ నిర్మించింది. ఈ పైపులైన్‌కి వినియోగించిన పైపులను గుత్తేతదారు పక్క నియోజవర్గానికి తరలిస్తుండగా ఆదివారం ప్రజలు అడ్డుకున్నారు. దొన కొండ, చందారంలో కొత్తగా నిర్మిస్తున్న పైపులైన్‌కు ఈ పాత పైపులైన్ గొట్టాలను వాడుకునేందుకు గుత్తేదారు ఒకరు యంత్రాలతో తొలగించారు. ఈ నెల 18న 'ఈనాడు'లో 'తాగునీటి ప్రత్యామ్నాయం.. తొలగింపు ఏం న్యాయం?' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ప్రజలు స్థానిక ఎమ్మెల్యే చంద్రశేఖర్ సహకారంతో దర్శి నియోజకవర్గం చందవరం ప్రాంతానికి పైపులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న లోడు లారీలను అడ్డుకున్నారు. తమ ప్రాంతానికి చెందిన పైపులైన్ తొలగించే అధికారం ఎవరికీ లేదని, భవిష్యత్తులో మరో పైపులైన్ కావాలంటే ఎక్కడ నుంచి తేవాలంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ విషయాన్ని మార్కాపురం సబ్‌కలెక్టర్ బి.సహదిత్ వెంకట త్రివినాగ్ మాట్లాడినట్లు ఆయన వాటిని ఆపు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం

కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

రాచర్ల, గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆకవీడు గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ పథకాన్ని త్వరలో అమలు చేయనున్నట్లు తెలిపారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోందని చెప్పారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కటికె. యోగానంద్, జీవనేశ్వరరెడ్డి, లక్ష్మిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, పిచ్చయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ◗ మసీదుల్లో పని చేసే ఇమామ్, మౌజన్లకు 9 నెలలుగా గౌరవేతనం అందక ఇబ్బందులు పడుతున్నారని, చొరవ తీసుకొని ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని ముస్లిం మత పెద్దలు ఆదివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి విన్నవించారు.

అనధికారిక కనెక్షన్లతో అవస్థలు

◗ నగర పంచాయతీ ఆదాయానికి గండి

పొదిలి, న్యూస్‌టుడే :

పాతూరులో అనధికారిక కనెక్షన్లు తొలగిస్తున్న నగర పంచాయతీ అధికారులు

పొదిలి నగర పంచాయతీలో అనధికారిక నీటి కనెక్షన్లతో కింద ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందడం లేదు. నగర పంచాయతీ రెండు రకాల నీటిని ప్రజలకు సరఫరా చేస్తుంది. దాహార్తి తీర్చేందుకు (తాగునీరు) సాగర్ నీరు, వాడుక నీటి కోసం (బుగ్గచలం) డీప్ బోరు నీటిని సరఫరా చేస్తున్నారు. దర్శి నుంచి పొదిలికి రావాల్సిన వాటా నీరు అందడం లేదు. వారంలో మూడు రోజులు నీళ్లు రావాల్సింది కనీసం రెండు రోజులు కూడా పూర్తిగా సరఫరా కావడం లేదు. వినియోగం పెరగడం, రావాల్సిన నీరు తగ్గడంతో ఏడాదంతా పొదిలిలో నీటి కష్టాలు తప్పడం లేదు. సుమారు దశాబ్దకాలంగా సాగర్‌నీటి పైపులైన్లపై అనధికారికంగా కనెక్షన్లు వేసుకోవడం, ఆ కుళాయిలకు మోటార్లు పెట్టడంతో పట్టణంలో నీటి కొరత ఏర్పడింది. పాతూరులోని ఓబులశెట్టివారివీధి, అమ్మవారిశాల, ఆంధ్రాబ్యాంకువీధి, మాయాబజార్, రథం రోడ్డు, దర్శి రోడ్డు తదితర ప్రాంతాల్లో బుగ్గచలం నీరు పూర్తిగా ఆగిపోయింది. ఆయా ప్రాంతాల్లోని సాగర్‌నీటి వీధి కుళాయిలకు సక్రమంగా తాగునీరు అందలేదు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు మోటార్లు పెట్టి నీటిని లాగేస్తున్నారు. కొత్తూరులోని విశ్వనాధపురం, కళాశాలరోడ్డు, బ్యాంకుకాలనీ, సబ్‌స్టేషన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లోను అనధికారిక కనెక్షన్లు ఉన్నాయి. దీంతో కింద ప్రాంతాల ప్రజలకు తాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదు. వాడుక నీటి అవసరాలను ఆయా ప్రాంతాల్లో డీప్‌బోర్ల ద్వార నీటిని సరఫరా చేస్తున్నారు. తాగునీటి అవసరాలకే మరింత ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. ఎక్కువ మంది ఎన్ఏపీ సంపువద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. అనధికారిక కనెక్షన్లు క్రమబద్ధీకరించడం వల్ల నగర పంచాయతీకి ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అన్ని ప్రాంతాలకు నీటిని అందించవచ్చు.

నగర పంచాయతీ జనాభా	: 36 వేలు
నగర పంచాయతీలో గృహాలు	: 12000
అధికారిక నీటి కనెక్షన్లు	: 1900.
అనధికారిక కనెక్షన్లు సుమారు	: 3500

గుర్తించి.. తొలగిస్తున్నాం

పొదిలి నగర పంచాయతీలో అనధికారిక తాగునీటి కనెక్షన్లను గుర్తిస్తున్నాము. ఇటీవల కొన్నింటిని గుర్తించి కనెక్షన్లు తొలగించాము. అనధికారిక కనెక్షన్లు తీసుకున్నవారు నగర పంచాయతీకి రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. సుమారు 60 మంది వరకు ముందుకు వచ్చారు. తాగునీటిని తాగేందుకు మాత్రమే పట్టుకోవాలి. అన్ని అవసరాలకు ఆ నీటిని పట్టుకోవద్దని చెబుతున్నాం. – కె.ఎల్.నారాయణరెడ్డి, కమిషనరు, పొదిలి.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

పొదిలి : మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంత లక్ష్మిలు అందజేశారు. ముల్లా షబ్బీర్‌కు రూ.1,40,329, రాములేటి మాబుకు రూ.25,000, షేక్ షెనవాజ్‌కు రూ.30,028, ఉప్పు రంగమ్మకు రూ.47,016, వీరిశెట్టి సుభాషిణికి రూ.25,574, రెడ్డిబోయిన చిన్న నరసింహంకు రూ.46,649, పొదిలి నరసమ్మకు రూ.70,090ల చెక్కున అందజేశారు

చెక్కులను మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి వసంతలక్ష్మి

రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలు

మార్కాపురం పట్టణంలో మున్సిపాలిటీ నిబంధనాలు పాటించకపోవడంతో ప్రజలకు కొత్త చిక్కులు వచ్చి పడుతున్నాయి. షాంపింగ్ కాంప్లెక్సులు, దుకాణాలు నిర్మించేటప్పుడు సెల్లార్లు ఏర్పాటు చేయకపోవడంతో పట్టణానికి వచ్చే వాహనాలను రోడ్లపైనే అడ్డంగా ఉంచుతున్నారు. దీంతో పుర ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా నెహ్రూబజార్, వెంకటరమణ స్టూడియో వీధి, చంద్రశేఖర్ కంటి ఆసుపత్రి, ఆంధ్రాబ్యాంక్ తదతర ప్రాంతాల్లో వాహనాలను ఎక్కువగా ఉంచడంతో కొత్త చిక్కులు వచ్చి పడుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్, పోలీసుశాఖ అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, మార్కాపురం పట్టణం

ఆక్రమించెయ్.. కట్టెయ్

ఖాళీ జాగా కనిపిస్తే చాలు ఆక్రమణకు గురవుతున్నాయి. కొంత మంది రహదారులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేస్తున్నారు. మార్కాపురం పట్టణంలోని నాయుడు వీధి, సత్యనారాయణ స్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో గజం విలువ సుమారు రూ.4 లక్షల వరకు ఉంది. ఎన్టీఆర్ విగ్రహం పక్క వీధిలో ప్రైవేటు నేత ఒకరు రహదారిని కొంత మేర ఆక్రమించి గృహ నిర్మాణం పూర్తి చేశారు. అంతటితో ఆగకుండా ఇంకాస్త ముందుకు వచ్చి ఆ నివాసానికి అవసరమైన లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ఆ ప్రాంతంలో చిన్న వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు ఆక్రమణలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, మార్కాపురం అర్బన్

చిన్నపాటి వర్షానికే ... మడుగులా

పెద్దదోర్నాల మండలంలోని అసనాబాద్ లోని ఓ వీధిలో వర్షం నీరు రహదారిపై నిలబడి నివాస గృహాల్లోకి వెళుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వర్షం నీరు ప్రవహించేందుకు దారి ఉండేది. అయితే ఇటీవల మట్టితో ఆ దారి ఎత్తు పెంచారు. దీంతో నీరు నిలిచిపోతోంది. ◗ చిన్నపాటి వర్షానికే వై.పాలెం నుంచి వీరభద్రాపురం, కొలుకుల వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి జలమయంగా మారిపోతోంది. నీరు వెళ్లే కాలువ మార్గంలో యథా ఏర్పాటు చేయడంతో పూడిపోయి పెద్ద చెరువును తలపిస్తూ వారాల తరబడి మురుగు నిలుస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి రహదారిలో నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, పెద్దదోర్నాల,యర్రగొండపాలెం

అసనాబాద్‌లో జలమయమైన రహదారి

చెరువులా మారిన కొలుకుల రోడ్డు

కాలువ పూడి.. మురుగు నిలిచి

చిత్రంలో కనిపిస్తున్నది కంభం పట్టణ పరిధిలోని పాత ఆసుపత్రి సమీపంలో మురుగునీరు మడుగు కట్టిన ప్రాంతం. కాలువ ఆక్రమణలకు గురై పూడిపోవడంతో మురుగు నీరు ఆ ప్రాంతంలో మడుగు కట్టింది. దుర్వాసనతో ఇబ్బందిగా ఉందని, దోమల బెడద అధికంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఆ కాలువ పరిధిలో వందల ఎకరాల సాగు భూమి ఉంది, ఆక్రమణలు తొలగించి కాలువ బాగు చేయించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలు గుర్తించాలని రెవెన్యూ అధికారులను కోరినట్లు నీటి పారుదల శాఖ జేఈ శ్రీనివాస్ తెలిపారు. రెవెన్యూ వారి సహకారంతో ఆక్రమణలు తొలగించి కాలువను బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. –న్యూస్‌టుడే, కంభం

నిరుపయోగంగా.. అంబులెన్స్

మార్కాపురం లోని సర్వజన ప్రభుత్వ వైద్యశాలకు చెందిన అంబులెన్స్‌కు జబ్బు చేసింది. రెండేళ్ల కిందట నెల్లూరు జిల్లాకు చెందిన దాతలు వైద్యశాలకు అత్యవసర సమయంలో రోగులకు ఉపయోగపడేందుకు అంబులెన్స్‌ను అందజేశారు. మూడు నెలల వరకు అంబులెన్స్ వినియోగించిన వైద్యశాల అధికారులు మరమ్మతులకు గురి కావడంతో బాగు చేయించకుండా వదిలేశారు. అత్యవసర సమయాల్లో రోగులను ఈ అంబులెన్స్ ద్వారా ఇతర ప్రాంతాల్లో ఉన్న వైద్యశాలలకు తీసుకువెళ్లేవారు. అంబులెన్స్ నిరుపయోగంగా మారడంతో రోగులు బయట ఉన్న ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయించి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దాతలు కొనుగోలు చేసి అందజేసిన అంబులెన్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలని రోగులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, మార్కాపురం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం: 8008552658

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే :

?: పట్టణంలోని ఆర్టీ బజారులో జడ్పీ ఉన్నత పాఠశాల వెళ్లే రోడ్డులో ఇటీవల సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించారు. పాఠశాలకు వెళ్లే రోడ్డుపై వర్షం నీరు డ్రైనేజీ లోకి వెళ్లే ఏర్పాటు చేయలేదు. నీరు నిలిచి విద్యార్థులకు ఇబ్బంది కరంగా మారింది. – బాషా, స్థానికుడు

✓: నీరు వెళ్లేందుకు జాలీ ఏర్పాటు చేశాం. ఆ మార్గంలో మట్టి పోయడంతో బ్లాక్ అయింది. నీటి తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – రవీంద్రారెడ్డి, పీఆర్ ఏఈ

రాచర్ల, న్యూస్‌టుడే :

?: స్థానిక పంచాయతీ పాత రెవెన్యూ కార్యాలయ సమీపంలోని పెద్ద పీర్ల చావిడి వద్ద ఉన్న బోరు మరమ్మతులకు గురైంది. ఆ ప్రాంతవాసులు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేయించాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. బాగు చేయించండి.
– వెంకటేశ్వర్లు, స్థానికుడు

✓: బోరును పరిశీలించి, పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.
– వెంకట్రామిరెడ్డి, ఎంపీడీవో, రాచర్ల

శాకంబరిగా పోలేరమ్మ

శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

మార్కాపురం పట్టణం, పెద్దదోర్నాల, కంభం, పొదిలి : ఆషాఢమాసం సందర్భంగా మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో వెలిసిన అంకాళ పోలేరమ్మ ఆదివారం శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి ఆశీష కాలు, పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ◗ దిగువ శ్రీశైలంగా పేరొందిన పెద్దదోర్నాలలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారికి భక్తులు ఆదివారం ఆషాఢమాసం సారె అందజేశారు. అమ్మవారికి సమర్పించే దుస్తులు, గాజులు, నైవేద్యాలు, పిండి వంటలతో భక్తులు ప్రదర్శనగా దేవాలయానికి వెళ్లి సమర్పించారు. ◗ ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని కంభం పట్టణ సమీపంలోని కోట సత్యమాంబదేవికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. ◗ రావిపాడు గ్రామంలోని పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం గ్రామస్థులు బోనాలు సమర్పించారు. ◗ పొదిలిలోని శ్రీ అగిని లక్ష్మినరసింహస్వామి గోసంరక్షణ కేంద్రంలో ఆదివారం శ్రీకృష్ణపరమాత్మ పూజ నిర్వహించారు. గోశాల అధ్యక్షులు అప్పల శంకరరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పూజలో పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: అమ్మవారికి సారెతో పిండి వంటకాల సమర్పణ

రావిపాడులో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

మోక్షగుండంలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

బేస్తవారపేట, న్యూస్‌టుడే : మండలంలోని మోక్షగుండంలో మొహర్రం ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పీర్ల నిమజ్జనం సందర్భంగా ఆదివారం భక్తులు పీర్లను పూలతో, కొత్త దుస్తులతో అలంకరించి ఘనంగా ఊరేగించారు. గ్రామంలోని పీర్ల చావిడి వద్ద హిందు, ముస్లింలు కుల, మతాలకు అతీతంగా ఈ ఉత్సవంలో పాల్గొని పీర్లను దర్శించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

పొదిలి, గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : తమ న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు చేస్తున్న సమ్మె పొదిలిలో నాల్గో రోజుకు చేరింది. మస్టర్ కేంద్రం బయట పొదిలి నగర పంచాయతీ కార్మికులు ఆదివారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ◗ కనీస వేతనం రూ.26,000 అందించాలని కోరుతూ గిద్దలూరు పురపాలకశాఖ ఒప్పంద ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఆదివారానికి అయిదో రోజుకు చేరింది.

నెలలు నిండకుండానే జన్మించిన కవలలు

మార్కాపురం, న్యూస్‌టుడే : నెలలు నిండకుండా జన్మించిన కవల పిల్లలకు మార్కాపురం సర్వజన ప్రభుత్వ వైద్యశాల వైద్యులు జీవం పోశారు. గిద్దలూరు మండలంలోని కిష్టంశెట్టిపల్లెకు చెందిన జోహ్నా గత నెల 27వ తేదీన కంభం ప్రభుత్వ వైద్యశాలలో ఇద్దరూ కవల పిల్లలకు జన్మనిచ్చింది. నెలలు తక్కువగా ఒక ఆడ, మగ పిల్లవాడు జన్మించారు. 1.500ల కిలోలు మాత్రమే ఉండటంతో వీరికి అత్యవసర వైద్యం అందించేందుకు మార్కాపురం సర్వజన వైద్యశాలకు తీసుకువచ్చారు. కవలలకు చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో వైద్యులు చికిత్స అందించారు. 14 రోజులపాటు వైద్యం అందించడంతో కవల పిల్లల ఆరోగ్యం మెరుగుకావడంతో డిశ్చార్జి చేసినట్లు వైద్యులు తెలిపారు.

చెట్టును ఢీకొన్న లారీ.. ఇద్దరికి గాయాలు

కిష్టాపురం(శావల్యాపురం), న్యూస్‌టుడే : లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి మార్గంలో పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం కిష్టాపురం వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గిద్దలూరు నుంచి కూరగాయల లోడుతో చిలకలూరిపేట వస్తున్న లారీ కిష్టాపురం సమీపంలో అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఆ సమయంలో లారీలో ఇద్దరు మాత్రమే ఉన్నారు. ప్రమాద ధాటికి అందులో ఉన్న దమ్మవరపు శేఖర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. చుట్టుపక్కల వాహనాల్లో ప్రయాణికులు తాళ్ల సహాయంతో లారీని పక్కకు లాగి అతన్ని అతి కష్టం మీద బయటకు తీశారు. అతని రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, దమ్మవరపు బన్నీకి స్వల్ప గాయాలు కావడంతో శావల్యాపురం 108 వాహనంలో వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు కొంతసేపు ఇబ్బంది తలెత్తింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు తెలిపారు.

మేలైన బేళ్లకే డిమాండు

పొదిలి, న్యూస్‌టుడే : వేలం కేంద్రంలో వ్యాపారులు కొనుగోలు చేస్తున్న రకం బేళ్లనే రైతులు తెచ్చుకోవాలని వేలం కేంద్రం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ సూచించారు. మూగచింతల, కొనకనమిట్ల, వద్దిమడుగు, కొత్తపల్లి, కాట్రగుంట, తన్నీరువారిపల్లి గ్రామాల్లో బోర్డు అధికారులు పర్యటించారు. వేలానికి తెచ్చుకోవాల్సిన బేళ్ల గురించి అవగాహన కల్పించారు.

కానిస్టేబుల్ మృతికి సంతాపం

పొదిలి: కొనకనమిట్ల పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నూరేనబి (57) ఇంట్లో శనివారం గుండెపోటుతో చనిపోయారు. ఈయన స్వగ్రామం పొదిలిలోని నవాబుమిట్ట. పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నూతన కమిటీ ఎన్నిక

పొదిలి, న్యూస్‌టుడే : మానవతా సేవా సంస్థ పొదిలిశాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మానవతా సంస్థ కార్యాలయంలో ఆ సంఘం సభ్యుల సమావేశం జరిగింది. ఛైర్మన్‌గా కాటూరి వెంకట నారాయణబాబు, అధ్యక్షులు వెలిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి షేక్ రసూల్, కోశాధికారి అప్పల వెంకట సత్యం, కన్వీనర్ కల్లం సుబ్బారెడ్డి, గౌరవ అధ్యక్షులు సోమిశెట్టి చిరంజీవి, గౌ.సలహాదారు చిట్టెంశెట్టి కృష్ణారావు, కార్యక్రమాల నిర్వహణ కమిటీ బాధ్యులుగా బి.అశోక్, గౌ.ఛైర్మన్‌గా ముప్వల పార్థసారథిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మానవతా సంస్థ పొదిలిశాఖ నూతన కమిటీ సభ్యులు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన టి.రంజిత్‌కుమార్ జ్ఞాపకార్థం వారి కుమార్తెలు జోహిత, రితికలు మానవతా శాఖ వారికి రూ.లక్ష విలువ చేసే రెండు ఆక్సిజన్ మిషన్లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కాపురంలో ఉన్న ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

ప్లాస్టిక్ కవర్లను విక్రయించవద్దంటూ వ్యాపారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ నారాయణరావు

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్.నారాయణరావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను సందర్శించి వ్యాపారులకు పలు సూచనలు చేశారు. 120 మైక్రాన్ కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు, బ్యానర్లను నిషేధించారని పేర్కొన్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, టీకప్పులు, ప్లాస్టిక్ ఇయర్ బడ్స్, క్యారీ బ్యాగులు, వాటర్ ప్యాకెట్లను అమ్మినా, కొనుగోలు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధం అమలు ఉన్నందున ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుట్టులో నైపుణ్యం.. ఉపాధికి ఊతం

కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే :

మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగాలని భావించిన కూటమి ప్రభుత్వం ఉపాధి మార్గం చూపుతోంది. స్వశక్తితో తమ కాళ్లమీద నిలబడేలా వారికి కుట్టులో శిక్షణ అందించి తమకంటూ ఒక ఉపాధి మార్గాన్ని చూపిస్తోంది. కొమరోలులోని సచివాలయం-2 భవనంలో గత మూడు నెలలుగా బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ పథకం ఈ నెలాఖరుతో పూర్తికానుంది. కొమరోలు మండలం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 90 మంది మహిళలు శిక్షణ తీసుకుంటున్నారు. ఉదయం పూట పది నుంచి ఒంటి వరకు 40 మందికి, సాయంత్రం రెండు నుంచి అయిదు వరకు మరో 50 మంది శిక్షణ తీసుకుంటున్నారు. శిక్షకురాలు చంద్రగిరి లక్ష్మీదేవి మహిళలకు కుట్టులో శిక్షణను అందిస్తున్నారు. స్థానిక ఎంపీడీవో, జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ అధికారులు తరచుగా ఈ కేంద్రాన్ని తనిఖీలు చేస్తూ మహిళలకు కావాల్సిన సౌకర్యాలను కల్పించారు. కటింగ్‌పై అవగాహన కల్పిస్తూనే పేపర్ కటింగ్ విధానంతోపాటు, హ్యాండ్ వర్క్ పనులపై మెలకువలను నేర్చుకున్నారు. 75 శాతం హాజరైన శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు యంత్రాలతో పాటు ధ్రువీకరణ పత్రం అందజేస్తారు.

శిక్షణ తీసుకుంటున్న మహిళలు

రుణాలు మంజూరు చేస్తే బాగు : నేను ఈ శిక్షణకు రాకముందే కొంత ప్రావీణ్యం ఉంది. నిత్యం వచ్చి శిక్షణ తీసుకున్నా. శిక్షణానంతరం బ్యాంకులు, కార్పొరేషన్ల ద్వారా వడ్డీ రహిత రుణాలను అందిస్తే నా కాళ్ల మీద నేను నిలబడగలుగుతాం. సొంత టైలరింగ్ కేంద్రాన్ని నెలకొల్పి గ్రామంలోని పది మందికి నేర్పిస్తా. – అరుణ, తాటిచెర్ల

టైలరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తా... : మా గ్రామంలో నైపుణ్యంతో కూడిన మహిళా టైలర్లు లేరు. ఇక్కడ తీసుకున్న శిక్షణతో నైపుణ్యం సాధించా. గ్రామంలో సొంతంగా టైలరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి నా కాళ్లపై నేను నిలబడతా. ఆత్మవిశ్వాసం పెరిగింది. – పఠాన్ నియాజ్, రాజుపాలెం

(c) eenadu

కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి

గాలి వీచిందో కరెంట్ కట్!

వార్డు వాయిస్

మున్సిపాలిటీ	- కనిగిరి
వార్డు	- 18
కుటుంబాలు	- 400

న్యూస్‌టుడే, కనిగిరి

కనిగిరి పట్టణంలోని 18వ వార్డులో తరచూ విద్యుత్తు సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. సుభాష్‌రోడ్డు, పెద్దకరణం వీధి, పెరుమాళ్లవీధి, పరాశర భారతి బజార్, కొత్తపేట బజార్ తదితర కాలనీల దీని పరిధిలోకి వస్తాయి. ఈ ప్రాంతాల్లో అధికంగా విద్యుత్తు తీగలు చెట్లకొమ్మల మధ్య నుంచి వెళ్లడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం కావడంతో స్తంభాలు, చెట్లు కూలే ప్రమాదం ఉంది. గాలి వీచినప్పుడు కొమ్మలను తీగలు రాసుకుని నిప్పు రవ్వలు ఇళ్లపై పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో తీగలు కూడా తెగి పడుతున్నాయని చెబుతున్నారు. ప్రమాదాలు జరగకుండా తీగలకు ఆనుకుని ఉన్న కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు ఏఈ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా.. పట్టణంలో వరుస క్రమంలో అన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలను తొలగిస్తామని తెలిపారు.

సుభాష్‌రోడ్డులో చెట్టు కొమ్మల లోపల నుంచి ఉన్న విద్యుత్తు తీగలు

అధికారులు చొరవ తీసుకోవాలి

మా ప్రాంతంలో చెట్ల కొమ్మల్లో విద్యుత్ తీగలు పోతున్నాయి. గాలి వీచినపుడు నిప్పు రవ్వలు వస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో తీగలు తెగి పోతున్నాయి. దీంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడి సరఫరా నిలిచిపోతుంది. వెంటనే విద్యుత్ అధికార్లు స్పందించి సమస్య పరిష్కరించాలి.
– వి. లక్ష్మణ, ఉపాధ్యాయుడు, సుభాష్‌రోడ్డు

శాకంబరీదేవిగా వల్లూరమ్మ

టంగుటూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆదివారం భక్తులకు శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, తెదేపా నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వెతలు విన్నారు.. వెంటనే పరిష్కరించారు

☛ 'ఈనాడు' ఆధ్వర్యంలో దర్శి మున్సిపల్ కమిషనర్ మహేష్‌తో ఉదయపు నడక

ఈనాడు మీ తోడు

న్యూస్‌టుడే, దర్శి

దర్శి పట్టణంలో ఆదివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మహేష్‌తో నిర్వహించిన ఉదయపు నడక కార్యక్రమంలో పలు సమస్యలకు పరిష్కారం లభించింది. స్థానిక 12వ వార్డులోని పుట్టబజారు ప్రాంతంలో అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. మురుగుపారని కాలువలు, రోడ్ల పక్కన పిచ్చిమొక్కలు, తాగునీరు, విద్యుత్తు తదితర వాటికి సంబంధించి మొత్తం 22 సమస్యలను గుర్తించారు. వీటిలో 12 సమస్యలను సాయంత్రంలోగా పరిష్కరించారు. కాలువలు, రోడ్ల నిర్మాణం, తాగునీటి ఇక్కట్లు తీర్చేందుకు రూ.69.4 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు.

వినతులు.. తక్షణ చర్యలు..

● 6 నుంచి 9 లైన్ల వీధుల్లో లో ఓల్టేజీ సమస్య ఎదురవుతుందని స్థానికులు తెలియజేయగా.. విద్యుత్తు అధికారులతో మాట్లాడి 15 రోజుల్లో నూతన పరివర్తకం ఏర్పాటు చేయిస్తామని కమిషనర్ తెలిపారు. ● 3, 4, 5 వీధుల్లో చివరి గృహాలకు తాగునీరు అందడం లేదని స్థానికులు ఫిర్యాదు చేయగా, కుళాయిల సంఖ్య పెంచడం ద్వారా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

● ప్రశాంత పాఠశాల లైనులో శివారు ప్రాంతంలో నివసిస్తున్న 100 గృహాల ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుండగా, నూతన పైపులైన్ వేస్తామని తెలిపారు. అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తామని చెప్పారు. ● 5, 6 లైన్లలో గృహాల మధ్య, రోడ్ల పక్కన పెరిగిన పిచ్చి చెట్లను జేసీబీతో తొలగించారు.

● 6వ లైనులో కాలువల్లో పేరుకుపోయిన మురుగు తొలగించి బ్లీచింగ్ చల్లారు. గృహాల మధ్య వేసిన పశువుల వ్యర్థాల దిబ్బలను, వరిగడ్డి వాములను తొలగించటంతో పాటు తిరిగి వేయకుండా సదరు వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

● 5వ లైనులో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్తు తీగలను సరిచేయించారు. ఇటీవల నూతనంగా వేసిన తాగునీటి పైపులైన్ గృహాల ముందు ఎత్తుగా ఉండడంతో ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందని పలువురు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సిమెంట్ వేయించటం ద్వారా సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ● 5, 6, 7వ లైన్లలో పలు గృహాల పైనుంచి తక్కువ ఎత్తులో వెళుతున్న 11 కేవీ విద్యుత్తు లైన్ మార్పును 15 రోజుల్లో చేపడతామని తెలిపారు.

సమస్యలు తెలుసుకునేందుకు 12వ వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ మహేష్, మున్సిపల్ సిబ్బంది

5వ లైనులో జేసీబీతో రోడ్ల పక్కన పిచ్చి మొక్కల తొలగింపు

4వ లైనులో కాలువ శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఇలా..

● చర్చి బజారులో రూ.23 లక్షలు, ఆరో లైనులో రూ.11.40 లక్షలు, ఇతర వీధుల్లో మరో రూ.5 లక్షలతో సైడ్ కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. ● తాగునీటి పైపులైన్ కోసం రూ.15 లక్షలు, శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.15 లక్షలతో ప్రతిపాదనలు చేశారు. వచ్చే కౌన్సిల్ సమావేశంలో వీటి ఆమోదానికి తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నక్కా రంగా, శానిటరీ కార్యదర్శి సుభాని, టౌన్ ప్లానింగ్ సిబ్బంది వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు, తాగునీటి సరఫరా సిబ్బంది హరనాథ్, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక నేతలు మహమ్మద్, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి

తిమ్మారెడ్డిపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, ఆవులవారిపల్లి గ్రామాల్లో మండల తెదేపా అధ్యక్షుడు ఎస్.తిరుపతిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజల నుంచి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, మండలంలో జరగాల్సిన పనులపై చర్చించారు. కనిగిరి-కంభం రహదారి పనులు ప్రారంభమయ్యాయని, త్వరలో రెండు వరుసల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తిరుపతిరెడ్డి, రఘునాథ కాశిరెడ్డి, కుందురు నారాయణరెడ్డి, నరసయ్య, రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ భవనం పనుల పరిశీలన..

హెచ్‌ఎంపాడులో నిర్మాణంలో ఉన్న పోలీస్ స్టేషన్ భవనాన్ని ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి పరిశీలించారు. మూడేళ్లుగా నిధుల కొరతతో నిలిచిపోగా ఇటీవల మళ్లీ పనులు ప్రారంభించారు. నిధుల కొరత ఏర్పడితే సొంతంగా సమకూరుస్తానని, పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయించాలని పోలీసు అధికారులకు సూచించారు. సీఐ ఖాజావలి, ఎస్సై మాధవరావు, పోలీస్ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ ఫలాలు

ముండ్లమూరు: పేదలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెదేపా మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి సుంకర రాఘవరెడ్డిలు తెలిపారు. మండలంలోని పోలవరంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైకాపా పాలనలో అయిదేళ్లు రాష్ట్రాన్ని అన్ని విధాలా వెనక్కి నెట్టారని విమర్శించారు. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు విజయలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కనిగిరి మండల అధ్యక్షుడిగా రామ్మోహన్

కనిగిరి, న్యూస్‌టుడే: మండల ఏపీటీఎఫ్ అధ్యక్షుడిగా కుడారి రామ్మోహన్, ప్రధాన కార్యదర్శిగా ఎ.హజరత్‌రెడ్డిని సభ్యులు ఎన్నుకున్నారు. ఆదివారం కనిగిరిలోని ఆ సంఘం ప్రాంతీయ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పి.రాజ్‌కుమార్‌లు పర్యవేక్షించారు.

రోడ్ల అభివృద్ధికి రూ.1.6 కోట్ల మంజూరు

వితలాపురం-మన్నేపల్లి రహదారి

తాళ్లూరు, న్యూస్‌టుడే: దర్శి నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రెండు రహదారులను అభివృద్ధి పర్చేందుకు ర.భ.శాఖ ద్వారా ఎండీఆర్ ప్లాన్‌లో భాగంగా రూ.1.60 కోట్ల మేరకు నిధులు మంజూరయ్యాయి. వీటికి టెండర్లు సైతం ఖరారు చేశామని, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు ర.భ.శాఖ డీఈ ఎన్.గోపీకృష్ణ తెలిపారు. తాళ్లూరు మండలం వితలాపురం నుంచి మన్నేపల్లి మధ్య మూడు కిలోమీటర్లు, కురిచేడు-మర్లపాలెం రహదారిలో (డీటీసీ వైపు) మరో మూడు కిలోమీటర్ల మేర తారు రహదారి నిర్మాణం కోసం మంజూరు నిధులు చేశారు. నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ ఏర్పాటు చేసిన వివిధ రహదారుల మరమ్మతులకు మరో రూ. 24 లక్షలు మంజూరయ్యాయి. త్వరలో ఆయా పనులకు టెండర్లను ఖరారు చేయాల్సి ఉంది. ఏడాది వరకు గుత్తేదారుడే అక్కడ మరమ్మతుల నిర్వహణ చేయాల్సి ఉంటుందని డీఈ తెలిపారు.

తాళ్లూరు, ముండ్లమూరు మండలాల్లో భారీ వర్షం

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం నుంచి కుండపోతగా వర్షం కురిసింది. తాళ్లూరులోని పూర్వప్ప కొట్లబజారు, తూర్పుపాలెం వీధుల్లోని రహదారులపై పెద్ద ఎత్తున నీరు నిలిచి స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. తూర్పుగంగవరంలోని పలు ప్రధాన వీధుల్లోనూ ఇదే పరిస్థితి. బొద్దికూరపాడులోని పోలంరెడ్డి బజారులో గృహాల్లోకి వరదనీరు చేరింది.

◗ ముండ్లమూరు: మండలంలో శంకరాపురం, పోలవరం, ముండ్లమూరు, నూజెళ్లపల్లి, మారెళ్ల, మక్కెనవారిపాలెం, ఈదర, కెల్లంపల్లి, పెద్దఉల్లగల్లు, పసుపుగల్లు పూరిమెట్ల, ఉమామహేశ్వరపురం గ్రామాల్లో గాలులతో భారీ వర్షం కురిసింది. ముండ్లమూరులోని అద్దంకి- దర్శి రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. రాత్రి తొమ్మిది గంటల వరకు వర్షం పడింది. మొక్కజొన్నతో పాటు ఇతర పంటలకు ఎంతో మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దారి కోత.. చూడకుంటే చింత

పీసీపల్లి మండలంలోని వాకంవారిపల్లి, కొత్తముద్దపాడు గ్రామాలకు వెళ్లే రహదారిలో కొన్నిచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. మరి కొన్నిచోట్ల రోడ్డు కోతకు గురై ద్విచక్రవాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. మర్రికుంటపల్లి నుంచి కేవలం మూడు కిలోమీటర్ల దూరం ఉంది. దీని నిర్మాణానికి 2014-19లో తెదేపా ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయి. కంకర వేశాక సార్వత్రిక ఎన్నికలు రావడంతో అప్పటి నుంచి పనులు నిలిచిపోయాయి. అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వ ఏమాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా రహదారి పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో హనుమంతరావును వివరణ కోరగా పంచాయతీరాజ్ అధికారులతో చర్చించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. -న్యూస్‌టుడే, పీసీపల్లి

శిథిల ట్యాంకు.. నిత్యం వణుకు

ముండ్లమూరు మండలం శంకరాపురంలో ఉన్న ఎస్‌పీపీ ఓహెచ్‌ఆర్ నీటి ట్యాంకు ఇది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన కావడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఇక్కడ మధ్య, అంగన్‌వాడీ కేంద్రం పక్కన, గ్రామంలో ప్రధాన రహదారికి సమీపంలో ఉంది. పిల్లలు పెద్దలు నిత్యం ఇక్కడ తిరుగుతుంటారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కూలిపోతే ప్రమాదం జరుగుతుందేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమాన్‌బాబును వివరణ కోరగా.. ఉన్నతాధికారులకు దీనిపై నివేదిక పంపించామని, అనుమతులు రాగానే కూల్చివేతకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. -న్యూస్‌టుడే, ముండ్లమూరు

మురుగు కదలక.. దుర్వాసన వదలక

మేజర్ పంచాయతీ, మండల కేంద్రం సింగరాయకొండలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. ఏ వీధిలో చూసినా చెత్తకుప్పలు, పూడికలతో నిండిన కాలువలే కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. స్థానిక బాలయోగినగర్ రెండో వీధిలో రెండు నెలలుగా నివాసాల నుంచి వచ్చే వాడకపునీరు పారుదల కాక రోడ్డుపైనే నిలిచి ఉంటోంది. దుర్వాసనతో పాటు, రాత్రి వేళ దోమల బెడద తీవ్రతరమైందని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి జగదీష్‌ను వివరణ కోరగా.. వెంటనే కాలువలు శుభ్రం చేయించి మురుగునీరు పారుదలయ్యేలా చర్యలు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

చువ్వలు గుచ్చుకుంటాయ్ జాగ్రత్త!

పామూరులోని నెల్లూరు రోడ్డులో స్లాబు శిథిలం ప్రమాదకరంగా ఉంది. పామూరులో ఇటీవల ప్రధాన రహదారులకు ఇరువైపులా మురుగు కాలువలపై ఆక్రమణలను అధికారులు తొలగించారు. ఇందులో భాగంగా స్థానిక తెదేపా కార్యాలయానికి సమీపంలో రెండు స్లాబు శిథిలాలు ఉన్నాయి. ఇందులో ఒకటి సిమెంట్ రహదారి పక్కనే ఇనుప చువ్వలతో ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో నిత్యం వాహనాలతోపాటు, విద్యార్థులు, పాదచారులు తిరుగుతుంటారు. వీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. శిథిలాలను త్వరితగతిన తొలగించేలా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి జీవీ అరవింద తెలిపారు. –న్యూస్‌టుడే, పామూరు

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: తాళ్లూరు మండలం శివరాంపురం బస్టాండు సెంటర్‌లో వీధి దీపం వెలగడం లేదు. –వెంకటేశ్వర్లు, గ్రామస్థుడు
✓: కొత్త దీపం వేయించి సమస్యను పరిష్కరిస్తాం. –హనుమంతరావు, ఎంపీడీవో, తాళ్లూరు

?: మర్రిపూడి మండలం జువ్విగుంట బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. –కోటేశ్వరరావు, స్థానికుడు
✓: పంచాయతీ కార్యదర్శికి సూచించి మరమ్మతులు చేయిస్తాం. -నాగూర్‌వలి, డిప్యూటీ ఎంపీడీవో

?: హనుమంతునిపాడు మండలం కొండారెడ్డిపల్లి పంచాయతీ రసీదుపురంలోని రహదారుల అంచుల్లో పశువుల వ్యర్థాలు వేస్తున్నారు. –పి.కొండయ్య, గ్రామస్థుడు
✓: వెంటనే తొలగిస్తాం. –కె.దేవమ్మ, సర్పంచి

?: కురిచేడు మండలం పడమర వీరాయపాలెం పంచాయతీలోని వెంగాయపాలెం, ఎస్సెస్సీ కాలనీల్లో నివాసాల నుంచి వచ్చే మురుగునీరు కాలువల్లో పారడం లేదు. దుర్వాసన, దోమల వ్యాప్తి అధికమైంది. – వెంకటేష్, కాలనీవాసి
✓: రెండు రోజుల్లో శుభ్రం చేయిస్తాం. –శివలక్ష్మి, సర్పంచి

-న్యూస్‌టుడే, తాళ్లూరు, మర్రిపూడి, హనుమంతునిపాడు, కురిచేడు

ప్రతిజ్ఞ చేస్తున్న ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు

సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం సభ్యులు తెలిపారు. మండల శాఖ అధ్యక్షుడిగా కె.వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడిగా జె.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.సుధాకర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన పీఆర్సీని వెంటనే విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల అలవెన్సులను ప్రభుత్వం చెల్లించాలని కోరారు. తల్లికి వందనం పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలలకే కేటాయించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించేలా పోరాడాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీజీపేటలో సందడిగా పీర్ల ఊరేగింపు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మండలంలోని డీజీపేటలో మొహర్రం ప్రార్థనలు పీర్ల స్నానంతో ఆదివారం ముగిశాయి. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ముజావర్‌లు, హిందూ, ముస్లిం సోదరులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పీర్లను ఎత్తుకొని గుండంలో నడిచారు. గ్రామంలో మేళతాళాలు, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపు నిర్వహించారు. యువకులు, కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, గ్రామస్థులు

ఒంటికాలిపై నిల్చుని ఆందోళన చేస్తున్న కార్మికులు

పారిశుద్ధ్య కార్మికుల నిరసన

కనిగిరి, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారానికి అయిదో రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులంతా ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు పి.కేశవరావు మాట్లాడుతూ.. కనిగిరి మున్సిపాలిటీలో జనాభాకు తగ్గట్టుగా కార్మికులు లేరని, అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. వారికి పరికరాలు ఇవ్వాలని, ఏడాదిలో రెండు, మూడుసార్లు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. దుస్తులు పంపిణీ చేయాలని, పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చార్లెస్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ యువకులు.. అభాగ్యుల నేస్తాలు

సింగరాయకొండలో అనాథ శవాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న యువకులు (పాతచిత్రం)

న్యూస్‌టుడే, టంగుటూరు, సింగరాయకొండ గ్రామీణం

మనిషి తన జీవితంలో ఎలా బతికినా చివరి మజిలీ మాత్రం సాఫీగా సాగిపోవాలని కోరుకుంటాడు. ఎంతో మంది అభాగ్యులు అంతిమ సంస్కారాలకు నోచుకోక దిక్కులేని వారిగా మిగిలిపోతున్నారు. అలాంటి వారికి మేమున్నామంటూ ముందుకొచ్చి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు యువనేస్తం ఫౌండేషన్ సభ్యులు. దీంతోపాటు ఆపదలో ఉన్నవారికి తమవంతుగా సాయపడుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

దినసరి కూలీలే సేవాసంస్థ సభ్యులు..

సింగరాయకొండ మండలం పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని అయ్యప్పనగర్‌కు చెందిన అంకిపల్లి బంగారుబాబు నిరుపేద కుటుంబంలో పుట్టి కష్టాలతో పెరిగారు. ఆర్థిక సమస్యల కారణంగా చదువు మానేయాల్సి వచ్చింది. సెంట్రింగ్ పనులు చేస్తూ కాస్త నిలదొక్కుకున్న ఆయన తోటి వారికి సాయపడాలని 2016లో 20 మందితో యువనేస్తం ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. అనాథలకు భోజనం అందించడం, ఆర్థిక సాయం చేయడం, దివ్యాంగులకు వీల్‌ఛైర్లు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం 50 మంది నిత్యం వివిధ సేవల్లో పాల్గొంటున్నారు. కొండపి నియోజకవర్గంతో పాటు, ఇతర ప్రాంతాలకు చెందిన వెయ్యి మంది సభ్యులుగా ఉన్నారు. వీరంతా దినసరి కూలీలే కావడం మరో విశేషం.

191 మృతదేహాలకు అంత్యక్రియలు..

బంధువులు సైతం తొంగి చూడని వేళ కరోనాతో మృతి చెందిన వారికి అండగా నిలిచి అంత్యక్రియలు నిర్వహించారు. యాచకులు, గుర్తుతెలియని వారు మరణించినా అంతిమ సంస్కారాలు చేస్తారు. ఇలా ఇప్పటి వరకు 191 అనాథ శవాలకు అంత్యక్రియలు చేశారు.

ఆపదలో రక్తదాతలుగా మారి..

అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమంటే చాలు ఎంత దూరమైనా సరే వీరు సొంత ఖర్చులతో వెళ్లి సాయం చేస్తారు. సామాజిక మాధ్యమాల ద్వారా రక్తం కావాల్సిన వారి వివరాలను సేకరించి దాతల వివరాలను బాధితులకు తెలియజేస్తారు. ఇప్పటి వరకు 1,220 మందికి రక్తదానం చేశారు.

యాచకులు, మతిస్థిమితం లేని వారికి

రోడ్డు వెంబడి తిరిగే అనాథలు, మతిస్థిమితం లేని యాచకులకు భోజనం అందించి, దుస్తులు ఇవ్వడం వంటి వాటిని సమకూర్చి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. గాయాలై, దుర్వాసన వస్తున్న వారికి సైతం క్షవరం, స్నానం చేయించి, వైద్యం అందిస్తుంటారు. నలుగురికీ సేవ చేయడంలోనే తమకు ఆనందం అని యువనేస్తం సభ్యులు చెబుతున్నారు.

తెదేపా నాయకుడి మృతికి సంతాపం

పామూరు, న్యూస్‌టుడే: మండలంలోని బోడవాడకు చెందిన తెదేపా సీనియర్ నాయకుడు, నీటి సంఘం అధ్యక్షుడు వెల్లంకి శివయ్య(64) అనారోగ్యంతో ఆదివారం తన స్వగృహంలో మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల మండల తెదేపా అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

టంగుటూరు: జూద శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. టంగుటూరు బుచ్చిరాజుపాలెంలో డ్రోన్ సాయంతో నిఘా పెట్టారు. అనంతరం శిబిరం వద్దకు పోలీసులు చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.14,840 నగదు స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

తోడికోడలిపై మహిళ దాడి

ముండ్లమూరు: తోడి కోడలిపై మహిళ దాడి చేసిన ఘటనపై ముండ్లమూరు పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని శంకరాపురంలో శనివారం ఉదయం కుటుంబ కలహాల నేపథ్యంలో మందలపు భారతి అనే మహిళ గేదెలకు పాలు తీస్తుండగా.. అదే గ్రామానికి చెందిన ఆమె తోడి కోడలు మందలపు లక్ష్మి వచ్చి కారం చల్లి, గొడ్డలితో దాడి చేయడంతో భారతి తలపై గాయమైంది. కుటుంబ సభ్యులు ప్రైవేటు వాహనంలో అద్దంకిలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై కమలాకర్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

PUBLIC NOTICE

I give notice on the instructions given by my client M/s Shriram Finance Limited, Ongole, Prakasam District. The property mentioned in the below schedule belongs to **Chalichama Ramadevi W/o Samba Siva Rao** said Chalichama Ramadevi applied for a loan and mortgage the said property at my client. The loan application is under consideration. So those who have objections i.e. the court cases. the sale agreements. or any objections over the property detailed below should contact the below address or our client within 7 days. If we have not received any objections to the deadline specified in the notice the applicant will be identified as the property owner and the applicant is given a loan.

ITEM-1 (Property covered under Document Number 3602/2021)
Survey No. 32B/1, extent : 387.2 Sq.Yards of site location Tellabadu Village, Doddavaram, Meddipadu Mandal, Prakasam District. Boundaries: SRO Chimakurthy **EAST:** Chalichama Chalapathi Rao's Site. **SOUTH:** Panchayathy Bazar. **WEST:** Panchayathy Bazar **NORTH:** Chalichama Ramadevi Property.

ITEM-2: (Prperty Covered under Document Number 3603/2021)
Survey No. 382/2, Extent : 338.8 Sq.Yards of site. Location: Tellapadu Village, Doddavaram, Maddipadu Mandal, Prakasam District. Boundaries SRO Chimakurthy. **EAST:** A Muras of Width way some extent and property of Chalichama Chalapathi Rao **SOUTH:** Chalichama Ramadevi Property. **WEST:** Bazar **NORTH:** Houses of Nadendla Ramesh others.

Sd/- **JAGARLAMUDI SURESH BABU**
Advocate & Legal Advisor, AP/1488/1988
Shriram Finance Ltd, Ongole.

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

సమ్మెలో కార్మికులు... ప్రత్యామ్నాయంలో అధికారులు

అందుబాటులో ఉన్న కార్మికులతో ప్రధాన వీధుల్లో చెత్త తొలగింపు

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం: కార్మికులు సమ్మె వీడకపోవడంతో నగరంలో పారిశుద్ధ్య సమస్య తీవ్రమవుతోంది. డిమాండ్ల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగం కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఆదివారం నాటికి సమ్మె ఆరో రోజుకు చేరుకుంది. ఇంజినీరింగ్ కార్మికులు 9 రోజులుగా సమ్మెలో ఉన్నారు. యూనియన్ నాయకులతో ఇంత వరకు ప్రభుత్వం చర్చలు జరపనందున మరికొన్ని రోజులు సమ్మె కొనసాగే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. ● కార్మికుల సమ్మె వల్ల పారిశుద్ధ్యం అడుగంటడంతో కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు శానిటేషన్ విభాగం అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిపెట్టారు. నగరంలో ఆయా డివిజన్లు ఉండగా ఒక్కో డివిజన్‌కు కనీసం 20 మంది రోజు వారి వేతనంతో నియమించాలని ఆదేశించారు. సమీప గ్రామాలకు చెందిన కూలీలను పనుల్లో పెట్టుకుని నిర్వహించారు. కనీసం కొన్ని సమస్యాత్మక ప్రాంతాల్లోనైనా పారిశుద్ధ్య పనులు చేయాలని యోచిస్తున్నారు.

కూటమి ప్రభుత్వ విజయాలపై ప్రచారం

ప్రచార పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సంతనూతలపాడులోని అంబేడ్కర్ నగర్‌లో ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనగా ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి ప్రచార పత్రాలను అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమంపై వివరించారు. స్థానికులను అడిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని ప్రజలు విన్నవించారు. సకాలంలో పరిష్కరించేలా చూస్తానని ఆయన తెలిపారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి ఆర్.అంకారావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు తన్నీరు శ్రీనివాసరావు, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి రావులపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ అభివృద్ధికి సహకరిస్తా: ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: లయన్స్‌క్లబ్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. స్థానిక సంతపేటలోని కృష్ణప్రియ కల్యాణ మండపంలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, సమాజానికి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేలా క్లబ్ సభ్యులు ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు పబ్బిశెట్టి రాజేష్, కార్యదర్శి నాగసూరి ఆనంద్, కోశాధికారి శనగపల్లి శ్రీనివాసరావు, ప్రతినిధులు చలువాది శ్రీహరి, కుమారస్వామి, నామినేని మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

స్థలం వివాదం: ఇద్దరిపై కేసు

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలో తెల్లబాడు గ్రామంలో వివాదాస్పద స్థలం విషయంలో శుక్రవారం జరిగిన వివాదంలో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం మద్దిపాడు మండల పరిధిలోని తెల్లబాడు గ్రామంలో మండెపూడి శ్రీధర్ గోకులం షెడ్ నిర్మిస్తున్నాడు. ఆ స్థలం అక్రమితమని అదే గ్రామానికి చెందిన చలిచీమ శివాంజనేయులు, గొల్లపూడి రామచంద్రరావు అనే ఇరువురు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం గం 11-00 లకు సదరు ప్రాంతంలోని చెట్లు చుట్టూ అరుగుల నిర్మించడానికి ఇరువురు వ్యక్తులు ట్రాక్టర్‌లో రాళ్లు తరలిస్తుండగా వివాదం నెలకొంది. ట్రాక్టర్ లో రాళ్లు కిందకు పడవేసే సమయంలో శ్రీధర్ అడ్డుకోగా రాళ్లు అతనిపై పడి గాయాలు కాగా ఒంగోలు రిమ్స్ వైద్యశాల చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శివాంజనేయులు, గొల్లపూడి రామచంద్రరావులపై మద్దిపాడు పోలీస్‌లు ఆదివారం కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఒంగోలు కర్నూల్ రోడ్డు : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: ఒంగోలు గ్రామీణం : వలేటివారిపాలెం గ్రామంలోని కాలువల్లో పూడికతీత పనులు సక్రమంగా చేయడం లేదు. దీంతో దోమల బెడద పెరిగి ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలి. – ఆంజనేయులు, వలేటివారిపాలెం, ఒంగోలు.

✓: తక్షణమే పూడికతీత పనులు చేయిస్తాం. – బాలచెన్నయ్య, డిప్యూటీ ఎంపీడీవో.

?: కొత్తపట్నం: మండలం గుండమాల గ్రామంలో కుక్కల బెడదతో బయటకు రావాలంటే భయపడిపోతున్నాం. చిన్న పిల్లలు, వృద్ధుల మీద దాడికి యత్నిస్తున్నాయి. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలి. – అమీన్ బాబు, గుండమాల.

✓: సమస్యను వెటర్నరీ డాక్టర్ దృష్టికి తీసుకువెళ్తాం. కుక్కలకు టీకాలు, సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు నిర్వహిస్తాం. – లావణ్య, పంచాయతీ కార్యదర్శి.

?: ఒంగోలు నగరం:రామ్‌నగర్ నాలుగు, అయిదు లైన్లలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. బండిమీద వచ్చేవారి వెంట పడుతుండటంతో పడిపోయి గాయపడుతున్నారు. రాత్రిపూట పెద్దగా అరుస్తూ ఇబ్బంది కలిగిస్తున్నాయి. వెంటనే చర్యలు తీసుకోండి.– మహేష్, రామ్‌నగర్.

✓: అన్ని ప్రాంతాల్లో దశలవారీగా కుక్కల్ని పట్టించి సంతాన నిరోధక ఆపరేషన్లు చేయిస్తున్నాం. మీ ప్రాంతంలో సమస్యను కూడా వెంటనే పరిష్కరిస్తాం. – వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్

?: కర్నూలురోడ్డు చీమకుర్తి కంటి ఆసుపత్రి ఎదుట వారం నుంచి చెత్తకుప్పలు ఎత్తడం లేదు. – కె.శ్రీనివాస్, ఒంగోలు.

✓: ప్రస్తుతం కార్మికులు సమ్మెలో ఉన్నందున ఈ సమస్య ఏర్పడింది. సత్వరం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం. – పిచ్చయ్య, శానిటరీ సూపర్‌వైజర్

?: ప్రకాశం కాలనీ పోతురాజు కాలువ వద్ద పొక్లెయిన్‌తో పనులు చేసే సమయంలో సిమెంట్‌రోడ్డు పగిలిపోయింది. ఇప్పటికి 20 రోజులైనా రిపేరు చేయలేదు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. – షేక్ వలి. ప్రకాశం కాలనీ.

✓: రెండు రోజుల్లో సిబ్బందిని పంపించి పరిశీలించాక సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – ఏసయ్య, మున్సిపల్ ఇంజినీర్

?: మద్దిపాడు: మండలం వెల్లంపల్లి గ్రామ పంచాయతీలో ఎస్సీ కాలనీలో విద్యుత్ వీధి దీపాలు పగలు రాత్రి తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోగలరు. – చల్లాపల్లి రాఘవులు, వెల్లంపల్లి

✓: మా సిబ్బందిని పంపించి తక్షణమే విద్యుత్ వీధి దీపాలు పగలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం. – చెన్నారెడ్డి, ఏఈ, మద్దిపాడు విద్యుత్ శాఖ

నేడు విద్యుత్ ఉపకేంద్రం ఆరంభం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక ఉత్తర బైపాస్‌లోని మంగమ్మ కళాశాల వద్ద రూ.4.80 కోట్లతో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాన్ని సోమవారం ఉదయం రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించనున్నారు. అనంతరం ప్రజా సమస్యలపై ప్రసంగిస్తారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఆడికృత్తిక సందర్భంగా నగరంలోని కొత్తపట్నం బస్టాండ్ వద్దగల అయ్యప్పస్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చక స్వామి శంకరమంచి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కాలే వెంకటేశ్వర్లు, కార్యదర్శి పువ్వాడ సురేష్, కోశాధికారి నాలం శివగోవర్ధన్.

కోటా శ్రీనివాసరావు, సరోజా దేవిలకు ఘన నివాళి..

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: సినీ ప్రేక్షకుల హృదయాలలో ఎన్నటికీ చెరగని ముద్ర పోషించిన కోటా శ్రీనివాసరావు, సరోజాదేవి వంటి ధన్యులని శ్రీ నాగినేని మెమోరియల్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షులు మిడసల మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం స్థానిక సివిఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో జరిగిన దివంగతులైన కోటా శ్రీనివాసరావు, సరోజాదేవిల సంస్మరణ సభను మనసారా నిర్వహించి మాట్లాడారు. వారి నటనా ప్రతిభను, సినీ రంగానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంగలకుర్తి ప్రసాద్, డాక్టర్ సంజీవరావు, కోటేశ్వరరావు, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

200 మందికిపైగా వైద్య పరీక్షలు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: మండలంలోని నిడమానూరు జడ్పీహెచ్‌ఎస్‌లో ఎయిమ్స్ వైద్యశాల ఒంగోలు వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు డాక్టర్ బి.వి.రమణారెడ్డి, డాక్టర్ బి.రామలింగేశ్వరరావు, డాక్టర్ నీరజ, డాక్టర్ కార్తీక్, డాక్టర్ శ్రీ హర్షలు హాజరై 200 మందికి పైగా రోగులను పరీక్షించి, గుండె, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. చికిత్సలకు సూచనలు చేశారు.

పారిశ్రామిక వాడ.. అసౌకర్యాల జాడ

న్యూస్‌టుడే, మద్దిపాడు

జిల్లాలోని దాదాపు 10 వేలమంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించి గతంలో ఎంతో పేరు గడించిన పారిశ్రామిక వాడ ఐదేళ్లుగా పూర్తిగా వెనుకబడి పోయింది. గత వైకాపా పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగ యువత ఉపాధికి పక్క జిల్లాల బాట పట్టాల్సి వస్తోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పారిశ్రామిక వాడ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని యువత కోరుతోంది.

2004లో 1300 ఎకరాల్లో ఏర్పాటు: మద్దిపాడు మండల పరిధిలో 2004 సంవత్సరంలో 1300 ఎకరాల్లో 638 ప్లాట్‌లుగా విభజించి సుమారు 300 పరిశ్రమలతో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల కార్మికులకు కూడా ఉపాధి కల్పించారు. పారిశ్రామిక వాడలో సింహభాగం గ్రానైట్ ఉత్పత్తులదే. మన రాష్ట్ర పారిశ్రామిక వేత్తలతో పాటు కర్ణాటక , రాజస్థాన్, మహారాష్ట్ర, చెన్నై రాష్ట్రాల నుంచి వచ్చి పరిశ్రమలు స్థాపించిన వారే కాకుండా గ్రానైట్ పరిశ్రమలో కార్మికునిగా పని చేసి పరిశ్రమ స్థాపించిన ఘనత ఈ పారిశ్రామిక వాడకు చెందుతుంది.

◗ కూటమి సర్కారు చొరవ అవసరం

పూడిపోయిన డ్రైనేజీ కాలువ

ఐలా నిర్వీర్యంతో డీలా.. : ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీస్ (ఐలా) కార్యవర్గం 2008లో పారిశ్రామిక వేత్తల భాగస్వామ్యంతో ఏర్పడింది. 2018లో దీని కార్యవర్గం రద్దుకావడంతో ప్రాధాన్యం కోల్పోతూ వచ్చింది. అప్పటి నుంచి పరిశ్రమలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు క్రమేణా విస్మరించారు. పారిశ్రామిక వాడలో ఏపీఐఐసీ సొంత భవనం ఉన్నప్పటికీ ఒంగోలులో అద్దె భవనం తీసుకుని నిర్వహిస్తున్నారు. మూత పడిన పరిశ్రమల్లో దొంగతనాలు జరగడం, రహదారులు అస్తవ్యస్తంగా ఉండటం, విద్యుత్ వీధి దీపాలు లేక అంధకారంలో పారిశ్రామిక వాడ ఉన్న విషయం పత్రికల్లో వచ్చినా అధికారులు ఏదో నామమాత్రంగానే స్పందిస్తున్నారు.

మూడు నెలలుగా చీకట్లోనే..

వీధి దీపాలు లేక మూడు నెలల నుంచి అంధకారంలో ఉంటున్నాం. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఉపయోగం లేదు. – మండవ రత్నాకర్‌రావు, అధ్యక్షులు, పారిశ్రామిక వాడ గ్రానైట్ పరిశ్రమల సంఘం.

మౌలిక వసతులు కల్పిస్తాం

మౌలిక వసతులు కల్పించేందుకు టెండర్లు పిలిచాం. ఆస్తిపన్ను 60 శాతం వసూలు కాకపోవడంతో ఐలా కార్యవర్గాన్ని రద్దు చేశాం. త్వరలో అధికారులతో మాట్లాడి ఐలాను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తాం.
– సత్యనారాయణ, ఏపీఐఐసీ కమిషనర్, గుండ్లాపల్లి

చీమకుర్తి మహాప్రస్థానం, గరికమిట్టకు వెళ్లే కూడలిలో వాగును తలపిస్తున్న రహదారి

ఒంగోలు బస్టాండ్ రోడు ఇలా..

ఒంగోలులో వర్షంలో తడుస్తూ..

కర్నూలురోడ్డులో ప్రవహిస్తున్న వరద

కురిసిన వర్షం.. జనం హర్షం

న్యూస్‌టుడే, కొత్తపట్నం: వర్షాకాలం వచ్చినా సరైన వర్షం లేక రైతన్నలు, ప్రజలు ఆందోళన చెందుతున్న తరుణంలో ఆదివారం జిల్లాలను పలు ప్రాంతాలను వరుణుడు కరుణించాడు. దాదాపు రెండు గంటలపాటు వర్షం దంచి కొట్టింది. కొత్తపట్నం మండలం కొత్తపట్నం, మోటుమాల, పాదర్తి, రాజుపాలెం, ఈతముక్కల గ్రామాలో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ప్రధాన రహదారులపై మోకాలి లోతు నీరు పారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ● **ఒంగోలు నగరం:** ఒంగోలు నగరంలో కర్నూలురోడ్డు, గాంధీరోడ్డు, మార్కెట్ సెంటర్, లాయర్‌పేట, రైతు బజార్ ప్రాంతాల్లోని రహదారులు జలమయమయ్యాయి. ● **చీమకుర్తి:** చీమకుర్తిలో రహదారులన్నీ జలమయమయ్యాయి. స్థానిక ఇసుకవాగు శివాలయంలో భారీగా వర్షపు నీరు చేరింది. చీమకుర్తి, పాటిమీదవారిపాలెం రహదారిలో కొంత సేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

● **సంతనూతలపాడు, న్యూస్‌టుడే:** వర్షంతో కర్నూల్ రోడ్డు మొత్తం జలమయమైంది. పేర్నమిట్టలోని సరస్వతీ, ప్రతిభ కళాశాల, సమతానగర్ ఇలా పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వర్షపు నీరు ప్రవహించింది. రోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పలేదు. మరో వైపు మండలంలో ఎండుముఖం పట్టిన నువ్వులు, ఇతర చిరు ధాన్యాలు, పచ్చిరొట్టె ఎరువుల పంటలు వర్షంతో ఊపిరి పోసుకుంటాయని రైతులు పేర్కొన్నారు.

అలవాటనుకోకు.. ప్రమాదమని మరవకు

కూలీలకు, రోజువారీ పనులకు ఆటోలు, ఇతర వాహనాల్లో ఇరుక్కుని, వెలాడుతూ, చివర్లో కూర్చుని వెళ్లడం అలవాటు. ఏమాత్రం పట్టు జారినా, లేదా వాహనం గుంతల్లో కుదుపులకు గురైనా కూర్చున్న వారు ప్రమాదం పాలవక తప్పదు. మద్దిపాడు మండలంలో టాటా ఎస్ వాహనం వేగంతో వెళ్తుండగా కొందరు మహిళా కూలీలు నిలబడి, పురుషులు అంచుల్లో కూర్చుని ప్రమాదకర స్థితిలో ప్రయాణిస్తున్నారు. అధికారులు ఈ తరహా ప్రయాణాల కట్టడికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, మద్దిపాడు

బండలు తీశారు.. పనులు వదిలేశారు

నగరంలో కర్నూలు రోడ్డు కేబీ రెస్టారెంట్ పక్కన డ్రైనేజీ కాలువ పనులు కోసం కాలువపై ఉన్న బండలను తొలగించారు. తిరిగి వేయడం మరిచారు. 20 రోజులు అవుతున్నా ఇంత వరకు తిరిగి చూసిన దాఖలాలు లేవు. దుర్గంధం భరించలేక అవస్థ పడుతున్నామని దుకాణదారులు, స్థానికులు వాపోతున్నారు. వర్షం పడితే డ్రైనేజీ పొంగి షాపుల్లోకి వస్తోందన్నారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఒంగోలు కర్నూలు రోడ్డు

స్పందించండి.. సమస్యలు పరిష్కరించండి

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు అయిదో రోజైన ఆదివారం కార్యాలయం వద్ద అర్ధనగ్నంగా నిరసన తెలియజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.పద్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరి వీడాలన్నారు. పి.ఏడుకొండలు, ఇ.నాగయ్య, పిచ్చయ్య, వి.శ్రీను, నరసయ్య, ఆంద్రి, విజయ, తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, చీమకుర్తి

ఇచ్చిన హామీలు అమలుచేయాలి

మాట్లాడుతున్న వెంకట్రావు

ఉప్పుగుండూరు (సంతనూతలపాడు), న్యూస్‌టుడే: గొర్రెల కాపరులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పూసపాటి వెంకట్రావు, జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావులు డిమాండ్ చేశారు. ఆదివారం ఉప్పుగుండూరులో యాదవ కమ్యూనిటీ హాలులో ఏపీ గొర్రెలు, మేకల పెంపకం దారుల మండల మహాసభను నిర్వహించగా ఆయన మాట్లాడారు. ◗ అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా నక్కల శ్రీకాంత్, కొనికి రాఘవ, కమిటీ సభ్యులుగా భాస్కరరావు, భట్టు వెంకట్రావు, ఈర్ల మహేష్, కొండపి నాగరాజు, వీరభద్రయ్య, శివయ్య, అంజయ్య, వెంకట్రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు: కేసుల నమోదు

కర్నూలు నేర విభాగం, న్యూస్‌టుడే: ఒంగోలుకు చెందిన పెరకం నాగాంజనేయులు, తిరుపతికి చెందిన పామిడి సత్యనారాయణ, కొండూరు మహేశ్‌లపై కర్నూలు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో సైబర్ నేరాలు, ఇతర చట్టాల కింద ఆదివారం కేసు నమోదు చేశారు. తిరుపతిలోని శ్రీపంగలూరి సీతమ్మ ఆర్యవైశ్య ధర్మసత్రం అభివృద్ధి సంఘం ఛైర్మన్‌గా మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ కొనసాగుతున్నారని, ఆయనపై ముగ్గురు నిందితులు అసత్య ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని కర్నూలుకు చెందిన ఆ ట్రస్టు కోశాధికారి ఇల్లూరి లక్ష్మయ్య ఫిర్యాదు చేశారు. డబ్బుల కోసం బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోటరీ సేవలు మరింతగా విస్తరించాలి

సైకిళ్లతో విద్యార్థులు

చీమకుర్తి, న్యూస్‌టుడే: విద్య, వైద్యంతో పాటు మరిన్ని రంగాలకు చీమకుర్తి రోటరీ క్లబ్ సేవలు విస్తరించాలని క్లబ్ 3150 మాజీ గవర్నర్ అన్నె రత్నప్రభాకర్ ఆకాక్షించారు. చీమకుర్తిలోని డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు విండో క్రీడా ప్రాంగణంలో ఆదివారం జరిగిన క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా తొగటి శ్రీను, పారెళ్ల శ్రీనివాసరావు, కోశాధికారిగా డి.శంకర్, కార్యవర్గం ఘనంగా ప్రమాణస్వీకారం చేశారు. వ్యవస్థాపక అధ్యక్షులు చెరుకూరి రఘుకిరణ్ మాట్లాడారు. క్లబ్ వైస్ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, మద్దిపాడు ఏఎంసీ ఛైర్మన్ మన్నం రాజేశ్వరిప్రసాద్, చీమకుర్తి సహకార సంఘం అధ్యక్షులు పూనాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పైసలు రాలే.. పనులుకాలే..

● భవనాలు పూర్తిచేస్తే ఎంతో ప్రయోజనం

కరవదిలో కొలిక్కిరాని ఒంగోలు మండల మహిళా సమాఖ్య భవనం

న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

ఒంగోలు మండల ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో గదుల కొరత నేపథ్యంలో గతంలో అదనపు భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ తర్వాత నిధుల కొరత కారణంగా ఏళ్ల తరబడి అసంపూర్తిగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వమైనా సదరు భవనాల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

■ **మండల సమాఖ్యకు మోక్షమెన్నడో... :** ప్రస్తుతం ఒంగోలు మండల వెలుగు కార్యాలయాన్ని స్థానిక సంతపేటలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. మండలానికి చెందిన ఎక్కువ గ్రామాలు కరవది ప్రాంతం వైపు ఉన్నాయి. స్వయం సహాయక సంఘాల మహిళల సౌలభ్యం నిమిత్తం భవన నిధులు మంజూరుకు స్థానిక నాయకులు విన్నవించారు. ఈ మేరకు కరవది గ్రామంలో ఒంగోలు మండల నూతన మహిళా సమాఖ్య భవనం నిర్మాణ నిమిత్తం తెదేపా ప్రభుత్వ హయాంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ అనుసంధానం కింద రూ.32 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో 2018 ఆగస్టులో పనులు ప్రారంభించారు. 2019 ఫిబ్రవరి నుంచే సంబంధిత గుత్తేదారుడు మధ్యలోనే పనులు ఆపేశారు. ఆ గ్రామంలో అంగన్‌వాడీ భవనం, సంత భవన నిర్మాణాలదీ అదే పరిస్థితి. దీంతో ఆ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి.

■ **పదేళ్లగా గోడలే మిగిలాయి :** మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో తాగునీటి బోర్ల మెటీరియల్ భద్రపరిచేందుకు అదనపు గది నిర్మాణ నిమిత్తం 2016లో నిధులు మంజూరు చేశారు. ఆ సమయంలో మండల పరిషత్‌లకు కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకు కేటాయించడంతో నిధులు కొరత ఏర్పడింది. దీంతో పనులు మధ్యలోనే ఆపేశారు. ప్రస్తుతం మళ్లీ మండలాలకు ఆర్థిక సంఘం నిధులు కేటాయించడంతో సదరు భవనాన్ని పూర్తి చేసే వెసులుబాటు వచ్చింది. ఆ దిశగా అడుగులు పడాలని ప్రజలు కోరుతున్నారు.

ఒంగోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పూర్తికాని అదనపు గది

జిల్లాలు తిరుగుదాం... మన ఐక్యత చాటుదాం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలు తిరుగుదాం...మన ఐక్యత చాటుదామని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పిలుపునిచ్చారు. ఒంగోలులోని బీఆర్.అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం మాల ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా ఎదిగితే అధికారం మనదేనన్నారు.

ఉత్సాహంగా చదవడం మాకిష్టం

కార్యక్రమంలో చదువుతున్న విద్యార్థులు

ఒంగోలు కర్నూలు రోడ్డు, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రతి ఆదివారం గ్రంథాలయానికి రావాలని విద్యార్థులకు ఇంఛార్జి డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ సూచించారు. నగరంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాస్టర్ మోహన్ బాబు విద్యార్థులతో పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంపూర్ణ మాట్లాడుతూ.. గ్రంథాలయానికి రావడం వల్ల పుస్తకాపై మంచి అవగాహన వస్తుందన్నారు.

(c) eenadu

రుణాలు తీసుకోలేదు..
చెల్లించమని ఒత్తిడి
బ్యాంకు అధికారుల తీరుతో గిరిజనుల ఆందోళన

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: బ్యాంకు నుంచి రుణాలు తీసుకోకపోయినా.. చెల్లించమంటూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని గిరిజనులు ఆదివారం యానాది సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పెంచలయ్య మాట్లాడుతూ కొందరు వ్యక్తులు ఎస్టీలను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపి జిల్లాలోని యాక్సిస్ బ్యాంక్‌లో లోన్ తీసుకుని రెండు, మూడు నెలలు సవ్యంగా చెల్లించి అనంతరం ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి రూ.20 కోట్ల వరకు స్కామ్ చేశారని ఆరోపించారు. నెల్లూరు, ముత్తుకూరు, కావలి తదితర ప్రాంతాల్లోని నిరుపేదలు, కూలీలు, యానాదులను ఎంచుకొని ఈ భారీ స్కామ్‌కు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు జిల్లాలో 66 మంది వరకు ఉన్నారని తెలిపారు. ఈ విషయమై గత ఏడాది డిసెంబర్‌లో ముత్తుకూరు పోలీసుస్టేషన్‌లో బ్యాంకు అధికారులపై ఫిర్యాదు చేసినా.. చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. బ్యాంకు అధికారులు నోటీసులతో బాధితులను ఇబ్బందులు పెడుతున్నారని, స్కామ్ చేసిన వారు బెదిరింపులకు దిగుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చౌకచర్లకు చెందిన బాధితుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కొందరు మా ఇళ్లదగ్గరకు వచ్చి బ్యాంకు రుణం ఇప్పిస్తామంటూ ఆధార్ కార్డు తీసుకుని, లోన్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల తరువాత మాకు నోటీసులు వచ్చాయని.. బ్యాంకు అధికారులను అడగ్గా.. మీరు లోన్ తీసుకున్నారు వాటిని చెల్లించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యానాది సంక్షేమ సంఘం జిల్లా ఛైర్మన్ రాపూరు కృష్ణయ్య, అధ్యక్షుడు మానికల మురళి, ప్రధాన కార్యదర్శి మాకాని రవీంద్ర, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ విచారణ

నెల్లూరు(నేర విభాగం): రుణాల స్కామ్‌కు సంబంధించి నెల్లూరు గ్రామీణ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు దర్యాప్తు నిర్వహించారు. ఈ నేపథ్యంలో యాక్సిస్ బ్యాంకు మేనేజరు మదన్ మోహన్‌రావును ఆదివారం తన కార్యాలయంలో డీఎస్పీ విచారించారు. గతంలో ఈ కేసుకు సంబంధించి బ్యాంకు ఇన్వెస్టిగేషన్ టీమ్ ఇచ్చిన రిపోర్టు, కేసుకు సంబంధించిన అన్ని దస్త్రాలు తీసుకురావాలని డీఎస్పీ మేనేజరుకు సూచించారు. బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అందజేస్తామని తెలిపారు.

శాకంబరి అలంకరణలో కామాక్షితాయి... ఆషాఢ మాసం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారు శాకంబరి అలంకారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

తిప్ప.. అడ్డుకోలేరప్ప!
చర్యలు లేక కొనసాగుతున్న మట్టి అక్రమ రవాణా

జిల్లాలో గత వైకాపా ప్రభుత్వంలో తిప్పలను పిండి చేసి రూ.కోట్లు గడించిన అక్రమాలపై ఇప్పటికీ చర్యలు లేవు. సంగం మండలంలో అక్రమ తవ్వకాలపై లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో అధికారులు దాడులు చేసి జరిమానా విధించినా రివిజన్ పేరుతో అటకెక్కించారు. అప్పటి నుంచి వాటి వసూల ఊసే లేదు. దాంతో అక్రమార్కుల మరో రూపంలో రవాణా కొనసాగిస్తూనే ఉన్నారు. జరిమానాల వసూలు, గ్రావెల్ సంరక్షణలో నిర్లక్ష్యమే నెలకొంది.

నెల్లూరుపాళెం తిప్పలో గుంతలు

న్యూస్‌టుడే, ఆత్మకూరు, నెల్లూరు గ్రామీణం

వైకాపా ప్రభుత్వంలో మట్టి మాఫియా చెలరేగిపోయింది. కొండలు, చెరువుల్లో గ్రావెల్, మట్టి అక్రమ రవాణా చేసి జేబులు నింపుకొన్నారు. ఆత్మకూరు నియోజవర్గంలోని సంగం మండలం పెరమన, కొరిమెర్ల, సంగం గ్రామాల తిప్పలను గ్రావెల్ కోసం తవ్వేశారు. నామమాత్రంగా అనుమతితో అధిక తవ్వకాలు చేశారు. ప్రజల వినతులతో చివరికి పరిశీలన చేసి జరిమానా విధించినా నేటికీ వసూలు లేదు. పెరమన తిప్ప తవ్వకాలపై 2023 మే నెలలో దాడులు చేసి అనుమతి లేని అధిక తవ్వకాలపై రూ.40,80,770 జరిమానా విధించారు. సంగం కొండలో అక్రమ తవ్వకాలపై 2023 సెప్టెంబరులో దాడిచేసి యంత్రాలు, టిప్పర్లు సీజ్‌చేసి రూ.24,96,727 జరిమానా వేశారు. జరిమానాలపై రివిజన్ కోసం అంటూ అప్పటి గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వద్దకు వెళ్లారు. అంతే అక్కడితో విషయం ఆగిపోయింది. అప్పటి వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఏదీ కదలిక?

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ విషయంలో కదలికలేదు. దాంతో అక్రమార్కులు తమకు ఏమి కాదులే అని ధీమాతో ఉన్నారు. ఆత్మకూరు మండలంలోని నెల్లూరుపాళెం తిప్పను అక్రమార్కులు తవ్వేస్తున్నారు. నెల్లూరుపాళెం నుంచి నారంపేట తిప్ప వరకు తవ్వకాలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో తవ్వకాలు రాత్రులు కొనసాగుతూనే ఉన్నాయి. వెంకట్రావుపల్లి 220కెవి విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలో, రామస్వామిపల్లి తిప్పల వద్ద తవ్వకాలు చేస్తున్నారు. అనంతసాగరం మండలం మంచాలపల్లి, ముత్తుకూరు, సంజీవనగరం ప్రాంతాలు, చేజర్ల మండలం మాముడూడు ప్రాంతంలో తిప్పల్లో తవ్వకాలు కొనసాగుతూనే ఉన్నాయి. సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు మండలంలో తిప్పలను తవ్వేశారు. ఈ నియోజకవర్గంలో గతంలో తిప్పల్లో అక్రమ తవ్వకాలు చేసిన వారిపై చర్యలు లేవు. కావలి మండలం రుద్రకోటలో కొండలు తవ్వి గ్రావెల్ తరలిస్తున్నారు. నిత్యం పెద్దసంఖ్యలో టిప్పర్లతో తరలిపోతోంది. నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండ తవ్వి తరలించేవారు. అక్రమంపై 'ఈనాడు'లో కథనం రావడంతో ప్రస్తుతం తవ్వకాలు ఆగాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఇటీవలే బాధ్యతలు చేపట్టా. రివిజన్ స్థాయిలో ఉన్న జరిమానాల విషయం పరిశీలిస్తా. నెల్లూరుపాళెం తిప్పల్లో అక్రమ తవ్వకాలు పరిశీలిస్తాం. అరికట్టేలా చర్యలు తీసుకుంటాం.
– చంద్రశేఖర్, డీడీ, గనులు భూగర్భ వనరులశాఖ, నెల్లూరు

స్పౌజ్ పింఛన్లకు ఎదురుతెన్నులు!

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్), దుత్తలూరు, ఉదయగిరి : జిల్లాలో స్పౌజ్ పింఛన్ల కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. పట్టణాలు, గ్రామాల వారీగా అర్హులైన లబ్ధిదారుల జాబితాలు సిద్ధం చేసి మూడు నెలలు నిండినా.. నేటికీ నగదు అందలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ భరోసా పథకంలో స్పౌజ్ పింఛను విభాగాన్ని ప్రవేశపెట్టింది. సామాజిక పింఛను తీసుకుంటూ భర్త చనిపోతే ఆయన భార్యకు మరుసటి నెల నుంచే స్పౌజ్ పింఛను అందించాలని నిర్ణయించింది. అర్హులైన వారంతా అవసరమైన ధ్రువ పత్రాలతో ఆన్‌లైన్ చేయించుకున్నారు. భర్త తీసుకునే పింఛను ఐడీ నంబరుతో పాటు మరణ ధ్రువ పత్రాలను అందించిన వారంతా అర్హుల జాబితాల్లో చేర్చారు. జిల్లాలో 722 గ్రామాలతో పాటు నెల్లూరు నగరపాలకసంస్థ, కందుకూరు, కావలి, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు పట్టణాల్లో 3,492 మందిని గుర్తించారు.

రెండోసారి వాయిదా

2023 డిసెంబరు ఒకటి నుంచి 2024 అక్టోబరు 31వ తేదీ మధ్య స్పౌజ్ విభాగంలో పింఛను మంజూరు చేసేందుకు అర్హుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. జూన్ 12న రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైన సందర్భంగా పింఛన్లు అందజేయాలని నిర్ణయించారు. కొన్ని కారణాలతో వాయిదా వేశారు. ఈనెల మొదటి వారంలో సామాజిక పింఛన్లు పంపిణీ పూర్తి చేసి 4, 5 తేదీల్లో ఇచ్చేలా నిర్ణయించారు. దీనికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా రూ.1,39,68,000 నగదును ప్రభుత్వం బ్యాంకుల్లో జమ చేసింది. మరోసారి వాయిదా వేశారు. ఆయా గ్రామ సచివాలయాల చుట్టూ లబ్ధిదారులు తిరుగుతున్నారు.

● ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అందజేస్తామని, లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు.

సమన్వయంతో ప్రజలకు సత్వర న్యాయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్, చిత్రంలో ఎస్పీ తదితరులు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: న్యాయ వ్యవస్థ, పోలీసు శాఖ సమన్వయంతోనే ప్రజలకు సత్వర న్యాయం జరుగుతుందని, తద్వారా ప్రజలకు ఈ వ్యవస్థలపై నమ్మకం కలుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ పేర్కొన్నారు. పోలీసు శాఖ అర్ధ వార్షిక నేర సమీక్షా సమావేశం ఆదివారం నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించి, చట్టవ్యతిరేక కార్యకలాపాలను నిరోధించి, ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పడం బాధ్యతగా భావించాలన్నారు. కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ సర్కిళ్ల వారీగా సమీక్ష నిర్వహించారు. ప్రజలతో మమేకమై వారితో స్నేహభావంతో మెలిగినప్పుడే పోలీసుల పట్ల విశ్వాసం పెరుగుతుందన్నారు. సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, న్యాయ సలహాదారు శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు నగర, గ్రామీణ, కావలి, ఆత్మకూరు, కందుకూరు, మహిళా పోలీసు స్టేషన్ల డీఎస్పీలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణలు పట్టించుకోరు!

న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నా.. పట్టణంలో ఆక్రమణలు అడ్డుకోవడం లేదు. ప్రధాన రోడ్లు కుచించుకుపోయాయి. గతంలో రోడ్డు మార్జిన్లు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా అప్పటి నాయకులు, అధికారులు రాజకీయ కారణాలతో చోద్యం చూస్తూ ఉండిపోయారు. ఓవీరోడ్డు, పామూరురోడ్డు, కనిగిరోడ్లు కొన్నిచోట్ల 60 అడుగులు కూడా లేకుండా ఆక్రమించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా పామూరురోడ్డు, ఓవీరోడ్డులో రహదారుల వెడల్పు, డివైడర్లు,

ఉన్న స్థలంలోనే అభివృద్ధి పనులా?

సెంట్రల్ లైటింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. ఇటీవల పామూరురోడ్డు వెడల్పు పనులు ప్రారంభమయ్యాయి. ప్రధాన రోడ్లలో డివైడర్ ఏర్పాటుచేయాలంటే ఇరువైపులా రోడ్డు తగినంత వెడల్పుతో ఉండాలి. పామూరు మార్గంలో కొన్నిచోట్ల, ఓవీరోడ్డులో మరికొన్ని చోట్ల డివైడర్ ఏర్పాటుకు అవసరమైన వెడల్పు లేదు. దీంతో అధికారులు ఉన్నంతలోనే వెడల్పు చేస్తున్నట్లు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో మార్జిన్లు ఆక్రమించి నిర్మాణాలు చేయడమే సమస్యకు కారణం. ఆక్రమణలు తొలగించేందుకు మున్సిపల్ అధికారులు ముందుకొచ్చినా.. ఆక్రమణదారులు కోర్టును ఆశ్రయించి ఇబ్బందులు సృష్టిస్తున్నారు. దీంతో అధికారులు వెనకడుగేసి రాజీ ప్రయత్నాలు చేసుకుంటున్న పరిస్థితి దశాబ్దకాలంగా చోటుచేసుకుంటోంది. ఈ నేపథ్యంలో పామూరురోడ్డు, ఓవీరోడ్డులో డివైడర్ ఏర్పాటుకు అవసరమైన రహదారి వెడల్పు జరిగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పామూరు బస్టాండులో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులు

తొలగింపునకు చర్యలు

పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న ఆక్రమణల తొలగింపు విషయంలో ఎటువంటి రాజీ లేదు. ప్రస్తుతం పామూరు రోడ్డు కూడలిలో తొలగిస్తున్నాం. మిగిలిన చోట్ల కూడా రోడ్ల వెడల్పు చేస్తాం.
– కె.అనూష, మున్సిపల్ కమిషనర్

ఆటంకం ఉండదు..
అతివేగమే
త్వరలో మూడోలైనుపై రైళ్ల పరుగులు

మనుబోలు సమీపంలో అరుదైన ఆర్‌ఓఆర్ వంతెన

న్యూస్‌టుడే, బిట్రగుంట

దక్షిణ మధ్య రైల్వేలో కీలకమైన విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని విజయవాడ- గూడూరు మధ్య పెరిగిన రైళ్ల సంఖ్య, సరకు రవాణాకు తగ్గట్టుగా మూడో రైలు మార్గ నిర్మాణం అనివార్యమైంది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో శ్రీకారం చుట్టారు. 2,88 కి.మీ. పరిధిలో మార్గం ఏర్పాటుకు రూ. 3,246 కోట్లు కేటాయించారు. ఆర్‌వీఎన్‌ఎల్ సంస్థ నిర్ణీత సమయంలో పూర్తి చేయలేకపోయింది. కరోనా వంటి పలు సమస్యలు తలెత్తడంతో కొన్ని ప్రాంతాల్లో పనులు నత్తనడకన సాగాయన్న విమర్శలు రైల్వే ఎదుర్కోవాల్సి వచ్చింది.

> ఏళ్లుగా ఎదురుచూస్తున్న మూడో రైలు మార్గం పనులు ఎట్టకేలకు పూర్తి కానున్నాయి. సరకు రవాణా, ప్రయాణికులు చేరవేసే రైళ్లు సకాలంలో గమ్యానికి చేరే పరిస్థితులు ఉన్నాయి. వరదల్ని సైతం అధిగమించి పరుగులు పెట్టేందుకు దక్షిణ ఆసియా ఖండంలోనే అరుదైన ఆర్‌ఓఆర్ వంతెన విజయవాడ రైల్వే డివిజన్‌లోనే ఉండడం విశేషం.

కొద్దిపాటి పనులే..

బాపట్ల- విజయవాడ మధ్య పలుచోట్ల మూడోలైను పనులు చురుగ్గా సాగుతున్నాయి. తెనాలి రైల్వేస్టేషన్ జంక్షన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు కూడా పూర్తయితే నెలలో పూర్తిస్థాయిలో ప్రారంభించేందుకు అవకాశాలు ఉన్నాయి. 160 కి.మీ. వేగంతో రైళ్లను నడపవచ్చన్న లక్ష్యాలు ఉన్నా.. 130 కి.మీ. పరుగుకు ఢోకా ఉండదన్న అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలో దక్షిణ మధ్య రైల్వేలో సరకు రవాణా వ్యవస్థలో అత్యధిక లాభాలు తెచ్చిపెట్టే డివిజన్ విజయవాడ అగ్రస్థానంలో ఉండబోతోంది. ప్రయాణికుల్ని చేరవేసే రైళ్లు కూడా సకాలంలో గమ్యానికి చేరే అవకాశం ఉంది. తీరం వెంబడి రైలు మార్గం ఉండడం వల్ల సరకు రవాణాకు అత్యంత ప్రాధాన్యం సంతరించుకోబోతోంది.

చురుగ్గా.. ఆర్‌యూబీలు

విజయవాడ- గూడూరు మధ్య లెవల్ క్రాసింగ్ గేట్లు లేకుండా చేయాలన్న లక్ష్యం వైపు కూడా రైల్వేశాఖ అడుగులు వేసింది. సులభతరంగా అయ్యే ట్రాఫిక్‌లేని గేట్ల వద్ద ఆర్‌యూబీలు నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. 2027 ఆఖరి కల్లా ట్రాఫిక్ గేట్ల వద్ద నిర్మాణం పూర్తి చేయాలన్న లక్ష్యంతో రైల్వేశాఖ ఉంది.

అరుదైన వంతెన

మనుబోలు- గూడూరు మధ్య అరుదైన రైల్వే వంతెనపై రైళ్ల పరుగులు కనువిందు చేయడం జిల్లాకు ప్రత్యేకమని చెప్పకతప్పదు. ఎగువ, దిగువ మార్గాలపై ఆర్‌ఓఆర్ వంతెన నిర్మించడం ఆకర్షణీయంగా నిలుస్తోంది. ఇలా నిర్మించడం వల్ల భారీ వర్షాలు, వరదల్ని సైతం అధిక మించి ఎలాంటి ఆటంకం లేకుండా రైళ్లు సకాలంలో గమ్యానికి చేరే అవకాశం ఉంది.

జేసీ కార్తీక్‌కు సమస్యలు వివరిస్తున్న బాధిత రైతులు

పరిహారంపై ఆశ.. అందక నిరాశ

గుడ్లూరు, న్యూస్‌టుడే: ఓడరేవు అనుబంధ పరిశ్రమల కోసం భూములిచ్చిన అన్నదాతలు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలోని చేవూరు, ఏలూరుపాడు గ్రామాల్లో 400 మంది రైతులకు 1100 ఎకరాల భూములకు పరిహారం అందాల్సి ఉంది. ఇందుకు సుమారు రూ.60 కోట్లు ఇవ్వాలి. వివరాల్లోకి వెళితే.. చేవూరు గ్రామ పరిధిలో ఇండోసోల్ కంపెనీకి గత ప్రభుత్వం సుమారు 3,500 ఎకరాలు కేటాయించింది. ఇందుకోసం రూ.500 కోట్లు మంజూరు చేసింది. భూసేకరణలో ఎకరానికి రూ.23 లక్షల వరకు అందజేస్తున్నారు. రెండు నెలల వరకు సేకరించిన భూమికి ప్రభుత్వం మంజూరుచేసిన రూ.500 కోట్లు ఖర్చయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇండోసోల్‌ను కాకుండా బీపీసీఎల్‌కు భూములు సేకరిస్తోంది. అప్పటి నుంచి సుమారు 1100 ఎకరాలు సేకరించారు. వీటికి పరిహారం అందజేయాల్సి ఉంది. నెలల తరబడి నగదు జమ కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. భూములు లేక పరిహారం అందక చేతిలో చిల్లిగవ్వ లేకుండా పోయిందని చేవూరుకు చెందిన రైతులు వెంకట రమణయ్య, కృష్ణయ్య తెలిపారు. బీపీసీఎల్‌కు ప్రభుత్వం నగదు మంజూరు చేస్తే పరిహారం త్వరగా వస్తుందని వారు తెలిపారు.

ఉన్నతాధికారులకు తెలియజేశాం

వారంక్రితం జేసీ కార్తీక్‌కు సమస్యను తెలియజేశాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే నగదు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.– విజయభాస్కర్, తహసీల్దారు, గుడ్లూరు

నిధులకు నిరీక్షణ
అసంపూర్తిగా సెంట్రల్ అగ్రిల్యాబ్

నగరంలోని సెంట్రల్ అగ్రిల్యాబ్

న్యూస్‌టుడే, నెల్లూరు(నవాబుపేట)

నిధుల కొరతతో సెంట్రల్ అగ్రిల్యాబ్ ప్రారంభానికి నోచుకోలేదు. పనులు పూర్తై ల్యాబ్ ద్వారా సేవలు ఎప్పటికీ అందుబాటులోకి వస్తాయోనన్న మీమాంస నెలకొంది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పరీక్షలు చేసి రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలన్న లక్ష్యంతో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరంలో సెంట్రల్ అగ్రి ల్యాబ్, కోవూరు, పొదలకూరు, ఉదయగిరి, ఆత్మకూరు, కావలి, కందుకూరులో నియోజకవర్గ ప్రయోగశాలలు నిర్మించారు. సెంట్రల్ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పరీక్షలు జరుగుతాయి. నియోజకవర్గ ప్రయోగశాలల్లో విత్తనాలు, ఎరువులే పరీక్షలు చేస్తారు. వ్యవసాయాధికారుల ద్వారా వచ్చే విత్తనాలు, ఎరువులు కోడింగ్ సెంటర్లకు వెళతాయి. అక్కడి నుంచి వేరే జిల్లాలకు తీసుకెళ్లి పరీక్షల అనంతరం ఫలితాలు ప్రయోగశాలకు వస్తాయి. నేరుగా రైతులు, ఇతర సంస్థలు ప్రయోగశాల్లో రుసుము చెల్లించి విత్తనాలు, ఎరువులను పరీక్షలు చేయించుకోవచ్చు.

సాగుతున్న పనులు

గత ప్రభుత్వ ప్రణాళికా లోపం.. సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో అగ్రిల్యాబ్‌లు అనుకున్న సమయంలో ప్రారంభం కాలేదు. సెంట్రల్ అగ్రిల్యాబ్ నిర్మాణానికి సుమారు రూ.2.50కోట్లు, నియోజకవర్గ ల్యాబ్‌ల నిర్మాణానికి ఒక్కోదానికి రూ.78లక్షలు నాబార్డు-ఆర్‌కేవీవై నిధులు కేటాయించారు. అగ్రిల్యాబ్‌ల నిర్మాణాలు అనుకున్న గడువుకు పూర్తి కాలేదు. ఉదయగిరిలో కొద్ది రోజుల కిందటే ప్రారంభమైంది. అంతకుముందే మిగిలినవి ప్రారంభం అయ్యాయి. అన్నింటిలోనూ సిబ్బంది కొరత వేధిస్తోంది. సెంట్రల్ అగ్రిల్యాబ్ భవనం పూర్తి అయిన కొద్దిపాటి మరమ్మతు పనులతో పాటు ప్రధానంగా ల్యాబ్‌లకు అవసరమయ్యే పరికరాలు తదితరాలు లేక ప్రారంభానికి నోచుకోలేదు. రూ.2.50కోట్లు కాకుండా, నిర్మాణం డిజైన్ల మార్పు కారణంగా మరో రూ.2.50కోట్లు అవసరమని అప్పట్లోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మొదట్లో విడుదలైన నిధుల మేరకు భవనం పూర్తయింది. నిధుల కోసం పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులకు అడుగులు పడలేదు. సెంట్రల్ అగ్రి ల్యాబ్ సేవలు అందుబాటులోకి వస్తే విత్తనాలు, ఎరువులతో పాటు పురుగు మందుల పరీక్షలు ఇక్కడ చేయవచ్చు. దీనివల్ల రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

ప్రతిపాదనలు పంపాం

సెంట్రల్ అగ్రిల్యాబ్ పూర్తి చేసేందుకు రూ.2.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే అందుబాటులోకి తీసుకొస్తాం.
– సత్యవాణి, వ్యవసాయశాఖ జేడీ

మామిడి పండు.. నష్టాలు మెండు

అమ్మకానికి ఉంచిన మామిడి పండ్లు

న్యూస్‌టుడే, ఉలవపాడు

మధురఫలంగా పిలిచే మామిడి పండు ఈ ఏడాది రైతులకు చేదును పంచింది. పంట చేతికి వచ్చే సమయానికి అకాల వర్షాలతో పాటు పండు ఈగ దెబ్బ తీసింది. జిల్లాలో సుమారు 20వేల ఎకరాలకు పైగా మామిడి తోటలు సాగులో ఉన్నాయి. అందులో సగభాగం ఉలవపాడు, గుడ్లూరు ప్రాంతాల్లోనే సాగు చేస్తున్నారు. వీటిలో సుమారు 80 శాతం తోటలు కౌలు రైతులు కొనుగోలు చేస్తారు. ఎకరా తోటను చెట్ల వయసును బట్టి రూ.20వేల నుంచి రూ.60వేల వరకు కొనుగోలు చేస్తున్నారు.

దెబ్బతీసిన పండు ఈగ, వర్షాలు

ఎరువులు పురుగుమందులతో పాటు కాపలాదారుని ఖర్చులు రూ.40వేల నుంచి రూ.50వేల వరకు ఉంటుంది. మొత్తంగా ఎకరానికి రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతోంది. జిల్లాలో ఎక్కువగా బంగినపల్లి, బెంగళూరు కాయలు పండిస్తారు. వీటితో పాటు చెరకు రసాలు, ఇమాంపసంద్, తీయమామిడి, సువర్ణరేఖ, నీలం రకాలు సాగు చేస్తుంటారు. వీటిలో బంగినపల్లి, బెంగళూరు రకాలకు దేశవ్యాప్తంగా డిమాండ్ ఉంది. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఇక్కడి మామిడి కాయలను కొనుగోలు చేస్తుంటారు.

కాయల్లో పురుగు చేరి..

ఈ సంవత్సరం సగం చెట్లకు పూత రాకపోగా దిగుబడి పైన వర్షాల ప్రభావం పడి ధరలు తగ్గాయి. వచ్చిన దిగుబడితోనే లాభాలు గడించాలన్న ఆశతో ఉన్న రైతులను వర్షాలకు పండు ఈగ దెబ్బతీసింది. ఈగ ప్రభావంతో కాయల్లో పురుగు చేరింది. దీంతో వ్యాపారులు ఉలవపాడు ప్రాంతంవైపు కన్నెత్తి చూడలేదు. మే, జూన్ నెలలో వారానికి ఒకసారి వర్షాలు కురిశాయి. వర్షాలు, ఎండలకు కాయలు రాలిపోయాయి. ధరలేక పోవడంతో చెట్ల మీద పండి నేలరాలిన కాయలను చిరువ్యాపారులకు అమ్ముకోడానికి అవస్థలు పడ్డారు. తోటల నుంచి పండు మార్కెట్‌కు ట్రేలలో కాయలను తరలిస్తుంటారు. ట్రే ధర వర్షాలకు ముందు రూ.600 నుంచి రూ.700 పలకగా ఆ తర్వాత రూ.150 నుంచి రూ.250 మధ్య ఉంది.

దిగజారిన ధరలు

పండు ఈగ ఎక్కువగా వ్యాపించడంతో ధరలు దిగజారాయి. వర్షాలు కురవడంతో బంగినపల్లి కాయల్లో పురుగు చేరింది. అంతకుముందు అక్కడక్కడ పక్వానికి వచ్చిన కాయలను టన్ను రూ.40 వేల నుంచి రూ.60వేల వరకు కొనుగోలు చేశారు. పురుగు ఉద్ధృతి కారణంగా రూ.30వేలకు పడిపోయింది.

పెట్టుబడి కూడా రాలేదు

70 ఎకరాల తోటలను రూ.25 లక్షలకు కొనుగోలు చేశా. సుమారు రూ.15 లక్షల విలువైన మందులను పిచికారీ చేశాం. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా వర్షాల కారణంగా పురుగు సోకడంతో ధరలు తగ్గాయి. సగానికిపైగా కాయలు దెబ్బతిన్నాయి. పెట్టుబడులు కూడా రాలేదు.
– యానాది, రైతు

ప్రకృతి వైపరీత్యాలతోనే..

మామిడి తోటల్లో ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులకు నష్టాలు వచ్చాయి. అకాల వర్షాలే ఇందుకు కారణం.
– విశాల్, ఉద్యాన శాఖాధికారి

ముగిసిన వైద్యుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ

నెల్లూరు (జీజీహెచ్), న్యూస్‌టుడే: మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో జరుగుతున్న వైద్యుల నమోదు, పునరుద్ధరణ ప్రక్రియ ఆదివారం ముగిసింది. రెండు రోజుల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుండగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వైద్యులు పేర్లు నమోదు చేసుకున్నారు. పునరుద్ధరణ, పీజీ, రీ రిజిస్ట్రేషన్లు 266 నమోదు చేసుకోగా, ఇ-డాక్టర్ ప్రొఫైల్ 324 జరిగాయి. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి, జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

పరిమితికి మించి కుక్కేస్తున్నారు

సర్వేపల్లి నియోజకవర్గంలో కూలీలను తరలించే ఆటోవాలాలు నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి తరలిస్తున్నారు. పొదలకూరులో అయిదుగురు వెళ్లే వాహనంలో 15 మందితో కుక్కేస్తున్నారు. కొందరు డ్రైవరుకు ఇరువైపులా కూర్చోబెట్టుకుని ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఇటీవల సైదాపురం, రాపూరు, చేజర్ల, ఏఎస్‌పేట మండలాల్లో ఇలా వెళుతూ ప్రమాదాలు జరిగాయి. అయినా పోలీసులు, రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఉన్నతాధికారులైనా స్పందించి చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

గంగపట్నంలో ఆకట్టుకున్న శివుడు

గంగపట్నంలో వెలసి ఉన్న చాముండేశ్వరి అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అమ్మవారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలో శివుడిని కూరగాయలతో చేసిన అలంకరణ ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. - న్యూస్‌టుడే, ఇందుకూరుపేట

దప్పిక తీరాలంటే.. డ్రమ్ములు నిండాల్సిందే!

సముద్రం ఒడ్డున ఉన్న కృష్ణపట్నం గ్రామంలో తాగునీటికి తిప్పలు తప్పడం లేదు. ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. తాగేందుకు, వాడుకకు నీరు కొనాల్సిందే. మంచినీటి పైపులైన్లు పనిచేయక పథకం నుంచి గ్రామానికి నీరు చేరడం లేదు. పొరుగు గ్రామాల నుంచి ట్యాంకర్లతో నీటిని తెచ్చి అమ్ముతున్నారు. ప్రతి ఇంటి ముందు డ్రమ్ములు ఉంచుకుని నీటిని నిల్వ చేసుకుంటున్నారు. - ఈనాడు, నెల్లూరు

కావలి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సీఎం ప్రశంస

కావలి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ ప్లాస్టిక్ భూత వేషధారణలో అభినయించిన కావలి పట్టణానికి చెందిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్‌ను సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు ప్రశంసించారు. జ్ఞాపికను అందజేశారు. శనివారం తిరుపతిలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొనగా కావలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత వస్తువులు వాడాలంటూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తన వేషధారణతో అందర్నీ మెప్పించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణతో బషీర్

హౌసింగ్ అసిస్టెంట్ ఇంజినీర్ల రాష్ట్ర కార్యవర్గంలో నెల్లూరీయులు

వెంకటేశ్వర్లురెడ్డి, పెంచలయ్య

విడవలూరు, నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజినీర్ల రాష్ట్ర కార్యవర్గం ఎన్నికలు ఆదివారం విజయవాడలో జరిగాయి. వీటిలో నెల్లూరుకు చెందిన ఇద్దరు ఇంజినీర్లు ఎంపికయ్యారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లురెడ్డి, కార్యదర్శిగా పెంచలయ్యను ఎన్నుకున్నారు. వీరికి గృహ నిర్మాణ సంస్థ జేఏసీ వర్కింగ్ కమిటీ చైర్మన్ మనోహర్‌బాబు అభినందించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు నగదు చెల్లించాలి

జలదంకి: గత ప్రభుత్వం మాదిరిగా కూటమి కాలయాపన చేయకుండా తక్షణమే ప్రభుత్వం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి అగ్రిగోల్డ్ బాధితులకు నగదు చెల్లింపులు జరపాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.తిరుపతయ్య కోరారు. ఆదివారం జలదంకి సీపీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.వి.ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఎస్.శంకరయ్య, మండల కమిటీ కార్యదర్శి జి.మాల్యాద్రి పాల్గొన్నారు.

సర్దుబాటు భారం

తగ్గుతున్న చేపలు, రొయ్యల సాగు

రాష్ట్రంలో రొయ్యలు, చేపలు అనగానే గుర్తుకు వచ్చేది ఉమ్మడి నెల్లూరు జిల్లా. దేశానికి విదేశీ మారక ద్రవ్యం తెచ్చి పెట్టేది ఆక్వా సాగు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సాగుపై ప్రభుత్వాల చేయూత కరవైంది. రొయ్యలు, చేపలు సాగు చేసే రైతులు ఫీడ్, సీడ్, మార్కెటింగ్ వంటి సమస్యలతో సతమతమవుతుంటే.. విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రభుత్వం అదనంగా బిల్లులు వసూలు చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల సమస్యలపై 'ఈనాడు- ఈటీవీ' పరిశీలనాత్మక కథనం

న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతి నగర్)

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో తీర ప్రాంత మండలాలైన కోట, వాకాడు, చిల్లకూరు, ముత్తుకూరు, ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు, కొడవలూరు, విడవలూరు, కావలి మండలాల్లో రొయ్యలు, చేపల పెంపకం ఎక్కువగా ఉంది. 2019లో 60 వేల ఎకరాల్లో చేపలు, రొయ్యలు పెంచేవారు. వైకాపా ప్రభుత్వంలో ఆక్వా జోన్ పరిధిలో ఉన్న వారికి యూనిట్‌కి రూ.1.50 అని చెప్పి ఇంధనపు సర్దుబాటు (ట్రూ అప్ ఛార్జీలు) పేరుతో యూనిట్‌కి రూ.4 విద్యుత్తు శాఖ వసూలు చేసింది. జోన్ పరిధిలో లేని రైతులకు యూనిట్‌కి రూ.6వరకు బిల్లులు వసూలు చేసిన పరిస్థితులు జిల్లాలో ఉన్నాయి.

ఐదు సంవత్సరాలు ఆక్వా రైతులు అష్టకష్టాలు పడ్డారు. కూటమి ప్రభుత్వం వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గుతాయని ఆశించినా నిరాశే మిగిలింది. ప్రభుత్వం ఆక్వా రైతులకు యూనిట్‌కి రూ.1.50 వసూలు చేస్తున్నట్లు చెబుతున్నా ఇంధనపు సర్దుబాటు ఛార్జీల పేరుతో గత ప్రభుత్వం ఎలా వసూలు చేసిందో.. అలాగే యూనిట్‌కి రూ.6 ప్రస్తుతం వసూలు చేస్తున్నారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న ట్రూ అప్ ఛార్జీలను విద్యుత్ శాఖ రైతుల నుంచి ప్రస్తుతం వసూలు చేస్తోంది. విద్యుత్తు బిల్లుల భారంతో 60 వేల ఎకరాల్లో ఉన్న సాగు.. ప్రస్తుతం ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 40 వేల ఎకరాలకు పడిపోయింది. కొన్ని గ్రామాల్లో రొయ్యలు, చేపల గుంతలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

ఖాళీగా వదిలేసిన చేపల గుంత

ఈనాడు ఈటీవీ పరిశీలన

సీడ్, ఫీడ్, మార్కెటింగ్ సమస్యలు

మరో వైపు ఫీడ్, సీడ్, మార్కెటింగ్ సమస్యలు వెంటాడుతున్నాయని రైతులు చెబుతున్నారు. నకిలీ ఫీడ్, సీడ్ జిల్లాలో విక్రయాలు జరుగుతున్నా.. మత్స్యశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. కష్టాలు అధిగమించి సాగు చేసినా.. దళారీ వ్యాపారులు ఆడిగిన ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందని పలువురు చేపల, రొయ్యల రైతులు చెబుతున్నారు.

ఉచితంగా ఇస్తేనే..

- రవిచంద్రారెడ్డి, చేపల రైతు సంఘం జిల్లా సెక్రటరీ

ఉన్నతాధికారులు సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళితే పరిష్కారం అవుతుందన్న నమ్మకం ఉంది. వ్యవసాయానికి విద్యుత్తు ఉచితంగా ఇచ్చినట్లే.. చేపలు, రొయ్యలు సాగు చేసే రైతులకు కూడా ఇవ్వాలి.

అదనంగా వసూలు చేయడం లేదు

- విజయన్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

చేపలు, రొయ్యల రైతులకు ఇంధనపు సర్దుబాటు ఛార్జీలు ప్రభుత్వం వసూలు చేయడంలేదు. యూనిట్‌కి రూ.1.50 వసూలు చేస్తున్నాం.

కామాక్షితాయికి వేమిరెడ్డి దంపతుల సారె సమర్పణ

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారిని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు ఆదివారం దర్శించుకున్నారు. లక్ష్మీగణపతి స్వామి, మల్లికార్జున స్వామి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, శాకంబరి అలంకారంలో కామాక్షితాయిని దర్శించుకొని, ఆషాఢం సారె సమర్పించారు. ఆలయ మర్యాదలతో ఈవో వెంకట శ్రీనివాసులురెడ్డి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ అశోక్‌రెడ్డి వేద పండితులు ఆహ్వానం పలికారు. వీరి వెంట బుచ్చి ఛైర్‌పర్సన్ సుప్రజ తదితరులున్నారు.

జొన్నవాడ ఆలయంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానం: ఎంపీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానం దక్కుతుందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, ఆ సంస్థ అధ్యక్షులు గ్రోసు సుబ్బారావు సహకారంతో పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేత కార్యక్రమం ఆదివారం నగరంలోని పరమేశ్వరి కల్యాణ మండపంలో జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విలువైన స్థలం.. వినియోగిస్తే ప్రయోజనం

చేజర్ల, న్యూస్‌టుడే: వ్యవసాయశాఖ సామగ్రి, ఎరువులు విత్తనాలు నిల్వ చేసేందుకు సమితి వ్యవస్థ ఉన్నప్పుడు చేజర్ల బస్టాండులో గోదాము నిర్మించారు. మండల వ్యవస్థ ఏర్పాటుతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ మండల పరిషత్తు ప్రాంగణానికి మారాయి. కొన్నేళ్ల పాటు ఇందులోనే చేజర్ల ప్రాథమిక పాఠశాల కొనసాగింది. పైకప్పు దెబ్బతినడంతో పదేళ్ల క్రితం తాత్కాలిక మరమ్మతులు చేయించి ఎరువుల గోదాముగా వినియోగించారు. ఈ క్రమంలో ఎనిమిదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. రూ.50 లక్షలకు పైగా ఉన్న విలువైన స్థలాన్ని సద్వినియోగం చేసుకునేలా ఉన్నతాధికారులు చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు. ఇటీవల మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటనలో గోదామును తిరిగి వినియోగంలోని తీసుకొస్తే ప్రయోజనకరంగా ఉంటుందని సూచించారు. భవిష్యత్తులో వ్యవసాయ అవసరాలకు తగ్గట్లుగా ఉపయోగపడేలా చూడాలని రైతులు సూచిస్తున్నారు.

నిరుపయోగంగా ఉన్న వ్యవసాయశాఖ గోదాము

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ.9,445
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ.75,560
వెండి గ్రాము :	రూ.118.80

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	111
రిటైల్	133
లేయర్	112
బ్రాయిలర్స్	193
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	219
లేయర్ మాంసం	190
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	131
లేయర్	112
బ్రాయిలర్స్	234
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	258
లేయర్ మాంసం	190

కళ్లల్లో కారం కొట్టి.. భార్యపై కత్తితో దాడి

దగదర్తి, న్యూస్‌టుడే: భార్యపై అనుమానంతో కళ్లల్లో కారం కొట్టి భర్త కత్తితో విచక్షణారహితంగా దాడిచేసిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దగదర్తి మండలం తడకలూరులో మున్వర్, సుల్తానా దంపతులు చికెన్ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కాగా.. బుచ్చిరెడ్డిపాలెం నుంచి ఐదు నెలల క్రితం తడకలూరుకు వచ్చారు. ఈ నేపథ్యంలో అక్రమ సంబంధం పెట్టుకున్నావంటూ ఆమెను మున్వర్ చిత్రహింసలు పెట్టేవాడు. కుటుంబ సభ్యులంతా ఇంట్లో పడుకుని ఉండగా శనివారం వేకువజామున కంట్లో కారంకొట్టి కత్తితో కాళ్లు, చేతులపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. అనంతరం ఆటోలో ఆమెను రాజుపాళెంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. గాయాలు ఎక్కువగా ఉండడంతో వైద్యులు చికిత్సకు నిరాకరించారు. దీంతో భార్య బంధువులకు ఫోన్‌లో సమాచారమిచ్చి అక్కడే వదిలి వెళ్లాడు. ఆమె అక్క, బావ, మరిది ఆటోలో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. ఆ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ మోసం

కావలి, న్యూస్‌టుడే: తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని ఓ వ్యక్తి మోసగించడంటూ ఫిర్యాదు అందడంతో పోలీసులు నిందితుడ్ని పట్టుకోగా అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన ఆదివారం కావలి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన ఉలవకాయల వీరబాబుకు.. రెండేళ్ల క్రితం కావలి పట్టణం తుపాన్‌నగర్‌కు చెందిన గుర్రంకొండ కిశోర్ పరిచయమయ్యారు. తక్కువ ధరకే బంగారం ఇస్తానంటూ నమ్మించారు. రూ.20లక్షలు తీసుకున్నారు. అప్పటి నుంచి ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేదు. కనీసం నగదు అయినా తిరిగి ఇవ్వాలని కోరుతున్నా తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ మేరకు బాధితుడు కావలి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు నిందితుడ్ని పట్టుకోగా అస్వస్థతకు గురయ్యారు. స్థానికంగా ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా గుండె సంబంధిత ఇబ్బందులున్నాయని వైద్యులు ధ్రువీకరించారు. ప్రస్తుతం చెన్నైలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం మెరుగుపడగానే అదుపులోకి తీసుకుని విచారిస్తామని సీఐ గిరిబాబు తెలిపారు.

హెచ్చరిస్తున్నా నిర్లక్ష్యమేనా..!

కలువాయి, న్యూస్‌టుడే: సోమశిల నుంచి కలువాయికి ద్విచక్రవాహనంపై ఇద్దరు వెళుతుండగా పరమానంద ఆశ్రమం సమీపంలో ఆదివారం అదుపు తప్పి తెలుగుగంగ లీకేజీ కాలువలో పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వారిద్దరిని ఆసుపత్రికి తరలించారు. ఏడాదిగా కాలువ వద్ద డైవర్షన్ రోడ్డు సరిగా లేదని 'ఈనాడు'లో పలు కథనాలు ప్రచురితమైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ ప్రమాదాలు జరగకముందే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు సూచిస్తున్నారు.

ఎస్పీకి అస్వస్థత

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: ఎస్పీ జి.కృష్ణకాంత్ అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం నేర సమీక్షా సమావేశం జరిగింది. అనంతరం అతిథులతో కలిసి పోలీసు అతిథి గృహానికి నడుచుకుంటూ వెళ్లారు. గెస్ట్ హౌస్ వద్ద కళ్లు తిరిగి పడిపోగా.. అప్రమత్తమైన పోలీసులు హుటాహుటిన సమీపంలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. గతంలోనూ అస్వస్థతకు గురై చికిత్స పొందారు.

చదువెంతో దూరం.. మరెంతో భారం

న్యూస్‌టుడే, కలిగిరి, దుత్తలూరు

జిల్లాలో ఆదర్శ పాఠశాలలు: 11 | విద్యార్థుల సంఖ్య: 5,569

- కలిగిరి సమీపంలోని కమ్మవారిపాలెం పరిధిలో ఉన్న ఆదర్శ పాఠశాలలో 673 మంది చదువుతున్నారు. కలిగిరి నుంచి నెల్లూరు మార్గంలో మండల కేంద్రానికి మూడు కి.మీ దూరంలో ఉంది. ఈ మార్గంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి ఉంటాయి. పాఠశాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం లేదు. ఈ పరిస్థితుల్లో ఇక్కడి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తెల్లపాడు, చినఅన్నలూరు, తూర్పుదూబగుంట, కావలిముస్తాపురం, నాగసముద్రం, వీర్నకొల్లు, గంగిరెడ్డిపాలెం, గుడ్లదొన, అనంతపురం తదితర సుదూర ప్రాంతాల నుంచి ఆటోల్లో వచ్చి పోతున్నారు.
- ఏ.ఎస్.పేటలోని పాఠశాల మండల కేంద్రానికి కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ 402 మంది చదువుతున్నారు. శ్రీకొలను, కావలియడవల్లి, జమ్మవరం, చౌటభీమవరం, పందిపాడు, గుడిపాడు, పెదబ్బీపురం గ్రామాల నుంచి బస్సు సౌకర్యం లేదు. మండల కేంద్రానికి ప్రైవేటు వాహనాల్లో వచ్చిన విద్యార్థులు అక్కడి నుంచి పాఠశాలకు నడిచి వెళుతున్నారు. కొందరు వారి గ్రామాల నుంచి ప్రత్యేకంగా ఆటోలను అద్దెకు మాట్లాడుకున్నారు. వర్షాల సమయంలో వీరి ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉంటున్నాయి.

ఆదర్శ పాఠశాలల్లో బోధన బాగుండడంతో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఇవి దూరంగా ఉండడంతో రవాణా వసతి లేక గ్రామాల నుంచి వెళ్లి రావడం భారంగా మారింది. బడి సమయానికి బస్సులు రాకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ప్రతి నెలా ప్రైవేటు వాహనాలకు చెల్లించే మొత్తం పేదలకు భారంగా మారింది. ప్రభుత్వం ఇచ్చే రవాణా ఛార్జీలు సరిపోవడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆటోల్లో ప్రమాదకరంగా వెళుతున్న విద్యార్థులు

పరిమితికి మించి

తక్కువ మందితో వెళితే గిట్టుబాటు కాదని ఒక్కో ఆటోలో 20 మంది వరకు ఎక్కించుకుంటున్నారు. పుస్తకాల సంచులను చుట్టుపక్కల వేలాడదీస్తున్నారు. ఆటోలోని డ్రైవర్‌కు ఇరువైపులా, వెనుకవైపు కూర్చొని ప్రమాదకర ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఒక్కో విద్యార్థి నెలకు రూ.600 నుంచి రూ.1,500 వరకు ఇందుకు ఖర్చు చేస్తున్నారు. ఇతర మండలాల నుంచి ఇక్కడకు వచ్చి చదివే విద్యార్థులు బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉంటున్నారు. రద్దీగా ఉన్న వాటిలో ఫుట్‌బోర్డులో వేలాడుతూ వెళుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కనీసం 30 ఆటోలు ఇక్కడకు వచ్చి పోతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

తల్లిదండ్రుల ఆందోళన

ప్రైవేటు వాహనాల్లో పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల పరిస్థితిపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చదువు కోవడానికి వేలాడుతూ, కిక్కిరిసిన ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణం తప్పనిసరైంది. ఈ తరుణంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. మరోవైపు ఆటో డ్రైవర్ల ప్రవర్తన సక్రమంగా ఉండడం లేదని కొందరు చెబుతున్నారు. ఆకతాయిలు ఇబ్బందులు పెడుతున్నారని పలువురు వాపోతున్నారు.

ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం

- ఎ.శ్రీనివాసులు, ప్రిన్సిపల్, కలిగిరి

విద్యార్థులకు రవాణా ఇబ్బందులు వాస్తవమే. దీనిపై మిగిలిన పాఠశాలల ప్రిన్సిపాళ్లు కూడా ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నారు. దాతలను కూడా వెదుకుతున్నాం. విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపితే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

పేదలకు ఉపాధి ఆసరా

న్యూస్‌టుడే, కొండాపురం, ఉదయగిరి

సన్న, చిన్న కారు రైతులకు ఆదాయం వచ్చేలా ఉపాధి హామీ అధికారులు పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహమిస్తున్నారు. పంట కుంటలు (ఫారం పాండ్లు) ఏర్పాటు చేసుకుని ఆ నీటితో ప్రభుత్వం ఇచ్చే వివిధ రకాలైన పండ్ల మొక్కలు సాగుచేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో 2025- 2026 సంవత్సరానికి 3500 ఎకరాల్లో పండ్ల తోటల సాగు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పొదలకూరు, రాపూరు, సైదాపురం, చేజర్ల, కలిగిరి మండలాల్లో అధికంగా నిమ్మ, మామిడి తోటల పెంపకం చేపట్టేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఉదయగిరి వంటి ప్రాంతాల్లో చౌడు భూములు ఉండడంతో రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇందుకోసం అధికారులు భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. ఆ తరువాత ఏవి వేసుకోవచ్చో తెలుస్తుందని వివరిస్తున్నారు.

కుంట తవ్వేందుకు భూమిని సిద్ధం చేస్తున్న రైతులు

నీటి కుంటలు తప్పనిసరి

రాయితీపై పండ్ల తోటలు పెంచాలంటే భూమిలో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలి. అప్పుడే వారికి పండ్ల మొక్కలు అందిస్తారు. కుంటల చుట్టూ పూల మొక్కలు పెంచేందుకు అవకాశం ఉంది. డ్రిప్ సౌకర్యం కూడా కల్పిస్తామని ఉపాధి హామీ పథకం అధికారులు చెబుతున్నారు.

రైతులకు ఎంతో ఉపయోగం

- మృదుల, ఏపీడీ, నెల్లూరు

పండ్ల తోటలతో ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుంది. మొక్కలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. నిమ్మ, మామిడి, జామ తోటలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. వీటి చుట్టూ వేసేందుకు ఎర్రచందనం, టేకు, కొబ్బరి మొక్కలు కూడా ఇస్తాం.

సృజనాత్మకత పెరిగేలా బాల్యానికి భరోసా

న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

అంగన్‌వాడీ అంటే కేవలం పోషకాహారం ఇవ్వడం.. కొంతసేపు పిల్లలను కూర్చోబెట్టడం.. పంపించడం కాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిన్నారుల శారీరక, మానసిక ఆరోగ్యం పెంపుపై దృష్టిసారించింది.. ఏ నెలలో చిన్నారి శారీరక ఎదుగుదల, మానసిక వికాసానికి అవసరమైన కార్యక్రమాలతో పాటు తల్లిదండ్రులు ఏం చేయాలి.. అంగన్‌వాడీ కార్యకర్త బాధ్యత ఏమిటో తెలిపేందుకు నవచేతన- ఆధార్‌శిల పుస్తకాల ద్వారా తెలియజేస్తున్నారు. కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో సుమారు 687 అంగన్‌వాడీలు, 7,645 మంది చిన్నారులు, 5987 మంది తల్లులు, బాలింతలున్నారు.

అంశాల వారీగా వివరిస్తూ..

పసిబిడ్డల పెంపకంలో తల్లి, కుటుంబ సభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వారితో ప్రవర్తించే విధానం. చిట్టి బుర్రలకు అర్థమయ్యేలా కబుర్లు, కథలు చెప్పడం తదితర అంశాలు చిత్రాలతో సహా పుస్తకంలో ఉన్నాయి. 36 నెలలు వచ్చే వరకు ఏం చేస్తే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారనే వివరాలతో పాటు ఏ నెలలో ఏ అంశాలు నేర్పాలో అందులో పొందుపరిచారు.

బుచ్చిలో పుస్తకాలు అందిస్తున్న పర్యవేక్షకురాలు

అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర..

చిన్నారుల మెదడు అభివృద్ధి, సమగ్ర ఎదుగుదలలో అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర కీలకం. 85 శాతం మెదడు అభివృద్ధి ఆరేళ్ల ముందు పూర్తవుతుంది. ఈ సమయంలో సరైన సంరక్షణ, ప్రేరణ, అనుభవాత్మక కృత్యాల ద్వారా పిల్లల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, ఆసక్తి శ్రద్ధ పెంపొందించనున్నారు. తల్లిదండ్రులకు మార్గదర్శకంగా నిలుస్తూ పిల్లల ఆహారం, విద్యావసరాలను తీర్చడంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తారు.

చిన్నారులకు ఎంతో మేలు

చిన్నారులకు నవచేతన- ఆధార్‌శిల పుస్తకాలు అంగన్‌వాడీలకు వచ్చాయి. వీటిని ప్రతి కార్యకర్త తల్లులకు తెలియజేయాలి. వీడియోలు అప్‌లోడ్ చేయాలి. పుట్టినప్పటి నుంచి మూడేళ్ల వరకు నవచేతన, పూర్వ పాఠశాల విద్యార్థులకు ఆధార్‌శిల పుస్తకాలు ఉపయోగించాలి. - జ్యోతి, సీడీపీవో

శ్రీ మాల్యాద్రి లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం, మాలకొండ
వలేటివారిపాలెం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

సీల్డు టెండర్స్ కమ్ బహిరంగ వేలం పాటల ప్రకటన

శ్రీ మాల్యాద్రి లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానము శ్రీ స్వామి వారికి భక్తులు సమర్పించిన సుమారు 15 టన్నుల మిక్స్‌డ్ బియ్యం, ఖాళీ నూనె ఐరన్ డబ్బాలు మరియు ఇతర సామాగ్రిని తేది : 31-07-2025 గురువారం ఉదయం గం. 10.00 లకు కొండపైన దేవస్థానం కళ్యాణ మండపము వద్ద సీల్డు టెండర్ కమ్ బహిరంగ వేలం పాటలు నిర్వహించబడును. ఇతర వివరములు సెల్ నెం. 92906 74118 సంప్రదించగలరు.

సం/- యస్.చంద్రశేఖర్
ఉప కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి

సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మలిరెడ్డి

నెల్లూరు (క్రీడా విభాగం), న్యూస్‌టుడే: సాఫ్ట్‌బాల్ జిల్లా అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మలిరెడ్డి కోటారెడ్డి ఎంపికయ్యారు. ఆదివారం ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్సులో ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర పరిశీలకులుగా పి.నరసింహారెడ్డి, ఆర్.సురేష్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.గురుప్రసాద్, డీఎస్‌ఏ పరిశీలకులుగా జసీమ్ వ్యవహరించారు. కమిటీ అధ్యక్షుడిగా మలిరెడ్డి కోటారెడ్డి, ఉపాధ్యక్షులుగా నరహరి, మాలకొండయ్య, కార్యదర్శిగా సీహెచ్ కామేశ్వరి, సంయుక్త కార్యదర్శులుగా పి.వేణు, జి.మహేష్, టి.హరి, కోశాధికారిగా బి.సుకృతను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా మలిరెడ్డి కోటారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సాఫ్ట్‌బాల్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులు పాల్గొన్నారు.

అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

సమాజాన్ని మార్చేది సాహిత్యమే: బుద్ధప్రసాద్

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: సమాజాన్ని మార్చే శక్తి సాహిత్యానికి ఉందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగిన విశాలాక్షి మాసపత్రిక వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఇందులో ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు కూడా తెలుగు సాహిత్యానికి విలువ ఇవ్వాలని సూచించారు. తెలుగు సాహిత్యం కోసం పార్టీలకతీతంగా పోరాటాలు సాగాలని రాష్ట్ర ఆక్వా అథారిటీ బోర్డు ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కార్టూన్ల పోటీల్లో పాల్గొన్న 35 మంది విద్యార్థులు, మినీ కథల పోటీల్లో గెలుపొందిన రచయితలను సన్మానించారు. కార్యక్రమానికి 25 కళాసంఘాల ఛైర్మన్ కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. కవులు, సామాజికవేత్తలు పూర్ణచంద్, కుసుమకుమారి, శివకుమార్, నిర్వాహకులు కోసూరు రత్నం, ఈతకోట సుబ్బారావు పాల్గొన్నారు.

సంపుటిని ఆవిష్కరిస్తున్న బుద్ధప్రసాద్, వెంకటరమణారెడ్డి తదితరులు

EENADU Classifieds

EDUCATION

Last Chance: 10th, Inter, Direct Degree (Disc), B.A, B.Com, B.Sc, BBA, BCA, B.Tech, Diploma, M.A, M.Com, MBA, MCA Regular/Lateral Entry ✆ 93812 87629.

FACULTY/ TEACHERS

WANTED TEACHERS to Teach 9th to 10th Hindi-1, 6th to 10th Computer-1, 6th to 10th Spoken English-1, IIT Maths (8th to 10th) -1. Salary: Negotiable. Cont: Vivekanandha EM School, Buchi. ✆ 94401 22213.

PEOPLE CARE

OLD AGE HOME

డా॥ లక్ష్మీప్రియాంక ఫౌండేషన్, ఒంగోలు. వానప్రస్థ వృద్ధాశ్రమం డార్మిటరీ1,2,3తో షేరింగ్ రూమ్స్ 24/7 కేర్ టేకర్స్ అందుబాటులో గలరు. సెల్: 62811 78484, 70322 50098.

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

REAL ESTATE

PLOT FOR SALE

నెల్లూరు ధనలక్ష్మీపురం KGK కళ్యాణ మండపం సమీపంలో సాయి కృష్ణానగర్ NUDA అప్రూవల్ లేఅవుట్ నందు ఇండ్ల మధ్యలో గల తూర్పు ఫేసింగ్ 25 అంకణములు ప్లాట్ అమ్మకమునకు కలదు. ✆ 89859 65161, 94914 54990

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే. వివరాలకు.. నెల్లూరు 80080 01790

JOBS

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 9014651068, 7075633416.

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

పొట్టిశ్రీరాములు విగ్రహ ఏర్పాటు అభినందనీయం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య నాయకులు

కావలి గ్రామీణం, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో శ్రీపొట్టిశ్రీరాముల 58 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టడం అభినందనీయమని ఆర్యవైశ్యుల కావలి కమిటీ అధ్యక్షులు తటవర్తి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులోని శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన నివసించిన ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేస్తామని సీఎం చెప్పడం హర్షించదగిన విషయం అన్నారు. ఆర్యవైశ్య నాయకులు మాల్యాద్రి, వేణుగోపాల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కావలి

•కావలి •ఉదయగిరి •కందుకూరు

పారిశుద్ధ్య మెరుగుకు ప్రాధాన్యం

స్పందనకు వందనం

కలిగిరి : తెల్లపాడులో పారిశుద్ధ్య మెరుగుకు ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి తెలిపారు. గ్రామంలోని నివాసాల పక్కనున్న చెత్త నిల్వలపై శనివారం ఈనాడులో ప్రచురితమైన 'పక్కనే వ్యర్థాలు.. స్థానికుల అవస్థలు' వార్తకు ఆయన స్పందించారు. పొక్లెయిన్, ట్రాక్టర్లతో తొలగించి శుభ్రం చేయించారు. వీధుల్లో చెత్త వేయకూడదని ప్రజలకు సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: అల్లూరుకు కేటాయించిన సెప్టిక్ ట్యాంకు శుభ్రం చేసే యంత్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలి. - రామారావు, స్థానికుడు
సమాధానం: త్వరలోనే తీసుకొస్తాం. - ఉమామహేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ - అల్లూరు, న్యూస్‌టుడే

? వెలగపాడు గ్రామంలో అర్హత ఉన్నా పలువురికి పక్కా గృహాలు మంజూరు కాలేదు. ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. - శివ, స్థానికుడు
✓ అర్హులందరికీ మంజూరు చేస్తాం.
- వెంకటేశ్వరరెడ్డి, హౌసింగ్ ఏఈ - న్యూస్‌టుడే, కలిగిరి.

అత్యవసరానికి అవస్థ

న్యూస్‌టుడే, సీతారామపురం

వివిధ పనుల నిమిత్తం గ్రామ సచివాలయాలకు వచ్చే ప్రజలకు, అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో అత్యవసరానికి అవస్థలు తప్పడం లేదు. ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మండలంలో తొమ్మిది సచివాలయాలు ఉండగా.. గత ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ భారత్ మిషన్ పథకంలో భాగంగా 2022-23లో రూ. 3లక్షలతో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఆ మేరకు బసినేనిపల్లి, నెమళ్లదిన్నె, సింగారెడ్డిపల్లిలో పనులు ప్రారంభించగా.. నేటికీ పూర్తికాలేదు. అయ్యవారిపల్లిలో పునాదులు తీసి వదిలేశారు. మిగిలిన సచివాలయాల వద్ద అసలు మొదలు కాని పరిస్థితి నెలకొంది. బసినేనిపల్లి, నెమళ్లదిన్నె సచివాలయాలు వద్ద మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటుచేసి, ప్లాస్టరింగ్ పనులు పూర్తిచేసినట్లయితే వినియోగంలోకి వస్తాయి. బిల్లులు పూర్తిగా రాకపోవడంతో గుత్తేదారులు పనులు అసంపూర్తిగా వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి నిర్మాణాలు పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తిగా నెమళ్లదిన్నెలోని మరుగు దొడ్డి

అంచనాలు మార్పు చేసి పంపించాం

సచివాలయాల వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి గతంలో రూ. మూడు లక్షలు మంజూరు చేశారు. ఎక్కడా పూర్తికాలేదు. దీంతో వీటి నిర్మాణానికి అంచనాలు తిరిగి రూపొందించి ఉన్నతాధికారులకు పంపించాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. - హనీనిస్సీ, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

శిథిల నీడలో వసతి గృహాలు

నిధులు మంజూరైనా పూర్తికాని మరమ్మతులు

న్యూస్‌టుడే, కలిగిరి

వానొస్తే పైకప్పు ఉరుపుతో లోపలకు నీళ్లు.. బీటలు వారి చెమ్మగిల్లే గోడలు.. పెచ్చులూడి దెబ్బతిన్న తలుపులు, కిటికీలు.. ప్రభుత్వ వసతి గృహాల్లో ఈ పరిస్థితిని మార్చడానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించింది. పాఠశాలలు పునఃప్రారంభమై నెలరోజులైనా.. అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో విద్యార్థులను వసతి గృహాల్లో ఉంచడానికి తల్లిదండ్రులు జంకుతున్నారు.

కలిగిరి మండలం శిద్దనకొండూరు ఎస్సీ వసతి గృహంలో పిల్లలను చేర్పించేందుకు ఇటీవల తల్లిదండ్రులు వచ్చారు. అక్కడి వసతులను చూసి భయపడిపోయారు. త్వరలో మరమ్మతులు పూర్తవుతాయని, పిల్లల భద్రతకు తమది భరోసా అని వార్డెన్ సమాధానమిచ్చారు. సౌకర్యాలు మెరుగుపడితేనే చేర్పుతామని, అప్పటివరకు ఎన్ని ఇబ్బందులైనా ఇంటి నుంచి పాఠశాలకు పంపుతామని సుమారు 35 మంది వరకు విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తులు ఇచ్చి వెళ్లారు.

శిద్దనకొండూరులో డైనింగ్ గది ఇలా..

ఉదయగిరి నియోజకవర్గంలో శిద్దనకొండూరు, సీతారామపురం, నర్రవాడ, వింజమూరు, కొండాపురం ప్రాంతాల్లో ఎస్సీ బాలుర వసతిగృహాలు ఉన్నాయి. వీటి మరమ్మతులకు నిధులు మంజూరు కావడంతో ప్రాధాన్యక్రమంలో పనులు చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. వారి పర్యవేక్షణ కొరవడటం, గుత్తేదారుల అలసత్వంతో పనులు పూర్తికావడం లేదు. పనులు పూర్తయితే విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూస్తామని అధికారులు చెబుతున్నారు.

వివరాలు ఇలా..

వసతి గృహం	నిధులు మంజూరు(రూ.లక్షల్లో)	పనుల శాతం	విద్యార్థుల సంఖ్య
శిద్దనకొండూరు	6	10	11
సీతారామపురం	7.6	95	51
నర్రవాడ	8.50	90	47
కొండాపురం	49	70	100
వింజమూరు	3.40	90	60

శిద్దనకొండూరులో ఇదీ పరిస్థితి

ఈ హాస్టల్ భవనం పూర్తిగా శిథిలమైంది. కప్పుపైకి వర్షానికి స్లాబు ఉరుస్తోంది. గోడలు బీటలు వారాయి. భద్రత లేకపోవడంతో గతంలో బియ్యం బస్తాలు చోరీ అయ్యాయి. వంట గది, డైనింగ్ హాల్ పైకప్పు ఇనుప చువ్వలతో దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్లు, నీళ్ల ట్యాంకు, గేట్లు మరమ్మతులకు గురయ్యాయి. ప్రహరీ లేకపోవడంతో పాముల బెడద ఉంది. కరెంటు తీగలు బయట వేలాడుతున్నాయి. సంక్షేమాధికారి ఉమాశంకర్ మాట్లాడుతూ ఇక్కడి పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చామన్నారు. 35 మంది విద్యార్థులు ఉండేందుకు దరఖాస్తులు ఇచ్చారని ప్రస్తుతం 11 మంది మాత్రమే ఉన్నారన్నారు. మరమ్మతులు పూర్తయితే 50 మంది వరకు ఉండే అవకాశం ఉందన్నారు.

అంకమ్మతల్లికి బోనాలు

గుడ్లూరు, న్యూస్‌టుడే: స్థానిక మిట్టపాలెంలోని అంకమ్మ దేవత బోనాలు సమర్పణ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. బస్టాండు కూడలి నుంచి మేళతాళాలు మధ్య మహిళలు బోనాలను ఆలయానికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

ఉదయగిరి, న్యూస్‌టుడే: దుర్గంపల్లిలో ఆదివారం గ్రామ దేవతలు అంకాలమ్మ, పోలేరమ్మలకు ప్రజలు భక్తిశ్రద్ధలతో పొంగళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లను వండి నైవేద్యంగా సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు.

పీఏసీఎస్‌లకు అధ్యక్షుల ఎంపిక

దగదర్తి, న్యూస్‌టుడే: మండలంలోని దగదర్తి, శ్రీరామపురం పీఏసీఎస్‌ల అధ్యక్షులుగా బొలిగర్ల వెంకట రత్నం, ఈదల రవి కృష్ణారెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే డి.వి.కృష్ణారెడ్డి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి రవి కుమార్ చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.

మూతపడిన శుద్ధజలకేంద్రం..

పోట్లూరు శుద్ధ జల కేంద్రం మరమ్మతులకు గురవడంతో గ్రామస్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ప్రైవేటు వ్యక్తులతో అధిక ధరలకు కొనాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిర్వాహకులకు పంచాయతీ బకాయిలు చెల్లించాలని నోటీసులు ఇచ్చామని.. వారం రోజుల్లో మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తామన్నారు. - న్యూస్‌టుడే, గుడ్లూరు

పారిశుద్ధ్యం.. అధ్వానం

పోట్లూరు ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాల చుట్టూ అపరిశుభ్రం నెలకొంది. సక్రమంగా కాలువలు లేకపోవడంతో మురుగు రోడ్డు అంచుల్లో నిలుస్తోంది. దుర్వాసన, దోమల ఉద్ధృతితో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు బ్లీచింగు కూడా చల్లడం లేదని ఆరోపిస్తున్నారు. వర్షాలు పడుతున్నందున పూడిక తీయించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వెంకటేశ్వరావు మాట్లాడుతూ చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, గుడ్లూరు

ప్రమాదకరంగా గుంత

పట్టణంలోని ఆవుల వీధిలో సీసీ రోడ్డు కుంగి గుంత ఏర్పడి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో గమనించక చిన్నారులు, వృద్ధులు గాయాల పాలవుతున్నా అధికారులకు పట్టడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఉదయగిరి

అల్లుకున్న నిర్లక్ష్యం

చిప్పలేరు వాగు సమీపంలో ర.భ శాఖ రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభానికి పిచ్చిమొక్కలు అల్లుకున్నాయి. నిత్యం ఇటుగా అధికారులు రాకపోకలు సాగిస్తున్నా.. వారికి కనబడటం లేదని పలువురు స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యుత్తు ఏఈ సునీల్ మాట్లాడుతూ వాటిని తొలగించి సమస్య పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, జలదంకి

ట్రాఫిక్ కోరల్లో బోగోలు

బోగోలు రైలు గేటుకు ఇరువైపులా రోడ్డు అధ్వానంగా ఉంది. రహదారిపై ఏర్పడిన గోతులు, వ్యాపారుల తీరుతో వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గేటు మూసి, తెరిచే సమయంలో ఆ రద్దీ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా ఉంటుందని పలువురు చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పరిష్కారం చూపాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బిట్రగుంట

అర్ధాంగి ఒడిలోనే కన్నుమూసి..

సుభానీకి సపర్యలు చేస్తున్న ఆఫ్రిన్

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కుమార్తెకు మంచి భవిష్యత్తు ఇచ్చామన్న ఆనందంతో బయల్దేరిన ఆ తల్లిదండ్రులను విధి వంచించింది. ఆమెను కళాశాలలో చేర్పించి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. రక్తమోడుతూ అర్ధాంగి చేతుల్లోనే ఆ ఇంటి పెద్ద కన్ను మూయడం స్థానికులను కలచివేసింది. ఈ ఘటన ఆదివారం ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం కలికివాయ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై మహేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం పలుకూరుకు చెందిన షేక్ సుభానీ బాషా, ఆఫ్రిన్ దంపతులు. ఆయన స్థానికంగా దర్జీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇటీవల వారి కుమార్తె తెలంగాణ రాష్ట్రం బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. దీంతో ఆమెను అక్కడ చేర్పించి శనివారం రాత్రి రైల్లో దంపతులిద్దరూ తిరుగుపయనమయ్యారు. ఆదివారం ఒంగోలులో దిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నారు. కలికివాయ సమీపంలో ఆగివున్న లారీని ఢీకొనడంతో సుభానీ తలకు తీవ్ర గాయమైంది. వెంటనే అక్కడున్న ప్రయాణికులు స్పందించి 108 వాహనంలో వారిని ఒంగోలుకు తరలిస్తుండగా, భార్య ఒడిలోనే ఆయన ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

ఉదయగిరి : ఉదయగిరి శివారు ప్రాంతంలోని 167-బీజీ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. సీతారామపురానికి చెందిన మీనిగ ఓంకార్ జువ్వలదిన్నెలో ఫిషరీస్ సహాయకుడిగా పనిచేస్తున్నారు. తన వాహనంపై స్వగ్రామానికి వస్తుండగా జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టి గాయాలపాలయ్యారు. స్థానికులు గమనించి 108 వాహానానికి సమాచారమందించటంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

లారీని ఢీ కొన్న కారు

ఉలవపాడు : మండలంలోని మన్నేరు సమీపంలో ఆదివారం జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీని కారు ఢీకొనగా అయిదుగురికి గాయాలపాలయ్యాయి. వివరాల మేరకు.. ఉలవపాడుకు చెందిన వారు ఒంగోలు సమీపంలోని పెళ్లూరుకు వెళ్లి కారులో తిరిగి వస్తున్నారు. ఆ క్రమంలో లారీని ఢీకొనడంతో అంగన్‌వాడీ కార్యకర్త పద్మకి తీవ్ర గాయాలు కాగా మిగిలిన నలుగురుకు స్వల్పగాయాలయ్యాయి. ఆమెను ఒంగోలుకు తరలించారు.

పోలీసుల అదుపులో గుర్తుతెలియని వ్యక్తులు

ఉలవపాడు : స్థానిక దర్గా కూడలిలో కరేడు ఆటో కోసం వేచి ఉన్న గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం ఆటోల వద్ద వారు అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎక్కడినుంచి వచ్చారో కానీ రెండు కారులో దిగిన పోలీసులు ముగ్గురు వ్యక్తులను తమ వాహనాల్లో తీసుకుని వెళ్లిపోయారు. ఈ విషయమై ఎలాంటి సమాచారం లేదని స్థానిక పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో హాస్టల్ నిర్వాహకుడి మృతి

కొండల్‌రావు

రాయదుర్గం : విద్యుదాఘాతంతో ఓ హాస్టల్ నిర్వాహకుడు మృతిచెందిన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సీతారామపురం మండలం గుండుపల్లికి చెందిన రాచల కొండల్‌రావు(43), నిర్మల దంపతులు మూడేళ్ల క్రితం హైదరాబాద్ నగరానికి వచ్చారు. రాయదుర్గం మధురానగర్‌లో శ్రీలక్ష్మీబాలాజీ ఉమెన్స్ హాస్టల్ నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం కొండల్‌రావు హాస్టల్‌లో ఫ్లోరింగ్ శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగ తగిలి విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఆయనను భార్య స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు భార్య ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో గంగమ్మకు పూజలు

గ్రామస్థులతో మాట్లాడుతున్న తహసీల్దారు, పోలీసులు

లింగసముద్రం : గంగమ్మదేవికి పూజలు చేసే విషయమై రెండు గ్రామాల మధ్య ఆదివారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. తిమ్మారెడ్డిపాలెం-గంగపాలెం సరిహద్దులోని పొలాల్లో గంగమ్మదేవి ఆలయం ఉంది. సమీపంలో కొత్తగా మరోకటి నిర్మించారు. పాత గుడిలోని విగ్రహాలను కొత్త ఆలయంలో ప్రతిష్ఠించాలని తిమ్మారెడ్డిపాలేనికి చెందిన కొందరు తీర్మానించారు. గంగపాలెంవాసులు అందుకు నిరాకరించారు. దీంతో ఇరు గ్రామాల మధ్య ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. సమాచారం అందుకున్న సీఐ మంగరావు, ఎస్సైలు నారాయణ, వెంకట్రావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బలగాలను మోహరించారు. తహసీల్దారు సీతామహాలక్ష్మి అక్కడికి చేరుకుని ఇరువర్గాలతో పలు దఫాలు చర్చించారు. ఈ తరుణంలో అధికారులతో తిమ్మారెడ్డిపాలెం మహిళలు, యువకులు వాగ్వాదానికి దిగారు. వారందరికి పోలీసులు సర్దిచెప్పి పంపించగా గంగపాలెం వాసులు గంగమ్మకు పొంగళ్లు పెట్టి పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

కావలి : పురపాలక కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీయూసీసీ (ట్రేడ్ యూనియన్ కోఆర్డినేషన్ సెంటర్) రాష్ట్ర అధ్యక్షులు డీవీఎస్ రాజు అన్నారు. ఆదివారం స్థానిక పురపాలిక కార్మికులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తాము డబ్ల్యూఎఫ్‌టీయూ(వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్) అనుబంధ యూనియన్‌గా జాతీయ స్థాయిలో పనిచేస్తున్నట్లు వివరించారు. అందులో నేతాజీ మున్సిపల్ వర్కర్ల యూనియన్ కూడా ప్రత్యేక సేవలందిస్తోందన్నారు. కమిటీలో గౌరవాధ్యక్షులుగా డీవీఎస్ రాజు, అధ్యక్షులుగా ఏసు, ఉపాధ్యక్షుడిగా మనోహర్, ప్రధాన కార్యదర్శిగా రవి, సంయుక్త కార్యదర్శిగా భానుప్రకాశ్, కోశాధికారిగా ఆదిలక్ష్మి, సంయుక్త కోశాధికారిగా ఎలమందయ్య ఉన్నారు.

జోరుగా జూదం (ప్రత్యేక వాహనాల్లో..)

న్యూస్‌టుడే, కందుకూరు

నియోజకవర్గంలోని గుడ్లూరు మండలం తెట్టు పరిసర ప్రాంతంలో జూద స్థావరాలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. చుట్టూ పక్కల మండలాల వారితో పాటు ఒంగోలు, నెల్లూరు నుంచి ఈ క్రీడల్లో పాల్గొనేందుకు ఇక్కడకు వస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా రాత్రి సమయంలోనే ఈ వ్యవహారం సాగుతోంది.

● తెట్టు రైల్వే స్టేషనుకు తూర్పుభాగం, రావూరు మార్గానికి ఉత్తరాన అటవీ ప్రాంతంలో జూదం ఆడేందుకు అనుకూలమైన ప్రదేశంగా మార్చారు. గత ప్రభుత్వంలో చిరుద్యోగిగా పనిచేసిన ఏలూరుపాడుకు చెందిన ఓ వ్యక్తి వీటిని నిర్వహిస్తున్నట్లు సమాచారం. కొన్ని రోజులు ఇక్కడ మరికొన్ని రోజులు కావలి మండలం చెన్నాయపాలెం పరిసరాల్లో నడిపిస్తున్నారు.

రాత్రి సమయంలో జూదప్రియులు తెట్టు వరకు కార్లలో వస్తారు. అక్కడ నుంచి నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో కేంద్రాలకు తీసుకుని వెళ్లారు. ఇందుకోసం ప్రత్యేక నిఘా వ్యవస్థ ఉంటుంది. కాపలాదారులకు రోజుకు రూ. 2000 వరకు చెల్లిస్తారు. ఒక రోజు ఆట నిర్వాహకుడికి సుమారు రూ. లక్ష వరకు ఖర్చు అవుతుందని సమాచారం.

● ఈ విషయమై గుడ్లూరు సీఐ మంగారావు మాట్లాడుతూ.. ఇంతవరకు సమాచారం లేదు. జూదం ఆడటాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించాం. నిఘా ఉంచుతామన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి

కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు పట్టణం: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే ఇంటింటి పర్యటన చేపట్టినట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 27వ వార్డు విప్పగుంట రోడ్డులోని వినాయక స్వామి ఆలయం నుంచి సుపరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ మంత్రి నారాయణ సహకారంతో పట్టణంలో మొట్టమొదటిగా డివైడర్, రోడ్ల వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టామన్నారు. నాయకులు దామా మల్లేశ్వరరావు, శివసూర్య, వీరాస్వామి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు, ఉదయగిరి, న్యూస్‌టుడే: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు అభివృద్ధి పనులు చేయడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. మండలంలోని చాకలకొండలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు గూడా నరసారెడ్డి, వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉదయగిరి పట్టణంలోని దేవలాల గడ్డ, తుపాన్‌నగర్, ఈద్గామిట్ట ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

బిట్రగుంట: కూటమి ప్రభుత్వం మత్స్యకార్లకు అండగా ఉంటుందని తెదేపా మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు అన్నారు. పాతకడపాళెం గ్రామంలో ఇంటింటికి తిరిగి ఏడాదిలో సాధించిన ప్రగతిని వివరించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌తో మత్స్యకారులకు మేలు జరుగుతుందన్నారు.

నీరు రాక.. అవసరాలు తీరక

న్యూస్‌టుడే, ఉదయగిరి

పట్టణంలో నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. ఒకవైపు ఎండలు మండిపోతున్నాయి. మరోవైపు నీరు లేక బిందెలు చేతబట్టి దూరప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు. పంచాయతీ ద్వారా మూడు, నాలుగు రోజులకోసారి విడుదల చేస్తున్నారు. ఇళ్లలో వాడుకకు అవసరమైన నీరు అందుబాటులో నానాఇబ్బందులు పడుతున్నారు. సుమారు నాలుగు వేల వరకు నివాసాలుండగా 17 వేల మంది ఉన్నారు. డైరెక్ట్ పంపింగ్‌కు 42 చోట్ల బోర్ల మోటార్లు ఉన్నాయి. నాలుగేసి ఓవర్‌హెడ్ ట్యాంకులు, నేల ట్యాంకులు ఉన్నాయి. వీటి ద్వారా సరఫరా చేస్తున్నారు. పెరిగిన జనాభాకు ఇవి సరిపోవడం లేదు. దీంతో కొన్ని వీధులకు రెండు రోజులకొకసారి మరికొన్నింటికి మూడు, నాలుగు రోజులకొకసారి ఇస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఈ పరిస్థితి చాలా కాలంగా ఉన్నా పాలకులు ఆలకించకపోవడంతో అల్లాడిపోతున్నామని ఆవేదన చెందుతున్నారు.

నిల్వ చేసే వనరుల్లేకనే..

ఉదయగిరి మేజరు పంచాయతీలో పెరిగిన జనాభాకు అనుగుణంగా ట్యాంకులు లేని కారణంగా నీటి సరఫరాలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. కొందరు మోటార్లు పెట్టి తోడేస్తుండడంతో చివరి వారికి అందడం లేదని వివరిస్తున్నారు.

నీటికోసం ఇళ్ల ముందు ఉంచిన డ్రమ్ములు

నాలుగు రోజులకోసారి ఇస్తే ఎలా? : సావిత్రి, ఆవుల వీధి

మా వీధికి నాలుగు రోజులకొకసారి ఇస్తున్నారు. ఇళ్లలో వాడుకొనేందుకు కూడా అందుబాటులో ఉండక అవస్థలు పడుతున్నాం. ప్రతిరోజు సరఫరా చేయాలి.

ట్యాంకుల్లేక ఇబ్బందులు

– కరీముల్లా, డిప్యూటీ ఎంపీడీవో

ఎక్కువ నీటి నిల్వ సామర్థ్యమున్న ట్యాంకులు అందుబాటులో లేవు. దీంతో ఉన్న వాటికే నింపి సరఫరా చేస్తున్నాం. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగన్నాథం దృష్టికి తీసుకెళ్లగా అందుబాటులో ఉన్న వనరులతో రోజుమార్చి రోజు సరఫరా జరుగుతుందన్నారు. గ్రిడ్‌లో భాగంగా పట్టణానికి మూడు ఓవర్‌హెడ్ ట్యాంకుల ఏర్పాటుకు ప్రతిపాదన పంపామని వివరించారు.

PUBLIC NOTICE

Under the instructions of my clint M/s Shriram Finance ltd., Kandukur Branch, SPSR Nellore District issue the following notice to the general public .

My client intends to grant loan to the applicant **Shaik Pyarijaan W/o. Kalesha R/o SPSR Nellore District,, Kandukur Town, 14th ward, Mullapaalem (v), Door No.14-1-15/1,** Submitted the documents to create the same as security for the trade finance . On careful scrutiny of the documents . I have submitted my legal opinion as follows for the property as security by way of registered mortgage . As such if anyone have my claims, charges, mortgages, sale agreements, court attachments, court disputes, etc., Shall be informed to the below address within 5 days from the date of this notice. Otherwise later objection will not bind my clint in this regard.

SCHEDULE: SRPS.Nellore District Registration, Kandukur Sub Registration, Kandukur Municipal Corporation, Kandukur Town, 12th ward, 3rd block Servey No.865/1A1A2A1, 12th ward, vacant site an extent of 112 sq.yards, or 1008 sq.feet, or 14 gadies, or 93.632 Sq.meters of Boundary **East:**Side shaik khaakar and shaik noorjahaan banku its covering an extent of 18 Sq.feet and 8 inches, **South:** side Idupulapati Ranga Rao house it covers 54sq.feet, **West:** side Gundamkatta road its covering an extent 18 sq.feet and 8 inches, and **North:**side Shaik shaapool Hamed site covering an extent 54 sq. feet of vacant site bounded by:

Sd/- JAGARLAMUDI SURESH BABU
Advocate& Legal Advisor AP/1488/1998
Shriram Finance Ltd., Ongole

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd., Kandukur Branch, SPSR Nellore District issue the following notice to the general public.

My client intends to grant loan to the applicant **Gosula Nirupa W/o Raghavareddy,** R/o, Atmakuru, Ulavapadu Mandal. SPSR Nellore District, Andhra Pradesh, submitted the documents to create the same as security for the Trade Finance. On careful scrutiny of the documents. I have submitted my legal opinion as follows for the property as security by way of registered mortgage. As such if anyone have any claims, charges, mortgages, sale agreements, court attachments, court disputes, etc., shall be informed to the below address within 7 days from the date of this notice. Otherwise later objection will not bind my client in this regard.

SCHEDULE: SPSR Nellore District Registration, Old Prakasam District, Kandukur Sub Registration, Kandukur Mandal, Palurudondapadu Grama Panchayath and Paluru village in Survey no. 172/2B, an extent of Ac.0.22 cents or 1061.8 sq.yards or 894.432 sq.meters, Amareswari Rice Mill with in it 1277 sq.feet of ACC roof shed constructed there in with assessment no.548, bounded by: **East :** Road-65feet, **South :** Land of Daggumati Subbaramireddy - 151feet **West :** Land of Katta Kotaiah - 64.6feet **North :** Land of Katta Kotaiah - 144feet.

Sd/- JAGARLAMUDI SURESH BABU
Advocate& Legal Advisor AP/1488/1998
Shriram Finance Ltd., Ongole

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా క్లయింట్ అయిన **యాంట్రాతి తిరుపతమ్మ** W/o **రామయ్య,** సీతారామపురం మండలం, అయ్యవారిపల్లె గ్రామం అను వారు **కట్టా షార్కే** అను వారిపై గౌరవ సీనియర్ సివిల్ జడ్జి ఆత్మకూరు కోర్టు నందు A.S.No. 5/2024 మరియు I.A.No. 342/2024 గా కేసు నమోదై కోర్టు నందు విచారణ జరుగుచున్నది. కావున నా క్లయింట్ యొక్క ఈ క్రింది షెడ్యూల్డ్ ఆస్తిని అక్రమముగా ఆక్రమించాలని ప్రయత్నిస్తే వారి మీద సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడును.

ఆస్తి షెడ్యూలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఉదయగిరి సబ్‌రిజిస్ట్రేషన్ ఏరియా, సీతారామపురం మండలం, అయ్యవారిపల్లె గ్రామం, సర్వే నెంబర్ 7, విస్తీర్ణం 0.03 సెంట్లులో బంకు మరియు ఖాళీ స్థలం.

ఇట్లు : **సందిరెడ్డి రామారావు,** M.A.,BL., అడ్వొకేట్, ఉదయగిరి, సెల్ : 94417 68202

(c) eenadu

సూచిక లేక విభాగినిని ఢీకొన్న కారు
ఏడుగురికి తీవ్ర గాయాలు

సంగం, న్యూస్‌టుడే: నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి వెంగారెడ్డిపాలెం, సిద్ధిపురం గ్రామాల మధ్య నాలుగు వరుసలుగా మారుతుంది. రహదారి మధ్యలో విభాగిని వద్ద ఎలాంటి సూచికలు లేక ఆదివారం రాత్రి రెండు కార్లు ప్రమాదానికి గురవడంతో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సంగం నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారు రాత్రి ఏడున్నర గంటల సమయంలో భారీ వర్షం రావడంతో సూచికలు లేక విభాగిని కనిపించకపోవడంతో దాన్ని ఢీకొన్నాయి. సిద్ధిపురం సమీపంలో విభాగిని వద్ద చక్రం దెబ్బతినడంతో మరొక కారు ఢీకొంది. క్షతగాత్రులను గ్రామస్థులు వైద్య చికిత్సకు తరలించారు. ఈ సమస్యను 'ఈనాడు' పలుమార్లు వెలుగులోకి తెచ్చినా జాతీయ రహదారి విభాగం అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

కోవూరు
• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

యువత క్రీడల్లో రాణించాలి

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: యువత క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీహరికోట ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని నరసాపురం గ్రామంలో ఎంవీఆర్ జడ్పీ హైస్కూల్లో మార్నింగ్ స్టార్స్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన డివిజన్ వారియర్స్ జట్టుకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: పొదలకూరు రూరల్ పరిధిలోని చిట్టేపల్లి హరిజనవాడ ప్రధాన రహదారిలోని విద్యుద్దీపాలు మరమ్మతులకు గురై పది రోజులుగా వెలగడం లేదు. - హరి, స్థానికుడు

సమాధానం: పరిశీలించి సిబ్బందికి చెప్పి సరి చేస్తాం. - నరసింహారావు, ఎంపీడీవో

? బుచ్చి నగర పంచాయతీలోని పెద్దూరు దళితవాడ నాలుగో వీధిలో పారిశుద్ధ్య సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. - జాన్సన్

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - బాలకృష్ణ, నగర పంచాయతీ కమిషనర్

? సంగం మండలం నీలాయపాలెంలో ప్రాథమిక పాఠశాల సమీపంలో వీధి దీపం వెలగనందున ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. - పెంచలయ్య, స్థానికుడు

✓ వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - సుధాకర్, పంచాయతీ కార్యదర్శి

? మర్రిపాడు మండలం పీసీపల్లి పంచాయతీ అనంతపురంలో శ్మశాన వాటిక వద్ద చేతిపంపు ఏర్పాటు చేయాలి. - పవన్, స్థానికుడు

✓ బోరు వేసి చేతిపంపు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. - నాగేశ్వర ప్రసాద్, ఎంపీడీవో

? పొదలకూరు మండలం అంబేడ్కర్ గిరిజన కాలనీలో సుమారు 21 మంది పిల్లలు చదువుతున్నారు. ప్రస్తుతం కాలనీలో ఒక ఇంట్లో పాఠశాల నిర్వహిస్తున్నారు. సొంత భవనం నిర్మిస్తే బాగుంటుంది. - ప్రభాకర్, స్థానికుడు

✓ నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపాం. అనుమతి వస్తే నిర్మిస్తాం. - శోభనాద్రి, ఎంఈవో

? చేజర్ల మండలం ఆదూరుపల్లి ఆటవీ రాజా వద్ద వర్షపు నీరు నిలిచింది. - స్థానికులు

✓ సమస్య పరిష్కరిస్తాం - అన్వేష్, ర.భ ఏఈ

? చేజర్ల, ఆదురుపల్లి, పలుగ్రామాల్లో విద్యుత్తు స్తంభాలకు కట్టిన డిష్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. గాలులకు కిందికి జారి వాహనదారులు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. - పెంచలరెడ్డి, చేజర్ల

✓ సంబంధిత వ్యక్తులకు సమాచారమిస్తాం. తొలగించకుంటే విద్యుత్తు సిబ్బంది ద్వారా తొలగిస్తాం. - లిఖితేష్, ట్రాన్స్‌కో ఏఈ

పేదరిక నిర్మూలనే చంద్రబాబు లక్ష్యం

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, విడవలూరు, ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా చంద్రబాబు సుపరిపాలన అందిస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని ఆమె నివాసంలో ఆదివారం కోవూరు నియోజకవర్గ విజన్ యాక్షన్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పీ4 విధానం ద్వారా నియోజకవర్గంలో 10 వేల కుటుంబాలను గుర్తించాలని సూచించారు. అధికారులు పక్కా ప్రణాళికతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ❖ పేదప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. ఆమె నివాసంలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని 32 మందికి రూ. 26.29 లక్షల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ చేశారు. ❖ ఇందుకూరుపేట మండల పరిధిలోని గంగపట్నం, రాముడుపాలెంలో సుపరిపాలనలో తొలిఅడుగు-ఇంటింటికీ తెదేపా కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమన్నారు. ఆమె ఓ టిఫిన్ దుకాణంలో దోసెలు పోసి వారితో మమేకమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాముడుపాలెం ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాగుదారులకు యూరియా భారం

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేయాలంటే రైతులు ఆసక్తి చూపడం లేదు. అమాంతం పెరిగిన ధరలతో ఆశించిన దిగుబడులు లేక సతమతమవుతున్నారు. కొన్ని చోట్ల బాగున్నా గిట్టుబాటు ధరల్లేక నష్టపోతున్నారు. ప్రస్తుత సీజన్‌లో ఎరువుల ధరలు పెరగడంతో సాగుదారుల్లో ఆందోళన నెలకొంది. అది లేకుండా సాగు చేసే దిగుబడులు రావని ఎంతైనా వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో రెండో పంట సుమారుగా 80 వేల ఎకరాల్లో సాగుచేస్తారు. ❖ ఎకరానికి ఎరువులు, దుక్కిపిండికి రూ. 7 వేలు, యూరియా రూ. 1200 ఖర్చవుతోంది. మొత్తం మీద పురుగుమందులు కలిపితే మొత్తం ఎకరానికి రూ. 20 వేలు వెచ్చిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర రైతుల వ్యవసాయ ఖర్చులకు, పెరిగిన ధరలకనుగుణంగా లేక ఆశించిన లాభాలు రావడం లేదు. ఇక కౌలు రైతులైతే అప్పులు మిగులుతున్నాయి. యూరియాపై కేంద్ర ప్రభుత్వ నియంత్రణ ఉంది. కాంప్లెక్స్ ఎరువుల విషయంలో ప్రభుత్వ రాయితీ లేకపోవడంతో ఆయా కంపెనీలు తయారీ ఖర్చుల ఆధారంగా ధరలు నిర్ణయిస్తున్నారు. పొటాష్, పాస్ఫరస్ వంటివి దేశీయంగా లభించక విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీంతో బస్తాకు రూ. 100 నుంచి రూ. 250 వరకు పెరిగాయి.

జిల్లాలో కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఇలా

ఎరువు	2023	2024	2025
10–26–26	1375	1720	1750
20-20-0-13	1175	1300	1400
14–35–14	1450	1800	1900
16–16–16	1250	1475	1600
ఎంఓపీ	1400	1550	1800

❖ బుచ్చి మండల వ్యవసాయాధికారి శ్రీహరి మాట్లాడుతూ... ఎమ్మార్పీకి మించి ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల ప్రతి దుకాణంలో ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించారని పేర్కొన్నారు.

మానవ అక్రమ రవాణా ముఠాలపై అప్రమత్తమవుదాం

వెంకటాచలం, న్యూస్‌టుడే: మానవ అక్రమ రవాణా ముఠాలపై మహిళలు, విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఏఎస్ఐ వై. శ్రీహరి సూచించారు. మండలంలోని కనుపూరులో మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, పోక్సో యాక్ట్, మాదక ద్రవ్యాల వినియోగం, శక్తియాప్‌లపై ఆదివారం అవగాహన కల్పించారు. మహిళా సంరక్షణకు పోలీస్ శాఖ పటిష్ఠ చర్యలు తీసుకుంటుందన్నారు. ఏఎస్ఐ సతీశ్ బాబు, సిబ్బంది రాంబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కోవూరు, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు డిమాండ్ చేశారు. పెద్దపడుగుపాడులోని కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం తొమ్మిదో మహాసభలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ ప్రయోజనాల కోసం ఈ సంఘం ఏర్పాటు చేసిందన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా అల్లాడి గోపాల్, కాయంబు శ్రీనివాసులు, 29 మంది సభ్యులతో నూతన కమిటీని నియమించారు. కార్యక్రమంలో హరి, హరిబాబు, నజీర్, సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నరసింహారావు.. వేదికపై సంఘం నాయకులు

సైదాపురంలో వసతులు మృగ్యం

కాలువలు లేక రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

న్యూస్‌టుడే, సైదాపురం

మండల కేంద్రమైన సైదాపురంలో సుమారు పదివేలకుపైగా జనాభా ఉన్నారు. శివారు ప్రాంతాలైన మొలకలకపూండ్ల, దాడిశెట్టిపల్లి, కమ్మవారిపల్లిలో కనీస వసతుల్లేక అవస్థలు పడుతున్నారు. పలు కాలనీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. మురుగు కాలువలు లేక రోడ్లపై ప్రవహిస్తోంది. గత పాలనలో అధికారులు, ప్రజాప్రతినిధులకు పలువురు విన్నవించినా పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. రాపూరు రోడ్డు గిరిజన కాలనీలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పిచ్చి మొక్కలు పెరగడంతో రాత్రివేళల్లో బయటికి రావాలంటే ప్రజలు హడలుతున్నారు. ❖ పంచాయతీ కార్యదర్శి శశి ఇంద్రాణి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రూ. 70 లక్షలతో సిమెంటు రోడ్ల పనులు జరుగుతున్నాయని వివరించారు. . మురుగు కాలువలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, నిధులు సమకూరిన వెంటనే పనులు చేస్తామన్నారు.

గ్రామ దేవతలకు పొంగళ్లు

సంగం, రాపూరు, అనంతసాగరం, తోటపల్లిగూడూరు, మనుబోలు, న్యూస్‌టుడే: సంగంలో పాత చెక్ పోస్టు సెంటరు వద్ద బాబూ జగ్జీవన్‌రాం నగర్‌లోని మాతా పరమేశ్వరి ఆలయంలో జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. భక్తులు పెన్నానదికి చేరుకుని గంగమ్మకు పూజలు చేశారు. ▼ రాపూరు మండలం రామిరెడ్డిపల్లిలో గంగమ్మతల్లికి పొంగళ్లు నిర్వహించారు. ▼ అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లిలో గ్రామ దేవత తుమాలమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు ఆలయం వద్ద పొంగళ్లను వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ▼ మనుబోలమ్మ, నాగారప్పమ్మ, గంగమ్మ ఆలయాల్లో విశేష పూజలు చేశారు. అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ▼ కోదండరామపురంలోని దేవాంగుల వీధిలోని పోలేరమ్మ ఆలయంలో ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. నివేదన సమయంలో ఉపయోగించే ఎలక్ట్రికల్ ఢంకా నాదాన్ని వేముల లక్ష్మి కుటుంబ సభ్యులు వితరణగా అందజేశారు.

రాపూరులో పొంగళ్లతో మహిళలు

సంగం : కలశాలతో మహిళల శోభాయాత్ర

ఉచిత కంటి వైద్యశిబిరం

మర్రిపాడు, ఏఎస్‌పేట : మర్రిపాడు ఉన్నత పాఠశాలలో ప్రవాస భారతీయురాలు, ఈమెడ్ ఈవెంట్స్ సీఈవో ప్రియ కొర్రపాటి దంపతులు చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ వైద్య సిబ్బందితో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 35 మందికి శస్త్రచికిత్సలు చేయించారు. ● ఏఎస్‌పేటలోని హబీబియా క్లినిక్‌లో ఉచిత నేత్ర వైద్యశిబిరం జరిగింది. నెల్లూరులోని సుశీల నేత్రాలయ ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు డాక్టరు విజయ్ రోగులకు నేత్ర పరీక్షలు చేశారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేట మండలం చిరమన పాఠశాలలో ఆదివారం విద్యార్థులు మొక్కలు నాటారు. వర్షాధార పరిరక్షణలో భాగంగా ప్రతి పాఠశాలకు మొక్కలు పంపిణీ చేశారు. మండలంలోని 54 పాఠశాలలకు 2500 మొక్కలు అధికారులు అందజేశారు. వాటిని విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలల్లో, గృహాల్లో, ఖాళీ ప్రదేశాల్లోను నాటాలని ఆదేశాలిచ్చారు. ఇప్పటికే అన్ని జడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతోంది. అందులో భాగంగా చిరమన పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులు.. హెచ్ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

కాలువ ధ్వంసం.. దుర్వాసనతో సతమతం

గత వైకాపా పాలనలో మురుగు కాలువలు నాసిరకంగా నిర్మించారు. పొదలకూరు రమణారెడ్డి కాలనీలో మురుగు కాలువ ధ్వంసమైంది. దుర్వాసనతో నెల రోజులుగా సతమతమవుతున్నామని స్థానికులు చెబుతున్నారు.. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని తెలిపారు. అధికారులు స్పందించి కాలువకు మరమ్మతులు చేసి మురుగు నిల్వ లేకుండా చేయాలని విన్నవిస్తున్నారు. **- న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్**

పూడిక తీయక.. సాగునీరందక

సాగునీరందించే కాలువలు పూడిక తీయక అధ్వానంగా ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పొదలకూరు మీదుగా ప్రవహించే పోట్లేలువాగు కాలువ కండలేరు జలాశయం ఎడమ కాలువ నుంచి వచ్చే నీటిని బిరదవోలు, పార్లపల్లి గ్రామాలకు సాగునీరందుతుంది. కొంతకాలంగా పూడిక తీయక పోవడంతో పారుదలకు అడ్డంకిగా మారుతోంది. **- న్యూస్‌టుడే, పొదలకూరు**

ఎప్పటికి పూర్తయ్యేనో...!

కొడవలూరు మండలం రేగడిచెలికలో ఉన్న గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, ఆరోగ్య కేంద్రం అన్నీ ఒకే చోట నిర్మాణం చేపట్టారు. గుత్తేదారు సగం పనులు చేసి వదిలేశారు. ఏళ్లు గడిచినా పూర్తికావడం లేదు. అధికారులు స్పందించి భవనాలను పూర్తి చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కొడవలూరు**

నీటి వృథా అరికట్టారు

కోవూరు మండలం పడుగుపాడులో పైపులు ధ్వంసమై తాగునీరు కలుషితమవుతోంది. స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదు. 'ఈనాడు'లో 17న 'లీకేజీతో నీరు కలుషితం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు మరమ్మతులు చేశారు. తాగునీటి వృథా అరికట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, కోవూరు**

ప్రమాదకరంగా నియంత్రిక

కోవూరు మండలం ఇనమడుగు కూడలి నుంచి వెళ్లే మార్గంలో రోడ్డుపై విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. కొన్ని రోజుల నుంచి నియంత్రిక కింద నిర్మించిన సిమెంట్ దిమ్మె ఒరిగిపోయింది. విద్యుత్తు నియంత్రిక కూడా పక్కకు ఒరిగి ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిస్కం అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కోవూరు**

అర్హులకు ప్రభుత్వ పథకాలందాలి

సమస్యలు తెలుసుకుంటున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మనుబోలు, న్యూస్‌టుడే : ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందని వారి వివరాలను నమోదు చేసుకున్నారు. శిథిలావస్థకు చేరిన ఇంటిలో ఉండలేకపోతున్నామని, కొత్త ఇళ్లు కట్టించాలని గిరిజనులు రాజగోపాల్‌రెడ్డికి విన్నవించారు. ఎస్టీకాలనీలో ఇళ్లు ఉరుస్తున్నాయని, స్థలాలు లేనివారికి మంజూరు చేయించి నూతన గృహాలు నిర్మిస్తామన్నారు. మురుగునీటి కాలువ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, నాయకులు కలికి వేణురెడ్డి, అశోక్, అల్లూరు సుమన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతుగా ర్యాలీ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పురపాలక కార్మికుల సమ్మెకు మద్దతుగా సీపీఎం, సీఐటీయూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పురపాలక కార్యాలయం సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, సీఐటీయూ జిల్లా నాయకులు శివప్రసాద్, కొండమూరి హజరత్తయ్య పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

రాపూరు, న్యూస్‌టుడే: మండలంలోని పెంచలకోన నిత్యాన్నదాన సత్ర నిర్వహణకు చిత్తూరుకు చెందిన సురభి సుబ్రహ్మణ్యం, అనంతలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు నరసింహమూర్తి.. అనురాధ కలిసి శనివారం రూ. 25 వేలను ఆలయ అధికారులకు అందజేశారు. దాతలతో ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు తగదు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ దురుద్దేశంతో లేని లిక్కర్ స్కాం సృష్టించి అరెస్టు చేయడం తగదని ఆయన పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అనంతసాగరం, న్యూస్‌టుడే: పదో తరగతిలో కలిసి చదువుకున్న విద్యార్థులంతా 35 ఏళ్ల తర్వాత ఒక చోట చేరి సందడి చేశారు. ఆదివారం రేవూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1989- 90 పదో తరగతి చదువుకున్న 60 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను పిలిచి ఘనంగా సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లురెడ్డికి హామీ ఇచ్చారు. పూర్వ ఉపాధ్యాయులు రమణారెడ్డి, ఉపాధ్యాయులు గౌరీరెడ్డి, పెంచలరావు, యూటీఎఫ్ నాయకులు హరిబాబు, సుబ్బారెడ్డి, భక్తవత్సల రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గండికోట సుధీర్‌కు పురస్కారం

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సుధీర్‌కుమార్‌కు మల్లెతీగ సాహితీసేవా సంస్థ భారత్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు దక్కింది. ఆదివారం విజయవాడ అంబేడ్కర్ స్మృతి వనంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. 77వ స్వాతంత్ర దినోత్సవం నేపథ్యంలో 77 మంది తెలుగు కవులతో 'ప్రణామం' పేరుతో కవితా సంకలనం చేసినందుకు మల్లెతీగ సాహితీసేవా సంస్థ భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో గౌరవించారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

న్యూస్‌టుడే, కోవూరు

ఇటీవల జిల్లాలో కురిసిన అకాల వర్షాలతో కూరగాయల దిగుబడి తగ్గి కొద్ది రోజుల నుంచి వాటి ధరలు పెరుగుతున్నాయి. గత నెలతో పోల్చుకుంటే జులై నెలలో గణనీయంగా పెరిగాయి. దీంతో కూరగాయలు కొనేవారు ప్రస్తుత ధరలతో అవాక్కవుతున్నారు. సామాన్య కుటుంబం రూ. 500 ఖర్చు చేసి కూరగాయలు కొనుగోలు చేసినా రెండు, మూడు రోజులకు మించి రావడం లేదని చెబుతున్నారు.

కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల పరిధిలోని గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరలు సాగుచేస్తున్నారు. కొన్ని రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో పంటకు నీరందక అవి ఎండిపోతున్నాయి. వీరంతా దిగుబడులను నెల్లూరు, కోవూరు, రైతు బజార్లకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. వీరికి రవాణా చార్జీలు అదనపు భారమవుతున్నాయి. కొన్ని చోట్ల రైతు బజార్లు లేకపోవడంతో వినియోగదారులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ధరల పెరుగుదలతో అటు సాగు చేసే రైతులు, ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ధరల వివరాలు (కిలో)

కూరగాయలు	జూన్‌లో	ప్రస్తుతం
టమాటా	20	50
వంకాయ	30	60
బీరకాయ	40	60
పచ్చిమిర్చి	40	80
క్యారెట్	45	80
దొండ	30	60
బెండకాయ	30	50

నెల రోజుల వ్యవధిలో..

నెల రోజుల వ్యవధిలో కూరగాయల ధరలు రెట్టింపు కావడంతో ప్రజలు కొనడానికి బెంబేలెత్తిపోతున్నారు. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వారికి నచ్చిన రేటుకు విక్రయిస్తున్నారు. ఆకు కూరలు, ధరలు సైతం పెరిగినా నాణ్యమైనవి లభించడం లేదు. చేసేదేమీ లేక అందుబాటు ధరలో ఉన్న కూరగాయాలను మాత్రమే కొనుగోలు చేస్తున్నారు.

దాత ఔదార్యం... సమకూరిన భవనం

న్యూస్‌టుడే, రాపూరు

తెగచెర్ల పాఠశాల వద్ద నిర్మించిన అదనపు గదులు

దాత వెంకటస్వామిరెడ్డి

మండల పరిధిలో అటవీ ప్రాంతంలో ఉన్న తెగచెర్లలో తాజాగా యూపీ పాఠశాలను ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచారు. ప్రస్తుతం 86 మంది విద్యార్థులున్నారు. బస్సు సౌకర్యం కల్పిస్తే సమీప గ్రామాల పదో తరగతి విద్యార్థులు చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. రామకూరు, గరిమెనపెంట గ్రామాలతో పాటు కలువాయి మండలం కోటూరుపల్లి నుంచి విద్యార్థులు వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న గరిమెనపెంట నుంచి తొమ్మిది గంటలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

సొంత నిధులతో నాలుగు గదుల ఏర్పాటు..

తెగచెర్లకు చెందిన వీరపురెడ్డి వెంకటస్వామిరెడ్డి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచారని తెలుసుకొని స్పందించారు. విద్యార్థుల సౌకర్యార్థం సొంత నిధులు రూ. 4 లక్షలు వెచ్చించి నాలుగు తరగతి గదులు ఇటీవల నిర్మించారు. దీంతో పాటు పాఠశాల అవసరాల నిమిత్తం 2.5 ఎకరాల సొంత భూమిని అందజేశారని ఎంఈవో శ్రీనివాసులు పేర్కొన్నారు. దాత వెంకటస్వామిరెడ్డి మాట్లాడుతూ... గరిమెనపెంట నుంచి తెగచెర్లకు బస్సు ఏర్పాటు చేయమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నెల్లూరు డీఈవో, ఆర్టీసీ ఆర్ఎంకు విన్నవిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందిస్తే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.

ధ్యానం దివ్యౌషధం

చేజర్ల, న్యూస్‌టుడే: మానవుడు శారీరక, మానసిక శక్తి పొందడానికి ధ్యానం చక్కని ఔషధమని పిరమిడ్ సభ్యులు వెంకటేశ్వర్లు తెలిపారు. పిరమిడ్ ధ్యాన విధానం గురించి సాధకులు ఆదివారం నాగులవెల్లటూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ధ్యాన మందిర నిర్మాణం గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, ధ్యాన శిక్షకులు పాల్గొన్నారు.

తపాలా సేవలు మరింత సులభతరం

న్యూస్‌టుడే, కోవూరు

పోస్ట్ ఇన్ఫో యాప్ ముఖచిత్రం

కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలో ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు తపాలాశాఖ కొత్తగా పోస్ట్ ఇన్ఫో యాప్‌ను అమల్లోకి తెచ్చింది. ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని తపాలా శాఖ అందించే సేవలను ఆన్‌లైన్‌లోనే ఇంటి నుంచి పొందొచ్చు. నగదు చెల్లింపులు, ఫిర్యాదులు, ఆర్టికల్ ట్రాకింగ్, జీవిత బీమా పాలసీలను ఎంపిక చేసుకోవచ్చు. ◆ యాప్‌ను ఉపయోగించడంతో ప్రస్తుతం మార్కెట్‌లో రేట్లకు తగ్గట్లు తపాలా ఖాతాలో ఎంత మొత్తాన్ని జమ చేస్తే ఎంత ఆదాయం వస్తుంది.. తదితర వివరాలను లెక్కించి చూపిస్తుంది. రిజిస్టర్ పోస్ట్, స్పీడ్ పోస్టులకు ఎంత మొత్తం చెల్లించాలో తెలియజేస్తుంది. రిజిస్టర్ ఆర్టికల్ ద్వారా పంపిన పోస్టు, పార్సిల్ ఎక్కడ ఉందో ట్రాకింగ్ ద్వారా తెలుసుకోవచ్చు. తెలియని ప్రదేశాల పిన్‌కోడ్ తెలుసుకునే వీలుంది. పోస్టల్ లైఫ్, రూరల్ ఇన్సూరెన్స్ ప్రీమియం ఎంత చెల్లించాలో తెలుసుకోవచ్చు.

ఫిర్యాదుల నమోదు...

తపాలాకు సంబంధించి ఏ ఫిర్యాదునైనా ఈ యాప్‌తో నమోదు చేయొచ్చు. అలాగే వాటిని ట్రాకింగ్ చేసుకోవచ్చు. వినియోగదారులు సర్వీసుల మీద తమ అభిప్రాయం తెలియజేసే సౌకర్యముంది. ఖాతాదారులు కార్యాలయానికి రాకుండానే ఏ సమయంలోనైనా సేవలను వినియోగించవచ్చు.

ఆన్‌లైన్‌లో ఖాతాకు నగదు బదిలీ చేసుకునేలా...

పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతాను తెరిస్తే ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లింపులు చేసుకునే క్రమంలో వినియోగదారులు కార్యాలయానికి రాలేని పక్షంలో సర్వీస్ రిక్వెస్ట్ పెడితే తపాలా సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి సేవలందిస్తారు. దాని కోసం రూ. 25తో పాటు జీఎస్టీని చెల్లించాల్సి ఉంటుంది. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా తపాలా ఖాతా నుంచి బ్యాంకు ఖాతాకు నగదు బదిలీ చేసుకోవచ్చు. ఖాతాదారులు ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో తమ ఖాతాలను ఆన్‌లైన్‌లోనే రద్దు చేసుకోవచ్చు.

(c) eenadu

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి, దేవాదాయ సిబ్బంది

25 నుంచి శ్రావణ మాస పూజలు

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: నగరంలోని దర్గామిట్టలో రాజరాజేశ్వరి ఆలయంలో ఈనెల 25వ తేదీ నుంచి ఆగస్టు 23 వరకు శ్రావణ మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఈవో జనార్దనరెడ్డితో కలసి ఆదివారం గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25, ఆగస్టు 1, 8, 15, 22 తేదీల్లో వచ్చే శ్రావణ శుక్రవారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

చదువుతో ఉన్నత స్థానం

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని వక్ఫ్ బోర్డు రాష్ట్ర ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ సూచించారు. ఆదివారం నగరంలోని జెండా వీధి వీఎస్ఎం మహిళా జూనియర్ కళాశాలలో ప్రెషర్స్‌డే నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు జావెద్, ఇంతియాజ్, నౌషాద్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజీజ్

వర్షం..నగర వాసికి ఉపశమనం

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: పగలంతా విపరీతమైన ఎండ. వేసవిని తలపించేలా ఉక్కపోత. దీంతో నగరవాసులు విలవిలలాడిపోతున్నారు. ఈతరుణంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగింది. ఈదురుగాలులతో పాటు వర్షం పడడంతో నగరం తడిసి ముద్దయింది. పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచింది. వహాబ్‌పేట, కోటమిట్ట, రాధామాదవ్ వీధి, గాంధీబొమ్మ సెంటర్, ఏసీ సెంటర్, మూలాపేట తదితర ప్రాంతాల్లో కాలువలు పొంగాయి. పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో ఉండడంతో పలు కాలువలు పూడికతో నిండిపోయాయి. నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది.

నగరంలో కురుస్తున్న వర్షం

పీ4లో జాషువా గ్రంథాలయం అభివృద్ధి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నగరంలోని గుర్రం జాషువా గ్రంథాలయాన్ని పీ4లో భాగంగా అభివృద్ధి చేయనున్నామని ఆ గ్రంథాలయం వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఎస్కే ఖాసిమ్ పేర్కొన్నారు. దాతల సమీకరణలో భాగంగా ఆదివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిని కలిసి భవనాల నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వీరు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

ఇటు విస్తరణ.. అటు ఆక్రమణ

న్యూస్‌టుడే, నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)

ట్రాఫిక్ సజావుగా సాగాలని అధికారులు తీసుకుంటున్న చర్యలు ఫలితం ఇవ్వడం లేదు. రోడ్డు ఒక వైపు విస్తరిస్తుంటే మరోవైపు ఆక్రమిస్తున్నారు. దీంతో లక్ష్యానికి విఘాతం కలుగుతోంది. స్మార్ట్ సిటీ దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందుకు పలు ప్రధాన మార్గాల విస్తరణ పనులు కొన్ని జరిగా.. మరికొన్ని చేస్తున్నారు. మినీబైపాస్ రోడ్డు పనులు రూ. 14.69 కోట్లతో జరుగుతున్నాయి. జీఎన్‌టీ రోడ్డు వేదాయపాలెం కూడలి నుంచి బైక్ రోడ్డు వరకు విస్తరణ, సెంట్రల్ డివైడర్, లైటింగ్ పనులు రూ. 2.67 కోట్లతో పూర్తయ్యాయి. మైపాడు- నెల్లూరు- బళ్లారి- ముంబాయి రోడ్డు 0/5 నుంచి 3/4 కి.మీ వరకు విస్తరణ పనులు గత ప్రభుత్వ హయాంలో కోర్‌నెట్ ప్లాన్ నిధులు రూ.9 కోట్లతో జరిగాయి. మరో ప్రధాన రహదారైన పొదలకూరు రోడ్డు డీకేడబ్ల్యూ కళాశాల నుంచి విస్తరిస్తున్నారు. సెంట్రల్ లైటింగ్, డివైడర్ పనులు రూ. 12 కోట్లతో చేస్తున్నారు. నగరం నుంచి వెళ్లే ముత్తుకూరు, జొన్నవాడ రోడ్ల పనులు పూర్తయ్యాయి.

మినీబైపాస్‌లో రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

లక్ష్యానికి విఘాతం

రోడ్ల విస్తరణతో ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని.. తమ ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని నగరవాసులు భావించారు. కానీ అభివృద్ధి పనులు ముక్కుబడిగా సాగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. నిర్ణీత కొలతల మేరకు రహదారులు, మార్జిన్, ఫుట్‌పాత్‌లు ఏర్పాటుచేయాలి. చాలావరకు ఆ కొలతల ప్రకారం జరగడం లేదని విమర్శలు వస్తున్నాయి. గతంలో ఉన్న రోడ్ల కొలతల ప్రకారం చేస్తున్నారు. ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే కొంత మేరకు తొలగించి, పనులు పూర్తికాగానే మునుపే తిరిగి ఆక్రమిస్తున్నారు. వ్యాపార సంస్థలు, దుకాణాల ముందు పార్కింగ్ వాహనాలు రోడ్డు మధ్యలో పెడుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మైపాడు రోడ్డు చాలా వరకు కుంచించుకుపోయింది. మినీబైపాస్ రోడ్డులో ఓ వైపు పనులు జరుగుతున్నాయి. పూర్తవగానే వ్యాపార సంస్థలు రోడ్డుపైనే మరలా కార్యకలాపాలు చేస్తున్నాయి. విజయమహల్ గేటు నుంచి హరనాథపురం సెంటర్ వరకు విస్తరణ, ఫుట్‌పాత్ పనులు జరిగిన వెంటనే ఆక్రమణలు వెలిశాయి. దీంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.

లస్కర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

నెల్లూరు(మార్కెట్ సెంటర్): ఇరిగేషన్ అసోసియేషన్ లస్కర్ల జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. నగరంలోని జిల్లా డ్రైవర్ల అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఇరిగేషన్ సర్కిల్ బ్రాంచ్ ఉద్యోగుల మహాసభ జరిగింది. ఇందులో ఈ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా పొదిలి చిన్నయ్య, అధ్యక్షుడిగా చాన్‌బాషా, అసోసియేట్ అధ్యక్షుడిగా రహమాన్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఖాదర్ బాషా, ఉపాధ్యక్షుడిగా తాజుద్దీన్, కార్యదర్శులుగా శంకరయ్య, సుబ్రహ్మణ్యం, మస్తాన్ ఎన్నుకున్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

నెల్లూరు (విద్య): గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏ)లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బందగీ సాహెబ్ కోరారు. నగరంలోని రామచంద్రారెడ్డి భవన్‌లో ఆదివారం ఆ సంఘం జిల్లా నాలుగో మహాసభలు జరిగాయి. పోరాటాలు అండగా ఉంటామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టీవీ ప్రసాద్ ప్రకటించారు. అనంతరం 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

పెన్‌కాక్ శిలాట్‌లో ప్రతిభ

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : తమిళనాడులో ఆదివారం జరిగిన ఆరో దక్షిణ భారత దేశ పెన్‌కాక్ శిలాట్ పోటీల్లో నగరంలోని అరవిందనగర్‌కు చెందిన పోనుగోటి యశస్విని రెండు వెండి పతకాలు సాధించింది. ఈమె నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. పలువురు అభినందించారు.

అన్నదానానికి విరాళం

నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో అన్నదానం కోసం రూ.50,116 విరాళం అందజేశారు. నగరానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి, పద్మజ దంపతులు ఈ విరాళాన్ని ఆదివారం ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డికి అందజేశారు.

వెలగని వీధి దీపాలు

నెల్లూరు (టౌన్), న్యూస్‌టుడే: నగరంలోని పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. జాతీయ రహదారుల కార్యాలయం నుంచి వేదాయపాళేనికి వచ్చే మార్గంలో మొదట మూడు స్తంభాలకు దీపాలు వెలగక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

మ్యాన్‌హోల్ అధ్వానం - రాకపోకలు ప్రమాదకరం

నగరంలోని రహదారుల్లో మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారినా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో రాత్రిళ్లు వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మూలాపేట చెమ్మండివారితోటలో మ్యాన్‌హోల్ అధ్వానంగా తయారైంది. రావి చెట్టు సెంటర్ నుంచి పబ్లిక్ హెల్త్ కార్యాలయం వైపు వెళ్లే ఈ మార్గంలో ఉంది. పైన వేసిన ఇనుప కమ్ముల మూత తప్పుపట్టింది. ప్రమాదకరంగా తయారైంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (మార్కెట్ సెంటర్)

నీటి వృథా.. కనరా!

నగరంలోని పలు ప్రాంతాల్లో నీరు రాక దప్పిక తీర్చుకోవడానికి ప్రజలు నానాఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు వృథాగా పోతుంది. దీన్ని అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారు. అందుకు నిదర్శనమే నగరంలోని జొన్నవాడ గేట్ సెంటర్‌లో తాగునీటి ప్రధాన పైపులైన్ లీకేజీ. మూడు నెలలుగా ఇక్కడ నీరు రోడ్డు పాలవుతుంది. లీకేజీ కారణంగా వాల్వ్ నుంచి నిరంతరాయంగా వెళుతోంది. అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.–న్యూస్‌టుడే,నెల్లూరు (మార్కెట్ సెంటర్)

రోడ్లపై అడ్డంగా పశువులు

నెల్లూరు నగరంలో పశువులు సాయంత్రం ఆరు గంటల నుంచి రోడ్లపై గుంపులుగా చేరుతున్నాయి. రాత్రి పూట కన్పించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు వాటిని కొనుగోలు చేసి రోడ్లపై వదిలేస్తున్నారు. అవి పెద్దవి అయ్యాక అధిక ధరకు విక్రయిస్తున్నారు. నగరంలోని గుప్తాపార్కు, మూలాపేట, కోటమిట్ట తదితర ప్రాంతాల్లో పశువుల సమస్య అధికంగా ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

బోరుకొచ్చింది సారూ!

ఎండలు మండిపోతున్నాయి. రక్షిత పథకాలకు నీరు అందడం లేదు. ఈ సమయంలో ప్రజలకు ఉపయోగపడే చేతిపంపులు అలంకారప్రాయంగా మారాయి. ఎప్పుడో వేసిన వీటిని అధికారులు పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు గురయ్యాయి. అందుకు నిదర్శనమే పోస్టల్ కాలనీలో చేతిపంపు. ఇక్కడి మొదటి వీధిలో ఉన్న చేతి పంపు మరమ్మతులకు గురై నీరు రావడం లేదు. బాగుచేస్తే పరిసరాల్లోని వారికి నీటి సమస్య తీర్చనుంది. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

వివాహితకు వేధింపులు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేసిన భర్తపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. పడారుపల్లికి చెందిన ఓ యువతికి కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లాకు చెందిన చేతన్‌కుమార్‌తో ఈ ఏడాది మార్చిలో వివాహమైంది. కొద్ది రోజులు అన్యోన్యంగా ఉన్నారు. వివాహిత ఫిట్స్‌తో అనారోగ్యానికి గురవడంతో భర్త హింసించడం మొదలుపెట్టారు. మూడు నెలల క్రితం నగరంలోని తల్లిదండ్రుల వద్ద వదిలి వెళ్లారు. రూ.15 లక్షలు కట్నం తీసుకొస్తేనే కాపురానికి రావాలని లేదంటే విడాకులు ఇవ్వాలని షరతు పెట్టారు. పెద్దలు సర్దిచెప్పినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో బాధితురాలు ఆదివారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'ఇష్టానుసారంగా బదిలీలు'

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : బదిలీల్లో ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, దివ్యాంగ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేశారని గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కౌన్సెలింగ్ చేపట్టకుండా, సీనియారిటీ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా బదిలీ చేశారన్నారు.

సింహపురి.. దుర్గంధ భరి

ఎనిమిది రోజులుగా కార్మికుల సమ్మె

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

నగరంలో పారిశుద్ధ్యం లోపించింది. ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు ఎనిమిది రోజులుగా సమ్మె బాట పట్టడంతో పౌర సేవలపై ప్రభావం కనిపిస్తోంది. ఈనెల 12 నుంచి ఇంజినీరింగ్ సిబ్బంది, 17 నుంచి పారిశుద్ధ్య కార్మికులు విధులకు హాజరుకాకపోవడంతో నగరంలో ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు.

ములుమూడి బస్టాండులో వ్యర్థాలు

నగరపాలకసంస్థ పరిధిలోని 54 డివిజన్లలో కార్మికులు సమ్మె చేస్తున్నారు. తాగునీరు సరఫరా, వీధిదీపాల నిర్వహణలో ఇంజినీరింగ్ కార్మికుల సేవలు కీలకం. పారిశుద్ధ్య కార్మికులు రోజుకు సగటున 320 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు సేకరిస్తున్నారు. సమ్మె కారణంగా వీధుల్లో చెత్త పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఇంటింటా చెత్త సేకరించే పారిశుద్ధ్య కార్మికులు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో చెత్త కుండీలు నిండిపోయాయి. శాశ్వత కార్మికులతో అరకొరగా తొలగిస్తున్నారు. ప్రధాన రహదారులు, ముఖ్యమైన ప్రాంతాల్లో శుభ్రం చేస్తున్నారు. మిగిలిన ప్రాంతాలు, శివారు కాలనీల్లో ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోయాయి. వర్షం పడుతుండడంతో తడిసి దుర్గంధం వస్తోంది.

పౌరసేవలకు ఇబ్బందులు: జీవో నంబరు 36 ప్రకారం ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు జీతాలు పెంచాలని, మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గ్రాట్యుటీ, పింఛను, వారసులకు ఉద్యోగాలు తదితర సౌకర్యాలు కల్పించాలని సమ్మె బాట పట్టారు. ఈ నేపథ్యంలో పౌరసేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నగరంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ నందన్ వివరించారు.

పరిష్కరించకుంటే పోరు ఉద్ధృతం

నగరంలో కార్మికుల ప్రదర్శన

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి కె. పెంచలనరసయ్య ప్రకటించారు. రాష్ట్రానికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రావడానికి పారిశుద్ధ్య కార్మికుల శ్రమే కారణమని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారని, పాలనలో అందుకు విరుద్ధంగా వ్యవహరించడం విచిత్రంగా ఉందని ఆరోపించారు. సమ్మెలో భాగంగా ఆదివారం స్వతంత్ర పార్కు నుంచి గాంధీ బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ఒక వైపు శాలువాలు కప్పుతూ మరో వైపు వారి కడుపు కొట్టి కాంట్రాక్టర్ల జేబులు నింపడం కోసం టెండర్లు పిలిచారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు కొండా ప్రసాద్, సుధాకర్, ఆర్ఎం సునీల్‌కుమార్, రమేష్, షబ్బీర్, మరియన్న, కామాక్షమ్మ, చంద్రమ్మ, కొండమ్మ, సలోమి, సుజాతమ్మ, వజ్రమ్మ పాల్గొన్నారు.

IN THE HIGH COURT OF A.P AT AMARAVATHI

A.S.No.229/2025

Between

Venumbaka Ramana Reddy ... Appellant / Plaintiff

And

Karreyeddula Audi Seshaiah and others ... Respondents / Defendants

NOTICE TO RESPONDENT Nos. 2, 7 & 8 IN AS No. 229/2025

To

1) **Yerrabolu Suresh** S/o late Audi Seshaiah, Hindu, aged about 54 years, Private Employee. Residing at D No 25-2-950, Police Colony, Nellore-524004.

2) **Venati Suresh Reddy,** S/o Subramanyam Reddy, Hindu, aged about 55 years, Property owner, Residing at Bank Colony, B V Nagar. Nellore City, Now Residing at 2nd floor, Sai Soudha Apartment, Opposite to RTO Office, B V Nagar, Nellore City. 524004.

3) **Venati Sudhakar Reddy** S/o Chenga Reddy, Hindu, aged about 56 years, Property owner, Residing at Bank Colony, B V Nagar, Nellore City. Now Residing at 2nd floor, Sai Soudha Apartment, Opposite to RTO Office, B V Nagar, Nellore City. 524004.

Take notice in the above appeal A.S.No.229/2025 on the file of Hon'ble High Court of AP filed by Venumbaka Ramana Reddy over the judgement and decree dated 13-03-2025 passed in O.S.No. 32/2021 by the Hon'ble III Additional District Judge, Nellore. On 09-07-2025, the Hon'ble High Court of A.P. ordered substitute mode by way of publication in newspaper which is posted for your appearance on 06-08-2025 either in person or through Counsel. Failure to appear on that date, the matter will be heard in your absence. Collect papers from the Registry of High Court.

Date: 19-07-2025 **P.V. RAGHU RAM**
Place: Amaravathi Counsel for Appellant.

చదరంగం పోటీలు ప్రారంభం

పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నెల్లూరు (క్రీడా విభాగం), న్యూస్‌టుడే: రాష్ట్ర చదరంగ సమాఖ్య, శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ, ఎంజీబీ ఫెసిలిటీ మాల్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు నగరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎంజీబీ మాల్ డిప్యూటీ జనరల్ మేనేజరు మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. తొలిరోజు అయిదు రౌండ్లలో అయిదు పాయింట్లు సాధించి మహేంద్ర తేజ, పృథ్వీకుమార్, ధృవేష్ ప్రథమస్థానంలో నిలవగా, 4 1/2 పాయింట్లతో ప్రణవ్ ద్వితీయ స్థానంలో, 4 పాయింట్లతో శ్రీరామ్ హరిచరణ్, శివ పవన్ తేజ, విజయ్ అగర్వాల్, ఆకాష్ కొనసాగుతున్నారు. వీటికి రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు వచ్చారు. ఫిడే టైటిల్ క్రీడాకారులు కేపీ ప్రణవ్, మాస్టర్ వి.పృథ్వీకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు.. సంప్రదాయ కళ పరిరక్షకులు

కోలాటం ఆడుతున్న మహిళలు

నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నగరంలో మహిళలు బృందంగా ఏర్పడి కోలాటం కళ ప్రాచుర్యానికి కృషి చేస్తున్నారు. పప్పులవీధిలో కొంతమంది మహిళలు శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానం కోలాట మండలిగా ఏర్పాటయ్యారు. 2017లో ప్రారంభమైన మండలిలో ఎంతో మంది మహిళలు శిక్షణ పొందుతున్నారు. 18 నుంచి 60 సంవత్సరాల లోపు వయసున్న వారు నేర్చుకొని వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు. ఔత్సాహికులకు నేర్పిస్తున్నారు. దీంతో శారీరక ఆరోగ్యం కలుగుతుందని మహిళలు అంటున్నారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో స్వామివారి ముందు కోలాటం ఆడుతూ భక్తి భావం పెంపొందిస్తున్నారు.

సేవలకు వినియోగం

మహిళలు ఇప్పటివరకు 300 ప్రదర్శనలు ఇచ్చారు. జిల్లాలోని అన్ని ప్రముఖ ఆలయాలతో పాటూ తిరుమల, తిరుచానూరు, ఒంటిమిట్ట, చెన్నైలోని ఆలయాల ఇచ్చి మన్ననలు పొందారు. కోలాటం ద్వారా ఆలయ నిర్వాహకులు పారితోషికం ఇస్తే సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ఇలా వచ్చే పారితోషికంతో వృద్ధాశ్రమాలకు అవసరమయ్యే సామగ్రి అందజేస్తున్నారు. భక్తిలో భాగంగానే కోలాట మండలిని ప్రారంభించామని శిల్ప, పవిత్ర, స్మిత, భాగ్య తెలిపారు. ఆలయ ఉత్సవాల్లో ప్రదర్శలు చేస్తూ ఆధ్యాత్మిక అనుభూతి పొందుతున్నామన్నారు. దీనిపై వచ్చే నగదు సేవలకు ఖర్చు చేస్తున్నామని వివరించారు.

గుండెపోటు మందు పంపిణీ అభినందనీయం

కిట్ల ప్యాకెట్లతో వీఆర్సీ లాఫింగ్ క్లబ్ కార్యదర్శి షేక్ రియాజ్ అహ్మద్, అడ్వకేట్ నన్నేసాహెబ్, వాకర్లు

నెల్లూరు (బృందావనం), న్యూస్‌టుడే: గుండెపోటుకు ముందస్తు మందులా ఉపయోగపడే లోడింగ్ డోస్ కిట్లను వాకర్లకు శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత భయ్యా రవి అందజేయడం అభినందనీయమని వీఆర్సీ లాఫింగ్ క్లబ్ కార్యదర్శి షేక్ రియాజ్ అహ్మద్ ప్రశంసించారు. ఆదివారం నగరంలోని వీఆర్సీ మైదానంలో మైదానం లాఫింగ్ క్లబ్ అధ్యక్షులు బండారు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షులు, అడ్వకేట్ నన్నేసాహెబ్, డాక్టర్ భాస్కరరావు, సభ్యులు కె. విజయకుమార్, రవికుమార్, జి. రమణారెడ్డి, శివ, బాలసుబ్బారావు, గుర్రం వెంకటేశ్వర్లు, తాజుద్దీన్, వాకర్లు పాల్గొన్నారు.

In the Court of the Ist Addl. Senior Civil Judge : Nellore

E.P.No. 107/2024

O.S.No. 22/2024

Amancha Preetham ... DHR

Vs.

Cheepurupalli Raju ... JDR

వేలం ప్రకటన

పై నెంబరు డిక్రీ హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు జెడిఆర్ తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని తేది: 25-08-2025న ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలంపాట జరుపబడును. కావున పాటదారులు ఎవ్వరికైనా వేలంపాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

SCHEDULE

SPSR Nellore Registration District, Nellore Sub Registration, Nellore Municipal Corporation, Nellore City, Kondayapalem Area, Sy. No. 255-A, an extent of Ac. 0.57 cents, in Sy. No. 256-B an extent of Ac. 0.30 cents, Sy. No. 260-1, an extent of Ac. 1.15 cents, Sy. No. 261-A, an extent of Ac. 0.87 cents total extent of Ac. 2.89 cents of land laid out into house plots, as per layout plan Plot in Sy. No. 255-A, Near Door No. 26-1-1078, Plot No. 19 out of an extent of 43.75 ankanams western side portion of 21.87 ankanams or 174.96 Sq.Yards of RCC Building bounded by: East: House and site belongs to M. Sandhya Rani, South: Plot No. 18, West: Plot No.12, North: 30'-0" wide Layout Road. Within the above said boundaries an extent of 21.87 ankanams or 174.96 Sq.yards of vacant site and the newly constructed RCC Building Ground Floor 1175 Sq.ft., 1st Floor 1318 Sq.ft., & 2nd Floor 800 Sq.ft., along with Doors, Windows, Almarahs, Electrical Fittings, Letrin, Bathrooms, Current Metre, Wiring and with its all easement rights.

DHR Value: Rs. 60,00,000/-
Amin Value: Rs. 80,00,000/-
Market Value : Rs: 69,67,980/-

I, the petitioner herein do hereby declare that the facts stated above are true to the best of my Knowledge, belief and information.

కాకుటూరు రమేష్‌రెడ్డి, B.Com., B.L.,
డిక్రీ హోల్డర్ తరపు న్యాయవాది, నెల్లూరు. సెల్: 94402 77437.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: నగరంలోని ఇరుగాళమ్మ సంఘంలో పందుల బెడద ఎక్కువగా ఉంది. నెల్లూరు- పొట్టేపాళెం రోడ్డుపై అడ్డుగా రావడంతో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. – వెంకటకృష్ణ, స్థానికుడు

సమాధానం: పందులను నగరానికి దూరంగా తరలించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? శోధన్‌నగర్‌లో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. – లక్ష్మి, స్థానికురాలు

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

తెరపై ఈనాడు

ఎం.ఐ సినిమాస్.: స్క్రీన్. 1 ఏ మాయ చేశావే , తెలుగు, నాలుగు షోస్ స్క్రీన్ ..2. జూనియర్ తెలుగు, నాలుగు షోస్ స్క్రీన్.. 3. కొత్తపల్లిలో ఒకప్పుడు తెలుగు నాలుగు షోస్ **స్పైస్.సినిమాస్:** స్క్రీన్ 1. జురాసిక్ వరల్డ్ 3డీ, ఒక షోస్, ఎఫ్.1, ఇంగ్లీషు ఒక షోస్, సూర్యసన్ ఆఫ్ కృష్ణ తెలుగు ఒక షో, సూపర్‌మాన్ 3డి..1షో స్క్రీన్..2 మైబేబీ తెలుగు రెండుషోస్, కొత్తపల్లిలో ఒకప్పుడు తెలుగు రెండుషోస్, స్క్రీన్..3.స్మర్ఫ్స్ ఇంగ్లీషు రెండు షోస్, ఐ నోవాట్ యూ డిడ్ లాస్ట్ సమ్మర్, ఇంగ్లీషు రెండుషోస్ స్క్రీన్.. 4..ఏ మాయ చేశావే.. తెలుగు నాలుగు షోస్, స్క్రీన్..5 జూనియర్ తెలుగు, నాలుగు షోస్ **రెయిన్ సినిమా:** స్క్రీన్ 1.. సూపర్ మ్యాన్3డి, తెలుగు, జురాసిక్ వరల్డ్ రీబర్త్ 2డి తెలుగు స్క్రీన్..2. జూనియర్ తెలుగు, స్క్రీన్..3.. ఐ నోవాట్ యూ డిడ్ లాస్ట్ సమ్మర్, ఇంగ్లీషు స్మర్ఫ్స్ ఇంగ్లీషు, ఎఫ్1,ది మూవీ ఇంగ్లీషు, స్క్రీన్..4.. కొత్తపల్లెలో ఒకప్పుడు తెలుగు, మైబేబీ తెలుగు, వీడే మన వారసుడు, తెలుగు

బాలాజీనగర్‌లో బోలెడు సమస్యలు

బాలాజీనగర్ వంతెన ఎదుట దెబ్బతిన్న రోడ్డు

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

ఎంతో ప్రత్యేకత ఉన్న బాలాజీ నగర్‌లో సమస్యలు తిష్ట వేశాయి. సర్వేపల్లి కాలువ వంతెన తరువాత బాలాజీనగర్‌కు చేరుకోవాలి. ముఖద్వారంగా రెండు వంతెనలున్నా.. ఇక్కడ రోడ్డు గుంతలు పడుతున్నాయి. స్థానికంగా అన్నపూర్ణ అపార్ట్‌మెంట్ కూడలిలో తరచూ చిన్న చిన్న వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయని, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. గౌడ హాస్టల్ కూడలికి వెళ్లే మార్గంలో వీధిలైట్లు పాతవి కావడంతో సరిగా వెలగడం లేదు. పారిశుద్ధ్య పరిస్థితులు బాగానే ఉన్నా.. తరచూ కాలువల్లో పూడిక సరిగా తీయడం లేదని స్థానికులు వాపోతున్నారు. స్థానిక ప్రైవేట్ పాఠశాలకు వెళ్లే మార్గంలోనూ, ఇతర ప్రధాన రహదారులపైనా పలు చోట్ల ఇటీవల గుంతలు పడుతున్నాయి. వాటికి మరమ్మతులు చేస్తే రోడ్డు కొన్నాళ్లపాటు పటిష్ఠంగానే ఉంటాయి.

ముఖ్యకూడళ్లలో పార్కింగ్ సమస్య : ఈ ప్రాంతంలో ప్రధాన వ్యాపార కూడళ్లున్నాయి. స్థానిక సీపీఎం కార్యాలయ సమీపం నుంచి కొన్ని ముఖ్య కూడళ్లలో పార్కింగ్ సమస్యలు వెంటాడుతున్నాయి. ఎక్కువగా చిన్నపాటి వీధులే కావడం వల్ల స్కూటర్లు, ఆటోలు నిలవాలన్నా స్థలం దొరకడం లేదు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పూడిక తీయక..

బాలాజీనగర్ ప్రాంతంలో తొలి నుంచి ఇరిగేషన్ కాలువల సమస్య ఉంది. ఒకప్పుడు పంటల సాగు ఉండగా సాగునీరు అందించేవి. కాలక్రమంలో అవన్నీ మేజర్‌డ్రెయిన్లుగా మారిపోయాయి. ఏసీ స్తూపం కూడలి, పద్మావతి సెంటర్‌కు వెళ్లే మార్గం, గౌడహాస్టల్ ప్రాంతం, చిల్డ్రన్స్‌పార్కుకు వెళ్లే కూడళ్లలో చిన్నపాటి కాలువలున్నాయి. వాటిలో పూడిక సరిగా తీయకపోవడంతో దోమల ఉద్ధృతి ఎక్కువగా ఉందని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు.

● రోడ్లు పరిశీలించి ప్యాచ్ పనులు చేయిస్తామని ఎస్ఈ రామమోహన్‌రావు తెలిపారు.

పెద్దిరెడ్డి కుటుంబమంటే చంద్రబాబుకు భయం: అనిల్

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: జగన్‌కు అండగా ఉన్న వారిని ఇబ్బంది పెట్టేందుకు లిక్కర్ స్కామ్ తెరపైకి తీసుకొచ్చి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీ మంత్రి పి. అనిల్‌కుమార్‌యాదవ్ ఆరోపించారు. ఆదివారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరులోని వైకాపా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుటుంబమంటే చంద్రబాబుకు భయమని అందుకే మిథున్‌రెడ్డిని అరెస్టు చేసి శునకానందం పొందుతున్నారని, ఇది నిలబడే కేసు కాదన్నారు. ఆధారాలు లేకుండా అరెస్టు చేశారని, అధికారం శాశ్వతం కాదని పోలీసులు గుర్తు పెట్టుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు ఖలీల్, బొబ్బల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తూ వైకాపా నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తుందని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. నెల్లూరు రాంజీనగర్‌లోని వైకాపా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆధారాలు లేకపోయినా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారని మండిపడ్డారు.

(c) eenadu

సత్యసాయి బోధనలు, సేవలు ఆచరణీయం

సంగీత విభావరి నిర్వహిస్తున్న విదేశీ భక్త బృందం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి ఆధ్యాత్మిక బోధనలు, సేవాతత్వాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ప్రశాంతి నిలయంలో మూడో రోజు ఆదివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. 18 దేశాలకు చెందిన యువతీ యువకులు పాల్గొన్నారు. యువతలో స్వీయ పరివర్తన కోసం సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో చేపట్టిన కోర్సులను పూర్తి చేసుకున్న వారిని ఉద్దేశించి మలేషియాకు చెందిన విమల్‌రాజ్, యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన రిషా ప్రసంగించారు. సత్యసాయి మానవాళికి బోధించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసను ఆచరించాలని పేర్కొన్నారు. సాయి బోధనలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ దేశాలకు చెందిన యువత సంయుక్తంగా సాయి భక్తి గీతాలను ఆలపించారు. కోర్సులు పూర్తి చేసుకున్న యువతకు ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సతీమణి హిమవాహిణి ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఎందుకిలా మారుస్తున్నారు?

బోధనేతర ఉద్యోగుల బదిలీలపై విమర్శలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో బోధనేతర ఉద్యోగుల బదిలీలపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎస్కేయూలో కొత్తగా ఉపకులపతి, కులసచివులు బాధ్యతలు స్వీకరించారు. నూతన ఉన్నతాధికారుల పాలన ఏర్పడి ఈ నెల 19వ తేదీ నాటికి ఏడాది పూర్తయ్యింది. ఈ ఏడాది కాలంలో బోధనేతర ఉద్యోగులను ఐదు సార్లు బదిలీ చేశారు. ఒక ఉద్యోగికి నాలుగు సార్లు వేరువేరు విభాగాలకు మార్చారు. మరికొందరిని రెండుసార్లు బదిలీ చేశారు. గతంలో ఒకసారి బదిలీ అయితే కనీసం ఒకటి, రెండేళ్ల వరకు బదిలీ చేసేవారు కాదు. మొదటిసారి 60 మందిని బదిలీ చేశారు. తాజాగా శుక్రవారం 16 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తరచూ నిర్వహిస్తున్న బదిలీల్లో ఏదో మతలబు ఉందని ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. బోధనేతర ఉద్యోగుల్లో రెగ్యులర్ ప్రాతిపదికన సుమారు 200 మంది, టైంస్కేల్ ఉద్యోగులు 160, మినిమంస్కేల్ ఉద్యోగులు 220 మంది పని చేస్తున్నారు. విద్యార్థులకంటే బోధనేతర ఉద్యోగులే ఎక్కువ మంది ఎస్కేయూలో పని చేస్తున్నారు.

వైకాపా అనుయాయులకే ప్రాధాన్యం

విశ్వవిద్యాలయం రాజకీయాలకు అడ్డాగా మారింది. అప్పట్లో కొందరు బోధనేతర ఉద్యోగులు వైకాపాకు అనుకూలంగా పని చేశారు. ప్రతి విభాగంలో వారే కీలకంగా వ్యవహరించారు. ఇటీవల నిర్వహించిన బదిలీల్లో వైకాపాకు అనుకూలమైనవారిని కీలక విభాగాల్లో నియమించినట్లు తెలుస్తోంది. పరీక్షల విభాగం ఎంతో కీలకమైనది. ఆ విభాగంలో కూడా గత ప్రభుత్వానికి అనూకూలంగా వ్యవహరించిన వారిని నియమించినట్లు ఉద్యోగవర్గాల్లో చర్చ నడుస్తోంది.

కాలువలు బాగుంటేనే చెరువులకు జలకళ

➡ హంద్రీనీవా, హెచ్చెల్సీ నీటిరాక ఆరంభం ➡ మరమ్మతులకు నిధులు

ఈనాడు, పుట్టపర్తి, చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం, తుంగభద్ర జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 17న మల్యాల వద్ద ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీనీవాకు నీటిని విడుదల చేశారు. నీటిపారుదల సాఫీగా సాగాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మల్యాల నుంచి జీడిపల్లి జలాశయం వరకు హంద్రీనీవా ప్రధాన కాలువ కాంక్రీట్ లైనింగ్ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టింది. చాలావరకు పనులు పూర్తయ్యాయి. శ్రీశైలం నుంచి చిత్తూరు వరకు నీటిని తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదట జిల్లాలోని జలాశయాలను.. ఆపై చెరువులను నింపేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు.

చెరువుల మరమ్మతులకు మంజూరైన నిధుల వివరాలు		
నియోజకవర్గం	చెరువులు	నిధులు (రూ.లక్షల్లో)
పెనుకొండ	25	50
హిందూపురం	14	23.19
మడకశిర	14	35
కదిరి	24	33
పుట్టపర్తి	48	99

అదే నిర్లక్ష్యం పునరావృతం కాకుండా..

ఉమ్మడి అనంత జిల్లావ్యాప్తంగా హంద్రీనీవా, హెచ్చెల్సీ ద్వారా వందలాది చెరువులకు నీరందనుంది. గత ప్రభుత్వంలో హంద్రీనీవా నీటిని తూతూమంత్రంగా చెరువులకు అందించినప్పటికీ ఆయకట్టుకు అందిన దాఖలాల్లేవు.. దీంతో చెరువుల ఆయకట్టు కాలువలు పిచ్చిమొక్కలతో నిండి, పలుచోట్ల పూడిక పేరుకుపోయింది. జగన్ సర్కారు కనీసం చెరువుకట్టలు, కాలువలకు మరమ్మతులు చేయించిన పాపానపోలేదు. ఆరేళ్లుగా నిర్వహణకు నోచుకోని కాలువలు రూపు కోల్పోయాయి. అదే నిర్లక్ష్యం పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రూ.2.40 కోట్లు మంజూరు

జిల్లాలోని 105 చెరువుల మరమ్మతులకు రూ.2.40 కోట్లు మంజూరయ్యాయి. వీటితో పనులు చేపడతాం. మిగిలిన చెరువుల కోసం ప్రతిపాదనలు పంపాం. సాగునీటి యాజమాన్య సంఘాలతో మాట్లాడి కాలువల్లో చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తాం.

- గురుమూర్తి, మైనర్ ఇరిగేషన్ ఈఈ

చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దల చెరువు ఆయకట్టు కాలువలో పెరిగిన జనుము

వివాదాలు రానీయకుండా..

శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 1,186 చెరువులు ఉన్నాయి. వీటి కింద 83,485 ఎకరాల ఆయకట్టు ఉంది. జిల్లాలో ఈసారి లోటు వర్షపాతం నమోదైనా.. హంద్రీనీవా, హెచ్చెల్సీ ద్వారా సాగు, తాగునీటి అవసరాలు తీరే అవకాశం ఉంది. తుంగభద్ర, శ్రీశైలం జలాశయాల ద్వారా ఈసారి 23 టీఎంసీలు అందే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. నీరు చెరువులకు చేరాలంటే కాలువలు అధ్వానస్థితిలో ఉన్నాయి. వాటికి సత్వరమే మరమ్మతులు చేయించాలి. చెరువు కట్టలపై పెరిగిన ముళ్లకంపను తొలగించాలి. బలహీనంగా ఉన్న కట్టలను పటిష్ఠం చేయించాలి. నీటి వినియోగంలో రైతుల మధ్య వివాదాలు తలెత్తకుండా సమన్వయంతో పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (జీపీఆర్‌ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ టీఎస్‌చేతన్ తెలిపారు. కదిరి, పెనుకొండ, ధర్మవరం ఆర్డీవో కార్యాలయాలతో పాటు మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోనూ సంబంధిత అధికారులు వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. మరింత సమాచారం తెలుసుకునేందుకు కాల్ సెంటర్ 1100 నంబరులో సంప్రదించవచ్చన్నారు. ఫిర్యాదుదారుడు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ రత్న తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

జిల్లావ్యాప్తంగా 17 మండలాల్లో వర్షం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా లేపాక్షిలో 19.2 మి.మీ., అత్యల్పంగా నల్లచెరువు 2.0 మి.మీ. వర్షం పడింది. హిందూపురం 11.2, అమరాపురం 9.8, ఎన్‌పీకుంట 7.4, గుడిబండ 7.4, సోమందేపల్లి 7.4, బత్తలపల్లి 7.2, తాడిమర్రి 6.8, రొళ్ల 6.2, తనకల్లు 5.8, గాండ్లపెంట 5.4, తలుపుల 5.2, అగళి 4.6, పెనుకొండ 4.4, కదిరి 2.4, ధర్మవరం 2.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు జిల్లా ప్రణాళికాధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

వైకాపా పాలనలో జరిగిందంతా అరాచకమే: మంత్రి

పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే సునీత, ఎంపీ పార్థసారథి

కనగానపల్లి, న్యూస్‌టుడే: వైకాపా పాలనంతా అరాచకంగానే సాగిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. ఆదివారం కనగానపల్లిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత, ఎంపీ బీకే పార్థసారథితో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి పథకాలన్నీ అందుతున్నాయా లేదా? అని ఆరా తీశారు. అనంతరం బీసీ కాలనీలో రూ.1.30 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లు, శివాలయం వద్ద సామాజిక భవన నిర్మాణానికి రూ.15 లక్షలు, రూ.60 లక్షలు ఎంపీ నిధులతో చేపడుతున్న కనకదాసు కల్యాణ మండపానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. పేరూరు జలాశయానికి నీరు అందించేందుకు గత తెదేపా ప్రభుత్వంలో రూ.800 కోట్ల నిధులు కేటాయించిందన్నారు. ఇందుకోసం భూమి సేకరించారన్నారు. సోమరవాండ్లపల్లితోపాటు పలు జలాశయాల నిర్మాణం చేపట్టామన్నారు. ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో వైకాపాకు అధికారాన్ని ఇస్తే.. రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక్కి నెట్టేలా చేశారన్నారు. హిందూపురం పార్లమెంటు అధ్యక్షుడు అంజినప్ప పాల్గొన్నారు.

కరవు నిధులపై కన్నేశారు!

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం పురపాలికలో గతంలో ఖర్చు చేయని కరవు నిధులు మూలుగుతున్నాయి. వాటిని ఏదో ఒకదానికి ఖర్చు పెట్టేదాం.. మనల్ని నమ్ముకొన్న గుత్తేదారులకు ఆదాయం చేకూరుద్దాం.. అనే రీతిలో మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. సమస్యను పరిష్కరించడానికి ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపి రూ.194 కోట్లతో గొల్లపల్లి నుంచి పట్టణానికి ప్రత్యేక పైపులైన్‌తో నీటిని సరఫరా చేసేలా చూశారు. అంతకుముందు ఏటా వేసవిలో తాగునీటి సమస్య కోసమే ప్రభుత్వం ప్రత్యేకంగా కరవు నిధులను విడుదల చేసేది. అలా 2015-17 మధ్య కాలంలో విడుదల చేసిన నిధుల్లో రూ.3.68 కోట్లు వివిధ కారణాలతో ఖర్చు చేయకపోవడంతో ఖాతాల్లో ఉన్నాయి. దానికితోడు వడ్డీ రూ.1.97 కోట్లు. మొత్తంగా రూ.4.65 కోట్లు కరవు నిధులు అందుబాటులో ఉన్నాయి.

మరమ్మతులకు ఉపయోగించకుండా..

ప్రస్తుతం పట్టణంలో నీటి సరఫరా పథకం నిర్వహణ సరిగా లేకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయి. కరవు నిధులను వాటి మరమ్మతులకు ఉపయోగించుకోవచ్చు. అలాకాకుండా ట్యాంకర్లతో నీటి సరఫరాకు ఈ నిధులను వెచ్చించడానికి ఎన్నికల సమయంలో అధికారులు అనుమతి తీసుకొన్నారు. ట్యాంకర్లతో నీటి సరఫరా అంటేనే అక్రమాలకు అవకాశం ఉంటుందని ఏడాది కిందటే విమర్శలు వచ్చాయి.

రూ.కోటి కేటాయింపు

గొల్లపల్లి తాగునీటి పథకం ప్రారంభం నుంచి ఆరేళ్లుగా పట్టణంలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాల్సిన అవసరం రాలేదు. అలాంటప్పుడు ట్యాంకర్లతో నీటి సరఫరాకు రూ.80 లక్షలు, పట్టణంలోని బోర్లను డీపెనింగ్ చేయడానికి రూ.20 లక్షలు కేటాయించారు. మిగిలిన నిధులను గొల్లపల్లి తాగునీటి పథకం మరమ్మతులతోపాటు పట్టణంలో పాత పైపులైన్లను తొలగించడం, వాటి స్థానంలో పైపులైన్లు వేయడానికి, మోటార్లు, పంపులు మార్చడానికి వెచ్చిస్తున్నారు. ఇదేమని అడిగితే గతంలో ఆమోదించిన ప్రతిపాదనలు అంటూ అప్పటి పాలకులపై నెట్టివేస్తున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ రమేశ్ తెలిపారు. అజెండాలోని అంశాలపై చర్చించి ఆమోదిస్తామని పేర్కొన్నారు. అజెండాలో గతంలో కరవు నిధులను ఖర్చు పెట్టడానికి ఆమోదించిన ప్రతిపాదనలను పొందుపరిచారు. ఇందులో గొల్లపల్లి తాగునీటి పథకానికి, ఇతర పైపులైన్ల మర్మతుల కోసం నిధులు కేటాయించారు. వాటితో పాటు ట్యాంకర్లతో నీటి సరఫరాకూ కేటాయించారు. వేసవి ముగిసి, వర్షాకాలం వచ్చిన సమయంలో ట్యాంకర్లతో నీటి సరఫరాకు నిధులు ఎందుకు అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

(c) eenadu

హోంమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

ఏర్పాట్లను పరిశీలన చేస్తున్న ఎస్పీ వి.రత్న, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, పోలీసులు అధికారులు

మడకశిర, న్యూస్‌టుడే : మడకశిరలో సోమవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పర్యటనకు సంబంధించి పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం జిల్లా ఎస్పీ వి.రత్న, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు మంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాట్లపై చర్చించారు. మంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వారు తెలిపారు.

పటిష్ఠ బందోబస్తు

హోంమంత్రి పర్యటనకు సంబంధించి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. పర్యటనకు 120 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నామని, బహిరంగ సభ సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఎస్పీ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేశామన్నారు.

మాజీ సైనికుల ఇంటి పట్టాలకు 400 అర్జీల స్వీకరణ

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా మాజీ సైనికుల సంఘం సర్వసభ్య సమావేశం వీకే భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఇంటి స్థలాలు లేని మాజీ సైనికుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ సూచనల మేరకు దరఖాస్తులు స్వీకరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 400 మంది అర్జీలు సమర్పించారు. ఆ సంఘం అధ్యక్షుడు కెప్టెన్ డి. షేకన్న ఆధ్వర్యంలో అర్జీలు స్వీకరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి కెప్టెన్ ఉమామహేశ్వరరావు, కోశాధికారి తిమ్మారెడ్డి, సభ్యులు కుమారస్వామి, ఈశ్వరయ్య, హుస్సేన్, సంజీవ్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

'భారతీయ ముస్లింల త్యాగాలు వెలకట్టలేనివి'

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ గోపాలగౌడ తదితరులు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరంలో ముస్లిం యోధుల త్యాగాలు వెలకట్టలేనివని, దేశ అభివృద్ధిలో వారి పాత్ర గణనీయమైనదని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ పేర్కొన్నారు. హిందూపురం పట్టణానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త ఉమర్ ఫారూక్‌ఖాన్ రచించిన '150 మంది ముస్లిం లెజెండ్స్' పుస్తకాన్ని ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో స్వాతంత్ర్య సమరయోధులు మేళావాయి గోవిందరెడ్డి, ఆంధ్రప్రభ ఎడిటర్ వైఎస్సార్ శర్మ, గజల్ శ్రీనివాస్, కవి బిక్కి కృష్ణలతో కలిసి జస్టిస్ గోపాల్‌గౌడ ఆవిష్కరించారు. దేశం కోసం ముస్లిం పోరాట యోధులు, రచయితలు, సాహితీకారులు, సామాజిక కార్యకర్తలు తమ జీవితాలను అంకితం చేశారని వక్తలు పేర్కొన్నారు. హిందూ, ముస్లింల మధ్య విభేదాలు సృష్టించి, దేశ నాశనానికి పాల్పడే వినాశకర శక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కనుమరుగవుతున్న ముస్లింల చరిత్రను వెలికి తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐ.ఆర్.ఎస్. అధికారి విద్యాధర్‌రావు, మున్సిపల్ ఛైర్మన్ రమేశ్, డీఎస్పీ మహేశ్, అనంతరాముడు, జాబిలి చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పేదల బియ్యం.. అక్రమార్కులకు భోజ్యం

పావగడ నుంచి అక్రమ రవాణా చేస్తుండగా పట్టుకున్న పీడీఎస్ బియ్యం లారీ

మడకశిర, న్యూస్‌టుడే : పేదల ఆకలి తీర్చాలనే ఆశయంతో పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. జిల్లాలోని కర్ణాటక సరి

యథేచ్ఛగా సాగుతున్న దందా

హద్దుల్లో ఉన్న నియోజకవర్గాల నుంచి యథేచ్ఛగా తరలిస్తున్నారు. దళారులు అత్యధికంగా కర్ణాటక సరిహద్దులో ఉన్న గ్రామాలనే ఎంపిక చేసుకుని లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని సేకరించి అక్రమంగా రవాణా చేస్తున్నారు.

పావగడ కేంద్రంగా..

చౌకబియ్యాన్ని అక్రమ రవాణా చేసేందుకు కర్ణాటక రాష్ట్రం పావగడ అడ్డాగా మారింది. ఉమ్మడి జిల్లాలోని కంబదూరు, శెట్టూరు, కుందుర్పి, రొద్దం, రామగిరి, అమరాపురం, మడకశిర, గుడిబండ మండలాలు కర్ణాటకకు సరిహద్దున ఉన్నాయి. దీంతో పక్కనే ఉన్న పావగడలోని కొంతమంది బడా వ్యాపారులు ఆయా మండలాల్లోని చిన్న వ్యాపారులతో సంబంధాలు పెట్టుకుని చౌకబియ్యాన్ని సేకరించి అక్రమంగా తరలిస్తున్నారు.

రైస్ మిల్లులకు తరలించి..

గ్రామీణ ప్రాంతాల్లో దళారులు, వ్యాపారులు ఇంటింటికీ తిరిగి సగటున కిలో రూ.10 నుంచి రూ.20 చొప్పున లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని పావగడలోని రైస్‌మిల్లులకు చేర్చుతున్నారు. అక్కడ సన్న బియ్యంగా మార్చి 50కిలోల బస్తాను తుమకూరు, శిరా, బెంగళూరు పట్టణాలకు తరలించి రూ.3 వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

పోలీసుల హస్తం..?

పీడీఎస్ బియ్యాన్ని సరిహద్దులు దాటించేందుకు ఇద్దరు, ముగ్గురు పోలీసులు సహకరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గత రెండేళ్లలో పీడీఎస్ బియ్యం లారీలను 90 శాతం విజిలెన్స్ అధికారులు పట్టుకోవడమే ఇందుకు నిదర్శనం. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇలాంటి వాటికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

235 క్వింటాళ్లు పట్టివేత..

విజిలెన్స్ అధికారులు ఈ నెల 18న నిర్వహించిన తనిఖీల్లో ఒకే రోజు కర్ణాటకకు తరలిస్తున్న 455 సంచుల్లో 235 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. విజిలెన్స్ అధికారులు మడకశిరకు వచ్చి ఆకస్మిక తనిఖీలు చేస్తేనే ఇంత పెద్ద మొత్తంలో పట్టుకున్నారు. రేషన్ బియ్యం అక్రమ దందాపై పోలీసు, రెవెన్యూ, పౌరసరఫరా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమాచారం ఇస్తే చర్యలు

రేషన్ బియ్యం అక్రమంగా తరలుతున్నట్లు సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రేషన్ బియ్యం సక్రమంగా లబ్ధిదారులకు అందాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా ఉండాలని డీలర్లను హెచ్చరిస్తున్నాం. లబ్ధిదారులు కూడా చౌకబియ్యాన్ని వ్యాపారులకు విక్రయించరాదు. **- లక్ష్మీనరసింహా, సివిల్ సప్లై ఉప తహసీల్దార్, మడకశిర**

మస్తాన్‌వలిస్వామి ఉరుసు ప్రారంభం

విద్యుత్తు దీపకాంతుల్లో దర్గా

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో సయ్యద్ మస్తాన్‌వలిస్వామి ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పాత గుంతకల్లులో ఆదివారం అర్ధరాత్రి గణచారి ఇంటి నుంచి గంధం ఊరేగింపుతో దర్గాకు చేరుకుంది. 22న వేకువజామున స్వామివారి షంషేరు ఊరేగింపుతో దర్గాకు చేరుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉరుసుతో పాత గుంతకల్లులో సందడి నెలకొంది. భక్తులు మస్తాన్‌వలిస్వామి సమాధిని దర్శించుకొని ప్రార్థనలు నిర్వహించారు. దర్గాను విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

సంతల ఆదాయం రూ.3.18 లక్షలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : **అనంతపురం వ్యవసాయ మార్కెట్** యార్డులోని వారం సంతల్లో మొత్తం 3,18,300 ఆదాయం వచ్చింది. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో రూ.1,69,300 ఆదాయం రాగా, ఆదివారం జరిగిన పశువుల సంతలో రూ.1.49 లక్షలు ఆదాయం వచ్చిందని యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

నృత్యం చేస్తున్న బాలికలు

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

పుట్టపర్తి, న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా బాలికలు నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. ఆదివారం రాత్రి పుట్టపర్తిలోని శిల్పారామంలో జయంతి చారి డాన్స్ అకాడమీ బృందం భరతనాట్యం ప్రదర్శన నిర్వహించారు. గణేష్, సత్యసాయి గీతాలను ఆలపిస్తూ.. నృత్యం చేశారు. వందలాది మంది ప్రజలు పాల్గొని తిలకించారు.

ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

సీనియర్ మహిళ, పురుష జట్లతో సంఘం జిల్లా అధ్యక్షుడు తదితరులు

హిందూపురం, న్యూస్‌టుడే: సీనియర్ల మహిళ, పురుష జిల్లా ఫుట్‌బాల్ జట్లను ఆదివారం ఎంపిక చేశారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో ఎంపిక పోటీలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు వివరించారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్, కార్యదర్శి మొహమ్మద్ సలీం, కోశాధికారి శేఖర్, ఈసీ సభ్యులు విజయవాణి, ఆజాద్, కోచ్‌లు బాలాజీ, చైతన్యలు అభినందించారు.

ఉత్కంఠ భరితంగా జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

వివిధ విభాగాల జట్ల ఎంపిక

అనంతపురం (క్రీడలు), న్యూస్‌టుడే: జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలు విజయవంతంగా ముగిశాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జట్ల ఎంపిక నిమిత్తం నిర్వహించిన ఈ పోటీలు ఉత్కంఠంగా జరిగాయి. ఆదివారం స్మాష్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగిన ఫైనల్ పోటీలు నువ్వా నేనా అన్నట్లుగా ఉత్కంఠ రేపాయి. విన్నర్లు అద్భుత స్మాష్ షాట్లతో అలరించారు. కొన్ని ఫైనల్ పోటీలు ఏకపక్షంగా.. మరికొన్ని పోటీలు ఆసక్తి రేపాయి. విజేతలుగా నిలిచిన క్రీడాకారులను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి, కార్యదర్శి జయశంకర్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా సత్తా చాటి ఛాంపియన్లుగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చదువుతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తోందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రాథమిక విద్య నుంచే క్రీడలను పాఠశాలల్లో నేర్పుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలను అంతర్భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారి వివరాలను బ్యాడ్మింటన్ కార్యదర్శి జయకుమార్ ప్రకటించారు.

పతకాలు సాధించిన క్రీడాకారులతో ఎమ్మెల్యే దగ్గుపాటి తదితరులు

విభాగాల వారీగా ఇలా..

35 ఏళ్ల పైన పురుషుల సింగిల్స్ విభాగం విజేత నరేష్, ద్వితీయ స్థానం మస్తాన్.
డబుల్స్ విభాగం: ప్రథమ స్థానం షాషావలి, మల్లికార్జున, ద్వితీయ స్థానం నరేష్, మల్లి.
45+ సింగిల్స్ విభాగం: రామాంజనేయులు (ప్రథమ), చంద్రశేఖర్ (ద్వితీయ).
50+ సింగిల్స్ విభాగం: షాషావలి (ప్రథమ), సుబ్బారెడ్డి (ద్వితీయ).
అండర్-13 బాలికల సింగిల్స్ విభాగం: ఎస్. ముస్కాన్ (ప్రథమ), శ్రీనిధి (ద్వితీయ).
బాలుర విభాగం: 1. హర్షిత్ వెంకటసాయి 2. జె.కార్తిక్.
అండర్-15 బాలికల విభాగం: 1. యజ్ఞశ్రీ 2. ముస్కాన్, **బాలుర విభాగం:** 1. డీవీ యజ్ఞత్ 2. హర్షిత్ వెంకటసాయి.
అండర్-17 బాలికల విభాగం: 1. డీవీ యజ్ఞశ్రీ 2. జల నక్షత్ర.
అండర్-19 బాలుర విభాగం: 1. మురళీ వెంకట్ 2. అబురెహాన్
బాలికల విభాగం: 1. యజ్ఞశ్రీ 2. జలనక్షత్ర

మంత్రి అనిత పర్యటనను అడ్డుకుంటాం

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న వైకాపా నాయకులు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలో సామూహిక లైంగిక దాడికి గురైన దళిత బాలికను ప్రభుత్వం ఆదుకోవాలని, లేని పక్షంలో నేడు (సోమవారం) మడకశిర వస్తున్న హోంమంత్రి అనితను అడ్డుకుంటామని వైకాపా నాయకులు హెచ్చరించారు. లైంగిక దాడికి గురై, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన బాలికను పరామర్శించేందుకు వైకాపా నాయకులు ఆదివారం ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చంద్ర, నాయకుడు చామలూరు రాజగోపాల్‌లు మాట్లాడుతూ.. హోంమంత్రి దళితురాలైనా.. తమ వర్గానికి న్యాయం జరగలేదన్నారు. ఇటీవల మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ జిల్లాకు వచ్చి వెళ్లినా బాలికకు న్యాయం జరగలేదన్నారు. ప్రస్తుతం బాధిత బాలిక ప్రసవించిందన్నారు. తల్లీబిడ్డ సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలపాలన్నారు. బాలిక పరామర్శకు వెళ్తుంటే అడ్డుకోవడం దారుణమన్నారు. అనంతపురంలో ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్యకు గురైనా ఆ కుటుంబాన్ని ఆదుకోలేదన్నారు. జిల్లాలో దళిత సామాజిక వర్గానికి చెందిన ఎంఎస్ రాజు, బండారు శ్రావణి ఎమ్మెల్యేలుగా గెలిచినా దళితుల గురించి ఆలోచించడం లేదని ఆరోపించారు. బాధితుల తరఫున వైకాపా పోరాటం చేస్తుందన్నారు. ఆందోళన చేస్తున్న నాయకులను రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం వదిలేశారు. నాయకులు శ్రీనివాస్‌బాబు నాయక్, శ్రీనివాసులు, చంద్రశేఖర్ యాదవ్, పసులూరి ఓబుళేసు, చంద్రలేఖ పాల్గొన్నారు.

ప్రాణాలంటే లెక్కలేదా?

వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా ప్రజల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. అందుకు ఈ చిత్రమే నిదర్శనం. హీరేహాళ్ మండలం హిర్దేహాళ్ సమీపంలో పనికి వెళ్లిన పిల్లలు బొలెరో వాహనం టాపుపై కూర్చొని ప్రమాదకరంగా ప్రయాణం సాగించారు. అందులో మొత్తం 50 మందిని ఎక్కించారు. గుంతల దారుల్లో వాహనం ఏమాత్రం కుదుపులకు లోనైనా భారీగా ప్రాణనష్టం వాటిల్లే ఆస్కారం ఉంది. ఇటువంటి వారిపై పోలీసులు అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, డి.హీరేహాళ్**

బదిలీ ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఇటీవల బదిలీ పొందిన ఉపాధ్యాయులకు వెంటనే వేతనాలు చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం ఆ ఉపాధ్యాయ సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. బదిలీలు నిర్వహించి నెల గడిచింది. పనిచేసే పాఠశాల ఐడీ లేకపోవడంతో వేతనాలు రాలేదన్నారు. రెండు నెలల వేతనాలు బకాయిలున్నాయని, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వంలో రహదారులకు మోక్షం

దందేపల్లి వద్ద పత్తి పంటను పరిశీలిస్తున్న మంత్రి సవిత

రొద్దం, న్యూస్‌టుడే : గత వైకాపా పాలకుల నిర్లక్ష్యంతో గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారాయని, వాటికి కూటమి ప్రభుత్వం మోక్షం కల్పిస్తోందని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. ఆదివారం రొద్దం మండలంలోని దందేపల్లి వద్ద నుంచి నల్లూరుకు వెళ్లే రహదారిలో పెన్నానదిపై నిర్మిస్తున్న వంతెన పనులను మంత్రి పరిశీలించారు. ఈ రహదారికి రూ.8 కోట్లతో పనులు చేస్తున్నారు. వంతెన వద్దకు వెళ్లే సమయంలో మంత్రి దందేపల్లికి చెందిన గోవిందమ్మ అనే మహిళా రైతు సాగుచేసిన పత్తి పంటను పరిశీలించారు. ఈ ఏడాది సాగు ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రొద్దం, దొడగట్ట, కోగిర గ్రామాల్లో పర్యటించి అనారోగ్యం, రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించారు. మండలాభివృద్ధి అధికారి రామ్‌కుమార్, పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీర్లతో పాటు వివిధ శాఖల అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయ ప్రసాద్

తొగటవీర క్షత్రియులు ఐక్యతతో మెలగాలి

ధర్మవరం: తొగటవీర క్షత్రియులు ఐక్యంగా మెలగాలని అప్పుడే సామాజికంగా, రాజకీయంగా రాణించగలరని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయప్రసాద్ అన్నారు. పట్టణంలోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం సత్యసాయి జిల్లా సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. కుల గురువు దివ్యజ్ఞానానందగిరి స్వామి సమక్షంలో జిల్లా అధ్యక్షుడిగా దాసరి శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా పోలా వెంకటనారాయణ, సోమశేఖర్, బండారు శ్రీనివాసులు, శేషాద్రి, జిల్లా కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ధర్మవరంలో 50 ఏళ్లుగా వైద్య సేవలందిస్తున్న డాక్టర్ నరసింహులును సన్మానించారు. కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు జయశ్రీ, పోలా ప్రభాకర్ పాల్గొన్నారు.

సమ్మె ఉద్ధృతం చేస్తాం

కూటమి ప్రభుత్వ పెద్దల చిత్రపటాల మాస్కులతో ర్యాలీగా వస్తున్న కార్మికులు

కమలానగర్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉద్ధృతం చేస్తామని మున్సిపల్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నగర అధ్యక్షుడు వెంకటనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం 9వ రోజు సమ్మె సందర్భంగా కార్మికులు వినూత్నంగా రాజకీయ నాయకుల చిత్రపటాల మాస్కులతో నగరపాలక సంస్థ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. 125 మున్సిపాలిటీల్లో కార్మికులు సమ్మె చేస్తున్నా కూటమి ప్రభుత్వ నాయకులు స్పందించటం లేదన్నారు. డిమాండ్లు పరిష్కరించని పక్షంలో సమ్మె ఉద్ధృతం చేస్తామన్నారు. నాయకులు మల్లికార్జున, రాయుడు, ఓబుళపతి, పోతులయ్య పాల్గొన్నారు.

చెరువు గట్టుపై నుంచి పడి రైతు మృతి

ఆంజనేయులు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కెంచానపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతు ఆంజనేయులు (40) చెరువు గట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు.. గ్రామంలో మాగాణి కౌలుకు తీసుకొని తల్లి చిన్నమారెక్క, కుమారుడు ఆంజనేయులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఆయనకు వివాహం కాలేదు. ఈనెల 16న తోటలో వ్యవసాయ పనులకు వెళ్తుండగా చెరువుపై నుంచి కిందపడి తలకు తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బంధువులు వెంటనే అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. రాయదుర్గం ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

దూసుకొచ్చిన మృత్యువు

కారు ఢీకొని దంపతుల దుర్మరణం

రఘునాథ్‌రెడ్డి, సావిత్రమ్మ

శింగనమల, న్యూస్‌టుడే: అమ్మవారిని దర్శించుకోవాలి.. స్వగ్రామంలో బంధు, మిత్రులను కలిసి సరదాగ గడపాలని ఆ దంపతులు ద్విచక్ర వాహనంలో బయల్దేరారు. రోడ్డు విస్తరణలో భాగంగా దేవాలయాన్ని గుర్తించలేక కాస్త ముందుకెళ్లారు. వాహనాన్ని వెనక్కు తిప్పుతుండగా మృత్యువు కారు రూపంలో దూసుకొచ్చి ఆ దంపతులను బలిగొంది. ముప్పై ఏళ్ల దాంపత్య జీవనం సాగించిన వీరు మృత్యువులోనూ బంధాన్ని వీడలేదు. ఈ ఘటన శింగనమల మండలం శ్రీశివపురం పెద్దమ్మ దేవాలయం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. శింగనమల మండలం గుమ్మేపల్లి గ్రామానికి చెందిన రఘునాథ్‌రెడ్డి (55), సావిత్రమ్మ (48) జీవనోపాధి కోసం 20 ఏళ్ల కిందట తాడిపత్రిలో స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో శివపురం వద్ద శ్రీపెద్దమ్మ అమ్మవారిని దర్శనం చేసుకోవాలని నిర్ణయించుకొన్నారు. ఆరు వరుసల రోడ్డు నిర్మాణంతో అమ్మవారి దేవాలయాన్ని గుర్తించలేక కొంత ముందుకు వచ్చారు. స్థానికులను దేవాలయం ఎక్కడ అని అడిగారు. వెనకనే ఉందని చెప్పడంతో వెంటనే వాహనాన్ని తిప్పారు. అదేసమయంలో తాడిపత్రి నుంచి వస్తున్న కారు వేగంగా వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో రఘునాథ్‌రెడ్డి కాళ్లు తెగిపడి అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన సావిత్రమ్మను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని.. యువకుడి మృత్యువాత

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం మండలం బి.కొత్తపల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని భరతసింహారెడ్డి (22) అనే యువకుడు దుర్మరణం చెందాడు. బుక్కరాయసముద్రం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గార్లదిన్నె మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన రమేశ్‌రెడ్డి కుమారుడు భరతసింహారెడ్డి వడియంపేట హెచ్‌పీ గ్యాస్ ప్లాంటులో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై యర్రగుంట్లకు వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. చేతికి వచ్చిన కుమారుడు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

రమేశ్‌నాయుడు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: గార్లదిన్నె మండలం తిమ్మంపేట గ్రామ సమీపంలో జాతీయరహదారి పక్కన వ్యవసాయ పొలాల్లో రమేశ్‌నాయుడు (28) అనే యువకుడు విష ద్రావకం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లికి చెందిన రమేశ్‌నాయుడు అనంతపురంలోని శిల్పనగర్‌లో నివాసముంటున్న ఓ యువతిని గత నెల ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరు అన్యోన్యంగా జీవనం సాగించారు. కొద్దిరోజుల కిందట యువతి పుట్టింటికి వెళ్లి కాపురానికి రానని చెప్పడంతో యువకుడు వారం రోజుల కిందట పామిడి రైల్వే స్టేషన్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆదివారం గార్లదిన్నె మండల సమీపంలోని తిమ్మంపేట వద్ద బలవన్మరణం చెందాడు. బంధువులకు సమాచారం అందడంతో పోలీసులకు జరిగిన ఘటన తెలిపారు. సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ గౌస్‌బాషాలు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఉద్యోగినిపై వేధింపులు.. కేసు నమోదు

కదిరి పట్టణం: కదిరి అడపాలవీధిలో నివాసముంటున్న ఓ బ్యాంకులో మహిళా ఉద్యోగిని వేధిస్తున్న విజయ్‌కుమార్‌పై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఉద్యోగిని భర్త అనారోగ్యంతో మృతిచెందారు. ఆమెతో స్వగ్రామానికి చెందిన విజయ్‌కుమార్ నాలుగేళ్లుగా చనువుగా ఉంటున్నాడు. ఆ పరిచయంతో వ్యక్తిగత అవసరాల కోసం విజయ్‌కుమార్ మహిళ నుంచి డబ్బు, బంగారం తీసుకున్నాడు. తిరిగి ఇస్తానని నమ్మించి ఇవ్వకపోవడంతో ఆమె నిలదీశారు. ఈ క్రమంలో ఆగ్రహించిన విజయ్‌కుమార్ ఆమెపై దాడి చేశాడు. నీ అంతుచూస్తానని బెదిరించి, ఆమెకు సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తానని బెదిరిస్తున్నారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

పోలీసులపై మందుబాబుల రుబాబు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని గుత్తి రోడ్డులో మందుబాబులు ఆదివారం రెచ్చిపోయారు. ఏకంగా పోలీసులతోనే ఘర్షణకు దిగారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. నగరానికి చెందిన షేక్ షఫీ, టిప్పుసుల్తాన్‌లు గుత్తిరోడ్డులోని స్థానిక రాజశేఖర్ మద్యం దుకాణం వద్ద రోడ్డుపై బహిరంగంగా మద్యం తాగుతూ హల్‌చల్ చేశారు. అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులను ఆపి వారిని భయపెడుతూ దూషణలకు దిగారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ బ్లూకోల్ట్స్ పోలీసులు గంగరాజు, హోంగార్డుతో కలిసి ఘటనాస్థలికి వెళ్లి స్టేషనుకు తరలించడానికి ప్రయత్నించారు. రెచ్చిపోయిన మందుబాబులు గొడవకు దిగారు. మత్తులోనే పోలీసులపై గట్టిగా కేకలు వేస్తూ దాడికి వెళ్లారు. అంతటితో ఆగకుండా పోలీసుల ద్విచక్ర వాహన తాళాలు తీసుకుని, బెదిరింపులకు పాల్పడ్డారు. సీఐ శాంతిలాల్ ఆదేశాలతో వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై నోరు పారేసుకోవడమే కాకుండా, ఆటంకం కల్గించినందుకు వారిపై కేసు నమోదు చేశారు. నిందితులను మొబైల్ కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి వారికి 14 రోజులు రిమాండ్ విధించడంతో రెడ్డిపల్లి జైలుకు తరలించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ ... Cell: 7382114647.

EDUCATION

GNM అడ్మిషన్స్: ... G.N.M (Nursing) ... Cell: 9030661651, ATP.

AP NCET ... B.Sc (Nursing) ... G.N.M (Nursing), B.Sc (MLT), B.P.T ... Cont: G.Murali, 9030661651, అనంతపురం.

JOBS

... Ph: 7994761626.

... Age: 21 to 28 Qua: Any Degree/ MBA, Ramnagar, ATP. Ph: 9966620252, 9100703123.

Evargo ... Ph: 7337544439, 9014651068, 7075633416.

గమనిక

...

5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

వివరాలకు: 8008709784

(c) eenadu

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

ఆలయ నిర్మాణానికి విరాళం

సభ్యులకు చెక్కు అందజేస్తున్న విశ్రాంత తహసీల్దార్ అంజన్‌రెడ్డి, ఆయన సతీమణి

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని లక్ష్మీపురంలో ఉన్న బాలాజీ ఆలయ అభివృద్ధికి ఆదివారం స్థానిక డీఆర్ కాలనీకి చెందిన విశ్రాంత తహసీల్దార్ అంజన్‌రెడ్డి, ఆయన సతీమణి రూ.1,25,116 చెక్కును కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యులు విజయ్‌గోపాల్, వెంకట్రాముడు, అర్చకుడు సత్యనారాయణలు పాల్గొన్నారు.

138 మందికి వినికిడి పరీక్షలు

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని శిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీసాయికాళేశ్వరస్వామి ఆశ్రమంలోని నవ్యశ్రీ ఉచిత కంటి వైద్యశాలలో 138మందికి ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహించారు. వినికిడి సమస్యలున్న 87మందికి అవసరమైన యంత్ర పరికరాలను ఉచితంగా అందజేశారు. మరో 46మందికి అనుశీలన పరీక్షలు చేశారు.

పరీక్షలను పర్యవేక్షిస్తున్న ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 80085 73018
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: మోరుబాగల్ ఎస్సీ కాలనీలో వీధి దీపాలు లేక అంధకారంలో ఉంటున్నాం **-చంద్రశేఖర్**
సమాధానం: పరిశీలించి వెంటనే ఏర్పాటు చేయిస్తాం. **-తిప్పేస్వామి, సర్పంచి, మోరుబాగల్.**
సమస్య: గొల్లపల్లి రోడ్డు గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **-తిప్పస్వామి**
సమాధానం: గుంతలు పూడ్చి ఇబ్బందులు లేకుండా చేస్తాం. **-రంగస్వామి, సర్పంచి, తాళికెర.**
సమస్య: కెంచనపల్లిలో శుద్ధజల కేంద్రం నుంచి నీటి సరఫరా సక్రమంగా లేదు. **-లీలావతి**
సమాధానం: రెండు రోజుల్లో సరఫరాకు చర్యలు తీసుకుంటాం. **-సరస్వతి, ఎంపీడీవో.**
సమస్య: మణేసముద్రం బీసీ కాలనీలో రోడ్ల పక్కనే చెత్త వేస్తున్నారు. **-నారాయణప్ప**
సమాధానం: సిబ్బందిని అప్రమత్తం చేసి తొలగించేలా చూస్తాం. **-శివకుమార్, ఈవోఆర్‌డీ**
-న్యూస్‌టుడే, గుడిబండ, హిందూపురం గ్రామీణం

సమస్య: రత్నగిరి ఇందిరమ్మ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. **-అడవీశ్**
సమాధానం: పాడైన చోట్ల వెంటనే ఏర్పాటు చేయిస్తాం. **-చిన్నరంగప్ప, సర్పంచి**
సమస్య: పిల్లిగుండ్లలో కాలువలు వ్యర్థాలతో నిండి మురుగు కదలడం లేదు. **-ఈరన్న**
సమాధానం: రెండు రోజుల్లో శుభ్రం చేయించి బ్లీచింగ్ వేయిస్తాం. **-అనిత, సర్పంచి, దొడ్డేరి.** -న్యూస్‌టుడే, రొళ్ల

కార్యాలయాల ఆవరణాల్లో కంపచెట్లు

పాముల బెడదతో సిబ్బంది బెంబేలు

గోరంట్ల ఎమ్మార్సీ ఆవరణలో కంప, పిచ్చిమొక్కలు

గోరంట్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడో శనివారం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర పేరుతో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇది కేవలం ప్రధాన రహదారులకే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గోరంట్లలోని పలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగి అపరిశుభ్రత తాండవిస్తోంది. దీంతో కార్యాలయ సిబ్బంది పాములతో సహజీవనం చేయాల్సిన పరిస్థితి కొనసాగుతోంది.

● మండల ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో భాగంగా ఉన్న వ్యవసాయశాఖ భవనం చుట్టూ పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగాయి. నిత్యం పాములు కార్యాలయం లోపలికి వస్తుండటంతో భయపడి దూరంగా చిన్నగదిలోకి ఆఫీసు మార్చేసుకున్నారు. ఇటీవల ఒకేసారి రెండు పెద్దపాములు లోపలికి రావడంతో మహిళా ఉద్యోగినులు పరుగులు పెట్టారు.

● **ఎమ్మార్సీ ఆవరణలో:** ఇక్కడ ప్రాథమిక పాఠశాల, మూడు అంగన్‌వాడీ కేంద్రాలు, గోరంట్ల-5వ సచివాలయం, ఎమ్మార్సీ, ఐఈఆర్సీ కొనసాగుతున్నాయి. అంతే కాదు గోరంట్లకు నీటిసరఫరా అయ్యే ట్యాంకులు అక్కడే ఉన్నాయి. శనివారం ఉదయం ఒక అంగన్‌వాడీ కేంద్రం తలుపు తెరిచారు. పైనుంచి పాము కిందకు పడింది. పాములు పట్టే వ్యక్తిని పిలుచుకుని వచ్చారు. దొరకలేదు. అదే గదిలో చిన్నారులతో కేంద్రం కొనసాగిస్తున్నారు.

● అదే ఆవరణంలోని సచివాలయంలో మూడు రోజుల క్రితం పెద్దపాము సంచరించింది. చూసిన సచివాలయ మహిళా సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. వనాన్ని తలపించే విధంగా ఆవరణం మొత్తం కంపచెట్లతో నిండిపోయింది. వందలాది మంది చిన్నారులు చదువుకునే బడి పరిసరాలు ఇలాఉంటే భద్రత ఎలా ఉంటుందో ఊహించుకోవాలి.

చర్యలు తీసుకుంటాం

అయిదో సచివాలయ పరిసరాల్లో పాము సంచరించినట్లు సమాచారం వచ్చింది. ఆ సచివాలయాన్ని చావిడిలోకి మార్చడానికి ఆదేశాలు ఇచ్చాం. ప్రస్తుతం చావిడిలో ఉన్న గోరంట్ల- 2 సచివాలయం నూతనంగా నిర్మించిన పక్కా భవనంలోకి మారుస్తున్నాం. మిగిలిన కార్యాలయాల పరిసరాలు పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **-నరేంద్రకుమార్, ఎంపీడీవో, గోరంట్ల**

భక్తిశ్రద్ధలతో జలధికి పీర్ల తరలింపు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీకంఠపురంలో భక్తులు పీర్లకు చక్కెరతో చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం పీర్లను ఊరేగించి చెరువులో జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్రీకంఠపురంలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

రొద్దం : మండలంలోని సానిపల్లి, బూచెర్ల, రాచూరు గ్రామాల్లో పీర్ల స్వాములను ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా జలధికి తరలించారు.

బూదిలి వీధుల్లో గ్రామస్థులు

గోరంట్ల: పులేరు, గౌనివారిపల్లి, గుంటిపల్లి, బూదిలి, వడిగేపల్లి, బోయలపల్లి, బత్తలపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో బాబయ్య స్వాములను వీధుల్లో ఊరేగించారు. అనంతరం జలధికి పంపించారు. శనివారం రాత్రి నుంచే సీఐ శేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు.

నిరుపేదలకు అండ సీఎం సహాయనిధి

చెక్కులు అందజేస్తున్న మంత్రి సవిత, తదితరులు

పెనుకొండ, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరుపేదలకు అండగా నిలుస్తుందని మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని 21మంది బాధితులకు రూ.13.61లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పెనుకొండలో అందజేశారు. ప్రజలు అత్యవసర సమయంలో ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స చేయించుకొని ఉంటే బిల్లులు స్థానిక క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్(ముఖ్యమంత్రి సహాయనిధి)కి దరఖాస్తు చేసుకోవాలని, వీలైనంత సహాయం ప్రభుత్వం అందిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం

సోమందేపల్లి : సోమందేపల్లిలో ఈనెల 25న వెయ్యి మంది మహిళల చేత చౌడేశ్వరీదేవికి సమర్పించే బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని మంత్రి సవితకు ఆదివారం తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు సినీ హరిదాస్, సభ్యులు మహేంద్ర, అనిల్ తదితరులు ఆహ్వాన పత్రిక అందజేశారు.

హోంమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం

గుడిబండ, న్యూస్‌టుడే: రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత గుడిబండ పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెదేపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్పలు పేర్కొన్నారు. రాళ్లపల్లి, మందలపల్లి, మోరుబాగల్‌లో విడివిడిగా నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి పర్యటన విజయవంతానికి తగిన సూచనలు, సలహాలు అందించారు.

బడుల చెంత.. చెత్త

దుర్వాసనతో అల్లాడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిలమత్తూరు, న్యూస్‌టుడే: అది మండల కేంద్రం ప్రతి రోజు వివిధ పనులు నిమిత్తం అనేక ప్రాంతాల నుంచి ప్రజలు వస్తారు. వారు తమ కాలకృత్యాలను తీర్చుకోవడానికి ఎక్కడ పడితే అక్కడ కానిచ్చేస్తున్నారు. ఎమ్మార్సీ కార్యాలయం సమీపంలో ఇలా చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. ఇక్కడ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయి. విద్యను అభ్యసించడానికి ప్రతిరోజు వందల మంది చిన్నారులు వస్తారు. ప్రాథమిక ఉన్నత పాఠశాలలకు వెళ్లే దారిలోనూ ఇదే పరిస్థితి. ముక్కు మూసుకొని అటువైపు వెళ్లాలి. చెత్త, చెదారం ఎక్కడ పడితే అక్కడ ఉండిపోవడంతో దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. చిలమత్తూరు బీసీకాలనీ విద్యుత్తు కార్యాలయం సమీపంలో చెత్తను తీయకుండా పంచాయతీ సిబ్బంది అలానే ఉంచేశారు. ఈ మూడు చోట్లు నెలల కొద్ది పంచాయతీ సిబ్బంది పనిచేయకపోవడంతో పేరుకుపోయిన చెత్త, చెదారం దర్శనం ఇస్తున్నాయి. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా స్పందించకుండా బెదిరింపులకు దిగుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త తొలగింపజేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మార్సీ కార్యాలయం పక్కన పేరుకుపోయిన చెత్త

సమస్యలు.. పరిష్కారం

హిందూపురం అర్బన్: పట్టణంలో వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను 'ఈనాడు'లో మేమున్నాం-మీకు తోడుగా శీర్షికన ప్రచురించడంతో సంబంధిత అధికారి స్పందించారు. పట్టణంలోని సూరప్పకుంట నుంచి నంది సర్కిల్ వరకు, రైల్వే రోడ్డు నుంచి సరస్వతి థియేటర్ వెళ్లే రహదారిలో ఉన్న కాలువలను ఆదివారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయించారు.

సోమందేపల్లి సహకార సంఘం అధ్యక్షుడిగా వెంకటేశులు

సోమందేపల్లి: స్థానిక సహకార సంఘం అధ్యక్షుడిగా మాగేచెరువుకు చెందిన పూల వెంకటేశులను నియమించారు. కన్వీనర్‌గా తెదేపా నాయకుడిగా పని చేస్తున్న ఆయన సేవలను గుర్తించి సీఎం చంద్రబాబునాయుడు ఎంపిక చేయడం పట్ల ఆనందంగా ఉందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు వెంకటరాముడు, సర్పంచి నరసింహులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామసాయి నుంచే ఆర్ఎస్ఎస్ అభివృద్ధి జరగాలి

గోరంట్ల : రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ అభివృద్ధి గ్రామస్థాయి నుంచే జరగాలని ఏపీ గ్రామవికాస్ సంయోజక్ తిరుపతయ్య పేర్కొన్నారు. మండలంలోని మల్లాపల్లి సమీపంలోని రాధాకృష్ణ కల్యాణ మండపంలో ఆదివారం గ్రామ సంయోజకుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్‌లోని విభాగాలు, అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. సంయోజకులు ఏవీరెడ్డి, జగదీష్, చంద్రశేఖర్, దేవీ ప్రసాద్, సంజీవప్ప తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛ రోగులు నీరు, నిప్పు వద్ద సంచరించొద్దు

హిందూపురం: మూర్ఛవ్యాధితో ఇబ్బందులు పడుతున్న వారు నీరు, నిప్పు వద్ద సంచరించకూడదని వైద్యులు సూచించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఆర్టీసీ రోడ్‌లోని పాఠశాలలో 130వ మూర్ఛ వ్యాధి నివారణ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు ఈటీ రామ్మూర్తి, పిల్లల వైద్యులు రత్నాచారి, ఎముకల వైద్యులు మాట్లాడుతూ ఈ వ్యాధిని సరైన చికిత్సతో బయటపడవచ్చన్నారు. శిబిరంలో పాల్గొన్న 154 మందికి వైద్యం చేసి మందులు అందజేశారు. జేవీవీ ప్రతినిధులు పి.రామకృష్ణ, గంగిరెడ్డి, ఉగ్రప్ప, అంజన్‌రెడ్డి, జీఆర్ శ్రీనివాసులు, లక్ష్మీపతి, ఎం.రామకృష్ణ, అతావుల్లా, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వాహనాన్ని క్షుణ్నంగా పరిశీలించండి

కొడికొండ చెక్‌పోస్టు(చిలమత్తూరు), న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన ప్రొహిబిషన్ ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు ఎక్సైజ్ అధికారులు ఆదివారం కొడికొండ చెక్‌పోస్టులో ఘనస్వాగతం పలికారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్నంగా పరిశీలించి పంపాలని ఆదేశించారు. సీసీ కెమెరాల పనితీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాహనాల తనిఖీలో మానవ తప్పిదాలను నివారించేందుకు యంత్ర పరికరాల వాడకాన్ని పరిశీలించాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో వోఎస్‌డీ గోపాల్, అనంతపురం డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, సత్యసాయి జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు, సీఐ శ్రీధర్, ఎస్ఐ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

సీపీఐ నూతన కమిటీ ఎంపిక

నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న సీపీఐ నాయకులు

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్క్యాఏ ఛారిటబుల్ ట్రస్ట్ భవనంలో ఆదివారం సీపీఐ నియోజకవర్గ 5వ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా శ్రీరాములు, మండల కార్యదర్శిగా నరసింహులు, సహాయ కార్యదర్శిగా మల్లికార్జున ఇతర పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం

లేపాక్షి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని కళాకారులను గుర్తించి వారి ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా తేనెతెలుగు కల్చరల్ ఛారిటబుల్ ట్రస్టు పని చేస్తుందని అధ్యక్షుడు అంజినప్ప, డైరెక్టర్ సాయిలు పేర్కొన్నారు. స్థానిక ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ట్రస్టు ఆధ్వర్యంలో పద్య నాటక ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు పాల్గొని తమ నటనా కౌశల్యాన్ని ప్రదర్శించారు. వీరిలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

ఏకపాత్రాభినయం చేస్తున్న కళాకారుడు

వైకాపా నిరసన ర్యాలీ

లేపాక్షిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైకాపా నాయకులు

లేపాక్షి, న్యూస్‌టుడే: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ ఆదివారం లేపాక్షిలో వైకాపా నియోజకవర్గ సమన్వయ కర్త దీపిక ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుమతిరెడ్డి, మండల కన్వీనర్ నిసార్ అహ్మద్, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, మాజీ ఎంపీపీ హనోక్, నాయకులు వేణురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● ఆదివారం స్థానిక చేతన ఫంక్షన్ హాల్‌లో వైకాపా మండల కన్వీనర్ నిసార్ అహ్మద్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం రీకాలింగ్ మ్యానిఫెస్టో పేరుతో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే చర్యలు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: పాఠశాలలు, ప్రార్థనా మందిరాలు, గ్రంథాలయాలు వంటి బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా ధూమపానం చేస్తే చర్యలు తప్పవని ఎస్సై రమేశ్‌బాబు హెచ్చరించారు. గ్రామాల్లో బహిరంగ ప్రదేశాలైన వీధులు, రహదారులు, టీ, హోటళ్లలో సిగరెట్లు, బీడీలు తాగిన వారికి రూ.200, పాఠశాలలు, గ్రంథాలయాలు, ఆలయాలు, మసీదులు, చర్చిలు వంటి చోట్ల పొగతాగితే రూ.400 చొప్పున జరిమానా విధిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెంటనే చర్యలు చేపట్టనున్నామని, ఈవిషయాన్ని గుర్తించుకొని, మంచి సమాజం ఏర్పాటు కోసం ప్రతిఒక్కరూ తమకు సహకరించాలని ఆయన కోరారు. ఆదివారం సాయంత్రం టీ హోటళ్ల వద్ద వ్యాపారులు, ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు

బకాయిలు చెల్లించాలని కార్మికుల నిరసన

పెనుకొండ,న్యూస్‌టుడే: బకాయిపడిన 8నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం వెంకటాపురంతండా వద్ద పంప్‌హౌస్‌ల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, జిల్లా కోశాధికారి డి.బాబు మాట్లాడుతూ గొల్లపల్లి నుంచి హిందూపురం వరకు ఉన్న 4పంప్‌హౌసుల్లో 25మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారికి బకాయి వేతనాలు చెల్లించాలని, అదేవిధంగా కార్మికులను అప్కాస్‌లో చేర్చి ప్రతినెలా వేతనం అందజేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు.

గొల్లాపురంలో ఇంటింటికీ తెదేపా

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: సుపరిపాలనలో తొలిఅడుగు, ఇంటింటికీ తెదేపా కార్యక్రమాన్ని ఆ పార్టీ మండల కన్వీనర్ రాము అధ్యక్షతన గొల్లాపురం గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు అరుణాచల రెడ్డి, ప్రదీప్‌కుమార్, ఆదినారాయణ తదితరులు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ నటించిన పెద్దన్నయ్య సినిమాలోని పాటను కంటిచూపులేని మహిళా అభిమాని లత వినిపించడంతో నాయకులు, కార్యకర్తలు అభినందించారు. తెదేపా, భాజపా, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాట పాడుతున్న అంధురాలు లత

వెలుగులు పంచుతున్న వక్క మాను

ఉప్పార్లపల్లి ఇందిరమ్మ కాలనీలో వక్క మానే విద్యుత్తు స్తంభంగా ఉపయోగపడుతోంది. ఈ కాలనీలో పలువురు ఇళ్లు కట్టుకుని నివాసముంటున్నారు. అధికారులు స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో ఇలా వారే ఎండిన వక్క చెట్టును తెచ్చి నాటి విద్యుత్తు దీపం ఏర్పాటు చేసుకున్నారు. అది వానకు నాని కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికైనా స్తంభం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గుడిబండ**

విద్యుత్తు సరఫరా లేక ఇబ్బందులు..

సోమందేపల్లి : మండలంలోని రేణుకానగర్‌లో ఆదివారం ఉదయం నుంచి ఎలాంటి సమాచారం అందించకుండా విద్యుత్తు సరఫరాను నిలిపివేశారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. సాయంత్రం 7.30 గంటలైనా పునరుద్ధరించక పోవడంతో చీకట్లో చుట్టూ పొలాల మధ్య ఉన్న తమ గ్రామంలో పిల్లలు, మహిళలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఈ విషయంపై విద్యుత్తు ఏఈ పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఉదయం నుంచి ఆ గ్రామంలోనే తమ సిబ్బంది విద్యుత్తు లైన్ మరమ్మతులు చేపట్టారని, కొంత ఆలస్యమైనా సరఫరాకు చర్యలు చేపట్టామని వివరించారు.

పరిగి చెరువు.. పనుల పరుగు

రూ.1.20 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం

కట్టపై కంపచెట్లను తొలగిస్తున్న పొక్లెయిన్

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: ఏళ్లుగా ఎటువంటి మరమ్మతుకు నోచుకోని దుస్థితిలో ఉన్న పరిగి చెరువు మరమ్మతు పనులు ఎట్టకేలకు ప్రారంభం అయ్యాయి. గత మూడేళ్ల వ్యవధిలో కర్ణాటక ప్రాంతంలో కురిసిన వర్షాలకు జయమంగళి నది ప్రవహించడంతో రెండు పర్యాయాలు చెరువు పూర్తి స్థాయిలో నిండింది. దీంతో మండలంలోని పరిగి, ధనాపురం, శిరేకోళం, నరసాపురం, ఎస్.బీరేపల్లి, ఎన్.ముద్దిరెడ్డిపల్లి, చిన్నపల్లి, పైడేటి, విట్టాపల్లి గ్రామాలకు చెందిన రైతులు విరివిగా వరి పంటను సాగు చేసి పండించుకున్నారు.

బలహీనంగా ఉన్న చెరువు కట్ట

శ్రీసత్యసాయి జిల్లాలో పెద్దచెరువుల్లో ఒకటిగా పరిగి చెరువు గుర్తింపు పొందింది. ఈ చెరువు కింద 2,800 ఎకరాల ఆయకట్టు ఉంది. 20 ఏళ్లుగా చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టక పోవడంతో కట్టపై ముళ్లకంపలు విస్తృత స్థాయిలో ఆక్రమించుకుని ఉన్నాయి. చెట్ల వేర్లు కట్టలోపలికి చొచ్చుకొని వెళ్లడంతో నెర్రెలు ఇచ్చి కట్ట బలహీనంగా మారింది. చెరువు కట్ట పునరుద్ధరణకు 2018లో తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.1.20 కోట్లు నిధులు మంజూరయ్యాయి. అయితే అప్పట్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వం అధికారంలో రావడంతో చెరువు కట్ట మరమ్మతు పనులు అటకెక్కాయి. పనులు దక్కించుకున్న గుత్తేదారుతో అప్పటి వైకాపా నాయకులు అధిక మొత్తంలో పర్సంటేజీలు చెల్లించాలని ఒత్తిడి తేవడంతో గుత్తేదారు చేసేది లేక పనులను అర్ధాంతరంగా ఆపివేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిగి చెరువు కట్ట మరమ్మతులు చేపట్టేందుకు గుత్తేదారు ముందుకు వచ్చారు. ప్రస్తుతం చెరువు కట్టపై ఉన్న కంపచెట్లు తొలగించే పనులతో పాటు, కట్ట బలహీనంగా ఉన్న ప్రాంతంలో సిమెంట్‌తో కాంక్రీట్ పనులు చేపడుతున్నారు. చెరువు కట్ట పనులు ప్రారంభం కావడంపై రైతు సంఘం నాయకులు వెంకట్రామిరెడ్డి, కొండూరు నవీన్‌లు హర్షం వ్యక్తం చేశారు.

యుద్ధప్రాతిపదికన పనులు చేయిస్తాం

పరిగి చెరువు మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయిస్తాం. కట్ట బలహీనంగా ఉన్న ప్రాంతంలో కాంక్రీట్‌తో రక్షణ గోడలు నిర్మిస్తాం. సాగునీరు లీకవుతున్న రెండవ తూముకు అవసరమైన మరమ్మతులు చేయిస్తాం. చెరువు నుంచి సాగునీటిని మళ్లించే ప్రాంతాలాల్లో సప్లయ్ ఛానల్స్‌పై కల్వర్టులను నిర్మిస్తాం.
-రమణారెడ్డి, నీటి పారుదల శాఖ ఇంజినీరు, పెనుకొండ

దోమలు బాబోయ్ దోమలు

☛ అల్లాడిపోతున్న పట్టణ ప్రజలు ☛ ఏడాదిగా ఫాగింగ్ చేయని వైనం

ఓ దుకాణం ఎదుట దోమతెరను చుట్టుకొన్న కాపలాదారుడు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణంలో సాయంకాలం అయితే చాలు ఆరు బయట నిలబడలేం. దోమల నివారణ క్రిమి సంహారక పరికరాలను పెట్టుకోకపోతే ఇళ్లలోనూ ఉండలేం. దోమల బెడదతో పట్టణ ప్రజలు అల్లాడిపోతున్నారు. పట్టణంలో సమగ్ర మురుగు కాలువ వ్యవస్థ లేకపోవడం, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేయకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రతి ఇంటిలోనూ, కార్యాలయంలోనూ దోమల నివారణ కోసం మస్కిటో రీఫిల్లను వాడుతున్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన మున్సిపాలిటీ పూర్తిగా విఫలమైంది. ఏడాది కాలంగా పట్టణంలో ఫాగింగ్ చేయలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మున్సిపాలిటీ గతంలో కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్లు సరిగా పని చేయకపోవడంతో అటకెక్కించారు. నాసిరకం మిషన్లను కొనుగోలు చేస్తుండటంతో అవి రెండేళ్లయినా పని చేయడం లేదు. ఇప్పటికైనా దోమల నివారణకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

అటకెక్కిన ఫాగింగ్ యంత్రాలు

(c) eenadu

సమావేశంలో పాల్గొన్న నాయకులు

పార్టీ అభివృద్ధికి కృషి చేద్దాం

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా భాజపా నాయకులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆదివారం మండల పరిధిలోని భాజపా నాయకుడు తలుపుల గంగాధర్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయగా.. మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏడాదిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాధించిన విజయాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. నాయకులు రామకృష్ణ, కేశవరెడ్డి, రామకృష్ణ, రమేశ్‌బాబు, షమీవుల్లా, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి

• పుట్టపర్తి • ధర్మవరం • కదిరి • రాప్తాడు

అలరించిన నృత్య ప్రదర్శన

భరతనాట్యం చేస్తున్న విద్యార్థులు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని సాంస్కృతిక కళా మండలిలో ఆదివారం కూచిపూడి కళాకేంద్రం విద్యార్థినుల గురుపూజోత్సవం సందర్భంగా నృత్యాంజలి నిర్వహించారు. పీఆర్‌టీ కాలనీ కూచిపూడి కళాకేంద్రం విద్యార్థినుల నృత్యాలు అలరించాయి. కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శించారు. క్షీరసాగరమథనం నృత్యరూపకం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కూచిపూడి నృత్య గురువులను ఘనంగా సన్మానించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: ముదిగుబ్బలోని కదిరి రోడ్డులో చెత్త దిబ్బలు పేరుకుపోయాయి. దీంతో దోమలకు నిలయంగా మారింది. **- జయకృష్ణ**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

సమస్య: ముదిగుబ్బ ఎస్టీ కాలనీలో నిత్యం రహదారిపై మురుగు ప్రవహిస్తోంది. దీంతో రొచ్చుగా మారి తీవ్ర అపరిశుభ్రంగా ఉంటోంది సమస్యను పరిష్కరిచండి. **- సువర్ణ**

సమాధానం: వెంటనే మురుగు తొలగించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

(పై రెండు సమస్యలకు ఎంపీడీవో దివాకర్ సమాధానాలు ఇచ్చారు.)

– న్యూస్‌టుడే, ముదిగుబ్బ

సమస్య: చెన్నేకొత్తపల్లి పాత బీసీ కాలనీ రెండో రోడ్డు ప్రవేశ మార్గం పక్కనే సింగిల్ ఫ్యూజ్ నియంత్రికకు పిచ్చి మొక్కలు అల్లుకొని ప్రమాదకరంగా మారింది. **- ప్రసాద్, స్థానికుడు**

సమాధానం: కాలనీని సందర్శించి పిచ్చి మొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- సుధాకర్, పంచాయతీ లైన్‌మెన్**

సమస్య: చెన్నేకొత్తపల్లి చెన్నకేశవస్వామి ఆలయ సమీపంలో మురుగు కాలువ పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభం కింది భాగంలో దెబ్బతినడంతో ఇనుప చువ్వలు వెలుగు చూసి ప్రమాదకరంగా మారింది. **- చాంద్‌బాషా, స్థానికుడు**

సమాధానం: సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారానికి కృషి చేస్తాం. **- సుధాకర్, పంచాయతీ లైన్‌మెన్**

సమస్య: చెన్నేకొత్తపల్లి ఉన్నత పాఠశాల ముందువైపు పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో అపరిశుభ్రత నెలకొంది. **- రమేష్‌రెడ్డి, స్థానికుడు**

సమాధానం: పిచ్చి మొక్కలు తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే: చెన్నేకొత్తపల్లి

అతివేగం.. తీస్తోంది ప్రాణం

రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు అంధకారం

కదిరి పట్టణం, కదిరి గ్రామీణం, గాండ్లపెంట, న్యూస్‌టుడే: సాఫీగా సాగిపోతున్న కొందరి జీవితాలు రోడ్డు ప్రమాదం రూపంలో అంధకారంలోకి చేరాయి. కుటుంబ పెద్దదిక్కును కోల్పోయి ఆ కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఎదుటివారి నిర్లక్ష్యం వల్ల కొందరు ప్రమాదం బారిన పడితే.. అతివేగం వల్ల మరికొందరు అశువులు బాసి కుటుంబ సభ్యులకు కడుపుకోత మిగిల్చారు. గత ఏడాది సెప్టెంబరు నుంచి జూన్ వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పదిమందికి పైగా మరణించారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రహదారి ప్రమాదాల్లో మరణించిన వారిలో కుటుంబ భారాన్ని మోస్తున్న ఇంటి పెద్దలు ఉన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు ఆసరాగా నిలవాల్సిన కొడుకులు ఉన్నారు. వారి పడుతున్న ఇబ్బందులపై ప్రత్యేక కథనం.

పిల్లల సంరక్షణ తలచుకుంటేనే భయమేస్తోంది

మాది కదిరి మండలం కాళసముద్రం. తన భర్త ఆదినారాయణ భవన నిర్మాణ పనులు చేసి కుటుంబాన్ని పోషించేవాడు. ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబానికి అండగా ఉంటున్న ఇద్దరినీ కారు రూపంలో మృత్యువు కబళించింది. కదిరిలో పనికి వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నప్పుడు కారు ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందారు. భర్త, అత్త చనిపోవడంతో దివ్యాంగుడైన మామ, ముగ్గురు పిల్లలతో పాటు రోడ్డున పడాల్సి వచ్చింది. పిల్లలను పోషించుకోవడానికి స్వగ్రామం వదిలి కదిరికి వచ్చాను. ఆడపడుచు భర్త గంగులప్పతో పాటు కూలీ పనులకు వెళ్తూ బిడ్డలకు పట్టెడన్నం పెడుతున్నాను. పెద్దమ్మాయి రేవతి 8వ, రెండో కూతురు లోకేశ్వరి 5వ, కొడుకు వినయ్‌కుమార్ 3వ తరగతి చదువుతున్నారు. **- శిరీష, కాళసముద్రం**

ప్రభుత్వమే ఆదుకోవాలి

మాది కదిరి మండలం ఎగువపల్లి. భవన నిర్మాణ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించే తన భర్త మహేశ్ కదిరి నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నప్పుడు ఆర్డీవో కార్యాలయం వద్ద అదుపుతప్పి కల్వర్టులోకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన మృతితో మూడేళ్ల కుమారుడి బాధ్యతను మోయాల్సి వచ్చింది. బిడ్డను వదిలి ఉపాధి కోసం వేరే ప్రాంతానికి వెళ్లలేని పరిస్థితి. గత సెప్టెంబరులో తన భర్త మృతిచెందిన ఇప్పటివరకు వితంతు పింఛను మంజూరు కాలేదని వాపోయారు. ఇంటర్ వరకు చదువుకున్న తనను ప్రభుత్వమే ఉపాధి చూపి ఆదుకోవాలి. **- రజిత, ఎగువపల్లి, కదిరి మండలం**

అండగా ఉంటాడనుకుంటే.. అందనంత దూరం వెళ్లిపోయాడు

మాది గాండ్లపెంట మండలం నరసప్పగారిపల్లి. ఐదు నెలల కిందట ద్విచక్ర వాహనంపై వెళ్తూ తమ కుమారుడు రెడ్డిశేఖర్ ప్రమాదానికి గురై మృతిచెందాడు. వృద్ధాప్యం కారణంగా అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్య గంగులమ్మ కొడుకు మృతిని జీర్ణించుకోలేక మంచానికే పరిమితమైంది. వయసు మీదపడటంతో తాను ఏ పనులు చేయలేకపోతున్నాను. వృద్ధాప్యంలో అండగా ఉంటాడనుకున్న కొడుకు రోడ్డు ప్రమాదంలో అందనంత దూరం వెళ్లిపోయాడు. దేవుడిపై భారం వేసి బతుకుతున్నాం. **- గంగులమ్మ, నారాయణ, నరసప్పగారిపల్లి, గాండ్లపెంట**

ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

అలనాటి జ్ఞాపకాలు పదిలం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తమవంతు సహకారం అందిస్తామని పూర్వవిద్యార్థులు పేర్కొన్నారు. ఆదివారం పుట్టపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2012-13లో చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు బాలకృష్ణ, విశ్వనాథ్, వెంకటరమణ, రాధాకృష్ణ, మల్లికార్జున, చిన్ననాగప్ప, ఆనందరెడ్డి, చంద్రశేఖర్‌శెట్టి, సూర్యనారాయణలను ఘనంగా సత్కరించారు. పాతజ్ఞాపకాలు గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

తండ్రిపై కుమారుడి దాడి

ధర్మవరం: పట్టణంలోని గూడ్స్‌షెడ్ కొట్టాల కాలనీలో ఏటూరి మహేశ్‌పై కుమారుడు సతీశ్ దాడి చేశాడు. గాయపడిన మహేశ్‌ను చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శనివారం రాత్రి భార్య మహాలక్ష్మితో మహేశ్ గొడవ పడుతుండగా పెద్ద కుమారుడు సతీశ్ తండ్రిపై కర్రతో దాడి చేశాడు. మహేశ్ ఫిర్యాదు మేరకు సతీశ్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని రెండో పట్టణ సీఐ రెడ్డెప్ప తెలిపారు.

క్షుద్ర పూజల కలకలం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి పట్టణం మారుతీనగర్‌లో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. జహా ఇంటి ముందు మైదా పిండితో బొమ్మను తయారు చేసి పసుపు, కుంకుమ, తమలపాకులతో క్షుద్ర పూజలు చేశారు. వేకువజామున నిద్రలేచిన ఇంటి యజమాని గుమ్మం ముందు ఉన్న బొమ్మను చూసి భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న స్థానికులు దానిని తొలగించారు. ఇలాంటివి చేసేవారిని గుర్తించి చట్టపరంగా శిక్షించాలని ఇంటి యజమాని పోలీసులను కోరారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండలంలోని గుంజేపల్లిలో ఆదివారం విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందింది. రైతు భాస్కర్‌కు చెందిన ఆవు ఉదయం మేతకోసం బయటకు వదిలాడు. నియంత్రిక నుంచి మోటారుకు వెళ్లే విద్యుత్తు తీగలు ఆవుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. సుమారు రూ.70వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కదిరి, న్యూస్‌టుడే: కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. క్రికెట్ శిబిరంలో శిక్షణ పొందుతున్న వయసుల విభాగం క్రీడాకారులకు పోటీలు జరిపారు. ఇందులో మొదట పోటీపడిన అండర్-12 మ్యాచ్‌లో రైజింగ్ స్పోర్ట్స్ జట్టు 93 పరుగులు చేశారు. తర్వాత బ్యాటింగ్ చేసిన లిటిల్ థండర్స్ జట్టు 8 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించారు. రెండవ మ్యాచ్‌లో సీనియర్స్ జట్టు ఆటగాళ్లు తాకిబ్ 102, రేవంత్ 42 పరుగులతో రాణించారు. నిర్ణీత 20 ఓవర్లలో 188 పరుగులు చేశారు. తర్వాత బ్యాటింగ్ చేసిన అండర్-19 జట్టు 120 పరుగులకే సరిపెట్టుకున్నారు. ప్రతిభా క్రీడాకారులు వినయ్, పర్హాన్‌లకు రంజీ క్రీడాకారుడు గిరినాథ రెడ్డి టీషర్టులు బహూకరించారు.

పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

రామగిరి: మండల పరిధిలోని పేరూరు గురుకుల పాఠశాలలో సాహితి గగన్ మహల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాలలోని విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేందుకు రూ. 1.70 లక్షలతో వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ట్రస్ట్ అధ్యక్షుడు, న్యాయవాది ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు.

శ్వాస మీద ధ్యాసే ధ్యానం

బత్తలపల్లి: శ్వాస మీద ధ్యాస పెట్టడమే ధ్యానమని శ్రీహరి పిరమిడ్ ధ్యాన మాస్టర్ నాగేంద్ర పేర్కొన్నారు. ఆదివారం బత్తలపల్లిలోని హరి పిరమిడ్ ధ్యాన మందిరంలో ధ్యాన మాస్టర్ ధర్మవరం లలిత, మున్ని భక్తులకు ధ్యాన ప్రవచనలు వినిపించారు.

నాము గడ్డి తిని గొర్రెలు..

ఓబుళదేవరచెరువు: మండలంలోని నల్లగుట్లపల్లికి చెందిన రైతు ఆసాదిరవికి చెందిన నాలుగు గొర్రెలు ఆదివారం నాము ఎక్కిన గడ్డి (లేత గడ్డి) తిని మృతిచెందాయి. రూ.50 వేలు విలువ చేసే గొర్రెలు మృతిచెందినట్లు బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుడికి సాహితీ సేవా పురస్కారం

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మండలం బండ్లపల్లి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు ఇషాక్ మహమ్మద్ ఇక్బాల్ సాహితీ సేవా పురస్కారం అందుకున్నారు. ఆదివారం హిందూపురంలో భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ, జిల్లా రచయితల సంఘం సంయుక్తంగా పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 'మానిక్యమ్ము శతకం' రచయిత ఇషాక్‌కు ప్రఖ్యాత గాయకులు గజల్ శ్రీనివాస్, హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ రమేశ్‌కుమార్‌లు సాహితీసేవా పురస్కారం అందించారు. తెలుగు సాహిత్యంలో విశేష ప్రతిభ కనబరిచినందుకు పురస్కారాన్ని అందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ విశ్రాంత న్యాయమూర్తి గోపాల్, స్వాతంత్ర్య సమరయోధుడు మెళవాయి గోవిందరెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు చాంద్ బాషా, ఇందాద్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఇషాక్‌కు పురస్కారం అందజేస్తున్న గజల్ శ్రీనివాస్

ఆర్టీసీ ఉద్యోగుల నిజాయతీ

కదిరి: కదిరి ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న పర్సు, నగదు అందించి డిపో ఉద్యోగులు నిజాయతీ చాటుకున్నారు. కదిరి - మదనపల్లి ప్రయాణించిన పులివెందులకు చెందిన ఆర్‌టీసీ డ్రైవరు మహబూబ్‌బాషా పర్సు బస్సులో పడిపోయింది. పర్సును డ్రైవరు రుద్రమనాయుడు, కండక్టరు ప్రసాద్‌లు గమనించారు. ఆధార్‌కార్డులోని సమాచారంతో బాధితుడికి విషయం తెలిపారు. ఆయన డిపోకు వచ్చి వివరాలు తెలపటంతో పర్సు అందజేశారు.

పుట్టపర్తిలో...

బుక్కపట్నంలో పీర్ల ఊరేగింపు

జలధికి తరలిన పీర్లు

పుట్టపర్తి, బుక్కపట్నం, బత్తలపల్లి, ఓబుళదేవరచెరువు, గాండ్లపెంట, న్యూస్‌టుడే: పుట్టపర్తిలో ఆదివారం పీర్లకు జలధి నిర్వహించారు. అగ్నిగుండ ప్రవేశం తర్వాత పీర్లను ఊరేగించారు. భక్తులు బెల్లం, చక్కెర చదివించారు. బుక్కపట్నంలోని పేట, కోట ప్రాంతం, బత్తలపల్లి మండలంలోని తంబాపురం, ఓబుళాపురం గ్రామాల్లో, ఓబుళదేవరచెరువు, గాజుకుంటపల్లి, గాండ్లపెంట మండలం సోమయాజులపల్లి పంచాయతీ కత్తివారిపల్లిలో ఆదివారం ఉరుసుపీరు గ్రామాల్లో పీర్లను జలధికి తరలించారు.

ఉద్యోగి మృతికి నివాళి

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండలంలోని ఒడ్డుకిందతండాకు చెందిన రమేశ్‌నాయక్ (27) శనివారం అనంతపురంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం తెలిసిందే. పామిడిలోని ఏపీజీబీ బ్యాంకులో స్వీపర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేసేవారు. మృతిచెందిన విషయం తెలుసుకున్న ఏపీజీబీ బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి మృతుడి స్వగ్రామానికి చేరుకుని నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

లైన్‌మెన్ మృతికి సంతాపం

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండలంలోని చిల్లకొండాయపల్లికి చెందిన వీరయ్య (56) దాడితోటలోని విద్యుత్తు ఉప కేంద్రంలో లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. శనివారం రాత్రి నలతగా ఉందని తెలపడంతో కుటుంబసభ్యులు బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఆదివారం విద్యుత్తు శాఖ ఏడీ రఘు, ఏఈలు శివయ్య, మదన్‌మోహన్, సబ్ ఇంజినీర్ రవికుమార్ ఆయన మృతికి సంతాపం తెలియజేశారు. రూ.15 వేలు అందజేసి, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నినాదాలు చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

కొనసాగుతున్న ఇంజినీరింగ్ కార్మికుల దీక్ష

ధర్మవరం పట్టణం: పట్టణంలోని పురపాలకశాఖ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ కార్మికుల దీక్ష గత 25 రోజులుగా కొనసాగుతునే ఉంది. ఆదివారం కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘం అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కార్మికుల సమస్యలు తీర్చుతామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం కూడా అదే ధోరణి ప్రదర్శిస్తోందని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు.

విభాగినిపై పేరుకున్న చెత్తచెదారం

కొక్కంటిక్రాస్‌లోని 42 జాతీయ రహదారి మధ్యలోని విభాగినిపై గడ్డి పెరిగి చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాలు వెళ్లే సమయంలో గాలికి చెత్తతో పాటు దుమ్ము లేస్తుండడంతో వాహనదారుల కళ్లల్లోకి పడి ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం ఎన్నో ఘటనలు జరుగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. ఈ విషయమై ఎంపీడీవో రామానాయక్‌ను వివరణ కోరగా.. పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయిస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, కొక్కంటిక్రాస్, తనకల్లు

బ్రాహ్మణ అభ్యుదయ సేవాసంఘం ఏర్పాటు

కదిరి, న్యూస్‌టుడే: కదిరిలో నూతనంగా శ్రీమత్ ఖాద్రీ క్షేత్ర బ్రాహ్మణ అభ్యుదయ సేవాసంఘం ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు నివర్తి వెంకట శివకుమార్‌శర్మ తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా నివర్తి వెంకట శివకుమార్‌శర్మ, ఉపాధ్యక్షుడిగా రంగనాథరావు, గౌరవాధ్యక్షుడిగా నాగభూషణరావు, కార్యదర్శిగా శ్రీనివాసశర్మ, కోశాధికారిగా శివశంకరశాస్త్రి, సహాయ కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం శర్మ తదితరులు ఉన్నట్లు పేర్కొన్నారు. బ్రాహ్మణులకు శుభ, అశుభ కార్యాలకు సహకారం అందిస్తామన్నారు. శ్రీఖాద్రీశుని బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తాలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుకు నిర్ణయించినట్లు తెలిపారు.

చెత్తకుప్పలు.. స్థానికులకు తిప్పలు

మార్కెట్లో గ్రామ సచివాలయం-3 ఎదురుగా చెత్తకుప్ప

కొత్తచెరువు, న్యూస్‌టుడే: మేజరు పంచాయతీ కొత్తచెరువులో ప్రధాన వీధి కూడళ్లలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 4500 ఇళ్లలో దాదాపు 20 వేల జనాభా నివసిస్తున్నారు. బుక్కపట్నం, పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ రోడ్లతో పాటు వారపు సంత, నాలుగు రోడ్ల కూడలిలో ప్రతిరోజూ 20 మంది కార్మికులు చెత్తను శుభ్రం చేసి గ్రామం వెలుపలకు తరలిస్తున్నారు. రోజూ నివాసాల నుంచి వెలువడుతున్న ఆరు ట్రిప్పుల చెత్త మూడు ట్రాక్టర్లతో బయటకు తరలిస్తున్నారు. రెండ్రోజులకు ఒకసారి ఇళ్ల నుంచి చెత్తను నేరుగా సేకరిస్తూ. ప్రతి బుధ, శనివారాల్లో ఆయా ప్రాంతాల నుంచి చెత్త కుప్పలను తరలిస్తున్న, కొన్ని ప్రాంతాల్లో నిల్వలు పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొంటోంది.

● ఉర్దూ పాఠశాల, విజయనగర కాలనీ, యూనియన్ బ్యాంకు దగ్గర చెత్త తరలింపు ఒక్కరోజు ఆలస్యమైనా అందరికీ పరీక్షగా మారుతోంది. ఆదివారం 'న్యూస్‌టుడే' పరిశీలనలో నాలుగైదు ప్రాంతాల్లో చెత్త కుప్పలు దర్శనమిచ్చాయి. మండల కేంద్రంలోని నివాసాల పరిధిలోని ఖాళీ స్థలాల్లో యథేచ్ఛగా చెత్తను వేయడం వల్ల పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందిగా మారింది.

● దీనిపై ఈవో శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా.. పంచాయతీ స్థలాలు, వీధి కూడళ్లలో చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తున్నామన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లోని ప్రైవేటు స్థలాల్లో ఇళ్లలోని వ్యర్థాలు వేయడం సమస్యగా మారుతోందని చెప్పారు. ఖాళీ స్థలాలకు హద్దులు వేసుకుని శుభ్రంగా ఉంచుకోవాలని యజమానులకు సూచిస్తున్నట్లు తెలిపారు.

మహిళల వ్యాపారం.. కుటుంబాలకు ఆధారం

వ్యక్తిగత నైపుణ్యాలతో రాణింపు

కదిరి, పుట్టపర్తి, న్యూస్‌టుడే: గృహిణిలుగా ఉన్న మహిళలు కుటుంబ నిర్వహణలోనే కాదు.. వ్యాపారం, వ్యవహారంలోనూ దక్షతను చాటుతున్నారు. ఇందుకు స్వయం సహాయక సంఘాల రుణాలు ఆసరా చేసుకున్నారు. నష్టాలకు అవకాశం లేకుండా అందరికీ అవసరమైన అమ్మకాలు చేపట్టారు. చింతపండును వినియోగ రూపంలో మార్కెటింగ్‌కు అనువుగా మార్చడం, వస్త్ర వ్యాపారం వంటి చేపట్టారు. కుటుంబ జీవనం, పిల్లల చదువులకు దన్నుగా నిలుస్తున్నారు. తోటి మహిళలకు కూలి పనులతో ఉపాధి కల్పిస్తున్నారు.

నెలకు రూ.30 వేలు ఆదాయం

కదిరి పట్టణంలోని కుటాగుళ్లకు చెందిన బీబీ చింతపండు వ్యాపారం చేస్తున్నారు. వచ్చే ఆదాయంతో కుటుంబ జీవనం నిశ్చింతగా సాగిస్తున్నారు. 15 ఏళ్ల కిందట మీరజ్‌బాబా పొదుపు సంఘ సభ్యురాలుగా చేరారు. రూ.5 వేలతో మొదలైన రుణం రూ.2 లక్షలు పొందారు. చింతవనాల దిగుబడి కొనుగోలుతో వ్యాపారం చేపట్టారు. చింతకాయలను విత్తనాలు తీసి, పండును చపాతీలుగా తయారు చేసి మార్కెటింగ్ చేస్తున్నారు. మరో ఐదుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. అన్ని ఖర్చులు పోయి నెలకు రూ.30 వేలు ఆదాయం వస్తున్నట్లు బీబీ తెలిపారు. తన కొడుకును మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చేయించినట్లు వివరించారు.- **బీబీ, కదిరి**

వస్త్రదుకాణంతో కుటుంబానికి అండగా



పుట్టపర్తికి చెందిన జ్యోత్స్నబాయి ఎంబీఏ వరకు చదువుకున్నారు. ఉన్నత విద్యతో ఎవరి దగ్గర ఉద్యోగానికి ఎదురుచూడలేదు. మీనాక్షి మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరిన ఆమె రుణం పొందారు. స్వయం ఉపాధి కోసం వస్త్ర దుకాణాన్ని ప్రారంభించారు. నెలకు రూ.20 వేలకు పైగా ఆదాయం పొందుతున్నారు. దీనికి తోడు భర్త ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు. ఇద్దరి సంపాదనతో ఇద్దరు పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నారు. వ్యక్తిగత నైపుణ్యాలకు తగినట్లు ఎంచుకున్న రంగంలో రాణిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. వ్యాపారంతో వచ్చే సంపాదనతో పిల్లల చదువు, కుటుంబ జీవనం సంతోషంగా గడుపుతున్నట్లు ఆమె తెలిపారు. **- జ్యోత్స్నబాయి, పుట్టపర్తి**

భక్తిశ్రద్ధలతో లలితసహస్ర పారాయణం

అమ్మవారి చీర, తాంబూలం స్వీకరిస్తున్న మహిళా భక్తులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని గాంధీనగర్ కూడలిలోని శ్రీచౌడేశ్వరీదేవి ఆలయంలో గత పదిహేను రోజులుగా సాగుతున్న లలితసహస్ర పారాయణం ఆదివారం భక్తిశ్రద్ధలతో ముగిసింది. ఈ సందర్భంగా వేదపండితులు మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు లలితసహస్ర పారాయణం చేసిన మహిళా భక్తులకు అమ్మవారి పాదాల వద్ద పూజకు ఉంచిన చీరలు, తాంబూలం, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మల్లికార్జున, కుమారస్వామి, లక్ష్మీనరసింహులు, నారాయణస్వామి, ఈశ్వరయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన గాయత్రీ మహాయజ్ఞం..

ధర్మవరం: పట్టణంలోని శివానగర్ శివాలయం ఆవరణలో ఆదివారం ధర్మవరం గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో 108 కుండముల జ్ఞాన గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. ధర్మవరం గాయత్రీ పరివార్ ప్రతినిధి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన యజ్ఞంలో వేయి మంది భక్తులు పాల్గొన్నారు. అఖిల విశ్వగాయత్రీ పరివార్ హరిద్వార్ గాయత్రీ ఉపన్యాసకుడు విక్రమ్ శివాజీ యజ్ఞోపదేశం చేశారు. యజ్ఞంలో కూర్చున్న వారితో పూజలు చేయించారు. దివ్యజ్యోతి కలశం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ, అన్నదానం చేశారు. గాయత్రీ పరివార్ ప్రసాద్, శివాలయ అభివృద్ధి కమిటీ సుధాకర్, శివశంకర్, రంగయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

గంగమ్మకు బోనాలు

ఎలుగుట్టివారిపల్లిలో బోనాలు సమర్పిస్తున్న గ్రామస్థులు

గాండ్లపెంట, న్యూస్‌టుడే: మండలంలోని ఎలుగుట్టివారిపల్లి, సోమయాజులపల్లి, కటకంవారిపల్లి, జురుకువారిపల్లి గ్రామాల్లో ఆదివారం గంగమ్మకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో గ్రామ పొలిమేర వరకు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి ప్రదక్షిణలు చేశారు. వర్షాలు బాగా కురవాలని వేడుకున్నారు.

చౌడేశ్వరీదేవీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అలంకరణలో అమ్మవారు

ధర్మవరం, న్యూస్‌టుడే: శ్రీచౌడేశ్వరీదేవి జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని నేసేపేటలో వెలిసిన శాంతకళా చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పట్టణంలోని వివిధ కాలనీల్లోని దేవీ ఆలయాల్లో పూజలు జరిగాయి.

(c) eenadu

న్యూస్‌టుడే, లావేరు

జిల్లాలో పౌర సరఫరాల సంస్థ గోదాంల నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా అవుతున్న బియ్యం బస్తాల్లో తరుగు వస్తోందని ప్రతి నెలా డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి బస్తా బరువులో వ్యత్యాసం ఉండటంతో నష్టపోతున్నామని వాపోతున్నారు. ఈ విషయమై జిల్లా అధికారులు, పలువురు ప్రజాప్రతినిధుల వద్ద మొర పెట్టుకున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు.

తూకమేసి.. మోసం చేసి..!

రేషన్ బియ్యంలో పెద్దఎత్తున తరుగు

నష్టపోతున్నామని డీలర్ల ఆందోళన

లావేరు గోదాంలో ఓ బస్తా తూకం వేయగా 44.140 కిలోల బరువు ఉంది.

★ లావేరు, రణస్థలం మండలాల్లో రేషన్ డిపోలు : 131
★ రేషన్ కార్డులు : 49,354
★ బియ్యం సరఫరా : 810 టన్నులు

ఇదీ పరిస్థితి

★ ప్రభుత్వం సరఫరా చేస్తున్న 50 కిలోల బస్తా సంచితో కలుపుకొని 50.560 కిలోల బరువు ఉండాలి. కొన్ని 44.140, 47.660 కిలోలు ఉంటున్నాయి. ఒక్కో బస్తా నుంచి సుమారు 6.420, 4, 3, 2 కిలోల చొప్పున తరుగు వస్తోందని డీలర్లు చెబుతున్నారు.

★ లావేరు, రణస్థలం మండలాలకు సంబంధించి లావేరులోని పౌర సరఫరాల సంస్థ గోదాం నుంచి ప్రతి నెలా 810 టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. ఆగస్టుకు సంబంధించి గత 3 రోజులుగా ఈ ప్రక్రియ మొదలైంది.

★ లావేరులోని 6002, 6029 డిపోలకు సంబంధించి 9,760 కిలోల బియ్యం, 4,290 కిలోల ట్రాక్టర్ బరువు కలుపుకొని 13,740 కిలోలకు సంబంధించి బిల్లు (ఆర్వో) ఇచ్చారు. తూనికలో తేడా కనిపించడంతో కొందరు డీలర్లు లావేరులోని ఓ ప్రైవేటు వేబ్రిడ్జి వద్దకు వెళ్లి తనిఖీ చేయించారు. బియ్యం 9,200 కిలోలు, ట్రాక్టర్ 4,260 కిలోలు కలుపుకొని 13,460 కిలోలు ఉన్నట్లు తేలింది. ఒక్క లోడ్‌కే 280 కిలోల వ్యత్యాసం కనిపించడంతో డీలర్లు అవాక్కయ్యారు.

★ గోదాం సిబ్బంది తూనికలో మాయాజాలం చేస్తున్నారని డీలర్లు చెబుతున్నారు. ప్రతి బస్తాలో వస్తున్న తరుగుకు సంబంధించి అదనంగా బియ్యం ఇస్తున్నామని అధికారులు బుకాయిస్తున్నారే తప్ప సరఫరా చేయడం లేదని వాపోతున్నారు. రెండు డిపోలకు సంబంధించి ఇంత తరుగు వస్తే మిగిలిన డిపోలకు సరఫరా చేస్తున్న బియ్యంలో ఎంత స్థాయిలో ఉంటుందో గ్రహించాలని అంటున్నారు. ప్రతి నెలా గోదాం నుంచి 120 నుంచి 180 క్వింటాళ్ల వరకు బియ్యం బయటకు తరలిపోతున్నాయని ఆరోపిస్తున్నారు.

కాగితాలపై రాసిస్తున్నారు..

గోదాంలో పని చేస్తున్న కొందరు కుమ్మక్కై మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కంప్యూటర్ బిల్లు ఇవ్వాలని డీలర్లు అడిగితే ప్రింటర్ పని చేయడం లేదని కాగితాలపై రాసి ఇస్తున్నారు. గత రెండేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. తూకంలో తరుగు వస్తోందని ఇటీవల తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధికారులను డీలర్లు నిలదీశారు. ఇదే విషయమై ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు ఫిర్యాదు చేశారు.

చర్యలు తీసుకుంటాం..

పౌరసరఫరాల సంస్థ ద్వారా కార్డుదారులకు సరఫరా చేస్తున్న బియ్యం బస్తాల్లో తరుగు, తూనికల్లో తేడాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ప్రతి నెలా బియ్యం పక్కాగా సరఫరా చేస్తున్నాం. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నాం. తరుగు విషయంలో తప్పులు జరిగినా ఉపేక్షించం.

– టి.వేణుగోపాల్, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ, శ్రీకాకుళం

దంచి కొట్టిన వర్షం

రణస్థలం, లావేరు, మందస మండలాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. బీరుపాలెం, తెప్పలవలస పంచాయతీ పరిధి పాపారావుపేటలో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. స్థానికులు బకెట్లతో బయటకు తోడారు. లావేరులో పొలాలు నీటితో నిండి పోయాయి. పలుచోట్ల రహదారులు జలమయమయ్యాయి. చెరువుల్లో నీరు చేరడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. లావేరు వద్ద పొలాల్లో వర్షం కురుస్తున్న దృశ్యాన్ని చిత్రంలో చూడొచ్చు. – న్యూస్‌టుడే, రణస్థలం, లావేరు

న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

శివారు భూముల రైతులకు ఏటా వర్షాభావంతో వ్యవసాయానికి అవస్థలు పడుతున్నారు. సకాలంలో వర్షాలు పడితే తప్ప సాగుకు ఉపక్రమించడం లేదు. గతేడాది ఖరీఫ్ తొలి దశలోనే వంశధార కాలువలకు సాగునీరు చేరింది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఈసారి ముందుగానే రూ.3 కోట్ల మేర వెచ్చించి కాలువలు, గెడ్డలు, మదుములు, వరదులు, కల్వర్టుల అభివృద్ధి చేసినా ప్రయోజనం లేకపోయింది. ఇప్పటికీ వంశధార కాలువల నుంచి నీరు రాకపోవడంతో చెరువులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మరోవైపు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇప్పటికే వేసిన వెదలు, నారు మడుల తడులకు అన్నదాతలు దిక్కులు చూస్తున్నారు.

కానరాని వంశధార..!

కరుణించని వరుణుడు

● శివారు రైతులకు తప్పని ఎదురుచూపులు

పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని సుమారు 36 వేల ఎకరాల్లో ఏటా వరి సాగు చేస్తారు. ఇవన్నీ వర్షాధార పంట భూములు. 80 శాతం మేర వెద పద్ధతి అనుసరిస్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలో వంశధార కుడి, ఎడమ కాలువల పరిధిలో చినవంక, చినడోకులపాడు, నగరంపల్లి, గుల్లలపాడు, శారదాపురం, తాడివాడ, కిడిసింగి, వజ్రపుకొత్తూరు, కాశీనగర్, పాతటెక్కలి, కొండపూరు, పోద్దబొడ్డపాడు, సీతాపురం, కూర్మనాథపురం, కొల్లిపాడు, పొల్లాడ తదితర శివారు పంట గ్రామాలకు సంబంధించి సుమారు 4 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభమైనా కనీస వర్షపాతం నమోదు కాలేదు.

శారదాపురం ప్రాంతంలో నీటి చుక్క లేని కాలువ

సాగునీరందేలా చర్యలు తీసుకోవాలి

మావి పూర్తిగా వర్షాధారిత పంట భూములు. ఈసారి అధికంగా వెద సాగుపై ఆశలు పెట్టుకున్నాం. అప్పుడప్పుడు వర్షం పడినా తరువాత వంశధార నీరొస్తుందని ఆశించి ముందుకు సాగాం. ఇప్పటికే సగం పెట్టుబడి పెట్టాం. కొన్ని రోజులుగా మేఘాలు వచ్చి వెళ్లిపోవడమే తప్ప వాన కురవడం లేదు. వంశధార నీరు రాకపోవడంతో నష్టపోయే అవకాశం ఉంది. అధికారులు వేగంగా స్పందించి సాగునీరందేలా చర్యలు తీసుకోవాలి.

– సాన కృష్ణ, రైతు, చినవంక

తడులకు తంటా

పలాస మండలం జగన్నాథ సాగర్ నుంచి అంతరకుడ్డ, పెదబడాం మీదుగా గుల్లలపాడు లహరిబంద చెరువు నుంచి శారదాపురం, తాడివాడ, కిడిసింగి చెరువులను కలుపుకొని వజ్రపుకొత్తూరు వరకు దేశబట్టి ద్వారా సాగునీరు చేరాల్సి ఉంది. ఇప్పటికీ పలాస ప్రాంతానికి చేరకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వెద పొలాల తడులకు తంటాలు పడుతున్నారు. నారు మడులకు సిద్ధంగా ఉంచిన పొలాలు బీడు భూములుగా మారిపోతున్నాయి. సాగుకు పెట్టుబడి పెట్టడానికి అన్నదాతలు ముందుకు రావడం లేదు.

అన్నదాతలకు ఇబ్బంది లేకుండా చూస్తాం..

పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో శివారు ప్రాంతాలకు వంశధార నీరు అందేలా చర్యలు చేపట్టాం. సాగునీరు వృథాగా పోకుండా పలు అభివృద్ధి పనులు చేపట్టాం. కాలువలు, గెడ్డల్లో పూడిక తీయించి ఇతర సిమెంటు పనులు పూర్తి చేశాం.

– రాజశేఖర్, వంశధార జేఈ, పలాస

వైకాపా పాలనలో ప్రగతి శూన్యం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా ఐదేళ్ల పాలనలో పల్లెలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి అంజనాపురంలో ఆదివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రహదారి, తాగునీరు, విద్యుత్తు ఇబ్బందులను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తొలుత జాతీయ రహదారి నుంచి రూ.1.98 కోట్ల అంచనాతో టెక్కలి- అంజనాపురం- సవరగోపాలపురం రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అంజనాపురం, టెక్కలి చేరి వీధి వద్ద పట్టణ పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి అవసరమైన లేఅవుట్లు సిద్ధం చేయాలన్నారు. టెక్కలి మండల పరిషత్తు కార్యాలయం వద్ద దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలు, వినికిడి యంత్రాలు, చేతికర్రలు అందజేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు చొరవతో రూ.73 లక్షల విలువైన 352 ఉపకరణాలను దివ్యాంగులకు అందజేస్తున్నట్లు తెలిపారు. జడ్పీ సీఈవో ఎల్‌వీఎన్ శ్రీధర్‌రాజా, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అంజనాపురం రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి అచ్చెన్నాయుడు, నాయకులు

శాకంబరిగా నీలమణిదుర్గమ్మ

ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణిదుర్గ అమ్మవారు ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పండ్లు, కాయగూరలు, పూలతో అలంకరించారు. పాతపట్నం సమీప గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలిరావడంతో రద్దీ నెలకొంది. కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

– న్యూస్‌టుడే, పాతపట్నం



నేతన్నకు ఊతం..!

ఉచిత విద్యుత్తుతో 1,250 కుటుంబాలకు లబ్ధి

న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

చేనేత కార్మికులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆర్థికంగా వృద్ధి చెందడానికి వీలుగా ఉచిత విద్యుత్తు అందించడానికి రంగం సిద్ధం చేసింది. జిల్లాలోనూ అర్హులైన కార్మికులు ఈ ప్రయోజనం పొందనున్నారు. ఆగస్టు 7 నుంచి సుమారు 1,250 కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. పొందూరు, అంపోలు, సింగుపురం, కొరసవాడ, జింకిభద్ర, తోలాపి తదితర గ్రామాల్లో చేనేత కార్మికులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఇప్పటికే సర్వే చేపట్టి అర్హుల జాబితాలను ప్రభుత్వానికి నివేదించారు.

త్రిఫ్ట్ నిధుల విడుదలకు సన్నాహాలు

చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించడానికి త్రిఫ్ట్ (చేనేత పొదుపు నిధి) నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. వైకాపా పాలనలో ఈ రంగాన్ని నిర్లక్ష్యం చేసింది. నిధులివ్వకపోవడంతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గాడిలో పెట్టడానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతూ చర్యలు తీసుకుంది. జిల్లావ్యాప్తంగా 7 చేనేత సహకార సంఘాల నుంచి 240 మంది నేత కార్మికులు త్రిఫ్ట్‌లో నమోదై ఉన్నారు. వారికి 2019లో తెదేపా ప్రభుత్వం రూ.26.16 లక్షలు మంజూరు చేసింది. అప్పట్నుంచి సొసైటీలకు నిధులు విడుదల కాలేదు. కొత్త సభ్యుల చేరిక లేదు. తాజాగా నిధుల విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు

కార్మికులకు తప్పని అవస్థలు

చేనేత సంఘాల్లో సభ్యులుగా నమోదై దినసరి కూలీలుగా పని చేసే వారు వేతనం నుంచి రోజుకు రూ.8 చెల్లిస్తే ప్రభుత్వం రూ.16 చేర్చి త్రిఫ్ట్ నిధి ఖాతాకు జమ చేస్తారు. గత ఆరేళ్లుగా ఆయా నిధులు ప్రభుత్వం నుంచి జమ కాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుటుంబ అవసరాలకు రుణం పొందాలన్నా అందులో నిధులు లేక లబ్ధి పొందలేక పోతున్నారు.

1,948 మందికి రుణ సౌకర్యం

జిల్లాలోని చేనేత సహకార సంఘాల్లో సభ్యులుగా నమోదైన వారికి బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నారు. 1,948 మంది సభ్యులకు మంజూరు చేయడానికి అవకాశం ఉంది. చేనేత సామగ్రి, నూలు, ఇతర పరికరాలు, ముడి సరకు కొనుగోలుకు వీలు కలుగుతుంది.

సర్వే పూర్తి చేశాం..

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే పూర్తి చేసి నివేదిక పంపాం. నేత కార్మికులకు ఉచిత విద్యుత్తు సౌకర్యం అందుబాటులోకి రానుంది. మరోవైపు త్రిఫ్ట్ నిధుల మంజూరుకు చర్యలు తీసుకున్నాం. ఖజానాకు బిల్లులు పంపాం. త్వరలో నిధులు విడుదల కానున్నాయి.

టి.జనార్దనరావు, ఏడీ, చేనేత జౌళి శాఖ, శ్రీకాకుళం

జిల్లాలో చేనేత సహకార సంఘాలు: 36 | చురుగ్గా ఉన్నవి: 20 | సహకార రంగంలో ఉన్న సభ్యులు: 1,948 | సహకారేతర రంగంలో ఉన్న వారు: 430

నిధులు రావు.. పనులు కావు!

కొలిక్కి రాని వనితమండలం - గార వంతెన పనులు

న్యూస్‌టుడే, పోలాకి

తీర ప్రాంతాల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడం.. అరసవల్లి, శాలిహుండం, కోటబొమ్మాళి, నరసన్నపేట ప్రాంతాలు పర్యాటకంగా అభివృద్ధి చెందుతాయనే ఉద్దేశంతో వనితమండలం-గార గ్రామాల మధ్య వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించారు. ఆయా పనులకు 2018లో భూమిపూజ చేశారు. గతేడాది మార్చి నాటికి 59 శాతం పూర్తయ్యాయి. ఆ తరువాత ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

దూరం తగ్గుతుంది..

ఈ వంతెన అందుబాటులోకి వస్తే పోలాకి, నరసన్నపేట జలుమూరు మండలాల ప్రజలు గార, శ్రీకూర్మం, శ్రీకాకుళం వెళ్లాలంటే ప్రస్తుతం ఉన్న మార్గానికి 20 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది. నాయకులు వచ్చి చూసి వెళ్లడం తప్ప నిధులు మంజూరు కాక పనులు పూర్తి చేయించడంపై దృష్టి సారించడం లేదని విమర్శలు వస్తున్నాయి.

అసంపూర్తిగా వారధి నిర్మాణం

బిల్లుల చెల్లింపుల్లో జాప్యం

ఇప్పటివరకు వంశధార నదిలో 18 పిల్లర్ల నిర్మాణం పూర్తి చేశారు. వనితమండలం వైపు నుంచి స్తంభాలపై కొంత మేర పని జరిగింది. తాత్కాలిక ప్రాతిపదికన సీసీ రోడ్డు వేసి రెండు పక్కలా గజాలు అమర్చారు. 2023 మార్చి నాటికి రూ.33.94 కోట్ల విలువైన పనులు జరిగాయి. వాటికి సంబంధించి బిల్లు మంజూరు చేయాలని గుత్తేదారు దరఖాస్తు చేశారు. రూ.4.30 కోట్ల మేర చెల్లింపులు జరగలేదు. ఈ నేపథ్యంలో పనులు నిలిపేశారు. గార గ్రామం వైపు అనుసంధాన రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

కనిపించని పురోగతి

వైకాపా పాలనలో వంతెన పనులను పట్టించుకోలేదు. అప్పటి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించి గడువు లోగా పూర్తి చేస్తామని ప్రకటించారు. అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయన మాటలకు రెండు మండలాల ప్రజలు ఎంతో సంబర పడ్డారు. ఆ నేత మాటలు హామీలకే పరిమితమయ్యాయి. ఏళ్లు గడిచినా పనుల్లో పురోగతి లేదు.

గుత్తేదారుకు లేఖ రాశాం..

వనితమండలం వద్ద చేపట్టిన హైలెవల్ వంతెన పనులు నిలిచిపోవడం వాస్తవమే. బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. వివిధ సమావేశాల్లో ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పనులు చేపట్టాలని గుత్తేదారుకు లేఖ రాశాం.

– తిరుపతిరావు, ఈఈ, ఆర్‌అండ్‌బీ శాఖ

అందక నీరు.. ఎండుతోంది నారు..!

కర్తలి వద్ద ఇంజిన్ సాయంతో నారుమడులకు నీరు పెడుతున్న రైతులు

బావిలో అడుగంటిన నీరు

అడపా దడపా చినుకులు పడుతుండటం, అనంతరం వేడి వాతావరణంతో నారు మడులు ఎండిపోతున్నాయి. పంటను కాపాడుకోవడానికి రైతులు అద్దెకు ఇంజిన్లు తీసుకొచ్చి నీరు పెడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో చెరువులు, నేల బావులు అడుగంటుతున్నాయి. దూర ప్రాంతంలోని పొలాలకు నీరు పెట్టడానికి అవస్థలు తప్పడం లేదు. కంచిలి మండలం కొల్లూరు పంచాయతీ పరిధి కర్తలి శివారులో ఆదివారం అన్నదాతల ఇబ్బందులను 'న్యూస్‌టుడే' కెమెరాలో బంధించింది. బావి నుంచి 150 మీటర్ల దూరంలోని పొలానికి గంట సేపు నీరు పెట్టడానికి ఇంజిన్‌కు రూ.400 అద్దె చెల్లిస్తున్నానని రైతు పైల రుక్మిణి తెలిపారు. బావిలో నీరు లేకపోవడంతో రోజుకొకరే వినియోగించుకోవాల్సి వస్తోందని తెలిపారు. మరో వారం రోజుల్లో వర్షాలు పడకపోతే వరి సాగుపై ఆశలు వదులుకోవాల్సిందేనని.. అప్పటివరకు వ్యయప్రయాసలు తప్పవని ఇక్కడి కర్షకులు ఆవేదన చెందుతున్నారు. – న్యూస్‌టుడే, కంచిలి

హక్కుల సాధనకు సమరశీల పోరాటాలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: కార్మికుల హక్కుల సాధనకు సమరశీల పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు బీవీ కొండలరావు, పి.రమణ కోరారు. శ్రీకాకుళం నగరంలోని క్రాంతి భవన్‌లో ఆదివారం ఏఐటీయూసీ జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. కార్మిక శాఖ అధికారులకు ఎలాంటి అధికారం లేకుండా చేస్తున్నారని ఆక్షేపించారు. కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని.. పుర కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హమాలీలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ కౌన్సిల్ సభ్యులు టి.తిరుపతిరావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు చిక్కాల గోవిందరావు, కె.అప్పలరాజు, లబ్బ రాజు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కొండలరావు, చిత్రంలో ఇతర నాయకులు

ప్రసాద్ ప్రతిపాదనలకే పరిమితం..!

అభివృద్ధికి నోచుకోని శ్రీముఖలింగేశ్వరస్వామి క్షేత్రం

న్యూస్‌టుడే, జలుమూరు

తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర స్వామి క్షేత్రం అభివృద్ధికి దూరంగా ఉంది. వైకాపా పాలకులు ఐదేళ్లు పట్టించుకోకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రసాద్ పథకం కింద రూ.55 కోట్లు మంజూరు చేయాలని దేవాదాయ శాఖాధికారులు ప్రతిపాదనలు పంపినా కదలిక లేదు. తాగునీరు, కల్యాణ కట్ట, పార్కింగ్, భోజనశాల, వసతి ఏర్పాట్లు కలగానే మిగిలాయి. కూటమి ప్రభుత్వం ఆలయ ప్రగతిపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

శ్రీముఖలింగేశ్వరస్వామి క్షేత్రం

తెదేపా పాలనలో వైభవం

మాడ వీధుల నిర్మాణానికి 2018లో రూ.20 కోట్లు మంజూరు చేసి శరవేగంగా పనులు చేపట్టారు. ఆలయం చుట్టూ ఉన్న ఇళ్లు తొలగించి వారికి మరోచోట పట్టాలిచ్చారు. 2017 జులై 31 నుంచి ఆగస్టు 8 వరకు జరిగిన అష్టతీర్థ రాజ మహాయోగం కార్యక్రమంలో భాగంగా రూ.35 లక్షలతో అష్టతీర్థ ఘట్టాలను అభివృద్ధి చేశారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రత్యేక నిధులు రూ.5 లక్షలతో పర్యాటకుల విశ్రాంతి భవనం నిర్మించారు. జర్జంగి- పిండ్రువాడ రహదారిని రూ.28 కోట్లతో విస్తరించారు.

మాడ వీధుల్లో రహదారుల నిర్మాణం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉపాధి హామీ పథకం నిధులు రూ.20 లక్షలతో ఆలయం చుట్టూ మాడ వీధుల్లో రహదారులు నిర్మించారు. పంచాయతీ నిధులతో గ్రామంలో రోడ్లు వేశారు. ఎన్టీఆర్ ఘాట్ నుంచి కరకట్టపై 800 మీటర్ల పొడవునా రూ.80 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు.

కనీస వసతులు కరవు

శ్రీముఖలింగేశ్వరస్వామి క్షేత్రానికి తెలుగు రాష్ట్రాలు సహా దూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. ఇక్కడ సేద తీరడానికి వసతులు, మరుగుదొడ్లు లేవు. రాత్రి వేళ బస చేయడం కష్టమే. పాలకులు దృష్టి సారిస్తేనే ఇవన్నీ అందుబాటులోకి వస్తాయని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రసాద్ పథకం కింద రూ.55 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపాం. పర్యాటక భవనం వినియోగంలోకి తీసుకొచ్చేలా కృషి చేస్తాం. ఇతర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– టి.వాసుదేవరావు, ఇన్‌ఛార్జి ఈవో, శ్రీముఖలింగేశ్వరస్వామి క్షేత్రం

భక్తుల రాక ఇలా..	కార్తిక సోమవారాల్లో:	మహాశివరాత్రి ఉత్సవాల్లో:	చక్రతీర్థస్నాన ఘట్టం నాడు	సాధారణ రోజుల్లో:
	15 వేల వరకు	రోజుకు 10 వేల నుంచి 15 వేల మంది	: 1.50 లక్షల మంది	సుమారు 250 మంది

బదిలీ ఉపాధ్యాయులకు జీతాలిచ్చేదెప్పుడో?

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఇటీవల బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు జీతాలు అందలేదని, ఎప్పుడిస్తారో అర్థం కావడం లేదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా అధ్యక్షుడు దుప్పల శివరాంప్రసాద్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొజిషన్ ఐడీలు జారీ చేసి త్వరితగతిన జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొందరు విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ఉపాధ్యాయులకు హ్యాండ్‌బుక్‌లు అందలేదన్నారు. అనంతరం పోలాకి మండల అధ్యక్షుడిగా ఎస్.రాజు, ప్రధాన కార్యదర్శిగా యు.వేణుగోపాలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పి.కాశీవిశ్వనాథ్, నాయకులు రాజు, వేణుగోపాలరావు, జి.చిన్నకృష్ణం నాయుడు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న ఆపస్ జిల్లా అధ్యక్షుడు శివరాంప్రసాద్

ఎంబీఏలో ప్రవేశానికి వెబ్ ఆప్షన్ల నమోదు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ కోర్సులో 55 సీట్లకు ఐసెట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు రిజిస్ట్రార్ పీలా సుజాత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 44 (రెగ్యులర్), 11 (సెల్ఫ్ ఫైనాన్స్) సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కోర్సులో చేరడానికి సోమవారం సాయంత్రం లోగా ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

(c) eenadu

కుర్రాళ్లు..అదరగొట్టారు..!

ఏపీఎల్‌కు 9 మంది క్రీడాకారుల ఎంపిక

న్యూస్‌టుడే, పాతపట్నం

క్రికెట్‌లో రాణిస్తే సిక్సర్ల మోత మోగిస్తారు. అంతుచిక్కని బంతులతో వికెట్లు పడగొడతారు. ఆ ప్రతిభే వారిని లక్ష్యం దిశగా తీసుకెళ్లింది. క్రికెట్‌లో మరింత రాణించేలా చేస్తోంది. ఇప్పటికే జిల్లా క్రీడాకారులు అన్ని ఫార్మాట్లలో మెరుస్తున్నారు. తాజాగా ఆంధ్ర ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) సీజన్‌-4 వేలంలోనూ అదే ఒరవడి కొనసాగించారు. ఆగస్టు 8 నుంచి ప్రారంభం కానున్న మ్యాచ్‌ల్లో వివిధ ఫ్రాంఛైజీల తరఫున ఆడేందుకు సిక్కోలు నుంచి 9 మంది ఎంపికయ్యారు. గత మూడు సీజన్ల కంటే అత్యధిక ధరలు అందుకున్నారు.

అవకాశమే వరమై..

బ్యాట్స్‌మెన్, వికెట్ కీపర్‌గా సత్తా చాటుతున్న జలుమూరుకు చెందిన సింగుపురం దుర్గా నాగ వరప్రసాద్ అత్యధికంగా రూ.9.5 లక్షలకు పలికాడు. అమరావతి రాయల్స్ ఫ్రాంఛైజీ తరఫున సీజన్‌-4లో ఆడనున్నాడు. తండ్రి లేకపోయినా మేనమామ అండతో నరసన్నపేటలో క్రికెట్ ప్రస్థానాన్ని ప్రారంభించాడు. అండర్‌-12, జిల్లా, రాష్ట్ర స్థాయి మ్యాచ్‌లు, ఏపీఎల్ వంటి అనేక టోర్నీల్లో ఆడుతున్నాడు. ప్రస్తుతం విశాఖపట్నం, విజయనగరంలో శిక్షణ పొందుతున్నాడు. ఎప్పటికైనా ఐపీఎల్‌లో ఆడటమే తన లక్ష్యమని వరప్రసాద్ చెబుతున్నాడు.

విజయ పరంపర..

త్రిపురాన విజయ్.. జిల్లా క్రికెట్‌లో పెద్దగా పరిచయం లేని పేరు. ఇప్పటికే ఎన్నో మ్యాచ్‌లు సాధించాడు. ఇటీవల ఐపీఎల్‌లోనూ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో ఆడాడు. అదే హవా కొనసాగిస్తున్న ఈ ఆల్‌రౌండర్ ఏపీఎల్ సీజన్‌-4 వేలంలో రూ.7.55 లక్షలకు పలికాడు. టెక్కలి అయ్యప్పనగర్ కాలనీకి చెందిన ఈయన తండ్రి వెంకట కృష్ణంరాజు ప్రభుత్వ ఉద్యోగి. తల్లి లావణ్య గృహిణి. అండర్‌-19, అండర్‌-23, రాష్ట్ర మ్యాచ్‌లు, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీల్లో ఉత్తమ ప్రతిభ చూపాడు. సింహాద్రి వైజాగ్ లయన్స్ జట్టు తరఫున ఈసారి అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు.

శ్రీనివాస్ మరోసారి..

శ్రీకాకుళం నగరం సానా వీధికి చెందిన సిర్ల హిమ శ్రీనివాస్ ఏడేళ్ల వయసు నుంచి క్రికెట్ ఆడుతున్నాడు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోనే క్రికెట్ అకాడమీ నిర్వహిస్తున్నాడు. తండ్రి సిర్ల రామారావు మాజీ క్రికెటర్ కావడం... తల్లి రమాదేవి గృహిణి. ఇప్పటి వరకు కెరీర్ మొత్తంలో రంజీలతో కలిపి 70పైగా మ్యాచ్‌లు ఆడాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, ఏపీఎల్ మూడు సీజన్లలోనూ మంచి ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. గతేడాది దుబాయ్, ఆస్ట్రేలియా, కెన్యాలలోనూ జరిగిన టోర్నీల్లో పాల్గొన్నాడు. ఏపీఎల్ సీజన్‌-4 వేలంలో కాకినాడ కింగ్స్ జట్టు రూ.2 లక్షలకు శ్రీనివాస్‌ను దక్కించుకుంది.

వీరితో పాటు మరో ఆరుగురు.. డీవీఎస్ సాయి శ్రీరామ్(రూ.80 వేలు), బెండాళం సాత్విక్(రూ.60 వేలు), నిమ్మల హిమకర్(రూ.60 వేలు), రూ.30 వేల చొప్పున ప్రద్నీష్ సాయి, థామస్ రామ్ కుమార్, కె.కశ్యప్ ప్రకాశ్ వివిధ జట్లకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా క్రికెట్ సంఘ ప్రతినిధులు పీవైఎన్ శాస్త్రి, హసన్‌రాజా షేక్, ఇలియాస్ మహ్మద్, మదీనా శైలానీ తదితరులు అభినందనలు తెలిపారు.

భాజపా జిల్లా నూతన కార్యవర్గం ఖరారు

పాతపట్నం, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఖరారు చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కమిటీ ప్రతిపాదించిన సభ్యుల్లో ఎంపిక చేసిన వారిని నూతన కార్యవర్గంగా అమలు చేస్తూ రాష్ట్ర కమిటీ నుంచి ఆదేశాలొచ్చాయన్నారు. నూతన నిర్వాహక సభ్యులుగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా సిరిపురం తేజేశ్వరరావు(పాతపట్నం), ఉపాధ్యక్షులుగా పాలవలస వైకుంఠరావు(పలాస), వెల్లంపల్లి గోవిందరావు(ఆమదాలవలస), మంగి లక్ష్మీరెడ్డి(ఇచ్ఛాపురం), బెంక అప్పలనాయుడు(ఎచ్చెర్ల), తాడేల భూపతి(పాతపట్నం), నరుపాక లక్ష్మీనారాయణ(టెక్కలి), బైరి అప్పారావు(శ్రీకాకుళం), నారాయణశెట్టి కల్పన(ఎచ్చెర్ల) ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రధాన కార్యదర్శులుగా చింతు పాపారావు(నరసన్నపేట), పేడాడ సూరపునాయుడు(ఆమదాలవలస) నియమితులయ్యారు. వీరితో పాటు జిల్లా కార్యదర్శులుగా 8 మందిని, కోశాధికారిగా ఒకరిని, రెండు విభాగాలకు కన్వీనర్లుగా ఇద్దరిని నియమించినట్లు ఆయన తెలిపారు.

ఆదిత్యుని ఆదాయం రూ.5.06 లక్షలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారంతా స్వామిని దర్శించుకున్నారు. కేశఖండనశాలలో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచి ఉచిత, రూ.100, రూ.300 దర్శనం, కేశఖండనశాల క్యూలైన్లు కిటకిటలాడాయి. ఆర్జిత సేవలు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.5.06 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో కె.ఎన్.వి.డి.ప్రసాద్ తెలిపారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగంలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ వినతులు నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీ స్థితిని తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయొచ్చని చెప్పారు.

సందడిగా 125 వసంతాల వేడుక

మందస, న్యూస్‌టుడే: మందస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 125 వసంతాల వేడుకలు ఆదివారం సందడిగా జరిగాయి. శనివారం ప్రారంభమైన ఉత్సవాల్లో రెండో రోజు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. దీనికి స్థానికులతో పాటు దేశ, విదేశాల్లో స్థిరపడిన వారు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పదో తరగతి చదివిన విద్యార్థులు బ్యాచ్‌ల వారీగా వేదికపైకి వచ్చి ఆనందం వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా పలువురు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

వేడుకలకు హాజరైన పూర్వ విద్యార్థులు

సంతృప్తినిచ్చింది.. మా తండ్రి పట్నాన నీలకంఠం ఆచారి ఇక్కడే ఉపాధ్యాయుడిగా పని చేశారు. నేను, మా అన్నయ్య ఇదే బడిలో చదువుకున్నాం. శిథిలావస్థకు చేరిన పాఠశాలను బాగు చేయాలని ఎంతో మంది పూర్వ విద్యార్థులను సంప్రదించాను. వారిలో 500 మందికిపైగా స్పందించారు. తోచిన సాయం చేశారు. మిత్రులు అందించిన రూ.30 లక్షలతో పూర్వ వైభవం తెచ్చాం. ఇది నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. – పి.మోహనరావు ఆచారి, క్లినికల్ విభాగ ఆచార్యులు, టెంపుల్ విశ్వవిద్యాలయం, అమెరికా

ఆనందంగా ఉంది. నేను, మా నాన్నగారు పీసీసీ మాజీ అధ్యక్షుడు మజ్జి తులసీదాసు, అక్క మాజీ ఎమ్మెల్సీ శారద, ముగ్గురు సోదరులు ఇక్కడే చదివాం. నాది పదో తరగతి 1977 బ్యాచ్. ఇక్కడ 125 వసంతాల వేడుకల్లో పాల్గొనడం జీవితంలో మరచిపోలేని అనుభూతి. చాలా ఏళ్ల తరువాత స్నేహితులను కలవడం ఆనందంగా ఉంది. – మజ్జి లక్ష్మీభవాని, యూనిసెఫ్ అధికారి, టాంజానియా, అమెరికా

అక్షరంతో ఆట.. పదాలతో పాట..!

● అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్న బోధనకు శ్రీకారం

న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన బోధన అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బాల్యం నుంచే అమ్మభాషలోని కమ్మదనాన్ని వారికి పరిచయం చేసేందుకు వినూత్న బోధనకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది నుంచి పిల్లలకు చక్కగా అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్పేందుకు 'నవ చేతన', 'ఆధార్ శిల' అనే రెండు కొత్త పుస్తకాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అందులో పిల్లలతో పాటు తల్లులకు ఉపయోగపడే అంశాలనూ పొందుపరిచింది. ఇప్పటికే వీటిని అన్ని కేంద్రాలకు సరఫరా చేశారు. కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

పలాస మండలం అల్లుకోల అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు బోధిస్తున్న కార్యకర్త

'ఆధార్ శిల'తో గుణాత్మక విద్య

కేంద్రాల్లోని 3 నుంచి 6 ఏళ్లలోపు వయసు వారందరికీ ఆట, పాటలతో వినోదాత్మకంగా గుణాత్మక విద్యనందించేందుకు వివిధ అంశాల గురించి 'ఆధార్ శిల' పుస్తకంలో వివరించారు. ఇందులో నీతి పద్యాలను పొందుపరిచారు. రుతువులు, పండగలు, పండ్లు, కూరగాయలు, మన ఊరు, కుటుంబం తదితర ఇతివృత్తాల ద్వారా పిల్లలు, పరిసరాలు, సంస్కృతిని అర్థం చేసుకోవడానికి దోహదపడేలా అనేక అంశాలకు చోటు కల్పించారు.

శైశవ దశలో 'నవ చేతన'

'నవ చేతన' పుస్తకంలో శిశువు గురించి వివరించారు. ఇది గర్భధారణ దశ నుంచి శిశువు శారీరక, మానసిక ప్రేరణ అవసరాన్ని తెలియజేస్తుంది. పిల్లల మెదడు, శరీర అభివృద్ధిని గుణాత్మకంగా పెంచేందుకు తల్లిదండ్రులు, సంరక్షకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఇందులో సూచించారు. నేను, నా కుటుంబం, శరీర భాగాలు, ఆహారం రుచులు తదితర అంశాలు పొందుపరిచారు. మూడేళ్లలోపు వారికి ఆయా అంశాలు ఎలా వివరించాలో విశదీకరించారు. చిన్నారుల్లో విషయ పరిజ్ఞానం పెంపొందించి కబుర్లు, కథలు ఎలా చెప్పాలనేది చిత్రాలతో సహా తెలియజేశారు.

కార్యకర్తల పాత్ర కీలకం...

చిన్నారుల సమగ్ర ఎదుగుదలలో అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర కీలకం. 85 శాతం మెదడు అభివృద్ధి ఆరేళ్లలోపే జరుగుతుంది. ఈ సమయంలోనే సరైన సంరక్షణ, ప్రేరణ అవసరం. వారిలో అనుభవాత్మక ఆలోచన, ఆసక్తి, శ్రద్ధ పెంపొందించాలి. అందుకు దోహదపడేలా రెండు పుస్తకాలను అన్ని కేంద్రాలకు సరఫరా చేశాం. వాటిల్లోని అంశాలపై కార్యకర్తలు, సహాయకులకు శిక్షణ ఇచ్చాం. ఇవి పిల్లల సమగ్రాభివృద్ధికి ఉపయోగపడతాయి. అమలు తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– బి.శాంతిశ్రీ, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, శ్రీకాకుళం

జిల్లాలో వివరాలిలా.. ● ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 16 ● అంగన్‌వాడీ కేంద్రాలు: 3,385 ● చిన్నారులు: 38,900 ● బాలింతలు: 8,292 ● గర్భిణులు: 10,168

పాత నిమ్మతొర్లాడ వద్ద ఉద్రిక్తత

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని నిమ్మతొర్లాడ పంచాయతీ పరిధి పాత నిమ్మతొర్లాడ వద్ద ఆదివారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. ప్రభుత్వ అనుమతులతో గుత్తేదారులు నాగావళి నది నుంచి ఇసుక తరలించేందుకు బాట వేసేందుకు ప్రయత్నించగా గ్రామస్థులు ఇటీవల అడ్డుకున్నారు. ఆదివారం రాత్రి నదిలో బాట వేసేందుకు గుత్తేదారుకు చెందిన సిబ్బంది మరోసారి ప్రయత్నించగా గ్రామస్థులు అక్కడికి చేరుకుని ఘర్షణ పడ్డారు. అది కొట్లాటకు దారితీసింది. ర్యాంపు సిబ్బంది, గ్రామస్థుల్లో కొందరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఆమదాలవలస ఎస్సై బాలరాజు, ఎస్సై-2 కాంతారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎటువంటి గొడవలు జరగకుండా గ్రామంలో పోలీస్ పహారా ఉంచారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస రైలు నిలయానికి వెళ్లే దారిలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆ వ్యక్తి రైలు నిలయానికి వెళ్లే దారిలో నడుచుకుంటూ వెళ్తూ ఒక్కసారిగా పడిపోయాడు. స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వయసు సం. 40లు ఉంటుంది. మూడు రోజులుగా రామాలయం ప్రాంతంలో తిరుగుతుండేవాడని స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసులు వివరాలు సేకరించారు.

గడ్డి మందు తాగి ఆత్మహత్య

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం హనుమంతునాయుడుపేట గ్రామానికి చెందిన సీరపు అప్పలస్వామి (40) గడ్డిమందు తాగి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పలస్వామి గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తుంటారు. కొద్దిరోజులుగా కుటుంబంలో చిన్న పాటి తగాదాలు జరుగుతున్నాయి. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందు తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను స్థానికులు గుర్తించి టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈయనకు భార్య పాపమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నౌపడ ఏఎస్సై రమేష్ దేవ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గ సమీప కోసంగిపురం జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో లారీ డ్రైవర్ సుశాంత్ నాయక్ (35) మృతి చెందగా మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలాస మండలం కేదారిపురానికి చెందిన లోక్షితాక్షుడు (డ్రైవర్), దయాకర్ (క్లీనర్) బ్రహ్మపుర నుంచి కోళ్లు తీసుకొస్తూ వ్యాన్‌ను కోసంగిపురం జాతీయ రహదారి పక్కన ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆపారు. తిరిగి వెళ్లేందుకు వ్యాను బయలుదేరుతుండగా వెనుక నుంచి ఇనుప రాళ్ల లోడ్‌తో వస్తున్న లారీ వ్యానును ఢీకొని ముందున్న గోతిలో పడిపోయింది. ప్రమాదంలో ఒడిశా రాష్ట్రం కటక్ ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ సుశాంత్‌నాయక్ అక్కడికక్కడే దుర్మరణం పాలవ్వగా.. లారీ క్లీనర్ దీపక్ నాయక్, వ్యాను డ్రైవర్, క్లీనర్ గాయాలపాలయ్యారు. వీరిలో లోహితాక్షుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో కోళ్ల వ్యాను సైతం రహదారి పక్కన బోల్తాపడటంతో అందులో ఉన్న కోళ్లు మృతి చెందాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సూర్యనారాయణ పేర్కొన్నారు.

ఏఎంసీ అధ్యక్షుడి నియామకంపై నిరసన

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న జనసేన కార్యకర్తలు

హిరమండలం, న్యూస్‌టుడే: హిరమండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) అధ్యక్షుడి నియామకాన్ని పునః పరిశీలించాలని జనసేన పార్టీ కార్యకర్తలు కోరారు. గొట్ట గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు వి.సింహాచలంతో పాటు పలువురు కార్యకర్తలు ప్లకార్డులు చేతపట్టుకుని ఏఎంసీ కార్యాలయం ఎదుట ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ తాను 2020లో చొర్లంగి ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేశానని, తనతో పాటు పలువురు యువకులు పార్టీ కోసం పని చేస్తున్నారని చెప్పారు. ఇతర పార్టీల నుంచి వలస వచ్చేవారికి పదవులు కట్టబెట్టడం మంచిది కాదన్నారు. ఏఎంసీ ఛైర్మన్ నియామకంలో అభిప్రాయ సేకరణ జరగలేదన్నారు. పోలీసులు శాంతి భద్రతలు పర్యవేక్షించారు.

షోకాజ్ నోటీసు జారీ.. నిరసన తెలిపిన వి.సింహాచలానికి జనసేన పార్టీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. పార్టీ నియమాలు, ఆదేశాలు ఉల్లంఘించినందుకు మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలియజేయాలని పేర్కొంటూ ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ నోటీసు అందజేశారు. సరైన సమాధానం తెలియజేయకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అందులో స్పష్టం చేశారు.

ఇదే బజారు.. చూస్తే బేజారు..!

ఈ చిత్రంలో కనిపిస్తుంది ఆమదాలవలస పట్టణంలో 2000లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు బజార్. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోనే దీన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభించిన కొంత కాలం బాగానే నిర్వహించారు. రైతులు, వ్యాపారులు పంటను తెచ్చి అమ్ముకునేవారు. కాలక్రమేణా రైల్వేస్టేషన్ ఎదురుగా ప్రధాన రహదారిపై కొందరు దుకాణాలు ఏర్పాటు చేయడంతో అక్కడ రద్దీ పెరిగి.. ఇక్కడికి వినియోగదారులు రావడం తగ్గిపోయింది. దీంతో రైతులు సైతం బజార్‌ను వీడటంతో నాటి నుంచి నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరి.. సర్పాలు, విషకీటకాలకు ఆవాసంగా తయారైంది. విలువైన సామగ్రి సైతం తుప్పు పట్టిపోతున్నాయి. ఈ విషయమై పుర కమిషనర్ టి.రవి మాట్లాడుతూ త్వరలోనే అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

స్వచ్ఛ సంకల్పం.. మాటలకే పరిమితం

సంతబొమ్మాళి మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛ సంకల్పంలో భాగంగా నిర్మించిన మరుగుదొడ్లు పలుచోట్ల నిరుపయోగంగా మారాయి. పనులు పూర్తయినా చోట కొంత మంది వ్యవసాయ పరికరాలు, ఇతర వస్తువులు నిల్వ చేస్తున్నారు. కొల్లిపాడు, మలాగం, సంతబొమ్మాళి, లక్కివలస, నౌపడ తదితర గ్రామాల్లో నిర్మాణాలను అసంపూర్తిగానే వదిలేశారు. శ్రీజగన్నాథపురంలో పరిస్థితిని చిత్రంలో చూడొచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ సిద్ధార్థను వివరణ కోరగా, ప్రజలకు అవగాహన కల్పించి వినియోగించేలా చూస్తామన్నారు. – న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

ఇసుక లారీలతో ఇక్కట్లు

బూర్జ మండలంలోని గుత్తావల్లి రహదారిలో నిత్యం రాకపోకలు చేస్తున్న ఇసుక లారీలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా రహదారి పొడవునా గుంతలు ఏర్పడ్డాయి. 30 వేల టన్నులకు పైగా వాహనాలతో ఇసుక తరలించడంతో కల్వర్టు, వంతెనలు దెబ్బతింటున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఎండగా ఉన్నప్పుడు దుమ్ముతో అవస్థలు పడుతున్నామని కొల్లివలసలో దుకాణదారులు, చీడివలస గ్రామస్థులు వాపోతున్నారు. ఇటీవల పలుమార్లు ఇసుక లారీల రాకపోకలు జరగకుండా రహదారికి అడ్డంగా గ్రామస్థులు నిరసన తెలిపినా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. – న్యూస్‌టుడే, బూర్జ

బాధిత కుటుంబానికి చేయూత

స్పందనకు వందనం

నరసన్నపేట మండలంలోని దేవాది గ్రామం వద్ద ఇటీవల జరిగిన రహదారి ప్రమాదంలో మృతి చెందిన బండి కృష్ణ కుటుంబ సభ్యులకు పలువురు దాతలు ఆపన్నహస్తం అందిస్తున్నారు. 'నాన్నే అమ్మయ్యాడు..ఆయనా దూరమయ్యాడు' శీర్షిక ఈ నెల 16న 'ఈనాడు'లో వచ్చిన వార్తకు పలువురు స్పందిస్తున్నారు. కంబకాయ, దేశవానిపేట, కన్నేవలస, తదితర గ్రామాలకు చెందిన పలువురు దాతలు ఆదివారం రూ.25 వేల నగదును చిన్నారులు మోహిని, యోగిత లకు అమ్మమ్మ, తాత నీలయ్య, సాయమ్మ సమక్షంలో అందజేశారు.

– న్యూస్‌టుడే, నరసన్నపేట

EENADU Classifieds

JOBS

ప్రముఖ కంపెనీ Ephraimలో పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. జీతం నెలకు 21,000/- నుండి 45,000/- వరకు. Cell : 9704107303, 8008574616.

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 9014651068, 7075633416.

FACULTY/ TEACHERS

6th to 10th (EM) వరకు బయాలజీ & ఇంగ్లీషు టీచర్స్ కావలెను. అనుభవంగల వారికి ఆకర్షణీయమైన జీతం. ✆ 8106362976, 7893805797.

SECURITY GUARDS

గరివిడిలో పనిచేయుటకు Security Guards కావలెను. 15,000/- Salary ఉచిత వసతి సదుపాయం కలదు. Contact No:9949826283, 8341732380.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

వీఆర్వోల సంఘ జిల్లా అధ్యక్షుడిగా వేణుగోపాలరావు

టెక్కలి పట్టణం, నరసన్నపేట, పాతపట్నం, న్యూస్‌టుడే: వీఆర్వోల సంఘం జిల్లా కార్యవర్గాన్ని టెక్కలిలో ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సంఘ సమావేశం జరిగింది. అధ్యక్షుడిగా ప్రగడ వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శిగా కొర్ల శ్రావణ్‌కుమార్, కోశాధికారిగా కేకే ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా వి.తిరుపతిరావుతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.అప్పలనాయుడు, పార్వతీపురం మన్యం జిల్లా సంఘ అధ్యక్షుడు వి.రమేష్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	110	175	195

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

పాఠశాల నిర్వహణకు నిధులొచ్చాయ్..!

జిల్లాకు రూ.3.08 కోట్లు విడుదల

న్యూస్‌టుడే, కలెక్టరేట్ (శ్రీకాకుళం), పొందూరు, జి.సిగడాం

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు నిధుల సమస్యల తీరింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం డబ్బులు విడుదల చేసింది. వైకాపా హయాంలో వీటి ఊసెత్తకపోవడంతో ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. బడుల్లో మరమ్మతులు, సుద్దముక్కలు, స్టేషనరీ సామగ్రి కొనుగోలు, ఇతర అవసరాలకు కొందరు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉండేది. కూటమి అధికారంలోకి వచ్చాక దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ఈ ఏడాది జిల్లాకు రూ.3.08 కోట్లు ఇచ్చింది.

ముందుగా సగం జమ..

జిల్లాలోని 2653 పాఠశాలలకు ఈ విద్యాసంవత్సరానికిగాను రూ.6.17 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. ఆ మొత్తంలో ప్రస్తుతానికి సగం మంజూరు చేశారు. ప్రాథమిక పాఠశాలలకు రూ.1.88 కోట్లు, ఉన్నత బడులకు రూ.1.20 కోట్లు కేటాయించారు. మిగిలిన మొత్తం విద్యాసంవత్సరం మధ్యలో ఇవ్వనున్నారు.

నిర్వహణ గ్రాంటు మంజూరు ఇలా..

విద్యార్థుల సంఖ్య	ఇవ్వాల్సింది (రూ.వేలల్లో..)
1-30	10
31-100	25
101-250	50
251-1000	75
1001పైన	100

ఎంఆర్‌సీలకు రూ.21 లక్షలు..

మండల విద్యావనరుల కేంద్రాలు(ఎంఆర్‌సీ), క్లస్టర్ విద్యావనరుల కేంద్రాల(సీఆర్‌సీ)కు కూడా నిధులు విడుదలయ్యాయి. జిల్లాలోని 30 ఎంఆర్‌సీలకు ఒక్కో కేంద్రానికి ప్రభుత్వం రూ.70,000 చొప్పున రూ.21 లక్షలు మంజూరు చేసింది. అందులో నిర్వహణ ఖర్చుల కింద రూ.20 వేలు, బోధనోపకరణాల(టీఎల్‌ఎం) గ్రాంట్‌గా రూ.15 వేలు, సమావేశాలు, రవాణా ఛార్జీలకు రూ.15 వేలు, కంటిన్‌జెన్సీ గ్రాంటు రూ.20 వేలు కేటాయించారు. 170 సీఆర్‌సీలకు ఒక్కోదానికి రూ.28,700 చొప్పున రూ.48.79 లక్షలు ఇచ్చారు.

సద్వినియోగం చేసుకోవాలి.. విద్యాశాఖ మంజూరు చేసిన పాఠశాల నిర్వహణ నిధులను ఆయా పాఠశాలల బ్యాంకు ఖాతాలో జమ చేశాం. వాటిని ప్రధానోపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలి. మరుగుదొడ్ల నిర్వహణతో పాటు మరమ్మతులు, ఇతర అవసరాలకు వీటిని వినియోగించుకోవచ్చు.

- ఎస్.శశిభూషణ్, ఏపీసీ, సమగ్రశిక్షా

జిల్లాలో వివరాలిలా.. ● ప్రాథమిక పాఠశాలలు: 2226 ● ఉన్నత: 427 ● విడుదల చేసిన నిధులు: రూ.3.08 కోట్లు

ప్రజల దృష్టి మళ్లించేందుకే అక్రమ అరెస్టులు

మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే అక్రమ అరెస్టులు చేస్తున్నారని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆరోపించారు. శ్రీకాకుళం నగరంలోని వైకాపా జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు అందులో భాగమేనన్నారు. వైకాపా హయాంలో మద్యం విధానంలో అవినీతికి తావు లేదని, దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించిందని చెప్పారు. ఆదాయం పెంచి వినియోగాన్ని తగ్గించాలన్నదే గత ప్రభుత్వ ఉద్దేశమన్నారు. 2014లో గెలిచాక గ్రామాల్లో బెల్టు షాపులు తెరిచి అమ్మకాలు చేపట్టారని, అసలు కుంభకోణం ఎక్కడ జరిగిందో ప్రజలే గుర్తించాలన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ కొందరు అధికారులు ఎవరినో సంతృప్తి పరచడానికి ప్రయత్నిస్తున్నారని వాపోయారు. విశాఖలో రూ.వేల కోట్ల విలువైన ఆస్తులను కారు చౌకగా కట్టబెడుతున్నారని ఆరోపించారు. చంద్రబాబుకు ఇదే చివరి అవకాశమన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు పదవి పోతుందన్న భయంతో వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారన్నారు. జగన్‌ను టచ్ చేస్తే కోట్లాది మందిని టచ్ చేసినట్లేనని ప్రజల మనోభావాలతో ఆటలాడొద్దని హెచ్చరించారు.

రాష్ట్రంలో అరాచక పాలన

మాట్లాడుతున్న శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి.. అధికారం చేపట్టాక ఆ మాట మరిచారని వైకాపా పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త, శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆదివారం ఆమదాలవలసలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందన్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా కక్ష సాధింపులో భాగంగా అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసం రూ.1.80 లక్షల కోట్లు అప్పు తెచ్చి ఏం చేశారో చెప్పాలన్నారు. వైకాపా నాయకుడు తమ్మినేని చిరంజీవి నాగ్ పాల్గొన్నారు.

(c) eenadu

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని.. ప్రతిఒక్కరూ ఓ మొక్క నాటి సంరక్షించాలని ఇచ్ఛాపురం రోటరీ క్లబ్ ప్రతినిధులు అన్నారు. ఆదివారం రాజావారి క్రీడా మైదానంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్, కాదా రామకోటి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. రోటేరియన్లు డి.కృష్ణమూర్తిరెడ్డి, డి.కృష్ణారావు, కె.జోగారావు, పి.దినేశ్, బి.షణ్ముఖరావు, ఎం.నవీన్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

కుండపోత వర్షం

మందసలో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం ఎండ, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి సుమారు గంట పాటు వర్షం కురిసింది. నారుమడులు, వెదలు ఎండిపోతున్న సమయంలో ఈ వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, మందస

ఇచ్ఛాపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

పుర కార్మికుల మౌన పోరాటం

పలాస, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో పారిశుద్ధ్య కార్మికుల సమ్మె 5వ రోజుకు చేరుకుంది. తమ సమస్యలు పరిష్కరించే వరకు విధులకు వెళ్లమని కార్మికులు స్పష్టం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, పారిశుద్ధ్య కార్మికుల సంఘం నాయకులు సీహెచ్ మురుగన్, వెంకట్, ఈశ్వర్‌రావు, ఉన్ని పాల్గొన్నారు. ❖ తమ డిమాండ్ల సాధన కోసం ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో ఒప్పంద, పొరుగు సేవల కార్మికులు మౌన పోరాటం చేశారు. కార్మిక నాయకుడు ఎ.రమేష్ పట్నాయక్ ఆధ్వర్యంలో పుర మస్తర్ల కేంద్రం వద్ద ఆదివారం కార్మికులందరూ సమ్మె చేపడుతూ, నోటిపై వేలిని పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు.

కాశీబుగ్గలో నిరసన ధర్నాలో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులు

సమస్యలు విన్నాం.. పరిష్కరిస్తాం

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

– న్యూస్‌టుడే, పలాస/గ్రామీణం

పలాస నియోజకవర్గంలో సమస్యలను అధికారులతో సంప్రదించి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి ఆదివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పుర కమిషనర్ ఎన్.రామారావు, పలాస, మందస, వజ్రపుకొత్తూరు ఎంపీడీవోలు వసంతకుమార్, రమేష్‌నాయుడు, వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రశ్న: తల్లికి వందనం నగదు పడలేదు. – జయకృష్ణ, ఎ.ప్రకాశ్, పుణ్యవతి, కె.జయలక్ష్మి, లోహిదాసు, ప్రభాకర్ సిద్దిగాం, భాస్కరరావు, సొండిపూడి, మందస మండలం, దీపిక దోకులపాడు, వజ్రపుకొత్తూరు మండలం

ఎమ్మెల్యే: తల్లికి వందనం పథకంలో ఉన్న ఇబ్బందులను ప్రభుత్వం ఇప్పటికే పరిశీలిస్తోంది. పలాసలోని తమ కార్యాలయానికి ధ్రువపత్రాలు పట్టుకుని వస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం.

?: కాశీబుగ్గ పాత జాతీయ రహదారి ఎరుకల సత్యారావు క్వార్టర్స్ మీదుగా కల్వ రహదారికి ఇబ్బందిగా ఉంది. కాలువ పనులు చేయాలి. – గణపతి, విశ్రాంత ఉద్యోగి → పుర కమిషనరతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

?: పలాస-కాశీబుగ్గ పురపాలికలో ఆహారపదార్థాల కల్తీ ఎక్కువగా జరుగుతోంది. పలాస కేంద్రంగా ఆహార కల్తీ నిరోధక అధికారిని నియమించాలి. – ఎవి.వెంకటాచలం, వైస్‌ప్రెసిడెంట్, రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య, పలాస → ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆహార కల్తీ నియంత్రణ అధికారి నియామకానికి చర్యలు తీసుకుంటాం.

?: కేటీ రోడ్డులో అప్పయ్యదొర విగ్రహం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు కాలువలపై పలకలు ఉండటంతో పూడిక తొలగించడం లేదు. – అరవింద్, కాశీబుగ్గ → పుర కమిషనర్‌కు చెప్పి పూడిక తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

?: కాశీబుగ్గ బస్టాండ్ సులభ్ కాంప్లెక్స్‌లో అధిక ధరలు వసూలు చేస్తుండటంతో ఆరుబయటే మూత్రవిసర్జన చేస్తున్నారు. – దీనబంధు, కాశీబుగ్గ → పరిశీలించి అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

?: పలాస మండలం దానగోర పాఠశాలకు వంతెన లేదు. కోటారింగ్ తాళభద్ర నుంచి మహదేవపురం వరకు రోడ్డు పనులు సగంలోనే ఆగిపోయాయి. – జగన్నాయకులు, ఉపసర్పంచ్ → వంతెన ఏర్పాటుకు చర్యలు చేపడతాం. గత ప్రభుత్వ హయాంలో సగంలోనే ఆగిపోయిన రోడ్డు పనులపై ప్రభుత్వానికి ఇప్పటికే విన్నవించాం.

?: పురపాలిక 23వ వార్డులో ఎల్లమ్మగుడి నుంచి బిడ్డి పోలమ్మ గుడి వరకు రహదారి శిథిలమైంది. నీటి కుళాయిలు ఏర్పాటు చేయాలి. – వి.షణ్ముఖరావు, పలాస → మీ ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

?: పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో వైద్యులు సమయపాలన పాటించడం లేదు. – టి.విజయకుమార్, రెయ్యిపాడు, వజ్రపుకొత్తూరు మండలం → వైద్యులు అందుబాటులో లేకపోతే చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం.

?: పలాస-కాశీబుగ్గ పురపాలిక గొడగల వీధిలో కుళాయిల ద్వారా నీరు రావడం లేదు. కాలువలు శుభ్రం చేయడం లేదు. – స్థానికులు → పుర అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

?: పలాస మండలం పెదంచలలో ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ లేదు. – ఎళ్ల సుభాష్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు → విద్యాశాఖాధికారులు ప్రతిపాదనలు పంపించి గోడ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

?: పలాస మండలంలో జాతీయరహదారి సున్నాదేవి, కొబ్బరిచెట్టూరు, రంగోయి కూడళ్ల వద్ద వేగనిరోధకాలు, రేడియం స్టిక్కర్లు అతికించాలి. – ప్రవీణ్, టెక్కలి → జాతీయరహదారి అధికారులతో మాట్లాడి వేగనిరోధకాలు వేసేందుకు అవకాశం ఉందో తెలుసుకుంటాం. రేడియం స్టిక్కర్లు వేసేలా చర్యలు తీసుకుంటాం.

?: ముత్యాలమ్మకోనేరులో పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. మారుతీనగర్‌లో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. జీడి పొగతో సమీప ఇళ్లలో ఇబ్బంది ఉంది. – హెచ్ మురళీమోహన్, కాశీబుగ్గ → ముత్యాలమ్మకోనేరులో అభివృద్ధి పనులు గుత్తేదారు రాకపోవడంతో నిలిచిపోయాయి. జీడిపొగ, విద్యుత్తు తీగలపై ఆయా శాఖల అధికారులకు తెలియజేస్తాం.

?: వజ్రపుకొత్తూరు మండలం పల్లిసారథి పరిధి రేవుపేటలో వీధి దీపాలు లేవు. బీసీ కాలనీలో పీఎంపురం పంచాయతీ సాగరకాలనీలో దీపాలు వేయడం లేదు. – ఆర్.నవీన్, యు.ప్రసాద్, పల్లిసారథి, – విజయకుమార్, సాగరకాలని → సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం	9440437129
పలాస	8008574279
కవిటి గ్రామీణం	9063144707
పలాస గ్రామీణం	7396408926
కంచిలి గ్రామీణం	9063144708

?: ఇచ్ఛాపురం పట్టణం బెందాళీవీధిలో ఇరువైపులా పనికిరాని మొక్కలు పెరిగిపోయి రోడ్డు పైకి వచ్చాయి. రాకపోకలకు అవస్థలు పడుతున్నాం. – ఆర్.సత్యం, ఇచ్ఛాపురం ❖ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. – విక్రమ్, ఏఈ, ఆర్.అ.బి.శాఖ – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

?: పలాస మండలం మామిడిపల్లి ప్రధాన, పెద్ద వీధుల్లో కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. – ఖగేశ్వరరావు, మామిడిపల్లి ❖ రెండు రోజుల్లో కాలువలు శుభ్రం చేసి సమస్యను పరిష్కరిస్తాం. – సుధాకర్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, బొడ్డపాడు – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

?: కవిటి మండలం లండారిపుట్టుగలో విద్యుత్తు స్తంభాలకు వేసిన వీధి దీపాలు నిత్యం వెలుగుతూనే ఉంటున్నాయి. – యుకుకులు, లండారిపుట్టుగ ❖ చర్యలు తీసుకుంటాం. – రూప, కార్యదర్శి, లండారిపుట్టుగ – న్యూస్‌టుడే కవిటి గ్రామీణం

?: కంచిలి మండలం కత్తివరం నుంచి బంజరి నారాయణపురం మీదుగా సోంపేటకు వెళ్లే రహదారికి ఇరువైపులా పొదలు పెరిగిపోయాయి. రాకపోకలకు అవస్థలు పడుతున్నాం. – ఎన్.దేవా, శ్రీరాంపురం ❖ పొదలు తొలగిస్తాం. – ధనంజయ, ఏఈ పంచాయతీరాజ్ శాఖ – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

ఇచ్చట పనికిరాని మొక్కలున్నాయి!

ఇచ్ఛాపురం మండలం కేదారిపురం సమీపంలో ఆలయం చుట్టూ పనికిరాని మొక్కలు దర్శనమిస్తున్నాయి. ఆపై నివాసాల సమీపంలో ఉండటంతో అక్కడి వారు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో విషకీటకాలు సంచరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో కె.రామారావు వివరణ కోరగా త్వరలో పనికిరాని మొక్కలు తొలగించి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

చీకట్లో ఇందిరమ్మ కాలనీ



కవిటి మండలం నెలవంకలోని ఇందిరమ్మ కాలనీలో వీధి దీపాలు లేవు. రాత్రి పూట చీకట్లో రాకపోకలు సాగిస్తున్నామని, ఈ సమయంలో ప్రమాదాలకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే వీధి దీపాలు అమర్చాలని కోరుతున్నారు. దీనిపై కార్యదర్శి రమేష్ బెహరాను వివరణ కోరగా రెండు రోజుల్లో దీపాలు వేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

సూచిక ఎక్కడుంది..!

కవిటి మండలం సూరిపుట్టుగ, లండారిపుట్టుగ మధ్య ఆర్అండ్‌బీ రోడ్డులో సూరిపుట్టుగ వద్ద మలుపులో ప్రమాద సూచికను ముళ్లపొదలు కప్పేశాయి. దీంతో మలుపు వద్ద రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ విక్రమ్‌ను వివరణ కోరగా ముళ్లపొదలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పొంచి ఉన్న ప్రమాదం

ఇచ్ఛాపురం పట్టణం బిరుసువీశ్వర పేట వద్ద రహదారి పక్కనే విద్యుత్తు స్తంభం తీగలకు ఓ ఫ్లెక్సీ చుట్టుకుంది. నివాసాలు, దుకాణ సముదాయాలతోపాటు జనసంచారం ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఫ్లెక్సీని తొలగించి సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్తు ఉప కేంద్రం ఏఈ కేవీ గోవిందరావు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

అసలే మలుపు.. ఆపై మురుగు

ఇచ్ఛాపురం పట్టణం బీకే పేట మలుపులో వర్షపు, వాడుక నీరు రోడ్డుపై నిలిచిపోతోంది. గతంలో ఇక్కడ ఉండే కాలువను ఆక్రమించి, మూసివేయడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిధిలోని రత్తకన్నతోపాటు మండలం, ఒడిశా గ్రామాల ప్రజలు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. కాలువను పునరుద్ధరించి, సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

కూటమితోనే సంక్షేమం

మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

సోంపేట, పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజలను మభ్యపెడుతున్న వైకాపా నాయకుల దుర్మార్గపు చర్యలపై దృష్టి పెట్టాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. ఆదివారం సుంకిడి పంచాయతీలో నిర్వహించిన 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రమిస్తున్నారని, ఆయన కష్టం ఫలించాలంటే వైకుంఠపాళీ ఆడొద్దని హితవు పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు చంద్రమోహన్, కుమార్, శ్రీను, నాగేష్ రవి పాల్గొన్నారు. ❖ పలాస మండలం గరుడఖండిలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొని మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి కూటమి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, పీరికట్ల విఠల్, కుత్తుం లక్ష్మణ్, వంకల కూర్మారావు, సూర్యకృష్ణంరాజు పాల్గొన్నారు.

పైడిగాం ఆధునికీకరణతో సాగునీటి ఇబ్బందులకు మోక్షం

సోంపేట, న్యూస్‌టుడే: పైడిగాం ప్రాజెక్టు ఆధునికీకరణకు చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని, దీంతో శివారు ఆయకట్టు భూములకు సాగునీటి ఇబ్బందులు తీరుతాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం రైతులు, కూటమి నాయకులతో కలిసి ప్రాజెక్టు ప్రధాన కాలువ వద్ద పూజలు నిర్వహించి పైడిగాం నీటిని విడిచిపెట్టారు. ఆయకట్టు రైతు ప్రతినిధులు సనపల శ్రీరామ్మూర్తి తదితరులు మాట్లాడుతూ ఆనకట్ట వేరే చోటుకు మార్చడంతోపాటు ప్రధాన కాలువ పరంగా నెలకొన్న ఇబ్బందులు పరిష్కరించి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పైడిగాం పనుల కోసం రూ.38 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు చేపడతామని అశోక్ హామీ ఇచ్చారు. నాయకులు చంద్రమోహన్, శ్రీను, కుమార్, నాగేష్, నీటిసంఘాల అధ్యక్షులు కోదండరావు, దుర్యోధనరావు, చిరంజీవి పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న ప్రభుత్వవిప్ అశోక్, రైతు ప్రతినిధులు

లయన్స్ సేవల్లో పురోగతి పెంచాలి

పలాస, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో లయన్స్ సేవల్లో పురోగతిపెంచాలని విశాఖపట్నం లయన్స్‌క్లబ్ ఛైర్మన్ డీఎస్ఎస్‌వీ వర్మ అన్నారు. లయన్స్ క్లబ్ క్యాజు ల్యాండ్, లయన్స్ క్లబ్ ఆఫ్ పలాస-కాశీబుగ్గ, లయన్స్‌క్లబ్ ఆఫ్ పాలబుగ్గ, లయన్స్ క్లబ్ వనిత సంఘాల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం కాశీబుగ్గలో నిర్వహించారు. క్యాజు ల్యాండ్ అధ్యక్షుడిగా అట్టాడ మాధవరావు, పలాస-కాశీబుగ్గ అధ్యక్షుడిగా ఎస్.మధుసూదనరావు, పాలబుగ్గ అధ్యక్షుడిగా బి.తరుణ్‌కుమార్, వనిత విభాగం అధ్యక్షురాలిగా టి.శ్వేతకుమారిలను ఎంపిక చేసి ప్రమాణ స్వీకారం చేయించారు. వీరితోపాటుగా నాలుగు క్లబ్‌లకు సెక్రటరీ, కోశాధికారులను ఎన్నుకున్నారు. జిల్లా ఛైర్‌పర్సన్ వి.ఎం.రావు, కేవీ సుబ్బరాజు, ఎస్.శ్రీనివాసరావు, సీహెచ్ కృష్ణమోహన్, ఎం.జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గలో లయన్స్ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న మాధవరావు, శ్వేతకుమారి, మధుసూదనరావు, తరుణ్‌కుమార్

బాధ్యతల స్వీకరణ

ఎంఈవో-2 రామకృష్ణను అభినందిస్తున్న ఎంఈవో ధనంజయ మజ్జి, సిబ్బంది

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి మండలం విద్యాశాఖాధికారి-2గా బొరివంక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రామకృష్ణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఈవో ధనంజయ మజ్జి, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

సాగు చేస్తున్న రైతులకు పట్టాలివ్వాలి

కంచిలి, న్యూస్‌టుడే: దశాబ్దాలుగా పోరాటాలు చేసి సాగు చేసున్న భూములకు ప్రభుత్వ పట్టాలు అందజేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గం సభ్యుడు ఎస్.నారాయణ స్వామి డిమాండ్ చేశారు. ఆదివారం శాసనాంలో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. జాజిమొగ్గల తరిణి, అమరవీర స్థూపం నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకొన్నారు. ఒంగోలులో ఆగస్టు 20 నుంచి 25 వరకు జరగనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పి.ఆరేలమ్మ, వసంతకుమార్, వెంకటస్వామి, పార్వతి, లోకనాథం పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

రహదారి భద్రత.. అందరి బాధ్యత

వాహన చోదకులు, స్థానికులకు అవగాహన కలిగిస్తున్న ఎస్సై శ్రీనివాస్

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రహదారి భద్రత అందరి బాధ్యతని, నియమ నిబంధనలు తెలుసుకోవడంతోపాటు పాటించాలని ఇచ్ఛాపురం గ్రామీణ ఎస్సై శ్రీనివాస్ అన్నారు. ఎం.తోటూరు కూడలిలో ఆదివారం వాహన చోదకులు, స్థానికులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాల నిల్వ ఉంటే సమాచారమివ్వాలని కోరారు. నారీశక్తి యాప్ మహిళలకు రక్షణ అని అన్నారు.

రైలు నుంచి జారిపడి గాయాలు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస సమీపంలో ఆదివారం రైలు నుంచి జారిపడి బ్రహ్మపురకు చెందిన అలోక్ రంజన్‌కు గాయాలయ్యాయి. బ్రహ్మపుర నుంచి పలాస వస్తూ సుమ్మాదేవి రైలు నిలయం దాటిన తర్వాత జారిపడిపోయాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 సిబ్బంది సత్యం, శ్రీనివాసరావు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

హెచ్చరిక బోర్డును ఢీకొన్న లారీ

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస సమీప పారసాంబ ప్రాంతంలో ఆదివారం జాతీయ రహదారిలో ఉన్న సెన్సార్ (హెచ్చరిక) బోర్డును ఓ లారీ ఢీకొంది. టెక్కలి నుంచి పలాస వైపు వస్తున్న వాహనం ఢీకొనడంతో బోర్డు రహదారికి అడ్డంగా ఒరిగి పోయింది. దీంతో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం కలిగింది. హైవే సిబ్బంది చేరుకొని బోర్డును తొలగించే ప్రక్రియ చేపట్టారు. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

ఆర్థికసాయం

కవిటి గ్రామీణం: కోటబొమ్మాళికి చెందిన రంజిత్ తలసేమియాతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కవిటి మండలానికి చెందిన ఎస్‌జీఎఫ్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం బాధితుడిని పరామర్శించి ఆ కుటుంబానికి రూ. 7500 నగదు అందించారు.

కాలువ శుభ్రం చేశారు

స్పందనకు వందనం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: బెల్లుపడ ప్రధాన మార్గంలో ప్రమాదకరంగా మారిన కాలువను శుభ్రం చేశారు. ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న చిన్న కాలువ కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని 'ఈనాడు'లో ఈ నెల 16న 'ఇక్కడో కాలువ ఉంది' శీర్షికన ప్రచురితమైన వార్తపై పుర కమిషనర్ నల్లి రమేష్ స్పందించారు. పారిశుద్ధ్య విభాగాధికారి పి.ఉపేంద్రకుమార్ సిబ్బందితో పూడిక తీయించి కాలువను గుర్తించేలా చర్యలు తీసుకున్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా..

కంచిలి, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో కంచిలి పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని తెదేపా మండలాధ్యక్షుడు రామారావు అన్నారు. ఇటీవల కంచిలిలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ వైకాపా హయాంలో జరిగిన అక్రమాలపై మాట్లాడారు. దీనిపై స్థానిక ఎంపీపీ పైల దేవదాసురెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆదివారం కంచిలి మార్కెట్ యార్డు ఆవరణలో నాయకులు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే అశోక్‌ను విమర్శించే స్థాయి ఎంపీపీకి లేదన్నారు. పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై పూర్తి ఆధారాలతో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రధాన కార్యదర్శి రామారావు, పీఏసీఎస్ ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, డైరెక్టర్ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెదేపా మండల అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి రామారావు

శిథిలావస్థలో పశువైద్యశాలలు

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పశు వైద్యం గాలిలో దీపంలా మారింది. పాడి రైతులకు అందాల్సిన సేవలు పడకేశాయి. పశుపోషకుల బాగోగులను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏళ్ల కిందట నిర్మించిన భవనాలతో అవస్థలు తప్పడంలేదు. ఫలితంగా సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వైద్యం కోసం వచ్చే పశుపోషకులు సైతం భయాందోళన మధ్య సేవలకు వేచి ఉంటున్నారు. దీంతో వైద్యశాలకు పశువులను తీసుకొచ్చే వారు క్రమంగా తగ్గిపోతున్నారు.

40 ఏళ్ల కిందట నిర్మించిన భవనాలే..

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో 10 పశు వైద్యశాలలున్నాయి. రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్లు కవిటి మండలంలో రాజపురం, శిలగాం, ఇచ్ఛాపురం మండలంలో డొంకూరు, తోటూరు, కంచిలి మండలంలో జె.భైరిపురంలో ఐదు చోట్ల ఉన్నాయి. బారువ ఆసుపత్రి, శిలగాంలో ఆర్ఎల్‌యూ భవనాలు మాత్రమే కొత్తగా నిర్మించారు. మిగతా భవనాలన్నీ 40 ఏళ్ల కిందట నిర్మించినవే. అవి ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. మరమ్మతులకు ప్రభుత్వం నిధులు ఇవ్వలేకపోవడం అధికారులు వీటిని పట్టించుకోవడం లేదు. వర్షం వస్తే స్లాబులు కారి గదులు నీటితో నిండిపోతున్నాయని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పశు వైద్యశాలలు నిర్మాణాలతోపాటు గత ప్రభుత్వం నిలిపివేసిన పథకాలను మళ్లీ అమలు చేసి పాడి రైతులను ఆదుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో ఉన్న కవిటి పశువైద్యశాల

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

ప్రతిపాదనలు పంపించాం

పశువైద్యశాలలు ఎక్కడెక్కడ శిథిలావస్థలో ఉన్నాయో వాటి వివరాలు ఉన్నతాధికారులకు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన వెంటనే మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటాం.
– కె.అప్పలస్వామి పశుసంవర్ధక శాఖ ఏడీ, సోంపేట

నియోజకవర్గంలో పశు సంపద

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
కవిటి	10,979	3,608	15,795	4,959
ఇచ్ఛాపురం	12,864	5,737	14,384	5,506
కంచిలి	11,995	2,921	17,082	4,959
సోంపేట	12,449	1,705	8,965	4,537

హామీల అమలులో విఫలం

సోంపేట, పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసం గురించి కార్యకర్తలు, నాయకులు ప్రతి గడపకు తెలియజేయాలని జడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ కోరారు. ఆదివారం సోంపేటలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, తక్కువ సమయంలో ప్రజావ్యతిరేకత కూడ గట్టుకున్నారన్నారు. ఎంపీపీ ఎన్.దాసు, జడ్పీటీసీ సభ్యురాలు యశోద, వైకాపా నాయకులు శ్యాంప్రసాద్‌రెడ్డి, భాస్కరరావు, జోగారావు పాల్గొన్నారు. ❖ మద్యం కుంభకోణం కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని వైకాపా జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. కక్ష సాధింపులో భాగంగానే ఆయన్ను అరెస్టు చేశారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారని ఆరోపించారు.

గోడప్రతులు ప్రదర్శిస్తున్న వైకాపా నాయకులు

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, కె.టి.రోడ్డు, పలాస వారి భోగట్టాపై ఇస్తున్న పబ్లిక్ నోటీసు.

శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, పురుషోత్తపురం గ్రామం, శివాజీనగర్ వీధి కాపురస్తులైన కద్దాల ఢిల్లేశ్వరి W/o. నాగేశ్వరరావు నా క్లయింటు సంస్థ నుండి తీసుకొనబోవు రుణమునకు హామీగా ఆమె యొక్క స్వాధీన, హక్కు అనుభవములోనున్న ఈ దిగువ షెడ్యూలులో వివరించిన ఆస్తిని తాకట్టుగా పెట్టుటకు ప్రతిపాదించి యున్నారు. కావున సదరాస్తిపై వేరెవ్వరికయినా ఎట్టి హక్కుగాని, ఆసక్తి గాని ఉన్న యెడల అట్టివారు ఈ నోటీసు ప్రచురింపబడిన ఏడు దినములలోగా వారి యొక్క అక్షేపణలను నాకు గానీ, నా క్లయింటుకు గాని తెలియపరచవలెను. లేని యెడల సదరాస్తిపై గానీ, దానిపై జరుపబోవు తాకట్టుపై గాని ఎవరికీ ఎట్టి అభ్యంతరములు లేవని భావింపబడునని. యిందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు: శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల ఉదయపురం గ్రామంలో గల వార్డు నెం. 18వ రు, సర్వే నెం. 305/1 గల తూ.ప.లకు 12 అడుగులు, ఉ.ద.లకు 54 అడుగులు, మొత్తం: 72 చ॥గ॥లు గల ఖాళీ స్థలంకు హద్దులు: తూర్పునకు: పొట్నూరు సదాశివ గారి డాబా ఇల్లు, దక్షిణంకు: రోడ్డు, పశ్చిమానికి: ఉప్పాడ నారాయణ గారి డాబా ఇల్లు, ఉత్తరానికి: గోర్జి.

యవ్వారి హేమకుమార్, అడ్వకేట్, పలాస, 9440592204

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

యోగా శిబిరానికి స్పందన

రాజారాంపురం సముద్రతీరంలో యోగా చేస్తున్న సాధకులు

నరసన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక పెద్దపేటలోని యోగా భవన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత యోగా శిబిరానికి విశేష స్పందన వస్తోంది. యోగా గురువు ఎస్.రవి ఆధ్వర్యంలో సాధకులకు శిక్షణ ఇస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం చిన్నారులు, మహిళలు, వృద్ధులు హాజరవుతున్నారు. ఆదివారం పోలాకి మండలం రాజారాంపురం సముద్ర తీరంలో సాధన చేసినట్లు రవి చెప్పారు.

సంతబొమ్మాళిని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం : అచ్చెన్న

నిమ్మాడలో క్యాంప్ కార్యాలయంలో సంతబొమ్మాళి మండల తెదేపా నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో సంతబొమ్మాళి తెదేపా నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నాయకులు భేదాభిప్రాయాలు ఉంటే పక్కన పెట్టి, అభివృద్ధిపై దృష్టిసారించాలని సూచించారు. సంతబొమ్మాళి పీఏసీఎస్ అధ్యక్షుడిగా కూచెట్టి కాంతరావును ఎంపిక చేశామని, త్వరలో పార్టీ మండలాధ్యక్షుడిని ఎన్నుకుంటామన్నారు. నరసన్నపేట-డీపీఎన్-నౌపడ-వెంకటాపురం రహదారి టెండర్ దశలో ఉందని, బోరుభద్ర- మేఘవరం రహదారి రెండు వరుసల రహదారి ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. అనంతరం పలు పంచాయతీల్లో ఉన్న సమస్యలను కార్యకర్తలు, నాయకులు మంత్రి దృష్టికి తీసుకురాగా ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. తెదేపా నాయకులు అట్టాడ రాంప్రసాద్, జీరు భీమారావు, సుగ్గు శాంతి స్వరూప్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండ

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, న్యూస్‌టుడే: ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద ప్రజల వైద్య సేవలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందించి అండగా ఉంటామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఎల్ఎన్‌పేట మండలం యంబరాం గ్రామానికి చెందిన వెలమల తేజమణికంఠ కడుపునొప్పితో బాధపడుతున్నాడు. అతని వైద్య సేవల నిమిత్తం రూ.91,204 చెక్కును ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సరిహద్దు గ్రామాల్లో నిఘా పటిష్ఠం

– న్యూస్‌టుడే, కొత్తూరు

ప్రజలు, దాతల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటు

రాష్ట్ర సరిహద్దుల్లోని పాతపట్నం నియోజకవర్గంలో నిఘాను పోలీసు అధికారులు మరింత పటిష్ఠం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో చోరీలు పెరగడం, అపరిచిత వ్యక్తుల కదలికలు, వివిధ మార్గాల్లో అక్రమ రవాణా వంటివాటిని నిరోధించేందుకు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు ప్రధాన కూడళ్లు, మసీదు, చర్చి, దేవాలయాల్లో నిఘా కెమెరాలను ఏర్పాటు చేశారు. పాతపట్నం నియోజకవర్గంలోని సీసీ కెమెరాలను ఆయా స్టేషన్ల పరిధిలోని దాతలు, ప్రజలు స్వచ్ఛందంగా సమకూర్చారు.

కొత్తూరు-పాలకొండ రహదారిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

కొత్తూరు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల పర్యవేక్షణ గది

నిందితులను గుర్తించేలా..

రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లోని కొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి మండలాలతోపాటు, మైదాన ప్రాంతమైన హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో కేసుల్లో నిందితులను పట్టుకోవడం, దురుసుగా వాహనాలను నడిపిన వ్యక్తులను గుర్తించడం, అక్రమ రవాణా అడ్డుకట్ట వేయడం, ఆలయాల్లో చోరీలను గుర్తించేందుకు ఇవి ఉపయోగపడనున్నాయి.

★ కొత్తూరు ప్రధాన కేంద్రం నాలుగు రహదారుల్లో, పాలకొండ రోడ్డు, హడ్డుబంగి, బల్లిలి, శ్రీకాకుళం ఒడిశా సరిహద్దు గ్రామాల్లో నిఘా పెంచారు. సుమారు 25 చోట్ల ఆలయాలు, చర్చిల వద్ద సీసీ కెమెరాలు అమర్చారు. నియోజకవర్గ కేంద్రమైన పాతపట్నంలోని ప్రధాన కూడలి, గంగువాడ, తెంబూరు, కాగువాడలతోపాటు పలు గ్రామాల్లో మొత్తం 30 చోట్ల, ఎల్ఎన్‌పేట మండలంలోని ఎల్ఎన్‌పేట కూడలితోపాటు, 15 చోట్ల కెమెరాలను ఏర్పాటు చేశారు.

★ హిరమండలం మేజర్ పంచాయతీల్లోని హిరమండలం ప్రధాన రహదారితోపాటు, 20 చోట్ల, మెళియాపుట్టి మండలంలోని మెళియాపుట్టి, కొసమల, జాడుపల్లి, గంగరాజపురం, గొప్పిలి, జాడుపల్లి వంటి పెద్ద గ్రామాలతోపాటు 40 చోట్ల ఆలయాలు, చర్చిల వద్ద నిఘా పెంచారు.

నేరాల నియంత్రణే లక్ష్యం..

ఇటీవల కాలంలో వరుసగా జరుగుతున్న సంఘటన నేపథ్యంలో నిఘా వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తున్నాం. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయి. ప్రజల భాగస్వామ్యం, దాతల సహకారంతో అన్నిచోట్ల వీటిని ఏర్పాటు చేశాం. – చింతాడ ప్రసాద్, ఏ.ఆర్.రావు, సీఐలు, కొత్తూరు, పాతపట్నం

మంత్రి హామీతో రూ.60 లక్షలు మంజూరు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలో గత నెల 28న ఉపాధిహామీ కార్యాలయం, బాలికల ఉన్నత పాఠశాల గ్రామంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించారు. ఆ రోజు కోటబొమ్మాళికి పట్టణ సొబగులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన సుడా నిధులు రూ.60 లక్షలతో కొత్తపేట నుంచి కోటబొమ్మాళికి సెంట్రల్ లైటింగులో భాగంగా ఆదివారం డివైడర్ ఉన్న ప్రాంతాల్లో పనులు ప్రారంభమయ్యాయి

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: నందిగాం మండలం హర్షబాడ పంచాయతీ అంగన్వాడీ కేంద్రం వద్ద ఉన్న బోరుబావి ఆరు నెలలుగా మరమ్మతులకు గురై తాగేందుకు నీరు లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నాం. – బూరె కృష్ణారావు, స్థానికుడు ★: క్షేత్రస్థాయిలో పరిశీలించి బోరుకు మరమ్మతులు చేయిస్తాం. – విశ్వేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, హర్షబాడ

?: పోలాకి మండలం గుల్లవానిపేటలో నిత్యం వీధి దీపాలు వెలుగుతున్నాయి. వాటిని నియంత్రించేందుకు స్విచ్ బోర్డులు ఏర్పాటు చేయాలి. – మోహనరావు, గుల్లవానిపేట

★ కార్యదర్శికి చెప్పి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – జి.పద్మావతి, ఈవోపీఆర్డీ, పోలాకి – న్యూస్‌టుడే, నందిగాం, పోలాకి

ఎన్టీఆర్ అభిమానుల వితరణ

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలిలో 20 మంది పేద విద్యార్థులకు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు, టీం తారక్ ట్రస్టు సభ్యులు ఆదివారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. స్కూల్ బ్యాగులతోపాటు పుస్తకాలు, ఇతర సామగ్రిని అందించారు. కార్యక్రమంలో టీం తారక్ ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్ డి.భాస్కర్ పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!

మండల కేంద్రం మెళియాపుట్టిలో గత కొద్ది రోజులుగా ఎక్కడికక్కడే చెత్త దర్శనమిస్తోంది. ప్రధాన రహదారిలో సైతం చెత్త తొలగించకపోవడంతో పాదచారులు, స్థానికులు దుర్వాసన, దోమల బెడదతో అవస్థలు పడుతున్నారు. పంచాయతీ పాలనాయంత్రాంగం దృష్టి సారించకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై ఎంపీడీవో నర్సింహ ప్రసాద్ పండా దృష్టికి తీసుకువెళ్లగా పంచాయతీ సిబ్బందితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, మెళియాపుట్టి

ఎప్పుడు కూలుతుందో..

టెక్కలి పాతజాతీయ రహదారిపై ప్రభుత్వ డిగ్రీకళాశాల వద్ద ఉన్న ప్రయాణికుల విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరింది. బీటలువారి, శ్లాబు కింది భాగంలో పెచ్చులూడి పోవడంతో విద్యార్థులతోపాటు నిత్యం రాకపోకలు చేసే ప్రయాణికులు అది ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమస్యపై కళాశాల ప్రిన్సిపల్ టి.గోవిందమ్మ మాట్లాడుతూ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

కాలే వరకు.. కాంతులే

హిరమండలం మేజర్ పంచాయతీలోని ఏబీ రహదారికి పక్కన, పలు వీధుల్లో పగటి పూట విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్తు వృథాతో పాటు దీపాలు మరమ్మతులకు గురై పాడవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. పలుచోట్ల త్రీఫేజ్ విద్యుత్తు లైన్ ఉండాల్సిన చోట పంచాయతీలైన్‌కే తీగలు అనుసంధానం చేసి సరఫరా చేస్తున్నారు. దీంతో పంచాయతీ సిబ్బంది ఎన్ని పర్యాయాలు మరమ్మతులు చేసినా ఫలితం లేకపోతుంది. ఏడీఈ శంకరరావు మాట్లాడుతూ పరిశీలించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, హిరమండలం

బోరు వేశారు..హెడ్ మరిచారు

కొత్తూరు మండలంలోని మెట్టూరు బిట్-2, మెట్టూరు బిట్-3 పంచాయతీల సరిహద్దుల్లో వేసిన తాగునీటి బోరు హెడ్ బిగించలేదు. దీంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తీరడం లేదు. రెండు పంచాయతీల సరిహద్దు సమస్య ఉత్పన్నం కావడంతో ఎవరూ దీని గురించి పట్టించుకోవడం లేదు.

సంబంధిత అధికారులు స్పందించి బోరుకు హెడ్ బిగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యపై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ సాగర్ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

దోమల బెడద

నరసన్నపేట మారుతీనగర్-2లో కాలువలు లేక మురుగు ఇళ్ల ఎదుట నిలిచిపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన, దోమల బెడదతో అవస్థలు పడుతున్నామని పేర్కొంటున్నారు. పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీనిపై ఈవో దాక్షాయిణి వద్ద ప్రస్తావించగా, మారుతీనగర్-2లో కాలువల నిర్మాణానికి కార్యవర్గ తీర్మానం అవసరమని, వచ్చే సమావేశంలో చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట

గిరిజనుల అభ్యున్నతికి నిదర్శనం

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఏఎంసీ ఛైర్మన్ గౌరమ్మ

మెళియాపుట్టి, కొత్తూరు, ఎల్ఎన్‌పేట, జలుమూరు, న్యూస్‌టుడే: గిరిజనుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు రుణపడి ఉంటామని పాతపట్నం ఏఎంసీ ఛైర్మన్ చిన్నింటి గౌరమ్మ, తెదేపా నాయకులు బైరిసింగి దినకర్ అన్నారు. ఆదివారం వెంకటాపురం గ్రామంలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను వివరించారు. తెదేపా కొత్తూరు మండలాధ్యక్షుడు ఎ.మాధవరావు, కార్యదర్శి దశరథరావు, మండల నాయకులు మెట్టూరు బిట్-2, ఇరపాడుగూడ, కొత్తూరు గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. తెదేపా జిల్లా అధికార ప్రతినిధి శివ్వాల కిశోర్‌బాబు ఆధ్వర్యంలో ఎల్ఎన్‌పేట మండలంలో సరడాంలో, జలుమూరు మండలం రామయ్యవలసలో తెదేపా నాయకులు ప్రచారం చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పోలాకి, న్యూస్‌టుడే: మండలంలోని చెల్లాయవలసలో అనారోగ్యంతో బాధపడుతున్న టి.సావిత్రమ్మ, ఇటీవల మృతి చెందిన అలిగి రాములు కుటుంబాలను జడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య ఆదివారం సాయంత్రం పరామర్శించారు. తెదేపా మండలాధ్యక్షుడు కె.కృష్ణ, పరిషత్తు సలహాదారు బైరాగినాయుడు తదితరులు ఉన్నారు.

వైభవంగా సత్యసాయి పల్లకీ సేవ

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నీలంపేట పంచాయతీ గుంట జగన్నాథపురంలో ఆదివారం బాబా చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి వైభవంగా తిరువీధి నిర్వహించారు. గ్రామంలో భజనలతో నగర సంకీర్తన చేపట్టారు. టెక్కలి జోన్ కోటబొమ్మాళి సేవాసమితి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కొత్తపేట భక్తులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేదు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: ఎరువులు కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి కె.సింహాచలం పేర్కొన్నారు. మండలంలో పెద్దకొల్లివలస పంచాయతీ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో అన్నదాతలకు ఎరువులను ఆదివారం పంపిణీ చేశారు. సర్పంచి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సేవకుడికి ఆర్థిక సాయం

పాతపట్నం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: పాతపట్నం సత్యసాయి సేవా సమితిలో నిత్య నారాయణ సేవలో పనిచేసే సేవకుడు మోహనరావు ఇటీవల రహదారి ప్రమాదంలో గాయపడ్డారు. వైద్య సేవలు పొంది ఆదివారం సత్యసాయి మందిరానికి వచ్చారు. దీంతో సత్యసాయి భక్తులు ఎరుకోల కృష్ణారావు, వాడవలస రామారావు, నాగులపల్లి శ్రీనివాసరావు, పి.చిన్నారావు, ఎం.రామారావు, అనంతకృష్ణతో పాటు పలువురు ఆయనకు రూ.9,500 ఆర్థిక సాయం చేశారు. * కోటబొమ్మాళికి చెందిన రంజిత్ తలసేమియాతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కవిటి మండలానికి చెందిన ఎస్‌జీఎఫ్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం బాధితుడిని పరామర్శించి ఆ కుటుంబానికి రూ.7,500 నగదు అందించారు.

తోటి మహిళకు బాసట

హిరమండలం: హిరమండలంలో బీసీ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రానికి చెందిన మహిళలు తమతో శిక్షణ పొందుతున్న తోటి మహిళ దండుపాటి లక్ష్మికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈమె భర్త సీతారాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీంతో వారి బాధిత కుటుంబానికి మహిళలందరూ కలిసి విరాళాలు సేకరించి రూ.10,400 అందజేశారు.

హామీల అమలులో విఫలం

టెక్కలి పట్టణం: హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందిందని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. ఆదివారం టెక్కలిలోని ఓ కల్యాణమండపంలో నిర్వహించిన మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపీపీ అట్ల సరోజనమ్మ, టెక్కలి సర్పంచి గొండేల సుజాత, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ దృష్టికి సమస్యలు

ఛైర్మన్ బొజ్జిరెడ్డితో గిరిజన ఐక్యవేదిక నాయకులు

సారవకోట, న్యూస్‌టుడే: జిల్లాల్లోని గిరిజన సమస్యలను ఆదివారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు గిరిజన ఐక్యవేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు చౌదరి లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన స్వగ్రామమైన రంపచోడవరంలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు విన్నవించడంతో సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీను, దళిత మహాసభ సంఘ రాష్ట్ర కార్యదర్శి బి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రక్షిత భవనానికి మోక్షమెప్పుడో..?

నందిగాం మండలం ప్రతాపవిశ్వనాథపురం పంచాయతీ చెరుకుపల్లి నిర్మించిన ఏకైక తుపాను రక్షిత భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. విపత్తులు సంభవిస్తే భవనంలో తలదాచుకోడానికి 48 ఏళ్ల కిందట దీన్ని నిర్మించారు. శ్లాబ్ పెచ్చులూడి ప్రమాదస్థితికి చేరుకుంది. తిత్లీ తుపాను సమయంలో గ్రామంలో ఎస్సీకాలనీకి చెందిన పలువురు ఇళ్ల రేకులు ఎగిరిపోయాయి. రక్షిత భవనం ఉండి కూడా అందులోకి వెళ్లక వేరేవాళ్ల ఇంట్లో తలదాచుకునే దుస్థితి నెలకొంది. అధికారులు ఈ భవనంపై ఎప్పుడు దృష్టి సారిస్తారోనని గ్రామస్థులు ఎదురు చూస్తున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డిప్యూటీ ఎంపీడీవో రాజారావు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నందిగాం

రైతులకు సేవలందించేందుకు కృషి

ఏఎంసీ ఛైర్మన్ రామకృష్ణను సత్కరిస్తున్న జనసేన పార్టీ నాయకులు

పాతపట్నం, న్యూస్‌టుడే: రైతులకు విలువైన సేవలందించేందుకు తనవంతు కృషి చేస్తానని హిరమండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మామిడి రామకృష్ణ అన్నారు. ఆదివారం పాతపట్నం జనసేన కార్యాలయంలో నియోజకవర్గం స్థాయి నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనను గుర్తించి, ఈ పదవి ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఏఎంసీ ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు, అవసరమైన సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు ఆయనను సత్కరించి, అభినందనలు తెలిపారు. నాలుగు మండలాల అధ్యక్షులు బాలరాజు, జైరాజు, నవీన్, రామ్‌శంకర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

మురుగు కదలదు.. వ్యథ తీరదు

టెక్కలి శంభానవీధిలో రైల్వేస్టేషన్‌కు ఎదురుగా ఉన్న ప్రాంతంలో కాలువలో మురుగు వెళ్లే మార్గం లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కురిసిన వర్షాలకు కాలువలోని మురుగు ఇళ్లలోకి ప్రవేశిస్తుండటంతో స్థానికులే సిమెంటు పలకలు వేసి ఇలా మురుగును మళ్లించేందుకు అవస్థలు పడ్డారు. టెక్కలిలో కాలువల్లో పూడిక తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్ చేపడతామని పంచాయతీ కార్యదర్శి వెంకటశ్రీనివాసరావు తెలిపారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

వంతెన నిర్మించేలా చర్యలు

స్పందనకు వందనం

జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరు మండలం శ్రీముఖలింగం - హిరమండలం రహదారిలో కరకవలస మలుపు వద్ద 10 ఆర్ కాలువపై వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతోపాటు ఇరువైపుల రక్షణ గోడలు లేకపోవడంతో ఈనాడులో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై ర.భ శాఖ జేఈఈ జి.సరోజ స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వంతెనను పరిశీలించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఆగిన పనులు.. తప్పని అవస్థలు

– న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

అధికారుల సమన్వయం లోపం ముందుకు సాగని బోరుభద్ర రహదారి విస్తరణ

సంతబొమ్మాళి మండలం బోరుభద్ర వాణిజ్యపరంగా అభివృద్ధి చెందిన గ్రామం. మండలంలో సముద్ర తీర ప్రాంత మత్స్యకారులు, ప్రజలు నిత్యం ఇక్కడి నుంచే రాకపోకలు చేస్తుంటారు. ఒకే వరుస రహదారి కావడంతో నిత్యం వాహనచోదకులు, గ్రామస్థులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఎన్నికల సమయంలో మంత్రి అచ్చెన్నాయుడు బోరుభద్ర-మేఘవరం రహదారి విస్తరణ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది జనవరిలో పనులు ప్రారంభించినా అధికారుల సమన్వయ లోపంతో నెలరోజులుగా అవి ముందుకు సాగక స్థానికులకు అవస్థలు తప్పడం లేదు.

★ తొలివిడతగా బోరుభద్ర పశువైద్య కేంద్రం నుంచి డీపీఎన్ రోడ్డు వరకు ఒక వరుసలో ఉన్న తారురోడ్డును కాస్త రెండు వరుసల సీసీ రహదారిగా మార్చడానికి విస్తరణ పనులు చేపట్టారు. ఉపాధి పథకంలో భాగంగా రూ.2.50 కోట్లతో పనులు ప్రారంభించారు. రహదారికి ఇరువైపుల 25 అడుగుల చొప్పున మొత్తం 50 అడుగుల విస్తరణ, ఇరువైపులా 3 అడుగుల కాలువలు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించారు.

బోరుభద్రలో రహదారి పనులు జరుగుతున్నా తొలగించని విద్యుత్తు స్తంభాలు

మురుగు నిలిచి ఇక్కట్లు

ఇది వరకే ఉన్న విద్యుత్తు స్తంభాలు, రోడ్డే పక్క నియంత్రికలు, కొన్ని చోట్ల రోడ్డును తవ్వేసి మట్టి దిబ్బలు ఇప్పటి వరకు తొలగించలేదు. సాధారణంగా రోడ్డు పనులు చేయించే సంబంధిత అధికారులు, గుత్తేదారు నుంచి ఏపీఈపీడీసీఎల్ వారికి లైన్ షిఫ్టింగ్ ఛార్జీలు చెల్లించాలి. సదరు గుత్తేదారు చెల్లించకపోవడంతో విస్తరణకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. మురుగు సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఛార్జీలు చెల్లించాలి

రహదారికి మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించాలంటే సంబంధిత గుత్తేదారుడు, ఆర్అండ్‌బీ అధికారులు లైన్ షిఫ్టింగ్ ఛార్జీలు చెల్లించాలి. కనీసం చెకింగ్ విధానంలోనైనా ఏపీఈపీడీసీఎల్‌కు 12 శాతం ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. – శశిభూషణరావు, మండల విద్యుత్తు శాఖ ఏఈఈ

కాలువలు పూర్తి చేశాం

విద్యుత్తు స్తంభాలు తొలగించడానికి సంబంధిత గుత్తేదారుకు ఆదేశాలిచ్చాం. ఇప్పటికే కాలువ పనులు పూర్తి చేశాం. పలకలు ఏర్పాటు చేస్తాం. ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తాం. – అనిజిత్ కుమార్, ఇన్‌ఛార్జి పీఆర్ ఏఈఈ

కుమార్తెను వేధిస్తున్నారని తల్లి ఫిర్యాదు

పోలాకి, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి ఓ మహిళ తన కుమార్తెను గత కొంత కాలంగా స్థానికంగా ఉండే ఎల్.సూర్యనారాయణ ప్రేమించమని వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. ఈ విషయం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వరద నీటిలోనే రాకపోకలు

కళింగపట్నం-పాతపట్నం జాతీయ రహదారిలో తిలారు రైల్వేగేటు వద్ద నిర్మించిన అండర్‌పాసేజీ వంతెనలో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరుకుంది. దీంతో తిలారు రైల్వే నిలయానికి వెళ్లే వారితోపాటు, చిన్నదూగాం నుంచి రావిపాడు వెళ్లాల్సిన వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై సూపరువైజరు అప్పలనాయుడు వద్ద ప్రస్తావించగా యంత్రాల సహాయంతో వరదను తొలగించామని తెలిపారు. – న్యూస్‌టుడే, జలుమూరు

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

అపూర్వ కలయిక

శ్రీకాకుళం నగరపాలకోన్నత పాఠశాలలో 1975 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. జిల్లా కేంద్రంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమానికి స్నేహితులంతా హాజరై ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమానికి సమన్వయకర్తలుగా రామేశ్వరరావు, ఎన్.వి.కామేశ్వరరావు, పి.వి.శ్యామ్, కిలాన ఫల్గుణ, పి.శారద, గోపాల్, కమలాకర్, టి.వెంకట్రావు వ్యవహరించారు. - న్యూస్‌టుడే, పాతబస్టాండ్

తెరపై ఈనాడు

● కిన్నెర : కొత్తపల్లిలో ఒకప్పుడు.. ● కీర్తన : ఓ భామ..అయ్యో రామ.. ● కీర్తిక : 3బీహెచ్‌కే ● మారుతి : ఏం మాయ చేశావే ● సూర్యమహల్: కన్నప్ప ● ఎస్వీసీ (రామలక్ష్మణ): మై బేబీ ● సన్‌మార్క్స్: సూర్య సన్నాఫ్ కృష్ణన్ ● సరస్వతి : జూనియర్

-న్యూస్‌టుడే, పాతబస్టాండ్

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

సమస్య: సప్తపురాల్లో తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నాం. **- సుజాత, స్థానికులు**

సమాధానం: తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం.

– జాన్సన్, మున్సిపల్ ఏఈ, ఆమదాలవలస

సమస్య: పట్టణంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. **- మోహనరావు, స్థానికులు**

సమాధానం: చర్యలు చేపడతాం.

- బాలరాజు, ఎస్సై, ఆమదాలవలస

సమస్య: ఐజేనాయుడు కాలనీలో మురుగు కాలువల్లో పూడిక నిండటంతో దోమల బెడద అధికంగా ఉంది. **- వైకుంఠరావు, స్థానికులు**

సమాధానం: పరిశీలించి పూడిక తొలగిస్తాం. **- టి.రవి మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస**

– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

సమస్య: పొన్నాంపేటలో కొంతకాలంగా పూడిక తొలగించకపోవడంతో కాలువల్లో మురుగు నీరు నిల్వ ఉంటోంది. **- గ్రామస్థులు**

సమాధానం: తక్షణమే తొలగించే విధంగా చర్యలు చేపడతాం.

- గోపాలరావు, ఈవోపీఆర్డీ, ఆమదాలవలస

– న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

గార(కొర్లాం), ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. గార మండలం కొర్ని, కొర్లాం, కొమరవానిపేట పంచాయతీల్లో ఆదివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొర్నిలో వజ్జ సూర్యనారాయణతో పాటు పలువురు ఎమ్మెల్యే సమక్షంలో తెదేపాలో చేరారు. ★ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం అక్కివలస పంచాయతీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆమదాలవలస నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. నాయకులు రామ్మోహనరావు, సీతారాం, హరి, హనుమంతు బాలకృష్ణ, మండలాధ్యక్షులు రాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్, నారాయణపురం ప్రాజెక్టు ఛైర్మన్ డిల్లేశ్వరరావు, అమ్మాజీ పాల్గొన్నారు.

అక్కివలసలో ర్యాలీ చేపట్టిన ఎమ్మెల్యే కూన రవికుమార్

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

కొండపై స్థలం ఆక్రమణ

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: చిట్టివలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సంగమేశ్వరస్వామి కొండను తవ్వి ఎర్రమట్టిని అక్రమంగా తొలగించి సుమారు ఎకరా స్థలం ఆక్రమించుకున్నారని గ్రామస్థులు ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆదివారం అక్కివరం పంచాయతీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ప్రచారం చేస్తున్న సమయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. సంగమేశ్వరస్వామి కొండ ఆక్రమించుకుని పట్టా చేయించుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే ఆక్రమణలపై పరిశీలించాలని ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

అమ్మా..! బడికెళ్లాలంటే భయం వేస్తోంది..

– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

బడికి వెళ్లాలంటే భయం.. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని.. గదిలో కూర్చొని పాఠం విందామంటే ఆందోళన... పైకప్పు పెచ్చులు ఎక్కడ ఊడిపడిపోతాయేమోనని.. సరదాగా ఆడుకోవడానికి మైదానంలోకి వెళ్లాలంటే తడబాటు.. పాఠశాల ఆవరణలోని శిథిల భవనాలు ఎప్పుడు కూలుతాయేమోనని.. ఇలా బిక్కుబిక్కుమంటూ చదువులు సాగిస్తున్నారు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు. ఆమదాలవలస నియోజకవర్గంలో పలు బడుల్లో కూలడానికి సిద్ధంగా ఉన్న పాత భవనాల కూల్చివేతకు సంవత్సరాల తరబడి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ఇదీ పరిస్థితి..

★ ఆమదాలవలస మండలంలో 34 పాఠశాలలకు మొదటి విడతలో నాడు-నేడు నిధులు మంజూరయ్యాయి. వాటి పనులు పూర్తి చేశారు. రెండో విడతలో 26 పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయి. వీటికి శంకుస్థాపనలు చేశారు కానీ పనులు ఇంకా ప్రారంభించలేదు. బొబ్బిలిపేట, సీపానపేట గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ★ సరుబుజ్జిలి మండలంలో బప్పడాం, బురిడివలసకాలనీ, అమృతలింగానగరం, రావివలస, పాలవలస, సుభద్రాపురం, రొట్టవలస, వీరభద్రాపురం, సుబ్బపేట, తదితర పాఠశాలల్లో గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షం పడితే చాలు బురిడివలసకాలనీ పాఠశాలలో శ్లాబు పెచ్చులు పడి పై నుంచి నీరు కారుతోంది.

★ పొందూరు మండలంలో ఎరుకలకాలనీ, బాపిరాజుపేట ప్రాథమిక పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా చాలు పాఠశాలల్లో నీరు చేరుతోంది.

నిధుల సమస్య..

2021 మేలో ఎంపీడీవో, ఎంఈవో, ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో భవనాల బాగుకు కమిటీ వేశారు. పాఠశాలల్లో శిథిల భవనాలను పరిశీలించి అవసరమైతే అక్కడ ఉపాధ్యాయులు అనుమతి ధ్రువీకరణ పత్రం తీసుకుని తొలగించాలి. ఒక్కో భవనాన్ని తొలగించడానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు అవుతుందని అంచనా. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో అవి అలాగే ఉండిపోయాయి. దీంతో కొన్ని చోట్ల వినియోగానికి దూరంగా ఉంచగా.. మరికొన్ని చోట్ల తప్పని పరిస్థితుల్లో వాటిలోనే తరగతులు నిర్వహిస్తున్నారు.

సుబ్బపేటలో తొలగించని శిథిల పాఠశాల భవనం

★ బూర్జ మండలం మండలంలో నారాయణపురం, పి.ఎల్.దేవిపేట ప్రాథమిక పాఠశాలలు, ఉప్పినవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటికి నాడు-నేడు కింద నిధులు కేటాయించకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.

ఉన్నతాధికారులకు నివేదించాం

శిథిలమైన పాఠశాలల స్థలాల్లో నాడు-నేడు కింద భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు వేసవి సెలవులకు ముందు నివేదిక పంపించాం. ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు రాలేదు. నిధులు మంజూరు కాగానే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– డి.బాలరాజు, రాజేంద్రప్రసాద్, శ్రీరాములు, శ్యామసుందరరావు,సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు, బూర్జ ఎంఈవోలు

కాలువలు శుభ్రం

స్పందనకు వందనం

చెవ్వాకులపేట వద్ద పురుషోత్తపురం-నైర ఛానల్ పూడిక పేరుకుపోవడంతో దిగువ ప్రాంతాలకు సాగునీరు అందే పరిస్థితి లేదు. దీనిపై ఈ నెల 18న 'దిగువకు నీరు వెళ్లేదెలా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ రూ.4.4 లక్షలు నిధులు మంజూరు చేయించారని, వాటితో కాలువలో పూడికలు తొలగించామని ఏఈ శోభన్‌పాండే పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

తాగునీరు వృథా

శ్రీకాకుళం నగరంలోని కొత్తవంతెన వద్ద ఉన్న ఆటో యూనియన్ కార్యాలయం వద్ద కుళాయికి ట్యాప్ లేకపోవడంతో కొద్ది రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. నిత్యం ఉదయం, సాయంత్రం నీటి సరఫరా వేళల్లో ఇదే సమస్య తలెత్తుతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి. ప్రసాదరావును వివరణ కోరగా తక్షణమే నీటి వృథాను అరికట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

వీధుల్లో అంధకారం

పట్టణంలోని కొత్తకోటవారివీధి, మోనింగివారివీధి, ఐజేనాయుడుకాలనీ, పూజారిపేట ఇతర వీధుల్లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయంలో రాకపోకలతోపాటు దొంగల భయం అధికంగా ఉంటోందని ఆయా ప్రాంత నివాసితులు వాపోతున్నారు. సమస్య మున్సిపల్ కమిషనర్ టి.రవి వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

అల్లుకున్న నిర్లక్ష్యం

జి.సిగడాం మండలం జాడ గ్రామానికి వెళ్లే దారిలో విద్యుత్తు మినీ ట్రాన్స్‌ఫార్మర్‌కు పనికిరాని మొక్కలు అల్లుకున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పనికిరాని మొక్కలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై విద్యుత్తుశాఖ ఏఈ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, జి.సిగడాం

భవనం పూర్తయ్యేనా..!

పొందూరు మండలం వీఆర్ గూడెం పంచాయతీ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన సచివాలయ భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో అద్దె భవనంలో విధులు నిర్వహిస్తూ సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో మన్మథరావు వద్ద ప్రస్తావించగా గుత్తేదారులతో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

ప్రమాదకర గుంతలు

బూర్జ మండలంలోని తుడ్డలి, మర్రిపాడు, లక్కుపురం కూడలి, అప్పలపేట, టీఆర్‌రాజుపేట, కొల్లివలస తదితర గ్రామాల వద్ద ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ ఉండి గుంత కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని రహదారి భవనాలశాఖ జేఈఈ ఆంజనేయ నాయక్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, బూర్జ

శాకంబరిగా లలితాదేవి

శ్రీకాకుళం నగరం మొండేటి వీధిలోని లలితాదేవి సహిత శివ కామేశ్వరి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సకల జీవరాశుల ఆకలి తీర్చే శాకంబరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం జరిగిన లలితా సహస్ర నామ పారాయణ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర ఆలయంలో ఆదివారం సుబ్రహ్మణ్యస్వామికి విశేషపూజలు నిర్వహించారు. ఆడి కృత్తిక పర్వదినం సందర్భంగా క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణలతో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

విజేతలతో చౌదరి బాబ్జీ, నిర్వాహకులు

పాతబస్టాండ్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి చదరంగా పోటీలు ఉత్సాహంగా సాగాయి. 12 విభాగాల్లో జరిగిన పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 116 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహనరావు, రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ పోటీలను ప్రారంభించారు. చీఫ్ ఆర్బిటర్‌గా ఫణికుమార్ వ్యవహరించారు. విజేతలకు తెదేపా నాయకుడు చౌదరి బాబ్జీ చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. సీఎన్ఎన్ ట్రస్ట్ తరఫున క్రీడాకారులకు భోజన సదుపాయాలు కల్పించి.. ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ సభ్యులు సనపల భీమారావు, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి జామి రమేష్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సలహాదారు కె.వి.వి.శర్మ పాల్గొన్నారు.

విశ్రాంత ఇంజినీర్ మృతికి సంతాపం

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు పట్టణానికి చెందిన సువ్వారి **జగదీశ్వరరావు** (62) ఆదివారం స్వగృహంలో హఠాన్మరణం పొందారు. భార్య పార్వతి గృహిణి, ఈయనకు ఇద్దరు కుమార్తెలున్నారు. ఈయన జలవనరుల శాఖలో ఏఈఈగా ఉద్యోగం పొంది అంచెలంచెలుగా ఎదిగి వంశధార రిజర్వాయర్ డీఈఈగా పదోన్నతి పొంది పాయకరావుపేటలో 2025 మార్చి 31న ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం స్వగ్రామం పొందూరులో నివాసముంటున్నారు. ఈయన మరణంపై తనతోపాటు పనిచేసిన అధికారులు సంతాపం తెలిపారు.

క్రికెటర్ శ్రీరాం...

పాతబస్టాండ్: జిల్లాకు చెందిన సీనియర్ క్రికెటర్ మురళీ సోదరుడు బి.శ్రీరాం(క్రికెటర్) మృతిపై క్రికెట్ సంఘ సభ్యులు ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన ఆదివారం మృతి చెందారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో సభ్యులు వీవైఎన్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా, కోశాధికారి శైలానీ, ఉపాధ్యక్షులు టి.బాలమురళీకృష్ణ, మెంటార్ ఇలియాజ్ మహ్మద్, కౌన్సిలర్ రవికుమార్, సభ్యులు పాల్గొన్నారు.

బ్రూస్‌లీ వర్ధంతి

పాతబస్టాండ్: శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం బ్రూస్‌లీ వర్ధంతి నిర్వహించారు. నగరానికి చెందిన కరాటే శిక్షకులు దయామయ బ్రూస్‌లీ జీవిత విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహించి విద్యార్థులకు బెల్ట్‌లు అందజేశారు. సీనియర్ మాస్టర్స్ చిట్టి సూరి పాల్గొన్నారు.

బాలలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

బాలల సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా చూడాలని సత్యసాయి సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించిన బాలవికాస్ గురువుల శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలల్లో స్వయం సేవా కార్యక్రమాలు ప్రోత్సహిస్తూ వారికి సలహాలు, సూచనలు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు, శశికాంత్, లాడే చంద్రశేఖర్, రవీంద్రబాబు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

శుద్ధజల యంత్రాల అందజేత

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం శ్రీకాకుళం నగరానికి చెందిన బరాటం మణికంఠ ఉపకరణాలను సమకూర్చారు. మూడు శుద్ధజల యంత్రాలు, రిఫ్రిజిరేటర్‌లను ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ సమక్షంలో ఆదివారం అందజేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి.. వారిని ఆశీర్వదించారు. – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

ఉపకరణాలు అందిస్తున్న దాతలు

కంటి వైద్య శిబిరానికి స్పందన

లావేరు: మురపాకలో వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 74 మందికి కంటి పరీక్షలు చేపట్టగా 22 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసి విశాఖపట్నం తరలించారు. సంఘం అధ్యక్షుడు బాలి శ్రీనివాస్ నాయుడు, సర్పంచి ప్రతినిధి లక్ష్మణరావు, ఎంపీటీసీ ప్రతినిధి సురేష్ పాల్గొన్నారు.

రద్దీ ప్రదేశాల్లో విస్తృత తనిఖీలు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, పొందూరు/గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని రద్దీ ప్రదేశాల్లో ఆదివారం పోలీసు జాగిలాలతో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్సైలు హరికృష్ణ, రామారావు, సెర్చ్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు. పొందూరులోని రామ్మోహన్ నాయుడు కాలనీలో ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దూర ప్రాంతాలకు ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

జూదరుల అరెస్టు.. ఎచ్చెర్ల: షేర్‌మహ్మద్‌పురం పంచాయతీ సమీపంలో జూదమాడుతున్న ఎనిమిది మందిని ఆదివారం ఎచ్చెర్ల పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ. 21,130 నగదు, ఏడు చరవాణులు, మూడు ద్విచక్ర వాహనాలు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై-2 ఎం.అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా పశువుల తరలింపు

సరుబుజ్జిలి మండలంలోని ఆదివారం అలికాం-బత్తిలి రహదారిలో కొందరు వ్యాపారులు పోలీసులకు కళ్లు కప్పి వ్యానుల్లో పశువులను అక్రమంగా తరలిస్తున్నారు. స్థానిక పోలీసులు పలుమార్లు పశువుల వాహనాలను పట్టుకుని గోశాలలకు అప్పగించినా వ్యాపారుల ఆగడాలకు అడ్డులేకుండా పోతోంది. ఈ విషయాన్ని ఎస్సై బి.హైమావతి వద్ద ప్రస్తావించగా రోజూ అలికాం-బత్తిలి రహదారిలో సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తున్నాం. పట్టుబడితే కేసు నమోదు చేసి వారి నుంచి అపరాధ రుసుం వసూళ్లు చేస్తూ, వాహనాన్ని సీజ్ చేస్తున్నామన్నారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Vizianagaram Branch-I, Vizianagaram**, I issue the following notice to general public. My client intends to grant loan to **Mr. VARUDU DEVI PRASAD** S/o Babji Rao by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULES OF THE PROPERTY

Item no.01: (Property covered under document No. 9867/2021) Srikakulam District, Srikakulam Sub-District, Srikakulam Town, Srikakulam Municipality/Corporation, Fhajulbegh peta village accounts, as per the Correlation certificate of Srikakulam Tahsildar, SR No.06/20201/B dated 04.06.2021 S.No.100/4 part, Purushotham Nagar Colony, (NGGOS Colony) Western side Second Main Road, Southern side 5th Cross Road, Plot No.212 site measuring East to West 48 feet or 14.631 meters and North to South 70 feet or 21.336 meters totaling 373.33 Sq. yards or 312.15 Sq. meters nearby D.No.16-22-24 is bounded by:

East	Second Main Road
South	Plot no.185 belongs to PLN Patnaik
West	Plot no.213 belongs to V Sanyasamma
North	5th Cross Road

Item No.02: (Property covered under document No.21947/2024) Srikakulam District, Srikakulam Sub-District, Srikakulam Town, Srikakulam Municipality/Corporation area, Balaga Ward, T.S. No.1950-3B, R.S. No.11 part, Western side of One Way Traffic road, previously D.No.7-3-12/1, assessment No.1085005540 presently vacant site consisting of three items are measured and bounded by:

Item no.01: East to West 51 feet or 15.544 meters, North to South 18.4 feet or 5.608 meters totaling 103.87 Sq. yards or 86.84 Sq. meters of vacant site and adjacent to it on Eastern side as **Item no.02** East to West 72 feet or 21.924 meters, North to South on Eastern side 18.4 feet or 5.58 meters and Western side 17 feet or 5.176 meters totaling 141.32 Sq. yards or 118.143 Sq. meters of vacant site and adjacent to Item nos. 1 & 2 on Northern side **Item no.03** East to West 126.6 feet or 38.557 meters and North to South 34.4 feet or 10.463 meters totaling 482.527 Sq. yards or 403.455 Sq. meters and item Nos. 1 to 3 totaling 727.717 Sq. yards or 608.466 Sq. meters of vacant into a single bit bounded by:

East	One way traffic road
South	Site of vendor to some extent and RCC building of Karakavalasa Chandra Mouli
West	Compound wall of Vijaya Lakshmi
North	Compound wall of L Venugupala Rao

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates, S-2, Bharat Apartments, Behind Rythu bazar, Seethammadhara, Visakhapatnam-13. Mobile No. **9885166648**
Mail: **sreenivaskoduri@gmail.com**

Visakhapatnam Dt.21.07.2025

వాన రాక.. చెరువులు నిండక..

ఆందోళనలో అన్నదాతలు

– న్యూస్‌టుడే, రణస్థలం

ఖరీఫ్ సాగు సమయం మించుతోంది. ఈ పాటికే వరి సాగుకు నారుమడులు వేసి దమ్ములకు సిద్ధంగా ఉండాలి. ఇప్పటికీ చెరువుల్లో చుక్కనీరు చేరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత మూడేళ్లుగా జులై నాటికి విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు నిండేవి. ఈ ఏడాది ముసురు నెలకొని తుపర్లు పడటం తప్ప నీరు చేరకపోవడంతో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకమైంది.

★ నియోజకవర్గంలో అన్ని మండలాల రైతులు వర్షంపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టులు ద్వారా సాగునీరందుతుందని వారు ఆశ పడినప్పటికీ అవి అడియాసలయ్యాయి. తోటపల్లి కాలువలు అభివృద్ధి పనులు చేయకపోవడంతో శివారు ప్రాంతానికి నీరు రావడం లేదు. గత తెదేపా ప్రభుత్వంలో తోటపల్లి నీరు కొంతమేర వచ్చినప్పటికీ తర్వాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు.

★ ఎచ్చెర్ల మండలంలో కొంతమేర నారాయణపురం కుడికాలువ ద్వారా సాగునీరందుతోంది. రణస్థలం, లావేరు మండలాలు పూర్తిగా వర్షంపైనే ఆధారపడి ఉన్నాయి. వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, తోటపల్లి నీరు వచ్చే సూచన లేకపోవడంతో రైతులు సరుగుడు, నీలగిరి, ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పత్తి సాగు వైపు మళ్లుతున్నారు. ఈ ఏడాదైనా తోటపల్లి ద్వారా సాగునీరు వస్తే భూగర్భ జలాలు వృద్ధి చెందడమే కాకుండా సాగుకు మేలు చేకూరుతుందని భావిస్తున్నారు. జిల్లాలోనే అత్యధికంగా నియోజకవర్గంలో సాగునీటి చెరువులున్నాయి. 1073 సాగు నీటి చెరువులు కింద 31,674 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది.

చుక్కనీరు లేని తోటపల్లి కాలువ

రణస్థలం వ్యవసాయ సబ్‌డివిజనులో జులైలో పడిన వర్షపాతం వివరాలు

సంవత్సరం	సాధారణ	పడిన వర్షపాతం (మి.మీల్లో)
2022	830.2	1,114.9
2023	830.2	904.3
2024	830.2	1,119.0
2025 ఇప్పటివరకు	830.2	321.2

ఈ ఏడాది వర్షపాతం తక్కువే..

గత మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది వర్షపాతం తక్కువగానే ఉంది. తోటపల్లి నీరొస్తేనే కొంతమేర సాగుకు సానుకూలంగా ఉంటుంది. లేకుంటే సాగుకు ఇబ్బందికరమే.

- వి.శ్రీనివాసరావు, ఏడీఏ, రణస్థలం

ఆరో తేదీనే విడిచిపెట్టాం..

ఈనెల ఆరో తేదీనే తోటపల్లి నీరు విడిచిపెట్టాం. శనివారం నాటికి శ్రీకాకుళం బ్రాంచి కాలువ ప్రారంభ ప్రాంతం చీపురుపల్లి మండలం పుర్రేయవలసకు చేరుతుంది. వారం రోజులపాటు బ్రాంచి కాలువ ద్వారా రణస్థలం, లావేరు ప్రాంతానికి విడిచిపెడతాం. ప్రవాహం తక్కువగా ఉన్నందున నెమ్మదిగా వస్తోంది.

- లావణ్య, డీఈ, తోటపల్లి ప్రాజెక్టు

హామీలు అమలు చేయలేదు..

తిరుపతిపాలెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైకాపా నాయకులు

రణస్థలం: కూటమి పాలనతో రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని వైకాపా నాయకులు ఎద్దేవా చేశారు. ఆదివారం తిరుపతిపాలెంలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, నాయకులు రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోండి

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విధున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్ష రాజకీయ చర్యలు మానుకోవాలని హితవు పలికారు. ఎలాంటి ఆధారాలు లేకుండా సిట్ పేరుతో అక్రమంగా కేసులు బనాయించి వారిని అరెస్టులు చేయడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు జశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

కరుణించమ్మా.. ముత్తు మారియమ్మ

పాల బిందెలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ఆడి మాసం గత శుక్రవారం ప్రారంభమైంది. ఈ క్రమంలో చెన్నై కొరట్టూర్‌లోని ముత్తు మారియమ్మన్ ఆలయంలో ఆడి మాసం మొదటి ఆది వారం సందర్భంగా భక్తులు 1008 పాల బిందెలతో ఊరే గింపుగా వెళ్లి క్షీరాభిషేకం నిర్వహించారు. కొందరు భక్తులు నోటిలో శూలాలు గుచ్చుకొని వేపాకు చేత పట్టుకొని భక్తిశ్ర ద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రీ కపాల కాళియమ్మన్‌కు క్షీరాభిషేకం

ప్యారిస్: విరుదునగర్ జిల్లా కారియాపట్టి వద్ద 16 అడుగుల ఎత్తైన శ్రీ కపాల కాళియమ్మన్ విగ్రహం ఉంది. ఈ విగ్రహానికి ఆదివారం క్షీరాభిషేకం జరిగింది. ముందుగా మహిళలు 1008 పాల కుండలతో ఊరేగిం పుగా వచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పిల్లలు వివిధ దేవతామూ ర్తుల వేషాలతో పాల్గొన్నారు.

కపాల కాళియమ్మన్ విగ్రహం ఎదుట పాల కుండలతో..

ఊళ్లకు ఉపాధి దొరికింది!

అభివృద్ధికి కీలకంగా ఉన్న తూత్తుకుడి ఓడరేవు

ఊరు మారాలంటే.. ముందు మనం ఏకం కావాలి అనుకున్నారు అక్కడి ప్రజలు. ఎన్ని వర్గాలున్నా, ఎన్ని గొడవలున్నా.. రాజీకి వచ్చారు. ఐక్యంగా మంచి కోరుకున్నారు. ఇది ఎంతటి మార్పును తెచ్చిందంటే.. ఆ గ్రామాలకు అభివృద్ధి పరిగెత్తుకుంటూ వచ్చేలా చేసింది. ఇలాంటి గ్రామాలు తమిళనాడులో చాలానే ఉన్నాయి. ప్రధాన కంపెనీలు, పారిశ్రామికవాడల్ని తీసుకొచ్చేలా రాష్ట్ర యంత్రాంగం ప్రయత్నాలు మొదలుపెట్టింది. - ఈనాడు-చెన్నై

- ◆ ప్రజల ఐకమత్యంతో నెలకొంటున్న కంపెనీలు
- ◆ ప్రధానంగా దక్షిణాది జిల్లాల్లోనే
- ◆ పని కోరే గ్రామాలకు మంచిరోజులు

తలరాతలు మార్చుకున్నారు

ఒక్క కరిసాల్కుళం గ్రామమే కాదు, ఇలా మారిన గ్రామాలు, తల రాతల్ని మార్చుకున్న గ్రామాలు తమిళనాడులో చాలానే ఉన్నాయి. ప్రత్యేకించి దక్షిణాది జిల్లాల్లో ఈ తరహా గ్రామాలు ఎక్కువ. అక్కడి ప్రజలు ఐకమత్యంతో అభివృద్ధిని కోరుకోవడం, నేతల మీద ఒత్తిడి తీసుకురావడంతో చాలా ప్రాంతాలు ఉపాధి వనరులుగా మారాయి. ఈ విషయాన్ని పరి శ్రమలశాఖ సైతం స్పష్టం చేసింది.

30శాతం నిధుల వాటా

'గత నాలుగేళ్లలో రాష్ట్రం రూ.7.51 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడుల్ని ఆకర్షించింది. ఇందులో 30 శాతం వాటా దక్షిణ జిల్లాల పరిధిలోని గ్రామాలకు చెందుతోంది. ఇందులో ప్రధానంగా తిరునెల్వేలి, తెన్ కాశి, తూత్తుకుడి, రామనాథపురం, కన్నియాకుమరి జిల్లాలున్నాయి. దశాబ్దాల తరబడి వివిధ సమస్యలతో సతమత మైన గ్రామాలు ఇప్పుడు పెట్టుబడుల కేంద్రాలుగా మారుతు న్నాయి. ఇది తమిళనాడు ప్రజలు సాధించిన విజయం' అని పరి శ్రమలశాఖలోని 'గైడెన్స్ తమిళనాడు' విభాగం వివరించింది.

హోసూరు సమీపంలోని ద్విచక్ర వాహనాల తయారీ పరిశ్రమలో యువతులు

దిగ్గజ కంపెనీల రాక

◆ ఆశ్చర్యకరంగా పలు దిగ్గజ కంపెనీలు చెన్నైని దాటి గ్రామాలకు వెళ్లి పరిశ్రమల్ని ఏర్పాటుచేస్తున్న విషయాన్ని పరిశ్రమలశాఖాధి కారులు ప్రస్తావించారు. ప్రపంచంలోనే పేరొం దిన విన్‌ఫాస్ట్, జబిల్ లాంటి సంస్థలు గ్రామా ల్లోనే తమ కంపెనీలను పెడుతున్నాయని గుర్తుచేశారు.

◆ తూత్తుకుడి సమీపంలోని గ్రామాల పరి ధిలో విన్‌ఫాస్ట్ సంస్థ ఏర్పాటవుతోందన్నారు. ఇప్పటికే పరిసర గ్రామాల్లోని 344 పాలిటెక్నిక్ విద్యార్థుల్ని ఎంపికచేసి శిక్షణలు కూడా మొద లుపెట్టిందని చెప్పారు. వీరినుంచి 200మందిని ఎంపికచేయనున్నారు.

◆ పెరంబలూరు, కళ్లకురిచ్చి, తిరువణ్ణా మలై జిల్లాల్లోని గ్రామాల్లోకి నాన్‌లెదర్ ఫుట్‌వేర్ కంపెనీలు వస్తున్నాయి. ప్రత్యేకించి ఇక్కడి గ్రామీణ మహిళలకు పెద్ద ఎత్తున ఉపాధి వచ్చేలా ప్రణాళికలు చేస్తున్నారు.

◆ ఆయా గ్రామాలకు దగ్గర్లోనే పోర్టు వసతి ఉండటం, భూముల్ని ఇవ్వడానికి ప్రజలు ముందుకురావడం, అనువైన వాతావరణం ఉండటం ఇవన్నీ లాభించాయని వివరించారు. ఆ పరిసర గ్రామాలవారికి ఇప్పుడు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని అన్నారు.

మత గొడవలు అంతం

తిరునెల్వేలి జిల్లా చిత్తారు నది ఒడ్డునున్న చిత్తార్‌చత్రం పరిధి కరిసాల్కుళం గ్రామంలో ఏళ్లతరబడి మత గొడవలు జరిగాయి. ఊరిలోనే వర్గాలుగా విడి పోయి కొట్టుకునేవారు. ఆ గ్రామంలో అడుగు పెట్టాలంటేనే భయపడేవారు. అనూహ్యంగా అక్కడి ప్రజల్లో వచ్చిన మార్పు, నెలకొన్న శాంతి.. చుట్టుపక్కల వారందరికీ వరమైంది. దగ్గర్లోనే పారి శ్రామికపార్కును ప్రభుత్వం ఏర్పాటుచే సింది. దిగ్గజ కంపెనీలు టాటా సోలార్, యోకోహమా, బ్రిటానియా, బోష్ లాంటి పరిశ్రమలు అక్కడికొచ్చాయి. క్రేన్లు తిరుగుతున్నాయి, కార్గో వాహనాలు నడుస్తున్నాయి. ఏటా యువతకు ఉపా ధికల్పన కోసం ఇంటర్వ్యూలు జరుగు తున్నాయి. ఉద్యోగాలొచ్చాయి. ఊరికి ఐటీ, ఈ-గవర్నెన్స్ కార్యక్రమాలు వచ్చాయి. ఒకప్పుడు గొడవలతో నర కాన్ని చూపిన ఆ గ్రామం.. ఇప్పుడు ఐకమత్యంతో భారీ పెట్టుబడుల్ని ఊరికి వచ్చేలా చేసుకుంటోంది.

కరిసాల్కుళం గ్రామ సమీపంలో ఏర్పాటైన పారిశ్రామికవాడ

నగరాలపై భారం తగ్గేలా..

రాష్ట్రంలో చెన్నై, కోయంబత్తూరు లాంటి నగరాల్లోనే కంపెనీలు, తయారీ పరిశ్రమలు కేంద్రీకృతం కాకుండా బయటి ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు రాష్ట్రం ఆసక్తి చూపుతోందని అధికారులు వెల్లడిం చారు. తద్వారా ప్రధాన నగరాలపై భారం తగ్గుతోందని చెప్పారు. ప్రత్యేకించి దక్షిణ తమిళనాడు జిల్లాలు ఈ అవకాశాన్ని బాగా అంది పుచ్చుకొంటున్నట్లు గుర్తుచేశారు. రానున్న రోజుల్లో గ్రామాల స్వరూపమే మారిపోనుందని వారు వ్యాఖ్యానించారు.

ప్రచారంలో మాట్లాడుతున్న పళనిసామి

అధికారంలో భాగస్వామ్యం ఇవ్వడానికి మూర్ఖులం కాదు

ఆర్కేనగర్: అధికారంలో భాగస్వామ్యం ఇవ్వడానికి తాము మూర్ఖులం కాదని అన్నాడీఎంకే ప్రధాన కార్య దర్శి ఎడప్పాడి పళనిసామి తెలిపారు. 'మక్కలై కాప్పోం- తమిళగత్తై మీట్పోం' పేరుతో ఆయన చేప ట్టిన రాష్ట్రవ్యాప్త పర్యటన తిరువారూర్ జిల్లా తిరుత్తురై పూండిలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే విజయం సాధిస్తే భాజపాకు అధికారంలో భాగస్వామ్యం ఇస్తారని ముఖ్యమంత్రి స్టాలిన్ చెబుతున్నారని, అలా చేయడానికి తామేమీ మూర్ఖులం కాదన్నారు. అన్నాడీఎంకే అధిక స్థానాల్లో గెలిచి ఒంటరిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. మీలా వారసుల కోసం అధికారంలోకి రావాలని ఆరాట పడటం లేదన్నారు. మీరు పొత్తు పెట్టుకున్నప్పుడు మాత్రం భాజపా మంచి పార్టీ అని, తాము పొత్తు పెట్టుకుంటే మతవాద పార్టీనా? అని ప్రశ్నించారు.

విజయావకాశాలపై పార్టీల రహస్య సర్వేలు

సైదాపేట, న్యూస్‌టుడే: రానున్న అసెంబ్లీ ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సన్నద్ధమవు తున్నాయి. అధికార, ప్రతిపక్షాలైన డీఎంకే, అన్నా డీఎంకే కూటముల మధ్యే ప్రధానంగా పోటీ ఉండే అవకాశం ఉంది. ఎప్పటిలాగే నామ్ తమి ళర్ కట్చి ఒంటరిగానే బరిలోకి దిగనుంది. కొత్తగా పార్టీ పెట్టిన విజయ్ అన్నాడీఎంకే కూట మిలో చేరుతారా? లేదా కొత్త కూటమి ఏర్పాటు చేస్తారా? ఒంటరిగా పోటీ చేస్తారా? అన్న ప్రశ్నపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే విజయ్ అన్నాడీఎంకే కూటమిలోకి వెళ్తే విజయం తథ్య మని రాష్ట్ర రాజకీయ వర్గాల భోగట్టా. ఇప్పటికే డీఎంకే, అన్నాడీఎంకేలు ప్రచారాలు ప్రారంభిం చాయి. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి 'మక్కలై కాప్పోం- తమిళగత్తై మీట్పోమ్' పేరుతో రాష్ట్ర వ్యాప్త పర్యటన చేపట్టారు. ప్రచార సమావేశాల్లో తమ కూటమిలోకి కొత్త పార్టీలు రానున్నట్లు ఆయన చెబుతూ వస్తున్నారు. తమ పార్టీ 200కు పైగా నియోజకవర్గాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తమ కూటమిలోకి వచ్చే పార్టీలను రత్న తివాచీ పరిచి స్వాగతిస్తా మని చెబుతున్నారు. ఎన్నికలకు ఇంకా 8 నెలలే ఉన్నందున ప్రధాన పార్టీలన్నీ ప్రజల మానసిక స్థితి, ఎన్నికల్లో విజయావకాశాలు తదితర విష యాల గురించి ప్రైవేటు ఏజెన్సీల ద్వారా సర్వేలు నిర్వహిస్తున్నాయి. డీఎంకేకు సంబంధించినంత వరకు అధికార పార్టీ అయినందున నిఘా సంస్థల ద్వారా ఎప్పటి సమాచారం అప్పుడు అందుతోంది. అంతేకాకుండా శబరీశన్‌కు చెందిన పెన్ టీమ్ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సర్వే నిర్వహిస్తోంది. అలాగే టీవీకే కోసం ఆదవ్ అర్జున తన 'వాయిస్ ఆఫ్ కామన్' సంస్థ ద్వారా సర్వే చేయిస్తున్నారు. అన్నాడీఎంకే కోసం ఎడ ప్పాడి పళనిసామి కుమారుడు మిథున్ ఓ ఏజెన్సీ ద్వారా సర్వే నిర్వహిస్తున్నట్లు సమా చారం. ఆ ఏజెన్సీ మూడు నెలలకోసారి రాజ కీయ స్థితిగతులకు తగ్గ ఎన్నికల పరిస్థితులను అంచనా వేసి సమాచారం అందిస్తున్నట్లు తెలు స్తోంది. అందుకు తగ్గట్లు ఎడప్పాడి పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ ఆధ్వర్యంలో జర్నలిజం ఇన్‌స్టిట్యూట్

వడపళని, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరం నుంచి కొత్తగా జర్నలిజం ఇన్‌స్టిట్యూట్‌ను చెన్నైలో ప్రారంభించనుంది. జర్నలిజంపై ఆసక్తి, అభిరుచి ఉన్న యువతకు 'ది చెన్నై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జర్నలిజం' ద్వారా ఏడాదిపాటు 'డిప్లొమా ఇన్ జర్నలిజం' కోర్సును అందించనుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.7.75 కోట్ల నిధులు మంజూరు చేసినట్టు శనివారం అధికారిక ప్రకటన విడుదలైంది. హిందూ ఆంగ్ల దినపత్రిక మాజీ ఎడిటర్ ఎన్.రవి గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్‌గా, హిందూ దినపత్రిక పాఠకుల మాజీ ఎడిటర్ ఏఎస్ పన్నీర్‌సెల్వన్ ఎడిటర్‌గా వ్యవహరిస్తారు.

వన్నియర్లకు వెంటనే రిజర్వేషన్లు కల్పించాలి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసి 1200 రోజులైనా వన్నియర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇంకా 10.5శాతం రిజర్వేషన్లు కల్పించలేదని ఆరోపిస్తూ ఆదివారం విళుపురంలో పీఎంకే అన్బుమణి వర్గం తరఫున ఆందోళన చేపట్టారు. దీనికి అన్బుమణి నేతృత్వం వహించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున విళుపురం, కళ్లకు రిచ్చి జిల్లాలకు చెందిన కార్యకర్తలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆందోళనలో మాట్లాడుతున్న అన్బుమణి

సేలంలో టీవీకే తొలి ప్రచార బహిరంగ సభ నేడు

చెన్నై, న్యూస్‌టుడే: టీవీకే తొలి ప్రచార బహిరంగ సభ సేలంలో సోమవారం జరగ నుంది. ఆ మేరకు పార్టీ విడుదల చేసిన ప్రక టనలో... రాష్ట్ర ప్రజల సంక్షేమం దృష్ట్యా టీవీకే ప్రయాణంలో తర్వాతి దశగా పార్టీ లక్ష్యాలను, సిద్ధాంతాలను ప్రజల చెంతకు తీసుకెళ్లే చర్య లను ముమ్మరం చేసినట్లు తెలిపింది. ఆ మేరకు 5 జోన్లు, 120 పార్టీ జిల్లాలు, 12,500 శాఖ పార్టీలు వంటివాటిలో ప్రచార సభలను నిర్వ హించాలని కార్యవర్గ సమావేశం తీర్మానించిం దని పేర్కొంది. రాష్ట్ర స్థాయిలో భారీ ప్రచార తొలి బహిరంగ సభ సోమవారం సాయంత్రం 4 గంటలకు సేలంలోని నేతాజీ సుభాష్ చంద్ర బోస్ స్టేడియంలో జరగనుందని తెలిపింది. పార్టీ ప్రధానకార్యదర్శి బుస్సి ఆనంద్ నేతృ త్వంలో జరగనున్న సభలో పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను వక్తలు వివరిస్తారని పేర్కొంది.

'మై టీవీకే' యాప్ ఆవిష్కరణ వాయిదా

చెన్నై: టీవీకే సభ్యత్వ నమోదు కోసం రూపొం దించిన 'మై టీవీకే' యాప్ ఆవిష్కరణ కార్యక్రమం వాయిదా పడింది. వచ్చే శాసనసభ ఎన్నికల్లోపు పార్టీని బలోపేతం చేసేందుకు టీవీకే పలు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా సభ్యత్వ నమోదుకు 'మై టీవీకే' యాప్‌ను రూపొందించింది. దాని ఆవి ష్కరణ కార్యక్రమం, జిల్లా కార్యదర్శులతో సమాలో చన పనైయూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆది వారం జరగాల్సి ఉండగా వాటిని అనివార్య కారణా లతో వాయిదా వేశారు. ఈ కార్యక్రమాలు రానున్న 24న జరగనున్నట్లు సమాచారం.

డీఎస్పీ సుందరేశన్ సస్పెన్షన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: మైలాడుదుర్తై జిల్లా ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ సుందరేశన్‌కి కార్యాలయ పనుల నిమిత్తం అందజేసిన వాహనాన్ని ఉన్నతాధికారులు వెనక్కు తీసుకోవడంతో ఆయన తన ఇంటి నుంచి కార్యాలయానికి నడిచి వెళ్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ఇటీవల వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తాను లంచాలు తీసుకోకుండా నిజాయతీగా పనిచేసినందుకు తనకు కేటాయించిన వాహనాన్ని వెనక్కు తీసుకొని మానసికంగా హింసిస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులపై ఆరోపణలు చేసినందుకుగాను సుందరేశన్‌పై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా సస్పెండ్ చేస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

అమిత్‌షా పిడికిలి నుంచి అన్నాడీఎంకే తప్పించుకోలేదు

సెల్వ పెరుంతగై

చెన్నై, న్యూస్‌టుడే: అమిత్‌షా పిడికిలి నుంచి అన్నాడీఎంకే తప్పించుకోలేదని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై తెలి పారు. ఆయన తన ప్రకటనలో... 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నాటి ముఖ్యమంత్రి జయలలిత మోడీనా? లేడీనా? అంటూ తీవ్రంగా ప్రచారం చేశారని, 2016లో ఆమె మరణించే వరకు నీట్, ఉదయ్ విద్యుత్తు పథకం వంటి రాష్ట్ర ప్రజావ్యతిరేక పథకాలను నెరవేర్చడానికి నిరాకరించారని తెలిపారు. ఆమె మరణించిన తర్వాత ముఖ్యమంత్రి అయిన ఎడప్పాడి పళ నిసామి ఆ పథకాలకు పచ్చజెండా ఊపారని పేర్కొన్నారు. భాజపా కూటమిలో అన్నాడీఎంకే చేరాల్సిన నిర్బంధం గురించి ఇప్పటివరకు ఎడప్పాడి పళనిసామి వెల్లడించలేదన్నారు. ఇటీ వల మదురైలో జరిగిన మురుగన్ మహానాడులో తందై పెరియార్, అన్నాదురై వంటి నేత లను కించపరుస్తూ వీడియో విడుదల చేసినప్పుడు వేదికపై ఉన్న ఉదయకుమార్, వేలుమణి తదితర అన్నాడీఎంకే మాజీ మంత్రులు ఎందుకు మౌనం వహించారని ప్రశ్నించారు. పదేళ్ల అన్నాడీఎంకే హయాంలో రూ.4.18 లక్షల కోట్ల రుణం పొందిన నేపథ్యంలో రాష్ట్ర రుణభారం గురించి మాట్లాడే ఎడప్పాడి పళనిసామికి కేంద్ర భాజపా ప్రభుత్వ రుణం రూ.185లక్షల కోట్ల రుణం గురించి మాట్లాడే దమ్ము ఉందా? అని ప్రశ్నించారు. ఎడప్పాడి పళనిసామి తదితర మాజీ మంత్రులు అవినీతి ఆరోపణల్లో చిక్కుకుని ఈడీ, రెవెన్యూశాఖ పిడికిలిలో ఉన్నంతవ రకు అమిత్‌షా పిడికిలి నుంచి అన్నాడీఎంకే తప్పించుకోలేదని తెలిపారు.

పుదుచ్చేరి ప్రభుత్వ అవినీతిపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేయడానికి సిద్ధమైన కాంగ్రెస్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో ఎన్నార్ కాంగ్రెస్-భాజపా ప్రభుత్వ అవినీతికి సంబంధించి ఫిర్యాదు చేయడానికి కాంగ్రెస్ నేతలు ఈ వారం రాష్ట్రపతిని సమయం కోరారు. దీంతో రెండు రోజుల్లో దిల్లీ వెళ్లేం దుకు కాంగ్రెస్ నేతల బృందం నిర్ణయిం చింది. కూటమి ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం అవినీతి ఆరోపణలు చేస్తూనే ఉంది. మాజీ ముఖ్యమంత్రి నారాయస్వామి స్మార్ట్‌సిటీ పథకంలో అవినీతి, మద్యం తయారీ పరిశ్రమల అనుమతుల్లో అవకతవ కలు, ప్రజాపనుల శాఖలో 35శాతం కమి షన్, బాండ్ల జారీలలో లంచాలు, కోడిగుడ్ల కొనుగోలులో అవినీతి వంటి ఆరోపణలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కో శాఖలో అవినీతి జాబితాను సిద్ధం చేసి నేరుగా రాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు చేయడానికి కాంగ్రెస్ నేతలు నిర్ణయించారు. దీని గురించి కాంగ్రెస్ వర్గాలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు వైద్యలింగం నేతృ త్వంలో మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మాజీ మంత్రులు కందసామి, షాజ హాన్, కమలకన్నన్, మాజీ ఎమ్మెల్యేలు తది తర 20మందితో కూడిన బృందం రాష్ట్రప తిని కలిసి ప్రభుత్వ అవినీతి జాబితాను ఆధారాలతో ఇవ్వనున్నట్లు తెలిపింది. ఇందుకోసం 23 లేదా 24 తేదీల్లో రాష్ట్రపతి సమయం కోరారు. అదేవిధంగా రాష్ట్ర పరి స్థితులపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే లను కలిసి వివరించనున్నారు.

యువకుల్లో ద్రావిడ సిద్ధాంతాలను వ్యాప్తి చేయాలి

ఉదయనిధి

సైదాపేట, న్యూస్‌టుడే: ద్రావిడ సిద్ధాంతా లను యువకుల్లో వ్యాప్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పిలుపుని చ్చారు. ద్రావిడ సిద్ధాంతాలను యువకుల్లో వ్యాప్తి చేసేందుకు ద్రావిడ ఉద్యమ తత్వా లను యువతరం రక్త కణాల్లో చొప్పించేం దుకు ప్రారంభించిన డీఎంకే యుజవన విభాగం ప్రారంభించిన రోజు ఇదని పేర్కొ న్నారు. మదురై జాన్సీ రాణి పార్కులో విక సించిన మన యువజన విభాగం నేడు 46వ ఏడాదిలోకి ప్రవేశించిందని తెలిపారు. ముత్త మిళరిజ్ఞర్ కరుణానిధి మార్గదర్శకంలో మన ముఖ్యమంత్రి స్టాలిన్ ఏర్పాటు చేసిన యువ జన విభాగ కార్యదర్శిగా పనిచేస్తుండటం గర్వకారణమని తెలిపారు. క్షేత్ర స్థాయి లోనూ, విధానపరంగా యువజన విభాగ సేవలు ఎనలేనవన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే చారిత్రాత్మక విజయం సాధించేందుకు ఓరణియిల్ తమిళనాడును ఏకం చేద్దామని తెలిపారు.

నదిలో తేలుతున్న రసాయన వ్యర్థాలు

కాలుష్య కోరల్లో కుశస్థలి నది

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: చెన్నై ఎన్నూరు నౌకాశ్రయం వద్ద కుశస్థలి నది సముద్రంలో కలుస్తోంది. ఈ ప్రాంతంలో లెక్కకు మించి కర్మాగారాలు ఉన్నాయి. వీటి నుంచి వెలువడే వ్యర్థాలు కుశస్థలి నదిలోకి మళ్లించడంతో నది నీరు కలుషితమవుతోంది. దీంతో చేపలు లభించక జాలర్లు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. గత ఏడాది ఓ నౌక నుంచి లక్షలాది లీటర్ల నూనె లీకవడంతో సుమారు 3 నెలలపాటు చేపలు లభించక జాలర్లు ఉపాధి కోల్పోయారు. ఆ ఘటన నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో నది నీరు కలుషితమవడంతో వారు దిక్కుకోచని స్థితిలో పడ్డారు. వ్యర్థ జలాలను నదిలోకి మళ్లించే కర్మాగారాల యజమానులపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పాలనలో భాగస్వామ్యాన్ని కాంగ్రెస్ కోరుకుంటోంది

◆ ఎంపీ కార్తి చిదంబరం

ప్యారిస్, న్యూస్‌టుడే: కాంగ్రెస్‌కి కూడా అధికారంలో భాగ స్వామ్యం కావాలన్న ఆశ ఉందని ఎంపీ కార్తి చిదంబరం తెలిపారు. శివగంగై జిల్లా సింగంపుణరిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఎన్నికల్లో విజయం సాధించి అధికార పార్టీగా అన్నాడీఎంకే, ప్రతిపక్షంగా భాజపా ఉంటాయని మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీ అన్నారని, కానీ ఆయన బాధపడాల్సిన అవసరం లేదని, భాజపాతో ఎవరు కూటమి ఏర్పాటు చేసుకున్న ఓడిపోతా రని తెలిపారు. భాజపాతో పొత్తు పెట్టుకుంటే అన్నాడీఎంకేకి వచ్చే ఓట్లు కూడా తగ్గుతాయన్నారు. డీఎంకే ఇంటింటికీ వెళ్లి సభ్యులను చేర్చడం స్వాగతించదగ్గ విషయమన్నారు. దానినే కాంగ్రెస్ కూడా పాటించాలన్నారు. రాష్ట్రంలో కూటమి పాలన ఇంతవరకు రాలేదని, కానీ అధికారంలో భాగస్వామ్యం అనేది కాంగ్రెస్ కూడా కోరుకుం టోందని పేర్కొన్నారు.

తూత్తుకుడి విమానాశ్రయ పునరుద్ధరణ పనులు పూర్తి

◆ 28న పునఃప్రారంభించనున్న ప్రధాని

ప్యారిస్, న్యూస్‌టుడే: పునరుద్ధరించిన తూత్తుకుడి విమానాశ్ర యాన్ని ఈ నెల 28న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. తూత్తుకుడిలో 1992లో విమానాశ్రయాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం రూ.381 కోట్ల వ్యయంతో విస్తరణ పనులు చేపట్టారు. 1,350 మీటర్లుగా ఉన్న రన్‌వేని 3వేల మీటర్లుగా మార్చారు. ఒకే సారి 5 విమానాలను నిలిపేలా పలు వసతులతో పునరుద్ధరిం చారు. ప్రస్తుతం పనులు పూర్తి కావడంతో ప్రారంభోత్సవానికి సిద్ధ మైంది. ఈ నేపథ్యంలో ఈ నెల 28న పునరుద్ధరించిన విమానాశ్ర యాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ప్రధాని రాక సందర్భంగా తూత్తుకుడిలో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

అపరిపక్వంగా రాహుల్ వ్యాఖ్యలు: షణ్ముగం

చెన్నై, న్యూస్‌టుడే: ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు అపరిపక్వతను వెల్లడిస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం తెలిపారు. ఆయన తన ప్రకటనలో... మతవాద భాజపా, ఆర్.ఎస్.ఎస్‌కు వ్యతిరేకంగా లౌకికవాద పార్టీలను సమన్వయం చేయాల్సిన గురుతర బాధ్యత కాంగ్రెస్‌కు ఉందన్నారు. ఆర్.ఎస్. ఎస్., సీపీఎం పార్టీలను సిద్ధాంతపరంగా సమస్థాయిలో వ్యతిరేకించి పోరాడుతున్నానని కాంగ్రెస్ అగ్రనేత నేత రాహుల్‌గాంధీ చెప్పడం ఆయన అపరిపక్వతను వెల్లడిస్తున్నాయని తెలిపారు. మార్క్సిస్ట్ పార్టీ లేకుండా లౌకికవాద భద్రత సాధ్యమా? అని ప్రశ్నించారు.

పీఎంకే నుంచి ముగ్గురు ఎమ్మెల్యేల తాత్కాలిక తొలగింపు

సైదాపేట, న్యూస్‌టుడే: పీఎంకే నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలను తాత్కాలికంగా సస్పెండ్ అయ్యారు. ఆ ప్రకారం ఎమ్మె ల్యేలు శివకుమార్, సదాశివం, వెంకటేశ్వ రన్, న్యాయవాది బాలుని సస్పెండ్ చేస్తు న్నట్లు రామదాస్ మద్దతుదారుడు, పార్టీ అధిష్ఠాన కార్యదర్శి అన్బళగన్ ప్రకటిం చారు. పార్టీ నిబంధనల ప్రకారం వ్యవస్థా పకులు రామదాస్ అనుమతి, ఆదేశం లేకుండా పార్టీ తరఫున ఎలాంటి నిర్ణ యాన్నీ ఎమ్మెల్యేలుగాని, మిగతా ఎవరు గాని తీసుకోకూడదన్నారు. అయితే ఇటీ వలి కాలంగా పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు పీఎంకే శాసనసభాపక్ష నేత ద్వారా అధిష్ఠానానికి తెలిసింద న్నారు. దీనిని క్రమశిక్షణ కార్యాచరణ కమిటీకి పంపగా ఆ ముగ్గురు ఎమ్మె ల్యేలు, న్యాయవాది బాలుల తీరు పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తెలి సిందన్నారు. వారి నలుగురిపై సమగ్ర దర్యాప్తు జరగాల్సి ఉన్నందున వారిని పార్టీ కనీస సభ్యత్వం నుంచి తొలగిస్తు న్నట్లు ప్రకటించారు. విచారణ ముగిసే వరకు వారితో పార్టీ శ్రేణులు ఎలాంటి సంబంధాలు పెట్టుకోరాదని సూచించారు.

13 వైద్య కళాశాలల్లో కొత్త పీజీ కోర్సులు

● 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు ● ప్రభుత్వం ప్రతిపాదనలు

- న్యూస్‌టుడే, వడపళని

రాష్ట్రంలో 2026-27 విద్యా సంవత్సరం నుంచి 13 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్తగా పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) వైద్య కోర్సులను ప్రారంభించ డానికి ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు జరిగాయి. 13 కళాశాలల్లో 11 కళాశాలలు 2022లో స్థాపితమ య్యాయి. రెండు సంవత్సరాల క్రితం ప్రారంభ మైన 'కలైజ్ఞర్ సెంటినరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్(కేసీఎస్ఎస్‌హెచ్)'లో ప్రస్తుతమున్న పీజీ సీట్ల సంఖ్యను పెంచాలనుకుంటోంది. కొత్త కోర్సుల కోసం కావాల్సిన ఎసెన్షియాలిటీ సర్టిఫికె ట్ కూడా జారీ అయింది. 'నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ)' నుంచి అధికారిక ఆమోదం పొందడానికి దరఖాస్తు చేసుకునేందుకు 'డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(డీఎంఈ ఆర్)'కు అనుమతి కూడా లభించింది.

460 సీట్ల కోసం..

పుదుక్కోట్టై, కరూర్, రామనాథపురం, తిరు పూర్, తిరువళ్లూరు, నామక్కల్, విరుదునగర్, నీల గిరి, కల్లకురిచ్చి, దిండిగల్, నాగపట్నం, అరియ లూర్, కృష్ణగిరిలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశా లల్లో కొత్తగా 460 పీజీ సీట్ల కోసం ప్రతిపాదిం చింది. పుదుక్కోట్టై, కరూర్ మినహా మిగిలిన కళా శాలలు 2022లో కొత్తగా ప్రారంభమైనవే. ప్రభుత్వ కీల్పాక్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి అను బంధంగా ఉన్న కేసీఎస్ఎస్‌హెచ్ ప్రస్తుతం 38 పీజీ సీట్లతో నడుస్తోంది. ఇక్కడ నెఫ్రాలజీ, యూరాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, కార్డియాలజీ, అనస్థీషియాలజీ, రేడియోలజీ వంటి ఏడు కోర్సులలో అదనంగా 28 సీట్ల కోసం ప్రభుత్వం ప్రతిపాదించింది. 13 వైద్య కళాశాలల్లో ప్రతిపాదించిన కోర్సుల్లో జనరల్ మెడి సిన్, పీడియాట్రిక్స్, ఆర్థోపీడియాట్రిక్స్, ప్రసూతి, గైనకాలజీ, రేడియో డయాగ్నోసిస్, అనస్థీషియాల జీలో ఎండీ కోర్సులున్నాయి.



గిండిలోని కలైజ్ఞర్ సెంటినరీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

వైద్యుల అసంతృప్తి

ప్రభుత్వ ప్రతిపాదనపై కొందరు ప్రభుత్వ వైద్యులు.. ప్రభుత్వ ఓమందూరర్ మెడికల్ కాలేజీ, తమిళనాడు ప్రభుత్వ మల్టీసూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వంటి విద్యా సంస్థలను చేర్చకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సీట్ల పెరుగుదలను అందరికీ సమాంతరంగా చేసి ఉండాల్సిందని తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేశారు. రోగులు వచ్చే సంఖ్యను మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో కూడా సీట్లు పెరుగు తాయని ఆలోచించామని, కానీ పట్టించుకోలే దని అంటున్నారు. సర్వీసు డాక్టర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.రామలింగం మాట్లాడుతూ.. ప్రభుత్వం జూనియర్, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల ఉద్యో గాలను క్రమంగా తొలగిస్తోందన్నారు. ప్రస్తుత వైద్యుల కొరతను తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం పీజీలను తమ అవసరాలకు విని యోగించుకునే దిశగా పయనిస్తున్నట్టు కనిపి స్తోందని ఆయన పేర్కొన్నారు.

(c) eenadu

రాష్ట్రంలో హెచ్చుమీరిన అవినీతి: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: పోలీసు అధికారే సాక్ష్యం చెప్పేంతగా రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం ఆరోపించారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... నేడు డీఎంకే పాలనలో అన్ని శాఖల్లో అవినీతి పేరుకుపోయిందని చెప్పారు. మైలాడుదురై జిల్లా ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ సుందరేశన్ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. దీంతో డీఎస్పీపై ఉన్నతాధికారులు ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నట్లు, ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిసిందన్నారు. దీన్నిబట్టి పోలీసుశాఖలో అవినీతి పెరిగిపోయినట్లు తెలుస్తోందన్నారు. నిజాయతీపరులైన అధికారులపై ప్రతీకార చర్యలను అడ్డుకోవాలని డీఎంకే ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమావేశం

నాగేంద్రన్‌ను సత్కరిస్తున్న భాజపా నిర్వాహకులు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: అరియలూర్ జిల్లా గంగైకొండ చోళపురంలోని బృహదీశ్వరాలయంలో జరుగనున్న ఆడి మాస ఉత్సవంలో ఈనెల 27వ తేదీ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. ఇందుకుగాను ఏర్పాట్లను సమీక్షించడానికి ఏర్పాటైన సెంట్రల్ కమిటీ సమావేశాన్ని శనివారం సాయంత్రం అరియలూర్ జిల్లా గంగైకొండ చోళపురంలో నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కార్యకర్తలు, నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. తరువాత ఉత్సవంలో పాల్గొనడానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం కల్పించాల్సిన వసతులు, బందోబస్తు, తదితర అంశాలపై నిర్వాహకులతో చర్చించారు.

పోరాటాల నుంచి పార్టీ వరకు..

• కొనసాగిన వన్నియర్ సంఘ ప్రస్థానం • 37వ వసంతంలోకి అడుగిడిన పీఎంకే

- న్యూస్‌టుడే, సైదాపేట

రామదాస్ 1989లో స్థాపించిన పాట్టాలి మక్కల్ కట్చి ఈనెల 16వ తేదీ 37వ వసంతంలోకి అడుగుపెట్టింది. 1987లో ఎంజీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలం అది. ఓ వైద్యుడి నేతృత్వంలో వరుస రాస్తారోకోలు జరిగాయి. రహదారుల వెంబడి చెట్లను నరికేసి మరీ మార్గాలను అడ్డుకున్నారు. ఆ ఆందోళనలతో తమిళనాడులోని ఉత్తర జిల్లాలకు రవాణా స్తంభించింది. వారం రోజులపాటు జరిగిన ఆందోళనలను నియంత్రించలేక పోలీసులు చేతులెత్తేశారు. చివరిగా పోరాటాన్ని అణచివేసేందుకు తుపాకీ కాల్పులు జరిగాయి. అందులో 21 మంది మృతి చెందారు. నిరసనలకు పిలుపునిచ్చిన నాయకుడిని జైలులో పెట్టారు. ఆ పోరాటం ద్వారా యావత్ దేశాన్ని తిరిగి చూసేలా చేసిన వ్యక్తి మరెవరో కాదు వన్నియర్ సామాజికవర్గ రిజర్వేషన్ కోసం పోరాడిన రామదాస్.

రూ.2కే వైద్యం

1939లో విళుప్పురం జిల్లా కీళ్‌విసిరి అనే గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన రామదాస్ చెన్నైలోని ఓ వైద్య కళాశాలలో వైద్య విద్య చదివారు. దిండివనం ప్రభుత్వాస్పత్రిలో మూడేళ్లు పని చేశారు. తర్వాత పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతో సొంతంగా క్లినిక్ ప్రారంభించారు. రూ.2 ఫీజుతో ప్రజలకు వైద్యం చేశారు. తన దగ్గరకు వైద్యం కోసం వచ్చే నిరుపేదలకు ఉచితంగా చూడటమే కాకుండా వారికి బస్సు ఛార్జీలు కూడా ఇచ్చి పంపేవారు. ప్రగతిశీల ఆలోచనలు, సామాజిక న్యాయ దృక్పథం కలిగిన రామదాస్ తన వన్నియర్ సామాజిక వర్గం వెనుకబడి ఉండటాన్ని గమనించాడు.

పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్

20 శాతం తక్కువనే భావన

దీంతో 1980 జులై 20న వన్నియర్ సంఘాన్ని ప్రారంభించారు. అదే ఏడాది వన్నియర్లకు ప్రత్యేక రిజర్వేషన్ డిమాండ్ చేస్తూ మొదటి మహానాడు నిర్వహించారు. 1984లో చెన్నై మెరీనా తీరంలో ఆకలి పోరాటం, 1985లో చెన్నైలో లక్షలాది మందితో ర్యాలీ, 1986లో వివిధ సమయాల్లో వరుస ఆందోళనలు, ఎంజీఆర్‌కు వ్యతిరేకంగా నల్ల జెండాల నిరసన, ఒకరోజు రాస్తారోకో, రైల్‌రోకో అని చెప్పుకుంటూపోతే రామదాస్ చేసిన ఆందోళనలు అనేకం. రాష్ట్రంలో వన్నియర్లు ఎక్కువగా ఉండే ప్రాంతాలకు వెళ్లి వారితో మాట్లాడారు. సుమారు ఏడేళ్ల వరుస, కఠిన పోరాటాలను అప్పటి అన్నాడీఎంకే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. 1989లో డీఎంకే అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి అయిన కలైజ్ఞర్ కరుణానిధి వన్నియర్ సామాజిక వర్గం సహా 108 సామాజికవర్గాలను ఎంబీసీ అనే కొత్త జాబితాలో చేర్చి 20శాతం రిజర్వేషన్ కల్పించారు. దీన్ని కొంతమంది వన్నియర్ సంఘ నేతలు స్వాగతించినా తక్కువ రిజర్వేషన్ అని రామదాస్ తీవ్రంగా విమర్శించారు.

దళితుడికి ముఖ్య పదవి

తర్వాత వన్నియర్ సంఘాన్ని రాజకీయ పార్టీగా మార్చేందుకు రామదాస్ నిర్ణయించారు. ఆ ప్రకారం 1989 జులై 16న వన్నియర్ సంఘం పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) అనే రాజకీయ పార్టీగా అవతరించింది. చెన్నైలో జరిగిన పార్టీ ప్రారంభోత్సవంలో 10 లక్షల మంది పాల్గొన్నట్లు సమాచారం. ఆ కాలంలో ఒక పార్టీ ప్రారంభోత్సవంలో ఇంతమంది పాల్గొనడం అదే మొదటిసారి. మార్క్స్, అంబేడ్కర్‌లను తన మార్గదర్శకులుగా ప్రకటించిన రామదాస్.. ఒక దళితుడు తమ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉండొచ్చనే విధంగా పార్టీ బైలానా రూపొందించారు. ద్రావిడ పార్టీలనే చూస్తూ వచ్చిన రాష్ట్ర ప్రజల్లో కొంతమంది కళ్లకు పీఎంకే ప్రత్యామ్నాయంగా కనిపించింది. తమిళ భాష అభివృద్ధికి 'కొంగు తమిళ్ ట్రస్టు, 'అలై ఓసై' పత్రిక, మక్కల్ టెలివిజన్ ప్రారంభించారు. 1988లో కుంభకోణం సమీపంలోని కుడితాంగి గ్రామంలో తక్కువ కులానికి చెందిన వ్యక్తి మృతదేహాన్ని వన్నియర్లు నివసించే ప్రాంతం గుండా తీసుకెళ్లేందుకు వ్యతిరేకత రాగా దానిని మీరి రామదాస్ స్వయంగా పాడె మోసుకెళ్లి ఖననం చేశారు. దీంతో ఆయన్ను 'తమిళగ కుడితాంగి' అని పిలిచారు తిరుమావళవన్. ఇలా ప్రారంభ కాలంలో తమిళ జాతీయవాద మార్గాన్ని అనుసరించిన రామదాస్ కాలక్రమేణా తన వైఖరిని మార్చుకుని మళ్లీ కుల రాజకీయాలకే పరిమితుడయ్యాడనే చెప్పాలి.

అన్నా వర్సిటీలో 'టీఎన్‌టీటీఎఫ్‌సీ' ప్రారంభం

వడపళని, న్యూస్‌టుడే: అన్నా విశ్వవిద్యాలయంలోని 'ఐ తమిళనాడు టెక్నాలజీ(ఐటీఎన్టీ)' హబ్‌లో డీప్‌టెక్ ఆవిష్కరణల కోసం 'తమిళనాడు టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ఫెసిలిటేషన్ సెంటర్(టీఎన్‌టీటీఎఫ్‌సీ)ని ఏర్పాటు చేశారు. దీనిని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి పళనివేల్ త్యాగరాజన్ ఆదివారం ప్రారంభించారు. దీనికి తమిళనాడు ఇన్నోవేషన్ ఇనిషియేటివ్ కింద ప్రభుత్వం నుంచి నిధులు సమకూరనున్నాయి. స్టార్టప్‌లు, పరిశ్రమలతో విద్యా సంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య ఉన్న అంతరాన్ని తొలగించి, డీప్‌టెక్ ఆవిష్కరణలను సులభతరం చేయడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా హబ్‌ను ఏర్పాటు చేయడమే ఈ కేంద్ర లక్ష్యంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ కేంద్రం ఐపీ నిర్వహణ, లైసెన్సింగ్, మార్కెట్ విశ్లేషణ సహా ప్రపంచ సహకారాలకు కేంద్రీకృత వేదికగా కూడా పని చేయనుందని వివరించారు. వినూత్న సాంకేతికతలను స్కేలింగ్ చేయడం, ఎంఎస్ఎంఈ, పరిశోధకులకు కూడా మద్దతిస్తుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ జె.జయరంజన్ పేర్కొన్నారు. ఐటీ, డిజిటల్ సర్వీసెస్ విభాగ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బ్రజేంద్ర నవ్‌నీత్ మాట్లాడుతూ.. 'టీఎన్‌టీటీఎఫ్‌సీ' ఎండ్ టు ఎండ్ ఐపీ నిర్వహణకు పూర్తిస్థాయి మద్దతును అందిస్తుందని తెలిపారు. పరిశ్రమ అవసరాలను తీర్చే ఉమ్మడి ప్రాజెక్టులు, కాంట్రాక్ట్ పరిశోధనల అమలును కేంద్రం సులభతరం చేస్తుందని ఐటీఎన్టీ హబ్ సీఈఓ వనితా వేణుగోపాల్ పేర్కొన్నారు.

ఘనంగా వన్నియర్ సంఘ వార్షికోత్సవం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: దిండివనం సమీప తైలాపురంలోని పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ తోటలో వన్నియర్ సంఘ 46వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రామదాస్ సంఘ జెండాను ఎగురవేశారు. పీఎంకే మాజీ అధ్యక్షుడు ధీరన్, జిల్లా కార్యదర్శి జయరాజ్, సహా అనేకమంది పాల్గొన్నారు. అనంతరం రామదాస్ విలేకరులతో మాట్లాడుతూ.. వన్నియర్లకు రిజర్వేషన్లు డిమాండ్ చేస్తూ ఆదివారం విళుపురంలో అన్బుమణి ఆందోళన నిర్వహించారని, ఒక్కచోటే ఆందోళన నిర్వహిస్తే చాలదని, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలన్నారు. పూంపుహార్‌లో వచ్చే నెల 10వ తేదీ నిర్వహించే పీఎంకే మహిళా మహానాడుకు అందరూ ఆహ్వానితులేనన్నారు.

29 నుంచి ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై కార్యశాల

వడపళని: ఎంఎస్ఎంఈ అనుబంధ సంస్థ 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఇన్‌స్టిట్యూట్' ఆధ్వర్యంలో ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై కార్యశాల జరుగనుంది. గిండీ, సిడ్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఈడీఐఐ ఆఫీసు రోడ్డులోని సంస్థ కార్యాలయంలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యశాల జరుగుతుంది. యూట్యూబ్ చానెల్, వెబ్‌సైట్ డిజైన్‌లో మెలకువలు, సాంకేతికతలు, వాట్ నిబంధనలు, వెబ్ హోస్టింగ్ వంటివి ఉంటాయని సంస్థ ప్రకటనలో పేర్కొంది. వివరాలకు 95437 73337, 93602 21280 నెంబర్లపై సంప్రదించాలి.

హెర్బల్ ఉత్పత్తుల తయారీపై...

వడపళని: 'హెర్బల్ స్కిన్ కేర్ ఉత్పత్తుల తయారీపై గిండీలోని ఈడీఐఐ ఆఫీసు రోడ్డులో 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఇన్‌స్టిట్యూట్' కార్యశాలను నిర్వహిస్తోంది. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు తమ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యశాల ఉంటుందని ఓ ప్రకటనలో పేర్కొంది. కార్యశాలలో సబ్బులు, షాంపూలు, నూనెల తయారీని నేర్పిస్తారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 ఏళ్ల వయసు పైబడిన వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. పురుషులు, మహిళలకు రుసుముతో హాస్టల్ వసతి కూడా ఉంది. 86681 02600, 80729 14694 నెంబర్లను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చు.

చెన్నై విమానాశ్రయానికి బాంబు బెదిరింపులు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో బాంబులు పెట్టినట్లు మేనేజర్ కార్యాలయానికి ఈ-మెయిల్ వచ్చింది. సమాచారం మేరకు వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, ఇంటెలిజెన్స్ విభాగం, పోలీసులు జాగిలాలతో విమానాశ్రయం అంతటా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులు బోర్డింగుకు వచ్చే చోట కూడా సోదాలు చేశారు. ఎలాంటి పేలుడు వస్తువులు లభించలేదు. ప్రయాణికుల తనిఖీల కారణంగా హాంగ్‌కాంగ్, ఫ్రాంక్‌ఫర్ట్, కువైట్, దుబాయి, షార్జా, దోహా, మస్కట్, సింగపూర్, కౌలాలంపూర్, లండన్ వెళ్లే విమానాలు 30 నిమిషాలు ఆలస్యంగా నడిచాయని అధికారులు పేర్కొన్నారు.

జాగిలాలతో తనిఖీలు చేస్తున్న భద్రతా సిబ్బంది

ఒక్కో మూత్రపిండం రూ.6 లక్షలకు విక్రయం

☛ మహిళ వాంగ్మూలం ☛ రంగంలోకి రెండు ప్రత్యేక పోలీసు బృందాలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఒక్కో మూత్రపిండం రూ.6 లక్షలకు విక్రయించినట్లు ఓ మహిళ తన వాంగ్మూలంలో తెలియజేయడంతో అధికారులు ఖంగుతిన్నారు. నామక్కల్ జిల్లా పళ్లిపాలయం సమీపంలోని అన్నై సత్యానగర్‌కు చెందిన ఆనందన్(45) మూత్రపిండాల విక్రయ దళారి. ఇతను అదే ప్రాంతానికి చెందిన కౌసల్య, విజయ అనే మహిళా కార్మికులకు డబ్బు ఆశచూపి వారి కిడ్నీలను తీసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న జిల్లా మెడికల్ జాయింట్ డైరెక్టర్ రాజ్‌మోహన్ నేతృత్వంలోని అధికారులు, పళ్లిపాలయం పోలీసులు ఈనెల 17వ తేదీ అన్నై సత్యానగర్‌లో దర్యాప్తు జరిపారు. సమాచారం తెలుసుకున్న ఆనందన్ పరారయ్యాడు. ఈ నెల 18వ తేదీ రాత్రి చెన్నై ఆరోగ్యశాఖ శీఘ్ర డివిజన్ సంయుక్త సంచాలకులు మీనాక్షిసుందరం, రాజ్‌మోహన్ నేతృత్వంలోని వైద్య బృందం విచారణ జరపడానికి అన్నై సత్యానగర్‌కు చేరుకుంది. అనంతరం కిడ్నీ అమ్ముకున్న కౌసల్యను పళ్లిపాలయం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి నాలుగు గంటలపాటు విచారించారు. ఈరోడ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కిడ్నీ శస్త్రచికిత్స జరిగిందని ఆమె చెప్పింది. అనంతరం అధికారులు సంబంధిత ఆస్పత్రికి వెళ్లి శస్త్రచికిత్స చేయించుకున్న వారి జాబితా సేకరించారు. అందులో ఆరుగురి పత్రాలను ధ్రువీకరించారు. వారంతా పళ్లిపాలయం, అన్నై సత్యానగర్, అరవంగాడుకు చెందిన వారని గుర్తించారు. ఆయా ప్రాంతాలకు వెళ్లి విచారించగా 5 చిరునామాలు నకిలీవని తెలిసింది. అందులో కౌసల్య గతేడాది ఆగస్టులో ఒక కిడ్నీని రూ.6 లక్షలకు విక్రయించినట్లు తన వాంగ్మూలంలో తెలిపినట్లు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. పూర్తి వివరాలు వెల్లడించలేదు. కుమారపాళయంలోని విజయ అనే మహిళను విచారించలేదని అధికారులు పేర్కొన్నారు. కాగా ఆనందన్ తలకు టోపీ పెట్టుకొని ద్విచక్ర వాహనంపై సత్యానగర్‌కు వచ్చాడన్న సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లారు. కానీ, పోలీసుల రాకను పసిగట్టిన అతను తప్పించుకున్నాడు. దీంతో పట్టుకోవడానికి తిరుచెంగోడు డీఎస్పీ కృష్ణన్, పళ్లిపాలయం ఇన్‌స్పెక్టర్ శివకుమార్ నేతృత్వంలో రెండు ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగి గాలిస్తున్నాయి.

దళారి నామక్కల్ ఆనందన్

కొత్తగా వెలుగులోకి మరో దళారి

తాజాగా మరో కిడ్నీ రాకెట్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మరో దళారి మురుగన్ పళ్లిపాలయం, ఈరోడ్‌లోని కరుంగల్‌పాలయం, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో 100 మందికి పైగా పేదలు, కూలీ కార్మికులను డబ్బు ఆశచూపి తిరుచ్చి, ఈరోడ్, కొచ్చి, బెంగళూరు తదితర నగరాల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లి శస్త్రచికిత్స ద్వారా కిడ్నీలను తొలగించి విక్రయించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి బాధితుల పేర్ల జాబితా, శస్త్రచికిత్సకు తీసుకెళ్లిన వారి వివరాలు పోలీసులకు అందాయి. అంతేకాకుండా దళారి మురుగన్ కిడ్నీ ఇవ్వడానికి వచ్చే వారితో కమిషన్ గురించి మాట్లాడుతున్న ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో విడుదలైంది. ఒక్కొక్కరి నుంచి రూ.4 లక్షలు కమిషన్ పొందిన మురుగన్ రూ.కోట్లు పొందినట్లు వెలుగు చూసింది. దళారులను అరెస్టు చేస్తేనే పూర్తి వివరాలు తెలుస్తాయని దర్యాప్తు చేస్తున్న వైద్య బృందం చెబుతోంది.

ఆలయ ప్రాంగణంలో భక్తజనం

తిరుత్తణి ఆలయానికి పోటెత్తిన భక్తులు

అలంకరణలో వళ్లి, దేవసేన సమేత స్వామివారు

తిరుత్తణి, న్యూస్‌టుడే: ఆడి మాసం మొదటి ఆదివారం సందర్భంగా తిరుత్తణి మురుగన్ ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేలాది మంది కావళ్లు మోసుకుంటూ వచ్చి సుమారు 5 గంటలపాటు వరుసలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో వచ్చే నెల 16న ఆడి కృత్తిక ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ముందుగా ఆడి మాసం మొదటి కృత్తిక సందర్భంగా ఆదివారం రాష్ట్రంలోని నలుమూలల నుంచేకాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు అనేకమంది కావళ్లతో ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, దీపారాధనలు జరిగాయి. కావడి మండపంలో ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ఆండాళ్ ఆలయంలో ఘనంగా ఆడిపూరం ఉత్సవం

ధ్వజస్తంభానికి దీపారాధన చేస్తున్న దృశ్యం ▸ అలంకరణలో ఆండాళ్, రంగమన్నార్

ప్యారిస్, న్యూస్‌టుడే: విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్‌లోని ప్రసిద్ధ ఆండాళ్ ఆలయంలో ఆడి పూరం ఉత్సవం ఆదివారం ధ్వజారోహణతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉదయం ఆండాళ్ సమేత రంగమన్నార్‌కి తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. రథోత్సవం 28వ తేదీ జరుగనుంది.

కనులపండువగా మేరిమాత ఊరేగింపు

ఊత్తుకోట, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోటలోని మేరిమాత చర్చిలో ఈనెల 16వ తేదీ 23వ వార్షిక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రధాన ఘట్టమైన మేరిమాత విగ్రహ ఊరేగింపు శనివారం రాత్రి నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. క్రైస్తవ మతగురువులు ఆంథోనిస్వామి, అలెక్స్‌రాజ్, ఆరోగ్యదాస్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

EENADU Classifieds JOBS

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 9014651068, 7075633416.

ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

పదోసారి గర్భం దాల్చిన గిరిజనురాలు

బలవంతంగా ఆస్పత్రికి తరలింపు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: పదోసారి గర్భం దాల్చిన గిరిజనురాలిని అంబులెన్స్‌లో బలవంతంగా ఆస్పత్రికి తరలించిన సంఘటన కృష్ణగిరి జిల్లా కెలమంగళం సమీపంలోని కొండ గ్రామంలో చోటుచేసుకుంది. ఈ నెల 18వ తేదీ కెలమంగళం పంచాయతీ పరిధిలోని పెట్టముగిలాలం కడమకుట్టె కొండ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. అప్పుడు ఆ గ్రామానికి చెందిన మల్లి (41) పదోసారి గర్భం దాల్చినట్టు తేలింది. ఆమెను పరీక్షించిన వైద్యులు రక్తహీనత ఉన్నట్టు గుర్తించారు. ఆమెకు ఇప్పటికి ఏడుగురు పిల్లలుండగా రెండుసార్లు అబార్షన్ అయింది. దీంతో ఆస్పత్రికి తీసుకెళ్లాలని కుటుంబీకులకు సూచించారు. కానీ, మల్లి అందుకు ఒప్పుకోలేదు. వైద్య బృందం ఎంత బతిమాలి నచ్చజెప్పినా ఫలితం కనిపించలేదు. దీంతో ఆరోగ్య శాఖాధికారి ద్వారా జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు సమాచారం చేరవేశారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు శనివారం ఆ గ్రామానికి వెళ్లిన ప్రాంతీయ వైద్యాధికారి రాజేష్, నర్సుల నేతృత్వంలోని బృందం మల్లికి ప్రథమ చికిత్స అందించి అంబులెన్స్ ద్వారా ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి బలవంతంగా తీసుకెళ్లి చికిత్స అందించారు.

మల్లిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్తున్న వైద్య బృందం

కోవై బాంబు పేలుళ్ల కేసు

టైలర్ రాజా వద్ద దర్యాప్తు ముమ్మరం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూరు ఆర్ఎస్‌పురం సహా వివిధ ప్రాంతాల్లో 1998 ఫిబ్రవరి 14వ తేదీ వరుస బాంబు పేలుళ్లు జరిగాయి. ఈ కేసులో నిందితుడిగా ఉంటూ 27 ఏళ్లుగా పరారీలో ఉన్న కోయంబత్తూరుకి చెందిన టైలర్ రాజా ఆలియాస్ సాధిక్‌ను కోయంబత్తూరు ఉగ్రవాద నిరోధక విభాగ పోలీసులు ఈనెల 9న కర్ణాటక రాష్ట్రం విజయపురం జిల్లాలో అరెస్టు చేశారు. తర్వాత అతన్ని కోయంబత్తూరు సెంట్రల్ జైలులో ఉంచారు. తర్వాత పోలీసు కస్టడీకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాంబు పేలుళ్ల కేసుతో తనకి సంబంధం ఉన్నట్లు అతను నేరాన్ని అంగీకరించినట్లు తెలుస్తోంది. దీని గురించి పోలీసులు మాట్లాడుతూ.. టైలర్ రాజాను అరెస్టు చేసినప్పుడు తనకు బాంబు పేలుళ్ల ఘటనతో సంబంధంలేదని, మొదటి భార్యకి భయపడి పరారీలో ఉన్నట్లు చెప్పాడని తెలిపారు. అయితే కస్టడీకి తీసుకుని దర్యాప్తు చేయగా నిజం ఒప్పుకున్నాడని, కావున అతన్ని పేలుళ్లు జరిగిన ప్రదేశాలకు తీసుకెళ్లి దర్యాప్తు జరపడం గురించి చర్చిస్తున్నట్లు చెప్పారు. పోలీసు కస్టడీ ఇంకా రెండు రోజులు ఉన్నందున దర్యాప్తు ముమ్మరం చేసినట్లు తెలిపారు.

22, 23 తేదీల్లో తిరుప్పూర్, కోవై జిల్లాల్లో సీఎం పర్యటన

చెన్నై, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్టాలిన్ ఈనెల 22, 23 తేదీల్లో తిరుప్పూర్, కోయంబత్తూర్ జిల్లాల్లో పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం చెన్నై నుంచి విమానం ద్వారా కోయంబత్తూర్ చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గంగా తిరుప్పూర్ వెళ్లనున్నారు. వేలంపాళెయంలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని, కోవిల్‌వళి కొత్త బస్టాండును ప్రారంభించి మధ్యాహ్న విశ్రాంతి తర్వాత సాయంత్రం మడత్తుకుళం వెళ్లనున్నారు. అక్కడ కరుణానిధి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా తిరుప్పూర్, ఉడుమలైపేట్టై, మడత్తుకుళం తదితర ప్రాంతాల్లో రోడ్ షోలో పాల్గొననున్నారు. రాత్రి ఉడుమలైలో బస చేసి బుధవారం ఉదయం స్థానిక బస్టాండు సమీపాన ఏర్పాటు చేసిన పెరియార్, అన్నాదురై, కరుణానిధి, అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. నేతాజీ మైదానంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు సంక్షేమ సాయం పంపిణీ చేసి, పూర్తయిన ప్రాజెక్టులను ప్రారంభించి, కొత్త ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. తర్వాత కోయంబత్తూర్ జిల్లా పొళ్లాచ్చిలో ప్రజాపనులశాఖ జలవనరుల ప్రధాన ఇంజినీరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కామరాజర్, కేంద్ర మాజీ మంత్రి సుబ్రమణియం, వీకే పళనిసామి కవుండర్, మాజీ ఎమ్మెల్యే పొళ్లాచ్చి మహాలింగం తదితరుల విగ్రహాలు ఆవిష్కరించి ఆడిటోరియాన్ని ప్రారంభించనున్నారు. బుధవారం సాయంత్రం కోయంబత్తూర్ విమానాశ్రయం నుంచి విమానం ద్వారా చెన్నై చేరుకోనున్నారు.

28న పెన్షన్ అదాలత్

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై సిటీ సెంట్రల్ డివిజన్‌లోని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ ఆధ్వర్యంలో 28వ తేదీ పెన్షన్ అదాలత్ జరుగనుంది. నగరవ్యాప్తంగా ఉన్న 24 తపాలా కార్యాలయాల్లో పెన్షన్ ఖాతాదారులు తమ సందేహాలు తీర్చుకోవచ్చని ఓ ప్రకటన విడుదల చేసింది. ముందుగా ఖాతాదారులు తమ ఫిర్యాదులు, సూచనలు పోస్టు లేదా ఈ-మెయిల్ ద్వారా తెలియజేయాలి. ఫిర్యాదులు chennaicitycentral@indiapost.gov.in లేదా వాట్సప్ నెంబరు 89396 46404కు తెలియజేయాలి.

అజిత్‌కుమార్ కారుకి ప్రమాదం

చెన్నై, న్యూస్‌టుడే: జీటీ4 యూరోపియన్ సిరీస్ కారు రేసులో నటుడు అజిత్‌కుమార్ నడిపిన కారు ప్రమాదానికి గురైంది. ఇటలీలో జరుగుతున్న జీటీ4 యూరోపియన్ సిరీస్ కారు రేసులో నటుడు అజిత్‌కుమార్ పాల్గొన్నారు. ఈ రేసులో ముందు వెళ్తున్న కారు అకస్మాత్తుగా ట్రాక్‌కు అడ్డంగా నిలిచిపోవడంతో వెనుకనే వచ్చిన అజిత్‌కుమార్ కారు దానిని ఢీకొట్టింది. దీంతో అజిత్‌కుమార్ కారు ముందువైపున ఎడమ భాగం దెబ్బతింది. అదృష్టవశాత్తు ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదు.

బస్సులో అరుణాచలం పేరుతో బోర్డు

☛ కండక్టర్ సస్పెన్షన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కళ్లకురిచ్చి ప్రభుత్వ రవాణా సంస్థ డిపో నుంచి ఈనెల 15వ తేదీ బెంగళూర్‌కు బయలుదేరిన ప్రభుత్వ బస్సులో ముందువైపు ఎల్ఈడీ తెరపై తిరువణ్ణామలైకు బదులు అరుణాచలం అని ఆంగ్ల అక్షరాల్లో ప్రదర్శించారు. అది చూసిన కొందరు సెల్‌ఫోన్‌లో ఫొటో తీసిన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఇందుకు సంబంధించి ఓ సామాజిక కార్యకర్త ప్రభుత్వ రవాణా సంస్థను ప్రశ్నించారు. విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ అధికారులు సామాజిక కార్యకర్తకు లేఖ పంపారు. తరువాత బస్సు డిజిటల్ తెరపై తిరువణ్ణామలై అని పేరు మార్చారు. అదేవిధంగా తిరువణ్ణామలై వెళ్లే బస్సుల్లో తప్పనిసరిగా 'తిరువణ్ణామలై' అనే పేరే ఉండాలని కండక్టర్లకు సూచించారు. ఇదిలా ఉండగా అరుణాచలం అనే పేరు ఉంచిన కళ్లకురిచ్చికి చెందిన కండక్టర్ విజయరాఘవన్‌ను సస్పెండ్ చేస్తూ రవాణా సంస్థ విళుపురం జోన్ జనరల్ మేనేజర్ జయశంకర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని: విద్యుత్తుశాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కీల్పాక్, అంబత్తూరు ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్తు శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

'ఆలయాల్లో దర్శన ఛార్జీలతో సమాజంలో ఆర్థిక అంటరానితనం'

సైదాపేట, న్యూస్‌టుడే: ఆలయాల్లో దర్శన ఛార్జీల వసూలు ద్వారా సమాజంలో ఆర్థిక అంటరానితనాన్ని డీఎంకే ప్రభుత్వం చొప్పిస్తోందని హిందూ మున్నని రాష్ట్ర అధ్యక్షుడు గాడేశ్వర సుబ్రమణియమ్ ఆరోపించారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... లంచం తీసుకున్న దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఇందిర అరెస్టయ్యారని, ప్రభుత్వ శాఖల్లో ఎక్కువ అవినీతి జరిగే, అవకతవకలు చోటుచేసుకునే, ఎక్కువ కేసులు ఎదుర్కొనే శాఖగా హిందూ దేవదాయశాఖ ఉందని తెలిపారు. దేవదాయశాఖకు ప్రత్యేకంగా ఆలయాలు నిర్మించే క్రాంటాక్టర్లు ఉంటారని పేర్కొన్నారు. వారి ద్వారానే ఏపనయినా జరుగుతుందన్నారు. అయితే దీన్ని ఆసరాగా చేసుకుని మంత్రి శేఖర్‌బాబు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దర్శన ఛార్జీల ద్వారా సమాజంలో ఆర్థిక అంటరానితనాన్ని డీఎంకే ప్రభుత్వం ఏర్పరుస్తోందని విమర్శించారు. చర్చిలు, మసీదులు పనిచేస్తున్నట్లు స్వతంత్రంగా పనిచేసే బోర్డుకు దేవాలయాలను అప్పగించాలని డిమాండ్ చేశారు.

భగవతి అమ్మవారిని దర్శించుకున్న తమిళిసై

ఊత్తుకోట, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట సమీపం మైలాపూరులోని ప్రసిద్ధ శ్రీభగవతి అమ్మవారి ఆలయంలో ఆడి కృత్తిక సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ గవర్నర్, భాజపా సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందర్‌రాజన్ ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పూజలో పాల్గొన్న తమిళిసై సౌందరరాజన్

మదురై ఆధీనం వద్ద పోలీసుల దర్యాప్తు

ప్యారిస్, న్యూస్‌టుడే: కారు ప్రమాదం కేసు వ్యవహారమై మదురై ఆధీనం వద్ద చెన్నై సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మదురై ఆధీనం జ్ఞానసంబంధ దేశిక పరమాచార్య స్వామి గత మే 2వ తేదీ చెన్నైలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు కారులో బయలుదేరారు. అప్పుడు ఉళుందూర్‌పేట వద్ద మరో కారు ఆయన కారుని ఢీకొందని, తనపై హత్యాయత్నం జరిగినట్లు ఆధీనం ఆరోపణలు చేశారు. ఈ ప్రమాదంపై సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలించగా మదురై ఆధీనం తరపున తప్పుడు సమాచారం తెలిపినట్లు తెలిసింది. అనంతరం ప్రమాదం గురించి తప్పుడు సమాచారం వ్యాప్తిచేసి మత కల్లోలాలు సృష్టించేలా మాట్లాడిన మదురై ఆధీనంపై కేసు నమోదు చేయాలని అయనావరానికి చెందిన హైకోర్టు న్యాయవాది రాజేంద్రన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చెన్నై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా ముందస్తు బెయిల్ కోరుతూ ఆధీనం చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అప్పుడు ఆయనకు 60 ఏళ్లకుపైగా వయసు ఉండటంతో పోలీస్‌స్టేషన్‌లో హాజరవడం తప్పనిసరి కాదని, పోలీసులు నేరుగా వెళ్లి దర్యాప్తు చేయవచ్చని, పోలీసుల దర్యాప్తుకి పూర్తిగా సహకరించాలని ఆధీనానికి నిబంధనలతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అనంతరం పోలీసులు ఆదివారం ఆధీనం వద్ద దర్యాప్తు చేసేందుకు సైబర్ క్రైం ఇన్‌స్పెక్టరు పద్మకుమారి నేతృత్వంలోని ముగ్గురు పోలీసులు వెళ్లారు.

ఆధీనం వద్ద దర్యాప్తు చేస్తున్న పోలీసులు

(c) eenadu

సగం పారితోషికం తీసుకున్న జీవీ ప్రకాశ్‌కుమార్

● నిర్మాత అమల్‌రాజ్

ఆడియో ఆవిష్కరిస్తున్న దృశ్యం

చెన్నై, న్యూస్‌టుడే: ఎం.మారన్ దర్శకత్వంలో జీవీ ప్రకాశ్‌కుమార్, తేజు అశ్విని, బిందు మాధవి తదితరులు ముఖ్యపాత్రల్లో నటించిన 'బ్లాక్ మెయిల్' ఆగస్టు 1న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చెన్నై నగరంలో నిర్వహించిన ఆడియో ఆవిష్కరణ కార్యక్రమంలో నిర్మాత అమల్‌రాజ్ మాట్లాడుతూ... చిత్రం కోసం జీవీ ప్రకాశ్‌కుమార్ సగం పారితోషికమే తీసుకున్నారని తెలిపారు. దర్శకుడు ఆర్కే ఉదయకుమార్ మాట్లాడుతూ... 30 ఏళ్ల కిందట 'బ్లాక్ మెయిల్' అనే హిందీ చిత్రం చూశానన్నారు. ప్రముఖుడు విలన్‌గా మారే కథ అదని, ఆ చిత్రంలోని ఆకర్షణ ప్రస్తుత 'బ్లాక్ మెయిల్'లో చూశానని తెలిపారు. ఇళయరాజా తర్వాత అద్భుతమైన సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ మాత్రమే ఉన్నారు. సంగీత దర్శకుడు శ్యామ్ సి.ఎస్ మాట్లాడుతూ... 'ఆరువప్పు, ఆయిరం కబ్‌గళ్' చిత్రం తర్వాత మారన్‌తో పనిచేసే రెండో చిత్రమిదన్నారు. జీవీ ప్రకాశ్‌కుమార్ నటించిన చిత్రాల్లో ఆయన నటన పరాకాష్ఠకు చేరిన చిత్రమిదని తెలిపారు. సంభాషణలు లేకుండా సంగీతం ద్వారా కథను చెప్పాలన్న ఈ చిత్రం తనకు సంతృప్తిని మిగిల్చిందని పేర్కొన్నారు. సినీ గేయరచయిత కార్తీక్ నేతా మాట్లాడుతూ... జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం సమకూర్చిన పలు చిత్రాలకు పాటలు రాశానని, ఆయన నటించిన చిత్రానికి పాటలు రాస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో నటులు జీవీ ప్రకాశ్‌కుమార్, తేజు అశ్విని, లింగ, చంద్రిక, ముత్తుకుమార్, బిందు మాధవి, నిర్మాతలు ధనంజయన్, కదిరేశన్, దర్శకులు వసంతబాలన్, ఆదిక్ రవిచంద్రన్, మారన్, డ్రీమ్ వారియర్ సీఈవో కుహన్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు-కర్ణాటక సరిహద్దుల్లో జరిగే కథే అక్యూస్డ్

ప్రభాకర్

కార్యక్రమంలో చిత్రబృందం

చెన్నై, న్యూస్‌టుడే: ప్రభ శ్రీనివాస్ దర్శకత్వంలో ఉదయ, అజ్మల్, యోగిబాబు తదితరులు ముఖ్యపాత్రల్లో నటించిన 'అక్యూస్డ్' ఆగస్టు 1న విడుదల కానున్న నేపథ్యంలో పాత్రికేయుల సమావేశాన్ని చెన్నై నగరంలో నిర్వహించారు. నిర్మాత పన్నీర్‌సెల్వం మాట్లాడుతూ... నటుడు ఉదయ కఠిన శ్రమను ఈ చిత్రంలో ప్రత్యక్షంగా చూశామన్నారు. ఎడిటర్ శ్యామ్ మాట్లాడుతూ... ఎడిటింగ్‌లో ఈ చిత్రం ఉత్సాహాన్ని ఇచ్చిందని, ఇది సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా రూపొందిందని తెలిపారు. స్క్రీన్‌ప్లే వేగంగా ఉంటోందన్నారు. నటుడు డాని మాట్లాడుతూ... 'ఓ మరియా' పాటలో నటి రంభతో కలిసి డ్యాన్స్ చేశానని, 1999 తర్వాత మళ్లీ ఈ చిత్రంలో నటిస్తున్నానని తెలిపారు. ఈ చిత్రంలో ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా నటించానని పేర్కొన్నారు. నిర్మాత సేతు మాట్లాడుతూ... ఇది తమ తొలి నిర్మాణ చిత్రమన్నారు. సంగీత దర్శకుడు నరేన్ బాలకుమార్ మాట్లాడుతూ... ఈ చిత్రంలో పనిచేయడం మంచి అనుభవాన్ని ఇచ్చిందని తెలిపారు. నటుడు ప్రభాకర్ మాట్లాడుతూ... దర్శకుడు ప్రభ శ్రీనివాస్ దర్శకత్వంలో కొన్ని కన్నడ చిత్రాల్లో నటించానని, తమిళంలో ఇది తనకు తొలి చిత్రమని పేర్కొన్నారు. ఈ చిత్రంలో ప్రతినాయకుడి అవకాశాన్ని ఆయనే కల్పించారని తెలిపారు. చిత్రంలోని కథ తమిళనాడు-కర్ణాటక సరిహద్దుల్లో జరిగేటట్లు ఉండటంతో తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకునే అవకాశాన్ని ఇచ్చారని పేర్కొన్నారు. దర్శకుడు ప్రభ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కన్నడంలో చిత్రాలకు దర్శకత్వం వహించినా తన సినీ జీవితం తమిళంలోనే మొదలైందన్నారు. సుమారు 400 పాటలకు కొరియోగ్రాఫర్‌గా పనిచేశానని, కన్నడంలో దర్శకత్వం వహించడానికి అవకాశం రావడంతో అటు వెళ్లానని తెలిపారు. ఇది తన దర్శకత్వంలో ఏడో చిత్రంకాగా తమిళంలో తొలి చిత్రమని పేర్కొన్నారు. నటి జాన్విక మాట్లాడుతూ... ఇది తనకు తొలి తమిళ చిత్రమన్నారు. ఇందులో అందమైన ప్రేమ కథ ఉందని తెలిపారు. నటుడు అజ్మల్ మాట్లాడుతూ... చిత్రంలోని కథాపాత్రలను దర్శకుడు చక్కగా మలిచారన్నారు. 'అంజాదే', 'కో' చిత్రాల్లో లభించిన పాజిటివ్ ఎనర్జీ ఈ చిత్రంలోనూ తనకు లభించిందని తెలిపారు. నటుడు ఉదయ మాట్లాడుతూ... మూడున్నరేళ్ల విరామం తర్వాత ఈ చిత్రంలో నటించానన్నారు. సినీ రంగంలోకి అడుగుపెట్టి 25ఏళ్లు అయిందని తెలిపారు.

చీ పా తూ ఆల్బమ్ బృందానికి కమల్ ప్రశంసలు

ఆల్బమ్ బృందంతో కమల్‌హాసన్

చెన్నై: యువ సంగీత దర్శకుడు దరణ్ కుమార్ సంగీతంలో ప్రముఖ ర్యాప్ సంగీత కళాకారుడు వాహీసన్ రాసయ్య రచనలోని 'సరిగమ ఒరిజినల్స్' సమర్పణగా 'చీ పా తూ' వీడియో మ్యూజిక్ ఆల్బమ్ విడుదలైంది. ఈ పాటను సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్, వాహీసన్ రాసయ్య కలిసి పాడారు. ఈ పాటకు శక్తివేల్ నృత్యాలు సమకూర్చగా మాస్టర్ రాజు సుందరం డ్యాన్స్ చేశారు. ఈ వీడియో మ్యూజిక్ ఆల్బమ్‌కు ఆనందు దర్శకత్వం వహించారు. ఈ ఆల్బమ్‌ను నటుడు కమల్‌హాసన్ చూసి ఆల్బమ్ బృందాన్ని పిలిపించి అభినందించారు.

'మారీచన్' రెండో సింగిల్ విడుదల

చెన్నై: సుధీశ్ శంకర్ దర్శకత్వంలో నటుడు వడివేలు, ఫహద్ ఫాజిల్ కలిసి నటించిన 'మారీచన్' చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. చిత్రంలోని తొలి సింగిల్ 'ఫాఫా'ను ఇటీవల విడుదల చేయగా రెండో సింగిల్ 'మారీచా'ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాటను యువన్ శంకర్ రాజా పాడారు. చిత్రానికి ఆయనే సంగీతం సమకూర్చారు. గ్రామీణ నేపథ్యంతో ట్రావెలింగ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని సూపర్ గుడ్ ఫిలిమ్స్ పతాకంపై ఆర్బీ చౌదరీ నిర్మించారు.

రక్తదానం చేసిన అభిమానులను కలిసిన కార్తి

చెన్నై: నటుడు కార్తి 48వ జన్మదినం సందర్భంగా 25వ తేదీ ఆయన అభిమానులు చెన్నైలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రక్తదానం చేశారు. వారిలో 250 మందిని త్యాగరాయనగర్‌లో కార్తి కలిసి ద్రవపదార్థాలు అందజేశారు. విందు భోజనం ఏర్పాటు చేసి వారితో కలిసి ఫొటోలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులను అభినందించారు. తనపై చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు తెలిపారు. గర్వించేలా పలు విషయాలను చేయాలంటూ పిలుపునిచ్చారు. 'మార్షల్' చిత్రీకరణ ప్రారంభం కానుందని, మళ్లీ పంచె కట్టి మీసాలు మెలేసి నటించనున్నానని తెలిపారు.

అభిమానులతో కార్తి

'బ్యాడ్ గర్ల్' సినిమా టీజర్‌ను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలి

● మదురై ధర్మాసనం

ప్యారిస్, న్యూస్‌టుడే: 'బ్యాడ్ గర్ల్' సినిమా టీజర్ ని సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. దర్శకుడు వెట్రిమారన్‌కి చెందిన గ్రాస్ రూట్ ఫిలిమ్ కంపెనీ నిర్మాణంలో దర్శకుడిగా పరిచయం అవుతున్న వర్ష భరత్ దర్శకత్వంలో 'బ్యాడ్ గర్ల్' చిత్రం తెరకెక్కింది. ఈ సినిమాలో అంజలి శివరామన్ కథానాయిక. ఈ చిత్రం సెప్టెంబరు 5న విడుదల కానున్నట్లు ప్రకటించారు. టీజర్ విడుదలైనప్పటి నుంచి చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో శంకరన్‌కోవిల్‌కి చెందిన రామ్‌కుమార్, రమేష్‌కుమార్ మొదలైన ముగ్గురు వ్యక్తులు మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనంలో దాఖలు చేసిన పిటిషన్‌లో... టీజర్‌లో బాలురు, బాలికల గురించి అసభ్యకరమైన సన్నివేశాలు ఎక్కువగా ఉన్నాయని, అది లైంగిక నేరమని తెలిపారు. కావున టీజర్‌ని సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని, సంబంధిత వ్యక్తులపై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన మదురై ధర్మాసనం.. యూట్యూబ్ మొదలైన సామాజిక మాధ్యమాల నుంచి 'బ్యాడ్ గర్ల్' టీజర్‌ని తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది. రానున్న రోజుల్లో ఇలాంటి పోస్టులు ఉండకుండా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

రేపు 'ముఖ్యమంత్రి కప్' పోటీలు ప్రారంభం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లాలో జిల్లా స్థాయి 'ముఖ్యమంత్రి కప్' క్రీడా పోటీలు ఈనెల 22న ప్రారంభం కానున్నాయని జిల్లా కలెక్టర్ ప్రతాప్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, దివ్యాంగులు, ప్రభుత్వ ఉద్యోగులకు 5 విభాగాల్లో మొత్తం 67 పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 12వ తేదీ వరకు కొనసాగనున్న పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తిగలవారు www.cmtrophy.sdat.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని లేదా 95140 00777 నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

నిత్యావసర సరకుల పంపిణీ

లలితా మురళికి సరకులు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

వడపళని, న్యూస్‌టుడే: ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) ట్రస్ట్ తరఫున మానసిక దివ్యాంగులకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఆదివారం చెన్నై మధురవోయల్ లోని మానస స్కూల్ ఆఫ్ స్పెషల్ చిల్డ్రన్స్ ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వేమిరెడ్డి కోటారెడ్డి, కార్యదర్శి టి.సంతోష్‌కుమార్, కోశాధికారి బీవీఎస్ కోటేశ్వరరావు తదితరులు చిన్నారులతో సరదాగా గడిపారు. అనంతరం నెలకు సరిపడా నిత్యావసర సరకులను ఆశ్రమ కార్యదర్శి లలితా మురళికి అందజేశారు. ట్రస్టీలు విజయేంద్రరావు, ముంద్రు శ్రీనివాసరావు, వడ్లమాని బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

శునకాల మాంసం విక్రయిస్తున్నారని ఆందోళన

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు పట్టణంలోని సలవన్‌పేటకి చెందిన వడివేలు (48) సామాజిక కార్యకర్త. ఈయన బర్మా బజార్‌లో హోటల్ నడుపుతున్నారు. గాయపడిన వీధి శునకాలను కాపాడి ఆస్పత్రిలో చికిత్స అందించి ఆహారం పెడుతుంటారు. ప్రస్తుతం సలవన్‌పేటలోని తన ఇంటిని విక్రయించి కాట్పాడిలో తన సోదరుడు ప్రేమ్‌ఆనంద్‌తో కలిసి ఉంటున్నారు. తిరువలం ఎస్‌ఎం పుదూర్‌కి చెందిన మంజుల అనే మహిళ ఇంటిని అద్దెకు తీసుకుని శునకాల సంక్షరణ కేంద్రాన్ని నడుపుతున్నారు. ఇందు కోసం వడివేలు లైసెన్స్ తీసుకున్నారు. ప్రస్తుతం తన కేంద్రంలో 25 శునకాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శునకాలను బంధించి వాటిని చంపి వడివేలు విక్రయిస్తున్నట్లు ఆ ప్రాంత ప్రజలు అనుమానం వ్యక్తం చేశారు. ఆదివారం సంరక్షణ కేంద్రాన్ని ముట్టడించిన స్థానికులు వెంటనే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఆందోళన చేశారు. సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అందులో శునకాలను చంపి విక్రయిస్తున్నట్లు ఎటువంటి ఆధారాలు దొరకలేదని తెలిపారు. దీని గురించి విచారించడానికి జంతు హింస నివారణ సంఘం, పశుసంవర్ధక శాఖ అధికారులకు కాట్పాడి తహసీల్దార్ సమాచారం ఇచ్చారు. విచారణ తర్వాతే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

వడివేలును ముట్టడించిన ప్రజలు

శునకాల సంరక్షణ కేంద్రం

ఓపీఎస్, ఈపీఎస్ వర్గాలు కలవకుంటే నష్టమే

● ఆర్వీ రంజిత్ కుమార్

కాంచీపురం, న్యూస్‌టుడే: ముక్కలుగా చీలిపోయిన అన్నాడీఎంకే ఒక్కటిగా కాకుంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ నష్టపోయే ప్రమాదముందని, అలా కాకుండా తాము ఎడప్పాడి కాళ్లపై పడటానికీ సిద్ధంగా ఉన్నామని మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీర్‌సెల్వం వర్గం కాంచీపురం జిల్లా కార్యదర్శి ముత్యాలపేట ఆర్వీ రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. కాంచీపురం సమీప కొరుక్కుపేటలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం ఓపీఎస్ వర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. జిల్లా కార్యదర్శి ఆర్వీ రంజిత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు వైద్యలింగం, పీహెచ్ పాండియన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్వీ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా తాము అనేక రకాలుగా పోరాటాలు చేశామని, అనేక సమస్యలు ఎదుర్కొన్నామన్నారు. తమ వర్గాన్నీ కలుపుకోవాలని పళనిసామిని కోరుతున్నామని తెలిపారు. వైద్యలింగం మాట్లాడుతూ.. సెప్టెంబరు 15వ తేదీ నాటికి ఓపీఎస్ వర్గాన్ని ఈపీఎస్ వర్గంలో విలీనం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఒకవేళ విలీనం కాకుంటే తర్వాతి పోరాటంపై ఆలోచిస్తామన్నారు. మరి కొద్ది రోజుల్లో మదురైలో ఓపీఎస్ వర్గ మహానాడు జరుగుతుందని, అందులో పెద్దఎత్తున కార్యకర్తలు, నిర్వాహకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వైద్యలింగం, పీహెచ్ పాండియన్‌ను గజమాలతో సత్కరిస్తున్న ఆర్వీ రంజిత్‌కుమార్

టైరు పేలి రోడ్డు పక్కన గుంతలో పడిన కారు

● నలుగురి మృతి, ఆరుగురికి గాయాలు

ఘటనాస్థలి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: టైరు పేలి అదుపుతప్పిన కారు రోడ్డు పక్కనున్న గంతలో పడటంతో నలుగురు మృతి చెందగా ఆరుగురు గాయపడిన ఘటన తిరుక్కోవిలూర్ సమీపంలో చోటుచేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. విళుపురం జిల్లా కండాచ్చిపురం తాలూకా టి.దేవనూర్ గ్రామానికి చెందిన మాధవన్ (44) విళుపురం సాయుధ పోలీసు దళంలో పనిచేస్తున్నారు. ఈయన ఆదివారం ఉదయం టి.దేవనూర్ నుంచి కారులో కుటుంబ సభ్యులతో కలిసి తిరువణ్ణామలై ఆలయానికి బయలుదేరారు. కారును మాధవన్ నడిపారు. అందులో ఆయన భార్య మేనక, కుమార్తె కోషికా, సంగీత, శుభ, ధనలక్ష్మి, రాఘవేంద్రన్, మరో ఇద్దరు ఉన్నారు. కారు మణలూర్‌పేట సమీపం కాట్టుకోయిల్ వద్ద వెళుతుండగా టైర్ పేలడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలో పడింది. ప్రమాదంలో సంగీత(30), శుభ(55), ధనలక్ష్మి(70), రాఘవేంద్రన్ (13) అక్కడికక్కడే మృతిచెందారు. మాధవన్, ఆయన భార్య మేనక, కుమార్తె కోషికా, మరో ఇద్దరు గాయపడ్డారు. సమాచారం మేరకు తిరుక్కోవిలూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను, మృతదేహాలను తిరువణ్ణామలై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మణలూర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

బావిలో మునిగి కళాశాల విద్యార్థి మృతి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా ఆవడి సమీపం భారతినగర్‌కు చెందిన రాఘవేందర్ (17) పట్టాభిరాంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీకాం తొలి ఏడాది చదువుతున్నాడు. ఇతను తన స్నేహితులతో ఆదివారం సిరుకడల్ ప్రాంతంలోని బావిలో స్నానానికి దిగి మునిగిపోయాడు. చెవ్వాపేట పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కలిసి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అబార్షన్ చేయించుకున్న మహిళ...

ప్యారిస్: తూత్తుకుడి జిల్లా ఏరల్‌కి చెందిన థామస్ స్టీఫన్, ఆరోగ్య సెల్వప్రియ దంపతులు. వీరికి రెండేళ్ల కుమార్తె ఉన్న నేపథ్యంలో ఆరోగ్య సెల్వప్రియ మళ్లీ గర్భం దాల్చింది. ఇదిలా ఉండగా ఆమె తిరునెల్వేలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఈ నెల 18న అబార్షన్ చేయించుకుంది. ఆ తర్వాత ఆమెకు అనారోగ్య సమస్యలు తలెత్తినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం ఆరోగ్యం మరింత క్షీణించడంతో సాత్తాన్‌కుళం ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా వివాహిత...

ప్యారిస్: చెన్నై కోయంబేడు మన్నడి వీధికి చెందిన ధనలక్ష్మి (50) అద్దె ఇంట్లో నివసిస్తోంది. ప్యారిస్‌లో పువ్వుల వ్యాపారం చేసే ఆమె రెండు రోజుల కిందట కోయంబేడు పూల మార్కెట్‌కి బయలుదేరింది. రోడ్డుపై జారి కిందపడటంతో తలకు తీవ్రగాయమైంది. దీంతో వ్యాపారానికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంది. ఆమె ఇంట్లోంచి బయటకు రాకపోవడంతో అనుమానించిన పక్కింటి మహిళ ధనలక్ష్మి ఇంటికి వెళ్లి చూసింది. గదిలో మంచంపై ఆమె నగ్నంగా మృతిచెంది కనిపించింది. సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రిలో భార్యను హత్య చేసిన భర్త

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆస్పత్రిలో భార్యను దారుణంగా హత్య చేసిన భర్త పరారయ్యాడు. కరూర్ జిల్లా కళిత్తలై ప్రభుత్వ ఆస్పత్రిలో శృతి (27) ఇన్‌పేషెంట్‌గా చికిత్స పొందుతోంది. ఆమె భర్త విస్రూత్ ఆస్పత్రిలోకి చొరబడి విచక్షణా రహితంగా మూడుసార్లు కత్తితో పొడవడంతో శృతి ప్రాణాలు కోల్పోయింది. ముందే చోటుచేసుకున్న గొడవల్లో భర్త దాడి చేయడంతో గాయపడిన ఆమె ఆస్పత్రిలో చేరింది. ఈ నేపథ్యంలో ఆదివారం వేకువజామున విస్రూత్ ఆస్పత్రిలోకి చొరబడి భార్యను హత్య చేసి పరారయ్యాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

ప్రేయసిని చంపిన యువకుడి కోసం గాలింపు

సౌందర్యతో దినేష్ (పాతచిత్రం)

శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే: నాగై జిల్లాకు చెందిన దినేష్ (27), సౌందర్య(25) కలిసి శ్రీపెరుంబుదూర్ సమీప మేవళూర్‌కుప్పం గ్రామంలో విడివిడిగా ఇళ్లు అద్దెకు తీసుకొని నివసిస్తూ సమీపంలో ఉన్న ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఇద్దరూ ఒకే జిల్లాకు చెందిన వారు కావడంతో పరిచయం ఏర్పడి ప్రేమించుకున్నారు. ప్రేమ వ్యవహారం ఇరువురి తల్లిదండ్రులకు తెలియడంతో పెళ్లి చేయడానికి నిర్ణయించారు. కొద్ది రోజుల క్రితం సొంతూరిలో నిశ్చితార్థం నిర్వహించారు. ఇదిలా ఉండగా సౌందర్య మరో యువకుడితో మాట్లాడుతూ చనువుగా తిరుగుతున్నట్లు తెలుసుకున్న దినేష్ ఆమెను మందలించాడు. ఈ వ్యవహారమై ఇరువురి మధ్య శనివారం రాత్రి గొడవ జరిగింది. దీంతో ఆగ్రహించిన దినేష్ ప్రేయసి ఉంటున్న ఇంటికి వెళ్లి కత్తితో దాడి చేసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన సౌందర్య అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై శ్రీపెరుంబుదూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. పరారీలో ఉన్న దినేష్ కోసం గాలిస్తున్నారు.

మహిళ మృతదేహం లభ్యం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుచ్చి మణప్పారై సమీపంలోని సిట్కో ప్రాంగణంలో ఆదివారం 20ఏళ్ల యువతి మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె కళనివాసల్‌పట్టికి చెందిన సుకన్య (20)గా తేలింది. భర్తతో అభిప్రాయభేదాల కారణంగా ఒంటరిగా నివసిస్తున్న ఆమెను దుండగులు హత్య చేసినట్లు గుర్తించారు. దర్యాప్తు కొనసాగుతోంది.

బాలికను గర్భవతిని చేసిన యువకుడు

శ్రీనాథ్ (పాతచిత్రం)

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: సేలం జిల్లా ఓమలూర్‌కి చెందిన 18ఏళ్ల యువకుడు భవన నిర్మాణ కార్మికుడు. ఇతనికి ఇన్‌స్టాగ్రామ్‌లో అరియలూర్‌కి చెందిన 17 ఏళ్ల వయసున్న ప్లస్‌టూ చదువుతున్న బాలికతో పరిచయం ఏర్పడింది. తర్వాత ఇద్దరు ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో యువకుడు తన ఇంట్లో ఎవరూలేని సమయంలో ప్రేయసిని తీసుకొచ్చి లైంగికంగా దగ్గరయ్యాడు. దీంతో ఆమె గర్భం దాల్చింది. ప్రస్తుతం ఐదు నెలల గర్భంతో ఉన్నట్లు బాలిక బాలల సంక్షేమ అధికారులకు సమాచారం ఇచ్చింది. వారి ఫిర్యాదు మేరకు ఓమలూర్ ఆల్ ఉమెన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న అతని కోసం గాలిస్తున్నారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు సత్తువాచ్చేరికి చెందిన శ్రీనాథ్ (28), అదే ప్రాంతానికి చెందిన అరుణాచలం, ముహ్మద్ అలీ స్నేహితులు. గత జూన్‌లో శ్రీనాథ్.. అరుణాచలం తండ్రిపై ఇనుపరాడ్డుతో దాడిచేశాడు. ఈ ఘటనపై సత్తువాచ్చారి పోలీసులు శ్రీనాథ్‌పై కేసు నమోదు చేశారు. ఇదిలాఉండగా రెండు రోజుల క్రితం శ్రీనాథ్, ముహ్మద్ అలీ పులిమేడు ప్రాంతంలోని జలపాతం వద్ద మద్యం తాగుతుండగా అక్కడికి అరుణాచలం వచ్చాడు. శ్రీనాథ్ తన తండ్రిపై దాడిచేసినట్లు ముహ్మద్ అలీకి చెప్పాడు. దీంతో శ్రీనాథ్, ముహ్మద్ అలీ మధ్య వాగ్వాదం జరిగింది. అప్పుడు ముహ్మద్ అలీ, అరుణాచలం కలిసి కత్తితో శ్రీనాథ్‌పై దాడిచేసి చంపేశారు. తర్వాత మృతదేహాన్ని జలపాతంలో పడేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మృతదేహాన్ని గమనించిన స్థానికులు అరియూర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి అరుణాచలం, ముహ్మద్ అలీని అరెస్టు చేశారు.

పోక్సో కేసులో ముగ్గురు బాలురు...

గుమ్మిడిపూండి: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండిలోని ప్రభుత్వ పాఠశాలలో 11ఏళ్ల బాలిక ఏడో తరగతి చదువుతోంది. అదే పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు బాలికను లైంగికంగా వేధించారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు దర్యాప్తు చేపట్టి విద్యార్థులు ముగ్గురిని పోక్సో చట్టం కింద ఆదివారం అరెస్టు చేసి చెన్నై కెల్లీస్‌లోని హోంకు తరలించారు.

బాలికను పెళ్లి చేసుకున్న వ్యక్తి...

విల్లివాక్కం: ధర్మపురి సమీపం నల్లంపల్లి కంబంపట్టికి చెందిన సెల్వరాజ్(34) భార్య మృతి చెందింది. ఇతనికి ఇద్దరు పిల్లలున్నారు. ఇదిలా ఉండగా పాలక్కోడులోని బంధువు ఇంటికి వెళ్లినప్పుడు ఆ ప్రాంతానికి చెందిన 15 ఏళ్ల బాలికతో సెల్వరాజ్‌కు పరిచయం ఏర్పడింది. ఈ నెల 15వ తేదీ ఆమెను తీసుకెళ్లి మేచ్చేరిలోని ఓ ఆలయంలో వివాహం చేసుకున్నాడు. దీని గురించి బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పాలక్కోడు ఆల్ ఉమెన్ పోలీసులు పోక్సో చట్టం కింద సెల్వరాజ్‌ని శనివారం అరెస్టు చేశారు.

దీపావళి చిట్టీ పేరుతో మోసగించిన నిందితుడు...

శంకర్

ప్యారిస్: కాంచీపురానికి చెందిన దేవి అనే మహిళ చిన్నమ్మ కుమారుడు శంకర్ మణపాక్కంలో సూపర్ మార్కెట్ నడుపుతున్నారు. అదేవిధంగా దీపావళి చిట్టీలు నిర్వహిస్తూ 30 మంది నుంచి మొత్తం రూ.9.36 లక్షలు వసూలు చేశాడు. చిట్టీ గడువు ముగిసినా వారికి చెప్పిన వస్తువులు ఇవ్వకుండా మోసానికి పాల్పడడంతో బాధితులు నందంబాక్కం పోలీసులకి ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు దర్యాప్తు చేసి శంకర్‌ని అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించినట్లు పోలీసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

రైలులో గంజాయి స్వాధీనం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: తిరుప్పూర్ నుంచి కోయంబత్తూరు వచ్చిన వెస్ట్ కోస్ట్ రైలులో రైల్వే పోలీసులు, మాదకద్రవ్యాల నిరోధక విభాగ పోలీసులు తనిఖీలు చేశారు. ఓ బోగీలో అనుమానాస్పదంగా కనిపించిన బ్యాగును పరిశీలించారు. అందులో ఉన్న 9కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ హత్య కేసులో రైతుకు జీవిత ఖైదు

సెల్వరాజ్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: మహిళను హత్య చేసిన కేసులో రైతుకు జీవిత ఖైదు విధిస్తూ కరూర్ జిల్లా కోర్టు శనివారం ఉత్తర్వులు ఇచ్చింది. కరూర్ జిల్లా అరవక్కురిచ్చి సమీపంలోని మొడక్కూర్ వడగపట్టి కళ్ళిక్కాట్టు గార్డెన్‌కు చెందిన రైతు సెల్వరాజ్(51)కి ఈరోడ్ జిల్లా అవల్‌పూందురైకి చెందిన శశికళతో(26) వివాహేతర సంబంధం ఉన్నట్టు తెలుస్తోంది. 2018 నవంబరు 21వ తేదీ వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. సెల్వరాజ్ ఆమెను హత్య చేశాడు. దీంతో అరవక్కురిచ్చి పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ కేసు విచారణ కరూర్ జిల్లా బెంచ్ కోర్టులో విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో సెల్వరాజ్‌కు జీవిత ఖైదు, రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. జరిమానా చెల్లించకుంటే మరో 4 ఏళ్ల జైలు శిక్ష అనుభవించాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

మరో కేసులో ఐదుగురికి...

ప్యారిస్: తేని జిల్లా పళనిచెట్టిపట్టిలో 2022లో సుకుమారన్ (19), కపిల్ (22), సేవాగ్ (19), అజిత్‌కుమార్ (19), సెంథిల్‌కుమార్ (45) అనే వ్యక్తులు మద్యం మత్తులో రోడ్డుపై వెళ్తున్న వారితో గొడవపడ్డారు. అప్పుడు అటుగా వెళ్తున్న పాండియన్ అనే వ్యక్తి వారిని మందలించాడు. దీంతో ఆవేశం చెందిన యువకులు పాండియన్‌పై దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. అనంతరం పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ కేసుని విచారించిన తేని ప్రిన్సిపల్ సెషన్ కోర్టు ఐదుగురికి జీవిత ఖైదు, తలా రూ.5 వేల జరిమానా విధిస్తూ శనివారం ఉత్తర్వులు ఇచ్చింది.

భార్యాభర్తల బలవన్మరణం

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా కణియంబాడికి చెందిన శంకర్ (50), సుమతి (48) దంపతులు కూలీలు. వీరి ఇద్దరు కుమార్తెలకు వివాహమైంది. కుమారుడు ఎలక్ట్రీషియన్. శంకర్ మద్యానికి బానిసై ఇంట్లో డబ్బులు ఇవ్వట్లేదు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి కూడా వారిమధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో శంకర్ పురుగుల మందు తాగాడు. తర్వాత సుమతి కూడా తాగింది. ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. వేలూరు తాలూకా పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడు ప్రేమ పెళ్లి చేసుకున్నాడని తల్లి...

ప్యారిస్: కన్నియాకుమరి జిల్లా అంజు గ్రామానికి చెందిన మరియ ఆరోగ్యం, సహాయమలర్ (52) దంపతులు. వీరికి ముగ్గురు కుమారులున్నారు. వారిలో ఇద్దరు కుమారులు ఇదివరకే ప్రేమ వివాహం చేసుకుని వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో మూడో కుమారుడికి వివాహం చేసేందుకు తల్లిదండ్రులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మూడో కుమారుడు కూడా ఓ యువతిని ప్రేమ పెళ్లి చేసుకొని ఇంటికి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. దీంతో సహాయమలర్ మనస్తాపానికి గురై విషం తాగింది. ఆమెను ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుడు...

గుమ్మిడిపూండి: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపం నేమలూరుకు చెందిన కార్తిక్ (40) దివ్యాంగుడు. ఇతనికి ఇంకా పెళ్లి కాలేదు. దీంతో మనోవేదనకు గురైన అతను శనివారం రాత్రి క్రిమిసంహారక మందు తాగాడు. అపస్మార స్థితికి చేరడంతో కుటుంబీకులు చెన్నై స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గుమ్మిడిపూండి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

సంబరం కలకాలం నిలిచేలా స్వీయచిత్రం

సెల్ఫీ పాయింట్‌లో పట్టాలతో యువతులు

విద్యార్థికి పట్టా ప్రదానం చేసి.. చిత్రానికి ఫోజిస్తున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

మేమే ఐఐటీయన్లం

- ఘనంగా ఏడో స్నాతకోత్సవం
- ప్రాంగణమంతా కుటుంబ సభ్యులతో విద్యార్థుల సందడి

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఐఐటీ ఏడో స్నాతకోత్సవంలో పట్టభద్రులు సంతోషాలతో సంబరాలు జరుపుకొన్నారు. కుటుంబ సమేతంగా ఐఐటీ ప్రాంగణానికి చేరుకుని తీపి జ్ఞాపకాలు పదిలంగా మదిలో ఉంచుకునేలా స్వీయచిత్రాలు తీసుకున్నారు. ఆచార్యుల నుంచి ఆశీర్వచనాలు పొందడంతో పాటు తోటి విద్యార్థులతో కలిసి సందడి చేశారు. మేమే 'ఐఐటీ'యన్లమని కేరింతలతో అల్లరి చేయడంతో ఐఐటీ ప్రాంగణం సందడిగా మారింది. కొందరు పరిశోధన విద్యార్థులు పిల్లలతో కలిసి స్నాతకోత్సవానికి హాజరు కాగా మరికొందరు తల్లిదండ్రులు, బంధువులు, అవ్వతాతలతో పాల్గొన్నారు. ఐలవ్ ఐఐటీ అని ప్రాంగణమంతా సందడి చేస్తూ అందాలను ఆస్వాదించారు. డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కుటుంబ సభ్యులతో ఆనందం పంచుకుంటూ..

పట్టుబట్టి పట్టా సాధించాడు

తల్లి చిట్టెమ్మతో అనిల్‌కుమార్

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అయ్యగార్లపల్లికి చెందిన అనిల్‌కుమార్ పట్టుదలతో చదువుల్లో రాణించి ఐఐటీ పట్టా పొందాడు. ఐదేళ్ల కిందట తండ్రి అంజయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ అప్పులు తీర్చేందుకు తల్లి చిట్టెమ్మ ఉన్న మూడెకరాల్లో రెండు ఎకరాలు అమ్మేశారు. మిగిలిన ఎకరాలో సాగు చేస్తూ.. కూలి పనులకు వెళ్లి తన ఇద్దరు బిడ్డలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేశారు. ఈ నేపథ్యంలో రెండో కుమారుడైన అనిల్ ఐఐటీలో సీటు సాధించడమే కాకుండా ఉత్తీర్ణుడై పట్టా సాధించాడు. అదేవిధంగా బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం రావడంతో నెలకు రూ.88వేలు ఆర్జిస్తున్నాడు. కుమారుడు ప్రయోజకుడిగా మారడంతో తల్లి చిట్టెమ్మ ఆనందం వ్యక్తం చేశారు.

కుమారుడికి తల దువ్వుతున్న తండ్రి..

వేదికపై ముఖ్యఅతిథులు లక్ష్మీనారాయణన్, సజ్జన్ జిందాల్, డైరెక్టర్ సత్యనారాయణ, వివిధ విభాగాధిపతులు

భార్యాపిల్లలు, తల్లిదండ్రులతో కలిసి వస్తున్న బంగారుపాళ్యం విద్యార్థి వెంకటేష్

■ మార్మోగిన హరోహర నామస్మరణ

ఇంద్ర విమానంపై కొలువుదీరిన శ్రీవళ్లి, దేవసేన సమేత చెంగల్వరాయస్వామి

విజ్ఞానగిరి.. భక్తజన ఝరి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మురుగనికి హరోహర.. స్కందునికి హరోహరా అంటూ శ్రీకాళహస్తి పులకించిపోయింది. ఆడికృత్తిక వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం విజ్ఞానగిరి భక్తజన ఝరిగా మారిపోయింది. కొండపై కొలువుదీరిన కుమారస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్కందునికి ప్రీతికరమైన ఆడికృత్తిక సందర్భంగా భక్తులు పసుపు వస్త్రాలు ధరించి, ఉత్సవమూర్తులతో తరలివచ్చి సమర్పించారు. కావళ్లు పట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. తాత్కాలిక స్నాన ఘట్టాల వద్ద పుణ్యస్నానాలు చేశారు. కుమారస్వామికి గోత్రీలతో పాటు వివిధ పూజా ద్రవ్యాలతో ప్రత్యేక రీతిలో అభిషేకాలు చేశారు. వెండి ఉడుపులతో ప్రత్యేక అలంకరణలతో ఉన్న స్వామిని భక్తులు దర్శించి తరించారు. శ్రీవళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఇంద్రవిమానాన్ని అధిరోహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్. కృష్ణారెడ్డి, ఏఈవో హేమమాలిని, డీఈ శ్రీనివాసులరెడ్డి, సూపరింటెండెంట్లు రవి, నాగభూషణం, వెంకటరెడ్డి, శ్రీహరి, తనిఖీ అధికారి లక్ష్మయ్య, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కావడితో వెళ్తున్న చిన్నారి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి ఆదివారం సాయంత్రానికి భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్, నారాయణగిరి వద్ద నిండిపోయి ఏటీజీహెచ్ వరకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వీరికి దాదాపు 12 గంటల్లో, రూ.300 ఎస్‌ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని 90,011 మంది భక్తులు దర్శించుకోగా రూ.4.23 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

29న గరుడ పంచమి

తిరుమల: ఈ నెల 29న మంగళవారం గరుడ పంచమి పర్వదినం తిరుమలలో జరగనుంది. ఈ సందర్భంగా రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శ్రీమలయప్ప స్వామివారు తనకు ఇష్టమైన గరుడునిపై తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహిస్తారు. ఈ నెలలో స్వామి వారు రెండోసారి గరుడ వాహనంపై దర్శనమివ్వనున్నారు.

తలొగ్గి.. తగ్గించి

☛ ఆస్తి పన్ను మదింపులో చేతివాటం

☛ వైకాపా ప్రభుత్వ హయాంలో అన్నీ అక్రమాలే

● తిరుపతి నగరపాలక సంస్థలో గత ప్రభుత్వ హయాంలో పన్ను మదింపులో అవినీతి, అక్రమాలకు సంబంధించి ప్రభుత్వానికి ఫిర్యాదులందాయి. అనంతపురం ఆర్డీ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. నగరంలోని ఒక డివిజన్‌లో రూ.20లక్షల వరకు పన్ను మదింపులో చేతులు మారినట్లు తనిఖీల్లో వెల్లడైంది.

● చిత్తూరు నగరపాలికలో గత ప్రభుత్వ హయాంలో పన్నుల విధింపు సమయంలో వైకాపా పాలకుల ఒత్తిడులకు తలొగ్గి ఆ పార్టీ నాయకుల గృహాలకు, వాణిజ్య సముదాయాలకు భారీగా పన్ను తగ్గించేశారు. ఇదే సమయంలో రెవెన్యూ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు.

గూడూరు పురపాలక సంఘం కార్యాలయం

● సూళ్లూరుపేట మున్సిపాలిటీలో పట్టణ ప్రణాళికా, రెవెన్యూ విభాగంలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు అవినీతి నిరోధకశాఖ అధికారులు గుర్తించారు. ఇంటి నిర్మాణం పేరుతో భవనాన్ని నిర్మించి వాణిజ్యపరంగా వినియోగించడాన్ని అధికారులు గుర్తించారు. అప్పట్లో ఏసీబీ అధికారులు 125 భవనాలపై ఛార్జిషీటు దాఖలు చేసి చర్యలు చేపట్టారు. గూడూరు, నాయుడుపేట మున్సిపాలిటీల్లోనూ ఇలాంటి ఘటనలే ఉన్నాయి.

పుత్తూరు, సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో పురపాలికల రాబడికి భారీగా గండిపడింది. పురపాలికలు, నగరపాలక సంస్థల్లో ఆస్తిపన్ను మదింపులో వైకాపా నేతల మాటే చెల్లుబాటైంది. నేతల ఇష్టారాజ్యంతో కొన్ని చోట్ల భవనాలకు ఆస్తి పన్ను విధించలేదు. మరికొన్ని చోట్ల నామమాత్రపు పన్నులు విధించి చేతులు దులుపుకొన్నారు. కూటమి ప్రభుత్వం ఆస్తిపన్ను మదింపుపై ఇంటింటి సర్వే చేయాలని మార్గదర్శకాలిచ్చి ఆ దిశగా చర్యలు చేపట్టడంతో అక్రమాలు వెలుగుచూస్తున్నాయి.

పురపాలికలకు ఆర్థికంగా వెసులుబాటు

ప్రభుత్వం చేపడుతున్న సర్వే పూర్తయితే మున్సిపాలిటీలకు ఆర్థిక వెసులుబాటు కలగనుంది. తక్కువ పన్నుతో లబ్ధి పొందుతున్న వారి గుర్తింపు జరిగితే వారికి పన్నులు విధించడం ద్వారా నగరపాలికలు, పురపాలికలకు రూ.కోట్లల్లో ఆదాయం సమకూరే అవకాశం ఉంది. దీంతో ఆర్థిక పరిపుష్టి కలగనుంది.

● **రాష్ట్ర వ్యాప్తంగా సర్వే..** నగరపాలికలు, పురపాలికల్లో ఆస్తి పన్ను మదింపులో అవినీతి, అక్రమాలపై సర్వే చేస్తున్నాం. అక్రమాలు తేలితే అధికారులు, సిబ్బందిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. **-విశ్వనాథ్, ఇన్‌ఛార్జి ఆర్డీ, అనంతపురం**

అటవీ పోరంబోకు భూముల్లో గ్రావెల్ తవ్వకాలకు హైకోర్టు బ్రేక్

చిట్టమూరు(కోట): యాకసిరిలోని సర్వే నెంబరు 425 అటవీ పోరంబోకు భూముల్లో గ్రావెల్ తవ్వకాలకు హైకోర్టు స్టేటస్‌కో విధించింది. దీంతో ఆదివారం తహసీల్దారు సతీష్‌కుమార్, ఆర్ఐ సుధ, రెవెన్యూ సిబ్బంది వెళ్లి గ్రావెల్ తవ్వకాలను ఆపుచేశారు. కోర్టు ఉత్తర్వులు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. యాకసిరి సమీపంలోని అటవీ భూముల్లో సాగరమాల రోడ్డు నిర్మాణానికి సీనరేజ్ చెల్లించకుండానే గ్రావెల్ రవాణా చేస్తున్నారని సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి హైకోర్టుకు వెళ్లారు. దీంతో హైకోర్టు యథాతథస్థితి విధించి తహసీల్దారును కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

భూములు పరిశీలిస్తున్న తహసీల్దారు సతీష్‌కుమార్ తదితరులు

తితిదే కళాశాలల్లో..

ఇంటర్ స్పాట్ ప్రవేశాలపై పీటముడి

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తితిదే జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ ఎంతకూ కొలిక్కి రావడం లేదు. ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియ ముగించి 20 రోజులు గడుస్తున్నా స్పాట్ ప్రవేశాలు తేల్చకపోవడం, సమాధానం చెప్పేవారు లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తితిదే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీపద్మావతి, ఎస్వీ జూనియర్ కళాశాలల ప్రవేశాలకు గత నెల 9 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. ఆ వెంటనే మిగిలిన సీట్లకు స్పాట్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించాల్సి ఉండగా జాప్యం నెలంది. దీనిపై కనీస సమాచారం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు ప్రైవేటులో చేరలేక ఇటు తితిదే కళాశాలల్లో సీటు వస్తుందో రాదో తెలియక నలిగిపోతున్నారు.

● **యూనిట్ టెస్ట్ పూర్తయినా..** ఇంటర్ విద్యార్థులకు ఈ నెల 17న విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం యూనిట్ టెస్ట్-1 పూర్తయింది. మరోవైపు ఇంటర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందంటూ అధికారులు ప్రకటిస్తుండటం గమనార్హం. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని త్వరితగతిన ప్రవేశాలకు ముగింపు పలకాలన్న విన్నపాలు వెల్లువెత్తుతున్నాయి.

పులిగుండుపై వ్యర్థాలు తొలగించిన బృందం

యువత.. సామాజిక బాధ్యత

పెనుమూరు, న్యూస్‌టుడే: మండలంలోని పర్యాటక ప్రాంతమైన పులిగుండు పైభాగం, పరిసరాల్లో చిత్తూరుకు చెందిన యువత, ప్రజలు ఆదివారం స్వచ్ఛందంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని చిత్తూరులోని గ్లామ్స్ స్టుడియో నిర్వాహకులు రాజ్‌కమల్ నేతృత్వంలో నిర్వహించారు. ఇటీవల ఆయన పులిగుండును సందర్శించిన సమయంలో అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు అపరిశుభ్రంగా ఉండడాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని స్నేహితులు, ఇన్‌స్టాగ్రాం ఇన్‌ఫ్లూయెన్సెస్ బృందం సభ్యులకు తెలిపారు. దీంతో సుమారు 40 మంది యువతీ యువకులు పులిగుండు వద్దకు చేరుకుని పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించారు. వాటిని సుమారు యాభై బస్తాల్లో నింపి తాడు సాయంతో కిందకు దింపారు. వ్యర్థాలను ట్రాక్టర్‌లో ఉంచి పెనుమూరు డంపింగ్ యార్డుకు తరలించారు. స్థానిక ఎస్సై రామచంద్రయ్య, సిబ్బంది సహకరించారు.

గుండుపై ఉన్న కొలనులోని వ్యర్థాలు తొలగిస్తున్న యువత

అనంతరం ట్రాక్టర్‌లో నింపుతున్న యువకుడు

పట్టీలు కావాలని వచ్చి..

బంగారం కొట్టేసి

- ఇద్దరు మహిళల చేతివాటం
- సీసీ కెమెరా ఫుటేజీల్లో వెలుగులోకి

చోరీ చేస్తున్న మహిళ (సీసీ కెమెరాలో దృశ్యం)

నాగలాపురం, న్యూస్‌టుడే: పట్టీలు కావాలని నగల దుకాణానికి వచ్చిన ఇద్దరు మహిళలు వ్యాపారి ఏమరుపాటుగా ఉన్న సమయంలో బంగారం కాజేసి జారుకున్న ఘటన సీసీ కెమెరా ఫుటేజీలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. నాగలాపురంలోని మహావీర్ బంగారు నగల దుకాణానికి శనివారం మధ్యాహ్నం ఇద్దరు మహిళలు వెండి కాళ్లపట్టీలు కావాలని వచ్చారు. దుకాణ యజమాని జష్‌రాజ్ వాటిని తీస్తుండగా గోడకు ఉంచిన 12 గ్రాముల బరువైన రెండు బంగారు గొలుసులను తీసిన వారు లోదుస్తుల్లో పెట్టుకుని వెళ్లిపోయారు.

దుండగుల దుశ్చర్యతో..

ఆదివారం ఉదయం దుకాణ షట్టర్ల తాళాల ధ్వంసానికి విఫలయత్నం జరిగి ఉండటాన్ని గమనించిన స్థానికులు చెప్పడంతో జష్‌రాజ్ సీసీ కెమెరాల ఫుటేజీ చూశారు. అందులో శనివారం అర్ధరాత్రి దాటాక ఇద్దరు యువకులు దుకాణ షట్టర్ తాళాలను గడ్డపారతో విరగొట్టడానికి యత్నించిన దృశ్యం కన్పించింది. ఎంతకీ తాళాలు పగలకపోవడంతో వారు వెళ్లిపోయారు. అలా సీసీ కెమెరాల ఫుటేజీ చూడగా శనివారం మధ్యాహ్నం ఇద్దరు మహిళలు చేసిన చోరీ దృశ్యం కూడా కన్పించడంతో ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమగ్రంగా విచారించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

ర్యాగింగ్.. ఆదిలోనే అరికడదాం..!

● గతేడాది ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయంలో విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. జూనియర్‌ను సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. అధికారులు, పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ర్యాగింగ్ భూతానికి దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు.

● ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ వరండాలో క్రికెట్ ఆడుతున్న సీనియర్లను జూనియర్ ప్రశ్నించడంతో వివాదం నెలకొని కొట్టుకున్నారు. సీఐ రామయ్య కౌన్సెలింగ్ ఇచ్చి.. ర్యాగింగ్ కమిటీ ఏర్పాటుకు సహకరించారు.

➡ కమిటీల ఏర్పాటు, బలోపేతం కీలకం

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: విద్యార్థుల మధ్య ఆధిపత్య పోరుతో ర్యాగింగ్ భూతం జడలు విప్పుతోంది. రెండేళ్లుగా పలు కళాశాలల్లో ర్యాగింగ్ జరుగుతుండగా విద్యార్థుల జీవితాలు నాశనం చేయడమెందుకని కేసులు పెట్టకుండా హెచ్చరించి వదిలేశారు. విద్యాక్షేత్రంగా విరాజిల్లుతున్న తిరుపతిలోని వర్సిటీలు, ఇంటర్, డిగ్రీ, బీటెక్, వైద్య కళాశాలల్లో ఏదోరూపంలో ర్యాగింగ్ జరుగుతున్నా యాజమాన్యాలు బహిర్గతం కానివ్వడం లేదు. 'ర్యాగింగ్ నిర్మూలన కమిటీ' ప్రతి కళాశాలలో ఏర్పాటు చేయాల్సి ఉంది. కొన్నిచోట్ల నామమాత్రంగా.. ఎక్కువ కళాశాలల్లో కమిటీల ఊసే లేదు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్

ఎవరుంటారంటే..

ర్యాగింగ్ నిర్మూలన కమిటీ ఛైర్మన్‌గా కళాశాల ప్రిన్సిపల్ లేదా సంచాలకులు ఉంటారు. అధ్యాపకులు ఒకరిద్దరు.. ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులు ప్రతినిధులుగా ఉండాలి. స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో సభ్యులుగా ఉండాలి. విద్యార్థుల తల్లిదండ్రులు, సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు సభ్యులుగా ఉండవచ్చు.

బాధ్యతలు ఇలా..

ర్యాగింగ్‌కు ఆస్కారం లేకుండా పర్యవేక్షించాలి. అలాంటివి ఉంటే కమిటీలోని ఉన్నతస్థాయి అధికారి దృష్టికి తీసుకెళ్లాలి. ర్యాగింగ్ వల్ల కలిగే దుష్పరిణామాలు, కేసుల్లో చిక్కుకుంటే ఎదురయ్యే పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. బాధితులకు అండగా నిలవాలి. ఫిర్యాదుల స్వీకరణకు వీలు కల్పించాలి. టోల్‌ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించాలి.

సదస్సులు నిర్వహిస్తున్నాం..

కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. శక్తి టీమ్స్, ఈగల్ క్లబ్‌లతో కలిసి తరచూ కళాశాలలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. కమిటీలు ఎలాంటి చర్యలు చేపట్టాలో సూచిస్తున్నాం. బహిరంగ ప్రదేశాల్లో ఎలా ప్రవర్తించాలి.. ర్యాగింగ్‌తో పాటు గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరిస్తున్నాం. శక్తి యాప్ డౌన్‌లోడ్ చేయించి ఎలా వినియోగించాలో తెలియజేస్తున్నాం. **- ఎం.శ్రీలత, మహిళా డీఎస్పీ, తిరుపతి**

బుజ్జాయిలకు బేబీ కిట్..!

☛ పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం సిద్ధం

ప్రభుత్వ వైద్యశాలల్లో జన్మించే చిన్నారులకు రక్షణ కల్పించేందుకు ఎన్టీఆర్ బేబీ కిట్లు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. అధికారంలో ఉన్నంత కాలం అమలైంది. అనంతరం గద్దెనెక్కిన వైకాపా.. ఈ పథకం పేరు మార్చి మొక్కుబడిగా అమలు చేసింది. 2021 నుంచి పూర్తిగా నిలిపేసింది. దీంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, తిరుపతి(నేరవిభాగం)

జిల్లా వివరాలిలా..	
జిల్లా ఆస్పత్రి	1
ఏరియా ఆస్పత్రులు	2
సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ	38
పీహెచ్‌సీ	57
ఆస్పత్రుల్లో ఏటా ప్రసవాలు	సుమారు 30 వేలు
మార్కెట్‌లో బేబీ కిట్ ఖరీదు	రూ.1,500 నుంచి రూ.2వేలు

11 రకాల వస్తువులు

కూటమి ప్రభుత్వం అందించనున్న ఎన్టీఆర్ కిట్‌లో మొత్తం 11 రకాల వస్తువులు ఉంటాయి. శిశువు పడుకునేందుకు వీలుగా బెడ్, దోమతెర, చేతులు శుభ్రం చేసుకునే ద్రావణం, సోపు, పౌడర్, న్యాప్‌కిన్, రెండు తువ్వాళ్లు, బొమ్మతో పాటు మరికొన్ని వస్తువులు కిట్‌లో ఉంటాయి. ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు పెంచాలనే ఉద్దేశంతో ఈ కిట్ల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది.

రుగ్మతల బారినపడే అవకాశం

ప్రసవం అయిన తర్వాత పిల్లల సంరక్షణపై ప్రత్యేక దృష్టి అవసరం. దుస్తులు, వ్యక్తిగత శుభ్రత లేకపోయినా నవజాత శిశువులు రుగ్మతల బారినపడే ప్రమాదముంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పేదలకు ప్రయోజనం చేకూరుతోంది. **- డా.ఆర్‌ఆర్ రెడ్డి, ఆర్‌ఎంవో, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, తిరుపతి**

మహిళల జీవితాల్లో దీపం వెలుగులు

- రెండో విడతలో రూ.26.75 కోట్లు జమ
- తొలివిడత నమోదుకు నెలాఖరుతో ముగింపు

తిరుపతి (రెవెన్యూ), న్యూస్‌టుడే: దీపం-2 పథకంలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం తొలి విడత ఉచిత గ్యాస్ సిలిండర్ నమోదు ప్రక్రియ ఈ నెలాఖరుతో ముగియనుంది. ఏటా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

దీపం-2 పథకం కింద తొలివిడతగా 3.85 లక్షల గ్యాస్ కనెక్షన్లకుగాను రాయితీ నగదుగా రూ.31.07 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రెండో విడతలో 3,15,303 మంది లబ్ధిదారులకు రూ.26.75 కోట్లు జమయింది. సిలిండర్ కోసం వివరాలు నమోదు చేసుకున్న రెండు రోజుల్లో వినియోగదారుడికి చేరుతుంది. ఇందుకు మొదట నగదు చెల్లించాలి. తర్వాత 48 గంటల్లోనే వినియోగదారుడి ఖాతాలోకి ఆ మొత్తాన్ని ప్రభుత్వం జమ చేస్తుంది. ఈ ప్రక్రియలో ఏదైనా సమస్యలు ఎదురైనా.. వినియోగదారులు ఫిర్యాదు చేసినా.. పౌరసరఫరాల శాఖ, గ్యాస్ ఏజెన్సీలు వెంటనే పరిశీలించి పరిష్కరిస్తున్నాయి. గ్యాస్ రాయితీ నగదు జమ కాకుంటే వినియోగదారులు ఫిర్యాదు చేసేలా ప్రభుత్వం వీలు కల్పించింది.

నగదు పడకుంటే..

సిలిండరు తీసుకున్న తర్వాత రాయితీ జమ కాకుంటే 1967 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి సమస్య తెలియజేయొచ్చు. తొలుత వినియోగదారుడుగ్యాస్ ఏజెన్సీని సంప్రదించాలి. అక్కడ ఈకేవైసీ చేయించుకోవాలి. ఆ తర్వాత సదరు బ్యాంకుకు వెళితే ఎన్‌పీసీఐ మ్యాపింగ్ ప్రక్రియ చేపడతారు. అనంతరం రాయితీకి అర్హత నగదు ఖాతాల్లోకి జమవుతుంది.

● **సద్వినియోగం చేసుకోవాలి..** దీపం-2లో ఈ ఏడాది తొలి విడత ఉచిత గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ఈ నెలాఖరుతో ముగియనుంది. లబ్ధిదారులు అందరూ సిలిండర్లు బుక్ చేసుకోవాలి. 48 గంటల్లో రాయితీ నగదు ఖాతాల్లో జమవుతుంది.
-శేషాచలం రాజు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

పాలకవర్గాలు లేక.. నిధులు రాక

➡ వైకాపా ఏకపక్ష నిర్ణయాలతో ఇబ్బంది

➡ తాజాగా ఎన్నికల నిర్వహణకు కసరత్తు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరుకు స్థానిక సంస్థలకు పాలక వర్గాలు ఉండాలని పేచీ పెట్టింది. జిల్లాలోని గూడూరు, శ్రీకాళహస్తిలో రెండు చోట్ల పుర ఎన్నికలు నిర్వహించకపోవడంతో 2023-24 నుంచి ఆర్థిక సంఘం నిధులు విడుదల కాక అభివృద్ధి కుంటుపడుతోంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం తాజాగా ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది.

● వైకాపా హయాంలో పురపాలక సంఘాల్లో సమీప గ్రామాల విలీన ప్రక్రియను 2019 డిసెంబరులో చేపట్టారు. అప్పట్లో ఈ వ్యవహారం అంతా ఏకపక్షంగా చేశారు. ఇలాంటి పరిస్థితి గూడూరు, శ్రీకాళహస్తిలోనూ జరిగింది. దీనిని సంబంధిత గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్లు వేయడంతో స్టే విధించింది. కోర్టు ఉత్తర్వులతో 2021 మార్చిలో అన్ని చోట్ల పుర పాలక ఎన్నికలు జరిగినా గూడూరు, శ్రీకాళహస్తిలో నిర్వహించలేదు.

● **నిబంధనలతో..** కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసేందుకు తప్పనిసరిగా పాలకవర్గాలు ఉండాలని నిబంధన పెట్టింది. ఇక్కడ పాలక వర్గాలు లేకపోవడంతో 2023-24 నుంచి నిధులు విడుదల కాలేదు. కేవలం సాధారణ నిధులతో పాటు వివిధ పద్దుల కింద ప్రభుత్వం మంజూరు చేసే వాటితోనే అభివృద్ధి పనులు చేయాల్సి వస్తోంది.

● **ఎన్నికల నిర్వహణపై దృష్టి..** ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో విలీన గ్రామాలతో సంబంధం లేకుండా ఎన్నికలు నిర్వహించేలా ముందుకెళ్తున్నారు.

ఏం జరిగిందంటే..

శ్రీకాళహస్తి పురపాలికలో 35 వార్డులు ఉన్నాయి. సమీప గ్రామాలైన ఊరందూరు, నారాయణపురం, ఆరవకొత్తూరు, టీఎంవీకండ్రిగ, తొట్టంబేడు(పార్ట్)ను విలీనం చేయగా ఊరందూరు, నారాయణపురం గ్రామస్థులు వ్యతిరేకించారు.

● గూడూరు పురపాలికలో 33 వార్డులు ఉన్నాయి. చెన్నూరు, దివిపాలెం, పోటుపాలెం, చిల్లకూరు, నెల్లటూరులను విలీనం చేయగా చెన్నూరు, దివిపాళెంవాసులు హైకోర్టును ఆశ్రయించారు.

104FM Tirupati
ఈ FM 104 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9000180635

(c) eenadu

శ్రమించాం.. గెలిచాం.. నిలిచాం..

తిరుపతి ఐఐటీయన్ల మనోగతం

పట్టాలు, బంగారు పతకాలు పొందిన విద్యార్థులు

ఏర్పేడు, శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఎంతో శ్రమించారు.. తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చేలా.. చివరికి విజయతీరాలు చేరుకున్నారు.. ఈ పయనంలో కొలువులు సాధించారు.. జీవితంలో తిరుగులేదనిపించారు. ఇక సాంకేతిక రంగంలో తమదైన రీతిలో రాణిస్తామని ధీమాగా చెబుతున్నారు తిరుపతి ఐఐటీలో పట్టభద్రులైన విద్యార్థులు. మూడోతరం ఐఐటీ అయినప్పటికీ ప్రపంచ దేశాలకు ఆదర్శవంతంగా నిలచేలా చాటిచెబుతామని ప్రతిజ్ఞబూనారు. ఈ నేపథ్యంలోనే పలువురు 'ఈనాడు- ఈటీవీ'తో తమ లక్ష్యాలను పంచుకున్నారు. ఆ విశేషాలు వారి మాటల్లోనే..

గొప్ప శాస్త్రవేత్తగా ఎదుగుతా

మాది బెంగళూరు. నాన్న విశ్రాంత ఉద్యోగి, అమ్మ రాధ గృహిణి. కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తిచేశాను. పాలసీగ్రేడింగ్ అల్గారిథంలో మార్పులు, ఉపయోగాలపై పరిశోధన చేశాను. ఇదేరీతిలో అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రతిభను కనబరచడంతో నాకు ప్రెసిడెంట్ మెడల్ రావడం ఆనందంగా ఉంది. అమ్మ, తాతతో సంతోషాన్ని పంచుకున్నాను. మరిన్ని పరిశోధనలు జరిపి కొత్త సాంకేతిక విధానాన్ని రూపొందించాలన్నదే నాలక్ష్యం.

- అరవింద్ శ్రీనివాసన్, ప్రెసిడెంట్ మెడల్ గ్రహీత

కెమికల్ ఇంజినీర్‌గా రాణిస్తా

మాది తమిళనాడు. నాన్న మురగన్, అమ్మ చిత్ర. నేను ఐఐటీలో కెమికల్ ఇంజనీరింగ్ పూర్తిచేయడంతో పాటు గవర్నర్ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. బయోసెన్సార్ విధానంపై చేసిన పరిశోధన సంతృప్తినిచ్చింది. ఐఐటీ మద్రాస్‌లో ఎంటెక్ పూర్తిచేసి కెమికల్ ఇంజినీర్‌గా రాణించాలన్నదే నా లక్ష్యం.

- మేఘవర్షిణి, గవర్నర్ మెడల్ అవార్డు గ్రహీత

వృథానీటికి అడ్డుకట్ట

మాది గుంటూరు. ఐదేళ్ల కిందట తిరుపతి ఐఐటీలో అడుగుపెట్టాను. వినియోగించిన నీటిని నదులు, చెరువుల్లోకి విడుదల చేస్తుండటంతో నీటి కాలుష్యం అధికంగా మారుతుంది. నీటి వృథాకు అడ్డుకట్టి మురుగునీటిని ట్రీట్ చేసేలా పరిశోధనలు చేశాను. ప్రస్తుతం యూఎస్‌ఏలో అగ్రికల్చర్ పరిశోధన సంస్థలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నా. ఇండియాకి తిరిగి వచ్చి ఇక్కడ పరిశోధన సంస్థలో శాస్త్రవేత్తగా చేరి వ్యవసాయాభివృద్ధి, నీటిశుద్ధిని పెంపొందించేందుకు కృషి చేస్తా. ఐఐటీ నుంచి ఉత్తమ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. **- షేక్ మహ్మద్ అల్లాబక్షి**

గూగుల్‌లో ఉద్యోగం వచ్చింది

మాది హైదరాబాద్. ఐఐటీ తిరుపతిలో కంప్యూటర్ సైన్స్ విద్యను పూర్తిచేశాను. ఈనేపథ్యంలో ఇటీవల గూగుల్ సంస్థలో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం నెలకు రూ.55వేలు వంతున సంపాదిస్తున్నా. తిరుపతి ఐఐటీ నాకు ఎప్పటికీ ప్రత్యేకమే. **- వర్షిత, విద్యార్థిని**

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

వైకాపా నేతలను మహిళలు నిలదీయాలి

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

నాయుడుపేట: కూటమిపై విమర్శలు చేసే ఇక్కడ వస్తే వైకాపా నాయకులను కాలర్ పట్టుకుని నిలదీయాలని రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆదివారం తిరుపతి జిల్లా నాయుడుపేట ఏఎంసీ కార్యాలయంలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వైకాపా పాలనలో రాష్ట్రాన్ని దోచుకుని విధ్వంసం చేసిన వైకాపా నాయకులకు ఏడాది పాలనపై విమర్శలు చేసే అర్హత లేదన్నారు. రీకాల్ పేరుతో మీ ఇంటికి వచ్చే వైకాపా నేతలను నిలదీయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, ఆకుతోట రమేష్, పుర వైస్‌ఛైర్మన్ ఎస్.కె.రఫీ, తెదేపా అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా గర్భిణులకు సీమంతాలు చేశారు.

ఒప్పందం.. అభివృద్ధికి ఊతం

❖ జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఎంవోయూలు ❖ అభివృద్ధి పథంలో మహిళా వర్సిటీ

మహిళా వర్సిటీ(తిరుపతి), న్యూస్‌టుడే: మహిళలను ఉన్నత విద్యావంతులుగా, సాంకేతిక నిపుణులుగా, పారిశ్రామిక వేత్తలుగా, వృత్తి నిపుణులుగా తయారు చేస్తూ వారు సాధికారత సాధించేలా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 42ఏళ్లుగా విశేష కృషి చేస్తోంది. నూతన కోర్సులు, ప్రత్యేక సెంటర్లతో అంచెలంచెలుగా ఎదుగుతోంది. వర్సిటీని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తూ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమావెన్నం, ఉన్నతాధికారులు విదేశీ సంస్థలు, విశ్వవిద్యాలయాలతో సరికొత్త మార్పులు తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా పలు దేశ, విదేశీ సంస్థలు, విశ్వవిద్యాలయాలతో మెమోరాండమ్ ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంవోయూ) చేసుకున్నారు. 2014నుంచి ఇప్పటి వరకు దేశ, విదేశాలకు చెందిన పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలతో 166 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

ఏయే సంస్థలంటే..

హిందూపురానికి చెందిన ఏపీ స్టేట్ సెరికల్చర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, యూఎస్‌ఏకు చెందిన ఆబర్న్ యూనివర్సిటీ, సికింద్రాబాద్‌కు చెందిన ది ప్రతిష్ఠ ఇండస్ట్రీస్, ఇండియన్ టెలికం ఇన్నోవేషన్ హబ్, న్యూ ఆర్లెన్స్ వర్సిటీ, నవ్య ఫుడ్స్, ఆర్ఎంఎం ఫుడ్ ప్రాడెక్ట్స్, టాసా ఫుడ్స్, శ్రీ వర్ష ఫుడ్ ప్రాజెక్ట్స్, శ్రీ మంజునాథ ఫ్రూట్ కానింగ్ ఇండస్ట్రీస్, సెంటర్ ఫర్ మీడియా స్టడీస్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బాంబే, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్, యూఎస్‌ఏ వోహియో వర్సిటీ, స్విమ్స్, తానా, పద్మావతి మెడికల్ కళాశాల, యూఎస్‌ఏ సుస్వర అకాడమీ, ఎస్వీ వెటర్నరీ వర్సిటీ, స్టాండ్‌ఫోర్డ్ బ్లెకింగ్ యూనివర్సిటీ, ఎస్వీ జూపార్క్, యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్, ఇథియోపియా జిగ్జిగా వర్సిటీ, సౌత్ కొరియా, బంగ్లాదేశ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఐసీటీ ఇన్ డెవలప్‌మెంట్, సింగపూర్ విద్య సంగీతం అకాడమి, మలేషియా లిన్‌కోల్న్ వర్సిటీ, ఇవే కాకుండా ఆస్ట్రేలియా, కొరియా, అమెరికా, స్వీడన్, ఇథియోపియా, శ్రీలంక, యూకే వంటి దేశాలకు చెందిన సంస్థలు, దేశీయ సంస్థలు కలిపి మొత్తం 166 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

ఇవీ ప్రయోజనాలు

అవగాహన ఒప్పందాలతో ఇరు సంస్థలు, వర్సిటీలకు వివిధ ఉపయోగాలున్నాయి. డ్యూయల్ డిగ్రీ, నూతన, ఉమ్మడి కోర్సుల నిర్వహణ, ఫ్యాకల్టీ సభ్యుల మార్పిడి, సహకార పరిశోధన ప్రాజెక్టులు, విద్యార్థినులకు ఇంటర్న్‌షిప్ సదుపాయం, నూతన ఆవిష్కరణలకు అవకాశం, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం, ప్రయోగశాలల వినియోగం, నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో పరస్పర సహకారం, ప్రాజెక్టు ప్రపోజల్స్ పంపడం, వర్క్‌షాపుల నిర్వహణ, ఉద్యోగ, ఉపాధి తదితర ప్రయోజనాలున్నాయి.

మధ్యవర్తిత్వం.. కక్షిదారులకు సువర్ణావకాశం

పుంగనూరు, న్యూస్‌టుడే: కక్షిదారులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం సువర్ణావకాశం. సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి జీవనం సాగిస్తే శాంతి నెలకొంటుంది. కానీ మారుతున్న కాలంలో మితిమీరిన ఆశ, క్షణికావేశం, అసూయ, కక్షలు ఎక్కువయ్యాయి. ఓ వైపు అపరిష్కృత కేసులు.. మరోవైపు కొత్తగా నమోదయ్యే కేసులతో కోర్టుల్లో కేసుల భారం పెరిగిపోతోంది. ఇలాంటి సమస్యల నేపథ్యంలో న్యాయసేవాధికార సంస్థ 'జాతీయ లోక్ అదాలత్'ను నిర్వహిస్తోంది. తాజాగా మీడియేషన్, సయోధ్య ప్రాజెక్టు కమిటీ ఆదేశాలతో 'మధ్యవర్తిత్వం' ద్వారా కేసులు పరిష్కరించేలా కార్యాచరణ చేపట్టారు.

పుంగనూరులో అవగాహన ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు

సమయం, నగదు ఆదా

ఏదైనా కేసుల్లో కోర్టుకు వెళ్లాలంటే అది ఎన్నాళ్లకు పరిష్కారమవుతుందో తెలియని పరిస్థితి. కానీ లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం అందడంతో పాటు శాశ్వత పరిష్కారం లభిస్తోంది. అటు సమయం ఇటు నగదు ఆదా అవుతోంది. రాజీకి అనువైన సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుంది.

కక్షిదారులు ముందుకు రావాలి

మధ్యవర్తిత్వం ద్వారా కేసు పరిష్కారానికి కక్షిదారులు ముందుకు రావాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. **- ఎ.చెన్నకేశవులు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, పుంగనూరు**

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి, చిత్తూరు, శ్రీకాళహస్తి, పుంగనూరు, మదనపల్లె, కుప్పం, వాల్మీకిపురం, తంబళ్లపల్లె, సత్యవేడు, పుత్తూరు, పీలేరు, పలమనేరు, పాకాల, నగరిలో అంటే 2024 మార్చి నుంచి 2025 జులై వరకు నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసుల వివరాలు..

ఏడాది	నెల	పరిష్కరించిన కేసులు
2024	మార్చి	1079
2024	జూన్	1336
2024	సెప్టెంబరు	3,629
2024	డిసెంబరు	5,317
2025	మార్చి	8,201
2025	జులై	5,098

శ్రీవారి ఆలయం ఎదుట వికాస్ సింగ్ తదితరులు

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్‌సింగ్ ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

అమ్మ సన్నిధి.. వరాల పెన్నిధి

ఒక్క రోజు ఆదాయం రూ.22.44 లక్షలు

బోయకొండ గంగమ్మ

గంగమ్మ సన్నిధి.. వరాల పెన్నిధిగా ప్రసిద్ధి చెందిన బోయకొండ ఆలయం ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. రణభేరి గంగమ్మ ఆలయం నుంచి ప్రధాన ఆలయం వరకు కాలినడకన వచ్చే భక్తులు పలికే ఆదిశక్తి నామాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. సర్వ దర్శనానికి సుమారు 3 గంటలు సమయం భక్తులు క్యూలైన్లో నిరీక్షించారు. రూ.200, రూ.500 టిక్కెట్ల దర్శనాలు సైతం కిక్కిరిశాయి. రద్దీ పెరగడంతో వీఐపీల దర్శనాలు రద్దు చేస్తూ ఈవో ఏకాంబరం ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక దర్శన టిక్కెట్లు, ప్రసాదాల నుంచి ఒక్క రోజు ఆదాయం రూ.22.44 లక్షలు సమకూరినట్లు ఈవో వివరించారు. **- న్యూస్‌టుడే, చౌడేపల్లె**

ఆలయంలో భక్తుల రద్దీ

'విధానపరంగానే దూరం పెట్టారు'

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: విధాన పరంగానే సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని పార్టీ దూరం పెట్టిందని ఆ నియోజకవర్గ పార్టీ కార్యక్రమాల సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. పిచ్చాటూరు మండలం కీళపూడిలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేతో తనకు ఏమాత్రం శత్రుత్వం లేదన్నారు. గతంలో జరిగిన ఒక అంశంతో క్రమశిక్షణా కారణాలతో దూరంగా ఉన్న ఆయన తిరిగి పార్టీలోకి రావచ్చేమో అంటూ వ్యాఖ్యానించారు. పార్టీ బలోపేతానికి సంబంధించి అసంతృప్తితో ఉన్న ప్రతి నేతతోనూ తాను ఒకటికి రెండు సార్లు మాట్లాడతానని.. వారిలో మార్పు రాకుండా.. పార్టీకి నష్టం కలిగించే కార్యక్రమాలు చేపడితే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పూర్తయిన వెంటనే నియోజకవర్గవ్యాప్తంగా అన్ని మండల కమిటీలు, నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ జరుగుతుందన్నారు.

గోవిందుడిని స్మరించి..

తిరునామం ధరించి

శ్రీవారి భక్తులకు సేవ చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి తిరుమలకు వస్తుంటారు. అయితే అందులో కొందరు తమ ప్రత్యేకత చాటుతున్నారు. అలాంటి కోవలోకే వస్తారు తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా పెద్దపల్లికి చెందిన నాగరాజు శర్మ. భక్తులచే గోవింద నామాలు పలికిస్తూ వాటిని తన మైక్ ద్వారా అందరికీ వినిపించేలా చేస్తూ వారికి తిరు నామాలు దిద్దుతున్నారు. తద్వారా భక్తులు ఆసక్తిగా ఆయన వద్దకు చేరుకుని తిరునామాలు పెట్టించుకోవడంతోపాటు గోవింద నామాలు పలుకుతూ స్మరిస్తూ ఆధ్యాత్మిక అనుభూతి పొందుతున్నారు. **- న్యూస్‌టుడే, తిరుమల**

రాష్ట్ర నూతన కార్యవర్గంలో చోటు దక్కించుకున్న జిల్లా సభ్యులు

రేషన్ డీలర్ల సమాఖ్యలో చోటు

తిరుపతి(రెవెన్యూ, గ్రామీణ), న్యూస్‌టుడే: రాష్ట్ర రేషన్ డీలర్ల సమాఖ్యలో జిల్లాకు చెందిన ముగ్గురికి చోటు లభించింది. విజయవాడ వేదిక ఆదివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు దివిలీల మాధవరావు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర కార్యదర్శిగా తిరుపతి గ్రామీణ మండలం చెర్లోపల్లికి చెందిన కోటీశ్వరనాయుడు ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేష్‌రెడ్డి, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా హేమలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గుజ్జు పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాలు పాటించని మామిడి గుజ్జు పరిశ్రమలు, ర్యాంపులపై చర్యలు తీసుకోవాలని మామిడి సంక్షేమ సంఘం జిల్లా కమిటీ నాయకులు తీర్మానించారు. ఆదివారం స్థానిక ఎన్జీయూ భవనంలో మామిడి సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ కన్వీనర్లు జనార్దన్, ఆనందనాయుడు, మునీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తోతాపురి మామిడి కిలోకు రూ.12 అందజేస్తామని.. ఇందులో గుజ్జు పరిశ్రమలు రూ.8, ప్రోత్సాహక నగదుగా ప్రభుత్వం రూ.4 చెల్లిస్తామని సీఎం ప్రకటించారన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని పాటించని వారిపై చర్యలకు ఉపక్రమించాలని కోరారు. ఈ నెల 22న స్థానిక జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రపంచ మామిడి దినోత్సవానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని జయప్రదం చేయాలని కోరారు. కమిటీ సభ్యులు హరిబాబుచౌదరి, సంజీవరెడ్డి, లవకుమార్, ఓబుల్‌రాజు, మునిరత్నంనాయుడు, చంద్రమౌళిరెడ్డి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో కమిటీ సభ్యులు

'తిరుమలలో అన్యమతస్థులను విచారించాలి'

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో ఆరేళ్లుగా ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో అనధికారికంగా ఇద్దరు అన్యమత వ్యక్తులు అతితక్కువ జీతానికి పని చేస్తూ అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్నారని, తితిదే అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు తుమ్మ ఓంకార్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇందులో మహారాష్ట్రకు చెందిన అష్రఫ్ అన్సర్, బిహార్ నుంచి వచ్చిన ఎండీ నసీంగా గుర్తించామని, వీరు పెట్రోల్ బంక్‌లో టైర్లకు పంక్చర్లు వేస్తున్నారని, ఇటువంటి వారితో తిరుమల భద్రతకు ప్రమాదం ఉందన్నారు. రాయచోటి, పుత్తూరు వంటి ఘటనలను దృష్టిలో ఉంచుకుని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: తిరుపతి కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు అందరూ కార్యక్రమంలో పాల్గొంటారని, అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మునగాకు కోస్తూ విద్యుదాఘాతంతో యువకుడి మృతి

గంగాధర నెల్లూరు, న్యూస్‌టుడే: మిట్టకొత్తూరులో ఆదివారం మునగాకు కోస్తూ లోకేశ్ (31) అనే వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. వరదరాజులనాయుడు కుమారుడైన లోకేశ్ పొలం వద్ద ఉన్న మునగచెట్టు ఎక్కి ఆకు కోస్తుండగా, చెట్టుపై వెళ్తున్న విద్యుత్తు తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. కుటుంబీకులు చిత్తూరు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. సీఐ శ్రీనివాసంతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లోకేశ్ (పాతచిత్రం)

❖ **పండుగ రోజే మరణం:** వరదరాజులనాయుడుకు ఏడాది క్రితం ఇందుప్రియ అనే యువతితో వివాహమైంది. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి. ఆదివారం ఆడికృత్తిక కోసం మామతో కలిసి పొలం వద్ద మునగచెట్టు ఎక్కి మృత్యువాత పడటంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఇందుప్రియను ఓదార్చడం బంధుమిత్రులు, గ్రామస్థుల వల్ల కాలేదు. మేస్త్రి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించే లోకేశ్ మృతితో ఆ కుటుంబం వీధిన పడింది.

బస్సు ఢీకొని రైల్వే ఒప్పంద ఉద్యోగి దుర్మరణం



రాజశేఖర్ బాబు (పాత చిత్రం)

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: అపశవ్య దిశగా వస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొని ఓ ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యారు. తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు వివరాల మేరకు.. చంద్రగిరి మండలం నరసింగాపురం గ్రామానికి చెందిన రాజశేఖర్ బాబు (44) రైల్వే ఐఆర్‌సీటీసీలో ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తున్నారు. గ్రామంలో కాపురం ఉంటూ రోజూ విధుల నిమిత్తం తిరుపతికి వచ్చి వెళ్తుంటారు. భార్య ఉషారాణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆదివారం ఉదయం కుమార్తెలను చంద్రగిరికి తీసుకొచ్చి అక్కడి నృత్యం క్లాసులో విడిచిపెట్టారు. అనంతరం విధుల నిమిత్తం తిరుపతికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. చంద్రగిరి రోడ్డులో నుంచి చెర్లోపల్లి వైపు వస్తుండగా.. ఎదురుగా అపసవ్య దిశగా వస్తున్న పుంగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు వేగంగా ఢీకొంది. వాహనం నుంచి ఎగిరి కిందపడ్డ రాజశేఖర్ బాబు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే రుయాకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. డ్రైవర్ అమరనాథ్ నిర్లక్ష్యంగా బస్సు నడపడంతో ఘటన జరిగినట్లు ఆరోపణలు వ్యక్తమయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాజీ వైస్ ఎంపీపీ హత్య



రంగయ్య నాయుడు (పాతచిత్రం)

తవణంపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని తెల్లగుండ్లపల్లె గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ రంగయ్యనాయుడు(78) శనివారం రాత్రి హత్యకు గురయ్యాడు. తెదేపా హయాంలో 1994-99లో రంగయ్యనాయుడు తవణంపల్లె మండలం వైస్ ఎంపీపీగా పనిచేశారు. పోలీసుల కథనం మేరకు.. తెల్లగుండ్లపల్లె గ్రామానికి చెందిన రంగయ్యనాయుడు భార్య జయంతి అనారోగ్యం రీత్యా హైదరాబాదులో నివాసం ఉన్న కుమారుడు బాలాజీ దగ్గరకు వెళ్లింది. కుమార్తె జనప్రియ, అల్లుడు షణ్ముగనాయుడు తెల్లగుండ్లపల్లెలో ఉంటూ రంగయ్య బాగోగులు చూసుకుంటున్నారు. శనివారం ఉదయం గ్రామానికి చెందిన సాయి, బాలాజీ మరికొందరు యువకులతో రంగయ్యకు వాగ్వాదం జరిగింది. ఆదివారం ఉదయం రంగయ్య ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డులో ఉరికి వేలాడుతూ మృతిచెంది ఉండటాన్ని పక్కింటి వారు చూశారు. కాళ్లు, చేతులు కట్టేసి ఉన్నాయి. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేయించారు. లభించిన ఆధారాలతో పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గొడవ పడ్డ కొందరు యువకులను అనుమానితులుగా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీధర్‌నాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఘాట్‌రోడ్డులో ఎలుగు సంచారం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల మొదటి ఘాట్ రోడ్డు సమీపంలో ఓ ఎలుగుబంటి కలకలం సృష్టించిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. కపిలతీర్థం ఆలయంపైన ఉన్న కొండ ప్రాంతంలో ఎలుగుబంటి సంచారాన్ని మొదటి ఘాట్‌రోడ్డులో వాహనాల్లో వెళ్తున్న భక్తులు గుర్తించారు. ఈ విషయాన్ని తితిదే అటవీశాఖకు సమాచారం అందించారు. అనంతరం కొంతసేపటికి ఎలుగుబంటి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది.

ఘాట్‌రోడ్డుకు సమీపంలో ఎలుగు

ఫోన్‌పేలో నగదు బదిలీ.. దొంగ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: సహచర రైల్వే ప్రయాణికులు ఫోన్‌పే వినియోగించే సమయంలో లాక్ గుర్తుపెట్టుకుని తర్వాత ఇంట్లోవాళ్లతో మాట్లాడాలని వారి సెల్‌ఫోన్ తీసుకుని ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేసుకునే దొంగను అరెస్టు చేసినట్లు జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు ఆశీర్వాదం, సందీప్ కుమార్ ఆదివారం తెలిపారు. ఒంగోలుకు చెందిన వేణుబాబు (36) రైల్లో ప్రయాణిస్తూ.. పక్కనున్న వృద్ధుడి ఫోన్ తీసుకుని రూ.87 వేల నగదు బదిలీ చేసుకున్న ఘటనపై గతంలో తిరుపతి జీఆర్‌పీ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఘటనపై జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి నిందితుడు వేణుబాబును శనివారం ఒంగోలులో అరెస్టు చేసి తిరుపతికి తీసుకొచ్చారు. వృద్ధుల పక్కన కూర్చొని వారి సెల్‌ఫోన్లలోని నగదు కాజేసినట్లు నిందితుడు అంగీకరించారు. ఎస్సైలు ధర్మేంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

వెన్‌కాబ్ (కిలో రూ.ల్లో)

బ్రాయిలర్ (రైతు ధర)	106
రిటైల్	127
లేయర్	112
బ్రాయిలర్	184
బ్రాయిలర్ స్కిన్ లెస్	210
లేయర్ మాంసం	190

ఏడాదిగా బెదిరిస్తూ.. యువతిపై వృద్ధుడి అత్యాచారం

కల్లూరు, న్యూస్‌టుడే: అరవై ఏళ్ల వృద్ధుడు ఏడాదిగా ఓ యువతిని బెదిరిస్తూ.. అత్యాచారానికి పాల్పడిన ఘటన పులిచెర్ల మండలంలో ఆదివారం వెలుగు చూసింది. కల్లూరు ఎస్సై వెంకటేశ్వర్లు కథనం మేరకు.. మండలానికి చెందిన 22 ఏళ్ల యువతి కొంత వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగా అదే గ్రామానికి చెందిన 60 ఏళ్ల వృద్ధుడు (వరుసకు మామ) యువతిని కత్తితో బెదిరించి ఏడాది కిందట యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇలా పలుమార్లు బెదిరించి అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఈ విషయం తన తల్లిదండ్రులకు చెబుతానని యువతి అనడంతో 'మీ నాన్న తాగే మద్యంలో విషం కలిపి చంపుతా' అని బెదిరించినట్లు యువతి ఫిర్యాదులో పేర్కొంది. ఈ నెల 13న యువతి తన తమ్ముడితో కలిసి వెళ్తుండగా మళ్లీ బెదిరించాడు. ఆ తర్వాత యువతి మెడలో దారం వేసి ఫొటో దిగి పెళ్లయినట్లు చిత్రీకరించడంతో ఆమె తల్లిదండ్రులకు అసలు విషయం చెప్పింది. దీంతో వారు బాధితురాలిని పోలీసుల వద్దకు తీసుకెళ్లారు. వృద్ధుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

తొట్టంబేడు, న్యూస్‌టుడే: భార్య అలిగి వెళ్లిందని ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన శ్రీకాళహస్తిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు.. స్థానిక కుందేటివారివీధికి చెందిన చిన్నప్పరెడ్డి (64) బీడీ కార్మికుడిగా పనిచేస్తుంటారు. మద్యానికి బానిసైన ఈయన తరచూ తాగొచ్చి భార్యతో గొడవకు దిగేవారు. ఈ నేపథ్యంలో శనివారం భార్యతో గొడవపడగా అతనితో ఉండలేనంటూ సమీపంలో కాపురముంటున్న కుమారుడి ఇంటికెళ్లింది. మనస్తాపానికి గురైన చిన్నప్పరెడ్డి చీరతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. కుటుంబీకులు ఆయన్ను శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందారని వైద్యులు నిర్ధారించారు. కుటుంబీకులు ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పంచనామా అనంతరం వారికి అప్పగించామని సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

TO LET

తిరుపతి సిటీ హోటల్ వెనుక ... (TOLET) కి ఇవ్వబడును. ✆ 99895 68666.

FOR SALE

తిరుపతి నగరంలో మంచి రన్నింగ్ కండిషన్‌లో ఉన్న స్కూల్ అమ్మబడును. ✆ 95027 73400.

JOBS

EDUCATION

Last Chance: 10th, Inter, Direct Degree (Disc), B.A, B.Com, B.Sc, BBA, BCA, B.Tech, Diploma, M.A, M.Com, MBA, MCA Regular/ Lateral Entry ✆ 93812 87629.

Salary Negotiable. ✆ 97015 10490.

✆ 85559 11711.

✆ 94400 46210, 88852 78852.

Textile Showroom ... Sales Man, Sales Woman, Manager & Accountant ... Ph.No: 99667 71121.

Evargo ... Ph: 7337544439, 9014651068, 7075633416.

MARRIAGE SERVICES

✆ 94918 40669.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

CHANGE OF NAME

I, G.Sree Harsha is son of ser No.JC-441899 H Sub: Ramesh Golla Resident of Varanasi Vari Palli (village), Rompicherla (Post & Mandal), Chittoor (Dist), Andhra Pradesh State, Pin 517192. Have changed my name from G.SREE HARSHA to GOLLA SREE HARSHA vide Affidavit Declaration Date: 19th July, 2025. Advocate and Notary: P.Nagabushanam, Piler.

గమనిక

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే

అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తింపును

తిరుపతి
•తిరుపతి • చంద్రగిరి

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే: చిన్నగొట్టిగల్లు మండలం ఎగువూరు గ్రామం అరుణగిరి (అనమలబండ)పై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం ఆదివారం ఆడికృత్తిక సందర్భంగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు కావిళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

శిల్పారామంలో నాట్య విందు

శిల్పారామంలో కళాకారుల భరతనాట్య ప్రదర్శన

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన సందర్శకులను కనువిందు చేసింది. ఆదివారం పెద్దబాయిల్ల బృందం కళాకారుల నృత్య ప్రదర్శన జరిగింది. ఇందులో భాగంగా పలు సంకీర్తనలకు కళాకారులు చేసిన నృత్యాలు నగర వాసులను అబ్బురపరిచాయి.

ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఊరేగింపు

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: దుర్గసముద్రం గ్రామంలో ద్రౌపది సమేత ధర్మరాజుల ఉత్సవమూర్తుల ఊరేగింపు ఘనంగా జరిగింది. మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉత్సవమూర్తులను వడ్డిపల్లి, కాపు చంద్రపేట, భాగ్యనగరం గ్రామాల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త ప్రసాద్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉత్సవమూర్తులకు ముత్యాల కిరీటాలు అందజేస్తున్న దాతలు

ఘనంగా పవిత్రోత్సవాల ప్రారంభం

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: కోదండ రామస్వామి వారి ఆలయంలో ఆదివారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు ఉత్సవమూర్తులను యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ స్నపన తిరుమంజనం, అనంతరం శత్తుమొర, ఆస్థానం నిర్వహించారు. సాయంత్రం శ్రీసీతారామ లక్ష్మణులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి పవిత్ర ప్రతిష్ఠ, శయనాధివాసం తదితర కార్యక్రమాలు చేపట్టారు. తిరుపతికి చెందిన భక్తుడు పురుషోత్తం ఆలయ ఉత్సవమూర్తులకు నాలుగు ముత్యాల కిరీటాలను విరాళంగా సమర్పించారు. డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

బోనాల వేడుకల్లో తితిదే ఛైర్మన్

అమ్మవారిని దర్శించుకుంటున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు

తిరుమల, తిరుచానూరు, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని పాతబస్తీలో వెలసిన లాల్ దర్వాజా మహంకాళి అమ్మవారిని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదివారం దర్శించుకున్నారు. ఛైర్మన్ మాట్లాడుతూ.... లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తిరుచానూరు అమ్మవారి సేవలో జస్టిస్ రవినాథ్ తిల్హరి శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి దర్శించుకున్నారు.

మేఘన ఆసుపత్రికి ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు

తిరుపతి (వైద్య విభాగం), న్యూస్‌టుడే: స్థానిక అశోక్ నగర్‌లోని మేఘనా మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాలకు ఎన్‌ఏబీహెచ్ అక్రిడిటేషన్ వచ్చినట్లు ఆసుపత్రి అధినేత డా. హేమాద్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈహెచ్‌ఎస్ కార్డుదారులకు నగదు రహిత వైద్య సేవలు, తితిదే, ఏపీ ఎస్పీడీసీఎల్ ఉద్యోగులకు ఉచిత దంత వైద్యం అందజేస్తామని తెలిపారు.

పట్టాలిచ్చారు.. స్థలం మరిచారు

సొంతింటి కలకు దూరమైన లబ్ధిదారులు

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: ఇళ్లు లేని పేదలు దరఖాస్తు చేసుకుంటే స్థలాలు ఇస్తామని గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. ఎంతో ఆశతో దరఖాస్తు చేసిన పేదలు సొంతింటి కల సాకారం కాబోతోందని సంతోషపడ్డారు. చివరకు ఐతేపల్లి, చిందేపల్లి వద్ద అటవీ ప్రాంతాల్లో, కొండలపై జగనన్న లేఔట్లు ఏర్పాటు చేయగా లబ్ధిదారులకు ఆయా సచివాలయాల్లో పట్టాలు ఇచ్చేసి చేతులు దులుపుకొన్నారు. మూడేళ్లు గడుస్తున్నా ఇంతవరకు స్థలాలు చూపించలేదు. ఫలితంగా పేదలు బాడుగ ఇళ్లలోనే నివాసాలు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

తిరుపతి నియోజకవర్గంలో అర్బన్, రూరల్ మండలాల పరిధిలో 15,861 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 3,120 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 12,741 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. చంద్రగిరి నియోజకవర్గంలోని చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం, తిరుపతి రూరల్, యర్రావారిపాలెం పరిధిలో 9,875 ఇళ్లు మంజూరు కాగా 5,251 ఇళ్లు పూర్తయ్యాయి. 4624 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. తిరుపతి గ్రామీణ మండలంలోని పెరుమాళ్లపల్లి, వెంకటపతినగర్, రిక్షాకాలనీలో లబ్ధిదారులకు గత ప్రభుత్వం తొండవాడ, ఐతేపల్లి, చిందేపల్లిలో పట్టాలు కేటాయించింది. నగరానికి చిందేపల్లి లేఔట్ 35 కి.మీ., ఐతేపల్లి 13 కి.మీ., తొండవాడ ఆరు కి.మీ. ఉండగా తొండవాడ వద్ద పట్టాలు వచ్చిన లబ్ధిదారులు నిర్మాణాల్లో నిమగ్నమయ్యారు. చిందేపల్లి, ఐతేపల్లి తిరుపతికి దూరంగా ఉండటం, లబ్ధిదారులకు స్థలాలు చూపించకపోవడంతో లబ్ధిదారులు పట్టాలు చేతపట్టుకుని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. స్థలాలు చూపకపోయినా ఆన్‌లైన్‌లో పేరు ఉండటం, ప్రస్తుతం మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుందో లేదో అన్న సవాలక్ష ప్రశ్నలతో లబ్ధిదారులు నలిగిపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

బోరుగులమ్మి జీవనం

వెంకటపతినగర్‌లో బాడుగ ఇంట్లో నివాసం ఉంటున్నా. రోజూ బోరుగులమ్మి జీవనోపాధి పొందుతున్నా. ఐతేపల్లి వద్ద స్థలం వచ్చిందని సచివాలయంలో ఇంటి పట్టా ఇచ్చారు. ఇంతవరకు స్థలం చూపించలేదు. దగ్గరలోనే తొండవాడ సమీపంలో స్థలం చూపిస్తే బాగుంటుంది. **- కుప్పం కవిత**

ఉత్త పట్టా ఏం చేసుకోవాలి

నేను రిక్షాకాలనీలో నివాసం ఉంటున్నా. మూడేళ్లకు ముందు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నా. పట్టా ఇచ్చారు. ఇంటి స్థలం ఎక్కడుందో తెలియదు. పలుమార్లు సచివాలయంలో అడిగినా సమాధానం లేదు. ఉత్త పట్టా ఇంట్లో పెట్టుకుని ఏంచేయాలి. దగ్గరలో ఇంటి స్థలం ఇస్తే తిరుపతిలో కూలి పనులు చేసుకోవచ్చు. ఐతేపల్లి వద్ద అయితే రాను పోను ఛార్జీలకు సరిపోతుంది. **- గంగమ్మ**

ఇంటి స్థలమైనా చూపించాలి

నేను వెంకటపతినగర్‌లో బాడుగ ఇంట్లో ఉంటున్నా. వైకాపా ప్రభుత్వంలో ఐతేపల్లి వద్ద ఇంటి స్థలం వచ్చిందని పట్టా ఇచ్చారు. ఇంతవరకు స్థలం చూపించింది లేదు. లేదా కొత్తగా దరఖాస్తు చేసుకోమని చెప్పినా దరఖాస్తు చేసుకుంటాం. ఈ ప్రభుత్వమైనా మాకు ఇంటి స్థలం మంజూరు చేయాలి. **- హసీన**

పెయింటర్ పని చేసుకుంటున్నా

మాది రిక్షాకాలనీ. వెంకటపతి నగర్‌లోని బాడుగ ఇంట్లో నివాసం ఉంటున్నా. రోజూ తిరుపతికి వెళ్లి పెయింటింగ్ పనిచేసుకుని జీవనం సాగిస్తున్నా. ఇంటి బాడుగ నెలకు రూ.3,000 చెల్లించాలి. సొంత ఇల్లు ఉంటే ఆ అవసరం ఉండదు. ఐతేపల్లి వద్ద ఇంటి స్థలం వచ్చిందని చెప్పారు. ఇంతవరకు స్థలం ఎక్కడుందో తెలియదు. తిరుపతికి దగ్గరలో స్థలం ఇస్తే బాగుంటుంది. **- సంజీవ, రిక్షాకాలనీ**

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి ఎస్వీ ఆర్. ఆసుపత్రి మార్గం ప్రారంభమయ్యే తిరుమల బైపాస్ రోడ్డు వద్ద నిర్మించిన ఫుట్‌పాత్ పూర్తిగా అపరిశుభ్రంగా ఉంది. చిరువ్యాపారులు ఆక్రమించుకుని వాటిని అపరిశుభ్రం చేస్తున్నారు. కొంత భాగం మట్టితో నిండిపోయింది. **- అమరనాథ్, కొర్లగుంట**

సమాధానం: పరిశీలించి ఫుట్‌పాత్ శుభ్రం చేసేందుకు చర్యలు చేపడతాం. **- యువ అన్వేష్, నగరపాలిక వైద్యాధికారి**

సమస్య: తిరుచానూరు మార్గం నుంచి నారాయణపురం వెళ్లే మార్గం వర్షంతో నిండిపోతోంది. చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలతోపాటు పెద్దఎత్తున చెత్తను డంప్ చేస్తున్నారు. శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి. **- దివాకర్‌బాబు, నారాయణపురం**

సమాధానం: సమస్యను శాశ్వతంగా పరిష్కరించే అంశాన్ని కమిషనర్‌తో చర్చించి చర్యలు చేపడతాం. **- యువ అన్వేష్, నగరపాలిక వైద్యాధికారి.**

వికాస్ సింగ్‌ను సన్మానిస్తున్న వీసీ ఆచార్య ఉమ తదితరులు

సేవాభావంతో ఉండాలి

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: న్యాయ విద్యార్థులు సమాజంపట్ల సేవాభావంతో ఉండాలని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఉపకులపతి ఆచార్య వి.ఉమ పేర్కొన్నారు. వర్సిటీ న్యాయ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం సావేరి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అనంతరం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది వికాస్‌సింగ్ మాట్లాడుతూ కృషి, పట్టుదల, నిబద్ధత, ఆసక్తిగా చదవడం, లాజికల్ థింకింగ్ లక్షణాలు న్యాయవాదులకు ఉండాలన్నారు. డీన్ వాణి, న్యాయ విభాగాధిపతి సీతాకుమారి ప్రసంగించారు.

'నాటి తితిదే పెద్దల అవినీతి లెక్క తేల్చండి'

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: ఐదేళ్ల వైకాపా పాలనలో తితిదేలో కొనుగోళ్లు, ఇంజినీరింగ్ విభాగాల్లో అనేక అక్రమాలు జరిగాయని, వాటికి బాధ్యులైన అప్పటి పాలకమండలి పెద్దలను శిక్షించాలని ప్రస్తుత పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనకు విచ్చేసిన సమయంలో శనివారం విజ్ఞాపనా పత్రాన్ని ఆయన అందజేశారు. వివరాలను ఆదివారం ఆయన మీడియాకు విడుదల చేశారు. గత ప్రభుత్వంలో తితిదే పాలక మండలిలోని పెద్దలు తమ అధికారాన్ని దుర్వినియోగం చేసి శ్రీవారి నిధులు పక్కదారి పట్టించారని, ఆరునెలల కిందట విజిలెన్స్ విభాగం అనేక అంశాల్లో విచారణ జరిపి నివేదికను రూపొందించిందని, చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. పరకామణిలో అక్రమాలకు పాల్పడిన దోషులు తప్పించుకు తిరుగుతున్నారని, వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులు పక్కదోవ పట్టాయని, ధర్మప్రచార పరిషత్తులో అనేక అంశాల్లో అవినీతి జరిగిందని, వీటన్నింటిపై విచారణ జరిపించి దోషులను శిక్షించాలని కోరారు.

ప్రకృతి ఒడిలో ఎస్సీ బాలుర వసతిగృహం

మరో 60 మంది విద్యార్థుల చేరికకు అవకాశం

చంద్రగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం ప్రకృతి ఒడిలో ఆదర్శప్రాయంగా రూపుదిద్దుకుంది. కొత్తపేటలోని నూకలగుంట ఒడ్డున ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. ప్రధానంగా నూతన విద్యాసంవత్సరంలో 90 మంది బాలురు ఉండాల్సిన వసతి గృహంలో ఇప్పటివరకు 30 మంది మాత్రమే హాజరయ్యారు. అడ్మిషన్లు పొందిన మరో పది మంది హాజరుకావాల్సి ఉండగా ఇంకా 60 మంది ఎస్సీ విద్యార్థులు ప్రవేశాలు పొందటానికి అవకాశాలు ఉన్నాయని వసతిగృహం సంరక్షకులు హిమబిందు తెలిపారు. విశాలంగా ఉన్న వసతిగృహ ఆవరణలో సేంద్రీ పద్ధతిలో పండించిన ఆకుకూరలతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నామని, విద్యార్థులకు ప్రతివారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు రాత్రి, వేకువజామున ప్రత్యేక పాఠాలు బోధిస్తున్నామని ఆమె వివరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 6 నుంచి 10వ తరగతి వరకు ఎస్సీ విద్యార్థులు వసతిగృహంలో చేరేందుకు అర్హులని ఆమె తెలిపారు.

ఎస్బీ డీఎస్పీగా బాధ్యతల స్వీకరణ

డీఎస్పీ వెంకటనారాయణ

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) డీఎస్పీగా జె.వెంకట నారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ హర్షవర్ధన్ రాజుని కలిశారు. డీజీపీ అటాచ్‌మెంట్‌లో ఉన్న ఆయన్ను ఎస్‌బీ డీఎస్పీగా నియమిస్తూ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు ఇచ్చారు. ఆ మేరకు బాధ్యతలు స్వీకరించారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి: సీపీఎం

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: అదానీ కంపెనీ ప్రయోజనాల కోసం ఇంటింటా స్మార్ట్ మీటర్లు బిగించే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, దీన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. గత ఎన్నికల సమయంలో మంత్రి నారా లోకేశ్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా వచ్చేనెల 4 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నాయకులు మూలం రమేష్, కందారపు మురళి, సుబ్రహ్మణ్యం, అంగేరి పుల్లయ్య, సాయిలక్ష్మీ, ఆర్.లక్ష్మీ, జయచంద్ర, వేణుగోపాల్, శివకుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అరణ్యవాస ఘట్టం

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: సి.రామాపురంలో ద్రౌపతి సమేత మహాభారత వార్షిక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే భాగవతారణి అనసూయ ఆదివారం పాండవులు అరణ్యవాసానికి వెళ్లిన ఘట్టాన్ని విపులంగా వివరించారు.

మాజీ ఎమ్మెల్సీల పరామర్శ

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, గేయానంద్ పరామర్శించారు. ఇటీవల ఆయన తల్లి రాజమ్మ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఆయన్ని పరామర్శించి రాజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాహుల్, మల్లారపు నాగార్జున తదితరులు ఉన్నారు.

పులివర్తి నానికి..

పాకాల, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే పులివర్తి నానిని తితిదే పాలకమండలి సభ్యురాలు, మాజీ ఎంపీ పనబాక లక్ష్మి ఆదివారం పరామర్శించారు. ఎమ్మెల్యే మాతృమూర్తి లక్ష్మీభారతి మృతి చెందిన నేపథ్యంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

జనార్దన్ చౌదరికి సన్మానం

రామచంద్రాపురం: సింగిల్ విండో ఛైర్మన్‌గా నూతనంగా నియమితులైన చేకూరి జనార్దన్ చౌదరిని ఆదివారం మండలంలోని పీవీ పురం పంచాయతీ తెదేపా నాయకులు సన్మానించి అభినందించారు. పంచాయతీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేత్ర చికిత్స శిబిరం

పాకాల, న్యూస్‌టుడే: ప్రగతి గ్రామీణాభివృద్ధి ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీవేంకటేశ్వరా అరవింద్ కంటి ఆసుపత్రివారిచే ఆదివారం మొగరాల ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించారు. శిబిరానికి 250 మంది హాజరుకాగా పరీక్షలు నిర్వహించి వారిలో 55 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. ట్రస్టు అధ్యక్షుడు నాగరాజనాయుడు, ట్రస్టు ప్రతినిధులు చక్రవర్తినాయుడు, జయచంద్ర, మునిస్వామినాయుడు, శివముని, ఉపాధ్యాయుడు వెంకటసిద్దులు పాల్గొన్నారు.

సీపీఐ కార్యదర్శిగా విశ్వనాథ్

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: సీపీఐ నగర కార్యదర్శిగా విశ్వనాథ్, సహాయ కార్యదర్శిగా బండి చలపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఐ నగర మహాసభల్లో భాగంగా ఆదివారం పార్టీ నగర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా రవి, శివ, కేవై రాజా, పద్మనాభరెడ్డి, డా.ఎండీ ప్రసాద్, డా.బలరాం, ఉదయ్‌కుమార్, మహేంద్ర, నాగరాజు, మంజుల, రత్నమ్మలతో పాటు 61 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వీఆర్‌ఏ అత్యుత్సాహంపై విమర్శలు

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: రంగంపేటలో వంక పోరంబోకు భూమిపై వివాదం నెలకొనగా వీఆర్‌ఏ అత్యుత్సాహంపై బాధితులు ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన కొందరు వ్యవసాయ పొలాలు, ఇళ్లకు దారి సమస్య నెలకొనడంపై గతనెలలో కలెక్టర్‌కు అర్జీ ఇవ్వగా స్పందించిన ఆయన సమస్య పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. సర్వేనం 229/2ఎలో తొమ్మిది సెంట్ల భూమి ప్రభుత్వ రికార్డుల్లో వంక పోరంబోకుగా ఉండగా ఆ స్థలం తమదేనని ఓ మహిళ వాదిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ విషయంలో వీఆర్‌ఏ వెంకటరమణ అత్యుత్సాహం ప్రదర్శించి అధికారుల అనుమతులు లేకుండానే దగ్గరుండి తొమ్మిది సెంట్ల స్థలానికి కొలతలు వేయించడంతో ఆమె ఫెన్సింగ్ వేశారని, దారి కావాలని అర్జీ పెట్టిన తమని బెదిరిస్తున్నట్లు బాధితుడు దండు నాగరాజు వాపోయారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు స్పందిస్తూ ఏవైనా పత్రాలు ఉంటే కార్యాలయంలో హాజరు కావాలని మహిళ తరపువారిని ఆదేశించామని, ఇప్పటివరకు వారు స్పందించలేదని, వీఆర్‌ఏ అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించారు.

మాట్లాడుతున్న నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ తదితరులు

'పెద్దిరెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం'

తిరుపతి (భవానీనగర్) న్యూస్‌టుడే: ఐదేళ్ల పాలనలో లిక్కర్ స్కామ్‌లో ప్రజాధనాన్ని లూటీ చేసిన వైకాపా నాయకులను వదిలిపెట్టే ప్రసక్తేలేదని, దోషులు ఎవరైనా చట్టపరమైన చర్యలు ఉంటాయని యాదవ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ నరసింహ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఉపమేయర్ ఆర్సీ మునికృష్ణతో కలిసి మాట్లాడారు. వైకాపా పాలనలో ముఖ్యమంత్రి స్థాయి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం లిక్కర్ స్కామ్‌లో భాగస్వాములయ్యారన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డిని రాజకీయ కక్షతోనే దోషులుగా చిత్రీకరిస్తున్నారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజకీయ కక్షలు, దాడులు, హత్యలు చేసిన ఘనత వైకాపాకే దక్కుతుందన్నారు. మహేష్ యాదవ్, సుబ్బు యాదవ్, శ్రీరాములు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆడికృత్తిక పూజలు

కావళ్లతో ఆలయానికి చేరుకుంటున్న భక్తులు

పాకాల, న్యూస్‌టుడే: ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని ఊట్లవారిపల్లి సమీపంలోని ఆనందగిరి(పాళ్యంకొండ)పై వెలసిన శ్రీవల్లి దేవసన సమేత సుబ్రహ్మణ్య స్వామివారి ఆలయం వద్ద ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కావళ్లతో వచ్చిన పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆనవాయితీ ప్రకారం ఆనందగిరి ఆలయం వద్ద ఆగస్టు 13 నుంచి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్ నాయుడు తెలిపారు.

సత్వర పరిష్కారంతో మన్ననలు

స్పందనకు వందనం

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: 'మేమున్నాం.. మీకు తోడు'గా శీర్షికన ప్రచురితమైన సమస్యల్ని పరిష్కరించేందుకు అధికారులు సత్వర చర్యలు చేపడుతున్నారు. కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశాలతో ఆరోగ్యాధికారి డా.యువఅన్వేష్, ఎస్ఈ శ్యాంసుందర్, ప్రణాళిక విభాగం అధికారులు ప్రజాసమస్యల్ని పరిష్కరించి నగరవాసుల మన్ననలు పొందుతున్నారు.

❖ ఈనెల 12న బాలాజీకాలనీలోని ఎన్టీఆర్ కూడలిలో హైమాస్క్ విద్యుద్దీపాలు వెలగలేదన్న ప్రజల సమస్యని ఇంజినీరింగ్ అధికారులు పరిష్కరించారు. ఖాదీకాలనీ నుంచి తిరుమల బైపాస్ మార్గం రోడ్డును కలుపుతూ నిర్మించిన రోడ్డు అసంపూర్తిగా ఉండగా పూర్తిచేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈనెల 14న.. బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్టెయిన్‌లెస్ స్టీల్ చెత్తకుండీలు నిండిన వెంటనే చెత్తను తొలగించకపోవడంపై ప్రచురితం కాగా ఆరోగ్య విభాగం అధికారులు స్పందించి పరిష్కరించారు. క్రమంతప్పకుండా చెత్త సేకరించేలా చర్యలు చేపట్టారు. రేణిగుంట మార్గంలో గరుడవారధి కింది భాగంలో అపారిశుద్ధ్యం సమస్యను పరిష్కరించారు. ఈనెల 16న.. శివజ్యోతినగర్‌లోని రత్నం పాఠశాల సమీపంలో పొంగుతున్న యూడీఎస్‌ను శుభ్రం చేసి సమస్యకు పరిష్కారం చూపారు. వెంకటరమణ లేవుట్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ వ్యర్థాల్ని తరలించారు. ఇస్కాన్ సమీపంలోని తితిదే ఉద్యోగుల క్వార్టర్స్ నుంచి వరదరాజనగర్‌కు వెళ్లే మార్గంలోని వ్యర్థాలను సిబ్బంది పరిష్కరించారు. ఖాదీకాలనీ మార్గంలో గుంతలమయమైన రోడ్డును బాగు చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈనెల 18న ప్రచురితమైన అలిపిరి నుంచి మహతి కూడలి వరకు అనధికారిక బ్యానర్లతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వినతితో వాటిని తొలగించారు. కొర్లగుంట పెద్దబావి సందులో ఇంటింటి చెత్త సేకరణ సైతం క్రమబద్ధీకరించారు. ఈనెల 19న ప్రచురించిన ఎస్వీఎస్ కళాశాల మార్గంలో రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించాలని, స్థానికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్న వినతిపై సత్వరం స్పందించి వాహనాలను కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టారు. కొత్తపల్లె ప్రధాన రహదారిలో నిల్వ ఉన్న వర్షపు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.

చెక్కులు అందజేస్తున్న సంఘం సభ్యులు

మెకానిక్ కుటుంబాలకు చేయూత

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: ముగ్గురు బాధిత మెకానిక్‌లకు తిరుపతి టూవీలర్స్ మెకానిక్‌ల సంఘం ఆధ్వర్యంలో రూ.30 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక గాంధీభవన్‌లో సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో భాగంగా తిరుపతికి చెందిన గోపాల్ (గుండె), చంద్రగిరికి చెందిన చిన్న తంబి (కిడ్నీ), తలకోనకు చెందిన సుబ్రహ్మణ్యం (కాలు విరిగి) సమస్యలతో బాధపడుతుండటంతో రూ.10వేల చొప్పున అందజేశారు. 70 మంది మెకానిక్‌లకు స్పెషల్ టూల్ కిట్లు అందజేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు, కార్యదర్శి గురు ఆచారి, సంయుక్త కార్యదర్శి తేజారెడ్డి, కోశాధికారి బాబు, కమిటీ సభ్యులు నాగరాజు, పాపయ్య, మురుగ తదితరులు పాల్గొన్నారు.

WANTED
మా తిరుపతి బ్రాంచిలో పనిచేయుటకు
క్యాషియర్ (MALE)
జీతం: Rs:20,000/-, విద్యార్హత: డిగ్రీ
ఇంటర్వ్యూ తేది: 25 & 26.07.2025
ఉ:11 గం.ల నుండి సా:5 గం.వరకు
కొరంట్ల సెంటర్, తిరుమల బైపాస్, మారుతి నగర్, తిరుపతి
శ్రీ విష్ణుప్రియ ఫైనాన్స్ కార్పొరేషన్
77990 28444
92810 22773

గోవిందధామం అధ్యక్షురాలిగా లక్ష్మి

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: తిరుపతి గోవింద ధామం అధ్యక్షురాలిగా జూలకంటి లక్ష్మి నియమితులయ్యారు. నగర పరిధి అక్కారంపల్లిలోని గోవిందధామంలో ఆదివారం మహాప్రస్థాన సేవాసమితి గోవిందధామం నూతన కార్యవర్గ నియామకం, ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. కార్యదర్శిగా రామశేఖర్, కోశాధికారిగా మాఘం హేమచందర్, వైస్‌ప్రెసిడెంట్‌గా సోమ రవికుమార్, సహకార దర్శిగా శ్రీనివాసరెడ్డి, సహకోశాధికారిగా నామా రాజేష్ నియామకమయ్యారు. వారితో వ్యవస్థాపక అధ్యక్షుడు టెంకాయల దామోదరం ప్రమాణ స్వీకారం చేయించారు.

తొలగిన మురుగు

ఈనాడు కథనానికి స్పందన

చంద్రగిరి, న్యూస్‌టుడే: రాయలపురం పంచాయతీ వెంకటంపేట సమీపంలోని మురుగునీటి పెద్దకాల్వలో వ్యర్థాలు, పిచ్చిమొక్కలను శుభ్రం చేశారు. 'ఈనాడు' దినపత్రికలో మురుగునీటికాల్వ దుస్థితిపై ఫొటో కథనం వెలువడింది. ఇన్‌ఛార్జి ఎంపీడీవో వెంకటరత్నం నాయుడు ఆదేశాల మరకు పంచాయతీ కార్యదర్శి సుధారాణి, ఈవో చంద్రశేఖర్‌రెడ్డి రెండు రోజులపాటు శ్రమించి శుభ్రం చేయించారు.

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన వారిపై కేసు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన పెరకం నాగాంజనేయులు, తిరుపతికి చెందిన పామిడి సత్యనారాయణ, కొండూరు మహేశ్‌లపై కర్నూలు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో సైబర్ నేరాలు, ఇతర చట్టాల కింద ఆదివారం కేసు నమోదు చేశారు. తిరుపతిలోని శ్రీపంగలూరి సీతమ్మ ఆర్యవైశ్య ధర్మసత్రం అభివృద్ధి సంఘం ఛైర్మన్‌గా మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ కొనసాగుతున్నారని, ఆయనపై ముగ్గురు నిందితులు అసత్య ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని కర్నూలుకు చెందిన ఆ ట్రస్టు కోశాధికారి ఇల్లూరి లక్ష్మయ్య ఫిర్యాదు చేశారు. డబ్బుల కోసం బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నదిలో వాహనాలు అడ్డుకుంటున్న పోలీసులు

అలా పట్టుకున్నారు.. ఇలా వదిలిపెట్టారు

చంద్రగిరి, న్యూస్‌టుడే: స్వర్ణముఖి నదిలో పట్టపగలే నేతల అండతో ఇసుక అక్రమరవాణా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఆదివారం నరశింగాపురం సమీపంలో ఓ విశ్రాంత మిలిటరీ ఉద్యోగికి ఇచ్చిన డీకేటీ పొలం సమీపంలో జేసీబీ యంత్రంతో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడ్డారు. రహస్యంగా అందిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని యంత్రాలు స్వాధీనం చేసుకున్నారు. నాయకుల నుంచి ఫోన్లు వచ్చినప్పటికీ వాటిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. మరోమారు నాయకుల నుంచి ఒత్తిడి తెచ్చిన అక్రమార్కులు జేసీబీ, ఇసుక ట్రాక్టర్లను అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. రెవెన్యూ అధికారులు ఎప్పటిలాగే నదిలో ఇసుక తరలించడానికి ఎవరికీ ఎలాంటి అనుమతులు లేవని వెల్లడించారు.



(c) eenadu

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

క్యూలైన్లల్లో దర్శనం కోసం నిరీక్షిస్తున్న జనం

వాయులింగేశ్వరాలయం.. భక్తజనసంద్రం

ముక్కంటి ఆలయం భక్తజన సంద్రంగా మారింది. ఆదివారం, అందులోనూ ఆడికృత్తిక కావడంతో వేకువజామునే క్యూలైన్లన్నీ నిండిపోయాయి. వారంతం కావడంతో ఆశేషంగా జనం తరలిరావడంతో క్యూలైన్లల్లో నిలిచిపోయారు. సామాన్య భక్తులు రాహు, కేతు పూజలు, దర్శనం కోసం దాదాపు ఐదు గంటలు నిరీక్షించాల్సి వచ్చింది. సాధారణంగా జరిగినా రద్దీ మాత్రం దాదాపు 32 వేలకు పైగా వచ్చినట్లు అధికారులు భావిస్తున్నారు. ఇక ప్రత్యేక, శీఘ్ర, అంతరాలయ దర్శనం టికెట్లు భారీగా అమ్ముడుపోయాయి.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

త్రిశూల ఊరేగింపు

నాయుడుపేట పట్టణం: నాయుడుపేట శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆడికృత్తిక ఉత్సవాలు వైభవంగా జరిగాయి. భక్తులు త్రిశూలాలతో పురవీధుల్లో దేవతామూర్తులను ఊరేగించారు

కరపత్రాల పంపిణీ

సత్యవేడు, న్యూస్‌టుడే: తెదేపా నియోజకవర్గ పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల ప్రధాన కార్యదర్శి శివయ్య శెట్టి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో ఆ పార్టీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి ఇంటింటికెళ్లి ఏడాదిలో జరిగిన అభివృద్ధిపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి వాసు, కోనయ్య, రాజేష్, జేమ్స్, మహిళలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ నగర్‌లో స్థానికులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: క్రీడారంగంలో రాణిస్తే ప్రపంచ ప్రఖ్యాతి పొందొచ్చని, యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ పేర్కొన్నారు. శ్రీకాళహస్తి పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంటు విజేతలకు ఆదివారం ట్రోఫీ ప్రదానోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. అనంతరం విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు రూ.20 వేల నగదు ప్రోత్సాహం అందించారు. రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.15 వేలు, 3 నుంచి 6 స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.5 వేల చొప్పున అందజేశారు.

విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న బొజ్జల బృందమ్మ

రూ.లక్షలు వ్యయం.. ఏదీ ప్రయోజనం

● పాముల బెడదతో తప్పని అవస్థలు
● రూ.90 లక్షలు వృథానేనా?

శ్రీకాళహస్తి పట్టణంలోని మంచినీళ్ల గుంటలో ప్రస్తుతం ప్రారంభమైన అంతర్గత ఏర్పాట్లతో ఉద్యాన పనులు

న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

భూగర్భజలాలు పెంపొందించడంతో పాటు పచ్చదనపు ఆహ్లాదాన్ని పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు వీలుగా పురపాలక సంఘ కార్యాలయానికి సమీపంలోని మంచి నీళ్ల గుంటను అభివృద్ధి పరిచారు. 2018లో తెదేపా హయాంలో అమృత్ పథకం ద్వారా వచ్చిన నిధులతో దీన్ని అభివృద్ధి పరిచారు. కానీ వైకాపా అధికారంలోకి వచ్చాక.. దీని బాగోగులపై శ్రద్ధ చూపని కారణంగా పరిస్థితి ఇలా తయారైంది.

జనరక్షణ.. జలసంరక్షణ

మంచినీళ్ల గుంటలో కాల క్రమేణా నీటి నిల్వలు తాగు నీటికి వినియోగించేందుకు వీలులేకుండా పోయింది. పట్టణ నడిబొడ్డున నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నీటి గుంట ఉండటంతో జల సంరక్షణగా ఉంటూ వచ్చింది. ఎప్పుడూ నీటి నిల్వలు ఉండటం వల్ల చుట్టుపక్కల భూగర్భజలాలు పెంపొందించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతూ వచ్చింది. సాధారణంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంతను విధిగా ఏర్పాటు చేయాల్సి ఉంది. పట్టణ పరిధిలో అలా చేసేందుకు వీలులేకపోవడంతో మంచినీళ్ల గుంట ద్వారా జల సంరక్షణ చేపట్టాలని గతంలో అభివృద్ధిని చేపట్టారు.

పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారిన మంచి నీళ్ల గుంట

నిధుల్లేక.. పనులు సాగక

ఇక్కడి గుంటను సుందరంగా అభివృద్ధి చేయాలని ఏడేళ్ల క్రితం రూ.90 లక్షలు వ్యయంతో పనులు ప్రారంభించారు. ఆక్రమణలకు వీల్లేకుండా చుట్టూ ప్రహరీ నిర్మించారు. గుంటను పూడిక తీసి చుట్టూ సుందరంగా ఏర్పాటు చేయాలని పనులు చేపట్టారు. అయితే అప్పట్లో రావల్సిన నిధులను ఇతర అభివృద్ధి పనులకు మళ్లింపు చేయడంతో ఈ గుంట పురోభివృద్ధికి నోచుకోకుండా పోయింది.

పాముల బెడదతో బెంబేలు

మంచినీళ్ల గుంట పాములకు ఆవాస కేంద్రంగా మారిపోయింది. గుంట నిండుగా పిచ్చిమొక్కలు ఉండిపోవడంతో పాములు, తేళ్లు, జెర్రులతో సమీప ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆక్రమణలకు వీల్లేకుండా ప్రహరీ నిర్మించిన తెదేపా ప్రభుత్వం, ప్రస్తుతం ఈ గుంటలో వ్యర్థాలు, పిచ్చిమొక్కలు తొలగించి పాముల బెడద తప్పించేలా చర్యలు తీసుకోవాలంటూ నివాస గృహస్థులు వేడుకుంటున్నారు. ఇదే విషయమై అధికారులకు ఫిర్యాదు చేశారు. దుస్థితికి చేరిన మంచినీళ్ల గుంటను అభివృద్ధి పరిచేలా పాలకులు, అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

రేణిగుంట, న్యూస్‌టుడే: సమస్య: రేణిగుంట పంచాయతీలోని అన్నస్వామిపల్లె మార్గంలోని పెద్ద కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోయాయి. - **రఘు**

సమాధానం: వెంటనే ఇక్కడ శుభ్రత చర్యలు చేపడతాం. - **రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, రేణిగుంట**

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సమస్య: సువర్ణముఖి నదీ స్నాన ఘట్టాల వద్ద పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. - **రమేష్‌బాబు**

సమాధానం: కార్మికులతో వ్యర్థాలు తొలగించేలా చర్యలు చేపడతాం. - **కుమార్, పారిశుద్ధ్య విభాగం**

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని గాజులపెళ్లూరు గ్రామం పాత ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి వెంబడి పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. - **మణి**

సమాధానం: పిచ్చి మొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - **చిరంజీవి, ఈవోపీఆర్డీ**

తొలగిన మురుగు

పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో మురుగునీటి కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. మురుగు పేరుకుపోవడంతో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారడంపై ఈనాడులో సమస్య ప్రచురితమైంది. స్పందించిన పారిశుద్ధ్య కార్మికులు మురుగు తొలగించారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

విద్యుత్తు దీపాలకు నియంత్రిక ఏర్పాటు

స్పందనకు వందనం

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కేజీబీవీ ప్రధానగేటుకు అమర్చిన విద్యుత్తు దీపాలకు నియంత్రికలను ఆదివారం ఏర్పాటు చేశారు. ఇక్కడ నిత్యం దీపాలు వెలుగుతున్నాయంటూ 'ఈనాడు'లో సమస్య ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఏపీఎస్ సదరన్ పవర్ అధికారులు ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు రాత్రి వేళల్లో మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గోపురంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామికి వెండి ఉడుపులతో ప్రత్యేక అలంకరణలు



మయూర వాహనంపై దర్శనమిస్తున్న కుమారస్వామి

నాగలాపురం: విశేషాలంకరణలో చెల్లెమ్మ

భక్తులకు సేవలందిస్తున్న స్కౌట్స్ విద్యార్థులు

కేవీబీపురంలో..

నారాయణవనం: కావళ్లతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

ఆడికృత్తిక వైభవం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఆడికృత్తిక సందర్భంగా విజ్ఞానగిరి భక్తజన సంద్రంగా మారింది. కుమారస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు స్కౌట్స్ విద్యార్థులు తమవంతుగా సేవలందించారు. రద్దీ దృష్ట్యా ఆదివారం క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్తులకు నీళ్ల పంపిణీ, క్యూలైన్ల నియంత్రణ, వృద్ధులు, చంటి పిల్లల తల్లులు ఇబ్బందులు వాటిల్లకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పంపడం చేస్తూ సేవలందించారు. అలాగే భ్రమరాంబ సేవా సమితి తరపున భక్తులకు సేవలందించారు. ● ఆడికృత్తికను పురస్కరించుకుని విజ్ఞానగిరికి వచ్చిన భక్తులకు కార్తికేయ సేవా సంఘం తరఫున ప్రసాదాలు పంపిణీ చేశారు. సంఘ సభ్యులు పులిహోర, గుగ్గిళ్లు, పొంగలి తదితర ప్రసాదాలు వితరణగా పంచి పెట్టారు.

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న ఆలయాల్లో ఆడికృత్తిక వైభవం ఘనంగా జరిగింది. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని దేవతామూర్తులకు పూజలు, ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం రంగుల గోపురంలోని శ్రీవల్లీ, దేవసేన సమేతుడైన సుబ్రహ్మణ్య స్వామికి, నెహ్రూవీధిలోని శ్రీషణ్ముఖస్వామి ఆలయంలోనూ విశేష పూజలు జరిపారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయాల్లో సందడి వాతావరణం నెలకొంది.

నాగలాపురంలో వేడుకగా పూజలు ..

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురం గ్రామదేవత చెల్లెమ్మ ఆలయంలో తమిళ ఆడినెల తొలి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి సాయంత్రం భక్తుల తాకిడి అధికంగా కొనసాగింది. అమ్మవారికి అర్చకులు విశేషాభిషేకాలు చేసి వెండి తొడుగులతో అలంకరించారు. ఏర్పాట్లను అర్చకులు జానకిరామన్, జగన్, లోకేష్‌లు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో కావళ్లు..

నారాయణవనం, న్యూస్‌టుడే: మండలంలో ఆడికృత్తిక వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆదివారం ఉదయం కైలాసకోనలో ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామివారికి అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు హరోహర.. నామస్మరణతో కావళ్లను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

'స్వతంత్ర భారతదేశం' పుస్తకావిష్కరణ

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు సమీపంలో శ్రీకాళహస్తి రోడ్డులోని ఓ మండపంలో ఆదివారం విశ్రాంత ఉపాధ్యాయుడు పేర్నాటి వెంకటేశ్వర్లు రచించిన స్వతంత్ర భారతదేశం, రాజ్యాంగ నిర్మాణం అనే పుస్తకాన్ని మాజీ సైనిక సుబ్రహ్మణ్యం, న్యాయవాదులు, ప్రైవేటు విద్యా సంస్థల నిర్వాహకులు, ఎస్సీ సంఘాల నాయకులు కలిసి ఆవిష్కరించారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, న్యాయవాదులు సోమశేఖర్, కుమార్, నిర్వాహకులు పద్మనాభరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు పరాకాష్ఠ

అక్రమ రవాణా బరితెగింపునకు ఈచిత్రమే నిదర్శనం.. ఈ పటం చూస్తుంటే ఎక్కడో క్వారీలో పడిన గ్రానైటు బండ అనుకుంటున్నారా.. కాదండి బాబూ..! నిత్యం ప్రజలు తిరుగుతూ, సమస్యల పరిష్కారం కోసం కట్టుకొచ్చే కేవీబీపురం పోలీసుస్టేషన్ వద్ద ఆదివారం దర్శనమిచ్చిన గ్రానైటు బండ. పట్టపగలే శ్రీకాళహస్తి నుంచి కేవీబీపురం మీదుగా చెన్నై గ్రానైటు బండలను నింపుకొని ఓ టిప్పర్ లారీ బయలుదేరింది. ఇక్కడి వేగనిరోధకాన్ని దాటగానే లారీ నుంచి గ్రానైటు బండ కిందకు పడిపోయింది. ఆ సమయంలో ప్రజలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ రవాణాకు అతితక్కువ దూరం, జిల్లా అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇసుక, ఎర్రచందనం, పశువు వంటి అసాంఘిక కార్యక్రమాలకు అక్రమార్కులు ఈ మార్గాన్నే ఎంచుకుంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - **న్యూస్‌టుడే, కేవీబీపురం**

మురుగు కాలువ ఆక్రమణతో అవస్థలు

అప్పాయపాళెం గ్రామం శ్రీకృష్ణమందిరం వీధి చివరలో మురుగు కాలువను కొంతమంది ఆక్రమించడంతో గ్రామస్థులకు అవస్థలు తప్పడం లేదు. ఇదివరకు కురుస్తున్న వర్షాలకు పైనుంచి వచ్చే వర్షపు నీరు బయటకు వెళ్లే వెసులుబాటు లేకపోవడంతో ఇళ్లలోకి వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఓ వ్యక్తి ఇదివరకు తన ఇంటి చుట్టు ప్రహరీ నిర్మించుకున్నాడు. దీనికి ఉత్తరాన ఉన్న మురుగు కాలువపై మట్టిని నింపిన స్థలం తనదేనని స్థానికులతో గొడవపడుతున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధికారులకు తెలియోజేసిన చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, సత్యవేడు**

సీసీ రహదారి.. రొచ్చుగా మారి

మండలంలోని గాజులపెళ్లూరు గ్రామం ప్రాథమిక పాఠశాల వీధిలో రహదారి రొచ్చుగా మారింది. గతంలో ఇక్కడ సీసీ రహదారి నిర్మించినా చదునుగా వేయకపోవడంతో వర్షపునీరు పక్కకు వెళ్లే మార్గం లేదు. దీనికి తోడు రహదారికి ఇరువైపులా ఉన్న మట్టితో రహదారి రొచ్చుగా మారింది. పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. రహదారి బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, బీఎన్‌కండ్రిగ**

సొగసు చూడతరమా..!

నాగలాపురంలోని ప్రధాన వీధుల్లో రహదారి సొగసు అత్యంత దారుణంగా తయారైంది. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో రహదారులు ఆధునికీకరించినా.. నాగలాపురంలో మాత్రం కనీస మరమ్మతులు కరవయ్యాయి. జాతీయ రహదారిలోని ఆర్చీ నుంచి మరోవైపు వరకు రహదారి గుంతలమయమై అధ్వానంగా ఉంది. చినుకుపడితే వాహనాల కదలికలతో పాదచారులపై వెదజల్లి మురికిమయం చేస్తోంది. అధికారులు స్పందించి రహదారి ఆధునికీకరణకు శ్రద్ధ చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- **న్యూస్‌టుడే, నాగలాపురం**

సమగ్ర సాక్ష్యాలతోనే మిథున్‌రెడ్డి అరెస్టు

తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు నరసింహయాదవ్

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: కక్షలు, కుట్రలు, కుతంత్రాలకు మారుపేరుగా వైకాపా చరిత్రలో నిలుస్తోందని తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు నరసింహయాదవ్ ఆరోపించారు. మండలంలోని కీళపూడిలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మద్యం కుంభకోణం కేసులో సమగ్ర సాక్ష్యాలతో సిట్ అధికారులు మిథున్‌రెడ్డి అరెస్టు చేశారన్నారు. ఆయన తప్పు చేసినందునే కోర్టుల్లో బెయిల్ నిరాకరణకు గురై జైలుకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. గతంలో ఏమాత్రం ఆధారాలు లేకుండా చంద్రబాబునాయుడిని అరెస్టు చేసిన వైకాపా పాలకులు.. తమను కక్షసాధింపులతో ఎంపీని అరెస్టు చేశామనడం విడ్డూరమన్నారు. పింక్ డైమండ్, మామిడి ధరల పేరిట వేషాలు వేయటంతో పాటు అసంబద్ధ ప్రకటనలను వైకాపా నేతలు మానుకోవాలని హితవు పలికారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో పులివెందులలోనూ వైకాపా గెలిచే అవకాశాలు లేవన్న ఆయన.. ఎన్నికల అనంతరం వైకాపా తెరమరుగు ఖాయమని జోస్యం చెప్పారు. నియోజకవర్గ కార్యక్రమాల సమన్వయకర్త శంకర్‌రెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు పద్మనాభరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడులు పాల్గొన్నారు.

గుత్తి త్యాగరాజును సన్మానిస్తున్న దేవాంగ పరిషత్ ప్రతినిధులు

గుత్తి త్యాగరాజు సేవలకు సత్కారం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: ప్రజాసేవ, దేవాంగ సంప్రదాయ పరిరక్షణలో అందించిన సేవలకు గుర్తింపుగా వరదయ్యపాళెంనకు చెందిన గుత్తిత్యాగరాజు, బొప్పన మోహన్‌బాబులను దేవాంగ అర్చక పురోహిత పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. చీరాల నియోజకవర్గం ఆమోదగిరిలో దేవాంగ అర్చక, పురోహిత పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 4వ వార్షిక సర్వసభ్య సమావేశంలో దేవాంగుల అభ్యున్నతికి, ఆచార సంప్రదాయాలపై చైతన్యం కల్పిస్తున్న పలువురు ప్రముఖులను ఆ పరిషత్ అధ్యక్షుడు చల్లారామారావు సన్మానించారు.

గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం

ఏర్పేడు: కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేసిందని తెదేపా మండలాధ్యక్షుడు నాగరాజునాయుడు తెలిపారు. మండలంలోని రావిళ్లవారికండ్రిగలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. నాయకులు గురవారెడ్డి, పొన్నారావు, సూర్యనాయుడు, గిరినాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అడ్డదార్లో వెళ్లేందుకు రభస

శ్రీకాళహస్తి: ఆడికృత్తికను పురస్కరించుకుని విజ్ఞానగిరిపై అడ్డదారిన వెళ్లేందుకు పలువురు భక్తులు ప్రయత్నించడం, భద్రతా సిబ్బంది అంగీకరించకపోవడంతో కొంత మేర రభస చోటు చేసుకుంది. ఉదయం 9 నుంచి విజ్ఞానగిరిపై భక్తులు పోటెత్తారు. ఆ సమయంలో అడ్డదారిన భక్తులు రానీయకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. అయితే కొందరు వెళ్లేందుకు ప్రయత్నించడం పోలీసులు, భద్రతా అడ్డు చెప్పడం, దీంతో భక్తులు వాదనకు దిగడం జరిగింది. అయితే ఉన్నతాధికారుల జోక్యంతో వివాదాలకు అవకాశం లేకుండా ప్రశాంతంగా ముగిసింది.

కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మంజునాథ్‌రెడ్డి, చిత్రంలో ఎస్సై సుధాకర్

నిత్యం నిఘా ఉంటుంది

రేణిగుంట: రౌడీ, సస్పెక్ట్ షీటర్లపై నిత్యం నిఘా ఉంటుందని, సమాజంలో జాగ్రత్తగా ఉండాలని రేణిగుంట గ్రామీణ సీఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి వారి కదిలికలపై ఎప్పటికప్పుడు తమకు సమాచారం వస్తుందని, తీరు మార్చుకోని అందరితో బాగుండాలని సూచించారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు గురైన చేతి పంపు

గ్రామాల ప్రగతి.. పట్టించుకోక అధోగతి

కనీస వసతుల్లేక ప్రజల అవస్థలు

నారాయణవనం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి చందాన తయారయ్యాయి. మండలంలోని దిగువ కనకపాళెం(డీకేపాళెం) అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. సమస్యలు పరిష్కరించే నాథుడే కరవయ్యారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం వంటి కనీస వసతులు సైతం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు.

తీరని తాగునీటి కష్టాలు

గ్రామంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి ట్యాంకు నుంచి నీరు సరఫరా అవుతున్న గొట్టాలు పలు చోట్ల ధ్వంసం కావడంతో పలు వీధులకు నీరు సక్రమంగా చేరడం లేదు. మూడు చేతి బోర్లు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా నేటికీ బాగు చేయలేదు. దీంతో నీటిని దూరప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. నిత్యం బిందెలతో మహిళలు అష్టకష్టాలు పడుతున్నారు.

పారిశుద్ధ్యం.. అధ్వానం

గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. వీధుల పక్కనే వ్యర్థాలతో నిండిపోయింది. మురుగు నిలిచి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. విషజ్వరాలు ప్రబలుతున్నాయి. పారిశుద్ధ్యంపై అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం ప్రజల పాలిట శాపంగా మారింది.

● ఈ విషయమై ఎంపీడీవో అరుణ మాట్లాడుతూ డీకేపాళెంలో తాగునీటి గొట్టాలు పునరుద్ధరించి, చేతి బోర్లకు మరమ్మతులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించామని తెలిపారు.

డీకేపాళెంలో అధ్వానంగా పారిశుద్ధ్యం

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ

మధ్యంతర భృతి చెల్లించాలి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని తక్షణం చెల్లించాలంటూ ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని బాబు అగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ అపరిష్కృత సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలని కోరారు. 2023 నుంచి ఉద్యోగుల వేతన సవరణపై చర్చ జరగాల్సి ఉన్నా ఇంత వరకు ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయకపోవడం దారుణమన్నారు. పూర్వ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సుధాకర్, జిల్లా బాధ్యులు గోపాల్, చంద్రశేఖర్, హేమకుమార్, సుబ్రహ్మణ్యరాజు, హరి, వెంకటేశ్వర్‌రెడ్డి, మునస్వామి పాల్గొన్నారు.

అందరినీ అరెస్టు చేయాలి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి బాధ్యులైన అందరూ అరెస్టు కావడం తథ్యమని తెదేపా బీసీ విభాగం స్పష్టం చేసింది. పట్టణంలోని స్థానిక కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి నేతృత్వంలో నేతలు సమావేశం అయ్యారు.

క్రైం కార్నర్

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య

తొట్టంబేడు, న్యూస్‌టుడే: కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం శ్రీకాళహస్తి పట్టణ శివారు ప్రాంతంలో చోటు చేసుకుంది. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు.. చంద్రయ్య, శ్రావణి(28) దంపతులు గత కొంతకాలంగా రాజీవ్‌నగర్‌లోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. చంద్రయ్య తిరుమలలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. శ్రావణి కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండటంతో భర్త చంద్రయ్య ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ఈ క్రమంలో శ్రావణి ఈనెల 15న తీవ్ర కడుపు నొప్పిని తాళలేక జుట్టుకు రాసుకునే రసాయన ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గుర్తించిన కుటుంబీకులు ఆమెను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆసుపత్రికి అనంతరం తిరుపతి రుయాకు తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ శ్రావణి మృతి చెందింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

(c) eenadu

గూడూరు
•గూడూరు •వెంకటగిరి •సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 26 నుంచి రూ. 35 వరకు
రెండో రకం: కిలో రూ. 15 నుంచి రూ. 25 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్ (రైతు ధర)	131
లేయర్	112
బ్రాయిలర్	234
బ్రాయిలర్ స్కిన్‌లెస్	258
లేయర్ మాంసం	190

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

దక్కిలి: సమస్య: మండలంలోని దందోలు నుంచి కే.బి.పల్లికి వెళ్లే మార్గం మట్టి మార్గం కావడంతో వర్షాకాలంలో ఇబ్బందిగా ఉంది. - హరికృష్ణ, కే.బి పల్లి

సమాధానం: నర్సరసింహాపురం అటవీ శాఖకు చెల్లించి, రోడ్డు నిర్మించుకోవాల్సి ఉంది. - సుహాసిని, డీఈవో

సమస్య: పాతాలపాడు నుంచి హరిజనవాడకు వెళ్లే మార్గంలోని వంతెన శిథిలావస్థకు గురైంది. - మణి

సమాధానం: త్వరలో పరిష్కరిస్తాం. -గుణశేఖర్, ఎంపీడీవో

గూడూరు పట్టణం: సమస్య: పట్టణంలోని ఎర్రమిట్ట ప్రాంతంలో వీధి దీపాలు సక్రమంగా వెలగడంలేదు. - వెంకటాద్రి, గూడూరు

సమాధానం: సిబ్బందితో ఏర్పాటు చేయిస్తాం. - వెంకటేశ్వర్లు, కమిషనర్

సూళ్లూరుపేట: సమస్య: మతకామడుగులో ఎస్సీ, బీసీ కాలనీల్లో సీసీ రోడ్లు వేసినా మురుగు కాలువలు నిర్మించలేదు. దాంతో మురుగు నీరు వెళ్లేందుకు మార్గం లేక రోడ్ల పైనే చేరుతోంది. - సుధాకర్, మతకామడి

సమాధానం: 15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరైన వెంటనే మురుగు కాలువలు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం. - తోట సులోచనమ్మ, సర్పంచి

చెంగాళమ్మ సేవలో మంత్రి

వేద పండితుల ఆశీర్వాదం అందుకుంటున్న మంత్రి సంధ్యారాణి

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయానికి ఆదివారం సాయంత్రం రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల ఆశీర్వాదం అందుకున్నారు. తదుపరి ప్రసన్న లక్ష్మి ఆలయ సందర్శించి పూజలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, తెదేపా నేతలు టి.సుధాకర్‌రెడ్డి, ఎ.రమేష్, ఏజీ కిషోర్, మాదనపాలెం, పెరుమాళ్, కొండలరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

త్వరలో ఫ్లైఓవర్, పంబలేరు వంతెన పూర్తి చేస్తాం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరులో అభివృద్ధి జరిగిందంటే ఒక్క తెదేపా ప్రభుత్వ హయాంలోనే అని త్వరలోనే ఫ్లైఓవర్, పంబలేరు వంతెన పూర్తి చేస్తామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి పనిచేసే వ్యక్తి సునీల్‌కుమార్ అని, ఎక్కడ కూడా వైకాపా నాయకులపై తప్పుడు కేసులు పెట్టిన దాఖలాలు లేవని చెప్పారు. గూడూరును తిరుపతి జిల్లాలో కలిపిన పాపం వైకాపాదేనని, గూడూరులో నెల్లూరు జిల్లాలో కలపాలని పోరాడుతున్నట్లు తామేనని చెప్పారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ మైనింగ్ చేసిన చరిత్ర వైకాపా నాయకులదేనని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వర్లురాజు, రహీమ్, దువ్వూరు రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

కుటుంబ సాధికారత సర్వే చేపట్టండి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రమణయ్య, పక్కన ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు సమగ్రంగా కుటుంబ సాధికార సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి జిన్ని రమణయ్య అన్నారు. పట్టణంలో ఆదివారం నియోజకవర్గం స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ వైకాపా పాలనలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో డిఎస్ఎంఎస్ ఛైర్మన్ గంగొడు నాగేశ్వరరావు, నేతలు పాల్గొన్నారు.

స్వతంత్ర్య భారతదేశం పుస్తకావిష్కరణ

పుస్తకావిష్కరణలో పాల్గొన్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, న్యాయవాదులు ప్రముఖులు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు సమీప శ్రీకాళహస్తి రోడ్డులోని ఓ మండపంలో ఆదివారం విశ్రాంత అధ్యాపకులు పేర్నాటి వెంకటేశ్వర్లు రచించిన స్వతంత్ర్య భారతదేశం, రాజ్యాంగ నిర్మాణం అనే పుస్తకాన్ని మాజీ నెలవల సుబ్రమణ్యం, న్యాయవాదులు, ప్రైవేటు విద్యా సంస్థల నిర్వాహకులు, ఎస్సీ సంఘాల నాయకులు కలిసి ఆవిష్కరించారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, న్యాయవాదులు సోమశేఖర్, కుమార్, నిర్వాహకులు పద్మనాభరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

కూటమిలోనూ ప్రయాణ కష్టాలేనా?

❖ ఎమ్మెల్యే పట్టించుకుంటేనే బాగు
❖ నేడు ర.భ. మంత్రి పర్యటన

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గూడూరు నియోజకవర్గంలో గత ఐదేళ్ల వైకాపా పాలనలో ర.భ. రహదారుల దుస్థితితో ఇబ్బందులు పడ్డాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రోడ్డు కష్టాలేనా అంటూ ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. గత ఐదేళ్లుగా ర.భ. రోడ్లు గుంతలమయంగా ఉన్నా వైకాపా పాలనలో తట్ట మట్టి కూడా వేయలేదని.. దాంతో నరకయాతనతో ప్రయాణించామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు నెలల్లో వర్షాకాలం ప్రారంభం కానుండడంతో గుంతల్లో నీరు చేరి రహదారులు అధ్వానంగా మారి మరింత ఇబ్బందులు తప్పవని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేటాయించినా నేటికీ పనులను చేపట్టలేదు. వీటిలో విద్యానగర్-గూడలి రోడ్డుకు టెండర్లు పూర్తి కాగా, మిగిలిన రెండు రోడ్లకు టెండర్లు కాకపోవడం విడ్డూరం.

కోట మండలం విద్యానగర్ వద్ద రోడ్డు దుస్థితి

✦ నియోజకవర్గంలో రహదారుల పరిస్థితి పలు చోట్ల బాగాలేదు. గత వైకాపా పాలనలో ప్రజలు ఇబ్బందులు పడినా కూటమి ప్రభుత్వంలోనూ ఇంతేనా అంటూ నిట్టూరుస్తున్నారు. సత్వరమే స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పట్టించుకోకపోతే నియోజకవర్గ ప్రజలకు రానున్న రోజుల్లో కష్టాలు తప్పవు.

రూ.8 కోట్లు కేటాయించినా..

కోట ర.భ. సర్కిల్ పరిధిలో విద్యానగర్-మెట్టు, వాకాడు మండలంలోని రావిగుంటపాలెం-నిడిగుర్తి రహదారుల నిర్మాణానికి రూ.8 కోట్లు నిధులను కూటమి

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

గూడూరు గ్రామీణ మండలంలో విందూరు-మిట్టాత్మకూరు, గూడూరు-తిప్పవరప్పాడు, చిల్లకూరు మండలంలో చిల్లకూరు-మేనసూరు, జాతీయ రహదారి-రెడ్డిపల్లి, కోట మండలంలో కోట-సిద్దవరం, విద్యానగర్-కొత్తపాలెం, కోట- అల్లంపాడు, విద్యానగర్-నాయుడుపేట, కోట-కర్లపూడి, వాకాడు మండలంలో యర్రగుంటపల్లి-బాలిరెడ్డిపాలెం, కోవిపురం-కొండాపురం, రావిగుంటపాలెం-నిడిగుర్తి, వావిళ్లపాలెం-కొండూరు, బాలిరెడ్డిపాలెం-తూపిలిపాలెం, వావిళ్లపాలెం-తిరుమూరు, కల్లూరు, ముట్టెంబాక, దుర్గవరం, సాయిబులపాలెం-కొండూరు రోడ్లు గుంతతో నిండి దుస్థితికి చేరుతున్నాయి. చిట్టమూరు మండలంలో కొత్తగుంట-మల్లాం, కొత్తగుంట-ఆరూరు, తదితర గ్రామాల్లో ర.భ. రహదారులు బాగాలేవు.

ప్రతిపాదనలు పంపాం

రహదారుల బాగుకోసం ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. విద్యానగర్ రోడ్డును త్వరలో పూర్తి చేస్తాం. రామాంజనేయులు, ర.భ. శాఖ ఈఈ, గూడూరు.

అర్హులందరికీ తల్లికి వందనం

చిల్లకూరు: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయబడుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. చిల్లకూరు మండలంలోని తిక్కవరం ఉన్నత పాఠశాలలో దాదాపు 300 మందికి తల్లికి వందనం అందకపోవడాన్ని ఇటీవల 'ఈనాడు' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దీనికి ఎమ్మెల్యే స్పందించి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి సమస్యను తీసుకెళ్లామని చెప్పారు. ఇదే విషయాన్ని కలెక్టర్‌తోనూ చర్చించామన్నారు. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరికీ న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తున్నామని స్పష్టం చేశారు.

శాకంబరి అలంకారంలో వాసవీకన్యకా పరమేశ్వరి



కోట: స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించి పరమేశ్వరి చాలీసా పారాయణం చేశారు. ప్రసాదాలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో కమిటి ప్రతినిధులు నాగరాజు, విజయభాస్కర్, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పులికాట్‌లో అటవీశాఖ కన్జర్వేటర్

గుంతలను పరిశీలిస్తున్న కన్జర్వేటర్ సెల్వం, తదితరులు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పులికాట్ సరస్సును ఆదివారం తిరుపతి అటవీశాఖ కన్జవేటర్ సెల్వం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రాయదొరువు వద్ద ఉన్న పులికాట్ ముఖద్వారం వద్దకెళ్లి, ఇటీవల కురిసిన వర్షాలకు సరస్సులోకి నీరు వస్తోందా లేదా తెలుసుకున్నారు. అక్కడ నుంచి వేనాడు ప్రాంతానికి వెళ్లారు. పేర్నాడు రిజర్వు ఫారెస్టులో వాటర్‌షెడ్ పనులు చేపట్టే ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట వన్య ప్రాణి డివిజనల్ అటవీశాఖాధికారిణి హారిక, సిబ్బంది ఉన్నారు.

గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలి

పెళ్లకూరు, న్యూస్‌టుడే: మండలంలో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యాణికి పెళ్లకూరు మండల తెదేపా అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పలువురు నాయకులు విజ్ఞప్తి చేశారు. నాయుడుపేటలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. తెదేపా నాయకులు శేఖర్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు. సిద్దులనాయుడు. మదన్‌నాయుడు పాల్గొన్నారు.

జీవో 36 ప్రకారం వేతనాలు పెంచాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: జీవో నెం.36 ప్రకారం వేతనాలు పెంచాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ నాయకులు డిమాండ్ చేశారు. గూడూరు పట్టణం పురపాలక కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల సమ్మె ఆదివారం ఎనిమిదో రోజుకు చేరింది. కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య, కోటేశ్వరరావు, మురళి, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

స్పందించారు.. శుభ్రం చేశారు

బొగ్గులమిట్టలోని వ్యర్థాలు శుభ్రం చేస్తూ..

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు వార్డుల్లోని సమస్యలను 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' కార్యక్రమంలో ప్రచురితమైన సమస్యలకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్పందించి చర్యలు చేపట్టారు. ◆ పట్టణంలోని తూర్పువీధిలోని జడ్పీ పాఠశాల ముందు భాగంలోని పైపు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. ఈ సమస్యపై ప్రచురితం కావడంతో స్పందించి కాలువలో వ్యర్థాలను తొలగించి మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. ◆ మార్కెట్ వీధిలోని మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి మార్కెట్‌లోకి వెళ్లే మార్గంలో మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు నడిచి వెళ్ళే వీలు లేకుండా పోయింది. ఈవార్తకు స్పందించి కాలువలో వ్యర్థాలు తొలగించి మురుగునీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు. ◆ బొగ్గులమిట్ట సందులోని సైడు కాలువలో వ్యర్థాలు నిల్వ ఉండి మురుగునీరు నిలిచింది. దీనిపై స్పందించి కాలువలో వ్యర్థాలు తొలగించారు. ◆ బొగ్గులమిట్టలోని కాలువలో రాళ్లు అడ్డుగా ఉండడంతో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీనిపై స్పందించిన అధికారులు కాలువలో రాళ్లు తొలగించి మురుగునీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు. ◆ పట్టణంలోని కాలేజిమిట్టలో సైడు కాలువలో వ్యర్థాలు తొలగించి రోడ్డుపై వదిలేశారు. ఈసమస్యపై వార్త ప్రచురితం కావడంతో వ్యర్థాలను తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ◆ పట్టణంలోని డక్కిలి వీధిలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. దీనిపై సమస్య ప్రచురితం కావడంతో కాలువలను శుభ్రం చేయించారు. ◆ **కోట:** స్థానిక ఎస్సీ గురుకుల కళాశాల సమీపంలోని పంటకాలువలోకి వృథా నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పైపును ఇరిగేషన్ ఏఈ మునిరత్నం తొలగించారు. ◆ **గూడూరుపట్టణం:** పట్టణంలోని నల్లజాలమ్మవీధి ప్రాంతంలో వీధిదీపాలు వెలగకపోవడంతో ఈనాడులో ప్రచురితమైన కథనానికి స్పందించిన పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు సిబ్బంది ద్వారా వీధి దీపాలు ఏర్పాటు చేశారు.

సన్మానం అందుకుంటున్న అధ్యాపకుడు రమేష్‌బాబు

కవితల పోటీల్లో అధ్యాపకుడి ప్రతిభ

చిల్లకూరు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కవితల పోటీల్లో డా.బీఆర్ అంబేడ్కర్ చిల్లకూరు గురుకులం ఆంగ్ల అధ్యాపకుడు దుప్పటి రమేష్ బాబు ప్రతిభ కనబరిచారు. నెల్లూరులోని పుర మందిరంలో ఆదివారం జరిగిన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. ఈ క్రమంలో అతిథులైన ఆనం వెంకటరమణారెడ్డి, మండలి బుద్ధప్రసాద్, జీవీ పూర్ణచందు, సుబ్బారావు చేత జ్ఞాపికతో పాటు సన్మానం అందుకున్నారు.

నేడు గూడూరుకు ర.భ. మంత్రి రాక.. గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం గూడూరుకు రానున్నట్లు రభ గూడూరు ఈఈ రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు పర్యటన వివరాలను తెలియజేశారు. మంత్రి గూడూరులో జరిగే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌తో కలసి పాల్గొంటారని చెప్పారు.

బ్యారేజీలో గంగ జలాల విడుదల

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజీ నుంచి తెలుగుగంగ జలాలను ఆదివారం అధికారులు, కూటమి నేతలు దిగువకు విడుదల చేశారు. గత పదిహేను రోజులుగా బ్యారేజీకి గంగ జలాలు వస్తుండడంతో మొదటగా రెగ్యులేటర్ ద్వారా తూపిలి చెరువుకు విడుదల చేసి మిగిలిన జలాలను దిగువ ప్రాంతంలోని పంటలు, తాగునీటి అవసరాల నిమిత్తం 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తెదేపా మండల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, మధురెడ్డి, సీనియర్ నేత దొరువుకట్ట దశరథరామిరెడ్డి, భాజపా నియోజకవర్గం కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, పనబాక కోటేశ్వరరావు, తూపిలి ఆయకట్టు అధ్యక్షుడు తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, నేతలు కృష్ణమూర్తి, ద్వారకానాథ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆడికృత్తిక పూజలు

సూళ్లూరుపేటలో కల్యాణానికి కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి
✦ కాళికామాత ప్రదర్శన ✦ పూలవాహనంలో సుబ్రహ్మణ్యేశర స్వామి నగరోత్సవం

కోట, న్యూస్‌టుడే: కోట, చిట్టమూరు మండలాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం ఆడికృత్తిక ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. కోటలోని విషభయహార బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోని స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు చేసి అలంకరణలు చేశారు. ఉభయకర్తలు ఎం. సురేష్ కుటుంబీకులు హోమ పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. చిట్టమూరు మండలం మల్లాంలోని వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, ఆరవపాలెంలోని ఆలయాల్లో వైభవంగా పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామి దర్శించుకున్నారు.

వైభవంగా త్రిశూల ఊరేగింపు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆడికృత్తిక ఉత్సవాలు వైభవంగా జరిగాయి. పసుపు వస్త్రాలతో భక్తులు త్రిశూలాలతో పురవీధుల్లో దేవతామూర్తులను ఊరేగించారు. ఆలయంలో దేవతామూర్తులకు చందనాలంకారం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ, నిర్వాహకులు పాల్గొన్నారు.

దేవతామూర్తులకు చందనా అలంకరణ

ఆధ్యాత్మికం

తడ: ఆడి కృత్తిక సందర్భంగా చిన్నమాంబట్టులో అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో కావడి ఉత్సవం వేడుకగా జరిగింది. మంగళ వాయిద్యాలు, కోలాటం మధ్య కావళ్లతో భక్తులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. వేమనబోయిన మునిరాజ్ యాధవ్ కుటుంబ సభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. తిరుపతి స్విమ్స్ వైద్యులు, పద్మజ మునుస్వామి దంపతులు అన్నదానం చేశారు. వెంకురెడ్డి, దేవేంద్రరెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం

సూళ్లూరుపేట: పురపాలక సంఘంతో పాటు, గ్రామాల్లో ఆడికృత్తిక పర్వదినాన్ని ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సూళ్లూరుపేటలోని నాగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వారికి అభిషేకాలు నిర్వహించి అలంకరించారు. ఆలయ ఆవరణలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చి కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయకర్తలు ఏఎంసీ మాజీ ఛైర్మన్ పర్వతరెడ్డి కవిత, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు.

365 కలశాలతో నగరోత్సవం.. వెంకటగిరి: పట్టణంలో ఆడికృత్తిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆత్మామలిక్ ధ్యాన మందిరంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి సేకరించిన జలాలను 365 కలశాలతో నింపి మహిళలు పురవీధుల్లో ఊరేగించారు. ప్రత్యేక పూల వాహనంలో స్వామి ఉత్సవమూర్తిని ఉంచి నగరోత్సవం జరిపారు. రాత్రి స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా జరిపారు. సీఐ వెంకటరమణ బందోబస్తు నిర్వహించారు.

వేడుకగా.. బాలాయపల్లి: కయ్యూరు పంచాయతీ సుబ్రమణ్యం గ్రామంలో దేవాదాయశాఖ పరిధిలోని శ్రీవల్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆడికృత్తిక వేడుకలు నిర్వహించారు. ఉత్సవమూర్తులైన శ్రీవల్లీదేవసేన, సుబ్రహ్మణ్యేశ్వరునికి వేదపండితులు కల్యాణం కమనీయంగా చేశారు.

స్వామి వారి ఉత్సవర్లు

సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు నియోజకవర్గంలో కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్య పోరాటం చేసి పరిష్కరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, ప్రభాకర్, శశికుమార్, ఉదయ్‌కుమార్, చాముండేశ్వరి, కుమార్, ప్రసన్న పాల్గొన్నారు.

నార్త్ గిరిజనకాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు

కోట, న్యూస్‌టుడే: నెల్లూరుపల్లి కొత్తపాళెం పంచాయతీలో ఆదివారం తెదేపా నాయకులు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు అందించిన అభివృద్ధిని కరపత్రాలు ద్వారా వివరించారు. కార్యక్రమంలో నాయకులు మురళిరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, జనార్ధనరెడ్డి, శ్రీనివాసులు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

విద్యార్థిని ఉన్నత చదువులకు చేయూత

విద్యార్థినికి నగదును అందజేస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు పిచ్చయ్యనాయుడు

చిల్లకూరు, న్యూస్‌టుడే: మండలంలోని చేడిమాల గ్రామానికి విద్యార్థిని బండి వరలక్ష్మి ఉన్నత చదువులకు స్థానిక రాజనేని రామానాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీనివాసులునాయడు చేయూతనిచ్చారు. తిక్కవరం ఉన్నత పాఠశాలలో చదివిన వరలక్ష్మి పదిలో 550 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ఆర్థిక ఇబ్బందులతో కళాశాలలో చేరేందుకు అవసరమైన ఫీజు రూ.50 వేలు నగదును ట్రస్ట్ అధ్యక్షుడు పిచ్చయ్యనాయడు ఆదివారం విద్యార్థినికి అందజేశారు. ప్రతినిధులు రామానాయుడు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సొమ్ము.. ప్రైవేటుకు దానం

✦ చెట్లకు అమర్చిన కంచె బోర్డుల తొలగింపు

నాయుడుపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద చెట్ల అంచున తొలగించిన ఇనుప కంచె బోర్డులు

ప్రైవేటు వ్యక్తి తన స్థలంలో యంత్రాలతో పనులు చేయిస్తూ

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఇష్టమొచ్చినట్లు పనులు చేస్తున్నారు. పురపాలక సంఘం నిధులతో అభివృద్ధి చేసిన పార్కు ప్రాంతాన్ని చదును చేసి పరులకు అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రోడ్డు పక్కన కోట్ల విలువజేసే స్థలాలను అన్యాక్రాంతం చేసేలా అడుగులు వేస్తున్నారు. లక్షలాది నిధులతో అభివృద్ధి చేసిన ప్రాంతాన్ని బీడుగా మార్చేలా వ్యవహరిస్తున్నారు.

✦ నాయుడుపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద ర.భ. రోడ్డు అనుకుని ఒక ఎకరా పైగా విస్తీర్ణంలోని ప్రభుత్వ స్థలంలో కొన్నేళ్లుగా మొక్కలు నాటి పార్కులా అబివృద్ధి చేస్తున్నారు. పురపాలక సంఘం నిధులతో అభివృద్ధి చేశారు. ర.భ.శాఖకు చెందిన ఈ స్థలంలో అప్పటి అధికారులు మొక్కలు నాటి కంచెలు ఏర్పాటు చేసి ప్రచార బోర్డులు అమర్చి సుందరంగా తయారు చేశారు. పట్టణానికి ముఖద్వారంగా ఉండే ఇక్కడ పచ్చని చెట్లను పెద్దవిగా చేసి పెంచారు. ప్రత్యేక పర్యవేక్షణతో పచ్చదనం అమర్చారు. ఇక్కడ ఒకప్పుడు చెత్త పోసేవారు. నిత్యం నాయుడుపేట మీదుగా మంత్రులు, ఉన్నతాధికారులు రాకపోకలు సాగిస్తుండడంతో అపరిశుభ్రంగా ఉందని చెట్లతో నింపారు. ఈ స్థలాన్ని ఆనుకుని ఓ ప్రైవేటు వ్యక్తికి 30 సెంట్ల భూమి ఉండటంతో దానికి దారి వసతికోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కంచెలు తొలగించి ప్రచార బోర్డులు తీసేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ భూమి కలిగిన యజమాని కూడా తనకు ర.భ.రోడ్డులోకి వెళ్లేందుకు దారి చెట్ల మధ్యలోనే కల్పించాలంటున్నారు. మరో వైపు ఇక్కడ ట్రక్కు వ్యాన్లను నిలిపేందుకు స్థలం కేటాయిస్తారని తెలుస్తోంది. విలువైన స్థలాన్ని పరులు పాలు కాకుండా ర.భ. అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ విషయమై కమిషనర్ ఎస్‌కే.ఫజులుల్లాను వివరణ కోరగా చెట్లను పెంచే స్థలంలో చెత్తతో సంపద తయారీ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు.

క్షుద్ర పూజలు చేస్తున్నారని కొండూరులో ఉద్రిక్తత

తడ, న్యూస్‌టుడే: కొండూరులో కృష్ణా జిల్లాకు చెందిన శేషగిరి అనే వ్యక్తి క్షుద్ర పూజలు జరుపుతుండడంతో తాము భయభ్రాంతులకు గురవుతున్నామని, వెంటనే అతను స్థావరం ఖాళీ చేసి వెళ్లిపోవాలని పంచాయతీ ప్రజలు ఆదివారం ఆందోళన చేపట్టారు. నిర్మాణ దశలో ఉన్న స్థావరాన్ని కొంత మేర కూలదోశారు. పోలీసులు రావడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. జాతీయ రహదారిపై బైఠాయించి స్థానికులు ఆందోళన చేపట్టారు. ప్రజలు రావడాన్ని గమనించి శేషగిరి అక్కడి నుంచి పారిపోయాడు. శేషగిరి స్థానికంగా ఉన్న కొందరి సహకారంతో గుంట పోరంబోకు స్థలం 10 సెంట్లు ఆక్రమించి అందులో శక్తిపీఠం పేరుతో అక్రమ నిర్మాణం చేపడుతున్నారని గ్రామస్థులు ఆరోపించారు. అతని స్థావరంలో పలువురు మహిళల పాస్‌పోర్టు సైజు ఫొటోలు ఉండడాన్ని స్థానికులు పోలీసులకు చూపించారు. స్థావరం ఖాళీచేసే వరకు తాము వెళ్లేది లేదని భీష్మించారు. పోలీసులు స్థానికులకు సర్దిచెప్పి పంపించారు. అధికారులు నిర్ణయం తీసుకునే వరకు వారం రోజుల పాటు సంయమనం పాటించాలని సూచించారు.

ఆక్రమించి నిర్మాణం సాగుతున్న ప్రదేశంలో స్థానికులకు సర్దిచెపుతున్న పోలీసులు

రొయ్యలవాగులోకి కలుషిత నీరు

చిట్టమూరు(కోట), న్యూస్‌టుడే: మల్లాం సమీపంలోని రొయ్యలవాగులోకి రొయ్యల గుంతల కలుషిత నీటిని వదిలేస్తున్నారు. దీంతో రొయ్యల వాగులోని నీరు రంగు మారి దుర్వాసన వస్తోంది. సమీప గ్రామాల్లో విస్తారంగా రొయ్యల సాగు ఉంది. వ్యర్థాల నీటిని కాలువల ద్వారా వాగులోకి వదిలేస్తున్నారు. దీంతో సుమారు 15 గ్రామాల పరిసర భూములకు సాగునీరు అందించే కాలువ మురుగుగా తయారైంది. ఈ విషయమై తహసీల్దారు సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా వెంటనే నివారణ చర్యలు తీసుకొంటామన్నారు.

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాయుడుపేట పట్టణం: పురపాలక సంఘం తుమ్మూరు వద్ద రామాలయం వెనుక ఉన్న చెట్టుకు గుర్తు తెలియని(40) వ్యక్తి శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు వద్ద ఎటువంటి ఆధారాలు లేవు. మతిస్థితిమితం లేని వ్యక్తిగా అనుమానిస్తున్నారు. మృతుడి వివరాలపై ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీ: యువకుడికి గాయాలు

తడ: తడకండ్రిగ పంచాయతీ బోడిలింగాలపాడు వద్ద ఆదివారం రాత్రి జాతీయ రహదారి దాటుతున్న అయ్యాంగుళం దినేష్‌ను నెల్లూరు నుంచి చెన్నై వెళ్లే కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దినేష్‌కు స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు అతన్ని చెన్నై తరలించారు.

నేత్ర శిబిరానికి స్పందన.. నాయుడుపేట పట్టణం: నాయుడుపేట జనరల్ పాఠశాలలో ఆదివారం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన నేత్రవైద్య శిబిరానికి 250 మంది హాజరయ్యారు. తిరపతి అరవింద నేత్రాలయ వైద్యులు పరీక్షలు చేశారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE : VENKATAGIRI
O.S.No. 187/2022

బుట్టి శేషారెడ్డి .. వాది
Vs
దందవోలు రమణయ్య, S/o లేట్ సుబ్బయ్య, భీమవరం గ్రామం, మోపూరు గ్రామ పంచాయతి, డక్కిలి మండలం, తిరుపతి జిల్లా ..ప్రతివాది

నోటీసు

అయ్యా మీపై వాది వేసిఉన్న దావాలో మీ యొక్క హాజరు నిమిత్తం తే: 29.8.2025 కు వాయిదా వేసియున్నారు. సదరు దినమున మీరు పై కోర్టుకు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఉదయం 10.30 గం॥లకు హాజరు అయ్యి మీ యొక్క అక్షేపణలు తెలుపవలయును. అట్లు తెలపని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు
సి.వి.వి. సాయి వరప్రసాద్ (బాబ్జి)
న్యాయవాది
తూర్పువీధి, వెంకటగిరి, తిరుపతి జిల్లా
వెంకటగిరి
తే: 20.7.2025 Cell No: 94405 67849

మలేసియా మారిటైం విన్యాసాల్లో 'సంధాయక్'

సింధియా, న్యూస్‌టుడే : ఇండియన్ నేవీ హైడ్రోగ్రాఫిక్ విభాగానికి (ఐఎన్‌హెచ్‌డీ) చెందిన 'ఐఎన్‌ఎస్ సంధాయక్' నౌక మలేసియా పర్యటనకు వెళ్లిందని ఆదివారం నేవీ వర్గాలు తెలిపాయి. ఈనెల 16 నుంచి 19 వరకు ఆ దేశ మారిటైం సంబంధిత విన్యాసాల్లో భాగస్వామ్యం అయిందని పేర్కొన్నాయి. ఈ నౌక పూర్తి దేశీయ సాంకేతికతతో నిర్మితమై, 2024 ఫిబ్రవరిలో జాతికి అంకితమైందని నేవీ వర్గాలు వివరించాయి.

అలల హోరు.. పర్యాటకుల హుషారు

అల్పపీడనం ప్రభావంతో ఆర్కే బీచ్‌లో ఆదివారం అలలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. మరో వైపు సెలవు రోజు కావడంతో బీచ్‌కు పర్యాటకులు పోటెత్తారు. అలలు ఉద్ధృతంగా తీరం వైపునకు దూసుకొస్తున్న దృశ్యాలను చూసి కేరింతలు కొట్టారు. కొందరు సముద్రపు నీటిలో మునకలేస్తూ కనిపించారు. - ఈనాడు, విశాఖపట్నం

రాజు చెరువు 'చిక్కి'పోయింది..!

కబ్జాల చెరలో విలువైన జలవనరు

చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే

జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ రెవెన్యూ పరిధిలోని సుజాతనగర్ దరి రాజుచెరువుపై కబ్జాదారుల కన్ను పడింది. రాజకీయ నాయకుల ముసుగులో దళారులు రూ.లక్షలు ఆర్జిస్తుంటే.. మరోవైపు పేదలు పాకలు వేసుకుని తమకు ఇళ్ల పట్టాలు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. అత్యంత విలువైన ప్రాంతంలో ఉన్న ఈ చెరువు ఇప్పుడు ఆక్రమణదారుల గుప్పిట్లో చిక్కుకుంది. సుమారు 300 వరకు పాకలు, రేకుల షెడ్లు, శాశ్వత నిర్మాణాలు వెలిశాయి.

■ **నాడు రూ.3.30కోట్ల మంజూరు:** కేంద్ర ప్రభుత్వం 'అమృత్' పథకంలో భాగంగా రాజుచెరువును పునరుద్ధరించడానికి 2023లో రూ.3.30కోట్లు మంజూరు చేసింది. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ద్వారా పనులు ప్రారంభించారు. అప్పటికి సుమారు 50 మంది దళారులు ఆక్రమించారు. వారు కాకుండా కొందరు పేదలు పాకలు వేశారు. చెరువు అభివృద్ధి కోసం వాటిని తొలగించారు. అనంతరం కొన్నాళ్లు పనులు జరిగినప్పటికీ తర్వాత నిలిచిపోయాయి. ఇప్పటికీ ఆ నిధులు ఏమయ్యాయో..? పనులు ఎందుకు ఆగిపోయాయో..? ఎవరికీ తెలియని పరిస్థితి.

ప్రస్తుతం చెరువు స్థలంలో వెలసిన ఆక్రమణలు

2023 జులైలో రాజు చెరువు పరిస్థితి ఇలా..

■ **24 ఎకరాలకు మిగిలింది.. 5 ఎకరాలే:** చినముషిడివాడ రెవెన్యూ సర్వే సంఖ్య 163లో 24 ఎకరాల్లో రాజు చెరువు విస్తరించి ఉండేది. ఆక్రమణల కారణంగా కేవలం 11 ఎకరాలే మిగిలినట్లు కొన్నేళ్ల కిందట అధికారులు గుర్తించారు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఇక్కడ వెలిసిన సుమారు 200 నివాసాలను క్రమబద్ధీకరించారు. అప్పట్లో సుమారు 46 నిర్మాణాలు క్రమబద్ధీకరణ కాలేదు. అనంతరం జరిగిన పరిణామాల్లో కబ్జాల జోరు పెరిగింది. ప్రస్తుతం 300పైగా ఆక్రమణలు ఉంటాయని అంచనా. ఇప్పుడు చెరువు విస్తీర్ణం 5 ఎకరాలకే పరిమితమైంది.

■ **తాత్సారం ఎందుకో?:** నీటి వనరుల్లో నిర్మాణాల క్రమబద్ధీకరణకు చట్టం అనుమతించదు. అయినప్పటికీ ఎప్పటికైనా క్రమబద్ధీకరణ చేయకపోతారా? అనే ఆలోచనతో దళారులు ఆక్రమణలను కొనసాగిస్తున్నారు. క్షేత్రస్థాయిలో కబ్జాలను అడ్డుకట్ట వేయాల్సిన యంత్రాంగం కళ్లు మూసుకుంది. ఆక్రమణలకు విద్యుత్తు, ఇంటి పన్ను, డోర్ నంబర్ సహా అన్నిరకాల ధ్రువీకరణలు సృష్టిస్తున్నారు. కొందరు అధికారులు, రాజకీయ దళారుల ప్రమేయంతో కబ్జాల పర్వం నిరంతరాయంగా సాగిపోతోంది. రాజు చెరువు కనుమరుగైతే భవిష్యత్తులో సుజాతనగర్, చినముషిడివాడ పరిసరాల్లో తీవ్రమైన భూగర్భ జలాల కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. భారీ వర్షాల సమయంలో ఎగువ నుంచి వచ్చే వరదనీరు కాలనీలను ముంచెత్తే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు.

దగ్గరలో గడువు.. అప్పగించరా భవనం..!

ఐఐఎం అధికారులను కోరిన ఏయూ వర్గాలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ ప్రాంగణంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) భవనం కాలపరిమితి ఈ ఏడాది సెప్టెంబరుతో ముగియనుంది. దీంతో ఆ భవనాన్ని అప్పగించాలని ఏయూ వర్గాలు ఐఐఎం అధికారులను కోరినట్లు తెలిసింది. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా 2015లో ఐఐఎం నగరానికి వచ్చింది. సంస్థ సొంత భవనం నిర్మించుకునే వరకు ఏయూ అవుట్‌గేట్ సమీపంలోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఎదురుగా సుమారు రూ.8కోట్ల వ్యయంతో భవనం నిర్మించి అందులో కొన్నేళ్లపాటు తరగతులు నిర్వహించారు. నగర శివారులోని గంభీరం వద్ద రెండేళ్ల కిందట భవనం నిర్మించి ఐఐఎంను అక్కడికి మార్చారు. ఏయూలోని భవనాన్ని వివిధ శిక్షణలకు ఉపయోగిస్తున్నారు. ఒప్పందం ప్రకారం దీని గడువు ఈ ఏడాది సెప్టెంబరుతో ముగియనుంది. దీంతో రెండు సంస్థల అధికారులు ఇటీవల సమావేశం నిర్వహించారు. మరో రెండేళ్ల పాటు భవనాన్ని తమ అధీనంలో ఉంచాలని ఐఐఎం అధికారులు కోరినట్లు తెలిసింది. అందుకు ఏయూ అధికారులు ససేమిరా అన్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే ఏయూలోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరో 9 గదులు అవసరం ఉందని, దీని కోసం ఐఐఎం భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ అధ్యాపకులు ఏయూ అధికారులపై ఒత్తిడి పెంచారు. దీంతో భవనాన్ని ఐఐఎంకి ఇవ్వాలా లేదా స్వాధీనం చేసుకోవాలా అనే విషయమై కమిటీ వేసి నిర్ణయిస్తామని వీసీ చెప్పినట్లు సమాచారం.

31 వరకే రెండో రాయితీ సిలిండర్ గడువు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత వంటగ్యాస్ సిలిండర్ల పథకంలో భాగంగా రెండో విడత సిలిండర్ పంపిణీ ప్రక్రియ ఈ నెలాఖరుకు ముగియనుంది. మొదటి విడత సిలిండర్‌ను గత ఏడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది మార్చి వరకు పంపిణీ చేశారు. రెండో విడతకు ఏప్రిల్ నుంచి జులై నెలాఖరు వరకు అవకాశం ఉంది. మిగిలిన అర్హులు ఎవరైనా ఉంటే.. వెంటనే వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

★ జిల్లాలో రెండో విడతకు సంబంధించి ఇప్పటివరకు మూడు చమురు సంస్థల నుంచి 3,65,091 మందికి గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరిగింది. వారిలో 3,56,764 మందికి గ్యాస్ రాయితీ వర్తించనుంది. ఇప్పటి వరకు 3,52,379 మంది వినియోగదారుల ఖాతాల్లోకి రూ.29.44 కోట్ల నిధులు జమయ్యాయి. ఇంకా 4,385 మందికి రూ.37.34లక్షల రాయితీ నిధులు అందాల్సి ఉంది.

★ మొదటి విడత నిధులు సకాలంలోనే ఖాతాలకు జమైనా, రెండో విడత నిధులు విడుదలలో కాస్త జాప్యం జరగడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. ఆయా సాంకేతిక సమస్యలు పరిష్కరించి... బ్యాంకు ఖాతాలకు నిధులు జమ చేస్తున్నారు. మూడో విడత ఉచిత సిలిండర్‌కు ఆగస్టు నుంచి నవంబరు వరకు అవకాశం ఉంటుంది.

ఆకట్టుకునేలా.. జీవం ఉట్టిపడేలా..!

-న్యూస్‌టుడే, కరాస

దుప్పి

కుందేళ్ల గుంపు

జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్ సమీప ఆర్‌అండ్‌బీ కూడలి నుంచి విశాఖ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం వరకు ఉన్న గ్రీన్‌బెల్ట్ స్థలంలో పార్కులను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆర్‌అండ్‌బీ సమీప హరితవనంలో ఏర్పాటు చేసిన దుప్పులు, కోతులు, కుందేళ్ల బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. ప్రాణం ఉన్న జంతువుల్లా కనిపించడంతో వాహనదారులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. పార్కులోని తల్లీబిడ్డ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

ఎటు చూసినా 'స్కాన్'!

ప్రజాభిప్రాయ సేకరణకు సాంకేతికత దన్ను

ఈనాడు, విశాఖపట్నం

ప్రజాభిప్రాయ సేకరణలో విశాఖ మహా ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) కొత్త పుంతలు తొక్కుతోంది. మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. పర్యాటక ప్రాంతాల్లో ఫిర్యాదుల పెట్టెల స్థానంలో క్యూఆర్ కోడ్‌లను ఉపయోగించి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తోంది. తద్వారా ఆయా ప్రదేశాల్లో అందుతున్న సేవల గురించి తెలుసుకొని తగు మార్పులు చేస్తున్నారు.

✦ **ఈ ప్రదేశాల్లో..:** సిటీ సెంట్రల్ పార్కు, వుడా పార్కు, కైలాసగిరి, తొట్లకొండ, తెన్నేటి పార్కు, కురుసురా జలాంతర్గామి, టీయూ-142, సీహారియర్, రోప్‌వేలను వీఎంఆర్‌డీఏ నిర్వహిస్తోంది. నిత్యం వేల మంది వీటిని సందర్శిస్తారు. ఇక్కడ గతంలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేసినా స్పందన అంతంతమాత్రంగానే ఉండేది. వాటికి ప్రత్యామ్నాయంగా ఇటీవల క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటు చేయగా మంచి ఫలితాలు వస్తున్నాయి. ముఖ్యంగా పార్కుల వద్ద బ్యానర్ల రూపంలో ప్రజలకు కనిపించేలా వీటిని వేలాడదీస్తున్నారు.

వీఎంఆర్‌డీఏ భవనం వద్ద క్యూఆర్ కోడ్ వివరాలు

✦ పార్కుల్లో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని, తాగునీటి వసతి సరిగా లేదని తదితర లోపాలపై ఫిర్యాదులొస్తున్నాయి. సిటీ సెంట్రల్ పార్కులో నడకకు ఉచితంగా ప్రవేశం కల్పించాలని, వాహనాలకు పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని పలువురు క్యూఆర్ కోడ్‌ల ద్వారా అభిప్రాయాలు తెలిపారు.

✦ **అద్దెకు తీసుకోవాలన్నా:** మధురవాడ, గాజువాక, సీతమ్మధార, ఎంవీపీ కాలనీ... ఇలా పలు చోట్ల వీఎంఆర్డీఏకు వాణిజ్య సముదాయాలున్నాయి. కొన్ని చోట్ల కల్యాణ మండపాలు, కైలాసగిరిపై వేడుకలకు అద్దెకిచ్చే స్థలాలున్నాయి. ఎక్కడెక్కడ ఏ భవనాలున్నాయి, వాటి అద్దె ఎంత అనే వివరాలు చిత్రాలతో సహా... 'స్కాన్' చేసిన చోట వస్తాయి. నచ్చితే అక్కడి సేవలను వినియోగించుకోవచ్చు.

✦ వీఎంఆర్‌డీఏ ఇటీవల మధ్యతరగతి కుటుంబాల కోసం బడ్జెట్ హౌసింగ్ అపార్టుమెంట్లను ప్రతిపాదించింది. దీనికి సంబంధించిన డిమాండ్ సర్వేను క్యూఆర్ కోడ్‌లతోనే పూర్తి చేశారు. ఎంత విస్తీర్ణంలో అవసరం, ఏ ప్రాంతంలో కావాలి వంటి వివరాలతోపాటు సలహాలను ఆహ్వానిస్తూ క్యూఆర్ కోడ్ బ్యానర్లను నగరంలో పలు చోట్ల ఏర్పాటు చేశారు. వాటికి మంచి స్పందనే వచ్చింది. వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళిక పునఃపరిశీలనలో భాగంగా అభ్యంతరాల స్వీకరణ కూడా ఇదే తరహాలో చేశారు.

✦ **ఎప్పటికప్పుడు సమీక్షించి నివేదిక:** 'క్యూఆర్ కోడ్ ద్వారా వచ్చే వినతులను ముందుగా సంబంధిత విభాగాలకు పంపుతున్నాం. వాటిని ఎంత వరకు పరిష్కరించారనేది ప్రతి వారం సమీక్షించి ప్రగతి నివేదిక రూపొందిస్తున్నాం. వీఎంఆర్‌డీఏకు చెంది, ప్రజలతో సంబంధమున్న ప్రతి అంశాన్ని దీనికి అనుసంధానం చేస్తున్నాం. మెరుగైన ఫలితాలొస్తున్నాయి' అని కమిషనర్ విశ్వనాథన్ పేర్కొన్నారు.

పిల్లల్లో మానసిక సమస్యలకు ఉచిత చికిత్స

'సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్'లో సకల సౌకర్యాలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే

పిల్లల్లో మానసిక సమస్యలను గుర్తించి చికిత్స అందించడానికి పెదవాల్తేరు ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ పథకంలో భాగంగా ఇటీవల దీన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం బాలల్లో మానసిక సమస్యలు పెరుగుతున్నాయని వాటిని ముందుగానే గుర్తించి వైద్య సేవలు అందించాలని, లేకపోతే వయసు పెరిగే కొద్దీ అవి తీవ్రరూపం దాలుస్తాయని ఆసుపత్రి వైద్యులు చెబుతున్నారు. గతంలో మానసిక ఆసుపత్రిలో వారానికి ఒక రోజు పిల్లలకు ఓపీ ఉండేది. సరైన మందులు కూడా ఉండేవి కాదు. 'సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్' కారణంగా ఆ సమస్య తీరింది.

మానసిక ఆసుపత్రిలో పిల్లల ప్రత్యేక విభాగం

● **వైద్య సదుపాయాలు ఇలా..:** నిత్యం ఓపీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది. ఈ విభాగంలో 40 పడకలు ఉన్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ముగ్గురు, పీజీ వైద్యులు 9 మంది ఉన్నారు. వ్యాధికి చికిత్స అందించిన తర్వాత ఉచితంగా మందులు అందజేస్తారు.

● **అందించే చికిత్సలు..:** పలువురు బాలలు హైపర్ యాక్టివ్‌గా ఉంటారు.. విపరీతమైన విసుగు, కోపాన్ని ప్రదర్శిస్తుంటారు. దేనిపైనా ఏకాగ్రత నిలపరు. మిగతా పిల్లల్లో కలవరు. ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారు. ఇలాంటి వారికి బిహేవియర్ థెరపీ ఇచ్చి సాధారణ స్థితికి తీసుకొస్తారు. అవసరమైతే ప్రత్యేక విద్య అందిస్తారు. మాటలు తడబడుతుంటే స్పీచ్ థెరపీ ఇస్తారు.

ప్రయోజన సమాచారం

● 'ప్రస్తుతం రోజుకు 10 నుంచి 15వరకు కొత్త కేసులు వస్తున్నాయి. ఇన్‌పేషెంట్లుగా 25 మంది వరకు ఉన్నారు. 35 నుంచి 40 మంది నిరీక్షణలో ఉంటున్నారు. ఆసుపత్రి సేవలు అవసరమైన వారు 0891-2754918 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలి' అని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి తెలిపారు.

తాగునీరు గరళం.. డయేరియా భయం..!

✦ పీఎంపాలెం పరిధిలో ప్రబలిన వ్యాధి

✦ సంపుల శుభ్రతలో సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం

ఈనాడు-విశాఖపట్నం, మధురవాడ, కొమ్మాది-న్యూస్‌టుడే

గొంతు తడిపే నీరు సిబ్బంది నిర్లక్ష్యంతో గరళమవుతోంది. ఫలితంగా నగరంలోని పలు వార్డుల్లో డయేరియా ప్రబలుతోంది. తాజాగా పీఎంపాలెం పరిధిలో 23 మంది డయేరియా బారిన పడటం కలవరపెడుతోంది. నగరంలో చాలా వరకు ప్రధాన తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల్లో దర్శనమిస్తున్నాయి. వర్షం పడినా, మురుగు పొంగినా ఏళ్లనాటి తుప్పు పట్టిన పైపులు దెబ్బతిని తాగునీరు కలుషితమవుతోంది.

● **సంపు శుభ్రత గాలికి..:** పీఎంపాలెం పరిధి గాయత్రీనగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో డయేరియా ప్రబలి పదుల సంఖ్యలో బాధితులుగా మారారు. అందులో నలుగురు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా ఓ మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఓ సంపు ద్వారా కాలనీలోని 60 ట్యాంకులకు నీటిని నింపుతారు. అక్కడి నుంచి నిత్యం 12 బ్లాక్‌ల్లోని సుమారు 500 కుటుంబాలకు నీటిని సరఫరా చేస్తారు. సంపును శుభ్రం చేయకపోవడంతోనే నీరు కలుషితమైనట్లు తెలుస్తోంది. వాస్తవానికి మూడు నెలలకోసారి సంపును శుభ్రం చేసి.. ఆ తేదీని బోర్డుపై రాయాల్సి ఉంటుంది. అయితే డయేరియా ప్రబలినట్లు తెలిసిన సిబ్బంది నీటి నమూనాల సేకరణకు ముందే సంపును శుభ్రం చేయడం గమనార్హం.

కలవరపెడుతున్న కేసులు... ● గతేడాది నవంబరులో నగరంలోని సాయినగర్‌లో కలుషితనీరు తాగి ముగ్గురు డయేరియా బారిన పడ్డారు.

మారికవలస కాలువలో ప్రధాన పైపులైను

● తాజాగా పీఎంపాలెం పరిధిలో ఏకంగా 23 మంది అస్వస్థతకు గురయ్యారు. డయేరియాతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించే బాధితుల సంఖ్య ఎక్కువగానే ఉంది.

● **మురుగు కాలువల్లో పైపులైన్లు:** నగరంలో ప్రధాన తాగునీటి పైపులైన్లు 379 ప్రాంతాల్లో మురుగు కాలువల్లో నుంచి వెళుతున్నట్లు గత కమిషనర్ సంపత్‌కుమార్ హయాంలో గుర్తించారు. వాటిలో కొన్నింటిని మాత్రమే మార్పు చేశారు. మధురవాడలో స్టేడియం నుంచి బోరవానిపాలెం వరకు సుమారు 5 కి.మీ. మేర తాగునీటి పైపులైను కాలువలో వెళుతోంది. మారికవలస వద్ద ఇటీవల పైపులైను పగిలిపోయి తాగునీటిలో మురుగు కలిసిపోయింది. కారుషెడ్డు-కొమ్మాది వరకు సర్వీసు రోడ్డు పక్కనే కాలువల్లో శిథిలమైన తాగునీటి పైపులైన్లు ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు.

● **ప్రజారోగ్యానికి ప్రమాదం:** ప్రధాన పైపులైను నుంచి ఇళ్లకు అనుసంధానం వేసిన పైపులు ఎక్కువ భాగం మురుగు కాలువల్లో ఉంటున్నాయి. వాటిని పక్కకు మార్చాలని నివాసితులకు చెబుతున్నా స్పందన కనిపించడం లేదని అధికారులు చెబుతున్నారు. వన్‌టౌన్, పూర్ణమార్కెట్, స్ప్రింగ్‌రోడ్డు, అల్లిపురం, రెల్లివీధి, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, కంచరపాలెం, రవీంద్రనగర్, ఆరిలోవ ప్రాంతాల్లో ఈ దుస్థితి కనిపిస్తోంది. ఇది ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారుతోందని, ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు కళ్లు తెరిచి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నగరంలో ప్రతిరోజూ తాగునీటి సరఫరా: 400ఎంఎల్‌డీ	తాగునీటి శుద్ధి కేంద్రాలు: 10	సరఫరా చేసే పైపులైన్ల పొడవు: 2,550 కి.మీ.	అనుసంధాన పైపులు: 1700 కి.మీ.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

వన్‌టౌన్, కార్పొరేషన్, న్యూస్‌టుడే : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తుల స్థితిగతులు తెలుసుకునేందుకు 1100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ★ జీవీఎంసీ జోనల్ కార్యాలయాలతో పాటు, ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందని మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు.

ప్రకటన

కస్టమర్లకు మరియు సంబంధిత వ్యక్తులకు తెలియజేయునది ఏమనగా, **ముంబయి-పూణే రోడ్, ఆకుర్ది, పూణే - 411035** లో రిజిస్టర్డ్ కార్యాలయం కలిగి ఉన్న బజాజ్ ఆటో క్రెడిట్ లిమిటెడ్ వారి వైజాగ్ కార్యాలయం, బజాజ్ ఆటో క్రెడిట్ లిమిటెడ్, డోర్ నం.39-6-71/5/9, ఫ్లాట్ 203, శ్రీ సత్య కాంప్లెక్స్, బోత్సా స్క్వేర్, మురళీనగర్ జం., వైజాగ్-530007 **2025 అక్టోబర్ 25వ తేదీ** నుండి మూసివేయబడుతుంది.

ముగింపు తేదీ : 25 అక్టోబర్ 2025

వారు లేరు.. నేనున్నాను..!

జగదాంబకూడలిలో ఆదివారం సాయంత్రం వాహనాల రద్దీతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. పాదచారులు రహదారి దాటలేని పరిస్థితి. సాధారణంగా ఇక్కడ ట్రాఫిక్ పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరిస్తుంటారు. ఆదివారం కావడంతో వారెవరూ కనిపించలేదు. వాహనాల రద్దీలో పాదచారులు రోడ్డు దాటలేక అవస్థలు పడటం అక్కడే ఉన్న ఓ యాచకుడు గమనించాడు. వెంటనే అక్కడికి చేరుకుని వాహనాలను నిలిపేసి పాదచారులను రహదారి దాటించాడు.- ఈనాడు, విశాఖపట్నం

అంతన్నారు..ఇంతన్నారు.. చేతులెత్తేశారు..!

✦ భూసమీకరణలో అక్రమార్కులపై చర్యలు శూన్యం

✦ విజిలెన్స్ విచారణ బుట్టదాఖలేనా..!

ఈనాడు, విశాఖపట్నం : గత వైకాపా ప్రభుత్వంలో ఒక సెంటు స్థలాల అభివృద్ధికి విశాఖలో చేపట్టిన భూసమీకరణలో బినామీల లెక్క ఇప్పటికీ తేలలేదు. ఆయా గ్రామాల్లో భూముల్లేని వారికి పరిహారంగా పట్టాలు ఇవ్వడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పలుమార్లు విచారణ జరిపినా అక్రమార్కులను గుర్తించడం లేదు.

✦ ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి, అనకాపల్లి, సబ్బవరం, పరవాడ మండలాల్లో మొత్తం 6 వేల ఎకరాల్లో భూసమీకరణ చేపట్టారు. రైతులకు పరిహార పట్టాలు అందజేశారు. ఈ క్రమంలో అర్హుల జాబితాల్లో వైకాపా నేతలు బినామీల పేర్లను పెద్ద సంఖ్యలో చేర్చారనే ఆరోపణలు వచ్చాయి.

✦ **ముదపాకలో స్థానికేతరులు:** ముదపాకలో భూములు లేని స్థానికేతరుల పేర్లు చేర్చి..భూములిచ్చిన రైతుల పేర్లు లేకుండా చేశారన్న ఆరోపణలున్నాయి. మొదట్లో ఇచ్చిన ఎల్‌పీవోసీ (భూసమీకరణ యాజమాన్య హక్కు) పత్రాల జాబితా ప్రకారం చూస్తే ముదపాకలో భూసమీకరణ పరిహారం జాబితాలో 25 మంది వరకు బినామీలున్నట్లు సమాచారం. వీరికి 34 ఎకరాలు ఉన్నట్లు ఎల్‌పీవోసీలు జారీ చేశారు.

✦ **పెందుర్తి, పద్మనాభం మండలాల్లో..:** పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలో 11వేల గజాల స్థలాన్ని అక్రమార్కులు కొట్టేశారు. ఇక్కడ 64.63 ఎకరాలు సమీకరించగా రైతులకు పరిహారంగా అభివృద్ధి చేసిన ప్లాట్లను 21 ఎకరాలుగా గుర్తించారు. ఇందులో డీపట్టాదారులు 59, ఆక్రమణదారులు ఆరుగురిని గుర్తించి నివేదిక తయారు చేశారు. అనర్హులకు 7305 గజాల స్థలం కట్టబెట్టారు.

ముదపాక భూసమీకరణలో గుర్తించిన వివాదాస్పద స్థలం

✦ పద్మనాభం మండలంలో వైకాపా ప్రజాప్రతినిధి స్థానికంగా లేని వ్యక్తుల పేర్లతో 30 ఎకరాలు కొట్టేశాడు. మండలంలోని నరసాపురం, తునివలస, రెడ్డిపల్లిలో కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లతో బినామీ పట్టాలు ఇప్పించుకొన్నారు. అప్పట్లోనే వీటిపై ఫిర్యాదులు అందగా చూసీచూడనట్లు వదిలేశారు. ఇప్పుడు విజిలెన్స్ విచారణ ఆ దిశగా సాగినట్లు కనిపించలేదు. ఆనందపురం భూసమీకరణలోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయి.

✦ **విజిలెన్స్ విచారణ జరిపినా..:** కూటమి ప్రభుత్వం వచ్చాక భూసమీకరణలో అక్రమాలపై విచారణకు ఆదేశించింది. రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టగా మొదట అక్రమాలు బయట పడకపోవడంతో రెండో సారి విచారణ జరిపారు. ఇప్పటి వరకు అక్రమార్కుల వివరాలు బయటపెట్టలేదు. ఉన్నతాధికారుల ఒత్తిళ్లే దీనికి కారణమనే ఆరోపణలు వస్తున్నాయి.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

23కు చేరిన డయేరియా బాధితులు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: విశాఖలోని జీవీఎంసీ ఆరో వార్డు పీఎంపాలెం గాయత్రీనగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో డయేరియా కలకలం రేపుతోంది. గత మూడు రోజుల నుంచి ఇప్పటి వరకు 23 మంది బాధితులను వైద్యాధికారులు గుర్తించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మహిళను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించడంతో ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పీఎంపాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారి పల్లా సుజన్ తెలిపారు. పదేళ్ల బాలిక స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని, డయేరియా లక్షణాలు బయటపడడంతో పలువురు రోగులు కోలుకుంటున్నారు. ఇప్పటికే కాలనీలో నీళ్ల ట్యాంకుల శుభ్రతతో పాటు కాలువలు, ఖాళీల మధ్య వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో మందులు పిచికారీ చేస్తున్నారు. ఆదివారం జోన్-2 జీవీఎంసీ సహాయ వైద్యాధికారి కిశోర్‌తో పాటు యూపీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బంది పలు నివాసాలకు వెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీశారు. డయేరియా లక్షణాలతో ఇంట్లో ఉన్న వారితో మాట్లాడి అవసరమైన మందులు సమయానుసారం తీసుకోవాలని సూచించారు. కాలనీలో 24 గంటల ఉచిత వైద్య శిబిరం కొనసాగుతోంది. జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి జగదీశ్వరరావు కాలనీలో పర్యటించి వైద్యశిబిరాన్ని పరిశీలించారు.

గాయత్రీనగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న జీవీఎంసీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులు

అప్రమత్తతతో సురక్షిత వేట..!

న్యూస్‌టుడే, వన్‌టౌన్

ప్రాణాలకు తెగించి నడి సంద్రంలో చేపల వేట సాగించే మత్స్యకారులు.. తుపాను సమయంలో అప్రమత్తంగా లేకుంటే ముప్పు తప్పదని మత్స్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. గత ఏడాది విశాఖ నుంచి సముద్రంలోకి వెళ్లిన పలు బోట్లకు విపత్కర పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ ఏడాదిలో ఇప్పటికే వేట ప్రారంభమైన నేపథ్యంలో... తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ జేడీ పి.లక్ష్మణరావు సూచిస్తున్నారు.

విశాఖ తీరంలో బోట్లు

తుపాను వేళ మత్స్యకారులకు అధికారుల సూచనలు

ఇదీ పరిస్థితి..! : విశాఖ చేపలరేవు నుంచి దాదాపు 600 బోట్ల ద్వారా సముద్ర జలాల్లో వేట సాగుతుంది. అవి ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరం వరకు వెళ్తుంటాయి. ఇటీవల వాతావరణ మార్పులతో సముద్రంపై అల్పపీడనాలు ఏర్పడి, ఈదురుగాలులు వీస్తున్నాయి. ★ తుపాను సమయంలో వీచే గాలులకు బోట్లు తట్టుకోలేవు. కొన్ని దారి తప్పి అలలపై సుదూర ప్రాంతాలకు కొట్టుకుపోతే, ఇంజిన్లు మునిగిపోతుంటాయి. గతంలో పలుమార్లు ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ★ సాధారణంగా మే- అక్టోబరు నెలల మధ్య తుపాన్లు ఎక్కువగా వస్తుంటాయి. ఈ సమాచారాన్ని మత్స్యకారులు ఎప్పటికప్పుడు తెలుసుకుని అప్రమత్తంగా ఉంటూ చేపలవేట కొనసాగించడం ద్వారా ముప్పు నుంచి బయటపడొచ్చు.

వివరాలు నమోదు తప్పనిసరి: ★ వేటకు వెళ్లే మత్స్యకారులు తమ బోటు నెంబరు, సిబ్బంది వివరాలు, వారి ఫోన్ నెంబర్లు, వేట సాగించే దిశ, ప్రాంతం వంటి వివరాలను కుటుంబ సభ్యులు, సంబంధిత గ్రామ పెద్దలతో పాటు, మత్స్య సహాయకులు, సాగర మిత్రలకు తెలియజేయాలి. ★ బోటులో రక్షణ పరికరాలైన లైఫ్ జాకెట్లు, టార్చిలైట్‌తో పాటు ప్రతి బోటుకు జీపీఎస్ పరికరం అమర్చుకోవాలి. బోట్లపై సముద్రంలోకి వెళ్లే వారు వీలైనంత వరకు ఫిష్ హార్బర్ దగ్గరగా వేట సాగించాలి. దీంతో అత్యవసర పరిస్థితిలో పరస్పర సహకారం, సమాచార మార్పిడికి వీలుంటుంది.

★ వేట సమయంలో తుపాన్లు, ఇతర విపత్కర పరిస్థితులు ఎదురైతే... వెంటనే మత్స్యకారులు తమ బోట్లను సమీప ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు, లేదా చేపలరేవులకు తీసుకెళ్లాలి. ★ మత్స్యకారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వేట సాగించాలి... ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించొచ్చని జేడీ సూచించారు.

సీతారామ కల్యాణంపై అభ్యంతరం

భద్రాచలం, న్యూస్‌టుడే: విశాఖపట్నం బీచ్ రోడ్డులోని అయోధ్య రిషికా ఆలయంలో త్వరలో నిర్వహించనున్న సీతారామ కల్యాణానికి భద్రాచలం ఆలయ పండితులు వస్తారని చేస్తున్న ప్రచారాన్ని స్థానిక పండితులు ఖండించారు. ఈ మేరకు భద్రాచలం రామాలయం తరఫున అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'అయోధ్య రామ మందిర్' పేరుతో దాదాపు అర నిమిషం నిడివి గల వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆరు వేల మంది కూర్చునేలా ఈనెల 29న సాయంత్రం 5 గంటలకు సీతారామ కల్యాణం ఉంటుందని టికెట్ ధర రూ.2,999 అని వీడియోలో వెల్లడించారు. ఈ కల్యాణం జరిపించడానికి భద్రాచలం ఆస్థాన పండితులు వస్తున్నట్లు అందులో ఉండటంపై రామాలయం అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కల్యాణానికి రామాలయానికి ఎలాంటి సంబంధం లేదని భక్తులు గమనించాలని పేర్కొన్నారు. తమ దేవస్థానానికి కాపీ రైట్స్ ఉన్నాయని, తమకు తెలపకుండా ఇలా కల్యాణాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని తెలిపారు.

ఏకగ్రీవంగా జిల్లా కార్యవర్గం ఎన్నిక

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి విశాఖ జిల్లా కమిటీ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం ఉదయం పాతనగరంలోని ఓ హోటల్లో సంఘం సభ్యులు సమావేశమయ్యారు. సంఘం రాష్ట్ర కమిటీ ప్రధాన సలహాదారు డాక్టర్ జేవీఎల్.శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షునిగా డాక్టర్ పి.రాఘవేంద్రరావు, ఉపాధ్యక్షునిగా డాక్టర్ ఎం.శివకాంత్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ రాజా శ్రీకాంత్, కోశాధికారిగా డాక్టర్ ఎం.చంద్రశేఖర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా డాక్టర్ వి.సునీత, డాక్టర్ ఎస్.సుదర్, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ ఎస్.ఆనందరావు, డాక్టర్ ఆర్.దీప్తి, డాక్టర్ దయాకుమార్, డాక్టర్ వి.మల్లికార్జున, మహిళా వైద్యుల ప్రతినిధిగా డాక్టర్ జగదాంబిని ఎన్నుకున్నారు. అనంతరం వారంతా ప్రమాణ స్వీకారం చేశారు.

హోమియోపతి వైద్యుల సంఘానికి ఎన్నికైన సభ్యులు

సదస్సులో పాల్గొన్న సీనియర్ ఇంజినీర్లు సాయిరాజు, నవీన్‌రాజు

రైల్వేలో భద్రతకు అధిక ప్రాధాన్యం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : రైల్వేలో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని సీనియర్ డివిజనల్ ఇంజినీర్లు బి.సాయిరాజు, బి.నవీన్‌రాజు అన్నారు. ట్రాలీ, మోటార్ ట్రాలీ పని విధానంపై ఆదివారం వాల్తేర్ రైల్వే ఇంజినీరింగ్ విభాగంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ట్రాక్ నిర్వాహకులు, ట్రాలీ ఆపరేటర్లు, కీలకమైన ఇంజినీరింగ్ విభాగాల సిబ్బంది పాల్గొని భద్రతపరమైన అంశాలు, అమలు చేయాల్సిన నిబంధనలపై చర్చించారు. ట్రాలీ ఆపరేషన్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రెవెన్యూ అధికారులపై కబ్జాదారుల దాడి

మధురవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ స్థలం ఆక్రమణను అడ్డుకునేందుకు వెళ్లిన రూరల్ రెవెన్యూ అధికారులపై కబ్జాదారులు దాడికి పాల్పడ్డారు. జీవీఎంసీ ఏడో వార్డు పరిధి రామానాయుడు స్టూడియో సమీపంలోని కొండ దిగువన తిమ్మాపురం గ్రామంలో సుమారు 80 గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమించి కొందరు భవనం నిర్మిస్తున్నారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిశోర్, వీఆర్వో దుర్గాప్రసాద్‌లు ఆక్రమణను అడ్డుకునేందుకు వెళ్లారు. ఈ సమయంలో కబ్జాకు పాల్పడుతున్న కొర్రాయి రమణమ్మ, కె.అప్పయ్యమ్మ, శ్యామ్ తదితర కుటుంబ సభ్యులు వారిపై దాడికి యత్నించి వాగ్వాదానికి దిగారు. దీంతో రెవెన్యూ ఆర్ఐ ఆక్రమణదారులపై పీఎంపాలెం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అధికారులపై దాడికి పాల్పడిన ముగ్గురిని స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నట్లు సీఐ జి.బాలకృష్ణ తెలిపారు.

ఆక్రమణల జోరు: ఏడో వార్డు పరిధి తిమ్మాపురం గ్రామంలో కొండలపై ప్రభుత్వ స్థలాలను చదును చేసి విరివిగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. గ్రామంలో పెద్దలుగా చలామణి అవుతున్న కొందరు నాయకులు రాత్రి వేళ దాదాపు 80 నుంచి 100 గజాల స్థలాలను చదును చేసి రూ.8 నుంచి రూ.10 లక్షలకు విక్రయాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే చాలా వరకు కొండ ప్రాంతం కబ్జాల పాలైంది. దీనిపై భీమిలి ఆర్డీఓ దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తిమ్మాపురంలో ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడం

హిందుస్థాన్ షిప్‌యార్డు సందర్శన

సింధియా, న్యూస్‌టుడే : వికసిత్ భారత్ దిశగా హిందుస్థాన్ షిప్‌యార్డు పనితీరు మెరుగ్గా ఉందని కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ప్రశంసించారని సంస్థ యాజమాన్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈనెల 18న విశాఖపట్నం నేవల్ జెట్టీలో నిస్తార్ నౌకను జాతికి అంకితం చేసిన కేంద్రమంత్రి, ఆ తర్వాత షిప్‌యార్డును సందర్శించి, వివిధ విభాగాలను పరిశీలించినట్టు పేర్కొంది. సంస్థ ఆవరణలో మొక్కలు నాటిన మంత్రి.. అధికారులు, సిబ్బందితో మాట్లాడి, వారితో గ్రూప్ ఫొటో దిగారు.

షిప్‌యార్డులో మొక్క నాటుతున్న కేంద్ర సహాయమంత్రి సంజయ్ సేథ్

220 విదేశీ మద్యం సీసాలు స్వాధీనం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఎక్సైజ్ శాఖకు చెందిన టాస్క్‌ఫోర్స్ విభాగం శనివారం రాత్రి లలితానగర్ ప్రాంతంలో దాడులు నిర్వహించి 220 విదేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఈఎస్ ఆర్.ప్రసాద్ తెలిపారు. పిఠాపురం కాలనీలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఆదివారం మధ్యాహ్నం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. లలితానగర్‌లో తిరుపతి వెంకటేశన్ పిళ్లై అనే వ్యక్తి ఒక ఇంటిని గొడౌన్‌గా మార్చి అనధికారికంగా వివిధ దేశాల నుంచి మద్యం సీసాలను సేకరించి విక్రయాలు చేపడుతున్నాడన్నారు. పక్కా సమాచారం రావడంతో శనివారం రాత్రి దాడులు చేశామన్నారు. వెంకటేశన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చెన్నై నుంచి మద్యం సీసాలను తెప్పిస్తున్నట్లు తెలిపాడన్నారు. ప్రస్తుతం దొరికిన 220 విదేశీ మద్యం సీసాలు విలువ సుమారు రూ.15లక్షల నుంచి రూ.18 లక్షల వరకు ఉంటుందన్నారు. మద్యంతో పాటు ద్విచక్రవాహనం, రూ.4310 నగదు, చరవాణి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్, ఎస్సై ముసలనాయుడు, సిబ్బంది కె.వి.ఎం.రాజు, వెంకటేశ్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుకున్న విదేశీ మద్యం సీసాలతో ఎక్సైజ్ అధికారులు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అపోహలొద్దు

ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

గురుద్వారా, న్యూస్‌టుడే: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అపోహలు అవసరం లేదని, వీటి వల్ల వినియోగదారులపై ఎటువంటి అదనపు ఛార్జీల భారం పడదని ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'వినియోగదారులకు అందించే సేవల్లో పారదర్శకతను మరింతగా పెంచేందుకు మాత్రమే కేంద్రం చేపట్టిన ఆర్‌డీఎస్ (పునరుద్ధరించిన పంపిణీ రంగం) పథకంలో భాగంగా అన్ని రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రతిపాదనకు 2021 ఫిబ్రవరిలోనే ఏపీ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆమోదం తెలిపింది. ఏపీఈఆర్‌సీ రెగ్యులేషన్-2021 ప్రకారం ప్రభుత్వ వాణిజ్య కేటగిరీల దుకాణాలకు వీటిని అమర్చుతున్నాం. అనంతరం ఎక్కువ విద్యుత్తు వాడుతున్న గృహ వినియోగదారులకు అమర్చుతాం. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ముందు వాటి ప్రత్యేకతలు, ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. వీటిని అమర్చే సమయంలో ఛార్జీలు, మామూళ్లు చెల్లించాల్సిన అవసరం లేదు. నెలవారీ విద్యుత్ బిల్లులో కూడా ఇన్‌స్టాల్‌మెంట్స్ వసూలు చేయరు. స్మార్ట్ మీటర్లు పాత మీటర్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగాన్ని నమోదు చేయవు. ఏపీఈఆర్‌సీ నిర్ణయించిన టారిఫ్ ప్రకారమే బిల్లులు వసూలు చేస్తాం' అని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీల విజేత...'విశాఖ'

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : బీచ్‌రోడ్డులోని ఆక్వా స్విమ్మింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు రోజుల పాటు జరిగిన పదో రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ స్విమ్మింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో విశాఖ జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. జట్టు క్రీడాకారులు 15 స్వర్ణ, 27 రజత, 23 కాంస్య పతకాలతో 179 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో ఎన్టీఆర్ జిల్లా జట్టు నిలిచింది. ఆ క్రీడాకారులు 22 స్వర్ణ, 12 రజత, 9 కాంస్య పతకాలతో 155 పాయింట్లు సాధించారు. తృతీయ స్థానంలో నిలిచిన కృష్ణా జట్టు క్రీడాకారులు 9 స్వర్ణ, 10 రజత, 15 కాంస్య పతకాలతో 90 పాయింట్లు సొంతం చేసుకున్నారు. విశాఖ జిల్లా స్విమ్మింగ్ సంఘం అధ్యక్షుడు సంతోష్‌శెట్టి, ఇతర సభ్యులు ఎన్.విజయకుమార్, ఆర్.విజయకుమార్ హాజరై విజేత జట్లకు ట్రోఫీలు అందించారు. టోర్నీ నిర్వాహకులు, జిల్లా స్విమ్మింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి మోహన్ వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న స్విమ్మింగ్ సంఘం అధ్యక్షుడు సంతోష్‌శెట్టి తదితరులు

జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ సంఘం ఛైర్మన్‌గా 'పీలా'

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం వాల్తేరు క్లబ్‌లో నిర్వహించారు. ఛైర్మన్‌గా మేయర్ పీలా శ్రీనివాసరావు, అధ్యక్షులుగా తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడిగా చుక్కా శ్రీనివాసరావు, కార్యదర్శులుగా 67వ కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్, ఉషశ్రీ, కోశాధికారిగా బి.శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ నిత్యం షటిల్ ఆడేవారు ఆరోగ్యంగా ఉంటారన్నారు. నగరంలోని అన్ని వార్డుల్లో షటిల్ కోర్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు.

మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, చుక్కా శ్రీనివాసరావులను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

ఘనంగా 'కిసాన్ దివస్-2025' వేడుకలు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీఓఐ) 'కిసాన్ దివస్-2025' వేడుకల్ని ఆదివారం జగదాంబకూడలిలోని బీఓఐ శాఖలో నిర్వహించారు. బ్యాంకు జనరల్ మేనేజర్ ఎం.సుభాకర్, జోనల్ మేనేజర్ నికేష్‌కుమార్ సిన్హా, డిప్యూటీ మేనేజర్ సీతారాం తదితరులు హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంత రైతులకు బ్యాంకు సేవల్ని చేరువ చేసేలా జులై నెల మొత్తం 'కిసాన్' వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఏపీలోని 11 జిల్లాల్లో 2.60 లక్షల మంది రైతులకు రూ.105 కోట్ల మేర వివిధ రుణాలు అందించామన్నారు. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, విజయనగరం తదితర ప్రదేశాల్లో మెగా లోన్ మేళాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న బీఓఐ జీఎం సుభాకర్, జెడ్‌ఎం నికేష్‌కుమార్ సిన్హా, తదితరులు

టీకాలు అందిస్తూ.. ఆరోగ్య సంరక్షణ చేపడుతూ..

విశాలాక్షినగర్. న్యూస్‌టుడే

పిల్లలకు సరైన సమయంలో టీకాలు వేయించకపోవడంతో పలు అనారోగ్య సమస్యల బారినపడి మృత్యువాత పడుతుంటారు. ఇటువంటి ఘటనలు జరగకుండా ఆరోగ్యకర సమాజాన్ని సృష్టించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను రూపొందించి అమలు చేస్తున్నాయి. పుట్టిన శిశువు నుంచి ఎదిగే వయసులో ఉన్న పిల్లలకు ఏ సమయంలో ఏయే టీకాలు అందించాలో క్యాలండర్ తయారు చేసి సచివాలయాల వారీగా ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలను భాగస్వామ్యం చేసి సమయానుకూలంగా అందించే ఏర్పాట్లు చేస్తున్నాయి.

వారంలో రెండుసార్లు ఇమ్యునైజేషన్..: ఇమ్యునైజేషన్‌లో భాగంగా వార్డు సచివాలయాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీల్లో ప్రతి బుధ, శనివారాల్లో చిన్నారులు, గర్భిణులకు వ్యాక్సినేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి సిబ్బందిని సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమం చేపడుతున్నారు.

సచివాలయంలో చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

వ్యాక్సిన్లు అందించే ప్రక్రియ ఇలా..

బిడ్డ ప్రసవించిన నాటి నుంచి 24 గంటల లోపు: క్షయ, పచ్చకామెర్ల వ్యాధులు సోకకుండా బీసీసీ, పోలియో నివారణకు ఓపీవీ 0 డోసు, లివర్ ఇన్ఫెక్షన్ రాకుండా హెపటైటిస్ టీకాలు వేస్తారు. 45 రోజుల తర్వాత పోలియో సోకకుండా ఓపీవీ-1, ఓపీవీ-2, ఓపీవీ-3, ఐపీవీ డోస్‌లు అందిస్తారు.

75 రోజులకు: కంఠ సర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం, మెదడు వాపు, న్యుమోనియా నివారణకు పెంటా వ్యాక్సిన్ వారానికి ఒకటి చొప్పున మూడు డోసులు అందిస్తారు.

9 నుంచి 12 నెలల వయసులో: తట్టు, రుబెల్లా వ్యాధుల నివారణకు ఎంఆర్-1, అంధత్వ నియంత్రణకు విటమిన్ ఏ, మెదడువాపు నివారణకు జేఈ-1, దగ్గు, జ్వరం, శ్వాసలో ఇబ్బందులు నివారణకు ఎఫ్ఐవీవీ-3, అంధత్వ నివారణకు విటమిన్-ఏ2 **5 నుంచి 6 సంవత్సరాలకు:** కంఠసర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం నివారణకు డీపీటీ-2 డోసు వేస్తారు.

ఆరోగ్యకర సమాజం కోసం..

పుట్టిన బిడ్డ 16 ఏళ్ల వరకు ఆరోగ్యవంతంగా ఎదిగేందుకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం టీకాలు అందించేందుకు సచివాలయాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా చర్యలు చేపడుతున్నాం. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించి వారిని సచివాలయాలకు తీసుకురావడం రాలేకపోతే వారింటి వద్దకే వెళ్లి టీకాలు వేయడం చేస్తున్నారు. చిన్నారులకే కాకుండా గర్భిణులు, బాలింతలకు కూడా సమయం ప్రకారం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ కిరణ్‌లలిత, బాలాజీనగర్, యూపీహెచ్‌సీ వైద్యురాలు

పిలకమెట్ట.. ఆక్రమణల చిట్టా

రూ.5కోట్ల విలువ ఉంటుందని అంచనా

సబ్బవరం, న్యూస్‌టుడే: నగర పరిధి 88వార్డు వెదుళ్లనరవ గ్రామ రెవెన్యూ సర్వేనెం.101లో 96 సెంట్ల పిలక మెట్ట స్థలంపై కొందరు వ్యక్తులు కన్నేశారు. గుట్టు చప్పుడు కాకుండా మెట్టపై ఉన్న రాళ్లను తొలగించి చదును చేయడం ప్రారంభించారు. ఇక్కడ సెంటు భూమి రూ.5 లక్షల నుంచి 6 లక్షల వరకు ఉంటుంది. చదును చేసిన మొత్తం భూమి రూ.5 కోట్లు నుంచి రూ.6 కోట్లు పలికే అవకాశం ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. ఇంతటి విలువైన స్థలాన్ని ఆక్రమిస్తున్నా రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఎస్.ఎఫ్.ఏలో కూడా పిలకమెట్ట ప్రభుత్వ బంజరు భూమిగానే ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణను అడ్డుకొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై సబ్బవరం తహసీల్దారు బి.చిన్ని కృష్ణను 'న్యూస్‌టుడే' వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

రాళ్లను తొలగించి చదును చేసిన పిలకమెట్ట స్థలం

EENADU e Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

FURNITURE & FURNISHING

GRAND LIVING PREMIUM FURNITURE MALL 5 FLOORS BIGGEST FURNITURE MALL SOFA EXCHANGE MELA MVS JEWEL PARK BUILDING, OPP ASILMETTA BUSSTOP, VIZAG ✆84532 89999 / 90527 51666

FINANCIAL SERVICES

We are doing all Loans Personal, Business, Home, Mortgage, Vehicle & Education Loans for all profiles with good service. 9393932337.

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలు లోపు ఫైనాన్స్ చేయబడును (సిబిల్ చూడబడదు). JK అసోసియేట్స్, ✆ 96665 47338.

REAL ESTATE

PLOT FOR SALE

MADHURAWADA

55000/- per sq. yd. 366 sq.yds. E/s corner. vuda plot. Lake view layout, Midhilapuri colony. Cont: 9059837191.

JOBS

Subhodayam!.. Great Job opportunity awaits you in a well established and reputed orgn. in Vizag with excellent income with good working environment. req. M/F candidates above 35 years. Cont: 8885435455.

ప్రముఖ కంపెనీలో ఫుల్/ పార్ట్ టైం చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F), Retd. పర్సన్స్, ఈవెంట్స్ కండక్ట్ చేయుటకు (F) కావలెను. జీతం+ ఇన్‌సెంటివ్స్. ✆ 9985209038.

ప్రముఖ స్వీట్స్ & బేకరీ గాజువాక మల్కాపురంలో పనిచేయుటకు సేల్స్‌మెన్స్ కావలెను. పురుషులు మాత్రమే. భోజనం మరియు వసతి సదుపాయం కలదు. ✆ 9866073366.

ప్రముఖ స్వీట్స్ & బేకరీ సంస్థ వైజాగ్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ మరియు హౌస్‌కీపింగ్ కావలెను. భోజనం సదుపాయం కలదు. ✆ 9948557714.

పెందుర్తిలో మహిళా శక్తి సదన్‌లో ఉండిపోయి పనిచేయుటకు సూపరింటెండెంట్ (F) కావలెను అర్హత Any P.G. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ✆ 7331124498.

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 9014651068, 7075633416.

HR ఫీల్డ్ ఆఫీసర్లు, సెక్యూరిటీ గార్డులు, టెలికాలర్స్, క్లీనింగ్, హౌస్ కీపింగ్ వారు కావలెను. 10th, డిగ్రీ. జీతం : 14-18K. RSR. Ct: 7702959468, 0891-3570630.

FACULTY/ TEACHERS

Wanted Teachers to Teach Biology and Social for Higher Classes. Sri Ramanjuan School, T.C. Palem, VSP-16. ✆ 8639890047.

DRIVERS

ఆరిలోవ ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు అంబులెన్సు డ్రైవర్ కావలెను. డ్యూటీ: 12 గం|| -జీతం: 21,000/-. ✆ 9505204279, 8247036280.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నేడు గుర్రమ్మపాలెంలో వ్యవసాయ మంత్రి పర్యటన

పెందుర్తి, న్యూస్‌టుడే: 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం పెందుర్తి మండలం గుర్రమ్మపాలెం గ్రామంలో పర్యటిస్తారని నియోజకవర్గ తెదేపా ఇంచార్జి గండి బాబ్జి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి గ్రామంలో ఇంటింటి ప్రచారంలో మంత్రి పాల్గొంటారని వివరించారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారని తెలియజేశారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మోతుగూడెంలో అఖండ-2 షూటింగ్!

మోతుగూడెం, న్యూస్‌టుడే: చింతూరు మండలం మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో అఖండ-2 సినిమా షూటింగ్ జరగనుంది. పలు సన్నివేశాలను ఈ నెల 22 నుంచి ఐదు రోజులపాటు ఇక్కడ చిత్రీకరించనున్నారు. ఇప్పటికే దర్శకుడు బోయపాటి శ్రీను, 30 మంది యూనిట్ బృందం మోతుగూడెం చేరుకుని రిసార్ట్స్‌లో ఉన్నారు. లొకేషన్ల ఎంపిక కోసం ఆదివారం పర్యాటక ప్రాంతాలను పరిశీలించారు. దారాలమ్మ పిక్నిక్ స్పాట్, పొల్లూరు జలపాతాలు మరి కొన్ని ప్రదేశాలను ఎంపిక చేసినట్లు సమాచారం. కథానాయకుడు నందమూరి బాలకృష్ణ రెండు రోజులు షూటింగ్‌లో పాల్గొననున్నారు. ఈ నెల 22న 150 మంది యూనిట్ సభ్యులు రానున్నారు.

మోతుగూడెంలోని ఓ రిసార్ట్‌లో దర్శకుడు బోయపాటి శ్రీను

ప్రమాదస్థలంలో డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు

భర్త కళ్లముందే భార్య మృతి

రోడ్డు దాటుతుండగా చిదిమేసిన లారీ

లంకెలపాలెం (పరవాడ) న్యూస్‌టుడే: జాతీయ రహదారి లంకెలపాలెం కూడలికి సమీపంలో ఆదివారం మధ్యాహ్నం రోడ్డు దాటుతున్న మహిళను లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లంకెలపాలెం శ్రీరంగనగర్‌కాలనీకి చెందిన దాసరి లక్ష్మణరావు, ఆదిలక్ష్మి(67) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కూర్మన్నపాలెంలో నివాసం ఉంటున్న పెద్ద కుమార్తె దగ్గరికి వెళ్లేందుకు ఆదివారం భార్యాభర్తలిద్దరు పయనమయ్యారు. లంకెలపాలెం కూడలి సమీపంలోని బస్టాప్ వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గాజువాక నుంచి అనకాపల్లి వెళుతున్న సిమెంట్ లారీ ఆదిలక్ష్మిని ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. భర్త లక్ష్మణరావు కొద్ది క్షణాల ముందే రోడ్డు దాటడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. కళ్లెదుటే భార్య మృతిచెందడంతో కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. డ్రైవరును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆదిలక్ష్మి (పాతచిత్రం)

చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెంలో మద్యానికి బానిసై ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇది. సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీకి చెందిన కొర్లపు లక్ష్మణరావు (55) మద్యానికి బానిసయ్యాడు. అలాగే ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో హౌసింగ్‌బోర్డు కాలనీ పాత లలిత ఆలయ ప్రాంతంలోని ఎంవీజీ నివాసంలో గది అద్దెకు తీసుకుని ఒంటరిగా నివసిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున సమీప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అతని భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గోడ కూలి ఇద్దరు కార్మికుల దుర్మరణం

సింధియా, న్యూస్‌టుడే : డాక్‌యార్డు సమీప ప్రైవేట్ గోదాముల వద్ద గోడ కూలి సివిల్ పనులు చేస్తున్న ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతి చెందిన ఘటనపై ఆదివారం మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాలు.. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన కార్మికులు ధర్మారావు(50), రామారావు(60) భవన నిర్మాణ పనికి వెళ్లారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో వారు పని చేస్తున్న ప్రదేశంలో అయిదున్నర అడుగుల ఎత్తులో ఉన్న గోడ ఒక్కసారిగా కూలిపోయి, వారిపై పడింది. తీవ్రంగా గాయపడిన బాధితుల్ని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఇద్దరూ చనిపోయారని పోలీసులు తెలిపారు. ధర్మారావు కుటుంబం ప్రకాశనగర్‌లో రామారావు కుటుంబం జనతాకాలనీలో నివాసం ఉంటున్నాయి. బాధిత కుటుంబీకులు రాత్రి 8 గంటలకు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. సీఐ గొలగాని అప్పారావు పర్యవేక్షణలో సిబ్బంది కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	95	85
లైవ్	117	105
డ్రెస్డ్	170	180
స్కిన్‌లెస్	193	190

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తి, న్యూస్‌టుడే
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 - **జూనియర్**
స్క్రీన్-2 - **మై బేబీ**

ఇంకుడు గుంతల నిర్వహణతో ప్రయోజనం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఇంకుడు గుంతల నిర్వహణతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, జీవీఎంసీ పరిధిలో సాధించిన ఫలితాలతో రూపొందించిన 'రెయిన్ హార్వెస్ట్ పిట్ గైడ్ బ్రోచర్'ను మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆదివారం 87వ వార్డు తిరుమలనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఉదయ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కేఎస్ఆర్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్టీల్‌క్లబ్ ఉత్సవాలు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కునగరంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న స్టీల్‌క్లబ్ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన క్లబ్ అధ్యక్షులు, ఉక్కు జీఎం(హెచ్ఆర్) ఇంఛార్జి ఎం.మధుసూదనరావు మాట్లాడారు. ఈ మేరకు ఐక్యంగా ఉత్సవాలను విజయవంతం చేసిన క్లబ్ సభ్యుల్ని అభినందించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆయా కళాకారుల్ని క్లబ్ నిర్వాహకులు సత్కరించారు. ఉక్కు జీఎం (యుటిలిటీస్) వి.చిట్టిబాబు, క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, సభ్యులు రవికుమార్, వేణుగోపాల్, నరసింహం, కృష్ణయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: 93వ వార్డు గౌతం నగర్‌లో రహదారులు అస్తవ్యస్తంగా ఉండటంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంది. - శ్రీనివాసరావు, గౌతం నగర్ ✓: రహదారులు మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపడతాం. - హేమవతి, జోనల్‌కమిషనరు, జోన్-8

సబ్బవరం న్యూస్‌టుడే: ?: సబ్బవరం మెయిన్ రోడ్డులో దీపాలు వెలగటం లేదు. రాత్రి వేళల్లో ప్రయాణం సాగించాలంటే భయమేస్తోంది. - కె.సూర్యానారాయణ సబ్బవరం. ✓: చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం - అశోక్ కుమార్ ఏఈ ఏపీడీసీఎల్ సబ్బవరం

?: సబ్బవరంలో కుక్కలు పెరిగిపోయాయి. రాత్రివేళ అడ్డగించి కాటేస్తున్నాయి. కుక్కలను పట్టి వాటి సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టాలి - వి.బంగారు కృష్ణ సబ్బవరం. ✓: కుక్కలను పట్టించే ఏర్పాటు చేస్తాం. సమస్యను పరిష్కరిస్తాం.
- వై రాజేశ్వరరావు కార్యదర్శి, సబ్బవరం.

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ విద్యుత్తు సబ్‌స్టేషన్ కూడలి వద్ద బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బస్‌లు వచ్చే వరకు దుకాణాల వద్ద ఎండలో వేచి ఉండాల్సి వస్తోంది. - నారాయణరావు, ప్రయాణికుడు. ✓: సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పరిష్కారానికి కృషి చేస్తాం - ధర్మారావు, ఈవోపీఆర్డీ, పరవాడ

కాలువ శుభ్రం చేయించారు

స్పందనకు వందనం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలం గుర్రమ్మపాలెం పంచాయతీ అక్కిరెడ్డిపాలెం గ్రామంలో కాలువలు పూడుకుపోయాయని స్థానికులు 'ఈనాడు మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు శనివారం 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి మండల డిప్యూటీ ఎంపీడీవో కామేశ్వరరావు స్పందించారు. సిబ్బందితో కాలువలు శుభ్రం చేయించి పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. దీనిపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

ఇళ్లు నిర్మించకుంటే పట్టా రద్దు

పేదల గృహనిర్మాణ పథకంపై కలెక్టర్ ఆదేశాలు
గ్రామసభల నిర్వహణకు అధికారుల సన్నాహాలు

పెందుర్తి, న్యూస్‌టుడే: గృహనిర్మాణ పథకంలో భాగంగా పేద, బలహీనవర్గాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయకుంటే పట్టాలు రద్దు చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు గ్రామ సభలు నిర్వహించి నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మూడు రోజుల క్రితం గృహనిర్మాణ పథకాల పురోగతిపై ఆయన సమీక్షించారు. నిర్మాణాలు పూర్తి చేయడంపై మండల స్థాయి అధికారులకు తగు సూచనలు చేశారు. దీంతో లబ్ధిదారుల్లో చలనం మొదలయ్యే అవకాశాలున్నాయి.

గుర్రమ్మపాలెం గృహనిర్మాణ లేఅవుట్‌లో అరకొరగా నిర్మాణాలు

కూటమి ప్రభుత్వం అదనంగా రూ.50వేలు మంజూరు

పెందుర్తి మండలంలోని తొమ్మిది గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న 15 గ్రామ పంచాయతీల్లో 1785 ఇళ్లను గత ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ నిర్మాణం చేపట్టేందుకు గత ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80లక్షల సొమ్ము ఎటూ సరిపోని నేపథ్యంలో చాలా మంది లబ్ధిదారులు అప్పట్లో ముందుకు రాలేదు. మొత్తం నిర్మాణాల్లో 936 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. చాలా ఇళ్లు పునాది స్థాయిలోనే ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గృహనిర్మాణ పథకంపై దృష్టి సారించింది. నిర్మాణాలు చేపట్టేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అదనంగా మరో రూ.50వేలు మంజూరు చేసింది.

ఆ పట్టాల రద్దుకు సన్నాహాలు

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయని లబ్ధిదారుల పట్టాలను రద్దు చేసేందుకు గృహనిర్మాణ శాఖ అధికారులు పూర్తి సన్నాహాలు చేస్తున్నారు. ముందుగా గ్రామసభలు ఏర్పాటు చేసి నిర్మాణాలు పూర్తి చేయాలని సూచిస్తారు. లబ్ధిదారులు స్పందించకపోతే పట్టాలు రద్దు చేస్తామని నోటీసులు పంపుతారు. దాన్ని కూడా బేఖాతరు చేస్తే పట్టా రద్దు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

పెందుర్తి మండలంలో ఇళ్ల నిర్మాణ పురోగతి ఇలా..

మొత్తం ఇళ్లు	1785
పూర్తయిన నిర్మాణాలు	936
ఇంకా ప్రారంభం కానివి	3
పునాది స్థాయికి దిగువన ఉన్నవి	215
పునాది దశలోనే ఉన్నవి	434

అవగాహన కల్పిస్తాం

ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని లబ్ధిదారుల్లో అవగాహన కల్పించి కలెక్టర్ ఆదేశాలను తెలియజేస్తాం. గృహనిర్మాణ పథకాల లే అవుట్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఇప్పటికే ఆదేశించారు. - నాగేశ్వరరావు, గృహనిర్మాణ శాఖ ఏఈ, పెందుర్తి.

'రెండు నెలల్లో వేపగుంట - పినగాడి రహదారి పూర్తి'

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

సీసీ రహదారుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ప్రజా ప్రతినిధులు

రాంపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: వేపగుంట - పినగాడి రహదారి రెండు నెలల్లో పూర్తవుతుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు హామీ ఇచ్చారు. పెందుర్తి మండలం రాంపురం గ్రామంలో రూ.2.25 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఆదివారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేపగుంట - పినగాడి రహదారి నిర్మాణానికి అనేక ఆటంకాలు ఎదురైనా ఎన్నో ప్రయత్నాలు చేసి ర.భ.శాఖ నుంచి ఎన్‌వోసీ తీసుకువచ్చినట్లు తెలిపారు. పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. రాంపురం గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైకాపా నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ముందుగా ఉపాధి హామీ నిధులతో చేపట్టిన రోడ్లు, కాలువలు, అంగన్‌వాడీ భవనాల ప్రారంభోత్సవం చేసిన అనంతరం జలజీవన్ మిషన్ ద్వారా నిర్మించనున్న నీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి, రాంపురం, సరిపల్లి ఎంపీటీసీ సభ్యులు గండి హిమబిందు, గొల్లవిల్లి రమణ, జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గంగునాయుడు, పెందుర్తి భాజపా కన్వీనర్ గొర్లె రామునాయుడు, పెందుర్తి ఎంపీడీవో గుండు అప్పలరాజు, డీఈ పీవీ.రమణమూర్తి, ఏఈ లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎంవీవీ సత్యనారాయణ, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

వెదుళ్లనరవలో ఇటీవల అక్రమంగా నిర్మించిన షెడ్డు

సబ్బవరం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్లనరవ రెవెన్యూ సర్వే నెం.99/18లో 1.53 ఎకరాల గెడ్డ వాగు భూమి ఉంది. మూడేళ్ల కిందట ఈ స్థలంలో ఓ వ్యక్తి వేసిన షెడ్డును సబ్బవరం రెవెన్యూ అధికారులు తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇప్పుడు అదే స్థలంలో మరో వ్యక్తి షెడ్డు నిర్మించారు. దీనిపై గ్రామస్థుడు ఉరుకూటి దుంబబాబు ప్రశ్నించగా...ఆక్రమణకు పాల్పడిన వ్యక్తి ఇతర మహిళలతో దాడి చేయించినట్లు బాధితుడు సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామచంద్రరావు తెలిపారు.

ఊరించి.. వెనక్కి వెళ్లిన మేఘాలు

వేపగుంటలో ఆదివారం సాయంత్రం మేఘావృతమైన ఆకాశం

వేపగుంట, న్యూస్‌టుడే : ఆదివారం ఉదయం నుంచి ఎండతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారి మేఘావృతమై కనిపించింది. దీంతో వాతావరణం కాస్త చల్లబడినప్పటికీ వర్షం పడకుండా మేఘాలు వెనక్కి మరలిపోవడంతో వేపగుంట వాసులు నిరాశకు గురయ్యారు. రాత్రిసరికి కొద్దిపాటి చిరుజల్లులు పడటంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఇళ్ల మేడలపై నుంచి పలువురు తిలకించారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కరపత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు

లంకెలపాలెం (పరవాడ) న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. వార్డు పరిధి లంకెలపాలెం బీసీ కాలనీలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాదికాలంగా చేస్తున్న సంక్షేమం, అభివృద్ధితో పాటు భవిష్యత్తులో అమలుచేయబోయే పథకాల గురించి వివరించి కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అర్జున్, రామారావు, మూర్తి, చిన్నారావు, అప్పారావు, నూకరాజు, సూరిబాబు పాల్గొన్నారు

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా

రహదారిపై వృథాగా పోతున్న నీరు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల పరిషత్ కూడలికి సమీపంలోని ఏపీఐఐసీకి చెందిన పైపులైన్ దెబ్బతిని తాగునీరు వృథాగా పోయింది. పరవాడ ఫార్మాసిటీలోని ఏపీఐఐసీకి చెందిన పంపుహౌస్ నుంచి అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో ఉన్న పరిశ్రమలకు భూగర్భం ద్వారా తాగు నీటిని సరఫరా అందించేందుకు దశాబ్దాల క్రితం పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. గత కొంత కాలంగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. వెంటనే పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు

ప్రారంభించి పక్కన పెట్టేశారు..

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ సంతబయలువద్ద నూతనంగా నిర్మించిన సచివాలయం-1 భవనం నిరుపయోగంగా మూతపడి ఉంది. సుమారు రూ.35 లక్షల వ్యయంతో గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టారు. భవన నిర్మాణ పనులు అన్ని హంగులతో పూర్తిచేసి 2024 సార్వత్రిక ఎన్నికలకు కొద్దిరోజుల ముందు అప్పటి ప్రజాప్రతినిధులు హడావుడిగా ప్రారంభించేశారు. అప్పటి నుంచి ఏడాదిన్నరగా భవనం మూతపడి ఉంది. ఈ భవనం పూర్తి స్థాయి సేవలు అందించడానికి సరిపోకపోవడంతో నేటికీ పాత పంచాయతీ భవనంలోనే సచివాలయ సేవలను అందిస్తున్నారు. ఇప్పటికైనా భవనాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా ఉన్న పరవాడ సచివాలయం-I భవనం

తొట్టెలు సరే.. నీరు మరి..?

ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కు శివారు కొండ ప్రాంతం వద్ద నిరుపయోగంగా తొట్టె

పరవాడ, న్యూస్‌టుడే: మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో నీటి తొట్టెలను నిర్మించారు. మేతకు వెళ్లిన పశువులకు నీటిని అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో రూ.30 వేలు ఖర్చు చేసి నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం ఈ.బోనంగి సాలిడ్ వేస్టుమెనేజ్‌మెంట్ ప్లాంటు మార్గంలో, ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కు శివారు కొండప్రాంతం వద్ద నిర్మించిన రెండు నీటి తొట్టెలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. నీటిని నింపకపోవడంతో పశువులను మేతకు తీసుకువెళ్లే సమయంలో ఇబ్బంది పడుతున్నామని పాడి రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తొట్టెల్లో నీరు నింపేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా బీఆర్టీఎస్ డక్ట్‌లు

వేపగుంట, న్యూస్‌టుడే : బీఆర్టీఎస్ రహదారిలో వర్షపునీరు, మురుగునీరు ప్రవహించేందుకు ఏర్పాటుచేసిన డక్ట్‌లపై మూతలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. దీంతో మురుగునీరు బయటకు పొంగిపొర్లి రోడ్డుమీదకు వచ్చేస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పాదచారులు నడిచివెళ్లేటప్పుడు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సమస్య మరింత ఎక్కువగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాలని వాహనదారులు, స్థానికులు, కాలనీవాసులు కోరుతున్నారు ఈ విషయమై జెడ్సీ హేమవతిని వివరణ కోరగా.. డక్ట్‌ల విషయాన్ని ప్రాజెక్టు అధికారులకు తెలియజేసి మూతలు వేయించే ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఎల్జీ పాలిమర్స్ కూడలి వద్ద మురుగుతో నిండిన డక్ట్

మురుగుతో తప్పని ఇక్కట్లు

రహదారి మధ్యలో నిలిచిపోయిన మురుగు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్ పోర్టు కాలనీ వాసులకు భూగర్భ మురుగు నీటి వ్యవస్థతో కష్టాలు తప్పడం లేదు. సత్యానగర్ పార్కు సమీపంలోని హంస ఆర్కేడ్ బహుళ అంతస్తుల భవనం ఎదురుగా యూజీడీ పంపు నుంచి మురుగు గత కొన్ని రోజులుగా రహదారి మధ్యలో నిలిచిపోతోంది. దీనిని పట్టించుకునే వారే లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోయారు. నిత్యం దుర్వాసన వెదజల్లుతుందని అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

వీధిదీపాలు, తాగునీటి బోర్లు మంజూరు

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ 88వ వార్డుకి మూడవ విడతగా 50వీధి దీపాలు, 11 మంచినీటి బోర్లు మంజూరైనట్లు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు తెలిపారు. అవసరాన్ని గుర్తించి ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన మంచినీటి బోర్లను ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. దీనికి సహకరించిన ఎమ్మెల్యే పంచకర్ల, తెదేపా ఇన్‌ఛార్జి గండిబాబ్జీ, మేయర్ పీలా శ్రీనువాసరావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మంచినీటి బోరును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు

సీఎం సహాయ నిధి అందజేత

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం మల్లునాయుడుపాలెం, గ్రామానికి చెందిన రావిపల్లి పైడంనాయుడు అనారోగ్యంతో బాధ పడుతున్న విషయాన్ని తెలుసుకుని పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండిబాబ్జీ ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి రూ.2,01,607 మంజూరు చేయించారు. ఈ మేరకు మంజూరైన చెక్కును ఆదివారం బాధితుడికి అందించారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం మాజీ ఎంపీపీ, సబ్బవరం పీఏసీఎస్ ఛైర్మన్ గండి దేముడు, మండల తెదేపా అధ్యక్షుడు బలిరెడ్డి అప్పారావు, నాయకులు బలిరెడ్డి సూర్యప్రసాద్, అప్పారావు, బలిరెడ్డి రాము, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడుకి చెక్కును అందిస్తున్న పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, నాయకులు

అక్కిరెడ్డిపాలెంలో రక్తదాన శిబిరం

గుర్రమ్మపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలం గుర్రమ్మపాలెం పంచాయతీ పరిధిలోని అక్కిరెడ్డిపాలెంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. యువ ఫౌండేషన్, గ్రామ యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఎక్కువగా యువత పాల్గొని రక్తదానం చేశారు. ఈ మేరకు నగరానికి చెందిన ఫస్ట్ రక్తనిధి కేంద్రం ప్రతినిధులు మొత్తంగా 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో త్రివేణి ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ శంకర్, కొప్పిశెట్టి ప్రసాద్, గ్రామ యువత పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఔత్సాహికులు, నిర్వాహకులు

దుర్గమాంబ ఆలయంలో 25 నుంచి శ్రావణమాస పూజలు

శ్రీదుర్గమాంబ అమ్మవారు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం దుర్గమాంబ ఆలయంలో శ్రావణ మాసం పూజలు ఈ నెల 25నుంచి ఆగస్టు 23 వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఆయా తేదీల్లో జరగనున్న పూజలను వివరించారు. మొదటి శుక్రవారం 25న సామూహిక కుంకుమార్చనలు జరుగుతాయని తెలిపారు. ఆగస్టు 1న సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన గాజుల అలంకరణ ఉంటుందని తెలిపారు. 8న సాయంత్రం వరలక్ష్మీదేవి వ్రతం, కుంమార్చన, బంగారు వెండి పుష్పాలతో అమ్మవారికి పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 15న అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకాలు జరుగుతాయన్నారు. 22న అమ్మవారికి సారె ఊరేగింపు ఉంటుందన్నారు. కుంకుమార్చనలో పాల్గొనాలనుకునే భక్తులు ముందుగా ఆలయ కమిటీ వారిని సంప్రదించి గోత్రనామాలతో పేర్లు రాయించుకోవాలని సూచించారు.

శివాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న సోమునాయుడు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం శివాలయానికి మండలంలోని తవ్వవానిపాలేనికి చెందిన బోకం శ్రీనివాస్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈమేరకు ఆతని సోదరుడు సోమునాయుడు చేతులమీదుగా ఆదివారం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దంగేటి నాగేశ్వరావు, గెడ్డం కృష్ణ, బర్ల రమణ, కోరాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం

వేపగుంట, న్యూస్‌టుడే: అలమేలు మంగాదేవి, పద్మావతి సమేత శ్రీనివాసకల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలగాణ్య బ్రాహ్మణ అభ్యుదయ సమాజం 52వ వసంతాల స్వర్ణోత్సవం సందర్భంగా వేపగుంట-పినగాడి రహదారిలో చీమలాపల్లి సమీప మీనాక్షీ కన్వెన్షన్ సెంటర్‌లో కల్యాణోత్సవం జరిపారు. ఉదయం సుప్రభాతసేవతో వేడుక ప్రారంభమైంది. అనంతరం తోమాలసేవ, విశేష అలంకరణ, నీరాజన మంత్ర పుష్పములు, మహానివేదన, ప్రసాద వితరణ జరిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సైబర్ నేరాలపై నియంత్రణపై అవగాహన

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: సాంకేతికత అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతమవుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ సూచించారు. 97వ వార్డు చినముషిడివాడ పాత గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సైబర్ నేర అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గుర్తు తెలియని నంబర్లతో వచ్చే ఫోన్లకు, అనుమానాస్పద ఎస్ఎంఎస్‌లకు, వాట్సాప్ సందేశాలకు స్పందించడం, ఇతరులకు సమాచారం పంపడం వంటివి చేయవద్దని సూచించారు. పిల్లలకు స్మార్ట్ ఫోన్లు అవసరం మేరకే ఇవ్వాలని తెలిపారు.

అవగాహన సదస్సులో పాల్గొన్న సీఐ సతీశ్‌కుమార్, స్థానిక మహిళలు

సమస్యల పరిష్కారానికి కృషి

వేపగుంట, న్యూస్‌టుడే: బాలాజీగార్డెన్ కాలనీలో కార్పొరేటరు రాపర్తి కన్నా ఆదివారం పర్యటించారు. స్థానిక అపార్ట్‌మెంట్ వాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కాలనీ వాసులు మురుగు సమస్య ప్రధానంగా ఉందని, కొన్నిచోట్ల వీధిదీపాలు వెలగడంలేదని ఆయనకు వివరించారు. అంచెలంచెలుగా ప్రతీ సమస్యను పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

బాలాజీగార్డెన్ కాలనీవాసులతో చర్చిస్తున్న కార్పొరేటర్ రాపర్తికన్నా

నిర్వహణ లేక.. వీధి దీపాలు వెలగక..

అంధకారంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

పట్టించుకోని అధికారులు

వెలగని వీధిదీపం

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డుపరిధి దేశపాత్రునిపాలెంలో వీధి దీపాల నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో సంభాలు ఉన్నా వీధి దీపాలు అమర్చకపోవడం, కొన్నిచోట్ల దీపాలు ఉన్నా మరమ్మతులకు గురై మూలకు చేరడంతో రాత్రి వేళల్లో చీకటి అలుముకుంటోంది. దీంతో నిత్యం వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు నానా యాతన పడాల్సి వస్తోంది.

ఇదీ పరిస్థితి..:

★ నిత్యం వాహనదారులు, పాదచారులతో రద్దీగా ఉండే జాజులవాని పాలెం నుంచి దేశపాత్రునిపాలెం వరకు గల మెయిన్‌రోడ్డు వెంబడి పలు చోట్ల వీధి దీపాలు కొంతకాలంగా వెలగడం లేదు. అదే మార్గంలో కొన్ని స్తంభాలకు దీపాలు అమర్చకుండా నిరుపయోగంగా వదిలేశారు. ప్రస్తుతం వర్షాల కారణంగా మరికొన్ని చోట్ల దీపాలు వెలుగుతూ, ఆరిపోతూ ఉన్నాయి.
★ బస్టాపు వద్ద సాయంత్రమైతే వెలుగులు లేకపోవడంతో సమీపంలో పనులు చేసుకునే వారు ఇబ్బంది పడుతున్నారు.
★ ఆశిస్ ఎస్టేట్స్‌కు వెళ్లేమార్గంలో అంధకారంతో బయటకు వెళ్లాలంటే భయపడాల్సి వస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు. కుక్కల బెడదతో పాటు విష పురుగులు రహదారిపైకి వస్తున్నా కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన చెందుతున్నారు.

ఆశిష్ ఎస్టేట్స్‌కు వెళ్లే దారిలో అంధకారం

సమస్య పరిష్కరిస్తాం..

వర్షాకాలంలో విద్యుత్తు సమస్యలు తలెత్తుతాయి. ఎక్కడ వీధి దీపాలు వెలగకపోయినా విద్యుత్తు సిబ్బందితో మాట్లాడి ప్రజలు ఇబ్బంది పడకుండా మరమ్మతులు చేయిస్తున్నాం. నిరుపయోగంగా ఉన్న స్తంభాలకు దీపాలను అమర్చి వెలిగే విధంగా చర్యలు చేపడతాం.
- వార్డు కార్పొరేటర్, రౌతు శ్రీనివాసరావు

ఆంజనేయస్వామి ఆలయానికి తుది మెరుగులు

పరవాడ, న్యూస్‌టుడే: మండలకేంద్రం పరవాడ సంతబయలు వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయం అన్ని హంగులతో రూపుదిద్దుకుంటోంది. దశాబ్దాల క్రితం నిర్మించిన స్వామివారి ఆలయం శిథిలావస్థకు చేరడంతో దాన్ని తొలగించి ఆ స్థానంలో దాతల సహకారంతో గ్రామస్థులు నూతన ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. దాదాపు పనులు పూర్తికావడంతో రంగులు వేస్తున్నారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తిచేయించి ఆలయ ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నట్లు సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు తెలిపారు.

శ్రద్ధాంజలి

శ్రీ జి. జగన్నాథ రావు
President
Port Employees Union
Visakhapatnam

విశాఖపట్నం పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు **శ్రీ గాజుల జగన్నాథ రావు** గారు తే॥ 19-07-2025 ది రాత్రి స్వర్గస్థులయ్యారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం ప్రసాధించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ H.M.S.

(c) eenadu

సి ని మా లు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ : కొత్తపల్లిలో ఒకప్పుడు
రాములమ్మ : వర్జిన్ బోయ్స్
తాతా : మై బేబీ
సప్తగిరి: జూనియర్

భీమిలి ఎంఈవో-2గా శ్రీనివాసరావు

బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి మండలం ఎంఈవో-2గా డొకర శ్రీనివాసరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఇక్కడ ఎంఈవోగా పని చేస్తున్న ఎ.జయప్రద సెలవుల్లో ఉండటంతో తాటితూరు జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న శ్రీనివాసరావును నియమించారు.

భీమిలి

ఇంకుడు గుంతల నిర్వహణతో మేలు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఇంకుడు గుంతల నిర్వహణతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, జీవీఎంసీ పరిధిలో సాధించిన ఫలితాలతో రూపొందించిన 'రెయిన్ హార్వెస్ట్ పిట్ గైడ్ బ్రోచర్'ను మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆదివారం 87వ వార్డు తిరుమలనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఉదయ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కేఎస్ఆర్.మూర్తి, కార్యదర్శి దుర్గాప్రసాద్, తిరుమలనగర్ సంఘం ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందం తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: వరహాగిరినగర్(ఎండాడ)లో విద్యుద్దీపాలు వెలగక అంధకారం నెలకొంటోంది. - నర్సింగ్, వరహాగిరి నగర్, ✓విద్యుద్దీపాలకు మరమ్మతులు చేపడతాం. - గాయత్రీ, విద్యుత్ ఏఈ

?: మిథిలాపురి వుడాకాలనీ (మధురవాడ) ప్రధాన దారిలో విద్యుద్దీపాలు వెలగక ప్రమాదాలు జరుగుతున్నాయి. - కాలనీవాసులు

✓ విద్యుద్దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - గాయత్రీ, విద్యుత్ ఏఈ

?: ఎన్జీఓఎస్ లేఅవుట్(మధురవాడ)లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. - రమేష్, స్థానికుడు, ✓ వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. - కిశోర్, ఆరోగ్య అధికారి

?: శాంతినికేతన్ లేఅవుట్ (సాగర్‌నగర్) ప్రధాన దారిలో ఇంటి నిర్మాణ సామగ్రి వేస్తున్నారు. - లేఅవుట్ వాసులు

✓పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - కనకమహాలక్ష్మి, జోన్-2 కమిషనర్

ఇనుప గ్రిల్స్ ఏర్పాటు

కొమ్మాది, న్యూస్‌టుడే: కొమ్మాది కూడలి వద్ద ఇటీవల ఓ భారీ వాహనం ఇనుపగ్రిల్స్‌ను ఢీ కొట్టడంతో సగభాగం వరకు విరిగిపోయాయి. అనంతరం వాటిని ఏర్పాటు చేయకపోవడంతో పలువురు పాదాచారులు ప్రమాదాలబారిన పడ్డారు. దీంతో 'ఈనాడు'లో ప్రచురించిన 'రక్షణ కంచె ఏదీ?' కథనానికి జీవీఎంసీ యంత్రాంగం స్పందించింది. జెడ్పీ కె.కనకమహాలక్ష్మి ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ అధికారులు రక్షణ కంచెగా ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు.

స్పందనకు వందనం

ప్రమాదాలు జరగకుండా ఏర్పాటుచేసిన ఇనుపగ్రిల్స్

చేయి తడిపితే సక్రమం.. లేకుంటే అక్రమం!

పద్మనాభం, న్యూస్‌టుడే

విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా పద్మనాభం మండల రెవెన్యూ సిబ్బంది చోద్యం చూస్తోంది. ఆక్రమణలను అరికట్టాల్సి ఉన్నా కొందరు సిబ్బంది అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారు. చేయి తడిపితే సక్రమమని, లేకుంటే అక్రమం అనేలా వారు తీరు ఉండటంతో స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

★ మండల కాంప్లెక్స్‌ను ఆనుకొని ఉన్న కృష్ణాపురం సర్వే సంఖ్య 1లో తహసీల్దార్ కార్యాలయం ఎదుటే భూములను చదును చేసి ఫెన్సింగ్ వేశారు. అయినా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోలేదు. తీరుబడిగా ఇప్పుడు ఫెన్సింగ్ స్తంభాలు వేశాక ఆక్రమణలు తొలగించి హెచ్చరిక బోర్డులు పెడుతున్నారు. ఈ స్థలం ఆడ కొండలను ఆనుకొని ఉంటుంది. పై నుంచి వచ్చే వర్షపు నీరు, ఊట నీరు పోవడానికి గతంలో గెడ్డలు ఉండేవి. కొంత మంది వ్యక్తులు ఈ గెడ్డలను పూడ్చేసి ఆక్రమణకు పాల్పడ్డారు. ప్రభుత్వ భూమి అయినప్పటికీ ఈ ప్రాంతంలో క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ వ్యవహారం అంతా తహసీల్దార్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో జరగడం గమనార్హం.

రెవెన్యూ సిబ్బంది పెట్టిన హెచ్చరిక బోర్డు

★ తొలి నుంచి విమర్శలే: స్థానిక భూములపై ఇప్పటికే అనేక వివాదాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో విషయం రెవెన్యూ సిబ్బందికి చేరవేసి హెచ్చరిక బోర్డు పెట్టించడం, ఇంతలో నాయకుల సిఫార్సులతో కొంతకాలానికి బోర్డు మాయం చేయడం ఇక్కడ సర్వసాధారణం. ఇప్పటికే ఒక్కో స్థలం అయిదారు చేతులు మారాయంటే అమ్మకాలు ఎంత జోరుగా సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడి స్థలాలు తక్కువ ధరకు వస్తున్నాయనో లేక మండల కేంద్రానికి దగ్గరలో ఉందనో చాలా మంది కొనేస్తున్నారు. తీరా అవి ప్రభుత్వం భూములని తెలిసి రెవెన్యూ సిబ్బంది బోర్డులు పెట్టడంతో లబోదిబోమంటున్నారు. ఇందుకు కొందరు దిగువ స్థాయి రెవెన్యూ సిబ్బంది సైతం తోడ్పాటు అందించడంతో చాలా మంది అమాయకులు బలైపోతున్నారు.

★ ఈ విషయమై తహసీల్దార్ కె.ఆనందరావును వివరణ కోరగా కృష్ణాపురం సర్వే నెం.1లో ఉన్నవి ప్రభుత్వ భూములు కావడంతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ భూమి, డీ-పారం భూములు అమ్మడం, కొనడం రెండూ నేరమే. దళారుల మాయలో పడి ఎవరూ మోసపోవద్దని సూచించారు.

తొలగించిన ఫెన్సింగ్

ఎమ్మెల్యే క్షేత్రస్థాయి పర్యటన

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు గ్రామ సమస్యలు వివరిస్తున్న ప్రజలు

ఆనందపురం, న్యూస్‌టుడే: ప్రజా మద్దతుతో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సాగిందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రామవరం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. తొలి ఏడాదిలోనే తల్లికివందనం, మూడు గ్యాస్ సిలిండర్లు, ఎన్టీఆర్ భరోసా పింఛను, సంక్రాంతి పండుగ పేరిట రోడ్లు, మురుగునీటి కాలువలు వేయడం, మెగా డీఎస్సీ నిర్వహణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు అగరపు గంగరాజు, మండల తెదేపా అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు, బీఆర్‌బీ.నాయుడు, అగరపు దేముడు, తహసీల్దార్ శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం దాతలకు సత్కారం

దాతలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ బృందం

కొమ్మాది, న్యూస్‌టుడే: చంద్రంపాలెం జాతరగట్టుపై వెలిసిన శ్రీదుర్గాలమ్మ ఆలయ ప్రాంగణంలో నాలుగు నెలలు పాటు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం ఆదివారంతో ముగిసింది. పీఎంపాలెం పద్మశాలి ఆత్మీయ సేవా సంఘం, చంద్రంపాలెం గ్రామ పెద్దలు, దాతల సహకారంతో గత కొన్నేళ్లుగా దాహార్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నామని ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు తెలిపారు. అనంతరం ముగింపు రోజు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన బి.సుధీర్‌కుమార్, స్వప్న దంపతులతో పాటు దాతలను సత్కరించారు. పద్మశాలి ఆత్మీయ సేవా సంఘం అధ్యక్షులు కే.వి.నాగేశ్వరరావు, ఆలయ కమిటీ కార్యదర్శి నాగోతి తాతారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, దుక్కవరం, పీస రామారావు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడ్ని రక్షించిన లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్‌లో ఆదివారం సముద్రస్నానం చేస్తుండగా మునిగిపోతున్న ఓ యువకుడిని టూరిజం, జీవీఎంసీ లైఫ్‌గార్డులు రక్షించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన ఇంజినీరింగ్ విద్య పూర్తి చేసుకున్న అయిదుగురు విద్యార్థులు హెచ్‌పీసీఎల్ సంస్థలో శిక్షణ నిమిత్తం విశాఖ నగరానికి విచ్చేశారు. ఈ క్రమంలో ఇక్కడ బీచ్‌కు వచ్చిన వీరు స్నానం చేస్తుండగా అభిషేక్‌కుమార్ (21) అలల్లో చిక్కుకున్న విషయాన్ని గార్డులు గమనించారు. దీంతో హుటాహుటిన సముద్రంలోకి వెళ్లి సకాలంలో ఒడ్డుకు చేర్చడంతో ప్రాణాపాయం తప్పింది. మెరైన్ పోలీసుస్టేషన్ ఏఎస్సై జె.శ్రీనివాసరావు సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి పంపించేశారు.

కాపాడిన యువకుడితో గార్డులు

నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

అలరించిన నృత్య ప్రదర్శన

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామం (జాతర) కళావేదికపై ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నగరానికి చెందిన శ్యామల డాన్స్ అకాడమీ చిన్నారులు ప్రశాంతి, చాందిని, హారిక, రక్షిత, తులసి, దేవిప్రసన్న, హరిణి, అమృతలు వారి హావభావాలతో నర్తించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ నృత్యాలకు శ్యామల దర్శకత్వం వహించగా స్థానిక పరిపాలనాధికారి రమేష్‌రెడ్డి చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు.

స.హ. చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం

పద్మనాభం, న్యూస్‌టుడే: సమాచార హక్కు (స.హ) చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం వంటిదని సమాచార హక్కు కార్యకర్తల సంఘం విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు కిలపర్తి తిరుపతిరావు అన్నారు. పద్మనాభంలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పద్మనాభం మండలం కొత్త కొవ్వాడ గ్రామానికి చెందిన ఆయన ఈ నెల 14న జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 500 దరఖాస్తులు చేసి వివిధ శాఖల నుంచి సమాచారం పొందినట్లు పేర్కొన్నారు. ఈ నెల 26న కంచరపాలెంలోని చాణక్య డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. స.హ చట్టానికి సంబంధించి ఏ విధమైన ఇబ్బందులున్నా 94918 93115 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మాట్లాడుతున్న కిలపర్తి తిరుపతిరావు

జ్యూట్‌మిల్లు కార్మిక ఐకాస సమావేశం

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: చిట్టివలస జ్యూటుమిల్లు ఐక్య కార్యాచరణ సమితి సమావేశం ఆదివారం ఇంటక్ జాతీయ కార్యదర్శి కాకర్లపూడి వరహాలరాజు అధ్యక్షతన చిట్టివలసలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో మిల్లు యాజమానితో కార్మిక సంఘాలు కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఇంకా బకాయిలు అందని కార్మికుల నుంచి దరఖాస్తులను స్వీకరించామన్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి ఆదివారం వరకు 917 దరఖాస్తుల్లో 520 దరఖాస్తులను పీఎఫ్ కార్యాలయానికి అందించి కార్మికులకు చెల్లించాల్సిన పరిహారంపై నాలుగు రోజుల్లో స్పష్టత ఇవ్వనున్నామన్నారు. కార్మిక సంఘాల నాయకులు జీరు వెంకటరెడ్డి, చిల్ల వెంకటరావు (ఇంటక్), దల్లి అప్పలరెడ్డి, మునకాల ఆదినారాయణ (కాంగ్రెస్ కార్మిక సంఘం), కొండపు ఈశ్వరరావు, చిల్ల రాంపైడి (ఏఐటీయూసీ), మామిడి గురువులు, బొర రామారావు, సాడి అచ్చారావు (టీఎన్‌టీయూసీ) పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇంటక్ జాతీయ కార్యదర్శి కాకర్లపూడి వరహాలరాజు

జూదరుల అరెస్టు

సంగివలస (తగరపువలస), న్యూస్‌టుడే: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ యాతపేటలోని నిర్మానుష్య ప్రాంతంలో జూదమాడుతున్న ఎనిమిది మంది వ్యక్తులను టాస్క్‌ఫోర్సు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.50 వేలు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. వీరిని భీమిలి పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ భరత్ కుమార్‌రాజు చెప్పారు.

సింహగిరిపై రేపు పాదాలమ్మ పండగ

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరి గ్రామదేవతలు శ్రీఉమామహేశ్వరీ పాదాలమ్మ, బంగారమ్మ అమ్మవార్ల పండగ మంగళవారం సంప్రదాయబద్ధంగా జరుగుతుందని సింహాచలం దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. సోమవారం రాత్రి 9 నుంచి అమ్మవారి తొలేళ్ల వేడుక జరుగుతుందన్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారి అనుపు మహోత్సవం నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత భక్తులకు అప్పన్న స్వామి దర్శనం లభించదని తెలియజేశారు. తిరిగి 23న ఉదయం 6.30 గంటల నుంచి యథావిధిగా దర్శనాలు లభిస్తాయని వివరించారు.

■ 34 కిలోల గంజాయి పట్టివేత

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం - పెందుర్తి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులోని సత్తరువు కూడలిలో ఆదివారం ఆనందపురం పోలీసులు 34 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలిలా.. సత్తరువు కూడలిలో ఆదివారం ఉదయం పోలీసులను చూసి కంగారు పడిన ఇద్దరు వ్యక్తులను విచారించి వారి వద్ద ఉన్న బ్యాగులు తనిఖీ చేయగా అందులో 34 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. పార్వతీపురం మన్యం జిల్లా పిన్నింటి రామునాయుడు గ్రామానికి చెందిన మరిపి గోవిందరావు (గౌతమ్), ఒడిశా చెందిన 16 ఏళ్ల బాలుడిని నిందితులుగా గుర్తించారు. వీరిపై ఆనందపురం సీఐ వాసునాయుడు కేసు నమోదు చేసి భీమిలి న్యాయస్థానంలో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

■ కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

కె.నగరపాలెం (గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: భీమిలోడ్డులోని పెద మంగమారిపేట వద్ద సైకిల్‌పై వెళుతున్న చంద్రమౌళి కామేశ్ (15) అనే విద్యార్థిని ఆదివారం సాయంత్రం కారు ఢీకొంది. దీంతో బాలుడికి తీవ్రగాయాలు కావడంతో పాటు సైకిల్ నుజ్జు అయింది. క్షతగాత్రుడ్ని స్థానికులు సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా వెళ్లిపోయినట్లు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. విద్యార్థి తండ్రి సతీశ్‌శర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చేపలతిమ్మాపురం (గ్రామీణభీమిలి): బీచ్‌రోడ్డులోని తొట్లకొండ వద్ద ఆదివారం సాయంత్రం కారు ఢీకొని అభిషేక్ (25) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు చెప్పారు. భీమిలి వైపు నుంచి విశాఖకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎండాడకు చెందిన ఈయన గీతంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. క్షతగాత్రున్ని ఓ ఆసుపత్రికి తరలించారు.

■ తీరానికి చేరిన మృత తాబేలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ బీచ్ ప్రాంత సముద్రంలో నుంచి తీరానికి ఆదివారం ఓ పెద్ద మృత తాబేలు చేరింది. సాగర జలాల్లో చాలా లోపల మనుగడ సాగించే ఇవి ఆహార అన్వేషణలో భాగంగా ముందుకొచ్చే సందర్భాల్లో ఇలా మృత్యువాత పడతాయని మత్స్యకారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో మర పడవల ఇంజిన్ల చక్రాలు తగలడం లేదా వలలకు చిక్కిన సందర్భాల్లో భయాందోళనకు గురైన నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. సముద్రంలో పర్యావరణ పరిరక్షణ దిశగా మనుగడ సాగించే ఇవి ఇలా విగతజీవులుగా చేరుతుండటంతో ప్రకృతి ప్రేమికులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

■ గ్యాస్ కట్టర్ పేలి వ్యక్తి మృతి

దాకమర్రి (తగరపువలస): తగరపువలస-విజయనగరం రోడ్డులోని భీమిలి మండలం దాకమర్రి వద్దనున్న ఎవరెస్ట్ ప్లైవుడ్ కంపెనీలో గ్యాస్ కట్టర్ పేలి ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్‌లోని చికార్ జిల్లాకు చెందిన మూలా రామ్‌జిత్ (40) స్థానిక ప్లైవుడ్ కంపెనీలోని మెయింటెనెన్స్ విభాగంలో అసిస్టెంట్ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గ్యాస్‌కట్టర్ పేలడంతో ఆయన మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించి పంచనామా చేశారు. సంస్థ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తిరుమలరావు తెలిపారు.

పుష్కరిణి చెరువు గట్లపై అపరిశుభ్రత

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: అడివివరం గ్రామంలోని అప్పన్న స్వామి వరాహ పుష్కరిణి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. చెరువు గట్లపై పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయాయి. భక్తులు పుణ్యస్నానాలు చేసి విడిచిపెట్టిన దుస్తులు, ఇతర వ్యర్థాలు పోగుపడ్డాయి. పవిత్రమైన పుష్కరిణి పరిశుభ్రతపై దేవస్థానం శ్రద్ధ వహించడం లేదని భాజపా నాయకులు ఆరోపించారు. ఆదివారం పుష్కరిణి ప్రాంతాన్ని పరిశీలించారు. తక్షణమే పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెద్ద ఎత్తున పోగుపడిన దుస్తులు, ఇతర వ్యర్థాలు

స్టడీ మెటీరియల్ అందజేత

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: (హింద్) ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జాతీయ ఉపకార వేతన పరీక్షకు శిక్షణ పొందుతున్న 150 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఆదివారం అందించారు. శ్రీను అనే దాత రూ.30 వేలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ సామగ్రిని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పొట్నూరు మురళీమోహనరావు చేతులమీదుగా నిర్వాహకులు విద్యార్థులకు అందజేశారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, కృష్ణా ప్రభుత్వ కళాశాల సూపరింటెండెంట్ అప్పారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న నిర్వాహకులు

అప్పన్న సన్నిధిలో నాగఫణిశర్మ

సింహాచలం, న్యూస్‌టుడే: ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, పద్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ సతీసమేతంగా ఆదివారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు స్వామి వారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు.

కప్పస్తంభం వద్ద మొక్కుతున్న నాగఫణిశర్మ దంపతులు

సాగర్‌నగర్ సమీప తీరంలో ఆదివారం మత్స్యకారుల వలకు చేపలతో పాటు పలు జెల్లీఫిష్‌లు పడ్డాయి. అందులోని జెల్లీ ఫిష్‌లు వివిధ ఆకృతుల్లో ఉండటంతో సందర్శకులు ఆసక్తిగా గమనించారు. వాటి వల్ల ప్రయోజనం లేకపోవడంతో తిరిగి సాగరజలాల్లోకి విడిచిపెట్టారు. - న్యూస్‌టుడే, సాగర్‌నగర్

'వాలంటీర్లపై వదిలేయడంతోనే ఓడిపోయాం'

తగరపువలస, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో ప్రజల బాగోగులను వాలంటీర్లపై వదిలేయడంతోనే పార్టీకి ప్రజలకు మధ్య దూరం పెరిగి ఓటమికి దారి తీసిందని విజయనగరం జడ్పీ ఛైర్మన్, వైకాపా భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం మజ్జివలసలో ఆదివారం జరిగిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. పార్టీ నాయకులు దాట్ల పెదబాబు, వాసురాజు, బంగారునాయుడు, యలమంచిలి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంత పరిశుభ్రతకు కృషి

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సముద్ర జలాలు కలుషితం కాకుండా తీర ప్రాంత పరిశుభ్రత విషయంలో అంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచిస్తూ వైజాగ్ వాలంటీర్ల ఆధ్వర్యంలో ఆదివారం సాగర్‌నగర్, జూపార్కు బీచ్‌ల పరిసరాల్లో శుభ్రత చర్యలు చేపట్టారు.

పచ్చదనం పెంపుదలకు చర్యలు

భీమునిపట్నం: పర్యావరణాన్ని పెంపొందించడంలో భాగంగా భీమిలి కేజీబీవీ ప్రాంగణంలో విద్యార్థినులు విశాఖ పోర్టుట్రస్ట్ అందించిన మొక్కలను ఆదివారం నాటారు. గ్రీన్ క్లైమేట్ సంస్థ కార్యదర్శి జె.వి.రత్నం పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరానికి స్పందన

పరీక్షలు చేస్తున్న వైద్యులు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలికి చెందిన కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 88 మందికి పరీక్షలు చేశారు. హోమియో వైద్యులు టి.జె.మోహనరావు, టి.జగన్నాథరావు ఆధ్వర్యంలో మందులను అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కె.శ్రీరామచంద్రమూర్తి, కె.సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

చిట్టివలస అపార్టుమెంట్లలో సమస్యల తిష్ట

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

జీవీఎంసీ ఒకటో వార్డు పరిధి చిట్టివలసలోని పలు అపార్టుమెంట్లకు సదుపాయాలు లేక నివాసితులు అవస్థలు పడుతున్నారు. చిట్టివలస చెరువు, పెరికివీధి, వెలంపేట, సంతపేట అంబేడ్కర్ పాఠశాల, శ్రీనివాస కల్యాణమండపం, జ్యూటుమిల్లు, సప్తగిరి కూడలి ప్రాంతాల్లో దాదాపు పాతిక నుంచి ముప్పై వరకూ బహుళ అంతస్తుల భవనాలున్నాయి. బాలాజీ, ఆర్ఆర్, కమల్ ప్రకాశ్, శ్రీ రెసిడెన్సీలు, ఎస్ఎం లేక్, జీవీఎస్ లేక్ వ్యూ, సురేఖ, ఎస్ఎం ఎన్‌క్లేవ్, సిరి సౌధ, శ్రీహర్షిత నివాస్, కేకేఎస్ సాయిసుధా, శుభం-1, 3, 7, తదితర అపార్టుమెంట్లలో దాదాపు అయిదు వందలకు పైగా కుటుంబాలు నివాసముంటున్నాయి.

★ కానరాని కాలువలు: కనీస సదుపాయాలు ఈ అపార్టుమెంట్లకు లేకపోవడంతో నివాసితులు ఇబ్బందులకు గురవుతున్నారు. కాలువలు, అవుట్‌లెట్‌లు లేక వాడుక నీరంతా నివాసాల ముందు లేదా ఖాళీగా ఉన్న స్థలాల్లో నిలిచిపోతోంది. దీంతో దుర్వాసన రావడంతో పాటు ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాలకు కారణమవుతున్నాయి. రోడ్లు కూడా సరిగా లేవు. కొన్నిచోట్ల ఇటీవల సీసీ రోడ్లు వేసినా మరికొన్ని చోట్ల రాళ్లు తేలుతూ అధ్వానంగా ఉన్నాయి. వీధి దీపాలు కొన్ని వెలగడం లేదని, జీవీఎంసీ కొళాయి నీరు అపార్టుమెంట్లకు అందడం లేదని కొందరు నివాసితులు వాపోతున్నారు. కాలనీల్లో పిచ్చి తుప్పలు, ముళ్లకంచెలు, చెత్త, చెదారం, మురుగు ఉంటోందని ఆవేదన చెందుతున్నారు.

పెరికివీధి సమీప బహుళ అంతస్తుల వద్ద నిలిచిన మురుగు

అపార్టుమెంట్లు	కుటుంబాలు	జనాభా
29	587	2451

సదుపాయాలు కల్పిస్తాం: అపార్టుమెంట్ల నివాసితులకు అన్ని మౌలిక వసతులు కల్పిస్తాం. ఇటీవల కొన్నింటికి రోడ్లు వేశాం. కాలువలు, అవుట్‌లెట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం. ఎలాంటి సమస్యలున్నా దశలవారీగా పరిష్కరిస్తాం. - సురేశ్ (జోన్-1 ఇంజినీరింగ్ అధికారి)

పీహెచ్‌సీ సిబ్బందికి తాఖీదులు..!

మధురవాడ, న్యూస్‌టుడే: మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో గడిచిన వారం రోజుల్లో వివిధ విభాగాల్లో పని చేస్తున్న నలుగురు ఉద్యోగులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జగదీశ్వరరావు మెమోలు జారీ చేసినట్లు తెలిసింది. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్న ఎల్‌టీ మణికంఠ, ఓటీ శ్రీను, అటెండర్ శ్రీనుతో పాటు ఎఫ్ఎన్ఓ శ్రావణిలను వివరణ కోరినట్లు సమాచారం. అలాగే ఇటీవల ఆసుపత్రి ప్రాంగణంలో మహిళా వైద్య సిబ్బంది భర్తకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించి కేక్ కోయడంతో వివాదాస్పదంగా మారింది. దీంతో సంబంధిత ఉద్యోగినిపై డీఎంహెచ్‌వో ఆగ్రహం వ్యక్తం చేశారని, తరచూ పీహెచ్‌సీలో సమస్యలు ఉత్పన్నమవడంపై ఆయన మండిపడ్డారని తెలిసింది. అలాగే పీహెచ్‌సీలో ముగ్గురు స్టాఫ్ నర్సుల్లో నెల రోజుల కిందట ఒకరు బదిలీపై వెళ్లడంతో ఇద్దరూ 12 గంటల చొప్పున విధులు నిర్వహిస్తూ ఒత్తిడికి లోనవుతున్నామని డీఎంహెచ్‌వోకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

వైభోగం సింహాచలేశుని నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో ఆదివారం నిత్య కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని అందంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు.

మధురవాడలో ఎడాపెడా విద్యుత్తు కోతలు

మధురవాడ, న్యూస్‌టుడే: ఏపీఈపీడీసీఎల్ జోన్-3 మధురవాడ, పీఎంపాలెం, కొమ్మాది ప్రాంతాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా ఎడాపెడా విద్యుత్తు కోతలతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. ఎప్పుడు సరఫరా నిలిచిపోతుందో తెలియక నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో అల్లాడి పోతుంటే విద్యుత్తు కోతలు వేధిస్తున్నాయని వినియోగదారులు మండి పడుతున్నారు. రెండు రోజులుగా రాత్రి సమయంలో ప్రతి గంటకు ఓసారి సరఫరా నిలిపి వేస్తున్నారని, ఎప్పుడు ఇస్తారో, తీస్తారో తెలియకుండా పోతోందన్నారు. విద్యుత్తు సరఫరా హెచ్చుతగ్గుల కారణంగా పలు విద్యుత్తు ఉపకరణాలు కాలిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నట్లు అధికారులు రికార్డుల్లో చూపిస్తున్నా అనధికారిక కోతలతో ప్రజలకు బాధలు తప్పడం లేదు.

అర్ధరాత్రి సబ్‌స్టేషన్ వద్దకు వచ్చిన వినియోగదారులు

PUBLIC NOTICE

The Public are hereby informed that one of my clients intends to purchase the Schedule Property from Sri Adatrow Veera Jagadeesh Kumar, S/o A.V. Narasinga Rao, R/o # 47-3-6, Dwaraka Nagar, Visakhapatnam, which was purchased by him from Smt. Somayajula Prathibha, W/o Srinivas, vide Regd. Sale deed bearing Doc. No. 6283/2005, dt. 27-09-2005 of the Sub-Registrar, Bheemunipatnam.

Hence, if anybody has any objection with respect of the sale of the schedule property by the above person, they are required to come forward with documentary or other proof of evidence to the below mentioned address, within 7 days. If no such objections are received, my client shall proceed with the sale transaction considering that there are no objections.

Schedule of Property: All that piece of land measuring 244.44 sq. yards or 204.37 sq. mts. Plot No. D-17, situated in Kapuluppada Layout in S. No. 312/ part of Kapuluppada village & Panchayat, in Sub-Registry of Bheemunipatnam, is bounded by: **North:** Plot No. D-18, **East:** 33' Road, **South:** Plot No. D-16, **West:** Plot No. D-6.

S. BHAVANI, ADVOCATE
9-42-9, Flat No. 308,
Mahalakshmi Towers, Balaji Nagar, Siripuram, Visakhapatnam.
Visakhapatnam, Dt. 18-07-2025. **Cell: 9849012042.**

(c) eenadu

విశాఖ తూర్పు

ఇంకుడు గుంతలతో ప్రయోజనం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: ఇంకుడు గుంతల నిర్మాణంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పెదరైతన్ ఆర్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, జీవీఎంసీ సహకారంతో సాధించిన ఫలితాలతో రూపొందించిన 'రెయిన్ హార్వెస్ట్ పిట్ గైడ్ బ్రోచర్‌'ను మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆదివారం 87వ వార్డు తిరుమలనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఉదయ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కేవీకేఆర్.మూర్తి, కార్యదర్శి దుర్గాప్రసాద్, తిరుమలనగర్ సంఘం ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందం తదితరులు పాల్గొన్నారు.

రేపు తూర్పు ఎమ్మెల్యేతో 'ఈనాడు-ఫోన్‌ఇన్'

విశాఖ తూర్పు నియోజకవర్గం ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల్ని నేరుగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఈనాడు' 'ఫోన్‌ఇన్' కార్యక్రమం నిర్వహిస్తోంది. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల వివరాలు, వార్డుల్లో మౌలిక వసతులు, ప్రభుత్వ పథకాలకు సంబంధించి అంశాలపై నేరుగా ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయవచ్చు.

- తేదీ: 22.07.25, మంగళవారం
- సమయం: ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు

ఫోన్ నెంబర్లు 9393120999, 0891-2791999

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం:	ఎంపీవీ కాలనీ:
ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య	8008574768
	మద్దిలపాలెం: 9912120229

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 13వ వార్డు పైనాపిల్‌కాలనీ శివారు ప్రాంతాల్లోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. - కె.మోహనరావు, పైనాపిల్ కాలనీ ✓: సిబ్బందిని పంపించి కాలువల్లోని పూడికను తొలగిస్తాం. - ఆర్.రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: పెదవాల్తేరు అమ్మవారి ఆలయం ఆర్చిపక్కన చెత్త పేరుకుపోయింది. దోమలు, ఈగలు వృద్ధి చెందడంతో పాటు దుర్వాసన వస్తోంది. - లక్ష్మణరెడ్డి, స్థానికుడు ✓: వెంటనే సిబ్బందిని పంపించి చెత్తను తొలగిస్తాం. -ప్రకాశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 19వ వార్డు జాలారిపేట చేపల మార్కెట్ వద్ద వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. పారిశుద్ధ్య సిబ్బంది స్పందించి వ్యర్థాలను తరలించాలి. - అప్పలనాయుడు, జాలారిపేట ✓: తక్షణమే సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం. - సత్యనారాయణ, శానిటరీ సూపర్‌వైజర్

ఎంవీపీకాలనీ(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: ఎంవీపీకాలనీలోని ధర్మశక్తి నగర్, రైతుబజారు, మహాత్మాగాంధీ ఆసుపత్రి ఎదురు వీధుల్లో పేరుకుపోతున్న చెత్తను సకాలంలో తరలించడం లేదు. - చంద్రశేఖర్, సామాజిక కార్యకర్త ఎంవీపీకాలనీ ✓: పరిశీలించి చెత్తను తరలించేలా చూస్తాం. - సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: జోడుగుళ్లపాలెం జీవీఎంసీ పార్కు ఎదురుగా ఉన్న భూగర్భ నీటిశుద్ధి కేంద్రం వద్ద మురుగును శుద్ధి చేయకుండా నేరుగా సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. దీంతో బీచ్ రోడ్డులో నడిచే వాకర్లు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. - ప్రకాశరావు, నడక సంఘం ప్రతినిధి ✓: పరిశీలించి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం. - సురేశ్, ఏఈ భూగర్భ నీటి శుద్ధి విభాగం

స్పందనకు వందనం

దోమల నివారణకు చర్యలు: విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఎంవీపీ కాలనీ మెడికవర్ ఆసుపత్రి వెనుక భాగం నుంచి కైలాసగిరి రోప్‌వే వరకు వెళ్లే రోడ్డు చివరి ప్రాంతంలో దోమలు వృద్ధి చెంది స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. వీరి ఇబ్బందులపై 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికతో ఈనెల 20న ప్రచురించిన వార్తకు జోన్-3 మలేరియా విభాగం అధికారి బి.శ్రీనివాస్ స్పందించారు. సిబ్బందితో ఫాగింగ్ చేయించారు.

మొక్కలు పెంచు.. సంరక్షణ వహించు..!

- పాఠశాలల్లో గ్రీన్ పాస్‌పోర్టుకు శ్రీకారం
- విద్యార్థులకు బాధ్యతలు అప్పగింత

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే

'పాఠశాల దశలో విద్యార్థులకు చదువే కాదు.. సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యత గురించి చెప్పాలి. తద్వారా ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు. సమాజానికి ఉపయోగపడే పనులు చేపడతారు..' అని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. ఆ దిశగా పాఠశాల విద్యావ్యవస్థలో మార్పు తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. అందులో 'గ్రీన్ పాస్‌పోర్టు' ఒకటి. ఈ విధానంలో మొక్కల సంరక్షణ బాధ్యతను విద్యార్థులు, తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ నెల 10న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (మెగా పీటీఎం)లో పాఠశాల విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది.

ఎలాంటి మార్పు వస్తుందంటే..: జిల్లాలోని మూడు లక్షలమందిపైగా ఉన్న విద్యార్థులు ఒక్కో మొక్క నాటి సంరక్షిస్తే ఐదేళ్లలో విశాఖ నగరం పచ్చని వనంలా మారుతుంది. వాతావరణంలో కాలుష్య కారకాలు తగ్గుతాయి. విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెరుగుతుంది. మొక్కలతో అనుబంధం ఏర్పడి మానవీయ విలువలు పెంపొందుతాయి. భవిష్యత్తులో పర్యావరణ మార్పులకు కారణాలను అన్వే

విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టు అందిస్తున్న ఎంఈఓ అనూరాధ

షించి పరిష్కార మార్గాలను తెలుసుకుంటారు.' అని డీఈఓ ప్రేమకుమార్ చెప్పారు.

ప్రతినెలా వివరాల నమోదు: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 3,44,261 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి విద్యార్థికి ఒక మొక్క అందించి లీప్ అనే యాప్‌లో పేరు నమోదు చేసి గ్రీన్ పాస్‌పోర్టు పేరిట ఒక పుస్తకం ఇస్తారు. అందులో విద్యార్థి పేరు, తరగతి, పాఠశాల పేరు, మొక్క శాస్త్రీయనామం నమోదు చేస్తారు. ఈ పుస్తకానికి మూడేళ్ల కాలవ్యవధి ఉంటుంది. అందులో మొక్క ఎప్పుడు నాటారు, ప్రతి నెల ఎంత మేర పెరిగింది.. అనే వివరాలు నమోదు చేస్తారు. ఆయా మొక్కలను క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు తనిఖీచేసి ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తారు.

బాధ్యతగా తీసుకున్నా..: మెగా పీటీఎంలో గ్రీన్ పాస్‌పోర్టు గురించి అవగాహన కల్పించారు. నాకు చాలా నచ్చింది. మొక్కను మా ఇంటి ముందు నాటా. ప్రతిరోజు స్నానం చేసిన తరువాత నీరు పోస్తున్నా. దాన్ని పశువులు తినకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నా. మొక్క చెట్టుగా మారే వరకు సంరక్షణను బాధ్యతగా తీసుకుంటా. - సునీత, ఆరోతరగతి, కోటగరువు పాఠశాల

ప్రతి విద్యార్థి చేత నాటిస్తున్నాం..: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులకు మొక్కలు అందజేసి ఇళ్ల ముందు, పొలాలు, రోడ్ల పక్కన నాటి వాటి సంరక్షణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశాం. తొలివిడతగా 96శాతం విద్యార్థులకు అందించాం. మొక్కల లభ్యత లేనందున మిగిలిన వారికి వారం రోజుల్లో సేకరించి పంపిణీ చేస్తాం. విద్యార్థుల ఉత్సాహంగా ఈ క్రతువులో పాలుపంచుకుంటున్నారు. - ప్రేమకుమార్, డీఈఓ

యాగశాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

విశ్వశాంతికి ఆగస్టు 7 నుంచి యాగం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రపంచశాంతి కోసం సనాతన ధర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అనంత విభూషిత నారాయణ నందగిరి మహారాజ్ ఆధ్వర్యంలో యాగానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఆదివారం ఆర్.కే.బీచ్ కాళీమాత ఆలయం వెనుక ఉన్న ఏపీఐఐసీ మైదానంలో యాగశాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. సంస్థ ప్రతినిధి శ్రీరామాచార్యులు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడేందుకు పూర్వకాలంలో రుషులు యజ్ఞ, యాగాదులు చేశారన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా అశాంతి నెలకొందని, ఈ నేపథ్యంలో విశ్వశాంతి కోసం నారాయణ నందగిరి దేశవ్యాప్తంగా 12 యాగాలు నిర్వహించడానికి సంకల్పించారన్నారు. అందులో భాగంగా ఆగస్టు 7 నుంచి 10 వరకు మొదటి యాగం విశాఖలో నిర్వహించనున్నట్లు చెప్పారు. 7న సాయంత్రం లక్ష్మీనారాయణ శోభాయాత్ర జరుగుతుందన్నారు. అనంతరం మూడురోజుల పాటు సముద్ర హారతి, హోమాలు, యాగాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన యువకుడి అరెస్టు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిని మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ పైడయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాయకరావుపేటకు చెందిన కె.వాసు(25) అదే ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబర్చుకున్నాడు. తర్వాత వివాహం చేసుకోవాలని అడిగితే మాట దాటవేస్తున్నాడు. దీంతో బాధితురాలు మూడో పట్టణ పోలీసు స్టేషన్లో ఇటీవల ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు వాసును అరెస్టు చేశారు. తమ మొదట కలుసుకున్న ప్రాంతం మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఉండటంతో ఇక్కడ ఫిర్యాదు చేసినట్లు యువతి తెలిపింది.

పొంగుతున్న మురుగు.. వీడని దుర్వాసన

దర్పణం

శివాజీపాలెం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 21, 22వ వార్డుల్లోని శివాజీపాలెం, శివాజీపార్కు, రుషికొండ ప్రాంతాల్లో యూజీడీ మ్యాన్‌హోల్ పొంగి రూపొందడా రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసన వస్తోంది. ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించాలంటే ముక్కుమూసుకోవాల్సిందేనని వాహనచోదకులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ఇదే సమస్యతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. యూజీడీ ఏఈ సత్యనారాయణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

డంపింగ్ యార్డా.. మైదానమా..?

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల మైదానం వ్యర్థాల డంపింగ్ నిలయంగా మారుతోంది. శివాజీపాలెం వైపు ఉన్న మైదానంలో కొంతమంది గుట్టు చప్పుడు కాకుండా భవన నిర్మాణ వ్యర్థాలను పారబోస్తున్నారు. ఏయూ పారిశుద్ధ్య కార్మికులు, రక్షణ సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడమే దీనికి కారణమని పలువురు క్రీడాకారులు, విద్యార్థులు, స్థానికులు చెబుతున్నారు. మైదానాన్ని పూర్తిగా వాడుకలోకి తీసుకొస్తే ఇలాంటి సమస్య ఉండదని చెబుతున్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుక్కలు పిక్కలు పీకుతున్నాయ్..!

క్లిక్ క్లిక్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాలాక్షినగర్ ప్రధాన రహదారిలో, జోడుగుళ్లపాలెం నుంచి అబ్దుల్ కలాం వ్యూపాయింట్ వరకు వీధికుక్కల బెడద అధికంగా ఉండటంతో స్థానికులు, ప్రయాణికులు ఆపోకార్చునికి గురవుతున్నారు. ద్విచక్ర వాహనదారులను వెంబడించి గాయపరచడంతో ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఉదయం సాయంత్రం వాకింగ్ వచ్చేవారిపై దాడి చేస్తున్నాయి. జోడుగుళ్లపాలెంలోని వీధుల్లో రాత్రంతా అరుస్తూ తిరుగుతుండటంతో వృద్ధులు, రోగులకు రాత్రిపూట కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఎంవీపీకాలనీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం సాయంత్రం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సి.ఐ. బాస్కరరావు, ఎస్సై భరత్ పాతనేరస్థులను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ప్రస్తుతం ఏం చేస్తున్నారు.. నేరప్రవృత్తిలో మార్పు వచ్చిందా అనే విషయంపై ఆరా తీశారు. సత్ప్రవర్తనతో మెలగాలని, దందాలకు పాల్పడినా, నేరాల్లో పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టాస్క్‌ఫోర్స్ కార్యాలయం వద్ద రౌడీషీటర్లు

రక్షణ లేని పంప్‌హౌస్

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో తలుపులు లేని పంప్‌హౌస్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలోని పంప్‌హౌస్ నిర్లక్ష్యానికి గురవుతోంది. ఇక్కడ వేసిన బోరు బావి నుంచే సమీపంలో గల ఏయూ వసతి గృహాలకు నీరు అందుతుంది. పంప్‌హౌస్‌కు కనీసం తలుపులు కూడాలేవు. సిబ్బంది నిర్లక్ష్యానికి ఇదొక మచ్చుతునక. నగరంలో ఆకతాయిల బెడద ఎక్కువగా ఉన్నందున ఇప్పటికైనా స్పందించి దీనికి తలుపులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కైలాసగిరిపై సందడే సందడి..

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: కైలాసగిరిపై ఆదివారం సందర్శకులు తాకిడి అధికంగా ఉంది. నగరంలో నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చి ఉల్లాసంగా గడిపారు. వ్యూపాంట్లు, పార్వతీపరమేశ్వర్ల విగ్రహాల వద్ద ఫోటోలు దిగుతూ సందడి చేశారు. చెట్ల కింద సామూహికంగా భోజనాలు చేస్తూ కనిపించారు. అద్దాల రైలును త్వరగా తిప్పాలని కోరారు.

సహపంక్తి భోజనాలు చేస్తున్న సందర్శకులు

హోంమంత్రి అనితకు ఆహ్వాన పత్రం అందజేత

హోంమంత్రి అనితకు ఆహ్వానం అందజేస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సైనిక్ సంక్షేమ శాఖ, యాక్మీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 26న పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో కార్గిల్ విజయ్‌దివస్‌ను పురస్కరించుకుని భారతీయం పేరిట జాతీయ సమైక్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి ఆదిభట్ల శైలజ తెలిపారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనితకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాక్మీ సభ్యులు పాల్గొన్నారు

ముగిసిన హరికథ ఉత్సవాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ(కళాభారతి) ఆధ్వర్యంలో పిఠాపురం కాలనీలోని ఆడిటోరియంలో మూడురోజుల పాటు నిర్వహించిన హరికథ ఉత్సవాలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. చివరిరోజున కపిలేశ్వరపురం ప్రాంతానికి చెందిన నేమాని నాగలక్ష్మి భాగవతారిణిచే భక్తరామదాసు హరికథను గానం చేశారు. రామదాసు జీవిత చరిత్రను హరికథ గానంలో ఆమె వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.ఎస్.ఎన్.రాజు, జీఆర్కేప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హరికథ గానం చేస్తున్న నాగలక్ష్మి

స్వచ్ఛ దేవాలయాల ప్రాజెక్టు అభినందనీయం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ సంస్థ ఆలయాలు, ప్రజాప్రదేశాలను శుభ్రం చేయడం అభిందనీయమని వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. బీచ్‌రోడ్డులో ఆదివారం ఉదయం సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన రెండో స్వచ్ఛ దేవాలయ ప్రాజెక్టును కమిషనర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వ్యర్థాల నివారణ, రీ సైక్లింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఈ ప్రాజెక్టు సమాజ సేవకు ఉదాహరణ అన్నారు. జిల్లా గవర్నర్ (నామినీ) శోభన్ ప్రసాద్, క్లబ్ అధ్యక్షులు ధర్మేందర్, కార్యదర్శి శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు ప్రారంభంలో పాల్గొన్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్, క్లబ్ ప్రతినిధులు

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఆరిలోవ, న్యూస్‌టుడే: 13వ వార్డు లక్ష్మీనగర్‌లో ఆదివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. వార్డు తెదేపా నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలిపారు. అర్హత ఉండీ పథకాలు అందనివారి వివరాలు తీసుకుని తెదేపా యాప్‌లో అప్‌లోడ్ చేశామని బూత్ కన్వీనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పి.ధర్మారావు, నాయకులు వై.సురేష్, కె.సంజీవరావు, ఎస్.సుధాకర్, మజ్జి రమణి, కె.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

300 కిలోల కూరగాయలతో అమ్మవారికి అలంకరణ

శాకంబరిగా ఎరుకుమాంబ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం బహుళ పక్షం దశమి సందర్భంగా కరవు కాటకాలు లేకుండా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారిని ఆదివారం శాకంబరి దేవిగా అలంకరించారు. దీని కోసం 300 కిలోల కూరగాయలు, పండ్లను వినియోగించారు. నగరంలోని వివిధ ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి జి.వి.రమాబాయి దగ్గరుండి పర్యవేక్షించారు. దేవస్థానం మాజీ ఛైర్మన్, 27వ వార్డు తెదేపా అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, మాజీ ధర్మకర్త మజ్జి వెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మహాలక్ష్మికి జననీరాజనాలు

మాధవధార, న్యూస్‌టుడే: మాధవధార ప్రజల ఇలవేల్పు కొత్త మహాలక్ష్మి(కడవల) అమ్మవారి పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి దర్శనాల కోసం భక్తులు బారులుతీరారు. వేప కర్రలతో తయారు చేసిన అమ్మవారి ప్రతిమలను పసుపు, కుంకుమ, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. సాయంత్రం సదరం పట్టు నుంచి అమ్మవారి ఘటాలను ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త సనపల బంగారురాజు, కూటమి నాయకులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మాధవధారలో ప్రత్యేక అలంకరణలో కొత్త మహాలక్ష్మి, బారులు తీరిన భక్తులు

వైభవుడి సన్నిధిలో శ్రావణ మాసం పూజలు

మురళీనగర్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 49వ వార్డు కప్పరాడ ఎన్‌జీజీఓస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరుడి దివ్యక్షేత్రంలో ఈనెల 25 నుంచి ఆగస్టు 22 వరకు శ్రావణ మాస పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పద్మావతి అమ్మవారికి ఈనెల 25న మొదటి శుక్రవారం సహస్ర కుంకుమార్చన, ఆగస్టు 1న సంపెంగలతో, 8న గులాబీలతో ఆరాధన, 9న వైభవుడికి పంచామృతాలతో అభిషేకం, నిజరూప దర్శనం, 16న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉట్టికొట్టే మహోత్సవం, 22న రజనీగంధ పుష్పాలతో ఆరాధన ఉంటాయని పేర్కొన్నారు.

పుష్పాలంకరణలో వైభవ వేంకటేశ్వరుడు

అప్పన్న సన్నిధిలో నాగఫణిశర్మ

సింహాచలం, న్యూస్‌టుడే: ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, పద్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ సతీసమేతంగా ఆదివారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు.

27 నుంచి కిక్ బాక్సింగ్ పోటీలు

గాజువాక, న్యూస్‌టుడే : ఈనెల 27 నుంచి నగరంలో నిర్వహించే గ్రేటర్ విశాఖ డిస్ట్రిక్ట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల ట్రోఫీని ఆదివారం రాష్ట్ర కిక్ బాక్సింగ్ సంఘం గౌరవ అధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు ఆవిష్కరించారు. ఆదివారం పాత కర్నవానిపాలెంలో సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులకు, కోచ్‌లకు టీషర్ట్స్ అందజేశారు. పోటీల్లో గెలుపొందిన వారు అక్టోబరులో అసోంలో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధిస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. కిక్ బాక్సింగ్ సంఘం ప్రతినిధులు,కోచ్‌లు నూకరాజు, పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ సేవా సంఘం వార్షిక వేడుకలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: గౌరీ సేవా సంఘం(పోర్టు విభాగం) వార్షిక వేడుకల్ని దొండపర్తిలోని ఓ హోటల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్దా శివాజీ, వైద్యురాలు కాళ్ల నళిని ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బొడ్డేడ భాస్కరరావు నేతృత్వంలో జరిపిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పొలమరశెట్టి ఎస్.జె.వి.ఆర్.ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా సూరిశెట్టి జగ్గ అప్పారావు, కార్యదర్శిగా దాడి గోవిందరాజు, కోశాధికారి రాపేటి చంద్రరావు, ఉపాధ్యక్షులుగా దాడి వి.వి.రామారావు, భీశెట్టి అప్పారావు, బి.వి.సత్యనారాయణ, కె.ఆర్.కె.ఎన్.అప్పారావు, మద్దాల గోవిందరాజు, సంయుక్త కార్యదర్శులుగా కాళ్ల వరప్రసాద్, రాపేటి కృష్ణఅప్పారావు, ఎస్.రాజారావు, ఎస్.వి.ఎస్.అప్పారావు ఎన్నికయ్యారు. వీరంతా 2027 వరకు పదవిలో కొనసాగనున్నారు.

మనస్తాపంతోనే వెళ్లిపోయా..

- పోలీసులకు ఏఈఈ కిశోర్ వాంగ్మూలం
- క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగింత

తిరువూరు, న్యూస్‌టుడే: 'బదిలీ జరిగి నెల దాటినా, రిలీవ్ చేయకపోవడంతో మనస్తాపానికి గురై తిరువూరు నుంచి విశాఖపట్నం వెళ్లి, అక్కడి నుంచి రాజమహేంద్రవరం వచ్చాను' అంటూ.. జలనవరులశాఖ తిరువూరు ఏఈఈ వి.కిశోర్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ శుక్రవారం లేఖ రాసి, అధికారుల గ్రూపులో పోస్టుచేసి అదృశ్యమైన ఏఈఈని ఆదివారం ఉదయం రాజమహేంద్రవరంలో పోలీసులు పట్టుకున్నారు. దాంతో రెండ్రోజుల ఉత్కంఠకు తెరపడగా, క్షేమంగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరు తీసుకొచ్చి అతని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం తిరువూరులోని కార్యాలయం నుంచి ఖమ్మం జిల్లా బంజరు చేరుకున్న అతను, బస్సులో రాజమహేంద్రవరం చేరుకున్నాడు. అక్కడ నగదు డ్రా చేసి రాత్రికి ప్రయివేటు వాహనంలో విశాఖపట్నం వెళ్లాడు. రాత్రి సమయంలో అతని ఫోన్ ఆన్ కావడం.. వెంటనే ఆగిపోవడంతో విశాఖపట్నంలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, అతని కుటుంబ సభ్యులతో కలిసి బయలుదేరి వెళ్లారు. తీరా విశాఖపట్నం వెళ్లాక, శనివారం రాత్రి రాజమహేంద్రవరంలో ఫోన్ ఆన్ అయినట్లు సిగ్నల్స్ రాగా వారు కూడా అక్కడికి చేరుకున్నారు. అయినా మళ్లీ ఫోన్ ఆగిపోవడంతో రాత్రంతా అక్కడే ఉండిపోయారు. ఈ లోగా ఫోన్ కలిసే వరకు అందుబాటులో ఉండాలని ఏఈఈ కుటుంబ సభ్యులకు పోలీసులు సూచించారు. చివరికి ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో ఫోన్ కలవడంతో, సాంకేతిక సాయంతో అతను గోదావరి ఒడ్డున పుష్కరఘాట్ వద్ద ఉన్నట్లు నిర్ధరించుకుని, భార్యతో ఫోన్ మాట్లాడమని సూచించారు. ఈ లోగా నేరుగా అక్కడకు వెళ్లి కిశోర్‌ను పట్టుకున్నారు. అక్కడ అల్పాహారం అనంతరం మధ్యాహ్నం 12 గంటలకల్లా తిరువూరు స్టేషన్‌కు తీసుకొచ్చి, వాంగ్మూలం నమోదు చేసుకుని కుటుంబసభ్యులకు అప్పగించారు.

రాజమహేంద్రవరంలో పోలీసుల సంరక్షణలో వి.కిశోర్

బస్టాండ్‌లో బస: శుక్రవారం రాత్రి ప్రయాణంలో ఉన్న అతడు శనివారం రాత్రికి రాజమహేంద్రవరం చేరుకుని, బస్టాండ్ ప్రాంగణంలో గది తీసుకుని అక్కడే ఉన్నట్లు పోలీసులకు వివరించాడు. ఈ లోగా తనను రిలీవ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలివ్వడం, పోలీస్ స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైనట్లు తెలుసుకుని తిరిగి రావడానికి సిద్ధమైనట్లు పేర్కొన్నారు.

(c) eenadu

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

సమన్వయంతో ఆలయ అభివృద్ధి

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : జ్ఞానాపురం బీఆర్టీఎస్ రహదారిలోని ఎర్నిమాంబ ఆలయ అభివృద్ధికి, ఉత్సవాల నిర్వహణకు పాలకమండలి సభ్యులు, ఈఓ సురేష్‌బాబా సమన్వయంతో పని చేస్తున్నారని పాలకమండలి ఛైర్మన్ ఎల్.రమణ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆలయ అభివృద్ధిపై పలువురు లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆలయ ఖర్చులు, టెండర్‌లు, లీజులు తదితర అంశాలన్నీ పారదర్శకంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఆలయ సంవత్సర ఆదాయం రూ.2.62 కోట్లుగా ఉందన్నారు. సభ్యులు ఆదినారాయణ, శ్యాంసుందర్‌రెడ్డి, వి.నారాయణరావు, దానయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హరికథ ఉత్సవాలు

హరికథ గానం చేస్తున్న నాగలక్ష్మి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ(కళాభారతి) ఆధ్వర్యంలో పిఠాపురం కాలనీలోని ఆడిటోరియంలో మూడు రోజుల పాటు నిర్వహించిన హరికథ ఉత్సవాలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. చివరిరోజున కపిలేశ్వరపురం ప్రాంతానికి చెందిన నేమాని నాగలక్ష్మి భాగవతారిణిచే భక్తరామదాసు హరికథను గానం చేశారు. రామదాసు జీవిత చరిత్రను హరికథ గానంలో ఆమె వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.ఎస్.ఎన్.రాజు, జీఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796
విశాఖ దక్షిణం: 8008574977

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 51వ వార్డు రామన్నకాలనీలో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – అప్పారావు, స్థానికుడు. ✓: సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయిస్తాం. – జీవన్, వీధి దీపాల నిర్వాహకుడు.

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 41వ వార్డు పరిధిలోని పలు వీధుల్లో కాలువల్ని శుభ్రం చేయడం లేదు. తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. – ప్రకాశ్, జ్ఞానాపురం. ✓: సిబ్బందిని పంపి, పూడిక వ్యర్థాలు తీయిస్తాం. –ప్రసాద్, వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

అల్లిపురం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 35వ వార్డు బౌడారా రోడ్డులో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. –రామారావు, వేలంపేట. ✓: పరిశీలించి, దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. –మల్లయ్యనాయుడు, జోన్–4 జెడీ.

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ సెక్టార్-10 పరిసర ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రిళ్లు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – రాజ్యలక్ష్మి, స్థానికురాలు. ✓: తక్షణమే మరమ్మతులు చేయించి, దీపాలు వెలిగేలా చూస్తాం. – సాయి, వీధి దీపాల నిర్వాహకుడు.

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్ రెలి ఆసుపత్రి వీధిలో వీధి దీపం కొద్ది రోజులుగా వెలగక అంధకారం అలముకుంటోంది. – కుమారి, స్థానికురాలు. ✓: మరమ్మతులు చేసి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – వీధి దీపాల నిర్వహణ అధికారి

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వెనుక పైపులైన్ మరమ్మతులకు గురై మంచినీరు నేలపాలవుతోంది. – సుబ్బారావు, స్థానికుడు. ✓: పరిశీలించి లీకేజీ అరికడతాం. – రహీం, జీవీఎంసీ మంచినీటి సరఫరా ఏఈ

స్పందనకు వందనం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: పాతనగరం టౌన్‌కొత్తరోడ్డు నుంచి పంజాబ్ కూడలికి వెళ్లే మార్గంలో భూగర్భ విద్యుత్తు తీగల కోసం తవ్విన గోతుల్ని పూడ్చకపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. సిబ్బందితో ఆయా గోతుల్ని పూడ్చించారు.

ఆటపాటలతో అభ్యసనం.. ఆకట్టుకునే బోధన

మాధవధార, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ చిన్నారుల్లో సృజనాత్మకత విద్యను అందించేందుకు, వారిని మరింత చైతన్యం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. జాతీయ విద్యా విధానం-2020 బాల్య సంరక్షణ విద్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇందులో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ సహకారంతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ప్రత్యేక బోధన చేపట్టనున్నారు. 'నవ చేతన', 'ఆధార్ శిల' పేరుతో కొత్తగా రెండు అభ్యసన పుస్తకాలు(హ్యాండ్ బుక్స్) ముద్రించారు. ప్రాథమిక స్థాయిలోనే చిన్నారులకు విద్య పట్ల మంచి పునాది పడాలనే ఉద్దేశంతో వీటిని రూపొందించారు. నగర పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు వీటిని సరఫరా చేశారు. వీటిపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. నూతన విద్యా విధానంలో భాగంగా ప్రీప్రైమరీ-1, ప్రీప్రైమరీ-2 పుస్తకాలను చిన్నారులకు అందజేశారు. మూడేళ్ల దాటిన పిల్లలకు ఆంగ్లం, గణితం, తెలుగు ఇలా అన్ని అంశాలు సులభంగా చదువుకునేలా వారికి అర్థమయ్యే రీతిలో పుస్తకాలు రూపొందించారు.

కొత్తగా ముద్రించిన నవ చేతన, ఆధార్ శిల పుస్తకాలు

చిన్నారులకు అందించనున్న రైమ్స్ పుస్తకాలు

మెదడు, శరీర అభివృద్ధికి 'చేతన': నవ చేతన పుస్తకంలో శిశువు గురించి వివరించారు. తల్లి గర్భధారణ దశ నుంచే శిశువు తన శారీరక, మానసిక ప్రేరణ అవసరాన్ని తెలియజేస్తుంది. దీన్ని గుర్తించి చిన్నారుల మెదడు, శరీర అభివృద్ధిని గుణాత్మకంగా పెంచేందుకు తల్లిదండ్రులు, సంరక్షకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఇందులో సూచించారు. నేను నా కుటుంబం, శరీర భాగాలు, ఆహారం, రుచులు తదితర అంశాలు పొందుపరిచారు. మూడేళ్లలోపు వారికి వీటి గురించి చెప్పి వారి తల్లిదండ్రులకు వివరించేలా సూచిస్తారు. పిల్లల్లో విషయ పరిజ్ఞానం పెంపొందించి కబుర్లు, కథలు, ఎలా చెప్పాలన్నది చిత్రాలతో సహా తెలియజేస్తారు.

'ఆధార్ శిల'తో వినోదాత్మకంగా: కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్లలోపు వయసు వారందరికీ ఆట, పాటలతో వినోదాత్మకంగా బోధన సాగించే అంశాల గురించి ఆధార్ శిల పుస్తకంలో వివరించారు. నీతి పద్యాలు, రుతువులు, పండగలు, పండ్లు, కూరగాయలు, మన ఊరు, కుటుంబం తదితర ఇతి వృత్తాంతాల ద్వారా పిల్లలు పరిసరాలు, సంస్కృతిని అర్థం చేసుకోవడానికి దోహదపడేలా ఇందులో పలు అంశాలు పొందుపరిచారు. 'విశాఖ అర్బన్ పరిధిలోని 273 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 1924 మంది చిన్నారులకు వీటిని అందజేశాం. పుస్తకాల్లో ఉన్న అంశాలను చిన్నారులు, తల్లిదండ్రులకు ఎలా వివరించాలో కార్యకర్తలకు అవగాహన కల్పించాం' అని అర్బన్ సీడీపీవో నీలిమ తెలిపారు.

సామాజిక భవనం ప్రారంభోత్సవం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 26వ వార్డు పరిధి చాకలిపేటలో రూ.20 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, ఉత్తరం జనసేన ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్, కార్పొరేటర్ ముక్కా శ్రావణి ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడి రజకుల సేద తీరేందుకు, ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఈ భవనం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జీవీఎంసీ ఈఈ గంగాధరరావు, డీఈ విజయ్‌కుమార్, ఏఈ నిహారిక, వార్డు కూటమి పార్టీల అధ్యక్షులు ముక్కా కిశోర్‌కుమార్, అనంతబాబు, బోడసింగి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే హాజరైన కార్యక్రమానికి ప్రొటోకాల్ ప్రకారం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో హాజరుకాకపోవడంపై కొంతమంది వార్డు నాయకులు మండిపడ్డారు.

ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, పసుపులేటి ఉషాకిరణ్, కార్పొరేటర్ ముక్కా శ్రావణి తదితరులు

ఇంటింటికీ తిరిగి.. పథకాలు వివరించి..

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 44వ వార్డు శ్రామికనగర్‌లో ఆదివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని తెదేపా రాష్ట్ర బి.సి.సెల్ ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ముఖ్యఅతిథిగా పాల్గొని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తెదేపా వార్డు అధ్యక్షుడు కాళ్ల గౌరీశంకర్‌నాయుడు, నాయకులు షేక్ సోనా, పందిరిపల్లి శ్రీను, కాళ్ల శ్రీనివాస్, అమ్మారావు, నిరంజన్, లావణ్య, మధు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, తెదేపా నాయకులు

అప్పన్న సన్నిధిలో నాగఫణిశర్మ

సింహాచలం, న్యూస్‌టుడే: ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, పద్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ సతీసమేతంగా ఆదివారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు.

సింహగిరిపై రేపు పాదాలమ్మ పండగ

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరి గ్రామ దేవతలు శ్రీఉమామహేశ్వరీ పాదాలమ్మ, బంగారమ్మ అమ్మవార్ల పండగ మంగళవారం సంప్రదాయబద్ధంగా జరుగుతుందని సింహాచలం దేవస్థానం ఈవో వేంద్ర త్రినాధరావు తెలిపారు. సోమవారం రాత్రి 9 నుంచి అమ్మవారి తొలేళ్ల వేడుక జరుగుతుందన్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారి అనుపు మహోత్సవం నిర్వహిస్తారన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న వైద్యుడు

గురుద్వారా, న్యూస్‌టుడే: సహాయ చారిటబుల్ ట్రస్ట్, వైద్యులు ఎస్.రహ్మతుల్లా సంయుక్త ఆధ్వర్యంలో ఎబాట్, టొరెంటో, ఫ్రాంకో ఇండియన్ వంటి వైద్య సంస్థల సహకారంతో జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం కొత్త ఏఎంజీ ఎదురుగా ఉన్న సితార ఎన్‌క్లేవ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్య నిపుణలు హాజరై ఉదయం ఆరు గంటల నుంచి 11 వరకు బీఎండీ, మధుమేహం, థైరాయిడ్, యూరిక్ యాసిడ్, పిల్లలకు ప్రత్యేకంగా చెవి, దంత, ముక్కు, గొంతు వైద్యపరీక్షలు ఉచితంగా జరిపారు. ట్రస్టు ఛైర్మన్ పీవీవీఎస్ మూర్తి, సభ్యులు పి.శ్రీనివాసరావు, జి.సాంబమూర్తి, బి.శ్రీరంగ తదితరులు పాల్గొన్నారు.

12 గంటల నిర్విరామ సినీ సంగీత విభావరి

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: అక్కయ్యపాలెం సంగం ఆఫీసు కూడలిలోని ఓ హోటల్‌లో నీలు స్వరాంజలి ఆధ్వర్యంలో 12 గంటల పాటు నిర్విరామ సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. నీలు స్వరాంజలి అధినేత్రి నీలు, సుధాకర్ దంపతుల ఆధ్వర్యంలో మాస్ట్రో ఇళయరాజా మేనియా పేరుతో నిర్వహించిన సంగీత విభావరిలో పలు గీతాలను ఆలపించి శ్రోతలను ఉర్రూతలూగించారు. అనంతరం లఖినేని బాలకృష్ణ నేతృత్వంలో నిర్వహించనున్న బాలు స్వరఝరి సంస్థ బ్యానర్‌ను ఆవిష్కరించారు.

నీలు, సుధాకర్ దంపతుల్ని సత్కరిస్తున్న గాయకులు

తప్పిపోయిన బాలుడి అప్పగింత

బాలుడిని తల్లి చెంతకు చేర్చిన కానిస్టేబుల్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడిని ఒకటో పట్టణ పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఆ వివరాలు. . ఆదివారం ఉదయం పాతనగరంలోని చిలకపేటలో ఉండే మూడేళ్ల బాలుడు గౌతమ్ తప్పిపోయి రోడ్డుపైకి వచ్చేశాడు. ఏడుస్తున్న బాలుడిని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు అప్పగించారు. సీఐ జీడీ బాబు ఆధ్వర్యంలో తల్లిదండ్రుల వివరాలు సేకరించి, అప్పగించారు.

27 నుంచి కిక్ బాక్సింగ్ పోటీలు

గాజువాక, న్యూస్‌టుడే: ఈనెల 27 నుంచి నగరంలో నిర్వహించే గ్రేటర్ విశాఖ డిస్ట్రిక్ట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల ట్రోఫీని ఆదివారం రాష్ట్ర కిక్ బాక్సింగ్ సంఘం గౌరవ అధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు ఆవిష్కరించారు. ఆదివారం పాత కర్నవానిపాలెంలో సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులకు, కోచ్‌లకు టీషర్ట్స్ అందజేశారు. పోటీల్లో గెలుపొందిన వారు అక్టోబరులో అసోంలో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధిస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. కిక్ బాక్సింగ్ సంఘం ప్రతినిధులు,కోచ్‌లు నూకరాజు, పాల్గొన్నారు.

పేదలకు నిత్యవసరాల వితరణ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: నెహ్రూబజార్‌లో ఆకు కూరలు విక్రయించుకుంటున్న దూసి అప్పలస్వామి ఇటీవల మరణించారు. దీంతో అతని కుటుంబం దిక్కులేనిదిగా మారిపోయింది. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని 26వ వార్డు మాజీ కార్పొరేటర్ భర్త, స్థానిక నాయకుడు పోతు సత్యనారాయణ ఆ కుటుంబానికి నెలకు సరిపడ బియ్యం, పప్పులు నిత్యావసర వస్తువుల్ని అందజేశారు.

300 కిలోల కూరగాయలతో అమ్మవారికి అలంకరణ

శాకంబరిగా ఎరుకుమాంబ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం బహుళ పక్షం దశమి సందర్భంగా కరవు కాటకాలు లేకుండా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారిని ఆదివారం శాకంబరి దేవిగా అలంకరించారు. దీని కోసం 300 కిలోల కూరగాయలు, పండ్లను వినియోగించారు. నగరంలోని వివిధ ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.వి.రమాబాయి దగ్గరుండి పర్యవేక్షించారు. దేవస్థానం మాజీ ఛైర్మన్, 27వ వార్డు తెదేపా అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, మాజీ ధర్మకర్త మజ్జి వెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మహాలక్ష్మికి జననీరాజనాలు

మాధవధార, న్యూస్‌టుడే: మాధవధార ప్రజల ఇలవేల్పు కొత్త మహాలక్ష్మి(కడవల) అమ్మవారి పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి దర్శనాల కోసం భక్తులు బారులుతీరారు. వేప కర్రలతో తయారు చేసిన అమ్మవారి ప్రతిమలను పసుపు, కుంకుమ, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. సాయంత్రం సదరం పట్టు నుంచి అమ్మవారి ఘటాలను ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ నిర్వాహ కర్త సనపల బంగారురాజు, కూటమి నాయకులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మాధవధారలో ప్రత్యేక అలంకరణలో కొత్త మహాలక్ష్మి, బారులు తీరిన భక్తులు

వైభవుడి సన్నిధిలో శ్రావణ మాసం పూజలు

మురళీనగర్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 49వ వార్డు కప్పరాడ ఎన్‌జీజీఓస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి ఆగస్టు 22 వరకు శ్రావణ మాస పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. [illegible] అమ్మవారికి ఈనెల 25న మొదటి శుక్రవారం సహస్ర కుంకుమార్చన, ఆగస్టు 1న సంపెంగలతో, 8న గులాబీలతో ఆరాధన, 9న వైభవుడికి పంచామృతాలతో అభిషేకం, నిజరూప దర్శనం, 16న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉట్టికొట్టే మహోత్సవం, 22న రజనీగంధ పుష్పాలతో ఆరాధన ఉంటాయని పేర్కొన్నారు.

పుష్పాలంకరణలో వైభవ వేంకటేశ్వరుడు

ముస్లింలకు ప్రభుత్వం అండ: పల్లా

గాజువాక: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం 66వ వార్డు అజీమాబాద్‌లో రూ.50 లక్షలతో నిర్మించనున్న ముస్లిం కబరిస్థాన్ ప్రహరీకి శంకుస్థాపన చేశారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పల్లా చెప్పారు.

ముగిసిన స్టీల్‌క్లబ్ ఉత్సవాలు

ఉక్కునగరం,న్యూస్‌టుడే: ఉక్కునగరంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న స్టీల్‌క్లబ్ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన క్లబ్ అధ్యక్షుడు, ఉక్కు జీఎం(హెచ్‌ఆర్)ఇంఛార్జి ఎం.మధుసూదనరావు మాట్లాడారు. [illegible] ఉత్సవాలను విజయవంతం చేసిన క్లబ్ సభ్యుల్ని అభినందించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రహదారిపై మురుగు పరుగు

గురుద్వారా, న్యూస్‌టుడే: జీవీఎంసీ 24వ వార్డు కొత్త ఏఎంజీ మార్గంలో భూగర్భ డ్రైనేజీ లీకై మురుగంతా వరదలా ప్రవహిస్తోంది. పల్లపు ప్రాంతంలో ఉన్న నివాసితులు, ప్రయాణికులు దుర్వాసనతో పాటు రహదారి చిత్తడిగా మారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని పారిశుద్ధ్య నిర్వహణ అధికారులు, సిబ్బంది ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈగలు, దోమలు చేరడంతో పాటు ఇళ్లల్లో నుంచి బయటకు రాలేకపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: రైల్వే న్యూకాలనీలోని శ్రీనివాస కల్యాణ మండపంలో ఆదివారం బ్రహ్మకుమారీస్ సంస్థ, రోటరీ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీతేజావతి మాతాజీ ప్రథమ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాన్ని రోటరీ బ్లడ్ బ్యాంకు ఛైర్మన్ కె.వి.శ్రీనివాసరావు, డాక్టర్ మురళీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక వ్యక్తి రక్తదానం చేయడం వల్ల ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంస్థ ఇన్‌ఛార్జి శశికళ, రోటరీ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు

ఘనంగా గౌరీ సేవా సంఘం వార్షిక వేడుకలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: గౌరీ సేవా సంఘం(పోర్టు విభాగం) వార్షిక వేడుకల్ని దొండపర్తిలోని ఓ హోటల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, వైద్యురాలు కాళ్ల నళిని ముఖ్యఅతిథులుగా హాజరై పోర్టులో పని చేసి పదవీ విరమణ చేసిన వారిని సత్కరించారు. ప్రతిభ చూపిన పిల్లలకు ఉపకార వేతనాలు అందజేశారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బొడ్డేడ భాస్కరరావు నేతృత్వంలో జరిపిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పొలమరశెట్టి ఎస్.జె.వి.ఆర్.ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా సూరిశెట్టి జగ్గఅప్పారావు, కార్యదర్శిగా దాడి గోవిందరాజు, కోశాధికారి రాపేటి చంద్రరావు, ఉపాధ్యక్షులుగా దాడి వి.వి.రామారావు, భీశెట్టి అప్పారావు, బి.వి.సత్యనారాయణ, కె.ఆర్.కె.ఎన్.అప్పారావు, మద్దాల గోవిందరాజు, సంయుక్త కార్యదర్శులుగా కాళ్ల వరప్రసాద్, రాపేటి కృష్ణఅప్పారావు, ఎస్.రాజారావు, ఎస్.వి.ఎస్.అప్పారావు ఎన్నికయ్యారు. వీరంతా 2027 వరకు పదవిలో కొనసాగనున్నారు.

నూతనంగా ఎన్నికైన గౌరీ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు

నైపుణ్య ఆధారిత పిల్లల కార్యక్రమానికి స్పందన

సీతంపేట, న్యూస్‌టుడే: విశాఖ పౌర గ్రంథాలయం, భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన నైపుణ్య ఆధారిత సృజనాత్మక పిల్లల కార్యక్రమానికి స్పందన లభించింది. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కథకురాలు సీతా శ్రీనివాస్ నేతృత్వంలో పిల్లలు వివిధ రకాల బొమ్మలు గీసి వారి నైపుణ్యాలను ప్రదర్శించారు. ప్రతి ఒక్కరికీ ఒక ప్రత్యేక పాత్ర అప్పగించి ఆ పాత్రల ఆధారంగా బృందాలుగా ఏర్పడి బొమ్మలకు రంగులు వేసి వాటిని కథలుగా మలిచి వివరించారు.

విద్యార్థులకు కథ చెబుతున్న సీతా శ్రీనివాస్

స్మార్ట్ మీటర్లు వద్దు : సీపీఎం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ప్రజలకు ఆర్థికంగా నష్టం చేకూర్చే స్మార్ట్ విద్యుత్తు మీటర్ల నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సీపీఎం జగదాంబ జోన్ నాయకుడు వై.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో పాతనగరంలోని పితానిదిబ్బ, భానోజీనగర్ ప్రాంతాల్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్మార్ట్‌మీటర్లు బిగింపును ప్రజలంతా వ్యతిరేకించాలని ఆయన కోరారు. పార్టీ నాయకులు గోవిందరావు, దానయ్య, గణేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కైలాసగిరిపై సందడే సందడి..

సహపంక్తి భోజనాలు చేస్తున్న సందర్శకులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: కైలాసగిరిపై ఆదివారం సందర్శకుల తాకిడి అధికంగా ఉంది. నగరంలో నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చి ఉల్లాసంగా గడిపారు. వ్యూపాయింట్లు, పార్వతీపరమేశ్వర్ల విగ్రహాల వద్ద ఫొటోలు దిగుతూ సందడి చేశారు. చెట్ల కింద సామూహికంగా భోజనాలు చేస్తూ కనిపించారు. అద్దాల రైలును త్వరగా తిప్పాలని కోరారు.

స్పందనకు వందనం

జాతీయ రహదారి గురుద్వారా బస్టాప్ వద్ద అడుగు లోతులో గొయ్యి ఏర్పడింది. దీంతో బస్సులు బస్టాప్ లోకి రాకుండా రహదారిపై నిలుపుతున్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడటమే కాకుండా నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఇక్కడి సమస్యపై 'ఈనాడు'లో ఈనెల 16న 'గోతులు పడ్డాయి.. పూడ్చండి సారూ..' శీర్షికతో ప్రచురించిన చిత్ర కథనానికి అధికారులు స్పందించి గోతులను పూడ్చారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అ'పూర్వ' కలయిక.. ఆనంద వేడుక

అల్లిపురం, న్యూస్‌టుడే : విశాఖలోని అల్లిపురం సమీప మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఎంజీఎం) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. 1979-1980 విద్యా ఏడాదిలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకే చోట చేరి, నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎం.సత్యనారాయణ, ఉపాధ్యక్షునిగా బాలకృష్ణారెడ్డి, కోశాధికారిగా పి.సత్యనారాయణ ఎంపికయ్యారని వ్యవస్థాపక అధ్యక్షులు డి.ఎస్.గుప్తా తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో స్థిరపడిన వారిని సత్కరించారు.

ఎం.జి.ఎం.ఉన్నత పాఠశాలలో...

అల్లిపురం, న్యూస్‌టుడే: కంచరపాలెం సమీప కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 1994-95 విద్యా ఏడాదిలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అల్లిపురంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలపై ఆరా తీశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువుల్ని సత్కరించారు. మృతి చెందిన ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులకు నివాళి అర్పించారు.

కె.కాలనీ జీవీఎంసీ హైస్కూల్లో..

ఇంకుడు గుంతలతో ప్రయోజనం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఇంకుడు గుంతల నిర్వహణతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, జీవీఎంసీ పరిధిలో సాధించిన ఫలితాలతో రూపొందించిన 'రెయిన్ హార్వెస్ట్ పిట్ గైడ్ బ్రోచర్'ను మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆదివారం 87వ వార్డు తిరుమలనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఉదయ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కేఎస్ఆర్.మూర్తి, కార్యదర్శి దుర్గాప్రసాద్,తిరుమలనగర్ సంఘం ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందం తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సోమేశ్వర స్వామివారి దేవస్థానం, సత్యానగర్, NH-5, విశాఖపట్నం.
ఆర్.సి.నెం. 14-2/2025, తే 19.07.2025 ది

టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

శ్రీ సోమేశ్వర స్వామి వారి దేవస్థానం, సత్యానగర్, విశాఖపట్నంకు చెందిన ఈ దిగువ సుదహరించిన ప్రకారం తేది.31.07.2025 గురువారం ఉదయం 11-00 గంటలకు షాపుల లైసెన్సు హక్కు టెండర్ కం బహిరంగ వేలంపాట దేవాదాయశాఖ అధికారుల సమక్షమున కార్యనిర్వహణాధికారిచే దేవస్థానం వద్ద నిర్వహించబడును.

షాపు నెం.	షాపు వివరములు (పొxవె) అడుగులు	ప్రథమ ధరావత్తు	కౌలు కాలం
1	10,6 x 8 = 84.8 చదరపు అడుగులు డోర్ నెం.37-7-9/1	10,000/-	తేది.01.09.2025 నుండి 31.08.2028 వరకు
2	8 x 6= 84.8 చదరపు అడుగులు డోర్ నెం. 37-7-9/2	10,000/-	తేది.01.09.2025 నుండి 31.08.2028 వరకు
3	7 x 3 = 21 చదరపు అడుగులు డోర్ నెం. 37-7-9/3	5,000/-	తేది.01.08.2025 నుండి 31.07.2028 వరకు

1. ఈ వేలంపాటకు హిందూమతస్థులు టెండర్ దాఖలు చేయువారు టెండర్‌తో బాటు ప్రథమ ధరావత్తు సొమ్ము కార్యనిర్వహణాధికారి, శ్రీ సోమేశ్వర స్వామి వారి దేవస్థానం, సత్యానగర్, విశాఖపట్నం పేరున డిమాండ్ డ్రాఫ్ట్, ఆధార్ జెరాక్సు జతపరచవలెను. 2. వేలంపాట అనంతరం హెచ్చుపాటదారుడు వెంటనే 12 నెలలు లైసెన్సు ఫీజు సెక్యూరిటి డిపాజిట్ చెల్లించవలెను. మిగిలిన వివరాలకు మొబైల్ నెం.9966817143ను సంప్రదించండి.

పి.సత్యనారాయణమూర్తి, కార్యనిర్వహణాధికారి

శ్రద్ధాంజలి

శ్రీ జి. జగన్నాథ రావు
President
Port Employees Union
Visakhapatnam

విశాఖపట్నం పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు **శ్రీ గాజుల జగన్నాథ రావు** గారు తే॥ 19-07-2025 ది రాత్రి స్వర్గస్తులయ్యారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం ప్రసాధించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ H.M.S.

పోటీల్లో ప్రతిభకు ప్రశంసలు

అక్కిరెడ్డిపాలెం(నత్తయ్యపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలేనికి చెందిన మాజీ సైనిక ఉద్యోగి కొత్తపల్లి షణ్ముఖ రామకృష్ణను ఆదివారం మాజీ సైనికోద్యోగులు, గ్రామస్థులు, స్నేహితులు సత్కరించారు. జులై 13 నుంచి వైఎస్సార్ కడప జిల్లాలో జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీల్లో షణ్ముఖ రామకృష్ణ బంగారు పతకం సాధించారు. ఆయన ప్రతిభను పలువురు ప్రశంసించారు.

రామకృష్ణను అభినందిస్తున్న మాజీ సైనికోద్యోగులు, గ్రామస్థులు

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

అనాథ బాలలకు సాయహస్తం

గాజువాక, న్యూస్‌టుడే : సామాజిక సేవలో భాగంగా 69వ వార్డు తుంగ్లం ప్రాంతానికి చెందిన ప్రవాస భారతీయుడు సుధీర్‌రెడ్డి ఆదివారం గాజువాకలోని స్వర్ణ అనాథ బాలల ఆశ్రమం, లయోలా వృద్ధాశ్రమానికి రూ.65 వేల విలువ చేసే నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పలువురు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

బాలలతో ప్రవాస భారతీయుడు సుధీర్‌రెడ్డి తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: సమస్య : కణితిరోడ్డు నుంచి గొంతెనవానిపాలెం వెళ్లే అనుసంధాన రోడ్డు గోతులతో అధ్వానంగా ఉంది. -ఆనంద్, గాజువాక. సమాధానం : పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. -శేషాద్రి, జేఈ

?: జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీ ఎల్ఐజీ, ఎంఐజీ బ్లాకుల్లో పైపులైన్లు లీకై నీరు వృథాగా పోతోంది. -శ్రీనాథ్, 76వ వార్డు. ✔: సిబ్బందిని పంపి, మరమ్మతులు చేయిస్తాం. -కేదార్‌నాథ్, ఏఈ

మల్కాపురం, న్యూస్‌టుడే, ?: జీవీఎంసీ 62వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో మురుగు కాలువ వ్యవస్థ అధ్వానంగా ఉంది. -త్రినాథ్, స్థానికుడు ✔: ఎప్పటికప్పుడు శుభ్రత పనులు చేస్తున్నాం. కాలువల పునరుద్ధరణ పనులపై అధికారులకు ప్రతిపాదిస్తాం. -నవరత్నం, వార్డు పారిశుద్ధ్య అధికారి

సింధియా, న్యూస్‌టుడే, ?: పారిశ్రామిక ప్రాంతం పవనపుత్రనగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. -సన్నీ, స్థానికుడు ✔: పరిశీలించి కొత్త దీపాలు ఏర్పాటు చేయిస్తాం. -శ్రీనివాస్, విద్యుత్తు విభాగం సిబ్బంది

రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

'న్యూస్‌టుడే'తో అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.గోపీకృష్ణ

అగనంపూడి, న్యూస్‌టుడే: గాజువాక పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.గోపీకృష్ణ అన్నారు. ఇన్నాళ్లు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ పి.ఉష నరసాపురం ఆసుపత్రికి బదిలీ అవ్వడంతో.. సివిల్ సర్జన్‌గా సేవలు అందిస్తున్న గోపీకృష్ణ ఇటీవల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వ పరంగా అందిస్తున్న వైద్యసేవలు, ఆసుపత్రి అభివృద్ధికి చేపట్టబోయే కార్యాచరణపై ఆయన 'న్యూస్‌టుడే' ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ప్రశ్న: ఆసుపత్రిలో బాధితులకు వైద్య సేవలు ఎలా అందుతున్నాయి?

సమాధానం: అన్ని విభాగాల్లోనూ సమర్థులైన వైద్య నిపుణులు ఉన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సేవలు అందిస్తున్నాం. అయితే నూతన భవనాల నిర్మాణం పూర్తయితే మరిన్ని మౌలిక సదుపాయాలు సమకూరుతాయి.

?: అయిదేళ్లుగా నూతన భవన నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. జాప్యానికి కారణం ఏమిటి..?

✔: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులు విడుదల చేయడంతో గుత్తేదారు గత ఏడాది కాలంలో పనులు చకచకా పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే 80 శాతం పూర్తయ్యాయి. పరిపాలన, ఎంసీహెచ్ బ్లాకుల పనులు తుది దశలో ఉన్నాయి.

?: రోడ్డు ప్రమాద బాధితులకు అత్యవసర సమయంలో అవసరమైన పూర్తిస్థాయి చికిత్స అందిస్తున్నారా..?

✔: ప్రస్తుతానికి సెకండరీ గ్రేడ్ ఆసుపత్రిగా ఉండటంతో కొన్ని కేసులను కేజీహెచ్‌కు తరలించాల్సి వస్తోంది. ప్రధానంగా ఇక్కడ ట్రామాకేర్ కేంద్రం లేదు. ఎంఆర్ఐ, సీటీస్కాన్, ఇతర ఆధునిక వైద్య పరికరాలు లేవు. ఉన్నంతలో అత్యవసర సేవలు అందించి, వెంటనే కేజీహెచ్‌కు పంపిస్తున్నాం.

?: ప్రసూతి కేసులకు అందిస్తున్న సేవలు ఎలా ఉన్నాయి..?

✔: ఆసుపత్రిలో 24×7 ప్రసూతి సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నాం. రాత్రి సమయంలోనూ సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నాం. క్లిష్టమైన కేసులు తప్పితే మిగతా వాటికి ఆసుపత్రిలో ప్రసవాలు జరిపేలా చర్యలు తీసుకుంటున్నాం.

?: నేత్ర సంబంధిత సేవలు పూర్తిస్థాయిలో ఎందుకు అందడం లేదు..?

✔: గతంలో ప్రైవేటు సంస్థతో ప్రభుత్వం చేసుకున్న గడువు ముగియడంతో... ఆ సంస్థ సేవలు నిలిచిపోయాయి. ప్రస్తుతం నిపుణులైన నేత్ర వైద్యులు ఉండడంతో రోగులకు ఇబ్బంది లేకుండా వైద్యం అందిస్తున్నాం.

?: ఓపీ విభాగంలో రోగుల రద్దీ నియంత్రణకు చేపడుతున్న చర్యలు ఎలా ఉన్నాయి..?

✔: ప్రస్తుతం ఓపీ భవనం ఇరుకుగా ఉండటంతో రోగులకు కాస్త అసౌకర్యం కలుగుతున్న మాట వాస్తవమే. టాటా ట్రస్టు వారు షెడ్డు నిర్మాణానికి ముందుకొచ్చారు. నూతన భవనాలు అందుబాటులోకి వస్తే ఓపీ విభాగానికి విశాలమైన గదిని కేటాయిస్తాం. రోగులకు చీటీలు ఇవ్వడానికి అదనపు కౌంటర్లు అందుబాటులోకి తీసుకొస్తాం.

?: ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు ఎప్పుడు..?

✔: కమిటీ నూతన కార్యవర్గం ఎంపిక పూర్తయింది. త్వరలో వారితో ప్రమాణస్వీకారం చేయిస్తాం.

నిలువ నీడ లేక ఇక్కట్లు

దర్పణం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: పెదగంట్యాడ కూడలిలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇక్కట్లు తప్పడం లేదు. రోజూ ఉదయం కళాశాలకు వెళ్లే విద్యార్థులు, వివిధ సంస్థల్లో విధులకు వెళ్లే కార్మికులు, ఉద్యోగులు ప్రధాన రోడ్డు మలుపులో బస్సుల కోసం వేచి ఉంటున్నారు. ఎండైనా, వానైనా అక్కడే నిరీక్షించాల్సి వస్తోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నడుపూరు, హౌసింగ్ బోర్డుకాలనీకి తిరిగే సర్వీసులకు నిత్యం ప్రయాణికుల నుంచి మంచి డిమాండ్ ఉంటోంది. అయితే ఈ కూడలిలో నిలువ నీడ లేక.. స్థానిక దుకాణాల వద్ద, చెట్ల నీడ కింద బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, షెల్టర్ సదుపాయం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పెదగంట్యాడలో బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థులు

ఎల్ఈడీ దీపాల పునరుద్ధరణ

స్పందనకు వందనం

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాకలో పడకేసిన వీధి దీపాల సమస్యపై పలుమార్లు 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తలకు అధికారులు స్పందించారు. 64, 65, 73 వార్డుల్లో అదనపు సిబ్బందితో దీపాలకు మరమ్మతులు చేయించారు. అవసరమైన ఎల్ఈడీ, హైమాస్ట్ దీపాలను బిగించారు.

కమిటీ ఏర్పాటుపై అసంతృప్తి

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 86వ వార్డు తెదేపా నూతన కమిటీ నియామకంపై పార్టీ సీనియర్ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం వారంతా కూర్మన్నపాలెం సమీప ఆల్‌ఇండియా రేడియో స్టేషన్ ఎదురుగా ఉన్న ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. సీనియర్ నాయకుడు కర్రి ఈశ్వరరావు మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా నూతన కమిటీ నియామకం జరిగిందని, ఏకపక్షంగా ఏర్పాటు చేసిన కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీకి కంచుకోటగా ఉన్న వార్డులో విభేదాలపై అధిష్ఠానం దృష్టి సారించాలన్నారు. అనంతరం కమిటీ రద్దుకు సేకరించిన సంతకాల ప్రతిని కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావుకు అందజేశారు. ఈ అంశాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వార్డు నాయకులు బొడ్డ రమణ, రాజాన నాయుడు, ఆయూబ్, తుంపాల శ్రీను, శంకరరావు, మోహన్, కుమార్, శ్రీను, బేగం, లక్ష్మి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ కోటేశ్వరరావుకు వినతి అందజేస్తున్న వార్డు తెదేపా నాయకులు

ముస్లింలకు ప్రభుత్వం అండ: పల్లా

గాజువాక, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం 66వ వార్డు అజీమాబాద్‌లో రూ. 50 లక్షలతో నిర్మించనున్న ముస్లింల కబరిస్థాన్ ప్రహరీకి శంకుస్థాపన చేశారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పల్లా చెప్పారు. వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, మాజీ కార్పొరేటర్ ఎండీ రఫీ, వార్డు అధ్యక్షుడు గోమాడ వాసు, గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తదితరులు

సీఎం సహాయనిధి అందజేత

సింధియా (జవహర్‌నగర్), న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం 58వ వార్డు రామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న వై.వసంతకు సీఎం సహాయనిధిని మంజూరైంది. ఆదివారం వార్డు తెదేపా అధ్యక్షులు కోరాడ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాధితురాలి వైద్య ఖర్చులకు రూ.90 వేల ఆర్థికసాయం మంజూరు పత్రాన్ని అందజేశారు. కూటమి నాయకులు రాజేష్, శ్రీనివాస్, దుర్గాప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ధ్రువీకరణపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

● సమస్యల పరిష్కారానికి విన్నపం

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే : బీహెచ్‌పీవీ గ్రౌండ్ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డిని కలిశారు. గ్రౌండ్ సమస్యల పరిష్కారానికి విన్నవించి, అసోసియేషన్ తరపున నిర్వహించే కార్యక్రమాలకు సహాయ, సహకారాలు అందించాలన్నారు. సంఘం అధ్యక్షులు అనార్‌బాబు, కార్యదర్శి భాస్కర్, ప్రతినిధులు ప్రసాద్, రాము, దుర్గ, రాంబాబు, శశి, తదతరులు పాల్గొన్నారు.

● సాహిత్య పుస్తకాల అందజేత

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కు ఎస్సీ, ఎస్టీ సంఘం కార్యాలయానికి ఉక్కు సీనియర్ మేనేజర్ ఆర్‌టీఆర్.అంబేడ్కర్ ఆదివారం సాహిత్య పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ... ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన సంఘం సభ్యులకు రూ. 12వేలు చొప్పున చెక్కులు అందించామన్నారు. సభ్యులు మల్లయ్య, సత్యనారాయణ, కేవీ.రత్నం, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

● డ్రోన్‌తో నేరాల నియంత్రణ

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే : డ్రోన్‌తో నేరాల నియంత్రణ సాధ్యమని గోపాలపట్నం పోలీసులు అన్నారు. ఆదివారం కొత్తపాలెం పరిసర ప్రాంతాల్లో డ్రోన్ ఎగురవేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిని, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పారు.

● నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

గాజువాక, న్యూస్‌టుడే : పాత గాజువాక లంకా మైదానంలో ఎస్వీ ఎంటర్‌టెన్‌మెంట్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ఏడాది వినాయకుడిని లక్ష చీరలతో సుందర వస్త్ర గణపతిగా తీర్చిదిద్దుతామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆదివారం గాజువాకలో ఉత్సవ గోడపత్రికను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. నిర్వాహకుడు కొసిరెడ్డి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా, తదితరులు

బాధితులకు ఆర్థిక సాయం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఇటీవల జరిగిన ప్రమాదంలో పెదగంట్యాడ వాంబేకాలనీకి చెందిన శివకుమార్(28) చేయికి తీవ్ర గాయమై, చికిత్స పొందుతూ ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆదివారం వార్డు జనసేన, టీడీఎస్ ఫౌండేషన్ సభ్యులు అతడిని పరామర్శించి రూ.11,500 ఆర్థిక సాయం అందజేశారు. ప్రతినిధులు దిల్లీశ్వరరావు, అనిల్, శ్రీను, కార్తిక్, యశ్వంత్ పాల్గొన్నారు.

అగనంపూడి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 88వ వార్డు పరిధి దువ్వాడ సెక్టార్-1 కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ జి.కనకరాజు అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. అగనంపూడి పరిధి దిబ్బపాలేనికి చెందిన శ్రీ భావన రుషి మార్కండేయ సేవా సంఘం సభ్యులు స్పందించి.. బాధితుడికి రూ.12వేల నగదు, నెలకు సరిపడా నిత్యావసరాలు అందించారు. సంఘం అధ్యక్షుడు గుదే కృష్ణ, ప్రతినిధులు నుశీల గజేంద్ర రావు, రాంబాబు, పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

శివకుమార్‌కు నగదు అందజేస్తున్న యూత్ ప్రతినిధులు

27 నుంచి కిక్ బాక్సింగ్ పోటీలు

గాజువాక, న్యూస్‌టుడే : ఈనెల 27 నుంచి నగరంలో నిర్వహించే గ్రేటర్ విశాఖ డిస్ట్రిక్ట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల ట్రోఫీని ఆదివారం రాష్ట్ర కిక్ బాక్సింగ్ సంఘం గౌరవ అధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు ఆవిష్కరించారు. ఆదివారం పాత కర్నవానిపాలెంలో సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులకు, కోచ్‌లకు టీషర్ట్స్ అందజేశారు. పోటీల్లో గెలుపొందిన వారు అక్టోబరులో అసోంలో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధిస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. కిక్ బాక్సింగ్ సంఘం ప్రతినిధులు,కోచ్‌లు నూకరాజు, ప్రేమ్‌కుమార్, సతీష్, వర్మ, ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం చదరంగం పోటీలు నిర్వహించారు. ఛాంపియన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ చదరంగం క్రీడాదినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీలను న్యాయవాది అండిబోయిన లక్ష్మి ప్రారంభించారు. విద్యార్థుల్లో మేధాశక్తి మెరుగుదలకు చెస్ ఉపకరిస్తుందన్నారు. కార్పొరేటర్ బీఎన్. పాత్రుడు, నాయకులు అప్పారావు, కోచ్ పట్నాల శివ, నిర్వాహకులు శ్రీను, రాము, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రోఫీ ఆవిష్కరిస్తున్న నర్సింగరావు, కోచ్‌లు

వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియంలో..

ఇంకుడు గుంతల నిర్వహణతో మేలు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఇంకుడు గుంతల నిర్వహణతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, జీవీఎంసీ పరిధిలో సాధించిన ఫలితాలతో రూపొందించిన 'రెయిన్ హార్వెస్ట్ పిట్ గైడ్ బ్రోచర్'ను మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆదివారం 87వ వార్డు తిరుమల నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఉదయ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కేవీఎస్ ఆర్.మూర్తి, కార్యదర్శి దుర్గాప్రసాద్, తిరుమలనగర్ సంఘం ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందం తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతితో విషాదం

అగనంపూడి, న్యూస్‌టుడే : లంకెలపాలెం కూడలిలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రహదారి ప్రమాదంలో ఫార్మాసిటీ పునరావాస కాలనీ పరిధి లేమర్తి గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి(67) మృతి చెందడంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. లేమర్తికి చెందిన డాక్‌యార్డు విశ్రాంత ఉద్యోగి దాసరి లక్ష్మణరావు, భార్య ఆదిలక్ష్మి లంకెలపాలెంలోని శ్రీ రంగనగర్‌లో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తలు ఇద్దరూ కూర్మన్నపాలెం వెళ్లేందుకు కూడలిలో రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : రైల్వే ప్రయాణికుడు అదృశ్యమైన ఘటనపై ఆదివారం దువ్వాడ జీఆర్పీ ఎస్సై కేటీఆర్ లక్ష్మి తెలిపిన వివరాలివి. సోమనాథ్ రక్షిత్ (39) అనే వ్యక్తి ఈనెల 11న నంద్యాలలో యశ్వంతపూర్-హావ్‌డా రైలెక్కినట్టు కుటుంబ సభ్యులకు చరవాణిలో సమాచారం ఇచ్చాడు. 12న దువ్వాడ రైల్వేస్టేషన్‌లో దిగి కుటుంబీకులతో వీడియో కాల్‌లో మాట్లాడాడు. ఆ తర్వాత నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని, సోమనాథ్ ఆచూకీ తెలియడం లేదని అతని సోదరుడు జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన వ్యక్తి 5 అడుగుల ఎత్తు ఉంటాడని, పసుపు రంగు చొక్కా, నీలిరంగు జీన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు 73820 58996 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై లక్ష్మి సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : యాదవజగ్గరాజుపేట అభివృద్ధి అభ్యుదయ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గొంప వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా మాడిశ అప్పలనాయుడు, కోశాధికారిగా మాడిశ రాజు, మరో 10 మంది సభ్యులుగా ఎంపికయ్యారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం పాలనలో రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతుందని తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం 87వ వార్డు వడ్లపూడి ఈ-సేవ కేంద్రం సమీప సామాజిక భవనం ప్రాంగణంలో కార్పొరేటర్ బి.జగన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వైకాపా విధ్వంస పాలనలో గాడి తప్పిన రాష్ట్రాన్ని అన్ని విధాలుగా బాగు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం వార్డు పరిధిలో రూ.6 కోట్లతో చేపట్టే గెడ్డ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. సిద్ధార్థనగర్‌లో ఖాళీ స్థలాన్ని క్రీడా మైదానంగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ ప్రచారం చేయాల్సిన బాధ్యత శ్రేణులపై ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ శేషాద్రి, ఈఈ ఎంఆర్ఎస్ అప్పారావు, కార్పొరేటర్లు ముత్యాలనాయుడు, రౌతు శ్రీనివాస్, వార్డు నాయకులు విజయరామరాజు, ప్రకాష్, పెంటారావు, దానయ్య, అప్పారావు, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలో మేయర్ పీలా శ్రీనివాసరావు, తెదేపా నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి పినమడక కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని నిర్వాహకులు పేర్కొన్నారు. అమ్మ ఛారిటబుల్ ట్రస్టు, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని 85వ వార్డు తెదేపా అధ్యక్షుడు కర్రి దేశేంద్ర ప్రారంభించారు. వైద్య సిబ్బంది 105 మందికి పరీక్షలు నిర్వహించి, 21 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. అమ్మ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు జి.వెంకటరావు, తెదేపా నాయకులు ఇల్లపు ప్రసాద్, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మర్యాదపూర్వక కలయిక

గాజువాక, న్యూస్‌టుడే : గోవా గవర్నర్‌గా నియమితులైన పి.అశోక్‌గజపతిరాజును శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆదివారం విజయనగరంలో కలిసి అభినందనలు తెలిపారు. శాప్ కార్యకలాపాలు, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై గవర్నర్‌కు వివరించారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, విశాఖ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటిరాజు తదితరులు పాల్గొన్నారు.

అశోక్ గజపతిరాజుతో శాప్ ఛైర్మన్ రవినాయుడు, తదితరులు

బాలనటుడికి అభినందనలు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : నాయుడుతోట ప్రాంతానికి చెందిన బాలనటుడు అరుణ్‌దేవ్ ఇటీవల ఉత్తమ బాలనటుడిగా ఎంపికై గద్దర్ అవార్డు అందుకున్నాడు. ఆదివారం గోపాలపట్నం కళాసేవా పీఠం ఆధ్వర్యంలో అరుణ్‌దేవ్ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబును కలిశారు. ఈ సందర్భంగా బాలుడిని ఎమ్మెల్యే అభినందించారు. పీఠం సభ్యులు ఎన్.సోములు, సుబ్బారావు, బంగార్రాజు, రాజేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అరుణ్‌దేవ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ముగిసిన స్టీల్‌క్లబ్ ఉత్సవాలు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కునగరంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న స్టీల్‌క్లబ్ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన క్లబ్ అధ్యక్షులు, ఉక్కు జీఎం(హెచ్‌ఆర్)ఇంఛార్జి ఎం.మధుసూదనరావు మాట్లాడారు. ఐక్యంగా ఉత్సవాలను విజయవంతం చేసిన క్లబ్ సభ్యుల్ని అభినందించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆయా కళాకారుల్ని క్లబ్ నిర్వాహకులు సత్కరించారు. ఉక్కు జీఎం(యుటిలిటీస్) వి.చిట్టిబాబు, క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, సభ్యులు రవికుమార్, వేణుగోపాల్, నరసింహం, కృష్ణయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులతో ఉక్కు జీఎం మధుసూదనరావు, తదితరులు

అదనపు వేతనంతో ఊరట

అక్కిరెడ్డిపాలెం (బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే : జీవీఎంసీ 68వ వార్డు మింది సమీపంలోని అమెజాన్ గోదామును ఇటీవల పెందుర్తి దరి గుర్రంపాలేనికి మార్చారు. గాజువాక పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 140 మంది సిబ్బంది గోదాములో పని చేసేవారు. ఇప్పుడు వారంతా గుర్రంపాలెం వెళ్లి విధులు నిర్వహించడం కష్టంగా ఉండటంతో.. యాజమాన్య ప్రతినిధులు వారి స్థానంలో ఇతర సిబ్బందిని నియమించుకున్నారు. అయితే ఉద్యోగాలు కోల్పోయిన సిబ్బందికి అదనంగా 40 రోజుల వేతనం మంజూరు చేసేలా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీశ్ దంపతులు కృషి చేశారు. దీంతో ఆయా సిబ్బంది ఆదివారం అమర్‌నాథ్‌ను, కార్పొరేటర్ దంపతుల్ని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

లతీశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అమెజాన్ ఉద్యోగులు

స్మార్ట్‌మీటర్లతో భారం తప్పదు : సీపీఐ

కైలాస్‌నగర్ (గాజువాక), న్యూస్‌టుడే : స్మార్ట్‌మీటర్లతో వినియోగదారులకు భారం తప్పదని సీపీఐ గాజువాక సమితి నాయకులు ఆరోపించారు. ఆదివారం గాజువాక రైతుబజార్‌లో నిరసన ప్రదర్శన చేపట్టి, కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ, సభ్యులు వనజాక్షి, ఆనంద్, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

సింధియా(నెహ్రూనగర్) : విద్యుత్తు స్మార్ట్ మీటర్ల బిగింపును గతంలో వ్యతిరేకించిన కూటమి నాయకులు, ఇప్పుడు స్మార్ట్ మీటర్ల విధానానికి మద్దతు పలకడం సిగ్గుచేటని మల్కాపురం జోన్ సీపీఎం నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి అన్నారు. ఆదివారం 60వ వార్డు హనుమాన్ సంజీవకాలనీలో కార్యకర్తలు నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి.. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. పాతయాత్రలో కార్యకర్తలు కె.రమణ, ఎం.శ్రీనివాస్, ఎస్కే.సుభాని, రాజారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

60వ వార్డులో సీపీఎం కార్యకర్తల పాదయాత్ర

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : యువ ఉద్యోగులకు విశాఖ ఉక్కులో బంగారు భవిష్యత్తు ఉంటుందని, అందరూ క్రమశిక్షణతో పని చేయాలని ఉక్కు ట్రాఫిక్ విభాగం హెచ్‌ఓడీ డి.విజయకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉక్కునగరం తృష్ణ మైదానంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ విభాగం క్రికెట్ లీగ్ సీజన్-2ను ఆయన ప్రారంభించారు. క్రీడలతో ఉద్యోగులకు మానసిక ఉల్లాసం ఏర్పడుతుందన్నారు. ఒక్కరోజు నిర్వహించిన పోటీలు సాయంత్రానికి ముగియడంతో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విభాగం డీజీఎం ఎన్.శ్రీధర్, కార్మికులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, రామన్న, జగదీష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉక్కు ట్రాఫిక్ అధికారి విజయకుమార్

రైతుబజార్ల ప్రక్షాళనకు చర్యలు

సింధియా, న్యూస్‌టుడే : రైతుబజార్ల ప్రక్షాళనకు త్వరలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ మేరకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధమవుతోందని జిల్లా మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ పోతాబత్తుల శ్రీను అన్నారు. ఆదివారం ఆయన ములగాడ రైతుబజార్‌ను సందర్శించి క్రయవిక్రయాలపై ఆరా తీశారు. బజారులో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని, పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామన్నారు. నిర్ణీత ధరల కంటే అధికంగా అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట బజారు ఎస్టేట్ అధికారి జయసింహ, కూటమి కార్యకర్తలు రాము, పైడిరాజు, రామకృష్ణ, హరి తదితరులు పాల్గొన్నారు.

ములగాడ రైతుబజార్‌లో మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ పి.శ్రీను, తదితరులు

(c) eenadu

ఈనాడు
విజయనగరం
సోమవారం జులై 21, 2025

కన్నీటి ప్రసవంలో కాసుల వేట

☛ విజయనగరానికి చెందిన 20 ఏళ్ల గర్భిణి ఆరంభం నుంచి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రసవానికి ఘోష ఆసుపత్రిలో చేరుతానని చెప్పగా ప్రైవేటు వైద్యులు వద్దన్నారు. ఉమ్మ నీరు తగ్గిందని, కాన్పు కష్టమని చెప్పారు. ఇంతవరకు సమస్యలు లేవన్నారు కదా అని గర్భిణి ప్రశ్నించగా.. తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. డబ్బులు ఖర్చైనా పర్వాలేదని కుటుంబ సభ్యులు అప్పు చేసి అక్కడే శస్త్రచికిత్స చేయించగా రూ.1.70 లక్షలు తీసుకున్నారు.

2024-25లో నమోదు ఇలా..

ఆసుపత్రి	ప్రసవాలు	సాధారణ	శస్త్రచికిత్సలు
ప్రభుత్వ	20,272	14,424	5,848
ప్రైవేటు	20,501	11,999	8,502

– న్యూస్‌టుడే, విజయనగరం వైద్యవిభాగం

ఆందోళనకరంగా సిజేరియన్లు

అత్యవసర పరిస్థితుల్లో తల్లీబిడ్డను కాపాడేందుకు సిజేరియన్లు చేయాలి. కానీ ఇప్పుడు కాన్పు అంటేనే కోత శరణ్యంగా మారింది. కొన్ని ప్రైవేటు ఆసుపత్రులకైతే ఇది ఆదాయ వనరుగా మారిపోయింది. వివిధ రకాల కారణాలతో శస్త్రచికిత్సలకు ఒప్పించి లాభాల లెక్కలేసుకుంటున్నారు. సాధారణ ప్రసవానికి రూ.30 వేల వరకు, శస్త్రచికిత్స అయితే రూ.50 నుంచి రూ.70 వేలకు పైబడి వసూలు చేస్తున్నారు. వివిధ రకాల పరీక్షలు, గది అద్దె, మందుల ఖర్చులు అదనం.

'ఉమ్మడి జిల్లాలో సిజేరియన్లు జరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే తాజా గణాంకాల ప్రకారం దేశంలో అత్యధికంగా శస్త్రచికిత్సలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఏపీ మూడో స్థానంలో ఉంది. ఉమ్మడి విజయనగరం జిల్లా 65.10 శాతంతో రాష్ట్రంలో అయిదో స్థానంలో ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు'.

రిఫరల్‌కే మొగ్గు..

రెండు జిల్లాల్లో 85 పీహెచ్‌సీలున్నాయి. ఒక్కో ఆసుపత్రిలో ఇద్దరు, ముగ్గురు చొప్పున వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, ఆరోగ్య సహాయకులు, ఆశాలు, 108, 104 సిబ్బంది ఉంటారు. ఇంతమంది ఉన్నప్పటికీ సాధారణ ప్రసవాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. చాలావరకు రిఫరల్‌కే మొగ్గు చూపుతున్నారు. గతేడాది విజయనగరం జిల్లాలోని పీహెచ్‌సీల్లో 776 సాధారణ ప్రసవాలే జరిగాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వోలు భాస్కరరావు, జీవనరాణి తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులపై నిఘా పెంచుతామన్నారు.

ఆరోగ్యానికి ప్రమాదకరం

రక్తస్రావం, ఇన్‌ఫెక్షన్లు, అలర్జీలు, శక్తి సన్నగిల్లడం, ఒక్కోసారి గర్భసంచి తీసేయాల్సిన పరిస్థితి రావొచ్చు. బిడ్డల్లో శ్వాసకోశ, స్థూలకాయత్వానికి ఆస్కారం ఉంటుంది. తల్లిని విపరీతమైన నడుము నొప్పి, ఆందోళన, కోపం వంటి దీర్ఘకాలిక సమస్యలు వెంటాడుతాయని ఘోషా ఆసుపత్రి వైద్యుడు రవిచంద్ర తెలిపారు.

తవ్వేశారు.. ప్రమాదాలకు వదిలేశారు

విజయనగరం జిల్లా కేంద్రం సమీపంలోని గుంకలాం గ్రామం వద్ద కంకర కొండల పరిస్థితి ఇది. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ పెద్దఎత్తున ఇళ్ల పట్టాలిచ్చారు. ఈక్రమంలో చదును పేరుతో కొందరు వైకాపా నాయకులు ఇలా ఇష్టానుసారంగా కంకర తవ్వి, తరలించేశారు. రాత్రి, పగలు అని తేడా లేకుండా సాగిన తవ్వకాలతో ఆ ప్రాంతంలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అందులో నీరు చేరి, మడుగులను తలపిస్తున్నాయి. ఎవరైనా అటువైపు వెళితే మునిగిపోయే ప్రమాదముంది. హెచ్చరిక బోర్డులు పెడతామని, తవ్వకాలు జరగకుండా చూస్తామని ఎంపీడీవో జి.వెంకటరావు తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

అద్దె భవనంలో సిమెంటు బస్తాల పక్కన కూర్చున్న విద్యార్థులు

ఇదిగో అన్నారు.. ఇరుకున పెట్టారు

మెంటాడ మండలం రెడ్డివానివలసలోని ఎంపీఈపీ పాఠశాల విద్యార్థుల కష్టాలివి. పక్కా భవనం లేకపోవడంతో ఓ ఇంట్లో సిమెంటు బస్తాలు, నిర్మాణ సామగ్రి మధ్యలో పాఠాలు నేర్చుకుంటున్నారు. ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో నాడు- నేడు కింద రూ.35 లక్షలతో రెండు తరగతి గదులు మంజూరు కాగా.. తొలి విడతలో రూ.9 లక్షల పనులు చేశారు. బిల్లులు రాకపోవడంతో పునాదులు, పిల్లర్లు వేసి వదిలేశారు. ప్రస్తుతం ఇద్దరు ఉపాధ్యాయులు, 28 మంది బాలలు ఇరుకు గదిలోనే మగ్గిపోతున్నారు. కొత్త భవనాన్ని త్వరితగతిన నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి, పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామని ఎంఈవో వర్మరాజు తెలిపారు. – న్యూస్‌టుడే, మెంటాడ

అసంపూర్తిగా నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

నగరంలో కుండపోత

విజయనగరంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వీధులు, కాలనీలు, ప్రధాన రహదారుల్లో నీరు ఏరులై పారింది. సింహాద్రినగర్, ఐస్‌ఫ్యాక్టరీ కూడలి, సూర్యా ఆసుపత్రి దారి, రవీంద్రభారతి పాఠశాల, భగవాన్ నగర్, రింగురోడ్డు, దాసన్నపేట రైతు బజారు కూడలి, ధర్మపురి, పద్మావతినగర్, సిటీ స్టాండ్ తదితర ప్రాంతాలు చెరువులను తలపించాయి. గాలులకు పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. నీరు నిలవకుండా చూస్తామని కమిషనర్ నల్లనయ్య చెప్పారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ఐస్‌ఫ్యాక్టరీ కూడలి- సింహాద్రినగర్ దారిలో చేరిన నీరు

నేడు మంత్రి రాక

కొత్తవలస, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు మంగళపాలెం రానున్నారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో జరిగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

సాగునీరో నారాయణ!!

సంతకవిటి, న్యూస్‌టుడే: విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించే నారాయణపురం ఆనకట్ట అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎనిమిదేళ్ల కిందట రూ.100 కోట్లకుపైగా నిధులు మంజూరైనా గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వెనక్కి మళ్లాయి. దీంతో కాలువల ఆధునికీకరణ పూర్తికాక ఏటా పంట పొలాలు ఎండిపోతున్నాయి.

వాల్తేరు వద్ద అర్ధాంతరంగా నిలిచిన కాలువ లైనింగ్ పనులు

రూ.112.10 కోట్లు మంజూరు..

నాగావళి నదిపై 1960లో నారాయణపురం ఆనకట్ట, కుడి, ఎడమ ప్రధాన కాలువలను నిర్మించారు. నిర్వహణ కొరవడి కొన్నాళ్లకు శిథిలావస్థకు చేరుకున్నాయి. 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఆధునికీకరణకు రూ.112.10 కోట్ల జైకా నిధులు మంజూరు చేసింది. ప్యాకేజీ-1లో ఆనకట్ట, ఎడమ ప్రధాన కాలువకు రూ.62.46 కోట్లు, ప్యాకేజీ-2లో కుడి ప్రధాన కాలువకు రూ.49.46 కోట్లు వెచ్చించాలని భావించారు. 20 శాతం మేర పనులు చేసిన తర్వాత వైకాపా రావడంతో నిర్లక్ష్యం ఆవహించింది. అయిదేళ్లలో 15 శాతం ప్రక్రియ మాత్రమే జరిగింది. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు నిలిపేశారు. ఈక్రమంలో గడువు ముగిసి నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

చేయాల్సినవివీ..

ఆనకట్టపై ఉన్న 118 షట్టర్లను మార్చాలి. కాలువలపైన ప్రధాన రెగ్యులేటర్లు, స్కవర్ వెండర్లు, కాంక్రీటు వేపరాన్, రాతికట్టలను పునరుద్ధరించాలి. రెండు కాలువల్లోనూ పూర్తిస్థాయిలో పూడికతీత, లైనింగ్ చేపట్టాలి. గత ఎనిమిదేళ్లలో కుడి ప్రధాన కాలువ పరిధిలో 25 కి.మీ.లకు గానూ 3 కి.మీ. మాత్రమే లైనింగ్ జరిగింది. ఎడమ ప్రధాన కాలువలో 35 శాతం చేపట్టారు. కొన్నిచోట్ల కాంక్రీటు రక్షణ గోడలు, మదుములు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో కొత్తగా రూ.177 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని **జలవనరుల శాఖాధికారి పి.సుధాకర్** 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

మా ప్రతిభ విభిన్నం..

పోటీల్లో విజేయులం

నడవ లేని వారు పరుగెత్తారు.. చూపు లేని వారు లక్ష్యాలను చేరారు.. చేతులు, కాళ్లు పనిచేయకున్నా గుండెల నిండా ధైర్యంతో గెలిచి చూపారు.. తల్లిదండ్రులు ఓ వైపు, సంరక్షకులు, సహాయకులు మరోవైపు ఉంటూ ఉత్సాహ పరుస్తున్న వేళ విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో విభిన్న ప్రతిభావంతులు వివిధ రకాల క్రీడల్లో పోటీ పడ్డారు. పరుగు, షాట్‌పుట్, లాంగ్ జంప్, హైజంప్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రోలో తమ సత్తా చూపి ఔరా అనిపించారు. ఆదివారం ఉదయం ప్రారంభమైన పారా జూనియర్, సబ్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొని వచ్చేనెలలో హరియాణాలో జరగనున్న జాతీయస్థాయి టోర్నమెంటుకు ఎంపికయ్యారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి, జిల్లా గౌరవాధ్యక్షుడు కె.దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం క్రీడావిభాగం

పరుగు తీస్తున్న విభిన్న ప్రతిభావంతులు

లాంగ్‌జంప్‌లో దివ్యాంగుడి ప్రతిభ..

మహోన్నతమైన మహనీయునికి అశ్రుతాంజలి



జననం : 01-01-1942
మరణం : 12-07-2025

కీ॥శే॥ శంబంగి నాయనోరు కృష్ణమూర్తినాయుడు గారు
పక్కి గ్రామం, బొబ్బిలి మండలం

మంచితనానికి, మానవత్వానికి, ఆప్యాయత, ప్రేమానురాగాలకు ప్రతీకగా ఎంతోమంది పేదప్రజల కంటి వెలుగుగా వారి కంటి చూపు మెరుగుపరిచేందుకు ఆపరేషన్స్ చేసుకునేందుకు విశేష కృషిచేసి అనేక సామాజిక, రాజకీయ సేవలందించి అందరి హృదయాలలో సుస్థిరస్థానం సంపాదించుకున్న మీరు భౌతికంగా మా నుండి దూరమైనారన్న నిజం నమ్మలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : శంబంగి మహాలక్ష్మి

తమ్ముళ్లు : శంబంగి నాయనోరు సూరపునాయుడు
శంబంగి నాయనోరు శివున్నాయుడు

చెల్లెళ్లు : శ్రీమతి చింతల పార్వతి
శ్రీమతి గుల్లిపల్లి కళావతి

మరియు బంధుమిత్రులు

కుమారులు - కోడళ్లు - మనుమలు/మనుమరాండ్రు - మునిమనుమలు
కన్నంనాయుడు - కుమారి - నరేంద్ర-స్వప్న, భార్గవ్ - చి॥ దేవాన్ష్‌నాయుడు, తనిష్క
శ్రీరామమూర్తినాయుడు - సునీత - ప్రియాంక

కుమార్తె - అల్లుడు - మనుమలు
నడిమింటి అలివేలు - పరశురాంనాయుడు - ఈష్‌కుమార్, సంతోష్

పెద్దకర్మ : తే 21-07-2025 సోమవారం నాడు పక్కి గ్రామంలో మా స్వగృహము నందు జరుపబడును. సెల్ : 81061 51876, 77319 30270, 96669 82248

(c) eenadu

ఇక్కడ మోక్షం

మేఘాద్రి గెడ్డ వంతెనకు నిధులు మంజూరు

కొత్తవలస మండలం మంగళపాలేనికి సమీపంలోని మేఘాద్రి గెడ్డపై అసంపూర్తిగా ఉన్న వంతెన పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇక్కడి వారధిపై స్లాబ్ నిర్మించి సుమారు 1.4 కి.మీ. తారు రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నుంచి రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి. తెదేపా అధికారంలో ఉన్నప్పుడు వంతెనకు, బీటీ రోడ్డు నిర్మాణానికి అప్పట్లోనే రూ.కోటి మేర కేటాయించారు. వైకాపా అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత పనులు ప్రారంభమయ్యాయి. అనుసంధాన రహదారి, గెడ్డపై కాంక్రీట్ స్తంభాలు నిర్మించి వదిలేశారు. బిల్లులు అందక గుత్తేదారు పనులు ఆపేశారు. సుమారు రూ.70 లక్షల బిల్లు చెల్లించినా మిగతా పని పూర్తిచేయలేదు. ఈ పరిస్థితిపై 'ఈనాడు'లో వరుస కథనాలొచ్చాయి. దీని నిర్మాణం పూర్తయితే ఏడెనిమిది గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభమవుతాయి. గనిశెట్టిపాలేనికి సమీపంలో సబ్బవరం- కొత్తవలస- కె.కోటపాడు రోడ్డు నుంచి మంగళపాలెం మీదుగా కూడలిలో విశాఖపట్నం- అరకు జాతీయ రహదారిని చేరుకోడానికి ఈ వంతెన, రోడ్డు దోహదపడతాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే లలితకుమారి చొరవతో ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయి. వర్షాలు తగ్గితే పనులు చేయిస్తామని పంచాయతీరాజ్ డీఈ సీహెచ్.వి.స్వామినాయుడు చెప్పారు. - న్యూస్‌టుడే, కొత్తవలస

అక్కడ దైన్యం

తాండ్రంగి గోస్తనీ నదిపై కానరాని కాజ్‌వే

జామి మండలంలో తాండ్రంగి- తానవరం గ్రామాల మధ్య గోస్తనీ నదిపై కాజ్‌వే నిర్మించాలని స్థానికులు ఏళ్లుగా కోరుతున్నారు. ఈ ప్రాంతంలో నిర్మిస్తే సమీప గ్రామాలకు ఎస్.కోట మండలం దగ్గరవుతుంది. ప్రస్తుతం నదికి వరద వస్తే తాండ్రంగి వాసులు ఎస్.కోట వెళ్లాలంటే జామి మీదుగా సుమారు ఎనిమిది కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. గంట్యాడ, గజపతినగరం, బొండపల్లి మండలాల ప్రజలు ఎస్.కోట వెళ్లడానికి ఇది దగ్గర దారి. ఇంత ప్రాధాన్యమున్న ఈ ప్రాంతంలో కాజ్‌వే నిర్మించడానికి గత వైకాపా ప్రభుత్వం ముందుకు రాలేదు. నిధులు మంజూరయ్యాయని ప్రతి గ్రామసభలో అప్పటి ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు ప్రకటించినా నిర్మాణం జరగలేదు. ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు కూడా పలుమార్లు దీని గురించి వినతిపత్రాలు ఇచ్చారు. ఇటీవల సుపరిపాలన పర్యటనలో, కలెక్టరు ఈ గ్రామం సందర్శించినప్పుడు విజ్ఞప్తి చేశారు. దీనిపై పంచాయతీరాజ్ డీఈ స్వామినాయుడు వద్ద ప్రస్తావించగా.. తాండ్రంగి గోస్తనీ నదిపై కాజ్‌వే నిర్మించాలన్న స్థానికుల విజ్ఞప్తిని జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. అంచనాలు తయారు చేశామని, నిధులు మంజూరైతే పనులు చేపడతామని తెలిపారు. - న్యూస్‌టుడే, జామి

తానవరం సమీపంలో కాజ్‌వే నిర్మించాల్సిన స్థలమిదే

కలెక్టర్ ఆదేశాలూ పట్టించుకోరా..?

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని స్వయానా కలెక్టర్ ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికి నిదర్శనమే సాలూరు పట్టణంలోని బీసీ బాలురు కళాశాల వసతి గృహం. ఇక్కడ పది మరుగుదొడ్లు ఉండగా ఒక్కటే వినియోగంలో ఉంది. మిగిలినవి పైపులు, తలుపులు పాడవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ సమస్యపై గతనెల 18న 'ఈనాడు'లో 'మన్నీలే తలుపులై.. కన్నీళ్లే తలపులై' శీర్షికతో వార్త ప్రచురితమైంది. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ స్పందించారు. వెంటనే బాగు చేయాలని ఆదేశించారు. ఎస్టీ బాలిక వసతి గృహంలో రూ.1.50 లక్షలతో బాగు చేశారు. బీసీ వసతి గృహంలో తలుపులు బిగించి వదిలేశారు. దీంతో విద్యార్థులకు ఆరుబయటకు వెళ్తున్నారు. ఒకే గుత్తేదారుకు అన్నిచోట్లా పనులు అప్పగించడంతో జాప్యం జరిగిందని, త్వరలో పనులు చేయిస్తామని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇ.అప్పన్న తెలిపారు. - న్యూస్‌టుడే, సాలూరు

వినియోగానికి దూరంగా మరుగుదొడ్లు.. (అంతరచిత్రం) లోపల దుస్థితి

భూతాన్ని తరుముదాం.. ఆరోగ్యం పంచుదాం

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, పాలకొండ, సాలూరు

కూరగాయలు కొనాలన్నా.. చేపలు, మాంసం తీసుకురావాలన్నా.. ఇంటి నుంచి బయటకు వెళ్లాలన్నా చేతిలో పాలిథిన్ సంచులు ఉండాల్సిందే. ఇంట్లో ఉన్న ఎన్నో వస్తువులు ప్లాస్టిక్‌వే. వీటి వినియోగంతో సర్వ రోగాలు వస్తాయని తెలిసినా వదులుకోలేని స్థితికి చేరుకున్నాం. దూరంగా ఉంచితేనే ఆరోగ్యం సొంతం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిషేధం విధించాలని సూచిస్తున్నారు.

జిల్లా కేంద్రంలో వదిలేశారు..

పార్వతీపురం పట్టణంలోని 30 వార్డుల్లో 2,061 దుకాణాలు ఉన్నాయి. ఇళ్లు, దుకాణాల నుంచి రోజుకు 21 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. 3 టన్నుల వరకు పాలిథిన్, టన్ను కవర్లు ఉంటాయి. గతంలో బెలగాంలోని అన్న క్యాంటీన్ స్థలంలో చెత్తను వేరు చేసి ప్లాస్టిక్‌ను ఇతర ప్రాంతాలకు రవాణా చేసేవారు. కొన్నాళ్లుగా ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో డబ్బాలు, సంచులే కనిపిస్తున్నాయి.

సాలూరులో రూ.70 వేల జరిమానా..

సాలూరు పట్టణంలోని 29 వార్డుల నుంచి రోజుకు 18.5 టన్నుల చెత్తను సిబ్బంది సేకరిస్తున్నారు. 500 కిలోల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటాయి. పట్టణంలో నిషేధం అమల్లో ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు దుకాణ దారులకు రూ.70 వేల వరకు అపరాధ రుసుము విధించారు. వ్యర్థాలను డంపింగ్‌యార్డుకు తీసుకెళ్లి బెయిలింగ్ చేసి విక్రయిస్తూ నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం సంపాదిస్తున్నారు.

వరహాలు గెడ్డ వద్ద సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు

పాలకొండలో రెండేళ్లే నిషేధం..

పాలకొండ పట్టణంలోని 20 వార్డుల నుంచి రోజుకు 13 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. 2, 3 టన్నుల వరకు పాలిథిన్ ఉంటుంది. ఇక్కడ 2019 నుంచి రెండేళ్ల పాటు ప్లాస్టిక్‌పై నిషేధం అమలైంది. తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. దీనికి తోడు డంపింగ్‌యార్డు కూడా లేకపోవడంతో ప్లాస్టిక్‌ను వేరు చేసే ప్రక్రియ జరగడం లేదు. దీంతో పట్టణంలో ఎక్కడ చూసినా వ్యర్థాలే కనిపిస్తున్నాయి.

ఇలా చేస్తే మేలు.. ● చేపలు, మాంసం దుకాణాల వద్ద నార, వస్త్ర సంచులు, స్టీలు డబ్బాలు ఉండేలా యంత్రాంగమే చర్యలు చేపట్టాలి. ● టీ దుకాణాల్లో మట్టి, గాజు గ్లాసులు వినియోగించేలా చూడాలి. ● వేడుకల్లో ప్లాస్టిక్ సామగ్రి వినియోగం తగ్గించాలి. ● ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

అధికారుల మాట.. పురపాలక సంఘాల్లో ప్రైవేటు భవనాలు అద్దెకు తీసుకొని చెత్త, ప్లాస్టిక్ వేరు చేసే ప్రక్రియ ప్రారంభిస్తాం. పాలిథిన్‌పై నిషేధం విధించి ప్రజలకు అవగాహన కల్పిస్తాం. - వెంకటేశ్వర్లు, రత్నరాజు, బాలకృష్ణ, కమిషనర్లు, పారిశుద్ధ్య అధికారి, పార్వతీపురం, పాలకొండ, సాలూరు

నాడు నరకం.. నేడు సాఫీ ప్రయాణం

నాడు

ఒకప్పుడు వర్షం పడితే బురద మార్గంలో వెళ్లేందుకు జియ్యమ్మవలస మండలంలోని లోతువానివలస గ్రామస్థులు పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న నాథుడే లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధి హామీ నిధులు రూ.80 లక్షలు మంజూరు చేసింది. వీటితో జియ్యమ్మవలస ప్రధాన రోడ్డు నుంచి లోతువానివలసకు 1.5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డుతో పాటు మధ్యలో 6 కల్వర్టులు నిర్మించారు. ఇకపై హుషారుగా వెళ్తామని గ్రామస్థులు చెబుతున్నారు. త్వరలో రోడ్డు ప్రారంభిస్తామని పీఆర్ ఏఈ పార్థసాయి తెలిపారు. - న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

నేడు

బయోమెట్రిక్‌కు 1.14 లక్షల మంది దూరం

న్యూస్‌టుడే, విద్యావిభాగం, కొమరాడ

ఆధార్ నవీకరణకు కొరవడుతున్న స్పందన

ఆధార్ నవీకరణకు ప్రజల నుంచి స్పందన కొరవడుతోంది. అధికారిక గణాంకాలను బట్టి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ నెల 18తో నవీకరించుకోని వారి సంఖ్య 1.14 లక్షల మంది ఉన్నట్లు తేలింది. కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ నవీకరించుకోవడం తప్పనిసరి అని అధికారులు పదేపదే సూచిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్న సచివాలయాల్లో అందిస్తున్న నవీకరణ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

వయసు పెరిగిన కొద్దీ చేతి వేలిముద్రల్లో మార్పులు వస్తుంటాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో సమస్య రాకుండా నవీకరణను తీసుకొచ్చారు. ఆధార్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ 5-10, 11-17 ఏళ్లలో రెండు సార్లు ఆధార్ మేనేజర్ బయోమెట్రిక్ అప్‌డేషన్ (ఎంబియూ) చేసుకోవాలని నిర్దేశించారు. నవీకరణ చేసుకోవడంతో భవిష్యత్తులో వేలిముద్రల మ్యాచింగ్ సమస్య రాదు. డేటాబేస్‌లో కనీసం ఒక్కసారైనా నవీకరణ కాకపోతే సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం శాఖాపరంగా ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేషన్ ప్రక్రియను దఫదఫాలుగా నిర్వహిస్తోంది. ఈ నెలలో 15, 18 తేదీల్లో సచివాలయాల్లో నవీకరణ, ఆధార్ నమోదు చేపట్టారు. మళ్లీ మరోమారు ఈ నెల 22, 25 తేదీల్లో నిర్వహించనున్నారు. విజయనగరం జిల్లాలో 125 సచివాలయాల్లో సేవలు పొందవచ్చు.

కేంద్రంలో వేలిముద్ర వేస్తున్న మహిళ

జిల్లా	ఎంబియూ చేసుకోనివారు	ఆధార్ లేని ఏడాదిలోపు పిల్లలు
పార్వతీపురం మన్యం	39,972	191
విజయనగరం	74,160	373

ఏడాదిలోపు వారికీ..

పుట్టిన ప్రతి పిల్లవాడికీ ఆధార్ ఉండాలి. ఏడాదిలోపు బాలల్లో కొందరికి ఆధార్ లేదని ఇటీవల అధికారులు గుర్తించారు. రెండు జిల్లాల్లో వీరి సంఖ్య 563గా ఉంది. వీరిలో ఎక్కువ మంది విజయనగరం జిల్లాలో ఉన్నారు. వీరంతా నమోదు చేసుకోవాలి. పెండింగ్‌లో ఉన్నవారికి సచివాలయాల్లో నమోదు చేస్తున్నట్లు జిల్లా సచివాలయ అధికారిణి ఎస్.రోజారాణి 'న్యూస్‌టుడే'కు తెలిపారు, నమోదుతో పాటు నవీకరణ సేవలు పొందవచ్చన్నారు. సీఎస్‌సీ, తపాలా, బ్యాంకుల్లో కూడా సేవలను వినియోగించుకోవచ్చని సూచించారు.

సివిల్స్ అభ్యర్థులకు అండగా ఉంటా: ఎంపీ

మాట్లాడుతున్న కలిశెట్టి అప్పలనాయుడు, చిత్రంలో ఐవీపీ.రాజు తదితరులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: పార్లమెంటులో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ఇప్పటివరకు 89 ప్రశ్నలు వేసినట్లు చెప్పారు. ఆదివారం విజయనగరంలోని అశోక్ బంగ్లాలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన పార్లమెంటు పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో ఒక డిజిటల్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీల్యాడ్స్, దాతల సహకారంతో నిర్మిస్తామని, ఇందుకోసం భూసేకరణ జరుగుతోందన్నారు. ఇందులో యోగా కేంద్రం, సివిల్స్‌కు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం అన్ని రకాల సదుపాయాలు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. తెదేపా నాయకులు ఐవీపీ.రాజు, ప్రసాదుల వరప్రసాద్, కర్రోతు నర్సింగరావు, బ్రహ్మరాజు, సంతోష్‌కుమార్, భరత్, కనకల మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌కు శుభాకాంక్షల వెల్లువ

సత్కరిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు, తెలుగుయువత నాయకులు

విజయనగరం అర్బన్, కొత్తవలస, న్యూస్‌టుడే: గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతిరాజును ఆదివారం విజయనగరంలోని బంగ్లాలో శాప్ ఛైర్మన్ రవినాయుడు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అతనితో పాటు శాప్ డైరెక్టర్ బీవీఎస్ఎన్.రాజు, విజయనగరం పార్లమెంటరీ తెలుగు యువత అధ్యక్షుడు వేమలి చైతన్యబాబు, ప్రధాన కార్యదర్శి గొలగాన సురేంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోగిరి పైడిరాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మద్దిల ప్రవీణ్, నాయకులు రాజు నాయుడు, మాతా బుజ్జి, సంతోష్‌వర్మ, సతీష్ పాల్గొన్నారు. ★ మంగళపాలెంకు చెందిన శ్రీగురుదేవ ఛారిటబుల్ ట్రస్ట్ వైస్ ఛైర్మన్ డా.ఫణీంద్ర మర్యాద పూర్వకంగా కలిసి, సత్కరించారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

గణప్రసాద్ (పాతచిత్రం)

కొమరాడ, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉండగా గుండె నొప్పి రావడంతో కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కొమరాడ పోలీసు స్టేషన్‌లో గార్డుగా విధుల్లో ఉన్న కానిస్టేబుల్ గణప్రసాద్(41) శనివారం రాత్రి భోజనం అనంతరం శరీరంలో నలతగా ఉందని సహచరులకు చెప్పారు. తర్వాత ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే సిబ్బంది ప్రథమ చికిత్స చేసి అత్యవసర వాహనానికి సమాచారం అందించారు. స్టేషన్ నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న భార్య, ఇద్దరు కుమారులు ఆసుపత్రికి చేరుకొని విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మరో ఇద్దరికి గాయాలు

దామోదరరావు (పాతచిత్రం)

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో ఓ యువకుడు మృతి చెందగా, ఇద్దరికి గాయాలైన ఘటన పూసపాటిరేగ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై దుర్గాప్రసాద్ వివరాల మేరకు.. డెంకాడ మండలం దొడ్డుబాడువకు చెందిన డోల దామోదరరావు(27), కోరాడ నారాయణరావు, కోరాడ నాగభూషణరావు ద్విచక్ర వాహనంపై పూసపాటిరేగ వస్తుండగా కోనాడ కూడలి సమీపంలో అదుపు తప్పి బోల్తా పడి విభాగినిని ఢీకొట్టారు. దామోదరరావు అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఇద్దరికీ గాయాలయ్యాయి. వారిని నగరంలోని మహారాజా ఆసుపత్రికి తరలించారు. దామోదరరావుకు తండ్రి వెంకటరావు, తల్లి గంగమ్మ ఉన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

5,600 లీటర్ల ఊట ధ్వంసం

సామగ్రి చూపుతున్న పోలీసులు

కొమరాడ, పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్ర- ఒడిశా సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న సారా తయారీ కేంద్రాలపై అబ్కారీ ఇన్‌స్పెక్టర్ బి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. కొరాపుట్ జిల్లా బందుగాం బ్లాక్ పరిధిలో అలమండ, జగ్గగూడ, పల్లాడ కేంద్రాల్లో 5,600 లీటర్ల ఊటతో పాటు 400 లీటర్ల సారా ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం కొరాపుట్, బొబ్బిలి, సీతానగరం, పార్వతీపురం అబ్కారీ సిబ్బంది, విజయనగరం టాస్క్‌ఫోర్స్ పోలీసులు 51 మంది పాల్గొన్నారు.

మహిళకు వేధింపులు.. కేసు నమోదు

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: వివాహితను ఓ యువకుడు వేధిస్తుండడంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. పూసపాటిరేగకు చెందిన జి.లక్ష్మిని, శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం వంద్రంగి గ్రామానికి చెందిన సహిన క్రిష్ణ చైతన్య వేర్వేరు నంబర్లతో ఫోన్ చేసి వేధిస్తున్నాడు. అసభ్య పదజాలంతో దూషిస్తూ, ఎవరికైనా చెబితే ఆమె భర్తను హత్య చేస్తానని బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీతాఫలాలకు గిట్టుబాటేదీ?

వారపు సంతలో అమ్మకానికి తెచ్చిన సీతాఫలాలు

సీతంపేట, న్యూస్‌టుడే: మన్యంలో సీతాఫలాల సీజన్ ప్రారంభమైంది. సీతంపేట వారపు సంతకు ఆదివారం గిరిజనులు సీతాఫలాలను తీసుకొచ్చి, విక్రయించారు. ఒక్కో ట్రే రూ.700 నుంచి 800 లోపు చెల్లుబాటు అయ్యాయని అంటున్నారు. గతేడాది ఇదే సమయానికి ఒక్కో ట్రే రూ.1500 వరకు అమ్ముడుపోయాయని తెలిపారు. రానున్న రోజుల్లో ధర ఎలా మారుతుందో అని కలవరపడుతున్నారు. మరికొద్ది రోజుల్లో మన్యం సంతలకు ఈ పండ్లు భారీగా రానున్నాయి. ప్రోసెసింగ్ యూనిట్ మన్యంలో ఏర్పాటు చేస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశిస్తున్నారు.

మద్యం, పొగాకు విక్రయాలపై నిఘా

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, ప్రజాశాంతికి భంగం కలిగించినా, విద్యా సంస్థలకు వంద మీటర్ల పరిధిలో సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యా సంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయించే వ్యాపారులపై నిఘా పెట్టామని చెప్పారు. శనివారం ఒక్క రోజే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 255 మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

EENADU eClassifieds

JOBS

ప్రముఖ కంపెనీ Ephraimలో పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. జీతం నెలకు 21,000/- నుండి 45,000/- వరకు. Cell : 9704107303, 8008574616.

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 9014651068, 7075633416.

MARKETING/ SALES

Wanted PRO's/marketing staff for a reputed residential school in Vizag. No's: 9441225296, 7569534430.

SECURITY GUARDS

గరివిడిలో పనిచేయుటకు Security Guards కావలెను. 15,000/- Salary ఉచిత వసతి సదుపాయం కలదు. Contact No:9949826283, 8341732380.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
కేవలం 315 /-
(GST 5% అదనం)
మాత్రమే
సంప్రదించండి:
8008597609

నెల కిందట రూ.180.. ఇప్పుడు రూ.900

పార్కింగ్ రుసుములపై రైల్వే ప్రయాణికుల నిరసన

ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు వివరిస్తున్న ప్రయాణికులు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధి నిమిత్తం విజయనగరం రైల్వే స్టేషన్ నుంచి సుమారు 3 వేల మంది నిత్యం విశాఖపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో కొందరు నెల మొత్తానికి డబ్బులు చెల్లించి పాస్ తీసుకుంటారు. రోజూ ప్రయాణించే వారిలో నిరుపేద, మధ్యతరగతి ప్రయాణికులే అధికం. రైల్వే పార్కింగ్ గుత్తేదారు తీసుకున్న నిర్ణయం వారికి గుదిబండగా మారింది. గతంలో సైకిల్ పార్కింగ్‌కు 24 గంటలకు రూ.5లను ప్రస్తుతం రూ.20 చేశారని, ద్విచక్ర వాహనానికి రూ.12కు బదులు రూ.80 వసూలు చేస్తున్నారని ప్రయాణికుడు అరవింద్ తెలిపారు. నెల వారీ పార్కింగ్‌కు గతంలో రూ.180 ఉండేదని, ఇప్పుడు రూ.900 తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా రైల్వే స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రయాణికులు ఆదివారం విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజును కలిసి వినతిపత్రం ఇచ్చారు. అంతకు ముందు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, అనకాపల్లి, విజయనగరం ఎంపీలు సీఎం రమేష్, కలిశెట్టి అప్పలనాయుడును కలిసి వినతిపత్రాలు అందజేశారు. రైల్వే గుత్తేదారు తాజా నిర్ణయాన్ని మార్చుకోకపోతే న్యాయపోరాటం చేస్తామని ప్రయాణికులు పేర్కొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

చికెన్ ధరలు

రకం	బ్యాగ్‌లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	105	180	190

విద్యార్థులం.. సమాజ సేవకు సిద్ధం

న్యూస్‌టుడే, సీతానగరం

దేశభక్తి, క్రమశిక్షణతో పాటు సేవాగుణం పెంచేందుకు విద్యార్థులను స్కౌట్స్, గైడ్స్‌గా తీర్చిదిద్దుతున్నారు. దీనిలో భాగంగా మన్యం జిల్లాలో పలువురు బాలలకు శిక్షణ ఇచ్చారు. ముందుగా పీఎంశ్రీ పథకంలో ఉన్న పాఠశాలలను గుర్తించి బాల, బాలికలను ఎంపిక చేశారు. వీరికి 5 రోజుల పాటు అవగాహన కల్పించారు.

జోగింపేటలో ముగిసిన స్కౌట్స్, గైడ్స్ శిక్షణ

గుడారాలు ఏర్పాటు చేస్తున్న గైడ్స్

ప్రాణాలు కాపాడటమే లక్ష్యం..

బాలభటుల వ్యవస్థలో ప్రవేశ్, ప్రథమ, ద్వితీయ, తృతీయ, రాష్ట్రీయ విభాగాలను గుర్తించారు. పార్థన గీతాలు, జెండా ఆవిష్కరణ, వ్యాయామం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆపదలో ఉన్న వారిని ఆదుకొని ప్రథమ చికిత్స అందించడం, అగ్ని ప్రమాదాల్లో భవనాల్లో చిక్కుకున్న వారిని కాపాడటమే లక్ష్యంగా తర్ఫీదు ఇచ్చారు. గుడారాల ఏర్పాటు, కర్రలతో వంతెనల నిర్మాణంపై మెలకువలు నేర్పించారు.

క్రమశిక్షణ, మానసిక దృఢత్వం..

ఇక్కడ విద్యార్థులకు క్రమశిక్షణ, మానసిక, శారీరక దృఢత్వం పెంపొందేలా నిపుణులు రజియా బేగం, నాగేశ్వరరావు, నారాయణ మూర్తి, చిన్నంనాయుడు, విజయ్‌కుమార్ సూచనలు అందించారు. ఈ కేంద్రంలో శిక్షణ పొందిన 88 మంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి మిగిలిన వారికి రోజూ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది.

వీరికి శిక్షణ.. : జిల్లాలోని 19 పీఎంశ్రీ పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో వీరఘట్టం, గాదెలవలస, గరుగుబిల్లి, చినమేరంగి, బలిజిపేట, పాంచాలి, మక్కువ, పాలకొండ ఉన్నత, మక్కువ, భామిని, సాలూరు ఆదర్శ, నర్సిపురం, అన్నవరం ప్రాథమిక, కొమరాడ, రేగిడి, హడ్డుబంగి, కురుపాం గురుకుల, బెలగాం, డబ్బివీధి బాలికల పాఠశాలలు ఉన్నాయి. ఆయా విద్యాలయాల నుంచి 48 బాలురు, 40 మంది బాలికలను ఎంపిక చేసి జోగింపేట పంపించారు.

మిగిలిన వారికి నేర్పిస్తాం

శిక్షణ కేంద్రంలో దేశభక్తి గేయాలు, జెండా వందనం, పెట్రోలింగ్, తాళ్లతో ముడులు వేయడం, ప్రథమ చికిత్స గురించి వివరించారు. ఇన్నాళ్లు వీటిని ప్రత్యక్షంగా చేయలేదు. శిక్షణ బాగుంది. మిగిలిన వారికి నేర్పిస్తాం. - వర్షిణి, మణిశ్రీ, భవ్యశ్రీ, దుర్గ

సంప్రదాయాలపై అవగాహన

శిక్షణలో దేశ సంస్కృతి, సంప్రదాయాల గురించి వివరించారు. వరదలు, అగ్ని ప్రమాదాల్లో బాధితులను రక్షించే విధానాలు ఆసక్తి రేపాయి. కొండలు, గుట్టల్లో చిక్కుకున్న వారిని తాళ్ల సాయంతో కాపాడటంపై అవగాహన వచ్చింది. - సాయిసుధీర్, సంపత్‌కుమార్, రిత్విక్, మోహన్ వంశీ, ప్రేమ్‌చంద్, స్కౌట్స్

పాఠశాలల్లో కొనసాగించాలి

జోగింపేటలో శిక్షణ పొందినవారు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు నేర్పించాలి. వారి ఆసక్తి ఆధారంగా 12, 24, 32 మంది చొప్పున బృందాలుగా ఏర్పడి కార్యక్రమాలు నిర్వహించవచ్చు. సామాజిక సేవ, నాయకత్వ లక్షణాలు పెంచడమే లక్ష్యంగా తర్ఫీదు ఇచ్చాం. - జె.నారాయణస్వామి, జిల్లా కార్యదర్శి, భారత్ స్కౌట్స్, గైడ్స్

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

చినుకులు పడక పంటలు పండక..


బీటలు వారిన పొలం

గజపతినగరం, న్యూస్‌టుడే: వర్షాభావ పరిస్థితులు రైతును దెబ్బతీస్తున్నాయి. గజపతినగరం మండలంలో తగినంత వర్షాలు లేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మదుపల్లి గ్రామంలో గత వారంలో కురిసిన కొద్దిపాటి వర్షంతో వరినాట్లు వేయగా.. రెండు రోజుల్లో తడి పూర్తిగా ఎండిపోయింది. భూమి బీటలు వారుతోంది. దీంతో అన్నదాత వాపోతున్నారు. మండలంలో నేరుగా వరిసాగు (వెదజల్లే) కూడా నీటి ఎద్దడిని ఎదుర్కొంటోంది. మదుపాడ ప్రాంతంలో నారు మడులు ఎండిపోతున్నాయి. నారు చివరి భాగం ఎర్రగా మారిపోతోంది. ప్రస్తుతం నీటి ఎద్దడి ఉందని, రైతులకు సూచనలు చేస్తామని ఏవో కిరణ్‌కుమార్ తెలిపారు.

యూరియా అందక ఇబ్బందులు

మెరకముడిదాం, న్యూస్‌టుడే: మండలంలో యూరియా అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ ఎస్కేలకు, పీఏసీఎస్‌లలో సొసైటీలకు సంపూర్ణంగా యూరియా సరఫరా కాలేదు. మిగిలిన సొసైటీలకు సరఫరా చేసిన బస్తాలు కూడా పక్కదారి పట్టాయి. మార్కెట్లో వ్యాపారులు యూరియా బస్తాను రూ.400 నుంచి రూ.500 వరకు అమ్ముతున్నారు. ఆర్ ఎస్కేలకు యూరియా కావాలని జిల్లా వ్యవసాయ అధికారులకు నివేదిక ఇచ్చామని ఏవో శ్రావణతేజ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

ప్రసంగిస్తున్న కిషోర్‌కుమార్

రోటరీ క్లబ్ సేవలు విస్తృతం

రాజాం, న్యూస్‌టుడే: ప్రపంచ వ్యాప్తంగా రోటరీ సేవలు అందిస్తోందని పూర్వ జిల్లా గవర్నర్, రోటరీ సౌత్ ఇండియా పబ్లిక్ ఇమేజ్ చైర్మన్ చెరుకుపల్లి కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. రాజాంలోని కళ్యాణ్ ఇన్ సమావేశ మందిరంలో రాజాం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరై మాట్లాడారు. శాంతి, సేవాభావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పోలియో రహిత సమాజం కోసం రోటరీ అంతర్జాతీయంగా పనిచేసి లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపిందని సహాయ గవర్నర్ ఎస్.నరసింగరావు వివరించారు. సీఏ కె.అశోక్‌కుమార్ క్లబ్‌ను ప్రశంసించారు. రాజాం క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు గట్టి పాపారావు, వసంతరావు, ఉపాధ్యక్షుడు బీబీ అప్పలనాయుడు తదితరులు ప్రమాణం చేశారు.

మహిళకు కరపత్రం అందిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

యువత ఉపాధికి పరిశ్రమల ఏర్పాటు

గజపతినగరం, న్యూస్‌టుడే: యువత ఉపాధికి ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి రప్పిస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గజపతినగరం మండలంలోని ఋమ్మిడిపల్లి గ్రామంలో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మాట్లాడారు. పింఛన్ల అమలులో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఏఎంసీ అధ్యక్షుడు గోపాలరాజు, తెదేపా మండల అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మక్కువ శ్రీధర్, జి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

'ఏడాదిలో ఎంతో చేశాం'

తెర్లాం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేసిందని, మరి కొన్ని త్వరలో అమలు చేయబోతోందని ఎమ్మెల్యే బేబీనాయన, బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆదివారం గొలుగువలసలో నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి, పథకాల గురించి వివరించారు. ఏఎంసీ ఛైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, వెంకటేశ్వరరావు, జి.లలిత, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన, తెంటు

హామీ ఇచ్చారు.. అవస్థల్లో వదిలేశారు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి నియోజకవర్గంలో రైల్వే సమస్యలతో ప్రయాణికులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. రూ.కోట్లతో రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నా వెతలు తొలగలేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు దృష్టికి రైల్వే సమస్యలు తీసుకెళ్లారు. పరిష్కరిస్తామని హామీలు ఇచ్చినా కార్యాచరణ లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.

రైల్వే శాఖ అనుమతి లేక జరగని రహదారి నిర్మాణం

గత ప్రభుత్వ నిర్వాకంతో రైల్వే సమస్యల తిష్ఠ

ఇవిగో.. ఇబ్బందులు

❖ సుమారు 3,300 మంది పేదలకు జగనన్న కాలనీలో ఇళ్లు మంజూరు చేశారు. ఇక్కడ మధ్యలో రైల్వే ట్రాకు ఉండటంతో రహదారి వేసేందుకు ఆ శాఖ అధికారుల అనుమతులు ఉండాలి. అవి లేక నిర్మాణానికి నోచుకోలేదు. ఈ కాలనీ పక్కనే 2,400 మంది కోసం తలపెట్టిన టిడ్కో గృహాలు కూడా ఉన్నాయి.

❖ గతంలో బొబ్బిలిలో రైల్వే యార్డు ఉండేది. ఇక్కడ నుంచి వ్యాగన్లలో సరకులు రవాణా అయ్యేవి. 2,000 మంది కార్మికులకు ఉపాధి దొరికేది. రైల్వే విస్తరణ పనుల్లో భాగంగా యార్డును ఎత్తేశారు. ఉపాధి పోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే బేబినాయన దృష్టికి సమస్య తీసుకెళ్లారు.

❖ రాజామహల్‌కు వెళ్లే రైల్వే గేటు ఇరుగ్గా ఉంది. వాహనాలు ఎదురెదురుగా వస్తే ఇబ్బందే. రహదారి విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు

❖ విస్తరణ పనుల్లో భాగంగా మల్లంపేట నుంచి రాచ్చెరువలసకు వెళ్లే దారులు ఇరుగ్గా మారాయి. భవనాలు నిర్మిస్తున్నారు. రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారి విస్తరణ చేపట్టాలి.

❖ మల్లంపేట గ్రామంతోపాటు పట్టణంలోని పలు సామాజికవర్గాలకు చెందిన శ్మశాన వాటికలు రైల్వే ట్రాకును అనుసరించి ఉన్నాయి. దారులు మూసివేయడంతో సమస్య ఏర్పడింది. వాటికి మార్గం చూపించాలి.

❖ స్టేషన్‌లో పాదచారుల పాత వంతెన తొలగించి కొత్తది నిర్మించారు. ఇది ఎత్తుగా ఉండటంతో వయో వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. లిఫ్టు సౌకర్యం కల్పించాలి.

❖ బాడంగి మండలం డొంకినవలస గ్రామానికి దూరంగా రైల్వే స్టేషన్ ఉంది. రైల్వే గేటు వద్ద గంటల కొద్దీ నిరీక్షణతో ఇబ్బందులు వస్తున్నాయి. ఇక్కడ వంతెన నిర్మించాల్సి ఉంది.

డీఆర్ఎం దృష్టికి తీసుకెళ్తా

బొబ్బిలి నియోజకవర్గంలో రైల్వే సమస్యలను తెలుసుకున్నాం. ఎమ్మెల్యే బేబినాయన కూడా మా దృష్టికి తీసుకొచ్చారు. త్వరలో రైల్వే డీఆర్ఎంకి ఇబ్బందులు వివరించి, పరిష్కరించేందుకు కృషి చేస్తాం. దశల వారీగా చర్యలు తీసుకుంటాం.
– కలిశెట్టి అప్పలనాయుడు, ఎంపీ, విజయనగరం

గిరిజనులకు బియ్యం అందజేస్తున్న ఎస్సై సీతారాం

ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలి

మెంటాడ, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాల్లోని బాలబాలికలు ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలని, ప్రభుత్వం అందజేస్తున్న విద్యా సౌకర్యాలను అందిపుచ్చుకోవాలని ఆంధ్ర ఎస్సై కె.సీతారాం అన్నారు. ఆదివారం రాత్రి మెంటాడ మండలంలోని కొండపర్తి గ్రామాన్ని సందర్శించి గిరిజనులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని వృద్ధులకు బియ్యం, యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. గ్రామస్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సారూ.. ఎలా వెళ్లమంటారు!

ఎం.గుమడాం గ్రామ ప్రధాన వీధిలో బోరు బావి, విద్యుత్తు స్తంభం ఉన్నాయి. మధ్యలో ఉన్న వాటిని గత ప్రభుత్వ హయాంలో నాయకులు అలానే ఉంచి రహదారి నిర్మించారు. బోరుబావి చుట్టూ ఉన్న ప్లాట్‌ఫారం, రహదారి చివరలో విద్యుత్తు స్తంభం వల్ల కనీసం ద్విచక్ర వాహనం సాఫీగా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. నాలుగు చక్రాల వాహనాల పరిస్థితి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. విద్యుత్తు స్తంభాన్ని తొలగించాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఏఈ కృష్ణ అన్నారు. – న్యూస్‌టుడే, గజపతినగరం

ఈ భవనాలకి మోక్షమెప్పుడో

చీపురుపల్లి మండలం బైరెడ్డిపేటలో ఒకటో అంగన్‌వాడీ, పెదనడిపల్లి ఎస్సీకాలనీ కేంద్రాలు అసంపూర్తిగా ఉన్నాయి. గత తెదేపా హయాంలో ఉపాధి హామీ నిధులతో వీటిని చేపట్టారు. అప్పట్లో ఒక్కో భవన నిర్మాణానికి రూ.8 లక్షలు కేటాయించారు. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం.. గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో పూర్తిచేయలేదు. సమస్యను పీఆర్ జేఈఈ ఎస్.హరికృష్ణ వద్ద ప్రస్తావించగా గతంలో నిర్మించి, అసంపూర్తిగా ఉన్న భవనాలపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదని, ఆదేశాలు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. –న్యూస్‌టుడే,చీపురుపల్లి గ్రామీణం

శివారుకు సాగునీరు పారేనా?

బోనంగి మీదుగా వసాది, రామభద్రపురం గ్రామాలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నెలకొంది. తాటిపూడి జలాశయం నీరు ఇటీవల విడుదల చేశారు. కానీ కొన్ని గ్రామాల పరిధిలోని కాలువలు మాత్రం తుప్పలతో అధ్వానంగా ఉన్నాయి. అధికారులు పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై తాటిపూడి జలవనరుల శాఖ ఏఈ హేమకుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. తుప్పలు తొలగిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

'ఉద్యోగులు నష్టపోతున్నారు'

బొబ్బిలి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57ను 2003కు ముందు నియామకం పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేసి పాత పింఛను వర్తింపజేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కౌన్సిలర్ జేసీ రాజు డిమాండు చేశారు. ఆదివారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్రం మెమో జారీ చేసినా రాష్ట్రం ఏళ్లు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. 2003కు ముందు నియామకం పొందిన ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రవీణ్ కుమార్, చిన్నారావు, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

బొబ్బిలి, న్యూస్‌టుడే: వచ్చే నెల విజయనగరంలో జరగనున్న ఐద్వా 9వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షురాలు కె.పుణ్యవతి కోరారు. ఆదివారం వీటికి సంబంధించిన గోడపత్రికలను సిటు కార్యాలయంలో ఆవిష్కరించారు. పీడిత ప్రజల సమస్యల కోసం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం పోరాటం చేస్తోందన్నారు. దీనిపై మహాసభలో చర్చిస్తామని చెప్పారు. పార్వతి, రాములమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సిమెంటు అందజేత

చీపురుపల్లి, న్యూస్‌టుడే: గుర్ల మండలం గరికివలసలో రామాలయం నిర్మాణానికి తెదేపా బీసీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ముల్లు రమణ 70 బస్తాల సిమెంట్‌ను పెద్దలు నారాయణ, సత్యం తదితరులకు ఆదివారం అందజేశారు.

వీధి దీపాలను బాగు చేయండి

తెర్లాం, న్యూస్‌టుడే: డి.గదబవలసలో గత కొన్ని నెలలుగా వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామ పెద్దలు చెబుతున్నారు. రాత్రయితే చీకట్లో తిరుగుతున్నారని పేర్కొన్నారు. సర్పంచి జి.రమేష్, కార్యదర్శి ఆదినారాయణను వివరణ కోరగా.. పంచాయతీలో నిధుల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: మరడాం గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన మర్రివలస సమీపంలో ఆదివారం జాతీయ రహదారిపై కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. విశాఖపట్నం జిల్లా పీఎం పాలెం గ్రామానికి చెందిన బి.అనిల్ కుమార్ తన అత్తవారి గ్రామమైన రామభద్రపురం మండలం మిర్తివలస వెళ్లి తిరిగి స్కూటీపై వస్తుండగా కారు ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గజపతినగరం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఎస్.బూర్జవలస ఏఎస్ఐ బీవీ రమణ కేసు నమోదు చేశారు.

స్పందనకు వందనం

గోతుల పూడ్చివేత

బొండపల్లి, న్యూస్‌టుడే: దేవుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో 'గోతులు కప్పురా' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు గోతులు పూడ్చారు. చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించారు.

రహదారికి మరమ్మతులు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: చిలకపాలెం- రాయఘడ ప్రధాన రహదారిలోని పారాది మెట్టవలస, గొర్లెసీతారాంపురం గ్రామాల వద్ద పాడైపోయిన చోట్ల మరమ్మతు పనులు చేపట్టారు. ఇటీవల 'ఈనాడు'లో వచ్చిన కథనాలతో ఎమ్మెల్యే బేబినాయన, ర.భ శాఖ అధికారులు స్పందించారు. వెంటనే నిధులు మంజూరు చేయాలని కలెక్టరును కోరగా రూ.10 లక్షలు కేటాయించారు. దీంతో పనులు ప్రారంభించారు. పాడైపోయిన చోట్ల తవ్వి కొత్తగా పిక్కరాయి, తారు వేస్తున్నామని ఏఈ వివరించారు.

అందుబాటులోకి బోరు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: పిల్లపేటలో మరమ్మతులకు గురైన చేతిబోరుకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. ప్లాట్‌ఫారం నిర్మించారు. దీనిపై 'ఈనాడు' 'మేమున్నాం... మీకు తోడుగా'లో ఇటీవల వచ్చిన వార్తకు ఏఈ ఐ.రామకృష్ణ స్పందించారు.

ప్లాట్‌ఫారం నిర్మాణం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధి రాజుపేటలో తాగునీటి బోర్ల చుట్టూ ఎట్టకేలకు ప్లాట్‌ఫారం నిర్మించారు. ఇక్కడ వాడుక నీరు తిరిగి బోరులోకి వెళ్లిపోవడంపై పలుమార్లు ఈనాడులో వచ్చిన కథనాలకు పంచాయతీ కార్యదర్శి ఉమా స్పందించారు.

కొత్త దీపాల ఏర్పాటు

వంగర, న్యూస్‌టుడే: శివ్వాం గ్రామంలో వారం రోజులుగా ఇంటి దీపాలు వెలగకపోవడంపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 'ఈనాడు'లో వార్త ప్రచురణ య్యింది. స్పందించిన ఎంపీడీవో రఘునాదథాచారి ఆ గ్రామంలో కొత్త దీపాల్ని ఏర్పాటు చేశారు.

వంతెనల బాగుకు చర్యలు

తెర్లాం, న్యూస్‌టుడే: వంతెనల బాగుకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్అండ్‌బీ డీఈఈ వెంకటరావు చెప్పారు. 'ఆదమరిస్తే అంతే' శీర్షికతో జూన్ 23న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు స్పందించారు. ఆర్అండ్‌బీ నిర్వహణ నిధులతో పణుకువలస అడ్డురోడ్డు ఎత్తుఖానా వంతెన రక్షణగోడను బాగు చేస్తామన్నారు. ఏఈ అప్పలరాజు, వర్క్స్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, ధర్మారావుతో కలిసి పరిశీలించారు.

వ్యర్థాల తొలగింపు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: పెదవేమలి శివారు వీధి కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను ఎట్టకేలకు తొలగించారు. ఇక్కడ సమస్యపై గతనెల 26న 'ఈనాడు'లో 'ప్రధాన వీధులు మురుగు కూపాలు' శీర్షికన వచ్చిన కథనానికి స్పందించారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి ఎన్‌జీవో హోంలో ఆదివారం పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం బొబ్బిలి తాలూకా యూనిట్ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా సంఘ జిల్లా కోశాధికారి పీఎం రవి కుమార్, పరిశీలకులుగా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీరాములు వ్యవహరించారు. అధ్యక్షుడిగా బి.శ్రీనివాసులనాయుడు, ఉపాధ్యక్షురాలిగా బి.ఉమాదేవి, కోశాధికారిగా కృపాల్, సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ రామినాయుడు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉద్యోగ సంఘం ఎన్నిక

బాడంగి యూనిట్ సభ్యులు

బాడంగి, న్యూస్‌టుడే: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘం ఎన్నిక ఆదివారం బాడంగిలో జరిగింది. అధ్యక్షుడిగా యడ్ల శ్యామలరావు ఏకగ్రీవంగా రెండోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా డి.వి.ఎస్ శ్రీలత, సెక్రటరీగా కె.రవి, జాయింట్ సెక్రటరీగా తెంటు రాంబాబు, ట్రెజరర్‌గా వై.వేణు నాయుడు తదితరులు ఎన్నికయ్యారు. జిల్లా ఏపీఎన్జీవో సెక్రటరీ ఆవు సురేష్, చింతాడ మురళి, ఆల్తి రమణ తదితరులు పాల్గొన్నారు.

దేశమ్మ తల్లి.. దీవించవే

గుడికి సారెతో వెళ్తున్న భక్తులు

రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం మేజర్ పంచాయతీ గొర్లె వీధి, రెడ్డిక, మహంతి వీధుల్లో ప్రజలు ఆదివారం దేశమ్మతల్లి వారాల పండగ ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

గ్రామ దేవత ఉత్సవాలు

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పురపాలికలోని డోలపేటలో గ్రామ దేవత ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పుట్టల పోలమ్మ, దేశాలమ్మతల్లి, దుర్గమ్మలకు గ్రామస్థులు మొక్కుబడులు చెల్లించారు. మహిళలు నైవేద్యం సమర్పించి చల్లగా దీవించండమ్మా అంటూ పూజలు చేశారు. మంగళవారం బురదలపోలమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. గ్రామస్థులంతా ఏకమై ప్రతిష్ఠాత్మకంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

ఉచితంగా నృత్య శిక్షణ

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి శ్రీ వేంకటేశ్వర వైభవ్ ఆలయంలో ఆదివారం చిన్నారులకు ఉచితంగా నృత్యం నేర్పించారు. నిడగల్లు, నారాయణప్పవలస, గొల్లపల్లి, అప్పియ్యపేట ప్రాంతాల బాలికలు పాల్గొన్నారు. రెండు గంటలపాటు సాధన చేశారని డాన్స్ మాస్టర్ ఇ.కరుణ్ కుమార్ తెలిపారు.

సాధన చేస్తున్న బాలికలు

సంపులో మొక్క తొలగించరూ

సంతకవిటి, న్యూస్‌టుడే: జావాం గ్రామం వద్ద నాగావళి నదిలో ఏర్పాటు చేసిన సమగ్ర రక్షిత మంచినీటి పథకం పైపులైన్‌కు సంబంధించి కొండగూడెం వద్ద ఉన్న ఎయిర్ వాల్వు సంపు ఇది. ఈత చెట్టు పెరిగి, పెద్దవుతోంది. ఇలాగే వదిలేస్తే సంపు పాడైపోయే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు. పెద్దది కాక ముందే తొలగించాలని కోరుతున్నారు. చర్యలు తీసుకుంటామని గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఏఈ సంతోష్‌కుమార్ అన్నారు.

సాహిత్యం.. సామాజిక అవసరం

ప్రసంగిస్తున్న చింతకింది కాశీం

రాజాం, న్యూస్‌టుడే: సాహిత్యం సామాజిక అవసరమని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రిన్సిపల్ చింతకింది కాశీం పేర్కొన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రారవే ఆధ్వర్యంలో కో-కన్వీనర్ పిల్లా తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సాహిత్య సదస్సులో 'సమాజం-సాహిత్యం-సాంస్కృతిక చైతన్యం' అనే అంశంపై మాట్లాడారు. విమర్శలు సృజనకారుడికి మేలు చేస్తాయని, ఇది ఉత్తమ సాహిత్యానికి దోహదపడుతుందన్నారు. రచయితలు సహజత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. బాలసుధాకర్‌మౌళి రచించిన 'కున్నెమ్మ- మరికొన్ని కథలు' సంపుటిని ఆవిష్కరించారు. గంటేడ గౌరునాయుడు, మజ్జి మదన్‌మోహన్, ఎస్.స్వామినాయుడు, డి.రామచంద్రరావు, ఆర్.గణపతిరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో క్విజ్ పోటీలు

బాలురకు బహుమతులు అందజేస్తున్న డీడీ అన్నపూర్ణ

గంట్యాడ, బొండపల్లి: న్యూస్‌టుడే: విద్యా ప్రమాణాలు మెరుగుపరచడం, పిల్లల్లో పఠనాశక్తి పెంచడమే లక్ష్యంగా ఎస్సీ వసతి గృహ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని సంబంధిత శాఖ డీడీ అన్నపూర్ణ అన్నారు. ఆదివారం గంట్యాడ వసతి గృహ బాలురకు నిర్వహించిన క్విజ్ పోటీలను తిలకించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీతత్వం వల్ల పిల్లల్లో ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. ఇకపై ప్రతి 3వ ఆదివారం అన్ని వసతి గృహాల్లో క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. సంక్షేమాధికారి గోవింద సన్యాసిరావు, సిబ్బంది పాల్గొన్నారు. బొండపల్లి ఎస్సీ వసతి గృహాన్ని అన్నపూర్ణమ్మ పరిశీలించారు. సంక్షేమాధికారిణి లక్ష్మి ఉన్నారు.

'సృజనాత్మకతకు దోహదపడటం లేదు'

బొబ్బిలి, న్యూస్‌టుడే: విద్యార్థుల సృజనాత్మకతకు దోహదపడే విధంగా ప్రభుత్వ విధానాలు లేవని ఆచార్యులు డాక్టర్ కె.పద్మ అన్నారు. ఆదివారం ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో 'వైజ్ఞానిక దృక్పథంతోనే నూతన ఆవిష్కరణలు సాధ్యం' అనే అంశంపై జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. ప్రస్తుత విద్యా రంగంలో సైన్సుకి, సూడో సైన్సుకి వ్యత్యాసం గమనించి ప్రచారంలోకి తీసుకెళ్లాలని వెల్లడించారు. ఈ ఏడాది సెప్టెంబరులో జరగనున్న మహాసభలు విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు వెంకటరావు, ప్రధాన కార్యదర్శి రమణప్రభాస్ కోరారు. సాహితీ ప్రవంతి రాష్ట్ర కార్యదర్శి దివాకర్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి, ప్రిన్సిపల్ పురుషోది, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న కె.పద్మ

ఆగిన లారీ.. నిలిచిన వాహనాలు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మెట్టవలస, పారాది గ్రామాల మధ్యలో ఆదివారం సుమారు రెండు గంటలపాటు వాహనాలు నిలిచిపోయాయి. మధ్యలో ఒక లారీ మరమ్మతులకు గురికావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీంతో దారి లేక వాహనాలు ఇరువైపులా నిలిచిపోయాయి. పోలీసులకు సమాచారం అందడంతో లారీని పక్కకు తీసి రాకపోకలకు పునరుద్ధరించారు. ఎప్పటికప్పుడు ఇక్కడ ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

(c) eenadu

విజయనగరం

●విజయనగరం ●నెల్లిమర్ల ● ఎస్.కోట

ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం

మంత్రి శ్రీనివాస్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఏఎంసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డైరెక్టర్లు

విజయనగరం వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు సూచనలతో ఈ నెల 30న మధ్యాహ్నం 3 గంటలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి ముహూర్తం నిర్ణయించినట్లు ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా నియమితులైన కర్రోతు నర్సింగరావు, బొబ్బాది చంద్రరావులు తెలిపారు. ఆదివారం జిల్లా మంత్రి శ్రీనివాస్‌ను కలిసి ముఖ్య అతిథిగా రావాలంటూ ఆహ్వానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు హుస్సేన్, తాతయ్య పాల్గొన్నారు.

సుపరిపాలనే కూటమి లక్ష్యం

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: సుపరిపాలన అందించడమే కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం కొట్టాంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. వర్షంలోనూ ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమాలను వివరించారు. డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ఇ.సుబ్బలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు జీవన్ నాయుడు, నాయకులు రెడ్డి వెంకన్న, రెడ్డి అప్పలసత్యం తదితర నాయకులు పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	8008574326
భోగాపురం	70959 54646

? స్థానిక లక్ష్మీగణపతికాలనీ-2, నాయుడు కాలనీ నాలుగెస్సుల డిగ్రీ కళాశాల దారిలో వర్షం పడితే నీరు నిలిచిపోతోంది. - రామచంద్రరావు, లక్ష్మణ్

● పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - పి.నల్లనయ్య, కమిషనరు, నగర పాలక సంస్థ

? స్థానిక దాసన్నపేట, రింగ్‌రోడ్డు, గెడ్డవీధి మెయిన్ రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. - అప్పలనాయుడు, సూర్యనారాయణ

● సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటాం. - ప్రశాంతి, ఏఈ, నగర పాలక సంస్థ

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

? మధుపాడలో ప్రధాన రహదారి మరమ్మతులకు గురై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - అయ్యలరావు, మధుపాడ

● ఈ రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. పనులు మంజూరైన వెంటనే రహదారి నిర్మాణాలు ప్రారంభిస్తాం. - నందకుమార్, ఆర్అండ్‌బీ జేఈ

? జొన్నవలస శివారులో నీటి సరఫరా తక్కువగా ఉంటుంది. ఇబ్బందులు తలెత్తుతున్నాయి. - స్థానికులు

● ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తాం. - ఆర్.రవి, కార్యదర్శి

– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

కూల్చారు.. కట్టడం మరిచారు..!

కొత్తవలస, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్సీ) రూపు రేఖలు మార్చేస్తామని ప్రగల్భాలు పలికిన వైకాపా రోగులకు, సిబ్బందికి ఇబ్బందులే మిగిల్చింది. కొత్త భవనాలు మంజూరు చేసినా బిల్లుల విడుదలలో జాప్యం కారణంగా ఎక్కడివక్కడే ఉన్నాయి. పాతవి కూల్చేయడంతో అద్దె భవనాల్లో అవస్థలు ఎదుర్కొంటున్నారు.

అసంపూర్తిగా నిలిచిన పీహెచ్‌సీ భవనాలు

వియ్యంపేటలో పొదల్లో అసంపూర్తి భవనం

బిల్లు చెల్లించక..

ఎస్.కోట నియోజకవర్గంలో అయిదు పీహెచ్‌సీలకు కొత్త భవనాలు మంజూరు చేశారు. కొత్తవలసలో రూ.179.67 లక్షలతో కొత్త భవన నిర్మాణానికి 2023లో శంకుస్థాపన చేశారు. దీంతో పాతది కూల్చేశారు. ఎన్జీవోల సామాజిక భవనంలో ఆరోగ్య కేంద్రం నిర్వహిస్తున్నారు. సిబ్బందికే వసతి సరిపోవడం లేదు. రోగుల పరిస్థితి దయనీయం. అత్యవసర సేవలకు కష్టాలు తప్పడం లేదు. గుత్తేదారుకు దాదాపు రూ.36.31లక్షల బిల్లు బకాయి ఉండడంతో స్లాబ్ వరకు చేసిన తర్వాత ఆపేశారు.

❖ జామి మండలం అలమండపీహెచ్‌సీ రూ.166.97 లక్షలు మంజూరవగా 2020 సెప్టెంబరులో శంకుస్థాపన చేశారు. స్లాబ్, గోడల వరకు పనులు జరిగాయి. బిల్లులు చెల్లించక ఆపేశారు.

ఈనాడు పరిశీలన

ఇంకా పాత భవనంలోనే..

జామిలో రూ.184.36 లక్షలతో, లక్కవరపుకోటలో రూ.166 లక్షలతో పనులు ప్రారంభించగా దాదాపు చివరకు చేరుకున్నాయి. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఫ్లోరింగ్, విద్యుత్తు, తలుపులు బిగించి అందుబాటులోకి తీసుకురావడమే తరువాయి. వాటిని ఇంకా పూర్తి చేయకపోవడంతో పాత భవనంలో వైద్య సేవలు కొనసాగుతున్నాయి.

ఇద్దరు గుత్తేదార్లు మారినా

కొత్తవలస మండలం వియ్యంపేటలో రూ.160 లక్షలతో 2022లో ప్రారంభించారు. మొదటి గుత్తేదారు పని చేయకపోవడంతో ఒప్పందం రద్దుచేసి మరొకరికి అప్పగించారు. ఆయన స్లాబ్ వరకు చేసి ఆపేశారు. పాత భవనాలు కూల్చేయడంతో ఎదురుగా ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో పీహెచ్‌సీ నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

జామి, లక్కవరపుకోటలో చివరి దశలో ఉన్నాయి. కొత్తవలస, వియ్యంపేటలో స్లాబ్ స్థాయిలో ఉన్నాయి. అలమండలో గోడల వరకు జరిగాయి. గత ప్రభుత్వ హయాంలోనే పనులు ఆపేశారు. బిల్లుల బకాయి ఉంది. దీనిపై ప్రభుత్వానికి నివేదించాం.

– శ్రీనివాసరావు, డీఈఈ, ర.భ.శాఖ, శృంగవరపుకోట

వాన కురిస్తే ముంపే

జాతీయ రహదారిపై నిలిచిపోయిన వర్షపు నీరు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రం, నాలుగైదు మండలాలకు విద్య, వైద్యానికి ప్రధాన దిక్కు అయిన ఎస్.కోట పట్టణం చిన్నపాటి వర్షం కురిసినా ముంపునకు గురవుతోంది. ఆక్రమణదారులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు చేసిన తప్పులకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ పరిధిలోని జాతీయ రహదారికి ఆనుకుని దుకాణాలు, భవనాలు నిర్మించడంతో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. పుణ్యగిరి గెడ్డ విస్తరణ తగ్గడంతో నీరు పొంగి రోడ్డు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలోకి చేరుతోంది. గతంలో కల్వర్టు ద్వారా నీరు కిందకు వెళ్లేది. కిందవైపు జిరాయితీ భూమి యజమానులు కాలువ మూసేయడంతో సమస్య ఉత్పన్నమైంది. ఆక్రమణ తొలగింపుపై ఈవోపీఆర్‌డీ బీవీ లక్ష్మి మాట్లాడుతూ స్థలం జాతీయ రహదారుల సంస్థకు కావడంతో తాము నోటీసు ఇవ్వలేకపోతున్నామన్నారు. ఎన్‌హెచ్ జేఈ సురేష్ ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలని తహసీల్దార్ శ్రీనివాసరావుకు లేఖ రాయగా తమ పరిధి కాదని చెబుతున్నారు. దీంతో ఆక్రమణలు తొలగడం లేదు. కాలువ తవ్వకానికి ఉపాధి నిధులు రూ.30లక్షలు మంజూరైనా పనులు చేయడం లేదని పలువురు చెబుతున్నారు.

హామీల అమలులో విఫలం

విజయనగరం పట్టణం, నెల్లిమర్ల: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆదివారం ధర్మపురిలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో మాట్లాడారు. మేయరు వి.విజయలక్ష్మి, ఫ్లోర్ లీడరు రాజేష్, బంగారునాయుడు, ఆశపు వేణు పాల్గొన్నారు. నెల్లిమర్లలో ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జడ్పీటీసీ గదల సన్యాసినాయుడు కార్యక్రమం నిర్వహించారు.

లీకవుతున్నా.. పట్టించుకోరేం..!

ఎస్.కోట మండలం బొడ్డవరలో బస్టాండు వెనుక మూడు నెలలుగా పైపులైను లీకై నీరు వృథాగా పోతోంది. డ్రైనేజీ ఉండడంతో నీరు కలుషితమై రోగాల బారిన పడుతున్నామని అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులన్నారు. తాటిపూడి రిజర్వాయరు పైలట్ ప్రాజెక్టు నుంచి ఈ పైపుల ద్వారానే గ్రామానికి తాగునీరు సరఫరా అవుతుంది. పరిశీలించి చర్యలు తీసుకుంటామని రక్షిత మంచినీటి విభాగం జేఈ సత్యకిశోర్ అన్నారు. – న్యూస్‌టుడే, శృంగవరపుకోట

గుంతల దారిలో అవస్థలు

విజయనగరం మండలంలోని గుంకలాం నుంచి ఓంపల్లి వెళ్లే రోడ్డు దుస్థితి ఇది. గతంలో బీటీ రోడ్డు వేసినా, నిర్వహణ లేక అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడే భారీ గుంతలు పడడంతో వాటిలో వర్షపునీరు చేరుతోంది. దీంతో ప్రయాణికులు, చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. పరిశీలించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో వెంకటరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

కల్వర్టులు నిర్మించరూ..!

ఎస్.కోట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు వరకు జాతీయ రహదారి పక్కన కాలువలో పూడిక తీసేందుకు కల్వర్టులను తొలగించారు. వెంకటేశ్వర థియేటర్ నుంచి ఎరుకుల వీధిలోకి, కాంప్లెక్సు ఎదురు వీధికి వెళ్లే మార్గంలోనూ తవ్వేశారు. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పంచాయతీ ఈవో అనురాధ వద్ద ప్రస్తావించగా వెంటనే కల్వర్టుల నిర్మాణం చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, శృంగవరపుకోట

సీనియర్ నాయకులకు సన్మానం

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: నెల్లిమర్ల నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషిచేస్తున్న సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావును ఆదివారం అశోక్ బంగ్లాలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అభినందించారు. పూసపాటిరేగ ఏఎంసీ నూతన ఛైర్‌పర్సన్ గేదెల గాయత్రి ఎన్నికైన సందర్భంగా మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ ఆమెను సత్కరించారు. నాయకులు బి.వెంకటరమణ, పి.రాజప్పన్న, టి.సత్యనారాయణ, నల్లం శ్రీనివాసరావు, రేగాన రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో శిక్షణ తరగతులు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ఐఎఫ్‌టీయూ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను వచ్చే నెల 2, 3 తేదీల్లో నెల్లిమర్లలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక అమరవీరుల భవనం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కె.అప్పలసూరి, నెల్లిమర్ల జూట్‌మిల్లు కార్మిక సంఘం అధ్యక్షుడు ఎన్.తిరుపతిరావు, నాయకులు ఈశ్వరరావు, చింతల లక్ష్మి, వి.పార్వతి, పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లైంట్ అయినా గోపాల్ కుమార్ అగర్వాల్ తండ్రి లేట్ ఇంద్రసేన అగర్వాల్ తేదీ 20-05-2025న ఆర్టీసీ బస్టాండ్‌లో నల్లటి హ్యాండ్ బ్యాగ్ పోయినది. అందులో డాక్యుమెంట్ నెంబర్ 3713/1989 మరియు 145/1993 గల డాక్యుమెంట్స్ కలవు. ఎవరికైనా దొరికినచో కింద నెంబర్‌కి అడ్రస్‌కు అందజేయగలరు. అందజేసిన వారికి తగిన బహుమానం ఇవ్వబడును. ఇట్లు

Puvvada Anjaneya Vardhan
B.Com.,B.L.,
ADVOCATE
Kotha Agraharam, VIZIANAGARAM.

నీట మునిగిన రోడ్డు పరిశీలన

శృంగవరపుకోట: పట్టణంలోని పెందుర్తి-బొడ్డవర 516బీ జాతీయ రహదారిని డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. రోడ్డు ముంపునకు గురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆయన ఎంపీడీవో, తహసీల్దార్లుతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యపై కలెక్టరు అంబేడ్కర్‌కు వివరిస్తానన్నారు. సోమవారం డీపీవో మల్లికార్జునరావు, అధికారులు పరిశీలిస్తారని ఎంపీడీవో సతీష్ తెలిపారు.

'రోజాపై వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'

విజయనగరం పట్టణం: మాజీ మంత్రి ఆర్‌కే రోజాను కించపరుస్తూ నగరి శాసనసభ్యుడు గాలి భానుప్రకాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మేయరు వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయరు కోలగట్ల శ్రావణి అన్నారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేటర్లు బాలి పద్మావతి, పిన్నింటి కళావతి, ఆల్తిసత్యకుమారి, తాళ్లపూడి సంతోషి పాల్గొన్నారు.

ఏజెన్సీలో మౌలిక వసతులకు వినతి

విజయనగరం అయ్యన్నపేట: పార్వతీపురం మన్యం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకరరావును సీపీఎం నాయకుడు ఎం.కృష్ణమూర్తి కోరారు. ఆదివారం విజయనగరం క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిశారు.

క్రీడాకారులకు మెరుగైన వసతులు

క్రీడాకారులతో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. ఆరో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ద్వితీయస్థానంలో నిలిచిన క్రీడాకారులను ఆదివారం అభినందించారు. జిల్లా బాక్సింగ్ ఛైర్మన్ ఐవీపీ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అవనాపు విజయ్, భార్గవి, కార్యదర్శి లక్ష్మణ్, శిక్షకుడు సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

బాధితుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే లోకం మాధవి

భోగాపురం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. ఆదివారం అమటాంలో పర్యటించారు. గ్రామానికి చెందిన ఎన్.నర్సింహులుకు మంజూరైన రూ.60వేలు సీఎం సహాయనిధి చెక్కు అందజేశారు. కొయ్యావానిపాలెంలో వేర్నికోస్ వ్యాధితో బాధపడుతున్న బంగారప్పడుకు రూ.10వేలు అందించారు.

నగరంలో వెలుగులు

కొత్తగా 40 దీపాలు వేయడంతో వెలుగులీనుతున్న రాజారావు మేడ దారి

నగరపాలికలో పరిస్థితి ఇది..

వాట్‌లు	దీపాల సంఖ్య
20	13,589
30- 36	3636
60- 72	1424
90	390
110	600
190	453

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం నగరపాలక సంస్థలో ఒకప్పుడు చీకట్లు రాజ్యమేలేవి. ఏ వీధికెళ్లినా దీపాలు కనిపించేవి కాదు. దీంతో దొంగతనాలు చోటుచేసుకునేవి. ప్రమాదాలకు ఆస్కారం ఉండేది. కొన్నేళ్లుగా ఆ పరిస్థితి మారింది. గతంలో తెదేపా హయాంలో ఈఈఎస్ఎల్ సంస్థతో ఒప్పందం మేరకు పెద్దఎత్తున దీపాలు వేశారు. 2023తో గడువు ముగియడం, గత వైకాపా ప్రభుత్వ హయాంలో సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో సంస్థ వెనకడుగు వేసింది. ఈక్రమంలో స్థానికంగా శ్రీసిరి కన్‌స్ట్రక్షన్స్‌కు బాధ్యతలు అప్పగించారు. మెటీరియల్ అందజేయంలో జాప్యం జరగడంతో విమర్శలొచ్చాయి. కూటమి రాకతో పరిస్థితి మారింది. నేరుగా కౌన్సిల్ రంగంలోకి దిగడంతో నగరం వెలుగులీనుతోంది.

కొత్తగా ఇలా..

800 వరకు కొత్తవి వేసేందుకు ఇటీవల చర్యలు తీసుకున్నారు. రోడ్డు విస్తరణ జరిగిన అంబటి సత్రం దారిలోని రాజారావు మేడ మార్గంలో ఇప్పటికే 40 ఏర్పాటు చేశారు. ఇక్కడున్న ఆరు హైమాస్ట్‌లకు ఇవి అదనం. ఎప్పటికప్పుడు మరమ్మతులతో పాటు ఫూల్‌బాగ్ రోడ్, అలకనందా కాలనీ, కుసుమగజపతినగర్, శ్రీరామనగర్, అయ్యకోనేరు దక్షిణ గట్టు తదితర ప్రాంతాలు, ముఖ్య కూడళ్లు, శివారు ప్రాంతాల్లో బిగిస్తున్నారు. ప్రస్తుతం నగర వ్యాప్తంగా 20 వేలకు పైగా దీపాలుండగా.. పర్యవేక్షణకు ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు కమిషనర్ నల్లనయ్య తెలిపారు.

అవీ..ఇవీ..అన్నీ

మహా రుద్రాభిషేకం

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: మండలంలోని చోడమ్మ అగ్రహారంలో ఆదివారం శివ భక్తులు మహా రుద్రాభిషేకం, వైభవోపేతంగా నిర్వహించారు. పూజలు చేశారు. తెదేపా నాయకులు పిళ్ల లక్ష్మీనారాయణ, పిళ్ల శ్రీరాములు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రామన్నపాలెంలో పోలీసుల మోహరింపు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ రామన్నపాలెం వద్ద ఆదివారం భారీగా పోలీసులను మోహరించారు. రైతులు సాగు చేసుకుంటున్న భూములు జిందాల్ భూసేకరణలో ఉన్నాయని రెవెన్యూ అధికారులు చెప్పడంతో వారు అక్కడికి వస్తారని తెలియడంతో వెళ్లినట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు.

రేషన్ డీలర్ల సంఘంలో జిల్లా నాయకులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన కె.ఉమాశంకరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విజయనగరానికి చెందిన సీహెచ్ రామారావు ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో వీరిని ఎన్నుకున్నారు. దివ్యాంగుల విభాగంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ వెంకటరమణ ఎన్నికయ్యారు.

మృతుడి వివరాలు లభ్యం

భోగాపురం: మండలంలోని జాతీయ రహదారిపై శనివారం ఓ కారు ఢీకొట్టడంతో మృతి చెందిన వ్యక్తి వివరాలు లభ్యమైనట్లు ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు. ఆయన పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామానికి చెందిన దాసరి అప్పన్న(66)గా గుర్తించామన్నారు. మతిస్థిమితం బాగోలేక శనివారం శ్రీకాకుళం వైపు వెళ్తుండగా కారు ఢీకొని మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. వీఆర్వో మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఆధ్యాత్మిక గీతాల పోటీలకు స్పందన

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ప్రముఖ భారతీయ తత్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రంలో ఇన్నర్ వీల్ క్లబ్, శ్రీక్షేత్రం సంయుక్తంగా నిర్వహించిన ఆధ్యాత్మిక గీతాల పోటీల్లో 50 మంది చిన్నారులు పాల్గొన్నారు. విజేతలను శ్రీక్షేత్రం ధర్మకర్త దుర్గా బాలాజీ, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రవ్వ మంజు, కృష్ణవేణి, మండపాక రవి, శారద అభినందించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి ఊరేగింపు

సుబ్రహ్మణ్య స్వామి జన్మనక్షత్రం సందర్భంగా ఆదివారం నగరంలోని ఫూల్‌బాగ్ వల్లీదేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామి కావడి ధరించి భక్తులు 'శరవణ్ భవ' అంటూ ఊరేగింపులో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

రైతుబజారు తరలింపు సరికాదు

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న శంకరరావు, నాయకులు

వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: నగరంలో ఎంఆర్‌హెచ్ రైతుబజారు స్థలం రాజావారిది కాదని, బ్రిటీష్ కాలం నుంచి ప్రభుత్వ స్థలమని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. ఆదివారం రైతుబజారు వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 1922 నుంచి 1995 వరకు ఇక్కడ మహారాజా ప్రభుత్వ ఆసుపత్రి కొనసాగిందని, 1995లో ఆసుపత్రిని వేరే చోటుకు తరలించడంతో 1999 వరకు ఖాళీగా ఉందన్నారు. న్యాయం కోసం సోమవారం చలో కలెక్టరేట్ నిర్వహిస్తామన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాసరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

డయేరియా కేసులు లేవు



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జీవన్‌రాణి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: డయేరియా, జ్వరాలకు సంబంధించి ఎటువంటి కేసులు నమోదు కాలేదని డీఎంహెచ్‌వో జీవన్‌రాణి అన్నారు. డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణతో కలిసి స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిని ఆదివారం సందర్శించారు. పట్టణంలో జ్వరాలు, డయేరియా కేసులు అధికంగా ఉన్నాయని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టరుకు ఫిర్యాదులు రావడంతో ఆయన ఆదేశాల మేరకు ఆసుపత్రిలో పరిస్థితిని పరిశీలించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నమోదైన కొన్ని జ్వరాల కేసులు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోనివి అన్నారు. దీనిపై ఆ జిల్లా వైద్యశాఖ అధికారితో మాట్లాడానన్నారు. కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి జుత్తాడ హారిక, తెదేపా నాయకులు ఆర్.చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

జిందాల్ చెప్పిందే జరుగుతోంది

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: జిల్లాలో జిందాల్ సంస్థ చెప్పిన విధంగానే జరుగుతోందని ఎమ్మెల్సీ రఘురాజు ఆరోపించారు. ఆదివారం ఎస్.కోటలో విలేకరులతో మాట్లాడారు. ఆ సంస్థ చెప్పింది చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చిందా అని ప్రశ్నించారు. వారు ఏం రాసిస్తే అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటనల ద్వారా అదే వినిపిస్తున్నారన్నారు. అప్పట్లో తీసుకున్న భూములు, ఇతరాలకు రూ.70కోట్లు ఖర్చు చేసిందని, వాటి విలువ ఇప్పుడు రూ.3,000కోట్లు అన్నారు. రికార్డులు తారుమారు చేసి ఇష్టారాజ్యంగా భూసేకరణ చేశారన్నారు. సీసీఎల్‌ఏలోనూ మాయమయ్యాయన్నారు. దీనిపై విచారణ జరిపించాలని కోరారు.

(c) eenadu

నేడు యథావిధిగా పీజీఆర్‌ఎస్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్‌) యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోనూ కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన 1100 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయొచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సంప్రోక్షణలో విజయవాడ, ఆకివీడు, వీరవాసరం మహిళలు

భీమవరం క్వీన్స్ కిట్టీ మహిళ సభ్యులు

మావుళ్లమ్మకు ఆషాఢ సారె

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మకు వివిధ ప్రాంతాల మహిళలు ఆషాఢం సారెను ఆదివారం సమర్పించారు. విజయవాడ, ఆకివీడు, వీరవాసరం నుంచి పసుపు, కుంకుమ, గాజులు, చీర, సుమారు 150 రకాల మిఠాయిలు 650 కిలోలు తీసుకురాగా.. ప్రధానార్చకుడు మల్లికార్జున శర్మ, అర్చకులు సంప్రోక్షణ చేసి అమ్మవారి వద్ద నైవేద్యంగా ఉంచారు. భీమవరం పట్టణానికి చెందిన క్వీన్స్ కిట్టీ మహిళ సభ్యులు 250 కిలోల సుమారు 51 రకాల మిఠాయిలతో సారె సమర్పించినట్లు ఆలయ సహాయ కమిషనర్ బి.ఎం.నగేష్ తెలిపారు.

రోడ్డుకో దండం.. అడుగేస్తే గండం

అభివృద్ధికి నోచుకోని ప్రత్తిపాడు-బాదంపూడి మార్గం

జువ్వపాలెం వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే

అడుగడుగునా అగాధాలతో ప్రమాద ఘంటికలు మోగిస్తున్న ఆ రోడ్డు పేరు వింటేనే ప్రయాణికులు వణికిపోతున్నారు. ఒక గొయ్యి తప్పించే లోపే మరో గొయ్యి ఇలా దారి పొడవునా ఉన్న గుంతలను తప్పించేందుకు చోదకులు ప్రయాసపడాల్సి వస్తోంది. అతుకుల బొంతను తలపిస్తున్న ప్రత్తిపాడు - బాదంపూడి రోడ్డులో ప్రయాణమంటే ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.

తాడేపల్లిగూడెం పట్టణం మీదుగా వెళ్లే ప్రత్తిపాడు-బాదంపూడి రోడ్డు సుమారు 12 కి.మీ. పొడవు ఉంటుంది. ప్రతిరోజూ సగటున ఈ మార్గంలో 25 వేలకు పైగా చిన్న, పెద్ద వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. గతంలో గోదావరి పుష్కరాల సమయంలో ఈ మార్గంలో నూతన రహదారి నిర్మాణం జరిగింది. మళ్లీ పుష్కరాలు సమీపిస్తున్నా ఎలాంటి అభివృద్ధికీ నోచుకోలేదు. ఫలితంగా 12 కి.మీ. పరిధిలో వందల సంఖ్యలో గుంతలు ఏర్పడ్డాయి. కిందటి వైకాపా ప్రభుత్వం అప్పుడు రోడ్డు వేస్తాం ఇప్పుడు రోడ్డు వేస్తామంటూ ఐదేళ్ల పాటు కాలయాపన చేసింది. ఎన్నికల వేళ నూతన రహదారి నిర్మాణానికి రూ.6.90 కోట్లు కేటాయిస్తూ హడావుడిగా శంకుస్థాపనలు చేసి ప్రజలను మభ్యపెట్టారు. చివరకు పైపైన గోతులు పూడ్చి వదిలేశారు. దీంతో రాకపోకలకు వాహన చోదకులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు.

మరమ్మతుల మాయాజాలం

వైకాపా ప్రభుత్వం రోడ్డు వేయడం పక్కన పెడితే గుత్తేదారులకు లబ్ధి చేకూర్చే విధంగా వ్యవహరించింది. ఐదేళ్ల కాలంలో కేవలం రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చేందుకే రూ.1.02 కోట్లు ఖర్చు చేసింది. అప్పటి అధికారులు, పాలకులు చేతివాటం ప్రదర్శిస్తూ మరమ్మతుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చారు. నిబంధనలు పక్కన పెట్టి గోతుల్లో పైపైన పూతలు పూసి మరమ్మతుల మాయాజాలం ప్రదర్శించారు. చివరకు గ్రావెల్, మట్టితో కూడా గోతులను పూడ్చిన సందర్భాలు ఉన్నాయి.

పడాల వద్ద బస్సు వెళ్తుంటే పైకి లేస్తున్న దుమ్ము

రోడ్డు నిర్మాణానికి చర్యలు.. ఇటీవల రహదారిపై ఉన్న గుంతలను చాలా వరకు పూడ్చటం జరిగింది. ఈ మార్గంలో నూతన రహదారి నిర్మాణానికి కృషి చేస్తాం. -రవి, ఆర్‌అండ్‌బీ ఏఈ

రొయ్య అధరహో..!

- వనామీ రకం వంద కౌంటు కిలో రూ.250
- చెరువులు ఖాళీ అయ్యాక పెరుగుదల

ఉమ్మడి జిల్లాలో (లక్షల ఎకరాల్లో..)

ఆక్వా సాగు మొత్తం :	2.90
రొయ్యలు :	1.10
చేపలు :	1.80

(ధర రూ.లో)

కౌంటు	జూన్‌లో	ప్రస్తుతం
100	215	250
90	225	260
80	245	280
70	265	305
60	295	335
50	310	355
40	340	360

కలిదిండి, న్యూస్‌టుడే:

'అయిదు ఎకరాల్లో రొయ్యలు పండిస్తున్నా.. వాతావరణ మార్పులతో పది రోజుల కిందట ఆకస్మికంగా పట్టుబడి చేసేశా.. రూ.7.50 లక్షల నష్టం వాటిల్లింది. ఈ రోజు ఉన్న ధర ఆ రోజు ఉంటే లాభాలతో బయట పడేవాణ్ని' అని ప్రొద్దువాకకు చెందిన ఓ రొయ్యల రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

● దిగుబడులు బాగున్నప్పుడు ధరలు పతనం అవుతున్నాయి. చెరువులు ఖాళీ అయ్యాక ధరలు పైపైకి ఎగసిపడుతున్నాయి. ఇదీ.. రొయ్య రైతుల దయనీయ పరిస్థితి. రెండు నెలలుగా వ్యాధుల ఉద్ధృతితో ఉమ్మడి జిల్లాలో 80 శాతం చెరువుల్లో పట్టుబడులు చేసేశారు. ఈ నేపథ్యంలో ధరలు పెరగడంతో రైతులు ఉసూరుమంటున్నారు.

నష్టాల బాట.. ఈ ఏడాది జూన్ తొలి వారంలో 100 కౌంటు కిలో ధర రూ.225 ఉంది. మూడో వారంలో రూ.215కి పడిపోయింది. జులై తొలి వారం నుంచి ధర క్రమంగా పుంజుకుంటూ 20వ తేదీకి రూ.250కి చేరింది. రూ.210 - 220 ధరల్లో పట్టుబడి చేసిన రైతులంతా తీవ్ర నష్టాలు మూటగట్టుకున్నారు. ఇప్పుడు పెరిగిన ధరలు చూసి ఆవేదనకు గురవుతున్నారు.

సాగుపై సందిగ్ధం .. ఇన్ని ఒడిదుడుకులు ఎదుర్కొంటూ రొయ్యల సాగు చేయాలా? వద్దా? అనే సందిగ్ధంలోకి సాగుదారులు వెళ్లిపోతున్నారు. రాష్ట్ర తలసరి ఆదాయంలో సింహభాగం సమకూర్చి పెట్టే ఆక్వా రంగంపై ప్రభుత్వాలు మరింత శ్రద్ధ పెట్టాలనే భావన రైతుల్లో కనిపిస్తోంది. రొయ్య పిల్ల హేచరీల ఏర్పాటు, మందులు, మేతల ధరల నియంత్రణ, ధరల స్థిరీకరణ, శీతల గిడ్డంగుల ఏర్పాటు వంటి వాటిపై గట్టి చర్యలు తీసుకుంటేనే సాగు మనుగడ సాధ్యమవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

చిత్రకళను ప్రోత్సహించాలి

ప్రఖ్యాత చిత్రకారుడు రాజశేఖరన్ పరమేశ్వరన్‌కు చిత్రపటాన్ని బహూకరిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: చిత్రకళను అందరూ ప్రోత్సహించాలని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరం ఆర్ట్ సొసైటీ, విజయవాడ ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ఆధ్వర్యంలో భీమవరంలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో భారతీయ కళా దర్శకుడు, రెండుసార్లు గిన్నిస్ ప్రపంచ రికార్డులు సాధించిన రాజశేఖరన్ పరమేశ్వరన్ పర్యవేక్షణలో చిత్ర ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ దీన్ని ప్రారంభించారు.. దాన్ని ఆయన తిలకించి మాట్లాడారు. చిత్రకారుల కళా నైపుణ్యం, సామర్థ్యం అద్భుతం అన్నారు. భూపతిరాజు గోపరాజు (జనప్రియ), అనుపోజు వరప్రసాద్ (ఏలూరు), కె.సతీష్ (దేవరపు), నందిగం సాగర్ (నరసాపురం), గొల్లె దుర్గారావు (శ్రీకాకుళం), నిమ్మల సూర్యనారాయణ (నిడదవోలు), కొత్తపల్లి సీతారామరాజు (భీమవరం) తదితరులు వేసిన చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. కాస్మోపాలిటన్ క్లబ్ అధ్యక్షుడు అల్లూరి పద్మరాజు, కార్యదర్శి పెన్మెత్స వెంకటరామరాజు, ముదునూరి సుబ్బరాజు, కోసూరి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య భాగ్యం.. పతకాల 'యోగ'ం | 6 లో | ఉరేసుకొని ఉపాధ్యాయిని ఆత్మహత్య

అన్నామంతే.. చేశామింతే!

- పునాదుల్లోనే వైద్య కళాశాల నిర్మాణం
- వైకాపా పాలనకు సాక్ష్యమిదే

ఈనాడు డిజిటల్, భీమవరం, భీమవరం టూటౌన్, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు పునాదుల దశ దాటని ఎన్నో నిర్మాణాలు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఆ కోవలోకే పాలకొల్లులోని వైద్య కళాశాల నిర్మాణం చేరుతుంది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పార్లమెంటు నియోజకవర్గానికో వైద్య కళాశాల మంజూరు చేశామంటూ ఊదరగొట్టినా పూర్తి చేసేందుకు మాత్రం ముందుకు రాలేదు.

ఈ చిత్రం ఊరి చివరన కొండ ప్రాంతం కాదు. వైద్య కళాశాల నిర్మాణానికి పునాదుల కోసం తీసిన గోతులు. కాంక్రీటు పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ఇలా మారింది.

● నాడు-నేడుతో వైద్య, ఆరోగ్య రంగంలో పెను మార్పులు తీసుకొస్తామని 2021లో పాలకొల్లులో వైద్య కళాశాల నిర్మాణానికి దగ్గులూరు సమీపంలో 61 ఎకరాలు సేకరించారు. రూ.475 కోట్ల అంచనాతో చేపట్టి సుమారు రూ.60 కోట్ల పనులు మాత్రమే చేశారు. 2023 నాటికి పూర్తి కావాల్సి ఉండగా.. నిధుల సమస్యతో పునాదుల్లో మట్టి వేసేందుకే రెండేళ్లు పట్టింది. సేకరించిన స్థలం పూర్తిగా పల్లపు ప్రాంతం కావడంతో చిన్నపాటి వర్షమొచ్చినా నీరు నిలిచిపోతోంది. కొంతకాలంగా పనులు ఆగిపోవడంతో విలువైన నిర్మాణ సామగ్రి తుప్పుపట్టి పోతుంది. కళాశాలలో ప్రవేశాలు, తరగతులు జరగాలంటే 300 పడకల ఆసుపత్రిని అనుసంధానం చేయాల్సి ఉంటుంది. ఆ దిశగా చర్యలు చేపట్టకుండానే భవన నిర్మాణ పనులు చేపట్టడంపై అప్పట్లోనే అనేక అభ్యంతరాలు వచ్చినా పట్టించుకోలేదు. ఫలితంగా రూ. కోట్ల సొమ్ము పునాదులకే పరిమితమవుతుంది.

తుప్పు పడుతున్న ఇనుము

సరికొత్తగా పోలీసు సేవలు

- ఇ-ఆఫీస్ అమలుకు ఏర్పాట్లు
- నమూనా ప్రాజెక్టుగా ఎంపిక

నరసాపురంలో ఎస్డీపీవో కార్యాలయం

నరసాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పోలీస్‌స్టేషన్లు, ఆ శాఖ కార్యాలయాల్లో 'ఇ- ఆఫీస్' విధానం అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా నరసాపురం సబ్ డివిజినల్ పోలీసు కార్యాలయాన్ని రాష్ట్రంలో తొలి ఇ-ఆఫీస్‌గా ప్రయోగాత్మకంగా అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేసింది. ఈ నెల 19వ తేదీ నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించి సంబంధిత సాఫ్ట్‌వేర్‌ను కార్యాలయ కంప్యూటర్లలో నిక్షిప్తం చేశారు. ఈ విధానంలో బాధితుల నుంచి ఫిర్యాదు అందినప్పటి నుంచి పరిష్కారమయ్యే వరకు అన్ని దశల్లో ఉన్నత స్థాయి పర్యవేక్షణ ఉంటుంది. తొలి దశలో ఎంపిక చేసిన అధికారులకు నూతన సాంకేతిక విధానాలు, కేసుల పరిష్కారంలో కృత్రిమ మేధ వినియోగం తదితర అంశాలపై గత నెలలో వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. జిల్లా నుంచి ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేదఅరవింద ఈ శిక్షణలో పాల్గొన్నారు.

జాప్యం లేకుండా.. బాధితులు, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, నమోదైన కేసులు, వాటి స్థాయి, విచారణలో భాగంగా తీసుకున్న, తీసుకోవాల్సిన చర్యలు, జాప్యం లేకుండా పరిష్కారం తదితర అంశాలను ఎస్డీపీవో కార్యాలయం నుంచి జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుని సమీక్షించేందుకు వీలుంటుంది. ఈ విధానంతో సమయం ఆదా కావడంతో కాగిత రహితంగా కార్యాలయ నిర్వహణకు అవకాశం ఏర్పడనుంది. బాధితులకు సత్వర న్యాయం, పారదర్శకంగా కేసుల విచారణకు వీలుంటుందని పోలీసు శాఖ ఉన్నతాధికారులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

బాలికతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

పాలకొల్లు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అండగా నిలుస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఆదివారం పాలకొల్లులో దివ్యాంగులకు పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రూ.500 ఉండే దివ్యాంగుల పింఛనును రూ 3 వేలకు.. మళ్లీ 2024లో రూ.3 వేల నుంచి రూ. 6 వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. వైకాపా ఐదేళ్ల పాలనలో కనీసం సహాయ పరికరాలకు కూడా దివ్యాంగులు నోచుకోలేకపోయారన్నారు. కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ద్వారా దివ్యాంగుల సహాయ పరికరాల నిమిత్తం నరసాపురం పార్లమెంటు నియోజకవర్గంలో రూ.2 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. తొలి విడతగా రూ.50 లక్షలు మంజూరు కాగా పాలకొల్లు నియోజకవర్గంలో మొదటి శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అతివలే.. ఉపాధి సారథులు!

- యూనిట్ల ఏర్పాటుకు 50 శాతం రాయితీ
- డీఆర్డీఏ ద్వారా త్వరలో లబ్ధిదారుల ఎంపిక

పాలకొల్లు, న్యూస్‌టుడే: పేద కుటుంబాల్లో మహిళలు స్వశక్తితో ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా కూటమి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. స్వయం ఉపాధి యూనిట్లు స్థాపనకు ముందుకు వచ్చేవారికి 50 శాతం రాయితీ అందించనుంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలోని జీవనోపాధుల విభాగం పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. దీనికి సంబంధించిన విధివిధానాలు త్వరలోనే వెలువడనున్నాయి.

స్థానిక వనరుల ఆధారంగా.. జిల్లాలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఎక్కువ మంది ఆధారపడి ఉన్నారు. వీటి ఆధారంగానే వివిధ యూనిట్ల ఏర్పాటుకు చేయూత నిస్తారు. గ్రామాల్లో పొదుపు సంఘాల మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేసి అర్హులను ఎంపిక చేయనున్నారు. సూక్ష్మ పరిశ్రమల స్థాపనలో భాగంగా ఏపీ స్టేట్ హేచరీ, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఆసక్తి ఉన్న వారి వివరాలను ఆయా మండలాల్లో సమావేశాలు నిర్వహించినప్పుడు నమోదు చేస్తామని డీఆర్డీఏ పీడీ వేణుగోపాల్ స్పష్టం చేశారు.

✦ జిల్లాలో పెరటికోళ్ల పెంపకం యూనిట్లు 2 వేల వరకు ఏర్పాటు చేయనున్నారు. కడక్‌నాథ్, దేశీయ కోళ్లను కలిపి పెంచి సమృద్ధి బ్రీడ్‌ను తయారు చేయనున్నారు.

✦ నారు పెంపకం, కూరగాయల సాగుకు వీలుగా షేడ్ నెట్స్‌ను మంజూరు చేయనున్నారు. ఒక్కో యూనిట్‌కు సుమారు రూ. 3 లక్షలు ఖర్చవుతుందని అంచనా. దీనిపై 50 శాతం రాయితీ ఉంటుంది.

✦ నమో డ్రోన్ దీదీ పేరిట జిల్లాకు 20 డ్రోన్లను మంజూరు చేశారు. ఒక్కో డ్రోన్‌కు 80 శాతం రాయితీ అందనుంది. డ్రోన్ నిర్వహణకు ఒక పైలట్, సహాయకురాలు అవసరం. స్వయం సహాయక సంఘాల నుంచి వీరిని ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నారు.

✦ చిరుధాన్యాల ఉత్పత్తుల ప్యాకింగ్, విక్రయశాలల ఏర్పాటుకు జీవనోపాధుల కల్పన విభాగం సన్నాహాలు చేస్తోంది. చేపలు, మునగసాగు, తేనెటీగల పెంపకానికి అవకాశం ఇవ్వనున్నారు.

లెక్కలు నేర్వాలి.. సామర్థ్యాలు పెరగాలి..!

పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ 2024 నివేదికలో వెల్లడి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: జాతీయ విద్య పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ పేరిట విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై నివేదికను ఇటీవల విడుదల చేసింది. గతేడాది డిసెంబరులో ఎన్‌సీఈఆర్టీ జిల్లాలో మూడు, ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థులకు మాతృభాష, గణితం, పరిసరాల పరిజ్ఞానం, సామాన్య సాంఘిక శాస్త్రాల్లో పరీక్ష నిర్వహించారు. దానికి సంబంధించి వెలువడిన ఫలితాల్లో ఎక్కువ అంశాల్లో జిల్లా సగటు రాష్ట్ర, జాతీయ సగటు కంటే తక్కువగా ఉండటం గమనార్హం. ఆయా విభాగాల్లో ఇంకా మెరుగు పడాల్సి ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

వివిధ సబ్జెక్టుల్లో సగటు స్కోరు ఇలా..

తరగతి	పాఠ్యాంశం	జిల్లా	రాష్ట్రం	జాతీయ
మూడో	మాతృభాష	66	64	64
	గణితం	62	61	60
ఆరో	మాతృభాష	49	48	57
	గణితం	42	41	46
	ఈవీఎస్	40	40	49
తొమ్మిదో	మాతృభాష	47	50	54
	గణితం	34	35	37
	సైన్సు	34	36	40
	సోషల్	34	37	40

ఉమ్మడి జిల్లాలో ఇలా.. పశ్చిమగోదావరి జిల్లాలో జాతీయ బృందం మొత్తం 104 పాఠశాలల్లోని 2,813 మంది విద్యార్థులు, 378 మంది ఉపాధ్యాయులపై సర్వే చేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల్లో కొందరు లెక్కలు సరిగ్గా చేయడం లేదు. గణితంలో 40 శాతం దాటలేదు. ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థుల కంటే మూడో తరగతి విద్యార్థులే మెరుగ్గా కనిపించారు. ఉమ్మడి జిల్లాల్లోనూ వారు 59 స్కోరు దాటారు. ఆరు, తొమ్మిది తరగతి వారు 50 స్కోరు దాటకపోవడం గమనార్హం. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించి వారిలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాల్సిన ఆవశ్యకత సర్వే తేటతెల్లం చేసింది.

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం పన్నుల భారం వేసి రవాణా రంగాన్ని కుదేలు చేస్తే.. . కూటమి ప్రభుత్వం వారిని ఆదుకుంది. ఈ మేరకు సరకు, ప్రజా రవాణా వాహనాలపై హరిత పన్ను(గ్రీన్ ట్యాక్స్) రూపంలో ఉన్న భారాన్ని తగ్గిస్తూ ప్రభుత్వం తాజాగా ఆర్డినెన్స్ జారీ చేసింది.

రెండు స్లాబ్ విధానంలోనే.. ఉమ్మడి జిల్లాలో రవాణా వాహనాలు సుమారు 64 వేల వరకు ఉన్నాయి. సరకు, ప్రజా రవాణా వాహనాలు ఏడేళ్ల తర్వాత సామర్థ్య పత్రం పొందాలంటే ఏటా హరిత పన్ను చెల్లించాలి. ఇది రూ.200 మాత్రమే ఉండేది. గత ప్రభుత్వం 2022లో భారీగా పెంచింది. 7 నుంచి పదేళ్ల వాహనాలకు సగం, 10 నుంచి 12 ఏళ్ల వాటికి పూర్తిగా, 12 ఏళ్లు దాటితే రెండు రెట్లు త్రైమాసిక పన్నుల విలువ మేర చెల్లించేలా ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆయా కేటగిరీ, వాటి వయస్సు బట్టి రూ.800

భారం తగ్గింది

హరిత పన్ను నుంచి ఊరట

నుంచి గరిష్ఠంగా రూ.20 వేల వరకు ఏటా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా మూడు రెట్లకు పైగా పెంచింది. అప్పట్లో ఈ బాదుడు వల్ల ప్రభుత్వానికి రూ.13 కోట్ల వరకు ఆదాయం సమకూరిందని అంచనా. ఇలా ఇష్టానుసారంగా పన్నులు పెంచడంతోపాటు బాడుగులు సక్రమంగా లేక లారీల యజమానులు ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. కొంత మంది లారీలను విక్రయించి డ్రైవర్లుగా చేరారు. భారీగా పెంచిన పన్నులు తలకుమించిన భారంగా ఉన్నాయని లారీ యజమానులు ఎన్నికల ముందు యువనేత లోకేశ్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఇచ్చిన హామీ మేరకు హరిత పన్ను సవరించి ఏడాదికి రూ.1,500, రూ.3 వేలు చొప్పున రెండు స్లాబ్‌ల్లో చేసేలా కూటమి ప్రభుత్వం కొత్త విధానం తీసుకొచ్చింది.

ఎరువుల అతి వినియోగంతో నష్టాలు

మార్టేరు, న్యూస్‌టుడే: రసాయన ఎరువుల అతి వినియోగంతో పెట్టుబడి వ్యయం పెరగడం తప్ప ప్రయోజనం ఉండదని మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఎకరాకు సగటున 102 కిలోల ఎరువుల వినియోగంతో రాష్ట్రం దేశంలో 8 స్థానంలో నిలిచిందని. . ఇది ఆందోళన కలిగించే పరిణామని ఆదివారం వెల్లడించారు. దేశంలో సగటున ఎకరాకు 56 కిలోలు వాడుతుండగా ఏపీలో 82 శాతం అధికంగా ఉందన్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే తూర్పుగోదావరి జిల్లాలో సగటున ఎకరానికి 164 కిలోలు (193 శాతం అధికం), పశ్చిమగోదావరిలో 170 కిలోలు (203 శాతం అధికం)వినియోగిస్తున్నారని పేర్కొన్నారు.

నారుమడులు నీట మునక

కుళ్లిన నారు చూపిస్తున్న రైతులు

రావులపర్రు (ఉంగుటూరు), న్యూస్‌టుడే: రావులపర్రులో సుమారు 150 ఎకరాల్లో వరి నారుమళ్లు నీట మునగడంతో అన్నదాతలు ఆదివారం ఆందోళన చేపట్టారు. వరినారు నీట మునిగి కుళ్లిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు తోకలపల్లి మురుగు కాలువ గుండా కొల్లేరులో కలుస్తోంది. రావులపర్రు రెగ్యులేటర్ వద్ద ఈ కాలువ చెక్క బల్లలు కిందకు దించడంతో నీరు దిగువకు వెళ్లడం లేదు. పత్తేపురం పంట కాలువకు మిడ్‌లెవల్ కాలువ, తోకలపల్లి మురుగు కాలువలు ప్రధాన నీటి వనరు. సామర్థ్యానికి మించి తోకలపల్లి మురుగు కాలువ నుంచి నీరు పత్తేపురం పంట కాలువలో కలుస్తోంది. దీంతో నీరు వెనక్కి మళ్లీ పొలాల్లోకి నీరు చేరి నారుమళ్లు నీట మునిగిపోయాయని రైతులు ఆందోళన వెలిబుచ్చారు. దీనిపై నీటి పారుదల శాఖ ఏఈ సుధారాణి మాట్లాడుతూ సీతారామపురంలో పందికోడు వద్ద నీటిని దిగువకు మళ్లించగా పరిస్థితి కొంత చక్కబడిందని.. రావులపర్రు-రాచూరు మధ్య డ్రెయిన్ పూడిక తీయించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

గోవులకు నీడ..

జిల్లాకు మరో 400 గోకులాలు

వీరవాసరంలో నిర్మించిన మినీ గోకులం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే : రైతుకు వ్యవసాయం ఎంత ముఖ్యమో. . పాడి కూడా అంతే. అందుకే ప్రభుత్వం రాయితీపై మినీ గోకులాలు నిర్మించుకుని పశువులకు నీడ కల్పించేందుకు అవకాశం కల్పించింది. జిల్లా వ్యాప్తంగా గత ఏడాది 755 మినీ గోకులాల నిర్మాణానికి అనుమతులు జారీ చేసింది. వాటికి సంబంధించి ఇటీవల రూ.5.50 కోట్ల బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో వేసింది.

గతంలో జిల్లాలో మినీ గోకులాల నిర్మాణానికి చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. ఇవి మండలాల వారీగా మంజూరైన యూనిట్ల కంటే అధికంగా ఉండటంతో కొందరు రైతులు పొందలేకపోయారు. ఈ నేపథ్యంలో కొత్తగా జిల్లాలో 400 యూనిట్లు మంజూరు చేసింది. గత ఏడాది ఖరారు చేసిన రాయితీనే ప్రస్తుతం అమలు చేయనున్నారు. మినీ గోకులాల నిర్మాణం కోసం ఆసక్తి ఉన్న రైతులు పశుసంవర్ధక శాఖ లేదా ఉపాధి హామీ అధికారులకు దరఖాస్తులు అందజేయవచ్చు. తొలుత సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యం ఇస్తారు. రెండు పశువులు ఉంటే యూనిట్ విలువ రూ.1.15 లక్షలు, నాలుగు పశువులకు రూ.1.85 లక్షలు, ఆరు పశువులకు రూ.2.30 లక్షలు వ్యయంగా నిర్ణయించారు. లబ్ధిదారులు 10 శాతం ఖర్చు చేస్తే ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం 90 శాతం రాయితీ కల్పిస్తుందని డ్వామా పీడీ కేసీహెచ్.అప్పారావు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, ఈసారి గోకులాలు నిర్మాణం పూర్తయిన వెంటనే ప్రభుత్వం నగదు జమ చేయనుందని పేర్కొన్నారు.

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి



జీఎస్‌టీ 5% అదనం

మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీస్‌లో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు. ఆకాంక్షించండి... వారి భావి జీవితం సుఖమయం ఆనందాలు... తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు.

80080 12494

(c) eenadu

క్రీడాకారిణులతో అసోసియేషన్ ప్రతినిధులు

బాస్కెట్‌బాల్ బాలికల జట్టు ఎంపిక

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ బాలికల జట్టు ఎంపికను స్థానిక కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. వారు ఆగస్టు 14 నుంచి విశాఖపట్నంలో జరిగే అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైనవారిలో ఈవీపీ జయశ్రీ, ఎ.యామిని, ఎ.రుత్విక, జి.పూజిత, డి.సాయి భవాని, పి.నందిని, బి.దేవిశ్రీ, జి.సరిత, ఎస్.ఖుషీ హాసిని, డి.సాయి శ్రీలావణ్య, ఎ.రియా, పి.శాంతిసులోచన ఉన్నారు.

క్రీడల్లో తర్ఫీదు అవసరం

చదరంగం పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాసు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యతో పాటు ఆసక్తి ఉన్న క్రీడల్లో పిల్లలకు తర్ఫీదు ఇవ్వాలని భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరంలోని జీవీఆర్ కల్యాణ మండపంలో ఏపీ స్టేట్ ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్-2025 పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. జిల్లా చదరంగ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిశోర్, గౌరవాధ్యక్షుడు తోట భోగయ్య, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శి అడ్డాల శివప్రసాద్ పాల్గొన్నారు.

ఫస్ట్ అయినా.. సెకండైనా మేమే..

ఇద్దరు విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పెరూరు శివారు తెరగూడెం ప్రాథమిక పాఠశాలలో పరిస్థితి ఇది. ఇక్కడ ప్రస్తుతం ఒక ఉపాధ్యాయుడు, ఇద్దరు విద్యార్థులు మాత్రమే మిగిలారు. గతేడాది అయిదుగురు ఉండగా ముగ్గురు ఆరో తరగతి చేరేందుకు వెళ్లిపోయారు. గ్రామంలో ఐదే ఈడు పిల్లలు మరెవరూ లేరని ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు చెప్పారు. చేపల చెరువులపై కాపలాకు వలస వచ్చిన వారిలో ఎవరైనా ఉన్నారేమో వివరాలు తెలుసుకుంటున్నామని వివరించారు.

అలల్లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

ప్రమాదకరంగా కెరటాలు

మొగల్తూరు, న్యూస్‌టుడే: వాతావరణ మార్పుల ప్రభావంతో మొగల్తూరు మండలంలోని పేరుపాలెం నార్త్, కేపీ పాలెంసౌత్ ప్రాంతాల్లో బీచ్ వెంబడి అలల ఉద్ధృతి పెరిగింది. ఆదివారం కావడంతో పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు, యువకులు పెద్ద సంఖ్యలో బీచ్‌కు వచ్చారు. వీరిలో కొందరు పోలీసు హెచ్చరికలను సైతం లెక్కచేయకుండా ఎగసిపడే అలలకు ఎదురెళ్లి స్నానాలు చేశారు. ఈ ప్రాంతంలో తరచూ సముద్ర స్నానాలకు దిగిన పర్యాటకులు కొట్టుకువెళ్లి ప్రాణాలు కోల్పోతున్న ఉదంతాలు ఉన్నాయి.

మీరూ వ్యాపారవేత్తలు కావచ్చు..!

పీఎంఈజీపీ పథకంలో యువతకు అవకాశాలు

నూజివీడు, న్యూస్‌టుడే: వ్యాపారం చేయాలనే ఆసక్తి ఉందా.. పెట్టుబడికి రుణం పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా.. ఇలాంటి సమస్యలకు పీఎంఈజీపీ (ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పట్టభద్రులైన యువత వ్యాపారం నెలకొల్పి పలువురికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో దీనికి రూపకల్పన చేశారు. ఈ పథకం ద్వారా అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చు. ఇందుకుగానూ https:///www.kviconline.gov.in/pmegpeportal/pmegphome/index.jsp వెబ్‌సైట్‌లో అప్లికేషన్ ఫర్ న్యూ యూనిట్ అనే దానిపై క్లిక్ చేస్తే రుణ దరఖాస్తు ప్రత్యక్షమవుతుంది. మోడల్ ప్రాజెక్ట్‌లపై క్లిక్ చేస్తే 1056 వ్యాపార ఆలోచనల ప్రాజెక్టు పీడీఎఫ్ వివరాలు వస్తాయి. వాటిలో ఏదైనా ఒకదాన్ని ఎంచుకుని ప్రాజెక్టుతో రుణ ఫారం దరఖాస్తు పూర్తి చేయాలి.

ఆన్‌లైన్ పోర్టల్ ముఖ చిత్రం

రూ.లక్ష నుంచి రూ.50లక్షల వరకు.. ఈ పథకంలో చిన్న వ్యాపారాలు మొదలుకుని మధ్య తరహా పరిశ్రమ స్థాయి వరకు రుణాలు ఇస్తారు. పాత పరిశ్రమల నవీకరణ కోసం మాత్రం రుణం ఇవ్వరు. నెగిటివ్ పరిశ్రమల జాబితాలో ఉన్న వాటికి ఈ పథకం వర్తించదు. 2026 వరకు దీనిని అమలు చేయనున్నారు. 18 ఏళ్ల వయస్సు, 8వ తరగతి విద్యార్హత ఉంటే చాలు. స్వయం సహాయక బృందాలు అనగా ఇతర పథకాల కింద ప్రయోజనం పొందని బీపీఎల్‌కు చెందిన వారు అర్హులు. ఒక కుటుంబం నుంచి ఒక వ్యక్తి మాత్రమే అర్హుడు. కొత్త యూనిట్ నెలకొల్పడానికి రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు రుణం అందిస్తుంది. నిరుద్యోగ యువతకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో రుణ పరిమితిని రూ.50 లక్షల వరకు పెంచారు.

రాయితీ ఇలా... ఈ పథకం కింద పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే యూనిట్లకు 25 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో వారికి 35 శాతం రాయితీ ఉంది.

మునకేసి.. పట్టేసి!

చిత్రంలోని నల్లని నీటికోంగను చూశారా.. అవలీలగా నీటిలో మునకేసి ఒడుపుగా చేపను పట్టేసింది. దీనిని లిటిల్ కార్మొరాంట్ అని పిలుస్తారు. శాస్త్రీయనామం ఫాలక్రోకరాక్స్ నైగర్. ఇది ఆహారం కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో గంట నుంచి రెండుగంటల పాటు నీటిలో వేట కొనసాగిస్తుంది. బయటకొచ్చి శరీరాన్ని ఆరబెట్టుకుంటుంది. తద్వారా ఉత్పత్తి అయిన ద్రావణాన్ని ముక్కుతో తీసి వెంట్రుకలకు రాసుకుంటుంది. దాని మూలంగా ఉత్తేజితమవుతూ మెరుస్తుందని, తాజా పట్టిన చేపలను మాత్రమే తింటుందని ఫారెస్ట్ బీట్ అధికారి రాజేశ్ తెలిపారు. పొడవు 51 సెంటీమీటర్లు. బరువు 600 నుంచి 800 గ్రాముల వరకూ ఉంటుంది. కొల్లేరులో ఇవి ఎనిమిది వేల వరకూ ఉన్నాయన్నారు. కైకలూరు మండలం ఆటపాక సమీపంలోని పోల్‌రాజ్‌కెనాల్‌లో 'ఈనాడు' కెమెరాకు చిక్కిన చిత్రాలివి. – ఈనాడు, ఏలూరు

ఆరోగ్య భాగ్యం.. పతకాల 'యోగ'ం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: యోగాతో ఆరోగ్యమే కాదు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలతో గుర్తింపు కూడా పొందవచ్చని నిరూపిస్తున్నారు జిల్లాకు చెందిన యువతులు. నిత్యం కఠోర సాధన చేస్తూ పోటీల్లో విజయ కేతనం ఎగురవేస్తున్నారు. భీమవరంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి పోటీలకు జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు అబ్బురపరిచే ఆసనాలు వేసి పతకాలు సొంతం చేసుకున్నారు.

అంతర్జాతీయ గుర్తింపు లక్ష్యం

ఎంబీఏ చదువుతున్నా. అఖిల భారత స్థాయిలో ప్రతిభ కనబరిచా. ఖేలో ఇండియాలో విజేతగా నిలిచా. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించడంతో జాతీయస్థాయిలో మరింత మెరుగైన స్థానాలపై గురిపెట్టాను. అంతర్జాతీయ గుర్తింపే లక్ష్యం. **- కె.కార్తిక ఉషశ్రీదుర్గ, తణుకు**

నా జీవితంలో భాగం

యోగా నా జీవితంలో భాగమైంది. ఆరోగ్యంగా ఉండటమే కాదు అంతర్జాతీయంగా శ్రీలంకలో ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్‌గా నిలిచా. థాయ్‌లాండ్, సింగపూర్‌లో మూడు బంగారు పతకాలు, జాతీయ స్థాయిలో తొమ్మిది పతకాలు అందుకున్నా. భీమవరంలో జరిగిన పోటీల్లో రెండు విభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచా. **- బి.శిరీష, భీమవరం**

వయసుతో సంబంధం లేదు

ఏ వయసు వారు అయినా ఆసనాలు వేయొచ్చు. 2023లో విజయవాడలో, 2024లో కర్నూలులో జరిగిన పోటీల్లో రాష్ట్రస్థాయిలో పతకాలు అందుకున్నా. గతేడాది చండీగఢ్‌లో ఉద్యోగులకు నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పతకం పొందా. **- ఇ.అమ్మాజీ, జంగారెడ్డిగూడెం**

కొందరికి నేర్పిస్తున్నా

నేను డీఎడ్ చదువుకున్నా. ఆరోగ్యం కోసం ఆసనాలు వేసేదాన్ని. పోటీల్లో పాల్గొంటే జిల్లాస్థాయిలో పతకం అందుకున్నా. మరింత సాధనతో రాష్ట్రస్థాయిలో కూడా పతకం సాధించా. నేను నేర్చుకున్న ఆసనాలు మరికొందరికి నేర్పిస్తున్నా. **- బి.ధనమాధవి, భీమవరం**

26న గిరి ప్రదక్షిణ మార్గం ప్రారంభం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవారి క్షేత్రంలో పారిశ్రామికవేత్త గోకరాజు గంగరాజు వితరణతో నిర్మించిన గిరి ప్రదక్షిణ మార్గం ఈ నెల 26న ఉదయం ప్రారంభించనున్నారు. అహోబిల మఠం పీఠాధిపతి అహోబిల రామానుజ జీయర్‌స్వామి గిరి మార్గాన్ని శనివారం ఉదయం 10.38 గంటలకు శాస్త్రోక్తంగా ప్రారంభిస్తారని ఈవో కె.శ్రీనివాస్, అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పేరిచర్ల జగపతిరాజు తెలిపారు. పారిజాతగిరి కొండ చుట్టూ సుమారు 2.5 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డును గోకరాజు గంగరాజు సుమారు రూ.60 లక్షలు వెచ్చించి నిర్మించారు. చాలా కాలంగా పారిజాతగిరి చుట్టూ ప్రదక్షిణ ఏర్పాటు చేయాలని అభివృద్ధి కమిటీ ప్రయత్నాలు చేస్తోంది. ఇవి ఎట్టకేలకు కార్యరూపం దాల్చాయి.

గిరి ప్రదక్షిణ సందర్భంగా ఈ నెల 26 శనివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవం ఉంటుందని ప్రధాన అర్చకుడు రవికుమారాచార్యులు తెలిపారు. గిరి ప్రదక్షిణ చేసేందుకు ఆసక్తి ఉన్న భక్తులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఇందులో పాల్గొనవచ్చని ఈవో తెలిపారు. శనివారం నాడు ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

పూజల్లో ఎమ్మెల్యే రామాంజనేయులు

మావుళ్లమ్మ, కనకదుర్గమ్మ జాతర ఊరేగింపు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మావుళ్లమ్మ ఆషాఢమాసం ఉత్సవాల్లో భాగంగా 36వ వార్డులో మావుళ్లమ్మ, కనకదుర్గమ్మ 45వ జాతర ఊరేగింపులో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆదివారం ప్రారంభించారు. అమ్మవారి ప్రతిమతో ప్రధాన వీధుల మీదుగా రాత్రి వరకు ఊరేగింపు నిర్వహించారు. మోటుపల్లి వారి వీధి 20వ వార్డులో జాతరను మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. 23వ వార్డు చిన్నివారి వీధిలో మావుళ్లమ్మ, పుంతలో ముసలమ్మవార్ల జాతర శ్రీరామ బాలభక్త యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. 3వ వార్డులో జాతర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపులో భక్తులు అమ్మవారికి హారతులు ఇచ్చి నైవేద్యాలు సమర్పించారు.

రెండు బిల్లులు ఒకేసారి సమర్పించేలా..

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఈ ఏడాది జూన్ నెలలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు సప్లిమెంటరీ జీతాల బిల్లులతోపాటు రెగ్యులర్ జీతాల బిల్లులు ఒకేసారి సమర్పించేలా రాష్ట్ర ఖజానా శాఖ సంచాలకుడు చొరవ చూపాలని ఏపీటీఎఫ్-1938 రాష్ట్ర అకడమిక్ కన్వీనరు జి.కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఇ.రామ్మోహన్ ఒక ప్రకటనలో కోరారు. కొంతమంది డీడీవోలు బదిలీ అయిన ఉపాధ్యాయులకు బకాయి జీతాల బిల్లులు చేసే అవకాశం ఉన్నా బిల్లులు చేయకుండా వేధిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా వ్యవహరిస్తున్న డీడీవోలపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు.

భాజపా జిల్లా ఉపాధ్యక్షుడి ఎన్నిక



సింహాద్రి లక్ష్మణ్ కుమార్ గుప్తా

తణుకు, న్యూస్‌టుడే: దువ్వ గ్రామానికి చెందిన భాజపా సీనియర్ నాయకుడు సింహాద్రి లక్ష్మణ్ కుమార్ గుప్తా పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికైనట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం భీమవరంలోని భాజపా జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నియమించినట్లు ప్రకటించారు. గుప్తా మాట్లాడుతూ భాజపాకు సేవలందించిన కార్యకర్తలను గుర్తించి ఉన్నత పదవులు కట్టబెడుతుందన్నారు. నాపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. జిల్లాలోని భాజపా నాయకులు, కార్యకర్తలు ఆయనను అభినందించారు.

దిగొస్తున్న కూరగాయల ధరలు

20 శాతం మేర తగ్గుదల

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: కొండెక్కిన కూరగాయల ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. గత వారంతో పోలిస్తే 20 శాతం వరకు ధరలు తగ్గడంతో సామాన్యులకు కాస్త ఊరట లభించింది. స్థానికంగా సాగైన పలు రకాల కూరగాయలను రైతులు మార్కెట్‌కు తీసుకురావడంతో లభ్యత పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. సిద్ధాంతం (దొంగరావిపాలెం) హోల్‌సేల్ మార్కెట్లో ఆదివారం నాటి ధరలు (కిలోకు రూపాయల్లో) ఇలా ఉన్నాయి. ★ బీర- 20, బెండ- 20, దొండ- 12, దోస- 15, నల్ల వంకాయ- 30, తెల్ల వంకాయ- 50, బెండ- 20, నాటుచిక్కుడు- 100, లైన్ చిక్కుడు- 40, గోరు చిక్కుడు- 35, కీరదోస- 30, చిలకడదుంప- 40, బీట్‌రూట్- 30, క్యారెట్- 30, బంగాళాదుంప -20, పచ్చిమిర్చి- 70, చామ- 30, కాకర- 25, టామోటా- 20, ఉల్లిపాయలు- 23.

ఆధార్ సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

ఈనాడు కథనానికి స్పందన

నరసాపురం, న్యూస్‌టుడే: విద్యుత్తు మీటర్లకు ఇతరుల ఆధార్ సంఖ్యల అనుసంధానంతో ఏర్పడిన సమస్యల పరిష్కారానికి ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సమస్యపై 'మాదికాదు మొర్రో.. అన్నా వినరేం..!' శీర్షికన 'ఈనాడు'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి ఆ శాఖ పర్యవేక్షక ఇంజినీరు హరినాథబాబు స్పందించారు. ఆధార్ సమస్యలపై అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు.

రహదారి ప్రమాదంలో యువకుడి దుర్మరణం

సాయిచంద్ (పాత చిత్రం)

మొగల్తూరు, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం మండలం సీతారాంపురం వద్ద ఆదివారం జరిగిన రహదారి ప్రమాదంలో రుస్తుంబాద పరిధి యడ్లపల్లివారితోటకు చెందిన పరసా సాయిచంద్ (22) మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. సాయిచంద్ తన మిత్రుడితో కలిసి గ్రామంలోని అంతర్గత మార్గంలో బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన సాయిచంద్ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మరో ద్విచక్ర వాహనదారుడు పుష్పరాజ్, మరో వ్యక్తికి గాయాలు కాగా వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఆ ప్రాంతంలో మద్యం గొలుసు దుకాణాలు ఉండటంతో ఏర్పడి రద్దీయే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు.

మరమ్మతుల్లో ఫ్రీజర్.. నరసాపురం ప్రాంతీయ ఆసుపత్రి శవాగారంలో ఫ్రీజర్ల నిర్వహణను కొద్ది నెలలుగా గాలికి వదిలేశారు. ఇక్కడ మూడు ఫ్రీజర్లు ఉండగా రెండింటిలో మృతదేహాలను భద్రపరిచారు. మరొకటి మరమ్మతులకు గురికావడంతో రహదారి ప్రమాదంలో మృతిచెందిన సాయిచంద్ మృతదేహాన్ని భద్రపరిచే అవకాశం లేక శవాగారంలో కాంక్రీటు దిమ్మపై ఉంచారు. బయటి నుంచి ఫ్రీజర్ తెచ్చుకోవాలని ఆసుపత్రి సిబ్బంది సూచించారని సాయిచంద్ మిత్రులు చెబుతున్నారు. ప్రభుత్వ విప్ నాయకర్ ఆసుపత్రికి వచ్చి మృతదేహాన్ని సందర్శించగా ఫ్రీజర్ పనిచేయని విషయాన్ని అక్కడి వారు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో నాయకర్ ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నించి ఆగ్రహం వ్యక్తం చేశారు.

మినీ బస్సు ఢీకొని మహిళ..

తణుకు, న్యూస్‌టుడే: వెనుక నుంచి వేగంగా వచ్చిన మినీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం తణుకు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. తేతలి గ్రామానికి చెందిన గుంటూరి సూర్యకుమారి (38), ఆమె పిన్ని భూపతిరాజు లక్ష్మీ ద్విచక్ర వాహనంపై డీమార్ట్‌కు వెళ్లే క్రమంలో పాత టోల్‌గేట్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా పెరవలి వైపు నుంచి తణుకు వైపు వస్తున్న వాహనం ఢీకొట్టడంతో సూర్యకుమారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను తణుకు జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. లక్ష్మీ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద ఘటనపై పట్టణ ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

భీమడోలు, న్యూస్‌టుడే: భీమడోలు రైల్వే గేటు సమీపంలో రైలు ఢీకొని ఒక వ్యక్తి ఆదివారం మృతి చెందాడని రైల్వే ఎస్‌ఐ సైమన్ ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడు ద్వారకాతిరుమల మండలం సత్తెనగూడెం గ్రామానికి చెందిన కొత్తపల్లి అశోక్(32)గా గుర్తించారు. మృతదేహాన్ని శవ పరీక్ష కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.80 లక్షలకు టోకరా?

ఆకివీడు, న్యూస్‌టుడే: ఓ మహిళ ఉద్యోగాలు ఇప్పిస్తానని సుమారు రూ.80 లక్షలకు టోకరా వేసిన ఘటన ఆకివీడులో వెలుగులోకి వచ్చింది. పట్టణంలో నివాసముంటూ తాను చార్టెడ్ అకౌంట్ (సీఏ) చేశానంటూ, ఉద్యోగాలు వేయిస్తానని నిరుద్యోగులను నమ్మించారు. అది నిజమనుకుని పలువురు ఆమెకు దఫదఫాలుగా రూ.లక్షల్లో ఇచ్చారు. చివరకు ఆమె మోసం చేసింది అని గుర్తించిన బాధితులు ఒక్కొక్కరు బయటకు వస్తున్నారు. న్యాయం చేయాలని స్థానిక నాయకులను ఆశ్రయిస్తున్నారు. ఈ విషయంలో మహిళ భర్త తనకు ఏమీ తెలియదంటూ తప్పించుకుంటున్నారని బాధితులు చెబుతున్నారు. వీరు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తుంది.

ఉరేసుకొని ఉపాధ్యాయిని ఆత్మహత్య..!

బ్లేడుతో కాళ్లూ చేతులు కోసుకున్న భర్త

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆ దంపతులిద్దరూ ఉపాధ్యాయులు.. వారికి ఇద్దరు పిల్లలు.. సాఫీగా సాగిపోతున్న సంసారం.. ఇద్దరూ అన్యోన్యంగా ఉంటారని స్థానికులు, బంధువులు చెబుతున్నారు.. ఈ నేపథ్యంలో ఇంట్లోనే భార్య ఉరేసుకొని మృతి చెందడం, అది జీర్ణించుకోలేక ఆమె భర్త బ్లేడుతో కాళ్లు, చేతులు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు నగర శివారు చొదిమెళ్లలోని ఓ అపార్టుమెంట్లో నివాసముంటున్న మండాడ దేవిక (38), చిన్ని సురేంద్ర దంపతులిద్దరూ ఉపాధ్యాయులు. వారికి ఇంటర్, పదో తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులున్నారు. దేవిక ఉంగుటూరు మండలం నల్లమాడులో పని చేస్తుండగా సురేంద్ర అదే మండలం రాచూరులోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 19న దేవిక పుట్టిన రోజు. యథావిధిగా ఇద్దరూ విధులు ముగించుకొని రాత్రికి ఇంటికి చేరుకున్నారు. సురేంద్ర ఇంటికి వచ్చే సమయానికి ఇల్లు తాళం వేసి ఉండటంతో, తన వద్ద ఉన్న తాళం చెవితో తెరిచి చూడగా దేవిక ఫ్యానుకు ఉరేసుకొని వేలాడుతూ కనిపించింది.

దేవిక, సురేంద్రబాబు (పాత చిత్రం)

జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్యాయత్నం

భార్య మృతిని జీర్ణించుకోలేని సురేంద్రబాబు బ్లేడుతో చేతులు, కాళ్లను కోసుకున్నారు. ఆ రక్తంతో భార్య నుదుటిపై తిలకం దిద్దారు. ఆ తర్వాత గోడపై 'ఐ లవ్ యు దేవిక' అని, బాగా చదువుకొని జాగ్రత్తగా ఉండాలంటూ పిల్లలకు సూచిస్తూ రక్తంతో రాశారు. ఆ తర్వాత అలానే ఉండిపోయారు. శనివారం రాత్రి బాగా పొద్దుపోయాక గుర్తించిన స్థానికులు ఆయన్ను ఆసుపత్రిలో చేర్పించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న దేవిక తల్లిదండ్రులు, బంధువులు ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రస్తుతం సురేంద్ర చికిత్స పొందుతున్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు ఆదివారం ఆసుపత్రికి చేరుకొని పరామర్శించారు.

పిల్లలను బాగా చదివించాలంటూ..

దేవిక చనిపోయే ముందు తన గదిలో బోర్డుపై 'అమ్మా నాన్న ఐ లవ్ యు, భర్తను ఉదహరించి లవ్ యూ చిన్నా అంటూ.. పిల్లలను బాగా చదివించి ఐఐటీలో చేర్చాలని, తాను బాగానే చదువుకున్నానని, పిల్లలు కూడా ప్రయోజకులు కావాలని' మార్కర్‌తో రాశారు. అనంతరం సురేంద్రబాబు కూడా అదే బోర్డుపై పిల్లలనుద్దేశించి బాగా చదవాలని.. ఏటీఎం పిన్ నంబర్లను రాశారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు

ఈ కేసును పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సీఐ సత్యనారాయణ, గ్రామీణ ఎస్సై దుర్గాప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దేవిక మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి శవాగారానికి తరలించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై సురేంద్రను ఆరా తీశారు. అనంతరం సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పలేదని భర్తపై అలిగి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలిసిందన్నారు. ఇంకా ఏమైనా బలమైన కారణాలున్నాయా అనే దానిపై విచారణ చేస్తామన్నారు. అయితే తమ కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని దేవిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ ఉభయ జిల్లాల సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. సంఘంలో సభ్యులుగా ఉన్న బోధనేతర సిబ్బంది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జయరామ్, ఉపాధ్యక్షుడిగా యోసేపు, ప్రధాన కార్యదర్శిగా కృపారావు, సంయుక్త కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా శ్రీనివాసరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు నూతన కార్యవర్గాన్ని సత్కరించారు.

ఫెన్సింగ్ అసోసియేషన్..

కాకినాడ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం సాంబమూర్తినగర్‌లోని ఆదిత్య మహిళా కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలుగా డా.నల్లమిల్లి సుగుణ (తూర్పుగోదావరి), కార్యదర్శిగా గుణ్ణం కృష్ణమోహన్ (పశ్చిమగోదావరి), కోశాధికారిగా ఆకుల చంద్రకళావతి(కడప), ఉపాధ్యక్షురాలుగా కె.సూర్యలక్ష్మీదేవి(గుంటూరు), సహాయ కార్యదర్శిగా జి.నవీన్(ప్రకాశం), కార్యవర్గ సభ్యులుగా నంద్యాల రాధిక, డి.అశోక్‌బాబు ఎన్నికయ్యారు. పరిశీలకులుగా ఫెన్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి అశోక్‌దురారే, శాప్ నుంచి కాకినాడ డీఎస్ఏ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ వి.సతీష్ హాజరయ్యారు. నూతన కార్యవర్గం 2025-29 వరకు కొనసాగుతుందని అసోసియేషన్ మెంటార్ నాగం సతీష్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -112 రిటైల్ ధర 134 చికెన్ విత్ స్కిన్ - 194, చికెన్ స్కిన్‌లెస్ - 221.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, 129, 140 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 238.

క్రమశిక్షణ, కఠోర సాధనతోనే విజయం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నేటి యువత ప్రతికూల ఆలోచనా విధానాన్ని విడిచి పెట్టి క్రమశిక్షణ, కఠోర సాధనతో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని యూపీఎస్సీ పరీక్షలో జాతీయ స్థాయి 11వ ర్యాంకు సాధించిన ట్రిపుల్ ఐటీ పూర్వ విద్యార్థిని సాయి శివాని తెలిపారు. ఆదివారం నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహించిన 'యూపీఎస్సీ ప్రేరణ వ్యూహ శిబిరం' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ ఆమెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సాయి శివాని జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2016 నుంచి 2022 సంవత్సరాల మధ్య ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ఈసీఈ విభాగంలో చదివినట్లు చెప్పారు. ముఖ్యంగా సోషల్ మీడియాను ఎంత వరకు ఉపయోగించుకోవాలో అవగాహన ఉండాలన్నారు. జాతీయ స్థాయిలో యూపీఎస్సీ పరీక్ష ద్వారా 23 సర్వీసులకు ఎంపికయ్యే అవకాశం ఉందని వివరించారు. ఎన్సీఈఆర్టీ పుస్తకాలను చదివి బేసిక్స్ నుంచి బలమైన కాన్సెప్ట్‌లను నిర్మించుకోవాలని సూచించారు. యూపీఎస్సీలో విజయం సాధించిన విజేతల మనోగతాలను, ప్రిపరేషన్ విధానాన్ని పరిశీలించాలన్నారు.

సాయి శివానిని సత్కరిస్తున్న ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్

ఫలాలపై కాకుండా ప్రక్రియపై.. ఫలాలపై కాకుండా ప్రక్రియపై దృష్టి పెట్టాలని సాయి శివాని సూచించారు. మీ శ్రమను ఆధారం చేసుకుని మీకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవడానికి ప్రయత్నించాలన్నారు. మన కలలను సాధించడానికి ఎన్నో త్యాగాలు చేయాలని, ఎక్కువ సమయం పుస్తక పఠనంలో, రివిజన్‌లో గడపాలన్నారు. రోజూ చదువుతున్న చదువుకు అదనంగా మూడు, నాలుగు గంటలు చదవాలని సూచించారు. కోచింగ్ కంటే స్వీయ అధ్యయనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇంటర్వ్యూలో వ్యక్తిగత వివరాలతో పాటు సత్వర నిర్ణయాలు, ప్రజంటేషన్, స్పష్టత అనే అంశాలు ప్రాధాన్యత కలిగి ఉంటాయన్నారు. వ్యక్తిగత జీవితం, తల్లిదండ్రులు తనకు స్ఫూర్తిగా నిలిచిన విధానం, ప్రిపరేషన్ పద్ధతి, ఇంటర్వ్యూ విధానం తదితర అంశాలను చెప్పి విద్యార్థులను ఆకట్టుకున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ ఆమెను జ్ఞాపిక, శాలువాతో సన్మానించారు. పీయూసీ విద్యార్థులు పెన్సిల్‌తో గీసిన సాయి శివాని చిత్రపటాన్ని ఆమెకు బహూకరించారు. ఏవో లక్ష్మణరావు, డీన్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

PEOPLE CARE

OLD AGE HOME

స్వామి వివేకానంద గ్రూప్, VJA, శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99590 21122, 99590 31122.

రామకృష్ణ గ్రూప్ (AP No.1) VJA వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 96038 42233, 97054 72233.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం (TG No.1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119570, 8639120683.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం - VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో.వ.+ జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5,000/- కమీషన్ కలదు. ✆ 92814 52827, 92814 52838.

భీమవరంలో ఫైనాన్స్ కంపెనీ యందు పని చేయుటకు రికవరీ స్టాఫ్ (Male) జీ॥ 14000 to 16000. Ph: 91339 87779, 96526 74226.

ఆపే ఆటో ఆథరైజ్డ్ డీలర్ ధరణి మోటార్స్ కొరకు ఏలూరు మరియు భీమవరంలలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, HR ఎగ్జిక్యూటివ్స్ కావలెను. వివరాలకు ఫోన్ : 9885185543, 9949452666.

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 9014651068, 7075633416.

JOBS

Required Female office Staff well Experience in Computer, Communication & Accounts. Salary-15 to 20K- Depend on Experience. Contact: 94918 48888, 94418 48888. WhatsApp.

KFC Hiring Part Time/ Full Time Jobs in Tadepalligudem. SSC Pass, Age: 18 to 30 Yrs. Male/Female, Salary CTC 15740/- ✆ 8309225385, 9642101030.

ఉండిలోని ఓ రెస్టారెంట్‌లో పనిచేయడానికి టిఫిన్ మాస్టర్ మరియు సర్వీసు చేసేవారు కావలెను. Ph: 98482 38133. భార్యా భర్తలకు ప్రాధాన్యత ఇవ్వబడును.

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం, VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు 10th ఆపై చదివి, 20-30 వయస్సు కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో.వ+ జీతం: 18-20 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్ కలదు. ✆ 99635 21122, 99631 01122.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.05 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 6304901226

(c) eenadu

భీమవరం

•భీమవరం •ఉండి

యోగాతో ఆరోగ్యం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: యోగాతో ఆరోగ్యంగా ఉండొచ్చని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగాసన పోటీలు భీమవరంలో ఆదివారం నిర్వహించారు. 10 విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వబిలిశెట్టి శ్రీవేంకటేశ్వర్లు, జె. మాధవరావు, కె. రామకృష్ణ, ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు, కంతేటి వెంకట్రాజు పాల్గొన్నారు.

విజేత మెడలో పతకం వేస్తున్న శ్రీనివాసవర్మ

భక్తులకు ఇబ్బందులు రానివ్వొద్దు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్దనస్వామి దేవస్థానానికి నూతన ఛైర్మన్‌గా చింతలపాటి బంగార్రాజు నియమితులయ్యారు. ఆయన్ను ఎమ్మెల్యే తన కార్యాలయంలో ఆదివారం అభినందించారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

బంగార్రాజుతో ఎమ్మెల్యే రామాంజనేయులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం: 80085 74471 | వీరవాసరం: 80085 74475
భీమవరం మండలం: 80085 74533 | ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525 | పాలకోడేరు: 80085 74467
కాళ్ల : 80085 74474

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: ? యనమదుర్రు పంచాయతీలో రోజూ సేకరించిన చెత్తను యనమదుర్రు డ్రెయిన్ గట్టుపై వేస్తున్నారు. దీంతో తీవ్ర దుర్వాసన వస్తుంది. **- కుమార్**

✔ వెంటనే చెత్త తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- వీర్రాజు, పంచాయతీ కార్యదర్శి**

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ? భీమవరంలోని మెంటేవారితోట రైల్వే అండర్‌పాస్‌లో మురుగుతో ఇబ్బందిగా ఉంది **- జె.చంద్రశేఖర్, కె.నాగేశ్వరరావు, మెంటేవారితోట**

✔ మోటారు ఏర్పాటు చేసి నీరు నిల్వ ఉండకుండా తోడేస్తున్నాం. **- కె.రామచంద్రా రెడ్డి, పురపాలక కమిషనర్, భీమవరం**

ఉండి, న్యూస్‌టుడే: ? మీడియం, మైనర్ డ్రెయిన్లల్లో చెత్త వల్ల కొద్దిపాటి వర్షాలకే మా ప్రాంతంలో లేత నారుమడులు నీట మునిగాయి. **- సూర్యనారాయణరాజు, ఆరేడు**

✔ నీటి సంఘాల ఆధ్వర్యంలో చెత్త తొలగింపు పనులు జరుగుతున్నాయి. పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. **- జయప్రకాష్, డ్రెయినేజీ ఏఈ**

? ఆరేడు నుంచి కలిగొట్ల వెళ్లే మార్గంలో కాలువ గట్టు వెంబడి రెండు చోట్ల విద్యుత్తు స్తంభాలు పక్కకు ఒరిగాయి. తక్షణమే వీటి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి. **- వెంకట్రావు, కలిగొట్ల**

✔ పరిశీలించి అవసరమైన చోట్ల నివారణ చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసరావు, విద్యుత్తు శాఖ ఏఈ, ఉండి**

ఆకివీడు, న్యూస్‌టుడే: ? ఆకివీడులో జూపూడి సుబ్బన్న జమిందార్ ప్రాథమిక పాఠశాల వద్ద విద్యుత్తు తీగలపై పడిన కొమ్మలను తొలగించి రహదారిపై పడేశారు. **- స్థానికులు**

✔ నగర పంచాయతీ అధికారులకు చెప్పి తొలగింపజేస్తాం. **- రత్నాకర్, విద్యుత్తు శాఖ ఏఈ**

వీరవాసరం, న్యూస్‌టుడే: ? వీరవాసరం తూర్పు పంట కాలువలోకి కొందరు స్థానికులు మురుగునీటి గొట్టాలు అమర్చారు. ఈ కారణంగా పంట నీరు కలుషితమవుతోంది. **- రాము**

✔ పరిశీలించి గొట్టాలు తొలగించేలా చర్యలు తీసుకుంటా. **- జి. సత్యనారాయణ, జల వనరుల శాఖ ఏఈ, వీరవాసరం**

? వీరవాసరం 1వ వార్డు గాంధీబొమ్మ సెంటర్‌లో విద్యుత్తు లోవోల్టేజీ సమస్యతో గృహోపకరణాలు కాలిపోతున్నాయి. **- కె.శ్రీను**

✔ లైన్‌మెన్‌ను పంపించి సరఫరా పరిశీలించాలని ఆదేశిస్తాం. **- ఆర్‌వీ.అప్పారావు, ఏఈ**

బాలలు.. ఎత్తుకు పైఎత్తులో దిట్టలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే చదరంగం మెదడుకు పదును పెడుతుంది.. ఆటలో ప్రత్యర్థి ఎత్తుకు తగ్గట్టుగా పావులు కదపడం అంటే ఆషామాషీ కాదు. అలాంటి చదరంగంలో భీమవరానికి చెందిన బాలలు రాణిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అంతర్జాతీయ చదరంగం దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరంలోని జీవీఆర్ కల్యాణ మండపంలో ఇన్విటేషనల్ ఏపీ స్టేట్ ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంటు-2025 పోటీలు ఆదివారం నిర్వహించారు. ఇందులో క్రీడాకారులు పాల్గొని సత్తా చాటారు. చదరంగంలో ఎలాంటి తర్ఫీదుతో రాణిస్తున్నారో 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

చదరంగం ఆడుతున్న చిన్నారులు

✸ ప్రణయ్ ప్రతిభ- గతంలో పలు ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో పాల్గొన్నాను. ఒక్కోసారి త్వరగానే గెలిచేవాడ్ని, మనతో తలపడే ఆటగాళ్లను బట్టి మనం ఆడాల్సి ఉంటుంది. చదరంగంలో మెలకువలను చెన్నై నుంచి వర్చువల్‌గా శిక్షకుడి నుంచి నేర్చుకుంటాను. జాతీయస్థాయి, రేటింగ్ క్రీడాకారుడిగా గుర్తింపు పొందుతా.

✸ జి.షణ్ముఖ్ శ్రీజస్విక్ ప్రతిభ- జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడాను. గెలుపు, ఓటముల గురించి పట్టించుకోను. ఎలాగో గెలవాలనుకుంటాను. ఒకవేళ ఓడినా ఎందుకు ఇలా జరిగిందో తెలుసుకుంటాను. మరోసారి గెలిచేందుకు ప్రయత్నిస్తాను. ఆటలతో స్నేహితులు పెరుగుతారు. నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి. జాతీయ స్థాయిలో బహుమతులు పొందడమే లక్ష్యం.

✸ షణ్ముఖ్ ప్రతిభ- గుంటూరు, విజయవాడ, ఏలూరు తదితర చోట్ల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడాను. చదువుతో పాటు ఆటలో ప్రతిభకు సమయం కేటాయిస్తాను. విజయం సాధించామని సంతోషం, ఓటమితో దుఃఖం తెచ్చుకోకూడదు. మన కంటే ప్రత్యర్థి ఎంత బాగా ఆడుతున్నారో తెలుసుకుంటాను. పావులు కదపడంలో మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటన్నది తెలుసుకుంటే మరోసారి ఓటమి అంచుల్లోకి వెళ్లం.

షైనీకి షైనింగ్ స్టార్ అవార్డు

ఆకివీడు, న్యూస్‌టుడే: అజ్జమూరుకు చెందిన గంటా షైనీ కరాటే, యోగా తదితర పోటీల్లో చూపిస్తున్న ప్రతిభకు విజయవాడలోని గుజ్జల సరళాదేవి భవనంలో వై.ఎం.కె. అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సినీ నటుడు భానుచందర్ చేతుల మీదుగా మల్టీ టాలెంటెడ్ షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్నారు.

అందిస్తున్న భానుచందర్

భాజపా జిల్లా ఉపాధ్యక్షుడిగా రామ్మూర్తి

కాళ్ల, న్యూస్‌టుడే: పెదఅమిరానికి చెందిన సీనియర్ భాజపా నాయకుడు కోరా రామ్మూర్తి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈయన ఉండి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తగా, సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడిగా ఉన్నారు. జిల్లాలో పార్టీని అందరితో కలిసి ముందుకు నడిపిస్తానని తెలిపారు.

ఆక్రమణల తొలగింపు ప్రారంభం

కాళ్ల, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో కాలువల ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టినట్లు ఉండి డీసీ ఛైర్మన్ తోట ఫణబాబు తెలిపారు. కాళ్ల మండలం సీసలి గ్రామ పరిధిలో మేడవరం పంట కాలువ ప్రక్షాళన పనులను ఆయన పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు ఆదేశాల మేరకు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న అనధికార కట్టడాలను తొలగిస్తున్నట్లు చెప్పారు.

రూ.కోట్ల కంటే ఆరోగ్యం మిన్న

పాలకోడేరు, న్యూస్‌టుడే: చక్కటి ఆరోగ్యం కలిగి ఉంటేనే ఏదైనా సాధించగలమని, రూ.కోట్ల కంటే ఆరోగ్యం మిన్న అని భీమవరం న్యూరాలజిస్టు జె.శివకుమార్ తెలిపారు. మోగల్లు శివారు గోస్తనీనది తీర్థం ఆవరణలో పాలకోడేరు, మోగల్లు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు శివకుమార్, దంతులూరి వెంకటేశ్వరరాజు, యు.నాగరాజు పాల్గొని ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాల గురించి అవగాహన కల్పించారు. వాకర్స్ గవర్నర్ గుంటూరి రామరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు గాదిరాజు కృష్ణంరాజు, సీతారామరాజు, సందీప్‌వర్మ, కొత్తపల్లి బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యూరాలజిస్టు శివకుమార్

19, 20న సీపీఐ జిల్లా సమితి మహాసభలు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తణుకులో ఆగస్టు 19, 20 తేదీల్లో జరగనున్న సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా సమితి 27వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు కోరారు. ఆదివారం భీమవరంలో నిర్వహించిన క్లాప్ డ్రైవర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం సూపర్-6 హామీలు, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. క్లాప్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు రాజు, సత్యనారాయణ, శివ, గోపాలం తదితరులు పాల్గొన్నారు.

నినదిస్తున్న నాయకులు

నిత్యాన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామానికి చెందిన వేణుగోపాల రావు ఆదివారం రూ. లక్ష విరాళాన్ని ఈవో సుబ్బారావుకు అందజేశారు.

మురుగు కాలువల ప్రక్షాళన

ఉండి, న్యూస్‌టుడే: మురుగు కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, చెత్త తొలగింపు పనులు శరవేగంగా జరుగుతున్నాయని కోలమూరు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు యర్రా వెంకట సుబ్రహ్మణ్యం తెలిపారు. పాములపర్రు వంతెన, ఉండి అక్విడెక్టుల వద్ద తూడు తొలగింపు పనులను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉప సభాపతి, ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు ఆదేశాలతో డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురళీకృష్ణంరాజు నేతృత్వంలో బొండాడ మేజర్ డ్రెయిన్‌లో తూడు తొలగిస్తున్నట్లు వివరించారు. శివారు ప్రాంతాల్లోనూ మురుగునీటి పారుదలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా కృషి చేస్తున్నామని తెలిపారు.

పనులను పరిశీలిస్తున్న నీటి సంఘం అధ్యక్షుడు వెంకట సుబ్రహ్మణ్యం

ఖరీఫ్‌లోనూ కన్నీరేనా

మోగల్లులో అందని జలాలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: రబీలో ఏటా సాగునీటి ఎద్దడిని ఎదుర్కొనే మోగల్లు రైతులకు ఈ ఏడాది ఖరీఫ్ ఆదిలోనే కష్టాలు మొదలయ్యాయి. అల్లంకోడు, ఉనికిలి, నక్కల కాలువ సమీపంలో 150 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. నారుమడులు ఎండిపోవడంతో పాటు దమ్ములు చేసుకునేందుకు చుక్క లేదు. రేలంగి పంట కాలువకు అనుసంధానమైన ఛానల్ నుంచి ఆయకట్టుకు సాగునీరు సరఫరా అవుతుంది. పలుచోట్ల పంట కాలువ ఆక్రమణలకు గురికావడం, విపరీతంగా నాచు పెరిగిపోవడంతో గడిచిన 20 రోజులుగా నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. ముందస్తు ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలని పదేపదే చెబుతున్న అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని రైతులు వాపోతున్నారు. వారం రోజులుగా ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా ఇప్పటి వరకు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నాట్లు వేయడం ఆలస్యమైందని, మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే పంట విరామం ప్రకటించక తప్పదని పేర్కొన్నారు. రేలంగి కాలువలో నాచు పెరిగిపోవడంతో సరఫరాకు ఆటంకం ఏర్పడుతుందని, తొలగింపు పనులు జరుగుతున్నాయని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

నీరు లేక పూర్తిగా ఎండిపోయిన భూములు

పంట బోదెలో పేరుకుపోయిన నాచు

ఫీల్డ్ కౌన్సిల్ సభ్యుడిగా చాంబర్లిన్

చెరుకువిల్లి (ఆకివీడు), న్యూస్‌టుడే: చెరుకువిల్లిలోని సీఎస్ఐ చర్చి ఫీల్డ్ కౌన్సిల్ సభ్యుడిగా వరుసగా మూడోసారి ఏకగ్రీవ చాంబర్లిన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం చర్చిలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. సర్పంచులు నందమూరి ప్రకాశం, చిగురుపాటి చిట్టిబాబు, కె. సాల్మన్‌రాజు, వి. రత్నభూషణం, బి. జాన్, ఎం. ప్రశాంతరాజు పాల్గొన్నారు.

భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No.20/2018 in O.S.No.241/2010

DHR : దంతులూరి వెంకట నర్సింహరాజు
JDRS : ఉండవల్లి శ్రీనివాసరావు
ఉండవల్లి పద్మావతి

పై నెంబరు దావా డిక్రీ బాకీ రాబట్టుటకు 2 JDR కి చెందిన యీ దిగువ షెడ్యూల్ ఆస్తిని శ్రీ కోర్టు వారు ది.29.07.2025 తేది ఉదయం 10.30 ని॥లకు లగాయతు కోర్టులో వేలంవేయుదురు. కావలసినవారు పాడుకొన వచ్చును

SCHEDULE

An Up stair shop and Tin sheet shed Bearing D.No.3-8-49 and Assessment No.8140 in an extent of northern 76 square yards of site or 684.5 square ft., or 63 square meters of site out of 135 square yards of site out of the total extent of Ac.0.84 cents in R.S.No.202/4 belong to the 2nd judgment debtor in the old 6th ward, New 3rd ward and the present 4th ward of Bhimavaram Municipality, Bhimavaram Mandalam, Bhimavaram Sub Division Bhimavaram Sub Registry of west godavari District within the Following **Boundries**:**East**:Wall of samayamanthula prasad rao-18 feet. **South**:Shop of samayaman thula Koteswara Rao and others and joint wall -37 feet.**West**: Public Road - 19 feet, **North**: Building of Muilapudi Venkanna - 37 feet.

DHR Value : 4,00,000/-
Amina'sValue : 1,70,00,000/-
వేలం తేది : 29.07.2025

ఆల్తి శివరామకృష్ణ DHR తరుపు అడ్వకేట్
శ్రీరాంపురం, భీమవరం -2

విషసర్పాలకు ఆవాసం.. ఈ భవనం

నందమూరుగరువులో 2019కు ముందు గ్రామ సమాఖ్య భవన నిర్మాణం చేపట్టారు. గత పాలనలో ఆ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి ఆ ప్రాంతం విషసర్పాలు, కీటకాలకు ఆవాసంగా మారింది. పూర్తయితే గ్రామంలోని డ్వాక్రా సంఘాల మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, శిక్షణలకు ఉపయోగకరంగా ఉంటుంది. వెలుగు ఏపీఎం జ్యోతిరాణి మాట్లాడుతూ నిధులు రాగానే పూర్తి చేస్తామని చెప్పారు. **- న్యూస్‌టుడే, నందమూరుగరువు (వీరవాసరం)**

గట్టు.. ప్రమాదాలు జరిగేటట్టు

ఉండి-మహదేవపట్నం మధ్య కాలువ గట్టు ప్రమాదకరంగా మారింది. [illegible] మహదేవపట్నం పరిధిలో సుమారు రెండున్నర కిలోమీటర్ల వెంబడి పూర్తిస్థాయిలో బలోపేతం చేసి పక్కా రహదారి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. మహదేవపట్నం వంతెన నుంచి ఆ గ్రామ పరిధిలో గట్టుపై అర కిలోమీటరు పరిధిలో సిమెంట్ రహదారి నిర్మించారు. దాని పక్కన అంచులను పూర్తిస్థాయిలో పటిష్ఠపరచలేదు. వంతెనకు దిగువున ఇటీవల సరివి బాదులతో రక్షణ చర్యలు చేపట్టారు. దీనిపై జల వనరుల శాఖ ఉండి ఏఈ కె.ఫణిశంకర్ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని వివరించారు. **- న్యూస్‌టుడే, మహదేవపట్నం (ఉండి)**

మురుగు.. కాలువలోకే పరుగు

గొల్లలకోడేరు శివారు 4వ వార్డులో డ్రెయినేజీ దెబ్బతినడంతో మురుగు సమీపంలోని పంట కాలువలో కలుస్తోంది. అందులో నీరే మంచినీటి చెరువుకు పెడుతున్నారు. పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న వారే లేరు. మురుగు వల్ల కాలువ నీరు కలుషితం అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీకి మరమ్మతులు చేపడతామని పంచాయతీ కార్యదర్శి కె.సుజాత తెలిపారు. **- న్యూస్‌టుడే, గొల్లలకోడేరు (పాలకోడేరు)**

రోడ్డు మీద నుంచి కాలువలోకి వెళ్తున్న మురుగు

ఇలా పడుతుంది.. అలా పోతుంది

ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో ఆనాల చెరువుకు వెంకయ్యవయ్యేరు కాలువ నీటిని విద్యుత్తు మోటారు ద్వారా తోడుతున్నారు. సుమారు ఏడేళ్ల కిందట కాలువ గట్టు వద్ద పంపుహౌస్ నిర్మించారు. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరడంతో పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో ఒక పక్క కాలువలో నీటిని మోటారుతో తోడుతుండగా కుండీ కింద నుంచి తిరిగి వెంకయ్యవయ్యేరులోకే వెళ్లిపోతోంది. ఈ విషయాన్ని మేనేజర్ వెంకటేశ్వరరావు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, ఆకివీడు

పాల్గొన్న విశ్వాసులు

స్తుతి ఆరాధన

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులోని ఉల్వర్టన్‌పేట ప్రాంతంలో ఎల్.ఇ.ఎఫ్ చర్చిలో లేమెన్స్ ఇవాలిజికల్ ఫెలోషిప్ 90వ వార్షికోత్సవ స్తుతి ఆరాధన పాస్టర్ జయంతరావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. బ్రదర్ మాథ్యూస్ వాక్యోపదేశం చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నాటిక ప్రదర్శనలు, భక్తి గీతాలు అలరించాయి.

రూ.1.43 లక్షల స్వాధీనం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఒకటో పట్టణం పారిశ్రామికవాడలో జూదమాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేశామని సీఐ ఎం.నాగరాజు తెలిపారు. వారి నుంచి రూ.1.43 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కోడిపందేల స్థావరంపై దాడి

అర్తమూరు (ఉండి), న్యూస్‌టుడే: అర్తమూరులోని సెల్‌టవర్ సమీపంలోని బహిరంగ ప్రదేశంలో కోడిపందేలు జరుగుతున్నాయనే సమాచారంతో ఎస్సై నసీరుల్లా ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. పట్టుబడిన పది మంది వ్యక్తుల నుంచి రూ.4,100 నగదు, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు.

కొట్టి.. డబ్బులు లాక్కొని..

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: రెండో పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో పనిచేస్తున్న ఎన్. ఉదయకుమార్‌ను కొందరు వ్యక్తులు కొట్టి గాయపరిచారు. అతని దగ్గర ఉన్న రూ.10 వేలు లాక్కెళ్లిపోయారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రెహమాన్ తెలిపారు. బాధితుడు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

15 నుంచి నిరవధిక దీక్షలు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: భీమవరం పాత బస్టాండ్ వద్ద అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాలు పునఃనిర్మించకపోతే ఆగస్టు 15 నుంచి నిరవధిక దీక్షలు చేస్తామని సాధన కమిటీ నాయకుడు జేఎన్‌వీ.గోపాలన్ అన్నారు. ఆదివారం భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో కమిటీ సమావేశం నిర్వహించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పి.కోటేశ్వరరావు, కనుమూరి సత్యనారాయణరాజు, కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులంతా ముందుకొచ్చి నిర్మాణం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బి.రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

మాకు అత్యంత ఆప్తులు, శ్రేయోభిలాషులు
శ్రీ అల్లూరి సీతారామరాజు సేవా సమితి అధ్యక్షులు
శ్రీ గాదిరాజు సుబ్బరాజు గారి తండ్రి గారు
కీ॥శే॥ శ్రీ గాదిరాజు వెంకటరామరాజు గారి
మరణానికి చింతిస్తూ.. దివికేగిన వారి
పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ..
వారి కుటుంబ సభ్యులకు
మా ప్రగాఢ సానుభూతిని
తెలియజేస్తున్నాము.

కీ॥శే॥శ్రీ గాదిరాజు వెంకట రామరాజు గారు

డా॥ అల్లూరి రామకృష్ణంరాజు M.D. గౌ॥ అధ్యక్షులు	ఉద్దరాజు వేణుగోపాలరాజు ఉపాధ్యక్షులు I	శ్రీమతి Ch. ఝాన్సీలక్ష్మి ఉపాధ్యక్షులు II
Ch.A.V.D. సుబ్రహ్మణ్యంరాజు సెక్రటరీ	K.V. సత్యనారాయణరాజు (సత్తులు) జాయింట్ సెక్రటరీ	నడింపల్లి వెంకట సత్యసుబ్బరాజు (విష్ణుప్రియ ఆక్వాఫీడ్స్) ట్రెజరర్
కునాథరాజు వెంకట మాధ్రాజు యోగా టీచర్, కార్యవర్గ సభ్యులు	ముదుండి సత్యనారాయణరాజు Retd.ADE, కార్యవర్గ సభ్యులు	చేకూరి భీమరాజు (I.O.B) కార్యవర్గ సభ్యులు
వేగేశ్న రమణరాజు (ONGC) కార్యవర్గ సభ్యులు	వేగేశ్న రామకృష్ణంరాజు (జువ్వలపాలెం) కార్యవర్గ సభ్యులు	దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు (పాలకోడేరు) కార్యవర్గ సభ్యులు

తోట సత్యనారాయణ (M.D. సీతామెరైన్స్) కో ఆప్టెడ్ సభ్యులు	వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు (బులియన్ మర్చంట్) కో ఆప్టెడ్ సభ్యులు	MSM రామప్రసాద్ F.C.A. కోఆప్టెడ్ సభ్యులు	సేవాసమితి స్టాఫ్

శ్రీ అల్లూరి సీతారామరాజు సేవా సమితి, భీమవరం

మన 'సారె' కొలిచె

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవార్లకు భక్తులు సారె సమర్పించారు. గునుపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మకు ఆలయ మాజీ పాలకవర్గ సభ్యుడు యర్రంశెట్టి శ్రీనివాస్ దంపతులు సారె అందజేశారు. **వాండ్రం (ఉండి), న్యూస్‌టుడే:** వాండ్రం గ్రామదేవత పోలేరమ్మకు సర్పంచి దాసరి వెంకటకృష్ణ, పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో తొలుత అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, పూలతో పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళవాయిద్యాల మధ్య మిఠాయి, సారెను ఊరేగింపుగా తీసుకొచ్చారు. మాజీ సర్పంచి రెడ్డిపల్లి సత్యనారాయణ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులోని పుంతలో ముసలమ్మకు, మాదివాడలోని గంగానమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్లకు సాలిపేట భక్తులు వివిధ రకాల పిండి వంటలు, మిఠాయిలు, పండ్లు, చలివిడి, పానకాలు, చీరలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భీమవరం: అలంకరణలో ఆదిలక్ష్మి

వాండ్రం: ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులోని గంగానమ్మకోడు వీధిలోని దండు మారెమ్మను ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రదర్శనగా వచ్చి బోనాలు సమర్పించారు.

గునుపూడి విద్యాగణపతి ఆలయ ప్రాంగణంలో జ్ఞాన సరస్వతికి ఉమాసోమేశ్వర గునుపూడి, భీమవరం బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో లక్ష జాజి పువ్వులతో పూజ, అలంకరణ చేశారు.

కాళ్ల, న్యూస్‌టుడే: కోలనపల్లి గ్రామ దేవత ముత్యాలమ్మకు సుమారు 500 కిలోల సారెను కావిళ్లతో గ్రామస్థులు తీసుకొచ్చి అందజేశారు.

దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం

మొగల్తూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్య) ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉందని మొగల్తూరు స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్, ప్రధానోపాధ్యాయుడు వి.రవిశంకర్ సర్కార్ తెలిపారు. పదో తరగతిలో ప్రవేశానికి వచ్చే ఆగస్టు 31వ తేదీ నాటికి 14 ఏళ్లు నిండి ఉండాలని, ఇంటర్మీడియట్‌కు పదోతరగతిలో ఉత్తీర్ణులై 15 ఏళ్ల వయసు నిండిన వారు అర్హులని తెలిపారు.

విద్యార్థులకు పోటీలు

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలో ఆదరణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు పోటీలు నిర్వహించారు. 200 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

మావుళ్లమ్మ ఉత్సవాలు ప్రారంభం

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట నటరాజ్ వీధిలో మావుళ్లమ్మ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రాత్రి అమ్మవారి పంచలోహ విగ్రహానికి అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. సోమవారం కుంకుమ పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.

23 నుంచి శ్రావణమాస పూజలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు గీతామందిరంలో ఈ నెల 23వ తేదీ నుంచి శ్రావణమాస పూజలు జరుగుతాయని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. 23న మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చనలు, ఆగస్టు 16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుగుతాయన్నారు.

10 AM to 1 PM
మేమున్నాం.. మీకు తోడుగా..
నరసాపురం: 80085 74504
పాలకొల్లు: 80085 74510
ఆచంట: 91212 29087

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ? లంగర్పు ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకున్నాయి. - నగర సత్యనారాయణ, చిట్టవరం

✔ పాదులు తొలగిస్తాం. - కొల్లి సుధాకర్, విద్యుత్తు ఏఈఈ

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? యరమిల్లి వారి వీధిలో డ్రెయిన్లలో పూడిక, రోడ్ల వెంబడి చెత్త సక్రమంగా తొలగించడం లేదు. - ఎన్. బాబూరావు, జె.రామకృష్ణ, నరసాపురం

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తాం. - ఎం. అంజయ్య, పురపాలక కమిషనర్

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ? పావుకాన పేటలో కొద్ది రోజులుగా డ్రెయిన్లను శుభ్రం చేయడం లేదు. దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. - రవి, పాలకొల్లు

✔ డ్రెయిన్లను శుభ్రం చేయిస్తాం. - లక్ష్మణ్, ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య అధికారి

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ? నాగరాజుపేటలో రహదారి పక్కనే చెత్త వేస్తున్నారు. - రాము, సొంపకుడు

✔ పరిశీలించి చెత్త తొలగిస్తాం. - సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి

పెనుగొండ, న్యూస్‌టుడే: ? వడలి బ్రాహ్మణ వీధిలో చెత్త పేరుకుపోయి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - టి.రమేశ్

✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్త తొలగిస్తాం. - ఎస్.శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి

నీరు చేరక.. పనులు సాగక!

ఖరీఫ్ ఆరంభంలోనే రైతులకు ఇక్కట్లు

నరసాపురం గ్రామీణ, జిన్నూరు (పోడూరు), న్యూస్‌టుడే: ఖరీఫ్ సాగు ఆరంభంలోనే నీటి ఎద్దడితో అన్నదాతలకు ఇక్కట్లు తప్పడం లేదు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో చాలా గ్రామాల్లో రైతులు ఖరీఫ్ సాగు పనులకు సమాయత్తమయ్యారు. కొద్ది రోజులుగా ఎండల తీవ్రత వేసవిని తలపిస్తోంది. పంట కాలువల్లో తగినంత నీటి మట్టం లేకపోవడంతో పొలాల్లోకి నీరు చేరక దమ్ములు చేసే పరిస్థితి లేదు. కొన్ని చోట్ల దమ్ము చేసిన పొలాలు, నారుమడులు తడారిపోతున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. దీంతో కాలువల్లో ఉన్న కొద్ది పాటి జలాలను ఇంజిన్లతో పొలాల్లోకి మళ్లిస్తున్నారు. నరసాపురం మండలంలోని సీతారామపురం నార్త్, రుస్తుంబాద, లిఖితపూడి, లక్ష్మణేశ్వరం, సారవ, వద్దిపర్రు, యర్రంశెట్టిపాలెం, ఎల్బీచర్ల, కె.బేతపూడి, రాజుగారితోట తదితర గ్రామాల్లో సమస్య ఎక్కువగా ఉంది. ఇక్కడ కాలువల్లో నీటి మట్టం పెంచి నీటి ఎద్దడిని అధిగమించేలా ఇప్పటికే చర్యలు చేపట్టామని జలవనరులశాఖ డీఈఈ సీహెచ్ వెంకట నారాయణ తెలిపారు.

రుస్తుంబాదలో నీరు లేక దమ్ము చేయని పొలం

పోడూరులో సిద్ధమైన నారుమడి

ముదిరిపోతున్న నారు..

పోడూరు మండల పరిధిలో మండలంలో 13,070 ఎకరాల్లో వరి సాగవుతోంది. ఇప్పటి వరకు సుమారు 850 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. గుమ్మలూరు, పెనుమదం, వద్దిపర్రు, రావిపాడు ప్రాంతాల్లో సాగునీటి ఎద్దడితో నాట్లు వేయలేదు. ఈ గ్రామాల్లో నారుమడులు ఎదిగి నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నాయని. అవి ముదిరి కణుపులు వేస్తే పనికిరాకుండా పోతాయని గుమ్మలూరుకు చెందిన రైతు పొలమూరి భూషణం ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి కోసం జలవనరుల అధికారులతో వ్యవసాయ శాఖ గ్రామ అసిస్టెంట్లు ప్రతీ రోజు సమీక్షిస్తున్నారని వ్యవసాయ శాఖ ఏఈవో బాలాత్రిపురసుందరి తెలిపారు.

శాకంబరి అలంకరణలో బండి ముత్యాలమ్మ

మొగల్తూరు, న్యూస్‌టుడే: ఆషాఢమాస ఆదివారం సందర్భంగా ముత్యాలపల్లిలో కొలువైన బండి ముత్యాలమ్మను శాకంబరి రూపంలో అలంకరించారు. గ్రామానికి చెందిన తోట మణిబాబు 500 కిలోల కూరగాయలు సమకూర్చారు.

మూలస్థానేశ్వరి ఆలయంలో... యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి గ్రామ దేవత మూలస్థానేశ్వరి దేవిని ఆదివారం వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పూలతో శాకంబరి రూపంలో అలంకరించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చి ఆషాఢ సారె సమర్పించారు.

గంగాలమ్మ ఆలయంలో.. నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ఎల్బీచర్లలో కొలువైన గంగాలమ్మ ఆదివారం విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ఎల్బీచర్లలో కొలువైన గంగాలమ్మకు సారె, చీర సమర్పించే కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు మేళతాళాలు, బాణసంచా కాల్పుల మధ్య సారె, చీరలు, కావిళ్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు.

ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న భక్తులు

సూర్యనారాయణ స్వామికి అభిషేకాలు.. నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని బాపు ఘాట్‌లో కొలువైన సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం అభిషేకాలు, విశేష పూజలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు కోడిగట్టు వద్ద సర్వోదయపురంలో సూర్యనారాయణస్వామి ఆలయంలో అభిషేకాలు జరిపించారు. అనంతరం రజత ఆభరణాలు, పూలతో స్వామివారిని అలంకరించారు.

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సిద్ధాంతంలో వాసవీమాతను ఆర్య వైశ్య సంఘం సభ్యులు పండ్లు, కూరగాయలతో శాకంబరి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు

అమ్మవార్లకు ఆషాఢ సారె

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ వాసవీ శాంతిధామ్‌లో అమ్మవారి మరకత ప్రతిమకు భీమవరం మండలానికి చెందిన ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆషాఢ సారె సమర్పించారు. పెనుగొండలోని కామాక్షి మాత ఆలయంలో భక్తులు పూజలు చేసి మిఠాయిలు, పిండి వంటలతో ఆషాఢ సారె సమర్పించారు.

హరితం.. మాటలకే పరిమితం!

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలంటూ అధికారులు ప్రకటనలు చేయడం తప్ప ఆచరణలో విఫలమవుతున్నారు. నరసాపురం పట్టణంలో విభాజకాలు పచ్చదనం లేక వెలవెలబోతున్నాయి. బస్టాండ్ రోడ్డు, నక్షత్ర రోడ్డు, స్టేషన్ పేట బైపాస్, మిషన్ హైస్కూల్, ప్రభుత్వ ఆసుపత్రి రహదారుల్లో కొన్ని చోట్ల మొక్కలు నాటినా పర్యవేక్షణ కొరవడింది. దీంతో విభాజక మధ్యలో గడ్డి, జిల్లేడు, పిచ్చి మొక్కలు, పాదులు దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల మొక్కలు నాటకపోవటంతో చెత్త పేరుకుపోతోంది. ఈ విషయాన్ని పురపాలక కమిషనర్, ఎం. అంజయ్య దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి మొక్కల సంరక్షణకు చర్యలు చేపడతామన్నారు.

విభాజకం మధ్యలో పెరిగిన గడ్డి

భాజపా జిల్లా ఉపాధ్యక్షుడిగా రామ్మూర్తి

కాళ్ల, న్యూస్‌టుడే: పెదఅమిరానికి చెందిన సీనియర్ భాజపా నాయకుడు కోరా రామ్మూర్తి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈయన ఉండి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తగా, సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడిగా ఉన్నారు. జిల్లాలో పార్టీని అందరితో కలిసి ముందుకు నడిపిస్తానని తెలిపారు.

కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి

నరసాపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు నిర్భయంగా జీవిస్తున్నారని ముస్లిం మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎంఏ షరీఫ్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం పార్టీ నరసాపురం పట్టణ అధ్యక్షుడు జక్కం శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో 7, 8 వార్డుల్లో ఆదివారం జరిగింది. నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పరిష్కరించాల్సిన సమస్యలు తెలుసుకుని నమోదు చేశారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. నాయకులు కొల్లు పెద్దిరాజు, ఉదయగిరి అచ్యుతరామయ్య, సంకు భాస్కరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికులతో షరీఫ్, రామరాజు తదితరులు

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

కరపత్రాలు అందిస్తున్న ఏఎంసీ ఛైర్మన్ బ్రహ్మాజీ

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పెనుగొండ ఏఎంసీ ఛైర్మన్ బడేటి వీరబ్రహ్మం (బ్రహ్మాజీ) అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం రామన్నపాలెం గ్రామంలో ఆయన నాయకులతో కలిసి పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. సమస్యలు ఉంటే నేరుగా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఎంపీటీసీ సభ్యుడు మొఖమట్ల కృష్ణకాంత్, తెదేపా గ్రామాధ్యక్షుడు పారాబత్తుల తాతాజీ, నాయకులు నాగమల్లేశ్వరరావు, దుర్గారావు, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంట కాలువలో అవరోధాలు

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలో ప్రవహిస్తున్న ఎల్లప్ప పంట కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో సాగునీరు ముందుకు సాగక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పరిసరాల్లో ఇళ్లు, దుకాణాల్లో చెత్త, ఖాళీ బాటిళ్లు, ఇతర వ్యర్థాలను స్థానికులు ఈ కాలువలో వేయడంతో ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. కొందరు ఖాళీ మద్యం సీసాలను కూడా ఈ కాలువలో వేయటంతో శుభ్రం చేయించే సమయంలో సమస్యలు ఎదురవుతున్నాయి. గతంలో ఎల్లప్ప కాలువ ఆధునీకీరణ పనులు చేపట్టినా అసంపూర్తిగా నిలిచాయి. నరసాపురం ప్రధాన కాలువ నుంచి నక్కల డ్రెయిన్ వరకు ఎల్లప్ప కాలువ ప్రవహిస్తోంది. గ్రామంలో పలు ప్రాంతాల్లో మురుగు ఈ కాలువలో కలుస్తుండంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై ఉప ఎంపీడీవో వై.కిశోర్ స్పందిస్తూ పంటకాలువలో వ్యర్థాలు వేయకుండా ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

పెనుగొండలో ఎల్లప్ప కాలువ దుస్థితి

వరదొస్తే వణుకే!

బలహీనంగా ఏటిగట్టు

పాలకొల్లు, యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి, ఆచంట, నరసాపురం మండలాల్లోని పలు ప్రాంతాల్లో వశిష్ఠ గోదావరి ఏటిగట్టు బలహీనంగా మారింది. సుమారు 40 కిలోమీటర్ల మేర గట్టు పొడవునా గాళ్లు దర్శనమిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కాలినడకన వెళ్లడానికి కూడా గట్టు అనువుగా లేక చిట్టడవిని తలపిస్తోంది. అసలే వర్షాకాలం.. ఆపై వరదలతో గోదావరి పొంగే సమయం. ఏమాత్రం తేడా వచ్చినా తీర గ్రామాలకు ముంపు ముప్పు తప్పదు. పాలకొల్లు నియోజకవర్గంలో మంత్రి నిమ్మల రామానాయుడు చొరవతో గట్టు ఆధునికీకరణకు మూడు విడతలుగా నిధులు మంజూరయ్యాయి. ఆచంట, నరసాపురం నియోజకవర్గాలో నేతలు కూడా గట్టు పటిష్ఠీకరణ పనులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

యలమంచిలి వద్ద ఏర్పడిన గాళ్లు

పాతనవరసపురం సమీపాన ఇలా..

మలుపుల్లో ముప్పు!

పెనుగొండ, పాలకొల్లు గ్రామీణ, పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: మండల కేంద్రాల్లో ప్రధాన రహదారులు, గ్రామాలను అనుసంధానం చేసే మార్గాల్లో మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. పెనుగొండలో లింగాల, శివాలయం, వాసవీమాత ఆలయ ప్రాంతాల్లో, ప్యాలెస్ థియేటర్ సమీపాన, దొంగరావిపాలెం- సిద్ధాంతం, నడిపూడి- చిన్నమల్లం రహదారిల్లో మలుపుల వద్ద వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో పెనుగొండలో లింగాల, శివాలయం వీధుల నుంచి ప్రధాన రహదారిపైకి వచ్చే ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. రాత్రి వేళ వాహన చోదకులు వేగంగా రావడంతో ప్రమాదాలకు ప్రధాన కారణమని స్థానికులు చెబుతున్నారు. పాలకొల్లు- భీమవరం రహదారిలో లంకలకోడేరు మంచినీటి ట్యాంకు సమీపాన మలుపులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ అంశంపై ఆర్అండ్‌బీ ఏఈ టీఆర్వీ ప్రసాద్‌ను వివరణ కోరగా ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.

లంకలకోడేరులో తాగునీటి ట్యాంకు వద్ద..

పెనుగొండ ప్యాలెస్ థియేటర్ సమీపాన..

సుబ్రహ్మణ్యేశ్వరునికి క్షీరాభిషేకం

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరు పంచాయతీ పరిధి ఉచ్చింతకాలువ సమీపాన సుబ్రహ్మణ్యేశ్వరంలో కొలువైన సుబ్రహ్మణ్యస్వామికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. హైందవ సంఘాల సభ్యులు పాల కావిళ్లతో ప్రదర్శనగా ఆలయానికి వెళ్లి స్వామికి నివేదించి అభిషేకం చేశారు. రమేశ్, శ్రీకాంత్ ఆధ్వర్యంలో అన్న సమారాధన చేశారు.

పాల కావిళ్లు తెస్తున్న హైందవ సంఘాల సభ్యులు

ప్రమాద ఘంటికలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణ పరిధి ఆనంద్ మొహద్దీన్‌నగర్ కాలువ గట్టు రోడ్డులో విద్యుత్తు స్తంభానికి, తీగలకు ఇలా పాదులు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి. వీటి వల్ల విద్యుత్తు సరఫరాలో తరచూ అవరోధాలు ఏర్పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే పాదులను తొలగించాలని కోరుతున్నారు. ఈ సమస్యను 'న్యూస్‌టుడే' విద్యుత్తు ఏఈ కె.ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతామన్నారు.

యోగాతో ఆరోగ్యం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: యోగాతో ఆరోగ్యంగా ఉండొచ్చని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగాసన పోటీలు భీమవరంలో ఆదివారం నిర్వహించారు. 10 విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వబిలిశెట్టి శ్రీవేంకటేశ్వర్లు, జె.మాధవరావు, కె.రామకృష్ణ, ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు, కంతేటి వెంకట్రాజు పాల్గొన్నారు.

స్వచ్ఛత కనుమరుగు!

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ

ఆచంట, నరసాపురం గ్రామీణ, పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లో డ్రెయిన్ల నిర్వహణ సక్రమంగా లేకపోడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. నరసాపురం డివిజన్‌లోని ఆచంట, పాలకొల్లు, నియోజకవర్గాల పరిధిలో పట్టణ స్థాయి జనాభా ఉన్న పెద్ద గ్రామాలతో పాటు చిన్న పల్లెల్లోనూ 500కు పైగా జనావాసాలు ఉన్న కాలనీలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదు. మురుగు నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి.

దగ్గులూరు పరిధి పెదపేటలో నిలిచిన మురుగు

● ఆచంటలో చినపేట, పెదపేట, కొత్తురు, కాపులవీధితో పలు ప్రాంతాల్లో ప్రవహిస్తున్న రెండు డ్రెయిన్లు నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. వల్లూరు, కొడమంచిలి, పెచుమంచిలి, వేమవరంలలో వీధి డ్రెయిన్లు దుస్థితిలో ఉన్నాయి. మండల కేంద్రాలైన పెనుగొండ, పెనుమంత్రతో పాటు పలు గ్రామాల్లో డ్రెయిన్ల నిర్వహణ సక్రమంగా లేదని స్థానికులు వాపోతున్నారు. దోమల నివారణకు మందులు పిచికారీ చేయడం లేదని చెబుతున్నారు. ● నరసాపురం మండలం పెదలంకలో డ్రెయినేజీ లేక మురుగు రోడ్డుపైకి చేరుతోంది. సీతారామపురం నార్త్‌లో వీధిలోనూ రోడ్డు పక్కనే మురుగు నిలిచిపోతోంది. కొప్పర్రు పరిధిలో పెదపేటలోనూ ఇదే పరిస్థితి. ● పాలకొల్లు మండలం దగ్గులూరు నెహ్రూవీధి నుంచి పెదపేటకు వెళ్లే దారిలో కొద్దిపాటి వర్షానికే డ్రెయిన్లో నీరు రోడ్డుపైకి చేరుతోంది. యలమంచిలి మండలంలోని మేజర్ గ్రామల్లోని అనేక పేటల్లో డ్రెయిన్ల సమస్య ఉంది. ● పంచాయతీల్లో దోమల నివారణకు కనీస చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వీధుల్లో కనీసం కచ్చాడ్రెయిన్లు కూడా లేకపోవడంతో రోడ్ల పక్కన మురుగు నిలిచి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఈ అంశంపై డీఎల్పీవో జ్యోతిర్మయి స్పందిస్తూ అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులు, దోమల నివారణ చర్యలకు ఆదేశించామన్నారు.

ఆచంటలో గ్రామంలో డ్రెయిన్ దుస్థితి

నరసాపురం డివిజన్‌లో ఇలా.. మండలాలు: 8 మేజర్ పంచాయతీలు: 35 మైనర్ పంచాయతీలు: 130 జనాభా: సుమారు 6.30 లక్షలు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణం, మండలం, మొగల్తూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. తీరు మార్చుకుని ప్రశాంత జీవనం అలవరుచుకోవాలని పోలీసు అధికారులు వారికి సూచించారు. హద్దుమీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

మొగల్తూరు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఢీకొట్టిన ఘటనలో మహిళ గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. కాళీపట్నం పడమర పరిధి సురారపువారితోట ప్రాంతానికి చెందిన ఎస్.శ్రీలక్ష్మి(55) ఆదివారం సాయంత్రం ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఆమెను ఢీకొట్టింది. గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు నరసాపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

వేధిస్తున్న యువకుడిపై కేసు

నరసాపురం, న్యూస్‌టుడే: యువతిని వేధిస్తున్న యువకుడిపై ఆదివారం కేసు నమోదైంది. నరసాపురం పట్టణానికి చెందిన యువతి దుస్తుల విక్రయ సంస్థలో పనిచేస్తున్నారు. పొన్నపల్లికి చెందిన బర్రె కిరణ్‌కుమార్ వేధిస్తున్నట్లు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు.

స్థలం కొనుగోలు పేరిట మోసం

నరసాపురం, న్యూస్‌టుడే: స్థలం కొనుగోలు చేస్తానని రూ.5 లక్షలు తీసుకుని మోసగించిన ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ఎన్ ముత్యాలరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్థానికుడు రేవు పద్మారావు భూముల క్రయ విక్రయాలకు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నారు. పట్టణానికి చెందిన వడ్డి వెంకటేశ్‌కు రుస్తుంబాదలో ప్రాంతీయ ఆసుపత్రి వెనుక నాలుగు ఎకరాల మెరక భూమి ఉంది. దీనిని విక్రయించేందుకు పద్మారావు మధ్యవర్తిగా ఉంటూ కొనుగోలుదారులను చూస్తున్నారు. ఇటీవల విశాఖపట్నానికి వెంకటయాదవ్ పద్మారావుతో ఫోన్లో మాట్లాడి స్థలం కొనుగోలు చేస్తానన్నారు. ఈ నెల 14న అతడు పట్టణానికి వచ్చి ఆ భూమిని రూ.4 కోట్లకు కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నాడు. ఈ నెల 19న రిజిస్ట్రేషన్ చేయించుకుంటానని నమ్మించాడు. ప్రాసెసింగ్ ఫీజు, ఇతర అవసరాలకు రూ.5 లక్షలు అవసరమని చెప్పి.. సర్దుబాటు చేస్తే రిజిస్ట్రేషన్ రోజున తిరిగి ఇచ్చేస్తానని పద్మారావును నమ్మించి సొమ్ము తీసుకున్నాడు. తరువాత వెంకటయాదవ్ జాడ లేకుండా పోయింది. దీనిపై పద్మారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైకాపా నిరసన..

ఆచంట, న్యూస్‌టుడే: వైకాపాకు చెందిన ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును ఖండిస్తూ ఆచంటలో వైకాపా నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. వైఎస్సార్ విగ్రహం వద్ద సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు ప్రదర్శన జరిపారు. ఆచంటలో వైకాపా నాయకుడు వైట్ల కిశోర్ కుమార్ ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మిథున్‌రెడ్డి అరెస్ట్ కక్ష సాధింపు చర్యని ఆరోపించారు.

పంటల బీమా.. అన్నదాతకు ధీమా

వరికి ఆగస్టు 15 వరకు గడువు

పెనుగొండ, న్యూస్‌టుడే: అన్నదాతలకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం దశాబ్ద కాలం నుంచి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడలతో పంటలకు నష్టం వాటిల్లితే రైతులకు ఇబ్బంది లేకుండా బీమా వర్తించేలా ఈ పథకాన్ని రూపొందించింది. ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల పరిధిలో సుమారు 35,722 వేల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు.

ఎకరానికి రూ.210తో.. పంట బీమా పొందడానికి రైతులు ఆధార్, భూమి పత్రాలు, కౌలుదారులు అయితే తహసీల్దారు అందించే ధ్రువపత్రాలు, చరవాణి, బ్యాంకు ఖాతా వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. వరికి ఎకరాకు రూ. 210 చొప్పున ప్రీమియం చెల్లించాలి. పంట రుణం తీసుకునే రైతులకు బ్యాంకులు, సహకార సంఘాలు ప్రీమియం మినహాయించుకుంటున్నాయి. మిగిలిన వారు నేరుగా చెల్లించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. దరఖాస్తుకు ఆగస్టు 15వ తేదీ వరకు గడువు ఉందని.. ఈ పథకాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి పి.స్పందన తెలిపారు.

ఆగస్టు 19 నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తణుకులో ఆగస్టు 19, 20 తేదీల్లో జరగనున్న సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా సమితి 27వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు కోరారు. ఆదివారం భీమవరంలో నిర్వహించిన క్లాప్ డ్రైవర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం సూపర్-6 హామీలు, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. క్లాప్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు రాజు, సత్యనారాయణ, శివ, గోపాలం తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య నిధులొచ్చాయ్..!

పాలకొల్లు- ఆచంట రోడ్డుకు రూ.1.50 కోట్లు

ఆచంట, న్యూస్‌టుడే: రెండు నియోజకవర్గాల ప్రజలకు కీలకమైన ఆచంట- పాలకొల్లు రహదారి అభివృద్ధికి తాజాగా కూటమి ప్రభుత్వం రూ.1.50 కోట్లు కేటాయించింది. వైకాపా పాలనలో ఈ రోడ్డు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. నాలుగేళ్ల క్రితమే నిధులు మంజూరైనా అప్పటి ప్రభుత్వం పనులు పూర్తి చేయించలేదు. ఆచంట పరిధిలో 250 మీటర్ల మేర సీసీ రోడ్డుకు, గుమ్మలూరు-పెనుమదం మధ్య కాలువకు కాంక్రీట్ కట్టడం, రోడ్డు నిర్మాణానికి కలిపి గతంలో నిధులు మంజూరయ్యాయి. కాంక్రీటు కట్టడం, రోడ్డు నిర్మాణాలను నాలుగు నెలల క్రితమే కూటమి ప్రభుత్వం పూర్తి చేయించింది. తాజాగా మంజూరు చేసిన నిధులతో పాలకొల్లు పరిధిలో అగ్నిమాపక కేంద్రం కూడలి నుంచి బైపాస్ రోడ్డులో కాలువ వరకు సీసీ రోడ్డు నిర్మించనున్నారు.

ఆచంట వద్ద రహదారి ఇలా..

అడుగడుగునా గుంతలతో.. ఈ మార్గంలో ఆచంట మార్కెట్ నుంచి కచేరీ కూడలి వరకు వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం రూ.50 లక్షలు మంజూరయ్యాయి. నాలుగు నెలల కిందట రోడ్డును తిరగబెట్టి, నిర్మాణ సామగ్రి సిద్ధం చేయగా రాజకీయ కారణాలతో పనులు నిలిచాయి. ఇప్పుడు ఈ మార్గం అడుగడుగునా గోతులతో అధ్వానంగా మారింది. దీనిపై ఆర్అండ్‌బీ డీఈ రమణ స్పందిస్తూ నిధులు సిద్ధంగా ఉన్నాయని.. పనులు చేపట్టేలా గుత్తేదారుతో ఇప్పటికే చర్చించినట్లు తెలిపారు.

(c) eenadu

తాడేపల్లిగూడెం
• తాడేపల్లిగూడెం • తణుకు

అమ్మవార్లకు సారె సమర్పణ

పెంటపాడు, న్యూస్‌టుడే: ఆషాఢం పురస్కరించుకొని కస్పాపెంటపాడులో పెంట్లమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. బైరాగిమఠం శ్రీగోపాల స్వామి, ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి మహిళలు సారెతో ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, భవన ఇతర కార్మికుల బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ, భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి తాతాజీ గోపాలస్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీశ్, పంతం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● పరిమెళ్లలోని ముత్యాలమ్మ వారిని శాకంబరిగా అలంకరించారు. మహిళలు ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించారు. ● ప్రత్తిపాడులోని కనకదుర్గమ్మ, కాగులుంపాడులోని స్వయంభూ కనకదుర్గమ్మ, రావిపాడులోని శ్రీముత్యాలమ్మ ఆలయాల్లో అమ్మవార్లను శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పించారు.

అంకాలమ్మకు.. తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: కొండ్రుప్రోలు గ్రామ దేవత అంకాలమ్మ తల్లికి భక్తులు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. పిల్లల నుంచి పెద్దల వరకు పసుపు, కుంకుమ, పిండి వంటలు, చీరలతో ప్రదర్శనగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా కావడి ఉత్సవం

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి పుణ్యక్షేత్రం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆడికృత్తిక పాల కావడి ఉత్సవం ఆదివారం మాలధారణ భక్తుల ఆధ్వర్యంలో జరిగింది. స్వామిని విశేషంగా అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. చిన్నారుల కోలాటాలు, కేరళా డప్పు వాయిద్యాలు, పొన్నవాహన, హంస, శేషవాహన, సింహ, గరుత్మంత, అశ్వ, ఏనుగు, నెమలి వాహనాలతో స్వామికి కావడి ఉత్సవం కనులపండువగా గ్రామ వీధుల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు.

పుంతలో ముసలమ్మకు విశేష పూజలు

దువ్వ(తణుకు), న్యూస్‌టుడే: దువ్వలోని పుంతలో ముసలమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మహిళలు ఊరేగింపు ఆలయం వద్దకు వచ్చి భక్తిశ్రద్ధలతో చీర, సారె, పసుపు కుంకుమ, నైవేద్యాలు సమర్పించారు. తెదేపా రాష్ట్ర నాయకురాలు వావిలాల సరళాదేవి పాల్గొని అమ్మవారికి సారె సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక కొబ్బరితోటలోని పుంతలో ముసలమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆషాఢం పురస్కరించుకుని పసుపు, కుంకుమ, చీర, పిండి వంటలతో సారె సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు రాజా త్రినాథ్, పృథ్వీరాజ్, స్నేహిత తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలి

తణుకు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య (ఏపీబీఎస్ఎస్ఎస్) బైలాస్ సవరణ సమావేశాన్ని ఆదివారం తణుకులో యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సూరంపూడి కామేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏపీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోనూరి సతీశ్ శర్మ, సలహాదారుడు సత్యవాద దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా బ్రాహ్మణులు ఏకం కావాలన్నారు. సంఘ వ్యవస్థాపకుడు కుర్తాళం పీఠాధిపతి ఆంజనేయులు స్వస్థలమైన తణుకులో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు, యువజన అధ్యక్షులను ఘనంగా సత్కరించారు.

నీళ్లు రాక.. గొంతు తడవక

శివారు ప్రాంతాల్లో దాహం కేకలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలో తాగునీటి సమస్య రోజు రోజుకు తారాస్థాయికి చేరుకుంటోంది. వర్షాకాలం అయినప్పటికీ ఎండ తీవ్రతతో అవసరానికి తగ్గట్లు సరఫరా లేకపోవడంతో పట్టణవాసులు అవస్థలు పడుతున్నారు. అస్తవ్యస్తంగా నూతన పైపులైన్ల అనుసంధాన పనులు, లీకుల బెడద వెరసి ప్రతి వార్డులో నీటి సమస్య తలెత్తుతోంది. ఇంటింటికి కుళాయిలు ఉన్నా.. నీళ్లు రాక గుక్కెడు నీటి కోసం ఆపసోపాలు పడాల్సిన వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

విద్యుత్తు కోతలతో.. పట్టణంలో రోజూ రెండు పూట్ల కలిపి గంట పాటు నీరు సరఫరా చేస్తున్నారు. నీళ్ల వదిలే సమయంలో విద్యుత్తు కోతలు ఉండటంతో శివారు ప్రాంత ప్రజలు మోటార్ల ద్వారా నీటిని సేకరించే అవకాశం ఉండటం లేదు. ఎప్పుడో నాలుగు దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన పైపులైన్లు, గృహాలు మెరకలో ఉండటంతో కుళాయిలకు నీళ్లు అందడం లేదు. మోటార్లు వేస్తే తప్పా నీళ్లు రాని పరిస్థితి. విద్యుత్తు లేని సమయంలో జనరేటర్లు వినియోగించి నీటిని సంపుల్లో నింపుకుంటున్నారు.

ట్యాంకరు వద్ద బారులు తీరిన ప్రజలు

పట్టణ ప్రజలు:	1.20 లక్షలు
వార్డులు:	35
ప్రతిరోజు నీటి సరఫరా:	12.2 మిలియన్ లీటర్లు
సమస్య ఉన్న ప్రాంతాలు:	22
కుళాయి కనెక్షన్లు:	18,200

ఎక్కడ చూసిన అంతే.. అమృత్ పథకంలో భాగంగా పట్టణంలో సుమారు 47 కి.మీ.మేర నూతన పైపు లైన్లు ఏర్పాటు చేశారు. పైపు లైన్ల అనుసంధాన ప్రక్రియ అస్తవ్యస్తంగా ఉండటంతో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. ఎక్కడ చూసినా నీళ్లు రావట్లేదనే మాటే వినిపిస్తోంది. బ్యాంకు కాలనీ, టీచర్స్ కాలనీ, తాళ్లముదునూరుపాడు, జువ్వలపాలెం, గణేశ్‌నగర్, గొల్లగూడెం, రామారావుపేట, హౌసింగ్‌బోర్డు, వీకర్స్ కాలనీ, బళ్లదొడ్డి, మిలటరీ కాలనీ, యానాదుల కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు నీటి ట్యాంకర్లపైనే ఆధారపడాల్సిస్తోంది. ట్యాంకర్లు రోజూ రాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

పరిష్కరిస్తాం..

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. నీళ్లు రాని ప్రాంతాలకు ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం.

- ఏసుబాబు, మున్సిపల్ కమిషనర్

ప్రజల ఆశలకు అనుగుణంగా పాలన: గన్ని

సాయిరమేశ్‌తో సంతకం చేయిస్తున్న బొలిశెట్టి, గన్ని, వలవల

పెంటపాడు, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని కోరుమిల్లిలో సొసైటీ త్రిసభ్య కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, భవన నిర్మాణ, ఇతర కార్మికుల బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ, మాజీ ఎమ్మెల్యే ముళ్లపూడి వెంకట కృష్ణారావు హాజరయ్యారు. సొసైటీ అధ్యక్షునిగా వల్లూరి సాయి రమేశ్, సభ్యులుగా కొండ్రెడ్డి బుల్లిరాజు, జేష్ఠ వెంకట సుబ్బారావు ప్రమాణస్వీకారం చేశారు. బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ.. లాభాల్లో ఉన్న సొసైటీలు గత వైకాపా పాలనలో దోపిడీకి గురయ్యాయన్నారు. గన్ని మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మంచి ప్రభుత్వమని నమ్మి తమకు ప్రజలు ఓటు వేశారని, వారి ఆశలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వలవల బాబ్జీ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా అందించామన్నారు. గత వైకాపా హయాంలో గతి తప్పిన రాష్ట్రాన్ని.. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గాడిలో పెడుతున్నారన్నారు. సర్పంచి భాస్కరరావు, కిలపర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే: పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని భవన నిర్మాణ, ఇతర కార్మికుల బోర్డు ఛైర్మన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ అన్నారు. ఆదివారం పట్టణంలోని 22వ వార్డులో పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు అధ్యక్షతన జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు పథకాలను ప్రభుత్వం అమలు చేయనుందన్నారు. టైలర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ ఆకాశపు స్వామి, గొర్రెల శ్రీధర్, సిరికి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: రామన్నపేటలో డ్రెయిన్లు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి మురుగు పారక దుర్వాసన వెదజల్లుతోందని ఆదివారం 'దుర్వాసన దోమలతో వెతలు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ సిబ్బంది స్పందించి పొక్లెయిన్‌తో వ్యర్థాలను తొలగించారు.

డ్రెయిన్ శుభ్రం చేస్తున్న పొక్లెయిన్

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	: 79950 67078
పెంటపాడు	: 79939 36123
తణుకు	: 85558 50851
అత్తిలి	: 91548 46774

పెంటపాడు, న్యూస్‌టుడే: ? ఆకుతీగపాడు ఎస్సీ కాలనీలో దోమల ఉద్ధృతి ఎక్కువగా ఉంది. - ప్రసాద్, స్థానికుడు
✔ నివారణ మందు పిచికారీ చేయిస్తాం. - శకుంతల, పంచాయతీ కార్యదర్శి
? పడమరవిప్పర్రులో ఉప్పరగూడెం వెళ్లే మార్గంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద చెత్త పేరుకుపోయింది. - సురేశ్, స్థానికుడు
✔ చర్యలు తీసుకుంటాం. - శోభన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి

చదరంగంతో మేధోశక్తి మెరుగు

తణుకు, న్యూస్‌టుడే: మేధోశక్తిని పెంపొందించుకునేందుకు చదరంగం దోహదపడుతుందని ద్వారకాతిరుమల ఏఈ వెంకటేశ్, స్టెపింగ్ స్టోన్స్ ప్రిన్సిపల్ రాజశేఖర్ అన్నారు. అంతర్జాతీయ చదరంగం దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం స్థానిక స్టెపింగ్ స్టోన్ పాఠశాలలో మాస్టర్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. విజేతలను సోమవారం ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు.

సమస్యలతో సతమతం

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే

పట్టణానికి కేంద్ర బిందువైన 26వ వార్డులో సమస్యలు రాజ్యమేతులున్నాయి. వార్డులో వార్ఫ్‌రోడ్డు, పోలీస్ ఐలాండ్, గూడ్స్‌షెడ్ తదితర ప్రాంతాలున్నాయి. పోలీస్ ఐలాండ్ నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు ఏలూరు కాలువపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. వంతెన రహదారిపై గోతులతో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెనకు మరమ్మతులు చేయించి, రహదారి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరిన 26వ వార్డులోకి వెళ్లే వంతెన

26 వార్డు నివేదన

● జలవనరులశాఖ కార్యాలయం వెనుక ప్రాంతంలో డ్రెయిన్‌లు సరిగ్గా లేక వర్షాలు కురిసినప్పుడు రాకపోకలు సాగించాలంటే నరకం కనపడుతుందని ప్రజలు వాపోతున్నారు. కాలువకి ఆనుకొని నివాసాలు ఉండటంతో దోమలు, సర్పాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జనాభా:	2800
ప్రాంతాలు:	పోలీస్ ఐలాండ్, వార్ఫ్ రోడ్డు, గూడ్స్ షెడ్

పరిష్కారానికి కృషి.. వంతెనను పరిశీలించి మరమ్మతులు నిర్వహించేందుకు కృషి చేస్తాం. వార్డులోని రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

- ఏసుబాబు, మున్సిపల్ కమిషనర్

12 శాతం రిజర్వేషన్ కల్పించాలి

తణుకు, న్యూస్‌టుడే: కాపు, తెలగా, బలిజ, ఒంటరి కులాల పట్ల గత వైకాపా ప్రభుత్వం అనుసరించిన పద్ధతినే నేడు కూటమి ప్రభుత్వం అనుసరిస్తోందని కాపు రిజర్వేషన్ పోరాట సమితి, కాపు రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర ఛైర్మన్ చనమల్ల ప్రసాదరావు అన్నారు. ఆదివారం కొమరవరంలో కేఆర్‌పీఎస్ కార్యాలయంలో జరిగిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న కాపు, తెలగా, బలిజ, ఒంటరి కులాల వారికి నామినేషన్ పదవుల్లో 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూల దృక్పథంతో అందరివాడిగా మారాలని, కమ్మ-కాపు మైత్రిని బలోపేతం చేయాలని కోరారు. రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్, సమన్వయకర్తలు అమ్మా శ్రీనివాస్, జానపాముల నాగబాబు, రాష్ట్ర కో-కన్వీనర్లు బోడపాటి పెదబాబు, కాకిలేటి హరినాథ్, పంచాది రంగారావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఉచిత వైద్యం

తణుకు, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్య కార్యక్రమం నిర్వహించింది. ప్రముఖ వైద్యులు హుస్సేన్ అహ్మద్ (నేత్ర), నిమ్మగడ్డ అచ్యుత రామయ్య (ఆర్థోపెడిక్) పట్టణంలో పర్యటించి మంచానికే పరిమితమైన వృద్ధులకు వైద్య సేవలందించారు. సభ్యులు అతికాల ప్రసాద్‌రావు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేశారు. వైద్య సేవలు కావాల్సిన వారు స్వయంగా లేదా 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలన్నారు. సంఘం అధ్యక్షుడు కరుణాకర్ చౌదరి, కోశాధికారి భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని గొల్లగూడెంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పదం కుమార్ గుప్తా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. 22 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. 17 మందిని శస్త్రచికిత్స నిమిత్తం నిడదవోలులోని కంటి ఆసుపత్రికి తీసుకెళ్లారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మణీంద్ర, సభ్యులు సుంకర శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలి

పెంటపాడు, న్యూస్‌టుడే: వైకాపా బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఉపముఖ్యమంత్రి, తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం పెంటపాడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ అధ్యక్షతన బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎంపీపీ దాసరి హైమావతి, కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, గుండుమోగుల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై అవగాహన

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన బుక్ రీడింగ్ క్లబ్ ద్వారా విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు గ్రంథాలయంలో లభ్యమయ్యే పుస్తకాలు, ఇతర సేవల గురించి వివరించారు. పుస్తకాలను చదవడంతో అపారమైన జ్ఞానం పొందవచ్చని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో బాపయ్య శర్మ, ఏవీ లక్ష్మణరావు, రామాంజనేయులు పాల్గొన్నారు.

జూద శిబిరంపై దాడి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: జూద శిబిరంపై దాడి చేసి పలువురిని గ్రామీణ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి కథనం మేరకు.. జగన్నాథపురంలో జూదమడుతున్నారనే సమాచారంతో ఆకస్మిక దాడి చేసినట్లు గ్రామీణ ఎస్సై జేవీ ప్రసాద్ తెలిపారు. ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.18,200 స్వాధీనం చేసుకున్నామన్నారు.

అధిక లోడు.. అడ్డుకునేదెవరు?

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: నిత్యం రద్దీగా ఉండే అత్తిలి రహదారిపై ఊక, ఎండు గడ్డి, పాత ఇనుముతో లోడు వాహనాలు తరచూ రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటుగా నిత్యం అనేక మంది వాహనదారులు ప్రయాణిస్తుంటారు. భారీ లోడు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటే ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

తరచూ ప్రమాదాలు.. మంచిలి, పాలూరు, పాలి, ఉరదాళ్లపాలెం, బల్లిపాడు రహదారుల మీదుగా భారీ లోడు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆయా మార్గాల్లో రహదారులు చిన్నవి కావడం, వంతెనలు శిథిలావస్థకు చేరడం, ఎక్కువ మలుపులు ఉండటం, తక్కువ ఎత్తులో విద్యుత్తు తీగలు వేలాడటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. భారీ వాహనాలు ఎదురుగా వస్తే మరో వాహనం పక్కకు తప్పుకోలేని పరిస్థితి. అధిక లోడుతో వాహనాలు వెళ్లే సమయంలో ఎదురుగా ఎంత అత్యవసర వాహనం వచ్చినా దాటుకుని వెళ్లే పరిస్థితి ఉండటం లేదు. అధికారులు లోడు వాహనాలను రద్దీ తక్కువగా ఉండే మార్గాల గుండా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్తు భారం మోపడం సరికాదు: సీపీఎం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: సామాన్య ప్రజలపై విద్యుత్తు భారం మోపడం సరికాదని సీపీఎం పట్టణ కార్యదర్శి రామకృష్ణ అన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఆదివారం పట్టణంలోని సవిత్రుపేటలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లతో భవిష్యత్తులో ముప్పు తప్పదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.15,485 కోట్లను సర్దుబాటు పేరుతో ప్రజలపై భారం మోపిందన్నారు. జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, CHEKURI SRI LAKSHMI W/o. Chekuri SRi Bhadrachala Ramam, at 9-159, Venkatarayapuram, TANUKU, West Godavari Dist, Andhra Pradesh. Ph:90592 01243 Changing my Name from KANTIPUDI SRI LAKSHMI (Old Name) To CHEKURI SRI LAKSHMI (New Name) W/o. Chekuri Sri Bhadrachala Ramam. Hence forth I am being called as CHEKURI SRI LAKSHMI (New Name) For all prposes.

ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
శ్రీ అల్లూరి ధనరాజు గారు
ఛైర్‌పర్సన్, పాలూరు PACS
ది పాలూరు PACS (ది 21-07-2025 సోమవారం ఉ॥ 11.00 ని॥లకు) నూతనముగా నియమించబడిన సంఘ ఛైర్‌పర్సన్ మరియు డైరెక్టర్లు ప్రమాణ స్వీకార మహోత్సవం కార్యక్రమానికి విచ్చేయుచున్న ముఖ్య అతిథులకు సంఘ సభ్యులకు స్వాగతం– సుస్వాగతం
శ్రీ యలమంచిలి త్రిమూర్తులు గారు డైరెక్టర్
శ్రీ పెరికిల పాండురంగ గారు డైరెక్టర్
మంతెన నాగ శ్రీరామరాజు CEO
గుడిమెట్ల గణేష్‌రెడ్డి అకౌంటెంట్
సత్తి బలరామ్‌రెడ్డి క్లర్క్
అల్లూరి జితేంద్రరాజు క్లర్క్
వంకా సూర్యనారాయణ క్లర్క్
ది పాలూరు PACS - అత్తిలి మండలం

ప్రమాణ స్వీకార మహోత్సవ శుభాకాంక్షలు
ది. ఉనికిలి LSCS LTD No 2165, ఉనికిలి
(ది. 21-07-2025 సోమవారం ఉ॥ 9.50 ని॥లకు)
నూతనముగా నియమించబడిన సంఘ ఛైర్ పర్సన్ మరియు డైరెక్టర్లు
ప్రమాణ స్వీకార మహోత్సవం కార్యక్రమానికి విచ్చేయుచున్న ముఖ్య అతిథులకు సంఘ సభ్యులకు
స్వాగతం - సుస్వాగతం
శ్రీ చేకూరి శ్రీనివాస్ గారు
ఛైర్ పర్సన్ - ఉనికిలి LSCS, AMC డైరెక్టర్ - అత్తిలి
జంగం దినకరన్ డైరెక్టర్
బాలం మహేష్ డైరెక్టర్
బాసంశెట్టి శ్రీనివాస్ C.E.O
వెలగల హనుమంతరెడ్డి సేల్స్‌మెన్
కొల్లూరి నాగారున నాగరాజు జిస్టాఫ్ అసిస్టెంట్
శ్రీమతి బొక్కా మేనకాకుమారి స్టాఫ్ అసిస్టెంట్
శ్రీమతి మంగినీడి సత్యరత్నం స్టాఫ్ అసిస్టెంట్
శ్రీమతి చిలక అంజలి స్వీపర్

ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
శ్రీ అల్లూరి ధనరాజు గారు
ఛైర్‌పర్సన్, పాలూరు PACS
మాకు అత్యంత ఆత్మీయులు, శ్రేయోభిలాషి శ్రీ అల్లూరి ధనరాజు గారు నేడు పాలూరు PACS ఛైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేయుచున్న శుభసందర్భంగా వారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విచ్చేయుచున్న అతిథులకు, సంఘసభ్యులకు స్వాగతం - సుస్వాగతం.
అల్లూరి రఘు వర్మ పాలూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు
దాట్ల రామకృష్ణం రాజు టీడీపీ నాయకులు, పాలూరు
అల్లూరి గణపతి రాజు టీడీపీ నాయకులు, పాలూరు
అల్లూరి వెంకట రాజు, (కాంట్రాక్టర్) టీడీపీ సీనియర్ నాయకులు, పాలూరు
పెన్మెత్స శ్రీనివాస రాజు (కంచుమర్రు రాజు గారు) టీడీపీ నాయకులు, పాలూరు
అల్లూరి శ్రీనివాస్ రాజు (సత్తిబాబు) టీడీపీ నాయకులు, పాలూరు
అల్లూరి లక్ష్మణ సోమ రాజు (పండు) టీడీపీ నాయకులు, పాలూరు
అల్లూరి రామకృష్ణం రాజు (చిన్నాబాయి గారి కిట్) టీడీపీ నాయకులు, పాలూరు
అల్లూరి ఫణిరవికుమార్ రాజు (రవి) టీడీపీ నాయకులు, పాలూరు
SV సుబ్బిరెడ్డి ఆరవల్లి
అల్లూరి రామకృష్ణం రాజు (శివాజీ రాజు) టీడీపీ నాయకులు, పాలూరు
పేరిచర్ల శ్రీనివాస రాజు టీడీపీ నాయకులు, పాలూరు
పేరిచర్ల రామలింగ రాజు టీడీపీ నాయకులు, పాలూరు
మంతెన సతీష్ రాజు టీడీపీ నాయకులు, పాలూరు

ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
మాకు అత్యంత ఆత్మీయులు, శ్రేయోభిలాషి శ్రీ చేకూరి శ్రీనివాస్ గారు ఉనికిలి LSCS అధ్యక్షులుగా మరియు డైరెక్టర్లుగా శ్రీ జంగం దినకరన్, శ్రీ బాలం మహేష్ నేడు ప్రమాణ స్వీకారం చేయుచున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విచ్చేయుచున్న అతిథులకు, అందరికీ స్వాగతం - సుస్వాగతం.
శ్రీ చేకూరి శ్రీనివాస్ గారు
ఛైర్‌పర్సన్, ఉనికిలి LSCS
AMC డైరెక్టర్, అత్తిలి
మీ మిత్రులు, శ్రేయోభిలాషులు-ఉనికిలి
నెక్కంటి హరిశ్చంద్ర ప్రసాద్
బొల్లింపల్లి దొరబాబు
చేకూరి నరసయ్య (గ్రామ బీజేపీ అధ్యక్షులు)
దాసరి శ్రీనివాసరావు
చేకూరి రామకృష్ణ (చంటి)
నెక్కంటి సత్యనారాయణ S/o. ముత్యాలరావు
నెక్కంటి శ్రీనివాస్ S/o. ముత్యాలరావు
నెక్కంటి రమేష్ S/o. ముత్యాలరావు
కొరిపల్లి వెంకయ్య
బలుసు హరిశ్చంద్ర S/o. వెంకట్రావు
కొరిపల్లి రాజారమేష్ S/o.ఆనందరావు
యిాదర నాగేశ్వరరావు
గొడవర్తి ఆనంద్ బ్రదర్స్
చేకూరి మణికుమార్
చేకూరి వెంకట సత్యవతి మాజీ గ్రామ సర్పంచ్
గొడవర్తి తిరుపయ్య
బొల్లింపల్లి వెంకటసత్యనారాయణ
P.సూర్యనారాయణ రాజు
బలుసు అన్నవరం
వేముల సీతారత్న గుప్త
దిగుమర్తి పాండురంగారావు
దొంగ దుర్గారావు
గుడూరి సత్యనారాయణ (కొండ)
గుడూరి శ్రీహరి
బుడితి సంతోషం
బుడితి శామ్యూల్
సిరా రాంబాబు
దిగుమర్తి సత్యనారాయణ
కొడవలూరు దుర్గావరప్రసాదు
బొక్కా శ్రీనివాసరావు
చేకూరి సీతారామయ్య (కలిదిండి)
కొల్లా లక్ష్మీనారాయణ (నాని)

(c) eenadu

అమ్మలగన్న అమ్మ.. పెద్దమ్మ



ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: అమ్మలగన్న అమ్మ... ముగ్గురమ్మల మూలపుటమ్మ... పెద్దమ్మ తల్లికి ఆదివారం ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం పూజలు వైభవంగా జరిగాయి. ప్రొద్దుటూరు హౌసింగ్ బోర్డు కాలనీలోని అమ్మవారికి జల, క్షీర, తైల, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వెండి కవచం, కిరీటం, పట్టు వస్త్రాలు, ఫల, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పసుపు, కుంకుమలు, గాజులతో అర్చన చేసి నైవేద్యం సమర్పించి, మంగళ హారతులు ఇచ్చారు. ఆషాఢ మాస వ్రతం ఆచరించిన సుహాసినులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సౌభాగ్యవతిగా నిండు నూరేళ్ల దీవించమ్మా అంటూ అమ్మవారికి ప్రణమిల్లారు.

వేల్‌వేల్ మురుగయ్యా.. కల్యాణం కనరయ్యా!

వేల్‌వేల్ మురుగయ్యా అంటూ భక్తులు వేనోళ్ల కీర్తించారు. ఆదివారం ఆడికృత్తిక సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం, మైదుకూరు, పులివెందుల, బద్వేలు నియోజకవర్గాల్లోని సుబ్రహ్మణ్య స్వామీ ఆలయాల్లో స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కడప మహావీర్ కూడలిలో స్వామి వారి ఉత్సవ మూర్తులను చిత్రంలో చూడవచ్చు. **- న్యూస్‌టుడే, మారుతీనగర్**

దారి దీపిక.. ప్రమాద పాచిక

కడప-రేణిగుంట జాతీయ రహదారి-716లో సిద్దవటం మండలం మలినేనిపల్లె కాలనీ సమీపంలో ప్రమాదాల నివారణ కోసం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో వర్టికల్ స్ప్రింగ్ పోస్ట్‌లను ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో అటు, ఇటు తిరుగుతున్న వాహనాలు వీటిని ఢీకొనడంతో అవి పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రమాదాలు జరగకుండా, రోడ్డు దాటుతున్న వారికి రక్షణ కోసం వీటిని అమర్చారు. కొన్నాళ్లకే పాడయ్యాయి. అధికారులు స్పందించి పాడైన వాటిని తొలగించి ప్రమాదాలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

మదనపల్లె ఫైల్స్... దర్యాప్తు తుస్‌స్‌స్

◆ దస్త్రాల దహనానికి నేటితో ఏడాది

ఈనాడు, కడప

రాష్ట్రంలో సంచలనం కలిగించిన అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ దస్త్రాల దహనం ఘటన జరిగి సరిగ్గా నేటితో (జులై 21) ఏడాది. ఈ కేసులో ఆశించినంతగా పురోగతిలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వేలాది దస్త్రాలతో ముడిపడిన వ్యవహారం కావటంతో కేసు దర్యాప్తునకు సమయం పడుతోందని దర్యాప్తు సంస్థ సీబీసీఐడీ వాదన. సమగ్ర దర్యాప్తుతో వ్యవహారాన్ని నిగ్గు తేల్చడానికి అన్ని రకాల ప్రయత్నాలు జరుగుతున్నాయని విచారణాధికారి చెబుతున్నారు. 2024 జులై 21న రాత్రి 11.30 గంటలకు ఘటన జరిగ్గా.. ఆ మరుసటి రోజే మదనపల్లెకు డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యనార్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం యాక్సిడెంట్ కాదని.. ఇన్సిడెంట్ అని విచారణ సందర్భంగా అప్పట్లో డీజీపీ వ్యాఖ్యానించారు.

దస్త్రాల దహనం జరిగిన మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలోని భవనం

● మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో పుంగనూరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో వైకాపా హయాంలో భారీగా భూదందాలు జరిగాయి. వైకాపా హయాంలో ఫ్రీహోల్డ్ చట్టం తీసుకొచ్చాక డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 416 సర్వే నంబర్ల కింద 48,273 ఎకరాల భూముల్ని అక్రమంగా ఫ్రీహోల్డ్ చేశారు. ఆ తర్వాత వైకాపా అధికారం కోల్పోవడం, కూటమి సర్కారు అధికారంలోకి రావడం, రెవెన్యూ అధికారుల బదిలీలతో అక్రమాలు బయటకొస్తాయనే కారణంగా దస్త్రాలను దహనం చేసినట్లు అభియోగాలు నమోదయ్యాయి. ● మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి అనుచరులే మంటకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. వందలాది మంది బాధితులు తరలి వచ్చి పెద్దిరెడ్డి కుటుంబంపై ఫిర్యాదులు చేశారు. ఘటన తర్వాత బాధ్యులుగా గుర్తించి పూర్వ ఆర్డీవో మురళి, ఘటన జరిగిన సమయంలో పని చేసిన హరిప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. కేసు తీవ్రత నేపథ్యంలో దర్యాప్తును 2024 ఆగస్టు 6న సీబీసీఐడీకి అప్పగిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ● అంతకు ముందే ఈ ఘటనపై పోలీసులు 9 కేసులు నమోదు చేశారు. సీఐడీ మొదటగా సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపింది. ఆ తర్వాత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డి హస్తం ఉన్నట్లుగా గుర్తించి అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టగా కొన్ని రోజులకే రిమాండ్ నుంచి తప్పించుకున్నారు. ● ఐదేళ్ల పూర్వ ఆర్డీవో మురళిని అరెస్టు చేయగా సుప్రీంకోర్టు నుంచి బెయిల్ తెచ్చుకోవడంతో విడుదలయ్యారు.

కాలిపోయిన దస్త్రాలు (పాత చిత్రం)

రిమాండ్ రిపోర్టులో పెద్దిరెడ్డి పేరు

అరెస్టయిన గౌతమ్ తేజ్ రిమాండ్ రిపోర్టులో పలుచోట్ల పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేరును సీఐడీ ప్రస్తావించింది. డివిజన్‌లోని డీ పట్టా, ఫ్రీహోల్డ్ భూముల అక్రమ క్రమబద్ధీకరణకు సంబంధించిన ఆధారాలు ధ్వంసం చేసేందుకు పెద్దిరెడ్డి పీఏ ముని తుకారాం, ముఖ్య అనుచరుడు మాధవరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌ను పురికొల్పి దస్త్రాలకు నిప్పుపెట్టేలా ప్రేరేపించారు. నాలుగో నిందితుడైన (ఏ-4) ముని తుకారాం గత ఏడాది జులైలో అమెరికాకు పారిపోయారు. అభియోగాలు ఎదుర్కొంటున్న నిందితుల కాల్‌డేటాను సేకరించిన సీఐడీ వారి మధ్య ఇన్‌కమింగ్, అవుట్‌గోయింగ్ కాల్స్‌ను విశ్లేషించింది. వేల ఎకరాల భూముల్ని ఆర్డీవో స్థాయి అధికారి అప్పటి మంత్రి పీఏ, అనుచరుడు చెప్పారని రెగ్యులరైజ్ చేసేస్తారా... పెద్దిరెడ్డి ఆదేశాలతోనే ఇది జరిగిందా... వీటి అంతిమ లబ్ధిదారు ఎవరన్నది సమగ్ర ఆధారాల సేకరణకు సీఐడీ ప్రయత్నిస్తోంది. ముని తుకారాం జాడ ఇప్పటికీ కనిపెట్టలేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అమెరికాలో ఆరు నెలలకు మించి ఉండటానికి ఆస్కారం లేదు. విచారణలో జాడ గురించి తేలాల్సి ఉంది.

నీరుగట్టు... సాగేదెలా ఆయకట్టు

లింగాల కాలువలో నీటి చౌర్యం జరిగేదిక్కడే

లింగాల, న్యూస్‌టుడే: పెంచికల బసిరెడ్డి జలాశయం (పీబీఆర్) నుంచి పులివెందుల బ్రాంచి కాల్వ (పీబీసీ), జీకేఎల్‌ఐ, లింగాల కుడికాలువ ద్వారా 2.51 లక్షల ఎకరాలు సాగవుతుండగా సాగునీటి సరఫరా, నిర్వహణ, నియంత్రణకు తగినంత మంది లస్కర్లు లేకపోవడంతో తీవ్ర సమస్యగా మారింది. కాలువల పర్యవేక్షణ, చివరి ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందించడంలో లస్కర్ల పాత్ర కీలకం. 10 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన పీబీఆర్ ద్వారా, పైడిపాళెం ద్వారా ఏటా 4 నుంచి 7 టీఎంసీల జలాలను ఆయకట్టుకు విడుదల చేస్తున్నారు. చాలా ఏళ్లుగా లస్కర్లను తాత్కాలిక పద్ధతిన నియమించి వారి సేవలను వినియోగించుకుంటున్నారు.

ఎటు చూసినా ఖాళీలే : పీబీసీ, లింగాల కుడికాలువ, జీకేఎల్‌ఐ పరిధిలో 80 ఉపకాల్వలు, 190 కి.మీ ప్రధాన కాల్వ పరిధిలో 140 మంది లస్కర్లు పనిచేయాల్సి ఉండగా కేవలం పది మంది మాత్రమే పనిచేస్తున్నారు. చాలామంది పదవీ విరమణ చేసినా నూతన నియామకాలు చేయలేదు. 5 వేల ఎకరాలకు ఒకరు చొప్పున సాగునీటి సరఫరా, ఉప కాల్వల పర్యవేక్షణ, రెగ్యులేటర్ నియంత్రణ పర్యవేక్షిస్తూ లస్కర్లు సాగుకు సాయంగా నిలిచేవారు. 1996 నుంచి వీరి నియామకాన్ని పూర్తిగా నిలిపేసి సీజన్లలో ఒప్పంద ప్రాతిపదికన విధుల్లోకి తీసుకుంటున్నారు. అలాగే 17 మంది ఏఈలకు గాను 3, 17 మంది జేఈలకు 4 మాత్రమే పనిచేస్తున్నారు. కీలక ఈఈ పోస్టు కూడా ఇన్‌ఛార్జితో నడిపిస్తున్నారు. కాల్వల పర్యవేక్షణకు లస్కర్ల కొరతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఇన్‌ఛార్జి ఈఈ వెంకట్రామయ్య తెలిపారు.

కేంద్ర కారాగారం.. ప్రక్షాళనకు శ్రీకారం

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప కేంద్ర కారాగారం ఇటీవల వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. కారాగారంలో వరుసగా చరవాణులు, దొరకడం, కారాగారంలోని ఓ ఖైదీ అధికారులను శాసించడంతో పాటు పలు ఆరోపణలు రావడంతో ఉన్నత స్థాయి అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జైళ్లశాఖ డీజీ అంజనీకుమార్ ఇటీవల కడప కేంద్ర కారాగారాన్ని తనిఖీ చేసినప్పటికీ ఎలాంటి మార్పు రాలేదు. జైల్లో ఓ ఖైదీ వద్దనే విడతల వారీగా 11 చరవాణులు దొరకడం కలకలం రేపింది. కడప జైల్లో ఏమి జరుగుతుందో పూర్తి స్థాయిలో విచారించి నివేదిక ఇవ్వాలని డీజీపీ ఆదేశించడంతో రాజమండ్రి ప్రాంతీయ డీఐజీ రవికిరణ్ ఆరు రోజులుగా ఇక్కడే తిష్ఠ వేశారు. గత కొద్ది రోజులుగా ప్రధాన ద్వారాల వద్ద బందోబస్తు ఉంటున్న వారి వివరాలను రికార్డు చేసి వారి పాత్రపై ఆరా తీశారు. పెట్రోలు బంకుపై వచ్చిన ఆరోపణలన్నింటినీ విచారిస్తున్నారు. ప్రధాన కారకులు ఎవరన్నది ఇప్పటికే గుర్తించి నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం. దీంతో కేంద్ర కారాగార సిబ్బందిలో పలువురిపై వేటు పడే అవకాశముందని చెబుతున్నారు. విచారణ నైపథ్యంలో అక్కడున్న అధికారులు, సిబ్బందిలో భయం మొదలైంది. మరో అయిదు రోజుల పాటు విచారణ కొనసాగనుందని తెలుస్తోంది.

కారం కావాలంటే.. వరుసలో ఉండాలంతే!

మిరప ధరలు మండుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.80 నుంచి రూ.90 వరకూ విక్రయిస్తున్నారు. రైతుబజారులో ఒకే ఒక వ్యక్తి దగ్గర పచ్చి మిరప కాయలు ఉండడంతో జనం చుట్టుముట్టారు. కిలో రూ.70తో వ్యాపారి విక్రయించారు. రైతుబజారులోని ధరల సూచికలో కిలో రూ.60 అని ఉండగా విక్రయదారు మాత్రం కిలో రూ.70తో అమ్మడం గమనార్హం. ఈ విషయమై కొందరు వినియోగదారులు సిబ్బందికి ఫిర్యాదు చేయాల్సి వచ్చింది. **- న్యూస్‌టుడే, కడప వ్యవసాయం**

కడగండ్లు... తీర్చేలా తోపుడు బండ్లు

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇక్కట్లకు తార్కాణం ఈ తోపుడు బండ్లు... జిల్లాలో జమ్మలమడుగు నియోజకవర్గ ప్రాంతంలో కనిపించే సాధారణ దృశ్యాలివి. ఇంటింటికీ కొళాయి మాటేమోగానీ తాగునీటికి కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో అంత దూరం నుంచి బిందెలను మోసుకురాలేక ఇలాంటి బండ్లను తయారు చేయించుకుని వాటిపై నీటిని రవాణా చేస్తున్నారు. ఇలా ఒక్కో బండి కొనాలంటే రూ.6 వేల వరకు ఖర్చు అవుతోంది. నీటి తిప్పలు తప్పాలంటే ఇంటింటికీ ఇలాంటి బండ్లు కొనకతప్పడం లేదు మరి. మైలవరం మండలంలోని వద్దిరాలలో తీసిందీ చిత్రం. **- న్యూస్‌టుడే, మైలవరం**

బుగ్గవంక.. వంతెనల నిర్మాణంలో కదలిక

కడప నగరపాలక, న్యూస్‌టుడే: బుగ్గవంకపై రెండు చోట్ల కొత్తగా వంతెనల నిర్మాణానికి నగరపాలక సంస్థ టెండర్లు పిలిచింది. పాత న్యాయ కళాశాల నుంచి పాత బస్టాండు రోడ్డుకు వచ్చే మార్గంలో, మురాదియా నగర్ నుంచి పాతకలెక్టర్ కార్యాలయం రోడ్డుకు చేరే మార్గంలో వంతెనల నిర్మాణానికి రూ.20 కోట్ల విలువైన పనులను చేపట్టనున్నారు. రవీంద్రనగర్, అక్కాయపల్లి, నబీకోట, మరియాపురం, మరాఠీ వీధి, మురాదియా నగర్ తదితర ప్రాంతాల ప్రజలు బుగ్గవంకను దాటి కడప నగరంలోని ప్రధాన రహదారులను చేరడానికి గతంలో ఈ రెండు చోట్ల లో-లెవల్ వంతెనలుండేవి. 2021లో బుగ్గవంకకు వచ్చిన వరదల్లో ఆ రెండూ దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో వంతెనలపై రాకపోకలను నిలిపేశారు. తదనంతరం లోలెవల్ వంతెనలను పూర్తిగా మూసివేస్తూ అక్కడ రక్షణ గోడ కట్టడంతో శాశ్వతంగా మూతపడ్డాయి. వీటి స్థానంలో కొత్తవి నిర్మించాలని ఈ ప్రాంత వాసులు కొన్నేళ్లుగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశారు. వైసీపీ హయాంలో రెండు చోట్ల వంతెనల నిర్మాణానికి రెండు సార్లు శంకుస్థాపనలు చేసినా పనులు ప్రారంభించనే లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 25 శాతం లోపు మాత్రమే పూర్తి అయిన పనులను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెండు వంతెనల నిర్మాణంపై ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన అవసరం ఉందని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి సీఎంకు ఈ సమస్యపై ప్రత్యేకంగా వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన సీఎం చంద్రబాబు బుగ్గవంకపై వంతెనల నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేశారు. రెండు చోట్ల వంతెనల నిర్మాణానికి నగరపాలక సంస్థ ఎస్‌డీఎఫ్ నిధుల కింద రూ.20 కోట్లతో టెండర్లు పిలిచింది. ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు బిడ్ డ్యాక్యుమెంటును సాయంత్రం 5 గంటల వరకు డౌన్లోడ్ చేసుకోవచ్చు. డౌన్లోడ్ చేసుకున్న బిడ్‌ను అదే రోజు సాయంత్రం 5.30 గంటల్లోపు సమర్పించాల్సి ఉంది. రూ.20 కోట్ల పనులకు ఇలా టెండర్లు పిలవడంపై కొన్ని రాజకీయ పార్టీల నుంచి విమర్శలు వస్తున్నాయి.

షహమీరియా దర్గా వద్ద బుగ్గవంకపై దెబ్బతిన్న వంతెన

హత్యతో కలకలం... పడకేసిన పర్యాటకం

ఇంటర్ విద్యార్థిని హత్యతో ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోట కళ తప్పింది. జిల్లాతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే వేలాది మంది పర్యాటకులతో కళకళలాడే కోటలో ఆదివారం సందడి కనిపించలేదు. కోటలో భద్రతపై పర్యాటకులతో పాటు ప్రజా సంఘాల నాయకులు అనుమానాలు వ్యక్తం చేయడం తెలిసిందే. ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి గ్యాంగులకు అడ్డాగా మారిందని ఆరోపిస్తున్నారు. స్పందించిన పోలీసు అధికారులు కోట ముఖ ద్వారం వద్ద ఉన్న పోలీసు అవుట్‌పోస్టును పునః ప్రారంభించి ఒక ఏఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లను నియమించారు. కోట సందర్శనకు వచ్చే పర్యాటకులకు సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేసుకున్న తర్వాతే లోనికి పంపుతున్నారు. వందల్లో వచ్చే శకటాలు నేడు కేవలం 55కు చేరాయి. వెలవెలబోతున్న కోట పరిసరాలను చిత్రంలో చూడవచ్చు.

- న్యూస్‌టుడే, జమ్మలమడుగు

బాలబడి... నూతన ఒరవడి

ఆట పాటలతో చిన్నారులకు వినూత్న బోధన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయడంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యలోనే ప్రైవేటు ప్లే స్కూళ్లకు దీటుగా విద్యా బోధన సాగించడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మూడేళ్లు దాటిన చిన్నారులకు మెరుగైన విద్యా బోధనకు పాఠ్య పుస్తకాలను కేంద్రాలకు సరఫరా చేశారు. ఆంగ్లం, గణితం, తెలుగుతో పాటు స్పోకెన్ ఇంగ్లిషు సులభంగా చదువుకొనేలా, అర్థమయ్యే రీతిలో పుస్తకాలు రూపొందించారు. ఆట పాటలతో విద్యా బోధన చేయడానికి కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కొత్తగా వచ్చిన పుస్తకాలను చదవడానికి చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు.

● **కార్యకర్తలకు నవచేతన :** అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు ఈ సంవత్సరం కొత్తగా నవచేతన, ఆధార్‌శిల పేరిట రెండు పుస్తకాలు అందజేశారు. నవచేతనలో బాల్యారంభ ప్రేరణకు జాతీయ చట్టం-2025 మేరకు పుట్టినప్పటి నుంచి మూడేళ్ల వరకు ప్రేరణ కృత్యాలకు సంబంధించిన అంశాలు పొందుపరిచారు. గర్భస్త శిశువుకు గర్భధారణ దశ నుంచి శారీరక, మానసిక ప్రేరణ అవసరాన్ని తెలిపారు. ఆధార్ శిలతో మూడేళ్ల నుంచి ఆరేళ్ల చిన్నారులకు ఏ రోజు ఏ అంశం వివరించాలో పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు తొలిసారిగా పుస్తకాలను అందజేసి వారితో వినూత్న రీతిలో విద్యాబోధన చేయిస్తున్నారు.

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు

- ప్రధాన కేంద్రాలు : 2,389
- గర్భిణులు : 10,534 ● బాలింతలు : 8,079
- 3-4 సంవత్సరాల లోపు పిల్లలు : 65,335
- 4-6 సంవత్సరాల లోపు పిల్లలు : 53,162

ప్రైవేటుకు దీటుగా ప్రగతి

జిల్లాలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఆట పాటలతో విద్యాబోధన అందిస్తున్నాం. ఇందుకు సంబంధించి ప్రభుత్వం సరికొత్తగా పుస్తకాలు మంజూరు చేసింది. వీటన్నింటినీ ఆయా కేంద్రాలకు తరలించాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశాలకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. కార్యకర్తలకు కూడా మెరుగైన శిక్షణ ఇచ్చాం. **- శ్రీలక్ష్మి, స్త్రీ శిశు సాధికారశాఖాధికారి, కడప**



కృష్ణవేణి... తరలిరావే అలివేణి

కొండాపురం, న్యూస్‌టుడే: జిల్లాలోనే లక్షల ఎకరాలకు సాగు, లక్షల గొంతులకు తాగునీటిని అందించే అతి పెద్ద జలాశయం గండికోట ప్రాజెక్టు కృష్ణా జలాల కోసం ఎదురుచూస్తోంది. ఈ ప్రాజెక్టుకు ప్రధాన నీటి వనరు పెన్నానదే అయినా వరద ప్రవాహం తక్కువ కావడంతో కృష్ణా నీటిపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ శ్రీశైలం జలాశయానికి చేరుతుండటంతో నిండుకుండను తలపిస్తోంది. ప్రస్తుతం గోరుకల్లు జలాశయానికి నీరు చేరుతున్న నేపథ్యంలో అక్కడ నుంచి అవుకు జలాశయం టన్నెల్ ద్వారా గండికోట ప్రాజెక్టుకు నీరు వచ్చే అవకాశం ఉంది. గండికోట జలాశయాన్ని 26.85 టీఎంసీల నీరు నిల్వ చేసేలా రూపొందించారు. ప్రస్తుతం జలాశయంలో 14.2 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : కడప కలెక్టరేట్‌లోని సభాభవనంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని డివిజన్, మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోనూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. సోమవారం ఉదయం 9.30 నుంచి అరగంట పాటు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ఉన్నతాధికారులు పాల్గొని ప్రజల సమస్యలు ఆలకిస్తారన్నారు. ఈ మేరకు సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి రాలేని వారు 08562244437 నంబరుకు చేసి తమ సమస్యను విన్నవించుకోవచ్చన్నారు.

వన విహారి.. లాహిరి... లాహిరి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ప్రకృతి రమణీయతతో అలరాలుతున్న సోమశిల వెనుక జలాల్లో పర్యాటకులు పడవలో షికారు చేయడానికి అనుమతివ్వాలని అటవీ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు. ఈ జలవనరు సామర్థ్యం 77.988 టీఎంసీలు. ప్రస్తుతం 27.645 టీఎంసీల నీరుంది. ఏటా అక్టోబరు-డిసెంబరు వరకు చూస్తే కనీసం 65-70 టీఎంసీలకు పైగా నీరు ఉంటుంది. అదేవిధంగా జనవరి-ఏప్రిల్ నెలల్లో 35-40 టీఎంసీల జలాలు ఉంటాయి. ఎగువన భారీ వర్షాలు కురిస్తే పూర్తి స్థాయిలో నింపుతారు. నెల్లూరు జిల్లాలో ఈ ప్రాజెక్టును నిర్మించడంతో ఉమ్మడి కడప జిల్లాలో ఒంటిమిట్ట, అట్లూరు, గోపవరం, నందలూరు, సిద్దవటం, పెనగలూరు మండలాల్లో 105 గ్రామాలు పూర్తిగా, మరో తొమ్మిది పల్లెలు పాక్షికంగా ముంపులో చేరాయి. ఇప్పటికే 90 శాతానికి పైగా ఇళ్లు, భూములకు పరిహారం చెల్లించడంతో సొంతూర్లను ఖాళీ చేసి వెళ్లారు. కొన్ని ఊళ్లకు మాత్రమే డబ్బులు ఇవ్వాల్సి ఉంది. కనుచూపు మేర అపార జలనిధి అందుబాటులో ఉంటుంది.

● ఒంటిమిట్ట మండలం కోటపాడు వద్ద వెనుక జలాల చెంతనే అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఇప్పటికే వన విహారి కేంద్రంలో మొదటి దశలో రూ.అర కోటి వెచ్చించి వనం ఏర్పాటు చేశారు. ఇక్కడ యాత్రికులు విడిది చేయడానికి రెండు గదులు నిర్మించారు. చిన్న పిల్లలు ఆడుకోవడానికి పార్కు ఏర్పాటు చేశారు. నడకలు సాగించడానికి కాలిబాటలు ఉన్నాయి. రక్షిత శుద్ధి జలాల కోసం ఆర్వో కేంద్రాన్ని పెట్టారు. మరుగు వసతి అందుబాటులో ఉంది. ఇక్కడ కూర్చోని హాయిగా సేద తీరేలా బల్లలు సిద్ధం చేశారు. పచ్చదనంతో పాటు ఆహ్లాదం కోసం మొక్కలు నాటి పెంచుతున్నారు. రానున్న రోజుల్లో మరికొన్ని వసతులు కల్పించడానికి ప్రణాళికలు రూపొందించారు. త్వరలో అధికారికంగా ప్రారంభించాలని నిర్ణయించారు.

● మండల కేంద్రమైన ఒంటిమిట్ట నుంచి 13 కి.మీ దూరంలో శ్రీరామ ఎత్తిపోతల పంపుహౌస్ సమీపంలోనే వన విహారి కేంద్రం పనులు చేపట్టారు. పర్యాటకులను ఆకర్షించేలా వెనుక జలాలను సందర్శించాలని ఇక్కడికి వస్తున్న యాత్రికులు నీటిలో పడవపైన విహారం (బోటింగ్) చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అటవీ అధికారులు ముందుకొచ్చారు. ● జల షికారు నిర్వహణ కోసం పడవలు కావాలి. నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలి. బోట్లును అటవీ శాఖ ద్వారా కొనుగోలు చేయాలనా, పర్యాటకాభివృద్ధి సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలనా అనే అంశంపై ఉన్నత స్థాయిలో చర్చ జరుగుతోంది. ● అపారమైన మత్స్య సంపద ఉంది. అటు, ఇటు పెనుశిల నరసింహ అభయారణ్యం ఉంది. నింగిని తాకే ఎత్తయిన గిరులు నడుమ జల హోయలతో పెన్నానది పరవళ్లు తొక్కుతోంది. విదేశాల నుంచి వస్తున్న వేలాది వలస పక్షులు ఈ ప్రాంతంలో సందడి చేస్తున్నాయి. ప్రకృతి సోయగాల మధ్యలో బోటు ప్రయాణం అందుబాటులోకి తీసుకొస్తే యాత్రికులు అంతులేని జలానుభూతి పొందుతారని అధికారులు భావిస్తున్నారు.

వెనుక జలాల్లో పడవ ప్రయాణం

ప్రతిపాదనలు పంపించాం

కోటపాడు సమీపంలో వన విహారి కేంద్రం తొలివిడత పనులు ముగింపు దశకు వచ్చాయి. మలి దశలో మరికొన్ని వసతులు కల్పించాలని నిర్ణయించాం. సోమశిల వెనుక జలాల్లో పర్యాటకులు జలానందం పొందేలా జల షికారును అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నాం. ఇందుకోసం అనుమతి ఇవ్వాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఈ ప్రాంతాన్ని పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చేస్తాం. **- బాలసుబ్రహ్మణ్యం, అటవీ క్షేత్రాధికారి**

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత ..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో
నివేదించడం తప్ప
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు
ఈనాడు కార్యాలయము, ఆలంఖాన్‌పల్లి, కడప.
కడప : ✆ 99899 97626

(c) eenadu

ఆపరేషన్ సిందూర్ విజయచిహ్నం ఆవిష్కరణ

జాతీయ చిహ్నాలను ప్రారంభిస్తున్న జిల్లా సైనిక్ సంక్షేమ బోర్డు ఛైర్మన్ భక్తవత్సలరెడ్డి, అధికారులు

గోపవరం, న్యూస్‌టుడే: దేశ భక్తిని చాటుతూ ఆపరేషన్ సిందూర్ విజయానికి గుర్తుగా నిర్మించిన విజయ చిహ్నాన్ని జిల్లా సైనిక్ సంక్షేమ బోర్డు ఛైర్మన్ వి.భక్తవత్సలరెడ్డి ఆదివారం గోపవరంలో ఆవిష్కరించారు. దేశం సాధించిన విజయాన్ని గుర్తు చేసుకుంటూ మాజీ సైనికుడు గుమ్మళ్ల శ్రీనివాసులు తన ఇల్లు, పొలం వద్ద విజయ చిహ్నాన్ని నిర్మించారు. దేశం చాటిన విజయంతో తాను స్ఫూర్తిపొందినట్లు ఆయన 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పసిడిపురి చేరిన ఇస్కాన్ శోభాయాత్ర

రథాన్ని లాగుతున్న వృషభాలు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఇస్కాన్ వ్యవస్థాపకులు భక్తి వేదాంత స్వామి ప్రభుపాద, నితాయ్ గౌర్ సుందర్ ప్రతిమల విహారం ప్రొద్దుటూరులో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ యాత్ర రథాన్ని కాంక్రేజ్ కోవకు చెందిన బూడిద, వెండి రంగుల పెద్ద కొమ్ములు కలిగిన వృషభ రాజాలు లాగుతున్నాయి. దేశంలోని 15 ప్రాంతాల్లో ఈ పాదయాత్ర జరుగుతోంది. ఆధ్యాత్మిక నగరం తిరుపతి కేంద్రంగా ఆగస్టులో గుజరాత్ నుంచి సాగుతున్న ఈ శోభాయాత్ర ఆదివారం వెల్లాల మీదుగా ప్రొద్దుటూరుకు చేరుకుంది. భక్తి ప్రచారంలో భాగంగా మృదంగం, భజన తాళాలతో భక్తులు సంకీర్తనలు ఆలపించారు.

ఈ నీళ్లు తాగేదెలా?

ట్యాంకులో పేరుకుపోయిన ఇసుక

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలోని రెండోవార్డు భాగ్యనగర్ కాలనీలో మూడు, నాలుగు రోజులుగా నీళ్లలో కలిసి ఇసుక వస్తోందని వాటిని ఎలా తాగాలని స్థానిక మహిళలు వాపోతున్నారు. నీటి ట్యాంకు అడుగులో పేరుకుపోయిన ఇసుక చాలా ఉందని చెబుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం నీళ్లను పట్టుకుంటే అడుగులో కలిసిన ఇసుకను గుర్తించినట్లు చెప్పారు. అయితే నీటిని ఎలా తాగాలని ప్రశ్నిస్తున్నారు. పురపాలక సంఘం డీఈ సురేంద్రబాబును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా గతంలో ఈ సమస్య ఉండేదని చెప్పారు. నారాపుర వేంకటేశ్వర ఆలయం, పశువుల వైద్యశాల కార్యాలయం ఆవరణలో కొత్త బోర్లు వేసిన తర్వాత నీటిలో కలిసిన ఇసుక రావడం లేదన్నారు. తమ సిబ్బందిని పంపించి పూర్తి వివరాలు కనుగొంటామన్నారు.

సెప్టెంబరు 12 నుంచి ఏఐఎస్‌బీ జాతీయ మహాసభలు

ఏఐఎస్‌బీ జాతీయ మహాసభ లోగోను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి తదితరులు

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరంలో సెప్టెంబరు 12, 13, 14 తేదీల్లో అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) 9వ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ మహాసభల్లో విద్యార్థులు, యువకులు, విద్యావంతులు, మేధావులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన లోగోను ఆదివారం కడప నగరంలో ఏఐఎస్‌బీ నాయకులతో కలిసి ఆవిష్కరించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ సమాజంలో విద్యార్థి సంఘాల పాత్ర కీలకమైందన్నారు. విద్యారంగ సమస్యలపై, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థి సంఘాల పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం అధ్యక్షుడు సుందర్‌రామరాజు, ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, నాయకులు పాపిరెడ్డిపల్లి పృథ్వీ, సగిలి రాజేంద్రప్రసాద్, మనోజ్, చిరంజీవి, విష్ణు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏటి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసి ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

MARRIAGE SERVICES

శ్రీ పరిణయ మ్యాట్రిమోనీలో పెళ్ళి సంబంధాల రిజిస్ట్రేషన్ అమ్మాయిలకు ఫ్రీ అబ్బాయిలకు 50% రాయితీ. జులై 31 వరకు మాత్రమే. మా వద్ద న్యూమరాలజీ, పామిస్ట్రీ, జ్యోతిష్యం, వాస్తుసేవలు కలవు, తిరుపతి ✆ 94918 40669.

REAL ESTATE

PLOT FOR SALE

తిరుపతి ఎయిర్‌బైపాస్ రోడ్డు రోడ్డుకు 2వ ప్లాటు (రాస్ బిల్డింగ్ దగ్గర) 100 అంకణముల సెమి కమర్షియల్ ప్లాటు అమ్మబడును. వివరములకు: Cell: ✆ 95154 83527.

JOBS

Evargo కంపెనీలో ఆన్‌లైన్ డెలివరీ చేయడానికి బైక్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. Ph: 7337544439, 9014651068, 7075633416.

కొడితే గోల్స్ పడాల్సిందే..!

- జాతీయ స్థాయిలో పతకాలు
- సత్తా చాటుతున్న హాకీ క్రీడాకారులు

సాధన చేస్తున్న హాకీ క్రీడాకారులు

ప్రొద్దుటూరు, ఖాజీపేట, న్యూస్‌టుడే: రాయలసీమ వ్యాయామ విద్య కళాశాల విద్యార్థులు హాకీ క్రీడలో దూసుకుపోతున్నారు. గురువులు ఇచ్చే శిక్షణ, చక్కని మెలకువలతో, పట్టుదల, ఏకాగ్రతతో ఉత్తమ ప్రతిభ చాటుతున్నారు. ఎస్‌జీఎఫ్ఐ, రాష్ట్ర, యూనివర్సిటీ, జోనల్, జాతీయ స్థాయిల్లో బంగారు పతకాలు సాధిస్తున్నారు. హాకీ బ్యాట్ పడితే ప్రత్యర్థుల్లో ముచ్చెమటలు పట్టేట్లు గోల్స్ చేసి జట్టును విజయతీరాలకు చేర్చుతున్నారు. డీపీఈడీ, బీపీడీ మొదటి, రెండో సంవత్సరం చదివే బి.రత్నభూషణ్, ఎస్.హఫీజ్ అలి, కె.గణేష్ సాధించిన పతకాలు, విజయాలు తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకం.

పీఈటీగా సేవలందిస్తా

నా పేరు బుద్ధ రత్నభూషణ్. అనంతపురం, గుంటూరుల్లో జరిగిన రాష్ట్ర స్థాయిలో రెండు సార్లు మూడో స్థానం నిలిచాను, తమిళనాడులో అంతర్ యూనివర్సిటీ స్థాయిలో, ఝూర్ఖండ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. 5 గోల్స్ చేశాను. జాతీయ స్థాయిలో బంగారు పతకం, ఉత్తమ పీఈటీ కావాలని లక్ష్యం ఉంది.

ఉద్యోగ సాధనే నా కల

నా పేరు షేక్ హఫీజ్‌అలి. క్రీడలో రాణిస్తున్నా. ఇప్పటి వరకు 2018లో 2వ ఏపీ స్టేట్ జూనియర్ హాకీ ఛాంపియన్‌షిప్, 2019-20లో ఎస్‌జీఎఫ్ఐ జాతీయ స్థాయిలో పాల్గొన్నా. 2021లో ఒకటో హాకీ ఇండియా జూనియర్ మెన్ జాతీయ అకాడమీ ఛాంపియన్‌షిప్, 2022-23లో బెంగళూరులో జరిగిన సౌత్ జోన్ అంతర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో ఆడాను. 30 గోల్స్ చేసి గెలుపునకు సహకరించాను. భారత్‌కు ఆడాలని, వ్యాయామ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించడమే నా స్వప్నం.

ఒలింపిక్స్‌కు ఆడటమే ధ్యేయం

నా పేరు కె.గణేష్. ఇంత వరకు 2014 నుంచి 2019 వరకు ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్ర స్థాయిలో మూడు సార్లు ప్రతిభ చూపాను. ఒక్క సారి మూడో స్థానంలో నిలిచాను. 2023 తిరుపతిలో జరిగిన ఏపీ సీఎం కప్ పోటీల్లో బంగారు పతకం సాధించాను. ఇదే ఏడాది బెంగళూరు సౌత్ జోన్ యూనివర్సిటీ, భోపాల్‌లో ఒక్కటో హాకీ ఇండియా జూనియర్ మెన్ జాతీయ అకాడమీ ఛాంపియన్‌షిప్‌లో, గుంటూరులో జరిగిన ఒక్కటో హాకీ రాష్ట్ర సీనియర్ మెన్ ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో పాల్గొన్నాను. రెండు బంగారు పతకాలు సాధించా, 4 గోల్స్ వేశాను. ఒలింపిక్ ఆడాలని ఉంది. స్పోర్ట్స్ కోటాలో వ్యాయామ సంచాలకుడు ఉద్యోగ సాధనే నా ధ్యేయం.

30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్

మాట్లాడుతున్న బీటీయూ జిల్లా అధ్యక్షుడు మేడ్రగుత్తి గంగరాజు

కడప విద్య, న్యూస్‌టుడే : ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిషన్‌ను నియమించి కనీసం 30 శాతం ఐఆర్ ప్రకటించాలని బీటీయూ జిల్లా అధ్యక్షుడు మేడ్రగుత్తి గంగరాజు కోరారు. ఆదివారం స్థానిక బహుజన టీచర్స్ యూనియన్ (బీటీయూ) కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 13 నెలలు పూర్తయిందని, ఇంతవరకూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ కమిటీ వేయకపోవడం, కనీసం ఐఆర్ ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీల మేరకు పీఆర్సీపై, ఐఆర్‌పై, పెండింగ్ బకాయిలపై దృష్టిపెట్టాలని కోరారు. అర్జిత సెలవులను నగదుగా మార్చుకోవడానికి బిల్లులు పెట్టుకున్నారని, మూడేళ్లుగా ఇంతవరకూ చెల్లించలేదన్నారు. మాతృభాషలో విద్యాబోధన విద్యార్థుల సంపూర్ణ వికాసానికి దారితీస్తుందన్నారు. అన్ని రకాల పాఠశాలల్లో తెలుగు మీడియం ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు శివార్జున, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, ట్రెజరర్ రాజబాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గంగాధర్ పాల్గొన్నారు.

జన జీవనంపై సమ్మె ప్రభావం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: పురపాలక కార్మికులు కొనసాగిస్తున్న సమ్మె ప్రభావం జన జీవనంపై చూపుతోంది. గత నాలుగు రోజులుగా బి.కొత్తకోటలో నీటి సరఫరా ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంపై పోరుబాట తప్పదు : యూటీఎఫ్

మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప విద్య, న్యూస్‌టుడే : ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి ఏడాది పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పట్టించుకోవడం లేదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా అన్నారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు కొండంత చేసింది గోరంత మాత్రమేనన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను నామమాత్రంగానే చెల్లించారన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా బకాయిలన్నీ చెల్లిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. గత పీఆర్సీ బకాయిలతో పాటు డీఏ, సరెండర్ లీవ్స్, ఏపీజీఎల్ఐ బకాయిలు చెల్లింపులకు నోచుకోలేదన్నారు. 2024 జూన్ మాసానికే 12వ పీఆర్సీని అమలు చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగులకు నెలసరి జీతాలను చెల్లించడమే ప్రభుత్వం గొప్పగా భావిస్తున్నట్లుందన్నారు. ఉద్యోగులకు జీవన్మరణ సమస్యగా ఉన్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెంఛన్ విధానాన్ని పునరుద్ధరించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరుబాట పట్టక తప్పదని హెచ్చరికలు చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేశ్‌బాబు, జిల్లా సహాధ్యక్షురాలు సుజాతరాణి, నాయకులు నరసింహారావు, రూతు ఆరోగ్యమేరీ, సుబ్బారావు, సూర్యకుమార్, హిఫాజతుల్లా, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ వ్యాల్యూషన్ నిధులు చెల్లించండి

మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అవుల శ్రీనివాసులు

కడప విద్య, న్యూస్‌టుడే : పదో తరగతి పరీక్షలకు సంబంధించి స్పాట్ వ్యాల్యూషన్ నిధులను ఉపాధ్యాయుల ఖాతాలో జమచేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అవుల శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 పదో తరగతి పరీక్షలకు సంబంధించిన డీఓ, డిపార్ట్‌మెంటల్ అధికారులు, స్క్వాడ్‌ల రెమ్యునరేషన్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. బదిలీల్లో రీఅపోర్సనెంట్‌లో వచ్చిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు బాలకృష్ణ, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఆర్పీసీ రాయలసీమ వైస్ ఛైర్మన్‌గా రామ్మోహన్‌రెడ్డి

కొండాపురం, న్యూస్‌టుడే: హెచ్ఆర్పీసీ రాయలసీమ రీజనల్ వైస్ ఛైర్మన్‌గా కొండాపురం మండలం పి.అనంతపురం గ్రామానికి చెందిన రామ్మోహన్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ హెచ్ఆర్పీసీ జాతీయ ఛైర్మన్ ప్రసన్నకుమార్ ఈ నియామక పత్రం అందజేశారన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, బెదురు, బలవంత వర్గాలపై జరుగుతున్న దాడులపై సంస్థ ఆధ్వర్యంలో న్యాయపోరాటాలు చేస్తామన్నారు.

నాసిరకం సరకుల సరఫరాపై విచారణకు డిమాండ్

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే నాసిరకం కంది పప్పు, కోడిగుడ్లపై విచారణ చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి బాదుల్లా డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో నగర అధ్యక్షుడు సుబ్బరాయుడుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కొంతమంది అధికారులు గుత్తేదారులతో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకుని కోడిగుడ్లు, చిక్కీలు, కందిపప్పు నాసిరకమైన సరఫరా చేస్తున్నారన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే కార్యకర్తలను బెదిరిస్తున్నారన్నారు. దీంతో లబ్ధిదారులు అడిగే ప్రశ్నలకు కార్యకర్తలు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. వీటితో పాటు వివిధ రకాల యాప్‌ల పేరుతో కార్యకర్తలపై ఒత్తిడి పెరుగుతోందని దీనిపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.

'విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నా పట్టించుకోరా?'

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : వైవీయూ పరిధిలోని బీఎడ్, న్యాయ కళాశాలల్లో తరగతులు నిర్వహించకున్నా వాటికి అఫిలియేషన్ ఎలా ఇస్తారని రాష్ట్ర రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేశు ప్రశ్నించారు. ఆదివారం కడపలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తరగతులు నిర్వహించని కళాశాలలపై చర్యలు తీసుకుంటామని వైస్‌ఛాన్సులర్ చెప్పిన కొన్ని రోజులకే అఫిలియేషన్ ఇవ్వడం విచారకరమన్నారు. కొన్ని కళాశాలలకు తరగతి గదులు, సరైన భవనాలు లేకున్నా ప్రవేశాలు కల్పిస్తూ.. విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం కళ్లుండి చూడలేకున్నారని విమర్శించారు. విశ్వవిద్యాలయ అధికారులు సరైన నిర్ణయాలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

ఇదేనా 'చెత్త' నిర్వహణ

ఉద్యాన వనం కంచె వద్ద చేరిన చెత్త

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఆంధ్రుల భద్రాద్రి ఒంటిమిట్ట కోదండ రామాలయం దక్షిణ గోపురం మాడ వీధి పక్కనే ఉద్యాన వనం వద్ద చెత్త, ఇతర వ్యర్థాలు చేరాయి. కడప - రేణిగుంట జాతీయ రహదారి ఆనుకొని తితిదే అధికారులు పచ్చదనం కోసం మొక్కలు నాటారు. రక్షణ కోసం కంచె ఏర్పాటు చేశారు. సమీప ప్రదేశాల నుంచి ప్లాస్టిక్ పాత సంచులు, చిత్తు కాగితాలు, చెత్త గాలికి ఎగిరి వచ్చి ఇక్కడ చేరుతోంది. అయితే సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో సిబ్బంది ఎవరూ తొలగించడం లేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇక్కడ పనిచేస్తున్న అధికార యంత్రాంగం మాత్రం చెవికెక్కించుకోలేదు. రామయ్య దర్శనం కోసం నిత్యం వేలాది మంది యాత్రికులు వస్తున్నారు. ఇక్కడ పోగైన చెత్తను చూసి ఇదేం నిర్వహణ అంటూ ప్రశ్నిస్తున్నారు. తితిదే అధికారులు దృష్టి సారించడం లేదు. మండల పరిషత్తు, పంచాయతీ అధికారులు కూడా తమ పరిధి కాదని మిన్నకుండా ఉంటున్నారు. స్వచ్ఛ స్ఫూర్తితో పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు మాత్రం కళ్లకు గంతలు కట్టుకున్నారు. పరిశుభ్రత వాతావరణం కల్పించాలనే మాటన విస్మరించారు.

'గంగ'కు ఏటూరు కాలువలో చెత్తకుప్పల స్వాగతం

ఓబుళరెడ్డిపేట వద్ద కాలువలో చెత్తకుప్పలు

కేసీ కెనాల్ ఏటూరు లైనింగ్ కాలువలో ప్రతిఏటా ఉపాధిహామీ పథకం కింద కూలీలతో శుభ్రం చేయిస్తారు. దీని ద్వారా చాపాడు, ఖాజీపేట మండలాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఇందులో భాగంగా విజయనగరం, ఓబుళరెడ్డిపేట వద్ద కూలీలు పనిచేసినా చెత్త కుప్పలు అలాగే పేరుకుపోయాయి. వంతెన పనులు జరుగుతుండగా సంబంధిత కాలువకు నీరు ఇంకా వదల్లేదు. సోమవారం సాయంత్రం కాలువకు నీరు విడుదల చేస్తున్నట్లు ఏఈ గురుమోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యదర్శుల ద్వారా కాలువలో చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. **-న్యూస్‌టుడే, చాపాడు**

రోడ్డు తవ్వేసిన ఘటనపై కేసు నమోదు

చాపాడు, న్యూస్‌టుడే: మండలంలోని తిప్పిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో సిమెంటు రోడ్డును పెకిలించారన్న ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. గత వైకాపా ప్రభుత్వం వేసిన సిమెంటు రోడ్డు తమ పట్టా భూమిలో ఉందని శనివారం మల్లికార్జున్‌రెడ్డి, బాలసుబ్బారెడ్డి యంత్రంతో తవ్వినట్లు చెప్పారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ప్రజాధనానికి నష్టం వాటిల్లినట్లు గుర్తించి అన్నదమ్ములిద్దరిపై కేసు నమోదుచేసి విచారిస్తున్నామన్నారు.

రమేష్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు

మాజీ ఎమ్మెల్యే అరెస్టు... మదనపల్లె గ్రామీణ ఠాణాకు తరలింపు

మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాయచోటి మాజీ ఎమ్మెల్యే, వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ★ చిన్నమండెం మండలం కదిరివాండ్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ఎమ్మెల్యేలలో దోపిడీ చేయని వారు ఎవరున్నారో చెప్పాలన్నారు. ప్రతి పల్లెలో నాలుగు గొలుసు దుకాణాలు నిర్వహిస్తూ పేదలను అప్పుల పాలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం కక్ష సాధింపుగా వ్యవహరిస్తున్నారన్నారు. చంద్రబాబు చెప్పేవి నమ్మొద్దని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పదే పదే చెప్పినా చిన్నమండెం మండలంలో నాలుగు వేల ఓట్ల మెజార్టీ ఇచ్చారన్నారు. ఎవరినో తీసుకొచ్చి పెట్టామని.. ఏదో అయిపోతుందని చివరకు ఓ దొంగను తెచ్చారంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు.

★ తెదేపా నేతలతో పాటు ప్రజలను రెచ్చగొట్టేలా ప్రసంగించారని లక్కిరెడ్డిపల్లెకు చెందిన తెదేపా నాయకుడు మదన్‌మోహన్ లక్కిరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని సీఐ కొండారెడ్డి తెలిపారు. దీంతో స్థానికంగా ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా ఉండేందుకు రమేష్‌కుమార్‌రెడ్డిని రాత్రి అదుపులోకి తీసుకున్నామని ఆయన వివరించారు. లక్కిరెడ్డిపల్లె నుంచి మదనపల్లె గ్రామీణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. రమేష్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గంలోని లక్కిరెడ్డిపల్లి, రామాపురం, సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి పోలీసు స్టేషన్లలో ఆయా మండలాలకు చెందిన తెదేపా నాయకులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం, మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమజసం కాదన్నారు.

లక్కిరెడ్డిపల్లిలో సీఐ టీవీ కొండారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న తెదేపా నాయకులు

ఓర్వలేకనే విమర్శలు: మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో లక్కిరెడ్డిపల్లి పోలీసు స్టేషన్‌కు చేరుకోవడంతో కాసేపు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. తాము ప్రజల పక్షాన పని చేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని.. ఓర్వలేకనే వైకాపా నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన మండిడ్డారు.

దేశ చరిత్రలోనే అతి పెద్ద లిక్కర్ స్కాం

కమలాపురం, న్యూస్‌టుడే : తాడేపల్లెలో జరిగిన లిక్కర్ స్కాం దేశ చరిత్రలోనే అతి పెద్ద లిక్కర్ స్కాం అని ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైకాపా ప్రభుత్వంలో ఎంపీగా గెలిచిన మిథున్‌రెడ్డి ప్రజలకు సేవా చేయాల్సింది పోయి మాజీ సీఎం జగన్ నడిచే అడ్డదారిలో నడుస్తూ, కల్తీ మద్యం తయారీ యాజమాన్యాలతో చేతులు కలిపి లిక్కర్ స్కాం చేసి రూ.వేల కోట్లు పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఆయన మద్యం స్కాంలో అరెస్టు అయ్యే అవకాశం ఉందన్నారు. దివంగత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి ఐఏఎస్ అధికారులను అవినీతి దారిలో నడిపించడంతోనే పలువురు వివిధ స్కాంలో ఇరుక్కున్నారన్నారు. తండ్రి బాటలోనే తనయుడు జగన్ నమ్ముకున్న వారిని ఇప్పుడు జైలు పాలు చేస్తున్నారన్నారు. వైకాపా ప్రభుత్వంలో జరిగిన అవినీతిని చూసి ప్రజలు 11 సీట్లు ఇచ్చారని, అయినా ఇప్పటికీ వారు మారలేదన్నారు. కూటమి ప్రభుత్వ నాయకులను అసభ్య పదజాలంతో మాట్లాడుతూ ప్రజల్లో ఇంకా దిగజారుతున్నారన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై మంత్రి మండిపల్లి ఆగ్రహం

మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి, పక్కన తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, నాయకులు

రాయచోటి: ప్రభుత్వంపై వైకాపా నేతలు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించే ప్రసక్తే లేదని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం రాత్రి తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను శాంతి యుత రాముడిగా ఉంటే రెచ్చగొట్టేలా అనుచిత వ్యాఖ్యలు చేసి రావణుడిలా చేయొద్దన్నారు. మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డికి వైకాపాలో ఆయన స్థానం ఏమిటో తెలియదని.. అలాంటి వ్యక్తి తనను.. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి ఎక్కడిదని ప్రశ్నించారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు పనులు బిల్లులన్నీ తన ఖాతాలోనే వేసుకొని కార్యకర్తలు, నాయకుల నోళ్లు కొట్టిన చరిత్ర ఆయనదేనన్నారు. వైకాపాలోకి రానీయకుంటే రాయభారం పంపి మరీ ఎన్నికల ముందు పార్టీలో చేరి తెదేపాకు ద్రోహం చేసిన వ్యక్తి అని ఆరోపించారు. సామాజిక మాధ్యమాలలో ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెట్టినా, కామెంట్లు చేసినా ఇకపై సహించే ప్రసక్తి ఉండదన్నారు. అటువంటి వారికి సరైన జవాబు చెప్పి తీరుతానని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, మాజీ సర్పంచి నాగేశ్వరనాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డెయ్య, మైనార్టీ నాయకుడు జాఫర్ పాల్గొన్నారు.

బద్వేలు.. సర్కారు విద్య కుదేలు

- ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలల ఊసేలేదు
- ఉన్నత చదువులకు నోచుకోని పేద విద్యార్థులు

-న్యూస్‌టుడే, బద్వేలు

బద్వేలు నియోజకవర్గంలో పేద విద్యార్థులు సర్కారు విద్యకు దూరమవుతున్నారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో చదువుకోలేకపోతున్నారు. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పదో తరగతి పూర్తయినవారు పైతరగతులకు వెళ్లలేక పోతున్నారు. నియోజకవర్గంలో కలసపాడు, కాశినాయన, బి కోడూరు, పోరుమామిళ్ల, బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాలు ఉన్నాయి. ఒక పోరుమామిళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మినహాయిస్తే ఏ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదు. ప్రైవేటు జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల్లో 24 వేల మంది గ్రామీణ, పట్టణ కేంద్రాలకు చెందిన పేద విద్యార్థులు చదువుకుంటున్నారు. రోడ్డు ఉన్నా గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యాలులేక పోవడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ప్రమాదకర పరిస్థితుల్లో ప్రైవేటు కళాశాలలకు చేరుకోవాల్సివస్తోంది. ఓట్లు వేయించుకుని గెలిచిన వారు ప్రతి మండలానికి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీలను ఇచ్చారేకానీ.. ఆచరణలో పెట్టింది లేదు.

బద్వేలులోని ఎస్‌బీవీఆర్ కళాశాల

ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

ప్రతి మండలంలో ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తాం. మండల కేంద్రాల్లోని పేద విద్యార్థులకు జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేస్తాం. బద్వేలులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **-దాసరి సుధ, ఎమ్మెల్యే బద్వేలు**

ప్రభుత్వ భూమి చదును పనులు అడ్డుకున్న అధికారులు

చదును చేసిన పొలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ రమణ

అట్లూరు, న్యూస్‌టుడే : మండలంలో 1039 సర్వే నెంబరులోని సుమారు ఐదెకరాల ప్రభుత్వ పొలాన్ని రెండు రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా స్థానికులు డోజర్‌తో చదును చేస్తున్నారు. సుమారు రూ.20 లక్షల విలువైన ప్రభుత్వ భూమిని దక్కించుకునేందుకు అధికార పార్టీకి చెందిన నాయకులు ఆక్రమించుకుంటున్నారని రెవెన్యూ అధికారులకు స్థానిక మరో వర్గం ఆదివారం ఫిర్యాదు చేశారు. పట్టాదారు పాసుపుస్తకాలు ఉంటే చెల్లవని సంబంధిత రైతు ఆన్‌లైన్ చేపించుకుంటేనే హక్కు ఉంటుందని ఇన్‌ఛార్జి తహసీల్దారు శిరీష అన్నారు. చదును చేస్తున్న పొలాన్ని ఆర్ఐ రమణ పరిశీలించి చదును చేస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేస్తామని పట్టాదారు పాసుపుస్తకం ఉన్న మాడపూరు సుబ్బయ్యను హెచ్చరించారు. గతంలోను ఇదే పొలం రెండేళ్ల కిందట ఆక్రమణలకు గురవుతుంటే రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

మైలవరం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రామచంద్రాయపల్లె గ్రామంలో గత కొద్దిరోజులుగా నీటి కోసం ప్రజలు ద్విచక్ర వాహనాలు, తోపుడు బండ్లపై దూరప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. ఆదివారం 'ఈనాడు'లో 'వరుస కట్టిన కన్నీటి కష్టం' అనే శీర్షికతో కథనం వచ్చింది. దీంతో స్పందించిన ఎంపీడీవో రామచంద్రారెడ్డి అధికారులు, కూటమి నాయకులు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

ఉద్యోగుల సంఘం ఎన్నిక

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం బద్వేలు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హుసేనయ్య, కార్యదర్శిగా పుష్పరాజు, కోశాధికారిగా విజయ్‌కుమార్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి చంద్రశేఖర్ తెలిపారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బాలయ్య, ఉపాధ్యక్షులుగా నరసింహప్రసాద్, బ్రహ్మాజీ, లక్ష్మీదేవి, శ్రీహరి, సుబ్బరాయుడు, రఘునాథరెడ్డి, కొండయ్యల ఎన్నుకున్నామని వివరించారు.

బద్వేలు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9000409516
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ : 8008573493

?: మైలవరం మండల పరిధిలోని తొర్రివేముల గ్రామంలో కాలువలు బ్లాక్ కావడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. ఈ సమస్యను పరిష్కరించాలి. **-సుబ్బమ్మ, తొర్రివేముల**

✓: తగిన చర్యలు తీసుకుంటాం. **- ఎంపీడీవో రామచంద్రారెడ్డి**

?: నార్జంపల్లె గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. దీపాలు వెలిగేలా చూడాలి. **- నాగేష్‌రెడ్డి**

✓: దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- చిదంబరరెడ్డి, విద్యుత్తు ఏఈ మైలవరం -న్యూస్‌టుడే, మైలవరం**

?: బద్వేలు పురపాలకలోని సిద్ధవటంరోడ్డులో కాలువ పూడికతో నిండింది. కొద్దిపాటివర్షం కురిసినా ఆర్టీసీ గ్యారేజీ, మహబుబ్‌నగర్ వీధి తోపాటు రహదారులపై వరదనీరు చేరి రాకపోకలకు కష్టంగా ఉంది. **-మహబుబ్‌నగర్ వీధి ప్రజలు, బద్వేలు**

✓: కాలువ పూడికను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ఆర్టీసీ గ్యారేజీ, మహబుబ్‌నగర్ వీధి, రహదారులపై వరదనీరు చేరకుండా శ్రద్ధ తీసుకుంటాం.

?: బద్వేలు విద్యానగర్‌లో కొన్ని స్తంభాలకు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో విషజంతువుల బెడద అధికంగా ఉంది. చీకటి పడితే ఇంటిలో నుంచి బయటకు రాలేకపోతున్నాం. **-విద్యానగర్ వాసులు, బద్వేలు**

✓: బద్వేలు విద్యానగర్‌లో వీధి దీపాలను వెలగని విద్యుత్తు స్తంభాలను గుర్తిస్తాం. వీధి దీపాలను ఏర్పాటు చేస్తాం.

(పై సమస్యలకు బద్వేలు పురపాలక కమిషనర్ నరసింహారెడ్డి సమాధానం చెప్పారు.) -న్యూస్‌టుడే, బద్వేలు

?: ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలోని పైఅంతస్తులకు వెళ్లే మెట్లు, ర్యాంపులు శుభ్రంగా లేవు. కుక్కలు మల, మూత్ర విసర్జన చేసి అపరిశుభ్రంగా ఉన్నాయి. **-శ్రీనివాసులు, ప్రొద్దుటూరు**

✓: పైఅంతస్తులకు వెళ్లే మెట్లు, ర్యాంపులు నీటితో శుభ్రంచేయించి, పరిశుభ్రంగా ఉంచుతాం. **-రమేష్, శానిటరీ సూపర్‌వైజర్ -న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు వైద్యం**

?: అట్లూరు మండలంలోని ఎర్రబల్లె ఎస్సీ కాలనీలో ఐదు రోజులుగా తాగునీటి బోరు పనిచేయక చేతిపంపుతో ఇబ్బందులు పడుతున్నాం. చేతి పంపు నీరు ఏమాత్రం సరిపడటం లేదు. వెంటనే మరమ్మతు చేపించండి. **-సుబ్బయ్య, ఎస్సీ కాలనీ, ఎర్రబల్లె**

✓: కాలనీలోని నీటి సమస్య నా దృష్టికి రాలేదు. వెంటనే మరమ్మతు చేపిస్తాం. **-సుజన, పంచాయతీ కార్యదర్శి, తంబళ్లగొంది -న్యూస్‌టుడే, అట్లూరు**

?: బ్రహ్మంగారిమఠం ఐదురోడ్ల కూడలి సమీపంలోని మురికి కాలువను కొన్ని రోజులుగా శుభ్రం చేయడం లేదు. దుర్వాసన, దోమల బెడద అధికమైంది. **-నరసింహులు, స్థానికుడు**

✓: పరిశీలించి వెంటనే శుభ్రం చేయిస్తాం. **-ప్రభాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శి -న్యూస్‌టుడే, బ్రహ్మంగారిమఠం**

సమస్యల దరువు.. పరిష్కారం కరవు

ఈ చిత్రంలో కనిపించేది చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం కొండాపురంలోని ఆర్అండ్ఆర్ కాలనీ ఇళ్ల వద్ద ఉంది. గతంలో ఈ చెత్త కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గండికోట జలాశయం పరిధిలో కొండాపురం ముంపునకు గురవడంతో సంపద కేంద్రం పక్కనే ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటు చేశారు. నిర్వాసితులు ఇళ్లు నిర్మించుకున్నా కేంద్రం మరో ప్రాంతానికి తరలించలేదు. దీంతో నిత్యం దుర్వాసనతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో మరింత ఇబ్బంది కలుగుతోంది.

కొండాపురంలోని జడ్పీ పాఠశాల భవనాన్ని 1948లో నిర్మించారు. ఇది గండికోట జలాశయం పరిధిలో ముంపునకు గురైంది. కొత్త భవనం నిర్మించకపోవడంతో పాత గ్రామంలోని పాఠశాలకు వెళ్తున్నారు. పాత ఊరిలోకి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు రైల్వేట్రాక్ దాటి ప్రమాదకరంగా వెళ్తున్నారు. గతంలో 750 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం ఈ ఏడాది 88 మంది విద్యార్థులు ఉన్నారు.

నేడు కొండాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

–న్యూస్‌టుడే, కొండాపురం

నియోజకవర్గంలో పెద్ద మండలం కొండాపురం. 52 గ్రామాలు ఉండగా 21 గ్రామాలు గండికోట జలాశయం పరిధిలో ముంపునకు గురయ్యాయి. మిగిలిన గ్రామాల ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రధానంగా కొండాపురం పంచాయతీలోని రామసుబ్బారెడ్డి కాలనీలో ఏళ్లు గడుస్తున్నా మురుగుపారుదలకు కాలువల్లేక అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. స్వచ్ఛత లోపించింది. ప్రభుత్వ కార్యాలయాలు గండికోట జలాశయం పరిధిలో ముంపుబాట పట్టాయి. కొత్త కాలనీల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపట్టలేదు. తహసీల్దారు, ఎంపీడీవో, రాణా, పశువైద్యాశాల, ఆర్అండ్‌బీ వసతి గృహం, బస్టాండ్, ప్రభుత్వ పాఠశాల... భవనాల నిర్మాణాలు జరగలేదు.

చీకటిపడితే అంధకారం

కొండాపురంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే మార్గంలో కొంతదూరం సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు. మిగిలిన రోడ్డును కూడా బైపాస్ వరకు పూర్తి చేయాలి. వీధి దీపాలు లేక అంధకారం నెలకొంది. కుక్కల బెడద అధికంగా ఉంది. ప్రధాన రహదారిపై వాహనాలకు అడ్డు రావడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. శశ్మాన వాటికకు స్థలం కేటాయించాలి. అక్కడ చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి, నీటి వసతి గది ఏర్పాటు చేయాలి. ఎస్‌బీఐ సమీపంలోని ఆర్అండ్ఆర్ కాలనీలో చెత్త సంపద కేంద్రం ఉంది. దీని నుంచి దుర్వాసనతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో మరింత సమస్యగా ఉంటుంది.

సర్కిల్ వద్ద షెల్టర్లు లేక బస్సుల కోసం ప్రయాణికులు ఎండలో, వానలో ఇబ్బంది పడుతున్నారు. అక్కడ మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని మహిళలు, వృద్ధులు, విద్యార్థులు కోరుతున్నారు. గండికోట జలాశయం పరిధిలో ముంపునకు గురైన నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించారు. ప్రభుత్వం నుంచి రాయితీ రుణాలు మంజూరు చేయించాలి. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన గోదాంలు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని వినియోగంలోకి తీసుకురావాలి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముద్దనూరు, న్యూస్‌టుడే: కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలోని ముద్దనూరు శివారు ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పులివెందులకు చెందిన రవికుమార్ తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పులివెందులకు చెందిన రవికుమార్ ఎర్రగుంట్ల మండలంలోని ఐసీఎల్ సిమెంట్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విధులు పూర్తి చేసుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా ముద్దనూరు మండలం తిమ్మాపురం గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టి.. కొంత దూరం వరకు లాక్కెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది క్షతగాత్రున్ని ప్రొద్దుటూరులోని ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు.

రైలు కింద పడ్డ ప్రయాణికుడు...

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్లే మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ కింద జమ్మలమడుగు స్టేషన్‌లో ప్రయాణికుడు కిందపడి గాయపడిన ఘటన జరిగింది. ఈ ఎక్స్‌ప్రెస్ రాత్రి 9.39 గంటలకు చేరుకుని 9.40 గంటలకు బయల్దేరి వెళ్లాలి. ఆదివారం రాత్రి 9.50 గంటలకు జమ్మలమడుగు స్టేషన్‌కు చేరుకుంది. బయల్దేరుతుండగా ఒక వ్యక్తి రైలు ఎక్కబోయి జారిపోయి కింద పడిపోయినట్లు ప్రయాణికులు తెలిపారు. కాస్త దూరం వెళ్లాక గుర్తించిన ప్రయాణికులు రైలును ఆపి కిందపడిపోయిన వ్యక్తిని పైకిలాగి రక్షించారు.

మాజీ ఎమ్మెల్యే మాయలో పడొద్దు

కడప, న్యూస్‌టుడే: 'రఘురామిరెడ్డి కోసం ఐదెకరాలు పోగొట్టుకున్నానని చెప్పిన సంగతి మరచిపోయావా షరీఫ్ అని మైదుకూరు పురపాలక సంఘ వైస్ ఛైర్మన్‌ను ఉద్దేశించి ఛైర్మన్ మాచనూరు చంద్ర ప్రశ్నించారు. ఆయన రాసిచ్చిన పేపరు మీడియా ముందు చదవడం మంచిది కాదన్నారు. తమ బాధలు ఎంపీ అవినాష్‌రెడ్డి దగ్గరకు వెళ్లి చెప్పుకోకపోతే మనల్ని గంపగుత్తగా అమ్మేస్తాడని పలికిన మాటలు ఏమయ్యాయని.. కులాలు పోయి, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ట్రాప్‌లో పడొద్దని చంద్ర ఆదివారం మీడియా సమావేశంలో హితవు పలికారు. తన వద్ద డబ్బులు తీసుకున్నట్లు పెద్దమ్మతల్లి గుడి వద్ద ప్రమాణం చేస్తానని మాజీ ఎమ్మెల్యేకు ఇదివరకే సవాలు విసిరానని అందుకు ఆయనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైస్ ఛైర్మన్ షరీఫ్ మూడేళ్ల కిందట తీసిన పాత వీడియోలు చూపించి నేను డబ్బు ఇవ్వలేదన్నట్లు ప్రచారం చేయడం బాగలేదన్నారు. పార్టీ కోసం నాతో బలవంతంగా ప్రెస్ మీట్ పెట్టించగా, ఆ రోజు డబ్బులివ్వలేదని అబద్ధమాడానని అన్నారు.

మాట్లాడుతున్న మైదుకూరు పురపాలక ఛైర్మన్ మాచనూరు చంద్ర, పక్కన కౌన్సిలర్లు

పోలీసు స్టేషన్‌లో విచారణ

జమ్మలమడుగు, జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: గండికోటలో హత్యకు గురైన ఇంటర్ విద్యార్థిని కేసుకు సంబంధించి విచారణ కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం యువతి కుటుంబ సభ్యులు, బంధువులను స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారించి వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. ఈ నెల 15వ తేదీ గండికోటలో యువతి మృతదేహాన్ని ఎలా గుర్తించారు, ముందుగా చూసింది ఎవరు, ఎక్కడ్నుంచి చూశారు, ఘటనా స్థలానికి ఎలా చేరుకున్నారు, అనే కోణంలో విచారణ చేసినట్లు సమాచారం. అనంతరం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఏర్పాటు చేసిన సమావేశం రాత్రి వరకు కొనసాగింది. వీలైనంత త్వరలో కేసును ఛేదించేందుకు శతవిధాలుగా ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

రాజుపాళెంలో బంగారం చోరీ

రాజుపాళెం, న్యూస్‌టుడే: రాజుపాళెంలో గోపిరెడ్డి సుస్మిత అనే మహిళ ఇంట్లో 5 తులాలు బంగారం చోరీ అయినట్లు పోలీసు స్టేషనులో ఫిర్యాదు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఆమె పశువులను తోలుకొని మేత కోసం పొలాలకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంట్లో బీరువా పగలగొట్టి దొంగలు మూడు తులాల లాంగ్ చైన్, 2 తులాల నల్లపూసల దండ చోరీ చేశారు. ఈమేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కలసపాడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల వద్ద ఆదివారం మండలంలోని పలు పాఠశాలల్లో పని చేస్తూ ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను ఎస్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, యు.సుబ్రహ్మణ్యం, జిల్లా మహిళ కమిటీ కన్వీనరు కవిత ఉపాధ్యాయులు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రవీంద్రబాబు, జయరామిరెడ్డి, రమణారెడ్డి, బాలరాజునాయక్, నాగిరెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22న సీపీఐ జిల్లా మహాసభలు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలో ఈ నెల 22వ తేదీ సీపీఐ జిల్లా మహాసభలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు సీపీఐ బద్వేలు మండల కార్యదర్శి ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. ఆదివారం బద్వేలు పట్టణంలోని ఎద్దుల ఈశ్వరరెడ్డినగర్‌లోని పార్టీ కార్యాలయంలో సీపీఐ జిల్లా మహాసభల కరపత్రాలను ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని, నియోజక వర్గంలోని ముఖ్య సమస్యలపై చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ మండల కార్యదర్శి ఇమ్మానుయేల్, నాయకులు

ఎన్‌జీవో సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: స్థానిక ఏపీ ఎన్‌జీవో కార్యాలయంలో ఆదివారం జమ్మలమడుగు తాలూకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా పోరెడ్డి నారాయణరెడ్డి, కార్యదర్శిగా వీరారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా డాక్టర్ రఫీక్‌పాషాను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కె.శ్రీరాములు, బి.నాగేంద్ర రెడ్డి, కె.జగన్‌మోహన్‌రెడ్డి, బి.రమాదేవి, సంయుక్త కార్యదర్శులుగా గంగాధర్, మనోహర్, శ్రీనివాసులు, విజయమ్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా భారతి, కోశాధికారిగా ప్రవీణకుమారి ఎంపికయ్యారు. ఈ కార్యవర్గం మూడేళ్ల వరకు కొనసాగుతుందన్నారు. ఎన్నికల అధికారిగా బాల పుల్లయ్య, సహాయ ఎన్నికల అధికారిగా శ్రీనివాసులు, పరిశీలకుడిగా రవికుమార్ వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి అభినందించారు. పెండింగ్ డీఏ, పీఆర్సీ, సరెండర్ బిల్లులు తదితర సమస్యలు పరిష్కరించేందుకు నేతలు హామీ ఇచ్చారు. నాయకులు తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, నిత్య పూజయ్య, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీవో సంఘం నూతన కార్యవర్గం ఇదే

ముస్లిం సోదరుల సమస్యలపై దృష్టి

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని ముస్లిం సోదరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఇన్సాఫ్ మండల అధ్యక్షుడు, కార్యదర్శి రఫీ, హుసేన్ అన్నారు. ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడారు. పట్టణంలోని వీధులు, వార్డుల్లో ఉండే సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. గుర్తించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. ఇన్సాఫ్‌ను 21 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో మాట్లాడుతున్న ఇన్సాఫ్ కమిటీ అధ్యక్షుడు రఫీ

ప్రజలే ప్రశ్నించాలి: ఎమ్మెల్యే

కాశినాయన, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో చెప్పిన ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు అందించామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ అరకొరగా అమలు చేస్తూ, కొన్నింటిని ఇప్పటికీ అమలు చేయని విషయాన్ని ప్రజలే ప్రశ్నించాలని ఎంఎల్ఏ సుధ అన్నారు. ఆదివారం నరసాపురంలో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ వితంతువులకు పింఛన్ ఇచ్చేందుకు రకరాల ఆక్షేపణలు పెడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి ఆదిత్యారెడ్డి, భూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, వైకాపా మండల అధ్యక్షుడు హనుమంతరెడ్డి, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసుబుక్కు పోయినది

కడప జిల్లా, ప్రొద్దుటూరు (మం), పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన ఎర్రదాసరి దయానిధి, తండ్రి రాజన్న గారి పట్టాదారు పాసుబుక్కు పోయినది. పాసుబుక్కు నెంబరు : 1684. ఎవరికైనా దొరికిన యెడల క్రింది నెంబరుకు తెలియజేయగలరు. వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

Cell : 8008303197

రహదారులు అధ్వానం.. వసతులు శూన్యం

✦ అయిదేళ్ల నుంచి సమస్యల తిష్ఠ ✦ నిధుల్లేక అమలుకు నోచుకోని అభివృద్ధి పనులు

గుంతలమయమైన పొట్టిపాడు రహదారి

– న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

ప్రొద్దుటూరు పట్టణం బుడ్డాయపల్లె, బొల్లవరం, చిట్టోళ్లవీధి, పాణ్యంవీధి, కాచనవారివీధి, ఎస్సీకాలనీ తదితర వీధుల్లో సమస్యలు తిష్ఠవేశాయి. సెయింట్‌జోసెఫ్ పాఠశాలకు వెళ్లే రోడ్డులో సుమారు రెండు కిలో మీటర్ల మేర పొట్టిపాడు రహదారి పూర్తిస్థాయిలో గుంతలుగా మారింది. గత అయిదేళ్ల నుంచి ఈ రహదారి అధ్వానంగా మారింది. నిధులు లేక ఆర్అండ్‌బీ అధికారులు ఎలాంటి పనులు చేయలేకపోతున్నారు. తాత్కాలికంగా మరమ్మతులు చేసినా ఉపయోగంలేదని కొత్తగా రోడ్డు నిర్మించేందుకు దాదాపుగా రూ.6 కోట్లు అవసరం ఉందని ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రహదారి నుంచి వెళ్లే వాహనదారులకు వర్షపునీరు చేరినప్పుడు గుంతలు కనబడక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో మూడు పాఠశాలలు ఉన్నాయి. వర్షాల సమయంలో గుంతలు నిండడం వలన విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీకాలనీలో కాలువల్లో పూడికతీత సకాలంలో తొలగించడం లేదు.

✤ బొల్లవరంవీధిలో వేంకటేశ్వరస్వామి దేవాలయం వీధి, గోపిరెడ్డివీధి, ఐటీఐ వీధి, జెండాచెట్టు వీధి, మహర్షి పాఠశాల వీధి, పోస్టల్ కాలనీ వీధి తదితర వీధులు ఉన్నాయి. బొల్లవరం ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సూపర్‌బజారువీధికి వెళ్లే దారి గుంతలమయంగా మారింది. ప్రధాన రహదారి కావడంతో వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు చేస్తున్నా పురపాలక అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోపిరెడ్డివీధి, ఐటీఐ వీధుల్లో రహదారి నిర్మించాలని స్థానికులు విన్నవిస్తున్నారు. బొల్లవరం నుంచి వేంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లే దారిలో ఉన్న మురుగు కాలువల్లో సకాలంలో పూడికను తొలగించడం లేదు. జెండాచెట్టువీధిలో చెత్తడబ్బా లేకపోవడం వలన రోడ్డు పైనే చెత్తను పడేస్తున్నారు.

బొల్లవరం నుంచి సూపర్‌బజారు రోడ్డుకు వెళ్లే దారిలా

ఇబ్బందులు పడుతున్నాం

పొట్టిపాడు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. రాత్రి వేళ రోడ్డు కనబడకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ఈ రహదారిపై నడవాలన్నా సాధ్యంకాని పరిస్థితి నెలకొంది. నూతన రహదారి నిధుల నిర్మాణానికి అధికారులు త్వరగా ప్రయత్నించాలి.

-సంపత్, ఉపాధ్యాయుడు, పొట్టిపాడురోడ్డు



(c) eenadu

శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : కడప శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యుత్తు కాంతుల నడుమ తెలుగుదనం ఉట్టిపడేలా చిన్నారుల నృత్యాలు వీక్షకులను అలరించాయి. శాస్త్రీయ నృత్యాలు, పల్లెజానపదాలు, సినీ నృత్యాలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. కార్యక్రమంలో శిల్పారామం అధికారి కృష్ణప్రసాద్ ఉన్నారు.

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

రిక్షాలు ఇలా.. చెత్త సేకరణ ఎలా..?

ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించేందుకు ప్రభుత్వం అందించిన రిక్షాలు మూలకు చేరాయి. వేంపల్లె పంచాయతీకి సంబంధించిన కేటాయించిన రిక్షాలు ఇక్కడి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మరమ్మతులకు గురై మూలకు చేరాయి. సంవత్సరాలు గడుస్తున్నా వాటి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో చెత్త సేకరణ కష్టతరంగా మారింది. ఈ విషయమై గ్రామ పంచాయతీ ఈఓ మాధవరెడ్డిని అడగ్గా రిక్షాలను బాగు చేయించి వినియోగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, వేంపల్లె

రైతుబజారులో కూరగాయల ధరలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే : రైతుబజారులో కూరగాయలు కిలో ధరలు **(నిన్న టివి)** ఇలా... బంగాళదుంప- 35, క్యాబేజి- 25, క్యారెట్- 60, బీన్స్- 75, బీట్‌రూట్- 40, కీర- 45, దోస- 35, దొండకాయలు -40, ముల్లంగి- 35, అల్లం - 75, కాలీఫ్లవర్- 40, క్యాప్సికం- 60, టమాట- 24, మిరపకాయలు- 60, వంకాయలు - 25, బెండకాయలు- 30, బీర- 35, కాకర- 40, మట్టికాయ- 35, చిక్కుడు- 50, అలసందకాయలు- 40, అనపకాయలు- 55, ఉల్లిపాయలు - 25, మునగకాయలు- 50.

వర్షమొస్తే నగరానికి కష్టాలే..!

● కూలిన కాలువల్లో పారని మురుగు
● పట్టించుకోని పాలకులు, అధికారులు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : కడప మినహా రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కడప నగరంలో భారీ వర్షాలు కురవకపోవడం ఒకింత నగర వాసులకు మేలే.. ఎందుకంటే ఇంకా నగరంలో వరద కాలువల నిర్మాణం పూర్తి కాలేదు. వాటిని పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భారీ వర్షాలు కురిస్తే నగరం జలమయం కావడం ఖాయం... పైగా రోడ్లపై రాకపోకలు సాగించేందుకు నగర వాసులు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొనేది. కొన్ని ప్రాంతాల్లో నివాసాల్లోకి నీళ్లు చేరి నష్టపోయేవారు. మోస్తరు వర్షాలు కురిసినా నగర పౌరులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తని పరిస్థితులు కల్పించడంలో అటు ఎన్నికైన ప్రజాప్రతినిధులు.. ఇటు మున్సిపల్ అధికారులు ఘోరంగా వైఫల్యం చెందారు. వారు నగర ప్రజలకు సౌకర్యాలు మెరుగు పరచడంపై దృష్టి కేంద్రీకరించడం లేదు. వర్షాలు కురవకపోవడమే మేలు అని నగర ప్రజలు భావించాల్సిన దుస్థితి ఏర్పడటం విచారకరం.

పాతబైపాస్ నుంచి వై.కూడలి వరకు కూలిన కాలువ

రోడ్లు, కాలువలు ఏకమయ్యేలా..

చిన్నచౌకు పాతబైపాస్ నుంచి వై.కూడలి వరకు ఉన్న కాలువ పలు చోట్ల దెబ్బతింది. కొన్ని చోట్ల విశాలంగా మరికొన్ని చోట్ల చిన్నదిగా ఉంది. గురుకుల్ విద్యాపీఠ్ ఎదుట ఉన్న ఈ కాలువకు కట్టడాలు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. భరత్‌నగర్-1, భరత్‌నగర్-2తో పాటు పలు కాలనీలకు వెళ్లే మార్గంలో కాలువపై నిర్మించిన స్లాబ్ కింద భాగం దెబ్బతింది. భారీ వాహనాలు వెళ్తే కూలే పరిస్థితి నెలకొంది. బ్రహ్మయ్య షెడ్ వద్ద పూర్తిగా కాలువ కట్టడం కుంగిపోవడంతో రోడ్డు కూడా దెబ్బతింది. ఈ కాలువపై బండలు వేసి విద్యుత్తు నియంత్రికను ఏర్పాటు చేశారు. ఒక వేళ భారీ వర్షాలు కురిస్తే ఈ కాలువలన్నీ పూర్తిగా నిండి రోడ్లపై మురుగు, వాన నీరు పారే పరిస్థితులున్నాయి. కాలువల్లో పేరుకున్న వ్యర్థాలు, వర్షం నీళ్లల్లో కొట్టుకొచ్చి పరిసరాలన్నీ దుర్భరంగా మారే అవకాశం ఉంది.

కొరవడిన ముందు చూపు

ప్రజాప్రతినిధులు.. మున్సిపల్ అధికారులు వర్షాకాలం రాకమునుపే క్షేత్రస్థాయిలో కాలువల దుస్థితిని పరిశీలించి.. వాటి బాగుకు చర్యలు తీసుకోవాలి. వర్షం వచ్చే రోడ్లపై నీరు నిలిచే పరిస్థితులు ఎక్కడెక్కడ ఉంటాయో గుర్తించి ముందస్తు సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఆ దిశగా వారు చేయకపోవడంతో నగర వాసులు కష్టాలు పడాల్సిన దుస్థితి నెలకొంది. కనీసం కాలువను బాగు చేయాలని, కూలిపోయిన కట్టడాలను తిరిగి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యను 'న్యూస్‌టుడే' కడప నగర పాలక సంస్థ పారిశుద్ధ్య విభాగం వైద్యాధికారి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. మురుగు కాలువ కట్టడాలు ఇంజినీరింగ్ విభాగం వారు చూస్తున్నారన్నారు. కాలువలో పూడికలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా ఎక్కడైన పూడికలు చెత్తాచెదారముంటే తొలగిస్తామన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ.. స్తంభించిన ట్రాఫిక్

జాతీయ రహదారిపై లారీని తొలగిస్తున్న యంత్రం

చెన్నూరు, న్యూస్‌టుడే : కడప - కర్నూలు జాతీయ రహదారిలో చెన్నూరు గ్రామంలోని పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం వేకువజామున వేగంగా వస్తున్న లారీ అదుపు తప్పి పక్కనే ఉన్న రోడ్డు డివైడర్ పైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. డివైడర్‌ను ఢీకొనడంతో యంత్రం దెబ్బతింది. కదలకుండా రోడ్డు పైనే ఆగింది. ఈ దారిన వెళ్లే వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అనంతరం టోల్ నిర్వాహకులు క్రేన్ సహాయంతో తొలగించారు.

దాడి ఘటనలో 11 మందిపై కేసు

తొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఇనగలూరులో శనివారం పాత కక్షల నేపథ్యంలో జరిగిన దాడి ఘటనలో 11 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరమణ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు గ్రామానికి చెందిన వారిపై దాడి చేసిన ఘటనలో దస్తగిరిరెడ్డి (బాబురెడ్డి), ప్రశాంత్‌రెడ్డి వారి అనుచరులు 9 మందిపై కేసు నమోదైంది. వెంటనే నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని సీఐ పేర్కొన్నారు. గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

జూదరుల అరెస్ట్.. రూ.1.45 లక్షలు స్వాధీనం

చక్రాయపేట, న్యూస్‌టుడే : చక్రాయపేటలోని కంకరమిషన్ సమీపంలోని ఒక నిమ్మతోటలో ఆదివారం జూదశాలపై దాడులు చేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నామని ఇడుపులపాయ సీఐ తెలిపారు. వారి నుంచి నగదు రూ.1,45,100, 11 చరవాణులు, 4 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

సొసైటీ ఛైర్మన్‌కు ఘన సన్మానం

పీఏసీఎస్ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్సీ సెల్ కార్యదర్శి సుబ్బరాయుడు

కమలాపురం : పల్లూరు సొసైటీ ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన లేబాక నాగేశ్వర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆదివారం పల్లూరులో తెదేపా కార్యాలయంలో కడప పార్లమెంట్ ఎస్సీ సెల్ కార్యదర్శి దర్శి సుబ్బరాయుడుతోపాటు ఎ.ఓబాయపల్లెకు చెందిన పలువురు తెదేపా యువ నాయకులు శాలువాలు, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ సెల్ కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండే నాగేశ్వర్‌రెడ్డికి సొసైటీ ఛైర్మన్ పదవి దక్కడం శుభపరిణామమన్నారు.

ఫెన్సింగ్ అసోసియేషన్ కోశాధికారిగా చంద్ర కళావతి

కాకినాడ, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ సాంబమూర్తినగర్‌లోని ఆదిత్య మహిళా కళాశాల సెమినార్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా డా. నల్లమిల్లి సుగుణ (తూర్పు గోదావరి), కార్యదర్శిగా గుణ్ణం కృష్ణమోహన్ (పశ్చిమగోదావరి), కోశాధికారిగా ఆకుల చంద్రకళావతి (కడప), ఉపాధ్యక్షురాలిగా కె.సూర్యలక్ష్మీదేవి (గుంటూరు), సహాయ కార్యదర్శిగా జి.నవీన్ (ప్రకాశం), కార్యవర్గ సభ్యులుగా నంద్యాల రాధిక, డి.అశోక్‌బాబు ఎన్నికయ్యారు. కార్యవర్గం 2025-29 వరకు కొనసాగుతుంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466, 8008573474
కమలాపురం : 8008573475

?: పులివెందులలోని నగరిగుట్టలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నిండి పొర్లుతున్నాయి. రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. – **రాముడు, నగరిగుట్ట**

?: రాజీవ్‌కాలనీలో ఇళ్ల నుంచి వచ్చే నీరు రోడ్డుపై పారుతోంది.– **సుజాత, స్థానికురాలు**

✓: సిబ్బందిని పంపి సమస్యలు పరిష్కరిస్తాం. – **రాముడు, పురపాలక కమిషనర్, పులివెందుల.** – న్యూస్‌టుడే, పులివెందుల

బీమా వద్దంటే 22లోగా తెలపండి

వేంపల్లె, న్యూస్‌టుడే : అలవలపాడు ఆంధ్రా గ్రామీణ బ్యాంకు పరిధిలోని వేంపల్లె, వేముల మండలాల రైతులు పత్తిపంటకు బీమా వద్దనుకునే రైతులు ఈ నెల 22లోగా అభిప్రాయాలు తెలపాలని బ్యాంకు మేనేజర్ సన్నీసిన్హా తెలిపారు. పత్తి పంటకు బీమా అవసరమని చెబితే సదరు రైతుల ఖాతాల నుంచి డబ్బులు విత్ డ్రా చేసి బీమా కంపెనీలకు పంపిస్తామన్నారు. బీమా వద్దనుకునే రైతులు తప్పనిసరిగా తమ కార్యాలయానికి వచ్చి లిఖిత పూర్వకంగా ఇవ్వాలని ఆయన కోరారు.

వారికి ఎస్సీ రిజర్వేషన్లు రద్దు చేయాలి

కడప విద్య, న్యూస్‌టుడే : అన్యమతస్థులు ఎస్సీ రిజర్వేషన్ వాడుకుంటే వారి కులధ్రువీకరణ పత్రాలను రద్దు చేసేలా చట్టం తీసుకురావాలని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ ఆర్థిక కార్యదర్శి సమ్మెట శశిధర్ ప్రకటనలో డిమాండు చేశారు.

ఆటిజం లక్షణాలపై నిర్లక్ష్యం తగదు

కడప వైద్యం, న్యూస్‌టుడే : కడప నగరంలోని ఐఎంఏ హాల్‌లో ఆదివారం పిల్లల్లో ఎదుగుదల లోపాలపై (ఆటిజం) ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని అష్యూర్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల మానసిక వైద్యనిపుణులు సోమశేఖర్ మాట్లాడుతూ 18 నెలలు నిండిన పిల్లల్లో వారి ప్రవర్తన, ఎదుగుదల, మాట్లాడటం వంటి అంశాలను తల్లిదండ్రులు పరిశీలించాలన్నారు. వీటిలో తేడాలున్నట్లు గుర్తిస్తే వైద్యులను సంప్రదించి తగిన థెరపీల ద్వారా పిల్లలను సాధారణ స్థాయికి తీసుకు రావచ్చన్నారు. డాక్టర్ వంశీధర్ మాట్లాడుతూ పిల్లల్లో ఆటిజం లక్షణాలు గుర్తిస్తే వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆటిజం లక్షణాలున్న పిల్లల్ని ఇతరులతో, కుటుంబ సభ్యులతో సన్నిహితంగా ఉంచాలని చెప్పారు. మొబైల్ ఫోన్లకు పిల్లల్ని దూరంగా ఉంచాలన్నారు. వైద్య శిబిరంలో పలువురు చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఓబులరెడ్డి, సంస్థ ప్రతినిధులు కిశోర్‌కుమార్, నాగరాజు, థెరపిస్టులు బాబూరావు, ప్రవల్లిక పాల్గొన్నారు.

ఆటిజం పిల్లలను పరీక్షిస్తున్న వైద్యులు

కాలువలో చెత్త.. స్థానికులకు చింత

నగరంలోని కోఆపరేటివ్ కాలనీలో ప్రధాన రహదారి నుంచి అటు విద్యామందిర్ పాఠశాల, ఇటు సాయికృష్ణ పాఠశాలకు వెళ్లే మార్గంలోని కాలువలో చెత్త గుట్టలా పేరుకుపోయింది. మురుగు నిలిచిపోవడంతో ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. నగరపాలక అధికారులు స్పందించి కాలువల్లో చెత్త తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, అరవిందనగర్

కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

సామాజిక సేవలు వెలకట్టలేనివి

శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ తులసిరెడ్డి

వేంపల్లె, న్యూస్‌టుడే : సమాజసేవలో మానవతా సేవా సంస్థ భాగస్వామ్యం హర్షణీయమని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ తులసిరెడ్డి పేర్కొన్నారు. మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, ఉచిత మెగా వైద్య శిబిరాలను వారు ప్రారంభించి మాట్లాడారు. రాజారెడ్డినగర్ వద్ద రూ.20 కోట్లతో నిర్మించి అసంపూర్తిగా నిలిచిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను ఎమ్మెల్సీ పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, మానవతా సేవా సంస్థ ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు యోగీశ్వరబాబు, వేంపల్లె తెదేపా అధ్యక్షుడు ఆర్.వి.రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కడప చిన్నచౌకు : మానవత సేవలను వెలకట్టలేమని పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కడప నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ నగర అధ్యక్షుడు సాంబశివారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు. నగర అధ్యక్షులు సాంబశివారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గోపి, సుబ్రహ్మణ్యం, సుబ్బరాయుడు, రామకృష్ణారెడ్డి, బాలయల్లారెడ్డి, సుబ్బారెడ్డి, వెంకట్రామిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆడికృత్తిక మహోత్సవం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : ఆడికృత్తిక సందర్భంగా కడప ఆకుల వీధిలోని రాజరాజేశ్వరిదేవీ దేవస్థానంలో ఆదివారం సుబ్రహ్మణ్యం స్వామికి పంచామృతాభిషేకం, సర్ప శాంతి హోమం నిర్వహించారు. స్వామి విగ్రహాన్ని పూలతో అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కమలాపురం : కావడి మోస్తున్న మహిళలు

కమలాపురం : మండలంలోని రామాపురం క్షేత్రంలో ఆడికృత్తిక మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీవల్లీ దేవసేన సమేత ద్వికందర షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి వారికి నాగబంధ, కాల సర్ప దోష నివృత్తి, సుబ్రహ్మణ్య తదితర హోమాలతో పాటు వివిధ రకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శతఅష్టోత్తర కలాభిషేకం, పంచామృతాభిషేకాన్ని నిర్వహించారు. దప్పులు, మంగళవాయిద్యాల నడుమ కావడిని ఉత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం మయూర వాహనంపై స్వామి వారి ఊరేగించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

కడప : పూల అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి

వేంపల్లె : వేంపల్లెలో వెలిసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ఆడికృత్తిక సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడి పాతపేటలోని ఆలయంలో అర్చకుడు శేషగిరిరావు ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధి సింగనమల సాంబశివుడు పాల్గొన్నారు.

చౌడమ్మకు ఆషాఢం ఆడపడుచు సారె

బ్యాండు మేళాలతో సారె తీసుకెళ్తున్న అమ్మవారి భక్తులు

చెన్నూరు, న్యూస్‌టుడే : ఆషాఢం ఆడపడుచు సారె ఆదివారం చెన్నూరులో వైభవంగా జరిగింది. స్థానిక సరస్వతి నగర్‌లోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పడమటి వీధిలోని శ్రీరామలింగ చౌడేశ్వరిదేవి అమ్మ వారికి ఆడపడుచు సారెగా అనేక రకాల పిండి వంటకాలు, చీరలు, పసుపు, కుంకుమ, పండ్లు, సప్త వర్ణాల గాజుల తట్టెలను నెత్తిన పెట్టుకుని మంగళ వాయిద్యాలు, డప్పులతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. తర్వాత ఆలయంలో సారె సమర్పణ కార్యక్రమం శాస్త్రోక్తంగా అర్పించారు.

భక్తి శ్రద్ధలతో గంగమ్మకు పూజలు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : మండలంలోని బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ ఆలయంలో ఆదివారం గంగమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాలు పట్టి పూలమాలలు, నిమ్మమాలలు వేసి కానుకలు సమర్పించి అమ్మ వారికి మొక్కులు చెల్లించారు. అలాగే ఆలయ ఆవరణంలోని వినాయకస్వామి, వీరభద్రస్వామి, వైద్యనాథీశ్వరుడు, ఆంజనేయస్వామి ఆలయాల్లో కూడా భక్తులు పూజలు నిర్వహించారు.

గంగమ్మా.. వర్షాలు కురిపించుమా!

పులివెందుల, న్యూస్‌టుడే : వర్షాలు బాగా కురవాలని శ్రీసత్యమ్మ తల్లి అమ్మ వారికి ఆదివారం 108 బోనాలు సమర్పించారు. పులివెందుల మండలం మల్లికార్జునపురంలో వెలిసిన శ్రీసత్యమ్మ అమ్మ వారికి మహిళలంతా కలిసి 108 బోనాలను తయారు చేసుకుని వాటిని తలపై ఉంచుకుని ఊరేగింపుగా వెళ్లి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. వర్షాలు సకాలంలో కురవకపోడంతో అమ్మ వారికి బోనాలు సమర్పిస్తే వర్షాలు కురుస్తాయని విశ్వాసం. ఈ కారణంగా అమ్మ వారికి తెల్లవారుజామున నుంచే ప్రత్యేకంగా అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించి అనంతరం బోనాలు సమర్పించారు. వానలు బాగా కురిసి చెరువులు, కుంటలు నిండి పంటలు పండాలని వారు మొక్కులు చెల్లించారు.

పెండ్లిమర్రి : పగడాలపల్లె గంగమ్మ తల్లీ కరుణించి వర్షం కురవాలని కోరుతూ పగడాలపల్లె, ద్వారకానగర్ గ్రామాలకు చెందిన ప్రజలు ఆదివారం బోనాలు సమర్పించారు.

తొండూరు : ప్రత్యేక అలంకరణలో మాలే గంగమ్మ

భక్తిశ్రద్ధలతో అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు.

తొండూరు : మండల పరిధి మల్లేల గ్రామంలోని మాలే గంగమ్మకు ఆదివారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని బోనాలు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మల్లేల గ్రామానికి 8 కిలో మీటర్ల దూరం కొండ ప్రాంతంలో ఉన్న అమ్మ వారిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

లింగాల : వరుణుడు ముఖం చాటేయడంతో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని అంబకపల్లెలో ఆదివారం విరాట పర్వం పఠనం చేశారు. పాఠకులు బండి శివారెడ్డి ఉపవాసంతో కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని ప్రధాన ఆలయాల్లో కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. వర్షాలు కురవడం ఆలస్యమైతే విరాట పఠనం చేయడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్థులు తెలిపారు.

లింగాల : విరాటపర్వం పఠనం చేస్తున్న భక్తులు

పులివెందులలో సత్యమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

అధ్వాన మార్గం.. అవస్థల ప్రయాణం

కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వెళ్లే రహదారి నుంచి రామచంద్రయ్య కాలనీ, శ్రీ అన్నపూర్ణ నిత్యాన్నదాన క్షేత్రం, దేవాలయానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. గుంతలు తేలి అటువైపు వెళుతున్న ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు చేరడంతో అవస్థలు పడుతున్నారు. రోడ్డు వేసి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. **- కడప విద్య, న్యూస్‌టుడే**

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 99899 97626

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 91771 11468

పులివెందులలో ఇంజినీరింగ్ విభాగం ఖాళీ!

అధికారులు లేక సాగని అభివృద్ధి పనులు

పులివెందుల, న్యూస్‌టుడే : పులివెందుల పురపాలక కార్యాలయంలో ముఖ్యమైన విభాగాల్లో సిబ్బంది కొరత ఏర్పడి పనులు సరిగ్గా జరగడంలేదు. ఫలితంగా పట్టణ పరిధిలో రోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు, తాగునీరు సరఫరా, వీధి దీపాల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాటిని పరిష్కరించడానికి నిధులు - సిబ్బంది కొరతతో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. ఏ అభివృద్ధి పనులు జరగాలన్నా సాంకేతిక పరంగా ఇంజినీరింగ్ అధికారులు అవసరం. అనుమతుల కోసం ప్రజలు కార్యాలయానికి వెళ్తే సిబ్బంది కొరతతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. పులివెందుల పురపాలక కార్యాలయంలో ముగ్గురు ఏఈలు, ఒక డీఈ ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేకపోవడం విశేషం. అంతా బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో సచివాలయ వార్డు అమెనిటీస్ సెక్రటరీలతో నెట్టుకొస్తున్నారు. పారిశుద్ధ్య అధికారి (శానిటరీ ఇన్‌స్పెక్టర్) కూడా లేకపోవడంతో పారిశుద్ధ్యం పడకేసి పట్టణం అధ్వానంగా తయారైంది. పారిశుద్ధ్య అధికారి ఉదయాన్నే వార్డుల్లో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయిస్తుండగా పరిస్థితి అంతంత మాత్రంగా ఉండేది. అయితే ఆ అధికారి లేకపోవడంతో పట్టణ పరిసరాలు దుర్భరంగా ఉంటున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు.. విజిలెన్స్ అధికారుల విచారణ.. రాజకీయ ఒత్తిళ్లు వెరసి ఇంజినీరింగ్ అధికారులు ఇక్కడికి రావడానికి మొగ్గు చూపడంలేదు. తాజాగా జరిగిన సాధారణ బదిలీల్లో ఒక డీఈని కర్నూలు జిల్లా నుంచి పులివెందులకు నియమించినప్పటికీ ఆయన విధుల్లో చేరలేదని తెలిసింది. ఇలా సిబ్బంది కొరత కారణంగా పులివెందుల అభివృద్ధి పనుల పరిస్థితి ప్రశ్నార్థకం.

పులివెందుల పురపాలక కార్యాలయం

ఖాళీగా డీఈ సీటు

మా రోడ్లకు ఎప్పుడు మోక్షమొస్తుందో : పులివెందులలోని బాకరాపురం, యర్రగుడిపల్లె, పెద్దరంగాపురం, కె.వెలమవారిపల్లె ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థతోపాటు ఛిద్రమైన రోడ్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఆయా ప్రాంతాల్లో రోడ్లకు ఎప్పుడు మోక్షమొస్తుందో. **- ఆంజనేయులు, పులివెందుల**

రోడ్డుపై మురుగు పారుతోంది. : కె.వెలమవారిపల్లెలో మురుగునీటి కష్టాలతో అవస్థలు పడుతున్నాం. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పూర్తి కాకుండానే ఇళ్లనుంచి పైపులకు కనెక్షన్లు ఇచ్చారు. దీంతో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు బయటకు పొంగి రోడ్లపై పారుతోంది. **- కుళ్లాయప్ప, కె.వెలమవారిపల్లె**

ఏఈలుగా సచివాలయ అమెనిటీస్‌లు : పులివెందుల పురపాలక కార్యాలయంలో ఇంజనీర్లు ముగ్గురు, ఒక డీఈ ఉండాల్సి ఉంది. అయితే వారు బదిలీపై వెళ్లడంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టాం. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీర్ల కొరత ఉన్న కారణంగా సచివాలయ అమెనిటీస్‌లను ఏఈల స్థానంలో వినియోగించుకోవాలని ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ మేరకు ముగ్గురు అమెనిటీస్‌లను వినియోగిస్తున్నాం. డీఈ పోస్టు ఖాళీగా ఉంది. **- రాముడు, పురపాలక కమిషనర్, పులివెందుల**

విద్యుత్తు సబ్ స్టేషన్ ఆపరేటర్‌పై ఫిర్యాదు

లింగాల, పులివెందుల, న్యూస్‌టుడే : మండలంలోని తాతిరెడ్డిపల్లెలో విద్యుత్తు సబ్‌స్టేషన్ ఆపరేటర్ చైతన్యకుమార్‌రెడ్డి పనితీరుపై గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆ శాఖ ఏడీఈ గురుమోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. గత కొంత కాలంగా ఆపరేటర్ పనితీరు సక్రమంగా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఏడీఈ తెలిపారు.

(c) eenadu